ఇల కైలాసం..

మన్యంలో వంజంగి, చెరువులవెనం, మాడగడ మేఘాల కొండలకు పర్యాటకులు పోటెత్తుతున్నారు. తాజాగా ఆ జాబితాలోకి మరో కొండ చేరింది. హుకుంపేట మండలం తడిగిరికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న డుంకురాయి కొండపై వ్యూపాయింట్ సందర్శకులను ఆకట్టుకుంటోంది. ఈ కొండకు వెళ్లే రెండు కిలోమీటర్ల మార్గాన్ని అభివృద్ధి చేస్తే మన్యానికి మరో మణిహారంగా వెలుగొందుతుందని స్థానికులు చెబుతున్నారు. – న్యూస్‌టుడే, పాడేరు

జీవన ధ్రువపత్రాలు సమర్పించండి

పాడేరు, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వ పింఛనుదారులు జీవన ప్రమాణ ధ్రువపత్రాలను 2026 జనవరి 1 నుంచి ఫిబ్రవరి 28 లోపు సమర్పించాలని జిల్లా ఖజానాధికారి ఆర్.ప్రసాద్‌బాబు సూచించారు. పాడేరులో సోమవారం మాట్లాడుతూ.. గడువులోగా వీటిని సమర్పించాల్సి ఉందన్నారు. మీసేవా కేంద్రాలు, పోస్టాఫీసులు, బ్యాంకులు, జీవన ప్రమాణ యాప్ ద్వారా అందజేయవచ్చన్నారు. పింఛనుదారుల సౌకర్యం కోసం అన్ని ఖజానా కార్యాలయాల్లో ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఎవరైనా విదేశాల్లో ఉంటే తమ ప్రతినిధి ద్వారా ధ్రువపత్రాలు సమర్పించాలని కోరారు.

భూములు కొంటున్నారా.. అప్రమత్తం!

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే

భూములు, ఆస్తులు కొనుగోలు చేసేటప్పుడు అప్రమత్తంగా వ్యవహరించాలి. లేకుంటే ఇబ్బందులు తప్పవు. అనంతగిరి మండలంలో గిరిజనేతర పంచాయతీలైన బీంపోలు, గుమ్మకోట, గరుగుబిల్లి, రొంపల్లి, ఎన్‌ఆర్‌పురంలలో ఎక్కడైనా మైదాన ప్రాంతవాసులు ఆస్తులు కొనుగోలు చేసుకోవచ్చు. ఇదే అవకాశంగా చేసుకుని చాలామంది మధ్యవర్తులు అక్రమాలకు పాల్పడుతున్నారు. ఆయా పంచాయతీల్లో భూములు కొనేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని ఉన్నతాధికారులు సూచిస్తున్నారు. రూ.కోట్లతో ముడిపడిన వ్యవహారంలో అప్రమత్తంగా ఉండాలంటున్నారు. సాగు భూముల క్రయవిక్రయాలు చేసేటప్పుడు.. రిజిస్ట్రేషన్ అయిందా.. హక్కుదారులు ఎవరు అనేది తెలుసుకోవాలి. నిబంధనల ప్రకారం అన్నీ ఉన్నాయా అన్నది తప్పనిసరిగా పరిశీలించుకోవాలి. వీటిపై అవగాహన లేకపోవడంతో పలువురు మోసపోతున్నారు.

ఏం చేయాలంటే..

భూముల కొనుగోలు సమయంలో హక్కుదారులు ఎవరికైనా బకాయిలు ఉన్నారా అనే విషయాన్ని నిర్ధారించుకోవాలి. మీ భూమి వెబ్‌సైట్ ద్వారా యాజమాన్య హక్కు పత్రం, అడంగల్ తనిఖీ చేయాలి. తద్వారా ఆస్తి అమ్మకందారుని పేరిట ఉందా..? లేదా అనేది తెలుసుకోవచ్చు. దస్తావేజుల ప్రతులు, ఈసీ ద్వారా ఆస్తిపై హక్కు ఎవరిది. ఎలా సంక్రమించిందనే విషయాలు తెలుసుకోవచ్చు.

★ ఆయా పంచాయతీల్లో భూముల కొనుగోలు చేసే సమయాల్లో అసైన్‌మెంట్ రిజిస్ట్రర్‌లో నమోదు ముఖ్యం. ఈ వివరాల మదింపు రిజిస్టర్‌లో భూమికి సంబంధించిన హక్కులను పరిశీలించుకోవాలి. కొనుగోలు చేసే భూములకు సంబంధించి తగాదాలు ఉన్నాయా, లేదా అనేదానిపై దృష్టిసారించాల్సిన అవసరముంది.

మధ్యవర్తుల మాయాజాలం

కొంతమంది మధ్యవర్తులు కొనుగోలుదారుల నుంచి అడ్వాన్సుగా కొంత నగదు తీసుకుని ఇదిగో.. అదిగో అంటూ రిజిస్ట్రేషన్ చేయకుండా వాయిదాలు వేస్తున్నారు. భూయజమానులకు ఈ వ్యవహారం తెలియకుండా జాగ్రత్తలు తీసుకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు.

కారడవిలో కాంతులీనేలా...

సీలేరు నుంచి కొత్త లైన్

అటవీ అనుమతులే ఆలస్యం

చింతపల్లి, న్యూస్‌టుడే

అల్లూరి సీతారామరాజు జిల్లాలో కనుచూపు మేర పచ్చని చెట్లు, ఎత్తయిన కొండలు, మధ్యలో గిరిజనుల ఆవాసాలే కనిపిస్తాయి. మన్యంలో చాలా గ్రామాలకు ఇప్పటికీ సరైన విద్యుత్తు సదుపాయం లేదు. వాతావరణం ఎప్పుడు ఎలా ఉంటుందో తెలియదు. చింతపల్లి ఉప కేంద్రం పరిధిలో విద్యుత్తు లైన్లన్నీ దట్టమైన అటవీ ప్రాంతంలోనే ఉన్నాయి. ఈదురుగాలులకు చెట్ల కొమ్మలు విరిగి తీగలపై పడితే విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. అడవిలో సమస్య ఎక్కడ తలెత్తిందో గుర్తించేందుకు చాలా సమయం పడుతోంది. ఇలాంటి సమస్యలన్నింటికీ చెక్ పెట్టేందుకు తూర్పు పంపిణీ విద్యుత్తు సంస్థ (ఈపీడీసీఎల్) నూతన ప్రాజెక్టుకు రూపకల్పన చేసింది.

సీలేరు జెన్‌కో నుంచి చింతపల్లికి అదనంగా 33 కేవీ లైను ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. రూ.3 కోట్ల వ్యయంతో ఈ ప్రాజెక్టు పట్టాలెక్కనుంది. ఇప్పటికే అనుమతులన్నీ వచ్చాయి. కొత్త లైను ఏర్పాటుకు అటవీ శాఖ నుంచి అనుమతులు రావడమే ఆలస్యం. ప్రస్తుతం అటవీ శాఖ ఉన్నతాధికారుల వద్ద ఈ దస్త్రం ఉంది. అనుమతులు రాగానే సీలేరు నుంచి చింతపల్లి వరకు ప్రత్యామ్నాయంగా 33 కేవీ లైను ఏర్పాటు చేసి విద్యుత్తు సరఫరా చేయనున్నారు. ఇది అందుబాటులోకి వస్తే నిరంతర విద్యుత్తు సరఫరా గిరిజన గ్రామాలన్నీ కాంతులీనుతాయి.

33/11 కేంద్రం	చింతపల్లి
ఉప కేంద్రాలు	లంబసింగి, గూడెంకొత్తవీధి, దారకొండ, దుప్పిలవాడ, సప్పర్ల
లైన్ల విస్తీర్ణం	106 కి.మీ.
నియంత్రికలు : 1,425	మీటర్లు : 36,425

★ చింతపల్లిలోని 33/11 కేవీ విద్యుత్తు కేంద్రం తోపాటు రెండు మండలాల్లోని విద్యుత్తు ఉప కేంద్రాలకు నర్సీపట్నం సమీపంలోని బలిఘట్టం వద్ద ఉన్న 132 కేవీ ఉప కేంద్రం నుంచి విద్యుత్తు సరఫరా జరుగుతోంది. కొయ్యూరు మండలం డౌనూరు నుంచి లంబసింగి వరకు దట్టమైన అటవీ ప్రాంతం ఉంది. ఘాట్ రోడ్డులో విద్యుత్తు లైన్ల వల్ల తరచూ సమస్యలు ఏర్పడుతున్నాయి. గూడెంకొత్తవీధి నుంచి దుప్పిలవాడ వరకు ఉన్న మార్గంలోనూ ఇదే సమస్య. చింతపల్లి నుంచి సీలేరు సమీపంలోని దుప్పిలవాడ వరకు గతంలో వేసిన లైన్లు ఉన్నాయి.

“సీలేరు జెన్‌కో నుంచి 33 కేవీ లైను పనులు త్వరలోనే ప్రారంభంకానున్నాయి. సీలేరు నుంచి దుప్పిలవాడ, దారకొండ, గూడెంకొత్తవీధి మీదుగా చింతపల్లి వరకూ ప్రత్యామ్నాయ లైను అందుబాటులోకి వస్తుంది. నర్సీపట్నం లైనులో ఏమైనా ఆటంకాలు, అవరోధాలు తలెత్తితే సీలేరు లైను నుంచి విద్యుత్తు సరఫరా తీసుకోవచ్చు. దుప్పిలవాడ నుంచి 9 కి.మీ. దూరం కొత్తగా స్తంభాలు వేసి తీగలు లాగాల్సి ఉంది. కిలోమీటరుకు 12 స్తంభాలు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది.
– ప్రభాకరరావు, ఏఈఈ, చింతపల్లి

కరుణకుమారి.. జిల్లాకే గర్వకారణం

పాడేరు, న్యూస్‌టుడే: అంధ మహిళల టీ-20 క్రికెట్ ప్రపంచ కప్‌లో రాణించిన మన్యం బిడ్డ పాంగి కరుణకుమారిని కలెక్టర్ దినేష్‌కుమార్ సోమవారం అభినందించారు. శాలువా కప్పి, అల్లూరి సీతారామరాజు జ్ఞాపిక అందజేశారు. వంట్లమామిడి గ్రామంలో పీవీటీజీ కుటుంబంలో పుట్టిన కరుణకుమారి అంతర్జాతీయ స్థాయిలో రాణించడం జిల్లాకే గర్వకారణమన్నారు. ఆమెతో మాట్లాడి కుటుంబ పరిస్థితులు తెలుసుకున్నారు. ఆర్థిక సహాయం కోసం ప్రభుత్వానికి లేఖ పంపినట్లు చెప్పారు. పీఎం జన్‌మన్ పథకంలో ఇల్లు మంజూరు చేస్తామని.. చదువుకునేందుకు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.

కరుణకుమారిని సత్కరించిన కలెక్టర్ దినేష్‌కుమార్, డీఆర్వో

రైతులే విక్రయించేలా కాఫీ బజార్లు

పాడేరు, న్యూస్‌టుడే: అరకు కాఫీకి అంతర్జాతీయ మార్కెట్‌లో స్థిరమైన ధర, అత్యుత్తమ గుర్తింపు లభించేలా జిల్లా యంత్రాంగం పటిష్టమైన ప్రణాళికలు రూపొందిస్తోందని కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. కాఫీ రైతులు, వ్యాపారులు, ఎఫ్‌పీవోలు, ఎస్‌హెచ్‌జీలతో కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన అవగాహన చర్చలో మాట్లాడారు. జిల్లాలో కాఫీ ట్రేడర్స్ అందరూ కలిసి ట్రేడర్స్ అసోసియేషన్‌గా ఏర్పాటైతే చట్టబద్ధత కల్పిస్తామన్నారు. ట్రేడ్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ కలిగి ఉండాలని స్పష్టం చేశారు. దళారుల ప్రమేయం లేకుండా రైతులే నేరుగా విక్రయించేలా కాఫీ బజార్లను ఏర్పాటు చేస్తామన్నారు. రైతులకు 30 శాతం రాయితీపై యంత్ర పరికరాలు అందజేస్తామన్నారు. ఉద్యాన, వ్యవసాయ అధికారులు, కాఫీ బోర్డు శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

పాల్ ల్యాబ్‌లో పాఠం నిక్షిప్తం

జిల్లా వ్యాప్తంగా 52 పాఠశాలల్లో వినియోగం

అనంతగిరి, న్యూస్‌టుడే

విద్యా వ్యవస్థలో మార్పులకు శ్రీకారం చుట్టిన ప్రభుత్వం విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాల మెరుగుకు తీసుకొచ్చిన పాల్ ల్యాబ్‌ల వినియోగం జిల్లాలో చక్కగా ఉంది. మొదటి విడతలో 52 పాఠశాలల్లో ఈ ల్యాబ్‌లు అందుబాటులోకి వచ్చాయి. వీటిలో 11 కేజీబీవీలు ఉన్నాయి. ఎంపిక చేసిన పాఠశాలల్లో ఆరు నుంచి తొమ్మిది తరగతుల విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. వీటిపై అవగాహన కల్పించడంతోపాటు పాల్ ల్యాబ్‌ల వినియోగంపై ఉపాధ్యాయులకు ఎప్పటికప్పుడు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ ల్యాబ్‌లో తెలుగు, గణితం, ఆంగ్లం సబ్జెక్టులు ఉండగా వారానికి రెండు పీరియడ్లు (45 నిమిషాల చొప్పున) వినియోగించుకునేలా ఏర్పాట్లు చేశారు.

★ విద్యార్థులకు ఇచ్చిన ట్యాబ్‌ల్లో ఆయా తరగతులకు సంబంధించిన తెలుగు, ఆంగ్లం, గణిత పాఠ్యాంశాలకు సంబంధించిన పాఠాలు ఉంటాయి. ఉపాధ్యాయుడు తరగతి గదిలో పాఠాలు బోధించిన అనంతరం వాటిని మరింత లోతుగా అభ్యసన చేసేందుకు ఇవి దోహదపడతాయి. ఓ విద్యార్థి పాఠ్యపుస్తకంలోని ఓ లెక్కను ట్యాబ్‌లో చేసేటప్పుడు సరైన సమాధానం వచ్చేంత వరకు ముందుకు వెళ్లదు. సందేహాలను నివృత్తి చేసేందుకు ఉపాధ్యాయులు సహకరిస్తారు.

ట్యాబ్‌లను విద్యార్థులు ఏ విధంగా వినియోగిస్తున్నారు, లేదా, వారం రోజుల్లో ఎన్ని సమయం వినియోగించారో స్టేట్ పాల్ ల్యాబ్ టెక్నికల్ టీంకు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో చేరుతుంది. ఏ పాఠశాలలో ఎక్కువ గంటలు వినియోగించుకున్నారనే పర్యవేక్షణ ఉంటుంది.

ట్యాబ్‌లో పాఠం వింటున్న విద్యార్థులను పరిశీలిస్తున్న ఏపీసీ స్వామినాయుడు

★ జిల్లా వ్యాప్తంగా 52 పాఠశాలల్లో ఎప్పటికప్పుడు వీటి వినియోగంపై పర్యవేక్షణ, సమీక్ష వంటివి ఉంటాయి. నేరుగా విద్యార్థుల వద్దకు వెళ్లి ట్యాబ్‌ల పనితీరు, ట్యాబ్‌లో ఉన్న పాఠ్యాంశాలు అర్థమవుతున్నాయా, కాకపోతే ఉపాధ్యాయులు అర్థమయ్యేలా బోధన చేస్తున్నారా, లేదనా అని తెసుకుంటున్నాం. – స్వామినాయుడు, ఏపీసీ, సమగ్ర శిక్షా

‘కౌశలం’కు సర్వర్ల సంకటం

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే

గ్రామీణ యువతకు స్థానికంగానే ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. కౌశలం పేరిట ఇంట్లోనే ఉద్యోగం (వర్క్ ఫ్రం హోం) కల్పన చర్యలు తీసుకుంది. తొలి విడతలో ఈ నెల 2 నుంచి 6 వరకు గ్రామ, వార్డు సచివాలయాల్లో పరీక్షలు నిర్వహించారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. సర్వర్ మొరాయింపుతో అభ్యర్థులు ఇబ్బందులు పడ్డారు. మరికొందరు స్థానికంగా లేకపోవడంతో పరీక్షకు రాయలేదు.

★ అభ్యర్థి ఎక్కడి నుంచి పరీక్ష రాస్తున్నారో గుర్తించేలా జీపీఆర్‌ఎస్ తరహాలో లైవ్ లొకేషన్ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయాల్సిఉంది. ఈ విధానంతో సాంకేతిక సమస్యలు తలెత్తాయి. ఫలితంగా సర్వీసుకు అవాంతరంగా మారింది. సమస్య పరిష్కారానికి లైవ్ లొకేషన్ క్యూఆర్ కోడ్‌ను తొలగించినా చాలాచోట్ల సర్వర్ పనిచేయలేదు. కంప్యూటర్లకు యూపీఎస్, ఇన్వర్టర్ సదుపాయం లేకపోవడం, అభ్యర్థులు అందుబాటులో ఉండక చాలామంది పరీక్ష రాయలేదు. అనివార్య కారణాలతో పరీక్ష రాయలేని అభ్యర్థులు వారికిచ్చిన లింక్‌తో ఆధార్ నంబరు ద్వారా రీషెడ్యూల్ చేసుకోవచ్చని గ్రామ సచివాలయ సిబ్బంది చెబుతున్నారు.

చింతపల్లిలో పరీక్ష రాస్తున్న అభ్యర్థిని

రోజుకు ఇద్దరు: ఈ పరీక్ష వ్యవధి 60 నిమిషాలు. రెండు పేపర్లు ఉంటాయి. కమ్యూనికేషన్ స్కిల్ అసెస్‌మెంట్‌కు 15 నిమిషాలు, స్కిల్ అసెస్‌మెంట్‌కు 45 నిమిషాలు కేటాయించారు. రోజుకు ఇద్దరు చొప్పున ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గంటల మధ్య పరీక్ష నిర్వహించారు. జిల్లాలోని 22 మండలాల్లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు 18,726 మంది ఉన్నారు. చింతపల్లి మండలంలో 999 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 10 మంది మినహా మిగతా వారందరికీ త్వరలో ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహించనున్నారు.

బొండం కాదిది.. గుమ్మడి

ఈ చిత్రంలో కనిపిస్తోంది లేత కొబ్బరి బొండం అనుకుంటే పప్పులో కాలేసినట్టే. ఇది మన్యంలో గిరిజనులు పండించే లేత గుమ్మడి కాయ. చింతపల్లిలో సోమవారం ఒక కాయగూరల దుకాణంలో కనిపించింది. అచ్చం కొబ్బరి బొండాన్ని పోలి ఉంది. సాధారణంగా గుమ్మడి కాయలు గుండ్రంగా, బల్లపరుపుగా ఉంటాయి. పందిరిసాగులో పండించే గుమ్మడి కాయలు వేలాడటం వల్ల ఇలా కొన్ని కాయలు వివిధ ఆకారాల్లో పొడవుగా పెరిగే అవకాశాలుంటాయని చింతపల్లి ఉద్యాన పరిశోధనాస్థానం అధిపతి శాస్త్రవేత్త డాక్టర్ చెట్టి బిందు తెలిపారు.
– చింతపల్లి, న్యూస్‌టుడే

ఎన్‌పీటీఈఎల్ కోర్సుల నిర్వహణకు అనుమతులు

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్ర విశ్వవిద్యాలయం సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో అడ్జంక్ట్ ప్రొఫెసర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆచార్య కె.రాజగోపాల్‌కు 12 వారాల ఎన్‌పీటీఈఎల్ కోర్సులు నిర్వహించడానికి ఏఐసీటీఈ అనుమతులు మంజూరు చేసింది. సివిల్ ఇంజినీరింగ్‌లో యూజీ, పీజీ కోర్సులు చదువుతున్న విద్యార్థులకు ఉపయుక్తంగా నిలిచే ‘ఫైనైట్ ఎలిమెంట్ మెథడ్స్, కాన్సిట్యూటివ్ మోడలింగ్ ఇన్ జియో మెకానిక్స్, జియోసింథటిక్స్ అండ్ రీఇన్‌ఫోర్స్‌డ్ సాయిల్ స్ట్రక్చర్స్’ కోర్సులను అందిస్తారు. దేశ వ్యాప్తంగా విద్యార్థులు ప్రవేశాలు పొందుతారు. 2026 జనవరి-ఏప్రిల్ నెలల్లో ఈ కోర్సు నిర్వహిస్తారు. పూర్తి చేశాక విద్యార్థులకు లభించే క్రెడిట్స్‌ను విశ్వవిద్యాలయాలు, జాతీయ విద్య సంస్థలు పరిగణనలోనికి తీసుకుంటాయి. ఇటువంటి కోర్సులను నిర్వహించే అవకాశం పొందడం గర్వకారణమని వీసీ ఆచార్య జీపీ రాజశేఖర్ అభినందించారు.

ప్రారంభించారు.. కొనుగోలు మరిచారు!

గత నెలలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన అధికారులు, ప్రజాప్రతినిధులు

వై.రామవరం, న్యూస్‌టుడే: వై.రామవరంలో ధాన్యం కొనుగోలు చేసేందుకు గత నెలలో కేంద్రాన్ని ప్రారంభించారు. నెల గడుస్తున్నా నేటికీ ధాన్యం కొనుగోలు చేసేందుకు వ్యవసాయ అధికారులు చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు. మండలంలో వరికోతలు, నూర్పులు ముమ్మరంగా సాగుతున్నాయి. ధాన్యాన్ని ఎక్కడ అమ్మాలో తెలియక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వ్యవసాయశాఖాధికారిణి సుజాత సంప్రదించగా.. సంచులు ఇంకా రాలేదని, వచ్చిన వెంటనే కొనుగోలు ప్రారంభిస్తామన్నారు.

చింతపల్లిలో విత్తనోత్పత్తి కేంద్రం!

చింతపల్లి, న్యూస్‌టుడే: చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రానికి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు మంజూరైంది. తొలిసారిగా విత్తనోత్పత్తి కేంద్రాన్ని దిల్లీలోని అఖిల భారత సమన్వయ పరిశోధనా సంస్థ మంజూరు చేసింది. ఇందుకోసం రూ.80 లక్షల నిధులు కేటాయించినట్లు చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానం ఏడీఆర్ డాక్టర్ అప్పలస్వామి సోమవారం తెలిపారు. పరిశోధనా స్థానం ఏర్పడిన 40 ఏళ్లకు గిరిజన రైతులకు మేలు చేకూరేలా విత్తనోత్పత్తి కేంద్రానికి అధికారులు చర్యలు తీసుకున్నారన్నారు. ఇప్పటివరకూ పరిశోధనలకే పరిమితమైన ఈ కేంద్రం ఇక నుంచి గిరిజన ప్రాంత రైతులకు మేలు రకపు విత్తనాలను అందించేందుకూ పనిచేస్తుందన్నారు. ఈ నెలాఖరులోగా ఈ-టెండర్లను ఆహ్వానిస్తామన్నారు. రూ.35 లక్షలతో యంత్రాలు, రూ.20 లక్షలతో భవనాలు, రూ.25 లక్షలు విత్తన హబ్‌కు కేటాయిస్తామన్నారు. వచ్చే ఏడాది ఈ కేంద్రం అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. రాగులు, రాజ్‌మా, వలిసెలు, చిరుధాన్యాలు, అన్ని రకాల విత్తనాలకు సంబంధించి ఇక్కడ జీన్ బ్యాంకు ఏర్పాటు చేయనున్నట్లు ఏడీఆర్ చెప్పారు.

ప్రశాంతంగా ముగిసిన పీఎల్‌జీఏ వారోత్సవాలు

సీలేరు, న్యూస్‌టుడే: ఆంధ్రా, ఒడిశా సరిహద్దు (ఏవోబీ)లో మావోయిస్టు ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం (పీఎల్‌జీఏ) వారోత్సవాలు ప్రశాంతంగా ముగిశాయి. ఏటా డిసెంబరు 2 నుంచి 8 వరకు మావోయిస్టులు పీఎల్‌జీఏ వారోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. గత నెల 18, 19 తేదీల్లో మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో జరిగిన ఎదురుకాల్పుల్లో కేంద్ర కమిటీ సభ్యుడు హిడ్మాతో సహ 13 మంది మావోయిస్టులు మృతి చెందడంతో మావోయిస్టులు ప్రతీకారం తీర్చుకుంటారన్న నిఘా వర్గాల హెచ్చరికలతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. మారుమూల ప్రాంతాలకు వెళ్లే బస్సు సర్వీసులను రద్దు చేశారు. గిరిజన గ్రామాల ప్రజలు భయాందోళనతో జీవనం సాగించారు. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు సీలేరు ఎస్సై యాసిన్ సిబ్బందితో సరిహద్దు, రామాలయం కూడళ్లలో తనిఖీలు చేపట్టారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా వారోత్సవాలు ముగియడంతో ఊపిరి పీల్చుకున్నారు.

రాత్రిబస్సుల పునరుద్ధరణ : మావోయిస్టు పీఎల్‌జీఏ వారోత్సవాలు, బంద్ సందర్భంగా గత నెల 29 నుంచి రద్దు చేసిన ఆర్టీసీ బస్సులను మంగళవారం నుంచి పునరుద్ధరిస్తున్నట్లు విశాఖ డిపో మేనేజర్ మాధురి తెలిపారు. విశాఖ నుంచి సీలేరు మీదుగా భద్రాచలం వెళ్లే రాత్రి బస్సు సర్వీసుల తోపాటు పాడేరు - భద్రాచలం, భద్రాచలం - పాడేరు, విశాఖ - సీలేరు రాత్రి సర్వీసులు యథావిధిగా నడుస్తాయన్నారు. రిజర్వేషన్ సదుపాయాన్ని పునరుద్ధరించినట్లు చెప్పారు.

రామాలయం కూడలి వద్ద పోలీసుల తనిఖీలు

ప్రభుత్వ ఉద్యోగికి స్క్రబ్‌టైఫస్

చింతూరు, న్యూస్‌టుడే: చింతూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగికి స్క్రబ్‌టైఫస్ పాజిటివ్‌గా నిర్ధారణ అయినట్లు సూపరింటెండెంట్ కోటిరెడ్డి సోమవారం తెలిపారు. అధిక జ్వరం, ఒంటి నొప్పులతో ఆరోగ్య కేంద్రానికి వచ్చిన ఆయనకు పరీక్షలు నిర్వహించగా.. స్క్రబ్‌టైఫస్ పాజిటివ్‌గా తేలిందన్నారు. ప్రస్తుతం సీహెచ్‌సీలోనే చికిత్స పొందుతున్నాడని, ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందన్నారు. చింతూరు సీహెచ్‌సీలో వ్యాధి నిర్ధారణ కిట్లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు.

WANTED
ప్రముఖ 2 వీలర్ ఫైనాన్స్ కంపెనీ వారి చింతూరు, భద్రాచలం బ్రాంచీలలో పనిచేయుటకు
★ కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్
★ బిజినెస్ ఎగ్జిక్యూటివ్స్
కావలెను.
శ్రీ సత్య ఫైనాన్స్ కార్పొరేషన్
Opp: అక్షయ ఫంక్షన్ హాలు, చర్ల రోడ్, భద్రాచలం
85006 44978
88863 33600

పోలవరం ముంపు అడవుల సర్వే

రేంజ్	ముంపు ప్రాంతం హెక్టార్లలో..	కంపార్టుమెంట్లు
కూనవరం	605	17
వరరామచంద్రాపురం	512.62	04
చింతూరు	368.29	03
నెల్లిపాక	16	01

చింతూరు, కూనవరం, న్యూస్‌టుడే: పోలవరం ప్రాజెక్టు పరిధిలో ఇప్పటి వరకు నిర్వాసితుల లెక్కలు తేల్చిన ప్రభుత్వం ఈ ప్రాజెక్టు ముంపులో ముంపునకు గురవుతున్న అటవీ ప్రాంతం లెక్కలు తేల్చేందుకు సర్వే చేస్తోంది. వచ్చే ఏడాదిలోగా ప్రాజెక్టును పూర్తి చేయాలన్న లక్ష్యంగా పెట్టుకోగా, నష్టపోతున్న అన్ని రంగాల డేటాను సేకరిస్తోంది. ఇప్పటివరకు నిర్వాసిత గ్రామాలు, నిర్వాసితుల లెక్కలు తేటతెల్లమయ్యాయి. వారికి ఇవ్వాల్సిన పునరావాసం, సాగు భూములు, పరిహారాల వివరాలు కొలిక్కి వచ్చాయి. అటవీ సంపద లెక్కలను జలవనరుల శాఖ అధికారులు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. గతంలోనే అటవీ శాఖ సర్వేలు చేపట్టి అడవుల లెక్కలు గణించింది. తాజాగా మార్పులు, చేర్పులపై నాలుగు నెలలుగా అధికారులు దృష్టిసారించారు. కూనవరం, వరరామచంద్రాపురం, ఎటపాక రేంజ్‌ల పరిధిలో ముంపునకు గురవుతున్న అడవులు లెక్కలు కడుతున్నారు. చింతూరు, కూనవరం, వరరామచంద్రాపురంలలో అధికంగా అడవులు ముంపునకు గురవుతుండగా నెల్లిపాక రేంజ్‌లో కొంతమేరకు నష్టం వాటిల్లుతోంది. నాలుగు మండలాల్లోని సిబ్బంది అడవుల్లో కోల్పోతున్న మొక్కలు, చెట్లు, విలువైన సంపద వివరాలను సేకరిస్తున్నారు. ఇక్కడ కోల్పోతున్న అడవులకు నష్టపరిహారంతోపాటు ముంపు లేని ప్రాంతాల్లో కొత్తగా అడవుల వృద్ధికి ప్రత్యామ్నాయంగా భూములు చూపనున్నారు.

ముంపునకు గురయ్యే అటవీ ప్రాంతం

వినతులు పునరావృతం కానీయొద్దు

రంపచోడవరం, న్యూస్‌టుడే: సమస్యలపై వినతులు పునరావృతం కాకుండా సంబంధిత అధికారులు సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఐటీడీఏ పీవో స్మరణ్‌రాజ్ ఆదేశించారు. ఐటీడీఏ సమావేశ మందిరంలో ఏపీవో డీఎన్‌వీ రమణ, ఈఈ శ్రీనివాసరావు, సబ్ కలెక్టరేట్ ఏవో సావిత్రితో కలిసి సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. వివిధ సమస్యలపై 136 వినతులు వచ్చాయి. వై.రామవరం మండలం చవిటిదిబ్బలులో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని ఎంపీపీ ఆనంద్, జడ్పీటీసీ సభ్యురాలు వెంకటలక్ష్మి వినతిపత్రం ఇచ్చారు. కళాశాల ఏర్పాటుకు గొర్లె రాజేష్‌బాబు రెండెకరాల భూమిని స్వచ్ఛందంగా ఇస్తున్నారని పేర్కొన్నారు. రాజవొమ్మంగిలో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేసి.. గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని బాలకృష్ణ తదితరులు కోరారు. రంపచోడవరం మండలం ముసురుమిల్లి ఆర్అండ్ఆర్ కాలనీలో వాటర్‌ట్యాంకు నిర్మించాలని, శ్మశానానికి స్థలం కేటాయించాలని పెసా కమిటీ ఉపాధ్యక్షుడు వీరబాబు, కృష్ణ విన్నవించారు. గిరిజన సంక్షేమశాఖ డీడీ రుక్మాంగదయ్య, వెటర్నరీ డీడీ షరీఫ్, పీహెచ్‌వో దేవదానం, జీసీసీ డీఎం జయశ్రీ, ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు, డీడీవో కోటేశ్వరరావు, డీఈలు వెంకటరమణ, ప్రదీప్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సమస్యలు వింటున్న ఐటీడీఏ పీవో స్మరణ్‌రాజ్, అధికారులు

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు
ఈనాడు లో ప్రకటనల ద్వారా తెలియజేయండి
THE EENADU WAY CLASSIFIEDS
ఈనాడు క్లాసిఫైడ్స్
పదవీ విరమణ శుభాకాంక్షలు
జన్మదిన శుభాకాంక్షలు
లీగల్ ప్రకటనలు
వేడుక ఏదైనా..
ఈనాడు ను
చేసుకోండి వేదిక
జయంతి, వర్ధంతి
అంత్యక్రియలు,
ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి
ప్రకటనల కొరకు సంప్రదించండి
80087 09638

(c) eenadu

వైద్య శిబిరంలో 180 మందికి సేవలు

వై. రామవరం, న్యూస్‌టుడే: వై. రామవరంలో సోమవారం ఎన్టీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ట్రస్టు మేనేజరు శ్రీకాంత్ మాట్లాడుతూ.. ఎన్టీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో గ్రామాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని, వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా 180 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. తెదేపా మండల అధ్యక్షుడు కాంతారెడ్డి, నాయకులు పల్లాల వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు కంటి పరీక్ష చేస్తున్న వైద్యులు

మోడల్ పరీక్షతో మేలు

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: నవోదయ పరీక్ష రాయబోతున్న విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు మోడల్ పరీక్ష నిర్వహించామని యన్ఆర్‌టెక్ హబ్ ఇన్‌స్టిట్యూట్ నిర్వాహకులు ఎస్. రమేష్ తెలిపారు. చింతపల్లి, గూడెంకొత్తవీధి మండలాలకు చెందిన విద్యార్థులకు సోమవారం పరీక్ష నిర్వహించారు. విద్యార్థుల్లో భయాన్ని పోగొట్టేందుకు ఈ పరీక్ష ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. శెట్టి స్వామి, చంద్రశేఖర్, వంజరి మేరి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పరీక్ష తీరును వివరిస్తున్న ఉపాధ్యాయుడు

డిమాండ్‌కు తగ్గట్లు విద్యుదుత్పత్తి

సీలేరు, న్యూస్‌టుడే: సీలేరు జలవిద్యుత్కేంద్రంలో డిమాండ్‌కు తగ్గట్లు విద్యుదుత్పత్తి చేస్తున్నట్లు ఏపీ జెన్‌కో కార్యనిర్వాహక ఇంజినీరు రాజేంద్రప్రసాద్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. లోడ్ డిస్పాచ్ సెంటర్ ఆదేశాల మేరకు జలవిద్యుత్కేంద్రంలో ఉత్పత్తి చేస్తున్నామన్నారు. ప్రస్తుతానికి నీటినిల్వలు అందుబాటులో ఉన్నప్పటికీ.. పరిమితంగానే వాడుతున్నామని పేర్కొన్నారు. ప్రస్తుతానికి రోజుకు నాలుగు యూనిట్ల ద్వారా ఒక మిలియన్ యూనిట్ ఉత్పత్తి చేస్తున్నామని వివరించారు.

రాజేంద్రప్రసాద్

తాగునీటి సమస్య రానీయొద్దు

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: గ్రామాల్లో తాగునీటి సమస్య రానీయొద్దని ఎంపీడీవో రమణబాబు పేర్కొన్నారు. జర్రెల, మొండిగెడ్డ సచివాలయాలను సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిటిజెన్ ఈ-కేవైసీ, గృహ నిర్మాణ సర్వేలు పూర్తి చేయాలని సూచించారు. ఇంటి పన్నులను పక్కాగా వసూలు చేయాలని ఆదేశించారు. డిప్యూటీ ఎంపీడీవో జగదీష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ కల్యాణ్, పరిపాలనాధికారి ఇమ్మానుయేల్, కార్యదర్శులు, పాల్గొన్నారు.

వెంకయ్యనాయుడితో మర్యాదపూర్వక కలయిక

దేవీపట్నం, న్యూస్‌టుడే: మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడికి గండిపోశమ్మ ఆలయ కమిటీ ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ఈవో లక్ష్మీకుమార్ గండిపోశమ్మ అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. సోమవారం కొంతమూరు వచ్చిన ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. పోలవరం ప్రాజెక్టులో భాగంగా ముంపునకు గురవుతున్న గండిపోశమ్మ అమ్మవారి ఆలయం చరిత్ర, ఇటీవల కూటమి ప్రభుత్వం ఆలయ అభివృద్ధికి భారీగా నిధులు మంజూరు చేసిన విషయాన్ని ఆయనకు వివరించారు. ఆలయ స్వయంభు రక్షణకు ప్రభుత్వం చేపడుతున్న పనులపై హర్షం వ్యక్తం చేశారు.

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడికి గండిపోశమ్మ చిత్రపటం అందజేస్తున్న ఈవో, ఛైర్మన్

ముక్కోటి ఉత్సవాలకు ఏర్పాట్లు

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: శ్రీరామగిరి రామాలయంలో ముక్కోటి ఉత్సవ నిర్వహణపై సోమవారం ఆలయ కమిటీ ఛైర్మన్ పెందుర్తి సుదర్శన్ ఆధ్వర్యంలో ఆలయంలో సమావేశం జరిగింది. గోదావరిలో తెప్పోత్సవం, భక్తులకు వసతుల కల్పనపై చర్చించారు. ఉత్తర ద్వార దర్శన సమయం, దీనిపై గ్రామాల్లో ప్రచారంపై మాట్లాడారు. ఆలయ పరిసరాలు, గోదావరి రేవు, కల్యాణ మండపం పరిశీలించారు. అర్చకులు పురుషోత్తమాచార్యులు, గుమస్తా సాయిబాబు, సత్తిబాబు, లక్ష్మణరావు, సత్యనారాయణ, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఆలయ పరిసరాలు పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

రాజవొమ్మంగి, గంగవరం, న్యూస్‌టుడే: వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని ఎస్సై శివకుమార్ పేర్కొన్నారు. కేంద్ర కూడలి వద్ద మమ్మంగి వాహనాలు తనిఖీలు చేపట్టారు. పలు అంశాలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. శిరస్త్రాణం ధరించాలన్నారు. గంగవరం ఎస్సై వెంకటేష్ ఆధ్వర్యంలో నెల్లిపూడి కూడలిలో వాహనాల తనిఖీలు చేపట్టారు.

కేంద్ర కూడలి వద్ద వాహనదారులతో మాట్లాడుతున్న ఎస్సై శివకుమార్

ఉష్ణోగ్రతలు తగ్గుముఖం

పాడేరు మన్యం చలిగుప్పిట్లో చిక్కుకుంది. ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోయాయి. పొగమంచు దట్టంగా కురుస్తోంది. వృద్ధులు, చిన్నారులు చలికి అల్లాడిపోతున్నారు. ఉదయం 11 గంటల వరకు మంచు కురుస్తోంది. సాయంత్రం నాలుగు గంటల నుంచి చలి మొదలవుతోంది. పర్యాటకులు ఇక్కడి మంచు అందాలను ఆస్వాదిస్తున్నారు. సందర్శకులను ఆకట్టుకునేలా రిసార్ట్ నిర్వాహకులు క్యాంప్ ఫైర్ ఏర్పాట్లు చేస్తున్నారు. మరో రెండు రోజులు ఇక్కడ చలి ఎక్కువగా ఉండనుందని అధికారులు చెబుతున్నారు. – పాడేరు, చింతపల్లి, న్యూస్‌టుడే

చలిలో వ్యాయామం చేస్తున్న ఆశ్రమ విద్యార్థులు

డీటీఎఫ్ జిల్లా కార్యవర్గ ఎన్నిక

పాడేరు పట్టణం, న్యూస్‌టుడే: డీటీఎఫ్(డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్) జిల్లా నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. స్థానిక గిరిజన భవన్‌లో రాష్ట్ర ఉపాధ్యక్షులు ధర్మేంద్రరెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కార్యవర్గ ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా ఎస్.గురుదొర, ఉపాధ్యక్షులుగా ఎంవీ రమణనాయుడు, జె.సింహాచలం, వి మాధవరావు, ప్రధాన కార్యదర్శిగా దేముడు, కార్యదర్శులుగా ప్రసాదరావు, రాజుబాబులు, ఆడిట్ కమిటీ సభ్యులుగా కిముడు కామేశ్వరరావు, కిలో జలంధర్, రాష్ట్ర కౌన్సిలర్లుగా రామకృష్ణ, వికాస్, ఆనందరావు, తిరుపతిరావు ఎన్నికయ్యారు. అనంతరం ముక్కి శేషాద్రి, ప్రసాదరావు, వెంకటమరణ ఆధ్వర్యంలో కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.

ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

రైతేరాజు

చింతపల్లిలోనూ రబ్బరు వనాలు

మారేడుమిల్లితోపాటు చింతపల్లిలోనూ రబ్బరు వనాలను పెంచుతున్నారు. ఉద్యాన పరిశోధనా క్షేత్రంలో పరిశోధనల నిమిత్తం చాన్నాళ్ల కిందట నాటారు. వీటి సాగుకు వాతావరణం అనుకూలంగా ఉండటంతో అల్లూరి జిల్లా మారేడుమిల్లి, రంపచోడవరం ప్రాంతాల్లో గిరిజన రైతులు సాగు చేస్తున్నారు. ఈ చెట్ల కాండాల నుంచి సేకరించిన పాలతో రబ్బరు తయారు చేస్తారు. చింతపల్లి ఉద్యాన పరిశోధనా స్థానంలో రబ్బరు వనాలు ఆశాజనకంగా పెరుగుతున్నా వాటి నుంచి పాలను సేకరించడం లేదని ఉద్యాన పరిశోధనా స్థానం శాస్త్రవేత్త చెట్టి బిందు తెలిపారు. – న్యూస్‌టుడే, చింతపల్లి

గులి రాగి.. సిరుల పంట

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: రసాయన ఎరువులు, పురుగు మందులు వినియోగించకుండా ప్రకృతి వ్యవసాయ విధానంలో స్థానికంగా లభ్యమయ్యే సేంద్రియ ఎరువులతో గిరిజన రైతులు పంటలు సాగు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. వరిలో శ్రీవరి సాగు, రాగుల్లో గులిరాగి పద్ధతులను అవలంబిస్తూ సాధారణం కంటే అధిక దిగుబడి సాధిస్తున్నారు. సాధారణ సాగు విధానంలో కంటే కొద్దిపాటి పెట్టుబడితోనే నాలుగు రెట్ల దిగుబడి పొందవచ్చని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

★ పాడేరు మన్యంలోని 11 మండలాల్లో వ్యవసాయ శాఖ ఎంపిక చేసిన గ్రామాల్లో మూడేళ్లుగా గులిరాగి పద్ధతిలో సాగు చేస్తున్నారు. మన్యం వ్యాప్తంగా 15 వేల హెక్టార్లలో సాధారణ పద్ధతిలో సాగవుతుండగా, గులిరాగి విధానంలో 5 వేల ఎకరాల్లో పండిస్తున్నారు. ఈ విధానాన్ని అన్ని గ్రామాలకు విస్తరించేందుకు వ్యవసాయ అధికారులు కసరత్తు చేస్తున్నారు.

సాధారణం కంటే నాలుగింతల అధిక దిగుబడి


వనుగుపుట్టులో సాగవుతున్న రాగి పంట

★ ముంచంగిపుట్టు మండలంలో ఈ ఏడాది వెయ్యి ఎకరాల్లో గులిరాగి విధానంలో రాగి పంట సాగైంది. మాకవరం, బంగారుమెట్ట, ఏనుగురాయి, కుమడ, పెదగడ, పనసపుట్టు, జర్రెల, కుమడ, కరిముఖిపుట్టు, జర్జుల, సుజనకోట పంచాయతీలకు చెందిన రైతులు అధిక దిగుబడులు నమోదు చేశారు.

★ సుజనకోట పంచాయతీ వనుగుపుట్టు రైతు రామకృష్ణ ఎకరా విస్తీర్ణంలో గులి రాగి విధానంలో సాగు చేశారు. సాధారణ సాగు విధానంలో ఐదు క్వింటాళ్ల దిగుబడి రాగా.. గులి రాగి విధానంలో 500 గ్రాముల విత్తనాలతో 20 క్వింటాళ్ల దిగుబడి సాధించి రైతులందరికీ ఆదర్శంగా నిలిచారు.

★ అందుబాటులో ఉన్న, స్థానికంగా లభ్యమయ్యే దేశవాళీ రాగుల విత్తనాలను గులి రాగి విధానంలో సాగు చేయవచ్చు. ఘన, ద్రవ జీవామృతం, బీజామృతం విత్తనాలకు కలిపి నారుగా పోయాలి. 12 రోజుల తర్వాత నారు తీసి పొలంలో అడుగు దూరం ఉండేలా వరుసగా నాటాలి. పక్షం రోజులకోసారి మొక్కను కదిలించాలి. పశువులతో తొక్కించడం, మొక్కలను తాడు, దుడ్డు సాయంతో కదపడం ద్వారా మొక్కలు కదిలి, ఎక్కువ పిలకలు వస్తాయి. పిలకలకు వెన్నులు అధికంగా రావడం ద్వారా దిగుబడి పెరుగుతుంది. నాలుగు నెలలకే పంట కోతకు వస్తుంది.

★ సాధారణ పద్ధతిలో 25 రోజుల తర్వాత నాటితే.. గులిరాగి విధానంలో 15 రోజులకే నాటుతారు. రసాయన ఎరువులు వినియోగించకుండా గోమూత్రం, పేడ, ఆకులు, సెనగపిండి, బెల్లంతో చేసిన ఘన, ద్రవ జీవామృతం, సేంద్రియ ఎరువులు వినియోగిస్తూ సాగు చేస్తారు. చీడపీడలు ఆశించకుండా పసుపు రంగు చట్రాలను ఏర్పాటు చేసుకోవాలి. ఈ చట్రాలపై ఉండే జిగురు పదార్థం రెక్క పురుగులను నియంత్రిస్తుంది. పెదగుడ, బంగారుమెట్ట రైతు సేవా కేంద్రాల్లో వెయ్యి మెట్రిక్ టన్నుల రాగుల కొనుగోలుకు చర్యలు చేపడుతున్నట్లు ఏఓ మురళీకృష్ణ చెప్పారు. కేజీ రూ.43 చొప్పున కొనుగోలు చేస్తామన్నారు.

రెల్లరాల్చు, మానిపండు తెగులు.. నివారణ చర్యలు

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: వరి కోత దశలో మానిపండు తెగులు, రెల్లరాల్చు పురుగులు నష్టం కలిగిస్తున్నాయి. కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం పరిధిలోని గ్రామాల్లో మానిపండు తెగులు ఎక్కువగా ఉన్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. నివారణ చర్యలను కేవీకే ప్రధాన శాస్త్రవేత్త రాజకుమార్ సూచిస్తున్నారు.

మాని పండు తెగులు: గింజ పాలు పోసుకునే దశ నుంచి కోత వరకు ఆశించే తెగుళ్లలో ఇది ముఖ్యమైనది. విత్తన సేకరణలో జాగ్రత్తలు తీసుకోకపోవడం, విత్తనశుద్ధి లోపం వల్ల ఈ తెగులు వ్యాప్తి చెందుతుంది. అండాశయంలో శిలీంద్రం పెరుగుదల వల్ల పసుపు పచ్చరంగు ముద్దగా అభివృద్ధి చెంది, ఆకుపచ్చ రంగులోకి మారి చివరకు నల్లగా మారుతుంది. గింజ స్థానంలో శిలీంద్ర బీజ సముదాయం ఏర్పడుతుంది. నివారణకు ప్రొపికోనజోల్ లీటరు నీటిలో 25 ఇ.సి. 1 మి.లీ. కలిపి పొట్టదశ, వెన్నులు వచ్చే దశలో సాయంత్రం వేళల్లో పిచికారీ చేయాలి.

రెల్ల రాల్చు పురుగు: అన్ని ప్రాంతాల్లో ఓ మోస్తారుగా ఈ పురుగు ఆశిస్తుంటుంది. ఒక్కోసారి తీవ్రంగా వ్యాపించి పంటకు నష్టం కలిగిస్తుంది. లద్దెపురుగులు గింజ పాలుపోసుకునే దశ నుంచి గింజ గట్టిపడే తరుణంలో పైరును రాత్రివేళల్లో ఆశించి వెన్నులలో రెల్లను కొరికి రాల్చివేస్తాయి. పగటిపూట లద్దె పురుగులు మొక్క మొదళ్లలో పిలకల మధ్య దాగి ఉంటాయి. కంకి వెలువడక ముందు పురుగు ఆశిస్తే.. ఆకులను తిని నష్టం కలిగిస్తాయి. కంకి వచ్చాక ఆశిస్తే గింజలతో కూడిన కంకిని కొరికి రాల్చేస్తాయి. వాతావరణ పరిస్థితులను బట్టి ఇది వ్యాపిస్తుంది. బంగారుమెట్ట, లోతూడి, ఎల్.సింగవరం తదితర గ్రామాల్లోని వరి పొలాల్లో ఈ పురుగు ఉద్ధృతి ఎక్కువగా ఉంది. నివారణ చర్యలను సాయంత్రం వేళల్లో చేపట్టాలి. పురుగు తీవ్రత తక్కువగా ఉంటే నివారణకు క్లోరిపైరిఫాస్ 2 మి.లీ. మందు లీటరు నీటిలో/ ఎసిఫేట్ 2.5 గ్రాములు లీటరు నీటిలో/ ఫిప్రోనిల్ 400 మి.లీ. మందు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయవచ్చు.

పురుగు కొరికేయడంతో నేలపై రాలిన వరివెన్నులు

రైతు ప్రశ్న శాస్త్రవేత్త సలహా

? మన్యంలో వాతావరణ పరిస్థితులను బట్టి రసాయన ఎరువులను వినియోగించవద్దంటున్నారు. తెగుళ్లు ఆశించి దిగుబడులు రావడం లేదు. ప్రత్యామ్నాయమేంటి. – రామచంద్రరావు, జి.మాడుగుల

✔: వరి, రాజ్‌మా వంటి పంటల్లో ద్రవరూప జీవన ఎరువులను వినియోగించాలి. రాజ్‌మాలో రైజోబియం వంటి ద్రవరూప జీవన ఎరువుల వినియోగం వల్ల తెగుళ్లను నియంత్రించడంతోపాటు అధిక దిగుబడులు సాధించవచ్చు.

? వేరు సెనగను ఇప్పుడు వేసుకోవచ్చా. – పరమేశ్వరరావు, గొందిపాకలు

✔: నీటి సదుపాయం ఉన్నచోట రబీలో ఆరుతడి పంటగా వేరుసెనగ సాగు చేయవచ్చు. పూత దశలో మొక్క మొదళ్లలో ఎకరాకు 200 కేజీల జిప్సం వేయడం ద్వారా మంచి దిగుబడులు వస్తాయి.

జీవన ఎరువులతో సత్ఫలితాలు

? తుపాను ప్రభావంతో మన్యంలో వర్షాలు పడుతున్నాయి. కోతకు వచ్చిన వరి పొలాలకు ఏమైనా ఇబ్బంది ఉంటుందా. –గిరిబాబు, తాజంగి

✔: పంట కోయకుండా ఉంటే వర్షం పడినా ఇబ్బందేమీ ఉండదు. కోసిన పనలను మడులో ఉండకుండా చూసుకోవాలి. కుప్ప వేసి తడవకుండా టార్పాలిన్లు కప్పితే సరిపోతుంది.

★ రైతుల ప్రశ్నలు, సందేహాలకు కేంద్ర విస్తరణ విభాగం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ పీటీ ప్రదీప్‌కుమార్ సమాధానాలు ఇచ్చారు. – న్యూస్‌టుడే, చింతపల్లి

సాగులో సందేహాలా.. ఫోన్ చేయండి

రైతుల ప్రశ్నలు, సందేహాలకు అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డి.శ్రీదేవి సమాధానాలిస్తారు. మంగళవారం ఉ. 10- సా. 4 గంటల వరకు 94410 92084 నంబరుకు ఫోన్‌చేయవచ్చు.

తగ్గిన రంగు, మధ్య రకం బెల్లం ధరలు

అనకాపల్లి, న్యూస్‌టుడే: అనకాపల్లి మార్కెట్‌లో గత వారం రోజులుగా రంగు, మధ్య రకం బెల్లం ధరలు తగ్గాయి. రంగులు వంద కేజీలకు రూ.220, మధ్య రకాలు రూ.330 తగ్గాయి. నాసి రకాలు రూ.160 ధరలు పెరిగాయి.

రకం	రంగులు	మధ్య	నాసి
గత వారం (రూ.)	3,985	3,685	3,130
ఈ వారం (రూ.)	3,765	3,355	3,290

తగ్గని గోదావరి

దేవీపట్నం, న్యూస్‌టుడే: గండిపోశమ్మ అమ్మవారి ఆలయం వద్ద గోదావరి నిలకడగా కొనసాగుతోంది. వారం రోజులుగా ఆలయం వరద ముంపులోనే ఉండటంతో మైదాన ప్రాంతాల నుంచి అమ్మవారి దర్శనానికి వస్తున్న భక్తులు కొండ పైనుంచే అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటున్నారు. పోశమ్మ గండి నుంచి దండంగి వైపునకు రహదారిపై వరద నీరు తగ్గకపోవడంతో నేటికీ రాకపోకలు సాగడం లేదు. రెండు బోట్లలో పాపికొండల విహారయాత్రకు సందర్శకులు వెళ్లారని కంట్రోల్ రూం అధికారులు తెలిపారు.

సకాలంలో ఇంటిపన్నుల చెల్లింపు

గంగవరం, న్యూస్‌టుడే: పంచాయతీలో ఉన్న ప్రతిఒక్కరూ ఇంటిపన్నులు సకాలంలో చెల్లించి రసీదులు పొందాలని గంగవరం పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ కోరారు. సోమవారం సచివాలయ సిబ్బందితో కలిసి ఇంటి పన్నులు వసూలు చేశారు. ఆన్‌లైన్‌లోనూ పన్నులు చెల్లించవచ్చని పేర్కొన్నారు.

హోరాహోరీగా ఫుట్‌బాల్ పోటీలు

నరసరావుపేట క్రీడలు, న్యూస్‌టుడే: ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 69వ రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల అండర్-17 బాల బాలికల ఫుట్‌బాల్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. పట్టణంలోని డాక్టర్ కోడెల శివప్రసాదరావు స్టేడియంలో సోమవారం రెండో రోజు బాలుర విభాగంలో తూర్పుగోదావరి- విశాఖపట్నం జట్ల మధ్య లీగ్ పోటీలను ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా 26 ఎకరాల్లో అన్ని వసతులు కలిగిన స్టేడియాన్ని ప్రజలకు మాజీ సభాపతి కోడెల శివప్రసాదరావు అందుబాటులోకి తెచ్చారన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఎన్.సురేష్‌కుమార్ మాట్లాడుతూ వివిధ జిల్లాల నుంచి 13 జట్లు పోటీల్లో పాల్గొంటున్నాయని, ఈ పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేస్తామన్నారు.

పగలు సేకరణ.. రాత్రుళ్లు రవాణా!

కాకినాడకు తరలుతున్న రేషన్ బియ్యం

ఈనాడు డిజిటల్ అనకాపల్లి, ఎలమంచిలి న్యూస్‌టుడే

జిల్లాలో రేషన్ బియ్యం అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. ప్రజాప్రతినిధులు, పోలీసులు తప్పితే.. అక్రమ రవాణాను అరికట్టాల్సిన పౌరసరఫరాల శాఖ అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. పేదలకు అందాల్సిన చౌక బియ్యాన్ని పక్కదారి పట్టిస్తూ అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. ప్రతి నెలా రేషన్ బియ్యం లబ్ధిదారుల ఇళ్లకు చేరక ముందే అక్రమార్కుల పరమవుతోంది. జిల్లా వ్యాప్తంగా ఈ దందాను కట్టడి చేయాల్సిన సంబంధిత అధికారులే దళారులకు సహకరిస్తున్నారన్న విమర్శలున్నాయి.

■ ప్రతి మండలంలోనూ రేషన్ బియ్యం కొనుగోలు చేసేందుకు ముఠాలున్నాయి. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా.. వీరి హవానే సాగుతోంది. చోడవరం, ఎలమంచిలి, రాంబిల్లి, అచ్యుతాపురం మండలాల్లో వీరికి ఎదురే లేదు. ఆయా మండలాల్లో రేషన్ బియ్యాన్ని దళారులే కొనుగోలు చేయాలన్న ఆదేశాలున్నాయి. పగలు దండటం, సమీపంలోని రైస్ మిల్లుల్లో నిల్వ చేయడం చేస్తున్నారు. అర్ధరాత్రి సమయంలో లోడ్ చేసి కాకినాడ పోర్టుకు తరలిస్తున్నారు. అధికారులు తమ టార్గెట్‌కు అనుగుణంగా.. దాడులు చేసి దళారుల సూచనల మేరకు నామమాత్రంగా కేసులు నమోదు చేస్తూ చేతులు దులిపేసుకుంటున్నారు. జిల్లాలో కార్డుదారుల నుంచి రేషన్ డీలర్లు కేజీ బియ్యం రూ.18 చొప్పున కొనుగోలు చేస్తున్నారు. వీరు బియ్యం వ్యాపారులకు రూ.20 చొప్పున అమ్ముతున్నారు. వ్యాపారులు పాలిష్ పట్టి కేజీకి రూ.30 ధర నిర్ణయించి కాకినాడకు తరలిస్తున్నారు.

ఎలమంచిలిలో ఇటీవల పట్టుబడిన రేషన్ బియ్యం

■ జిల్లాలో పౌరసరఫరాల శాఖ డీటీలు ఆరుగురు ఉన్నారు. వీరెవరూ ఎక్కడా ఒక్క బియ్యం కేసు పట్టుకున్న దాఖలాల్లేవు. స్థానికులు పట్టుకుని అప్పగించే సందర్భాల్లో మాత్రమే కేసులు నమోదు చేస్తున్నారు. ఎలమంచిలి పౌరసరఫరాల శాఖ డీటీకి గ్రామాల నుంచి ఎవరైనా ఫోన్ చేసి సమాచారం ఇచ్చినా.. ఆ ప్రాంత వ్యాపారులకు సమాచారం చేరవేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఎలమంచిలిలో ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ శనివారం 2,625 కేజీల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. ఎమ్మెల్యే ఫోన్ చేసి చెప్పాక రెవెన్యూ అధికారులు అక్కడకు చేరుకున్నారు.

ప్రత్యేక నిఘా పెట్టాం... ప్రతి నెలా రేషన్ అందించే సమయాల్లో.. బియ్యం పక్కదారి పట్టకుండా దాడులు చేస్తున్నాం. డీటీలు, తహసీల్దార్లు తనిఖీలు చేయాలని ఆదేశాలిచ్చాం. ప్రభుత్వం ఈ విషయంలో కఠినంగా వ్యవహరిస్తోంది. రేషన్ బియ్యం అక్రమ తరలింపుపై ప్రత్యేక నిఘా పెట్టాం. – కేవీఎన్ మూర్తి, డీఎస్‌వో, అనకాపల్లి



ఆర్థిక లావాదేవీలపై అవగాహన

కూనవరం, న్యూస్‌టుడే: పొదుపు సంఘాల మహిళలకు సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఆర్థిక లావాదేవీలపై అవగాహన కార్యాక్రమం నిర్వహించారు. సంఘం నిర్వహణ, రుణాల చెల్లింపును సీఆర్పీలు వివరించారు. గ్రామంలో ప్రదర్శన ఏర్పాటుచేశారు. ఏపీఎం రాధ అపర్ణ, ఎంపీడీవో, సెర్ప్ ఈఎంటీ మేరి, ఎంఎంఎస్ అధ్యక్షురాలు పుల్లమ్మ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సీఆర్పీ

ఖైనీ కోసం వెళ్తే ప్రాణం పోయింది!

గూడెంకొత్తవీధి, చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: ఖైనీ ప్యాకెట్ కోసం దుకాణం వద్దకు వెళ్లి వస్తుండగా గిరిజనుడిని మృత్యువు కబళించింది. జాతీయ రహదారిలో జీకేవీధి మండలం అసరాడలో సోమవారం సాయంత్రం జరిగిన ఈ ఘటనకు సంబంధించి స్థానికులు అందించిన వివరాల మేరకు.. అసరాడ గ్రామానికి చెందిన సలిమితి ఈశ్వరరావు(46) జాతీయ రహదారి నిర్మాణ పనులకు వెళ్లి సోమవారం సాయంత్రం ఇంటికి వచ్చారు. ఖైనీ ప్యాకెట్ కొనుక్కోవడానికి రోడ్డుపైకి వెళ్లాడు. తిరిగి ఇంటికి వస్తుండగా కొట్నాపల్లి గ్రామానికి చెందిన రాంబాబు ద్విచక్రవాహనంపై వేగంగా వస్తూ ఈశ్వరరావును ఢీకొన్నాడు. తీవ్రంగా గాయపడిన ఈశ్వరరావును స్థానికులు చింతపల్లి ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు స్థానికులు పేర్కొన్నారు.

మృతుడు ఈశ్వరరావు

నూతన అధికారుల బాధ్యతల స్వీకరణ

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: గూడెంకొత్తవీధి మండల విద్యాశాఖ అధికారి-2గా గోవిందరావుపడాల్‌ను నియమిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ ఎంఈవో-2గా పనిచేస్తున్న తగ్గి సత్యనారాయణ స్వచ్ఛందంగా తప్పుకోవడంతో మూడు నెలలుగా ఆ పోస్టు ఖాళీగా ఉంది. తాజాగా పెదవలస పాఠశాలలో పనిచేస్తున్న గోవిందరావుపడాల్‌ను నియమించారు. ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించారు. విద్యాశాఖ అధికారి రామన్న, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు ఆయన్ను అభినందించారు. చింతపల్లి ఎంఈవో ప్రసాద్, పూర్వ ఎంఈవో సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


గోవిందరావుపడాల్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

డిప్యూటీ ఎంపీడీఓగా మూర్తి

చింతపల్లి, న్యూస్‌టుడే: చింతపల్లి డిప్యూటీ ఎంపీడీఓగా బీఏఎల్‌మూర్తి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం చింతపల్లి, చౌడుపల్లి సచివాలయాలను తనిఖీ చేశారు. సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు వెంకటరావు, సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శోభన్ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ ఎంపీడీఓ మూర్తికి పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలుకుతున్న సచివాలయ ఉద్యోగులు

రూ.7.40 లక్షలతో శ్మశానం అభివృద్ధి

రంపచోడవరం, న్యూస్‌టుడే: స్థానిక హిందూ శ్మశాన వాటికను పంచాయతీ నిధులు రూ.7.40 లక్షలతో అభివృద్ధి చేస్తున్నట్లు సర్పంచి మంగా బొజ్జయ్య తెలిపారు. ఈ పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. ఎంపీటీసీ సభ్యురాలు ఉలవల లక్ష్మి, వార్డు సభ్యులు వాసు, ఆనంద్, యూత్ నాయకులు శ్రీరామ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి కామరాజు తదితరులు పాల్గొన్నారు.

పనులకు శంకుస్థాపనలో సర్పంచి బొజ్జయ్య, ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మి

JOBS

అమెరికాలో 1 సం|| బాబు ఆలన, పాలన వ్యక్తిగత సంరక్షణ కొరకు అనుభవంగల ఆడవారు కావలెను. అమెరికా వీసా కల్గినవారు మాత్రమే. ✆ 9440803362

ఉచిత శిక్షణ, భోజనం మరియు వసతి సౌకర్యం & ఉద్యోగావకాశాలు. గాజువాకలో అర్హత: 10 ఆపైన. వయస్సు: 18-30. ✆ 9573366622, 9573366611.

223 కిలోల గంజాయి పట్టివేత

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: ఓ మినీ వ్యానులో తరలిస్తున్న గంజాయిని పోలీసులు భద్రాచలం బ్రిడ్జి పాయింట్ వద్ద ఆదివారం రాత్రి పట్టుకున్నారు. 222.96 కిలోలు ఉన్న సరకు విలువ రూ. 1,11,48,300 ఉంటుందని అంచనా. భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ రోహిత్‌రాజ్, ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ సోమవారం విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. వారి కథనం మేరకు... ఎస్సై సతీష్ తన సిబ్బందితో కలిసి ఆదివారం వాహన తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పదంగా కనిపించిన మినీ వ్యానును తనిఖీ చేయగా గంజాయి పట్టుబడింది. సరకు స్వాధీనం చేసుకొని నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నిందితుల్లో ఇద్దరు ఏపీ, ఇద్దరు హైదరాబాద్, ఒకరు ఛత్తీస్‌గఢ్‌కు చెందినవారు ఉన్నారు. నిందితులను కూరపాటి బుచ్చయ్య(ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం మోతుగూడెం), కలుముల రమేశ్(ఇదే మండలం సుకుమామిడి), షేక్ షఫీవుద్దీన్ ఎలియాస్ అబ్దుల్ జాఫర్(బృందావన్ కాలనీ, టోలీచౌకీ) మహ్మద్ మోసీన్(సాలార్‌జంగ్ కాలనీ, హైదరాబాద్), ప్రీతం పాత్రో ఎలియాస్ మున్నా, ఎలియాస్ హరి(ఛత్తీస్‌గఢ్‌లోని ఎంపీ-17 గ్రామం)లుగా గుర్తించారు. వీరు సుకుమామిడి వద్ద కొబ్బరి పీచు కట్టల మధ్యలో 110 గంజాయి పొట్లాలు(222.96 కిలోలు) పెట్టుకొని భద్రాచలం మీదుగా మహారాష్ట్రకు తరలిస్తున్నట్లు వెల్లడించారు. వీరి వద్ద నుంచి వాహనం, గంజాయితో పాటు 4 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. సీఐ నాగరాజు, ఎస్సై సతీష్, సీసీఎస్ బృందాన్ని ఎస్పీ అభినందించారు.

నిందితులతో ఎస్పీ రోహిత్‌రాజ్, ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, సిబ్బంది

చింతూరు ఆసుపత్రికి వితరణ

చింతూరు, న్యూస్‌టుడే: సమారిటన్ ఆఫ్ నేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో చింతూరు ప్రభుత్వ ఆసుపత్రికి స్లీపింగ్ బ్యాగులు, మందులు వితరణ చేశారు. సంస్థ ప్రతినిధి రాము మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసేవలు మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నామన్నారు. స్వచ్ఛంద సంస్థకు సూపరింటెండెంట్ కోటిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

డాక్టర్ కోటిరెడ్డికి సామగ్రి అందజేస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	126	125
లైవ్	153	145
డ్రెస్డ్	222	260
స్కిన్‌లెస్	252	270

(c) eenadu

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: సంపంగిపుట్టు నుంచి బంగారుమెట్ట వరకు రోడ్డు అంతా ఎత్తుగా ఉంది. రోడ్డు వెడల్పు తక్కువగా ఉండటంతో వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. - దాసుబాబు, స్థానికుడు ✓: రోడ్డు విస్తరణకు నిధులు మంజూరు చేయాలని ప్రతిపాదనలు పంపించాం. నిధులు విడుదలైతే పనులు చేపడతాం. - శ్రీదేవి, ఏఈ, ఆర్‌.డబ్ల్యూ.శాఖ, ముంచంగిపుట్టు

మేమున్నాం.. మీకు తోడుగా
పాడేరు: 89853 66570 | అరకులోయ: 63034 86346 | రంపచోడవరం: 94908 77172

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: కుట్రవాడలో చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రం నిరుపయోగంగా మారింది. నిధులు వృథా అవుతున్నాయి. దీన్ని వినియోగంలోకి తీసుకురావాలి. - మంగిరెడ్డి, కుట్రవాడ ✓: కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపడతాం. - రవికిశోర్, ఎంపీడీవో

వ్యాయామం.. చలి మాయం!

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే

చలికాలం బద్ధకిస్తాం.. ఉదయం నిద్ర లేవలేం.. వ్యాయామం అనేదే పక్కనపెట్టి ముసుగుతన్ని పడుకుంటాం. ఇలాంటి పరిస్థితులు అధిగమించాలంటే కసరత్తు తీరు మార్చుకోవాలి. వాతావరణ పరిస్థితులను శరీరానికి అనుగుణంగా మలుచుకోవాలి. చలికాలంలో క్రమం తప్పకుండా వ్యాయామం చేసేవారు కూడా వాయిదా వేస్తుంటారు. ఇలాంటివి సరికాదని శిక్షకులు చెబుతున్నారు. శీతాకాలంలో రోగనిరోధక శక్తిని పెంచుకునేందుకు వ్యాయామం ఏకైక మార్గం అనే విషయం గుర్తించాలన్నారు. వృద్ధులు, ఆస్తమా బాధితులు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలి.

ఓపిక తెచ్చుకుని..

శీతాకాలంలో శక్తి పెంచేందుకు కసరత్తు చేయడం ఉత్తమ మార్గం. ఉత్సాహంగా ఉంటే శరీరంలో వెచ్చదనం వస్తుంది. జీర్ణ, జీవక్రియలు పెరుగుతాయి. మెదడు చురుగ్గా పనిచేస్తుంది. మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడకుండా చేస్తుంది. వ్యాయామంతో శ్వాస బాగా ఆడుతుంది. ఎముకలు, కీళ్లు కూడా బలంగా మారుతాయి. గుండె, ఊపిరితిత్తులకు రక్తప్రసరణ జరిగి శీతాకాలంలో వచ్చే వ్యాధులు దరిచేరవు. సాధారణంగా ఈ కాలంలో ఆహారం ఎక్కువగా తీసుకుంటారు. ఈ రకం వ్యాయామాలతో శరీరంలో కొవ్వు అధికంగా నిల్వ ఉండకుండా నిలువరించవచ్చు. సాధారణంగా చలికాలంలో అంతగా చెమట పట్టదు. కొన్ని వ్యర్థాలు చెమట రూపంలో బయటకు వెళ్లవు. కార్డియో ఎక్సర్‌సైజు ద్వారా చెమట బాగా పడుతుంది. దీంతో శరీరం దృఢత్వం కూడా సాధ్యమవుతుంది. ఆత్మవిశ్వాసమూ పెరుగుతుంది.

చింతపల్లి జిమ్‌లో వ్యాయామం చేస్తున్న యువత

జిల్లాలో నమోదైన కనిష్ఠ ఉష్ణోగ్రతలు..

తేదీ	డిగ్రీలు
04-12-2025	14.3
05-12-2025	11.1
06-12-2025	8.1
07-12-2025	5.3
08-12-2025	3.6

వ్యాధులు దరి చేరవు

చలికాలంలో ప్రత్యేకంగా కొన్ని కసరత్తులు చేయాలి. ప్రధానంగా చెమట పట్టే కొన్నింటిని చేస్తే సాధారణంగా వచ్చే వ్యాధులు దరి చేరవు. శారీరక దృఢత్వం కోల్పోరు. ఉదయం వ్యాయామం వల్ల చలిని పారదోలొచ్చు. ఆరోగ్య జీవనం సాగించవచ్చు.
- పి. లోవ, శిక్షకుడు

వేతనాలు జమ చేయండి

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: డిసెంబరు 8వ తేదీ వచ్చినా ఇంత వరకు తమకు వేతనాలు చెల్లించకపోవడం దారుణమని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యూవీ గిరి అన్నారు. మండల గిరిజన ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బొడ్డ గంగరాజుతో కలిసి సోమవారం మాట్లాడుతూ.. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు జీతాలు సక్రమంగా జమ కావడంలేదన్నారు. సకాలంలో రుణాలు చెల్లించలేకపోతున్నారని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు దేముళ్లనాయుడు, పద్మనాభం, మోహనరావు, రామరాజు తదితరులు పాల్గొన్నారు.

వాటర్‌షెడ్ మహోత్సవం 10న

కొయ్యూరు, న్యూస్‌టుడే: ఈనెల 10న కొయ్యూరులో వాటర్‌షెడ్ మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు తెదేపా మండల ప్రధాన కార్యదర్శి టి.దొరబాబు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి హాజరవుతారన్నారు. కూటమి నేతలు, కార్యకర్తలంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా గంగమ్మ పండగ

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: కమలబందలో గంగమ్మ తల్లి పండగ ఘనంగా జరుగుతోంది. ఏటా డిసెంబరులో ఉత్సవాలను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. గిరిజన ఆచారాల ప్రకారం వేడుకలు నిర్వహిస్తున్నారు. థింసా నృత్యంతో గిరిజనులు సందడి చేస్తున్నారు.

గిరిజనుల నృత్య ప్రదర్శన

సీసీ రోడ్ల నిర్మాణానికి వినతి

కొయ్యూరు, న్యూస్‌టుడే: రాజేంద్రపాలెం, రేవళ్ల పంచాయతీల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఆయా పంచాయతీల సర్పంచులు సింహాచలం, వెంకటలక్ష్మి కోరారు. కలెక్టర్ దినేష్‌కుమార్, ఐటీడీఏ పీవో శ్రీపూజను కలిసి వినతిపత్రం అందించారు.

అర్హులు దరఖాస్తు చేసుకోండి

వరరామచంద్రాపురం: ఎస్ఎస్‌సీ జీడీ కానిస్టేబుల్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదలైందని, అర్హులు దరఖాస్తులు చేసుకోవాలని ఎస్సై సంతోశ్‌కుమార్ సోమవారం తెలిపారు. ఈనెల 31లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. వీటిపై ఏమైనా సందేహాలు ఉంటే తమను సంప్రదించాలన్నారు.

పాతబాలారంలో ఇల్లు దగ్ధం

కొయ్యూరు, న్యూస్‌టుడే: పాత బాలారం గ్రామంలో వి.కొండబాబుకు చెందిన తాటాకిల్లు సోమవారం జరిగిన అగ్ని ప్రమాదంలో కాలిపోయింది. ఇంట్లోని నిత్యావసర సరకులు, వస్తువులు అన్నీ కాలిపోవడంతో బాధి కుటుంబం రోడ్డున పడింది. విద్యుత్తు షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. బాధిత కుటుంబాన్ని స్థానిక సర్పంచి, తెదేపా నాయకురాలు అప్పలనర్స పరామర్శించారు. ప్రభుత్వం నుంచి సాయం అందించేందుకు కృషిచేస్తానని పేర్కొన్నారు.

15 నుంచి 'సరస్' ప్రదర్శనలు

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్రవిశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో ఈనెల 15 నుంచి 26వరకు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి సరస్ (సేల్ ఆఫ్ ఆర్టికల్స్ ఆఫ్ రూరల్ ఆర్టిసియన్స్ సొసైటీ) ప్రదర్శన నిర్వహించనున్నారు. ఇందులో స్వయం సహాయక సంఘాలు తయారు చేసిన ఉత్పత్తులను విక్రయించనున్నారు. సుమారు 250వరకు స్టాల్స్ ఏర్పాటు చేస్తారు. రాష్ట్రం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాలకు చెందిన స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు తమ ఉత్పత్తులను ఇక్కడ స్టాల్స్‌లో విక్రయించనున్నారు. ఈ ప్రదర్శన కోసం నిరంతరం విద్యుత్తు సరఫరా చేస్తారు. ఒక వేళ సరఫరాలో అంతరాయం కలిగితే జనరేటర్ అందుబాటులో ఉంచుతారు. మొబైల్ టాయిలెట్లను ఏర్పాటు చేయనున్నారు. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఆయా ఏర్పాట్లు జరుగుతున్నాయి.

అప్రెంటీస్‌షిప్ మేళాకు 135 మంది ఎంపిక

విశాఖపట్నం, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాత ఐటీఐలో సోమవారం నిర్వహించిన ప్రధాన మంత్రి జాతీయ అప్రెంటీస్‌షిప్ మేళాకు స్పందన లభించింది. వివిధ ట్రేడులకు చెందిన సుమారు 300పైగా విద్యార్థులు పాల్గొన్నారు. వివిధ కంపెనీ ప్రతినిధులు పాల్గొని విద్యార్థుల ధ్రువపత్రాలు పరిశీలించారు. వారిలో 135 మందిని ప్రాథమికంగా ఎంపిక చేశారని ప్రిన్సిపల్ ఎన్.సోలమన్ తెలిపారు.

కలెక్టరేట్ ముట్టడి 12న

పెదబయలు గ్రామీణం, న్యూస్‌టుడే: తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు విన్నవించారు. సోమవారం సీడీపీవో స్రవంతిని కలిసి వినతిపత్రం అందించారు. ఈనెల 12వ తేదీన సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి తలపెట్టామని తెలిపారు. సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

సీడీపీవోకు వినతిపత్రం అందిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

సమయపాలన తప్పనిసరి

కొయ్యూరు, న్యూస్‌టుడే: గ్రామ సచివాలయం ద్వారా ప్రజలకు సకాలంలో సేవలందించాలని డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు అన్నారు. రేవళ్ల గ్రామ సచివాలయాన్ని సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాజరుపట్టీ, రికార్డులు పరిశీలించారు. సచివాలయ ఉద్యోగులంతా సమయపాలన పాటించాలని పేర్కొన్నారు.

వేంగడలోనే ఆన్‌లైన్ సేవలు

అనంతగిరి, న్యూస్‌టుడే: వేంగడ పంచాయతీ కేంద్రంలో సచివాలయం లేకపోవడంతో పంచాయతీవాసులు ఆన్‌లైన్ పనులకు ఇబ్బందులు పడుతుండేవారు. ఈ విషయాన్ని జడ్పీటీసీ సభ్యుడు గంగరాజు దృష్టికి స్థానికులు తీసుకొచ్చారు. పంచాయతీ కార్యదర్శి, సర్పంచిలతో ఆయన మాట్లాడి వేంగడలో ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చారు.

ఘనంగా ఐక్య క్రిస్మస్

హుకుంపేట, న్యూస్‌టుడే: గూడ పంచాయతీ పాటిమామిడి గ్రామంలో మండల పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ఐక్య క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఆఫ్ హోల్డ్ స్వచ్ఛందసేవ సంస్థ వ్యవస్థాపకుడు అంజూరి తిమోతి, పాస్టర్ వి.మోజెష్, అనిల్‌కుమార్, రీమాలి జాన్, ప్రేమ్‌కుమార్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పాకలో చదువులు.. ఎన్నాళ్లీ పాట్లు!

మన్యంలో పలుచోట్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు భవనాలు సమకూరక బాలిబాలికలు ఇబ్బందులు పడుతున్నారు. పాకల్లో చదువు సాగిస్తున్నారు. ఏనుగురాయి పంచాయతీ బొండాపుట్టు గ్రామంలో 30 మంది విద్యార్థులు చదువుతున్నారు. ముగ్గురు ఉపాధ్యాయులు ఉన్నారు. భవనాలు లేక పాకలో, అసంపూర్తిగా ఉన్న భవనంలోనూ చదువు సాగిస్తున్నారు. గత ప్రభుత్వం భవనాల నిర్మాణానికి రూ.5 లక్షలు విడుదల చేసి.. రెండో దశలో రద్దు చేసింది. విడుదలైన నిధులతో పునాదులు వేసి వదిలేశారు. కొత్త భవనాలు మంజూరు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.
- ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే

బొండాపుట్టులో పాకలో నిర్వహిస్తున్న పాఠశాల

రేషన్ సరకులకు బారులు

గంగవరం జీసీసీ రేషన్ డిపో వద్ద సోమవారం కార్డుదారులు బారులుతీరారు. నాలుగు గ్రామాల ప్రజలకు ఇక్కడే సరకులు అందిస్తుండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. లబ్ధిదారుల వేలి ముద్రలు సక్రమంగా పడక, మొబైల్ సంకేతాలు అందక గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుసుమరాయి, రాజంపాలెం, ఆముదాల బంధ గ్రామాల్లోనే సరకులు అందించేలా ఏర్పాట్లు చేయాలని అక్కడి ప్రజలు కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, గంగవరం

మూలకు చేరిన మిల్లులు

గిరి మహిళల ఆర్థిక స్వావలంబనకు గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలో వెలుగు ద్వారా రుణాలు కల్పించి పిండి మిల్లులను మంజూరు చేశారు. వైకాపా ప్రభుత్వం గిరిజన మహిళలకు ఉపాధి కల్పనపై నిర్లక్ష్యం వహించడంతో ఈ యంత్రాలు అటకెక్కాయి. డ్వాక్రా మహిళలకు ప్రోత్సాహం లేక మిల్లులు మూలకు చేరాయి. కూటమి ప్రభుత్వం స్పందించి వీటిని పునరుద్ధరించాలని మహిళలు కోరుతున్నారు. - డుంబ్రిగుడ, న్యూస్‌టుడే

పెదపాడులో నిరుపయోగంగా...

మూడేళ్లయినా పట్టదా?

కించుమండలో కనుమరుగైన ఏటీఎం

మన్యంలో జాతీయ రహదారి విస్తరణతో గిరిజనులకు ఉపయోగకరంగా ఉన్న కేంద్రాలు కనుమరుగయ్యాయి. మూడేళ్ల క్రితం కించుమండలో జాతీయ రహదారి విస్తరణ పనులు జరిగాయి. ఈ పనులతో ఎస్‌బీఐ ఏటీఎంను తొలగించారు. నేటికీ సంబంధిత అధికారులు దీన్ని పునరుద్ధరించలేదు. ఖాతాదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కించుమండలో ఏటీఎం ఏర్పాటు చేయాలని వినియోగదారులు కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, డుంబ్రిగుడ

జాతీయస్థాయి కరాటే పోటీలకు ఎంపిక

కొయ్యూరు, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో పెదమాకవరం గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు. ఈనెల 7న అనపర్తిలో జరిగిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో తొమ్మిదో తరగతి చదువుతున్న సోమెల కీర్తి, లోచెల రాజ్యలక్ష్మి వెండి, దేవరాజు దుర్గా నాగలక్ష్మి రజత పతకాలు సాధించారు. వీరిని హెచ్‌ఎం సంధ్య, డిప్యూటీ మేట్రిన్ పద్మ, ఉపాధ్యాయులు సోమవారం అభినందించారు. ముగ్గురు విద్యార్థినులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం చెప్పారు.

విద్యార్థినులను అభినందిస్తున్న హెచ్‌ఎం సంధ్య, ఉపాధ్యాయులు

కరాటే పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

క్రీడాలోకం

ఎటపాక, న్యూస్‌టుడే: విద్యార్థులకు చదువుతోపాటు కరాటేలో ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు ఆదిత్య పాఠశాల డైరెక్టర్ వెంకట్, ప్రిన్సిపల్ రాజ్యలక్ష్మి చెప్పారు. తోటపల్లి శ్రీఆదిత్య పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి కరాటే పోటీల్లో సత్తా చాటి విజేతలుగా నిలిచారు. సోమవారం వారికి అభినందన సభ జరిగింది. బ్లాక్, గ్రీన్, బ్రౌన్ బెల్టులు సాధించిన సాయి అనన్య, రోహిత్, దీప్తికి ప్రశంసా పత్రాలు, పతకాలు అందజేశారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో రజత పతకం

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: వెయిట్ లిఫ్టింగ్‌లో 58 కేజీల విభాగం పోటీల్లో గొల్లోరి లెనిన్ ప్రియ రజత పతకం సాధించింది. పోతంగి పంచాయతీ బోడిగుడ గ్రామానికి చెందిన విద్యార్థిని కడప జిల్లా పుట్టంపల్లిలోని డాక్టర్ వైఎస్సార్ స్పోర్ట్స్ స్కూల్‌లో పదో తరగతి చదువుతోంది. కేరళ రాష్ట్రం త్రిసూర్‌లో జరిగిన ఖేలో ఇండియా వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో సత్తా చాటింది. ఈమెను కుటుంబికులు, గ్రామస్థులు అభినందించారు.

లెనిన్ ప్రియతో శిక్షకులు

శిరస్త్రాణంతో ప్రాణాలకు రక్షణ

అరకులోయ, న్యూస్‌టుడే: వాహనదారులు శిరస్త్రాణం ధరించడంతో ప్రమాదాల్లో ప్రాణాలతో బయటపడొచ్చని పాడేరు డీఎస్పీ షెహబాజ్ అహ్మద్ అన్నారు. అరకులోయలో సోమవారం శిరస్త్రాణంపై పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. హెల్మెట్ లేని కారణంగా ఎక్కువమంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. వాహనదారులకు లైసెన్స్ ఉండాలన్నారు. సీఐ హిమగిరి, ఎస్సైలు గోపాలరావు, పాపినాయుడు పాల్గొన్నారు.

★ 'మొంథా' తుపాను సమయంలో పోలీసు శాఖకు సహకరించినవారిని డీఎస్పీ సత్కరించారు. వృక్షాలు, కొండచరియలు తొలగించడంలో జేసీబీ వాహనాల ప్రతినిధులు చక్కగా స్పందించారన్నారు. వాహనాల ప్రతినిధులు శ్రీనివాసరావు, బలరాం, సత్యనారాయణ, ఏఎస్ఐ శ్రీనివాసరావు, హెడ్ కానిస్టేబుల్ సత్యన్నారాయణ, హోంగార్డ్ గురుమూర్తిలను అభినందించారు.

అవగాహన ర్యాలీలో డీఎస్పీ, పోలీసులు

శబరిమలకు పయనం

ముంచంగిపుట్టు గ్రామీణం, న్యూస్‌టుడే: ఆంధ్రా, ఒడిశా సరిహద్దులోని ఒనకఢిల్లీలో సోమవారం అయ్యప్ప నామస్మరణ మార్మోగింది. ఇక్కడి అయ్యప్ప పీఠంకు చెందిన 15 మంది దీక్షధారులకు స్థానిక ముక్తేశ్వర ఆలయంలో ఇరుముడులు కట్టారు. ముందుగా పీఠం గురుస్వామి బి.రామారావు ఆధ్వర్యంలో గణపతి హోమం నిర్వహించారు. అనంతరం మాలధారులు శబరిమలకు పయనమయ్యారు. భక్తులకు ఒనకఢిల్లీకి చెందిన సనాతనపండా దంపతులు అన్నప్రసాద వితరణ చేశారు.

ఇరుముడులతో మాలధారులు

రాయితీపై మినుము విత్తనాల పంపిణీ

రంపచోడవరం, న్యూస్‌టుడే: గిరిజన రైతులకు 100శాతం రాయితీపై మినుము విత్తనాలు అందజేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి కె.లక్ష్మణరావు తెలిపారు. రంప రైతు సేవా కేంద్రంలో సోమవారం మినుము విత్తనాల పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా ఏవో లక్ష్మణరావు మాట్లాడుతూ.. వీబీఎన్-8 విత్తనాలతో పంటలో పురుగు, తెగుళ్లు సోకవని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రంప, మర్రివాడ సర్పంచులు దేవి, కుమారి, పెసా కమిటీ సభ్యులు చెల్లన్నదొర, వీఏఏ మురళి, రైతులు పాల్గొన్నారు.

రంపలో రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏవో లక్ష్మణరావు, సర్పంచులు దేవి, కుమారి

చదువులో వెనుకబడిన విద్యార్థులపై దృష్టి

రంపచోడవరం, న్యూస్‌టుడే: ఏజెన్సీలో ప్రతి విద్యార్థి బాగా చదువుకునేలా సీఆర్‌పీలు ఎప్పటికప్పుడు పాఠశాలలను పరిశీలించాలని ఐటీడీఏ పీవో స్మరణ్‌రాజ్ ఆదేశించారు. స్థానిక ఐటీడీఏలో డీడీ, ఏజెన్సీ డీఈవో, ఎంఈవోలు, సీఆర్‌పీలతో సమీక్ష జరిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు పోషకాహారం అందించేలా సీడీపీవోలు పర్యవేక్షించాలన్నారు. పదో తరగతి విద్యార్థులకు 100 రోజుల కార్యక్రమం పక్కాగా అమలు చేయాలన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. డీడీ రుక్మాంగదయ్య, ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు, ఏటీడబ్ల్యూవో శంబుడు, బీఎస్ కుమార్, ఏటీవో జగన్, జీసీడీవో శాంతిమతి, ఎంఈవోలు శ్రీనివాసరావు, ముత్యాలరావు, త్రిమూర్తులు పాల్గొన్నారు.

ఐటీడీఏ పీవోకు లేఖ అందిస్తున్న ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బొజ్జిరెడ్డి, డైరెక్టర్ సునీత తదితరులు

సమగ్ర శిక్షా సిల్వర్‌జూబ్లీ వేడుకలు నిర్వహించండి

రంపచోడవరం, న్యూస్‌టుడే: సమగ్ర శిక్షా ప్రారంభించి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఐటీడీఏ ఆధ్వర్యంలో సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహించాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్ సోళ్ల బొజ్జిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఐటీడీఏ ఏపీవో కమిషన్ డైరెక్టర్ గొర్లె సునీత, మాజీ ఎమ్మెల్యే శీతంశెట్టి వెంకటేశ్వరరావు, మల్లిరెడ్డి ఛారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ ఫణీంద్ర తదితరులు పీవో స్మరణ్‌రాజ్‌ను కలిసి లేఖ అందించారు. బొజ్జిరెడ్డి మాట్లాడుతూ.. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు, నాణ్యమైన విద్య అందించేందుకు 2000లో అప్పటి ప్రధానమంత్రి వాజపేయి ఎస్ఎస్ఏ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారన్నారు.

గిరి క్రీడాకారులకు ప్రోత్సాహం

అరకులోయ, న్యూస్‌టుడే: గిరిజన క్రీడాకారులు మరింత రాణించేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని శాప్ డైరెక్టర్ జగదీశ్వరి అన్నారు. అరకులోయలోని గిరిజన సంక్షేమ గురుకుల క్రీడా పాఠశాలని సోమవారం ఆమె సందర్శించారు. ఆమె మాట్లాడుతూ.. గిరిజన క్రీడాకారుల్లో ప్రతిభని వెలికితీసేందుకు గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలోనే అరకులోయలో క్రీడా పాఠశాల ఏర్పాటు చేశారన్నారు. పాఠశాలకు పూర్తిస్థాయి భవనం, మైదానం ఏర్పాటు చేసేందుకు తన వంతు కృషి చేస్తున్నానన్నారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఆర్టీసీ రీజియన్ ఛైర్మన్ దొన్నుదొర తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న శాప్ డైరెక్టర్ జగదీశ్వరి

పరిసరాల శుభ్రతకు కృషి

సీలేరు, న్యూస్‌టుడే: సీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో దుప్పిలవాడ పంచాయతీ బూసుకొండలో సోమవారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. వాలంటీర్లు పిచ్చి మొక్కలను తొలగించి వాటిని కాల్చారు. పరిసరాల పరిశుభ్రతకు ప్రతిఒక్కరూ పాటుపడాలని సర్పంచి కుమారి పిలుపునిచ్చారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: రవ్వలగుడ, ఆర్.డుంబ్రిగుడ గ్రామాల్లో అరకులోయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు సేవా కార్యక్రమాలు కొనసాగించారు. రెండు గ్రామాల్లో మొక్కలు నాటారు. ముగింపు కార్యక్రమంలో మాజీ వైస్ సర్పంచి సత్యానందం, ప్రిన్సిపల్ భరత్‌కుమార్ నాయక్ పాల్గొని పర్యావరణం, విద్యార్థులు సామాజిక సేవా అంశాలపై మాట్లాడారు. ఎన్ఎస్ఎస్ పీఓలు విజయలక్ష్మి, నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

బూసుకొండలో చెత్త తొలగిస్తున్న ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు

తెదేపా బలోపేతానికి ఐక్యంగా పనిచేద్దాం

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని తెదేపా మండల అధ్యక్షుడు పొత్తూరు కొండలరావు పిలుపునిచ్చారు. తెదేపా మండల కార్యదర్శి నాగమణి ఆధ్వర్యంలో సోమవారం జీకేవీధిలో పార్టీ సమావేశం నిర్వహించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించేందుకు సమర్థవంతంగా పనిచేయాలన్నారు. వ్యక్తిగత ప్రయోజనాలను పక్కన పెట్టి పార్టీ కోసం శ్రమించాలన్నారు. దేవరాపల్లి సర్పంచి బుజ్జిబాబు, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ శరభన్నదొర, మాజీ సర్పంచి నారాయణమ్మ, తెదేపా నాయకులు నాగేంద్ర, రామారావు, వెంకటలక్ష్మి, బలరాం తదితరులు పాల్గొన్నారు.

జీకేవీధిలో సమావేశమైన తెదేపా నాయకులు

మంచు.. మురిపించు!

మనసును ఆహ్లాదపరిచే ప్రకృతి అందాలకు పుట్టినిల్లు ఫోర్‌బే పర్యాటక ప్రాంతం. ఎన్నిసార్లు చూసినా ఇంకా చూడాలనిపించే అద్భుత దృశ్యాలు ఇక్కడున్నాయి. ఈ ప్రాంతం ప్రస్తుత శీతాకాలంలో ప్రకృతి శోభను సంతరించుకుంది. జలాశయం ఎగువ, దిగువన రమణీయ దృశ్యాలు కనువిందు చేస్తున్నాయి. వేకువజామున మంచుపొరలు కమ్ముకున్న దృశ్యాలను చిత్రీకరించేందు పర్యాటకులు ఆసక్తి చూపుతున్నారు.
- న్యూస్‌టుడే, మోతుగూడెం

సేంద్రియ సాగుతో ఖర్చులు ఆదా

జి.మాడుగుల, న్యూస్‌టుడే: సేంద్రియ సాగుకు ప్రోత్సాహం అందిస్తున్నామని మత్స్యదేవత రైతు ఉత్పత్తిదారుల సంఘం సీఈవో హనుమంతరావు తెలిపారు. చింతగొంది గ్రామంలో సోమవారం రైతులకు వర్మీకంపోస్టు పీట్లు, వానపాములను పంపిణీ చేశారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించి, సహజ ఎరువులతో పంటలు పండించడం ద్వారా రైతులకు ఖర్చులు తగ్గుతాయని పేర్కొన్నారు. సీఎస్ఎం ప్రతినిధి అరుణ, సంఘ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

వానపాములు విడిచిపెడుతున్న మత్స్యదేవత ఎఫ్‌పీవో సభ్యులు

వ్యసనాలతో జీవితాలు నాశనం

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని స్థానిక డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ విజయభారతి అన్నారు. ఎన్ఎస్ఎస్ పీవోలు ఈశ్వరరావు, సతీష్ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి చింతపల్లిలో ర్యాలీ నిర్వహించారు. వ్యసనాలతో భవిష్యత్తు నాశనమవుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు ఉన్నత చదువులు చదివి.. కుటుంబానికి, గ్రామానికి మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

చింతపల్లి డిగ్రీ కళాశాల విద్యార్థుల ర్యాలీ

కార్మికుల మనుగడకు ముప్పు

చింతపల్లి, న్యూస్‌టుడే: బహుళజాతి సంస్థలతో కార్మికుల సంక్షేమానికి ముప్పు వాటిల్లుతుందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్యపడాల్ అన్నారు. కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలకు కొమ్ముకాసే ప్రభుత్వాలపై నిరంతర పోరాటం సాగించాలని పిలుపునిచ్చారు. చింతపల్లిలోని ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు, ఆటో యూనియన్ నాయకులతో కలిసి సీఐటీయూ మహాసభల గోడప్రతులను సోమవారం ఆవిష్కరించారు. కార్మిక సంఘ నాయకులు ఈశ్వర రావు, రాములమ్మ, రమణ, రామకృష్ణ, ప్రసాద్ చంటిబాబు పాల్గొన్నారు.

చింతపల్లిలో పోస్టర్లు విడుదల చేస్తున్న సీఐటీయూ నాయకులు చిన్నయ్యపడాల్

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని సీఐటీయూ మండల కార్యదర్శి శంకరరావు డిమాండ్ చేశారు. ఈనెల 31 నుంచి జనవరి 4 వరకు విశాఖపట్నంలో నిర్వహించే సీఐటీయూ మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం ముంచంగిపుట్టులో గోడ పత్రికలు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. అవుట్‌సోర్సింగ్, ఒప్పంద, రోజువారీ కార్మికులను రెగ్యులర్ చేయాలని కోరారు. కార్మిక సంఘాల నాయకులు లైకోన్, ఈశ్వరి, గంగాభవానీ, విజయ, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

కంద ఉంటేనే ధర

సాధారణంగా ఏ వ్యాపార లావాదేవీకైనా నాణ్యత కీలకం. సరకును తరచి చూసి ధర నిర్ణయించి కొనుగోలు చేస్తుంటారు. మరి రాష్ట్రంలోనే పెద్దదైన దుగ్గిరాల పసుపు మార్కెట్లో నాణ్యతను ఎలా గుర్తిస్తారో తెలుసా..?

ఇలా విరిచి నాణ్యత చూస్తారు

పసుపు కొనాలంటే.. అందులోని కుర్కుమిన్ శాతాన్ని చూడాలి. సామాన్య పరిభాషలో చెప్పాలంటే లోపల ఉన్న కండను చూసి వ్యాపారులు కొంటుంటారు. కుర్కుమిన్ ఎక్కువగా ఉన్న రకాలకు మంచి ధర పలుకుతుంది.

ఎలా చూస్తారంటే...: రైతులు తెచ్చిన సరకులో కొమ్ములు తీసి ఒక ట్రైండు విరిచి దానిలో ఉన్న రంగును బట్టి.. వ్యాపారం పరిభాషలో తోడు(కండ)ను బట్టి ధర నిర్ణయిస్తారు. ☛ పసుపులో కుర్కుమిన్ ఎంత ఉందనేది గుర్తించడానికి యంత్రం లేదు. ఇందుకే అలవాటుగా వస్తున్న ప్రక్రియనే ఇక్కడ ఉపయోగిస్తున్నారు. సాధారణంగా 5 శాతం కంటే ఎక్కువ ఉంటే అది నాణ్యమైన పసుపుగా గుర్తిస్తారు. ☛ కండ బాగుంటే ధర కోసం రైతులు పట్టుబట్టడానికి అవకాశం ఉంటుంది.

కుర్కుమిన్ అంటే...: పసుపు రంగుకు రసాయన సమ్మేళనం. ఇది అనేక ఔషధ గుణాలతో ఉంటుంది. యాంటీఆక్సిడెంట్ లక్షణాలు ప్రత్యేకం. దీన్ని శోషించుకోవడం పైపెర్ఫార్మెన్స్ లిక్విడ్ క్రోమటోగ్రఫీలో గుర్తిస్తారు. మరో పద్ధతి స్పెక్ట్రోఫోటోమెట్రీ. ఇది సరళంగా ఉంటుంది. కుర్కుమిన్ ద్రావణం కాంతిని ఎంత గ్రహిస్తుందో కొలవడం ద్వారా సాంద్రతను అంచనా వేస్తారు. ☛ పసుపు సారం స్వచ్ఛతను సాధారణంగా 95% కుర్కుమినాయిడ్స్ లేదా స్టాండర్డైజ్ టు 95% కుర్కుమిన్ అని చూపిస్తారు.

- న్యూస్‌టుడే, దుగ్గిరాల

మరో రెండు స్క్రబ్ టైఫస్ కేసులు

మేడికొండూరు, పెదకాకాని, న్యూస్‌టుడే: తాజాగా మరో రెండు స్క్రబ్ టైఫస్ కేసులు వెలుగులోకొచ్చాయి. మేడికొండూరు మండలం పేరేచర్ల లక్ష్మీనరసింహ కాలనీకి చెందిన వృద్ధుడిని (76) గత నెలలో కీటకం కుట్టింది. విపరీతమైన జ్వరం రాగా చికిత్స తీసుకున్నప్పటికీ తగ్గలేదు. గత నెల 21న జీజీహెచ్‌కు వెళ్లగా పరీక్షల్లో స్క్రబ్ టైఫస్ జ్వరంగా నిర్ధారించారు. వెనిగండ్లలో ముస్లిం కాలనీకి చెందిన షేక్ రజాక్ రెండు నెలల క్రితం ఆయాసం, నీరసంతో పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు చేయించుకున్నాతగ్గక పోవటంతో ఈ నెల 3న జీజీహెచ్‌లో చేరాడు. 6న నిర్వహించిన వైద్య పరీక్షల్లో స్క్రబ్ టైఫస్ లక్షణాలు ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. ప్రస్తుతం అక్కడి ఐసీయూలో చికిత్స పొందుతున్నారు.

సైనికుల త్యాగాలు వెలకట్టలేనివి

కలెక్టరేట్, న్యూస్‌టుడే: సైనికుల త్యాగాలు వెలకట్టలేనివని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. కలెక్టర్ కార్యాలయంలో సాయుధ దళాల పతాక దినోత్సవం సోమవారం నిర్వహించారు. కలెక్టర్ విరాళం అందించి దినోత్సవాన్ని ప్రారంభించారు. జిల్లా సైనిక సంక్షేమ అధికారి ఆర్.గుణశీల మాట్లాడుతూ విరాళాలను డైరెక్టర్, సైనిక సంక్షేమ శాఖ, మధు గార్డెన్స్, విజయవాడ 520010 వారికి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎంజీ రోడ్డు, గవర్నర్‌పేట, విజయవాడ (16857)కు కరెంట్ అకౌంట్ నెంబరు: 33881128795, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ SBIN0016857 ద్వారా గాని ఇవ్వొచ్చన్నారు. జిల్లాలో రూ.17,67,363 సేకరించారన్నారు. ఎక్కువ మొత్తంలో విరాళాలిచ్చిన వారిని కలెక్టర్ సత్కరించారు. 2023, అక్టోబరు 17న ఉత్తరాఖండ్ కుమాన్ సెక్టార్‌లో ఆపరేషన్ స్నో లెపర్డ్ సైనిక చర్యల్లో భాగంగా వెళ్తూ.. ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చిట్టిమడుగుల వాసు కిశోర్ మృతి చెందగా... ఆయన భార్య నవీనను సత్కరించి ఏటుకూరులో 300 గజాల ఇంటి స్థలం అందజేశారు.

యువజనరంజకం


అలరించిన శాస్త్రీయ నృత్యం

ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలో యువజనోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. దాదాపు 22 కళాశాలల నుంచి 400 మందికిపైగా విద్యార్థులు హాజరయ్యారు. తొలిరోజు బృంద నృత్యాలు, జానపద గేయాలు, మైమ్స్, థియేటర్ ఆర్ట్స్, సంగీతం, చిత్రలేఖనాలతో అలరించారు. సిమ్స్ విద్యార్థుల జానపద గేయాలు ఆకట్టుకున్నాయి. ఏఎన్‌యూ విద్యార్థులు చేసిన మైమ్స్ ఆలోచింపజేశాయి. అంతకుముందు ఉత్సవాలను ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య గంగాధర్ ప్రారంభించారు. రెక్టార్ ఆచార్య శివరామప్రసాద్, రిజిస్ట్రార్ సింహాచలం, ఆచార్య సుమంత్‌కుమార్, యువజనోత్సవాల సమన్వయకర్త ఆచార్య మురళీమోహన్, ప్రముఖ మిమిక్రీ కళాకారుడు కృష్ణంరాజు పాల్గొన్నారు.

మైమ్స్‌లో ఆకట్టుకున్న ప్రదర్శన

జానపద నృత్యంలో...

కోలాటానికి సన్నద్ధమై...

- న్యూస్‌టుడే, ఏఎన్‌యూ

అవినీతి సొమ్ము కక్కించాల్సిందే

గత వైకాపా పాలనలో రూ.6 కోట్ల రుణాలు స్వాహా

పొన్నూరు, న్యూస్‌టుడే

పట్టణం	పొన్నూరు
వార్డులు	31
పొదుపు సంఘాలు	1,710
పొదుపు సంఘ సభ్యుల సంఖ్య	17,200
బినామీ గ్రూపుల సంఖ్య	100
స్వాహా చేసిన రుణాల మొత్తం	రూ.6 కోట్లు

గత వైకాపా పాలనలో వైకాపా నేతలు, మెప్మా అధికారులు, ఆర్పీలు కలిసి బినామీ గ్రూపులు ఏర్పాటు చేసి రూ.కోట్లు పక్కదారి పట్టించారు. మెప్మా విభాగంలోని పూర్వ కీలక అధికారి, నలుగురు సీవోలు అవినీతిలో కీలక పాత్ర పోషించారు. మెప్మాలో అవినీతి అక్రమాలపై 'ఈనాడు'లో అనేక కథనాలు ప్రచురితమయ్యాయి. ఎన్నికలకు ముందు అప్పటి మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ 8వ వార్డు పర్యటనకు వెళ్లిన సమయంలో కొంత మంది మహిళలు వచ్చి మెప్మా అధికారులు, వైకాపా మహిళా నేత కలిసి రుణాలు స్వాహా చేశారని ఆయన ఎదుట వాపోయారు.

ఎమ్మెల్యే హెచ్చరించడంతో.. అవినీతి అక్రమాలపై ఆరా తీసి మూడు రోజుల క్రితం మెప్మా అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందులో బ్యాంకు అధికారుల నివేదికపై చర్చ కొనసాగింది. బినామీ పేర్లతో తీసుకున్న రుణాలను రెండు నెలల్లోపు చెల్లించాలని లేని పక్షంలో చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని.. అవినీతికి పాల్పడిన వారిని హెచ్చరించారు. వారికి నోటీసులు కూడా సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. అప్పటి వైకాపా మహిళా నేతలు, మెప్మా విభాగంలోని కీలక అధికారి అండ చూసుకుని ఓ ఆర్పీ 9 బినామీ గ్రూపులు ఏర్పాటు చేసి సుమారు రూ.81 లక్షలు కాజేశారు. గడువు దాటాక రుణాలు చెల్లించకపోతే పెద్ద గండంగా వారు భావిస్తున్నారు. ☛ దీనిపై మెప్మా పీడీ విజయలక్ష్మిని అడుగగా రెండు నెలల్లోపు రుణాలు చెల్లించాలని, లేని పక్షంలో బాధ్యులైన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

17న జిల్లాకు శాసనసభ అంచనాల కమిటీ రాక

జిల్లాపరిషత్తు, న్యూస్‌టుడే: శాసనసభ అంచనాల కమిటీ ఈనెల 17న జిల్లాలో పర్యటించనుందని ఐఅండ్‌పీఆర్ ఉప సంచాలకులు సోమవారం తెలిపారు. కమిటీ సభ్యులు కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో 2019-22 ఆర్థిక సంవత్సరాల బడ్జెట్ అంచనాలపై సమీక్షిస్తారన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మండపేట ఎమ్మెల్యే వి.జోగేశ్వరరావు అంచనాల కమిటీ ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నారన్నారు.

అఖండ దీపానికి 40 ఏళ్లు

పొన్నూరులో 1961లో జగన్నాథస్వామి నిర్మించిన సహస్ర లింగేశ్వరస్వామి ఆలయంలో అఖండ దీపం ఏర్పాటు చేసి నాలుగు దశాబ్దాలైంది. శివ భక్తుల నిర్ణయం మేరకు దేవాలయం ఎదుట రాతి స్తంభంపై 1985 నవంబరు 22న అఖండ దీపాన్ని వెలిగించారు. జగన్నాథస్వామి ఆశ్రమ అర్చకులు ప్రతి రోజూ మూడుసార్లు ఆవు నెయ్యి పోస్తుంటారు. సహస్ర లింగేశ్వరస్వామిని దర్శించుకున్న భక్తులు అఖండ దీపాన్ని దర్శించడం పరిపాటి. - న్యూస్‌టుడే, పొన్నూరు

వీఆర్‌కు పొన్నూరు గ్రామీణ ఎస్సై

పొన్నూరు, న్యూస్‌టుడే : పొన్నూరు గ్రామీణ ఎస్సై జి.కిరణ్‌ను వీఆర్‌కు పంపుతూ ఎస్పీ వకుల్ జిందాల్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. రేషన్‌బియ్యం వ్యాపారులకు సహకరించిన ఇద్దరు కానిస్టేబుళ్లను సస్పెండ్ చేసిన రెండు రోజులకే గ్రామీణ ఎస్సైను వీఆర్‌కు పంపారు.

కార్మికుల భద్రత, రాజధాని రైతుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వండి

తుళ్లూరు, న్యూస్‌టుడే: రాజధాని పనుల్లో కార్మికుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని.. రైతులు, ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ప్రపంచ, ఆసియా అభివృద్ధి బ్యాంకుల ప్రతినిధుల బృందం ప్రతినిధులు సూచించారు. సోమవారం అమరావతిలో విస్తృతంగా పర్యటించారు. అమరావతి ఇంటిగ్రేటెడ్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం అమల్లో భాగంగా చేపట్టిన నిర్మాణ పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు ట్రాఫిక్ నిర్వహణ, రహదారుల ప్రణాళిక, క్షేత్ర స్థాయిలో అమలు కావాల్సిన కార్యకలాపాలపై ఏపీ సీఆర్డీఏ ప్రధాన కార్యాలయంలో తొలుత చర్చలు జరిపారు. కార్యక్రమంలో సీఆర్డీఏ, ఏడీసీఎల్, పీఎంసీ, పీజీఎంసీ అధికారులు, గుత్తేదారు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

☛ రాయపూడి తదితర గ్రామాల్లో నేరుగా స్థానికులతో బ్యాంకుల ప్రతినిధులు చర్చించారు.

☛ నాన్ గెజిటెడ్ ఉద్యోగులకు నిర్మిస్తున్న భవన సముదాయాల నిర్మాణ పనులను పరిశీలించి.. గుత్తేదారు సంస్థ కార్మికులను కల్పిస్తున్న సౌకర్యాలు, ఆహారం, వైద్య సదుపాయాలు, జీతాలు తదితర వివరాలు తెలుసుకున్నారు. అనంతరం పీఎంసీ, పీజీఎంసీ, గుత్తేదారు సంస్థ ప్రతినిధులు, సీఆర్డీఏ అధికారులతో సమావేశమయ్యారు.

ఎన్‌జీవో భవనాల వద్ద కార్మికులతో ప్రపంచ, ఆసియా అభివృద్ధి బ్యాంకుల ప్రతినిధుల బృందం

వందేళ్ల నాటి వృక్షాలను పరిరక్షిస్తూ..

గుంటూరు వైద్య కళాశాల ప్రాంగణంలోని వందేళ్ల నాటి వృక్షాలను గుర్తించి ప్రత్యేకంగా పరిరక్షిస్తున్నారు. పురాతనమైన భవనాల్లో నిర్వహిస్తున్న ఈ వైద్య కళాశాలలో పాత కాలం నాటి వృక్షాలు ప్రాంగణమంతా విస్తరించి ఉద్యానాన్ని తలపిస్తున్నాయి. ఆవరణలో వందల చెట్లు ఉన్నా.. వందేళ్లకు పైబడిన వాటిని ప్రత్యేకంగా గుర్తించి వాటి సంరక్షణకు చర్యలు చేపట్టారు. ఈక్రమంలో వాటికి అందమైన రంగులద్ది.. ప్రతి చెట్టుకు క్యూఆర్ కోడ్‌ను ఏర్పాటు చేసి వాటి వివరాలు పొందుపర్చారు. కళాశాలలో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించడంలో ఈ తరువులు కీలకమని, అందుకే ఇక్కడి పురాతన భవనాలతో పాటుగా వీటిని భాగస్వాములుగా భావించి సంరక్షిస్తున్నామని ప్రిన్సిపల్ సుందరాచారి పేర్కొన్నారు. -ఈనాడు, గుంటూరు

వందేళ్ల నాటి వృక్షాలతో అలరారుతున్న గుంటూరు వైద్య కళాశాల ప్రాంగణం

తరువులకు క్యూఆర్ కోడ్ గుర్తింపు

ఇకపై మొక్కుబడి తనిఖీలకు చెక్

హెచ్‌పీటీఎస్‌తో వసతిగృహాల పర్యవేక్షణ

జిల్లాపరిషత్తు, న్యూస్‌టుడే

సంక్షేమ వసతి గృహాల్లో పర్యవేక్షణ అంటే తనిఖీ అధికారులు మొక్కుబడిగా చేసేవారు. అధికారుల మధ్య సాన్నిహిత్యం దృష్ట్యా రికార్డులను పైపైన చూసి అంతా బాగుందని రికార్డుల్లో రాసి వెళ్లేవారు. జిల్లా అధికారులదీ అదే బాట. దాంతో హాస్టళ్లలో అధ్వాన పరిస్థితులు కొనసాగుతుండేవి. కూటమి ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాల్లో పరిస్థితిని సమూలంగా మార్చేందుకు హాస్టల్ పెర్ఫార్మెన్స్ ట్రాకింగ్ సిస్టం (హెచ్‌పీటీఎస్) యాప్‌ని ప్రవేశపెట్టింది. దీనిద్వారా హాస్టళ్లలో పరిస్థితులను ప్రత్యక్షంగా వీక్షించనున్నారు.

యాప్‌లో వివరాలు పరిశీలిస్తున్న జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఉపసంచాలకుడు చెన్నయ్య

సంక్షేమ విభాగం	వసతి గృహాలు	విద్యార్థులు
సాంఘిక	33	2,590
బీసీ	27	1,360
గిరిజన	4	450
మైనార్టీ	2	45
మొత్తం	66	4,445

మూడు విధాలుగా కార్యక్రమాలు : హాస్టళ్లలో రోజు, వారం, నెల వారీగా చేయాల్సిన పనులను నిర్ణయించారు. ప్రాంగణం పరిశుభ్రంగా ఉంచడం, మరుగుదొడ్లు, తాగునీటి ట్యాంకులు శుభ్రం చేయడం, ఆహార పదార్థాలు, కూరగాయల సరకుల నిల్వ, వినియోగించిన వాటి వివరాలు, ఆహార పదార్థాల నాణ్యత నిర్ణయించడం, చెత్త కుండీల ఏర్పాటు, డ్రెయినేజీ నిర్వహణ, విద్యార్థుల హాజరు వివరాలు రోజువారీ కార్యక్రమాల్లో భాగంగా యాప్‌లో నమోదు చేయాలి. ☛ వసతిగృహం భవనం ఫ్లోరింగ్, పైకప్పు, తలుపులు, కిటికీల పరిస్థితిపై ఫొటోలు తీసి నెలవారీగా అప్‌లోడ్ చేయాలి. ☛ వారంలో ఓరోజు నీటిలో టీడీఎస్ స్థాయి పరీక్షించాలి. వీటిని జిల్లా, రాష్ట్ర అధికారులు పర్యవేక్షిస్తారు.

ప్రత్యేకతలు ఇవీ.. జియో ట్యాగింగ్ చేయడంతో సంబంధిత హాస్టల్ పరిసరాల్లోనే పని చేస్తుంది. దీంతో ఉదయం, సాయంత్రం హెచ్‌డబ్ల్యూవోలు విధిగా హాస్టల్‌కు వెళ్తున్నారు. కొత్తగా తీసిన ఫొటోలనే స్వీకరిస్తుంది. జేఎన్‌బీ నివాస్‌లో విద్యార్థుల సమగ్ర ఆరోగ్య వివరాలు నమోదు చేయాలి. విద్యార్థినులకు సంబంధించి ప్రత్యేకంగా ఆరోగ్య వివరాలు, బ్లడ్ గ్రూప్ నమోదుతో అత్యవసరమైతే ఆ గ్రూప్ రక్తాన్ని సులభంగా సేకరించొచ్చు.

యాప్‌తో ప్రయోజనాలు

ఈ యాప్‌ని ప్రవేశపెట్టడంతో హెచ్‌డబ్ల్యూవోలు, సిబ్బంది గైర్హాజరీకి అడ్డుకట్ట పడింది. విద్యార్థులకు రుచి, శుచికరంగా ఆహార పదార్థాలు వండి పెడుతున్నారు. ఎక్కడైనా నాసి రకంగా వండితే చర్యలు తీసుకోవచ్చు. హాస్టల్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుతున్నారు.

- యు.చెన్నయ్య, మురళీధర్, జిల్లా సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖల అధికారులు

పైవంతెన వస్తే.. యాతనకు చెల్లు

ఈనాడు – అమరావతి

గుంటూరు నగరంలో నందివెలుగు రోడ్డులో రైలుమార్గంపై వంతెన నిర్మాణానికి నిధుల సమస్య కొలిక్కి రావడంతో పనులు వేగవంతమయ్యాయి. దశాబ్దాలపాటు ప్రజలెదుర్కొన్న సమస్య త్వరలోనే పరిష్కారం కాబోతోంది.

శరవేగంగా నందివెలుగు రోడ్డులో పనులు

గత వైకాపా ప్రభుత్వం మొండిచేయి: వంతెన నిర్మాణానికి ఆర్‌అండ్‌బీ, రైల్వేశాఖ సంయుక్తంగా రూ.31 కోట్లతో ప్రతిపాదించగా.. 2016-17లో టెండర్లు పిలిచారు. ☛ రైల్వేశాఖ తన పరిధిలో రూ.13 కోట్లతో పనులను 2021లో పూర్తి చేసింది. ☛ ఆర్‌అండ్‌బీ పరిధిలో రూ.18 కోట్ల పనులు చేపట్టిన గుత్తేదారు 2018నాటికి 25 శాతం పూర్తి చేశారు. ☛ వైకాపా ప్రభుత్వం వచ్చాక బిల్లులు చెల్లించకపోవడంతో గుత్తేదారు పనులాపేశారు. ఎట్టకేలకు 2022లో మంజూరు చేయడంతో 2023 మార్చి వరకు రూ.5.20 కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయి. అనంతరం బిల్లులు ఆపేయడంతో పరిస్థితి మొదటికొచ్చింది. మొత్తానికి రూ.10.50 కోట్ల విలువైన పనులే పూర్తయ్యాయి. 21 స్లాబులకుగాను 5 స్లాబులతో పిల్లర్లు వేశారు. సర్వీసురోడ్లు, డ్రెయిన్లలో కొంతభాగం పనులయ్యాయి.

పెమ్మసాని చొరవ : కూటమి ప్రభుత్వం వచ్చాక కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చొరవ తీసుకుని పెండింగ్ పనులు రైల్వే శాఖ చేపట్టాలని కేంద్ర రైల్వేశాఖ మంత్రికి లేఖ రాశారు. ఆయన్ను స్వయంగా కలిసి రాష్ట్రం నిధులిచ్చే పరిస్థితి లేనందున రూ.36.91 కోట్ల భారం భరించాలని విన్నవించారు. అంగీకరించిన రైల్వేశాఖ నిధులు విడుదల చేయడంతో మిగిలిన పనులకు టెండర్లు పిలిచి గత ఏప్రిల్‌లో ప్రారంభించారు. ఇప్పటికే కొన్ని పిల్లర్లు నిర్మించారు. వీలైనంత తొందరగా పనులు పూర్తి చేయాలన్న లక్ష్యంతో ఉన్నారు.

కీలకమైన మార్గం : కోల్‌కతా-చెన్నై జాతీయరహదారి 16 నుంచి గుంటూరు నగరంలోకి వచ్చే కీలకమార్గం కావడంతోపాటు రైతుబజారు, కొల్లిశారద టోకు మార్కెట్, ఆర్టీసీ బస్టాండుకు ఇదే కీలక రహదారి. జెండాచెట్టు ప్రాంతం, పాత గుంటూరు, వినోభానగర్, బాలాజీనగర్‌వాసుల రాకపోకలకు ప్రధాన మార్గం. గేటు పడితే ఇరువైపులా వాహనాల రద్దీ పెరిగి ట్రాఫిక్ నిలిచిపోతోంది. వంతెన అందుబాటులోకొస్తే ఈ కష్టాలన్నీ తీరతాయి.

చెత్తరహితం ఇంకెప్పుడు?

న్యూస్‌టుడే – తెనాలి టౌన్

నిబంధనలు కాగితాల్లో పక్కాగానే ఉంటాయి.. అమల్లోనే ఇబ్బందులు. కారణంగా చిత్తశుద్ధి లేకపోవడమే. నగరాలు, పట్టణాలను చెత్తరహితంగా ఉంచాలన్న కేంద్రం ఆదేశం నేటికీ పూర్తిస్థాయిలో అమలు కావడం లేదు. ఉదయం 11 గంటల వరకు డంపింగ్ పాయింట్ల వద్ద వ్యర్థాల గుట్టలు.. వాటిని తరలించే వాహనాలను చూస్తుంటాం. ఈ ప్రక్రియ ముగిశాక.. ఆ పాయింట్ల వద్ద, వీధుల చివర్లలో ఏర్పాటు చేసిన డంపర్ బిన్ల వద్ద తిరిగి చెత్త పేరుకుపోతుంటుంది. చూసేవారికి ఇబ్బందికరంగానూ... స్థానికులకు నరకంగానూ ఉంటున్నా.. ఈ పరిస్థితిని మార్చేందుకు ముందడుగు పడని పరిస్థితి.

పాతికేళ్ల క్రితమే... దేశవ్యాప్తంగా వ్యర్థాల సమస్య పరిష్కరించడానికి కేంద్రం 'ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలు-2000' పేరిట తొలి దశ ప్రమాణాలను విడుదల చేసింది. 2016, 2024 సంవత్సరాల్లో వాటిని మరింత క్రియాశీలకంగా మార్చింది. 2019లో దేశమంతటా 'డంపర్ బిన్ ఫ్రీ సిటీస్' అమలు కావాలని నిర్దేశించింది. విచిత్రమేమంటే.. ఈ విధానం నేటికీ ఉమ్మడి గుంటూరు, ఉమ్మడి కృష్ణా జిల్లాల్లో అమలు కాలేదు.

రోడ్ల వెంబడి డంపింగ్ పాయింట్ల వద్ద చెత్త తీరు

లోపాలెన్నో... పూర్తిస్థాయిలో తడి-పొడి చెత్తను విభజించి నిర్ణీత సమయంలో సేకరించాలి. నేరుగా కంపోస్టుయార్డుకు లేదా వ్యర్థాల నిర్వహణ ప్రాంతాలకు తరలించాలి. ఈ రెండూ సక్రమంగా లేక.. డంపింగ్ పాయింట్లు, డంపర్ బిన్లు ఏర్పాటు చేస్తున్నారు. ☛ తెనాలిలో 2010-19 మధ్య చెత్త సేకరణ, నిర్వహణలో గణనీయమైన ప్రగతి సాధించి, పలు జాతీయ పురస్కారాలు దక్కాయి. ప్రస్తుతం పరిస్థితి మారిపోయింది. ☛ ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పట్టణాలు, నగరాల్లో డంపింగ్ పాయింట్లు, డంపర్ బిన్లు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి.

ఉమ్మడి జిల్లాలో నిత్యం చెత్త: 750 మెట్రిక్ టన్నులు

ప్రయత్నం ప్రారంభించాం.. డంపింగ్ పాయింట్లు.. డంపర్ బిన్లు లేని పట్టణాల ఆవిష్కరణకు కొన్ని సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ విషయంలో మంగళగిరిలో నూరుశాతం ఫలితాలు సాధించాం. మిగిలినచోట్ల కూడా త్వరలో సాధించడానికి ప్రయత్నిస్తాం. **- సూర్యదేవర హరికృష్ణ, మున్సిపల్ ఆర్డీ**

చెవికెక్కలేదని... పలుగూ పారా పట్టుకుని...

పట్టాభిపురం, న్యూస్‌టుడే: గుంటూరు నగరపాలక సంస్థ అధికారుల తీరుపై పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రధాన రహదారుల్లో ఒకటైన జీటీ రోడ్డు గుంతలమయమై ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా ఉంటుందని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించకపోవడంతో.. ఆ గుంతల్లో కంకర, డస్ట్ పోసి స్వయంగా పూడ్చి సోమవారం వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ 'కూటమి ప్రభుత్వం మంచి పనులు చేస్తూ ప్రజల మన్ననలు పొందుతుంటే.. కొందరు అధికారులు ప్రజల సమస్యలపై వినతిపత్రాలు అందజేసినా పనులు చేయకుండా ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకొచ్చేలా వ్యవహరిస్తున్నారు. నగరంలో కీలకమైన జీటీ రోడ్డు గుంతలమయంగా తయారై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నేను స్కూటీపై వెళ్లినప్పుడు గుంతల వల్ల ఇబ్బందులు పడ్డాను. కళ్ల ముందే ఓ వ్యక్తి గుంతలో పడి ప్రమాదానికి గురయ్యాడు. ప్రజల ఇబ్బందుల్ని దృష్టిలో పెట్టుకుని సొంత నిధులతో కంకర, డస్ట్ తెప్పించి జీటీ రోడ్డులో మస్తాన్ దర్గా వద్ద భారీ గుంతల్ని తెదేపా కార్యకర్తలు, తెలుగు మహిళలతో కలిసి పూడ్చాల్సి వచ్చింది. నా కార్యాలయం ముందున్న రోడ్డును కూడా బాగు చేయించలేకపోతున్నానని నాపై విమర్శలొచ్చాయి. అధికారులు విఫలమైనందున మేము జోక్యం చేసుకోక తప్పలేదు. పరిధి దాటితే ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్తాం. ఖాళీ స్థలాలు, వీధి కుక్కల బెడద తదితర సమస్యల్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నార'న్నారు.

కంకర, డస్ట్ పోసి పారతో చదును చేస్తున్న ఎమ్మెల్యే గళ్లా మాధవి

దుగ్గిరాల వసతిగృహం హెచ్‌డబ్ల్యూవో సస్పెన్షన్

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: దుగ్గిరాల సాంఘిక సంక్షేమ బాలికల వసతిగృహం హెచ్‌డబ్ల్యూవో ఎం.నిర్మలను కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా సోమవారం సస్పెండ్ చేశారు. ఆమె వసతిగృహ విద్యార్థినులతో అనుచితంగా ప్రవర్తించడమే దీనికి కారణం. కలెక్టర్ ఆదేశాలతో నిర్మలను సస్పెండ్ చేస్తూ జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకుడు యు.చెన్నయ్య ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల హాస్టల్ విద్యార్థినుల పట్ల అనుచితంగా ప్రవర్తించారని ఆరోపణలు రావడంతో మంగళగిరి ఏఎస్‌డబ్ల్యూవోని విచారణ అధికారిగా నియమించారు. సదరు అధికారి నవంబరు 17న విచారణ చేయగా విద్యార్థినులు హెచ్‌డబ్ల్యూవోకు వ్యతిరేకంగా ఫిర్యాదు చేశారు. ఈ విషయాలను జిల్లా అధికారికి లిఖితపూర్వకంగా నివేదించారు. ఈ అంశాన్ని కలెక్టర్ తమీమ్ అన్సారియా దృష్టికి తీసుకెళ్లగా.. ఆమెపై చర్యలకు ఆదేశించడంతో వేటు వేశారు. ఆమె స్థానంలో మంగళగిరి సాంఘిక సంక్షేమ బాలికల వసతిగృహం హెచ్‌డబ్ల్యూవో పి.వహీదాను పూర్తి అదనపు బాధ్యతలతో హెచ్‌డబ్ల్యూవోగా నియమించారు.

కౌన్సిల్ అత్యవసర సమావేశానికి ఏర్పాట్లు

ఈనాడు, అమరావతి: జీఎంసీలో పరిసర 11 గ్రామాల విలీనానికి గత కొద్దిరోజులుగా కసరత్తు జరుగుతుండటం తెలిసిందే. దీనిపై స్పష్టత కోరుతూ జీఎంసీ రాసిన లేఖకు జిల్లా పంచాయతీ అధికారులు ప్రత్యుత్తరం పంపడం.. అందులో 11 గ్రామాల ప్రస్తావనతో పాటు, గ్రామసభల తీర్మానాల ప్రతులను అందించారు. కలెక్టర్‌కూ వివరించిన నేపథ్యంలో రెండు మూడు రోజుల్లో కౌన్సిల్ అత్యవసర సమావేశానికి ఏర్పాట్లు చేస్తున్నారు

75 రోజుల అక్షర పునాది

న్యూస్‌టుడే – దుగ్గిరాల

ఐదో తరగతిలోకొచ్చినా.. చదవడంలో కంగారు... గణితంలో తడబాటు. అక్షరాలను గుర్తించలేని అశక్తత. ఇకపై ఇలాంటి పరిస్థితి ఎదురుకాకుండా విద్యాశాఖ ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) బోధనకు శ్రీకారం చుట్టింది. పాఠశాలల్లో సోమవారం నుంచి 75 రోజుల ప్రణాళిక అమలు ప్రారంభమైంది. ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు కనీస అక్షర పరిజ్ఞానం ఉండేలా చూడడమే ప్రధాన ఉద్దేశం.

మధ్యాహ్నం ఒంటి గంట నుంచి.. ఉదయం పూట ఆ నెలకు సంబంధించిన పాఠాలు బోధిస్తారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 3.30 గంటల వరకు ఎఫ్ఎల్ఎన్ అమలు ఉంటుంది. చదవడం, రాయడం, అర్థం చేసుకోవడం, ప్రాథమిక గణితంపై అవగాహన చేసుకోవడమే కాకుండా.. ఆ అంశాల్లో నైపుణ్యాన్ని సాధించేలా చూస్తారు.

జిల్లాలోని ప్రాథమిక పాఠశాలలు: 758 | **ప్రాథమికోన్నత పాఠశాలలు: 64**

ఇదీ షెడ్యూల్.. మధ్యాహ్నం ఒంటిగంట నుంచి 1.10 వరకు: పిల్లలు ప్రశాంతంగా ఉండేలా చూస్తారు. ☛ 1.10 - 1.40: తెలుగు అక్షరాలు, పదాలు ఎలా చదివిస్తారో పరిశీలన చేస్తారు. ☛ 1.40 - 2.10: ఆంగ్లంలో ఫొనిక్స్, అక్షరాలు రాయడం, వాటిని కలిపి చదవడం, మాటలు చదవడం. ☛ 2.15 - 2.55: గణితంలో అంకెలు, సంఖ్యలు గుర్తించడం. కృత్యాధార బోధన, చతుర్విధ ప్రక్రియలు నేర్పడం. ☛ 2.55 - 3.20: చిన్న చిన్న పరీక్షలు లేదా సమూహంగా కృత్యాలు చేయడం లేదా సాధనపత్రాలు పూర్తి చేయడం. ☛ 3.20 - 3.35: ఆ రోజు బోధించిన దానిపై పునశ్చరణ, ఇంటి పని.

1, 2 తరగతులకు ఒకవిధంగా; 3, 4, 5 తరగతులకు మరోవిధంగా బోధన ఉంటుంది. విద్యార్థులను స్థాయిని బట్టి ఎ, బి, సి గ్రూపులుగా విభజించారు. ఏ స్థాయిలోని వారికి ఎలా చెప్పాలో స్పష్టంగా పేర్కొన్నారు. మొదట్లో అక్షరాలతో మొదలుపెట్టి 75వ రోజు పూర్తయ్యేసరికి ఏదైనా సబ్జెక్టు విషయాలపై మాట్లాడడం, సొంతంగా కథ రాయడం, పేరా రాయడం వంటివి చేయాలి.

నిమిషం ఆలస్యమైనా టెట్‌కు అనుమతించరు

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ టీచర్ ఎలిజిబులిటీ టెస్ట్ (ఏపీ టెట్) ఈ నెల 10 నుంచి 21 వరకు జరగనుంది. ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5 వరకు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. పేరేచర్ల ఐయాన్ డిజిటల్ జోన్, కొర్నెపాడు వద్ద ఉన్న ప్రియదర్శిని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్, చల్లవారిపాలెం వద్ద ఉన్న క్లేక్యాంపస్ టెక్నాలజీస్, వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంట వద్ద మలినేని పెరుమాళ్లు ఎడ్యుకేషనల్ సొసైటీ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్, మలినేని లక్ష్మయ్య ఉమెన్స్ ఇంజినీరింగ్ కాలేజీలో నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి సి.వి.రేణుక తెలిపారు. అభ్యర్థులు పరీక్ష సమయానికి ఒక గంట ముందుగాకేంద్రానికి చేరుకోవాలని, నిమిషం ఆలస్యమైనా అనుమతించేది లేదని ఆమె పేర్కొన్నారు.

S.B.V.R. అగ్రికల్చరల్ కళాశాల, బద్వేలు

ఇంటర్మీడియట్ నందు Bi.P.C విభాగంలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు చివరి అవకాశం. కడప జిల్లా బద్వేలులో I.C.A.R., NEW DELHI వారిచే గుర్తింపు పొందిన S.B.V.R. అగ్రికల్చరల్ కాలేజ (S.B.V.R. A.G.B.Sc), నందు B.Sc (Hons.) Agricultureలో అడ్మిషన్ కొరకు ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకున్నా, చేసుకోకపోయినా కన్వీనర్ కోటాలో అగ్రికల్చరల్ బి.ఎస్సి చేరుటకు చిట్ట చివరి అవకాశం కలదు.

వివరములకు సంప్రదించవలసినది : 94400 33523, 91825 05395, 94928 56652.
కరెస్పాండెంట్, S.B.V.R. అగ్రికల్చరల్ కళాశాల

(c) eenadu

ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న డీఈవో రేణుక

పోటీతత్వంతోనే ప్రతిభకు గుర్తింపు

గుంటూరు విద్య, న్యూస్‌టుడే: పోటీతత్వంతోనే ప్రతిభకు గుర్తింపు లభిస్తుందని డీఈవో రేణుక అన్నారు. సోమవారం పాతబస్టాండ్ పరీక్ష భవన్‌లో కౌశల్ జిల్లా స్థాయి విజేతలకు బహుమతులు అందజేశారు. డీఈవో మాట్లాడుతూ ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో శాస్త్రీయ ప్రతిభను పెంపొందించడానికి కౌశల్ పరీక్షలు దోహదపడతాయన్నారు. జిల్లా కౌశల్ సమన్వయకర్త ఎం.సురేష్‌కుమార్ మాట్లాడుతూ 8, 9, 10 తరగతుల విద్యార్థులకు క్విజ్, పోస్టర్, రీల్స్ తయారీ అంశాలపై పాఠశాల, జిల్లా స్థాయి పోటీలు ఆన్‌లైన్‌లో నిర్వహించినట్లు తెలిపారు. ఆరుగురు ప్రథమ, ఆరుగురు ద్వితీయ బహుమతులు పొంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. పాఠశాల సమన్వయ కర్తలు శాంతిప్రియ, రామాంజనేయులు, రవీంద్రబాబు, నిర్మల, బాలకృష్ణ పాల్గొన్నారు.

విజేతలు: క్విజ్ విభాగంలో.. ప్రథమ: షేక్ రషీద్(అంకిరెడ్డిపాలెం), సీహెచ్ మనోహ(వంగిపురం), షేక్ నస్రీన్(మాచవరం). ద్వితీయ: ఎ.వెంకటతనూజ(ప్రత్తిపాడు), పి.ప్రియాంక(కాకుమాను), ఎం.కీర్తన(కాకుమాను).
పోస్టర్ విభాగంలో... ప్రథమ: బి.అమూల్య(అత్తోట), కె.విలియంబాబు(కాకుమాను). ద్వితీయ: టి.వాసవి(ముట్లూరు), ఎం.శ్రీవిద్య(సంగం జాగర్లమూడి).
రీల్స్ విభాగంలో... ప్రథమ: ఎస్‌డీ ఖాసిం(వేములూరిపాడు). ద్వితీయ: మాహి(గోగులమూడి).

శ్రీ గంగాభ్రమరాంబ మల్లేశ్వర స్వామి దేవస్థానము,
కురగల్లు (గ్రా), మంగళగిరి (మం), గుంటూరు జిల్లా.
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
కురగల్లు (గ్రా), మంగళగిరి (మం), గుంటూరు జిల్లా శ్రీ గంగాభ్రమరాంబ మల్లేశ్వర స్వామి దేవస్థానము పునఃనిర్మాణము కొరకు టెండర్లు ప్రకటన చేయడమైనది. మిగిలిన వివరముల కొరకు **https://tender.apeprocurement.gov.in** లో చూడవచ్చును.
సం/ప్ర: కార్యనిర్వహణాధికారి,
శ్రీ గంగా భ్రమరాంబ మల్లేశ్వర స్వామి దేవస్థానము, కురగల్లు (గ్రా), మంగళగిరి (మం), గుంటూరు జిల్లా.

ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలను ఆదుకోండి

ఏపీఐఐసీ భవనం వద్ద రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న పారిశ్రామికవేత్తలు

తాడేపల్లి, మంగళగిరి, న్యూస్‌టుడే: మంగళగిరి ఏపీఐఐసీ భవనం ఎదుట ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలు సోమవారం నిరసన తెలిపారు. ఉదయం నుంచి రాత్రి వరకు తమ ఆందోళన కొనసాగించారు. రాష్ట్రంలో వారికి రావాల్సిన రాయితీలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలు తమకు న్యాయం జరిగే వరకు తిరిగి వెళ్లేది లేదంటూ బైఠాయించారు. మాకు విడుదల కావాల్సిన నిధులు వెంటనే ఇవ్వాలని కోరారు. 2013లో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టం చేసినప్పటికీ దాన్ని అమలు చేయకుండా నీరు కారుస్తున్నారని వాపోయారు. 8 వేల మంది పారిశ్రామికవేత్తలు గత నాలుగేళ్లుగా ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వాలు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు రావాల్సిన రాయితీ నిధులు ఇవ్వకపోతే ఆత్మహత్యలే శరణ్యమని వాపోతూ తమ ఆందోళన సాయంత్రం వరకు కొనసాగించారు. తమకు నిధులు ఎప్పటిలోగా విడుదల చేస్తారో లిఖిత పూర్వకంగా తెలియజేయాలని డిమాండ్ చేశారు. ఏపీ జేఏసీ నాయకులు మీడియం స్మాల్, మైక్రో ఇండస్ట్రీస్, ఏపీ ఎస్సీ ఎస్టీ ఎంటర్‌ప్రెన్యూర్ అసోసియేషన్, ఎస్సీ ఎస్టీ ట్రైబల్ ట్రాన్స్‌పోర్టు అసోసియేషన్ ఏపీ, హయర్ బస్సు కాంట్రాక్ట్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

విధిగా పరిశీలించాలి.. వేగంగా పరిష్కరించాలి

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: ఇళ్ల స్థలాలు.. భూమి సమస్యలు.. పింఛను కోసం.. అభివృద్ధి పనులు.. ఇలా పలు రకాల సమస్యలను ప్రజలు అధికారుల దృష్టికి తీసుకొస్తున్నారు. క్షేత్ర స్థాయిలో అధికారులకు వినతులను అందించినా ఎటువంటి ప్రయోజనం లేకపోవడంతో జిల్లా కేంద్రానికి వచ్చామని పలువురు అర్జీదారులు పేర్కొంటున్నారు. కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ హాలులో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో 351 అర్జీలు అందాయి. అర్జీలపై కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా సమీక్షిస్తూ అర్జీలను విధిగా పరిశీలించాలని, సకాలంలో వాటి పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. కలెక్టర్‌తో పాటు జేసీ అశుతోష్ శ్రీవాస్తవ ప్రజల నుంచి వినతులు స్వీకరించి అధికారులకు సూచనలు చేశారు.

అర్జీ స్వీకరిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

విభిన్న ప్రతిభావంతులకు ప్రత్యేక గ్రీవెన్స్

జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులకు ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించాలని విభిన్న ప్రతిభావంతుల ఆదరణ సేవా సమితి నాయకులు కలెక్టర్‌ను కోరారు. ఎస్.ఆర్.శంకరన్ హాలు వద్దకు వచ్చిన సమితి సభ్యుల నుంచి వినతిపత్రం స్వీకరించిన కలెక్టర్ తమీమ్ అన్సారియా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతి నెలా నాలుగో శనివారం విభిన్న ప్రతిభావంతులకు ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తామని కలెక్టర్ వివరించారు. కార్యక్రమంలో సమితి జిల్లా అధ్యక్షుడు వి.శివప్రసాద్, నాయకులు ఎస్.బ్రహ్మయ్య, పి.హనిమిబాయి, పి.సైదారాజు, విజయ్ ఉన్నారు.

పట్టాలు ఇచ్చారు.. స్థలం చూపలేదు..

గత ప్రభుత్వ హయాంలో నిరుపేదలమైన తమకు ఇళ్ల పట్టాలిచ్చి కొర్నెపాడు వద్ద స్థలాలు ఇచ్చామన్నారే గానీ, స్థలాలు మాత్రం చూపలేదని శారదాకాలనీ 24 నుంచి 31 లైన్లలో ఉంటున్న ప్రజలు వాపోయారు. ఈమేరకు పీజీఆర్ఎస్‌లో వినతి అందించి రోడ్డు అంచుల్లో ఉంటున్నామని, ఇళ్ల స్థలాలు ఇప్పించాలని కోరారు.

సబ్సిడీ రుణాల వివరాలు బ్యాంకుల్లో ప్రదర్శించాలి

ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అందిస్తున్న రుణాలకు సంబంధించిన వివరాలను బ్యాంకుల్లో ప్రదర్శించాలని భాజపా జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు పీజీఆర్ఎస్‌లో వినతిపత్రం అందించారు. కేంద్ర రాయితీ రుణాల వివరాలు ఖాతాదారులకు తెలిసేలా బ్యాంకుల వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని, అప్పుడే ఖాతాదారులు సద్వినియోగం చేసుకుంటారని తెలిపారు.

పీజీఆర్ఎస్‌లో వినతి అందించిన భాజపా నాయకులు

బోధన రుసుముల బకాయిలు చెల్లించాలని ఆందోళన

తాడేపల్లి, దుగ్గిరాల, న్యూస్‌టుడే: ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలంటూ తాడేపల్లిలోని సాంఘిక సంక్షేమ శాఖ సంచాలకుల కార్యాలయం వద్ద వైఎస్ఆర్ స్టూడెంట్స్ యూనియన్ చేపట్టిన ఆందోళన ఉద్రిక్తతకు దారితీసింది. సోమవారం ఉదయం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య ఆధ్వర్యాన కార్యకర్తలు క్రిష్టియన్‌పేట నుంచి ర్యాలీగా కార్యాలయం వద్దకు చేరుకున్నారు. జాతీయ రహదారి సర్వీసు మార్గంలో బైఠాయించి వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగించారు. పోలీసులు అక్కడకు చేరుకుని ఆందోళన చేస్తున్న కార్యకర్తలను పక్కకు మళ్లించి వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించారు. ఈ క్రమంలో కార్యాలయంలోకి దూసుకెళ్లేందుకు నిరసనకారులు ప్రయత్నించారు. పోలీసులు అడ్డుగా ఏర్పాటు చేసిన బారికేడ్లను తోసివేసి వారి విధులకు ఆటంకం కలిగించారు. ఈ సందర్భంగా పోలీసులకు, కార్యకర్తలకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఆందోళన చేస్తున్న ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చైతన్యతోపాటు నాయకులు నరేంద్రరెడ్డి, నవీన్‌కుమార్, రవీంద్ర, రవిచంద్రలను పోలీసులు అదుపులోకి తీసుకుని దుగ్గిరాల పోలీసుస్టేషన్‌కు తరలించారు. సాయంత్రం ఐదుగురిని మంగళగిరి గ్రామీణ పోలీసుస్టేషన్‌కు తీసుకొచ్చారు. తమ విధులకు ఆటంకం కలిగించారని తాడేపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులను మంగళగిరి మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా చైతన్యకు రిమాండ్ విధించగా.. మిగిలిన వారికి 41 నోటీసులు ఇవ్వాలని ఆదేశించినట్లు పోలీసులు తెలిపారు.

పోలీసులను తోసుకుంటూ కార్యాలయంలోకి దూసుకెళ్లేందుకు యత్నిస్తున్న నిరసనకారులు

నూతన ఆవిష్కరణలకు వేదిక.. 'రూపజ్ఞ-2026'

గుంటూరు రూరల్, న్యూస్‌టుడే: ఇంజినీరింగ్, ఫార్మసీ విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపునకు, నూతన ఆవిష్కరణలకు ఆర్వీఆర్ అండ్ జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో జనవరి 6న నిర్వహించనున్న 'రూపజ్ఞ-2026' మంచి వేదిక అవుతుందని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ అన్నారు. జనవరి 6న జాతీయ స్థాయి ప్రాజెక్టు ఛాలెంజ్‌లో భాగంగా నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్, ఆన్‌లైన్ నమోదు కోసం ప్రత్యేక వెబ్‌సైట్‌ను సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు విభాగాల్లో జరుగనున్న ఈ పోటీల్లో విజేతలకు రూ.లక్ష వరకు నగదు బహుమతులు, జ్ఞాపికలు, ధ్రువపత్రాలు అందజేస్తామన్నారు. ఉత్తమ ప్రాజెక్టులకు కళాశాల ఐటీబీఐ నుంచి డీఎస్‌టీ నిధుల ద్వారా రూ.10 లక్షల వరకు స్టార్టప్ గ్రాంట్ అందించనున్నట్లు చెప్పారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు కళాశాల వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ప్రిన్సిపల్ కొల్లా శ్రీనివాస్, రవీంద్ర, శ్రీనివాసరావు, చంద్రశేఖర్, శోభ, అభిజిత్ బాబా, రాధిక తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కళాశాల ప్రతినిధులు

జీవరసాయన శాస్త్రంలో పరిశోధనలు పెరగాలి

తుళ్లూరు: జీవ రసాయన శాస్త్రంలో నూతన ఆవిష్కరణల కోసం శాస్త్రవేత్తలు కృషి చేయాలని ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య సీహెచ్ సతీష్‌కుమార్ పేర్కొన్నారు. కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో సోమవారం 'ఎమర్జింగ్ ట్రెండ్స్ ఇన్ కెమికల్ బయాలజీ' అంశంపై అంతర్జాతీయ సదస్సు జరిగింది. రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో దేశ విదేశాల నుంచి శాస్త్రవేత్తలు, పరిశోధన రంగ నిపుణులు, యంగ్ స్కాలర్స్ హాజరయ్యారు. వీసీ మాట్లాడుతూ... పరిశోధనా సామర్థ్యాన్ని పెంపొందించేందుకు ఈ తరహా సదస్సులు ఉపయోగపడతాయన్నారు. ఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ స్కూల్ డీన్ డా.సీవీ టామి, వర్సిటీ డీన్ డా.రంజిత్ థాపా మాట్లాడుతూ.. జీవరసాయనశాస్త్రం ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం కాన్ఫరెన్స్ అబ్‌స్ట్రాక్ట్ బుక్‌ను ఆవిష్కరించారు. కెమిస్ట్రీ విభాగాధిపతి డా.సవ్యసాచి చక్రవర్తి, కార్యక్రమ కన్వీనర్ డా.ఎ.సతీష్, డా.రాజు పాండ్యన్, బెంగళూరు ఐఐఎస్సీ నుంచి విచ్చేసిన ప్రొ.రాఘవన్ వరదరాజన్, ప్రొ.హరినాథ్, సోమ వేణుగోపాలరావు, వెంకట శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య సతీష్‌కుమార్, వర్సిటీ ప్రతినిధులు

బ్రాయిలర్ ధరలు (కిలో కి రూ.లలో)
వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 135, రిటైల్ ధర - 162, చికెన్ విత్‌స్కిన్ - 235, చికెన్ స్కిన్‌లెస్ - 267.
కృష్ణా జిల్లా: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -130 రిటైల్ ధర 157 చికెన్ విత్ స్కిన్ - 228, చికెన్ స్కిన్‌లెస్ - 259. అమరావతి ఫార్మ్ ఫార్మ్స్ & ఫ్రెష్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 140, 152, 168 చికెన్ విత్ స్కిన్ - 274 చికెన్ స్కిన్‌లెస్ - 284.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80085 10541
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80085 14589

స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ ప్రారంభం

విజ్ఞానపాడు(పట్టిచెరుకూరు), గుంటూరు నగరం, న్యూస్‌టుడే: హ్యాకథాన్‌లో విద్యార్థులు రూపొందించిన ప్రతి ప్రాజెక్టును ప్రజలు వినియోగించుకునేలా చూడాలని జేఎన్‌టీయూ(కె) వైస్‌ఛాన్సలర్ చేకూరి శివరామకృష్ణప్రసాద్ అన్నారు. పట్టిచెరుకూరు మండలంలోని విజ్ఞానపాడు కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం కేంద్ర ప్రభుత్వం ఏఐసీటీఈ, విద్యామంత్రిత్వ శాఖ, ఇన్‌స్టిట్యూట్ ఇన్నోవేషన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో 36 గంటల 'స్మార్ట్ ఇండియా హ్యాకథాన్(ఎస్ఐహెచ్ సాఫ్ట్‌వేర్ ఎడిషన్ గ్రాండ్ ఫినాల్ 2025ను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఇటువంటి వేదికల ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న సాంకేతిక నైపుణ్యాలు వెలుగులోకి వస్తాయన్నారు. పారిశ్రామికవేత్తలు, ప్రభుత్వ ప్రతినిధులు ఏకతాటిపైకి వచ్చి ప్రస్తుత అవసరాలకు తగిన ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలన్నారు. వ్యవసాయం, సామాజిక సమస్యలు, సైబర్ సెక్యూరిటీ తదితర రంగాల్లో పరిశోధనలు జరగాలన్నారు. నోవల్‌సెంటర్ అధిపతి లలిత్‌మోహన్ మాట్లాడుతూ ఈ హ్యాకథాన్‌లో దేశంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 1360 మంది విద్యార్థులు హాజరు అవుతున్నారని చెప్పారు. అనంతరం వైస్‌ఛాన్సలర్‌ను కిట్స్ ఛైర్మన్ కోయి సుబ్బారావు, కార్యదర్శి కోయి శేఖర్, ఆచార్యులు చిట్టినేని అరుణ, సంచాలకులు హరిబాబు, ప్రిన్సిపల్ పి.బాబు తదితరులు సన్మానించారు.

జేఎన్‌టీయూ(కె) వీసీ చేకూరి శివరామకృష్ణప్రసాద్‌ను సన్మానిస్తున్న కోయి సుబ్బారావు తదితరులు

దూసుకొచ్చిన మృత్యువు..!

- క్షతగాత్రుడిని కాపాడేందుకు ట్రాఫిక్ పోలీసుల విశ్వప్రయత్నం
- గ్రీన్ ఛానల్‌లో తరలించినా నిలవని ప్రాణం

ఘటనాస్థలంలో క్షతగాత్రుడిని పరీక్షిస్తున్న వైద్యురాలు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : ఘోర రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి ప్రాణాలు నిలిపేందుకు ట్రాఫిక్ పోలీసులు విశ్వప్రయత్నం చేశారు. గ్రీన్ ఛానల్ ద్వారా ప్రభుత్వాసుపత్రికి తరలించి.. చికిత్స అందిస్తుండగా మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. గుంటూరు జిల్లా కుంచనపల్లికి చెందిన వౌబట్టు విజయ గోపాలకృష్ణ (52) నగరంలోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ కార్యాలయంలో సెక్షన్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. సోమవారం సాయంత్రం విధులు ముగించుకుని కుంచనపల్లిలోని ఇంటికి బయలుదేరారు. బెంజిసర్కిల్ సమీపం స్క్యూబ్రిడ్జి వద్దకు రాగానే.. ఒక లారీ వేగంగా వచ్చి ఢీకొట్టింది. వెనుక చక్రాల వద్ద ఆయన ఇరుక్కుపోయారు. శిరస్త్రాణం ధరించినా.. తీవ్ర గాయాలయ్యాయి. ట్రాఫిక్ సీఐ రవికుమార్, సిబ్బంది శ్రమించి ఆయన్ని బయటకు తీశారు. అదే సమయంలో అటుగా వెళుతున్న ఒక వైద్యురాలు వచ్చి పరీక్షించగా.. నాడి కొట్టుకుంటోంది. వెంటనే ఆసుపత్రికి తరలించాలని ఆమె సూచించారు. అంబులెన్స్ వచ్చేందుకు ఆలస్యం అయ్యే అవకాశం ఉండడంతో.. ఆటోలో ఎక్కించారు.

లారీ వెనుక చక్రాల వద్ద ఇరుక్కుపోయిన విజయ గోపాలకృష్ణ

కూడళ్లలో వాహనాలు నిలిపివేసి.. క్షతగాత్రుడిని ఆటోలో ఎక్కించిన వెంటనే కంట్రోల్‌రూంకు సమాచారం అందించారు. అక్కడి నుంచి వస్తున్న ఆదేశాలతో బెంజిసర్కిల్, నిర్మల కాన్వెంట్ కూడలి, రమేష్ ఆసుపత్రి కూడలిలో వాహనాలను నిలిపివేశారు. ఆటోకు గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేసి.. హుటాహుటీన ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స చేస్తుండగా.. విజయగోపాలకృష్ణ ప్రాణాలు కోల్పోయారు. అతన్ని కాపాడేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడంతో ట్రాఫిక్ పోలీసులు వేదనకు గురయ్యారు. ప్రమాద ఘటనపై పటమట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నకిలీ బంగారం విక్రయ ముఠా అరెస్టు

- రూ.20 లక్షలు స్వాధీనం.. అదుపులో నలుగురు నిందితులు

సూర్యాపేట నేరవిభాగం, న్యూస్‌టుడే: నకిలీ బంగారు బిస్కెట్లు అంటగట్టి మోసం చేస్తున్న నలుగురు అంతర్రాష్ట్ర ముఠా సభ్యులను సూర్యాపేట గ్రామీణ పోలీసులు సోమవారం అరెస్టు చేసినట్లు ఎస్పీ నరసింహ తెలిపారు. నిందితుల నుంచి 20 గ్రాముల ఐదు నకిలీ బిస్కెట్లు, రూ.12 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని పల్నాడు జిల్లా నరసారావుపేటకు చెందిన ప్రధాన నిందితుడు నాగేశ్వరరావు అలియాస్ రాజారావు, బాల, మేడి ఆదినారాయణ, ప్రకాశం జిల్లా పెద్దఆరవీడు మండలానికి చెందిన కుందూరు యోగిరెడ్డి, పిట్ట నాగేంద్రరెడ్డి, ఇదే జిల్లా రాజులపాడుకు చెందిన చంద్ర, గుంటూరుకు చెందిన శ్రీనివాస్‌రావు, హుజూర్‌నగర్‌కు చెందిన ఇర్రి నరేశ్, ఖమ్మం జిల్లా వైరాకు చెందిన సుధాకర్ మొత్తం తొమ్మిది మంది ఒక ముఠాగా ఏర్పడి అమాయక ప్రజలకు మాయమాటలు చెప్పి నకిలీ బంగారాన్ని తులం రూ.90 వేల చొప్పున విక్రయించారు. ఇలా విక్రయించగా వచ్చిన డబ్బులో పది శాతం కమీషన్ ఇస్తానని ప్రధాన నిందితుడు నాగేశ్వరరావు మిగిలిన నిందితులకు చెప్పాడు.

* హనుమకొండకు చెందిన వెంకటేశ్వరరావు, లీలా అనే ఇద్దరు బాధితులు ఈ నెల 6న హోటల్ సెవన్ వద్దకు చేరుకొని రూ.18 లక్షలకు 20 గ్రాముల పది బంగారు బిస్కెట్లు (నకిలీ) కొనుగోలు చేసేందుకు అంగీకరించారు. అదే రోజు నాగేశ్వరరావు సూర్యాపేటలోని బాలెంల గ్రామ శివారులో అద్దెకు నివాసం ఉంటున్న ఇంటి వద్దకు వచ్చి రూ.12 లక్షలు చెల్లించి, ఐదు బిస్కెట్లను తీసుకొని వెళ్లారు. మిగిలిన డబ్బు చెల్లించిన తర్వాత మరో ఐదు బిస్కెట్లు ఇవ్వనున్నట్లు అంగీకరించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో బాధితులు చెల్లించిన డబ్బును నాగేశ్వరరావు తాత్కాలికంగా నరేశ్ వద్ద ఉంచాడు. సోమవారం ఆ డబ్బును బాలెంల సమీప ఖమ్మం జాతీయ రహదారి పైవంతెన వద్దకు తీసుకురావాలని, అలాగే బాధితులను మిగిలిన డబ్బులు అక్కడికే తేవాలని నాగేశ్వరరావు కోరాడు. ఇందులో భాగంగా నిందితులంతా సోమవారం బాలెంల సమీపంలోని పైవంతెన వద్దకు చేరుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు సూర్యాపేట గ్రామీణ సీఐ రాజశేఖర్, ఎస్సై బాలునాయక్ తన సిబ్బందితో కలిసి దాడి చేయడంతో నలుగురు నిందితులు, ఐదు నకిలీ బిస్కెట్లు, రూ.12 లక్షలు పట్టుబడ్డాయి. మిగిలిన ఐదుగురు నిందితులు పరారయ్యారు. ఈ కేసును ఛేదించిన సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

SHRIRAM Finance **శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్**
రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్, ప్లాట్ నెం. 14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032.
బ్రాంచ్ ఆఫీస్: డి.నెం.29-37-141, 2వ అంతస్తు, రామమందిరం దగ్గర, ఏలూరు రోడ్డు, విజయవాడ-520002.

2002 సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలలోని రూల్ 8 (6) క్రింద 30 రోజులు అయిన తర్వాత అమ్మకాన్ని తెలుపుతూ ఋణగ్రహీతకు ఇవ్వబడిన ఉద్దేశిత అమ్మకం ప్రకటన.

ఋణగ్రహీతలు / హామీదారుల వివరాలు: 1. చౌదరి బొల్లా, తండ్రి: బొల్లా రామయ్య, డి.నెం: 63/1, సింహపురి ఎస్టేట్స్, మహాలక్ష్మీపురం, గుంటూరు జిల్లా-522003. మరొక చిరునామా: ఫ్లాట్ నెం. 205, సాయి అనూహ్య ఎన్‌క్లేవ్, 7/2, చంద్రమౌళి నగర్, గుంటూరు జిల్లా-522007. **2. సూరం వెంకటేశ్వర రెడ్డి,** తండ్రి: శేషు రెడ్డి, డి.నెం: 5-90-46/1, చంద్రమౌళి నగర్ 7/1, గుంటూరు జిల్లా-522007. **3. నెల్లూరు రాఘవ రెడ్డి,** తండ్రి: వీరా రెడ్డి, డి.నెం: 5-92-52/ఎ, ఫ్లాట్ నెం. 101, గాయత్రి రెసిడెన్సీ, దేవపురం, గుంటూరు జిల్లా-522002.
సర్/మేడమ్,
విషయం: 2002 సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలతో చదువుకోనేలా 2002 సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం ద్వారా ఋణదాతకు బకాయి పడిన మొత్తాలను వసూలు చేయుటకు ఋణగ్రహీతలు: **శ్రీ చౌదరి బొల్లా మరియు సూరం వెంకటేశ్వర రెడ్డి** గారికి చెందిన ఆస్తుల అమ్మకం గురించి నిర్దేశించిన అమ్మకం ప్రకటన.
సూచిక: రుణ ఒప్పందం నెంబరు: VIJA2TF1506260001.
ఇందుమూలంగా తెలియజేయడమేమనగా "శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్" ఎన్.సి.ఎల్.టి చెన్నై ఉత్తర్వుల ప్రకారం "శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్"తో విలీనం కాబడింది. ఇటీవల "శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్"గా మార్పుచెందింది. ఇది ది. 30-11-2022 నుండి పేరు మార్పుకు సంబంధించిన సర్టిఫికేట్ ఆఫ్ ఇన్ కార్పొరేషన్ ది. 30-11-2022 ద్వారా "శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్" గా మార్పుచెందింది. దీని రిజిస్టర్డ్ కార్యాలయం: శ్రీ టవర్స్ ప్లాట్ నెం. 14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032 మరియు ఆఫీస్ చిరునామా: శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, డి.నెం. 29-37-141, 2వ అంతస్తు, రామమందిర దగ్గర, ఏలూరు రోడ్డు, విజయవాడ-520002 మరియు బ్రాంచి **ఆఫీస్: విజయవాడ-1** (ఇక నుంచి కంపెనీగా/ఋణదాతగా పిలవబడేది).
సెక్యూర్డ్ ఋణదాత శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారు సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002లోని సెక్షన్ 13(2) క్రింద **తేది.27-01-2023**న జారీ చేసిన డిమాండ్ నోటీసుతో పేర్కొన్న **తేది. 27-01-2023** నాటికి బకాయి **రూ.1,99,53,920/-** (అక్షరాలా ఒక కోటి తొంభై తొమ్మిది లక్షల యాభై మూడు వేల తొమ్మిది వందల ఇరవై రూపాయలు మాత్రమే) తో పాటు ఇటీవల వడ్డీ /ఖర్చుల మొత్తాన్ని నిర్దేశించిన కాలపరిమితిలోగా మీరు చెల్లించవలెను. మీరు సదరు నోటీసులో నిర్దేశించిన కాలపరిమితిలోగా బకాయి మొత్తాన్ని చెల్లించనందున అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారు 2002 సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలలోని రూల్ 8తో చదువుకొనేలా చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద సెక్యూర్డ్ స్థిరాస్తులను **తేది. 12.08.2023** న లాంఛనాత్మకంగా స్వాధీనం చేసుకొనిరి. మరియు ఆ స్థలం ఖాళీ స్థలం కాబట్టి, మా కార్యనిర్వాహక అధికారి సహాయంతో **తేది. 04.12.2025**న భౌతిక స్వాధీనం కూడా చేసుకొనిరి.
సెక్యూర్డ్ ఆస్తి స్వాధీనం చేసుకున్నప్పటికీ, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారికి మీరు బకాయి మొత్తాన్ని చెల్లించలేదు. అందువల్ల దిగువ వివరించిన ఆస్తిని బహిరంగ ఈ-వేలం ద్వారా ఈ నోటీసు ప్రచురించిన తేది, ఈ నోటీసు చేరిన తేదీ నుంచి గల 30 రోజుల తర్వాత, విడిగా ఈ-వేలం అమ్మకం నోటీసు ఇచ్చి అమ్మవల్సిన అవసరం ఏర్పడింది. ఈ-వేలం జరిగే తేదీ మరియు సమయంతో పాటు ఆస్తి రిజర్వు ధర మరియు ఈ-వేలం నిర్వహించనున్న సర్వీసు ఏర్పాటుదారుని వివరాలను విడిగా మీకు తెలుపబడును.
అందువల్ల మీరు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారికి బకాయిపడ్డ మొత్తంతో పాటు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారికి అయిన ఖర్చులను మరియు ఇటీవల అయిన వడ్డీ, ఖర్చులు, ఛార్జీల మొత్తాన్ని అమ్మకం ప్రకటన ప్రచురణ తేదీకి ముందుగా చెల్లించినచో, ఆస్తి అమ్మకంపై ఏలాంటి తదుపరి చర్యలు తీసుకోబడవు మరియు మీరు చట్టంలోని సెక్షన్ 13(8) క్రింద నిర్దేశించిన ప్రకారం మీ ఆస్తిని మీరు విడిపించుకొనవచ్చును.
ఫైనాన్షియల్ ఇన్‌స్టిట్యూషన్ కి చెందిన షెడ్యూల్ ఆస్తుల వివరాలు
గుంటూరు జిల్లా, నల్లపాడు సబ్-జిల్లా, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, టౌన్ సర్వే చేయబడని అంకిరెడ్డిపాలెం గ్రామం, డి.నెం. 175/2 లోని మొత్తం ఎకరా 4.10 సెంట్ల విస్తీర్ణం నుండి ప్లాట్లుగా విభజించబడిన స్థలంలో ప్లాట్ నెం. 4ఎ యొక్క ఉత్తర వైపున ఉన్న 1950 చదరపు గజాలలో ఉత్తర వైపున 1190.77 చదరపు గజాల స్థలం పోగా దక్షిణ వైపున ఉన్న 500 చదరపు గజాలు లేదా 418.05 చదరపు మీటర్ల ఖాళీ స్థలం, దగ్గర డోర్ నెం. 25-27-94. **హద్దులు: తూర్పు:** 40 అడుగుల వెడల్పు రోడ్డు-43.41/2 అడుగులు, **దక్షిణం:** ఆలపాటి మరియు కంపెనీ వారి స్థలం-103.09 అడుగులు, **పడమర:** నూకల సాంబశివ రావు మొదలైన వారి స్థలం-43.41/2 అడుగులు, **ఉత్తరం:** ఆలపాటి లక్ష్మి ప్రసన్న గారి స్థలం-103.09 అడుగులు. పై హద్దులలో ఉన్న 500 చదరపు గజాలు లేదా 418.05 చదరపు మీటర్ల ఖాళీ స్థలం మాత్రమే. (ఈ ఆస్తి నల్లపాడు ఎస్.ఆర్.ఓ. యొక్క డాక్యుమెంట్ నెం. 2258/2015 కు సంబంధించినది).
తేది: 08.12.2025 అధీకృత అధికారి
ప్రదేశం : విజయవాడ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

SHRIRAM Finance **శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్**
రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్, ప్లాట్ నెం. 14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032.
బ్రాంచ్ ఆఫీస్: డి.నెం.29-37-141, 2వ అంతస్తు, రామమందిరం దగ్గర, ఏలూరు రోడ్డు, విజయవాడ-520002.

2002 సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలలోని రూల్ 8 (6) క్రింద 30 రోజులు అయిన తర్వాత అమ్మకాన్ని తెలుపుతూ ఋణగ్రహీతకు ఇవ్వబడిన ఉద్దేశిత అమ్మకం ప్రకటన.

ఋణగ్రహీతలు / హామీదారుల వివరాలు: 1. షేక్ మహమ్మద్ జానీ, తండ్రి: గాలిబ్, డోర్ నెం: 15-13-59/ఎ, 1వ లైన్, గాంధీ నగర్, ఆర్.టీ.సి. కాలనీ, గుంటూరు జిల్లా-522004. **2. షేక్ బీబి ఆయేషా,** భర్త: గాలిబ్, డోర్ నెం: 15-13-59/ఎ, 1వ లైన్, గాంధీ నగర్, ఆర్.టీ.సి. కాలనీ, గుంటూరు జిల్లా-522004. **3. షేక్ గాలిబ్,** తండ్రి: షేక్ జాన్ అహ్మద్, డోర్ నెం: 15-13-59/ఎ, 1వ లైన్, గాంధీ నగర్, ఆర్.టీ.సి. కాలనీ, గుంటూరు జిల్లా-522004. **4. షేక్ హారీస్ అహ్మద్,** తండ్రి: గాలిబ్, డోర్ నెం: 15-13-59/ఎ, 1వ లైన్, గాంధీ నగర్, ఆర్.టీ.సి. కాలనీ, గుంటూరు జిల్లా-522004. **5. షేక్ సుభానీ,** తండ్రి: షేక్ మహబూబ్ అలీ, డోర్ నెం: 8-19/1-5, 1వ లైన్, అరుంధతి నగర్, గుంటూరు జిల్లా-522001.
సర్/మేడమ్,
విషయం: 2002 సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలతో చదువుకొనేలా 2002 సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం ద్వారా ఋణదాతకు బకాయి పడిన మొత్తాలను వసూలు చేయుటకు ఋణగ్రస్తులగు: **శ్రీమతి ఆయేషా బీబి @ షేక్ బీబి ఆయేషా** గారికి చెందిన ఆస్తుల అమ్మకం గురించి నిర్దేశించిన అమ్మకం ప్రకటన.
సూచిక: రుణ ఒప్పందం నెంబరు: IBPATTF2204300006.
ఇందుమూలంగా తెలియజేయడమేమనగా "శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్" ఎన్.సి.ఎల్.టి చెన్నై ఉత్తర్వుల ప్రకారం "శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్"తో విలీనం కాబడింది. ఇటీవల "శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్"గా మార్పుచెందింది. ఇది ది. 30-11-2022 నుండి పేరు మార్పుకు సంబంధించిన సర్టిఫికేట్ ఆఫ్ ఇన్ కార్పొరేషన్ ది. 30-11-2022 ద్వారా "శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్" గా మార్పుచెందింది. దీని రిజిస్టర్డ్ కార్యాలయం: శ్రీ టవర్స్ ప్లాట్ నెం. 14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032 మరియు ఆఫీస్ చిరునామా: శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, డి.నెం. 29-37-141, 2వ అంతస్తు, రామమందిర దగ్గర, ఏలూరు రోడ్డు, విజయవాడ-520002 మరియు బ్రాంచి **ఆఫీస్: ఇబ్రహీంపట్నం** (ఇక నుంచి కంపెనీగా/ఋణదాతగా పిలవబడేది).
సెక్యూర్డ్ ఋణదాత శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారు సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002లోని సెక్షన్ 13(2) క్రింద **తేది.09-03-2024**న జారీ చేసిన డిమాండ్ నోటీసుతో పేర్కొన్న **తేది. 09-03-2024** నాటికి బకాయి **రూ. 42,23,434/-** (అక్షరాలా నలభై రెండు లక్షల ఇరవై మూడు వేల నాలుగు వందల ముప్పై నాలుగు రూపాయలు మాత్రమే) తో పాటు ఇటీవల వడ్డీ /ఖర్చుల మొత్తాన్ని నిర్దేశించిన కాలపరిమితిలోగా మీరు చెల్లించవలెను. మీరు సదరు నోటీసులో నిర్దేశించిన కాలపరిమితిలోగా బకాయి మొత్తాన్ని చెల్లించనందున అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారు 2002 సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలలోని రూల్ 8తో చదువుకొనేలా చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద సెక్యూర్డ్ స్థిరాస్తులను **తేది. 20.09.2024** న లాంఛనాత్మకంగా స్వాధీనం చేసుకొనిరి. మరియు ఆ స్థలం ఖాళీ స్థలం కాబట్టి, మా కార్యనిర్వాహక అధికారి సహాయంతో **తేది. 04.12.2025**న భౌతిక స్వాధీనం కూడా చేసుకొనిరి.
సెక్యూర్డ్ ఆస్తి స్వాధీనం చేసుకున్నప్పటికీ, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారికి మీరు బకాయి మొత్తాన్ని చెల్లించలేదు. అందువల్ల దిగువ వివరించిన ఆస్తిని బహిరంగ ఈ-వేలం ద్వారా ఈ నోటీసు ప్రచురించిన తేది, ఈ నోటీసు చేరిన తేదీ నుంచి గల 30 రోజుల తర్వాత, విడిగా ఈ-వేలం అమ్మకం నోటీసు ఇచ్చి అమ్మవల్సిన అవసరం ఏర్పడింది. ఈ-వేలం జరిగే తేదీ మరియు సమయంతో పాటు ఆస్తి రిజర్వు ధర మరియు ఈ-వేలం నిర్వహించనున్న సర్వీసు ఏర్పాటుదారుని వివరాలను విడిగా మీకు తెలుపబడును.
అందువల్ల మీరు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారికి బకాయిపడ్డ మొత్తంతో పాటు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారికి అయిన ఖర్చులను మరియు ఇటీవల అయిన వడ్డీ, ఖర్చులు, ఛార్జీల మొత్తాన్ని అమ్మకం ప్రకటన ప్రచురణ తేదీకి ముందుగా చెల్లించినచో, ఆస్తి అమ్మకంపై ఏలాంటి తదుపరి చర్యలు తీసుకోబడవు మరియు మీరు చట్టంలోని సెక్షన్ 13(8) క్రింద నిర్దేశించిన ప్రకారం మీ ఆస్తిని మీరు విడిపించుకొనవచ్చును.
ఫైనాన్షియల్ ఇన్‌స్టిట్యూషన్ కి చెందిన షెడ్యూల్ ఆస్తుల వివరాలు
గుంటూరు జిల్లా, గుంటూరు సబ్-జిల్లా, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, టౌన్ సర్వే చేయబడని గుంటూరు గ్రామం, డోర్ నెం.లు: 537/ఎ2 మరియు 539/1 మరియు జి.ఎం.సి, సిటీ ప్లానర్ యొక్క ఆమోదం పొంది గుంటూరు, తేదీ. 14-03-2022, డి.నెం.లు: 537/ఎ2సి మరియు 537/ఎ2డి లలో గల 441 చదరపు గజాలు లేదా 370.74 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉన్న ఖాళీ స్థలం. డోర్ నెం: 16-14-24. **హద్దులు: తూర్పు:** 25 అడుగుల వెడల్పు గల దారి-52 అడుగులు, **దక్షిణం:** 40 అడుగుల వెడల్పు గల దారి-75 అడుగులు, **పడమర:** జంగా చిన సుబ్బారెడ్డి గారి ఇల్లు-50.6 అడుగులు, **ఉత్తరం:** కర్రె వీరయ్య గారి ద్వారా నీలగిరి సాయి లీల గారికి విక్రయించబడిన ఆస్తి-80 అడుగులు. పైన పేర్కొన్న హద్దుల లోపల 441 చదరపు గజాలు లేదా 370.74 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉన్న ఖాళీ స్థలం మాత్రమే. (ఈ ఆస్తి గుంటూరు ఎస్.ఆర్.ఓ యొక్క డాక్యుమెంట్ నెం. 11940/1984 కు సంబంధించినది).
తేది: 08.12.2025 అధీకృత అధికారి
ప్రదేశం : విజయవాడ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి అధికధరకు కొనబడును (స్పాట్ క్యాష్). ✆ 87907 41166.

EDUCATION

SPOT admissions by Govt AP 12/12: M.Com/MA English/MSW only Rs 5000 per sem, PLNM Degree College, 91774 08565.

PEOPLE CARE

OLD AGE HOME

రామకృష్ణ గ్రూపు, GNT, వృద్ధులకు, పేషెంట్ల సేవకు ఇంటి/వంట, బేబీ కేర్‌కు వర్కర్లను భారతదేశం అంతటా పంపగలము. ✆ 91540 85588, 91549 35588

Book your 5 lines Classified Colour Rs.770/-
3Ads Package Rs.1945/-
5 lines Classified B/W Rs.650/-
3Ads Package Rs.1625/-
ప్రకటనపై 5% జి.ఎస్.టి. అదనం

REAL ESTATE

PLOT FOR SALE

GENERAL

133.33 Sq.Yds. కేవలం 1,00,000/- మాత్రమే. వినుకొండ, పల్నాడు డిస్ట్రిక్ట్‌లో లిమిటెడ్ ఆఫర్. ఫోన్: 9133445755.

JOBS

Wanted Sales Executives For Guntur, Ongole for Mahesh Extruions (P) Ltd Bellari Send Your Resumes maheshpvcpipes@gmail.com.

గుంటూరు, లక్ష్మీపురం నందు క్రొత్తగా ప్రారంభించిన బోటిక్ నందు పనిచేయుటకు Sitching వర్క్ వచ్చిన లేడీస్ కావలెను. 80192 08772.

గుంటూరు, బ్రాడీపేటలోని ప్రముఖ జ్యూయలరీ షోరూంవారికి 25-30 సం||ల వయస్సు, జ్యూయలరీ సేల్స్‌లో 2సం|| అనుభవంఉన్న సేల్స్‌మెన్స్/గర్ల్స్ కావలెను. ✆ 98485 58182.

అమెరికాలో 1 సం|| బాబు ఆలన, పాలన వ్యక్తిగత సంరక్షణ కొరకు అనుభవంగల ఆడవారు కావలెను. అమెరికా వీసా కల్గినవారు మాత్రమే. ✆ 9440803362

గుంటూరు ఓనరసరావుపేటలోని ప్రముఖ అడ్వకేటు ఆఫీసునందు లీగల్ Openions టైపుచేయుటకు అనుభవం కలిగిన అభ్యర్థులు కావలెను. Ph: 9346983822.

అకౌంటెంట్స్, సూపర్‌వైజర్స్, ఐషర్ డ్రైవర్స్ కావలెను. చిలకలూరిపేట మం. యడవల్లి గ్రామంలో ఉన్న పేపర్ మిల్లులో పనిచేయుటకు. 93906 33593, 90595 14555.

30-65Yrs బ్యాంక్ అనుబంధ సంస్థలో జీతం+Inc 35వేలు టీంమేనేజర్స్, ఎగ్జిక్యూటివ్స్. Q:10th, డిగ్రీ. రిటైర్డ్ బిజినెస్ ఇన్సూరెన్స్ ఏజంట్స్ మ్యూచువల్‌ఫండ్స్. నోటార్గెట్. ✆90524 70111

SHO కు MLT, DMLT,BSc - MLT, ANM, GNM లు కావలెను. జీతం 8-10 వేలు. సంప్ర: SHO, 2/1 బ్రాడీపేట, గుంటూరు. ✆: 98483 91212.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం..
ఈనాడు లో ప్రకటన ఇవ్వటం
పూర్తి వివరాలకు సంప్రదించండి:
8008510541

తెనాలి

●తెనాలి ●పొన్నూరు

మాతాశిశు రక్షణ ముఖ్యం

పొన్నూరు, న్యూస్‌టుడే : స్థానిక 30 పడకల వైద్యశాలను జాతీయ ఆరోగ్య మిషన్ అధికారులు వివేక్ సింగ్, యశ్వంత్ సందర్శించారు. ఈ సందర్భంగా మాతాశిశు సంరక్షణకు తీసుకుంటున్న చర్యలను సూపరింటెండెంట్ ఫిరోజ్‌ఖాన్‌ను అడిగి తెలుసుకుని వైద్యశాలకు కావాల్సిన వసతులపై చర్చించారు. మాతాశిశు మరణాలు నివారించాలని వైద్యులను ఆదేశించారు.

వైద్యులతో జాతీయ ఆరోగ్య మిషన్ అధికారులు

ప్రజా సమస్యలు పట్టవా..?

చేబ్రోలు, న్యూస్‌టుడే : క్షేత్రస్థాయి అధికారులకు ప్రజా సమస్యలు పట్టవా? నిధులు మంజూరై భూమి పూజ చేసి నెలలు గడుస్తున్నా పనులు ప్రారంభించరా? పంచాయతీ వార్డు సభ్యులు తమ వార్డుల్లో ఉన్న సమస్యలు చెప్పేందుకు వస్తే నిర్లక్ష్యం వహిస్తారా.... అంటూ పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ క్షేత్రస్థాయి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమం నిర్వహించారు. పాత రెడ్డిపాలెంలో కేంద్ర పథకం కింద మురుగు కాల్వల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. వాటికి ఎమ్మెల్యే నరేంద్రకుమార్ భూమిపూజ చేసి పనులు ప్రారంభించాలని ఆదేశాలు జారీ చేశారు. అయితే గ్రామీణ నీటి సరఫరా విభాగం ఇప్పటికీ పనులు ప్రారంభించక పోవడం.. మురుగు కాల్వలో పూడిక పెరిగి నీరు ఆగింది. దీంతో ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నారని స్థానికులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. ఆయన అధికారులకు ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకోగా... వారు సరైన సమాధానం చెప్పక పోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు.

దివ్యాంగుల సమస్యలు వింటున్న ఎమ్మెల్యే నరేంద్రకుమార్

★ పండించిన పంటను తక్కువ ధరకు విక్రయించవద్దని, మద్దతు ధరకు ప్రభుత్వమే కొంటుందని ఎమ్మెల్యే నరేంద్రకుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడారు. మండలంలో ఇప్పటి వరకు ధాన్యం సేకరణ కేంద్రాల ద్వారా రూ.1.64 కోట్ల విలువైన 705.7 టన్నులు కొన్నారని వెల్లడించారు. అనంతరం జీడీసీఎంఎస్ ఆధ్వర్యంలో కొన్న ధాన్యాన్ని తరలించేందుకు ఏర్పాటు చేసిన జీపీఎస్ అమర్చిన ట్రాక్టరును ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసశర్మ, ఏవో ప్రియదర్శిని, పలు శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

శంకరుని పేరున సేవా కార్యక్రమాలు నేడు

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే : పట్టణ బోసురోడ్డులోని ధర్మసత్రం వ్యవస్థాపకుడు కాకుమాను శంకరుని వర్ధంతి సందర్భంగా మంగళవారం ఉదయం 10 గంటలకు 200 మంది విద్యార్థులకు రూ.5.25 లక్షల ఉపకార వేతనాలు, గోవాడ గోశాల గోవుల సంరక్షణకు రూ.3 లక్షలు అందిస్తున్నట్లు సత్రం ధర్మకర్త కె.శరత్‌బాబు, ఈవో టి.శివారెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన సత్రంలో మాట్లాడారు. పేదలకు అన్న, వస్త్రదానం చేయనున్నట్లు తెలిపారు.

ఎట్టకేలకు పురోగతి

వినియోగంలోకి బహుళ ప్రయోజనకర గోదాములు

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే

నాబార్డు నిధులతో నిర్మించిన బహుళ ప్రయోజనకర గోదాములు వినియోగించాలని సహకార శాఖ అధికారులు.. వేర్ హౌసింగ్, గృహ నిర్మాణ సంస్థ, పౌర సరఫరాల శాఖ అధికారులను, వ్యాపారులు, రైతులను పలుసార్లు కలిశారు. వీరిలో కొందరు తీసుకోక పోగా దారి లేని చోట వాటిని నిర్మించారని సదరు అధికారులను తప్పుపట్టారు. దీంతో అధికారులు నిరుత్సాహ పడకపోగా తమ ప్రయత్నాన్ని తీవ్రం చేశారు. ఎట్టకేలకు వీరి ప్రయత్నం ఫలించింది. మూడు గోదాములు అద్దెకు తీసుకోటానికి డీసీఎంఎస్ అధికారులు అంగీకారం తెలిపారు.

● గత వైకాపా ప్రభుత్వ హయాంలో జిల్లా అంతటా నాబార్డు నిధులతో బహుళ ప్రయోజనకర గోదాములు నిర్మించారు. వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఇంజినీర్లు. ఒక్కోదానికి రూ.40 లక్షలు ఖర్చు చేశారు. ఇవి 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గలవి. వీటిని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు అప్పగించారు. వీటిని అద్దెకిచ్చి వచ్చిన ఆదాయం నుంచి రూ.40 లక్షల రుణాన్ని దశల వారీగా తీర్చాలని సూచించారు.

అద్దెకు తీసుకున్న ఈమనిలోని గోదాము

● తెనాలి డివిజన్ సహకార శాఖ పరిధిలో గల పెదరావూరు, బుర్రిపాలెం, కొలకలూరు,పెనుమూలి, సుద్దపల్లి డొంక, కొల్లిపర, వల్లభాపురం, తాళ్లపాలెం (ఆరెమండ), ఉప్పరపాలెం, కసక్రు, నందూరు, చినలింగాయపాలెం, కొండభట్లవారి పాలెం, రేటూరులలో గోదాములు నిర్మించారు. వీటిని అద్దెకు తీసుకోవాలని సహకార శాఖ అధికారులు డీసీఎంఎస్ అధికారులను కోరగా పరిశీలించి దుగ్గిరాల మండలం ఈమని గోదామును అద్దెకు తీసుకున్నారు. అలాగే తూములూరు, వెల్లలూరు గోదాములు తీసుకోటానికి ఒప్పందం కుదుర్చుకునేందుకు అధికారులతో మాట్లాడుతున్నారు. దుగ్గిరాల పీఏసీఎస్ వారు పెదపాలెం గోదాములో ఎరువుల వ్యాపారం చేస్తున్నారు. వీరి గురించి చెబుతూ మిగిలిన గోదాములను అద్దెకు తీసుకోవాలని సహకార శాఖ అధికారులు పలువురిని కోరుతున్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం

చేబ్రోలు, న్యూస్‌టుడే : గ్రామాభివృద్ధికి తెదేపా కట్టుబడి ఉందని పొన్నూరు ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ పేర్కొన్నారు. మండలంలోని శేకూరులో సోమవారం పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా రూ.21.5 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను, రూ.6 లక్షలతో నిర్మించిన ఘన వ్యర్థాల కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్లకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌కు వినతి

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే : పట్టణంలోని చెంచుపేట అమరావతి కాలనీలోని ఫెన్సింగ్ తొలగించాలని కోరుతూ స్థానికులు కమిషనర్ జె.రామ అప్పలనాయుడుకు అర్జీ అందించారు. ఆయన సోమవారం పురపాలక కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అర్జీ స్వీకరించారు.

ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగితే విజయం

పుస్తకాలను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు, నాట్స్ ప్రతినిధులు

నారాకోడూరు (చేబ్రోలు), న్యూస్‌టుడే : విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లాలని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. మండలంలోని నారాకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉత్తర అమెరికా తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎన్ఎంఎంఎస్, ఐఏఎస్ ఓరియంటేషన్ పుస్తకాలను ఆవిష్కరించి విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాట్స్ అధ్యక్షుడు పిన్నమనేని ప్రశాంత్ మాట్లాడుతూ తాము కూడా ప్రభుత్వ పాఠశాలల్లో విద్య అభ్యసించే ఉన్నత స్థాయికి ఎదిగామని, మాతృభూమి రుణం కొంతైనా తీర్చుకునేందుకు సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. నాట్స్ ఈసీ సభ్యులు కిరణ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 26,500 మంది విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో విద్యాకమిటీ ఛైర్మన్ గోపీనాథ్, ప్రధానోపాధ్యాయుడు ఏడుకొండలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉద్యోగి కుటుంబానికి ఆర్థిక సాయం

తెనాలి (కొత్తపేట): గతనెల 20న అనారోగ్యంతో మృతి చెందిన నాజర్‌పేట పదో వార్డు సచివాలయ శానిటేషన్ కార్యదర్శి చుక్క ధనరాజ్ భార్య ప్రత్యూషకు రూ.28 వేలు సాయం అందించినట్లు సచివాలయాల శానిటేషన్ కార్యదర్శులు, ఇతర ఉద్యోగులు పేర్కొన్నారు. తోటి ఉద్యోగి కుటుంబాన్ని ఆదుకునేందుకు ఉద్యోగులు చేయూత అందించినట్లు పేర్కొన్నారు.

అక్రమాలపై విచారణ చేపట్టాలి

పొన్నూరు, న్యూస్‌టుడే : గత వైకాపా పాలనలో స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో జరిగిన అవినీతి, అక్రమాలపై విచారణ చేపట్టాలని ముస్లిం మైనార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి షేక్ బాజీ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణ పరిధిలోని 4వ వార్డు షాదీఖానాలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... గత వైకాపా పాలనలో ప్రభుత్వ వైద్యశాల దోపిడీకి కేంద్రంగా మారిందని విమర్శించారు. పొన్నూరులో 30 పడకల వైద్యశాలను 100 పడకల వైద్యశాలగా మారుస్తామని ఆనాటి నేతలు గొప్పలు చెప్పారని.. కానీ అభివృద్ధికి పైసా మంజూరు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం పాలనలో పడకల సంఖ్య పెరిగి.. రూ.5 కోట్లకు పైగా నిధులు మంజూరు కావడంలో ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ కీలకపాత్ర పోషించారని వెల్లడించారు.

నిర్మాణ సామగ్రి తొలగింపు

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే : పట్టణంలోని గంగానమ్మపేట భవనంవారి వీధిలోని ఓ భవన యజమాని రాత్రికి రాత్రే ప్లాను లేకుండా నూతన భవన నిర్మాణం చేపట్టాడు. సోమవారం దీన్ని తొలగించేందుకు పట్టణ ప్రణాళికా అధికారులు వెళ్లగా తొలుత యజమాని సహకరించలేదు. అధికారులను అడ్డుకుంటే మరింత ఇబ్బందుల్లో పడతారని హెచ్చరించటంతో దిగి వచ్చాడు. సిబ్బంది నిర్మాణ సామగ్రి తొలగించారు.

సమస్యలపై పది అర్జీలు

తెనాలి టౌన్ : తెనాలి సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదులు పరిష్కారాల వేదిక కార్యక్రమంలో వివిధ సమస్యలపై ఏడు అర్జీలు వచ్చినట్లు ఏవో శ్రీధర్‌బాబు తెలిపారు. సర్వే, వ్యక్తిగత సమస్యలు తదితరాలు వాటిలో ఉన్నాయని వివరించారు. తన కార్యాలయంలో మూడు అర్జీలు స్వీకరించామని తహసీల్దార్ గోపాలకృష్ణ తెలిపారు. కుమారులు పట్టించుకోలేదని, కిడ్నీ మార్పిడికి అనుమతి అర్జీలు వాటిలో ఉన్నాయి.

స్థాపితం:- 1906 ఫోన్:- 08644-228894

నెం.22 ది.తెనాలి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లిమిటెడ్

టి.బి.రోడ్, కొత్తపేట, తెనాలి.

సర్వసభ్య సమావేశపు నోటీసు

అధ్యక్షులు : శ్రీ మంగమూరి హరిప్రసాదరావు

బ్యాంకు యొక్క సర్వసభ్య సమావేశము ది.23-12-2025 మంగళవారం మధ్యాహ్నం గం.3.30 ని॥లకు నెం.22 ది.తెనాలి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు ఆవరణలో జరుగును. కావున 'A' తరగతి సభ్యులు తప్పక విచ్చేయవలసినదిగా ఆహ్వానించడమైనది.

గమనిక : ఒకవేళ ది. 23-12-2025 మంగళవారం నాటి సమావేశమునకు తగిన కోరము లేని యెడల ది. 24-12-2025 బుధవారం మధ్యాహ్నం గం.3.30 ని॥లకు బ్యాంకు ఆవరణలో సర్వసభ్య సమావేశము జరుపబడును

ఎజెండా

1. ది.01-06-2025 నాటి నుండి ది.30-11-2025 నాటి వరకు నూతనముగా చేర్చుకొనబడిన 'A' తరగతి సభ్యులను మరియు 'A' తరగతి సభ్యులకి వాటా ధనమును వాపస్ చేస్తూ తీసుకొన్న చర్యలను ఆమోదించుట గురించి.
2. మన బ్యాంకు ఖాతాదారులకు ఇచ్చు మార్టిగేజ్ లోన్స్ లిమిట్‌ను Rs.3000000/- ల వరకు పెంచిన చర్యను ఆమోదించుట గురించి
3. బ్యాంకు కార్యకలాపాలను ఖాతాదారుల సేవలకి అనుగుణంగా గ్రౌండ్ ఫ్లోర్‌లోనికి మార్చుటకు, మిగిలి ఉన్న పనులు పూర్తి చేయుటకు గాను ప్రభుత్వ ఇంజనీర్‌గారిచే వేయించిన ఎస్టిమేషన్ కాపీని పరిశీలించి, ఆమోదించుట మరియు పనులు పూర్తి చేయుటకు అనుమతి ఇచ్చు విషయం గురించి.
4. అధ్యక్షుల వారిచే తేబడు ఇతర విషయములు.

పాలకవర్గము అనుమతిన

ప్రదేశం: తెనాలి సం/- K.V.V. అమర్‌నాథ్

తేది: 08/12/2025 సెక్రటరి ఇన్‌చార్జి

పూడిక తీయరు.. మురుగు కదలదు

పెదకాకానిలో మురుగు నీరు పోయే పాతూరు డొంక కాలువ అధ్వానంగా ఉంది. పంచాయతీ అధికారులు పూడిక తీయించక మురుగు ముందుకు వెళ్లే పరిస్థితి లేదు. ఇటీవల కురిసిన వర్షాలకు వరద నీరు ఈ డొంకతో పాటు పక్కన ఉన్న పొలాలను ముంచి అన్నదాతలకు నష్టం కలిగించింది. గతంలో ఈ మురుగు నీరు నంబూరుకు వెళ్లే రోడ్డుకు వెళ్లేవి. కొన్నేళ్ల నుంచి పాతూరు వైపు మళ్లించారు. కానీ రోడ్డు, మురుగు వ్యవస్థ అభివృద్ధి చేయటం మరిచారు. ఉన్నతాధికారులు స్పందించి డొంక రోడ్డుకు ఇరువైపులా ఉన్న డ్రెయిన్ పూడికలు తీసి, అభివృద్ధి చేయాలని అన్నదాతలు కోరుతున్నారు. **- పెదకాకాని, న్యూస్‌టుడే**

ఏడేళ్లు.. పూర్తయ్యేందుకు ఎన్నేళ్లు?

గత తెదేపా ప్రభుత్వ హయాంలో యడ్లలింగయ్య కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రానికి శాశ్వత భవనం నిర్మించాలని సంకల్పించారు. ఈ క్రమంలో సుమారు రూ.40 లక్షలతో ఇదే కాలనీలోని మున్సిపాలిటీ స్థలంలో సుమారు గ్రౌండ్, ఫస్ట్ ఫ్లోర్ భవనం నిర్మించారు. వీటికి గోడలు, ఫ్లోరింగ్, తలుపులు ఏర్పాటు చేయకుండా వదిలేశారు. ఈ పనులు పూర్తి చేసి వినియోగంలోకి తేవాలని కౌన్సిలర్ల నుంచి ప్రతిపాదన రాలేదని మున్సిపల్ అధికారులు బదులిస్తున్నారు. ప్రస్తుతం అద్దె భవనంలో కేంద్రం నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి.. మిగిలిన పనులు పూర్తి చేసి.. భవనాన్ని వినియోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు. **- తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే**

మున్సిపల్ స్థలంలో ఆగిన నిర్మాణం

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తెనాలి : 80085 73125 పొన్నూరు : 80085 73144

పొన్నూరు, న్యూస్‌టుడే: ? పొన్నూరు పట్టణ పరిధిలోని 7వ వార్డులో రహదారి పగుళ్లిచ్చి ప్రమాదకరంగా మారింది. మరమ్మతులు చేపట్టాలి. **-కె.శ్రీనివాస్, 7వ వార్డు.** ✔ మరమ్మతులు చేసేలా చర్యలు తీసుకుంటా. **-షేక్ హసీనా, పురపాలక సంఘం సహాయ ఇంజినీరు** ? పొన్నూరు పట్టణ పరిధిలోని విద్యానగర్‌లోని మురుగు కాలువలో వ్యర్థాలు పేరుకున్నాయి. **- పి.నాగలక్ష్మి, విద్యానగర్** ✔ వ్యర్థాలు తొలగించే చర్యలు తీసుకుంటా.

- పోతురాజు, ప్రజారోగ్యశాఖాధికారి

తెనాలి టౌన్, న్యూస్‌టుడే

? తెనాలి పట్టణం ఇందిరానగర్ కాలనీలో భూగర్భంలోని పైపులు పగిలి తాగునీరు వృథా అవుతోంది. లీకుల ద్వారా జలాలు కలుషితమయ్యే ప్రమాదం ఉంది. **-ప్రసాద్.** ✔ సత్వరం మరమ్మతులు చేయిస్తాం. ? తెనాలి పట్టణ షరాఫ్‌బజార్ నుంచి ఉప్పు బజార్ వెళ్లే మార్గంలో వీధి దీపాలు వెలగడం లేదు. **- నళిని** ✔ మరమ్మతులు చేయిస్తాం. **– పై ప్రశ్నలకు మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు సమాధానాలు ఇచ్చారు.**

◆ తెనాలి మండలం సంగం జాగర్లమూడిలో వీధి దీపాలు వెలగడం లేదని స్థానికులు 7న మేమున్నాం...మీకు తోడుగా ద్వారా పంచాయతీ అధికారులకు తెలియజేయగా మరమ్మతులు చేయించారు. ◆ తెనాలి పట్టణ పాండురంగపేటలో వీధి కుక్కల బెడదను స్థానికులు ఈ నెల 8న మున్సిపల్ అధికారులకు తెలియజేయగా సమస్య పరిష్కరించారు. **- న్యూస్‌టుడే, తెనాలి టౌన్**

స్పందనకు వందనం

◆ మేమున్నాం...మీకు తోడుగా శీర్షికన ప్రచురితమైన సమస్యకు అధికారులు స్పందించారు. పట్టణ పరిధిలోని 2వ వార్డులో మూడు రోజులుగా పేరుకున్న చెత్తను కార్మికులతో తొలగింపజేశారు. ◆ 27వ వార్డులో పాడైన వీధి దీపాన్ని బాగు చేశారు. **- పొన్నూరు, న్యూస్‌టుడే**

విజేతలకు అభినందనలు

పెదకాకాని, న్యూస్‌టుడే : అబాకస్ పోటీలు విద్యార్థుల జ్ఞాపకశక్తి పెంపునకు దోహద పడతాయని సోమవారం శ్రీఅనిత పబ్లిక్ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు పెద్ది శ్రీనివాసరావు, వేదవతి దంపతులు తెలిపారు. విశ్వం ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో గుంటూరులో 7న అబాకస్ జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. పాఠశాలకు చెందిన ఒకటో తరగతి విద్యార్థిని షేక్ ఫౌజియా, రెండో తరగతికి చెందిన ఎం.యశస్విని, నాలుగో తరగతి విద్యార్థిని బి.శ్రీనిధి, ఐదో తరగతికి చెందిన డి.ఆకాంక్ష వీటిలో ప్రతిభ చూపి.. ప్రథమ స్థానంలో నిలిచారు. విజువలైజేషన్ పోటీలో నాలుగో తరగతి విద్యార్థిని ఎ.ఆరాధ్య మొదటి స్థానంలో నిలిచింది. వారిని హెచ్ఎం దంపతులు అభినందించారు.

విద్యార్థినులతో ప్రధానోపాధ్యాయుడు పెద్ది శ్రీనివాసరావు, వేదవతి దంపతులు

మున్సిపల్ స్థలాలు ఆక్రమించకుండా చర్యలు

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే : మున్సిపాలిటీ పరిధిలోని మున్సిపల్ స్థలాల్లో రక్షణ లేని వాటిని గుర్తించి నివేదిక అందించాలని పలువురు అధికారులు వార్డు సచివాలయాల ఉద్యోగులకు సూచించారు. వీరు సోమవారం పురపాలక కార్యాలయంలో నిర్వహించిన సచివాలయాల ఉద్యోగుల సమావేశంలో మాట్లాడారు. వీటిని ఎవరూ ఆక్రమించకుండా రక్షణ చర్యలు చేపట్టనున్నట్లు వారు తెలిపారు. మున్సిపాలిటీ స్థలాలు ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. సమావేశంలో కమిషనర్ జె.రామ అప్పలనాయుడు, డీఎస్పీ జనార్దనరావు, ఏసీపీ వాణి పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత

విద్యార్థులతో వాసిరెడ్డి ప్రియ బాంధవి తదితరులు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే : పర్యావరణ పరిరక్షణను మనమంతా బాధ్యతగా భావించాలని డాక్టర్ కొడాలి వీరయ్య ఎడ్యుకేషనల్ అకాడమీ వ్యవస్థాపకురాలు వాసిరెడ్డి ప్రియబాంధవి పేర్కొన్నారు. ప్రముఖ వైద్యుడు, మాజీ శాసనసభ్యుడు డాక్టర్ కొడాలి వీరయ్య వర్ధంతి సందర్భంగా తెనాలి నల్లమోతు చెంచు రామానాయుడు పురపాలక ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన వక్తృత్వ పోటీలు పర్యవేక్షించారు. 'పర్యావరణ పరిరక్షణ- నా బాధ్యత' అనే అంశంపై విద్యార్థులు మాట్లాడారు. విజేతలకు 10న బహుమతులు అందించనున్నట్లు బాంధవి తెలిపారు. కార్యక్రమంలో వసంతలక్ష్మి, బెల్లంకొండ వెంకట్, శ్రీదేవి, మహేష్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వసతి గృహంలో ప్రత్యేక అధికారి తనిఖీలు

పెదకాకాని, న్యూస్‌టుడే : వసతి గృహంలో వంట మనిషి లేకపోవటంపై మండల ప్రత్యేక అధికారి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ నరసింహారావు విస్మయం వ్యక్తం చేశారు. పెదకాకానిలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని సోమవారం ఎంపీడీవో ఆర్.శ్రీనివాసరావుతో కలిసి ఆయన తనిఖీ చేశారు. వసతి, భోజనం, దుప్పట్లు, పారిశుద్ధ్యంపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి గదిని పరిశీలించారు. వంట మనిషి లేకపోవటంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానని చెప్పారు. వసతి గృహ సంరక్షకురాలు ఝాన్సీ, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థినులతో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి నరసింహారావు

మోటారు.. తీగలు చోరీ

తెనాలి టౌన్, న్యూస్‌టుడే : పట్టణ రామలింగేశ్వరపేటలో నిర్మాణంలో ఉన్న ఇంట్లో ఆదివారం రాత్రి మోటారు, వైర్లు చోరీ చేశారు. ఈ ప్రాంతాల్లో ఇలా నిర్మాణంలో ఉన్న అనేక భవంతుల్లో ఇదే తరహాలో చోరీలు జరుగుతున్నాయని యజమానులు వాపోయారు. పోలీసులు నిఘా పెంచాలని కోరుతున్నారు.

నన్నపనేని సుధప్రియకు విశిష్ట వైద్య సేవా పురస్కారం

తెనాలి టౌన్, న్యూస్‌టుడే : రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ ఛైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, ముకుందరావు దంపతుల కుమారుడు రఘురాం సతీమణి డాక్టర్ నన్నపనేని సుధప్రియకు అమెరికాలోని డెట్రాయిట్‌లో '2025 విశిష్ట వైద్య సేవ పురస్కారం' అందుకున్నారు. ఉత్తమ వైద్యసేవలు.. ముఖ్యంగా పెద్దలకు మెరుగైన సేవలు అందించిన క్రమంలో కోర్‌వెల్ హెల్త్ సంస్థ నుంచి ఆమె ఈ పురస్కారాన్ని ఆదివారం స్వీకరించారు. సుధప్రియ (యం.డి. జనరల్ మెడిసిన్) వైద్యురాలిగా డెట్రాయిట్‌లో వైద్య సేవలు అందిస్తున్నారు. ఈ వివరాలను సోమవారం తెనాలిలో ముకుందరావు, రాజకుమారి దంపతులు తెలిపారు.

పురస్కారాన్ని అందుకున్న డాక్టర్ సుధప్రియ

ఏఎన్‌యూ ఉద్యోగి మృతికి సంతాపం

ఏఎన్‌యూ, న్యూస్‌టుడే : ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం బాలుర వసతి గృహ రెసిడెన్షియల్ వార్డెన్ అబ్దుల్లా అనారోగ్యంతో మృతి చెందారు. కొంతకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో ఆయన బాధపడుతున్నారు. సోమవారం ఆరోగ్యం విషమించడంతో మృతి చెందారు. ఆయనకు భార్య ఉన్నారు. అబ్దుల్లా మృతికి ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య గంగాధర్, రెక్టార్ ఆచార్య శివరామ్ ప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం సంతాపం తెలిపారు. కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు.

క్రికెట్ పోటీల సందడి

విజేతలైన జట్టుకు కప్పు అందిస్తున్న ఉపాధ్యాయులు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే : తెనాలి వీఎస్ఆర్ అండ్ ఎన్‌వీఆర్ కళాశాల ప్రాంగణంలో సోమవారం భాష్యం విద్యాసంస్థల క్రికెట్ పోటీల ఫైనల్స్‌లో తెనాలి, రేపల్లె పాఠశాలల జట్లు సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో తలపడ్డాయి. తెనాలి జట్లు విజయం సాధించాయి. జడ్ఈవో శివ, రాము, జోషి, బ్యూలా, మణికంఠ, మోహన్‌దాస్, భీమరాజు, ఉపాధ్యాయులు క్రీడాకారులను అభినందించి కప్పు, పతకాలు అందించారు.

అబాకస్‌లో ప్రతిభ

తెనాలి టౌన్, న్యూస్‌టుడే : విశ్వం ఎడ్యుటెక్ ఆధ్వర్యంలో ఆదివారం గుంటూరులో నిర్వహించిన జిల్లా స్థాయి అబాకస్ పోటీలో తమ విద్యార్థులు మోక్షిత్ శ్రీతేజ్, వేదిక్ మాథ్స్‌లో షేక్ అఫియ తమ విభాగాల్లో విజేతలుగా నిలిచి రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యారని తెనాలి నందులపేట అక్షరగీతా విద్యానికేతన్ డైరెక్టర్ కన్నెగంటి అశోక్‌బాబు, ఏవో రాంప్రియ తెలిపారు. పాఠశాలలో సోమవారం విజేతలను వారు అభినందించారు.

విజేతలతో అభినందిస్తున్న పాఠశాల డైరెక్టర్ అశోక్‌బాబు

క్రీడల్లో ఫార్మసీ కళాశాల విద్యార్థుల సత్తా

ఏఎన్‌యూ, న్యూస్‌టుడే : ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం పరిధిలోని మంగళగిరి నిర్మలా ఫార్మసీ కళాశాలలో నిర్వహించిన క్రీడల్లో విద్యార్థులు సత్తా చాటారు. మహిళల ఖోఖో పోటీల్లో మొదటి, 100 మీటర్ల రిలే పరుగులో ప్రథమ, చదరంగంలో రెండో బహుమతిని ఏఎన్‌యూ ఫార్మసీ కళాశాల విద్యార్థులు సాధించారు. వీటితో పాటు రూ.3 వేల నగదు పురస్కారం అందుకున్నారు. విద్యార్థులను ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య గంగాధర్ సోమవారం అభినందించారు. ప్రిన్సిపల్ ఆచార్య దివ్య తేజోమూర్తి, సమన్వయకర్త డాక్టర్ విజయ్ కిషోర్ పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య గంగాధర్

అంతర కళాశాలల బాస్కెట్‌బాల్ పోటీలు ప్రారంభం

ఏఎన్‌యూ, న్యూస్‌టుడే : ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయ పరిధిలోని అంతర కళాశాలల బాస్కెట్ బాల్ పోటీలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోటీల్లో ఏడు జట్లు పాల్గొన్నాయని నిర్వాహకుడు వినోద్ చెప్పారు. నాకౌట్, లీగ్ పద్ధతిలో పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. సోమవారం నాకౌట్ పోటీలు ముగిశాయని చెప్పారు. మంగళవారం నుంచి లీగ్ దశ పోటీలు ప్రారంభమవుతాయని వినోద్ తెలిపారు. ఇందులో సత్తా చాటిన వారిని విశ్వ విద్యాలయం జట్టుకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు.

బాస్కెట్ బాల్ పోటీలో క్రీడాకారులు

మంగళగిరి

• మంగళగిరి • తాడికొండ • ప్రత్తిపాడు

'జననీ మిత్ర' యాప్‌పై అవగాహన

పాల్గొన్న ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు

మంగళగిరి పట్టణం, న్యూస్‌టుడే: మంగళగిరి పట్టణ పరిధిలోని ఇందిరా నగర్ ఏరియా సమీపంలో ఉన్న యూపీహెచ్‌సీ కేంద్రంలో సోమవారం 'జననీ మిత్ర' యాప్‌పై ఏఎన్‌ఎంలకు అవగాహన సదస్సు నిర్వహించినట్లు మెటర్నల్ హెల్త్ డాక్టర్ సతీష్ తెలిపారు. ఈ యాప్‌ను ఏఐ అండ్ మెడ్‌టెక్ అలయన్స్ ఫౌండేషన్, ఆసియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంటరాలజీ వారు రూపొందించినట్లు పేర్కొన్నారు. యాప్‌లో గర్భిణుల ఆరోగ్యం, మందులు పంపిణీ, పోషకాహారం తదితర వివరాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డైరెక్టర్ అనిల్‌కుమార్, మెటర్నల్ హెల్త్ ప్రోగ్రాం ఆఫీసర్ కె.స్వాతి, డీపీఎం కె.సుజాత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

మంగళగిరి: 80085 73111 ప్రత్తిపాడు: 99596 89564 తాడికొండ: 97053 99233

స్పందన వందనం

మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: నీరుకొండ గ్రామంలోని ఎస్సీ కాలనీలో డ్రెయిన్ పూడిపోయి ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా పంచాయతీ కార్యదర్శి సత్యసాయి దృష్టికి తెచ్చారు. ఆయన స్పందించి కార్మికులతో ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయించి బ్లీచింగ్ చల్లించారు.

విత్తన చట్టాన్ని ఉపసంహరించుకోవాలి

ప్రతులను దహనం చేస్తున్న రైతు సంఘం నాయకులు

తాడేపల్లి, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విత్తన చట్టాన్ని ఉపసంహరించుకోవాలని కోరుతూ తాడేపల్లి మండలం వడ్డేశ్వరం వద్ద రైతు సంఘం నాయకులు సోమవారం నిరసన తెలిపారు. ఆ చట్ట ప్రతులను దహనం చేశారు. ప్రైవేటు కంపెనీలకు అనుకూలంగా.. రైతుల హక్కులను దెబ్బతీసే విధంగా ఈ చట్టాన్ని తీసుకొచ్చారని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి మండిపడ్డారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయ్య, కౌలురైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాధాకృష్ణ, నాయకులు శివనాగమణి, జొన్నా శివశంకరరావు, మోదుగుల శ్రీనివాసరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నుంచే పన్ను కట్టేయ్..!

పారదర్శక చెల్లింపులకు 'స్వర్ణ పంచాయతీ యాప్'

మేడికొండూరు, ఫిరంగిపురం (గ్రామీణం), న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీల్లో పారదర్శక పాలనకు శ్రీకారం చుట్టింది. పన్ను చెల్లింపుల్లో ఎక్కడా అవినీతికి తావులేకుండా ఉండేందుకు స్వర్ణ పంచాయతీ యాప్ తీసుకొచ్చింది. తద్వారా నగదు రహిత చెల్లింపులు చేపట్టింది. గ్రామాల్లో పన్ను చెల్లింపుదారులకు ముందుగా యాప్ ద్వారా సంక్షిప్త సమాచారం పంపిస్తారు. లబ్ధిదారులు పోర్టల్ ద్వారా నగదు చెల్లించవచ్చు. అవగాహన లేని వాళ్లు సంబంధిత పంచాయతీ సిబ్బందిని ఆశ్రయిస్తే యాప్‌లో వివరాలు సరి చూసుకుని క్యూఆర్ కోడ్ స్కాన్ ద్వారా డిజిటల్ చెల్లింపులు చేయొచ్చు. అన్ని పంచాయతీల్లో విధానం అమలు జరుగుతుంది. ముఖ్యంగా ఇల్లు, కుళాయి పన్నులు, వ్యాపారాలకు సంబంధించిన ఫీజు, సెల్ టవర్ల, వేలం రుసుం తదితరాలను ఇలా చెల్లించవచ్చు. అవగాహన కలిగిన వాళ్లు పంచాయతీ కార్యాలయానికి రాకుండానే ఇంటి దగ్గర నుంచి లేదా దూర ప్రాంతంలో ఉన్నా పన్ను చెల్లించొచ్చు.

మేడికొండూరు: పాలడుగులో డిజిటల్ చెల్లింపు చేసి రసీదు తీసుకుంటున్న గ్రామస్థుడు

నియోజకవర్గం పరిధిలో ఇలా..

మండలం	పంచాయతీలు
మేడికొండూరు	14
ఫిరంగిపురం	17
తాడికొండ	15
తుళ్లూరు	19

ఇలా చేస్తే సులభతరం..

యాప్ అందుబాటులోకి రావడంతో గ్రామీణులు ఇంటి నుంచి సేవలు పొందే అవకాశం మెరుగుపడింది. 'స్వర్ణ పంచాయత్' ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్‌కి వెళ్లి 'పేమెంట్ ఆప్షన్' క్లిక్ చేస్తే మొత్తం ఏడు రకాల పన్నుల వివరాలు కనిపిస్తాయి. వాటిల్లో చెల్లించాల్సిన దాని వద్ద క్లిక్ చేయాలి. అనంతరం సంవత్సరం, జిల్లా, మండలం, పంచాయతీ, గ్రామం వివరాలు నమోదు చేయాలి. అప్పుడు అసెస్‌మెంట్ నంబరు, యజమాని పేరు చూపిస్తుంది. వీటిలో ఒక దానిపై క్లిక్ చేసి వివరాలు నమోదు చేసి పన్ను వివరాలతో పేమెంట్ క్లిక్ ద్వారా నగదు చెల్లించవచ్చు.

మంచి ఆదరణ లభిస్తోంది..

యాప్ ద్వారా ప్రజలు చెల్లించిన ప్రతి పైసా నేరుగా పంచాయతీ ఖాతాల్లోకి జమవుతుంది. దీని ద్వారా ప్రతి జమ ఖర్చులు, ఇతర లావాదేవీలు ఆన్‌లైన్‌లో నమోదు కావడంతో పారదర్శకత పెరుగుతుంది. ప్రజల నుంచి మంచి స్పందన వస్తుంది. - డేవిడ్ ప్రభాకర్, ఎంపీడీవో, మేడికొండూరు

విత్తన శుద్ధితో తెగుళ్లు దూరం

రైతులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

మంచికలపూడి(దుగ్గిరాల), న్యూస్‌టుడే: మొక్కజొన్న విత్తనాలను బీజామృతంతో శుద్ధి చేయడం వల్ల ఎటువంటి తెగుళ్లు రావని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తెలిపారు. మంచికలపూడిలో రైతులకు ఎలా శుద్ధి చేయాలో చూపారు. దీంతో పాటు ఒక్కొక్క రైతుకు 5 కిలోల జీవవైవిధ్య విత్తనాలు అందజేశారు.

'యూరియా కొరత లేదు'

దుగ్గిరాల, న్యూస్‌టుడే: రబీ సంబంధించి కావల్సిన యూరియా నిల్వలు ఉన్నాయని ఏవో విజయకుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొందరు రైతులు యూరియా దొరకదనే అపోహతో ఉన్నట్లు తెలుస్తోందన్నారు. రైతుల అవసరాల మేరకు అందిస్తామని తెలిపారు. ఇదే విషయాన్ని 'రైతన్నా మీ కోసం' కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ చెప్పారన్నారు.

విద్యుత్తు సరఫరా నిలిపివేత నేడు

ఫిరంగిపురం న్యూస్‌టుడే: సుదురుపాడు, యర్రగుంట్లపాడు, పొనుగుపాడు, ముసునూరు, మేరికపూడి గ్రామాల్లో విద్యుత్తు లైన్ల మరమ్మతుల నిమిత్తం మంగళవారం ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు ఆ శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

భూసార పరీక్షలతో రైతులకు మేలు

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఏవో శ్రీరంజని

తాడికొండ, న్యూస్‌టుడే: భూసార పరీక్షలతో రైతులకు మేలు జరుగుతుందని వ్యవసాయ అధికారి శ్రీరంజని తెలిపారు. తాడికొండ మండలం పొన్నెకల్లు గ్రామ జిల్లా పరిషత్ పాఠశాలలో 'సాయిల్ హెల్త్' కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీరంజని పాల్గొని మాట్లాడుతూ భూసార పరీక్షలు చేయడం ద్వారా భూమి స్వభావం తెలుస్తుందని అన్నారు. మట్టి నమూనాలు సేకరించడం ద్వారా ఆవశ్యక సూచిక, నత్రజని, ఫాస్పరస్, పొటాషియం, మెగ్నీషియం, సల్ఫర్, జింక్, ఐరన్, మాంగనీస్, కాపర్ వంటి పోషకాల స్థాయిని గుర్తించవచ్చని తెలిపారు. వాటి ఆధారంగా ఎరువులను వాడితే మంచి దిగుబడులు సాధించవచ్చని వివరించారు.

ఇందిరానగర్‌లో ఉద్రిక్తత

స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేషన్ అధికారులు

తాడేపల్లి, న్యూస్‌టుడే: మంగళగిరి ఇందిరానగర్‌లో కృష్ణుడి విగ్రహం తొలగింపునకు నగరపాలక అధికారులు చేసిన ప్రయత్నాన్ని పలువురు స్థానికులు అడ్డుకున్నారు. కోర్టు ఆదేశాలతో విగ్రహాన్ని తొలగించేందుకు అధికారులు పోలీసు బలగాలతో సోమవారం అక్కడికి చేరుకోగా.. యాదవ సామాజికవర్గానికి చెందిన వారు ఒప్పుకోలేదు. ఈ నేపథ్యంలో ఇరువురి మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో పరిస్థితి అదుపు తప్పుతుందని భావించిన అధికారులు వెనుతిరగడంతో వివాదం సద్దుమణిగింది.

13న రాష్ట్ర స్థాయి వెటరన్ అథ్లెటిక్స్ పోటీలు

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న అసోసియేషన్ సభ్యులు

పాలపర్రు(పెదనందిపాడు), న్యూస్‌టుడే: పాలపర్రు ఎస్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల వజ్రోత్సవ సంవత్సరాన్ని పురస్కరించుకుని ఈ నెల 13, 14వ తేదీల్లో రాష్ట్ర స్థాయి వెటరన్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించనున్నట్లు అథ్లెటిక్ అసోసియేషన్ కార్యదర్శి జి. రాంబాబు, సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయరామేశ్వర రావు సోమవారం తెలిపారు. ఆ పాఠశాలలో వారు విలేకరులతో మాట్లాడారు. మహిళ, పురుష విభాగాల్లో నడక, పరుగు, దూరం దూకడం, ట్రిపుల్ జంప్, పోల్‌వాల్ట్, డిస్కస్ త్రో, జావెలిన్ త్రో, హ్యామర్ త్రో పోటీలు ఉంటాయని 30 నుంచి 90 ఏళ్ల లోపు ఉన్న క్రీడాకారులు పాల్గొనవచ్చని చెప్పారు. ఆ రోజున ఎస్ఆర్ పాఠశాల వ్యవస్థాపకుడు ముద్దన వెంకయ్య, పేద విద్యార్థుల అభివృద్ధికి కృషి చేసిన నంగినేని చౌదరి విగ్రహాల ఆవిష్కరణ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి హైకోర్టు జడ్జి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్, విజ్ఞానసంస్థల అధినేత లావు రత్తయ్య, ద్రోణాచార్య అవార్డు గ్రహీత నాగపురి రమేష్, అర్జున అవార్డు గ్రహీత, బీసీసీఐ మాజీ చీఫ్ సెలక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్ పాల్గొంటారన్నారు. సమావేశంలో శ్రీనివాసరావు, పీడీ ఎం. సత్యనారాయణ, పూర్వ విద్యార్థులు నాగశ్రీనివాసరావు, సుబ్బారావు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ సేవా శిబిరం ప్రారంభం

లేమల్లెపాడు(వట్టిచెరుకూరు), న్యూస్‌టుడే: లేమల్లెపాడు గ్రామంలో వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నాలజికల్ యూనివర్సిటీ విద్యార్థుల ఎన్ఎస్ఎస్ సేవా శిబిరం సోమవారం ప్రారంభమైంది. ఎంఈవో సత్యన్నారాయణ మూర్తి, సొసైటీ పర్సన్ ఇన్‌ఛార్జి పాతూరి కృష్ణారావు, ప్రధానోపాధ్యాయులు కె.శ్రీనివాసరావులు ఈ కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. తొలి రోజున స్వచ్ఛతాహీ సేవ, పచ్చదనం పరిశుభ్రత, మత్తు పదార్థాల అనర్థాలపై ర్యాలీ నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ అధికారి భక్తసింగ్, పీడీ పసుపులేటి శ్రీధర్‌లు పాల్గొన్నారు.

చాకుతో దాడి చేసి.. ఆసుపత్రిలో చేర్పించి..

మేడికొండూరు, న్యూస్‌టుడే: అకారణంగా చాకుతో దాడి చేసి గాయపరిచిన వ్యక్తే.. క్షతగాత్రుడిని ఆసుపత్రిలో చేర్పించిన ఘటనపై సోమవారం సాయంత్రం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన కథనం మేరకు.. పల్నాడు జిల్లా వినుకొండ మండలం సీతారామపురం తండాకు చెందిన రామావత్ రామానాయక్ కొన్నేళ్లుగా గుంటూరులో ఒక హోటల్‌లో పని చేస్తూ అక్కడే అద్దె గదుల్లో(లాడ్జి) నివాసం ఉంటున్నారు. ఆదివారం సాయంత్రం పని ముగించుకుని తిరిగి వస్తున్న సమయంలో అదే హోటల్‌లో పని చేసే శివ అతడి వద్దకు వచ్చాడు. మేడికొండూరు మండలం విశదల గ్రామంలో పని ఉందని చెప్పాడు. ఈ క్రమంలో ఇద్దరూ కలిసి ద్విచక్ర వాహనంపై విశదల వద్దకు వచ్చారు. ఆ సమయంలో శివ ఒక్కసారిగా చాకు తీసుకుని బెదిరిస్తూ రామునాయక్‌పై దాడి చేయగా.. అతడి గొంతు వద్ద రక్త గాయమైంది. అనంతరం క్షతగాత్రుడిని.. శివ ద్విచక్ర వాహనంపై ఎక్కించుకుని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి పరారయ్యాడు. పట్టాభిపురం పోలీసులు బాధితుడి వివరాలు నమోదు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

దొంగల ముఠా అరెస్టు

మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: అంతర్ జిల్లా దొంగల ముఠాను మంగళగిరి పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం కేసుకు సంబంధించిన వివరాలను డీఎస్పీ మురళీకృష్ణ వెల్లడించారు. ఆ వివరాల మేరకు.. విశాఖ, కడప జిల్లాలకు చెందిన తోట శివకుమార్, తోట వరలక్ష్మి, ఇంతియాజ్ పగలంతా రెక్కీ నిర్వహించి రాత్రి పూట తాళాలు వేసి ఉన్న ఇళ్లలోకి చొరబడి దొంగతనాలకు పాల్పడుతున్నారు. ప్రధాన నిందితుడు శివకుమార్‌పై రాష్ట్ర వ్యాప్తంగా 150 పైగా దొంగతనం కేసులు ఉండగా.. మొత్తం ముఠాపై గాజువాక, అనకాపల్లి, దువ్వాడ, మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్లలో పలు చోరీ కేసులు నమోదయ్యాయి. గత నెల 4వ తేదీన మంగళగిరి మండలం యర్రబాలెం గ్రామానికి చెందిన భూక్యా వీరాంజనేయులు ఇంట్లో ఈ ముఠా చోరీ చేశారు. బాధితుడు ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు వీరిని అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి 19 గ్రాముల బంగారం, 740 గ్రాముల వెండిని స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ వెల్లడించారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారని ఎస్.ఐ చిరుమామిళ్ల వెంకట్ తెలిపారు.

గిట్టుబాటు కాదని..గట్టుబాటన పడేసి..

వట్టిచెరుకూరు మండలంలోని గ్రామాలలో మిర్చి తోటల్లో మొక్కలకు కాయలు వస్తున్నాయి. తొలి దశలో కాసిన వీటిని రైతులు కోసేసి మార్కెట్‌కు తరలిస్తుంటారు. వీటిని అలాగే వదిలేస్తే చెట్లకు బరువై తర్వాతి దశలో ఏర్పడే ప్రధాన పంట దిగుబడిపై ప్రతికూల ప్రభావం చూపుతాయి. ఈసారి గుంటూరు మార్కెట్‌లో తొలిదశ కాయలకు ధర రాకపోవడంతో, రవాణా ఖర్చులు కూడా గిట్టుబాటు కావనే ఉద్దేశంతో పలువురు రైతులు గట్టునే పారబోస్తున్నారు. లేమల్లెపాడు, ముట్లూరు, గారపాడు, కాట్రపాడు, చమళ్లమూడి, చింతపల్లిపాడు, కుర్నూతల, కోవెలమూడి గ్రామాల్లో ఇలాంటి దృశ్యాలు కనిపిస్తున్నాయి. - **వట్టిచెరుకూరు, న్యూస్‌టుడే**

లేమల్లెపాడు- ముట్లూరు మధ్య తోటలో గట్టుపై పోసిన మిరపకాయలు

కూలితే ప్రమాదమే..!

తాడికొండ మండలం దామరపల్లి గ్రామ శివారు పంట కాలువలో విద్యుత్తు స్తంభాలు ఒరిగాయి. ఆ మార్గంలో ప్రయాణించే వాహన చోదకులు భయభ్రాంతులకు గురవుతున్నారు. స్తంభం విరిగి రహదారిపై పడితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. సమీపంలో ఉన్న పంట పొలాల్లో వ్యవసాయ కూలీలు పనులు చేస్తుంటారు. సంబంధిత అధికారులు స్పందించి స్తంభాలను సరిచేయించాలని ప్రజలు కోరుతున్నారు. - **న్యూస్‌టుడే, తాడికొండ**

కలుషిత నీరే దిక్కు..

తాడికొండ గ్రామం స్వరాజ్‌నగర్ మురుగు కాలువల్లో వ్యర్థాలు చేరాయి. దుర్వాసన, దోమలతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇది చాలదన్నట్టు ఆ డ్రెయిన్‌లో పంచాయతీ తాగునీటి పైపులైన్ ఉంది. దానికి లీకులు ఏర్పడి మురుగు తాగునీటితో కలిసి సరఫరా అవుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జ్వరాలు వ్యాపిస్తున్న తరుణంలో ఇలాంటి నీటిని వినియోగిస్తే తమ పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి కాలువల్లో పూడిక తీసి పైపులైన్లకు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు. - **న్యూస్‌టుడే, తాడికొండ**

మొదలు పెట్టారు.. పూర్తి చేస్తారా..?

అసంపూర్తిగా నిలిచిన నిర్మాణం

రాజధాని గ్రామం మందడం జిల్లా పరిషత్ పాఠశాలలో భౌతిక, రసాయన, జీవ శాస్త్ర ల్యాబ్‌లను ఏర్పాటు చేసేందుకు ఒక్కో గది నిర్మాణానికి సుమారు రూ.23 లక్షలు చొప్పున మూడు గదుల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఆ పనులు దక్కించుకున్న గుత్తేదారు సంస్థ నిర్మాణ పనులు ప్రారంభించింది. కాగా, కొద్ది రోజులుగా ఆ పనులు నిలిచిపోయాయి. త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. - **తుళ్లూరు, న్యూస్‌టుడే**

23 ఏళ్లగా అయ్యప్పల సేవలో..

భోజనాలు చేస్తున్న మాలధారులు

పెదనందిపాడు అయ్యప్ప సేవాసంఘం మణికంఠ అయ్యప్ప దీక్షధారులకు అండగా నిలిచి గత 23 ఏళ్లగా దాతల సహకారంతో భిక్ష (భోజనం) ఏర్పాటు చేసి సేవలు అందిస్తుంది. ఈ భిక్ష కార్యక్రమం 2026 జనవరి 10 వరకు కొనసాగించేందుకు సేవాసంఘం నిర్ణయించింది. ఏ స్వామి దీక్ష తీసుకున్న మాలధారులైనా ఇక్కడికి వచ్చి భోజనం చేయవచ్చని సంఘం పేర్కొంది. ప్రతి రోజు 200 మంది పైబడి ఇక్కడ భిక్ష స్వీకరిస్తున్నారు. - **న్యూస్‌టుడే, పెదనందిపాడు**

సమాజాభివృద్ధికి వీఐటీ వర్సిటీ కృషి

చిన్నారులకు పండ్లు, బ్యాగులు అందిస్తున్న వర్సిటీ ప్రతినిధులు

తుళ్లూరు, న్యూస్‌టుడే: వీఐటీ విశ్వవిద్యాలయం వ్యవస్థాపకుడు, ఛాన్సలర్ డా.జి.విశ్వనాథన్ 87వ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని సోమవారం ఏపీ-వీఐటీ యూనివర్సిటీ దత్తత గ్రామాల్లోని పాఠశాలల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులకు అవసరమైన విద్య, క్రీడా సామగ్రిని ఉచితంగా అందజేశారు. వైస్ ఛాన్సలర్ (ఇన్‌ఛార్జి) డా.అరుల్మోళి వర్మన్, రిజిస్ట్రార్ డా.జగదీష్ చంద్ర, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థి వాలంటీర్లతో కలిసి ఐనవోలు జిల్లా పరిషత్, శాఖమూరు ఎంపీపీ, వెలగపూడిలోని ప్రాథమిక పాఠశాలల్లో పండ్లు, బ్యాగులు, నోట్‌బుక్‌లు, కంప్యూటర్లు తదితరాలను అందజేశారు. విశ్వనాథన్ ఆకాంక్షలకు అనుగుణంగా సమాజ పురోగతికి తమ వంతు కృషి చేస్తున్నామని వర్సిటీ రిజిస్ట్రార్ జగదీష్‌చంద్ర తెలిపారు.

విద్యార్థులకు చేయూత

కాకుమాను, న్యూస్‌టుడే: కాకుమానుకు చెందిన పారిశ్రామికవేత్త కారుమంచి ప్రసాద్‌బాబు దాతృత్వం చాటుకున్నారు. అప్పాపురం గ్రామానికి చెందిన శరణ్య కుమారి కాకుమాను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. గతేడాది జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆ విద్యార్థినికి కాలు పూర్తిగా తెగిపోయింది. అయినప్పటికీ చదువు ఆపలేదు. ఆ బాలిక వైద్య ఖర్చుల నిమిత్తం ప్రసాద్‌బాబు రూ. 35 వేలు నగదు సమకూర్చారు. కాకుమానుకు చెందిన సుధీర్ విద్యార్థి ఇంజినీరింగ్ చదువుతున్నాడు. ల్యాప్‌టాప్ కొనుగోలు నిమిత్తం అతడికి రూ.25 వేలు నగదు అందజేశారు.

సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించండి

మేడికొండూరు, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని ఆ పార్టీ మండలాధ్యక్షుడు బాషా పేర్కొన్నారు. ప్రధానమంత్రి ఉజ్వల్ గ్యాస్ యోజన పథకం (పీఎంయూవై)పై ప్రజలకు అవగాహన కల్పించి, అర్హులందరికీ అందేలా చూడాలని కోరుతూ సోమవారం ఆయన ఎంపీడీవో డేవిడ్ ప్రభాకర్‌కు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో భాజపా మండల ప్రధాన కార్యదర్శి చల్లా రోశిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో శాంతిభద్రతలకు ప్రాధాన్యం

ప్రత్తిపాడు(కాకుమాను), న్యూస్‌టుడే: గ్రామాలలో తప్పనిసరిగా శాంతిభద్రతలపై దృష్టి పెట్టాలని గుంటూరు సౌత్ డీఎస్పీ భానోదయ సిబ్బందిని ఆదేశించారు. ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్‌ను ఆమె సోమవారం ఆమె తనిఖీ చేశారు. రిజిస్టర్లు, కేసుల నమోదు తదితర అంశాలపై నిశితంగా పరిశీలించి పలు సూచనలు చేశారు. గ్రామాల్లో గస్తీ పెంచాలన్నారు. దొంగతనాలపై చర్యలు తీసుకోవాలన్నారు. ఆమె వెంట ఎస్సై నరహరి, సిబ్బంది ఉన్నారు.

నిరవధికంగా జీతభత్యాలు చెల్లించాలి

ప్రత్తిపాడు(కాకుమాను), న్యూస్‌టుడే: సొసైటీలో పని చేస్తున్న తమకు డీఎల్ఎస్ఎఫ్ ద్వారా నిరవధికంగా జీతభత్యాలు చెల్లించాలని ఆ శాఖల కార్యదర్శులు వినతిపత్రంలో తెలిపారు. ప్రత్తిపాడు సొసైటీ బ్యాంకు మేనేజర్ సుధాకర్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. జీతభత్యాలలో డ్యూటు పద్దులను రద్దు చేయాలన్నారు. ఉద్యోగులకు గ్రాట్యుటీ చట్టం అమలు పరచాలని కోరారు. వేతన సవరణ వెంటనే చేయాలన్నారు. రైతులకు సంఘాల ద్వారా మాత్రమే పంట రుణాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

ఇళ్ల స్థలాలు మంజూరు చేయండి

పెదనందిపాడు, న్యూస్‌టుడే: రావిపాడు ఎస్సీ కాలనీలో అర్హులైన వారికి ఇళ్లస్థలాలు ఇప్పించాలని ఎంఆర్‌పీఎస్ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌లో తహసీల్దార్ హేనాప్రియకు ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కారుమూరి అంకయ్య ఆధ్వర్యంలో అర్జీలు అందజేశారు.

తప్పుడు కేసు పెట్టారని ఫిర్యాదు

తాడికొండ, న్యూస్‌టుడే: ఓ మాజీ ఏఎస్ఐ తన స్థలాన్ని ఆక్రమించి తనపైనే తప్పుడు ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టారని గుంటూరు ఎస్పీ కార్యాలయంలో సోమవారం గుంటూరుకు చెందిన ఈడే మురళీకృష్ణ ఫిర్యాదు చేశారు. తాను తాడికొండ అడ్డరోడ్డు వద్ద 1.07 పొలాన్ని గతంలో కొనుగోలు చేశానని, ఆ పక్కనే ఉన్న ఆర్అండ్‌బీ స్థలంలో మాజీ ఏఎస్ఐ పోలరాజు అక్రమంగా రేకుల షెడ్డు వేసుకున్నారని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. తన పొలంలో కొంత భాగాన్ని ఆక్రమించేందుకు పోలరాజు ప్రయత్నించగా అడ్డుకున్నందుకు తన షెడ్డును తానే కూల్చివేసి తప్పుడు కేసు పెట్టాడని ఫిర్యాదుదారు పేర్కొన్నారు. చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

ద్విచక్ర వాహనం చోరీపై కేసు

పుల్లడిగుంట(వట్టిచెరుకూరు), న్యూస్‌టుడే: పుల్లడిగుంట గ్రామంలో బుల్లెట్ బైక్ చోరీపై వట్టిచెరుకూరు పోలీస్‌స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. సీఐ రామానాయక్ తెలిపిన వివరాల మేరకు..గ్రామంలో అద్దెకు ఉంటున్న జి.రాజ్‌కుమార్ ఈ నెల 2వ తేదీ రాత్రి ఇంటి ముందు తన ద్విచక్రవాహనాన్ని నిలిపారు. ఉదయం లేచి చూసేసరికి వాహనం కనిపించలేదు. బంధువులు, మిత్రులను విచారించినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

జాతీయ స్థాయి క్రీడలకు ఎంపిక

విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

తాడికొండ, న్యూస్‌టుడే: తాడికొండ గ్రామంలోని శ్రీసత్యసాయిబాబా ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి సాఫ్ట్ టెన్నిస్ పోటీలకు ఎంపికయ్యారని హెచ్ఎం రమణయ్య సోమవారం తెలిపారు. శ్రీకాకుళంలోని పాతపట్నంలో నవంబర్11న జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో గుంటూరు జిల్లా జట్టు విజేతగా నిలిచింది. ఈ జట్టులో విద్యార్థులు షేక్ ఫయాజ్ అహ్మద్, షేక్ ఫజల్ ఉత్తమ ప్రతిభ కనబరిచి అండర్-17, అండర్-19 విభాగంలో మొదటి స్థానం సాధించారు. వీరు మధ్యప్రదేశ్ ఈ నెల 12న జరిగే నేషనల్ మీట్‌లో ప్రాతినిధ్యం వహిస్తారని హెచ్ఎం తెలిపారు.

శ్రీరామ..జయరామ

పెదనందిపాడు: స్థానిక కోదండ రామాలయంలో సోమవారం శ్రీరామ జన్మ నక్షత్రం పురస్కరించుకుని (పునర్వసు) ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అభిషేకాలు, విశేష పూజలు అర్చకులు నళినికాంత్ భట్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వార్లను సర్వాంగ సుందరంగా అలంకరించారు. భజన బృందాల సభ్యులు భజనలు, పారాయణలు చేశారు. బాలాత్రిపుర సుందరి భజన బృందం సహకారంతో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

KVB Karur Vysya Bank Smart way to bank

ది కరూర్ వైశ్యా బ్యాంక్ లిమిటెడ్

గుంటూరు మెయిన్ బ్రాంచ్, ఇంటి నెం.22-4-105, హేమ సుదర్శన కాంప్లెక్స్, జిన్నా టవర్ దగ్గర, లాలాపేట, గుంటూరు, ఫోన్: 0863-2223425, 2356767

స్థిరాస్తుల విక్రయమునకు అమ్మకపు నోటీసు

సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002, 9(1) అనుబంధంతో చదువబడే స్థిరాస్తుల ఇ-వేలం అమ్మకం ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి మరియు ముఖ్యముగా ఋణగ్రహీత కమ్ టైటిల్ హోల్డర్ : **(01)** మెస్సర్స్ లక్ష్మి ప్రణతి కాటన్ ట్రేడర్స్, పార్టనర్స్ చే ప్రాతినిధ్యం వహించబడుచున్నది, డి.నెం. 4-67/ఎ, చింతపల్లిపాడు గ్రామం, వట్టిచెరుకూరు మండలం, గుంటూరు-522212. పార్టనర్ కమ్ హామీదారు కమ్ టైటిల్ హోల్డర్: **(02) శ్రీ మన్నవ శేషగిరిరావు,** తండ్రి : లేటు మన్నవ రామకృష్ణయ్య, డి.నెం. 4-67ఎ, చింతపల్లిపాడు గ్రామం, వట్టిచెరుకూరు మండలం, గుంటూరు-522212, పార్టనర్ కమ్ హామీదారు : **(03) శ్రీమతి నళిని మన్నవ, భర్త : మన్నవ రామకృష్ణయ్య,** డి.నెం. 16-3-21, ప్లాటు నెం.393, భగత్‌సింగ్ నగర్, వాటర్ ట్యాంక్ దగ్గర, తిరుమలగిరి, కూకట్‌పల్లి, హైదరాబాద్, తెలంగాణా-500072. హామీదారు కమ్ టైటిల్ హోల్డర్: **(04) : శ్రీ మన్నవ రామకృష్ణయ్య,** తండ్రి : మన్నవ శేషగిరి రావు, డి.నెం. 16-3-21, ప్లాటు నెం.393, భగత్‌సింగ్ నగర్, వాటర్ ట్యాంక్ దగ్గర, తిరుమలగిరి, కూకట్‌పల్లి, హైదరాబాద్, తెలంగాణా-500072 గార్లకు తెలియజేయునది ఏమనగా ఋణగ్రహీత దిగువ తెలిపిన పట్టికలోని బకాయి మొత్తం మరియు వడ్డీ + ఖర్చులు వసూలు నిమిత్తం సెక్యూర్డ్ క్రెడిటార్ ది కరూర్ వైశ్యాబ్యాంక్ లిమిటెడ్ కు తనఖా చెయ్యబడి అధీకృత అధికారి, ది కరూర్ వైశ్యాబ్యాంక్ లిమిటెడ్ వారిచే లాంచనాత్మకంగా స్వాధీనం చేసుకోబడిన దిగువ తెలిపిన స్థిరాస్తులను "అక్కడ ఏమి ఉన్నదో అది, అక్కడ ఏమి ఉన్నదో అలాగే మరియు అక్కడ ఏమి వున్నా అదే" అనే పద్ధతి మీద **తేది.30.12.2025** న ఇ-వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించడమైనది.

వ.నెం.	ఋణ స్వభావం	ఖాతా నెంబరు	మొత్తం బకాయిలు (రూ.లలో)	తేది నాటికి
1	క్యాష్ క్రెడిట్	140322300001203	రూ.2,99,60,874.00	30.11.2025
2	టెర్మ్‌లోన్ బిల్డింగ్	140373900001720	రూ.1,10,54,363.29	30.11.2025
3	వర్కింగ్ క్యాపిటల్ టెర్మ్ లోన్	140375000000011	రూ.1,53,43,301.24	30.11.2025
4	వర్కింగ్ క్యాపిటల్ టెర్మ్ లోన్-జీఇసీఎల్	140380800000262	రూ.1,06,45,478.32	05.12.2025
5	ఫండెడ్ ఇంటరెస్ట్ టెర్మ్‌లోన్	E07FTNL210880002	రూ.15,73,111.03	30.11.2025
		మొత్తం	రూ.6,85,77,127.88	

(అక్షరాల ఆరు కోట్ల ఎనభై ఐదు లక్షల డెభ్బై ఏడు వేల నూట ఇరవై ఏడు రూపాయల ఎనభై ఎనిమిది పైసలు మాత్రమే)

స్థిరాస్తి వివరములు - షెడ్యూలు-ఎ

(రిజర్వు ధర రూ.2,55,00,000/-)

(ధరావత్తు : రూ.25,50,000/- మరియు బిడ్ పెంపుదల మొత్తం : రూ.1,00,000/-)

గుంటూరు డివిజన్, ప్రత్తిపాడు సబ్ డివిజన్, గారపాడు శివారు, చింతపల్లిపాడు గ్రామ పంచాయితీ ఏరియా, గారపాడు, డి.నెం.131/ఎ, డోర్ నెం.6-91, 4555.70 చ.గ.లు విస్తీర్ణం గల స్థలములోని కాటన్ జిన్నింగ్ మిల్ (టిఎమ్‌సి), ఇండస్ట్రియల్ భూమి మరియు భవనము మెస్సర్స్ లక్ష్మి ప్రణతి కాటన్ ట్రేడర్స్ వారికి చెందినది. హద్దులు : తూర్పు : ఆర్ & బి రోడ్డు (గుంటూరు నుండి నల్లపాడు), దక్షిణం : మన్నవ కమలమ్మ గారి భూమి, పడమర : గుమ్మడి గోపాలకృష్ణ మూర్తి గారి భూమి, ఉత్తరం : బాతుల బాబు గారి భూమి.

గమనిక : పైన పేర్కొన్న ఆస్తిలో సెకండ్ హ్యాండ్ మెషినరీ (12వ నెంబరు బజాజ్ గిన్నింగ్ తయారీ సెట్, బజాజ్ హైడ్రాలిక్ ప్రెస్సింగ్ మెషినరీ)తో సహా

షెడ్యూలు-బి 2

(రిజర్వు ధర రూ.37,00,000/-)

(ధరావత్తు : రూ.3,70,000/- మరియు బిడ్ పెంపుదల మొత్తం : రూ.50,000/-)

గుంటూరు జిల్లా, ప్రత్తిపాడు సబ్ జిల్లా చింతపల్లిపాడు పంచాయితీ పరిధిలో, గరపాడు గ్రామం, డి.నెం.158/బి, ఎ.2-78 సెంట్లు మరియు దానిలో ఎ.0.21 సెంట్లు లేదా 1016.40 చదరపు గజములు నికరంగా లభ్యమయ్యే 709 చ.గజములు విస్తీర్ణం గల ఖాళీ స్థలము శ్రీ మన్నవ శేషగిరిరావు గారికి చెందినది. హద్దులు : తూర్పు : రోడ్డు (తేది.10.11.2015 నాటి దస్తావేజు నెం.5571/2015 ప్రకారం మన్నవ మురళి రోడ్డు కొరకు బహుమతిగా ఇచ్చిన భూమి), దక్షిణం : మన్నవ కృష్ణమూర్తి గారి భూమి, పడమర : యడ్లపల్లి వెంకటరావు గారి భూమి, ఉత్తరం : మన్నవ కృష్ణమూర్తి గారి భూమి.

విక్రయం యొక్క సవివరమైన నియమ నిబంధనలు కొరకు బ్యాంక్ వారి / సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క వెబ్‌సైట్ : www.kvb.co.in/Property Under Auction మరియు సర్వీస్ ప్రొవైడర్ మెస్సర్స్ 4 క్లోజర్ (bankauctions.in), హైదరాబాద్ వెబ్ పోర్టల్ https://www.bankauctions.in నందు చూడగలరు.

సర్ఫేసి చట్టం 2002 యొక్క రూల్ 9(1) అనుబంధం క్రింద చట్టబద్ధ 15 రోజుల అమ్మకం ప్రకటన

ఋణగ్రహీతకు / హామీదారులకు ఇందుమూలముగా తెలియజేయునది, వేలము తేదీకి ముందుగా పైన పేర్కొనబడిన మొత్తమును ఇప్పటి వరకు వడ్డీ మరియు అనుబంధ వ్యయములతో కలిపి చెల్లించవలసినదిగా ఈ నోటీసును ప్రకటించినారు. లేని పక్షములో ఆస్తి వేలము వేయబడును / అమ్మబడును మరియు మిగులు బకాయిలు ఏవేని ఉన్నచో అవి వడ్డీ మరియు ఇతర ఖర్చులతో కలిపి తిరిగి రాబట్టుకొనబడును.

తేది : 06.12.2025
ప్రదేశం : గుంటూరు

సం/-అధీకృత అధికారి
ది కరూర్‌వైశ్యా బ్యాంక్ లిమిటెడ్

(c) eenadu

క్రాస్ కంట్రీ పోటీల్లో రాణించాలి

గుంటూరు క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి క్రాస్ కంట్రీ పోటీల్లో రాణించాలని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి అఫ్రోజ్‌ఖాన్ అన్నారు. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బీఆర్ స్టేడియంలో జిల్లా క్రాస్ కంట్రీ ఎంపికలను సోమవారం ఆయన ప్రారంభించారు. అఫ్రోజ్‌ఖాన్ మాట్లాడుతూ ఈ పోటీల్లో ఎంపికైన జట్టు కాకినాడలో ఈనెల 24న జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటుందన్నారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్, సభ్యుడు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు తూర్పు

ధర వరలు

ఎన్టీఆర్ రైతుబజారులో ధరలు నిన్నటివి... (కిలో ఒక్కింటికి రూ.లో) టమాట 37, వంగ 20, బెండ 42, పచ్చిమిర్చి 39, కాకర 45, క్యారెట్ 40, క్యాబేజీ 24, బీర 35, దొండ 29, బంగాళదుంప 27, ఉల్లిపాయలు 23, గోరుచిక్కుడు 48, దోస 28, పొట్ల 37, చామదుంప 28, మునగ 70, గోంగూర 10, తోటకూర 15, చుక్కకూర 14, కొత్తిమీర 25, బీట్‌రూట్ 35, కీర 30, క్యాప్సికం 69, అల్లం 80, ఫ్రెంచి బీన్స్ 54, సొర 13, అరటి 8. **- న్యూస్‌టుడే, పట్నంబజారు**

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
94406 38515, 80085 73097

స్పందనకు వందనం

☛ జియావుద్దీన్‌నగర్ ప్రధాన రోడ్డు కాలువల్లో పూడికలు చేరి మురుగునీటి పారుదలకు ఆటంకంగా ఉందని స్థానికుడు మస్తాన్ 'మేమున్నాం.. మీకు తోడుగా'కు తెలిపారు. సమస్యను శానిటరీ సూపర్‌వైజర్ అయూబ్‌ఖాన్‌కు తెలియజేయడంతో పూడికలు తీయించారు.

☛ వెంగళరావునగర్ మూడోలైన్‌లో వీధుల్లో చెత్తకుప్పలు తొలగించకపోవడంతో అపరిశుభ్రంగా ఉందని స్థానికుడు శ్రీనునాయక్ 'మేమున్నాం.. మీకు తోడుగా'కు తెలిపారు. సమస్యను ప్రజారోగ్య అధికారులకు తెలియజేయడంతో చెత్తకుప్పలు తీయించి తరలించారు. **- న్యూస్‌టుడే, నగరపాలక సంస్థ**

అన్ని ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్

ఎన్టీఆర్ సర్కిల్, న్యూస్‌టుడే: అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులను చేపట్టి సుస్థిరపరుస్తున్నామని తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ పేర్కొన్నారు. రాహుల్‌గాంధీనగర్, మద్దిరాల కాలనీ, మంగళదాసునగర్ తదితర ప్రాంతాల్లో రూ.1.46 కోట్లతో చేపట్టనున్న సిమెంట్ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు తొలి ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. మౌలిక వసతులను మెరుగు పర్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రూ.26 కోట్లతో సిమెంట్ రోడ్లు, డ్రెయిన్లు నిర్మిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ షేక్ సజీల తదితరులు పాల్గొన్నారు.

రహదారులు మురుగుమయం

గుంటూరు నగరం, న్యూస్‌టుడే

పొన్నూరు రోడ్డులోని హుస్సేన్‌నగర్‌లో రోడ్లు, కాలువలు లేక అక్కడి ప్రజలు అవస్థలు పడుతున్నారు. కాలనీ ఏర్పడి సంవత్సరాలు గడిచినప్పటికీ నేటికీ రోడ్లు, మురుగు కాలువలు సమకూరలేదు. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రజలు మురుగుతో సహవాసం చేయాల్సి వస్తోంది. కాలువలు లేకపోవటంతో నివాసగృహాల నుంచి వచ్చే మురుగునీరు రోడ్లపై పారుతోంది. కొన్ని వీధుల్లో రోడ్లపైనే నిలిచిపోతోంది. రోడ్లపై నిలిచిన మురుగునీటిలోనే జనం రాకపోకలు సాగించాల్సి వస్తోంది. ఇళ్ల మధ్య ఉన్న ఖాళీ స్థలాలు చిన్నపాటి చెరువులను తలపిస్తున్నాయి. మురుగునీటికి తోడు వర్షాలు కురిసినప్పుడు ఆ నీరంతా ఖాళీ స్థలాల్లోకి చేరుతోంది. రోజుల తరబడి ఇదే పరిస్థితి ఉండడంతో దోమలు వ్యాప్తి చెంది ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. కొన్ని ఖాళీ స్థలాల్లో నిలిచిన మురుగు పాచి పట్టి దుర్వాసన వస్తుండటంతో జనం అవస్థలు పడాల్సి వస్తోంది. గత ఎన్నికల సమయంలో వచ్చిన నాయకులు.. ఇక్కడ రోడ్లు, కాలువలు నిర్మిస్తామని ఇచ్చిన హామీ ఇంతవరకు నెరవేరలేదు. కనీసం ఆ ప్రయత్నం చేసిన జాడ లేదు. కొన్ని స్థలాల్లో జమ్మి పెరిగి చిట్టడవులను తలపిస్తున్నాయి.

రహదారిలో నిలిచిన మురుగు

తటాకాలుగా మారిన నివాసాల మధ్య ఖాళీ స్థలాలు

అర్జీల పరిష్కార బాధ్యత విభాగాధిపతులదే

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థకు వివిధ మార్గాల ద్వారా వచ్చే ప్రజా ఫిర్యాదులు, అర్జీల పరిష్కార బాధ్యత విభాగాధిపతులదేనని కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. సోమవారం డయల్ యువర్ కమిషనర్ ఛాంబర్‌లో నిర్వహించారు. 26 ఫిర్యాదులురాగా వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం కౌన్సిల్ హాలులో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో అర్జీలు స్వీకరించారు. పట్టణ ప్రణాళిక 13, ఇంజినీరింగ్ 9, రెవెన్యూ 3, ప్రజారోగ్యం 7, ఉపాసెల్‌కు ఒకటి చొప్పున ఫిర్యాదులు రాగా వాటిని నిర్దేశిత సమయంలోగా పరిష్కరించాలని ఆదేశించారు. కమిషనర్ శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదులు పునరావృతం కాకుండా శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఏసీ ఓబులేసు, డీసీలు సీహెచ్ శ్రీనివాస్, బి.శ్రీనివాసరావు, సీపీ రాంబాబు, ఇన్‌ఛార్జి ఎస్ఈ సుందర్రామిరెడ్డి, సీఎంవోహెచ్ డాక్టర్ శాంతికళ తదితరులు పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

ట్రాఫిక్ కష్టాలు.. షరా మామూలే

పట్నంబజారు, న్యూస్‌టుడే: కొత్తపేట పశువుల ఆసుపత్రి సెంటర్లో ట్రాఫిక్ రద్దీ నియంత్రణ లేక జనానికి కష్టాలు తప్పడం లేదు. శంకర్ విలాస్ బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతున్న దృష్ట్యా బస్టాండు పరిసర ప్రాంతాల నుంచి బ్రిడ్జి వైపు వెళ్లే వాహనాలను అధికారులు పశువుల ఆసుపత్రి వైపు నుంచి మూడు వంతెనల సెంటర్ వైపు మళ్లించారు. దీంతో ఈ ప్రాంతంలో వాహనాల రద్దీ బాగా పెరిగింది. పశువుల ఆసుపత్రి సెంటర్లో దాదాపు మూడు నెలల నుంచి ట్రాఫిక్ సిగ్నల్ దీపాలు వెలగటం లేదు. ట్రాఫిక్ పోలీసులు ఈ విషయాన్ని పలుమార్లు పోలీసు ఉన్నతాధికారులకు వివరించి ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. పెరిగిన రద్దీని కట్టడి చేయటం.. నిత్యం ఈ ప్రాంతంలో విధులు నిర్వర్తించే ట్రాఫిక్ పోలీసులకు సవాల్‌గా మారింది. కొందరు వాహనదారులు ఇష్టానుసారంగా నడపటంతో తరచూ రాకపోకలు నిలిచిపోతున్నాయి. పోలీసు ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి ట్రాఫిక్ సిగ్నల్స్‌కు మరమ్మతులు చేయించాల్సిన అవసరం ఉంది.

పశువుల ఆసుపత్రి సెంటర్లో ఇలా....

ఆటోనగర్‌లో తొమ్మిది మినీ ఉద్యానవనాలు

ఆటోనగర్ (పెదకాకాని), న్యూస్‌టుడే: గుంటూరులోని ఆటోనగర్‌లో తొమ్మిది ఖాళీ స్థలాలను మినీ పార్కులుగా అభివృద్ధి చేయనున్నట్టు ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ నరసింహారావు చెప్పారు. నేషనల్ క్లీన్‌నెస్ పథకంలో 3, ఏపీఐఐసీ, ఐలా ఆధ్వర్యంలో 6 పార్కులు ఏర్పాటు చేస్తామన్నారు. ఇందుకోసం ప్రణాళికలు సిద్ధం చేసినట్టు వెల్లడించారు. ఆటోనగర్‌లో పచ్చదనం అభివృద్ధి చేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. స్థానిక ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ సహకారంతో ఇవి మంజూరయ్యాయన్నారు.

ఇక్కడికి ఉమ్మడి జిల్లా నుంచి నిత్యం వందల సంఖ్యలో వ్యాపారులు, మెకానిక్‌లు, వాహనదారులు వస్తుంటారు. వారు సేదదీరేందుకు ఈ ఉద్యానవనాలు ఉపయోగపడతాయని తెలిపారు. ఖాళీ స్థలాలు వ్యర్థాలకు ఆవాసంగా మారడంతో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు.

ఫేజ్ 4లో పార్కుగా మారనున్న స్థలం

అదనపు బస్సు సర్వీసులు నడపండి

పట్నంబజారు, న్యూస్‌టుడే: గుంటూరు నుంచి పర్చూరు మార్గంలో తగినన్ని బస్సు సర్వీసులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గంలోని ఏటుకూరు, ఇంజనంపాడు, పుల్లడిగుంట పరిసర ప్రాంతాల నుంచి నిత్యం పెద్దసంఖ్యలో ప్రజలు గుంటూరుకు వచ్చి వివిధ దుకాణాల్లో పనులు చేసి సాయంత్రం తిరుగు ప్రయాణమవుతారు. స్త్రీ శక్తి పథకం అమల్లోకి వచ్చినప్పట్నుంచి ఈ మార్గంలో ఉన్న బస్సుల్లో మహిళలు కిక్కిరిసి ప్రయాణిస్తున్నారు. రద్దీకి తగ్గట్టుగా అదనంగా సర్వీసులను ఏర్పాటు చేయకపోవడం ఇబ్బందిగా మారింది. కొందరు ప్రయాణికులు జీపులు, ఆటోలకు హెచ్చు మొత్తాల్లో ఛార్జీలు చెల్లించి రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ మార్గంలో బస్సుల సర్వీసులు పెంచాలని పలుమార్లు ఆర్టీసీ అధికారులకు విన్నవించుకున్నా ఫలితం కనిపించలేదని పలువురు ప్రయాణికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా సాయంత్రం వేళల్లో గుంటూరు నుంచి ఏటుకూరు, ఇంజనంపాడు, పుల్లడిగుంట, 5వ మైలు రాయి, కొర్నెపాడు, కుర్నుతల, కొయ్యవారిపాలెం, తిక్కిరెడ్డిపాలెం, ప్రత్తిపాడు ప్రాంతాలకు వెళ్లేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి గుంటూరు నుంచి పర్చూరు రూట్‌లో ఉదయం, సాయంత్రం వేళల్లో ఒక్కో ట్రిప్పు చొప్పున అదనపు సర్వీసులు నడపాలని ఆ ప్రాంతవాసులు కోరుతున్నారు.

బీసీలకు జగన్ క్షమాపణ చెప్పాల్సిందే

పట్నంబజారు, న్యూస్‌టుడే: మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ బీసీలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని బీసీ మండల్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు అన్నారు. బీసీ మండల్ స్టడీ సర్కిల్‌లో సోమవారం బీసీ, ఎస్టీ, ఎస్సీ, మైనార్టీ సంఘాల ప్రతినిధుల సమావేశానికి బి.సి. మహాజనసభ రాష్ట్ర అధ్యక్షుడు ఉగ్గం సాంబశివరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మాజీ సి.ఎం. జగన్‌మోహన్‌రెడ్డి యాదవ సామాజికవర్గానికి చెందిన కాలుష్య నియంత్రణ బోర్డు ఛైర్మన్ పి.కృష్ణయ్య, గోపీనాథ్‌జెట్టిలను ఉద్దేశించి అవమానకరంగా మాట్లాడటం సరికాదన్నారు. అహంకారంతో బీసీలను అవహేళన చేస్తున్నారని మండిపడ్డారు. బి.సి. మహాజనసభ రాష్ట్ర అధ్యక్షుడు ఉగ్గం సాంబశివరావు మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీలంతా కలిసి జగన్‌ను పీఠం దించినా ఇంకా బుద్ధి రాలేదన్నారు. కార్యక్రమంలో జి.ఆర్.భగత్‌సింగ్, తాడికొండ నరసింహారావు, తన్నీరు సాంబయ్య, అంగిరేకుల వర ప్రసాద్‌యాదవ్,, చంద్రనాయక్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

స్వచ్ఛభారత్ లక్ష్య సాధనలో శౌచాలయాలు కీలకం

పట్నంబజారు, న్యూస్‌టుడే: స్వచ్ఛ భారత్ లక్ష్యాల సాధనలో శౌచాలయాల నిర్మాణం అత్యంత ముఖ్యమని ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి అన్నారు. గుంటూరు మెడికల్ కాలేజీలో దాతల సహకారంతో ఆధునికీకరించిన క్యాంటీన్‌ను సోమవారం ప్రిన్సిపల్ డాక్టర్ సుందరాచారి ఆధ్వర్యంలో డాక్టర్ రామకృష్ణారెడ్డి ప్రారంభించారు. విద్యార్థినుల కోసం 15, విద్యార్థుల కోసం 12 శౌచాలయాలు నిర్మించి ప్రారంభించారు. డాక్టర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఈ కళాశాలలో చదివిన తాను తిరిగి ఇదే కళాశాలకు తన వంతు సేవ చేయటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. డాక్టర్ సుందరాచారి నాయకత్వంలో జరుగుతున్న అభివృద్ధి అభినందనీయమన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ సుందరాచారి మాట్లాడుతూ క్యాంటీన్‌ను పరిశుభ్రంగా ఉంచి, స్వచ్ఛతతో కూడిన ఆహారం అందించాలని నిర్వాహకులకు సూచించారు. ఆధునికీకరణ పనులను పర్యవేక్షించిన శరీర నిర్మాణ శాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నాగేశ్వర్ సేవలను ఆయన అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ (అడ్మిన్) డాక్టర్ శ్రీధర్, వైస్ ప్రిన్సిపల్ (అకడమిక్) డాక్టర్ మాధవి, ప్రొఫెసర్ డాక్టర్ సాల్మాన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ రామకృష్ణారెడ్డి

ఇలా వెళ్తే ప్రమాదకరమే కదా..

దర్గారోడ్డు ప్రమాదాలకు కేంద్రబిందువుగా మారింది. ఇక్కడ ట్రాఫిక్ పోలీసులు ఏర్పాటు చేసిన డివైడర్ల మధ్య నుంచి కొందరు ద్విచక్రవాహనదారులు రాకపోకలు సాగిస్తూ ఎదురుగా వస్తున్న వాహనాలను ఢీకొడుతున్నారు. కొద్ది రోజుల కిందట ఈ ప్రాంతంలో ఒక చిన్నారి రోడ్డు దాటుతుండగా టూరిస్టు బస్సు ఢీ కొని మృతి చెందింది. పరిస్థితిని చక్కదిద్దడంలో ట్రాఫిక్ పోలీసులు విఫలమవుతున్నారు. **- న్యూస్‌టుడే, పట్నంబజారు**

రహదారులే విక్రయ కేంద్రాలు

నగర జనాభా గణనీయంగా పెరగడంతో పండ్లు, కూరగాయలు, పువ్వుల విక్రయశాలలు గణనీయంగా పెరిగాయి. కొంతమంది ప్రధాన రహదారులు సహా అంతర్గత రోడ్లను ఆక్రమించి వాటిని నిల్వ చేస్తున్నారు. మార్కెట్ సెంటర్, పట్నంబజారు తదితర ప్రాంతాల్లో నిత్యం ఉదయంపూట రోడ్లపైనే విక్రయాలు సాగుతున్నాయి. పండ్ల పెట్టెలను రోడ్లపైనే పెడుతున్నారు. దీంతో భారీ వాహనాలు, బస్సుల రాకపోకలకు ఆటంకం కలుగుతోంది. **- న్యూస్‌టుడే, గుంటూరు నగరం**

పేరుకుపోతున్న వ్యర్థాలు

పాతగుంటూరు బాలాజీనగర్ జీరో లైనులోని వెంకటయ్య రైసు మిల్లు ఎదురుగా వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. దాదాపు వారం రోజుల నుంచి ఇదే పరిస్థితి. చుట్టూ ఆవులు చేరి వాటిని చెల్లాచెదురు చేస్తున్నాయి. వ్యర్థాలను తొలగించాలని పలుమార్లు కార్పొరేషన్ అధికారులకు ఫిర్యాదు చేసినా వాటిని తొలగించటం లేదని ఆ ప్రాంతవాసులు తెలిపారు. **-న్యూస్‌టుడే, పట్నంబజారు**

విజేతలకు అభినందన

పట్నంబజారు: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఆధునిక బోధన పద్ధతులు దోహదపడతాయని జైన్ హైస్కూల్ డైరెక్టర్ డాక్టర్ ఎం.డి.మున్ను అన్నారు. విశ్వం ఎడ్యుటెక్ ఆధ్వర్యంలో సెంట్రల్ పబ్లిక్ స్కూల్‌లో జరిగిన గుంటూరు జోనల్ స్థాయి అబాకస్ కాంపిటీషన్లో సంగడిగుంటలోని జైన్ హైస్కూల్‌లో రెండో తరగతి విద్యార్థి రీషన్ స్టార్ జూనియర్స్ విభాగంలో రెండో బహుమతి, ఐదో తరగతి విద్యార్థిని జి.శ్రావ్య సీనియర్ లెవెల్ విభాగంలో మొదటి బహుమతి కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం అభినందనసభ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ పి.కనకదుర్గ, ఉపాధ్యాయులు సుప్రియ, రిహానా, గాయత్రి పాల్గొన్నారు.

విజేతలను అభినందిస్తున్న జైన్ హైస్కూల్ డైరెక్టర్ డాక్టర్ ఎం.డి.మున్ను, ప్రిన్సిపల్ కనకదుర్గ

అసంపూర్తి పనులపై నివేదిక ఇవ్వండి

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరంలో డివిజన్లవారీగా అసంపూర్తి పనులపై వెంటనే నివేదిక ఇవ్వాలని కమిషనర్ శ్రీనివాసులు ఆదేశించారు. సోమవారం ఆయన నవభారత్‌నగర్, ఎస్వీఎన్ కాలనీ, గోరంట్ల, మేరీప్రియ నగర్, కాకాని రోడ్డు తదితర ప్రాంతాల్లో పర్యటించి పారిశుద్ధ్యం, అభివృద్ధి పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో పార్కులు, రహదార్లు, డ్రెయిన్‌ల అభివృద్ధికి పనులు దక్కించుకుని, కొంత అసంపూర్తిగా వదిలేస్తున్నారన్నారు. దీని వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాంటి గుత్తేదారులకు నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకోవడంలో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఇంజినీరింగ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. గుత్తేదారులపై ఏం చర్యలు తీసుకున్నారో నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఎస్వీఎన్ కాలనీలో పార్కులో పెండింగ్ పనులు పూర్తి చేయాలన్నారు. పర్యటనలో కార్పొరేటర్ వేములపల్లి శ్రీరాంప్రసాద్, ఇంజినీరింగ్, పారిశుద్ధ్య అధికారులు పాల్గొన్నారు.

☛ పర్యటనలో భాగంగా కమిషనర్ శ్రీనివాసులు ఆర్టీవో కార్యాలయం వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. భోజనం చేసేవారు ఎక్కువగా వస్తున్నందున మౌలిక సదుపాయాల కల్పన విషయంలో రాజీపడవద్దని అధికారులకు ఆదేశాలిచ్చారు.

ఉత్సాహంగా పికిల్‌బాల్ పోటీలు

గుంటూరు క్రీడలు, న్యూస్‌టుడే: రోటరీక్లబ్ ఆఫ్ గుంటూరు ఆదర్శ్ ఆధ్వర్యంలో వీవీవీ హెల్త్ హబ్‌లో జరుగుతున్న గుంటూరు ఓపెన్ పికిల్‌బాల్ టోర్నమెంట్ పోటీలు సోమవారం ముగిశాయి. దిల్లీ పబ్లిక్ పాఠశాలకు చెందిన నేహ అండర్-14 మిక్స్‌డ్ సింగిల్స్, ఉమెన్ ఓపెన్ సింగిల్స్‌లో విజేతగా నిలిచింది. ఓపెన్ డబుల్స్‌లో విన్సెంట్, నాగరాజు విన్నర్స్‌గా, ఆనంద్ కుమార్, అరుణ్‌కుమార్ రన్నర్స్ టైటిల్ సాధించారు. విజేతలకు రోటరీక్లబ్ ఆఫ్ ఆదర్శ్ అధ్యక్షురాలు అనురాధ, మాస్టర్స్ గేమ్స్ ఇండియా సీనియర్ ఉపాధ్యక్షుడు డాక్టర్ టి.వి.రావు, రోటరీక్లబ్ అసిస్టెంట్ గవర్నర్ భాస్కరరావు పతకాలు అందజేశారు.

విజేతలకు పతకాలు అందజేసిన అనురాధ, టీవీ రావు

అంబేడ్కర్‌కు నివాళి

పట్నంబజారు : ప్రతి ఒక్కరూ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని డివిజనల్ రైల్వే మేనేజర్ సుధేష్ణసేన్ అన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ మహా పరినిర్వాణ దినోత్సవం సందర్భంగా సోమవారం ఆమె అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

నివాళులు అర్పిస్తున్న డీఆర్ఎం సుధేష్ణసేన్

నిర్ణీత సమయంలో అర్జీల పరిష్కారం

ఎస్పీ వకుల్ జిందాల్

గుంటూరు నగరం, న్యూస్‌టుడే: నిర్ణీత సమయంలో ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అర్జీలు స్వీకరించారు. ఆర్థిక, కుటుంబపరమైన అంశాలతోపాటు పలు మోసాలకు సంబంధించి సమస్యలు, బెదిరింపులు, ఆక్రమణలపై ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయని వివరించారు. వాటిని సంబంధిత పోలీసు అధికారులకు పంపుతున్నామన్నారు. జిల్లా అదనపు ఎస్పీ రమణమూర్తి, డీఎస్పీలు బెల్లం శ్రీనివాస్, శ్రీనివాసరెడ్డి, మధుసూదనరావు, తదితరులు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు.

☛ తన తల్లిదండ్రుల ద్వారా సంక్రమించిన పొలం పల్నాడు జిల్లా రొంపిచర్లలో ఉందని, అందులోకి వెళ్లనీయకుండా గంజి అంకారావు, అతని తండ్రి వెంకటేశ్వర్లు బెదిరిస్తున్నారని నగరంలోని రవీంద్రనగర్‌కు చెందిన మద్ది శ్రీవాణి ఫిర్యాదు చేశారు. ☛ అధికారపార్టీకి చెందిన ఖాలేషావలి, చాంద్, హసీనా, జాను తదితరులు తనను ఇబ్బందులకు గురి చేస్తున్నారని తాడేపల్లి మండలం వడ్డేశ్వరానికి చెందిన షేక్ రిహానా ఫిర్యాదు అందించారు. ☛ వన్‌లైఫ్ వన్‌కార్డు కంపెనీ యాజమాన్యం తనకు రావాల్సిన బకాయి వేతనం ఇవ్వకుండా కాలయాపన చేస్తోందని మంగళగిరి వడ్డెరపాలేనికి చెందిన బండారు వరలక్ష్మి అర్జీ అందించారు. ☛ కొంతమంది ఒక ముఠాగా ఏర్పడి వివాహాల పేరుతో అమాయకులను బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా కల్లూరుకు చెందిన నాణెంకాల వెంకటేశ్వరరావు ఫిర్యాదు చేశారు. డబ్బులు బాగా ఉన్న యువకులను లక్ష్యంగా చేసుకుంటున్నారన్నారు. ☛ గుంటూరు రైల్వేస్టేషన్‌లో 12 సవర్ల బంగారు ఆభరణాలు చోరీకి గురైతే పోలీసులకు ఫిర్యాదు చేశామని, ఈ నెల 1న ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేయగా.. కొత్తపేట స్టేషన్‌కు వెళ్లమన్నారని పొన్నూరు మండలం ఇటికంపాడుకు చెందిన తాళ్లూరి రమాదేవి చెప్పారు. అక్కడి పోలీసులు 12 సవర్ల బంగారానికి బదులు 16.5 గ్రాములే ఉందని చెప్పారన్నారు.

ప్రజల నుంచి ఫిర్యాదులు తీసుకుంటున్న అధికారులు

తోడబుట్టినవాళ్లే మోసం చేశారని చేబ్రోలు మండలం సుద్దపల్లికి చెందిన ఆరాధ్యుల శ్రీనివాసరావు ఫిర్యాదు చేశారు. తనకు రావాల్సిన పొలాన్ని వారు దొంగతనంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆరోపించారు.

☛ తన భర్త చనిపోగా.. అత్తమామలు ఇంట్లోకి రానివ్వకుండా బెదిరిస్తున్నారని బొంగరాలబీడుకు చెందిన కొండవీటి శైలజ ఫిర్యాదు చేశారు.

ఉపాధ్యాయుడిపై సస్పెన్షన్ ఎత్తివేయాలి

గుంటూరు విద్య, న్యూస్‌టుడే: ఎస్‌కేబీఎం పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం రోజు కాకతాళీయంగా జరిగిన ఘటనను ఆసరాగా చేసుకుని గణిత ఉపాధ్యాయుడు సుబ్బారావుపై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తేసి విధుల్లోకి తీసుకోవాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ (ఎన్టీఏ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హైమారావు కోరారు. ఈ విషయమై సోమవారం డీఈవో రేణుకను కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లా అధ్యక్షుడు సాయివిశ్వనాథ్, లలితబాబు తదితరులు పాల్గొన్నారు.

డీఈవో రేణుకకు వినతిపత్రం ఇస్తున్న ఎన్టీఏ నాయకులు

భక్తిశ్రద్ధలతో తులసి సహస్ర నామార్చనలు

పూజా క్రతువులో భక్తులు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: స్థానిక శ్రీరామనామక్షేత్రం 99వ శ్రీరామకోటి మహోత్సవాలు కొనసాగుతున్నాయి. సోమవారం అఖండ హరినామ సంకీర్తనలు, క్రోసూరి కృష్ణమాచార్యులు నిర్వహణలో రాగతాళాలతో గరుడాళ్వారును ఆహ్వానించి ధ్వజారోహణ కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. సంతానార్థులకు గరుడ ప్రసాదాన్ని అందించారు. ప్రాంగణంలోని విద్యాభారతి సదనంలో సామూహిక శ్రీరామకోటి తులసి సహస్ర నామార్చనలు జరిగాయి. హనుమాన్ చాలీసా పారాయణం, పురాణం విశేషాలను శేషసాయి, రామదాసు కీర్తనలను బసవరాజు జయశంకర్, మునిపల్లె రమణి ఆలపించారు. సాయంత్రం శేష వాహనంపై రామకోటి పుస్తకాలతో నగరోత్సవం జరిగింది. బెల్లంకొండ మస్తాన్‌రావు, రాగం వెంకట లీలాసుందరి, పాతకోట బ్రాహ్మణయ్య నాయుడు, కొప్పురావూరి వెంకట సుబ్బారావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

పంచాయతీల అభివృద్ధికి పవన్‌కల్యాణ్ విశేష కృషి

గోరంట్ల, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని గ్రామ పంచాయతీల అభివృద్ధికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ విశేషంగా కృషి చేస్తున్నారని సేవాసదన్ అధ్యక్షుడు, జనసేన పార్టీ నాయకులు మిరియాల గోపీకుమార్ అన్నారు. ఈ మేరకు సోమవారం మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో పవన్ కల్యాణ్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం ఇటీవల పోలీస్ వెల్ఫేర్ ఛైర్మన్‌గా నియమితులైన కల్యాణం శ్రీనివాసరావును కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు జాస్తి వీరాంజనేయులు, సేవాసదన్ సభ్యులు మిరియాల ప్రసాదరావు, డేగల వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన 'కోగంటి' శత జయంత్యుత్సవాలు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: బహుమఖ ప్రజ్ఞాశాలి కోగంటి సీతారామాచార్యుల శతజయంతి వారోత్సవాలు బృందావన్ గార్డెన్స్ శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై సోమవారం రాత్రితో ముగిశాయి. ఆయన శిష్యులు, అభిమానులు పలువురు ఆయన ఆదర్శ గుణగణాలను, ఆయనతో తమకున్న సాన్నిహిత్యాన్ని వివరించారు. డాక్టర్ అచ్యుతుని శ్రీచిన్మయి నృత్య ప్రదర్శన, రామరాజు లక్ష్మీశ్రీనివాస్ వీణానాదార్చనతో జరిగాయి. బాలాజీ కల్యాణ మండపంలో నూతలపాటి తిరుపతయ్య, లంక విజయబాబు జ్యోతి వెలిగించి కార్యక్రమాలను ప్రారంభించారు. సభకు కోగంటి వెంకటాచార్యులు అధ్యక్షత వహించారు. ధనకుదరం సీతారామానుజాచార్యులు, పంచాంగం రామానుజాచార్యులు, సుఖవాసి మల్లికార్జునరాయశాస్త్రి, ఎన్‌సీహెచ్ సుధామైథిలి, మైలవరపు లలితకుమారి తదితరులు ప్రసంగించారు. సీతారామాచార్యుల వారి శతాబ్ది సంచికను పరమహంస త్రిదండి అష్టాక్షరి సంపత్ కుమార రామానుజ జీయర్ స్వామి ఆవిష్కరించి సీతారామాచార్యులు జీవిత విశేషాలను వివరించారు. కార్యక్రమంలో దేవాలయ పాలకమండలి అధ్యక్షుడు చిటిపోతు మస్తానయ్య, బొల్లేపల్లి సత్యనారాయణ, కోగంటి వెంకట శ్రీరంగనాయకి, కోగంటి అప్పలాచార్యులు, ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.

శతాబ్ది సంచికను ఆవిష్కరిస్తున్న అష్టాక్షరి సంపత్ కుమార రామానుజ జీయర్ స్వామి

(c) eenadu

గుంటూరు పశ్చిమ

ప్రసంగంతో మెరిసిన విద్యార్థులు

ఏటీ అగ్రహారం, న్యూస్‌టుడే: ఎస్వీవీ కాలనీలోని సుమేధ హైస్కూల్‌లో 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు సోమవారం నిర్వహించారు. 'విద్యార్థుల జీవితాల్లో సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆర్.గాయత్రి దేవి (10వ తరగతి) ప్రథమ, ఎం.శ్రావ్య (9వ తరగతి) ద్వితీయ, పి.షాజహాన్‌ఖాన్ (8వ తరగతి) తృతీయ స్థానాల్లో నిలిచారు. వారికి పాఠశాల డైరెక్టర్ ఎం.చంద్రశేఖర్‌రెడ్డి, హెచ్ఎం కె.రాంబాబు బహుమతులు అందించారు.

విజేతలకు బహుమతులు అందజేస్తున్న డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, హెచ్ఎం రాంబాబు

రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీలకు రషీద్

గోరంట్ల, న్యూస్‌టుడే: ఏపీ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, విజ్ఞాన భారతి సంయుక్తంగా నిర్వహించిన జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు అంకిరెడ్డిపాలెం జడ్పీ హైస్కూల్ విద్యార్థి రషీద్ జాయ్ ఎంపికయ్యాడని పాఠశాల ఇన్‌ఛార్జి రామచంద్రరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27న తిరుపతిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో రషీద్ పాల్గొంటాడని తెలిపారు. ఈ సందర్భంగా రషీద్‌ను జీటీని ఉపాధ్యాయులు శాంతిప్రియ, పాఠశాల ఇన్‌ఛార్జి రామచంద్రరావు, వ్యాయామ ఉపాధ్యాయుడు సంజీవ రెడ్డి తదితరులు సన్మానించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

80086 22566, 97042 53525, 80085 74897

? లక్ష్మీనగర్ రెండో లైన్‌లో రహదారి వెంబడి ఉన్న కాలువలో పూడిక తీయకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. దోమల బెడద ఎక్కువైంది. -స్థానికులు

✓ పారిశుద్ధ్య సిబ్బందిని పంపి మురుగు ముందుకు కదిలేలా చర్యలు తీసుకుంటాం. - నాగేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్

? కృష్ణబాబుకాలనీలో యూహెచ్‌సీ దగ్గర ఉన్న సైడ్ కాలువలో మురుగు ముందుకు కదలడంలేదు. దీంతో దుర్వాసన వెదజల్లుతోంది. -స్థానికులు

✓ సిబ్బందితో కాలువలో పూడిక తీసి మురుగు నీరు పారుదల అయ్యేలా చర్యలు తీసుకుంటాం. - బ్రహ్మయ్య, శానిటరీ ఇన్‌ఛార్జి ఇన్‌స్పెక్టర్ - న్యూస్‌టుడే, ఏటీ అగ్రహారం

ధర వరలు

కృష్ణనగర్ రైతుబజారులో నిన్నటి ధరలు(కిలో రూ.లో): టమాట 37, వంగ 24, బెండ 35, పచ్చిమిర్చి 40, కాకర 45, బీర 55, క్యాలిఫ్లవర్ 25, క్యాబేజీ 24, క్యారెట్ 38, దొండ 29, బంగాళదుంప 27, ఉల్లి పాయలు 23, గోరుచిక్కుళ్లు 44, దోస 28, సొర 24, పొట్ల 35, అరటికాయ 10, పెద్దచిక్కుళ్లు 66, చామదుంప 26, ముల్లంగి 10, బీట్‌రూట్ 33, కీరదోసకాయ 35, బీన్స్ 79, క్యాప్సికం 69, కర్రపెండలం 25, ఆకాకరలు 15, నిమ్మకాయలు 25, అల్లం 80, వెల్లుల్లి 110. -న్యూస్‌టుడే, పట్టాభిపురం

పాఠాలకు జై.. పోటీలకు సై..!

షటిల్ బ్యాడ్మింటన్‌లో సత్తా చాటుతున్న అధ్యాపకులు

ఎస్వీఎన్‌కాలనీ, న్యూస్‌టుడే: నిరంతరం విద్యాసంబంధ విషయాల్లో తలమునకలయ్యే అధ్యాపకులు శారీరక వ్యాయామం కోసం ఆటలపై దృష్టి పెట్టారు. పోటీల్లో పాల్గొని బహుమతులు సైతం సొంతం చేసుకుంటున్నారు. ఇటీవల విజయవాడలో కళాశాల అధ్యాపకుల కోసం షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో గుంటూరు అధ్యాపకులు సత్తా చాటారు. వీరంతా నాలుగు పదుల వయసు దాటినవారే. పతకాలు సాధించి యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్న గురువుల గురించి తెలుసుకుందాం.

విజేతలు వీరే

మెన్స్ డబుల్స్ విభాగంలో వీవీఐటీ యూకు చెందిన వి.ప్రవీణ్‌కుమార్, ఎస్.అనిల్‌కుమార్ జోడీ మెన్స్ విజేతగా నిలవగా, జి.సాంబశివరావు(కిట్స్ అక్షర్), జె.రమేష్(చిప్స్ కళాశాల) జంట సూపర్ వెటరన్స్‌లో విజయదుందుభి మోగించారు. వెటరన్స్‌లో ఆర్వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల ఆచార్యులు ఎం.శివరామకృష్ణ-వి.శేషగిరి రావు రన్నర్స్‌గా నిలిచారు. ఆర్వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల ఉత్తమ భాగస్వామ్య అవార్డు సొంతం చేసుకుంది.

రోజూ సాధన

ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఆర్వీఆర్‌జేసీ కార్యదర్శి రాయపాటి గోపాలకృష్ణ, కిట్స్ వైస్ ఛైర్మన్ కోయ సుబ్బారావు, పెదమామిళ్ల విద్యాసంస్థల ఛైర్మన్ పెదమామిళ్ల ఇక్కడ కూడిన మిత్రబృందం 12 ఏళ్ల నుంచి జేకేసీ కళాశాలలో షటిల్ కోర్టులో ఆడుతున్నాం. శారీరక వ్యాయామంతో పాటు వృత్తి సంబంధ ఒత్తిడి నుంచి ఉపశమనం పొందడానికి ఉపయోగపడుతోంది. రెండేళ్ల నుంచి ఇద్దరం జోడీగా ఆడుతున్నాం. ఆటలకు, వయసుకు సంబంధం లేదు. యువత శారీరక ఆరోగ్యం గురించి వ్యాయామంపై దృష్టి పెట్టాలి. - జి.సాంబశివరావు, డైరెక్టర్, కిట్స్ అక్షర్, జె.రమేష్, చిప్స్ కళాశాల

లాభాలెన్నో..

కళాశాల తర్వాత సాయంత్రం రింగురోడ్డులోని కోర్టులో ప్రతిరోజూ ప్రాక్టీస్ చేయడంతో పాటు శిక్షణ కూడా ఇస్తాం. పోటీలకు 130 జట్లు వచ్చాయి. పోటీలకు హాజరైన వారిని చూస్తే ఆరోగ్యం కోసం వీళ్లు ఎంత కష్టపడుతున్నారో తెలిసింది. ఆటల వల్ల ఒత్తిడిలోనూ మంచి నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం, కోపాన్ని నియంత్రించుకోవడం, సానుకూల దృక్పథం, శారీరకంగా ఆరోగ్యంగా ఉంటామనే విషయాన్ని యువత గ్రహించాలి. - వి.ప్రవీణ్‌కుమార్, ఎస్.అనిల్‌కుమార్, వీవీఐటీయూ

ఆరోగ్యం మన చేతుల్లోనే..

చిన్నతనం నుంచి ఆటలంటే మక్కువ. అధ్యాపక వృత్తిలో ఉన్నా వ్యాయామానికి దూరం కాలేదు. ప్రస్తుతం కళాశాలలో షటిల్, త్రోబాల్, టెన్నికాయిట్ ఆడతాం. 15 ఏళ్ల నుంచి రాష్ట్ర స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొంటున్నాం. చాలాసార్లు 2, 3 స్థానాల్లో నిలిచాం. ఈ ఏడాది నాలుగో స్థానం దక్కింది. ఆటల వల్ల శారీరక, మానసిక వికాసం, ఒత్తిడి తగ్గడం, బృంద స్ఫూర్తి, క్రమశిక్షణ అలవడుతుంది. మన ఆరోగ్యం మన చేతిలో ఉంది. దానికి వ్యాయామం అవసరమని యువత తెలుసుకోవాలి. - డాక్టర్ ఎస్.రాధిక, డాక్టర్ కె.కీర్తన, ఆర్వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల

అసంపూర్తి పనులపై నివేదిక ఇవ్వండి

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరంలో డివిజన్లవారీగా అసంపూర్తి పనులపై వెంటనే నివేదిక ఇవ్వాలని కమిషనర్ శ్రీనివాసులు ఆదేశించారు. సోమవారం ఆయన నవభారత్‌నగర్, ఎస్వీఎన్ కాలనీ, గోరంట్ల, మేరీ ప్రియనగర్, కాకాని రోడ్డు తదితర ప్రాంతాల్లో పర్యటించి పారిశుద్ధ్యం, అభివృద్ధి పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో పార్కులు, రహదారులు, డ్రెయిన్ల అభివృద్ధికి పనులు దక్కించుకుని, కొంత అసంపూర్తిగా వదిలేస్తున్నారన్నారు. దీని వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ అంశంపై సంబంధిత గుత్తేదారులకు నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకోవాలని, ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఇంజినీరింగ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. గుత్తేదారులపై ఏ చర్యలు తీసుకున్నారో నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఎస్వీఎన్ కాలనీలో పార్కులో పెండింగ్ పనులు పూర్తి చేయాలన్నారు. పర్యటనలో కార్పొరేటర్ వేములపల్లి శ్రీరాంప్రసాద్, ఇంజినీరింగ్, పారిశుద్ధ్య అధికారులు తదితరులు పాల్గొన్నారు.

★ పర్యటనలో భాగంగా కమిషనర్ శ్రీనివాసులు ఆర్టీవో కార్యాలయం వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. భోజనం చేసేవారు ఎక్కువగా వస్తున్నందున మౌలిక సదుపాయాల కల్పన విషయంలో రాజీపడవద్దని అధికారులకు ఆదేశాలిచ్చారు.

రూ.8.50 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం

పట్టాభిపురం, న్యూస్‌టుడే: గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో పలు డివిజన్లలో రూ.8.50 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని ఎమ్మెల్యే గళ్లా మాధవి తెలిపారు. 19, 22, 39, 52 డివిజన్లలోని పలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు సోమవారం ఆమె భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ అచ్చయ్య డాబా సెంటర్, నల్లచెరువు, భాగ్యనగర్, ఆరండల్‌పేట ఒకటో లైనులోని సిమెంటు రోడ్లు, డ్రెయిన్లు, బీటీ రోడ్ల అభివృద్ధి పనులు చేపట్టనున్నాము. కాంట్రాక్టర్లు పనులు వేగంగా పూర్తి చేసి... లను తొలగించాలన్నారు. అన్ని పనులు నెలల్లోగా పూర్తి చేయాలని సూచించారు. నల్లచెరువు సమీపంలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగి ఆకతాయిలు ఇబ్బందులు పెడుతున్నారని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనికి ఆమె స్పందించి ఇటువంటి పనులు పునరావృతం కాకుండా, మళ్లీ జరిగితే బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. స్థానికులు కూడా అసాంఘిక కార్యకలాపాలపై వీడియో తీసి పంపాలని సూచించారు.

పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మాధవి

రోడ్డుపైనే నిర్మాణ సామగ్రి.. రాకపోకలెలా?

కొండిరి రోడ్లపైనే ఇష్టారాజ్యంగా భవన నిర్మాణ సామగ్రి పెడుతున్నారు. ఫలితంగా రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కృష్ణనగర్ ఎనిమిదో లైనులో భవనాలు నిర్మిస్తున్న వారు ఇసుక, ఇటుక, కంకర రోడ్డుపైనే కుప్పలుగా పోస్తారు. పర్యవేక్షించాల్సిన సచివాలయ సిబ్బంది, టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. రోడ్డుపైనే భవన నిర్మాణ సామగ్రి రోజుల తరబడి ఉంచడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా పరిణమిస్తోంది. అధికారులు స్పందించి రోడ్లపై భవన నిర్మాణ సామగ్రి రోజుల తరబడి ఉంచే వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, పట్టాభిపురం

స్తంభాలు తొలగించకుండానే.. రోడ్డేశారు

ఇన్నర్‌రింగ్‌రోడ్డు నుంచి రెడ్డిపాలెం ఎస్టీ కాలనీ వరకు ఉన్న సీసీ రోడ్డులో మిగిలిన పనులను ఇటీవల ప్రారంభించారు. ఇక్కడ శాఖల మధ్య సమన్వయలోపం కనిపిస్తోంది. అందుకు నిదర్శనమే ఈ చిత్రం. రోడ్డు నిర్మించే సమయంలో అడ్డుగా ఉన్న విద్యుత్తు స్తంభాలను పక్కకు తరలించి నిర్మించాల్సి ఉన్నా.. శాఖల మధ్య సమన్వయంలోపం, గుత్తేదారు పట్టించుకోకుండా రోడ్డేసేశారు. అటుగా వెళ్లేవారంతా ఈ పనిని చూసి అధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. -న్యూస్‌టుడే, గోరంట్ల

అర్జీల పరిష్కార బాధ్యత విభాగాధిపతులదే



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థకు వివిధ మార్గాల ద్వారా వచ్చే ప్రజా ఫిర్యాదులు, అర్జీల పరిష్కార బాధ్యత విభాగాధిపతులదేనని కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. సోమవారం డయల్ యువర్ కమిషనర్ ఛాంబర్‌లో నిర్వహించారు. 26 ఫిర్యాదులు రాగా వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం కౌన్సిల్ హాలులో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో అర్జీలు స్వీకరించారు. పట్టణ ప్రణాళిక 13, ఇంజినీరింగ్ 9, రెవెన్యూ 3, ప్రజారోగ్యం 7, ఉపాసెల్‌కు ఒకటి చొప్పున ఫిర్యాదులు రాగా వాటిని నిర్దేశిత సమయంలోగా పరిష్కరించాలని ఆదేశించారు. కమిషనర్ శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదులు పునరావృతం కాకుండా శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఏసీ ఓబులేసు, డీసీలు సీహెచ్ శ్రీనివాస్, బి.శ్రీనివాసరావు, సీపీ రాంబాబు, ఇన్‌ఛార్జి ఎస్ఈ సుందర్రామిరెడ్డి, సీఎంవోహెచ్ డాక్టర్ శాంతికళ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో తులసి సహస్ర నామార్చన

పూజా క్రతువులో భక్తులు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: స్థానిక శ్రీరామనామ క్షేత్రం 99వ శ్రీరామకోటి మహోత్సవాలు కొనసాగుతున్నాయి. సోమవారం అఖండ హరినామ సంకీర్తనలు, క్రోసూరి కృష్ణమాచార్యులు నిర్వహణలో రాగతాళాలతో గరుడాళ్వారును ఆహ్వానించి ధ్వజారోహణ కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. సంతానార్థులకు గరుడ ప్రసాదాన్ని అందించారు. ప్రాంగణంలోని విద్యాభారతి సదనంలో సామూహిక శ్రీరామకోటి తులసి సహస్ర నామార్చనలు జరిగాయి. హనుమాన్ చాలీసా పారాయణం, పురాణం విశేషాలను శేషసాయి, రామదాసు కీర్తనలను బసవరాజు జయశంకర్, మునిపల్లె రమణి ఆలపించారు. సాయంత్రం శేష వాహనంపై రామకోటి పుస్తకాలతో నగరోత్సవం జరిగింది. బెల్లంకొండ మస్తాన్‌రావు, రాగం వెంకట లీలాసుందరి, పాతకోట బ్రాహ్మణయ్య నాయుడు, కొప్పురావూరి వెంకట సుబ్బారావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

అడ్డదిడ్డంగా తవ్వేసి.. అవస్థలు తెచ్చేసి..

గుంటూరు నగరపాలక సంస్థ అధికారుల ప్రణాళికా లోపంతో జనం అవస్థలు పడుతున్నారు. శంకర్ విలాస్ పైవంతెన నిర్మాణ పనులు ప్రారంభమైన చాలా కాలానికి ఆ పరిసరాల్లోని నీటి పైపులైన్లను వేరే చోటకు మారుస్తున్నారు. ఈ నేపథ్యంలో రోడ్లను అడ్డగోలుగా తవ్వేస్తుండటం.. వచ్చిన మట్టిని చెల్లాచెదురుగా పడేస్తుండటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ట్రాఫిక్ మళ్లింపు చేపట్టకపోవడంతో వాహనదారులు బ్రాడీపేట మొత్తం తిరగాల్సిన దుస్థితి. అసలే ట్రాఫిక్ కష్టాలతో అల్లాడుతున్న ప్రజలకు తాజా పరిస్థితులు మరింత ఇబ్బందులు తెచ్చి పెడుతున్నాయి. నాజ్‌సెంటర్ నుంచి బస్‌స్టాండ్‌కు వెళ్లే ప్రధాన రహదారి వెంబడి ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తోంది. సంబంధిత అధికారులు దృష్టి పెట్టి పరిష్కారం చూపాల్సిన అవసరం ఉంది. - ఈనాడు, గుంటూరు

బ్రాడీపేట నాలుగోలైన్ నుంచి సూచికలు లేకుండా తవ్విన గుంతలు

అరండల్‌పేటలో దారికి అడ్డంగా మట్టికుప్ప

ముగిసిన 'కోగంటి' శత జయంత్యుత్సవాలు

శతాబ్ది సంచిక ఆవిష్కరిస్తున్న సంపత్ కుమార రామానుజ జీయర్ స్వామి

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: బహుముఖ ప్రజ్ఞాశాలి కోగంటి సీతారామచార్యుల శతజయంతి వారోత్సవాలు బృందావన్ గార్డెన్స్ శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై సోమవారం రాత్రితో ముగిశాయి. ఆయన శిష్యులు, అభిమానులు పలువురు ఆయన ఆదర్శ గుణగణాలను, ఆయనతో తమకున్న సాన్నిహిత్యాన్ని వివరించారు. డాక్టర్ అచ్యుతుని శ్రీచిన్మయి నృత్య ప్రదర్శన, రామరాజు లక్ష్మీశ్రీనివాస్ వీణానాదార్చనతో జరిగాయి. బాలాజీ కల్యాణ మండపంలో నూతలపాటి తిరుపతయ్య, లంక విజయబాబు జ్యోతి వెలిగించి కార్యక్రమాలను ప్రారంభించారు. సభకు కోగంటి వెంకటాచార్యులు అధ్యక్షత వహించారు. ధనకుదరం సీతారామానుజాచార్యులు, పంచాంగం రామానుజాచార్యులు, సుఖవాసి మల్లికార్జునరాయ శాస్త్రి, ఎన్‌సీహెచ్ సుధామైథిలి, మైలవరపు లలితకుమారి తదితరులు ప్రసంగించారు. సీతారామచార్యుల వారి శతాబ్ది సంచికను పరమహంస త్రిదండి అష్టాక్షరి సంపత్ కుమార రామానుజ జీయర్ స్వామి ఆవిష్కరించి సీతారాయాచార్యులు జీవిత విశేషాలను వివరించారు. కార్యక్రమంలో దేవాలయ పాలకమండలి అధ్యక్షుడు చిటిపోతు మస్తానయ్య, బొల్లేపల్లి సత్యనారాయణ, కోగంటి వెంకట శ్రీరంగనాయకి, కోగంటి అప్పలాచార్యులు, ఆచార్యులు పాల్గొన్నారు.

స్టాఫ్ నర్సులకు తగిన రక్షణ కల్పించాలి

గోరంట్ల, న్యూస్‌టుడే: ఈ నెల 3న గణపవరం పీహెచ్‌సీ తలుపులు వేసి ఉండడంతో అక్కడ పని చేస్తున్న 12 మంది ఉద్యోగులను సస్పెండ్ చేశారని, ఏపీఎన్జీవో సంఘ రాష్ట్ర అధ్యక్షుడి విజ్ఞప్తితో తిరిగి వారిని విధుల్లోకి తీసుకుంటామని వైద్యారోగ్య శాఖ కమిషనర్ తెలిపారని ఏపీఎన్జీఓల సంఘం జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్ వైద్యారోగ్య శాఖ కమిషనర్‌ను కలిసి ఉద్యోగుల సస్పెన్షన్ ఎత్తివేయాలని కోరారన్నారు. వైద్య శాఖ ఉద్యోగులకు సరైన రక్షణ సదుపాయాలు లేకుండా రాత్రిపూట విధులు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేయడం ఇబ్బందికరమని, ప్రభుత్వం తక్షణమే రాత్రిపూట విధులు నిర్వహించే స్టాఫ్ నర్సులకు తగిన రక్షణ కల్పించాలని విద్యాసాగర్ కోరారని తెలిపారు. సస్పెన్షన్ ఉత్తర్వులను రద్దు చేసే దిశగా కృషి చేసిన రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.వి.రమణ ఇతర నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.

ఉత్సాహంగా పికిల్‌బాల్ పోటీలు

విజేతలకు పతకాలు అందజేసిన అనురాధ, టీవీ రావు

గుంటూరు క్రీడలు, న్యూస్‌టుడే: రోటరీక్లబ్ ఆఫ్ గుంటూరు ఆదర్శ్ ఆధ్వర్యంలో వీవీవీ హెల్త్ హబ్‌లో జరుగుతున్న గుంటూరు ఓపెన్ పికిల్‌బాల్ టోర్నమెంట్ పోటీలు సోమవారం ముగిశాయి. ఢిల్లీ పబ్లిక్ పాఠశాలకు చెందిన నేహా అండర్-14 మిక్స్‌డ్ సింగిల్స్, ఉమెన్ ఓపెన్ సింగిల్స్‌లో విజేతగా నిలిచింది. ఓపెన్ డబుల్స్‌లో విన్సెంట్, నాగరాజు విన్నర్స్‌గా, ఆనంద్ కుమార్, అరుణ్‌కుమార్ రన్నర్స్ టైటిల్ సాధించారు. విజేతలకు రోటరీక్లబ్ ఆఫ్ ఆదర్శ్ అధ్యక్షురాలు అనురాధ, మాస్టర్స్ గేమ్స్ ఇండియా సీనియర్ ఉపాధ్యక్షుడు డాక్టర్ టి.వి.రావు, రోటరీక్లబ్ అసిస్టెంట్ గవర్నర్ భాస్కర రావు పతకాలు అందజేశారు.

క్రీడల్లో రాణిస్తే గుర్తింపు

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అఫ్రోజ్‌ఖాన్, ప్రసాద్

గుంటూరు క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి క్రాస్ కంట్రీ పోటీల్లో రాణించాలని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి అఫ్రోజ్‌ఖాన్ అన్నారు. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బీఆర్ స్టేడియంలో జిల్లా క్రాస్ కంట్రీ ఎంపికలను సోమవారం ఆయన ప్రారంభించారు. అఫ్రోజ్‌ఖాన్ మాట్లాడుతూ ఈ పోటీల్లో ఎంపికైన జట్టు కాకినాడలో ఈనెల 24న జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటుందన్నారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్, సభ్యుడు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు

పంచాయతీల అభివృద్ధికి పవన్‌కల్యాణ్ విశేష కృషి

కల్యాణం శ్రీనివాసరావును శాలువాతో సన్మానిస్తున్న మిరియాల గోపీకుమార్

గోరంట్ల, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని గ్రామ పంచాయతీల అభివృద్ధికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ విశేషంగా కృషి చేస్తున్నారని సేవాసదన్ అధ్యక్షుడు, జనసేన పార్టీ నాయకులు మిరియాల గోపీకుమార్ అన్నారు. ఈ మేరకు సోమవారం మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో పవన్ కల్యాణ్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం ఇటీవల పోలీస్ వెల్ఫేర్ ఛైర్మన్‌గా నియమితులైన కల్యాణం శ్రీనివాసరావును కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు జాస్తి వీరాంజనేయులు, సేవాసదన్ సభ్యులు మిరియాల ప్రసాదరావు, డేగల వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

ఆటోనగర్‌లో తొమ్మిది మినీ ఉద్యానవనాలు

ఏర్పాటుకు ప్రణాళికలు

ఫేజ్ 4లో పార్కుగా మారనున్న ఖాళీ స్థలం

ఆటోనగర్ (పెదకాకాని), న్యూస్‌టుడే: గుంటూరులోని ఆటోనగర్‌లో తొమ్మిది ఖాళీ స్థలాలను మినీ పార్కులుగా అభివృద్ధి చేయనున్నట్టు ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ నరసింహరావు చెప్పారు. నేషనల్ క్లీన్‌నెస్ పథకంలో 3, ఏపీఐఐసీ, ఐలా ఆధ్వర్యంలో 6 పార్కులు ఏర్పాటు చేస్తామన్నారు. ఇందు కోసం ప్రణాళికలు సిద్ధం చేసినట్టు వెల్లడించారు. ఆటోనగర్‌లో పచ్చదనం అభివృద్ధి చేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. స్థానిక ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ సహకారంతో ఇవి మంజూరయ్యాయన్నారు. ఇక్కడికి ఉమ్మడి జిల్లా నుంచి నిత్యం వందల సంఖ్యలో వ్యాపారులు, మెకానిక్‌లు, వాహనదారులు వస్తుంటారు. వారు సేదదీరేందుకు ఈ ఉద్యానవనాలు ఉపయోగపడతాయని తెలిపారు. ఖాళీ స్థలాలు వ్యర్థాలకు ఆవాసంగా మారడంతో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు.

ప్రాచీన విద్యలను కాపాడుకోవాలి

విజేతలతో కేవీ బ్రహ్మం, కృష్ణానంద్, కామేశ్వర శాస్త్రి

ఏటీ అగ్రహారం, న్యూస్‌టుడే: ప్రాచీన విద్యలను భవిష్యత్తు తరాలవారికి అందించే బాధ్యత నేటి యువతరం తీసుకోవాలని టీజేపీఎస్ కళాశాల కార్యదర్శి కరస్పాండెంట్ కె.వి.బ్రహ్మం, కోశాధికారి వి.కృష్ణానంద్ పేర్కొన్నారు. సౌత్ జోన్ సిలంబం ఛాంపియన్‌షిప్-2025 పోటీలకు వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో గుంటూరు జట్టు ఓవరాల్ ఛాంపియన్‌షిప్ కైవసం చేసుకుందని సంఘ ఏపీ కార్యదర్శి ఆర్.రిషిరాజవర్మ తెలిపారు. అడకా లోకనాథ్(బాలకుటీర్), కె.గుణేశ్వర్(శ్రీసత్య సాయి విద్యావిహార్), శ్రీమత్, ఎం.పావని (సుమేధ హైస్కూల్), సయ్యద్ మహమ్మద్ ఇర్షాద్ (కాటూరి పబ్లిక్ స్కూల్), ఎస్.బాంధవ్(భాష్యం), ఎం.మోక్ష వినయ్‌కుమార్ (ఎస్‌కేబీఎం హైస్కూల్), ఉద్దీప్ (ఆరక్కా), ఎస్.సంతోష్, గుణశేఖర్, యశ్వంత్, శ్రీనివాసులు ప్రతిభ కనబర్చారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ బీవీహెచ్ కామేశ్వరశాస్త్రి, అథ్లెటిక్స్ కోచ్ ఆర్.శివాజీ, కూడో జిల్లా కార్యదర్శి సిద్ధార్థవర్మ, కిక్ బాక్సింగ్ కోచ్ గణపతి, అడకా వేణు తదితరులు పాల్గొన్నారు.

'రాజధానిలో పర్యటించే ధైర్యం జగన్‌కు ఉందా?'

పట్టాభిపురం: జగన్‌రెడ్డి, అంబటి రాంబాబులకు ధైర్యం ఉంటే రాజధానిలో పర్యటించి భూసేకరణ విధానం గురించి మాట్లాడాలని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు సవాల్ చేశారు. జిల్లా పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాజధాని అమరావతిని శ్మశానంతో పోల్చిన వైకాపా నేతలు నేడు ఏ మొహం పెట్టుకుని భూసేకరణ విధానాన్ని ప్రశ్నిస్తున్నారో సమాధానం చెప్పాలన్నారు. జగన్.. అమరావతిని సర్వనాశనం చేయడమే కాకుండా ఆ ప్రాంత మహిళల ఉసురు పోసుకున్నారని, అందుకే ప్రతిపక్ష హోదా కూడా రాలేదని ఎద్దేవా చేశారు. భవిష్యత్తులో రాజధాని అమరావతిని ఎవరూ కదిలించలేని విధంగా పార్లమెంట్‌లో ప్రభుత్వం చట్టం చేయబోతుందన్నారు.

స్వచ్ఛభారత్ లక్ష్య సాధనలో శౌచాలయాలు కీలకం

పట్నంబజారు, న్యూస్‌టుడే: స్వచ్ఛ భారత్ లక్ష్యాల సాధనలో శౌచాలయాల నిర్మాణం అత్యంత ముఖ్యమని ప్రముఖ న్యూరో సర్జన్ రామకృష్ణారెడ్డి అన్నారు. గుంటూరు మెడికల్ కాలేజీలో దాతల సహకారంతో ఆధునికీకరించిన క్యాంటీన్‌ను సోమవారం ప్రిన్సిపల్ సుందరాచారి ఆధ్వర్యంలో రామకృష్ణారెడ్డి ప్రారంభించారు. విద్యార్థినుల కోసం 15, విద్యార్థుల కోసం 12 శౌచాలయాలు నిర్మించి ప్రారంభించారు. డాక్టర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఈ కళాశాలలో చదివిన తాను తిరిగి ఇదే కళాశాలకు తన వంతు సేవ చేయటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. డాక్టర్ సుందరాచారి నాయకత్వంలో జరుగుతున్న అభివృద్ధి అభినందనీయమన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ సుందరాచారి మాట్లాడుతూ క్యాంటీన్‌ను పరిశుభ్రంగా ఉంచి, స్వచ్ఛతతో కూడిన ఆహారం అందించాలని నిర్వాహకులకు సూచించారు. పనులు పర్యవేక్షించిన అసిస్టెంట్ ప్రొఫెసర్ నాగేశ్వర్ సేవలను ఆయన అభినందించారు. వైస్ ప్రిన్సిపల్ (అడ్మిన్) శ్రీధర్, వైస్ ప్రిన్సిపల్ (అకడమిక్) మాధవి, ప్రొఫెసర్ సాల్మాన్‌రాజు పాల్గొన్నారు.

నిర్ణీత సమయంలో అర్జీల పరిష్కారం

ఎస్పీ వకుల్ జిందాల్

ప్రజల నుంచి ఫిర్యాదులు తీసుకుంటున్న అధికారులు

గుంటూరు నగరం, న్యూస్‌టుడే: నిర్ణీత సమయంలో ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అర్జీలు స్వీకరించారు. ఆర్థిక, కుటుంబపరమైన అంశాలతోపాటు పలు మోసాలకు సంబంధించి సమస్యలు, బెదిరింపులు, ఆక్రమణలపై ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయని వివరించారు. వాటిని సంబంధిత పోలీసు అధికారులకు పంపుతున్నామన్నారు. జిల్లా అదనపు ఎస్పీ రమణమూర్తి, డీఎస్పీలు బెల్లం శ్రీనివాస్, శ్రీనివాసరెడ్డి, మధుసూదనరావు, తదితరులు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు.

★ తన తల్లిదండ్రుల ద్వారా సంక్రమించిన పొలం పల్నాడు జిల్లా రొంపిచర్లలో ఉందని, అందులోకి వెళ్లనీయకుండా గంజి అంకారావు, అతని తండ్రి వెంకటేశ్వర్లు బెదిరిస్తున్నారని నగరంలోని రవీంద్రనగర్‌కు చెందిన మద్ది శ్రీవాణి ఫిర్యాదు చేశారు.

★ తోడబుట్టినవాళ్లే మోసం చేశారని చేబ్రోలు మండలం సుద్దపల్లికి చెందిన ఆరాధ్యుల శ్రీనివాసరావు ఫిర్యాదు చేశారు. తనకు రావాల్సిన పొలాన్ని వారు దొంగతనంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆరోపించారు.

★ అధికారపార్టీకి చెందిన ఖాలేషావలి, చాంద్, హసీనా, జాను తదితరులు తనను ఇబ్బందులకు గురి చేస్తున్నారని తాడేపల్లి మండలం వడ్డేశ్వరానికి చెందిన షేక్ రిహానా ఫిర్యాదు అందించారు.

★ వన్‌లైఫ్ వన్‌కార్డు కంపెనీ యాజమాన్యం తనకు రావాల్సిన బకాయి వేతనం ఇవ్వకుండా కాలయాపన చేస్తోందని మంగళగిరి వడ్డెరపాలేనికి చెందిన బండారు వరలక్ష్మి అర్జీ అందించారు.

★ కొంతమంది ఒక ముఠాగా ఏర్పడి వివాహాల పేరుతో అమాయకులను బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా కల్లూరుకు చెందిన నాణెంకాల వెంకటేశ్వరరావు ఫిర్యాదు చేశారు. డబ్బులు బాగా ఉన్న యువకులను లక్ష్యంగా చేసుకుంటున్నారన్నారు.

★ తన భర్త చనిపోగా.. అత్తమామలు ఇంట్లోకి రానివ్వకుండా బెదిరిస్తున్నారని బొంగరాలబీడుకు చెందిన కొండవీటి శైలజ ఫిర్యాదు చేశారు.

★ గుంటూరు రైల్వేస్టేషన్‌లో 12 సవర్ల బంగారు ఆభరణాలు చోరీకి గురైతే పోలీసులకు ఫిర్యాదు చేశామని, ఈ నెల 1న ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేయగా.. కొత్తపేట స్టేషన్‌కు వెళ్లమన్నారని పొన్నూరు మండలం ఇటికంపాడుకు చెందిన తాళ్లూరి రమాదేవి చెప్పారు. అక్కడి పోలీసులు 12 సవర్ల బంగారానికి బదులు 16.5 గ్రాములే ఉందని చెప్పారన్నారు.

(c) eenadu

2027లో రై రై బుల్లెట్ రైల్

●అదే ఏడాది ఆగస్టులో ట్రయల్ రన్ ●గుజరాత్‌లో వేగంగా ప్రాజెక్టు పనులు ●ప్రతి స్టేషన్ నిర్మాణమూ ప్రత్యేకమే

గుజరాత్ నుంచి ఈనాడు ప్రత్యేక ప్రతినిధి

నిర్మాణంలో ఉన్న అహ్మదాబాద్ బుల్లెట్ ట్రైన్ స్టేషన్ ★ సబర్మతిలో నిర్మించిన మల్టీ ట్రాన్స్‌పోర్ట్ హబ్

దేశంలో మొదటి బుల్లెట్ ట్రైన్ పరుగులు పెట్టనున్న గుజరాత్‌లో ప్రాజెక్టు పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈ ట్రాక్ వెళ్లే అహ్మదాబాద్, సబర్మతిలలో స్టేషన్లను సంస్కృతి ప్రతిబింబించేలా అదే సమయంలో అత్యాధునిక వసతులు ఉండేలా తీర్చిదిద్దుతున్నారు. అహ్మదాబాద్-ముంబయి మధ్య నడవనున్న బుల్లెట్ రైలు.. 508 కిలోమీటర్ల దూరాన్ని 2 గంటల 7 నిమిషాల్లోనే చేరుకుంటుంది. దీనికి సంబంధించి 2027 ఆగస్టులో గుజరాత్‌లోని సూరత్-బిలిమోరా మధ్య 50 కి.మీ. దూరానికి ట్రయల్ చేపట్టనున్నట్లు నేషనల్ హైస్పీడ్ రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ అహ్మదాబాద్ సివిల్ పనుల విభాగం ప్రిన్సిపల్ చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ రాజేష్ అగర్వాల్ వివరించారు. ఈ ప్రాజెక్టు మొత్తం వ్యయం రూ.1.08 లక్షల కోట్లు కాగా గంటకు 350 కి.మీ. వేగంతో దూసుకుపోయే సామర్థ్యం ఈ బుల్లెట్ రైలుకు ఉంటుంది. అత్యాధునిక ట్రాక్‌తో పాటు మెట్రో, బస్సు, రైలు, బుల్లెట్ రైలు మార్గాలను అనుసంధానించేలా పూర్తి స్థాయి వసతులతో మొత్తం 12 స్టేషన్లను నిర్మిస్తున్నారు. సబర్మతిలో మల్టీమోడల్ ట్రాన్స్‌పోర్ట్ హబ్ నిర్మాణం ఇప్పటికే పూర్తయింది. ఇది 2026లో అందుబాటులోకి రానుందని రాజేష్ వివరించారు. అహ్మదాబాద్, సబర్మతిలలో కొన్ని చోట్ల పనులు ఇప్పటికే పూర్తికాగా, మరి కొన్నిచోట్ల వివిధ దశల్లో ఉన్నాయి. ఈనాడు ప్రతినిధి ఈ ప్రాజెక్టు పనులను క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు. వివరాలివీ...

అహ్మదాబాద్ బుల్లెట్ ట్రైన్ స్టేషన్

●అహ్మదాబాద్ బుల్లెట్ ట్రైన్ స్టేషన్ నిర్మాణాన్ని నగర సాంస్కృతిక, చారిత్రక వారసత్వం ప్రతిబింబించేలా రూపొందించారు. సుమారు 38,000 చదరపు మీటర్ల విస్తీర్ణంలో నేల పైనుంచి 33.7 మీటర్ల ఎత్తులో ఈ స్టేషన్ ఉంటుంది. ప్రస్తుతం నిర్మాణ పనులు సాగుతున్నాయి. ●ప్రయాణికుల సౌలభ్యం కోసం లాంజ్, మరుగుదొడ్లు, ఉద్యానవనాలు, వాణిజ్య దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. ●బుల్లెట్ ట్రైన్ స్టేషన్‌ను మెట్రో, ఆటోలు, క్యాబ్ సర్వీసులతో అనుసంధానించేందుకు ఇంటిగ్రేటెడ్ భవనం నిర్మిస్తున్నారు. అహ్మదాబాద్ రైల్వే స్టేషన్‌తోనూ బుల్లెట్ ట్రైన్ స్టేషన్ అనుసంధానమై ఉంటుంది. ●ఇక్కడి నుంచి అహ్మదాబాద్ విమానాశ్రయం దాదాపు 10 కి.మీ, గీతా మందిర్ సెంట్రల్ బస్ స్టాండ్ 3.5 కి.మీ. దూరంలోనే ఉంటాయి.

సబర్మతి మల్టీమోడల్ హబ్

●హై స్పీడ్ రైల్ మల్టీమోడల్ హబ్ ఒక ఆధునిక భవనం. సబర్మతి రైల్వే స్టేషన్లు, మెట్రో స్టేషన్, నిర్మాణంలో ఉన్న సబర్మతి బుల్లెట్ ట్రైన్ స్టేషన్, బస్ ర్యాపిడ్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్‌తో నిరంతర కనెక్టివిటీ అందించడానికి దీనిని డిజైన్ చేశారు. ●ఈ ప్రతిష్ఠాత్మక నిర్మాణం ముందు భాగం దండి మార్చ్ ఉద్యమాన్ని ప్రతిబింబిస్తుంది. ఈ భవన నిర్మాణం దాదాపుగా పూర్తయింది. ●ఆరు అంతస్తుల ఈ భవనంలో బ్యాంకెట్ హాళ్లు, కాన్ఫరెన్స్ రూమ్‌లు, స్విమ్మింగ్ పూల్, రెస్టారెంట్‌తో కూడిన హోటల్.. మొదలైనవి ఉంటాయి. ●పర్యావరణానికి హాని కలిగించని రీతిలో గ్రీన్ బిల్డింగ్‌గా ఈ హబ్‌ను తీర్చిదిద్దనున్నారు.

సబర్మతి బుల్లెట్ ట్రైన్ స్టేషన్

●సబర్మతి టెర్మినల్ స్టేషన్ మహాత్మా గాంధీ సబర్మతి ఆశ్రమంలోని చరఖా నుంచి ప్రేరణ పొందింది. ●ఈ స్టేషన్ మొత్తం నిర్మాణ విస్తీర్ణం: 45,094 చదరపు మీటర్లు కాగా భూమి నుంచి 44 మీటర్ల ఎత్తులో ఉంటుంది. నిర్మాణం కొనసాగుతోంది.

నేలపాలు చేసిన ద్రవ ఉక్కు

1,500 టన్నుల ద్రవ ఉక్కు నేలపాలు

ఉక్కునగరం (స్టీల్ సెక్టార్-3), న్యూస్‌టుడే: విశాఖ ఉక్కు కర్మాగారంలో సోమవారం 1,500 టన్నుల ద్రవ ఉక్కును నేలపాలు చేశారు. ఎ.షిఫ్ట్‌లో 600 టన్నులు, బి.షిఫ్ట్‌లో 900 టన్నుల చొప్పున ద్రవ ఉక్కును ఇలా పారబోశారు. విశాఖ ఉక్కు యాజమాన్యం విలువైన ఉక్కును తుక్కు (స్క్రాప్) పేరుతో నేలపాలు చేస్తుండటంపై కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఉక్కు తయారీ పంపకుండా పూర్తి ఐరన్ పేరుతో తుక్కుగా మార్చడం తగదని అంటున్నాయి. పూర్తి ఐరన్ తయారు చేయాలంటే కమిటీ అనుమతులు ఉండాలని.. అది తీసుకోకుండానే ఇలా చేస్తున్నారని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎవరి లబ్ధి చేకూర్చేందుకు ఈ విధంగా చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు.

కర్ణాటక సీఎంకు 'సుప్రీం' తాఖీదులు

ఈనాడు, బెంగళూరు: కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు సుప్రీంకోర్టు తాఖీదులు జారీ చేసింది. 2023లో విధానసభ ఎన్నికల సమయంలో మైసూరు జిల్లా వరుణ నియోజకవర్గం నుంచి సిద్ధరామయ్య గెలిచేందుకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 'గ్యారంటీ పథకాల భరోసా' కారణమని, అవి ఎన్నికల నియమావళిని ఉల్లంఘించడమేనని అభ్యంతరం తెలుపుతూ అదే నియోజకవర్గానికి చెందిన శంకర్ అనే ఓటరు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ధర్మాసనం వివరణ ఇవ్వాల్సిందిగా సిద్ధరామయ్యకు తాఖీదులు జారీ చేసింది. ఎన్నికల ముందు ఇచ్చే గ్యారంటీ హామీలు ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951 ప్రకారం అవినీతిగా పరిగణించాలని, మహిళలకు మాత్రమే బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించటం పురుషులపై వివక్షగా భావించాలని శంకర్ గతంలో కర్ణాటక హైకోర్టులో పిటిషన్ వేశారు. దీన్ని విచారించిన కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సునీల్‌దత్ యాదవ్.. పిటిషన్‌లో చట్టాలను ఉల్లంఘించేంత కారణాలేవీ లేవన్నారు. పార్టీ రూపొందించిన ఎన్నికల ప్రణాళికలకు ఓ అభ్యర్థిని ఎలా బాధ్యుడిని చేస్తామని ప్రశ్నించారు. ఇలాంటి పిటిషన్లు గతంలోనూ దాఖలైనట్లు గుర్తుచేస్తూ శంకర్ అభ్యంతరాలను కొట్టివేశారు. ఈ తీర్పును సవాలు చేస్తూ పిటిషనర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

మంత్రి నెహ్రూ అవినీతికి పాల్పడ్డారు

● కేసు నమోదు చేయండి ● తమిళనాడు డీజీపీకి ఈడీ లేఖ

చెన్నై (ప్యారిస్), న్యూస్‌టుడే: తమిళనాడు పురపాలక, నీటి సరఫరా శాఖల మంత్రి కేఎన్ నెహ్రూ రూ.1,020 కోట్ల మేర అవినీతికి పాల్పడ్డారని, ఆయనపై కేసు నమోదు చేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఆ రాష్ట్ర డీజీపీకి లేఖ రాసింది. అందులో.. మంత్రి కేఎన్ నెహ్రూ నిర్వహిస్తున్న శాఖల్లో భవనాలు, మరుగుదొడ్ల నిర్మాణం, పొరుగు సేవల నియామకం, నాబార్డ్ నిధులు, పారిశుద్ధ్య పనులకు సంబంధించిన ఒప్పందం, పారిశుద్ధ్య కార్మికుల గృహ నిర్మాణ ప్రాజెక్టులకు సంబంధించిన టెండర్లు, ఒప్పందాల్లో అవకతవకలు జరిగాయని తెలిపింది. టెండర్లు, ఒప్పందాలు ముందుగానే ఎవరికి ఇవ్వాలో నిర్ణయించి, ఒక్కో టెండరుకు 7.5 శాతం నుంచి 10 శాతం వరకు కమీషన్ తీసుకున్నారని, ఈ అవినీతి రూ.1,020 కోట్ల మేర జరిగినట్లు ఆరోపించింది. కమీషన్‌గా పొందిన నగదు విదేశాలకు హవాలా ద్వారా బదిలీ అయి ఉండొచ్చని పేర్కొంటూ 259 పేజీల పత్రాలను తమిళనాడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీలకు పంపింది. ఇందుకు సంబంధించి కేసు నమోదు చేయాలని కోరింది. మంత్రి కేఎన్ నెహ్రూపై అవినీతి ఆరోపణలు చేస్తూ కేసు నమోదు చేయాలంటూ డీజీపీకి ఈడీ రాసిన రెండో లేఖ ఇది కావడం గమనార్హం. ఇదివరకు ఆయన శాఖలోని ఖాళీల భర్తీలో భారీగా అవినీతి జరిగిందని, ఒక్కో పోస్టుకు రూ.25 లక్షల నుంచి రూ.35లక్షల వరకు లంచం తీసుకున్నారని ఆరోపణలు చేసింది.

పాతికేళ్ల ప్రతీకారం.. రియల్టర్ దారుణ హత్య

● వేటకొడవళ్లతో నరికి...
తుపాకీతో కాల్చిన ఆరుగురు..

హత్యకు గురైన వెంకటరత్నం

ఈనాడు-హైదరాబాద్, జవహర్‌నగర్, న్యూస్‌టుడే: స్థిరాస్తి వ్యాపారిని ఆటోతో గుద్దించి.. కత్తులతో విచక్షణ రహితంగా నరకడంతోపాటు తుపాకీతో కాల్చి మరీ హతమార్చిన ఘటనతో హైదరాబాద్ ఉలిక్కిపడింది. సుమారు 25 ఏళ్ల క్రితం జరిగిన తన తండ్రి ఎన్‌కౌంటర్‌కు ప్రతీకారంగా.. ఆయన కుమారుడు.. స్నేహితులతో కలిసి ఈ దారుణానికి ఒడిగట్టినట్లు, అనంతరం పోలీసులకు లొంగిపోయినట్లు సమాచారం. సోమవారం తెల్లవారుజామున మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన దారుణం.

ఆటోతో ఢీకొట్టి.. కిరాతకంగా హత్య

ఏపీలోని కృష్ణా జిల్లా మైలవరానికి చెందిన గంట వెంకటరత్నం(54).. మూడు దశాబ్దాల క్రితం హైదరాబాద్ వచ్చారు. చాలా కాలంగా స్థిరాస్తి వ్యాపారం చేస్తున్నారు. ఐదేళ్లుగా జవహర్‌నగర్ రాజా పరిధి సాకేత్ కాలనీలో నివసిస్తున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు. ఎప్పటిలాగే సోమవారం ఉదయం కుమార్తెను ఆ కాలనీలోని స్కూల్ దగ్గర వదిలిపెట్టారు. ఉదయం 7.55 గంటల సమయంలో ఇంటికి తిరిగి వెళ్తుండగా.. ద్విచక్రవాహనంపై ఇద్దరు, ఆటోలో నలుగురు వెంబడించారు. తొలుత వెంకటరత్నం ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనాన్ని రాంగ్ రూట్‌లో వచ్చి ఆటోతో ఢీకొట్టారు. కిందపడిపోయిన ఆయన తేరుకునేలోపే.. వేటకొడవళ్లతో మెడ, తల, ఇతర శరీరభాగాలపై దాదాపు 25 సార్లు నరికారు. తర్వాత సమీపంలోని బండరాయి తీసుకొచ్చి తలపై మోదారు. ఇదంతా జరుగుతుండగానే.. నిందితుల్లో ఒకడు తుపాకీతో ఒక రౌండు కాల్పులు జరపడంతో అక్కడికక్కడే మృతి చెందారు. అనంతరం నిందితులు అక్కణ్నుంచి పరారైన దృశ్యాలు సమీపంలోని సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. జవహర్‌నగర్ పోలీసులు, మల్కాజిగిరి డీసీపీ శ్రీధర్ ఘటనాస్థలిని సందర్శించారు. ఘటనా స్థలంలో పడి ఉన్న తూటా, వేట కొడవలిని స్వాధీనం చేసుకున్నారు. హత్య జరిగిన తర్వాత నిందితులు సౌత్‌వెస్ట్ జోన్ డీసీపీ కార్యాలయంలో లొంగిపోయినట్లు విశ్వసనీయంగా తెలిసింది.

పాతకక్షల కారణంగానే..: పాతకక్షల కారణంగానే హత్య చేసినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. నగరంలోని రాంనగర్‌కు చెందిన చందన్‌సింగ్(33) చెప్పినట్లు సమాచారం. ఆ ప్రకారం.. చందన్‌సింగ్ తండ్రి సుదేర్‌సింగ్ రౌడీషీటర్. పాతికేళ్ల క్రితం నగరంలో దందాలు, సెటిల్మెంట్లు చేసే వాడు. అప్పట్లో వెంకటరత్నం ఆయనకు ప్రధాన అనుచరుడిగా ఉండేవాడు. సుదేర్‌సింగ్ 2001 ఏప్రిల్‌లో జరిగిన పోలీస్ ఎన్‌కౌంటర్‌లో మరణించాడు. వెంకటరత్నం పోలీస్ ఇన్‌ఫార్మర్‌గా వ్యవహరించడమే తన తండ్రి మరణానికి కారణమని భావించిన చందన్ సింగ్ పగ పెంచుకున్నాడు. ఈ క్రమంలోనే తన స్నేహితులైన వడ్డే వెంకటనారాయణ(39), కె.నరేశ్‌కుమార్(28), ఈషాన్‌శర్మ(19), ఎన్.పవన్‌కుమార్(20), నర్సింగ్(26) సాయంతో హత్యకు ప్రణాళిక రచించాడు.

రెరాపై నెలకో ఉమ్మడి జిల్లాలో అవగాహన సదస్సు

● 10న తిరుపతిలో శ్రీకారం
● ఏపీ రెరా ఛైర్మన్ శివారెడ్డి వెల్లడి

ఈనాడు, అమరావతి: రెరా చట్టంపై బిల్డర్లు, కొనుగోలుదారులకు అవగాహన కల్పించేందుకు నెలకో ఉమ్మడి జిల్లాలో సదస్సులు నిర్వహించనున్నట్లు ఏపీ రెరా ఛైర్మన్ ఎ.శివారెడ్డి తెలిపారు. ఈనెల 10న తిరుపతిలో మొదటి సదస్సు జరగనుందని ఆయన చెప్పారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని అన్ని పుర, నగరపాలక సంస్థల పరిధిలోని బిల్డర్లు, కొనుగోలుదారులు, సంబంధిత ప్రభుత్వశాఖల అధికారులను ఆహ్వానిస్తున్నామని వివరించారు. విజయవాడలోని రెరా కార్యాలయాన్ని రాజధాని అమరావతిలో కొత్తగా ప్రారంభించిన సీఆర్‌డీఏ కార్యాలయం ప్రాంగణంలోకి తరలించిన విషయం తెలిసిందే. కొత్త కార్యాలయంలో డైరెక్టర్లతో కలిసి ఛైర్మన్ శివారెడ్డి సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'ఇళ్లు, స్థలాల కొనుగోలుదారులకు రెరా చట్టం కల్పిస్తున్న హక్కులపై ఇంకా అవగాహన అవసరం. బిల్డర్లు, లేఔట్‌లు వేసే వారికి కూడా కొత్తగా ప్రారంభించే ప్రాజెక్టులకు రెరా రిజిస్ట్రేషన్ తప్పనిసరన్న విషయంపై అవగాహన కల్పించాలన్న ఉద్దేశంతో సదస్సులు నిర్వహించాలని నిర్ణయించాం' అని ఛైర్మన్ వివరించారు.

సాధ్యంకాని హామీలు ఇవ్వొద్దు..

'బిల్డర్లు ఎంత చేయగలరో ఆ మేరకే బ్రోచర్లలో ముద్రించాలి. ఎక్కువ చేస్తామని చెప్పి చేయకపోతే తర్వాత ఇబ్బందుల్లో పడతారు. సాధ్యంకాని హామీలు ఇవ్వొద్దు. ప్రాజెక్టుల పనులు గడువులోగా పూర్తి చేయాలి. కొనుగోలుదారులకు నష్టం జరిగితే ఎట్టి పరిస్థితుల్లోనూ విడిచిపెట్టేది లేదు. ప్రాజెక్టుల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి బిల్డర్లు అన్ని దస్తావేజులు పక్కాగా అప్‌లోడ్ చేస్తే ..గంట వ్యవధిలో రిజిస్ట్రేషన్లు పూర్తి చేయడానికి సిద్ధంగా ఉన్నాం' అని శివారెడ్డి అన్నారు.

ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయొచ్చు

ఇళ్లు, స్థలాల కొనుగోలుదారులు నష్టం జరిగిందని భావిస్తే... ఏపీ రెరాకు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయొచ్చు. కార్యాలయం అమరావతికి మార్చినా ఫిర్యాదుదారులకు ఎలాంటి ఇబ్బంది లేదు. బాధితులకు న్యాయం చేయడానికే ప్రయత్నిస్తాం. మహారాష్ట్ర, దిల్లీ, గుజరాత్ రాష్ట్రాల్లో రెరాలో అమలు చేస్తున్న ఉత్తమ విధానాలపై అధ్యయనం కోసం త్వరలో వెళ్లనున్నాం. వాటిలో ముఖ్యమైనవి రాష్ట్రంలోనూ అమలు చేయడానికి ప్రయత్నిస్తాం' అని శివారెడ్డి తెలిపారు. 'ఈ ఏడాది సెప్టెంబరు 17న బాధ్యతలు చేపట్టిన నుంచి ఇప్పటివరకు 270 కొత్త స్థిరాస్తి వ్యాపార ప్రాజెక్టులకు అత్యంత పారదర్శకంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేశాం. కొనుగోలుదారుల ఫిర్యాదులపై విచారణకు గురు, శుక్రవారాల్లో రెండు రోజులపాటు బెంచ్ భేటీ అవుతోంది. గతంలో వారంలో ఒక రోజే ఉండేది' అని రెరా డైరెక్టర్ దామచర్ల శ్రీనివాసరావు వివరించారు. డైరెక్టర్లు కామేశ్వరరావు, కులదీప్, జగన్నాథరావు, వెంకటరత్నంతోపాటు రెరా పట్టణ ప్రణాళిక విభాగం డైరెక్టర్ నాగసుందరి పాల్గొన్నారు.

స్క్రబ్ టైఫస్‌పై అప్రమత్తత తప్పనిసరి

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: జిల్లాలో స్క్రబ్ టైఫస్ జ్వరాల వల్ల మరణాలు సంభవించకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా అన్నారు. కలెక్టరేట్లోని వీసీ హాలు నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు అంశాలపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ స్క్రబ్ టైఫస్‌పై వైద్య ఆరోగ్యశాఖతో పంచాయతీ, రెవెన్యూ శాఖలు సమన్వయం చేసుకుంటూ ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షాకాలంలో చిగ్గర్ మైట్ (కీటకం) కుట్టడం వల్ల ఈ తరహా జ్వరాలు వస్తాయని, కొన్నేళ్లుగా ఈ జ్వరాలు నమోదవుతున్నా.. ప్రస్తుతం తీవ్ర అనారోగ్యం, మరణాలకు దారి తీస్తుందన్నారు. చిన్న నల్ల మచ్చ(దద్దురు మాదిరిగా) శరీరంపై కనిపించి, జ్వరం వస్తే.. స్క్రబ్ టైఫస్‌గా అనుమానించవచ్చన్నారు. జ్వరం వచ్చి మూడు రోజుల వరకు తగ్గకుంటే జీజీహెచ్‌కు వచ్చి రక్త పరీక్షలు చేయించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. జ్వరాలకు ఉపయోగించే మందులు ఉప ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. గ్రామాల్లో సచివాలయ ఉద్యోగుల ద్వారా విస్తృత ప్రచారం కల్పించేలా ఎంపీడీవోలు పర్యవేక్షించాలని సూచించారు. ★ జిల్లాలో గృహ నిర్మాణానికి సంబంధించి గతంలో లేఔట్లలో ఆప్షన్-3లో ఇళ్లు నిర్మించిన కాంట్రాక్టర్ల పనులను పరిశీలించి తేడా ఉంటే.. సరిచేయించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. స్పందించని కాంట్రాక్టర్లపై చర్యలకు సిఫార్సు చేయాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌వో విజయలక్ష్మి, జడ్పీ సీఈవో వి.జ్యోతిబసు, సీపీవో శేషశ్రీ, హౌసింగ్ పీడీ ప్రసాద్, డ్వామా పీడీ శంకర్ పాల్గొన్నారు.

ఊపందుకుంటున్న పత్తి కొనుగోళ్లు

ఆశాజనకంగా ధరలు.. అమ్మకాలకు ఆసక్తి చూపుతున్న రైతులు

పట్టాభిపురం(గుంటూరు), న్యూస్‌టుడే

పత్తి కొనుగోళ్లు ఊపందుకుంటున్నాయి. కొన్ని రోజులుగా వర్షాలు వెనకడాయి. పత్తి తడవక పోవడంతో సీసీఐ నిర్దేశించిన ప్రమాణాల మేరకు కాస్త అటూఇటుగా తేమ శాతం ఉంటుంది. దీంతో కొనుగోళ్లు వేగం పుంజుకుంటున్నాయి. ధరలు సైతం ఆశాజనకంగా ఉండడంతో రైతులు అమ్మకాలకు ఆసక్తి చూపుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా రూ.405 కోట్ల విలువైన 5,21,000 క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేసింది. 13,604 మంది రైతులు ఇప్పటి వరకు సీసీఐ కేంద్రాల్లో పత్తి విక్రయించారు. ఇందులో 1,44,000 క్వింటాళ్లకు రూ.170 కోట్లు వరకు రైతులకు సీసీఐ చెల్లింపులు చేసింది.

సీసీఐ కొనుగోలు చేసిన పత్తి వివరాలివీ..

జిల్లా	రైతులు	క్వింటాళ్లు	విలువ (రూ.లక్షల్లో)
గుంటూరు	1058	65,570	50.43
పల్నాడు	1392	78,778	61.23
ఎన్టీఆర్	1447	87,207	67.13

సీసీఐ కొనుగోలు చేసిన పత్తి

పత్తిని బాగా ఆరబెట్టుకుని తీసుకొస్తే మంచి ధర.. రైతులు బాగా ఆరబెట్టుకుని దుమ్ము, ధూళి లేకుండా సీసీఐ కేంద్రాలకు తీసుకొస్తే మంచి ధర పడుతుంది. నవంబరులో వర్షాలు పడడం, తేమ 12 శాతానికి మించి ఉండడం, నాణ్యమైన పత్తి లభించకపోవడంతో క్వింటా ధర రూ.అయిదారు వేల కంటే పడలేదు. ప్రస్తుతం ఆ పరిస్థితిలో మార్పు వచ్చింది. సాధ్యమైనంత వరకు రైతులు పత్తిని ఆరబెట్టుకుని తీసుకొస్తుండడంతో క్వింటాకు రూ.7000 వరకు ధర వస్తుంది. నాణ్యత, ప్రమాణాలు బాగుండటంతో పాటు తేమ 8 నుంచి 12 శాతం వరకు ఉంటే కనీస మద్దతు ధర రూ.8110 పొందవచ్చని సీసీఐ అధికారులు సూచిస్తున్నారు. గతంతో పోలిస్తే సీసీఐ పత్తి కొనుగోళ్ల వేగం పుంజుకోవడంతో పాటు చెల్లింపులు వెంటనే జరుగుతుండటంతో రైతులు అమ్మకానికి ముందుకు వస్తున్నారు. సీసీఐ కొనుగోళ్లు జరపక ముందు దళారులు, వ్యాపారులు ధరల్ని ఇష్టం వచ్చినట్లు తగ్గించేశారు. సీసీఐ రంగంలోకి దిగిన దగ్గర నుంచి పరిస్థితిలో మార్పు వచ్చింది. సీసీఐ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన దగ్గర నుంచి బహిరంగ మార్కెట్లోనూ ధర కొంత మేరకు పెరిగింది. క్వింటాకు రూ.500కు పైగానే ధర పెరిగిందని రైతులు పేర్కొంటున్నారు.

ఎన్టీఆర్ బయోసెన్సర్స్‌తో ఏఎన్‌యూ ఎంవోయూ

ఒప్పందం చేసుకుంటున్న సింహాచలం, గంగాధర్, బయోసెన్సర్స్ ప్రతినిధి సురేష్

ఏఎన్‌యూ, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ బయోసెన్సర్స్‌తో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం సోమవారం అవగాహన ఒప్పందం చేసుకుంది. ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య గంగాధర్ సమక్షంలో ఒప్పంద పత్రాలపై ఎన్టీఆర్ బయోసైన్స్ ప్రతినిధి సురేష్, రిజిస్ట్రార్ సింహాచలం సంతకాలు చేశారు. ఈ ఒప్పందంలో భాగంగా ఎన్టీఆర్ బయోసెన్సర్స్ సంస్థ విశ్వ విద్యాలయానికి ఫొటొ టైపు పరికరాల ప్రయోగశాల, పరిశోధన, నైపుణ్యాలను పరస్పరం మార్చుకోవడం, ఉమ్మడి కార్యక్రమాల నిర్వహణ, నైపుణ్యాలపై శిక్షణ తరగతులను విద్యార్థులకు అందించనున్నారు. బయో మెడికల్ ఇంజినీరింగ్, వైద్య పరికరాలు, బయోసెన్సర్లకు సంబంధించి ఉమ్మడి పరిశోధనలు, ప్రాజెక్టుల అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆచార్య గంగాధర్ తెలిపారు. ఈ ఒప్పందం మూడేళ్లు అమలులో ఉంటుందని చెప్పారు. మూడేళ్లలో విద్యార్థులకు కార్యశాలలు, ఇంటర్న్‌షిప్‌లు, విద్యార్థులకు అవసరమైన పరిశ్రమ ఆధారిత శిక్షణ కార్యక్రమాలను నిర్వహించనుందని వీసీ గంగాధర్ వెల్లడించారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య శివరామ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ నూతన కార్యవర్గం ఎన్నిక

వేదికపై నూతన జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాజీ, శ్యాంబాబు తదితరులు

గుంటూరు విద్య, న్యూస్‌టుడే: ఎస్టీయూ నూతన జిల్లా అధ్యక్షుడిగా షేక్ బాజీ, ప్రధాన కార్యదర్శిగా వై.శ్యాంబాబు ఎన్నికయ్యారు. స్థానిక రెవెన్యూ కల్యాణ మండపంలో 79వ వార్షిక కౌన్సిల్ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు డి.పెదబాబు అధ్యక్షతన 'ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ- సమాజం బాధ్యత' అంశంపై విద్యాసదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్త కార్యవర్గాన్ని ప్రకటించారు. ఆర్థిక కార్యదర్శిగా బి.హనుమంతప్రసాద్, గౌరవాధ్యక్షుడిగా ఏవీ ప్రసాద్‌బాబు, రాష్ట్ర కౌన్సిలర్లుగా డి.పెద్దబాబు, ఎస్.రామచంద్రయ్య, డీకే సుబ్బారెడ్డి, వి.ప్రసాదరావు, కె.జోజప్ప, జి.దేవరాజు, మల్లికార్జునరావు, జోసఫ్ తదితరులు ఎన్నికయ్యారు. వీరిని కార్యక్రమంలో ఏఐఎస్టీఎఫ్ జాతీయ ఆర్థిక కార్యదర్శి సీహెచ్ జోసఫ్ సుధీర్‌బాబు, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు తదితరులు ప్రత్యేకంగా అభినందించారు.

అమృత ఆరోగ్య కార్డులతో నగదు రహిత సేవలు

బాలికకు ఆరోగ్య కార్డు అందజేస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

జిల్లాపరిషత్తు (గుంటూరు), న్యూస్‌టుడే: ప్రభుత్వ గుర్తింపు పొందిన అనాథాశ్రమాల్లోని బాలల సంక్షేమం కోసం ఎన్టీఆర్ వైద్య సేవ, అమృత ఆరోగ్య పథకాన్ని అమలు చేస్తున్నట్లు కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో అమృత హెల్త్ కార్డులను సోమవారం 39 మందికి కలెక్టర్ అందజేసి మాట్లాడారు. ఎన్టీఆర్ వైద్య సేవ గుర్తింపు పొందిన నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో పూర్తిగా నగదు రహిత వైద్యం అందజేస్తారన్నారు. అనాథాశ్రమాల్లోని పిల్లలకు ఉచితంగా అధునాతన వైద్యం అందజేయడం ఈ పథకం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. అనాథ పిల్లల ఆరోగ్య రక్షణ కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న మంచి పథకాల్లో అమృత్ ఆరోగ్య పథకం ఒకటని వివరించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో కె.విజయలక్ష్మి, ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా సమన్వయకర్త విజయ్, విద్యార్థినులు, అనాథ ఆశ్రమాల నిర్వాహకులు పాల్గొన్నారు.

మిర్చి యార్డు సమాచారం (నిన్నటి ధరలు)



వచ్చిన బస్తాలు:	40,522
అమ్మకాలు:	37,706
నిల్వలు:	9,325

నాన్ ఏసీ కామన్ వెరైటీ (క్వింటా రూ.ల్లో)

334	10,000-17,000
నంబర్ 5	11,500-15,500
341	10,500-16,500
సూపర్ 10	11,500-16,000

నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ

తేజ	10,000-15,600
బాడిగ	10,500-16,700
దేవనూరు డీలక్స్	11,000-16,300
ఆర్మూర్	10,500-13,000

ఏసీ కామన్ వెరైటీ

334	10,500-16,800
నంబర్ 5	11,000-15,300
341	12,000-16,500
4884	12,000-14,200

ఏసీ స్పెషల్ వెరైటీ

తేజ	11,000-14,800
బాడిగ	11,000-17,000
దేవనూరు డీలక్స్	10,500-16,000
తాలు	5,200-7,600

- న్యూస్‌టుడే, మిర్చియార్డు

91.9FM Vijayawada

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 80080 03297

గ్రామ కంఠాల సమస్యలు పరిష్కరిస్తాం

రైతులతో మాట్లాడుతున్న భార్గవతేజ, భాగ్యరేఖ

తుళ్లూరు, న్యూస్‌టుడే: సీఆర్డీఏ నిబంధనల మేరకు రాజధాని గ్రామాల్లో గ్రామకంఠాల సమస్యలను పరిష్కరిస్తామని సీఆర్డీఏ అదనపు కమిషనర్ ఏ.భార్గవ తేజ తెలిపారు. సోమవారం రాజధాని గ్రామం నేలపాడు గ్రామాన్ని సీఆర్డీఏ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.ఎస్.భాగ్యరేఖ, సిబ్బందితో కలసి ఆయన సందర్శించారు. స్థానికంగా ఉన్న గ్రామ కంఠాల పరిస్థితిని ప్రత్యక్షంగా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. 9.2 ద్వారా మినహాయింపులు, గ్రామ భౌగోళిక పరిస్థితులు, భూ సరిహద్దులు, గ్రామ పరిధి సంబంధిత అంశాలను అధికారులు, గ్రామ పెద్దలతో చర్చించి సవివరంగా తెలుసుకున్నారు. గ్రామ కంఠాల సమస్యలను పరిష్కరించటానికి ప్రభుత్వం నియమించిన కమిటీ సూచనల మేరకు తగిన చర్యలు తీసుకుంటామని అదనపు కమిషనర్ స్పష్టం చేశారు. గ్రామ కంఠాలకు సంబంధించిన వివరాలు, సరిహద్దుల వివరణ, పెండింగ్‌లో ఉన్న పలు ఇతర అంశాలను గ్రామ పెద్దలు, రైతులు ఆయనకు వివరించారు.

ఇద్దరు పసికందుల మెదడులో ట్యూమర్ తొలగింపు

కిమ్స్ శిఖరలో అరుదైన శస్త్రచికిత్సలు

శస్త్రచికిత్సల అనంతరం చిన్నారులతో వైద్య బృందం

నగరపాలక సంస్థ (గుంటూరు), న్యూస్‌టుడే: తల్లి గర్భంలోనే బ్రెయిన్ ట్యూమర్‌తో ఉన్న ఇద్దరు పసికందులకు వారు పుట్టిన పది రోజుల అనంతరం అరుదైన శస్త్రచికిత్సలు చేసినట్లు గుంటూరు కిమ్స్ శిఖర హాస్పిటల్స్ వైద్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వారం రోజుల వ్యవధిలో ఇద్దరు చిన్నారులకు వీటిని నిర్వహించినట్లు వివరించారు. ఆసుపత్రి వర్గాల సమాచారం ప్రకారం.. చిన్నారుల మెదడులో 5×5 సెం.మీ. కోడిగుడ్డు సైజులో బ్రెయిన్ ట్యూమర్స్ ఉన్నట్టు ప్రసవం అనంతరం గుర్తించారు. తల్లిదండ్రులు ఎన్ని ఆసుపత్రులు తిరిగినా ఎవరూ ఆపరేషన్ చేసేందుకు ముందుకు రాకపోవడంతో చివరకు కిమ్స్ శిఖర హాస్పిటల్స్ న్యూరోసర్జన్ డాక్టర్ చిట్టెం లక్ష్మణ్‌రావును సంప్రదించారు. కిమ్స్ శిఖర కడిల్స్‌కు చెందిన వైద్యుల బృందం సాహితి చందర్లపాటి, పవన్ సత్యం, బాలకృష్ణా రెడ్డి పల్నాటి, రూపేష్, ప్రత్యూషతో పాటు.. అనస్థీషియా వైద్యులు పసికందులను పూర్తిగా పరీక్షించారు. న్యూరోసర్జన్ డాక్టర్ చిట్టెం లక్ష్మణ్‌రావు, అనస్థీషియా వైద్యులు కల్యాణ్‌రామ్ అత్యాధునిక పరిజ్ఞానం, వైద్య పరికరాలతో బ్రెయిన్ ట్యూమర్స్‌ను పూర్తిగా తొలగించారు. సుమారు 3 గంటల పాటు శ్రమించి శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. వారం రోజుల వ్యవధిలో ఇద్దరు పిల్లలకు బ్రెయిన్ ట్యూమర్‌లను తొలగించామని.. వారు పూర్తి ఆరోగ్యంగా ఉన్నారని వైద్యులు ప్రకటించారు. కోటి మందిలో ఒకరికి మాత్రమే ఇలా రావచ్చని, అది పూర్తిగా క్యూర్ చేసినట్లు వివరించారు. గర్భిణీ స్త్రీలు మొబైల్ ఫోన్‌లు, ల్యాప్‌ట్యాప్‌లు చూడటం, రేడియేషన్‌కు గురికావడం వల్ల వచ్చిందా.. అనేది పరిశోధనల్లో తేలాల్సి ఉందని పేర్కొన్నారు.

కార్మిక, కర్షకులంతా ఐక్యంగా పోరాడాలి

ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర మహాసభ



మాట్లాడుతున్న డాక్టర్ రాజమోహన్

గుంటూరు నగరం, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక, రైతాంగానికి వ్యతిరేకంగా చేసిన చట్టాల రద్దు కోసం ఐక్యంగా పోరాటం సాగించాలని ఆహ్వాన సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొల్లా రాజమోహన్ పిలుపునిచ్చారు. ఏఐఎఫ్‌టీయూ(న్యూ) రాష్ట్ర మహాసభల సందర్భంగా సోమవారం నగరంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. వెంకటేశ్వర విజ్ఞాన మందిరం నుంచి ప్రారంభమైన ప్రదర్శన జిన్నాటవర్, కొత్తపేట, నాజ్‌సెంటర్‌ల మీదుగా విజ్ఞానమందిరానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో డాక్టర్ రాజమోహన్ మాట్లాడుతూ ప్రభుత్వాలు పెత్తందారులకు కొమ్ముకాస్తూ కార్మికులు, రైతులకు అన్యాయం చేస్తున్నాయని ఆరోపించారు. ఏఎఫ్‌టీయూ జాతీయ అధ్యక్షుడు విజయ్‌కుమార్ మాట్లాడుతూ సామ్రాజ్యవాదులు, కార్పొరేట్ సంస్థలకు అడవులను అప్పగించడమే కాకుండా ఆపరేషన్ కగార్ పేరిట ఉద్యమకారులను, గిరిజనులను ప్రభుత్వాలు పొట్టన పెట్టుకుంటున్నాయని ఆరోపించారు. జాతీయ నాయకులు పీకే సాహి, రైతుకూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఝాన్సీ, రాష్ట్ర కార్యదర్శి కిషోర్‌బాబు, కోశాధికారి స్వామి, హనుమంతరావు, లలితకుమారి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

పీజీవాలా చాయ్.. హుషారెత్తించేనోయ్..

ఓ చిన్న ఆలోచన జీవితాన్ని మార్చేస్తుంది. విజయవాడ తిరిదే కల్యాణ మండపం రోడ్డులో నవంబరు 25న పీజీవాలా చాయ్‌తో పాటుగా క్రీం, చాక్లెట్ మస్కాబన్ల అమ్మకం ప్రారంభించారు తాండ్ర స్పందన. ఉదయం, సాయంత్రం 6 నుంచి 8.30 వరకూ అమ్ముతున్నారు. రెండు పీజీలు (ఎంఏ, ఎంఈడీ) చేసినా చదువుకు తగ్గ ఉద్యోగం రాలేదనుకుంటూ ఆమె సమయం వృథా చేసుకోలేదు. కుటుంబ పరిస్థితులు, పిల్లల పెంపకం కారణంగా బయటకు వెళ్లి ఉద్యోగం చేసే పరిస్థితి లేక.. కష్టపడే ఇష్టంతో చేసే చిన్న పనైనా చాలు మనకు అన్నం పెడుతుందని ఆమె చెబుతున్నారు. పదేళ్లు టైలరింగ్ పని చేసి పిల్లలను చదివించారు. బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్న కొడుకు గత ఆగస్టులో భీమవరం దగ్గర పేరుపాలెం బీచ్‌లో సముద్ర కెరటాల్లో చిక్కుకుని మృతి చెందాడు. ఆ విషాదం నుంచి బయటకు వచ్చి, పాలిటెక్నిక్ మొదటి సంవత్సరం చదువుతున్న పాపను బాగా చూసుకోవాలని, ఇందుకోసం కొత్తగా ఏదైనా వ్యాపారం చేయాలని ఇలా చాయ్-మస్కాబన్ ఎంచుకున్నానని స్పందన తెలిపారు. రెండు వారాల్లోనే ప్రజల ఆదరణ పెరిగిందని చెప్పారు. కుమారుడు చనిపోయినా అతని స్నేహితులు అండగా నిలబడ్డారని గుర్తు చేసుకున్నారు. - ఈనాడు, అమరావతి

ఇదిగో సౌకర్యం.. వాడితే సౌలభ్యం

రైలు ప్రయాణికులకు మెరుగైన సౌకర్యం కల్పించేందుకు రైల్వే శాఖ సేవలను విస్తృతం చేస్తోంది. దివ్యాంగులు, వృద్ధులు, గర్భిణులు, అనారోగ్యంతో ఉన్న ప్రయాణికుల కోసం విజయవాడ రైల్వేస్టేషన్‌లో వీల్‌చైర్ అందుబాటులో ఉంది. ఈ సేవలు ఉన్నట్టు చాలా మందికి తెలియక ఇబ్బందులు పడుతున్నారు. రైలు దిగి బయటకు వెళ్లడానికి లేదా బయట నుంచి రైలు వద్దకు వెళ్లేందుకు ఈ సౌకర్యం అందుబాటులో ఉంది. విజయవాడ రైల్వేస్టేషన్ ప్రధాన ముఖ ద్వారంతో పాటు పార్సిల్ కార్యాలయం, తారాపేట, బుకింగ్ ప్రాంతాల్లో.. ఈ సేవలు 24గంటలు అందిస్తారు. రైలు విజయవాడకు చేరుకునే లోపు ప్రయాణికులు ఫోన్ చేసి రైలు నంబరు, పేరు, బోగీ, బెర్తు నంబరు చెబితే.. మీరు స్టేషన్‌కు చేరుకునేలోపు పోర్టర్లు వీల్‌చైర్‌తో సిద్ధంగా ఉంటారు. అలాగే బయటి నుంచి వచ్చే వారి కోసం విజయవాడ రైల్వేస్టేషన్‌లోని అన్ని ప్రవేశ మార్గాల్లో ఫోన్ నంబర్లతో కూడిన బోర్డులు ఏర్పాటు చేశారు. ఫోన్ చేస్తే.. పోర్టర్ మొదటి ప్లాట్‌ఫాంకు వస్తారు. దీనికి రూ.165 మాత్రమే వసూలు చేస్తారు. ఎవరైనా అధికంగా వసూలు చేస్తే.. విజయవాడ స్టేషన్ డైరెక్టర్‌కు ఫిర్యాదు చేయవచ్చు. ఫోన్ నంబరు 0866-2767225, 96037 28325, 99481 88678. - న్యూస్‌టుడే, విజయవాడ(గాంధీనగర్)

బందరు తాజ్‌మహల్

మచిలీపట్నంలోని ఇంగ్లీషు చర్చి

అరబెల్లా సమాధి

ఆగ్రాలోని తాజ్‌మహల్ ప్రేమకు చిహ్నమని అందరికీ తెలిసిందే. అంతటి కట్టడం కాదు కానీ ఎప్పుడో శతాబ్దాల నాటి ప్రేమకు చిహ్నం మచిలీపట్నంలోనూ ఉంది. దానిని బందరు తాజ్‌మహల్ అంటారు. 18వ శతాబ్దంలో ఇంగ్లండ్ నుంచి వచ్చిన సైనికాధికారి కెప్టెన్ రాబిన్‌సన్, ఆయన భార్య హారియట్, కుమార్తె అరబెల్లా బందరులో ఉండేవారు. అప్పట్లో సైనిక కేంద్రానికి మేజర్‌గా ఉండే జనరల్ పాటర్, అరబెల్లా సౌందర్యానికి ఆకర్షితుడై ప్రేమిస్తున్నట్టు చెప్పడంతో ఆమె అంగీకరించింది. కానీ వారి వివాహానికి అరబెల్లా తండ్రి, క్రైస్తవ మతాధిపతులు అంగీకరించలేదు. దీంతో వారిద్దరూ సహజీవనం ద్వారా తమ ప్రేమను పదిలపర్చుకున్నారు. అదే సమయంలో ఆంగ్ల సిపాయిల మధ్య అంతర్గత గొడవలు తీవ్రమవడంతో బ్రిటిష్‌రాజు సైనిక అధికారుల పదోన్నతులు నిలిపివేశారు. రాబిన్‌సన్ పదవి కోల్పోవాల్సి వచ్చింది. తాను పదవి కోల్పోవడానికి పాటర్ కారణమని భావించి తన కూతురు అరబెల్లా పాటర్‌ను కలవకుండా కట్టుదిట్టం చేశారు. పాటర్‌ను కలవలేక బాధతో అనారోగ్యానికి గురైన అరబెల్లా మంచం పట్టింది. ఆమె 1809 నవంబరు 6న తన ప్రియుడు పాటర్ చేతుల్లోనే తుదిశ్వాస విడిచింది.

నాటి ప్రేమకు చిహ్నం: పెళ్లి కాకముందే కాపురం చేశారన్న నెపంతో మతపెద్దలు అరబెల్లా మృతదేహాన్ని బందరుకోట ఆంగ్ల శ్మశానవాటికలో ఖననం చేయడానికి అంగీకరించలేదు. పాటర్ తన ప్రియురాలిని వివాహానికి సిద్ధం చేసుకున్న పెళ్లిగౌను, ఉంగరాలు ఆమె పార్థివదేహానికి తొడిగి శరీరం కుళ్లిపోకుండా రసాయనాలు పూసి గాజు పేటికలో భద్రపరిచారు. మాచవరంలో 15 ఎకరాలు కొని అక్కడే పాతిపెట్టారు. తన ప్రేయసి మృతదేహాన్ని తరచూ చూసుకునేలా ఏర్పాట్లు చేశారు. ఆ తరవాత సమాధి మీద 1814లో చర్చి నిర్మించి 1818లో బ్రిటిష్ ప్రభుత్వానికి అప్పగించారు. పాటర్ మద్రాసు బదిలీ అయ్యాక అక్కడే చనిపోయారు. ప్రస్తుత ఇంగ్లీషు చర్చి ఆవరణలోని సమాధి వారి ప్రేమను నేటి తరానికి చాటిచెబుతోంది. - మచిలీపట్నం కార్పొరేషన్

ఉడతా ఉడతా ఊచ్.. ఉరకలు వేసిందోచ్..

గాల్లో తేలినట్టుందే.. అంటూ ఈ చిట్టి ఉడతల సందడి చూస్తే ముచ్చటేస్తోంది కదూ.. ఆహార వేటలో గుంపులుగా ఉండి ఒకదానితో మరొకటి తరుముకుంటూ చకచకా గెంతులు వేస్తూ ఉడతలు సందడి చేశాయి. విజయవాడ ప్రభుత్వ అతిథి గృహం ఆవరణలో రెండు ముగ్గిపులి చెట్టు రెమ్మల్లో నుంచి ఒకదాని వెంట ఒకటి గెంతులు వేస్తూ 'ఈనాడు' కెమెరాకు చిక్కాయి. -ఈనాడు, అమరావతి

వరి తోరణం.. విరిసిన ఆనందం

వరికంకులతో తయారు చేసిన అందమైన తోరణాలు ఇంటి గుమ్మాలకు, వరండాల్లో కట్టుకుంటే ఆకలిగా ఉన్న పక్షులు తిండి గింజలు అవసరమైనప్పుడు వచ్చి తినడానికి వీలుగా తయారు చేశారు. చూడముచ్చటగా ఉన్న వీటిని రోజ్ సొసైటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రదర్శనలో అమ్మకానికి ఉంచారు. ఈ వరికంకుల తోరణాలు సైజును బట్టి రూ.300 నుంచి రూ.450 వరకు విక్రయించారు. -ఈనాడు, అమరావతి

అనాథనయ్యాను ఆదుకోండి..

94 ఏళ్ల వయసులో కలెక్టర్‌కి తన సమస్య చెప్పుకోవడానికి వచ్చిన ఈ వృద్ధురాలి పేరు జాలాది లక్ష్మీకాంతం. విజయవాడ గ్రామీణ మండలం నిడమానూరు వాసి. కట్టుకున్న భర్త, కన్న కొడుకు చనిపోవడంతో ఒంటరిగా మిగిలింది. ప్రభుత్వ పింఛను డబ్బులతోనే జీవనం సాగిస్తోంది. కొడుకు చనిపోవడంతో కోడలు ఆధీనంలో ఉన్న తన ఇంటిలో తనకు రావాల్సిన వాటా ఇప్పించాల్సిందిగా కోరుతూ ఈ ఏడాది జూన్‌లో కలెక్టర్‌కి దరఖాస్తు చేసుకున్నారు. సమస్య పరిష్కారం కాకపోవడంతో సోమవారం మరోసారి కలెక్టర్ కార్యాలయానికి వచ్చి ఆరా తీశారు. - ఈనాడు, అమరావతి

క్రిస్మస్ కొవ్వొత్తులు.. వెదజల్లే సువాసనలు..

క్రిస్మస్ సమీపిస్తుండడంతో వివిధ రకాల పర్యావరణ హితమైన క్యాండిల్స్ అందుబాటులోకి వస్తున్నాయి. విజయవాడ ఆటోనగర్ బస్టాండు ఎదురుగా ఉన్న ఓ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన థీమెటిక్ ఎగ్జిబిషన్‌లో సోయాబీన్స్ నుంచి వచ్చే ఓ పదార్థంతో తయారైన క్రిస్మస్ కొవ్వొత్తులు ప్రత్యేకంగా ఆకర్షిస్తున్నాయి. వీటిని వివిధ రకాల ఫ్లేవర్స్‌తో తయారు చేశారు. వెలిగిస్తే సువాసనలు వెదజల్లుతున్నాయి. - ఈనాడు, అమరావతి

ప్రమాదకరమైనా.. అరికట్టలేరా?!

ఈనాడు డిజిటల్- మచిలీపట్నం- న్యూస్‌టుడే, తోట్లవల్లూరు

నేనండీ... మీ విజయవాడ- అవనిగడ్డ కరకట్ట దారిని.. దయచేసి నా విన్నపం ఆలకించరూ..

విజయవాడ నుంచి అవనిగడ్డ వెళ్లాలంటే నేనే దగ్గర దారినండి. ఏళ్లుగా గుంతలు పడి.. ఎక్కడికక్కడ కుంగినా.. నాకు మరమ్మతులైనా చేయలేదు. నాపై బస్సులు మినహా పెద్ద వాహనాలకు అనుమతిలేదు. గత వైకాపా జమానా నుంచి భారీ ఇసుక టిప్పర్లు తిప్పేస్తున్నారు. ఆ బరువు మోయడం నా వల్ల కాదని తెలిసినా పట్టించుకోవట్లేదు. జనం నన్ను నిందించకుండా కూటమి ప్రభుత్వంలో అయినా బాగు చేస్తారేమోనని ఆశపడితే.. కొందరు పాలకులు, అధికారులు నాటి దందానే సాగిస్తూ వేదన మిగులుస్తున్నారు.

అప్పారావుపేట వద్ద దెబ్బతిన్న రోడ్డు

చితికిపోతున్నా.. చిన్నచూపేల?

యనమలకుదురు నుంచి పులిగడ్డ వరకు 90 శాతం దెబ్బతిన్నా. చాలా చోట్ల భారీ గుంతలు పడగా.. ఇంకొన్నిచోట్ల ఎక్కడికక్కడ కుంగి ఎగుడుదిగుడుగా మారాను. 20 టన్నుల టిప్పర్లు... 40-50 టన్నుల ఇసుకతో 50 కి.మీ. వేగంతో దూసుకెళ్తున్నాయి. అంతటా ఇసుక జారి ప్రమాదకరంగా ఉంది. ద్విచక్ర వాహనదారులు నిత్యం అదుపు తప్పి గాయాలపాలై నన్ను తిడుతున్నారు.

చక్కదిద్దింది... బాబేనండి

యనమలకుదురు- నుంచి పులిగడ్డ వరకు 60 కి.మీ. కరకట్ట రోడ్డు నేను. 1998 కృష్ణా వరదలకు బాగా బలహీనపడగా అప్పటి సీఎం చంద్రబాబు రూ.15 కోట్లతో నన్ను బాగు చేసి.. రూ.10 కోట్లతో 2002లో తారురోడ్డుగా మార్పించారు. ★ 2009లో వరదలు రాగా రూ.138 కోట్లతో రెండు వరుసల దారేశారు. ★ 2017 నుంచి బస్సులను అనుమతించారు.

చల్లపల్లి: నడకుదురు-రాముడుపాలెం వద్ద ఒకవైపు కుంగిన రహదారి

అడుగడుగునా గాయాలే..!

రామలింగేశ్వరుడి సన్నిధి నుంచి పెదపులిపాక, చోడవరం, మద్దూరు, రొయ్యూరు, వల్లూరుపాలెం, భద్రిరాజుపాలెం, చాగంటిపాడు, కళ్లంవారిపాలెం, దేవరపల్లి, గుర్విందపల్లి, ఐలూరు, అప్పారావుపేట, లంకపల్లి, శ్రీకాకుళం, వెలువోలు, నడకుదురు, కొత్తపాలెంలో విపరీతంగా దెబ్బతిన్నా. ★ నేను

ప్రాణాలు పోతున్నాయ్..!

ఇటీవల అవనిగడ్డ నుంచి విజయవాడ వెళ్తున్న బస్సు తోట్లవలూరు వద్ద గుంతల ధాటికి పొలాల్లోకి దూసుకెళ్లింది. బస్సులో 37 మంది ఉన్నారు. డ్రైవర్ అప్రమత్తతతో పెద్ద ముప్పు తప్పింది. ★ పాపవినాశనం వద్ద గుంతల తీవ్రతకు లారీ బోల్తా పడి డ్రైవర్ బలయ్యాడు.

పూర్తిగా దెబ్బతింటే కట్ట కింద గ్రామాలన్నీ కొట్టుకుపోతాయి. అవనిగడ్డ, కోడూరు, నాగాయలంక మండలాలకు విజయవాడ నుంచి బందరు మీదుగా 120 కి.మీలు తిరిగి రావాల్సిందే.

★ కొత్త లేయర్ నిర్మాణానికి రూ.139 కోట్ల అంచనాతో సర్కారుకు ప్రతిపాదనలు పంపామనీ.. ఇసుక టిప్పర్లు తిరగకుండా చర్యలు తీసుకుంటామని నీటి పారుదల శాఖ ఈఈ రవికిరణ్ చెబుతున్నారు.. ఇవి నెరవేరతాయని కాసింత ఆశతో ఉన్నా.

నిత్యమై.. సత్యమై..!

పెదకళ్లేపల్లిలో స్వయంభుగా వెలసిన శ్రీదుర్గాపార్వతి సహిత నాగేశ్వరస్వామి ఆలయంలో సత్యానికి ప్రతీకగా నిలిచే స్తంభం ఉంది. దీనికి మూడు పేర్లున్నాయి. అవి.. సత్యస్తంభం, కర్కోటక (నవ నాగులలో ఒకటైనది)స్తంభం, ధర్మ స్తంభం. భక్తులు తొలుత ఈ స్తంభానికి మొక్కి 'నా చేత, నా నోటి వెంట సత్యాన్ని పలికించు..' అని మొక్కుకుని అనంతరం స్వామి, అమ్మవార్లను కొలుస్తారు.

అగస్త్య మహర్షి ద్వారా ఈ దేవాలయం వెలుగులోకి వచ్చిందని పురాణ విశ్లేషణ. ఈ దేవాలయం 15వ శతాబ్దిలో రాజుల పాలనలో ఉండేది. గ్రామాల్లో తగాదాలు ఆస్తి, కుటుంబ కలహాలు వస్తే ఇరు పక్షాలనూ విచారించి రాజు చెప్పినదే తుది తీర్పు. ఒకసారి అన్నదమ్ముల మధ్య ఆస్తి తగాదా.. రాజుగారి వద్దకు వచ్చింది. ఇద్దరినీ ఆలయంలో ఈ స్తంభం వద్ద నిల్చోబెట్టి విచారించారు. ఇద్దరిలో ఒకరిదే ఆస్తి, కానీ రెండో వాడు కూడా తనకు సంపద వస్తుందనే ఆశతో ఉన్నాడు. 'అబద్ధమే కదా ఆడేది.. కొంపలు మునిగిపోతాయా?' అనే ధోరణితో వ్యవహరించాడు. రాజు గారి ముందు అబద్ధమాడితే ఏమవుతుందిలే అనుకున్నాడు. స్తంభం దగ్గర నిలబడిన అన్నదమ్ముల్ని రాజు గారు అదేశిస్తూ.. 'ఈ ఆస్తి నాది' అనమన్నాడు. అదే మాట ఇద్దరి నోటి వెంట ఒకేసారి వెలువడింది. అబద్ధం ఆడిన వ్యక్తి శిరస్సుపై స్తంభం మూడు ముక్కలుగా విరిగి పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఒక భాగం మాత్రం ఇప్పటికీ దేవాలయ ప్రాంగణంలో విశేష పూజలందుకుంటోంది. పడిపోయిన మూడు భాగాలను ఆలయంలో ఉన్న భోగ మండప నిర్మాణ సమయంలో అమర్చారు. ఇప్పటికీ అవి సజీవతను భక్తులకు తెలియచేస్తున్నాయి.

– పెదకళ్లేపల్లి(మోపిదేవి), న్యూస్‌టుడే

పీజీ మెడికల్ ఆల్ ఇండియా కోటా సీట్లకు ఫ్రీ ఎగ్జిట్

ఈనాడు కథనానికి స్పందన

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం: దేశంలోని కొన్ని రాష్ట్రాల అభ్యర్థనలను పరిగణనలోకి తీసుకున్న మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ పీజీ మెడికల్ ప్రవేశాలకు ఫ్రీ ఎగ్జిట్ ఆప్షన్ ఇచ్చింది. ఆల్ ఇండియా కోటా సీట్లు పొందిన అభ్యర్థులు ఆయా సొంత రాష్ట్రాల్లోనూ సీట్లు సాధించి డోలాయమానంలో కొట్టుమిట్టాడుతున్నారని సోమవారం 'ఈనాడు' ప్రధాన సంచికలో ప్రచురితమైన కథనానికి స్పందన వచ్చింది. మొదటి విడత ఆల్ ఇండియా కోటాలో సీట్లు పొందిన అభ్యర్థులు ఇతర రాష్ట్రాలకు వెళ్లాలంటే సోమవారం సాయంత్రం 4 గంటల నుంచి 10వ తేదీ సాయంత్రం 6 గంటల్లోగా ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవచ్చని ఎంసీసీ పేర్కొంది. అలా వదిలేసిన సీట్లను రెండో విడత ఆల్ ఇండియా కోటాకు మళ్లించబడతాయని తెలిపింది. ఆంధ్రప్రదేశ్‌కు వచ్చేసరికి పీజీ మెడికల్ మొదటి విడత కౌన్సెలింగ్ గడువు 10వ తేదీతో ముగియనుండగా.. ఈ గడువును మరో రెండు రోజులు అదనంగా పొడిగించాలని చూస్తున్నామని విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి తెలిపారు.

హుండీ ఆదాయం రూ.5.22 కోట్లు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : దుర్గగుడి హుండీల్లో కానుకలను మల్లికార్జున మహా మండపం ఆరో అంతస్తులో సోమవారం లెక్కించారు. 26 రోజుల్లో రూ.5,22,18,647 వచ్చింది. కానుకలతో పాటు 415 గ్రాముల బంగారం, 7.465 కిలోల వెండి వస్తువులు వేశారు. విదేశీ కరెన్సీ 489 యుఎస్‌ఏ డాలర్లు, 109 సింగపూర్ డాలర్లు, 125 కెనడా డాలర్లు, 860 యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దిర్హామ్స్, 125 సౌది రియాల్స్ కానుకలుగా హుండీల్లో వేసినట్లు దేవస్థానం ఈవో శీనానాయక్ తెలిపారు. లెక్కింపును ఈవోతో కలిసి పాలకమండలి ఛైర్మన్ రాధాకృష్ణ పర్యవేక్షించారు.

కష్టం.. కోలుకోలేనంత!

వరి కోత యంత్రాల నిర్వాహకుల దోపిడీ

ఈనాడు, అమరావతి

వరికోత యంత్రాల నిర్వాహకుల దోపిడీ అన్నదాతకు గుండెకోత మిగులుస్తోంది. పెరిగిన పెట్టుబడి భారంతో నలిగిపోతున్న రైతన్నను ఈ పరిణామం గోరుచుట్టుపై రోకటి పోటులా వేధిస్తోంది. దిత్వా తుపాను, కోతల ఎద్దడిని ఆసరాగా తీసుకుని రేటు భారీగా పెంచి వరి రైతుల వెన్ను విరుస్తున్నారు. ధరలు క్రమబద్ధీకరించే వ్యవస్థ లేకపోవడంతో నష్టపోతున్నారు.

తిరువూరులో యంత్రంతో వరి కోతలు

ఎద్దడిని బూచిగా చూపి...

✪ ఉమ్మడి జిల్లాలో 4.74 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. ఇప్పటికే 60 శాతం వరకు కోతలు పూర్తయ్యాయి. ✪ దిత్వా తుపాను నేపథ్యంలో ఆగిన కోతలు ఒకేసారి ఊపందుకోవడంతో డిమాండ్‌ను కోత యంత్రాల నిర్వాహకులు సొమ్ము చేసుకుంటున్నారు. ✪ నిరుడు కోత యంత్రానికి గంటకు రూ.3 వేలు తీసుకున్నారు. ఈసారి రూ.3,500 పెంచారు. తుపానుకు ముందు డిమాండ్ పెరగడంతో గంటకు రూ.4,500 వసూలు చేశారు. ✪ తుపాను తర్వాత అందరూ కోతలు మొదలుపెట్టగా ఎద్దడిని బూచిగా చూపి రూ.3,700-4,000 వసూలు చేస్తున్నారు.

నేల వాలితే అంతే...

✪ ఉమ్మడి జిల్లాలో దాదాపు 2 లక్షల ఎకరాల్లో పంట నేల వాలినట్లు అంచనా. సాధారణంగా నిలబడి ఉన్న పంట కోయాలంటే గంటన్నర పడుతుంది. గంటకు రూ.3,500 చొప్పున ఎకరాకు రూ.5,250 అవుతుంది. అదే నేలవాలిన పంట కోయాలంటే 3 గంటలు పడుతుంది. ✪ నేలవాలిన పంట కోసే సమయంలో ఎకరానికి 3 బస్తాలకు పైగా ధాన్యం రాలిపోతోంది. దీంతోపాటు మట్టి ఇతర చెట్ల గింజలు ధాన్యంలో కలిసిపోతున్నాయి.

తిరుపూరు రైతు అన్నాబత్తుల కుమారస్వామి మూడెకరాల్లో కౌలు సాగు చేస్తున్నారు. పైరు బాగా పెరిగిందని తుపాను గాలులకు పడిపోతుందని కోత కోయిస్తే గంటకు రూ.4,500 వసూలు చేశారు. ఎకరానికి గంటన్నర పట్టగా రూ.6,750 చొప్పున మూడెకరాలకు రూ.20,250 ఖర్చయింది.

కంకిపాడు మండలం ఈడా బాలస్వామి 10 ఎకరాల్లో కౌలు సాగు చేస్తున్నారు. ఆరెకరాలు నేల వాలింది. యంత్రంతో కోయిస్తే 18 గంటలు పట్టగా... (రూ.3500 చొప్పున) రూ.63 వేల ఖర్చు అయింది.

10 శాతం అదనపు భారం..

✪ ఇదే అదనుగా కూలీలూ కొండెక్కి కూర్చున్నారు. ఎకరం కోత కోసి, కుప్ప వేసి, ధాన్యం తీస్తే రూ.15-18 వేలు వసూలు చేస్తున్నారు. ఇలాంటి రైతులు ప్రతి గ్రామంలో పదుల్లో ఉన్నారు. ఈ బాదుడుతో 10 శాతం అదనపు పెట్టుబడి భారం పడుతోంది.

టెట్ సజావుగా నిర్వహించండి: కలెక్టర్

భాస్కరపురం (మచిలీపట్నం), న్యూస్‌టుడే: ఏపీ టెట్ పరీక్షలను సజావుగా, ఎటువంటి ఆటంకం లేకుండా నిర్వహించేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ డి.కె.బాలాజీ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఛాంబర్ నుంచి సంబంధిత అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షా సమయంలో అంతర్జాలం, విద్యుత్తు సౌకర్యం ఉండే విధంగా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్పీ కె.విద్యాసాగర్‌నాయుడు, డీఈవో పీవీజే రామారావు, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ యుగంధర్, జిల్లా ప్రజారవాణా అధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ★ జిల్లా పంచాయతీ అధికారి ఆధ్వర్యంలో పంచాయతీ ఈవోలకు కలెక్టర్ సోమవారం ఐఎస్‌వో ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ★ డీఆర్డీఏ ఆధ్వర్యంలో రూపొందించిన జెండర్ గోడపత్రికను, గుర్రపుడెక్కతో తయారుచేసిన అల్లికల బుట్టను కలెక్టర్ సోమవారం ఆవిష్కరించారు.

10వ తేదీ నుంచి నిర్వహణ..

టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ జిల్లాలోని మూడు కేంద్రాల్లో ఈ నెల 10వ తేదీ నుంచి 21వ తేదీ వరకు రోజుకు రెండు షిఫ్టుల్లో జరుగుతుందని జిల్లా విద్యాశాఖాధికారి జేవీజే రామారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెనమలూరు మండలం కానూరులోని ఐయాన్ డిజిటల్ జోన్, పెదన మండలం నందమూరు గ్రామంలోని శ్రీవాసవి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో, గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాలలో ఉదయం 9.30 గంటల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు జరుగుతుందని పేర్కొన్నారు. సందేహాలు ఉంటే సెల్ నంబరు 63013 14348లో సంప్రదించవచ్చన్నారు.

జిల్లా జడ్జిగా ఎంపిక

ఘంటసాల, న్యూస్‌టుడే: ఘంటసాలకు చెందిన బండ్ల స్నేహ జిల్లా జడ్జిగా ఎంపికయ్యారు. సోమవారం వెలువడిన జిల్లా జడ్జి పరీక్షా ఫలితాలలో ఆమె ఎంపికవడంతో స్థానికంగా పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈమె ఘంటసాలకు చెందిన దివంగత వేమూరి ప్రసాద్- ఎంపీపీ వేమూరి రజనీకుమారి దంపతుల కోడలు. స్నేహను పలువురు గ్రామ ప్రముఖులు అభినందించారు.

బండ్ల స్నేహ

వరద తగ్గింది.. మట్టిదారి వచ్చింది..

ఈ ఏడాది భారీ వర్షాలకు ప్రకాశం బ్యారేజీకి ఎగువ నుంచి వచ్చిన వరద ప్రవాహం సుమారు 4 నెలల పాటు సాగింది. బ్యారేజీ నుంచి నీటి విడుదల కారణంగా తోట్లవల్లూరు మండలంలో లంక గ్రామాలు, పొలాలకు చేరుకునేందుకు కృష్ణానదిలో ప్రమాదకరంగా పడవ ప్రయాణం చేయాల్సిన పరిస్థితి. ప్రస్తుతం వరద పూర్తిగా తగ్గడంతో తోట్లవల్లూరు మండల కేంద్రంతో పాటు సమీప గ్రామాల వద్ద సైతం నది దాటేందుకు మళ్లీ మట్టి దారి ఏర్పాటు చేసుకుంటున్నారు. – ఈనాడు, కృష్ణా

బాలోత్సవానికి వేళాయె..

నేటి నుంచే..

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజన, నైపుణ్యం, కళలను ప్రోత్సహించేందుకు అమరావతి-బాలోత్సవం- పిల్లల పండగ పేరుతో కొన్నేళ్ల నుంచి నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది మొగల్రాజపురం పీబీ సిద్ధార్థ కళాశాల ఆడిటోరియం ఇందుకు వేదికగా నిలిచింది. మూడు రోజులు నిర్వహించే ఈ కార్యక్రమం మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం, మంచి గాలి కోసం, మంచి జీవితం కోసం అనే నినాదంతో దీనిని నిర్వహించనున్నారు. ఇప్పటికే నిర్వాహకులు ఏర్పాట్లు సిద్ధం చేశారు.

వేదికలకు ప్రముఖుల పేర్లు : ఈ పోటీలకు ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, ఏలూరు జిల్లాల పరిధిలోని 18 మండలాల్లో వివిధ యాజమాన్యాలకు చెందిన రెండు వందల పాఠశాలల నుంచి 12 వేల మంది విద్యార్థులు పాల్గొనడానికి ఇప్పటికే పేర్లు నమోదు చేసుకున్నారు. ఐదు వేదికలు, ఐదు ప్రాంగణాలు, ఐదు గదులు మొత్తం 15 చోట్ల ఒకేసారి వివిధ కార్యక్రమాలు నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు. వివిధ వేదికలకు ప్రముఖ సైంటిస్టు పద్మభూషణ్ డాక్టర్ ఏఎస్ రావు, విశ్వనరుడు, గుర్రం జాషువా, బాలల ప్రేమికుడు రచయిత నార్ల చిరంజీవి, ప్రఖ్యాత కూచిపూడి నృత్యకారిణి పద్మశ్రీ శోభానాయుడు, తెలుగు నాట మొట్టమొదటి సినీ గాయని లావు బాలసరస్వతీదేవి, ప్రముఖ విద్యావేత్త గిజుబాయ్, ప్రముఖ చిత్రకారుడు సూర్యదేవర సంజీవదేవ్, ప్రజాకళాకారుడు, నాటక రచయిత, దర్శకుడు గాదె సుబ్బారెడ్డి పేర్లు పెట్టారు.

మానసిక వికాసం, సమగ్రాభివృద్ధి: చదువుతో పాటు విద్యార్థుల్లో కళా నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి బాలోత్సవం నిర్వహించనున్నట్లు అమరావతి బాలోత్సవం అధ్యక్షుడు ఎస్పీ రామరాజు, ప్రధాన కార్యదర్శి ఆర్. కొండలరావు తెలిపారు. 12 వేల మంది విద్యార్థులు హాజరుకానున్నారని తెలిపారు.

(c) eenadu

పంచాయతీ కార్యదర్శి గొప్ప మనసు

పంచాయతీ కార్మికులకు బీమా పాలసీ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు (పాత చిత్రం)

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి. కరోనా రోజుల్లో... బుడమేరు ముంపు సమయంలో... స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాల్లో... వారిని సన్మానించి, ఒక జత దుస్తులు ఇవ్వడం తప్ప వారి భద్రతను పట్టించుకున్నవారే లేరు. గ్రామ శుభ్రత కోసం ఆహర్నిశలు శ్రమిస్తున్న కార్మికుల భద్రత కోసం విజయవాడ రూరల్ మండలం నిడమానూరు పంచాయతీ కార్యదర్శి ఎస్.నరసింహారావు ఆదర్శవైన నిర్ణయం తీసుకుని ఆచరణలో నిలుస్తున్నారు. గ్రామంలో పనిచేస్తున్న 52 మంది కార్మికుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని రూ.40 లక్షల విలువైన బీమా పాలసీని సొంత ఖర్చుతో చేయించారు. ఇందుకోసం రూ.1.25 లక్షలు ఖర్చు చేశారు.

అడుగు వడిని ఇలా.. నరసింహారావు గతంలో గుంటుపల్లి కార్యదర్శిగా పనిచేస్తున్న సమయంలో జాతీయ రహదారిని శుభ్రం చేస్తున్న ఓ కార్మికురాలిని కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆస్పత్రిలో ఖర్చులను ఎవరూ ఆదుకోలేదు... పారిశుద్ధ్య కార్మికుల రక్షణ కోసం ఆయన గ్రామాల పారిశుద్ధ్య కార్మికులకు ఇన్సూరెన్స్ పాలసీ చేయిస్తున్నారు. నిడమానూరు పంచాయతీ పరిధిలో సుమారు తొమ్మిది కిలోమీటర్ల మేర జాతీయ రహదారి ఉంది. 15 మంది సిబ్బంది నిరంతరం జాతీయ రహదారి పైనే ప్రమాదకర ప్రాంతాల్లో పనిచేస్తుంటారు. ఈ నేపథ్యంలో ఇక్కడ అందరికీ బీమా చేయించి గత నెలలో ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు చేతుల మీదుగా కార్మికులకు పాలసీ పత్రాలు అందజేశారు. - **న్యూస్‌టుడే, నిడమానూరు**

కోడూరులో బుక్ కీపర్ చేతివాటం

రూ.10.70 లక్షల సంఘం నిధులు గల్లంతు

ఎమ్మెల్యే బుద్ధప్రసాద్‌కు ఫిర్యాదు చేస్తున్న డ్వాక్రా మహిళలు

కోడూరు (అవనిగడ్డ), న్యూస్‌టుడే: మండల పరిధిలోని హంసలదీవి గ్రామ బుక్ కీపర్ పరిధిలో రూ.10.70లక్షలు గల్లంతైనట్లు ఐకేపీ ప్రజా దర్బారులో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌కు డ్వాక్రా మహిళలు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. వెలుగు కార్యాలయం నుంచి సేకరించిన వివరాల ప్రకారం 2018-24 మధ్య కాలంలో సంఘంలో 170 మంది గ్రూపు సభ్యులు బుక్ కీపర్ పరిధిలో ఉండేవారు. అప్పటికి సంఘంలో రూ.10 లక్షల నిధులు నిల్వ ఉన్నాయి. ఆ తర్వాత సంఘానికి వచ్చిన గ్రూపుల రూ.4.25 లక్షలు, సభ్యత్వాలుగా చెల్లించిన మొత్తంతో కలిపి రూ.10.70 లక్షలు ఉండాలి. బుక్ కీపర్‌గా ఉన్న ఒడుగు సువర్ణ ఈ ఏడాది మార్చిలో బుక్ కీపర్ విధుల నుంచి తప్పుకొంది. ఆనవాయితీ ప్రకారం లెక్కలు చూడగా రూ.10.70 లక్షలు గల్లంతైనట్లు వెలుగులోకి వచ్చింది. దీంతో గ్రామ పెద్దల మధ్యవర్తిత్వంతో బుక్ కీపర్‌ రూ.8 లక్షలు తిరిగి చెల్లించే విధంగా ఒప్పందం చేసుకుని, 3 నెలల్లో చెల్లిస్తానని గడువు ఇచ్చారు. గడువు దాటినా కట్టకపోవడంతో బుక్ కీపర్ ఇంటికి వెళ్లి గ్రూపుల సభ్యులు అడిగితే, తన ఇంటికి రావద్దని హెచ్చరించినట్లు చెబుతున్నారు. ఆయినా తనను నిధుల విషయమై ప్రశ్నిస్తున్నారని ఆమె గ్రామ పెద్ద, ఒక వీవోపై తనను వేధిస్తున్నారని పోలీసు స్టేషన్‌లో ఎదురు కేసు పెట్టినట్లు తెలిసింది. దీనిపై ఉన్నతాధికారులు ఏమి చేస్తారోనని గ్రూపుల సభ్యులు ఎదురు చూస్తున్నారు.

సైనిక కుటుంబాల సంక్షేమం అందరి బాధ్యత

విరాళం అందజేస్తున్న కలెక్టర్ బాలాజీ

భాస్కరపురం (మచిలీపట్నం), న్యూస్‌టుడే: దేశ రక్షణలో ప్రాణాలర్పించిన సైనికుల కుటుంబాల సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ విరాళాలు అందించాలని కలెక్టర్ డి.కె. బాలాజీ పిలుపునిచ్చారు. సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం కలెక్టరేట్ ప్రాంగణంలో జిల్లా సైనిక సంక్షేమ అధికారి కె.కల్యాణవీణ ఆధ్వర్యంలో మచిలీపట్నం, పెడన మాజీ సైనికుల సంక్షేమ సంఘం సభ్యుల సహకారంతో ఎన్‌సీసీ క్యాడెట్ల సహకారంతో సైనిక గౌరవ వందనం సమర్పించారు. జేసీ ఎం.నవీన్, డీఆర్వో కె.చంద్రశేఖరరావు, కేఆర్ఆర్‌సీ ఎస్డీసీ శ్రీదేవి, ఆర్డీవో స్వాతి, జిల్లా అధికారులు విరాళాలు అందజేశారు. కార్యక్రమంలో సైనిక సంక్షేమశాఖ కార్యాలయ పర్యవేక్షకులు ఈశ్వరరావు, మచిలీపట్నం, పెడన మాజీ సైనిక సంక్షేమ సంఘాల సభ్యులు, ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు ఆరోగ్య పథకం ఉపయుక్తం: అనాథ పిల్లలకు ఆరోగ్య పథకం ఎంతగానో ఉపయోగపడుతుందని కలెక్టర్ బాలాజీ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఎన్టీఆర్ వైద్యసేవల ఆమ్మత ఆరోగ్య పథకం కింద 17 అనాథ ఆశ్రమాలకు చెందిన 82 మంది పిల్లలకు ఆరోగ్య కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేసిన ఈ ఆరోగ్య కార్డుల ద్వారా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా వైద్య చికిత్సలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో యుగంధర్, ఎన్టీఆర్ వైద్యసేవల జిల్లా సమన్వయకర్త డాక్టర్ సతీష్, ఐసీడీఎస్ పీడీ ఎం.ఎన్.రాణి తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో జీ రూపాయల్లో)

ఎనెకెబి: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -130 రిటైల్ ధర 157 చికెన్ విత్ స్కిన్ - 228, చికెన్ స్కిన్‌లెస్ - 259. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 149, 158, 169 చికెన్ విత్ స్కిన్ - 284 చికెన్ స్కిన్‌లెస్ - 294.

ఫ్లోర్‌బాల్ పురుషుల విభాగంలో కృష్ణా జట్టు ప్రథమం

నరసరావుపేట క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి సీనియర్ పురుషులు, మహిళల ఫ్లోర్‌బాల్ అంతర్ జిల్లాల పోటీలు నరసరావుపేటలో సోమవారం ముగిశాయి.

పురుషుల విభాగం విజేతలు : కృష్ణా జిల్లా (ప్రథమ), తిరుపతి జిల్లా (ద్వితీయ), ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్, నరసరావుపేట, పల్నాడు జిల్లా (తృతీయ) **మహిళల విభాగంలో..** తిరుపతి జిల్లా (ప్రథమ), సత్యసాయి జిల్లా (ద్వితీయ), పల్నాడు జిల్లా (తృతీయ)

కృష్ణా జిల్లా జట్టుకు బహుమతి అందజేస్తున్న దృశ్యం

రూ.లక్షలు తీసుకుని బెదిరిస్తున్నారు

కలెక్టరేట్‌లో అర్జీ అందించిన బాధితులు

మచిలీపట్నం కార్పొరేషన్: వ్యాపారంలో పెట్టుబడి అని చెప్పి తమ వద్ద నుంచి రూ.లక్షలు తీసుకున్నది కాక బెదిరింపులకు పాల్పడుతున్నారు.. తమకు న్యాయం చేయాలని కోరుతూ మచిలీపట్నంకు చెందిన వెంకటలక్ష్మణరావు, సుశీల, బొర్రా నాగలక్ష్మిలు సోమవారం కలెక్టరేట్‌లో అర్జీ అందించారు. ఈ సందర్భంగా వారు కలెక్టరేట్ వద్ద విలేకరులతో తమకు జరిగిన మోసాన్ని వెల్లడించారు. మూండి ఆర్ వ్యక్తి ఇసుక, ఆయిల్ తదితర వ్యాపారాల్లో పెట్టుబడి పెడితే మంచి లాభాలు వస్తాయని చెప్పారని అన్నారు. తన మామయ్య మాదమూడి విక్టర్ ప్రసాద్ ఎస్పీ కమిషన్ డ్రైవర్‌గా ఉన్నారని, తాము రాజకీయంగా ప్రజల్లో తిరిగేవారమని, ఎలాంటి భయం లేదని చెప్పడంతో నమ్మి నగదు ఇచ్చామని వెంకటలక్ష్మణరావు తెలిపారు. తాను రూ.20లక్షలు ఇస్తే, తమ ఇంట్లో ఉంటున్న నాగలక్ష్మి రూ.12లక్షలు ఇచ్చారన్నారు. వైకాపా హయాంలోనే ఇదంతా జరిగిందని వివరించారు. ఆ తరవాత డబ్బులు అడుగుతుంటే దాట వేస్తూ వచ్చారని, ప్రస్తుతం ఆతను కనిపించకుండా పోయారని, ఎవరినైనా అడితే అతనికి తెలిసిన వ్యక్తులతో బెదిరింపులకు పాల్పడుతున్నారని వాపోయారు. తాము చెల్లించిన నగదుకు సంబంధించిన అన్ని ఆధారాలు ఉన్నాయని, ఉన్నతాధికారులు చొరవ తీసుకుని న్యాయం చేయాలని కోరారు.

దేవదాయ ధర్మదాయ శాఖ, ఆంధ్రప్రదేశ్

టెండరు నోటీసు నెం. Q/COE/492/2018, తేది. 08-12-2025

కమిషనర్ వారి కార్యాలయం, గొల్లపూడి లో పనిచేయుటకు అవసరమైన సెక్యూరిటీ గార్డ్ ల కొరకు అవుట్ సోర్సింగ్ ఏజెన్సీల ద్వారా సప్లై చేయుటకు టెండర్లు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా పిలవడమైనది. వివరముల కొరకు tender.apeprocurement.gov.in నందు చూడగలరు.

కె రామచంద్ర మోహాన్
కమిషనర్ (FAC), దేవదాయ ధర్మదాయ శాఖ

వెట్టిచాకిరి నిర్మూలనకు నిఘా, పర్యవేక్షణ సంఘం

భాస్కరపురం (మచిలీపట్నం), న్యూస్‌టుడే: వెట్టిచాకిరి నిర్మూలనకు జిల్లా స్థాయి నిఘా, పర్యవేక్షణ సంఘాన్ని ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ డి.కె.బాలాజీ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో వెట్టిచాకిరి నిర్మూలనపై జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా స్థాయి కమిటీకి కలెక్టర్ ఛైర్మన్‌గా, జాయింట్ కలెక్టర్ కన్వీనర్‌గా ఉంటారన్నారు. సాంఘిక, సంక్షేమ శాఖ డీడీ, డీఎంహెచ్‌వో, డీఆర్డీఏ పీడీ, డీపీవో, డ్వామా పీడీ, లీడ్ బ్యాంకు మేనేజర్, జిల్లా న్యాయసేవా ప్రాధికార సంస్థ, పోలీస్ ప్రతినిధులు, ఇద్దరు సామాజిక కార్యకర్తలు కమిటీ సభ్యులుగా ఉంటారని వివరించారు. కార్మికశాఖ డిప్యూటీ కమిషనర్ నోడల్ అధికారిగా వ్యవహరిస్తారన్నారు. ఈ కమిటీ గ్రామాలు, పట్టణాల్లో వెట్టిచాకిరి బాధితులను గుర్తించి, సంబంధిత వ్యక్తులపై చర్యలకు కలెక్టర్‌కు నివేదిస్తుందన్నారు. సమావేశంలో పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వండి: ఎస్పీ

సమస్యలు వింటున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

భాస్కరపురం (మచిలీపట్నం), న్యూస్‌టుడే: ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్‌నాయుడు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ మీకోసం కార్యక్రమం నిర్వహించి ప్రజల సమస్యలు విన్నారు. చట్ట పరిధిలో పూర్తి స్థాయి విచారణ జరిపి తప్పనిసరిగా పరిష్కారం అందిస్తామని హామీ ఇచ్చారు. పెనమలూరుకు చెందిన కవిత తన భర్త అదనపు కట్నం కోసం రెండేళ్లుగా తీవ్ర వేధింపులకు గురి చేస్తున్నాడని ఫిర్యాదు చేశారు. పెడనకు చెందిన నర్సమ్మ అనే వృద్ధురాలు తన ఇద్దరు కుమారులు భోజనం పెట్టకుండా వేధింపులకు పాల్పడుతున్నారని, ఆస్తి కోసం చంపాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తోట్లవల్లూరుకు చెందిన వీరయ్య తన ఇంటి సరిహద్దులను తన స్థలాన్ని ఆక్రమించాలని చూస్తూ భౌతిక దాడికి పాల్పడుతున్నారని, న్యాయం చేయాలని ఫిర్యాదు చేశారు. అవనిగడ్డకు చెందిన వనజ భార్యాభర్తల గొడవ కారణంగా మూడేళ్ల వయసున్న తన బిడ్డను అత్తింటివారి వద్దే ఉంచుకుని కలవనివ్వడం లేదని వాపోయింది.

12న మచిలీపట్నంలో ఉద్యోగ మేళా

భాస్కరపురం (మచిలీపట్నం), న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 12న మచిలీపట్నంలోని ఎస్.ఎస్.ఆర్ డిగ్రీ కళాశాలలో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నారు. 880 ఉద్యోగాలకు సంబంధించి డెక్కన్ ఫైన్ కెమికల్స్, జోయలుక్కాస్ జ్యుయెలర్స్, టాటా ఎలక్ట్రానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్, క్రెస్ట్ కార్పొరేషన్ లిమిటెడ్, యాక్సిస్ బ్యాంక్, ఎన్.ఎస్.ఇన్ స్ట్రుమెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్, కలర్ట్రీ-పాలీమెట్ లిమిటెడ్, గోల్డ్‌ఫిన్ జ్యుయెల్ ఇండస్ట్రీస్ వంటి కంపెనీలు ఉపాధి అవకాశాలు కల్పించనున్నాయి. 7వ తరగతి నుంచి డిగ్రీ వరకు, ఐటీఐ, డిప్లొమా కోర్సులు చేసిన వారికి ఉద్యోగాలు కల్పిస్తున్నారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు https://naipunyam.ap.gov.in/user-regestration లింక్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఇతర వివరాలకు 99664 89796, 63006 18985, 99895 19495 నంబర్లలో సంప్రదించాలి.

పెడనలో రెండు స్క్రబ్ టైఫస్ కేసులు

పెడన, న్యూస్‌టుడే: పెడన పట్టణంలోని దక్షిణ తెలుగుపాలెంలో ఒక బాలుడి(5)కి, కృత్తివెన్ను మండలం అడ్డపర్రకు చెందిన మహిళ(55)లో ఈ లక్షణాలు కన్పించడంతో మచిలీపట్నం ప్రభుత్వ ఆస్పత్రిలో పరీక్షలు చేసి స్క్రబ్ టైఫస్‌గా నిర్ధారించారు. ప్రస్తుతం బాధితులిద్దరూ కోలుకుంటున్నారు. నియోజకవర్గంలో ఇప్పటికి 9 మందిలో ఈ వ్యాధి నిర్ధారణ అయ్యింది. అత్యధికంగా బంటుమిల్లి మండలం మునుజులూరులో నలుగురికి సోకింది.

పరీక్షా ఫలితాలు విడుదల

కృష్ణావిశ్వవిద్యాలయం (మచిలీపట్నం), న్యూస్‌టుడే: కృష్ణా విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలలకు సంబంధించి బీఫార్మసీ రెండు సెమిస్టర్ ఫలితాలను సోమవారం విడుదల చేశారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి కె.రాంజీ ఆదేశాల మేరకు ఫలితాలు విడుదల చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి పి.వీరబ్రహ్మాచారి ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 120 మంది పరీక్షలు రాయగా 80.83 శాతం ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. పునః మూల్యాంకనం కోసం ఈనెల 18వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

స్ట్రెస్డ్ అస్సెట్స్ రికవరీ బ్రాంచి, 3వ అంతస్తు, కెఫ్‌సి మేడమీద, సూర్యప్రకాష్ స్క్వేర్, గురునానక్ నగర్ రోడ్డు, ఎన్.టి.ఆర్.జిల్లా, విజయవాడ - 520008. ఆంధ్రప్రదేశ్. ఫోన్ :0866-2546922

అధీకృత అధికారి వివరములు : పేరు : శ్రీ వై. ముక్తేశ్వరరావు (చీఫ్ మేనేజర్), మొబైల్ నెం. : 88866 40777
ఆస్తి తనిఖీ కొరకు : 92912 32223

Appendix – IV –A
[See Proviso to Rule 8(6) R/w Rule 9(1)]

స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8(6)కు రూల్ 9(1) లోని నిబంధనలతో చదువుకోవలసిన సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకము కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన)

1 సెక్యూర్డ్ క్రెడిటార్ స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (సెక్యూర్డ్ క్రెడిటార్) వారికి ఋణగ్రహీత: శ్రీ రాచేటి వినయ్ కుమార్, తండ్రి : ఆర్. శామ్యూల్, డోర్ నెం. 3-1-36/3, అంబేద్కర్ నగర్, వార్డు నెం.8, వట్టివారిపాలెం, బాపట్ల, బాపట్ల జిల్లా - 522101. వారు డిమాండ్ నోటీసు తేది.28-10-2024 ప్రకారం తేది.28-10-2024 నాటికి చెల్లించవలసిన బకాయి మొత్తము రూ.29,88,503/- (అక్షరాల ఇరవై తొమ్మిది లక్షల ఎనభై ఎనిమిది వేల ఐదు వందల మూడు రూపాయలు మాత్రమే) + తేది.29.10.2025 నుండి తదుపరి వడ్డీ, కాస్ట్స్ మరియు ఇతర ఖర్చులు, ఛార్జీలు మొదలగునవి (తదుపరి జమలు ఉన్నచో తీసివేయబడును) వసూలు కొరకు సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క అధీకృత అధికారి వారిచే భౌతిక స్వాధీనత పరుచుకోబడిన బ్యాంక్ తనఖాలో నున్న దిగువ వివరించిన స్థిరాస్తి "ఎక్కడ ఎలా ఉన్నది అలానే" ఏది ఎలా వుంటే అలానే" "అక్కడ ఏది ఉన్నదో అది" మరియు "రీకోర్స్ లేకుండా" పద్ధతిపై తేది.21-01-2026న విక్రయించబడునని యావన్మంది ప్రజానీకమునకు మరియు ప్రత్యేకంగా ఋణగ్రహీతకు ఇందుమూలముగా సూచించటమైనది.

షెడ్యూలు ఆస్తి వివరములు

కృష్ణాజిల్లా, విజయవాడ తూర్పు జిల్లా రిజిస్ట్రారు వారి పరిధిలో చేరిన, శ్రీ గన్నవరం సబ్ రిజిస్ట్రారు వారి యిలాకా, గన్నవరం మండలం, గన్నవరం గ్రామ పంచాయితీ ఏరియాలో చేరిన, గన్నవరం గ్రామ రీ.సర్వే నెం.124/1ఎ రు దాఖలా య.0-12ట్లున్నూ, రీ.సర్వే నెం.124/1బి రు దాఖలా య.0-11ట్లున్నూ, రీ.సర్వే నెం.124/1సి రు దాఖలా య.0-12 1/4 ట్లు అయియుండి, సదరాస్తిని మషాయతు చేయగా తేలిన విస్తీర్ణం య. 0-12ట్లున్నూ, రీ.సర్వే నెం.124/1డి రు దాఖలా య.0-20ట్లున్నూ, రీ. సర్వే నెం.124/1ఇ రు దాఖలా య.0-10 ట్లున్నూ, రీ. సర్వే నెం. 124/1ఎఫ్ రు దాఖలా య.0-10 ట్లున్నూ, రీ.సర్వే నెం.124/1జి రు దాఖలా య.0-12ట్లున్నూ, రీ.సర్వే నెం. 124/1హెచ్ రు దాఖలా య. 0-10 ట్లున్నూ, రీ.సర్వే నెం.124/1ఐ రు దాఖలా య.0-65 ట్లున్నూ, రీ.సర్వే నెం.124/2ఎ1 రు దాఖలా య.1-13ట్లున్నూ, రీ.సర్వే నెం. 124/2ఎ2 రు దాఖలా య.0-50ట్లున్నూ, రీ.సర్వే నెం.124/2బి రు దాఖలా య.0-89 ట్లున్నూ, రీ.సర్వే నెం.124/2సి1 రు దాఖలా య.0-09 ట్లున్నూ, రీ.సర్వే నెం.124/2సి2 రు దాఖలా య.0-52 ట్లున్నూ, రీ.సర్వే నెం.124/2సి3 రు దాఖలా య.0-26 ట్లున్నూ, రీ.సర్వే నెం.124/2సి4 రు దాఖలా య.0-26ట్లున్నూ, రీ.సర్వే నెం.124/3 రు దాఖలా య.1-50 ట్లున్నూ, రీ.సర్వే నెం.124/4 రు దాఖలా య.0-05 ట్లున్నూ, రీ.సర్వే నెం.124/5ఎ1 రు దాఖలా య.1-07 ట్లున్నూ, రీ.సర్వే నెం.124/5ఎ2 రు దాఖలా య.1-07 ట్లున్నూ, రీ.సర్వే నెం.124/5బి1 రు దాఖలా య.0-93 ట్లున్నూ, రీ.సర్వే నెం.124/5సి2 రు దాఖలా య.0-14 ట్లున్నూ, రీ.సర్వే నెం.124/5బి2 రు దాఖలా య.0-99 ట్లున్నూ, రీ. సర్వే నెం.124/5సి3రు దాఖలా య.0-08 ట్లున్నూ వెరశి య.10-65 ట్లు స్థిరాస్తి అయి యుండి, సదరాస్తిని మషాయతు చేయగా తేలిన విస్తీర్ణము య. 10-54 ట్లు లేక చ.గ.51058.88లులో పెరిఫిల్ రోడ్డు నిమిత్తం చ.గ.4853.29లున్నూ, ఐ.టి.బ్లాక్‌లో 1&2 ఆఫీసుల నిమిత్తం చ.గ. 1833.39లున్నూ, ఒక క్లబ్ హౌస్ నిమిత్తం చ.గ.2113.95లున్నూ, టాట్ లాట్ లేదా ఓపెన్ ఏరియా నిమిత్తం చ.గ.4740.78లున్నూ వెరశి చ.గ. 13541.42లు పోగా ఇంకనూ మిగిలియున్నటువంటి చ.గ.37517.46లు స్థిరాస్తి ఖాళీ నివేశన స్థలము ఆస్తికి హద్దులు: తూర్పు: 60 అడుగుల వెడల్పు గల రోడ్డు మరియు ఒక క్లబ్ హౌస్, ఐ.టి.బ్లాక్, దక్షిణం : జీనగల సుజాత గారి భూమి, పడమర : పంట కాలువ, ఉత్తరం: జాస్తి శివ ప్రసాద్ వగైరా గారల ఆస్తి.

యీ నాలుగు హద్దుల మధ్య చ.గ.37517.46లు లేక చ.మీ.31368.35 ర్లు స్థిరాస్తి స్థలములో జాయింటు అనిర్దిష్టపు స్థిరాస్తి చ.గ. 40.23లు లేక చ.మీ.33-63ర్లు జాయింటు స్థలమున్నూ, మరియు

బి-షెడ్యూలు: పై ఎ-షెడ్యూలు దాఖలా మొత్తము స్థలములో "చంద్రిక అయోధ్య" అను అపార్ట్‌మెంట్‌లో (ఐ) బ్లాక్‌లో "అంబుజ" నందు 2వ బ్లాక్ ఫోర్త్ ఫ్లోర్‌లో పడమర ఫేజ్ గల ఫ్లాట్ నెం.205రు సూపర్ బిల్టప్ ఏరియా 1000 చ॥అ॥లు (ఫ్లాట్ కార్పెట్ ఏరియా 715 చ॥అ॥లు, ప్లింత్ ఏరియా 800 చ॥అ॥లు, కామన్ ఏరియా 200 చ॥అ॥లు) గల అసంపూర్తి నిర్మాణ దశలో యున్న ఫ్లాట్‌కు హద్దులు: తూర్పు: ఓపెన్ టు స్కై, దక్షిణం : ఓపెన్ టు స్కై & లిఫ్ట్, పడమర : కామన్ కారిడార్, ఉత్తరం : ఓపెన్ టు స్కై.

యీ నాలుగు హద్దుల మధ్య చ.అ.800లు ప్లింతేరియాగల అసంపూర్తిగా గల ఫ్లాట్ కట్టడములు, చ.అ.200లు విస్తీర్ణముగా గల కామన్ ఏరియా, చ.అ.120లు విస్తీర్ణము గల కార్ పార్కింగ్ ఏరియా వెరశి చ.అ.1120లు, సదరు కట్టడములకు సంబంధించిన యావద్విశిష్ఠ కలప వగైరా సామాను సహా, దామాషాన మెయిన్‌టెనెన్స్ మరియు రిపేరింగ్ ఛార్జీలు చెల్లించెడి ఏర్పాటుతో మొత్తం కట్టడములకు సంబంధించిన కామన్ పార్కింగ్, కామన్ కారిడార్, లిఫ్ట్, జనరేటర్, వాటర్ కనెక్షన్, కరెంట్ కనెక్షన్, డ్రైనేజీ కనెక్షన్ మరియు కామన్ ఫెసిలిటీస్‌లో జాయింటు వాడకపు హక్కులతో సహా యావత్తు యీజిమెంట్ హక్కులతో సహా.

రిజర్వు ధర : రూ.31,68,000/- ధరావత్తు : రూ.3,16,800/- బిడ్ పెంపుదల : రూ.10,000/-

2 సెక్యూర్డ్ క్రెడిటార్ స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (సెక్యూర్డ్ క్రెడిటార్) వారికి ఋణగ్రహీత: శ్రీ కమర్తం వెంకట సందీప్, తండ్రి : కె. కోటేశ్వరరావు, డోర్ నెం.2-235/2, గోలి కృష్ణారావు వారి వీధి, కరెన్సీ నగర్, విజయవాడ, ఎన్‌టిఆర్ జిల్లా - 521108. వేరొక చిరునామా: డోర్ నెం.2-1, ఆత్కూరు, ఉంగుటూరు మండలం, కృష్ణాజిల్లా-521229. వారు డిమాండ్ నోటీసు తేది.23-05-2025 ప్రకారం తేది.23-05-2025 నాటికి చెల్లించవలసిన బకాయి మొత్తము రూ.89,96,552/- (అక్షరాల ఎనభై తొమ్మిది లక్షల తొంభై ఆరు వేల ఐదు వందల యాభై రెండు రూపాయలు మాత్రమే) + తేది.24.05.2025 నుండి తదుపరి వడ్డీ, కాస్ట్స్ మరియు ఇతర ఖర్చులు, ఛార్జీలు మొదలగునవి (తదుపరి జమలు ఉన్నచో తీసివేయబడును) వసూలు కొరకు సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క అధీకృత అధికారి వారిచే భౌతిక స్వాధీనత పరుచుకోబడిన బ్యాంక్ తనఖాలో నున్న దిగువ వివరించిన స్థిరాస్తి "ఎక్కడ ఎలా ఉన్నది అలానే" ఏది ఎలా వుంటే అలానే" "అక్కడ ఏది ఉన్నదో అది" మరియు "రీకోర్స్ లేకుండా" పద్ధతిపై" తేది.21-01-2026న విక్రయించబడునని యావన్మంది ప్రజానీకమునకు మరియు ప్రత్యేకంగా ఋణగ్రహీతకు ఇందుమూలముగా సూచించటమైనది.

షెడ్యూలు ఆస్తి వివరములు

(సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం.3070/2023, తేది.24.03.2023, గన్నవరం ఎస్ఆర్ఓ ప్రకారం): కృష్ణాజిల్లా, గన్నవరం సబ్ - రిజిస్ట్రార్, ఉంగుటూరు మండలం, ఆత్కూరు గ్రామ పంచాయితీ ఏరియా, ఆత్కూరు గ్రామము తాలూకు రీ సర్వే నెం.2/2ఎలోని 173 చ॥గ॥ల విస్తీర్ణంలో అసెస్మెంట్ నెం.153, డోర్ నెం.2-1తో క్రింది, మొదటి మరియు రెండవ అంతస్తులతో కూడిన ఆర్‌సిసి భవనం. ఆస్తికి హద్దులు: తూర్పు : ముసునూరు శైలజ గారి ఆస్తి, దక్షిణం: సారంపాటి లక్ష్మణాచారి గారి ఆస్తి, పడమర : సారంపాటి వెంకట రమణమూర్తి గారి ఆస్తి కొంతమేర మరియు సర్వీస్ రోడ్డు, ఉత్తరం : పంచాయితీ రోడ్డు.

పైన తెలిపిన హద్దులలోని 173 చ॥గ॥లు లేదా 144.648 చ॥మీ॥ల నివాస భూమి విస్తీర్ణంలో క్రింది, మొదటి మరియు రెండవ అంతస్తులతో కూడిన ఆర్‌సిసి భవనం అన్నీ ఈజిమెంటరీ హక్కులతో కలదు.

రిజర్వు ధర : రూ.60,52,000/- ధరావత్తు : రూ.6,05,200/- బిడ్ పెంపుదల : రూ.20,000/-

3 సెక్యూర్డ్ క్రెడిటార్ స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (సెక్యూర్డ్ క్రెడిటార్) వారికి ఋణగ్రహీత: శ్రీ దన్నే వెంకటేశ్వరరావు, తండ్రి : డి. సుబ్బారావు, డోర్ నెం.20-4/11-19ఎ, న్యూ రాజరాజేశ్వరి పేట, విజయవాడ, ఎన్‌టిఆర్ జిల్లా - 520008.. వేరొక చిరునామా: డోర్ నెం.20-4/11-137, సుబ్బరాజు నగర్, న్యూ రాజరాజేశ్వరి పేట, విజయవాడ, ఎన్‌టిఆర్ జిల్లా-520008. వారు డిమాండ్ నోటీసు తేది.02-06-2025 ప్రకారం తేది.02-06-2025 నాటికి చెల్లించవలసిన బకాయి మొత్తము రూ.50,94,978/- (అక్షరాల యాభై లక్షల తొంభై నాలుగు వేల తొమ్మిది వందల డెబ్బై ఎనిమిది రూపాయలు మాత్రమే) + తేది.03.06.2025 నుండి తదుపరి వడ్డీ, కాస్ట్స్ మరియు ఇతర ఖర్చులు, ఛార్జీలు మొదలగునవి (తదుపరి జమలు ఉన్నచో తీసివేయబడును) వసూలు కొరకు సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క అధీకృత అధికారి వారిచే భౌతిక స్వాధీనత పరుచుకోబడిన బ్యాంక్ తనఖాలో నున్న దిగువ వివరించిన స్థిరాస్తి "ఎక్కడ ఎలా ఉన్నది అలానే" ఏది ఎలా వుంటే అలానే" "అక్కడ ఏది ఉన్నదో అది" మరియు "రీకోర్స్ లేకుండా" పద్ధతిపై" తేది.21-01-2026న విక్రయించబడునని యావన్మంది ప్రజానీకమునకు మరియు ప్రత్యేకంగా ఋణగ్రహీతకు ఇందుమూలముగా సూచించటమైనది.

షెడ్యూలు ఆస్తి వివరములు

(సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం.1663/2023, తేది.08.02.2023 ప్రకారం శ్రీ దన్నే వెంకటేశ్వరరావు గారి పేరున కలదు): ఎన్‌టిఆర్ జిల్లా, విజయవాడ డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్ ఆఫీస్, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, విజయవాడ టౌన్, సుబ్బరాజు నగర్, విజయవాడ గ్రామ పోర్షన్ తాలూకా, ఆర్.ఎస్.నెం.67/బి, ప్లాట్ నెం.23బి, మున్సిపల్ వార్డు నెం.52ఎ, పాత అసెస్మెంట్ నెం.150606, కొత్త అసెస్మెంట్ నెం.1073066731, డోర్ నెం.20-4/1-137తో గల ఆస్తి.

1వ ఐటమ్: 93.0 చ॥గ॥లు లేదా 77.76 చ॥మీ॥ల విస్తీర్ణం గల నివాస స్థలం మరియు అందు గల ఆర్‌సిసి భవనం. హద్దులు: తూర్పు: అరుణోదయ నగర్ ఆస్తి - 26.6 అ॥లు, దక్షిణం : 2వ ఐటమ్ కొంత భాగం మరియు నడక దారి మరియు ఇతరుల ఆస్తి - 32.00 అ॥లు, పడమర : ప్లాట్ నెం.22 మరియు 25 ఆస్తులు - 26.6 అ॥లు, ఉత్తరం : ప్లాట్ నెం.24 ఆస్తి - 30.9 అ॥లు.,

పైన తెలిపిన నాలుగు హద్దులలోని ఏరియా 93.0 చ॥గ॥లు లేదా 77.76 చ॥మీ॥ల స్థలం అన్నీ ఈజిమెంటరీ హక్కులతో కలదు.

2వ ఐటమ్: పైన తెలిపిన షెడ్యూలు ప్రకారం 7.66 చ॥గ॥ల విస్తీర్ణం గల ఆస్తి, హద్దులు: తూర్పు: అరుణోదయ నగర్ ఆస్తి, దక్షిణం: రోడ్డు, పడమర : ప్లాట్ నెం.23ఎ ఆస్తి, ఉత్తరం : ఐటమ్ నెం.1 ఆస్తి.

పైన తెలిపిన హద్దులలోని 7.66 చ॥గ॥లు లేదా 6.40 చ॥మీ॥ల స్థలం.

ఐటమ్ 1 మరియు ఐటమ్ 2ల మొత్తం విస్తీర్ణం 100.66 చ॥గ॥లు లేదా 84.16 చ॥మీ॥లుగా గల పైన తెలిపిన షెడ్యూలు ఆస్తి అన్నీ ఈజిమెంటరీ హక్కులతో కలదు.

రిజర్వు ధర : రూ.30,86,000/- ధరావత్తు : రూ.3,08,600/- బిడ్ పెంపుదల : రూ.10,000/-

ఇ-వేలం తేదీ : 21-01-2026, సమయం : ఉ॥ 11.00 గం॥ల నుండి సా॥ 04.00 గం॥ల వరకు
వేలం పూర్తయ్యే వరకు ప్రతి బిడ్‌కు 5 ని॥ల అపరిమిత పొడిగింపు కలదు

పై ఆస్తి తనిఖీ తేది మరియు సమయం : తేది:09-12-2025 నుండి 20-01-2026 వరకు ఉ॥10.00 గం॥ల నుండి సా॥ 04.00 గం॥ల వరకు

ఇ-వేలం యొక్క నియమ నిబంధనలు

1) అమ్మకం యొక్క సవివరమైన నియమ నిబంధనల కొరకు, సెక్యూర్డ్ క్రెడిటార్స్ అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క వెబ్ సైట్ : www.sbi.co.in/web/sbi-in-the-news/auction-noticesలో ఏర్పాటుచేసిన లింకును రిఫర్ చేయండి. రిజిస్ట్రేషన్, ఇయండి, వేలం యొక్క వివరములు మొదలగు వాటి గురించి సర్వీసు ప్రొవైడర్ M/s. PSB Alliance & M/s. Baanknet యొక్క ఇ-వేలం పోర్టల్ : https://baanknet.com/eauction-psb/x-login & https://baanknet.com & టోల్ ఫ్రీ ఫోన్ నెం.: 91 - 8291220220, Mail ID : support.baanknet@psballiance.comను సంప్రదించండి.
2) ఆస్తిని రిజిస్ట్రేషన్ చేసుకొనుటకు వర్తించే స్టాంపు డ్యూటీలు బదిలీ ఛార్జీలు, ఫీజు వగైరా మరియు చట్టపరమైన/నాన్ స్టేటటరీ బకాయిలు, పన్నులు, రేట్లు, ఎస్సెస్‌మెంట్ ఛార్జీలు, ఫీజులు వగైరా కొనుగోలు దారే భరించవలెను.
గమనిక : ఆసక్తి గల బిడ్డర్లు ఇ-వేలం ముగిసేలోపు PSB Alliance నందు ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డి (Pre-Bid EMD) జమ చేయవలెను. ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డి మొత్తం PSB Alliance బ్యాంక్ అకౌంట్‌లో జమ అయిన సమాచారం వెబ్‌సైట్‌లో పొందుపరిచిన తరువాత మాత్రమే బిడ్డరు యొక్క "వాలెట్"లో చూపించబడుతుంది. బ్యాంకింగ్ ప్రక్రియలో ఇది జరుగుటకు సమయం పట్టవచ్చు, కావున బిడ్డర్లు చివరి నిముషంలో ఇబ్బందులు ఎదుర్కొనకుండా తమ ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డిను సాధ్యమైనంత త్వరగా జమ చేసుకోవాలనీ సూచించటమైనది.
ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 194-1A యొక్క ప్రొవిజన్స్ ప్రకారం అమ్మకం జరుగును.

తేది: 08-12-2025, ప్రదేశం: విజయవాడ సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

విగ్రహం ఏర్పాటు అంశంపై వివాదం

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే: నగరంలోని బైపాస్‌రోడ్డులోని హౌసింగ్‌బోర్డు సర్కిల్లో విగ్రహ ఏర్పాటు అంశం వివాదంగా మారింది. సర్కిల్లో మాజీ ప్రధాని దివంగత అటల్‌బిహారీ వాజ్‌పేయి విగ్రహ ఏర్పాటు నిమిత్తం సోమవారం భూమిపూజ చేసేందుకు భాజపా నాయకులు అక్కడకు చేరుకున్నారు. విషయం తెలుసుకున్న తెదేపా నాయకులు, ఎన్టీఆర్ అభిమానులు సర్కిల్ వద్దకు చేరి ఆందోళనకు దిగారు. ఇరుపార్టీలకు చెందినవారు కూడలి వద్ద బైటాయించి నిరసన వ్యక్తం చేయడంతో పోలీసులు రంగ ప్రవేశం చేశారు. కొందరు నాయకులు ఎన్టీఆర్ ప్రతిమను తీసుకొచ్చి నినదించారు. మచిలీపట్నం అర్బన్ బ్యాంకు ఛైర్మన్ దిలీప్ కుమార్, మాజీ కౌన్సిలర్ బత్తినదాసు, తెదేపా నాయకులు సాతులూరి నాంచారయ్య, ఎన్టీఆర్ అభిమానులు చెరుకూరి కోటేశ్వరరావు తదితరులు మాట్లాడుతూ సర్కిల్లో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు తెదేపా హయాంలోనే కౌన్సిల్ తీర్మానం చేసినట్లు తెలిపారు. భాజపా జిల్లా అధ్యక్షుడు తాతినేని శ్రీరామ్, రాష్ట్ర నాయకులు మట్టా ప్రసాద్, చిగురుపాటి కుమారస్వామి, గుత్తికొండ రాజబాబు, పంతం గజేంద్ర, సోడిశెట్టి బాలాజీ, కూనపరెడ్డి శ్రీనివాస్, ధూళిపాళ్ల శ్రీరామచంద్రమూర్తి, పుప్పాల రాము, గాజుల సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు. అధినాయకత్వం ఆదేశాల మేరకు మాత్రమే తాము ఇక్కడ విగ్రహం ఏర్పాటు చేయాలని నిర్ణయించామని, ఈ విషయాన్ని వారి దృష్టికి తీసుకెళ్తామన్నారు. పోలీసులతో పాటు పలువురు ఇరుపక్షాలకు నచ్చజెప్పడంతో పరిస్థితి సద్దుమణిగింది.

దూసుకొచ్చిన మృత్యువు..!

- క్షతగాత్రుడిని కాపాడేందుకు ట్రాఫిక్ పోలీసుల విశ్వప్రయత్నం
- గ్రీన్ ఛానల్‌లో తరలించినా ఫలించని వైనం

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : ఘోర రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి ప్రాణాలు నిలిపేందుకు ట్రాఫిక్ పోలీసులు విశ్వప్రయత్నం చేశారు. గ్రీన్ ఛానల్ ద్వారా ప్రభుత్వాసుపత్రికి తరలించి.. చికిత్స అందిస్తుండగా మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. గుంటూరు జిల్లా కుంచనపల్లికి చెందిన వౌబట్టు విజయగోపాలకృష్ణ (52) నగరంలోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ కార్యాలయంలో సెక్షన్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. సోమవారం సాయంత్రం విధులు ముగించుకుని కుంచనపల్లిలోని ఇంటికి బయలుదేరారు. బెంజిసర్కిల్ సమీపం స్క్యూ బ్రిడ్జి వద్దకు రాగానే.. ఒక లారీ వేగంగా వచ్చి ఢీకొట్టింది. వెనుక చక్రాల వద్ద ఆయన ఇరుక్కుపోయారు. శిరస్త్రాణం ధరించినా.. తీవ్ర గాయాలయ్యాయి. ట్రాఫిక్ సీఐ రవికుమార్, సిబ్బంది శ్రమించి ఆయన్ని బయటకు తీశారు. అదే సమయంలో అటుగా వెళుతున్న ఒక వైద్యురాలు వచ్చి పరీక్షించగా.. నాడి కొట్టుకుంటోంది. వెంటనే ఆసుపత్రికి తరలించాలని ఆమె సూచించారు. అంబులెన్స్ వచ్చేందుకు ఆలస్యం అయ్యే అవకాశం ఉండడంతో.. ఆటోలో ఎక్కించారు.

కూడళ్లలో వాహనాలు నిలిపివేసి.. క్షతగాత్రుడిని ఆటోలో ఎక్కించిన వెంటనే కంట్రోల్ రూంకు సమాచారం అందించారు. అక్కడి నుంచి వస్తున్న ఆదేశాలతో బెంజిసర్కిల్, నిర్మల కాన్వెంట్ కూడలి, రమేష్ ఆసుపత్రి కూడలిలో వాహనాలను నిలిపివేశారు. ఆటోకు గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేసి.. హుటాహుటీన ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స చేస్తుండగా.. విజయగోపాలకృష్ణ ప్రాణాలు కోల్పోయారు. అతన్ని కాపాడేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడంతో ట్రాఫిక్ పోలీసులు వేదనకు గురయ్యారు. ప్రమాద ఘటనపై పటమట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతానికి ఎలక్ట్రీషియన్ మృతి

పామర్రు రూరల్, న్యూస్‌టుడే: విద్యుత్తు వైరింగ్ పనిచేస్తుండగా ఎలక్ట్రీషియన్ మృతిచెందిన ఘటన పామర్రు మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పామర్రు శివారు చెన్నువారిపురానికి చెందిన విజయబాబు(51) సోమవారం మండలంలోని బల్లిపర్రులో ఒక నివాసగృహంలో విద్యుత్తు వైరింగ్ పనులు చేస్తున్నాడు. ఈ క్రమంలో విద్యుదాఘాతానికి గురికావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు సంతానం. పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం గుడివాడ తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేస్తామని ఎస్.ఐ రాజేంద్రప్రసాద్ తెలిపారు.

91.9 FM Vijayawada
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
8008003297

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి ఈ రోజు మార్కెట్ ధరకు కొనబడును.స్పాట్ క్యాష్. ✆ 81422 92071

బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం విడిపించి అధిక ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్). ✆8333833368

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి అధికధరకు కొనబడును (స్పాట్ క్యాష్). ✆ 87907 41166.

EDUCATION

SPOT admissions by Govt AP 12/12: M.Com/MA English/MSW only Rs 5000 per sem, PLNM Degree College, 91774 08565.

PEOPLE CARE

OLD AGE HOME

గాయిత్రి గ్రూపు, VJA, వృద్ధులకు, పేషెంట్ల సేవకు, ఇంటి/ వంట, బేబి కేర్‌కు వర్కర్లను భారతదేశం అంతటా పంపగలము. ✆9959021122, 9603842233

REAL ESTATE

PLOT FOR SALE

133.33 Sq.Yds. కేవలం 1,00,000/- మాత్రమే. వినుకొండ, పల్నాడు డిస్ట్రిక్ట్‌లో లిమిటెడ్ ఆఫర్. ఫోన్: 9133445755.

JOBS

మ్యారేజి సంస్థలో పనిచేయుటకు కంప్యూటర్ నాలెడ్జ్ గల ఇన్‌ఛార్జ్ (F) జీ. 20 K, రిసెప్షనిస్ట్ (F) జీ. 15 K, ఏదైనా డిగ్రీ, VJA- 7 ✆ 87905 99799.

విజయవాడలోని రామచంద్రబ్రదర్స్ ఫర్నిచర్ షోరూం నందు పనిచేయుటకు క్యాషియర్ (M) కావలెను. వయసు - 35 సం॥లోపు. 99638 48003.

Wanted Female Telecallers. Qul: any Degree, Salary:Up To 15000+Incentives, Job Location: Benzcircle, & Kankipadu. ✆98481 72444

అమెరికాలో 1 సం॥ బాబు ఆలన, పాలన వ్యక్తిగత సంరక్షణ కొరకు అనుభవంగల ఆడవారు కావలెను. అమెరికా వీసా కల్గినవారు మాత్రమే. ✆ 9440803362

హోటల్ మేనేజ్‌మెంట్ ఇనిస్టిట్యూట్ నందు అనుభవంగల ఫ్యాకల్టీ కావలెను. సంప్రదించండి. ఫార్ట్యూన్ మురళీపార్క్, విజయవాడ. ✆ 90109 01020.

విజన్ ఆటోమొబైల్స్ ఆపె ఆటోషోరూము NTR జిల్లా విజయవాడ, నందిగామ, నూజివీడు నందు పనిచేయుటకు 3 వీలర్ మార్కెట్ నందు కనీసము 5 సం॥ అనుభవము ఉన్న *1.సేల్స్‌మేనేజరు - 5 *2.సేల్స్ఎగ్జిక్యూటివ్స్-18 *3.సేల్స్ టీంలీడర్స్-10 *4. అకౌంటెంట్లు-1 టాలీ అకౌంటింగ్ ప్యాకేజీలో అనుభవము, అకౌంటింగ్ రంగములో 4సం॥ అనుభవము ఉన్న అకౌంటెంట్లు కావలెను. *5.సేల్స్ రిసెప్షనిస్ట్- 5 *6.సర్వీసు మేనేజరు (డిప్లమో/ITI)-2 *7.సర్వీసు సూపర్‌వైజర్లు-5 (డిప్లమో/ITI) పైన తెలిపిన పోస్టులకు అభ్యర్థి అనుభవమును బట్టి జీతము నిర్ణయించబడును. సం/- మొబైల్/వాట్సప్‌నెం: 77999 09050/ 7799909066

ప్రముఖ లిఫ్ట్/ ఎలివేటర్ కంపెనీలో పనిచేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను Q: డిగ్రీ, కమ్యునికేషన్ స్కిల్స్ & మార్కెటింగ్ అనుభవం తప్పనిసరి. మంచి వాక్‌చాతుర్యం/ చురుకుదనం గల యువకులు కావలెను. జీతం+ ఇన్సెంటివ్స్+ఎకామిడేషన్ కూడా కలదు. ✆ 90305 54778.

Book your 5 lines Classified Colour Rs.1200/-
3Ads Package Rs.3250/-
5 lines Classified B/W Rs.1025/-
3Ads Package Rs.2575/-
ప్రకటనపై 5% జి.ఎస్.టి. అదనం
PH: 98496 97616

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

మచిలీపట్నం

•మచిలీపట్నం •పెడన

స్క్రబ్ టైఫస్ కేసులపై న్యాయమూర్తి ఆరా

మచిలీపట్నం కార్పొరేషన్: జిల్లాలో స్క్రబ్ టైఫస్ కేసులు నమోదు కావడంతో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కేవీఆర్ కృష్ణయ్య మచిలీపట్నం సర్వజన ఆసుపత్రి వైద్యులను ఆరా తీశారు. వ్యాధిని ఎదుర్కోవడానికి ఎలాంటి చర్యలు తీసుకున్నారు, అందుబాటులో ఉన్న చికిత్స తదితర అంశాలపై వివరణ ఇవ్వాలని కోరారు. దీనిపై ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.ఆశాలత తగు వివరణ ఇచ్చారు. వ్యాధి నిర్ధారణ పరీక్షలకు అవసరమైన కిట్‌లు అందుబాటులో ఉంచామని, ర్యాపిడ్ రెస్పాన్స్ టీంను నియమించినట్లు తెలిపారు. డా.నివేదిత నేతృత్వంలో పలువురు వైద్యులతో బృందాన్ని ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు ఆందోళన చెందకుండా ఆసుపత్రిలో ఉన్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని న్యాయమూర్తి ప్రజలకు పిలుపునిచ్చారు. ఏదైనా సమస్యలు ఉంటే న్యాయసేవాధికార సంస్థ దృష్టికి తీసుకొస్తే తగు చర్యలు తీసుకుంటామన్నారు.

ధర వరలు

టమాట 38, వంగ 20, బెండ 40, పచ్చిమిర్చి 42, కాకర 37, క్యాబేజీ 24, క్యారెట్ 42, దొండ 31, బంగాళదుంప 30, ఉల్లిపాయలు 24, గోరుచిక్కుడు 46, దోస 30, సొర 25,20, అరటికాయ 7,8, చిక్కుళ్లు 47, బీర 42, చామదుంప 26, మునగ 20/18, కంద 40, బీట్‌రూట్ 40, కీరదోస 32, బీన్స్ 80, క్యాప్సికం 72, అలసందలు 45, చిలకడదుంప 40, కొత్తిమీర 17/08, పుదీనా 15/05. మంగళవారం ఉదయం 7 గంటల వరకు ఈ ధరలు వర్తిస్తాయి.

- మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే

సినిమాలు

రేవతి: రివాల్వర్ రీటా, **మినీరేవతి:** ప్రేమంటే, **సిరి కృష్ణ:** రాజు వెడ్స్ రాంబాయి, **సిరివెంకట్:** ఆంధ్రాకింగ్ తాలూకా

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

మచిలీపట్నం : 80089 02911, పెడన : 63099 94687

? బ్రహ్మపురం వైఎస్ఆర్ కాలనీలో వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉంది. కాలనీ వాసులపై తరచూ దాడులకు పాల్పడుతున్నాయి. **- స్థానికురాలు** ✔ సమస్యను ఇప్పటికే గుర్తించాం. నియంత్రణకు చర్యలు తీసుకుంటాం.
- హరికిషోర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ? 216 జాతీయ రహదారిపై ప్రమాదాలు పెరుగుతున్నాయి. నియంత్రణకు చర్యలు చేపట్టడం లేదు. **- రమణ, బల్లిపర్రు**
✔ పెడన-కృత్తివెన్ను మధ్య వేగ నియంత్రికలు ఏర్పాటు చేశాం. హైవే పెట్రోలింగ్ విస్తృతం చేస్తాం.
- నాగేంద్రప్రసాద్, రూరల్ సీఐ –న్యూస్‌టుడే, పెడన

★ నగరంలోని సుకర్లాబాదలో ఖాళీ స్థలంలో ఆవరించిన పొదలతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను ఆ ప్రాంతవాసులు మేమున్నాం మీకుతోడుగా దృష్టికి తీసుకురాగా అధికారులకు వివరించడంతో స్థల యజమానులతో చెప్పి శుభ్రం చేయించారు.

స్పందనకు వందనం

★ నగరంలోని పంచాయతీరాజ్ కాలనీలో రహదారి పక్కన ఉన్న చెత్తను తొలగించకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను ఆ ప్రాంతవాసులు మేమున్నాం మీకు తోడుగా దృష్టికి తీసుకురాగా అధికారులకు వివరించడంతో సిబ్బంది చెత్తను తొలగించేలా చర్యలు తీసుకున్నారు.

- మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే

★ మండలంలోని మల్లేశ్వరంలో ప్రధాన వీధిలో మురుగు బోదె పూడుకుపోవడంతో నీరు రోడ్డు పైకి వచ్చి చేరుతోంది. సమస్య పరిష్కరించాలని కోరుతూ స్థానికులు మేమున్నాం మీకు తోడు ద్వారా పలుమార్లు మల్లేశ్వరం ఎంపీటీసీ సభ్యుడు పెపేటి వీరబాబు, జడ్పీటీసీ సభ్యురాలు మల్లిశెట్టి వెంకటరమణ, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా వారు స్పందించారు. జిల్లా పరిషత్ నిధులు సుమారు రూ.10లక్షలతో ప్రాధాన్యత మేరకు సీసీ డ్రైనేజీ నిర్మించారు.

- న్యూస్‌టుడే, బంటుమిల్లి

ఏసీ బస్సు సర్వీసులో 10 శాతం రాయితీ

భాస్కరపురం (మచిలీపట్నం), న్యూస్‌టుడే: మచిలీపట్నం నుంచి హైదరాబాద్ వెళ్లే ఏసీ బస్సు సర్వీసులో ఈ నెల 9వ తేదీ నుంచి 31వ తేదీ వరకు 10 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ పెద్దిరాజు సోమవారం తెలిపారు. మచిలీపట్నం నుంచి ఆదివారం వెళ్లే సర్వీసులో, హైదరాబాద్ నుంచి శుక్రవారం మచిలీపట్నం వచ్చే సర్వీసులో రాయితీ ఉండదని, మిగిలిన రోజుల్లో 10శాతం రాయితీ ఉంటుందని వివరించారు.

చౌక బియ్యం పట్టివేత

పెడన, న్యూస్‌టుడే: మండలంలోని నందిగామలో సోమవారం రాత్రి 9.30 గంటల ప్రాంతంలో రెవెన్యూ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. రేషన్ డీలర్ తోట సూర్యచంద్రరావుకు చెందిన ఇంటిలో 35 బస్తాల రేషన్ బియ్యాన్ని గుర్తించి సీజ్ చేశారు. ఈ బియ్యాన్ని పెడనలోని ట్రేడింగ్ మిల్లులో భద్రపరుస్తామని ఆర్ఐ ఈదే విజయలక్ష్మి తెలిపారు. దాడుల్లో పీడీఎస్ డిప్యూటీ తహసీల్దార్ కె.నాగమల్లేశ్వరరావు, వీఆర్వో గణేష్ తదితరులు పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామి ఆలయాల్లో ముగిసిన ఉత్సవాలు

మట్లం, నిడుమోలు (కృత్తివెన్ను): మండలంలోని మట్లం, నిడుమోలు గ్రామాల్లో నిర్వహిస్తున్న శ్రీఅభయాంజనేయస్వామి ఉత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఆలయ ప్రాంగణంలో అభిషేకాలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి భక్తులు ఉత్సాహంగా ముగించారు.

ఆధునికీకరించినా.. తీరని అవస్థలు!

న్యూస్‌టుడే, మచిలీపట్నం కార్పొరేషన్

మచిలీపట్నం ప్రధాన రైల్వేస్టేషన్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడంతో పాటు ఆదర్శ స్టేషన్‌గా తీర్చిదిద్దడంతో స్టేషన్ మళ్లీ పూర్వవైభవం సంతరించుకుంటుందని ఆశించారు. ప్రస్తుతం రైల్వేస్టేషన్‌ను ఆధునికీకరించినా ఇంకా తిష్ఠవేసిన పలు సమస్యలతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. పలుమార్లు అర్జీలు అందించినా పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

సమస్యలతో సతమతం..

మచిలీపట్నంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి వేల మంది ప్రయాణికులు వివిధ రైళ్ల ద్వారా రాకపోకలు సాగిస్తారు. ఈ స్టేషన్ నుంచి యశ్వంత్‌పూర్, బీదర్, విశాఖపట్నం తదితర ఎక్స్‌ప్రెస్ రైళ్లతో పాటు పెడన, గుడివాడ మీదుగా విజయవాడకు మరో 8 ప్యాసింజర్ రైళ్లు నడుస్తాయి. ఇలా రోజూ ఆ రైళ్ల ద్వారా సగటున 4వేల మందికి పైగా ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. గతంతో పోల్చుకుంటే ప్రయాణికుల సంఖ్య క్రమేపీ పెరుగుతోంది. కానీ దానికి తగ్గట్టుగా వసతులు లేకపోవడంతో స్టేషన్‌కు రావాలంటేనే వెనుకంజ వేసే పరిస్థితి నెలకొంది. స్టేషన్‌లో లిఫ్ట్ సౌకర్యం లేదు. దీనివల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మూడో ప్లాట్‌ఫామ్‌లో రైలు దిగి రావాలంటే ఎత్తయిన మెట్లు ఎక్కడానికి అవస్థలు పడుతున్నారు. వృద్ధులైతే రాలేని పరిస్థితి. స్టేషన్ ప్రాంగణంలో పలు పనులు అసంపూర్తిగా ఉన్నాయి.

లిఫ్ట్ సౌకర్యం లేని మచిలీపట్నం రైల్వేస్టేషన్

అలంకారప్రాయంగా రిజర్వేషన్ కేంద్రం

మచిలీపట్నం ప్రధాన రైల్వేస్టేషన్ దూరంగా ఉండడంతో ప్రయాణికులు టికెట్లు రిజర్వేషన్ చేయించుకునేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. దీనిని పరిష్కరించేందుకు 2007లో నగరంలోని రైతుబజారు సమీపంలో రిజర్వేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మచిలీపట్నం పరిసర ప్రాంతాలకు చెందిన ప్రయాణికులు ఈ కేంద్రాన్ని వినియోగించుకునేవారు. కొన్నేళ్లు కేంద్రం పనిచేసినా తరవాత వివిధ కారణాలతో మూసేశారు.

కిరాయికే.. రూ.వందలు

రోల్డ్‌గోల్డ్ పరిశ్రమల నిర్వాహకులతో పాటు కలంకారీ, ఆక్వా ఉత్పత్తుల వ్యాపారులు తదితరులు రోజూ వందల మంది మచిలీపట్నం నుంచి వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తారు. వారంతా రిజర్వేషన్ కోసం రైల్వేస్టేషన్‌కు వెళ్లాల్సి వస్తోంది. వ్యయ ప్రయాసలకు ఓర్చి అక్కడకు వెళ్లలేక, ఆన్‌లైన్ ద్వారా రిజర్వేషన్ చేసుకునే అవగాహన లేక ఇతరులను ఆశ్రయించాల్సి వస్తోందని వాపోతున్నారు. స్టేషన్‌కు వెళ్లాలంటే ఆటోలు, ఇతర వాహనదారులు రూ.వందల రూపాయిలు కిరాయి వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కేంద్రం తిరిగి ప్రారంభించాలని ఎంపీ బాలశౌరితో పాటు పలువురు రైల్వే ఉన్నతాధికారులకు అర్జీలు అందించారు. ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నందమూరులో స్వచ్ఛభారత్

పెడన, పెడన గ్రామీణ, న్యూస్‌టుడే: నందమూరు వాసవీ ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ స్వచ్ఛంద సేవలు ఈనెల 14 వరకు కొనసాగుతాయని ప్రోగ్రాం కోఆర్డినేటర్ అనిల్‌కుమార్ చెప్పారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఈ గ్రామంలోని ఇంటింటికి వెళ్లి స్వచ్ఛతపై తొలిరోజు అవగాహన కల్పించారు రహదార్లపై ఉన్న వ్యర్థాలను తొలగించి సంపద కేంద్రాలకు తరలించారు. జడ్పీ హైస్కూలు విద్యార్థులకు సామాజిక అంశాల్లో చైతన్యం కల్పించారు. యోగాలో శిక్షణ, హోమియోపతి శిబిరాలు, మంగినపూడి బీచ్‌లో వ్యర్థాల తొలగింపు, మహిళల భద్రత తదితర కార్యక్రమాలను దశలవారీగా చేపడతామని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ డా.బీఆర్ఎస్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డా.డి.రాజారమేశ్ తదితరులు పాల్గొన్నారు.

అవగాహన ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యార్థులు

పైడమ్మ ఉత్సవం.. అంతటా ఉత్సాహం

పెడన, న్యూస్‌టుడే: పెడన గ్రామదేవత పైడమ్మ తల్లి ఉత్సవాలు సోమవారం నాటికి 5వ రోజుకు చేరుకున్నాయి. ఈ నెల 14 వరకు ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. ఉత్సవ శోభతో విరాజిల్లుతున్న పైడమ్మ వారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివస్తున్నారు. శిడిబొమ్మలు అనే ప్రభలు ఊరేగింపు ఈ ఉత్సవాలలో ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది.

దర్శించిన ప్రముఖులు: భాజపా జిల్లా అధ్యక్షుడు తాతినేని శ్రీరామ్ సోమవారం అమ్మవారిని దర్శించుకున్నారు. హిందూ బంధువుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు నాదెళ్ల కోటేశ్వరరావు తదితరులు దర్శించిన వారిలో ఉన్నారు. స్థానిక భాజపా నేతలు సాదర స్వాగతం పలికారు. ఉత్సవ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వివిధ రకాల స్టాళ్లు, జెయింట్ వీల్ ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఉత్సవాల నేపథ్యంలో పట్టణంలో ట్రాఫిక్ అంతరాయం కలుగుతోంది.

పైడమ్మ తల్లిని దర్శించుకుంటున్న శ్రీరామ్

ప్రభలతో ఆలయానికి తరలివెళ్తున్న భక్తులు

ఉపన్యసించారు.. బహుమతులు సాధించారు

విజేతలతో హెచ్‌.ఎం., ఉపాధ్యాయులు

పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

గూడూరు, న్యూస్‌టుడే: ఈనాడు, ఈటీవీ ఆధ్వర్యంలో సోమవారం మండల పరిధిలోని మల్లవోలు జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రతిభాపాటవ పోటీలు నిర్వహించారు. విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం అనే అంశంపై విద్యార్థులకు ఉపన్యాస పోటీలు నిర్వహించగా వివిధ తరగతుల విద్యార్థినులు అధిక సంఖ్యలో పాల్గొని చరవాణి ఆవశ్యకత, అధికంగా వినియోగించడం వల్ల కలిగే శారీరక, మానసిక సమస్యలపై ఉపన్యసించి ఆకట్టుకున్నారు. ఈ పోటీల్లో బి.సాయిసాహితి (9వతరగతి), కె.కీర్తి నాగప్రియ(8వ తరగతి), ఏ.లక్ష్మీభావణి(8వతరగతి) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. విజేతలకు హెచ్‌ఎం సీహెచ్ మురళీకృష్ణతో పాటు ఉపాధ్యాయులు అబ్బరాజుపూడి సుబ్రహ్మణ్యం తదితరులు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ప్రతిభాపాటవ పోటీలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈనాడు సంస్థలు విద్యార్థులకు సామాజిక అంశాలపై అవగాహన కల్పించేలా పోటీలు నిర్వహించడం ప్రశంసనీయమన్నారు.

'కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా బిల్లులు'

బంటుమిల్లి, న్యూస్‌టుడే: కేంద్రంలో భాజపా ప్రభుత్వం పెట్టుబడిదారులకు, కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తోందని, సామాన్యుడికి, రైతులకు అవసరమైన బిల్లులను తీసుకురావడం లేదని రైతు సంఘం జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు అన్నారు. సోమవారం స్థానిక అంబేడ్కర్ కూడలి వద్ద రైతు సంఘం ఆధ్వర్యంలో సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన విత్తన, విద్యుత్తు సవరణ బిల్లులు 2025ను ఖండిస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు, లంకదాసుల అజయ్‌ఘోష్, మాజేటి శివశ్రీనివాసరావు, వెంట్రపాటి శ్యామ్‌సుందర్, బొడ్డు నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

అర్జీలు సకాలంలో పరిష్కరించాలి: కలెక్టర్

మచిలీపట్నం కార్పొరేషన్: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఇచ్చే అర్జీలను సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ పలువురు అధికారులతో కలిసి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. జిల్లాలో 284 అర్జీలను సంబంధిత అధికారులు ఇంకా చూడకపోవడం సరికాదని, వెంటనే వాటిని పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. 128 అర్జీలు గడువుదాటి ఉన్నాయని, అత్యంత ప్రాధాన్యతగా భావించి వెంటనే పరిష్కరించాలన్నారు. వాటిని ఆడిట్ కూడా చేయాలన్నారు. జేసీ ఎం.నవీన్, డీఆర్వో కె.చంద్రశేఖరరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

★ ఆర్టీసీకాలనీ మురళీకృష్ణ ఆసుపత్రి ఎదురు వీధిలో రోడ్డు, డ్రైనేజీ లేకపోవడంతో రాకపోకలకు ఇబ్బందికరంగా మారిందని, సీసీరోడ్డు నిర్మించాలని మహ్మద్ హసీనా, సీహెచ్ కోటేశ్వరి, చందన నాగేశ్వరరావు అర్జీ అందించారు.

బాడీ బిల్డింగ్ పోటీల్లో ఛాంపియన్‌గా నిలిచిన ప్రశాంత్ కలెక్టర్‌ను కలవగా సన్మానించారు.

ప్రభుత్వ పథకాలపై మత్స్యకారులకు అవగాహన

వన్నూరుకానూరు (మచిలీపట్నంరూరల్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై వన్నూరుకానూరులోని మత్స్యకారులకు సార్డ్స్ స్వచ్ఛంద సంస్థ సోమవారం అవగాహన కల్పించింది. జిల్లా తెలుగు రైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మత్స్యకారులు పని ప్రదేశాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పీపీ కిట్ల గురించి వివరించారు. సార్డ్స్ ప్రతినిధులు చంద్రశేఖర్, హరికృష్ణ, జి.ఎస్.రాజు, పి.సాంబయ్య, కూటమి నాయకులు పాల్గొన్నారు.

చేతి సంచులతో మత్స్యకారులు

శిక్షణతో తక్షణ ఉద్యోగావకాశాలు

పెడన, న్యూస్‌టుడే: ఇంటర్‌మీడియట్‌లో వృత్తి విద్యా కోర్సులకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని జిల్లా ఇంటర్ విద్యాధికారి ఎస్.సరళకుమారి తెలిపారు. పెడన బొడ్డు నాగయ్య, మచిలీపట్నం లేడియాంప్తిల్ కళాశాలల వృత్తి విద్యా కోర్సుల విద్యార్థులు పొందుతున్న ఒకేషనల్ జాబ్ ట్రైనింగ్‌ను సోమవారం ఆమె పరిశీలించారు. కేడీసీసీ పెడన బ్రాంచి, పెడన పీహెచ్‌సీల్లో శిక్షణ పొందుతున్న విద్యార్థుల అనుభవాలను తెలుసుకున్నారు.

మండల కేంద్రానికి రండి.. సమస్యలు చెప్పండి

పెడన: ప్రతి సోమవారం మండల రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ప్రజలు తమ వ్యక్తిగత, సామాజిక సమస్యలను లిఖిత పూర్వకంగా తీసుకురావాలని తహసీల్దార్ కె.అనిల్‌కుమార్ తెలిపారు. రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఇతర శాఖల అధికారులతో కలిసి పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి అర్జీని ఆన్‌లైన్ చేసి సంబంధిత శాఖకు పంపిస్తామని చెప్పారు. కొన్ని ముఖ్య శాఖల అధికారులు గైర్హాజరైనట్లు గుర్తించిన తహసీల్దార్ సంబంధిత అధికారులకు షోకాజ్‌లు జారీ చేస్తామని తెలిపారు.

వాలీబాల్ జట్టుకు కృష్ణావర్సిటీ విద్యార్థి ఎంపిక

కృష్ణావిశ్వవిద్యాలయం (మచిలీపట్నం), న్యూస్‌టుడే: దక్షిణ భారత వాలీబాల్ పురుషుల టోర్నమెంట్‌కు కృష్ణా విశ్వవిద్యాలయ విద్యార్థి ఎంపికయ్యారు. విశ్వవిద్యాలయ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి జి.మహేష్‌బాబు ఈ నెల 10 నుంచి 14వ తేదీ వరకు కాకినాడ జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో పోటీల్లో మహేష్‌బాబు పాల్గొంటారని ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఆర్.విజయకుమారి తెలిపారు. విద్యార్థితో పాటు వ్యాయామ ఉపాధ్యాయులు పరుచూరి గోపిని ఆమె అభినందించారు.

విద్యార్థితో ప్రిన్సిపల్, పీడీ

బీచ్ వాలీబాల్ జిల్లా జట్లు..

మంగినపూడి (మచిలీపట్నంరూరల్): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగినపూడిలో బీచ్ వాలీబాల్ జిల్లా జట్ల ఎంపిక కోసం సోమవారం పోటీలు నిర్వహించారు. అండర్-14, అండర్-17 విభాగాల్లో పోటీలు నిర్వహించామని, ప్రతిభ కనబరిచిన వారితో జిల్లా జట్లను ఎంపిక చేశామని ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి అరుణ తెలిపారు. వ్యాయామోపాధ్యాయులు నాంచారయ్య, రమేష్, గంగాధర్, బాబూరావు, భాష్యం, ముకుంద్ పోటీలను పర్యవేక్షించారు.

క్రీడాకారులతో సంఘ నాయకులు, వ్యాయామోపాధ్యాయులు

ప్రకృతి సేద్యం.. సంపూర్ణ ఆరోగ్యం

పెడన, న్యూస్‌టుడే: సహజసిద్ధ ఎరువులతో పండించిన పంటలు ప్రమాదకర వ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తాయని మండల పరిషత్తు ఏవో కటకం శివప్రసాద్ అన్నారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో సోమవారం ప్రకృతి సేద్య విధానంలో పండించిన కూరగాయల స్టాల్‌ను ఏర్పాటు చేశారు. రైతు సాధికార సంస్థ పెడన మండల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈస్టాల్‌ను సందర్శించిన ఏవో ఈ పంటలను ప్రజలు ప్రోత్సహించాలని సూచించారు. తద్వారా సంపూర్ణ ఆరోగ్యం సాధ్యపడుతుందన్నారు. ప్రతి సోమవారం తహసీల్దార్ లేదా మండల పరిషత్తు కార్యాలయాల్లో ఈస్టాల్ ఏర్పాటు చేస్తామని మండల యూనిట్ ఇన్‌ఛార్జి బి.వినుకొండ చెప్పారు. తొలిరోజు 40 కిలోల వివిధ రకాల కూరగాయల విక్రయాలు జరిగాయని పేర్కొన్నారు. డిప్యూటీ ఎంపీడీవో శ్యాం, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సేంద్రియ కూరగాయలు కొనుగోలు చేస్తున్న అధికారులు

ప్రాణాయామం.. వ్యాయామం అవసరం

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: ప్రస్తుత తరుణంలో విద్యార్థి దశ నుంచే ప్రాణాయామం, వ్యాయామం చేయడం అలవర్చుకోవాలని విజయవాడ యోగశక్తి సాధన సమితి ఛైర్మన్ డా.మాకాల సత్యనారాయణ అన్నారు. నగరంలోని ఎస్ఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో సోమవారం మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆక్యుపంక్చర్, ఆక్యుప్రెషర్ చికిత్సా విధానాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. శారీరక, మానసిక రుగ్మతల నుంచి దూరమయ్యేందుకు 13 నాడీ కేంద్రాల్లో ఆక్యుప్రెషర్ చేయడం ద్వారా మంచి ఫలితం ఉంటుందన్నారు. సంస్థ అధ్యక్షుడు జి.కిషోర్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ బాబాప్రసాద్, సంస్థ ప్రతినిధులు అయ్యప్పస్వామి, శాస్త్రి, రెడ్‌క్రాస్ సంస్థ జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సత్యనారాయణ

విద్యుత్తు విజిలెన్స్ తనిఖీలు

రూ.4.38లక్షల అపరాధ రుసుం విధింపు

పెడన, పెడన గ్రామీణ, న్యూస్‌టుడే: విద్యుత్తు విజిలెన్స్ అధికారులు సోమవారం పెడనలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మొత్తం 33 బృందాలుగా ఏర్పడి 3023 గృహ, 163 వాణిజ్య కేటగిరీ సర్వీసులను తనిఖీ చేశారు. పరిమిత లోడ్ కంటే అధికంగా 343 కేవీ విద్యుత్తును 255 మంది వినియోగిస్తున్నట్లు గుర్తించి రూ.4.38లక్షల అపరాధం విధించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈ తనిఖీలు జరిగాయి. ఆశాఖ జిల్లా ఎస్ఈ వి.వి.చిరంజీవి, ఈఈ జి.గోవిందరావు, విజిలెన్స్ ఈఈ సీహెచ్ వాసు పెడన డీఈఈ మాణిక్యాలరావు, ఏఈఈ కొండలరావు మచిలీపట్నం డివిజన్ పరిధిలోని డీఈఈలు, ఏఈఈలు, లైన్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు. విద్యుత్తు చౌర్యం నేరమని, ఎక్కడైనా జరుగుతుంటే 94408 12091, 94408 12362లో ఫిర్యాదు చేయాలని అధికారులు చెప్పారు. పెడన పట్టణం, మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో ఈ తనిఖీలు జరిగాయి.

వెంటనే వసతులు కల్పించాలి

మచిలీపట్నం (గొడుగుపేట): బందరు మండలం రుద్రవరం టిడ్కో గృహ సముదాయంలో వెంటనే వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. పలువురు లబ్ధిదారులు, వామపక్ష నాయకులు సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేయడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీ అందించారు. సీపీఎం నగర కార్యదర్శి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఇళ్లు కేటాయించి ఆరు నెలలైనా ఇప్పటికీ తాగునీటి సౌకర్యం కల్పించకపోవడంతో చాలా మంది అక్కడకు వెళ్లడానికి వెనుకంజ వేస్తున్నారని, అక్కడే నివాసం ఉంటున్నవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఆయనతోపాటు నాయకులు కొడాలి శర్మ, సీహెచ్ జయరావుతోపాటు లబ్ధిదారులు గృహసముదాయం వద్ద సమస్యలను వివరించారు.

నిరసనలో పాల్గొన్న నాయకులు, లబ్ధిదారులు

ఆశ్రమాల్లో సేవా కార్యక్రమాలు

భాస్కరపురం (మచిలీపట్నం): కృష్ణా యూనివర్సిటీ ప్రొఫెసర్ సల్మా అనాథ ఆశ్రమం, వృద్ధాశ్రమాల్లో సోమవారం సేవా కార్యక్రమాలు చేపట్టారు. సల్మా ఆర్థిక సహకారంతో హ్యూమానిటీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనాథ ఆశ్రమంలో చిన్నారులకు భోజనాలు పెట్టారు. చిలకలపూడిలోని అన్నపూర్ణ వృద్ధుల ఆశ్రమంలో 25 మంది వృద్ధ మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నూర్జహాన్, అజ్మతున్నీసా, సయ్యద్ నాజియా, డేవిడ్ పాల్గొన్నారు.

కార్మికులకు కనీస వేతనాలివ్వాలి

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. నాయకులు మోదుమూడి రామారావు, యర్రంశెట్టి ఈశ్వరరావు తదితరులు మాట్లాడుతూ మచిలీపట్నం నగరపాలక సంస్థలో పనిచేస్తున్న కార్మికులకు నెలనెలా జీతాలు సక్రమంగా అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఒప్పంద కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని, అనేక ఆందోళన కార్యక్రమాలు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఇచ్చే అంతంతమాత్రపు వేతనాలు నెలల తరబడి బకాయిలు ఉండడంతో కార్మికులు అప్పులు చేసి నెట్టుకురావాల్సి వస్తుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ తీసుకుని సక్రమంగా వేతనాలు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు ఒడుగు చైతన్యకుమార్, తాటిపర్తి రామకృష్ణ, కర్నాటి అర్జునరావు, యర్రంశెట్టి శ్రీమన్నారాయణ, గుర్రం దుర్గారావు, యర్రంశెట్టి వెంకటేశ్వరరావు, వజీర్ తదితరులు పాల్గొన్నారు.

నిరసనలో పాల్గొన్న నాయకులు, కార్మికులు

ఉద్యోగుల సమస్య పరిష్కరించండి

బంటుమిల్లిలో మేనేజర్ నాగలక్ష్మికి వినతిపత్రం ఇస్తున్న పీఏసీఎస్‌ల సిబ్బంది తదితరులు

బంటుమిల్లి, న్యూస్‌టుడే: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని నాయకులు అన్నారు. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు సోమవారం స్థానిక కేడీసీసీ బ్యాంక్ వద్ద మండల పరిధిలోని పీఏసీఎస్‌ల ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం మేనేజర్ నాగలక్ష్మికి వినతిపత్రాలు అందించారు. జీవో నంబర్ 36ను వెంటనే అమలు పర్చాలని కోరారు. పెండింగులో ఉన్న వేతన సవరణలు చేయాలని కోరారు. మధ్యంతర భృతి ఇవ్వాలని, చట్ట ప్రకారం గ్రాట్యుటీ చెల్లింపులు చేయాలని డిమాండ్ చేశారు. నాగిని, జయలక్ష్మీ, ఉదయభాస్కర్, వాసు, సత్యనారాయణ, శంకర్, సీఐటీయూ నాయకులు మాజేటి శివశ్రీనివాసరావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు, లంకదాసుల అజయ్‌ఘోష్, తదితరులు పాల్గొన్నారు.

పెడన, న్యూస్‌టుడే: దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ పీఏసీఎస్ ఉద్యోగులు సోమవారం స్థానిక కేడీసీసీ బ్యాంకు ఎదుట నిరసన తెలిపారు. తమ న్యాయపరమైన డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జీవో నం.36 రద్దు, రూ.20లక్షల ఆరోగ్య బీమా, పీఆర్సీ అమలు తదితర డిమాండ్లను ప్రభుత్వం ఎదుట ఉంచారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ నిరసన జరిగింది. ప్రభుత్వం స్పందించకుంటే దశలవారీగా ఆందోళన తీవ్రతరం చేస్తామని స్పష్టం చేశారు. ఉద్యోగుల సంఘ నేతలు జన్యావుల రామాంజనేయులు, మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

కేడీసీసీ బ్యాంకు ఆవరణలో ఉద్యోగుల నినాదాలు

ప్రథమ చికిత్స మాత్రమే చేయాలి

మాట్లాడుతున్న ఆంజనేయులు

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: ఆర్ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు బీఎస్సార్ ఆంజనేయులు అన్నారు. సోమవారం నగరంలోని బెల్ ఆడిటోరియంలో గ్రామీణ వైద్యుల అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. క్లినిక్‌లలో పడకలు ఏర్పాటు చేయకూడదని, రక్త, మూత్ర తదితర పరీక్షలు నిర్వహించరాదన్నారు. ఆయనతో పాటు సంఘ నాయకులు పీఎస్ఐ ఖాన్, ఎ.కోటేశ్వరరావు, సందీప్‌కుమార్, డేవిడ్‌రాజు, దుర్గారావు, హరిప్రసాద్, అర్జునరావు, మల్లిఖార్జునుడు తదితరులు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు.

(c) eenadu

గుడివాడ
•గుడివాడ •పామర్రు •అవనిగడ్డ

బాధితురాలికి నగదు, దుస్తులు అందజేస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే భరోసా

అవనిగడ్డ, న్యూస్‌టుడే: చల్లపల్లి మండలం, లక్ష్మీపురం శివారు రామానగరానికి చెందిన యర్రారపు లక్ష్మీతిరుపతమ్మ, వీరాంజనేయులుకు చెందిన పూరి గృహం ఇటీవల అగ్నిప్రమాదంలో పూర్తిగా కాలిపోగా కట్టు బట్టలతో మిగిలారు. బాధితులు సోమవారం ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌ను కలిసి ప్రభుత్వం ద్వారా గృహం మంజూరు చేయించమని కోరారు. ఎమ్మెల్యే స్పందించి వారికి గృహాన్ని మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చి, వారికి రూ.5 వేలు నగదు, దుస్తులు, దుప్పట్లు పంపిణీ చేసి ధైర్యం చెప్పారు.

సాగునీరు లేక రైతుల అవస్థలు

వెంకటపురం(మోపిదేవి), న్యూస్‌టుడే: 11/1 బ్రాంచి కాల్వకు సాగునీటిని విడుదల చేయాలని రైతులు సోమవారం డిమాండ్ చేశారు. కాలవ పరిధిలో 600 ఎకరాల ఆయకట్టు ఉందని, హార్వెస్టర్ యంత్రంతో వరి నూర్పిళ్లు పూర్తి అయిందని, మినుము విత్తేందుకు దమ్ములు చేయాల్సి ఉందని చెబుతున్నారు. నీరు విడుదల లేక దమ్ము చేయలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మినుము విత్తే సమయం దాటిపోతోందని, ఇరిగేషన్ అధికారులు సకాలంలో స్పందించి నీరు తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

సాగునీరు లేని బ్రాంచి కాల్వ

గౌతమబుద్ధుని చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సభ్యులు

బుద్ధ భగవానునికి నివాళి

పామర్రు, న్యూస్‌టుడే: గౌతమబుద్ధుడు జ్ఞానోదయం పొందిన బోధి దినోత్సవం నుంచి ప్రతి ఒక్కరూ స్ఫూర్తి పొందాలని బోధి తత్వ ఫౌండేషన్ అధ్యక్షుడు ఇంతేటి వెంకట్ అన్నారు. సోమవారం స్థానిక ఫౌండేషన్ కార్యాలయంలో సోమవారం బుద్ధ భగవానుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘ కార్యదర్శి గంగాధర్, పి.ఎం.ఎస్.ప్రసాద్, కాకి కిరణ్‌కుమార్, రాయవరపు వెంకటేశ్వరరావు, మద్దాలి అశోక్, తదితరులు పాల్గొని బుద్ధుని ఆశయానికి ప్రతిజ్ఞ చేశారు.

నిధులు రాక... నిలిచిపోయిన పనులు

మండలంలోని కొతవరంలో సచివాలయం 2 పరిధిలోని గ్రామీణ ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణ పనులు నిలిచిపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. 2019లో అప్పటి వైకాపా ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి గ్రామీణ ఆరోగ్య కేంద్రం నిర్మించతలపెట్టింది. 2020లో నూతన భవన నిర్మాణ పనులు చేపట్టింది. కొతవరంలో ఆంధ్రలక్ష్మీ రైస్ మిల్ రోడ్డులో రూ.21.50 లక్షల వ్యయంతో భవన నిర్మాణం చేపట్టగా బేస్‌మెంట్ వరకూ పనులు నిర్వహించారు. ఐతే, నిధులను ప్రభుత్వం మంజూరు చేయకపోవడంతో గుత్తేదారు పనులు నిలిపివేశారు. తర్వాత నిధులిస్తామని చెప్పడంతో శ్లాబ్ వేశారు. బిల్లులు రాకపోవడంతో మళ్లీ పనులు నిలిచిపోయాయి. దీంతో నాలుగేళ్లుగా మొండి భవనంలా మారి రాత్రిళ్ల అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. కూటమి ప్రభుత్వం చొరవ తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.
– కొతవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే

పంచాయతీలకు ఐఎస్‌ఓ సర్టిఫికెట్ల అందజేత

నాగాయలంక, న్యూస్‌టుడే: నాగాయలంక గ్రామ పంచాయతీ ద్వారా ప్రజలకు అత్యుత్తమ సేవ లందించినందుకు ఐఎస్‌ఓ సర్టిఫికెట్ దక్కింది. మచిలీపట్నంలోని కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, జిల్లా పంచాయతీ అధికారిణి డాక్టర్ అరుణ నుంచి ఐఎస్‌ఓ 9001-2015 సర్టిఫికెట్‌ను పంచాయతీ కార్యదర్శి పవన్‌కుమార్, సర్పంచి కైతేపల్లి అంకాలు అందుకున్నారు. జిల్లా అధికారులు నాగాయలంక పాలకవర్గాన్ని అభినందించారు.

కలెక్టర్ నుంచి ఐఎస్‌ఓ సర్టిఫికెట్లు అందుకుంటున్న ఈవోలు పవన్‌కుమార్, మాధవేంద్రరావు

చల్లపల్లి, న్యూస్‌టుడే: చల్లపల్లి గ్రామ పంచాయతీకి ఐఎస్‌ఓ సర్టిఫికెట్ లభించగా, సోమవారం మచిలీపట్నంలో పంచాయతీ కార్యదర్శి పి.వి. మాధవేంద్రరావు అందుకున్నారు. క్లీన్ అండ్ గ్రీన్, సచివాలయ, పంచాయతీ రికార్డుల నిర్వహణలకుగానూ ఎంపికైనట్లు ఈవో తెలిపారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు

ఘంటసాల: బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థినులు ఎన్ఎస్ఎస్ స్వచ్ఛంద సేవ కార్యక్రమాలలో భాగంగా ఘంటసాల యువీఆర్ గొర్రెపాటి స్కూల్ విద్యార్థులకు చిత్రలేఖనం, క్విజ్ పోటీలను సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జి. విజయకుమార్, డాక్టర్ సి.సంధ్యారాణి, డాక్టర్ ఏజే సువర్ణలత, ప్రిన్సిపల్ లోయ నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. స్థానిక గ్రంథాలయం సందర్శించి గ్రంథాలను, కంప్యూటర్లను పరిశీలించారు. గ్రంథాలయ అధికారి ఎం.శరత్‌కుమార్ పాల్గొన్నారు.

చిత్రలేఖన పోటీలో పాల్గొన్న గొర్రెపాటి స్కూల్ విద్యార్థులు

ప్రజా సేవకురాలు థెరీసా మృతి

అవనిగడ్డ, న్యూస్‌టుడే: అవనిగడ్డలో ప్రజాశక్తి విద్యా సంఘం అధ్యక్షురాలిగా పేదలకు గృహ నిర్మాణాలు, విద్యా, సాంకేతిక శిక్షణ, తదితర సేవలందించిన థెరీసా (82) సోమవారం ఉదయం మంగళగిరిలో ఓ ఆసుపత్రిలో అనారోగ్యంతో మరణించారు. ఆమె మృతదేహాన్ని స్థానిక ఆర్సీఎం చర్చికి తీసుకువచ్చి ఆపై సమీపంలో ఆమె భర్త మృతదేహాన్ని ఖననం చేసిన చోటే ఖననం చేశారు. ఆమె కుమారుడు ప్రశాంత్ తన సహ విద్యార్థి కావడంతో పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అవనిగడ్డ వచ్చి నివాళులర్పించారు. అనంతరం థెరీసా పాడె మోశారు. ఏఎంసీ ఛైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, తెదేపా జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు మాచవరపు ఆదినారాయణ, దిరిశం బాలకోటయ్య, తదితరులు పాల్గొన్నారు.

థెరీసా పాడె మోస్తున్న పామర్రు ఎమ్మెల్యే కుమార్‌రాజా

వ్యాసరచన పోటీల్లో ప్రతిభ

పామర్రు, న్యూస్‌టుడే: పామర్రు జమాతే ఇస్లామి హింద్ వారు నిర్వహించిన మానవ హక్కుల గురించి వ్యాసరచన పోటీల్లో ఏఎన్ఎం పాఠశాల విద్యార్థి దివ్య ప్రథమ స్థానం సాధించింది. సోమవారం పాఠశాలలో ఏర్పాటుచేసిన ఒక కార్యక్రమంలో ప్రిన్సిపల్ పూర్ణచంద్రారెడ్డి ఆమెను అభినందించారు.

రావెళ్ల కృష్ణ సేవాసమితి సాయం

చల్లపల్లి, న్యూస్‌టుడే: చల్లపల్లి మండలం రామానగరంలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన యర్రారపు వీరాంజనేయులు కుటుంబానికి రావెళ్ల కృష్ణ సేవాసమితి ఛైర్మన్ రావెళ్ల ఉదయ్‌కుమార్ రూ.10వేలు ఆర్థికసాయాన్ని సోమవారం అందచేశారు. గొరిపర్తి సుబ్బారావు, రావెళ్ల విజయ్, ఉప్పాల బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారు కుటుంబీకులతో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

సంక్షేమం ఆగకుండా చంద్రబాబు పాలన

గుడివాడ, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు సంక్షేమం ఆగకుండా పరిపాలన సాగిస్తున్న మహోన్నత పరిపాలనాదక్షుడని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. స్థానిక ప్రజా వేదికలో 20 మంది అనారోగ్య బాధితుల కుటుంబాలకు రూ.10.05 లక్షల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను సోమవారం పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 18 నెలల్లో గుడివాడలో రూ.3.41 కోట్లను ముఖ్యమంత్రి సహాయనిధిగా పంపిణీ చేశామన్నారు. జనసేన బాధ్యుడు బూరగడ్డ శ్రీకాంత్, పట్టణ తెదేపా అధ్యక్షుడు దింట్యాల రాంబాబు, ముళ్లపూడి రమేష్ చౌదరి, కంచర్ల సుధాకర్, పండ్రాజు సాంబయ్య, గోకవరపు సునీల్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళాలు

తాడంకి(పమిడిముక్కల), న్యూస్‌టుడే: తాడంకిలో నిర్మిస్తున్న శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయ నిర్మాణానికి స్థానికులు చలపాటి రెడ్డియ్య రూ.1,02,000, పరిశె శ్రీనివాసరావు రూ.1,01116, పురిటిగడ్డకు చెందిన తాతా నరేంద్ర రూ.20వేలు ఇచ్చినట్టు సర్పంచి జంపాన ధనలక్ష్మి తెలిపారు.

యూత్ ఫెస్టివల్ విజేతలకు అభినందన

గుడివాడ, న్యూస్‌టుడే: కృష్ణా తరంగ్ యూత్ ఫెస్టివల్‌లో అక్కినేని నాగేశ్వరరావు కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చి విజేతలుగా నిలిచారని ప్రిన్సిపల్ డాక్టర్ పీజేఎస్.కుమార్ పేర్కొన్నారు. విజేతలను సోమవారం అభినందించారు. స్పాట్ పెయింటింగ్‌లో ఎస్.నాగసాయి, వాద్య సంగీతంలో సంజన ప్రతిభ కనబరిచారన్నారు. కరస్పాండెంట్ కేఎస్.అప్పారావు, అధ్యక్షుడు ఎల్ఆర్‌కే.ప్రసాద్, తదితరులు అభినందించారు.

విజేతలను అభినందిస్తున్న ఏఎన్నార్ కళాశాల పాలకవర్గం

విఘ్నేశ్వరుని దేవస్థానంలో శ్రీలక్ష్మీగణపతి హోమం

గుడివాడ, న్యూస్‌టుడే: గుడివాడ మెయిన్ రోడ్డులోని శ్రీ విఘ్నేశ్వరస్వామివారి దేవస్థానంలో సంకటహర చతుర్థి పర్వదినాన్ని పురస్కరించుకుని లోక కళ్యాణార్థం శ్రీ లక్ష్మీగణపతి హోమం సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా 100 మంది దంపతులు ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ శాయన రాజేష్, ఈవో యార్లగడ్డ వాసు, కమిటీ సభ్యులు లోయ వాసు, పంచుమర్తి శ్రీనివాసరావు, రమణమూర్తి, పోతురాజు, వీరమాచనేని శైలజ, విజయలక్ష్మి, శారద, దుర్గాభవానీ, గణపతి శాస్త్రి, పాల్గొన్నారు.

హోమ గుండం వద్ద ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు

పరిశుభ్రతే వ్యాధి నివారణకు కీలకం

గుడ్లవల్లేరు, న్యూస్‌టుడే: పరిసరాల పరిశుభ్రతే వ్యాధి నివారణకు కీలకమని వైద్యులు యశస్విని పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఇందిరాకాలనీలో స్క్రబ్ టైఫస్ వ్యాధికి గురైన బాధితురాలిని ఆమె, ఎంపీడీవో ఇమ్రాన్ పరిశీలించారు. అందుతున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం కుదుటపడినట్లు బాధితురాలు వారికి వివరించింది. పురుగు కుట్టిన చోట నల్లమచ్చను వారు పరిశీలించారు. మురుగునీటి కుంటలు, పేడకుప్పలు, చెత్తపోగుల వద్ద ఈ వ్యాధికారక కీటకం ఉంటుందని, అందరూ శుభ్రత పాటించాలని సూచించారు.

బాధితురాలితో మాట్లాడుతున్న వైద్యులు యశస్విని, ఎంపీడీవో ఇమ్రాన్

అప్రమత్తంగా ఉండాలి

గుడివాడ, న్యూస్‌టుడే: గుడివాడ నియోజకవర్గంలోని గ్రామాలలో స్క్రబ్ టైఫస్ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. ఈమేరకు వైద్య శాఖ అధికారులతో సమీక్షించారు. వైద్యులు శ్రావ్య, దీప్తి, మంజూష, సాయికిరణ్, తేజ తదితరులు పాల్గొన్నారు.

స్వల్పకాలిక పంటలపై దృష్టి

మోపిదేవి, న్యూస్‌టుడే: మొంథా తుపాన్‌తో జీవం కోల్పోయిన కృష్ణానదీ పరివాహక పంటపొలాలు బీడయ్యాయి. రైతన్నలకు జరిగిన నష్టానికి ప్రభుత్వం పెట్టుబడి సాయం ఇస్తుందని ఆశగా చూసినా ఫలితం లేకుండా పోయింది. మిగిల్చిన నష్టాన్ని పూడ్చుకునే ప్రయత్నంలో మూడునెలల్లోనే దిగుబడి వచ్చే వాటిపై మొగ్గు చూపుతున్నారు. అందుకే స్వల్పకాలిక పంటలపై దృష్టి సారించారు. మినుము, మొక్కజొన్న, ఉద్యానపంటలైన బీర, బెండ, వంగ, టమాట, మిర్చి, తీగ జాతి కూరగాయల సాగును చేపట్టారు. మోపిదేవివార్పు నుంచి యనమదలకుదురు వరకు నదీతీర పంటపొలాలు హరితహారంలా కనువిందు చేస్తున్నాయి.

కళకళలాడుతున్న మొక్కజొన్న పంట

పందుల సంచారంతో ఇక్కట్లు

స్థానిక మూడో వార్డు గుర్రపుచెరువు మలుపులో చెత్తకుప్పలు తొలగించక పోవడంతో వాటిలో పందుల సంచారంతో దుర్వాసన వెలువడుతోందని ఆ ప్రాంత ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెత్తకుప్పలు వెంటనే తొలగించరని, పందులను నివారించరని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనివలన అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని భయపడుతున్నారు. **- అవనిగడ్డ, న్యూస్‌టుడే**

కల్వర్టుపై సిమెంట్ స్లాబ్ ఏర్పాటు

ఈనాడు కథనానికి స్పందన

గుడివాడ పట్టణం సత్యనారాయణపురం నలంద ఉన్నత పాఠశాల సమీపంలో కల్వర్టుపై నిర్మించిన సిమెంట్ స్లాబ్ కుంగిపోవడంతో తాత్కాలికంగా చెట్టు కొమ్మను ఏర్పాటు చేశారు. రాత్రి సమయంలో గుంతను 'గమనించకపోతే ప్రమాదమే సుమా' అన్న శీర్షికతో ఈనాడులో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించి నూతన సిమెంట్ స్లాబ్‌ను ఏర్పాటు చేశారు. భారీ వాహనాలు ఈ రహదారి వెంబడి ప్రయాణాలు సాగించకుండా చర్యలు తీసుకున్నారు. **- గుడివాడ (సత్యనారాయణపురం), న్యూస్‌టుడే**

ఉర్దూ పాఠశాలకు మోటారు వితరణ

మేడూరు(పమిడిముక్కల), న్యూస్‌టుడే: తమ పాఠశాలలో మోటారు చెడిపోయి గత కొన్ని వారాలుగా విద్యార్థులకు తాగునీరు సమస్యగా మారిందన్న సమాచారంపై స్పందించిన ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ రూ.5వేలతో మోటారు ఏర్పాటు చేశారని మేడూరులోని ఉర్దూ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మీర్జా అస్కర్ అబ్బాస్ తెలిపారు. గుమ్మడి సోమవారం స్థానికుల అభ్యర్థనపై ఉర్దూ పాఠశాల, మసీదును సందర్శించారు. మసీదు ప్రహరీ నిర్మాణం అవసరమని స్థానికులు తెలుపగా అధికారులతో సంప్రదించి తగు ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. పాఠశాల అవసరాలను తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు.

మసీదు పెద్దలతో మాట్లాడుతున్న గుమ్మడి

లయన్స్ క్లబ్‌కు అవార్డులు

గుడ్లవల్లేరు, న్యూస్‌టుడే: స్థానిక లయన్స్‌క్లబ్ జిల్లాస్థాయిలో పలు అవార్డులను అందుకున్నట్లు మాజీ జిల్లా గవర్నర్ వైపీసీ ప్రసాద్ వెల్లడించారు. విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా గవర్నర్ గద్దే శేషగిరి నుంచి ఉత్తమ యోగా, కంటి తదితర సేవలతో పాటు జీవిత సాఫల్య పురస్కారాన్ని వైపీసీ అందుకున్నారు.

అవార్డు అందుకుంటున్న వైపీసీ ప్రసాద్

ఖోఖో సంఘం అధ్యక్షుడిగా ప్రసాద్

గుడివాడ(సత్యనారాయణపురం), న్యూస్‌టుడే: గుడివాడ పట్టణానికి చెందిన విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు మడకా ప్రసాద్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఖోఖో సంఘం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈమేరకు ఆయన్ను గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, ఎన్టీఆర్ స్టేడియం కమిటీ సభ్యులు యలవర్తి శ్రీనివాసరావు, కిలారపు రంగప్రసాద్, గౌతమ్ స్కూల్ డైరెక్టర్ కె.గౌతమ్, ఖోఖో జిల్లా కార్యదర్శి మద్దినేని సత్యప్రసాద్‌లు అభినందనలు తెలియజేశారు.

పురాతన ఆలయాన్ని అభివృద్ధి చేసుకుందాం

నాగాయలంక, న్యూస్‌టుడే: శతబ్దాల చరిత్ర కలిగిన శ్రీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయాన్ని సమష్టిగా అభివృద్ధి చేసుకుందామని గ్రామ ప్రముఖులు ఏకాభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. నాగాయలంకలో జీర్ణోద్ధరణలో ఉన్న ఆలయం అభివృద్ధికి దేవాదాయ శాఖ సర్వ శ్రేయోనిధి నుంచి రూ.ఒక కోటి మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో మాజీ సర్పంచి మండవ బాలవర్ధిరావు అధ్యక్షతన సోమవారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ ఏర్పాటైంది. సీహెచ్.వెంకట రాయిజీ ధవేజీ, చెన్ను లక్ష్మణరావు, రాచంశెట్టి పాపారావు, చిట్టా వీర అన్నపూర్ణయ్య, సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

వంతెనకు అప్రోచ్ రహదారి వేయండి

చల్లపల్లి, న్యూస్‌టుడే: చల్లపల్లి మండలం వెలివోలు కరకట్ట వంతెనకు అప్రోచ్ రహదారిని ఏర్పాటు చేయాలని కృష్ణాజిల్లా బీసీ సంఘం ఉపాధ్యక్షులు బొల్లా ఫణిబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మాట్లాడుతూ వంతెన నిర్మించి 12 సంవత్సరాలు అయినా అప్రోచ్‌రోడ్డు వేయకపోవడంతో తరచూ ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. గ్రామస్థులు బొల్లా సహదేవుడు, మురాల వెంకటేశ్వరరావు, వేకనూరు బాబూరావు, బొల్లా పెద్దఫకీరు, నాంచారయ్య పాల్గొన్నారు.

స్వచ్ఛ రథాన్ని సద్వినియోగం చేసుకోవాలి

అంగలూరు(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే: స్వచ్ఛరథాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, నిర్ణీత సమయంలో షెడ్యూల్ ప్రకారం గ్రామాలకు వస్తుందని ఎంపీడీవో ఇమ్రాన్ పేర్కొన్నారు. సోమవారం అంగలూరు గ్రామంలో ఆయన పరిశీలించి సూచనలు చేశారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణను విరమించాలి

ఘంటసాల, న్యూస్‌టుడే: ప్రభుత్వ వైద్య కళాశాలలు ప్రైవేటీకరణను ప్రభుత్వం విరమించుకోవాలని జడ్పీటీసీ సభ్యుడు తుమ్మల మురళీకృష్ణ అన్నారు. సోమవారం గోగినేనిపాలెంలో సర్పంచి కుంపటి సుశీల అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరిస్తే ప్రతిభగల పేద విద్యార్థులు ఫీజులు కట్టుకోలేక వైద్య విద్యకు దూరమవుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ ఛైర్మన్ వేమూరి వెంకట్రావు, ఏఎంసీ డైరెక్టర్ కుంపటి శరత్, తదితరులు పాల్గొన్నారు.

పోయినవి

గుడివాడ పట్టణం మార్కెట్ సెంటర్‌లో నివసిస్తున్న ఈదుపల్లి అప్పారావు S/o. జగ్గారావుకు సంబంధించిన ఆస్తి దస్తావేజు నెం. 5687/2012 జిరాక్స్ నిమిత్తం ది. 25-10-2025న ఇంటి దగ్గర నుండి వెళ్ళుచుండగా దారి మధ్యలో పోయినవి. ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్సుకు తెలియజేయగలరు. తగిన పారితోషికం ఇవ్వబడును.

ఇట్లు: **ఈదుపల్లి అప్పారావు**
S/o. జగ్గారావు, మార్కెట్ సెంటర్,
గుడివాడ. సెల్: **87904 94334**

పాల ఉత్పత్తిదారుల సంక్షేమమే సొసైటీ లక్ష్యం

పామర్రు, న్యూస్‌టుడే: పాల ఉత్పత్తిదారుల సంక్షేమమే లక్ష్యంగా కృష్ణామిల్క్ యూనియన్ పనిచేస్తుందని యూనియన్ జిల్లా ట్రస్టుబోర్డు సభ్యుడు బొమ్మారెడ్డి కృష్ణారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక సొసైటీ కార్యాలయంలో పాల శీతలీకరణ మేనేజర్ దామోదర కృష్ణ గోపీనాథ్‌తో కలిసి పాల ఉత్పత్తిదారులకు బోనస్ పంపిణీ చేసి మాట్లాడారు. వేతన కార్యదర్శి హరి, పాడి రైతులు పాల్గొన్నారు.

ప్రజల నుంచి అర్జీల స్వీకరణ

పామర్రు, న్యూస్‌టుడే: ప్రజలకు జవాబుదారీతనంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని పామర్రు ఎమ్మెల్యే కుమార్‌రాజా అన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్‌లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. 36 అర్జీలు వచ్చాయని, 11 అర్జీలను సత్వరం పరిష్కరించామన్నారు.

కొత్త వంతెనపై వీధి దీపాల ఏర్పాటుకు వినతి

గుడ్లవల్లేరు, న్యూస్‌టుడే: గుడ్లవల్లేరు, కూరాడ, కౌతవరం గ్రామాల మధ్యలో పుల్లేరుపై ఉన్న స్థానిక కొత్తవంతెనపై వీధి లైట్లు లేక ప్రయాణికులు, గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారని చినగొన్నూరు సర్పంచి కోటప్రోలు నాగు, వైకాపా నాయకులు లింగం జాన్‌బెన్ని తదితరులు తెలిపారు. దీపాలు ఏర్పాటు చేయాలని ఎంపీఈవో ఇమ్రాన్‌కు వినతిపత్రం అందజేశారు.

నిషేధిత లాటరీ టికెట్ల విక్రేతల అరెస్టు

గుడివాడ, న్యూస్‌టుడే: గుడివాడ పట్టణంలో నిషేధిత లాటరీ టికెట్లను విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను గుడివాడ వన్‌టౌన్, టూటౌన్ పోలీసులు సోమవారం రాత్రి అరెస్టు చేశారు. పెద్ద వీధికి చెందిన దేవనబోయిన గోపాలకృష్ణను సీఐ కొండపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో అరెస్టు చేసి, 18 లాటరీ టికెట్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. చెంచుకాలనీకి చెందిన కెల్లా చిన్నారావు టికెట్లు అమ్ముతుండగా అరెస్టు చేశారు. ఎస్.ఐ లోవరాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సహకార సంఘాల ఉద్యోగుల ధర్నా

గుడివాడ, న్యూస్‌టుడే: ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలలో పనిచేసే ఉద్యోగుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని కోరుతూ పలు డిమాండ్లతో పీఏసీఎస్ ఉద్యోగులు కృష్ణా జిల్లా కేంద్ర సహకార బ్యాంకు వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా రాష్ట్ర పీఏసీఎస్ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు టీసీఎస్ హనుమంతరావు మాట్లాడుతూ ఉద్యోగులకు తక్షణం గ్రాట్యుటీ చట్టం అమలు చేయాలని, వెంటనే 36వ జీవోను అమలులోనికి తేవాలని, పదవీ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలన్నారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు మేనేజరు మాధవికి డిమాండ్లతో కూడిన వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌సీపీ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు రమేష్, హరీష్, సుజాత పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు, న్యూస్‌టుడే: స్థానిక కేడీసీసీ బ్యాంక్ వద్ద సోమవారం మండలంలోని 9 సహకార సంఘాల ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. గుడ్లవల్లేరు, కౌతవరం, వడ్లమన్నాడు, వెణుతురుమిల్లి, చంద్రాల, విన్నకోట, డోకిపర్రు, శేరికల్వపూడి, పెంజెంద్ర సొసైటీల కార్యదర్శిలు, ఉద్యోగులు ఈ ధర్నాలో పాల్గొన్నారు.

గుడివాడ: సహకార బ్యాంకు వద్ద నినాదాలు చేస్తున్న ఉద్యోగులు

చల్లపల్లిలో నిరసన తెలుపుతున్న పీఏసీఎస్ ఉద్యోగులు చంద్ర రవికుమార్, తోట కృష్ణారావు, తదితరులు

నాగాయలంక, న్యూస్‌టుడే: సోమవారం స్థానిక కేడీసీఎస్ బ్యాంక్ వద్ద మండలంలోని ఆరు మండలాల పీఏసీఎస్ ఉద్యోగులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ, నినాదాలు చేశారు. ఉద్యోగ సంఘ నాయకులు కేవీ రామాంజనేయులు, శ్రీనివాసరావు, కె.రాజేష్, కె.ఆనందబాబు పాల్గొన్నారు.

మొవ్వ(కూచిపూడి)న్యూస్‌టుడే: కూచిపూడి, మొవ్వ, మొవ్వపాలెం, కోసూరు, కాజ, చినముత్తేవి, అయ్యంకి సహకార సంఘాల సిబ్బంది మొవ్వ సహకార బ్యాంకు వద్ద, అవురుపూడి, మంత్రిపాలెం ఉద్యోగులు గూడూరు కోఆపరేటివ్ బ్యాంకు వద్ద ధర్నా నిర్వహించారు.

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే : తోట్లవల్లూరు మండలంలో ఐదు సంఘాలకు చెందిన సహకార ఉద్యోగులు సోమవారం తోట్లవల్లూరు గ్రామంలోని పీఏసీఎస్ బ్యాంక్ వద్ద ధర్నా చేశారు.

వీరంకిలాకు(పమిడిముక్కల), న్యూస్‌టుడే: వీరంకిలాకు బ్యాంకు పరిధిలోని అగినపర్రు, అమీనపురం, చోరగుడి, ధూళిపూడిపాలెం, చోరగుడి, ఐలూరు, కపిలేశ్వరపురం, మేడూరు, పమిడిముక్కల కృష్ణాపురం సహకార సంఘాల ఉద్యోగులు ధర్నా నిర్వహించారు.

వెంట్రప్రగడలో తెదేపా నేతల మధ్య వివాదం

పెదపారుపూడి, న్యూస్‌టుడే: గత కొంతకాలంగా వెంట్రప్రగడ గ్రామంలో రెండు వర్గాలుగా చీలిపోయిన తెదేపా నేతల మధ్య వివాదం నెలకొంది. ఆదివారం రాత్రి తెదేపా కార్యాలయంలో ఓ వర్గం నాయకునిపై మరో వర్గం వ్యక్తి దాడి చేశాడు. ఇతరులు వారించి కొట్టిన వ్యక్తిని పంపించే క్రమంలో మరోసారి దాడిచేసి పరారయ్యాడు. అతడ్ని పట్టుకుందామని ప్రయత్నించినా దొరకలేదు. దెబ్బలుతిన్న వ్యక్తి తరపున కొందరు కేకలు వేయగా కాసేపటికి పారిపోయిన వ్యక్తి, అతడి వర్గం వ్యక్తులు రావడంతో మళ్లీ ఇరు వర్గాలు ఘర్షణ పడ్డారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని వారిని నిలువరించారు. సోమవారం సి.ఐ.శుభాకర్ గ్రామంలోకి వచ్చి గొడవకు గల కారణాలను గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. దీనితో వెంట్రప్రగడలో పోలీసులు పికెట్ ఏర్పాటు చేశారు.

వివరాలు సేకరిస్తున్న సీఐ శుభాకర్, సిబ్బంది

శతాధిక వృద్ధురాలి మృతి

చల్లపల్లి, న్యూస్‌టుడే: చల్లపల్లి మండలం రామానగరం బీసీకాలనీకి చెందిన అంబటి సీతమ్మ(100) సోమవారం తెల్లవారుజామున మృతి చెందారు. ఎప్పుడూ ఆరోగ్యంతో, చలాకీగా ఉండేవారు. ఇటీవల అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందారు. సీతమ్మ మృతదేహాన్ని అవనిగడ్డ ఎల్ఐసీ బ్రాంచ్ మేనేజర్ ఆకుల హరిప్రసాద్, పలువురు ప్రముఖులు సందర్శించి నివాళులర్పించారు.

చురుగ్గా కాలక్షేప మండపం నిర్మాణం

వేమవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే: మండలంలోని ప్రసిద్ధ వేమవరం శ్రీకొండలమ్మ తల్లి దేవస్థాన ఆవరణలో రూ. 90 లక్షల వ్యయంతో కాలక్షేపమండప నిర్మాణ పనులు నిర్వహిస్తున్నారు. రూ.60 లక్షల సీజీఎఫ్ నిధులకు రూ.30 లక్షల కాంట్రిబ్యూషన్ నిధులు సమకూర్చడంతో ఈ భవన నిర్మాణం చేపట్టారు. వైకాపా ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఈ భవన నిర్మాణం చేయాలని తలపెట్టగా ఎమ్మెల్యే కొడాలి నాని హడావుడిగా శంకుస్థాపన చేశారు. ఐతే నిధులు వస్తాయో రావోననే సందేహంతో గుత్తేదారుడు పనులు చేపట్టలేదు. ఎట్టకేలకు నిర్మాణ పనుల్ని కూటమి ప్రభుత్వం వచ్చాక మూడు నెలల కిందట చేపట్టారు. ప్రస్తుతం బేస్‌మెంట్ దశలో పనులు జరుగుతున్నాయి. పనులను ఛైర్మన్ ఈడే మోహన్, అధికార, పాలకవర్గం పర్యవేక్షిస్తున్నారు.

నిర్మాణ పనులు జరుగుతున్న దృశ్యం

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

(c) eenadu

పంచాయతీ కార్యదర్శి గొప్ప మనసు

పంచాయతీ కార్మికులకు బీమా పాలసీ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు (పాత చిత్రం)

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి. కరోనా రోజుల్లో.. బుడమేరు ముంపు సమయంలో.. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాల్లో.. వారిని సన్మానించి, ఒక జత దుస్తులు ఇవ్వడమే కానీ వారి భద్రతను పట్టించుకున్నవారే లేరు. గ్రామ శుభ్రత కోసం అహర్నిశలు శ్రమిస్తున్న కార్మికుల భద్రత కోసం విజయవాడ రూరల్ మండలం నిడమానూరు పంచాయతీ కార్యదర్శి ఎన్.నరసింహారావు అరుదైన నిర్ణయం తీసుకుని ఆదర్శంగా నిలుస్తున్నారు. గ్రామంలో పనిచేస్తున్న 52 మంది కార్మికుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని రూ.40 లక్షల విలువైన బీమా పాలసీని సొంత ఖర్చుతో చేయించారు. ఇందుకోసం రూ.1.25 లక్షలు ఖర్చు చేశారు.

అడుగు పడింది ఇలా.. నరసింహారావు గతంలో గుంటుపల్లి కార్యదర్శిగా పనిచేస్తున్న సమయంలో జాతీయ రహదారిని శుభ్రం చేస్తున్న ఓ కార్మికురాలిని కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అప్పటినుంచి ఆయన ఎక్కడ విధులు నిర్వర్తిస్తున్న ఆయా గ్రామాల పారిశుద్ధ్య కార్మికులకు ఇన్సూరెన్స్ పాలసీ చేయిస్తున్నారు. నిడమానూరు పంచాయతీ పరిధిలో సుమారు తొమ్మిది కిలోమీటర్ల మేర జాతీయ రహదారి ఉంది. 15 మంది సిబ్బంది నిరంతరం జాతీయ రహదారిపైనే ప్రమాదకర ప్రాంతాల్లో పనిచేస్తుంటారు. ఈ నేపథ్యంలో ఇక్కడా అందరికీ బీమా చేయించి గత నెలలో ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు చేతుల మీదుగా కార్మికులకు పాలసీ పత్రాలు అందజేశారు. **- న్యూస్‌టుడే, నిడమానూరు**

కోడూరులో బుక్ కీపర్ చేతివాటం

రూ. 10.70 లక్షల సంఘం నిధులు గల్లంతు

ఎమ్మెల్యే బుద్ధప్రసాద్‌కు ఫిర్యాదు చేస్తున్న డ్వాక్రా మహిళలు

కోడూరు (అవనిగడ్డ), న్యూస్‌టుడే: మండల పరిధిలోని హంసలదీవి గ్రామం బుక్ కీపర్ పరిధిలో రూ.10.70లక్షలు గల్లంతైనట్లు ఇటీవల ప్రజా దర్బారులో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌కు డ్వాక్రా మహిళలు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. వెలుగు కార్యాలయం నుంచి సేకరించిన వివరాల ప్రకారం 2018-24 మధ్య కాలంలో సంఘంలో 170 మంది గ్రూపు సభ్యులు బుక్ కీపర్ పరిధిలో ఉండేవారు. అప్పటికి సంఘంలో రూ.10 లక్షల నిధులు నిల్వ ఉన్నాయి. ఆ తర్వాత సంఘానికి వచ్చిన గ్రాంటు రూ.4.25 లక్షలు, సభ్యత్వాలుగా చెల్లించిన మొత్తంతో కలిపి రూ.10.70 లక్షలు ఉండాలి. బుక్ కీపర్‌గా ఉన్న ఒడుగు సువర్ణ ఈ ఏడాది మార్చిలో బుక్ కీపర్ విధుల నుంచి తప్పుకొంది. ఆసమయంలో లెక్కలు చూడగా రూ.10.70 లక్షలు గల్లంతైనట్లు వెలుగులోకి వచ్చింది. దీంతో గ్రామ పెద్దల మధ్యవర్తిత్వంతో బుక్ కీపర్‌ను రూ.8 లక్షలు తిరిగి చెల్లించే విధంగా ఒప్పందం చేసుకుని, 3 నెలల్లో చెల్లించమని గడువు ఇచ్చారు. గడువు దాటినా కట్టకపోవడంతో బుక్ కీపర్ ఇంటికి వెళ్లి గ్రూపుల సభ్యులు అడిగితే, తన ఇంటికి రావద్దని హెచ్చరించినట్లు చెబుతున్నారు. అయినా తనను నిధుల విషయమై ప్రశ్నిస్తున్నారని ఆమె గ్రామ పెద్ద, ఒక వీవోపై తనను వేధిస్తున్నారని పోలీసు స్టేషన్‌లో ఎదురు కేసు పెట్టినట్లు తెలిసింది. దీనిపై డీఆర్‌డీఏ అధికారులు ఏమి చేస్తారోనని గ్రూపుల సభ్యులు ఎదురు చూస్తున్నారు.

దూసుకొచ్చిన మృత్యువు..!

- క్షతగాత్రుడిని కాపాడేందుకు ట్రాఫిక్ పోలీసుల విశ్వప్రయత్నం
- గ్రీన్ ఛానల్‌లో తరలించినా ఫలించని వైనం

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : ఘోర రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి ప్రాణాలు నిలిపేందుకు ట్రాఫిక్ పోలీసులు విశ్వప్రయత్నం చేశారు. గ్రీన్ ఛానల్ ద్వారా ప్రభుత్వాసుపత్రికి తరలించి.. చికిత్స అందిస్తుండగా మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. గుంటూరు జిల్లా కుంచనపల్లికి చెందిన వొబట్టు విజయగోపాలకృష్ణ (52) నగరంలోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ కార్యాలయంలో సెక్షన్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. సోమవారం సాయంత్రం విధులు ముగించుకుని కుంచనపల్లిలోని ఇంటికి బయలుదేరారు. బెంజిసర్కిల్ సమీపం స్క్యూబ్రిడ్జి వద్దకు రాగానే.. ఒక లారీ వేగంగా వచ్చి ఢీకొట్టింది. వెనుక చక్రాల వద్ద ఆయన ఇరుక్కుపోయారు. శిరస్త్రాణం ధరించినా.. తీవ్ర గాయాలయ్యాయి. ట్రాఫిక్ సీఐ రవికుమార్, సిబ్బంది శ్రమించి ఆయన్ని బయటకు తీశారు. అదే సమయంలో అటుగా వెళుతున్న ఒక వైద్యురాలు వచ్చి పరీక్షించగా.. నాడి కొట్టుకుంటోంది. వెంటనే ఆసుపత్రికి తరలించాలని ఆమె సూచించారు. అంబులెన్స్ వచ్చేందుకు ఆలస్యం అయ్యే అవకాశం ఉండడంతో.. ఆటోలో ఎక్కించారు.

కూడళ్లలో వాహనాలు నిలిపివేసి.. క్షతగాత్రుడిని ఆటోలో ఎక్కించిన వెంటనే కంట్రోల్‌రూంకు సమాచారం అందించారు. అక్కడి నుంచి వస్తున్న ఆదేశాలతో బెంజిసర్కిల్, నిర్మల కాన్వెంట్ కూడలి, రమేష్ ఆసుపత్రి కూడలిలో వాహనాలను నిలిపివేశారు. ఆటోకు గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేసి.. హుటాహుటీన ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స చేస్తుండగా.. విజయగోపాలకృష్ణ ప్రాణాలు కోల్పోయారు. అతన్ని కాపాడేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడంతో ట్రాఫిక్ పోలీసులు వేదనకు గురయ్యారు. ప్రమాద ఘటనపై పటమట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -130 రిటైల్ ధర 157 చికెన్ విత్ స్కిన్ - 228, చికెన్ స్కిన్‌లెస్ - 259.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 149, 158, 169 చికెన్ విత్ స్కిన్ - 284 చికెన్ స్కిన్‌లెస్ - 294.

సహకార ఉద్యోగుల ధర్నా

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: సహకార సంఘాల ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ ఐకాస ఆధ్వర్యంలో సోమవారం హనుమాన్‌జంక్షన్ కేడీసీసీ బ్యాంకు వద్ద ఉద్యోగులు ఆందోళన నిర్వహించారు. జీవో36ను వెంటనే అమలు చేయడంతో పాటు పెండింగ్‌లో ఉన్న పీఆర్సీని తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా సహకార సంఘాల ఉద్యోగుల ప్రధాన కార్యదర్శి వీరపనేని రాజేశ్వరరావు నాయకత్వం వహించారు. హనుమాన్‌జంక్షన్ బ్రాంచి పరిధిలో 15 సహకార సంఘాలను మూసివేసి, ఉద్యోగులంతా ఈ ఆందోళనలో పాల్గొన్నారు.

ఉయ్యూరు, గన్నవరం (గ్రామీణం), కంకిపాడు, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ సహకార సంఘ ఉద్యోగుల యూనియన్ల ఐక్యవేదిక పిలుపు మేరకు కేడీసీసీ బ్యాంకు ఉయ్యూరు శాఖ ఎదుట సోమవారం పీఏసీఎస్ ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. సహకార సంఘాల ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోరుతూ ఈ ఆందోళన చేపట్టినట్లు పీఏసీఎస్ ఉద్యోగ సంఘ ప్రతినిధులు తెలిపారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన 11 ప్రధాన డిమాండ్లపై వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. గన్నవరంలో జరిగిన ఆందోళనలో సంఘం జిల్లా కార్యదర్శి కొండపల్లి బాలాజీ పాల్గొన్నారు. పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని బ్రాంచ్ బీఎ మేనేజర్ ఆర్.రాంబాబుకు అందజేశారు. కంకిపాడులో జేఏసీ ప్రతినిధులు వి.దీక్షితులు, ఎ.వెంకటప్పారెడ్డి, పద్మనాభం, జితేంద్ర, ఎ.శ్యామల, ప్రవీణ్ నిరసన వ్యక్తం చేశారు.

హనుమాన్‌జంక్షన్ కేడీసీసీ బ్యాంకు ఎదుట ఆందోళన చేస్తున్న ఉద్యోగులు

ఉయ్యూరులో ప్లకార్డులు ప్రదర్శిస్తూ..

ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వండి: ఎస్పీ

సమస్యలు వింటున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

భాస్కరపురం (మచిలీపట్నం), న్యూస్‌టుడే: ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్‌నాయుడు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ మీకోసం కార్యక్రమం నిర్వహించి ప్రజా సమస్యలను విన్నారు. చల్లపల్లిలో పూర్తి స్థాయి విచారణ జరిపి తప్పనిసరిగా పరిష్కారం చూపాలని ఆదేశించారు. [illegible]

వెట్టిచాకిరి నిర్మూలనకు నిఘా, పర్యవేక్షణ సంఘం

భాస్కరపురం (మచిలీపట్నం), న్యూస్‌టుడే: వెట్టిచాకిరి నిర్మూలనకు జిల్లా స్థాయి నిఘా, పర్యవేక్షణ సంఘాన్ని ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ డి.కె.బాలాజీ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో వెట్టిచాకిరి నిర్మూలనపై జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా స్థాయి కమిటీకి కలెక్టర్ ఛైర్‌పర్సన్‌గా, జాయింట్ కలెక్టర్ కన్వీనర్‌గా ఉంటారన్నారు. [illegible] సమావేశంలో పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

12న మచిలీపట్నంలో ఉద్యోగ మేళా

భాస్కరపురం (మచిలీపట్నం), న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 12న మచిలీపట్నంలోని ఎస్.ఆర్.ఆర్ కళాశాలలో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నారు. 880 ఉద్యోగాలకు సంబంధించి [illegible] ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు https://naipunyam.ap.gov.in/user-registration లింక్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఇతర వివరాలకు 99664 89796, 63006 18985, 99895 19495 నంబర్లలో సంప్రదించాలి.

దేవదాయ ధర్మదాయ శాఖ, ఆంధ్రప్రదేశ్
టెండరు నోటీసు నెం. Q/COE/492/2018, తేది. 08-12-2025
కమిషనర్ వారి కార్యాలయం, గొల్లపూడి లో పనిచేయుటకు అవసరమైన సెక్యూరిటీ గార్డ్ ల కొరకు అవుట్ సోర్సింగ్ ఏజెన్సీల ద్వారా సప్లై చేయుటకు టెండర్లు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా పిలవబడినవి. వివరముల కొరకు tender.apeprocurement.gov.in నందు చూడగలరు.
కె రామచంద్ర మోహన్
కమిషనర్ (FAC), దేవదాయ ధర్మదాయ శాఖ

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
స్ట్రెస్డ్ అసెట్స్ రికవరీ బ్రాంచి, 3వ అంతస్తు, [illegible] విజయవాడ - 520008. ఆంధ్రప్రదేశ్. ఫోన్: 0866-2546922
అధీకృత అధికారి వివరములు : పేరు : శ్రీ వై. ముక్కోటేశ్వరరావు (చీఫ్ మేనేజర్), మొబైల్ నెం. : 88866 40777 ల్యాండ్ ఫోన్: 92912 32223

Appendix – IV –A
[See Proviso to Rule 8(6) R/w Rule 9(1)]
స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

[illegible]

1	[illegible]
	రిజర్వు ధర : రూ.31,68,000/- ధరావత్తు : రూ.3,16,800/- బిడ్ పెంపుదల : రూ.10,000/-
2	[illegible]
	రిజర్వు ధర : రూ.60,52,000/- ధరావత్తు : రూ.6,05,200/- బిడ్ పెంపుదల : రూ.20,000/-
3	[illegible]
	రిజర్వు ధర : రూ.30,86,000/- ధరావత్తు : రూ.3,08,600/- బిడ్ పెంపుదల : రూ.10,000/-

ఇ-వేలం తేదీ : 21-01-2026, సమయం : ఉ|| 11.00 గం||ల నుండి సా|| 04.00 గం||ల వరకు
[illegible]
[illegible] www.sbi.co.in/web/sbi-in-the-news/auction-notices [illegible] https://baanknet.com/eauction-psb/x-login [illegible] support.baanknet@psballiance.com [illegible]
తేదీ: 08-12-2025, ప్రదేశం: విజయవాడ సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

గోనె సంచులు వచ్చేశాయ్..

ఈనాడు కథనానికి స్పందన

కంకిపాడు, న్యూస్‌టుడే: రైతు సేవా కేంద్రాలు, పీఏసీఎస్‌లకు గోనె సంచులు చేరవేయడంతో పాటు దావులూరు, చలివేంద్రపాలెం మిల్లుల్లో ధాన్యం దిగుమతికి అధికారులు చర్యలు తీసుకున్నారు. ధాన్యం సేకరణలో ఎదురవుతున్న ఇబ్బందులపై 'గోనె సంచుల కొరత.. అన్నదాత కలత' శీర్షికన సోమవారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. జేసీ ఆదేశాల మేరకు తహసీల్దారు, వ్యవసాయాధికారి కోలవెన్ను, పునాదిపాడు గ్రామాల్లో పర్యటించారు. ఇతర ఆర్‌ఎస్‌కేల్లో అదనంగా ఉన్న సంచులను ఇక్కడ సర్దుబాటు చేశారు. మిల్లుల్లోనూ ధాన్యం సేకరణకు మార్గం సుగమం చేశారు. కల్లాలు, రహదారులపై ధాన్యం ఆరబెట్టిన రైతులతో మాట్లాడారు.

95 శాతం ధాన్యం సేకరణ

కోలవెన్ను పీఏసీఎస్ పరిధిలో 95 శాతం ధాన్యం సేకరించి మిల్లులకు పంపామని ఛైర్మన్ వల్లభనేని రాంబాబు, నీటి సంఘం అధ్యక్షుడు తుమ్మల జగదీష్ చెప్పారు. ఈ మేరకు సోమవారం సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొందరు రైతులు ధాన్యాన్ని ఆరబెట్టకముందే గోనె సంచులు తీసుకెళ్తున్నట్లు వెల్లడించారు. చొప్పరపు గంగాధరరావుకు మూడు రోజుల క్రితం సంచులు సరఫరా చేశామన్నారు. మండలంలో సంచుల కొరత లేకుండా చర్యలు తీసుకున్నట్లు తహసీల్దార్ భవనారాయణ తెలిపారు.

వరిగడ్డికి నిప్పు.. వాహనదారులకు అవస్థలు

పునాదిపాడు-కోలవెన్ను రహదారిపై దట్టంగా వ్యాపించిన పొగ

కంకిపాడు, గన్నవరం(గ్రామీణం, న్యూస్‌టుడే: వ్యవసాయ అధికారులు వారిస్తున్నా యంత్రాలతో నూర్పిడి చేసిన వరి పొలాల్లో మిగిలిన గడ్డికి రైతులు నిప్పు పెడుతున్నారు. దీంతో సమీప ప్రాంతాల వారితో పాటు వాహనదారులు అవస్థల పాలవుతున్నారు. గడ్డిని కాల్చివేస్తే భూసారం తగ్గడం, పంటకు మేలు చేసే సూక్ష్మజీవులు నాశనమవుతున్నాయని చెప్పినా చాలా మంది పెడచెవిన పెడుతున్నారు. సోమవారం మధ్యాహ్నం పునాదిపాడు-కోలవెన్ను రహదారిలో ఉన్న పొలంలో వరిగడ్డికి నిప్పు పెట్టారు. దట్టంగా వ్యాపించిన పొగ రహదారిపై గంటపాటు ప్రయాణికులను ఇబ్బంది పెట్టింది. ఎదురుగా వస్తున్న వాహనాలను గుర్తించలేక ఓ ప్రమాదం కూడా జరిగింది. ద్విచక్ర వాహనదారుడు కారును ఢీకొని కింద పడిపోవడంతో గాయాలయ్యాయి. అటుగా వస్తున్న ఆటోకార్మికులు ఆసుపత్రికి తరలించారు.

క్వాంటమ్ కంప్యూటింగ్‌పై జాతీయ సదస్సు

పోస్టర్ ఆవిష్కరిస్తున్న ధనేకుల రవీంద్రనాథ్ ఠాగూర్, భవానీ ప్రసాద్, కడియాల రవి, డీకెఆర్‌కె ప్రసాద్, తదితరులు

పెనమలూరు, న్యూస్‌టుడే: ధనేకుల ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఈ నెల 15 నుంచి 19 వరకు క్వాంటమ్ కంప్యూటింగ్‌పై జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు కళాశాల డైరెక్టర్ డీకెఆర్‌కె రవిప్రసాద్ తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అప్లికేషన్స్ ఇన్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ (క్యూయూఏసీఈ-2025) పేరుతో ఈ సదస్సు జరగనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని అనుసంధాన్ రీసెర్చ్ ఫౌండేషన్, ఐఈఈఈ గుంటూరు, ఐఈటీఈ విజయవాడ ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో ఛైర్మన్ ధనేకుల రవీంద్రనాథ్‌ఠాగూర్, కార్యదర్శి భవానీ ప్రసాద్, ప్రిన్సిపల్ కడియాల రవి, సత్యప్రసాద్, రాజేష్, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

రూ.లక్షలు తీసుకుని బెదిరిస్తున్నారు

మచిలీపట్నం కార్పొరేషన్: వ్యాపారంలో పెట్టుబడి అని చెప్పి తమ వద్ద నుంచి రూ.లక్షలు తీసుకున్నది కాగా బెదిరింపులకు పాల్పడుతున్నారు...తమకు న్యాయం చేయాలని కోరుతూ మచిలీపట్నంకు చెందిన వెంకటలక్ష్మణరావు, సుశీల, బొర్రా నాగలక్ష్మిలు సోమవారం కలెక్టరేట్‌లో అర్జీ అందించారు. ఈ సందర్భంగా వారు కలెక్టరేట్ వద్ద విలేకరులతో తమకు జరిగిన మోసాన్ని వెల్లడించారు. డూండి అనే వ్యక్తి ఇసుక, ఆయిల్ తదితర వ్యాపారాల్లో పెట్టుబడి పెడితే మంచి లాభాలు వస్తాయని చెప్పారని అన్నారు. తన మావయ్య మారుమూడి విక్టర్ ప్రసాద్ ఎస్సీ కమిషన్ ఛైర్మన్‌గా ఉన్నారని, తాము రాజకీయంగా ప్రజల్లో తిరిగేవారమని, ఎలాంటి భయం లేదని చెప్పడంతో నమ్మి నగదు ఇచ్చామని వెంకటలక్ష్మణరావు తెలిపారు. తాను రూ.20లక్షలు ఇస్తే, తమ ఇంట్లో ఉంటున్న నాగలక్ష్మి రూ.12లక్షలు ఇచ్చారన్నారు. వైకాపా హయాంలోనే ఇదంతా జరిగిందని వివరించారు. ఆ తరవాత డబ్బులు అడుగుతుంటే దాట వేస్తూ వచ్చారని, ప్రస్తుతం అతను కనిపించకుండా పోయారని, ఎవరినైనా అడిగితే అతనికి తెలిసిన వ్యక్తులతో బెదిరింపులకు పాల్పడుతున్నారని వాపోయారు. తాము చెల్లించిన నగదుకు సంబంధించి అన్ని ఆధారాలు ఉన్నాయని, ఉన్నతాధికారులు చొరవ తీసుకుని న్యాయం చేయాలని కోరారు.

పరీక్షా ఫలితాలు విడుదల

కృష్ణావిశ్వవిద్యాలయం (మచిలీపట్నం), న్యూస్‌టుడే: కృష్ణా విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలలకు సంబంధించి బీఫార్మసీ రెండు సెమిస్టర్ ఫలితాలను సోమవారం విడుదల చేశారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి కె.రాంజీ ఆదేశాల మేరకు ఫలితాలు విడుదల చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి పి.వీరబ్రహ్మాచారి ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 120 మంది పరీక్షలు రాయగా 80.83 శాతం ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. పునః మూల్యాంకనం కోసం ఈనెల 18వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

91.9FM Vijayawada 91.9 Mee FM
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 8008003297

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి ఈ రోజు మార్కెట్ ధరకు కొనబడును.స్పాట్ క్యాష్. ✆ 81422 92071

బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం విడిపించి అధిక ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్). ✆8333833368

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి అధికధరకు కొనబడును (స్పాట్ క్యాష్). ✆ 87907 41166.

EDUCATION

SPOT admissions by Govt AP 12/12: M.Com/MA English/MSW only Rs 5000 per sem, PLNM Degree College, 91774 08565.

PEOPLE CARE

OLD AGE HOME

గాయిత్రి గ్రూపు, VJA, వృద్ధులకు, పేషెంట్ల సేవకు, ఇంటి/ వంట, బేబి కేర్‌కు వర్కర్లను భారతదేశం అంతటా పంపగలము. ✆9959021122, 9603842233

REAL ESTATE

PLOT FOR SALE

133.33 Sq.Yds. కేవలం 1,00,000/- మాత్రమే. పెనుగంచిప్రోలు, పల్లంపల్లి డెవలప్‌మెంట్, ఫోన్: 9133445755.

JOBS

మ్యారేజి సంస్థలో పనిచేయుటకు కంప్యూటర్ నాలెడ్జ్ గల ఇన్‌చార్జ్ (F) జీ. 20 K, రిసెప్షనిస్ట్ (F) జీ. 15 K, ఏదైనా డిగ్రీ, VJA- 7 ✆ 87905 99799.

విజయవాడలోని రామచంద్రబ్రదర్స్ ఫర్నిచర్ షోరూం నందు పనిచేయుటకు క్యాషియర్ (M) కావలెను. వయసు - 35 సం||లోపు. 99638 48003.

Wanted Female Telecallers. Qul: any Degree, Salary:Up To 15000+Incentives, Job Location: Benzcircle, & Kankipadu. ✆98481 72444

అమెరికాలో 1 సం|| బాబు ఆలన, పాలన వ్యక్తిగత సంరక్షణ కొరకు అనుభవంగల ఆడవారు కావలెను. అమెరికా వీసా కల్గినవారు మాత్రమే. ✆ 9440803362

హోటల్ మేనేజ్‌మెంట్ ఇనిస్టిట్యూట్ నందు అనుభవంగల ఫ్యాకల్టీ కావలెను. సంప్రదించండి. పార్ట్యాన్ మురళీపార్క్, విజయవాడ. ✆ 90109 01020.

విజన్ ఆటోమొబైల్స్ ఆపె ఆటోషోరూము NTR జిల్లా విజయవాడ, నందిగామ, నూజివీడు నందు పనిచేయుటకు 3 వీలర్ మార్కెట్ నందు కనీసము 5 సం|| అనుభవము ఉన్న *1.సేల్స్‌మేనేజరు - 5 *2.సేల్స్‌ఎగ్జిక్యూటివ్స్-18 *3.సేల్స్ టీంలీడర్స్-10 *4. అకౌంటెంట్లు-1 టాలీ అకౌంటింగ్ ప్యాకేజీలో అనుభవము, అకౌంటింగ్ రంగములో 4సం|| అనుభవము ఉన్న అకౌంటెంట్‌లు కావలెను. *5.సేల్స్ రిసెప్షనిస్ట్- 5 *6.సర్వీసు మేనేజరు (డిప్లమో/ITI)-2 *7.సర్వీసు సూపర్‌వైజర్లు-5 (డిప్లమో/ITI) పైన తెలిపిన పోస్టులకు అభ్యర్థి అనుభవమును బట్టి జీతము నిర్ణయించబడును. సం/- మొబైల్/వాట్సాప్‌నెం: 77999 09050/ 7799909066

ప్రముఖ లిఫ్ట్/ ఎలివేటర్ కంపెనీలో పనిచేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను Q: డిగ్రీ, కమ్యునికేషన్ స్కిల్స్ & మార్కెటింగ్ అనుభవం తప్పనిసరి. మంచి వాక్ఛాతుర్యం/ చురుకుదనం గల యువకులు కావలెను. జీతం+ ఇన్సెంటివ్స్+ఎకామిడేషన్ కూడా కలదు. ✆ 90305 54778.

Book your 5 lines Classified Colour Rs.1200/-
3Ads Package Rs.3250/-
5 lines Classified B/W Rs.1025/-
3Ads Package Rs.2575/-
ప్రకటనపై 5% జి.ఎస్.టి. అదనం
PH: 98496 97616

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే హక్కుయు/ లేదా తగిన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

పెనమలూరు
• పెనమలూరు • గన్నవరం

ఆలయ నిర్మాణానికి రూ.50 వేల విరాళం

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: బాపులపాడు ధర్మకోనేరు చెరువు వద్ద నిర్మిస్తున్న శ్రీహరిహరసుత అయ్యప్పస్వామి దేవాలయానికి బాపులపాడుకు చెందిన స్రవంతి ట్రస్టు నిర్వాహకులు వీరమాచనేని సత్యప్రసాద్, శ్రీదేవి దంపతులు రూ.50,116 విరాళంగా అందజేశారు. సోమవారం ఆలయ నిర్మాణకర్తలు గూడపాటి రత్నశేఖర్, గూడవల్లి చిన్నా, తమిరి రమేష్ తదితరులకు ఈ మొత్తాన్ని అందించారు.

చెక్కు అందిస్తున్న సత్యప్రసాద్

ముమ్మరంగా ఆక్రమణల తొలగింపు

పోరంకి, న్యూస్‌టుడే: గత కొన్ని రోజులుగా రోడ్డుకు ఇరువైపులా అనధికారికంగా ఏర్పాటు చేసిన వ్యాపార ప్రకటనల బోర్డులు, నిర్మాణాలను పురపాలక అధికారులు, ట్రాఫిక్ పోలీసులు, పెనమలూరు పోలీసులు కలిసి సంయుక్తంగా తొలగిస్తున్నారు. సోమవారం కూడా పోరంకి నుంచి పెనమలూరు సెంటర్ వరకు ఉన్న ఆక్రమణలను తొలగించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ, పెనమలూరు సీఐ వెంకటరమణ, కమిషనర్ షేక్ నజీర్, అసిస్టెంట్ కమిషనర్ కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పోరంకిలో ఆక్రమణలు తొలగిస్తున్న ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

కానూరు : 80085 74647 హనుమాన్‌జంక్షన్, 98486 27585

పోరంకి సాలిపేటలో చెత్త తీయడం లేదని స్థానికులు 'మేమున్నాం మీకు తోడుగా' దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయంపై స్పందించిన కమిషనర్ షేక్‌నజీర్ సిబ్బందిని పంపి చెత్త తీయించారు.

✤ కానూరు తులసీనగర్‌లో కొన్ని రోజులుగా మురుగుకాల్వలో పూడికతీత పనులు జరగక, మురుగు పారట్లేదని స్థానికులు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై స్పందించిన కమిషనర్ షేక్‌నజీర్ సిబ్బందిని పంపి పూడికతీత పనులు చేయించి సమస్య పరిష్కరించారు. - కానూరు, పోరంకి, న్యూస్‌టుడే

కోలవెన్ను రహదారికి మరమ్మతులు పూర్తి

కంకిపాడు, న్యూస్‌టుడే: కోలవెన్ను-ఎంపీ రహదారిపై అధికారులు ఎట్టకేలకు తారు వేశారు. 'కంకర రహదారితో కష్టాలు' శీర్షికన గత నెల 26న 'ఈనాడు'లో వార్త ప్రచురితమైన విషయం తెలిసిందే. రెండున్నర కిలోమీటర్ల మేర రోడ్డు మరమ్మతుల్లో భాగంగా ఆరు నెలల క్రితం కంకర పొడి వేసి వదిలేశారు. దీంతో వాహనదారులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. చివరికి స్పందించిన అధికారులు తారు వేశారు.

స్పందనకు వందనం

మెకానిక్ షెడ్లలో చోరీలు.. పట్టించుకోని పోలీసులు

న్యూస్‌టుడే, కంకిపాడు గ్రామీణం

తీవ్రంగా నష్టపోతున్న బాధితులు

వారందరివి రెక్కాడితే కానీ డొక్కాడని బతుకులు. ఏరోజు కూలి ఆరోజు సంపాదించే చిరు మెకానిక్‌లు. వారికి వచ్చే మొత్తంతో పెద్ద పెద్ద గ్యారేజీలు నడపలేక.. గ్రామ శివారులో షెడ్డు, గది అద్దెకు తీసుకొని జీవితాన్ని నెట్టుకొస్తున్నారు. ఇలాంటి వారిపై కన్నేసిన కొన్ని ముఠాలు మరమ్మతుల కోసం ఉంచిన వాహనాల స్పేర్‌పార్టులు, బ్యాటరీలను ఎత్తుకెళ్లి జీవనోపాధిని దెబ్బతీస్తున్నాయి. పెనమలూరు, కంకిపాడులో ఏడాది క్రితం మొదలైన చోరీల తంతు ఇంకా కొనసాగుతోంది. అయితే ఫిర్యాదు చేయడానికి వెళ్లిన బాధితుల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు ఇక్కడ చర్చనీయాంశమవుతోంది.

సీసీ ఫుటేజీలు ఇచ్చినా..

కంకిపాడు శివారులోని పైవంతెన వద్ద ఓ ట్రాక్టర్ మెకానిక్ షెడ్డు అద్దెకు తీసుకున్నారు. అతను ప్రతిరోజు తన వద్దకు వచ్చే వాహనాలకు మరమ్మతు చేయడంలో భాగంగా వాటిలోని స్పేర్‌పార్టులను కొన్నిటిని తీసివేసి కొత్తవి మారుస్తారు. పాతవి తన దగ్గర ఉంచుకొని ఎంతో కొంతకు విక్రయిస్తుంటారు. అంతేకాకుండా కొన్ని వాహనాల పార్టులను రిపేరు చేసేందుకు కొన్ని రోజులపాటు షెడ్డులో ఉంచాల్సి వస్తోంది. దీన్ని గమనించిన కొందరు రాత్రి సమయంలో తాళాలు పగలగొట్టి సామగ్రి మొత్తం ఎత్తుకెళ్లిపోయారు. మరుసటి రోజు ఉదయం వచ్చిన మెకానిక్ ఫిర్యాదు చేయడానికి పెనమలూరు పోలీసు స్టేషన్‌కు వెళ్తే.. పాతసామగ్రికి మేమెక్కడ కాపలా ఉంటామంటూ హేళనగా మాట్లాడారని బాధితుడు వాపోయారు. ఎలాగైనా నిందితులను పట్టుకోవాలని తన షెడ్డు మార్గాల్లో ఉన్న సీసీ ఫుటేజీలు సంపాదించి ఇస్తే వాటితో ఏ విధంగా గుర్తిస్తామని చిన్నచూపు చూశారని ఆవేదన వ్యక్తం చేశారు. అదే షెడ్డులో పలుమార్లు చోరీలు జరగడంతో ఎవరికీ చెప్పుకోలేక వేరొక చోటుకు వెళ్లిపోయారు.

కంకిపాడులోని ఓ ట్రాక్టర్ మెకానిక్ షెడ్డు

✱ ఇదే ప్రాంతంలో ఓ కారు మెకానిక్ తీసుకున్న గదిలో పాత ఇంజిను, కొన్ని పరికరాలు పెట్టి వెళ్లాడు. ఆ రాత్రి జరిగిన చోరీలో వాటన్నింటినీ దొంగలు ఎత్తుకెళ్లారు. పోలీసుల వద్దకు వెళ్లలేక సన్నిహితుల వద్ద కన్నీటి పర్యంతమయ్యారు. చోరీ జరిగిన సామగ్రిని బయట అమ్మితే వచ్చేది రూ.వందల్లోనే.. కానీ ఆ వస్తువులను ఈ చిన్న మెకానిక్‌లు మళ్లీ కొని వేయాలంటే రూ.వేలల్లో ఉంటాయి. ఈ ఆర్థిక భారం వారిని అప్పుల్లోకి నెడుతోంది.

మేమంటే చులకన ఎందుకు

మాకు వచ్చిన వృత్తితో బతకాలంటే పెద్దపెద్ద గ్యారేజీలు తీసుకోలేం. ఊరి చివర్లో చిన్న షెడ్డు, గది వంటివే తీసుకోగలుగుతాం. వాటికి మాత్రమే అద్దె కట్టగలిగే సంపాదన మాది. ఓవైపు కుటుంబపోషణ, పిల్లల చదువులు, మా ఖర్చులు ఇవన్నీ గడవాలంటే నిత్యం పనిచేయాల్సిందే. మా షెడ్లలో దొంగతనాలంటే చూసేవారికి, పోలీసులకు చిన్నదిగానే ఉంటుంది. కానీ, మాకు అవే పెద్దవి. కనీసం చులకనగా చూడకుండా భరోసా కల్పించే విధంగానైనా చర్యలు తీసుకోవాలి. - షేక్ సలాం

కరాటే పోటీల్లో కానూరు విద్యార్థుల ప్రతిభ

కానూరు, న్యూస్‌టుడే: గుంటూరులో జరిగిన 23వ నేషనల్ ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో కానూరుకు చెందిన ఛాంపియన్స్ కరాటే ఆఫ్ మార్షల్ ఆర్ట్స్ విద్యార్థులు బహుమతులు సాధించారని కోచ్ బి.నరసింహారెడ్డి తెలిపారు. సోమవారం కానూరులో జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన వివరాలు వెల్లడించారు. దేశవ్యాప్తంగా వేల మంది పాల్గొన్న ఈ పోటీల్లో తమ అకాడమీ విద్యార్థులు 16 బంగారు పతకాలు, 9 రజత పతకాలు సాధించి సత్తా చాటారన్నారు.

బహుమతులు సాధించిన విద్యార్థులతో కోచ్ బి.నరసింహారెడ్డి, ఇతర ప్రతినిధులు

కలుషిత నీటి సమస్యకు పరిష్కారం

పెనమలూరు, కానూరు, న్యూస్‌టుడే: పెనమలూరు హరిజనవాడలో కలుషిత నీటి సమస్యను ఎమ్మెల్యే బోడే ప్రసాద్ పరిష్కరించారు. ఇక్కడ గత కొన్నిరోజులుగా కలుషిత నీరు వస్తోందని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. సోమవారం ఆయన స్వయంగా అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సంబంధిత సిబ్బందితో అవసరమైన మరమ్మతులు చేయించారు. సర్పంచి లింగాల భాస్కర్, కోయ ఆనంద్, మారుపూడి ధనకోటేశ్వరరావు, కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం పెనమలూరు ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే తనిఖీ చేశారు. వైద్యసేవలు సరిగ్గా అందుతున్నాయా లేదా అని రోగులను అడిగి తెలుసుకున్నారు.

హరిజనవాడలో సమస్యను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బోడే ప్రసాద్

వీధిదీపాలు వెలగక ఇక్కట్లు

కానూరు, న్యూస్‌టుడే: కానూరు సర్కిల్ పరిధిలోని బందరురోడ్డుపై పప్పులమిల్లు సెంటర్ నుంచి కామయ్యతోపు సెంటర్ వరకు పది రోజులుగా వీధిదీపాలు వెలగక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కీలకమైన ఈ ప్రాంతంలో చీకటిగా ఉండటంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. నిత్యం వేలల్లో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. వీలైనంత వెంటనే సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

బాలోత్సవానికి సహకారం

హనుమాన్ జంక్షన్: న్యూస్‌టుడే: ఏలూరులో ఈ నెల 12 నుంచి జరగనున్న హేలాపురి బాలోత్సవం నిర్వహణకు మానవత సంస్థ కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు రూ.30 వేలు ఇవ్వగా, ఘంటా సత్యనారాయణ, కొట్నాని రామచంద్రరావు, లలితా కామేశ్వరి, కూరెళ్ల సుబ్బాచారి, జయరామచంద్రరావు, నారగాని కొండలరావు కలిసి రూ.16,500 సమకూర్చారు.

అవీ.. ఇవీ..

కక్ష సాధింపుతో బదిలీ

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: కొన్నేళ్లుగా విజయ డెయిరీలో ఉద్యోగం చేస్తున్న తనను కక్ష సాధింపుతోనే తిరుపతికి బదిలీ చేశారని బాపులపాడు మండలం రేమల్లె గ్రామ తెదేపా అధ్యక్షుడు కొల్లూరి చంద్రకాంత్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన తెదేపా సంస్థాగత ఎన్నికల్లో తనను పార్టీ గ్రామ అధ్యక్షుడిగా ఎన్నుకున్నప్పటి నుంచి డెయిరీ వర్గాల నుంచి వేధింపులు ఎక్కువయ్యాయంటూ సామాజిక మాధ్యమాల్లో సోమవారం వీడియో విడుదల చేశారు. మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ ఇటీవల రేమల్లె వచ్చి వెళ్లగానే తన బదిలీ జరిగిందని ఆరోపించారు.

పేరంటాలమ్మ సంక్రాంతి జాతర ఏర్పాట్లపై సమీక్ష

రామవరప్పాడు, న్యూస్‌టుడే: రామవరప్పాడులోని శ్రీవెంకమ్మ పేరంటాలమ్మ సంక్రాంతి జాతర మహోత్సవ ఏర్పాట్లపై సోమవారం ఆలయంలో ఈవో ప్రియాంక ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. గ్రామ పెద్దలతో పాటు వివిధ విభాగాల అధికారులు పాల్గొని పలు సూచనలు చేశారు. ట్రాఫిక్ ఏసీపీ ఎన్.వంశీధర్‌గౌడ్, ట్రాఫిక్ సీఐలు రామారావు, రమేష్‌కుమార్, కిషోర్‌బాబు, జిల్లా దేవాదాయ ధర్మాదాయశాఖ అధికారి ఎన్.షణ్ముఖం, రూరల్ ఎమ్మార్వో సుగుణ, ఛైర్మన్ పి.వెంకటేశ్వరరావు, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

ఫులె విగ్రహం ఏర్పాటుపై హర్షం

హనుమాన్ జంక్షన్, న్యూస్‌టుడే: బాపులపాడు మండల పరిషత్తు కార్యాలయంలో జ్యోతిబా ఫులె విగ్రహం ఏర్పాటుకు వీలుగా నిధులు కేటాయిస్తూ మండల పరిషత్తు పాలకవర్గం నిర్ణయం తీసుకోవడంపై సామాజిక ప్రజా చైతన్య వేదిక నాయకులు ఎనికేపల్లి రాఘవేంద్రరావు, కొల్లిపర వరప్రసాదరావు హర్షం వ్యక్తం చేశారు. రూ.5 లక్షల మంజూరుకు కృషిచేసిన ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, ఎంపీపీ నగేష్, రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్ దయాల రాజేశ్వరరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి చలమలశెట్టి రమేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

లయన్స్‌క్లబ్‌కు సేవా పురస్కారాలు

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు విద్య, వైద్యపరంగా సేవలందించినందుకుగాను హనుమాన్‌జంక్షన్ లయన్స్‌క్లబ్‌కు ఉత్తమ సేవా పురస్కారాలు లభించాయి. క్లబ్ బాధ్యులు ఆళ్ల గోపాలకృష్ణ, అక్కినేని రాఘవేంద్రరావు, కళ్లేపల్లి నారాయణ, తమిరి రమేష్, అక్కినేని ఫణీంద్రకు ఈ పురస్కారాలు దక్కాయి. ఆదివారం విజయవాడలో జరిగిన జిల్లాస్థాయి పురస్కారాల ప్రదాన కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ గవర్నర్ గద్దె శేషగిరిరావు వీటిని అందజేశారు.

విజిలెన్స్ విచారణకు వినతి

ఉయ్యూరు, న్యూస్‌టుడే: ఉయ్యూరు మున్సిపాలిటీలో జరుగుతున్న అవినీతిపై వెంటనే విజిలెన్స్ విచారణకు ఆదేశించాలని కోరుతూ సామాజికకర్త జె.శ్రీనివాస్‌గౌడ్ రాష్ట్ర మున్సిపల్‌శాఖ మంత్రి పి.నారాయణకు వినతి పత్రం అందించారు. మోటార్ల వైండింగ్, ట్యాంకుల శుభ్రం, బ్లీచింగ్ వినియోగం, మొంథా తుపాను సందర్భంగా జనరేటర్ల ఏర్పాటు తదితర అంశాల్లో అవినీతి జరిగిందని ఆయన ఆరోపించారు.

అసత్య ప్రచారం సరికాదు

ఉయ్యూరు, న్యూస్‌టుడే: మొంథా తుపాను సహాయక చర్యల్లో భాగంగా మున్సిపాలిటీలో అక్రమాలు జరిగాయని ఓ సామాజిక కార్యకర్త చేస్తున్న ప్రచారం సరైంది కాదని కమిషనరు జాస్తి రామారావు తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. తుపానులో అప్రమత్తత కోసం ముందు జాగ్రత్తగా ప్రతిపాదనలే చేశామని, వాటికి ఎక్కడా బిల్లులు చేయలేదని స్పష్టం చేశారు. సమావేశంలో పురపాలక సంఘం ఛైర్మన్ వల్లభనేని సత్యనారాయణ(నాని), ఏఈ శ్రీనివాసరావు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు రూ.4.20 లక్షలు అందజేత

ఉయ్యూరు, న్యూస్‌టుడే: ఉయ్యూరులో గత నెల 23న శివాలయం సమీపంలో ఫ్లెక్సీ కిందకు దించే సమయంలో విద్యుదాఘాతానికి గురైన నలుగురు యువకుల కుటుంబాలకు అఖిల భారత యాదవ మహాసభ ప్రతినిధులు సోమవారం ఆర్థిక సాయం అందించారు. ఈ ఘటనలో ఒకరు మరణించగా, ముగ్గురు వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. యాదవ మహాసభ రాష్ట్ర నాయకులు బొడ్డు రమేష్ నేతృత్వంలో ఒక్కొక్కరికి రూ.1.05 లక్షల చొప్పున మొత్తం రూ.4.20 లక్షలను ప్రతినిధులు అందజేశారు. కార్యక్రమంలో అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దిబోయిన శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వీర్ల నాని, రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ గౌరిపర్తి శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ జీతం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నగదు అందిస్తున్న యాదవ మహాసభ ప్రతినిధులు

క్రైం కార్నర్

కారును ఢీకొన్న టిప్పర్

ఉయ్యూరు, న్యూస్‌టుడే: ఉయ్యూరు మండలం గండిగుంట వద్ద విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారిపై సోమవారం రోడ్డు ప్రమాదం జరిగింది. విజయవాడ వైపు వెళ్తున్న కారును వెనుక నుంచి టిప్పర్ ఢీకొట్టింది. డ్రైవర్ సీటు బెల్టు పెట్టుకోవడంతో ఎలాంటి గాయాలు కాలేదని పట్టణ సీఐ టి.వి.వి.రామారావు తెలిపారు.

కాలువలో దూకి వివాహిత ఆత్మహత్య

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: పోలవరం పంట కాలువలో దూకి వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గన్నవరం మండలం సూరంపల్లి వద్ద చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. స్టేషన్ పరిధిలోని చనుపల్లివారిగూడెంకు చెందిన జి.ధనలక్ష్మి(40), గోపి దంపతుల మధ్య కొన్నాళ్లుగా మనస్పర్థలు తలెత్తాయి. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం జరిగిన వివాదంపై మనస్తాపానికి గురైన ఆమె కాలువలో దూకి బలవన్మరణానికి పాల్పడింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

పెనమలూరు, న్యూస్‌టుడే: సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తిని లారీ ఢీకొట్టిన ఘటనపై పెనమలూరు పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. కానూరుకు చెందిన సొంగా సుధాకర్ కూలి పనులు చేస్తుంటాడు. ఈ నెల 6న సోమవారం సైకిల్‌పై కామయ్యతోపు నుంచి వెళ్తుండగా వెనక నుంచి వచ్చిన లారీ ఆయన్ని ఢీకొట్టింది. సుధాకర్ కిందపడిపోగా ఆయన ఎడమచేతిపైకి లారీ టైరు ఎక్కింది. తీవ్రగాయాలు కావడంతో ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

జూదరుల అరెస్టు

పెనమలూరు, న్యూస్‌టుడే: ఓ ప్రైవేటు లాడ్జీలో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేసినట్లు పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.12 వేలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

నోటీసు

మహారాజశ్రీ గుంటూరు 4వ అదనపు సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
ఒ.యస్.నెం.170/2023 మరియు ఐ.ఎ.నెం.473/2023
బిట్వీన్:
శ్రీనివాసబాబు మంచికలపూడి గారి తరపున జి.పి.ఏ. హోల్డర్ రాంబాబు జోడపాటి ..వాది(పిటీషనరు)
మరియు
నాగండ్ల హైమావతి వగైరాలు.
...ప్రతి వాదులు(రెస్పాండెంట్లు)
టు,
D-5(R-5):చాగర్లమూడి జయ సరస్వతి, భర్త.శివరామ బ్రహ్మయ్య, నివాసం.డోర్ నెం.3-63-2, పెనమలూరు, విజయవాడ, కృష్ణా జిల్లా.
పై నెంబరు దావాలో 5వ ప్రతివాది మరియు ఐ.ఎ.నెం.473/2023 ఇన్ ఓ.యస్.నెం.170/2023 పిటీషనులో 5వరెస్పాండెంటు అయిన మీకు పై కోర్టు వారి నుండి ఎన్ని సార్లు సమన్సు/నోటీసులు పంపించినను ముట్టనందున మీకు సమన్సు/నోటీసులు ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయమని ది.05-01-2026కి వాయిదా వేసినారు. కావున వాయిదా రోజు ఉ.గం.10-30ని.లకు పై కోర్టు వారి యెదుట మీరు స్వయంగా కాని లేదా మీ తరపు న్యాయవాది ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనిచో సదరు దావా మరియు పిటీషను మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడును.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేదీ: 05-01-2026
పెద్ది రాజేంద్ర ప్రసాద్, వాది(పిటీషనరు)తరపు అడ్వకేట్, గుంటూరు, సెల్. 98483 66343

ప్రకటన

నా క్లయింట్ గన్నవరం కాపురస్థులు శ్రీ చాట్ల దేవసహాయం గారి కుమారుడు శ్రీ చాట్ల మోజెస్ గారి సంజాయిషీ పొంది తెలియజేయునది ఏమనగా గన్నవరం కాపురస్థులు శ్రీ చిలకపాటి బసంత్ కుమార్ గారు వారి స్థిరాస్తులను రిజిస్టర్డ్ పార్టీషన్ దస్తావేజు నెం. 508/1984 క్రింద వారి తండ్రిగారు మరియు వారి సోదరులతో పంచుకొనగా ముఖ్య parata ద.నెం. 881/1999 క్రింది శ్రీ కారంపూడి సత్యనారాయణ గారితో మార్పిడి చేసుకొనగా వారికి సంక్రమించిన గన్నవరం గ్రామ రీ సర్వే నెం. 384/9 దాఖలా చ.గ. 510లును ద.నెం. 2642/2011 క్రింద శ్రీ కొక్కిలిగడ్డ వరప్రసాద్ గారికి విక్రయించినారని మరియు శ్రీ చిలకపాటి బసంత్ కుమార్ గారు పైన తెలిపిన పార్టీషన్ దస్తావేజు క్రింద సంక్రమించిన ఆస్తి నుండి రీ సర్వే నెం. 383/3నందున చ.గ. 102లు ద.నెం. 7810/2011 క్రింద శ్రీమతి కొక్కిలిగడ్డ ప్రమీల గారికి విక్రయించినారని తదుపరి శ్రీ కొక్కిలిగడ్డ వరప్రసాద్ గారు మరియు శ్రీమతి కొక్కిలిగడ్డ ప్రమీల గార్లు దిగువ షెడ్యూల్ దాఖలా చ.గ. 612లును శ్రీ చెన్నుపాటి చంద్రశేఖరరావు గారి భార్య శ్రీమతి తుమ్మల నాగలక్ష్మి గారికి రిజిస్టర్డ్ క్రయ దస్తావేజు నెం. 5228/2014 విక్రయించినారని ఆ తదాది నుండి సదరు స్థలము శ్రీమతి తుమ్మల నాగలక్ష్మి గారి సర్వ స్వాధీన హక్కు భుక్తములందే కలదని నా క్లయింటును నమ్మించగా దిగువ షెడ్యూల్ దాఖలా స్థలమును శ్రీమతి తుమ్మల నాగలక్ష్మి గారి నుండి క్రయం పొందుటకు నా క్లయింట్ ఖరారు పడి త్వరలో సక్రమమైన రిజిస్టర్డ్ క్రయ దస్తావేజు ద్వారా స్వాధీనము పొందబోవుచున్నాడు. కావున సదరు షెడ్యూల్ దాఖలా స్థిరాస్తి పైన ఎవరికైనను ఎటువంటి హక్కులు గానీ, క్లయిమ్‌లు గానీ, అభ్యంతరములు గాని ఉన్న యెడల నాకు 7 దినముల లోగా రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా తెలియపరచగలరు. లేనిచో సదరు షెడ్యూల్ దాఖలా ఆస్తి నిర్వివాదమైనదని భావించి నా క్లయింట్ కొనుగోలు చేయుదురు. తదుపరి వచ్చు క్లయిమ్‌లు గానీ అభ్యంతరములు గాని చట్టప్రకారం చెల్లవు మరియు నా క్లయింటును బైండ్ చేయజాలవు.
షెడ్యూల్:- కృష్ణా జిల్లా విజయవాడ రిజిస్ట్రేషన్ జిల్లా గన్నవరం సబ్-రిజిస్ట్రార్ వారి ఇలాకా గన్నవరం మండలం గన్నవరం గ్రామ పంచాయితీ ఏరియాలోని రీ సర్వే నెం. 383/3 మరియు 384/9 దాఖలా చ.గ. 612 లకు హద్దులు:- తూర్పు: 18.6 అడుగుల దారి మరియు చిలకపాటి బసంత్‌కుమార్‌గారి ఆస్తి, దక్షిణం: అర్వపల్లి బోసుగారి తాలూకు ఆస్తి, పడమర: షేక్ బాబీస్‌సాహెబ్ గారి ఆస్తి, ఉత్తరం: కోనేరు వెంకటేశ్వరరావు గారి తాలూకు ఆస్తి.
ఇట్లు
పాదర్తి పూర్ణచంద్రరావు, అడ్వకేట్
F.F-1, LRK టవర్స్, రామాలయం వీధి, కృష్ణలంక, విజయవాడ-13. Ph.98482 30004

SBI భారతీయ స్టేట్ బ్యాంక్
హోమ్ లోన్ సెంటర్-2, డి.నెం.54-15-1/బి, యలమంచిలి కాంప్లెక్స్, వెంకటేశ్వర నగర్, విజయవాడ-520 008.
స్వాధీనత ప్రకటన
APPENDIX IV (రూలు-8(1) (స్థిరాస్తి కొరకు)
[illegible]
తేది : 05-12-2025
ప్రదేశం: విజయవాడ
అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

SBI భారతీయ స్టేట్ బ్యాంక్
హోమ్ లోన్ సెంటర్-1 (ఆర్‌ఎసిపిసి-1), కె.కె.టవర్స్, మొదటి అంతస్తు, యం.జి.రోడ్డు, విజయవాడ-520 010, ఎన్‌టిఆర్ జిల్లా.
Appendix – IV –A
[See Provison to rule 8(6) R/w 9(1)]
స్థిరాస్తి ఈ-వేలం అమ్మకం బహిరంగ ప్రకటన తేది.09-01-2026
[illegible]
రిజర్వు ధర: రూ.47,60,000/- ధరావత్తు: రూ.4,76,000/- బిడ్ పెంపుదల: రూ.10,000/-
ఇ-వేలం తేదీ & సమయం: 09-01-2026 ఉ॥ గం॥ 11.00 ల నుండి సా॥ గం॥ 04.00 ల వరకు
A/c No:30733231487, IFSC Code: SBIN0011098, Name of the Bank, SBI, SARC, (HLC-1), Vijayawada, NTR District https://www.baanknet.com
M/s PSB Alliance PVT Ltd., +91 8291220220 https://www.baanknet.com
SBI, HLC-1, 9424690028, sbi.05252@sbi.co.in
M/s.PRS Associates: 7013439314
ప్రదేశం: విజయవాడ
తేది : 08-12-2025
సం/- అధీకృత అధికారి, భారతీయ స్టేట్ బ్యాంక్

(c) eenadu

2027లో రై రై బుల్లెట్ రైల్

● అదే ఏడాది ఆగస్టులో ట్రయల్ రన్ ● గుజరాత్‌లో వేగంగా ప్రాజెక్టు పనులు ● ప్రతి స్టేషన్ నిర్మాణమూ ప్రత్యేకమే

గుజరాత్ నుంచి ఈనాడు ప్రత్యేక ప్రతినిధి

దేశంలో మొదటి బుల్లెట్ ట్రైన్ పరుగులు పెట్టనున్న గుజరాత్‌లో ప్రాజెక్టు పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈ ట్రాక్ వెళ్లే అహ్మదాబాద్, సబర్మతిలలో స్టేషన్లను సంస్కృతి ప్రతిబింబించేలా అదే సమయంలో అత్యాధునిక వసతులు ఉండేలా తీర్చిదిద్దుతున్నారు. అహ్మదాబాద్-ముంబయి మధ్య నడవనున్న బుల్లెట్ రైలు.. 508 కిలోమీటర్ల దూరాన్ని 2 గంటల 7 నిమిషాల్లోనే చేరుకుంటుంది. దీనికి సంబంధించి 2027 ఆగస్టులో గుజరాత్‌లోని సూరత్-బిలిమోరా మధ్య 50 కి.మీ. దూరానికి ట్రయల్ చేపట్టనున్నట్లు నేషనల్ హైస్పీడ్ రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ అహ్మదాబాద్ సివిల్ పనుల విభాగం ప్రిన్సిపల్ చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ రాజేష్ అగర్వాల్ వివరించారు. ఈ ప్రాజెక్టు మొత్తం వ్యయం రూ.1.08 లక్షల కోట్లు కాగా గంటకు 350 కి.మీ. వేగంతో దూసుకుపోయే సామర్థ్యం ఈ బుల్లెట్ రైలుకు ఉంటుంది. అత్యాధునిక ట్రాక్‌తో పాటు మెట్రో, బస్సు, రైలు, బుల్లెట్ రైలు మార్గాలను అనుసంధానించేలా పూర్తి స్థాయి వసతులతో మొత్తం 12 స్టేషన్లు నిర్మిస్తున్నారు. సబర్మతిలో మల్టీమోడల్ ట్రాన్స్‌పోర్ట్ హబ్ నిర్మాణం ఇప్పటికే పూర్తయింది. ఇది 2026లో అందుబాటులోకి రానుందని రాజేష్ వివరించారు. అహ్మదాబాద్, సబర్మతిలలో కొన్ని చోట్ల పనులు ఇప్పటికే పూర్తికాగా, మరి కొన్నిచోట్ల వివిధ దశల్లో ఉన్నాయి. ఈనాడు ప్రతినిధి ఈ ప్రాజెక్ట్ పనులను క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు. వివరాలివీ....

నిర్మాణంలో ఉన్న అహ్మదాబాద్ బుల్లెట్ ట్రైన్ స్టేషన్ ★ సబర్మతిలో నిర్మించిన మల్టీ ట్రాన్స్‌పోర్ట్ హబ్

అహ్మదాబాద్ బుల్లెట్ ట్రైన్ స్టేషన్

● అహ్మదాబాద్ బుల్లెట్ ట్రైన్ స్టేషన్ నిర్మాణాన్ని నగర సాంస్కృతిక, చారిత్రక వారసత్వం ప్రతిబింబించేలా రూపొందించారు. సుమారు 38,000 చదరపు మీటర్ల విస్తీర్ణంలో నేల పైనుంచి 33.7 మీటర్ల ఎత్తులో ఈ స్టేషన్ ఉంటుంది. ప్రస్తుతం నిర్మాణ పనులు సాగుతున్నాయి. ● ప్రయాణికుల సౌలభ్యం కోసం లాంజ్, మరుగుదొడ్లు, ఉద్యానవనాలు, వాణిజ్య దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. ● బుల్లెట్ ట్రైన్ స్టేషన్‌ను మెట్రో, ఆర్టీసీ, క్యాబ్ సర్వీసులతో అనుసంధానించేందుకు ఇంటిగ్రేటెడ్ భవనం నిర్మిస్తున్నారు. అహ్మదాబాద్ రైల్వే స్టేషన్‌తోనూ బుల్లెట్ ట్రైన్ స్టేషన్ అనుసంధానమై ఉంటుంది. ● ఇక్కడి నుంచి అహ్మదాబాద్ విమానాశ్రయం దాదాపు 10 కి.మీ., గీతా మందిర్ సెంట్రల్ బస్ స్టాండ్‌కు 3.5 కి.మీ. దూరంలోనే ఉంటాయి.

సబర్మతి బుల్లెట్ ట్రైన్ స్టేషన్

● సబర్మతి టెర్మినల్ స్టేషన్ మహాత్మా గాంధీ సబర్మతి ఆశ్రమంలోని చరఖా నుంచి ప్రేరణ పొందింది. ● ఈ స్టేషన్ మొత్తం నిర్మాణ విస్తీర్ణం: 45,094 చదరపు మీటర్లు కాగా భూమి నుంచి 44 మీటర్ల ఎత్తులో ఉంటుంది. నిర్మాణం కొనసాగుతోంది.

సబర్మతి మల్టీమోడల్ హబ్

● హై స్పీడ్ రైల్ మల్టీమోడల్ హబ్ ఒక ఆధునిక భవనం. సబర్మతి రైల్వే స్టేషన్లు, మెట్రో స్టేషన్, నిర్మాణంలో ఉన్న సబర్మతి బుల్లెట్ ట్రైన్ స్టేషన్, బస్ ర్యాపిడ్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్‌తో నిరంతర కనెక్టివిటీ అందించడానికి దీనిని డిజైన్ చేశారు. ● ఈ ప్రతిష్ఠాత్మక నిర్మాణం ముందు భాగం దండి మార్చ్ ఉద్యమాన్ని ప్రతిబింబిస్తుంది. ● ఈ భవన నిర్మాణం దాదాపుగా పూర్తయింది. ● ఆరు అంతస్తుల ఈ భవనంలో బ్యాంకెట్ హాళ్లు, కాన్ఫరెన్స్ రూమ్‌లు, స్విమ్మింగ్ పూల్, రెస్టారెంట్‌తో కూడిన హోటల్.. మొదలైనవి ఉంటాయి. ● పర్యావరణానికి హాని కలిగించని రీతిలో గ్రీన్ బిల్డింగ్‌గా ఈ హబ్‌ను తీర్చిదిద్దనున్నారు.

నేలపాలు చేసిన ద్రవ ఉక్కు

1,500 టన్నుల ద్రవ ఉక్కు నేలపాలు

ఉక్కునగరం (స్టీల్ సెక్టార్-3), న్యూస్‌టుడే: విశాఖ ఉక్కు కర్మాగారంలో సోమవారం 1,500 టన్నుల ద్రవ ఉక్కును నేలపాలు చేశారు. ఎస్ఎమ్ఎస్-2లో 600 టన్నులు, బి.ఎస్ఎమ్‌లో 900 టన్నుల ద్రవ ఉక్కును ఇలా పారబోశారు. విశాఖ ఉక్కు యాజమాన్యం విలువైన ఉక్కును తుక్కు (స్లాగ్) పేరుతో నేలపాలు చేస్తోందని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఉక్కు తయారీ పంపకుండా ఫుల్ ఐరన్ పేరుతో తుక్కుగా మార్చడం తగదని అంటున్నాయి. ఫుల్ ఐరన్ తయారు చేయాలన్నా కమిటీ అనుమతులు ఉండాలని.. అది తీసుకోకుండానే ఇలా చేస్తున్నారని కార్మికులు ఆరోపణలు చేస్తున్నారు. ఎవరికి లబ్ధి చేకూర్చేందుకు ఈ విధంగా చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు.

కర్ణాటక సీఎంకు 'సుప్రీం' తాఖీదులు

ఈనాడు, బెంగళూరు: కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు సుప్రీంకోర్టు తాఖీదులు జారీ చేసింది. 2023లో విధానసభ ఎన్నికల సమయంలో మైసూరు జిల్లా వరుణ నియోజకవర్గం నుంచి సిద్ధరామయ్య గెలిచేందుకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 'గ్యారంటీ పథకాల భరోసా' కారణమని, అవి ఎన్నికల నియమావళిని ఉల్లంఘించడమేనని అభ్యంతరం తెలుపుతూ అదే నియోజకవర్గానికి చెందిన శంకర్ అనే ఓటరు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ధర్మాసనం వివరణ ఇవ్వాల్సిందిగా సిద్ధరామయ్యకు తాఖీదులు జారీ చేసింది. ఎన్నికల ముందు ఇచ్చే గ్యారంటీ హామీలు ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951 ప్రకారం అవినీతిగా పరిగణించాలని, మహిళలకు మాత్రమే బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించటం పురుషులపై వివక్షగా భావించాలని శంకర్ గతంలో కర్ణాటక హైకోర్టులో పిటిషన్ వేశారు. దీన్ని విచారించిన కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సునీల్‌దత్ యాదవ్.. పిటిషన్‌లో చట్టాలను ఉల్లంఘించేంత కారణాలేవీ లేవన్నారు. పార్టీ రూపొందించిన ఎన్నికల ప్రణాళికలకు ఓ అభ్యర్థిని ఎలా బాధ్యుడిని చేస్తామని ప్రశ్నించారు. ఇలాంటి పిటిషన్లు గతంలోనూ దాఖలైనట్లు గుర్తుచేస్తూ శంకర్ అభ్యంతరాలను కొట్టివేశారు. ఈ తీర్పును సవాలు చేస్తూ పిటిషనర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

మంత్రి నెహ్రూ అవినీతికి పాల్పడ్డారు

● కేసు నమోదు చేయండి ● తమిళనాడు డీజీపీకి ఈడీ లేఖ

చెన్నై (ప్యారిస్), న్యూస్‌టుడే: తమిళనాడు పురపాలక, నీటి సరఫరా శాఖల మంత్రి కేఎన్ నెహ్రూ రూ.1,020 కోట్ల మేర అవినీతికి పాల్పడ్డారని, ఆయనపై కేసు నమోదు చేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఆ రాష్ట్ర డీజీపీకి లేఖ రాసింది. అందులో.. మంత్రి కేఎన్ నెహ్రూ నిర్వహిస్తున్న శాఖల్లో భవనాలు, మరుగుదొడ్ల నిర్మాణం, పొరుగు సేవల నియామకం, నాబార్డ్ నిధులు, పారిశుద్ధ్య పనులకు సంబంధించిన ఒప్పందం, పారిశుద్ధ్య కార్మికుల గృహ నిర్మాణ ప్రాజెక్టులకు సంబంధించిన టెండర్లు, ఒప్పందాల్లో అవకతవకలు జరిగాయని తెలిపింది. టెండర్లు, ఒప్పందాలు ముందుగానే ఎవరికి ఇవ్వాలో నిర్ణయించి, ఒక్కో టెండరుకు 7.5 శాతం నుంచి 10 శాతం వరకు కమీషన్ తీసుకున్నారని, ఈ అవినీతి రూ.1,020 కోట్ల మేర జరిగినట్లు ఆరోపించింది. కమీషన్‌గా పొందిన నగదు విదేశాలకు హవాలా ద్వారా బదిలీ అయి ఉండొచ్చని పేర్కొంటూ 259 పేజీల పత్రాలను తమిళనాడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీలకు పంపింది. ఇందుకు సంబంధించి కేసు నమోదు చేయాలని కోరింది. మంత్రి కేఎన్ నెహ్రూపై అవినీతి ఆరోపణలు చేస్తూ కేసు నమోదు చేయాలంటూ డీజీపీకి ఈడీ రాసిన రెండో లేఖ ఇది కావడం గమనార్హం. ఇదివరకు ఆయన శాఖలోని ఖాళీల భర్తీలో భారీగా అవినీతి జరిగిందని, ఒక్కో పోస్టుకు రూ.25 లక్షల నుంచి రూ.35లక్షల వరకు లంచం తీసుకున్నారని ఆరోపణలు చేసింది.

పాతికేళ్ల ప్రతీకారం.. రియల్టర్ దారుణ హత్య

● వేటకొడవళ్లతో నరికి...

తుపాకీతో కాల్చిన ఆరుగురు..

ఈనాడు-హైదరాబాద్, జవహర్‌నగర్, న్యూస్‌టుడే: స్థిరాస్తి వ్యాపారిని ఆటోతో గుద్దించి.. కత్తులతో విచక్షణ రహితంగా నరకడంతోపాటు తుపాకీతో కాల్చి మరీ హతమార్చిన ఉదంతంతో హైదరాబాద్ ఉలిక్కిపడింది. సుమారు 25 ఏళ్ల క్రితం జరిగిన తన తండ్రి ఎన్‌కౌంటర్‌కు ప్రతీకారంగా.. ఆయన కుమారుడు.. స్నేహితులతో కలిసి ఈ దారుణానికి ఒడిగట్టినట్లు, అనంతరం పోలీసులకు లొంగిపోయినట్లు సమాచారం. సోమవారం తెల్లవారుజామున మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిందీ దారుణం.

ఆటోతో ఢీకొట్టి.. కిరాతకంగా హత్య

ఏపీలోని కృష్ణా జిల్లా మైలవరానికి చెందిన గంటా వెంకటరత్నం(54).. ముప్పై ఏళ్లకు పూర్వమే హైదరాబాద్ వచ్చాడు. చాలా కాలంగా స్థిరాస్తి వ్యాపారం చేస్తున్నాడు. ఐదేళ్లుగా జవహర్‌నగర్ ఠాణా పరిధి సాకేత్ కాలనీలో నివసిస్తున్నాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు. ఎప్పటిలానే సోమవారం ఉదయం కుమార్తెను అదే కాలనీలోని స్కూల్ దగ్గర వదిలిపెట్టాడు. ఉదయం 7.55 గంటల సమయంలో ఇంటికి తిరిగి వెళ్తుండగా.. ద్విచక్రవాహనంపై ఇద్దరు, ఆటోలో నలుగురు వెంబడించారు. తొలుత వెంకటరత్నం ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనాన్ని రాంగ్ రూట్‌లో వచ్చి ఆటోతో ఢీకొట్టారు. కిందపడిపోయిన ఆయన తేరుకునేలోపే.. వేటకొడవళ్లతో మెడ, తల, ఇతర శరీరభాగాలపై దాదాపు 25 సార్లు నరికారు. తర్వాత సమీపంలోని

హత్యకు గురైన వెంకటరత్నం

బండరాయి తీసుకొచ్చి తలపై మోదారు. ఇదంతా జరుగుతుండగానే.. నిందితుల్లో ఒకడు తుపాకీతో ఒక రౌండు కాల్చడంతో వెంకటరత్నం అక్కడికక్కడే మృతి చెందాడు. హత్యోదంతం.. అనంతరం నిందితులు అక్కణ్నుంచి పరారైన దృశ్యాలు సమీపంలోని సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. జవహర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదయ్య, మల్కాజిగిరి డీసీపీ శ్రీధర్ ఘటనాస్థలిని సందర్శించారు. ఘటనా స్థలంలో పడి ఉన్న తూటా, వేట కొడవలిని స్వాధీనం చేసుకున్నారు. హత్య జరిగిన తర్వాత నిందితులు సౌత్‌వెస్ట్ జోన్ డీసీపీ కార్యాలయంలో లొంగిపోయినట్లు విశ్వసనీయంగా తెలిసింది.

పాతకక్షల కారణంగానే..: పాతకక్షల కారణంగానే హత్య చేసినట్లు ప్రధాన నిందితుడు, నగరంలోని జుమ్మెరాత్‌బజార్‌కు చెందిన చందన్‌సింగ్(33) చెప్పినట్లు సమాచారం. ఆ ప్రకారం..'చందన్‌సింగ్ తండ్రి సుదేశ్‌సింగ్ రౌడీషీటర్. పాతికేళ్ల క్రితం నగరంలో భూదందాలు, సెటిల్‌మెంట్లు చేసే వాడు. అప్పట్లో వెంకటరత్నం ఆయనకు ప్రధాన అనుచరుడిగా ఉండేవాడు. సుదేశ్‌సింగ్ 2001 ఏప్రిల్‌లో జరిగిన పోలీస్ ఎన్‌కౌంటర్‌లో మరణించాడు. వెంకటరత్నం పోలీస్ ఇన్‌ఫార్మర్‌గా వ్యవహరించడమే తన తండ్రి మరణానికి కారణమని భావించిన చందన్‌సింగ్ పగ పెంచుకున్నాడు. ఈ క్రమంలోనే తన స్నేహితులైన వడ్డే వెంకటనారాయణ(39), కె.నరేశ్‌కుమార్(28), ఈషాన్‌శర్మ(19), ఎన్.పవన్‌కుమార్(20), నర్సింగ్(26) సాయంతో హత్యకు ప్రణాళిక రచించాడు.

రెరాపై నెలకో ఉమ్మడి జిల్లాలో అవగాహన సదస్సు

● 10న తిరుపతిలో శ్రీకారం

● ఏపీ రెరా ఛైర్మన్ శివారెడ్డి వెల్లడి

ఈనాడు, అమరావతి: రెరా చట్టంపై బిల్డర్లు, కొనుగోలుదారులకు అవగాహన కల్పించేందుకు నెలకో ఉమ్మడి జిల్లాలో సదస్సులు నిర్వహించనున్నట్లు ఏపీ రెరా ఛైర్మన్ ఎ.శివారెడ్డి తెలిపారు. ఈనెల 10న తిరుపతిలో మొదటి సదస్సు జరగనుందని ఆయన చెప్పారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని అన్ని పుర, నగరపాలక సంస్థల పరిధిలోని బిల్డర్లు, కొనుగోలుదారులు, సంబంధిత ప్రభుత్వశాఖల అధికారులను ఆహ్వానిస్తున్నామని వివరించారు. విజయవాడలోని రెరా కార్యాలయాన్ని రాజధాని అమరావతిలో కొత్తగా ప్రారంభించిన సీఆర్‌డీఏ కార్యాలయం ప్రాంగణంలోకి తరలించిన విషయం తెలిసిందే. కొత్త కార్యాలయంలో డైరెక్టర్లతో కలిసి ఛైర్మన్ శివారెడ్డి సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'ఇళ్లు, స్థలాల కొనుగోలుదారులకు రెరా చట్టం కల్పిస్తున్న హక్కులపై ఇంకా అవగాహన అవసరం. బిల్డర్లు, లేఔట్‌లు వేసే వారికి కూడా కొత్తగా ప్రారంభించే ప్రాజెక్టులకు రెరా రిజిస్ట్రేషన్ తప్పనిసరన్న విషయంపై అవగాహన కల్పించాలన్న ఉద్దేశంతో సదస్సులు నిర్వహించాలని నిర్ణయించాం' అని ఛైర్మన్ వివరించారు.

సాధ్యంకాని హామీలు ఇవ్వొద్దు..

'బిల్డర్లు ఎంత చేయగలరో ఆ మేరకే బ్రోచర్లలో ముద్రించాలి. ఎక్కువ చేస్తామని చెప్పి చేయకపోతే తర్వాత ఇబ్బందుల్లో పడతారు. సాధ్యంకాని హామీలు ఇవ్వొద్దు. ప్రాజెక్టుల పనులు గడువులోగా పూర్తి చేయాలి. కొనుగోలుదారులకు నష్టం జరిగితే ఎట్టి పరిస్థితుల్లోనూ విడిచిపెట్టేది లేదు. ప్రాజెక్టుల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి బిల్డర్లు అన్ని దస్తావేజులు పక్కాగా అప్‌లోడ్ చేస్తే ..గంట వ్యవధిలో రిజిస్ట్రేషన్లు పూర్తి చేయడానికి సిద్ధంగా ఉన్నాం' అని శివారెడ్డి అన్నారు.

ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయొచ్చు

ఇళ్లు, స్థలాల కొనుగోలుదారులు నష్టం జరిగిందని భావిస్తే... ఏపీ రెరాకు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయొచ్చు. కార్యాలయం అమరావతికి మార్చినా ఫిర్యాదుదారులకు ఎలాంటి ఇబ్బంది లేదు. బాధితులకు న్యాయం చేయడానికే ప్రయత్నిస్తాం. మహారాష్ట్ర, దిల్లీ, గుజరాత్ రాష్ట్రాల్లో రెరాలో అమలు చేస్తున్న ఉత్తమ విధానాలపై అధ్యయనం కోసం త్వరలో వెళ్లనున్నాం. వాటిలో ముఖ్యమైనవి రాష్ట్రంలోనూ అమలు చేయడానికి ప్రయత్నిస్తాం' అని శివారెడ్డి తెలిపారు. 'ఈ ఏడాది సెప్టెంబరు 17న బాధ్యతలు చేపట్టిన నుంచి ఇప్పటివరకు 270 కొత్త స్థిరాస్తి వ్యాపార ప్రాజెక్టులకు అత్యంత పారదర్శకంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేశాం. కొనుగోలుదారుల ఫిర్యాదులపై విచారణకు గురు, శుక్రవారాల్లో రెండు రోజులపాటు బెంచ్ భేటీ అవుతోంది. గతంలో వారంలో ఒక రోజే ఉండేది' అని రెరా డైరెక్టర్ దామచర్ల శ్రీనివాసరావు వివరించారు. డైరెక్టర్లు కామేశ్వరరావు, కులదీప్, జగన్నాథరావు, వెంకటరత్నంతోపాటు రెరా పట్టణ ప్రణాళిక విభాగం డైరెక్టర్ నాగసుందరి పాల్గొన్నారు.

హస్త కళాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం

విజయవాడ (గాంధీనగర్), న్యూస్‌టుడే : తెలుగు నేల సాంస్కృతిక సౌరభాలకు నెలవు. హస్తకళలు, కళాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ పసుపులేటి హరిప్రసాద్ అన్నారు. ఈ నెల 8వ తేదీ నుంచి 14 వరకు జాతీయ హస్తకళా వారోత్సవాల్లో భాగంగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సోమవారం గాంధీనగర్‌లోని లేపాక్షి ఎంపోరియాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. ఏపీహెచ్‌డీసీ ఆధ్వర్యంలో ఈ నెల 10న వైఎస్ఆర్ కడప జిల్లా ఓనిపెంటలో గురుశిష్య హస్త శిల్ప్ ప్రశిక్షణ్ ప్రోగ్రామ్ (జీఎస్‌హెచ్‌పీపీ) ద్వారా ఇత్తడి, కంచు లోహపు హస్తకళాకారులకు శిక్షణ ప్రారంభమవుతుందన్నారు. ఈ నెల 12న పల్నాడు జిల్లా దుర్గిలో కళాకారులకు డిజైన్ అభివృద్ధిపై కార్యశాల, 13న శ్రీకాళహస్తిలో కలప, చెక్క కళాకారులకు టూల్ కిట్ల పంపిణీ, 14న అనకాపల్లి జిల్లా కె.డి.పేటలో కళాకారులకు టూల్‌కిట్ల పంపిణీ, డిసెంబరు 15-21 తేదీల్లో రాజమహేంద్రవరంలో గాంధీ శిల్ప్ బజార్ నిర్వహణ, 17న నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో శిల్పకళాకారులకు టూల్‌కిట్ల పంపిణీ ఉంటుందని వివరించారు. డిసెంబరు 9న దిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో భారత ప్రభుత్వ జౌళి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 2023, 2024 సంవత్సరాలకు సంబంధించి హస్తకళా అవార్డుల ప్రదానోత్సవం జరగనుందని తెలిపారు. ఇందులో రాష్ట్రానికి చెందిన ముగ్గురు కళాకారులు అవార్డులు అందుకోనుండడం గర్వకారణమన్నారు. డి.శివమ్మ (తోలుబొమ్మలాట, శిల్పగురు అవార్డు), గోర్స సంతోష్ (ఏటికొప్పాక బొమ్మలు, జాతీయ అవార్డు 2024), పి.విజయలక్ష్మి (కలంకారి హ్యాండ్ పెయింటింగ్, జాతీయ హస్తకళా అవార్డు 2023)లు రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డులు అందుకోనున్నట్లు వివరించారు. రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ వీసీ అండ్ ఎండీ ఎం.విశ్వ, లేపాక్షి ఓఎస్‌డీ ఐ.వి.లక్ష్మీనాథ్, ఎంపోరియం మేనేజర్ ఎం.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కొండపల్లి బొమ్మను పరిశీలిస్తున్న పసుపులేటి హరిప్రసాద్ తదితరులు

9 నుంచి లారీ యజమానుల సమ్మె

ఆటోనగర్, న్యూస్‌టుడే: రవాణా వాహనాలపై ఫిట్‌నెస్ ఛార్జీలను పాత విధానంలోనే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 9వ తేదీ అర్ధరాత్రి నుంచి లారీలను నిలిపివేసి సమ్మె చేపడుతున్నట్లు న్యూ ఆంధ్రా మోటార్ ట్రక్కర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొడ్డ శేషగిరి ప్రకటనలో తెలిపారు. రాష్ట్రానికి ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న రవాణా రంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందన్నారు. ఫిట్‌నెస్ ఛార్జీల పెంపుతో నిత్యావసర వస్తువుల ధరలు పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. రవాణా ఛార్జీలు పెరగడం వల్ల వ్యవసాయ వ్యయాలతో పాటు నిత్యావసర సరకుల ధరలు అధికమవుతాయన్నారు. గతంలో రూ.900 నుంచి రూ.1400 వరకు మాత్రమే ఉండే ఫిట్‌నెస్ ఛార్జీలు.. ప్రస్తుతం మూడు రెట్లు పెరగడంతో లారీ యజమానులపై తీవ్రమైన ఆర్థికభారం పడుతుందన్నారు. రోడ్ల పరిస్థితి దారుణంగా ఉందని, గుంతలు ఉన్న రోడ్ల కారణంగా వాహనాలు తరుచూ మరమ్మతులకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ రహదారుల పక్కనే సర్వీస్ రోడ్ల నిర్మాణం చేపడితే రోడ్డు ప్రమాదాలు గణనీయంగా తగ్గుతాయన్నారు. కౌంటర్ సిగ్నేచర్ ఫైల్‌ను తెలంగాణ ప్రభుత్వం మూడేళ్లలో ఆమోదించి పంపిందని కానీ ఆ ఫైల్ గత ఎనిమిదేళ్లుగా ఏపీ రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి వద్ద పెండింగ్‌లోనే ఉందని బొడ్డ శేషగిరి గుర్తుచేశారు.

బీడీఎస్ యాజమాన్య ప్రవేశాలకు ఫ్రీ ఎగ్జిట్

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: 2025-26 విద్యా సంవత్సరానికి రాష్ట్రంలో పలు ప్రైవేటు దంత వైద్య కళాశాలల్లో అందుబాటులో ఉన్న బీడీఎస్ యాజమాన్య కోటా సీట్ల ప్రవేశానికి సంబంధించి మొదటి రెండు విడతల్లో సీటు పొందిన అభ్యర్థులకు విజయవాడ డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం 'ఫ్రీ ఎగ్జిట్' ఆప్షన్ ఇచ్చింది. అభ్యర్థులు ఈనెల 10వ తేదీ మధ్యాహ్నం రెండు గంటల్లోగా తమ ఆప్షన్‌ను సంబంధిత దంత కళాశాలల ప్రిన్సిపల్స్‌కు తెలియజేయాల్సి ఉంటుందని రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి తెలిపారు.

పోలీసుల వైఖరిపై భవానీల ఆగ్రహం

కృష్ణలంక, న్యూస్‌టుడే: దీక్షలో ఉన్న తమపై అనుచితంగా ప్రవర్తించిన పోలీసులు క్షమాపణ చెప్పాలంటూ భవానీలు కృష్ణలంక జాతీయ రహదారిపై బైఠాయించారు. కంకిపాడుకు చెందిన సుమారు 20 మంది భవానీలు సోమవారం రెండు ఆటోల్లో చద్ది నిమిత్తం గుంటూరు జిల్లా తాడేపల్లికి బయలు దేరారు. ఆటోలు తాడిగడప 100 అడుగుల రోడ్డుకు చేరుకునే సరికి వెనుకగా ద్విచక్ర వాహనంపై వెళుతున్న మఫ్టీలో ఉన్న ఏఆర్ కానిస్టేబుల్ ఒకరు ఆటో వెనుక భాగంలో అజాగ్రత్తగా కూర్చున్న పిల్లలను గమనించి వారిని సరిగ్గా కూర్చోపెట్టాల్సిందిగా ఆటో డ్రైవర్‌కు సూచించారు. అదే వ్యక్తి ఆటోను వెంబడించి కానూరు వీఆర్ సిద్ధార్థ కళాశాల వద్దకు ఆటో చేరుకున్న క్రమంలో ద్విచక్ర వాహనాన్ని ఆటో ముందు నిలుపుదల చేసి ఫొటో తీయడంతో భవానీలు కిందకు దిగి ఫొటో ఎందుకు తీశారంటూ గొడవకు దిగి చరవాణిని లాక్కొని నేలకేసి కొట్టి అక్కడ నుంచి వెళ్లిపోయారు. సదరు వ్యక్తి బెంజిసర్కిల్ వద్ద ట్రాఫిక్ పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఆటోను ఆపడంతో ఆటో దిగిన భవానీలు పోలీసులతో గొడవకు దిగడంతో వారిని అక్కడి నుంచి పంపించి వేశారు. కొద్దిసేపటికి స్క్యూబ్రిడ్జి వద్ద ఆటోలను ట్రాఫిక్ పోలీసులు నిలుపుదల చేయడంతో తామేం తప్పు చేయకున్నా దీక్షలో ఉన్న తమను కించపరిచే విధంగా మూడుసార్లు తమ ఆటోలను ఆపిన పోలీసులు అనుచితంగా ప్రవర్తించారంటూ జాతీయ రహదారిపై బైఠాయించి భజన చేశారు. అదే సమయంలో వారిలో ఒక బాలిక ఈ తతంగాన్ని ఫోన్‌లో వీడియో తీస్తుండడాన్ని గమనించి పోలీసుల్లో ఒకరు ఫోన్‌ను లాక్కుని నేలకేసి కొట్టడంతో ఆగ్రహానికి లోనైన భవానీలు పోలీసులు తమకు క్షమాపణ చెప్పాలని.. అప్పటి వరకూ ఇక్కడి నుంచి కదిలేది లేదంటూ పట్టుబట్టారు. దీంతో బెంజిసర్కిల్ వైపు నుంచి వచ్చే వాహనాలు పెద్ద సంఖ్యలో నిలిచి ట్రాఫిక్ నిలిచింది. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న ఏసీపీలు దామోదర్, పావన్ కుమార్, సీఐలు నాగరాజు, పవన్‌కిషోర్, బాల మురళీకృష్ణ తదితరులు వారికి సర్దిచెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

రహదారిపై బైఠాయించి భజన చేస్తున్న దీక్షాధారులు

ఖరీదైన బైక్‌లే లక్ష్యంగా చోరీలు

ఐదుగురి అరెస్టు, 15 ద్విచక్ర వాహనాల స్వాధీనం

నిందితులంతా నల్గొండ జిల్లా వారే

నందిగామ, న్యూస్‌టుడే

వ్యసనాలకు బానిసలైన యువకులు ఖరీదైన బైక్‌లే లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలోనే రెండు తెలుగు రాష్ట్రాల్లో ద్విచక్ర వాహనాలను చోరీ చేసి వాటిని విక్రయించి తాకట్టు పెడుతున్నారు. వీరంతా తెలంగాణ రాష్ట్రంలోని నల్గొండ జిల్లాకు చెందిన వారే. ఎన్టీఆర్ జిల్లా నందిగామ పోలీసులు నందిగామ వై.జంక్షన్ వద్ద ఆదివారం ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు. వీరి వద్ద 15 ఖరీదైన బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. వీటిని కొనుగోలు చేసిన మరికొందర్ని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. ఈ కేసు వివరాలను నందిగామ పోలీస్ స్టేషన్‌లో సోమవారం డీసీపీ లక్ష్మీనారాయణ విలేకరులకు వెల్లడించారు.

నందిగామ పోలీస్ స్టేషన్ పరిధిలో గత 20 రోజుల వ్యవధిలో ఐదు బైక్‌లు చోరీ చేశారు. పోలీస్ కమిషనర్ రాజశేఖర్‌బాబు ఆదేశాల మేరకు ఏసీపీ బాలగంగాధర్ తిలక్, సీఐ వైవీవీఎల్ నాయుడు, పోలీసులు దర్యాప్తు చేశారు. దీనిలో భాగంగా నందిగామ వై.జంక్షన్ వద్ద ఎస్సైలు మోహనరావు, సూర్యవంశీలు వాహనాలు తనిఖీ చేశారు. ఈ సమయంలో పోలీసులను చూసి నిందితులు తప్పించుకోవడానికి ప్రయత్నించగా వెంటాడి పట్టుకున్నారు. వీరి వద్ద నుంచి నందిగామ పోలీస్ స్టేషన్ పరిధిలోని 5, పల్నాడు జిల్లా పిడుగురాళ్ల, నరసరావుపేట, పెనమలూరు, కృష్ణలంక, రెంటచింతల పోలీస్ స్టేషన్ల పరిధిలో 5, ఇతర ప్రాంతాల్లో మరో 5 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.26 లక్షలు ఉంటుందని డీసీపీ తెలిపారు.

పట్టుబడిన ద్విచక్ర వాహనాలు, నిందితులతో డీసీపీ లక్ష్మీనారాయణ, ఏసీపీ తిలక్, సీఐ వైవీవీఎల్ నాయుడు

నందిగామ కోర్టులో హాజరు

బైక్‌ల చోరీ కేసులో నల్గొండ జిల్లా తిప్పర్తి మండలం ఇండ్లూరుకు చెందిన ఏపూరి శివ, నకిరికల్ మండలం చీమలగడ్డకు చెందిన కర్రి మహేంద్ర, నకిరికల్ పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన కంచుకొమ్మల సంజయ్‌కుమార్, దామచర్ల మండలానికి చెందిన ఊదర సంతోష్, నకిరికల్ మండలం చీమలిగడ్డకు చెందిన మేడిపల్లి ఉమేష్‌లను అరెస్టు చేశారు. వీరిని నందిగామ కోర్టులో న్యాయమూర్తి ముందు హాజరుపరుస్తామని డీసీపీ తెలిపారు. దొంగలను పట్టుకుని బైక్‌లు రికవరీ చేసిన నందిగామ ఎస్సైలు మోహనరావు, సూర్యవంశీ, తొమ్మిది మంది పోలీసులను డీసీపీ లక్ష్మీనారాయణ అభినందించారు. అనంతరం రివార్డులు అందజేశారు.

మావోయిస్టులకు న్యాయ సహాయంపై పిటిషన్

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : కృష్ణా జిల్లా పెనమలూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో పట్టుబడిన 26 మంది మావోయిస్టులకు న్యాయ సహాయం అందించేందుకు వారితో మాట్లాడాలని, దీనికి అనుమతి ఇవ్వాలని కోరుతూ బెజవాడ బార్ అసోసియేషన్ మానవ హక్కుల కమిటీ న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేసింది. మానవ హక్కుల కమిటీ సభ్యులు పిచుక శ్రీనివాస్, వేముల రవీంద్రనాథ్, సతీష్, ఎ.ఎస్.ఎస్.రాంప్రసాద్, గంగాభవానీ, ఆంజనేయులు తదితరులు జైలులో ఉన్న ముద్దాయిలను కలుసుకునేందుకు అనుమతి కోరుతూ విజయవాడలోని 6వ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. గత నెల 18న హిడ్మా మరి కొంత మంది మావోయిస్టులు మారేడుమిల్లి అడవుల్లో ఎదురు కాల్పుల్లో చనిపోయారు. వారికి రక్షణ వలయంగా ఉన్న సెక్యూరిటీ దళ సభ్యులు కానూరులో షెల్టర్ తీసుకున్నారు. మొత్తం 26 మంది మావోయిస్టులను పెనమలూరు పోలీసులు అరెస్టు చేయగా.. వారు రాజమహేంద్రవరం జైలులో రిమాండ్‌లో ఉన్నారు. వీరి కుటుంబ సభ్యులకు కేసు వివరాలు చెప్పలేదని, జైలులో ఉన్న వారికి న్యాయ సాయం అందలేదని పిచుక శ్రీనివాస్ తెలిపారు. ఈ నేపథ్యంలో బీబీఏ తరఫున న్యాయ సహాయం అందించేందుకు.. వారితో మాట్లాడేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ సోమవారం పిటిషన్ దాఖలు చేశారు.

పటమట కేసులో... పటమట పోలీస్‌స్టేషన్ పరిధిలో పట్టుబడి నెల్లూరు కారాగారంలో ఉన్న నలుగురు మావోయిస్టులకు న్యాయ సహాయం అందించేందుకు 4వ ఏసీజేఎం కోర్టులో ఇప్పటికే పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ అనంతరం ఈ నెల 10వ తేదీకి వాయిదా వేస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు.

నకిలీ మద్యం కేసులో నలుగురు నిందితులకు కస్టడీ

ఈనాడు - అమరావతి: నకిలీ మద్యం కేసులో నలుగురు నిందితులను కోర్టు కస్టడీకి ఇచ్చింది. ములకలచెరువు నకిలీ మద్యం కేసులో అరెస్టు అయిన కట్టా రాజు, సయ్యద్ హాజీ, అంతదాస్, మిథున్‌దాస్‌లను నాలుగు రోజులు కస్టడీకి ఇస్తూ విజయవాడ ఎక్సైజ్ కోర్టు సోమవారం సాయంత్రం తీర్పు ఇచ్చింది. వీరిపై ఇటీవల ఎక్సైజ్ పోలీసులు పీటీ వారెంట్‌పై హాజరుపరిచిన సంగతి తెలిసిందే. నలుగురు నిందితులను 10 రోజుల కస్టడీకి ఇవ్వాలని ఇటీవల పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై న్యాయస్థానం తీర్పు వెలువరిచింది. ఈనెల 11 నుంచి 15 వరకు కస్టడీకి అనుమతిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రోనక్ పిటిషన్‌పై జైలు అధికారుల కౌంటర్

ఈనాడు - అమరావతి: ఇంటి నుంచి భోజనానికి అనుమతించాలని మద్యం కేసులో నిందితుడు రోనక్ వేసిన పిటిషన్‌పై సోమవారం జైలు అధికారులు కౌంటర్ దాఖలు చేశారు. తమ ఆచారాల మేరకు ఉల్లిపాయలు తినే అలవాటు లేదనీ, ఇంటి నుంచి భోజనానికి అనుమతించాలని రోనక్ పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. దీనిపై గుంటూరు జైలు అధికారులు కౌంటర్ దాఖలు చేశారు. తదుపరి విచారణ కోసం ఈనెల 10వ తేదీకి న్యాయాధికారి భాస్కరరావు వాయిదా వేశారు.

10న బాక్సింగ్ జట్ల ఎంపికలు

విజయవాడ క్రీడలు: ఎన్టీఆర్ జిల్లా బాక్సింగ్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీన స్థానిక ఆంధ్రా లయోలా కళాశాల ఇండోర్ స్టేడియంలో జిల్లా సీనియర్ (స్త్రీ, పురుషుల), యూత్(బాలికల) బాక్సింగ్ జట్ల ఎంపికలు నిర్వహిస్తామని ఆ సంఘం కార్యదర్శి వైవీఎస్ ఉమామహేశ్వరరావు తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు ఆధార్‌కార్డు, పుట్టిన తేదీ ధ్రువపత్రంతో అదే రోజు ఉదయం 8 గంటలకు ఇండోర్ స్టేడియంలో రిపోర్టు చేయాలన్నారు. ఎంపికైన పురుషుల జట్టు ఈ నెల 13, 14వ తేదీల్లో నగరంలో జరిగే రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల సీనియర్ పురుషుల బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో, మహిళలు, యూత్ బాలికలు ఈ నెల 20, 21వ తేదీల్లో పిఠాపురంలో జరిగే రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల మహిళల, యూత్ బాలికల బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో తలపడతారని పేర్కొన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు మరిన్ని వివరాలకు కోచ్ జె.రాజు ఫోన్ 91103 72647 నంబరుపై సంప్రదించాలన్నారు.

ప్రతిభావంతులకు జూడో జట్లలో స్థానం

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: కండ్రికలోని ఏఆర్ స్పోర్ట్స్ అకాడమీలో జరిగిన కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల క్యాడెట్(అండర్-18), జూనియర్(అండర్-21) బాలబాలికల జూడో జట్ల ఎంపిక పోటీల్లో పలువురు క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇందులో ప్రతిభ చూపిన క్రీడాకారులను ఆయా జిల్లా జట్లకు ఎంపిక చేశామని ఎన్టీఆర్ జిల్లా జూడో సంఘం కార్యదర్శి ఎన్.పవన్ సందీప్, కృష్ణా జిల్లా సంఘం కార్యదర్శి నామిశెట్టి వెంకట్, కార్యనిర్వాహక కార్యదర్శి ఎంఎల్ ఉషారాణిలు సోమవారం తెలిపారు. క్యాడెట్ విభాగంలో ఎంపికైన 16 మంది, జూనియర్ విభాగంలో ఎంపికైన 16 మంది బాలబాలికలు ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు కర్నూలులో జరిగే రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల కేడెట్, జూనియర్ బాలబాలికల జూడో ఛాంపియన్‌షిప్‌లో ఆయా జిల్లా జట్లకు ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు.

క్రీడాకారులతో కమిటీ సభ్యులు, జిల్లా సంఘాల ప్రతినిధులు

పీజీవాలా చాయ్.. హుషారెత్తించేనోయ్..

ఓ చిన్న ఆలోచన జీవితాన్నే మార్చేస్తుంది. విజయవాడ తితిదే కల్యాణ మండపం రోడ్డులో నవంబరు 25న పీజీవాలా చాయ్‌తో పాటుగా క్రీం, చాక్లెట్ మస్కాబన్ల అమ్మకం ప్రారంభించారు తాండ్ర స్పందన. ఉదయం, సాయంత్రం 6 నుంచి 8:30 వరకూ అమ్ముతున్నారు. రెండు పీజీలు (ఎంఏ, ఎంఈడీ) చేసినా చదువుకు తగ్గ ఉద్యోగం రాలేదనుకుంటూ ఆమె సమయం వృథా చేసుకోలేదు. కుటుంబ పరిస్థితులు, పిల్లల పెంపకం కారణంగా బయటకు వెళ్లి ఉద్యోగం చేసే పరిస్థితి లేక.. కష్టపడి, ఇష్టంతో చేసే చిన్న పనైనా చాలు మనకు అన్నం పెడుతుందని ఆమె చెబుతున్నారు. పదేళ్లు టైలరింగ్ పని చేసి పిల్లలను చదివించారు. బీటెక్ 3వ సంవత్సరం చదువుతున్న కొడుకు గత ఆగస్టులో భీమవరం దగ్గర పేరుపాలెం బీచ్‌లో సముద్ర కెరటాల్లో చిక్కుకుని మృతి చెందాడు. ఆ విషాదం నుంచి బయటకు వచ్చి, పాలిటెక్నిక్ మొదటి సంవత్సరం చదువుతున్న పాపను బాగా చూసుకోవాలని, ఇందుకోసం కొత్తగా ఏదైనా వ్యాపారం చేయాలని ఇలా చాయ్-మస్కాబన్‌ని ఎంచుకున్నానని స్పందన తెలిపారు. రెండు వారాల్లోనే ప్రజల ఆదరణ పెరిగిందని చెప్పారు. కుమారుడు చనిపోయినా అతని స్నేహితులు అండగా నిలబడ్డారని గుర్తు చేసుకున్నారు. - ఈనాడు, అమరావతి

ఇదిగో సౌకర్యం.. వాడితే సౌలభ్యం

రైలు ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు రైల్వే శాఖ సేవలను విస్తృతం చేస్తోంది. దివ్యాంగులు, వృద్ధులు, గర్భిణులు, అనారోగ్యంతో ఉన్న ప్రయాణికుల కోసం విజయవాడ రైల్వేస్టేషన్‌లో వీల్‌ఛైర్ అందుబాటులో ఉంది. ఈ సేవలు ఉన్నట్లు చాలా మందికి తెలియక ఇబ్బందులు పడుతున్నారు. రైలు దిగి బయటకు వెళ్లడానికి లేదా బయట నుంచి రైలు వద్దకు వెళ్లేందుకు ఈ సౌకర్యం అందుబాటులో ఉంది. విజయవాడ రైల్వేస్టేషన్ ప్రధాన ముఖ ద్వారంతో పాటు పార్సిల్ కార్యాలయం, తారాపేట, తూర్పు బుకింగ్ ప్రాంతాల్లో.. ఈ సేవలు 24గంటలూ అందిస్తారు. రైలు విజయవాడకు చేరుకునేలోపు ప్రయాణికులు ఫోన్ చేసి రైలు నంబరు, పేరు, బోగీ, బెర్తు నంబరు చెబితే.. మీరు స్టేషన్‌కు చేరుకునేలోపు పోర్టర్లు వీల్‌ఛైర్‌తో సిద్ధంగా ఉంటారు. అలాగే బయటి నుంచి వచ్చే వారి కోసం విజయవాడ రైల్వేస్టేషన్‌లోని అన్ని ప్రవేశ మార్గాల్లో ఫోన్ నంబర్లతో కూడిన బోర్డులు ఏర్పాటు చేశారు. ఫోన్ చేస్తే.. పోర్టర్ అక్కడికే వస్తారు. దీనికి రూ.165 మాత్రమే వసూలు చేస్తారు. ఎవరైనా అధికంగా వసూలు చేస్తే.. విజయవాడ స్టేషన్ డైరెక్టర్‌కు ఫిర్యాదు చేయవచ్చు. ఫోన్ నంబర్లు 0866-2767225, 96037 28325, 99481 88678. - న్యూస్‌టుడే, విజయవాడ(గాంధీనగర్)

బందరు తాజ్‌మహల్

మచిలీపట్నంలోని ఇంగ్లిషు చర్చి

అరబెల్లా సమాధి

ఆగ్రాలోని తాజ్‌మహల్ ప్రేమకు చిహ్నమని అందరికీ తెలిసిందే. అంతటి కట్టడం కాదు కానీ ఎప్పుడో శతాబ్దాల నాటి ప్రేమకు చిహ్నం మచిలీపట్నంలోనూ ఉంది. దానిని బందరు తాజ్‌మహల్ అంటారు. 18వ శతాబ్దంలో ఇంగ్లండ్ నుంచి వచ్చిన సైనికాధికారి కెప్టెన్ రాబిన్‌సన్, ఆయన భార్య హరియత్, కుమార్తె అరబెల్లా బందరులో ఉండేవారు. అప్పట్లో సైనిక కేంద్రానికి మేజర్‌గా ఉండే జనరల్ పాటర్, అరబెల్లా సౌందర్యానికి ఆకర్షితుడై ప్రేమిస్తున్నట్లు చెప్పడంతో ఆమె అంగీకరించింది. కానీ వారి వివాహానికి అరబెల్లా తండ్రి, క్రైస్తవ మతాధిపతులు అంగీకరించలేదు. దీంతో వారిద్దరు సహజీవనం ద్వారా తమ ప్రేమను పదిలపర్చుకున్నారు. అదే సమయంలో ఆంగ్ల సిపాయిల మధ్య అంతర్గత గొడవలు తీవ్రమవడంతో బ్రిటన్‌రాజు సైనిక అధికారుల పదోన్నతులు నిలిపివేశారు. రాబిన్‌సన్ పదవి కోల్పోవాల్సి వచ్చింది. తాను పదవి కోల్పోవడానికి పాటర్ కారణమని భావించి తన కూతురు అరబెల్లా పాటర్‌ను కలవకుండా కట్టుదిట్టం చేశారు. పాటర్‌ను కలవలేక బాధతో అనారోగ్యానికి గురైన అరబెల్లా మంచం పట్టింది. ఆమె 1809 నవంబరు 6న తన ప్రియుడు పాటర్ చేతుల్లోనే తుదిశ్వాస విడిచింది.

నాటి ప్రేమకు చిహ్నం: పెళ్లి కాకముందే కాపురం చేశారన్న నెపంతో మతపెద్దలు అరబెల్లా మృతదేహాన్ని బందరుకోట ఆంగ్ల శ్మశానవాటికలో ఖననం చేయడానికి అంగీకరించలేదు. పాటర్ తన ప్రియురాలు వివాహానికి సిద్ధం చేసుకున్న పెళ్లిగౌను, ఉంగరాలు ఆమె పార్థివదేహానికి తొడిగి శరీరం కుళ్లిపోకుండా రసాయనాలు పూసి గాజు పేటికలో భద్రపరిచారు. మాచవరంలో 15 ఎకరాలు కొని అక్కడే పాతిపెట్టారు. తన ప్రేయసి మృతదేహాన్ని తరచూ చూసుకునేలా ఏర్పాట్లు చేశారు. ఆ తరవాత సమాధి మీద 1814లో చర్చి నిర్మించి 1818లో బ్రిటీషు ప్రభుత్వానికి అప్పగించారు. పాటర్ మద్రాసు బదిలీ అయ్యాక అక్కడే చనిపోయారు. ప్రస్తుత ఇంగ్లీషు చర్చి ఆవరణలోని సమాధి వారి ప్రేమను నేటి తరానికి చాటిచెబుతోంది. - మచిలీపట్నం కార్పొరేషన్

ఉడతా ఉడతా ఊచ్.. ఉరకలు వేసిందోచ్..

గాల్లో తేలినట్టుందే.. అంటూ ఈ చిట్టి ఉడతల సందడి చూస్తే ముచ్చటేస్తోంది కదూ.. ఆహార వేటలో గుంపులుగా ఉండి ఒకదానితో మరొకటి తరుముకుంటూ చకచకా గంతులు వేస్తూ ఉడతలు సందడి చేశాయి. విజయవాడ ప్రభుత్వ అతిథి గృహం ఆవరణలో రెండు మున్సిపల్ చెత్త రిక్షాలపై నుంచి ఒకదాని వెంట ఒకటి గంతులు వేస్తూ 'ఈనాడు' కెమెరాకు చిక్కాయి. -ఈనాడు, అమరావతి

వరి తోరణం.. విరిసిన ఆనందం

వరికంకులతో తయారు చేసిన అందమైన తోరణాలు ఇంటి గుమ్మాలకు, వరండాల్లో కట్టుకుంటే ఆకలిగా ఉన్న పక్షులు తిండి గింజలు అవసరమైనప్పుడు వచ్చి తినడానికి వీలుగా తయారు చేశారు. చూడముచ్చటగా ఉన్న వీటిని రోజ్ సొసైటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రదర్శనలో అమ్మకానికి ఉంచారు. ఈ వరికంకుల తోరణాలు సైజును బట్టి రూ.300 నుంచి రూ.450 వరకు విక్రయించారు. -ఈనాడు, అమరావతి

అనాథనయ్యాను ఆదుకోండి..

94 ఏళ్ల వయసులో కలెక్టర్‌కి తన సమస్య చెప్పుకోవడానికి వచ్చిన ఈ వృద్ధురాలి పేరు జాలాది లక్ష్మీకాంతం. విజయవాడ గ్రామీణ మండలం నిడమానూరు వాసి. కట్టుకున్న భర్త, కన్న కొడుకు చనిపోవడంతో ఒంటరిగా మిగిలింది. ప్రభుత్వ పింఛను డబ్బులతోనే జీవనం సాగిస్తోంది. కొడుకు చనిపోవడంతో కోడలు ఆధీనంలో ఉన్న తన ఇంటిలో తనకు రావాల్సిన వాటా ఇప్పించాల్సిందిగా కోరుతూ ఈ ఏడాది జూన్‌లో కలెక్టర్‌కి దరఖాస్తు చేసుకున్నారు. సమస్య పరిష్కారం కాకపోవడంతో సోమవారం మరోసారి కలెక్టర్ కార్యాలయానికి వచ్చి ఆరా తీశారు. - ఈనాడు, అమరావతి

క్రిస్మస్ కొవ్వొత్తులు.. వెదజల్లే సువాసనలు..

క్రిస్మస్ సమీపిస్తుండడంతో వివిధ రకాల పర్యావరణ హితమైన క్యాండిల్స్ అందుబాటులోకి వస్తున్నాయి. విజయవాడ ఆటోనగర్ బస్టాండు ఎదురుగా ఉన్న ఓ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన థీమెటిక్ ఎగ్జిబిషన్‌లో సోయాబీన్స్ నుంచి వచ్చే ఓ పదార్థంతో తయారైన క్రిస్మస్ కొవ్వొత్తులు ప్రత్యేకంగా ఆకర్షిస్తున్నాయి. వీటిని వివిధ రకాల ఫ్లేవర్స్‌తో తయారు చేశారు. వెలిగిస్తే సువాసనలు వెదజల్లుతున్నాయి. - ఈనాడు, అమరావతి

ప్రమాదకరమైనా.. అరికట్టలేరా?!

ఈనాడు డిజిటల్- మచిలీపట్నం- న్యూస్‌టుడే, తోట్లవల్లూరు

నేనండీ... మీ విజయవాడ- అవనిగడ్డ కరకట్ట దారిని.. దయచేసి నా విన్నపం ఆలకించరూ..

విజయవాడ నుంచి అవనిగడ్డ వెళ్లాలంటే నేనే దగ్గర దారినండి. ఏళ్లుగా గుంతలు పడి.. ఎక్కడికక్కడ కుంగినా.. నాకు మరమ్మతులైనా చేయలేదు. నాపై బస్సులు మినహా పెద్ద వాహనాలకు అనుమతిలేదు. గత వైకాపా జమానా నుంచి భారీ ఇసుక టిప్పర్లు తిప్పేస్తున్నారు. ఆ బరువు మోయడం నా వల్ల కాదని తెలిసినా పట్టించుకోవట్లేదు. జనం నన్ను నిందించకుండా కూటమి ప్రభుత్వంలో అయినా బాగు చేస్తారేమోనని ఆశపడితే.. కొందరు పాలకులు, అధికారులు నాటి దందానే సాగిస్తూ వేదన మిగులుస్తున్నారు.

అప్పారావుపేట వద్ద దెబ్బతిన్న రోడ్డు

చితికిపోతున్నా చిన్నచూపేల?

యనమలకుదురు నుంచి పులిగడ్డ వరకు 90 శాతం దెబ్బతిన్నా. చాలా చోట్ల భారీ గుంతలు పడగా.. ఇంకొన్నిచోట్ల ఎక్కడికక్కడ కుంగి ఎగుడుదిగుడుగా మారాను. 20 టన్నుల టిప్పర్లు... 40-50 టన్నుల ఇసుకతో 50 కి.మీ. వేగంతో దూసుకెళ్తున్నాయి. అంతటా ఇసుక జారి ప్రమాదకరంగా ఉంది. ద్విచక్ర వాహనదారులు నిత్యం అదుపు తప్పి గాయాలపాలై నన్ను తిడుతున్నారు.

చక్కదిద్దింది... బాబేనండి

యనమలకుదురు- నుంచి పులిగడ్డ వరకు 60 కి.మీ. కరకట్ట రోడ్డు నేను. 1998 కృష్ణా వరదలకు బాగా బలహీనపడగా అప్పటి సీఎం చంద్రబాబు రూ.15 కోట్లతో నన్ను బాగు చేసి.. రూ.10 కోట్లతో 2002లో తారురోడ్డుగా మార్పించారు. ★ 2009లో వరదలు రాగా రూ.138 కోట్లతో రెండు వరుసల దారేశారు. ★ 2017 నుంచి బస్సులను అనుమతించారు.

చల్లపల్లి: నడకుదురు-రాముడుపాలెం వద్ద ఒకవైపు కుంగిన రహదారి

ప్రాణాలు పోతున్నాయ్..!

ఇటీవల అవనిగడ్డ నుంచి విజయవాడ వెళ్తున్న బస్సు తోట్లవలూరు వద్ద గుంతల ధాటికి పొలాల్లోకి దూసుకెళ్లింది. బస్సులో 37 మంది ఉన్నారు. డ్రైవర్ అప్రమత్తతతో పెద్ద ముప్పు తప్పింది. ★ పాపవినాశనం వద్ద గుంతల తీవ్రతకు లారీ బోల్తా పడి డ్రైవర్ బలయ్యాడు.

అడుగడుగునా గాయాలే..!

రామలింగేశ్వరుడి సన్నిధి నుంచి పెదపులిపాక, చోడవరం, మద్దూరు, రొయ్యూరు, వల్లూరుపాలెం, భద్రిరాజుపాలెం, చాగంటిపాడు, కళ్లంవారిపాలెం, దేవరపల్లి, గుర్విందపల్లి, ఐలూరు, అప్పారావుపేట, లంకపల్లి, శ్రీకాకుళం, వెలువోలు, నడకుదురు, కొత్తపాలెంలో విపరీతంగా దెబ్బతిన్నా. ★ నేను పూర్తిగా దెబ్బతింటే కట్ట కింద గ్రామాలన్నీ కొట్టుకుపోతాయి. అవనిగడ్డ, కోడూరు, నాగాయలంక మండలాలకు విజయవాడ నుంచి బందరు మీదుగా 120 కి.మీలు తిరిగి రావాల్సిందే.

★ కొత్త లేయర్ నిర్మాణానికి రూ.139 కోట్ల అంచనాతో సర్కారుకు ప్రతిపాదనలు పంపామనీ.. ఇసుక టిప్పర్లు తిరగకుండా చర్యలు తీసుకుంటామని నీటిపారుదల శాఖ ఈఈ రవికిరణ్ చెబుతున్నారు.. ఇవి నెరవేరతాయని కాసింత ఆశతో ఉన్నా.

నిత్యమై.. సత్యమై..!

పెదకళ్లేపల్లిలో స్వయంభుగా వెలసిన శ్రీదుర్గాపార్వతి సహిత నాగేశ్వరస్వామి ఆలయంలో సత్యానికి ప్రతీకగా నిలిచే స్తంభం ఉంది. దీనికి మూడు పేర్లున్నాయి. అవి.. సత్యస్తంభం, కర్కోటక (నవ నాగులలో ఒకటైనది)స్తంభం, ధర్మ స్తంభం. భక్తులు తొలుత ఈ స్తంభానికి మొక్కి 'నా చేత, నా నోటి వెంట సత్యాన్ని పలికించు..' అని మొక్కుకుని అనంతరం స్వామి, అమ్మవార్లను కొలుస్తారు. అగస్త్య మహర్షి ద్వారా ఈ దేవాలయం వెలుగులోకి వచ్చిందని పురాణ విశ్లేషణ. ఈ దేవాలయం 15వ శతాబ్దిలో రాజుల పాలనలో ఉండేది. గ్రామాల్లో తగాదాలు ఆస్తి, కుటుంబ కలహాలు వస్తే ఇరు పక్షాలనూ విచారించి రాజు చెప్పినదే తుది తీర్పు. ఒకసారి అన్నదమ్ముల మధ్య ఆస్తి తగాదా.. రాజుగారి వద్దకు వచ్చింది. ఇద్దరినీ ఆలయంలో ఈ స్తంభం వద్ద నిల్చోబెట్టి విచారించారు. ఇద్దరిలో ఒకరిదే ఆస్తి, కానీ రెండో వాడు కూడా తనకు సంపద వస్తుందనే ఆశతో ఉన్నాడు. 'అబద్ధమే కదా ఆడేది.. కొంపలు మునిగిపోతాయా?' అనే ధోరణితో వ్యవహరించాడు. రాజు గారి ముందు అబద్ధమాడితే ఏమవుతుందిలే అనుకున్నాడు. స్తంభం దగ్గర నిలబడిన అన్నదమ్ముల్ని రాజు గారు ఆదేశిస్తూ.. 'ఈ ఆస్తి నాది' అనమన్నాడు. అదే మాట ఇద్దరి నోటి వెంట ఒకేసారి వెలువడింది. అబద్ధం ఆడిన వ్యక్తి శిరస్సుపై స్తంభం మూడు ముక్కలుగా విరిగి పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఒక భాగం మాత్రం ఇప్పటికీ దేవాలయ ప్రాంగణంలో విశేష పూజలందుకుంటోంది. పడిపోయిన మూడు భాగాలను ఆలయంలో ఉన్న భోగ మండప నిర్మాణ సమయంలో అమర్చారు. ఇప్పటికీ అవి సజీవతను భక్తులకు తెలియచేస్తున్నాయి.

- పెదకళ్లేపల్లి(మోపిదేవి), న్యూస్‌టుడే

పీజీ మెడికల్ ఆల్ ఇండియా కోటా సీట్లకు ఫ్రీ ఎగ్జిట్

ఈనాడు కథనానికి స్పందన

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం: దేశంలోని కొన్ని రాష్ట్రాల అభ్యర్థనలను పరిగణనలోకి తీసుకున్న మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ పీజీ మెడికల్ ప్రవేశాలకు ఫ్రీ ఎగ్జిట్ ఆప్షన్ ఇచ్చింది. ఆల్ ఇండియా కోటా సీట్లు పొందిన అభ్యర్థులు ఆయా సొంత రాష్ట్రాల్లోనూ సీట్లు సాధించి డోలాయమానంలో కొట్టుమిట్టాడుతున్నారని సోమవారం 'ఈనాడు' ప్రధాన సంచికలో ప్రచురితమైన కథనానికి స్పందన వచ్చింది. మొదటి విడత ఆల్ ఇండియా కోటాలో సీట్లు పొందిన అభ్యర్థులు ఇతర రాష్ట్రాలకు వెళ్లాలంటే సోమవారం సాయంత్రం 4 గంటల నుంచి 10వ తేదీ సాయంత్రం 6 గంటల్లోగా ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవచ్చని ఎంసీసీ పేర్కొంది. అలా వదిలేసిన సీట్లను రెండో విడత ఆల్ ఇండియా కోటాకు మళ్లించబడతాయని తెలిపింది. ఆంధ్రప్రదేశ్‌కు వచ్చేసరికి పీజీ మెడికల్ మొదటి విడత కౌన్సెలింగ్ గడువు 10వ తేదీతో ముగియనుండగా.. ఈ గడువును మరో రెండు రోజులు అదనంగా పొడిగించాలని చూస్తున్నామని విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి తెలిపారు.

హుండీ ఆదాయం రూ.5.22 కోట్లు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : దుర్గగుడి హుండీల్లో కానుకలను మల్లికార్జున మహా మండపం ఆరో అంతస్తులో సోమవారం లెక్కించారు. 26 రోజుల్లో రూ.5,22,18,647 వచ్చింది. కానుకలతో పాటు 415 గ్రాముల బంగారం, 7.465 కిలోల వెండి వస్తువులు వేశారు. విదేశీ కరెన్సీ 489 యుఎస్ఏ డాలర్లు, 109 సింగపూర్ డాలర్లు, 125 కెనడా డాలర్లు, 860 యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దిర్హామ్స్, 125 సౌది రియాల్స్ కానుకలుగా హుండీల్లో వేసినట్లు దేవస్థానం ఈవో శీనానాయక్ తెలిపారు. లెక్కింపును ఈవోతో కలిసి పాలకమండలి ఛైర్మన్ రాధాకృష్ణ పర్యవేక్షించారు.

కష్టం.. కోలుకోలేనంత!

వరి కోత యంత్రాల నిర్వాహకుల దోపిడీ

ఈనాడు, అమరావతి

వరికోత యంత్రాల నిర్వాహకుల దోపిడీ అన్నదాతకు గుండెకోత మిగులుస్తోంది. పెరిగిన పెట్టుబడి భారంతో నలిగిపోతున్న రైతన్నను ఈ పరిణామం గోరుచుట్టుపై రోకటి పోటులా వేధిస్తోంది. దిత్వా తుపాను, కోతల ఎద్దడిని ఆసరాగా తీసుకుని రేటు భారీగా పెంచి వరి రైతుల వెన్ను విరుస్తున్నారు. ధరలు క్రమబద్ధీకరించే వ్యవస్థ లేకపోవడంతో నష్టపోతున్నారు.

తిరువూరులో యంత్రంతో వరి కోతలు

ఎద్దడిని బూచిగా చూపి...

✪ ఉమ్మడి జిల్లాలో 4.74 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. ఇప్పటికే 60 శాతం వరకు కోతలు పూర్తయ్యాయి. ✪ దిత్వా తుపాను నేపథ్యంలో ఆగిన కోతలు ఒకేసారి ఊపందుకోవడంతో డిమాండ్‌ను కోత యంత్రాల నిర్వాహకులు సొమ్ము చేసుకుంటున్నారు. ✪ నిరుడు కోత యంత్రానికి గంటకు రూ.3 వేలు తీసుకున్నారు. ఈసారి రూ.3,500 పెంచారు. తుపానుకు ముందు డిమాండ్ పెరగడంతో గంటకు రూ.4,500 వసూలు చేశారు. ✪ తుపాను తర్వాత అందరూ కోతలు మొదలుపెట్టగా ఎద్దడిని బూచిగా చూపి రూ.3,700-4,000 వసూలు చేస్తున్నారు.

నేల వాలితే అంతే...

✪ ఉమ్మడి జిల్లాలో దాదాపు 2 లక్షల ఎకరాల్లో పంట నేల వాలినట్లు అంచనా. సాధారణంగా నిలబడి ఉన్న పంట కోయాలంటే గంటన్నర పడుతుంది. గంటకు రూ.3,500 చొప్పున ఎకరాకు రూ.5,250 అవుతుంది. అదే నేలవాలిన పంట కోయాలంటే 3 గంటలు పడుతుంది. ✪ నేలవాలిన పంట కోసే సమయంలో ఎకరానికి 3 బస్తాలకు పైగా ధాన్యం రాలిపోతోంది. దీంతోపాటు మట్టి ఇతర చెట్ల గింజలు ధాన్యంలో కలిసిపోతున్నాయి.

☛ **తిరుపూరు** రైతు అన్నాబత్తుల కుమారస్వామి మూడెకరాల్లో కౌలు సాగు చేస్తున్నారు. పైరు బాగా పెరిగిందని తుపాను గాలులకు పడిపోతుందని కోత కోయిస్తే గంటకు రూ.4,500 వసూలు చేశారు. ఎకరానికి గంటన్నర పట్టగా రూ.6,750 చొప్పున మూడెకరాలకు రూ.20,250 ఖర్చయింది.

☛ **కంకిపాడు** మండలం ఈడా బాలస్వామి 10 ఎకరాల్లో కౌలు సాగు చేస్తున్నారు. ఆరెకరాలు నేల వాలింది. యంత్రంతో కోయిస్తే 18 గంటలు పట్టగా... (రూ.3500 చొప్పున) రూ.63 వేల ఖర్చు అయింది.

10 శాతం అదనపు భారం..

✪ ఇదే అదనుగా కూలీలూ కొండెక్కి కూర్చున్నారు. ఎకరం కోత కోసి, కుప్ప వేసి, ధాన్యం తీస్తే రూ.15-18 వేలు వసూలు చేస్తున్నారు. ఇలాంటి రైతులు ప్రతి గ్రామంలో పదుల్లో ఉన్నారు. ఈ బాదుడుతో 10 శాతం అదనపు పెట్టుబడి భారం పడుతోంది.

ఇంతి మోమున...వెలుగురేఖ!

ఈనాడు, అమరావతి

మహిళల్లో సృజనాత్మక నైపుణ్యాల పెంపునకు జిల్లా డీఆర్‌డీఏ నడుం బిగించింది. కేశినేని ఫౌండేషన్ సహకారంతో వెలుగు సిబ్బందికి జాతీయ గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ (ఎన్ఐఆర్‌డీపీఆర్) హైదరాబాద్‌లో శిక్షణ పొందే అవకాశం దొరికింది.

35 రోజుల ప్రత్యేక శిక్షణ... ఇంటికో ఎంటర్‌ప్రెన్యూర్ ఉండాలనే కూటమి ప్రభుత్వ ఆశయానుగుణంగా వెలుగు మహిళలకు శిక్షణ చేపట్టారు. జిల్లా నుంచి మొత్తం 101 మందిని పంపారు. ★ ఎన్ఐఆర్డీలో చిరుధాన్యాల సాగు, ఆరోగ్య ప్రయోజనాలు, మిల్లెట్స్, సోయా ఉత్పత్తుల తయారీపై 5 రోజులు శిక్షణ ఇస్తున్నారు. ★ గచ్చిబౌలిలో ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ (ఎఫ్‌డీడీఐ)లో లెదర్, నాన్ లెదర్ వస్తువుల తయారీలో 30 రోజులు శిక్షణ ఇస్తున్నారు. డిసెంబరు 1న 40 మంది వెలుగు సభ్యులు హైదరాబాద్ తరలివెళ్లారు. అక్కడ తరగతులే కాక.. ఆచరణాత్మక శిక్షణ ఇస్తున్నారు.

హైదరాబాద్‌లో శిక్షణ పొందుతూ..

కుటీర పరిశ్రమలకు ఊతం... ఈ శిక్షణ... బృందాల వారీగా కొనసాగుతుంది. ఏటా 3-4 బృందాలకు శిక్షణ ఇవ్వాలనేది లక్ష్యం. ★ సభ్యుల నైపుణ్యాలు, అభిరుచుల మేరకు ఒక్కో బృందానికి ఒక్కో రకం అంశాలపై శిక్షణ ఇచ్చేలా డీఆర్‌డీఏ అధికారులు ప్రణాళిక రూపొందిస్తున్నారు. అల్లికలు, బ్యూటీషియన్ కోర్సు, కుట్టులో నైపుణ్య తర్ఫీదు, బొమ్మలు, వస్తువుల తయారీ వంటివి ఉంటాయి. ★ శిక్షణ పూర్తయిన బృందాలు స్వతహాగా కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేలా ప్రభుత్వం రుణాలు మంజూరు చేస్తుంది. ★ ప్రభుత్వ కార్యక్రమాల్లో వీరి ఉత్పత్తులతో స్టాళ్లు పెట్టించి ప్రచారం కల్పిస్తారు. ★ వారు ఆదాయం పొందుతూనే మరికొందరికి ఉపాధి కల్పించేందుకు ఈ శిక్షణ ఉపకరిస్తుందని డీఆర్‌డీఏ పీడీ నాంచారరావు తెలిపారు.

★ మరో 61 మందికి కూడా: సోమవారం తరలివెళ్లిన 61 మందికి డిసెంబరు 8-12 వరకు 5 రోజుల శిక్షణ ఇస్తారు. ★ 30 మందికి హ్యాండ్‌మేడ్ పేపర్ తయారీపై శిక్షణ.. 31 మందికి ఆ పేపర్ నుంచి తయారయ్యే వాషింగ్ పౌడర్, లిక్విడ్ సోప్స్, షాంపూలు, ఫినాయిల్ తయారీపై శిక్షణ ఇస్తారు.

ఆస్తి.. భూ వివాదాలే ఎక్కువ

విజయవాడ నేరవార్తలు: పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 82 ఫిర్యాదులు వచ్చాయి. డీసీపీ ప్రసాద్, ఏడీసీపీ రాజారావు ఫిర్యాదులు స్వీకరించారు. అత్యధికంగా ఆస్తి, భూ, నగదు లావాదేవీల వివాదాలపై 46 ఫిర్యాదులు వచ్చాయి. వివిధ మోసాలు 7, మహిళా సంబంధ నేరాలు 5, కుటుంబ కలహాలు 2, కొట్లాటలు 2, దొంగతనాలు 2, రోడ్డు ప్రమాదం 1, ఇతర వివాదాలు 17 చొప్పున వచ్చాయి.

S.B.V.R. అగ్రికల్చరల్ కళాశాల, బద్వేలు

ఇంటర్మీడియట్ నందు Bi.P.C విభాగంలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు చివరి అవకాశం. కడప జిల్లా బద్వేలులో I.C.A.R., NEW DELHI వారిచే గుర్తింపు పొందిన S.B.V.R. అగ్రికల్చరల్ కాలేజ (S.B.V.R. A.G.B.Sc), నందు B.Sc (Hons.) Agricultureలో అడ్మిషన్ కొరకు ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకున్నా చేసుకోకపోయినా కన్వీనర్ కోటాలో అగ్రికల్చరల్ బి.ఎస్సి చేరుటకు చిట్ట చివరి అవకాశం కలదు.

వివరములకు సంప్రదించవలసినది : 94400 33523, 91825 05395, 94928 56652.

కరెస్పాండెంట్, S.B.V.R. అగ్రికల్చరల్ కళాశాల

బాలోత్సవం వచ్చేసింది..

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజన, నైపుణ్యం, కళలను ప్రోత్సహించేందుకు అమరావతి-బాలోత్సవం- పిల్లల పండగ పేరుతో కొన్నేళ్ల నుంచి నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది మొగల్రాజపురం పీబీ సిద్ధార్థ కళాశాల ఆడిటోరియం ఇందుకు వేదికగా నిలిచింది. మూడు రోజులు నిర్వహించే ఈ కార్యక్రమం మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం, మంచి గాలి కోసం, మంచి జీవితం కోసం అనే నినాదంతో దీనిని నిర్వహించనున్నారు. ఇప్పటికే నిర్వాహకులు ఏర్పాట్లు సిద్ధం చేశారు.

నేటి నుంచే..

వేదికలకు ప్రముఖుల పేర్లు : ఈ పోటీలకు ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, ఏలూరు జిల్లాల పరిధిలోని 18 మండలాల్లో వివిధ యాజమాన్యాలకు చెందిన రెండు వందల పాఠశాలల నుంచి 12 వేల మంది విద్యార్థులు పాల్గొనడానికి ఇప్పటికే పేర్లు నమోదు చేసుకున్నారు. ఐదు వేదికలు, ఐదు ప్రాంగణాలు, ఐదు గదులు మొత్తం 15 చోట్ల ఒకేసారి వివిధ కార్యక్రమాలు నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు. వివిధ వేదికలకు ప్రముఖ సైంటిస్టు పద్మభూషణ్ డాక్టర్ ఏఎస్ రావు, విశ్వనరుడు, గుర్రం జాషువా, బాలల ప్రేమికుడు రచయిత నార్ల చిరంజీవి, ప్రఖ్యాత కూచిపూడి నృత్యకారిణి పద్మశ్రీ శోభానాయుడు, తెలుగు నాట మొట్టమొదటి సినీ గాయని లావు బాలసరస్వతీదేవి, ప్రముఖ విద్యావేత్త గిజుబాయ్, ప్రముఖ చిత్రకారుడు సూర్యదేవర సంజీవదేవ్, ప్రజాకళాకారుడు, నాటక రచయిత, దర్శకుడు గాదె సుబ్బారెడ్డి పేర్లు పెట్టారు.

మానసిక వికాసం, సమగ్రాభివృద్ధి: చదువుతో పాటు విద్యార్థుల్లో కళా నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి బాలోత్సవం నిర్వహించనున్నట్లు అమరావతి బాలోత్సవం అధ్యక్షుడు ఎస్వీ రామరాజు, ప్రధాన కార్యదర్శి ఆర్. కొండలరావు తెలిపారు. 12 వేల మంది విద్యార్థులు హాజరుకానున్నారని తెలిపారు.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక

మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ప్రకటనల కొరకు సంప్రదించండి: 98496 97616

(c) eenadu

ముగిసిన ఫల.. పుష్ప ప్రదర్శన

పూల మొక్కలు చూస్తున్న విద్యార్థులు

మొగల్రాజపురం (విజయవాడ సిటీ): పిన్నమనేని పాలీక్లినిక్ రోడ్డులోని సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల మైదానంలో రోజ్ సొసైటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఈ నెల 5న ప్రారంభమైన ఫల, పుష్ప ప్రదర్శన సోమవారం రాత్రితో ముగిసింది. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి నర్సరీల నిర్వాహకులు వివిధ రకాల మొక్కలను ప్రదర్శించారు. నగరంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు ఆసక్తిగా తిలకించారు. వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు సందర్శించారు. ప్రదర్శనను 60 వేల మందికి పైగా తిలకించారని రోజ్ సొసైటీ ప్రతినిధులు తెలిపారు.

బ్రాయిలర్ ధరలు (కిలో రూపాయల్లో)

నెక్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -180 లైవ్ బర్డ్ 157 చికెన్ విత్ స్కిన్ - 228, చికెన్ స్కిన్‌లెస్ - 259. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 149, 158, 169 చికెన్ విత్ స్కిన్ - 284 చికెన్ స్కిన్‌లెస్ - 294.

దేవదాయ ధర్మదాయ శాఖ, ఆంధ్రప్రదేశ్

టెండరు నోటీసు నెం. Q/COE/492/2018, తేది. 08-12-2025

కమిషనర్ వారి కార్యాలయం, గొల్లపూడి లో పనిచేయుటకు అవసరమైన సెక్యూరిటీ గార్డ్ ల కొరకు అవుట్ సోర్సింగ్ ఏజెన్సీల ద్వారా సప్లై చేయుటకు టెండర్లు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా పిలవడమైనది. వివరముల కొరకు **tender.apeprocurement.gov.in** నందు చూడగలరు.

కె రామచంద్ర మోహన్
కమిషనర్ (FAC), దేవదాయ ధర్మదాయ శాఖ

OFFICE OF THE EXECUTIVE ENGINEER
AP EDUCATION & WELFARE INFRASTRUCTURE DEVELOPMENT CORPORATION, NTR DISTRICT, VIJAYAWADA

'E' Procurement Short Tender Notice

Short Tender Notice No. 05/DB/EE/APEWIDC/NTR/2025-26, Dated 08-12-2025.

Tenders are invited for Completion of incomplete works to Dr. B.R.Ambedkar at NTR District Works of 7 No. **(Vide NIT. Nos. 09 to 15)** of APEWIDC., Division in NTR District on e-procurement platform of Government of Andhra Pradesh. Further Details are can be viewed 'E' procurement market place i.e., **www.apeprocurement.gov.in**.

Bid Document Downloading Start Date from: 10-12-2025.
Bid Document Downloading End Date : 18-12-2025 up to 3.00 PM.
Bid Submission Closing Date : 18-12-2025 up to 4.00 PM.
Bid Opening Date : 18-12-2025 @ 4.30 PM.
Note: Tender Published through online Executive Engineer, APEWIDC, Krishna, Machilipatnam

Sd/- Executive Engineer, APEWIDC, NTR, Vijayawada

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
స్ట్రెస్సడ్ అస్సెట్స్ రికవరీ బ్రాంచి, 3వ అంతస్తు, కెఫ్‌సి మేడమీద, సూర్యప్రకాష్ స్క్వేర్, గురునానక్ నగర్ రోడ్డు, ఎన్.టి.ఆర్.జిల్లా, విజయవాడ - 520008. ఆంధ్రప్రదేశ్. ఫోన్ :0866-2546922

అధీకృత అధికారి వివరములు : పేరు : శ్రీ వై. ముక్తేశ్వరరావు (చీఫ్ మేనేజర్), మొబైల్ నెం. : 88866 40777
ఆస్తి తనిఖీ కొరకు : 92912 32223

Appendix – IV –A
[See Proviso to Rule 8(6) R/w Rule 9(1)]
స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన
(సెక్యూరిటీ ఇంటరస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8(6)కు రూల్ 9(1) లోని నిబంధనలతో చదువుకోవలసిన సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకము కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన)

1 సెక్యూర్డ్ క్రెడిటార్ స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (సెక్యూర్డ్ క్రెడిటార్) వారికి **ఋణగ్రహీత:** శ్రీ రాచేటి వినయ్ కుమార్, తండ్రి : ఆర్. శామ్యూల్, డోర్ నెం. 3-1-36/3, అంబేద్కర్ నగర్, వార్డు నెం.8, పట్టివారిపాలెం, బాపట్ల, బాపట్ల జిల్లా - 522101. వారు **డిమాండ్ నోటీసు తేది.28-10-2024** ప్రకారం **తేది.28-10-2024** నాటికి చెల్లించవలసిన బకాయి మొత్తము **రూ.29,88,503/-** (అక్షరాల ఇరవై తొమ్మిది లక్షల ఎనభై ఎనిమిది వేల ఐదు వందల మూడు రూపాయలు మాత్రమే) + **తేది.29.10.2025** నుండి తదుపరి వడ్డీ, కాస్ట్లు మరియు ఇతర ఖర్చులు, ఛార్జీలు మొదలగునవి (తదుపరి జమలు ఉన్నచో తీసివేయబడును) వసూలు కొరకు సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన **స్టేట్‌బ్యాంక్ అఫ్ ఇండియా** యొక్క అధీకృత అధికారి వారిచే భౌతిక స్వాధీనత పరుచుకోబడిన బ్యాంక్ తనఖాలో నున్న దిగువ వివరించిన స్థిరాస్తి "ఎక్కడ ఎలా ఉన్నది అలానే" "ఏది ఎలా వుంటే అలానే" "అక్కడ ఏది ఉన్నదో అది" మరియు "రీకోర్స్ లేకుండా" పద్ధతిపై" **తేది.21-01-2026**న విక్రయించబడునని యావన్మంది ప్రజానీకమునకు మరియు ప్రత్యేకంగా ఋణగ్రహీతకు ఇందుమూలముగా సూచించటమైనది.

షెడ్యూలు ఆస్తి వివరములు

కృష్ణాజిల్లా, విజయవాడ తూర్పు జిల్లా రిజిస్ట్రారు వారి పరిధిలో చేరిన, శ్రీ గన్నవరం సబ్ రిజిస్ట్రారు వారి యిలాకా, గన్నవరం మండలం, గన్నవరం గ్రామ పంచాయితీ ఏరియాలో చేరిన, గన్నవరం గ్రామ రీ.సర్వే నెం.124/1ఏ రు దాఖలా య.0-12ట్లున్నూ, రీ.సర్వే నెం.124/1బి రు దాఖలా య.0-11ట్లున్నూ, రీ.సర్వే నెం.124/1సి రు దాఖలా య.0-12 1/4 ట్లు అయియుండి, సదరాస్తిని మషాయతు చేయగా తేలిన విస్తీర్ణం య. 0-12ట్లున్నూ, రీ.సర్వే నెం.124/1డి రు దాఖలా య.0-20ట్లున్నూ, రీ. సర్వే నెం. 124/1ఇ రు దాఖలా య.0-10 ట్లున్నూ, రీ. సర్వే నెం. 124/1ఎఫ్ రు దాఖలా [illegible]

రిజర్వు ధర : రూ.31,68,000/- ధరావత్తు : రూ.3,16,800/- బిడ్ పెంపుదల : రూ.10,000/-

2 సెక్యూర్డ్ క్రెడిటార్ స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (సెక్యూర్డ్ క్రెడిటార్) వారికి ఋణగ్రహీత: [illegible] డిమాండ్ నోటీసు తేది.23-05-2025 ప్రకారం తేది.23-05-2025 నాటికి చెల్లించవలసిన బకాయి మొత్తము రూ.89,96,552/- [illegible] తేది.24.05.2025 నుండి [illegible] తేది.21-01-2026న [illegible]

షెడ్యూలు ఆస్తి వివరములు

[illegible]

రిజర్వు ధర : రూ.60,52,000/- ధరావత్తు : రూ.6,05,200/- బిడ్ పెంపుదల : రూ.20,000/-

3 సెక్యూర్డ్ క్రెడిటార్ స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (సెక్యూర్డ్ క్రెడిటార్) వారికి ఋణగ్రహీత: [illegible] డిమాండ్ నోటీసు తేది.02-06-2025 ప్రకారం తేది.02-06-2025 నాటికి చెల్లించవలసిన బకాయి మొత్తము రూ.50,94,978/- [illegible] తేది.03.06.2025 నుండి [illegible] తేది.21-01-2026న [illegible]

షెడ్యూలు ఆస్తి వివరములు

[illegible] అరుణోదయ నగర్ ఆస్తి - 26.6 అ॥లు, **దక్షిణం :** 2వ ఐటమ్ కొంత భాగం మరియు నడక దారి మరియు ఇతరుల ఆస్తి - 32.00 అ॥లు, **పడమర :** ప్లాట్ నెం.22 మరియు 25 ఆస్తులు - 26.6 అ॥లు, **ఉత్తరం :** ప్లాట్ నెం.24 ఆస్తి - 30.9 అ॥లు.,
పైన తెలిపిన నాలుగు హద్దులలోని ఏరియా 93.0 చ॥గ॥లు లేదా 77.76 చ॥మీ॥ల స్థలం అన్నీ ఈజిమెంటరీ హక్కులతో కలదు.
2వ ఐటమ్: పైన తెలిపిన షెడ్యూలు ప్రకారం 7.66 చ॥గ॥ల విస్తీర్ణం గల ఆస్తి. **హద్దులు: తూర్పు:** అరుణోదయ నగర్ ఆస్తి, **దక్షిణం:** రోడ్డు, **పడమర :** ప్లాట్ నెం.23ఎ ఆస్తి, **ఉత్తరం :** ఐటమ్ నెం.1 ఆస్తి.
పైన తెలిపిన హద్దులలోని 7.66 చ॥గ॥లు లేదా 6.40 చ॥మీ॥ల స్థలం.
ఐటమ్ 1 మరియు ఐటమ్ 2ల మొత్తం విస్తీర్ణం 100.66 చ॥గ॥లు లేదా 84.16 చ॥మీ॥లుగా గల పైన తెలిపిన షెడ్యూలు ఆస్తి అన్నీ ఈజిమెంటరీ హక్కులతో కలదు.

రిజర్వు ధర : రూ.30,86,000/- ధరావత్తు : రూ.3,08,600/- బిడ్ పెంపుదల : రూ.10,000/-

ఇ-వేలం తేదీ : 21-01-2026, సమయం : ఉ॥ 11.00 గం॥ల నుండి సా॥ 04.00 గం॥ల వరకు
వేలం పూర్తయ్యే వరకు ప్రతి బిడ్‌కు 5 ని॥ల అపరిమిత పొడిగింపు కలదు

పై ఆస్తి తనిఖీ తేది మరియు సమయం : తేది:09-12-2025 నుండి 20-01-2026 వరకు ఉ॥10.00 గం॥ల నుండి సా॥ 04.00 గం॥ల వరకు

ఇ-వేలం యొక్క నియమ నిబంధనలు

1) అమ్మకం యొక్క సవివరమైన నియమ నిబంధనల కొరకు, సెక్యూర్డ్ క్రెడిటార్స్ అయిన **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా** యొక్క వెబ్ సైట్ : **www.sbi.co.in/web/sbi-in-the-news/auction-notices**లో ఏర్పాటుచేసిన లింక్‌ను రిఫర్ చేయండి. రిజిస్ట్రేషన్, ఇయండి, వేలం యొక్క వివరములు మొదలగు వాటి గురించి సర్వీసు ప్రొవైడర్ **M/s. PSB Alliance & M/s. Baanknet** యొక్క ఇ-వేలం పోర్టల్ : **https://baanknet.com/eauction-psb/x-login & https://baanknet.com** & టోల్ ఫ్రీ ఫోన్ నెం.: **91 - 8291220220, Mail ID : support.baanknet@psballiance.com**ను సంప్రదించండి.
2) ఆస్తిని రిజిస్ట్రేషన్ చేసుకొనుటకు వర్తించే స్టాంపు డ్యూటీలు ఐదిలీ ఛార్జీలు, ఫీజు వగైరా మరియు చట్టపరమైన/నాన్ స్టేటటరీ బకాయిలు, పన్నులు, రేట్లు, ఎస్సెస్‌మెంట్ ఛార్జీలు, ఫీజులు వగైరా కొనుగోలు దారే భరించవలెను.
గమనిక : ఆసక్తి గల బిడ్డర్లు ఇ-వేలం ముగిసేలోపు PSB Alliance నందు ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డి (Pre-Bid EMD) జమ చేయవలెను. ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డి మొత్తం PSB Alliance బ్యాంక్ అకౌంట్‌లో జమ అయిన సమాచారం వెబ్‌సైట్‌లో పొందుపరిచిన తరువాత మాత్రమే బిడ్డరు యొక్క "వాలెట్"లో చూపించబడుతుంది. బ్యాంకింగ్ ప్రక్రియలో ఇది జరుగుటకు సమయం పట్టవచ్చు. కావున బిడ్డర్లు చివరి నిముషంలో ఇబ్బందులు ఎదుర్కొనకుండా తమ ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డీను సాధ్యమైనంత త్వరగా జమ చేసుకోవాలనీ సూచించటమైనది.
ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 194-1A యొక్క ప్రొవిజన్స్ ప్రకారం అమ్మకం జరుగును.

తేది: 08-12-2025, ప్రదేశం: విజయవాడ సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

టెట్ నిర్వహణకు ఏర్పాట్లు

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) అక్టోబర్-2025 ఆన్‌లైన్ పరీక్షలు ఈ నెల 10 నుంచి 21వ తేదీ వరకు రెండు బ్యాచ్‌లుగా నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాధికారి యు.వి.సుబ్బారావు తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులకు కేటాయించిన పరీక్ష కేంద్రానికి గంట ముందు హాజరు కావాలని కోరారు. హాల్ టికెట్‌పై ఫొటో లేకపోతే తాజా ఫొటో, గుర్తింపు కార్డు లేదా ఒరిజినల్ ఆధార్, పాన్‌కార్డు, ఓటరు కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌పోర్టు తీసుకుని వెళ్లాలని సూచించారు. పీహెచ్‌సీ అభ్యర్థులు టెట్-2025 దరఖాస్తులో పీహెచ్‌సీ అని పొందుపర్చకపోతే వారి వైకల్య ధ్రువీకరణ పత్రంతో జిల్లా విద్యాశాఖాధికారి అనుమతితో సహాయకుడిని పొందవచ్చన్నారు. అభ్యర్థులు ఎలక్ట్రానిక్ పరికరాలు, కాలిక్యులేటర్, సెల్‌ఫోన్‌లు తీసుకెళ్లవద్దన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఏపీ టెట్ అక్టోబరు-2025 పేరుతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, ఉదయం 7.30 నుంచి సాయంత్రం 7 గంటల వరకు ఉంటుందని, అభ్యర్థులు సందేహాలుంటే హెల్ప్‌లైన్ నంబరు 87902 58661 నంబరును సంప్రదించాలని కోరారు.

యువ మేధతో నూతన ఆవిష్కరణలు

రాఘవయ్యపార్కు కూడలి(కృష్ణలంక), న్యూస్‌టుడే : యువ మేధస్సు నూతన ఆవిష్కరణలకు దోహదం చేస్తుంది. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్(ఆర్‌టీఐహెచ్) సహకారంతో పరిశ్రమల ఏర్పాటు దిశగా అడుగులు వేయాలని ఇన్‌ఛార్జి కలెక్టర్ ఎస్.ఇలక్కియా అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్-విజయవాడ స్పోక్ ఆధ్వర్యంలో ఇగ్నైట్ సెల్‌లో యువత వివిధ సమస్యలకు చూపిన సాంకేతిక పరిష్కారాలను ప్రదర్శించారు. తక్కువ ఖర్చుతో అందుబాటులో ఉండే ప్రొస్థెటిక్ చేతిని విష్ణు అసిస్టివ్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్, మారిస్ స్టెల్లా కళాశాల విద్యార్థులు సామాజిక ప్రభావం కలిగించే పలు సాంకేతికతలను, ఎస్ఆర్ఎం వర్సిటీ-టీమ్ స్కైవర్క్స్ బృందం స్వయం నియంత్రిత డ్రోన్ లాస్ట్‌మైల్ డెలివరీ వ్యవస్థను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఇలక్కియా మాట్లాడుతూ.. యువ ఆవిష్కర్తలు, విద్యార్థి పరిశోధకులను ఆర్‌టీఐహెచ్‌తో పాటు కలెక్టరేట్‌లోని ఇగ్నైట్ విభాగం ప్రోత్సహిస్తోందని తెలిపారు. రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనను వేగవంతం చేసేందుకు ఈ చర్యలు దోహదం చేస్తాయన్నారు. ప్రోగ్రామ్ అసోసియేట్స్ జి.సుజాత, సౌమ్య మనోజ్, ఆర్‌టీఐహెచ్ సీఈవో జి.కృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

విస్సన్నపేటలో మామిడి కొనుగోళ్లు

విస్సన్నపేట: విస్సన్నపేటలో మామిడి కొనుగోళ్లు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. స్థానిక కిట్టూ మ్యాంగో గ్రోయర్స్‌లో తోతాపురి రకం టన్ను రూ.75,000లు పలికింది. విస్సన్నపేట నుంచి అహ్మదాబాద్ మార్కెట్‌కు మేలి రకం తోతాపురి మామిడి కాయలు అర టన్ను రైలు మార్గాన ఎగుమతి చేసినట్లు మామిడి వ్యాపారి రాయల కిట్టూ తెలిపారు.

దూసుకొచ్చిన మృత్యువు..!

- క్షతగాత్రుడిని కాపాడేందుకు ట్రాఫిక్ పోలీసుల విశ్వప్రయత్నం
- గ్రీన్ ఛానల్‌లో తరలించినా ఫలించని వైనం

లారీ వెనుక చక్రాల వద్ద ఇరుక్కుపోయిన విజయ గోపాలకృష్ణ

క్షతగాత్రుడిని పరీక్షిస్తున్న వైద్యురాలు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే: ఘోర రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి ప్రాణాలు నిలిపేందుకు ట్రాఫిక్ పోలీసులు విశ్వప్రయత్నం చేశారు. గ్రీన్ ఛానల్ ద్వారా ప్రైవేటు ఆసుపత్రికి తరలించి.. చికిత్స అందిస్తుండగా మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. గుంటూరు జిల్లా కుంచనపల్లికి చెందిన వొబ్బిన్న విజయగోపాలకృష్ణ (52) నగరంలోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ కార్యాలయంలో సెక్షన్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. సోమవారం సాయంత్రం విధులు ముగించుకుని కుంచనపల్లిలోని ఇంటికి బయలుదేరారు. బెంజిసర్కిల్ సమీపం స్క్యూ బ్రిడ్జి వద్దకు రాగానే.. ఒక లారీ వేగంగా వచ్చి ఢీకొట్టింది. వెనుక చక్రాల వద్ద ఆయన ఇరుక్కుపోయారు. శిరస్త్రాణం ధరించినా.. తీవ్ర గాయాలయ్యాయి. ట్రాఫిక్ సీఐ రవికుమార్, సిబ్బంది శ్రమించి ఆయన్ని బయటకు తీశారు. అదే సమయంలో అటుగా వెళుతున్న ఒక వైద్యురాలు వచ్చి పరీక్షించగా.. నాడి కొట్టుకుంటోంది. వెంటనే ఆసుపత్రికి తరలించాలని ఆమె సూచించారు. అంబులెన్స్ వచ్చేందుకు ఆలస్యం అయ్యే అవకాశం ఉండడంతో.. ఆటోలో ఎక్కించారు.

కూడళ్లలో వాహనాలు నిలిపివేసి.. క్షతగాత్రుడిని ఆటోలో ఎక్కించిన వెంటనే కంట్రోల్‌రూమ్‌కు సమాచారం అందించారు. అక్కడి నుంచి వస్తున్న ఆదేశాలతో బెంజిసర్కిల్, నిర్మల కాన్వెంట్ కూడలి, రమేష్ ఆసుపత్రి కూడలిలో వాహనాలను నిలిపివేసి.. ఆటోకు గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేసి.. హుటాహుటిన ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స చేస్తుండగా.. విజయగోపాలకృష్ణ ప్రాణాలు కోల్పోయారు. అతన్ని కాపాడేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడంతో ట్రాఫిక్ పోలీసులు వేదనకు గురయ్యారు. ప్రమాద ఘటనపై పటమట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఈఎస్ఐ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

పటమట, న్యూస్‌టుడే: ఉపాధి కల్పనా సంస్థలతో పాటు వాటిలో పనిచేస్తున్న కార్మికులను ప్రోత్సహించేందుకు ఈఎస్ఐసీ ప్రవేశపెట్టిన స్కీమ్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ రిజిస్ట్రేషన్ ఆఫ్ ది ఎంప్లాయర్స్ అండ్ ఎంప్లాయీస్-2025 పథకం గడువు ఈ నెల 31తో ముగుస్తుందని రీజనల్ డైరెక్టర్ మల్ల రామారావు తెలిపారు. ఈ పథకం ఈ ఏడాది జులై 1న ప్రారంభమైందని వెల్లడించారు. ఇప్పటి వరకు ఈ పథకంలో రాష్ట్రంలో 2.5 లక్షల మంది కార్మికులను రిజిస్ట్రేషన్ చేయించి వారికి సామాజిక భద్రత కల్పించామన్నారు. సుమారు 1000 కంపెనీలు పాత బకాయిలు చెల్లించి లబ్ధి పొందాయని వివరించారు. కంపెనీల యాజమాన్యాలు, కార్మికులు స్వచ్ఛందంగా వచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకుని ఈఎస్ఐ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 0866-2453498 సంప్రదించాలని సూచించారు.

గడువులోగా సమస్యలకు పరిష్కారం చూపాలి

అర్జీ పరిశీలిస్తున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ ఇలక్కియా

రాఘవయ్యపార్కు కూడలి(కృష్ణలంక), న్యూస్‌టుడే : కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ఇన్‌ఛార్జి కలెక్టర్ ఎస్.ఇలక్కియా నేతృత్వంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించారు. మొత్తం 162 వినతి పత్రాలు స్వీకరించారు. వీటిలో అధికంగా రెవెన్యూ శాఖకు 65 అర్జీలు అందాయి. పోలీస్ 20, పురపాలక పట్టణాభివృద్ధి శాఖ 26, పంచాయతీరాజ్ 10, విద్య 6, పౌరసరఫరాలు 5, వైద్యారోగ్యం 4, సర్వే, ఏపీ సీపీడీసీఎల్, జల వనరుల శాఖలకు 3 చొప్పున, ప్రజా రవాణా (ఆర్టీసీ), డీఆర్డీయే, కార్మిక, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖలకు రెండేసి చొప్పున వచ్చాయి. గృహ నిర్మాణం, పశుసంవర్ధ శాఖ, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంపులు, సహకార శాఖ, అటవీ, దేవాదాయ, ఐసీడీఎస్, బీసీ సంక్షేమం, అగ్నిమాపక శాఖలకు ఒక్కొక్కటి చొప్పున వినతులు వచ్చాయి. ఇలక్కియా మాట్లాడుతూ.. అర్జీల పరిష్కారంలో జాప్యం ఉండరాదని, సత్వర, సంతృప్తికర పరిష్కారం లభించేలా చూడాలని అధికారులను ఆదేశించారు. డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, జడ్పీ సీఈవో కన్నమనాయుడు, జిల్లా గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జ్యోతి, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

నాగపండు కుటుంబానికి సాయం అందజేత

కవితకు ఎఫ్‌డీ పత్రాలు ఇస్తున్న అధికారులు

ఎ.కొండూరు, న్యూస్‌టుడే : మండల విద్యా శాఖ కార్యాలయంలో సీఆర్‌పీగా పని చేస్తూ ఇటీవల మృతి చెందిన గుగులోతు నాగపండు కుటుంబానికి విద్యా శాఖ అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది రూ.8.38 లక్షలు ఆర్థిక సాయం చేశారు. ఎ.కొండూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో నాగపండు భార్య కవితకు తహసీల్దారు కె.లక్ష్మి, ఎంపీడీవో బి.శ్రీనివాసరావు, ఎ.కొండూరు, విస్సన్నపేట ఎంఈవోలు ఎం.రాజశేఖర్, ఈఎల్‌సీ.కేశవరావు, ఈ.సుధాకర్, హెచ్‌ఎం ప్రసాదరావు ఎఫ్‌డీ పత్రాలను అందజేశారు. తిరువూరు, గంపలగూడెం, ఎ.కొండూరు, మైలవరం మండలాల్లోని ఉపాధ్యాయులు, విద్యా శాఖ అధికారులు రూ.7.75 లక్షలు, కేజీబీవీ సిబ్బంది రూ.33 వేలు, సమగ్ర శిక్షా సిబ్బంది రూ.20 వేలు బాధిత కుటుంబాన్ని ఆదుకునేందుకు ఇచ్చారని ఎంఈవో కేశవరావు తెలిపారు. మొత్తం సాయంలో రూ.7.75 లక్షలు అతని ఇద్దరి కుమారుల పేరుతో పదేళ్ల కాలపరిమితితో బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసినట్లు వెల్లడించారు.

నవీన్‌రెడ్డి హత్య కేసులో రౌడీషీటర్ అరెస్టు

మద్యం మత్తులోనే ఘటన జరిగిందని తేల్చిన పోలీసులు

వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ, ఏసీపీ, సీఐ

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: జగ్గయ్యపేటలో సస్పెక్ట్ షీటర్ అలవాల నవీన్‌రెడ్డి హత్య కేసులో ప్రధాన నిందితుడు విజయవాడకు చెందిన రౌడీషీటర్ సాయికృష్ణ (పిల్ల సాయి)ని సోమవారం పోలీసులు అరెస్టు చేసి కోర్టుకు హాజరు పర్చారు. జగ్గయ్యపేట మండలం చిల్లకల్లు సమీపంలో రాంకో సిమెంట్స్ కర్మాగారం పక్కన లేబర్ కాలనీకి వెళ్లే మార్గంలో పొలాల్లో నవీన్‌రెడ్డి హత్యకు గురైన సంగతి తెలిసిందే. స్థానిక సీఐ కార్యాలయంలో డీసీపీ లక్ష్మీనారాయణ, ఏసీపీ తిలక్, సీఐ వెంకటేశ్వర్లు కేసు వివరాలు విలేకరులకు సోమవారం వెల్లడించారు. చిల్లకల్లుకు చెందిన ఇనపనుర్తి అన్వేష్ ధర్మవరప్పాడు తండా వద్ద ఏర్పాటు చేసిన మద్యం పార్టీలో నవీన్‌రెడ్డి, సాయికృష్ణ మరికొందరు పాల్గొన్నారు. మద్యం మత్తులో నవీన్‌రెడ్డి, సాయికృష్ణ వాగ్వాదం.. ఆవేశంలో హత్య జరిగినట్లు పోలీసులు తేల్చారు. ఆవేశంతో తన చేతిలోని బీరు సీసా పగలకొట్టిన నిందితుడు.. నవీన్ కంఠంపై పొడవడంతో తీవ్ర రక్తస్రావానికి గురయ్యాడు. తీవ్ర గాయాలతో ఉన్న నవీన్‌రెడ్డిని ఆసుపత్రికి తరలించగా వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. నిందితుడు సాయికృష్ణపై ఎన్టీఆర్ కమిషనరేట్ పరిధిలోని పలు పోలీస్ స్టేషన్లలో దొంగతనం, కొట్లాటలు, హత్య, గంజాయి రవాణా వంటి కేసులున్నట్లు గుర్తించి గాలింపు చేపట్టారు. డీసీపీ లక్ష్మీనారాయణ, ఏసీపీ తిలక్‌ల ఆధ్వర్యంలో 10 ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి.. ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన దర్యాప్తులో భాగంగా సోమవారం నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. నిందితుడు సాయికృష్ణ విజయవాడలోని కృష్ణలంక రాజీవ్ కాలనీకి చెందిన వ్యక్తి. ఈ అరెస్టులో కీలక పాత్ర పోషించిన సీఐ వెంకటేశ్వర్లు, చిల్లకల్లు ఎస్ఐ సూర్యశ్రీనివాస్, మణికంత, సిబ్బందిని నగర పోలీస్ కమిషనర్ అభినందించారు. కొద్ది కాలంగా చిల్లకల్లులో అద్దెకు ఉంటున్న నవీన్‌రెడ్డి, నిందితుడు కూడా విజయవాడకు చెందిన వారే. ఇద్దరూ నేరచరితులు కావడం, గంజాయి కేసుల్లో ఉండడంతో నేరాన్ని తీవ్రమైనదిగా భావించిన పోలీసులు ఆ దిశగా విచారణ, పరిశోధన చేసి నిందితుడిని అరెస్టు చేశారు.

జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనం దగ్ధం

కాలిపోతున్న వాహనం

కృష్ణలంక: కృష్ణలంక జాతీయ రహదారిపై సోమవారం ద్విచక్ర వాహనం దగ్ధమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యనమలకుదురు హోసన్నా చర్చి సమీపంలో నివాసం ఉంటున్న పొదులోపు కిషోర్. కంచికచర్ల మిక్ ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతున్నాడు. సోమవారం ఉదయం 9 గంటలకు ఇంటి నుంచి ద్విచక్ర వాహనంపై కళాశాలకు బయలుదేరాడు. కృష్ణలంక జాతీయ రహదారి ఫైర్‌స్టేషన్ సెంటర్‌కు వచ్చే సరికి ఇంజిన్‌లో లోపాలు తలెత్తి పొగలు వస్తుండడాన్ని గమనించి వాహనాన్ని పక్కకు తీసి నిలిపి కిందకు దిగుతుండగా అప్పటికే మంటలు రేగడంతో యువకుడి కాళ్లకు స్వల్ప గాయాలయ్యాయి. వాహనం మంటల్లో కాలిపోతుండడాన్ని స్థానికులు గమనించి ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది పూర్తి స్థాయిలో మంటలను ఆర్పివేశారు.

ధరల నియంత్రణ కమిటీ సమావేశం

రాఘవయ్యపార్కు కూడలి(కృష్ణలంక): నగరంలోని కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఇన్‌ఛార్జి కలెక్టర్ ఎస్.ఇలక్కియా సోమవారం జిల్లా ధరల నియంత్రణ కమిటీ సభ్యులతో సమావేశాన్ని నిర్వహించారు. కూరగాయలు, నిత్యావసర వస్తువుల ధరలను సమీక్షించారు. గతేడాదితో పోల్చితే ఈ సంవత్సరం ధరలు నియంత్రణలో ఉన్నాయని తెలిపారు. కూరగాయల దిగుమతులు ఎక్కువగా ఉండడంతో రానున్న కాలంలో కొరత ఉండదన్నారు. డీఎస్‌వో ఎ.పాపారావు, మార్కెటింగ్, అగ్రికల్చర్, అధికారులు, రైస్ మిల్లర్స్ ప్రెసిడెంట్, జిల్లా ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ తదితరులు పాల్గొన్నారు.

91.9 FM Vijayawada
ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
8008003297

స్వదేశాగమన శుభాకాంక్షలు

స్నేహానికి నిలువెత్తు రూపం... ఆత్మీయతకు ప్రతిరూపం...
నమ్ముకున్న వారి కోసం అహర్నిశలు పరితపించే మా ఆత్మీయులు
శ్రీ కుకునూరు అనిల్‌కుమార్ - శ్రీమతి అరుణకుమారి గార్లు
అమెరికా పర్యటనను దిగ్విజయంగా పూర్తి చేసుకొని
నేడు జన్మభూమి తెనాలికి విచ్చేయు శుభతరుణంలో వారికి
యివే మా హృదయపూర్వక స్వదేశాగమన శుభాకాంక్షలు....

బత్తుల రంగారావు, సుద్దపల్లి	ఆలకుంట శ్రీను (భీముడు), సుద్దపల్లి
సయ్యద్ రబ్బానీ, వడ్లమూడి	షేక్ రియాజ్అలీ, ఛైర్‌పర్సన్ PACS, వేజండ్ల
కొమిరి కోటేశ్వరరావు, సుద్దపల్లి	కొప్పూరి శివశంకర్, సుద్దపల్లి
కొప్పూరి శ్రీను (బుల్లెట్ శ్రీను), సుద్దపల్లి	తోట లక్ష్మీకాంత్ (నాని), సుద్దపల్లి
కుంచాల శ్రీను, వేజండ్ల	బండారు వాసు (జెమిని), నరసరావుపేట
కోడూరు కోటేశ్వరరావు, నారాకోడూరు	కనపర్తి కుమార్, సుద్దపల్లి
నీల సత్తయ్య (J.K), సుద్దపల్లి	పిల్లి అనిల్, సుద్దపల్లి

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి ఈ రోజు మార్కెట్ ధరకు కొనబడును.స్పాట్ క్యాష్. ✆ 81422 92071

బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం విడిపించి అధిక ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్). ✆8333833368

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి అధికధరకు కొనబడును (స్పాట్ క్యాష్). ✆ 87907 41166.

EDUCATION

SPOT admissions by Govt AP 12/12: M.Com/MA English/MSW only Rs 5000 per sem, PLNM Degree College, 91774 08565.

PEOPLE CARE

OLD AGE HOME

గాయిత్రి గ్రూప్, VJA, వృద్ధులకు, పేషెంట్ల సేవకు, ఇంటి/ వంట, బేబి కేర్‌కు వర్కర్లను భారతదేశం అంతటా పంపగలము. ✆9959021122, 9603842233

REAL ESTATE

PLOT FOR SALE

133.33 Sq.Yds. కేవలం 1,00,000/- మాత్రమే. వినుకొండ, పల్నాడు డిస్ట్రిక్ట్‌లో లిమిటెడ్ ఆఫర్. ఫోన్: 9133445755.

JOBS

మ్యారేజి సంస్థలో పనిచేయుటకు కంప్యూటర్ నాలెడ్జ్ గల ఇన్‌ఛార్జ్ (F) జీ. 20 K, రిసెప్షనిస్ట్ (F) జీ. 15 K, ఏదైనా డిగ్రీ, VJA- 7 ✆ 87905 99799.

విజయవాడలోని రామచంద్రబ్రదర్స్ ఫర్నిచర్ షోరూం నందు పనిచేయుటకు క్యాషియర్ (M) కావలెను. వయసు - 35 సం॥లోపు. 99638 48003.

Wanted Female Telecallers. Qul: any Degree, Salary:Up To 15000+Incentives, Job Location: Benzcircle, & Kankipadu. ✆98481 72444

అమెరికాలో 1 సం॥ బాబు ఆలన, పాలన వ్యక్తిగత సంరక్షణ కొరకు అనుభవంగల ఆడవారు కావలెను. అమెరికా వీసా కల్గినవారు మాత్రమే. ✆ 9440803362

హోటల్ మేనేజ్‌మెంట్ ఇనిస్టిట్యూట్ నందు అనుభవంగల ఫ్యాకల్టీ కావలెను. సంప్రదించండి. ఫార్చ్యూన్ మురళీపార్క్, విజయవాడ. ✆ 90109 01020.

విజన్ ఆటోమొబైల్స్ అపె ఆటోషోరూము NTR జిల్లా విజయవాడ, నందిగామ, నూజివీడు నందు పనిచేయుటకు 3 వీలర్ మార్కెట్ నందు కనీసము 5 సం॥ అనుభవము ఉన్న *1.సేల్స్‌మేనేజరు - 5 *2.సేల్స్‌ఎగ్జిక్యూటివ్స్-18 *3.సేల్స్ టీంలీడర్స్-10 *4. అకౌంటెంట్లు-1 టాలీ అకౌంటింగ్ ప్యాకేజీలో అనుభవము, అకౌంటింగ్ రంగములో 4సం॥ అనుభవము ఉన్న అకౌంటెంట్‌లు కావలెను. *5.సేల్స్ రిసెప్షనిస్ట్- 5 *6.సర్వీసు మేనేజరు (డిప్లమో/ ITI)-2 *7.సర్వీసు సూపర్‌వైజర్లు-5 (డిప్లమో/ ITI) పైన తెలిపిన పోస్టులకు అభ్యర్థి అనుభవమును బట్టి జీతము నిర్ణయించబడును. సం/- మొబైల్/ వాట్సప్‌నెం: 77999 09050/ 7799909066

ప్రముఖ లిఫ్ట్/ ఎలివేటర్ కంపెనీలో పనిచేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను Q: డిగ్రీ, కమ్యూనికేషన్ స్కిల్స్ & మార్కెటింగ్ అనుభవం తప్పనిసరి. మంచి వాక్‌చాతుర్యం/ చురుకుదనం గల యువకులు కావలెను. జీతం+ ఇన్సెంటివ్స్+ఎకామిడేషన్ కూడా కలదు. ✆ 90305 54778.

Book your 5 lines Classified Colour Rs.1200/-
3Ads Package Rs.3250/-
5 lines Classified B/W Rs.1025/-
3Ads Package Rs.2575/-
ప్రకటనపై 5% జి.ఎస్.టి. అదనం
PH: 98496 97616

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

? తూర్పు ఇబ్రహీంపట్నం వీటీపీఎస్ గ్యాస్ గోడౌన్ వద్ద రహదారి అధ్వానంగా మారింది. - షరీఫ్, స్థానికుడు

✔ పరిశీలించి చర్యలు తీసుకుంటాం. - మధు, పారిశుద్ధ్య పర్యవేక్షకుడు - న్యూస్‌టుడే ఇబ్రహీంపట్నం

? మూలపాడు క్యాటిల్ పాస్‌వేకు ఇరువైపుల చెత్త చెదారంతో దుర్వాసన వస్తోంది. - గోవిందరావు, స్థానికుడు

✔ ప్రత్యేక సిబ్బందిని నియమించి పారిశుద్ధ్య పనులు చేయిస్తాం. అనిల్ కుమార్, గ్రామ కార్యదర్శి - న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం గ్రామీణం

? పినపాకలోని ఎస్సీ శ్మశాన వాటికలో పంచాయతీ బోరు మరమ్మతులకు గురైంది. - రమేష్ స్థానికుడు ✔ మరమ్మతు పనులు పూర్తి చేసి అవస్థలు తొలగిస్తాం. - నారాయణరావు పంచాయతీ కార్యదర్శి - న్యూస్‌టుడే, జి.కొండూరు

స్పందనకు వందనం

✱ జి.కొండూరు గుడి సెంటర్‌లోని డ్రెయిన్లలో మురుగు పేరుకుందని స్థానికులు సమస్యను 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా అధికారులకు తెలిపారు. స్పందించిన పంచాయతీ కార్యదర్శి బసవలింగేశ్వరరావు పారిశుద్ధ్య సిబ్బందితో పూడిక తీయించారు. - న్యూస్‌టుడే, జి.కొండూరు

✱ కొండపల్లి గీతామందిర్ రోడ్డులోని కాలువల్లో తీసిన చెత్తను తొలగించాలని స్థానికులు 'ఈనాడు' 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన పారిశుద్ధ్య పనుల మేస్త్రీ శ్రీను కార్మికులతో చెత్తను సోమవారం తీయించారు. - న్యూస్‌టుడే, కొండపల్లి

✱ తిరువూరు 2వ వార్డులోని డ్రెయిన్లలో పూడిక పేరుకుందని స్థానికుడు ప్రసాదరావు అధికారులకు ఫిర్యాదు చేశారు. శానిటరీ అధికారి పారిశుద్ధ్య కార్మికులను పంపించి శుభ్రం చేయించారు. - న్యూస్‌టుడే, తిరువూరు టౌన్

విద్యార్థులకు చలికోట్లు అందజేత

జి.కొండూరు, న్యూస్‌టుడే : స్థానిక సాంఘిక సంక్షేమ వసతి గృహంలోని 35 మంది విద్యార్థులకు జి.కొండూరుకు చెందిన ప్రవాస భారతీయుడు ఒరుగంటి నరసింహారావు, ఆయన బంధువు చనమోలు వెంకటేశ్వరరావు మొదటి వర్ధంతి సందర్భంగా రూ.10 వేలు వితరణ చేశారు. దీంతో ఆయన మిత్రులు చలికోట్లను సమకూర్చి విద్యార్థులకు సోమవారం అందజేశారు. పోతురాజు రమేష్, హేమ రాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : మండల జీఎస్ డబ్ల్యూఎస్ అధికారిగా నర్రా ప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన్ను ఇన్‌ఛార్జి ఎంపీడీవో ప్రభాకరరావు, పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్తు కార్యాలయం సిబ్బంది ఘనంగా సన్మానించారు.

ప్రసాద్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న ప్రభాకరరావు తదితరులు

తిరువూరులో సందడిగా సెమీ క్రిస్మస్

గంపలగూడెం, తిరువూరు, న్యూస్‌టుడే : తిరువూరులోని మునుకుళ్ల రోడ్డులో సోమవారం రీజనల్ పాస్టర్స్ ఫెలోషిప్ ప్రతినిధుల ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ నిర్వహించారు. పాస్టర్లు పుష్పరాజు, ఉపేంద్ర, జోనాతాన్, రామకృష్ణ, కృష్ణారెడ్డి తదితరుల ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా కేకు కోసి కొవ్వొత్తులు వెలిగించారు. పెద్ద సంఖ్యలో విశ్వాసులు పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో రీజనల్ పాస్టర్స్ ఫెలోషిప్ ప్రతినిధులు

లక్ష్యం చేరేలా.. కర్షకులను ఆదుకునేలా..

తిరువూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే

తిరువూరు రెవెన్యూ డివిజన్‌లో ప్రభుత్వ కేంద్రాల ద్వారా శనివారం నాటికి 35,232 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. ఈ ఏడాది డివిజన్‌లో సాగైన ఖరీఫ్ వరిలో 1,56,331 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి లభిస్తుందని అధికారుల అంచనా. గత నెల రోజుల్లో పీపీసీల ద్వారా దిగుబడి అంచనాలో 22.54 శాతం ధాన్యం కొన్నారు. అంతకు రెట్టింపు ధాన్యం రైతులు ప్రైవేటు వ్యాపారులకు విక్రయించారు. ఈ సంవత్సరం తిరువూరు, గంపలగూడెం, విస్సన్నపేట, ఎ.కొండూరు, రెడ్డిగూడెం మండలాల పరిధిలో 31,755 మంది రైతులు 58,422 ఎకరాల్లో వరి సాగు చేశారు. నవంబరు మొదటి వారం నుంచి నూర్పిడులు ప్రారంభించారు. డిసెంబరు మొదటి వారానికి మొత్తం సాగు విస్తీర్ణంలో 36,028 ఎకరాల్లో నూర్పిడి పూర్తయింది.

అవగాహన కల్పిస్తున్న అధికారులు

సత్యాలపాడు: రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో మాధురి, పక్కన తహసీల్దారు రాజేశ్వరి

ఇంకా 22,394 ఎకరాల్లో వరి కోతలు జరగాల్సి ఉంది. ఆలస్యంగా నాట్లు వేసిన భూముల్లో ఈ నెలాఖరు వరకు నూర్పిడులు కొనసాగుతాయి.

వాతావరణ పరిస్థితుల దృష్ట్యా..

వాస్తవంగా పంట దిగుబడిలో 60 శాతం మేరకు పీపీసీ కేంద్రాల్లో కొనుగోలు చేయాలి. లక్ష్యం మేరకు మద్దతు ధర చెల్లించి ధాన్యం కొనేందుకు రెవెన్యూ, వ్యవసాయాధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి అన్నదాతలను చైతన్య పరుస్తున్నారు. ప్రభుత్వం చెల్లించే మద్దతు ధర సాగుదారులకు అనుకూలంగా ఉన్నా.. వాతావరణ పరిస్థితులు రైతులను ప్రైవేటు వ్యాపారులకు విక్రయించేలా చేస్తున్నాయి. ఇంకా 22 వేల ఎకరాల్లో నూర్పిడి చేయాల్సిన ధాన్యం ఉండగా ప్రభుత్వ నిర్దేశించిన లక్ష్యాన్ని చేరేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. పీపీసీలో కొనుగోలు చేసిన ధాన్యానికి గంటల వ్యవధిలోనే నగదు చెల్లిస్తున్న నేపథ్యంలో రైతులు తమ పంటని ప్రభుత్వ కేంద్రాల్లో విక్రయించాలని ఆర్డీవో కె.మాధురి కోరారు. ధాన్యం నూర్పిడిలో ప్రతికూల వాతావరణం ఏర్పడినపుడు అధికార యంత్రాంగం కర్షకులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆదుకునేందుకు సిద్ధంగా ఉన్నామని ఆమె చెప్పారు.

భవనానికి స్థలం కేటాయించాలని వినతి

విస్సన్నపేట, న్యూస్‌టుడే : మండల శివారు రాజీవ్‌నగర్ కాలనీలో సామాజిక భవనానికి ప్రభుత్వం స్థలం కేటాయించాలని కాలనీవాసులు తెదేపా మండల అధ్యక్షుడు రాయల సుబ్బారావు ఆధ్వర్యంలో తహసీల్దార్ కె.లక్ష్మీకల్యాణికి సోమవారం వినతిపత్రం అందించారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

తహసీల్దార్ లక్ష్మీ కల్యాణికి అర్జీ ఇస్తున్న కాలనీవాసులు

సకాలంలో రైతుల ఖాతాల్లోకి నగదు

గొల్లపూడి, న్యూస్‌టుడే : రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోపే వారి ఖాతాల్లో నగదు జమ చేస్తున్నట్లు పౌర సరఫరాల శాఖ ఎండీ సతీష్ పేర్కొన్నారు. గొల్లపూడి వ్యవసాయ మార్కెట్ యార్డులోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సోమవారం పరిశీలించారు. ప్రస్తుతం 57 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. అన్నదాతలకు రూ.121 కోట్ల నగదును వారి ఖాతాల్లో జమ చేసినట్లు పేర్కొన్నారు.

వివరాలు తెలుసుకుంటున్న సతీష్

పుస్తక నిర్వహణ జరిగేలా చూడాల్సింది సీసీలే..

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : గ్రామైక్య సంఘాల్లో ప్రతి నెల రెండు సమావేశాలు నిర్వహించాలని వెలుగు ఏపీఎం బి.రామకృష్ణ పేర్కొన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల మహిళా సమాఖ్య సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎస్‌హెచ్‌జీల సమావేశాలు షెడ్యూల్ మేరకు వీవోఏలు ఏర్పాటు చేసి సమావేశంలోనే పుస్తక నిర్వహణ జరిగేలా చూడాల్సిన బాధ్యత సీసీలదే అన్నారు. ఈ నెలలో జెండర్ మాసోత్సవాల్లో భాగంగా అన్ని వీవోల్లో సమావేశం పెట్టి జెండర్ అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు శిరీష, ఎంఎస్ కార్యదర్శి సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.

ప్రసంగిస్తున్న ఏపీఎం రామకృష్ణ

లోక్‌అదాలత్‌లో అధిక కేసులు పరిష్కరించాలి

గంపలగూడెం, తిరువూరు, న్యూస్‌టుడే : తిరువూరు న్యాయస్థానంలో ఈ నెల 13న నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌లో కక్షిదారులు తమ వివాదాలను రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయమూర్తి ఎ.సింధూర, అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె.సూర్యతేజ కోరారు. సోమవారం తిరువూరు న్యాయస్థానంలో న్యాయవాదులు, బ్యాంకు, పోలీస్ అధికారులతో వారు సమన్వయ సమావేశం నిర్వహించారు.

సూచనలు ఇస్తున్న న్యాయమూర్తి సింధూర, పక్కన అదనపు జడ్జి సూర్యతేజ

ప్రజాస్వామ్య పద్ధతిలో ఎంపీపీ ఎన్నిక

విస్సన్నపేట, న్యూస్‌టుడే : విస్సన్నపేట ఎంపీపీ ఎన్నిక ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రశాంత వాతావరణంలో జరిగేలా ఎంపీటీసీ సభ్యులు సహకరించాలని ఆర్డీవో కె.మాధురి కోరారు. గత ఎంపీపీ పిల్లి మెర్సీ వనజాక్షి రాజీనామాతో మంగళవారం నూతన ఎంపీపీ ఎన్నిక జరుగనుంది. ఈ నేపథ్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పలు శాఖల అధికారులతో ఆర్డీవో సమావేశమై మాట్లాడారు. ★ ఎంపీపీ ఎన్నిక నేపథ్యంలో స్థానిక ఎస్సై గరికపాటి రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు. ఈ మేరకు సోమవారం ఎస్సై రామకృష్ణ, ఎంపీడీవో రాట్నాలుతో కలిసి మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణాన్ని పరిశీలించారు.

అధికారులతో చర్చిస్తున్న ఆర్డీవో మాధురి

పరిసరాల శుభ్రతలో వివాదం

చంద్రాల(మైలవరం), న్యూస్‌టుడే : మండలంలోని చంద్రాల జడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో శుభ్రత వ్యవహారం వివాదాస్పమైంది. మైదానంలో పిచ్చిమొక్కలు పెరగడంతో పాటు విషసర్పాలు వస్తున్నాయని, పిల్లలు భయపడుతున్నారంటూ పీటీఏలో తల్లిదండ్రులు తెలిపారు. దాంతో మాజీ సర్పంచి లీలాప్రసాద్ ఆధ్వర్యంలో మొక్కలు తొలగించే పనులు చేస్తుండగా, గతంలో తొలగించిన నాపరాళ్లను తరలిస్తున్నారని, వీల్దేటూ గ్రామానికి చెందిన ముఖ్య నాయకుడొకరు ఫిర్యాదు చేయడంతో పనులు ఆపేశారు. దీనిపై మాజీ సర్పంచి అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఎంపీడీవో అనురాధ, తహసీల్దార్ అబ్దుల్ దరియా సాయంత్రం పాఠశాలకు వెళ్లి పరిశీలించారు. పరిసరాలను శుభ్రం ఉంచాల్సిందేనని సూచించారు. మరో వైపు పాఠశాల యాజమాన్య కమిటీ తీర్మానంతో సోమవారం మైదానంలో పిచ్చిమొక్కల తొలగింపునకు కూలీలను నియమించి పనులు ప్రారంభించారు.

వైభవంగా వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠ వార్షికోత్సవం

గంపలగూడెం: పెనుగొలను శివాలయంలో సోమవారం వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ఠ వార్షికోత్సవం నిర్వహించారు. భక్తులు వాల్మీకి చిత్రపటం పట్టుకుని శివాలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అర్చకులు డి.రామలింగేశ్వరశర్మ, నిర్వాహకులు ఎం.బ్రహ్మం, పి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

గంపలగూడెం, న్యూస్‌టుడే : కొత్తపల్లి సమీప కట్టలేరులో గోపాలస్వామి మడుగు ఒడ్డున్న ఉమాగౌరీశంకరుని ఆలయంలో శివలింగానికి శోభాయమానంగా అలంకరించారు. గంపలగూడెం, మేడూరు, పెనుగొలను, తిరువూరు, ఎ.కొండూరు మండలం కంభంపాడు శివాలయాల్లో అర్చకులు, భక్తులు విశేష పూజలు నిర్వహించారు.

ఉమాగౌరీశంకరుని ఆలయంలో శివలింగం

మైలవరం, న్యూస్‌టుడే : స్వామి వారి పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని సోమవారం స్థానిక కోదండ రామాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో భాగంగా అభిషేకాలు నిర్వహించారు.

స్క్రబ్ టైఫస్‌పై అప్రమత్తత అవసరం

కొండపల్లి, న్యూస్‌టుడే : స్క్రబ్ టైఫస్ జ్వరాల పట్ల పారిశుద్ధ్య కార్మికులు అప్రమత్తంగా ఉండాలని వైద్యుడు మధుసూదనరావు సూచించారు. కొండపల్లి చెత్త నుంచి సంపద కేంద్రం వద్ద మున్సిపల్ చైర్మన్ చిట్టిబాబు ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులకు స్క్రబ్ టైఫస్‌పై సోమవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పురపాలికలో దీని వ్యాప్తి చెందకుండా చేపట్టాల్సిన చర్యల బాధ్యత పారిశుద్ధ్య కార్మికులదేనని చెప్పారు. వైస్ చైర్మన్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మధుసూదనరావు

రెడ్డిగూడెం: స్క్రబ్ టైఫస్ సంబంధించి ముందస్తు చర్యల్లో భాగంగా స్థానిక ఎస్సీ కాలనీలో గడ్డిమందు పిచికారీ చేయించామని పంచాయతీ కార్యదర్శి ఎస్.రామారావు సోమవారం తెలిపారు. సర్పంచి ఎం.రాణి, ఇన్‌ఛార్జి ఎంపీడీవో ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

చట్టంలో నిబంధనలు పొందుపరచాలి

ఇబ్రహీంపట్నం గ్రామీణం : నకిలీ విత్తనాలతో రైతులు నష్టపోతే పరిహారం ఇచ్చేలా చట్టంలో నిబంధనలు పొందుపరచాలని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ.ప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం మూలపాడు గ్రామ సెంటరులో రైతు సంఘం ఆధ్వర్యంలో విత్తన బిల్లు, విద్యుత్తు బిల్లుల ప్రతులను దగ్ధం చేసి నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తీసుకురానున్న రైతు వ్యతిరేక విత్తన బిల్లు, విద్యుత్తు బిల్లులను వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు.

కొండపల్లి, న్యూస్‌టుడే : విత్తన, విద్యుత్తు బిల్లులకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాన్ని కొండపల్లి ఎంసీపీఐ కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించారు. ఎంసీపీఐ నాయకుడు మరెడ్డి వెంకటరెడ్డి, బసవయ్య, తులసీప్రసాద్, వెంకటరత్నం, రాఘవులు, గణేష్‌బాబు పాల్గొన్నారు.

ఘనంగా ఎస్వీ సుధాకరరావు జన్మదిన వేడుకలు

సుధాకరరావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న తెదేపా నాయకులు

మైలవరం, న్యూస్‌టుడే : ద్వారకా తిరుమల దేవస్థాన ఛైర్మన్, పట్టణ ప్రముఖుడు ఎస్వీ సుధాకరరావు జన్మదిన వేడుకలను మైలవరంలోని ఆయన కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. పలు పార్టీల నాయకులు, అధికారులు, వివిధ సంఘాల ప్రతినిధులు, పట్టణ ప్రముఖులు, ప్రజలు ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

దారి.. రైతుకు ఆసరాగా మారి..

రైతులను కలవరపెట్టిన తుపాను తొలగింది. దీంతో కోత యంత్రాలతో పొలాల్లో సందడి మొదలైంది. చేతికొచ్చిన పంటను కోసి విక్రయించేందుకు సంసిద్ధులైన రైతులకు ధాన్యం ఆరబెట్టుకునే జాగా కరవైంది. దాంతో నూర్చిన ధాన్యాన్ని ట్రాక్టర్లతో ఒడ్డుకు తెచ్చి రోడ్లనే కళ్లాలుగా మార్చి ఎండబెట్టుకుంటున్నారు. మైలవరం మండలంలోని బాడవ టోల్‌గేట్ వద్ద ఖాళీ జాగాలో వడ్లను ఆరబెట్టారు. చంద్రగూడెంలో బైపాస్ నుంచి గ్రామంలోకి వెళ్లే దారిపై పెద్ద ఎత్తున ధాన్యాన్ని ఆరబోయడంతో మార్గమంతా ధాన్యంతో నిండిందిలా. - న్యూస్‌టుడే, మైలవరం

నిత్యం ప్రమాదాలు.. రక్షణ చర్యలు శూన్యం

గొల్లపూడి నుంచి ఇబ్రహీంపట్నం వరకు ఉన్న ఎన్టీటీపీఎస్ కాలువ ప్రమాదకరంగా మారింది. ఎన్టీటీపీఎస్‌లో వినియోగానికి అవసరమైన నీటిని అందించేందుకు వీలుగా కృష్ణా నది సమీపంలో దశాబ్దాల కిందట దీన్ని తవ్వారు. అయితే... కాలువ వెంబడి సరైన రక్షణ చర్యలు లేకపోవడంతో అనేక మంది చనిపోతున్నారు. ఇబ్రహీంపట్నం వరకు కాలువ పొడవునా అనేక గ్రామాలున్నాయి. దీంతో ప్రజలతో పాటు కాలువ గురించి తెలియని అనేక మంది అక్కడకెళ్లి ప్రమాదవశాత్తు అందులో పడి గల్లంతవుతున్నారు. లోతుగా ఉండడంతో అందులో పడితే బయటకు రావడం కష్టం. కొందరు మహిళలు దీని వద్దనే దుస్తులు ఉతుకుతుంటారు. వారు కూడా ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి. దీనికి రక్షణ కంచె ఏర్పాటు చేస్తే కొంత వరకైనా ప్రమాదాలు తగ్గుతాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. - న్యూస్‌టుడే, గొల్లపూడి

చీకట్లు.. రాకపోకలకు అవస్థలు

తిరువూరులోని ప్రధాన రహదారుల్లో గత కొన్ని రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదు. దీంతో రాకపోకలకు ప్రయాణికులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా బోసు బొమ్మ రోడ్డు కూడలి నుంచి బస్టాండ్ వరకు చీకట్లు అలముకుంటున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ మార్గంలో పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు రావడానికి భయపడుతున్నారు. దీనిపై సంబంధిత అధికారిని పలుమార్లు సంప్రదించినా సమస్య మాత్రం పరిష్కారం కాలేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా దీపాలకు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, తిరువూరు టౌన్

దస్తావేజులు పోయినవి

కర్లిబెల్ చంద్రమౌళి S/o సుందర్ ఫ్లాట్ నెం: 111 బ్లాక్- సి, రాఘవ ఎస్టేట్ AP11C కాలనీ IDA జీడిమెట్ల రంగారెడ్డిజిల్లా, తెలంగాణ అను నాకు సంబంధించి నూజివీడులో గల ఆస్తి డాక్యుమెంట్ నెం: 2200/2007ను ది. 27-11-2025న NTR జిల్లా జి. కొండూరులో జిరాక్స్ తీసుకుని వస్తుండగా పడిపోయినవి. కావున దొరికిన వారు పై అడ్రస్‌లోగాని ఈ క్రింది సెల్ నెంబరుకు తెలియపరచగలరని మనవి చేస్తూ..

సెల్: 98494 87721

★ **డీపీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు : మైలవరం, న్యూస్‌టుడే :** డెమొక్రాటిక్ పీఆర్‌టీయూ సంఘ సభ్యత్వ నమోదును ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పెదగమళ్ల నాగరాజు ఆధ్వర్యంలో వివిధ పాఠశాలల్లో సోమవారం నిర్వహించారు. మండలంలోని చిలుకూరివారి గూడెం హైస్కూల్, పొందుగల హైస్కూల్, క్లస్టర్ పరిధిలోని పాఠశాలల్లో పర్యటించి ఉపాధ్యాయులకు సభ్యత్వాలు ఇచ్చారు. పొందుగలలో నూతనంగా నియమితుడైన వ్యాయామోపాధ్యాయుడు దారా మహేష్‌కు సర్వీస్ రిజిస్టర్ అందించారు. సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శి కె.కోటేశ్వరరావు, ఆర్వీఆర్ కృష్ణారావు, నాయకులు యాకుబ్‌మియా, మస్తాన్, ప్రసాద బాబు, రాందాసు తదితరులు పాల్గొన్నారు.

★ **మండల సర్వసభ్య సమావేశం నేడు: జి.కొండూరు, న్యూస్‌టుడే :** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బీవీ.రామకృష్ణ నాయక్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు దీనికి హాజరుకావాలని ఆయన కోరారు.

అవీ ఇవీ

★ **విద్యార్థులు పుస్తకాలకే పరిమితం కావొద్దు : తిరువూరు టౌన్, న్యూస్‌టుడే :** విద్యార్థులు పుస్తకాలకే పరిమితం కాకుండా, పర్యావరణ పరిరక్షణలో భాగస్వామ్యం కావాలని స్థానిక డాక్టర్.బీఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాల హెచ్‌ఎం ఎస్.రవిబాబు తెలిపారు. పాఠశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ విద్యార్థులు స్కూల్ ఆవరణలో సహజ పద్ధతుల్లో పండించిన ఆకుకూరలు, ఇతర కూరగాయలను భోజనాల్లో ఉపయోగిస్తున్నామని చెప్పారు. అనంతరం పాఠశాలలో కంప్యూటర్ పీఏయల్ ల్యాబ్‌ను ప్రారంభించారు.

★ **ఆధునిక పరికరాల పంపిణీ : మైలవరం, న్యూస్‌టుడే :** పీఎం ఉష పథకం కింద స్థానిక లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు రూ.14 లక్షల విలువైన ఆధునిక ఐసీటీ పరికరాలను సోమవారం అందజేసినట్లు ప్రిన్సిపల్(ఎఫ్ఏసీ) పి.రంగారావు తెలిపారు. ఇంటరాక్టివ్ బోర్డులు 4, జిరాక్స్ యంత్రం, యూపీఎస్‌లు, కలర్ ప్రింటర్లు సరఫరా చేసినట్లు పేర్కొన్నారు. ఇవి విద్యార్థులు, కళాశాల అవసరాలకు ఉపయోగపడతాయని చెప్పారు.

వంట ఏజెన్సీ నియామకంపై రగడ

గణపవరం(మైలవరం), న్యూస్‌టుడే : గణపవరంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో వంట ఏజెన్సీ నియామకం స్వల్ప వాదనకు దారి తీసింది. బడిలో ఆయాగా పని చేస్తున్న దాసరి రత్నకుమారి అత్త కొన్నాళ్ల కిందటి వరకు ఏజెన్సీ నిర్వాహకురాలిగా ఉంటూ మృతి చెందారు. తర్వాత ఆ బాధ్యతలను భర్తతో కలిసి రత్నకుమారి నిర్వహిస్తుండగా, ఖాళీగా ఉన్న ఏజెన్సీని వేరే వారికి కేటాయించాలని గ్రామ తెదేపా నాయకులు కొన్నాళ్లగా పట్టుబడుతున్నారు. ఇటీవల కలెక్టర్‌కు ఎంఈవోపై ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం ఎస్ఎంసీ తీర్మానంతో పీట్ల దుర్గ అనే మహిళలకు ఏజెన్సీ నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తూ తీర్మానించారు. హెచ్ఎం వేళాంగిణి ద్వారా తీర్మానాన్ని ఎంఈవోకు అందించారు. ఎవరూ ముందుకు రానప్పుడు తామే బాధ్యతలు నిర్వహిస్తే, అన్యాయంగా తొలగిస్తున్నారని రత్నకుమారి వాదనకు దిగారు. తానే మధ్యాహ్న భోజన పథకం నిర్వహిస్తానని చెప్పినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

చికిత్స పొందుతూ భవన నిర్మాణ కార్మికుడి మృతి

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే : ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న భవన నిర్మాణ కార్మికుడు సోమవారం మృతి చెందాడు. నందిగామ మండలం పల్లగిరికి చెందిన రత్నకుమారి, ఆమె భర్త మరియదాసు గుంటుపల్లిలో నిర్మాణంలో ఉన్న అపార్ట్‌మెంటు వద్ద కాపలాగా ఉంటూ నిర్మాణ పనుల్లో పాల్గొంటున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం నాలుగో అంతస్తుకు మరియదాసు వాటరింగ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం విజయవాడలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ చనిపోయాడు. దీనిపై ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బస్సు చక్రం కిందపడి మహిళకు గాయాలు

మైలవరం, న్యూస్‌టుడే : బస్సు వెనుక చక్రం కింద ఓ మహిళ కాలుపడి తీవ్రంగా గాయాలైన సంఘటన సోమవారం సాయంత్రం జరిగింది. రెడ్డిగూడెం మండలం కుదపకు చెందిన పజ్జూరి కృష్ణకుమారి, ఆమె తల్లిని స్థానిక ప్రభుత్వాస్పత్రిలో నిర్వహిస్తున్న కంటి వైద్య శిబిరంలో పరీక్షలు చేయించారు. అనంతరం గ్రామానికి వెళ్లేందుకు బస్టాండ్‌కు రాగా, విస్సన్నపేట వెళ్లే బస్సు రద్దీగా ఉండటంతో ముందుగా ఎక్కి సీటు ఆపారు. బయట ఉన్న తల్లి కోసం కిందకు దిగగా అప్పటికే బస్సు నిండిపోయింది. బయలుదేరేందుకు డ్రైవర్ బస్సును వెనక్కి తీశాడు. ఆ సమయంలో ఆమె ఒక్కసారిగా చక్రం కింద పడగా, కాలుపైకి ఎక్కడంతో నుజ్జయ్యింది. అక్కడున్న ప్రయాణికులు గమనించి బస్సును ఆపి, క్షతగాత్రురాలిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రాథమిక చికిత్స అనంతరం విజయవాడకు తరలించారు.

వెల్వడంలో చౌక బియ్యం పట్టివేత

మైలవరం: వెల్వడంలో అక్రమంగా నిల్వ చేసిన 6.5 క్వింటాళ్ల చౌక బియ్యాన్ని పట్టుకున్నట్లు తహసీల్దార్ అబ్దుల్ దరియా సోమవారం తెలిపారు. గ్రామంలోని ఒక ఇంటిని అద్దెకు తీసుకుని బియ్యం నిల్వ చేశారన్న సమాచారంతో వీఆర్వో ద్వారా పరిశీలించి, శనివారం రాత్రి సీజ్ చేశామన్నారు. ఆ బియ్యాన్ని స్థానిక రేషన్ డీలరుకు స్వాధీన పర్చి, వాటిని నిల్వ చేసిన పరికెల జమలయ్యపై 6ఏ కేసు నమోదు చేసినట్లు వివరించారు.

వేతనాల్లో కోతలు పెడతామనడం తగదు

మైలవరం: బ్యాంకు మేనేజర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఉద్యోగులు

జి.కొండూరు సహకార బ్యాంకు ఆవరణలో..

తిరువూరు, మైలవరం నియోజకవర్గాల్లోని వ్యవసాయ పరపతి సహకార సంఘాల్లో పని చేస్తున్న ఉద్యోగులు ఆయా ప్రాంతాల్లోని బ్యాంకుల వద్ద సోమవారం నిరసన తెలిపారు. దీర్ఘకాలికంగా ఉన్న న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. పీఆర్‌సీ అమలు చేయాలని, ఉద్యోగ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని, 2019 నుంచి సహకార సంఘాల్లో నియమితులైన సిబ్బందిని క్రమబద్ధీకరించాలని కోరారు. ఎక్కడా లేని విధంగా రుణాల రికవరీకి ఉద్యోగులను బాధ్యులను చేసి, వేతనాల్లో కోతలు వేస్తామంటూ చేస్తున్న చర్యలు ఆక్షేపణీయమన్నారు. అనంతరం ఆయా బ్యాంకు శాఖల మేనేజర్లకు వినతిపత్రాలు అందించారు. - న్యూస్‌టుడే, బృందం

గంపలగూడెంలో..

ఇబ్రహీంపట్నంలో..

ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు

Cell: 98496 97616

నేత్రదానం

గంపలగూడెం, తిరువూరు: తిరువూరుకు చెందిన మునిగంటి లక్ష్మయ్య(82) సోమవారం మృతి చెందగా కుటుంబ సభ్యులు అతని నేత్రాలను విజయవాడ ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి దానం చేశారు. తిరువూరు లయన్స్ క్లబ్ ప్రతినిధులు పి.వెంకటేశ్వరరావు, కొమ్మినేని రాజేష్‌ఖన్నా, ఎన్.శ్యామ్ నేత్రదానంపై కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించారు.

ఫలితాల సాధనకు ఉపయుక్తం

విస్సన్నపేట: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ప్రచురించిన స్టడీ మెటీరియల్ పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాల సాధనకు ఉపయోగపడుతుందని ఎంఈవో- 1 కె.శంకరరావు తెలిపారు. సోమవారం నరసాపురం జడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు హెచ్‌ఎం. ఎస్.శోభాలత వీటిని అందించారు.

SBI భారతీయ స్టేట్ బ్యాంక్

హోమ్ లోన్ సెంటర్-2, డి.నెం.54-15-1/బి, యలమంచిలి కాంప్లెక్స్, వెంకటేశ్వర నగర్, విజయవాడ-520 008.

స్వాధీనత ప్రకటన

APPENDIX IV (రూలు-8(1) (స్థిరాస్తి కొరకు)

ఇందుమూలముగా సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం-2002 (నెం.54 ఆఫ్ 2002) ప్రకారం భారతీయ స్టేట్ బ్యాంక్, స్వాతి జంక్షన్ బ్రాంచి, విజయవాడ, యన్‌టీఆర్ జిల్లా, ఆంధ్రప్రదేశ్ యొక్క అధీకృత అధికారిగా దిగువ సంతకందారు, సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క సెక్షన్ 13(12) 3వ నిబంధన క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ, సదరు నోటీసు స్వీకరించిన తేది నుండి 60 రోజులలోపు నోటీసులో తెలిపిన మొత్తము బకాయి రూ. 67,98,333/- (రూ.27,82,340/- + రూ.2,44,056/- + రూ.37,71,937/-) (అక్షరాల అరవైఏడులక్షల తొంభైఎనిమిదివేల మూడువందల ముప్పైమూడు రూపాయలు మాత్రమే) మరియు ది:01-06-2025 నుండి చెల్లించవలసిన వడ్డీ, ఖర్చులతో సహా చెల్లించమని కోరుతూ ఋణగ్రహీతలు: **1) శ్రీమతి బొర్రా గుణసుందరి, భర్త: వెంకట సోమ శేఖర్, 2) శ్రీ బొర్రా వెంకట సోమ శేఖర్, తండ్రి: నాగేశ్వరరావు,** డోర్ నెం.26-89/1, 2వ క్రాస్ రోడ్, కబేళా సెంటర్, విద్యాధరపురం, విజయవాడ-520012. (హెచ్‌యల్: 37935657256, సురక్ష: 37946059161 & టాప్‌అప్: 38078760776) వీరిని కోరుతూ ది:31-05-2025వ తేదీన డిమాండు నోటీసును జారీచేయడమైనది.

సదరు మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో ఋణగ్రహీతలు విఫలమైనందున సదరు రూల్ "8"తో చదువుకొనవలసిన సదరు చట్టం ద్వారా సెక్షన్ 13(4) క్రింద దిగువ వివరించిన స్థిరాస్థిని సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 ప్రకారం ఈ దిగువ సంతకందారు ఈ రోజున సింబాలిక్ స్వాధీనం చేసుకొన్నారని ఋణగ్రహీతకు / తనఖాదారుకు మరియు సాధారణ ప్రజానీకానికి ఈ నోటీసు ద్వారా తెలుపడమైనది.

ఈ స్థిరాస్థితో ఏవిధమైన లావాదేవీలు జరుపరాదని, ఏవేని లావాదేవీలు జరిపిన పక్షంలో అవి భారతీయ స్టేట్ బ్యాంక్ యొక్క ఛార్జికి మొత్తం బకాయి మొత్తము బకాయి రూ.67,98,333/- (రూ.27,82,340/- + రూ.2,44,056/- + రూ.37,71,937/-) మరియు ది:01-06-2025 నుండి తదుపరి వడ్డీ + ఖర్చులు మొదలగువాటికి లోబడి ఉంటాయని ఋణగ్రహీతకు/తనఖాదారుకు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా తెలియపరచటమైనది.

ఋణగ్రహీతలు సదరు చట్టంలో సబ్ సెక్షన్(8) ఆఫ్ సెక్షన్ 13 ప్రకారం తనఖా ఆస్థిని గడువులోపల విడిపించుకొనుటకు గాను దృష్టి సారించవలసి ఉన్నది.

తనఖాపెట్టిన స్థిరాస్తి వివరము

కృష్ణా జిల్లా, ఇబ్రహీంపట్నం మండలం, **గొల్లపూడి గ్రామం,** సమీప వార్డు నెం.23-60, ఆర్‌యస్ నెం.408/6 లోని 117 చ॥గ॥ల విస్తీర్ణములో నిర్మించిన ఆర్‌సిసి భవనము శ్రీమతి బొర్రా గుణసుందరి, భర్త: వెంకట సోమ శేఖర్ గారికి చెందిన రిజిష్టర్డ్ గిఫ్ట్‌డీడ్ నెం.2756/2008, తేది:26-05-2008, ఇబ్రహీంపట్నం జెయస్‌ఆర్ఓ, కృష్ణా జిల్లా. హద్దులు: తూర్పు: దాడి గిరిజ యొక్క ఆస్థి, దక్షిణం: రోడ్డు, పడమర: కొలుసు వీరాంజనేయులు యొక్క ఆస్థి, ఉత్తరం: జి. తిరుమలరావు యొక్క ఆస్థి.

తేది : 04-12-2025 | అధీకృత అధికారి

ప్రదేశం: విజయవాడ | స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

విజయవాడ తూర్పు

అంధుల క్రికెట్ పోటీలకు ఆహ్వానం

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్ర అంధుల క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు నంబూరులోని డాక్టర్ గోకరాజు గంగరాజు, ఎమ్మెస్కే క్రికెట్ మైదానంలో 'ఇండస్ ఇండ్ బ్యాంక్ నగేష్ ట్రోఫీ 2025-26'లో భాగంగా జరిగే గ్రూపు-ఎ మ్యాచ్‌ల ప్రారంభోత్సవ కార్యక్రమానికి శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడును ముఖ్యఅతిథిగా ఆహ్వానించారు. ఈ మేరకు సోమవారం ఐజీఎంసీ స్టేడియంలోని శాప్ కార్యాలయంలో రాష్ట్ర అంధుల క్రికెట్ సంఘం కార్యదర్శి జి.రవీంద్రబాబు శాప్ ఛైర్మన్‌కు ఆహ్వానపత్రిక అందజేశారు. రాష్ట్ర అంధుల క్రికెట్ సంఘం కోశాధికారి అజయ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాతరంగ్ పోటీల్లో ప్రతిభ

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే : కృష్ణా యూనివర్సిటీలో నిర్వహించిన కృష్ణాతరంగ్ పోటీల్లో నలంద డిగ్రీ కళాశాల ఓవరాల్ ఛాంపియన్‌షిప్ మొదటి రన్నరప్‌గా నిలిచిందని ప్రిన్సిపల్ ఎం.అనూరాధ తెలిపారు. సాంస్కృతిక అంశాల్లో నిర్వహించిన పోటీల్లో కళాశాల విద్యార్థులు వివిధ స్థాయిల్లో బహుమతులు సాధించారని పేర్కొన్నారు. విజేతలను విద్యా సంస్థల ఛైర్మన్ విజయబాబు అభినందించారు.

అగ్నిప్రమాద బాధితులకు సాయం

కృష్ణలంక, న్యూస్‌టుడే: కృష్ణలంక 20వ డివిజన్ పరిధిలోని రణదివేనగర్‌లో అగ్నిప్రమాద బాధితులను సోమవారం ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పరామర్శించారు. మూడు ఇళ్లు కాలిపోగా ఒక్కో ఇంటికి రూ.5 వేలు చొప్పున, అలాగే నిత్యావసర సరకులు, దుస్తులు అందజేశారు. గుండు శ్రీను, గల్లా శ్రీను, శివలక్ష్మి, రమాదేవి, భవాని, షకీలా, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు

వినతి పరిశీలిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : నగరంలోని పలు ప్రాంతాల్లో డ్రెయిన్ల నిర్మాణాలు చేపట్టాలంటూ పలువురు నగర కమిషనర్ ధ్యానచంద్రకు వినతిపత్రాలు అందించారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించగా.. ప్రజల నుంచి సమస్యలపై 25 వినతులు అందాయి. కమిషనర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను విభాగాధిపతులు నేరుగా పరిశీలించి. . సకాలంలో పరిష్కరించాలని అన్నారు. ఆస్తిపన్ను తగ్గింపు, రహదారుల ఆక్రమణలు, ట్రేడ్ లైసెన్సు, వాటర్ మీటర్ పన్ను, నాన్ వాటర్ మీటర్ పన్ను తొలగింపు, ఖాళీస్థలం పన్ను మినహాయింపు, చెట్ల కొమ్మల తొలగింపు, మౌలిక వసతుల కల్పన వంటి సమస్యలతో పాటు విద్యుత్తు ఉప కేంద్ర నిర్మాణం, ఇందిరాగాంధీ మున్సిపల్ క్రీడా ప్రాంగణ సమస్య, గ్రంథాలయం ఏర్పాటు, డ్రెయిన్ల ఎత్తు పెంపు, రహదారుల శుభ్రత, తాగునీటి సమస్య, వీధి కుళాయిల ఏర్పాటు, టీడీఆర్ బాండ్ సమస్య, వీధి దీపం ఏర్పాటు, రహదారులు, కల్వర్టుల నిర్మాణం, ఎన్టీఆర్ కాంప్లెక్సులో దుకాణాల సమస్య వంటి అంశాలపై వినతులు అందాయి. అధికారులు డి.చంద్రశేఖర్, అర్జునరావు, కె.సంజయ్ రత్నకుమార్, జి.సృజన, ఎ.శ్రీధర్, శ్రీనివాస్, ప్రభాకర్, కామేశ్వరరావు, చంద్రశేఖర్, మాల్యాద్రి, బి.సోమశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

తాటాకు ఇల్లు దగ్ధం

కృష్ణలంక, న్యూస్‌టుడే: స్థానిక రణదివేనగర్ కరకట్ట పరిధిలో తాటాకు ఇల్లు దగ్ధమైన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. 20వ డివిజన్ నిర్మల శిశుభవన్ సమీపంలోని కరకట్ట ప్రాంతంలో చేకూరి వెంకటేశ్వర్లుకు నాలుగు గదుల తాటాకు ఇల్లు ఉంది. మూడు గదులు శిథిలమైపోగా ఒక్క గదిలో సుంకర రాజాల అనే మహిళ అద్దెకు ఉంటోంది. సోమవారం మధ్యాహ్నం 12.30 సమయంలో పని నిమిత్తం మహిళ ఇంటికి తాళం వేసి వెళ్లింది. కొద్దిసేపటికే ఇంట్లో మంటలు చెలరేగడంతో సమీపంలోని వారు ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. దీపారాధన కారణంగా మంటలు చెలరేగి తాటాకులకు అంటుకుని ప్రమాదం జరిగి ఉండొచ్చని భావిస్తున్నారు. ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి ఆపద తలెత్తకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

సూచించలేవు.. శాసించలేవు!

★ పనిచేయని ట్రాఫిక్ సిగ్నళ్లు
★ వాహనచోదకుల అవస్థలు

జమ్మి చెట్టు కూడలిలో నిత్యం ఇదే పరిస్థితి..

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: తూర్పు నియోజకవర్గ పరిధిలోని మొగల్రాజపురం ప్రాంతం.. వర్తక, వ్యాపార, వాణిజ్య విద్యా కేంద్రంగా ఉంది. ఇక్కడ లక్ష మందికి పైగా నివసిస్తున్నారు. నిత్యం 60 వేలకు పైగా వాహనాలు ప్రయాణిస్తుంటాయి. దీంతో అంతర్గత రహదారులు రద్దీగా ఉంటాయి. ముఖ్యంగా ఐదో నంబరు రూట్(ఏఎస్ రామారావు రోడ్డు)లో కొన్ని నెలల నుంచి కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నళ్లు పనిచేయడం లేదు. ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ సమస్య పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సిద్ధార్థ సర్కిల్‌లో అలంకారప్రాయంగా..

★ జమ్మిచెట్టు కూడలికి పీవీపీ మాల్, కరెంట్ బావి, మధుచౌక్, సిద్ధార్థ సర్కిల్ ఇలా నాలుగు వైపుల నుంచి వాహనాలు వస్తాయి. సిగ్నల్ లేకపోవడంతో అన్ని వైపులా ఒకేసారి వాహనాలు వస్తున్నాయి. దీంతో ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొని చోదకులు గాయాలపాలవుతున్నారని స్థానికులు చెబుతున్నారు. ఇక్కడి బోయపాటి శివరామకృష్ణయ్య నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో సుమారు వెయ్యి మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. రహదారి దాటాలంటే భయమేస్తోందని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు భయపడుతున్నారు. కనీసం ట్రాఫిక్ సిబ్బందినైనా ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

★ నైస్ బార్ కూడలిలో నాలుగు వైపుల నుంచి ఒకేసారి వాహనాలు దూసుకువస్తున్నాయి. దీంతో తరచూ ట్రాఫిక్ ఇక్కట్లు ఏర్పడుతున్నాయని, సాయంత్రం సమయంలో రహదారి దాటాలంటే తీవ్ర అవస్థలు పడుతున్నామని స్థానికులు చెబుతున్నారు.

★ సిద్ధార్థ సర్కిల్‌లో పీబీ సిద్ధార్థ కళాశాల ఉంది. కనీసం ఆరు వేల మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. సిగ్నల్ లేకపోవడంతో వాహనదారులు ఆగడం లేదు. ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

ప్రతిపాదనలు పంపించాం:

ప్రస్తుతం ఉన్న ట్రాఫిక్ సిగ్నల్స్ పని చేయడం లేదు. కొత్త వాటిని ఏర్పాటు చేయమని నగరపాలక సంస్థకు ప్రతిపాదనలు పంపించాం. అనుమతులు వచ్చి నిధులు మంజూరు కాగానే వీటి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. రద్దీగా ఉన్న సమయాల్లో కూడళ్ల వద్ద సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నాం. ప్రజలకు, వాహన చోదకులకు ఇబ్బందిలేకుండా చర్యలు చేపడతాం.

\- సీఐ వై.రవికుమార్

నీటి వృథా అరికట్టరూ..

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: మూడో డివిజన్ కరెన్సీనగర్, శ్రీరామచంద్రనగర్ కలిసే బాయన బాబూజీ రహదారిలో తాగునీటి పైపు లీకేజీ అవుతోంది. వృథాగా పోతున్న నీటిలో మురుగునీరు కలుస్తోందని మహిళలు ఆరోపిస్తున్నారు. అధికారులు ఈ సమస్యపై దృష్టి పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

హైటెన్షన్ రోడ్డులో భారీ గుంత

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: హైటెన్షన్ రోడ్డు ఆయుష్ ఆసుపత్రి నుంచి నాగార్జునగర్‌కు వెళ్లే మార్గంలో గుంత పడడంతో రాత్రి సమయాల్లో వాహనాల రాకపోకలకు ఇబ్బందవుతోంది. ఇదే ప్రాంతంలో రోడ్డు మరమ్మతులు జరిగినప్పటికీ గుంతను పట్టించుకోలేదు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఎక్కడి గుంతలు అక్కడినే ఉన్నాయి. దీంతో శ్రీరామచంద్రనగర్, కరెన్సీనగర్, కనకదుర్గ నగర్ ప్రాంతాల్లో గోతులు దర్శనం ఇస్తున్నాయి.

పుష్కరాల ఏర్పాట్లపై మంత్రి ఆనంతో భేటీ

మంత్రి రామనారాయణరెడ్డితో ఎంపీ శివనాథ్, బుద్ధా వెంకన్న

పటమట, న్యూస్‌టుడే: రాబోయే పుష్కరాలను దృష్టిలో పెట్టుకుని భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పుష్కర స్నానం, అమ్మవారి దర్శనం జరిగేలా శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధి పనులపై ఎంపీ కేశినేని శివనాథ్.. దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో చర్చించారు. సోమవారం తాడేపల్లిలోని మంత్రి నివాసంలో ఆయనతో ఎంపీ కేశినేని శివనాథ్ భేటీ అయ్యారు. ఆలయ అభివృద్ధి, పుష్కరాల ఏర్పాట్లపై చర్చించారు. మాజీ ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధితో పేదలకు భరోసా

చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్, వాసు, గణేష్ తదితరులు

కృష్ణలంక, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ ద్వారా ఎంతోమంది పేదలకు వందల రూ.కోట్లు సాయం మంజూరు చేస్తోందని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. 21వ డివిజన్ కృష్ణలంక సత్యం హోటల్ సెంటర్ వద్ద సోమవారం సీఎం సహాయ నిధి కింద 30 మందికి మంజూరైన రూ.37 లక్షల విలువైన చెక్కులు పంపిణీ చేశారు.

రాష్ట్ర ఖోఖో సంఘం అధ్యక్షుడిగా ప్రసాద్

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ ఖోఖో సంఘం అధ్యక్షుడిగా ఎంవీఎస్ ప్రసాద్ ఎన్నికయారని ఉమ్మడి కృష్ణా జిల్లా ఖోఖో సంఘం కార్యదర్శి మద్దినేని వెంకట సత్యప్రసాద్ తెలిపారు. ఈ నెల 7వ తేదీన ఏలూరులో జరిగిన రాష్ట్ర ఖోఖో సంఘ సర్వసభ్య సమావేశం, ఎన్నికల్లో జిల్లా ఖోఖో సంఘం అధ్యక్షుడు ఎంవీఎస్ ప్రసాద్‌ను రాష్ట్ర సంఘ అధ్యక్షుడిగా ఎన్నుకున్నారని ఆయన పేర్కొన్నారు. సంఘ సభ్యులు పలువురు ప్రసాద్‌ను అభినందించారు.

ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్
(ప్రభుత్వ రంగ షెడ్యూల్డ్ బ్యాంక్) ప్రాంతీయ కార్యాలయం: విజయవాడ
సూర్యదేవర నెస్ట్, డోర్ నెం.4-195, అయ్యప్పస్వామి గుడి వీధి, గొల్లపూడి, విజయవాడ, మెయిల్ ఐడి: rovijayawada@sgbank.in

లీజ్ ప్రాతిపదికన భవనం కావలెను

ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్, విజయవాడ నగరంలో **గుణదల మరియు రాణిగారి తోట** ఏరియాలలో నూతన శాఖలు ప్రారంభించుట కొరకు అన్ని అవసరమైన సౌకర్యాలతో గల భవనము కావలెను. అందు నిమిత్తము **విజయవాడ నగరంలో గుణదల మరియు రాణిగారి తోట ఏరియాలలో** తగిన పార్కింగ్ స్థలం, నీటి సౌకర్యం, మంచి వెంటిలేషన్ మరియు సులభ ప్రవేశం కలిగి **సుమారు 1200 నుండి 1400 చదరపు అడుగుల (±20%)** (కనీసం 200 చ.అ.ల స్ట్రాంగ్ రూమ్‌తో కలిపి) కార్పెట్ ఏరియా కలిగిన భవనము (గ్రౌండ్ ఫ్లోర్ ప్రాధాన్యతగా) అద్దెకు కావలెను. బ్యాంక్ అవసరాలకు అనుగుణంగా సిద్ధంగా ఆక్రమించదగిన (రెడీ-టు-ఆక్యుపై) భవనం లేదా నిర్మాణం పూర్తికావచ్చిన భవనం కావలెను, కావున ఆసక్తి గల వారి నుండి టెండర్లు కోరడమైనది.
టెండర్ విధానం: ఆసక్తి గల వ్యక్తులు టెక్నికల్ బిడ్ మరియు ఫైనాన్షియల్ బిడ్లను విడి విడిగా సీల్డ్ కవర్లలో సమర్పించాలి. ఈ రెండు కవర్లను మరొక సీల్డ్ కవరులో ఉంచి దానిపై ఈ విధంగా రాయాలి: **"Tender for Premises - Regional Office, Vijayawada".**
టెండర్ దరఖాస్తు ఫారాలు (టెక్నికల్ & ఫైనాన్షియల్) మరియు ఇతర వివరాలు ప్రాంతీయ కార్యాలయం, గొల్లపూడి, విజయవాడ నుండి కార్యాలయ సమయాల్లో పొందవచ్చు.
ముఖ్యమైన తేదీలు: టెండర్ సమర్పణకు చివరి తేదీ: 03-01-2026 (శనివారం) సాయంత్రం 05:00 గంటల వరకు,
టెండర్ తెరవబడే తేదీ, సమయం & స్థలం: 05-01-2026 (సోమవారం) ఉదయం 11-00 గంటలకు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్, ప్రాంతీయ కార్యాలయం, గొల్లపూడి, విజయవాడ (బిడ్డర్లు లేదా వారి అధీకృత ప్రతినిధులు టెండర్ తెరవబడే సమయంలో హాజరు కావచ్చు).
సంప్రదించవలసిన వివరాలు: **9441799711, 8106142725** ప్రాంతీయ కార్యాలయం, విజయవాడ.
గమనిక: టెండర్లను ఏ దశలోనైనా రద్దు చేయుటకు లేదా మార్పు చేయుటకు బ్యాంక్ వారికి అధికారము కలదు.
ఇట్లు/- రీజనల్ మేనేజర్

సేవలకు పురస్కారం

శ్రుతి వీణను సత్కరిస్తున్న ఫాదర్ మెల్కియోర్ తదితరులు

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: డెఫ్ ఎనేబుల్డ్ ఫౌండేషన్ 16వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఆంధ్రా లయోలా కళాశాలలో హెలెన్ కెల్లర్ ఎక్సలెన్స్ అవార్డులను ప్రదానం చేశారు. బధిరుల విభాగంలో విద్యా, బోధన, కళలు, నాయకత్వం, సమాజ సేవలో సాధించిన విజయాలను గుర్తించి ఫౌండేషన్ అవార్డులు ప్రకటించింది. ప్రిన్సిపల్ ఫాదర్ మెల్కియోర్, జి.సహాయ భాస్కరన్‌లు గౌరవ అతిథులుగా హాజరయ్యారు. ఈ ఫౌండేషన్ ఉపాధ్యాయుల అవార్డు కింద సెయింట్ ఆన్స్ మనోవికాస కేంద్రం కె.శ్రుతివీణ, గుణదల మడోన్నా హైస్కూల్‌కు చెందిన కేఎంపీ విజయలక్ష్మిలను సన్మానించారు. విద్యార్థుల అవార్డు కింద జి.లీలా సామ్రాజ్యం(సెయింట్ ఆన్స్), ఎ.శ్రీహిత(మడోన్నా హైస్కూల్)లకు అందించారు. అచీవర్ అవార్డుల కింద ఉత్తమ వ్యవస్థాపకులు కె.సాయి సందీప్, కె.గణపతిలు అవార్డు అందుకున్నారు.

రక్తదాన శిబిరానికి స్పందన

రక్తదానం చేస్తున్న ఎన్ఎస్ఎస్ వాలంటీరు

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: ఆంధ్రా లయోలా కళాశాల 72వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎన్టీఆర్ జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి చిట్టిబాబు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను అభినందించారు. ప్రిన్సిపల్ ఫాదర్ మెల్కియోర్, రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ వైద్యాధికారి డాక్టర్ మదన్ మోహన్, ప్రోగ్రామ్ అధికారులు శామ్యూల్ దయాకర్, ఆర్.జాన్, కె.ప్రకాశరావు, కె.శేఖర్, సత్యనారాయణ, భాస్కర్‌లు పాల్గొన్నారు. వాలంటీర్లు దాదాపు 51 యూనిట్ల రక్తాన్ని ఇచ్చారు.

దస్తావేజు పోయినది
నేను అనగా ఎస్.కె.ఖాసిం సాహెబ్ S/o. ఎస్.కె.నజీర్ భాషా, డోరు నెం. 74-6-5/1, అయ్యప్పనగర్, విజయవాడ. ది. 22.11.2025 న ఒరిజనల్ దస్తావేజు నెం. 3724/2012 కృష్ణలంక కట్టమీదుగా వస్తున్నప్పుడు జారి పడిపోయినది ఎంత వెదకిననూ దొరక లేదు. ఎవరికైనా దొరికిన ఎడల ఈ క్రింది ఫోన్‌లో సంప్రదించవలసినదిగా కోరుచున్నాము.
ఫోన్ : 96033 79786



మహిళా టీటీ పోటీలకు ఎన్టీఆర్ వర్సిటీ జట్టు

విజయవాడ క్రీడలు: విశాఖలోని గీతం విశ్వవిద్యాలయంలో ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు జరిగే దక్షిణ భారత అంతర్ విశ్వవిద్యాలయాల మహిళా టేబుల్ టెన్నిస్ పోటీల్లో పాల్గొనే డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం జట్టును వర్సిటీ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి ఇ.త్రిమూర్తి సోమవారం వెల్లడించారు. ఎంపికైన జట్టు సభ్యులను వర్సిటీ ఉపకులపతి డాక్టర్ పి.చంద్రశేఖర్, రిజిస్ట్రార్ డాక్టర్ వి.రాధికారెడ్డిలు అభినందించారు. వర్సిటీ జట్టులో ఎం.సుభాషిణి(కేకేసీ హోమియోపతి కళాశాల, పుత్తూరు), ఎన్.యామిని, ఎ.ఖ్యాతి(ఎన్ఆర్ఐ వైద్య కళాశాల, చినకాని), టి.సాత్విక(జీఎస్ఎల్ వైద్య కళాశాల, రాజమహేంద్రవరం), జి.కల్యాణి (మహారాజ హోమియోపతి కళాశాల, విజయనగరం) స్థానం సాధించారు.

కరాటేలో సత్తా

విజయవాడ క్రీడలు: గుంటూరులోని ఎన్టీఆర్ నగరపాలక సంస్థ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 7న జరిగిన 23వ జాతీయ ఓపెన్ కరాటే పోటీల్లో నగరంలోని వాంకన్ కరాటే-డో సమాఖ్య రాష్ట్ర శాఖకు చెందిన పలువురు క్రీడాకారులు సత్తాచాటి పతకాలు కైవసం చేసుకున్నారని ఆ సంస్థ రాష్ట్ర చీఫ్ ఎస్.దుర్గారావు తెలిపారు. జి.నీనా(7) కటా, కుమితే, వెపన్ కటాలో మూడు పసిడి, ఎస్.అనన్య(8) కటా, కుమితేలో రెండు పసిడి, బి.లక్ష్మణ్(8) కటాలో పసిడి, పి.గౌతమ్(8) కటాలో రజత, ఎస్.జోషి స్వరూప్(7) కటాలో రజత, ఎస్.షణ్ముఖ సాయినాథ్(9) కటాలో రజత పతకాలు సొంతం చేసుకున్నారని పేర్కొన్నారు.

పెయింటర్ అదృశ్యం

కృష్ణలంక: భర్త అదృశ్యంపై భార్య చేసిన ఫిర్యాదుపై కృష్ణలంక పోలీసులు కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు పి.నాగరాజు(50) పెయింటర్ కాగా రాణిగారితోటలో నివాసం ఉంటున్నారు. అతడి భార్య ఉష సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నారు. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇటీవల అనారోగ్యానికి లోనైన నాగరాజు పనికి వెళ్లకుండా ఇంటి వద్దే ఉంటున్నాడు. ఈనెల 3వ తేదీ ఉదయం 8.30 గంటలకు బయటకు వెళ్లి వస్తానన్న నాగరాజు తిరిగి ఇంటికి చేరుకోలేదు.

అశ్రునివాళి

జననం 02-02-1932
మరణం 30-11-2025

కీ॥శే॥ **కొడాలి లక్ష్మణరావు** గారు

కల్మషమెరుగని మనసుతో అందరి హృదయాలలో సుస్థిర స్థానమేర్పరచుకుని
మా ఉజ్వల భవితకు బాటవేసిన మహావ్యక్తి, మీరు చూపిన మార్గంలో నడుస్తూ...
మీ ఆశయాల సాధనకు కృషి సాగిస్తూ.... మీ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

భార్య: కొడాలి సీతారామమ్మ

కుమారులు - కోడళ్ళు
కొడాలి వెంకట సుబ్బారావు - పద్మావతి
డా॥ కొడాలి సతీష్ - డా॥ అపర్ణ
కుమార్తె - అల్లుడు
డా॥ కొడాలి ఆషా - డా॥ శింగమనేని రమేష్‌బాబు

తమ్ముడు-మరదలు: డా॥ కొడాలి కిషోర్‌బాబు - డా॥ రంగనాయకమ్మ
చెల్లెలు-బావమరిది: కాజ శోభారాణి - గోపాలకృష్ణ
తమ్ముడు కుమార్తె: కెల్లంపల్లి ఉజ్వల తమ్ముడు కుమారుడు: డా॥ కొడాలి ధీరజ్
మనుమరాళ్ళు, మనుమడు: రవళి, డా॥ దివ్య, డా॥ సౌమ్య, నేహ, వ్యాస్
మునిమనుమరాళ్ళు: మీరా, తార మరియు బంధుమిత్రులు

పెద్దకర్మ: ది. 10-12-25 బుధవారం నాడు ఉదయం 11.00 గంటలకు విజయవాడ, మొగల్‌రాజపురంలో అమ్మ కళ్యాణ మండపం నందు జరుపబడును

(c) eenadu

నందిగామ

• నందిగామ • జగ్గయ్యపేట

ఉత్సాహంగా ప్రతిభా పాటవ పోటీలు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: నందిగామ చైతన్య ఏసీ కళాశాల, దీక్ష జూనియర్ కళాశాలల్లో సోమవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. జూనియర్, సీనియర్ ఇంటర్ విద్యార్థులకు 'కృత్రిమ మేధవల్ల(ఏఐ) భవిష్యత్తులో వచ్చే మార్పులు' అన్న అంశంపై ఉపన్యాస పోటీలు నిర్వహించారు. చైతన్య కళాశాల విద్యార్థులు ఎం.హర్షిణి (సీనియర్ బైపీసీ), టి.శశిరేఖ(సీనియర్ బైపీసీ) ఎం.మోనికాదుర్గ(సీనియర్ ఎంపీసీ) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు ప్రశంసా పత్రాలు, బహుమతులను కళాశాల ప్రిన్సిపల్ అమరనేని కార్తీక్, డైరెక్టర్ ఎ.శాంతిప్రత్యూష అందజేశారు. దీక్ష జూనియర్ కళాశాల విద్యార్థులు ఎ.గ్రీష్మ(ప్రథమ బైపీసీ), ఎ.పావని(ప్రథమ ఎంపీసీ), కె.అనుదీపిక (ప్రథమ ఎంపీసీ) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు ప్రిన్సిపల్ ఎస్‌డీ హనీఫ్, వైస్ ప్రిన్సిపల్ వి.రామారావు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు.

చైతన్య కళాశాల విద్యార్థినులతో డైరెక్టర్ శాంతిప్రత్యూష

'దీక్ష' విజేతలతో వైస్ ప్రిన్సిపల్ రామారావు

వెండి దేవాలయం.. మహాలక్ష్మికి దీపోత్సవం

పట్టణంలోని అద్దాల బజార్ వెండి దేవాలయంలోని మహాలక్ష్మి అమ్మవారికి మహిళలు సోమవారం కనుల పండువగా దీపోత్సవం నిర్వహించారు. ప్రమిదల్లో దీపాలు వెలిగించి.. భక్తులు ఏకరూప దుస్తుల్లో అమ్మవారికి గాజార్చన చేసి మైమరపించారు. -న్యూస్‌టుడే, జగ్గయ్యపేట

శివయ్యా.. క్షమించు!

★ ఆక్రమణలతో కుంచించుకుపోతున్న కోనేరు ★ పట్టించుకుంటేనే గత వైభవం

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే

పూర్వం ఈ కోనేరులో స్వామివారి ఉత్సవ మూర్తులకు తెప్పోత్సవం నిర్వహించేవారు. ఏళ్ల తరబడి చెరువును పట్టించుకోపోవడంతో మురుగు, వర్షం నీటితో నిండింది. ఇందులో పురాతన రాతి మండపం ఉంది. రూ.కోట్లు విలువ చేసే స్థలాన్ని కాపాడుకుని అభివృద్ధి చేసేలా దేవాదాయ శాఖ అధికారులు దృష్టి పెట్టాలని భక్తులు కోరుతున్నారు.

నందిగామలో రూ.కోట్లు విలువ చేసే రామలింగేశ్వరస్వామి ఆలయ కోనేరు స్థలం ఆక్రమణకు గురైంది. పాత బస్‌స్టాండ్‌లో ఆర్ఎస్ నంబరు 125లో 1.25 ఎకరాల విస్తీర్ణంలో కోనేరు ఉంది. పూర్వం మాఘ మాసంలో స్వామివారి కల్యాణ మహోత్సవంలో ఉత్సవ మూర్తులకు ఇక్కడ తెప్పోత్సవం నిర్వహించేవారు. ఉత్సవ మూర్తులను కొలువుదీర్చడానికి కోనేరు మధ్యలో రాతి మండపం నిర్మించారు. ప్రస్తుతం ఇది మురుగు నీటితో నిండినా రాతి మండపం చెక్కు చెదర లేదు. ఆక్రమణలతో మూసుకుపోయింది. కొన్నాళ్ల క్రితం రెవెన్యూ, పోలీస్, దేవాదాయ శాఖ అధికారులు ఆక్రమణలను కొంతమేర తొలగించారు. మోటార్లతో మురుగు నీటిని బయటకు తోడించారు. కోనేరుకు ఆగ్నేయంగా పురాతన సోమేశ్వరస్వామి విగ్రహాలు బయట పడ్డాయి. ఆ సమయంలో రూ.5 లక్షలతో కోనేరు పూడికతీయించి మంచినీటితో నింపాలని, నాలుగు వైపులా మెట్లు నిర్మించాలని ప్రతిపాదించారు. ఇది ఇప్పటి వరకు కొలిక్కిరాలేదు. కోనేరు స్థలంలో విద్యుత్తు లైన్ ఏర్పాటు చేశారు.

మురుగు నీటితో నిండిన చెరువు

వేగంపుంజుకోని ఉపాలయాల పనులు

శివాలయంలో రూ.1.30 కోట్ల సీజీఎఫ్ నిధులతో నాలుగు ఉపాలయాల నిర్మాణ పనులు సాగుతున్నాయి. ఇప్పటికే ఇవి పూర్తి చేయాల్సి ఉంది. గర్భాలయ అభివృద్ధిని చేపట్టారు. తాజాగా శివాలయ వంశపారంపర్య ధర్మకర్త వాసిరెడ్డి మురళీరామవరపుకార్ సొంత నిధులతో ప్రహరీ నిర్మాణ పనులు ప్రారంభించారు. మాఘ మాసంలో స్వామివారి కల్యాణ మహోత్సవాలు ప్రారంభం నాటికి రామేశ్వర, భీమేశ్వర, సోమేశ్వర, చంద్రమౌళీశ్వరస్వామి ఉపాలయాల నిర్మాణం పూర్తి చేయాలని భక్తులు కోరుతున్నారు.

అభివృద్ధి చేస్తున్నాం..: కంచర్ల సురేష్, ఈవో

కోనేరును అభివృద్ధి చేయిస్తా. దీని స్థలం అంశం ఆర్డీవో కోర్టులో ఉంది. 1934 లోని రికార్డుల్లో శివాలయ స్థలంగా ఉంది. కోనేరుకు పూర్వవైభవం తీసుకువస్తాం. గర్భాలయం అభివృద్ధి చేయిస్తున్నాం. ఆలయ ఆవరణలో మట్టిని తవ్వించాలి. దీనిపై ఆగమ పండితులను సంప్రదిస్తున్నాం. ఉపాలయాల నిర్మాణ పనులు వేగవంతం చేయిస్తా.

తిరుపతమ్మ తిరునాళ్లపై సమావేశం

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: శ్రీగోపయ్య సమేత తిరుపతమ్మ అమ్మవారి తిరునాళ్లలో భాగంగా మంగళవారం మధ్యాహ్నం 2.30 గంటలకు ఆర్డీవో కె.బాలకృష్ణ ఆధ్వర్యంలో సమన్వయ సమావేశం నిర్వహించనున్నట్లు ఆలయ ఉపకమిషనర్ మహేశ్వరరెడ్డి తెలిపారు. ఆలయపై అన్ని శాఖల అధికారులతో చర్చించనున్నట్లు చెప్పారు.

పార్వతీ పుత్రునికి అభిషేకం

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: నందిగామ పాత బస్‌స్టాండ్ వద్ద సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధి వినాయకునికి సోమవారం సంకటహర చతుర్థి పురస్కరించుకుని పంచామృతాభిషేకం నిర్వహించారు. అర్చకుడు రఘురామ్ స్వామి గరిక, పుష్పాలతో సహస్ర నామార్చనతో అలంకరణ చేశారు. దేవాలయ కమిటీ ఛైర్మన్ అన్నవరపు తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు. మరోవైపు గోళ్లమూడి శివాలయంలో గణపతి, శంభులింగేశ్వర స్వామికి పంచామృతాభిషేకం నిర్వహించి గరిక, పుష్పాలతో అలంకరణ చేశారు. శివాలయ ఛైర్మన్ చావా అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణ అందరి బాధ్యత

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణ అందరి బాధ్యతని డీసీపీ లక్ష్మీనారాయణ సూచించారు. చిల్లకల్లు పాలశీతలీకరణ కేంద్రం కమ్యూనిటీ హాలులో గ్రామ సచివాలయాలు, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లకు నిర్వహించిన అవగాహన సదస్సుల్లో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో కొత్త వ్యక్తుల సంచారం, వారి ప్రవర్తనను గమనించడం అవసరమని, ముఖ్యంగా నేరప్రవృత్తి ఉన్నవారి సమాచారం పోలీసులకు అందించాలన్నారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో నేరప్రవృత్తి, హింసాత్మక ఘటనలు, అసాంఘిక శక్తుల కదలికలు ముందుగానే పోలీసులకు తెలియజేస్తే గ్రామాల్లో ప్రశాంతత నెలకొంటుందన్నారు.

కాళేశ్వరరావు, హనుమంతరావు విగ్రహాల ఏర్పాటుకు స్థల పరిశీలన

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: నందిగామ జడ్పీ ఉన్నత పాఠశాల స్థలంలో ఉమ్మడి రాష్ట్ర తొలి స్పీకర్ అయ్యదేవర కాళేశ్వరరావు, గ్రంథాలయోద్యమ పితామహుడు మాడపాటి హనుమంతరావు విగ్రహాలను ఏర్పాటు చేయనున్నారు. సోమవారం బళ్లారి రాఘవ కళాసమితి వ్యవస్థాపకుడు బబ్బెళ్లపాటి గోపాలకృష్ణసాయి, కాంగ్రెస్ పార్టీ నాయకుడు పాలేటి సతీష్, భాజపా నాయకుడు బండారు కేదార్‌నాథ్‌శర్మ స్థల పరిశీలన చేశారు. చందర్లపాడు బస్‌స్టాండ్ సమీపంలోని పాఠశాల స్థలంలో విగ్రహాల ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని ప్రధానోపాధ్యాయిని పి.విజయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యాయులు వీసం శ్రీధర్, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

చర్చిస్తున్న గోపాలకృష్ణసాయి, సతీష్ తదితరులు

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

నరసింహారావుపాలెం(వీరులపాడు), న్యూస్‌టుడే: మండలంలో వివిధ గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులపై సామాజిక తనిఖీలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా పంచాయతీ కార్యాలయాల్లో గ్రామసభలు ఏర్పాటు చేస్తున్నట్లు ఏపీఎం వెంకటేశ్వరరావు తెలిపారు. డిప్యూటీ ఎంపీడీవో, జీఎస్‌డబ్ల్యూఎస్, ఎంఈవో అధికారులు పరిశీలకులుగా ఉండి ఈ నెల 21 వరకు పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహిస్తున్నారు. సోమవారం నరసింహారావుపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో గ్రామ సభ నిర్వహించారు. గ్రామస్థుల నుంచి అభ్యంతరాలను స్వీకరించారు. 2026 జనవరి 23న మండల స్థాయి సామాజిక తనిఖీ నిర్వహించనున్నట్లు ఏపీఎం తెలిపారు. సర్పంచి బొమ్మిశెట్టి దుర్గాదేవి, జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారి రామారావు, సోషల్ ఆడిట్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ సభలో అధికారులు

అన్నదానానికి దాతల విరాళం

జగ్గయ్యపేట: ప్రసిద్ధ తిరుమలగిరి స్వయంభూ వాల్మీకోద్భవ వెంకటేశ్వరస్వామి క్షేత్రంలో జరిగే నిత్యాన్నదానానికి జగ్గయ్యపేటకు చెందిన గుడిమెట్ల శ్రావణి, ఆమె తల్లిదండ్రులు, సోదరితో కలిసి రూ.31 వేలు విరాళంగా అందించారు. ఆలయ అర్చకులు.. వారికి శేషవస్త్రాలను అందజేసి ఆశీర్వచనాలు ఇచ్చారు.

ఆలయంలో హుండీ చోరీ

దొడ్డదేవరపాడు(వీరులపాడు): దొడ్డదేవరపాడు బీసీ కాలనీలోని ఆంజనేయస్వామి దేవాలయంలో హుండీని గుర్తుతెలియని వ్యక్తులు సోమవారం చోరీ చేశారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. గత కార్తిక పౌర్ణమి రోజునే హుండీ నుంచి నగదు తీసినట్లు, దొంగతనం జరిగిన సమయానికి హుండీలో కొంత నగదు మాత్రమే ఉందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. హుండీలో పెద్దగా నగదు లేకపోవడంతో గుడి సమీపంలోని పంట పొలాల్లో పడేశారని, సీసీ ఫుటేజీలను పరిశీలించి నిందితులను పట్టుకుంటామని ఎస్సై అభిమన్యు తెలిపారు.

ఉత్సాహంగా సెమీక్రిస్మస్ వేడుకలు

నందిగామ గ్రామీణం: మండల పరిధిలోని రామిరెడ్డిపల్లిలో సోమవారం రాత్రి సెమీక్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. సిలువగిరి ఫాదర్ ఫెలోమెన్‌రాజు ఆధ్వర్యంలో ఇంటింటికీ బాలఏసు ప్రతిమలతో వెళ్లి ప్రార్థనలు చేశారు. శాంతాక్లాజ్ వేషధారణతో చాక్లెట్లు, క్యాలెండర్లు అందజేశారు. ఆర్సీఎం సంఘ పెద్దలు గోవింద్, రోశయ్య, రాంబాబు, నాగమల్లేశ్వరరావు, సిలువగిరి సిస్టర్స్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు బాగు చేయరూ..

నందిగామ, న్యూస్‌టుడే: స్థానిక రైతుపేటలో సీఎం రోడ్డు నుంచి కాకతీయ అపోలో పాఠశాల వరకు సిమెంట్ రోడ్డు అధ్వానంగా మారింది. నందిగామ మేజర్ పంచాయతీగా ఉన్నప్పుడు మొదటిసారి సీసీ రోడ్డు వేశారు. భూమి కుంగిపోవడం వల్ల సిమెంట్ రోడ్డు పగిలిపోయి గుంతలు పడ్డాయి. దీనివల్ల వాహనాలు, ప్రజల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. ఈ ప్రాంతంలో విద్యాసంస్థలు ఉండడం వల్ల విద్యార్థులు అసౌకర్యానికి గురవుతున్నారు. సిమెంట్ రోడ్డు నిర్మాణానికి మున్సిపల్ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికుడు రామిరెడ్డి శ్రీధర్ తెలిపారు

కూటమి ప్రభుత్వంలో వైద్యానికి పెద్దపీట

నందిగామ, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం వైద్యానికి ఎక్కువ ప్రాధాన్యం నిధులు కేటాయిస్తోందని ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య అన్నారు. స్థానిక కాకానినగర్‌లో సోమవారం నియోజకవర్గంలోని 44 మందికి రూ.26,76,793 సీఎంఆర్ఎఫ్ నిధుల మంజూరు పత్రాలను ఆమె పంపిణీ చేశారు. పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలు వైద్య చికిత్సలకు ఇబ్బందిపడకుండా సీఎం చంద్రబాబు నాయుడు తమ నుంచి సిఫార్సు లేఖలు అందిన వెంటనే నిధులు మంజూరు చేస్తున్నారన్నారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి, మార్కెట్ యార్డు ఛైర్మన్ కోగంటి బాబు, తెదేపా నాయకులు వాసిరెడ్డి ప్రసాద్, కొంగ్రగుంట శ్రీనివాస్ కుమార్, ఏచూరి రామకృష్ణ, వీరంకి వీరాస్వామి, మనబోతుల శ్రీరామ్, వేల్పుల బిక్ష తదితరులు పాల్గొన్నారు.

మంజూరు పత్రం అందిస్తున్న ప్రభుత్వ విప్ సౌమ్య

రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ ఉపాధ్యక్షుడిగా కోగంటి

కంచికచర్ల, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యవసాయ మార్కెట్ నూతన కమిటీలో కంచికచర్ల వ్యవసాయ మార్కెట్ యార్డు ఛైర్మన్ కోగంటి బాబుకు ఉపాధ్యక్ష పదవి దక్కడంపై తెదేపా నేతలు హర్షం వ్యక్తం చేశారు. తెదేపా కష్టకాలంలో పార్టీ ఉన్నతికి కష్టపడిన కోగంటి బాబుకు పదవి దక్కడంతో పలువురు నాయకులు సోమవారం ఆయనను అభినందించారు.

పీఎంఏవై గృహాల మంజూరు

నందిగామ, న్యూస్‌టుడే: ప్రధాన మంత్రి ఆవాస్ యోజన(పీఎంఏవై)లో భాగంగా నందిగామ నియోజకవర్గంలో 337 మందికి గృహాలు మంజూరయ్యాయి. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ. 2.89 లక్షలు కేటాయించారు. స్థానిక బాబూ జగ్జీవన్‌రాం ఫంక్షన్ హాలులో మంగళవారం ఉదయం 10.30 గంటలకు ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య లబ్ధిదారులకు మంజూరు పత్రాలు పంపిణీ చేస్తారు. ఈ మేరకు గృహనిర్మాణ శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు.

పబ్లిక్ నోటీసు

మా క్లయింట్లున్నూ యన్.టి.ఆర్. జిల్లా, కంచికచర్ల మండలం, కంచికచర్ల గ్రామ కాపురస్తులు కుర్రా శివరామకృష్ణ ప్రసాద్ గారి భార్య 1. కుర్రా పద్మావతి గారున్నూ మరియు యన్.టి.ఆర్. జిల్లా, కంచికచర్ల మండలం, నక్కలంపేట గ్రామ కాపురస్తులు నెమలిపురి నరసింహారావు గారి భార్య 2. నెమలిపురి లక్ష్మి గారున్నూ, వీరి యిరువురి సంజాయిషీ పొంది తెలియజేయునది.

మా క్లయింట్లు ముప్పసాని నాగేశ్వరరావు గారి భార్య ప్రమీల గారి వద్ద నుంచి ఈ నోటీసు షెడ్యూలు దాఖలా ఆస్తిని కొనుగోలు చేయుటకు అంగీకరించుచూ ది.14.8.2025న మా క్లయింట్లున్నూ సదరు ముప్పసాని ప్రమీల గారు అగ్రిమెంటు వ్రాసుకున్నారు. సదరు కొనుగోలు వ్యవహారమునకు సంబంధించి వేరెవ్వరికైనా ఎటువంటి అభ్యంతరములు ఉన్ననూ, ఈ పబ్లిక్ నోటీసు తేదీ లగాయతు 7 దినములలోగా మాకు గానీ, మా క్లయింట్లకు గానీ తెలియచేయమని కోరుచున్నాము. సదరు గడువు లోగా ఏ అభ్యంతరములు లేనియెడల, సదరు ఆస్తిని మా క్లయింటు రిజిస్టరు పొందగలడనియు, దరిమిలా లేవనెత్తిన అభ్యంతరములు ఏవియు మా క్లయింటు హక్కులకు భంగము కలుగచేయవని యిందుమూలముగా తెలియచేయడమైనది.

షెడ్యూలు: కృష్ణా జిల్లా (ప్రస్తుతం యన్.టి.ఆర్. జిల్లా), కంచికచర్ల స॥రి॥ యిలాకా, కంచికచర్ల మండలం, పరిటాల గ్రామం తాలూకు ఆర్.యస్.నెం. 607/2, యల్.పి.నెం. 2239లో య.0.50 సెం॥ల మాగాణి భూమికి హద్దులు. **తూర్పు:** పంట కాలువ, **దక్షిణం:** మా క్లయింట్ల తాలూకు భూమి, **పడమర:** మా క్లయింట్ల తాలూకు భూమి, **ఉత్తరం:** ఇతరుల భూమి.
(పై నంబరు భూమి ముప్పసాని ప్రమీల గారి పేర ఖాతా నం.335గా రెవిన్యూ రికార్డులలో నమోదు కాబడియున్నది)

టి.వి.వి.సంగమేశ్వర శర్మ, న్యాయవాది
నందిగామ - 521 185.
సెల్ నెం: 99851 45299

శివరామకృష్ణప్రసాద్ సేవలు మరువలేం

చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న భాజపా నాయకులు

నందిగామ, న్యూస్‌టుడే: భాజపా జన సందేశ్ పత్రిక మాజీ ఎగ్జిక్యూటర్ సంపాదకుడు, నందిగామకు చెందిన అన్నప్రగడ శివరామకృష్ణప్రసాద్ అనారోగ్యంతో ఆదివారం హైదరాబాద్‌లో మృతి చెందారు. భాజపా నాయకుడు, ఏకత్వతా మానవతావాద సిద్ధాంత ప్రచారకర్తగా పార్టీలో ఆయన కీలకపాత్ర పోషించారు. అనంతరం ఆయన పార్టీ పత్రిక జనసందేశ్‌కు ఎడిటర్‌గా బాధ్యతలు నిర్వహించారు. నందిగామ భాజపా కార్యాలయంలో సోమవారం ఆయన చిత్రపటానికి పార్టీ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కేదార్‌నాథ్‌శర్మ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కటుకూరి సుందరావు, జిల్లా కార్యదర్శి పోరుగంటి నరసింహారావులు మాట్లాడుతూ నందిగామలో పార్టీ ఎదుగుదలకు శివరామకృష్ణప్రసాద్ ఎంతో కృషి చేశారని కొనియాడారు. అంకితభావంతో పని చేసి అంచెలంచెలుగా ఎదిగారని చెప్పారు. ఆయనను పార్టీ నాయకులు మునగంటి కామేశ్వరరావు, ఎం.నరసింహారావు, కాల్వ మహేష్, లక్ష్మణ్, కొత్త సాంబశివరావు, రజియాబేగం తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఒత్తిడి దూరం

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: క్రీడలు ఒత్తిడిని దూరం చేసి మానసిక ఆనందాన్నిస్తాయని ఎమ్మెల్యే శ్రీరాంతాతయ్య అన్నారు. స్థానిక బాలుర హైస్కూల్‌లో బాల చైతన్య స్ఫూర్తి 14వ వార్షికోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఎమ్మెల్యే శ్రీరాంతాతయ్య జెండా వందనంతో క్రీడలను ప్రారంభించి మాట్లాడారు. తాత్వికులు గెంటేల వెంకటరమణ స్ఫూర్తితో ప్రారంభించిన ఈ కార్యక్రమం బాలల్లో ఆరోగ్యం, మానసిక వికాసం, నైతిక విలువలు పెంపొందిస్తాయన్నారు. వివిధ కోర్టులను మాజీ ఛైర్మన్ శ్రీరాంసుబ్బారావు, సీఐ వెంకటేశ్వర్లు, యలమంచిలి రాఘవ, డీవైఈవో శ్యాంసుందర్‌లు ప్రారంభించారు. ఎంఈవో ఎల్.చిట్టిబాబు, పీడీ ఎం.శ్రీనివాస్, మేకా వెంకటేశ్వర్లు, కట్టా నరసింహారావు, ధూళిపాళ లక్ష్మణరావు, గెంటేల చక్రవర్తి, కారారి కిశోర్, కౌన్సిలర్లు కన్నెబోయిన రామలక్ష్మి, కంచేటి గీతారాణి, నరసింహారావు, వెంకట్, రాంప్రసాద్, హెచ్ఎంలు వీపీ నాగేశ్వరరావు, కె.హేమమాధవి, నాయకులు పాల్గొన్నారు.

గౌరవ వందనం చేస్తున్న విద్యార్థులు

సమాజ సంస్కరణకు సాహిత్యమే ఆయుధం

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: సమాజ నిర్మాణంలో కళలు మూల స్తంభాలుగా నిలుస్తాయని కవి శ్రీరామకవచం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. జగ్గయ్యపేట మున్సిపల్ కూడలిలో సోమవారం నిర్వహించిన శ్రీకళావేదిక ప్రథమ వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యారంగంపై ప్రభావం చూపుతున్న అంశాలపై అధ్యయనం చేసి వాటికి పరిష్కార మార్గాలు చూపాలన్నారు. సాహిత్య రంగంలో వస్తున్న వింత పోకడలను పరిహరించి మరింత హుందాతనాన్ని పెంచాలన్నారు. కవులు సరికొండ నరసింహరాజు, షేక్ అబ్బాస్ అలి, కరణం లుగేంద్రపిళ్లై, పరసా శ్రీనివాసరావు, బత్తుల బ్రహ్మయ్య, అద్దంకి సుధాకర్, ముక్కా సత్యం, దోసపాటి నాగేశ్వరరావు, టి.ప్రసాదబాబు, పర్చా లక్ష్మణరావులు పాల్గొని తమ కవిత్వాలు వినిపించారు. వివిధ పాఠశాల విద్యార్థులు చరవాణి ప్రభావంపై వివరించారు. కార్యక్రమంలో ప్రముఖులు ధరణికోట వెంకటరమణ, కేటీ ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు. అధ్యక్షుడు తట్టా రంగరామానుజం, కార్యదర్శి కొండూరు నాగేశ్వరావుల ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు.

ప్రసంగిస్తున్న కవి శ్రీరామకవచం, వేదికపై నిర్వాహకులు, కవులు

ప్లాస్టిక్ నియంత్రణపై అవగాహన

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: మండలంలోని శివాపురంలో ప్లాస్టిక్ నియంత్రణపై అవగాహన కల్పించారు. బాపట్ల ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహం సెంటర్ నుంచి అన్ని వీధుల్లో.. ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి కలిగే ఇబ్బందులు తెలియజేశారు. అనంతరం మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మండల ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ అధికారులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి చెస్ పోటీల్లో ప్రతిభ

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: నందిగామ కాకతీయ విద్యాసంస్థల విద్యార్థులు జిల్లా స్థాయి చదరంగం పోటీల్లో ప్రతిభ చాటారు. విజయవాడ భవానీపురంలో ఈ నెల 7న జిల్లా స్థాయి ఓపెన్ చెస్ ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. అండర్-10 విభాగంలో కాకతీయ సీబీఎస్ఈ పాఠశాల విద్యార్థి మోహిబ్ అర్హమ్ ప్రథమ, అండర్-8 విభాగంలో కాకతీయ అపోలో పాఠశాల విద్యార్థి తాటి తుషార తృతీయ స్థానంలో నిలిచారు. సోమవారం వీరిని అపోలో పాఠశాల ఛైర్మన్ కాపా రవీంద్రనాథ్, ప్రిన్సిపల్ భారతి, సీబీఎస్ఈ పాఠశాల డైరెక్టర్లు కార్తికేయ, సుష్మ, ప్రిన్సిపల్ సత్యమూర్తి, ప్రధానోపాధ్యాయుడు రాఘవులు, చెస్ కోచ్ త్రివేణి అభినందించారు.

నందిగామ ఎస్సైగా సూర్యవంశీ బాధ్యతల స్వీకరణ

నందిగామ, న్యూస్‌టుడే: మండల ఎస్సైగా సూర్యవంశీ నియమితులయ్యారు. ఇప్పటి వరకు నందిగామలోనే ట్రైనింగ్ ఎస్సైగా విధులు నిర్వహించారు. సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం స్థానిక ఏసీపీ బాలగంగాధర్ తిలక్, సీఐ వైవీవీఎల్ నాయుడులను మర్యాదపూర్వకంగా కలిశారు.

రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపిక

పొన్నవరం(వీరులపాడు), న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు పొన్నవరం సమీపంలోని ఏకత్వ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల వ్యవస్థాపకుడు, ఎండీ అమరనేని మనోజ్ తెలిపారు. గత నెల 21న విజయవాడలోని పటమట ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఫెన్సింగ్ పోటీల్లో అండర్-14 బాలుర, బాలికల విభాగంలో ఉత్తమ ప్రతిభ చాటిన శ్రీరామ్, జస్వంత్, భార్గవ్, నందన్, శ్రీనివాస్, హర్ష, సనా, సహస్ర, సాయిశ్రీలను పాఠశాల ఎండీ అభినందించారు. ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఈనెల 9 నుంచి 11వ తేదీ వరకు నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు.

పీఏసీఎస్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

నందిగామ: బ్యాంకు మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగులు

జగ్గయ్యపేట కేడీసీసీ బ్యాంకు ఎదుట..

పెద్దాపురం(వీరులపాడు), న్యూస్‌టుడే: సహకార సంఘాల ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలని ఎన్టీఆర్ పీఏసీఎస్ ఎంప్లాయీస్ యూనియన్ పెద్దాపురం శాఖ ఆర్గనైజర్ ఎన్. వెంకట్రావు అన్నారు. ఈ మేరకు కృష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంకు పెద్దాపురం బ్రాంచి పరిధి ఏడు సహకార సంఘాల ఆధ్వర్యంలో సోమవారం నిరసన తెలిపారు. ఆర్గనైజర్ మాట్లాడుతూ జీవో నంబరు 36 అమలు చేయాలని, 2019 తర్వాత నియమితులైన సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, ఉద్యోగ విరమణ వయసు 62 ఏళ్లు చేయాలని డిమాండు చేశారు. అనంతరం నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యకు వినతిపత్రం అందజేశారు.

కంచికచర్ల, న్యూస్‌టుడే: కంచికచర్ల పీఏసీఎస్ ఉద్యోగులు స్థానిక కేడీసీసీ బ్యాంకు ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం బ్రాంచి మేనేజర్‌కు వినతి పత్రం అందజేశారు.

నందిగామ, న్యూస్‌టుడే: మండలంలోని సహకార సంఘాల ఉద్యోగులు నందిగామలోని కేడీసీసీ బ్యాంకు ప్రధాన బ్రాంచి ముందు ధర్నా చేశారు.

జగ్గయ్యపేట: జగ్గయ్యపేట, వత్సవాయి కేడీసీసీ బ్యాంకుల వద్ద జరిగిన నిరసన కార్యక్రమాల్లో ఉద్యోగులు ప్లకార్డులు ప్రదర్శించారు.

పెనుగంచిప్రోలు: స్థానిక కేడీసీసీ బ్యాంకు ఎదుట ఏపీ రాష్ట్ర వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో ఉద్యోగులు ధర్నా చేశారు.

చందర్లపాడు, న్యూస్‌టుడే : స్థానిక కేడీసీసీ బ్యాంకు వద్ద జరిగిన కార్యక్రమంలో ఉద్యోగులు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మేనేజర్ మేకల మౌళేశ్వరరావుకు అందజేశారు. రాటకొండ సత్యనారాయణ ప్రసాద్, బ్రహ్మానందరావు, నాగేశ్వరరావు, మనోహర్‌దేవి పాల్గొన్నారు.

ఆధునిక పశుగ్రాసాలతో ఖర్చు ఆదా

చెక్కులు పంపిణీ చేస్తున్న చలసాని

జగ్గయ్యపేట: ఆధునిక పశుగ్రాసాలతో ఖర్చు తగ్గించుకోవచ్చని జిల్లా పాల ఉత్పత్తిదారుల సంఘం ఛైర్మన్ చలసాని ఆంజనేయులు పేర్కొన్నారు. చిల్లకల్లు పాలకేంద్రం కమ్యూనిటీ హాల్‌లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన సుమారు 120 మంది రైతులకు రూ.లక్ష చొప్పున... రూ.1.2 కోట్ల బోనస్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న పశువుల వసతిగృహాల ద్వారా అనేక ప్రయోజనాలు ఉంటాయన్నారు. కృష్ణా మిల్క్ యూనియన్ పాలకవర్గ సభ్యులు నెలకుదిటి నాగేశ్వరరావు, ఇంజం రామారావు, ట్రస్ట్ సభ్యులు కోకా వెంకటేశ్వరరావు, ఉప్పుగండ్ల మాధవరావు, అధ్యక్షుడు, వేతన కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తితో కుంకుమార్చన

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: నందిగామ సాయి అయ్యప్ప దేవాలయ ప్రాంగణంలో సోమవారం రాత్రి లక్ష్మీగణపతికి పంచామృతాభిషేకం నిర్వహించారు. మహిళలు కుంకుమార్చన చేశారు. దేవాలయ కమిటీ అధ్యక్షుడు శాఖమూరు వంశీ, సభ్యులు పాల్గొన్నారు.

ఆటోనగర్ కాలుష్యంపై జనాగ్రహం

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: జగ్గయ్యపేట సమీపంలోని ఆటోనగర్ నుంచి పెరుగుతున్న కాలుష్యంపై ప్రజల నుంచి తీవ్ర స్థాయి ఆందోళన వ్యక్తమైంది. పట్టణంలోని కోదాడ రోడ్డులో షేర్‌మహ్మద్‌పేట అడ్డరోడ్డు మొదలుకొని పులిచింతల కార్యాలయం వరకు విస్తరించిన నివాస ప్రాంతాల వారు సోమవారం రోడ్డెక్కారు. ఆటోనగర్‌లో కాలుష్యం కారణంగా చనిపోయిన కుక్క ఫొటోతో బ్యానర్ చేయించి రేపటి ప్రజల బతుకు కూడా ఇంతేనా.. అని ప్రశ్నిస్తూ నినాదాలతో నిరసన చేపట్టారు. ట్రాఫిక్ నిలిచిపోవడంతో సీఐ సహా పోలీసులు రంగప్రవేశం చేసి ఆందోళన విరమింపజేయాలని చూసినా తమ ఇబ్బందులు ఎవరు తీరుస్తారని ప్రశ్నించారు. ఆటోనగర్‌తో పాటు కర్మాగారాల కాలుష్యం కూడా అధికమై నానా యాతన పడుతున్నామని, ప్రాణాంతకమైన ఈ కాలుష్యం భరించలేమని తేల్చి చెప్పారు. ఎమ్మెల్యే శ్రీరాంతాతయ్య వచ్చి ప్రజలు, అధికారులతో మాట్లాడి తప్పక దీనిపై కఠిన చర్యలతో పాటు కాలుష్య నియంత్రణకు కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు. ఆయా ప్రాంతాలకు చెందిన న్యాయవాదులు, వైద్యులు, మహిళలు, ఉద్యోగులు, వివిధ వర్గాల ప్రజలు వచ్చి నిరసనలో పాల్గొనడం విశేషం. ధరణికోట రమణ, మందడపు శ్రీను, గద్దె నాని, ప్రసాద్, రాజేష్, సౌమ్య, ప్రసాద్, రమేష్, పాల్గొన్నారు.

కోదాడ రోడ్డులో ఆందోళన చేస్తున్న స్థానికులు

కాలుష్యకారక కర్మాగారాలపై చర్యలకు సిఫార్సు

జగ్గయ్యపేట ప్రాంతంలో కాలుష్యకారకంగా మారుతున్న కర్మాగారాలపై చర్యలకు సిఫార్సు చేస్తున్నట్లు ఎమ్మెల్యే శ్రీరాంతాతయ్య అన్నారు. ఆర్డీవోతో ఫోన్‌లో మాట్లాడి సమస్యాత్మక సంస్థలపై చర్యలు తీసుకోవాలన్నారు. త్వరలోనే కాలుష్య నియంత్రణ మండలి, కలెక్టర్లను స్వయంగా సంప్రదించి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

పబ్లిక్ నోటీసు

మా క్లయింటున్నూ ప్రస్తుతం హైదరాబాద్ నివాసి అయిన పోసాని లక్ష్మయ్య గారి రమేష్ బాబు గారి సంజాయిషీ పొంది తెలియజేయునది..

మా క్లయింటును. వారి తండ్రిగారైన లక్ష్మయ్య గారు మరియు వారి సోదరుడైన శ్రీనివాసరావు గారు జాయింటు కుటుంబ సభ్యులయి యుండి, సదరు జాయింటు కుటుంబమునకు దిగువ పేర్కొన్న ఆస్తులు కలవనియూ, అయితే మా క్లయింటు తండ్రి గారు మరియు సోదరులు కలసి మా క్లయింటు ప్రమేయం లేకుండా సదరు ఆస్తులను అమ్మజూపుతున్నట్లు మా క్లయింటుకు తెలియవచ్చిన దరిమిలా భాగ పంపిణీ కోరుచూ ది.30.11.2025న నోటీసు యిచ్చియున్నారు. ఈ పబ్లిక్ నోటీసు ద్వారా యావన్మందికీ తెలియచేయునది ఏమనగా.. ఈ దిగువ పేర్కొన్న ఆస్తులను మా క్లయింటు ముందస్తు అనుమతి లేనిదే క్రయం పొందుట గాని, క్రయ ఒప్పందములు కుదుర్చుకొనుటకానీ చేయవలదని కోరడమైనది. ఈ నోటీసు దర్మిలా కూడా ఎవరైనా అటువంటి ఒప్పందములు కుదుర్చుకున్నా అవి చట్ట ప్రకారం చెల్లవని, మా క్లయింటుకు సదరు ఆస్తిలో గల హక్కుకు భంగం వాటిల్లదనియు తెలియచేయడమైనది.

షెడ్యూలు : 1వ అయిటం: యన్.టి.ఆర్. జిల్లా, కంచికచర్ల స॥రి॥ యిలాకా, కంచికచర్ల మండలం, పేరకలపాడు గ్రామం తాలూకు, ఆర్.యస్. 31/3లో య. 1.00 సెం॥కు **హద్దులు: తూర్పు :** డొంక రోడ్డు, **దక్షిణం:** చుండూరు నాగేశ్వరరావు గారి భూమి, **పడమర:** సిహెచ్ వెంకట లక్ష్మీ నరసింహారావు గారి భూమి, **ఉత్తరం:** మహమ్మద్ అబ్దుల్ సలీమ్ గారి భూమి.

2వ అయిటం: యన్.టి.ఆర్ జిల్లా, కంచికచర్ల స॥రి॥ యిలాకా, కంచికచర్ల మండలం, పేరకలపాడు గ్రామం తాలూకు, ఆర్.యస్.నెం. 42/2ఎ లో య.2.00 సెం॥కు **హద్దులు: తూర్పు :** చుండూరు రవీంద్ర బాబు గారి భూమి, **దక్షిణం:** పోసాని వెంకటేశ్వరరావు గారి భూమి, **పడమర:** రాయిడి అహల్య గారి భూమి, **ఉత్తరం:** ఈదల రామకృష్ణయ్య గారి భూమి.

3వ అయిటం: యన్.టి.ఆర్ జిల్లా, కంచికటర్ల స॥రి॥ యిలాకా, కంచికచర్ల మండలం, పేరకలపాడు గ్రామం తాలూకు ఆర్.యస్.నెం.58 మరియు 59/2ల లో య.2.65 సెం॥కు **హద్దులు: తూర్పు:** రోడ్డు, **దక్షిణం:** మర్రి వరప్రసాద్ గారి భూమి, **పడమర:** చవలం వెంకటేశ్వరరావు గారి భూమి, **ఉత్తరం:** డొంక రోడ్డు.

4వ అయిటం: యన్.టి.ఆర్. జిల్లా, కంచికచర్ల స॥రి॥ యిలాకా, కంచికచర్ల మండలం, గండేపల్లి గ్రామం తాలూకు, ఆర్.యస్.నెం 289/4, 284/4 మరియు 290/2లలో య. 7.73 సెం॥కు **హద్దులు: తూర్పు:** చవలం మంగమ్మ గారి భూమి, **దక్షిణం:** రోడ్డు, **పడమర:** చవలం శ్రీదేవి గారి భూమి, **ఉత్తరం:** సిహెచ్ హరికృష్ణ మరియు రామకృష్ణ గారల భూమి.

5వ అయిటం: యన్.టి.ఆర్. జిల్లా, కంచికచర్ల స॥రి॥ యిలాకా, వీరులపాడు మండలం, జగన్నాథపురం గ్రామం తాలూకు ఆర్.యస్.నెం. 19/3ఎ మరియు 19/3ఇ లలో య.4.43 సెం॥కు **హద్దులు: తూర్పు:** నాగార్జున సాగర్ కాలువ, **దక్షిణం:** లింగమనేని శేషగిరిరావు గారి భూమి, **పడమర:** లింగమనేని లక్ష్మి వగైరాల భూమి, **ఉత్తరం:** కోటేరు బాలరెడ్డి వగైరాల భూమి.

6వ అయిటం: యన్.టి.ఆర్. జిల్లా, కంచికచర్ల స॥రి॥ యిలాకా, వీరులపాడు మండలం, జగన్నాథపురం గ్రామం తాలూకు, గ్రామ కంఠం బాపతు య. 0.29 సెం॥ల స్థలమునకు **హద్దులు: తూర్పు:** రోడ్డు, **పడమర:** నన్నపనేని వెంకటేశ్వరరావు వగైరాల ఆస్తి, **దక్షిణం:** కోటేరు బాలరెడ్డి గారి ఆస్తి, **ఉత్తరం:** రాయల వెంకట్రామయ్య వగైరాల ఆస్తి.

టి.వి.వి. సంగమేశ్వర శర్మ, న్యాయవాది
నందిగామ – 521 185. సెల్ : 99851 45299

(c) eenadu

విజయవాడ పశ్చిమ

భవానీ దీక్షల విరమణకు పటిష్ఠ ఏర్పాట్లు తప్పనిసరి

కనకదుర్గానగర్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్డీవో చైతన్య, ఈవో శీనానాయక్, ఏడీసీపీ రామకృష్ణ

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : భవానీ దీక్షల విరమణకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని ఆర్డీవో కావూరి చైతన్య అన్నారు. ఈనెల 11 నుంచి 15 వరకు శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానం నిర్వహించనున్న భవానీ దీక్షల విరమణకు సంబంధించిన ఏర్పాట్లను ఈవో శీనానాయక్, ఏడీసీ రామకృష్ణతో కలిసి ఆర్డీవో సోమవారం పరిశీలించారు. దీక్షలకు రూపొందించిన ఆటో క్యాడ్ ప్లాన్లను చూశారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు ఉండాలని సూచించారు. హోమగుండాలు, ఇరుముడి కేంద్రాల వద్ద రద్దీని నియంత్రించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. కనకదుర్గానగర్‌లో తొక్కిసలాటలకు తావు లేకుండా పోలీసులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ప్రసాదాలు, అన్నప్రసాద తయారీ కేంద్రాల వద్ద నాణ్యత, పరిశుభ్రతపై శ్రద్ధ చూపాలని, అగ్ని ప్రమాదాలకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. స్థానాచార్య శివప్రసాదశర్మ, ఈఈ రాంబాబు, ఏసీపీ దుర్గారావు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధితో పేదలకు భరోసా

కృష్ణలంక, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ ద్వారా ఎంతోమంది పేదలకు వందల రూ.కోట్లు సాయం మంజూరు చేస్తోందని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. 21వ డివిజన్ కృష్ణలంక సత్యం హోటల్ సెంటర్ వద్ద సోమవారం సీఎం సహాయ నిధి కింద 30 మందికి మంజూరైన రూ.37 లక్షల విలువైన చెక్కులు పంపిణీ చేశారు. జనసేన తూర్పు నియోజకవర్గ బాధ్యుడు అమ్మిశెట్టి వాసు, భాజపా నాయకుడు కోలపల్లి గణేష్ ఉన్నారు.

పరిజ్ఞానం లేకున్నా.. పనులప్పగిస్తారా?

- కంప్యూటర్ సంబంధిత విధుల్లో స్వీపర్లు, అటెండర్లు
- ప్రసాదాల కౌంటర్లలో ఉద్యోగేతరులతో పనులు

ప్రసాదాల కౌంటరులో ఉద్యోగేతరుడు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే

దుర్గగుడిలో కంప్యూటర్ పరిజ్ఞానం లేనివారిని ప్రసాదాల కౌంటర్లలో నియమిస్తున్నారు. కనీసం సంతకం కూడా చేయలేని వారు.. రూ.వేలు ఆదాయం వచ్చే ప్రసాదాల కౌంటర్లలో విధులు నిర్వర్తించడానికి అవస్థలు పడుతున్నారు. చేయలేమని చెబితే దేవస్థానంలో ఉద్యోగం మానేసి వేరే పని చూసుకోమని చెబుతున్నారు. ఉద్యోగం పోకుండా ఉండేందుకు అటెండర్లు, స్వీపర్లు తమ స్థానంలో కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న వారిని పెట్టుకుంటున్నారు.

☛ ఈ విషయం పాలకమండలి సభ్యుడు ధర్మారావు దృష్టికి రాగా ఇటీవల నిర్వహించిన సభ్యుల సమావేశంలో సమస్యను ఛైర్మన్ రాధాకృష్ణ, ఈవో శీనానాయక్ దృష్టికి తీసుకువచ్చారు. ఉద్యోగేతరులు విధులు నిర్వర్తిస్తే ఏదైనా నగదు తేడా వస్తే ఎవరు బాధ్యత వహిస్తారని సభ్యులు సమావేశంలో ప్రశ్నించారు.

☛ అటెండర్లు, స్వీపర్లకు విద్యార్హతలు ఉండవని తెలిసి కూడా అధికారులు ఏవిధంగా కంప్యూటర్ సంబంధిత కౌంటర్లలో వేస్తారని వారు అడిగిన ప్రశ్నకు సమాధానం ఇవ్వలేదు. భవానీ దీక్షల విరమణకు లక్షలాది దీక్షాధారులు ప్రసాదాలు అందించాల్సి ఉంటుంది. ప్రస్తుతం కౌంటర్లలో అధికశాతం విద్యార్హతలు లేనివారే అధికంగా ఉన్నారు.

విద్యార్హతలు ఉన్న వారిని నియమిస్తాం

దుర్గగుడి ప్రసాదాల కౌంటర్లలో విద్యార్హతలు లేని వారిని నియమించడం వలన జరుగుతున్న పరిణామాలపై ఏఈవో వాసును సంప్రదించగా కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్నవారిని మాత్రమే కౌంటర్లలో విధులు నిర్వర్తించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గతంలో వీరు కౌంటర్లలో పనిచేసిన అనుభవం ఉన్నందున కొంత మందిని నియమించినట్లు చెప్పారు. ప్రస్తుతం కంప్యూటర్ వినియోగం తెలియక వారి కుటుంబ సభ్యులను వినియోగిస్తున్న విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. భవానీ దీక్షల విరమణ ఏర్పాట్లలో భాగంగా కౌంటర్లు పెంచినందున మార్పులు చేస్తున్నామని ఆయన వెల్లడించారు.

రక్తదాన శిబిరానికి స్పందన

రక్తాన్ని అందిస్తున్న ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: ఆంధ్రా లయోలా కళాశాల 72వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎన్టీఆర్ జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి చిట్టిబాబు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను అభినందించారు. ప్రిన్సిపల్ ఫాదర్ మిల్కియోర్, రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ వైద్యాధికారి డాక్టర్ మదన్ మోహన్, ప్రోగ్రామ్ అధికారులు శామ్యూల్ దయాకర్, ఆర్.జాన్, కె.ప్రకాశరావు, కె.శేఖర్, సత్యనారాయణ, భాస్కర్‌లు పాల్గొన్నారు. వాలంటీర్లు దాదాపు 51 యూనిట్ల రక్తాన్ని ఇచ్చారు.

పారిశుద్ధ్యం మెరుగుకు కార్మికులను పెంచాలి

సమస్యలు తెలుసుకుంటున్న సత్యబాబు, నేతలు

చిట్టినగర్, న్యూస్‌టుడే : పారిశుద్ధ్యం మెరుగుకు కార్మికుల సంఖ్య పెంచాలని సీపీఎం పక్ష నేత బోయి సత్యబాబు అన్నారు. 50వ డివిజన్ లోని నసేన్నసాహెబ్‌వీధి, గున్నాబత్తుల అచ్చయ్య వీధి, అప్పలస్వామివీధి, బంక కామరాజువీధి, పరశురామయ్యవీధి, గొల్లపాలెంగట్టు రోడ్డు ప్రాంతాల్లో ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు సీపీఎం నాయకులు సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్యం లోపించడం వల్ల దోమలు ప్రబలి ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, కొన్ని చోట్ల తాగునీటి పైపులైన్లు మార్చాలని, కొండ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు మంజూరైనా ముందుకు సాగడం లేదని అన్నారు. ఈ సమస్యలపై ఈనెల 10న నిర్వహించే కౌన్సిల్ సమావేశంలో చర్చించేందుకు ప్రతిపాదనలు పెట్టినట్లు ఆయన తెలిపారు. ప్రజా శ్రేయస్సు దష్ట్యా కమిషనర్ చర్యలు తీసుకోవాలని కోరినట్లు వివరించారు.

వెంటపడతాయ్.. కరుస్తాయ్

రాకేష్ పాఠశాల రోడ్డులో రాత్రుళ్లు కుక్కలు ఇలా

కుక్కల బెడదతో ప్రజలు అల్లాడుతున్నారు. ఎవరికి చెప్పినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంటి నుంచి రోడ్డు మీదకు రావాలంటే భయమేస్తోందని వాపోతున్నారు. అవి వాహనాలను వెంబడించడం, పాదచారులను వెనుకగా వచ్చి కరుస్తుండటంతో స్థానికులు హడలిపోతున్నారు. ప్రధానంగా కేఎల్‌రావునగర్, సింగ్‌నగర్ బ్యాంకుకాలనీ, అంబాపేట అజిత్‌సింగ్, పాతబస్తీ రోడ్లలో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. రాకేష్ పాఠశాల రోడ్డులో రాత్రుళ్లు నడవాలంటే సాహసమే. కుక్కలు గుంపులుగా చేరి మీద ఎగబడుతున్నాయని, రక్షణ కల్పించాలని నగర పాలక సంస్థ అధికారులను ప్రజలు కోరుతున్నారు. **- చిట్టినగర్, న్యూస్‌టుడే**

దుర్గగుడి నిత్యాన్నదాన పథకానికి విరాళం

దాత వరప్రసాద్‌కు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న వేద పండితుడు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : శ్రీదుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి విశాఖపట్నం సీతమ్మధార ప్రాంతానికి చెందిన కె.వరప్రసాద్ రూ.1,00,023 విరాళం సోమవారం అందజేశారు. దాత కుటుంబానికి దేవస్థానం సిబ్బంది ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. వేదపండితులు ఆశీర్వచనం, అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రం, ప్రసాదాలు అందజేశారు.

యోగాతో ఆరోగ్య పరిరక్షణ

అవార్డు గ్రహీతలతో సంఘ ప్రతినిధులు, సాధకులు

చిట్టినగర్, న్యూస్‌టుడే : యోగా సాధనతో ఆరోగ్య పరిరక్షణకు బాటలు వేసుకోవచ్చని అబ్దుల్ కలాం వాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష, గౌరవ అధ్యక్షులు శివకుమార్ పట్నాయక్, గుగ్గిలం విజయకుమార్ అన్నారు. కేఎల్‌రావు పార్కులో అబ్దుల్ కలాం వాకర్స్ అసోసియేషన్, శ్రీ వీరాంజనేయ యోగా సేవా కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో యోగా ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. శిక్షణలో సాధకులకు ఉత్తమ యోగా అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ యోగా దినోత్సవం పురస్కరించుకుని ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు యోగాంధ్ర పేరిట నెల రోజుల శిక్షణ తరగతులు నిర్వహించారని అన్నారు. అదే స్ఫూర్తితో అప్పటి నుంచి ఇప్పటి వరకు యోగా గురువు జన్ను సుబ్బారావు యోగా సాధన కొనసాగించడం హర్షణీయమని అన్నారు. అనంతరం యోగా సాధకులు బి.శంకరరావు, పి.సాంబశివరావు, వై.లక్ష్మి, బి.సరళను సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. సంఘ కార్యదర్శి జగుపిల్లి శ్రీనివాసరావు, కోశాధికారి బీరం శ్రీనివాసరావు, ఓలేశ్వరరావు, కస్తూరి, తులసి, హ్యాపీ వాకర్స్ క్లబ్ కార్యదర్శి బెల్లం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

భవానీ దీక్షల విరమణ సందర్భంగా ప్రత్యేక పూజ

నూతన ప్రసాదాల పోటులో ఈవో శీనానాయక్‌తో పూజ చేయిస్తున్న స్థానాచార్య శివప్రసాదశర్మ

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : భవానీ దీక్షల విరమణ పురస్కరించుకొని నూతన ప్రసాదాల పోటు, అన్నప్రసాద తయారీ కేంద్రంలో దేవస్థాన ఈవో శీనానాయక్ స్థానాచార్య ప్రత్యేక పూజ సోమవారం చేయించారు. ఈనెల 11 నుంచి 15 వరకు భవానీ దీక్షల విరమణ పురస్కరించుకొని వేలాది దీక్షాధారులకు వీటిలో తయారు చేసిన అన్నప్రసాదం, లడ్డూలు పంపిణీ చేస్తారని ఈవో తెలిపారు.

దుర్గగుడి అభివృద్ధిలో వ్యాపారుల పాత్ర ప్రశంసనీయం

రాధాకృష్ణను సత్కరిస్తున్న సమితి నాయకులు

విద్యాధరపురం, న్యూస్‌టుడే : దుర్గగుడి అభివృద్ధిలో పాతబస్తీ వ్యాపార వర్గాల పాత్ర ప్రశంసనీయమని పాలక మండలి ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ అన్నారు. వన్‌టౌన్ సెంటర్‌లోని పాతబస్తీ అభివృద్ధి పోరాట సమితి కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో రాధాకృష్ణను సమితి ప్రముఖులు సోమవారం సత్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భవానీ దీక్షల విరమణ పురస్కరించుకుని వేలాది భక్తులు పాతబస్తీ వీధుల వస్తారన్నారు. దసరా ఉత్సవాల మాదిరి సహకరించాలని కోరారు. సమితి అధ్యక్షుడు కొణిజేటి రమేష్, గెల్లి లోకనాథ్, కనిగంట్ల బుల్లిబాబు, సత్యనారాయణ, సురేంద్ర, అంజనేయ గుప్తా పాల్గొన్నారు.

బాధితులకు సాయం

కృష్ణలంక, న్యూస్‌టుడే: కృష్ణలంక 20వ డివిజన్ పరిధిలోని రణదివేనగర్‌లో అగ్నిప్రమాద బాధితులను సోమవారం ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పరామర్శించారు. మూడు ఇళ్లు కాలిపోగా ఒక్కో ఇంటికి రూ.5 వేల చొప్పున, అలాగే సరుకులు, దుస్తులు అందజేశారు. గుండు శ్రీను, గల్లా శ్రీను, శివలక్ష్మి, రమాదేవి, భవాని, షకీలా, క్రాంతి పాల్గొన్నారు.

తాటాకు ఇల్లు దగ్ధం

కృష్ణలంక, న్యూస్‌టుడే: స్థానిక రణదివేనగర్ కరకట్ట పరిధిలో పేకాటి వెంకటేశ్వర్లుకు చెందిన నాలుగు గదుల తాటాకు ఇల్లు కాలిపోయింది. మూడు గదులు శిథిలమైపోగా ఒక్క గదిలో సుంకర రాజాల అనే మహిళ అద్దెకు ఉంటోంది. సోమవారం మధ్యాహ్నం పని నిమిత్తం మహిళ ఇంటికి తాళం వేసి వెళ్లింది. కొద్దిసేపటికే ఇంట్లో మంటలు రేగాయి. సమీపంలోని వారు ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. దీపారాధన కారణంగా మంటలు చెలరేగినట్లు భావిస్తున్నారు.

ఎల్ఓసీ పత్రం అందజేత

భవానీపురం, న్యూస్‌టుడే : అనారోగ్యంతో బాధపడుతున్న మహిళకు పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి సహకారంతో ఎల్ఓసీ పత్రం మంజూరైంది. పశ్చిమ నియోజకవర్గం 48వ డివిజన్‌కు చెందిన షేక్ సబీరా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. ఆమెకు చికిత్స నిమిత్తం మంజూరైన రూ.5 లక్షల ఎల్ఓసీ పత్రాన్ని కార్యాలయ కార్యదర్శి ప్రతిపాటి శ్రీధర్, కార్పొరేటర్ విజయకుమార్ భవానీపురంలోని కార్యాలయంలో సోమవారం అందజేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM

విజయవాడ పశ్చిమ : 90320 99986

★ పాతబస్తీ పూలబావి వీధిలో కుక్కలు బెడద అధికంగా ఉంది. **- సూర్య నారాయణ** ★ వాటిని నివారించేందుకు చర్యలు తీసుకుంటాం. **- సోమశేఖర్, పశుసంవర్ధక విభాగం అధికారి**

★ వినాయక ఆలయం స్ట్రీట్ మ్యాజిక్ వద్ద వీధిలో రోడ్డు వైర్లు వేలాడుతున్నాయి. **- రాజు** ★ చెత్తను సిబ్బందితో తొలగిస్తాం. **-యోగేంద్ర, శానిటరీ పరిశుద్ధ అధికారి**

★ చిట్టినగర్ గౌతమ్ స్కూల్‌కి వెళ్లే మార్గంలో కాలువలో పూడిక పేరుకుపోవడంతో స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా'కు సమాచారం ఇవ్వగా సోమవారం సమస్య 'ఈనాడు'లో ప్రచురితమైంది. స్పందించిన పారిశుద్ధ్య అధికారులు పూడిక తీశారు. ★ పాతబస్తీ పాత పోస్టాఫీసు వద్ద యూజీడీ పొంగి పొర్లుతోందని స్థానికులు ఫిర్యాదు చేశారు. స్పందించిన పారిశుద్ధ్య అధికారులు సమస్య పరిష్కరించారు. **- విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే**

స్పందనకు వందనం

రహదారి భద్రతపై అవగాహన అవసరం

మాట్లాడుతున్న వరణ్ మోటార్స్ మేనేజర్ వరుణ్‌కుమార్

విద్యాధరపురం, న్యూస్‌టుడే : రహదారి భద్రతపై విద్యార్థులకు అవగాహన అవసరమని వరణ్ మోటార్స్ మేనేజర్ వరుణ్‌కుమార్ అన్నారు. నున్నలోని వికాస్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ టెక్నాలజీలో రహదారి భద్రతపై సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో వరణ్ మోటార్స్ సంస్థ తరపున ఆయన పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు వాహనాలను నడిపేటప్పుడు రహదారి ఎలా ఉంది.. వాహనానికి లైటింగ్ సరిగా ఉందో లేదో పరిశీలించాలని, వేగ నియంత్రణ ఎలా చేయాలో తెలియాలని చెప్పారు. చరవాణిలో మాట్లాడటం, అధిక వేగంతో నడపడం, ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించక పోవడం వంటి కారణాలతో ప్రమాదాలు జరుగుతాయని గుర్తించాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ పరమేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

సేవలకు పురస్కారం

కరెన్సీనగర్, న్యూస్‌టుడే : డెఫ్ ఎనేబుల్డ్ ఫౌండేషన్ 16వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఆంధ్రా లయోలా కళాశాలలో హెలెన్ కెల్లర్ ఎక్సలెన్స్ అవార్డులను ప్రదానం చేశారు. ఫౌండేషన్ ఉపాధ్యాయుల అవార్డు కింద సెయింట్ ఆన్స్ మనోవికాస కేంద్రం కె.శ్రీదేవి, గుణదల మడోన్నా హైస్కూల్‌కు చెందిన కేఎంపీ విజయలక్ష్మిలను సన్మానించారు. విద్యార్థుల అవార్డు కింద జి.లీలా సామ్రాజ్యం (సెయింట్ ఆన్స్), ఎ.శ్రీహిత (మడోన్నా హైస్కూల్)లకు అందించారు. అచీవర్ అవార్డుల కింద ఉత్తమ వ్యవస్థాపకులు కె.సాయి సందీప్, కె.గణపతి అవార్డు అందుకున్నారు.

సినిమాలు

రివాల్వర్ రీటా, రాజు వెడ్స్ రాంబాయి: జీ-3(రాజ్-యువరాజ్), మిరాజ్, ఐనాక్స్ (గాంధీనగర్), స్వర్ణాకాంప్లెక్స్(గవర్నర్‌పేట), తారా స్క్రీన్స్, రవీంద్ర సినిమాస్(పాయకాపురం), రామ్ సినిమాస్ (గుణదల), సౌమ్య(వన్టేన్), స్వాతి(భవానీపురం), లైలా మాల్, పీవీపీ మాల్, పీవీఆర్ మాల్(బందరు రోడ్డు), ట్రెండ్సెట్ మాల్(క్యాపిటల్ సినిమాస్), ఎల్ఈపీఎల్ ఐనాక్స్(పటమట), పవర్ వన్ మాల్(కానూరు). అఖండ-2: జీ-3(రాజ్-యువరాజ్), మిరాజ్, ఐనాక్స్(గాంధీనగర్), స్వర్ణాకాంప్లెక్స్(గవర్నర్ పేట), తారా స్క్రీన్స్, రవీంద్ర సినిమాస్ (పాయకాపురం), రామ్ సినిమాస్ (గుణదల), సౌమ్య(వన్టేన్), స్వాతి(భవానీపురం), లైలా మాల్, పీవీపీ మాల్, పీవీఆర్ మాల్(బందరు రోడ్డు), ట్రెండ్సెట్ మాల్(క్యాపిటల్ సినిమాస్), ఎల్ పీఎల్ మాల్(కానూరు). ఆంధ్ర కింగ్: జీ-3(రాజ్-యువరాజ్), ఐనాక్స్(పటమట), పవర్ వన్ మాల్(కానూరు). అమరకావ్యం: స్వర్ణా కాంప్లెక్స్ (గవర్నరుపేట), ఎస్ఈపీఎల్ (పటమట). **-న్యూస్‌టుడే, విజయవాడ వన్‌టౌన్**

భాజపా ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పట్నాయక్

శివకుమార్

చిట్టినగర్, న్యూస్‌టుడే : భాజపా ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా తనను పార్టీ నియమించినట్లు బలివాడ శివకుమార్ పట్నాయక్ సోమవారం తెలిపారు. పశ్చిమ నియోజకవర్గానికి చెందిన తాను 30 ఏళ్లుగా పార్టీ బలోపేతానికి కృషి చేయడం వల్ల ఈ పదవి దక్కిందన్నారు. రాష్ట్రంలో బీసీలందరినీ ఒక తాటిపైకి తెచ్చి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఆయన చెప్పారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ప్రధాన కార్యదర్శి మధుకర్, ఎమ్మెల్యే సుజనాచౌదరి, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గోపి శ్రీనివాస్, భాజపా జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి వినతులు

వినతి పరిశీలిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : నగరంలోని పలు ప్రాంతాల్లో నూతన డ్రెయిన్ల నిర్మాణాలు చేపట్టాలంటూ పలువురు నగర కమిషనర్ ధ్యానచంద్రకు వినతిపత్రాలు అందించారు. డ్రెయిన్ల నిర్మాణాలు చేపట్టక అనేక సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని తెలిపారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించగా.. ప్రజల నుంచి సమస్యలపై 25 వినతులు అందాయి. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను విభాగాధిపతులు నేరుగా పరిశీలించి.. సకాలంలో పరిష్కరించాలని అన్నారు. సమస్యలు తిరిగి ఉత్పన్నం కాకుండా చూడాలని సూచించారు. ఈ సందర్భంగా ఆస్తిపన్ను తగ్గింపు, రహదారుల ఆక్రమణలు, ట్రేడ్ లైసెన్సు, వాటర్ మీటర్ పన్ను, నాన్ వాటర్ మీటర్ పన్ను తొలగింపు, ఖాళీస్థలం పన్ను మినహాయింపు, చెట్లకొమ్మల తొలగింపు, మౌలిక వసతుల కల్పన వంటి సమస్యలతో పాటు విద్యుత్తు ఉప కేంద్ర నిర్మాణం, ఇందిరాగాంధీ మున్సిపల్ క్రీడా ప్రాంగణ సమస్య, గ్రంథాలయం ఏర్పాటు, డ్రెయిన్ల ఎత్తుపెంపు, రహదారుల శుభ్రత, తాగునీటి సమస్య, వీధి కుళాయిల ఏర్పాటు, టీడీఆర్ బాండ్ సమస్య, వీధి దీపం ఏర్పాటు, రహదారులు, కల్వర్టుల నిర్మాణం, ఎన్టీఆర్ కాంప్లెక్సులో దుకాణాల సమస్య వంటి అంశాలపై వినతులు అందాయి. కార్యక్రమంలో అధికారులు డి.చంద్రశేఖర్, అర్జునరావు, కె.సంజయ్ రత్నకుమార్, జి.సృజన, ఎ.శ్రీధర్, శ్రీనివాస్, ప్రభాకర్, కామేశ్వరరావు, చంద్రశేఖర్, మాల్యాద్రి, బి.సోమశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

పశువుల ఎముకలు తరలిస్తున్న వాహనం స్వాధీనం

స్వాధీనం చేసుకున్న వాహనం

భవానీపురం, న్యూస్‌టుడే : పశువుల ఎముకలు, కొమ్ములు తరలిస్తున్న వాహనాన్ని గోసంరక్షకులు సోమవారం అడ్డుకున్నారు. గుంటూరు నుంచి కోదాడకు వెళ్తున్న వాహనాన్ని గొల్లపూడి వద్ద ఆపారు. అందులో గోవులకు సంబంధించిన కొమ్ములు ఉన్నట్లు అనుమానం వ్యక్తం చేశారు. వెంటనే భవానీపురం పోలీసులకు సమాచారం ఇవ్వగా వారొచ్చి వాహనాన్ని పోలీసుస్టేషన్‌కు తరలించారు. పోలీసులు వాహనం పట్టా తీసి చూడగా కొమ్ములు, ఎముకలు ఉన్నాయి. అయితే... అవి ఏ జంతువులకు చెందినవో తెలియాల్సి ఉంది. పోలీసులు కబేళా అధికారులకు సమాచారం ఇచ్చారు. ఈ విషయమై విచారణ చేస్తున్నట్లుగా భవానీపురం స్టేషన్ సీఐ ఉమా మహేశ్వరరావు తెలిపారు.

వాహనాలు నిలిపేందుకు స్థలాల కేటాయింపు

పైవంతెన దిగువన ఏర్పాటు చేసిన బోర్డు

భవానీపురం, న్యూస్‌టుడే : దుర్గగుడికి వచ్చే భక్తులు వారి వాహనాలను నిర్దేశిత ప్రదేశాల్లోనే నిలపాలని ట్రాఫిక్ ఏసీపీ రామచంద్రరావు తెలిపారు. భవానీ దీక్షల విరమణ సందర్భంగా ట్రాఫిక్ స్తంభించకుండా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. కుమ్మరిపాలెం సెంటర్ సమీపంలోని పున్నమిఘాట్, తితిదే స్థలం తదితర చోట్ల వాహనాలు నిలపాలని పేర్కొన్నారు. మరెక్కడ నిలిపినా చర్యలు తీసుకుంటామని చెప్పారు. పార్కింగ్ ప్రదేశాల వద్ద బోర్డులు ఏర్పాటు చేసినట్లుగా వెల్లడించారు.

ఆటో ఢీకొని కార్మికుడికి గాయాలు

చిట్టినగర్, న్యూస్‌టుడే : ఆటో ఢీకొని కార్మికుడికి గాయాలయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం.. నాగమ్మసత్రం, అద్దాల వారి వీధికి చెందిన షేక్ బాజీ (45) బీరువాలు, టేబుళ్లు తయారు చేస్తాడు. ఈనెల 7న నైజాంగేటు ప్రాంతంలో పని చేసి కాళేశ్వరరావు మార్కెట్ వద్దకు వెళ్లి మద్యం తాగాడు. అక్కడ ఆటో ఎక్కి చేపల మార్కెట్ వద్ద దిగి మత్తుగా ఉండటంతో పడిపోయాడు. 8న తెల్లవారుజామున గుర్తు తెలియని ఆటో ఎడమ కాలు మీద నుంచి వెళ్లగా గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడు న్యాయం చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

కనుల పండువగా అయ్యప్ప పడిపూజ

పడిపూజ నిర్వహిస్తున్న మురళీధరన్

విద్యాధరపురం, న్యూస్‌టుడే : పాతబస్తీలోని పూలబావి వీధిలో అయ్యప్ప మండల పూజ మహోత్సవ కమిటీ ఆధ్వర్యంలో పడిపూజ సోమవారం కనుల పండువగా నిర్వహించారు. అయ్యప్ప దీక్షాధారుల శరణ ఘోషతో ఆ ప్రాంతం మార్మోగింది. అయ్యప్ప, జగన్మాత దుర్గమ్మ, శిర్డీ సాయినాథుడిని కీర్తిస్తూ అయ్యప్ప దీక్షాధారులు గీతాలు ఆలపించారు. కమిటీ అధ్యక్షుడు రుక్మన్ కుమార్ మాట్లాడుతూ 31 సంవత్సరాలుగా క్రమం తప్పకుండా పడిపూజ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆధ్యాత్మిక వాతావరణం ఉట్టిపడేలా పడిమెట్ల సెట్టింగ్ ఏర్పాటు చేయడం ప్రత్యేకత అన్నారు. పాత శివాలయంలోని అయ్యప్ప ఆలయ ప్రధానార్చకులు మురళీధరన్ నంబూద్రి, పసుమర్తి శివరాజ్‌కుమార్, మాలధారులు పాల్గొన్నారు.

సంఘ నేత దృష్టికి కార్మికుల సమస్యలు

సమస్యలు వింటున్న నాయకులు

రైల్వేస్టేషన్,న్యూస్‌టుడే : రైల్వే ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలను సంఘ్ విజయవాడ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ఆకుల రాఘవేంద్ర, ఆమంచి వెంకటేశ్వరరావు ద్వారా ఎన్ఎఫ్ఐఆర్ జాతీయ ప్రధాన కార్యదర్శి మర్రి రాఘవయ్య దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తానని ఎంప్లాయీస్ సంఘ్ ఇంజినీరింగ్ బ్రాంచి అధ్యక్షుడు కొయ్య రమణారెడ్డి అన్నారు. కార్మికుల సమస్యలు తెలుసుకునేందుకు సోమవారం పీవే సౌత్ కార్యాలయం సెక్షన్ యూనిట్‌లో ఆయన పర్యటించారు. కార్యక్రమంలో సంఘ్ బ్రాంచి కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, వి.రాంబాబు, ఐ.ప్రభాకర్, యుగంధర్, రామస్వామి, కె.వి.రమణ, వి.గురుస్వామి, మహేష్‌బాబు, వి.రాజు పాల్గొన్నారు.

మహిళా టీటీ పోటీలకు ఎన్టీఆర్ వర్సిటీ జట్టు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: విశాఖలోని గీతం విశ్వవిద్యాలయంలో ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు జరిగే దక్షిణ భారత అంతర్ విశ్వవిద్యాలయాల మహిళా టేబుల్ టెన్నిస్ పోటీల్లో పాల్గొనే డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం జట్టును వర్సిటీ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి ఇ.త్రిమూర్తి సోమవారం వెల్లడించారు. ఎంపికైన జట్టు సభ్యులను వర్సిటీ ఉపకులపతి డాక్టర్ పి.చంద్రశేఖర్, రిజిస్ట్రార్ డాక్టర్ వి.రాధికారెడ్డిలు అభినందించారు. వర్సిటీ జట్టులో ఎం.సుభాషిణి(కేకేసీ హోమియోపతి కళాశాల, పుత్తూరు), ఎన్.యామిని, ఎ.ఖ్యాతి(ఎన్ఆర్ఐ వైద్య కళాశాల, చినకాకాని), టి.సాత్త్విక(జీఎస్ఎల్ వైద్య కళాశాల, రాజమహేంద్రవరం), జి.కల్యాణి (మహారాజ హోమియోపతి కళాశాల, విజయనగరం) స్థానం సాధించారు.

ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్

(ప్రభుత్వ రంగ షెడ్యూల్డ్ బ్యాంక్) ప్రాంతీయ కార్యాలయం: విజయవాడ

సూర్యదేవర నెస్ట్, డోర్ నెం.4-195, అయ్యప్పస్వామి గుడి వీధి, గొల్లపూడి, విజయవాడ, మెయిల్ ఐడీ: rovijayawada@sgbank.in

లీజ్ ప్రాతిపదికన భవనం కావలెను

ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్, విజయవాడ నగరంలో గుణదల మరియు రాణీగారి తోట ఏరియాలలో నూతన శాఖలు ప్రారంభించుటకొరకు అన్ని అవసరమైన సౌకర్యాలతో గల భవనము కావలెను. అందు నిమిత్తము విజయవాడ నగరంలో గుణదల మరియు రాణీగారి తోట ఏరియాలలో తగిన పార్కింగ్ స్థలం, నీటి సౌకర్యం, మంచి వెంటిలేషన్ మరియు సులభ ప్రవేశం కలిగి సుమారు 1200 నుండి 1400 చదరపు అడుగుల (±20%) (కనీసం 200 చ.అ.ల స్ట్రాంగ్ రూమ్‌తో కలిపి) కార్పెట్ ఏరియా కలిగిన భవనము (గ్రౌండ్ ఫ్లోర్ ప్రాధాన్యతగా) అద్దెకు కావలెను. బ్యాంక్ అవసరాలకు అనుగుణంగా సిద్ధంగా ఆక్రమించదగిన (రెడీ-టు-ఆక్యుపై) భవనం లేదా నిర్మాణం పూర్తికావచ్చిన భవనం కావలెను. కావున ఆసక్తి గల వారి నుండి టెండర్లు కోరడమైనది.

టెండర్ విధానం: ఆసక్తి గల వ్యక్తులు టెక్నికల్ బిడ్ మరియు ఫైనాన్షియల్ బిడ్లను విడి విడిగా సీల్డ్ కవర్లలో సమర్పించాలి. ఈ రెండు కవర్లను మరొక సీల్డ్ కవరులో ఉంచి దానిపై ఈ విధంగా రాయాలి: **"Tender for Premises - Regional Office, Vijayawada".**

టెండర్ దరఖాస్తు ఫారాలు (టెక్నికల్ & ఫైనాన్షియల్) మరియు ఇతర వివరాలు ప్రాంతీయ కార్యాలయం, గొల్లపూడి, విజయవాడ నుండి కార్యాలయ సమయాల్లో పొందవచ్చు.

ముఖ్యమైన తేదీలు: టెండర్ సమర్పణకు చివరి తేదీ: 03-01-2026 (శనివారం) సాయంత్రం 05:00 గంటల వరకు,

టెండర్ తెరవబడే తేదీ, సమయం & స్థలం: 05-01-2026 (సోమవారం) ఉదయం 11-00 గంటలకు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్, ప్రాంతీయ కార్యాలయం, గొల్లపూడి, విజయవాడ (బిడ్డర్లు లేదా వారి అధీకృత ప్రతినిధులు టెండర్ తెరవబడే సమయంలో హాజరు కావచ్చు).

సంప్రదించవలసిన వివరాలు: 9441799711, 8106142725 ప్రాంతీయ కార్యాలయం, విజయవాడ.

గమనిక: టెండర్లను ఏ దశలోనైనా రద్దు చేయుటకు లేదా మార్పు చేయుటకు బ్యాంక్ వారికి అధికారము కలదు.

ఇట్లు/- రీజనల్ మేనేజర్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము, దేవదాయ ధర్మదాయ శాఖ

శ్రీ పారేపల్లి శ్రీరాములు ధర్మ రామానుజ కూటం

బ్రాహ్మణ వీధి, విజయవాడ-520 001

షాపులు అద్దెకు టెండర్ కమ్ బహిరంగ వేలం పాట ప్రకటన

ఎన్.టి.ఆర్. జిల్లా, విజయవాడ 1వ టౌన్, బ్రాహ్మణ వీధిలోని శ్రీ పారేపల్లి శ్రీరాములు ధర్మ రామానుజ కూటంనకు సర్వ సంపూర్ణ హక్కు భుక్తములు కలిగిన ఆర్.ఆర్. అప్పారావు వీధిలో గల ఈ క్రింది షాపుల నందు వ్యాపారం చేసుకొను నిమిత్తం లైసెన్స్ హక్కులు ఇచ్చుటకు **ది. 22-12-2025న సోమవారం ఉదయం గం. 10.30లకు** దేవదాయ ధర్మదాయ శాఖ అధికారులు మరియు ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ సమక్షములో శ్రీ పారేపల్లి శ్రీరాములు ధర్మ రామానుజ కూటం - సంస్థ నందు సీల్డ్ టెండర్ కమ్ బహిరంగ వేలంపాట నిర్వహించబడును.

వ. నెం.	వివరము	విస్తీర్ణం వివరము (APPROX)	ధరావతు	కాలపరిమితి
1.	1st ఫ్లోర్, డోర్ నెం: 11-22-9, R.R. Apparao వీధి, వన్‌టౌన్, విజయవాడ	52x43	రూ.1,00,000/-	స్వాధీనపరచిన తేదీ నుండి (3) మూడు సంవత్సరములు
2.	2nd ఫ్లోర్, డోర్ నెం: 11-22-9, R.R. Apparao వీధి, వన్‌టౌన్, విజయవాడ	52x43	రూ.1,00,000/-	స్వాధీనపరచిన తేదీ నుండి (3) మూడు సంవత్సరములు
3.	గ్రౌండ్ ఫ్లోర్, డోర్ నెం: 11-22-9 నందు షాపు నెం.2, R.R. Apparao వీధి, వన్‌టౌన్, విజయవాడ	22.5x 25.5	రూ.1,00,000/-	స్వాధీనపరచిన తేదీ నుండి (3) మూడు సంవత్సరములు
4.	గ్రౌండ్ ఫ్లోర్, డోర్ నెం: 11-22-9 నందు షాపు నెం.1, R.R. Apparao వీధి, వన్‌టౌన్, విజయవాడ	9x22	రూ.1,00,000/-	స్వాధీనపరచిన తేదీ నుండి (3) మూడు సంవత్సరములు
5.	గ్రౌండ్ ఫ్లోర్, డోర్ నెం: 11-22-9నందు షాపు నెం.6, R.R. Apparao వీధి, వన్‌టౌన్, విజయవాడ	12.4x 10.4	రూ. 50,000/-	స్వాధీనపరచిన తేదీ నుండి (3) మూడు సంవత్సరములు

1. ఈ వేలం పాట జి.ఓ.యం.ఎస్.నెం. 866 రెవెన్యూ (ఎండోమెంట్స్-1) డిపార్టుమెంటు తేది. 08-08-2003 మరియు జి.ఓ.యం.ఎస్.నెం. 426 రెవెన్యూ (ఎండోమెంట్స్- 1) డిపార్టుమెంటు తేది. 09-11-2016 అనుసరించి శ్రీయుత కమిషనర్, దేవదాయ ధర్మదాయ శాఖ, విజయవాడ వారి ఆమోద ఉత్తర్వులకు లోబడి జరుపబడుచున్నది. 2) ప్రథమ ధరావత్తు బ్యాంకు డి.డి. రూపంలో పై సంస్థ వారి పేరున చెల్లించి పాటలో పాల్గొనవలెను. 3) రూ. 200/-లు నగదు చెల్లించి టెండరు ఫారంలను, ది. 09-12-2025 నుండి ది. 20-12-2025 సా. 5.00 గం.లోపు కార్యాలయం నుండి పొందగలరు. ప్రథమ ధరావత్తుతో పాటు ఆధార్ కార్డు నకలు, ప్రస్తుత చిరునామాను ధ్రువపరచు పత్రము, పాన్‌కార్డు నకలుతోపాటు టెండరు డాక్యుమెంట్స్‌ను ది. 22-12-2025న సోమవారం ఉదయం గం. 10.30 లోపుగా సమర్పించి టెండర్ కమ్ బహిరంగ వేలంపాటలో పాల్గొనవలెను. 4) పాట ముగిసిన వెంటనే హెచ్చు పాటదారుడు ప్రథమ ధరావత్తు కాకుండా ఒక సంవత్సరం పాట సొమ్ము (12 నెలలు) అడ్వాన్సుగా చెల్లించవలెను. 5) ఆమోదించబడిన హెచ్చు పాటదారులు ప్రభుత్వమునకు చెల్లించవలసిన GST తదితర యావత్ పన్నులు సదరు లైసెన్స్ దారే చెల్లించుకొనవలెను. 6) సదరు పోర్షన్‌ను హెచ్చుపాటదారునికి స్వాధీనపరచిన తేదీ నుండి 3 సం.ముల కాలపరిమితికి నిర్ణయం. 7) ఈ వేలం పాటలో హిందుయేతరులు పాల్గొనరాదు.

విజయవాడ, తేది: 09-12-2025

ఇట్లు **సి. విజయలక్ష్మి**

ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్

Contact Person:- T.Srinivasulu (77022 83629)

(c) eenadu

విజయవాడ మధ్య

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
సీతారాంపురం–63036 11232, పాయకాపురం– 90631 44761

? గులాబీతోటలోని చెర్రీ బార్ వెనుక వీధిలోని సైడు కాల్వలో పూడిక తీయడం లేదు. దోమలు చేరి కంటిమీద కునుకులేకుండా పోతోంది. **- కిరణ్, స్థానికుడు**

✔ పరిశీంచి తగిన చర్యలు తీసుకుంటాం. **- సీహెచ్ బాబూ శ్రీనివాసన్** – న్యూస్‌టుడే, సీతారాంపురం

తెదేపాలోనే బీసీలకు ప్రాధాన్యం

గాంధీనగర్, న్యూస్‌టుడే : తెదేపాలోనే బీసీలకు చక్కని ప్రాధాన్యం లభించిందని అమరావతి బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోను హరిబాబు అన్నారు. సోమవారం సంఘం కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఏ పార్టీలు ఇవ్వని విధంగా గత ఎన్నికల్లో ఎక్కువ సీట్లు ఇచ్చింది ముఖ్యమంత్రి చంద్రబాబేనని చెప్పారు. రాజధాని అమరావతి అభివృద్ధిలో బీసీలంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు బోను ప్రసాద్, ఇంతియాజ్, ఖాజా, బాషా తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

సూర్యారావుపేట, న్యూస్‌టుడే : సీతారాంపురం వీరమాచనేని రంగారావు వీధిలోని ఒక ఇంట్లో జూదమాడుతున్న 12 మందిని సూర్యారావుపేట పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. పెద్ద ఎత్తున జనం చేరి జూదమాడుతున్నట్లు వచ్చిన సమాచారంతో ఎస్సై ఫ్రాన్సిస్ తన సిబ్బందితో దాడులు చేశారు. జూదరులను అరెస్టు చేసి, వారి నుంచి రూ.66,300 నగదు, 13 చరవాణిలను స్వాధీనం చేసుకున్నారు.

కృష్ణా తరంగ్‌లో ప్రతిభ

బహుమతులు గెలుపొందిన వారితో అధ్యాపకులు

మాచవరం, న్యూస్‌టుడే : స్థానిక ఎస్సారార్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన పలువురు విద్యార్థులు ఇటీవల కృష్ణా విశ్వవిద్యాలయంలో జరిగిన యువజనోత్సవాల్లో పలు బహుమతులు గెలుపొందారని వైస్ ప్రిన్సిపల్ పి.శైలజ తెలిపారు. ఆంగ్ల చర్చాగోష్ఠిలో పి.లక్ష్మీనారాయణ, వై.సతీష్ జోడీ ప్రథమ, ఆంగ్ల, హిందీ వక్తృత్వం పోటీల్లో పి.లక్ష్మీనారాయణ ప్రథమ బహుమతులు గెలుపొందారు. క్విజ్‌లో డి.వివేక్, డి.డేవిడ్‌రాజు, పి.లక్ష్మీనారాయణల బృందానికి ద్వితీయ, హిందీ చర్చాగోష్ఠిలో పి.లక్ష్మీనారాయణ, ఎల్.దివాకర్‌లకు తృతీయ, పోస్టర్ తయారీలో డి.వివేక్ తృతీయ బహుమతులు సొంతం చేసుకున్నారని పేర్కొన్నారు. సోమవారం వీరిని కళాశాల లిటరరీ కమిటీ సమన్వయకర్త కె.వి.శాంతకుమారి, సభ్యులు ఆలపాటి భానుప్రసాద్, యు.వి.రమణమూర్తి, రాధిక అభినందించారు. వ్యాయామ విద్యా విభాగాధిపతి డి.యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డేది?

శిథిల భవనంలో ఆకతాయిల తిష్ట

రామ్‌నగర్ కాలనీలో భవనం

అజిత్‌సింగ్‌నగర్, న్యూస్‌టుడే

అజిత్‌సింగ్‌నగర్ రామ్‌నగర్ కాలనీలోని పాడైపోయిన ప్రభుత్వ భవనం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. సుమారు 15 ఏళ్ల కిందట పక్కనే ఉన్న ఎస్‌టీపీ (మురుగు నీటి శుద్ధి కేంద్రం) ప్లాంట్‌కు సంబంధించి మురుగు నీటిని పరిశీలించడానికి ల్యాబ్ కింద ఉపయోగించారు. కొత్తగా ఎస్‌టీపీ వాటర్ ప్లాంట్ నిర్మించడంతో.. ఈ భవనం నిరుపయోగంగా మిగిలింది. ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. ఆకతాయిలు, మందుబాబులకు ఆవాసంగా మారింది. ఇది కాలనీ మధ్యలో ఉండడంతో.. చీకటి పడగానే వాంబే కాలనీ, లూనా సెంటర్, కృష్ణా హోటల్ సెంటర్ తదితర ప్రాంతాలకు చెందిన వారు ఇక్కడికి వచ్చేస్తున్నారు. మద్యం, గంజాయి తాగుతున్నారు. అర్ధరాత్రి వరకు ఉంటూ.. రచ్చ చేస్తున్నారు. గొడవలు పడుతూ స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. మత్తులో సీసాలు పగలకొట్టి భవనంలో, పక్కన ఉన్న ఖాళీ స్థలాల్లో విసిరేస్తున్నారు. పోలీసుల నిఘా పెద్దగా లేకపోవడంతో.. వారి ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండా పోతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారి ప్రాజెక్టు-2 డీఈ చంద్రశేఖర్‌ను వివరణ కోరగా.. భవనాన్ని పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గతంలో ల్యాబ్‌గా ఉపయోగించిన గది

ప్రాంతం : రామ్‌నగర్ కాలనీ	నివాసాల సంఖ్య : సుమారు 500	ప్రజలు : సుమారు 2000 మంది

పోలీసుల నిఘా పెరగాలి

అజిత్‌సింగ్‌నగర్‌కు మారుమూల ప్రాంతం కావడంతో నిఘా ఉండడంలేదు. సాయంత్రం కాగానే యువకులు క్రికెట్ పేరుతో స్థానిక ఖాళీ ప్రదేశంలోకి చేరుకుంటున్నారు. మద్యం, గంజాయి తెచ్చుకుని తెల్లవార్లూ తాగుతూ అక్కడే ఉంటున్నారు. చీకటి పడితే.. అటు వైపు వెళ్లాలంటేనే భయపడుతున్నాం. పోలీసులు పెట్రోలింగ్ పెంచి, కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలి. **- రమేష్, స్థానికుడు**

అడిగితే గొడవకు దిగుతున్నారు

తాగిన మైకంలో యువకులు గొడవ పడుతున్నారు. అర్ధరాత్రి ద్విచక్ర వాహనాలతో శబ్దాలు చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారు. భవనంలో, చుట్టు పక్కల ప్రాంతాల్లో ఎక్కడ చూసినా మందు సీసాలే కనిపిస్తున్నాయి. తాగిన సీసాలను రోడ్లపై పగల కొడుతున్నారు. ఎవరైనా గట్టిగా అడిగితే గొడవ పడుతున్నారు. పోలీసులు నిఘా పెంచి.. ఆకతాయిల ఆగడాలను నిరోధించాలి. **- నూకరాజు, స్థానికుడు**

15న సెమీ క్రిస్మస్ వేడుకలు

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బొండా ఉమా, దయానందం తదితరులు

మధురానగర్, న్యూస్‌టుడే : మధురానగర్ మెయిన్‌రోడ్డులో ఈ నెల 15న ఆంధ్రప్రదేశ్ క్రిస్టియన్ పాస్టర్స్ అండ్ లీడర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి బందెల దయానందం తెలిపారు. ఈ వేడుకలకు సంబంధించిన కరపత్రాన్ని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు చేతుల మీదుగా సోమవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. అసోసియేషన్ తరపున 300 మంది పాస్టర్లకు రూ.10 లక్షల ప్రమాద బీమా వచ్చేలా ప్రీమియం కట్టామని తెలిపారు. ఆయా బాండ్లను వేడుకల్లో అందిస్తామని తెలిపారు.

దీక్షల విరమణకు పటిష్ఠ ఏర్పాట్లు

ఇంద్రకీలాద్రి: భవానీ దీక్షల విరమణకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని ఆర్డీవో కావూరి చైతన్య అన్నారు. ఈనెల 11 నుంచి 15 వరకు శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానం నిర్వహించనున్న భవానీ దీక్షల విరమణకు సంబంధించిన ఏర్పాట్లను ఈవో శీనానాయక్, ఏడీసీ రామకృష్ణతో కలిసి ఆర్డీవో సోమవారం పరిశీలించారు. దీక్షలకు రూపొందించిన ఆటో క్యాడ్ ప్లాన్లను చూశారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు ఉండాలని సూచించారు. హోమగుండాలు, ఇరుముడి కేంద్రాల వద్ద రద్దీని నియంత్రించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. కనకదుర్గానగర్‌లో తొక్కిసలాటలకు తావు లేకుండా పోలీసులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు.

GENERAL NOTICE

IN THE COURT OF THE HON'BLE XIV ADDL. DIST. AND SESSIONS JUDGE : VIJAYAWADA.
G.W.O.P. No. 83 / 2025

Between:
Harisha Chunduru, W/o.Ramakrishna(Late), Represented on behalf of Miss.1)Baby Chandana Chunduru, D/o.Rama Krishna, Chunduru (Late), Miss.2)Tarini Chunduru, D/o.Rama Krishna Chunduru(Late),here the both are being minors represented by their Mother and Natural Guardian Harisha Chunduru, W/o. Ramakrishna (Late),all are R/o.H.No. 43-105-8, P&T Colony, New Ajith Singh Nagar,Vijayawada ....Petitioner
And
Nil. ...Respondent

పై నెంబరు ఒ.పి.లోని పిటీషనరు తన మైనరు పిల్లలైన బేబి చందన చుండూరు మరియు తరిని చుండూరు యొక్క బాగోగులు, పోషణ వగైరాలు కొరకు మైనర్ల తాలూకు ఆస్తిని అమ్ముటకు పర్మిషన్ కోరుచూ పిటీషను దాఖలుచేయగా సదరు పిటీషనులో ఎవరికైనా ఏవిధమైన అభ్యంతరములు వగైరాలు ఉంటే తెలుపుకొన వలసినదిగా కొరుచూ శ్రీ కోర్టు వారు జనరల్‌నోటీసు నిమిత్తం **ది.17-12-2025**కి వాయిదావేసినారు. కావున వాయిదా రోజు **ఉ.గం.10-30ని.**లకు పై కోర్టు వారి యెదుట హాజరై వారికిగల ఆక్షేపణలు, అభ్యంతరములు తెలుపుకొనగలరని యావన్మందికీ తెలియజేయడమైనది.

Schedule: The petition schedule is a House build with A.C.C. (Asbestos Cement Sheet) shed ad-measuring of 66.66Sq.Yds., or 55.73Sq.Mts., with the build area of 420 Sft., bearing House No.: 43-106-18/1,Assessment No.:1073060203, Municipal Ward No.: 55, Block No.: 106, Plot No.: 2695(Part),Survey No.:17/1 Part of Mutyalam Padu Village, P&T Colony, New Ajith Singh Nagar, Vijayawada Municipal Corporation Area, Vijayawada Urban in N.T.R. District, Andhra Pradesh State and bounded as follows:**East:**Plot No.:2687 property belongs to Sk.Sirajunnisa Garu,**South:**Plot No.:2694 property belongs to Chakravarthi Garu,**West:**Municipality Road, **North:**Plot No.:2695(Part) property belongs to Sk.Jilani Garu, Within the above boundaries House build with A.C.C. (Asbestos Cement Sheet) shed ad-measuring of 66.66 Sq. Yds., or 55.73 Sq.Mts.,

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం)
వాయిదా తేది:17-12-2025.

HARISRI LEGAL ASSOCIATES, CH.V.V.N. SRINIVASA RAO, JAYASREE NADAVA, ANURADHA GUDAPATI, VIJAYALAKSHMI ADDANKI, ARAVA SAI CHATURYA,
Advocates for Petitioners, Flat No.: 102, Sri Kota's Lakeview Enclave, Near: Avinash College, Vivek Nagar, Kukatpally, HYDERABAD- 500 072, Telangana, Mobile Nos.: 88854 11220, 70138 12721, 94930 32687 & 86391 48998.

బ్రహ్మానందం సేవలు నిరుపమానం

విజయవాడ సాంస్కృతికం, న్యూస్‌టుడే : ఆచార్యులు కె.వి.బ్రహ్మానందం రెండున్నర దశాబ్దాలకుపైగా సంగీత కళాశాలకు సేవలందించారని, శాస్త్రీయ సంగీతాన్ని అలవోకగా ఆలపిస్తారని గోళ్ళ నారాయణరావు పేర్కొన్నారు.

గాయకులను సత్కరిస్తున్న నారాయణరావు, చిట్టిబాబు తదితరులు

సోమవారం గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానంద కళావేదికపై సంగీత సామ్రాట్ ఎం.ఎస్.బాలసుబ్రహ్మణ్య శర్మ కళాసంస్థ, సుమధుర గాన సుధాకర కె.వి.బ్రహ్మానందం కళా సంస్థల ఆధ్వర్యంలో కె.వి.బ్రహ్మానందం పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా గాయకులు అంగాడి శివప్రసాద్, బి.శారదాసాయి, కట్టా సాయి జ్యోతి, పట్నాల మానస, ఆనంద్‌లను సత్కరించారు. అనంతరం నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆకట్టుకుంది. తెలుగు కళావాహిని, పోలవరపు సాంస్కృతిక సమితి, కళాభారతి సంస్థలు సహకారం అందించాయి. వక్తలు చింతకాయల చిట్టిబాబు, కె.డేవిడ్‌రాజు, బోడి ఆంజనేయరాజు మాట్లాడుతూ.. శాస్త్రీయ సంగీత సభలో బ్రహ్మానందం సంగీతం ఆలపించి రాష్ట్ర వ్యాప్తంగా తనదైన ముద్ర వేసుకున్నారని కొనియాడారు. త్యాగరాజు, అన్నమయ్య కీర్తనలు ఆలపిస్తుంటే.. వీనుల విందుగా ఉంటుందని పేర్కొన్నారు.

నిరుపేదలకు సరకుల పంపిణీ

నిత్యావసరాలు అందిస్తున్న బొండా సిద్ధార్థ

అజిత్‌సింగ్‌నగర్: ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు తనయుడు, తెదేపా యువ నాయకుడు బొండా సిద్ధార్థ పుట్టినరోజు సందర్భంగా తెదేపా నాయకులు, అభిమానులు కలిసి 30 మంది నిరుపేదలకు నిత్యావసర సరకులు, బియ్యం అందించారు. సోమవారం అజిత్‌సింగ్‌నగర్‌లోని తెదేపా కార్యాలయంలో సిద్ధార్థ చేతుల మీదుగా వీటిని అందజేశారు. 30వ డివిజన్ క్లస్టర్ ఇన్‌ఛార్జి ఘంటా కృష్ణమోహన్, రాష్ట్ర కార్యదర్శి కోలా దుర్గారావు, బుగతా రవితేజ, దుర్గాసి రాము, లబ్బా వైకుంఠం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చేయూత

అజిత్‌సింగ్‌నగర్, న్యూస్‌టుడే : స్థానిక లూనా సెంటర్‌లోని ఎం.కె.బేగ్ మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలలో బిగ్ హెల్ప్ ఫర్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో సోమవారం 'స్పాన్సర్ ఏ ఛైల్డ్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 20 మంది దత్తత విద్యార్థులకు దుప్పట్లు, పెన్నులు, పెన్సిళ్లు, స్కేల్స్ తదితర స్టేషనరీ సామగ్రి పంపిణీ చేశారు. మండల విద్యాశాఖాధికారులు శ్యాంప్రసాద్, బి.వెంకటేశ్వర్లు, ప్రధానోపాధ్యాయుడు ఎం.హుస్సేన్, ప్రాజెక్టు డైరెక్టర్ ఎ.ఆనందరావు, ఉపాధ్యాయులు హాజరయ్యారు. హుస్సేన్ మాట్లాడుతూ.. అమెరికాలో స్థిరపడిన షేక్ చాంద్ బాషా స్థాపించిన ఈ సంస్థ ద్వారా ప్రతి నెలా విద్యార్థులకు చేయూతనిస్తుందని తెలిపారు.

సామగ్రి అందుకున్నవారితో దాతలు, ఉపాధ్యాయులు

రాకపోకలకు వీలుగా మరమ్మతులు

పనులు చేయిస్తున్న సీఐ కిషోర్‌బాబు

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : రైల్వేస్టేషన్ పార్సిల్ కార్యాలయం గేట్ సమీపంలో.. బయటకు వచ్చే దారిలో మలుపు తీసుకోవడానికి ఇబ్బంది పడుతున్న వాహన చోదకుల కోసం ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపట్టారు. మలుపులో ప్రమాదాల జరగడంతో.. మూడో ట్రాఫిక్ పోలీసులు రైల్వే ఇంజినీరింగ్ సిబ్బందిని సంప్రదించారు. అక్కడ ఇబ్బంది లేకుండా పనులు చేయించారు. ఇప్పుడు రాకపోకలకు సాగించడానికి సౌకర్యంగా ఉంది. వాహన చోదకులు ఎగ్జిట్ వద్ద వన్‌వే పాటించి ముందుకు వెళ్లి రావాలని సీఐ కొత్తూరు కిషోర్‌బాబు కోరారు. ట్రాఫిక్ పోలీసుల చర్యలపై చోదకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి వినతులు

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : నగరంలోని పలు ప్రాంతాల్లో నూతన డ్రెయిన్ల నిర్మాణాలు చేపట్టాలంటూ పలువురు నగర కమిషనర్ ధ్యానచంద్రకు వినతిపత్రాలు అందించారు. డ్రెయిన్ల నిర్మాణాలు చేపట్టక అనేక సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని తెలిపారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించగా.. ప్రజల నుంచి సమస్యలపై 25 వినతులు అందాయి. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను విభాగాధిపతులు నేరుగా పరిశీలించి.. సకాలంలో పరిష్కరించాలని అన్నారు. సమస్యలు తిరిగి ఉత్పన్నం కాకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు డి.చంద్రశేఖర్, అర్జునరావు, కె.సంజయ్ రత్నకుమార్, జి.సృజన, ఎ.శ్రీధర్, శ్రీనివాస్, ప్రభాకర్, కామేశ్వరరావు, చంద్రశేఖర్, మాల్యాద్రి, బి.సోమశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

పోక్సో కేసులో అయిదేళ్ల జైలు

విజయవాడ (గాంధీనగర్): బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి పోక్సో న్యాయస్థానం జైలు శిక్ష విధించింది. పశ్చిమ బెంగాల్‌కు చెందిన రాకేష్‌డే(36) మారుతీనగర్‌లోని ఓ బంగారం నగల దుకాణంలో పని చేస్తున్నాడు. 2020, నవంబరు 15వ తేదీన సత్యనారాయణపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆరేళ్ల బాలికతో అతడు అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఈ విషయం తల్లిదండ్రులకు తెలియడంతో... సత్యనారాయణపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోక్సో కేసు నమోదు చేసి, నిందితుడిని అరెస్టు చేశారు. విచారణ అనంతరం అతడిపై నేరం రుజువు కావడంతో అయిదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.10వేల జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు న్యాయమూర్తి వేల్పుల భవానీ సోమవారం తీర్పు చెప్పారు. బాలికకు రూ.లక్ష నష్టపరిహారం చెల్లించాలని ఆదేశించారు. ప్రాసిక్యూషన్ తరపున పీపీ గడ్డం రాజేశ్వరరావు, సీఎంఎస్ సీఐ జగదీశ్వరరావు, సత్యనారాయణపురం సీఐ లక్ష్మీనారాయణ, సిబ్బంది పర్యవేక్షణలో మొత్తం అయిదుగురు సాక్షులను విచారించారు.

దొంగతనం కేసుల్లో..

మధురానగర్, న్యూస్‌టుడే : గుణదల పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన 6 దొంగతనం కేసుల్లో నిందితుడైన ఉయ్యాల రాజేష్(24)కు ఏడాది జైలుశిక్ష విధిస్తూ ఒకటో అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి ఎం.ఎస్.కరీముల్లా సోమవారం తీర్పు చెప్పారు. అజిత్‌సింగ్‌నగర్ వాంబేకాలనీకి చెందిన రాజేష్.. చిన్నతనంలోనే చదువు మానేశాడు. గంజాయి, సిగరెట్ తాగడం వంటి చెడు వ్యసనాలకు అలవాటు పడ్డాడు. జల్సాలు తీర్చుకునేందుకు దొంగతనాలు ప్రారంభించాడు. ఈ క్రమంలో 2024 నుంచి 10 నెలల కాలంలో గుణదల పోలీస్‌స్టేషన్ పరిధిలో తాళం వేసి ఉన్న ఇళ్లను ఎంచుకుని దొంగతనాలు చేశాడు. దీనిపై నిందితుడిని అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపరిచారు. విచారణలో అతడిపై నేరం రుజువు కావడంతో జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వై.సత్యవాణి వాదించారు.

ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్
(ప్రభుత్వ రంగ షెడ్యూల్డ్ బ్యాంక్) ప్రాంతీయ కార్యాలయం: విజయవాడ
సూర్యదేవర నెక్స్ట్, డోర్ నెం.4-195, అయ్యప్పస్వామి గుడి వీధి, గొల్లపూడి, విజయవాడ, మెయిల్ ఐడి: rovijayawada@sgbank.in
లీజ్ ప్రాతిపదికన భవనం కావలెను
ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్, విజయవాడ నగరంలో గుణదల మరియు రాణిగారి తోట ఏరియాలలో నూతన శాఖలు ప్రారంభించుట కొరకు అన్ని అవసరమైన సౌకర్యాలతో గల భవనము కావలెను. అందు నిమిత్తము విజయవాడ నగరంలో గుణదల మరియు రాణిగారి తోట ఏరియాలలో తగిన పార్కింగ్ ...
"Tender for Premises - Regional Office, Vijayawada".
... 03-01-2026 ... 05-01-2026 ...
ఇట్లు/- రీజనల్ మేనేజర్

SBI భారతీయ స్టేట్ బ్యాంక్
హోమ్ లోన్ సెంటర్-1 (ఆర్ఎసిపిసి-1), కె.కె.టవర్స్, మొదటి అంతస్తు, యం.జి.రోడ్డు, విజయవాడ-520 010, యన్‌టిఆర్ జిల్లా.
Appendix – IV –A
[See Provison to rule 8(6) R/w 9(1)]
స్థిరాస్తి ఈ-వేలం అమ్మకం బహిరంగ ప్రకటన తేది.09-01-2026
... https://www.baanknet.com ...
రిజర్వు ధర: రూ.35,28,000/- | ధరావత్తు: రూ.3,52,800/- | బిడ్ పెంపుదల: రూ.10,000/-
ఇ-వేలం తేదీ & సమయం: 09-01-2026 ఉ।। గం।। 11.00 ల నుండి సా।। గం।। 04.00 ల వరకు
... A/c No:30733231487, IFSC Code: SBIN0011098, Name of the Bank, SBI, SARC, (HLC-1), Vijayawada, NTR District ... https://www.baanknet.com ... M/s PSB Alliance PVT Ltd., ... +91 8291220220 ... https://www.baanknet.com ... sbi.05252@sbi.co.in ... M/s.PRS Associates: 7013439314 ...
ప్రదేశం: విజయవాడ
తేది : 08-12-2025
సం/- అధీకృత అధికారి, భారతీయ స్టేట్ బ్యాంక్

ఇంట్లోకి చొరబడి సామగ్రి ధ్వంసం

మధురానగర్, న్యూస్‌టుడే : ఇంటి తాళాలు పగలకొట్టి.. సామాన్లు ధ్వంసం చేసిన భర్తపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. దేవీనగర్ 8వ లైనుకు చెందిన కాలే మౌనిక, గుట్టా రమేష్‌లు భార్యాభర్తలు. విబేధాల కారణంగా వీరిద్దరూ విడివిడిగా ఉంటున్నారు. భార్యను శారీరకంగా, మానసికంగా వేధిస్తుండడంతో.. రమేష్‌పై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు రెండు వేర్వేరు కేసులు నమోదు చేశారు. గత నెల 30న మౌనిక గుంటూరులో ఉన్న సోదరి ఇంటికి వెళ్లారు. ఈ నెల 6న తెలిసిన వ్యక్తి ఆమెకు ఫోన్ చేశారు. ఆమె ఇంటికి ఉన్న డిజిటల్ ఫింగర్ ప్రింట్ తాళాన్ని రమేష్ విరిచి, ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించి సామానంతా ధ్వంసం చేసినట్లు సమాచారం ఇచ్చారు. ఆమె హుటాహుటిన విజయవాడకు వచ్చారు. అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కార్యాలయంలో రూ.లక్ష నగదు చోరీ

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : గోపాలరెడ్డిరోడ్డులోని కార్యాలయంలో నగదు చోరీపై గవర్నర్‌పేట పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. శిఖామణి సెంటరుకు చెందిన గుంపల్ల రమణకిషోర్.. గోపాలరెడ్డిరోడ్డులో జయప్రద ఆటో సేల్స్ కార్పొరేషన్ నిర్వహిస్తున్నారు. ఈ నెల 5వ తేదీ రాత్రి షట్టర్ తాళాలు వేసి ఇంటికి వెళ్లారు. శనివారం వచ్చి చూడగా.. తాళాలు విరిచి ఉన్నాయి. దుకాణంలోని సొరుగులు తెరిచి ఉన్నాయి. అందులోని రూ.లక్ష నగదును చోరీ చేసినట్లు గుర్తించారు. దీనిపై గవర్నర్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. బీసెంట్‌రోడ్డుకు అత్యంత సమీపంలో ఉండే ఈ రహదారిలో అర్ధరాత్రి వేళల్లోనూ జన సంచారం ఉంటుంది. షట్టర్ తాళాలు పగలకొట్టి చోరీకి పాల్పడడంపై స్థానిక వ్యాపారులు బెంబేలెత్తిపోతున్నారు. పోలీసులు సైతం చోరీని గోప్యంగా ఉంచి దర్యాప్తు చేస్తున్నారు. ఇలాంటి ఘటనలు జరగకుండా నిఘా పెంచాలని స్థానికులు కోరుతున్నారు.

ఒప్పందానికి విరుద్ధంగా స్థలం కేటాయింపు

మధురానగర్, న్యూస్‌టుడే : ఒప్పందానికి విరుద్ధంగా నాసిరకం సామాగ్రి వినియోగించారని, నిబంధనల కన్నా తక్కువ స్థలం కేటాయించారంటూ ఓ వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు గుణదల పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. మేడసాని రవీంద్ర చౌదరికి గుణదల సర్వే నంబరు 113/2లో ఎకరం వ్యవసాయ భూమి ఉంది. దీనిని డెవలప్‌మెంట్ నిమిత్తం ఎస్ఎల్‌వీ డెవలపర్స్‌కు అప్పగించారు. నిర్మాణదారు.. రవీంద్రచౌదరికి, అతని బంధువుకు మూడు ఫ్లాట్లు కేటాయించారు. ఒప్పందానికి విరుద్ధంగా.. నిర్మాణంలో నాసిరకం సామాగ్రి వినియోగిస్తున్నట్లు గుర్తించారు. తమకు ఇవ్వాల్సిన స్థలం కన్నా తక్కువ స్థలం ఇస్తుండడంతో ప్రశ్నించారు. అక్టోబరు 21న ఎస్ఎల్‌వీ డెవలపర్స్ మేనేజింగ్ పార్టనర్స్ పెన్మత్స శ్రీనివాసరాజు, సాగి రంగరాజులు సిబ్బందితో.. తమ ఫ్లాట్‌లోకి అక్రమంగా ప్రవేశించి, రూ.4లక్షల విలువైన తలుపుల తాళాలను తీసుకెళ్లి పోయినట్లు రవీంద్రచౌదరి చెబుతున్నారు. దీనిపై వారిని ప్రశ్నించటంతో.. తనను చంపుతానని బెదరించారని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై గుణదల పోలీసులు ఈ నెల 5న కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

2027లో రై రై బుల్లెట్ రైల్

● అదే ఏడాది ఆగస్టులో ట్రయల్ రన్ ● గుజరాత్‌లో వేగంగా ప్రాజెక్టు పనులు ● ప్రతి స్టేషన్ నిర్మాణమూ ప్రత్యేకమే

గుజరాత్ నుంచి ఈనాడు ప్రత్యేక ప్రతినిధి

నిర్మాణంలో ఉన్న అహ్మదాబాద్ బుల్లెట్ ట్రైన్ స్టేషన్ ★ సబర్మతిలో నిర్మించిన మల్టీ ట్రాన్స్‌పోర్ట్ హబ్

దేశంలో మొదటి బుల్లెట్ ట్రైన్ పరుగులు పెట్టనున్న గుజరాత్‌లో ప్రాజెక్టు పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈ ట్రాక్ వెళ్లే అహ్మదాబాద్, సబర్మతిలలో స్టేషన్లను సంస్కృతి ప్రతిబింబించేలా అదే సమయంలో అత్యాధునిక వసతులు ఉండేలా తీర్చిదిద్దుతున్నారు. అహ్మదాబాద్-ముంబయి మధ్య నడవనున్న బుల్లెట్ రైలు.. 508 కిలోమీటర్ల దూరాన్ని 2 గంటల 7 నిమిషాల్లోనే చేరుకుంటుంది. దీనికి సంబంధించి 2027 ఆగస్టులో గుజరాత్‌లోని సూరత్-బిలిమోరా మధ్య 50 కి.మీ. దూరానికి ట్రయల్ చేపట్టనున్నట్టు నేషనల్ హైస్పీడ్ రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ అహ్మదాబాద్ సివిల్ పనుల విభాగం ప్రిన్సిపల్ చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ రాజేష్ అగర్వాల్ వివరించారు. ఈ ప్రాజెక్టు మొత్తం వ్యయం రూ.1.08 లక్షల కోట్లు కాగా గంటకు 350 కి.మీ. వేగంతో దూసుకుపోయే సామర్థ్యం ఈ బుల్లెట్ రైలుకు ఉంటుంది. అత్యాధునిక ట్రాక్‌తో పాటు మెట్రో, బస్సు, రైలు, బుల్లెట్ రైలు మార్గాలను అనుసంధానించేలా పూర్తి స్థాయి వసతులతో మొత్తం 12 స్టేషన్లు నిర్మిస్తున్నారు. సబర్మతిలో మల్టీమోడల్ ట్రాన్స్‌పోర్ట్ హబ్ నిర్మాణం ఇప్పటికే పూర్తయింది. ఇది 2026లో అందుబాటులోకి రానుందని రాజేష్ వివరించారు. అహ్మదాబాద్, సబర్మతిలలో కొన్ని చోట్ల పనులు ఇప్పటికే పూర్తికాగా, మరి కొన్నిచోట్ల వివిధ దశల్లో ఉన్నాయి. ఈనాడు ప్రతినిధి ఈ ప్రాజెక్ట్ పనులను క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు. వివరాలివీ....

అహ్మదాబాద్ బుల్లెట్ ట్రైన్ స్టేషన్

● అహ్మదాబాద్ బుల్లెట్ ట్రైన్ స్టేషన్ నిర్మాణాన్ని నగర సాంస్కృతిక, చారిత్రక వారసత్వం ప్రతిబింబించేలా రూపొందించారు. సుమారు 38,000 చదరపు మీటర్ల విస్తీర్ణంలో నేల పైనుంచి 33.7 మీటర్ల ఎత్తులో ఈ స్టేషన్ ఉంటుంది. ప్రస్తుతం నిర్మాణ పనులు సాగుతున్నాయి. ● ప్రయాణికుల సౌలభ్యం కోసం లాంజ్, మరుగుదొడ్లు, ఉద్యానవనాలు, వాణిజ్య దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. ● బుల్లెట్ ట్రైన్ స్టేషన్‌ను మెట్రో, ఆర్టీసీ, క్యాబ్ సర్వీసులతో అనుసంధానించేందుకు ఇంటిగ్రేటెడ్ భవనం నిర్మిస్తున్నారు. ● అహ్మదాబాద్ రైల్వే స్టేషన్‌తో పాటు బుల్లెట్ ట్రైన్ స్టేషన్ అనుసంధానం ఉంటుంది. ● ఇక్కడి నుంచి అహ్మదాబాద్ విమానాశ్రయం దాదాపు 10 కి.మీ, గీతా మందిర్ సెంట్రల్ బస్ స్టాండ్‌కు 3.5 కి.మీ. దూరంలోనే ఉంటాయి.

సబర్మతి బుల్లెట్ ట్రైన్ స్టేషన్

● సబర్మతి టెర్మినల్ స్టేషన్ మహాత్మా గాంధీ సబర్మతి ఆశ్రమంలోని చరఖా నుంచి ప్రేరణ పొందింది. ● ఈ స్టేషన్ మొత్తం నిర్మాణ విస్తీర్ణం: 45,094 చదరపు మీటర్లు కాగా భూమి నుంచి 44 మీటర్ల ఎత్తులో ఉంటుంది. నిర్మాణం కొనసాగుతోంది.

సబర్మతి మల్టీమోడల్ హబ్

● హై స్పీడ్ రైల్ మల్టీమోడల్ హబ్ ఒక ఆధునిక భవనం. సబర్మతి రైల్వే స్టేషన్లు, మెట్రో స్టేషన్, నిర్మాణంలో ఉన్న సబర్మతి బుల్లెట్ ట్రైన్ స్టేషన్, బస్ ర్యాపిడ్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్‌తో నిరంతర కనెక్టివిటీ అందించడానికి దీనిని డిజైన్ చేశారు. ● ఈ ప్రతిష్ఠాత్మక నిర్మాణం ముందు భాగం దండి మార్చ్ ఉద్యమాన్ని ప్రతిబింబిస్తుంది. ● ఈ భవన నిర్మాణం దాదాపుగా పూర్తయింది. ● ఆరు అంతస్తుల ఈ భవనంలో బ్యాంకెట్ హాళ్లు, కాన్ఫరెన్స్ రూమ్‌లు, స్విమ్మింగ్ పూల్, రెస్టారెంట్‌తో కూడిన హోటల్.. మొదలైనవి ఉంటాయి. ● పర్యావరణానికి హాని కలిగించని రీతిలో గ్రీన్ బిల్డింగ్‌గా ఈ హబ్‌ను తీర్చిదిద్దనున్నారు.

నేలపాలు చేసిన ద్రవ ఉక్కు

1,500 టన్నుల ద్రవ ఉక్కు నేలపాలు

ఉక్కునగరం (స్టీల్ సెక్టార్-3), న్యూస్‌టుడే: విశాఖ ఉక్కు కర్మాగారంలో సోమవారం 1,500 టన్నుల ద్రవ ఉక్కును నేలపాలు చేశారు. ఎస్ఎంఎస్-2లో 600 టన్నులు, బి.ఎస్ఎంఎస్-1లో 900 టన్నుల ద్రవ ఉక్కును ఇలా పారబోశారు. విశాఖ ఉక్కు యాజమాన్యం విలువైన ఉక్కును తుక్కు (ఫుల్) పేరుతో నేలపాలు చేస్తోందని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఉక్కు తయారీకి పంపకుండా ఫుల్ ఐరన్ పేరుతో తుక్కుగా మార్చడం తగదని అంటున్నాయి. ఫుల్ ఐరన్ తయారు చేయాలన్నా కమిటీ అనుమతులు ఉండాలని.. అది [illegible] ఇలా చేస్తున్నారని కార్మికులు ఆరోపణలు చేస్తున్నారు. ఎవరికి లబ్ధి చేకూర్చేందుకు ఈ విధంగా చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు.

కర్ణాటక సీఎంకు 'సుప్రీం' తాఖీదులు

ఈనాడు, బెంగళూరు: కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు సుప్రీంకోర్టు తాఖీదులు జారీ చేసింది. 2023లో విధానసభ ఎన్నికల సమయంలో మైసూరు జిల్లా వరుణ నియోజకవర్గం నుంచి సిద్ధరామయ్య గెలిచేందుకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 'గ్యారంటీ పథకాల భరోసా' కారణమని, అవి ఎన్నికల నియమావళిని ఉల్లంఘించడమేనని అభ్యంతరం తెలుపుతూ అదే నియోజకవర్గానికి చెందిన శంకర్ అనే ఓటరు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ధర్మాసనం వివరణ ఇవ్వాల్సిందిగా సిద్ధరామయ్యకు తాఖీదులు జారీ చేసింది. ఎన్నికల ముందు ఇచ్చే గ్యారంటీ హామీలు ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951 ప్రకారం అవినీతిగా పరిగణించాలని, మహిళలకు మాత్రమే బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించటం పురుషులపై వివక్షగా భావించాలని శంకర్ గతంలో కర్ణాటక హైకోర్టులో పిటిషన్ వేశారు. దీన్ని విచారించిన కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సునీల్‌దత్ యాదవ్.. పిటిషన్‌లో చట్టాలను ఉల్లంఘించేంత కారణాలేవీ లేవన్నారు. పార్టీ రూపొందించిన ఎన్నికల ప్రణాళికలకు ఓ అభ్యర్థిని ఎలా బాధ్యుడిని చేస్తామని ప్రశ్నించారు. ఇలాంటి పిటిషన్లు గతంలోనూ దాఖలైనట్లు గుర్తుచేస్తూ శంకర్ అభ్యంతరాలను కొట్టివేశారు. ఈ తీర్పును సవాలు చేస్తూ పిటిషనర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

మంత్రి నెహ్రూ అవినీతికి పాల్పడ్డారు

● కేసు నమోదు చేయండి ● తమిళనాడు డీజీపీకి ఈడీ లేఖ

చెన్నై (ప్యారిస్), న్యూస్‌టుడే: తమిళనాడు పురపాలక, నీటి సరఫరా శాఖల మంత్రి కేఎన్ నెహ్రూ రూ.1,020 కోట్ల మేర అవినీతికి పాల్పడ్డారని, ఆయనపై కేసు నమోదు చేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఆ రాష్ట్ర డీజీపీకి లేఖ రాసింది. అందులో.. మంత్రి కేఎన్ నెహ్రూ నిర్వహిస్తున్న శాఖల్లో భవనాలు, మరుగుదొడ్ల నిర్మాణం, పొరుగు సేవల నియామకం, నాబార్డ్ నిధులు, పారిశుద్ధ్య పనులకు సంబంధించిన ఒప్పందం, పారిశుద్ధ్య కార్మికుల గృహ నిర్మాణ ప్రాజెక్టులకు సంబంధించిన టెండర్లు, ఒప్పందాల్లో అవకతవకలు జరిగాయని తెలిపింది. టెండర్లు, ఒప్పందాలు ముందుగానే ఎవరికి ఇవ్వాలో నిర్ణయించి, ఒక్కో టెండరుకు 7.5 శాతం నుంచి 10 శాతం వరకు కమీషన్ తీసుకున్నారని, ఈ అవినీతి రూ.1,020 కోట్ల మేర జరిగినట్లు ఆరోపించింది. కమీషన్‌గా పొందిన నగదు విదేశాలకు హవాలా ద్వారా బదిలీ అయి ఉండొచ్చని పేర్కొంటూ 259 పేజీల పత్రాలను తమిళనాడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీలకు పంపింది. ఇందుకు సంబంధించి కేసు నమోదు చేయాలని కోరింది. మంత్రి కేఎన్ నెహ్రూపై అవినీతి ఆరోపణలు చేస్తూ కేసు నమోదు చేయాలంటూ డీజీపీకి ఈడీ రాసిన రెండో లేఖ ఇది కావడం గమనార్హం. ఇదివరకు ఆయన శాఖలోని ఖాళీల భర్తీలో భారీగా అవినీతి జరిగిందని, ఒక్కో పోస్టుకు రూ.25 లక్షల నుంచి రూ.35లక్షల వరకు లంచం తీసుకున్నారని ఆరోపణలు చేసింది.

పాతికేళ్ల ప్రతీకారం.. రియల్టర్ దారుణ హత్య

● వేటకొడవళ్లతో నరికి...

తుపాకీతో కాల్చిన ఆరుగురు..

హత్యకు గురైన వెంకటరత్నం

ఈనాడు-హైదరాబాద్, జవహర్‌నగర్, న్యూస్‌టుడే: స్థిరాస్తి వ్యాపారిని ఆటోతో గుద్దించి.. కత్తులతో విచక్షణ రహితంగా నరకడంతోపాటు తుపాకీతో కాల్చి మరీ హతమార్చిన ఉదంతంతో హైదరాబాద్ ఉలిక్కిపడింది. సుమారు 25 ఏళ్ల క్రితం జరిగిన తన తండ్రి ఎన్‌కౌంటర్‌కు ప్రతీకారంగా.. ఆయన కుమారుడు.. స్నేహితులతో కలిసి ఈ దారుణానికి ఒడిగట్టినట్లు, అనంతరం పోలీసులకు లొంగిపోయినట్లు సమాచారం. సోమవారం తెల్లవారుజామున మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిందీ దారుణం.

ఆటోతో ఢీకొట్టి.. కిరాతకంగా హత్య

ఏపీలోని కృష్ణా జిల్లా మైలవరానికి చెందిన గంటా వెంకటరత్నం(54).. ముప్పై ఏళ్లకు పూర్వమే హైదరాబాద్ వచ్చాడు. చాలా కాలంగా స్థిరాస్తి వ్యాపారం చేస్తున్నాడు. ఐదేళ్లుగా జవహర్‌నగర్ ఠాణా పరిధి సాకేత్ కాలనీలో నివసిస్తున్నాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు. ఎప్పటిలానే సోమవారం ఉదయం కుమార్తెను అదే కాలనీలోని స్కూల్ దగ్గర వదిలిపెట్టాడు. ఉదయం 7.55 గంటల సమయంలో ఇంటికి తిరిగి వెళ్తుండగా.. ద్విచక్రవాహనంపై ఇద్దరు, ఆటోలో నలుగురు వెంబడించారు. తొలుత వెంకటరత్నం ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనాన్ని రాంగ్ రూట్‌లో వచ్చి ఆటోతో ఢీకొట్టారు. కిందపడిపోయిన ఆయన తేరుకునేలోపే.. వేటకొడవళ్లతో మెడ, తల, ఇతర శరీరభాగాలపై దాదాపు 25 సార్లు నరికారు. తర్వాత సమీపంలోని బండరాయి తీసుకొచ్చి తలపై మోదారు. ఇదంతా జరుగుతుండగానే.. నిందితుల్లో ఒకడు తుపాకీతో ఒక రౌండు కాల్చడంతో వెంకటరత్నం అక్కడికక్కడే మృతి చెందాడు. హత్యోదంతం.. అనంతరం నిందితులు అక్కణ్నుంచి పరారైన దృశ్యాలు సమీపంలోని సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. జవహర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదయ్య, మల్కాజిగిరి డీసీపీ శ్రీధర్ ఘటనాస్థలిని సందర్శించారు. ఘటనా స్థలంలో పడి ఉన్న తూటా, వేట కొడవలిని స్వాధీనం చేసుకున్నారు. హత్య జరిగిన తర్వాత నిందితులు సౌత్‌వెస్ట్ జోన్ డీసీపీ కార్యాలయంలో లొంగిపోయినట్లు విశ్వసనీయంగా తెలిసింది.

పాతకక్షల కారణంగానే..: పాతకక్షల కారణంగానే హత్య చేసినట్లు ప్రధాన నిందితుడు, నగరంలోని జుమ్మెరాత్‌బజార్‌కు చెందిన చందన్‌సింగ్(33) చెప్పినట్లు సమాచారం. ఆ ప్రకారం..'చందన్‌సింగ్ తండ్రి సుదేశ్‌సింగ్ రౌడీషీటర్. పాతికేళ్ల క్రితం నగరంలో భూదందాలు, సెటిల్‌మెంట్లు చేసే వాడు. అప్పట్లో వెంకటరత్నం ఆయనకు ప్రధాన అనుచరుడిగా ఉండేవాడు. సుదేశ్‌సింగ్ 2001 ఏప్రిల్‌లో జరిగిన పోలీస్ ఎన్‌కౌంటర్‌లో మరణించాడు. వెంకటరత్నం పోలీస్ ఇన్‌ఫార్మర్‌గా వ్యవహరించడమే తన తండ్రి మరణానికి కారణమని భావించిన చందన్‌సింగ్ పగ పెంచుకున్నాడు. ఈ క్రమంలోనే తన స్నేహితులైన వడ్డే వెంకటనారాయణ(39), కె.నరేశ్‌కుమార్(28), ఈషాన్‌శర్మ(19), ఎన్.పవన్‌కుమార్(20), నర్సింగ్(26) సాయంతో హత్యకు ప్రణాళిక రచించాడు.

రెరాపై నెలకో ఉమ్మడి జిల్లాలో అవగాహన సదస్సు

● 10న తిరుపతిలో శ్రీకారం

● ఏపీ రెరా ఛైర్మన్ శివారెడ్డి వెల్లడి

ఈనాడు, అమరావతి: రెరా చట్టంపై బిల్డర్లు, కొనుగోలుదారులకు అవగాహన కల్పించేందుకు నెలకో ఉమ్మడి జిల్లాలో సదస్సులు నిర్వహించనున్నట్లు ఏపీ రెరా ఛైర్మన్ ఎ.శివారెడ్డి తెలిపారు. ఈనెల 10న తిరుపతిలో మొదటి సదస్సు జరగనుందని ఆయన చెప్పారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని అన్ని పుర, నగరపాలక సంస్థల పరిధిలోని బిల్డర్లు, కొనుగోలుదారులు, సంబంధిత ప్రభుత్వశాఖల అధికారులను ఆహ్వానిస్తున్నామని వివరించారు. విజయవాడలోని రెరా కార్యాలయాన్ని రాజధాని అమరావతిలో కొత్తగా ప్రారంభించిన సీఆర్‌డీఏ కార్యాలయం ప్రాంగణంలోకి తరలించిన విషయం తెలిసిందే. కొత్త కార్యాలయంలో డైరెక్టర్లతో కలిసి ఛైర్మన్ శివారెడ్డి సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'ఇళ్లు, స్థలాల కొనుగోలుదారులకు రెరా చట్టం కల్పిస్తున్న హక్కులపై ఇంకా అవగాహన అవసరం. బిల్డర్లు, లేఔట్‌లు వేసే వారికి కూడా కొత్తగా ప్రారంభించే ప్రాజెక్టులకు రెరా రిజిస్ట్రేషన్ తప్పనిసరన్న విషయంపై అవగాహన కల్పించాలన్న ఉద్దేశంతో సదస్సులు నిర్వహించాలని నిర్ణయించాం' అని ఛైర్మన్ వివరించారు.

సాధ్యంకాని హామీలు ఇవ్వొద్దు..

'బిల్డర్లు ఎంత చేయగలరో ఆ మేరకే బ్రోచర్లలో ముద్రించాలి. ఎక్కువ చేస్తామని చెప్పి చేయకపోతే తర్వాత ఇబ్బందుల్లో పడతారు. సాధ్యంకాని హామీలు ఇవ్వొద్దు. ప్రాజెక్టుల పనులు గడువులోగా పూర్తి చేయాలి. కొనుగోలుదారులకు నష్టం జరిగితే ఎట్టి పరిస్థితుల్లోనూ విడిచిపెట్టేది లేదు. ప్రాజెక్టుల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి బిల్డర్లు అన్ని దస్తావేజులు పక్కాగా అప్‌లోడ్ చేస్తే ..గంట వ్యవధిలో రిజిస్ట్రేషన్లు పూర్తి చేయడానికి సిద్ధంగా ఉన్నాం' అని శివారెడ్డి అన్నారు.

ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయొచ్చు

ఇళ్లు, స్థలాల కొనుగోలుదారులు నష్టం జరిగిందని భావిస్తే... ఏపీ రెరాకు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయొచ్చు. కార్యాలయం అమరావతికి మార్చినా ఫిర్యాదుదారులకు ఎలాంటి ఇబ్బంది లేదు. బాధితులకు న్యాయం చేయడానికే ప్రయత్నిస్తాం. మహారాష్ట్ర, దిల్లీ, గుజరాత్ రాష్ట్రాల్లో రెరాలో అమలు చేస్తున్న ఉత్తమ విధానాలపై అధ్యయనం కోసం త్వరలో వెళ్లనున్నాం. వాటిలో ముఖ్యమైనవి రాష్ట్రంలోనూ అమలు చేయడానికి ప్రయత్నిస్తాం' అని శివారెడ్డి తెలిపారు. 'ఈ ఏడాది సెప్టెంబరు 17న బాధ్యతలు చేపట్టిన నుంచి ఇప్పటివరకు 270 కొత్త స్థిరాస్తి వ్యాపార ప్రాజెక్టులకు అత్యంత పారదర్శకంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేశాం. కొనుగోలుదారుల ఫిర్యాదులపై విచారణకు గురు, శుక్రవారాల్లో రెండు రోజులపాటు బెంచ్ భేటీ అవుతోంది. గతంలో వారంలో ఒక రోజే ఉండేది' అని రెరా డైరెక్టర్ దామచర్ల శ్రీనివాసరావు వివరించారు. డైరెక్టర్లు కామేశ్వరరావు, కులదీప్, జగన్నాథరావు, వెంకటరత్నంతోపాటు రెరా పట్టణ ప్రణాళిక విభాగం డైరెక్టర్ నాగసుందరి పాల్గొన్నారు.

హస్త కళాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం

కొండపల్లి బొమ్మను పరిశీలిస్తున్న పసుపులేటి హరిప్రసాద్ తదితరులు

విజయవాడ (గాంధీనగర్), న్యూస్‌టుడే : తెలుగు నేల సాంస్కృతిక సౌరభాలకు నెలవు. హస్తకళలు, కళాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ పసుపులేటి హరిప్రసాద్ అన్నారు. ఈ నెల 8వ తేదీ నుంచి 14 వరకు జాతీయ హస్తకళా వారోత్సవాల్లో భాగంగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సోమవారం గాంధీనగర్‌లోని లేపాక్షి ఎంపోరియాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. ఏపీహెచ్‌డీసీ ఆధ్వర్యంలో ఈ నెల 10న వైఎస్ఆర్ కడప జిల్లా ఓనిపెంటలో గురుశిష్య హస్త శిల్ప్ ప్రశిక్షణ్ ప్రోగ్రామ్ (జీఎస్‌హెచ్‌పీపీ) ద్వారా ఇత్తడి, కంచు లోహపు హస్తకళాకారులకు శిక్షణ ప్రారంభమవుతుందన్నారు. ఈ నెల 12న పల్నాడు జిల్లా దుర్గిలో కళాకారులకు డిజైన్ అభివృద్ధిపై కార్యశాల, 13న శ్రీకాళహస్తిలో కలప, చెక్క కళాకారులకు టూల్ కిట్ల పంపిణీ, 14న అనకాపల్లి జిల్లా కె.డి.పేటలో కళాకారులకు టూల్‌కిట్ల పంపిణీ, డిసెంబరు 15-21 తేదీల్లో రాజమహేంద్రవరంలో గాంధీ శిల్ప్ బజార్ నిర్వహణ, 17న నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో శిల్పకళాకారులకు టూల్‌కిట్ల పంపిణీ ఉంటుందని వివరించారు. డిసెంబరు 9న దిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో భారత ప్రభుత్వ జౌళి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 2023, 2024 సంవత్సరాలకు సంబంధించి హస్తకళా అవార్డుల ప్రదానోత్సవం జరగనుందని తెలిపారు. ఇందులో రాష్ట్రానికి చెందిన ముగ్గురు కళాకారులు అవార్డులు అందుకోనుండడం గర్వకారణమన్నారు. డి.శివమ్మ (తోలుబొమ్మలాట, శిల్పగురు అవార్డు), గోర్స సంతోష్ (ఏటికొప్పాక బొమ్మలు, జాతీయ అవార్డు 2024), పి.విజయలక్ష్మి (కలంకారి హ్యాండ్ పెయింటింగ్, జాతీయ హస్తకళా అవార్డు 2023)లు రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డులు అందుకోనున్నట్లు వివరించారు. రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ వీసీ అండ్ ఎండీ ఎం.విశ్వ, లేపాక్షి ఓఎస్‌డీ ఐ.వి.లక్ష్మీనాథ్, ఎంపోరియం మేనేజర్ ఎం.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

9 నుంచి లారీ యజమానుల సమ్మె

ఆటోనగర్, న్యూస్‌టుడే: రవాణా వాహనాలపై ఫిట్‌నెస్ ఛార్జీలను పాత విధానంలోనే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 9వ తేదీ అర్ధరాత్రి నుంచి లారీలను నిలిపివేసి సమ్మె చేపడుతున్నట్లు న్యూ ఆంధ్రా మోటార్ ట్రక్కర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొడ్డ శేషగిరి ప్రకటనలో తెలిపారు. రాష్ట్రానికి ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న రవాణా రంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందన్నారు. ఫిట్‌నెస్ ఛార్జీల పెంపుతో నిత్యావసర వస్తువుల ధరలు పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. రవాణా ఛార్జీలు పెరగడం వల్ల వ్యవసాయ వ్యయాలతో పాటు నిత్యావసర సరకుల ధరలు అధికమవుతాయన్నారు. గతంలో రూ.900 నుంచి రూ.1400 వరకు మాత్రమే ఉండే ఫిట్‌నెస్ ఛార్జీలు.. ప్రస్తుతం మూడు రెట్లు పెరగడంతో లారీ యజమానులపై తీవ్రమైన ఆర్థికభారం పడుతుందన్నారు. రోడ్ల పరిస్థితి దారుణంగా ఉందని, గుంతలు ఉన్న రోడ్ల కారణంగా వాహనాలు తరుచూ మరమ్మతులకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ రహదారుల పక్కనే సర్వీస్ రోడ్ల నిర్మాణం చేపడితే రోడ్డు ప్రమాదాలు గణనీయంగా తగ్గుతాయన్నారు. కౌంటర్ సిగ్నేచర్ ఫైల్‌ను తెలంగాణ ప్రభుత్వం మూడేళ్లలో ఆమోదించి పంపిందని కానీ ఆ ఫైల్ గత ఎనిమిదేళ్లుగా ఏపీ రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి వద్ద పెండింగ్‌లోనే ఉందని బొడ్డ శేషగిరి గుర్తుచేశారు.

బీడీఎస్ యాజమాన్య ప్రవేశాలకు ఫ్రీ ఎగ్జిట్

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: 2025-26 విద్యా సంవత్సరానికి రాష్ట్రంలో పలు ప్రైవేటు దంత వైద్య కళాశాలల్లో అందుబాటులో ఉన్న బీడీఎస్ యాజమాన్య కోటా సీట్ల ప్రవేశానికి సంబంధించి మొదటి రెండు విడతల్లో సీటు పొందిన అభ్యర్థులకు విజయవాడ డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం 'ఫ్రీ ఎగ్జిట్' ఆప్షన్ ఇచ్చింది. అభ్యర్థులు ఈనెల 10వ తేదీ మధ్యాహ్నం రెండు గంటల్లోగా తమ ఆప్షన్‌ను సంబంధిత దంత కళాశాలల ప్రిన్సిపల్స్‌కు తెలియజేయాల్సి ఉంటుందని రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి తెలిపారు.

పోలీసుల వైఖరిపై భవానీల ఆగ్రహం

రహదారిపై బైఠాయించి భజన చేస్తున్న దీక్షాధారులు

కృష్ణలంక, న్యూస్‌టుడే: దీక్షలో ఉన్న తమపై అనుచితంగా ప్రవర్తించిన పోలీసులు క్షమాపణ చెప్పాలంటూ భవానీలు కృష్ణలంక జాతీయ రహదారిపై బైఠాయించారు. కంకిపాడుకు చెందిన సుమారు 20 మంది భవానీలు సోమవారం రెండు ఆటోల్లో చద్ది నిమిత్తం గుంటూరు జిల్లా తాడేపల్లికి బయలు దేరారు. ఆటోలు తాడిగడప 100 అడుగుల రోడ్డుకు చేరుకునే సరికి వెనుకగా ద్విచక్ర వాహనంపై వెళుతున్న మఫ్టీలో ఉన్న ఏఆర్ కానిస్టేబుల్ ఒకరు ఆటో వెనుక భాగంలో అజాగ్రత్తగా కూర్చున్న పిల్లలను గమనించి వారిని సరిగ్గా కూర్చోపెట్టాల్సిందిగా ఆటో డ్రైవర్‌కు సూచించారు. అదే వ్యక్తి ఆటోను వెంబడించి కానూరు వీఆర్ సిద్ధార్థ కళాశాల వద్దకు ఆటో చేరుకున్న క్రమంలో ద్విచక్ర వాహనాన్ని ఆటో ముందు నిలుపుదల చేసి ఫొటో తీయడంతో భవానీలు కిందకు దిగి ఫొటో ఎందుకు తీశారంటూ గొడవకు దిగి చరవాణిని లాక్కొని నేలకేసి కొట్టి అక్కడ నుంచి వెళ్లిపోయారు. సదరు వ్యక్తి బెంజిసర్కిల్ వద్ద ట్రాఫిక్ పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఆటోను ఆపడంతో ఆటో దిగిన భవానీలు పోలీసులతో గొడవకు దిగడంతో వారిని అక్కడి నుంచి పంపించి వేశారు. కొద్దిసేపటికి స్క్యూబ్రిడ్జి వద్ద ఆటోలను ట్రాఫిక్ పోలీసులు నిలుపుదల చేయడంతో తామేం తప్పు చేయకున్నా దీక్షలో ఉన్న తమను కించపరిచే విధంగా మూడుసార్లు తమ ఆటోలను ఆపిన పోలీసులు అనుచితంగా ప్రవర్తించారంటూ జాతీయ రహదారిపై బైఠాయించి భజన చేశారు. అదే సమయంలో వారిలో ఒక బాలిక ఈ తతంగాన్ని ఫోన్‌లో వీడియో తీస్తుండడాన్ని గమనించి పోలీసుల్లో ఒకరు ఫోన్‌ను లాక్కుని నేలకేసి కొట్టడంతో ఆగ్రహానికి లోనైన భవానీలు పోలీసులు తమకు క్షమాపణ చెప్పాలని.. అప్పటి వరకూ ఇక్కడి నుంచి కదిలేది లేదంటూ పట్టుబట్టారు. దీంతో బెంజిసర్కిల్ వైపు నుంచి వచ్చే వాహనాలు పెద్ద సంఖ్యలో నిలిచి ట్రాఫిక్ నిలిచింది. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న ఏసీపీలు దామోదర్, పావన్ కుమార్, సీఐలు నాగరాజు, పవన్‌కిషోర్, బాల మురళీకృష్ణ తదితరులు వారికి సర్దిచెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

ఖరీదైన బైక్‌లే లక్ష్యంగా చోరీలు

ఐదుగురి అరెస్టు, 15 ద్విచక్ర వాహనాల స్వాధీనం

నిందితులంతా నల్గొండ జిల్లా వారే

నందిగామ, న్యూస్‌టుడే

పట్టుబడిన ద్విచక్ర వాహనాలు, నిందితులతో డీసీపీ లక్ష్మీనారాయణ, ఏసీపీ తిలక్, సీఐ వైవీవీఎల్ నాయుడు

వ్యసనాలకు బానిసలైన యువకులు ఖరీదైన బైక్‌లే లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలోనే రెండు తెలుగు రాష్ట్రాల్లో ద్విచక్ర వాహనాలను చోరీ చేసి వాటిని విక్రయించి తాకట్టు పెడుతున్నారు. వీరంతా తెలంగాణ రాష్ట్రంలోని నల్గొండ జిల్లాకు చెందిన వారే. ఎన్టీఆర్ జిల్లా నందిగామ పోలీసులు నందిగామ వై.జంక్షన్ వద్ద ఆదివారం ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు. వీరి వద్ద 15 ఖరీదైన బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. వీటిని కొనుగోలు చేసిన మరికొందర్ని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. ఈ కేసు వివరాలను నందిగామ పోలీస్ స్టేషన్‌లో సోమవారం డీసీపీ లక్ష్మీనారాయణ విలేకరులకు వెల్లడించారు.

నందిగామ పోలీస్ స్టేషన్ పరిధిలో గత 20 రోజుల వ్యవధిలో ఐదు బైక్‌లు చోరీ చేశారు. పోలీస్ కమిషనర్ రాజశేఖర్‌బాబు ఆదేశాల మేరకు ఏసీపీ బాలగంగాధర్ తిలక్, సీఐ వైవీవీఎల్ నాయుడు, పోలీసులు దర్యాప్తు చేశారు. దీనిలో భాగంగా నందిగామ వై.జంక్షన్ వద్ద ఎస్సైలు మోహనరావు, సూర్యవంశీలు వాహనాలు తనిఖీ చేశారు. ఈ సమయంలో పోలీసులను చూసి నిందితులు తప్పించుకోవడానికి ప్రయత్నించగా వెంటాడి పట్టుకున్నారు. వీరి వద్ద నుంచి నందిగామ పోలీస్ స్టేషన్ పరిధిలోని 5, పల్నాడు జిల్లా పిడుగురాళ్ల, నరసరావుపేట, పెనమలూరు, కృష్ణలంక, రెంటచింతల పోలీస్ స్టేషన్‌ల పరిధిలో 5, ఇతర ప్రాంతాల్లో మరో 5 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.26 లక్షలు ఉంటుందని డీసీపీ తెలిపారు.

నందిగామ కోర్టులో హాజరు

బైక్‌ల చోరీ కేసులో నల్గొండ జిల్లా తిప్పర్తి మండలం ఇండ్లూరుకు చెందిన ఏపూరి శివ, నకిరికల్ మండలం చీమలగడ్డకు చెందిన కర్రి మహేంద్ర, నకిరికల్ పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన కంచుకొమ్మల సంజయ్‌కుమార్, దామచర్ల మండలానికి చెందిన ఊదర సంతోష్, నకిరికల్ మండలం చీమలిగడ్డకు చెందిన మేడిపల్లి ఉమేష్‌లను అరెస్టు చేశారు. వీరిని నందిగామ కోర్టులో న్యాయమూర్తి ముందు హాజరుపరుస్తామని డీసీపీ తెలిపారు. దొంగలను పట్టుకుని బైక్‌లు రికవరీ చేసిన నందిగామ ఎస్సైలు మోహనరావు, సూర్యవంశీ, తొమ్మిది మంది పోలీసులను డీసీపీ లక్ష్మీనారాయణ అభినందించారు. అనంతరం రివార్డులు అందజేశారు.

మావోయిస్టులకు న్యాయ సహాయంపై పిటిషన్

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : కృష్ణా జిల్లా పెనమలూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో పట్టుబడిన 26 మంది మావోయిస్టులకు న్యాయ సహాయం అందించేందుకు వారితో మాట్లాడాలని, దీనికి అనుమతి ఇవ్వాలని కోరుతూ బెజవాడ బార్ అసోసియేషన్ మానవ హక్కుల కమిటీ న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేసింది. మానవ హక్కుల కమిటీ సభ్యులు పిచుక శ్రీనివాస్, వేముల రవీంద్రనాథ్, సతీష్, ఎ.ఎస్.ఎస్.రాంప్రసాద్, గంగాభవానీ, ఆంజనేయులు తదితరులు జైలులో ఉన్న ముద్దాయిలను కలుసుకునేందుకు అనుమతి కోరుతూ విజయవాడలోని 6వ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. గత నెల 18న హిడ్మా మరి కొంత మంది మావోయిస్టులు మారేడుమిల్లి అడవుల్లో ఎదురు కాల్పుల్లో చనిపోయారు. వారికి రక్షణ వలయంగా ఉన్న సెక్యూరిటీ దళ సభ్యులు కానూరులో షెల్టర్ తీసుకున్నారు. మొత్తం 26 మంది మావోయిస్టులను పెనమలూరు పోలీసులు అరెస్టు చేయగా.. వారు రాజమహేంద్రవరం జైలులో రిమాండ్‌లో ఉన్నారు. వీరి కుటుంబ సభ్యులకు కేసు వివరాలు చెప్పలేదని, జైలులో ఉన్న వారికి న్యాయ సాయం అందలేదని పిచుక శ్రీనివాస్ తెలిపారు. ఈ నేపథ్యంలో బీబీఏ తరఫున న్యాయ సహాయం అందించేందుకు.. వారితో మాట్లాడేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ సోమవారం పిటిషన్ దాఖాలు చేశారు.

పటమట కేసులో... పటమట పోలీస్‌స్టేషన్ పరిధిలో పట్టుబడి నెల్లూరు కారాగారంలో ఉన్న నలుగురు మావోయిస్టులకు న్యాయ సహాయం అందించేందుకు 4వ ఏసీజేఎం కోర్టులో ఇప్పటికే పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ అనంతరం ఈ నెల 10వ తేదీకి వాయిదా వేస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు.

నకిలీ మద్యం కేసులో నలుగురు నిందితులకు కస్టడీ

ఈనాడు - అమరావతి: నకిలీ మద్యం కేసులో నలుగురు నిందితులను కోర్టు కస్టడీకి ఇచ్చింది. ములకలచెరువు నకిలీ మద్యం కేసులో అరెస్టు అయిన కట్టా రాజు, సయ్యద్ హాజీ, అంతదాస్, మిథున్‌దాస్‌లను నాలుగు రోజులు కస్టడీకి ఇస్తూ విజయవాడ ఎక్సైజ్ కోర్టు సోమవారం సాయంత్రం తీర్పు ఇచ్చింది. వీరిపై ఇటీవల ఎక్సైజ్ పోలీసులు పీటీ వారెంట్‌పై హాజరుపరిచిన సంగతి తెలిసిందే. నలుగురు నిందితులను 10 రోజుల కస్టడీకి ఇవ్వాలని ఇటీవల పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై న్యాయస్థానం తీర్పు వెలువరించింది. ఈనెల 11 నుంచి 15 వరకు కస్టడీకి అనుమతిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రోనక్ పిటిషన్‌పై జైలు అధికారుల కౌంటర్

ఈనాడు - అమరావతి: ఇంటి నుంచి భోజనానికి అనుమతించాలని మద్యం కేసులో నిందితుడు రోనక్ వేసిన పిటిషన్‌పై సోమవారం జైలు అధికారులు కౌంటర్ దాఖలు చేశారు. తమ ఆచారాల మేరకు ఉల్లిపాయలు తినే అలవాటు లేదనీ, ఇంటి నుంచి భోజనానికి అనుమతించాలని రోనక్ పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. దీనిపై గుంటూరు జైలు అధికారులు కౌంటర్ దాఖలు చేశారు. తదుపరి విచారణ కోసం ఈనెల 10వ తేదీకి న్యాయాధికారి భాస్కరరావు వాయిదా వేశారు.

10న బాక్సింగ్ జట్ల ఎంపికలు

విజయవాడ క్రీడలు: ఎన్టీఆర్ జిల్లా బాక్సింగ్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీన స్థానిక ఆంధ్రా లయోలా కళాశాల ఇండోర్ స్టేడియంలో జిల్లా సీనియర్ (స్త్రీ, పురుషుల), యూత్(బాలికల) బాక్సింగ్ జట్ల ఎంపికలు నిర్వహిస్తామని ఆ సంఘం కార్యదర్శి వైవీఎస్ ఉమామహేశ్వరరావు తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు ఆధార్‌కార్డు, పుట్టిన తేదీ ధ్రువపత్రంతో అదే రోజు ఉదయం 8 గంటలకు ఇండోర్ స్టేడియంలో రిపోర్టు చేయాలన్నారు. ఎంపికైన పురుషుల జట్టు ఈ నెల 13, 14వ తేదీల్లో నగరంలో జరిగే రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల సీనియర్ పురుషుల బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో, మహిళలు, యూత్ బాలికలు ఈ నెల 20, 21వ తేదీల్లో పిఠాపురంలో జరిగే రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల మహిళల, యూత్ బాలికల బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో తలపడతారని పేర్కొన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు మరిన్ని వివరాలకు కోచ్ జె.రాజు ఫోన్ 91103 72647 నంబరుపై సంప్రదించాలన్నారు.

ప్రతిభావంతులకు జూడో జట్లలో స్థానం

క్రీడాకారులతో కమిటీ సభ్యులు, జిల్లా సంఘాల ప్రతినిధులు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: కండ్రికలోని ఏఆర్ స్పోర్ట్స్ అకాడమీలో జరిగిన కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల క్యాడెట్(అండర్-18), జూనియర్(అండర్-21) బాలబాలికల జూడో జట్ల ఎంపిక పోటీల్లో పలువురు క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇందులో ప్రతిభ చూపిన క్రీడాకారులను ఆయా జిల్లా జట్లకు ఎంపిక చేశామని ఎన్టీఆర్ జిల్లా జూడో సంఘం కార్యదర్శి ఎన్.పవన్ సందీప్, కృష్ణా జిల్లా సంఘం కార్యదర్శి నామిశెట్టి వెంకట్, కార్యనిర్వాహక కార్యదర్శి ఎంఎల్ ఉషారాణిలు సోమవారం తెలిపారు. క్యాడెట్ విభాగంలో ఎంపికైన 16 మంది, జూనియర్ విభాగంలో ఎంపికైన 16 మంది బాలబాలికలు ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు కర్నూలులో జరిగే రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల కేడెట్, జూనియర్ బాలబాలికల జూడో ఛాంపియన్‌షిప్‌లో ఆయా జిల్లా జట్లకు ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు.

(c) eenadu

ప్రయాణానికి రాజమార్గం

నక్కపల్లి, న్యూస్‌టుడే

యాప్‌తో తగ్గనున్న టోల్ ఫీజు

అనకాపల్లికి చెందిన కుమార్ కారులో తుని వెళ్లి వస్తే నక్కపల్లి మండలం కాగిత టోల్‌ప్లాజా ఫీజు రూ.225 ఫాస్టాగ్ నుంచి కట్ అయింది. అడ్డురోడ్డుకు చెందిన నాగేశ్వరరావు జీపులో రాజమహేంద్రవరం వెళ్లి రాగా రెండు టోల్‌ప్లాజాల్లో కలిపి రూ.60 మాత్రమే చెల్లింపు జరిగింది. ఈయన ఫాస్టాగ్‌తోపాటు రాజ్‌మార్గ్ యాత్ర యాప్‌ను వినియోగిస్తుండటంతో ఈ వెసులుబాటు కలిగింది.

జాతీయ రహదారిపై ప్రతి 80 కిలోమీటర్లకు ఓ టోల్‌గేట్‌ను దాటాల్సి ఉంటుంది. ఈ క్రమంలో సగటున కారు, జీపు అయితే రూ.140 వరకు ఫీజు రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. ఈ భారం తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం రాజ్‌మార్గ్ యాత్ర యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ యాప్ ద్వారా నిర్దేశించిన వాహన యజమానులకు ఆర్థికంతా ఊరట లభిస్తోంది.

యాప్ వినియోగించుకోవాలంటే..

- సొంత అవసరాల నిమిత్తం తిరిగే కార్లు/జీపులు/వ్యాన్‌లకు మాత్రమే ఉపయోగపడుతుంది. (వైట్ నంబర్ ప్లేట్)
- ఫాస్టాగ్ ఉన్న వారు తమ స్మార్టు ఫోన్‌లో ప్లేస్టోర్‌కు వెళ్లి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఇందులో వాహన నంబరు వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది. రవాణా శాఖ నుంచి వాణిజ్యేతర వాహనాల వివరాలను తీసుకుని కేంద్రం యాప్‌లో అప్‌డేట్ చేసింది. తనుగుణంగా ఉన్న వాహనాల వివరాలే ఇందులో నమోదవుతాయి.

- **అర్హత పొందిన వారు ఒకేసారి రూ.3 వేలు ఆన్‌లైన్‌లో రీఛార్జి చేసుకుంటే ఏడాది కాలంలో 200 సార్లు దేశ వ్యాప్తంగా ఏ జాతీయ రహదారి, జాతీయ ఎక్స్‌ప్రెస్ వే టోల్‌గేట్ల నుంచి రాకపోకలు సాగించొచ్చు. టోల్‌ప్లాజాను ఓసారి దాటితే రూ.15 మాత్రమే కట్ అవుతుంది.**
- గడువులోగా 200 ట్రిప్పులు పూర్తయితే మళ్లీ రీఛార్జ్ చేసుకోవచ్చు.
- టోల్‌ప్లాజా దాటిన తర్వాత ఇంకా ఎన్నిసార్లు రాకపోకలు సాగించవచ్చనే విషయాన్ని తెలుపుతూ సెల్‌ఫోన్‌కు సమాచారం వస్తుంది.
- రాష్ట్ర రహదారి టోల్‌గేట్ల నుంచి వెళ్లేవారు కచ్చితంగా ఫాస్టాగ్‌లో కొంత సొమ్మును నిల్వ ఉంచుకోవాలి. వీటికి రాజ్‌మార్గ్ యాత్ర యాప్ వర్తించదు. ఒకవేళ ఫాస్టాగ్‌లో సొమ్ము లేకుండా దాటితే ఆ మొత్తం రాజ్‌మార్గ్ యాత్ర యాప్ నుంచి మినహాయింపు జరిగి బ్లాక్ లిస్టులోకి వెళ్తుంది.

రాజ్‌మార్గ్ యాత్ర యాప్

గెడ్డపాలెం కొండపై బుద్ధుడి విగ్రహం

బయటపడిన విగ్రహం

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: ఎస్.రాయవరం మండలం గెడ్డపాలెంలో శివాలయం సమీపంలోని కొండపై బుద్ధుడి రాతి విగ్రహం, గుహ బయటపడ్డాయి. విశ్రాంత ఉపాధ్యాయుడు బాదనపల్లి జోగినాయుడు అందించిన సమాచారంతో పురావస్తు శాఖ అధికారి విశ్వేశ్వరరావు, సాంకేతిక సహాయకుడు శ్రీనివాసరావు సోమవారం స్థానికులతో కలిసి కొండపై విగ్రహాలను పరిశీలించారు. పూర్తిస్థాయిలో పరిశోధన చేసి ప్రభుత్వానికి నివేదిక పంపుతామన్నారు. తెదేపా నాయకులు ఎరకయ్య, సత్యనారాయణ, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

పగలు సేకరణ.. రాత్రుళ్లు రవాణా!

ఈనాడు డిజిటల్ అనకాపల్లి, ఎలమంచిలి న్యూస్‌టుడే

కాకినాడకు తరలుతున్న రేషన్ బియ్యం

జిల్లాలో రేషన్ బియ్యం అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. ప్రజాప్రతినిధులు, పోలీసులు తప్పితే.. అక్రమ రవాణాను అరికట్టాల్సిన పౌరసరఫరాల శాఖ అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. పేదలకు అందాల్సిన చౌక బియ్యాన్ని పక్కదారి పట్టిస్తూ అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. ప్రతి నెలా రేషన్ బియ్యం లబ్ధిదారుల ఇళ్లకు చేరక ముందే అక్రమార్కుల పరమవుతోంది. జిల్లా వ్యాప్తంగా ఈ దందాను కట్టడి చేయాల్సిన సంబంధిత అధికారులే దళారులకు సహకరిస్తున్నారన్న విమర్శలున్నాయి.

■ ప్రతి మండలంలోనూ రేషన్ బియ్యం కొనుగోలు చేసేందుకు ముఠాలున్నాయి. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా.. వీరి హవానే సాగుతోంది. చోడవరం, ఎలమంచిలి, రాంబిల్లి, అచ్యుతాపురం మండలాల్లో వీరికి ఎదురే లేదు. ఆయా మండలాల్లో రేషన్ బియ్యాన్ని దళారులే కొనుగోలు చేయాలన్న ఆదేశాలున్నాయి. పగలు దండటం, సమీపంలోని రైస్ మిల్లుల్లో నిల్వ చేయడం చేస్తున్నారు. అర్ధరాత్రి సమయంలో లోడ్ చేసి కాకినాడ పోర్టుకు తరలిస్తున్నారు. అధికారులు తమ టార్గెట్‌కు అనుగుణంగా.. దాడులు చేసి దళారుల సూచనల మేరకు నామమాత్రంగా కేసులు నమోదు చేస్తూ చేతులు దులిపేసుకుంటున్నారు. జిల్లాలో కార్డుదారుల నుంచి రేషన్ డీలర్లు కేజీ బియ్యం రూ.18 చొప్పున కొనుగోలు చేస్తున్నారు. వీరు బియ్యం వ్యాపారులకు రూ.20 చొప్పున అమ్ముతున్నారు. వ్యాపారులు పాలిష్ పట్టి కేజీకి రూ.30 ధర నిర్ణయించి కాకినాడకు తరలిస్తున్నారు.

ఎలమంచిలిలో ఇటీవల పట్టుబడిన రేషన్ బియ్యం

■ జిల్లాలో పౌరసరఫరాల శాఖ డీటీలు ఆరుగురు ఉన్నారు. వీరెవరూ ఎక్కడా ఒక్క బియ్యం కేసు పట్టుకున్న దాఖలాల్లేవు. స్థానికులు పట్టుకుని అప్పగించే సందర్భాల్లో మాత్రమే కేసులు నమోదు చేస్తున్నారు. ఎలమంచిలి పౌరసరఫరాల శాఖ డీటీకి గ్రామాల నుంచి ఎవరైనా ఫోన్ చేసి సమాచారం ఇచ్చినా.. ఆ ప్రాంత వ్యాపారులకు సమాచారం చేరవేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఎలమంచిలిలో ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ శనివారం 2,625 కేజీల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. ఎమ్మెల్యే ఫోన్ చేసి చెప్పాక రెవెన్యూ అధికారులు అక్కడకు చేరుకున్నారు.

ప్రత్యేక నిఘా పెట్టాం... ప్రతి నెలా రేషన్ అందించే సమయాల్లో.. బియ్యం పక్కదారి పట్టకుండా దాడులు చేస్తున్నాం. డీటీలు, తహసీల్దార్లు తనిఖీలు చేయాలని ఆదేశాలిచ్చాం. ప్రభుత్వం ఈ విషయంలో కఠినంగా వ్యవహరిస్తోంది. రేషన్ బియ్యం అక్రమ తరలింపుపై ప్రత్యేక నిఘా పెట్టాం. – కేవీఎన్ మూర్తి, డీఎస్‌వో, అనకాపల్లి



ఆతిథ్యం.. అతివకు ఆదాయం

నర్సీపట్నం, న్యూస్‌టుడే

పొదుపు మహిళల ఉపాధికి విస్తృత అవకాశాలు అందుబాటులో ఉన్నాయి. వీరి ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం సాయం అందిస్తోంది. తాజాగా పర్యాటక రంగంలోనూ లబ్ధిపొందేలా చర్యలు చేపడుతోంది. స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) సభ్యుల్లో ముందుకు వచ్చే వారికి 'హోంస్టే' పేరిట ప్రోత్సాహం అందించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా పర్యాటకులకు వసతి సమకూర్చి ఉపాధి పొందేలా కార్యక్రమాన్ని రూపొందించారు. లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు మెప్మా ఉద్యోగులు సర్వే చేస్తున్నారు.

'హోంస్టే' గురించి వివరిస్తున్న మెప్మా సీఓ రాధాకుమారి

✦ జిల్లాలోని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) పొదుపు మహిళలకు అవకాశం కల్పిస్తోంది. పర్యాటక ప్రాంతాలు ఎక్కువగా ఉన్నచోట సొంత ఇంట్లో ఉన్న అనుభూతి కలిగేలా ప్రత్యేక గృహాల ఏర్పాటుతో ఆదాయం పొందవచ్చు. ఇందుకు ముందుకు వచ్చే వారికి మెప్మా, సెర్ప్ ఆధ్వర్యంలో రుణ సాయం అందించనున్నారు.

✦ నర్సీపట్నంలో మెప్మా కమ్యూనిటీ ఆర్గనైజర్ (సీఓ) రాధాకుమారి పర్యవేక్షణలో ప్రతినిధులు పొదుపు మహిళలకు అవగాహన కల్పించి ఆసక్తి ఉన్న వారిని ఎంపిక చేసేందుకు సమావేశాలు నిర్వహిస్తున్నారు. నర్సీపట్నం చుట్టుపక్కల సందర్శనీయ స్థలాలు అధికంగా ఉన్నాయి. పట్టణానికి సీజన్‌లో పర్యాటకుల తాకిడి అధికంగా ఉంటోంది. 'హోంస్టే' ద్వారా ఆదాయం సమకూరనుంది. మహిళా సభ్యుల్లో సొంతంగా ఇళ్లు ఉండి వాటిని హోం స్టేకు అనుకూలంగా మార్చుకుంటే ప్రయోజనం చేకూరుతుందని అధికారులు సూచిస్తున్నారు.

✦ అతిథులుగా వచ్చే పర్యాకులకు ఆహారం సమకూర్చడం, కనీసం ఆరు గదులు, సదుపాయాలు చూపాల్సి ఉంటుంది. ప్రత్యేక యాప్‌లో పర్యాటకులు ముందుగానే బుకింగ్ చేసుకోవచ్చు. జిల్లాలో ఎలమంచిలి, నర్సీపట్నం మున్సిపాలిటీలో ఈ గృహాలతో ఉపాధి పొందేందుకు ఎంత మంది ముందుకు వచ్చినా అందరికీ సహకరిస్తామని మెప్మా పీడీ సరోజిని పేర్కొన్నారు.

కొండలను తొలిచేస్తున్నా.. కదలరు!

రాంబిల్లి, న్యూస్‌టుడే: కొండలను పట్టపగలే తొలిచేస్తున్నా రెవెన్యూ, పోలీసులు కన్నెత్తి చూడడం లేదు. లాలంకోడూరు, జెడ్.చింతువ గ్రామాల్లోని కాడిమెట్ల కొండల్లో అనధికార క్వారీలు దర్జాగా సాగుతున్నాయి. రోజూ రాయి, కంకర తవ్వి ట్రాక్టర్లపై తరలిస్తున్నారు. జెడ్.చింతువలో సర్వే నంబరు-115లో ఉన్న కొండ ప్రాంతంలో నిత్యం తవ్వకాలు జరుగుతున్నాయి. పూడిమడక - కొత్తపట్నం రహదారిని ఆనుకుని ఉన్న ఈ కొండపై కొద్ది రోజులుగా రాయి, కంకర తవ్వకాలు సాగుతున్నాయి. రెవెన్యూ సిబ్బందికి సమాచారం ఇచ్చినా స్పందించడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఈ విషయాన్ని తహసీల్దారు శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లగా మండలంలో ఎక్కడా క్వారీలకు అనుమతులు ఇవ్వలేదన్నారు. క్షేత్రస్థాయిలో తవ్వకాలను పరిశీలించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

చింతువ కొండ ప్రాంతంలో తవ్వకాలు

విద్యుత్తు బిల్లు.. గడువు దాటొద్దు!

ఒక నెలే కదా అని విద్యుత్తు బిల్లుల చెల్లింపులో నిర్లక్ష్యం వహిస్తున్నారా.. అయితే జరిమానా చెల్లించక తప్పదు. బిల్లుపై ఎప్పటిలోగా చెల్లించాలో స్పష్టంగా ఉంటుంది. మీటరు రీడింగ్ తీసిన సమయంలోనే బిల్లు చెల్లించడం ఉత్తమమని విద్యుత్తు అధికారులు సూచిస్తున్నారు. బిల్లు వచ్చిన నాటి నుంచి 15 రోజుల్లోగా చెల్లించాలి. గడువులోగా చెల్లించని బిల్లులపై అదనపు ఛార్జీలు వసూలు చేస్తారు. గడువుగా చెల్లించకుంటే కనెక్షన్‌ను బట్టి రూ.25 నుంచి 150 వరకు జరిమానా విధిస్తారు. కేటగిరీల వారీగా తదుపరి బిల్లులో అదనపు నగదు మొత్తం వస్తుంది. రెండు నెలలైనా బిల్లు చెల్లించకుంటే మరో 15 రోజుల సమయం ఇచ్చి విద్యుత్తు సరఫరా నిలిపివేస్తారు. కనెక్షన్ తొలగింపు సమయంలో ఛార్జీల కింద రూ.75 వినియోగదారుల నుంచే వసూలు చేస్తారు. ఏదైనా విద్యుత్తు సమస్య ఉంటే 1912 టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేయవచ్చు.

– న్యూస్‌టుడే, చీడికాడ

15 నుంచి 'సరస్' ప్రదర్శనలు

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్రవిశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో ఈనెల 15 నుంచి 26వరకు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి సరస్ (సేల్ ఆఫ్ ఆర్టికల్స్ ఆఫ్ రూరల్ ఆర్టిసియన్స్ సొసైటీ) ప్రదర్శన నిర్వహించనున్నారు. ఇందులో స్వయం సహాయక సంఘాలు తయారు చేసిన ఉత్పత్తులను విక్రయించనున్నారు. సుమారు 250వరకు స్టాల్స్ ఏర్పాటు చేస్తారు. రాష్ట్రం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాలకు చెందిన స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు తమ ఉత్పత్తులను ఇక్కడ స్టాల్స్‌లో విక్రయించనున్నారు. ఈ ప్రదర్శన కోసం నిరంతం విద్యుత్తు సరఫరా చేస్తారు. ఒక వేళ సరఫరాలో అంతరాయం కలిగితే జనరేటర్ అందుబాటులో ఉంచుతారు. మొబైల్ టాయిలెట్లను ఏర్పాటు చేయనున్నారు. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఆయా ఏర్పాట్లు జరుగుతున్నాయి.

నగరంలో జరుగుతున్న జాతీయ స్థాయి రోలర్ స్కేటింగ్ పోటీల్లో క్రీడాకారుల ప్రతిభను వీక్షిస్తున్న ప్రేక్షకులు సంభ్రమాశ్చర్యాలకు గురవుతున్నారు. కాళ్లకు చక్రాలు కట్టుకొని... శరీరాన్ని అలవోకగా వివిధ రూపాల్లో వంచుతూ వారు చూపుతున్న ప్రతిభకు ముగ్ధులవుతున్నారు. సోమవారం జరిగిన పోటీల్లో బాలికల విన్యాసాలను ఇక్కడ చూడొచ్చు.

– న్యూస్‌టుడే, విశాఖ క్రీడలు

ఎన్‌పీటీఈఎల్ కోర్సుల నిర్వహణకు అనుమతులు

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్రవిశ్వవిద్యాలయం సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో అడ్జెంక్ట్ ప్రొఫెసర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆచార్య కె.రాజగోపాల్‌కు 12వారాల ఎన్‌పీటీఈఎల్ కోర్సులు నిర్వహించడానికి ఏఐసీటీఈ అనుమతులు మంజూరు చేసింది. సివిల్ ఇంజినీరింగ్‌లో యూజీ, పీజీ కోర్సులు చదువుతున్న విద్యార్థులకు ఉపయుక్తంగా నిలిచే 'ఫైనైట్ ఎలిమెంట్ మెథడ్స్, కాన్సిట్యూటివ్ మోడలింగ్ ఇన్ జియో మెకానిక్స్, జియోసింథటిక్స్ అండ్ రీఇన్‌ఫోర్స్‌డ్ సాయిల్ స్ట్రక్చర్స్' కోర్సులను అందిస్తారు. దేశ వ్యాప్తంగా విద్యార్థులు ప్రవేశాలు పొందుతారు. 2026 జనవరి-ఏప్రిల్ మాసాలలో ఈ కోర్సు నిర్వహిస్తారు. దీన్ని పూర్తి చేసిన తరువాత విద్యార్థులకు లభించే క్రెడిట్స్‌ను విశ్వవిద్యాలయాలు, జాతీయ విద్య సంస్థలు పరిగణనలోనికి తీసుకుంటాయి. ఇటువంటి కోర్సులను నిర్వహించే అవకాశం పొందడం ఎంతో గర్వకారణమని వీసీ ఆచార్య జీపీ రాజశేఖర్ అభినందించారు.

మత్తులో.. రయ్ రయ్!

పోలీసుల తనిఖీల్లో పట్టుబడుతున్న చోదకులు

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే

మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. ఆ మత్తులో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. తాగి వాహనాలు నడపడం వల్ల వారు ప్రమాదాలకు గురవడమే కాకుండా ఎదుటి వారికి ముప్పుగా పరిణమిస్తున్నారు. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న జిల్లా పోలీసులు డ్రంగ్ అండ్ డ్రైవ్ కేసులపై ప్రత్యేకంగా దృష్టిసారించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో సిబ్బంది తనిఖీలు చేస్తుండటంతో ఇటీవల ఈ కేసుల సంఖ్య బాగా పెరిగింది. వాహన చోదకుల్లోనూ కొంత మార్పు వస్తోంది. మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడితే ఇప్పటివరకు జరిమానా విధించి మందలించి వదిలేసే వారు. ఇప్పుడు కోర్టుకు హాజరుపరచి రూ.10 వేల జరిమానా వసూలు చేస్తున్నారు. తరచూ పట్టుబడే వారి డ్రైవింగ్ లైసెన్సు రద్దుకు చర్యలు చేపడుతున్నారు.

వాహనదారునికి బ్రీత్ ఎనలైజర్ పరీక్ష చేస్తున్న పోలీసులు

✦ 'కుటుంబం మీకు కోసం ఎదురుచూస్తుంది' అంటూ పోలీసులు ప్రచారం చేస్తున్నారు. పనిపై బయటకు వెళ్లే వారు ఇంటికి వచ్చే వరకు కుటుంబ సభ్యులు ఎదురు చూస్తుంటారని.. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని వాహనాలు నడపాలని సూచిస్తున్నారు. చాలా మందిలో మార్పు రావడం లేదు. మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడుతూనే ఉన్నారు. అందరిలోనూ మార్పు వచ్చేలా చర్యలు చేపడుతున్నట్లు ఎస్పీ తుహిన్‌సిన్హా పేర్కొన్నారు.

నమోదైన కేసులు ఇలా

ఏడాది	కేసులు
2024	4391
2025 నవంబరు వరకు	4448

తరుణీ... తరుణం!

- వ్యాపారవేత్తలుగా ఎదిగేందుకు సహకారం
- జిల్లాలో నర్సీపట్నం మండలానికి అవకాశం

నర్సీపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే

మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదిగేలా ప్రోత్సహించేందుకు కూటమి ప్రభుత్వం నర్సీపట్నం గ్రామీణ మండలాన్ని ఎంపిక చేసింది. చిన్న అవకాశాల నుంచి పెద్ద విజయాలవైపు వారంతా పయనించేలా యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేస్తోంది. నిబద్ధతతో వ్యాపారం చేసి నిలదొక్కుకునేలా సహకారం అందించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఎంపిక చేసిన పది మంది క్లస్టర్ రిసోర్స్ పర్సన్లు వనరుల గుర్తింపు, మార్కెటింగ్ తదితర అంశాలపై పక్షం రోజుల కిందట విజయవాడలో శిక్షణ పొందారు. వ్యాపారవేత్తలుగా ఎదగాలన్న బలమైన ఆకాంక్ష ఉన్న 300 మంది అతివలను సర్వే ద్వారా గుర్తించనున్నారు. ఇప్పటికే వ్యాపారాల్లో ఉన్న పది శాతం మందిని ఈ కార్యక్రమంలోకి అనుమతిస్తారు. 90 శాతం కొత్త వారికి అవకాశాలు ఇవ్వాలని స్పష్టమైన మార్గదర్శకాలొచ్చాయి. తొలుత చిన్న మొత్తం పెట్టుబడిని వ్యాపార అభివృద్ధి ద్వారా క్రమేపీ రూ.రెండు లక్షల లావాదేవీల వరకు ఎదిగేలా సహకరిస్తారు. ఒక్కో సీఆర్పీ 30 మంది మహిళలను వ్యాపారవేత్తలుగా ఎదిగేలా తయారీ రంగంవైపు ప్రోత్సహించాలన్నది ప్రభుత్వ మార్గదర్శకమని డీఆర్‌డీఏ పీడీ శచీదేవి తెలిపారు. ప్రస్తుతం గ్రామాల్లో సర్వే పూర్తి కాగానే పెట్టుబడి సమకూర్చే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు.

జీడిపప్పు గ్రేడింగ్ పనుల్లో మహిళలు

✦ జిల్లాలోని పొదుపు సంఘాల్లోని మహిళలు జీవనోపాధులు మెరుగుపర్చుకునేలా ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయి. సేంద్రియ ఉత్పత్తులకు ప్రజల్లో ఆదరణ పెరుగుతున్న నేపథ్యంలో మహిళలను తేనె సేకరణ వైపు ప్రోత్సహించాలని అధికారులు నిర్ణయించారు. తొలి విడతగా 80 మందికి పదేసి తేనె సేకరణ పెట్టెలను సిద్ధం అందజేయాలని యోచిస్తున్నారు. మగువలు ముందుకు వస్తే 200 యూనిట్ల వరకు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారు. తేనె కొనుగోలుకు ఓ కంపెనీతో అవగాహన ఒప్పందం కుదర్చుకోనున్నారు.

జిల్లాలో గ్రామైక్య సంఘాలు : 1279
స్వయం సహాయక సంఘాలు : 40128
సంఘాల్లో సభ్యులు : 4,42,541

✦ ప్రధానమంత్రి మైక్రో ఫార్మేషన్ ఎంటర్‌ప్రైజెస్ (పీఎంఎఫ్‌ఎంఈ) ద్వారా 30 శాతం రాయితీపై బెల్లం తయారీ, చిరుధాన్యాల శుద్ధీకరణ, జీడిపప్పు, కొబ్బరి నూనె తయారీ తదితర వంద యూనిట్లను ఏర్పాటుచేయాలని ప్రతిపాదించారు. పీఎంఈజీపీ ద్వారా బ్యూటీ పార్లర్, దుస్తుల తయారీ, పౌల్ట్రీ, బేకరీ, ఫొటోగ్రఫీ వంటి వంద యూనిట్లను ఏర్పాటు చేయించనున్నారు. నర్సీపట్నం ప్రాంతీయ ఆసుపత్రి ఆవరణలో అమృత మహిళా క్యాంటీన్‌ను డ్వాక్రా సభ్యురాలు ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఇలాగే గాటోస్ కాఫీ కేంద్రాలను ఏర్పాటు చేయించి పలువురు మహిళలకు ఉపాధి కల్పించనున్నారు.

అప్రెంటీస్‌షిప్ మేళాకు 135 మంది ఎంపిక

విశాఖపట్నం, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాత ఐటీఐలో సోమవారం నిర్వహించిన ప్రధానమంత్రి జాతీయ అప్రెంటీస్‌షిప్ మేళాకు స్పందన లభించింది. వివిధ ట్రేడులకు చెందిన సుమారు 300పైగా విద్యార్థులు పాల్గొన్నారు. వివిధ కంపెనీ ప్రతినిధులు పాల్గొని విద్యార్థుల ధ్రువపత్రాలు పరిశీలించారు. వారిలో 135 మందిని ప్రాథమికంగా ఎంపిక చేశారని ప్రిన్సిపల్ ఎన్.సోలమన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డి.వెంకటేశ్వరరావు, అప్రెంటీస్‌షిప్ సలహాదారు యు.ఎస్.ఎన్.మూర్తి, ట్రైనింగ్ అధికారి హెచ్.వి.ఎన్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి శ్రీచక్రనవవర్ణార్చన

విశాఖపట్నం, న్యూస్‌టుడే: పాతనగరంలోని బురుజుపేటలో కొలువైన శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారికి మార్గశిర మాసోత్సవాల సందర్భంగా సోమవారం విశేష పూజలు నిర్వహించారు. త్రికాల సమయంలో జరిపిన పంచామృతాభిషేకం పూజల్లో 30 మంది వరకు ఉభయదాతలు పాల్గొన్నారు. అనంతరం అనివేటి మండపంలో శ్రీచక్రనవవర్ణార్చన, లక్ష్మీహోమం, శప్తశతీ, వేదపారాయణం, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారిని సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకొని పూజలు నిర్వహించారు.

కారిడార్‌లో మరిన్ని రోడ్లు

నక్కపల్లి, న్యూస్‌టుడే

పారిశ్రామికాభివృద్ధిలో భాగంగా మౌలిక సదుపాయాల కల్పన పనుల్లో మరిన్ని రహదారులను నిర్మించేలా పరిశ్రమల శాఖ చర్యలు చేపడుతోంది. గ్రామాల మధ్య అనుసంధానం, ప్రధాన మార్గాల ఏర్పాటుపై దృష్టిసారించారు. నక్కపల్లి మండల పరిధిలో బల్క్‌డ్రగ్ పార్కు, ఆర్సెలార్ మిత్తల్ స్టీల్‌ప్లాంటుకు సంబంధించిన పనులు జరుగుతున్నాయి. త్వరలోనే బొమ్మల పరిశ్రమ ఏర్పాటు కానుంది. బల్క్‌డ్రగ్, స్టీల్‌ప్లాంటుకు మరిన్ని భూములు అవసరం కావడంతో సీహెచ్‌ఎల్‌పురం, పెదతీనార్ల, వేంపాడు, నెల్లిపూడి, ఉద్దండపురం తదితర ప్రాంతాల్లో సేకరించేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. రాజయ్యపేట మొదలు డీఎల్ పురం వరకు మౌలిక సదుపాయాల కల్పనకు రూ.850 కోట్లు ఖర్చు చేయనున్నారు. పారిశ్రామిక కారిడార్‌కు చేరుకోడానికి వీలుగా కాగిత నుంచి రూ.26 కోట్లతో రహదారి నిర్మాణం చేస్తున్నారు. ఇప్పటికే సగం వరకు పనులు పూర్తయ్యాయి. ఈ రహదారిని మరింత విస్తరించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వ ఆమోదానికి పంపారు.

నిర్మాణంలోనున్న రహదారి

■ రాజయ్యపేట, బుచ్చిరాజుపేట, చందనాడ, అమలాపురం, డీఎల్‌పురం పంచాయతీల మధ్య రోడ్లు, కాలువలు, పరిపాలన భవనాల నిర్మాణాలు చేస్తున్నారు. పరిశ్రమలకు కేటాయించిన భూముల మధ్య సరిహద్దులు నిర్ణయిస్తున్నారు. ఇటీవల ఈ పనులు పరిశీలించేందుకు వచ్చిన పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ స్థానికులకు ఇబ్బందుల్లేకుండా మరిన్ని రహదారుల నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఏపీఐఐసీ అధికారులను ఆదేశించారు.

■ పారిశ్రామిక నడవకు చేరేందుకు ప్రస్తుతం కాగిత మార్గం ఒక్కటే ఏర్పాటవుతోంది. అదనంగా సారిపల్లిపాలెం నుంచి ఉన్న హెటెరో రహదారిని విస్తరించడం, అడ్డురోడ్డు సమీపం నుంచి పెదతీనార్ల - గుడివాడ వరకు మరో రహదారికి ప్రతిపాదించారు. కాగిత నుంచి ఎన్.నర్సాపురం మీదుగా హెటెరో రోడ్డుకు అనుసంధానంగా రహదారి నిర్మాణం చేయనున్నారు. ఇందుకు సంబంధించి ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

■ ఆయా గ్రామాలకు సంబంధించి ప్రస్తుతం నిర్మిస్తున్న రహదారులకు అనుసంధాన మార్గాలను చూపాల్సి ఉంటుంది. ఓ గ్రామం నుంచి మరో గ్రామానికి ప్రజలు రాకపోకలు సాగించడానికి ప్రస్తుతం ఐదారు కిలోమీటర్లు వెళ్తే సరిపోతుంది. భవిష్యత్తులోనూ ఇదే విధానంలో ఉండాలని, పరిధి పెరగరాదని యువరాజ్ స్పష్టం చేశారు. అనుసంధానం లేకపోతే 15 నుంచి 20 కి.మీ. దూరం ప్రయాణించాల్సి ఉంటుందన్నారు.

(c) eenadu

అర్జీదారులకు భరోసా కల్పించండి

అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

కలెక్టరేట్, న్యూస్‌టుడే: అర్జీదారుల సమస్యలపై అధికారులు నిర్లక్ష్యం వహించరాదని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు జిల్లా నలుమూలలు నుంచి అర్జీదారులు తరలివచ్చారు. కలెక్టర్‌తోపాటు డీఆర్వో సత్యనారాయణ వినతులు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ సమస్యలు పరిష్కారం అవుతాయన్న ఆశతో అర్జీదారులు వస్తున్నారన్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించి అర్జీదారులతో మాట్లాడి భరోసా ఇవ్వాలని సూచించారు. వివిధ సమస్యలపై 288 వినతులు వచ్చాయి. వీటిలో రెవెన్యూ 151, పంచాయతీరాజ్ 38, పోలీసు 15, సర్వేశాఖకు చెందినవి 15 ఉన్నాయి. వీటిని సంబంధిత శాఖల అధికారులకు పంపించారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి

కలెక్టరేట్, న్యూస్‌టుడే: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం బాల్ వివాహ్ ముక్త భారత్ గోడ ప్రతులను ఆవిష్కరించారు. డీఆర్వో సత్యనారాయణ, ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి, డీఎంహెచ్ఓ హైమావతి, జిల్లా బాలల సంరక్షణ అధికారి రమేష్ పాల్గొన్నారు. ఐదేళ్లలోపు చిన్నారులకు ఆధార్ నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి ఆధార్ కమిటీ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఆధార్ కార్డు రీజనల్ మేనేజర్ వరప్రసాద్, డీఆర్వో సత్యనారాయణ, సచివాలయాల అధికారిణి మంజులవాణి, డీఈవో అప్పారావు నాయుడు పాల్గొన్నారు.

10 కిలోమీటర్ల మారథాన్

కొత్తూరు (అనకాపల్లి): అనకాపల్లి ఏఎంఏఎల్ కళాశాలలో 10 కిలోమీటర్ల మారథాన్‌ను కలెక్టర్ విజయకృష్ణన్ ప్రారంభించారు. రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ నెల 10న విశాఖ కొమ్మాదిలో గిరిజన క్రీడల నేపథ్యంలో కబడ్డీ, ఆర్చరీ తదితర పోటీలను నిర్వహించారు. జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి పూజారి శైలజ, ప్రిన్సిపల్ జయబాబు పాల్గొన్నారు.

అవీ.. ఇవీ!

★ ఎలమంచిలిలో రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని కలెక్టరేట్ వద్ద ఎలమంచిలి రెవెన్యూ డివిజన్ సాధన సమితి ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మళ్ల కొండబాబు, నక్క శివ మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వం ఎలమంచిలి నియోజకవర్గంలో నాలుగు మండలాలు, పాయకరావుపేటలో నియోజకవర్గంలో నాలుగు మండలాలు కలిపి కొత్త రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు చర్యలు చేపట్టడానికి జీవో విడుదల చేసిందన్నారు. ఎలమంచిలిలో రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేస్తే అన్ని వర్గాల ప్రజలకు వెసులుబాటుగా ఉంటుందన్నారు. ★ వ్యవసాయ కూలీలను నిర్వాసితులుగా గుర్తించాలని విదసం ఐక్య వేదిక రాష్ట్ర కన్వీనర్ బూసి వెంకటరావు ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. నక్కపల్లిలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటులో భాగంగా భూములు కోల్పోతున్న వ్యవసాయ కూలీలను నిర్వాసితులుగా గుర్తించి ఉద్యోగాలు కల్పించాలన్నారు. మునగపాక, అచ్యుతాపురం మండలాలను అనకాపల్లి డివిజన్‌లోనే ఉంచాలన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ★ మినిమం టైం స్కేల్ అమలు చేయాలని వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు కలెక్టర్‌కు వినతి అందజేశారు. ★ బకాయిలు చెల్లించాలని మాకవరపాలెం జి.కోడూరుకు చెందిన పారిశుద్ధ్య కార్మికులు మాణిక్యం, అప్పారావు, పోతురాజు డీఆర్వో సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు.

రైతేరాజు

చింతపల్లిలోనూ రబ్బరు వనాలు

మారేడుమిల్లితోపాటు చింతపల్లిలోనూ రబ్బరు వనాలను పెంచుతున్నారు. ఉద్యాన పరిశోధనా క్షేత్రంలో పరిశోధనల నిమిత్తం చాన్నాళ్ల కిందట నాటారు. వీటి సాగుకు వాతావరణం అనుకూలంగా ఉండటంతో అల్లూరి జిల్లా మారేడుమిల్లి, రంపచోడవరం ప్రాంతాల్లో గిరిజన రైతులు సాగు చేస్తున్నారు. ఈ చెట్ల కాండాల నుంచి సేకరించిన పాలతో రబ్బరు తయారు చేస్తారు. చింతపల్లి ఉద్యాన పరిశోధనా స్థానంలో రబ్బరు వనాలు ఆశాజనకంగా పెరుగుతున్నా వాటి నుంచి పాలను సేకరించడం లేదని ఉద్యాన పరిశోధనా స్థానం శాస్త్రవేత్త చెట్టి బిందు తెలిపారు.

– న్యూస్‌టుడే, చింతపల్లి

గులి రాగి.. సిరుల పంట

సాధారణం కంటే నాలుగింతల అధిక దిగుబడి


వనుగుపుట్టులో సాగవుతున్న రాగి పంట

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: రసాయన ఎరువులు, పురుగు మందులు వినియోగించకుండా ప్రకృతి వ్యవసాయ విధానంలో స్థానికంగా లభ్యమయ్యే సేంద్రియ ఎరువులతో గిరిజన రైతులు పంటలు సాగు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. వరిలో శ్రీవరి సాగు, రాగుల్లో గులిరాగి పద్ధతులను అవలంబిస్తూ సాధారణం కంటే అధిక దిగుబడి సాధిస్తున్నారు. సాధారణ సాగు విధానంలో కంటే కొద్దిపాటి పెట్టుబడితోనే నాలుగు రెట్ల దిగుబడి పొందవచ్చని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

★ పాడేరు మన్యంలోని 11 మండలాల్లో వ్యవసాయ శాఖ ఎంపిక చేసిన గ్రామాల్లో మూడేళ్లుగా గులిరాగి పద్ధతిలో సాగు చేస్తున్నారు. మన్యం వ్యాప్తంగా 15 వేల హెక్టార్లలో సాధారణ పద్ధతిలో సాగవుతుండగా, గులిరాగి విధానంలో 5 వేల ఎకరాల్లో పండిస్తున్నారు. ఈ విధానాన్ని అన్ని గ్రామాలకు విస్తరించేందుకు వ్యవసాయ అధికారులు కసరత్తు చేస్తున్నారు.

★ ముంచంగిపుట్టు మండలంలో ఈ ఏడాది వెయ్యి ఎకరాల్లో గులిరాగి విధానంలో రాగి పంట సాగైంది. మాకవరం, బంగారుమెట్ట, ఏనుగురాయి, కుమడ, పెదగడ, పనసపుట్టు, జర్రెల, కుమడ, కరిముఖిపుట్టు, జర్జుల, సుజనకోట పంచాయతీలకు చెందిన రైతులు అధిక దిగుబడులు నమోదు చేశారు.

★ సుజనకోట పంచాయతీ వనుగుపుట్టు రైతు రామకృష్ణ ఎకరా విస్తీర్ణంలో గులి రాగి విధానంలో సాగు చేశారు. సాధారణ సాగు విధానంలో ఐదు క్వింటాళ్ల దిగుబడి రాగా.. గులి రాగి విధానంలో 500 గ్రాముల విత్తనాలతో 20 క్వింటాళ్ల దిగుబడి సాధించి రైతులందరికీ ఆదర్శంగా నిలిచారు.

★ అందుబాటులో ఉన్న, స్థానికంగా లభ్యమయ్యే దేశవాళీ రాగుల విత్తనాలను గులి రాగి విధానంలో సాగు చేయవచ్చు. ఘన, ద్రవ జీవామృతం, బీజామృతం విత్తనాలకు కలిపి నారుగా పోయాలి. 12 రోజుల తర్వాత నారు తీసి పొలంలో అడుగు దూరం ఉండేలా వరుసగా నాటాలి. పక్షం రోజులకోసారి మొక్కను కదిలించాలి. పశువులతో తొక్కించడం, మొక్కలను తాడు, దుడ్డు సాయంతో కదపడం ద్వారా మొక్కలు కదిలి, ఎక్కువ పిలకలు వస్తాయి. పిలకలకు వెన్నులు అధికంగా రావడం ద్వారా దిగుబడి పెరుగుతుంది. నాలుగు నెలలకే పంట కోతకు వస్తుంది.

★ సాధారణ పద్ధతిలో 25 రోజుల తర్వాత నాటితే.. గులిరాగి విధానంలో 15 రోజులకే నాటుతారు. రసాయన ఎరువులు వినియోగించకుండా గోమూత్రం, పేడ, ఆకులు, సెనగపిండి, బెల్లంతో చేసిన ఘన, ద్రవ జీవామృతం, సేంద్రియ ఎరువులు వినియోగిస్తూ సాగు చేస్తారు. చీడపీడలు ఆశించకుండా పసుపు రంగు చక్రాలను ఏర్పాటు చేసుకోవాలి. ఈ చక్రాలపై ఉండే జిగురు పదార్థం రెక్క పురుగులను నియంత్రిస్తుంది. పెదగుడ, బంగారుమెట్ట రైతు సేవా కేంద్రాల్లో వెయ్యి మెట్రిక్ టన్నుల రాగుల కొనుగోలు చర్యలు చేపడుతున్నట్లు ఏవో మురళీకృష్ణ చెప్పారు. కేజీ రూ.43 చొప్పున కొనుగోలు చేస్తామన్నారు.

రెల్లరాల్చు, మానిపండు తెగులు.. నివారణ చర్యలు

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: వరి కోత దశలో మాని పండు తెగులు, రెల్లరాల్చు పురుగులు నష్టం కలిగిస్తున్నాయి. కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం పరిధిలోని గ్రామాల్లో మాని పండు తెగులు ఎక్కువగా ఉన్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. నివారణ చర్యలను కేవీకే ప్రధాన శాస్త్రవేత్త రాజకుమార్ సూచిస్తున్నారు.

మాని పండు తెగులు: గింజ పాలు పోసుకునే దశ నుంచి కోత వరకు ఆశించే తెగులు ఇది. విత్తన సేకరణలో జాగ్రత్తలు తీసుకోకపోవడం, విత్తనశుద్ధి లోపం వల్ల ఈ తెగులు వ్యాప్తి చెందుతుంది. అండాశయంలో శిలీంధ్రం పెరుగుదల వల్ల పసుపు పచ్చరంగు ముద్దగా అభివృద్ధి చెంది, ఆకుపచ్చ రంగులోకి మారి చివరకు నల్లగా మారుతుంది. గింజ స్థానంలో శిలీంధ్ర బీజ సమూహాలు ఏర్పడుతాయి. నివారణకు ప్రొపికొనజోల్ లీటరు నీటిలో 25 ఇ.సి. 1 మి.లీ. కలిపి పొట్టదశ, వెన్నులు వచ్చే దశలో సాయంత్రం వేళల్లో పిచికారీ చేయాలి.

రెల్ల రాల్చు పురుగు: అన్ని ప్రాంతాల్లో ఓ మోస్తరుగా ఈ పురుగు ఆశిస్తుంటుంది. ఒక్కోసారి తీవ్రంగా వ్యాపించి పంటకు నష్టం కలిగిస్తుంది. లద్దెపురుగులు గింజ పాలుపోసుకునే దశ నుంచి గింజ గట్టిపడే తరుణంలో పైరును రాత్రివేళల్లో ఆశించి వెన్నులలో రెల్లను కొరికి రాల్చివేస్తాయి. పగటిపూట లద్దె పురుగులు మొక్క మొదళ్లలో పిలకల మధ్య దాగి ఉంటాయి. కంకి వెలువడ ముందు పురుగు ఆశిస్తే.. ఆకులను తిని నష్టం కలిగిస్తాయి. కంకి వచ్చాక ఆశిస్తే గింజలతో కూడిన కంకిని కొరికి రాల్చేస్తాయి. వాతావరణ పరిస్థితులను బట్టి ఇది వ్యాపిస్తుంది. బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడినప్పుడు ఈ పురుగు ఉద్ధృతి ఎక్కువగా ఉంటుంది. నివారణ చర్యలను సాయంత్రం వేళల్లో చేపట్టాలి. పురుగు తీవ్రత తక్కువగా ఉంటే నివారణకు క్లోర్‌పైరిఫాస్ 2 మి.లీ. మందు లీటరు నీటిలో/ ఎసిఫేట్ 2.5 గ్రాములు లీటరు నీటిలో/ ఫిప్రోనిల్ 400 మి.లీ. మందు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయవచ్చు.

పురుగు కొరికేయడంతో నేలపై రాలిన వరివెన్నులు

రైతు ప్రశ్న – శాస్త్రవేత్త సలహా

? మన్యంలో వాతావరణ పరిస్థితులను బట్టి రసాయన ఎరువులను వినియోగించవద్దంటున్నారు. తెగుళ్లు ఆశించి దిగుబడులు రావడం లేదు. ప్రత్యామ్నాయమేంటి.
– రామచంద్రరావు, జి.మాడుగుల

జీవన ఎరువులతో సత్ఫలితాలు

✔: వరి, రాజ్మా వంటి పంటల్లో ద్రవరూప జీవన ఎరువులను వినియోగించాలి. రాజ్మాలో రైజోబియం వంటి ద్రవరూప జీవన ఎరువుల వినియోగం వల్ల తెగుళ్లను నియంత్రించడంతోపాటు అధిక దిగుబడులు సాధించవచ్చు.

? వేరుసెనగను ఇప్పుడు వేసుకోవచ్చా.
– పరమేశ్వరరావు, గొందిపాకలు

✔: నీటి సదుపాయం ఉన్నచోట రబీలో ఆరుతడి పంటగా వేరుసెనగ సాగు చేయవచ్చు. పూత దశలో మొక్క మొదళ్లలో ఎకరాకు 200 కేజీల జిప్సం వేయడం ద్వారా మంచి దిగుబడులు వస్తాయి.

? తుపాను ప్రభావంతో మన్యంలో వర్షాలు పడుతున్నాయి. కోతకు వచ్చిన వరి పొలాలకు ఏమైనా ఇబ్బంది ఉంటుందా.
– గిరిబాబు, తాజంగి

✔: పంట కోయకుండా ఉంటే వర్షం పడినా ఇబ్బందేమీ ఉండదు. కోసిన పనలను మడులలో ఉంచకుండా కుప్పవేసి టార్పాలిన్ కప్పి ఉంచితే సరిపోతుంది.

★ రైతుల ప్రశ్నలు, సందేహాలకు పాడేరు ఏరువాక కేంద్రం విస్తరణ విభాగం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ పీటీ ప్రదీప్‌కుమార్ సమాధానాలు ఇచ్చారు. – న్యూస్‌టుడే, చింతపల్లి

సాగులో సందేహాలా.. ఫోన్ చేయండి

రైతుల ప్రశ్నలు, సందేహాలకు అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డి.శ్రీదేవి సమాధానాలిస్తారు. మంగళవారం ఉ. 10- సా. 4 గంటల వరకు 94410 92084 నంబరుకు ఫోన్‌చేయవచ్చు.

తగ్గిన రంగు, మధ్య రకం బెల్లం ధరలు

అనకాపల్లి, న్యూస్‌టుడే: అనకాపల్లి మార్కెట్‌లో గత వారం రోజులుగా రంగు, మధ్య రకం బెల్లం ధరలు తగ్గాయి. రంగులు వంద కేజీలకు రూ.220, మధ్య రకాలు రూ.330 తగ్గాయి. నాసి రకాలు రూ.160 ధరలు పెరిగాయి.

రకం	రంగులు	మధ్య	నాసి
గత వారం (రూ.)	3,985	3,685	3,130
ఈ వారం (రూ.)	3,765	3,355	3,290

పారా అథ్లెటిక్స్‌లో బంగారు పతకం

దుర్గాప్రసాద్‌ను అభినందిస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

కోటవురట్ల, న్యూస్‌టుడే: పాములవాక జడ్పీ పాఠశాల విద్యార్థి పోతల దుర్గాప్రసాద్ పారా అథ్లెటిక్స్‌లో స్వర్ణ పతకం సాధించాడు. జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో 400 మీటర్ల పరుగు పందెంలో విజేతగా నిలిచాడని పీఈటీ సావిత్రి చెప్పారు. ఎంఈఓ లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు అభినందించారు.

జాతీయస్థాయి కరాటే పోటీల్లో సత్తా

కశింకోట, న్యూస్‌టుడే: జాతీయస్థాయి కరాటే ఛాంపియన్‌షిప్‌లో కశింకోట విద్యార్థులు సత్తా చాటారు. ఆదివారం ఖమ్మంలో నిర్వహించిన జాతీయ కరాటే ఛాంపియన్‌షిప్-2025లో పాఠశాల విద్యార్థులు కె.సహిష్ణ, ఆర్.హిమశ్రీ, ఆర్.ఆరుష్, ఎం.ఎల్.లక్ష్మీ ప్రసన్న బంగారు పతకాలు, ఆర్.రేహాన్, ఎం.సాయిమారుతి, బి.సహస్ర, బి.తేజస్విని, కె.శ్యామ్ రజత పతకాలు, వి.నిహారిక, కె.కరుణశ్రీ, కె.భార్గవ్ కాంస్య పతకాలను సాధించారు. విజేతలను కోచ్ సీహెచ్.సూరిబాబు, పాఠశాల డైరెక్టర్లు బత్తుల నోబుల్‌కుమార్, కరస్పాండెంట్ బత్తుల అమూల్య, ప్రిన్సిపల్ రాజు అభినందించారు.

విద్యార్థులతో నోబుల్‌కుమార్, అమూల్య తదితరులు

హాకీ పోటీలకు అనకాపల్లి విద్యార్థి

నెహ్రూచౌక్ (అనకాపల్లి), న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి అండర్-17 హాకీ పోటీలకు జీవీఎంసీ పట్టణ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి కౌశిక్ ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బ్రహ్మాజీ తెలిపారు. ఈనెల 9 నుంచి 12 వరకు కడప జిల్లా పులివెందులలో జరగబోయే రాష్ట్రస్థాయి అండర్-17 పోటీల్లో పాల్గొంటాడని పీఈటీ నరసింహ తెలిపారు.

బాలబాలికల క్రికెట్ జట్ల ఎంపిక రేపు

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: అనకాపల్లి ఎన్టీఆర్ స్టేడియంలో ఉమ్మడి విశాఖ జిల్లా 17 ఏళ్ల లోపు బాలుర క్రికెట్ పోటీల జిల్లా జట్టు ఎంపిక జరుగుతుందని కార్యదర్శి టి.నాగేశ్వరరావు తెలిపారు. అనకాపల్లి మండలం కొప్పాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో 17 ఏళ్ల లోపు బాలికల క్రికెట్ జట్టు ఎంపిక చేపడతామన్నారు. క్రీడాకారులంతా సంబంధిత కేంద్రాల్లో ఉదయం 9 గంటలకు హాజరుకావాలని కోరారు.

ఎంపీ రమేష్‌కు పరామర్శ

సీఎం రమేష్ తల్లి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు

ఎర్రగుంట్ల, న్యూస్‌టుడే: రైల్వేస్టాండింగ్ కమిటీ ఛైర్మన్, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్‌ను పలువురు పరామర్శించారు. రమేష్ తల్లి చింతకుంట రత్నమ్మ ఇటీవల తుది శ్వాస విడిచారు. పెద్ద కర్మ సందర్భంగా సోమవారం వైఎస్సార్ కడప జిల్లా ఎర్రగుంట్ల మండలం పోట్లదుర్తిలోని సీఎం రమేష్ నివాసానికి ప్రజా ప్రతినిధులు, నాయకులు వచ్చి రత్నమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, కేంద్ర భారీ పరిశ్రమల, ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, మంత్రులు అచ్చెన్నాయుడు, అనిత, అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్.మాధవ్, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కేఎస్ఎన్ రాజు, బండారు సత్యనారాయణ మూర్తి, పంచకర్ల రమేష్‌బాబు, సుందరపు విజయ్ కుమార్, బండారు శ్రావణి, వరదరాజులురెడ్డి, తితిదే బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసురెడ్డి తదితరులు చింతకుంట రత్నమ్మ చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఫిర్యాదులు పరిష్కరించాలి

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: ఫిర్యాదులను పరిశీలించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ తుహిన్‌సిన్హా తెలిపారు. జిల్లా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో 66 ఫిర్యాదులు అందాయి. ఫిర్యాదుదారులతో ఆయన మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏఎస్పీ మోహనరావు, ఎస్సై విశ్వనాథం పాల్గొన్నారు.

తెదేపా నుంచి ఇద్దరి సస్పెన్షన్

అనకాపల్లి, న్యూస్‌టుడే: పెందుర్తి మండలం చింతగట్ల గ్రామానికి చెందిన గనిశెట్టి కనకరాజు, దమ్ము రమేష్‌లను పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు తెదేపా జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్యబాబు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు.

సర్వే ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడిగా ప్రసాద్

ఎన్నికైన నూతన కార్యవర్గం

అనకాపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: సర్వే ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా, డివిజన్ కార్యవర్గ ఎన్నికలు పట్టణంలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా టి.డి.వి.ప్రసాద్, ఉపాధ్యక్షుడిగా ఎస్.ఎమ్.అన్సారీ, కార్యదర్శిగా కె.మహేష్, కోశాధికారిగా లాలం అప్పారావు ఎన్నికయ్యారు. అనకాపల్లి డివిజన్ అధ్యక్షులుగా బి.జగదీష్, బి.వెంకటేశ్వరరావు, పి.సత్తిబాబు, ఉపాధ్యక్షులుగా పి.పవన్ అయ్యప్ప, ఎస్.కె. అమనుల్లా, బి.దేవీ ప్రసాద్, కార్యదర్శులుగా ఎన్.భరత్ వర్మ, వి.వరుణ్ కుమార్, ఎస్, ప్రశాంత్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షులు ఆర్.చిరంజీవిరావు ఆధ్వర్యంలో ఈ ఎన్నికలు జరిగాయి.

వృద్ధుడి అదృశ్యంపై కేసు

కశింకోట, న్యూస్‌టుడే: బయ్యవరం గ్రామానికి చెందిన వృద్ధుడు కొవ్వాడ అప్పారావు అదృశ్యంపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై పి.మనోజ్‌కుమార్ తెలిపారు. గతనెల 26న పొలానికి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు వెతికినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో ఆయన కుమారుడు కొవ్వాడ సత్తిబాబు పోలీసులను ఆశ్రయించాడు. ఆచూకీ లభించినవారు కశింకోట పోలీసులను సంప్రదించాలని ఎస్సై వివరించారు.

పదో తరగతి నమూనా ప్రశ్నపత్రాల ఆవిష్కరణ

ఆవిష్కరిస్తున్న డీఈఓ, కార్యవర్గ సభ్యులు

నెహ్రూచౌక్ (అనకాపల్లి), న్యూస్‌టుడే: పదో తరగతి విద్యార్థుల కోసం యూటీఎఫ్ ఆధ్వర్యంలో ముద్రించిన పదో తరగతి నమూనా ప్రశ్నపత్రాల డీఈఓ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పేపర్లు చదివి విద్యార్థులు మంచి ఉత్తీర్ణత సాధించవచ్చన్నారు. కార్పొరేటు పాఠశాల విద్యార్థుల తరహాలో పోటీ పడుతున్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఇవి ఎంతగానో ఉపయోగపడతాయని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి గొంది చినబ్బాయి తెలిపారు. సభ్యులు అక్కునాయుడు, సూర్యప్రకాశ్, రమేష్‌రావు, రాము, సత్యవేణి, బాబురావు, అప్పలరాజు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాల్లో మౌలిక వసతులు

విద్యార్థులతో మాట్లాడుతున్న శ్రీధర్‌రెడ్డి

ఎలమంచిలి, న్యూస్‌టుడే: పదో తరగతి పరీక్షా కేంద్రాల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించనున్నట్లు ప్రభుత్వ పరీక్షల నిర్వహణ అసిస్టెంట్ కంట్రోలర్ శ్రీధర్ రెడ్డి చెప్పారు. ఎలమంచిలి మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను సోమవారం తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రాలకు ఏ పాఠశాలలు అనుకూలంగా ఉన్నాయో పరిశీలించారు. కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్తు సరఫరా, ఫర్నిచర్, భద్రత, ప్రశాంత వాతావరణం ఉండేలా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఎలమంచిలిలో నాలుగు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. క్యూఆర్ కోడ్‌తో హాల్ టికెట్లు ఇస్తామన్నారు. తద్వారా విద్యార్థులు పరీక్షా కేంద్రం ఎక్కడ ఉందో సులువుగా తెలుసుకుని సకాలంలో చేరుకోగలరన్నారు. పరీక్షా కేంద్రాలను గూగుల్ మ్యాప్ ద్వారా గుర్తించేలా ఏర్పాట్లు చేశామన్నారు. ఎంఈఓ ఎస్.సూర్యప్రకాశరావు, సుశీల, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

BUSINESS SERVICES

లోకేష్ గోల్డ్ లోన్స్ బ్యాంక్/ ప్రైవేట్ తాకట్టుల్లో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ రేటుకు కొనబడును. ✆ 9848488068, 7799223300.

శ్రీవల్లి గోల్డ్ లోన్స్ బ్యాంక్/ ప్రైవేట్ తనఖాలో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ ధరకు కొనుగోలు, అధిక ధరకు ఇప్పించబడును. ✆ 9908545224.

PERSONAL CLASSIFIEDS

LOST

LOST PASSPORT
I, PULLABHATLA CHANDRA SEKHAR S/o P. Satyanarayana Rao, Residing at D.No.3-253, Street Number 7, Adarshnagar, Old Dairy Farm, Visakhapatnam - 530040 Andhra pradesh, India. I Lost my Original Passport, bearing No. N5750920, when I went to take Xerox copies at Ravindra Nagar on my Bike and return back to my home on 15-11-2025. If anybody find please Return to above Address
9491333900

REAL ESTATE

GENERAL

EENADU Classifieds

TO LET

SANKARAMATHAM
1250 Sft Flat Fully Finished Car Parking Nr: Sankaramatam Rd, opp: Crown Bakery Veg only For Rent. Ph: 7382941422

JOBS

కావలెను
Peram Group
9246812689, 8688400230

Wanted Staff in Saree Store Sales Boys, Sales Girls experience must be 2 to 3 years. Contact: 9394311123.

Wanted Civil Engineer B.Tech/ Diploma Minimum 5 years Experience in Roads Works. Resume Sent to: mohansaluru@gmail.com Ph: 9849913457.

Marketing Executives 10K to 30K, Telecallers (F) 10K to 15K, DTP & Digital (F&M) 15 to 25K. Ph: 0891 2563215, 9381756318.

JOB OPPORTUNITY
A Fast growing ISO Organisation newly open Seethammadhara Jn., / Office Work. No Field Work.
•CHIEF ADMINISTRATION OFFICERS (M/F) Qualf: Retd., would be Retd. / VRS - State / Central. Yearly Package: 15 Lakhs (Salary + other allowances negotiable)
•BUSINESS DEVELOPMENT MANAGERS: (M/F) Qualf: Non Banking, Chit Fund Companies or any Insurance Sectors. Yearly Package: 10 Lakhs (Salary + other allowances nego.)
•RESIDENTIAL MANAGERS: Work from home and Part Time Jobs. Age: 30 Years above. Yearly Package: 7 Lakhs (Salary + other allowances nego.)
Interviews on 9, 10, 11 Dec 25
B.SAROJA, AGM - DOCTORS COLONY, VIZAG
81432 16984
99854 61280

SECURITY GUARDS

జైగణేష్ సెక్యూరిటీసంస్థలో విశాఖ స్టీల్‌ప్లాంటు ఏరియాలో సెక్యూరిటీ గార్డ్స్ 150 మంది 8గం|| డ్యూటీ జీతం 18815/- PF, ESI సెక్యూరిటీ సూపర్‌వైజర్స్ 11మంది (Ex-Service) జీతం: 22600/-

TOURS AND TRAVELS

ఏటీఎం కార్డు నుంచి రూ.9.43 లక్షల స్వాహా

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: ఎస్.రాయవరం మండలం గెడ్డపాలెంలో కొన్ని నెలల క్రితం మరణించిన సాధువు కొవ్వూరు సుబ్బరాజు ఏటీఎం కార్డుతో ఇదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి రూ.9.43 లక్షలు స్వాహా చేసినట్లు ఎస్.రాయవరానికి చెందిన సోమిరెడ్డి రాజు సోమవారం కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదు చేశారు. మార్చి 31న సాధువు మరణించారని, అప్పటి నుంచి ఆయన ఏటీఎంను దొంగిలించి దఫదఫాలుగా నగదు తీసుకున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై అధికారులు పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని కోరారు.

అమ్మవారి వెండి ఖడ్గం అపహరణ

ఆలయంలో క్లూస్ టీం విచారణ

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: చోడమాంబిక అమ్మవారి ఖడ్గాన్ని దొంగలు అపహరించారు. అమ్మవారికి పూజలు చేయడానికి రోజూ మాదిరిగానే సోమవారం అమ్మవారిని దర్శించుకోవడానికి వెళ్లిన భక్తులకు వెండి ఖడ్గం కనిపించలేదు. వెంటనే ఈ విషయాన్ని ఆలయ ధర్మకర్త కర్రి నాగేశ్వరరావు, ఉత్సవ కమిటీ సభ్యుల దృష్టికి తీసుకెళ్లారు. కమిటీ పెద్దలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఖడ్గం కనిపించకపోవడంతో భక్తులు, ఆలయ కమిటీ పెద్దలు ఆందోళన చెందుతున్నారు. చోరీకి గురైన ఖడ్గం రెండు కేజీల బరువు ఉంటుందని, దీని విలువ రూ. 3 లక్షల పైనే ఉంటుందని కమిటీ ఛైర్మన్ వడిశెల సన్యాసినాయుడు తెలిపారు. పట్టుచీరలు, చిల్లర నాణేలు కూడా చోరీ చేసినట్లు చెప్పారు. క్లూస్ టీం ద్వారా విచారణ నిర్వహిస్తున్నట్లు సీఐ చంద్రశేఖరరావు చెప్పారు.

రెండు లారీలు ఢీకొని చోదకుడు సజీవ దహనం

బేస్తవారపేట, న్యూస్‌టుడే: ప్రకాశం జిల్లా గిద్దలూరు డివిజన్, బేస్తవారపేట మండలంలోని పెంచికలపాడు సమీపంలో సోమవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఓ చోదకుడు సజీవ దహనం కాగా, మరొకరు గాయాల పాలయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు .. ధర్మవరానికి చెందిన కుంపటి ఆది శేషయ్య మినీ లారీలో టమాటా లోడుతో అనంతపురం నుంచి రాజమహేంద్రవరం బయలుదేరాడు. ఈ క్రమంలో పెంచికలపాడు రాగానే లారీ టైరు ఒక్కసారిగా పేలిపోవడంతో అదుపుతప్పి ఎదురుగా వస్తున్న మడ్డి ఆయిల్ ట్యాంకర్ బలంగా ఢీకొట్టింది. ప్రమాద ధాటికి మినీ లారీ బోల్తా పడగా ట్యాంకర్ ముందు భాగం పూర్తిగా దెబ్బతింది. అనంతరం కొద్ది క్షణాల్లోనే రెండు లారీల ఇంజిన్ల నుంచి పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. దీంతో చోదకుడు ఆది శేషయ్య లారీలో నుంచి బయటపడ్డాడు. ఆయిల్ ట్యాంకర్ చోదకుడు పైడికొండల దుర్గారావు (40) కూర్చున్న సీట్‌లోనే సజీవ దహనమయ్యాడు. ఇతనిది పశ్చిమ గోదావరి జిల్లా దేవరపల్లి. పరవాడ వద్ద మడ్డి ఆయిల్‌ను ట్యాంకర్‌లో లోడ్ చేసుకున్నాడు. దాన్ని తాడిపత్రిలోని ఓ సిమెంట్ ఫ్యాక్టరీలో అన్‌లోడ్ చేసేందుకు వెళ్తుండగా ఈ దుర్ఘటన చోటుచేసుకుంది.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: తుమ్మపాలలోని ఇంట్లో జరిగిన అగ్ని ప్రమాదంలో మహిళ మృతిచెందింది. పట్టణ ఏఎస్సై సుధ కథనం ప్రకారం.. **గగనం సత్యవతి** (54) కొంత కాలంగా అనారోగ్యంతో మంచానికే పరిమితమయ్యారు. ఈమె భర్త ఆనందరావు సోమవారం సత్యవతి పడుకున్న మంచం కింద దోమల చక్రం వెలిగించి పాలు తీసుకు రాడానికి వెళ్లారు. మంచం దుప్పటికి దోమల చక్రాల నిప్పు అంటుకుని మంటలు రాజుకున్నాయి. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆమె మృతిచెందింది. ఇంట్లో నుంచి పొగలు రావడాన్ని గమనించి స్థానికులు ఆనందరావుకు ఫోన్‌చేసి చెప్పారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

అనకాపల్లిలో గుర్తుతెలియని ఒకరు..

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని పూడిమడక రోడ్డులో అండర్‌పాస్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని సోమవారం స్థానికులు గుర్తించారు. దుస్తులు లేకుండా పడి ఉన్న సుమారు 60 ఏళ్ల వ్యక్తి మృతదేహాన్ని ఎన్టీఆర్ ఆసుపత్రి శవగదికి తరలించారు. దీనిపై కేసు నమోదుచేసినట్లు హెచ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు తెలిపారు.

రైలు ఢీకొని..

పి.అప్పారావు

ఎలమంచిలి, న్యూస్‌టుడే: ఎలమంచిలి రైల్వేస్టేషన్ సమీపంలో రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. అనకాపల్లి విజయరామరాజు పేటకు చెందిన పి.అప్పారావు (55) తన మామ గారితో కలిసి స్టేషన్‌లో పాప్ కార్న్ అమ్ముతుంటారు. ఇతనికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. సోమవారం రైలు ఢీకొని గాయపడిన ఇతన్ని స్థానికులు ఎలమంచిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. అనంతరం మృత దేహాన్ని మార్చురీకి తరలించారు. తుని రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	126	125
లైవ్	153	145
డ్రెస్డ్	222	260
స్కిన్‌లెస్	252	270

తెరపై ఈనాడు

అనకాపల్లి: రాజా: రాజా వెడ్స్ రాంబాయి, సత్యనారాయణ స్క్రీన్-2: స్కూల్ లైఫ్, పరమేశ్వర: ప్రేమంటే, షిర్డీసాయి: అమర కావ్యం, రామచంద్ర: జటాధర, సత్యనారాయణ స్క్రీన్-1: ఆంధ్ర కింగ్ తాలూకా, వెంకటేశ్వర: బిజినెస్ మేన్, అచ్యుతాపురం: ఎస్‌టీబీటీ స్క్రీన్-1 ఆంధ్ర కింగ్ తాలూకా, స్క్రీన్-2: రివాల్వర్ రీటా

రేపు రగ్బీ క్రీడా పోటీలకు ఎంపిక

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: అచ్యుతాపురంలో రగ్బీ క్రీడాకారుల ఎంపిక పోటీలను ఈనెల 10న నిర్వహిస్తున్నట్లు క్లబ్ గౌరవ అధ్యక్షులు కాండ్రపు వెంకట నాయుడు, అధ్యక్షులు జగదీష్, శిక్షకుడు నాగ వెంకట రావు తెలిపారు. అండర్-15, 18, విభాగాల్లో యువతీ, యువకులకు వేరువేరుగా పోటీలను నిర్వహిస్తున్నారు. వివరాలకు 88861 41984 నంబరుకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు.

అనకాపల్లి

• అనకాపల్లి • ఎలమంచిలి • పాయకరావుపేట

సంపద కేంద్రానికి తాళాలు

మునగపాక, న్యూస్‌టుడే: మునగపాకలో సంపద కేంద్రానికి ఆదివారం రాత్రి కొందరు యువకులు తాళాలు వేశారు. పారిశుద్ధ్య పనులు చేపట్టేందుకు సోమవారం వెళ్లిన పారిశుద్ధ్య కార్మికులు ఈ కేంద్రానికి తాళాలు వేసిన విషయాన్ని గుర్తించారు. వెంటనే సర్పంచి దిమ్మల అప్పారావు, గ్రామ కార్యదర్శికి తెలిపారు. స్థానిక యువకులే సంపద కేంద్రానికి తాళాలు వేసినట్టుగా సీసీ కెమెరాల్లో గుర్తించారు. వారిపై చర్య తీసుకోవాలని కోరుతూ మునగపాక పోలీసులకు ఫిర్యాదు చేశారు.

యువ స్ఫూర్తి.. సేవా దీప్తి

సామాజిక సేవల్లో పాల్గొనే విద్యార్థులకు జాతీయ సేవా పథకం (ఎన్‌ఎస్‌ఎస్‌) వేదికగా నిలుస్తోంది. విద్యార్థి దశ నుంచి సమాజ సేవపై ఆసక్తిని పెంపొందించే ఉపయోగపడుతోంది. విద్యార్థుల్లో సేవా భావం, సామాజిక బాధ్యత, నాయకత్వ లక్షణాలు పెంపొందించే చదువుతో పాటు గ్రామాల్లోని వివిధ సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.

ఎలమంచిలి (గ్రామీణం), న్యూస్‌టుడే

ఎలమంచిలి గురజాడ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండు యూనిట్లు ఉండగా ఒక్కో యూనిట్‌లో 50 మంది వాలంటీర్లు ఉన్నారు. వీరు పరిసర గ్రామాలైన లైనుకొత్తూరు, రేగుపాలెం గ్రామాలను దత్తత తీసుకున్నారు. ఈ నెల 3 నుంచి వారం రోజుల పాటు రక్తదానం, పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పిస్తున్నారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాలను వివరిస్తున్నారు. మొక్కలు నాటడం, పర్యావరణ పరిరక్షణపై సదస్సులు కల్పిస్తున్నారు. సేంద్రియ వ్యవసాయం, డిజిటల్ లావాదేవీలు వివరిస్తున్నారు. వైద్య శిబిరాలు నిర్వహించి రోగులకు సేవలు అందిస్తున్నారు. ఈ కార్యక్రమాలను ఎలమంచిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ చంద్రశేఖర్, ఎన్‌ఎస్‌ఎస్ అధికారి ఆడారి అర్జున అప్పారావు వీటిని పర్యవేక్షిస్తున్నారు.

రేగుపాలెంలో రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నాం..: గ్రామాల్లో పర్యటించి ప్రతి ఒక్కరూ చదువుకోవాలని చెబుతున్నాం. పారిశుద్ధ్యం, మొక్కలు నాటడం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తున్నాం. - స్వామి దుర్గాప్రసాద్, బీఎస్సీ, రెండో సంవత్సరం

ఆరోగ్య సూత్రాలు వివరిస్తూ..: ప్రజలు ఆరోగ్యంపై ఎక్కువ శ్రద్ధ వహించాలని అవగాహన కల్పిస్తున్నాం. ధూమపానం, మద్యపానం వల్ల కలిగే అనర్థాలు వివరిస్తున్నాం. సామాజిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని చెబుతున్నాం. - బి.రమ్యశ్రీ, బీఎస్సీ మొదటి ఏడాది

విద్యార్థి దశ నుంచే..: విద్యార్థి దశ నుంచే సమాజ సేవ చేయడానికి ఎన్ఎస్ఎస్ ఉపయోగపడుతోంది. బాల్య వివాహాల నిరోధం, మహిళా సాధికారిత, ఆర్థికాంశాలపై ప్రజలకు వివరిస్తున్నాం. - ఎన్.జయశ్రీ, బీఎస్సీ

పన్ను వేయండి మహాప్రభో!

అనకాపల్లి, న్యూస్‌టుడే

సాధారణంగా ఏదైనా సేవకు సంబంధించి పన్నులు చెల్లించాల్సి వస్తే ఎలా తప్పించుకోవాలా అని దారులు వెతుకుతుంటారు. అనకాపల్లి జోన్‌లో పరిస్థితులు ఇందుకు విరుద్ధంగా ఉన్నాయి. 'మా ఇంటికి పన్ను వేయండి మహాప్రభో' అని అధికారులకు మొరపెట్టుకున్నా ఇక్కడ పట్టించుకునే నాథుడే లేరు. పురపాలక సంఘంగా ఉండే అనకాపల్లిని జీవీఎంసీలో పుష్కర కాలం కిందట విలీనం చేశారు. అప్పటి నుంచి ఇక్కడ ప్రణాళికా, రెవెన్యూ విభాగాల మధ్య సమన్వయం లోపించింది. రెవెన్యూ అధికారులు పాత పన్నులు వసూలు చేయడంపై దృష్టి పెడుతున్నారే తప్ప.. కొత్త పన్నులు విధించడం లేదు.

ఎవరైనా కొత్తగా ఇళ్లు నిర్మించుకోవాలను కుంటే ముందుగా ప్లాన్‌కు దరఖాస్తు చేసుకుంటారు. ఖాళీస్థలాలకు పన్ను చెల్లిస్తేనే ప్లాన్‌కు దరఖాస్తు చేయడానికి అవుతుంది. అందువలన ఇంటి నిర్మాణం చేసుకునే వారు పన్ను వేయాలని సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటున్నారు.

ముందుగా స్థలం విస్తీర్ణం ఎంత అనేది దస్తావేజుల్లో ఉన్నా సర్వేయరు కొలతలు తీసి ధ్రువీకరిస్తేనే పన్ను విధిస్తారు. అనకాపల్లి జోన్‌కు సర్వేయర్ లేరు. గాజువాక సర్వేయర్ ఇక్కడ ఇన్‌ఛార్జిగా ఉంటున్నారు. ఆయన ఎప్పుడు వస్తారో జోనల్ కమిషనర్‌కే తెలియడం లేదు. దీనివల్ల ఇంటి ప్లాన్ల అనుమతులు నిలిచిపోతున్నాయి. దాదాపు 30 స్థలాల వరకు సర్వే చేయాల్సి ఉన్నట్లు తెలుస్తోంది. పట్టణంలో ఖాళీ స్థలాలకు పన్నులు విధించాల్సిందిగా 50కి పైగానే దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇంటి నిర్మాణం పూర్తైనా పన్నులు విధించడంలేదు. కార్యాలయంలో దస్త్రాలు సమర్పించినా పట్టించుకోని పరిస్థితి నెలకొంది. ఇంటి ప్లాన్ ఏవిధంగా చేసుకోవాలి, పన్నులు విధింపు చేసే విధానం, అందుకు ఏఏ దస్త్రాలు సమర్పించాలి వంటి వివరాలు తెలుసుకునేలా కార్యాలయాల్లో బోర్డులు గానీ, గోడప్రతులు గానీ ఎక్కడా కనిపించవు. దీనిపై జోనల్ కమిషనర్ చక్రవర్తిని వివరణ కోరగా పూర్తి స్థాయి సర్వేయర్ లేకపోవడంతో ఇబ్బందులు ఉన్నమాట వాస్తవమేనన్నారు. కనీసం వారానికి మూడు రోజులు సర్వేయర్ ఇక్కడ అందుబాటులో ఉండే విధంగా చూస్తామన్నారు. ఇంత వరకు రెవెన్యూ అధికారి లేరని, ఇటీవలే నియమించారని తెలిపారు. ఖాళీ స్థలాలతో పాటు భవనాలకు పన్నులు విధిస్తామని చెప్పారు.

అనకాపల్లి పట్టణం

కాలువ పనులకు శ్రీకారం

అనకాపల్లి (గ్రామీణం), న్యూస్‌టుడే: వెంకటరమణపేటలో కాలువ నిర్మాణ పనులను సర్పంచి జెర్రిపోతుల లక్ష్మి, ఎంపీపీ సూరిబాబు ప్రారంభించారు. పంచాయతీ నిధులు రూ.9 లక్షలు, మండల పరిషత్ నిధులు రూ.6 లక్షలతో ఈ పనులు చేపడుతున్నారు.

ఎనిమిది మంది అరెస్టు

పాయకరావుపేట, న్యూస్‌టుడే: పట్టణంలోని పాత హరిజనవాడలో జూదం ఆడుతున్నారనే సమాచారంతో ఎస్సై పురుషోత్తం, ఏఎస్సై గోవింద్ ఆధ్వర్యంలో దాడులు చేశారు. ఎనిమిది మందిని అరెస్టు చేసి, రూ.14,700 నగదు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేశారు.

హెల్త్ అసిస్టెంట్లకు పదోన్నతులు హర్షణీయం

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: రాష్ట్రంలోని వార్డు, గ్రామ సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న హెల్త్ సెక్రటరీలను హెల్త్ అసిస్టెంట్, ఎంపీహెచ్‌ఏగా పదోన్నతులు కల్పించడం హర్షణీయమని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఆ సంఘ నాయకులు వీవీ నాగేశ్వరరావు అన్నారు. అనకాపల్లి సీఐటీయూ భవనంలో సోమవారం జరిగిన అభినందన కార్యక్రమంలో మాట్లాడారు.

విద్యుత్తు సరఫరా నిలిపివేత నేడు

పాయకరావుపేట, న్యూస్‌టుడే: పలు గ్రామాల్లో ఆర్డీఎస్ఎస్ పనుల్లో భాగంగా మంగళవారం విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నామని ఈఈ రాజశేఖర్ తెలిపారు. శ్రీరాంపురం, ఎస్. నర్సాపురం, పెదరామభద్రపురం, చినదర్సాపురం, పాల్తేరు, కేశవరం, రాజవరం, గజపతినగరం, వెంకటనగరం, రాజానగరం, కుమారపురం, రాజగోపాలపురం, కందిపూడి గ్రామాలకు సరఫరా ఉండదన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సరఫరా నిలిపివేస్తామని చెప్పారు.

స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వాలని ఆందోళన

కశింకోట, న్యూస్‌టుడే: స్థానికులకు సిమెంట్ కర్మాగారంలో శాశ్వత ప్రాతిపదికన ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఏఎస్‌పేట సమీపం లోరామ్‌కో సిమెంట్ కర్మాగారం వద్ద సోమవారం గ్రామస్థులు రిలే నిరాహార దీక్ష చేశారు. ఈ దీక్షలలో బి.వి.రమణ, మళ్ల గణేష్, సత్తిబాబు, సన్యాసినాయుడు, నాగేశ్వరరావు, కోన నాగేశ్వర రావు, యర్రంశెటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

హోంగార్డుకు ఆర్థికసాయం

అనకాపల్లి పట్టణం: చోడవరం పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తూ పదవీవిరమణ చేసిన హోంగార్డు చర్లపల్లి రామకోటేశ్వరరావుకు ఎస్పీ తుహిన్ సిన్హా సోమవారం రూ. 4,00,530 విలువ చేసే చెక్‌ను అందజేశారు. హోంగార్డుల ఒక రోజు వేతనాన్ని చెక్ రూపంలో ఇచ్చారు.

బైక్ దహనంపై ఫిర్యాదు

నక్కపల్లి, న్యూస్‌టుడే: చినతీనార్లలో ఓ ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు దహనం చేశారు. ఎస్సై కె.సన్నిబాబు కథనం ప్రకారం.. ఈ గ్రామానికి చెందిన చొక్కా ప్రసన్న కుమార్ తన ద్విచక్ర వాహనాన్ని ఆదివారం రాత్రి ఇంటి వద్ద ఉంచాడు. ఉదయానికి ఇంటికి కొద్ది దూరంలో కాలిపోయిన తన బైకును స్థానికులు చూసి సమాచారం అందించారు. తన వాహనాన్ని ఎవరో కావాలనే ఎత్తుకెళ్లి దహనం చేసినట్లు ప్రసన్నకుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

నాడు మొదలైంది.. నేడు కదలకుంది

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: అనకాపల్లి లోని గవరపాలెం జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో గత ప్రభుత్వ హయాంలో నాడు- నేడు పనుల పేరుతో అట్టహాసం చేశారు. రూ.80 లక్షలతో అదనపు తరగతి గదులు, ఆడిటోరియం నిర్మాణం చేపట్టారు. ఇవి మధ్యలో నిలిచిపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

నివాసాల ముందే నిలిచిన నీరు

పాయకరావుపేట (గ్రామీణం), న్యూస్‌టుడే: పీఎల్ పురం వద్ద కాలువలు మూసుకుపోవడంతో వర్షపు నీరు ముందుకు కదలడంలేదు. ఈ ప్రాంతంలో సాగు నీటి కాలువలకు అనుసంధానంగా జాతీయ రహదారికి ఇరువైపులా కాలువలు ఏర్పాటు చేశారు. వీటిని కప్పేయడంతో ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షపు నీరు ఖాళీ ప్రదేశాల్లోకి చేరుతోంది. ఈ కారణంగా దోమల బెడదతో సమీప కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. వరదనీరు పోయేందుకు మార్గం ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

పెచ్చులూడుతున్న పాఠశాల పైకప్పు

ఎలమంచిలి, న్యూస్‌టుడే: ఎలమంచిలిలో జడ్పీ బాలికోన్నత పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుంది. పైకప్పు దెబ్బతిని పెచ్చులు ఊడి పడుతున్నాయి. ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులకు ప్రమాదం పొంచి ఉంది. తరగతి గదులతో పాటు వరండాలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఈపాఠశాలలో 700 మందికి పైగా విద్యార్థులున్నారు. తరగతి గదులకు మరమ్మతులు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

దొంగల ముఠా అరెస్ట్

మంగళగిరి: అంతర్ జిల్లా దొంగల ముఠాను మంగళగిరి పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసు వివరాలను డీఎస్పీ మురళీకృష్ణ సోమవారం వెల్లడించారు. విశాఖ, కడప జిల్లాలకు చెందిన తోట శివకుమార్, తోట వరలక్ష్మి, ఇంతియాజ్ పగలంతా రెక్కీ నిర్వహించి రాత్రి పూట తాళాలు వేసి ఉన్న ఇళ్లలో దొంగతనాలకు పాల్పడుతున్నారు. ప్రధాన నిందితుడు శివకుమార్‌పై 150 పైగా దొంగతనం కేసులు ఉండగా.. మొత్తం ముఠాపై గాజువాక, అనకాపల్లి, దువ్వాడ, మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్లలో పలు కేసులు నమోదయ్యాయి. గత నెల 4న యర్రబాలెం గ్రామానికి చెందిన భూక్యా వీరాంజనేయులు ఇంట్లో ఈ ముఠా చోరీ చేయగా బాధితుడు ఫిర్యాదు మేరకు పోలీసులు వీరిని అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి 19 గ్రాముల బంగారం, 740 గ్రాముల వెండిని స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ వెల్లడించారు.

ద్విచక్ర వాహనం ఢీకొని ఒకరికి గాయాలు

ఎస్.కోట: కాపుసోంపురం వంతెన వద్ద ఆదివారం మధ్యాహ్నం ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తి తీవ్రంగా గాయపడినట్లు సీఐ వి.నారాయణమూర్తి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. అనకాపల్లి జిల్లా సబ్బవరం మండలం దువ్వాడకు చెందిన కిలారి గంగన్న, స్నేహితుడు గొడ్డు ఆదర్శ్ బైకుపై అరకు నుంచి వస్తుండగా కాపుసోంపురం వద్ద వాహనం ఢీకొంది. గంగన్నకు గాయాలయ్యాయి.

రూ.కోటితో ఉద్యానాల అభివృద్ధి

అనకాపల్లి, న్యూస్‌టుడే: పట్టణంలో రూ.40 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేశామని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ తెలిపారు. స్థానిక జీవీఎంసీ భవన్‌లో సోమవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ. కోటితో పట్టణంలోని అన్ని ఉద్యానాలు అభివృద్ధి చేస్తామన్నారు. రావుగోపాలరావు కళాక్షేత్రాన్ని రూ. 3.5 కోట్లతో, రాజీవ్‌గాంధీ స్టేడియాన్ని రూ. 2 కోట్లతో మెరుగుపరుస్తున్నామన్నారు. ఈపనులన్నీ మూడు నెలల్లో పూర్తివుతాయన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను మంజూరు చేస్తామన్నారు. స్థానికులకు కేటాయించిన టిడ్కో ఇళ్లను వైకాపా హయాంలో ఇతర ప్రాంతాల వారికి కేటాయించారని, హుద్‌హుద్ బాధితులకు నిర్మించిన ఇళ్లు సైతం ఇంత వరకు కేటాయించలేదన్నారు. ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చి వీటిని నిజమైన పేదలకు అందే విధంగా చూస్తామన్నారు. విజయరామరాజుపేట ఏఎంపీ కాలనీ, గాంధీనగరం అంజయ్యకాలనీలో గతంలో ఇళ్లు నిర్మించారని ఇంతవరకు వారికి రిజిస్ట్రేషన్ చేయలేదన్నారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లను అభివృద్ధి చేస్తామన్నారు. గాజువాక సర్వేయర్‌ను ఇక్కడ ఇన్‌ఛార్జిగా నియమించారని ఆయన సక్రమంగా రాకపోవడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని మాజీ కౌన్సిలర్ బీఎస్ఎంకే జోగినాయుడు తెలపగా విధిగా వారంలో మూడు రోజులు ఇక్కడ విధులు నిర్వహించాలని జోనల్ కమిషనర్‌కు తెలిపారు. మొత్తం 138 మంది వివిధ సమస్యలపై దరఖాస్తులు ఇచ్చారు. జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి, ట్రాఫిక్, పట్టణ సీఐలు వెంకటనారాయణ, ప్రేమకుమార్, నాయకులు ఆళ్ల రామచంద్రరావు, పీలా నాగశ్రీను, తాడి రామకృష్ణ, కాండ్రేగుల సత్యనారాయణ, బొడ్డేడ మురళి పాల్గొన్నారు.

దివ్యాంగుని సమస్య తెలుసుకుంటున్న కొణతాల

వృద్ధురాలిని బెదిరించి.. సొమ్ములు స్వాహా

ఎండాడ, న్యూస్‌టుడే: డిజిటల్ అరెస్టు, అంతర్జాతీయ సైబర్ ముఠాలకు బ్యాంకు ఖాతాలు అందించి నేరాలకు పాల్పడుతున్న ఆరుగురు నిందితులను సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేశారు. విశాఖ ఎంవీపీ కాలనీకి చెందిన ఎ.రజనికుమారి(63)కి ఈ ఏడాది మే నెలలో మోహన్‌కుమార్ అనే వ్యక్తి నుంచి ఫోన్ కాల్ వచ్చింది. హవాలా లావాదేవీలకు సంబంధించి ఆమెపై కేసు నమోదైందని, అన్ని ఆధారాలు ఉన్నాయని భయపెట్టాడు. ఇది జరిగిన రెండు రోజుల తర్వాత వెంకట్రామన్ అనే వ్యక్తి ఫోన్ చేసి డబ్బు చెల్లించకపోతే ముంబయి స్టేషన్‌లో డివిజన్ కారాగారంలో పెడతామని చెప్పాడు. భయపడిన ఆమె తన బ్యాంకు ఖాతా నుంచి రజత్‌కశ్యల్ పేరుతో ఉన్న ఖాతాకు రూ. 8.50 లక్షలు ఆన్‌లైన్‌లో పంపించారు. మరింత నగదు ఇవ్వాలని డిమాండ్ చేయడంతో తాను మోసపోయినట్లు తెలుసుకుని సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులకు అనకాపల్లి జిల్లాకు చెందిన ఎం.నరసింగరావు, బాపట్ల జిల్లా కూచిపూడికి వాసి జంపాల సందీప్, కాకినాడ జిల్లా సామర్లకోటకు చెందిన వి.సత్యనారాయణ, గుంటూరు జిల్లా వాసి డి.బాలఫణికుమార్, పశ్చిమగోదావరి జిల్లా భీమవరం వాసి జవ్వాడి రామాంజనేయులు, కాకినాడ పట్టణానికి చెందిన నార్ని సతీష్‌చంద్రలను అరెస్టు చేశారు. ఆశ చూపి కొందరి చేత బ్యాంకు ఖాతాలు తీయించి వాటిని సైబర్ ముఠాలకు అప్పగిస్తున్న ఈ నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

ప్రభుత్వ రంగంలోనే వైద్య కళాశాలలు నడపాలి

ఎలమంచిలిలో విద్యార్థుల ధర్నా

ఎలమంచిలి, న్యూస్‌టుడే: వైద్య కళాశాలలను ప్రభుత్వ రంగంలోనే నడపాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఇంటర్, డిగ్రీ విద్యార్థులు సోమవారం ఎలమంచిలిలో ధర్నా నిర్వహించారు. ముందుగా పాత జాతీయ రహదారిపై ర్యాలీ చేశారు. అనంతరం ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి వద్ద ధర్నా చేశారు. వాహనాల రాకపోకలు నిలిపివేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బాలాజీ, నాయకులు గౌతం, కృప, రాజేష్, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌జీవో యూనిట్ ఏకగ్రీవం

పాయకరావుపేట, న్యూస్‌టుడే: ఎన్‌జీఓ నక్కపల్లి తాలూకా యూనిట్ ఎన్నిక ఏకగ్రీవంగా ముగిసింది. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నామినేషన్ల స్వీకరణ చేశారు. దీనిలో 11 నామినేషన్లే రావడంతో సభ్యులు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. యూనిట్ అధ్యక్షుడిగా కొంతం శ్రీనివాసరావు, కార్యదర్శిగా ఆర్.రాము, అసోసియేట్ అధ్యక్షుడిగా ఆర్.రామగోవిందు, కోశాధికారిగా ఎం.వెంకటరెడ్డి ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి జి.వి.రమణబాబు తెలిపారు.

ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

నారాయణరావు మృతి తీరని లోటు

ఎలమంచిలి, న్యూస్‌టుడే: ఆక్వారంగంలో గుర్తింపు పొందిన వ్యాపారవేత్త సూరకాసుల నారాయణరావు మృతి రైతాంగానికి తీరని లోటని మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అన్నారు. సోమవారం ఎలమంచిలి ధర్మవరంలో సంస్మరణ సభకు మున్సిపల్ వైస్ ఛైర్మన్ బెజవాడ నాగేశ్వర రావు, మాజీ ఎంపీపీ దొర, నాయకులు హాజరై నారాయణరావుకు ఘన నివాళులు అర్పించారు. మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ కొఠారు సాంబ, వ్యాపారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

నివాళులు అర్పిస్తున్న నాయకులు

రెవెన్యూ డివిజన్‌తో పారిశ్రామికంగా అభివృద్ధి

కోటవురట్ల, న్యూస్‌టుడే: నక్కపల్లిలో రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయడం వల్ల పాయకరావుపేట నియోజకవర్గం పారిశ్రామికంగా మరింత అభివృద్ధి చెందుతుందని పీఏసీఎస్ ఛైర్మన్ వేచలపు జనార్దన్, తెదేపా మండల అధ్యక్షులు పెట్ల లింగన్ననాయుడు తెలిపారు. సోమవారం జల్లూరులోని తెదేపా పార్టీ కార్యాలయంలో పలువురు నాయకులతో కలిసి మాట్లాడారు. నక్కపల్లి పరిసర ప్రాంతాల్లో ఇప్పటికే పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి వెంకటరమణ, నాయకులు యలమంచిలి ప్రకాశ్, సుంకర బాబ్జి, సత్యనారాయణ, తిరుమలరావు పాల్గొన్నారు.

ఖాళీల భర్తీకి వినతి

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: అనకాపల్లి జోన్ పరిధిలో ఖాళీలన్నీ వెంటనే భర్తీ చేయాలని ఏఐటీయూసీ అనుబంధ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ యూనియన్ గౌరవాధ్యక్షుడు కోన లక్ష్మణ సోమవారం మున్సిపల్ జోనల్ కమిషనర్‌కు వారొక వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కారుణ్య నియమకాలన్నీ భర్తీ చేయాలన్నారు. పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. హెచ్‌ఆర్ పాలసీని అమలు చేయాలన్నారు. సుప్రీం కోర్టు ఉత్తర్వుల మేరకు సమాన పనికి సమాన వేతనాలు చెల్లించాలన్నారు. సిబ్బంది బకాయిలన్నీ చెల్లించాలని కోరారు. సంఘ ప్రతినిధులు ఎర్రంశెట్టి అప్పలరాజు, బంగారి రవికుమార్, శివమూర్తి, బంగారి శంకరరావు, రెడ్డి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

జెడ్సీకి వినతి ఇస్తున్న ప్రతినిధులు

శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలి

పాయకరావుపేట, మునగపాక, న్యూస్‌టుడే: ముస్లిం శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని నామవరానికి చెందిన మస్జిద్ ఎ మదీనా డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు తహసీల్దారు మహేశ్వరరావుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. కమిటీ అధ్యక్షుడు షేక్ వెంకా సాహెబ్, కార్యదర్శి నాగూర్, కోశాధికారి షాజహాన్, సత్తార్, ఇస్మాయిల్ సుభాన్ పాల్గొన్నారు. ▮బి క్లస్టర్ విధానాన్ని రద్దుచేయాలని యూనియన్ నాయకులు కర్రి లక్ష్మీనారాయణ తదితరులు తహసీల్దార్ సత్యనారాయణ, ఎంఈఓ వేణుగోపాలరావుకు వినతిపత్రాలు అందజేశారు. అచ్యుతకృష్ణ, గోవింద, నూకేశ్వరరావు, సత్తిబాబు, ఎం.వి.ఎ.రావు వినతిపత్రం ఇచ్చిన వారిలో ఉన్నారు.

తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న కమిటీ సభ్యులు

ఇళ్లు ఖాళీ చేయడానికి గడువు ఇవ్వండి

నక్కపల్లి, న్యూస్‌టుడే: పునరావాసంలో భాగంగా ఇళ్లను కోల్పోయినవారు తమ ఇళ్లను ఖాళీ చేయడానికి కొన్నాళ్లు గడువు ఇప్పించాలని తెదేపా నియోజకవర్గ సమన్వయకర్త కొప్పిశెట్టి వెంకటేష్ తహసీల్దారు ఆర్.నరసింహమూర్తిని కోరారు. మండలశాఖ అధ్యక్షుడు గింజాల లక్ష్మణరావు తదితరులతో సోమవారం నక్కపల్లిలో ఆయనను కలిసి మాట్లాడారు. తెలుగు యువత మండలశాఖ అధ్యక్షుడు కమ్మెల శివరామకృష్ణంరాజు, ఎరిపల్లి అప్పలరాజు, కుర్రా బాబ్జి, అమలకంటి హరి కృష్ణ పాల్గొన్నారు.

జీవో నెం 36 వెంటనే అమలుకు డిమాండ్

ఎలమంచిలి/ గ్రామీణం, న్యూస్‌టుడే: జీవో నం 36 వెంటనే అమలు చేసి పెండింగ్‌లో ఉన్న వేతన సవరణలతో పాటు మధ్యంతర భృతి చెల్లించాలని సహకార సంఘం ఉద్యోగులు ఎలమంచిలి డీసీసీబీ బ్రాంచి మేనేజర్‌కు వినతి పత్రం అందజేశారు. ఉద్యోగులు శివ కుమార్, పిల్లా మహాలక్ష్మినాయుడు తదితరులు పాల్గొన్నారు.

బ్రాంచి మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

మేమున్నాం.. మీకు తోడుగా

అనకాపల్లి- 80085 74722	పాయకరావుపేట- 80085 74750
ఎలమంచిలి- 80085 74726	

అనకాపల్లి, న్యూస్‌టుడే అనకాపల్లి కర్రివారి వీధిలో రహదారిపైనే ఇసుక, రాయి వేస్తున్నారు. వీటితో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. – కె.రాములమ్మ, అనకాపల్లి, ✓: రహదారిపై ఇసుక వేస్తే చర్యలు తీసుకుంటాం. – కె.చక్రవర్తి, జోనల్ కమిషనర్

అనకాపల్లి పట్టణం, అనకాపల్లి జిల్లా ఆసుపత్రి వద్ద వాహనాలను ఇష్టం వచ్చినట్లుగా పార్కింగ్ చేస్తున్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. – రాజశేఖర్, ✓: ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం. – వెంకట నారాయణ, ట్రాఫిక్ సీఐ

పాయకరావుపేట, న్యూస్‌టుడే పాయకరావుపేట రామాలయం పక్కన తాగునీటి పైపులైను నుంచి నీరు వృథాగా కాలువల్లోకి చేరుతోంది. – పెదిరెడ్డి శ్రీను, పాయకరావుపేట ✓: పైపులైనుకు మరమ్మతు చేయిస్తాం. – కె. డేవిడ్, ఈవో

పాయకరావుపేట, న్యూస్‌టుడే నామవరంలో కొండగెడ్డ పూడికతో నిండిపోయింది. – జయరాజ్, స్థానికుడు, ✓: గెడ్డలో పూడిక తొలగిస్తాం. – కె.డేవిడ్, డిప్యూటీ ఎంపీడీఓ

ఎలమంచిలి, న్యూస్‌టుడే ఎలమంచిలి ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద కారం మిల్లు ఘాటు భరించలేకపోతున్నాం. – ఆర్.రాము ఎలమంచిలి. ✓: ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చేస్తాం. – ప్రసాదరాజు, కమిషనర్

అచ్యుతాపురం, మోసయ్యపేటలో కాలువలను శుభ్రం చేయడంలేదు. – శ్రీనివాసరావు, మోసయ్యపేట, ✓: సమస్య లేకుండా చూస్తాం. – శ్రీను, పంచాయతీ కార్యదర్శి

వీధి దీపాల ఏర్పాటు

స్పందనకు వందనం

పాయకరావుపేట, న్యూస్‌టుడే: పట్టణంలోని లింగాలతోట కాలనీలో వీధి దీపాలు ఏర్పాటు చేశారు. ఈనెల 7న 'ఈనాడు'లో 'మేమున్నాం మీకు తోడుగా' శీర్షికలో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన సిబ్బంది సోమవారం కొత్తగా దీపాలు బిగించారు.

శాఖల వారీగా లక్ష్యసాధనకు చొరవ

కలెక్టరేట్, న్యూస్‌టుడే: శాఖల వారీగా నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొదటి విడతలో 24 మ్యాజిక్ డ్రైన్లు పూర్తి చేశామని, రెండో విడతలో మరో 24 పనులు చేపట్టాలన్నారు. పశువుల షెడ్లు, నీటి గుంతలు లక్ష్యం మేరకు పూర్తి చేయాలన్నారు. ప్రతి కుటుంబాలనికి వందరోజులు పనులు పూర్తి చేయాలన్నారు. నియోజకవర్గానికి ఒక పశువుల వసతి గృహం నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. జిల్లాకు కొత్తగా 5వేల నీటి గుంతలు మంజూరు చేస్తున్నామన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా అందిస్తున్న సేవలను ప్రజలకు చేరువ చేయాలన్నారు. సచివాలయ ఉద్యోగుల హాజరు నూరు శాతం నమోదు కావాలన్నారు. ప్రభుత్వ సేవలు, పథకాలకు సంబంధించి ప్రజల నుంచి సంతృప్తికరమైన సమాధానం వచ్చేలా చూడాలన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుపై ప్రత్యేక దృష్టి సారించి, సంపద కేంద్రాలను అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

హాజరైన జిల్లా అధికారులు

ఎంపీ మాతృమూర్తికి నివాళి

నివాళులు అర్పిస్తున్న తెలుగు మహిళలు

అనకాపల్లి, మునగపాక, న్యూస్‌టుడే: ఎంపీ సీఎం రమేశ్ తల్లి రత్నమ్మ చిత్రపటం వద్ద తెలుగు మహిళలు నివాళులు అర్పించారు. ఎంపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సంతాప సభలో తెలుగు మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కొణతాల రత్నకుమారి, భాజపా మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు నాగమణి, తెలుగు మహిళ జిల్లా కార్యదర్శి శంకర్ల పద్మలత, కళ్యాణి, సత్యవతి పాల్గొన్నారు. మునగపాక తెదేపా కార్యాలయంలో మండల తెదేపా అధ్యక్షుడు పెంటకోట విజయ్ ఆధ్వర్యంలో సంతాపసభ నిర్వహించారు. ఉల్లూరి నూకనరసింగరావు, భీమరశెట్టి శ్రీనివాసరావు, డొక్కా నాగభూషణం, ఆడారి జానకి, కడియం అనూరాధ పాల్గొన్నారు.

ఎలమంచిలిలో రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు దీక్షలు

మునగపాక, ఎలమంచిలి, న్యూస్‌టుడే: మునగపాక మండలాన్ని అనకాపల్లి రెవెన్యూ డివిజన్‌లోనే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ వైకాపా ఆధ్వర్యంలో సోమవారం నుంచి రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. ఒంపోలు, తిమ్మరాజుపేటకు చెందిన నాయకులు ఈ దీక్షల్లో కూర్చున్నారు. ఈ దీక్షలకు మాజీ మంత్రి అమర్‌నాథ్, వైకాపా సమన్వయకర్త కరణం ధర్మశ్రీ సంఘీభావం తెలిపారు. నాయకులు బొడ్డేడ ప్రసాదు, పెంటకోట స్వామిసత్యనారాయణ, ఆడారి గణపతి అచ్చింనాయుడు, బొద్దపు శ్రీరామమూర్తి పాల్గొన్నారు. ▮ఎలమంచిలిలో రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని కోరుతూ పాతజాతీయ రహదారిపై వైకాపా నాయకులు ధర్నా చేసి, మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కరణం ధర్మశ్రీ, మున్సిపల్ వైస్ ఛైర్మన్లు ఆరెపు గుప్తా, బెజవాడ నాగేశ్వరరావు, వర్రే గాంధీ, రఘురాజు, బొద్దపు ఎర్రయ్యదొర పాల్గొన్నారు.

అధ్యాపకులకు సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణ

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: అనకాపల్లిలోని దాడి వీరునాయుడు డిగ్రీ కళాశాలలో ఆంధ్ర యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కళాశాలలో సోమవారం నుంచి మూడు రోజుల పాటు జిల్లాలో అధ్యాపకులకు సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణ ఇస్తున్నట్లు వీసీ రాజశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా వీసీని కళాశాల ఛైర్మన్ దాడి రత్నాకర్ సత్కరించారు.

(c) eenadu

నర్సీపట్నం

• నర్సీపట్నం • చోడవరం • మాడుగుల

బహుమతులను అందజేస్తున్న శ్రీవిజ్ఞాన్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ గోవిందరావు తదితరులు

ఉత్సాహంగా ప్రసంగించి..

చోడవరం, న్యూస్‌టుడే: వయసుతో సంబంధం లేకుండా ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థులంతా ఉత్సాహంగా ముందుకొచ్చారు. పట్టణంలో శ్రీవిజ్ఞాన్ జూనియర్ కళాశాల, మహతి స్కూల్‌లో సోమవారం ఈనాడు- ఈటీవీ ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీల్లో విశేషంగా ఉపన్యసించారు. శ్రీవిజ్ఞాన జూనియర్ కళాశాలలో విద్యార్థులు 'కృత్రిమమేధతో' వచ్చే మార్పులు అంశంపై వక్తృత్వ పోటీలు జరిగాయి. ఇందులో ఏఐ సాయంతో రాణించే మార్పులను చక్కగా వివరించారు. మాట్లాడిన వారిలో బి.మహేంద్ర, కె.చిన్నమ్మయు, యు.శ్రీగౌరి విజేతలుగా నిలిచారు. వీరికి కళాశాల ప్రిన్సిపల్ నాయనిశెట్టి వ్యవహరించి బహుమతులను, జ్ఞాపికలను అందించారు. అధ్యాపకులు బి.రామకృష్ణ, ఎం.రమేష్ పాల్గొన్నారు.

ఉపన్యాస పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

విజేతలకు బహుమతులను అందిస్తున్న ప్రిన్సిపల్ ఉషారాణి, ఉపాధ్యాయులు

మహతి పాఠశాలలో..

మహతి స్కూల్‌లో విద్యార్థులు 'విద్యార్థుల పై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై వక్తృత్వ పోటీల్లో సెల్‌ఫోన్ వాడకంతో ఎదురయ్యే అనర్థాల గురించి వివరించారు. అవసరం లేకున్నా మితిమీరి వాడటంతో తలెత్తే దుష్ప్రభావాలను తెలిపారు. విజేతలుగా నిలిచిన డి.హసినిత, ఎస్.లాస్య, వి.జసుతో లకు మహతి స్కూల్ ప్రిన్సిపల్ పి.ఉషారాణి బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఉపాధ్యాయులు ఎస్.రామలక్ష్మి, బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న పాఠశాల విద్యార్థులు

తెరపై ఈనాడు

నర్సీపట్నం: శ్రీకృష్ణ ఆడి 1: రివాల్వర్ రీటా, జనతా బార్, స్కూల్ లైఫ్, రాజు వెడ్స్ రాంబాయి, ఆడి 2: ది గర్ల్ ఫ్రెండ్, రాజు వెడ్స్ రాంబాయి, నాట్ ఆల్ మూవీస్ ఆర్ ది సేమ్ డ్యూయల్, ఆడి 3: ఆంధ్రా కింగ్ తాలుకా, ఆడి 4: జూటోపియా, ఆంధ్రా కింగ్ తాలుకా, బంగార్రాజు: ప్రీ వెడ్డింగ్‌షో, రాజు: జింగిరి.
చోడవరం: శ్రీసాయిలక్ష్మి: ఆంధ్రా కింగ్ తాలుకా సాయిలక్ష్మి: శివ, పూర్ణా: రాజు వెడ్స్ రాంబాయి

సొంతింటి కల.. సాకారం దిశగా

చురుగ్గా పునఃపరిశీలన

నర్సీపట్నం, న్యూస్‌టుడే

సొంతిల్లు లేని పేదల కల త్వరలో సాకారం కానుంది. ఇందుకోసం ఇప్పటికే పీఎం ఆవాస్ గ్రామీణ్ యోజన పథకం 2.0 కింద లబ్ధిదారుల ఎంపికకు సర్వే చేపట్టారు. దీనిపై ఇప్పుడు 'చక్కర్ కన్ఫర్మేషన్' పేరిట పునఃపరిశీలన చురుగ్గా సాగుతోంది. సొంతస్థలం ఉన్న వారు, గతంలో అరకొరగా ఇంటి నిర్మాణాలు చేపట్టి వదిలేసిన వారు ఇప్పుడు గృహాల మంజూరు కోసం ముందుకొచ్చారు. వీరి వివరాలు, స్థలాల ఫొటోలు యాప్‌లో పొందుపరుస్తున్నారు. తుది అనుమతి కోసం వీటిని కేంద్ర ప్రభుత్వానికి నివేదించనున్నారు.

★ నర్సీపట్నం డివిజన్‌లోని నాలుగు నియోజకవర్గాల్లో ఇళ్ల కోసం సర్వేలో మొత్తం 21,700 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరి వివరాలన్నీ ఆన్‌లైన్లో నమోదయ్యాయి. నర్సీపట్నం నియోజకవర్గంలో 3,554 మంది, పాయకరావుపేటలో 10,280 మంది మాడుగులలో 3,964 మంది, చోడవరంలో 3,902 మంది చొప్పున ఈ దరఖాస్తులు అందజేశారు. వీటిని ఇప్పుడు మండలాల్లో హౌసింగ్ ఏఈలు సంబంధిత లబ్ధిదారుల దగ్గరకు వెళ్లి సర్వేలోని వివరాలన్నీ నిర్ధారించుకొని నమోదు చేస్తున్నారు. ఈ పనులను ఈనెల 14వ, తేదీలోగా పూర్తి చేయాలని ప్రభుత్వం గడువు నిర్ణయించింది. ఈ సమయాన్ని చాలా మంది దరఖాస్తులు ఇవ్వడానికి కేటాయించిందని అపోహ పడుతున్నారు. 'చక్కర్ కన్ఫర్మేషన్' పనులు చురుగ్గా సాగుతున్నాయని గృహ నిర్మాణ సంస్థ డివిజన్ ఈఈ శ్రీనివాసరావు తెలిపారు.

వైబీ అగ్రహారంలో లబ్ధిదారుల సమాచారం పునఃపరిశీలనకు ఫొటో తీస్తున్న ఏఈ జోగారావు

★ జిల్లా వ్యాప్తంగా నెల రోజుల కిందట ఈ పథకం కింద లబ్ధిదారుల ఎంపికకు సర్వే చేపట్టారు. ఇందులో సచివాలయాల సిబ్బంది, గ్రామ పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు. సెంటున్నర అలాగే అంతకు మించి సొంతస్థలం ఉన్న వారి వద్దకు వెళ్లి సమాచారాన్ని, ఫొటోలు పథకం 2.0 యాప్‌లో నమోదు చేశారు. ఈ సర్వే గతనెల 30 వరకు చేపట్టారు. తరువాత మూడు రోజులు దీనికి గడువు పెంచారు. పూర్తయిన దీనిపై ఇప్పుడు మరోసారి గృహనిర్మాణ సంస్థ ఏఈలు అన్నింటిని పరిశీలించి సమాచారాన్ని ధ్రువీకరిస్తున్నారు.

వసతి గృహంలో బాలికలపై కోతి దాడి

బాలిక మెడపై గాయాలు

రావికమతం, న్యూస్‌టుడే: రావికమతంలోని ఎస్సీ, బీసీ బాలికల వసతిగృహాల్లో కోతులు, కుక్కలకు ఆవాసాలుగా మారాయి. అక్కడ బసచేస్తున్న బాలికలపై దాడులు చేస్తూ గాయపరుస్తున్నాయి. దీంతో విద్యార్థినులు బిక్కుబిక్కుమంటున్నారు.

★ గత నెలలో బీసీ బాలికల వసతిగృహంలోకి అర్ధరాత్రి కుక్కలు ప్రవేశించి 12మంది బాలికలను గాయపరిచిన ఘటన మరవక ముందే ఆదివారం రాత్రి మరోఘటన చోటుచేసుకుంది. రాత్రి వసతి గృహంలో నిద్రిస్తున్న ఇద్దరిపై కోతులు దాడి చేశాయి. దీంతో ఏడో తరగతి చదువుతున్న పాల్లిరెడ్డి స్నేహ, తొమ్మిదో తరగతి విద్యార్థిని సేదిరి మంగకు స్వల్పంగా గాయాలయ్యాయి. దీంతో పెదగరువు, రాయిపాడుకు చెందిన వీరిద్దరిని సిబ్బంది ఆదివారం రాత్రి పీహెచ్‌సీకి తీసుకెళ్లగా ప్రాథమిక వైద్యం చేసి అనంతరం నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి పంపిస్తున్నట్లు సిబ్బంది తెలిపారు. అనంతరం విషయాన్ని బాలికల తల్లిదండ్రులకు తెలియజేశారు.

★ సంబంధిత శాఖాధికారులు తక్షణమే స్పందించి బాలికల రక్షణ కల్పించాలని వీహెచ్‌పీ కోలా, ఆదివాసీ గిరిజన సంఘం అధ్యక్షుడు గెమెల వాసు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గోవిందరావు, కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి సూరిబాబు, డప్పు కళాకారుల సంఘం అధ్యక్షుడు ఎత్తుల రాజు డిమాండు చేశారు. దీనిపై స్పందిస్తూ సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు సోమవారం వసతి గృహాన్ని పరిశీలించారు.

రూ.4 లక్షలతో డ్రైనేజీల నిర్మాణం

రావికమతం, న్యూస్‌టుడే: కొత్తకోటలో మండల పరిషత్తు నిధులు రూ.4 లక్షలతో సీసీ కాలువలు నిర్మిస్తున్నారు. ఎంపీటీసీ-2 పెద్ద దేవర మండల పరిషత్తు నిధులు రూ.4 లక్షలు కేటాయించగా ఆ నిధులతో ధతి కాలనీ, అంబేడ్కర్ కాలనీలో కొత్తగా సిమెంటు కాలువల నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం సిమెంటు కాలువల పనులు చురుగ్గా సాగుతున్నాయి.

మాకవరపాలెం: భీమబోయినపాలెం సివారు గండిపేట గ్రామ అభివృద్ధికి సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు రూ.30లక్షలు మంజూరు చేశారని సర్పంచి తెలిపారు. సోమవారం కాలువలు, రహదారుల నిర్మాణం పనులకు సంబంధించి అధికారులు సర్వే నిర్వహించారు.

108 వాహనంలో ప్రసవం

చీడికాడ, న్యూస్‌టుడే: చీడికాడ మండలం కోనాం పంచాయతీ శివారు గుడివాడ గ్రామానికి చెందిన గిరిజన మహిళ లింగభోయిన గంగకు సోమవారం ఉదయం పురిటినొప్పులు రావడంతో ఆశా, కుటుంబసభ్యులు చీడికాడ పీహెచ్‌సీ సమాచారం ఇచ్చారు. 108 వాహనం వేరే కేసు నిమిత్తం మరో చోటికి వెళ్లడంతో దేవరాపల్లి నుంచి అంబులెన్స్ వచ్చి పీహెచ్‌సీకి తీసుకువెళ్తుండగా మార్గమధ్యలోనే ప్రసవించి మగబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం చీడికాడ పీహెచ్‌సీకి తరలించారు.

ప్లాస్టిక్ వినియోగంతో అనర్థాలు

మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే: సాగరం కాలనీలో మాడుగుల ప్రభుత్వ డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం ప్రత్యేక సేవా శిబిరం మూడో రోజు కొనసాగింది. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ప్లాస్టిక్ వాడకంతో కలిగే నష్టాలు వివరిస్తూ వీధుల్లో ర్యాలీ చేశారు. కమ్యూనిటీ హెల్త్ అధికారిణి వరలక్ష్మి ఆధ్వర్యంలో మహిళలకు, వాలంటీర్లకు రక్త పరీక్షలు చేసి రక్తహీనతతో బాధపడుతున్న వారికి మందులు అందించారు. సర్పంచి జయమ్మ, అధ్యాపకులు రాజు, అప్పలనాయుడు, ప్రోగ్రాం అధికారి రామ్‌కుమార్ పాల్గొన్నారు.

మార్గదర్శకాలు పాటించాల్సిందే

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: నిర్వహణకు సంబంధించిన మార్గదర్శకాలన్నీ తప్పనిసరిగా పాటించాల్సిందేనని జిల్లా ప్రోగ్రాం అధికారిణి డాక్టర్ జె.ప్రశాంతి మెడికల్ ల్యాబ్ యజమానులకు స్పష్టం చేశారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఆదేశాల మేరకు సోమవారం ఆమె పట్టణంలోని పలు ప్రైవేట్ మెడికల్ ల్యాబ్‌లను తనిఖీ చేశారు. రెండు ల్యాబ్‌లలో నిపుణులైన సిబ్బంది లేరని, సిబ్బంది ధ్రువీకరణ పత్రాలు అందుబాటులో ఉంచలేదని గుర్తించారు. ప్రతిల్యాబ్‌కు పేషెంట్లకు ఉండాలని గతంలోనే ఇచ్చిన ఆదేశాలు సరిగా పాటించడం లేదన్నారు. వారం రోజుల్లో అందరు నిబంధనలు ఆచరించాలని, లేదంటే చర్యలు తీసుకుంటామన్నారు.



ప్రైవేట్ మెడికల్ ల్యాబ్‌లో దస్త్రాలు పరిశీలిస్తున్న డాక్టర్ ప్రశాంతి

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండండి

నర్సీపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: చదువుకునే వయసులో దారి తప్పవద్దని డీఎస్పీ పోతిరెడ్డి శ్రీనివాసరావు విద్యార్థులకు సూచించారు. గబ్బాడ హైస్కూల్లో సోమవారం సాయంత్రం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాలకు అలవాటు పడితే జీవితం నాశనమవుతుందని పేర్కొన్నారు. ఎక్కడైనా గంజాయి ఉన్నట్లయితే 112, 1972 నెంబర్లకు సమాచారమివ్వాలని కోరారు. గ్రామీణ ఎస్సై రాజారావు, ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న గబ్బాడ హైస్కూల్ విద్యార్థులు

చలి నుంచి బాలలను కాపాడాలి

నాతవరం: చలి తీవ్రంగా ఉన్నందున వసతి గృహాల్లోని బాలల సంరక్షణకు అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. నాతవరం, తాండవ తదితర వసతిగృహాల్లో సుమారు 550 మంది ఉంటున్నారు.

రాయితీపై విత్తనాల పంపిణీ

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: రబీలో సాగు చేసుకోవడానికి అపరాల విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి భాస్కరరావు తెలిపారు. మినుములు 1,680 కేజీలు, పెసలు 312 కేజీలు, వేరుశనగ 2340 కేజీలు, పది 1900 కిలోలు, రాగులు 50 కిలోల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. అవసరమైన రైతులు రైతుసేవా కేంద్రాలకు వెళ్లి రాయితీ ధరకు విత్తనాలు పొందవచ్చునని తెలిపారు.

రావికమతం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని అన్ని రైతు సేవా కేంద్రాల దగ్గర మంగళవారం నుంచి అపరాల విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి రమేష్ బాబు చెప్పారు. రబీ 2025 అపరాల పంటలకు సంబంధించి మినుము టి.బి.ఎస్-8 రకం 14.56 క్వింటాళ్లు, పెసర ఐ.పి.ఎం-14 రకం 1.36 క్వింటాళ్లు, వేరు సెనగ కె-6 రకం 26.20 టన్నులు విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. కొత్తకోట పీఏసీఎస్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే రాజు మంగళవారం ప్రారంభిస్తారని మండల వ్యవసాయాధికారి రమేష్ తెలిపారు.

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: అపరాల విత్తనాలను రైతులందరికీ అందజేసే విధంగా విస్తృతంగా చేపట్టాలని మార్కెట్ కమిటీ ఛైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ కోరారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటైన కార్యక్రమంలో సోమవారం రైతులకు పెసర, మినుము విత్తనాలు పంపిణీ చేశారు. వ్యవసాయాధికారిణి విజయలక్ష్మి మాట్లాడుతూ మండలానికి 11.44 క్వింటాళ్ల మినుములు, 7.92 క్వింటాళ్ల పెసలు వచ్చాయని తెలిపారు. మొలకశాతం పరిశీలన అనంతరం రైతులకు సరఫరా చేస్తున్నామని వివరించారు. కిలో మినుములు రూ.96.60, పెసలు రూ.94.50 చొప్పున చెల్లించి తీసుకువెళ్లాలని రైతులను కోరారు.

మహారాజశ్రీ చోడవరం సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
OS. 5/2023 EP 8/2024
Between
వేపుకుల్ల శ్రీనివాస్ ...Plaintiff/DHr
and
గండి సత్తిబాబు ... Respondent/JDr
వేలం ప్రకటన
దిగువ వివరింపబడిన షెడ్యూల్ ఆస్తి కోర్టు వారిచే పై కోర్టు నందు తేది. 2-1-2026న ఉదయం గం. 10.00ని॥ల నుండి సాయంత్రం గం. 5.00ని॥ల మధ్యలో బహిరంగ వేలం వేయబడును. కావున కావలసినవారు వేలంలో పాల్గొని పొందవచ్చును.
షెడ్యూలు ఆస్తి
అనకాపల్లి జిల్లా, చీడికాడ మండలం, మాడుగుల సబ్ రిజిస్ట్రార్ ఇండివిజన్ గ్రామము సర్వే నెం.81-2 పల్లం భూమి విస్తీర్ణం AC(లు) 0.41 Cents (సెంట్లు)
తూర్పు: గండి సూర్యనారాయణ & గండి సత్తు గారి వ్యవసాయ భూమి, పడమర: CC రోడ్డు, ఉత్తరం: గండి మోదునాయుడు గారి పంట భూమి, దక్షిణం: గండి సింహాచలం గారి భూమి యందు.
DHr VALUE: Rs.6,00,000/-
AMIN VALUE Rs.12,30,000/-
MARKET VALUE Rs. 7,00,000/-
(శ్రీ కోర్టువారి ఉత్తర్వులు ప్రకారం)
G.R.S.KUMAR
Advocate
Anakapalli. 9848634348

డంపింగ్ యార్డుకు స్థలం చూపాలని వినతి

రావికమతం, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో రావికమతం పంచాయతీకి డంపింగ్ యార్డు ఏర్పాటుకు స్థలం చూపాలంటూ సర్పంచి మోదినాయుడు, తెదేపా నాయకులు కలెక్టర్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. గ్రామంలో సేకరించిన చెత్తను ఊరు బయలకు తరలించి నిల్వ చేసేందుకు డంపింగ్ యార్డు లేక ఇబ్బందులు పడుతున్నట్లు వినతిపత్రంలో పేర్కొన్నారు.

వినతిపత్రం చూపిస్తున్న సర్పంచి, నాయకులు

రోలుగుంట, న్యూస్‌టుడే: మొంథా తుపాను సమయంలో కోందుజాతి గిరిజనులకు పరిహారం బకాయిలు ఇప్పటివరకు చెల్లించలేదని బాధితులు వాపోతున్నారు. సీపీఎం జిల్లా నాయకుడు గోవిందరావు కలిసి తహసీల్దార్ నాగమ్మకు వినతిపత్రం అందజేశారు.

నర్సీపట్నం, న్యూస్‌టుడే: స్థానిక సబ్ కలెక్టరేట్‌లో సోమవారం ఏర్పాటైన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు పన్నెండు అర్జీలు దాఖలయ్యాయి. తహసీల్దారు రామారావు, సబ్ కలెక్టరేట్ ఏఓ సత్యనారాయణ ఇందులో వినతులు స్వీకరించారు. ఈ ప్రాంతంలోని మహిళలు పలువురు తమకు వితంతు పింఛన్లు మంజూరు చేసి ఆదుకోవాలని దరఖాస్తులు అందజేశారు. మాకవరపాలెం మండలంలోని కామేశ్వర్‌నగర్, కొత్తపాలెం గ్రామాలను కలిపి ప్రజల సౌకర్యార్థం కొత్త పంచాయతీగా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాల్సిందిగా ఆ గ్రామాలకు చెందిన వారు అధికారులను కోరారు.

ధాన్యం రైతులకు గిట్టుబాటు ధర

మాకవరపాలెం, న్యూస్‌టుడే: ఈ ఖరీఫ్‌లో వరి పండించిన రైతులకు ధాన్యం గిట్టుబాటు ధర చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని తహసీల్దారు వెంకటరమణ తెలిపారు. ఆయన వ్యవసాయాధికారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. రైతు సేవాకేంద్రాల ద్వారా ధాన్యం సాధారణ రకం రూ.2369, గ్రేడ్ ఏ రకం రూ.2389 చెల్లించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఓ అప్పారావు రైతు సేవా సిబ్బంది పాల్గొన్నారు.

స్థల ఆక్రమణలపై కలెక్టర్‌కు ఫిర్యాదు

చోడవరం, న్యూస్‌టుడే: చోడవరం పట్టణ నడిబొడ్డున బి-ఎన్ రహదారిని అనుకుని ఉన్న పాత చెరువులో కొంత భాగం కప్పేస్తూ చేపడుతున్న నిర్మాణాలకు కళ్లెం వేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు కలెక్టర్‌ను కోరారు. ఈమేరకు అనకాపల్లి కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి సోమవారం ఫిర్యాదు చేశారు.

విద్యార్థుల పరీక్ష ఫీజు చెల్లింపు

మాకవరపాలెం: పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు ఆల్ఇండియా జ్యోతిరావు పూలే ఓబీసీ సంఘం అధ్యక్షుడు పోతల ప్రసాద్ సోమవారం పరీక్ష ఫీజు చెల్లించారు. మండలంలో ఉన్న అయిదు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న 414 మందికి సంబంధించి ఫీజును పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందించారు. వేములపూడి మండలంలో 184 మందికి ఫీజు చెల్లించినట్లు ప్రసాద్ ప్రతినిధి రమణ తెలిపారు. యూపీఎస్సీ సివిల్స్‌కు సన్నద్ధమవుతున్న దాదాపు 150 మందికి దిల్లీలో ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు జరిగిందని రమణ తెలిపారు. దీనితో పాటు పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన వారికి నచ్చిన కళాశాలలో చదివిస్తామని హామీ ఇవ్వడం హర్షణీయమని ప్రధానోపాధ్యాయులు నారాయణరావు తెలిపారు.

సర్వేఉద్యోగుల సంఘం కార్యవర్గం ఎన్నిక

నర్సీపట్నం, న్యూస్‌టుడే: డివిజన్ సర్వే ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా స్థానిక మండల సర్వేయర్ **బి.వెంకటేశ్వరరావు** ఎన్నికయ్యారు. ఈ సంఘం నూతన కార్యవర్గం సోమవారం ఎన్నికైంది. అధ్యక్షుడు వెంకటేశ్వరరావుతో పాటు కార్యదర్శిగా వరుణ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా అమానుల్లాహ్, సహాయ కార్యదర్శిగా సత్యనారాయణ, కోశాధికారిగా కిరణ్ మైఖేల్ ఎన్నికయ్యారు. వీరు ఈ పదవుల్లో మూడేళ్లపాటు కొనసాగనున్నారు.

చోడవరం, న్యూస్‌టుడే: రెడ్డిపల్లిలో జరిగిన ఉమ్మడిజిల్లా ఎస్టీయూ కౌన్సిల్ సమావేశంలో స్టేట్ టీచర్స్ జిల్లా యూనియన్ (ఎస్టీయూ) అధ్యక్షుడిగా ఐ.వి.రామిరెడ్డి ఎన్నికయ్యారు. ప్రస్తుతం ఆయన స్థానిక బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించి 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని డిమాండ్ చేశారు.

విజేతలకు అభినందనలు

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: పీఆర్టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన నవోదయ నమూనా పరీక్షల్లో విజేతలైన విద్యార్థులు జిల్లా సంఘం అధ్యక్షుడు డీజీనాథ్ సోమవారం జ్ఞాపికలను అందజేశారు. జి.హనిష్‌కుమార్, జి.సాత్విక్, కె.అఖిల్‌కుమార్, జి.రిషిత, ఎస్.యశ్విక, వి.శాన్విసాత్విక విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో పీఆర్టీయూ నాయకులు వరహాలనాయుడు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జ్ఞాపికలు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

పోలీసు కుటుంబానికి ఆర్థికసాయం

నర్సీపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: అల్లూరి సీతారామరాజు జిల్లా సీలేరు పోలీసుస్టేషన్‌లో ఏఎస్సైగా పనిచేస్తూ అనారోగ్యంతో మృతిచెందిన నర్సీపట్నానికి చెందిన టి.బుజ్జి కుటుంబానికి శక్తి పోలీసు సంఘం నాయకులు సోమవారం రూ. లక్ష అందజేశారు. 1990 బ్యాచ్ కానిస్టేబుళ్లు సంఘంగా ఏర్పడి ప్రతినెలా రూ.500 చొప్పున పొదుపు చేస్తున్నారు. సభ్యుల్లో ఎవరైనా అనారోగ్యంతో చికిత్స పొందుతుంటే రూ.20వేలు, మరణిస్తే ఆ కుటుంబానికి రూ.లక్ష చొప్పున అందజేస్తున్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు అనిల్, కార్యదర్శి పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: చోడవరం పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తూ పదవీవిరమణ చేసిన హోంగార్డు చర్లపల్లి రామకోటేశ్వరరావుకు ఎస్పీ తుహిన్‌సిన్హా సోమవారం రూ. 4,00,530 విలువ చేసే చెక్‌ను అందజేశారు. హోంగార్డుల ఒక రోజు వేతనాన్ని చెక్ రూపంలో ఇచ్చారు.

నగదు చెక్కు అందజేస్తున్న సభ్యులు

విద్యా సామగ్రి పంపిణీ

మాకవరపాలెం, న్యూస్‌టుడే : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌ఛార్జి సూర్యచంద్ర సోమవారం స్టడీ మెటీరియల్ అందజేశారు. ఉన్నత లక్ష్యాలను పెట్టుకుని వాటిని సాధించేందుకు కృషి చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ కార్యదర్శులు అల్లాడ సురేష్, పంచాద హరినాథ్, మండల ఉపాధ్యక్షులు కొండలరావు, సత్యనారాయణ ప్రధానోపాధ్యాయులు నారాయణరావు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి అందజేస్తున్న సూర్యచంద్ర

వాకర్స్ సందడి

చోడవరం, న్యూస్‌టుడే: పట్టణానికి చెందిన వాకర్ ఫ్రెండ్స్ హెల్త్ క్లబ్ సభ్యులు అడ్డూరు గ్రామంలో సమావేశమై సందడిగా గడిపారు. సంగీత విభావరిలో పాడే పాటలకు చిందేశారు. ఈ కార్యక్రమంలో పలువురిని సత్కరించారు. స్వాతంత్ర్య, ఉపాధ్యాయ దినోత్సవం రోజున అవార్డులు పొందిన నాగఅప్పారావు, సింహాచలం, పైడారావులను, న్యాయవాది టి.వి.రమణ, వాసవీక్లబ్ అంతర్జాతీయ జిల్లా గవర్నరుగా ఎన్నికైన పూసర్ల వెంకట రమణమూర్తి, న్యాయ సలహాదారు కాండ్రేగుల డేవిడ్, విశ్రాంత ఆరోగ్య విస్తరణాధికారి ఎ.జగన్నాధరావు సేవలను ప్రశంసించి సన్మానం చేశారు. ప్రధాన కార్యదర్శి జాజుల జగ్గారావు, కోశాధికారి రాయవరపు కన్నంనాయడు, కోకా రాంబాబు, దేవానందం, కాసిరాజు, మోనోహర్, టి.సత్యం, చిన బాబు, గనిరెడ్డి, సుధీర్ పాల్గొన్నారు.

సమావేశానికి హాజరైన క్లబ్ సభ్యులు

డిమాండ్ల సాధన కోసం దీక్షలు

చోడవరం డీసీసీబీ శాఖ ఎదుట నిరసన

చోడవరం, న్యూస్‌టుడే: సమస్యల పరిష్కారం కోరుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ ఐక్య వేదిక (జేఏసీ) ఆధ్వర్యంలో సంఘాల ఉద్యోగులు సోమవారం స్థానిక డీసీసీబీ శాఖ వద్ద నిరసన వ్యక్తం చేశారు. శాఖ ముందు శిబిరం ఏర్పాటు చేసి ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆందోళన చేపట్టారు. జిల్లా సమన్వయకర్త బొడ్డేడ అర్జునరావు, గొంతిన బాబ్జి, గోవాడ సింహాచలం, శీరం రెడ్డి శ్రీను జాజిమొగ్గల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: డిమాండ్ల సాధనకు సహకార సొసైటీల ఉద్యోగులు ఆందోళన చేపట్టారు. 8 సహకార సంఘాలకు చెందిన సీఈవోలు, సిబ్బంది నర్సీపట్నంలోని డీసీసీబీ బ్రాంచి వద్ద సోమవారం నిరసనకు దిగారు. సంఘం జిల్లా కార్యవర్గ సభ్యుడు మడ్డు మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రావికమతం, న్యూస్‌టుడే: కొత్తకోట, రావికమతం, చినపాచిల, మేడివాడ, తురకలపూడి, పొట్టిదొరపాలెం పీఏసీఎస్‌లకు చెందిన ఉద్యోగులు ఆందోళనలో పాల్గొన్నారు. 2019-24 మధ్య కాలానికి మధ్యంతర భృతి చెల్లించాలని డిమాండు చేశారు. డీసీసీబీ రావికమతం శాఖ మేనేజర్ నారాయణమూర్తికి వినతిపత్రం అందజేశారు.

కె.కోటపాడు, న్యూస్‌టుడే : కె.కోటపాడు డీజీజీబీ బ్రాంచి కార్యాలయం ఎదుట కె.కోటపాడు, చౌడువాడ, దేవరాపల్లి మండలం ములకలాపల్లి పీఏసీఎస్‌లకు ఉద్యోగులు ఆందోళన చేశారు.

నర్సీపట్నంలో నినాదాలు చేస్తున్న మహిళలు, నాయకులు

పాఠశాల మరమ్మతుకు చేయూత

పాఠశాల వద్ద ఉపాధ్యాయినులు, విద్యార్థులు

రోలుగుంట, న్యూస్‌టుడే: జె.పి. అగ్రహారం ప్రాథమిక పాఠశాలకు మరమ్మతులు చేసి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థి పెట్ల సత్యనారాయణ రూ.30 వేలు అందజేశారు. ఈ మొత్తంతో మరమ్మతు చేయించారు. పాఠశాలలో రికార్డులను భద్రపరిచేందుకు బీరువా బహూకరించారు. సర్పంచి వెంకటపద్మ, ఉపాధ్యాయులు, విద్యాకమిటీ ఛైర్మన్ సత్యనారాయణ పూర్వ విద్యార్థిని అభినందించారు.

మేమున్నాం.. మీకు తోడుగా

నర్సీపట్నం - 80085 74743	చోడవరం - 80085 74732
మాడుగుల - 80085 74740	చీడికాడ - 80085 74742

రోలుగుంట, న్యూస్‌టుడే: గ్రామంలో తాగునీటి అవసరాలకోసం ఏర్పాటుచేసిన రక్షిత తాగునీటి పథకానికి చెందిన రెగ్యులేటింగ్ పంపుహౌస్ శిథిలమై పుట్టలకు నిలయంగా మారింది. **– రాజబాబు, గొల్లపేట,** ✓: దీని స్థానంలో నూతనంగా జల్‌జీవన్ పథకంలో కొత్త పథకం నిర్మించాం. త్వరలో దాని నుంచి తాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటాం.
– పోతల రాజశేఖర్, సర్పంచి, ఎన్.కొత్తూరు

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: వడ్డాది గ్రామంలో పాతసినిమాహాల్ వద్ద రోడ్డులో వీధి దీపాలు వెలగడం లేదు. వారం రోజులగా రాత్రిపూట చీకట్లో ఇబ్బందులు పడుతున్నాం. **– ఆది రమేష్, వడ్డాది,** ✓: వీధి దీపాల పునరుద్ధరణకు వెంటనే చర్యలు తీసుకుంటాం.
– లోవరాజు, పంచాయతీ ఈవో, వడ్డాది

సంవత్సరీకం

ఏమండీ!
మీరు మా నుండి భౌతికంగా దూరమైనా మీరెల్లప్పుడూ మా అందరి హృదయాలలో నిలిచి ఉంటారు. మీ అనురాగం, మంచితనం, నిజాయితీ, పరోపకారం అనే బాటలో మేము సదా ముందుకు సాగుతాము.
ప్రేమతో మీ కుటుంబ సభ్యులు...

కీ॥శే॥ రేగులగెడ్డ రామ కామేశ్వర శివరావు గారు
Retd. సేల్స్ & పర్చేజెస్ మేనేజర్, చోడవరం కో-ఆపరేటివ్ సుగర్స్ లిమిటెడ్
జననం: 07-01-1946 శివైక్యం: 21-12-2024
భార్య: రేగులగెడ్డ వేంకట సత్య రామ సుబ్బలక్ష్మి
కుమారుడు - కోడలు: రేగులగెడ్డ నాగభూషణ శర్మ - రజని
మనుమడు : ప్రణవ నాగ శ్రీ కామేశ్వర అనిరుధ్
అల్లుడు - కుమార్తె : గరిమెళ్ల రామలింగేశ్వర శర్మ - వేంకట లక్ష్మీ గాయత్రి
మునుమరాలు : శ్రీ అంజనా సాత్విక
మరియు రేగులగెడ్డ, గరిమెళ్ల వారి కుటుంబ సభ్యులు
అన్న సంతర్పణ: తేది 10-12-2025 బుధవారం

यूनियन बैंक ऑफ इंडिया Union Bank of India
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కిర్లంపూడి బ్రాంచి, కిర్లంపూడి, కాకినాడ జిల్లా

స్వాధీనత ప్రకటన(స్థిరాస్తి కొరకు)
(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8(1))

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002 ప్రకారము **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా** యొక్క అధీకృత అధికారి అయిన ఈ సంతకందారుడు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 (2002 ఆఫ్ 54) నందలి సెక్షన్ 13(12)కు అనుబంధమైన నిబంధన 3 ప్రకారము సంక్రమించిన అధికారములతో **ఋణగ్రహీత : శ్రీ దాడి నరసింహారావు తండ్రి: కోటేశ్వర రావు,** డి.నెం.4-69, దాడి వారి వీధి,చిల్లంగి, కిర్లంపూడి మండలం, కాకినాడ జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 533 431. వారు చెల్లించవలిసిన బకాయిమొత్తం **రూ.25,69,536/- (అక్షరాల ఇరవై ఐదు లక్షల అరవై తొమ్మిది వేల ఐదు వందల ముప్పై ఆరు రూపాయలు మాత్రమే)** + వడ్డీ మరియు ఇతర ఖర్చులు మొ॥ సదరు నోటీసు తేదీ నుండి 60 రోజులలోగా చెల్లించవలసినదిగా **తేది. 26.06.2025న డిమాండ్ నోటీసు జారీచేయడమైనది.**

ఋణగ్రహీత మరియు హామీదారులు సదరు బకాయిమొత్తమును తిరిగి చెల్లించడంలో విఫలమైనందున ఈ దిగువ సంతకందారుడు సదరు చట్టములోని సెక్షన్ 13(4)కు అనుబంధమైన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 నందలి రూలు 8 ప్రకారము **తేది. 06.12.2025 న** దిగువ పేర్కొన్న ఆస్తిని స్వాధీనత తీసుకోవడమైనదని ఋణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకమునకు ఇందుమూలముగా తెలియజేయడమైనది.

సెక్షన్ 13(8) చట్టం ప్రకారము ఋణగ్రహీత మరియు హామీదారు తమ తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించుకోగలరు.

ముఖ్యంగా ఋణగ్రహీత/హామీదారును మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా హెచ్చరించునది ఏమనగా సదరు ఆస్తులతో ఎవరూ ఎటువంటి లావాదేవీలు జరుపరాదనియు మరియు సదరు ఆస్తులతో జరిపే ఏ లావాదేవీలైనా బకాయిమొత్తం **రూ.25,69,536/- (అక్షరాల ఇరవై ఐదు లక్షల అరవై తొమ్మిది వేల ఐదు వందల ముప్పై ఆరు రూపాయలు మాత్రమే)** + వడ్డీ మరియు ఇతర ఖర్చులు మొ॥ **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా** వారి ఛార్జీకి లోబడి ఉంటాయి.

సెక్షన్ 13(8) చట్టం ప్రకారము ఋణగ్రహీత మరియు హామీదారు తమ తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించుకోగలరు.

తనఖావుంచిన ఆస్తి వివరములు
విశాఖపట్నం జిల్లా , చోడవరం సబ్-రిజిస్ట్రీ, చోడవరం మండలం, నరసన్నపేట గ్రామపంచాయితీ పరిధి, సమీప డి.నెం. 2-14, ఎస్.నెం.279/2 మరియు 280/2 లో ప్లాట్ నెం.4 లో 224 చ॥గ॥ ఖాళీ నివాస స్థలము **శ్రీ దాడి నరసింహారావు తండ్రి: కోటేశ్వర రావు** సంబంధించిన యాపదాస్తి. ఈ దిగువ హద్దులలో: **తూర్పు** : ప్లాట్ నెం.5 ఖాళీ స్థలం మరియు రోడ్డు, **పడమర** : ప్లాట్ నెం.3లో ఖాళీ స్థలం,**ఉత్తరం** : లెక్కల సత్యనారాయణ గారి ఖాళీ స్థలం, **దక్షిణం** : 14అ॥ వెడల్పు గల రోడ్డు.

తేది : 06.12.2025
ప్రదేశం : కిర్లంపూడి
సం/- ఛీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి

(c) eenadu

పెందుర్తి

తెరపై ఈనాడు

లక్ష్మీకాంత్ స్క్రీన్-1 **రాజు వెడ్స్ రాంబాయి**

స్క్రీన్-2 - **ఆంధ్ర కింగ్ తాలూకా**

ఘనంగా అన్న సమారాధన

పెందుర్తి, న్యూస్‌టుడే: జీవీఎంసీ 96వ వార్డు పరిధి పెందుర్తి ద్రోణంరాజు నగర్ రెల్లికాలనీలో కొలువైన పోలమాంబ అమ్మవారి ఆలయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం నుంచి భక్తులు అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించి దర్శనం చేసుకున్నారు. స్థానిక నాయకులు శరగడం చినఅప్పలనాయుడు, తదితరులు అమ్మవారిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన అన్నసమారాధనలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

80085 74978 సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

వేపగుంట, న్యూస్‌టుడే: ?: బీఆర్టీఎస్ కాలిబాటలపై పలకలు పడిపోయి ప్రమాదకరంగా మారాయి. -శ్రీనివాసరావు, వేపగుంట ✓: ప్రమాదకరంగా మారిన పలకలను తొలగించి కొత్తవి వేయించేందుకు చర్యలు తీసుకుంటాం. -శంకర్రావు, ఇన్‌ఛార్జి జోనల్ కమిషనర్

సబ్బవరం, న్యూస్‌టుడే: ?: సబ్బవరం శివారు గొల్లలపాలెంలో వ్యర్థాలు పేరుకుపోయి దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నాం. -కె.శ్రీరాములు, గొల్లలపాలెం ✓: క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటాం. -పి.ఆనందరావు, ఇన్‌ఛార్జి గ్రామ కార్యదర్శి, సబ్బవరం

?: సబ్బవరం పాత సినిమాహాలు వద్ద, ఎన్టీఆర్ విగ్రహం సమీప కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోయి దోమల బెడద వెంటాడుతోంది. -జి.ముత్యాలరావు, సబ్బవరం ✓: వెంటనే పరిశీలించి పరిశుభ్రత చర్యలు చేపడతాం. -డి.ప్రసాదరావు, గామ కార్యదర్శి, సబ్బవరం

పరవాడ, న్యూస్‌టుడే: ?: పరవాడ మండలంలో కుక్కల బెడద అధికంగా ఉంది. అవి గుంపులుగా తిరుగుతూ దాడి చేస్తున్నాయి. -నాయుడు, పరవాడ ✓: పరిష్కారానికి వెంటనే చర్యలు చేపడతాం. -రమేశ్‌నాయుడు, ఎంపీడీవో, పరవాడ

బీఆర్‌టీఎస్‌లో రాకపోకలకు నిత్యం అవస్థలే...

వేపగుంట, న్యూస్‌టుడే

కృష్ణానగర్ వద్ద దుకాణదారుల వాహనాలు సగ భాగం ఆక్రమించేశాయిలా..

బీఆర్‌టీఎస్ సేవా మార్గాల్లో ఆక్రమణల కారణంగా స్థానికులు, వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా నాయుడుతోట-ఎల్‌జీపాలిమర్స్ కూడలి మధ్యలోని కృష్ణానగర్ ప్రాంతం వాహనదారులకు హడలెత్తిస్తోంది. దుకాణదారులు తమ తమ గూడ్సు వాహనాలను సేవా మార్గాల్లో పెట్టడంతో తరచూ ట్రాఫిక్ రద్దీ సమస్య తలెత్తుతోంది. జీవీఎంసీ, ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోకపోవడం వల్ల ఈ సమస్య రోజురోజుకు తీవ్రతరం అవుతోందని పలువురు వాపోతున్నారు.

సగం ఆక్రమిం చేసి..: ఇటీవల కాలిబాటల్లోని ఆక్రమణలను జీవీఎంసీ అధికారులు పోలీసు బందోబస్తుతో తొలగించిన సంగతి తెలిసిందే. ఇదే సమయంలో రహదారులను సగానికిపైగా తమ గూడ్సు వాహనాలతో ఆక్రమించేసిన దుకాణదారులపై ఎందుకు చర్యలు చేపట్టలేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. రద్దీ సమయాల్లోనూ లోడింగ్, అన్‌లోడింగ్ చేస్తుండడం వల్ల ఈ సమస్య మరింత జటిలం అవుతోందని అంటున్నారు.

నిబంధనలు బేఖాతరు : రహదారుల పక్కన వ్యాపారం చేసే దుకణదారులు నిబంధనలు కూడా పాటించడం లేదు. ముఖ్యంగా అగ్నిప్రమాదాల నివారణకు ఉపయోగించాల్సిన పరికరాలను సిద్ధంగా ఉంచడం లేదు. నాయుడుతోటలోని ఓ తుక్కు దుకాణం అగ్నిప్రమాదానికి గురై స్థానికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. మళ్లీ అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా దుకాణదారులు ఫైర్ సేఫ్టీ పరికరాలు సమకూర్చుకుని నిబంధనలన్నీ పాటించేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

■ రహదారి పక్కనున్న ఇళ్లను అద్దెకు తీసుకుని కొంతమంది వర్తకులు వ్యాపారాలు సాగిస్తున్నారు. ఆయా భవనాలను వ్యాపారానికి వినియోగిస్తున్నా ఇళ్ల పన్నులే వసూలు చేస్తుండడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంలో కొందరు అధికారులు ఆమ్యామ్యాలు తీసుకుని చూసీచూడనట్లు వదిలేస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం : పెందుర్తి-గోపాలపట్నం మధ్య బీఆర్‌టీఎస్ సేవా మార్గాల్లో రాకపోకలకు ఇబ్బందులు కలిగించే విధంగా దుకాణదారులు వాహనాలు ఉంచితే చర్యలు తప్పవు. రద్దీ సమయాల్లో లోడింగ్, అన్‌లోడింగ్ చేసి ఇబ్బంది కలిగిస్తే జరిమానా విధిస్తాం. కృష్ణానగర్ ప్రాంతంలో పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించి తగిన చర్యలు చేపడతాం. -నర్సింగరాజు, ట్రాఫిక్ ఎస్‌ఐ, పెందుర్తి పోలీసు స్టేషన్

నేడు ఎన్టీపీసీ క్రీడా పోటీలు

లంకెలపాలెం(పరవాడ), న్యూస్‌టుడే: పరవాడ మండలం లంకెలపాలెం జడ్పీ హైస్కూల్ మైదానం వేదికగా మంగళవారం సింహాద్రి ఎన్టీపీసీ ఆధ్వర్యంలో మండలస్థాయి గ్రామీణ క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు హెచ్‌ఎం రౌతు నాగేశ్వరరావు తెలిపారు. ఇప్పటికే మైదానాన్ని, వేదికను అన్ని హంగులతో సిద్ధం చేసి ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఈ పోటీలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు జరుగుతాయన్నారు. ఎన్టీపీసీ ఈడీ సమీర్‌శర్మ ముఖ్యఅతిథిగా విచ్చేసి పోటీలు ప్రారంభిస్తారన్నారు. మండల వ్యాప్తంగా ఉన్న 14 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు చెందిన 6 నుంచి పదోతరగతి వరకు గల విద్యార్థులు క్రీడల్లో పాల్గొంటారన్నారు. బాలికలకు ఖోఖో, త్రోబాల్, కబడ్డీ; బాలుర విభాగంలో ఖోఖో, వాలీబాల్, కబడ్డీ పోటీలతో పాటు బాలబాలికలకు 200మీ., 800మీ. పరుగు పోటీలు, లాంగ్‌జంప్, షాట్‌పుట్, 400×100 రిలే పోటీలు ఉంటాయన్నారు. విద్యార్థులంతా పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

పోటీలకు సిద్ధమైన లంకెలపాలెం పాఠశాల మైదానం

రైతుల భూములు కార్పొరేట్లకు దోచి పెడుతున్నారు

సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి. రాఘవులు

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: రాష్ట్రం పారిశ్రామికంగా ముందుకు దూసుకెళ్తోందని, రూ.లక్షల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయంటూ కూటమి ప్రభుత్వం చెబుతున్నా అందుకు తగ్గ కార్యచరణ కనిపించట్లేదని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు ఎద్దేవా చేశారు. సోమవారం జగదాంబకూడలిలోని సీపీఎం కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. గతంలో వేల ఎకరాల భూములను రైతుల నుంచి తీసుకుని కార్పొరేట్లకు ఇచ్చినా ఒరిగిందేమీ లేదన్నారు. ఆ భూముల్లో గడ్డి తుప్పలు తప్పా.. ఒక్క పరిశ్రమ కూడా రాలేదని వ్యాఖ్యానించారు. ఐటీ మంత్రి లోకేశ్ కూడా గడిచిన 17 నెలల్లో రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించామని అనడం విడ్డూరంగా ఉందన్నారు. అదే నిజమైతే ఆ డబ్బంతా ఎక్కడికి వెళ్లిందో చెప్పాలన్నారు. వివిధ ప్రాంతాల్లో భూములిచ్చిన రైతులకు పరిహారం ఏమిచ్చారంటూ ప్రశ్నించారు. ★ డేటా సెంటర్ అవసరమే కానీ అందులో వచ్చే ఉద్యోగాలు 300 కంటే మించవన్నారు. గూగుల్‌కి చౌకగా నీరు, విద్యుత్ ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రతిష్ఠను దిగజార్చి కార్మికుల జీతాల్లో కోత పెట్టి స్వచ్ఛందంగా ఉద్యోగాలను వదులుకునేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, యాజమాన్యం చేస్తున్నాయని మండిపడ్డారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.లోకనాథం, జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న బి.వి.రాఘవులు

■ ఆయుష్య గణపతికి పంచామృతాభిషేకం

పెందుర్తి, న్యూస్‌టుడే: సంకష్ట హర చతుర్థి పర్వదినాన్ని పురస్కరించుకుని వేంకటాద్రి క్షేత్ర పాలకుడు ఆయుష్య గణపతి ఆలయంలో సోమవారం విశేష అభిషేకాలు, అర్చనలు జరిగాయి. వేంకటాద్రి ఆలయ ప్రధానార్చకులు మహర్తి రామానుజాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు గణనాథుడికి పంచామృతాభిషేకం నిర్వహించారు. నూతన వస్త్రాలతో అలంకరించి షోడశోపచార పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పెందుర్తి, న్యూస్‌టుడే: జీవీఎంసీ 96వ వార్డు పెందుర్తి సుజాతానగర్‌లో కొలువైన సంపత్ వినాయక ఆలయంలో సోమవారం విశేష హోమాలు, పూజలు జరిగాయి. పురోహితులు గణనాథుడికి పంచామృతాభిషేకం, అర్చన చేశారు. హోమగుండంలో అగ్నిప్రతిష్ఠాపన చేసి వేదమంత్రాలతో హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

■ మార్షల్ ఆర్ట్స్‌లో విద్యార్థిని ప్రతిభ

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలం ఆర్కిడ్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న ఆర్.దీక్షిత ఈనెల 7వ తేదీన అనకాపల్లి తిరిత కల్యాణమండపంలో షోటోకాన్ అకాడమీ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి కరాటే ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. వందలాది మంది పోటీ పడగా దీక్షిత అండర్-14 విభాగంలో పోటీపడి స్వర్ణ పతకం సాధించినట్లు ప్రిన్సిపల్ స్వామినాయుడు, కరాటే కోచ్ అప్పారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆమెను అభినందించారు.

■ బాల్య వివాహాలు అరికట్టేందుకు కృషి

వన్‌టౌన్, న్యూస్‌టుడే: బాల్య వివాహాలు అరికట్టేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ అన్నారు. ఈ మేరకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం బాల్య వివాహాలకు వ్యతిరేకంగా కలెక్టర్ జిల్లా అధికారులతో ప్రతిజ్ఞ చేయించి ప్రసంగించారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే 1098 నంబరుకు ఫిర్యాదు చేయాలన్నారు.

■ వినియోగదారులను చైతన్యపర్చాలి

వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఈ నెల 24న జరగనున్న జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా స్మార్ట్ సిటీ కంజ్యూమర్ ప్రొటెక్షన్ కౌన్సెల్ వెలువరించిన గోడపత్రికను సోమవారం జేసీ మయూర్ అశోక్ తన ఛాంబరులో విడుదల చేశారు. ఈ దినోత్సవాన్ని పెద్ద ఎత్తున చేపట్టి వినియోగదారులను చైతన్యపర్చాలని, వివిధ అంశాలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని జేసీ సూచించారు. డీసీఎస్ఓ వి.భాస్కర్రావు, కౌన్సెల్ కార్యదర్శి పేర్ల భాస్కర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యాలయాలకు సామగ్రి వితరణ

ఇస్లాంపేట (పరవాడ), న్యూస్‌టుడే: జీవీఎంసీ 77వవార్డు పరిధి ఇస్లాంపేట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు సోమవారం రైల్వే కన్సల్టేటివ్ కమిటీ మాజీ డైరెక్టర్ కె.అప్పారావు, అగనంపూడికి చెందిన కాంట్రాక్టర్ నెల్లి శ్రీనివాసరావు తమ సొంత నిధులు రూ.7వేలు వెచ్చించి 16 కుర్చీలు సమకూర్చారు. పాఠశాలలో జరిగిన ఓ కార్యక్రమంలో వీటిని హెచ్‌ఎం ప్రమీలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంకు కుర్చీలు అందజేస్తున్న దాతలు అప్పారావు, శ్రీనివాసరావు

పాలిటెక్నిక్ కళాశాలకు పుస్తకాలు..

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని గ్రంథాలయానికి కాకినాడ ఆంధ్ర పాలిటెక్నిక్ కళాశాల నుంచి పదవీ విరమణ చేసిన సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి కె. శ్రీనివాసమూర్తి సుమారు రూ.10వేలు విలువైన పుస్తకాలను వితరణ చేశారు. ఈ సందర్భంగా సోమవారం పెందుర్తి కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్. చంద్రశేఖర్‌కు సంబంధిత పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

చినముషిడివాడ (పెందుర్తి), న్యూస్‌టుడే: జీవీఎంసీ 97వ వార్డు చినముషిడివాడ శారదానగర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఉపాధ్యాయులు సోమవారం అధ్యయన సామగ్రి అందజేశారు. ఐక్య ఉపాధ్యాయ సంఘం రూపొందించిన పదో తరగతి అధ్యయన సామగ్రిని పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు సొంత నిధులు వెచ్చించి వాటిని తెప్పించారని ప్రధానోపాధ్యాయిని శ్రీవాణి తెలిపారు. పదో తరగతి ప్రణాళికలో భాగంగా విద్యార్థులకు చక్కగా బోధించి మంచి ఫలితాలు రాబట్టేందుకు ఈ సామగ్రి ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పుస్తకాలు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

21న పల్స్‌పోలియో

వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఈనెల 21న జరిగే పల్స్‌పోలియో కార్యక్రమంలో అయిదేళ్ల లోపు ప్రతీ చిన్నారికి పోలియో చుక్కలు వేయించాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పల్స్‌పోలియో నిర్వహణపై జరిగిన సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో అయిదేళ్లలోపు చిన్నారులు 2,09,652 మంది ఉన్నారని చెప్పారు. వీరిలో నగర పరిధిలో 1,90,090 మంది, గ్రామీణ ప్రాంతంలో 16,562 మంది ఉన్నట్లు ఆయన వివరించారు. పోలియో చుక్కలు వేసేందుకు 1062 బూత్‌లు ఏర్పాటు చేయనున్నారు. జేసీ మయూర్ అశోక్, ఇన్‌ఛార్జి డీఆర్వో సత్తిబాబు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జగదీశ్వరరావు, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ శంకరప్రసాద్, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

వన్‌టౌన్, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీ, స్వచ్ఛభారత్, క్లాప్ మిత్ర కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ అనుబంధ కార్మిక సంఘం ఏపీ గ్రామ పంచాయతీ, స్వచ్ఛభారత్ వర్కర్స్ యూనియన్ కోరింది. కలెక్టరేట్ వద్ద యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం చేపట్టిన ధర్నాలో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ మాట్లాడారు. బకాయి పడిన జీతాలను వెంటనే చెల్లించాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ప్రమాద బీమా సహజ మరణం పొందిన కార్మికుల వారసులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని నాయకులు డిమాండ్ చేశారు. అనంతరం వినతిపత్రాన్ని కలెక్టరుకు అందజేశారు.

కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న వివిధ సంఘాల కార్మికులు

★ ఆటో కార్మిక సంఘం ఆధ్వర్యంలోనూ నిరసన ప్రదర్శన జరిగింది. ఈనెల 11 నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద చేపట్టనున్న రిలే నిరాహార దీక్షలకు సంబంధించిన సమాచారాన్ని సంఘ నాయకులు శ్రీను తదితరులు ఆధ్వర్యంలో కలెక్టరుకు విన్నవించారు.

అధికారులూ.. బాధ్యతగా వ్యవహరించండి

కార్పొరేషన్, న్యూస్‌టుడే: జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు విధి నిర్వహణలో బాధ్యతగా వ్యవహరించాలని కమిషనర్ కేతన్‌గార్గ్ హెచ్చరించారు. సోమవారం 'ఈనాడు'లో 'అడ్డగోలు ప్రతిపాదనం' శీర్షికతో ప్రచురితమైన కథనానికి స్పందించిన ఆయన ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడారు. పనుల ప్రతిపాదనల్లో అవకతవకలు చోటుచేసుకుంటున్నాయని, గుత్తేదారులు పనులు చేస్తున్న సమయంలో కనీసం పర్యవేక్షణ ఉండటం లేదన్నారు. వర్క్ ఇన్‌స్పెక్టర్లు, సహాయ ఇంజినీర్లు విధుల పట్ల అత్యంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. తీరు మారకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి అంశాన్ని క్షుణ్నంగా పరిశీలిస్తున్నామని, తప్పు ఎక్కడ దొర్లినా కఠిన చర్యలు తప్పవన్నారు.

■ వ్యాన్ ఢీకొని బిహార్ వాసి దుర్మరణం

పవన్‌కుమార్ (పాతచిత్రం)

లంకెలపాలెం (పరవాడ), న్యూస్‌టుడే: జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందినట్లు పరవాడ సీఐ మల్లికార్జునరావు తెలిపారు. ఆ వివరాలిలా.. బిహార్‌లోని జైరామ్ గ్రామానికి చెందిన పవన్‌కుమార్ (27) అగనంపూడి సమీప మినీ ఆటోనగర్‌లోని ఓ కంపెనీలో పనిచేస్తూ లంకెలపాలెంలో తోటిమిత్రులతో కలిసి నివాసం ఉంటున్నాడు. ఎప్పటి మాదిరిగానే సోమవారం ఉదయం విధులకు హాజరయ్యేందుకు సైకిల్‌పై వెళ్తుండగా లంకెలపాలెం ఐవోసీ పెట్రోల్‌బంకు సమీపంలో వెనుక నుంచి నీళ్ల ట్యాంకర్‌తో అతి వేగంగా వెళ్తున్న వ్యాన్ బలంగా ఢీకొట్టడంతో పవన్‌కుమార్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

■ పోలీసుల అదుపులో హత్య కేసు నిందితుడు

పెందుర్తి, న్యూస్‌టుడే: సహజీవనం నేపథ్యంలో మహిళను కిరాతకంగా హత్య చేసిన నిందితుడు వనుము శ్రీనివాసరావును ఎట్టకేలకు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ నెల 6వ తేదీన గోశాల సమీప సూర్యకాంతం లేఅవుట్‌లోని ఓ అపార్టుమెంటులో అల్లా దేవి అనే మహిళను శ్రీనివాసరావు హత్య చేసిన విషయం తెలిసిందే. హత్యానంతరం అతడు పరారయ్యాడు. సీఐ కె.వి.సతీశ్‌కుమార్ నేతృత్వంలో మూడు పోలీసు బృందాలు నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టాయి. ఎట్టకేలకు అతడు ఒడిశా రాష్ట్ర పరిధిలో ఉన్నట్లు గుర్తించి సోమవారం అక్కడికి వెళ్లి అదుపులోకి తీసుకున్నట్లు సీఐ పేర్కొన్నారు.

■ రేపు మాజీ ఎమ్మెల్యే వర్ధంతి

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మాజీ ఎమ్మెల్యే దివంగత పైలా అప్పలనాయుడు వర్ధంతి బుధవారం ఉదయం 8 గంటలకు పరవాడ సంతబయలు వద్ద నిర్వహించనున్నట్లు ఎంపీపీ పైలా వెంకటపద్మలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు పైలా శ్రీనివాసరావు తెలిపారు.

గీతంలో 'స్మార్ట్ ఇండియా హ్యాకథాన్' ప్రారంభం

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: కేంద్రప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ ఇన్నోవేషన్ సెల్, అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) గీతం డీమ్డ్ వర్సిటీలో సోమవారం నుంచి జాతీయస్థాయిలో నిర్వహిస్తున్న 'స్మార్ట్ ఇండియా హ్యాకథాన్' ఫైనల్ పోటీలను గీతం ప్రో-వీసీ ప్రొఫెసర్ వై.గౌతమ్ రావు ప్రారంభించారు. యువతలో నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి ఏఐసీటీఈ గత ఏడేళ్లుగా నిర్వహిస్తున్న ఈ స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ దేశంలో పలు స్టార్టప్‌లకు ఊపిరిపోసిందన్నారు. ★ గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్, విశాఖ నోడల్ సెంటర్ కన్వీనర్ ప్రొఫెసర్ రాజాఫణి పప్పు మాట్లాడుతూ ఈ పోటీల్లో పాల్గొనే విద్యార్థులకు కేంద్రప్రభుత్వం, ఇతరశాఖలు ఎదుర్కొంటున్న పలు సమస్యలకు పరిష్కారం కనుగొనాల్సిందిగా సూచించడం వినూత్న ప్రయత్నమన్నారు. ★ ఐదు రోజుల పాటు జరిగే ఈ పోటీలకు హాజరైన దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన 25 విద్యార్థి బృందాలు, 171 మంది యువత ఆలోచనల్ని పరిష్కారాల రూపంలో ప్రదర్శించనున్నారు. ఈ నెల 12వ తేదీన విజేతల్ని ప్రకటిస్తామని గీతం వీడీసీ కోచ్ బి.రాజ్‌కుమార్ పేర్కొన్నారు. కో-ఆర్డినేటర్లు వివేక్, అభితేజ్ తదితరులు పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా 60 విద్యాలయాల్లో జరుగుతున్న ఈ స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ పోటీల్లో పాల్గొంటున్న యువతను ఉద్దేశించి 'ఏఐసీటీఈ' ఛైర్మన్ టి.జి. సీతారామ్ వర్చువల్‌గా ప్రసంగించారు.

← విద్యార్థులనుద్దేశించి వర్చువల్‌గా మాట్లాడుతున్న ఏఐసీటీఈ ఛైర్మన్ సీతారామ్

మహిళా మార్టుపై విచారణ చేపట్టాలి

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండల సర్వ సభ్య సమావేశం ఎంపీపీ బోకం సూర్యకుమారి అధ్యక్షతన సోమవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో వాడీవేడిగా జరిగింది. సబ్బవరం జెడ్పీటీసీ సభ్యుడు మృతి చెందినందున మండలానికి జిల్లా పరిషత్ నిధులు వస్తున్నాయా? లేదా? అని అసకపల్లి ఎంపీటీసీ సభ్యుడు కర్రి అప్పలనాయుడు తదితరులు లేవనెత్తారు. ఈ విషయంపై అధికారులు వెంటనే దృష్టి సారించాలని అన్నారు. సబ్బవరం మహిళా మార్టును రూ.75లక్షలతో మొదలు పెట్టారని ప్రస్తుతం నష్టాల్లో కూరుకుపోయి మూతపడే స్థితికి చేరుకుందని అన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. బాటజంగాలపాలెం, ఆరిపాక, గొల్లలపాలెం, నల్లరేగులపాలెం, గుల్లేపల్లిలోని సమస్యలను సంబంధిత ప్రతినిధులు సమావేశం దృష్టికి తెచ్చారు. మావుళ్ల గెడ్డపై వంతెన నిర్మించాలని పలువురు కోరారు. ఉప ఎంపీపీలు ఝాన్సీ లక్ష్మీరాణి, మామిడి లక్ష్మి, ఎంపీడీవో పి.పద్మావతి, డీటీ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సూర్యకుమారి

జీవీఎంసీకి 86 వినతులు రాక

కార్పొరేషన్, న్యూస్‌టుడే: నగరంలో మల్టీప్లెక్సులు, షాపింగ్ మాల్స్, సినిమా థియేటర్ల వంటి వాణిజ్య సముదాయాల్లో నిబంధనలకు విరుద్ధంగా పార్కింగ్ రుసుములు వసూలు చేస్తున్నారని, వాటిని నియంత్రించాలని న్యాయవాది కొండా రాజీవ్‌గాంధీ ఫిర్యాదు చేశారు. మహా విశాఖ నగరపాలక సంస్థలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 86 వినతులు వచ్చాయి. మేయర్, కమిషనర్ అందుబాటులో లేకపోవడంతో అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి వాటిని స్వీకరించారు. వాటిలో జోన్-1కు 1, జోన్-2కు 8, జోన్-3కు 21, జోన్-4కు 6, జోన్-5కు 11, జోన్-6కు 22, జోన్-8కు 6, ప్రధాన కార్యాలయానికి 11 ఫిర్యాదులు అందాయి. వాటిలో పరిపాలనకు 13, రెవెన్యూకు 12, ప్రజారోగ్యానికి 4, ప్రణాళికకు 33, ఇంజినీరింగ్‌కు 18, ఉద్యానవన విభాగానికి 3, యూసీడీకి 3 ఫిర్యాదులున్నాయి.

ప్రమాదకరంగా కల్వర్టు

వేపగుంట, న్యూస్‌టుడే: మేహాద్రి రిజర్వాయరు సమీప కాలువపై ఉన్న కల్వర్టు శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. నరవ-కంపరపాలెం మార్గంలో రాకపోకలకు అనువుగా గతంలో పైపులు వేసి కల్వర్టు నిర్మించారు. భారీ వర్షాలకు రిజర్వాయరులో నీటిమట్టం పెరిగి గేట్లు ఎత్తినపుడు జల ప్రవాహానికి కల్వర్టు అడుగు భాగం, పైభాగం కోరుకుపోయి పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయి. దీనికి అవసరమైన మరమ్మతులు చేయించకుంటే భవిష్యత్తులో ప్రమాదాలు తప్పవని, సంబంధిత అధికారులు వెంటనే తగిన చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

రెండు బొగ్గు లారీలు బోల్తా

క్రేన్ సహాయంతో లారీని తొలగిస్తున్న దృశ్యం

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలంలో రెండు బొగ్గు లారీలు బోల్తా పడ్డాయి. స్థానికులు తెలిపిన వివరాలిలా.. గంగవరం పోర్టు నుంచి పరవాడ మీదుగా పాలవలసలోని హిందుజా పవర్‌ప్లాంటుకు బొగ్గుతో వెళ్తున్న లారీలు సోమునాయుడుపాలెం సమీపంలో సోమవారం తెల్లవారుజామున అదుపు తప్పి బోల్తా పడ్డాయి. ఈ ఘటనలో రెండు లారీల డ్రైవర్లు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఆ సమయంలో ఇతర వాహనాలేవీ రాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు పేర్కొన్నారు. లారీల్లోని బొగ్గు నేలపై పడిపోయింది. క్రేన్‌ల సహాయంతో లారీలను అక్కడి నుంచి తొలగించారు.

స్వీయ రక్షణపై బాలికలకు శిక్షణ

చినముషిడివాడ (పెందుర్తి), న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఆరు నుంచి తొమ్మిదో తరగతి వరకు చదువుతున్న బాలికలకు సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో 'రాణి లక్ష్మీబాయి ఆత్మరక్షణ ప్రశిక్షణ్' పేరిట స్వీయ రక్షణపై శిక్షణ కార్యక్రమం జరుగుతోంది. జీవీఎంసీ 97వ వార్డు చినముషిడివాడ శాంతినగరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ శిక్షణ జరుగుతోంది. కరాటే శిక్షకుడు జగదీశ్ ఆధ్వర్యంలో వారానికి రెండు రోజులు బాలికలకు శిక్షణ అందిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయిని శ్రీవాణి తెలిపారు. బాలికల స్వీయ రక్షణకు ఈ తర్ఫీదు ఎంతగానో సహాయపడుతుందని ఆమె పేర్కొన్నారు.

కరాటే సాధన చేస్తున్న బాలికలు

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్సై భీమరాజు

పరవాడ, న్యూస్‌టుడే: విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని పరవాడ ఎస్సై భీమరాజు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొత్త క్రిమినల్ చట్టాలు, డ్రగ్స్ అనర్థాలపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ఎక్కడైనా గంజాయి, డ్రగ్స్ అమ్మకం జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సైబర్‌క్రైమ్ పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్య అభ్యసించి ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. ప్రిన్సిపల్ వినోద్‌బాబు, సాంబశివరావు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

వినతుల స్వీకరణ

వేపగుంట, న్యూస్‌టుడే: వేపగుంట జోనల్ కార్యాలయంలో సోమవారం ప్రజాసమస్యల పరష్కార వేదిక జరిగింది. ఇన్‌ఛార్జి జడ్సీ శంకర్రావు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. సుజాతనగర్ సీ-1 జోన్‌లో రోడ్లు, కాలువలు నిర్మించాలని, చినముషిడివాడ, నేతాజీనగర్‌లలో అక్రమ నిర్మాణాలు, ఆక్రమణలు తొలగించాలని, శారదానగర్‌లో యూజీడీ పైపులైను సమస్య పరిష్కరించాలని అర్జీదారులు జడ్సీకి వినతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువిభాగాల అధికారులు పాల్గొన్నారు.

ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఇన్‌ఛార్జి జడ్సీ శంకర్రావు

మహాసభలు జయప్రదం చేయాలి

గోడపత్రిక ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

సబ్బవరం, న్యూస్‌టుడే: సీఐటీయూ 18వ మహాసభలు ఈనెల 31వ తేదీ నుంచి జనవరి 4వ తేదీ వరకు విశాఖపట్నంలో జరుగుతాయని సీఐటీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గనిశెట్టి సత్యనారాయణ అన్నారు. ఈమేరకు సోమవారం సబ్బవరం మండల ప్రధాన కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో గోడపత్రిక ఆవిష్కరించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలపై ఈ మహాసభల్లో చర్చిస్తారన్నారు. సీఐటీయూ నాయకులు రమణమ్మ, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆనంద్, జేసీ శివనారాయణ శర్మ, అధికారులు

పకడ్బందీగా టెట్ పరీక్షలు

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ అర్హత పరీక్షలను (టెట్) అత్యంత పకడ్బందీగా జరపడానికి సర్వం సిద్ధం చేయాలని కలెక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. ఈనెల 10 నుంచి 21దాకా రోజూ రెండు పూటలు జరుగుతాయి. ఇదే క్రమంలో ఈనెల 21న సామూహిక పోలియో చుక్కల కార్యక్రమాన్ని విజయవంతం జరపాలని తెలిపారు. సోమవారం రెవెన్యూ భవన్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి అర్జీలు తీసుకున్నారు. కలెక్టర్‌తో పాటు జేసీ శివనారాయణ శర్మ, ప్రత్యేక ఉప కలెక్టర్లు రామకృష్ణారెడ్డి, మల్లికార్జునుడు, తిప్పేనాయక్, జేడీఏ ఉమామహేశ్వరమ్మ, తదితరులు కలిసి బాధితుల నుంచి 498 వినతులు తీసుకున్నారు. ఆ తర్వాత జిల్లా అధికారులతో ప్రత్యేకంగా మాట్లాడారు. టెట్ పరీక్షల నిర్వహణకు జిల్లావ్యాప్తంగా ఏడు కేంద్రాలను ఏర్పాటు చేశాం. ప్రతిరోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 దాకా, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల దాకా రెండోపూట పరీక్ష ఉంటుంది. పోలీసు, డీఆర్‌ఓ, విద్యుత్తు, ఆర్టీసీ. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు.

ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు

జిల్లావ్యాప్తంగా అపుడే పుట్టిన బిడ్డతో మొదలుకుని ఐదేళ్ల చిన్నారి దాకా పోలియో చుక్కలు వేయాలని కలెక్టర్ తెలిపారు. 2,84,774 మంది పిల్లలు ఉన్నారు. పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ, పీపీ యూనిట్లు.. ఇలా అన్ని కలిపి మొత్తం 82 ఉన్నాయి. 1785 బూత్‌లలో చుక్కల కార్యక్రమం ఉంటుందన్నారు. 5,247 మంది సిబ్బందిని ఇప్పటికే నియమించామని కలెక్టర్ తెలిపారు. 21న సామూహిక చుక్కలు వేస్తాం. ఆ రోజు రాని వారికి మరుసటి రోజే ఇంటింటికి వెళ్లి చుక్కలు వేయాల్సి ఉందన్నారు.

రిజర్వుడు స్థలాల్లో పాగా

జగనన్న కాలనీల్లో వైకాపా నాయకుల కబ్జాపర్వం

పరిశీలన

ఈ చిత్రంలో కనిపిస్తున్న పునాదులు గుత్తికి 5 కిలోమీటర్లలోని కొత్తపేట జగనన్న కాలనీ లేఅవుట్‌లోనివి. ఓ పంచాయతీ ప్రజాప్రతినిధి భర్త.. సర్వేనంబరు 689లో సుమారు 20 సెంట్లు స్థలాన్ని ఆక్రమించి పునాదులు వేశాడు. ఆయనకు తన గ్రామంతోపాటు గుత్తిలో రూ. కోట్లు విలువైన భవంతులు ఉన్నాయి.

గుత్తి, గుంతకల్లు, తాడిపత్రి, ఉరవకొండ, న్యూస్‌టుడే: పేదల కోసమంటూ ఏర్పాటు చేసిన జగనన్న కాలనీల్లో వైకాపా నాయకులు పాగా వేశారు. దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకోవాలని... అధికారంలో ఉన్నప్పుడు సామాజిక అవసరాలకు కేటాయించిన రిజర్వుడు స్థలాలను కబ్జా చేశారు. రూ.కోట్లు విలువైన వాటిని కాజేశారు. గుడి, బడికి కూడా కాసింత స్థలం లేకుండా పోయింది. గుంతకల్లు, తాడిపత్రి, ఉరవకొండ నియోజకవర్గాల్లోని పలు జగనన్న కాలనీల్లో అక్రమార్కులు విలువైన స్థలాలను సొంతం చేసుకున్నారు. మరోవైపు పేదల ముసుగులో కొందరు వైకాపా నాయకులు, కార్యకర్తలు ప్లాట్లు దండుకున్నారు.

పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం

-మారుతీప్రసాద్, టీపీవో, గుత్తి

జగనన్న లేఅవుట్లలో రిజర్వుడు స్థలాలపై క్షేత్రస్థాయిలో విచారిస్తాం. ఆక్రమణదారుల నుంచి స్థలాలను తిరిగి తీసుకుంటాం. సాధారణంగా ప్రైవేట్ లేఅవుట్లలో ఎకరాకు పది సెంట్లు స్థలం వస్తుంది. జగనన్న లేఅవుట్లలో రిజర్వుడు స్థలాలు ఇచ్చారో లేదో పరిశీలించి తగు చర్యలు చేపడతాం.

ఎక్కడ.. ఏమి చేశారంటే..

గుత్తిలోని సర్వేనంబరు 689లో సుమారు 600 మందికి గత ప్రభుత్వం ప్లాట్లు ఇచ్చింది. కొత్తపేట లేఅవుట్‌లోని కాలనీలో రిజర్వుడు స్థలాన్ని అప్పట్లో అధికారులు కేటాయించారు. అక్కడ ఓ యువనాయకుడు సుమారు 2ఎకరాల భూమిని ఆక్రమించుకుని.. ప్లాట్లు వేసి ఇతరులకు అమ్ముకుని సొమ్ము చేసుకున్నాడు.

- సుమారు 40 మంది స్థలాలను ఆక్రమించి పునాదులు వేసుకున్నారు.
- లచ్చానిపల్లి రోడ్డులోని సర్వేనంబరు 642లో ఎకరా స్థలాన్ని వైకాపా నాయకులు దొడ్డిదారిన పట్టాలు మంజూరు చేయించుకున్నారు.
- చెట్నేపల్లిలోని సర్వేనంబరు 122-సిలో జగనన్న లేఅవుట్ వేశారు. అక్కడ రిజర్వుడు స్థలాన్ని కేటాయించగా ప్రభుత్వం పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించింది. తాజాగా కొందరు చోటా నాయకులు మిగిలిన ఖాళీ స్థలంలో ప్లాట్లు వేయడానికి పావులు కదుపుతున్నారు.
- గుంతకల్లు దోనిముక్కల రోడ్డులోని కాలనీలో కొందరు నాయకులు వందల సంఖ్యలో ప్లాట్లను విక్రయించి సొమ్ము చేసుకున్నారు.
- తాడిపత్రిలో నాలుగు జగనన్న లేఅవుట్లను వేయగా అప్పటి నాయకులు స్థలాలను కొట్టేశారు. 20సెంట్ల స్థలంలో ఇద్దరు నాయకులు పునాదులు వేసుకున్నారు.
- ఉరవకొండలోని రాయంపల్లి దారిలో ఉన్న లేఅవుట్‌లో సుమారు 50 మంది వైకాపా మద్దతుదారులు, నాయకులు మూడు సెంట్లు చొప్పున స్థలాలను ఆక్రమించారు.

దీపిక సారథ్యం దేశానికే గర్వకారణం

అంధుల మహిళా క్రికెట్ జట్టు కెప్టెన్ దీపిక, తల్లిదండ్రులను సన్మానించిన మంత్రి, కలెక్టర్, ఎమ్మెల్యేలు ఎంఎస్ రాజు, సింధూరరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి తదితరులు

మడకశిర, న్యూస్‌టుడే : దీపిక పేదరికం, అంగవైకల్యాన్ని లెక్కచేయకుండా ఆత్మస్థైర్యంతో సాధన చేసి... అంధుల క్రికెట్‌లో టీ-20 జట్టు సారథ్యం వహించి ప్రపంచకప్ గెలవడవం దేశానికే గర్వకారణమని బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత అన్నారు. సోమవారం ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఆధ్వర్యంలో మడకశిర ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో దీపికకు సన్మాన కార్యక్రమం, భారీ బహిరంగ సభను ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా మంత్రితోపాటు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, సినీ నటుడు సాయికుమార్, ఎమ్మెల్యే సింధూరరెడ్డి హాజరయ్యారు. మంత్రి మాట్లాడుతూ మారుమూల ప్రాంతమైన అమరాపురం మండలం తంబాళ్లహట్టి నుంచి కూలీలు చిక్కతిమ్మప్ప, చిత్తమ్మల బిడ్డ అంతర్జాతీయ స్థాయికి ఎదిగి స్ఫూర్తిగా నిలిచిందన్నారు. సాయికుమార్ మాట్లాడుతూ దీపికకు అభిమానిని అయ్యానన్నారు. ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ప్రసంగిస్తూ మడకశిర నియోజకవర్గం పేరును ప్రపంచ నలుమూలల చాటిన దీపికకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. దీపికకు పుట్టపర్తిలో 10 సెంట్ల స్థలం ఇవ్వాలని, జూనియర్ కళాశాల మైదానంలో ఇండోర్ స్టేడియానికి ఆమె పేరు పెట్టాలని, అమరాపురం మండలంలో 5 ఎకరాల భూమిని ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం దీపిక, తల్లిదండ్రులను శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఎస్పీ సతీశ్‌కుమార్, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, క్రికెట్ కోచ్ మహంతేశ్, తెదేపా రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి, రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ ఛైర్మన్ లక్ష్మీనారాయణ, ఆర్డీఓ ఆనంద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నగదు ప్రోత్సాహకం

ముఖ్యమంత్రి అందించిన రూ.10 లక్షల చెక్కు, మంత్రి సవిత రూ.2లక్షలు, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు రూ.2 లక్షలు, యాదవ సంఘం రూ.2 లక్షలు, సింగిల్ విండో కన్వీనర్లు రూ.లక్ష, అమరాపురం మండల తెదేపా నాయకులు రూ.50 వేలతోపాటు మరికొంత మంది నాయకులు నగదు ప్రోత్సాహకం అందజేశారు.

ఆన్‌లైన్ టికెట్లు.. తెలియక పాట్లు!

రైల్‌వన్ యాప్‌తో సులభతరం

గుంతకల్లు, న్యూస్‌టుడే: చరవాణుల ద్వారా రైల్వే జనరల్ టికెట్లను పొందడంపై అవగాహన లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. మొబైల్ ద్వారా టికెట్లను పొందడానికి రైల్వే రూపొందించిన 'రైల్‌వన్' యాప్‌ను వినియోగించడం గురించి ఎక్కువ మందికి తెలియదు. దీనిపై అవగాహన కల్పించడానికి రైల్వే అధికారులు స్టేషన్లలో మరిన్ని అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని ప్రయాణికులు కోరుతున్నారు. స్టేషన్‌లోకి ప్రవేశించగానే వారి వద్ద ఉండే చరవాణుల్లోకి యాప్‌ను పొందుపరిస్తే ప్రయోజనం కల్గుతుందని ప్రయాణికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ప్రయాణికులకు రైల్‌వన్ యాప్‌పై అవగాహన కల్పిస్తున్న టికెట్ కలెక్టర్లు

ఎలాగంటే?

మొదట రైల్‌వన్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలి. తరవాత ఫోన్ నెంబర్‌ను నమోదు చేయాలి. తరువాత ప్రయాణికుడి పేరు, ఓటీపీ నెంబరు నమోదు చేయాలి. అనంతరం పాస్‌వర్డ్, ఈమెయిల్ ఐ.డి, తరువాత చిరునామాను నమోదు చేయాలి. ఈ ప్రక్రియ పూర్తి అయిన తరువాత ఎక్కడి నుంచి ఎక్కడి వరకు ప్రయాణం చేయాలో చరవాణిలో ఎంటర్ చేసి డబ్బును ఆన్‌లైన్‌లో చెల్లించాల్సి ఉంటుంది.

★ టికెట్‌ను ఏ విధంగా పొందాలో అధికారులు సమాచారం కోసం రైల్వే స్టేషన్‌లో క్యూఆర్ కోడ్‌ను ఉంచి దీన్ని వినియోగించాలని చెబుతున్నారు. గుంతకల్లు స్టేషన్‌లో ఇద్దరు మాత్రమే అవగాహన కల్పిస్తున్నారు.

★ గుంతకల్లు రైల్వే జంక్షన్‌లో అధికారులు జనరల్ టికెట్లను చరవాణుల ద్వారా పొందడానికి వివరాలను ఏవిధంగా పొందుపర్చాలో అవగాహన కలుగజేయడానికి అధికారులు ఇద్దరు సిబ్బందిని మాత్రమే నియమించారు. స్టేషన్ గుండా రోజూ 15వేల మందికి పైగా వెళ్తుంటారు. రోజూ వారిలో ఒక శాతం మందికి కూడా అవగాహన కల్పించలేకపోతున్నారు. కనీసం పది మంది సిబ్బందిని నియమించాలని ప్రయాణికులు కోరుతున్నారు. చరవాణుల్లో టికెట్లు పొందడం తెలియక క్యూల్లో నిలబడుతున్నారు. ఇదేకాక స్టేషన్‌లో ఉండే ఆటోమేటిక్ టికెట్ వెండింగ్ మిషన్ల వద్ద కూడా వేచి ఉండాల్సి వస్తోంది. తమ వంతు కర్తవ్యంగా ఆన్‌లైన్ టికెట్ల గురించి తెలియజేస్తున్నామని స్టేషన్‌లో పనిచేస్తున్న ఇద్దరు తెలిపారు. విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళతామని తెలిపారు.

పది విద్యార్థులకు వంద రోజుల ప్రణాళిక

● ప్రభుత్వ బడుల్లో అమలు ● సెలవుల్లోనూ మధ్యాహ్న భోజనం

గుత్తి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పరీక్ష రాస్తున్న విద్యార్థినులు

ఎస్కేయూ, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో చదవుతున్న విద్యార్థులు ఉన్నతంగా రాణించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం వివిధ పథకాలు అమలు చేస్తోంది. ఇందులో భాగంగా పదో తరగతి విద్యార్థుల కోసం 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక ప్రవేశపెట్టి అమలు చేస్తోంది. ఈనెల 6న కార్యక్రమం ఆరంభమైంది. మార్చి 14వ తేదీ వరకూ వంద రోజుల ప్రణాళిక అమలు చేస్తారు. ఇందులో భాగంగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు పునశ్చరణ తరగతులు చేపడుతున్నారు. ఉదయం నేర్చుకొన్న సబ్జెక్టుపై సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు పరీక్ష రాయాల్సి ఉంటుంది. రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా మెటీరియల్, మాదిరి ప్రశ్నాపత్రాలు రూపొందించారు. ఏయే రోజుల్లో ఏ సబ్జెక్టులపై తర్ఫీదు ఇవ్వాలో మార్గదర్శకాలు జారీ చేశారు. ప్రణాళికాబద్ధంగా విద్యార్థులు సన్నద్ధమైతే పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణులు కావడానికి అవకాశం ఉంటుంది. గతంలో అనంత సంకల్పం అనే కార్యక్రమం అమలు చేశారు. సరైన పర్యవేక్షణ లేకపోవడంతో పెద్దగా ఫలితాలు రాలేదు. దీంతో వంద రోజుల ప్రణాళిక అమలులోకి తెచ్చారు.

అనంత జిల్లాలో ఇలా..

ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు	356
పదో తరగతి విద్యార్థులు	19,616
బాలికలు	10,305
బాలురు	9,311

సంక్రాంతికే మినహాయింపు!

గత సంవత్సరం వంద రోజుల కార్యక్రమం సెలవు రోజుల్లో మినహాయించారు. ఈ ఏడాది కేవలం సంక్రాంతి పండగను మాత్రమే మినహాయించారు. మిగిలిన అన్ని సెలవు రోజుల్లోనూ ప్రభుత్వ బడుల్లో ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాల్సిందే. ముఖ్యంగా పదో తరగతి విద్యార్థులకు సెలవు రోజుల్లో మధ్యాహ్న భోజనం అమలు చేస్తున్నారు. ఈ బాధ్యతలను ఆయా ఏజెన్సీలకు అప్పగించారు. సాధారణ రోజుల్లో ఇతర విద్యార్థులతో కలసి భోజనం చేస్తారు.

శత శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

- ప్రసాద్‌బాబు, డీఈవో, అనంతపురం

ప్రభుత్వ పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా ప్రణాళిక అమలు చేస్తున్నాం. ఈమేరకు విద్యార్థులకు బోధనతోపాటు ప్రత్యేకంగా సాధన చేయిస్తున్నాం.

పోలీసుల అదుపులో నకిలీనోట్ల చలామణిదారులు

బత్తలపల్లి, న్యూస్‌టుడే: నకిలీనోట్ల చలామణి విషయంగా గొడవపడిన ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు. . కడప జిల్లా తాళ్ల ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన రాజు అనే వ్యక్తి కొన్ని రోజుల క్రితం కదిరి పట్టణానికి చెందిన కొందరితో రూ.లక్ష మంచి నోట్లకు రూ.3లక్షలు విలువచేసే నకిలీ నోట్లు ఇస్తామన్నాడు. ఆమేరకు వారు రూ.లక్ష రాజుకు అందజేశారు. అతను వారికి నకిలీనోట్లు ఇచ్చాడు. అవి సక్రమంగా లేకపోవడంతో రాజును గట్టిగా ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో సోమవారం సాయంత్రం బత్తలపల్లి మండలం వెంకటగారిపల్లి సమీపంలోని దర్గా వద్దకు కదిరికి చెందిన వారిలో ఒక వ్యక్తి వచ్చాడు. రాజుతో గొడవకు దిగాడు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి వెళ్లి ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. నిందితులను విచారిస్తున్నట్లు ఎస్సై సోమశేఖర్ వెల్లడించారు.

కాలువకు తాత్కాలిక మరమ్మతులు కష్టమే!

తెగి పోయిన కాలువ గట్టును పరిశీలిస్తున్న హెచ్చెల్సీ ఎస్ఈ సుధాకర్‌రావు తదితరులు

కూడేరు(ఉరవకొండ), న్యూస్‌టుడే: పీఏబీఆర్ కుడి కాలువ తెగిన ప్రదేశంలో తాత్కాలిక మరమ్మతులు కష్టమే అన్న వాదన వినిపిస్తోంది. కూడేరు మండలం జల్లిపల్లి వద్ద ఆదివారం కాలువ తెగి పోయిన విషయం తెలిసిందే. ఎక్కువ సమయం నీటి ప్రవాహం కొనసాగడంతో మట్టి కొట్టుకుపోయి గట్టు బండ తేలింది. దానిమీద ఇసుక సంచులను ఏర్పాటు చేసి ప్రవాహాన్ని కొనసాగించడం కష్టం కానుందని అధికారులు భావిస్తున్నారు. బండ ఎగుడు దిగుడుగా ఉండడంతో ఇసుక సంచులు బలంగా కూర్చుంటాయా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. నీటి ప్రవాహం పెరిగినపుడు సంచుల మధ్యలోకి నీరు చేరితే, మళ్లీ కోతకు గురయ్యే ప్రమాదం ఉంటుందని అధికారులు అభిప్రాయ పడుతున్నారు. ఈ నేపథ్యంలో అక్కడ శాశ్వత మరమ్మతులు చేయించడమే మేలని చెబుతున్నారు. శాశ్వత పనులకు ఎక్కువ సమయం పడితే చెరువులకు నీరు అందడం మరింత ఆలస్యం అయ్యే అవకాశం ఉంది. సోమవారం తెగిపోయిన కాలువ గట్టును హెచ్చెల్సీ ఎస్ఈ సుధాకర్‌రావు, డీఈఈ విశ్వనాథరెడ్డి పరిశీలించారు. రూ.93 లక్షలతో మరమ్మతునకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు వివరించారు.

పీఏబీఆర్ నీటి విడుదల

పీఏబీఆర్ ప్రాజెక్టు అధికారులు మూడు గేట్ల ద్వారా సోమవారం పెన్నానదిలోకి 620 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. మరోవైపు కుడి కాలువ ఎస్కేప్ ఛానల్ ద్వారా ఎంపీఆర్ వైపు మరో 770 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతోంది. విద్యుత్తుత్పత్తికి 110 క్యూసెక్కులు, తాగునీటి పథకాలకు 55 క్యూసెక్కులు... ఇలా మొత్తం 1600 క్యూసెక్కుల మేర నీరు బయటికి పోతోంది. ప్రస్తుతం పీఏబీఆర్‌లో 5.2 టీఎంసీలు నిల్వ ఉన్నాయి. పైగా లింకు కాలువ, హంద్రీనీవా ద్వారా 730 క్యూసెక్కుల మేర ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. జలాశయ సామర్థ్యం 11 టీఎంసీలు. ఆనకట్ట భద్రత దృష్ట్యా 5 టీఎంసీలకు మించి నీటి నిల్వ ఉంచరు. ఈనేపథ్యంలో గేట్లను తెరిచి విడుదల చేసినట్లు జలాశయం డీఈఈ వెంకటరమణ, ఏఈఈలు ముత్యాలప్ప, గంగమ్మ, లక్ష్మీదేవి, రేణుక పేర్కొన్నారు.

పరిశ్రమలో మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న ఆక్టోపస్ దళం

కియాలో ఆక్టోపస్ మాక్‌డ్రిల్

పెనుకొండ, న్యూస్‌టుడే: కియా ఇండియా పరిశ్రమలో అత్యవసర పరిస్థితిలో సమష్టిగా స్పందించే విధానంపై రాష్ట్ర పోలీస్ కమాండో విభాగం ఆక్టోపస్ ఆధ్వర్యంలో సోమవారం ఆపరేషన్ ఫాల్కన్ మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఇందులో భాగంగా ఐదుగురు ఉగ్రవాదులు ఆయుధాలతో పరిశ్రమలోని అడ్మిన్ భవనంలోకి చొరబడి, సెక్యూరిటీ సిబ్బందిపై కాల్పులు జరిపి, లోపలికి ప్రవేశించనట్లుగా అందిన సమాచారంతో ఆక్టోపస్ బృందం హుటాహుటిన స్పందించి వ్యూహాత్మకంగా ఆపరేషన్ ప్రారంభించి ఉగ్రవాదులను న్యూట్రలైజ్ చేసి బంధీగా ఉన్న వారిని సురక్షితంగా రక్షించి మాక్‌డ్రిల్ పూర్తిచేశారు. కార్యక్రమంలో కియా సీఎస్‌వో మధుసూదన్, సెక్యూరిటీ ఇంఛార్జ్ నవీన్‌చంద్, వెంకటేశ్, రమేశ్, పార్థసారథి, ఆక్టోపస్ డీఎస్పీ జగ్గునాయుడు, ఆర్ఐ శ్రీనివాసరావు, ఉమాశంకర్, కియా స్టేషన్ ఎస్సై రాజేశ్, ఏఎస్సై వెంకటరమణ, డీఎంహెచ్‌వో నాగరాజు, ఆర్ఎస్సై ప్రసాద్, బాంబ్ డిస్పోజల్ టీం, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జుల నియామకం

అనంత సంక్షేమం: జిల్లా బీసీ సంక్షేమ సాధికారత ఇన్‌ఛార్జిగా రామ సుబ్బారెడ్డి, సాంఘిక సంక్షేమ సాధికారత ఇన్‌ఛార్జిగా శ్రీనివాసులును అధికారులు నియమించారు.

8th YEAR REMEMBRANCE

Sri. MADAN SRIRAMULU
07-09-1934 – 09-12-2017
Your unforgettable hard work and love shines eternally in our minds and live in our hearts forever.
Deeply Missed by:
Wife MADAN NARASAMMA Son's and Daughter in law's Daughters and Son in law's Grand Childrens & Staff.
MADAN SAREE EMPORIUM
J.M. Road, Bengaluru - 560002

ఏకంగా.. 62,970 మిగులు

● రద్దుకు సిద్ధమైన స్మార్ట్‌రేషన్ కార్డుల సంఖ్య ● 40 వేల మంది అనర్హులని అంచనా

అనంత గ్రామీణంలోని ఓ సచివాలయంలో మిగిలిన కార్డులు

అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే : క్యూఆర్ కోడ్ కలిగిన కొత్త స్మార్ట్ రేషన్ కార్డులను ఆగస్టు నెలలోనే పంపిణీ చేయాలని నిర్ణయించారు. అయితే డీలర్ల ద్వారా పంపిణీ చేపడితే బోగస్‌కు వత్తాసు పలుకుతారని ప్రభుత్వం గుర్తించి డీలర్లను పక్కనబెట్టారు. కేవలం సచివాలయ ఉద్యోగులు మాత్రమే పంపిణీ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. సచివాలయ ఉద్యోగులు కొత్తవారు రావడం, డీలర్లు సహకరించకపోవడంతో పంపిణీకి ఆటంకం ఏర్పడింది. జిల్లాకు 6,57,828 స్మార్ట్ కార్డులు మంజూరు కాగా, అందులో 5,94,835 కార్డులు పంపిణీ చేశారు. ఇంకా 62,970 కార్డులు మిగిలిఉన్నాయి.

ఇబ్బడి ముబ్బడిగా..

2019-20 మధ్యకాలంలో వైకాపా ప్రభుత్వం హయాంలో ఇష్టానుసారంగా రేషన్ కార్డులు మంజూరు చేశారు. అధికంగా అనర్హులకే మంజూరు చేసినట్లు పౌర సరఫరాలశాఖ అధికారులు పేర్కొనడం గమనార్హం. అప్పటి డేటా ప్రకారమే ఇప్పుడు ఈ స్మార్ట్ కార్డులు ముద్రించారు. తాజాగా మిగిలినవి తీసుకోని వారిలో 40వేల మంది అనర్హులుగా గుర్తించినట్లు తెలుస్తోంది.

పట్టణాల్లో ఎక్కువ

జిల్లాలో కొత్త స్మార్ట్‌రేషన్ కార్డులు 4 నెలల క్రితమే పంపిణీ చేశారు. 3 నెలలు సరకులు తీసుకోకపోతే కార్డు రద్దు చేస్తారు. ఇప్పటికే ఐదో నెల గడుస్తోంది. ఇంకా జిల్లాలో 62,970 కార్డులు మిగిలిపోయాయి. అంటే పట్టణ ప్రాంతాల్లోనే కార్డులు అధికంగా ఉన్నాయి. అనంతపురం అర్బన్‌లో 8,847 కార్డులు అత్యధికంగా మిగిలిపోయాయి. గ్రామీణంలో 6,386 కార్డులు, గుంతకల్లులో 4,340, తాడిపత్రిలో 3,216, రాయదుర్గంలో 2,483, కళ్యాణదుర్గంలో 2,263, గుత్తిలో 2,143, డీ హీరేహాళ్‌లో 2,050 చొప్పున కార్డులు మిగిలాయి.

3 నెలలు తీసుకోకపోతే రద్దు

- వెంకటేశ్వర్లు, జిల్లా పౌరసరఫరాల అధికారి (అనంతపురం)

3 నెలలు వరుసగా వేలిముద్ర వేయకుండా సరకులు తీసుకోకపోతే రేషన్ కార్డు రద్దు చేస్తాం. గ్రామ, వార్డు సచివాలయాల్లోనే కార్డులు అందుబాటులో ఉంచాం. అయినా లబ్ధిదారులు తీసుకోడానికి రావడం లేదు. పౌరసరఫరాలశాఖ కమిషనర్ కార్యాలయానికి వెనక్కి పంపుతాం.

పిల్లలూ... భద్రం సుమా!

కాలినడక వంతెనను నిర్మిస్తామని రైల్వే అధికారులు చెప్పడమే కానీ పనులను చేపట్టడంలో జాప్యం చేస్తున్నారు. ఫలితంగా పిల్లలు రైల్వేలైన్‌పై వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. గుంతకల్లు - కల్లూరు రైలు మార్గంలో రోటరీ పాఠశాల వద్ద కాలినడక వంతెనను నిర్మించాలని నాయకులు గత కొన్ని సంవత్సరాల నుంచి రైల్వే అధికారులకు విన్నవిస్తూనే ఉన్నారు. ప్రమాదాలు జరగకముందే సమస్యను పరిష్కరించాలిన స్థానికులు కోరుతున్నారు. దీన్ని పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని నాయకులకు కోఆర్డినేషన్ శ్రీనివాస్ సమాధానమిచ్చారు.

–న్యూస్‌టుడే, గుంతకల్లు

(c) eenadu

EENADU Classifieds
PERSONAL CLASSIFIEDS
BIRTHDAY GREETINGS

REAL ESTATE
HOUSE FOR SALE
అనంతపురం సాక్షి Office Opposite ఉన్న రాజహంస స్వీట్‌హోమ్స్ నందు House No.28. స్థలం 3.85 Cents, 1750 Sqft Construction 3 BHK Duplex House అమ్మబడును. Contact No. ✆: 9948266888

JOBS
Opportunity for Male Hindi Age 20 to 30 Managers with good Pay in Sainagar, Anantapur. Cell: 8096000222.

అమెరికాలో 1 సం|| బాబు ఆలన, పాలన వ్యక్తిగత సంరక్షణ కొరకు అనుభవంగల ఆడవారు కావలెను. అమెరికా వీసా కల్గినవారు మాత్రమే. ✆ : 9440803362

ఇంటర్ కాలేజీలో పనిచేయటానికి టెలికాలర్స్, ట్యూటర్లు, వార్డెన్లు మరియు పిఆర్వోలు కావలెను. సెల్: 8019989913, 9440045441.

ATP ప్లైవుడ్ షాపు నందు అకౌంటెంట్‌గా Tally Input, Output మరియు GST Returns వేయడంలో అనుభవం గల జెంట్స్ మాత్రమే కావలెను. సెల్: 9676358269.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్నంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

EENADU CLASSIFIEDS 5 లైన్ల ప్రకటన రూ. 395/- మాత్రమే
తక్కువ ఖర్చుతో... ప్రతిరోజు క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వండి.... అధిక స్పందనలు పొందండి. వాహనాల అమ్మకం... ఉద్యోగాల భర్తీ... ఇళ్లు, ఫ్లాట్లు, స్థలాల అమ్మకాలు, కొనుగోళ్లు... ఇళ్లు, షాపులు, ఫ్లాట్లు అద్దెకు మరియు అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు...
వివరాలకు : 8008709784
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

‘దుర్గం’ పుర ఛైర్మన్ ఎన్నికపై ఉత్కంఠ!

విహారయాత్రలో వైకాపా కౌన్సిలర్లు

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: మున్సిపల్ ఛైర్మన్ ఎన్నికపై ఉత్కంఠ నెలకొంది. తెదేపా, భాజపా మద్దతు కౌన్సిలర్లు 11, వైకాపా కౌన్సిలర్లు 13 మంది ఉందన్నారు. అధికార కూటమి ప్రభుత్వం ఎక్స్‌అఫిషియో సభ్యులుగా ఎమ్మెల్యే, ఎంపీలు వారి ఓట్లు ఉపయోగించుకుంటే తెదేపాకు 13 మంది అవుతారు. సమానంగా ఉండటంతో ఒక్క ఓటు కీలకంగా మారనుంది. ఈ నేపథ్యంలో ఏ కౌన్సిలర్ కూటమి వైపు మొగ్గుచూపుతారో అని వైకాపాకు భయం పట్టుకుంది. అందుకే పలువురు కౌన్సిలర్లను స్థానికంగా అందుబాటులో లేకుండా విహార యాత్రలకు పంపినట్లు సమాచారం. సంఖ్యా బలం తక్కువ ఉన్న మున్సిపాలిటీలో తాము చేస్తున్న అభివృద్ధిని చూసి వైకాపా కౌన్సిలర్లే తమకు మద్దతు ఇస్తారని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తెలిపినట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఏది ఏమైనా ఈనెల 11న మున్సిపల్ ఛైర్మన్ ఎన్నికపై రెండు పార్టీల్లో ఉత్కంఠ నెలకొంది.

ప్రయాణికుల భద్రతే అందరి లక్ష్యం : డీఆర్ఎం

గుంతకల్లు, న్యూస్‌టుడే : రైల్వే ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడంపై అందరూ దృష్టి పెట్టాలని డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్త అన్నారు. డీఆర్ఎం కార్యాలయంలోని సమావేశపు మందిరంలో సోమవారం డివిజన్ భద్రతా సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డివిజన్‌లో వారం రోజుల్లో జరిగిన

ట్రాక్‌మెన్‌కు ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న డీఆర్ఎం, కో-ఆర్డినేషన్ శ్రీనివాస్

తప్పిదాలు, మంచి కార్యక్రమాలపై ఆయన వివిధ విభాగాలకు చెందిన అధికారులతో సమావేశమై సమీక్షించారు. ప్రమాదాలు జరగలేదని సిబ్బంది, కార్మికులు విధుల విషయంలో నిర్లక్ష్యం చూపకుండా అధికారులు వారిని అప్రమత్తం చేయాలని చెప్పారు. జరిగిన తప్పిదాలు తిరిగి జరగకుండా చూసుకోవాలని అన్నారు. సమయ పాలన విషయంలో సిబ్బంది చక్కగా పని చేస్తున్నారని అందర్నీ అభినందిస్తున్నామన్నారు. రైలు ప్రమాదాలు జరగకుండా నిలువరించినందుకు ఇద్దరు ట్రాక్‌మెన్లకు ఆయన అవార్డులతో పాటు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కో-ఆర్డినేషన్ శ్రీనివాస్, సీనియర్ డీఓఎం శ్రావణ్‌కుమార్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

నూతన విత్తన చట్టాన్ని రద్దుకు డిమాండ్

బిల్లు ప్రతులను దహనం చేస్తున్న రైతు సంఘాల నాయకులు

ఆర్కేనగర్ (అనంతపురం), న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విత్తన చట్టం బిల్లును వ్యతిరేకిస్తూ రైతు సంఘాల నాయకులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. నగరంలోని గడియార స్తంభం వద్ద కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేసి, బిల్లు ప్రతులను దహనం చేశారు. నాయకులు చిరుతల మల్లికార్జున, చంద్రశేఖర్‌రెడ్డి, నాగరాజులు మాట్లాడారు. మోదీ సర్కారు కార్పొరేటు శక్తులకు వ్యవసాయాన్ని కట్టబెట్టడానికి నూతన విత్తన బిల్లును ప్రవేశపెట్టిందని విమర్శించారు. భాజపా అధికారం చేపట్టినప్పటి నుంచి రైతుల వద్ద నుంచి వ్యవసాయాన్ని లాక్కొని కార్పొరేట్లకు కట్టబెట్టాలని చూస్తోందని, అందులో భాగంగానే వ్యవసాయం మూడు నల్లచట్టాల్ని 2020లో తీసుకొచ్చిందన్నారు. నాయకులు చెన్నప్పయాదవ్, రాయుడు, రామంజనేయులు, రామకృష్ణ, బాలరంగయ్య, కృష్ణ, రామకృష్ణ, శివారెడ్డి పాల్గొన్నారు.

లంచం కేసులో జైలుశిక్ష విధింపు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : లంచం తీసుకున్న కేసులో దక్షిణ మధ్య రైల్వే గుంతకల్ డివిజనల్ ఫైనాన్స్ కార్యాలయ అకౌంట్స్ అసిస్టెంట్‌గా పనిచేసిన చల్లా శ్రీనివాసులుకు (ప్రస్తుతం రిటైర్డ్) రెండేళ్ల జైలుశిక్షతోపాటు రూ.20 వేల జరిమానా విధిస్తూ కర్నూలు సీబీఐ కోర్టు న్యాయమూర్తి ఎం.శోభారాణి సోమవారం తీర్పు ఇచ్చారు. గుత్తేదారుడైన సీహెచ్‌డీ రాజులు నాయుడు.. తాను చేసిన పనులకు సంబంధించి రూ.30 లక్షల విలువైన బిల్లులు పెట్టారు. దీనిని మంజూరు చేసేందుకు నిందితుడు రూ.15 వేలు లంచం డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు సీబీఐని ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. 2017, నవంబరు 20న గుత్తేదారుడు లంచం ఇస్తుండగా సీబీఐ అధికారులు దాడి చేసి పట్టుకుని అరెస్టు చేశారు. కోర్టు విచారణలో నిందితుడిపై నేరం రుజువవడంతో జైలుశిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చేశారు. ప్రాసిక్యూషన్ తరపున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సిరికొండ మనోహర్ వాదించారు.

14న గుంటూరులో రగ్బీ రాష్ట్ర జట్ల ఎంపిక

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: చెన్నై నగరంలో జరగనున్న దక్షిణ భారత స్థాయి రగ్బీ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్ల ఎంపిక పోటీలు ఈనెల 14న గుంటూరులో నిర్వహించనున్నట్లు జిల్లా రగ్బీ సంఘం కార్యదర్శి కె.శంకర్ తెలిపారు. ఈ పోటీలు అండర్-15, 18, సీనియర్ విభాగంలో మహిళలకు ఈ పోటీలు నిర్వహిస్తారని ఆయన వివరించారు. అండర్-15 విభాగంలో పాల్గొనే బాలికలు 2010-11 మధ్యలో, అండర్-18 విభాగంలో 2007-08 మధ్యలో, సీనియర్ విభాగంలో 2000-07 మధ్య జన్మించిన వారు ఈ పోటీల్లో పాల్గొనడానికి అర్హులన్నారు. దక్షిణ భారత స్థాయిలో గెలుపొందిన విజేత జట్టు ఒక్కో విభాగంలో రూ. లక్ష బహుమతి ఇస్తారు. క్రీడాకారిణులకు నేరుగా చెక్కులు అందజేస్తారు. ప్రతి ఒక్కరూ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన సూచించారు. ఇతర వివరాలకు నాగరాజు, వ్యాయామ అధ్యాపకుడు 83414-11083 చరవాణి నంబరును సంప్రదించాలన్నారు.

అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా బుడేన్‌సాబ్ నియామకం

బుడేన్‌సాబ్

అనంతపురం (మూడోరోడ్డు), న్యూస్‌టుడే: 8వ జిల్లా అదనపు న్యాయస్థానం, కుటుంబ న్యాయస్థానం పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా సీనియర్ న్యాయవాది బుడేన్‌సాబ్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఆయన మొదటి అదనపు జిల్లా న్యాయస్థానం పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గాపని చేశారు. ప్రస్తుతం ఆయనను అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమించారు. రామగిరి మండలం ఆర్.కొత్తపల్లికి చెందిన ఆయన 1977లో న్యాయశాస్త్ర విద్యలో పట్టభద్రులయ్యారు. న్యాయవాదిగా జిల్లా కోర్టులో సేవలు అందిస్తున్నారు.

కాకర సాగు.. లాభాల పసందు!

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే : కళ్యాణదుర్గం మండలం పాతచెరువు గ్రామానికి చెందిన హరినాథ్ కాకర పంట సాగు చేస్తూ అధిక దిగుబడులతో పాటు మంచి లాభాలు ఆర్జిస్తున్నారు. తీగ జాతి స్వల్పకాలిక పంట రైతుకు ఎంతో ఊరట కలిగిస్తోంది.

విపణిలో ఆశాజనకంగా ధర

కాకర పంట

సెప్టెంబరులో మూడెకరాల్లో పంట సాగు చేశారు. ర్యాపిడ్ రకం కాకర విత్తులు కళ్యాణదుర్గంలోని ఎరువుల దుకాణంలో 500 విత్తన ప్యాకెట్లను ఒక్కొక్కటి రూ.1,200లతో 25 ప్యాకెట్లు కొనుగోలు, కర్రలకు రూ.1.15 లక్షలు, దారాలు, కూలీలకు రూ.45వేలు, తీగ అల్లేందుకు రూ.20వేలు, ఎరువులు, పురుగు మందులు పిచికారీ చేసేందుకు రూ.80వేలు వెచ్చించారు. మొత్తం రూ.2.70 లక్షలు పెట్టుబడి పెట్టారు. 55 రోజులకే పంట కోతకు వచ్చింది. నాలుగైదు రోజులకోసారి కోత కోస్తామని, మొదటి, రెండో కోతల్లో ఒక్కోసారి 3 టన్నులు, నాలుగో కోతలో మూడున్నర టన్నులు, ఐదో కోతలో ఏడున్నర టన్నుల దిగుబడి రాగా, ఇప్పటికి దాదాపుగా రూ.6.10 లక్షల వరకు ఆదాయం వచ్చింది. మరో రెండు నెలల కాలం పంట ఉంటుందని, 30-40 టన్నుల వరకు దిగుబడి వస్తుందని, సుమారుగా రూ.32 లక్షల వరకు లాభాలు ఉంటాయని రైతు చెబుతున్నారు. మరో రెండెకరాల్లో సాగు చేసిన పంట 10-15 రోజుల్లో కోతకు రానుంది. మార్కెట్లో టన్ను ధర రూ.20వేలతో తోట వద్దనే వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. రవాణా ఖర్చులు ఆదా అవుతున్నాయి.

రైతులకు అవగాహన కల్పిస్తున్నా..

-హరినాథ్, పాతచెరువు

గతంలో టమాటా, కర్బూజ, మొక్కజొన్న పంటలు సాగు చేసి నష్టపోయా. ఏడాదిగా కాకర సాగు చేస్తూ మంచి లాభాలు ఆర్జిస్తున్నా. ప్రస్తుతం మూడెకరాల్లో పంట సాగు చేయగా, మరో రెండు ఎకరాల్లో పది రోజుల్లో కోతకు వస్తుంది. ఎకరాకు దాదాపు

15-20 టన్నుల వరకు దిగుబడి రానుంది. అదే స్థాయిలో మార్కెట్లో ధరలు బాగా ఉంటే మంచి లాభాలు పొందేందుకు ఆస్కారం ఉంది. ఈ పంట ఎంతో ఊరట కలిగిస్తోంది. పంట సాగుపై పలువురి రైతులకు అవగాహన కల్పిస్తున్నా.

రైతేరాజు

జామ తోటల్లో పండు ఈగలా?

చిట్కా

నార్పల, న్యూస్‌టుడే : జామ తోటల్లో పండు ఈగలను సమర్థంగా నివారిస్తే రైతులు అధిక దిగుబడులు, లాభాలు పొందవచ్చని రెడ్డిపల్లి కేవీకే ప్రధాన శాస్త్రవేత్త మల్లీశ్వరి తెలిపారు. పండు ఈగలను నిర్లక్ష్యం చేస్తే అవి జామకాయల నాణ్యతను దెబ్బతీస్తాయన్నారు. దీంతో రైతులకు 50 శాతం నష్టం జరుగుతుందన్నారు. తల్లి ఈగలు జామ కాయలపై గుడ్లు పెట్టడం కారణంగా పిల్ల ఈగలు కాయ లోపలకు వెళ్లి తినేస్తాయన్నారు. పండు ఈగల నివారణకు రైతులు మిథైల్ యూజినాల్ ఎరలను ఎకరానికి 12 ఏర్పాటు చేసుకోవాలి. దీంతో ఈగలు ఎరలో పడి నశిస్తాయి. పండు ఈగలు ఆశించిన కాయలను రైతులు తొలగించి నాశనం చేయాలని శాస్త్రవేత్త తెలిపారు.

పండు ఈగలు ఆశించి కుళ్లిన జామకాయలు

సమస్య- సమాధానం

బుక్కరాయ సముద్రం, న్యూస్‌టుడే : జిల్లాలో వివిధ రకాల పంటలు సాగుచేసిన రైతులు పంటల సాగులో ఎలాంటి సందేహాలున్నా రేకులకుంట వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త నారాయణస్వామి నంబరు: 62812 84235కు ఫోన్‌చేసి తగిన సలహాలు, సూచనలు పొందవచ్చు.

సమస్య : బీర పంటకు బూడిద తెగులు ఆశించడంతో పూత, పిందెలు రాలిపోతున్నాయి. ఈ తెగులు నివారణ ఎలా చేపట్టాలి.

- నాగభూషణ, నీలంపల్లి

సమాధానం: బీర పంటలో బూడిద తెగులు నివారణకు రైతులు హైక్సాకొనజోల్ 5 శాతం, పైరాక్లోస్ట్రోబిన్ 0.4 మి.లీ, క్లోరోథలోనిల్ 40 శాతం లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకుంటే తెగులు ఉధృతి తగ్గుతుంది.

సమస్య : మామిడి చెట్లు ప్రస్తుతం పూత, పిందె దశలో ఉన్నాయి. చెట్లకు చెదపురుగులు ఆశించాయి. ఈ పురుగులు ఎలా నివారించాలి.

-రాము, కెకె.అగ్రహారం

సమాధానం: చెద పురుగుల నివారణకు రైతులు చెట్లకు 40 కిలోల పశువుల పేడ ఎరువు, భాస్వరం, పొటాష్ ఎరువులు వేసుకున్న తర్వాత చెట్ల మొదలు దగ్గర పాలిథీన్ సంచి కట్టి గ్రీజు పూయాలి. ఇలా చేస్తే చెదపురుగులు చెట్టుపైకి ఎక్కలేవు. పురుగులు నశించాలంటే క్లోరిపైరిఫాస్ 3 గ్రాములు, లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

అరటి రెండో పంటలో రక్షణ చర్యలు

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: అరటిలో మంచి నాణ్యత ఉంటే ధరలు బాగా ఉంటాయని ఉద్యాన అధికారులు కృష్ణతేజ, గౌసియా అన్నారు. అక్టోబరు నుంచి ధరలు తగ్గాయని రైతుల్లో ఆందోళన ఉందన్నారు. ప్రస్తుతం రెండో పంట డిసెంబరు మూడో వారానికంతా పూర్తవుతుంది. పంట రక్షణతో పాటు కాయ నాణ్యతను పెంపొందించుకొనేలా చూడాల్సిన అవసరం ఉంది. నాణ్యత ఉంటే ధర పెరుగుతుందని చెప్పారు.

ఇవి పాటించాల్సిన తరుణం

అరటి పంట, గెలల పెరుగుదలపై రైతులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. పంటకు సోకే సిగటక, ఆకుమచ్చ తెగులు నివారణకు జాగ్రత్తలు పాటించాలి. ప్రధానంగా తెగులు ప్రారంభ దశలో పసుపు మచ్చలు ఏర్పడి బూడిద, గోధుమ రంగుకు మారి ఆకులు ఎండిపోతాయి. తెగుళ్లు సోకకుండా తోటల్లో కలుపు మొక్కలను తొలగించుకోవడం, నీరు నిల్వ లేకుండా నీటిపారుదల వ్యవస్థను మెరుగు పరుచుకోవాలని సూచించారు. తెగుళ్ల వ్యాప్తి మొదలైతే ప్రొపికొనజోల్ ఒక మి.లీ.. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. రెండో విడతలో కార్బండాజిమ్, మ్యాంకోజెబు ఒక గ్రా లీటరు నీటికి, మూడో విడతలో ప్రొపికొనాజోలు, మ్యాంకోజెబ్ మిశ్రమం 1.4 గ్రాములు లీటరు నీటికి, ఐదో పిచికారీ పైరాక్లోస్ట్రోబిన్ 133, ఎపోనికొనాజోల్ 50 ఎస్సీ, మినరల్ ఆయిల్ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. వీటన్నింటిని పాటిస్తే అరటిని తెగుళ్ల నుంచి రక్షించుకోవచ్చని తెలిపారు.

అరటి పంట

అనాథ బాలికలకు ఆరోగ్యకార్డులు

అనంతపురం (శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అనుబంధ బాలసదన్ అనాథ బాలికలకు ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా ఆరోగ్యకార్డులను పంపిణీ చేశారు. సోమవారం కలెక్టర్ ఆనంద్ తన కార్యాలయంలో బాలికలకు ఆరోగ్య కార్డులను అందించారు. ఈ కార్డుల ద్వారా అన్ని రకాల వైద్యసేవలు ఉచితంగా పొందడానికి వీలుందని కలెక్టర్ అన్నారు. ఇన్నాళ్లూ ఎలాంటి కార్డులు లేకపోవడంతో వారికి తగిన చికిత్స అందడం కష్టమైందన్నారు. ఇపుడు ప్రైవేటు ఆస్పత్రుల్లో కూడా ఉచిత సేవలు పొందవచ్చని కలెక్టర్ చెప్పారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవి, ఐసీడీఎస్ ఇన్‌ఛార్జి పీడీ చల్లా లలిత, ఎన్టీఆర్ వైద్యసేవ డీసీ డాక్టర్ గంగాధర్‌రెడ్డి, నెట్‌వర్క్ టీం లీడర్ సుధాకర్‌రెడ్డి, డీసీపీఓ మంజునాథ్, బాల సదన్ పర్యవేక్షకురాలు ఖాజీ రఫీమున్నీషా, డీసీపీ కౌన్సిలర్ ఉమాదేవి పాల్గొన్నారు.

ఆరోగ్య కార్డును అందిస్తున్న కలెక్టర్ ఆనంద్, డీఎంహెచ్‌ఓ ఈబీదేవి, ఇన్‌ఛార్జి పీడీ చల్లా లలిత, డీసీ గంగాధర్‌రెడ్డి, డీసీపీఓ మంజునాథ్

తాడిపత్రి ఎర్రవంక కబ్జా

తాడిపత్రి పట్టణానికి అతి సమీపంలో ఉన్న ఎర్రవంకను కబ్జా చేశారు. దీన్ని ప్లాట్లుగా వేసి రూ. కోట్లు ఆర్జిస్తున్నారని తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి కలెక్టర్ ఆనంద్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం ఆయన కలెక్టర్‌ను కలిసి వినతి అందించారు. అధికార పార్టీకి చెందిన జేసీ ప్రభాకర్‌రెడ్డి, తన అనుచరులు ఈ ఎర్రవంకను ఆక్రమిస్తున్నారని ఇప్పటికే ప్లాట్లు వేసి అమాయకులను మోసం చేస్తున్నారన్నారు.

రూ.22 వేలు ఇంటి పన్ను వేశారయ్యా!

నార్పల, న్యూస్‌టుడే : నార్పల పంచాయతీలో తన ఇంటికి అధికారులు ఇంటి పన్ను ఏకంగా రూ.22 వేలు వేశారంటూ బాధితుడు పెద్దన్న పురుగు మందు డబ్బాతో పంచాయతీ కార్యాలయం వద్ద నిరసన చేపట్టాడు. నార్పలలో నివాసం ఉంటున్న పెద్దన్న తన ఇంటికి పన్ను కోసం అధికారులకు దరఖాస్తు చేసుకున్నాడు. అధికారులు నెలలు గడచినా ఇంటి పన్ను రసీదు ఇవ్వకపోవడంతో గత నెలలో పంచాయతీ కార్యాలయం దగ్గర శరీరంపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ విషయం పోలీసుల దృష్టికి వెళ్లడంతో పంచాయతీ అధికారులు ఇంటిపన్ను రసీదు ఇస్తామని హామీ ఇచ్చారు. తాజాగా పంచాయతీ అధికారులు ఇంటిపన్ను రూ.22 వేలు చెల్లించాలని చెప్పడంతో పెద్దన్న అవాక్కయ్యాడు. ఉద్దేశపూర్వకంగానే అధికారులకు తనకు ఎక్కువ పన్ను వేశారని నిరసనగా పెద్దన్న పురుగు మందు డబ్బాతో కార్యాలయం వద్ద నిరసన తెలిపాడు. పోలీసులు వచ్చి బాధితుడికి నచ్చచెప్పడంతో ఆందోళన విరమించాడు. ఈ విషయంపై పంచాయతీ అధికారి శ్యామలను వివరణ కోరడానికి యత్నించగా ఆమె అందుబాటులోకి రాలేదు.

అగ్నిమాపక సిబ్బందికి మూడు రోజుల శిక్షణ

పెనుకొండ, న్యూస్‌టుడే : రాష్ట్ర విపత్తు, స్పందన, అగ్నిమాపక సేవల శాఖ ఆధ్వర్యంలో 26 జిల్లాల్లో ఒక్కో జిల్లా నుంచి ఇద్దరు అగ్నిమాపక సిబ్బంది చొప్పున మొత్తం 52 మందికి 3రోజుల పాట ఈత, రెస్క్యూలో మెలకువలపై 3 రోజుల శిక్షణను డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫైర్ పీవీ రమణ ప్రారంభించారు. సోమవారం పట్టణంలోని అగ్నిమాపక కేంద్రం ఆవరణలోని ప్రాంతీయ శిక్షణ కేంద్రంలో తరగతులను ప్రారంభించారు. ఈసందర్భంగా కేంద్రం ఆవరణలో మామిడి మొక్కలు నాటి నీళ్లు పోశారు. శిక్షణలో పాల్గొంటున్న 52 మంది సిబ్బందిని కొండ మీదకు ట్రెక్కింగ్ తీసుకెళ్లారు. ఈసందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ శిక్షణ పూర్తి చేసుకున్న సిబ్బంది ఆయా జిల్లాల్లోని అగ్నిమాపక సిబ్బందికి శిక్షణ ఇస్తారన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారి నుంచి జిల్లా నుంచి ఒకొక్కరి చొప్పున ఎంపిక చేసి విజయవాడలోని ఆక్వాడెవిల్స్‌లో శిక్షణ ఇస్తారన్నారు. 145 కేంద్రాల్లో నూతన వాహనాలు సమకూర్చేందుకు చర్యలు చేపట్టామన్నారు. రీజినల్ అగ్నిమాపక అధికారి భూపాల్‌రెడ్డి, పెనుకొండ అగ్నిమాపక కేంద్రాధికారి వెంకటేశ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డీజీఎఫ్ పీవీ రమణ

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

ప్రభాకర్

రాప్తాడు, న్యూస్‌టుడే: అప్పుల బాధ తాళలేక ఓ రైతు పురుగులు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. ఈ సంఘటన రాప్తాడు మండలం భోగినేపల్లిలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన చిత్రాప్రభాకర్ వ్యవసాయం చేస్తూ జీవనం సాగించేవారు. తమకు ఉన్న 5 ఎకరాల్లో పంటల సాగు చేస్తుండగా 3 సంవత్సరాల నుంచి పంటలు సరిగా పండక నష్టం వచ్చింది. తెలిసిన వారి వద్ద నుంచి అప్పు చేయడం ప్రారంభించారు. 3 ఏళ్ల నుంచి పంటలు దిగుబడి రాక అప్పులు కాస్తా.. రూ.16 లక్షలకు చేరింది. వాటిని తీర్చే విషయమై.. ఇంటిలో గొడవలు జరిగేవి. అప్పులు ఇచ్చిన వాళ్లు డబ్బులు అడుగుతున్నారని చెప్పి నిత్యం బాధపడేవాడని భార్య లక్ష్మి తెలిపారు. గురువారం అప్పుల విషయమై భార్యతో గొడవపడి 4న సాయంత్రం పొలంలోకి వెళ్లి పురుగుల మందు తాగాడు. తమ్ముడు నరేష్‌కు ఫోన్ చేసి పురుగు మందు తాగినట్లు తెలపడంతో ఆయన వచ్చి వెంటనే అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆరుగురు విద్యార్థుల డిబార్

ఎస్కేయూ, న్యూస్‌టుడే: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహిస్తున్న డిగ్రీ 3, 5 సెమిస్టర్ పరీక్షల్లో మాస్‌కాపీయింగ్‌కు పాల్పడుతున్న ఆరుగురు విద్యార్థులను డిబార్ చేసినట్లు పరీక్షల విభాగం సంచాలకులు జీవీ రమణ తెలిపారు. అనంతపురంలోని ఎస్ఎల్ఎన్ డిగ్రీ కళాశాలలో ఒకరు, ధర్మవరం వివేకానంద డిగ్రీ కళాశాలలో ఒకరు, గుత్తి ఎం.ఎస్ డిగ్రీ కళాశాలలో ముగ్గురు, హిందూపురం బాలాజీ విద్యామందిర్‌లో ఒకరిని డిబార్ చేసినట్లు ఆయన తెలియజేశారు.

ఊడిన బస్సు చక్రాలు.. తప్పిన ప్రమాదం

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని శ్రీచైతన్య టెక్నో ప్రైవేట్ పాఠశాలకు చెందిన బస్సు గ్రామాల్లోని విద్యార్థులను తీసుకొస్తుండగా చక్రం ఊడి పెద్ద ప్రమాదం తప్పింది. తిమ్మగానిపల్లి- మల్లాపురం గ్రామాల మధ్య బస్సు వెనుక చక్రం ఒకటి ఊడిపోయి 500 మీటర్ల దూరం వెళ్లిపోయింది. మరో చక్రం పంక్చర్ అయింది. దీనిని గమనించిన డ్రైవర్ అప్రమత్తమై బస్సును నిలిపివేశారు. బస్సు ప్రమాదానికి గురైందని ఆందోళన చెందిన తల్లిదండ్రులు ఘటనా స్థలం చేరుకొన్నారు. ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగక పోవడంతో ఊపిరి పీల్చుకొన్నారు. మరో బస్సుల్లో విద్యార్థులను పాఠశాలకు తీసుకొచ్చారు. రవాణా శాఖ ప్రాంతీయ అధికారి రమేష్ ‘న్యూస్‌టుడే’తో మాట్లాడుతూ ఆ పాఠశాల బస్సులను పరిశీలిస్తున్నామన్నారు. చక్రాలకు సంబంధించిన బోల్టులు ఊడిపోవడంతో ఇలా జరిగి ఉంటుందన్నారు.

రెండు లారీలు ఢీకొని చోదకుడు సజీవ దహనం

మరొకరికి గాయాలు

బేస్తవారపేట, న్యూస్‌టుడే: ప్రకాశం జిల్లా, గిద్దలూరు డివిజన్, బేస్తవారపేట మండలంలోని పెంచికలపాడు సమీపంలో అనంతపురం-అమరావతి జాతీయ రహదారిపై సోమవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఓ చోదకుడు సజీవ దహనం కాగా, మరో చోదకుడు గాయాల పాలయ్యాడు. ధర్మవరానికి చెందిన కుంపటి ఆది శేషయ్య మినీ లారీలో టమాటా లోడుతో అనంతపురం నుంచి రాజమండ్రికి బయలుదేరాడు. ఈ క్రమంలో పెంచికలపాడు సమీపంలోకి రాగానే అతను నడుపుతున్న లారీ టైరు పేలిపోవడంతో అదుపుతప్పి ఎదురుగా వస్తున్న మడ్డి ఆయిల్ ట్యాంకర్ బలంగా ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు మినీ లారీ బోల్తా పడగా ట్యాంకర్ లారీ ముందు భాగం పూర్తిగా దెబ్బతింది. అనంతరం కొద్ది క్షణాల్లోనే రెండు లారీల ఇంజిన్‌లకు పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. దీంతో చోదకుడు ఆది శేషయ్య అప్రమత్తమై లారీలో నుంచి బయటపడ్డాడు. ఆయిల్ ట్యాంకర్ చోదకుడు పైడికొండల దుర్గారావు (40) క్యాబిన్ ధ్వంసమై పూర్తిగా మూసుకుపోవడంతో బయటికి వచ్చేమార్గం లేక అందులోనే ఇరుక్కుపోయాడు. చూస్తుండగానే మంటలు చెలరేగి అతన్ని చుట్టుముట్టడంతో కూర్చున్న సీట్‌లోనే సజీవ దహనమయ్యాడు. ఇతనిది పశ్చిమ గోదావరి జిల్లా దేవరపల్లి కాగా సోమవారం విశాఖపట్టణం సమీపంలోని పరవాడ వద్ద మడ్డి ఆయిల్‌ను ట్యాంకర్ లారీలో లోడ్ చేసుకున్నాడు. దాన్ని తాడిపత్రిలోని ఓ సిమెంట్ ఫ్యాక్టరీలో అన్‌లోడ్ చేసేందుకు వెళ్తుండగా ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. గిద్దలూరు అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు.

వివాహిత ఆత్మహత్య కేసులో ముగ్గురి అరెస్టు

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: కట్నం వేధింపుల కారణంగా గత నెల 27న నగరంలో వివాహిత అమూల్య వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటనలో ముగ్గురిని ఒకటో పట్టణ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండలం డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న బండమీద రవికి భార్య అమూల్య, మూడున్నరేళ్ల కుమారుడితో కలిసి నివాసముండేవారు. కాగా 27న భార్య తన కుమారున్ని గొంతు కోసి చంపి, ఆ తర్వాత ఆమె కూడా ఉరి బిగించుకుని బలవన్మరణానికి పాల్పడింది. తమ కుమార్తె మృతికి అల్లుడు రవి, అతని తల్లిదండ్రులు శివాంజనమ్మ, కుళ్లాయప్పలు కారణమని మృతురాలి తండ్రి రామకృష్ణయ్య వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేశాడు. ఘటన జరిగిన నాటి నుంచి నిందితులు పరారీలో ఉన్నారు. ప్రత్యేక బృందాలతో పోలీసులు గాలించి సోమవారం ముగ్గురినీ అరెస్టు చేసి జిల్లా కోర్టు ఎదుట హాజరు పరిచారు. కోర్టు నిందితులకు 14 రోజుల రిమాండ్ విధించింది.

ప్లైవుడ్ దుకాణంలో భారీ అగ్నిప్రమాదం

తాడిపత్రి, న్యూస్‌టుడే: తాడిపత్రిలోని కడపరోడ్డులో ప్లైవుడ్ దుకాణంలో సోమవారం రాత్రి భారీ అగ్నిప్రమాదం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు పట్టణంలోని మోహనాచారికి చెందిన దుకాణంలో ప్రమాదవశాత్తు విద్యుత్తు షార్ట్ సర్క్యూట్ జరగడంతో మంటలు వ్యాపించాయి. గమనించి స్థానికులు పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో హుటాహుటిన చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది రెండు అగ్నిమాపక యంత్రాలతో మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశారు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

ముగ్గురు విద్యార్థుల ఆచూకీ లభ్యం

రాప్తాడు, న్యూస్‌టుడే: రాప్తాడు మండలం చిన్మయనగర్‌లో ఓ హాస్టల్‌లో ఉంటూ అదృశ్యం అయిన ముగ్గురు పదోతరగతి విద్యార్థుల ఆచూకీ సోమవారం కనిపెట్టారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శుక్రవారం ఉదయం హాస్టల్ నుంచి లగేజీ తీసుకొని వెళ్లిన విద్యార్థులు అనంతపురం రైల్వేస్టేషన్ నుంచి గుంతకల్లు చేరుకున్నారు. అక్కడి నుంచి కసాపురం అంజనేయస్వామి సన్నిధిలో మూడు రోజులు గడిపారు. వీరి కోసం పోలీసులు 3 రోజులుగా అన్ని ప్రాంతాల్లో గాలింపు చేపట్టినట్లు రాప్తాడు సీఐ శ్రీహర్ష తెలిపారు. సోమవారం ఉదయం ఓ విద్యార్థి తన తల్లిదండ్రులకు ఫోన్ చేయగా పోలీసులు ఆ ఫోన్ నంబరు ద్వారా వారి ఆచూకీ కనుగొని తల్లిదండ్రులతో మాట్లాడించి అనంతపురానికి రప్పించారు. రైల్వేస్టేషన్‌కు రాగానే పోలీసులు అదుపులోకి తీసుకొని వాళ్లను విచారించి వారి తల్లిదండ్రులకు అప్పగించారు.

(c) eenadu

రాయదుర్గం

• రాయదుర్గం • కళ్యాణదుర్గం • ఉరవకొండ

ఆసుపత్రిని యథావిధిగా కొనసాగించండి

ఆర్డీవోకు అర్జీని ఇస్తున్న ఎస్సీ, ఎస్టీ సంఘం నాయకులు

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: ఎలాంటి అనుమతులు తీసుకోకుండా గోళ్లలోని హోమియో ఆసుపత్రిని తరలించారని, వెంటనే ఆసుపత్రిని యథావిధిగా కొనసాగించాలని ఎస్సీ, ఎస్టీ ఐకాస అధ్యక్షుడు చెలిమప్ప డిమాండ్ చేశారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆర్డీవో వసంతబాబుకు ఈ మేరకు అర్జీ అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ సంఘం నాయకుడు చెలిమప్ప మాట్లాడుతూ ఆసుపత్రిలో మరుగుదొడ్డి లేదనే ఒకే కారణంతో అనంతపురం రూరల్‌కు తరలించారని ఆరోపించారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు తిప్పేస్వామి, నాగభూషణ, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు స్వశక్తితో రాణించాలి

ర్యాలీలో పాల్గొన్న ప్రజలు

కుందుర్పి, న్యూస్‌టుడే: మహిళాభివృద్ధి, ఆర్థిక స్వాతంత్ర్యంపై వెలుగు ఏపీఎం సర్దానప్ప ఆధ్వర్యంలో సోమవారం కుందుర్పి మండల కేంద్రంలో గ్రామైఖ్య సంఘాల అధ్యక్షులు, సభ్యులు ర్యాలీ నిర్వహించారు. మహిళలు స్వశక్తితో, ఆత్మవిశ్వాసంతో చిరు వ్యాపారాలు ప్రారంభించి ఆర్థికంగా ముందడుగు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు సీసీ శివణ్ణ, యానిమేటర్లు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

సమస్యలు వింటున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుని అక్కడికక్కడే అధికారులతో చర్చించి పరిష్కరించేలా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు కృషి చేశారు. సోమవారం ప్రజావేదికలో పట్టణంలోని నార్తు ఉన్నత పాఠశాల సమీపంలో కాలనీకి వెళ్లే రోడ్డు సరిగా లేదని, బలిజ కళ్యాణమండపం సమీపంలో విద్యుత్తు తీగలు లేవని పలువురు ఆయనకు తెలియజేశారు. వెంటనే ఎమ్మెల్యే సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారం అయ్యేలా చూడాలని ఆదేశించారు. అనంతరం రూ.25,833 సీఎం సహాయ నిధి చెక్కును యాటకల్లు ధనుంజయకు అందజేశారు.

పాలకేంద్రాన్ని పట్టించుకోరా?

■ నాలుగేళ్లుగా అతీగతి లేదు

“ **న్యూస్‌టుడే, రాయదుర్గం:** ఒకప్పుడు రెండు వేల లీటర్ల పాలతో పాడి రైతులను ఆదుకున్న పాల శీతలీకరణ కేంద్రం నాలుగేళ్లుగా మూతపడటంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రైవేటు డెయిరీల మోసాలతో పాడి రైతులు ఆందోళన చెందుతున్నారు. రాయదుర్గం పట్టణంలోని వెలుగు సంస్థ ఆధ్వర్యంలోని ‘దుర్గాదేవి మండల సమాఖ్య’, డెయిరీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఒకప్పుడు విజయవంతంగా నడిచిన పాల శీతలీకరణ కేంద్రం పరిస్థితి అస్తవ్యస్తంగా మారింది. ”

మూతపడిన పాల శీతలీకరణ కేంద్రం

కూలింగ్ ట్యాంకర్లు, జనరేటర్ల నిరుపయోగం

వైకాపా ప్రభుత్వ హయాంలో అమూల్ సంస్థ పాల శీతలీకరణ కేంద్రాన్ని చేపడుతుందని, పాత బకాయిలు చెల్లిస్తుందని హామీలు ఇచ్చినా... రాయదుర్గం ప్రాంతానికి ఆ సంస్థ రాలేదు. దీంతో నాలుగేళ్లుగా పాల శీతలీకరణ కేంద్రం మూతపడింది. దీనివల్ల 2 వేల లీటర్ల కెపాసిటీ కలిగిన రెండు కూలింగ్ ట్యాంకర్లు, జనరేటర్లు నిరుపయోగంగా మారాయి. గతంలో కేంద్రంలోని కొన్ని వస్తువులు దొంగలు చోరీ చేశారు. కూటమి ప్రభుత్వం పాల ఉత్పత్తులను ప్రోత్సహిస్తుండటంతో మళ్లీ శీతలీకరణ కేంద్రాన్ని ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.

బళ్లారి కేంద్రానికి తరలించే ఏర్పాట్లు

- గంగాధర, ప్రాజెక్టు మేనేజరు, వెలుగు జీవనోపాధుల సంఘం

రాయదుర్గంలోని పాల శీతలికర కేంద్రం 2021లో మూతపడింది. దీని పునరుద్ధరణ విషయంపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. ప్రస్తుతం రైతు సంఘాల ద్వారా పాలను సేకరించి బళ్లారిలోని పాల కేంద్రానికి తరలించే ఏర్పాట్లు చేస్తున్నాం.

మేమున్నాం.. మీకు తోడుగా

రాయదుర్గం పట్టణం: 9666888046
కళ్యాణదుర్గం గ్రామీణం: 9985668661
ఉరవకొండ: 8008573071

సమస్య: గోవిందవాడ గ్రామంలోని ఈశ్వరాలయం వద్ద, కాలనీలో చెత్తాచెదారం, మురుగును సకాలంలో తొలగించాలి. **-కాలనీవాసులు, గోవిందవాడ**

సమాధానం: ఈశ్వరాలయం, కాలనీల్లో ఇంటింటా చెత్తసేకరణ చేపట్టి పారిశుద్ధ్యం మెరుగుపర్చడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. **-రమణ, డిప్యూటీ ఎంపీడీవో, బాబా పక్రుద్దీన్, కార్యదర్శి**

సమస్య: ఉద్దేహాళ్ దారి పక్కన కుళాయిలకు నీరు రావడం లేదు. **-వన్నూరుస్వామి**

సమాధానం: పరిశీలించి తగు చర్యలు తీసుకుంటాం. **-దీపిక ఏఈఈ**

– న్యూస్‌టుడే, బొమ్మనహాళ్

రైతు సంక్షేమమే ధ్యేయం

రాయదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: రైతుల అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని రాయదుర్గం మండల వ్యవసాయాధికారి బాష తెలిపారు. రబీ సీజన్‌లో రైతులకు ప్రభుత్వం రాయితీపై విత్తన వేరుసెనగ కాయలు పంపిణీ చేస్తుందన్నారు. రైతుసేవా కేంద్రంలో అన్నదాతలు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

బాల్యవివాహాలు తగవు

మాట్లాడుతున్న డా.బి.ఎస్. శ్రీదేవి

వజ్రకరూరు, న్యూస్‌టుడే: వజ్రకరూరు మండలంలోని కేజీబీవీ పాఠశాలలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం డా.బి.ఎస్.శ్రీదేవి అధ్యక్షతన పలు అంశాలపై అవగాహన కల్పించారు. బాలికలు మరొకరిని రక్షించేలా ఉండాలని, బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 వినియోగించుకోవాలని కోరారు. చైల్డ్‌హెల్ప్‌లైన్ సమన్వయకర్త కృష్ణకుమారి, సోషల్‌వర్కర్ వెంకటకుమార్, ఎంఈఓలు ఎర్రిస్వామి, తిమ్మప్ప, ప్రిన్సిపల్ ధనలక్ష్మి, హెచ్‌ఈఓ లక్ష్మీనారాయణ, సూపర్‌వైజర్ రజియా తదితరులు పాల్గొన్నారు.

దాతృత్వం చాటుకున్న ఉద్యోగులు

ఆర్థిక సాయం అందిస్తున్న కమిషనర్ దివాకర్‌రెడ్డి

రాయదుర్గం, న్యూస్‌టుడే: తోటి ఔట్ సోర్సింగ్ పారిశుద్ధ్య కార్మికులు ముగ్గురు ఇటీవల మృతిచెందారు. వారి కుటుంబాలను ఆదుకోవడానికి 75 మంది కార్మికులు ఒక రోజు వేతనాన్ని సోమవారం విరాళంగా ఇచ్చారు. మొత్తం రూ.37 వేలు అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ కుటుంబాలకు పురపాలిక సంఘం తరఫున కమిషనర్ దివాకర్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీంద్రలు రూ.20 వేల చొప్పున మొత్తం రూ.60 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ అధ్యక్షుడు నాగరాజు, ఉపాధ్యక్షుడు మన్నూర్ప్ప, మైలారి రమేష్, కార్యదర్శి రాము, కోశాధికారి తిప్పేరుద్ర, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అందుబాటులో విత్తనాలు, ఎరువులు

కుందుర్పి, న్యూస్‌టుడే: అన్ని రైతు సేవా కేంద్రాల్లో రైతులకు రబీ సీజన్‌కు అవసరమైన వేరు సెనగ, జిప్సం, యూరియా, కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉన్నట్లు వ్యవసాయాధికారి విజయ్‌కుమార్, ఎఈఓ కులశేఖర్ తెలిపారు. రైతులు రైతు సేవాకేంద్రాల్లో పేర్లు నమోదు చేయించుకోవాలని కోరారు.

సద్వినియోగం చేసుకోండి

బెళుగుప్ప, న్యూస్‌టుడే: ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న వేరుశనగ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని తెదేపా నాయకుడు మల్లికార్జున పేర్కొన్నారు. రబీ సీజన్‌లో పంటలు సాగుచేసేందుకు కావాల్సిన విత్తన కాయలను సోమవారం రైతులకు పంపిణీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు మల్లి, కంబిరామంలు, ఈశ్వరప్ప పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి వితరణ

వజ్రకరూరు, న్యూస్‌టుడే: వజ్రకరూరు మండలం కొనకొండ్ల గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు రూ.26 వేల విలువగల క్రీడా సామగ్రిని విద్యార్థులకు వితరణ చేశారు. ఇందులో ఆంగ్ల ఉపాధ్యాయుడు జలాలుద్దీన్ రూ.14 వేలు విలువైన సైకిళ్లను విద్యార్థులకు అందజేశారు. హెచ్‌ఎం వేణుగోపాల్, పీడీలు లక్ష్మీప్రసాద్, కళా సుధాకర్‌రావు ఉపాధ్యాయులను అభినందించారు.

వేళకు రాని అధికారులు!

ఉదయం 11.30 గంటల సమయంలో ఐదుగురు మాత్రమే హాజరైన అధికారులు

విడపనకల్లు, న్యూస్‌టుడే: విడపనకల్లు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల వేదికకు అధికారులు సమయానికి హాజరు కాలేదు. ఉదయం 11.30 గంటలకు తహసీల్దార్ కార్యాలయంలో ఐదుగురు అధికారులు ఎంపీడీవో రాఘవేంద్ర, ఏపీఎం కాంతనాయక్, విడపనకల్లు, పాల్తూరు, కొట్టాలపల్లి ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మాత్రమే హాజరయ్యారు. సమస్యలు చెప్పుకోవడానికి వచ్చిన అర్జీదారులు పలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ప్రత్యేక పంచాయతీల ఏర్పాటుకు వినతి

శెట్టూరు, న్యూస్‌టుడే: శెట్టూరు మండలం ముచ్చర్లపల్లిని ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని కోరుతూ స్థానిక, మండల వైకాపా నాయకులు సోమవారం ఎంపీడీవో జిలాన్‌బాషా, తహసీల్దారు ఈశ్వరమ్మకు వినతి పత్రం అందజేశారు. గ్రామ ప్రజల అభిప్రాయం మేరకు ముచ్చర్లపల్లిని కొత్త గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని అధికారులకు విన్నవించారు.

బెళుగుప్ప: యలగలవంక గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీగా గుర్తించాలని గ్రామస్థులు సోమవారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం నరసాపురం పంచాయతీలో గ్రామం ఉందన్నారు. అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక పంచాయతీగా గుర్తించాలని కోరినట్లు గ్రామస్థులు తెలిపారు.

కంపతో మూసుకుపోతున్న దారి

పీఏబీఆర్ నుంచి ఉరవకొండ మండలం రాకెట్ల తండా వైపు వచ్చే ప్రధాన తారు రోడ్డుకు ఇరువైపుల భారీగా కంప పెరిగిపోయింది. ఇది దారిని కప్పేస్తోంది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఎదురుగా వచ్చే వాహనాలకు దారి ఇవ్వాలన్నా కష్టంగా మారింది. దారి అంచులకు వెళ్తే కంప తగిలిలే అవకాశం ఉంది. రాత్రిపూట వచ్చే వారు మరింత ఇబ్బందికి గురవుతున్నారు. దీనిని చూస్తున్న పీఆర్ అధికారులు ఈ కంపను తొలగించే దిశగా చర్యలు చేపట్టింది లేదు. ఇప్పటికైనా వారు స్పందించి కంపను తొలగించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, ఉరవకొండ**

ఆగిన పనులు.. అవస్థల్లో ప్రజలు

ఉరవకొండ పట్టణంలో ఇందిరానగర్ నుంచి ప్రధాన రహదారి వైపు పంచాయతీ అధికారులు రెండు నెలల కిందట మురుగు కాలువ పనులు ప్రారంభించి 80 శాతం పూర్తయ్యాక.. నెలన్నరగా ఆగిపోయింది. మురుగంతా అక్కడ పేరుకపోవడంతో దుర్వాసన వస్తోంది. దీనిని పంచాయతీ అధికారులు నిత్యం చూస్తున్నా.. తగు చర్యలు చేపట్టడం లేదు. వెంటనే స్పందించి నిర్మాణం పూర్తిచేసి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. ఎంపీడీవో రవిప్రసాద్ ‘న్యూస్‌టుడే’తో మాట్లాడుతూ కాలువ నిర్మాణం పూర్తిచేయించే దిశగా చర్యలు చేపడుతామన్నారు. **- న్యూస్‌టుడే, ఉరవకొండ**

చెత్తకుండిగా మారిన బావి

ఉరవకొండ మండలం పెన్నహోబిలంలో పారిశుద్ధ్యం లోపించింది. అక్కడి చెత్తాచెదారాన్ని పశ్చిమ గోపురం ఎదురుగా పురాతన బావిలో పడేస్తున్నారు. ఈ బావి చెత్త కుప్పగా మారింది. ఈ ప్రదేశంలో తీవ్ర అపరిశుభ్రత నెలకొంది. దీనిని చూడగానే పర్యాటకులు అసహనానికి గురవుతుంటారు. ఎంతో చరిత్ర కలిగిన బావిని అపరిశుభ్రంగా మార్చడంతో భక్తులు ఇదేంటని చర్చించుకుంటున్నారు. ఆలయ అధికారులు బావితోపాటు పరిసరాల్లో పారిశుద్ధ్యం మెరుగునకు చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, ఉరవకొండ**

ఈ మార్గంలో ఇక్కట్లు ఎన్నో?

కూడేరు మండలం శివరాంపేట నుంచి మరుట్ల-3కు వెళ్లే ప్రధాన దారి మరమ్మతులకు గురైంది. గత ఐదేళ్ల కాలంలో దారికి మరమ్మతులు చేసిన దాఖలాలు లేవు. దీంతో మరింతగా శిథిలం అవుతోంది. ఈ రహదారిలో రాకపోకలు సాగించే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చాలారోజులుగా సమస్య ఉండడంతో వర్షం వచ్చినపుడు, రాత్రిపూట వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. దీనిని ఉన్నతాధికారులు గుర్తించి దారికి మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, కూడేరు(ఉరవకొండ)**

నీట మునుగుతున్న పంటలు

పీఏబీఆర్‌లో నీటి నిల్వ గణనీయంగా పెరగడంతో జలాశయం పరిసరాల్లో పంట పొలాల్లోకి నీళ్లు చేరుతున్నాయి. కూడేరు మండలం జయపురం, కొర్రకోడు, ఎంఎం హళ్లి, బెళుగుప్ప మండలం బూదిగుమ్మ, అంకంపల్లి, ఉరవకొండ మండలం మైలారంపల్లి పరిసరాల వైపు పీఏబీఆర్ బ్యాక్ వాటర్ చేరుతోంది. దీంతో ఆ గ్రామాల పరిధిలోని పొలాల్లో సాగులో ఉన్న వేరుసెనగ, ఉలవతోపాటు ఉద్యాన పంటలు నీట మునుగుతున్నాయి. ఉన్నతాధికారులు దీనిని గుర్తించి తగిన సాయాన్ని అందించాలని రైతులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, ఉరవకొండ**

ప్రధానోపాధ్యాయుల తీరుపై నిరసన

డిప్యూటీ డీఈవోకు ఫిర్యాదు చేస్తూ..

గుమ్మఘట్ట, కుందుర్పి, న్యూస్‌టుడే: ‘ఈ ప్రధానోపాధ్యాయుడు మాకొద్దు.. ఆయన తీరు సరిగా లేద’ని పూలకుంట అయ్యప్పనగర్‌లోని ప్రాథమిక పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు సోమవారం డిప్యూటీ డీఈఓ మల్లారెడ్డికి ఫిర్యాదు చేశారు. స్థానిక హెచ్ఎం బషీర్‌అహ్మద్ విద్యార్థులు వాడుకోవాల్సిన శౌచాలయాలకు తాళాలు వేస్తున్నాడని, విద్యార్థులతో ఉపాధ్యాయుల కార్ల అద్దాలు తుడిపించటం, వరండాలు, గదుల్లో చెత్త నూకించటం తదితర చాకిరీ పనులు చేయిస్తారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపించారు. డిప్యూటీ డీఈఓ మల్లారెడ్డి, ఎమ్ఈఓ సోమశేఖర్, ఎస్సై ఈశ్వరయ్యలు తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వటంతో ఆందోళన నిరసనను విరమించారు. ● కుందుర్పి మండలం కొలమిపాళ్యం పాఠశాల హెచ్ఎం శ్రీదేవి పనితీరు సక్రమంగా లేదని తల్లిదండ్రులు ఎంఈవోలు లక్ష్మీదేవి, తిప్పేస్వామిలకు ఫిర్యాదు చేశారు. హెచ్ఎం అయినప్పటికీ పాఠశాలకు సక్రమంగా హాజరుకావడం లేదన్నారు. ఆమెను ప్రశ్నించిన సిబ్బందిని వేధింపులకు గురిచేస్తున్నట్లు ఈ ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఉపాధ్యాయులను నియమించండి

కుందుర్పి: ఎస్.మల్లాపురం పాఠశాలకు ఇద్దరు ఉపాధ్యాయలను నియమించాలని కోరుతూ.. పాఠశాల అభివృద్ధి కమిటీ ఛైర్మన్ బాలాజీ, సభ్యులు రాజునాయక్, హనుమంతరాయుడు సోమవారం ఎంఈవోలు లక్ష్మీదేవి, తిప్పేస్వామిలకు వినతిపత్రం అందజేశారు.

వాజ్‌పేయీ విగ్రహావిష్కరణకు తరలిరండి

బ్రహ్మసముద్రం, కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: దేశ మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి విగ్రహావిష్కరణకు భాజపా నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివాలని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం కళ్యాణదుర్గం పట్టణం కోట రామాలయంలో సమావేశమై ఈనెల 12న గుత్తిరోడ్డులో ఏర్పాటు చేసే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ● బ్రహ్మసముద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలోనూ కాపు మాట్లాడారు. భాజపా మండలాధ్యక్షుడు గుడిసె పాతన్న, జిల్లా ఉపాధ్యక్షుడు ముప్పిరి దేవరాజ్, ఆదినారాయణ, జిల్లా కో-కన్వీనర్ ఆంజనేయులు, నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కాపు రామచంద్రారెడ్డి, భాజపా నాయకులు

ప్రైవేటీకరణలో భాగమే కొత్త చట్టాలు: సీపీఎం

ఉరవకొండ: కేంద్రం తీసుకొస్తున్న విద్యుత్తు, విత్తన చట్టాలతో రైతులకు తీరని నష్టం ఎదురవనుందని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మధుసూదన్, జిల్లా అధ్యక్షుడు రంగారెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఉరవకొండలో రైతు సంఘాలు ఆ చట్టాలకు సంబంధించిన ప్రతులను దహనం చేశారు. నాయకులు శీనప్ప, సురేశ్, నారాయణ పాల్గొన్నారు.

డి.హీరేహాళ్: విద్యుత్తు, విత్తన చట్టాలు రైతులపై ప్రభావం చూపుతాయని నిరసిస్తూ సోమవారం డి.హీరేహాళ్ తహసీల్దారు కార్యాలయం ఎదుట సీపీఎం నాయకులు జీవో పత్రాలు దహనం చేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు మల్లికార్జున, గంగాధర, సురేశ్, శివరాం పాల్గొన్నారు.

విరాళాల సేకరణ

విడపనకల్లు: విడపనకల్లులో సీపీఐ నాయకులు విరాళాలు సేకరించారు. ఆ పార్టీ 100 సంవత్సరాల వేడుక సందర్భంగా అనంతపురం లలిత కళాపరిషత్ హాల్‌లో ఈనెల 11న ఆత్మీయ సమావేశానికి హాజరు కావాలని పిలుపునిచ్చారు. సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి చెన్నరాయుడు, జిల్లా మహిళా సమైక్య నాయకురాలు పార్వతిప్రసాద్, కార్యదర్శులు సుల్తాన్, రసూల్‌వలి, ఏఐఎస్ఎఫ్ కోశాధికారి సుధాకర్ పాల్గొన్నారు.

ఘనంగా జుంజప్పస్వామి ఉత్సవం

గుడిపల్లి(బ్రహ్మసముద్రం), న్యూస్‌టుడే: గుడిపల్లి పైదొడ్డిలో వెలసిన శ్రీ జుంజప్ప స్వామి ఉత్సవ వేడుకను యాదవులు సోమవారం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం వేళలలో డప్పు వాయిద్యాల నడుమ విగ్రహాలను ఊరేగించారు. స్థానికులతోపాటు సమీప గ్రామాల భక్తులు వచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

సంతలో ఒకటి, రెంటికి ఇక్కట్లు

వారాంతపు సంతలో నీళ్లులేక వృథాగా మారిన శౌచాలయ గదులు

కుందుర్పి, న్యూస్‌టుడే: కుందుర్తి మండల కేంద్రంలోని వారాంతపు సంతలో ప్రజల సౌకర్యార్థం గతంతో నిర్మించిన మురుగుదొడ్లు ప్రస్తుతం నిరుపయోగంగా మారాయి. ప్రతి గురువారం ఇక్కడ నిర్వహించే సంతకు సమీపంలోని వివిధ గ్రామాల నుంచి చిరు వ్యాపారులు, మహిళలు, కొనుగోలు దారులు ఎక్కువ సంఖ్యలో వస్తుంటారు. వీరందరి అత్యవసరార్థం నిర్మించిన మరుగుదొడ్లు, ఇతర మౌలిక వసతుల నిర్మాణాలు వినియోగించుకోవడానికి వీలులేకుండా మారాయి. పదేళ్ల కిందట వీటిని నిర్మించారు. మూడేళ్లుగా మరమ్మతులను అధికారులు పట్టించుకోకపోవడంతో మరుగుదొడ్లకు నీటి సౌకర్యం నిలిచిపోయింది. దీంతో ఇవి నిరుపయోగంగా మారాయి. సంతకు వచ్చే మహిళలు, చిరు వ్యాపారులు ఒకటిరెంటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఇప్పటికైనా శౌచాలయాలను ప్రజల సౌకర్యార్థం వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయంపై మండల పరిషత్ పరిపాలనాధికారిని వివరణ కోరగా.. వెంటనే నీటి సౌకర్యం కల్పించి వినియోగంలోకి తీసుకొస్తామని పేర్కొన్నారు.

కందిలో నాసిరకం విత్తనాలు..!

● లబోదిబోమంటున్న రైతులు

న్యూస్‌టుడే, కళ్యాణదుర్గం గ్రామీణం: ఖరీఫ్‌లో కంది పంట సాగు చేసిన విత్తనాలు నాసిరకంగా ఉండడంతో చేను పూత దశలోనే నిలిచిపోవడంతో అన్నదాతల్లో అయోమయం నెలకొంది. కళ్యాణదుర్గం మండలం గోళ్ల గ్రామానికి చెందిన పలువురు రైతులు బళ్లారిలో కంది విత్తనాలు కొనుగోలు చేసుకొచ్చి సుమారు 42 ఎకరాల్లో పంట వేశారు. నాలుగు నెలల్లో చేతికి రావాల్సిన పంట.. ఐదు నెలలు కావస్తున్నా పూతదశలోనే ఉండటం గమనార్హం. విత్తనాలు సక్రమంగా ఉండిఉంటే ఇప్పటికే పంట కోతకోసి దిగుబడిని మార్కెట్‌కు తరలించేవారమన్నారు. నాసిరకం విత్తనాలు అమ్మిన వారిని వ్యాపారులను రైతులు సంప్రదించగా నీరు పెట్టకపోవడంతోనే ఇలా అయ్యి ఉండొచ్చని పేర్కొంటుండటం కొసమెరుపు.

గోళ్లలో ఐదునెలలైనా పూత దశలోనే...

విత్తన కంపెనీ ప్రతినిధులను రప్పిస్తాం

- శ్రావణ్‌కుమార్, వ్యవసాయాధికారి

కళ్యాణదుర్గం పరిధిలో సాగు చేసిన కంది పంట పూత దశలోనే ఉందని రైతులు దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే వెళ్లి పరిశీలిస్తాం. ఈ విషయాన్ని విత్తనాలు అమ్మకం చేసిన కంపెనీవారితో మాట్లాడాం. త్వరలో శాస్త్రవేత్తలతో క్షేత్రస్థాయికి వచ్చి పరిశీలిస్తామని చెప్పారు.

మా పరిస్థితి అగమ్యగోచరం

- సంజీవరెడ్డి, రైతు, గోళ్ల, కళ్యాణదుర్గం మండలం

22 ఎకరాల్లో కంది సాగుకు రూ.2.40 లక్షలు ఖర్చు చేశా. విత్తనాలు నాసిరకం కావడంతో పంట పూతదశలోనే ఉండిపోయింది. ఇప్పుడు ఏం చేయాలో దిక్కుతోచడం లేదు. విత్తనాలు విక్రయించిన వారిని అడిగితే మిగతా విత్తనాలు తీసుకున్న వారికి ఇలాగే ఉంటే పరిహారం ఇస్తామంటున్నారు.

అవీ.. ఇవీ.. అన్నీ..

కిసాన్ మోర్చా నిరసన

వజ్రకరూరు: వజ్రకరూరులో సంయుక్త కిసాన్ మోర్చా పిలుపుమేరకు ‘విత్తన ముసాయిదా బిల్లు’ ప్రవేటీకరణను మానుకోవాలని నిరసన తెలిపారు. కిసాన్ మోర్చా రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి విరుపాక్షి, మండల కార్యదర్శి సుధాకర్, రైతు సంఘం నాయకులు వెంకటేష్, చిన్నపెద్దన్న పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఆందోళన

కణేకల్లు: మండల సీపీఎం, రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దారు కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. రీసర్వే సమస్యలు పరిష్కారం కాక జాయింట్ ఎల్పీఎంలతో రైతులు అవస్థలు పడుతున్నట్లు వాపోయారు. తహసీల్దారు బ్రహ్మయ్యకు వినతిపత్రం సమర్పించారు. సీపీఎం మండల కార్యదర్శి కోరి నాగరాజు, రైతు సంఘం ఆధ్యక్షుడు జయచంద్రారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

తండా పాఠశాలలో విచారణ

గుమ్మఘట్ట: 75వీరాపురం తాండా ప్రాథమిక పాఠశాలలో సోమవారం డిప్యూటీ డీఈఓ మల్లారెడ్డి విచారణ చేపట్టారు. పాఠశాలలో పనిచేస్తున్న ఇద్దరు ఉపాధ్యాయుల మధ్య వచ్చిన విభేదాలు, తరచుగా జరుగుతున్న గొడవలపై ఇటీవల డీఈఓకు అందిన ఫిర్యాదు మేరకు సోమవారం పాఠశాలలో విచారణ కొనసాగింది.

మహిళ అదృశ్యం

ఉరవకొండ, న్యూస్‌టుడే: ఉరవకొండ మండలం కోనాపురానికి చెందిన ఓ వివాహిత ఇంట్లో గొడవపడి ఈనెల 6న కుమారుడితోపాటు ఎక్కడికో వెళ్లిపోయారు. కుటుంబ సభ్యులు ఆమె కోసం నాలుగు రోజులుగా వెతికినా ఫలితం లేకపోవడంతో సోమవారం స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మహానంది పేర్కొన్నారు.

మూడు ట్రాక్టర్లకు జరిమానా

రాయదుర్గం పట్టణం, న్యూస్‌టుడే: అక్రమంగా మట్టి తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు తహసీల్దార్ నాగరాజు తెలిపారు. పట్టణ శివారులోని నాన్‌చెరువులో అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తుండగా సోమవారం గుర్తించి పట్టుకున్నట్లు చెప్పారు. మొదటి తప్పుగా గుర్తించి జరిమానా విధిస్తున్నామని, మళ్లీ పట్టుబడితే వాహనాలను రవాణా శాఖ అధికారులకు అప్పగిస్తామని యజమానులను హెచ్చరించారు.

ఆర్మీకి ఎంపికపై ఆనందోత్సాహాలు

రాయదుర్గం: పట్టణానికి చెందిన ఇద్దరు డ్రైవర్లు, ఒక చేనేత కార్మికుడి కుమారులు ఆర్మీకి ఎంపిక కావటంతో పట్టణంలోని వినాయక సర్కిల్‌లో సోమవారం కేక్‌కోసి బాణాసంచాపేల్చి సంబరాలు చేసుకున్నారు. ఆటో డ్రైవర్లుగా పనిచేస్తున్న అనీల్‌సింగ్, వెంకటేశుల కుమారుడు మహేశ్వరసింగ్, ఫణికుమార్‌లు, సందీప్‌లు ఇటీవల కర్నూలులో ఆర్మీకి ఎంపికై శిక్షణ పూర్తి చేసుకుని సోమవారం రాయదుర్గంకు వచ్చిన సందర్భంగా సంబురాలు చేసుకున్నారు.

‘కౌలు రైతులకు రుణాలివ్వండి’

విడపనకల్లు: మండలంలోని కౌలు రైతులందరికీ బ్యాంకు ద్వారా పంట రుణాలు మంజూరు చేయాలని కౌలు రైతు సంఘం నాయకులు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా ఏర్పాటు చేశారు. డిప్యూటి తహసీల్దార్ చంద్రమోహన్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఆ రైతు సంఘం జిల్లా ఆధ్యక్షుడు రంగారెడ్డి, కౌలు రైతు సంఘం నియోజకవర్గం కార్యదర్శి వెంకటేష్, రైతు సంఘం నాయకులు సుంకన్న, రామాంజినేయులు, శివమ్మ, సోమప్ప పాల్గొన్నారు.

(c) eenadu

గుంతకల్లు

•గుంతకల్లు •శింగనమల •తాడిపత్రి

తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేస్తున్న చేనేత కార్మికులు

చేనేత సమస్యల్ని పరిష్కరించాలి

యాడికి, న్యూస్‌టుడే: చేనేత జౌళీ శాఖ అధికారుల ఆదేశాల మేరకు యాడికిలో చేనేత కార్మికులు కలిసి గత ఏడాదిలో ఏర్పాటు చేసుకున్న శివలక్ష్మి చెన్నకేశవస్వామి హ్యాండ్ లూమ్ సిల్క్ సొసైటీ సమస్యను పరిష్కరించాలని తహసీల్దార్ కె.ప్రతాప్‌రెడ్డికి కార్మికులు వినతిపత్రాన్ని అందచేశారు. సంఘాన్ని గుర్తించి కార్మికులు సమస్యను పరిష్కరించాలని పొట్టే గంగాధర్, చౌడప్ప, విశ్వనాథ్, ఆదిశేషయ్య, గణేశ్, వెంకటరమణ, రామాంజనేయులు, తదితరులు కలిసి విజ్ఞప్తి చేశారు.

వైభవం.. అయ్యప్ప గ్రామోత్సవం

ప్రత్యేక వాహనంలో ఊరేగుతున్న అయ్యప్ప స్వామి

యాడికి, న్యూస్‌టుడే: యాడికిలో సోమవారం రాత్రి నిర్వహించిన అయ్యప్ప గ్రామోత్సవం వైభవంగా సాగింది. ఏటా నిర్వహించే విధంగా ఈ ఉదయం సుప్రభాతసేవతో కార్యక్రమాలు ప్రారంభమై నాత్యసేవల అనంతరం స్వామి వారికి అభిషేకాలు, అంబలం పూజను చేశారు. స్వామి దీక్షను చేపట్టిన స్వాములు భజన, గీతాలపాలనలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాయంత్రం ప్రత్యేకంగా వివిధ పుష్పాలతో అలంకరించిన వాహనంలో స్వామి వారిని ప్రతిష్ఠించి, మేళతాళాలు, వాయిద్యాల నడుమ గ్రామ పుర వీధుల్లో ఊరేగించారు.

మేమున్నాం.. మీకు తోడుగా

గుంతకల్లు పట్టణం: 80085 73072
తాడిపత్రి: 79950 67001
శింగనమల: 8008612342

సమస్య: తాడిపత్రిలోని కూరగాయల మార్కెట్‌కి ఎదురుగా ఉన్న ప్రధాన రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. **- రామాంజనేయులు**
సమాధానం: రోడ్డుపైన ఉన్న తోపుడు బండ్లను తొలగిస్తాం. **- గౌస్‌బాషా, పట్టణ ఎస్సై**
సమస్య: తాడిపత్రిలోని చేపల మార్కెట్ వద్ద పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి.
- బాబా ఫక్రుద్దీన్, స్థానికుడు
సమాధానం: మాంసపు మార్కెట్ వద్ద ఉన్న వ్యర్థాలను తొలగిస్తాం. **- నాగేంద్ర**
– న్యూస్‌టుడే, తాడిపత్రి
సమస్య: నార్పలలో ట్రాఫిక్ సమస్యలు ఎక్కువగా ఉన్నాయి. **- నాగరాజు, నార్పల**
సమాధానం: ట్రాఫిక్ సమస్యలు రాకుండా చర్యలు తీసుకుంటాం. **-సాగర్, ఎస్సై**
– న్యూస్‌టుడే, నార్పల

యథేచ్ఛగా అసాంఘిక కార్యకలాపాలు

• బహిరంగంగా గంజాయి సేవనం • గుట్టుగా మట్కా • పట్టీపట్టనట్లు పోలీసులు

డీఆర్‌ఎం కార్యాలయానికి వెళ్లే రోడ్డుపక్కన కొందరు ఒకరితరువాత ఒకరు గంజాయిని తీసుకుంటూ..

గుంతకల్లు, న్యూస్‌టుడే: కొందరు బహిరంగ ప్రదేశాల్లో నిర్భయంగా గంజాయి తాగుతున్నారు. దీని ఫలితంగా ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇతర ప్రాంతాల నుంచి కొందరు గంజాయిని గుంతకల్లుకు రైళ్లలో తెచ్చి అమ్ముతుండగా, మరికొందరు ఇతర ప్రాంతాలకు రహస్యంగా చేరవేస్తున్నారు. రైల్వే, సివిల్ పోలీసులు అప్పుడప్పుడు తనిఖీలు చేసి వారిని పట్టుకుని కేసులు పెట్టి ఆతరువాత మిన్నకుండిపోతున్నారు. గంజాయిని రైళ్లలో తెచ్చేవారు ముందుగానే కొందరిని రైల్వే స్టేషన్‌కు పంపి పోలీసుల కదలికల గురించి సమాచారం అందుకుని జాగ్రత్తగా తరలిస్తున్నట్లు తెలిసింది. కొందరు స్టేషన్ శివార్లలో రైళ్లు ఆగిన సమయంలో దిగి వెళుతున్నట్లు సమాచారం.

గంజాయి బాధిత ప్రాంతాలు

● పట్టణంలో పెద్దలే కాకుండా కొందరు యువకులూ గంజాయికి బానిసలవుతున్నారు. వారు ఎస్ఎస్‌ట్యాంకుల సమీపంలోని ముళ్ల పొదలు, గుంతకల్లు బ్రాంచ్‌కాలువ గట్లపైన, కసాపురం రోడ్డు పక్కన, నిరుపయోగంగా ఉన్న పార్కులు, రైల్వే కమ్యూనిటీ హాలు ప్రదేశం, రైల్వేస్టేషన్ పరిసరాలు, రైల్వే జంక్షన్ రోడ్డు, పాత బుకింగ్ కార్యాలయం, పాడుపడ్డ క్వార్టర్లు, అరవిందనగర్‌లోని తదితర ప్రాంతాల్లో గంజాయి తాగుతున్నారు. మహిళలు బయటకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. కొందరు యువకులు మత్తులో ఉంటూ దారిలో వెళ్లేవారిని విపరీతంగా కొడుతున్నారు. ఈ ప్రాంతాల్లో పోలీసులు తనిఖీలు చేయకపోవడంతో రోజురోజుకు బాధితుల సంఖ్య ఎక్కువవుతోంది.

● పట్టణంలో కొందరు మట్కాను గుట్టుగా నిర్వహిస్తున్నారు. ఇదంతా చరవాణుల్లో జరుగుతోంది. మట్కా డబ్బును, నంబర్లను చరవాణుల ద్వారా నిర్వాహకులకు చేరవేస్తున్నారు. కొందర్ని పోలీసులు పట్టుకుని తరువాత సర్దుబాటు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఇదే పనిగా కొందరు పోలీసులు ఇతర విధులను పక్కనపెట్టి చరవాణుల్లో మట్కా నంబర్లను పంపేవారి కోసం వెతుకుతూ డబ్బు వసూలు చేసుకుంటున్నట్లు సమాచారం. ప్రతిరోజూ గుంతకల్లులో చరవాణుల ద్వారా రూ. 2 లక్షలకు పైనే మట్కా జరుగుతున్నట్లు తెలుస్తోంది. పోలీసులు దాడులు చేసి కొందరిని అరెస్టు చేస్తున్నా వారు తిరిగి మళ్లీ కొనసాగిస్తున్నారు.

గట్టి చర్యలు తీసుకుంటాం

గంజాయిని విక్రయించే వారిని పట్టుకుని కేసులు నమోదు చేస్తున్నాం. ఇలాంటి వారి సమాచారాన్ని ప్రజలు తమకు అందించి సహకరించాలి. మట్కాను నిర్వహించే వారిపై కూడా చర్యలు తీసుకుంటున్నాం. వారి చరవాణులను పట్టుకుని వదిలేసే పోలీసులపై చర్యలు తీసుకుంటాం. ఇటువంటి సమాచారం అందిచేవారి పేర్లను గోప్యంగా ఉంచుతాం.
- మనోహర్, ఒకటో పట్టణ సీఐ

ఆశాలపై పనిభారం తగ్గించాలి

సీఐటీయూ మహాసభల గోడపత్రాలను విడుదల చేస్తున్న ఆశావర్కర్లు

గుత్తి, న్యూస్‌టుడే: నెలకు రూ.10వేలు వేతనం పొందే ఆశావర్కర్లతో ప్రభుత్వం వెట్టిచాకిరి చేయించుకుంటున్నట్లు సీఐటీయూ నాయకులు రమేశ్, ప్రమిల ఆరోపించారు. సోమవారం గుత్తిలోని పట్టణ ఆరోగ్యకేంద్రంలో యూనియన్ జాతీయ మహాసభల పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనాభాకు అనుగుణంగా ఆశాకార్యకర్తలను నియమించాలన్నారు. తక్కువ మంది పనులు చేయిస్తున్నట్లు పేర్కొన్నారు. పట్టణ ఆరోగ్యకేంద్రాలకు ప్రతి వారం సమావేశాలకు వచ్చే కార్యకర్తలకు టీఏలు, డీఏలు చెల్లించాలని కోరారు. ఆశాలకు సెలవులను అమలు చేయాలన్నారు. ఆదాయ పరిమితితో సంబంధం లేకుండా సంక్షేమ పథకాలను అమలు చేయాలని చెప్పారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

తాగునీటి సమస్యపై వినతిపత్రం ఇస్తున్న ప్రజలు

గుత్తి, న్యూస్‌టుడే: గుత్తిలోని పైగేరిలో తాగునీరు, వారం రోజులకోసారి కూడా ఉప్పునీటినీ కొళాయిలకు వదలడంలేదని స్థానికులు వాపోయారు. పురపాలిక అధికారులు రూ.30లక్షలతో తాగునీటి పైపులైన్ వేసి చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. కాలనీలో ఉపరితల ట్యాంకు ఉన్నా నీరు రావడం లేదన్నారు. సోమవారం కాలనీ వాసులు పురపాలిక కార్యాలయంకు వచ్చి కమీషనర్ జబ్బార్‌మియాకు వినతిపత్రం ఇచ్చారు. ఇప్పటికైనా కాలనీకి తాగునీటి సౌకర్యం కల్పించి తమను ఆదుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుడు మల్లికార్జున, జనసేన నాయకుడు చిన్న వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎండలో కూర్చున్న మహిళలు

ఇళ్ల పట్టాల కోసం నిరీక్షణ

గుత్తి గ్రామీణం, న్యూస్‌టుడే: ఇళ్ల పట్టాల కోసం పట్టణానికి చెందిన మహిళలు సోమవారం ఎర్రటి ఎండలో ఎదురు చూశారు. గత కొన్నేళ్ల నుంచి ఇళ్ల స్థలాలు లేక ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని తెలిపారు. ఇళ్ల పట్టాలు లేని వారికి స్థలాలు మంజూరు చేయాలని కోరుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం దాదాపు 30 మంది రెండు గంటల పాటు ఎండలో అర్జీలు పట్టుకుని కూర్చున్నారు. అనంతరం తహసీల్దార్ పుణ్యవతికి వినతి పత్రం అందజేశారు.

సీఎం రమేశ్ కుటుంబ సభ్యులకు పరామర్శ

రాంనగర్(అనంతపురం), న్యూస్‌టుడే : అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ మాతృమూర్తి ఇటీవల మరణించారు. తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి, తెదేపా నాయకులు జేసీ పవన్‌రెడ్డి ఇరువురు సోమవారం యర్రగుంట్ల మండలం పొట్లదుర్తి గ్రామంలో సీఎం రమేశ్ ఇంటికి వెళ్లారు. మాతృమూర్తి చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. అనంతరం సీఎం రమేశ్, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

తాడిపత్రి, న్యూస్‌టుడే : తాడిపత్రిలోని బస్టాండు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణ చెందిన ఘటన సోమవారం రాత్రి జరిగింది. పట్టణ సీఐ ఆరోహన రావు తెలిపిన వివరాల మేరకు ఐశ్వర్య విల్లాస్‌కు కాలనీకి చెందిన రామ్మోహన్‌రెడ్డి(56) రైల్వేలో విధులు నిర్వహిస్తున్నాడు. సొంతపని నిమిత్తం తాడిపత్రిలోకి వస్తుండగా బస్టాండు వద్దకు రాగానే ముందు వెళ్తున్న లారీని ఓవర్ టేక్ చేసేందుకు ముందుకు వెళ్లగా అదుపు తప్పి కిందపడ్డాడు. దీంతో లారీ టైర్లు అతనిపై ఎక్కడంతో తీవ్రంగా గాయపడ్డాడు. కొనఊపిరితో ఉన్న రామ్మోహన్‌రెడ్డి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు సీఐ వివరించారు. మృతుడికి భార్య మహేశ్వరమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. రామ్మోహన్‌రెడ్డి కుటుంబ సభ్యులు ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ వివరించారు.

ఫ్లెక్సీ పడి ఇద్దరికి గాయాలు

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: అనంతపురం నగరంలోని 44వ జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ ఫ్రేమ్ పడి ఇద్దరు వృద్ధులు తీవ్రంగా గాయపడ్డారు. బుక్కరాయసముద్రం మండలం కొట్టాలపల్లికి చెందిన సంజీవరెడ్డి, శ్రీనివాసరెడ్డిలు హైవే మీదుగా వెళ్తుండగా, స్థానిక ఎంజీ పెట్రోలు బంకు సమీపంలో రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ ఫ్రేమ్ హఠాత్తుగా మీద పడింది. ఈ ఘటనలో ఇనుప చువ్వలు తల, శరీర భాగాల్లో గుచ్చుకోవడం వల్ల తీవ్ర రక్తగాయాలయ్యాయి. ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తరలించారు. బాధితులు ఏ స్టేషన్‌లోనూ ఫిర్యాదు చేయలేదు. ఎక్కడపడితే అక్కడ ఇష్టారాజ్యంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం, వాటి నిర్వహణను పట్టించుకోకపోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని నగర వాసులు ఆరోపిస్తున్నారు.

విజయాలు సాధించాలంటే సాధన చేయాలి

విద్యార్థులను సత్కరిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

గుంతకల్లు, న్యూస్‌టుడే : సాధించిన విజయాలతో తృప్తి చెందకుండా నిత్యం సాధన చేసి మరిన్ని పురస్కారాలు అందుకోవాలని డీఎస్పీ శ్రీనివాసులు అన్నారు. సోమవారం ఆయన పట్టణంలోని బాష్యం పాఠశాలకు చెందిన పూర్వపు విద్యార్థి ఆయుష్ క్రీడాకారుడు రాజేశ్, 4వ తరగతి చదువుతున్న వేణుప్రియను అభినందించారు. రాజేశ్ గత నెల చివర కొండలో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీల్లో ప్రథమస్థానం పొందారు. దీంతో అతన్ని అధికారులు లక్నోలో ఈనెల 13న జరుగనున్న జాతీయ అథ్లెటిక్ పోటీలకు ఎంపిక చేశారు. న్యూఢిల్లీకి చెందిన వైల్డ్ డ్రీమ్ బూస్టర్ హబ్ సంస్థ ఆన్‌లైన్‌లో నిర్వహించిన నృత్య పోటీల్లో పాల్గొని ఆమె ప్రతిభ చూపి ప్రశంసాపత్రాన్ని అందుకుంది. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జ్యోత్స్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నియంత్రిక.. పడిపోతోంది జాగ్రత్త!

నిత్యం కాలనీల ప్రజలు, విద్యార్థుల రాకపోకలతో రద్దీగా ఉండే హనుమేశ్‌నగర్ రోడ్డు పక్కనున్న విద్యుత్తు నియంత్రిక దిమ్మె కూలిపోయే స్థితిలో ఉంది. నియంత్రిక కోసం నిర్మించిన దిమ్మె నాసిరకంగా ఉండటంతో బీటలు వారాయి. దీంతో నియంత్రిక పక్కకు వాలుతోంది. ఫ్యూజ్ క్యారియర్ విద్యుత్తు తీగలు తక్కువ ఎత్తులో ఉండటంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఈ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, గుంతకల్లు

గుంతల రోడ్డుతో తిప్పలు

పామిడి - కొండాపురం, వీరన్నపల్లి గ్రామాల మధ్య గత వైకాపా ప్రభుత్వంలో ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.90లక్షల అంచనా వ్యయంతో తారు రోడ్డు వేశారు. అయితే పామిడి గ్రామ సచివాలయ వద్ద కల్వర్టు నిర్మించి దాదాపు 60 మీటర్ల మేర తారు రోడ్డు వేయడం మరిచారు. దీంతో రోడ్డుపై గుంతలు పడి కంకర తేలడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. రాత్రివేళల్లో మార్గం వద్దకు రాగానే వాహనాల్లో ప్రయాణించే వృద్ధులు, గర్భవతులు, పిల్లలు ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. అధికారులు స్పందించి తారురోడ్డును పూర్తి చేయాలని అటుగా ప్రయాణించే ప్రజలు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, పామిడి

ఆధునిక యంత్రంతో స్వచ్ఛత పనులు

వైకాపా ప్రభుత్వం అధికారంలో ఉన్న ఐదేళ్ల కాలం పాటు భూగర్భ మురుగునీటి వ్యవస్థను గాలికి వదిలేశారు. దీంతో మురుగు అస్తవ్యస్తంగా మారింది. దీంతో ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాజస్థాన్ నుంచి ఆధునిక యంత్రాలను తాడిపత్రికి తెప్పించారు. భూగర్భ మురుగు కాలువలో పేరుకుపోయిన షిల్టును తొలగించి సమస్యను పరిష్కరిస్తున్నారు. సుమారు పదేళ్లుగా పెన్నానదిలోకి మురుగు బాగా ఎక్కువ పోయేదని, ఇప్పుడు పరిష్కారం అయిందని అధికారులు వివరించారు. ఆధునిక యంత్రం మురుగునీటి పైపుల్లో ఉన్న షిల్టును తొలగిస్తున్న దాని చూసి ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. – న్యూస్‌టుడే, తాడిపత్రి

జ్యోతిని వెలిగిస్తున్న డీఆర్‌ఎం చంద్రశేఖర్ గుప్తా

అంబేడ్కర్ ఆశయాల సాధనకు కృషి చేయండి

గుంతకల్లు, న్యూస్‌టుడే : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ ఆశయాల సాధనకు అందరూ కృషిచేయాలని డీఆర్‌ఎం చంద్రశేఖర్ గుప్తా అన్నారు. రైల్వేలో శని, ఆదివారాల్లో సెలవు కావడంతో అధికారులు అంబేడ్కర్ వర్ధంతిని సోమవారం రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో నిర్వహించారు. అధికారులు జ్యోతిని వెలిగించి, చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ కృషి చేసిన రాజ్యాంగం వల్లే అందరూ సమాన హక్కులు పొందుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో రైల్వే అధికారులు, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం నాయకుడు కిశోర్, సంఘ్, మజ్దూర్ యూనియన్ల కార్యదర్శులు ప్రభాకర్, విజయకుమార్ పాల్గొన్నారు.

అగ్నివీరులుగా ఎన్‌సీసీ క్యాడెట్లు

అగ్నివీరులుగా ఎంపికైన వారిని అభినందిస్తున్న అధ్యాపకులు

గుంతకల్లు, న్యూస్‌టుడే : దేశ రక్షణకోసం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని ఎన్‌సీసీ విభాగం సైనికులను అందిస్తున్నందుకు తమకు చాలా గర్వంగా ఉందని ప్రధానాచార్యుడు లక్ష్మయ్య, ఎన్‌సీసీ లెఫ్టినెంట్ అధికారి బాలకృష్ణ అన్నారు. కళాశాలకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్లు మధు, మహేంద్ర అగ్నివీర్ సైనిక శిక్షణ పూర్తిచేసుకుని మీరట్, పంజాబ్‌లోని పటాన్‌కోట్‌లలో పని చేయడానికి ఉత్తర్వులు పొందారు. సోమవారం కళాశాలలో అభినందన కార్యక్రమం వారు మాట్లాడుతూ ఇప్పటికే 12 మంది సైన్యంలో పనిచేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు రవిశంకర్ శర్మ, రాఘవేంద్రప్రసాద్, గోపినాయక్, నాగరాజు, బసవరాజు, అన్వర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

'కేంద్రం ఆలోచనల్ని తిప్పికొడతాం'

కేంద్ర ప్రభుత్వ ప్రతులను ప్రదర్శిస్తున్న కిసాన్‌మోర్చా ప్రతినిధులు

బుక్కరాయసముద్రం: విద్యుత్తు సంస్థలను ప్రైవేటు పరం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను వెంటనే నిలిపివేయాలని కోరుతూ సంయుక్త కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో సోమవారం బుక్కరాయసముద్రం బిల్లు ముసాయిదా ప్రతులు దహనం చేశారు. పండ్లతోటల రైతు సంఘం నాయకులు శివారెడ్డి మాట్లాడుతూ విద్యుత్తు సంస్థలు ప్రైవేటు పరం అయితే వ్యవసాయ, గృహ అవసరాలకు వినియోగించే విద్యుత్తు బిల్లులు పెరుగుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర పరిధిలో ఉన్న విద్యుత్తు పంపిణీ సంస్థలపై కేంద్ర ప్రభుత్వ అధికారమేంటని నిలదీశారు. కార్యక్రమంలో కిసాన్‌మోర్చా ప్రతినిధులు కుళ్లాయప్ప, సంజీవరెడ్డి, వెంకటరామిరెడ్డి, నాగేంద్ర, వేణు, పుల్లయ్య, అంకాలు తదితరులు పాల్గొన్నారు.

బాధితుల రాస్తారోకో

గుంతకల్లు పట్టణం: చీటీ డబ్బులు మోసం చేసిన దిల్షాద్‌బేగంను అరెస్టు చేయాలని బాధితులు గుంతకల్లులో సోమవారం సాయంత్రం రాస్తారోకో నిర్వహించారు. పట్టణంలో ఇలాహి ఫొటో స్టూడియోకు చెందిన ఏజెంటు దిల్షాద్ బేగం అనేక మందితో చీటీలు వేసి మోసం చేయడంతో.. ఏపీ ఎమ్మార్పీఎస్ మహిళా అధ్యక్షురాలు విజయజ్యోతి ఆధ్వర్యంలో మహిళ బాధితులు రీగల్ టాకీస్ సర్కిల్‌లో మెయిన్ రోడ్డులో రాస్తారోకోతో ఆందోళన నిర్వహించారు. ఆమె వద్ద రూ.లక్షల్లో చీటీలు వేశామని డబ్బు ఉడాయించిందని ఆమెను అరెస్టు చేయాలని కోరారు. మెయిన్‌రోడ్డులో ట్రాఫిక్ స్తంభించడంతో ఎస్సై కొండయ్య, పోలీస్‌సిబ్బంది అక్కడికి చేరుకొని వారికి నచ్చచెప్పడంతో ఆందోళన విరమించారు.

'వైద్య కళాశాలల ప్రైవేటీకరణను విరమించుకోండి'

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే : కోటి సంతకాల కార్యక్రమం చూసైనా కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయం విరమించుకోవాలని వైకాపా సమన్వయకర్త శైలజానాథ్ కోరారు. సోమవారం ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో కోటి సంతకాల కార్యక్రమం నిర్వహించారు. వైకాపా నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, ప్రసాద్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలపై పోరాడాలి

ఎన్నికైన ఎస్టీయూ మండల నూతన కమిటీ సభ్యులు

పామిడి, న్యూస్‌టుడే: పట్టణంలోని నాగిరెడ్డి కాలనీలో ప్రాథమిక పాఠశాలలో సోమవారం ఎస్టీయూ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రామాంజనేయులు యాదవ్, ప్రధాన కార్యదర్శిగా ఆగులురప్ప, కార్యదర్శులుగా వీరాంజనేయులు, నరసింహారెడ్డి, ఆర్థిక కార్యదర్శిగా శ్రీనివాసరాజు, ఆర్థిక కమిటీ సభ్యులుగా చంద్రమోహన్, రామాంజనేయులు, కుల్లాయప్ప, మహిళా కన్వీనర్‌గా సుభాషిణి, సీపీఎస్ కన్వీనర్ రోమేరీ, జిల్లా కౌన్సిల్ సభ్యులు నాగభూషణం, రాజశేఖర్, చంద్రశేఖర్, సుధాకర్‌లుగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఉపాధ్యాయుల డీఏ, ఐఆర్, పీఆర్సీ, టెట్ తదితర సమస్యలపై పోరాడాల్సిన ఆవశ్యకత ఉందన్నారు.

ప్రత్యేక పంచాయతీ ఏర్పాటు చేయండి

ప్రత్యేక పంచాయతీ కోసం అధికారులకు వినతిపత్రం ఇస్తున్న కాలనీ వాసులు

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: బుక్కరాయసముద్రం మేజర్ పంచాయతీలోని 10 కాలనీలను ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలని కాలనీ ప్రజలు తహసీల్దారు శ్రీధర్ మూర్తి, ఎంపీడీవో సదాశివకు వినతిపత్రం ఇచ్చారు. కాలనీ ప్రజలు మాట్లాడుతూ పంచాయతీలో 30కి పైగా కాలనీలు ఉన్నాయని, పెద్ద పంచాయతీ కావడంతో మా కాలనీలు అభివృద్ధి కావడం లేదని వాపోయారు. కొట్టాలపల్లి, సరళాదేవినగర్, విరూపాక్షనగర్, జనచైతన్యనగర్, ఎల్‌బీ.కాలనీ, విజయనగర్ కాలనీ, అనంతసాగర్, హమాలీ, రామిరెడ్డి, గాయత్రీనగర్‌లను కలిపి కొత్త పంచాయతీగా ఏర్పాటు చేయాలని విన్నవించారు. అధికారులు ఈ విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో కాలనీల వాసులు సుజాత, శేషానందరెడ్డి, రామచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమ్ ప్రాముఖ్యతపై అవగాహన

మాట్లాడుతున్న సహాయ సంచాలకులు రాజశేఖర్ రెడ్డి

యాడికి, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరు ఉద్యమ్ రిజిస్ట్రేషన్ చేయడం ద్వారా వ్యాపార లావాదేవీలు, ఇతర కార్యకలాపాలకు ఎంతో ప్రాధాన్యం ఉంటుందని జిల్లా పరిశ్రమల శాఖ సహాయ సంచాలకులు కె.రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం వెంకటేశ్వర మండల సమాఖ్య కార్యాలయంలో ఉద్యమ్ ప్రాముఖ్యతపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్ద పరిశ్రమలకే కాకుండా చిన్న చిన్న పరిశ్రమలకు సైతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక రాయితీలు కల్పిస్తున్నాయని, ముందుగా ఆన్‌లైన్‌లో ఉద్యమ్ నమోదు తప్పక చేయాలన్నారు. కార్యక్రమంలో పరిశ్రమల శాఖ పీవో రవీంద్రనాథ్ రెడ్డి, భువనేశ్వరి, శ్రీనాథ్, నిశాంత్, ఏపీఎం చంద్రశేఖర్, డీఆర్‌డీఏ సిబ్బంది పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలి

ఆర్డీఓ శ్రీనివాస్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న న్యూడెమొక్రసీ నాయకులు

గుంతకల్లు, న్యూస్‌టుడే : నియోజకవర్గంలో రైతులు పండిస్తున్న అరటి, పత్తి, మొక్కజొన్న, ఉల్లిగడ్డలు తదితర ఉత్పత్తులకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించే విధంగా చూడాలని న్యూడెమొక్రసీ డివిజన్ కార్యదర్శి సురేశ్ అన్నారు. సోమవారం పార్టీ నాయకులు, రైతులు కలిసి ఆర్డీఓ శ్రీనివాస్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అప్పు చేసి పెట్టుబడి పెట్టిన రైతులకు గిట్టుబాటు ధర లేక నష్టపోతున్నారు. వ్యాపారులు మండీ యజమానులు సిండికేట్‌గా ఏర్పడి రైతులకు అన్యాయం చేస్తున్నారని వాపోయారు. ప్రభుత్వం ఈ సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రఘునాథ్‌రెడ్డి, రాందాస్, షెక్షావలి, బాషా, నారాయణ, రామాంజి పాల్గొన్నారు.

సంపూర్ణ పారిశుద్ధ్యం సాధిద్దాం

భూమిపూజ చేస్తున్న మున్సిపల్ అధ్యక్షురాలు భవానీ, తెదేపా పట్టణ ఇన్‌ఛార్జి నారాయణస్వామి

గుంతకల్లు: పట్టణంలో అభివృద్ధి పనులకు భూమిపూజలు నిర్వహించిన వెంటనే పనులను ప్రారంభించి పూర్తి చేయాలని మున్సిపల్ అధ్యక్షురాలు భవానీ, పట్టణ తెదేపా ఇన్‌ఛార్జి నారాయణస్వామి అన్నారు. సోమవారం సాయినగర్‌లో రూ.10 లక్షలతో నిర్మించే మురుగు కాలువ పనులకు, హౌసింగ్‌బోర్డు కాలనీలో మున్సిపల్ వాహనాలను నిలపడానికి ఉద్దేశించి రూ.15 లక్షలతో నిర్మించే షెడ్డు పనులకు భూమిపూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాహనాలను నిలుపుకుని వాటికి మరమ్మతులు చేయడానికి షెడ్డు ఉపయోగపడుతుందని అన్నారు. ఇందుకు ప్రత్యేకంగా అధికారులు ఒక మెకానిక్‌ను నియమించాలని వివరించారు. పట్టణ శుభ్రతకు సంబంధించి వందశాతం పారిశుద్ధ్యాన్ని సాధించడానికి అవసరమైన చర్యలు చేపడతామని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నయాం అహమ్మద్, ఈఈ ఇంతియాజ్, యాదవ కార్పొరేషన్ డైరెక్టరు మస్తాన్ యాదవ్, సింగిల్‌విండో అధ్యక్షుడు మస్తానప్ప, కౌన్సిలర్ రవికుమార్, తెదేపా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్దాం

గుంతకల్లు, న్యూస్‌టుడే : ప్రజల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించి వాటిని వినియోగించుకునే విధంగా కృషి చేయాలని భాజపా నాయకులు పేర్కొన్నారు. సోమవారం గుత్తిరోడ్డులో నాయకుల సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ ఈనెల 12న అనంతపురంలో దివంగత మాజీ ప్రధాని వాజ్‌పేయి విగ్రహ ప్రతిష్ఠాకార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి గుంతకల్లు ప్రాంతం నుంచి పెద్దఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లాలని పిలుపునిచ్చారు. పార్టీ నియోజకవర్గం ఇన్‌ఛార్జి రామాంజనేయులు, పట్టణ అధ్యక్షుడు రమేశ్, గ్రామీణ విభాగం అధ్యక్షుడు అశోక్‌నాయక్, నాయకులు విశ్వనాథ్, కృష్ణమూర్తి, విజయలక్ష్మి, మహేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

స్కేటింగ్‌లో వీరవిహారం

పలు టోర్నీల్లో రాణించిన శ్రీయాన్ష్

సాధించిన మెడల్‌తో జి.శ్రీయాన్ష్

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: గుంతకల్లుకు చెందిన విద్యార్థి చిన్న వయసులోనే స్కేటింగ్‌లో అదరగొడుతున్నాడు. అనేక టోర్నీల్లో పాల్గొంటూ పతకాలు సాధిస్తున్నాడు.

● పట్టణానికి చెందిన జి.రఘుకుమార్, సుధారాణి దంపతుల కుమారుడు జి.శ్రీయాన్ష్ మాంటిస్సోరి స్కూల్‌లో ఆరో తరగతి చదువుతున్నాడు. స్కేటింగ్‌పై ఆసక్తి ఉండటంతో తల్లిదండ్రులు కోచ్ వద్ద శిక్షణ ఇప్పించారు. నాలుగో తరగతి నుంచే అనంతపురం, తిరుపతి, తాడిపత్రిలో జరిగిన స్పీడ్ స్కేటింగ్ టోర్నీలో పాల్గొని సత్తాచాడాడు.

బరిలో దిగితే విజయమే

తమిళనాడులోని మధురైలో జరిగిన జాతీయ స్థాయి ఛాంపియన్ షిప్ 2024 పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ సాధించాడు. ఈ ఏడాది మే, 18న మహారాష్ట్రలోని కొల్హాపుర్‌లో ఒలంపిక్ ఓపెన్ జాతీయ ఛాంపియన్ షిప్ టోర్నీలో 400 మీటర్ల స్కేటింగ్‌లో సిల్వర్ మెడల్, 800 మీటర్ల విభాగంలో తృతీయ స్థానంలో నిలిచి బ్రాంజ్ మెడల్ సొంతం చేసుకున్నాడు. జూన్ 1న అనంతపురంలో జరిగిన 600 మీటర్ల పోటీల్లో తృతీయ స్థానంలో నిలిచాడు. గుంతకల్లులో ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం రోజు నిర్వహించిన మారథాన్‌లో 79 నిమిషాలు నాన్ స్టాప్‌గా స్కేటింగ్ చేసి ఇండియన్, యూనిటైడ్ నేషన్స్, యూఎస్ఏ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌ను సొంతం చేసుకున్నాడు. వచ్చే ఏడాది జనవరి 11న జరిగే జాతీయ స్థాయి పోటీల కోసం సన్నద్ధమవుతున్నాడు. ఇంటర్నేషనల్ స్కేటింగ్‌లో ప్రతిభ చాటడమే తన లక్ష్యం అంటున్నాడు శ్రీయాన్ష్.

(c) eenadu

అనంతపురం

●అనంతపురం ●రాప్తాడు

12న అంగన్‌వాడీ వర్కర్ల నిరసన

ఆజాద్‌నగర్: వేతనాలు పెంచాలని, మిగిలిన మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని అంగన్ వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు నాగేంద్రకుమార్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శి శకుంతల, రమాదేవిలు డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని గణేనాయక్ భవనంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. మార్చిన సెంటర్లకు పెరిగిన వేతనాలు ఇవ్వాలనీ, సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరుతూ ఈ నెల 12న జిల్లా కలెక్టరేటు వద్ద నిర్వహించనున్న నిరసన కార్యక్రమానికి పెద్ద ఎత్తున అంగన్‌వాడీలు హాజరు అవ్వాలని పిలుపునిచ్చారు. అంగన్‌వాడీలకు డిపార్ట్మెంటు ఉద్యోగులకు మాదిరిగా డీఏ ఉండదు. కార్యకర్తలకు రూ. 24,800లు, ఆయాలకు రూ. 20,300ల వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఆసుపత్రి నిర్మాణంతో రాకపోకలకు ఇబ్బంది

కమిషనరుకు వినతి పత్రం అందిస్తున్న కాలనీవాసులు

అనంత నగరపాలక: జీసస్‌నగర్‌లో ఆసుపత్రి నిర్మాణం చేపడితే ప్రజలకు ఇబ్బంది అవుతుందని కమిషనరు బాలస్వామికి మాజీ కార్పొరేటర్ రమణ, ఆ ప్రాంతానికి చెందిన ప్రజలు విన్నవించారు. ఇక్కడ కేవలం 20 అడుగుల రోడ్డు ఉందని ఇదే ప్రాంతంలో పాఠశాలు, గుడి ఉండటంతో రద్దీ ఏర్పడే అవకాశం ఉందని అనుమతులు ఇవ్వరాదని కోరారు. చిన్న వీధి కావడంతో పెద్ద వాహనాలు ఆగితే ఇతర వాహనాలు వెళ్లడానికి ఇబ్బంది అవుతుందన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

అశోక్‌నగర్ : 8008573011
రాంనగర్: 8008573001
కమలానగర్: 7032975446

సమస్య: హమాలి కాలనీలోని ప్రభుత్వ పాఠశాలకు వెళ్లే మార్గంలో వీధి కుక్కలు 20 వరకు ఉండటంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. **- ఖాలిద్ ఖురేషీ**

సమాధానం: నగరంలో కుక్కలను తరలించి ఆపరేషన్లు చేపట్టాం. అక్కడ తొందరలోనే తరలిస్తాం.

సమస్య: వినాయకనగర్ మొదటి క్రాస్‌లో చెత్త కుప్ప అడ్డంగా ఉంది. **- ఆనంద్**

సమాధానం: వెంటనే చెత్తను తరలిస్తాం.

(పై ప్రశ్నలకు నగరపాలక డిప్యూటీ కమిషనరు పావని సమాధానాలు ఇచ్చారు.)

– న్యూస్‌టుడే, అశోక్‌నగర్

సమస్య: మండలంలోని బి.యాలేరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ప్రహరీ పూర్తిగా దెబ్బతింది. బయటి వ్యక్తులు పాఠశాల లోపలికి వెళ్లి అపరిశుభ్రత చేస్తున్నారు.

- తిరుపాలు, బి.యాలేరు

సమాధానం: ప్రహరీ నిర్మాణంపై నివేదికలు తయారు చేసి ఉన్నతాధికారులకు పంపాం. నిధులు వచ్చిన వెంటనే నిర్మాణం పూర్తి చేస్తాం. **- నరసింహారెడ్డి, ఎంఈవో, ఆత్మకూరు**

సమస్య: వై. కొత్తపల్లి సమీపాన శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో అపరిశుభ్రత నెలకొన్నది. ప్లాస్టిక్ వ్యర్థాలు ఎక్కడపడితే అక్కడ ఉన్నాయి. **- అమర్, ఆత్మకూరు**

సమాధానం: వెంటనే సిబ్బందితో ఆలయంలో ఎక్కడ చెత్త లేకుండా శుభ్రం చేయిస్తాం. **- దేవదాసు, ఆలయ నిర్వహణ అధికారి** – న్యూస్‌టుడే: ఆత్మకూరు

కాయగూరల ధరలు

అరవిందనగర్: (పాతూరు మార్కెట్లో ధరలు కిలో రూ.లలో) టమాటలు 25, రెండోరకం 20, ఉల్లిగడ్డలు 25, రెండోరకం 15, బంగాళాదుంపలు 40, మిరపకాయలు 30, బెండకాయలు 25, వంకాయలు 25 , ముల్లంగి 20, బీట్‌రూట్ 40, బీరకాయలు 40, కాకరకాయలు 40, చౌళేకాయలు 40, క్యాప్సికం 40, చిక్కుడుకాయలు 40

యానిమేటర్ల అక్రమాల పరంపర

● తాకట్టులో మహిళల ఆర్థిక సాధికారత
● రూ. కోటి వరకు స్వాహా

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: స్వయం సహాయక సంఘాలన్నీ యానిమేటర్ల చెప్పు చేతుల్లో ఉన్నాయి. వారు చెప్పిందే వేదం... వారు రాసిందే శాసనంగా మారుతున్నాయి. ఎక్కడా చూసినా యానిమేటర్లే రాజ్యమేలుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కొక్క యానిమేటర్ అక్రమాలు వెలుగు చూస్తున్నాయి. అధికారులు చూసీచూడనట్లు వదిలేయడంతో అక్రమాల పరంపర కొనసాగుతోంది.

అప్పులు తీసుకునే సందర్భంలో తప్పుదోవ

అనంతపురం గ్రామీణ మండలంలో మొత్తం 2,450 స్వయం సహాయక సంఘాలు, 76 గ్రామైక్య సంఘాలు ఉన్నాయి. ఈ సంఘాలన్నీ బ్యాంకులు, ప్రభుత్వం ద్వారా అమలు చేస్తున్న స్త్రీశక్తి, ఉన్నతి పథకాల ద్వారా రూ. 150 కోట్ల వరకు అప్పులు తీసుకున్నాయి. ప్రతి నెలా కోట్ల రూపాయలు అప్పుల చెల్లింపులు, రుణాల మంజూరు చేస్తుంటారు.

● మండలానికి ఒక ఏపీఎం, గ్రామైక్య సంఘాలను బట్టి కమ్యూనిటీ సమన్వయకర్తలు పనిచేస్తుంటారు.

ప్రతి సంఘం నెలనెలా సమావేశం నిర్వహించడం, అప్పులు, వడ్డీలు చెల్లించడం, కొందరు కొత్త అప్పులు తీసుకోవడం చేస్తుంటారు. బ్యాంకు ద్వారానే కాకుండా పొదుపు మొత్తాలను కూడా తక్కువ వడ్డీకి సభ్యురాళ్లకే ఇస్తారు. ఈ రుణాలతో వ్యాపారం, స్వయం ఉపాధి యూనిట్లు స్థాపించుకోవాలి. 90శాతం మంది మహిళలు ఇంటి అవసరాలు, ఆడబిడ్డల వివాహాలకే అప్పులు తీసుకుంటారు. ఇదే అదనుగా యానిమేటర్లు సంఘాలను తప్పుదోవ పట్టిస్తున్నారు.

● గ్రామీణ మండలం నందమూరినగర్‌లో ఆదిలక్ష్మి అనే యానిమేటరు రూ. 45లక్షల వరకు సంఘాల డబ్బులు తీసుకుని ఆచూకీ లేకుండా పోయింది. కక్కలపల్లికాలనీ సమీపంలోని మరో కాలనీలో పాత, కొత్త యానిమేటర్లు ఇద్దరూ కలసి రూ. 10 లక్షల వరకు సంఘాల డబ్బులు సొంతానికి వాడుకున్నారు.

26 మంది తొలగింపు

అనంతపురం గ్రామీణ మండలంలో 26 మంది యానిమేటర్లను తొలగించారు. చాలామంది అక్రమాలకు పాల్పడ్డారేనని విచారణలో తేలింది. వీరికి జీతాలు చెల్లిస్తున్నా.. బ్యాంకు రుణం, స్త్రీశక్తి రుణాలు మంజూరైనా సరే వారికి కొంత శాతం యానిమేటర్లకు ముట్టజెప్పాల్సిందే. సీసీలు కూడా కొందరు మామూళ్ల మత్తులో జోగుతున్నందున ఎలాంటి చర్యలు తీసుకోలేదు

● ఆకుతోటపల్లిలో కూడా మహిళలను మోసం చేసి ఏకంగా రూ. 10 లక్షల బ్యాంకు రుణాలనే కాజేసింది. అలాగే రుద్రంపేటలో కూడా అక్రమాలు వెలుగు చూస్తున్నాయి. ఇలా మండలవ్యాప్తంగా రూ. కోటి వరకు దుర్వినియోగం జరిగిందని అధికారులు వెల్లడించారు.

నిఘా పెట్టాం

అనంతపురం గ్రామీణ మండలంలోని అనేక సంఘాల్లో అక్రమాలు జరిగిన విషయం వాస్తవమే. ఇప్పటివరకు 26మంది యానిమేటర్లను తొలగించాం. ఎక్కడ ఏ తప్పు దొర్లినా వారిని ఉపేక్షించం

- రవికుమార్, వెలుగు ఏపీఎం

కృత్రిమమేధతో నూతన ఆవిష్కరణలు

వక్తృత్వ పోటీల్లో విద్యార్థినులు

బహుమతులు అందుకున్న విద్యార్థులు

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: విద్యార్థులు కృత్రిమ మేధపై పట్టు సాధించి నూతన ఆవిష్కరణలు చేపట్టాలని శ్రీచైతన్య జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ దుర్గేష్ పేర్కొన్నారు. ‘ఈనాడు’ ఆధ్వర్యంలో సోమవారం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో ప్రతిభ పాటవ పోటీలు నిర్వహించారు. ‘కృత్రిమ మేధ (ఏఐ) వల్ల భవిష్యత్తులో జరిగే మార్పులు’ అనే అంశంపై వక్తృత్వ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో ద్వితీయ సంవత్సరం విద్యార్థినులు మధుమిత ప్రథమ, హాసిని ద్వితీయ, మాధురి తృతీయ బహుమతులు దక్కించుకున్నారు.

‘తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డివి అన్నీ గాలి మాటలే’

ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే: రామగిరి మండలంలో 9 మంది ఎంపీటీసీలు ఉన్నా.. ఎంపీపీ ఎన్నిక కూడా రాలేదని.. సొంత గ్రామం తోపుదుర్తిలో విద్యుత్తు సబ్ స్టేషన్ కూడా పూర్తి చేయలేదని.. తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డివి అన్నీ గాలి మాటలే అని ఎమ్మెల్యే పరిటాల సునీత మండి పడ్డారు. ప్రకాశ్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఎమ్మెల్యే తీవ్రంగా స్పందించారు. అనంతపురం క్యాంపు కార్యాలయానికి వివిధ సమస్యలపై పలు గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. పలు సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ప్రకాశ్‌రెడ్డి సొంత మండలంలో రెండు విద్యుత్తు సబ్‌స్టేషన్లు పనులు పూర్తి చేయకుండా పక్క మండలాల్లో నేనే సబ్‌స్టేషన్ పనులు పూర్తి చేశానని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. తోపుదుర్తిలో ప్రజలు, రైతులు ఇబ్బందులు పడుతుంటే పట్టించుకోకుండా ఇప్పుడు సబ్‌స్టేషన్లు పూర్తి చేస్తే దానిపైనా విమర్శిస్తున్నారన్నారు. వాస్తవంగా ఈ విషయంలో ప్రకాశ్‌రెడ్డి క్షమాపణ చెప్పాలన్నారు. మరోవైపు రామగిరి ఎంపీపీ ఎన్నిక విషయంలో ప్రకాశ్‌రెడ్డి వ్యవహరిస్తున్న తీరుపై ఎమ్మెల్యే మండిపడ్డారు. తొమ్మిది ఎంపీటీసీలు ఉండి కూడా ఎంపీపీ ఎన్నిక కోసం ఎమ్పీడీవో కార్యాలయానికి కూడా రాకలేక పోయారన్నారు. ఇప్పటికే నాలుగుసార్లు ఎన్నిక వాయిదా పడిందన్నారు. పైగా తామేదో దౌర్జన్యం చేస్తున్నట్లు విమర్శలు చేయడం తగదన్నారు. ఎంపీపీ లేకపోవడంతో మండలంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు ఆటంకం ఏర్పడిందన్నారు. తాము దౌర్జన్యం చేయాలనుకుంటే ఆపే శక్తి తోపుదుర్తికి లేదన్నారు. కక్కలపల్లికాలనీలోని యానిమేటర్ రూ. 29లక్షలు కాజేశారని, దీనిపై అడిగితే దురుసుగా వ్యవహరిస్తున్నారని, యానిమేటర్ గత వైకాపా ప్రభుత్వం నుంచి ఇప్పటికీ కొనసాగుతున్నారని కాలనీవాసులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు.

ప్రత్యేక పంచాయతీ ఏర్పాటు చేయండి

అధికారులకు వినతిపత్రం ఇస్తున్న కాలనీ వాసులు

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: బుక్కరాయసముద్రం మేజర్ పంచాయతీలోని 10 కాలనీలను ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలని కాలనీ ప్రజలు తహసీల్దారు శ్రీధర్‌మూర్తి, ఎంపీడీవో సదాశివకు వినతిపత్రం ఇచ్చారు. కాలనీ ప్రజలు మాట్లాడుతూ పంచాయతీలో 30కి పైగా కాలనీలు ఉన్నాయని, పెద్ద పంచాయతీ కావడంతో మా కాలనీలు అభివృద్ధి కావడం లేదని వాపోయారు. కొట్టాలపల్లి, సరళాదేవినగర్, విరూపాక్షనగర్, జనచైతన్యనగర్, ఎల్‌బీ. కాలనీ, విజయనగర్ కాలనీ, అనంతసాగర్, హమాలీ, రామిరెడ్డి, గాయత్రీనగర్‌లను కలిపి కొత్త పంచాయతీగా ఏర్పాటు చేయాలని విన్నవించారు

భక్తిశ్రద్ధలతో సంకష్టహర చతుర్థి

పాతూరు దత్తమందిరంలో వ్రతం

అనంత సాంస్కృతికం: నగరంలోని విఘ్నేశ్వరాలయాలు సోమవారం రాత్రి భక్తులతో కిక్కిరిసిపోయాయి. పౌర్ణమి అనంతరం వచ్చే చవితి రోజున ఉదయం నుంచి ఉపవాసం చేసి సాయంత్రం గణపతిని పూజిస్తే సకల శుభాలు కల్గుతాయని భక్తుల విశ్వాసం. చవతిరోజు, సోమవారం కావడంతో మహిళలు పూజలు చేయించేందుకు ఆలయాల వద్దకు తరలి వచ్చారు. పీటీసీలోని కామితార్థ గణపతి ఆలయం, మూడో రోడ్డులోని బాబా మందిరం, హెచ్ఎల్‌సి కాలనీలోని నసనకోట ముత్యాలమ్మ ఆలయం, హౌసింగ్ బోర్డు వేంకటేశ్వరాలయం, అశోక్‌నగర్‌లోని సత్యదేవాలయం, రాంనగర్ వరసిద్ధి వినాయక ఆలయం, పాతూరు దత్తమందిరం, అశోక్‌నగర్ హరిహర దేవాలయం తదితర ప్రాంతాల్లోని ఆలయాల్లో వ్రతం చేయించేందుకు భక్తులు తరలివచ్చారు. స్వామివారికి పంచామృతాభిషేకం నిర్వహించి, కుడుముల హారాలు, గరికతో పాటు పలురకాల పుష్పాలతో అలంకరించడంతో స్వామివారికి ప్రత్యేక శోభ చేకూరింది.

సమయానికి రేషన్ సరకులు అందించాలి

తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

ఆత్మకూరు: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు సమయానికి రేషన్ సరకులు అందించాలంటూ అంగన్‌వాడీ సిబ్బంది సోమవారం తహసీల్దార్ లక్ష్మీనాయక్‌కు వినతి పత్రాన్ని అందించారు. మండలంలోని అంగన్‌వాడీ కేంద్రానికి ప్రభుత్వం కేటాయించిన సరకు కంటే తక్కువగా అందిస్తున్నారన్నారు. గత నెలలో ఉన్న బఫర్ సరకుల వివరాలను ఆన్‌లైన్‌లో నుంచి తొలగించడం లేదని విన్నవించారు. ఫలితంగా ప్రతి అంగన్‌వాడీ కేంద్రానికి బియ్యం తక్కువగా రావడంతో ఇబ్బంది పడుతున్నామని వివరించారు. ఇప్పటికే కొన్ని కేంద్రాల్లో నిల్వలు లేక పక్క ఉన్న కేంద్రాల నుంచి సర్దుబాటు చేసుకోవాల్సి వస్తోందని తెలిపారు. ఈవిషయంపై స్పందించిన తహసీల్దార్ లక్ష్మీనాయక్, సీఎస్‌డీటీ లక్ష్మీదేవి వెంటనే సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

‘డీసీఎంఎస్ స్థలాల లీజుపై అర్థం లేని ఆరోపణలు’

బాధితురాలిని పరామర్శిస్తున్న డీసీఎంఎస్ అధ్యక్షుడు నెట్టెం వెంకటేష్, అధికారులు

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) స్థలాల కేటాయింపులపై వివిధ పార్టీల నాయకులు అర్థంలేని ఆరోపణలు చేయడం తగదని అధ్యక్షుడు నెట్టెం వెంకటేష్ హితవు పలికారు. ముంతాజ్ మహిళ పురుగు తాగి ఆత్మహత్యకు యత్నించడాన్ని మేయరు వసీం, సీపీఐ నాయకుడు జాఫర్, కాంగ్రెస్ నాయకుడు దాదాగాంధీలు డీసీఎంఎస్‌కు అంటగట్టడం సహేతుకం కాదని ఆయన మండిపడ్డారు. డీసీఎంఎస్ స్థలాలకు ముంతాజ్‌కు ఎలాంటి సంబంధం లేదు. డీసీఎంఎస్ స్థలాలకు సంబంధించి ఆమె అసలు లీజుదారు కాదని దీనిపై మైనార్టీ నాయకులు రాజకీయంగా బురద జల్లడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. సోమవారం సాయంత్రం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ముంతాజ్‌ను పరామర్శించారు. రూ. 10వేల ఆర్థిక సాయం అందించడానికి వెళ్లగా ఆమె నిరాకరించారు. గుత్తిరోడ్డు సమీపంలో ఉన్న స్థలమే తనకు కేటాయించాలని ఆమె కోరారు. నెట్టెం వెంకటేష్ మాట్లాడుతూ.. డీసీఎంఎస్‌ను లాభాల దిశగా నడిపించాలన్న ప్రయత్నంలో భాగంగా భవనాలు, స్థలాలను క్రమబద్ధీకరిస్తున్నామని వివరించారు. గుత్తిరోడ్డు సమీపంలో ఉన్న స్థలంలో కొందరు అద్దె చెల్లించకుండా వ్యాపారాలు చేసుకుంటున్నారు. ఇలాంటి వారితో ఒప్పంద పత్రాలు రాయించుకుని అద్దెలు నిర్ణయించాలన్నదే లక్ష్యమన్నారు. రాజకీయ లబ్ధికోసం మేయరు వసీం, ఇతర నాయకులు నిరాధార ఆరోపణలు చేయడం సమంజసం కాదన్నారు.

తహసీల్దార్లు అర్జీలు పరిష్కరించకపోతే చర్య

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: ‘అత్యధిక అర్జీలన్నీ తహసీల్దార్ల స్థాయిలోనే పరిష్కరించవచ్చు. బాధ్యత లేకుండా చాలామంది నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. ఇక నుంచి మీ స్థాయిలో పరిష్కారమయ్యే వాటిని తప్పక పూర్తి చేయాలి. లేదంటే.. శాఖపరంగా తీవ్ర చర్య తప్పదు’.. అని కలెక్టర్ ఆనంద్ హెచ్చరించారు. సోమవారం జేసీ శివనారాయణ శర్మతో కలిసి ఆయన వీసీ ద్వారా జిల్లా, డివిజన్, మండల అధికారులతో మాట్లాడారు. ఆర్డీఓ, తహసీల్దార్లు ప్రత్యేక దృష్టి సారిస్తే సమస్యలన్నీ పరిష్కారం అవుతాయని కలెక్టర్ అన్నారు. తహసీల్దారు కార్యాలయాల్లో ప్రత్యేక పీజీఆర్ఎస్ డెస్కులు ఏర్పాటు చేయాలి. ఒక కంప్యూటర్ ఆపరేటర్‌ను నియమించాలి. ప్రత్యేక రిజిస్టర్ ఉండాలి. అర్జీదారులతో మర్యాదగా మాట్లాడాలి. వారికి ఓపిగ్గా సమాధానం చెప్పాలన్నారు. ఇక నుంచి అర్జీలు రీ ఓపెన్ అయితే మాత్రం ఏ శాఖ అయినా సరే చర్యలు తప్పవన్నారు. ఉపాధి హామీ పథకంలో కేవలం 16,992 మంది కూలీలు పని చేస్తున్నారు. కనీసం 80 వేల మంది రోజూ పని చేసేలా విస్తృత అవగాహన పెంచాలని కలెక్టర్ చెప్పారు. ఎమ్పీడీఓలు తగిన శ్రద్ధ పెట్టకపోతే చర్యలు ఉంటాయన్నారు.

గల్లంతయిన వ్యక్తి మృతి

ఆత్మకూరు, న్యూస్‌టుడే: స్నానం చేసేందుకు కాలువలోకి దిగి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని పంపనూరు గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. పంపనూరు గ్రామానికి చెందిన ఎగ్గిడి మల్లన్న ఆదివారం సాయంత్రం కాలువలోకి దిగి గల్లంతయ్యాడు. మల్లన కాలువ సమీపంలో తిరుగుతున్న విషయాన్ని గ్రామస్థులు గుర్తించారు. రాత్రికి ఇంటికి చేరుకోకపోవడంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కాలువలో గాలింపు చర్యలు చేపట్టారు. సోమవారం మధ్యాహ్నం పంపనూరు తండా సమీపంలో మృతదేహాన్ని వెలికితీశారు. మతిస్థిమితం సరిగా లేకనే మల్లన్న కాలువలోకి స్నానానికి దిగి ఉంటాడని పోలీసులు నిర్ధారణకు వచ్చారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ లక్ష్మణరావు తెలిపారు.

గ్రామాభివృద్ధిలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

రాప్తాడు, న్యూస్‌టుడే: అనంతపురం రూరల్ కందుకూరు గ్రామంలో ఏడు రోజులపాటు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు నిర్వహించిన ప్రత్యేక శిబిరం సోమవారం విజయవంతంగా ముగిసినట్లు జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు సాయిప్రసాద్ తెలిపారు. ఈ శిబిరంలో వాలంటీర్లు చురుకుగా పాల్గొని గ్రామాభివృద్ధికి, సామాజిక అవగాహనకు కృషి చేశారు. గ్రామంలో ఆరోగ్య, పోషకాహర అవగాహన, ఓటరు, డిజిటల్, సైబర్ భద్రత వంటి అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

ఫ్లెక్సీ మీద పడి ఇద్దరికి గాయాలు

ఫ్లెక్సీ ఇనుప ఫ్రేమ్ కింద పడిన వృద్ధుడు

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: అనంతపురం నగరంలోని 44వ జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ ఫ్రేమ్ మీద పడి ఇద్దరు వృద్ధులు తీవ్రంగా గాయపడ్డారు. బుక్కరాయసముద్రం మండలం కొట్టాలపల్లికి చెందిన సంజీవరెడ్డి, శ్రీనివాసరెడ్డిలు వ్యక్తిగత పనిమీద నగరంలోకి ద్విచక్ర వాహనంలో వచ్చారు. పని ముగించుకుని ఇంటికి హైవే మీదుగా వెళ్తుండగా, స్థానిక ఎంజీ పెట్రోలు బంకు సమీపంలో రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ ఫ్రేమ్ హఠాత్తుగా మీద పడింది. ఈ ఘటనలో ఇనుప చువ్వలు తల, శరీర భాగాల్లో గుచ్చుకోవడం వల్ల తీవ్ర రక్తగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు ప్రమాదానికి కారణమైన ఫ్రేమ్‌ను తొలగించి క్షతగాత్రులను ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తరలించారు. బాధితులు ఏ స్టేషన్‌లోనూ ఫిర్యాదు చేయలేదు. ఎక్కడపడితే అక్కడ ఇష్టారాజ్యంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం, వాటి నిర్వహణను పట్టించుకోక పోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని నగర వాసులు ఆరోపిస్తున్నారు.

దివ్యాంగులకు టింబక్టు సేవలు విస్తృతం

చెన్నేకొత్తపల్లి: దివ్యాంగులకు టింబక్టు సేవలను మరింత విస్తృతం చేస్తామని టింబక్టు కలెక్టివ్ సంస్థ వ్యవస్థాపకులు మేరీ వటమట్టమ్, బబ్లూ గంగూలీ పేర్కొన్నారు. చెన్నేకొత్తపల్లి సమీపంలోని సీవైఆర్సీలో సోమవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. బస్టాండ్ కూడలి నుంచి సభాస్థలి వరకు దివ్యాంగుల హక్కులపై చైతన్య ప్రదర్శన నిర్వహించారు. మేరీ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాలలో దివ్యాంగుల అభ్యున్నతికి టింబక్టు రెండున్నర దశాబ్దాలుగా కృషి చేస్తోందన్నారు.

నిమిషాల్లో కమ్మేసింది

సోమవారం.. తెల్లవారుజాము.. 6 గంటల వరకు ఎక్కడా మంచు లేదు. కానీ 7 గంటల 30 నిమిషాలకు ఒక్కసారిగా నగరాన్ని మంచు కమ్మేసింది. బెంగళూరు-హైదరాబాద్ జాతీయ రహదారిపై ఉదయం 9 గంటలు వరకు ఎదుటి వ్యక్తి కనబడనంత విధంగా మంచు కురిసింది. దీంతో వాహనదారులంతా నెమ్మదిగా లైట్లు వేసుకుని వెళ్లారు. విద్యార్థులు అతి కష్టం మీద స్కూళ్లకు వెళ్లాల్సి వచ్చింది.

- ఈనాడు అనంతపురం

అంబులెన్సు డ్రైవర్లపై బెదిరింపులు ఆపాలి

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: అంబులెన్సు డ్రైవర్లను పోలీసులు బెదిరిస్తే ఊరుకునేది లేదని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి పేర్కొన్నారు. టూటౌన్ పోలీసుల తీరును నిరసిస్తూ సోమవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం నుంచి ఎస్పీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ.. సర్వజన ఆసుపత్రి వద్ద అంబులెన్సు డ్రైవర్ల సమస్యలు పరిష్కరిస్తామని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కేసులు పెడతామని బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. కేసులు పెడితే దశల వారీగా ఆందోళన కార్యక్రమాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. సీఐపై చర్యలు తీసుకోవాలని కోరారు.

తారు రోడ్డు నిర్మాణంపై హర్షం

అనంత నగరపాలక,న్యూస్‌టుడే: నగరంలో ఒక్కొక్క సమస్య తీరుతుంటే ప్రజలు ఉపశమనం పొందుతున్నారు. ‘నిధులున్నా.. దుర్గతి ఏందన్నా!’ శీర్షికన ఈనాడులో ప్రచురితమైన కథనానికి కమిషనరు స్పందించారు. పనులను వేగంగా పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశించారు. నగరంలోని మూడో రోడ్డులో రూ. 13 లక్షలతో ఎన్‌క్యాప్ ద్వారా తారు రోడ్డు నిర్మాణం చేయాల్సి ఉండగా కంకర వేసి వదిలేశారు. ఈ విషయంపై కంకర రాళ్లు ఇళ్లలోకి అంటూ ఉపశీర్షికన కథనం ప్రచురితం అయింది. తారు రోడ్డు నిర్మాణం పూర్తి చేయడంతో ఈ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

మరువ కష్టాలు మరిచిపోయేలా!

నాడు

నేడు

ప్రజలకు ఉపయోగపడే పనులు నిర్వహించడంలో చిత్తశుద్ధి చూపినపుడే అంతిమంగా ఉపయుక్తంగా మారుతాయి. ఇది గత వైకాపా పాలనలో లోపించింది. అందుకు ఉదాహరణ అనంతనగరం శివారు రూరల్ మండలం ఎ నారాయణపురం గ్రామంలో వంకపై నిర్మించిన వంతెన. వర్షాలు బాగా కురిసినప్పుడు ఈ వంకలో నీళ్లు ఉద్ధృతంగా ప్రవహించి రోడ్డుపైన మరువ పారేది. ఆ నీటిలోనే గ్రామస్థులు తమ ద్విచక్రవాహనాలుతో ప్రయాణించలేక తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఉద్ధృతంగా ప్రవహించినప్పుడు వంక ఆవల ఉన్న నరసనాయిని కుంట, ఇందిరమ్మ గృహాలు, కోటంక గ్రామాలకు ఈ రహదారిపై నుంచే వెళ్లాలి. 2022వ సంవత్సరంలో ఈ వంకలో సంవత్సరం పాటు మరువ పారింది. రోడ్డు మొత్తం పాచి, నాచు పట్టి పాదచారులు, ద్విచక్ర వాహనదారులు జారి పడి గాయాలపాలయ్యారు. ఊర్లకు వెళ్లే వీలుండేది కాదు. 2024 ఎన్నికలకు రెండు నెలలు ముందు వైకాపా ప్రభుత్వం హడావుడిగా శంకుస్థాపన చేసి ఇసుక, కంకర తెప్పించి ఉంచారు. పనులేం చేయలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం మళ్లీ శంకుస్థాపన చేసి రూ. 5 కోట్లతో పనులు వేగంగా పూర్తి చేయించారు. ప్రస్తుతం వంతెన నిర్మాణం మొత్తం పూర్తయి.. గ్రామస్థులు ఇప్పుడు హాయిగా రాకపోకలు సాగిస్తున్నారు. **- ఈనాడు అనంతపురం, న్యూస్‌టుడే తపోవనం**

‘కేంద్రం ఆలోచనల్ని తిప్పికొడతాం’

బుక్కరాయసముద్రం: విద్యుత్తు సంస్థలను ప్రైవేటు పరం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను వెంటనే నిలిపివేయాలని కోరుతూ సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు బుక్కరాయసముద్రంలో బిల్లు ముసాయిదా ప్రతులు దహనం చేశారు. విద్యుత్తు బిల్లులు పెరుగుతాయన్నారు.

పరామర్శ

రాంనగర్: ఎంపీ సీఎం రమేశ్ మాతృమూర్తి ఇటీవల మరణించారు. ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి, తెదేపా నాయకులు జేసీ పవన్‌రెడ్డి సోమవారం యర్రగుంట్ల మండలం పొట్లదుర్తిలో సీఎం రమేశ్ ఇంటికి వెళ్లి నివాళులర్పించారు.

కుస్తీ వీరుడికి యాదవ సంఘం సత్కారం

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: చిత్తూరు జిల్లాలో జరిగిన సీనియర్ కుస్తీ పోటీల్లో అద్వితీయ ప్రతిభను ప్రదర్శించిన బాల శ్రీహర్షయాదవ్‌ను ఘనంగా సత్కరించారు. జిల్లా యాదవ సంఘం ఆధ్వర్యంలో సోమవారం సత్కరించి నగదును అందజేశారు. ఈనెల 2, 3 తేదీల్లో జరిగిన ఈ పోటీల్లో శ్రీహర్ష బంగారు పతకం సాధించాడు. ప్రత్యర్థులను చిత్తు చేసి రాష్ట్ర ఛాంపియన్‌గా నిలిచాడు. నార్పల మండలానికి చెందిన ఈ యువకుడు కుస్తీలో అనేక పతకాలు సాధించాడు. ఈనెల 11 నుంచి 13 వరకు గుజరాత్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహిస్తాడు. యాదవ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌యాదవ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరసింహులు, కార్యదర్శి నారాయణస్వామి, కార్పొరేటర్ బాలాంజనేయులు, జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, కార్యనిర్వాహక అధ్యక్షుడు ప్రభాకర్‌యాదవ్, యువజన సంఘం అధ్యక్షుడు జయపాల్, విజయ్, సాయితేజ హాజరై ఛాంపియన్‌ను సత్కరించి నగదు అందజేశారు.

రెజ్లర్‌ను సత్కరిస్తున్న జాతీయ యాదవ సంఘం కార్యదర్శి రాజశేఖర్ తదితరులు

(c) eenadu

ఈనాడు అన్నమయ్య

మంగళవారం డిసెంబరు 9, 2025

దేశంలోనే సుందరం.. ఆరోగ్యమాత మందిరం

దేశంలో నిర్మించిన కథోలిక చర్చిల్లో అతి సుందరమైన చర్చిగా కడప నగరంలోని ఆరోగ్యమాత చర్చి పేరొందింది. రెండంతస్తుల్లో నిర్మించిన ఈ చర్చిలో ఒకే సారి 1200 మంది విశ్వాసులు ప్రార్థనలు చేసుకునే వీలుంది. దక్షిణ భారతంలోని చర్చిల నిర్మాణంలో సిద్ధహస్తుడైన కడప నగరవాసి ప్రముఖ ఇంజినీరు వెంకటేశ్వర్లు ఈ చర్చి నిర్మాణానికి డిజైన్లు రూపొందించారు. 1978 నుంచి ఈ చర్చి ఆరోగ్యమాత పుణ్యక్షేత్రంగా ప్రచారంలోకి వచ్చింది. ఇక్కడి మేరీ మాతను దయగల మాత, పిల్లల మేరీ మాత అని కూడా పిలుస్తారని విశ్వాసులు చెబుతున్నారు. - న్యూస్‌టుడే, నాగరాజుపేట

ఆలస్యంగా నడిచిన రైళ్లు

ములకలచెరువు, న్యూస్‌టుడే: ములకలచెరువు మీదుగా నడిచే రైళ్లు సోమవారం ఆలస్యంగా నడిచాయి. దీంతో సరైన సమయానికి గమ్యస్థానాలకు చేరుకోవాల్సిన ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మహారాష్ట్ర నుంచి కాచిగూడ మీదుగా తిరుపతికి వెళ్లే సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు సుమారు నాలుగున్నర గంటలు ఆలస్యంగా నడిచింది. మదనపల్లె రైల్వేస్టేషన్‌కు తెల్లవారుజామున 3.19 గంటలకు రావాల్సి ఉండగా 7.55 గంటలకు, తిరుపతి నుంచి కదిరిదేవరపల్లికి వెళ్లే ప్యాసింజర్ రైలు 2.24కి రావాల్సి ఉండగా 5.02 గంటలకు వచ్చింది. తిరుపతి నుంచి గుంతకల్లుకు నడిచే ప్యాసింజర్ రైలు ఉదయం 9.34 గంటలకు రావాల్సి ఉండగా 11.40కు, నరసాపూర్ నుంచి ధర్మవరానికి వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలు ఉదయం 6.49కి రావాల్సి ఉండగా 9.01 గంటలకు ములకలచెరువుకు వచ్చింది.

తరుముకొస్తున్న వెనుక జలాలు

సోమశిల జలాశయానికి వరద పెరుగుతుండడంతో వెనుక జలాలు తరుముకొస్తున్నాయి. పెనగలూరు మండలంలోని సిరివరం, ఎన్ఆర్ పురం గ్రామాల చుట్టూ చేరాయి. వారం రోజులుగా తుపాన్ ప్రభావంతో చెయ్యేరు, పుల్లంగేరు, గుంజనేరు ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి. ఈ వరద నీరంతా పెన్నానదిలో కలిసి సోమశిల వైపు పయనిస్తోంది. జలాశయ నీటి మట్టం పెరుగుతుండడంతో వెనుక జలాలు రెండు గ్రామాల పరిధిలోని వ్యవసాయ భూములను ముంచెత్తుతోంది. ముంపు ప్రాంతాలను గుర్తించినప్పటికీ రైతులకు నష్ట పరిహారం ఇవ్వలేదని వాపోతున్నారు. నెలల తరబడి భూముల్లో నీటి నిల్వలుంటే వ్యవసాయం చేసేదెలాగని ఆవేదన వ్యక్తం చేశారు. - న్యూస్‌టుడే, రాజంపేట గ్రామీణ

గొట్టాలు కాలువల్లో.. కాలకూటం నోళ్లలో!

ఎస్‌ఎన్ కాలనీలోని నీటి ట్యాంకు వద్ద సూచికపై నమోదు కాని నిల్వ, శుభ్రత వివరాలు

పురాల్లో ఇంటింటికీ కుళాయిలు.. ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసే తాగునీటిని పరిశీలిస్తే ఒళ్లు జలదరించక మానదు.. పట్టణాల్లో గొట్టపు మార్గాలన్నీ దశాబ్దాల క్రితం వేసినవి కాగా, వాటిలో ఎక్కువ భాగం మురుగు కాలువల్లోనే ఉన్నాయి. ఇనుప పైపులు తుప్పుపట్టి రంధ్రాలు పడడంతో పాటు పలుచోట్ల లీకేజీలతో మురుగుతో తాగునీరు దోస్తీ చేస్తోంది. వానాకాలంలో ఏళ్లో నీటిని నేరుగా నోట్లో పోసుకోవాల్సిన పరిస్థితి వస్తోంది. పలుచోట్ల తాగునీరు మురుగు వాసన వస్తుండడంతో స్థానికులు బెంబేలెత్తుతున్నారు. జిల్లాలోని ప్రధాన పట్టణాల్లో పరిస్థితిపై ఈనాడు-ఈటీవీ పరిశీలన కథనం.

- న్యూస్‌టుడే, రాయచోటి, మదనపల్లె పట్టణం, రాజంపేట

● రాయచోటిలోని 34 వార్డుల్లో తాగునీరు మూడు రోజులకు ఒకసారి చిన్నధారగా వస్తోంది. దశాబ్దాలుగా పలు కాలనీలకు ట్యాంకర్లతోనే నీటిని సరఫరా చేస్తున్నారు. సమగ్ర నీటి పథకానికి 2005-08లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం వెలిగల్లు నీటి పథకాన్ని తీసుకొచ్చింది. ● పురవాసులకు 5 ఓవర్ హెడ్ ట్యాంకుల ద్వారా నీరు సరఫరా చేస్తున్నప్పటికీ నిర్ణీత గడువుకు ట్యాంకులు శుభ్రపరచక పోవడంతో తాగునీటి శుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించడం లేదని తెలుస్తోంది.

రాజంపేట: ఈడిగపాలెంలో మురుగు నీటిలో తాగునీటి పైపులైను

● మదనపల్లె పురపాలికలో 35 వార్డులు ఉన్నాయి. పట్టణంలోని అనపగుట్ట, మంజునాథ కాలనీ, నీరుగట్టువారిపల్లి, రాజానగర్, అమ్మచెరువుమిట్ట ప్రాంతాల్లో తాగునీటి పైపులైన్లు తరచూ లీకవుతున్నాయి. మరికొన్ని చోట్ల మురుగు కాలువలకు అనుబంధంగానే పైపులైన్లు ఉండటంతో మురుగు నీరు పైపులైన్ల ద్వారా కలుషితం అయ్యే ప్రమాదం పొంచి ఉంటోంది. ● పట్టణంలోని 12 తాగునీటి ట్యాంకుల ద్వారా రోజూ 130 ఎంఎల్‌డీ నీరు సరఫరా అవుతున్నా ట్యాంకుల శుభ్రతపై అధికారులు దృష్టి సారించడం లేదు.

● రాయచోటిలో జనాభా విస్తరించడంతో 2018-19 మధ్య తెదేపా ప్రభుత్వ హయాంలో రెండో నీటి పథకానికి అడుగులు పడ్డాయి. 2019లో వచ్చిన వైకాపా ప్రభుత్వం ఈ నిర్మాణాన్ని అయిదేళ్ల పాటు పూర్తి చేయలేకపోయింది.

● పట్టణ పరిధిలో 150 కిలోమీటర్ల మేర పైపులైన్లు వేశారు. 20 ఏళ్లుగా మార్పు లేకపోవడంతో చాలాచోట్ల తుప్పు పట్టి లీకేజీలు ఎక్కువగా ఉంటున్నాయి. కొన్ని చోట్ల పైపులు మురుగు కాలువల్లో ఉన్నాయి. లీకుల కారణంగా పైపుల్లో నీరు తరచూ కలుషితమవుతోంది.

● కొత్తపల్లి, కొత్తపేట, బోస్ నగర్, కె.రామాపురం, పాతరాయచోటి ప్రాంతాల్లోని వార్డుల్లోని నీటి కుళాయిలు మురుగు కాలువల్లో ఉండడంతో కాలువల్లో మురుగు పొంగినపుడు పైపుల్లోకి చేరుతోంది. నీటి ట్యాంకులు నిర్వహణ లేక శిథిలావస్థకు చేరాయి.

● రాజంపేటలో 29 వార్డులు ఉన్నాయి. పురపాలక పైపులైన్ల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ఈడిగపాలెం, కొలిమివీధి ప్రాంతాల్లో ఎక్కువగా పైపులైన్లు మురుగు కాలువల్లో ఉన్నాయి. ఇక్కడ తరచూ లీకేజీలతో తాగునీరు కలుషితం అవుతోంది.

● పట్టణ పరిధిలో సుమారు 55 కిలో మీటర్ల మేర తాగునీటి పైపులైన్లు ఉన్నాయి. నీటి నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో తరచూ లీకేజీలు ఏర్పడుతున్నాయి. మురుగు నీరు తాగునీటిలో చేరి కలుషితమవుతోందని పురవాసులు ఆవేదన చెందుతున్నారు.

పురపాలిక	రాయచోటి	మదనపల్లె	రాజంపేట
జనాభా	1.40 లక్షలు	1.90 లక్షలు	0.80 వేలు
ట్యాంకులు	08	12	05
పైపులైన్లు	148 కి.మీ	265 కి.మీ	76 కి.మీ
కుళాయిలు	18,120	24,183	8,497
రోజు నీటి సరఫరా	9 ఎంఎల్‌డీ	14 ఎంఎల్‌డీ	130 ఎల్‌పీసీడీ

సిబిల్.. యువకుల గుండె గుభేల్

ఆర్థిక క్రమశిక్షణపై ఆరా తీస్తున్న తల్లిదండ్రులు

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే: ఆ అబ్బాయి కేంటండీ రెండు ఇళ్లు.. ఒక కారు.. సాఫ్ట్‌వేర్ కొలువుంది. అమ్మాయిని బాగా చూసుకుంటాడు.. అని చెబితే యువతి తల్లిదండ్రులు గతంలో సంబంధం కుదుర్చుకునే వారు. ఇప్పుడా పరిస్థితి మారింది. కొందరు సదరు యువకుల గురించి ఆరా తీస్తున్నారు. ఆర్థిక క్రమశిక్షణ ఏపాటిదో తెలుసుకుంటున్నారు. అందుకు సిబిల్ స్కోర్‌ను పరిశీలిస్తున్నారు. స్కోరు ఏమాత్రం బాగాలేకున్నా.. చెక్‌బౌన్స్ వంటి కేసులున్నా.. క్రెడిట్ కార్డు ఓవర్ డ్యూస్, సెటిల్‌మెంట్స్ ఉన్నా.. మాకొద్దు మీ సంబంధమని చెప్పేస్తున్నారు. తమ కుమార్తెను ఇచ్చి పెళ్లి చేసేందుకు కొందరు తల్లిదండ్రులు యువకుల వ్యక్తిత్వం, సంపాదన, కుటుంబ నేపథ్యంతో పాటు ఆర్థిక క్రమశిక్షణ కలిగి ఉన్నాడా.. లేక ఇష్టానుసారంగా ఖర్చు చేసి అప్పుల ఊబిలో కూరుకుపోయాడో తెలుసుకునేందుకు సిబిల్ స్కోర్‌ను ఒక ఆయుధంగా ఎంచుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఆర్థిక క్రమశిక్షణగా ఉండకపోతే మొదటికే మోసం తప్పదు.

● **అవివాహితులూ జాగ్రత్త!:** సిబిల్ స్కోర్‌తో ఆ వ్యక్తి ఆర్థిక స్థితిగతులను తెలుసుకునేందుకు అవకాశం ఉంటుంది. అతను ఏ ఏ బ్యాంకుల్లో ఎంతెంత మొత్తం రుణాల రూపంలో తీసుకున్నారు. అవి ఏ రకం. వాయిదాలు సమయానికి చెల్లిస్తున్నారా లేదా.. ఓవర్‌డ్యూస్ ఏమైనా ఉన్నాయా తెలుసుకోవచ్చు. ఫైనాన్స్ కంపెనీల నుంచి రుణాలను తీసుకున్నా తెలుస్తుంది. 750 పాయింట్ల కంటే ఎక్కువగా ఉంటే సిబిల్ స్కోరు బాగున్నట్లు... అంతకన్నా తక్కువగా ఉంటే మాత్రం ఆర్థిక క్రమశిక్షణ అంతగా లేనట్లే! ఒక్కోసారి బ్యాంకుల వద్ద ఉన్న రుణాలను వన్‌టైమ్ సెటిల్‌మెంట్ చేసుకోవడం ద్వారా కూడా స్కోర్ దారుణంగా పడిపోతుంది. ఈ నేపథ్యంలో పెండ్లికాని ప్రసాద్‌లు సిబిల్ స్కోర్‌పై జాగ్రత్త వహిస్తూ.. ఆర్థిక క్రమశిక్షణ పాటించకుంటే అంతే సంగతులు.

హా.. హూ.. పతకాల్లో యాహూ!

అంతర్జాతీయ పోటీల్లో సత్తా

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : ఆత్మరక్షణ విద్య అందరికీ అవసరం. తమను తాము కాపాడుకోవడంతో పాటు ఇతరులను రక్షించే ధైర్యాన్ని పొందవచ్చు. బాల్యం నుంచే ఆత్మరక్షణ విద్యలో సాధన చేస్తున్న సోదరులు అంతర్జాతీయ స్థాయి పోటీల్లోనూ సత్తా చాటుతున్నారు. మదనపల్లెకు చెందిన చారుకేష్ రాయల్, ప్రజ్వల్ రాయల్‌ల ఉదంతం ఇది. జిల్లా స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి వరకు పోటీల్లో రాణిస్తూ ప్రశంసలు అందుకుంటున్నారు. ఆర్చరీ జాతీయ స్థాయి పోటీల్లోనూ సత్తా చాటుతున్నారు. రామసముద్రం ఎస్ఐ దిలీప్‌కుమార్, ప్లహరీల కుమారులైన వీరిద్దరూ బ్లాక్‌బెల్ట్ సాధించారు. విభిన్న అంశాల్లో ప్రతిభను చాటుతున్నారు.

ఒత్తిడి నుంచి ఉపశమనం

క్రీడల్లో సాధన ద్వారా ఒత్తిడి నుంచి ఉపశమనం లభిస్తుంది. పోటీల్లో పాల్గొనడానికి వివిధ ప్రాంతాలకు వెళ్లడం ద్వారా కొత్త విషయాలు తెలుసుకోగలిగాను. మలేషియా, శ్రీలంకలో జరిగిన అంతర్జాతీయ స్థాయి, చెన్నై, బెంగళూరు, ఊటీ, తమిళనాడుల్లో జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో పతకాలు సాధించారు. ఆర్చరీ రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాను. - ప్రజ్వల్ రాయల్

క్రమశిక్షణ.. ఆత్మరక్షణ

ఆత్మరక్షణతో పాటు క్రమశిక్షణకు కరాటే సాధన ఎంతో తోడ్పడుతుంది. మాస్టర్ మణిసాయి వద్ద కరాటే, ఆర్చరీల్లో శిక్షణ పొందుతున్నా. మేలో మలేషియా, గత నెల 17 నుంచి 18 వరకు శ్రీలంకలో జరిగిన అంతర్జాతీయ స్థాయి కరాటే పోటీల్లో బంగారు పతకాలు సాధించాను. తమిళనాడు, దిల్లీ, ఊటీ, బెంగళూరుల్లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లోనూ పతకాలు సాధించాను. రాష్ట్రస్థాయి ఆర్చరీలో ప్రథమ స్థానంలో నిలిచా. - చారుకేశ్‌రాయల్

ఇంటికే తీగలు.. చెంతకే సేవలు

ముకోసం

కలకడ, రాయచోటి, న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యుత్‌శాఖలో కొత్త సంస్కరణలు తీసుకొచ్చింది. దీంతో విద్యుత్ సర్వీసులు సులభంగా పొందవచ్చు. విద్యుత్ లైన్‌కు కొత్త కనెక్షన్ తీసుకొనే ఇంటికి 30 మీటర్లు దూరం దాటితే స్తంభాల ఖర్చు ఇప్పటి వరకు వినియోగదారే భరించాల్సి వచ్చేది. దరఖాస్తు చేశాక.. క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం అధికారులు రుసుం నిర్ణయించేవారు. వీటికి అదనంగా సర్వీస్ లైన్, డెవలప్‌మెంట్ ఛార్జీలు అధికారికంగా, సిబ్బందీ అనధికారికంగా వసూలు చేసేవారు.

● **ఇక నుంచి:** వినియోదారులకు సత్వర సేవలందించాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలతో ఏపీ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ (ఏపీఈఆర్‌సీ) కొత్త విద్యుత్ కనెక్షన్ల జారీలో సంస్కరణలు తీసుకొచ్చింది. కొత్త కనెక్షన్, అదనపు లోడ్‌కు కేటగిరీ ఆధారంగా స్థిర ఛార్జీలు నిర్ణయించింది. అదనపు ఛార్జీలు ఎత్తేసింది. సత్వరం కనెక్షన్ అందిస్తామని ఏపీఈపీడీసీఎల్ పీలేరు డివిజన్ డీఈ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

కరెంటు కష్టాలకు చెక్

విద్యుత్తు తీగలు లాగుతున్న ఉద్యోగి

కొత్త ఛార్జీలు ఇలా...

● **గృహ అవసరాల కనెక్షన్లు (ఎల్‌టీ) :** కిలో వాట్‌కు రూ. 1,500, 1 నుంచి 20 కిలోవాట్ల వరకు అదనంగా ప్రతి కిలో వాట్‌కు రూ.2 వేలు చొప్పున చెల్లించాలి. 20 నుంచి 150 వరకు కిలో వాట్‌కు రూ.12,600 చొప్పున చెల్లించాలి.

● **వాణిజ్య కనెక్షన్లు :** కిలో వాట్‌కు రూ.1,800, ఇక 20 కిలోవాట్ల వరకు రూ.1,800తో పాటు అదనంగా ప్రతి కిలో వాట్‌కు రూ.2 వేలు చొప్పున చెల్లించాలి. 20 నుంచి 150 వరకు ప్రతి కిలోవాట్‌కు రూ.12,600 చొప్పున చెల్లించాలి. ● **హెచ్‌టీ కనెక్షన్లు :** 75 నుంచి 150 వరకు ప్రతి కిలోవాట్‌కు రూ.4,400 చొప్పున చెల్లించాలి. నియంత్రికను వినియోగదారే ఏర్పాటు చేసుకోవాలి.

పీలేరులో షూటింగ్ సందడి

పీలేరు, న్యూస్‌టుడే: పీవీఆర్ సినీక్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న 'నాన్న డైరీ' చిత్రం పీలేరు పరిసరాల్లో చిత్రీకరిస్తున్నారు. నిర్మాత కోటి పాలకుంట. మధ్య తరగతి కుటుంబ జీవితాన్ని ఇతివృత్తంగా తీసుకుని, తండ్రీ కొడుకుల మధ్య సాగే ఎమోషనల్ డ్రామా, సెంటిమెంట్లతో ఈ చిత్రం నిర్మిస్తున్నట్లు చెప్పారు. గత నెల 17 నుంచి పీలేరు, సదుం మండలాల పరిసరాల్లో చిత్రీకరణ చేస్తున్నామని తెలిపారు. ఈ చిత్రానికి ఆనంద్ తంగేళ్ల కథ మాటలు సమకూర్చగా స్క్రీన్‌ప్లే, దర్శకత్వ బాధ్యతలను సురేష్ గండికోట, సహ దర్శకుడిగా సుహేల్, అసోసియేట్‌గా బన్నీ, కెమెరా, ఎడిటింగ్ ఏఆర్ రాఖీ అందిస్తున్నారన్నారు. 'ఆల్ ది బెస్ట్' ఖాదర్, చాను, ఇతర పాత్రల్లో బాబ్జాన్, అమ్ములు, తరిగొండ రాధాకృష్ణ నటిస్తున్నారు.

నాన్న డైరీ చిత్రంలో ఒక సన్నివేశం

మీలో ఉందా ఆ దమ్ము!

నేడు అంతర్జాతీయ అవినీతి నిరోధక దినం

ప్రభుత్వ సేవలను ప్రజలకు ఉచితంగా అందించడం అధికారుల బాధ్యత.. ఉద్యోగిగా జీతం పొందుతూ ఉచితంగా అందించే సేవలకు చేయి చాచే లంచగొండుల భరతం పట్టకపోతే సమాజం అవినీతిమయంగా మారుతుంది. పాత తరం ఇలాంటి చేష్టలను ఎదురించి ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు ఇచ్చే వారు. నేటితరంలో చాలా మంది ఫిర్యాదుకు జంకుతున్నారు. లంచాలు ఆశించే అధికారుల పనిపట్టడానికి అవినీతి నిరోధక శాఖ ప్రత్యేకంగా పనిచేస్తోంది. మీలో ఆ దమ్ముంటే ఫిర్యాదుకు ముందుకు రండి. నేడు అంతర్జాతీయ అవినీతి నిరోధక దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

ఇటీవల పలు ఘటనలివి : ● మదనపల్లె మండలంలోని కోళ్లబైలుకు చెందిన సచివాలయ ఉద్యోగి కుమార్ ఓ చేనేత కార్మికుడి వద్ద నుంచి నేతన్న నేస్తం కోసం రూ.5 వేలు లంచం తీసుకుంటూ అనిశా అధికారులకు దొరికాడు. దీంతో ఉద్యోగిని అరెస్టు చేసి రిమాండుకు తరలించారు.

● రామసముద్రం మండలంలోని పోలీస్ స్టేషన్‌లో ఓ కేసులో పట్టుకున్న లారీని వదిలేందుకు రూ.లక్ష లంచం ఇవ్వాలని సీఐ, ఎస్ఐలు కోరడంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. రూ.50 వేలు నగదు ఇస్తుండగా అనిశా అధికారులు ట్రాప్ చేసి పట్టుకున్నారు.

అవినీతి నిరోధక శాఖ కార్యాలయం

● మదనపల్లెలో ఆర్డీవోగా పని చేసిన మురళీపై ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నాయని ఏసీబీ అధికారులు ఆయన నివాసంతో పాటు కుటుంబ సభ్యుల నివాసాలు, అనుకూలురైన రెవెన్యూ అధికారుల ఇళ్లలో సోదాలు నిర్వహించారు. ఆర్డీవో మురళిని తిరుపతిలో అరెస్టు చేశారు.

● ఇలా ఒకటి కాదు.. రెండు కాదు.. జిల్లాలో తరచూ అవినీతికి పాల్పడే అధికారుల సంఖ్య పెరుగుతోంది. ఓ వైపు అనిశా అధికారులు దాడులు, అరెస్టులు చేస్తున్నా కొందరు లంచగొండులు చేతివాటం ప్రదర్శిస్తూ డబ్బు ఇస్తేనే పనిచేసి పెడతామని అంటున్నారు.

అవినీతిపరుల గుండెల్లో త్రిశూలం

1 అనిశా.. మూడు విధాలుగా అవినీతి అధికారుల కట్టడికి త్రిశూల వ్యూహంతో పనిచేస్తోంది. నగదు లావాదేవీలుండే కార్యాలయాల్లో అక్రమాలకు పాల్పడుతుంటే ఆకస్మిక తనిఖీల ద్వారా కట్టడి చేస్తారు. ఉదాహరణకు రవాణా, రిజిస్ట్రేషన్, ఖజానా వంటి కార్యాలయాల్లో ఇలాంటి తనిఖీల ద్వారా దళారులను పట్టుకుని సిబ్బందిపై కేసులు నమోదు చేస్తున్నారు.

2 ప్రభుత్వం ద్వారా ఉచితంగా అందించే సేవలకు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే వారిని వలపన్ని పట్టుకుంటారు.. దీనికోసం బాధితులకు అవసరమైన సహకారం అందిస్తారు. లంచగొండి అధికారులపై సమాచారం అందిస్తే చాలు.

3 ఆదాయానికి మించి ఆస్తులు కూడగడుతున్న ప్రభుత్వ అధికారులపై సమాచారం అందించినా దాడులు చేసి విచారణ కేసులు నమోదు చేసి అక్రమ ఆస్తులను జప్తు చేస్తారు. - న్యూస్‌టుడే, మదనపల్లె నేరవార్తలు

వీరికి ఫిర్యాదు చేయండి: జిల్లా పరిధిలో తిరుపతి, కడప ప్రాంతాల నుంచి అనిశా అధికారులు తనిఖీలు నిర్వహిస్తారు. తిరుపతి అనిశా డీఎస్పీ : 9440446190, కడప డీఎస్పీ : 9440446191, టోల్‌ఫ్రీ నంబర్లు : 14400, లేదా 1064లకు ఫిర్యాదు చేయవచ్చు.

10 నుంచి ఉపాధ్యాయ అర్హత పరీక్ష

రాయచోటి, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నిర్వహించడానికి జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ కె.సుబ్రహ్మణ్యం ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10వ తేదీ నుంచి 21వ తేదీ వరకు ఈ పరీక్షలు ఉంటాయన్నారు. పరీక్ష మొదటి సెషన్ ఉదయం 9.30 గంటల నుంచి 12 గంటల వరకు, రెండో సెషన్ మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. అభ్యర్థులు గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని ఆయన తెలిపారు. మదనపల్లెలోని ఆదిత్యా ఇంజినీరింగ్ కళాశాల, మదనపల్లె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (మిట్స్) కళాశాల, రాయచోటిలోని శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాల, భాస్కర్ ఇంజినీరింగ్ కళాశాలల్లో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లావ్యాప్తంగా 4,923 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని ఆయన తెలిపారు. ఏవైనా సందేహాలుంటే అభ్యర్థులు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ సెల్ విభాగంలో (హెల్ప్ డెస్క్) ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు చరవాణి నంబర్లు 8341177406, 8555931971, 9492277147లకు చేసి సమాచారం తెలుసుకోవచ్చని ఆయన తెలియజేశారు.

55 వసతి గృహాలకు స్వచ్ఛ సేవకులు

చిన్నమండెం, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో పారిశుద్ధ్య సమస్యకు కూటమి ప్రభుత్వం చెక్ పెట్టింది. తాజాగా అన్ని వసతి గృహాల్లో పారిశుద్ధ్యం నిర్వహణకు పొరుగు సేవల నుంచి సిబ్బందిని నియమించేందుకు అనుమతిస్తూ జీవో ఇచ్చింది. ● జిల్లాలో 55 సాంఘీక సంక్షేమ వసతి గృహాలున్నాయి. వీటిలో 4,500 మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రతి వసతి గృహానికి ఒక్కరు చొప్పున పారిశుద్ధ్య నిర్వహణకు సిబ్బందిని నియమించనున్నారు. ఈ లెక్కన జిల్లాలోని 55 వసతి గృహాలకు 55 మంది సిబ్బందిని కొత్తగా నియమించనున్నారు. ● జిల్లాలోని పుల్లంపేట, చిట్వేల్‌లోని ఇంటిగ్రేటెడ్ వసతి గృహాల్లో 300 మందికి పైగా విద్యార్థులుండడంతో అక్కడ అదనంగా మరొకరిని నియమించే అవకాశాలున్నాయి. ప్రభుత్వ ఆదేశానుసారం త్వరలో పోస్టులు భర్తీ చేయనున్నారు. ● ఇప్పటి వరకు వసతి గృహాల్లో వంట చేసే వారు, వాచ్‌మెన్‌లు మాత్రమే పనిచేసే వారు. వీరే ఆవరణాన్ని శుభ్రం చేసుకోవడం వంటి పనులు చేసే వారు. ఈ పనులతో పాటు పారిశుద్ధ్య నిర్వహణ, పరిసరాల పరిశుభ్రతలో కొత్తగా వచ్చే సిబ్బందికి అప్పజెప్పనున్నారు. ● జిల్లా సాంఘీక సంక్షేమ సాధికారిక అధికారి దామోదర్‌రెడ్డిని వివరణ కోరగా ప్రభుత్వ జీవో మేరకు జిల్లాలో 57 మంది సిబ్బందిని నియమించే అవకాశాలున్నాయన్నారు. త్వరలో నియామకాలు చేపడతామని చెప్పారు.

చిన్నమండెంలోని సాంఘీక సంక్షేమ వసతి గృహం

రిమ్స్‌లో స్క్రబ్ టైఫస్‌కు ప్రత్యేక విభాగం

సర్వజన ఆసుపత్రి, న్యూస్‌టుడే: స్క్రబ్ టైఫస్‌కు రిమ్స్ ఆసుపత్రిలో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేస్తున్నామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రస్తుతం నిర్ధారణ పరీక్షలకు ర్యాపిడ్ టెస్ట్‌లు చేస్తున్నట్లు చెప్పారు. పూర్తి స్థాయి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసే పరికరాల కోసం ఇండెంట్ పెట్టామని త్వరలో వస్తాయన్నారు. అనుమానిత కేసులు వస్తే తిరుపతి, విజయవాడకు పంపి నిర్ధారణ అయి తరువాత వైద్యం చేస్తామన్నారు. సర్వజన ఆసుపత్రిలో స్క్రబ్ టైఫస్‌కు మందులు, వైద్యం పూర్తి స్థాయిలో అందుబాటులో ఉన్నాయని, జిల్లా ప్రజలు ఎలాంటి భయాందోళనకు గురి కానవసరం లేదని, అనుమానం వస్తే వెంటనే రిమ్స్‌కు రావాలన్నారు. 24 గంటలూ వైద్యులు అందుబాటులో ఉంటారని స్క్రబ్ టైఫస్ బారిన పడకుండా అప్రమత్తంగా ఉంటూ ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

పశువులకూ వసతి గృహాలు

నియోజకవర్గానికి ఒకటి మంజూరు

కంభంవారిపల్లి, న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమపై దృష్టి సారించింది. పాడిని అభివృద్ధి చేయడానికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోంది. పాడి పరిశ్రమ అభివృద్ధిలో భాగంగా కూటమి ప్రభుత్వం పశువుల వసతి గృహాలు (యానిమల్ హాస్టల్స్) పేరిట మెగా గోకులాల ఏర్పాటుకు నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర పశుసంవర్ధకశాఖ ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఇప్పటి వరకు ప్రభుత్వం పాడి పరిశ్రమ అభివృద్ధికి రైతుల సొంత స్థలాల్లో మినీ గోకులాలు మంజూరు చేసింది. రైతుల అవసరం మేరకు నిర్మాణాలు చేపట్టారు. ఇందుకు జాతీయ ఉపాధి పథకం నిధులను కేటాయించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం స్థలాలు లేని పాడి రైతులకు ఉపయోగపడేలా పశువుల వసతి గృహాలు ఏర్పాటు చేయనుంది. స్థలం లేని రైతులు తమ పశువులను వసతి గృహాల్లో ఉంచి, వాటి పోషణ చూసుకొనే విధంగా కార్యక్రమాన్ని రూపొందించారు. జిల్లాలో ఆరు నియోజకవర్గాలు ఉండగా, నియోజకవర్గానికి ఒకటి చొప్పున మంజూరు చేశారు. తక్కువ కాలంలోనే వసతి గృహాలను ఉపయోగంలోకి తీసుకు రావాలన్నదే ప్రభుత్వ లక్ష్యం.

కంభంవారిపల్లెలో ఆరుబయట కట్టేసిన ఆవులు

● **ఒక్కో వసతి గృహంలో 30 పశువులు :** జిల్లాలో 2.28 లక్షల తెల్ల పశువులు ఉన్నాయి. ఒక్కో వసతి గృహంలో 30 పశువులు ఉండే విధంగా పశుసంవర్ధకశాఖ అధికారులు వీటిని ఏర్పాటు చేయనున్నారు. వసతి గృహం నిర్మాణానికి సుమారు అయిదెకరాల విస్తీర్ణం అవసరం. ప్రభుత్వ భూములేమైనా ఉంటే, వాటిని క్షేత్రస్థాయిలో రెవెన్యూ అధికారులు గుర్తించి పశుసంవర్ధకశాఖకు అప్పగించనున్నారు. ప్రభుత్వ భూమి లేని పరిస్థితిలో ప్రైవేటు భూములను ఐదేళ్ల పాటు లీజు (కౌలు)కు తీసుకోనున్నారు. ఒక్కో వసతి గృహంలో సుమారు 30 పశువులకు వసతి కల్పించే విధంగా ఎకరా స్థలంలో షెడ్లుతో పాటు పశువుల మేత, దాణా నిల్వ ఉంచేందుకు గదులు నిర్మించనున్నారు. ఉపాధి హామీ పథకం నుంచి రూ.10 లక్షలు నిధులు వీటికి కేటాయించనున్నారు.

నిర్వహణ బాధ్యత మహిళా సంఘాలకే

పశువుల వసతి గృహాల నిర్వహణ బాధ్యతను స్వయం సహాయక, రైతు సంఘాలు, సొసైటీలు, ఎఫ్‌పీవో సంస్థలకు అప్పగించనున్నారు. గ్రామాల్లో ఆసక్తి ఉన్న వారు తమ పశువులను అక్కడికి తరలిస్తే, వాటికి దాణా, గడ్డి, నీరు అన్నీ నిర్వాహకులు చూసుకుంటారు. ఉదయం సాయంత్రం యజమానులు వెళ్తే నిర్వాహకులే పాలు పితికి అప్పగిస్తారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్వహణకు అయ్యే ఖర్చు, కూలీలు, ఇతర ఖర్చులు లెక్కించి, గోబర్ గ్యాస్, సేంద్రియ ఎరువు విక్రయాలతో జమ చేస్తారు. అదనపు ఖర్చులుంటే యజమానులు చెల్లించాల్సి ఉంటుంది. పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి గుణశేఖర్ పిళ్లై కోరారు.

రైతేరాజు 6లో

(c) eenadu

చిరు ధాన్యాలు.. బహుళ ప్రయోజనాలు

స్ఫూర్తి

రాయచోటి, వీరబల్లి, న్యూస్‌టుడే: జిల్లాలో ఇటీవల చిరుధాన్యాల వినియోగం పెరిగింది. ఎక్కువ మంది ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. రాగి, జొన్న, సామలు, కొర్రలు మొదలైన వాటితో తయారయ్యే ఆహార పదార్థాలు ఆహారంలో తీసుకుంటున్నారు. పోషక విలువలు ఎక్కువ, ఖర్చు తక్కువ కావడంతో రైతులు సైతం ఆసక్తి చూపుతున్నారు.

ముడి సరకుల ప్రాసెసింగ్ ఇలా..

రైతులు పండించే చిరుధాన్యం పంటలను ప్రాసెసింగ్ చేసిన తర్వాతనే ధాన్యం ఇతర అవసరాలకు వినియోగిస్తారు. తిరుపతి, వాల్మీకిపురం, మదనపల్లెలలో ప్రాసెసింగ్ యూనిట్లు ఉన్నాయి. తిరుపతి ఎస్వీ ప్రాంతీయ వ్యవసాయం పరిశోధన స్థానంలో రైతులు తీసుకొచ్చిన ముడి సరకును ప్రాసెస్ చేస్తారు. కిలోకు రూ.10-12 తీసుకొని నాలుగు రకాల యంత్రాలతో వడపట్టి రైతుకు తిరిగి ధాన్యం అందజేస్తారు. ఈ ప్రాసెసింగ్ యూనిట్‌లో ఏటా ఇక్కడి నుంచి మూడు నెంచి 5 వేల కిలోల పంట ప్రాసెస్ జరుగుతుంది. జిల్లాలో చిరుధాన్యం పంటల సాగు ఇలా ఉంది.

100 గ్రాముల్లో పోషకాల శాతం ఇలా

పంట	మాంస కృత్తులు	పిండి పదార్థం
కొర్రలు	1.2	63.2
సామలు	9.7	60.9
జొన్న	10.4	70.7
సజ్జ	11.8	67
రాగి	7.7	72.6

జిల్లాలో సాగు విస్తీర్ణం (హెక్టార్లలో)

కొర్రలు	32
సామలు	13
సజ్జ	499
మొక్కజొన్న	26
జొన్న	21
రాగులు	351

ఖర్చు తక్కువ... రాబడి ఎక్కువ

- చిరు ధాన్యపు పంటలకు నీటి అవసరం తక్కువ
- తెగుళ్లు, చీడపీడలను తట్టుకునే శక్తి ఉంటాయి
- రసాయన మందుల వినియోగాన్ని విస్మరించొచ్చు
- రెండు, మూడు తడులు పదున్లు వర్షం సరిపోతుంది
- మూడు నెల ల్లోనే పంట కాలం పూర్తి
- చిరుధాన్యాల్లో మాంసపు కృత్తులు, పీచు పదార్థాలు అధికం

ప్రభుత్వ ప్రోత్సాహం

చిరుధాన్యం పంటలు సాగు చేస్తే తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం పొందవచ్చు. మంచి ఆరోగ్యానికి అవసరమైన దిగుబడి ఇస్తాయి. తక్కువ నీటితోనే పండించుకోవచ్చు. సాగుకు ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందుతోంది. రైతులకు సూచనలు ఇస్తున్నాం. - **వెంకటమోహన్, జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారి**

క్యాప్సికం సాగు.. లాభాలు బాగు

దిగుబడులను ఎగుమతికి సిద్ధం చేస్తున్న కూలీలు

రామసముద్రం, న్యూస్‌టుడే: రామసముద్రం-ముళబాగల్ ప్రధాన రహదారిలోని మండిగల్లు సమీపంలో సుబ్రహ్మణ్యం అనే రైతు క్యాప్సికం సాగుతో లాభాలు గడిస్తున్నారు. ముందుగా తనకున్న ఎకరా పొలాన్ని దుక్కి చేసి ఇరవై ట్రాక్టర్ లోళ్ల పశువుల ఎరువులను పొలంలో కలిపారు. నెల రోజుల పాటు మగ్గ పెట్టారు. 4'4 వెడల్పుతో బెడ్లు ఏర్పాటు చేశారు. బిందుసేద్యం ఏర్పాటు చేసి కలుపు నివారణకు మల్చింగ్ వేశారు. మల్చింగ్ పేపరుకు రంధ్రాలు ఏర్పాటు చేసి అందులో ఎకరానికి 12 వేల హైబ్రిడ్ రకం క్యాప్సికం మొక్కలు నాటారు. తెగుళ్ల నివారణకు హరితవనాన్ని ఏర్పాటు చేశారు. మొక్కలకు నాలుగు విడతలుగా పోషక ఎరువులు బిందు సేద్యం ద్వారా అందించారు. సూక్ష్మక్రిములు, ఊజీ ఈగల నివారణకు ఎల్లో కలర్ బంక పేపర్లు మొక్కల వద్ద వేలాడదీశారు. రెండు నెలల వ్యవధిలోనే దిగుబడి ప్రారంభమైంది. మొక్కలకు ఊతంగా కర్రలు ఏర్పాటు చేశారు. మొదటి కోతలో టన్ను దిగుబడి కోశారు. పదిహేను రోజులకు ఒక్కసారి అయిదు టన్నుల దిగుబడితో ఆరు నెలలకు 60 టన్నుల దిగుబడులు తీశారు. చెన్నై, కోలార్, బెంగళూరు మార్కెట్లకు తరలించి అమ్మకం చేశారు. కిలో రూ.30 నుంచి రూ.40 వరకు పలికింది. సాగుకు రూ.6 లక్షల వరకు ఖర్చు కాగా సాగు వ్యయం పోనూ రూ.12 లక్షల మేర ఆదాయం సమకూరినట్లు రైతు తెలిపారు.

రైతేరాజు

రైతు ప్రశ్న శాస్త్రవేత్త సమాధానం

ప్రశ్న: అరటిలో సిగటోక తెగులు (ఆకు మచ్చ) నివారణ సంరక్షణ చర్యలు తెలపగలరు? - **నరసింహరాజు, చెర్లోపల్లి గ్రామం**

సమాధానం: వర్షాకాలంలో తెగుళ్ల నివారణకు ప్రోపికొనజోల్ మందును 1 మి.లీ.ను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. కార్బండిజమ్, ఒక గ్రాము మాంకోజెట్ మిశ్రమాన్ని లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేస్తే తెగుళ్లను నివారించవచ్చు. అరటి తోటల్లో నీరు నిలవకుండా చేసి, ఎరువులు వాడకం పెంచాలి.

- **సురేష్ బాబు, ఉద్యాన శాఖ అధికారి- న్యూస్‌టుడే, రాజంపేట గ్రామీణ**

చిట్కా

మామిడిలో సస్యరక్షణకు సమయమిదే..!

తోటలలో పిచికారీ చేస్తున్న రైతు

రామాపురం, న్యూస్‌టుడే: మామిడి తోటల్లో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాల్సిన తరుణమిదేనని ఉద్యాన అధికారులు సూచిస్తున్నారు. ప్రస్తుత కాలంలో ముదిరిన కొమ్మలో మొగ్గలు ఏర్పడుతున్నందున తోటల్లోనే సేద్యం పూర్తి చేయాలి. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా డిసెంబర్ రెండో వారం నుంచి జనవరి మొదటి వారం వరకు మొగ్గలు కనిపిస్తాయి. పూత వచ్చేందుకు డిసెంబర్ 15-20 మధ్య నీటి వసతి ఉన్న తోటల్లో తేలికపాటి తడి ఇవ్వడం లేదంటే లీటర్ నీటికి పొటాషియం నైట్రేట్ 10 గ్రాములు, యూరియా 6 గ్రాముల చొప్పున కలిపి చెట్టుకు పిచికారీ చేయాలి. ఒక్క కొమ్మలో సుమారు 2-3 వేల పుష్పాలు ఉంటాయి. ఇందులో 99 శాతం పూత రాలుతుంది. ఒక రెమ్మకు 5-6 పిందెలు వస్తాయి. చివరికి ఒకటి రెండు మాత్రమే ఎదిగిన కాయలవుతాయి. మామిడిలో వివిధ కారణాలతో పూత పిందె రాలుతాయి. ఆ సమయంలో ఒకటి రెండు తేనెటీగల పెట్టెలను తోటలో పెట్టడం అక్కడక్కడా బెల్లం ద్రావణం తడిపిన గోనె సంచులు వేలాడదీయడంతో ఈగలకు ఆకర్షించి పిందె కట్టే శాతం పెంచొచ్చు. ఈ విషయాలపై ఉద్యాన అధికారులు మామిడి రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే పోలీసుల కర్తవ్యం

అర్జీదారు సమస్య తెలుసుకుంటున్న ఎస్పీ ధీరజ్ కునుబిల్లి

రాయచోటి, న్యూస్‌టుడే: ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరించడమే పోలీసుల కర్తవ్యమని జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భూ వివాదాలకు సంబంధించిన సమస్యలు అధికంగా వస్తున్నాయని, రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసుకుని సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలన్నారు. ప్రజలలో అవగాహన లోపంతో సైబర్ నేరాలు పెరుగుతున్నాయన్నారు. ఈ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. సంబంధిత పోలీసు స్టేషన్లకు అర్జీలను పంపి నిర్ణీత గడువులోపు పరిష్కరించి నివేదికను జిల్లా పోలీసు కార్యాలయానికి పంపాలని అధికారులను ఆదేశించారు.

లోక్ అదాలత్‌తో ఇరు వర్గాలకు న్యాయం

పీలేరు, న్యూస్‌టుడే: లోక్ అదాలత్‌లో కేసులు రాజీ మార్గంలో పరిష్కరించుకోవడం వల్ల ఇరు వర్గాలకు సమ న్యాయం జరుగుతుందని పీలేరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జియావుద్దీన్ పేర్కొన్నారు. ఈ నెల 13న రెండో శనివారం పీలేరు న్యాయస్థాన ప్రాంగణంలో జరుగనున్న 'జాతీయ లోక్ అదాలత్'పై న్యాయమూర్తి, పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ ప్రారంభంలో కోపంతో పేచీలకు పోయి సన్నిహితులుగా ఉన్న వారు కూడా కేసులు పెట్టుకుంటారని, అలాంటి వారి మధ్య రాజీ కుదర్చడం వలన కేసు సులభంగా పరిష్కరించుకోవచ్చన్నారు. పోలీసులకు కేసులలో ఇరు పక్షాలకు పరిచయాలు ఉన్నందున ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చూడాలని చెప్పారు. కార్యక్రమంలో ఏపీపీ శారద, పోలీసు అధికారులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న న్యాయమూర్తి జియావుద్దీన్

జాక్‌పాట్ రద్దు చేయాలని డిమాండ్

గుర్రంకొండ: స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో టమాటాల విక్రయంలో అమలు చేస్తున్న జాక్‌పాట్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ సోమవారం రాయచోటి కలెక్టరు కార్యాలయంలో రైతులు వినతిపత్రం అందజేశారు. 100 బాక్సులకు 10 బాక్సులు ఉచితంగా మండీ యజమాని తీసుకోవడంతో రైతులు పెద్ద ఎత్తున నష్టపోతున్నారని వారు చెప్పారు. అలాగే కమిషన్ 4 శాతం తీసుకోవల్సి ఉండగా, 10 శాతం తీసుకుంటున్నారని ఫిర్యాదు చేశారు. మార్కెట్ అధికారులు సైతం ఏమాత్రం స్పందించడం లేదని వారు వాపోయారు. ఫిర్యాదు చేసినవారిలో రైతులు అమరేంద్ర, శేషాద్రినాయుడు తదితరులున్నారు.

టెర్రాకోట ఉత్పత్తుల పరిశీలన

టెర్రాకోట కుండల తయారీని పరిశీలిస్తున్న కేవీఐసీ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ గ్రేవ్, డిప్యూటీ సీఈవో మదన్‌కుమార్‌రెడ్డి తదితరులు

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే: టెర్రాకోట కుండలు తయారు చేసే కార్మికులు ఉపాధి అవకాశాలు మెరుగు పర్చుకోవాలని ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ (కేవీఐసీ) రాష్ట్ర సంచాలకుడు డాక్టర్ గ్రేవ్ అన్నారు. సోమవారం కురబలకోట మండలంలోని బిగ్గేపల్లెలో కళా ఉత్పత్తుల విభాగాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. టెర్రాకోట కుండల తయారీదారులకు యంత్ర సామగ్రి అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కేవీఐసీ డిప్యూటీ సీఈఓ మదన్‌కుమార్‌రెడ్డి, ఏసీపీఏ ఎల్‌డీఎం ఆంజనేయులు, అసిస్టెంట్ డైరెక్టర్ అర్జున్ మూర్తి, పర్యటకశాఖ జిల్లా జనరల్ మేనేజర్ కృష్ణకిశోర్, డీఆర్‌డీఏ ఏపీ ప్రాజెక్టు మేనేజర్ గంగయ్య, ఏపీఎం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా సీతారాముల కల్యాణం

వాల్మీకిపురం, న్యూస్‌టుడే: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలోని స్థానిక పట్టాభి రామాలయంలో శ్రీరాముడి జన్మ నక్షత్రమైన పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని సోమవారం ఉదయం సీతారాముల కల్యాణాన్ని వేదపండితులు మంత్రోచ్ఛరణల మధ్య కనుల పండువగా నిర్వహించారు. ఆలయంలో సుప్రభాత సేవతో కల్యాణ క్రతువు ప్రారంభించారు. విశేషాలంకరణలో ముస్తాబైన సీతారాముల వారిని మంగళ వాయిద్యాల నడుమ ఆలయ ప్రాంగణంలోని ఉత్సవ మండపంలో అధిరోహింపజేశారు. హాజరైన భక్తుల సమక్షంలో స్వామి వార్ల కల్యాణాన్ని వైభవంగా జరిపించారు. అనంతరం కల్యాణోత్సవ ఆర్జిత సేవలో పాల్గొన్న దంపతులకు స్వామి వారి వస్త్రాలతో పాటు ప్రసాదాన్ని ఆలయ సిబ్బంది పంపిణీ చేశారు.



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

విద్యార్థులకు ప్రధానితో మాట్లాడే సువర్ణావకాశం

విద్యార్థులతో మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ నరసింహారెడ్డి, కోఆర్డినేటర్ శ్రీనివాస్

రాయచోటి, న్యూస్‌టుడే: పరీక్షా పే చర్చా కార్యక్రమం ద్వారా విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రధాన మంత్రితో నేరుగా మాట్లాడే అవకాశం కల్పిస్తున్నారని జిల్లా కోఆర్డినేటర్ తిరుపతి శ్రీనివాస్, డైట్ ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ఎం. నరసింహారెడ్డిలు తెలిపారు. సోమవారం డైట్ కేంద్రంలో పరీక్షా పే చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నోడల్ ఆఫీసర్‌గా జిల్లా విద్యాశాఖాధికారి ఉంటారన్నారు. పరీక్షలపై విద్యార్థులకు ఉన్న భయాన్ని తొలగించి ఆత్మవిశ్వాసం నింపడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని చెప్పారు. ఈ కార్యక్రమంలో 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు ఉన్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొనవచ్చన్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఈనెల 1 నుంచి ప్రారంభం అయిందని జనవరి 11 వరకు కొనసాగుతుందన్నారు. innovateindia1.myjeevo.in వెబ్ సైట్‌ను సందర్శించి వారి వివరాలు నమోదు చేయాలని కోరారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు, తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు శివభాస్కర్, గిరిబాబుయాదవ్, ఆంగ్ల ఉపాధ్యాయుడు పరుశురాం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏఎన్‌ఆర్‌ఎఫ్‌కు దయానంద ఎంపిక

పీలేరు, న్యూస్‌టుడే : పీలేరుకు చెందిన సిద్ధవటం దయానందకు అరుదైన అవకాశం వచ్చింది. అనుసంధాన్ జాతీయ పరిశోధన ఫౌండేషన్ (ఏఎన్‌ఆర్‌ఎఫ్) ప్రధాన మంత్రి ప్రొఫెసర్‌షిఫ్ పథకానికి శాస్త్రవేత్త, ప్రొఫెసర్ దయానంద సిద్ధవటం ఎంపిక కావడం విశేషం. దయానంద పీలేరు మండలం బోడుమల్లువారిపల్లె పంచాయతీ మేకలవాని కాలువ స్వగ్రామం. ప్రాథమిక, ఉన్నత పాఠశాల విద్య, ఇంటర్మీడియట్ (బైపీసీ) పీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పూర్తి చేశారు. అనంతరం తిరుపతి ఎస్వీ ఆర్ట్స్ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ, ఎస్వీ విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఈ ఫెలోషిప్ కోసం దేశవ్యాప్తంగా మూడు వేల దరఖాస్తులను పరిశీలించిన నిపుణుల కమిటీ 25 మందిని ఎంపిక చేసింది. ఎంపికైన వారిలో తెలుగు రాష్ట్రాల నుంచి దయానంద ఒక్కరే ఉండడం గమనార్హం. ఈ ప్రొఫెసర్ షిప్ కింద ఐదేళ్ల కాలానికి నెలకు రూ.2.5 లక్షల ఫెలోషిప్, ఏడాదికి రూ.24 లక్షల రీసెర్చ్ గ్రాంట్, ఏడాదికి అదనపు ఖర్చుల కింద రూ.లక్ష కేంద్రం ఇవ్వనుంది. అతని సోదరుడు సిద్ధవటం సుగుణాకర్ పీలేరులో విశ్రాంత ఎంఈవోగా, మరో సోదరుడు సుబ్రహ్మణ్యం పీలేరు శ్రీచెన్నకేశవస్వామి దేవస్థానం ఛైర్మన్‌గా పనిచేస్తున్నారు.

దేగానిచెరువు ఆయకట్టులో నీటి మళ్లింపునకు చర్యలు

ఈనాడు కథనానికి స్పందన

బి.కొత్తకోట, న్యూస్‌టుడే : బి.కొత్తకోట మండలం దేగానిపల్లె చెరువు ఆయకట్టు భూముల్లో నిల్వ ఉన్న వర్షపు నీటిని మళ్లించడానికి హంద్రీ - నీవా అధికారులు చర్యలు చేపట్టారు. హంద్రీ - నీవా కాలువ అడ్డంగా రావడంతో పాటు పిల్ల కాలువలు పూడిపోవడం వల్ల భూముల్లో వర్షపు నీరు నిలిచిపోయి రైతులు పంటలు సాగు చేసుకోలేని వైనంపై ఈ నెల 8న 'ఆయకట్టు చెరువైంది.. అడ్డుకట్ట కరవైంది.. కన్నీళ్ల పర్యంతమవుతున్న రైతులు' శీర్షికన 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన హంద్రీ - నీవా డీఈ వెంకట ప్రతాప్, జేఈ ఆంజనేయులు సోమవారం ఆయకట్టు భూములను పరిశీలించి రైతుల ఇబ్బందులు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఈ 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ చెరువు ఆయకట్టులో నిల్వ ఉన్న నీటిని కాలువలోకి సైఫన్ విధానంలో మళ్లించే పనులు మంగళవారం ప్రారంభిస్తామని తెలిపారు. ఆయకట్టు రైతులు పంటలు సాగు చేసుకునేందుకు వీలుగా వర్షపు నీటిని తరలిస్తామన్నారు. రానున్న రోజుల్లో ఆయకట్టు భూముల్లోకి వాన నీరు చేరకుండా ఇదే ప్రాంతంలో అండర్ టన్నెల్‌తోపాటు మరో సూపర్ ప్యాసేజిని నిర్మించబోతున్నామన్నారు.

బి.కొత్తకోట మండలం దేగానిపల్లె ఆయకట్టు భూములను పరిశీలిస్తున్న హంద్రీ-నీవా డీఈ వెంకట ప్రతాప్‌తో పాటు ఇంజినీర్లు

ఎర్రచందనం దుంగలు స్వాధీనం

స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగలతో అధికారులు

పీలేరు గ్రామీణ, న్యూస్‌టుడే : పీలేరు అటవీ శాఖ పరిధిలో వాహనం సహా ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నామని పీలేరు డీఎఫ్‌వో శ్రీనివాసులు సోమవారం తెలిపారు. రొంపిచెర్ల - పులిచెర్ల మార్గంలో ఎర్రచందనం దుంగలు అక్రమ రవాణా జరుగుతోందని అందిన రహస్య సమాచారం మేరకు సోమవారం వేకువజామున పులిచెర్ల వద్ద నిఘా ఏర్పాటు చేశారు. రొంపిచెర్ల వైపు నుంచి వచ్చిన వాహనం ఆపకుండా వేగంగా దూసుకెళ్లింది. సిబ్బందితో వెంబడించగా రెడ్డివారిపల్లె సమీపంలో దుండగులు వాహనాన్ని ఆపి చీకట్లో పారిపోయారు. వాహనాన్ని పరిశీలించగా 87 కిలోల బరువున్న 6 ఎర్రచందనం దుంగలు, వాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నామని డీఎఫ్‌వో తెలిపారు. ఎఫ్‌ఆర్వో చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

గుర్రంకొండలో రెండిళ్లలో చోరీ

గుర్రంకొండ, న్యూస్‌టుడే : పట్టణంలోని కొత్తపేట, నబీ కాలనీలో రెండిళ్లల్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు బాధితులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నబీకాలనీలో నివాసమున్న ఫర్హాద్ కుటుంబ సభ్యులు బంధువుల ఇంటికి వెళ్లారు. అది గమనించిన దుండగులు ఇంటి తాళం పగలగొట్టి బీరువాలోని 5 తులాల బంగారం, రూ.లక్ష నగదు చోరీ చేశారని పోలీసులు తెలిపారు. కొత్తపేటలో నివాసం ఉంటున్న ఖాదర్‌వలి కుటుంబం వివాహానికి వెళ్లింది. అది గుర్తించిన దుండగులు తాళం పగలగొట్టి.. బీరువాలో ఉన్న 4 గ్రాముల బంగారు, 700 గ్రాముల వెండి, రూ.20 వేల నగదు చోరీ చేసినట్లు వారు పేర్కొన్నారు. ఈ మేరకు ఘటన ప్రదేశాన్ని వాల్మీకిపురం సీఐ రాఘవరెడ్డి పరిశీలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బాలకృష్ణ పేర్కొన్నారు.

పోలీసులకు భయపడి... కత్తితో కోసుకుని

రాజంపేట గ్రామీణ: భార్య పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదుకు భయపడి తనను తానే చాకుతో పొడుచుకున్న ఘటన అన్నమయ్య జిల్లా పెనగలూరులో సోమవారం చోటుచేసుకుంది. నెల్లూరు జిల్లా రాపూరు మండలం గోనేపల్లి గ్రామానికి చెందిన దొడ్డవరపు మునికృష్ణ కొన్నేళ్ల కిందట పెనగలూరుకు చెందిన శశికళను వివాహం చేసుకున్నారు. మునికృష్ణ మద్యానికి బానిసై భార్యను నిత్యం వేధించేవాడు. వేధింపులు తట్టుకోలేక ఆమె ఆదివారం పెనగలూరులోని తన పుట్టింటికి వెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. విషయం తెలుసుకున్న మునికృష్ణ పెనగలూరుకు చేరుకొని భార్య బంధువులు తనపై చాకుతో దాడి చేసినట్లు ప్రచారం చేశారు. దీనిపై మునికృష్ణను విచారించగా కేవలం కేసుకు భయపడి ఇలా చేశానని పోలీసుల వద్ద ఒప్పుకొన్నట్లు ఎస్సై రఘురాం తెలిపారు. అనంతరం వారికి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించామని వివరించారు.

S.B.V.R. అగ్రికల్చరల్ కళాశాల, బద్వేలు

ఇంటర్మీడియట్ నందు Bi.P.C విభాగంలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు చివరి అవకాశం. కడప జిల్లా బద్వేలులో I.C.A.R., NEW DELHI వారిచే గుర్తింపు పొందిన S.B.V.R. అగ్రికల్చరల్ కాలేజ (S.B.V.R. A.G.B.Sc), నందు B.Sc (Hons.) Agricultureలో అడ్మిషన్ కొరకు ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకున్నా చేసుకోకపోయినా కన్వీనర్ కోటాలో అగ్రికల్చరల్ బి.ఎస్సీ చేరుటకు చిట్ట చివరి అవకాశం కలదు.

వివరములకు సంప్రదించవలసినది : 94400 33523, 91825 05395, 94928 56652.
కరెస్పాండెంట్, S.B.V.R. అగ్రికల్చరల్ కళాశాల

KAIRA DISTRICT CO-OPERATIVE MILK PRODUCERS' UNION LIMITED
ANAND 388 001, Gujarat, India.
Phone: (02692) 256124, 256224, 256324

Amul

Tender AD

Amul Chittoor Dairy, a unit of Kaira District Co-operative Milk Producers' Union Limited popularly known as Amul Dairy having an Annual Turnover of Rs. 14,000+ crores, invites sealed tenders from eligible bidders for following items.

Description
1. Operation & Maintenance of Steam Boiler at ASD, Madanapalli.
2. Operation & Maintenance of Effluent Treatment Plant (ETP) at ASD, Madanapalli.

The details of E-tender can be downloaded free of cost from the Website http://tender.amuldairy.com after online registration. The online tender will be available for access from Dt. 09-12-2025 to Dt. 15-12-2025. The completed tender in physical form will be received up to 17:00 hours on 15-12-2025 by Sr. Manager (Purchase), Sy. Nos: 12/1, 13, 24/1 and 24/2, 25, 26, 27, Greamspet Revenue Village, Vellore Road, Chittoor, Chittoor District, Andhra Pradesh-517001, India. Details regarding eligibility criteria, specifications and other conditions are available in the tender format from the above website. The Amul Dairy reserves the right to accept or reject any or all the tenders without assigning any reason thereof.

9th December 2025 Managing Director

కాలం చెల్లిన ఎరువులు విక్రయిస్తే చర్యలు

ములకలచెరువు, న్యూస్‌టుడే : ఎరువులు దుకాణాదారులు రైతులకు కాలం చెల్లిన ఎరువులు విక్రయించిన, ఎరువులను అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తప్పవని పీలేరు ఏడీఏ రమణారావు సూచించారు. సోమవారం ములకలచెరువులోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. పలు ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి రికార్డులు, ఎరువుల నిల్వలు, రైతులకు ఇస్తున్న రశీదులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు విక్రయించే ఎరువులు అధిక ధరలకు అమ్మరాదని, ప్రభుత్వం నిర్ణయించిన ధరకే విక్రయించాలన్నారు. కాలం చెల్లినవి విక్రయిస్తే చర్యలు తీసుకుని దుకాణం సీజ్ చేస్తామన్నారు. ములకలచెరువు గ్రోమోర్‌లో రూ.7,33,916లు విలువ చేసే ఎరువుల విక్రయాలు నిలుపుదల చేసినట్లు ఏవో ప్రవంతి తెలిపారు. ఎరువులు కొన్న వారికి బిల్లులు ఇవ్వకపోతే వ్యవసాయ శాఖ అధికారుల దృష్టికి తీసుకురావాలని రైతులను కోరారు. అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరికలు చేశారు.

ఎరువుల దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న ఏడీఏ రమణరావు

21న తంబళ్లపల్లెలో గిరిజన ప్రజా చైతన్య యాత్ర

పెద్దతిప్పసముద్రం, న్యూస్‌టుడే : ఈ నెల 21న తంబళ్లపల్లెలో జరిగే గిరిజన ప్రజా చైతన్య యాత్రకు గిరిజనులంతా తరలి రావాలని రాయలసీమ జిల్లా అధ్యక్షుడు మూడే ప్రసాద్‌నాయక్, కొర్ర సురేంద్ర నాయక్ పిలుపునిచ్చారు. సోమవారం పీటీఎం మండల పరిషత్ కార్యాలయం వద్ద గోడ పత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో బాస్ నాయకులు లక్ష్మీనారాయణ, శివలింగ పాల్గొన్నారు.

వ్యసనాల ఆకర్షణకు గురికావొద్దు

మాట్లాడుతున్న సీఐ రాఘవరెడ్డి

గుర్రంకొండ, న్యూస్‌టుడే : 'తెలిసీ తెలియని వయస్సులో ఏం చేస్తున్నారో మీకు తెలియదు.. చుట్టూ అనేకమైన చెడు వ్యసనాలు ఆకర్షిస్తాయి. వాటికి లోనై మీ బంగారు జీవితాన్ని, భవిష్యత్తును నాశనం చేసుకోకండి' అని వాల్మీకిపురం సీఐ రాఘవరెడ్డి సూచించారు. సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 13-18 ఏళ్ల వయస్సులో ఉన్న వారందరికీ చట్టాలు, సమాజంపై, తమ భవిష్యత్తుపై అవగాహన ఉండదన్నారు. బెల్లం చుట్టూ ఈగలు ముసురుతున్నట్లుగా చెడు వ్యసనాలైన గంజాయి, మాదక ద్రవ్యాలు, మందు, పొగతాగడం లాంటి వినాశక శక్తులు మిమ్మల్ని ఆకర్షిస్తాయన్నారు. బాల్య వివాహాలు, మైనర్ డ్రైవింగ్, పోక్సో కేసు, డ్రంక్ అండ్ డ్రై లాంటివి జీవితాలను విచ్ఛిన్నం చేస్తాయన్నారు. ఈ తరుణంలో చట్టాలపై, సమాజంలో మీ బాధ్యతపై అవగాహన కలిగి మంచి పౌరులుగా ఎదగాలని విద్యార్థులకు సూచించారు. ఎట్టి పరిస్థితుల్లో చెడు వాటికి ఆకర్షితులు కావద్దన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ బాలకృష్ణ, ప్రధానోపాధ్యాయులు తకివుల్లా, కళాశాల లెక్చరర్ జమీర్ తదితరులు పాల్గొన్నారు.

e-procurement Tender Notice
RAJAMPET MUNICIPALITY

ROC No.1118/E1/2025-26, Date:08-12-2025

S.No	'e' - Procurement Notice No.	Number of Works	Estimate Contract Value (in Lakhs)
1	66/GF/DEE/AE/2025-26 to 70/GF/DEE/AE/2025-26	5	44.79
2	55/15th FC/DEE/AE/2025-26 (2nd call)	1	15.38
	Bid document download start date	09-12-2025, 10.00AM	
	Bid document download end date	23-12-2025, 3.00 PM	
	Last date of receipt of Tender	23-12-2025, 3.30 PM	

Further details can be seen @ 'e' - Procurement Market Place in https://tender.apeprocurment.gov.in/, Contact No:9989051971

Sd/- COMMISSIONER, Rajampet Municipality

ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ధర్నా

రాయచోటి, న్యూస్‌టుడే: సహకార శాఖ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం సత్వరం పరిష్కరించాలని కోరుతూ సోమవారం సహకార బ్యాంకు ఎదుట ధర్నా నిర్వహించారు. ఏపీపీఏసీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుప్పం రెడ్డిబాబు, రాష్ట్ర కార్యదర్శి వి.ఆంజనేయులు మాట్లాడుతూ సహకార ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 6వ తేదీ నుంచి ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. డీఎల్‌ఎఫ్ ఏర్పాటు చేసి జీత భత్యాలు చెల్లించాలని కోరారు. 2019 తర్వాత ఉద్యోగంలో చేరిన వారిని వెంటనే క్రమబద్ధీకరించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు సాబ్‌జాన్, జిల్లా కన్వీనర్ జాఫర్‌వలీ తదితరులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న సహకార సంఘాల ఉద్యోగులు

EENADU Classifieds

AUTO

VEHICLES FOR SALE

Sundaram Finance Ltd. Vehicle for Sale Leyland 4/185 Travels Bus Scrab Condition Model 2012 Registration Number Ap-04-UA-3453 ✆ 9440909749, 8500667214.

REAL ESTATE

HOUSE FOR SALE

ఇల్లు అమ్మబడును, ఇండిపెండెంట్ ఇల్లు (గ్రౌండ్‌ఫ్లోర్ & ఫస్ట్‌ఫ్లోర్). కడప, ఎర్రముక్కపల్లి, పి.ఎఫ్.ఆఫీసు డౌన్, గరుడాద్రి అపార్ట్‌మెంట్ దగ్గర. సంప్ర: 9963451132.

JOBS

అమెరికాలో 1 సం|| బాబు ఆలన, పాలన వ్యక్తిగత సంరక్షణ కొరకు అనుభవంగల ఆడవారు కావలెను. అమెరికా వీసా కల్గినవారు మాత్రమే. ✆ 9440803362

కడపటౌన్ లోని ప్రముఖ హాస్పిటల్ నందు పనిచేయుటకు నర్సింగ్ స్టాఫ్, ల్యాబ్ టెక్నీషియన్ కావలెను. Contact: 9014808283.

ప్రముఖ హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీలో మేనేజర్‌లుగా పనిచేయుటకు 2 సం|| అనుభవం, ఆసక్తి గల యువతీ, యువకులు కావలెను. ✆ 9989996784.

రాయచోటిలోని ప్రముఖ ఫైనాన్స్ సంస్థ నందు వర్క్ చేయుటకు మేనేజర్స్ కావలెను. అర్హత ఏదైన డిగ్రీ, వయస్సు: 30సం|| లోపు, జీతం: 20K to 40K. వెంటనే సంప్ర|| సెల్: 9985178956, 9441560001.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్‌లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన రూ|| 350/- మాత్రమే
Contact: KDP: 9989997626, 8008514248 PDTR: 8008597620
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

మదనపల్లె

•మదనపల్లె • పీలేరు • తంబళ్లపల్లె

ఇళ్ల స్థలాల మ్యాపింగ్ పూర్తి చేయండి

సిబ్బందికి సూచనలిస్తున్న తహసీల్దార్ శివకుమార్

పీలేరు గ్రామీణ, న్యూస్‌టుడే : పీలేరు మండలంలో గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన జగనన్న కాలనీలలో ఖాళీ స్థలాల మ్యాపింగ్ చేయడం సకాలంలో పూర్తి చేయాలని తహసీల్దార్ శివకుమార్ అన్నారు. సోమవారం పీలేరు తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అధికారులతో మాట్లాడారు. ప్రభుత్వం ద్వారా ఇళ్ల స్థలాలు పొంది ఎలాంటి నిర్మాణాలు చేపట్టకుండా ఉంటే రద్దు చేయడానికి సిఫార్సు చేస్తామని ఆయన చెప్పారు. గడువులోగా పరిష్కారం చూపాలని అన్నారు.

14న వాజ్‌పేయీ విగ్రహ ప్రతిష్ఠ

మాట్లాడుతున్న భాజపా నాయకుడు నరసింహారెడ్డి

తంబళ్లపల్లె, ములకలచెరువు, న్యూస్‌టుడే : ఈ నెల 14న మదనపల్లెలో మాజీ ప్రధాని వాజ్‌పేయీ విగ్రహ ప్రతిష్ఠ నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమానికి భాజపా నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని సీనియర్ నాయకుడు చల్లపల్లి నరసింహారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక భాజపా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మండల భాజపా అధ్యక్షుడు వెంకటరమణ, నాయకులు గోల్డెన్ వ్యాలీ రమణారెడ్డి, మాజీ సర్పంచి రామస్వామిరెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ శంకర్‌రెడ్డి, యుగంధర్, రామరెడ్డి, వెంకటరమణారెడ్డి, మల్లికార్జున, హరినాథ్‌రెడ్డి, మోహన్ పాల్గొన్నారు.

ఆత్మస్థైర్యంతో అడుగేయాలి

ప్రత్యేక ప్రతిభావంతునికి ధ్రువీకరణపత్రాన్ని అందజేస్తున్న డీఎస్పీ మహేంద్ర

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : వైకల్యం ఉందని కుంగిపోకుండా ఆత్మస్థైర్యంతో అడుగు ముందుకేసి లక్ష్యాన్ని చేరుకోవడానికి కృషి చేయాలని డీఎస్పీ మహేంద్ర అన్నారు. సోమవారం అమ్మచెరువుమిట్టలోని వెలుగు ప్రత్యేక ప్రతిభావంతుల పాఠశాలలో ప్రత్యేక ప్రతిభావంతుల దినోత్సవాన్ని నిర్వహించారు. డీఎస్పీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకుని నిర్వాహకులను అభినందించారు. పాఠశాల నిర్వాహకులకు తనవంతు సహకారం అందిస్తానన్నారు. విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. బధిరులకు వినికిడి యంత్రాలు, వైకల్యం కలిగిన వారికి చక్రాల కుర్చీలు డీఎస్పీ అందజేశారు. కార్యక్రమంలో వెలుగు పాఠశాల కార్యదర్శి ఉదయ్‌మోహన్‌రెడ్డి, ప్రిన్సిపల్ శ్రీకాంతరెడ్డి, రఘునాథరెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డి, కన్వీనర్ భాగ్యలక్ష్మి, సుజాత, గీత తదితరులు పాల్గొన్నారు.

చెరువులను చెరబట్టారు!

ఆక్రమణదారులను పట్టించుకోని అధికారులు

ములకలచెరువు, పెద్దమండ్యం, న్యూస్‌టుడే : తంబళ్లపల్లె నియోజకవర్గంలో పలు చోట్ల చెరువులు ఆక్రమణకు గురయ్యాయి. ఆక్రమణలపై అధికారులు పట్టించుకోకపోవడంతో భూ కబ్జాదారులు యథేచ్ఛగా ఆక్రమణలకు పాల్పడుతున్నారు. వీరిని చూసి చెరువు చుట్టు పొలాలు ఉన్న రైతులు సైతం ఆక్రమణకు పాల్పడుతున్నారు. చెరువుల్లో సైతం బోర్లను వేయించి దర్జాగా పంటలను సాగు చేస్తున్నారు.

కలిచెర్ల సమీపంలో ఆక్రమణకు గురైన చెరువు

★ పెద్దమండ్యం మండలంలో 3,500 ఎకరాల ఆయకట్టు భూములున్నాయి. 90 చెరువులు ఆక్రమణకు గురైనట్లు ఇరిగేషన్ అధికారులు అంచనా వేసినట్లు సమాచారం ఉంది. వంకలను సైతం చదును చేసి పొలాలుగా మార్చేసుకుంటున్నారు. పెద్దమండ్యం పాతచెరువు కింద పల్లె చెరువు, బండ్రేవు పెద్దచెరువు, గుడిసెవారిపల్లి చెరువు, బ్రాహ్మణచెరువు, రెడ్లచెరువు, సిద్ధవరం పెద్దచెరువు, బండమీదపల్లి నాయునిచెరువు, చింతలచెరువు కొత్తచెరువు, తిప్పిరెడ్డిచెరువు భారీగా ఆక్రమణకు గురయ్యాయి. చెరువుల్లో సైతం ఇల్లు నిర్మించుకున్నారు. బోర్లను సైతం వేసుకొని సొంత పొలాలకు నీటిని వాడుకుంటున్నారు. గ్రామస్థులు, చెరువుల ఆయకట్టు దారులు అధికారులకు ఫిర్యాదు చేసినా ఏ మాత్రం పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

★ బి.కొత్తకోట మండలంలోని కనగులకుంట చెరువు ఆక్రమణకు గురైనట్లు అధికారులకు ఫిర్యాదులు అందాయి. దీనిపై విచారణ చేయాల్సి ఉంది.

★ పీటీఎం మండలంలోని పీటీఎం చెరువు ఆక్రమణకు గురైంది. అదే విధంగా మండలంలోని కనగులకుంట సైతం ఆక్రమణకు గురైంది. పలుచోట్ల చెరువులు ఆక్రమణకు గురైంది.

★ ములకలచెరువు పెద్దచెరువు ఆనుకుని గుడారులు ఏర్పాటు చేసుకున్నారు. ఆయా మండలాల్లో చెరువులు ఆక్రమణకు గురి కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

సర్వే చేయించి చర్యలు తీసుకుంటాం

చెరువులు ఆక్రమణకు గురై ఉంటే ప్రజలు మా దృష్టికి తీసుకురావాలి. పెద్దమండ్యం మండలంలో చెరువుల ఆక్రమణ మా దృష్టికి వచ్చింది. వీటిపై సర్వే చేయించి ఆక్రమణదారుల నుంచి చెరువుల భూములు కాపాడుతాం. ఎవరైనా చెరువుల ఆక్రమణకు పాల్పడితే చర్యలు తీసుకుంటాం.

- చెన్నకేశవరెడ్డి, ఇరిగేషన్ డీఈ

విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : స్థానిక నెహ్రూ మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం పీడీ లత క్రీడా దుస్తులు, బూట్లు పంపిణీ చేశారు. పాఠశాలలో చదువుతున్న ఆరుగురు విద్యార్థులు జిల్లా, రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో సత్తా చాటడంతో వారికి ప్రోత్సాహకంగా వాటిని అందజేశారు. వీటిని ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మురళీధర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శీనప్ప చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

క్రీడా దుస్తులు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

దివ్యాంగులపై చిన్నచూపు తగదు

కేకుకోస్తున్న ఎంఈవోలు పద్మావతి, నారాయణ

నిమ్మనపల్లె, న్యూస్‌టుడే : దివ్యాంగులపై చిన్నచూపు చూడకుండా అన్నిరంగాల్లో వారిని ప్రోత్సహిస్తే ప్రతిభ నిరూపించుకునే అవకాశం ఉంటుందని ఎంఈవోలు పద్మావతి, నారాయణ పేర్కొన్నారు. సోమవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా స్థానిక భవిత కార్యాలయం వద్ద చిన్నపిల్లలతో కలసి ఎంఈవోలు కేకు కోశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం దివ్యాంగుల విద్యపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో మోడల్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు భాస్కరన్, భవిత కేంద్రం సిబ్బంది సురేశ్, అనురాధ, న్యామత్‌బీ, ఎంఆర్‌సీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విచారణ చేయాలని విన్నపం

పీలేరు గ్రామీణ, న్యూస్‌టుడే : పీలేరు మండలం పరిధిలో రబీ సీజన్‌లో ఎస్సీ, ఎస్టీ రైతులకు చేసిన ఉచిత వేరుసెనగ విత్తనకాయల పంపిణీపై విచారణ జరిపించాలని మాలమహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ధరణికుమార్ డిమాండు చేశారు. ఈ మేరకు సోమవారం తహసీల్దారు శివకుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

సమస్యల పరిష్కారానికి వినతుల వెల్లువ

అర్జీదారును విచారిస్తున్న సబ్ కలెక్టర్ చల్లా కల్యాణి

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే : సమస్యల పరిష్కారానికి వినతులు వెల్లువెత్తాయి. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారవేదికలో 136 మంది తమ సమస్యలపై వినతులను సబ్ కలెక్టర్ చల్లా కల్యాణికి అందజేశారు. మదనపల్లె నుంచి అంగళ్లు, గౌడసానివారిపల్లి, ముత్రావారిపల్లెల మీదుగా తరిగొండకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కలించాలని కోరుతూ గ్రామస్థులు శివారెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి వినతిపత్రం అందజేశారు. మదనపల్లె మండలం కోళ్లబైలు పంచాయతీకి కార్యదర్శి లేకపోవడంతో అభివృద్ధి పనులు కుంటుపడుతున్నాయని, కార్యదర్శిని నియమించాలని సర్పంచి ఆనంద్‌రెడ్డి, పంచాయతీ వార్డు సభ్యులు సబ్ కలెక్టర్ అర్జీ ఇచ్చారు. ప్రభుత్వ భవనాల నిర్మాణాలకు తీసుకున్న స్థలానికి సంబంధించిన పరిహారం అధికారులు బినామీ పేర్లపై మంజూరు చేశారని దీనిపై పూర్తిస్థాయిలో విచారించి న్యాయం చేయాలని కలికిరి గ్రామానికి చెందిన బాధితులు నూరానీ ఫిర్యాదు చేశారు. సీటీఎం క్రాస్‌లోని శ్రీయోగభోగేశ్వరస్వామి ఆలయానికి ప్రభుత్వ స్థలం కేటాయించాలని సీటీఎం గ్రామ ప్రజలు అర్జీ సమర్పించారు. అదే విధంగా రీసర్వే, అడంగల్, పాసు పుస్తకాల సమస్యలపై పలువురు అర్జీలు సమర్పించారు. వీటిపై విచారించి నివేదిక ఇవ్వాలని సంబంధిత అధికారులను సబ్ కలెక్టర్ ఆదేశించారు. భర్తతో తనకు ప్రాణహాని ఉందని రక్షణ కల్పించాలని మదనపల్లె ఇందిరానగర్‌కు చెందిన జోయాఖాన్ సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో విచారించాలని పోలీసును ఆదేశించారు.

యాచకులకు దుప్పట్ల అందజేత

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : చలికి తీవ్ర ఇబ్బందులు పడుతున్న యాచకులు, నిరాశ్రయులకు హెల్పింగ్ మైండ్స్ సంస్థ నిర్వాహకుడు అబుబకర్ సిద్ధిక్‌తోపాటు సభ్యులు ఆదివారం రాత్రి దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా తమ సంస్థ నిరాశ్రయులకు దుప్పట్లు అందిస్తున్నట్లు తెలిపారు. దీన్ని ఇలాగే కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు అర్షియా, ఫయాజ్, నవీన్, ఐజా, అలీఫా పాల్గొన్నారు.

మినీ స్టేడియం నిర్మించరూ!

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : మదనపల్లెలో మినీ స్టేడియం నిర్మించాలని కోరుతూ బహుజన యువసేన అధ్యక్షుడు పునీత్‌కుమార్ రాష్ట్ర రవాణా, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. సోమవారం విజయవాడలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో మంత్రిని కలిసి వినతి పత్రం అందజేశారు. మదనపల్లెలో యువతకు క్రీడా సౌకర్యాలు లేవని, ఈ కారణంగా రాష్ట్ర, జాతీయ స్థాయిలో జరిగే పోటీల్లో రాణించలేకపోతున్నారని వివరించారు. యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభ వెలికితీయాలంటే నాణ్యమైన శిక్షణ చాలా అవసరమన్నారు. ఇందు కోసం మినీస్టేడియం, క్రీడా మైదానం అవసరమన్నారు.

ఘనంగా అయ్యప్ప స్వామి ఊరేగింపు

కలికిరి, న్యూస్‌టుడే : కలికిరి పట్టణంలో అయ్యప్ప స్వామి మాలాధారులు స్వామి వారి గ్రామోత్సవాన్ని సోమవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా కలికిరి చుట్టపక్కల గ్రామాల అయ్యప్ప మాలాధారులు అయ్యప్ప స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని పురవీధుల్లో కోలాటాలు, బ్యాండు మేళ తాలాలతో అయ్యప్ప స్వామిని స్తుతిస్తూ ఊరేగించారు.

కలికిరి పట్టణంలో గ్రామోత్సవం నిర్వహిస్తున్న అయ్యప్ప స్వాములు

సైబర్ నేరాలపై అవగాహన

బి.కొత్తకోట, న్యూస్‌టుడే : డిజిటల్ అరెస్టులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బి.కొత్తకోట సీఐ గోపాల్‌రెడ్డి సూచించారు. సోమవారం బి.కొత్తకోట మండలం అయ్యావారిపల్లెలో ప్రజలకు పోలీసు శాఖ ద్వారా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ డిజిటల్ అరెస్టుల పేరిట మోసగాళ్లు చరవాణుల ద్వారా బెదిరిస్తున్నారని, దీనిపై తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. సైబర్ నేరాలకు పాల్పడుతున్న వారిపై బాధితులు ఫిర్యాదు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. బాలికలు, మహిళలపై వేధింపులతో పాటు దౌర్జన్యాలకు పాల్పడే వారిపై కేసులు పెడతామని స్పష్టం చేశారు.

అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా కృషి

బండి ఆనంద్‌ను సన్మానిస్తున్న భాజపా నాయకులు

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందజేయడానికి కృషి చేస్తానని ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి ఆనంద్ పేర్కొన్నారు. ఆయన్ను భాజపా నాయకులు సోమవారం పార్టీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తనపై ఉంచిన బాధ్యతను చిత్తశుద్ధితో చేయడానికి కృషి చేస్తానన్నారు. భాజపా నాయకుడు శ్రీనివాసులు, నియోజకవర్గం పార్టీ బాధ్యుడు భగవాన్ మాట్లాడుతూ ఈ నెల 14న అన్నమయ్య కూడలిలో దివంగత మాజీ ప్రధాని వాజ్‌పేయీ విగ్రహం ఏర్పాటు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. భాజపా నాయకులు నారదరెడ్డి, కిరణ్‌కుమార్, జర్మన్‌రాజు, రామ్‌దాస్, వెంకటరెడ్డి, జయచంద్రారెడ్డి, చలపతి తదితరులు పాల్గొన్నారు.

అనుసంధాన సాంకేతికతపై కార్యశాల

ప్రసంగిస్తున్న వీసీ యువరాజ్

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : అనుసంధాన సాంకేతికత గురించి విద్యార్థులు తెలుసుకోవాలని మిట్స్ డీమ్డ్ టుబీ విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ సి.యువరాజ్ అన్నారు. సోమవారం ఆ విశ్వవిద్యాలయంలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ట్రిపుల్‌ఈ కమ్యూనికేషన్ సొసైటీ స్టూడెంట్ చాప్టర్ వారి సహకారంతో అనుసంధాన సాంకేతికతపై మూడు రోజుల కార్యశాల నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వర్చువల్ పద్ధతిలో బెంగళూరు, గ్రీస్, స్వీడన్, చైనాకు చెందిన నిపుణులతో సమావేశం నిర్వహించారు. భవిష్యత్తులో అనుసంధాన వ్యవస్థలో 5జీ, క్లౌడ్ నెట్‌వర్క్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ యంత్ర అనుసంధాన కీలక పాత్ర పోషిస్తాయన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని విద్యార్థులు అనుసంధాన సాంకేతికతో నైపుణ్యత సాధించాలన్నారు. కార్యక్రమంలో అంతర్జాతీయ సంబంధిత డీన్ డాక్టర్ శ్రీమంతబసు, ప్రిన్సిపల్ డాక్టర్ రామనాథన్, విభాగాధిపతి డాక్టర్ ఎస్.రాజశేఖరన్, విజయలక్ష్మి, అరవిందరాజ్, నాగశ్వేత విద్యార్థులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

పతకాలు సాధించిన విద్యార్థులతో కరాటే మాస్టర్లు

మదనపల్లె విద్య : కరాటే పోటీల్లో మదనపల్లె యోధా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ విద్యార్థులు ప్రతిభ చూపినట్లు కరాటే మాస్టర్ సతీశ్ తెలిపారు. తిరుపతిలో ఈ నెల 7న జరిగిన రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో మదనపల్లెకు చెందిన దేవాన్ష్‌రెడ్డి (బంగారు పతకం), గగన్ (బంగారు పతకం), దిశాంత్ (వెండి పతకం), కుమితే విభాగంలో గగన్, దిశాంత్‌లు ప్రథమ స్థానంలో నిలిచినట్లు ఆయన తెలిపారు.

పీలేరు గ్రామీణ : పీలేరులోని యోధా కరాటే మార్షల్ ఆర్ట్స్ శిక్షణ కేంద్ర విద్యార్థులు కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచారని ఈ కేంద్రం నిర్వాహకులు తెలిపారు. తిరుపతిలో ఆదివారం జరిగిన పోటీల్లో ముదిత్ సాయి, ఆసిఫా, అర్ష్, శ్యాన్, షీమా, ఫహీం, నఫీజ్, ప్రజ్వల్, అభిరాం, మేఘా, లీలానంద్, చేతన, షాబాద్, భవిష్య, హార్దిక్, తస్లీం, ఆయేషా, గీతిక, తదితర విద్యార్థులు బంగారు, వెండి పతకాలు సాధించారన్నారు.

మల్లయ్యకొండలో ప్రత్యేక పూజలు

ప్రత్యేక అలంకరణలో ఏనుగుమల్లమ్మ అమ్మవారు

తంబళ్లపల్లె, ములకలచెరువు, న్యూస్‌టుడే : ప్రముఖ పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధి చెందిన తంబళ్లపల్లె మండలంలోని మల్లయ్యకొండలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారి నుంచే వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో మల్లయ్యకొండకు చేరుకుని శ్రీభ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామిని దర్శించుకున్నారు. అర్చకులు ఈశ్వరప్ప కొండపై వెలిసిన మల్లికార్జునస్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారిని దర్శించుకున్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కొండపైన ఆలయం వద్ద అన్నదానం నిర్వహించారు. అలాగే ఆలయానికి సమీపంలో ఉన్న గౌరమ్మ అమ్మ వారిని, మార్గమధ్యంలో ఉన్న ఏనుగుమల్లమ్మ అమ్మ వారిని భక్తులు దర్శించుకున్నారు. భక్తుల సౌకర్యార్థం మల్లయ్యకొండపైకి ఆర్టీసీ బస్సులు నడిపారు.

గొలుసు దుకాణ నిర్వాహకుడి అరెస్ట్

పెద్దతిప్పసముద్రం, న్యూస్‌టుడే : మండలంలోని రంగసముద్రంలో గొలుసు దుకాణం నిర్వహిస్తున్న శబరీష్‌ను అరెస్ట్ చేసి 180 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ పరమేశ్వర్‌నాయక్ తెలిపారు. రంగసముద్రంలో గొలుసు దుకాణం నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో సోమవారం సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి పట్టుకున్నామన్నారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించామన్నారు.

వృద్ధుడి ఆత్మహత్యా యత్నం

మదనపల్లె నేరవార్తలు: కుటుంబ సమస్యలతో మదనపల్లె మండలం రెడ్డివారిపల్లెకు చెందిన గురుమూర్తి (65) సోమవారం పొలం వద్దకు వెళ్లి పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. అపస్మారక స్థితిలో ఉన్న ఆయన్ను కుటుంబ సభ్యులు మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రూరల్ పోలీసులు విచారణ చేస్తున్నారు.

కారు బోల్తా.. ప్రయాణికులు క్షేమం

ములకలచెరువు, న్యూస్‌టుడే : మండలంలోని వేపూరికోట సమీపాన వంతెనపై సోమవారం ఉదయం పెను ప్రమాదం తప్పింది. పలువురు అయ్యప్పస్వామి భక్తులు ఇన్నోవాలో కదిరి నుంచి మదనపల్లె వైపు వస్తుండగా.. చిత్తూరు నుంచి అనంతపురం వైపు కారు వెళ్తుంది. ఎదురుగా వస్తున్న ఇన్నోవాను తప్పించబోయి కారు బోల్తా కొట్టింది. వేపూరికోట సమీపాన వంతెన వద్ద అధిక పొగమంచు కారణంగా ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. ములకలచెరువు పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

ఊరెళ్తే పోలీసులకు సమాచారం ఇవ్వండి

గుర్రంకొండ, న్యూస్‌టుడే : పట్టణంలో చోరీలు జరుగుతున్నందున ఊర్లకు వెళ్లే వారు పోలీసు స్టేషన్‌లో సమాచారం తెలిపితే రాత్రి వేళ ఇంటిపై నిఘా ఉంచడంతోపాటు రక్షణగా పోలీసులు ఉంటారని వాల్మీకిపురం సీఐ రాఘవరెడ్డి, ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. విలువైన వస్తువులు బంగారు, వెండి తదితర వాటిని తమ వెంట తీసుకెళ్లడం, లేదా బ్యాంకు లాకర్‌లో, నమ్మకం ఉన్న వారి ఇంట్లో ఉంచడం మేలని పేర్కొన్నారు. కొత్తవారు, అపరిచితులు మీ ఇళ్ల పరిసరాల్లో తిరుగుతున్నట్లు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. చోరీలను అరికట్టడంలో ప్రజలు తమకు అన్ని రకాలుగా సహకారం అందించాలని కోరారు.

వైభవంగా సంకష్ట హర చతుర్థి

అలంకరణలో చంద్రశేఖరస్వామి

రామసముద్రం, న్యూస్‌టుడే : రామసముద్రం దిగువపేటలో వెలిసిన చంద్రశేఖర స్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అలాగే ఆలయంలోని వినాయకస్వామికి సంకష్ట హర చతుర్థి పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయంలో అన్నదానం చేశారు.

అడుగుకో గుంత.. ప్రమాదాల చింత

పట్టణంలో కలికిరి - కలకడ ప్రధాన రహదారి మహల్ తెలుగు ఉన్నత పాఠశాల బస్టాప్ వద్ద గుంతలు పడి వాహనచోదకులు ఇబ్బందికరంగా రాకపోకలు సాగిస్తున్నారు. ఈ రహదారిపై గుంతలు పడడం.. కొద్ది పాటి వర్షానికి గుంతల్లో నీరు చేరడంతో చోదకులు అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి గుంతలకు మరమ్మతులు చేపట్టి ప్రమాదాలు నివారించాలని వాహనదారులు, గ్రామస్థులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, మహల్ (కలికిరి)

గ్రామీణ దారి.. అధ్వానంగా మారి

పీలేరు మండలం అగ్రహారం పంచాయతీ దేశిరెడ్డిగారిపల్లెకు వెళ్లే తారు రోడ్డు కంకరతేలి అధ్వానంగా మారింది. పీలేరు - సదుం బస్సు మార్గం నుంచి 500 మీటర్ల దూరంలో దేశిరెడ్డిగారిపల్లె ఉంది. ఈ అర కిలో మీటరు దూరం తారు మొత్తం లేచిపోయి గుంతలు తేలాయి. దీంతో ద్విచక్ర వాహన చోదకులు వాహనాలను ఇబ్బందిగా నడుపుతున్నారు. గత ఐదేళ్లుగా ఇలానే ఉన్నా ప్రజాప్రతినిధులు, అధికారులు గుంతలను తారు వేసి మరమ్మతులు చేయడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, పీలేరు

న్యుమోనియాపై అప్రమత్తత అవసరం

తల్లులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

వాల్మీకిపురం, న్యూస్‌టుడే : చలి కాలం ప్రారంభం కావడంతో ఊపిరితిత్తులలో నెమ్ము (న్యుమోనియా)పై తల్లులు అప్రమత్తంగా ఉండాలని, చిన్న పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ అధికారి మహమ్మద్ రఫీ అన్నారు. సోమవారం మండలంలోని మూరెవాండ్లపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో న్యుమోనియా వ్యాధిపై తల్లులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహమ్మద్ రఫీ మాట్లాడుతూ ఐదు సంవత్సరాలలోపు పిల్లల్లో మరణాలు సంభవించడం ప్రధాన కారణం న్యుమోనియా అని అన్నారు. ప్రమాదకరమైన ఈ వ్యాధిపై తల్లులకు అవగాహన అవసరమన్నారు. అనంతరం వ్యాధి వ్యాప్తి, నివారణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలతోపాటు చర్యలను తెలియజేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పుష్పావతి, అనసూయ, కిరణ్మయి, ఆశా కార్యకర్తలు శ్యామల, సుబ్బలక్ష్మి, రమాదేవి, తల్లులు పాల్గొన్నారు.

ధ్యానంతో జ్ఞానం.. ముక్తికి మార్గం

మాట్లాడుతున్న బ్రహ్మ మహర్షి ప్రేమ్‌నాథ్

పీలేరు, న్యూస్‌టుడే : ధ్యానం చేయడం ద్వారా జ్ఞానం, ముక్తి పొందొచ్చని బెంగళూరు బ్రహ్మ మహర్షి ప్రేమ్‌నాథ్ అన్నారు. సోమవారం పీలేరు ఆర్యవైశ్య కల్యాణ మండపంలో పీలేరు పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో ధ్యాన జ్ఞాన సప్తాహం ఆధ్యాత్మిక కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రేమ్‌నాథ్ మాట్లాడుతూ ధ్యానం ద్వారానే సామాన్యులు మహర్షులయ్యారన్నారు. అహింస పాటించాలని, మాంసాహారం వీడి.. ధ్యానం చేయాలని పేర్కొన్నారు. అహింస ద్వారానే మహాత్మాగాంధీ స్వాతంత్ర్యాన్ని సాధించారన్నారు. కార్యక్రమంలో పిరమిడ్ అధ్యక్షుడు రేవూరి సుధీర్, విశ్రాంత ఉపాధ్యాయులు సిద్దయ్య, భగవాన్, వివేకానంద రఘునాథరెడ్డి, విశ్రాంత వ్యాయామ అధ్యాపకులు సిద్దులమ్మ పాల్గొన్నారు

రోడ్డు నిర్మించాలని నిరసన

నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్థులు

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే : మండలంలోని బొమ్మనచెరువు నుంచి పుంగనూరు రోడ్డు క్రాస్ వరకు దెబ్బతిన్న రహదారి నిర్మించాలని మూడు పంచాయతీల ప్రజలు డిమాండు చేశారు. బొమ్మనచెరువు, కొత్తపల్లె, కోటావారిపల్లె పంచాయతీలకు చెందిన ప్రజలు సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ బండకాడపల్లె మీదుగా ఉన్న ఈ మార్గంలో దాదాపు 20 గ్రామాలున్నాయన్నారు. రోడ్డుపై గుంతలు ఏర్పడటంతో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశీలించి రోడ్డు నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో బండకిందపల్లె, నారవాండ్లపల్లె, నాయనివారిపల్లె, అడవీలోపల్లె, బండకాడపల్లె, గుట్టవారిపల్లె, పాకాలవారిపల్లె గ్రామస్థులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలని వినతి

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : పట్టణంలోని బి.కె.పల్లె వైఎస్ఆర్‌కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ ప్రమీలకు సీపీఐ నాయకులు వినతిపత్రం ఇచ్చారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజల నుంచి కమిషనర్ వినతులు స్వీకరించారు. పారిశుద్ధ్యం, వీధి దీపాలు తదితర సమస్యలపై వినతులు రాగా.. వెంటనే వాటిని పరిష్కరించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటసుబ్బయ్యను కమిషనర్ ఆదేశాలిచ్చారు.

మత్తు పదార్థాల నిర్మూలనకు సహకరిద్దాం

గంజాయి అరికట్టేందుకు చేతులెత్తి సంఘీభావం తెలుపుతున్న సీపీఐ, ఏఐవైఎఫ్ ప్రతినిధులు

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే : యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కృష్ణప్ప, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వెంకటేశ్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో గంజాయి, మత్తు పదార్థాల నిర్మూలనకు యువత చేపట్టాల్సిన చర్యలపై ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో చాలా ప్రాంతాల్లో యువత గంజాయి, డ్రగ్స్‌కు అలవాటుపడి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్నారు. ఇందుకు యువతతోపాటు ప్రజలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. సందర్భంగా సీపీఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులు గంగాధర్, మల్లికార్జున, బాబ్జీ, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80080 01768
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

(c) eenadu

రాయచోటి

• రాయచోటి • రాజంపేట • రైల్వేకోడూరు

ఫిర్యాదుల పరిష్కారానికే వేదిక

సమస్యలు వింటున్న సబ్ కలెక్టర్ భావన

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: రెవెన్యూ సమస్యలపై వచ్చే ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని రాజంపేట సబ్ కలెక్టర్ భావన తెలిపారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలోని వివిధ మండలాల నుంచి వచ్చిన రైతులు, ప్రజలు తమ సమస్యలను సబ్ కలెక్టర్‌కు విన్నవించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రైతులు నుంచి వచ్చిన సమస్యలను రెండు రోజుల్లో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని అధికారులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

చిట్వేలి(పుల్లంపేట), న్యూస్‌టుడే: సీఎం సహాయ నిధి పేదలకు ఓ వరం అని ఎమ్మెల్యే అరవ శ్రీధర్ అన్నారు. చిట్వేలి మండలంలో సోమవారం ఆయన రూ.6.53లక్షల విలువ గల సీఎం సహాయనిధి చెక్కులను బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు సాయివికాష్‌రెడ్డి, వరలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

నేతివారిపల్లెలో బాధితురాలికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్, నాయకులు

ప్రతిభకు పురస్కారం

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని విక్టరీ ఉన్నత పాఠశాలలో 'ఈనాడు - ఈటీవీ' ఆధ్వర్యంలో విద్యార్థులకు సోమవారం ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం అనే అంశంపై ఉపన్యాస పోటీలు ఏర్పాటు చేశారు. ఈ పోటీలకు విద్యార్థులు ఆసక్తిగా పాల్గొన్నారు. వారిలో 9వ తరగతికి చెందిన ఎస్.తనుశ్రీ, యు.రితికశ్రీ, జి.లాస్య అనే విద్యార్థినులు విజేతలుగా నిలిచారు. వారికి కరస్పాండెంట్ నరసింహారెడ్డి బహుమతులు అందజేశారు. ప్రిన్సిపల్ రామకృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోటీలో ఉపన్యసిస్తున్న విద్యార్థిని

విజేతలకు బహుమతులు అందజేస్తున్న కరస్పాండెంట్ నరసింహారెడ్డి, ఉపాధ్యాయులు

ప్రతీ సమస్యను పరిష్కరించండి

✧ కలక్టరేట్‌కు పోటెత్తిన అర్జీదారులు

రాయచోటి, న్యూస్‌టుడే: రాయచోటి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అర్జీదారులు పోటెత్తారు. క్షేత్రస్థాయిలో సమస్యకు పరిష్కారం లభించకపోవడంతో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలనే ఆలోచన అర్జీదారుల్లో విపరీతంగా పెరిగింది. ప్రజల నుంచి తీసుకున్న వినతులను అక్కడే ఉన్న అధికారులకు ఎండార్స్ చేసి నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఆదేశించారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో జేసీ ఆదర్శ్ రాజేంద్రన్, డీఆర్వో మధుసూదన్‌రావు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

అర్జీదారు సమస్యలు తెలుసుకొంటున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

■ ఓబులవారిపల్లె మండలానికి చెందిన పెంచలయ్య తన కుటుంబానికి వచ్చే దీపం పథకం తన తల్లిపేరుపై ఉందన్నారు. ఆ గ్యాస్ కనెక్షన్‌ను తన భార్య పేరుపై మార్చాలని అధికారులను కోరినా పరిష్కారం కావడం లేదని కలెక్టర్‌కు అర్జీ సమర్పించారు.

■ రాయచోటి నియోజకవర్గంలోని లక్కిరెడ్డిపల్లె, రామాపురం, రాయచోటి మండలాల్లో ఉన్న ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతున్నాయని సీపీఐ నాయకులు శ్రీనివాసులు కలెక్టర్‌కు అర్జీ సమర్పించారు. అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

■ రాయచోటి, గాలివీడు మండలాల్లో అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని దళిత హక్కుల పోరాట సమితి నాయకులు సుధీర్, సీఐటీయూ నాయకులు రామాంజనేయులు వినతిపత్రం అందజేశారు.

■ చిట్వేలి మండలానికి చెందిన ఫణీంద్రారెడ్డి తాను పండించిన మామిడి కాయలను ఓ ప్రైవేట్ మండీ వ్యాపారికి విక్రయించానన్నారు. తనకు ప్రభుత్వం నుంచి రావాల్సిన రాయితీ మొత్తం జమ కాలేదని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. తనకు న్యాయం చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు.

బీమా పథకాల అమలుకు చర్యలు

గాలివీడు, న్యూస్‌టుడే: తపాలా శాఖ అమలు చేస్తున్న బీమా పథకాలు ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఏఎస్పీ(పోస్టల్) విజయ భాస్కర్‌రెడ్డి తెలిపారు. స్థానిక తపాలా కార్యాలయంలో సోమవారం మహా బీమా సంకల్ప్ 2.0 విజయవంతంపై సమావేశం నిర్వహించారు. పీఎల్ఐ, ఆర్‌పీఎల్ఐ బీమా పథకాలను విజయవంతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. కార్యక్రమంలో కడప డివిజన్ బీమాభివృద్ధి అధికారి మునాఫ్, రాయచోటి సబ్ డివిజన్ ఎంవో హరినాధ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తపాలా శాఖ ఏఎస్పీ విజయభాస్కర్

14 నుంచి విద్యుత్తు వారోత్సవాలు

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: రాజంపేట డివిజన్ పరిధిలో డిసెంబర్ 14 నుంచి 20వ తేదీ వరకు విద్యుత్తు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు డివిజనల్ ఈఈ రాజశేఖర్‌రెడ్డి సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలోని 9, 10వ తరగతి విద్యార్థులకు ఈ నెల 10న మన్నూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యాసరచన, క్విజ్ పోటీలు వంటివి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. డివిజనల్ పరిధిలో ప్రతిభ చూపిన విద్యార్థులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు.

అడుసు తొక్కాల.. కార్యాలయాల్లో అడుగు పెట్టాల

ఈ చిత్రం రాజంపేట పట్టణంలోని ఎంపీడీవో, విద్యాశాఖ, వ్యవసాయశాఖ కార్యాలయాల్లోకి వెళ్లే రహదారి. మండల పరిషత్ ఆధ్వర్యంలో మండలంలోని అన్ని పంచాయతీల్లో రహదారులను నిర్మిస్తుంటారు. అలాంటిది మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లే మార్గమే దారుణంగా ఉంది. ఎన్నిసార్లు పత్రికల్లో వచ్చినా అధికారుల్లో చలనం లేకపోవడం విమర్శలకు తావిస్తోంది.

రాజంపేట, న్యూస్‌టుడే: పట్టణంలో ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాలంటే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి వర్షాలకు కార్యాలయాల ఎదుట నీరు నిలిచి బురదమయంగా మారుతున్నాయి. పనుల కోసం కార్యాలయాలకు వచ్చే ప్రజలు ఆ బురదలోనే రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది

ఈ చిత్రం రాజంపేట పట్టణం నూనెవారిపల్లి మార్గంలోని ఐసీడీఎస్ కార్యాలయంలోకి వెళ్లే రహదారి. ఈ కార్యాలయం పరిధిలోకి రాజంపేట, నందలూరు, పెనగలూరు మండలాల్లోని అంగన్వాడీ కేంద్రాలు వస్తాయి. నిత్యం ఇక్కడికి అంగన్వాడీ కార్యకర్తలు, అధికారులు వస్తూ ఉంటారు. కానీ రహదారి తమకు పట్టదన్నట్లుగా దానిపై దృష్టి పెట్టకపోవడం విశేషం.

రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలని మిన్నంటిన ఆందోళనలు

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: రాజంపేటను జిల్లా కేంద్రంగా ప్రకటించాలని రోజురోజుకు నిరసన కార్యక్రమాలు పెరుగుతున్నాయి. విద్యార్థి సంఘాలు, వివిధ రాజకీయ నేతలు, విద్యావంతులు, నాయకులు కలిసి జేఏసీగా గత నెల రోజులుగా ర్యాలీలు, నిరసనలు చేస్తున్నారు. ముఖ్యంగా విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకుల ఆధ్వర్యంలో భారీ ఎత్తున సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా విద్యార్థులు పాల్గొనడంతో వీరికి సామాన్య ప్రజలు కూడా మద్దతు తెలిపారు. అనంతరం రాజంపేట సబ్ కలెక్టర్ కార్యాలయానికి ర్యాలీగా చేరుకుని సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు ఛైర్మన్ గన్నే సుబ్బనరసయ్య నాయుడు, సింగల్ విండో అధ్యక్షుడు సుబ్రహ్మణ్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

● రాజంపేట పురపాలక వైస్ ఛైర్మన్ మర్రి రవి మూడు రోజులుగా రాజంపేట పట్టణం రోడ్లు భవనాల శాఖ కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్ష చేస్తున్నారు. రాజంపేటను జిల్లా కేంద్రంగా ప్రకటించే వరకు ఈ దీక్ష సాగిస్తానని ఆయన వెల్లడించారు.

ఓబులవారిపల్లె, న్యూస్‌టుడే: రాజంపేటను అన్నమయ్య జిల్లా కేంద్రంగా ప్రకటించాలని సోమవారం బొమ్మవరం గ్రామ ప్రజలు ర్యాలీ నిర్వహించారు. రాజంపేటకు భౌగోళిక, పరిపాలనా పరంగా అన్ని అర్హతలున్నాయన్నారు. పౌర హక్కుల పరిరక్షణ, ప్రాంత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఈ కార్యాచరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు పాల్గొన్నారు.

రాజంపేటలో రైల్వే వంతెనపై విద్యార్థినుల భారీ ర్యాలీ

ఓబులవారిపల్లె : బొమ్మవరంలో నిరసన వ్యక్తం చేస్తున్న స్థానికులు

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని నిరసన

లక్కిరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: సహకార సంఘం ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని జిల్లా సహకార సంఘం ఉద్యోగుల యూనియన్ అధ్యక్షుడు సీవీ సుబ్బారెడ్డి కోరారు. స్థానిక డీసీసీ బ్యాంకు వద్ద ఉద్యోగులతో కలిసి సోమవారం ఆయన నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2019వ సంవత్సరం తర్వాత సంఘంలో చేరిన ఉద్యోగులను క్రమబద్ధీకరించాలన్నారు. ఏజీఎం రాజేంద్రనాథ్‌రెడ్డి, డీజీఎం వై.ప్రతాప్‌రెడ్డి, మేనేజరు రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న సహకార సంఘం ఉద్యోగులు

జిల్లా స్థాయిలో రాణించాలి

సుండుపల్లి, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల్లో ఉత్సాహాన్ని, నాయకత్వ లక్షణాలను పెంచేందుకు ప్రభుత్వం క్రికెట్ పోటీలు నిర్వహిస్తోందని ఎంఈవో వెంకటేశునాయక్ తెలిపారు. ఉపాధ్యాయులు క్రీడల్లో పాల్గొని ప్రతిభ చూపాలన్నారు. అనంతరం క్రీడా పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోటీలు ప్రారంభిస్తున్న ఎంఈవో వెంకటేసు నాయక్

జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక

పుల్లంపేట, న్యూస్‌టుడే: జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు పుల్లంపేట ఆదర్శపాఠశాల విద్యార్థి రిషిత్‌వర్మ ఎంపికైనట్లు ప్రిన్సిపల్ లీలాశ్రీహరి, పీడీ నీలకంఠేశ్వరరావు సోమవారం తెలిపారు. ఎస్‌జీఎఫ్ అండర్-19 బాలబాలికల రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు ఇటీవల గుంటూరు జిల్లాలో జరిగాయి. ఈ పోటీల్లో ప్రతిభ చూపడంతో రిషిత్‌వర్మను రాష్ట్ర జట్టులో స్థానం కల్పించారు. వచ్చే ఏడాది జనవరిలో జరగబోయే జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఏపీ జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నారన్నారు. ఎంపికైన విద్యార్థిని ఉమ్మడి కడప జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి చంద్రమోహన్‌రాజు అభినందించారు.

ఎంపికైన విద్యార్థి రిషిత్‌వర్మ

కౌశల్ పోటీలకు బోయనపల్లి విద్యార్థిని

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: మండలంలోని బోయనపల్లి జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని ఎం.గోపిక రాష్ట్ర స్థాయి కౌశల్ పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల హెచ్‌ఎం భారతి సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఆమె మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థిని ఎం.గోపికను అభినందిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు

ఐకాస నేతలకు పూర్తి సహకారం

నాయకులతో మాట్లాడుతున్న చమర్తి జగన్ మోహన్‌రాజు

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: రాజంపేటను జిల్లా కేంద్రంగా ప్రకటించాలని తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు సోమవారం తెలిపారు. రాజంపేట తెదేపా కార్యాలయంలో నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజంపేటను జిల్లా కేంద్రంగా ప్రకటించే వరకు జేఏసీ నేతలకు పూర్తి సహకారం అందించడంతోపాటు, నిరసన కార్యక్రమాల్లో పాల్గొంటానన్నారు. ఈ ప్రాంతంలోని ప్రజల అభిప్రాయాన్ని ప్రభుత్వానికి తెలిసేలా చేయాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక తెదేపా నేతలు, నాయకులు పాల్గొన్నారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ తగదు

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేయాలన్న నిర్ణయం సరికాదని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నరసింహ అన్నారు. పట్టణంలోని ఎన్జీవో కార్యాలయంలో సోమవారం ఆయన అధ్యక్షతన జిల్లా స్థాయి విస్తృత సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం విద్యను ప్రైవేటు, కార్పొరేట్ వ్యక్తులకు అప్పజెప్పే ప్రయత్నం చేస్తోందన్నారు. ఈ నిర్ణయం బడుగు, బలహీన వర్గాలకు వైద్య విద్యను దూరం చేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రమణ, సహాయ కార్యదర్శి లతీఫ్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నరసింహ

భవిత కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి

గాలివీడు, న్యూస్‌టుడే: దివ్యాంగులు భవిత కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవోలు నాగరాజు, శ్రీనివాసులు తెలిపారు. స్థానిక ఎంపీపీ పాఠశాలలోని భవిత కేంద్రంలో సోమవారం అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం దివ్యాంగుల విద్యార్థుల కోసం ప్రత్యేక పథకాలు అమలు చేస్తోందన్నారు. వారికి ఆటల పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బహుమతి అందజేస్తున్న హెచ్‌ఎం వెంకట రమణారెడ్డి

దివ్యాంగుల జీవనోపాధికి చేయూత

లక్కిరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో 100 శాతం రాయితీ కల్పించాలని అన్నమయ్య జిల్లా దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు వెంకటరామరాజు అన్నారు. ఆయన విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం మంత్రిని కలిసి వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం దివ్యాంగుల జీవనోపాధి కోసం చేయూతనివ్వాలన్నారు. దీనిపై స్పందించిన మంత్రి దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారన్నారు.

మంత్రి రాంప్రసాద్‌రెడ్డితో వివిధ ప్రాంతాల దివ్యాంగులు

దాడి ఘటనలపై ఎస్పీకి ఫిర్యాదు

రాయచోటి, న్యూస్‌టుడే: అన్నమయ్య జిల్లాలో వైకాపా కార్యకర్తలపై దాడులకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వైకాపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే అమరనాథరెడ్డి కోరారు. ఇటీవల రాయచోటిలో జరిగిన దాడిలో గాయపడిన విజయభాస్కర్‌తో కలిసి వారు సోమవారం జిల్లా ఎస్పీ ధీరజ్‌కు ఫిర్యాదు చేశారు. జిల్లాలో ఇప్పటికే చాలా చోట్ల దాడులు జరిగినా పోలీసులు తగిన చర్యలు తీసుకోవడం లేదన్నారు. దాడులకు సంబంధించిన నిందితులపై కఠిన చర్యలు తీసుకొంటామని ఎస్పీ హామీ ఇచ్చారని వారు వివరించారు.

రాజశ్రీ రాయచోటి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

OS No. 287/2021

షేక్ హజీరా, భర్త షామీర్ బాషా, R/o D.No. 31/72/A, అలీమబాద్ వీధి, రాయచోటి టౌన్ మరియు మండలం, అన్నమయ్య జిల్లా - వాది

Vs

1. షేక్ ఖాదర్ బాషా, తండ్రి మహబూబ్ బాషా, R/o సుకుర్‌మియా వీధి, రాయచోటి టౌన్ & మండలం, అన్నమయ్య జిల్లా.
2. మయాన షఫీవుల్లా, తండ్రి జమ్‌రుద్ అలీఖాన్, R/o S.N.కాలనీ, రాయచోటి టౌన్ & మండలం, అన్నమయ్య జిల్లా. - ప్రతివాదులు D3 & D6

ప్రకటన

పై నెంబరు యొక్క దావాలో రెస్పాండెంట్స్/ప్రతివాదులు 3 & 6 అయిన మీ మీద దావా దాఖలు చేసియున్నారు. దావా వాయిదా ఈ దినము అనగా 17.12.2025వ తేదీన యుంటూఉన్నది. అందువలన మీరు ఉదయం 10.30 గం॥లకు స్వయంగా గానీ, మీ వకీలు ద్వారా గానీ సదరు కోర్టుకు హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనంతట మీ పరోక్షమున తీర్మానించబడును.

స్థలం : రాయచోటి తేదీ : 07.12.2025

ఇట్లు : యస్.ప్రభాకర్‌రెడ్డి, వాది తరఫున వకీలు, రాయచోటి.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

రాయచోటి: నిబంధనలు అతిక్రమించి వాహనాలను నడిపితే కఠిన చర్యలు తీసుకొంటామని ట్రాఫిక్ సీఐ హెచ్చరించారు. పట్టణంలో సామర్థ్యానికి మించి విద్యార్థులను ఆటోలో తరలిస్తుండగా ఆయన తనిఖీ చేశారు. పరిమితికి మించి జనాలను ఎక్కిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. ఆటోలపై పోలీసు నంబర్లు ప్రదర్శించాలన్నారు.

విద్యుత్తు బిల్లుల చట్టంపై పునఃపరిశీలించాలి

రామాపురం, న్యూస్‌టుడే: వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు అప్పగించేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి విమర్శించారు. మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయం ఎదుట సోమవారం రైతు సంఘం నాయకులతో కలిసి ఆయన నిరసన నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న నూతన విద్యుత్తు బిల్లుల చట్టంపై కేంద్ర ప్రభుత్వం పునఃపరిశీలన చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

డాక్యుమెంట్ పోయినది

గునిపాటి వెంకటలక్ష్మమ్మ, భర్త గునిపాటి కేశవులు, R/o D.No: 1, RR సెంటర్-I, మంగంపేట, YSR కడప జిల్లా (ప్రస్తుతం అన్నమయ్య జిల్లా), A.P.కి చెందిన నేను ఎల్.మణిమంత నాయుడు VIDE DOCUMENT No: 6189/1986 Dt: 16-10-1986 ద్వారా కొనుగోలు చేయబడిన Plot No: 6, H.D.No: 6-56, Sy. No: 232, WARD No: 14, పద్మావతిపురం రెసిడెన్షియల్ ఏరియా, తిరుచానూరు విలేజ్ అకౌంట్స్, తిరుపతి రూరల్ మండలం, తిరుపతి జిల్లాకి సంబంధించిన ఇంటి డాక్యుమెంట్ మంగంపేటలోని మా శాశ్వత ఇంటినందు ఇల్లు క్లీనింగ్ చేయుచుండగా పోవడం జరిగినది. కనుక దొరికిన వారు క్రింది వారికి తెలియజేయగలరు.

Cell : 9949095911

పర్యావరణ రక్షణ అందరి బాధ్యత

మొక్క నాటుతున్న విద్యార్థిని

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారి కె.వెంకట నరసయ్య సోమవారం తెలిపారు. మండలంలోని ఎన్టీఆర్ కాలనీ ప్రభుత్వ పాఠశాల ఆవరణంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు మొక్కలు నాటారు. అనంతరం ఎన్ఎస్ఎస్ అధికారి మాట్లాడుతూ ఆయుర్వేద మొక్కలైన గన్నేరు, కానుగ, వేప తదితర మొక్కలు పెంచడంతో పర్యావరణ కాలుష్యం తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, స్థానిక ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు

Cell: 99899 97626

ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి

Cell: 91771 11468

మలుపులు.. ప్రమాద పిలుపులు

మదనపల్లె రోడ్డులో కుషావతి నది సమీపంలోని మలుపు

గాలివీడు, న్యూస్‌టుడే: మండలంలోని రహదారులపై పలు చోట్ల మూల మలుపులు మృత్యు పిలుపులుగా మారాయి. ఏళ్ల నుంచి సరిచేయడంలో శ్రద్ధ చూపడం లేదు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోవడం లేదు. రోడ్డు ప్రమాదాల్లో కుటుంబ యజమానులను కోల్పోయి సభ్యులు అనాథలుగా మారుతున్నా పట్టించుకునే వారు కరవయ్యారు. వైకాపా పాలనలో రహదారుల అభివృద్ధి పైసా కూడా విడుదల చేయలేదు. గాలివీడు-మదనపల్లె, రాయచోటి, లక్కిరెడ్డిపల్లె, కదిరి ప్రధాన మార్గాల్లో ప్రమాదాలు జరగకుండా తగిన ఏర్పాట్లు చేయడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఎక్కడెక్కడ ఉన్నాయంటే...

● వడిశలవంక సమీపంలో నాలుగు చక్రాల వాహనం ఢీకొని ద్విచక్ర వాహనంలో వెళ్తున్న ముగ్గురు ఘటనా స్థలంలోనే మృత్యువాత పడ్డారు. ● ప్యారాల గుట్ట ప్రాంతంలో ఆటో, బస్సు, ట్రాక్టర్లు బోల్తా పడిన ఘటనల్లో పలువురు మరణించారు. ● ప్యారంపల్లె, వెలిగల్లు, గుర్రాల మిట్ట గుట్ట మలుపుల్లో జరిగిన ప్రమాదాల్లో ద్విచక్ర వాహన చోదకులు మృతి చెందారు. ● గాలివీడు-నూలివీడు, తలముడిపి గ్రామీణ దారులపై ఉన్న మలుపుల్లో వాహన ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. ● ప్యారంపల్లె మిట్ట వద్ద ఏటా ప్రమాదాలు జరుగుతున్నా ఎవరూ పట్టించుకోలేదని బాధితులు వాపోతున్నారు. ● బందారు చెట్ల వంక మలుపు వద్ద కల్వర్టు అధ్వానంగా తయారైంది. పందికుంట కొండ మలుపుల్లో చోదకులు ఆదమరిస్తే వాహనాలు అదుపు తప్పుతున్నాయి. ● రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రులైన వారు దివ్యాంగులుగా మారుతున్నారు. వీరిపై ఆధార పడిన కుటుంబ సభ్యులకు తీరని కష్టాలను మిగిల్చుతున్నారు. కూటమి పాలనలో రోడ్ల అభివృద్ధిపై పాలకులు, అధికారులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని గ్రామస్థులు కోరుతున్నారు.

10వ వర్ధంతి

మాకు తోడు నీడగా, కలకాలం అండగా ఉంటావనుకున్న నీవు... ఆకస్మికంగా మా నుండి దూరమై 10 సం॥ గడిచినను... నీవు మాతో గడిపిన మధుర జ్ఞాపకాలను నేటికీ మరువలేకున్నాము. నీ పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ...

తాతయ్య : దార్ల చంద్రశేఖర్
Rtd. తహసీల్దార్, నందలూరు & సర్పంచ్, కె.బుడుగుంటపల్లి
అమ్మమ్మ : శ్రీమతి స్వర్ణలతాదేవి, Rtd. Head Mistress
Z.P.Girls High School, రైల్వేకోడూరు.
చెల్లెలు : వర్షిణి తమ్ముడు : రన్విత్
మరియు కుటుంబ సభ్యులు

శ్రీ॥శే॥ కె.హేమ్‌శ్రీష్ (హేని)
కె.బుడుగుంటపల్లి, రైల్వేకోడూరు (మం.)
మరణం : 9-12-2015

శ్రీష్ మందిరం, తిరుపతి.
(ప్రత్యేక అవసరాలు గల పిల్లల పాఠశాల)

(c) eenadu

జానపద నృత్యంలో యువతుల అభినయం

అలరించిన జానపదం.. పరవశించిన యువతరం

ఏఎన్‌యూ, న్యూస్‌టుడే : ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలో యువజనోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య గంగాధర్ వీటిని ప్రారంభించారు. ఉత్సవాల్లో తొలిరోజు దాదాపు 22 కళాశాలల నుంచి 400 మంది విద్యార్థులు పాల్గొన్నారు. తొలిరోజు బృంద నృత్యాలు, జానపద గేయాలు, మైమ్స్, థియేటర్ ఆర్ట్స్, సంగీతం, చిత్రలేఖనాలతో అలరించారు. సిమ్స్ విద్యార్థుల జానపద గేయాలు ఆకట్టుకున్నాయి. ఏఎన్‌యూ విద్యార్థులు వేసిన మైమ్స్ ఆలోచింపజేశాయి.

మైమ్స్ ప్రదర్శన

నిర్వహణ మరిచి.. సంపద వదిలేసి

నిరుపయోగంగా ఘన వ్యర్థ కేంద్రాలు

పేటేరు(రేపల్లె అర్బన్), న్యూస్‌టుడే

పంచాయతీలకు ఆదాయం తెచ్చి పెట్టేందుకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. జిల్లాలోని పలు గ్రామాల్లో నిర్వహణ సరిలేక అలంకార ప్రాయంగా మారాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు ఎంత చెప్పినా పరిస్థితుల్లో మార్పు రావడంలేదు.

వృథాగా చెత్త సంపద కేంద్రం

జిల్లాలో 365 కేంద్రాలు

జిల్లాలోని 459 పంచాయతీల్లో 365 ఘన వ్యర్థ నిర్వహణ కేంద్రాలున్నాయి. వీటిలో సగానికిపైగా అలంకారప్రాయంగా మారాయి. మొదట్లో కొన్నిచోట్ల నిర్వహణ బాగున్నా గత వైకాపా ప్రభుత్వ పాలనలో గాలికొదిలేశారు. కార్మికులు ఇంటింటా తిరిగి సుమారు 80 టన్నుల వరకు వ్యర్థాలు సేకరిస్తున్నారు. వాటి ద్వారా కంపోస్టు తయారీ చేసి విక్రయించడం ద్వారా లక్షల ఆదాయం సమకూరుతుంది. చాలాచోట్ల కేంద్రాలు నిరుపయోగంగా మారడంతో ఆదాయం నామమాత్రం అయ్యింది. కార్మికులు సేకరించిన వ్యర్థాలను గ్రామ శివారుల్లో వేస్తున్నారు. అధికారులు, నాయకులు పర్యటించే ముందు కాల్చేస్తున్నారు. ముఖ్యంగా రేపల్లె, బాపట్ల, వేమూరు నియోజకవర్గాల్లో కేంద్రాల నుంచి సంపద సృష్టి ప్రక్రియ జరగడంలేదు. గ్రామాల్లో సేకరించిన తడి-పొడి చెత్త వేరు చేసి కంపోస్టు ఎరువుగా మార్చేలా పంచాయతీ అధికారులు, కార్మికులకు శిక్షణ ఇచ్చినా ఉపయోగం లేకుండా పోయింది. కార్మికుల కొరత, ఉన్నవారిపై పని ఒత్తిడి వల్లనే కేంద్రాలు నిరుపయోగంగా మారాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

వినియోగంలోకి తెస్తాం

ఘనవ్యర్థాల నిర్వహణ కేంద్రాలను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తెచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నాం. ఇళ్ల నుంచి తడి-పొడి చెత్త సేకరించి సంపద సృష్టించేలా చర్యలు చేపడతాం. సేంద్రీయ ఎరువు తయారీ చేసి తక్కువ ధరకు రైతులకు విక్రయించి ఆదాయాన్ని సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటాం.
- పద్మ, రేపల్లె డివిజనల్ అభివృద్ధి అధికారిణి

పడవల రాకపోకలకు ప్రత్యేకంగా నిర్మించిన వంతెన

జల రవాణాకు అనువు..
కొమ్మమూరు కాలువ

1970 దశకం వరకు పడవల రాకపోకలు

ఆంగ్లేయుల కాలంలో 1837లో కొమ్మమూరు కాలువ(బకింగ్ హామ్ కెనాల్)ను తవ్వారు. కాలువ గుండా విజయవాడ నుంచి పడవల్లో చెన్నైకు ఆహార ధాన్యాలు, వస్తువుల రవాణా జరిగేది. బాపట్ల జిల్లాలో 37 కి.మీ. పొడవున కాలువ ఉంది. బాపట్ల మండలం నరసాయపాలెం సమీపంలో పడవల రాకపోకలకు అనువుగా కాలువలో ఎత్తయిన వంతెనలు, లాకుల వద్ద ప్రత్యేక మార్గాన్ని నిర్మించారు. 1974 వరకు జల రవాణా మనుగడలో ఉండటంతో బాపట్ల, పర్చూరు, కారంచేడు, వేటపాలెం, చినగంజాం మండలాల నుంచి విద్యార్థులు, వ్యాపారులు పడవల్లో చేబ్రోలు వరకు వెళ్లి అక్కడి నుంచి రోడ్డు మార్గాన గుంటూరుకు చేరుకునేవారు. అప్పటి నిర్మాణాలు నేటికీ ఉన్నాయి. కృష్ణా పశ్చిమ డెల్టాలో ప్రధాన సాగునీటి కాలువగా గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలో 2.68 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తోంది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో కాలువలో జల రవాణా పునరుద్ధరణపై 2008లో సర్వే ప్రారంభమైంది. కాలువ కట్టలు పటిష్ఠం చేసి, సరకు రవాణా పడవల కోసం కట్టడాల నిర్మాణానికి రూ.3500 కోట్లు అవసరమని జలవనరుల శాఖ అధికారులు అంచనా వేశారు. అయితే ప్రాజెక్టు ప్రతిపాదనల దశలోనే ఉండిపోయింది.
- న్యూస్‌టుడే, బాపట్ల

ఆరు కేసులు..
రెండు మరణాలు

స్క్రబ్‌టైఫస్ బాధితులకు ప్రత్యేక వార్డుల ఏర్పాటు

న్యూస్‌టుడే, బాపట్ల

స్క్రబ్ టైఫస్ వ్యాధి జిల్లాలో క్రమంగా విస్తరిస్తోంది. ఇప్పటి వరకు ఆరు కేసులు నమోదు కాగా రెండు మరణాలు సంభవించాయి. దీంతో వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. వ్యాధిగ్రస్థులకు అందించాల్సిన చికిత్సపై వైద్యులు, సిబ్బందికి ఉన్నతాధికారులు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ప్రాంతీయ, సామాజిక ఆసుపత్రుల్లో బాధితుల కోసం ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేసి ఔషధాలు అందుబాటులో ఉంచారు.

★ జిల్లాలోని రేపల్లె, పిట్టలవానిపాలెం, కర్లపాలెం, సంతమాగులూరు మండలాల్లో స్క్రబ్ టైఫస్ కేసులు నమోదయ్యాయి. వ్యాధి తీవ్రత పెరిగాక బాధితులు ఆసుపత్రులకు వెళ్తుండటంతో వైద్యులు చికిత్స చేసి కాపాడటానికి అవకాశం తక్కువగా ఉంటోంది. వ్యాధిపై గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేసి అవగాహన కల్పించాల్సిన బాధ్యత వైద్య ఆరోగ్య సిబ్బందిపై ఉంది. పీహెచ్‌సీ స్థాయిలో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండేలా అధికారులు గట్టి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. అనుమానిత లక్షణాలతో వస్తే వెంటనే వారికి రక్త పరీక్షలు చేసి వ్యాధి నిర్ధారించి ఔషధాలు అందించి చికిత్స చేస్తే ప్రాణ నష్టం లేకుండా చూడవచ్చు.

బాపట్ల ప్రాంతీయ ఆసుపత్రిలో వార్డు

కేసులు ఎక్కువగా నమోదవుతున్న ప్రాంతాల్లో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలతో సర్వే చేయించి బాధితులను గుర్తించి వైద్యం అందించాలి. వ్యాధి నియంత్రణకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి విజయమ్మ తెలిపారు. ప్రస్తుతం కేసులు వచ్చిన పీహెచ్‌సీల పరిధిలో ప్రత్యేక దృష్టిసారించి ఇంకా ఎవరైనా బాధితులు ఉంటే సత్వరమే గుర్తించి వైద్యం అందిస్తున్నామన్నారు. రక్త పరీక్ష చేసే కిట్లు, నివారణకు ఇవ్వాల్సిన ఔషధాలు అన్ని ఆసుపత్రుల్లో అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. స్క్రబ్‌టైఫస్ గురించి ఎవరూ భయపడవద్దని, అనుమానిత లక్షణాలుంటే వెంటనే సమీప ఆసుపత్రిలో చేరి చికిత్స చేయించుకోవాలని సూచించారు.

నైపుణ్యం పెంచుకో.. అవకాశం అందుకో..

విద్యార్హతకు తగిన ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లేక ఇబ్బంది పడుతున్న నిరుద్యోగ యువతకు ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ అండగా నిలుస్తోంది. బహుళజాతి సంస్థలు, పెద్దఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పించే సంస్థలు కోరుకునే విధంగా యువతకు నైపుణ్య శిక్షణ ఇస్తోంది. ఆయా కంపెనీలతో జాబ్‌మేళాలు ఏర్పాటు చేసి ఉద్యోగాలు కల్పిస్తోంది.

న్యూస్‌టుడే, నరసరావుపేట

నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు నియోజకవర్గానికి ఒకటి చొప్పున జిల్లాలో ఏడు స్కిల్‌హబ్‌లను ఏర్పాటు చేశారు. సత్తెనపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల, క్రోసూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, నరసరావుపేటలోని నాక్ కేంద్రం, పిడుగురాళ్లలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, వినుకొండలోని ఎస్‌జీకే డిగ్రీ కళాశాల, మాచర్లలోని ఎస్‌కేబీఆర్ డిగ్రీ కళాశాల, చిలకలూరిపేటలోని రాగన్నపాలెం కమ్యూనిటీ హాలులో స్కిల్‌హబ్‌లు ఏర్పాటై యువతకు సేవలందిస్తున్నాయి.

❖ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాలో ఏర్పాటు చేసిన జాబ్‌మేళాలు: 52
❖ జాబ్‌మేళాలో పాల్గొన్న ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే సంస్థలు : 297
❖ ఇప్పటివరకు ఉద్యోగాలు పొందిన వారు: 2,632 మంది

ఉపాధి, ఉద్యోగాలిచ్చే కోర్సుల్లో శిక్షణ.. ఇండస్ట్రియల్ ఎలక్ట్రీషియన్, ప్లంబర్, జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్, డొమెస్టిక్ బయోమెట్రిక్ ఆపరేటర్, ఫీల్డ్ టెక్నీషియన్ కంప్యూటింగ్, పెరిఫరల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్, బేసిక్స్ ఎంఎస్ ఆఫీస్ తదితర కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నాయి. కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్ డొమెస్టిక్ వాయిస్ కోర్సుల్లో జిల్లాలో ఒక్కో బ్యాచ్‌లో 660 మందికి శిక్షణ ఇస్తున్నారు. బీటెక్ వారికి ప్రత్యేక కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు.. ఐటీఐ, డిప్లొమో పూర్తి చేసి రెండు నుంచి మూడేళ్ల అనుభవం ఉన్న యువకులు, నర్సింగ్ కోర్సు పూర్తి చేసిన వారికి జర్మనీ, దుబాయ్‌లో ఉద్యోగాలు కల్పిస్తున్నారు.

పేరు అలా నిలిచిపోయింది

గడియార స్తంభం కూడలి

పట్టణానికి గుండె వంటింది గడియార స్తంభ ప్రాంతం. నియోజకవర్గానికి రాజకీయ కేంద్రం. ప్రముఖుల సభలన్నీ ఇక్కడే జరుగుతాయి. ఏడు దశాబ్దాల క్రితం ప్రజల అవసరాల కోసం ఇక్కడ గడియార స్తంభం ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఆప్రాంతానికి గడియార స్తంభం కూడలని పేరు. ప్రస్తుతం ఇక్కడ గడియార స్తంభం లేకపోయిన పేరు మాత్రం ఒక ల్యాండ్ మార్కుగా ఉంది.

ముక్కోణం పార్కు కూడలి: గతంలో రైల్వేస్టేషన్ ఎదురుగా ఇక్కడ ఒక పార్కు ఉండేది. ఇది మూడు రహదారుల మధ్యలో ముక్కోణాకారంలో ఉండటంతో ఈప్రాంతానికి ఆపేరు వచ్చింది. రైల్వేస్టేషన్ నుంచి వేటపాలెం వైపు వెళ్లే వాహనాలు ఇక్కడే నిలిచేవి. దీంతో ఈప్రాంతం రద్దీగా ఉండేది. ప్రస్తుతం అక్కడ పార్కు లేదు, వాహనాలు లేవు.. కానీ పేరు మాత్రం నిలిచిపోయింది. **- న్యూస్‌టుడే, చీరాల**

పేరేచర్లలో మరో స్క్రబ్ టైఫస్ కేసు

మేడికొండూరు: మేడికొండూరు మండలంలో మరో స్క్రబ్ టైఫస్ కేసు వెలుగులోకి వచ్చింది. పేరచర్ల లక్ష్మీనరసింహ కాలనీకి చెందిన వృద్ధుడు దగ్గు, ఆయాసంతో బాధ పడుతున్నారు. గత నెలలో ఆరు బయటకు వెళ్లిన సమయంలో ఆయన్ను కీటకం కుట్టింది. తర్వాత విపరీతమైన జ్వరం వచ్చింది. తొలుత గ్రామంలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స తీసుకున్నా ఫలితం లేకపోవడంతో మెరుగైన చికిత్సకు గత నెల 21న గుంటూరు సర్వజనాసుపత్రికి వెళ్లారు. అక్కడ వైద్య పరీక్షలు చేయగా స్క్రబ్ టైఫస్‌గా నిర్ధారణ అయ్యింది. గ్రామంలో మొత్తం రెండు కేసులు నమోదైనట్లు వైద్య సిబ్బంది చెప్పారు.

దారిపై ధాన్యం.. రైతు స్థితి దయనీయం

భట్టిప్రోలు మండలం పల్లెకోన ప్రధాన రహదారిలో ఇలా..

బాపట్ల జిల్లాలో వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. యంత్రంతో కోసిన పంట ధాన్యాన్ని రైతులు ట్రాక్టర్ల సాయంతో రోడ్లపైకి తెచ్చి ఆరబోస్తున్నారు. రేపల్లె, వేమూరు ప్రాంతాల్లో పలు రహదారులపై ధాన్యం కనిపిస్తోంది. ధాన్యంలో తేమ శాతం 17లోపు ఉంటేనే రైతు సేవా కేంద్రాల సిబ్బంది, వ్యాపారులు కొంటున్నారు. లేకపోతే తేమశాతాన్ని బట్టి బస్తాకు కిలోల చొప్పున తరుగు తీస్తున్నారు. దీంతో రైతులు నష్టపోయే పరిస్థితి నెలకొంది. **-ఈనాడు, బాపట్ల, న్యూస్‌టుడే, రేపల్లె అర్బన్**

ఆలివ్ రిడ్లే అంతరించకుండా..!

★ తీర ప్రాంతాల్లో ఆరు సంరక్షణ కేంద్రాలు ★ 15 వేల గుడ్లు సేకరించి పిల్లల ఉత్పత్తికి ప్రణాళిక

బాపట్ల, న్యూస్‌టుడే

అరుదైన ఆలివ్ రిడ్లే తాబేళ్ల సంరక్షణకు అటవీశాఖ చర్యలు చేపట్టింది. ఐటీసీకి చెందిన ట్రీ ఫౌండేషన్ సహకారంతో జిల్లాలోని తీర ప్రాంతాల్లో ఆరు సంరక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయటానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. జనవరి నుంచి కేంద్రాలు ప్రారంభించి సముద్రం నుంచి ఒడ్డుకు వచ్చి తాబేళ్లు పెడుతున్న గుడ్లను సేకరించి జాగ్రత్తగా పొదిగించటం ద్వారా పిల్లల ఉత్పత్తి చేయాలని, వాటిని మూడు నెలల అనంతరం తిరిగి సముద్రంలో వదిలిపెట్టేలా ప్రణాళికలు రూపొందించారు.

ఏడాది	సేకరించిన గుడ్లు	సముద్రంలోకి వదిలిన తాబేళ్ల పిల్లలు
2022	12,346	11,425
2023	12,413	11,234
2024	11,278	9,836
2025	11,986	11,000

వేల కిలోమీటర్లు వచ్చి..

ఏటా డిసెంబరు నుంచి మార్చి వరకు వేల కి.మీ. దూరం నుంచి సముద్రం ద్వారా తాబేళ్లు జిల్లాలోని తీరానికి చేరుకుని ఒడ్డున గుడ్లు పెడుతున్నాయి. గుడ్లు పెట్టటానికి తీరానికి వచ్చే క్రమంలో సముద్రంలో కాలుష్యం, మర పడవలు తగిలి, వలల్లో చిక్కి జిల్లాలో గత రెండేళ్లలో వేల సంఖ్యలో ఆలివ్ రిడ్లే తాబేళ్లు చనిపోయినట్లు ఓ స్వచ్ఛంద సంస్థ చేపట్టిన సర్వేలో వెల్లడైంది. ఐక్యరాజ్యసమితి ఆలివ్ రిడ్లే తాబేళ్లను అంతరించి పోయే జాతిగా ప్రకటించింది. వీటి సంరక్షణకు అంతర్జాతీయ, జాతీయ సంస్థలు కృషి చేస్తున్నాయి. తీరంలో తాబేళ్లు పెట్టిన గుడ్లు ధ్వంసం కాకుండా, సాగరంలో జీవ వైవిధ్యాన్ని కాపాడుతున్నాయి.

మరణాల నివారణకు చర్యలు

ఆలివ్ రిడ్లే తాబేళ్ల మరణాలు తగ్గించటానికి అవకాశం ఉన్న అన్ని చర్యలు చేపడుతున్నాం. వేట పడవలు, వలల వల్ల చనిపోకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలపై మత్స్యకారులకు అవగాహన కల్పిస్తున్నాం. త్వరలో సంరక్షణ కేంద్రాలు ఏర్పాటు చేస్తాం. ఏప్రిల్, మే నెలల్లో పిల్ల తాబేళ్లను సముద్రంలోకి దశలవారీగా వదులుతాం.
- బాలకృష్ణ, అటవీశాఖ ఉప రేంజ్ అధికారి

సంరక్షణ కేంద్రాలు ఇక్కడే

జిల్లాలో లంకెవానిదిబ్బ నుంచి పెద గంజాం పల్లెపాలెం వరకు 74 కి.మీ. సముద్ర తీరం ఉంది. ఆలివ్ రిడ్లే తాబేళ్ల సంరక్షణ ప్రాజెక్టు కింద అటవీశాఖ ఆధ్వర్యంలో సూర్యలంక, రామాపురం, రామచంద్రాపురం పొట్టి సుబ్బయ్యపాలెం, కుంకుడుచెట్లపాలెం, ఏటిమొగ్గలో ప్రాంతాల్లో సంరక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు.. వీటి నిర్వహణకు అవసరమైన నిధులను కార్పొరేట్ సామాజిక సేవా బాధ్యత కింద ఐటీసీ సంస్థ ట్రీ ఫౌండేషన్ ద్వారా అందజేస్తోంది. కొత్త ఏడాది ఆరంభం నుంచే తాబేళ్ల గుడ్లు సేకరించి జాగ్రత్తగా పొదిగించనున్నారు. జిల్లాలో నాలుగేళ్లలో 43 వేల ఆలివ్ రిడ్లే తాబేళ్ల పిల్లలను సముద్రంలోకి వదిలినట్లు అటవీశాఖ గణాంకాలు చెబుతున్నాయి. తీరంలో సంరక్షణ కేంద్రాలను మే వరకు కొనసాగిస్తామని అటవీశాఖ అధికారులు తెలిపారు.

రైతేరాజు
ఆదాయ వనరు పొట్ల సాగు 6లో
ధాన్యం నిల్వలో అప్రమత్తత అవసరం

కుమారుడి అక్రమాలు...
తండ్రి పాత్రపై అనుమానాలు!

ఉన్నతాధికారులకు వసూళ్ల ఏజెంట్‌గా ఏఎస్సై కార్యకలాపాలు

ఈనాడు డిజిటల్, నరసరావుపేట: బ్రేక్ ఇన్‌స్పెక్టర్ పేరిట కుమారుడి అరాచకం వెలుగులోకి రావడంతో తండ్రి ఏఎస్సై వ్యవహారం పోలీసువర్గాల్లో చర్చనీయాంశమైంది. కుమారుడి నేరాల చిట్టాలో తండ్రి పాత్ర ఏమిటి? అనేది తేలుస్తారా? ఇప్పటికే ఎస్పీ వద్ద ఉన్న పాత ఫైల్‌ను ఏం చేస్తారనేది ఆసక్తిగా మారింది. 15 ఏళ్లుగా నరసరావుపేటలోనే ఎందుకు పోస్టింగ్‌లో ఉంటున్నాడు? అనే దానిపై ఎస్పీ ఆరా తీస్తారా? అన్నది వేచి చూడాలి. బ్రేక్ ఇన్‌స్పెక్టర్ అవతారం ఎత్తిన వెంకటనాయుడు తన తండ్రి పోలీసు అధికారాన్ని అడ్డుపెట్టుకుని మొదటి నుంచీ అడ్డగోలుగా వ్యవహరించేవాడని.. పోలీసు స్టేషన్‌లో ఎవరినీ లెక్కచేసేవాడు కాదని తెలిసింది. నరసరావుపేట గ్రామీణ పోలీసుస్టేషన్‌లో తండ్రి పనిచేస్తున్న సమయంలో గంజాయి కేసులో ఓ ద్విచక్ర వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసు సిబ్బంది చూస్తుండగానే కుమారుడు వచ్చి దర్జాగా వాహనాన్ని తీసుకెళ్లిపోవడం దుమారం రేపింది. ప్రస్తుతం గురజాల డీఎస్పీగా ఉన్న జగదీశ్ అప్పట్లో ట్రైనీ డీఎస్పీగా అక్కడ ఉన్నారు. దీన్ని సీరియస్‌గా తీసుకుని వెంకటనాయుడిని మందలించి, ఆపై కౌన్సెలింగ్ ఇచ్చి వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. జాతీయ రహదారులపై భారీ వాహనాలను ఆపి బెదిరించి అందినకాడికి వసూలు చేయడం వెంకటనాయుడికి పరిపాటిగా మారింది. చిత్తూరుకు చెందిన ఓ పారిశ్రామికవేత్తను ఇలానే బెదిరించి భారీగానే వసూలు చేసినట్లు తెలిసింది. నరసరావుపేట డీఎస్పీగా ఉద్యోగ విరమణ చేసిన వ్యక్తికి కలెక్షన్ ఏజెంట్‌గా ఏఎస్సై వ్యవహరించాడని పోలీసువర్గాల్లోనే చర్చ నడుస్తోంది. గతంలో కోటప్పకొండ తిరునాళ్లకు బాగా వసూళ్లు చేసి వెనకేసుకున్నట్లు వార్తలొచ్చాయి. ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల చేయితడిపి జిల్లా కేంద్రంలోనే తిష్ఠ వేస్తున్నట్లు సమాచారం. గత ప్రభుత్వంలో ఓ ఎమ్మెల్యే (ప్రస్తుతం మాజీ)తో సత్సంబంధాలు నడిపి పోలీసుల పోస్టింగ్‌లో కీలకంగా వ్యవహరించి వసూలు చేసినట్లు తెలిసింది. ఇటీవల కోటసెంటర్‌లోని ఓ షాపింగ్‌మాల్‌లో అగ్ని ప్రమాదం జరిగిన తర్వాత దుకాణంలో చీరలు మాయమవడం.. అక్కడ సదరు ఏఎస్సై విధుల్లో ఉండడం పలు అనుమానాలకు తావిచ్చింది. కానీ విషయాన్ని బయటకు రాకుండా జాగ్రత్తపడ్డారు. కుమారుడి లీలలు వెలుగు చూసిన నేపథ్యంలో తండ్రి వ్యవహారాలపై ఉక్కుపాదం మోపాల్సిన అవసరం ఉందని పోలీసుల్లోనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

పశువులకూ వసతి గృహం!

రూ.10 లక్షలతో నియోజకవర్గానికి ఒకటి నిర్మాణం

జిల్లాలో పశుసంపద ఇలా	
గేదెలు	3,81,764
ఆవులు	21,930

న్యూస్‌టుడే, రేపల్లె అర్బన్, నిజాంపట్నం

పాడిపరిశ్రమ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది. అందులో భాగంగా పశువుల వసతి గృహాలు(యానిమల్ హాస్టల్)పేరుతో మెగా గోకులాల ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. ఇప్పటి వరకు రైతుల సొంత స్థలంలో మినీ గోకులాలు మంజూరు చేసి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు కేటాయించింది. తాజాగా స్థలం లేని పాడి రైతులు పశువులను వసతి గృహాల్లో ఉంచి వాటి పోషణ చూసుకునే విధంగా కార్యక్రమాన్ని రూపొందించింది. ఆరు నెలల వ్యవధిలో వీటి నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యం పెట్టింది. జిల్లాలో నియోజకవర్గానికి ఒకటి చొప్పున రేపల్లె, బాపట్ల, వేమూరు, చీరాల, అద్దంకి, పర్చూరు నియోజకవర్గాల్లో పశువుల వసతి గృహాలు నిర్మించనున్నారు.

గతంలో నిర్మించిన మినీగోకులం (పాత చిత్రం)

ఒక్కో గృహంలో 30 పశువులు.. ఒక్కో వసతి గృహం నిర్మాణం కోసం సుమారు ఐదెకరాలు అవసరం కాగా ఎంపిక చేసిన ప్రాంతంలో పోరంబోకు, అనాధీనం, ప్రభుత్వ భూమి ఉంటే రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో గుర్తించి పశుసంవర్ధకశాఖకు కేటాయిస్తారు. ప్రభుత్వ భూమి లేనిచోట ప్రైవేటు భూములను ఐదేళ్లపాటు లీజుకు తీసుకుంటారు. ఒక్కో వసతి గృహంలో 30 పశువుల వరకు వసతి కల్పించే విధంగా ఎకరా స్థలంలో షెడ్డు, స్టోరేజి గది నిర్మించనున్నారు. మిగిలిన నాలుగెకరాల్లో గడ్డి పెంపకం చేపడతారు. నీరు, పశుగ్రాసం, దాణా, గడ్డి కోసే యంత్రాలు సమకూర్చుతారు. ఒక్కో వసతి గృహం నిర్మాణానికి ఉపాధి హామీ పథకం నుంచి రూ.10 లక్షలు నిధులు వినియోగిస్తారు.

నిర్వహణ బాధ్యతలు ఇలా..

పశువుల వసతి గృహం నిర్వహణ బాధ్యతను స్వయం సహాయక, రైతు సంఘాలు, సొసైటీలు, ఎఫ్‌పీవో సంస్థలకు అప్పగించనున్నారు. గ్రామాల్లో ఆసక్తి ఉన్నవారు తమ పశువులను అక్కడికి తరలిస్తే వాటికి గడ్డి, దాణా, నీరు నిర్వాహకులే సమకూరుస్తారు. యజమానులు ఉదయం, సాయంత్రం వెళ్తే వారి ముందే పాలు పితికి అప్పగిస్తారు. నిర్వహణకు అయ్యే ఖర్చు, కూలీలు ఇతర ఖర్చులను లెక్కించి గోబర్ గ్యాస్, సేంద్రీయ ఎరువుల విక్రయాలతో జమ చేస్తారు. అదనపు ఖర్చులను పశువుల యజమానులు భరించాల్సి ఉంటుంది. పశువుల సంరక్షణకు ఈ పథకం ఎంతగానో తోడ్పాటు అందిస్తుందని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ వేణుగోపాల్ తెలిపారు.

సంక్రాంతికి పూర్తిస్థాయి ఏఆర్‌టీ సేవలు

అద్దంకి, న్యూస్‌టుడే: హెచ్ఐవీ, ఎయిడ్స్ పీడితులకు అద్దంకి సామాజిక ఆరోగ్యకేంద్రం(సీహెచ్‌సీ)లో సంక్రాంతి నాటికి పూర్తిస్థాయి ఏఆర్‌టీ సేవలు అందుబాటులోకి వస్తాయని ఎయిడ్స్ నియంత్రణ సంస్థ రాష్ట్ర సంయుక్త సంచాలకుడు డాక్టర్ పి.అంకినీడు ప్రసాద్ అన్నారు. సోమవారం ఉదయం అద్దంకి సీహెచ్‌సీని ఆయన పరిశీలించారు. రాష్ట్ర మంత్రి గొట్టిపాటి రవికుమార్ సూచనల మేరకు యుద్ధప్రాతిపదికన కేంద్రాన్ని ప్రారంభించాలని నిర్ణయించినట్లు ప్రసాద్ చెప్పారు. ప్రస్తుతం ఆసుపత్రిలోని పై అంతస్తులో రెండు గదులు కేటాయించామని, దీనిలో వైద్యులు, ఫార్మాసిస్టు, కౌన్సిలర్, స్టాఫ్‌నర్సు, ల్యాబ్ టెక్నీషియన్‌లు సేవలు అందిస్తారన్నారు. ఒంగోలు వెళ్లే అవసరం లేకుండా అద్దంకి పరిధిలో నమోదైన 1380 మంది పీడితులకు అన్నిరకాల సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ఎయిడ్స్ నియంత్రణ సంస్థ నుంచి అవసరమైన మందులు, పరికరాలు అందుబాటులో ఉంచుతామని, హెల్ప్ స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా కావలసిన సామగ్రి సమకూర్చేందుకు అంగీకారం తెలిపినట్లు వెల్లడించారు. ఆసుపత్రి పర్యవేక్షకురాలు డాక్టర్ కె.వాహెలాచౌదరి, హెల్ప్ సంస్థ ప్రతినిధి సాగర్, సాంకేతిక సిబ్బంది పాల్గొన్నారు.

ఆసుపత్రిని సందర్శించిన డాక్టర్ ప్రసాద్

చారిత్రక శిలలు.. వదిలేశారిలా..!

చరిత్రను భావితరాలకు తెలియజేసేందుకు ప్రభుత్వాలు రూ.లక్షలు ఖర్చు చేస్తోంది. చరిత్రకారులు చారిత్రక సాక్ష్యాలను శోధించి వాటిని భవిష్యత్తు తరాలకు తెలియజేస్తారు. అటువంటి చారిత్రక సాక్ష్యాలను అమరావతిలోని కాల చక్ర మ్యూజియంలో నిర్లక్ష్యంగా వదిలేశారు. కొన్నాళ్ల క్రితం మ్యూజియంలోని రెండు శిలలను లండన్‌లో జరిగిన ప్రపంచస్థాయి పురావస్తు ప్రదర్శనకు తీసుకెళ్లారు. అక్కడ రెండు నెలల పాటు ప్రదర్శనలో ఉంచారు. వాటిని తిరిగి కాలచక్ర మ్యూజియానికి తెచ్చారు. మ్యూజియం మూత ఉండటంతో మ్యూజియం వద్ద బయట పడేశారు. విషయం తెలిసి చరిత్రకారులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. **- అమరావతి, న్యూస్‌టుడే**

S.B.V.R. అగ్రికల్చరల్ కళాశాల, బద్వేలు
ఇంటర్మీడియట్ నందు Bi.P.C విభాగంలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు చివరి అవకాశం. కడప జిల్లా బద్వేలులో I.C.A.R., NEW DELHI వారిచే గుర్తింపు పొందిన S.B.V.R. అగ్రికల్చరల్ కాలేజి (S.B.V.R. A.G.B.Sc), నందు B.Sc (Hons.) Agricultureలో అడ్మిషన్ కొరకు ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకున్నా చేసుకోకపోయినా కన్వీనర్ కోటాలో అగ్రికల్చరల్ బి.ఎస్సీ చేరుటకు చిట్ట చివరి అవకాశం కలదు.
వివరములకు సంప్రదించవలసినది : 94400 33523, 91825 05395, 94928 56652.
కరెస్పాండెంట్, S.B.V.R. అగ్రికల్చరల్ కళాశాల

(c) eenadu

అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం చూపితే చర్యలు

మత్స్యకారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

బాపట్ల, న్యూస్‌టుడే: పీజీఆర్ఎస్‌కు ప్రజా సమస్యలపై వస్తున్న అర్జీల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం చూపితే చర్యలు తప్పవని కలెక్టర్ వినోద్‌కుమార్ హెచ్చరించారు. కలెక్టరేట్లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ప్రజల నుంచి జేసీ భావన, కలెక్టర్ అర్జీలు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు చిత్తశుద్ధితో పని చేస్తే సమస్యలు సత్వరం పరిష్కారమై ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. మార్టూరు మండలంలో ఎక్కువ అర్జీలు రావటంపై ఆరా తీశారు. అర్జీల ప్రీ ఆడిట్ చేయటంలో కొన్ని మండలాల పని తీరు సరిగా లేదని, అధికారులు పర్యవేక్షించాలని చెప్పారు. ప్రముఖులు ఇచ్చే ముఖ్యమైన అర్జీలు వేగంగా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రభుత్వం అడిగే ప్రశ్నలకు స్పందించని అధికారులపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో జిల్లాను మూడు కంటే పై స్థానంలో ఉంచటమే లక్ష్యంగా పని చేయాలని పేర్కొన్నారు. అర్జీల నమోదు కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. వృద్ధులు నిలబడి ఉండటాన్ని గమనించిన ఆయన అదనంగా కుర్చీలు వేయాలని సిబ్బందిని ఆదేశించారు. డీఎంహెచ్‌వో విజయమ్మ, పీడీ లవన్న, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఉప్పుటూరుకు జాతీయస్థాయి గుర్తింపు

పిడుగురాళ్ల- వాడరేవు జాతీయ రహదారిపై టోల్‌ప్లాజా వద్ద బోర్డు

పర్చూరు, న్యూస్‌టుడే: వాడరేవు-పిడుగురాళ్ల జాతీయ రహదారి167(ఎ)పై టోల్‌ప్లాజా నిర్మాణం శరవేగంగా సాగుతోంది. దీనికి రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ ఉప్పుటూరు టోల్‌ప్లాజాగా నామకరణం చేస్తూ బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ మార్గంలో వాడరేవు నుంచి చిలకలూరిపేట వరకు మొదటి టోల్‌ప్లాజా కావడం, తమ గ్రామం పేరు మీదుగా టోల్‌ప్లాజా ఏర్పాటు చేస్తూ జాతీయస్థాయిలో గుర్తింపు రావడంతో ఆ గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రామాపురం తీరంలో చెన్నై బీసెంట్ నగర్

లైట్ హౌస్‌తో పాటు దుకాణాల సెట్టింగ్

వేటపాలెం, న్యూస్‌టుడే: సినీ హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న ఓ చిత్రానికి సంబంధించిన షూటింగ్ చీరాల, వేటపాలెం పరిసర ప్రాంతాల్లో కొన్నాళ్లుగా చేస్తున్నారు. ఈ నేపథ్యంలో చెన్నై తీరంలో ఉన్న బీసెంట్ నగర్ సముద్రతీరంలో ఓ సన్నివేశం చేయాల్సి రావడంతో రామాపురం తీరంలో అక్కడ ఉన్నట్లుగానే లైట్ హౌస్‌తో పాటు కొన్ని దుకాణాల సెట్టింగ్ వేసి, ఇక్కడ చిత్రీకరించారు.

ధాన్యం విక్రయించే రైతులకు ఉచితంగా గోనె సంచులు

బాపట్ల, న్యూస్‌టుడే: ఆర్ఎస్‌కేలలో ధాన్యం విక్రయిస్తున్న రైతులకు ఉచితంగా గోనె సంచులు అందజేయాలని అధికారులను కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్లో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులే గోనె సంచులు తెచ్చుకుంటే నగదు చెల్లించాలని చెప్పారు. ఒక్కో సంచికి ప్రభుత్వం రూ.4.74లు చెల్లిస్తుందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 2,546 మంది రైతుల నుంచి 15,065 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామని, ఎనిమిది లక్షల గోనె సంచులు ఆర్ఎస్‌కేలకు పంపించామన్నారు. మరో 14.93 లక్షలు మిల్లర్ల వద్ద అందుబాటులో ఉన్నాయన్నారు. నిజాంపట్నంలో రాడార్ కేంద్రం నిర్మాణానికి ఎకరాన్నర భూమి కేటాయించాలని అధికారులను కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. నెడ్‌క్యాప్ ద్వారా సౌర విద్యుత్తు ఉత్పత్తి చేయటానికి బయోమాస్ పవర్ ప్లాంటు ఏర్పాటు కోసం మార్టూరులో వంద ఎకరాలు కేటాయించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలో హెలిప్యాడ్ ఏర్పాటు చేయటానికి పది ఎకరాల భూమి కేటాయించాలన్నారు. సమీకృత కలెక్టరేట్ భవనానికి 57.13 ఎకరాల భూమి కేటాయించినట్లు తెలిపారు.

చట్ట పరిధిలో సత్వర న్యాయం

మహిళ సమస్య వింటున్న సీసీఎస్ డీఎస్పీ జగదీష్‌నాయక్

బాపట్ల, న్యూస్‌టుడే: పీజీఆర్ఎస్‌లో సమస్యలపై అర్జీలు ఇచ్చినవారికి చట్ట పరిధిలో సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకుంటామని సీసీఎస్ డీఎస్పీ జగదీష్‌నాయక్ అన్నారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ప్రజల నుంచి 65 అర్జీలు స్వీకరించారు. అర్జీదారుల సమస్యను డీఎస్పీ స్వయంగా విని తెలుసుకున్నారు. అర్జీలు వేగంగా పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. కుటుంబ కలహాలు, భూ వివాదాలు, ఆర్థిక లావాదేవీలు, మోసాలపై ఎక్కువ ఫిర్యాదులు వచ్చాయి. మహిళా ఎస్సై లక్ష్మీరాజ్యం పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. ఆరుగురికి గాయాలు

మేదరమెట్ల: అదుపుతప్పి ఆటో బోల్తా పడటంతో ఆరుగురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన కొరిశపాడు మండలం మేదరమెట్ల గ్రామ శివారులోని సోమవరప్పాడు వద్ద సోమవారం రాత్రి చోటుచేసుకుంది. మేదరమెట్ల నుంచి ఆటో రావినూతల వైపు వెళ్తుండగా ప్రమాదం చోటుచేసుకుంది. ఆటోలోని ఆరుగురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను ప్రైవేటు వాహనంలో అద్దంకి వైద్యశాలకు తరలించారు. అందులో ఇద్దరిని గుంటూరు తీసుకువెళ్లారు. మేదరమెట్ల ఎస్సై మహమ్మద్ రఫి కేసు నమోదు చేశారు.

ఆదాయ వనరు పొట్ల సాగు

చినగంజాం, న్యూస్‌టుడే: చినగంజాం మండలంలోని సోపిరాల, పూలవారిపాలెం, కడవకుదురు, మోటుపల్లి, పెదగంజాం, కొత్తపాలెం తదితర గ్రామాల్లో రైతులకు పందిరి పొట్ల ఆదాయ వనరుగా మారింది. ఇసుక భూముల్లో విద్యుత్తు మోటార్ల సాయంతో ఇది చేస్తున్నారు. ఇది ఖర్చుతో కూడినది. అయిదు సెంట్ల విస్తీర్ణం నుంచి 20 సెంట్ల వరకు పందిళ్లను ఏర్పాటు చేస్తున్నారు. ముందుగా భూమిని రెండు సార్లు దున్ని, వాటిలో పాదులు పెడతారు. 5 సెంట్ల భూమిలో 25 పాదులు ఏర్పాటు చేస్తారు. పాదుకు 5 విత్తనాలు విత్తుతారు. ఇవి వారం రోజులకు మొలకెత్తుతాయి. అక్కడ నుంచి పాదులకు మొక్కల నుంచి పొట్ల తీగలు పందిరికి పాకేలా కర్రలతో గూడులు కడతారు. 60 రోజుల నుంచి కాయలు కాస్తాయి. వంద పొట్ల విత్తనాల ధర రూ.500 నుంచి రూ.700 ఉంది. 5 సెంట్లలో సాగుకు సుమారు రూ.10 వేలు ఖర్చవుతుందని రైతులు తెలిపారు. పంట కాలంలో సుమారు 1,000 నుంచి 1,200 కాయలు కాస్తాయన్నారు. ప్రస్తుతం ఒక్కో కాయను రూ.25 నుంచి రూ.30 వరకు అమ్ముతున్నారు. రూ.25 వేల ఆదాయం వస్తుందని, అన్ని ఖర్చులు పోగా రూ.15 వేలు మిగులుతుందని కర్షకులు తెలిపారు.

పందిరిలో కాసిన పొట్ల కాయలు

నా పేరు ఎం.కోటేశ్వరి. మాది చినగంజాం. శాంతి డ్వాక్రా సంఘంలో సభ్యురాలిని. 5 సెంట్ల భూమిలో పొట్ల సాగు చేశా. పందిరి వద్దే కాయ రూ.25 నుంచి రూ.30 అమ్ముతున్నా. కుటుంబ సభ్యులందరూ కలిపి పొట్ల, మిరప, ఇతర కూరగాయలు సాగు చేస్తాం. వీటి ద్వారా వచ్చే ఆదాయంతో కుమారుడు రాము బీహెచ్ఎంఎస్, కుమార్తె స్రవంతిని ఫార్మసీ చదివిస్తున్నాం. పొదుపు సంఘం నుంచి తీసుకున్న రుణాన్ని నెలనెలా క్రమం తప్పకుండా చెల్లిస్తున్నా.

బంతి పూల సిరులు

మక్కెనవారిపాలెం (సంతమాగులూరు), న్యూస్‌టుడే: సంతమాగులూరు మండలం మక్కెనవారిపాలెం, కొమ్మాలపాడు రైతులు బంతి పూల సాగుతో సిరులు పండిస్తున్నారు. ఈ గ్రామాల్లో 30 ఎకరాలకు పైగా పూల తోటల సాగు చేపట్టారు. మొక్క నాటిన తరువాత 55 రోజుల నుంచి పూలు పూస్తాయి. ఏడాది పొడవునా పూస్తూనే ఉంటాయి. ఎకరా సాగుకు నారు దగ్గర నుంచి పూలు పూర్తిగా కోసే వరకు రూ.80 వేల నుంచి రూ.లక్ష మేర అవుతుంది. 80 నుంచి వంద క్వింటాళ్ల వరకు దిగుబడి తీయవచ్చు. సగటున క్వింటా రూ.3 వేల వంతున వంద క్వింటాళ్లకు రూ.3 లక్షలకు పైగా ఆదాయం సమకూరే వీలుంది. దీనిలో పెట్టుబడి ఖర్చులు పోను రూ.2 లక్షల మేర లాభం ఉండటంతో బంతి పూల సాగుకు రైతులు మొగ్గు చూపుతున్నారు.

కొమ్మాలపాడులో సాగు చేసిన బంతి పూల తోట

నిప్పు.. భూసారానికి ముప్పు

రైతేరాజు

వరికోత తర్వాత రబీ సాగు చేసే ముందు పంట మొదలుకు రైతులు నిప్పుపెట్టడంతో భూమిలో ఎదుగుదలకు తోడ్పడే సూక్ష్మ పోషకాలకు హాని జరుగుతుందని పొన్నూరు వ్యవసాయశాఖ అధికారి రాజవరపు వెంకటేశ్వరరావు తెలిపారు. భూమి భౌతిక పరిస్థితి దెబ్బతింటుంది. మిత్ర పురుగులు కాలిపోతాయి. నేల పైపొరలోని సూక్ష్మపోషకాల స్థాయి తగ్గుతుంది. దిగుబడులపై ప్రభావం చూపుతుంది. కార్బన్ మోనాక్సైడ్ విడుదలై వాయు కాలుష్యానికి కారణమవుతుంది. భూసారానికి నష్టం కలుగుతుంది. గడ్డి అలా వదిలేస్తే..కుళ్లి సేంద్రియ ఎరువుగా మారుతుంది. రబీలో సాగు చేసే పంటకు పొటాషియం, నత్రజని, స్వరం తదితర పోషకాలు అందుతాయి. **న్యూస్‌టుడే, పొన్నూరు**

ధాన్యం నిల్వలో అప్రమత్తత అవసరం

అమృతలూరు, న్యూస్‌టుడే: మారుతున్న వాతావరణ పరిస్థితులు అనగా అధిక ఉష్ణోగ్రత, వర్షాలు, అల్ప ఉష్ణోగ్రతలు పంటకు నష్టం కలిగిస్తాయి. కీటకాలు, శిలీంద్రాలు, కలుపు మొక్కల కారణంగా కోతకు ముందే 20 నుంచి 30 శాతం, కోత అనంతరం నిల్వ చేసుకునే చర్యలతో 10 నుంచి 25 శాతం వరకు నష్టం వాటిల్లుతుందని ఏవో భరత్‌కుమార్ తెలిపారు. తేమ, ఉష్ణోగ్రతలు తక్కువ ఉండేటట్లు చూసుకుని ధాన్యం జీవిత కాలాన్ని పెంచుకోవాలని చెప్పారు. ధాన్యం నిల్వ చేయడంలో మెలకువలను వివరించారు.

తేమ శాతం తగ్గేందుకు ఆరబోసిన ధాన్యం

❖ కీటకాలు, శిలీంద్రాలు త్వరగా అభివృద్ధి చెందడానికి తేమ ఉత్ప్రేరకంగా పనిచేస్తుంది. నిల్వకు ముందుగానే ధాన్యాన్ని ఎండలో ఆరబెట్టి, చల్లటి ధాన్యాన్ని మాత్రమే దాచుకోవాలి. శాస్త్రీయంగా నిర్మించిన మంచి గాలి వెలుతురు కలిగిన ధాన్యాగారాలను ఎంపికచేసుకుని నిల్వ చేసుకోవాలి. నేల ద్వారా చెమ్మ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఆరబెట్టిన సమయంలో ధాన్యం తేమ శాతం 12 ఉండాలి. అంతకన్నా అధికంగా ఉన్న సమయంలో కీటకనాశినుల వాడుకోవాలి. వేపాకు, వేప నూనె, వేప, సీతాఫలం గింజలపొడిలో ఏదో ఒకటిని ధాన్యంలో కలిపి నిల్వ చేసుకుంటే ఆరు నెలల నుంచి ఏడాది వరకు పురుగు పట్టకుండా కాపాడుకోవచ్చని ఆయన వివరించారు.

రైతు ప్రశ్న? శాస్త్రవేత్త సలహా

? సెనగ పంటను ఎండు తెగులు ఆశించి నష్ట పరుస్తోంది. నివారణ చర్యలు ఏమిటి? –కాలారి శ్రీనివాసరావు, తాడికొండ

✔ శనగ పంటలో ఎండు తెగులు అనేది ఫుసరిమ్ అనే బూజు ఆశించడం వల్ల వస్తుంది. దీనివల్ల మొక్కలు ఒడలి పసుపు రంగులోకి మారి పూత, కాయ లేకుండా ఎండిపోతాయి. మొదట పొలంలో అక్కడక్కడ మొక్కలు ఎండిపోయి తరువాత పొలమంతా వ్యాపించి మొక్కలు మొత్తం ఎండి పోతాయి. దీని నివారణకు స్వరక్షణ చర్యలు పాటించాలి.

❖ ఎండు తెగులు తట్టుకునే ఎన్‌బీఈజీ-776, 778, 452, 857 వంగడాలను సాగు చేసుకోవాలి.

❖ కిలో శనగ విత్తనానికి 10 గ్రా. ట్రైకోడెర్మ విరిడీని కలిపి విత్తన శుద్ధి చేసుకోవాలి.

❖ 90 కిలోల పశువుల ఎరువు, 10 కిలోల వేప పిండి, 2 కిలోల ట్రైకోడెర్మవిరిడి పొడిని కలుపుకోవాలి. దీనిని నీడ కింద కుప్పగా చేసి గోనె పట్టా కప్పి రోజు లేదా రెండు రోజులకు ఒకసారి నీటిని చిలకరించాలి. 20 రోజుల తర్వాత కుప్ప మీద బూజు వచ్చిన తర్వాత పొలంలో ఆఖరి దుక్కి ముందు దీనిని చల్లుకుని విత్తుకోవాలి. ప్రతి సంవత్సరం ఈ తెగులు ఆశిస్తున్నట్లయితే జొన్న లేదా మొక్కజొన్న పంటలతో పంట మార్పిడి చేసుకోవాలి.

– గుంటూరు, న్యూస్‌టుడే

కత్తెర పురుగును కట్టడి చేద్దాం

పల్నాడు ప్రాంతంలో రబీ పంటగా మొక్కజొన్నను ఎక్కువగా సాగుచేస్తున్నారు. ఇటీవల ఈ పంటకు కత్తెర పురుగు ఆశించడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. రాత్రి పూట ఉష్ణోగ్రతలు తగ్గి, పొడి వాతావరణం ఉన్న పరిస్థితుల్లో ఈ పురుగు వ్యాపిస్తోంది. మొక్క దశలోనే గుర్తిస్తే ఉధృతిని చాలా వరకు నివారించొచ్చని పిడుగురాళ్ల ఏడీఏ శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. మొదటి నెల రోజుల వ్యవధిలో ఎకరా పొలంలో మోనోక్రోటోఫాస్ లేదా క్వినాల్‌ఫాస్ లేదా క్లోరోపైరిపాస్ ఏదో ఒక మందును లీటరు నీటికి 2మి.లీ, పిచికారీ చేయాలి. లేదా 5మి.లీ వేప నూనెను 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. పది శాతం మొక్కలకు పురుగులు ఆశిస్తే ఎకరానికి స్పైనిటోరమ్ 100 మి.లీ 80 గ్రాముల వంతున పిచికారీ చేయాలి. కత్తెర పురుగు ఎక్కువగా మొవ్వును ఆశిస్తుంది. రైతులు పురుగు మందులు మొవ్వు తడిసేలా పిచికారీ చేయాలని ఏడీఏ సూచించారు.

– గురజాల గ్రామీణ, న్యూస్‌టుడే

విజేతలు విజయనగరం, గుంటూరు

ముగిసిన రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలు

గుంటూరు బాలికల జట్టు

విజయనగరం బాలుర జట్టు

మోదుకూరు(చుండూరు), న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో చుండూరు మండలం మోదుకూరు ఉన్నత పాఠశాలలో మూడు రోజులుగా సాగుతున్న అండర్-19 రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలు సోమవారం ముగిశాయి. బాలుర విభాగంలో విజయనగరం జట్టు ప్రథమ స్థానం, కడప జట్టు ద్వితీయ స్థానంలో నిలిచాయి. బాలికల విభాగంలో గుంటూరు జిల్లా జట్టు ప్రథమ, శ్రీకాకుళం జట్టు ద్వితీయ స్థానం సాధించాయి. విజేతలకు సాఫ్ట్ బాల్ అంతర్జాతీయ అంపైర్ ఏఎస్ఎస్ జగదీశ్వరరెడ్డి, ఎఫ్ఎక్స్ డైరెక్టర్ నాగేశ్వరరావు, రాష్ట్ర సాఫ్ట్ బాల్ కన్వీనర్ ఎన్వీ రమణ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వరరావు, పీడీలు పద్మాకర్, సుధాకరరెడ్డి, సునీత, నరసింహారావు, స్థానిక కనక దుర్గా యూత్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ గంగాభ్రమరాంబ మల్లేశ్వర స్వామి దేవస్థానము,
కురగల్లు (గ్రా), మంగళగిరి (మం), గుంటూరు జిల్లా.

ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

కురగల్లు (గ్రా), మంగళగిరి (మం), గుంటూరు జిల్లా శ్రీ గంగాభ్రమరాంబ మల్లేశ్వర స్వామి దేవస్థానము పునఃనిర్మాణము కొరకు టెండర్లు ప్రకటన చేయడమైనది. మిగిలిన వివరముల కొరకు https://tender.apeprocurement.gov.in లో చూడవచ్చును.

సం॥: కార్యనిర్వహణాధికారి,
శ్రీ గంగా భ్రమరాంబ మల్లేశ్వర స్వామి దేవస్థానము, కురగల్లు (గ్రా), మంగళగిరి (మం), గుంటూరు జిల్లా.

స్వర్ణాంధ్ర లక్ష్య సాధనకు కృషి

బాపట్ల, న్యూస్‌టుడే: స్వర్ణాంధ్ర లక్ష్యం సాధనకు అధికారులు అంకితభావంతో కృషి చేయాలని కలెక్టర్ వినోద్ కుమార్ అన్నారు. కలెక్టరేట్లో సోమవారం రాత్రి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి పనులు లక్ష్యం మేరకు వేగంగా చేపట్టాలన్నారు. పది పంచాయతీ కార్యాలయాలకు భవనాలు తక్షణమే నిర్మించాలన్నారు. ఒక్కో కార్యాలయ నిర్మాణానికి ప్రభుత్వం రూ.32 లక్షలు కేటాయించిందన్నారు. గోకులం షెడ్లు త్వరగా నిర్మించాలన్నారు. ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టటంతో పాటు గ్రామాల్లో పూడిపోయిన చెరువులను తిరిగి వినియోగంలోకి తీసుకురావాలని చెప్పారు. యూరియా వాడకం ఈ సారి ఎక్కువగా ఉన్నందున విక్రయాల వివరాలు ఆన్‌లైన్లో పంపించాలని సూచించారు. డిసెంబరు నెలాఖరులోగా లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని పేర్కొన్నారు. జేసీ భావన, ఆర్డీవోలు గ్లోరియా, చంద్రశేఖర్, రామలక్ష్మి, వ్యవసాయ శాఖ డీడీ అన్నపూర్ణ, డ్వామా పీడీ విజయలక్ష్మి, గృహనిర్మాణ శాఖ పీడీ వెంకటేశ్వరరావు, మార్క్‌ఫెడ్ డీఎం కరుణశ్రీ పాల్గొన్నారు.

యూరియా కొరతపై ఫిర్యాదు

బాపట్ల, న్యూస్‌టుడే: రబీలో పంటల సాగుకు చీరాల, వేటపాలెం ప్రాంతంలో యూరియా కొరత ఉందని పీజీఆర్ఎస్‌లో కలెక్టర్ వినోద్‌కుమార్‌కు రైతులు సోమవారం ఫిర్యాదు చేశారు. ప్రైవేటు దుకాణాల్లో బస్తాకు రూ.450లు వసూలు చేస్తున్నారని రైతులు పేర్కొన్నారు. యూరియా అందేలా చూడాలని కోరారు. గ్రామంలో చెరువు, పాఠశాల, రోడ్లు తమవని స్థానికులను బెదిరిస్తూ వినియోగించటానికి వీల్లేదని బెదిరిస్తున్నారని గ్రామస్తులు ఫిర్యాదు చేశారు.

ఆక్రమణలు తొలగించాలని ఆందోళన

బాపట్ల, న్యూస్‌టుడే: మత్స్యకారుల వేటపడవలు సముద్రంలోకి రాకపోకలు సాగించటానికి అడ్డుగా ఉన్న ఈపూరుపాలెం స్ట్రెయిట్‌కట్ కాలువలోని బండరాళ్లను వెంటనే తొలగించాలని అడవిపల్లెపాలెం, దానవాయి పేట, విజయలక్ష్మీపురం, కృపానగర్ మత్స్యకారులు డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ వద్ద సోమవారం ఆందోళన నిర్వహించారు. మాజీ సర్పంచి రమణ, మత్స్యకార నేతలు రాంబాబు, శ్రీను, రమేష్‌ల నేతృత్వంలో మత్స్యకారులు కలెక్టర్‌ను కలిసి సమస్య వివరించారు. హైకోర్టు ఆదేశాల మేరకు రైతు బుర్ల వెంకట్రావును పిలిపించి మాట్లాడి తదుపరి చర్యలు చేపట్టాలని కోరారు. మత్స్యకార నేతలు మాట్లాడుతూ కాలువ పునరుద్ధరణ విషయంలో జాప్యం చేయటం తగదన్నారు. నెలలో పరిష్కరించకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని తెలిపారు.

చంపుతామని బెదిరింపు.. రక్షణ కల్పించండి

కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన

బాపట్లటౌన్, న్యూస్‌టుడే : చీరాల మండలం హరిప్రసాద్ నగర్‌కు చెందిన పల్లెపు యశోద, భర్త బాలఅంకమ్మరావు ప్రాణహాని ఉందని సోమవారం పీజీఆర్ఎస్‌లో కలెక్టర్ వి.వినోద్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఉజిలిపేట సచివాలయం పక్కన ఉన్న తమ కూరగాయల షాపును తొలగించాలని జవహర్‌నగర్‌కు చెందిన డి.బాలాజి బెదిరిస్తున్నట్లు ఆమె కలెక్టర్ దృష్టికి తెచ్చారు. కూరగాయల షాపును తీయని పక్షంలో టిప్పర్లతో తొక్కించి చంపుతామని బెదిరించినట్లు భార్యాభర్తలు తెలిపారు. ఈవిషయంపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడంలేదన్నారు. కుమార్తెతోపాటు కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు.

ఎంపీ రమేష్‌కు పరామర్శ

సీఎం రమేష్ తల్లి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, కేంద్ర సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాసవర్మ, మంత్రులు అచ్చెన్నాయుడు, అనిత, అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవి, తదితరులు

ఎర్రగుంట్ల, న్యూస్‌టుడే: రైల్వేస్టాండింగ్ కమిటీ ఛైర్మన్, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్‌ను పలువురు పరామర్శించారు. సీఎం రమేష్ తల్లి చింతకుంట రత్నమ్మ ఇటీవల తుది శ్వాసశాస విడిచారు. పెద్ద కర్మ సందర్భంగా సోమవారం వైఎస్సార్ కడప జిల్లా ఎర్రగుంట్ల మండలం పోట్లదుర్తిలోని సీఎం రమేష్ నివాసానికి ప్రజాప్రతినిధులు, నాయకులు వచ్చి చింతకుంట రత్నమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, కేంద్ర భారీ పరిశ్రమల, ఉక్కుశాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, మంత్రులు అచ్చెన్నాయుడు, అనిత, అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్ మాధవ్, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కాల్వశ్రీనివాసులు, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, జేసీ అస్మిత్‌రెడ్డి, బొజ్జల సుధీర్‌రెడ్డి, కెఎన్ఎస్ రాజు, బండారు సత్యనారాయణ మూర్తి, పంచకర్ల రమేష్ బాబు, సుందరపు విజయ్ కుమార్, బండారు శ్రావణి, వరదరాజులురెడ్డి, తితిదే బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, తెదేపా పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసురెడ్డి, సినీ నటుడు వెంకట్, మాజీ ఎమ్మెల్యేలు వల్లభనేని వంశీమోహన్, మాజీ ఎమ్మెల్సీ చదిపిరాళ్ల నారాయణరెడ్డి, మాజీ ఎంపీ తులసిరెడ్డి, తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి, రాయలసీమ రాష్ట్ర సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కుంచం వెంకటసుబ్బారెడ్డి తదితరులు చింతకుంట రత్నమ్మ చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రజాప్రతినిధులు, నాయకుల రాకతో డీఎస్పీ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో భారీగా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఎస్‌బీఐ మేనేజర్‌పై ఫిర్యాదు

వలపర్ల(మార్టూరు,పర్చూరు), న్యూస్‌టుడే: మార్టూరు మండలం వలపర్ల గ్రామానికి చెందిన స్నేహసుధ మహిళా మండలి పొదుపు సంఘం సభ్యులు తమ రుణాల మంజూరులో వలపర్ల స్టేట్‌బ్యాంకు మేనేజర్ ఆలస్యం చేయడంతో పాటు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారంటూ ఈనెల 5న వెలుగు ఏపీఎం, సీసీలకు ఫిర్యాదు చేసినట్లు సంఘం అధ్యక్షురాలు వై.వెంకటరత్నం సోమవారం తెలిపారు. సంఘం ద్వారా గతంలో రూ.10 లక్షల రుణాలు పొందామని, తిరిగి చెల్లించి మళ్లీ రుణాల కోసం వెళ్లామన్నారు ఈక్రమంలో మీ కుటుంబ సభ్యులు పొలాలను తనఖా పెట్టి తీసుకున్న రుణాలకు సంబంధించి నగదు ఎప్పుడు చెల్లిస్తారని, మీకు మంజూరైన నగదును ఆ రుణాలకు బదిలీ చేస్తున్నానని బ్యాంకు మేనేజర్ తెలిపినట్లు వాపోయారు. సంఘంలో సభ్యులందరికీ వచ్చే నగదును తనఖా రుణాలకు ఎలా బదిలీ చేస్తారని, సంఘం ద్వారా రుణాలు తీసుకుని వ్యాపారాలు చేసుకుని కుటుంబాలను నెట్టుకొస్తున్నామని, పంటలు చేతికి రాలేదని ఈ సమయంలో ఇలా చేస్తే నష్టపోతామని సభ్యులమంతా తెలిపామన్నారు. అయినా వినకపోవడంతో తమ పొదుపు ఖాతాను రద్దు చేయాలని కోరామని, లేని పక్షంలో ఖాతాను వేరొక బ్యాంకుకు బదిలీ చేయాలని కోరినా నిరాకరించడంతో చేసేది లేక ఫిర్యాదు చేశామని ఆమె తెలిపారు. ఆన్‌లైన్‌లో బ్యాంకు ఉన్నతాధికారులకూ ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. దీనిపై మేనేజర్ వి.రమేష్‌ని ఫోన్‌లో వివరణ కోరగా ఫిర్యాదు చేసిన విషయం నా దృష్టికి రాలేదన్నారు. గతంలో తీసుకున్న క్రాప్ రుణాలు కట్టమని అడిగానని చెప్పారు.

గొలుసు దుకాణం తనిఖీ

జె.పంగులూరు, న్యూస్‌టుడే: మండలంలోని కోటపాడులో సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు డి.రమాదేవి ఆధ్వర్యంలో సోమవారం రాత్రి అక్రమ మద్యం అమ్ముతున్న దుకాణాలను మహిళలతో కలిసి ఆమె తనిఖీ చేశారు.

బ్రాయిలర్ ధరలు (కిలో / కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 135, రిటైల్ ధర - 162, చికెన్ విత్‌స్కిన్ - 235, చికెన్ స్కిన్‌లెస్ - 267.
కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -130 రిటైల్ ధర 157 చికెన్ విత్ స్కిన్ - 228, చికెన్ స్కిన్‌లెస్ - 259.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 143, 152, 163 చికెన్ విత్ స్కిన్ - 274 చికెన్ స్కిన్‌లెస్ - 284.

40 తులాల నగలు, రూ. 6 లక్షలు చోరీ

కల్వకుర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలో దొంగలు చెలరేగిపోయారు. ఊర్కొండపేట శ్రీఆంజనేయ స్వామి ఆలయంలో పూజారిగా పని చేస్తున్న శ్రీనివాసశర్మ ఇంట్లో ఆభరణాలు, నగదు చోరీ చేశారని పోలీసులు తెలిపారు. పట్టణంలోని విద్యానగర్ పరిధిలోని కేశవనగర్‌లో శ్రీనివాస్ శర్మ కుటుంబంతో నివాసం ఉంటున్నారు. వారం రోజుల కిందట కుమార్తె పుట్టినరోజు సందర్భంగా భార్య, పిల్లలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని చీరాల పట్టణంలోని అత్తింటికి వెళ్లారు. పూజారి ఊర్కొండ ఆలయంలో ఉంటున్నారు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో దొంగలు ఇంటి, బీరువా తాళాలు పగులగొట్టి 40 తులాల బంగారు నగలు, రూ. 6లక్షలు దొంగిలించారు. సోమవారం ఉదయం వచ్చిన భార్య, పిల్లలు ఇంట్లో వస్తువులు చిందరవందరగా పడి ఉండటంతో చోరీ జరిగిందని గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి సీఐ నాగార్జున, ఎస్సైలు మాధవరెడ్డి, రాజశేఖర్ సందర్శించి పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి జిల్లాకేంద్రం నుంచి క్లూస్ టీంను రప్పించి నమూనాలను, ఆధారాలు సేకరించారు. రూ. 6లక్షలతో పాటు బంగారు నగలు, ఇంట్లో భద్రపర్చినవి పోయినట్లు బాధితుడు శ్రీనివాసశర్మ విలేకరులకు తెలిపారు. కల్వకుర్తి ఠాణా నుంచి అంతర్రాష్ట్ర దొంగ పరారు కావడం ఒక ఎత్తయితే... కల్వకుర్తి పట్టణంలో వరుస చోరీలు జరుగుతుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

EENADU eClassifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి అధికధరకు కొనబడును (స్పాట్ క్యాష్). ✆ 87907 41166.

EDUCATION

SPOT admissions by Govt AP 12/12: M.Com/MA English/MSW only Rs 5000 per sem, PLNM Degree College, 91774 08565.

PEOPLE CARE

OLD AGE HOME

రామకృష్ణ గ్రూపు, GNT, వృద్ధులకు, పేషెంట్ల సేవకు ఇంటి/వంట, బేబి కేర్‌కు వర్కర్లను భారతదేశం అంతటా పంపగలము.✆ 91540 85588, 91549 35588

Book your 5 lines Classified Colour Rs.770/-
3Ads Package Rs.1945/-
5 lines Classified B/W Rs.650/-
3Ads Package Rs.1625/-
ప్రకటనపై 5% జి.ఎస్.టి. అదనం

REAL ESTATE

PLOT FOR SALE

GENERAL

133.33 Sq.Yds. కేవలం 1,00,000/- మాత్రమే. వినుకొండ, పల్నాడు డిస్ట్రిక్ట్‌లో లిమిటెడ్ ఆఫర్. ఫోన్: 9133445755.

JOBS

Wanted Sales Executives For Guntur, Ongole for Mahesh Extruions (P) Ltd Bellari Send Your Resumes maheshpvcpipes@gmail.com.

గుంటూరు, లక్ష్మీపురం నందు క్రొత్తగా ప్రారంభించిన బోటిక్ నందు పనిచేయుటకు Sitching వర్క్ వచ్చిన లేడీస్ కావలెను. 80192 08772.

గుంటూరు, బ్రాడీపేటలోని ప్రముఖ జ్యూయలరీ షోరూంవారికి 25-30 సం॥ల వయస్సు, జ్యూయలరీ సేల్స్‌లో 2సం॥ అనుభవండున్న సేల్స్‌మెన్స్/గర్ల్స్ కావలెను. ✆ 98485 58182.

అమెరికాలో 1 సం॥ బాబు ఆలన, పాలన వ్యక్తిగత సంరక్షణ కొరకు అనుభవంగల ఆడవారు కావలెను. అమెరికా వీసా కల్గినవారు మాత్రమే. ✆ 9440803362

గుంటూరు ●నరసరావుపేటలోని ప్రముఖ అడ్వకేటు ఆఫీసునందు లీగల్ Openions టైపుచేయుటకు అనుభవం కలిగిన అభ్యర్థులు కావలెను. Ph: 9346983822.

అకౌంటెంట్స్, సూపర్‌వైజర్స్, ఐషర్ డ్రైవర్స్ కావలెను. చిలకలూరిపేట మం. యడవల్లి గ్రామంలోఉన్న పేపర్ మిల్లులో పనిచేయుటకు. 93906 33593, 90595 14555.

30-65Yrs బ్యాంక్ అనుబంధ సంస్థలో జీతం+Inc 35వేలు టీంమేనేజర్స్ ఎగ్జిక్యూటివ్స్. Q:10th, డిగ్రీ. రిటైర్డ్ బిజినెస్ ఇన్స్యూరెన్స్ ఏజంట్స్ మ్యూచువల్‌ఫండ్స్. నోటార్గెట్. ✆90524 70111

SHO కు MLT, DMLT,BSc - MLT, ANM, GNM లు కావలెను. జీతం 8-10 వేలు. సంప్ర: SHO, 2/1 బ్రాడీపేట, గుంటూరు. ✆: 98483 91212.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం..
ఈనాడు లో ప్రకటన ఇవ్వటం
పూర్తి వివరాలకు సంప్రదించండి:
8008510541

91.9FM Vijayawada
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 80080 03297

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80085 10541
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80085 14589

(c) eenadu

బాపట్ల

•బాపట్ల •రేపల్లె •వేమూరు

రేపల్లె పీజీఆర్ఎస్‌లో ఐదు అర్జీలు

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: రేపల్లె రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఐదు అర్జీలు వచ్చినట్లు ఆర్డీవో రామలక్ష్మి తెలిపారు. అందులో ఆక్రమణకు గురైన తమ భూమిని ఇప్పించాలని, 22 సెంటర్ల భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అర్జీలు వచ్చాయి. జాతీయ రహదారి విస్తరణలో కోల్పోయిన భూమికి పరిహారం ఇప్పించాలని ఒకటి, తమ ఇంటిపక్కనున్న రోడ్డు సమస్యను పరిష్కరించాలని రెండు అర్జీలు వచ్చాయి. స్వాధీనానికి యత్నం: బాపట్ల, న్యూస్‌టుడే: రీచ్ సంస్థను కొందరు అక్రమంగా స్వాధీనం చేసుకోవటానికి యత్నిస్తూ కరెంటు కనెక్షన్ తొలగించి తమను ఇబ్బంది పెడుతున్నారని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో మహిళ గోనె మాధవి ఫిర్యాదు చేసింది.

యోగాతో విద్యార్థుల్లో ఏకాగ్రత

యోగా సాధనలో విద్యార్థులు

చెరుకుపల్లి న్యూస్‌టుడే: యోగా విద్యార్థుల్లో ఏకాగ్రత పెంచే సాధనమని విశ్రాంత ఉపాధ్యాయుడు దివి లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం చెరుకుపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆయన యోగాలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యోగాసనాలు వేయటం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చన్నారు. వారంలో ఒకరోజు సాధన చేయడం వల్ల మంచి నడవడిక అలవడుతుందన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డి రాంబాబు, ఉపాధ్యాయులు అక్కల బాలాజీ, బాదావత్ సాంబయ్య నాయక్, విద్యార్థులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
బాపట్ల : 80085 73141, రేపల్లె : 80085 73136, వేమూరు: 91107 83738

స్పందనకు వందనం

గుంత పూడ్చివేత

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: రేపల్లె 26వ వార్డులో ఇటీవల పైపు లైనుకు లీకు ఏర్పడింది. గుంత తీసి మరమ్మతులు చేసిన మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు పూడ్చకుండా వదిలేశారు. దీనిపై ఈనాడులో ప్రచురితమైంది. స్పందించిన మున్సిపల్ ఏఈ శామ్యూల్ సోమవారం కార్మికులను పంపి గుంతను పూడిపించారు. సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

పిచ్చిచెట్ల తొలగింపు

బాపట్ల టౌన్, న్యూస్‌టుడే : కర్లపాలెం మండల పరిధిలోని సమ్మెటవారిపాలెంలో విద్యుత్తు స్తంభానికి పిచ్చిచెట్లు అల్లుకుపోయి లైటు వెలిగినా వెలుతురు కనిపించడం లేదు. ఈనేపథ్యంలో స్తంభం కనిపించదు.. వెలుతురు రాదు అనే శీర్షికతో ఈనెల 6న కథనం ప్రచురితమైంది. దీనికి విద్యుత్తు శాఖ స్పందించింది. సిబ్బంది ఆదివారం స్తంభం చుట్టుపక్కల ఉన్న పిచ్చి చెట్లు తొలగించారు.

శుద్ధజలం.. సాగుకు బలం..!

రూ.4.54 కోట్లతో మూడు ప్లాంట్ల నిర్మాణం

బాపట్ల, న్యూస్‌టుడే

నిర్మాణ దశలో ప్లాంటు

పురపాలక సంఘంలో మురుగు నీటి శుద్ధికి అడుగులు పడుతున్నాయి. పట్టణంలోని జమ్ములపాలెం రోడ్డులోని డంపింగ్‌యార్డు సమీపంలో 1 ఎంఎల్‌డీ సామర్థ్యంతో నీటి శుద్ధి ప్లాంటు నిర్మిస్తున్నారు. దీనిద్వారా ఈస్ట్, వెస్ట్ స్వాంప్ మురుగు కాలువల్లో నీరు శుద్ధిచేసి వ్యవసాయ, ఇతర అవసరాలకు వినియోగించవచ్చు. దీంతోపాటు మరో రెండు ప్లాంట్లు నిర్మించడానికి భూసేకరణ చేస్తున్నారు.

ప్రతిపాదిత నీటి శుద్ధి ప్లాంట్లు:	మూడు
కేటాయించిన నిధులు:	రూ.4.54 కోట్లు
శుద్ధి చేయనున్న నీరు:	3.5 ఎంఎల్‌డీ
ప్రస్తుతం నిర్మాణంలో ఉన్నది:	ఒకటి
నీటి శుద్ధి సామర్థ్యం:	01 ఎంఎల్‌డీ

సాగు నీటికి ప్రణాళిక

బాపట్ల పట్టణం శివారులో రెండు మురుగు కాలువలు ప్రవహిస్తున్నాయి. పట్టణం మధ్యలో నుంచి భీమునిగుంట కాలువ ప్రవహిస్తోంది. పురపాలక లోని 34 వార్డుల్లో మురుగు నీరు రెండు కాలువలలో ప్రవహిస్తోంది. ఈ నీటితో ఇప్పటి వరకు రైతులు వరి, అపరాలు, ఆకుకూరలు, కూరగాయలు, పూలమొక్కలు సాగు చేస్తున్నారు. కాలుష్య నియంత్రణ మండలి నిబంధనల ప్రకారం పురపాలక సంఘం నుంచి వచ్చే మురుగును శుద్ధి చేసిన తర్వాత వ్యవసాయ, ఇతర అవసరాలకు నీరు సరఫరా చేయాలి. ప్లాంటు నిర్మాణం పూర్తి అయితే సాగుకు శుద్ధి చేసిన నీరు అందనుంది. ఆమేరకు అధికారులు ప్రణాళిక రచించారు.

జూన్‌లోపు పూర్తి

బాపట్ల పురపాలక సంఘంలో జమ్ములపాలెం రోడ్డు డంపింగ్‌యార్డు వద్ద నీటి శుద్ధి ప్లాంటు నిర్మాణానికి ఎకరాన్నర భూమి కేటాయించారు. మూలపాలెం రోడ్డులో 0.5 ఎంఎల్‌డీ ప్లాంటు, మరుప్రోలువారిపాలెం రెవెన్యూ పరిధిలో భీమునిగుంట వాగు నీటిని శుద్ధి చేయటానికి రెండు ఎంఎల్‌డీ సామర్థ్యం కలిగిన మరో ప్లాంటు నిర్మించాలి. వీటికి భూసేకరణ చేయాల్సి ఉంది. గత వైకాపా ప్రభుత్వంలో ప్లాంట్ల నిర్మాణానికి గుత్తేదారులు ఎవరూ ముందుకు రాలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత డంపింగ్‌యార్డు వద్ద ప్లాంటు నిర్మాణ పనులు ప్రారంభించారు. వచ్చే జూన్‌లోగా పూర్తి చేయాలని లక్ష్యాన్ని నిర్దేశించారు.

భూసేకరణకు రూ.2.57 కోట్లు

ప్లాంటు నిర్మాణం పూర్తయితే ఈస్ట్, వెస్ట్ స్వాంప్ కాలువల్లో మిలియన్ లీటర్ల మురుగు నీటిని శుద్ధి చేయటానికి అవకాశం ఉంటుంది. శుద్ధి చేసిన అనంతరం నీటిని వ్యవసాయ, ఇతర అవసరాలకు సరఫరా చేయటానికి ప్రణాళిక రూపొందించారు. మరో రెండు ప్లాంట్లకు రెవెన్యూ అధికారులు మూడున్నర ఎకరాలు భూసేకరణ చేసి భూమిని కేటాయిస్తే ప్లాంట్ల నిర్మాణ పనులు ప్రారంభమవుతాయి. భూసేకరణ కోసం రూ. 2.57 కోట్లు కేటాయించారు. వీటి నిర్మాణం పూర్తయితే పట్టణంలో కలుషిత, మురుగునీటిని పూర్తిగా శుద్ధి చేయటానికి వీలుపడుతుంది. పంటల సాగు నీరు అందుతుంది.

వేగంగా పనులు

నీటి శుద్ధి ప్లాంటు నిర్మాణ పనులు త్వరలో పూర్తి చేస్తాం. అనంతరం మురుగునీరు శుద్ధి చేసే ప్రక్రియ ప్రారంభిస్తాం. రెవెన్యూ అధికారులు భూసేకరణ పూర్తి చేయాల్సి ఉంది. భూమి అప్పగించాక మరో రెండు ప్లాంట్ల నిర్మాణ ప్రారంభిస్తాం. -రఘునాథరెడ్డి, పురపాలక కమిషనర్

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

మంజూరు పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

చుండూరు, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని లబ్ధిదారులకు మంజూరైన 3.31 లక్షల సీఎం సహాయ నిధి చెక్కులు, మంజూరు పత్రాలను ఎమ్మెల్యే ఆనందబాబు బాధిత కుటుంబాలకు సోమవారం అందజేశారు. చుండూరుకు చెందిన ఉయ్యూరు నాగమల్లేశ్వరి, గుమ్మడి నాగలక్ష్మి, ఏటుకూరి జయనందం, మోదుకూరుకు చెందిన బీమవరపు బ్రహ్మారెడ్డి, తమ్మా చంద్రశేఖరరెడ్డి, పెనుగుదురుపాడుకు చెందిన దేవరకొండ ఏడుకొండలు, వేజండ్ల సాంబశివరావు, వలివేరుకు చెందిన ఆళ్ల వీరారెడ్డి, గానేపల్లి ప్రజ్ఞశ్రీ, యడ్లపల్లికి చెందిన వల్లేపు కోటేశ్వరమ్మ, ఆలపాడుకు చెందిన గోగరాజు బాలబాస్కర్ అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేటు వైద్యశాలలో శస్త్ర చికిత్సలు చేయించుకున్నారు. వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా, నిధులు మంజూరయ్యాయి.

అభివృద్ధి పనులకు రూ.38 లక్షలు

భట్టిప్రోలు, న్యూస్‌టుడే: భట్టిప్రోలు గ్రామ అభివృద్ధికి బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ నిధుల నుంచి రూ.38 లక్షలు నిధులు మంజూరైనట్లు తెదేపా రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా తెలిపారు. గ్రామంలో కమ్యూనిటీ భవన నిర్మాణానికి రూ.15 వేలు, పంచాయతీ కార్యాలయం దగ్గర్లో ఉన్న వంతెన నుంచి రైల్వేగేటు వరకు రహదారి అభివృద్ధికి రూ.13 లక్షలు, మార్కెట్ వెనుక జెండా చెట్టు బజారులో రూ.6 లక్షలు, అల్లూరు కాలువ కట్టపై సిమెంటు రోడ్డుకు రూ.4 లక్షలు చొప్పున మంజూరయ్యాయని వివరించారు. టెండర్ ప్రక్రియ ముగిశాక త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు.

ఆక్రమణలు తొలగించాలని వినతి

చెరుకుపల్లి న్యూస్‌టుడే : చెరుకుపల్లి బలంక్ కూడలిలో జాతీయ రహదారిపై తరచూ రోడ్డుప్రమాదాలు సంభవించడంపై పలు వర్గాల సోమవారం ఆందోళన వ్యక్తం చేశాయి. ఆక్రమణలు తొలగించి ప్రమాదాలు జరగకుండా చూడాలని కోరుతూ మండల తెదేపా నాయకులు, చెరుకుపల్లి ప్రెస్‌క్లబ్ సభ్యులు విడివిడిగా తహసీల్దార్ సిహెచ్ పద్మావతికి వినతిపత్రాలు అందించారు. అందులో వారం రోజుల్లో ఐదారు ప్రమాదాలు జరిగాయని, పలువురు తీవ్రగాయపాలయ్యారని పేర్కొన్నారు. గుళ్లపల్లి నుంచి బాదర్ ఖాన్ హాస్పిటల్ కూడలి వరకు ఆక్రమణల కారణంగా తరచు ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటిని తొలగించాలని కోరారు. తహసీల్దార్ స్పందిస్తూ త్వరలో స్థానికులలు, జాతీయరహదారి అధికారులు, పోలీసులతో సమావేశం ఏర్పాటుచేసి సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. గ్రామ తెదేపా నాయకులు శొంఠి సుబ్బయ్య, మల్లాది రామకృష్ణ, టి.శేషయ్య, మంచాల కిషోర్, చల్లాపల్లి కోటేశ్వరరావు, నాగుల పున్నారావు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ

బాపట్ల, న్యూస్‌టుడే: ప్రజా సమస్యలు పరిష్కారానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. నియోజకవర్గ విజన్ కార్యాచరణ యూనిట్ కార్యాలయంలో ఆయన సోమవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. సమస్యలపై ప్రజలు ఇచ్చిన అర్జీలు స్వీకరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పక్కా గృహాల కోసం ఈనెల 14 లోగా లబ్ధిదారులు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. భూ సంబంధ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించినట్లు పేర్కొన్నారు.

ఇన్‌ఛార్జి డీవైఈవోగా వెంకట శివబాబు

బాపట్ల, న్యూస్‌టుడే: జిల్లా తాత్కాలిక ఉప విద్యాశాఖాధికారి(బాపట్ల డివిజన్)గా వెంకట శివబాబు సోమవారం బాధ్యతలు చేపట్టారు. పీ-4 కార్యాలయంలో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మను ఆయన మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పది పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించటమే లక్ష్యంగా పని చేయాలని పేర్కొన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. జిల్లా సైన్స్ అధికారి సాధిక్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి

మాట్లాడుతున్న సీసీఎస్ డీఎస్పీ జగదీష్‌నాయక్

బాపట్ల, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రధాన రహదారుల్లో ప్రమాదాల నివారణకు ఎస్పీ ఉమామహేశ్వర్ తొమ్మిది ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారని సీసీఎస్ డీఎస్పీ జగదీష్‌నాయక్ అన్నారు. టీవీ హాల్లో ప్రత్యేక బృందాలకు సోమవారం నిర్వహించిన శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. ప్రతి బృందంలో ఇద్దరు పోలీసులు, ఇద్దరు ఎన్‌హెచ్ సిబ్బంది, రవాణా శాఖ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థ సేవకులు సభ్యులుగా ఉంటారని తెలిపారు. 19 సీజన్ పరిధిలోని ప్రధాన రహదారుల్లో ప్రమాదాలు నియంత్రించడమే లక్ష్యంగా రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు చేపడతారన్నారు. ఎస్‌బీ-2 ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షణలో పోలీసు బృందాలు పని చేస్తాయని తెలిపారు. వీటి పనితీరును ఎస్పీ స్వయంగా పరిశీలిస్తారని పేర్కొన్నారు. పెనుమూడి వంతెన, రెడ్డిపాలెం టోల్‌ప్లాజా, కర్లపాలెం క్రాస్ రోడ్డు, చీరాలలో మస్తాన్ దర్గా, జాగర్లమూడి, చినగంజాం, బొల్లాపల్లి, సంతమాగులూరు టోల్‌ప్లాజాలు, మేదరమెట్ల క్రాస్ రోడ్స్, అద్దంకి పట్టణ పరిసర ప్రాంతాల్లో బృందాలు విధులు నిర్వహిస్తాయని తెలిపారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడటంతో పాటు ప్రమాదం జరిగిన వెంటనే సత్వరమే చేరుకుని బాధితులను సమీప ఆసుపత్రికి తరలించటం, బహిరంగంగా మద్యపానం, మద్యం సేవించి వాహనాలు నడపటాన్ని నిరోధించటం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారని వివరించారు. ఎస్‌బీ-2 ఇన్‌స్పెక్టర్ రాంబాబు పాల్గొన్నారు.

జాతీయ కరాటే పోటీల్లో ప్రతిభ

సాధించిన పతకాలు, కప్పులతో క్రీడాకారులు

బాపట్ల, బాపట్ల వెస్ట్, న్యూస్‌టుడే: గుంటూరులో నిర్వహించిన జాతీయ కరాటే పోటీల్లో బాపట్ల కరాటే స్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపి 15 పతకాలు సాధించినట్లు నిర్వాహకులు వై.నాగేశ్వరరావు తెలిపారు. ఆయన సోమవారం మాట్లాడుతూ కమిటీ అండర్-14 విభాగంలో ఆరాధ్య, పవిత్ర, అండర్-11 కటాలో తన్విక్, అక్షర, జష్విత బంగారు పతకాలు సాధించినట్లు పేర్కొన్నారు. ఫైటింగ్ లో అన్విక, హసిత, కుంఫో రక్షణ, వైష్ణవ్ రజతం, లోకిత, ఐశ్వర్య కాంస్య పతకాలు గెలిచారన్నారు. కటా అండర్-9 విభాగంలో క్రియాన్ష, అఖిరా, అక్షర, అబ్దుల్లకాస్తా బంగారు పతకాలు, తన్విష్ రజత పతకాలు సాధించారని తెలిపారు.

గిరిజనుల భూములకు పరిష్కారం చూపండి

బాపట్లటౌన్, న్యూస్‌టుడే: బల్లి కురువ మండలం కూకట్లపల్లి గ్రామ గిరిజన భూమి సమస్యను పరిష్కరించాలని పీజీఆర్ఎస్‌లో సీపీఎం జిల్లా కార్యదర్శి గంగయ్య సోమవారం కలెక్టర్ వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా గంగయ్య మాట్లాడుతూ 1970లో గ్రామంలోని 337 ఎకరాల అటవీ భూమిని డీ ఫారెస్టు చేసి గిరిజనులకు, దళితులకు, ఎక్స్ మిలటరీవారికి ప్రభుత్వం పంపిణీ చేసిందన్నారు. 50 ఎస్టీ కుటుంబాలకు పట్టాలు ఇచ్చారని, అప్పటి నుంచి ఆభూమి వారి స్వాధీనంలోనే ఉందన్నారు. ఈ సమస్యను అధికారులకు తెలిపినప్పటికీ ఎవరూ పట్టించుకోలేదన్నారు.

గడ్డ కట్టిన నిర్లక్ష్యం

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: రేపల్లె ప్రభుత్వ పాఠశాల అదనపు గదుల నిర్మాణ పనులకు తీసుకొచ్చిన సిమెంటు బస్తాలు గడ్డకట్టి నిరుపయోగంగా మారాయి. గత ప్రభుత్వ పాలనలో రెండో విడత నాడు-నేడు పనుల్లో భాగంగా అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టారు. అప్పట్లో నిధులు మంజూరు కాక గుత్తేదారుడు అభివృద్ధి పనులను అసంపూర్తిగా వదిలేశారు. నిర్మాణానికి తీసుకొచ్చిన 20 సిమెంటు బస్తాలను జూనియర్, పాఠశాల వంటగదిలో భద్రపర్చారు. అది పూర్తిగా గడ్డకట్టడంతో ఇటీవల బయటపడేశారు.

వంతెనలేక అవస్థలు

ఈస్ట్ పిన్నిబోయిన వారిపాలెం (బాపట్ల టౌన్), న్యూస్‌టుడే : ఈస్ట్ పిన్నిబోయినవారిపాలెం ఎస్టీ కాలనీ సమీపంలో పంటకాలువపై వంతెన లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కాలనీవాసులు తాటి మొద్దులు అడ్డుగా పెట్టి కాలువ దాటుతున్నారు. 20 మీటర్లు వెడల్పు ఉండే కట్టమీద దాదాపు 40 కుటుంబాలు నివాసముంటున్నాయి. ఈ కట్టకు ఇరువైపులా పిన్నిబోయినవారిపాలెం, కప్పలవారిపాలెం రైతుల పొలాలు ఉన్నాయి. ఇక్కడ వంతెన నిర్మాణం చేపట్టాలని ఎప్పటి నుంచో రైతులు కోరుతున్నారు. వంతెన లేక 2 కిలోమీటర్లు తిరిగి రావాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు.

ప్రహరీ లేక పాట్లు

చందోలు (పిట్టలవానిపాలెం), న్యూస్‌టుడే: మండలంలోని చందోలు హబీబుల్లా వీధిలో ప్రధాన రహదారి పక్కనే ఉన్న ప్రాథమిక పాఠశాలకు ప్రహరీ లేక పోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. వాహన రద్దీ ఉండే వీధిలో ఉన్న పాఠశాల ముందు విద్యార్థులు ఆటలు ఆడుకునే పరిస్థితి లేదు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఆదమరిస్తే కాలువలోకే..!

ఖాజీపాలెం (పిట్టలవానిపాలెం), న్యూస్‌టుడే: ఖాజీపాలెం నుంచి కోమలి వెళ్లే ప్రధాన రహదారి నుంచి భవనంవారిపాలెం పంచాయతీ పరిధిలోని చోడిపాలెం వెళ్లే సీసీ రహదారికి పంట కాలువపై నిర్మించిన కల్వర్టుకు రక్షణ గోడలు లేక పోవడంతో ప్రమాదకరంగా మారింది. మరోవైపు కల్వర్టు వద్ద హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో తరుచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రాత్రి సమయాల్లో వాహనాలు కాలువలోకి దూసుకెళ్లితే ప్రాణ నష్టం జరిగే అవకాశం ఉందని వాహనచోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రక్షణ గోడలు ఏర్పటు చేయాలని కోరుతున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

రైలుపేట (బాపట్లటౌన్) న్యూస్‌టుడే : పట్టణంలోని బృందావనం కాలనీకి వెళ్లే రోడ్డులో హిందూ శ్మశానవాటిక దగ్గర మురుగు కాలువపై సిమెంట్ బల్ల విరిగిపోయింది. అటుగా నిత్యం రాకపోకలు సాగించే వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నట్లు కాలనీ వాసులు తెలిపారు. సంబంధిత అధికారులు సిమెంట్ బల్లను సరిచేసి పాడైన రోడ్డు, కాలువల మరమ్మతులు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

నేడు ఖాజీపాలెంలో 5కే రన్

ఖాజీపాలెం(పిట్టలవానిపాలెం), న్యూస్‌టుడే: పిట్టలవానిపాలెం మండలం ఖాజీపాలెంలో కేవీఆర్ కేవీఆర్ ఎంకేఆర్ డిగ్రీ కళాశాల క్రీడా ప్రాంగణంలో మంగళవారం ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల స్థాయి 5కే రన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ తలశిల శివప్రసాద్ తెలిపారు. చంపాటి చిన్నసూరపరాజు, సౌభాగ్యమ్మ సొసైటీ మర్రిపూడి వారి సౌజన్యంతో ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. అలాగే బాపట్ల నియోజకవర్గ పరిధిలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలకు చెందిన బాలురకు 3కే, బాలికలకు 2కే రన్ పోటీలు ఉంటాయన్నారు.

11న అథ్లెటిక్స్ పోటీలు

ఖాజీపాలెం(పిట్టలవానిపాలెం), న్యూస్‌టుడే: పిట్టలవానిపాలెంలో ఈనెల 11 నుంచి 13 వరకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం 48వ అంతర్ కళాశాలల అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ తలశిల శివప్రసాద్ తెలిపారు. పురుషులు, మహిళలకు నిర్వహించనున్న ఈ పోటీల్లో విశ్వవిద్యాలయం పరిధిలోని కళాశాలల నుంచి సుమారు 300 మంది క్రీడాకారులు పాల్గొంటారని ఆయన తెలిపారు.

'విద్య' లఘు చిత్రం చిత్రీకరణ

బాపట్ల: సమాజంలో విద్య ప్రాధాన్యత వివరిస్తూ వీఆర్ క్రియేషన్స్ ఆధ్వర్యంలో లఘుచిత్రాన్ని నిర్మించటం అభినందనీయమని పురపాలక కమిషనర్ రఘునాథరెడ్డి అన్నారు. వీఆర్ క్రియేషన్స్ సమర్పణలో నిర్మిస్తున్న 'విద్య' లఘుచిత్రానికి కమిషనర్ సోమవారం క్లాప్ కొట్టి చిత్రీకరణ ప్రారంభించారు. దర్శకుడు చంద్రశేఖర్, నటులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

మైనర్లకు వాహనాలిస్తే చర్యలు

పిట్టలవానిపాలెం, న్యూస్‌టుడే : మైనర్లకు వాహనాలు ఇచ్చిన వారిపై కఠిన చర్యలు తప్పవని చందోలు ఎస్సై శివకుమార్ యాదవ్ అన్నారు. సోమవారం చందోలు వద్ద జాతీయ రహదారిపై వాహనాలు నడుపుతున్న మైనర్లను గుర్తించి వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. వారి తల్లిదండ్రులను పిలిపించి అవగాహన కల్పించడంతో పాటు జరిమానాలు విధించారు.

గుడిలో చోరీపై కేసు నమోదు

నడింపల్లి (చెరుకుపల్లి గ్రామీణ), న్యూస్‌టుడే: మండలంలోని నడింపల్లి గ్రామ దేవత అంకాళ్లమ్మ తల్లి దేవాలయంలో దొంగలు అమ్మవారి కిరీటం, హుండీ సొమ్ము ఎత్తుకెళ్లిన ఘటనలో పోలీసులు కేసు నమోదు చేశారు. ఆదివారం రాత్రి గుడి పూజారి శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్సై శ్రీనివాస్ కేసు నమోదు చేశారు. సోమవారం బాపట్ల నుంచి క్లూస్ టీం, నిజాంపట్నం ఎస్సై తిరుపతిరావు ఘటన స్థలికి చేరుకుని ఆధారాలను సేకరించారు. దొంగలను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

కాలువలోకి దూసుకెళ్లిన ఆటో

రైలుపేట (బాపట్లటౌన్), న్యూస్‌టుడే: మంచుకు సోమవారం తెల్లవారు జామున ప్రమాదవశాత్తు ఆటో మురుగు కాలువలోకి దూసుకెళ్లింది. గాదె వెంకటరెడ్డి కాలనీ సమీపంలో ఇద్దరు వ్యక్తులతో బాపట్ల నుంచి పొన్నూరు వైపు వెళుతున్న ఆటో మూలమలుపు వద్ద ప్రమాదవశాత్తు కాలవలోకి వెళ్లింది. ఆటో కాలువ అంచుకు వెళ్లి ఆగిపోవడంతో ప్రాణాపాయం తప్పింది.

పూరిల్లు దగ్ధం

కర్లపాలెం, న్యూస్‌టుడే: కర్లపాలెం మండలం పెదపులుగువారిపాలెం గ్రామానికి చెందిన పులుగు వెంకటరెడ్డి పూరిల్లు సోమవారం అగ్నికి ఆహుతి అయ్యింది. విద్యుత్తు వల్ల మంటలు వ్యాపించటంతో ఇల్లు పూర్తిగా దగ్ధం కాగా, ఇంటిలో నగదు, బంగారం పూర్తిగా కాలిపోయింది. సంఘటన సమయంలో ఇంట్లో లేమని, సుమారు రూ.2 లక్షలు నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపారు.

హోంగార్డుకు గాయాలు

బాపట్ల, న్యూస్‌టుడే: పట్టణంలోని సూర్యలంక రోడ్డులో ఎన్ఆర్ఐ కళాశాల సమీపంలో ఎస్పీ కార్యాలయం కమ్యూనికేషన్ విభాగంలో విధులకు మోటార్ సైకిల్‌పై వెళ్తున్న హోంగార్డు సురేష్‌ను వెనుక నుంచి గుర్తు తెలియని ద్విచక్ర వాహనం సోమవారం ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ అతడిని ప్రాంతీయ ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన వైద్యం నిమిత్తం గుంటూరు తరలించారు. సురేష్‌ను హోంగార్డుల విభాగం ఆర్ఐ శ్రీకాంత్ పరామర్శించి తక్షణ సాయం కింద రూ. ఐదు వేలు అందజేశారు. ఘటనపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

మెరుగైన వసతులు కల్పిస్తాం

ఆహార నాణ్యత పరిశీలిస్తున్న అబ్బులు

బాపట్ల, న్యూస్‌టుడే: వసతి గృహాల్లో ఉంటూ విద్యనభ్యసిస్తున్న పేద విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పిస్తామని జిల్లా గిరిజన సంక్షేమశాఖాధికారి జి.అబ్బులు అన్నారు. జిల్లా ఇన్‌ఛార్జి గిరిజన సంక్షేమశాఖాధికారిగా ఆయన సోమవారం బాధ్యతలు చేపట్టారు. కలెక్టర్ వినోద్‌కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిసి మొక్క అందజేశారు. పట్టణంలోని సంజయ్ గాంధీ ఎస్టీ కళాశాల విద్యార్థుల వసతిగృహాన్ని రాత్రి తనిఖీ చేశారు. ఆహార నాణ్యత పరిశీలించి మెరుగుపడాలని ఆదేశించారు.

పొదుపుతో ఆర్థిక ఎదుగుదల

జి.ఎన్.పాలెం(పిట్టలవానిపాలెం), న్యూస్‌టుడే : పొదుపు వల్ల పేద కుటుంబాలు ఆర్థికంగా బలోపేతం అవుతాయని ఏపీఎం చిన్నయ్య అన్నారు. మండలంలోని గోకరాజు నల్లిబోయినవారిపాలెంలో సోమవారం నిర్వహించిన పొదుపు సంఘాల సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ తప్పకుండా పొదుపు మొత్తాలు చెల్లించాలని సూచించారు.

యువత రాజకీయాల్లోకి వస్తేనే మార్పు

మాట్లాడుతున్న విజయ్‌కుమార్

బాపట్ల, బాపట్ల వెస్ట్, న్యూస్‌టుడే: యువత రాజకీయాల్లోకి వస్తేనే పాలనలో మార్పు సాధ్యమని లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపకుడు, విశ్రాంత ఐపీఎస్ విజయ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో సోమవారం రాత్రి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యువతకు ఉపాధి కల్పనలో పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. నిరుద్యోగ సమస్య పెరుగుతోందని, ఇది దేశ భవిష్యత్తుకు మంచిది కాదన్నారు. పలు పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రైజోబియంతో మంచి దిగుబడులు

చెరుకుపల్లి న్యూస్‌టుడే : మినుము, పెసర, కంది వంటి పప్పుజాతి పంటలు సాగు చేసే రైతులు విత్తే సమయంలో విత్తనానికి రైజోబియం కల్చర్ పట్టించి నాటడం ద్వారా మంచి దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి ఎండీ ఫారుక్ తెలిపారు. కల్చర్ ఉపయోగించటం వల్ల మొక్కల వేళ్లపై లేతగులాబి రంగు బుడిపెలు ఏర్పడతాయన్నారు. ఈ బుడిపెల్లో ఉన్న రైజోబియం గాలిలోని నత్రజనిని స్థిరీకరించి మొక్కలకు అందిస్తాయని, తద్వారా మొక్కలు ఏపుగా పెరుగుతాయన్నారు. మంచి దిగుబడులు వస్తాయని, తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రయోజనాలు ఉంటాయన్నారు.

క్రీడలతో మనో వికాసం

విజేతలతో ఆర్ఐ రామకృష్ణశర్మ, ఏజీఎం వెంకటేశ్వర్లు, ప్రిన్సిపల్ భాగ్యరాణి

బాపట్ల, బాపట్ల వెస్ట్, న్యూస్‌టుడే: విద్యార్థుల మనో వికాసానికి క్రీడలు దోహదపడతాయని నారాయణ ఉన్నత పాఠశాల ప్రిన్సిపల్ భాగ్యరాణి అన్నారు. డెల్టా జోన్ క్రీడా పోటీల్లో బాపట్ల నారాయణ ఉన్నత పాఠశాల విద్యార్థులు పలు విభాగాల్లో ప్రతిభ చూపి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. పాఠశాలలో సోమవారం నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పరుగుపందెం, చెస్, వాలీబాల్ పోటీల్లో పాఠశాల విద్యార్థులు 120 పతకాలు గెలిచినట్లు పేర్కొన్నారు. విజేతలను అభినందించారు. ఆర్ఐ రామకృష్ణశర్మ, ఏజీఎం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సైబర్ నేరం... ఆరుగురి అరెస్టు

ఎండాడ, న్యూస్‌టుడే: అంతర్జాతీయ సైబర్ ముఠాలకు బ్యాంకు ఖాతాలు అందించి నేరాలకు పాల్పడుతున్న 6 మంది నిందితులను సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేశారు. ఎంవీపీ కాలనీలో నివసిస్తున్న ఎ.రజనికుమారి(63)కి ఈ ఏడాది మే నెలలో మోహన్‌కుమార్ అనే వ్యక్తి నుంచి ఫోన్ కాల్ వచ్చింది. హవాలా లావాదేవీలకు సంబంధించి మీపై కేసు నమోదైందని, అన్ని ఆధారాలు ఉన్నాయని భయపెట్టాడు. ఆమెను అరెస్టు చేస్తామని బెదిరించి విషయం పరిష్కరించాలంటే నగదు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. ఇది జరిగిన రెండు రోజుల తర్వాత వెంకట్రామన్ అనే వ్యక్తి ఫోన్ చేసి డబ్బు చెల్లించకపోతే ముంబయి స్టేషన్‌లో డివిజన్ కారాగారంలో పెడతామని చెప్పాడు. వరుస బెదిరింపులకు భయపడిన ఆమె తన బ్యాంకు ఖాతా నుంచి రజత్‌కశ్యల్ పేరుతో ఉన్న ఖాతాకు రూ.8.50 లక్షలు ఆన్‌లైన్‌లో నగదు పంపించారు. మరింత నగదు ఇవ్వాలని డిమాండ్ చేయడంతో తాను మోసపోయినట్లు తెలుసుకుని సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులకు బాపట్ల జిల్లా కూచిపూడికి వాసి జంపాల సందీప్, గుంటూరు జిల్లా వాసి డి.బాలఫణికుమార్‌తో పాటు మరో నలుగురిని అరెస్టు చేశారు. వీరు నగదు ఆశ చూపి టెలిగ్రాం ఛానల్ ద్వారా కరెంటు ఖాతాలు తెరచి సైబర్ ముఠా సభ్యులకు అప్పగిస్తున్నట్లు గుర్తించారు. వారి నుంచి అధిక సంఖ్యలో వివిధ బ్యాంకులకు చెందిన డెబిట్ కార్డులు, బ్యాంకు ఖాతా పాస్ పుస్తకాలు, సిమ్ కార్డులు, ఖాతాలు తెరిచేందుకు ఉంచిన దస్త్రాలు, చరవాణులు స్వాధీనపర్చుకుని సీజ్ చేశారు. 6 గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సైబర్ క్రైం పోలీసులు పేర్కొన్నారు.

కుళాయిలకు ట్యాప్‌ల ఏర్పాటు

నగరం, న్యూస్‌టుడే: యేలేటిపాలెం శివారు వెలమవారిపాలెంలో పబ్లిక్ కుళాయిలకు ట్యాప్‌లు లేక మంచినీరు నేలపాలవుతోందని ఈనాడులో ప్రచురితమైన కథనానికి సచివాలయ ఉద్యోగులు స్పందించారు. గ్రామంలో ట్యాప్‌లు లేని కుళాయిలను గుర్తించి వాటికి కొత్త ట్యాప్‌లు ఏర్పాటు చేశారు.

13న వార్షికోత్సవం

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: రేపల్లె ఓరియంటల్ ఉన్నత పాఠశాల 50వ వార్షికోత్సవం ఈనెల 13న ఉదయం 9.30 గంటలకు ప్రారంభమవుతుందని పాలకవర్గం తెలిపింది. పూర్వ విద్యార్థులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు.

HMKS & MGSM COLLEGE OF EDUCATION
(Affiliated to Acharya Nagarjuna University Guntur. AP Sponsored by Khaja Garib Nawaz Educational Society)
KANAGALA(V) Cherukupalli (M), Bapatla District. AP. - 522259.
Contact No. 8688728102, 9866766259 www.kgnes.com email: mgs.hmks2001@gmail.com
Eligible Candidates can attend for the Spot Admissions & Category "B" Quota in to M.Ed Course for the academic year 2025-2027 along with all original certificates on or before 09-12-2025. Admissions are subject to the guidelines & Approval of Competent authority.
Sd/- Secretary & Correspondent

(c) eenadu

చీరాల

• చీరాల • అద్దంకి • పర్చూరు

ముక్కోటికి ముస్తాబవుతున్న ఆలయాలు

అద్దంకి, న్యూస్‌టుడే: ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకొని పట్టణంలోని పలు ఆలయాలకు రంగులు వేస్తున్నారు. ప్రాంగణాలను పరిశుభ్రం చేసి భక్తుల మనోభావాలకు అనుగుణంగా అధికారులు సిద్ధం చేస్తున్నారు. దేవాదాయ శాఖ అద్దంకి బృందం కార్యనిర్వహణాధికారి పి.శైలేంద్ర కుమార్ అందించిన సమాచారం మేరకు పట్టణంలోని కోదండరామస్వామి ఆలయం, వీరరాఘవ స్వామి, వీరాంజనేయస్వామి, రుక్మిణీ సత్యభామ సమేత మాధవస్వామి, రంగనాయకస్వామి, వీరభద్రస్వామి, వినాయకస్వామి ఆలయాలకు రంగులు వేయిస్తున్నారు. అన్నింటికీ కలిపి మొత్తం రూ.1.20 లక్షల వరకు ఖర్చవుతుందని కార్యనిర్వహణాధికారి తెలిపారు.

శక్తి యాప్‌పై అవగాహన

జె.పంగులూరు, న్యూస్‌టుడే: శక్తి యాప్‌పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఎస్సై వినోద్‌బాబు అన్నారు. మండలంలోని ముప్పవరం శ్రీపాటిబండ్ల శ్రీమన్నారాయణ చౌదరి కమిటీ ఉన్నత పాఠశాలలో సోమవారం శక్తి యాప్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చీరాల డివిజన్ శక్తి టీం సభ్యుడు కె.సుబ్బారావు, ప్రధానోపాధ్యాయుడు పుచ్చకాయల ప్రసాద్ పాల్గొన్నారు.

పాఠశాలకు కంప్యూటర్ అందజేత

వేటపాలెం, న్యూస్‌టుడే: కొణిజేటి చేనేతపురి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు హస్తినాపురానికి చెందిన బుద్ది శంకర్, ప్రియాంక, గుద్దంటి చంద్రశేఖర్, దేవి దంపతులు సోమవారం కంప్యూటర్‌ని బహూకరించారు. ప్రధానోపాధ్యాయుడు ఆర్.లక్ష్మయ్య, మోడల్ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు డీవీఆర్ నాగరాజు, పి.బాబు కోన షణ్ముఖి, అరుణ, కరుణశ్రీ పాల్గొన్నారు.

ఆ వాగులపై వంతెనల నిర్మాణం జరిగేనా?

వంతెన నిర్మించాల్సిన ప్రదేశం

ముప్పవరం (జె.పంగులూరు), న్యూస్‌టుడే

ముప్పవరం-కొండమంజులూరు గ్రామాల మధ్య రామన్న వాగుపై వంతెన నిర్మాణం కోసం దశాబ్దాలుగా ప్రజలు ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా.. వంతెనపై దృష్టిసారించకపోవడంతో కూటమి సర్కారైనా నిర్మించకపోదా అని ఆశగా చూస్తున్నారు. రెండు కిలోమీటర్ల మేర గల ఈ మార్గంలో రామన్న వాగుపై వారధి నిర్మాణంతో పాటు ఇదే దారిలోని జనకవరం మైనర్ కాలువపై కల్వర్టు నిర్మించాల్సి ఉంది. అలాగే ముప్పవరం-కొండమంజులూరు రహదారిని అభివృద్ధి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. తద్వారా జాతీయ రహదారిపై వెళ్లకుండా మండలంలోని కొండమంజులూరు గ్రామానికి, మార్టూరు మండలంలోని బొల్లాపల్లి, తాటివారిపాలెం, కోలలపూడి గ్రామాలకు చేరుకోవడానికి ఇది ఉపయుక్తంగా ఉంటుంది. హైవేపై బైటమంజులూరు, భగవాన్‌రాజుపాలెం, కోలలపూడి వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో ఈ మార్గంలో ప్రమాదాల బారిన పడకుండా ప్రయాణాలు సాగించవచ్చని ప్రజలు అంటున్నారు. ముప్పవరం గ్రామానికి ఉత్తరం వైపు బైపాస్ నిర్మాణ పనులు జరుగుతున్న తక్షణం పాలకులు వీటిపై దృష్టిసారించి ఆయా గ్రామాల ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించాల్సి ఉంది.

ఇంకొల్లు, న్యూస్‌టుడే: ముప్పవరం ఆర్‌అండ్‌బీ రహదారిలో ఇంకొల్లు-గంగవరం మధ్య అప్పేరు వాగుపై వంతెనలేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇంకొల్లు నుంచి ముప్పవరం దగ్గర 16వ నంబరు జాతీయ రహదారికి వెళ్లాలంటే ఇది దగ్గర మార్గం కావడంతో నిత్యం వాహనాలతో రద్దీగా ఉంటుంది. చిన్న వర్షం కురిసినా చప్టాలోకి వరదనీరు ప్రవేశించి, గంటల తరబడి రాకపోకలు నిలిచిపోతున్నాయి. వాగుకు సమీపంలో దగ్గుబాటి విద్యాసంస్థలకు చెందిన ఫార్మసీ, డిగ్రీ, జూనియర్ కళాశాలలు, నివేదిత, సైనిక్ పాఠశాలలకు చెందిన 20 బస్సులు విద్యార్థులతో ప్రయాణిస్తుంటాయి. వర్షం వస్తే వాగుకు ఆవలివైపు బస్సులు నిలిచిపోయి, విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. వాగు దాటుతూ గతంలో ఒక మహిళ నీటి ప్రవాహానికి కొట్టుకుపోయి మృతిచెందింది. వంతెన నిర్మాణంతో పాటు ఇంకొల్లు-గంగవరం మధ్యలో మరో రెండు నేల చప్టాలు శిథిలావస్థకు చేరాయి. ఇటీవల రహదారికి మరమ్మతులు చేపట్టినప్పటికి వంతెన నిర్మాణంపై శ్రద్ధపెట్టలేదు. ఆర్‌అండ్‌బీ అధికారులు రహదారిని పరిశీలించి అవసరమైన చోట్ల వంతెనల నిర్మాణం చేపట్టాలని కొణికి సహకార సంఘం అధ్యక్షుడు బి.సుబ్బారావు విజ్ఞప్తి చేశారు.

అప్పేరు వాగు నేల చప్టాపై ప్రవహిస్తున్న వరద

క్రీడలు మానసికోల్లాసానికి దోహదం

పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈవో వస్రామ్‌నాయక్

మార్టూరు, న్యూస్‌టుడే: క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడతాయని ఎంఈవో వస్రామ్‌నాయక్ తెలిపారు. సోమవారం మార్టూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల మండలస్థాయి ఆటల పోటీలను ఆయన ప్రారంభించారు. ఎంఈవో-2 ప్రేమలత, హెచ్ఎం రూత్ మెర్సీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విజేతలతో రోటరీ ప్రతినిధులు

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

చీరాల, న్యూస్‌టుడే: రోటరీక్లబ్, ఇన్నర్‌వీల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యువజన వారోత్సవాల్లో భాగంగా సోమవారం చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమాన్ని వలివేటి మురళీకృష్ణ, ఎంవీ రామారావు, ఎం.రమణారావు, పుల్లయ్య, ఆంజనేయులు, జాలాది కృష్ణమూర్తి, తిరుమలశెట్టి లక్ష్మీప్రతాప్ పర్యవేక్షించారు.

ప్రమాదకరంగా కూడలి

ముంతావారి కూడలి (చీరాల), న్యూస్‌టుడే: పట్టణంలోని కొట్లబజారు రోడ్డు నుంచి స్వర్ణగేటు, నల్లగాంధీ బొమ్మ వైపు వెళ్లే రహదారి కూడలి ప్రమాదకరంగా మారింది. ఇక్కడ తరచూ ప్రమాదాలు జరుగుతుండటంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ముంతావారి కూడలి నుంచి వెళ్లే కొట్లబజారు రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. రాత్రి సమయాల్లో మరింత ఇబ్బందిగా ఉంటుంది. బైపాస్, నల్లగాంధీబొమ్మ వైపు నుంచి స్వర్ణగేటుకు వెళ్లేవారు ఈ కూడలి వద్ద కొట్లబజారును దాటి వెళ్లాలి. దీనికి తోడు ఈప్రాంతంలో రహదారిపై వాహనాలు అడ్డదిడ్డంగా నిలుపుతున్నారు. పరిస్థితి ఈవిధంగా ఉంటే ఇటీవల అక్కడ ఉన్న వేగనిరోధకం పగిలిపోయింది. దీంతో వాహనదారులు వేగంగా వెళుతున్నారు. ఈనేపథ్యంలో స్వల్ప ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి వేగనిరోధకాన్ని వేయడంతోపాటు వాహనాలు రహదారిపై నిలపకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

కూడలిలో వాహనాలు

పనిచేయని 108 వాహనం.. సేవలు ఆలస్యం

అద్దంకి, న్యూస్‌టుడే: అద్దంకి 108 వాహనం మరమ్మతులకు గురైంది. ఈకారణంగా సేవలు కొంత ఆలస్యమవుతున్నాయి. పురపాలక సంఘం పరిధిలో 50 వేల మంది జనాభా ఉన్నారు. దీనికి తోడు రాష్ట్రీయ, జాతీయ రహదారులపై జరిగే ప్రమాదాల్లో గాయపడిన వారికి వైద్యసేవలు అందించేందుకు 108 వాహనం ఉపకరిస్తుంది. గత నెల 22 నుంచి దీని సేవలు అందుబాటులో లేకపోవడంతో కొరిశపాడు, బల్లికురవ, ముండ్లమూరు 108 వాహనాలు వస్తున్నాయి. ప్రమాదం జరిగిన తరువాత కీలకమైన క్షణాల్లో 108 సేవలు అందాల్సి ఉండగా.. కొంత మేర ఆలస్యం అవుతున్నాయి. ఆదివారం మధ్యాహ్నం అద్దంకి విద్యుత్తు కార్యాలయం ఎదుట ప్రమాదం జరిగింది. క్షతగాత్రుడ్ని ఆసుపత్రికి తరలించేందుకు ఇది వచ్చే లోపు ప్రైవేటు అంబులెన్స్‌లో బాధితుడ్ని తరలించారు. ఏదేమైనా మరొకటి అందుబాటులో ఉంచాలని ప్రజలు కోరుతున్నారు. ఈవిషయమై 108 వాహనాల సూపరిండెంట్ చైతన్యను వివరణ కోరగా మరో వారంలో అద్దంకి వాహనం సిద్ధమవుతుందన్నారు. ఈలోపల బల్లికురవ, కొరిశపాడు వాహనాలను ప్రత్యామ్నాయంగా ఉంచినట్లు చెప్పారు.

అద్దంకి సీహెచ్‌సీ వద్ద ముండ్లమూరు 108 వాహనం

అధికారులు హాజరు.. అర్జీ ఒక్కటే

అద్దంకి, న్యూస్‌టుడే: రెవెన్యూ కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు మండల స్థాయి అధికారులంతా హాజరయ్యారు. ఒకే ఒక్క అర్జీ రావడం విశేషం. ఎక్కువ మంది నేరుగా బాపట్ల కలెక్టర్ కార్యాలయంలో అర్జీలు ఇస్తున్నారు. క్షేత్రస్థాయిలో పని చేయాల్సిన యంత్రాంగం సిద్ధంగా ఉన్నా అర్జీదారులు నేరుగా బాపట్ల వెళుతున్నారు. అద్దంకి రెవెన్యూ కార్యాలయానికి సంబంధించి ముగ్గురు కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి, ఇచ్చారు. అవి తిరిగి అద్దంకికి వచ్చేందుకు రెండు రోజులు పడుతుందని అధికారులు చెబుతున్నారు. స్థానికంగా అన్ని రకాల అర్జీలు పరిష్కరించేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు తహసీల్దార్ జి.శ్రీచరణ్ తెలిపారు.

ప్రయోగాత్మకంగా భూసార పరీక్షలు

శింగరకొండ (అద్దంకి), న్యూస్‌టుడే: విద్యార్థి దశ నుంచే భూసార పరీక్షల గురించి అవగాహన పెంచుకోవాలని బాపట్ల వ్యవసాయాధికారి బి.అంజిరెడ్డి అన్నారు. శింగరకొండ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయం వద్ద భూసార పరీక్షల గురించి వివరించారు. అనంతరం ప్రయోగాత్మకంగా విద్యార్థులతో మట్టి నమూనాలకు భూసార పరీక్షలు చేయించారు. మండల వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకటకృష్ణ మాట్లాడారు. ప్రిన్సిపల్ పి.చాముండేశ్వరి, ఆత్మ బీటీఎం పాలడుగు శేషారావు, సామాజిక శాస్త్రవేత్త ఎం.మరియకుమారి, ఆత్మ ఏటీఎం రామిరెడ్డి, గ్రామ ఏఈవో షేక్ సుభాని పాల్గొన్నారు.

నూతన కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవం

అద్దంకి, న్యూస్‌టుడే: అద్దంకి తాలూకా ఏపీ ఎన్‌జీజీవో ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. మొత్తం 902 మంది ఓటర్లుండగా 699 మందికి మాత్రమే ఓటు హక్కు ఉంది. ఎన్నికల అధికారిగా చీరాల అధ్యక్షుడు సీహెచ్.శేషుబాబు వ్యవహరించారు. ఒంగోలు ఎన్‌జీజీవో అధ్యక్ష కార్యదర్శులు కె.శరత్‌బాబు, ఆర్.సీహెచ్.కృష్ణారెడ్డి, ఒంగోలు ఛైర్మన్ పి.నాగేశ్వరరావు, కన్వీనర్ బి.ప్రసాద్‌లు పర్యవేక్షించారు. మొత్తం 16 పోస్టులకు 16 మంది నామినేషన్‌లు దాఖలు చేశారు. పోటీ లేకపోవడంతో ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. పాలకమండలి పదవీ కాల పరిమితి మూడేళ్లని అధికారులు వెల్లడించారు. అధ్యక్షుడిగా గద్దల కిరణ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా ఆర్.అమరనాథ్, అద్దంకి నాగేశ్వరరావు, ఎన్.అర్జునరావు, కె.శ్రీనివాసరెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడిగా డాక్టర్ పి.వెంకటకిరణ్, ఉపాధ్యక్షురాలుగా వై.అనూరాధ, ప్రధాన కార్యదర్శిగా తాళ్లూరి రమేష్‌బాబు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కె.రవికుమార్, సంయుక్త కార్యదర్శులుగా పి.ప్రదీప్‌కుమార్, డి.బుజ్జిబాబు, జి.సుబ్బారావు, షేక్ అబ్దుల్ సత్తార్, సంయుక్త కార్యదర్శిగా బి.శ్రీవాణి, కోశాధికారిగా జి.ఏడుకొండలు, డీఈసీ సభ్యుడిగా పి.నాగమోహన్ ఎన్నికయ్యారు.

అధ్యక్ష, కార్యదర్శులు కిరణ్‌కుమార్, రమేష్‌బాబు

ఇళ్ల స్థలాలకు వినతి

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: చీరాల, వేటపాలెం మండలాల్లో ఉన్న 69 మంది విభిన్న ప్రతిభావంతులు ఇళ్ల స్థలాల కోసం ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. దివ్యాంగులు తనను కలిసేందుకు వచ్చారని తెలుసుకున్న ఆర్డీవో మొదటి అంతస్తులో ఉన్న తన ఛాంబర్ నుంచి దిగి కిందకు వచ్చి, వారి నుంచి వివరాలు తెలుసుకున్నారు. అందరికీ ఒకే చోట స్థలాలు ఇప్పించాలని వారు కోరారు. అనంతరం నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌లో మరో తొమ్మిది అర్జీలను ప్రజల నుంచి స్వీకరించారు.

దివ్యాంగులతో మాట్లాడుతున్న ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

CHANGE OF SURNAME

I, **AMANI AKKALA** (old Name) w/o. Venugopal Reddy Kallam, resident of H.No. 2-85, Tanuboddivaripalem - 523169, Yeddanapudi Mandal, Bapatla Dt., A.P. I have changed my name as **Amani Kallam** (New Name) w/o. **Venugopal Reddy Kallam**. Hereafter my name is known as **Amani Kallam** (New Name) w/o. **Venugopal Reddy Kallam.**

రుద్రభూమే.. నమ్మండి!

జె.పంగులూరు, న్యూస్‌టుడే: ఈ చిత్రంలోనిది పొలం అనుకుంటే పొరపడినట్లే. ఇది రుద్ర భూమి. బైటమంజులూరు గ్రామంలో 1500 మంది జనాభా ఉండగా ఈ గ్రామ ప్రజలు చివరి మజిలీ కార్యక్రమాలకు జాతీయ రహదారి ఆనుకొని ఎకరా విస్తీర్ణంలో హిందూ శ్మశాన వాటిక ఉంది. ఇది మాగాణి పొలాన్ని తలపిస్తోంది. మోకాళ్లోతు నీళ్లు నిలిచి దట్టంగా పచ్చిక పెరిగింది. లోపలకి వెళ్లడానికి ముళ్లపొదలు అల్లుకొని ఉన్నాయి. అంత్యక్రియలు నిర్వహించుకోవడానికి గ్రామస్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. తక్షణం అధికారులు, పాలకులు స్పందించి శ్మశానవాటికను అభివృద్ధి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

బైటమంజులూరు హిందూ శ్మశానవాటిక

కాస్త చూసి వెళ్లండి!

రామకృష్ణాపురం (చీరాల అర్బన్), న్యూస్‌టుడే: చీరాల-వేటపాలెం రోడ్డులో వర్షం పడినప్పుడు సిపాయిపేట వద్ద గల ఓ బహుళ అంతస్తుల నీరంతా అందులోనే ఉంటుంది. దీన్ని నివారించేందుకు దాని యజమాని నాలుగు నెలల క్రితం తారు రోడ్డును అడ్డంగా పగులగొట్టి అవతల ఉన్న తన సొంత స్థలంలోకి పైపు వేశారు. తారు రోడ్డు మధ్యలో గాడిపెట్టిన దాన్ని మళ్లీ తారుతో మరమ్మతులు చేయకుండా సిమెంటుతో పూడ్చేశారు. ఫలితంగా ద్విచక్ర వాహనదారులు దీని గమనించకుండా వేగంగా వస్తే వాహనం కాస్త పక్కకు తిరుగుతోంది. అదే రాత్రిపూట అయితే అదుపుతప్పి పడిపోతున్నారు. అధికారులు స్పందించి సిమెంటు పూతను తొలగించి తారుతో మరమ్మతులు చేయాలని వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

తారు రోడ్డును పగులగొట్టి సిమెంటుతో బాగుచేశారిలా..

రోడ్డు పక్కన గుంత... జర జాగ్రత్త

కడవకుదురు (చినగంజాం), భీమవరం (ఇంకొల్లు), న్యూస్‌టుడే: చినగంజాం మండలంలోని కడవకుదురు నుంచి ఇంకొల్లుకు సుమారు 12 కిలోమీటర్ల మేర ఆర్‌అండ్‌బీ తారు రోడ్డు ఉంది. ఇది బాగానే ఉన్నా.. దాని పక్కన గుంతలు చాలా ఉన్నాయి. రోడ్డును ఆనుకొని దక్షిణంగా అప్పేరు వాగు ఉంది. కడవకుదురు నుంచి ఇంకొల్లు మండలంలోని భీమవరం గ్రామం వరకు రోడ్డు వెంట సుమారు 25కు పైగా గుంతలు ఉన్నాయి. ఇటీవల వచ్చిన మొంథా తుపాను ప్రభావంతో కురిసిన వర్షం, వరద నీరు కారణంగా ఈ గుంతలను అధికారులు పట్టించుకోవడం లేదు. వీటి కారణంగా వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. రాత్రుల మరీ ఇబ్బందిగా ఉందని అంటున్నారు. గుంతల వద్ద పలువురు ప్రమాదాలకు గురయ్యారు. అధికారులు వాటిని పరిశీలించి, పూడ్చివేసి ఇబ్బంది లేకుండా చూడాలని ప్రజలు, వాహన చోదకులు కోరుతున్నారు.

ఇంకొల్లు-కడవకుదురు మార్గంలో గొనసపూడి వద్ద ఇలా

IN THE COURT OF THE ADDITIONAL CIVIL JUDGE (SENIOR DIVISION), NARASARAOPET

IP.No. 32 of 2025

BETWEEN: Ravi Sudhakar S/o Ramaiah R/o H.No. 33-620/3, N.H.-5 Road, Chilakaluripeta Town, Palnadu District, Pin: 522 616, Andhra Pradesh, Cell No. 9848361546. ... **Petitioner**

AND

1. Kandimalla Anjana Devi, W/o Kandimalla Anji Babu, R/o.D.No.4-338/1, 3rdLane, Pandaripuram, Chilakaluripeta, PALNADU District - 522 616. Cell No. 9849638244.
2. Kandimalla Anji Babu, S/o Venkatanarayana, R/o. D.No.4-338/1, 3rdLane, Pandaripuram, Chilakaluripeta, PALNADU District - 522 616. Cell No. 9849638244 .
3. Kandimalla Chandra Sekhar, S/o Venkateswarlu, R/o. Kolalapudi Village, Marturu Mandal, PRAKASAM District - 523 261. Cell No. 9381359998.
4. Kandimalla Madhusudhana Rao, S/o Venkateswarlu, R/o.Kolalapudi Village, Marturu Mandal, PRAKASAM District - 523 261. Cell No. 9642676271.
5. Tati SubbaRao, S/o Tati Venkaiah, R/o Kolalapudi Village, Marturu Mandal, PRAKASAM District - 523 261.
6. Tati Anjaneyulu, S/o Venkateswarlu, R/o Kolalapudi Village, Marturu Mandal, PRAKASAM District - 523 261.
7. M.Ram Mohan Rao, R/o Pandaripuram, Opp.to PrattipatiPulla Rao House, Chilakaluripeta, Palnadu District - 522 616.
8. Somepalli Prasada Rao, S/o Venkateswarlu, R/o House No. 3-194, 7th Lane, Pandaripuram Chilakaluripeta, PALNADU District - 522 616. Cell No 9398666590.
9. Official Receiver, O/o Official Receiver, District Court Premises, GUNTUR - 522 002. ... **Respondents**

పై నెంబరు ఐ.పి.లో పిటీషనరు తనను ఇన్‌సాల్వెంట్‌గా డిక్లేర్ చేయవలసినదిగా దాఖలు చేసిన పిటీషను ... ది.05-01-2026 తేదీ ఉదయం 10:30 గంటలకు పై కోర్టువారి ఎదుట స్వయంగా గాని, మీ తరపు వకీలు ద్వారా గాని హాజరై మీకు గల అభ్యంతరము తెలుపుకోగలరు. లేనిచో శ్రీ కోర్టువారు వారి పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది: 05-01-2026.

వీరగాని లీలాకృష్ణ, పిటీషనరు తరుపు అడ్వకేటు, 18/2 అరండల్‌పేట, గుంటూరు. సెల్: 98483 41985.

వాలీబాల్ విజేతలకు అభినందన

వేటపాలెం, న్యూస్‌టుడే: సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాల మహిళల వాలీబాల్ జట్టు జేఎన్‌టీయూ కాకినాడ సెంట్రల్ జోన్ విజేతగా నిలిచినట్లు కళాశాల కార్యదర్శి వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావులు తెలిపారు. ఈ పోటీలు విజయవాడలో జరిగినట్లు చెప్పారు. క్రీడాకారిణులు సుష్మ, నిషిత, ఉమామహేశ్వరి, భూమిక, పూజిత, అనిత, హారిక, మానస, ప్రవల్లికలను ప్రిన్సిపల్ డాక్టరు కె.జగదీష్‌బాబు, పీడీ అన్నం శ్రీనివాసరావు, వివిధ విభాగాధిపతులు అభినందించారు.

కోటి సంతకాల యాప్ ప్రారంభం

రామకృష్ణాపురం (చీరాల అర్బన్), న్యూస్‌టుడే: నియోజకవర్గ వైకాపా బాధ్యుడు కరణం వెంకటేష్ తన క్యాంపు కార్యాలయంలో సోమవారం కోటి సంతకాల సేకరణ కోసం పార్టీ కేంద్ర కార్యాలయం రూపొందించిన యాప్‌ను ప్రారంభించారు. పార్టీ వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్నదానానికి విరాళం

శింగరకొండ(అద్దంకి), న్యూస్‌టుడే: శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో జరుగుతున్న నిత్యాన్నదానానికి పట్టణానికి చెందిన మారం వరప్రసాదరావు రూ.10,116 విరాళం అందించారు. పాలక మండలి ఛైర్మన్ చుండూరి మురళీసుధాకరరావు, ట్రస్టీ బత్తుల చంద్రశేఖర్‌కు విరాళం అందజేశారు.

బకాయిలు నూరు శాతం వసూలు చేయాలి

సంతమాగులూరు, న్యూస్‌టుడే: ఇంటి పన్ను బకాయిలను నూరు శాతం వసూలు చేయాలని ఎంపీడీవో జ్యోతిర్మయి కోరారు. గృహ నిర్మాణం, ఇంటి పన్ను వసూళ్లు, పీజీఆర్‌ఎస్ పథకాలపై సంతమాగులూరులో సోమవారం నిర్వహించిన సమావేశంలో సిబ్బందితో సమీక్షించి, సూచనలు చేశారు.

అ వీ ఇ వీ

నాణ్యతలేని విత్తనాల విక్రయంపై ఫిర్యాదు

కారంచేడు, న్యూస్‌టుడే: మండలంలోని కుంకలమర్రు గ్రామానికి చెందిన బి.షడ్రక్ అనే రైతు భీమ్ ఆర్మీ పార్టీ ఆధ్వర్యంలో తనకు గ్రామానికి చెందిన చైతన్య నాణ్యతలేని వరి విత్తనాలు విక్రయించారంటూ సోమవారం కలెక్టర్‌లో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. తనతో పాటు జొన్నలగడ్డ బుజ్జి విత్తనాలు కొన్నామని, మొలకెత్తలేదన్నారు. దీనిపై చైతన్యను ప్రశ్నించగా దిక్కున్నచోట చెప్పుకోమని బెదిరించాడంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయంపై ఏవో నాగరాజును వివరణ కోరగా పీజీఆర్‌ఎస్‌లో వచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు.

వసతి గృహంలో విచారణ

మార్టూరు, న్యూస్‌టుడే: మార్టూరులోని ప్రభుత్వ బాలికల వసతి గృహంలో ఇద్దరు బాలికల మధ్య చోటు చేసుకున్న ఘటనపై అద్దంకి మేజిస్ట్రేట్ ఆదేశాల మేరకు సోమవారం ఇరువురు న్యాయవాదుల వివరాలు సేకరించారు. గృహంలో జరిగిన ఘటనపై అక్కడి విద్యార్థినులతో మాట్లాడి, వివరాలు నమోదు చేసినట్లు న్యాయవాదులు చిరంజీవి, లీలావతి తెలిపారు.

ఆర్థికసాయం అందజేత

మార్టూరు, న్యూస్‌టుడే: గ్రామంలోని గొట్టిపాటి నగర్‌లో జరిగిన ఘర్షణలో తీవ్రంగా గాయపడి గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బాధితుడు బాజీని సోమవారం తెలుగుదేశం పార్టీ నాయకులు పరామర్శించారు. రాష్ట్ర తెదేపా మైనార్టీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ షేక్ అబ్దుల్ రజాక్, నాయకులు టి.ఆదినారాయణతో పాటు పలువురు నేతలు బాధితుడు తల్లికి ఆర్థిక సాయం అందజేశారు.

ఇరుముడితో శ్రీశైలం పయనం

మార్టూరు, న్యూస్‌టుడే: పట్టణానికి చెందిన శివ దీక్షాపరుడు ముప్పా సాంబశివరావు సోమవారం ఇరుముడితో శ్రీశైలం పయనమయ్యారు. గతంలోనూ భద్రాచలం, తిరుపతి, శ్రీశైలం, అన్నవరం పాదయాత్ర చేశారు. ఈ కార్తిక మాసంలో 41 రోజుల పాటు కాశీలో దీక్ష చేపట్టి, సోమవారం పెదకాకానిలో ఇరుమడి కట్టుకుని, శ్రీశైలం బయలుదేరారు. పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

పీజీఆర్‌ఎస్‌ను సద్వినియోగం చేసుకోండి

పర్చూరు, కారంచేడు, న్యూస్‌టుడే: ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న పీజీఆర్‌ఎస్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పర్చూరు, కారంచేడు తహసీల్దార్లు పి.బ్రహ్మయ్య, జి.నాగరాజు తెలిపారు. సోమవారం ఆయా రెవెన్యూ కార్యాలయాల్లో పీజీఆర్‌ఎస్ నిర్వహించారు. ఒక అర్జీ అందినట్లు బ్రహ్మయ్య చెప్పారు.

నల్లబర్లీ సాగు చేపడితే చర్యలు

పర్చూరు, న్యూస్‌టుడే: నల్లబర్లీ పొగాకు సాగు చేపడితే చర్యలు తప్పవని తహసీల్దార్ పి.బ్రహ్మయ్య చెప్పారు. సోమవారం మండలంలోని గర్నెపూడి, రమణాయపాలెం గ్రామాల్లో ఎటువంటి అనుమతులు లేకుండా ఏడెకరాల్లో సాగు చేస్తున్న నల్లబర్లీ పొగాకును మండల కమిటీ సభ్యులైన రెవెన్యూ, వ్యవసాయ, పోలీస్ శాఖ అధికారులు పరిశీలించారు. అనుమతి లేకుండా సాగు చేస్తే రైతులు స్వయంగా దున్నాల్సి వస్తుందని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఏవో కె.భాస్కరరావు, వీఆర్వో వై.శ్రీనివాసరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

శిరస్త్రాణం తప్పనిసరి

బొల్లాపల్లి(మార్టూరు), న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా శిరస్త్రాణం ధరించాలని సీఐ శేష గిరిరావు చెప్పారు. సోమవారం రోటరీ క్లబ్ ఆఫ్ మార్టూరు, పోలీస్‌శాఖ సంయుక్త ఆధ్వర్యంలో బొల్లాపల్లి టోల్‌ప్లాజా వద్ద రోడ్డు భద్రతా నియమాలు, ప్రమాదాల నివారణపై ద్విచక్ర వాహనదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలను ఎల్లప్పుడూ వెంట ఉంచుకోవాలన్నారు. సభ్యులు ఎం.సాంబశివరావు, సీహెచ్ నాగేశ్వరరావు, జి.రవికుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బిల్లుల ప్రతులు దహనం

మార్టూరు, న్యూస్‌టుడే: దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న విద్యుత్తు, విత్తనాల బిల్లులకు నిరసనగా సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్‌కేఎం), ఏఐకేఎస్‌ఈ, సీఐటీయూ, రైతు సంఘం నాయకులు సోమవారం మార్టూరు కూడలిలో బిల్లుల ప్రతులను దహనం చేశారు. నేతలు హనుమంతరావు, వి.కృష్ణమూర్తి, శేషాద్రి, రాంబాబు, సూరిబాబు, కె.రామకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కొణికిలో విద్యుత్తు ఉపకేంద్రం

కొణికి (ఇంకొల్లు), న్యూస్‌టుడే: సమస్యల పరిష్కారానికి కొణికిలో విద్యుత్తు ఉపకేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు ఏఈ జె.రామకృష్ణ తెలిపారు. ఇంకొల్లు ఉప కేంద్రంపై అదనపు లోడు పడుతున్న కారణంగా ఇక్కడ ఏర్పాటు చేస్తున్నామన్నారు. కొణికి, గంగవరం, దుద్దుకూరు, భీమవరం, నలతోటివారిపాలెం, కట్టావారిపాలెం, గొల్లపాలెం గ్రామాలతో పాటు ఇంకొల్లు-కొణికి మధ్య ఉన్న శీతల గిడ్డంగులకు ఈ కేంద్రం నుంచి విద్యుత్తు సరఫరా జరుగుతుందన్నారు. నిర్మాణానికి టెండర్లు పిలిచారని, త్వరలో పనులు ప్రారంభమవుతాయని రామకృష్ణ చెప్పారు.

పాలెం రహదారికి మరమ్మతులు చేపట్టరూ

గంగవరం (ఇంకొల్లు), న్యూస్‌టుడే: ఇంకొల్లు శివారు తాటిపర్తివారిపాలెం రహదారికి మరమ్మతులు చేపట్టాలని ఇంకొల్లు మండల సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఆ పార్టీ జిల్లా కార్యదర్శి సీహెచ్.గంగయ్య, నేతలు యేషయ్య, జకారియా, కె.గంగయ్య రహదారిని పరిశీలించారు. పదేళ్ల క్రితం నిర్మించిన రోడ్డు పూర్తిగా ధ్వంసమైందని, గత ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. వెంటనే మరమ్మతులు చేపట్టి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

నేడు యూటీఎఫ్ మండల కౌన్సిల్ ఎన్నిక

ఇంకొల్లు, న్యూస్‌టుడే: ఇంకొల్లు మండల యూటీఎఫ్ కౌన్సిల్ ఎన్నిక మంగళవారం జరుగుతుందని సంఘ అధ్యక్షుడు పి.సత్యనారాయణ తెలిపారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో సాయంత్రం 5 గంటలకు జరిగే సమావేశంలో కార్యదర్శి నివేదిక, ఆర్థిక నివేదికపై చర్చ, తీర్మానాలు, నూతన కమిటీ ఎన్నిక ఉంటుందని చెప్పారు. సభ్యులంతా పాల్గొని నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవాలని కోరారు.

నేడు ఉచిత నేత్రవైద్య శిబిరం

ఇంకొల్లు, న్యూస్‌టుడే: దివంగత కాపు సంఘ నాయకుడు పొన్నగంటి వెంకటేశ్వర్లు పేరిట కుటుంబ సభ్యులు మంగళవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. గొల్లపాలెం రోడ్డులో టీచర్స్ కాలనీలోని జానకి రామారావు గృహంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు వైద్య శిబిరం జరుగుతుంది. ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి వైద్యులు పరీక్షలు చేస్తారని చెప్పారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
కందుకూరు మెయిన్ బ్రాంచ్
వెంగమాంబ ఫంక్షన్ హాల్ ఎదురుగా, పామూరు రోడ్డు, కందుకూరు, SPSR నెల్లూరు జిల్లా-523105. ఫోన్ : 91599 16991
ఇ-మెయిల్: ubin0803049@unionbankofindia. bank

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియజేస్తూ 30 రోజుల ప్రకటన
(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క నిబంధన 6(2)/8(6) ప్రకారం)

టు:
లేటు లక్ష్మీ కాంత రెడ్డి గుండాల గారి చట్టరీత్యా వారసులు (ఋణగ్రహీత/తనఖాదారు :
1) గుండాల సుందర రామి రెడ్డి (లేటు లక్ష్మీకాంత రెడ్డి గుండాల యొక్క తండ్రి)
2) గుండాల రమా దేవి (లేటు లక్ష్మీకాంత రెడ్డి గుండాల యొక్క తల్లి)
3) గుండాల జ్యోత్స్న, భర్త: లేటు లక్ష్మీకాంత రెడ్డి గుండాల

డియర్ సార్/మేడమ్,

విషయం: సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు, 2002 క్రింద బ్యాంక్‌కు చెల్లించవలసిన బకాయి వసూలు కొరకు లేటు గుండాల లక్ష్మీ కాంత రెడ్డి గారికి చెందిన ఆస్తి అమ్మకం.

బ్యాంకు వారికి చెల్లించవలసిన బకాయి మొత్తములను నోటీసులో తెలిపిన నిర్ణీతకాలంలోగా చెల్లించవలసినదిగా సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 యొక్క 13(2) సెక్షన్ క్రింద **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కందుకూరు మెయిన్ బ్రాంచ్** సెక్యూర్డ్ క్రెడిటార్ వారు మీకు డిమాండ్ నోటీసు తేది **22.08.2025** న జారీచేసినారు. అయినప్పటికీ మీరు సదరు నోటీసులో సూచించిన నిర్ణీత కాలంలోగా బకాయి మొత్తము చెల్లించుటలో విఫలమైనందున సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు-2002 యొక్క 6/8 వ రూలుతో కూడిన సదరు చట్టం 13(4) సెక్షన్ క్రింద స్థిర సెక్యూర్డ్ ఆస్తులను అధీకృత అధికారి గారు ఆస్తిని తేది **28.11.2025** న స్వాధీన పరుచుకున్నారు.

సెక్యూర్డ్ ఆస్తులు స్వాధీన పరచుకున్న తరువాత కూడా మీరు బ్యాంకు యొక్క బకాయి మొత్తము చెల్లించలేదు. అందువలన ఈ నోటీసు స్వీకరణ తేదీ నుండి 30 రోజులు తరువాత బహిరంగ ఇ-వేలం నిర్వహించుట ద్వారా ఆన్‌లైన్ పద్ధతిలో దిగువ తెలిపిన ఆస్తులను విక్రయించవలసిన అవసరం ఉంటుంది. ఇ-వేలం తేదీ మరియు సమయంతో పాటు ఆస్తి యొక్క రిజర్వు ధర మరియు ఇ-వేలం నిర్వహించు సర్వీస్ ప్రొవైడర్ వివరములు మీకు విడిగా తెలియచేయబడతాయి.

కాబట్టి, అమ్మకం ప్రకటన ప్రచురణ తేదీకి ముందుగా మీరు బ్యాంకు వారికి చెల్లించవలసిన బకాయి మొత్తముతో పాటు దానిపై తదుపరి వడ్డీ, బ్యాంకు వారికి సంభవించిన ఖర్చులు, ఛార్జీలు మరియు వ్యయాలు చెల్లించినచో, ఆస్తి అమ్మకంపైన తదుపరి చర్యలు చేపట్టబడవు మరియు సదరు చట్టం 13(8) సెక్షన్ పరిధిలో మీ తనఖా ఆస్తులను మీరు విడిపించుకోవచ్చును.

స్థిరాస్తి వివరములు

ఆంధ్రప్రదేశ్-523109, ప్రకాశం జిల్లా, పొన్నలూరు మండలం, సింగరబొట్లపాలెం గ్రామం, డోర్ నెం. 1-61, సర్వే నెం. 3/3A వద్ద విస్తీర్ణం 290.44 చ॥గ॥లులోని ఇంటి స్థలంతో పాటు గ్రౌండ్ ఫ్లోర్ నందు ఆర్‌సిసి రూఫ్ రెసిడెన్షియల్ భవనం **లేటు గుండాల లక్ష్మీకాంత రెడ్డి, తండ్రి : సుందర రామిరెడ్డి గారికి చెందినది.** **హద్దులు : తూర్పు :** గ్రామ పంచాయితీ రోడ్డు (కోవూరు రోడ్డు), **దక్షిణం :** అప్పసబోయిన తిరుపతయ్య గారి స్థలం, **పడమర :** వాసిపల్లి వెంకటేశ్వర రెడ్డి గారి స్థలం, **ఉత్తరం :** గుండాల వెంకటేశ్వర రెడ్డి గారి స్థలం.

తేది : 05.12.2025 | **సం/- అధీకృత అధికారి,**
స్థలం: కందుకూరు | **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**

(c) eenadu

పురాతన ఆలయం.. త్రిమూర్తుల నిలయం

ఏర్పేడు, న్యూస్‌టుడే: ఏకశి లింగంపై బ్రహ్మ, విష్ణు మహేశ్వరులు కొలువుదీరిన పురాతనమైన శివాలయం మన జిల్లాలో ఉంది. తెలుసా..? ఏర్పేడు మండలంలోని గుడిమల్లంలో ఈ ఆలయం ఉంది. విగ్రహం ముదురు కాఫీ రంగులో ఉండటంతో పాటు కింద భాగంలో మరగుజ్జుగా బ్రహ్మ, భుజాన బాణం, ఒక చేతిలో మేకపోతు తల, మరో చేతిలో కల్లుకుండ పట్టుకుని తలపాగా ధరించి గంభీరంగా ఉన్న శ్రీపరశురామేశ్వరస్వామి అలంకరణలో విష్ణువు, లింగ రూపంలో శివుడు కొలువుదీరి భక్తులకు దర్శనమిస్తాడు. 1, 2వ శతాబ్దంలో చోళులు, పల్లవులు ఈ ఆలయాన్ని నిర్మించి అభివృద్ధి చేసినట్లు చరిత్రకారులు చెబుతుంటారు.

గుడిమల్లంలోని పరశురామేశ్వరస్వామి ఆలయం

ప్రత్యేకతలు.. ▶ ఆలయ గోపురం గజపృష్ఠ ఆకారంలో ఉండటమే కాకుండా లోపలిభాగం గుండ్రంగా ఉంటుంది. గోడలపై శ్రీ గురుదక్షిణామూర్తి, శ్రీవేంకటేశ్వరస్వామితో పాటు పలు దేవతామూర్తులు కొలువుదీరి ఉంటారు. ▶ సూర్యుడు ఉత్తరాయణంలో నుంచి దక్షిణాయనంలోకి మారే సమయంలో కిరణాలు నేరుగా స్వామి పాదాలు తాకేవిధంగా కిటికీలు అమర్చారు. అంతరాలయం పల్లంగా ఉంటుంది. 60ఏళ్లకో పర్యాయం స్వర్ణముఖినది నీరు స్వామివారిని తాకుతుంటాయని భక్తులు చెబుతుంటారు.

ఆలయంలో వెలసిన స్వామివారు

పిల్లలూ.. ప్రధానితో మాట్లాడతారా..!

తిరుపతి (విద్య), న్యూస్‌టుడే: బాలబాలికలకు.. ప్రధానమంత్రితో నేరుగా మాట్లాడే సువర్ణావకాశాన్ని కేంద్ర ప్రభుత్వం కల్పిస్తోంది. విద్యార్థుల్లో పరీక్షలపట్ల ఉన్న భయం, ఒత్తిడిని తగ్గించి వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు జాతీయస్థాయిలో 'పరీక్షా పే' చర్చా కార్యక్రమం ఏటా నిర్వహిస్తుండగా తొమ్మిదో విడత జనవరి 2026లో జరగనుంది. విద్యార్థులు తమ ప్రశ్నలు, సందేహాలు, అనుభవాలు, పరీక్షల సంసిద్ధతకు సంబంధించిన అభిప్రాయాలను ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా సమర్పించవచ్చు. పరీక్షల సీజన్ త్వరలో ప్రారంభం కానున్న నేపథ్యంలో వాటికి ఎలా సన్నద్ధమవ్వాలి.. విద్యార్థులు ఎదుర్కొనే సవాళ్లు ఏంటి? వాటిని ఎలా అధిగమించాలి? విద్యార్థుల ఆకాంక్ష ఏంటి? వాటిని చేరుకోవడానికి అనుసరించాల్సిన మార్గాలు.. పరీక్షల సమయంలో ప్రశాంతంగా ఎలా ఉండాలి.. తదితర అంశాలపై కార్యక్రమం జరుగుతుంది.

కార్యక్రమ ప్రచార చిత్రం

- **రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ:** జనవరి 11, 2026
- **అర్హులు :** 6 నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు
- **ప్రశ్నలు ఇలా ఉండాలి :** ప్రశ్న గరిష్ఠంగా 500 అక్షరాల్లోపు.
- రిజిస్ట్రేషన్‌కు innovateindia1.mygov.in వెబ్‌సైట్ సందర్శించాలి.
- అనంతరం 'పార్టిసిపేట్' బటన్‌పై క్లిక్‌చేసి విద్యార్థి //టీచర్ //తల్లిదండ్రులు అనే ఆప్షన్ ఎంచుకోవాలి.
- మొబైల్ లేదా ఈ-మెయిల్ ద్వారా లాగిన్ అయి వివరాలు నమోదు చేయాలి.
- అక్కడ ఇచ్చే చిన్న మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాలి.
- పాల్గొన్న వారందరికీ ప్రశంసాపత్రాలు లభిస్తాయి.
- విజేతలకు ప్రధానితో నేరుగా మాట్లాడే అవకాశం, ప్రశంసాపత్రాలు 'ఎగ్జామ్ వారియర్స్' కిట్‌లు బహుమతిగా లభిస్తాయి.

ఆగలేదు.. అంతేలేదు..

▶ దర్జాగా ఇసుక అక్రమ రవాణా
▶ కుశస్థలి పరివాహకంలో అడ్డగోలు తవ్వకం

తెరణి సమీప శ్మశానవాటిక వద్ద ఇసుక లోడింగ్ కోసం నిలిచి ఉన్న ట్రాక్టర్

● కుశస్థలి నది పరివాహకానికి ఆనుకొని పలు గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల పరిధిలోని వారంతా గట్లపై శ్మశానాలు ఏర్పాటు చేసుకున్నారు.. కొందరు ఇసుకాసురులు ఆయా శ్మశానాలను సైతం వదలకుండా తవ్వేస్తుండటం గమనార్హం.

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నా చిత్తూరు జిల్లాలో వైకాపా నేతల ఇసుక అక్రమ వ్యాపారం ఆగడం లేదు. గత ఐదేళ్లలో అందినకాడికి అడ్డగోలుగా ఇసుక తరలించి రూ.కోట్లు దోచుకున్నారు. ఇప్పటికీ వారి హవానే సాగుతుండటం గమనార్హం. ప్రకృతి వనరులను చెరబట్టిన ఆ నేతలు తాజాగా శ్మశానాలనూ వదలడం లేదు. అక్కడి ఇసుకను దర్జాగా రాత్రివేళ ఇటు తమిళనాడు.. అటు కర్ణాటకకు తరలిస్తున్నారు.

న్యూస్‌టుడే, పుత్తూరు, నగరి

ఆగని అక్రమాలు.. చిత్తూరు జిల్లాలో కార్వేటినగరం ప్రాంతం నుంచి విజయపురం వరకు 28 కి.మీ. మేర కుశస్థలి నది పరివాహకం ఉంది. ఏటా వర్షాకాలంలో ఈ నదిలో వరద ప్రవహిస్తే భారీగా ఇసుక చేరుతుంది. ఇది ఇసుకాసురులకు కాసులు కురిపిస్తోంది. గత వైకాపా హయాంలో రీచ్‌లు ఏర్పాటు చేసి బుకింగ్ చేసుకున్న వారికి అమ్మింది కొంతే. అక్రమంగా సరిహద్దులు దాటించిందే అధికం.

ప్రశ్నిస్తే దాడు.. కుశస్థలి నది పరివాహక ప్రాంతంలో అడ్డగోలుగా తవ్వకాలు చేపడుతున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే తమపైనే అక్రమార్కులు దాడులు చేస్తున్నారని గ్రామస్థులు వాపోతున్నారు. ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లను అడ్డుకున్నా లెక్కచేయడం లేదని చెబుతున్నారు. మరోవైపున నదిలోకి ప్రవేశించకుండా పలు గ్రామాల్లో యువత అడ్డుకుంటున్నా వారిపై తెగబడుతుండటం గమనార్హం. రాత్రికిరాత్రి ఆయా మార్గాల్లో వాహనాలు రాకుండా నదిలో పలుచోట్ల కందకాలు తవ్వుతున్నా వాటిని పూడ్చేసి మరీ అక్రమాలకు బరితెగిస్తున్నారంటే వారికున్న పలుకుబడి అలాంటిది మరి.

■ కుశస్థలి నది పరివాహక ప్రాంతం అటు తమిళనాడు, ఇటు ఆంధ్ర ప్రాంతాల్లోను పారుతుంది. నగరి మండలం తెరణి వద్ద రాత్రీ పగలూ తేడా లేకుండా ఇసుక తరలిస్తున్నారు. గతంలో ఎన్నోసార్లు వారిని అడ్డుకునే ప్రయత్నం చేసి గ్రామస్థులు విఫలమయ్యారు. నిత్యం వందల ట్రాక్టర్లతో తరలిస్తుండటంతో ఆ ప్రాంతంలో భూగర్భజలాలు అడుగంటి పోతున్నాయని రైతులు వాపోతున్నారు.

దాడులు నిర్వహిస్తాం.. ఇసుక అక్రమంగా తరలిస్తే కేసులు నమోదు చేస్తాం. ప్రభుత్వం ఇసుక రీచ్‌ల ద్వారా విక్రయిస్తోంది. అక్కడి నుంచే ట్రాక్టర్ల యజమానులు ఇసుక తీసుకెళ్లాలి. అలాకాక అక్రమంగా తరలించడం నేరం. పట్టుబడితే కేసులు నమోదు చేసి వాహనాలు సీజ్ చేస్తాం. ఎవరినీ ఉపేక్షించం.

- సత్యనారాయణ, డీడీ, గనులశాఖ, చిత్తూరు

వరసిద్ధుడి ఆలయ ఆధ్వర్యంలో వేద పాఠశాల

☛ రూ.2.8 కోట్లతో నూతన పుష్కరిణి ☛ పాలకమండలి సమావేశంలో తీర్మానం

వివరాలు వెల్లడిస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్, ఛైర్మన్ మణినాయుడు, ఈవో పెంచల కిషోర్

కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయ ఆధ్వర్యంలో వేద పాఠశాల త్వరలో ప్రారంభించనున్నామని ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ తెలిపారు. ఆలయ పాలకమండలి తొలి సమావేశ వివరాలను ఛైర్మన్ మణినాయుడు, ఈవో పెంచల కిషోర్‌తో కలిసి సోమవారం వెల్లడించారు. 70 ఏళ్ల ముందుచూపుతో రూపొందించిన మాస్టర్ ప్లాన్ అమలుకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని చెప్పారు. ఆలయానికి ఎదురుగా ఉన్న పుష్కరిణిని తొలగించి పాత లడ్డూ పోటు స్థానం(తూర్పు ఈశాన్యం)లో రూ.2.8 కోట్లతో నూతన పుష్కరిణి నిర్మిస్తామన్నారు. భక్తుల కోసం నిర్మించిన వంద గదులు త్వరలో అందుబాటులోకి తెస్తామని, భక్తులు ముందుకొచ్చి రూ.10 లక్షలు విరాళం అందజేస్తే ఆ గదికి వారి పేరు పెడతామన్నారు. రూ.25 కోట్ల తితిదే నిధులతో నిర్మించనున్న అతిథిగృహం, రెండు కల్యాణ మండపాలకు పాలకమండలి ఆమోదం తెలిపిందన్నారు. రూ.13 లక్షలతో స్వామివారి ప్రచార రథానికి మరమ్మతులు చేపట్టి గతంలో మాదిరి గ్రామాల్లో పర్యటించి హైందవ ధర్మంపై ప్రచారం చేస్తామని చెప్పారు.

16 నుంచి సుప్రభాతం స్థానంలో తిరుప్పావై

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి ఆలయంలో పవిత్ర ధనుర్మాసం పురస్కరించుకుని ఈనెల 16 నుంచి జనవరి 14 వరకు సుప్రభాతం బదులు తిరుప్పావై నివేదించనున్నారు. 12 మంది ఆళ్వార్లలో ఒకరైన శ్రీఆండాళ్(గోదాదేవి) మొదటగా ధనుర్మాసం వ్రతం ఆచరించడంతోపాటు వ్రతం ఎలా పాటించాలనే విషయాన్ని 30 పాశురాలతో కూడిన తిరుప్పావై దివ్యప్రబంధాన్ని లోకానికి అందించారు. ఈ నేపథ్యంలో తితిదే ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో తితిదే దేశవ్యాప్తంగా ఉన్న 233 కేంద్రాల్లో తిరుప్పావై ప్రవచనాలు పారాయణం చేయనున్నారు.

లక్ష్యం.. సూపర్ స్పెషాలిటీ వైద్యం

☛ ఈఎస్ఐ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.శ్యామ్‌బాబు

ముఖాముఖి

తిరుపతి (వైద్యవిభాగం), న్యూస్‌టుడే: ఉమ్మడి రాయలసీమ, నెల్లూరు జిల్లాలకు చెందిన కార్మికరాజ్య బీమా (ఈఎస్ఐ) కార్డుదారులు.. వారి కుటుంబ సభ్యులు సరాసరి 20 లక్షల మందికి ఆరోగ్య భరోసా కల్పించాల్సిన బాధ్యత తిరుపతి ఈఎస్ఐ ఆస్పత్రిపై ఉందని.. కూటమి ప్రభుత్వం, ఉన్నతాధికారుల తోడ్పాటుతో సరిపడా పడకలు, పరికరాలు, వైద్య సిబ్బందిని సమకూర్చుకుంటూ సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందించడమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నట్లు ఈఎస్ఐ మెడికల్ సూపరింటెండెంట్ డా.మల్చి శ్యామ్‌బాబు తెలిపారు. ఏడాదిలో తెచ్చిన మార్పులపై 'న్యూస్‌టుడే'తో ప్రత్యేకంగా మాట్లాడారు.

ఓపీని రెట్టింపు చేశాం

ప్రతినెలా రెండు వైద్య శిబిరాలు నిర్వహించి కార్మికులకు ఈఎస్ఐపై నమ్మకాన్ని పెంచుతున్నాం. ఒకప్పుడు నెలకు 4,500 ఉన్న ఓపీని.. గత సెప్టెంబరులో 7,884కు తీసుకొచ్చాం. నవజాత శిశువులకు టీకా వేసేందుకుగాను నేషనల్ ఇమ్యునైజేషన్ స్కీమ్‌లో చేర్చి నెలకు 275 టీకాలు వేసేస్థాయికి చేరాం. ఒకప్పుడు వెయ్యికి మించని ల్యాబ్ పరీక్షలు ఇప్పుడు 8 వేలకు పెంచాం.

మెమోలు స్వీకరించి..

పనిచేయని వారికి ఉన్నతాధికారి మెమోలు ఇవ్వడం సర్వసాధారణం. ఇక్కడ వార్డులు, క్యాజువాలిటీ, ఓపీల్లో పనిచేయని పరికరాలు, అవసరాల గురించి సంబంధిత సిబ్బందితోనే ముందుగా మెమోలు తెప్పించుకున్నాం. సంస్థ నిధులతో పాటు దాతల సహకారం తీసుకుని పరికరాలకు మరమ్మతులు చేయించాం. మూడు గ్లూకో మీటర్లు, 2,500 గ్లూకో స్ట్రిప్స్, ల్యాబ్, సర్జికల్ వస్తువులు సమకూర్చుకున్నాం. కొన్నేళ్లుగా పనిచేయని ఎక్స్‌రే యంత్రం అందుబాటులోకి తెచ్చాం.

రెఫరల్ అవసరం లేకుండా

పెద్ద శస్త్రచికిత్సలు మినహా ఈఎస్ఐ నుంచి అనుబంధ (రెఫరల్) ఆసుపత్రులకు రోగులను పంపకుండా ఇక్కడే సేవలు మెరుగుపరిచాం. నెలకు 200 వరకు కాన్పులు, శస్త్రచికిత్సలు చేస్తున్నాం. ట్రూనాట్ మిషన్ ద్వారా టీబీ రోగులను గుర్తించే పరీక్షలు నిర్వహిస్తున్నాం. రోగులకు మందుల కొరత లేకుండా చేశాం. రోగులతోపాటు ఓ సహాయకుడికి భోజనం అందిస్తున్నాం.

ఎన్ఏబీహెచ్ సాధనే లక్ష్యం

తిరుపతి ఈఎస్ఐ ఆస్పత్రికి నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఆఫ్ హాస్పిటల్స్ (ఎన్ఏబీహెచ్) గుర్తింపు వస్తే మెడిసిన్, గైనకాలజీ, ఆర్థో, జనరల్ సర్జరీ విభాగాలకు పీజీ సీట్లు రావడంతోపాటు నిధులు మంజూరవుతాయి. తద్వారా పడకల పెంపు, ఆస్పత్రి అభివృద్ధి సాధ్యమవుతుంది. సీటీ స్కాన్ మిషన్ కోసం విన్నవించాం. 8 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న అగ్నిమాపక శాఖ ఎన్‌వోసీ సాధన పనులు 90 శాతం పూర్తయ్యాయి. వంద పడకల స్థాయి సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎస్‌టీపీ) ఏర్పాటుకు నివేదించాం.

రోజువారీ సేవలు ఇలా..

పడకలు	100
ఓపీ	300-350
ఐపీ	60-70
మొత్తం కార్డుదారులు	5 లక్షలు

4,410 హెక్టార్లకు సూక్ష్మసేద్యం మంజూరు

చిత్తూరు(వ్యవసాయం), న్యూస్‌టుడే: జిల్లాలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 4,636 మంది రైతులకు సంబంధించి 4,410 హెక్టార్లకు సూక్ష్మసేద్యం రాయితీ మంజూరు చేశామని సూక్ష్మనీటి సాగు పథకం పీడీ రమణ సోమవారం తెలిపారు. ప్రభుత్వం ఈ ఏడాది 12 వేల హెక్టార్లు సూక్ష్మసేద్యం విస్తరణ లక్ష్యంగా నిర్ణయించిందన్నారు. 2,784 మంది రైతులకు సంబంధించి 2,602 హెక్టార్లకు పరికరాల సరఫరా, అమర్చడం వేగవంతం చేశామన్నారు. బిందు, తుంపర్ల సేద్యం రాయితీలకు రైతులు రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

● డ్రిప్ కంపెనీలకు ప్రభుత్వం జిల్లాకు సంబంధించి రూ.25 కోట్లు విడుదల చేసింది. వీటితోపాటు ఈ ఏడాది సూక్ష్మసేద్యం పథకం నిధులు వెంటనే మంజూరు చేయాలని డ్రిప్ కంపెనీల ప్రతినిధులు కోరుతున్నారు.

డయల్ యువర్ సీఎండీకి 70 వినతులు

తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: విద్యుత్తు వినియోగదారుల సమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా సోమవారం నిర్వహించిన డయల్ యువర్ సీఎండీ కార్యక్రమానికి 70 వినతులు వచ్చాయి. తిరుపతిలోని డిస్కం కార్పొరేట్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సీఎండీ శివశంకర్ లోతేటి వినియోగదారుల సమస్యలను ఫోన్ ద్వారా తెలుసుకున్నారు. కర్నూలు నుంచి 18, కడప నుంచి 13, అనంతపురం నుంచి 15, నెల్లూరు నుంచి 03, శ్రీసత్యసాయి జిల్లా నుంచి 03, తిరుపతి నుంచి 11, చిత్తూరు నుంచి 01, నంద్యాల నుంచి 6 సమస్యలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. వాటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను సీఎండీ శివశంకర్ లోతేటి ఆదేశించారు. డిస్కం డైరెక్టర్లు ఆయూబ్‌ఖాన్, గురవయ్య, రామ్మోహన్‌రావు, సీజీఎంలు జానకిరామ్, రమణాదేవి, శోభా వాలెంటీనా, ఆదిశేషయ్య, మురళీకుమార్, ఉమాపతి, జీఎంలు సురేంద్రనాయుడు, కృష్ణారెడ్డి, రామచంద్రరావు, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

డయల్ యువర్ సీఎండీ కార్యక్రమంలో అధికారులతో కలిసి సీఎండీ శివశంకర్ లోతేటి

ఎస్వీయూ పరిధిలో నేటి డిగ్రీ పరీక్ష వాయిదా

తిరుపతి (ఎస్వీయూ), న్యూస్‌టుడే: ఎస్వీయూ పరిధిలో మంగళవారం జరగాల్సిన డిగ్రీ పరీక్షలు సాంకేతిక కారణాలతో వాయిదా వేస్తున్నట్లు, మిగిలిన పరీక్షలు యథావిధిగా 10వ తేదీ నుంచి నుంచి జరుగుతాయని ఎస్వీయూ పరీక్షల విభాగం అధికారి రాజమాణిక్యం సోమవారం ప్రకటనలో తెలిపారు. డిసెంబరు 9న జరగాల్సిన పరీక్ష ఎప్పుడు నిర్వహించేది తర్వాత తెలియజేస్తామన్నారు.

రైతేరాజు 6లో

ఏటా కోతలే.. చేతల్లేవు

⏮ ప్రజలకు తప్పని తిప్పలు
⏮ జిల్లాలో ఇదీ పరిస్థితి

సోమల మండలం జీడిరేవుల వంకపై మట్టిపోసి చేసిన తాత్కాలిక మరమ్మతు

న్యూస్‌టుడే, పెనుమూరు

పరిశీలన

భారీ వర్షాలు కురిస్తే చాలు. . ఆ ప్రాంత ప్రజలకు చుక్కలు కనిపిస్తాయి. చిత్తూరు జిల్లాలో పలు మండలాల్లో రహదారి కల్వర్టులు ఏటా కోతకు గురై ప్రజలకు తిప్పలు తప్పడంలేదు.. ఏటా భారీ వర్షాల కారణంగా ఏర్పడిన వరదలకు రోడ్లు కొట్టుకుపోవడం.. అధికారులు, పాలకులు పరిశీలించడం.. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని చెప్పడం తప్ప కార్యరూపం దాల్చిన సందర్భాలు లేవు.

- ■ గంగాధరనెల్లూరు ■ పెనుమూరు
- ■ కొట్టుకుపోయిన భీమా నది రోడ్డు
- ■ పెనుమూరు, పూతలపట్టు మండలాలకు నిలిచిన రాకపోకలు. పెనుమూరు మండలం చిన్నకలికిరి పంచాయతీ ప్రజల ఇక్కట్లు

- ■ పుంగనూరు ■ సోమల
- ■ కోతకు గురైన పెద్దఉప్పరపల్లె-బసవపల్లె మార్గంలో గార్గేయ నది
- ■ ఈ మార్గంలో ఏడు గ్రామాలు

- ■ పూతలపట్టు ■ తవణంపల్లె
- ■ అరగొండ-గాజులపల్లె మార్గంలో కొట్టుకుపోయిన రోడ్డు
- ■ పది గ్రామాలకు నిలిచిన రాకపోకలు

- ■ గంగాధర నెల్లూరు ■ శ్రీరంగరాజపురం
- ■ ఎగువ కమ్మకండ్రిగ వద్ద కొట్టుకుపోయిన రోడ్డు
- ■ ఎస్సార్‌పురం, పాలసముద్రం మండలాలకు రాకపోకలు బంద్
- ● జీడీనెల్లూరు మండలంలో నీవా నదిపై గ్యారంపల్లె వద్ద కోతకు గురైన రోడ్డుపై రాకపోకలకు అవస్థ

- ■ పుంగనూరు ■ సోమల
- ■ కొట్టుకుపోయిన జీడిరేవుల వంక
- ■ ఏడు పంచాయతీల ప్రజల రాకపోకలకు ఇక్కట్లు
- ● ఇవేకాక అక్కడక్కడ చిన్నచిన్న వాగులు, వంకల మార్గాల్లో సైతం రోడ్లు కోతకు గురై ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

■ నియోజకవర్గం: ■ మండలం: ■ సమస్య: ■ ఇబ్బంది పడే గ్రామాలు:

కొట్టుకుపోయె.. కట్టేది లేదాయె

నగరి నియోజకవర్గం సత్రవాడ చెక్‌డ్యాం ఇది. కుశస్థలి నదికి వరదొస్తే.. ఆ నీటిని చెరువులకు మళ్లించడానికి 1972లో గొలుసు కట్టు విధానంతో నదిపై దీన్ని నిర్మించారు. 2017లో వరదలకు ఈ చెక్‌డ్యాం కొట్టుకుపోయింది. దీని బాగుకు రెండుసార్లు నిధులు మంజూరైనా పనులు మాత్రం జరగలేదు. దీంతో నీరంతా వృథాగా సముద్రంలో కలుస్తోంది. తాజాగా మరోసారి ప్రస్తుత ధరలకు అనుకూలంగా రూ.60 కోట్ల అంచనాలతో ప్రతిపాదనలు పంపించారు.

- న్యూస్‌టుడే, నగరి

శిథిలమైన చెక్‌డ్యాం

- ■ **ప్రాజెక్టు పేరు :** సత్రవాడ చెక్‌డ్యాం
- ■ **చెరువులు:** 21
- ■ **ఆయకట్టు :** 2663 ఎకరాలు
- ■ **సాగునీరందే మండలాలు:** నగరి, నిండ్ర, విజయపురం, పిచ్చాటూరు

నేడు తిరుపతి- సాయినగర్ శిర్డీ రైలు ప్రారంభం

తిరుపతి(రైల్వే), న్యూస్‌టుడే: తిరుపతి- సాయినగర్ శిర్డీ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రారంభోత్సవం మంగళవారం తిరుపతిలో జరగనుంది. ముఖ్యఅతిథులుగా కేంద్ర రైల్వే, జలశక్తి సహాయమంత్రి వి.సోమన్న, రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బి.సి.జనార్దన్‌రెడ్డిలు విచ్చేసి జెండా ఊపి ఎక్స్‌ప్రెస్ రైలును ప్రారంభించనున్నారు. వీరితో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొనున్నారు. ఏర్పాట్లను గుంతకల్ డీఆర్ఎం పరిశీలించారు.

అర్జీల పరిష్కారంపై ఆడిట్ చేయాలి

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా పరిష్కరించే అర్జీలపై ఆడిట్ నిర్వహించి ప్రజల అభిప్రాయాన్ని నమోదు చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. పీజీఆర్ఎస్ అర్జీల సమస్యల పరిష్కారంపై మండల అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఇప్పటివరకు గ్రీవెన్స్‌లో 68,998 అర్జీలు అందగా.. 58,594 అర్జీలు పరిష్కరించామని చెప్పారు. అర్జీలు రీఓపెన్ కాకుండా పరిష్కారం చూపాలన్నారు. డీఆర్వో మోహన్‌కుమార్, డీఎల్‌డీవో రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా దర్యాప్తు చేయండి

■ లైంగిక దాడి కేసుపై ఎస్పీకి హోంమంత్రి ఆదేశం

తిరుపతి (నేరవిభాగం), న్యూస్‌టుడే: జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం విద్యార్థినిపై జరిగిన లైంగిక దాడి కేసును పారదర్శకంగా దర్యాప్తు చేయాలని హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత ఆదేశించారు. ఎస్పీ సుబ్బరాయుడికి ఫోన్ చేసి కేసుకు సంబంధించిన పూర్వాపరాలు తెలుసుకున్నారు. మహిళల రక్షణే లక్ష్యంగా సాగుతున్న కూటమి ప్రభుత్వంలో ఏ ఒక్క మహిళకు అన్యాయం జరగకూడదని స్పష్టం చేశారు. విద్యార్థినికి న్యాయం జరిగేలా కేసును స్వయంగా పర్యవేక్షించాలని, విద్యార్థిని వద్దకు వెళ్లి భరోసా కల్పించాలని సూచించారు. నిందితులను వీలైనంత త్వరగా అరెస్టు చేయాలని స్పష్టం చేశారు. అనంతరం కేసు నమోదు, దర్యాప్తు వివరాలను ఎస్పీ నివేదించారు. నిందితుల చరవాణులు స్వాధీనం చేసుకుని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపామని, త్వరలో నిందితులను అరెస్టు చేస్తామని తెలిపారు.

ఒడిశాకు ప్రత్యేక బృందం

విద్యార్థినిపై ఆచార్య లక్ష్మణ్‌కుమార్ లైంగిక దాడికి పాల్పడగా.. మరో ఆచార్యులు శేఖర్ రెడ్డి లొంగదీసుకునేందుకు వేధించారన్న వర్సిటీ ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ రజనీకాంత్ శుక్లా ఫిర్యాదుతో తిరుపతి పడమర పోలీసులు కేసు నమోదు చేశారు. డీఎస్పీ భక్తవత్సలం దర్యాప్తు చేస్తున్నారు. వర్సిటీ కమిటీ ఇచ్చిన నివేదికను పరిశీలించి సభ్యులను విచారించారు. సీఐ మురళీమోహన్ ఆధ్వర్యంలోని బృందం బాధితురాలి స్వరాష్ట్రమైన ఒడిశాకు వెళ్లింది. ఆమెను విచారించిన అనంతరం వాంగ్మూలం తీసుకోనున్నారు.

S.B.V.R. అగ్రికల్చరల్ కళాశాల, బద్వేలు

ఇంటర్మీడియట్ నందు Bi.P.C విభాగంలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు చివరి అవకాశం. కడప జిల్లా బద్వేలులో I.C.A.R., NEW DELHI వారిచే గుర్తింపు పొందిన S.B.V.R. అగ్రికల్చరల్ కాలేజ (S.B.V.R. A.G.B.Sc), నందు B.Sc (Hons.) Agricultureలో అడ్మిషన్ కొరకు ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకున్నా చేసుకోకపోయినా కన్వీనర్ కోటాలో అగ్రికల్చరల్ బి.ఎస్సి చేరుటకు చిట్ట చివరి అవకాశం కలదు.

వివరములకు సంప్రదించవలసినది : 94400 33523, 91825 05395, 94928 56652.
కరస్పాండెంట్, S.B.V.R. అగ్రికల్చరల్ కళాశాల

104FM Tirupati ఈ FM 104 Mee FM
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వానేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
8008555167, 9154991499

ఏనుగులొస్తే.. చెప్పేస్తాయ్..

ట్రాకర్ల ఏర్పాటుతో రాక గుర్తింపు

జిల్లాలో ఏనుగుల వరుస దాడులతో అటు రైతులు ఇటు ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారు. ఏనుగుల కదలికలను ఎప్పటికప్పుడు గుర్తించడానికి వాటి మెడకు జీపీఎస్ ఆధారిత రేడియో కాలర్(కాలర్ ఐడీ) ఏర్పాటు చేయడానికి అటవీ అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగానే మూడు రోజుల కిందట అనంతపురం సీసీఎఫ్ యశోదబాయి పులిచెర్ల మండలంలో అక్కడి పరిస్థితులను అంచనా వేశారు. **- పలమనేరు, కల్లూరు న్యూస్‌టుడే**

కాలర్ తగిలించుకున్న ఏనుగు

కుంకీల ద్వారా అడవి ఏనుగులను నిలువరించే విధానం ప్రస్తుతం చిత్తూరు జిల్లాలో అమలు చేస్తున్నారు. పలమనేరు మండలం ముసలిమడుగు ప్రాంతంలో కుంకీల ఏనుగుల శిబిరాన్ని ఏర్పాటు చేశారు.


ట్రాకర్

ఇప్పటికే రెండు పర్యాయాలు ప్రత్యేక డ్రైవ్ చేపట్టిన అడవి ఏనుగులను కుంకీల ద్వారా అడవిలోకి మళ్లించారు. ఎప్పటికప్పుడు అడవి ఏనుగుల కదలికలను గుర్తించేందుకు అటవీశాఖ కొత్త విధానాలను అనుసరిస్తోంది. ఇందులో భాగంగానే ఏనుగుల మెడకు కాలర్ ఐడీ ఏర్పాటు చేసే ప్రక్రియను చేపట్టారు.

ఎలా పని చేస్తుందంటే..?

జీపీఎస్ ద్వారా అనుసంధానించిన కాలర్‌ను గుంపులోని ఓ ఏనుగుకు అమరుస్తారు. ఈ పరికరం అటవీశాఖ కార్యాలయానికి అనుసంధానమై ఉంటుంది. గంట లేదా రెండు గంటలకోసారి ఏనుగుల కదలికలు తెలిసేలా ప్రోగ్రాం ఉంటుంది. అవి గ్రామాల సమీపంలోకి రాగానే అధికారులు అప్రమత్తమై వాటిని తిరిగి అడవిలోకి పంపుతారు.

దాదాపు రెండు సంవత్సరాలు...

కాలర్‌కు ఉన్న బ్యాటరీ దాదాపు రెండు సంవత్సరాల వరకు పని చేస్తుంది. వీటిని ఏనుగులకు ఏర్పాటు చేయడానికి కొన్ని అనుమతులు రావాల్సి ఉంది. ఆ విషయాలు పరిశీలనలో ఉన్నాయి.

- ఎఫ్ఆర్వో నారాయణ, పలమనేరు

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి
లీగల్ ప్రకటనలు
ఈనాడు క్లాసిఫైడ్స్
వేడుక ఏదైనా.. ఈనాడు ను చేసుకోండి వేదిక
పదవీ విరమణ శుభాకాంక్షలు
జన్మదిన శుభాకాంక్షలు
అంత్యక్రియలు, వర్ధంతి, జయంతి
ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి
జి.ఎస్.టి. 5% అదనం
ప్రకటనల కొరకు సంప్రదించండి: 80085 13290

(c) eenadu

రైతేరాజు

రసాయనాలు పక్కనెట్టి.. సేంద్రియ సాగు చేపట్టి

సత్యవేడు, న్యూస్‌టుడే: సేంద్రియ వ్యవసాయంతో కూరగాయలు సాగు చేయడంవల్ల తక్కువ ఖర్చుతో మంచి దిగుబడులు సాధిస్తున్నారు. రసాయన ఎరువులు, మందులతో పిచికారీ చేయడంవల్ల అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. దీంతో రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు మొగ్గు చూపుతున్నారు. మండలంలోని కన్నావరానికి చెందిన భూమన పురుషోత్తంరెడ్డి సేంద్రియ వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధిస్తున్నారు.

నాలుగు ఎకరాల్లో..

భూమన పురుషోత్తంరెడ్డి సేంద్రియ పద్ధతిలో పంటలు సాగు చేస్తున్నారు. పొట్ల, సొర, బీర, కాకరకాయ వంటి వివిధ రకాల కూరగాయలను పండిస్తున్నారు. సేంద్రియ ఎరువులతో మంచి దిగుబడులు సాధించి ఆదాయాన్ని పొందుతున్నారు.

రోజు మార్చి రోజు దిగుబడు

విత్తు నాటిన 45రోజులలోపు దిగుబడి ప్రారంభమవుతుంది. రోజు మార్చి రోజు కోతకు వస్తాయి. నాలుగు ఎకరాల్లో మొదటి దశలో 750కేజీల వరకు దిగుబడి వస్తోంది. రెండో దశలో సుమారు 1400 వందల కేజీల వరకు దిగుబడి వస్తోంది. కేజీ రూ.15 నుంచి రూ.40 వరకు ధర పలుకుతుంది. నెలకు సరాసరి రూ.6.50లక్షలు, కూలీలు, ఎరువులు, రవాణా ఖర్చులు పోను రూ.రెండు లక్షల వరకు ఆదాయం వస్తోంది.

చీడపీడల నివారణ

బీజామృతం, ఘన జీవామృతం, కషాయం వంటివి తయారు చేసుకుని మొక్కల పెరుగుదలకు, చీడపీడల నివారణకు ఉపయోగిస్తున్నారు. అవసరాన్ని బట్టి వేరు కుళ్లు తెగులుకు అజీబో బ్యాక్టర్, సుడోమోనాస్ వంటివి [illegible] పిచికారీ చేయాల్సి ఉంటుంది.

దూడల పోషణలో మెలకువలు

పుత్తూరు, న్యూస్‌టుడే: పశువులను ఎంత జాగ్రత్తగా చూసుకుంటామో.. వాటి దూడలను కూడా అదే రీతిలో పోషణ చేయాలి. లేకపోతే అవి అనారోగ్యం బారిన పడతాయి. దూడల పోషణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను పశువైద్యాధికారి శ్రీదేవి వివరించారు. ఈ సీజన్‌లో అధిక సంఖ్యలో పశువులు ఈనుతుంటాయి. పుట్టిన దూడలకు తగిన మోతాదులో పాలు వదలకపోతే అవి మట్టిని నాకుతుంటాయి. అలాగే ఎక్కువ మంది పొదుగుకు అంటిన మట్టిని నీటితో కడగకుండా పాలు పట్టిస్తారు. ఆ మట్టిలో కలిసిన నులిపురుగులు దూడల పొట్టలోకి చేరి రక్తాన్ని పీల్చి వృద్ధిలోకి విస్తరిస్తుంటాయి. ఇవి ఒక్కొక్కటి సుమారు రెండు లక్షల వరకు గుడ్లు పెట్టి సంతతిని పెంచుతుంటాయి. ఇవి పెరుగుతున్న కొద్దీ రక్తహీనత ఏర్పడి దూడలు [illegible] తెల్లగా పాలిపోయి కునికిపాట్లు పడుతుంటాయి. వీటి నివారణకు పుట్టిన దూడలకు తగినన్ని పాలు వదలాలి. ప్రతి రోజూ పాలకు వదిలే ముందు పొదుగును శుభ్రంగా కడిగి పాలు తాగనివ్వాలి. తరువాత మూతికి [illegible] పశువైద్యాధికారి సూచించిన మోతాదులో మందు పట్టిస్తుండాలి.

మామిడిలో జాగ్రత్తలు

తిరుపతి (వ్యవసాయం), న్యూస్‌టుడే: వాతావరణంలో మార్పుల కారణంగా మామిడిలో పూత ఆలస్యం అవుతుంది. మామిడిలో పూత రావడానికి నేలలో బెట్ట పరిస్థితులు చలి వాతావరణం ఉండాలి. కాని ఈశాన్య రుతుపవన వర్షాలు డిసెంబరు వరకు కురుస్తుండడంతో భూమి తడిగానే ఉంటుంది. ఈ వర్షాల కారణంగా డిసెంబరు-జనవరిలో రావలసిన పూత, జనవరి-ఫిబ్రవరిలో వస్తోంది. రైతులు పూత తొందరగా రావడానికి పురుగు మందుల కంపెనీలు, వ్యాపారుల సలహాలతో అవసరం లేని మందులు కొట్టి మోసపోతున్నారు. శాస్త్రీయ సలహాల పాటించి మామిడిలో మంచి పూతను పొందవచ్చును. ● ఈశాన్య రుతుపవన వర్షాలు ఆగిన తర్వాత మామిడి తోటను తేలికగా దున్నుకోవాలి. దీని వలన భూమిలో తేమ ఆరి, బెట్ట పరిస్థితులు ఏర్పడతాయి. ● డిసెంబరు మూడో వారంలో 13-0-45(మల్టీ కె)లీటరు నీటికి 15 గ్రా, మోనో అమ్మోనియం పాస్ఫేట్ (12:61:0) లీటరు నీటికి, 10 గ్రా లేదా, నాన్ డీఏపీ లీటరు నీటికి 10 మి.లీ, సూక్ష్మ పోషకాల మిశ్రమం (ఫార్ములా 4) లీటరు నీటికి 2.5 గ్రా లేదా అగ్రిమ్యాంగో స్పెషల్ లీటరు నీటికి 5 గ్రా కలిపి పిచికారీ చేయడం వలన మామిడిలో మంచి పూత వస్తుంది. - మెరుగు భాస్కరయ్య, ఏడీఏ(విశ్రాంత), సాగు సలహాదారు, తిరుపతి

ప్రశ్న జవాబు

రేణిగుంట, న్యూస్‌టుడే: ప్రశ్న: రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం ప్రవేశ పెట్టిన కొత్త యాప్ పేరు ఏమిటి? దాని ఉపయోగాలు తెలుపండి?
- శ్రీనివాసులు, రైతు, కరకంబాడి

జవాబు: ఏపీఏఐఎంఎస్ 2.0- రైతు కోసం కొత్త డిజిటల్ వేదిక. ఈ యాప్‌ని ప్లేస్టోర్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. రైతు పంటను రక్షించడానికి, సరైన నిర్ణయం తీసుకోవడానికి ఈ యాప్ సహాయం పడుతుంది. ఇందులో భూమి సమాచారం, వాతావరణ సలహాల అప్‌డేట్లు, నేల పరీక్ష రిపోర్ట్, ముందస్తు చీడపీడల అలెర్ట్, పంట సరైన సాగు పద్ధతులు, రాయితీ పథకాల వివరాలు, మార్కెట్ ధరల సూచనలు ఉంటాయి. ఇది రైతుకు చాలా ఉపయోగపడుతుంది. - సునీల్‌కుమార్, మండల వ్యవసాయాధికారి, రేణిగుంట

నీటమునిగిన వరి సంరక్షణ ఇలా..

తుపాను కారణంగా వరి పొలాలను వర్షపు నీరు ముంచెత్తింది. ఈ పరిస్థితుల్లో పంటను ఏ విధంగా కాపాడుకోవాలి.. సమగ్ర సస్య రక్షణ చర్యలు ఏవిధంగా చేపట్టాలన్న విషయమై వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు రమేష్‌రెడ్డి సమాధానాలు..

విత్తనశుద్ధి ఇలా..: విత్తనశుద్ధిని బట్టి దిగుబడి ఉంటుంది. కిలో విత్తనానికి 2.5 గ్రాముల కార్బండిజిమ్ కలిపి 24 గంటల తర్వాత చల్లుకోవాలి. అదే దంప నారుమళ్లయితే లీటరు నీటికి ఒక గ్రాము కార్బండిజిమ్ కలిపి రోజంతా నానబెట్టి మళ్లీ మొలకలను చల్లుకోవాలి. పది లీటర్ల నీటిలో 1.5 కిలోల ఉప్పు కలిపి విత్తనాలను నానబెట్టాలి. తేలియాడే విత్తనాలను పక్కన పడేయాలి. మునిగిన గట్టి విత్తనాలను మళ్లీ రోజంతా మంచినీళ్లలో నానబెట్టి చల్లుకోవాలి.

వరిలో సస్యరక్షణ ఇలా..: నారు తీయడానికి వారం రోజులు ముందు సెంటు నారు మడికి 160 గ్రాముల కార్బోఫ్యూరాన్ గుళికలు చల్లుకోవాలి. జింక్‌లోపం రాకుండా ఉండేందుకు జింక్ సల్ఫేట్ ద్రావణాన్ని పిచికారీ చేసుకుంటే మంచిది. నారు నాటేముందు విత్తనాలను రెండు మిల్లీలీటరు క్లోరిఫైరిపాస్ ద్రావణం లీటరు నీటితో కలిపి ఆ మిశ్రమంలో నారును ముంచి నాటు కోవాలి. కొసలు తుంచి నాటుకుంటే తెగుళ్ల నియంత్రణకు మరింత శ్రేయస్కరం. - న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి

మునిగిన పంట సంరక్షణ చర్యలు ఇలా..

వరి పంట సాగు చేసి పక్షం రోజులు పూర్తయ్యాక నీళ్లు నాలుగైదు రోజులు నిలబడి ఉన్నా పంటకు ఇబ్బంది ఉండదు. నారు దశలో నారుమడి కుళ్లి పోవడం, వేసిన విత్తనాలు వర్షం తీవ్రతకు నేలపై తేలియాడే అవకాశముంది. ఈ తరహా పరిస్థితి ఉంటే మళ్లీ కొత్తగా సాగు ప్రారంభించాల్సిందే.

విన్నపాలు వినవలె!

● పీజీఆర్ఎస్‌లో 370 వినతులు

అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల్ని వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ సంబంధిత శాఖల అధికారుల్ని ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమంలో వివిధ సమస్యలపై 370 వినతులు అందాయి. శిక్షణ కలెక్టర్ నరేంద్ర పడాల్, డీఆర్వో మోహన్‌కుమార్, ఆర్డీవో శ్రీనివాసులు పాల్గొన్నారు. ● వరాల మండలం వడ్డపల్లెకు చెందిన ఆరుగురు తమకు పింఛన్లు నిలిపివేశారని కలెక్టరేట్‌కు వచ్చి నినాదాలు చేశారు. కలెక్టర్ అక్కడకు వచ్చి దివ్యాంగులతో మాట్లాడారు. సదరం ధ్రువపత్రాలు ఆరు దశల్లో పరిశీలిస్తున్నామన్నారు. దళారుల్ని నమ్మి మోసపోవద్దని సూచించారు.

● వి.కోట మండలంలో తమ గ్రామం నుంచి కర్ణాటకకు వెళ్లే మార్గంలో వంతెన నిర్మించాలని తోటకనుమ గ్రామస్థులు విన్నవించారు. వర్షాకాలంలో సమీప చెరువు నీటి ఉద్ధృతికి రాకపోకలకు ఇబ్బంది కలుగుతోందన్నారు.

● పీరమలై కల్లర్ కులస్థులకు కుల ధ్రువీకరణ పత్రాలు జారీచేయాలని కుల సంఘ జిల్లా అధ్యక్షుడు సౌందరరాజా విన్నవించారు. తరతరాలుగా తమ కుటుంబాలు జిల్లాలోనే స్థిర జీవనంలో ఉన్నాయని చెప్పారు. తమిళనాడులో తాము ఓబీసీ జాబితాలో ఉన్నామని, ఏపీలో కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడం లేదన్నారు. ఈ పత్రాలు జారీచేస్తే పిల్లల చదువుకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

స్వర్ణరథంపై ఏకదంతుడి విహారం

కాణిపాకం, న్యూస్‌టుడే: వరసిద్ధి వినాయకస్వామి సిద్ధిబుద్ధి సమేతుడై స్వర్ణరథంపై ఆలయ మాడవీధుల్లో సోమవారం రాత్రి విహరించారు. ఈవో పెంచల కిషోర్ దంపతులు, ఈఈ వెంకట నారాయణ, ఏఎస్పీ రాజశేఖర్‌రాజు, ఏఈవో రవీంద్ర బాబు, భక్తులు పాల్గొన్నారు.

సంకటహర గణపతి వ్రతం

వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో సామూహిక సంకటహర గణపతి వ్రతం నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. పాలకమండలి ఛైర్మన్ వి.మణినాయుడు, భక్తులు పాల్గొన్నారు.

వరసిద్ధుడి ఆలయానికి రూ.10 లక్షల విరాళం

కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీ వరసిద్ధి వినాయకస్వామి నిత్యాన్నదాన పథకానికి రూ.5 లక్షలు, గో సంరక్షణ ట్రస్టుకు రూ.5 లక్షలు మొత్తం రూ.10 లక్షల విరాళాన్ని హైదరాబాద్ కేపీహెచ్‌బీ వాస్తవ్యులు సిద్ధారెడ్డి ఉమాదేవి, సిద్ధార్థ, నివేదిత.. ఆలయ ఏఈవో రవీంద్రబాబుకు సోమవారం అందజేశారు. దాత, కుటుంబ సభ్యులకు స్వామి వారి దర్శనం కల్పించి, శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందించారు. సూపరింటెండెంట్ వాసు, ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు పాల్గొన్నారు.

ఏఈవోకు విరాళం అందజేస్తున్న ఉమాదేవి, సిద్ధార్థ, నివేదిత

14 నుంచి ఇంధన పొదుపు వారోత్సవాలు

చిత్తూరు(మిట్టూరు), న్యూస్‌టుడే: జిల్లాలో ఇంధన(విద్యుత్తు) పొదుపు వారోత్సవాలు ఈ నెల 14 నుంచి 20 వరకు నిర్వహించనున్నామని ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ సోమవారం తెలిపారు.

టెట్ కేంద్రాల పరిశీలన

చిత్తూరు విద్య, పూతలపట్టు, న్యూస్‌టుడే: జిల్లాలో ఈ నెల 10 నుంచి 21 వరకు నిర్వహించనున్న టెట్ కేంద్రాలను డీఈవో వరలక్ష్మి, ఏడీ-2 వెంకటేశ్వరరావు సోమవారం పరిశీలించారు. నగరంలోని సీతమ్స్, ఎస్వీసెట్, పూతలపట్టు మండలం పి.కొత్తకోట వేము ఇంజినీరింగ్ కళాశాలలకు వెళ్లి డీఈవో ప్రిన్సిపాళ్లు, సిబ్బందితో మాట్లాడారు. ఏడీ-2 పలమనేరులోని మదర్‌థెరెసా కళాశాల, కుప్పం ఇంజినీరింగ్ కళాశాలకు వెళ్లి ప్రిన్సిపాళ్లు, సిబ్బందితో చర్చించారు. టెట్‌కు 8,597 మంది అభ్యర్థులు హాజరు కానున్నారు.

భాజపాలో నియామకాలు

చిత్తూరు(సంతపేట), న్యూస్‌టుడే: భారతీయ జనతా పార్టీలో పలు విభాగాలకు నూతన అధ్యక్షులను నియమించామని పార్టీ జిల్లా అధ్యక్షుడు జగదీశ్వరనాయుడు సోమవారం తెలిపారు. జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా కైలాసం(నగరి), కిసాన్ మోర్చా అధ్యక్షుడిగా సుజిత్‌రెడ్డి(పూతలపట్టు), మహిళా మోర్చా అధ్యక్షురాలిగా కవితరాజు(పలమనేరు) నియమితులయ్యారని చెప్పారు. ఎస్టీ మోర్చా అధ్యక్షుడిగా శేఖర్(జీడీనెల్లూరు), మైనారిటీ మోర్చా అధ్యక్షుడిగా సయ్యద్ ముబారక్(పలమనేరు)ను నియమించామని పేర్కొన్నారు.

పట్టుగూళ్ల ధరలు తగ్గాయని ఆందోళన

రోడ్డుపై బైఠాయించిన రైతులు

పలమనేరు, న్యూస్‌టుడే: పట్టుగూళ్ల ధరలు తగ్గాయని సోమవారం సాయంత్రం పలమనేరులోని పట్టుగూళ్ల మార్కెట్ ఎదుట రైతులు ఆందోళన చేశారు. కర్ణాటకలో కిలో గూళ్లు రూ.800 ఉంటే... ఇక్కడ రూ.650 నిర్ణయిస్తున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. పైగా మొదటి లాట్ వేలంలో రూ.750 పోతే చివరి వేలం రూ.600లకు పడిపోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ధరలు నిలకడగా ఉండేలా చూడాలని నినాదాలు చేశారు. పోలీసులు అక్కడికి చేరుకుని నచ్చజెప్పడంతో రైతులు ఆందోళన విరమించారు. ఈ విషయమై పట్టు పరిశ్రమ అధికారి సరోజ మాట్లాడుతూ.. గూళ్ల నాణ్యత తక్కువగా ఉండటంతో రీలర్లు తక్కువకు కొనుగోలు చేస్తున్నారని పేర్కొన్నారు.

పోలీసు గ్రీవెన్స్‌కు 46 ఫిర్యాదులు

బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ తుషార్‌డూడి

చిత్తూరు(నేరవార్తలు), న్యూస్‌టుడే: జిల్లా పోలీసు కార్యక్రమంలో సోమవారం జరిగిన పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ కార్యక్రమానికి 46 ఫిర్యాదులు అందాయి. ప్రజలు తమ సమస్యలను ఫిర్యాదు రూపంలో ఎస్పీ తుషార్ డూడికి అందజేయగా ఆయన పరిశీలించి సంబంధిత స్టేషన్లకు సిఫార్సు చేశారు. ఆపై జూమ్ సమావేశంలో జిల్లాలోని అధికారులతో సమీక్షించారు.

పదవీ కాలం పొడిగింపు

చిత్తూరు నగరం, న్యూస్‌టుడే: డీసీసీబీ నాన్ అఫిషియల్ పర్సన్ ఇన్‌ఛార్జి కమిటీ పదవీ కాలాన్ని మరో ఆరు నెలల పాటు పొడిగిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతోపాటు జిల్లా సహకార ప్రింటింగ్ ప్రెస్ అఫిషియల్ పర్సన్ ఇన్‌ఛార్జి పదవీ కాలాన్ని సైతం ఆరు నెలలు పొడిగించింది.

తిరుపతి జిల్లాలో కలపాలి

నగరి, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని నగరి, నిండ్ర, విజయపురం మండలాలను తిరుపతి జిల్లాలో విలీనం చేయాలని అఖిలపక్ష పోరాట సాధన సమితి ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. ఓంశక్తి ఆలయం నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ చేసి, ఆర్డీవో అనుపమకు వినతిపత్రం అందజేశారు. సభ్యులు టి.కోదండయ్య, ఆర్.బాబు, నిజాం, వేలన్, గోపి, రవా, రఫీ, మస్తాన్, కుమారస్వామి, నాగూర్, రాజేంద్ర, భూపతి, అల్లాభక్షు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఇంటింటి సర్వే

చిత్తూరు(వైద్యవిభాగం), న్యూస్‌టుడే: జిల్లాలో ఎన్‌సీడీ 4.0 ఇంటింటి సర్వే పకడ్బందీగా నిర్వహించి క్యాన్సర్, ఇతర అనారోగ్య సమస్యలు గుర్తించి చికిత్స అందించాలని డీఎంహెచ్‌వో సుధారాణి ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సోమవారం జూమ్ సమావేశం ద్వారా ఆమె వైద్యాధికారులతో మాట్లాడారు.

KAIRA DISTRICT CO-OPERATIVE MILK PRODUCERS' UNION LIMITED
ANAND 388 001, Gujarat, India.
Phone: (02692) 256124, 256224, 256324

Amul

Tender AD

Amul Chittoor Dairy, a unit of Kaira District Co-operative Milk Producers' Union Limited popularly known as Amul Dairy having an Annual Turnover of Rs. 14,000+ crores, invites sealed tenders from eligible bidders for following items.

Description
1. Operation & Maintenance of Steam Boiler at ASD, Madanapalli.
2. Operation & Maintenance of Effluent Treatment Plant (ETP) at ASD, Madanapalli.

The details of E-tender can be downloaded free of cost from the Website http://tender.amuldairy.com after online registration. The online tender will be available for access from Dt. 09-12-2025 to Dt. 15-12-2025. The completed tender in physical form will be received up to 17:00 hours on 15-12-2025 by Sr. Manager (Purchase), Sy. Nos: 12/1, 13, 24/1 and 24/2, 25, 26, 27, Greamspet Revenue Village, Vellore Road, Chittoor, Chittoor District, Andhra Pradesh-517001, India. Details regarding eligibility criteria, specifications and other conditions are available in the tender format from the above website. The Amul Dairy reserves the right to accept or reject any or all the tenders without assigning any reason thereof.

9th December 2025 Managing Director

పొరుగున గతుకులు.. కుప్పాన సొబగులు

కర్ణాటక పరిధిలో..

కుప్పం, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పంలో అంతరాష్ట్ర రహదారులకు పూర్వ వైభవం సంతరించుకొంటోంది. వైకాపా పాలనలో దాపురించిన నిర్లక్ష్యం పుణ్యమా అని గుంతలమయమైన రోడ్లకు కూటమి పాలనలో మోక్షం లభిస్తోంది. కుప్పం పట్టణ పరిధి గుడుపల్లె రోడ్డు కూడలి నుంచి ద్రవిడ వర్సిటీ, పొగురుపల్లె మీదుగా కర్ణాటక సరిహద్దు వరకు 14.8 కి.మీ. పరిధి అంతరాష్ట్ర డబుల్ రోడ్డును రూ.6 కోట్లతో అభివృద్ధి చేశారు. మన రాష్ట్ర పరిధిలో గుడుపల్లె మండలం పొగురుపల్లె వద్ద చూడచక్కని డబుల్ రోడ్డుపై వాహనదారులు రయ్ మంటూ ప్రయాణిస్తున్నారు. గడుపల్లె మండలం సరిహద్దుకు అవతలి వైపున కర్ణాటక పరిధిలో పెద్దకొళ్లహల్లి వరకు కంకర, తారు తేలి.. గుంతలమయమైన బీటీ రోడ్డులో రాకపోకలకు నరకయాతన అనుభవిస్తున్నామని స్థానికులు వాపోతున్నారు.

పొగురుపల్లె వద్ద..

సర్వదర్శనానికి 8 గంటలు

తిరుమల, తిరుపతి (తితిదే), న్యూస్‌టుడే: సర్వదర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. ఆదివారం శ్రీవారిని 75,343 మంది భక్తులు దర్శించుకోగా రూ.3.69 కోట్ల హుండీ కానుకలు లభించాయి. **18 వేల టోకెన్లు జారీ :** శ్రీనివాసం, విష్ణునివాసం, భూదేవి కాంప్లెక్స్ వద్ద భక్తులకు సర్వదర్శన టోకెన్లు సోమవారం 18 వేలు జారీ చేశారు. శ్రీవారి మెట్టు మార్గం లో రెండువేల టోకెన్లు జారీ చేశారు.

ఇండిగో విమానం రద్దు

రేణిగుంట, న్యూస్‌టుడే: ముంబై నుంచి రేణిగుంటకు రాకపోకలు సాగించే ఇండిగో విమానాన్ని యాజమాన్యం సోమవారం రద్దు చేసింది. వివిధ ప్రదేశాల నుంచి ఇక్కడికి వచ్చే అన్ని ఇండిగో విమానాలు సమయానికి రాకపోకలు సాగించాయి. అయితే ఈ ఒక విమానాన్ని మాత్రం కొన్ని కారణాలతో రద్దు చేసినట్లు తెలిసింది. అయితే ప్రయాణికులకు ముందుగానే సందేశాలు పంపించారు.

అధికారులతో ఎమ్మెల్సీ కంచర్ల, రెస్కో ఛైర్మన్ ప్రతాప్ కుమార్

రెస్కోలో ఆన్‌లైన్ సేవలు

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: కుప్పం గ్రామీణ విద్యుత్తు సహకార సంస్థ(రెస్కో) పరిధిలో ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, రెస్కో ఛైర్మన్ ప్రతాప్‌కుమార్ తెలిపారు. స్థానిక రెస్కో కార్యాలయంలో సోమవారం 'కుప్పం రెస్కో' యాప్‌ను ప్రారంభించారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తైపీ ఆర్చరీ ఓపెన్‌లో పసిడి పతకం కైవసం

నాయుడుపేట, న్యూస్‌టుడే: నాయుడుపేట పట్టణానికి చెందిన అంతర్జాతీయ ఆర్చరీ క్రీడాకారుడు తిరుమూరు గణేష్ మణిరత్నం చైనాలోని తైపీ కేంద్రంగా ఈ నెల 5- 7 వరకు జరిగిన ఆర్చరీ ఓపెన్ పోటీల్లో పసిడి పతకం సాధించాడు. ఇండోర్ కాంపౌండ్ ఆర్చరీ వ్యక్తిగత విభాగంలో జరిగిన పోటీల్లో 149-138తో చైనాపై గెలిచి పసిడి పతకం కైవసం చేసుకున్నాడు. అతను పలు దేశాల్లో జరిగిన ఆర్చరీ పోటీల్లో పాల్గొని ఇప్పటి వరకు 12 వరకు పసిడి, కాంస్య పతకాలు సాధించాడు. మూడు నెలల క్రితం కెనడాలో జరిగిన ప్రపంచ ఆర్చరీ యూత్ ఛాంపియన్ పోటీల్లో పాల్గొని పసిడి గెలిచాడు. గత నెలలో లక్సెంబర్గ్‌లోని స్ట్రాసెన్‌లో జరిగిన పోటీలో కాంస్యం సాధించాడు.

గణేష్ మణిరత్నం

గుంతల దారి.. గండాల మారి

కదిరిమంగళం హైవే నుంచి వడమాలపేటకు వెళ్లే మార్గం గుంతలమయమైంది. చీమలవారిపం కపైన ఉన్న కాజ్‌వే ఇనుప కమ్మీలు తేలి కుంగిపోయింది. వడమాలపేటకు వెళ్లే వాహనాలు ఇటుగానే రాకపోకలు సాగించాలి. వర్షాల సమయంలో ఈ గుంతల్లో నీరు చేరి ఎటువెళ్లాలో తెలియక తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. -న్యూస్‌టుడే, వడమాలపేట

35 ఏళ్ల ఆత్మీయ కలయిక

నిత్యం ఖాకీ దుస్తులు ధరించి ప్రజా సమస్యల పరిష్కారం. . శాంతి భద్రతల పరిరక్షణకు పరితపించే మహిళా పోలీసులు ఆదివారం రాత్రి ఆత్మీయత పంచుకున్నారు. చిత్తూరు, తిరుపతి జిల్లాలకు చెందిన మహిళా పోలీసులు ఒకే వేదికపై చేరారు. బాగోగులు పంచుకుని ఆనందంగా గడిపారు. పోటీల్లో గెలిచి బహుమతులు అందుకున్నారు. కలసి భోజనం చేస్తూ.. పిల్లల యోగక్షేమాలు చర్చించుకున్నారు. చిత్తూరు, తిరుపతి జిల్లాలో పనిచేస్తున్న 1991 బ్యాచ్‌కు చెందిన మహిళా పోలీసులు 35 ఏళ్ల తర్వాత ఆదివారం తిరుపతిలో సమావేశమయ్యారు. ముఖ్యఅతిథులుగా ఏసీబీ అదనపు ఎస్పీ విమలకుమారి, సీఐడీ డీఎస్పీ పద్మలత, ఎస్ఐ అనిత విచ్చేశారు. ఏఎస్ఐ ఎంఆర్ఎల్ కుమారి, మహిళా పోలీసు నీరజ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. - న్యూస్‌టుడే, తిరుపతి (నేరవిభాగం)

ముగిసిన బద్రీనారాయణ అంత్యక్రియలు

● ప్రజాప్రతినిధులు, నేతల నివాళి

చిత్తూరు(జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: ప్రముఖ పారిశ్రామికవేత్త, దివంగత మాజీ ఎంపీ డీకే ఆదికేశవులు నాయుడి సోదరుడు బద్రీనారాయణ(72) అంత్యక్రియలు సోమవారం ముగిశాయి. ఆయన నాలుగు రోజుల క్రితం తిరుపతిలో మృతి చెందిన విషయం విదితమే. ఆయన భౌతికకాయాన్ని సోమవారం మధ్యాహ్నం వాహనంలో ర్యాలీగా వెళ్లి మహాసముద్రం టోల్‌ప్లాజా సమీపంలోని ఆయన పొలంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఆయన భౌతికకాయానికి ఎమ్మెల్యేలు అమరనాథరెడ్డి, పులివర్తి నాని, గురజాల జగన్మోహన్, పులివర్తి నాని, మురళీమోహన్, రాజకీయ నాయకులు, పారిశ్రామిక వేత్తలు, ప్రముఖులు నివాళులర్పించారు.

బద్రీనారాయణ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్

EENADU e Classifieds

EDUCATION

DISTANCE EDUCATION

10th/ Inter, BA,B.Com, B.Sc, BBA, BCA, BLIS, MA, M.Com, M.Sc, MCA, MBA, MLIS, Dip, B.Tech, M.Tech, M.Phil, Ph.D, BNYS, BPT, D Pharmacy, B Pharmacy, LLB, BA LLB, 9032030124

TO LET

తిరుపతి ఎయిర్‌పోర్ట్ దగ్గర 3BHK విల్లా & ధనలక్ష్మి నగర్, అవిలాల వద్ద 2 BHK Individual Houses అద్దెకు కలదు. ✆ 80086 25907.

JOBS

Immediate Joining: Wanted 3 x Accountants (M Com/CA), 5 x Computer Operator (Any Degree), 4 x Hindi Voice (Any Degree), for YV Accounting Solutions at Tirupati. Call: 8019670067.

తిరుపతిలోని ప్రముఖ కంపెనీకి బిజినెస్, రిటైర్డ్‌పర్సన్స్, వివాహితులు & యువత కావలెను. Age: 30 to 65, Qua: Inter to PG ✆ 7675095860

అమెరికాలో 1 సం|| బాబు ఆలన, పాలన వ్యక్తిగత సంరక్షణ కొరకు అనుభవంగల ఆడవారు కావలెను. అమెరికా వీసా కల్గినవారు మాత్రమే. ✆ 9440803362.

THE EENADU CLASSIFIEDS WAY
B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే
అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు
వివరాలకు...
80085 13290
మీ చిన్నారులకు పుట్టిన రోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి
B/W: రూ. 600
Colour: రూ. 800
ప్రకటనలపై 5% GST వర్తించును

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్‌లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

చిత్తూరు

• చిత్తూరు • పూతలపట్టు • గంగాధరనెల్లూరు • నగరి

ఎస్టీయూ నూతన కార్యవర్గం

వెంకటేశులు

వెంకట్

పుత్తూరు, న్యూస్‌టుడే: మండల ఎస్టీయూ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల పరిశీలకులు, సీనియర్ నాయకులు జయచంద్రన్, వెంకటేశయ్య పేర్కొన్నారు. స్థానిక ప్రధాన పాఠశాలలో సోమవారం సమావేశం నిర్వహించారు. గౌరవాధ్యక్షుడిగా మునిరాములు, అధ్యక్షుడిగా వెంకటేశులు, ప్రధాన కార్యదర్శిగా వెంకట్, కోశాధికారిగా యుగంధర్, మహిళా కన్వీనర్‌గా టీకే దేవి, సీపీఎస్ కన్వీనర్‌గా శ్రీహరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నామన్నారు.

12న కలెక్టరేట్ వద్ద ధర్నా..

పుత్తూరు: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 12న తిరుపతి జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేష్ పేర్కొన్నారు. స్థానిక సీడీపీవో కార్యాలయంలో సోమవారం వినతి అందజేశారు. అంగన్‌వాడీ యూనియన్ ప్రతినిధులు విజయకుమారి, మునికుమారి పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
చిత్తూరు నగరం: 80085 74598
నగరి: 9866112017
గంగాధరనెల్లూరు: 80085 74605
పూతలపట్టు: 9505557466

న్యూస్‌టుడే, యాదమరి: సమస్య: గ్రానైట్ పాలిషింగ్ పరిశ్రమల వ్యర్థాలు చిత్తూరు-గుడియాత్తం అంతర్రాష్ట్ర రహదారిలో పోస్తుండటంతో దుమ్మూధూళిగా మారి కళ్లలో పడుతోంది. **-వాహన చోదకులు**

సమాధానం: వ్యర్థాలు రహదారిపై వేయకుండా గ్రానైట్ పాలిషింగ్ పరిశ్రమలకు తాఖీదులు ఇస్తాం. దుమ్ము తొలగింపజేస్తాం. **- పార్థసారథి, తహసీల్దార్**

న్యూస్‌టుడే, నగరి: సమస్య: టవర్ క్లాక్ వద్ద హైమాస్ట్ లైట్లు సక్రమంగా వెలగక చీకటిలో అవస్థలు పడుతున్నాం **- ప్రవీణ్, స్థానికులు**

సమాధానం: పరిశీలించి దీపాలు వెలిగింపజేస్తాం. **- కె.వి.కృష్ణారెడ్డి, కమిషనర్**

గిరిప్రసాద్‌ను సత్కరిస్తున్న అసోసియేషన్ నాయకులు

ఏపీఏఈఎస్ఏ కార్యదర్శిగా గిరిప్రసాద్

చిత్తూరు(వ్యవసాయం), న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ అగ్రికల్చరల్ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్(ఏపీఏఈఎస్ఏ) జిల్లా కార్యదర్శిగా టి.గిరిప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం స్థానిక జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఈ ఎన్నిక జరిగింది. ఎన్నికల పరిశీలకులుగా నాగార్జున వ్యవహరించారు. అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొప్పన లలిత్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు అంజయ్య, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి చర్యలు

చిత్తూరు(సంతపేట), న్యూస్‌టుడే: గ్రంథాలయాల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఏపీ గ్రంథాలయ పరిషత్ సభ్యులు రాసాని వెంకట్రామయ్య కోరారు. చిత్తూరులోని జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని సోమవారం ఆయన సందర్శించారు. గ్రంథాలయంలో పాఠకులకు అందుతున్న సేవలు, పుస్తకాల లభ్యత ఇతర అంశాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఉప గ్రంథాలయాధికారి గజేంద్రబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర గ్రంథాలయంలో గ్రంథాలయ పరిషత్ సభ్యులు వెంకట్రామయ్య

కనికరించండి సారూ..

■ విసిగి వేసారి పోయాం
■ భారమైనా కలెక్టరేట్‌కు వస్తున్నాం
■ బాధితుల వేడుకోలు

తమ న్యాయమైన సమస్యల పరిష్కారానికి ఏళ్ల తరబడి మండల కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నాం.. తమ సమస్యలు ఆలకించి కనీసం పరిష్కారం చూపేవారే అక్కడ కరవయ్యారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు పలువురు అర్జీదారులు.. మండలాల్లో తమ గోడు వినేవారు లేరు.. క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది చొరవ చూపి కరుణించడమే లేదని.. దీంతో చేసేదేమీ లేక విసిగి వేసారి ఎంతో శ్రమకోర్చి కలెక్టరేట్‌కు వచ్చామని చెబుతున్నారు.. మీరైనా తమ బాధలు ఆలకించి పరిష్కరించాలని తమ ఆవేదన వెలిబుచ్చారు.
- న్యూస్‌టుడే, చిత్తూరు(మిట్టూరు), కలెక్టరేట్

జాండ్లపేట యానాది కాలనీ వాసులు

ఎస్టీ కాలనీలు ఇచ్చినా ఫలితం శూన్యం..

తమకు ఇంటి నివాస స్థలాలు మంజూరు చేయాలని కోరుతూ కార్వేటినగరం మండలం కేపీ అగ్రహారం పంచాయతీ జాండ్లపేట యానాది కాలని వాసులు కలెక్టరేట్‌కు వచ్చి అధికారులకు వినతిపత్రం అందజేశారు. తమ ఎస్టీ కాలనీలో 25 కుటుంబాలు కాపురం ఉంటున్నామన్నారు. తమకు ఏళ్ల తరబడి నివాస స్థలాలు లేక అవస్థలు పడుతున్నామని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు పరిశీలించి న్యాయం చేయాలని విన్నవించారు.

పెరుమాళ్లపెంట గ్రామస్థులు

ఇంటి స్థలాలు ఆక్రమించుకున్నారు..

జగనన్న కాలనీలోని ఇంటి స్థలాలను సర్పంచి ఆక్రమించుకున్నారని యాదమరి మండలం పెరుమాళ్లపెంట గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. 2022లో ఇంటి స్థలాలకు 30 మంది దరఖాస్తు చేసుకోగా 13 మందికే ఇంటి స్థలాలు మంజూరు చేశారని, మిగిలిన వారికి ఇవ్వలేదన్నారు. ఇంటి స్థలాలను ప్రభుత్వ నిధులతో చదును చేసి ఆక్రమించుకున్నారన్నారు.

పంచాయతీ విభజన వద్దు..

బొమ్మాయిపల్లె పంచాయతీకి చెందిన ప్రజలు

పంచాయతీ విభజన నిర్ణయాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని వెదురుకుప్పం మండలం బొమ్మాయిపల్లె పంచాయతీకి చెందిన ప్రజలు విన్నవించారు. ఒక పంచాయతీని బొమ్మాయిపల్లె, దేవళంపేట పేరిట రెండుగా విభజనకు ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. అలా జరిగితే బొమ్మాయిపల్లె పంచాయతీ వెనకబడుతుందని ఆవేదన చెందారు.

భూమి కేటాయించండి..

ఇంటి స్థలాలకు భూమి కేటాయించాలని చిత్తూరు గ్రామీణ మండలం చెర్లోపల్లె గ్రామస్థులు అధికారులను వేడుకున్నారు. తమ గ్రామంలో 120 కుటుంబాలకు నివాస స్థలాలు లేక అవస్థలు పడుతున్నామని వాపోయారు. తమకు సౌకర్యం ఉన్న సర్వే నంబరు 112, 654లో ప్రస్తుతం ఉన్న భూమిలో ఇంటి స్థలాలు కేటాయించాలని వారు విన్నవించారు.

చెర్లోపల్లె గ్రామస్థులు

అంధ స్కేటర్‌కు ఘన స్వాగతం

బంగారుపాళ్యం, న్యూస్‌టుడే: అంధ స్కేటర్ మూరారీ హర్షవర్ధన్‌కు సోమవారం బంగారుపాళ్యంలో ఘన స్వాగతం లభించింది. శాప్ ఛైర్మన్ రవినాయుడి ప్రోత్సాహంతో తాను ఈ ప్రయాణం చేపట్టానని అతడు పేర్కొన్నాడు. కర్ణాటక సరిహద్దు నంగిలి నుంచి తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి వరకు స్కేటింగ్ చేస్తున్నానని చెప్పాడు. ఈ నేపథ్యంలో బంగారుపాళ్యం సరిహద్దు నుంచి ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు చేపట్టామని సీఐ శ్రీనివాసులు తెలిపారు. హైవేపై స్కేటింగ్ కొనసాగిస్తూ వెళ్లిన హర్షవర్ధన్‌ను స్థానికులు అభినందించారు.

మైసూరుకు జిల్లా ఎంపీడీవోలు

చిత్తూరు జడ్పీ, పెద్దపంజాణి: మైసూరులోని అబ్దుల్ నజీర్ సాబ్ స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ శిక్షణ కేంద్రంలో ఎంపీడీవోలకు నిర్వహిస్తున్న జాతీయస్థాయి శిక్షణ తరగతులకు జిల్లాలోని ఐదు మండలాలకు చెందిన ఎంపీడీవోలను పంపారు. పెద్దపంజాణి, గంగవరం, శాంతిపురం, వెదురుకుప్పం, చౌడేపల్లె మండలాల ఎంపీడీవోలు బాలాజీ, సురేష్, ప్రేమ్‌రాజ్‌కుమార్, పురుషోత్తం, లీలామాధవి వారం రోజుల శిక్షణ తరగతులకు హాజరయ్యారు. శిక్షణలో ప్రధానంగా పంచాయతీల బలోపేతం, ఆదాయం పెంపు, సుపరిపాలన, ఉపాధిహామీ పథకం తదితర కీలక అంశాలపై శిక్షణ ఉంటుందని అధికారులు సోమవారం తెలిపారు.

మంత్రిని కలిసిన దివ్యాంగుల సంఘ నాయకులు

నింద్ర, న్యూస్‌టుడే: దివ్యాంగుల ఐకాస రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఉమాపతి పిళ్లై ఏపీలోని పలు జిల్లాలకు చెందిన దివ్యాంగుల సంఘ నాయకుల సమక్షంలో సోమవారం.. రవాణాశాఖ మంత్రి రామ్‌ప్రసాద్ రెడ్డిని విజయవాడలోని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు. ఇటీవల సీఎం చంద్రబాబు ప్రకటించిన వరాలు దివ్యాంగుల సంక్షేమానికి ఎంతో దోహదం చేస్తాయని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. తమకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం ఇప్పటికే కల్పించారని, అయితే అందులో కేటాయించిన సీట్లు తమకే ఉండేలా చొరవ తీసుకోవాలని మంత్రికి విన్నవించామని ఆయన తెలిపారు. మరికొన్ని సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని మంత్రికి నివేదించామని పేర్కొన్నారు.

మంత్రి రాంప్రసాద్‌రెడ్డితో ఉమాపతిపిళ్లై, ప్రతినిధులు

మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ల ప్రమాణ స్వీకారం

చిత్తూరు(జిల్లా పంచాయతీ), పుత్తూరు, న్యూస్‌టుడే: మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్లుగా ఉమ్మడి జిల్లాకు చెందిన 15 మంది సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. వెలగపూడిలోని బీసీ భవన్‌లో ఛైర్మన్ సీఎంటీ త్యాగరాజన్ సమక్షంలో వారు బాధ్యతలు స్వీకరించారు. డైరెక్టర్లుగా ప్రమాణం చేసిన వారిలో నాగరాజు, బి.డి.బాలాజీ, మణికంఠ, నమశివాయం, ఎం.మణి, శ్రీకాంత్, ధనపాల్, భాస్కరన్, పెరుమాళ్ మధుబాబు, ముత్తయ్య, శరవణ, శ్రీధర్, నటరాజన్, గోపాలకృష్ణన్, వినోద్‌కుమార్ ఉన్నారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న డైరెక్టర్ నాగరాజు, పక్కన ఛైర్మన్ త్యాగరాజన్

జాతీయ స్థాయి పోటీలకు నిరోషా

బంగారుపాళ్యం, న్యూస్‌టుడే: రాగిమానుపెంట జడ్పీ ఉన్నత పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థిని నిరోషా.. అండర్-14 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికైందని హెచ్‌ఎం రామ్మూర్తిరెడ్డి సోమవారం తెలిపారు. ఈ పోటీలు గత నెల 29 నుంచి ఈ నెల ఒకటో తేదీ వరకు పలమనేరులో జరిగాయన్నారు. దిల్లీలో జనవరి నెల రెండు నుంచి ఏడో తేదీ వరకు జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననుందని పేర్కొన్నారు. నిరోషాను ఉపాధ్యాయులు అభినందించారు.

జిల్లా కార్యవర్గంలో స్థానం

పాలసముద్రం: ఎస్టీయూ జిల్లా గౌరవాధ్యక్షుడిగా ఎస్.పీతాంబరం రాజు, రాష్ట్ర కౌన్సెలర్‌గా ఆర్.చంద్రశేఖర్, జిల్లా ఉపాధ్యక్షుడిగా ఇ.కోదండయ్య, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శిగా చంద్రశేఖర్, జిల్లా ఆర్థిక కమిటీ సభ్యులుగా ఎస్.ఉమాపతి ఎన్నికయ్యారని కార్యదర్శి కోదండయ్య తెలిపారు. జిల్లా స్థాయిలో మండల ఉపాధ్యాయులకు సముచిత స్థానం కల్పించిన జిల్లా, మండల శాఖలకు రుణపడి ఉన్నామన్నారు. **యాదమరి:** ఎస్టీయూ జిల్లా కార్యవర్గంలో కాశిరాళ్ల గొల్లపల్లి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు జేఎండీ సుల్తాన్ జిల్లా కార్యదర్శిగా, కొత్తపల్లి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు గణపతి జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. వారిని ఉపాధ్యాయులు అభినందించారు.

సహకార ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

నగరి, న్యూస్‌టుడే: జిల్లా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఉద్యోగుల యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. నగరి, కోసలనగరం, అగరం, నింద్ర ఉద్యోగులు, సహకార సంఘం ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో నిరసన తెలిపారు. తమ వంతు సహకారం అందిస్తామని డీసీసీబీ మేనేజర్ రోజా, అసిస్టెంట్ మేనేజర్ ఆనంద్, సూపర్‌వైజర్ శ్రీకాంత్ మద్దతు తెలిపారు. యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు తులసిపిళ్లై, రాష్ట్ర నాయకుడు సుబ్రహ్మణ్యం, నింద్ర సీఈవో సురేష్ బాబు, కృష్ణమూర్తి, రాధా, కార్తిక్ పాల్గొన్నారు. **పుత్తూరు:** సహకార సంఘాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు రిటైర్మెంట్ వయస్సు 62కు పెంచాలని ఆ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు కోటిరెడ్డి డిమాండ్ చేశారు. డీసీసీబీ వద్ద ఉద్యోగులు ధర్నా చేపట్టారు. బ్యాంకు మేనేజరుకు వినతి అందజేశారు. ఉద్యోగులు చిన్న, విజయ్, చెంగయ్య, వేణు, కన్నప్పరెడ్డి పాల్గొన్నారు.

నగరి పీఏసీఎస్ వద్ద నిరసన ప్రదర్శనలో ఉద్యోగులు

ఊర్ల పేరు తెలిసేదెలా..?

చిత్తూరు-బలిజకండ్రిగ ప్రధాన రహదారిలోని వీర్లగుడి వద్ద బోర్డు మూసుకుపోయి ముందు వచ్చే గ్రామాల వివరాలు, ఎన్ని కిమీ దూరం ఉందనేది తెలియడం లేదు. సూచిక బోర్డుల నిర్వహణ విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తుండటంతో ప్రయాణికులు అయోమయానికి గురవుతున్నారు. వెంగళరాజుకుప్పం పంచాయతీ వీర్లగుడి గ్రామం పేరున్న బోర్డు చుట్టూ విపరీతంగా పిచ్చిమొక్కలు పెరగడంతో గ్రామ బోర్డు పూర్తిగా కనబడటం లేదు. కొత్తగా ఇక్కడకు వచ్చేవారికి ఈ గ్రామం పేరు తెలియక తికమకపడుతున్నారు. **-న్యూస్‌టుడే, పాలసముద్రం**

నీరు నిలిచి.. అవస్థలు తెచ్చి

వడమాలపేట, న్యూస్‌టుడే: వడమాలపేట-వడమాల రోడ్డులో వర్షపు నీరు ముందుకు వెళ్లక నిలిచి పోయింది. ఈ ప్రాంతంలో సీసీరోడ్డు ఉన్నా రెండు వైపులా మురుగు కాల్వలు నిర్మించక పోవడంతో వర్షపు నీరు నిలిచి సముద్రాన్ని తలపిస్తోంది. ఇటుగా వెళ్లే విద్యార్థులు నిత్యం అవస్థలు పడుతున్నారు. పరిసర ప్రాంత ప్రజలు దోమల బెడదతో రోగాల బారిన పడుతున్నారు. ఈ సమస్య పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని ప్రజలు వాపోతున్నారు. అధికారులు స్పందించి కాలువలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలి

పుత్తూరు: విద్యార్థులు సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్వీకుమార్ పేర్కొన్నారు. పిల్లారిపట్టు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు నేషనూరులో ర్యాలీ నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ పీవో సాగర్‌రెడ్డి, పీడీ మౌలాలి, వాలంటీర్లు పాల్గొన్నారు.

నియామకం

కైలాసం యాదవ్

విజయపురం: కోసలనగరానికి చెందిన కైలాసం యాదవ్ భాజపా జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా ఎంపికయ్యారు. రాష్ట్ర మాజీ అధ్యక్షులు దివంగత చిలకం రామచంద్రారెడ్డి తనయుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చిలకం ఈశ్వరప్రసాద్ కృషితో ఈ పదవి వచ్చిందని, ఆయనకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని కైలాసం పేర్కొన్నారు.

బడి పిల్లలకు ప్లేట్లు, గ్లాసుల పంపిణీ

యాదమరి: తెల్లరాళ్లపల్లె ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు సోమశేఖర్ తన తల్లి కళావతి పుట్టినరోజు సందర్భంగా సోమవారం 50 మంది విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు, పాఠశాలకు రెండు కుర్చీలు వితరణగా సోమవారం అందజేశారు. ఎంఈవోలు రుక్మిణి, ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తొమ్మిది వినతుల స్వీకరణ

చిత్తూరు నగరం, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తొమ్మిది వినతులు అందాయని సహాయ కమిషనరు ప్రసాద్ తెలిపారు. ఇంజినీరింగ్ విభాగానికి మూడు, ప్రజారోగ్యం-2, మెప్మా-2, టౌన్ ప్లానింగ్‌కు, టిడ్కోకు ఒక్కొక్కటి చొప్పున తొమ్మిది వినతులు అందాయన్నారు. వాటిని పరిశీలించి నిర్దేశిత గడువులోగా పరిష్కరిస్తామని చెప్పారు. ఎంహెచ్‌వో లోకేష్, ఎంఈ వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

విరాళం అందజేస్తున్న ఇంద్రాణి బాలసుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులు

వినాయకుడి ఆలయానికి విరాళాలు

కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీ వరసిద్ధి వినాయకస్వామి నిత్యాన్నదాన పథకానికి చిత్తూరుకు చెందిన ఇంద్రాణి బాలసుబ్రహ్మణ్యం రూ.లక్ష, గో సంరక్షణ ట్రస్టుకు రాజమండ్రికి చెందిన నంబూరి గోపాలకృష్ణ రూ.లక్ష మొత్తాన్ని వేర్వేరుగా ఆలయ ఏఈవో రవీంద్రబాబుకు సోమవారం అందజేశారు. దాతలు, కుటుంబ సభ్యులకు స్వామివారి దర్శనం కల్పించి, తీర్థప్రసాదాలు అందించారు. పండితులు వేదాశీర్వచనం చేశారు.

II వినతుల స్వీకరణ.. చిత్తూరు గ్రామీణ, న్యూస్‌టుడే: స్పందనలో ప్రజలు, రైతుల నుంచి భూ వివాదాలు, సర్వే, పాసుపుస్తకాలు తదితరాలపై ఎనిమిది వినతులు అందాయని అర్బన్ తహసీల్దార్ కులశేఖర్ తెలిపారు. గ్రామీణ మండల తహసీల్దారు కార్యాలయానికి నాలుగు వినతులు అందాయని తహసీల్దార్ కల్యాణి వెల్లడించారు.

నేడు మండల సమావేశం.. తవణంపల్లె: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం ఉదయం 10.30గంటలకు ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు.

సదాశివేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు.. కార్వేటినగరం: శ్రీశిష్టా సౌందర్యవల్లీ సమేత సదాశివేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారిని పుష్పాలు, ఆభరణాలతో అలంకరించారు. భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అన్నదానం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

దాత సహకారం- రహదారికి మోక్షం

గత మూడు నెలలుగా కురుస్తున్న వర్షాలకు ఎగువ కమ్మ కండ్రిగ వద్ద ఉన్న పెద్దవాగుకు వేసిన పైపులపై పోసిన మట్టి కొట్టుకుపోయింది. పాలసముద్రం, గంగాధరనెల్లూరు వైపు వెళ్లి వచ్చే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కనీసం ద్విచక్ర వాహనం వెళ్లలేని విధంగా మట్టి కోతకు గురైంది. తెదేపా బూత్ కమిటీ అధ్యక్షుడు, ఎగువ కమ్మ కండ్రిగ గ్రామానికి చెందిన మాజీ ఆర్మీ ఉద్యోగి వెంకటేశులునాయుడు సొంత నిధులతో పైపులపై ఇసుక మూటలు వేసి, 100 మీటర్ల మేర దెబ్బతిన్న రోడ్డుపై మట్టితోలి చదును చేసి రాకపోకలకు చర్యలు చేపట్టారు. **- న్యూస్‌టుడే, శ్రీరంగరాజపురం**

కష్టాలకు కుంగిపోకూడదు

ఉపన్యసిస్తున్న రాధా మనోహర్ దాస్

చిత్తూరు(సంతపేట), న్యూస్‌టుడే: కష్టాలొచ్చినప్పుడు కుంగిపోకుండా ఉండాలని.. కాలం అన్ని సమస్యలకు పరిష్కారం చూపుతుందని ప్రవచన కర్త రాధా మనోహర్ దాస్ అన్నారు. చిత్తూరు నారాయణి సేవా సమితి ఆధ్వర్యంలో భజగోవిందంపై ప్రవచన కార్యక్రమం సోమవారం స్థానిక నాగయ్య కళాక్షేత్రంలో ప్రారంభమైంది. ఆయన మాట్లాడుతూ మానవులు చేసే పని హృదయ పూర్వకంగా చేయాలని, అప్పుడే సత్ఫలితాలు సాధించవచ్చన్నారు. ప్రతిఒక్కరూ మంచి పనులు చేయాలని, తోటి వారికి కీడు చేయరాదని సూచించారు. నగర వాసులు అధిక సంఖ్యలో కార్యక్రమానికి హాజరయ్యారు.

పల్స్‌పోలియో విజయవంతం చేయాలి.. గుడిపాల: ఈ నెల 21న జరగనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైద్యాధికారి సంధ్య కోరారు. సోమవారం స్థానిక పీహెచ్‌సీలో ఆరోగ్య, ఆశా కార్యకర్తలకు అవగాహన కల్పించారు. సీహెచ్‌వో బాలసూర్యనారాయణ పాల్గొన్నారు.

బుగ్గదేవాలయంలో అన్నదానం

నగరి, న్యూస్‌టుడే: బుగ్గఅగ్రహారంలోని శ్రీఅన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో సోమవారం మాజీ మంత్రి రోజా ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దఎత్తున అన్నదానం చేశారు.

అన్నదానం చేస్తున్న మాజీ మంత్రి రోజా తదితరులు

స్పందించి.. పరిష్కరించి

■ సమస్యలకు చెక్
■ నగరపాలక యంత్రాంగం చొరవ

న్యూస్‌టుడే, చిత్తూరు నగరం

ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా 'ఈనాడు మీతోడు' విభాగం ఆధ్వర్యంలోని 'మేమున్నాం-మీకుతోడుగా' శీర్షికన వచ్చిన పలు సమస్యలపై చిత్తూరు నగరపాలక సంస్థ, పలు మండలాల అధికారులు స్పందించారు.. ఎప్పటికప్పుడు ప్రచురితమైన సమస్యలపై స్పందించిన నగరపాలక ప్రజారోగ్య విభాగం అధికారులు వాటి పరిష్కారానికి చొరవ చూపారు.. వీధుల్లో చెత్త, వ్యర్థాలు, కాలువలు పూడిపోవడం, దోమల విజృంభణ తదితర సమస్యలు పరిష్కరించారు.

రంగాచారివీధిలో పూడిక తొలగిస్తున్న కార్మికుడు

స్పందనకు వందనం

● స్థానిక దుర్గానగర్ కాలనీ నాగాలమ్మ ఆలయ వీధి, సంతపేట ఆశ్రమ వీధి, త్యాగరాజనగర్, మురకంబట్టు ఇందిరమ్మ కాలనీ, నీవా నది పరివాహక ప్రాంత రంగాచారి వీధిలో కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోవడంతో ప్రజారోగ్య విభాగం అధికారులు పూడిక తొలగింపజేశారు. ● మసీదు మిట్ట, గజానన్ పోలీస్ కాలనీలో వీధి శునకాల బెడదపై స్థానికుల ఫిర్యాదుతో ప్రజారోగ్య విభాగం అధికారులు శునకాలను బంధించి ఏఆర్‌వీ, కు.ని.శస్త్రచికిత్స చేయించారు. ● కట్టమంచి మైదా కర్మాగారం వీధిలో నివాసాల మధ్య పేడదిబ్బలు, వ్యర్థాలు తొలగింపజేశారు. దోమల నివారణకు ఫాగింగ్ చేశారు.

తొలగిన మురుగు

సింహరాజుపురం పంచాయతీ దళితవాడ గ్రామ మురుగునీటి కాలువలు అధ్వానంగా ఉన్న సమస్యపై ఎంపీడీవో సతీష్‌రాజు స్పందించి సిబ్బందిచే మురుగునీటిని తొలగింపజేసి పరిసరాలు శుభ్రం చేయించారు.
-న్యూస్‌టుడే, పాలసముద్రం

తీగల తొలగింపు

ఉగ్రాణంపల్లె విద్యుత్తు ఉపకేంద్రం నుంచి బట్టువారిపల్లె వెళ్లే రోడ్డులో విద్యుత్తు స్తంభాలకు అల్లుకున్న తీగల సమస్యపై ఏఈ తులసిప్రసాద్ స్పందించి సిబ్బందిచే వాటిని తొలగింపజేశారు.
-న్యూస్‌టుడే, పెనుమూరు

నలుగురు జూదరుల అరెస్టు

రూ.4 లక్షల నగదు స్వాధీనం

పళ్లిపట్టు, న్యూస్‌టుడే: తిరువళ్లూరు జిల్లా ఆర్కేపేట సమీపం వేణుగోపాలపురం చెరువు కట్ట వద్ద కొందరు డబ్బులు పెట్టి జూదం ఆడుతున్నట్లు ఆర్కేపేట పోలీసులకు సమాచారం అందింది. ఆ మేరకు సబ్ ఇన్‌స్పెక్టరు రాఖీకుమారి నేతృత్వంలో పోలీసులు సోమవారం ఆ ప్రాంతానికి వెళ్లారు. వారిని చూసిన జూదగాళ్లు పారిపోవడానికి యత్నించారు. అందులో నలుగురిని పోలీసులు పట్టుకున్నారు. వారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలం బండపల్లి గ్రామానికి చెందిన కుమారరాజా, చిత్తూరు జిల్లా గ్రీంపేటకు చెందిన దయానంద, చిత్తూరు జిల్లా ఎస్.ఆర్.పురం మండలం పద్మాపురం గ్రామానికి చెందిన నవీన్‌కుమార్, చిత్తూరు జిల్లా కొంగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన సురేష్‌కుమార్‌గా తెలిసింది. వారిని అరెస్టు చేసి రూ.4 లక్షల నగదు, 5 ద్విచక్ర వాహనాలు, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న చిత్తూరుకు చెందిన చంద్రన్ కోసం గాలిస్తున్నారు.

అడవి జంతువు దాడిలో ఆవు మృతి

తవణంపల్లె, న్యూస్‌టుడే: చెర్లోపల్లె గ్రామానికి చెందిన పరదేశి పాడి ఆవులను అటవీ ప్రాంతంలో మేతకు తీసుకెళ్లగా అడవి జంతు దాడి చేసింది. ఈ దాడిలో ఓ ఆవు మరణించింది. అయితే దాడి చేసింది ఏ జంతువో తెలియలేదని ఎఫ్‌బీఏ జబ్బీ తెలిపారు. చిరుత దాడిలో ఆవు మృతి చెంది ఉంటుందని స్థానికులు అనుమానం వ్యక్తం చేశారు.

కరి దాడులు.. భయాందోళనలో రైతులు

యాదమరి, న్యూస్‌టుడే: అటవీ సమీప ప్రాంత పొలాల్లో కరి దాడులు మొదలయ్యాయి. కొద్ది రోజులుగా మండల పరిధిలో సంచరిస్తున్న 13 ఏనుగుల గుంపు ఆదివారం రాత్రి తాళ్లమడుగు సమీపంలో రైతులు సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు, మార్కండేయులుకు చెందిన అరటి, మామిడి, కొబ్బరి, జొన్న పంటలు ధ్వంసం చేశాయి. సోమవారం భూమిరెడ్డిపల్లి సమీప నుంజర్ల ప్రాజెక్టు వద్ద ఇవి ఉన్నట్లు ట్రాకర్లు గుర్తించారు. అవి దళవాయిపల్లి, తాళ్లమడుగు మధ్య తిరుగుతూ పంటలపై దాడి చేస్తున్నాయి. పంట నష్టాన్ని అటవీశాఖ అధికారులు, సిబ్బంది పరిశీలించారు. ఏనుగులను అనుసరిస్తూ అవి ఎక్కడ తిరుగుతున్నాయో గమనించి జనావాసాల్లోకి రాకుండా అడవిలోకి మళ్లిస్తున్నారు.

కంకర టిప్పరు బోల్తా.. వెదురుకుప్పం: బలిజమొండి వెంగనపల్లె సమీప చవటగుంట-అనుప్పల్లె ప్రధాన రహదారిపై సోమవారం కంకర లోడుతో వెళ్తున్న టిప్పరు అదుపు తప్పి రహదారి పక్కన ఉన్న పొలంలో బోల్తా పడింది. ఈ ఘటనలో చోదకుడు సురక్షితంగా బయట పడినట్లు స్థానికులు తెలిపారు.

నేడు పుత్తూరు సబ్‌స్టేషన్‌లో కొత్త బ్రేకర్ ఏర్పాటు

పుత్తూరు: స్థానిక 132కేవీ సబ్‌స్టేషన్‌లో మంగళవారం ఉదయం 7 నుంచి సాయంత్రం 4 వరకు 33 కేవీ అన్నూరు ఫీడర్‌కు సంబంధించి కొత్త బ్రేకర్ ఏర్పాటు చేస్తున్నామని ఈఈ దేవ ఆశీర్వాదం సోమవారం తెలిపారు. ఈ సమయంలో లక్ష్మీనగర్, కల్యాణపురం సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్తు వినియోగదారులకు కార్వేటినగరం ఫీడర్ నుంచి సరఫరా అందిస్తామని, అప్పుడప్పుడు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

IN THE COURT OF THE HON'BLE IV ADDITIONAL CIVIL JUDGE (JUNIOR DIVISION), CHITTOOR
O.S.No.154 of 2025
Between:
G.Nandagopal ...Plaintiff
And:
N.K.Thyagarajulu ...Defendant
NOTICE TO DEFENDANT
To
N.K.THYAGARAJULU,
S/o N.C.Koti Chetty,
D.No.10-137, Gandhi Road Extension, Chittoor Town and Municipal Corporation, Chittoor District.
Please take notice that the above suit filed by the plaintiff for recovery of suit amount stands posted to **08.01.2026** for your appearance. You are therefore directed by the above said court to appear either in person or through your advocate on **08.01.2026 at 10-30 a.m.** and file your written statement. Failing which the matter will be decided exparte.
By Order of the court
Sd/- C.SUDHAKAR GUPTA
Advocate for Plaintiff



పలమనేరు

•పలమనేరు • కుప్పం •పుంగనూరు

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
పలమనేరు: 80085 74580
కుప్పం పట్టణం: 80085 73490
పుంగనూరు: 80085 74622

పలమనేరు, న్యూస్‌టుడే: సమస్య: పట్టణంలోని తాలూకా కచ్చేరివీధిలో కాలువల్లో మురుగు పేరుకుపోయింది. - సుందర్, పలమనేరు

సమాధానం: సిబ్బందిని పంపి కాలువలు శుభ్రం చేయిస్తాం.- ఎన్వీ రమణారెడ్డి, కమిషనర్

పెద్దపంజాణి, న్యూస్‌టుడే: సమస్య: మండలంలోని శ్రీరామాపురంలో జాతీయ రహదారిపై వేగ నిరోధకాలు ఏర్పాటు చేయాలి. - వెంకటరమణ

సమాధానం: పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం. - శారదాదేవి, డిప్యూటీ ఎంపీడీవో

పుంగనూరు: సమస్య: హిదాయత్‌నగర్, మంగళం కాలనీలో వీధి దీపాలు వెలగడం లేదు. - రామకృష్ణ

సమాధానం: వీధిదీపాల మరమ్మతుకు చర్యలు తీసుకుంటాం.- మహేష్, డీఈఈ

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: సమస్య: పత్రపల్లె తండాలో మురుగు కాలువలను శుభ్రం చేయాలి.- మంజు

సమాధానం: కాలువలు శుభ్రం చేయిస్తాం. - నరసింహులు, కార్యదర్శి

సోమల, న్యూస్‌టుడే: సమస్య: మండలంలోని ఆవులపల్లెలో కాలువలు అధ్వానంగా ఉన్నాయి. - స్థానికులు

సమాధానం: కాలువలు శుభ్రం చేసేందుకు చొరవ తీసుకుంటాం. - మునికుమార్, కార్యదర్శి

బోయకొండ హుండీ ఆదాయం రూ.79.30లక్షలు

బోయకొండ(చౌడేపల్లె): బోయకొండ గంగమ్మ ఆలయానికి హుండీ ద్వారా రూ.79.30లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఏకాంబరం సోమవారం తెలిపారు. రూ.7879574 నగదు, 31 గ్రాముల బంగారు, 770 గ్రాముల వెండి, రణబేరి గంగమ్మ ఆలయంలోని హుండీ ద్వార రూ.51,249నగదు ఆదాయం సమకూరినట్లు ఆయన వివరించారు.

కాలువలు శుభ్రం

స్పందనకు వందనం

పలమనేరు: అంకిశెట్టి వీధిలో మున్సిపల్ కార్మికులు పారిశుద్ధ్య పనులను చేపట్టారు. కాలువలు అపరిశుభ్రంగా ఉన్నాయని 'ఈనాడు'లో 'మేమున్నాం మీకు తోడుగా'లో వార్త ప్రచురితమైంది. అధికారులు ఆ మేరకు స్పందించారు.

విద్యుత్తు తీగలు సరిచేశారు

ఈనాడు కథనానికి స్పందన

బైరెడ్డిపల్లె: కమ్మనపల్లె సమీపంలో ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్తు తీగలను ట్రాన్స్‌కో సిబ్బంది సోమవారం సరి చేశారు. 'ఈనాడు'లో ఈ నెల 7న 'చేతికందే ఎత్తులో ప్రమాదం' శీర్షికతో చిత్రవార్తకు స్పందించారు.

నేటి నుంచి డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: డిగ్రీ ద్వితీయ, తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు మంగళవారం నుంచి సెమిస్టర్ పరీక్షలు ఉదయం, మధ్యాహ్నం రెండు పూటలా నిర్వహించనున్నట్లు శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ రాజశేఖర్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. ఎంసీవీ, ఎస్వీ, విద్యానికేతన్, శ్రీనివాస, రామసముద్రం సాయివైష్ణవి, అమరావతి తదితర ప్రైవేటు కళాశాల విద్యార్థులకు స్థానిక శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పరీక్షలు నిర్వహిస్తారన్నారు. సదుంలో మరో మూడు ప్రైవేటు డిగ్రీ కళాశాలల విద్యార్థులు, సోమలలో మరో పరీక్ష కేంద్రంలో విద్యార్థులు సెమిస్టర్ పరీక్షలు రాయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

మునగ కిలో రూ.700

✦ వినియోగదారులపై భారం ✦ తగ్గిన దిగుమతులు

పుంగనూరు వారపు సంతలో కూరగాయలు

పుంగనూరు, న్యూస్‌టుడే: కూరగాయల ధరలు రెండు నెలల కిందట సామాన్యులకు అందుబాటులో ఉండేవి. వారం రోజులుగా ధరలు పెరుగుతూనే ఉన్నాయి. ఈ ధరలు చూసి వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. టమాటా, మిరప, బెండ, చిక్కుడు, బీన్స్ తదితర కూరగాయల ధరలు వినియోగదారులకు అందుబాటులో లేవు. కిలోకు రూ.6 నుంచి రూ.7లు వరకు ధరలు పెరిగాయి. జిల్లాలోనే కాదు పొరుగు జిల్లాలు, రాష్ట్రాల్లో వర్షాల కారణంగా కూరగాయల పంటల పూతలు రాలిపోతుండడంతో దిగుబడులు ఆశాజనకంగా లేవు. నెల రోజుల కిందట కిలో మునగ రూ.70లు. వంకాయలు కిలో రూ.50లు ఉండేవి. ప్రస్తుతం కిలో మునగ రూ.700లు, వంకాయలు రూ.100లు, బీన్స్ రూ.80, ముల్లంగి రూ.40లు, క్యారెట్ రూ.100లు ఉన్నాయి.

పుంగనూరు, పలమనేరు, కుప్పం ప్రాంతాల్లో రైతులు టమాటా పంటకే ప్రాధాన్యం ఇస్తారు. ఇతర కూరగాయలు, ఆకుకూరలు నామమాత్రంగానే పండిస్తారు. మార్కెట్‌లో అన్ని రకాల కూరగాయలకు డిమాండు ఉన్నా రైతులు టమాటాను మాత్రమే వేలాది ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఇతర కూరగాయలు, ఆకుకూరల్లా ఆసక్తి చూపడం లేదు. ఈ పరిస్థితి కూడా ధరలు పెరగడానికి కారణమవుతోంది.

ధరలు అదుపు చేయాలి

కూరగాయల ధరలను అదుపు చేయడానికి అధికారులు చర్యలు తీసుకోవాలి. రైతులకు పంటల సాగు, సాగు పద్ధతులు, విత్తనాల ఎంపికపై అవగాహన కల్పించాలి. రైతుల నుంచి కొనుగోలు చేసే ధరలకు వ్యాపారులు విక్రయించే ధరలకు వ్యత్యాసం ఉంటోంది. ఇలాంటి వాటిని నివారిస్తే రైతులకు, వినియోగదారులకు లాభం చేకూరుతుంది.
- **నవనీత, గృహిణి**

సామాన్యులు కొనలేరు

ఆకుకూరలు, కూరగాయలు ఎక్కువగా భుజించాలని సమావేశాల్లో అధికారులు చెబుతున్నారు. వాటిని కొనుగోలు చేయడం దినసరి కూలీలకు సాధ్యమయ్యే అవకాశం ఉండటం లేదు. కూలీలు, కార్మికులు, సామాన్యులు కూరగాయలను అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలి.
- **మస్తాన్, కార్మికుడు**

అభిషేక పూజలు

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: పాతపేటలోని శ్రీచెన్నమల్లికార్జునస్వామి ఆలయంలో భక్తులు స్వామివారికి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు స్వామివారికి పంచామృతాభిషేకం, పుష్పాలంకరణతో అర్చనలు జరిపారు.

IN THE COURT OF THE CIVIL JUDGE (SR. DIVISION): PUNGANUR
I.A: NO 154 & 155/2024
O.S.No. 78/2018

పిటిషనర్: కార్పొరేషన్ బ్యాంకు ప్రస్తుతం యూనియన్ బ్యాంకులో విలీనం, పుంగనూరు శాఖ తరపున ప్రస్తుత బ్యాంకు మేనేజరు
రెస్పాండెంట్స్ : 2. శ్రీ శ్రీనివాస అగ్రికోల్డ్ స్టోరేజ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ తరపున మేనేజింగ్ డైరెక్టర్ ఆర్.రాయల్ కుమార్, తండ్రి ఆర్.క్రిష్ణయ్య శెట్టి. 3. ఆర్.దీప, భర్త ఆర్.రాయల్ కుమార్, మేనేజింగ్ డైరెక్టర్, శ్రీ శ్రీనివాస అగ్రికోల్డ్ స్టోరేజ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్
2 మరియు 3 ప్రతివాదులు హిందువులు. వ్యాపార జీవనం, పోలీసులైను వీధి, పుంగనూరు టౌన్, చిత్తూరు జిల్లా.
NOTICE TO RESPONDENTS No.2 & 3
2 మరియు 3 ప్రతివాదులగు మీకు తెలియజేయడమేమనగా బ్యాంకు వారు మీరు బాకీ పడ్డ ఋణమును వసూలు చేసుకొనుటకు పై దావాను మీపై పై కోర్టు నందు దాఖలు చేసియున్నారు. సదరు దావా 11.12.2025 తేదీన వాయిదా కలదు. పై తేదీన మీరుగాని లేక మీ న్యాయవాది ద్వారా గాని అభ్యంతరములు తెలుపుకొనినయెడల పై పిటిషన్ మీ పరోక్షముగా తీర్మానించబడును.
(By order of Court)
Sd/-
P.VIJAYA BHASKAR M.A., L.L.B.,
ADVOCATE
Gokul Street
PUNGANUR-517 247
Cell: 9440862812, 8142033567.

IN THE COURT OF THE CIVIL JUDGE (SR. DIVISION): PUNGANUR
I.A: NO 146 & 147/2024
O.S.No. 39/2018

పిటిషనర్: కార్పొరేషన్ బ్యాంకు ప్రస్తుతం యూనియన్ బ్యాంకులో విలీనం, పుంగనూరు శాఖ తరపున ప్రస్తుత బ్యాంకు మేనేజరు
రెస్పాండెంట్స్ : 2. శ్రీ శ్రీనివాస అగ్రికోల్డ్ స్టోరేజ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ తరపున మేనేజింగ్ డైరెక్టర్ ఆర్.రాయల్ కుమార్, తండ్రి ఆర్.క్రిష్ణయ్య శెట్టి. 3. ఆర్.దీప, భర్త ఆర్.రాయల్ కుమార్, మేనేజింగ్ డైరెక్టర్, శ్రీ శ్రీనివాస అగ్రికోల్డ్ స్టోరేజ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్
2 మరియు 3 ప్రతివాదులు హిందువులు. వ్యాపార జీవనం, పోలీసులైను వీధి, పుంగనూరు టౌన్, చిత్తూరు జిల్లా.
NOTICE TO RESPONDENTS No.2 & 3
2 మరియు 3 ప్రతివాదులగు మీకు తెలియజేయడమేమనగా బ్యాంకు వారు మీరు బాకీ పడ్డ ఋణమును వసూలు చేసుకొనుటకు పై దావాను మీపై పై కోర్టు నందు దాఖలు చేసియున్నారు. సదరు దావా 11.12.2025 తేదీన వాయిదా కలదు. పై తేదీన మీరుగాని లేక మీ న్యాయవాది ద్వారా గాని అభ్యంతరములు తెలుపుకొనినయెడల పై పిటిషన్ మీ పరోక్షముగా తీర్మానించబడును.
(By order of Court)
Sd/-
P.VIJAYA BHASKAR M.A., L.L.B.,
ADVOCATE
Gokul Street
PUNGANUR-517 247
Cell: 9440862812, 8142033567.

పంటలపై ఆగని ఏనుగుల దాడులు

సోమల, న్యూస్‌టుడే: మండలంలో ఏనుగుల దాడులు కొనసాగుతున్నాయి. ఆదివారం రాత్రి నెరకురిపల్లె సమీపంలోని శ్రీనివాసులు, హరి రైతులకు చెందిన వరి, కొబ్బరి చెట్లను ధ్వంసం చేశాయి. ఎఫ్‌బీవో రాధమ్మ దెబ్బతిన్న పంటలను సోమవారం పరిశీలించారు.

విద్యార్థులకు సత్కారం

చౌడేపల్లె, న్యూస్‌టుడే: కర్నూలులో నవంబరులో జరిగిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన చిత్తూరు జిల్లా జట్టులో చారాల విద్యార్థి అరుణ ప్రత్యేక ప్రతిభ చాటింది. అలాగే మాచర్లలో అండర్-14 విభాగం రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో జిల్లా బాలుర జట్టులో అదే పాఠశాల విద్యార్థి అనిల్ పాల్గొన్నాడు. విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు సోమవారం సత్కరించారు. ప్రధానోపాధ్యాయురాలు రేణుక, వ్యాయామ ఉపాధ్యాయుడు రాజేంద్ర బాబు పాల్గొన్నారు.

గ్రామస్థులకు పట్టా అందిస్తున్న రాజగోపాల్

సత్వర పరిష్కారమే ధ్యేయం

కుప్పం గ్రామీణ, న్యూస్‌టుడే: సమస్యలను సత్వరం పరిష్కరించడమే ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్యేయమని తెదేపా మండల అధ్యక్షుడు రాజగోపాల్ పేర్కొన్నారు. జంపనూరులోని శ్మశాన సమస్యపై ఇటీవల తెదేపా కార్యాలయంలో ఏర్పాటు చేసిన జన నాయకుడులో గ్రామస్థులు విన్నవించారు. స్పందించిన కుప్పం తహసీల్దారు చిట్టిబాబు 50 సెంట్ల స్థలాన్ని శ్మశానానికి కేటాయిస్తూ సోమవారం పట్టా అందించారు. సర్పంచి పార్వతమ్మ, నాయకులు శివకుమార్, గోపాల్, రవి, అక్మల్ పాల్గొన్నారు.

గుడుపల్లెలో సౌర విద్యుత్తు ఉత్పత్తి ప్రాజెక్టు

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

గుడుపల్లె, న్యూస్‌టుడే: మండలంలోని సంగనపల్లె వద్ద 5.1 మెగావాట్ల సౌర విద్యుత్తు ఉత్పత్తి ప్రాజెక్టు పనులను ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, అధికారులు సోమవారం భూమి చేసి ప్రారంభించారు. 30 ఎకరాల విస్తీర్ణంలో రూ.21కోట్ల అంచనా వ్యయంతో ప్రాజెక్టు చేపట్టనున్నట్లు ఎమ్మెల్సీ వివరించారు. ప్రాజెక్టు కోసం సహకరించి తోడ్పాటు అందించిన 24 మంది రైతులను తహసీల్దారు సీతారాం, ప్రాజెక్ట్ మేనేజరు రాంబాబు, స్థానిక నాయకుడు పీఎం.బాబు సత్కరించారు. కార్యక్రమంలో పీకేఎం ఉడా ఛైర్మన్ సురేష్‌బాబు, రెస్కో ఛైర్మన్ ప్రతాప్‌కుమార్, తితిదే పాలకవర్గ సభ్యుడు శాంతారాం మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: కుప్పం-పెద్దపర్తికుంట వరకు రూ.5.16 కోట్లతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ సోమవారం భూమి పూజ చేసి ప్రారంభించారు.

మేనేజ్‌మెంట్ ఆలోచనలపై శిక్షణ

కుప్పం గ్రామీణ: కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్‌లో ఎంబీఏ చదువుతున్న విద్యార్థులకు మేనేజ్‌మెంట్ ఆలోచనలపై శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గుల్బర్గా విశ్వేశ్వరయ్య టెక్నాలజీ యూనివర్సిటీ నుంచి వచ్చిన శంభు లింగప్ప విద్యార్థులకు పలు అంశాలను వివరించారు.

పరామర్శ.. **శాంతిపురం:** విజలాపురం కేజీబీవీ కమిటీ ఛైర్మన్ భాగ్యలక్ష్మి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. బాధిత కుటుంబాన్ని ఆర్టీసీ వైస్ ఛైర్మన్ మునిరత్నం, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, నాయకులు సోమవారం పరామర్శించారు.

బాధ్యతల స్వీకరణ

కుప్పం గ్రామీణ, న్యూస్‌టుడే: మండలంలోని చెక్కునత్తం పంచాయతీకి చెందిన మణితో పాటు కుప్పం మున్సిపాలిటీ కత్తిమానిపల్లికి చెందిన వినోద్‌లను రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్లుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు వారు సోమవారం అమరావతిలోని బీసీ సంక్షేమ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. కుప్పం నుంచి వెళ్లిన నాయకులు వారిని సత్కరించారు. **పుంగనూరు:** రాష్ట్ర మొదలియార్ వెల్‌ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్లుగా నియమితులైన పట్టణానికి చెందిన మాజీ కౌన్సిలరు శ్రీకాంత్(తెదేపా), మణికంఠ(జనసేన) సోమవారం బాధ్యతలు చేపట్టారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

శాంతిపురం: రామకుప్పం మండలం మిట్టపల్లెకు చెందిన శాంతమ్మ అనారోగ్యం బారిన పడటంతో వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయనిధి ద్వారా రూ.50వేల చెక్కును సోమవారం తెదేపా నాయకులు అందజేశారు. మండల తెదేపా కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు ఆంజనేయరెడ్డి, నరసింహులు పాల్గొన్నారు.

టచ్ టూల్ అభ్యర్థులకు శిక్షణ

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: తరగతి గదిలో విద్యార్థులకు ప్రత్యేక బోధన అందించేందుకు టచ్ టూల్ అభ్యర్థులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించినట్లు ఎంఈవోలు నటరాజరెడ్డి, రెడ్డెన్నశెట్టి తెలిపారు. స్థానిక బసవరాజ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. హెచ్ఎంలు మహేష్‌నారాయణ, రాణి ఇందిర, రెడ్డెమ్మ, మాధురి, సీఆర్పీలు పాల్గొన్నారు.

మైసూరుకు జిల్లా ఎంపీడీవోలు

పెద్దపంజాణి: మైసూరులోని అబ్దుల్ నజీర్‌సాబ్ స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ శిక్షణ కేంద్రంలో ఎంపీడీవోలకు నిర్వహిస్తున్న జాతీయస్థాయి శిక్షణ తరగతులకు జిల్లాలోని ఐదు మండలాలకు చెందిన ఎంపీడీవోలను పంపారు. పెద్దపంజాణి, గంగవరం, శాంతిపురం, వెదురుకుప్పం, చౌడేపల్లె మండలాల ఎంపీడీవోలు బాలాజీ, సురేష్, ప్రేమ్‌రాజ్‌కుమార్, పురుషోత్తం, లీలామాధవి వారం రోజుల శిక్షణ తరగతులకు హాజరయ్యారు. శిక్షణలో ప్రధానంగా పంచాయతీల బలోపేతం, ఆదాయం పెంపు, సుపరిపాలన, ఉపాధి హామీ పథకం తదితర కీలక అంశాలపై శిక్షణ ఉంటుందని అధికారులు సోమవారం తెలిపారు.

IN THE COURT OF THE CIVIL JUDGE (SR. DIVISION): PUNGANUR
I.A: NO 150 & 151/2024
O.S.No. 48/2018

పిటిషనర్: కార్పొరేషన్ బ్యాంకు ప్రస్తుతం యూనియన్ బ్యాంకులో విలీనం, పుంగనూరు శాఖ తరపున ప్రస్తుత బ్యాంకు మేనేజరు
రెస్పాండెంట్స్ : 2. శ్రీ శ్రీనివాస అగ్రికోల్డ్ స్టోరేజ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ తరపున మేనేజింగ్ డైరెక్టర్ ఆర్.రాయల్ కుమార్, తండ్రి ఆర్.క్రిష్ణయ్య శెట్టి. 3. ఆర్.దీప, భర్త ఆర్.రాయల్ కుమార్, మేనేజింగ్ డైరెక్టర్, శ్రీ శ్రీనివాస అగ్రికోల్డ్ స్టోరేజ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్
2 మరియు 3 ప్రతివాదులు హిందువులు. వ్యాపార జీవనం, పోలీసులైను వీధి, పుంగనూరు టౌన్, చిత్తూరు జిల్లా.
NOTICE TO RESPONDENTS No.2 & 3
2 మరియు 3 ప్రతివాదులగు మీకు తెలియజేయడమేమనగా బ్యాంకు వారు మీరు బాకీ పడ్డ ఋణమును వసూలు చేసుకొనుటకు పై దావాను మీపై పై కోర్టు నందు దాఖలు చేసియున్నారు. సదరు దావా 11.12.2025 తేదీన వాయిదా కలదు. పై తేదీన మీరుగాని లేక మీ న్యాయవాది ద్వారా గాని అభ్యంతరములు తెలుపుకొనినయెడల పై పిటిషన్ మీ పరోక్షముగా తీర్మానించబడును.
(By order of Court)
Sd/-
P.VIJAYA BHASKAR M.A., L.L.B.,
ADVOCATE
Gokul Street
PUNGANUR-517 247
Cell: 9440862812, 8142033567.

యూనివర్సల్ పాఠశాల విద్యార్థులు

కీలపట్ల విద్యార్థులు

పోటీ పడ్డారు.. బహుమతులు పొందారు

పలమనేరు, న్యూస్‌టుడే: పట్టణంలోని యూనివర్సల్ పాఠశాల, గంగవరం మండలం కీలపట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'విద్యార్థులపై చరవాణి ప్రభావం' అనే అంశంపై పోటీలు నిర్వహించారు. యూనివర్సల్ పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థులు భవిష్య, రక్షిత ప్రథమ, ద్వితీయ, 9వ తరగతి విద్యార్థి కిషన్ తృతీయ బహుమతులు అందుకున్నారు. ప్రధానోపాధ్యాయిని ప్రేమ బహుమతులు అందజేశారు. కీలపట్ల ప్రభుత్వ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థులు వెంకటచరణ్, మనుశ్రీ, వేదశ్రీ ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు పొందారు. ఎంఈవో వేణుగోపాలరెడ్డి బహుమతులు పంపిణీ చేశారు.

ఎస్వీయూ వాలీబాల్ జట్టు కెప్టెన్‌గా ఎంపిక

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: తిరుపతి ఎస్వీయూ వాలీబాల్ టీం కెప్టెన్‌గా బైరెడ్డిపల్లె విద్యార్థి గణేశ్ ఎంపికైనట్లు మండల వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీహరిరెడ్డి తెలిపారు. ఎస్వీయూలో డిగ్రీ(బీఏ) తృతీయ సంవత్సరం చదువుతున్న గణేశ్ వాలీబాల్ టీం కెప్టెన్‌గా ఎంపిక కావడం హర్షణీయమన్నారు.

గణేశ్

యూరియా అందక.. అగచాట్లు

యూరియా కోసం వచ్చిన రైతులు

సదుం, న్యూస్‌టుడే: మండలంలోని రైతులు ఎరువుల కోసం అగచాట్లు పడుతున్నారు. రెండు రోజుల క్రితం నడిగడ్డలోని రైతు సేవా కేంద్రానికి యూరియా బస్తాలు వచ్చాయి. అవి తీసుకున్నేందుకు నడిగడ్డ, సదుం, చెరుకువారిపల్లె, జోగివారిపల్లె పంచాయతీల నుంచి రైతులు సోమవారం వచ్చారు. ఒకేసారి నాలుగు పంచాయతీల నుంచి రావడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆయా పంచాయతీలకు సంబంధించిన రైతుసేవా కేంద్రంలోనే ఎరువులు ఇస్తే బాగుంటుందని రైతులు అభిప్రాయపడుతున్నారు.

ఆయా కేంద్రాల్లోనే ఇవ్వాలి..

ప్రతి గ్రామంలోనూ రైతు సేవా కేంద్రం ఉంది. ఆయా కేంద్రాల్లోనే ఎరువులు అందజేస్తే రవాణా ఖర్చులు తగ్గుతాయి. ఉదయం నుంచి వరసలో ఉన్నా యూరియా అందలేదు. నాతో పాటు చాలా మందికి ఎరువులు రాలేదు. అలాగే ఉలవలు వచ్చినా రైతులకు ఇవ్వడం లేదు.
- **పురుషోత్తం, వేణుగోపాలపురం**

IN THE COURT OF THE CIVIL JUDGE (SR. DIVISION): PUNGANUR
I.A: NO 152 & 153/2024
O.S.No. 53/2018

పిటిషనర్: కార్పొరేషన్ బ్యాంకు ప్రస్తుతం యూనియన్ బ్యాంకులో విలీనం, పుంగనూరు శాఖ తరపున ప్రస్తుత బ్యాంకు మేనేజరు
రెస్పాండెంట్స్ : 1. [illegible] 2. శ్రీ శ్రీనివాస అగ్రికోల్డ్ స్టోరేజ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ తరపున మేనేజింగ్ డైరెక్టర్ ఆర్.రాయల్ కుమార్, తండ్రి ఆర్.క్రిష్ణయ్య శెట్టి. 3. ఆర్.దీప, భర్త ఆర్.రాయల్ కుమార్, మేనేజింగ్ డైరెక్టర్, శ్రీ శ్రీనివాస అగ్రికోల్డ్ స్టోరేజ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్
2 మరియు 3 ప్రతివాదులు హిందువులు. వ్యాపార జీవనం, పోలీసులైను వీధి, పుంగనూరు టౌన్, చిత్తూరు జిల్లా.
NOTICE TO RESPONDENTS No.1, 2 & 3
1, 2 మరియు 3 ప్రతివాదులగు మీకు తెలియజేయడమేమనగా బ్యాంకు వారు మీరు బాకీ పడ్డ ఋణమును వసూలు చేసుకొనుటకు పై దావాను మీపై పై కోర్టు నందు దాఖలు చేసియున్నారు. సదరు దావా 11.12.2025 తేదీన వాయిదా కలదు. పై తేదీన మీరుగాని లేక మీ న్యాయవాది ద్వారా గాని అభ్యంతరములు తెలుపుకొనినయెడల పై పిటిషన్ మీ పరోక్షముగా తీర్మానించబడును.
(By order of Court)
Sd/- P.VIJAYA BHASKAR M.A., L.L.B.,
ADVOCATE
Gokul Street, PUNGANUR-517 247
Cell: 9440862812, 8142033567.

IN THE COURT OF THE CIVIL JUDGE (SR. DIVISION): PUNGANUR
I.A: NO 148 & 149/2024
O.S.No. 40/2018

పిటిషనర్: కార్పొరేషన్ బ్యాంకు ప్రస్తుతం యూనియన్ బ్యాంకులో విలీనం, పుంగనూరు శాఖ తరపున ప్రస్తుత బ్యాంకు మేనేజరు
రెస్పాండెంట్స్ : 2. శ్రీ శ్రీనివాస అగ్రికోల్డ్ స్టోరేజ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ తరపున మేనేజింగ్ డైరెక్టర్ ఆర్.రాయల్ కుమార్, తండ్రి ఆర్.క్రిష్ణయ్య శెట్టి. 3. ఆర్.దీప, భర్త ఆర్.రాయల్ కుమార్, మేనేజింగ్ డైరెక్టర్, శ్రీ శ్రీనివాస అగ్రికోల్డ్ స్టోరేజ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్
2 మరియు 3 ప్రతివాదులు హిందువులు. వ్యాపార జీవనం, పోలీసులైను వీధి, పుంగనూరు టౌన్, చిత్తూరు జిల్లా.
NOTICE TO RESPONDENTS No.2 & 3
2 మరియు 3 ప్రతివాదులగు మీకు తెలియజేయడమేమనగా బ్యాంకు వారు మీరు బాకీ పడ్డ ఋణమును వసూలు చేసుకొనుటకు పై దావాను మీపై పై కోర్టు నందు దాఖలు చేసియున్నారు. సదరు దావా 11.12.2025 తేదీన వాయిదా కలదు. పై తేదీన మీరుగాని లేక మీ న్యాయవాది ద్వారా గాని అభ్యంతరములు తెలుపుకొనినయెడల పై పిటిషన్ మీ పరోక్షముగా తీర్మానించబడును.
(By order of Court)
Sd/-
P.VIJAYA BHASKAR M.A., L.L.B.,
ADVOCATE
Gokul Street
PUNGANUR-517 247
Cell: 9440862812, 8142033567.

మణినాయుడును కలిసిన తెదేపా నాయకులు

నూతన పాలకవర్గ ఛైర్మన్‌ను కలిసిన నాయకులు

పలమనేరు, న్యూస్‌టుడే: కాణిపాకం ఆలయ పాలక మండలి ఛైర్మన్ మణినాయుడును పలమనేరు తెదేపా నాయకులు సోమవారం కలిశారు. ఇటీవల ఆయన బాధ్యతలు స్వీకరించిన సందర్భాన్ని పురస్కరించుకుని సోమవారం అభినందించారు. పూతలపట్టు ఎమ్మెల్యే మురళిమోహన్ తెదేపా నాయకులకు శాలువా కప్పి స్వాగతం పలికారు. రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్ సుబ్రహ్మణ్యంగౌడు, మైనారిటీ జిల్లా అధ్యక్షుడు ఖాజాపీర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

కల్లూరు, న్యూస్‌టుడే: దివ్యాంగులకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం కల్పిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిర్ణయం తీసుకోవడం శుభపరిణామమని జిల్లా దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు ఇర్షాద్, మండల అధ్యక్షుడు రెడ్డిశేఖర్‌నాయుడు, మండల కార్యనిర్వాహక అధ్యక్షుడు డిల్లీబాబు పేర్కొన్నారు. సోమవారం కల్లూరులో నాలుగు రోడ్ల కూడలిలో మండల దివ్యాంగుల సంఘం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. **కుప్పం పట్టణం:** కుప్పంలో తెదేపా విభిన్న ప్రతిభావంతుల సంఘం అధ్యక్షుడు మురళి స్థానిక తెదేపా కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

నూతన కార్యవర్గం

రామమూర్తి, సుదర్శనాచారి

గంగవరం, న్యూస్‌టుడే: ఎస్టీయూ మండల అధ్యక్షుడిగా రామమూర్తిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల పరిశీలకుడు మునెప్పమొదలి తెలిపారు. సోమవారం జరిగిన సమావేశంలో మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా సుదర్శనాచారి, ఆర్థిక కార్యదర్శిగా యేసురత్నం, మహిళ కన్వీనర్‌గా షెహజాదిని ఎన్నుకున్నట్లు తెలిపారు.

విద్యార్థులతో కరాటే సంఘ నాయకులు, మాస్టర్లు

విద్యార్థులకు పతకాలు

పుంగనూరు, న్యూస్‌టుడే: నంద్యాల జిల్లా బనగానపల్లెలో ఏపీ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో పుంగనూరు విద్యార్థులు ప్రతిభ కనబరచి పతకాలు కైవసం చేసుకున్నారు. పోటీల్లో సహస్ర, పవిత్ర, రిత్విక్, జుహ ఫాతిమా, తనీశ్వర్‌రెడ్డి, కార్తికేయ, నవనీష్‌రెడ్డి బంగారు పతకాలు, శ్రేష్ఠ, మోహిత్, దేవాన్ష్‌లు సిల్వర్, హిష్ను, జీవన్‌కుమార్ కాంస్య పతకాలు సాధించారని కరాటే మాస్టరు రెడ్డిమహేష్ సోమవారం తెలిపారు.

యువకుడిపై చర్యలు తీసుకోవాలి

చౌడేపల్లె, న్యూస్‌టుడే: ప్రియురాలి మరణానికి కారణమైన యువకుడిపై చర్యలు తీసుకోవాలని వాల్మీకి సంఘం మండల నాయకులు కోరారు. సోమవారం ఆ సంఘ నాయకులు స్థానిక పోలీసుస్టేషన్‌కు చేరుకుని మృతురాలి కుటుంబీకులకు మద్దతుగా అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. మిట్టపల్లెకు చెందిన గౌతమిని సోమల మండలం కందూరుకు చెందిన కార్తిక్ ప్రేమించి పెళ్లికి నిరాకరించడంతో గత నెలలో ఆత్మహత్య చేసుకుందని వారు వివరించారు. పోలీసులు తగు న్యాయం చేయాలని కోరారు.

పారిశ్రామికవాడలో చోరీ

పలమనేరు, న్యూస్‌టుడే: పట్టణ సమీపంలోని పారిశ్రామిక వాడలో మహ్మద్ ఖాజా అనే వ్యక్తికి చెందిన పేపరు ప్లేట్ల పరిశ్రమలోని విలువైన మోటార్లు, సామగ్రిని గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి చోరీ చేశారు. బాధితుడు సోమవారం గంగవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో..

సదుం, న్యూస్‌టుడే: స్థానిక సుబ్రహ్మణ్యస్వామి ఆలయ ఆవరణలోని మరకత లింగేశ్వరస్వామి ఉప ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఆలయ ట్రస్టు ఛైర్మన్ కృష్ణారెడ్డి వివరాల మేరకు.. రెండు రోజుల కిందట గుర్తు తెలియని వ్యక్తులు ఆలయ తలుపులు పగులగొట్టి లోపలికి ప్రవేశించి హుండీలోని రూ.40వేల నగదు తీసుకెళ్లారు. ఈ విషయమై పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఎస్సై షేక్‌షావలి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బంతి కొడితే విజయమే..!

✦ కడపనత్తం విద్యార్థుల ప్రతిభ ✦ జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: గెలుపే లక్ష్యంగా కడపనత్తం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు క్రీడల్లో సై అంటూ దూసుకెళ్తున్నారు. బేస్‌బాల్, సాఫ్ట్‌బాల్, వాలీబాల్, క్రికెట్ ఆటల్లో చక్కటి నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ విజయాలు సాధిస్తున్నారు. జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో విజయకేతనం ఎగురవేస్తూ ఔరా అనిపిస్తున్నారు. పలమనేరులో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీల్లో పాఠశాల విద్యార్థులు జిల్లా జట్టు తరపున అత్యుత్తమ ప్రదర్శన కనబరిచారు.

జాతీయస్థాయి క్రీడాకారుడిగా గుర్తింపు

కడపనత్తం జడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి విద్యార్థి మోహన్‌బాబు జాతీయస్థాయి క్రీడాకారుడిగా గుర్తింపు తెచ్చుకోవాలని క్రీడల్లో నిరంతర సాధన చేస్తున్నాడు. పలమనేరులో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి అండర్-14 బేస్‌బాల్ పోటీల్లో జిల్లా జట్టు తరపున పాల్గొని ప్రథమ స్థానం సాధించాడు. జాతీయస్థాయిలో బేస్‌బాల్ క్రీడాకారుడిగా రాణించడమే లక్ష్యమంటున్నాడు. - **మోహన్‌బాబు**

దేశానికి సేవ చేయాలని

పాతపేటకు చెందిన లావణ్య కడపనత్తం జడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. చదువుతో పాటు క్రీడల్లో చక్కటి ప్రతిభ ప్రదర్శిస్తోంది. బేస్‌బాల్, సాఫ్ట్‌బాల్, వాలీబాల్ పోటీల్లో సాధన చేస్తూ విజయాలు సాధిస్తోంది. ఇటీవల జరిగిన అండర్-14 రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీల్లో జిల్లా జట్టు తరపున పాల్గొని ద్వితీయ స్థానం సాధించింది. క్రీడలతో పాటు ఎన్‌సీసీ కేడెట్‌గా శిక్షణ తీసుకుంటోంది. ఆర్మీలో ఉద్యోగిగా స్థిరపడి దేశానికి సేవ చేయాలని తపన పడుతోంది. - **లావణ్య**

క్రీడా కోటాలో ప్రభుత్వ ఉద్యోగం

క్రీడా కోటాలో ప్రభుత్వ ఉద్యోగం సాధించాలన్నదే గాయతి లక్ష్యం. కడపనత్తం జడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతోంది. వెంగంవారిపల్లెకు చెందిన విద్యార్థిని కడపనత్తం జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. పలమనేరులో ఇటీవల జరిగిన అండర్-17 బేస్‌బాల్ పోటీల్లో జిల్లా జట్టు తరపున పాల్గొని ద్వితీయ స్థానం సాధించింది. - **గాయతి**

IN THE COURT OF THE CIVIL JUDGE (SR. DIVISION): PUNGANUR
I.A: NO 156 & 157/2024
O.S.No. 80/2018

పిటిషనర్: కార్పొరేషన్ బ్యాంకు ప్రస్తుతం యూనియన్ బ్యాంకులో విలీనం, పుంగనూరు శాఖ తరపున ప్రస్తుత బ్యాంకు మేనేజరు
రెస్పాండెంట్స్ : 2. శ్రీ శ్రీనివాస అగ్రికోల్డ్ స్టోరేజ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ తరపున మేనేజింగ్ డైరెక్టర్ ఆర్.రాయల్ కుమార్, తండ్రి ఆర్.క్రిష్ణయ్య శెట్టి. 3. ఆర్.దీప, భర్త ఆర్.రాయల్ కుమార్, మేనేజింగ్ డైరెక్టర్, శ్రీ శ్రీనివాస అగ్రికోల్డ్ స్టోరేజ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్
2 మరియు 3 ప్రతివాదులు హిందువులు. వ్యాపార జీవనం, పోలీసులైను వీధి, పుంగనూరు టౌన్, చిత్తూరు జిల్లా.
NOTICE TO RESPONDENTS No.2 & 3
2 మరియు 3 ప్రతివాదులగు మీకు తెలియజేయడమేమనగా బ్యాంకు వారు మీరు బాకీ పడ్డ ఋణమును వసూలు చేసుకొనుటకు పై దావాను మీపై పై కోర్టు నందు దాఖలు చేసియున్నారు. సదరు దావా 11.12.2025 తేదీన వాయిదా కలదు. పై తేదీన మీరుగాని లేక మీ న్యాయవాది ద్వారా గాని అభ్యంతరములు తెలుపుకొనినయెడల పై పిటిషన్ మీ పరోక్షముగా తీర్మానించబడును.
(By order of Court)
Sd/-
P.VIJAYA BHASKAR M.A., L.L.B.,
ADVOCATE
Gokul Street
PUNGANUR-517 247
Cell: 9440862812, 8142033567.

IN THE COURT OF THE CIVIL JUDGE [SENIOR DIVISION] AT PUNGANUR.
O.E.P.No. 13/2023 in O.S.No. 48 /2011.
M.Vasanthamma ...**Decree holder.**
Versus
Bokkasam Reddeppa [Died By L.Rs] & 4 Others ...**Judgment debtors**

AUCTION NOTICE

It is hereby notified that the under mentioned immovable properties of the J.Drs will be sold in PUBLIC AUCTION in execution of the above decree on 24-12-2025 Wednesday in between 10.30 to 5.00 PM. in the premises of the above Court, The intending bidders can participate after verifying the conditions of sale.

SCHEDULE

Chittoor District Punganur Sub-district Battamdoddi dakhala.
1. S.No. 374/3 Wet Extent Ac. 1-67 Cents full. **Bounded by: East:** Own Land of Mortgager, **West:** B. Prasad, **North:** Onimi, **South:** Own Land of Mortgager. Water Bore 1/3rd Share
D.H.R. Value: Rs.1,67,000/-
Amin Value: Rs.12,00,000-00.
2. S.No. 374/4A Dry Extent Ac. 6-38 Cents Paiki Extent Ac. 1-50 Cents. **Bounded by: East:** B.Vijayananda **West:** R.Bhaskar Reddy, **North:** B.Prasad, **South:** R.Bhaskar Reddy.
D.H.R.Value: Rs.1,50,000/-
Amin Value: Rs.10,00,000-00
J.Dr's Value for Items 1 & 2 : Nil
As per E.C. No: 65274751 Dt: 23-05-2022 for 39 years i.e., from 01-01-1983 to 22-05- 2022, there are no encumbrances at all. Hence the afore said properties will be sold free of encumbrances.
Punganur Date: 06-12-2025.
/By Order of the Court/
Sd/- D.Venkatramaiah Chetty.
Advocate for Decree holder

16 నుంచి వాడపల్లిలో ధనుర్మాసోత్సవాలు

ఆత్రేయపురం: కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 16 నుంచి ధనుర్మాసోత్సవాలు ప్రారంభించనున్నట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి సూర్యచక్రధరరావు తెలిపారు. ఆయా రోజుల్లో సుప్రభాత సేవ స్థానంలో తిరుప్పావై సేవాకాలం, ప్రతి శుక్రవారం గోదాదేవి అమ్మవారి పల్లకి ఉత్సవం నిర్వహిస్తారని చెప్పారు. ఉత్సవాల అనంతరం జనవరి 13న(భోగి రోజు) గోదారంగనాథుల కల్యాణం ఉంటుందన్నారు.

ఆధ్యాత్మిక వైభవం

నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలో వేంచేసిఉన్న కోటసత్తెమ్మ తిరునాళ్ల ఉత్సవాలు సోమవారం రాత్రి నిర్వహించిన గరగోత్సవంతో ముగిశాయి. మంత్రి కందుల దుర్గేష్‌తో పాటు అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. - న్యూస్‌టుడే, నిడదవోలు

ప్రత్యేక అలంకరణలో కోటసత్తెమ్మ

● కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాల వద్ద జనం

కోతలు.. కుంటిసాకులు

ప్రైవేట్ ఆసుపత్రుల్లో భారీగా శస్త్రచికిత్స ప్రసవాలు

న్యూస్‌టుడే, అమలాపురం కలెక్టరేట్

సుఖ ప్రసవం.. ప్రైవేటు ఆసుపత్రుల్లో వినిపించని పదంలా మారింది. కాసుల సంపాదనే లక్ష్యంగా కొందరు ఈ మార్గాన్ని ఎంచుకుంటున్నారు. సుఖప్రసవానికి అవకాశం ఉన్నా, వివిధ కారణాలు చెప్పి కత్తెరకు పని చెబుతున్నారు. అలాంటి వారికి తాఖీదులు ఇచ్చినా.. తీరులో మార్పు రాకపోవడం గమనార్హం. ఇటీవల కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి సమీక్ష సమావేశంలో పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ఈ గణాంకాలపై విస్మయం వ్యక్తం చేశారు.

అమలాపురం పట్టణం లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రి పరిధిలో గత ఏడు నెలల్లో 254 ప్రసవాలు జరగ్గా వాటిలో 198 శస్త్ర చికిత్సలే.

అమలాపురం ఏరియా ఆసుపత్రి ప్రసూతి వార్డులో బాలింతలు

సాంకేతిక కారణాలు చెప్పి..

బిడ్డ అడ్డం తిరిగినా, గర్భసంచిలో తగినంత ఉమ్మనీరు లేకపోయినా, ఇతర అత్యవసర పరిస్థితుల్లో శస్త్రచికిత్స చేసి పురుడు పోయాల్సి ఉంటుంది. సాధారణ ప్రసవానికి సులువైన మార్గం ఉన్నా.. సాంకేతిక కారణాలు సాకుగా చూపి కాసులు పోగేసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రైవేటు ఆసుపత్రుల్లో నిర్వహిస్తున్న ప్రసవాల్లో 80 శాతం వరకు శస్త్రచికిత్సలే ఉండటం గమనార్హం.

మండపేట పరిధిలోని ప్రైవేటు ఆసుపత్రిలో 182 ప్రసవాలు జరగ్గా వాటిలో 138 శస్త్రచికిత్సలే ఉన్నాయి.

పర్యవేక్షణ ఏదీ..?

అకారణంగా శస్త్ర చికిత్సలు చేస్తున్న 32 ప్రైవేటు ఆసుపత్రులకు అధికారులు నోటీసులు ఇచ్చారు. కొన్ని ఆసుపత్రుల్లో భారీగా నగదు వసూలు చేస్తున్నారు. వీరిపై వైద్యారోగ్యశాఖ అధికారుల పర్యవేక్షణ కొరవడిందనే ఆరోపణలు ఉన్నాయి. ఆసుపత్రి స్థాయిని బట్టి సాధారణ ప్రసవానికి రూ.30వేలు, శస్త్ర చికిత్సకు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు వసూలు చేస్తున్నారు.

రాజోలు నియోజకవర్గం పరిధిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో 265 ప్రసవాలు జరగ్గా అందులో 201 మందికి శస్త్రచికిత్సలు చేశారు.

ఒక్కసారి చేస్తే..

గర్భిణులకు తొలిసారి శస్త్రచికిత్స చేస్తే తర్వాత ఎన్నిసార్లయినా ఈ విధానాన్నే అనుసరించాలి. మూడో కాన్పు వరకు వేచి ఉండి, మళ్లీ శస్త్ర చికిత్స చేస్తే ఆరోగ్యంపై ప్రభావం చూపే ప్రమాదం ఉందని వైద్యులు చెబుతున్నారు.

ఈ ఏడాది ఏప్రిల్ – నవంబరు మధ్య

ఆసుపత్రి	ప్రసవాలు	సాధారణ	శస్త్రచికిత్స
ప్రభుత్వ	2,610	1,163	1,447
ప్రైవేటు	6,462	1,889	4,573

వారికి తాఖీదులు ఇస్తున్నాం

శస్త్రచికిత్సలు అధికంగా చేస్తున్న ప్రైవేటు ఆసుపత్రులను గుర్తించి నోటీసులు ఇస్తున్నాం. ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాలకు సంబంధించి అన్ని సౌకర్యాలు ఉన్నాయి. ప్రజలు వాటిని వినియోగించుకోవాలి. -దుర్గారావు దొర, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి

జిల్లాలో ఇలా... ☛ నమోదైన ప్రసూతి ఆసుపత్రులు: 66 ☛ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు: 54 ☛ సీహెచ్‌సీలు: 9 ☛ ప్రాంతీయ ఆసుపత్రులు: 2 ☛ ఏటా ప్రసవాలు: 28 వేలు

మకరందం విందు.. భలే పసందు

సన్‌బర్డ్.. కోనసీమ ప్రాంతంలో కనిపించే అందమైన పక్షి. ఇళ్ల వద్ద తోటలు, పూల మొక్కలు ఉన్న ప్రదేశాల్లో ఎక్కువగా కనిపిస్తుంది. ఇది పుష్పాల్లోని మకరందం తాగేందుకు ఇష్టపడుతుంది. దానికి అనుగుణంగా ముక్కు పొడవుగా సూదిగా ఉంటుంది. చిన్న పురుగులు, సాలీడు వంటి వాటినీ తింటుంది. పూల దగ్గర మకరందం తాగే సమయంలో పతంగుల్లా గాల్లో తేలుతూ నిలబడతాయి. కోనసీమలో పూల మొక్కలు ఎక్కువగా ఉండటం వల్ల ఇక్కడ వీటి ఉనికి ఎక్కువగా ఉంటుంది. సోమవారం అయినవిల్లి మండలం నేదునూరులో ఇలా కనిపించింది. -న్యూస్‌టుడే, కోనసీమ

రాజీ మార్గం.. సత్వర ఉపశమనం

న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం

ప్రజలకు న్యాయ సేవలు సులభంగా అందించేందుకు ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపడుతోంది. అందులో ప్రధానమైనవి రాజీమార్గం ద్వారా కేసులు పరిష్కరించుకునేందుకు నిర్వహించే లోక్‌అదాలత్‌లు. మూడు నెలలకు ఒకసారి చొప్పున ఏడాదికి నాలుగుసార్లు ఆ నెలలో రెండో శనివారం నిర్వహిస్తారు. ఈ నెల 13న అమలాపురం కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించనున్నారు. అమలాపురం మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా రెండో అదనపు న్యాయమూర్తి పి.గోవర్ధన్ పర్యవేక్షణలో నిర్వహించే ఈ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించేలా అవగాహన కల్పిస్తున్నారు.

ఈ నెల 13న జాతీయ లోక్‌అదాలత్

▮ ఎలాంటి కేసులు: కొట్లాటలు, వేధింపులు, జూదం, రోడ్డు ప్రమాదాలు, బీమా పరిహారం, భార్యాభర్తల గొడవలు, కుటుంబ వివాదాలు, భూ తగాదాలు, సివిల్ వివాదాలు, కార్మిక, పారిశ్రామిక యాజమాన్య వివాదాలు, న్యూసెన్స్ కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్ తదితర కేసులు పరిష్కరించుకోవచ్చు.

ఉపయోగించుకోవాలి..

కేసులను సులువుగా పరిష్కరించుకోవడానికి లోక్‌అదాలత్ ఎంతో ఉపయోగపడుతుంది. కక్షిదారుల సమయంతో పాటు సొమ్ము ఆదా అవుతుంది. సామరస్య ధోరణి అవలంబిస్తే కేసుల నుంచి విముక్తి లభించి ఉపశమనం కలుగుతుంది. మండల న్యాయ అధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సులు నిర్వహిస్తున్నాం. కక్షిదారులు వినియోగించుకోవాలి.

-పి.గోవర్ధన్, జిల్లా రెండో అదనపు న్యాయమూర్తి, లోక్ అదాలత్ ఛైర్మన్

సెలవుల్లోనూ మధ్యాహ్న భోజనం

100 రోజుల కార్యాచరణలో భాగంగా పది విద్యార్థులకు అమలు

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: పదో తరగతి పరీక్షలకు విద్యార్థులు పూర్తి స్థాయిలో సన్నద్ధమయ్యేలా విద్యాశాఖ వంద రోజుల ప్రణాళిక అమలు చేస్తోంది. ఈ నెల ఆరో తేదీ నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమం ప్రకారం.. వచ్చే ఏడాది మార్చి 15 వరకు విద్యార్థులకు సెలవులు ఉండవు. ఈ నేపథ్యంలో సెలవు రోజుల్లో పాఠశాలలకు వచ్చేవారికి మధ్యాహ్న భోజనం వడ్డించనున్నారు.

విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డింపు

9 నుంచి ఒంటి గంట వరకు..

వందరోజుల ప్రణాళికలో భాగంగా రోజూ ఉదయం 8 గంటల నుంచి 9 వరకు, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు అదనపు తరగతులు నిర్వహిస్తున్నారు. ఆదివారం, ఇతర సెలవు రోజుల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంటల వరకు రెండు సబ్జెక్టులపై అదనపు తరగతులు నిర్వహించాలి. అనంతరం మధ్యాహ్న భోజనం పెట్టి ఇళ్లకు పంపించాలి.

పదో తరగతి విద్యార్థులు ఇలా..

యాజమాన్యం	పాఠశాలలు	విద్యార్థులు
ప్రభుత్వ	08	409
జడ్పీ ఉన్నత	210	10,957
మున్సిపల్	10	721
గురుకుల	06	422
బీసీ వెల్ఫేర్	02	95
ఎయిడెడ్	04	112
మొత్తం	240	12,716

3 రోజులు మాత్రమే..

వంద రోజుల ప్రణాళిక అమలు సమయంలో ఆదివారం, క్రిస్మస్ తదితర సెలవులు 14 రాగా.. సంక్రాంతి సెలవులు 9 ఉన్నాయి. పదోతరగతి విద్యార్థులకు సంక్రాంతి మూడు రోజులు మినహా మిగిలిన రోజుల్లో అదనపు తరగతులు నిర్వహించనున్నారు. ఇలా 20 రోజుల పాటు మధ్యాహ్న భోజనం అమలు కానుంది. దీనిపై డీఈవో షేక్ సలీం బాషా మాట్లాడుతూ.. ఈ నెల 7వ తేదీ ఆదివారం నుంచే ఈ కార్యక్రమం ప్రారంభమైందన్నారు.

ధాన్యం కుచ్చు.. పక్షులు మెచ్చు

పక్షి ప్రేమికులను ఈ వరిధాన్యం కుచ్చులు ఆకర్షిస్తున్నాయి. ముక్కామల పెట్రోలు బంకు సమీపంలో సోమవారం అయినవిల్లి మండలం నేదునూరుకు చెందిన బొక్కా వెంకటేశ్వరరావు, లక్ష్మణరావు వీటిని విక్రయిస్తున్నారు. పరిమాణాన్ని బట్టి రూ.100 నుంచి రూ.400 వరకు విక్రయిస్తున్నట్లు 'న్యూస్‌టుడే'కు తెలిపారు. పలువురు కొనుగోలు చేసి తీసుకెళుతున్నారు. - న్యూస్‌టుడే, అంబాజీపేట

క్వాయర్ పరిశ్రమల స్థాపనకు కృషి

అమలాపురం కలెక్టరేట్: జిల్లాలో తమిళనాడు తరహాలో క్వాయర్ పరిశ్రమల స్థాపనకు అంచనాలు రూపొందించాలని కలెక్టర్ మహేశ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో క్వాయర్ బోర్డు, ఉద్యాన శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో కొబ్బరి పంట ఆశించిన స్థాయిలో ఉంటుందని, కేవలం కొబ్బరి కాయల ద్వారానే కాకుండా, ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలు అన్వేషించాలని తెలిపారు. కార్యక్రమంలో జేసీ నిశాంతి, ఉద్యాన శాఖ అధికారి రమణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రైతేరాజు
అన్నదాతకు అండగా నిలిచేందుకు విభిన్న కథనాల సమాహారం -6లో

వృద్ధురాలి సమస్య వింటున్న కలెక్టర్

ప్రతి అర్జీకి పరిష్కారం

అమలాపురం కలెక్టరేట్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో ఇస్తున్న ప్రతి అర్జీకి శాశ్వత పరిష్కారం చూపాలని కలెక్టర్ మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్ కార్యక్రమంలో భాగంగా జేసీ నిశాంతి, ఇతర అధికారులతో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఒకే సమస్యపై వినతులు పునరావృతం కాకుండా చూడాలన్నారు. 265 వినతులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

బాల తిరుపతి.. భక్తులకేదీ వసతి

స్నానాలరేవుకు వెళ్లే మార్గంలో ఆక్రమణలు

న్యూస్‌టుడే, మామిడికుదురు

బాలతిరుపతిగా పేరొందిన అప్పనపల్లి బాలబాలాజీ ఆలయంలో ఏటేటా పెరుగుతున్న భక్తులకు అనుగుణంగా సౌకర్యాలు కానరావడం లేదు. అరకొర వసతులతోనే నెట్టుకొస్తున్నారు. గోదావరి పుష్కరాల నేపథ్యంలో ఇక్కడ అవసరమైన కార్యాచరణ చేపట్టాల్సిన అవసరం ఉందని భక్తులు విన్నవిస్తున్నారు.

ఆదాయ వ్యయాలు (రూ.లలో)

సంవత్సరం	ఆదాయం	వ్యయం
2022–23	5,74,77,460	5,69,99,500
2023–24	5,51,36,249	5,00,35,451
2024–25	5,22,65,948	4,83,67,122

నిత్యం వేలాది మంది..

స్వామివారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి నిత్యం 4-8 వేల మంది భక్తులు వస్తుంటారు. శని, ఆదివారాలతో పాటు పర్వదినాలు, శ్రావణ, కార్తిక మాసాల్లో ఈ సంఖ్య రెండు రెట్లు అదనంగా ఉంటుంది. ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు నిరంతరాయంగా అన్నదానం నిర్వహిస్తారు. ప్రస్తుతం 250 మందికి సరిపడే భోజన వసతి భవనం శిథిల స్థితికి చేరుకుంది. 2 వేల మంది కూర్చుని భోజనాలు చేసేలా భవనం నిర్మించాల్సి ఉంది.

సమస్యలు ఇలా..

◆ వంటశాలలో అధునాతన ఆవిరి యంత్ర పరికరాలను ఏర్పాటు చేయకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రస్తుతం జీడిపిక్కల పొట్టు పొయ్యినే ఉపయోగిస్తున్నారు. ◆ భోజనశాల పైభాగంలో ఉన్న కల్యాణ మండపం పెచ్చులు ఊడుతోంది. పెళ్లిళ్లు చేసుకునేందుకు వచ్చే వారంతా ప్రయాస పడుతున్నారు. ◆ కేశఖండన శాల దూరంగా ఉంది.

ఆక్రమణలతో చిక్కి..

స్థానిక కూడలి నుంచి స్నాన ఘట్టం వరకు 450 మీటర్ల మేర రహదారికి ఆక్రమణలు ఇబ్బందికరంగా మారాయి. ఇరువైపులా దుకాణాలు, ఇళ్లు ఉండటంతో భక్తులు అసహనానికి గురవుతున్నారు. వైనతేయ నదీ తీరంలోని స్నానఘట్టం మెట్లు విరిగి, రక్షణ కవచం దెబ్బతింది. దీనిని మరో 30 మీటర్ల మేర ఉత్తర దిశగా విస్తరించాలి. ఇక్కడ మరుగుదొడ్లు, దుస్తులు మార్చుకునేందుకు, సామగ్రి భద్రపరచుకునేందుకు గదులు, రేవులో పిండప్రదానాలకు షెడ్లు నిర్మించాలి.

ప్రతిపాదనలు పంపించాం

భక్తుల సౌకర్యార్థం రూ.5 కోట్లు వ్యయమవుతాయని ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైతే వసతులు సాకారమవుతాయి. పుష్కరాల్లో రోజుకు 50-60 వేల మంది వస్తారని అంచనా. - ఎం.సత్యనారాయణరాజు, ఏసీ, అప్పనపల్లి దేవస్థానం

నాణ్యత మమ.. బిల్లు జమ

☛ ఓదూరు కాలువ పనుల వ్యవహారం

☛ ఏడుగురు ఇంజినీర్లపై అభియోగాల నమోదు

ఈనాడు, అమలాపురం: రామచంద్రపురం మండలం ఓదూరులో ఆరేళ్ల క్రితం చేపట్టిన అభివృద్ధి పనుల్లో డొల్లతనానికి సంబంధించి ఎట్టకేలకు ఉచ్చు బిగుసుకుంటుంది. సంబంధిత అధికారులపై రేపోమాపో చర్యలు తీసుకోబోతున్నారు. ఇక్కడ సుమారు రూ.7 కోట్ల అంచనా వ్యయంతో పంట, మురుగు కాలువల మధ్య నాడు రక్షణ గోడ నిర్మించారు. నాణ్యతకు తిలోదకాలిచ్చినా జలవనరులశాఖ ఇంజినీరింగ్ అధికారులు గుడ్డిగా బిల్లులు చేసేశారు. ఫిర్యాదులందడంతో 2023లో విజిలెన్స్ విచారణ సాగింది. ధవళేశ్వరం, కాకినాడలోని నాణ్యత విభాగం నుంచి రికార్డులు తెచ్చి పరిశీలించారు. గోడ నమూనాలు తీసుకుని విశాఖలోని ఎన్ఏబీఎల్ అక్రిడేషన్ ల్యాబ్‌లో పరీక్షించగా నాణ్యత తీసికట్టుగా తేలింది. అప్పట్లో వివిధ హోదాల్లో పనిచేసిన డీఈఈలు తూరంగి శ్రీనివాస్, వీవీ సత్యనారాయణ మట్టపర్తి, జగం సురేష్‌బాబు, ఈఈలు బీవీవీ గోపాలరాజు, పీలా అప్పలనాయుడు, ఏఈఈలు గొంప ప్రవీణ్ యాదవ్, బొల్లింకల అప్పలరాజురెడ్డిని బాధ్యులుగా గుర్తించి అభియోగాలు నమోదుచేశారు. వీరిలో గోపాలరాజు గతంలో ఉద్యోగవిరమణ చేశారు. శాఖాపరమైన విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాల్సిందిగా ఆ శాఖ ముఖ్యకార్యదర్శి సాయిప్రసాద్ తాజాగా ఉత్తర్వులు జారీచేశారు.

ఇవీ లోపాలు

❖ రక్షణ గోడ పునాది లోతు తక్కువ. ❖ నాసిరకం ఇసుక, సిమెంటు.. సామర్థ్యం తక్కువున్న ఐరన్ ఊచల వినియోగం ❖ గోడ ఎం20 గ్రేడ్ నాణ్యత ఉండాలి. పరీక్షించినపుడు ఎం10 గ్రేడ్ కూడా రాలేదు. ❖ గోడ ఎడమ భాగంలో చ.మి.మీటరుపై 15 న్యూటన్ బలం తట్టుకునేలా ఉండాలి. ఆ సామర్థ్యం 6.10 గాను, పైభాగంలో 5.8 గా నమోదైంది. ❖ నాణ్యత లోపం విలువ రూ.కోటి ఉంటుందని అంచనా వేసిన విజిలెన్స్.. రికవరీ చేయాల్సిన అవసరం ఉందని పేర్కొంది.

మునగ @25

మార్కెట్‌లో మునగకాయల ధర మండిపోతోంది. కార్తిక మాసం వెళ్లినప్పటి నుంచి స్థానికంగా వీటి దిగుబడి పడిపోయింది. చెన్నై తదితర దూర ప్రాంతాల నుంచి తీసుకొచ్చి వ్యాపారులు విక్రయిస్తున్నారు. కార్తికంలో కిలో కాయలు రూ.100 ఉండేది. ఒకటి రూ.10కు లభించేది. ప్రస్తుతం దిగుబడి గణనీయంగా పడిపోవడంతో మార్కెట్‌లో గత పదిహేను రోజులుగా ఒకకాడ రూ.25 నుంచి రూ.30 వరకు పలుకుతోంది. చిన్నగా ఉంటే రూ.20 చొప్పున విక్రయిస్తున్నారు. కొంతమంది టోకు వ్యాపారులు విక్రయాలు మానుకున్నారు. అమ్మకం లేకపోతే నష్టం వస్తుందని, అందుకే తేవడం తగ్గించేశామని పి.గన్నవరం గ్రామానికి చెందిన వ్యాపారి అడ్డగళ్ల పవన్ తెలిపారు.

- న్యూస్‌టుడే, పి.గన్నవరం

మాట.. ఆట.. మనవిగా ఉండాలి

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

ఈనాడు, రాజమహేంద్రవరం, న్యూస్‌టుడే, రాజానగరం: "దైనందిన జీవితంలో మాతృభాష భాగమవ్వాలి. పరాయి భాషను విడనాడాలి. అమ్మభాష నేర్చుకున్నాకే సోదర, అన్యభాషలపై దృష్టి పెట్టాలి" అని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు సూచించారు. సోమవారం నన్నయ విశ్వ విద్యాలయంలో ఉపకులపతి డా.ఎస్.ప్రసన్నశ్రీ అధ్యక్షతన నిర్వహించిన 'భారతీయ భాషల్లో ఏకరూప శాస్త్రీయ సాంకేతిక పదజాలం' కార్యశాలలో ఆయన మాట్లాడారు. సంప్రదాయాలు పాటించాలని.. మన కట్టు.. బొట్టు.. మాట.. ఆట.. పాట.. భాష.. యాస.. గోస అన్నీ మనవిగా ఉండాలన్నారు. ఆంగ్లం స్థానంలో అనేక నూతన భారతీయ భాషా పదాల సృష్టికి ఈ కార్యక్రమం ఊతమివ్వాలన్నారు. భాష ఔన్నత్యం, కవులపై తానా మాజీ అధ్యక్షులు, సాహితీ సమితి అధ్యక్షులు తోటకూర ప్రసాద్ వివరించారు.

స్టాల్‌ను తిలకిస్తున్న వెంకయ్యనాయుడు

సాంకేతిక పదజాలం మాతృభాషలోకి..

ప్రాంతీయ భాషలు సాంకేతికంగా సుసంపన్నమైనపుడే గ్రామీణ విద్యార్థులు మాతృభాషలో ఏఐ (కృత్రిమమేధ), ఎంఎల్ (మెషిన్ లెర్నింగ్, మరప్రజ్ఞ/యంత్రాభ్యాసం)పై పట్టు సాధిస్తారని తెలుగు సంస్కృత అకాడమీ అధ్యక్షుడు ఆర్.డి.విల్సన్ అన్నారు. వీసీ ఎస్.ప్రసన్నశ్రీ మాట్లాడుతూ భాష ఒక నిత్య ప్రవాహిని అన్నారు. తరాలతో పాటు కాలానుగుణంగా మారుతూ ముందుకు సాగుతోందన్నారు. భారతీయ భాషా సమితి అకడమిక్స్ సమన్వయకులు కె.గిరిధరరావు, తెలుగుశాఖ సహాయ అధ్యాపకులు తలారి వాసు పాల్గొన్నారు.

బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బండారు, ఆర్డీవో తదితరులు

11 నుంచి సంక్రాంతి పడవ పోటీలు

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: జనవరి 11 నుంచి 13 వరకు జాతీయ స్థాయిలో నిర్వహించనున్న సర్ ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోఫీ సంక్రాంతి సంబరాలను జయప్రదం చేయాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ఆర్డీవో పి.శ్రీకర్ కోరారు. సోమవారం లొల్ల లాకుల వద్ద ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. పడవలు, ఈత, గాలిపటాలు, ముగ్గుల పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఈ సంవత్సరం కేరళ జట్లు పాల్గొంటాయన్నారు. ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన వారికి రూ.2 లక్షలు, రూ.లక్ష చొప్పున అందించనున్నట్లు చెప్పారు. డీఎస్పీ సుంకర మురళీమోహన్, ఇరిగేషన్, హెడ్‌వర్క్స్ ఈఈలు వెంకటేశ్వరరావు, శ్రీనివాస్, ఆర్టీసీ డీఎం కుమార్, ఆర్అండ్‌బీ డీఈ రాజేంద్ర, సీఐ విద్యాసాగర్ పాల్గొన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97607
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80082 34669

విద్యుత్తు సేవలకూ.. ఓ గడువుంది..!

న్యూస్‌టుడే, అమలాపురం గ్రామీణం

విద్యుత్తు వినియోగదారులకు సకాలంలో సేవలు అందేలా చూసేందుకు ఒక్కో పనికి ఒక్కో గడువు విధించారు. ఆ లోగా సంబంధిత అధికారులు సమస్యను పరిష్కరించాలి. ఈ మేరకు పౌర సేవల సమయపాలన పట్టిక ఏర్పాటు చేశారు. అందులోని గడువు ప్రకారం సేవలు అందించాల్సి ఉంది. లేకుంటే సదరు వినియోగదారుడికి పరిహారం చెల్లించవలసి ఉంటుంది. సేవలను బట్టి రోజుకు రూ.100 నుంచి రూ.500 వరకు పరిహారం పొందొచ్చు.

గడువు (గంటల్లో)	పట్టణాల్లో	గ్రామాల్లో
సాధారణ ఫ్యూజ్ ఆఫ్ కాల్స్	4	12
ఓవర్ హెడ్ లైన్ బ్రేక్ డౌన్	6	24
ట్రాన్స్‌ఫార్మర్ వైఫల్యం	24	48
మీటరు ఫిర్యాదులు (రోజులు)	7	15

ఏ సేవకు ఎన్ని రోజుల్లో పరిష్కారం

కొత్త కనెక్షన్	3
కాలిపోయిన మీటరు మార్పిడి	7
వినియోగదారుడి కారణంగా మీటరు కాలిపోతే	7
విద్యుత్తు సరఫరా (ఎల్‌టీ)	7
11 కేవీ నుంచి..	15
33 కేవీ నుంచి..	30
అదనపు హెచ్‌టీసీ	45
యాజమాన్యం హక్కు బదిలీ	7
కేటగిరీ మార్పు	7
ఎల్‌టీ 1 ఫేజ్ నుంచి 3 ఫేజ్	30
ఎల్‌టీ నుంచి హెచ్‌టీకి	60

పలు రైళ్లు రద్దు

సాంబమూర్తినగర్(కాకినాడ): నిర్వహణ పనులతో పలు రైళ్లు రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25న కాకినాడ టౌన్ - చర్లపల్లి (07155), 26న చర్లపల్లి - కాకినాడ టౌన్ (07156), హైదరాబాద్ - కాకినాడ టౌన్ (07157), 27న కాకినాడ టౌన్ - హైదరాబాదు (07158) రైళ్లు రద్దయ్యాయని వెల్లడించారు.



(c) eenadu

ఈనాడు కథనాలకు స్పందన

విద్యార్థుల వెతలు తీరాయి

అంబాజీపేట మండలం గంగలకుర్రు పంచాయతీ పరిధి గుంటమామిడిదొడ్డి ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు మరుగుదొడ్లు లేక నానా ఇబ్బందులు చవిచూశారు. వీరి బాధలపై ఈ ఏడాది ఆగస్టు 26న '75 మందికి ఇదే మరుగుదొడ్డి', సెప్టెంబర్ 2న 'అత్యవసరమా.. ఉగ్గబెట్టుకోవాల్సిందే' శీర్షికలతో చిత్ర కథనాలు ప్రచురితమయ్యాయి. స్పందించిన పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ రూ.2 లక్షలతో మరుగుదొడ్లతో పాటు స్థానికంగా ఉన్న పాఠశాల భవనాన్ని ఆధునికీకరించారు. దీంతో విద్యార్థుల ఇక్కట్లు తీరాయి. - న్యూస్‌టుడే, అంబాజీపేట

రహదారి మరమ్మతుకు నిధులు

రాజమహేంద్రవరం, నిడదవోలు, కొవ్వూరు వంటి పట్టణాలకు వెళ్లే అమలాపురం, బొబ్బర్లంక కీలక ఆర్‌అండ్‌బీ రాష్ట్రీయ రహదారి అభివృద్ధికి నోచుకోడం లేదు. గుంతలు ఏర్పడి ప్రయాణం కష్టంగా మారుతోందని, ఈ మార్గంలోనే వాడపల్లి ఆలయానికి చేరుకోవాలంటూ సోమవారం 'నిధుల జాడేదీ.. విస్తరణకు దారేదీ?' శీర్షికన వెలువడిన కథనానికి ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ఆర్‌అండ్‌బీ డీఈ రాజేంద్ర స్పందించారు. రూ.70 లక్షలతో మరమ్మతులు చేయించేందుకు చర్యలు తీసుకున్నారు.- న్యూస్‌టుడే, ఆత్రేయపురం

'ఇండిగో' వ్యవహారంలో పరువు తీశారు: బొత్స

రావులపాలెం పట్టణం, న్యూస్‌టుడే: ఇండిగో సంక్షోభంతో ప్రపంచంలో దేశం, రాష్ట్రం పరువు పోయిందని మాజీ మంత్రి, వైకాపా నేత బొత్స సత్యనారాయణ వాపోయారు. రావులపాలెంలో సోమవారం జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి అధ్యక్షతన జిల్లా సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. అనంతరం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. ఇండిగో సంక్షోభానికి ప్రభుత్వం, ఆ శాఖ వైఫల్యమే కారణమన్నారు. ఇది ప్రజల భద్రతకు సంబంధించిన విషయమన్నారు. సంక్షోభం వచ్చిన వెంటనే అధికారులు, ఆ సంస్థ సిబ్బంది కూర్చుని చర్చించి నిర్ణయం తీసుకోవడం మానేసి వీటికి సంబంధం లేని వ్యక్తులు, లోకేశ్ చూస్తున్నారని ప్రకటనలు చేయడం ఎందుకని ప్రశ్నించారు. బీసీఏ కొన్ని నిబంధనలు ఇచ్చిందని, ఈ నెల 1 నుంచి అమలు చేయాలని చెప్పిందన్నారు. సదరు సంస్థ దీనికి అంగీకరించలేదన్నారు. ప్రజల ప్రాణాలను గాలిలో పెట్టి ఇటువంటి పనులు చేయడం ఏమిటన్నారు. ఇటువంటి నిర్ణయాలు తీసుకునే ముందే ఒకసారి కూర్చుని చర్చించి క్షుణ్ణంగా పరిశీలించుకుని అప్పుడు అమలు చేస్తే ప్రజలు ఎటువంటి భయం లేకుండా విమానం ఎక్కుతారన్నారు. మన రాష్ట్రానికి చెందిన వ్యక్తి పౌరవిమానయాన శాఖ మంత్రి కావడం, ఆ చెడ్డ పేరు మనకు రావడం బాధ అనిపిస్తుందన్నారు. రాష్ట్రంలో వైద్య కళాశాలలను ప్రైవేటు పరం చేయడం దురదృష్టకరమన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న బొత్స సత్యనారాయణ, చిత్రంలో జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డి తదితరులు

GOVERNMENT OF PUDUCHERRY
PUBLIC WORKS DEPARTMENT - P.W.D., YANAM

No.707/PW/EE/DB/YNM/2025-26 Dated:08-12-2025

PRESS NOTICE FOR e-Tender

On behalf of the President of India, tenders are invited through e-Tendering by the Executive Engineer, Yanam Division, Public Works Department, Yanam for the following works from the eligible contractors/firms. Contractors other than those registered with P.W.D., Puducherry should produce documentary evidence in support of their having satisfactorily completed three similar works each of 40% of estimate cost put to tender or two works each of 60% of estimate cost put to tender or one work of 80% of estimate cost put to tender in the last seven years ending previous day of last date of submission of tenders. (Similar work means execution of "Civil Works"). The value of executed works shall be brought to current costing level by enhancing the actual value of work at simple rate of 7% per annum; calculated from the date of completion to last date of receipt of applications for tenders. The contractor after purchasing the valid key and Digital signature Certificate can only be able to download the Press Notice, Notice Inviting Tender and other related documents and upload the bid document online by verifying the Tender Number assigned for each work from www.pudutenders.gov.in

Sl. No.	Tender No	Name of Work	Approximate Estimated Cost (₹)	Earnest Money Deposit (₹)	Eligibility of contractors	Time allowed	Cost of Tender Schedule (₹)
(1)	(2)	(3)	(4)	(5)	(6)	(7)	(8)
1	87/EEY 2025-26	Improvements and upgradation of existing OPD block Government General Hospital, Yanam	35,52,300/- (inclusive of GST)	71,046/-	Class IV and above	3 (Three Months)	500 + (5% GST)
2	88/EEY 2025-26	Providing drinking water supply lines in GMC Balayogi colony adjacent to Panchala street in Yanam	25,87,700/- (inclusive of GST)	51,754/-	Class IV and above	3 (Three Months)	500 + (5% GST)
3	89/EEY 2025-26	Augmentation to the pipeline in Savithri Nagar new colony in Yanam	25,40,718/- (inclusive of GST)	50,814/-	Class IV and above	3 (Three Months)	500 + (5% GST)
4	90/EEY 2025-26	Improvements and repairs to Sri Raksha Hari Krishna Govt. Junior College, Guerinpeta, Yanam	19,76,634/- (inclusive of GST)	39,533/-	Class IV and above	3 (Three Months)	500 + (5% GST)
5	91/EEY 2025-26	Improvements to S.T.P.P. Govt. Junior College, Yanam	14,77,693/- (inclusive of GST)	29,554/-	Class IV and above	3 (Three Months)	500 + (5% GST)
6	92/EEY 2025-26	Balance improvements to Subramania Bharati Govt. Primary School, Savithri Nagar, Yanam	11,01,845/- (inclusive of GST)	22,037/-	Class IV and above	3 (Three Months)	500 + (5% GST)
7	93/EEY/ 2025-26	Annual Maintenance to 4.00 MLD Water treatment plant in Town water works for the Year 2025-26 in Yanam- Supply of Alumino (Ferric Alum) (Fifth Revision) Grade-4 BIS Approved Company.	9,49,500/- (inclusive of GST)	18,990/-	Class-V and above (or) Authorized Firms/ Distributors	2(Two Months)	500 + (5% GST)
8	94/EEY 2025-26	Shifting of Chlorine Gas chamber from existing location to a new location adjacent to waste water drain in 2.00 MLD water treatment plant at Kanakalapeta Water Works in Yanam	6,81,230/- (inclusive of GST)	13,625/-	Class V and above	3 (Three Months)	500 + (5% GST)
9	95/EEY 2025-26	Balance improvements to Mother Teresa Govt. Primary school, Mettacuru, Yanam	4,66,635/- (inclusive of GST)	9,333/-	Class V and above	3 (Three Months)	500 + (5% GST)
10	96/EEY 2025-26	Improvements and facelift to Dr. B.R. Ambedkar Govt. High School, Farampeta, Yanam	3,89,318/- (inclusive of GST)	7,786/-	Class V and above	3 (Three Months)	500 + (5% GST)
11	97/EEY 2025-26	Facelift to the Dr. B.R.Ambedkar Govt. Primary School, Farampeta, Yanam	3,15,232/- (inclusive of GST)	6,305/-	Class V and above	3 (Three Months)	500 + (5% GST)
12	98/EEY 2025-26	Urgent repairs to the Flood sluices in Dariyalathippa area in Yanam (3rd call)	2,52,412/- (inclusive of GST)	5,048/-	Class V and above	3 (Three Months)	500 + (5% GST)

(i)	Availability of NIT in website.	From 4.00 P.M	on	10-12-2025
(ii)	Closing date & time for Sale of tender / download and submission of Tenders online	4.00 P.M	on	17-12-2025
(iii)	Date & Time of opening of tenders	10.00 A.M	on	18-12-2025

Note: 1) The intending bidder must read the terms and conditions of FORM-6 carefully. He should only submit his bid if he considers himself eligible and he is in possession of all the documents required.

2) Information and Instructions for bidders posted on website shall form part of bid document.

3) The bid document consisting of plans, specifications, the schedule of quantities of various types of items to be executed and the set of terms and conditions of the contract to be complied with and other necessary documents can be seen and downloaded from website www.pudutenders.gov.in at free of cost.

4) Tenders shall be accompanied with e-tender processing fee & Earnest money which shall be payable using payment e-gateway of ICICI Bank through internet banking or DIRECT DEBIT/RTGS/NEFT/RTGS mode through online drawn in favour of the Executive Engineer, Yanam Division, Public Works Department, Yanam for which necessary challan will be available in the website.

List of Documents to be scanned and uploaded within the period of bid submission: MANDATORY DOCUMENTS

1) The e-tender processing fee & EMD should be deposited only through NEFT/ RTGS/Direct Debit mode available in the website. The e-tender processing fee & EMD should be drawn in favour of the Executive Engineer, Yanam Division, Public Works Department, Yanam.

2) All contractors should upload PWD/ CPWD/ MES/ Railways/ TWAD/ Any State PWD Registration Certificate / Enlistment Order of the appropriate class.

3) Certificate of Registration for GST, and Acknowledgement of up to date filed return of GST, if already obtained by the bidder.

4) If the bidder has not obtained GST registration as applicable, then he shall scan and upload following undertaking along with the bid document "If work is awarded to me, I/we shall obtain GST registration certificate, as applicable, within one month from date of receipt of award letter or before release of any payment whichever is earlier, failing which I/we shall be responsible for delay in payments which will be due towards me/us on account of the work executed and/or for any action taken by PWD or GST department in this regard."

5) Contractors / Firms other than those registered with PWD, Puducherry shall upload the Form "C" that the statement of detail of completed works as per the eligibility criteria specified in the NIT. Necessary Attested copies of the Work Order, final completion certificate from the client for the said work(s) in Form "C" have to be attached.

6) In respect of collection of affidavit for "Form 'J' for blacklisting, the affidavit may be collected on only from the contractors who have not enlisted in PWD, Puducherry on Non-Judicial Stamp Paper of Rs.100/- duly signed by the authorized person of agency/firm vide Corrigendum No.2805/PW/CE/EE(P)-3/F.Tech-Cir/Vol.V/2024-25 dated 06-01-2025.

7) In respect of collection of affidavit for 'Form 'G' for no back to back execution of work, the affidavit may be collected from the L1 contractor before issue of work order on Non-Judicial Stamp Paper of Rs.100/- duly signed by the authorized person of agency/firm vide Corrigendum No.2805/PW/CE/EE(P)-3/F.Tech-Cir/Vol.V/2024-25 dated 06-01-2025.

8) Declaration about site inspection.

9) All contractors should upload the scanned of

Note:-
All the above documents must be clearly displayed and seen by the tender opening authority before opening the actual bid.

All the bidders should submit the original documents uploaded for the above work after opening of the tender on the Same/Next day for verification.

Document to be submitted after acceptance:-

i) Licenses / Registrations or proof of applying for Labour licenses, registration with EPFO, ESIC & BOCW welfare Board.

ii) Willingness certificate from concerned competent electrical contractor if required.

Availability of Form 7/8 in PWD website

The General Conditions of Contract for PWD Works 2014 (Form 7/8) is available on the website https://pwd.py.gov.in/general-conditions-contract-pwd-works-2023 and the same can be viewed online by the intending contractors.

On the scheduled Time & date of opening, the Executive Engineer authorizes the opening on the notified time. Contractor can access the particulars, after opening of tender in the web site. The department will not be liable for any delay in submission of tender.

The time allowed for carrying out the work as mentioned in column (7) which including monsoon period from the date of start as defined in schedule 'F' or from the first date of handing over of the site, whichever is later, in accordance with the phasing, if any, indicated in the tender documents.

Prescribed format for submission of EMD

The Earnest Money and e-tender processing fee should be deposited only through Direct Debit / NEFT / RTGS mode only. Necessary challans are available in the website. The Earnest money and e-tender processing fee should be drawn in favour of the Executive Engineer, Yanam Division, Public Works Department, Yanam.

For e-payment assistance please contact ICICI Bank for e-payment help desk guidance in Phone No 89398 31491.

Please contact e-Procurement cell, 3rd floor, Chief Secretariat, e-tender help desk for guidance in Phone No.0413-2220225 & 1800 3070 2232 (Toll Free) mail id: support-eproc.py@supportgov.in

Sd/-
EXECUTIVE ENGINEER
YANAM DIVISION
P.W.D., YANAM

WEB SITE: https://pudutenders.gov.in.

సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలి

అమలాపురం కలెక్టరేట్: సాంఘిక, బీసీ సంక్షేమ శాఖ పరిధిలోని వసతి గృహాల విద్యార్థులకు పూర్తి స్థాయి సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. విద్యార్థులకు రక్షిత తాగునీరు, ఆరోగ్య భద్రతకు బీమా సౌకర్యం, కిచెన్ గార్డెన్స్ నిర్వహణ సక్రమంగా చేయాలన్నారు. శిథిల భవనాల గుర్తింపు, మరమ్మతుల నిర్వహణపై నివేదిక ఇవ్వాలన్నారు. సంక్షేమశాఖ అధికారి జ్యోతిలక్ష్మీదేవి పాల్గొన్నారు.

భట్టుపాలెంలో డెంగీ కలకలం

ఉప్పలగుప్తం: మండలంలోని భట్టుపాలెంలో ఓ వృద్ధుడికి డెంగీ నిర్ధారణ జరిగింది. ఆ వృద్ధుడు జ్వరంతో బాధపడుతూ అమలాపురం ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు డెంగీ జ్వరమని నిర్ధారించడంతో గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేసి ప్రజలను అప్రమత్తం చేశారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, జ్వర లక్షణాలు కనిపిస్తే వైద్య పరీక్షలు చేయించుకోవాలని వైద్యాధికారిణి విష్ణుప్రియ సూచించారు. సర్పంచి రాజేశ్‌కుమార్, మలేరియా అధికారి రాజేశ్‌కుమార్, రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాల ప్రిన్సిపల్ వైఖరిపై నిరసన

మామిడికుదురు: మామిడికుదురు మండలం మొగిలికుదురులోని ఓ ప్రైవేటు పాఠశాల ప్రిన్సిపల్ హిందూ విద్యార్థుల పట్ల వ్యతిరేక ధోరణి అవలంబిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమా తదితరులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. విద్యార్థులను బొట్టు, పువ్వులు పెట్టుకోవద్దని, గాజులు వేసుకోవద్దని ఇబ్బందులు పెట్టడంపై మండిపడ్డారు. అధికారులు పరిశీలన చేసి చర్యలు తీసుకోవాలని అడబాల నరసింహం, యాతం కృష్ణ, తదితరులు కోరారు. ప్రిన్సిపల్‌ను వివరణ కోరగా తాను విద్యార్థులెవరితో ఆవిధంగా మాట్లాడలేదన్నారు.

ఆరోగ్యం.. ఆదాయం.. సాంకేతికత

ఆదర్శ రైతులకు సీఎం సత్కారం

న్యూస్‌టుడే, గోపాలపురం, దేవరపల్లి, నల్లజర్ల

చెరకు తోటలో జోగేంద్రప్రసాద్

స్ఫూర్తి

పంటలకు ఎటువంటి రసాయనాలు వినియోగించకుండా తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం సాధిస్తున్నారు తూర్పు గోదావరి జిల్లాకు చెందిన పలువురు రైతులు. ఈ నెల 3న నల్లజర్లలో జరిగిన రైతన్నా.. మీ కోసం ముగింపు కార్యక్రమంలో ఆదర్శ రైతులుగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా సత్కారం అందుకున్నారు.

చెరకు, మిరప పండిస్తూ..

గోపాలపురం మండలం వాదాలకుంటకు చెందిన గడా జోగేంద్రప్రసాద్ ఎమ్మెస్సీ పూర్తి చేశారు. 6 ఎకరాల్లో చెరకు, మిరప పంటను సేంద్రియ పద్ధతిలో సాగుచేస్తున్నారు. తన కుటుంబ అవసరాలకు వినియోగించుకుని మిగిలిన పంటను అమ్ముకుంటున్నారు. చెరకుతో స్వయంగా బెల్లం తయారు చేసి అమ్మితే ఎకరాకు రూ.60 వేల నుంచి రూ.80 వేలు, మిరప పంటకు అన్ని ఖర్చులు పోగా రూ.25 వేలు వరకు ఆదాయం వస్తుందని ఆయన చెబుతున్నారు.

కొబ్బరి, కోకో సాగు..

దేవరపల్లి మండలం కురుకూరుకు చెందిన యలమాటి భాస్కరరావు పదెకరాల్లో కొబ్బరి, కోకో వేశారు. మూడేళ్లుగా సేంద్రియ విధానం అవలంబిస్తున్నారు. దీంతో ఖర్చు తగ్గింది. ఆదాయం కూడా అనుకున్న స్థాయిలో వస్తుంది. ఎకరాకు ఏడాదికి రూ. 2.10 లక్షల ఆదాయం వస్తుందని దానిలో పెట్టుబడి రూ.90 వేలు పోగా రూ. 1,10,000 నికర ఆదాయం మిగులుతుందన్నారు.

మిశ్రమ విధానంలో..

నల్లజర్ల మండలం సింగరాజుపాలేనికి చెందిన దొండపాటి లక్ష్మీనారాయణ 5 ఎకరాల ఆయిల్‌పామ్ తోటలో చేపలు, నాటు కోళ్లు, ఆవులు, గేదెలు పెంచుతున్నారు. వ్యవసాయ క్షేత్రంలో చిన్న చెరువు తవ్వి దానిలో చేపలు వేసి ఆవులు, గేదెలు వేసిన పేడను వినియోగిస్తున్నారు. పొలంలో క్రిమికీటకాలు తిని కోళ్లు పెరుగుతున్నాయి. ఏడాదికి ఖర్చు రూ.5 లక్షలు అవుతుందని అన్నింటితో కలిపి ఏడాదికి సుమారు రూ.11 లక్షలు ఆదాయం ఆర్జిస్తున్నట్లు తెలిపారు.

రైతేరాజు

మల్లె కొమ్మ కత్తిరింపులో పాటించాల్సిన జాగ్రత్తలు

మీ కోసం

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: మల్లె సాగులో యాజమాన్య పద్ధతులు అవలంబిస్తే ఆశించిన దిగుబడులు వస్తాయని ఉద్యానాధికారి కోటేశ్వరరావు వెల్లడించారు. నాటిన మూడో ఏడాది నుంచి దిగుబడి ప్రారంభమై 12-15 ఏళ్ల వరకు పొందొచ్చు. కత్తిరింపులు చేసే ముందు నవంబరు నుంచి నీటితడులు ఇవ్వకుండా చెట్లను వాడు ముఖం పట్టించాలి. అయిదేళ్ల లోపు వయసున్న తోటలో కొమ్మలు భూమి నుంచి రెండు, అయిదేళ్లు దాటితే మూడు అడుగులు ఉంచి మిగిలిన పైభాగాన్ని కత్తిరించాలి. తాజాదనం కోసం, మొగ్గల సువాసనలు రెండు, మూడు రోజులు వెదజల్లాలంటే సుక్రోస్ లేదా బోరిక్ యాసిడ్ 10 గ్రాములు లేదా అల్యూమినియం సల్ఫేటు ఒక గ్రాము లీటరు నీటికి కలిపిన ద్రావణంలో 10 నిమిషాల పాటు ఉంచి అనంతరం ఆరబెట్టాలి.

వాడపల్లిలో సాగవుతున్న మల్లెతోట

బాయిలర్ కోడిపిల్లలకు కుంపట్లు అమర్చి ఉష్ణోగ్రతలు అందిస్తున్న రైతు

చలికాలంలో కోడిపిల్లల రక్షణ ఇలా..

తెలుసుకుందాం..

జగ్గంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: బాయిలర్ కోడిపిల్లలకు శీతాకాలంలో తగిన ఉష్ణోగ్రతలు అందిస్తూ జాగ్రత్తలు పాటించాలని జగ్గంపేట పశుసంవర్ధక శాఖ ఏడీఏ తాతయ్య సూచించారు. నాణ్యత కలిగిన పిల్లలను ఎంపిక చేసుకొని మొదటి వారంలో 32-35 సెల్సియస్ వేడిని అందించాలి. దీనికోసం కుంపట్లు, గ్యాస్‌బ్రూడర్లు అమర్చుకోవాలి. షెడ్ల చుట్టూ పరదాలు కప్పితే చలిగాలి రాకుండా అడ్డుకోవచ్చు. కోడిపిల్ల వయసు పెరిగేకొద్దీ 39.5-41 సెల్సియస్ మధ్య ఉంచడం ఉత్తమం. నాభి లేదా మలద్వారం వద్ద థర్మామీటరు ఉంచడం ద్వారా ఉష్ణోగ్రతలు తెలుసుకోవచ్చు. తగినంత ఉష్ణోగ్రతలు అందించని పక్షంలో శ్వాసకోశ ఇబ్బంది, బద్ధకం, ఆకస్మిక మరణం సంభవించి నష్టం వాటిల్లుతుంది.

వెదురు.. లాభాలతో ఎదుగుదాం

40 ఏళ్ల వరకు ఆదాయం

వెదురు మొక్కలు

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: వెదురును ప్రధాన పంటగా గాని, పొలం చుట్టూ రక్షణగా గాని వేసుకుంటే తక్కువ పెట్టుబడితో 40 ఏళ్ల వరకూ ఆదాయం పొందొచ్చు. సాగు విధానం, లాభాలు, రాయితీల గురించి ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త చల్లా వెంకటనరసింహారావు వివరించారు. ● 5×5 మీటర్ల ఎడంతో ఎకరాకు 160 మొక్కలు నాటొచ్చు. ● ఎటువంటి భూముల్లోనైనా సాగు చేయొచ్చు. చదును నేలల్లో పొడవు రకాలు, ఏటవాలు భూముల్లో పొట్టి రకాలు వేసుకోవాలి. ● మొక్కలు నాటిన రెండేళ్ల వరకు అంతర పంటలుగా అల్లం, పసుపు, అశ్వగంధ వంటి ఔషధ పంటలు సాగు చేసుకుని అదనపు ఆదాయం పొందొచ్చు. ● మూడవ సంవత్సరం నుంచి ఏడాదికి ఎకరాకు 13 నుంచి 15 టన్నుల వెదురు లభిస్తుంది. టన్ను వెదురు రూ.4-5 వేలు ధర ఉండగా ఏడాదికి రూ.65-70 వేలు ఆదాయం లభిస్తుంది. ● రైతులకు మొక్కకు రూ.150 చొప్పున హెక్టారుకు రూ.60 వేలు ఉద్యానశాఖ రాయితీ అందిస్తుంది. ● సరుగుడు కంటే సాగు సులభం. పెట్టుబడి తక్కువ. లాభాలు అధికం. మార్కెట్ అవకాశాలు అధికం. ● కాగితం, నిర్మాణ రంగం, చేనేత, గృహోపకరణాల పరిశ్రమలకు, డెక్కింగ్, ఫ్లోరింగ్, అగరబత్తీల తయారీకి ముఖ్యమైన వనరును అందిస్తాయి.

విద్యారంగం సంక్షోభంలో పడకుండా చూడాలి

అంబాజీపేట, న్యూస్‌టుడే: ప్రభుత్వం అమలు చేస్తోన్న సంస్కరణలతో విద్యారంగం సంక్షోభంలోకి వెళుతోందని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బి.గోపిమూర్తి ఆందోళన వ్యక్తం చేశారు. అంబాజీపేట మండల యూటీఎఫ్ సమావేశం స్థానిక నాగమల్లి చెట్టు ఎంపీపీ మోడల్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం అధ్యక్షుడు ఎం.సూర్యనారాయణ అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ పాల్గొని మాట్లాడారు. యాప్‌లతో ఉపాధ్యాయులపై పనిభారం పెరిగిందన్నారు. వారిని కేవలం బోధనకు మాత్రమే పరిమితం చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. ఇన్‌సర్వీసు ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. తొలుత ఉద్యమకారుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.టి.వి.ఎ.సుబ్బారావు, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు జి.వి.రమణ, ఉమ్మడి తూగో జిల్లా ప్రధాన కార్యదర్శి టి.కామేశ్వరరావు, యూటీఎఫ్ జిల్లా ఎఫ్‌డబ్ల్యుఎస్ డైరెక్టర్ పి.నారాయణ మూర్తి, నాయకులు ఎం.రాంబాబు, పి.వెంకటేశ్వరరావు, బి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బి.గోపిమూర్తి

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి	18,500
కురిడీ (వెయ్యింటికి):	
పాతకాయ: గండేరా	28,000
గటగట	25,000
కొత్తకాయ: గండేరా	27,000
గటగట	24,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	15,000-16,000
కొత్త (పచ్చి) కాయ	14,000-15,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	6,000
కిలో	400

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	130-00
రిటైల్ లైవ్	157-00
డ్రెస్డ్	228-00
స్కిన్‌లెస్	259-00

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (यूनियन बैंक ऑफ इंडिया / యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా — మంచి ప్రజలు, మంచి బ్యాంక్)

అసెట్ రికవరీ బ్రాంచ్, డోర్ నెం.26-15-150, ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్, చెంగలరావుపేట, విశాఖపట్నం-530001.
ఫోన్ : 0891-2537792 / 82, మొబైల్ నెం. : 93245 17291. ఇ-మెయిల్ : ubin0817295@unionbankofindia.bank

స్థిరాస్తి అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

APPENDIX-IV-A [(See Proviso to Rule 8(6)]

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లో రూల్ 8(6) ప్రొవిజన్‌తో చదివే సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం స్థిరాస్తుల ఇ-వేలం అమ్మకం ప్రకటన

ఇందుమూలముగా "ఋణగ్రహీత(లు) / హామీదారు(లు)"లకు మరియు ప్రత్యేకంగా సాధారణ ప్రజానీకానికి నోటీసు జారీచేస్తూ తెలియజేయునది ఏమనగా, సెక్యూర్డ్ క్రెడిటార్ తనఖాలో / ఛార్జీలో ఉన్న దిగువ తెలిపిన స్థిరాస్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, (సెక్యూర్డ్ క్రెడిటార్) అధీకృత అధికారిచే స్వాధీనం తీసుకొనబడి వాటిని "ఎక్కడ ఉన్నది అలాగే" "ఏది ఉంటే అది & అక్కడ ఏది ఉన్నా అలాగే" పద్ధతిలో వెబ్‌సైట్ https://baanknet.com ద్వారా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఋణ వసూలు శాఖ, విశాఖపట్నం సెక్యూర్డ్ క్రెడిటార్ కి (ప్రస్తుతం ఈ దిగువ తెలిపిన ఖాతా ఋణ వసూలు శాఖ, విశాఖపట్నం వారికి బదిలీ చేయబడినది) వెల్లించవలసిన బకాయి సొమ్ము దిగువ తెలిపిన మొత్తము + వడ్డీ & ఇతర ఖర్చులతో సహా దిగువ తెలిపిన ఋణగ్రహీతలు & హామీదారుల నుండి రాబట్టుకొనుటకు తేది.30-12-2025 న ఆన్‌లైన్ ఈ-వేలం ద్వారా అమ్మకం చేయుటకు నిర్ణయించినారు. ధరావత్తు & రిజర్వు ధర దిగువ తెలుపబడినవి.

1 ఋణగ్రహీత(లు) : మెస్సర్స్ శ్రీ సత్య కృష్ణ కమ్యూనికేషన్స్, ప్రొప్రయిటర్ : శ్రీ మెండా శివ ప్రసాద్, మెయిన్ రోడ్, ఎమ్ఐ షోరూమ్ పై అంతస్తు, రత్న ప్యాలెస్ దగ్గర, రాజమండ్రి, తూర్పుగోదావరి జిల్లా ఆంధ్రప్రదేశ్-533101. ప్రొప్రయిటర్ : శ్రీ మెండా శివ ప్రసాద్, తండ్రి : స్వామి నాయుడు, హెరిటేజ్ అపార్ట్‌మెంట్, నాగమ్మ దేవాలయం దగ్గర, నారాయణపురం, రాజమండ్రి, తూర్పు గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్-533105. హామీదారు మరియు తనఖాదారు : శ్రీమతి మెండా (లంకపల్లి) మహేశ్వరి, భర్త : శివ ప్రసాద్, హెరిటేజ్ అపార్ట్‌మెంట్, నాగమ్మ దేవాలయం దగ్గర, నారాయణపురం రాజమండ్రి, తూర్పు గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్-533105. హామీదారు మరియు తనఖాదారు : శ్రీమతి మెండా (లంకపల్లి) మహేశ్వరి, భర్త : శివ ప్రసాద్, డి.నెం. 6-1-12, నల్లా గార్డెన్స్, అమలాపురం టౌన్, డా. బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఆంధ్రప్రదేశ్-533201. హామీదారు మరియు తనఖాదారు: శ్రీమతి మెండా (లంకపల్లి) మహేశ్వరి, భర్త: శివ ప్రసాద్, డి.నెం.1-48, కామిని, సలాదివారి పాలెం, ముమ్మిడివరం, ముమ్మిడివరం మండలం, డా.బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఆంధ్రప్రదేశ్-533216.

బకాయి మొత్తం: తేది.31-10-2025 నాటికి రూ.2,32,62,856.89 పై. (అక్షరాల రెండుకోట్ల ముప్పైరెండు లక్షల అరవైరెండు వేల ఎనిమిదివందల యాభై ఆరు రూపాయల ఎనభై తొమ్మిది పైసలు మాత్రమే)+ఒప్పంద రేటు ప్రకారం తదుపరి వడ్డీతో పాటు వ్యయాలు మరియు ఇతర ఖర్చులు.

స్థిరాస్తి వివరములు : ఐటమ్ నెం.1 : తూర్పు గోదావరి జిల్లా, అమలాపురం టౌన్ & మున్సిపాలిటీ, నల్లా గార్డెన్స్ ఏరియా వద్ద ఆర్.యస్.నెం. 755/2 లోని ఎ.484 చ.గ.లు ఒక్కొక్కటి విస్తీర్ణం గల స్థలము సమీప డి.నెం.6-1-60 గా గల రెసిడెన్షియల్ ఓపెన్ ప్లాటు శ్రీమతి మెండా మహేశ్వరి అలియాస్ లంకపల్లి మహేశ్వరి, భర్త : శివప్రసాద్ గారికి చెందినది. (రిజిష్టర్డు డాక్యుమెంట్ నెం.2519/2010, తేది.12-05-2010 ప్రకారం). రిజిష్టర్డు సెటిల్‌మెంట్ డాక్యుమెంట్ నెం.2519/2010 ప్రకారం హద్దులు : తూర్పు : మెండా మహేశ్వరి గారికి చెందిన స్థలము, పడమర : అలియా సత్యనారాయణ గారి స్థలము, దక్షిణం : లంకపల్లి తాతయ్య నాయుడు గారి స్థలము, ఉత్తరం : సలాది వెంకట భాగ్యలక్ష్మి గారి స్థలము. డిజిటల్ సర్వే రిపోర్టు తేది.23-09-2025 ప్రకారం హద్దులు : తూర్పు : సర్వే నెం.775/2 క్రింద గల మిగిలిన భూమి, పడమర : సర్వే నెం.775/1 లోని ఇతరుల భూమి, దక్షిణం : సర్వే నెం.775/2 లోని ఇతరుల భూమి, ఉత్తరం : సర్వే నెం.774 లోని ఇతరుల భూమి.

ఐటమ్ నెం.2 : తూర్పు గోదావరి జిల్లా, అమలాపురం టౌన్ & మున్సిపాలిటీ, నల్లా గార్డెన్స్ ఏరియా వద్ద ఆర్.యస్.నెం.755/2 లోని ఎ.484 చ.గ.లు ఒక్కొక్కటి విస్తీర్ణం గల స్థలము సమీప డి.నెం.6-1-60 గా గల రెసిడెన్షియల్ ఓపెన్ ప్లాటు శ్రీమతి మెండా మహేశ్వరి, భర్త : శివప్రసాద్ గారికి చెందినది. (రిజిష్టర్డు డాక్యుమెంట్ నెం.1484/2014, తేది.20-03-2014 ప్రకారం). రిజిష్టర్డు సెటిల్‌మెంట్ డాక్యుమెంట్ నెం.1484/2014 ప్రకారం హద్దులు: తూర్పు: రోడ్డు, పడమర: మెండా మహేశ్వరి గారికి చెందిన స్థలము, దక్షిణం : లంకపల్లి తాతయ్య నాయుడు గారి స్థలము, ఉత్తరం : సలాది వెంకట భాగ్యలక్ష్మి గారి స్థలము. డిజిటల్ సర్వే రిపోర్టు తేది.23-09-2025 ప్రకారం హద్దులు : తూర్పు : ప్రస్తుతం గల రోడ్డు, పడమర : సర్వే నెం.775/2 లోని మిగిలిన భూమి, దక్షిణం : సర్వే నెం.775/2 లోని ఇతరుల భూమి, ఉత్తరం : సర్వే నెం.774 లోని ఇతరుల భూమి.

గమనిక : ఐటమ్ నెం.1 వారికి ఐటమ్ నెం.2 వారి నుండి అనుమతితో మాత్రమే, మేము రెండు ఐటమ్‌లు ఒకే ఐటమ్ ఆస్తిగా చూపడమైనది.

రిజర్వు ధర : రూ.1,23,00,000/- ధరావత్తు : రూ.12,30,000/- బిడ్ పెంపుదల మొత్తం : రూ.1,23,000/-

2 ఋణగ్రహీత: (ప్రొప్రైటర్‌షిప్ సంస్థ): మెస్సర్స్ ఎస్‌ఆర్‌కె కన్‌స్ట్రక్షన్స్, ప్రొప్రైటర్: శ్రీ సాగి శివ రామ కృష్ణంరాజు, డి.నెం.నెం.5-124, గోశాల రోడ్, తిమ్మాపురం, కాకినాడ, తూర్పు గోదావరి జిల్లా (ప్రస్తుతం కాకినాడ జిల్లా), ఆంధ్రప్రదేశ్-533005. ప్రొప్రైటర్ & తనఖాదారు: శ్రీ సాగి శివరామ కృష్ణంరాజు, తండ్రి: సుబ్బరాజు, చిరునామా-1: డి.నెం.2-495/15, రోడ్ నెం.1, ఐశ్వర్య నగర్, రమణయ్యపేట, కాకినాడ, తూర్పు గోదావరి జిల్లా (ప్రస్తుతం కాకినాడ జిల్లా), ఆంధ్రప్రదేశ్-533005. చిరునామా-2: డి.నెం.2-161, ప్లాట్ నెం.1, పెనుమర్తి గ్రామం & గ్రామ పంచాయతీ, దుర్గా దేవి గుడి సమీపంలో, కాకినాడ రూరల్, తూర్పు గోదావరి జిల్లా (ప్రస్తుతం కాకినాడ జిల్లా), ఆంధ్రప్రదేశ్. చిరునామా-3: డి.నెం.7-124, మారుతి నగర్, కాకినాడ, తూర్పు గోదావరి జిల్లా (ప్రస్తుతం కాకినాడ జిల్లా), ఆంధ్రప్రదేశ్-533005. హామీదారు: శ్రీమతి సాగి శ్రీదేవి, భర్త: సాగి శివ రామ కృష్ణం రాజు, చిరునామా-1: డి.నెం.2-495/15, రోడ్ నెం.1, ఐశ్వర్య నగర్, రమణయ్యపేట, కాకినాడ, తూర్పు గోదావరి జిల్లా (ప్రస్తుతం కాకినాడ జిల్లా), ఆంధ్రప్రదేశ్-533005. చిరునామా-2: డి.నెం.2-161, ప్లాట్ నెం.1, పెనుమర్తి గ్రామం & పంచాయతీ, దుర్గా దేవి గుడి సమీపంలో, కాకినాడ రూరల్, తూర్పు గోదావరి జిల్లా (ప్రస్తుతం కాకినాడ జిల్లా), ఆంధ్రప్రదేశ్. చిరునామా-3: డి.నెం.7-124, మారుతి నగర్, కాకినాడ, తూర్పు గోదావరి జిల్లా (ప్రస్తుతం కాకినాడ జిల్లా), ఆంధ్రప్రదేశ్-533005.

బకాయి మొత్తం:రూ.46,16,566.07 పై. (అక్షరాల నలభై ఆరు లక్షల పదహారు వేల ఐదు వందల అరవై ఆరు రూపాయల ఏడు పైసలు మాత్రమే)+ఒప్పంద రేటు ప్రకారం తదుపరి వడ్డీతో పాటు వ్యయాలు మరియు ఇతర ఖర్చులు.

స్థిరాస్తి వివరములు : ఆంధ్రప్రదేశ్-533005, తూర్పు గోదావరి జిల్లా (ప్రస్తుతం కాకినాడ జిల్లా), కాకినాడ, కాకినాడ రూరల్ మండలం, పెనుమర్తి గ్రామంలోని ఆర్.ఎస్.నెం.58/5లో ఉన్న డోర్ నెం.2-161, ప్లాట్ నెం.1, టి.ఎల్.పి. నెం.28/2015 నందు 146.66 చదరపు గజాల విస్తీర్ణంతో (భవనం ప్లింత్ ఏరియా 797.28 చదరపు అడుగులు) గల క్రింది అంతస్థు లోని నివాసిత భవనము శ్రీ సాగి శివ రామ కృష్ణంరాజు గారికి చెందినది. హద్దులు: తూర్పు: ప్లాట్ నెం. 6కి చెందిన స్థలం, పడమర: 33 అడుగుల వెడల్పు రహదారి, ఉత్తరం: ప్లాట్ నెం. 2కి చెందిన స్థలం, దక్షిణం: ఇతరుల భూమి. (రిజిస్టర్డ్ అమ్మకపు దస్తావేజు నెం. 648/2016 తేది: 12.01.2016)

రిజర్వు ధర : రూ.31,00,000/- ధరావత్తు : రూ.3,10,000/- బిడ్ పెంపుదల మొత్తం : రూ.35,000/-

ఆంధ్రప్రదేశ్-530055, తూర్పు గోదావరి జిల్లా, కాకినాడ రూరల్ మండలం, కాకినాడ మండలం, తూరంగి గ్రామం, డోర్‌నెం.9-344/1 సమీపంలో, సర్వే నెం.160/4 లో ఉన్న ప్లాట్ నెం.9లో గల 168.88 చదరపు గజాల విస్తీర్ణంలోని నివాస ఖాళీ స్థలం శ్రీ సాగి శివ రామ కృష్ణం రాజుగారికి చెందినది. హద్దులు: తూర్పు: ప్లాట్ నెం. 24 యొక్క స్థలం, పడమర: 33 అడుగుల వెడల్పు రహదారి, ఉత్తరం: శ్రీ వి.వి. కృష్ణా మోహన్, ఎన్. రవి కిషోర్ మరియు జి.టి.ఎస్. ప్రకాష్ ల అస్తి, దక్షిణం: ప్లాట్ నెం. 10 యొక్క స్థలం. (రిజిస్టర్డ్ అమ్మకపు దస్తావేజు నెం. 3685/2017 తేది: 31.05.2017) గమనిక : SA /285/2024 ఫలితానికి లోబడి అమ్మకం విజయవంతమైనదని ప్రకటించబడుతుంది.

రిజర్వు ధర : రూ.26,00,000/- ధరావత్తు : రూ.2,60,000/- బిడ్ పెంపుదల మొత్తం : రూ.30,000/-

ఇ-వేలం తేది మరియు సమయం : 30-12-2025, మ॥ 12.00 గం॥ల నుండి సా॥ 05.00 గం॥ వరకు
(వేలము పూర్తి అగు వరకు 10 నిముషముల చొప్పున సమయం పొడిగించబడును)

బ్యాంకుకు తెలిసినంతవరకు ఆస్తిపై ఎటువంటి ఎన్‌కంబరెన్సులు లేవు.
విక్రయం యొక్క వివరణాత్మక నిబంధనలు మరియు షరతుల కోసం, దయచేసి https://www.unionbankofindia.co.in/auction-property/view-auction-property.aspx మరియు www.unionbankofindia.co.inలో అందించిన లింక్‌ను సందర్శించండి.

తేది : 02.12.2025
స్థలం : విశాఖపట్నం

సం/- అధీకృత అధికారి & అసిస్టెంట్ జనరల్ మేనేజర్
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అసెట్ రికవరీ బ్రాంచి

EENADU eClassifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

బంగారం బ్యాంకులలో, ముత్తూట్, మనప్పురం, ప్రైవేట్ సంస్థల్లో తాకట్టులో ఉన్నవి విడిపించి, ఈ రోజు మార్కెట్ ప్రకారం కొనబడును. స్పాట్‌క్యాష్. ✆ 98491 38626.

శ్రీసాయి గోల్డ్: తాకట్టులో ఉన్న బంగారం, ఏ బ్యాంక్/ ప్రైవేట్ సంస్థల నుండి అయినా విడిపించి ఆరోజు మార్కెట్ రేట్‌కి కొనబడును. స్పాట్ క్యాష్, ✆ 94933 38823

REAL ESTATE

HOUSE FOR SALE

RAJAMAHENDRAVARAM CITY

రాజమండ్రి లాలాచెరువు హౌసింగ్ బోర్డ్ కాలనీ MIG-418లో 277 చ॥గ॥ల్లో ఈస్ట్ ఫేసింగ్ ఇల్లు అమ్మకమునకు కలదు. Contact Cell: 63055 24046.

JOBS

Wanted Managers to Motivate Team/ Targets/ Salary upto 50K/ Tanuku/ age above 30Yr/ must Insurance Exp. ✆ 98494 21277.

EENADU for Advertisement Contact: 8008597607

Wanted Eng., Mat. Teacher for 6,7th. Sal: 18,000 Negotiable. Prakasham EM Hi-School, Madhuranagar, Kkd. 63023 05325, 99488 81449(Wtsap)

వైజాగ్ SKLM VZM జిల్లాలలో స్కూల్స్ హాస్పిటల్స్ బ్యాంక్‌లలో ఔట్‌సోర్సింగ్ & కాంట్రాక్ట్ బేస్ ద్వారా పనిచేయుటకు అటెండర్స్, రికార్డ్, జూనియర్ అసిస్టెంట్స్, కంప్యూటర్ ఆపరేటర్స్ బుకింగ్ క్లర్క్స్ బీట్ ఆఫీసర్స్ హెల్ప్‌డెస్క్, గార్డెనర్స్ MNO FNO ల్యాబ్‌టెక్నీషియన్స్ ANM GNM చేసినవారు M/F అర్జెంట్‌గా కావలెను. 10th నుండి బీటెక్ వరకు జీ: 20K to 40K ✆ 9160226051.

అమెరికాలో 1 సం॥ బాబు ఆలన, పాలన వ్యక్తిగత సంరక్షణ కొరకు అనుభవంగల ఆడవారు కావలెను. అమెరికా వీసా కల్గినవారు మాత్రమే. ✆ 9440803362

అకౌంటెంట్స్, సూపర్‌వైజర్స్, ఐషర్ డ్రైవర్స్ కావలెను. గోకవరం మండలం, పెంటపల్లి గ్రామంలోఉన్న పేపర్ మిల్లులో పనిచేయుటకు. 78935 55551, 90300 56553.

హైదరాబాద్‌లో పనిచేయడానికి M/F కేర్‌టేకర్స్ కావలెను. జీతం:20,000+ భోజనము+ వసతి. ఈ జీతం నెల 20లోపు జాయిన్ అయిన వారికి మాత్రమే. +91 76809 22316.

వైజాగ్‌లో ప్రముఖ షాపింగ్ మాల్స్‌లో పనిచేయుటకు 18-35వ యువతి యువకులు కావలెను. జీతం 10000-13500 ఫుడ్‌రూము 9704637370, 9949904532.

ఆర్మీ NAVY ఎయిర్‌ఫోర్స్ రైల్వే, SSC, బ్యాంకులలో ఉద్యోగావకాశాలు. అర్హత: 10th-డిగ్రీ. Age:16-25. శిక్షణ 3 నెలలు శిక్షణాకాలంలో హాస్టల్, 10th, ఇంటర్, డిగ్రీ డిస్టెన్స్ కోర్సులు కలవు. ★ ముందుగా ఎటువంటి ఫీజులేదు ★క్రిస్టియన్ ఎడ్యుకేషన్ అకాడమీ, వైజాగ్. ✆ 91212 32328.

నెక్ సూచించిన కోడిగుడ్డ ధర
★ For the Information of Trade & Industry
★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 6-50 పై॥
అనపర్తి ఆఫీసు: 08857-226908

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

రాజోలు

• రాజోలు • కొత్తపేట • పి.గన్నవరం

నేడు ‘వాడవాడకు ఎమ్మెల్యే గిడ్డి’

అయినవిల్లి, న్యూస్‌టుడే: పల్లెల్లో నెలకొన్న సమస్యలు పరిశీలించి పరిష్కరించే క్రమంలో భాగంగా మంగళవారం పొట్టిలంక గ్రామంలో ‘వాడవాడకు ఎమ్మెల్యే గిడ్డి’ ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల తెదేపా అధ్యక్షుడు వస్కా శ్యామ్ తెలిపారు. కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కొబ్బరికి మద్దతు ధర ఇవ్వాలి

అంబాజీపేట: కొబ్బరికాయకు రూ.20 మద్దతు ధర ప్రభుత్వం ప్రకటించాలని భారతీయ కిసాన్‌సంఘ్ ప్రతినిధులు, రైతులు కోరారు. అంబాజీపేట తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహసీల్దార్ బి.చినబాబుకు వారు వినతిపత్రం ఇచ్చారు. సరైన మద్దతు ధర లేకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

సీఎం సహాయ నిధితో భరోసా

మలికిపురం, న్యూస్‌టుడే: పేదల వైద్య చికిత్సలో సీఎం సహాయ నిధి ఎంతో భరోసాగా నిలుస్తోందని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. విశ్వేశ్వరాయపురం క్యాంపు కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో 64 మందికి రూ.39 లక్షల ఆర్థిక సాయంగా మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, ఎంపీపీలు వెంకటసత్యవాణి, శ్రీదుర్గ, సర్పంచి చెల్లుబోయిన హెలీనా, ఎంపీటీసీ శ్రీదేవి, గెడ్డం మహాలక్ష్మీప్రసాద్, గుబ్బల ఫణికుమార్, మాలే శ్రీనివాసనగేశ్, మల్లిపూడి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉంటేనే భవిష్యత్తు

మలికిపురం, న్యూస్‌టుడే: విద్యార్థులు బాగా చదివి ఉన్నతంగా ఎదగాలని మలికిపురం ఎస్సై పి.సురేశ్ ఆకాంక్షించారు. గూడపల్లిపల్లిపాలెం ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు ఆచటం రామచంద్రరావు అధ్యక్షతన సోమవారం జరిగిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య వక్తగా పాల్గొన్నారు. గంజాయి, మద్యం, సిగరెట్ల వినియోగంతో శారీరకంగా, సామాజికంగా జరిగే నష్టాలు, మాదకద్రవ్యాలు వినియోగిస్తే పడే శిక్షల గురించి వివరించారు. మైనర్ల డ్రైవింగు నేరమని, అధికంగా చరవాణి ఉపయోగించడం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ క్రమశిక్షణతో కష్టపడి చదివి తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చాలని సూచించారు. సర్పంచి పెచ్చెట్టి నరసింహస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎస్సై సురేశ్

అండర్-17 క్రికెట్ జట్టుకు ఎంపిక

అంబాజీపేట, న్యూస్‌టుడే: అంబాజీపేట జిల్లాపరిషత్తు ఉన్నత పాఠశాల పదోతరగతి విద్యార్థి సీహెచ్ లక్ష్మీనారాయణ స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 14న కృష్ణా జిల్లాలో జరిగే పోటీల్లో పాల్గొంటాడని పీడీలు కుంపట్ల ఆదిలక్ష్మి, ఆకుల ఉమామహేశ్వరరావు తెలిపారు. విద్యార్థిని హెచ్ఎం కడలి సాయిరాం, ఇన్‌ఛార్జి హెచ్ఎం బీఎస్ఎన్ మూర్తి, స్టాఫ్ సెక్రటరీ రామలింగేశ్వరరావు సోమవారం అభినందించారు.

లక్ష్మీనారాయణ

బ్యాడ్మింటన్ విజేత కలర్‌బ్లూ జట్టు

మలికిపురం, న్యూస్‌టుడే: స్థానిక డిగ్రీ కళాశాల ఇండోర్ స్టేడియంలో శ్రీరామ బ్యాడ్మింటన్ అకాడమీ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరిగిన ఉభయగోదావరి జిల్లాల స్థాయి బ్యాడ్మింటన్ లీగ్(డబుల్స్) టోర్నమెంట్ సోమవారం ముగిసింది. ఫైనల్స్‌లో కలర్‌బ్లూ జట్టు విజేతగా నిలిచి ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. కలర్ బ్లాక్ జట్టు ద్వితీయ స్థానం సాధించింది. విజేతలకు బహుమతులు అందించారు. శ్రీరామ బ్యాడ్మింటన్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు దెందుకూరి రాంబాబురాజు, కోచ్ హరికృష్ణలను అసోసియేషన్ సభ్యులు ఘనంగా సన్మానించారు.

విజేత జట్టుతో నిర్వాహకులు

అభ్యసన సామగ్రి పంపిణీ

రాజోలు, న్యూస్‌టుడే: తాటిపాక జడ్పీ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు 1997-98 బ్యాచ్ విద్యార్థులు సమకూర్చిన అభ్యసన సామగ్రిని యూటీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం పంపిణీ చేశారు. వీటిని సద్వినియోగం చేసుకుని మంచి మార్కులు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల యూటీఎఫ్ గౌరవాధ్యక్షుడు రేకపల్లి నాగేశ్వరరావు, కె.రవికుమార్, కె.వి.ఎస్.ఎన్.బాబు, హెచ్ఎం సుబ్బారావు పాల్గొన్నారు.

రహదారి పనులకు భూమిపూజ

మామిడికుదురు, న్యూస్‌టుడే: లూటుకుర్రులో రూ.3 లక్షల నరేగా నిధులతో పాత పంచాయతీ భవనం నుంచి జడ్పీ ఉన్నత పాఠశాల వరకు చేపట్టిన సిమెంటు రోడ్డు పనులకు పి.గన్నవరం నియోజకవర్గ సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు అడబాల తాతకాపు సోమవారం భూమిపూజ చేశారు. స్థానిక ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ఈ నిధులు మంజూరు చేశారన్నారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

అక్రమ ఆక్వా చెరువులపై చర్యలకు డిమాండ్

మామిడికుదురు, న్యూస్‌టుడే: ఏవిధమైన అనుమతులు లేకుండా తీర గ్రామాల్లో అక్రమంగా సాగు చేస్తున్న ఆక్వా చెరువులను నిలుపుదల చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని భాజపా జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ డిమాండ్ చేశారు. బి.దొడ్డవరంలో మండల శాఖ అధ్యక్షుడు భైరిశెట్టి దుర్గారామకృష్ణ అధ్యక్షతన సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బి.దొడ్డవరంలో అస్తవ్యస్తంగా ఉన్న పాటురేవులను చక్కదిద్దేలా చూడాలన్నారు. సమావేశంలో ఎన్.త్రిలోచనరావు, కె.తమ్మయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: రాజోలు: 80085 74174
ఉ॥ 10 - మ॥ 1 పి.గన్నవరం: 80085 74229 కొత్తపేట: 90323 93884

పూడికల తొలగింపు

స్పందనకు సందనం

ఆత్రేయపురం: బొబ్బర్లంకలోని డ్రెయిన్లలో పూడికలు పేరుకుపోవడంతో మురుగు నీటి పారుదలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ విషయాన్ని సర్పంచి నరాలశెట్టి సుబ్బలక్ష్మి వద్ద ప్రస్తావించగా సిబ్బందితో పూడికలు తీయించారు.

ప్రత్యేక కార్యాచరణ..
పటిష్ఠ నిర్వహణ

– న్యూస్‌టుడే, మామిడికుదురు

పదో తరగతి విద్యార్థులపై విద్యాశాఖ ప్రణాళికాయుతంగా దృష్టి పెట్టింది. వంద రోజుల కార్యాచరణను ఈ నెల 6 నుంచి అమలు చేస్తోంది. సెలవు రోజుల్లో కూడా ఉపాధ్యాయులు హాజరై ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గాల్లోని 124 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 2,578 మంది బాలురు, 2,674 మంది బాలికలు వెరసి 5,252 మంది పరీక్షలకు సిద్ధమవుతున్నారు.

మామిడికుదురు పాఠశాలలో పదోతరగతి విద్యార్థినులు

ప్రతి ఒక్కరిపై ప్రత్యేక దృష్టి

మార్చి 16 నుంచి పరీక్షలు ప్రారంభం కానుండటంతో ప్రతి పాఠశాలలోనూ నూరుశాతం ఉత్తీర్ణత కోసం ఉపాధ్యాయులు వంద రోజుల ప్రణాళిక ప్రకారం విద్యార్థులను మరింత తీర్చిదిద్దుతున్నారు. దీనికిగాను ప్రతిరోజూ ఒక సబ్జెక్టుపై పరీక్ష నిర్వహిస్తున్నారు. డీసీఈబీ నిపుణులు రూపొందించిన ప్రశ్నపత్రాల ఆధారంగా జవాబు పత్రాలను మూల్యాంకనం చేసి విద్యార్థులకు వచ్చిన మార్కుల వివరాలను లీప్ యాప్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేస్తున్నారు. నూరు శాతం ఉత్తీర్ణతతో పాటు ఎక్కువ మంది 600కి 600 మార్కులు సాధించేలా ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని విద్యాశాఖ అధికారులు సూచించారు.

• రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల వివరాలిలా..

మండలం	పాఠశాలలు	బాలురు	బాలికలు
రాజోలు	20	452	551
మామిడికుదురు	18	454	403
మలికిపురం	21	416	431
సఖినేటిపల్లి	20	281	335
పి.గన్నవరం	17	381	379
అంబాజీపేట	13	283	280
అయినవిల్లి	15	311	295

ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నాం

పదో తరగతిలో వంద రోజుల ప్రత్యేక తరగతుల ప్రణాళిక పటిష్ఠంగా అమలవుతోంది. ఎప్పటికప్పుడు వీటిపై పరిశీలన చేస్తూ అవసరమైన కార్యాచరణ చేస్తున్నాం. ప్రతి సబ్జెక్టుకు రివిజన్ టెస్టులు నిర్వహిస్తున్నాం. ప్రతి విద్యార్థిపై దృష్టి పెట్టి సందేహాలు నివృత్తి చేయడంతో పాటు వీడియో, ఆడియో పాఠాలతో మరింత తీర్చిదిద్దుతున్నాం. - షేక్ సలీంబాషా, డీఈవో, బి.హనుమంతరావు, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్

విమానయాన సంక్షోభానికి త్వరలో పరిష్కారం

కొత్తపేట, న్యూస్‌టుడే: దేశవ్యాప్తంగా నెలకొన్న విమానయాన సంస్థల సంక్షోభ పరిస్థితి క్రమంగా సద్దుమణుగుతోందని, త్వరలోనే పూర్తిస్థాయిలో పరిష్కారం కానుందని తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం అన్నారు. సోమవారం కొత్తపేటలో ఆయన మాట్లాడుతూ మంత్రి నారా లోకేశ్, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు సమర్థతపై వైకాపా నాయకుల విమర్శలను ఖండిస్తున్నామన్నారు. మాజీ మంత్రి జోగి రమేశ్ మద్యం కుంభకోణంలో దొరికిపోయి రిమాండ్‌కు వెళ్లిన సంగతి రాష్ట్రంలో అందరికీ తెలుసని, దానికి కులాన్ని అడ్డు పెట్టుకుని ఆ పార్టీ నేతలు మాట్లాడటం సరికాదని వ్యాఖ్యానించారు.

సమస్యలపై శాసనమండలిలో ప్రస్తావిస్తా

అంబాజీపేట: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులతో పాటు ఉపాధ్యాయ సమస్యలపై శాసనమండలిలో గళం విప్పుతానని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బి.గోపిమూర్తి స్పష్టం చేశారు. అంబాజీపేట మండలం గంగలకుర్రుఅగ్రహారం ఉన్నత పాఠశాలను ఆయన సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం తయారీ నిర్వాహకులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయనకు వివరించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. యూటీఎఫ్ నాయకులు జీవీ రమణ, అప్పారి శశికుమార్, ఇన్‌ఛార్జి హెచ్ఎం సీతారాం పాల్గొన్నారు.

విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్సీ బి.గోపిమూర్తి

మత్స్యకారుల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

మలికిపురం, న్యూస్‌టుడే: మత్స్యకారులు ఆర్థికంగా ఎదగడమే లక్ష్యంగా ప్రభుత్వం పలు పథకాలు ప్రవేశపెడుతోందని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. విశ్వేశ్వరాయపురంలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నియోజకవర్గంలోని పది సంఘాలకు మంజూరైన రూ.25.40 లక్షల మొత్తానికి నమూనా చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో అగ్నికుల క్షత్రియ సంఘ నాయకులు బర్రే శ్రీను, పొన్నాల ప్రభ, మత్స్యకార సంఘాల నాయకులు సంకరపు ఆదినారాయణ, ఇల్లింగి వెంకటరమణ, అర్జునరావు, కొల్లు రాము, తిరుమాని ఆచార్యులు, ఎంపీపీలు సత్యవాణి, శ్రీదుర్గ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

నమూనా చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

అన్నదాతల ఆదాయం పెంచడమే లక్ష్యం

రావులపాలెం గ్రామీణం, న్యూస్‌టుడే: రైతులకు ఆదాయ మార్గాలు పెంచడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం అరటి మార్కెట్‌యార్డులో సొసైటీ అధ్యక్షుడు కె.వి.సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎరువుల దుకాణాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. రైతులకు ఎరువులను పంపిణీ చేశారు. వ్యవసాయంలో ఖర్చులను తగ్గించడానికి సాంకేతికతను వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం మార్కెట్ యార్డును పరిశీలించి డ్రెయినేజీ, షాపింగ్ కాంప్లెక్స్, వేబ్రిడ్జి నిర్మాణాలకు ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, తెలుగు యువత జిల్లా అధ్యక్షులు చిలువూరి సతీష్‌రాజు, సీనియర్ నాయకుడు గుత్తుల రాంబాబు, రాష్ట్ర డైరెక్టర్ కేతా శ్రీను, కొప్పిశెట్టి ప్రసాద్, జక్కంపూడి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

రైతుకు ఎరువులను అందిస్తున్న ఎమ్మెల్యే బండారు

14న హిందూ సమ్మేళనం నిర్వహణ

మామిడికుదురు, న్యూస్‌టుడే: రాష్ట్రీయ స్వయం సేవక్ నూరేళ్లు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని హిందూ సమ్మేళనాన్ని ఈ నెల 14న గోగన్నమఠం వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. దీనికి సంబంధించిన కరపత్రాలను ఆలయ ప్రాంగణంలో నిర్వాహకులు సోమవారం ఆవిష్కరించారు. శృంగవృక్షం పీఠాధిపతి సాయిదత్త నాగానందసరస్వతి విశిష్ట అతిథిగా విచ్చేయనున్నట్లు తెలిపారు.

ఉత్తమ పురస్కారం ప్రదానం

అంబాజీపేట, న్యూస్‌టుడే: అంబాజీపేట పెద్దవీధిలోని శ్రీలక్ష్మి అడ్వాన్స్ నేచర్ ఫిజియోథెరపీ రిహాబిలిటేషన్ ఆసుపత్రి వైద్యుడు హనుమనాయక్ ఉత్తమ ఫిజియోథెరపిస్టు పురస్కారాన్ని అందుకున్నారు. అమలాపురం కిమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో సదరన్ ఫిజియో వార్షిక పరిశోధన, సాంస్కృతిక సమావేశం సోమవారం జరిగింది. లేజర్ ఫిజియోథెరపీతో అనేక మందికి వైద్యసేవలు అందించినందుకు గాను హనుమనాయక్ ఈ పురస్కారం అందుకున్నారు.

కాలువ నిండా గుర్రపుడెక్క

సిరిపల్లి, మాగం గ్రామాల్లోని విలస కాలువలో తూడు, గుర్రపుడెక్క పేరుకుపోయి సాగునీటి పారుదలకు ఆటంకం కలుగుతోందని స్థానిక రైతులు వాపోతున్నారు. రబీ నారుమళ్లకు ఇబ్బందులు తప్పవని ఆందోళన చెందుతున్నారు. పరిశీలించి పూడికలు తొలగించే విధంగా చర్యలు చేపడతామని వ్యవసాయాధికారి శోభ తెలిపారు. – న్యూస్‌టుడే, అయినవిల్లి

గుంతలతో తప్పని అవస్థలు

రావులపాలెం వద్ద హైవే నుంచి రావులపాడు మీదుగా వెళ్లే ప్రధాన రహదారిపై పెద్దపెద్ద గోతులు ఏర్పడటంతో అటుగా ప్రయాణించేవారు ఇబ్బందులు పడుతున్నారు. గోతుల్లో పడి ద్విచక్ర వాహనదారులు గాయాల పాలవుతున్నారు. పంచాయతీ కార్యదర్శి దుర్గాప్రసాద్ వద్ద సమస్యను ప్రస్తావించగా గుంతలను పూడ్చి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. – న్యూస్‌టుడే, రావులపాలెం గ్రామీణం

రక్షణగోడ విరిగి.. అగాధంగా మారి

మామిడికుదురు నుంచి కొమరాడ వైపు వెళ్లే రహదారిలో బైపాస్‌కు సమీపంలో గతంలో రక్షణగోడ విరిగి పడిపోయిన చోట రంధ్రం పడి క్రమేణా అగాధంగా మారడంతో వాహనచోదకులు, స్థానికులు ఆందోళన చెందుతున్నారు. రాత్రి సమయాల్లో మరింత కలవరపెడుతోందని బెంబేలెత్తిపోతున్నారు. ఏడు గ్రామాల ప్రజలకు ఇదే ప్రధాన రహదారి కావడంతో రద్దీ ఎక్కువగా ఉంటోంది. పరిశీలించి అక్కడ అవసరమైన రక్షణ చర్యలు చేపడతామని ర.భ. ఏఈఈ సురేష్ తెలిపారు. – న్యూస్‌టుడే, మామిడికుదురు

నిర్మించారు.. వదిలేశారు

అంతర్వేది దేవస్థానం గ్రామంలో నిర్మించిన వెల్‌నెస్ కేంద్రం నిరుపయోగంగా వదిలేయడంతో శిథిలమయ్యే ప్రమాదం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతర్వేదికర, పల్లిపాలెం, అంతర్వేది దేవస్థానం ప్రజలకు సేవలు అందించడానికి మూడేళ్ల కిందటే దీనిని నిర్మించారు. టైల్స్ వేసి మరుగుదొడ్లు నిర్మించాల్సి ఉంది. గుత్తేదారుడికి బిల్లులు ఇవ్వలేదనే నెపంతో పనులు ఆపేశారు. దీనిపై ఈవోపీఆర్డీ సూర్యనారాయణను వివరణ కోరగా పరిశీలించి నిర్మాణం పూర్తి చేయిస్తామన్నారు.– న్యూస్‌టుడే, అంతర్వేది

కూలితే ప్రమాదమే..

పుల్లేటికుర్రు పంచాయతీ పరిధి నెహ్రూనగర్ ప్రాథమిక పాఠశాల ఎదురుగా ఉన్న రక్షిత తాగునీటి ట్యాంకు శిథిలమైంది. 30 ఏళ్ల క్రితం దీన్ని నిర్మించారు. ఈ పరిసరాల్లోనే విద్యార్థులు ఆడుకుంటారు. దీన్ని తక్షణం తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై సర్పంచి జల్లి బాలరాజును వివరణ కోరగా చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, అంబాజీపేట

కవి వెంకట్‌కు సత్కారం

అంబాజీపేట, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్రంలోని సూర్యాపేటలో శ్రీశ్రీ కళావేదిక 159వ జాతీయ శతాధిక కవి సమ్మేళనంలో అంబాజీపేటకు చెందిన సామాజిక కవి పొలమూరి వెంకట్‌ను సోమవారం ఘనంగా సత్కరించారు. రోడ్డు ప్రమాదాలపై కవితా గానం చేసినందుకు ఈ సత్కారం దక్కింది. సంస్థ సీఈవో కత్తిమండ ప్రతాప్ ఆధ్వర్యంలో జరిగిన కవి సమ్మేళనంలో పోతుగంటి వీరాచారి, జి.ఈశ్వరభూషణం, టి.పార్థసారథి, సాదే బాలచందర్ పాల్గొన్నారు.

వెంకట్‌ను సత్కరిస్తున్న శ్రీశ్రీ కళావేదిక ప్రతినిధులు

ఎస్టీయూ నూతన కార్యవర్గం ఎన్నిక

అంబాజీపేట, న్యూస్‌టుడే: అంబాజీపేట మండల శాఖ ఎస్టీయూ నూతన అధ్యక్షుడిగా కుంపట్ల వెంకటసుబ్బారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానికంగా సోమవారం జరిగిన ఎన్నికల్లో ప్రధాన కార్యదర్శిగా ఎండి.ఎన్.ఎం.షరీఫ్, ఆర్థిక కార్యదర్శిగా బళ్ల శివను ఎన్నుకున్నారు. ఎస్టీయూ రాష్ట్ర కన్వీనర్ బోనం వెంకటగంగాధర్, నాయకులు వీరిని అభినందించారు.

ఎన్నికైన ప్రతినిధులు

దీర్ఘకాలిక వెతల పరిష్కారానికి ఆందోళన

మామిడికుదురు, రాజోలు, మలికిపురం, పి.గన్నవరం, అయినవిల్లి, అంబాజీపేట, ఆత్రేయపురం, ఆలమూరు, న్యూస్‌టుడే: దీర్ఘకాలికంగా వేధిస్తోన్న సమస్యలకు పరిష్కారాన్ని కోరుతూ రాష్ట్ర వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో జిల్లాలోని డీసీసీబీ శాఖల వద్ద సోమవారం ఆందోళన వ్యక్తం చేశారు. 36 జీవోను అమలు చేయాలని, 2019 తర్వాత చేరిన ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, ఉద్యోగ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచాలని, సంఘాల లాభనష్టాలతో సంబంధం లేకుండా వేతనాలు ఇవ్వాలని కోరారు. స్థానిక మేనేజర్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. నిరసనలో భాగంగా ఈ నెల 16న జిల్లా కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

మామిడికుదురులో వినతిపత్రం అందిస్తున్న ఉద్యోగులు

పి.గన్నవరంలో..

ఆత్రేయపురంలో..

విద్యాశాఖ కార్యాలయ నిర్మాణానికి సమకూరిన స్థలం

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: ఆత్రేయపురం విద్యాశాఖ కార్యాలయ భవన నిర్మాణానికి ఎట్టకేలకు స్థలం సమకూరింది. దీనికోసం ప్రభుత్వం రూ.55 లక్షలు విడుదల చేసినా ఇప్పటివరకు నిర్మాణానికి నోచుకోలేదు. బండారు సత్యానందరావు, వాడపల్లి దేవస్థానం ఛైర్మన్ ముదునూరి వెంకటరాజులు సోమవారం సాయంత్రం పరిశీలన చేసి తహసీల్దార్ కార్యాలయం చెంతన ఉన్న మిగులు స్థలం అనువుగా ఉందని గుర్తించారు. ఆర్డీవో శ్రీకర్, తహసీల్దార్ టీఆర్ రాజేశ్వరరావు, ఎంఈవో ప్రసాదరావు పాల్గొన్నారు.

పవన్ నాయకత్వంపై విశ్వాసం: గిడ్డి

పి.గన్నవరం, న్యూస్‌టుడే: వైకాపాకు భవిష్యత్తు లేదని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. నిజాయతీతో పార్టీని ప్రజాసేవ కోసం ముందుకు నడిపిస్తోన్న ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నాయకత్వం పట్ల ప్రజల్లో ఎనలేని విశ్వాసం ఉందన్నారు. సోమవారం పి.గన్నవరంలోని క్యాంపు కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో అంబాజీపేట, మామిడికుదురు మండలాలకు చెందిన వైకాపా నాయకులు అధిక సంఖ్యలో జనసేనలో చేరారు. వీరికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. రాష్ట్ర జలవనరుల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు, నగరం ఎ.ఎం.సి. ఛైర్మన్ పెనుమాల లక్ష్మి, సాధనాల శ్రీవెంకటసత్యనారాయణ, జాలెం శ్రీనివాసరాజా, దొమ్మేటి సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జనసేనలో చేరిన వారితో ఎమ్మెల్యే సత్యనారాయణ

వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేయడం తగదు: బొత్స

రావులపాలెం పట్టణం, న్యూస్‌టుడే: వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేయడం దారుణమని మాజీ మంత్రి, వైకాపా నేత బొత్స సత్యనారాయణ అన్నారు. రావులపాలెం సీఆర్సీలో సోమవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జులు, నాయకులతో కలిసి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. దీనికి బొత్స ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పార్టీ బలోపేతంపై చర్చించారు. మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయడాన్ని నిరసిస్తూ కోటి సంతకాల కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. గత 18 నెలల్లో రాష్ట్ర ప్రభుత్వం ఏ రంగంలోనూ వృద్ధి చెందలేదన్నారు. ఉపాధిహామీ పనిదినాలు తగ్గించారన్నారు. పంటలకు కనీస మద్దతు ధర లేదన్నారు. ప్రజల తరఫున పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు తోట త్రిమూర్తులు, బొమ్మి ఇజ్రాయిల్, కుడుపూడి సూర్యనారాయణ, జడ్పీ ఛైర్మన్ విపర్తి వేణుగోపాల్, మాజీ మంత్రులు పినిపే విశ్వరూప్, గొల్లపల్లి సూర్యారావు, మాజీ ఎమ్మెల్యేలు పొన్నాడ సతీష్, పాముల రాజేశ్వరి, నాయకులు జక్కంపూడి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతీ సంప్రదాయాలను కాపాడాలి

మలికిపురం: హిందూ సమాజ పరిరక్షణే మనందరి బాధ్యతని అంతర్వేది వశిష్ఠ సేవాశ్రమం వ్యవస్థాపకులు ప్రసాద్‌స్వామీజీ పేర్కొన్నారు. ఆర్ఎస్ఎస్ మలికిపురం ఖండ ఆధ్వర్యంలో విశ్వేశ్వరాయపురంలోని బలుసులమ్మ, నూకాలమ్మ, కనకదుర్గమ్మ, మహాలక్ష్మమ్మ ఆలయ ప్రాంగణంలో ముదునూరి ప్రసాదరాజు అధ్యక్షతన సోమవారం జరిగిన హిందూ సమ్మేళనంలో ఆయన విశిష్ఠ అతిథిగా ప్రసంగించారు. సంస్కారవంతమైన జీవన విధానాన్ని పాటిస్తూ హిందూ సంస్కృతీ సంప్రదాయాలను కాపాడాలని కోరారు. దేశభక్తితో హిందుత్వాన్ని పరిరక్షించుకోవాలని ముఖ్య అతిథి మంగెన వెంకటస్వప్రసాద్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గోదావరి విభాగ్ సంపర్క ప్రముఖ్ బులుసు జగదీశ్, ఆయా గ్రామాల నుంచి పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

ప్రసంగిస్తున్న ప్రసాద్‌స్వామీజీ

శివారు కాలనీలు..
అసౌకర్యాలతో బేజారు

– న్యూస్‌టుడే, రాజోలు, మలికిపురం

రాజోలు నియోజకవర్గంలోని పలు కాలనీల్లో దుర్భర పరిస్థితులు నెలకొన్నాయి. కనీస అవసరాలైన తాగునీరు, రోడ్లు లేకపోవడంతో ఏళ్ల కాలంగా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం దృష్టిసారించి సౌకర్యాలు కల్పించాలని వేడుకుంటున్నారు.

లక్కవరం ఎన్టీఆర్ కాలనీలో ముంపునీరు

పలు మండలాల్లో..

✦ శివకోటిలోని 18 ఎకరాల కాలనీలో కొన్ని ఇళ్లకు వెళ్లడానికి రహదారి లేదు. వీధి దీపాలు వెలగడం లేదు. మురుగు కాలువ సదుపాయం లేదు. వ్యర్థాలు పేరుకుపోయి దోమలకు నిలయంగా మారింది. తాగునీరు మూడు రోజులకు ఒకసారి వస్తోంది. ✦ చింతలపల్లి, రాజోలు నున్నవారిబాడవ, సోంపల్లి, పొదలాడ, తాటిపాక, ములికిపల్లి, కాట్రేనిపాడు, చెన్నడం, కడలి గ్రామాల్లోని కాలనీల్లో రెండు రోజులకు ఒకసారి తాగునీరు వస్తోంది. వర్షాలకు ఇళ్లన్నీ ముంపుబారిన పడుతున్నాయి. సోంపల్లి నుంచి చింతలపల్లి వరకు మురుగు కాలువ దుర్భరంగా ఉంది. ✦ లక్కవరం ఎన్టీఆర్ కాలనీలో డ్రెయినేజీ సౌకర్యం లేక మురుగునీరు ఎక్కడికక్కడే నిలిచిపోతోంది. ✦ రామరాజులంక గణపయ్యగారి మెరక, చర్చిపేట, ముద్దలవారిమెరక, తూర్పుపాలెంలో ముత్యాలవారి మెరక, మేడిచర్లపాలెం ఏపీఎస్ కాలనీ, చింతలమోరి, శంకరగుప్తం, పడమటిపాలెం, కేశనపల్లి గ్రామాల్లో తాగునీరు, రోడ్లు, మురుగు కాలువలను నిర్మించాలి. ✦ మోరి, వీవీమెరక చేనేత కాలనీల ప్రజలు ముంపునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. అంతర్వేది, కేశవదాసుపాలెం, గొంది గ్రామాల్లో తాగునీరు, డ్రెయినేజీ సమస్యలను ఎదుర్కొంటున్నారు.

సౌకర్యాల కల్పనకు కృషి

కాలనీల్లో సౌకర్యాల కల్పనకు కృషి చేస్తాం. తాగునీరు, డ్రెయినేజీ, రోడ్ల నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపడతాం. – కె.వెంకటేశ్వరరావు, లక్ష్మీకల్యాణి, ఎంపీడీవోలు, రాజోలు, మలికిపురం

(c) eenadu

అమలాపురం
• అమలాపురం • ముమ్మిడివరం

పురపాలక కమిషనర్‌గా రాఘవన్

యానాం, న్యూస్‌టుడే: యానాం పురపాలక కమిషనర్‌గా పుదుచ్చేరి పరిశ్రమలు, వాణిజ్యశాఖ సూపరింటెండెంట్ ఐ.రాఘవన్‌ను నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ శరత్ చౌహాన్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. 20 మంది అధికారులను అడ్‌హాక్ ప్రాతిపదికన ఉద్యోగోన్నతి కల్పించి బదిలీలు చేసినట్లు సీఎస్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రస్తుతం యానాం మున్సిపల్ కమిషనర్‌గా ఆరోగ్యశాఖ సూపరింటెండెంట్ అద్దంకి మల్లికార్జునరావు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆయన జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ శిక్షణ కోసం ప్రస్తుతం పుదుచ్చేరి వెళ్లారు. 14 మంది పీసీఎస్ అధికారులకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ సీఎస్ శరత్‌చౌహాన్ మరో ఉత్తర్వు జారీ చేశారు.

రైతుబజార్‌లో నిన్నటి ధరలు (కిలోకు)

అమలాపురం పట్టణం: టమాట - 38, వంకాయలు నలుపు - 36, వంకాయలు తెలుపు - 30, బెండకాయలు - 58, పచ్చిమిర్చి - 45, కాకరకాయ - 45, బీరకాయలు - 56, కాలీఫ్లవర్ - 26, క్యాబేజీ - 32, క్యారెట్ - 58, దొండకాయలు - 30, బంగాళదుంపలు - 25, ఉల్లిపాయలు - 18, 26, గోరుచిక్కుళ్లు - 45, దోసకాయలు - 26, చిక్కుడుకాయలు - 60, చేమదుంపలు - 43, కంద - 45, బీట్‌రూట్ - 48, కీరదోసకాయలు -35, అల్లం - 75, క్యాప్సికం - 90, చిలకడదుంపలు - 45, గుమ్మడి -30, ఉసిరి - 80, ముల్లంగి - 45, కరివేపాకు -75, నిమ్మకాయలు - 30, మామిడికాయ - 70. **ఒక్కొక్కటి చొప్పున...** అనబకాయ - 22, పొట్లకాయ -25, అరటికాయ -6, మునగకాయ -15, ఆకుకూరలు కట్ట - 10, 15, కొత్తిమీర కట్ట - 15, కొబ్బరికాయ - 20.

బాధితుల సమస్యలను పరిష్కరిస్తాం

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: అర్జీదారుల సమస్యలను పరిష్కరించేలా పోలీసు అధికారులు ఆదేశాలు జారీ చేశామని జిల్లా ఎస్పీ రాహుల్ మీనా పేర్కొన్నారు. అమలాపురం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ప్రజా సమస్య పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఎస్పీతో పాటు ఏఎస్పీ ఏవీఆర్‌పీబీ ప్రసాద్ 36 మంది నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ప్రతి అర్జీదారుతో ముఖాముఖి మాట్లాడారు.

సమస్యను వింటున్న ఎస్పీ రాహుల్‌మీనా

డీటీ లలితకు వినతిపత్రం ఇస్తున్న చల్లపల్లి రైతులు

బీడు భూములుగా మారుతున్నాయి

ఉప్పలగుప్తం, న్యూస్‌టుడే: గత ఏడేళ్లుగా డ్రెయిన్ల నుంచి ముంపు దిగక చల్లపల్లిలోని మట్టచెరువు, ఊరచేను, సైదు కాలువ ఆనుకుని ఉన్న పొలాలు బీడు భూములను తలపిస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. డ్రెయిన్లను బాగుచేసి సాగుకు చేయూత ఇవ్వాలని కోరుతూ సోమవారం తహసీల్దారు కార్యాలయంలో డీటీకి వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం పొలాల్లో నీరు దిగక పోవడంతో జమ్మి, తూడు, గుర్రపుడెక్క పెరిగిపోయి బీడువారుతున్నాయన్నారు. కొల్లు శ్యామ్, కుంపట్ల చౌడేశ్వరరావు, మాచరరావు, రామారావు, వెంకటనాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల నివేదన

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: సమస్యలను విని, వాటికి సరైన పరిష్కార మార్గాలు చూపాలని పలువురు అర్జీదారులు కలెక్టర్ మహేశ్ కుమార్‌కు వినతులు అందజేశారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్, ఇతర అధికారులు వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పలువురు తమ ఆవేదనను అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు.

అడ్డుకట్ట వేయాలి

మేం అల్లవరం మండలం సామంతకుర్రుకు చెందిన రైతులం. మా గ్రామ శివారులో వాసాలతిప్ప డ్రెయిన్‌కు డిసెంబరు మొదటి వారంలో అడ్డుకట్ట వేసేవారు. గత ఏడాది నుంచి నిర్లక్ష్యంగా వదిలేశారు. దీంతో డ్రెయిన్ నుంచి ఉప్పునీరు పంట కాలువల ద్వారా పంట పొలాల్లోకి చేరుతోంది. దీంతో సుమారు 2వేల ఎకరాల చేపల చెరువులు, 500 ఎకరాల వరి పొలాలు ఉప్పుబారిపోతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి మా గ్రామం పరిధిలో డ్రెయిన్‌కు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నాం. – సామంతకుర్రు రైతులు

కనీస మద్దతు ధర కల్పించాలి

మేమంతా జిల్లాలో కొబ్బరి పంటపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాం. ప్రస్తుతం వెయ్యి కొబ్బరికాయల ధర రూ.25వేల నుంచి రూ.13వేలకు పతనమైంది. తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి మార్కెఫెడ్ ద్వారా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలి. కనీస మద్దతు ధర రూ.20 వేలు ఉండేలా కృషి చేయాలని కోరుతున్నాం.

– భారతీయ కిసాన్ సంఘ్ నాయకులు

ప్రమాదం పొంచి ఉంది..

ఐ.పోలవరం మండలంలో పోక్సో కేసులో ప్రధాన నిందితుడు నెల రోజులు కాకుండానే బెయిల్‌పై వచ్చి గ్రామంలో తిరుగుతూ భయబ్రాంతులకు గురి చేస్తున్నాడు. అతనికి శిక్ష పడేలా చేయడంలో ప్రభుత్వ లాయర్లు విఫలమయ్యారు. అతడు మా ఇంటి పరిసరాల్లో యథేచ్ఛగా సంచరిస్తున్నాడు. నేను, బాధితురాలైన నా కుమార్తె ఒంటరిగా ఉంటున్నాం. అతని నుంచి ప్రమాదం పొంచి ఉంది. ఉన్నతాధికారులు స్పందించి అతని బెయిల్ రద్దు చేయాలని అధికారులను కోరాం.

– బాధితురాలి తల్లి, ప్రజా సంఘాల నాయకులు

కాలువ ఆధునికీకరణకు వినతి

మేమంతా అల్లవరం మండలం కొమరగిరిపట్నం రైతులం. గ్రామంలో 4వ నంబరు కాలువపై ఆధారపడి సుమారు 200 ఎకరాల ఆయకట్టు ఉంది. కొంత కాలంగా ఈ కాలువ నిర్వహణ సక్రమంగా లేదు. సాగునీరు పూర్తి స్థాయిలో రావడం లేదు. దీంతో పొలాలు బీడు బారిపోతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి సాగునీరు అందించాలని కోరుతున్నాం.

– కొమరగిరిపట్నం రైతులు

ఆక్రమణ తొలగించాలని కలెక్టర్‌కు ఫిర్యాదు

కాట్రేనికోన: పల్లంకుర్రులోని సాపేవారి పేటలో పంట కాలువపై ఆక్రమణ తొలగించాలని సాపే శ్రీనివాసరావు, గిడ్డి వెంకటరమణ, విజయలక్ష్మి సోమవారం కలెక్టరు ఫిర్యాదు చేశారు. తమ ఇంటి ముందున్న పంటకాలువను గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆక్రమించి కొంతకాలం క్రితం తాటాకిల్లు నిర్మించాడన్నారు. దీనిపై జలవనరులశాఖ అధికారులకు ఫిర్యాదుచేసినా స్పందించలేదన్నారు. ఆక్రమణను తొలగించి న్యాయం చేయాలని కోరారు.

పేద కుటుంబాలకు ఆర్థిక సాయం

అల్లవరం: కొమరగిరిపట్నంలో డీబీఆర్సీ దళిత బహుజన రిసోర్స్ సెంటర్ తరఫున పేద కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.4500 చొప్పున ఆర్థిక సాయాన్ని సోమవారం అందించారు. ఇటీవల సంభవించిన మొంథా తుపాను ప్రభావంతో ఇబ్బందులు ఎదుర్కొన్న వారికి ఈసాయం అందిస్తున్నట్లు సంస్థ ప్రతినిధి దేవకుమార్ తెలిపారు. రాష్ట్ర సమన్వయకర్త హేమలత పాల్గొన్నారు.

బాధితుడికి చేయూత..

ఉప్పలగుప్తం: అనారోగ్యంతో బాధపడుతున్న సన్నవిల్లికి చెందిన దోనిపాటి సత్యనారాయణకు గుడ్‌సీడ్ ఫౌండేషన్ అధినేత కుంచే రమణారావు చేయూత అందించారు. బాధితునికి రూ.10వేలు సహాయం సోమవారం ఇంటివద్ద అందజేశారు.

సేంద్రియ పంటలతో ఆరోగ్యం

కాట్రేనికోన: సేంద్రియ పద్ధతిలో పండించిన కూరగాయలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని తెదేపా రాష్ట్ర కార్యదర్శి నాగిడి నాగేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సేంద్రియ కూరగాయల దుకాణాన్ని పరిశీలించిన అనంతరం మాట్లాడారు. డీసీ ఛైర్మన్ ఆకాశం శ్రీను, ఏపీ సడా డైరెక్టర్ విత్తనాల బుజ్జి, రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: చిన్నారులపై జరుగుతున్న అఘాయిత్యాలు ఆందోళన కలిగిస్తున్నాయని.. విద్యార్థులు ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ మానటరింగ్ కమిటీ సభ్యురాలు పుణ్యమంతుల రజిని అన్నారు. ముమ్మిడివరం మండలం అనాతవరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సోమవారం ఆమె సందర్శించారు. చిన్నారులపై అఘాయిత్యాలకు పాల్పడుతున్న వారిలో ఎక్కువ మంది పరిచయస్థులు, బంధువులే అన్నారు. ప్రతి విషయాన్ని విద్యార్థులు తమ తల్లిదండ్రులతో పంచుకోవాలని సూచించారు. 'గుడ్ టచ్.. బ్యాడ్ టచ్'లపై వారికి అవగాహన కల్పించారు.

అనాతవరంలో మాట్లాడుతున్న రజిని

ఆదిలోనే వదిలేశారు..!

జిల్లా కేంద్రం అమలాపురంలోని ఆర్టీసీ నూతన బస్టాండ్ భవన నిర్మాణానికి వేసిన శిలాఫలకమిది. గత వైకాపా పాలనలో అప్పటి మంత్రి పినిపే విశ్వరూప్ 2024లో అత్యాధునిక బస్టాండ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రూ.5 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించేందుకు నమూనా తయారు చేయించారు. అనంతరం అడుగు ముందుకు పడలేదు. నిత్యం రద్దీగా ఉండే అమలాపురం బస్టాండ్‌కు నూతన భవనం ఎంతో అవసరమని ఈ ప్రభుత్వంలోనైనా నిర్మించాలని పలువురు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, అమలాపురం గ్రామీణం

ఎక్కడ చూసినా చెత్తకుప్పలే!

అమలాపురంలోని శ్రీరామపురం నుంచి గొల్లగూడెం వెళ్లే మార్గంలో రోడ్డుపై, మురుగుకాలువలలో చుట్టుపక్కలవారు చెత్త పడేస్తున్నారు. పారిశుద్ధ్య కార్మికులు సకాలంలో తొలగించకపోవడంతో రోడ్డు డంపింగ్ యార్డ్‌లా మారుతోంది. ఆ ప్రాంతంలో దుర్వాసన రావడంతోపాటు దోమలు విపరీతంగా పెరిగిపోతున్నాయని ఫిర్యాదులు అందుతున్నాయి. రోడ్డుపై చెత్త వేస్తే జరిమానా విధిస్తామని మున్సిపల్ కమిషనర్ వి. నిర్మల్‌కుమార్ హెచ్చరించారు. – న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం

రహదారి.. అధ్వానంగా మారి

కాట్రేనికోన మండలం పల్లంకుర్రులోని ఆదిఆంధ్రాపేట నుంచి చీకురుమెల్లివారిపేటకు వెళ్లే సీసీ రోడ్డు పరిస్థితి ఇదీ. మధ్యలో పగుళ్లు ఏర్పడి అధ్వానంగా మారింది. సుమారు నాలుగేళ్ల క్రితం నిర్మించిన ఈ రోడ్డు మధ్యలో 30 మీటర్ల మేర పగుళ్లు ఏర్పడ్డాయి. ఇలా వదిలేస్తే మరింత అధ్వానంగా మారుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి అవసరమైన మరమ్మతులు చేపట్టాలని వారు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కాట్రేనికోన

మురుగు కాలువలు ఏవీ..?

ఉప్పలగుప్తం మండలం గొల్లవిల్లి పంచాయతీ పరిధిలోని ఎన్టీఆర్ కాలనీ వర్షం వస్తే ముంపునకు గురవుతోంది. రహదారులు జలమయమై చెరువులను తలపిస్తున్నాయి. రోజుల తరబడి నీరు నిలువ ఉండి దోమలు, దుర్వాసన వ్యాప్తి చెందుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి కాలనీలో మురుగు కాలువల నిర్మాణం చేపట్టాలని కాలనీ వాసులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, ఉప్పలగుప్తం

ఐ.పోలవరంలో విజేతలకు బహుమతి అందజేత

విద్యార్థులకు బహుమతుల ప్రదానం

ఐ.పోలవరం: మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. సమగ్ర శిక్ష ఏఎంఓ పి.రాంబాబు, ప్రత్యేకాధికారి కృష్ణ ముఖ్య అతిథులుగా పాల్గొని దివ్యాంగుల హక్కులు.. వారికి ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను వివరించారు. పలు పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఎంఈఓ-1 నలమలమిల్లి కొండారెడ్డి, ఎంఈఓ-2 వీధి సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: ఉప్పలగుప్తం భవిత కేంద్రంలో సోమవారం అంతర్జాతీయ దివ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో డి.కృష్ణ, ఎంఈవోలు శంకరరావు, సత్యకృష్ణ, ఆర్ఐ మీరాసాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ సేవలు అభినందనీయం

అమలాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: భట్లపాలెం బీవీసీ ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం విద్యార్థులు చేస్తున్న సేవలు అభినందనీయమని సర్పంచి దాసరి అరుణ అన్నారు. పేరూరులో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం ఇంటింటా సర్వే నిర్వహించారు. వ్యక్తిగత వివరాలను నమోదు చేశారు. ఈ సందర్భంగా సేవా కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని సర్పంచి అరుణ కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ జె.వి.జి.రామారావు, ఏవో కృష్ణారావు, కార్యదర్శి సుజాత, పీడీ రవిసుధీర్, ప్రోగ్రాం అధికారి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

ధ్యానమార్గం అనుసరణీయం

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం.. రాజయోగ ధ్యాన మార్గంలో అనేక మందికి ప్రేరణగా నిలుస్తోందని బీకే సరోజ అన్నారు. అమలాపురం రవణంవీధిలోని ఓం శాంతి కేంద్రంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఇంఛార్జ్ బీకే రజని ఆధ్వర్యంలో సోమవారం 37వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రజా, ఆధ్యాత్మిక సేవలలో 20 ఏళ్లు పూర్తి చేసుకున్న 82 మంది బ్రహ్మకుమారీలకు జ్ఞాపికలను అందించి సత్కరించారు. మీరా, లక్ష్మి, స్వరూప, చంద్రకళ, భవాని తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం ఓం శాంతి కేంద్రంలో సత్కారం పొందిన బ్రహ్మకుమారీలు

ఇంట్లో చొరబడి గొలుసు చోరీ

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: అమలాపురానికి చెందిన గుబ్బల చంద్రావతి మెడలోని మూడు కాసుల బంగారం గొలుసును ఓ వ్యక్తి చోరీ చేశాడు. ఆదివారం అర్ధరాత్రి ఇంటి ఆవరణలోని బాత్‌రూమ్ వద్దకు వెళ్తుండగా అతడు వచ్చి గొలుసు లాక్కొని పరారయ్యాడని ఆమె పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని అమలాపురం పట్టణ సీఐ వీరబాబు తెలిపారు.

ప్రదర్శనకు మొక్కలు ఏవీ..

యానాం, న్యూస్‌టుడే: జనవరిలో యానాం వ్యవసాయశాఖ నిర్వహించే ఫల, పుష్ప ప్రదర్శన కొనుగోలు చేసి తెచ్చే మొక్కలపైనే పూర్తిగా ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది. ఏటా కనీసం 25వేల నుంచి 30వేల మొక్కల్ని స్థానిక నర్సరీలో పెంచి ప్రదర్శన కోసం సిద్ధం చేసేవారు. ఈ ఏడాది సెప్టెంబరులో మొక్కలు కోసం విత్తనాలు తెచ్చి బొటానికల్ గార్డెన్లో పెంపకం ప్రారంభించారు. అక్టోబరు 29న కోనసీమ వద్ద తీరం తాకిన మొంథా తుపాను సమయంలో వీచిన పెనుగాలులు, వర్షాలకు బంతి, చామంతి తదితర మొక్కలకు నష్టం వాటిల్లింది. కేవలం మూడు వేల లోపు మొక్కలు మాత్రమే మిగిలాయి. ఉన్నవాటినే వ్యవసాయశాఖ డిప్యూటీ డైరెక్టర్ చిక్కాల జోగి రాజు నేతృత్వంలో సిబ్బంది పెంచే ప్రయత్నం చేస్తున్నారు. ఈ ప్రదర్శనకు ప్రభుత్వం బడ్జెట్‌ను రూ.50 లక్షలకు పెంచింది. సమయాభావం వల్ల స్థానికంగా మొక్కలు పెంచడానికి వీలుకాకపోవడంతో కడియం నుంచి ఎక్కువ మొక్కల్ని తెచ్చి ప్రదర్శనను విజయవంతం చేయాలని అధికారులు యోచిస్తున్నారు.

మొక్కల్ని సిద్ధం చేస్తున్న వ్యవసాయశాఖ కార్మికులు

కరపత్రికలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, నాయకులు

ఆత్మీయ కలయిక విజయవంతానికి పిలుపు

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: మాదిగల ఆత్మీయ కలయిక గురువారం నిర్వహిస్తున్నామని, జిల్లా నుంచి అధిక సంఖ్యలో మాదిగ వర్గీయులు రావాలని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ పిలుపునిచ్చారు. అమలాపురంలోని ప్రిన్స్ వేడుకమందిరంలో మాదిగ సామాజిక వర్గ నాయకుల సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ మాట్లాడుతూ మాదిగల ఐక్యమత్యంగా ఉండాలనే లక్ష్యంతో అమలాపురం కొంకాపల్లి ఎత్తురోడ్డు వద్ద సత్తెమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో ఆత్మీయ కలయిక ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాజకీయాలకు అతీతంగా జరుగుతున్న ఈ కార్యక్రమానికి తరలి రావాలన్నారు. అనంతరం ఆత్మీయ కలయిక కరపత్రికలను ఆవిష్కరించారు. రవీంద్ర, మడికి శ్రీరాములు, నేదునూరి నతానియేలు, శ్రీనివాసరావు, భైరవమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరంలో ఆందోళన నిర్వహిస్తున్న సహకార సంఘ ఉద్యోగులు

సహకార ఉద్యోగుల ధర్నా

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: దీర్ఘకాలికంగా ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ముమ్మిడివరంలో సహకార ఉద్యోగులు సోమవారం ఆందోళన నిర్వహించారు. ముమ్మిడివరంలోని డీసీసీబీ బ్రాంచి కార్యాలయం వద్ద ఉద్యోగులు ఆందోళన చేశారు. జీవో 36ను అమలు చేయాలని, సహకార సంఘాల లాభ, నష్టాలతో సంబంధం లేకుండా జీతాలు ఇవ్వాలని తదితర డిమాండ్లతో డీసీసీబీ బ్రాంచి మేనేజర్లకు వినతిపత్రం అందజేశారు.

ఉప్పలగుప్తం: వ్యవసాయ సహకార సంఘాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని జేఏసీ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఉప్పలగుప్తం బ్రాంచి వద్ద నిరసన తెలియజేసి డీసీసీబీ బ్రాంచి మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ డైరెక్టరు ఆకుల సూర్యప్రభాకరరావు, చిక్కం లింగయ్యనాయుడు, మంచెం బాబి, కూసంపూడి శ్రీనివాసరాజు, ఆకుల గణేష్, నాగులాపల్లి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కాట్రేనికోన: దీర్ఘకాలంగా ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కాట్రేనికోన డీసీసీబీ బ్యాంకు వద్ద సహకార ఉద్యోగులు ధర్నా చేశారు. ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు వై.రామచంద్రరావు మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినా సొసైటీ ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. సత్య ప్రమేశ్వరరావు, వరహాలరాజు, వి.శంకర్, జి.వెంకట శ్రీనివాస్, నాగేంద్రకుమార్, నాని, వెంకటేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఐ.పోలవరం: మురమళ్ల డీసీసీబీ పరిధిలోని సహకార సంఘాల ఉద్యోగులు సోమవారం ధర్నా నిర్వహించారు. కొమరగిరి సొసైటీ సీఈఓ కె.శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో సహకార సంఘాల ఉద్యోగులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కాలువల్లో చెత్త వేయడంపై ఆగ్రహం

ఐ.పోలవరం, న్యూస్‌టుడే: మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం ఎంపీపీ మోర్త రాణి మిరియం జ్యోతి అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. గృహ నిర్మాణం, వ్యవసాయ, విద్య, వైద్య ఆరోగ్యం, తాగునీరు, పంచాయతీరాజ్ శాఖలకు సంబంధించి ప్రగతిపై ఆయా శాఖల అధికారులు సమావేశంలో సభ్యులకు వివరించారు. పంట కాలువల్లో ఇష్టానుసారం చెత్త, వ్యర్థాలు వేయడాన్ని అరికట్టాలని తిళ్లకుప్ప సర్పంచి కడియం తమ్మయ్య సమావేశం దృష్టికి తీసుకు వెళ్లారు. ఇలాంటి పరిస్థితిని అరికట్టడానికి పంచాయతీ కార్యదర్శులకు సూచనలు చేశామని ఎంపీడీఓ దీక్షితులు తెలిపారు. అనంతరం 2026-27 ఆర్థిక సంవత్సరానికి రూ.76,000 మిగులు అంచనాలతో బడ్జెట్‌ను ఆమోదించారు.

హెల్మెట్‌తో రక్షణ

అవగాహన కల్పిస్తున్న సీఐ ప్రశాంత్‌కుమార్

ఉప్పలగుప్తం, న్యూస్‌టుడే: వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని అమలాపురం గ్రామీణ సీఐ ప్రశాంత్ కుమార్, ఉప్పలగుప్తం ఎస్సై సీహెచ్ రాజేష్‌కుమార్ సూచించారు. సోమవారం వారు సన్నవిల్లి సెంటరు వద్ద వాహనాదారులకు హెల్మెట్ ధారణపై అవగాహన కల్పించారు. తప్పనిసరిగా లైసెన్సు ఉండాలని సూచించారు. వాహనం నడుపుతూ సెల్‌ఫోన్ మాట్లాడవద్దన్నారు.

ఇలాగైతే సమస్యలు పరిష్కారమెలా..

సర్వసభ్య సమావేశానికి డ్రెయిన్స్ అధికారుల గైర్హాజరుపై సభ్యుల ఆగ్రహం

ఉప్పలగుప్తం, న్యూస్‌టుడే: మండలంలోని ఆయకట్టుకు అనుసంధానంగా ఉన్న డ్రెయిన్లను ఆధునికీకరించకపోతే రైతులు వరి సాగుచేయలేరని పలువురు ప్రజాప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉప్పలగుప్తం మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం ఎంపీపీ డి.వీరఅచ్యుత జానకి అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. డ్రెయిన్స్, ఇరిగేషన్ అధికారులు గైర్హాజరు కావడంతో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ అధికారులను వెంటనే రప్పించాలని ఎంపీడీవో డి.కృష్ణను కోరారు. ఆయన చరవాణిలో సంప్రదించినా వారు సభకు రాకపోవడంతో సభ్యులు, అధికారుల మధ్య కొంతసేపు వాడివేడి చర్చ జరిగింది. ఎంపీడీవో జోక్యం చేసుకుని గైర్హాజరైన ఇరిగేషన్, డ్రెయిన్స్ అధికారులతో తిరిగి సమావేశం ఏర్పాటు చేస్తానని హామీ ఇవ్వడంతో సమస్య సద్దుమణిగింది. ఉప్పలగుప్తం, వానపల్లిపాలెం, కిత్తనచెరువు, చల్లపల్లి గ్రామాల్లో రెవెన్యూ, మేజర్, మైనర్ డ్రెయిన్స్ పూడికలు పెరిగి చేలల్లో ముంపునీరు దిగక ఏటా రెండు వేల ఎకరాల్లో రైతులు సాగు చేపట్టడం లేదని పేర్కొన్నారు. పలుచోట్ల డ్రెయిన్స్‌కు అడ్డంగా బరకంతో వలకట్లు ఏర్పాటు చేస్తున్నారని, దీంతో ముంపు కదలడం లేదని సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం చేలల్లో నీరు దిగక రైతులు నారుమడులు వేయలేక పోయారని పలువురు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. డ్రెయిన్స్ నుంచి ఉప్పునీరు పోటెత్తి కొబ్బరి చెట్లు దెబ్బతింటున్నాయని వాపోయారు.

వ్యవసాయాధికారి కుమార్‌బాబుకు సమస్య వివరిస్తున్న రవికుమార్

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
బ్యాంక్ స్ట్రీట్ బ్రాంచి, అమలాపురం, తూర్పుగోదావరి జిల్లా

స్వాధీనతా ప్రకటన
(చర మరియు స్థిరాస్తుల కోసం)

సెక్యూరిటైజేషన్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3తో చదువబడే సెక్షన్ 13 (2) క్రింద సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ స్ట్రీట్ బ్రాంచ్, అమలాపురం, తూర్పుగోదావరి జిల్లా యొక్క అధీకృత అధికారియగు దిగువ సంతకం దారు 29-09-2025 తేదీ గల డిమాండ్ నోటీసు జారీ చేసి ఋణగ్రహీత : శ్రీ బుదిరెడ్డి గాయత్రి సత్య సాయి శ్రీనివాస్, తండ్రి : సుబ్బారావు, డోర్‌నెం. 8-7-96/ఎ, గారపాటి వీధి, అమలాపురం, తూర్పుగోదావరి జిల్లా. శ్రీమతి బుదిరెడ్డి ఉదయలక్ష్మి నాగకుమారి, భర్త : గాయత్రి సత్య సాయి శ్రీనివాస్, డోర్‌నెం. 8-7-96/ఎ, గారపాటి వీధి, అమలాపురం, తూర్పుగోదావరి జిల్లా. (HTL Account No. 38062173378) వారిని సదరు నోటీసులో తెలిపిన విధంగా 29-9-2025 తేది నాటికి మొత్తం రూ. 32,44,070/- (అక్షరాల ముప్పైరెండు లక్షల నలభైనాలుగు వేల డబ్భై రూపాయలు మాత్రమే) + వడ్డీ, వ్యయాలు, చార్జీలు మొ. వాటిని తనుగుణంగా చెల్లించిన మొత్తం తగ్గించి, సదరు నోటీసు స్వీకరణ తేది నుండి 60 రోజుల్లోగా తిరిగి చెల్లించాలని కోరారు.

ఋణగ్రహీత మరియు హామీదారులు సదరు మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున, సదరు రూల్స్‌లోని రూల్ 8 మరియు 9తో చదువబడే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద తనకు సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ దిగువ వివరించిన ఆస్తిని దిగువ సంతకందారు 03 డిసెంబర్ 2025న నిర్మాణాత్మక స్వాధీనం చేసుకున్నారని ముఖ్యంగా ఋణగ్రహీతకు / హామీదరునకు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలముగా నోటీసు ఇవ్వడమైనది.

సదరు ఆస్తితో ఎలాంటి వ్యావహారం జరపరాదని మరియు సదరు ఆస్తితో జరిగే ఏ వ్యవహారములైనా 29-9-2025 తేది నాటికి మొత్తం రూ. 32,44,070/- (అక్షరాల ముప్పైరెండు లక్షల, నలభైనాలుగు వేల డబ్భై రూపాయలు మాత్రమే) + వడ్డీ, వ్యయాలు మరియు అనుషంగిక చార్జీలు మొదలవి తదుపరిగా మీకు ఏమైనా చెల్లింపులు చేస్తే అవి తగ్గించి స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా చార్జీలకు లోబడి ఉంటాయని ముఖ్యంగా ఋణగ్రహీతను / హామీదారులను మరియు సాధారణ ప్రజలను ఇందుమూలంగా హెచ్చరించడమైనది.

చర మరియు స్థిరాస్తుల వివరణ

శ్రీ బుదిరెడ్డి గాయత్రి సత్య సాయి శ్రీనివాస్, తండ్రి : సుబ్బారావు గారికి చెందిన ఆస్తి

తూర్పుగోదావరి జిల్లా అమలాపురం మండలం, అమలాపురం మున్సిపాలిటీ, అమలాపురం ఎస్.ఆర్.వో., ఎ.వై.రోడ్డు, స్వర్ణసాయి మందిరం ఎదురుగా 2593.95 చ॥గ॥ల మొత్తం విస్తీర్ణంలో ఎ.0.88 సెంట్ల జిరాయతీ ఆర్.ఎస్.నెం. 775/2లో విభజించబడని అవిభక్త 45.94 చ॥గ॥లో శ్రీ లంకలపల్లి హరివిల్లలోని జి+4 నకు సరిహద్దులు : తూర్పు : లంకలపల్లి లింగయ్యనాయుడుగారి స్థలం 91'; దక్షిణం : లంకలపల్లి లింగయ్య నాయుడుగారి స్థలం 273'9", పడమర : 30 అడుగుల వెడల్పు గల అప్రోచ్ రోడ్డు కోసం మిగిలి ఉన్న స్థలంను కలుపు ఎ.వై. రోడ్డు మరియు లంకలపల్లి సత్యనారాయణగారి స్థలం 54' 11" (అప్రోచ్ రోడ్డు 84'11") ఉత్తరం : రామకృష్ణనగం ఏరియాలో వున్న స్థలం మరియు ఇల్లు విస్తీర్ణం 105'06" + 165'01" మొత్తం 270'07'.

తూర్పుగోదావరి జిల్లా అమలాపురం మండలం, అమలాపురం మున్సిపాలిటీ, అమలాపురం ఎస్.ఆర్.వో., ఎ.వై.రోడ్డు, స్వర్ణసాయి మందిరం ఎదురుగా 2593.95 చ॥గ॥ల మొత్తం విస్తీర్ణంలో (1062 చ॥అ॥ నిర్మించిన ప్రాంతం) శ్రీ లంకలపల్లి హరివిల్లలోని 3వ అంతస్థులోని డి-10 ఫ్లాటనకు సరిహద్దులు : తూర్పు : ఓపెన్ స్పై, దక్షిణం : ఓపెన్ స్పై, పడమర : ఓపెన్ స్పై మరియు ఫ్లాట్ దగ్గర మెట్ల మరియు కారిడార్ మధ్య స్థలం. ఉత్తరం : కామన్ కారిడర్

తేది : 08-12-2025
ప్రదేశం : అమలాపురం

అధీకృత అధికారి
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

(c) eenadu

మండపేట
• మండపేట • రామచంద్రపురం

గణనాథునికి సంకటహర చతుర్థి పూజలు

రాయవరం: రాయవరం రాజరాజేశ్వరీకాలనీలోని వరసిద్ధి వినాయకుని ఆలయంలో సంకటహర చతుర్థి పూజలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు కాలధరి త్రినాథశర్మ ఆధ్వర్యంలో గణనాథునికి ఏకవార అభిషేకాలు, గరికపూజలు జరిపారు. అనంతరం వివిధ రకాల పిండివంటలతో నైవేద్యాలు సమర్పించారు. కార్యక్రమంలో వేదపండితులు కాలధరి సీతారామశర్మ, భక్తులు పాల్గొన్నారు.

రాయవరంలో లంబోదరుడు

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ. 10 - మ. 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు

మండపేట: 80085 74183 రామచంద్రపురం: 80085 74191
కపిలేశ్వరపురం: 97044 16418 పామర్రు: 80085 74228
ద్రాక్షారామ: 80085 74192 ద్వారపూడి: 91543 96553

వ్యర్థాలు తొలగించారు..

సమస్య: మండపేట మండలం అర్తమూరు గ్రామం శివాలయం వీధిలో రహదారి పక్కన వ్యర్థాలు పేరుకుపోయాయి. వాటి నుంచి దుర్వాసనతో పాటు దోమల బెడద తీవ్రంగా ఉంది. - సిహెచ్.శ్రీనివాసరెడ్డి, అర్తమూరు

పరిష్కారం: సమస్యను ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి ఎన్.కోటిరెడ్డికి తెలియజేయగా ఆయన వెంటనే స్పందించారు. సిబ్బందిని పంపించి వ్యర్థాలు తొలగించే పనులు చేయించారు. - న్యూస్‌టుడే, ద్వారపూడి

ముఖ్యమంత్రితో ఎమ్మెల్యే వేగుళ్ల భేటీ

మండపేట, న్యూస్‌టుడే: రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు సోమవారం సీఎం చంద్రబాబును క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండపేట నియోజకవర్గాన్ని తూర్పుగోదావరి జిల్లాలో విలీనం చేసి స్థానికుల చిరకాల ఆకాంక్ష నెరవేర్చినందుకు సీఎంకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

పుట్టినరోజున మొక్కలు నాటి..

మండపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని మండపేట మండలం ద్వారపూడి జడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థిని చాటిచెప్పింది. 8వ తరగతి విద్యార్థిని అనసూరి లక్ష్మీకుమారి తన పుట్టినరోజును పురస్కరించుకుని పాఠశాల ఆవరణలో సోమవారం ఉపాధ్యాయులతో కలిసి మొక్కలు నాటించింది. ప్రతి ఒక్కరూ ప్రత్యేక సందర్భాల్లో కనీసం ఒక మొక్కైనా నాటాలని కోరింది. విద్యార్థి సంకల్పాన్ని ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఎం బత్తిన రాజరాజేశ్వరి, ఉపాధ్యాయులు కర్రి సునీత, జ్యోతి, విద్యా కమిటీ ఛైర్మన్ కె.మురళి, సభ్యుడు ఎన్.సీతారామస్వామి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల ఆవరణలో మొక్క నాటుతున్న విద్యార్థిని

అడ్డూ అదుపు లేని టిప్పర్లు

యథేచ్ఛగా గ్రావెల్ తరలింపు

న్యూస్‌టుడే, మండపేట గ్రామీణం

మండపేట నియోజకవర్గంలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో కొద్ది రోజులుగా ఇసుక, మట్టి, గ్రావెల్ తరలించే టిప్పర్లు రాత్రీపగలు తేడా లేకుండా దూసుకువెళ్తున్నాయి. మితిమీరిన వేగంతో పాటు నిర్ణీత బరువుకు మించి అధిక లోడుతో వస్తున్న వీటిని చూసి స్థానికులు భయాందోళన చెందుతున్నారు. నివాసాలతో పాటు వ్యాపార సంస్థలు దుమ్ముతో నిండిపోతున్నాయి. ద్వారపూడి, కేశవరం మెట్ట ప్రాంతాల నుంచి గ్రావెల్, కపిలేశ్వరపురం మండలం నుంచి ఇసుక, రాయవరం మండలం నుంచి మట్టిని టిప్పర్లు, లారీలపై యథేచ్ఛగా తరలిస్తున్నారు.

టార్పాలిన్ లేకుండా వెళుతున్న వాహనం

ట్రాఫిక్ ఇబ్బందులు..

టిప్పర్ వాహనాల తాకిడితో మండపేట మండలం జడ్.మేడపాడు కూడలిలో నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కపిలేశ్వరపురం మండలం నుంచి వస్తున్న టిప్పర్లతో అంగర, మండపేట పట్టణంలో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. కొన్ని సందర్భాల్లో గంటల కొద్దీ వాహనాలు నిలిచిపోవడంతో ఆర్టీసీ బస్సులు, ఆటోలు, ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీరిని ప్రశ్నించేవారు లేకపోవడంతో వాహనాల రాకపోకలు ఎక్కువయ్యాయని గ్రామాల్లో ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో రోడ్డుకు సమీపంలోనే ఇళ్లు ఉండడంతో వృద్ధులు, చిన్నారులు బయటకు రావడానికి హడలిపోతున్నారు.

నిబంధనలు పాటించడంలేదు..

రోడ్డు రవాణా నిబంధనలు పాటించకుండా టిప్పర్ల చోదకులు అతివేగంగా భారీ వాహనాలను నడుపుతున్నారు. కనీసం గ్రావెల్, ఇసుక తరలించేటప్పుడు వాటిపై టార్పాలిన్ కప్పి తీసుకువెళ్లాలనే కనీస నిబంధనలు కూడా పాటించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల ఓ టిప్పర్‌ను 18 ఏళ్లలోపు బాలుడు నడపడంతో ద్వారపూడి గ్రామస్థులు అడ్డుకున్నారు. బాలుడిని మండపేట గ్రామీణ పోలీసులకు అప్పగించారు. మండపేట పట్టణంతో పాటు నియోజకవర్గంలో రహదారులు అధ్వానంగా ఉండగా వాటిపై భారీ వాహనాలు అధిక వేగంతో దూసుకుపోతుండడంతో రహదారులు మరింతగా ధ్వంసమవుతున్నాయి. వీటి వేగానికి కళ్లెం వేయడానికి పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

కఠిన చర్యలు తీసుకుంటాం..

రహదారి భద్రతా నియమాలు పాటించని వాహనచోదకులపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఇసుక, గ్రావెల్, మట్టి రవాణా చేసే టిప్పర్ల చోదకులకు అన్ని అనుమతులు ఉండాలి. సరకు రవాణా చేసేటప్పుడు టిప్పర్‌పై టార్పాలిన్ కప్పి తరలించాలి. గ్రావెల్ తవ్వకంతో పాటు తరలించడానికి అనుమతులు ఉండాలి. దీనిపై ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తూ కేసులు నమోదు చేస్తున్నాం.

- పీతల దొరరాజు, గ్రామీణం సీఐ, మండపేట

సౌర విద్యుత్తుతో బిల్లు ఆదా

మండపేట: సౌర విద్యుత్తుతో బిల్లు ఆదా చేయవచ్చని మున్సిపల్ కమిషనర్ టి.వి.రంగారావు చెప్పారు. పీఎం సూర్యఘర్ పథకంలో భాగంగా సోమవారం వివిధ బ్యాంకుల ప్రతినిధులు, మెప్మా సిబ్బందితో కమిషనర్ సమావేశం నిర్వహించారు. సోలార్ రూఫ్ ఏర్పాటుతో వేసవిలో కోతల నుంచి తప్పించుకోవచ్చన్నారు. సమావేశంలో బ్యాంకు ప్రతినిధులు, ఏఈ డి.పవన్‌కుమార్, మెప్మా సీఎంఎం సుజాత, సీవోలు, ఆర్పీలు పాల్గొన్నారు.

11న ఎంపీపీ ఎన్నిక

అంగర: కపిలేశ్వరపురం ఎంపీపీ పదవికి మేడిశెట్టి సత్యవేణి అక్టోబరు 13న వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేయగా ఆ ఖాళీ స్థానానికి ఎన్నికల సంఘం ఆదేశాలతో ఈనెల 11న ఎన్నిక నిర్వహిస్తామని డీఎల్‌పీవో, మండల ప్రత్యేక అధికారి వి.విజయలక్ష్మి తెలిపారు. మండల పరిషత్తు కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఆరోజు ఉదయం 11 గంటలకు ఎన్నిక జరుగుతుందని, అర్హులందరూ హాజరవ్వాలని కోరారు.

విద్యార్థుల ప్రతిభ

మండపేట గ్రామీణం: మండపేట మండలం తాపేశ్వరం చైతన్య పాఠశాల విద్యార్థులు జాతీయస్థాయి టాలెంట్ సెర్చ్ ఒలింపియాడ్‌లో ప్రతిభ కనబరిచారని హెచ్ఎం లక్ష్మీనారాయణ సోమవారం తెలిపారు. మొత్తం 376 మంది విద్యార్థులు రెండో దశ పరీక్షకు అర్హత సాధించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

విజయ సంకేతం చూపుతున్న విద్యార్థులు

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు: మంత్రి సుభాష్

రామచంద్రపురం, న్యూస్‌టుడే: క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని మంత్రి వాసంశెట్టి సుభాష్ చెప్పారు. రామచంద్రపురం కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ జాతీయ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలల విద్యార్థులకు కాకినాడ రోటరీ క్లబ్ సౌజన్యంతో సమకూర్చిన రూ.66 వేల విలువైన క్రీడా పరికరాలను మంత్రి సోమవారం అందించారు. కాకినాడ రోటరీ క్లబ్ ఛైర్మన్ తాడాల వీర వెంకట సత్యనారాయణ, సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా పరికరాలు అందిస్తున్న మంత్రి సుభాష్

సీఎం సహాయనిధితో ఆర్థిక భరోసా

ద్రాక్షారామ: ఆర్థిక సమస్యలతో సతమతమవుతూ వైద్య చికిత్సలు చేయించుకోలేని నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఆర్థిక భరోసా కల్పిస్తోందని మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. రామచంద్రపురం నియోజకవర్గం పరిధిలోని 17 మందికి రూ.15.97 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను సోమవారం పార్టీ కార్యాలయంలో మంత్రి అందించారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు గరికిపాటి సూర్యనారాయణ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టరు సలాది రమేష్, జనసేన పార్టీ ఇన్‌ఛార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాదర్బార్‌లో..

పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బారు కార్యక్రమంలో మంత్రి ఇద్దరికి ఆర్థిక సాయం అందించారు. వితంతు పింఛన్ కోరుతూ షేక్ మల్లికా బేగం మంత్రికి అర్జీ సమర్పించగా మంత్రి తక్షణం స్పందిస్తూ రూ.4 వేల నగదు సాయంగా అందించారు. పింఛన్ మంజూరయ్యే వరకు ప్రతి నెలా ఆర్థికసాయం అందిస్తానని హామీ ఇచ్చారు. కాజులూరుకు చెందిన కొప్పిరెడ్డి దుర్గాదేవి తన కుమారుడు సూర్య ఆరోగ్యం బాగులేదని మంత్రికి విన్నవించుకోగా ఆమెకు రూ.5 వేల సాయం అందించారు. పలువురి నుంచి అర్జీలు స్వీకరించి సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి..

కాజులూరు: గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. సోమవారం కోలంక గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ద్వారా మంజూరుచేసిన అయిదు ట్రాక్టర్లు, ట్రక్కులను ఆయన ప్రారంభించారు.

ఉపన్యాస పోటీలో విద్యార్థులు

బహుమతులు అందించిన ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్

చక్కగా చెప్పారు.. బహుమతి పట్టారు

మండపేట, న్యూస్‌టుడే: 'ఈనాడు ఈటీవీ' ఆధ్వర్యంలో సోమవారం స్థానిక శ్రీగౌతమి మున్సిపల్ పాఠశాలలో నిర్వహించిన ప్రతిభాపాటవ పోటీలో 7, 8, 9, 10 తరగతుల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం అనే అంశంపై ఉపన్యాస పోటీల్లో మేధస్సుకు పదునుపెట్టి పలు విషయాలపై ప్రసంగించారు. వీరిలో 9వ తరగతి విద్యార్థిని సుభశ్రీ ప్రథమ బహుమతి, 8వ తరగతి విద్యార్థిని ఎం.సిరివెన్నెల ద్వితీయ బహుమతి, 9వ తరగతి విద్యార్థిని హరిణి పల్లవి తృతీయ బహుమతి సాధించారు. వీరికి 'ఈనాడు' సమకూర్చిన బహుమతులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దంటు శ్రీనివాస్ అందించారు. ఎల్.ప్రసాద్: వి.లక్ష్మి, ఎస్.అజిత న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.

సహకార ఉద్యోగుల ధర్నా

ద్రాక్షారామ: సహకార ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ద్రాక్షారామ సంఘాల ఉద్యోగులు బ్రాంచి కార్యాలయం ముందు సోమవారం ధర్నా నిర్వహించారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని బ్రాంచి మేనేజరు మాణిక్యాంబదేవికి సమర్పించారు. ధర్నాకు సీఐటీయూ నేతలు బలరాం, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా నాయకురాలు దుర్గమ్మ సంఘీభావం తెలిపారు. యూనియన్ రాష్ట్ర కోశాధికారి పెంకే సత్యనారాయణ, సంఘాల సీఈవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

పంటబోదె.. బాగుపడదా..?

మండపేట పట్టణం గొల్లపుంత రోడ్డులోని పంటబోదెలో పిచ్చిమొక్కలు, గడ్డి, తుప్పలు పెరిగిపోయాయి. వీటిని తొలగించడానికి ఇటీవల గడ్డిమందు పిచికారీ చేశారు. దీంతో కొన్ని చోట్ల పిచ్చిమొక్కలు, గడ్డి ఎండిపోయాయి. వాటిని అలాగే వదిలేయడంతో నీరు ముందుకు కదిలే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు. వ్యర్థాలు తొలగించాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని నీటి పారుదల శాఖ జేఈఈ అజీజ్ దృష్టికి తీసుకువెళ్లగా గడ్డి కుళ్లిపోయిన తరవాత పూర్తిస్థాయిలో తొలగించే పనులు చేపడతామని వివరించారు.

- న్యూస్‌టుడే, మండపేట

లాకుల వద్ద పూజలు చేస్తున్న నీటి సంఘాల అధ్యక్షులు, అధికారులు

పంట కాలువలకు నీరు విడుదల

అంగర, న్యూస్‌టుడే: రబీ సీజన్‌లో రైతులకు సాగునీటి ఎద్దడి కలగకుండా ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని జల వనరుల శాఖ ఈఈ రామకృష్ణ, డ్రెయిన్ల డీఈ పోచారావు అన్నారు. కపిలేశ్వరపురం మండలంలోని తూర్పు డెల్టా ప్రధాన లాకుల వద్ద అధికారులు సోమవారం సాగునీటికి పూజలు చేశారు. అనంతరం రబీ సీజన్ పంటల సాగుకు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా అధికారులు పంటకాలువ లాకుల వద్ద జలానికి పుష్పాభిషేకం చేసి నీటిని వదిలారు. కూళ్ల డీసీ అధ్యక్షుడు ఎనుముల గోపాలకృష్ణ, ఏఈ త్రిమూర్తులు, పలు నీటి సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ వర్ధంతి సభలో అలసత్వంపై ఫిర్యాదు

రాయవరం, న్యూస్‌టుడే: రాయవరం మండల పరిషత్తు కార్యాలయంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద జరపాల్సిన వర్ధంతి సభలో అధికారుల నిర్లక్ష్య వైఖరిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ దళిత సంఘం నాయకులు రామచంద్రపురం ఆర్డీవో అఖిలకు ఫిర్యాదు చేశారు. సోమవారం మండల కోఆప్షన్ సభ్యుడు పీజేశ్యామ్ సుధాకర్ మాట్లాడుతూ అంబేడ్కర్ వర్ధంతి, జయంతి సభలను నిర్వహించాల్సిన అధికారులే అలసత్వం ప్రదర్శించడం సరికాదన్నారు. కార్యక్రమంలో ఎస్సీ నాయకులు దండంగి పైసాదాసు, గొట్టి సూరిబాబు, గొల్లపల్లి అర్జునరావు, ఎల్లే శ్యాంసన్, గోసాల శేషుబాబు, జైభీమ్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

డెంగీ కేసు నమోదు.. అప్రమత్తం

రామచంద్రపురం, న్యూస్‌టుడే: పట్టణంలోని అంకంవారివీధికి చెందిన ఓ మహిళకు డెంగీ సోకడంతో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. సోమవారం కోనసీమ జిల్లా డీఎంవో ఎన్.వెంకటేశ్వరరావు, ఎస్‌యూవోలు వెంకటేశ్వరరావు, బి.డి.బిషప్ తదితరులు పరిశీలించారు. వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ఇంటింటా ఆరోగ్య సర్వే నిర్వహించారు. డెంగీ వ్యాపించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం రాయుడు సుధారాణి, ఎంపీహెచ్ కామేశ్వరరావు, ఆశ వర్కర్ రాణి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాంశాల్లో మెరిసి..

మండపేట, న్యూస్‌టుడే: పట్టణంలోని ఎస్వీఎస్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు వివిధ క్రీడాంశాల్లో ప్రతిభతో బహుమతులు సాధించారు. వీరిలో 10వ తరగతి విద్యార్థి కొల్లి శివశంకర్‌ప్రసాద్ నవంబర్ 23న జమ్మూలో జరిగిన జాతీయ స్థాయి అండర్ 18 టెన్నీకాయిట్ పోటీల్లో తృతీయ స్థానంలో నిలిచాడు. 9వ తరగతి విద్యార్థి నీలి గౌతమ్‌సంజయ్ శ్రీకాకుళం జిల్లా పలాసలో జరిగిన అండర్-14 రాష్ట్రస్థాయి టెన్నీకాయిట్ పోటీల్లో ప్రథమ స్థానం సాధించి కేరళలో ఈనెల 22న జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగకుమార్, వ్యాయామ ఉపాధ్యాయురాలు జి.అనూరాధ తెలిపారు. 10వ తరగతి విద్యార్థి కంకిపాడు చందూసాయి ఈనెల 6వ తేదీన అంబాజీపేటలో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-17 క్రికెట్‌లో ఉత్తమ ప్రతిభతో రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యాడని వివరించారు. ఆయా క్రీడాకారులను సోమవారం ఉపాధ్యాయులు ఎల్.శ్రీనివాసరావు, ఐఎస్ఎస్ ప్రసాద్‌తో కలిసి హెచ్ఎం అభినందించారు.

విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

చిట్టి చేతులతో కళాకృతులు

• వ్యర్థాలతో వినియోగ వస్తువులకు రూపకల్పన

న్యూస్‌టుడే, అంగర

చిట్టి చేతులు గట్టి చేతలని నిరూపిస్తున్నాయి. పనికిరాని వృథా వస్తువులతో విభిన్న కళాకృతులు రూపొందించి ఔరా అనిపిస్తున్నారు. చిత్తు కాగితాల్ని అద్భుతాలుగా మలిచి విద్యార్థులు ఆకట్టుకుంటున్నారు. కపిలేశ్వరపురం మండలం అంగర జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఆర్ట్స్, క్రాఫ్ట్స్ ఉపాధ్యాయురాలు సాదే ఇంద్రావతి శిక్షణను అందిపుచ్చుకున్న పలువురు విద్యార్థులు చిత్తు కాగితాలు, ప్లాస్టిక్ వ్యర్థాలు, ఐస్‌క్రీమ్, చీపురుపుల్లలతో కళాత్మక వస్తువులు రూపొందిస్తున్నారు. పూలకుండీలు, గోడలకు తగిలించే పుష్పగుచ్ఛాలు తయారుచేశారు. టీచర్ లెర్నింగ్ మెటీరియల్ పేరుతో నిర్వహించిన పోటీల్లో వీరు తయారుచేసిన వస్తువులు బహుమతులు సాధించాయి. రావిఆకులు, చిరుధాన్యాలతో దేశనాయకుల చిత్రాలకు ప్రాణం పోయడం విద్యార్థులకు అలవాటుగా మారింది.

కాగితాలతో తయారుచేసిన పుష్పగుచ్ఛాలు, వివిధ ఆకృతులు

కళాకృతుల తయారీ ఎంతో ఇష్టం..



పనికిరాని అట్టముక్కలు, ప్లాస్టిక్ డబ్బాలు, చిత్తు కాగితాలు, కొబ్బరిపీచు ఉపయోగించి కళాకృతులు తయారుచేయడం అంటే చాలా ఇష్టం. సెలవుల్లో ఇలా కొన్ని వస్తువులు తయారుచేశాను. వీటితో ఇంటిని ప్రత్యేకంగా అలంకరించడంతో ప్రత్యేక కళ సంతరించుకుంది. - వి.రూపశ్రీ, ఏడో తరగతి

ఎన్నో బహుమతులు గెలుచుకున్నా..

పనికిరాని వస్తువులతో వివిధ రకాల అంకరణ సామగ్రిని తయారుచేయడం ద్వారా బహుమతులు సాధించాను. సామాజిక మాధ్యమాల ద్వారా మెరుగులు దిద్దుకున్నా. పాఠశాల స్థాయి ప్రదర్శనల్లో ఎన్నో అంశాలు పెట్టి బహుమతులు గెలుచుకున్నా. - ఎం.భవిత, ఏడో తరగతి

సమయం వృథా చేయకూడదని..

తరగతి గదిలో పాఠాలు శ్రద్ధగా నేర్చుకుంటూనే తీరిక సమయాన్ని వృథా చేయకూడదని క్రాఫ్ట్ వర్క్ నేర్చుకున్నా. ఇంట్లో అలంకరణ వస్తువులు, సామగ్రిని సొంతంగా తయారుచేస్తున్నా. చూసిన వారంతా బాగున్నాయని మెచ్చుకుంటున్నారు. - కె.నిఖిత గ్రీన్, 5వ తరగతి

పలువురికి నేర్పిస్తున్నా..

వేసవి, దసరా సెలవుల్లో ఒకవైపు పాఠ్యపుస్తకాలు తిరగేస్తూనే, బొమ్మలు గీయడం, వస్తువులు తయారుచేయడం నేర్చుకున్నా. ఎక్కువ రోజులు అదే పనిగా చేయడం వల్ల ప్రస్తుతం నేర్పే స్థాయికి చేరాను. - ఎస్.సత్యశ్రీ, తొమ్మిదో తరగతి, పడమర ఖండ్రిక

వాహనదారులకు శిరస్త్రాణం అందిస్తున్న సీఐ దొరరాజు, ఎస్సై సురేష్‌బాబు

శిరస్త్రాణం ధరించండి.. కుటుంబానికి భరోసానివ్వండి

రాయవరం, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే సమయంలో శిరస్త్రాణం ధరించాలని, కుటుంబానికి భరోసా కల్పించాలని మండపేట గ్రామీణ సీఐ పి.దొరరాజు కోరారు. సోమవారం సోమేశ్వరం పరిధిలోని మాచవరం వంతెన వద్ద రాయవరం ఎస్సై డి.సురేష్‌బాబు ఆధ్వర్యంలో వాహనదారులకు రోడ్డు భద్రత, నిబంధనలపై సీఐ అవగాహన కల్పించారు. అదే సమయంలో 16 మంది వాహనదారులు స్వచ్ఛందంగా శిరస్త్రాణాలను కొనుగోలు చేశారు. బీమా, కాలుష్య నియంత్రణ, ఆర్సీ తదితర పత్రాలులేని తొమ్మిది మంది నుంచి రూ.1,665 జరిమానాగా వసూలు చేశారు.

సతీష్‌రావుకు సోము వీర్రాజు పరామర్శ

ద్రాక్షారామ: మాతృవియోగంతో బాధపడుతున్న భాజపా రాష్ట్ర కిసాన్ మోర్చ కార్యదర్శి, హసనబాద గ్రామ సర్పంచి నాగిరెడ్డి సతీష్‌రావును సోమవారం ఎమ్మెల్సీ సోము వీర్రాజు ఆయన ఇంటి వద్ద పరామర్శించారు. రామచంద్రపురం వైస్‌ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, ద్రాక్షారామ సర్పంచి కొత్తపల్లి అరుణ, అన్నాయిపేట సర్పంచి పెమ్మిరెడ్డి దొరబాబు, ఉపసర్పంచి చల్లా బుజ్జి, ద్రాక్షారామ పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ ఛైర్మన్ ముప్పనపల్లి గణేష్ తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

సతీష్‌రావుతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సోము వీర్రాజు తదితరులు

కాపవరంలో చోరీ.. నగదు, వెండి అపహరణ

ద్రాక్షారామ: రామచంద్రపురం మండలం కాపవరం గ్రామానికి చెందిన పిల్లి శ్రీనివాస్ కుటుంబంతో కలిసి రెండు నెలలుగా హైదరాబాద్‌లో ఉంటున్నారు. ఈనెల 7వ తేదీన హైదరాబాద్ నుంచి వచ్చి వేళంగిలోని తోడల్లుడు ఇంటికి వెళ్లారు. 8వ తేదీ ఉదయం ఇంటి తలుపులు తెరిచి ఉండటాన్ని గుర్తించిన స్థానికులు శ్రీనివాస్‌కు సమాచారం అందించారు. ఆయన వచ్చి చూడగా ఇంట్లోని వస్తువులు చిందరవందరగా కనిపించాయి. బీరువాలోని రూ.10 వేల నగదు, అరకాసు బంగారు నల్లపూసలు దండ, 10 తులాల వెండి పట్టీలు కనిపించలేదని పోలీసులకు ఫిర్యాదు చేశారు. గుర్తుతెలియని వ్యక్తులు అతని పక్కింటిలోని నరాల సత్యనారాయణ ఇంట్లో కూడా చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సై ఎం.లక్ష్మణ్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

నర్సరీలో వివాదం.. వ్యక్తిపై కత్తితో దాడి..

మండపేట గ్రామీణం: స్వల్ప విషయమై మాటామాటా పెరిగి కత్తితో దాడికి పాల్పడిన ఘటన ఏడిద శివారులో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. మండపేట రూరల్ పోలీసుల వివరాలు ప్రకారం.. కడియం మండలం బుర్రిలంక గ్రామానికి చెందిన మల్లిపూడి శ్రీనివాసరావు ఏడిద శివారులో నేచురల్ గ్రీన్ నర్సరీ నిర్వహిస్తున్నారు. ఆ పక్కనే కుందేటి వెంకన్నబాబుకు వెంకటదుర్గా నర్సరీ ఉంది. ఈనెల 6వ తేదీన వెంకన్నబాబుకు చెందిన లారీ.. శ్రీనివాసరావు నర్సరీలోని మొక్కలపై నుంచి వెళ్లిందని ఇద్దరూ గొడవపడ్డారు. అనంతరం ఈనెల 7వ తేదీన వెంకన్నబాబు నర్సరీలో పనిచేసే మన్యం శ్రీను.. శ్రీనివాసరావుపై కత్తితో దాడిచేసి గాయపరిచాడు. తీవ్రంగా గాయపడిన అతన్ని నర్సరీలో పనిచేసే అన్నందేవుల గోవిందు కడియం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మండపేట రూరల్ ఎస్సై వి.కిషోర్ కేసు నమోదుచేశారు.

దివ్యాంగులకు చేయూతనివ్వండి

అంగర, న్యూస్‌టుడే: దివ్యాంగులను చిన్నచూపు చూడకుండా చేయూతనందిస్తే వారు అద్భుతాలు సృష్టిస్తారని పలువురు వక్తలు పేర్కొన్నారు. కపిలేశ్వరపురం భవిత కేంద్రంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఎంఈవోలు కె.తాతారావు, విజయ్‌కుమార్ ముఖ్యఅతిథులుగా విచ్చేసి చిన్నారులకు బహుమతులు అందించారు. రోజూ చిన్నారులను భవిత కేంద్రాలకు పంపడం వల్ల కలిగే ఉపయోగాలను ఐఈఆర్పీ సునీత వివరించారు. అనంతరం కేక్ కోసి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు కమ్మ వెంకట్రావు, రాఘవులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బాలుడికి బహుమతులు అందించిన ఎంఈవో తాతారావు

నేతల చిత్రపటానికి క్షీరాభిషేకం

అంగర, న్యూస్‌టుడే: మండపేట నియోజకవర్గాన్ని తూర్పుగోదావరిలో విలీనం చేయడంపై పలువురు నీటి సంఘాల నాయకులు హర్షం వ్యక్తంచేశారు. కపిలేశ్వరపురం బ్యాంకు కెనాల్ లాకుల వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఎమ్మెల్యే వేగుళ్ల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నీటి సంఘాల అధ్యక్షులు ఎనుముల గోపాలకృష్ణ, కె.భవ్య, కొరపాటి జానకిరామయ్య, జల వనరుల శాఖ ఈఈ రామకృష్ణ, డ్రెయిన్స్ డీఈ పోచారావు, ఏఈలు కృష్ణత్రిమూర్తులు, సుందర శ్రీను, తెదేపా మండల అధ్యక్షుడు బి.సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురంలో చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న అధికారులు

(c) eenadu

ఈనాడు
తూర్పుగోదావరి
మంగళవారం డిసెంబరు 9, 2025

మాట.. ఆట.. మనవిగా ఉండాలి
మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

తలారి వాసు ఏర్పాటు చేసిన స్టాల్‌ను తిలకిస్తున్న వెంకయ్యనాయుడు, చిత్రంలో ప్రసన్నశ్రీ, విల్సన్

ఈనాడు, రాజమహేంద్రవరం, న్యూస్‌టుడే, రాజానగరం: "దైనందిన జీవితంలో మాతృభాష భాగమవ్వాలి. పరాయి భాషను విడనాడాలి. అమ్మభాష నేర్చుకున్నాకే సోదర, అన్యభాషలపై దృష్టి పెట్టాలి' ' అని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు సూచించారు. నన్నయ విశ్వ విద్యాలయంలో ఉపకులపతి డా.ఎస్.ప్రసన్నశ్రీ అధ్యక్షతన నిర్వహించిన 'భారతీయ భాషల్లో ఏకరూప శాస్త్రీయ సాంకేతిక పదజాలం' కార్యశాలకు ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. సంప్రదాయాలు పాటించాలని.. మన కట్టు.. బొట్టు.. మాట.. ఆట.. పాట.. భాష.. యాస.. గోస అన్నీ మనవిగా ఉండాలన్నారు. ఆంగ్లం స్థానంలో అనేక నూతన భారతీయ భాషా పదాల సృష్టికి ఈ కార్యక్రమం ఊతమివ్వాలన్నారు. భాష ఔన్నత్యం, కవులు, సంస్కృతి గురించి తానా మాజీ అధ్యక్షులు, సాహితీ సమితి అధ్యక్షులు తోటకూర ప్రసాద్ వివరించారు.

పుస్తకాల ఆవిష్కరణ..

విశ్రాంత డీఎస్పీ, సైకాలజిస్ట్ నామగిరి బాబ్జి రచించిన 'హ్యాండ్‌బుక్ ఆఫ్ డ్రగ్ ఎడిక్షన్ అండ్ ది రోల్‌ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్' ..నన్నయ సోషల్‌వర్క్ విభాగ అధ్యాపకులు మల్లిభాస్కర్ రచన 'మస్తాన్‌బాబు జీవన చిత్రం', నర్సరీ రైతు పుల్లా చినసత్యనారాయణ 'ధరణిపుత్రులు' పుస్తకాలను వెంకయ్యనాయుడు ఆవిష్కరించారు. భారతీయ భాషా సమితి సమన్వయకులు కె.గిరిధరరావు పాల్గొన్నారు. తెలుగుశాఖ సహాయ అధ్యాపకులు తలారి వాసు ఏర్పాటుచేసిన నన్నయ రచనలు, నన్నయపై ఇతరుల పుస్తకాలను, అక్కడి స్టాల్‌ను వెంకయ్యనాయుడు సందర్శించారు.

సాంకేతిక పదజాలం మాతృభాషలోకి..

ప్రాంతీయ భాషలు సాంకేతికంగా సుసంపన్నమైనప్పుడే గ్రామీణ విద్యార్థులు మాతృభాషలో ఏఐ (కృత్రిమ మేధ), ఎంఎల్ (మెషిన్ లెర్నింగ్, మరప్రజ్ఞ/యంత్రాభ్యాసం)పై పట్టు సాధిస్తారు. సాంకేతిక పదజాలం మాతృభాషలోకి తెస్తే మేలు. ఏకరూపత ఉన్న శాస్త్రీయ పదజాలం అవసరం. ఇంటర్, డిగ్రీ స్థాయిలో తెలుగు అకాడమీ భాషానిపుణులు, శాస్త్రసాంకేతిక నిపుణులు, పాఠ్యగ్రంథ రచయితలు పారిభాషిక పదపట్టికలను శాస్త్రాల వారీ తయారుచేశారు. 65 ఏళ్లనాటి రచనలను పునఃముద్రిస్తాం. మాస పత్రికలతో పాటు తెలుగు కళలు, సంస్కృతులను పుస్తకరూపంలోకి తీసుకువస్తాం.

- ఆర్.డి.విల్సన్ (శరత్‌చంద్ర), తెలుగు, సంస్కృత అకాడమీ అధ్యక్షులు

భాష నిత్య ప్రవాహిని

భాష ఒక నిత్య ప్రవాహిని. తరాలతో పాటు కాలానుగుణంగా మారుతూ ముందుకు సాగుతోంది. ఆయా కాలాల్లో అప్పటి సంస్కృతిని ప్రతిఫలిస్తుంది. ఇతర సంస్కృతులతో కాలక్రమేణా ఏర్పడే సంబంధం, శాస్త్ర విజ్ఞానంలో కలిగే అభివృద్ధితో సమాజం నూతన సంస్కృతిని, జీవనశైలిని అలవరుచుకుంటోంది. ఫలితంగా భాషలోనూ మార్పులు అనివార్యమవుతున్నాయి. విభిన్న శాస్త్ర, సాంకేతిక రంగాల్లో వినియోగానికి అనువుగా మలచుకోవడానికి.. నూతన పదజాల సృష్టికి ప్రణాళిక అనివార్యం. **- ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ, ఉపకులపతి, నన్నయ విశ్వవిద్యాలయం**

భక్తజన కోట.. సత్తెమ్మ వాకిట..

ప్రత్యేక అలంకరణలో కోటసత్తెమ్మ ● కోలాటం, ఇతర కార్యక్రమాల వద్ద జనం

నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలో వేంచేసి ఉన్న కోటసత్తెమ్మ తిరునాళ్ల ఉత్సవాలు సోమవారం రాత్రి నిర్వహించిన గరగోత్సవంతో ముగిశాయి. మంత్రి కందుల దుర్గేష్‌తోపాటు అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. **- న్యూస్‌టుడే, నిడదవోలు**

చైతన్యమే ఔషధం..!

☛ జిల్లాలో పెరుగుతున్న క్యాన్సర్ కేసులు
☛ తొలి దశలో గుర్తిస్తే మెరుగైన వైద్యం

న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం వైద్యం

మారుతున్న జీవనశైలి.. ఆహారపు అలవాట్లు.. ఇతరత్రా కారణాలతో జిల్లాలో క్యాన్సర్ మహమ్మారి వ్యాపిస్తోంది. దీనిని త్వరగా గుర్తిస్తే మెరుగైన చికిత్స ద్వారా పూర్తిస్థాయిలో నయం చేయవచ్చని వైద్యనిపుణులు సూచిస్తున్నా అవగాహన లేమితో ఖర్చుతో కూడుకున్న పని అనుకుని ముందస్తు పరీక్షలకు వారు ముందుకు రావడం లేదు. ఏదైనా ఇబ్బంది వచ్చినప్పుడే వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకుంటున్నారు. 30 ఏళ్లు పైబడిన మహిళలంతా ఏడాదికోసారైనా ముందస్తు పరీక్షలు చేయించుకుంటే ఈ మహమ్మారి నుంచి బయటపడొచ్చని నిపుణులు చెబుతున్నారు.

సేవలు అరకొర..

నోటి క్యాన్సర్ పరీక్ష చేస్తున్న వైద్యసిబ్బంది

ఎన్‌సీడీ సర్వేలో ఇంటింటికీ ఆరోగ్య సిబ్బంది పరీక్షలు చేస్తున్నారు. లక్షణాలుంటే సమీపంలోని సీహెచ్‌సీ, ప్రాంతీయ ఆసుపత్రుల్లో ప్రాథమిక పరీక్షలు చేస్తారు. అనంతరం రాజమహేంద్రవరం జీజీహెచ్‌లోని ప్రివెంటివ్ ఆంకాలజీ విభాగానికి తరలిస్తున్నారు. ఇక్కడ సేవలు పూర్తి స్థాయిలో అందడం లేదు. 2024లో జీజీహెచ్‌లో రేడియేషన్, సర్జికల్ సిబ్బందిని కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చినా సర్జికల్, రేడియేషన్ అంకాలజీ విభాగానికి ఒక్కరే వైద్యుడు మాత్రమే అందుబాటులోకి వచ్చారు. ఓపీ, శస్త్రచికిత్సలు పెరిగి మెరుగైన సేవలందుతున్నాయి. రేడియేషన్ యంత్రం లేకపోవడంతో పూర్తి స్థాయి సేవలందడం లేదు. మెడికల్ ఆంకాలజీకి సంబంధించి రూ. వేల్లో ఖరీదైన కీమో ఇంజక్షన్లు, ఇతర వసతులు ఉన్నా సంబంధిత వైద్యుడు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు.

బాధితుల్లో మహిళలే ఎక్కువ

ఎన్‌సీడీ సర్వే 3.0 పూర్తయి 4.0 మొదలైంది. దీనిలో మొత్తం 948 కేసులు నమోదైతే 80 శాతం క్యాన్సర్ కేసులు మహిళలకు చెందినవే. మరో పది వేల మంది వరకు మహిళలను అనుమానితులుగా గుర్తించి పెద్దాసుపత్రులకు రిఫర్ చేశారు.

కొరవడిన అవగాహన

క్యాన్సర్ పరీక్షలు ఎక్కడ చేస్తారో.. సర్కారు ఆసుపత్రుల్లో ఇవి ఉన్నాయో లేదో కూడా తెలియక చాలా మంది వెనకడుగు వేస్తున్నారు. హైదరాబాద్, విశాఖపట్నం వంటి ప్రాంతాలకు వెళ్లాలని భావిస్తున్నారు. స్థానికంగా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

ఎన్‌సీడీ 3.0 సర్వే ప్రకారం

క్యాన్సర్ రకం	బాధితులు
నోటి క్యాన్సర్	179
రొమ్ము	461
సర్వేకల్	308

11,616 పనులు.. రూ.2106 కోట్లు..!
పుష్కరాలకు నగరపాలక సంస్థ ప్రతిపాదనలు

ఈనాడు, రాజమహేంద్రవరం, న్యూస్‌టుడే, టి.నగర్ : గోదావరి పుష్కరాల ఆతిథ్య నగరం రాజమహేంద్రవరానికి వచ్చే భక్తులకు ఏ సమస్య తలెత్తకుండా యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. రహదారులు, డ్రెయిన్ల నిర్మాణం, మరమ్మతులు, విస్తరణకు ప్రాధాన్యమిస్తూనే ఇతర అవసరాలపైనా దృష్టి సారించింది. నగరంలో 50 డివిజన్ల పరిధిలో 11,616 శాశ్వత, తాత్కాలిక పనులకు రూ.2106 కోట్లు అవసరమని తాజాగా ప్రతిపాదనలు సిద్ధం చేసింది.

రహదారులకు ప్రాధాన్యం

నగరం పరిధిలో 116 కిమీ మేర 431 సీసీ, బీటీ రహదారులకు రూ.641.13 కోట్లు అవసరమని తేల్చారు. 282 చోట్ల కొత్తగా సీసీ రోడ్లకు రూ.33.99 కోట్లు, 176 చోట్ల విస్తరణ, ఆధునికీకరణకు రూ.57.63 కోట్లు, ఆరు కొత్త బీటీ రోడ్లకు రూ.8.08 కోట్లు, 51 రోడ్ల పునరుద్ధరణకు రూ.38.10 కోట్లు, ఆరు మార్గాల మరమ్మతులకు రూ.4.67 కోట్లు చొప్పున ప్రతిపాదించారు.

కాలువల నిర్మాణానికి..

241 కిమీ మేర డ్రెయిన్ల నిర్మాణం, మరమ్మతులు, ఆధునికీకరణ, తాత్కాలిక కాలువల ఏర్పాటుకు రూ.195.71 కోట్లు కేటాయించాలని కోరారు.

వసతుల కల్పనకు...

● భక్తులకు ఇబ్బంది లేకుండా తాగునీరు అందించాలన్న లక్ష్యంతో రూ.127.57 కోట్లతో 116 పనులు ప్రతిపాదించారు. ● గోదావరి గట్లపై తాత్కాలిక లైటింగ్ (అలంకరణతోపాటు)కు రూ.77.49 కోట్లు ప్రతిపాదించారు. 22 చోట్ల శాశ్వత, 3357 తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయనున్నారు. ● ఉద్యానవనాల మరమ్మతులు, నిర్వహణకు రూ.37.28 కోట్లు, పూల కుండీలు, ల్యాన్ ఏర్పాటుకు రూ.15 కోట్లు అవసరమని ప్రతిపాదించారు. ● యాత్రికులకు తాత్కాలిక బస ఏర్పాటుకు ఎనిమిది ప్రాంతాల్లో పుష్కర నగరాలు, అక్కడ తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాటు, టెంట్లు, ఇతర సదుపాయాలకు రూ.63.36 కోట్లు ప్రతిపాదించారు. ● అద్దె వాహనాలకు రూ.80 లక్షలు, అతిథి గృహ నిర్మాణాలకు రూ.5 కోట్లు అవసరమని పేర్కొన్నారు.

తేనె విందు.. భలే పసందు

సన్‌బర్డ్.. కోనసీమ ప్రాంతంలో కనిపించే అందమైన పక్షి. ఇళ్ల వద్ద తోటలు, పూల మొక్కలు ఉన్న ప్రదేశాల్లో ఎక్కువగా కనిపిస్తుంది. ఇది పుష్పాల్లోని మకరందం తాగేందుకు ఇష్టపడుతుంది. దానికి అనుగుణంగా ముక్కు పొడవుగా సూదిగా ఉంటుంది. చిన్న పురుగులు, సాలీడు వంటి వాటినీ తింటుంది. పూల దగ్గర మకరందం తాగే సమయంలో పతంగుల్లా గాల్లో తేలుతూ నిలబడతాయి. కోనసీమలో పూల మొక్కలు ఎక్కువగా ఉండటం వల్ల ఇక్కడ వీటి ఉనికి ఎక్కువగా ఉంటుంది. సోమవారం అయినవిల్లి మండలం వేదునూరులో ఇలా కనిపించింది. **-న్యూస్‌టుడే, కోనసీమ**

రెవెన్యూ పరిధిలోనివే అత్యధికం
ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 213 అర్జీలు

కలెక్టరేట్‌లో వినతులు స్వీకరిస్తున్న అధికారులు

కలెక్టరేట్ (రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం జరిగిన జిల్లా స్థాయి ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు వివిధ సమస్యలపై మొత్తం 213 అర్జీలు వచ్చాయి. అత్యధికంగా రెవెన్యూ, సర్వేకు సంబంధించిన అర్జీలే 105 వరకు ఉన్నాయి. కలెక్టర్ కీర్తి చేకూరి, జేసీ మేఘాస్వరూప్, డీఆర్వో సీతారామమూర్తి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు భాస్కర్‌రెడ్డి, భాగ్యలక్ష్మి, సీపీవో అప్పలకొండ ఇతర అధికారులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

కొన్ని ఫిర్యాదులు పరిశీలిస్తే..

● తన పేరుతో 22 సెంట్ల భూమి ఉండగా రీసర్వేలో తగ్గిపోయిందని తాళ్లపూడికి చెందిన సత్యవతి అనే మహిళ ఫిర్యాదు చేశారు.

● తనకు ఉన్న 2.40 ఎకరాల వ్యవసాయ భూమిలోకి వెళ్లకుండా కొందరు అడ్డుకుంటున్నారంటూ పోలవరానికి చెందిన కామిశెట్టి వెంకటుద్గారావు ఫిర్యాదు చేశారు.

● గత ప్రభుత్వంలో ఇళ్ల పట్టాలు ఇచ్చి స్థలాలు చూపలేదంటూ మహిళలు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు.

బతుకు భారం..!

స్థానిక అన్నపూర్ణమ్మ పేటకు చెందిన ఇతని పేరు దోరెం ప్రసాద్. పెయింట్ పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవారు. నాలుగేళ్ల కిందట పక్షవాతం వచ్చింది. కాలు, చేయి పని చేయకపోవడంతో కూలీపనులకు వెళ్లలేని దీనస్థితి. కుటుంబ పోషణ భారంగా మారడంతో కనీసం పింఛను మంజూరు చేయాలని కోరుతూ నాలుగేళ్ల నుంచి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నానని వాపోయారు.

రైతేరాజు
అన్నదాతకు అండగా నిలిచేందుకు విభిన్న కథనాల సమాహారం -6లో

'తెలుగు' పాఠాలు..
విశ్వవిద్యాలయంలో ఎంఏ తెలుగు కోర్సు ప్రారంభం
పూర్వ వైభవానికి అడుగులు

బొమ్మూరు, న్యూస్‌టుడే: బొమ్మూరులోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం తెలుగు వెలుగులు పంచడానికి సిద్ధమవుతోంది. గతంలో ఇక్కడ చదువుకున్న వారు మేధావులుగా, పండితులుగా పేరొందారు. తర్వాత పరిస్థితుల్లో కళ తప్పింది. కొన్నేళ్ల తర్వాత ఇప్పుడు కొత్త కళను సంతరించుకుంది. కూటమి ప్రభుత్వం చొరవతో ఈ ఏడాది ఎంఏ తెలుగు కోర్సు ప్రారంభించారు. మరిన్ని కోర్సులు త్వరలో ప్రారంభిస్తామని వీసీ డా.డి.మునిరత్నం నాయుడు చెబుతున్నారు. పూర్వ వైభవం తీసుకురావడమే తమ లక్ష్యమని అంటున్నారు.

మాతృభాషపై ఆసక్తితో..



నాన్న చేనేత కార్మికుడు. డిగ్రీ వరకు ఆంగ్లమాధ్యమంలో చదివాను. ప్రస్తుత తరుణంలో చాలామంది తెలుగును తక్కువగా చూస్తున్నారు. అది తప్పు. మాతృభాషపై ఆసక్తితో ఇందులో చేరాను. తెలుగు ఉపాధ్యాయురాలిని అవ్వాలన్నదే నా లక్ష్యం. బోధన వృత్తిలో స్థిరపడి విద్యార్థులకు భాషపై ఇష్టాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తా. రోజూ పెద్దాపురం నుంచి వస్తున్నా.

- వై.ఝాన్సీ, పెద్దాపురం

తర్వాత తరాలకు అందాలి..



హిందీ, ఇంగ్లీష్‌లో ఎంఏలు చేశాను. ఎంఏ తెలుగు కూడా చేయాలనుకుంటున్నాను. అనుభజ్ఞులైన ప్రొఫెసర్లు చక్కగా చెబుతున్నారు. పద్యాలు, సాహిత్యం, భాష పరిజ్ఞానం అంటే ఏమిటో తెలుస్తుంది. ఎంతోమంది మహానుభావులు తమ రచనలు, కవితలు, పుస్తకాల ద్వారా భాషాభివృద్ధికి కృషి చేశారు. వాటిని తర్వాత తరాలకు అందించాలి.

- డి.ప్రవీణ్, దివాన్‌చెరువు

11 నుంచి పడవ పోటీలు

ఆత్రేయపురం: జనవరి 11 నుంచి 13 వరకు జాతీయ స్థాయిలో సర్ ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోఫీ సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నామని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు. సోమవారం లొల్ల లాకుల వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈ సంవత్సరం కేరళ జట్లు పాల్గొంటాయన్నారు. ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన వారికి రూ.2 లక్షలు, రూ.లక్ష చొప్పున అందించనున్నట్లు చెప్పారు.

మనోనేత్రంతో మ్యాజిక్..!
ఈ చిన్నారులు.. గాంధారి విద్యలో మెరికలు

బొమ్మూరు, హుకుంపేట, న్యూస్‌టుడే: ప్రస్తుత తరుణంలో చాలామంది పిల్లలు చరవాణులకే పరిమితం అవుతున్నారు. కానీ ఆ అక్కాతమ్ముడు ఎంతో ప్రత్యేకం. ఎందుకంటే వారు చూడకుండానే రంగులు గుర్తిస్తారు.. చదువుతారు.. ఎన్నో విన్యాసాలు చేస్తారు. అందుకనే వారిద్దరూ ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించారు. బొమ్మూరు ప్రశాంతీనగర్‌కు చెందిన పుల్లా రామారావు, నాగలక్ష్మి దంపతులు.. మనుమలు పుల్లా సాయి అమృత 7వ తరగతి, సాయి దీపక్ 6వ తరగతి చదువుతున్నారు. కర్ణాటకకు చెందిన మంజునాథ పూజార్ విద్యారంబ్ గురుకుల్‌లో గాంధారి విద్యలో ఆన్‌లైన్‌లో అభ్యసిస్తున్నారు. ఇందులో మంచి అలవాట్లు, సజ్జన సాంగత్యం, ప్రాణాయామం తదితరాలు నేర్పిస్తారు.

అన్నీ కళ్లు మూసుకునే..

ఇందులో కళ్లకు గంతలు కట్టుకుని రంగుల బంతులు గుర్తించడం, పుస్తకాలు చదవడం, రాయడం, డ్రాయింగ్, మనుషులను గుర్తించడం వంటివి నేర్పిస్తారు. సైకిల్ తొక్కడం, స్కేటింగ్, నగదు నోట్లపై అంకెలు గుర్తించడం వంటివి నేర్చుకున్నారు. రుచి, వాసన, స్పర్శ ద్వారా రంగులు చెబుతారు. ఈ విద్యను లీడర్స్, హనుమాన్ యోగా, ఆదియోగి అనే మూడు దశల్లో నేర్చుకుంటున్నారు.

తెల్లవారుజామున 4 గంటలకు నిద్రలేస్తా..

8 నెలల నుంచి సాధన చేస్తున్నా. రోజూ తెల్లవారుజామున 4 గంటలకు లేచి కళ్లకు గంతలు కట్టుకుని భగవద్గీత చదువుతాను. శిక్షణ మొదటి రోజు నుంచి కథలు, ఆసక్తికరమైన విషయాలు నేర్పిస్తున్నారు. గురువు చెప్పిన ప్రతీ విషయాన్ని సాధన చేస్తాను. ఆధ్యాత్మిక శాస్త్రవేత్త అవ్వాలన్నదే నా లక్ష్యం. **- సాయి దీపక్**

నైతిక విలువలు నేర్పుతారు..

సరదాగా నేర్చుకుందామని మొదలుపెట్టినా తర్వాత ఆసక్తి పెరిగింది. పిల్లలకు మంచి అలవాట్లు, కుటుంబ విలువలు ఎంతో అవసరం. ఆధ్యాత్మిక విద్యతో పాటు నైతిక విలువలు నేర్పుతారు. వీటితో పాటు కూచిపూడి, సంగీతం నేర్చుకుంటున్నా. కుటుంబ ప్రోత్సాహంతోనే సాధించగలిగాం. **- సాయి అమృత**

టెట్‌కు వేళాయె..!

శ్యామలాసెంటర్: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ఈ నెల 10 నుంచి 21 వరకు రాజమహేంద్రవరం పేపరుమిల్లు రోడ్డులోని లూథర్‌గిరి రాజీవ్‌గాంధీ ఐయాన్ డిజిటల్ జోన్‌లో నిర్వహించనున్నట్లు డీఎస్ఈవో వాసుదేవరావు ఒక ప్రకటనలో తెలిపారు.

దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు: 16,262

మొదటి విడత : ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు

రెండో విడత: మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు

సూచన : అభ్యర్థులు తమకు కేటాయించిన తేదీల్లో మాత్రమే హాజరుకావాలి. ఎలక్ట్రానిక్ పరికరాలు పరీక్ష కేంద్రానికి అనుమతించరు. పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుంది.

పోటీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

కలెక్టరేట్ (రాజమహేంద్రవరం): దిల్లీ పోలీస్, సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీసు ఫోర్సుల్లో సబ్ ఇన్‌స్పెక్టర్ పోస్టుల భర్తీకి ఈ నెల 9 నుంచి 11 వరకు స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సీ) నిర్వహించే పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా రెవెన్యూ అధికారి సీతారామమూర్తి తెలిపారు. రాజమహేంద్రవరం కేంద్రంగా జరిగే పరీక్షలకు జిల్లా పరిధిలోని 500 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై సమన్వయ శాఖల అధికారులతో సోమవారం కలెక్టరేట్‌లో సమీక్షించారు. కాతేరు గామన్ వంతెన సమీపంలోని జీఎస్ఆర్ ఆన్‌లైన్ అకాడమీలో మంగళవారం నుంచి రెండు విడతలుగా పరీక్షలు జరుగుతాయన్నారు.

లేనిది ఉన్నట్లు.. దివ్యాంగులకు అగచాట్లు

గోపాలపురం సామాజిక ఆరోగ్య కేంద్రంలో గతంలో సదరం కేంద్రం ఉండేది. ఇటీవల ఆ కేంద్రాన్ని తొలగించారు. అయినా ఇంకా అంతర్జాలంలో చూపిస్తోంది. దీంతో దివ్యాంగులు ధ్రువీకరణ పరీక్షలకు ఈ కేంద్రాన్ని ఎంపిక చేసుకుని దరఖాస్తు చేస్తున్నారు. ఇలా దరఖాస్తు చేసిన సుమారు 30 మంది సోమవారం సదరం ధ్రువీకరణ కోసం ఇక్కడికొచ్చారు. కేంద్రం లేదని వైద్యులు చెప్పడంతో నిరాశగా వెనుదిరిగారు. దీనిపై ఆసుపత్రి సూపరింటెండెంట్ చైతన్య రాజును వివరణ కోరగా ఆన్‌లైన్‌లో సాంకేతిక సమస్య కారణంగా ఈ ఇబ్బంది ఎదురైందని, ఉన్నతాధికారులకు తెలియజేశామని తెలిపారు. **-న్యూస్‌టుడే, గోపాలపురం**

సడలిన నిబంధనలు.. పురపాలికలకు కాసులు..!
ఇంటి పన్ను విధింపులో సర్కారు వెసులుబాటు

ఏప్రిల్ నుంచి డిసెంబరు వరకు పాత నిర్మాణాలు, కొత్త వాటికి వచ్చిన దరఖాస్తులు, పన్నుల విధింపు ఇలా..

పురపాలకం	దరఖాస్తులు (పాతనిర్మాణాలు)	ఆదాయం రూ.లక్షల్లో	దరఖాస్తులు (కొత్త నిర్మాణాలు)	ఆదాయం రూ.లక్షల్లో
రాజమహేంద్రవరం	1164	106	1,346	155
కొవ్వూరు	265	6.98	129	8.19
నిడదవోలు	321	16.32	456	25.91

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : ఇంటి పన్ను లేకపోతే ఆస్తికి సంబంధించి అన్ని లావాదేవీలు నిలిచిపోవడంతోపాటు, మిగిలిన ప్రయోజనాలు పొందేందుకు ఆస్కారం లేకుండా పోయేది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం నిబంధనలు సడలించింది. సాధారణంగా ఇంటి పన్ను విధింపులో కాగితాల్లో అడ్డంకులు ఉంటే దరఖాస్తులను తిరస్కరించేవారు. కొన్ని సందర్భాల్లో అదనపు నిర్మాణం ఉంటే పన్ను విధించడం కష్టంగా మారేది. దీంతో నిర్మాణ పనులు నిలిపేయాల్సి పరిస్థితి ఉండేది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ప్రత్యేక సర్వే చేపట్టింది. ఆయా పురపాలికల్లో పన్నులు లేకుండా నిర్ధారణ కాకుండా నిలిచిన ఆస్తులను గుర్తించి, క్రమబద్ధీకరిస్తున్నారు. దీంతో పురపాలికలకు ఆదాయం పెరుగుతోంది.

మునగ @ 25

మార్కెట్‌లో మునగకాయల ధర మండిపోతోంది. చెన్నై తదితర దూరప్రాంతాల నుంచి తీసుకొచ్చి వ్యాపారులు విక్రయిస్తున్నారు. కార్తికంలో కిలో కాయలు రూ.100 ఉండేది. ప్రస్తుతం దిగుబడి గణనీయంగా పడిపోవడంతో మార్కెట్‌లో ఒకకాడ రూ.25 నుంచి రూ.30 వరకు పలుకుతోంది. చిన్నగా ఉంటే రూ.20 చొప్పున విక్రయిస్తున్నారు. **- న్యూస్‌టుడే, పి.గన్నవరం**

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97607
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80082 34669

విద్యుత్తు సేవలకూ.. ఓ గడువుంది..!

న్యూస్‌టుడే, దేవీచౌక్

విద్యుత్తు వినియోగదారులకు సకాలంలో సేవలు అందేలా చూసేందుకు ఒక్కో పనికి ఒక్కో గడువు విధించారు. ఆ లోగా సంబంధిత అధికారులు సమస్యను పరిష్కరించాలి. ఈ మేరకు పౌర సేవల సమయపాలన పట్టిక ఏర్పాటు చేశారు. అందులోని గడువు ప్రకారం సేవలు అందించాల్సి ఉంది. లేకుంటే సదరు వినియోగదారుడికి పరిహారం చెల్లించవలసి ఉంటుంది. సేవలను బట్టి రోజుకు రూ.100 నుంచి రూ.500 వరకు పరిహారం పొందొచ్చు.

గడువు (గంటల్లో)	పట్టణాల్లో	గ్రామాల్లో
సాధారణ ఫ్యూజ్ ఆఫ్ కాల్స్	4	12
ఓవర్ హెడ్ లైన్ బ్రేక్ డౌన్	6	24
ట్రాన్స్‌ఫార్మర్ వైఫల్యం	24	48
మీటరు ఫిర్యాదులు (రోజులు)	7	15

ఏ సేవకు ఎన్ని రోజుల్లో పరిష్కారం

కొత్త కనెక్షన్	3
కాలిపోయిన మీటరు మార్పిడి	7
వినియోగదారుడి కారణంగా మీటరు కాలిపోతే	7
విద్యుత్తు సరఫరా (ఎల్‌టీ)	7
11 కేవీ నుంచి..	15
33 కేవీ నుంచి..	30
అదనపు హెచ్‌టీసీ	45
యాజమాన్యం హక్కు బదిలీ	7
కేటగిరీ మార్పు	7
ఎల్‌టీ 1 ఫేజ్ నుంచి 3 ఫేజ్	30
ఎల్‌టీ నుంచి హెచ్‌టీకి	60

పలు రైళ్లు రద్దు

సాంబమూర్తినగర్(కాకినాడ): నిర్వహణ పనులతో పలు రైళ్లు రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25న కాకినాడ టౌన్ - చర్లపల్లి (07155), 26న చర్లపల్లి - కాకినాడ టౌన్ (07156), హైదరాబాద్ - కాకినాడ టౌన్ (07157), 27న కాకినాడ టౌన్ - హైదరాబాదు (07158) రైళ్లు రద్దయ్యాయని వెల్లడించారు.

SSI MANTRA
50+ రోబోటిక్ శస్త్రచికిత్సలు విజయవంతం
కేవలం నాలుగు నెలల్లో
మీ నమ్మకానికి మా కృతజ్ఞతలు
రోబోటిక్స్‌తో జరిగే ఆధునిక శస్త్రచికిత్సలు
జనరల్ సర్జరీ గైనకాలజీ యూరాలజీ క్యాన్సర్ థైరాయిడ్
APEX HOSPITALS
ప్రకాష్ నగర్, రాజమండ్రి
Dr. Nitin Rimmalapudi, M.S.
Robotic Surgeon
అపాయింట్‌మెంట్ కొరకు సంప్రదించండి
93 922 922 00
సోమవారం నుండి శనివారం

(c) eenadu

బాధితుల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ నరసింహకిషోర్

సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు : ఎస్పీ

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): జిల్లా ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారం చూపేలా చర్యలు చేపడుతున్నామని ఎస్పీ డి.నరసింహకిషోర్ పేర్కొన్నారు. రాజమహేంద్రవరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 32 మంది ఫిర్యాదుదారులతో ఎస్పీ నేరుగా మాట్లాడి అర్జీలు తీసుకున్నారు. సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి వెంటనే ప్రజా సమస్యలను పరిష్కరించాలని సూచించారు.

యూరియా కోసం క్యూ

బిక్కవోలు సొసైటీ వద్ద సోమవారం రైతులు యూరియా కోసం క్యూ కట్టారు. దాదాపు 100 మంది వరుసలో నిల్చున్నారు. సొసైటీ అధ్యక్షుడు చిట్టిబాబు చౌదరి మాట్లాడుతూ 20 టన్నుల యూరియా వచ్చిందన్నారు. ఒక్కో పాస్‌పుస్తకానికి రెండు బస్తాల యూరియా ఇస్తున్నామన్నారు. ప్రస్తుతానికి ఎలాంటి కొరత లేదన్నారు. ఒకేసారి రైతులు రావటంతో వరుస ఏర్పాటు చేయాల్సి వచ్చిందన్నారు. అందదేమో అనే భయంతో రైతులు ఎదురు చూస్తున్నారన్నారు.

\- న్యూస్‌టుడే, బిక్కవోలు

ఔత్సాహికుల్లో వ్యాపార నైపుణ్యాభివృద్ధికి 'స్పార్క్'

కలెక్టరేట్‌లో గోడపత్రాలు ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జేసీ, ఇతర అధికారులు

కలెక్టరేట్ (రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: వినూత్న ఆలోచనలకు వేదికగా నిలిచే రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా ఔత్సాహిక వ్యాపారవేత్తలకు ఈ నెల 9 నుంచి 11 వరకు 'స్పార్క్' పేరిట మూడు రోజుల కార్యక్రమం నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన గోడ పత్రాలను సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ కీర్తి చేకూరి, జేసీ మేఘాస్వరూప్ ఇతర అధికారులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రారంభ దశ ఫౌండర్లు, ఇన్నోవేటర్లు, విద్యార్థులు, కొత్త వ్యాపారాల(స్టార్టప్)పై ఆసక్తి ఉన్నవారిని దృష్టిలో పెట్టుకుని స్పార్క్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మొదటి రోజు బొమ్మూరులోని రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్, రెండో రోజు రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మూడో రోజు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఔత్సాహిక వ్యాపారవేత్తలైన యువతకు ఈ కార్యక్రమం చక్కని అవకాశమని, స్పార్క్ ద్వారా వ్యాపార నైపుణ్యాలు వృద్ధి చెందుతాయని రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ నోడల్ అధికారి టి.వి.సూర్యప్రకాశ్ తెలిపారు.

రాజమహేంద్రవరం అంటే ఎంతో అభిమానం: జయసుధ

పాస్టర్లకు క్రిస్మస్ కానుకలు అందిస్తున్న జయసుధ

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం అంటే తనకు ఎంతో అభిమానమని ప్రముఖ సినీ నటి జయసుధ అన్నారు. రాజమహేంద్రవరంలోని మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ నివాసానికి సోమవారం వచ్చిన ఆమె పాస్టర్లకు క్రిస్మస్ కానుకలు పంపిణీ చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. తనకు చాలా సంవత్సరాల తర్వాత మలయాళ సినిమాలో అవకాశాలు వస్తున్నాయన్నారు. డిజిటల్ ప్లాట్ ఫాం వచ్చాక కొత్త వారికి అవకాశాలు ఎక్కువగా వస్తున్నాయన్నారు. ఇప్పటి వరకు 350 సినిమాలకు పైగా నటించినట్లు చెప్పారు. పవన్ కల్యాణ రాజకీయాల్లో తనదైన శైలిలో రాణిస్తున్నారని పేర్కొన్నారు. ఆయన పడిన కష్టం, నిజాయతీ ఈ స్థాయిలో నిలబెట్టాయన్నారు. ప్రస్తుతం ఏ పార్టీలోనూ లేనని స్పష్టం చేశారు.

గోదావరి తీరం పర్యాటక వైభవం

ప్రముఖ నటుడు ఎల్బీ శ్రీరామ్‌తో సత్యప్రసాద్, శ్రీనివాసు

కడియం, న్యూస్‌టుడే: గోదావరి నదీ తీరం పర్యాటక వైభవానికి నాంది అని ప్రముఖ రచయిత, హాస్యనటుడు ఎల్బీ శ్రీరామ్ కొనియాడారు. ధవళేశ్వరం రామపాదాల రేవు వద్ద జరిగిన ఓ షూటింగ్‌లో ఆయన సందడి చేశారు. ఇందులో ఆయన ప్రధాన కథానాయకుడిగా నటిస్తున్నారు. సినీ వినీలాకాశంలో గోదావరి అందాలు తెలుగు ప్రేక్షకులకు చెరగని దృశ్యాలుగా మారాయన్నారు. తిరుపతి జంట కవుల్లో ఒకరైన చెళ్లపిళ్ల వెంకటశాస్త్రి సాహిత్యంపై ఎల్బీ శ్రీరామ్ విస్తృత అధ్యయనం చేశారు. ఈనెల 15న కడియంలో తలపెట్టిన జంటకవుల రాష్ట్ర స్థాయి సాహిత్య కార్యక్రమానికి హాజరు కావాలంటూ ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, సమితి ప్రధాన కార్యదర్శి చిలుకూరి శ్రీనివాసరావులు ఆయనను కోరారు. ఉదయ్‌భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వో కార్యాలయ ఉద్యోగిపై ఎమ్మెల్యే ఆగ్రహం

రంగంపేట: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ ఉద్యోగి రాజేశ్వరరావుపై సోమవారం ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం రంగంపేట మండల పర్యటనలో ఉన్న ఎమ్మెల్యేను డీఎంహెచ్‌వో కార్యాలయంలో పనిచేసే ఎంపీహెచ్ఎస్ రాజేశ్వరరావు కలిశారు. దివ్యాంగ ధ్రువీకరణ పత్రాల పంపిణీలో అవకతవకలు జరిగాయని ఎమ్మెల్యే అన్నారు. బలభద్రపురంలో ఇలాంటి బాగోతం వెలుగులోకి వచ్చిందని, దీనిని కప్పిపుచ్చుకునేందుకు మీరు ఎన్ని అవస్థలు పడుతున్నారో తెలుసని వ్యాఖ్యానించారు. కలెక్టరు దృష్టికి తీసుకెళ్లానని, సంబంధిత మంత్రి దృష్టికి తీసుకెళ్లి విచారణ చేయిస్తామన్నారు.

నేడు వర్సిటీ ఫుట్‌బాల్ జట్టు ఎంపికలు

శ్యామలాసెంటర్: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలు, వర్సిటీ జట్టు ఎంపికలు ఈ నెల 9, 10 తేదీల్లో స్థానిక ఎస్‌కేవీటీ కళాశాలలో నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ బీవీ తిరుపణ్యం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెండు రోజులపాటు జరిగే ఎంపికలకు ఉభయ గోదావరిజిల్లాల నుంచి క్రీడాకారులు హాజరవుతారని తెలిపారు.

పెండింగ్ కేసుల జాబితా అందించండి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): పెండింగ్‌లో ఉన్న సివిల్, కాంపౌండబుల్ కేసుల జాబితాను బీమా సంస్థల యాజమాన్యాలు జిల్లా న్యాయసేవాధికార సంస్థకు అందించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత సూచించారు. రాజమహేంద్రవరంలోని కోర్టు ఆవరణలో సోమవారం బీమా సంస్థల ప్రతినిధులు, ఆయా సంస్థల న్యాయవాదులతో డీఎల్ఎస్ఏ కార్యదర్శి ఎన్.శ్రీలక్ష్మితో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ నెల 13న జరగనున్న జాతీయ లోక్‌అదాలత్‌లో వీలైనన్ని ఎక్కువ కేసులను పరిష్కరించి బాధితులకు పరిహారం అందించాలని కోరారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

అసెట్ రికవరీ బ్రాంచ్, డోర్ నెం.26-15-150, ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్, చెంగలరావుపేట, విశాఖపట్నం-530001.
ఫోన్ : 0891-2537792 / 82, మొబైల్ నెం. : 93245 17291. ఇ-మెయిల్ : ubin0817295@unionbankofindia.bank

స్థిరాస్తి అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

APPENDIX-IV-A [(See Proviso to Rule 8(6)]

[illegible]

రిజర్వు ధర : రూ.1,23,00,000/- ధరావత్తు : రూ.12,30,000/- బిడ్ పెంపుదల మొత్తం : రూ.1,23,000/-

[illegible]

రిజర్వు ధర : రూ.31,00,000/- ధరావత్తు : రూ.3,10,000/- బిడ్ పెంపుదల మొత్తం : రూ.35,000/-

[illegible]

రిజర్వు ధర : రూ.26,00,000/- ధరావత్తు : రూ.2,60,000/- బిడ్ పెంపుదల మొత్తం : రూ.30,000/-

ఇ-వేలం తేదీ మరియు సమయం : 30-12-2025, మ. 12.00 గం॥ల నుండి సా॥ 05.00 గం॥ల వరకు (వేలము పూర్తి అగు వరకు 10 నిముషముల చొప్పున సమయం పొడిగించబడును)

[illegible] https://www.unionbankofindia.co.in/auction-property/view-auction-property.aspx మరియు www.unionbankofindia.co.in [illegible]

తేది : 02.12.2025
స్థలం : విశాఖపట్నం

సం/- అధీకృత అధికారి & చీఫ్ మేనేజర్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అసెట్ రికవరీ బ్రాంచ్

ఆరోగ్యం.. ఆదాయం.. సాంకేతికత

ఆదర్శ రైతులకు సీఎం సత్కారం

పంటలకు ఎటువంటి రసాయనాలు వినియోగించకుండా తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం సాధిస్తున్నారు తూర్పు గోదావరి జిల్లాకు చెందిన పలువురు రైతులు. ఈ నెల 3న నల్లజర్లలో జరిగిన రైతన్నా.. మీకోసం కార్యక్రమంలో ఆదర్శ రైతులుగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా సత్కారం అందుకున్నారు.

చెరకు తోటలో జోగేంద్రప్రసాద్

స్ఫూర్తి

చెరకు, మిరప పండిస్తూ..

గోకవరం మండలం వాదాలకుంటకు చెందిన గడా జోగేంద్రప్రసాద్ ఎమ్మెల్యే పూర్తి చేశారు. 6 ఎకరాల్లో చెరకు, మిరప పంటను సేంద్రియ పద్ధతిలో సాగుచేస్తున్నారు. తన కుటుంబ అవసరాలకు వినియోగించుకుని మిగిలిన పంటను అమ్ముకుంటున్నారు. చెరకుతో స్వయంగా బెల్లం తయారు చేసి అమ్మితే ఎకరాకు రూ.60 వేల నుంచి రూ.80 వేలు, మిరప పంటకు అన్ని ఖర్చులు పోగా రూ.25 వేల వరకు ఆదాయం వస్తుందని ఆయన చెబుతున్నారు.

కొబ్బరి, కోకో సాగు..

దేవరపల్లి మండలం కురుకూరుకు చెందిన యలమాటి కృష్ణారావు పదెకరాల్లో కొబ్బరి, కోకో వేశారు. మూడేళ్లుగా సేంద్రియ విధానం అవలంబిస్తున్నారు. దీంతో ఖర్చు తగ్గింది. ఆదాయం కూడా అనుకున్న స్థాయిలో వస్తుంది. ఎకరాకు ఏడాదికి రూ.2.10 లక్షల ఆదాయం వస్తుందని దానిలో పెట్టుబడి రూ.90 వేలు పోగా రూ.1,10,000 నికర ఆదాయం మిగులుతుందన్నారు.

మిశ్రమ విధానంలో..

నల్లజర్ల మండలం సింగరాజుపాలెంకి చెందిన దొండపాటి లక్ష్మీనారాయణ 5 ఎకరాల ఆయిల్‌పామ్ తోటలో చేపలు, నాటు కోళ్లు, ఆవులు, గేదెలు పెంచుతున్నారు. వ్యవసాయ క్షేత్రంలో చిన్న చెరువు తవ్వి దానిలో చేపలు వేసి ఆవులు, గేదెలు వేసిన పేడను వినియోగిస్తున్నారు. పొలంలో క్రిమికీటకాలు తిని కోళ్లు పెరుగుతున్నాయి. ఏడాదికి ఖర్చు రూ.5 లక్షలు అవుతుందని అన్నింటితో కలిపి ఏడాదికి సుమారు రూ.11 లక్షలు ఆదాయం ఆర్జిస్తున్నట్లు తెలిపారు.

రైతేరాజు

మల్లె కొమ్మ కత్తిరింపులో పాటించాల్సిన జాగ్రత్తలు

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: మల్లె సాగులో యాజమాన్య పద్ధతులు అవలంబిస్తే అధిక దిగుబడులు వస్తాయని ఉద్యానాధికారి కోటేశ్వరరావు వెల్లడించారు. నాటిన మూడో ఏడాది నుంచి దిగుబడి ప్రారంభమై 12-15 ఏళ్ల వరకు పొందొచ్చు. కత్తిరింపులు చేసే ముందు నవంబరు నుంచి నీటితడులు ఇవ్వకుండా చెట్టును వాడు ముఖం పట్టించాలి. అయిదేళ్ల లోపు వయసున్న తోటలో కొమ్మలు భూమి నుంచి రెండు, అయిదేళ్లు దాటితే మూడు అడుగులు ఉంచి మిగిలిన పైభాగాన్ని కత్తిరించాలి. తాజాదనం కోసం, మొగ్గల సువాసనలు రెండు, మూడు రోజులు వెదజల్లాలంటే సుక్రోస్ లేదా బోరిక్ యాసిడ్ 10 గ్రాములు లేదా అల్యూమినియం సల్ఫేటు ఒక గ్రాము లీటరు నీటికి కలిపిన ద్రావణంలో 10 నిమిషాల పాటు ఉంచి అనంతరం ఆరబెట్టాలి.

వాడపల్లిలో సాగవుతున్న మల్లెతోట

బాయిలర్ కోడిపిల్లలకు కుంపట్లు అమర్చి ఉష్ణోగ్రతలు అందిస్తున్న రైతు

చలికాలంలో కోడిపిల్లల రక్షణ ఇలా..

తెలుసుకుందాం..

జగ్గంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: బాయిలర్ కోడిపిల్లలకు శీతాకాలంలో తగిన ఉష్ణోగ్రతలు అందిస్తూ జాగ్రత్తలు పాటించాలని జగ్గంపేట పశుసంవర్ధక శాఖ ఏడీఏ తాతయ్య సూచించారు. నాణ్యత కలిగిన పిల్లలను ఎంపిక చేసుకొని మొదటి వారంలో 32-35 సెల్సియస్ వేడిని అందించాలి. దీనికోసం కుంపట్లు, గ్యాస్‌బ్రూడర్లు అమర్చుకోవాలి. షెడ్ల చుట్టూ పరదాలు కప్పితే చలిగాలి రాకుండా అడ్డుకోవచ్చు. కోడిపిల్ల వయసు పెరిగేకొద్దీ 39.5-41 సెల్సియస్ మధ్య ఉంచడం ఉత్తమం. నాభి లేదా మలద్వారం వద్ద థర్మామీటరు ఉంచడం ద్వారా ఉష్ణోగ్రతలు తెలుసుకోవచ్చు. తగినంత ఉష్ణోగ్రతలు అందించని పక్షంలో శ్వాసకోశ ఇబ్బంది, బద్ధకం, ఆకస్మిక మరణం సంభవించి నష్టం వాటిల్లుతుంది.

వెదురు.. లాభాలతో ఎదుగుదాం

40 ఏళ్ల వరకు ఆదాయం

వెదురు మొక్కలు

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: వెదురును ప్రధాన పంటగా గాని, పొలం చుట్టూ రక్షణగా గాని వేసుకుంటే తక్కువ పెట్టుబడితో 40 ఏళ్ల వరకూ ఆదాయం పొందొచ్చు. సాగు విధానం, లాభాలు, రాయితీల గురించి ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త చల్లా వెంకటనరసింహారావు వివరించారు. ● 5×5 మీటర్ల ఎడంతో ఎకరాకు 160 మొక్కలు నాటొచ్చు. ● ఎటువంటి భూముల్లోనైనా సాగు చేయొచ్చు. చదును నేలల్లో పొడవు రకాలు, ఏటవాలు భూముల్లో పొట్టి రకాలు వేసుకోవాలి. ● మొక్కలు నాటిన రెండేళ్ల వరకు అంతర పంటలుగా అల్లం, పసుపు, అశ్వగంధ వంటి ఔషధ పంటలు సాగు చేసుకుని అదనపు ఆదాయం పొందొచ్చు. ● మూడవ సంవత్సరం నుంచి ఏడాదికి ఎకరాకు 13 నుంచి 15 టన్నుల వెదురు లభిస్తుంది. టన్ను వెదురు రూ.4-5 వేలు ధర ఉండగా ఏడాదికి రూ.65-70 వేలు ఆదాయం లభిస్తుంది. ● రైతులకు మొక్కకు రూ.150 చొప్పున హెక్టారుకు రూ.60 వేలు ఉద్యానశాఖ రాయితీ అందిస్తుంది. ● సరుగుడు కంటే సాగు సులభం. పెట్టుబడి తక్కువ. లాభాలు అధికం. మార్కెట్ అవకాశాలు అధికం. ● కాగితం, నిర్మాణ రంగం, చేనేత, గృహోపకరణాల పరిశ్రమలకు, డెక్కింగ్, ఫ్లోరింగ్, అగరబత్తీల తయారీకి ముఖ్యమైన వనరును అందిస్తాయి.

భూముల స్వాధీనానికి యత్నం

అధికారులను అడ్డుకున్న రైతులు

కోరుకొండ: కోరుకొండ దేవస్థానం పేరుతో ఉన్న ఇనాం భూముల్లోకి సోమవారం అన్నవరం దేవస్థానం, రెవెన్యూ అధికారులు వెళ్లడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏళ్లగా ఇక్కడి భూములపై వివాదం నడుస్తోంది. వీటి స్వాధీనానికి శ్రీరంగపట్నం సమీపంలోని పొలాల్లోకి వెళ్లిన రెవెన్యూ, దేవస్థానం అధికారులు, సిబ్బందిని రైతులు అడ్డుకున్నారు. అక్కడ నుంచి తహసీల్దారు కార్యాలయానికి వచ్చి నిరసన తెలిపారు. అక్కడే బైఠాయించి ఆందోళనకు దిగారు. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అక్కడకు వెళ్లి రైతులతో మాట్లాడి ఆందోళనను విరమింపజేశారు. అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎటువంటి సమాచారం లేకుండా ఎందుకు వెళ్లారంటూ నిలదీశారు. భూముల సమస్యకు పరిష్కారం ఓ కొలిక్కివస్తుంటే ఇలా ప్రవర్తించడం ఏంటని ప్రశ్నించారు. త్వరలో భూముల సమస్యకు పరిష్కారం వస్తుందని ఎమ్మెల్యే రైతులకు హామీ ఇచ్చారు.

శ్రీరంగపట్నం సమీపంలో పొలాల్లోకి వచ్చిన అధికారులను అడ్డుకున్న రైతులు

మంత్రి దుర్గేష్‌కు వినతిపత్రం అందిస్తున్న సహకార సంఘ ఉద్యోగులు

మంత్రివర్గ సమావేశం దృష్టికి సహకార ఉద్యోగుల సమస్యలు: దుర్గేష్

నిడదవోలు: రాష్ట్ర సహకార ఉద్యోగుల సంఘం జేఏసీ పిలుపు మేరకు ఉద్యోగులు నిడదవోలు డీసీసీబీ శాఖ వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి సోమవారం ధర్నా నిర్వహించారు. అటుగా వస్తున్న మంత్రి కందుల దుర్గేష్ శిబిరం వద్ద ఆగి ఉద్యోగులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. వారు ఆయనకు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈనెల 11న జరిగే మంత్రివర్గ సమావేశంలో ఈ అంశాన్ని ప్రస్తావిస్తానన్నారు. కార్యక్రమంలో సంఘ గౌరవాధ్యక్షుడు జువ్వల రాంబాబు, నాయకులు డీఎస్ఎన్ మూర్తి, కె.శ్రీనివాస్, కేతనపల్లి శ్రీనివాస్, డి.సూర్యచంద్రరావు, పెండ్యాల వరలక్ష్మి, పి.ప్రకాశరావు, కె.సుబ్బారావు, పి.సురేంద్రబాబు, ఎ.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రెండు లారీలు ఢీకొని చోదకుడు సజీవ దహనం

● మృతుడు దేవరపల్లి వాసి ● మరొకరికి గాయాలు

బేస్తవారపేట, న్యూస్‌టుడే: ప్రకాశం జిల్లా గిద్దలూరు డివిజన్ బేస్తవారపేట మండలంలోని పెంచికలపాడు సమీపంలో అనంతపురం-అమరావతి జాతీయ రహదారిపై సోమవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఓ చోదకుడు సజీవ దహనం కాగా, మరో చోదకుడు గాయాల పాలయ్యాడు. బేస్తవారపేట పోలీసుల వివరాల మేరకు ధర్మవరానికి చెందిన కుంపటి ఆది శేషయ్య మినీ లారీలో టమోటా లోడుతో అనంతపురం నుంచి రాజమహేంద్రవరం బయలుదేరాడు. ఈ క్రమంలో పెంచికలపాడు సమీపంలోకి రాగానే అతను నడుపుతున్న లారీ టైరు ఒక్కసారిగా పేలిపోవడంతో అదుపుతప్పి ఎదురుగా వస్తున్న మడ్డి ఆయిల్ ట్యాంకర్‌ను బలంగా ఢీకొట్టింది. ప్రమాద ధాటికి మినీ లారీ బోల్తా పడగా ట్యాంకర్ లారీ ముందు భాగం పూర్తిగా దెబ్బతింది. అనంతరం కొద్ది క్షణాల్లోనే రెండు లారీల ఇంజిన్లలో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. దీంతో చోదకుడు ఆది శేషయ్య అప్రమత్తమై లారీలో నుంచి బయటపడ్డాడు. ఆయిల్ ట్యాంకర్ చోదకుడు పైడికొండల దుర్గారావు (40) క్యాబిన్ ధ్వంసమై పూర్తిగా మూసుకుపోవడంతో బయటికి వచ్చే మార్గం లేక అందులోనే ఇరుక్కుపోయాడు. చూస్తుండగానే మంటలు చెలరేగి అతన్ని చుట్టుముట్టడంతో కూర్చున్న సీటులోనే సజీవ దహనమయ్యాడు. ఇతనిది తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లి కాగా సోమవారం విశాఖపట్టణం సమీపంలోని పరవాడ వద్ద మడ్డి ఆయిల్‌ను ట్యాంకర్ లారీలో లోడ్ చేసుకున్నాడు. దాన్ని తాడిపత్రిలోని ఓ సిమెంట్ ఫ్యాక్టరీలో అన్‌లోడ్ చేసేందుకు వెళ్తుండగా ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. గిద్దలూరు అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. మార్కాపురం డీఎస్పీ నాగరాజు, ఎస్సై రవీంద్రారెడ్డి పరిశీలించి వివరాలను సేకరించారు. టమోటా లారీ చోదకుడు ఆదిశేషయ్యకు స్వల్ప గాయాలు కావడంతో కంభం ప్రభుత్వ వైద్యశాలలో చేరి చికిత్స పొందుతున్నాడు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి	18,500
కురిడీ (వెయ్యింటికి):	
పాతకాయ: గండేరా	28,000
గటగట	25,000
కొత్తకాయ: గండేరా	27,000
గటగట	24,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	15,000-16,000
కొత్త (పచ్చి) కాయ	14,000-15,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	6,000
కిలో	400

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	130-00
రిటైల్ లైవ్	157-00
డ్రెస్డ్	228-00
స్కిన్‌లెస్	259-00

92.7 FM Rajamahendravaram
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

బంగారం బ్యాంకులలో, ముత్తూట్, మణప్పురం, ప్రైవేట్ సంస్థల్లో తాకట్టులో ఉన్నవి విడిపించి, ఈ రోజు మార్కెట్ ప్రకారం కొనబడును. స్పాట్‌క్యాష్. ✆ 98491 38626.

శ్రీసాయి గోల్డ్: తాకట్టులో ఉన్న బంగారం, ఏ బ్యాంక్/ ప్రైవేట్ సంస్థల నుండి అయినా విడిపించి ఆరోజు మార్కెట్ రేట్‌కి కొనబడును. స్పాట్ క్యాష్, ✆ 94933 38823

REAL ESTATE

HOUSE FOR SALE

RAJAMAHENDRAVARAM CITY

రాజమండ్రి, లాలాచెరువు హౌసింగ్ బోర్డ్ కాలనీ MIG-418లో 277 చ॥గ॥ల్లో ఈస్ట్ ఫేసింగ్ ఇల్లు అమ్మకమునకు కలదు. Contact Cell: 63055 24046.

JOBS

Wanted Managers to Motivate Team/ Targets/ Salary upto 50K/ Tanuku/ age above 30Yr/ must Insurance Exp. ✆ 98494 21277.

EENADU for Advertisement Contact: 8008597607

EENADU Classifieds

Wanted Eng., Mat. Teacher for 6,7th. Sal: 18,000 Negotiable. Prakasham EM Hi-School, Madhuranagar, Kkd. 63023 05325, 99488 81449(Wtsap)

వైజాగ్ SKLM VZM జిల్లాలలో స్కూల్స్ హాస్పిటల్స్ బ్యాంక్‌లలో ఔట్‌సోర్సింగ్ & కాంట్రాక్ట్ బేస్ ద్వారా పనిచేయుటకు అటెండర్స్, రికార్డ్స్, జూనియర్ అసిస్టెంట్స్, కంప్యూటర్ ఆపరేటర్స్ బుకింగ్ క్లర్క్స్ బీట్ ఆఫీసర్స్ హెల్ప్‌డెస్క్, గార్డెనర్స్ MNO FNO ల్యాబ్‌టెక్నీషియన్స్ ANM GNM చేసినవారు M/F అర్జెంట్‌గా కావలెను. 10th నుండి బీటెక్ వరకు జీ: 20K to 40K ✆ 9160226051.

అమెరికాలో 1 సం॥ బాబు ఆలన, పాలన వ్యక్తిగత సంరక్షణ కొరకు అనుభవంగల ఆడవారు కావలెను. అమెరికా వీసా కల్గినవారు మాత్రమే. ✆ 9440803362

అకౌంటెంట్స్, సూపర్‌వైజర్స్, ఐషర్ డ్రైవర్స్ కావలెను. గోకవరం మండలం, పెంటపల్లి గ్రామంలోఉన్న పేపర్ మిల్లులో పనిచేయుటకు. 78935 55551, 90300 56553.

హైదరాబాద్‌లో పనిచేయడానికి M/F కేర్‌టేకర్స్ కావలెను. జీతం:20,000+ భోజనము+ వసతి. ఈ జీతం నెల 20లోపు జాయిన్ అయిన వారికి మాత్రమే. +91 76809 22316.

వైజాగ్‌లో ప్రముఖ షాపింగ్ మాల్స్‌లో పనిచేయుటకు 18-35వ యువతి యువకులు కావలెను. జీతం 10000-13500 ఫుడ్‌రూము 9704637370, 9949904532.

ఆర్మీ NAVY ఎయిర్‌ఫోర్స్ రైల్వే, SSC, బ్యాంకులలో ఉద్యోగావకాశాలు. అర్హత: 10th-డిగ్రీ. Age:16-25. శిక్షణ 3 నెలలు శిక్షణాకాలంలో హాస్టల్, 10th, ఇంటర్, డిగ్రీ డిస్టెన్స్ కోర్స్‌లు కలవు. ★ ముందుగా ఎటువంటి ఫీజులేదు ★క్రిస్టియన్ ఎడ్యుకేషన్ అకాడమీ, వైజాగ్. ✆ 91212 32328.

నెక్ సూచించిన కోడిగుడ్డ ధర
★ For the Information of Trade & Industry
★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 6-50 పై॥
అనపర్తి ఆఫీసు: 08857-226908

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

రాజమహేంద్రవరం

సమస్యల పరిష్కారానికి కృషి

వి.ఎల్.పురం: ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఏపీ ఎన్జీవో సంఘం కృషి చేస్తోందని ఆ సంఘ జిల్లా కమిటీ ఛైర్మన్ మీసాల మాధవరావు అన్నారు. ఏపీ ఎన్జీవో సంఘ తాలూకా యూనిట్ ఎన్నికల సన్నాహక సమావేశం సోమవారం రాజమహేంద్రవరంలోని ఎన్జీవో కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు సంబంధించి పెండింగ్ డీఏలు, పీఆర్సీ ఏర్పాటు తదితర సమస్యల పరిష్కారానికి రాష్ట్ర జేఏసీ ఛైర్మన్ విద్యాసాగర్ నేతృత్వంలో ప్రభుత్వంతో చర్చలు జరుగుతున్నాయన్నారు.

పుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఈవో రమారజని

ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం రావాలి

శ్యామలాసెంటర్: పాఠశాలల రికార్డులను ప్రధానోపాధ్యాయులు ఎప్పటికప్పుడు నవీకరణ చేసుకోవాలని ఎంఈవో-2 రమారజని అన్నారు. స్థానిక బ్రాడీపేట నగరపాలక సంస్థ ప్రాథమిక పాఠశాలను సోమవారం సందర్శించారు. ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం రావాలని సూచించారు.

మేమున్నాం.. మీకు తోడుగా

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు:
ఉ॥ 10 - మ॥ 1
83282 39927, 80089 02897

సమస్య : స్థానిక సీతంపేటలో వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రి సమయాల్లో ఇబ్బందులు తప్పడం లేదు. - శ్రీకాంత్

సమస్య : భాస్కర్‌నగర్ కాలనీలో వీధి దీపాలు వెలగడం లేదు. దీపాలు మరమ్మతులకు గురయ్యాయి. - ప్రకాష్

సమాధానం: వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం.
- విమల, ఎలక్ట్రికల్ ఏఈ - న్యూస్‌టుడే, టి.నగర్,

ఆర్థిక స్వావలంబన సాధించాలి

వి.ఎల్.పురం: స్వయం సహాయక సంఘాలు(ఎస్‌హెచ్‌జీ)లోని మహిళలు వినూత్న విధానాలతో ముందుకెళ్తూ మరింత ఆర్థికాభివృద్ధి సాధించాలని కలెక్టర్ కీర్తి చేకూరి సూచించారు. జిల్లా మెప్మా వార్షిక సంచిక 'అవని 2024-2025'ను సోమవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అవని సంచికలో స్ఫూర్తినిచ్చే విజయగాథలు, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లోని మహిళా సంఘాలు సాధించిన అభివృద్ధి కథనాలు పొందుపరచినట్లు తెలిపారు. మెప్మా చేపట్టిన 9 ప్రాజెక్టులకు ఇటీవల లభించిన స్కోచ్ అవార్డులు దేశవ్యాప్తంగా మెప్మాను అగ్రగామిగా నిలిపాయన్నారు. జేసీ మేఘాస్వరూప్, డీఆర్వో సీతారామమూర్తి, మెప్మా పీడీ కనకరాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశం నేడు

కడియం, న్యూస్‌టుడే: కడియం మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం ఉదయం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ వెలుగు బంటి సత్యప్రసాద్ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రమేశ్ ఓ ప్రకటనలో తెలిపారు. అధికారులు, గ్రామ కార్యదర్శులు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు.

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలంటూ నిరసన

రాజమహేంద్రవరం వైద్యం, కోటగుమ్మం: వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే బాలింత మృతి చెందిందని.. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలంటూ రాజమహేంద్రవరం జీజీహెచ్ వద్ద బాధిత కుటుంబ సభ్యులు, వైకాపా నాయకులు సోమవారం ఆందోళన చేపట్టారు. వైకాపా మాజీ ఎంపీ భరత్‌రామ్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబ సభ్యులు, నాయకులు జీజీహెచ్‌లోని అత్యవసర వైద్య విభాగం వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 2న లాలాచెరువుకు చెందిన జయంతి(20) కాన్పు కోసం వస్తే వైద్యుల నిర్లక్ష్యం కారణంగా మృతి చెందిందని ఆరోపించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ సత్యనారాయణ అక్కడకు చేరుకుని, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

జీజీహెచ్ వద్ద ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు, మాజీ ఎంపీ భరత్

నగరం.. ప్రగతి పథం..!

● జోరుగా శంకుస్థాపనలు

సింహాచల్ నగర్‌లో పార్కు విస్తరణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : గత వైకాపా హయాంలో నగర అభివృద్ధిని విస్మరించడంతో ప్రజలు అనేక ఇబ్బందులకు గురయ్యారు. ప్రస్తుతం కూటమి సర్కారు ప్రణాళికా బద్ధంగా నగరాన్ని ప్రగతి బాట పట్టించాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో పలు అభివృద్ధి పనులకు ఇటీవల శంకుస్థాపన కార్యక్రమాలు జోరుగా నిర్వహించారు. రహదారులు, కాలువల విస్తరణ, సుందరీకరణకు సంబంధించి పనులు ప్రారంభించారు. ఈ మూడు నెలల కాలంలోనే రూ 19 కోట్లతో పనులు చేపట్టారు.

రూపుమారనున్న కాలువలు

● నారాయణపురంలో కాలువల విస్తరణకు రూ 27 లక్షలతో పనులు చేపట్టారు. ● 5వ డివిజన్ కంబాలపేటలో పిల్లవారి వీధిలో నూతనంగా కాలువ నిర్మిస్తున్నారు. ● కంబాలచెరువు లలితా జ్యువలరీ వద్ద కాలువ నిర్మాణానికి రూ. 16 లక్షల వరకు వెచ్చిస్తున్నారు. ● నెహ్రూనగర్‌లో రూ 9.95 లక్షలతో 450 మీటర్ల నిర్మాణ పనులు చేపట్టారు. ● ఎస్కేటీవీ కళాశాల నుంచి గుంటూరు మెస్‌కు వెళ్లే దారిలో రూ 8.20 లక్షలతో కల్వర్టు నిర్మాణం చేపట్టారు.

ఇక..దారులు తళ..తళ

● 8వ డివిజన్ చర్చి జంక్షన్‌లో బీటీ రోడ్డు నిర్మాణానికి రూ 27.50 లక్షలు కేటాయించారు. అల్లూరి సీతారామరాజు జంక్షన్ వద్ద గతంలో ఉన్న రోడ్డు పాడైపోవడంతో పునఃనిర్మిస్తున్నారు. ● గానుగ వీధిలో రూ 35 లక్షలతో సీసీ రోడ్డు ఆనుకొని బెర్మ్‌లు నిర్మాణం చేస్తున్నారు. ● వెంకటేశ్వరనగర్ అయిదో వీధిలో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ. 15 లక్షలు వెచ్చిస్తున్నారు. ● తారకరామ్ నగర్‌లో కాలువలు, రోడ్డు నిర్మాణ నిమిత్తం రూ. 38 లక్షలు కేటాయించారు.

ఆహ్లాదం పంచేలా ఉద్యానం

● ఏకేసీ పార్కు విస్తరణకు రూ 15 లక్షలతో పనులు చేపట్టారు. పార్కులో పచ్చదనం లేకపోవడంతో తిరిగి మొక్కలు వేస్తున్నారు. ● వెంకటేశ్వరనగర్ పార్కులో పైపులైన్ నిర్మాణానికి రూ 13.40 లక్షలు ఖర్చు చేస్తున్నారు. ● వెంకటేశ్వరనగర్ పార్కులో చిన్నారులకు ఆట వస్తువులు సమకూరుస్తున్నారు. ● వాకర్స్ పార్కు వద్ద అంతర్గత కాలువల నిర్మాణం చేపట్టారు.

వీధి దీపాల మరమ్మతులు

● గోదావరి ఘాట్ రోడ్లలో వీధి దీపాల మరమ్మతులు, నూతన దీపాలు ఏర్పాటు చేయనున్నారు. దీని కోసం సాధారణ నిధులు రూ 39.9 లక్షలతో పనులు చేపట్టారు. ● అంతర్గత విద్యుత్తు కేబుల్ మార్పు చేసేందుకు రూ 15 లక్షలతో పనులు చేపట్టారు.

మహిళలకు ఉపాధిపై ఉచిత శిక్షణ

ధవళేశ్వరం, మోరంపూడి, న్యూస్‌టుడే: మహిళలకు యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థలో ఉచితంగా శిక్షణ ఇస్తామని సంస్థ డైరెక్టర్ టి.శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. జిల్లాలోని గ్రామీణ ప్రాంత నిరుద్యోగ మహిళలు అందరూ అర్హులేనని, 14 రోజులు శిక్షణ ఇస్తామన్నారు. ఆ సమయంలో వారందరికీ వసతి, భోజన, సౌకర్యాలను కల్పిస్తామని, ఆసక్తి ఉన్న వారు రేషన్ కార్డు, ఆధార్ కార్డు, 10వ తరగతి మార్కుల జాబితా జిరాక్సులు, నాలుగు పాస్‌పోర్టు సైజు ఫొటోలు సమర్పించాలన్నారు. అనంతరం సర్టిఫికెట్, బ్యాంక్ నుంచి రుణం ఇస్తారన్నారు. 19 నుంచి 45 సంవత్సరాల మధ్య గల మహిళలు అర్హులని తెలిపారు.

సైనిక సంక్షేమ నిధికి విరాళాలు ఇవ్వండి

దేవీచౌక్: రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో సోమవారం ఆర్మ్‌డ్ ఫోర్సెస్ ఫ్లాగ్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.రామచంద్రరావు జాతీయ, ఎన్‌సీసీ పతాకాలు ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ దేశాన్ని కాపాడటానికి ప్రాణత్యాగం చేసిన సైనికుల సేవలు మరిచిపోలేమన్నారు. ప్రతి పౌరుడు దేశం ముందుగా అనే భావనతో ఉండాలని పిలుపునిచ్చారు. కాకినాడ జిల్లా సైనిక సంక్షేమ నిధికి ఉదారంగా విరాళాలు ఇవ్వాలని కోరారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీరామ్మూర్తి, సహాయ ప్రిన్సిపల్ జి.చంద్రశేఖర్, లెఫ్టినెంట్ డాక్టర్ ఈసూబ్ బాషాషేక్, డాక్టర్ ఎ.రాజేశ్వరి, డాక్టర్ కె.అనూష, అధ్యాపకులు పాల్గొన్నారు.

క్రికెట్‌లో విద్యార్థిని ప్రతిభ

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే : నన్నయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఇటీవల భీమవరంలో నిర్వహించిన మహిళా క్రికెట్ టోర్నమెంట్ పోటీల్లో విద్యార్థిని బి.తనిష్క విజేతగా నిలిచిందని కందుకూరి రాజ్యలక్ష్మి కళాశాల ప్రిన్సిపల్ రాఘవ కుమారి తెలిపారు. సౌత్ జోన్ అన్నా యూనివర్సిటీ తమిళనాడులో జనవరి 12 నుంచి 16 వరకు జరగబోయే మహిళా క్రికెట్ టోర్నమెంట్‌కు ఎంపికైందన్నారు. క్రికెట్ క్రీడలో ప్రతిభ చూపుతూ జాతీయ పోటీలకు అర్హత సాధించిన విద్యార్థిని తనిష్కను సోమవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో అభినందించారు. పీడీ వై.సుధారాణి, ఎ.నాగు, ఎ.అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సమాజ హితం కోరేదే సాహిత్యం

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే : సమాజ హితం కోరేదే సాహిత్యమని తెలుగు, సంస్కృత అకాడమీ ఛైర్మన్ ఆర్.డి.విల్సన్ అన్నారు. సోమవారం గౌతమఘాట్‌లోని రివర్‌బే హోటల్‌లో జాస్తి రమాదేవి రచించిన 'పందిరి పట్టె మంచం' కథా సంకలనాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. మారుతున్న కాలంలో ఎన్నో వృత్తులు మాయమవుతూ వారి కుటుంబాలు ఆర్థికంగా నష్టపోతున్నాయన్నారు. అందులో భాగంగా వడ్రంగి వృత్తిదారుల కష్టాలు వ్యక్తీకరించే పందిరి పట్టె మంచం కథ అపూర్వమన్నారు. ప్రముఖ రచయిత్రి తటవర్తి నాగేశ్వరి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సహరి సంపాదకురాలు పసుపులేటి సత్యశ్రీనివాస్, దుద్దుపూడి అనసూయ తదితరులు పాల్గొన్నారు.

'పందిరి పట్టె మంచం' కథా సంకలనం ప్రదర్శిస్తున్న విల్సన్ తదితరులు

పోస్టర్ ఆవిష్కరిస్తున్న కమిషనర్ రాహుల్ మీనా

ప్లాస్టిక్ నియంత్రణ అందరి బాధ్యత

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: ప్లాస్టిక్ నియంత్రణ అందరి బాధ్యతగా గుర్తించాలని రాజమహేంద్రవరం మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా అన్నారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్లాస్టిక్ రీ-సైక్లింగ్ లీగ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలలు, కళాశాలల్లో ప్లాస్టిక్ అనర్థాలపై ప్రచారం చేస్తామన్నారు. అదనపు కమిషనర్ రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ వెంకట రమణ, ఎంహెచ్‌వో వినూత్న, ఈఈ ఉమదర్శా ఆలీ, మాధవి, డిప్యూటీ సిటీ ప్లానర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు మెరుగుపరుస్తాం

టి.నగర్: పంచాయతీ పరిధిలో ఆయా గ్రామాల్లో మౌలిక వసతులు మెరగుపరుస్తామని కమిషనర్ రాహుల్ మీనా తెలిపారు. సోమవారం కోలమూరు గ్రామంలో పర్యటించారు. సచివాలయం సందర్శించి ఉద్యోగులతో మాట్లాడారు. ఆ ప్రాంతంలో కాలువలు, రోడ్లను పరిశీలన చేశారు.

ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సాయిరామ్

దేవీచౌక్: భారతీయ జనతాపార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రాజమహేంద్రవరానికి చెందిన కాలెపు సత్య సాయిరామ్ నియమితులయ్యారు. గతంలో సాయిరామ్ యువ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా, జిల్లా అధ్యక్షుడిగా, భాజపా జిల్లా కార్యదర్శిగా సేవలందించారు. ఆయనను ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమించడంపై భాజపా నాయకులు, ఓబీసీ మోర్చా నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడిగా లక్ష్మణరావు

నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు

కడియం: రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం 7వ జిల్లా వార్షిక కౌన్సిల్ సమావేశం రాజానగరంలోని గోదావరి గ్లోబల్ యూనివర్సిటీలో సోమవారం జరిగింది. ముఖ్యఅతిథిగా సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.సాయిశ్రీనివాస్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నూతన పీఆర్సీ కమిషన్ ఏర్పాటుతో పాటు ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడిగా ఎం.లక్ష్మణరావు, ప్రధాన కార్యదర్శిగా డానియేలు బాబు, ఆర్థిక కార్యదర్శిగా యు.అర్జునుడును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీసీ జాకబ్, టి.ఈశ్వర్‌రెడ్డి, త్రినాథ్‌బాబు, జిల్లా నాయకులు సూరిబాబు పాల్గొన్నారు.

విలువ ఆధారిత పంటల సాగుతో లాభాలు

వి.ఎల్.పురం: సంప్రదాయ పంటల సాగుతోపాటు విలువ ఆధారిత వ్యవసాయం, అనుబంధ పంటల సాగుపై దృష్టి పెట్టడం ద్వారా రైతులు అధిక లాభాలను అర్జించే అవకాశం ఉందని కలెక్టర్ కీర్తి చేకూరి అన్నారు. సోమవారం రాజమహేంద్రవరంలోని క్యాంపు కార్యాలయంలో ఉద్యాన రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీజనల్ డిమాండ్, స్థానిక వినియోగ అవసరాల మేరకు సాగు చేస్తే రైతుల ఆదాయంలో గణనీయమైన పెరుగుదల సాధ్యమవుతుందన్నారు. ఎంఐడీహెచ్ పథకం ద్వారా పండ్లు, కూరగాయల తోటల పెంపకానికి ప్రోత్సాహం అందిస్తున్నామన్నారు. జేసీ మేఘాస్వరూప్, జిల్లా ఉద్యాన అధికారి మల్లికార్జునరావు, జిల్లా వ్యవసాయ అధికారి మాధవరావు, అనుబంధ శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

సూచిక.. కనిపించక..!

రాజమహేంద్రవరం రూరల్ కొంతమూరు నుంచి జాతీయ రహదారికి అనుసంధానం చేసే కల్యాణ్‌నగర్ ప్రాంతంలో సూచికలు సరైన నిర్వాహణ లేక పడిపోయాయి. వల్లభ గణపతి ఆలయ మార్గంలో పెద్ద మలుపులు ఉన్నాయి. దీంతో పలు చోట్ల సూచికలు ఏర్పాటు చేశారు. అవి సరిగా లేకపోవడంతో చోదకులకు ఇబ్బందులు తప్పడం లేదు. –న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు

రహదారిపై ఇసుకతో వెతలు

నగరంలో నిత్యం రద్దీగా ఉండే మార్గాల్లో ఒకటైన ఐ.ఎల్.టి.డి వంతెనపై ఇసుక ఉండటంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. గ్రామీణ ప్రాంతాల మీదుగా నగరానికి చేరుకోవడానికి ఇదే ప్రధాన మార్గం. దీనిపై నిత్యం పెద్ద ఎత్తున ఇసుక లారీలు ప్రయాణిస్తుంటాయి. ఐ.ఎల్.టి.డి కూడలి నుంచి వంతెన మీదుగా రైల్వే క్వాటర్స్ వరకు సుమారు కిలోమీటరు మేర రహదారిపై ఇసుక పేరుకుపోయింది. –న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు

అంధకారంలో వీధులు

గోదావరి గట్టు ఆంధ్ర యువతి సంస్కృత కళాశాల (సేవా సదనం) వీధిలో రాత్రి సమయాల్లో ప్రయాణం చేయాలంటే స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ ప్రాంతంలో వీధి దీపాలు సరిగా వెలగకపోవడంతో అంధకారం అలముకుంటోంది. గోదావరి గట్టు, మెయిన్ రోడ్డును కలిపే మార్గంలో వీధి దీపాలు వెలగని పరిస్థితి. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు

పొంచి ఉన్న ప్రమాదం

నగరంలో చాలా ప్రాంతాల్లో విద్యుత్తు స్తంభాలకు ఫ్యూజ్ బాక్సులు తలుపులు లేకుండా బహిరంగంగా దర్శనమిస్తున్నాయి. చిన్న పిల్లలకు సైతం చేతికందే ఎత్తులో తెరచి ఉంటున్నాయి. ప్రధాన ప్రాంతాల్లోనే కాకుండా, పాఠశాల పరిసరాల్లో సైతం ఇవి ప్రమాదకరంగా మారాయి. సంబంధిత అధికారులు స్పందించి పరిస్థితిని చక్కదిద్దాలని నగర ప్రజలు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు

సూచనలు చేస్తున్న సీఐ మురళీకృష్ణ

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ నరసింహకిషోర్ అన్నారు. ఆయన సూచన మేరకు రాజమహేంద్రవరం పోలీసుస్టేషన్ పరిధిలో సీఐ మురళీకృష్ణ ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి పోలీసులు, స్పెషల్ పార్టీ సిబ్బందితో తనిఖీలు చేపట్టారు.

పీజీఆర్ఎస్‌కు 23 వినతులు

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ: ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా సోమవారం నగరపాలక సంస్థలో పరిష్కార వేదికను నిర్వహించారు. కమిషనర్ రాహుల్ మీనా పాల్గొని వినతులు స్వీకరించారు. పారిశుద్ధ్యం, తాగునీరు, మౌలిక వసతులపై 23 మంది ఫిర్యాదులు అందాయి.

వేదన వినాలి.. సాంత్వన కలగాలి..!

● పీజీఆర్ఎస్‌లో వినతుల వెల్లువ

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే: అర్హత ఉన్నా పింఛను రావడం లేదంటూ కొందరు.. ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలంటూ మరికొందరు.. మౌలిక వసతుల సమస్యలతో మరికొందరు.. ఇలా వివిధ సమస్యలతో అనేక మంది వ్యయప్రయాసలకోర్చి కలెక్టరేట్‌కు వచ్చారు. అధికారులకు తమ గోడు వినిపించి న్యాయం చేయాలని కోరారు.

వసతిగృహ సమస్యలపై ..

నగరంలోని సాంఘిక సంక్షేమ కళాశాల బాలుర వసతి గృహం-1లో అనేక సమస్యలు ఉన్నయని పీడీఎస్‌యూ నాయకులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ● రాజేంద్రనగర్‌లో అద్దెభవనంలో నిర్వహిస్తున్న కళాశాల బాలుర హాస్టల్- 2ను ఇక్కడ హాస్టల్-1 భవనంలోకి మార్పు చేసి సిబ్బందిని పెంచడం ద్వారా సమస్యలు పరిష్కారమవుతాయనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

పట్టా సరే.. ఏదీ ఇళ్ల స్థలం ..

గత ప్రభుత్వంలో ఇళ్ల స్థలాలు మంజూరైనట్లు చెప్పి పట్టాలు చేతుల్లో పెట్టారే తప్ప స్థలాలు చూపలేదు. దీంతో సొంతగూడు సమకూర్చుకోలేక అద్దె ఇళ్లల్లోనే అవస్థలు పడుతూ జీవనం సాగిస్తున్నామంటూ పలువురు లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు. రాజమహేంద్రవరం నగరంతోపాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన సుమారు వంద మంది మహిళలు కలెక్టరేట్‌కొచ్చి తమ గోడు విన్పించారు. పట్టాలు దగ్గర ఉన్నా స్థలాలు ఎక్కడో కూడా తెలియడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుత ప్రభుత్వంలోనైనా స్థలాలు చూపించి ఆదుకోవాలని కోరారు.

నినాదాలు చేస్తున్న రైతు కూలీ సంఘం నాయకులు

పేదలకు భూములు పంచాలంటూ...

భూమిలేని నిరుపేదలకు సీలింగు, బంజరు భూములు పంచాలని అఖిలభారత రైతు కూలీ సంఘం(ఏఐకేఎంఎస్) డిమాండ్ చేసింది. సోమవారం కలెక్టరేట్ వద్ద ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి అధికారులకు వినతిపత్రం అందించారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేశ్వరరావు, ఏఐకేఎంఎస్ నాయకులు భీమశంకరం తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నియంత్రణపై దృష్టి

వి.ఎల్.పురం: బాల్య వివాహ ముక్త్ భారత్ 100 రోజుల ప్రచార కార్యక్రమాల్లో భాగంగా బాల్య వివాహాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ కీర్తి చేకూరి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాల్యవివాహాల నిర్మూలనపై ప్రచార గోడపత్రాలు ఆవిష్కరించారు.

వసతిగృహాలపై నివేదికలకు ఆదేశాలు.. ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాల్లో పారిశుద్ధ్య నిర్వహణ మెరుగుపరచాలని, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషన్లు వసతి గృహాలను ప్రత్యక్షంగా పరిశీలించి నివేదికలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆయా శాఖల అధికారులతో ఆమె మాట్లాడుతూ ధాన్యం సేకరణ సేకరణ విషయంలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు.

సవరణ
ది. 4-12-2025 తేదీన ప్రచురించిన శ్రీ సారంగధరేశ్వర స్వామి వారి బహిరంగ వేలం పాట ప్రకటన నందు కాలపరిమితిని ది. 1-1-2026 నుండి 31-12-2027 వరకు 2 సం॥లుగా చదువుకొనగలరు
రాజమండ్రి,
ది. 8-12-25. నిర్వహణాధికారి

తప్పిన ప్రమాదం

హుకుంపేట జాతీయ రహదారి కూడలి వద్ద సాయంత్రం వ్యాన్‌పై వెళ్తున్న ఇనుప రాడ్లు అదుపు తప్పి రహదారిపై పడ్డాయి. ఈ క్రమంలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. వాటిని తొలగించే క్రమంలో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ట్రాఫిక్ పోలీసులు వాహనాలను సర్వీసు రోడ్డు వైపు మళ్లించారు.
– న్యూస్‌టుడే, హుకుంపేట

అధ్వానంగా నడక మార్గాలు

రాజమహేంద్రవరం నగరంలో గత పుష్కరాల్లో అభివృద్ధి చేసిన నడక మార్గాలు చాలా వరకు దెబ్బతిన్నాయి. కొన్ని చోట్ల దెబ్బతినగా మరికొన్ని ప్రాంతాల్లో కుంగిపోయాయి. కంబాలచెరువు సమీపంలోని గ్యాస్ కంపెనీల వద్ద నడకదారిలో పలక దెబ్బతిని ప్రమాదకరంగా ఉంది. రాత్రిపూట ఎవరైనా దానిపైనుంచి నడిస్తే ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది.
–న్యూస్‌టుడే, దేవీచౌక్

దౌర్జన్యం చేశారంటూ ఫిర్యాదు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే : చర్చి బాధ్యతల విషయంలో రెండు వర్గాలు ఒకరిపై మరొకరు ఫిర్యాదు చేసుకున్న ఘటన ఒకటో పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది.

పోలీసులు తెలిపిన వివరాలు.. ముగ్గుపేట చర్చిలో పాస్టర్ మార్టిన్ లూథర్ పదవీ కాలం పూర్తయిన తరువాత ఏఈఎల్‌సీ సంస్థ ద్వారా వచ్చిన తమను బాధ్యతలు స్వీకరించనీయకుండా దౌర్జన్యం చేస్తున్నారని ఇద్దరు పాస్టర్లు ఉదయ్‌కుమార్, శాంసన్‌క్రిస్టియన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ● కోర్టు ఆదేశాల ప్రకారం పాస్టర్‌గా కొనసాగుతున్న తన విధులకు ఆటంకం కలిగించి దౌర్జన్యం చేస్తున్నారని ఉదయ్, శాంసన్‌లపై మార్టిన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వాలంటీర్లకు ధ్రువపత్రాల అందజేత

దేవీచౌక్: రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్-2 యూనిట్ పిడింగొయ్యి గ్రామంలో గత వారంరోజులుగా నిర్వహిస్తున్న ప్రత్యేక సేవా శిబిరం సోమవారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక సేవా శిబిరంలో పాల్గొన్న వాలంటీర్లకు ప్రిన్సిపల్ డాక్టర్ కె.రామచంద్రరావు చేతుల మీదుగా ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త కె.సుభాషిణిదేవీ, ప్రోగ్రాం అధికారులు హెచ్.శ్రీరామ్‌పవన్, డాక్టర్ బి.భవానీ, డాక్టర్ పి.మురళీకృష్ణ, గ్రామ పెద్దలు, ఉన్నత పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలి

రాజానగరం: రాజానగరం నియోజకవర్గ పరిధిలోని జాతీయ రహదారి పనులు వేగవంతం చేయాలని రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఎన్‌హెచ్ అధికారులకు సూచించారు. దివాన్‌చెరువు వద్ద నిర్మించే పైవంతెన పనుల ప్రగతిపై ఎన్‌హెచ్ఏఐ ప్రాజెక్ట్ డైరెక్టర్, గుత్తేదారు, ఇంజినీర్లతో సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా హైవేలో దివాన్‌చెరువు నుంచి రాజమహేంద్రవరం వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని, అప్రోచ్ రోడ్ల పనులు వేగవంతం చేయాలని కోరారు.

WE'RE HIRING!
Walk-in
09:00 AM - 10:30 AM
10th & 11th Dec' 2025
Spoken English Trainers
Experienced Candidates ONLY
Pay Scale: ₹20,000 - ₹30,000
Pre-School / Primary Teachers
Freshers, Trained Graduates & Post Graduates
Pay Scale: ₹12,000 - ₹18,000
Accountant, Front-Office Executive
Candidates with experience & fluent English ONLY
Graduates; Pay Scale: ₹14,000 - ₹20,000
THE BODHI SCHOOL
Behind Income Tax Office
Rajamahendravaram, Ph: 87122 88551

(c) eenadu

రాజమహేంద్రవరం గ్రామీణం

• రాజమహేంద్రవరం గ్రామీణం • రాజానగరం • అనపర్తి

మహిళలకు ఉపాధిపై ఉచిత శిక్షణ

ధవళేశ్వరం, మోరంపూడి: మహిళలకు యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థలో ఉచితంగా శిక్షణ ఇస్తామని సంస్థ డైరెక్టర్ టి.శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. జిల్లాలోని గ్రామీణ ప్రాంత నిరుద్యోగ మహిళలు అందరూ అర్హులేనని, 14 రోజులు శిక్షణ ఇస్తామన్నారు. ఆ సమయంలో వారందరికీ వసతి, భోజన, సౌకర్యాలను కల్పిస్తామని, ఆసక్తి ఉన్న వారు రేషన్ కార్డు, ఆధార్ కార్డు, 10వ తరగతి మార్కుల జాబితా జిరాక్సులు, నాలుగు పాస్‌పోర్టు సైజు ఫొటోలు సమర్పించాలన్నారు. అనంతరం సర్టిఫికేట్, బ్యాంక్ నుంచి రుణం ఇస్తారన్నారు. 19 నుంచి 45 సంవత్సరాల మధ్య గల మహిళలు అర్హులని తెలిపారు.

సర్వసభ్య సమావేశం నేడు

కడియం: కడియం మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం ఉదయం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ వెలుగు బంటి సత్యప్రసాద్ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రమేశ్ ఓ ప్రకటనలో తెలిపారు. అధికారులు, గ్రామ కార్యదర్శులు, సర్పంచులు, ప్రజా ప్రతినిధులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు:
ఉ॥ 10 - మ॥ 1
ధవళేశ్వరం: 91212 29057,
కడియం: 91212 29062,
అనపర్తి: 95333 66637

వెలిగిన దీపాలు

స్పందనకు వందనం

బొమ్మూరు ఏసీబీ కాలనీలో వీధి దీపాలు వెలగక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సమస్యను గ్రామకార్యదర్శి కాశీ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి, మరమ్మతులు చేపట్టారు. వీధి దీపం వెలిగేలా చర్యలు తీసుకున్నారు.

రాత్రయితే అంధకారమే..

సమస్య: హుకుంపేట కల్వర్టు సమీపంలో కొన్ని వీధి దీపాలు నెలల తరబడి వెలగడం లేదు. సాయంత్రం 6 దాటితే చీకటిగా ఉంటుంది. అధికారులు పట్టించుకోవడం లేదు. **- మణి, స్థానికుడు**

సమాధానం: మరమ్మతులు చేయించి వీధి దీపం వెలిగేలా చర్యలు తీసుకుంటాం. **- కాశీ, కార్యదర్శి, హుకుంపేట**

- న్యూస్‌టుడే, బొమ్మూరు

పశువులకూ ఓ హాస్టల్

బిక్కవోలు, న్యూస్‌టుడే: రైతులకు పాడి పంటలు సమృద్ధిగా ఉన్నప్పుడే వ్యవసాయం బాగుంటుందని ప్రభుత్వం గోకులాల పేరుతో పశువులకు షెడ్లు నిర్మించింది. సొంత స్థలం ఉన్న రైతులు వీటిని నిర్మించుకున్నారు. షెడ్లు, సొంత స్థలాలు లేని వారు పశువులను బహిరంగ ప్రదేశాల్లో ఉంచుతున్నారు. వీటితో ట్రాఫిక్‌కు ఇబ్బంది అవుతుంది. ఆ పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. ఈ సమస్యను అధిగమించడానికి పశువులకు హాస్టల్ అవసరమని ప్రభుత్వం భావించింది. నియోజకవర్గానికి ఒకటి నిర్మించాలని సంకల్పించింది.

గుజరాత్‌లో విజయవంతం..

పశువులకు హాస్టల్ నిర్మించాలని తెదేపా ప్రభుత్వం 2016లోనే నిర్ణయించింది. బిక్కవోలు మండలం రంగాపురంలో స్థలం కూడా పరిశీలించారు. అప్పటికే గుజరాత్ రాష్ట్రంలో విజయవంతగా నిర్వహిస్తున్నారు. వాటిని పరిశీలించాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి కొందరు పశువైద్యుల్ని కూడా పంపారు. వారు పరిశీలించి వచ్చారు. హాస్టల్ నిర్మాణానికి అన్ని ఏర్పాట్లు చేశారు. అంతలో ఎన్నికలు రావడంతో ఆగిపోయింది. సర్కారు మారడంతో ఆ ప్రతిపాదన అటకెక్కింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వీటిని నిర్మించాలని నిర్ణయం తీసుకుంది.

గుజరాత్‌లో షెడ్ల నిర్మాణాలు

నియోజకవర్గానికి ఒకటి చొప్పున..

ప్రతి నియోజకవర్గంలో ఒక హాస్టల్ నిర్మించాలని భావిస్తోంది. అందుకు 2 నుంచి 5 ఎకరాల ప్రభుత్వ భూములు తీసుకుంటారు. లేదంటే లీజుకు తీసుకోడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. సొంత షెడ్లు లేని రైతులు తమ పశువుల్ని ఇక్కడ పెట్టుకుంటారు. వీటి నిర్వహణకు ఒకరిని ఏర్పాటు చేసుకుని, వారికి నెలకు కొంత సొమ్ము ఇస్తారు. డ్వాక్రా మహిళలకు అప్పగించేందుకు యోచిస్తున్నారు. నియోజకవర్గానికి ఒకేచోట కాకుండా అయిదారు చోట్ల ఏర్పాటు చేస్తే బాగుంటుందని రైతులు అభిప్రాయపడుతున్నారు.

రాజమహేంద్రవరం డివిజన్‌లో..		
మండలం	ఆవులు	గేదెలు
అనపర్తి	1,251	6,578
బిక్కవోలు	1,109	5,482
రంగంపేట	6,270	9,668
రాజానగరం	9,441	15,760
కోరుకొండ	4,876	11,575
సీతానగరం	3,987	10,694
గోకవరం	3,426	9,929
కడియం	1,307	3,945
రా.గ్రామీణం	1,783	5,168

ఆదేశాలు రాగానే..

ఇంకా ఆదేశాలు రాలేదు. వచ్చిన వెంటనే స్థల సేకరణ ప్రారంభిస్తాం. నిరుపేద పాడి రైతులకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. నిర్వహణ సులువు అవుతుంది. పాల ఉత్పత్తి కూడా పెరిగే అవకాశం ఉంది.
– వెంకటేశ్వర్లు, డిప్యూటీ డైరెక్టర్, పశుసంవర్ధక శాఖ

పూడికతీత పనుల పరిశీలన

అనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: అనపర్తి మండలం రామవరంలోని నల్లకాలువ పూడిక తీత పనులను ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కూటమి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలి

రాజానగరం: రాజానగరం నియోజకవర్గ పరిధిలోని జాతీయ రహదారి పనులు వేగవంతం చేయాలని రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఎన్‌హెచ్ఏఐ అధికారులను సూచించారు. దివాన్‌చెరువు వద్ద నిర్మిస్తున్న ఫ్లైఓవర్ పనుల ప్రగతిపై ఎన్‌హెచ్ఏఐ ప్రాజెక్ట్ డైరెక్టర్, గుత్తేదారు, ఇంజినీర్లతో సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా హైవేలో దివాన్‌చెరువు నుంచి రాజమహేంద్రవరం వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని, అప్రోచ్ రోడ్ల పనులు వేగవంతం చేయాలని కోరారు.

ప్రజా సమస్యలకు పరిష్కారం చూపుదాం: నల్లమిల్లి

రంగంపేట, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజాదర్బారు నిర్వహిస్తున్నట్లుగానే కార్యకర్తల కోసం క్యాడర్ కోసం నల్లమిల్లి నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. సోమవారం రంగంపేట తహసీల్దారు కార్యాలయంలో జరిగిన క్యాడర్ కోసం ఎమ్మెల్యే నల్లమిల్లి కార్యక్రమంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన కార్యకర్తలు తెలిపిన సమస్యల పరిష్కారంపై నాయకులు, అధికారులతో సమీక్షించారు. నెలక్రితం నిర్వహించిన కార్యక్రమంలో వచ్చిన 90శాతం సమస్యలకు పరిష్కారం లభించిందని అన్నారు. గ్రామ, మండల స్థాయిలో పరిష్కారం కాని వాటిని జిల్లాస్థాయి అధికారులతో చర్చించి పరిష్కరిస్తామన్నారు. విద్యుత్తు పరమైన సమస్యలు అధికంగా వచ్చాయని, వాటిలో చాలా వరకు పరిష్కరించినట్లు చెప్పారు. వడ్డేలలో రూ. 7లక్షలతో నిర్మించిన మంచినీటి బోరుని ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి ప్రారంభించారు. జిల్లా తెదేపా ప్రధానకార్యదర్శి ఆళ్ల గోవింద, ఏఎంసీ ఛైర్మన్ సూర్యనారాయణ, ఆత్మ కమిటీ ఛైర్మన్ సత్తిబాబు, మండల తెదేపా అధ్యక్షుడు ఉడ్డంద్రవు శ్రీనివాసరావు, జనసేన మండల అధ్యక్షుడు గిరిజాల సత్తిబాబు పాల్గొన్నారు.

రంగంపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ

రాజానగరం: అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రి ఖర్చులకు ఇబ్బందులు పడుతున్న నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన సుమారు రూ. 10 లక్షల విలువైన చెక్కులను సోమవారం అందజేశారు. జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు రాష్ట్ర కమిటీ కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి వీటిని పంపిణీ చేశారు. హెచ్.బి. కాలనీకి చెందిన పెన్నాడ జ్యోతిలక్ష్మీశ్రీకి రూ. 80,406, దివాన్‌చెరువుకు చెందిన జి. ఉషామాధవికి రూ. 2,03,265, జె. పద్మావతికి రూ. 25 వేలు, చక్రద్వారబంధానికి చెందిన జి. రామారావుకు రూ. 57,786, పి. రాంబాబుకు రూ. 50వేలు, బి. జానకికి రూ. 42 వేలు, ఎ. శ్రీనివాస్‌కు రూ. 51వేలు, పరిజల్లిపేటకు చెందిన కె. భరత్‌కుమార్‌కు రూ. 45 వేలు విలువైన చెక్కులు అందించారు.

వెంకయ్యనాయుడుకి స్వాగతం

కోరుకొండ, న్యూస్‌టుడే: మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుకి రాజమహేంద్రవరం విమానాశ్రయంలో సోమవారం ఘనస్వాగతం లభించింది. ఎమ్మెల్యేలు బత్తుల బలరామకృష్ణ, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, జనసేన నాయకురాలు బత్తుల వెంకటలక్ష్మి, భాజపా నాయకులు ఏపీఐఆర్ చౌదరి, నీరుకొండ వీరన్నచౌదరి, పిక్కి నాగేంద్ర, మింగి లక్ష్మీనారాయణ తదితరులు స్వాగతం పలికారు.



కోరుకొండ సీఐగా సత్యనారాయణమూర్తి

కోరుకొండ, న్యూస్‌టుడే: కోరుకొండ సీఐగా ఎస్. సత్యనారాయణమూర్తి నియమితులయ్యారు. కోరుకొండలోని పోలీసు సర్కిల్ కార్యాలయంలో సోమవారం రాత్రి ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కోరుకొండ, సీతానగరం, గోకవరం పోలీసుస్టేషన్ల ఎస్సైలు, ఏఎస్సైలు, హెచ్‌సీలు తదితర పోలీసు సిబ్బంది కొత్త సీఐను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

ఎస్సైగా శ్రీనివాస్ బాధ్యతల స్వీకరణ

కోరుకొండ, న్యూస్‌టుడే: కోరుకొండ ఎస్సైగా ఎస్. శ్రీనివాస్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పెద్దాపురం ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న ఈయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటివరకు పనిచేసిన కేవీ నాగార్జున జిల్లా పోలీసు కార్యాలయానికి వెళ్లారు.

ట్రాఫిక్ చిక్కులు

హుకుంపేట జాతీయ రహదారి కూడలి వద్ద సాయంత్రం వ్యాన్‌పై వెళ్తున్న ఇనుప రాడ్లు అదుపు తప్పి రహదారిపై పడ్డాయి. ఈ క్రమంలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. వాటిని తొలగించే క్రమంలో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ట్రాఫిక్ పోలీసులు వాహనాలను సర్వీసు రోడ్డు వైపు మళ్లించారు. **– న్యూస్‌టుడే, హుకుంపేట**

తీగలతో తంటా

బొమ్మూరులోని చాలా విద్యుత్తు స్తంభాలకు ఇష్టానుసారంగా వివిధ రకాల వైర్లు చుట్టేశారు. భారీ వాహనాలు వెళ్లేటప్పుడు తగిలి, అవి తెగిపోతున్నాయి. వాటిని మరమ్మతులు చేయడం ప్రహసనంగా మారింది. గతంలో స్తంభానికి కేబుల్, అంతర్జాల తీగలు చుట్టేందుకు పన్ను చెల్లించేవారు. ప్రస్తుతం చెల్లించట్లేదు. వీటికి అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు. **– న్యూస్‌టుడే, బొమ్మూరు**

సూచిక.. కనిపించక..!

రాజమహేంద్రవరం గ్రామీణం కొంతమూరు నుంచి జాతీయ రహదారికి అనుసంధానం చేసే కల్యాణ్‌నగర్ ప్రాంతంలో సూచికలు సరైన నిర్వాహణ లేక పడిపోయాయి. వల్లభ గణపతి ఆలయ మార్గంలో పెద్ద మలుపులు ఉన్నాయి. దీంతో పలు చోట్ల సూచికలు ఏర్పాటు చేశారు. అవి సరిగా లేకపోవడంతో చోదకులకు ఇబ్బందులు తప్పడం లేదు. **–న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు**

వారధి.. ప్రమాదకరంగా మారి..

నగరంలో నిత్యం రద్దీగా ఉండే మార్గాల్లో ఒకటైన ఐ.ఎల్.టి.డి వంతెనపై ఇసుక ఉండటంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. గ్రామీణ ప్రాంతాల మీదుగా నగరానికి చేరుకోవడానికి ఇదే ప్రధాన మార్గం. దీనిపై నిత్యం పెద్ద ఎత్తున ఇసుక లారీలు ప్రయాణిస్తుంటాయి. ఐ.ఎల్.టి.డి కూడలి నుంచి వంతెన మీదుగా రైల్వే క్వార్టర్స్ వరకు సుమారు కిలోమీటరు మేర రహదారిపై ఇసుక పేరుకుపోయింది. **–న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు**

సచివాలయ సిబ్బందిని నియమించాలి

ధవళేశ్వరం, మోరంపూడి, న్యూస్‌టుడే: ధవళేశ్వరం సచివాలయం-1 పరిధిలో ఖాళీగా ఉన్న డిజిటల్ అసిస్టెంట్, మహిళా పోలీసు పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని భాజాపా మండల అధ్యక్షుడు ఒంటెద్దు స్వామి, షేక్ షాజీద్‌లు సోమవారం కలెక్టర్ కీర్తి చేకూరికి వినతిపత్రం ఇచ్చారు. సిబ్బంది లేక ఏ పనులు జరగట్లేదని తెలిపారు. ● ధవళేశ్వరంలో ప్రస్తుతం 60 మంది పారిశుద్ధ్య కార్మికులు మాత్రమే ఉన్నారని, చెత్త తొలగించడంలో తీవ్ర జాప్యం జరుగుతుందని అందులో పేర్కొన్నారు. జనాభాకు తగినట్లుగా పారిశుద్ధ్య కార్మికులను నియమించాలని కోరారు.

ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడిగా లక్ష్మణరావు

కడియం, న్యూస్‌టుడే: రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం 7వ జిల్లా వార్షిక కౌన్సెల్ సమావేశం రాజానగరంలోని గోదావరి గ్లోబల్ యూనివర్సిటీలో సోమవారం జరిగింది. ముఖ్యఅతిథిగా సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.సాయిశ్రీనివాస్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నూతన పీఆర్సీ కమిషన్ ఏర్పాటుతో పాటు ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడిగా ఎం.లక్ష్మణరావు, ప్రధాన కార్యదర్శిగా డానియేలు బాబు, ఆర్థిక కార్యదర్శిగా యు.అర్జునుడును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీసీ జాకబ్, టి.ఈశ్వర్‌రెడ్డి, త్రినాథ్‌బాబు, జిల్లా నాయకులు సూరిబాబు, సునీత, దుర్గారావు, దాసరి శివ తదితరులు పాల్గొన్నారు.



నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు

కడియంలో మొక్కుబడిగా పీజీఆర్ఎస్

కడియం, న్యూస్‌టుడే: సంక్షేమ పథకాల అమలులో ఎదురవుతున్న ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వాటి సత్వర పరిష్కార మార్గాలను చూపించడానికి రాష్ట్ర ప్రభుత్వం పీజీఆర్ఎస్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. కడియం మండల రెవెన్యూ కేంద్రంలో సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో తహసీల్దార్ సునీల్‌కుమార్, ఎంపీడీవో రమేశ్ మినహా మరో మూడు శాఖల అధికారులు మాత్రమే హాజరయ్యారు. ఉద్యాన, వ్యవసాయ, ర.భ, వైద్య, పోలీసు, ఇతర శాఖల నుంచి రాకపోవడంతో పలువురు కలెక్టరేట్‌కు వెళ్తున్నారు. మండల స్థాయి అధికారులంతా పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

రంగాపురంలో మట్టి తవ్వకాల అడ్డగింత

బిక్కవోలు, న్యూస్‌టుడే: రంగాపురంలోని కుడుముల చెరువులో మట్టితవ్వకాలపై వైకాపా నాయకులు సోమవారం ఆందోళన చేశారు. లేఔట్ల మెరక, ఇతర పనులకు ఇక్కడ మట్టిని తోలి వ్యాపారం చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే డా.సత్తి సూర్యనారాయణ రెడ్డి ఆరోపించారు. చెరువు తవ్వుతున్న ప్రాంతానికి తన దళనుచరులతో వెళ్లి లారీలను, తవ్వకాలను అడ్డుకున్నారు. తహసీల్దారుకు, మైనర్ ఇరిగేషన్ అధికారులకు ఫోన్ సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. 10వేల క్యూబిక్కు మీటర్లకు అనుమతి ఇస్తే అంతకు మించి తవ్వుతున్నారని ఆరోపించారు. రాత్రిపూట కూడా యథేచ్ఛగా తవ్వేస్తున్నారని అన్నారు.

ప్రపంచ తెలుగు మహాసభల సన్నాహక సమావేశం నేడు

రాజానగరం, న్యూస్‌టుడే: వచ్చే ఏడాది నిర్వహించనున్న మూడో ప్రపంచ తెలుగు మహాసభలకు సంబంధించి సన్నాహక సమావేశాన్ని జీజీయూలో మంగళవారం నిర్వహించనున్నారు. ఈ మేరకు జీజీయూ ఛాన్సలర్ కె.వి.వి.సత్యనారాయణ రాజు సోమవారం తెలిపారు. 2026లో ఫిబ్రవరి 28, మార్చి 1 తేదీల్లో అమలాపురంలోని కిమ్స్ వైద్య కళాశాల ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు చెప్పారు. తెలుగుభాషా పండితులు, సాహితీవేత్తలు, భాషాభిమానులతో సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నట్లు వివరించారు.

క్రికెట్‌లో విద్యార్థిని ప్రతిభ

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే : నన్నయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఇటీవల భీమవరంలో నిర్వహించిన మహిళా క్రికెట్ టోర్నమెంట్ పోటీల్లో విద్యార్థిని బి.తనిష్క విజేతగా నిలిచిందని కందుకూరి రాజ్యలక్ష్మి కళాశాల ప్రిన్సిపల్ రాఘవ కుమారి తెలిపారు. సౌత్ జోన్ అన్నా యూనివర్సిటీ తమిళనాడులో జనవరి 12 నుంచి 16 వరకు జరగబోయే మహిళా క్రికెట్ టోర్నమెంట్‌కు ఎంపికైందన్నారు. క్రికెట్ క్రీడలో ప్రతిభ చూపుతూ జాతీయ పోటీలకు అర్హత సాధించిన విద్యార్థిని తనిష్కను సోమవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో అభినందించారు. పీడీ వై.సుధారాణి, ఎ.నాగు, ఎ.అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ నరసింహకిషోర్ అన్నారు. సోమవారం రాజమహేంద్రవరం ఒకటో పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలో సీఐ మురళీకృష్ణ ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి పోలీసులు, స్పెషల్ పార్టీ సిబ్బందితో విస్తృత తనిఖీలు చేపట్టారు.

భగవద్గీత పుస్తకాల పంపిణీ

రాజానగరం, న్యూస్‌టుడే: దివాన్‌చెరువులోని సేవా ఉగాది ఆధ్వర్యంలో 35 మంది విద్యార్థులకు భగవద్గీత అభ్యాసనలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. భగవద్గీత శ్లోకాల పోటీలకు వీరిని సన్నద్ధం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం వారికి భగవద్గీత పుస్తకాలను పంపిణీ చేశారు.

నర్సరీలో వివాదం.. కత్తితో దాడి..

మండపేట గ్రామీణం: స్వల్ప విషయమై మాటామాటా పెరిగి కత్తితో దాడికి పాల్పడిన ఘటన ఏడిద శివారులో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. మండపేట రూరల్ పోలీసుల వివరాలు ప్రకారం.. కడియం మండలం బుర్రిలంక గ్రామానికి చెందిన మల్లిపూడి శ్రీనివాసరావు ఏడిద శివారులో నేచురల్ గ్రీన్ నర్సరీ నిర్వహిస్తున్నారు. ఆ పక్కనే కుందేటి వెంకన్నబాబుకు వెంకటదుర్గా నర్సరీ ఉంది. ఈనెల 6వ తేదీన వెంకన్నబాబుకు చెందిన లారీ. . శ్రీనివాసరావు నర్సరీలోని మొక్కలపై నుంచి వెళ్లిందని ఇద్దరూ గొడవపడ్డారు. అనంతరం ఈనెల 7వ తేదీన వెంకన్నబాబు నర్సరీలో పనిచేసే మన్యం శ్రీను.. శ్రీనివాసరావుపై కత్తితో దాడిచేసి గాయపరిచాడు. తీవ్రంగా గాయపడిన అతన్ని నర్సరీలో పనిచేసే అన్నందేవుల గోవిందు కడియం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మండపేట రూరల్ ఎస్సై వి.కిషోర్ కేసు నమోదుచేశారు.

సింహాచలం దేవస్థానానికి మొక్కల వితరణ

పవిత్ర పుణ్యక్షేత్రంగా పేరొందిన సింహాచలం దేవస్థానానికి కడియపులంకకు చెందిన దుర్గా నర్సరీ అధినేత పెద్దిరెడ్డి శ్రీనివాస్ సంపంగి మొక్కలను వితరణ ఇచ్చారు. ఈ మొక్కలంటే స్వామికి ఎంతో ఇష్టమైనవిగా పరిగణిస్తారు. తుపాన్లకు అవన్నీ నేలకొరిగాయి. ఈ నేపథ్యంలో వాటి స్థానంలో కొత్తవి నాటేందుకు దేవస్థానం సూపరింటెండెంట్ హరికృష్ణను శ్రీనివాస్ కోరారు. అందుకోసం 100కు పైగా మొక్కలను సోమవారం మినీ లారీలో తరలించారు. గంగుల సత్యనారాయణ, గెడ్డం ఆదినారాయణ, చల్లా దుర్గారావు, బాదం పెద్దకాపు, తదితర రైతులు పాల్గొన్నారు. **- న్యూస్‌టుడే, కడియం**

ప్రకటన

నా క్లయింట్ తూర్పుగోదావరి జిల్లా, రాజమహేంద్రవరం కాపురస్తులు **వాకా చిన్నారెడ్డి** గారు ఇచ్చిన సంజాయిషీపై తెలియజేయునది ఏమనగా,

నా క్లయింట్ కొనుగోలు చేయుటకు నిర్ణయించుకున్న తూర్పుగోదావరి జిల్లా కోలమూరు గ్రామ పంచాయతీలోని కోలమూరు గ్రామం తాలూకు ఆర్.ఎస్. నెం. 377/2 పూరా ఎక. 4-40 1/2 సెంట్లు గళ్లా రత్నం అనబడే వెంకటరత్నం గారి తాలూకు **డాక్యుమెంట్ నెంబర్ 6729/1957** లోకి రాబడి తదుపరి సదరు గళ్లా రత్నం అనబడే వెంకటరత్నం గారు వ్రాయించిన **18-01-1980** తేదీ గల అన్ రిజిస్టర్డ్ వీలునామా రీత్యా సదరు గళ్లా రత్నం అనబడే వెంకటరత్నం గారు 26-04-2003 మరణించిన అనంతరం వారి కుమారుడైన గళ్లా శ్రీరామచంద్రరావు గారికి రాబడి సదరు గళ్లా శ్రీరామచంద్రరావు గారు, సదరు ఆస్తి యందు ప్రస్తుతం సబ్ డివిజన్ కాబడిన ఆర్.ఎస్. నెం. 377/2బి లోకి రాబడిన 264.44 చదరపు గజములు స్థలమును, డాక్యుమెంట్ నెం. 3471/2025 రీత్యా గంగుల వంశీ కృష్ణ గారి పేర జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ రిజిస్టర్ చేయించినారని తెలియజేసి ఉన్నారు. కావున పైన ఉదహరించిన ఆస్తిని గురించి ఎటువంటి అభ్యంతరములు, క్లయిములు వగైరాలు ఉన్న యెడల ఈ క్రింది చిరునామాకు వ్రాత పూర్వకముగా 7 రోజులలో తెలియపరచవలెనని ఇందు మూలముగా తెలియజేయడమైనది.

కె.వి.ఎస్.సూర్యనారాయణ, అడ్వకేట్
రాజమండ్రి శ్యామలానగర్, రాజమండ్రి
ది.08-12-25 సెల్: 9441475573

38వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
భారతీయ స్టేట్‌బ్యాంక్, దివాన్‌చెరువు బ్రాంచి
ఖాతాదారుల అత్యుత్తమ సేవలో SBI దివాన్‌చెరువు బ్రాంచి ముందంజలో ఉంటూ నేటికి 37 వసంతాలు పూర్తిచేసుకొని 38వ వసంతంలోనికి అడుగుపెడుతున్న సందర్భంగా బ్రాంచి చీఫ్ మేనేజరు శ్రీ లంక సునంద గార్కి, ఫీల్డ్ ఆఫీసర్లకు మరియు బ్యాంక్ సిబ్బంది అందరికి వార్షికోత్సవ శుభాకాంక్షలు.
వంక సురేంద్రకుమార్
RAM PAVAN FILLING POINT
H.P.C.L. DEALER
Burugupudi Gate, Dosakayalapalli Road.

38వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
భారతీయ స్టేట్‌బ్యాంక్, దివాన్‌చెరువు బ్రాంచి
ఖాతాదారుల అత్యుత్తమ సేవలో SBI, దివాన్‌చెరువు బ్రాంచి ముందంజలో ఉంటూ నేటికి 37 వసంతాలు పూర్తిచేసుకొని 38వ వసంతంలోనికి అడుగుపెడుతున్న సందర్భంగా బ్రాంచి చీఫ్ మేనేజరు శ్రీ లంక సునంద గార్కి, ఫీల్డ్ ఆఫీసర్లకు మరియు బ్యాంక్ సిబ్బంది అందరికి వార్షికోత్సవ శుభాకాంక్షలు.
శ్రీ లక్ష్మి జనరల్ స్టోర్స్, శ్రీ లక్ష్మి ఫైనాన్స్
ప్రొ॥ గంగి త్రిమూర్తులు, శ్రీరాంపురం రోడ్, దివాన్‌చెరువు, సెల్: 97054 13999

38వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
భారతీయ స్టేట్‌బ్యాంక్, దివాన్‌చెరువు బ్రాంచి
ఖాతాదారుల అత్యుత్తమ సేవలో SBI దివాన్‌చెరువు బ్రాంచి ముందంజలో ఉంటూ నేటికి 37 వసంతాలు పూర్తిచేసుకొని 38వ వసంతంలోనికి అడుగుపెడుతున్న సందర్భంగా బ్రాంచి చీఫ్ మేనేజరు శ్రీ లంక సునంద గార్కి, ఫీల్డ్ ఆఫీసర్లకు మరియు ఇతర సిబ్బందికి అందరికి వార్షికోత్సవ శుభాకాంక్షలు.
వంక వీర వేంకట సత్యనారాయణ
శ్రీ సూర్య ఏజెన్సీస్
దివాన్‌చెరువు
వంక మల్లికార్జునస్వామి (మల్లిబాబు)
రాష్ట్ర BC సాధికారిక డైరెక్టర్
Ex. వైస్ MPP, దివాన్‌చెరువు

38వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
భారతీయ స్టేట్‌బ్యాంక్, దివాన్‌చెరువు బ్రాంచి
ఖాతాదారులకు విశిష్టమైన సేవలందిస్తున్న SBI, దివాన్‌చెరువు బ్రాంచి నేడు 38వ వసంతంలోనికి అడుగుపెడుతున్న సందర్భంగా బ్రాంచి మేనేజరు శ్రీ లంక సునంద గార్కి, ఇతర సిబ్బంది అందరికీ వార్షికోత్సవ శుభాకాంక్షలు.
ఉమాకాంత్ కన్‌స్ట్రక్షన్స్
మోహనకృష్ణ కన్‌స్ట్రక్షన్స్
మోహనకృష్ణ NRI

38వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
భారతీయ స్టేట్‌బ్యాంక్, దివాన్‌చెరువు బ్రాంచి
ఖాతాదారుల అత్యుత్తమ సేవలో SBI దివాన్‌చెరువు బ్రాంచి ముందంజలో ఉంటూ నేటికి 37 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా బ్రాంచి మేనేజర్ శ్రీ లంక సునంద గార్కి, ఫీల్డ్ ఆఫీసర్స్, బ్యాంక్ సిబ్బంది అందరికీ వార్షికోత్సవ శుభాకాంక్షలు.
శ్రీ వెంకట గాయత్రీ ఇండస్ట్రీస్
ప్రొ: రుద్రం నారాయణమూర్తి, పుణ్యక్షేత్రం

38వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
భారతీయ స్టేట్‌బ్యాంక్, దివాన్‌చెరువు బ్రాంచి
ఖాతాదారుల అత్యుత్తమ సేవలో SBI, దివాన్‌చెరువు బ్రాంచి ముందంజలో ఉంటూ నేటికి 37 వసంతాలు పూర్తిచేసుకొని 38వ వసంతంలోనికి అడుగుపెడుతున్న సందర్భంగా బ్రాంచి చీఫ్ మేనేజరు శ్రీ లంక సునంద గార్కి, ఫీల్డ్ ఆఫీసర్లకు మరియు బ్యాంక్ సిబ్బంది అందరికి వార్షికోత్సవ శుభాకాంక్షలు.
పడాల వెంకటరెడ్డి
SSS బిల్డర్స్, దివాన్‌చెరువు

38వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
భారతీయ స్టేట్‌బ్యాంక్, దివాన్‌చెరువు బ్రాంచి
ఖాతాదారుల అత్యుత్తమ సేవలో SBI దివాన్‌చెరువు బ్రాంచి ముందంజలో ఉంటూ నేటికి 37వ వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా బ్రాంచి మేనేజర్ శ్రీ లంక సునంద గార్కి, ఫీల్డ్ ఆఫీసర్స్, బ్యాంక్ సిబ్బంది అందరికీ వార్షికోత్సవ శుభాకాంక్షలు.
శ్రీ లక్ష్మీగణపతి కాష్యూ నట్స్
ప్రొ: నంద్యాల నారాయణరావు, సాయిబాబా గుడి ప్రక్కన, శ్రీరాంపురం

38వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
భారతీయ స్టేట్‌బ్యాంక్, దివాన్‌చెరువు బ్రాంచి
ఖాతాదారుల అత్యుత్తమ సేవలో
SBI, దివాన్‌చెరువు బ్రాంచి
ముందంజలో ఉంటూ నేటికి 37 వసంతాలు
పూర్తిచేసుకొన్న సందర్భంగా బ్రాంచి చీఫ్ మేనేజరు
శ్రీ లంక సునంద గార్కి, ఫీల్డ్ ఆఫీసర్లకు
మరియు బ్యాంక్ సిబ్బంది అందరికి
వార్షికోత్సవ శుభాకాంక్షలు.
SRI GOWTHAMI
EDUCATIONAL INSTITUTIONS
RAJAMAHENDRAVARAM
url : srigowthamionline.com

WE'RE HIRING!
Walk-in
09:00 AM - 10:30 AM
10th & 11th
Dec' 2025
Spoken English Trainers
Experienced Candidates ONLY
Pay Scale: ₹20,000 - ₹30,000
Pre-School / Primary Teachers
Freshers, Trained Graduates & Post Graduates
Pay Scale: ₹12,000 - ₹18,000
Accountant, Front-Office Executive
Candidates with experience & fluent English ONLY
Graduates; Pay Scale: ₹14,000 - ₹20,000
THE BODHI SCHOOL
Behind Income Tax Office
Rajamahendravaram, Ph: 87122 88551

(c) eenadu

కొవ్వూరు
•కొవ్వూరు •నిడదవోలు •గోపాలపురం

ఎస్టీయూ నూతన కార్యవర్గం

తాళ్లపూడి: ఎస్టీయూ (రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం) మండల శాఖ నూతన కార్యవర్గం పూర్వ మండల అధ్యక్షురాలు జె.డి. సునీత అధ్యక్షతన సోమవారం ఏర్పాటైంది. అధ్యక్షుడిగా రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా బి.బుచ్చిబాబు, ఆర్థిక కార్యదర్శిగా ఈ.సత్యనారాయణ, అసోసియేట్ అధ్యక్షుడిగా ఎన్.రఘురామ్, మహిళా కార్యదర్శులుగా కాత్యాయిని, రేవతి, నాగజ్యోతి తదితరులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షుడు జె.డేనియల్‌బాబు విచ్చేశారన్నారు.

కుంతీదేవి ఉత్సవాలు

గోపాలపురం: మండలంలోని వాదాలకుంట పాతపేటలో కుంతీదేవి ఉత్సవాలు సోమవారం ఘనంగా జరిగాయి. కుంతీదేవి, నందీశ్వరుడి విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఉదయం పుర వీధుల్లో తీన్‌మార్ డప్పులు, శక్తివేశధారణల నడుమ ఊరేగించి, గ్రామంలోని చెరువులో నిమజ్జనం చేశారు.

శాంతియుత సమాజ స్థాపనకు కృషి

నిడదవోలు, న్యూస్‌టుడే: ప్రేమ, కరుణకు ప్రతీకగా నిలిచిన ఏసు క్రీస్తు ఆశించిన శాంతియుత సమాజ స్థాపనకు కృషి చేద్దామని రాష్ట్ర పర్యాటక శాఖామంత్రి కందుల దుర్గేష్ అన్నారు. సమిశ్రగూడెం బేతెస్థ చర్చిలో సోమవారం నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొని కేకు కోసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా దైవజనులు ఆయనను ఆశీర్వదించారు.

మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: కొవ్వూరు: 80085 74497 నిడదవోలు: 80085 74501, గోపాలపురం: 91212 29084

దుర్వాసనతో అవస్థలు..

సమస్య: దూబచర్ల ప్రధాన రహదారి పక్కన ఉన్న డ్రెయిన్ నుంచి మురుగు బయటకు వస్తుండడంతో ఆ ప్రాంతమంతా దుర్వాసన వెల్లువెత్తుతోంది. - స్థానికులు

సమాధానం: పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.
- ఆశా అలేఖ్య, పంచాయతీ కార్యదర్శి

- న్యూస్‌టుడే, నల్లజర్ల

పిచ్చిమొక్కలు తొలగించారు..

ఈనాడు కథనానికి స్పందన

నిడదవోలు: నిడదవోలులోని రాయిపేటలో చెత్తాచెదారం, పిచ్చిమొక్కలను పురపాలక అధికారులు తొలగించారు. రాయిపేట పాశం వారివీధిలో ఉన్న ఖాళీ స్థలంలో చెత్తాచెదారం వేయడంతోపాటు పిచ్చిమొక్కలు పెరిగి దుర్వాసనతో వచ్చేది. విషపురుగులు చుట్టుపక్కల ఇళ్లలోకి రావడంతో ప్రజలు తీవ్ర భయాందోళనలు చెందేవారు. దీనిపై ఈనెల 5న 'ఈనాడు'లో 'పిచ్చి మొక్కలు.. చెత్త కుప్పలు' శీర్షికన కథనం ప్రచురితం కావడంతో సిబ్బంది తూతూమంత్రంగా తొలగించి చెత్తాచెదారానికి అక్కడే మంటలు పెట్టారు. దాన్నుంచి వచ్చే పొగ కారణంగా స్థానికులు అనేక ఇబ్బందులకు గురయ్యారు. దీనిపై ఈనెల 6న 'వ్యర్థాలు తొలగించమంటే పొగపెడతారా..?' శీర్షికన కథనం ప్రచురితం కావడంతో సోమవారం జేసీబీతో చెత్త, పిచ్చిమొక్కలు పూర్తిగా తొలగించారు.

పొగాకు నారు ధర పైపైకి..

పది రోజుల వ్యవధిలో రూ. 2 వేలు పెంపు ● ట్రే మొక్క రూ.2

న్యూస్‌టుడే, గోపాలపురం

గోపాలపురం, దేవరపల్లి వేలం కేంద్రాల పరిధిలో వర్జీనియా నాట్లు చాలా వరకు చివరి దశకు చేరుకున్నాయి. ఈ ఏడాది రైతులు ఆశించిన స్థాయిలో ధర రావడంతో పంట విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. ఈ సీజన్‌లో ధర చూసిన కొందరు రైతులు వరి కోతలు కోసిన పొలాలు సిద్ధం చేసి పొగాకు నాట్లు వేయడం మొదలు పెట్టారు. దీంతో నారు ధర కొద్దికొద్దిగా పెరుగుతూ వస్తోంది. గత పది రోజుల వరకు నేలపై వేసిన నారు ఎకరానికి (6 వేల మొక్కలు) రూ.2000 నుంచి 3500 పలికేవి. ప్రస్తుతం రూ.3500 నుంచి రూ. 4 వేలు పైనే పలుకుతోంది. రానున్న రోజుల్లో మొక్క రూపాయి అయ్యే అవకాశం ఉందని రైతులు అంటున్నారు.

దుద్దుకూరు సమీపంలో అమ్మకానికి సిద్ధంగా నారు

సుమారు 250 ఎకరాల్లో నారుమళ్లు..

గోపాలపురం, దేవరపల్లి వేలం కేంద్రాల పరిధిలో సుమారు 250 ఎకరాల్లో పొగాకు నారుమళ్లు కట్టినట్లు బోర్డు అధికారులు చెబుతున్నారు. వీటిలో సుమారు 170 ఎకరాల వరకు రైతులు సొంతంగా వాడుకోవడానికి వేసుకున్నవి. మిగిలిన 80 ఎకరాల్లో అమ్ముకోవడానికి వేసినవి. కొందరు నేల మీద మడులు కడితే, చాలా మంది ప్లాస్టిక్ ట్రేల్లో వర్మీకంపోస్టు, కొబ్బరి పీచు వేసి పెంచుతారు. దీనికి గిరాకీ చాలా ఎక్కువ. మొక్క రూపాయి నుంచి రూపాయిన్నర వరకు ఉండేది. గత వారం రోజుల నుంచి దాని ధర సైతం పెరుగుతూ వస్తుంది. సోమవారం మొక్క రెండు రూపాయల పైబడి విక్రయించారు. దొమ్మేరు, పల్లంట్ల, కాపవరం, కొవ్వూరు పరిసర ప్రాంతాల్లో ఇంకా కొందరు రైతులు నూతన మడులు కడుతున్నారు. వచ్చే జనవరి మొదటి వారం వరకు అమ్మకాలు జరుగుతూనే ఉంటాయి.

6,800 హెక్టార్లలో నాట్లు..

రెండు వేలం కేంద్రాల పరిధిలో ఇప్పటి వరకు సుమారుగా 6,800 హెక్టార్ల మేర పొగాకు నాట్లు వేశారు. వీటికి సంబంధించి 3,890 మంది రైతులు సుమారు 4,420 బ్యారన్లు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. వచ్చే వారం పది రోజుల్లో రిజిస్ట్రేషన్ కార్యక్రమం పూర్తయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం నారు ధర పెరగడానికి కారణం గత వారం రోజుల నుంచి వేసిన మొక్కలు చనిపోతుండడమే. వాటి స్థానంలో కొత్త మొక్కలు తీసుకొచ్చి నాటడం వల్ల నారు ధర పెరిగిందని రైతులు అంటున్నారు.

10-15 రోజుల్లోనే పెరుగుదల..

నేను 12 ఎకరాల్లో పొగాకు నాట్లు పూర్తి చేశాను. గడిచిన వారం నుంచి పొలంలో మొక్కల చావులు ఎక్కువగా కనిపిస్తున్నాయి. బయట మాకు అవసరమైన రకం నారు దొరకడం లేదు. ఉన్నా ధర అధికంగా చెబుతున్నారు. 10-15 రోజుల వ్యవధిలో నారు ధర రెండు వేల వరకు పెరిగింది.

- ఎం.శ్రీనివాసరావు, కౌలు రైతు, గోపాలపురం

దుర్గాదేవికి వెండి మకర తోరణం

ఉండ్రాజవరం: పాలంగిలోని కనకదుర్గమ్మకు స్థానికులు సత్తి బాలకృష్ణ, అనంతలక్ష్మి దంపతులు రూ. లక్ష విలువైన వెండి మకరతోరణాన్ని సోమవారం బహూకరించారు. దానిని అమ్మవారికి అలంకరించి పూజలు చేశారు.

ఆభరణాలతో..

భక్తాంజనేయస్వామికి పుష్పాలంకరణ

తాళ్లపూడి: హనుమత్ వ్రత మహోత్సవాల ముగింపు పురస్కరించుకొని సోమవారం ప్రక్కిలంకలోని భక్తాంజనేయ స్వామిని పుష్పాలతో అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివార్లను దర్శించుకున్నారు.

విద్య, వైద్య రంగాల అభివృద్ధిపై శ్రద్ధ

కొవ్వూరు పట్టణం: విద్య, వైద్య రంగాల అభివృద్ధిపై ప్రభుత్వం శ్రద్ధ చూపుతోందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. తాళ్లపూడి, చాగల్లు మండలాలకు చెందిన 13 మంది వైద్య సేవలకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.6.01 లక్షల విలువైన చెక్కులను సోమవారం అందించారు. ద్విసభ్య కమిటీ సభ్యుడు కంఠమణి రామకృష్ణ, మద్దిపట్ల శివరామకృష్ణ, సూరపనేని చిన్ని, ఆళ్ల హరిబాబు, ఆళ్లల్లి రామకృష్ణ, సూర్యదేవర రంజిత్, బొడ్డు కేశవ్, కాబిపూడి గణపతి, పెనుమాక జయరాజు తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు సహాయనిధి చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు

ముగిసిన కోట సత్తెమ్మ తిరునాళ్లు

నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలో వేంచేసి ఉన్న కోటసత్తెమ్మ తిరునాళ్ల ఉత్సవాలు సోమవారం ముగిశాయి. సోమవారం రాత్రి గరగ నృత్యం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ తనయుడు కృష్ణతేజ దంపతులతో పాటు పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు. అమ్మవారికి పవళింపు సేవ చేశారు. సన్నాయి మేళం, తాళాలు, గరగనృత్యాలు, కేరళ చండా మేళం, కాళిక డ్యాన్స్, కోలాటాలు ప్రదర్శించారు. కూచిపూడి, జానపద నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కురుక్షేత్రం నాటకం నుంచి దుర్యోధన మయసభ సీనును నిడదవోలు పట్టణ ఏఎంసీ ఛైర్మన్ పరమహంస ప్రదర్శించి అలరించారు. అనంతరం ఆలయ ఆవరణలో నిర్వహించిన బాణసంచా కాల్పులను చూసేందుకు జనం తరలి వచ్చారు. కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ వి.హరిసూర్యప్రకాష్, వంశపారంపర్య ధర్మకర్త దేవులపల్లి రవిశంకర్, ప్రధానార్చకులు ఎవిఎస్ శర్మ పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, నిడదవోలు

గరగలు ఎత్తుకున్న మంత్రి దుర్గేష్ తనయుడు కృష్ణతేజ, అధికారులు

కేరళ చండా మేళం

బాలికలు ఉన్నతంగా ఎదగాలి

తాళ్లపూడి: బాలికలు చదువుపై దృష్టి సారించి ఉన్నతంగా ఎదగాలని ఎస్సై రామకృష్ణ తెలిపారు. పెద్దేవం జడ్పీ ఉన్నత పాఠశాలలో శక్తి టీం ఆధ్వర్యంలో నేరాలు, బాలికల అప్రమత్తతపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చరవాణికి దూరంగా ఉండాలని, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల మాట వినాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శక్తిటీం ఎస్సై గంగాధర్, సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైద్యానికి ఆర్థిక సాయం

తాళ్లపూడి: రోడ్డు ప్రమాదంలో గాయపడి రాజమహేంద్రవరంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మలకపల్లికి చెందిన పట్నాల చిరంజీవికి రూ. 10వేలు సాయం అందించినట్లు విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు పి. సతీష్, గౌరవాధ్యక్షుడు జి.వరహాలు, కోశాధికారి కడలి కిరణ్ సోమవారం తెలిపారు.

ఉద్యోగాలకు 41 మంది ఎంపిక

నిడదవోలు, న్యూస్‌టుడే: నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జిల్లా ఉపాధి కార్యాలయం, నైపుణ్యాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిడదవోలు వెలగపూడి రామకృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ఉద్యోగ మేళా నిర్వహించారు. ఆరు సంస్థల్లో నియామకాలకు ముఖాముఖి నిర్వహించగా 67 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వీరిలో 41 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు జిల్లా ఉపాధి అధికారి హరీష్ చంద్రప్రసాద్ తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు కళాశాల ప్రధానాచార్యురాలు డాక్టర్ కె.జ్యోతి నియామకపత్రాలు అందించారు.

నియామక పత్రాలు అందుకున్న అభ్యర్థులతో ప్రధానాచార్యురాలు జ్యోతి, అధ్యాపకులు

పుష్కరాలకు కోటసత్తెమ్మ ఆలయం ఆధునికీకరణ

నిడదవోలు, న్యూస్‌టుడే: కోటసత్తెమ్మ ఆలయం ఆధునికీకరణ పనులు చేపట్టి గోదావరి పుష్కరాల నాటికి భక్తులకు అందుబాటులోకి తీసుకొస్తామని రాష్ట్ర పర్యాటక శాఖామంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. మండలంలోని తిమ్మరాజుపాలెంలో వేంచేసి ఉన్న అమ్మవారిని ఆయన సోమవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి, సారె సమర్పించారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆలయ అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామన్నారు. అనంతరం నిడదవోలు గ్రామదేవత నంగాలమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట పురపాలక సంఘ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ, ఆలయ సహాయ కమిషనర్ వి.హరిసూర్యప్రకాష్, వంశపారంపర్య ధర్మకర్త దేవులపల్లి రవిశంకర్ తదితరులు ఉన్నారు.

మురుగు దిగదు.. ముంపు వీడదు

పంట చేల నుంచి వచ్చే మురుగునీరు బయటకు వెళ్లేందుకు వీలుగా నిడదవోలు మండలం పురుషోత్తపల్లి నుంచి విద్యుత్తు సబ్‌స్టేషన్‌కు వెళ్లే దారిలో ఏర్పాటు చేసిన కాలువ ఇది. పట్టించుకున్న వారు లేక.. నిర్వహణకు దూరమై గడ్డి పెరిగి అధ్వానంగా కనిపిస్తోంది. మురుగు కిందికి దిగే అవకాశం లేకపోవడంతో వర్షాకాలంలో పంట పొలాలు నీట మునుగుతున్నాయి. ఏటా ఖరీఫ్‌లో ఇదే పరిస్థితి. కాలువను శుభ్రం చేయించి ముంపు సమస్యను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, నిడదవోలు

పలకలు అమర్చేది ఇలాగేనా..

కొవ్వూరు గౌతమినగర్‌లోని వీధులు, థియేటర్ కూడలిలో కల్వర్టులపై సిమెంటు పలకలు దెబ్బతిన్నాయి. పలుచోట్ల ఖాళీలు ఏర్పడ్డాయి. చీకటిపడిన తర్వాత వాటిని గుర్తించలేక పలువురు పడిపోయి గాయాలపాలవుతున్నారు. దీంతో ఖాళీలపై ఎక్కడో తొలగించిన పెద్ద పరిమాణంలో ఉన్న పలకలను తెచ్చి పెడుతున్నారు. రాత్రి వేళల్లో వాటిని గుర్తించలేక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ సమస్యను మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు దృష్టికి తీసుకెళ్లగా పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. - న్యూస్‌టుడే, కొవ్వూరు పట్టణం

ఎంత కిరాయి కలిసొస్తే మాత్రం..

కిరాయి కలిసి వస్తుందని కొంతమంది ఒక ట్రాక్టర్‌కు రెండు గడ్డి లోడు ట్రక్కులను తగిలిస్తున్నారు. ఉండ్రాజవరం మండలం నుంచి నుంచి పెరవలి సోమవారం ఒక ట్రాక్టర్ ఇలా రెండు లోడు ట్రక్కులతో ప్రయాణించింది. దీంతో ఎదురుగా, వెనుక నుంచి వస్తున్న వాహనదారులు తప్పించుకుని ముందుకు వెళ్లటానికి దారిలేక ఇబ్బందికి గురయ్యారు. అవి ఎక్కడ బోల్తాకొడతాయోనని స్థానికులు ఆందోళన చెందారు. ఎస్సై రవికుమార్ దృష్టికి తీసుకెళ్లగా నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణిస్తున్న ఇలాంటి వాహనాలపై చర్యలు తీసుకుంటామన్నారు.

- న్యూస్‌టుడే, ఉండ్రాజవరం

అధ్వానం.. అవస్థలమయం

ఉండ్రాజవరం మండలంలోని చిలకపాడు, కాల్దరి, పసలపూడి గ్రామాల పరిధిలోని కాలువ గట్టు పుంతరోడ్డు దెబ్బతింది. దీంతో రాకపోకలకు రైతులు ఇబ్బంది పడుతున్నారు. పశువుల మకాంల వద్దకు వెళ్లేందుకు, ఆయకట్టు భూముల నుంచి పంట ఉత్పత్తులను ప్రధాన రహదారికి తరలించటానికి ఇబ్బందులు తప్పడం లేదని వారు వాపోతున్నారు. దారి అభివృద్ధికి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని జలవనరులశాఖ ఏఈ మురళి తెలిపారు.

- న్యూస్‌టుడే, ఉండ్రాజవరం

ప్రత్యేక కార్యాచరణతో సమస్యల పరిష్కారం

కొవ్వూరు పట్టణం: క్షేత్రస్థాయి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ అవలంబించాలని ఆర్డీవో రాణి సుస్మిత అధికారులకు సూచించారు. డివిజన్ స్థాయిలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో 18 మంది నుంచి ఆమె అర్జీలను స్వీకరించారు. ప్రాణ రక్షణ కల్పించాలని, పొలం సరిహద్దుల నిర్ణయం, సంక్షేమ పథకాలకు అర్హత, నిషేధిత భూమిలో నమోదైందని, అడంగల్ కాపీ ఇవ్వాలని, శ్మశానంలో ముళ్ల పొదలు తొలగించాలని తదితర అంశాలపై ఆ అర్జీలు అందాయి. వీటి పరిష్కారానికి ఆయా శాఖలు చొరవ చూపించాలని అధికారులకు సూచించారు. డివిజన్‌స్థాయిలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

దివ్యాంగుడి నుంచి అర్జీ తీసుకుంటున్న ఆర్డీవో రాణి సుస్మిత

సహకార సంఘ ఉద్యోగుల ఆందోళన

తాళ్లపూడి: సమస్యల పరిష్కారం కోరుతూ చేపట్టిన నిరసన కార్యక్రమంలో భాగంగా సహకార సంఘం ఉద్యోగులు, సిబ్బంది తాపూడిలోని డీసీసీబీ శాఖ వద్ద సోమవారం నల్లబ్యాడ్జీలు ధరించి ఆందోళన చేపట్టారు. జీవో 36 అమలు చేయాలని, ప్రతి ఐదేళ్లకు వేతన సవరణ జరగాలని, ఉద్యోగ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని, రూ. 5 లక్షలకు తగ్గకుండా ఆరోగ్య బీమా కల్పించాలని, 2019 తర్వాత చేరిన ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, నిబంధనల ప్రకారమే బదిలీ చేయాలని, సీనియారిటీ ప్రకారం ఉద్యోగులను సీఈవోలుగా నియమించాలని సంఘం జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు బొర్రా రామచంద్రం కోరారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు పి.శ్రీనివాసరావు, ఎం.పోశారావు, కె.గంగాధర్, దుర్గాప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

తాళ్లపూడిలో నల్లబ్యాడ్జీలు ధరించి కరపత్రాలు చూపిస్తున్న ఉద్యోగులు

పతకాలు సాధించిన విద్యార్థులు

రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో సత్తా

కొవ్వూరు పట్టణం: రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారని కొవ్వూరు ఇంటర్నేషనల్ డిల్లీ పాఠశాల ఛైర్మన్ నరేష్ తెలిపారు. ఈనెల 7న అనపర్తిలో జరిగిన అటల్‌జీ రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు తమ పాఠశాల నుంచి 17 మంది హాజరై కటా, కుమితే విభాగాల్లో ప్రతిభ కనబర్చారన్నారు. ఏడుగురు బంగారు, నలుగురు వెండి, ఐదుగురు కాంస్య పతకాలు సాధించారన్నారు. వారిని, తర్ఫీదునిచ్చిన శిక్షకులు ఆళ్ల రాధ, శరత్‌కల్యాణ్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సుకన్య, డైరెక్టర్ సౌజన్య పాల్గొన్నారు.

కోటి సంతకాల సేకరణకు స్పందన

నిడదవోలు: ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైకాపా రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిడదవోలు నియోజకవర్గంలో చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించిందని మాజీ ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు అన్నారు. సేకరించిన కోటి సంతకాల పత్రాలను నాయకులు సోమవారం వైకాపా కార్యాలయంలో ఆయనకు అందించారు. కార్యక్రమంలో సుంకవల్లి శ్రీహరి, కౌన్సిలర్లు ఆకుల ముకుందరావు, దాకే అనిల్‌కుమార్, కొత్తూరు శ్రీనివాస్, కె. సుభాష్‌చంద్రబోస్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ గ్రామ సభ

పెరవలి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ గ్రామ సభ మండలంలోని కొత్తపల్లి అగ్రహారంలో సోమవారం నిర్వహించారు. నివేదికను అధికారులు సభలో వెల్లడించారు. సర్పంచి బండారు వెంకటరమణ, పరిశీలకుడు సూర్జహాన్, కార్యదర్శి భానుకుమార్, క్షేత్రసహాయకుడు ఏలూరు శ్రీనివాసు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా అబ్దుల్లా

నిడదవోలు: కాంగ్రెస్ నిడదవోలు పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా మహమ్మద్ అబ్దుల్లా నియమితులయ్యారు. ఈ విషయం ఆయన సోమవారం నిడదవోలులో విలేకరులకు తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు

కొవ్వూరు పట్టణం: వ్యక్తి అదృశ్యంపై చాగల్లు స్టేషన్లో కేసు నమోదైంది. వివరాల ప్రకారం చిక్కాలకు చెందిన గంగుల మధు ఈనెల 6న సాయంత్రం 7 గంటలకు ద్విచక్ర వాహనంపై బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఎంత వెతికినా ఆచూకీ దొరకలేదు. దీంపై అతని తల్లి వరలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కె.నరేంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చలి పులితో అవస్థలెన్నో..!

పొగ మంచుతో రుగ్మతలు

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: శీతాకాలం చలి పంజా విసురుతోంది. వరుస తుపాన్లు, వాతావరణ మార్పులతో చిన్నారులు ఉబ్బసం, పెద్దలు జ్వరాల బారిన పడుతున్నారు. ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు. ప్రత్యేకంగా గోదావరి తీరాన్ని ఆనుకుని ఉన్న కొవ్వూరు, తాళ్లపూడి మండలాలు, పరిసర ప్రాంతాల్లో మంచు ప్రభావం క్రమంగా పెరుగుతోంది. ఉదయం 9 గంటల తర్వాతగాని ఎండ కనిపించడం లేదు. సాయంత్రం 4 గంటలకే చలి పుడుతోంది. పగలు 28 నుంచి 30 డిగ్రీలు, రాత్రిళ్లు 20 నుంచి 23 డిగ్రీల ఉష్ణోగ్రతలు, తేమలో అనూహ్య మార్పులు కనిపించడంతో వృద్ధులు, చిన్నారులకు అవస్థలు తప్పడం లేదు. మంచు కురిసే చలి కాలంలో వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా లేకపోతే శారీరక రుగ్మతలు తప్పవు. ఈ కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యాధికారులు పలు సూచనలు చేస్తున్నారు.

డివిజన్ పరిధిలోని కొవ్వూరు, నిడదవోలు, గోపాలపురం పీహెచ్‌సీలకు గత నెల ఒకటి నుంచి ఇప్పటి వరకు దగ్గు, జలుబుతో కూడిన జ్వరాలతో 191 మంది చికిత్సకు వచ్చారు.

దగ్గు, జలుబు, జ్వరాలు..

శీతాకాలంలో ఉష్ణోగ్రతలు పడిపోవడం వల్ల చర్మవ్యాధులు వచ్చే అవకాశం ఉంది. విటమిన్-డి లోపం వల్ల దద్దుర్లు, చర్మం పగుళ్లు రావడం జరుగుతాయి. అందుకే చలికాలంలో బయట తిరిగేటపుడు చర్మంపై దుమ్ము, ధూళి పడకుండా శ్రద్ధ చూపాలి.

కొవ్వూరు సీహెచ్‌సీలో జ్వర కేసులు, వైద్య సేవలపై ఆరా తీస్తున్న డీసీహెచ్ఎస్ పద్మ

చిన్నారులకు ఉబ్బసం..

పిల్లలకు చల్లని గాలి తగిలిన వెంటనే న్యూమోకోకల్ వైరస్ వారిలో ప్రవేశించి న్యుమోనియా (ఉబ్బసం) వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా 3 నుంచి 5 సంవత్సరాల లోపు చిన్నారులకు ఉబ్బసం వ్యాధి అధికంగా వస్తోంది. వ్యాధి ప్రభావం వల్ల ఊపిరితిత్తులు ప్రాణవాయువు పంపిణీ సరైన రీతిలో సాగదు.

అస్తమాతో ఇబ్బందులు..

పోషకాహార లోపం వల్ల పిల్లలు, పెద్దల్లో అస్తమా వ్యాధి వృద్ధి చెందుతుంది. వ్యాధిగ్రస్తులు ముఖ్యంగా జలుబు, దగ్గు సమస్య బారిన పడతారు. కోరింత దగ్గు, ముక్కు నుంచి నీరు కారడం వంటివి వ్యాధి లక్షణాలుగా ఉంటాయి. 40 ఏళ్ల వయస్సు పైబడిన వారిపై ఎక్కువగా ఈ ప్రభావం పడుతుంది.

అశ్రద్ధ చేయవద్దు..

చిన్నారుల్లో వ్యాధి నిరోధకశక్తి తక్కువగా ఉంటుంది. మిగతా కాలంలో ఎలా ఉన్నా ఏటా చలి కాలంలో త్వరగా వ్యాధుల బారిన పడే అవకాశం ఉంది. పిల్లలకు తల్లిపాలు శ్రేష్ఠమైనవి. చిన్నారులు అనారోగ్యానికి గురైతే అశ్రద్ధ చేయకుండా వెంటనే ఆసుపత్రికి తీసుకురావాలి.

- ఎం.పద్మ, జిల్లా ఆసుపత్రుల సమన్వయాధికారిణి

గత 4 సంవత్సరాలుగా మా వ్యాపార అభివృద్ధికి సహకరిస్తున్న కస్టమర్ దేవుళ్లకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు మరియు వార్షికోత్సవ శుభాకాంక్షలు.
వివాహ శుభకార్యములకు మీకు కావలసిన సరుకులు డోర్ డెలివరీ చేయబడును.
JD MART
ప్రొ॥ ఏలేటి సత్యనారాయణ (JD)
మెయిన్‌రోడ్, పోతవరం
నల్లజర్ల మండలం,
సెల్: 94403 31246

(c) eenadu

ఇక్కడంతా ప్రశాంతం: బెళగావి సువర్ణసౌధలో విధానసభాపర్వం ప్రారంభమైన నేపథ్యంలో సోమవారం ఉదయం నుంచి ఆ పరిసరాలకు సామాన్యులు రాకుండా కట్టడి చేశారు. ప్రముఖుల వాహనాలతో ఆ ప్రాంగణం కిటకిటలాడగా.. నేతలంతా లోపల చర్చల్లో మునిగితేలిన వేళ.. గాంధీ విగ్రహం మీదుగా కనిపించిన ప్రశాంత వాతావరణం (న్యూస్‌టుడే, బెళగావి)

రాచనగరిలో అపహరణ కలకలం

మైసూరు, న్యూస్‌టుడే : నగదు కోసం భూవ్యాపారి లోకేశ్‌ను అపహరించి, రూ.30 లక్షలు డిమాండ్ చేసిన ఐదుగురు నిందితులను పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. విజయనగర హెరిటేజ్ క్లబ్ వద్ద లోకేశ్‌ను అపహరించిన నిందితులు అతని భార్యకు ఫోన్ చేసి రూ.30 లక్షలు డిమాండ్ చేశారు. నిందితులను హెచ్‌ఎం సతీశ్, హెచ్‌ఎస్ అభిషేక్, ఆర్ ప్రజ్వల్, బీఎన్ దర్శన్, ప్రీతమ్‌లను నిందితులుగా గుర్తించారు. వీరంతా బెళగావి జిల్లాకు చెందిన చెందిన వారు. పెయింటింగ్, ఇతర పనుల కోసం మైసూరులో ఉంటున్నారు. నిర్మాణ పనులు చేసే సమయంలో లోకేశ్ పరిచయం అయ్యాడు. అతణ్ని అపహరిస్తే నగదు వస్తుందని ఆదివారం రాత్రి నేరానికి తెగించారు. బాధితుని భార్య ఫిర్యాదుతో తక్షణమే పోలీసులు అప్రమత్తమైన పోలీసులు, నిందితులను మైసూరుకు 50 కి.మీ. దూరంలో బంధించి విచారణ చేపట్టారు.

శీతాకాలం.. చర్చల సెగలు

- బెళగావిలో విధానసభాపర్వం
- తిమ్మక్క పేరిట పురస్కారం
- మైసూరులో భైరప్ప స్మారకం

ఈనాడు, బెళగావి : కర్ణాటక విధానసభ సమావేశాల శీతాకాల పర్వం.. బెళగావిలోని సువర్ణసౌధలో ప్రారంభమైంది. మొత్తం 12 రోజుల ఈ సమావేశాల్లో సోమవారం తొలి సభ ఆసక్తిని పెంచింది. సభారంభంలోనే.. ఇటీవల మరణించిన ప్రముఖులకు ఘన నివాళి సమర్పించగా ముఖ్యమంత్రి సిద్ధరామయ్య వారి సేవలకు గుర్తుగా కీలక ప్రకటనలు చేశారు. ప్రకటిత వేళకు అర్ధగంట ఆలస్యంగా సభ మొదలైనా సభ్యుల హాజరు సగానికి దాటకపోవటం గమనార్హం. సభా వ్యవహారాల సలహా సమితి సమావేశం కారణంగా సభను భోజన విరామానికి ముందే వాయిదా వేశారు. మంగళవారం నుంచి 'ఉత్తర' సమస్యలు, రాజకీయ, పాలనాపరమైన చర్చలతో పాటు సభ బయటా విపక్షాల ఆధ్వర్యంలో ఆందోళనతో శీతాకాల సమావేశాలు వేడెక్కటం ఖాయంగా కనిపిస్తోంది. సభాపర్వంపైనే అందరిలోనూ ఆసక్తి పెరిగింది.

దిగువ సభలో మాట్లాడుతున్న సిద్ధరామయ్య.. మరో వైపు అధికారులు

తిమ్మక్కకు నివాళి..

ఇటీవల మరణించిన వృక్షమాత సాలుమరద తిమ్మక్క పేరిట రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక పురస్కారాలు అందించనున్నట్లు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రకటించారు. సంతాప తీర్మానంలో ఈ అంశంపై చర్చిస్తూ వివరాలు ప్రకటించారు. అంతకు ముందు సాలుమరద తిమ్మక్క, సాహితీవేత్త ఎస్ఎల్ భైరప్ప, విధానసభ సభ్యులు హెచ్.వై.మేటి, మాజీ సభ్యులు ఆర్.వి.దేవరాజ్, శివశరణప్పగౌడ, కన్నడ చలన చిత్ర హాస్య నటుడు ఎంఎస్ ఉమేశ్‌ల సంతాప తీర్మానాన్ని సభలో ప్రవేశపెట్టారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఈ తీర్మానాన్ని బలపరుస్తూ మాట్లాడారు. పద్మశ్రీ పురస్కార గ్రహీత తిమ్మక్కను ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణ రాయబారిగా నియమించింది. ఇకపై ఆమె పేరిట పర్యావరణాన్ని పరిరక్షించిన వారికి పురస్కారాలు అందించాలని నిర్ణయించామన్నారు. ఆమె కోరిక మేరకు బేలూరులో ప్రత్యేక వస్తు సంగ్రహాలయాన్ని నిర్మించే తీర్మానం త్వరలో చేస్తామన్నారు.

- ప్రముఖ సాహితీవేత్త, నవలా రచయిత ఎస్.ఎల్.భైరప్పతో తనకు విధానపరమైన వ్యతిరేకత ఉన్నా ఆయన సాహిత్య సేవలు అనితర సాధ్యమన్నారు. ఆయన కేవలం రాష్ట్రానికే కాదు దేశ సాహితీ రంగానికి అందించిన రచనలు భావి తరానికి స్ఫూర్తిగా నిలుస్తాయన్నారు.

మైసూరులో ఆయన పేరిట ప్రత్యేక స్మారక నిర్మాణాన్ని ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. పార్టీ విధేయుడిగా ఉన్న హెచ్.వై.మేటితో తనకున్న అనుబంధాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్న ముఖ్యమంత్రి.. ఆర్.వి.దేవరాజ్ హఠాన్మరణం తనను కలచివేసిందన్నారు. ఈ తీర్మానంపై విపక్ష నేత ఆర్.అశోక్ మాట్లాడుతూ తిమ్మక్క పురస్కార నిర్ణయాన్ని స్వాగతించారు. హోంమంత్రి డాక్టర్ జి.పరమేశ్వర్, శాసనసభ వ్యహారాల మంత్రి హెచ్.కె.పాటిల్‌తో పాటు పలువురు సభ్యులు ఈ తీర్మానంపై మాట్లాడారు.

దిగువసభలో ప్రసంగిస్తున్న విపక్ష నేత ఆర్.అశోక్

మాట్లాడుతున్న బసవరాజ హొరట్టి

ఉత్తర చర్చలకే తొలి ప్రాధాన్యం

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : విధానపరిషత్తు కార్యకలాపాల్లో ఉత్తర కర్ణాటక సమస్యలపై చర్చకే ఎక్కువ ప్రాధాన్యమిస్తామని విధానపరిషత్ అధ్యక్షుడు బసవరాజ హొరట్టి స్పష్టం చేశారు. ఆయన సోమవారం బెళగావిలో విలేకర్లతో మాట్లాడారు. పరిషత్ కార్యకలాపాల్లో నీటి పారుదల సౌకర్యాలు, రైతుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా చర్చలు సాగడం అత్యవసరమన్నారు. దక్షిణ కర్ణాటక ప్రాంత సభ్యులకు ఈ విషయంలో చర్చకు అవకాశం ఇవ్వాలన్నారు. ప్రశ్నోత్తరాల సమయం ముగిసిన తరువాత 'ఉత్తర'కే పెద్దపీట వేస్తామని వివరించారు. ఇదే విషయాన్ని సభ్యులందరికీ వివరిస్తున్నామన్నారు. పరిషత్ అధ్యక్షస్థానం నుంచి తనను దించేందుకు కొందరు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడతారని ప్రచారం సాగుతున్నా.. దాన్ని పట్టించుకోవడం లేదని స్పష్టం చేశారు. తనకు వ్యతిరేకంగా అవిశ్వాసం తీర్మానం ప్రవేశపెడితే నిబంధనల ప్రకారం నడుచుకుంటానని తెలిపారు.

రాజకీయ కోలాహలం

విపక్ష నేత అశోక్ భుజంపై చేయి వేసి మాట్లాడుతున్న ముఖ్యమంత్రి

ఈనాడు, బెళగావి : సమావేశాల తొలిరోజునే బెళగావి సువర్ణసౌధ ప్రాంగణం వర్తమాన రాజకీయ వ్యవహారాలతో వేడెక్కింది. ఈ సమావేశాల్లో రచ్చగా మారే అవకాశం ఉందని అంచనా వేసిన ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రుల కుర్చీ పోరు రాచుకుంది. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కుమారుడు-ఎమ్మెల్సీ యతీంద్ర మాట్లాడుతూ శాసనసభా పార్టీ సమావేశంలో ముఖ్యమంత్రిని ఐదేళ్ల కాలపరిమితితోనే ఎన్నుకుంటారు. వాస్తవానికి ముఖ్యమంత్రి చర్చ రాష్ట్రంలో లేదు. తానూ ముఖ్యమంత్రి కావాలని డీకే చూస్తుండటంతోనే ఈ సమస్య మొదలైందన్నారు. జనవరి తర్వాత, సమావేశాలు ముగిసినా ముఖ్యమంత్రి మార్పు ఉండకపోగా.. తండ్రి సిద్ధరామయ్యే ఐదేళ్లు కొనసాగుతారని ప్రకటించారు. ఆయన వ్యాఖ్యలతో డీకే మద్దతుదారులు ఇక్బాల్ హుస్సేన్ స్పందిస్తూ జనవరి 9 వరకు ఎదురుచూడండి.. అందరూ అనుకున్నట్లే డీకే శివకుమార్ ముఖ్యమంత్రి పీఠం అధిరోహిస్తారని ప్రకటించారు. మరో ఎమ్మెల్యే కె.రాజణ్ణ ఇదే అంశంపై మాట్లాడుతూ ముఖ్యమంత్రి పదవికి ఎందరో సిద్ధంగా ఉన్నారని వ్యాఖ్యానించారు. ఒక్కరి వల్లనే పార్టీ గెలిచిందని భావించటం సరికాదంటూ డీకేపై తన ఆక్రోశాన్ని వ్యక్తం చేశారు. మంత్రులు శివరాజ తంగడిగి, సంతోశ్ లాడ్ తదితరులు అధిష్ఠానం సూచనల నేపథ్యంలో తామేమీ మాట్లాడమని ప్రకటించారు.

ఉత్తర సమస్యలపై..

సమావేశాల ప్రారంభంలోనే ఉత్తర కర్ణాటక సమస్యలపై చర్చించాలని కల్యాణ కర్ణాటక పోరాట సమితి సోమవారం ముఖ్యమంత్రికి మనవి చేసింది. బెళగావిలో నిర్వహించే సమావేశాల్లోనూ ఈ ప్రాంత సమస్యలపై చర్చ, సరైన పరిష్కార మార్గాలు అన్వేషించకపోవటం పోవటం సరికాదని సమితి అధ్యక్షుడు బసవరాజ్ దేశ్‌ముఖ్ అభ్యంతరం తెలిపారు. ఈ ప్రాంతానికి చెందిన మరికొందరు నాయకుల మనవి మేరకు ఈసారి సమావేశాల్లో ఉత్తర కర్ణాటక సమస్యలపై దృష్టి సారిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. మరోవైపు చెరకు, మొక్కజొన్న రైతుల సమస్యలు, జొన్నకు కనీస మద్దతు ధర ప్రకటించేలా 20 వేల మంది రైతులతో మంగళవారం సువర్ణసౌధను ముట్టడిస్తామని విపక్ష నేత ఆర్.అశోక్ ప్రకటించారు.

ఖాళీ..ఖాళీ: తొలి రోజున సభకు కేవలం సగం మంది సభ్యులే హాజరయ్యారు. మొత్తం 224 మంది సభ్యుల్లో విపక్షం నుంచే అత్యధికంగా 55 మంది హాజరవగా, అధికార పక్షంలో 140 మంది ఉండి కూడా మొత్తం 55 మంది కూడా హాజరవలేదు. మొత్తంగా తొలి రోజున 110 మందే హాజరైనట్లు సచివాలయ రికార్డుల్లో నమోదైంది.

పెద్ద జెండా: ప్రపంచంలోనే రెండో అతి పెద్ద జాతీయ పతాకాన్ని మంగళవారం ఆవిష్కరించనున్నారు. స్పీకర్ యు.టి.ఖాదర్ ఈ మేరకు సభలో ప్రకటన చేశారు. సువర్ణసౌధ సోపానాలపై ప్రపంచంలోనే రెండో పెద్ద జాతీయ పతాకాన్ని కలబురగి జిల్లా కమలాపుర వినోద్‌కుమార్ రేవప్ప బమ్మన్న కుటుంబ సభ్యులు వ్యక్తిగత ఆసక్తితో తయారు చేశారు. ఖాదీ వస్త్రంతో చేసిన ఈ భారీ పతాకాన్ని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉభయ సభల స్పీకర్లు, శాసనసభా వ్యవహారాల మంత్రి హెచ్.కె.పాటిల్, ఇతర సభ్యులు ఆవిష్కరిస్తారు.

కోడికూర తిను..

సువర్ణసౌధలో సమావేశాలు ప్రారంభానికి ముందస్తుగా తనకు ఎదురు వచ్చిన విపక్ష నేత అశోక్, మాజీ మంత్రి వి.సునీల్ కుమార్‌లతో ముఖ్యమంత్రి పిచ్చాపాటి మాట్లాడారు. 'హలో అశోక్.. సన్నగా అయ్యావు' అని పలుకరించగా.. 'నాటుకోడి మాంసం తినడాన్ని మానేశాను సార్' అని ఆయన బదులిచ్చారు. 'అలా నాటుకోడి తినడాన్ని మానేయకూడదు. తిను' అని అశోక్‌కు సూచించి సిద్ధు ముందుకు సాగారు. ఇటీవల ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఇంట నాటుకోడి రుచులతో సంబరం చేసుకున్న సిద్ధు.. ఆ అంశంపై హుందాగా స్పందించడం ప్రస్తావనార్హం. (న్యూస్‌టుడే, బెళగావి)

అప్పుల కుంపట్లలో చిక్కి కడతేరిన కుటుంబం

అనుమానాస్పదంగా మరణించిన మాదమ్మ, సుధా, మోనిశ్

బెంగళూరు (జయనగర), న్యూస్‌టుడే : తావరకెరె ఒకటో మెయిన్ రోడ్డులో ఉంటున్న మాదమ్మ (68), ఆమె కుమార్తె సుధ (38), సుధ కుమారుడు మోనిశ్ (14)లు అనుమానాస్పదంగా మరణించారు. తమిళనాడులోని ధర్మపురికి చెందిన మాదమ్మ తన కుమార్తె, మనవడితో ఏడాదిన్నరగా ఇక్కడ ఉంటున్నారు. ప్రారంభంలో బిర్యానీ హోటల్‌ను నిర్వహిస్తూ వచ్చిన తల్లీ కుమార్తెలు, ఇటీవల పాల వ్యాపారంతో పాటు ఇళ్లలోనూ పని చేస్తున్నారు. బిర్యానీ వ్యాపారం, అనంతరం చిప్స్ తయారీలో నష్టం రావడంతో ఆత్మహత్యకు పాల్పడ్డారని అనుమానిస్తున్నారు. తల్లీ కుమార్తెలు ఇద్దరూ మొదట మోనిశ్‌ను హత్య చేసి అనంతరం వీరిద్దరూ విషం తాగారని అనుమానిస్తున్నారు. వీరు మరణించారని వచ్చిన ఫిర్యాదుతో సుద్దగుంటపాళ్య ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మరణోత్తర పరీక్షల అనంతరమే వీరి మరణానికి కారణాన్ని గుర్తించగలమని డీసీపీ సారా ఫాతిమా తెలిపారు. ఈ సంఘటనతో తావరకెరె ప్రాంతంలో తీవ్ర కలకలం చెలరేగింది.

ప్రేమలేదని.. యువతి విషాదాంతం

రామనగర, న్యూస్‌టుడే : ప్రేమించి, వివాహం చేసుకుంటానని నమ్మించిన యువకుడు, తన శారీరక వాంఛలు తీర్చుకుని వంచించాడన్న బాధతో హర్షిణి (22) అనే యువతి ఆదివారం అర్ధరాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. రామనగర తాలూకా విభూతికెరెకు చెందిన బాధితురాలు దేవరదొడ్డి గ్రామానికి చెందిన అభి అనే యువకుడ్ని ప్రేమించింది. ఇటీవలే ఆమెకు గర్భస్రావం చేయించాడు. తనను వేధించిన, మరణానికి కారకుడవుతున్న అతణ్ని విడిచిపెట్టవద్దని లేఖ రాసి పెట్టి ఆమె ఆత్మహత్య చేసుకుంది. రామనగర గ్రామీణ ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నిందితుడి వ్యవహారంపై వివరాలు సేకరిస్తున్నామని అధికారులు వివరించారు.

కోర్టు మెట్లెక్కిన వింజో

బెంగళూరు (కృష్ణరాజపురం), న్యూస్‌టుడే : ఆన్‌లైన్ గేమ్‌లను నిర్వహించి, అక్రమ నగదు బదిలీలకు పాల్పడిన ఆరోపణలు ఎదుర్కొంటున్న వింజో సంస్థ హైకోర్టును ఆశ్రయించింది. ఈడీ అధికారులు తమపై చేసిన దాడులను అక్రమం అని ప్రకటించాలని కోరింది. తమ నుంచి జప్తు చేసుకున్న రూ.550 కోట్లను విడుదల చేయించాలని కోరుతూ వేసుకున్న అర్జీపై ఆక్షేపణలు తెలిపేందుకు ఈడీకి అవకాశం కల్పిస్తూ తదుపరి విచారణను జస్టిస్ సూరజ్ గోవిందరాజు డిసెంబరు 15కు వాయిదా వేశారు.

అక్షరబాట.. నిరంతర అలసట

14 కిలోమీటర్లు నడిస్తేనే పాఠశాల

బడికి వెళుతున్న బాలబాలికలతో.. పెద్దలు

చామరాజనగర, న్యూస్‌టుడే : పాఠశాలకు వెళ్లేందుకు బస్సు, ఇతర వాహన వ్యవస్థ లేకపోవడంతో నిత్యం 14 కి.మీ. అటవీ ప్రాంతంలో నడిచి బడికి వెళ్లి వస్తున్నామని హనూరు తాలూకా పచ్చెదొడ్డి గ్రామానికి చెందిన విద్యార్థులు ఆక్రోశించారు. సోళేరిపాళ్య గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామానికి సరైన రహదారి లేకపోవడంతో ఆటోలు కూడా రాకపోవడంతో తాము నడిచే బడికి వెళుతున్నామని వారు తెలిపారు. నడిచి వెళ్లి వచ్చేందుకు నిత్యం మూడు గంటల సమయం వృథా అవుతోందని ఆక్రోశించారు. తమ గ్రామానికి బస్సు, ఇతర సదుపాయాలు కల్పించాలని కోరుతూ ఎమ్మెల్యే ఎం.ఆర్.మంజునాథ్‌కు, ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు విద్యార్థులు లేఖ రాశారు. తమ గ్రామం నుంచి 50 మంది విద్యార్థులు అజ్జిపుర, రామాపుర, హనూరు, కొళ్లేగాళలోని విద్యాసంస్థలకు నిత్యం వెళ్లి వస్తున్నామని, కనీసం 7 కి.మీ. వెళితేనే బస్సు అందుబాటులో ఉంటుందని చెప్పారు. వర్షం కురుస్తున్న సమయంలో ఇబ్బందులతో పాటు, సాయంత్రాలు వన్యప్రాణులు వస్తాయన్న భయంతో బిక్కుబిక్కు మంటూ వెళ్లిరావలసి వస్తోందని సీఎం, ఎమ్మెల్యేలకు రాసిన లేఖలో పేర్కొన్నారు. గతంలో విద్యాశాఖ మంత్రిగా సేవలు అందించిన ఎస్.సురేశ్ కుమార్ ఈ గ్రామంలో 2020 ఫిబ్రవరి 11న పర్యటించారు. బస్సు సదుపాయాన్ని కల్పిస్తామని అప్పట్లో హామీనిచ్చారు. తాత్కాలికంగా అటవీశాఖ సహకారంతో ఒక బస్సును ఉదయం, సాయంత్రాలు నడిపారు. ప్రభుత్వం మారిన వెంటనే ఆ బస్సు నిలిచి పోయిందని గ్రామస్థులు తెలిపారు. విద్యార్థుల తరపున శరణ్య, చేతన్, గోకుల్, మాదేగౌడ, ఈశ్వరి, రష్మి, ఉమేశ్ తదితరులు సంతకాలు చేసి లేఖను నేతలకు పోస్టు చేశారు.



ముఖ్యమంత్రికి రాసిన లేఖ ప్రతి

తిరుగులేని సైకిల్!

దేశాన్ని చుట్టేస్తోంది..

ట్రింగ్ ట్రింగ్.. సైకిల్‌పై నాగరాజ్ ఉత్సాహయాత్ర!

మంగళూరు, న్యూస్‌టుడే : పాత సైకిల్.. ఉత్సాహంగా దేశాన్ని చుట్టేస్తోంది. హాసనకు చెందిన నాగరాజ్ గౌడ ఆ చిరు వాహనంపై పయనిస్తూ ప్రపంచ శాంతి, దేశ సమగ్రత అవసరాలను విద్యార్థి, యువలోకానికి బోధిస్తూ ఉత్సాహంగా ముందుకు సాగుతుంటే.. ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మంత్రులు, అధికారులు, ప్రముఖులెందరో మద్దతుగా నిలిచారు. ఆయన దేశాటన.. ఆరేళ్లుగా సాగుతోంది. బ్రహ్మచారి.. నాగరాజ్‌కు ఆధ్యాత్మిక భావాలు ఎక్కువ. సైకిల్ ఆయనకు ప్రాణం. దానిపైనే దేశాన్ని చుట్టేస్తూ ఆరుగురు ముఖ్యమంత్రుల నుంచి నేరుగా అభినందనలు అందుకున్నారు. సోనూ సూద్ వంటి ప్రముఖులూ వెన్నుతట్టి ముందుకు సాగేలా ప్రోత్సహించారు. మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్, హరియాణా, పంజాబ్, హిమాచలప్రదేశ్, ఉత్తరాఖండ్, దిల్లీ, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, ఒడిశా, తమిళనాడు, కర్ణాటకలోని అన్ని జిల్లాలూ చుట్టి వచ్చారు. నిత్యం ఆ వాహనాన్ని 70 కి.మీ. పరుగులు పెట్టిస్తున్నారు. ఆలయాలు, ఉచిత సత్రాలు, ఆర్యసమాజం, గురుద్వారా తదితర ప్రాంతాల్లో రాత్రుళ్లు విశ్రాంతి తీసుకుంటూ, వాటిలోనే తీర్థ, ప్రసాద, అన్నదానాలతో కడుపు నింపుకొంటూ సాగడం ఆయనకు అలవాటే. సైకిల్‌పై సందేశాల అట్టముక్కలు ప్రదర్శించి అందరినీ ఆకట్టుకుంటున్న ఆయన.. యువత చైతన్యమే దేశానికి బలమని చెబుతున్నారు. ప్రస్తుతం.. మంగళూరు నుంచి గోకర్ణ వైపు ఆయన ప్రయాణం సాగుతోంది.

మా నాన్నదే పీఠం

యతీంద్ర సిద్ధరామయ్య

బెళగావి, న్యూస్‌టుడే : ముఖ్యమంత్రిగా మా నాన్నే పూర్తి సమయం కొనసాగుతారని ఎమ్మెల్సీ డాక్టర్ యతీంద్ర సిద్ధరామయ్య మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి పీఠం కోసం గత కొద్ది రోజులుగా కొనసాగుతున్న వివాదాన్ని సిద్ధు, శివుడు అల్పాహార విందులతో కొంత సమయం సద్దుమణిగేలా చేశారు. బెళగావి శాసనసభ సమావేశాల్లో పాల్గొనేందుకు వచ్చిన యతీంద్ర తనను కలుసుకున్న విలేకరులతో మాట్లాడారు. సీఎం, డీసీఎంల మధ్య ఎటువంటి వివాదాలు లేవని, వారు సఖ్యతతోనే ఉన్నారని చెప్పారు. సీఎంగా పూర్తి అవధికి మా నాన్నే కొనసాగుతారని వ్యాఖ్యలు చేశారు.

గీతను అవమానించిన నిందితునికి కటకటాలు

మంగళూరు, న్యూస్‌టుడే : భగవద్గీత, మహిళలను కించపరుస్తూ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టిన ఫెలిక్స్ ఎడ్వర్డ్ మథాయిస్ (56) అనే వ్యక్తిని మంగళూరు పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. సౌదీ అరేబియాలో ఉంటూ అతను మత విద్వేషాలను రెచ్చగొట్టేలా పోస్టులు పెట్టాడు. అతనికి వ్యతిరేకంగా లుకవుట్ నోటీసులు కూడా జారీ చేశారు. నిందితుడ్ని అరెస్టు చేసి, న్యాయస్థానం ముందు హాజరు పరచి, విచారణ నిమిత్తం పోలీసులు అతన్ని అదుపునకు తీసుకున్నారని నగర పోలీసు కమిషనర్ సుధీర్ కుమార్ రెడ్డి తెలిపారు.

కారాగారంలో దర్శన్ దడ

పరిస్థితిపై అధికారుల అప్రమత్తం

బెంగళూరు (గాంధీనగర), న్యూస్‌టుడే : న్యాయస్థానం ఆదేశించినా టీవీ సదుపాయాన్ని కల్పించలేదని, బ్యారక్ వెలుపల నడిచేందుకు, ఇతర ఖైదీలను కలిసేందుకు అవకాశం కల్పించడం లేదంటూ హత్య కేసు నిందితుడు-ప్రముఖ వెండితెర కథానాయకుడు దర్శన్ తూగుదీప ఆక్రోశించాడు. కొందరు సహ ఖైదీలతో గొడవ పడి సిబ్బందికి కొత్త తలనొప్పులు తీసుకువస్తున్నాడు. దర్శన్ నటించిన 'డెవిల్' సినిమా ఈ నెల 11న విడుదల కానుంది. తనకు ఆ లోగా బెయిలు రావడం సాధ్యం కాదని గుర్తించాడు. కారాగారంలో సూపరింటెండెంట్‌గా నియమితులైన ఐపీఎస్ అధికారి అంశుకుమార్ నిబంధనలను కఠినం చేయడంతో దర్శన్‌కు ఏం చేయాలో పాలుపోవడం లేదు. చిత్రదుర్గకు చెందిన రేణుకాస్వామి హత్య కేసులో నిందితులు అనుకుమార్, జగ్గ, నాగరాజ్, ప్రదోశ్, లక్ష్మణ్‌లు దర్శన్‌తో కలిసి ఒకే సెల్‌లో ఉంటున్నారు. నాగరాజ్ మినహా మిగిలిన వారందరితోనూ దర్శన్ గొడవ పడుతూ వచ్చాడు. కథానాయకునిగా బయట ఉన్న సమయంలో లభించే రాచమర్యాదలు, అభిమానుల జయకారాలు మాత్రమే తెలిసిన అతనికి కారాగారంలో ఆహారం కోసం వరుసలో నిలబడవలసి రావడం, తాను వినియోగించే మరుగుదొడ్డిని తానే శుభ్రం చేసుకోవలసిన పరిస్థితి జీర్ణించుకోలేకపోతున్నాడని సిబ్బంది తెలిపారు. దర్శన్ వేధింపులు ఎక్కువయ్యాయని, తమను చిత్రదుర్గ కారాగారానికి బదిలీ చేయాలని అనుకుమార్, జగదీశ్ తమ న్యాయవాది సహకారంతో ఒక అర్జీని ఇప్పటికే వేసుకున్నారు. గతంలో కర్ణాటక ఉన్నత న్యాయస్థానం ఇచ్చిన బెయిలును సర్వోన్నత న్యాయస్థానం రద్దు చేయడంతో కారాగారం చేరినప్పటి నుంచి దర్శన్‌పై నిఘాను కారాగార సిబ్బంది కఠినం చేయడంతో అతని ఇబ్బందులు రెట్టింపయ్యాయి.

రైతుల సమస్యలపై కేంద్రం స్పందించదా?

డీకే శివకుమార్

బెంగళూరు (బాణసవాడి), న్యూస్‌టుడే : ఉత్తర కర్ణాటక సమస్యలకు కేంద్రమే సమాధానం చెప్పాలని ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్పష్టం చేశారు. ఆయన సోమవారం ఇక్కడ సదాశివనగరలోని తన నివాసంలో విలేకర్లతో మాట్లాడుతూ చెరకు రైతుల సమస్యలు, మొక్కజొన్నకు గిట్టుబాటు ధరల అంశాలను ఇప్పటికే అనేకసార్లు కేంద్రం దృష్టికి తెచ్చామన్నారు. నేటికీ స్పందన రాలేదని మండిపడ్డారు. ఈ రెండు సమస్యలపై రాష్ట్రానికి చెందిన ఎంపీల గొంతులు మూగబోవడం దారుణమని తప్పుబట్టారు. రాష్ట్ర ప్రభుత్వమే మొక్కజొన్న కొనుగోలు చేయాలని మాజీ ముఖ్యమంత్రి బసవరాజ బొమ్మై డిమాండ్ చేయడం ఆశ్చర్యకరమన్నారు.

చిక్కలో చక్కని గాలి!



ప్రకృతి అందాల మడికేరిలోనూ స్వచ్ఛగాలి తాకిడి

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే : దేశంలో చక్కని వాయు నాణ్యత ఉన్న పది నగరాల జాబితాలో కర్ణాటకకు చెందిన మూడు నగరాలు స్థానాన్ని దక్కించుకున్నాయి. చిక్కమగళూరు, చామరాజనగర, మడికేరిలో ఉత్తమ వాయు నాణ్యత ఉందని జాబితాలో పేర్కొన్నారు. వీటిలో కన్నడిగుల స్కాట్లాండ్‌గా పేరొందిన మడికేరి చక్కని పర్యాటక ప్రాంతంగా పేరొందింది. దిల్లీ, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, హరియాణా, మధ్యప్రదేశ్‌లలోని నగరాల్లో వాయు కాలుష్యం ఎక్కువగా ఉందని థింక్ ట్యాంక్ సెంటర్ ఫర్ రీసర్చ్ ఆన్ ఎనర్జీ అండ్ క్లీన్ ఎయిర్ తన నివేదికలో పేర్కొంది.

బెంగళూరులో ఆస్ట్రేలియన్ విద్య!

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే : ఆస్ట్రేలియాకు చెందిన న్యూసౌత్ వేల్స్ విశ్వవిద్యాలయం బెంగళూరులో తన శాఖను ఏర్పాటు చేసేందుకు సిద్ధమైంది. దీనికి సంబంధించి లెటర్ ఆఫ్ ఇంటెంట్‌ను జారీ చేశామని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెల్లడించారు. ఆస్ట్రేలియా విద్యాశాఖ మంత్రి జాసన్ క్లేర్ సమక్షంలో దీనికి సంబంధించిన ఒప్పందాలు చేసుకున్నారు. ప్రపంచంలో టాప్ 20 విశ్వవిద్యాలయాల్లో న్యూసౌత్ వేల్స్ విశ్వవిద్యాలయం ఒకటని గుర్తు చేశారు. భారత్‌లోని వేర్వేరు ప్రాంతాల్లో తమ శాఖను ఏర్పాటు చేసుకునేందుకు లాట్రోబ్, విక్టోరియా, వెస్టన్ సిడ్నీ, వెస్టన్ ఆస్ట్రేలియా విశ్వవిద్యాలయాలకు అనుమతులు మంజూరు చేశామని ఆయన వివరించారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 9121167525
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 9945050116

(c) eenadu

ముడిపడకనే .. మృత్యుబాట

☛ ప్రీవెడ్డింగ్ చిత్రీకరణకు వెళ్లి వధూవరుల దుర్మరణం ☛ కాబోయే జంట ఇంట కన్నీటి సంద్రం

మరి కొన్ని రోజుల్లో వారిద్దరూ మూడుముళ్ల బంధంతో వివాహం చేసుకోవాలి.. ఇరువైపులా బంధువులందరూ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.. కొత్త జంట ఉత్సాహంగా మధుర క్షణాలను పదిలపరుచుకోవాలని ప్రీవెడ్డింగ్ కోసం వెళ్లింది.. ఉదయం నుంచి సుందరమైన దృశ్యాల నడుమ అందమైన చిత్రాలు, వీడియో దృశ్యాలను చిత్రీకరించుకొన్నారు.. అంతా అయ్యాక కాబోయే భార్యను ఆమె ఇంటి వద్ద దింపాలని వరుడు ద్విచక్రవాహనంపై బయలుదేరాడు.. అంతలోనే కన్నుకుట్టిన మృత్యువు లారీ రూపంలో వచ్చి అమాంతం కబళించింది.. జంట ప్రాణాలను హరించివేసింది.. ఇరుకుటుంబాలను శోకసంద్రంలో ముంచింది..

గంగావతి,న్యూస్‌టుడే: పెళ్లి చేసుకోబోయే కొత్త జంట ప్రీవెడ్డింగ్ చిత్రీకరణకు వెళ్లి రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన హృదయ విదారక ఘటన ఇది. కొప్పళ తాలూకా ఇరకల్‌గడాకు చెందిన కరియప్ప, కారటగి తాలూకా ముష్టూరుకు చెందిన కవితలకు పెళ్లి నిశ్చయం అయింది. ఈ నెల 21న ముహూర్తం ఖరారైంది.

రహదారి ప్రమాదంలో మృతి చెందిన కరియప్ప, కవిత

ఈ నేపథ్యంలో ప్రీ వెడ్డింగ్ కోసం ఆదివారం తుంగభద్ర జలాశయం పరిసరాల్లో చిత్రీకరణ పూర్తి చేసుకుని గంగావతి తాలూకా చిక్కబెణకల్ కొండ ప్రాంతానికి వచ్చారు. అక్కడ చీకటి పడడంతో ఇళ్లకు తిరిగి వెళ్లాలనుకున్నారు. కాబోయే భార్యను ఇంట్లో దింపేందుకు ద్విచక్రవాహనంపై ఎక్కించుకొని బయలుదేరాడు. సరిగ్గా బండ్రాళ, వెంకటగిరి క్రాస్ వద్ద వేగంగా వచ్చిన కంకర లారీ వీరి వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. వరుడు కరియప్ప మడివాళ (26) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడవగా వధువు కవిత (19) అక్కడికక్కడే మృతి చెందింది. విధి వక్రించి ఇద్దరూ ప్రమాదంలో అసువులు బాయడంతో ఇరు కుటుంబాల సభ్యులు జీర్ణించుకోలేకపోతున్నారు. గంగావతి గ్రామీణ పోలీస్‌స్టేషన్లో కేసు నమోదైంది.

కేబుల్ ఆపరేటర్లకు ఊరట

బెంగళూరు (బాణసవాడి), న్యూస్‌టుడే : నగర, గ్రామీణ ప్రాంతాల్లో కేబుల్‌టీవీ ఆపరేటర్లకు విధిస్తున్న రుసుం 50 శాతానికి తగ్గిస్తామని ఇంధన వనరుల శాఖ మంత్రి కేజే జార్జి వెల్లడించారు. ఆయన సోమవారం బెళగావిలో ప్రారంభమైన విధానపరిషత్ ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యురాలు బల్కీస్‌భాను అడిగిన ప్రశ్నకు పై సమాధానమిచ్చారు. ఆపరేటర్ల విద్యుత్తు స్తంభాలను ఉపయోగించుకుంటున్నారని, ఒక్కో స్తంభంపై రూ.150 వసూలు చేస్తుండగా ఇక ఆ మొత్తాన్ని రూ.75కి తగ్గిస్తామన్నారు. ఇది పరోక్షంగా ప్రజలకూ అనుకూలమవుతుందన్నారు. రాష్ట్రంలో 2,800 కేబుల్ ఆపరేటర్లు ఉన్నారన్నారు.

● రాష్ట్రప్రభుత్వ పాఠశాలల్లో కనీసం ఒక్క విద్యార్థి ఉన్నా కొనసాగిస్తామేగానీ.. మూసివేయబోమని ప్రాథమిక విద్యాశాఖ మంత్రి మధు బంగారప్ప స్పష్టం చేశారు. విధానపరిషత్ సభ్యులు చిదానందగౌడ, ఉమాశ్రీ అడిగిన ప్రశ్నలకు ఆయన బదులిస్తూ విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండే పాఠశాలలను సమీపంలో ఉన్న పాఠశాల్లోకి విలీనం చేస్తామన్నారు. ఏ పాఠశాలనూ మూసివేయబోమని స్పష్టం చేశారు. నాణ్యమైన విద్యను అందించేందుకు ఇప్పటి వరకు ఐదు వందల కర్ణాటక పబ్లిక్ స్కూల్స్ ప్రారంభించామని, వచ్చే విద్యాసంవత్సరంలో ఆసంఖ్య తొమ్మిది వందలకు పెంచుతామని ప్రకటించారు.

● కర్ణాటక పరీక్షా ప్రాధికార ద్వారా వివిధ ఉద్యోగ ఖాళీల భర్తీకి సంబంధించి నిర్వహించే పరీక్షల కోసం అభ్యర్థుల నుంచి వసూలు చేసే పరీక్ష రుసుంను తగ్గించామని ఉన్నత విద్యా శాఖ మంత్రి డాక్టర్ ఎం.సి.సుధాకర్ తెలిపారు. సభ్యుడు నిరాణి హనుమంతప్ప రుద్రప్ప అడిగిన ప్రశ్నకు ఆయన బదులిస్తూ ప్రశ్నపత్రాలు ముద్రించడం, వాటిని పరీక్ష కేంద్రాలకు తరలింపు తదితర పరీక్ష ప్రక్రియ కోసం అభ్యర్థుల నుంచి తక్కువగా రుసుం వసూలు చేస్తున్నామన్నారు. అభ్యర్థులకు ఎక్కువ భారం కాకూడదనే ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు.

గోవధ నిషేధచట్టంలో మార్పు చేయడం తగదు

బళ్లారి, న్యూస్‌టుడే: కర్ణాటక జానువారు హత్య ప్రతిబంధక, సంరక్షణ చట్టం-2020 మార్పు చేయడానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాన్ని వ్యతిరేకిస్తూ విశ్వ హిందూ పరిషత్, విశ్వ హిందూ పరిషత్ బజరంగదళ నేతృత్వంలో కార్యకర్తలు సోమవారం ఆందోళన నిర్వహించారు. విహెచ్‌పి జిల్లా కార్యదర్శి చానాళు విష్ణువర్ధన్‌రెడ్డి, విభాగం కార్యదర్శి అశోక్ నేతృత్వంలో కార్యకర్తలు స్టేషన్ డా.రాజ్‌కుమార్ రహదారిలోని నారాయణరావు ఉద్యానవనం నుంచి గడిగి చెన్నప్ప కూడలి మీదుగా స్టేషన్ రహదారి నుంచి డీసీ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా గతంలో భాజపా ప్రభుత్వం తీసుకుని వచ్చిన గోవధ నిషేధ చట్టాన్ని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం బెళగావి సువర్ణసౌధ సమావేశంలో మార్పులు చేయడానికి ప్రయత్నాలు చేస్తోందన్నారు. దీన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ఈ చట్టం మార్పు చేస్తే ఆవును దేవతగా కొలిచే హిందువుల మనోభావాలను అవమానపరిచినట్లేనన్నారు. డీసీ కార్యాలయ అధికారికి వినతిపత్రం అందించారు. మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి, నేతలు రామలింగప్ప, హనుమంతప్ప, వెంకటరమణ, విజయలక్ష్మి హిరేమఠ, గోవింద నాయక, శ్రీరాములు, అయ్యన గౌడ, శ్రీకాంత్ గౌడ, కల్యాణ మహాస్వామి పాల్గొన్నారు.

నిరసన తెలియజేస్తున్న విశ్వ హిందూ పరిషత్ బజరంగదళ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి, హనుమంతప్ప, అనిల్‌కుమార్ మోకా

13న కోల్‌కతాలో విద్యుత్తు ఉద్యోగుల సమ్మేళనం

బళ్లారి, న్యూస్‌టుడే: విద్యుత్తు విభాగంలో ఉద్యోగులు, కార్మికులపై జరుగుతున్న దాడులను వ్యతిరేకించాలని దేశ వ్యాప్తంగా కార్మికులను ఏకతాటిపైకి తీసుకుని రావడానికి ఈ నెల 13 నుంచి రెండు రోజులపాటు ఆల్ ఇండియా పవర్ మెన్ సమాఖ్య సంఘం 3వ అఖిల భారత సమ్మేళనం కోల్‌కతాలో నిర్వహిస్తున్నారు. ఈ విషయాన్ని సంఘం అధ్యక్షుడు కె.సోమశేఖర్ తెలిపారు. సోమవారం పత్రికా భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమ్మేళనంలో ప్రధానంగా కార్మికులకు కనీస వేతనం, పీఎఫ్, ఈఎస్ఐ, మౌలిక సౌకర్యాల కల్పనపై తీర్మానిస్తామని వివరించారు. విధి నిర్వహణలో ప్రమాదాల నివారణ, ప్రమాద సమయంలో మృతిచెందిన వారికి పరిహారం వంటి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తున్నట్లు వివరించారు. కార్మిక నేత శంకర్‌దాస్ గుప్తా, సమీర్ సిన్హా హాజరవుతారన్నారు. నేతలు సోమశేఖర్ గౌడ, దేవదాస్, డా.ప్రమోద్ పాల్గొన్నారు.

గోడపత్రికలను విడుదల చేస్తున్న సోమశేఖర్, డా.ప్రమోద్, దేవదాస్ తదితరులు

‘ఆట గలాట’లో పురస్కారాల పంట

బెంగళూరు (గాంధీనగర), న్యూస్‌టుడే : బెంగళూరు సాహిత్య ఉత్సవాల్లో పలువురు రచయితలు, ప్రచురణ సంస్థలకు ఆటగలాట సంస్థ పలు పురస్కారాలు ప్రదానం చేసింది. వివిధ విభాగాల్లో అత్యుత్తమ రచనలు చేసిన, ఆయా పుస్తకాల్లో చిత్రాలు గీచిన జీత్ తాయిల్, శాంతను భట్టాచార్య, శ్రీకర్ రాఘవన్, రాజీవ్ ఐప్, రుజుత దివాకర్, దేవశిశ్ మఖీజా, చంద్రిమా ఛటర్జీ, హుతుక సుమి, సాయి సుధ ఆచార్యలకు ట్రోఫీలు, పురస్కారాలను ఆదివారం రాత్రి ప్రదానం చేశారు. ఇకపై స్వాతంత్ర్య ఉద్యానవనంలోనే ప్రతిఏటా సాహిత్య ఉత్సవాలను నిర్వహించాలని నిర్వాహకులు తీర్మానించారు.



అత్యుత్తమ బాల సాహిత్యాన్ని అందించి, పురస్కారం అందుకుంటున్న రచయిత్రి

కుందానగరి.. సభాపర్వ భేరి!

శాసనసభలోకి వెళ్లే మార్గంలో గణనాథుడికి పుష్పవైభవం

సభాపర్వానికి ముందు.. కళాకారుల సుగమ సంగీత కచేరి

అలనాటి బసవేశ్వరుని అనుభవమండప చిత్తరువు వీక్షిస్తున్న సిద్ధు

ఉత్సాహంగా ప్రారంభఘట్టం

బెళగావి, న్యూస్‌టుడే : కన్నడనాట కుందానగరిగా వినుతికెక్కిన బెళగావిలో శీతాకాల శాసనసభ సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఇటీవల కన్నుమూసిన ప్రముఖులకు ఉభయ సభల్లో నివాళి అర్పించారు. సభ్యులు, అతిథులకు స్వాగతం పలికేందుకు సువర్ణ సౌధ ముందు సంగీత కచేరి ఏర్పాటు చేశారు. పది రోజుల పాటు వేర్వేరు ప్రాంతాలకు చెందిన కళాకారులు ఇక్కడ ప్రదర్శనలు కొనసాగిస్తారు. సమావేశాలకు పోటీగా మహామేళాను నిర్వహించేందుకు ప్రయత్నించిన మహారాష్ట్ర ఏకీకరణ సమితి నాయకులు, కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేశారు. ఎంఈఎస్ కార్యకర్తలకు పోటీగా ఆందోళనకు దిగిన కన్నడ సంఘాల కార్యకర్తలనూ అదుపులోనికి తీసుకున్నారు. మంత్రులు, సిబ్బంది, పోలీసులు, అధికారుల కోసం నలభీములు ఉత్తర కర్ణాటక శైలి వంటకాలను సిద్ధం చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం సువర్ణ సౌధను ముట్టడిస్తామని భాజపా రాష్ట్రాధ్యక్షుడు విజయేంద్ర ప్రకటించారు. సమస్యలను పరిష్కరించడం సాధ్యం కాకపోతే ముఖ్యమంత్రి రాజీనామా చేసి ఇంటికి వెళ్లాలని ఎగువ సభలో విపక్షనేత చలువాది నారాయణస్వామి డిమాండ్ చేశారు. దిగువ సభతో పోల్చితే.. ఎగువ సభలో కొంత సేపు చర్చలు జోరుగానే సాగాయి. భాజపా నాయకులు చేసిన ఆరోపణలు, సంధించిన ప్రశ్నలకు మంత్రులు మధు బంగారప్ప, ఎంసీ సుధాకర్, మునియప్ప, ఈశ్వర ఖండ్రే, ప్రియాంక్ ఖర్గే తదితరులు బదులిచ్చారు. ప్రభుత్వ పాఠశాలలను మూసివేయడం లేదని మధు బంగారప్ప ఇదే సందర్భంగా స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో జరుగుతున్న తెలంగాణ రైజింగ్ సమ్మిట్‌లో పాల్గొనేందుకు ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ వెళ్లడం ప్రస్తావనార్హం. దిగువసభ.. మధ్యాహ్నం అనంతరం ఖాళీగా కనిపించింది.

ఖాళీగా ఉన్న దిగువ సభలోని ఆసనాలు

దిగువ సభలో మాట్లాడుతున్న అశోక్

మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే బాలకృష్ణ

ఎగువసభలో మాట్లాడుతున్న మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్

సభ్యులకు బదులిస్తున్న మంత్రి ప్రియాంక్ ఖర్గే

అధికార పార్టీ నాయకులపై విరుచుకు పడుతున్న ఎమ్మెల్సీలు రవికుమార్, భారతీశెట్టి తదితరులు

పేదలకు ఇందిరా కిట్ల భాగ్యం!

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : రాష్ట్రంలో బీపీఎల్ కార్డుదారులకు అన్నభాగ్య పథకంలో భాగంగా బియ్యానికి బదులు జనవరి నుంచి వివిధ ఆహారధాన్యాలతో కూడిన ‘ఇందిరా కిట్’ అందిస్తామని ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి కె.హెచ్.మునియప్ప తెలిపారు. బెళగావిలో సోమవారం ప్రారంభమైన విధానపరిషత్ ప్రశ్నోత్తరాల సమయంలో భాజపా సభ్యుడు సీటీ రవి అడిగిన ప్రశ్నకు ఆయన బదులిస్తూ ఐదుకిలోల బియ్యానికి బదులుగా కందిబేడలు, చక్కెర, ఉప్పు, నూనె తదితరాలను మూటగా చేరవేస్తామన్నారు. అన్నభాగ్య బియ్యం చీకటి బజారులోకి వెళ్లకుండా కఠిన చర్యలు చేపట్టామని, అక్రమ రవాణాపై సీఐడీ దర్యాప్తునకు ఆదేశించినట్లు తెలిపారు. వివిధ సమయాల్లో ఈ అక్రమ రవాణాకు సంబంధించి 570 మందిని అరెస్టు చేశామన్నారు.

సువర్ణ సౌధలోకి వస్తున్న హోం మంత్రి డాక్టర్ పరమేశ్వర్

ఇటీవల కన్నుమూసిన ప్రముఖులకు నివాళి అర్పిస్తున్న ఎగువసభ సభ్యులు, అధ్యక్షుడు, అధికారులు

ప్రముఖులకు పరిషత్ సంతాపం

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : ఇటీవల కన్నుమూసిన ప్రముఖులకు విధాన పరిషత్‌లో ఘన నివాళులర్పించారు. మాజీ శాసనసభ్యులు హెచ్.వై.మేటి, ఆర్‌వీ దేవరాజ్, సాహితీవేత్త డాక్టర్ ఎస్.ఎల్.భైరప్ప, పర్యావరణ ఉద్యమకారిణి సాలుమరద తిమ్మక్క, బాలివుడ్ సినీనటుడు ధర్మేంద్ర, కన్నడ నటుడు ఉమేష్ తదితరుల మృతికి సభ్యులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. సమావేశం ప్రారంభమైన తరువాత సభాధ్యక్షుడు బసవరాజ హొరట్టి సంతాప తీర్మానాన్ని ప్రవేశ పెట్టారు. ఉత్తర కర్ణాటక ప్రాంతానికి చెందిన హెచ్.వై.మేటి ప్రజాప్రతినిధిగా అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారని సభ్యులు నివాళులర్పించారు. బిల్‌కెరూరు గ్రామపంచాయతీ అధ్యక్షుడిగా రాజకీయ జీవితాన్ని ప్రారంభించి, బాగల్‌కోటె పట్టణాభివృద్ధి ప్రాధికార, ఎంఎస్ఐఎల్ అధ్యక్షుడిగా, డీసీసీ బ్యాంకు డైరెక్టర్‌గా పని చేశారని సభ్యులు గుర్తుచేసుకున్నారు. 1983 నుంచి శాసనసభ్యుడిగా ఎన్నికై మంత్రిగా పని చేశారని, ఓసారి లోక్‌సభకు ఎన్నికయ్యారని గుర్తు చేశారు. బెంగళూరు నగరానికి చెందిన ఆర్‌వీ దేవరాజ్ 1989లో తొలిసారిగా శాసనసభ్యుడిగా ఎన్నికయ్యారని, 1999లో, 2013లో అదే పదవికి ఎన్నికైనట్లు సభ్యులు వివరించారు. 2004 నుంచి 2010 వరకు విధానపరిషత్ సభ్యుడిగానూ ఆయన చేసిన సేవలను మననం చేసుకున్నారు. సభా నాయకుడు బోసు రాజు, ప్రతిపక్షనేత చలవాది నారాయణస్వామి తదితరులు ఈ అంశాలపై ప్రసంగించారు. సభ్యులందరూ లేచి నిలబడి రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం వ్యక్తం చేశారు.

వీధి కుక్కల దాడి

☛ పంచాయతీ సభ్యుడికి తీవ్ర గాయాలు

హొసపేటె, న్యూస్‌టుడే: ఉదయం నడకకు వెళ్తున్న గ్రామ పంచాయతీ సభ్యుడు మంజునాథ్‌పై వీధి కుక్కలు దాడిచేసి తీవ్రంగా గాయపరిచిన ఘటన హరపనహళ్లి తాలూకా ఉచ్చంగిదుర్గలో సోమవారం జరిగింది. ఉదయం 5.30 గంటలకు నడకకు వెళ్తున్న ఆయనపై తొలుత ఓ కుక్క దాడి చేసింది. మరో నిమిషంలో ఎక్కడి నుంచో వచ్చిన మరో నాలుగు కుక్కలు మీదపడి కరిచాయి. అడ్డుకున్న ఆయన రెండు అరచేతులకు తీవ్ర గాయాలయ్యాయి. రెండు వేళ్లు తెగిపోయే స్థితికి చేరుకున్నాయి. ఇంతలో ఇరుగు పొరుగువారు కర్రలు, రాళ్లతో కుక్కలపై దాడిచేయగా అక్కడి నుంచి పరుగులు తీశాయి. క్షతగాత్రుడికి స్థానికంగా చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం దావణగెరెకు తరలించారు. వీధికుక్కల బెడదను నియంత్రించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

చేతులకు తీవ్రగాయాలై చికిత్స అందుకుంటున్న మంజునాథ్

EENADU eClassifieds JOBS

అమెరికాలో 1 సం|| బాబు ఆలన, పాలన వ్యక్తిగత సంరక్షణ కొరకు అనుభవంగల ఆడవారు కావలెను. అమెరికా వీసా కల్గినవారు మాత్రమే. ✆ : 9440803362

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలను ఇచ్చుటకు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు.
బళ్ళారి : 9121167525
బెంగుళూరు : 9121167527
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

ముందస్తు సంబరాలు!

క్రిస్మస్ వేడుకలను ఆచరించుకునేందుకు బెంగళూరులోని ఫీనిక్స్ మార్కెట్ సిటీలో ‘మ్యాజిక్ ట్రీ హౌస్’ను సోమవారం రాత్రి ఆవిష్కరించారు. నూతన సంవత్సర వేడుకల వరకు ఈ క్రిస్మస్ చెట్టు వద్ద సంగీత కచేరీలు, నృత్య రూపకాలు, బాలలకు పోటీలు, కథలు చెప్పే కార్యక్రమాలను నిర్వహిస్తామని సంస్థ ప్రతినిధి రితు మెహతా తెలిపారు. ఎక్కువ మంది వినియోగదారులను ఆకట్టుకునేందుకు విభిన్నమైన కార్యక్రమాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయని ఆమె వివరించారు.

-న్యూస్‌టుడే, బెంగళూరు (మారతహళ్లి)

నిరంతర శ్రమతో ఆవిష్కరణల పర్వం

బెంగళూరు (రాజాజీనగర), న్యూస్‌టుడే : విద్యార్థులు పెద్ద కలలు కని, వాటిని సాకారం చేసుకునేందుకు శ్రమించాలని ఉప లోకాయుక్త జస్టిస్ కేఎన్ ఫణీంద్ర పిలుపునిచ్చారు. ఆదిమానవుడి నుంచి నేటి వరకు మనిషి నిరంతరం అధ్యయనాలతోనే పలు ఆవిష్కరణలతో ముందుకు సాగుతున్నట్లు గుర్తు చేశారు. బెంగళూరులోని సౌందర్య సెంట్రల్ పాఠశాల వార్షికోత్సవంలో ప్రముఖ వైద్యురాలు డాక్టర్ సుప్రజా చంద్రశేఖర్, సౌందర్య నిపుణురాలు శాలు చావ్లాతో కలిసి ఆయన ఆదివారం రాత్రి సత్కారాన్ని అందుకున్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలను వీక్షించి మాట్లాడారు. ఎవరికీ బాల్యం వెనక్కు తిరిగి రాదని, చిన్నారుల ఆకాంక్షలు, అభిరుచులను గుర్తించి, వారిని ప్రోత్సహించే బాధ్యతలను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులకు పౌష్టికాహారంతో కలిగే ప్రయోజనాలను డాక్టర్ సుప్రజా చంద్రశేఖర్ వివరించారు. వేర్వేరు అంశాలను ఎంచుకుని విద్యార్థులు ఇచ్చిన ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. సంస్థ సీఈఓ కీర్తన్ కుమార్, ఇతర బోధకులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శన



జస్టిస్ ఫణీంద్రను సత్కరిస్తున్న సంస్థ ప్రతినిధులు

నేల ఆరోగ్యాన్ని సంరక్షించాలి

బళ్లారి, న్యూస్‌టుడే: ప్రస్తుతం నేల కలుషితమవుతోంది. దానిని రక్షించడానికి సేంద్రియ ఎరువులు బయో-ఫెర్టిలైజర్లను ఉపయోగించాలి. ఫలితంగా నేల సారాన్ని కాపాడుకోవచ్చని హగరి వ్యవసాయ విజ్ఞాన కేంద్రం ఆచార్యుడు డాక్టర్ రమేష్ పేర్కొన్నారు. బళ్లారి తాలూకా హగరి వ్యవసాయ విజ్ఞాన పరిశోధన కేంద్రంలో ఏర్పాటు చేసిన విశ్వ మట్టి సంరక్షణ దినోత్సవాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ‘ఆరోగ్యకరమైన నేల ఆరోగ్యకరం’ అనే నినాదంతో ముందుకు వెళ్తున్నట్లు వివరించారు. 2014 నుంచి అంతర్జాతీయ స్థాయిలో మొదటిసారిగా ప్రపంచ నేత దినోత్సవాన్ని జరుపుకొన్నట్లు తెలిపారు. నేల సంరక్షణ, నేల లక్షణాల గురించి ప్రపంచవ్యాప్తంగా ప్రజల్లో అవగాహన కల్పించడమే ప్రధాన లక్ష్యమన్నారు. వ్యవసాయ విజ్ఞాన పరిశోధన కేంద్రం బాధ్యుడు డా. పాలయ్య కార్యక్రమానికి అధ్యక్షత వహించి మాట్లాడారు. పర్యావరణంలోని 60 శాతం జీవుల శ్రేయస్సుకు నేల ఒక ముఖ్యమైన పునాది అన్నారు. నేల విలువైన లక్షణాలను దృష్టిలో ఉంచుకుని నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ చేతులు కలపాలన్నారు. నేల ముఖ్యమైన వనరు, ఆహార ఉత్పత్తి, నీటిశుద్ధి, ఉష్ణోగ్రత నియంత్రణలో ఇది ముఖ్యమైన పాత్ర పోషిస్తుందన్నారు. నేల విభాగం శాస్త్రవేత్త డా.రవి మాట్లాడుతూ నేల సంరక్షణ గురించి వివరంగా వివరించారు. శాస్త్రవేత్తలు గిరీష్, గోవిందప్ప, మంజునాథ, బసవరాజ్, నాగేష్, బసప్ప, ఆనంద్, జానవి, రాజేశ్వరి, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులతో శాస్త్రవేత్తలు డా.రమేష్, పాలయ్య, గోవిందప్ప, తదితరులు

సౌత్‌జోన్ వాలీబాల్ పోటీలకు ఎంపిక

సింధనూరు, న్యూస్‌టుడే: సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ పురుషుల వాలీబాల్ పోటీలకు సింధనూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. వీరు రాయచూరులోని ఆదికవి శ్రీమహర్షి వాల్మీకి విశ్వవిద్యాలయం జట్టు తరపున ప్రాతినిధ్యం వహించబోతున్నారు. సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ పురుషుల వాలీబాల్ పోటీలు ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ జేఎన్‌టీయూ విశ్వవిద్యాలయం మైదానంలో ఈ నెల 10 నుంచి 14 వరకూ జరగబోతున్నాయి. సింధనూరు ప్రభుత్వ ఫస్ట్‌గ్రేడ్ డిగ్రీ కళాశాలలో బీఏ అయిదో సెమిస్టర్ చదువుతున్న అమీన్, ఒకటో సెమిస్టర్ చదివే తిమ్మణ్ణ ఈ పోటీలకు ఎంపికవడంతో తోటి విద్యార్థులతో అభినందనలు అందుకుంటున్నారు. పోటీలకు కాకినాడ బయలుదేరుతున్న విద్యార్థులు అమీర్, తిమ్మణ్ణను సోమవారం కళాశాల ప్రాచార్యులు ప్రొఫెసర్ పాండు, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ కె.శివ అభినందించి చక్కని ప్రదర్శనతో రాణించాలని వెన్నుతట్టి సాగనంపారు.

అమీన్, తిమ్మణ్ణ

‘డిజైనూరు’.. విస్మయాల తేరు!

బెంగళూరు (హలసూరు), న్యూస్‌టుడే : నిత్య జీవితానికి విన్యాసం పేరిట ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంటీరియర్ డిజైనర్స్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆర్కిటెక్చర్స్‌కు చెందిన విద్యార్థులు, నిపుణులు వేర్వేరు విన్యాసాల్లో ఉత్పత్తులను, పరికరాలను సిద్ధం చేశారు. చిత్రకళా పరిషత్తులో డిసెంబరు 11 నుంచి 14 వరకు ‘డిజైనూరు’ 5.0 పేరిట వీటిని ప్రదర్శిస్తామని ఇరుసంస్థల ప్రతినిధులు వెల్లడించారు. నాలుగు రోజుల ప్రదర్శనలతో పాటు విద్యార్థులు, కళాకారులు, ఇరు సంస్థలకు చెందిన ఆచార్యులు, అంకుర పరిశ్రమల ప్రతినిధులతో ప్రత్యేక కార్యశాలలు, చర్చాగోష్ఠులను నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. ప్రదర్శనతో పాటు సంప్రదాయక ఉత్తర కర్ణాటక చిత్రకళ, దేశంలోని వివిధ ప్రాంతాల్లో ప్రాచుర్యం పొందిన హస్తకళా ఉత్పత్తులు, లావణి, వీరగాసె, డొల్లుకుణిత తదితర సంప్రదాయ నృత్య ప్రదర్శనలతో కార్యక్రమాలను నిర్వహిస్తామని వెల్లడించారు. డిజైనర్లు, ప్రజల మధ్య అంతరాన్ని తగ్గించే దిశలో డిజైనూరును గత నాలుగేళ్లుగా నిర్వహిస్తూ వస్తున్నారు.

విస్మయం గొలిపే.. త్రీడీ అరల ర్యాక్

(c) eenadu

బళ్ళారి

● బళ్ళారి ● రాయచూరు ● కొప్పళ ● విజయనగర ● చిత్రదుర్గ

వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠ

కంప్లి, న్యూస్‌టుడే: కంప్లి తాలూకా రామసాగరలో అయ్యప్ప, వినాయక, సుబ్రహ్మణ్య స్వామి విగ్రహాల ప్రతిష్ఠ సోమవారం తెల్లవారుజామున వైభవంగా జరిగింది. హోమం, నవగ్రహ పూజ, అభిషేకం తదితర పూజలు జరిపారు. బుక్కసాగర కరి సిద్ధేశ్వర మఠ విశ్వారాధ్య స్వామీజీ సాన్నిధ్యం వహించారు. జీపీ అధ్యక్షురాలు ఆశా, పీడీవో మల్లికార్జున, ఆలయ సమితి అధ్యక్షుడు బోవేరు నారాయణ, శివశంకర గౌడ, గురు స్వాములు, అయ్యప్ప మాలధారులు, ప్రజలు పాల్గొన్నారు.

పల్స్‌పోలియోను జయప్రదం చేయండి

ఏర్పాట్లను సమీక్షిస్తున్న పాలనాధికారి సురేశ్ ఇట్నాళ

గంగావతి: పల్స్‌పోలియో కార్యక్రమాన్ని వంద శాతం జయప్రదం చేయాలని కొప్పళ జిల్లా పాలనాధికారి సురేశ్ ఇట్నాళ కోరారు. ఈ నెల 21నుంచి 24 దాకా జరిగే జాతీయ పల్స్‌పోలియో అభియాన్ ఏర్పాట్లను ఆయన సోమవారం సమీక్షించారు. ఐదేళ్లలోపు పిల్లలు జిల్లాలో 1,76,083 మంది ఉన్నారన్నారు. 704 కేంద్రాలు, 1,408 బృందాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 2816 మంది కార్యకర్తలను టీకా వేసేందుకు నియమించామన్నారు. అందరూ సమన్వయంతో పనిచేయాలన్నారు. డీహెచ్‌వో లింగరాజు, వైద్యులు శ్రీధర్, వి.ప్రకాశ్, రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలకు గుర్తింపు రాళ్లు వేయండి

పురసభ ముఖ్యాధికారికి వినతిపత్రం సమర్పిస్తున్న ఆశ్రయ ఇళ్ల లబ్ధిదారులు

కంప్లి, న్యూస్‌టుడే: కంప్లి మారుతీనగర్ కుడి వైపు ఆశ్రయ ఇళ్ల పథకం కింద పురసభ పంపిణీ చేసిన స్థలాలకు గుర్తింపు రాళ్లు వేయాలని లబ్ధిదారులు కోరారు. ఈ విషయమై పురసభ ముఖ్యాధికారి బి.మల్లికార్జునకు సోమవారం వినతిపత్రం సమర్పించారు. లబ్ధిదారులు కె.రంగప్ప, ఖాజా మొహినుద్దీన్, మహ్మద్ గౌస్ మాట్లాడుతూ అక్కడ ఇళ్లు కట్టుకుందామంటే గుర్తింపు రాళ్లు లేక ఏ స్థలం ఎవరిదో తెలియడం లేదు. అధికారులు ఆ స్థలాలను గుర్తించి మార్కింగ్ రాళ్లు వేయాలని కోరారు. స్థానికులు గంగమ్మ, అయ్యోది లక్ష్మమ్మ, షరీఫా, పి.సలీం, ఖాసిం, జాకీర్ పాల్గొన్నారు.

మరేగా.. కూలీలు కులాసాగా

● ఉపాధి పనుల్లో 90 శాతం పనులు పూర్తి ● రూ.113.26 కోట్లు ఖర్చు

ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

బళ్లారి, న్యూస్‌టుడే: ఉపాధి పనుల కోసం వేర్వేరు ప్రాంతాలకు వలసలు వెళ్లకుండా.. ఉన్న గ్రామంలోనే కుటుంబ సభ్యులకు ఉపాధి కల్పించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం గ్రామీణ రైతులు, వ్యవసాయ కూలీలు, కూలీలపాలిట సంజీవనిలా మారింది. ఈ పథకం కింద జిల్లా పంచాయతీ అర్హులకు ఏడాదికి ఇచ్చిన లక్ష్యంలో 90 శాతం సాధించి, రాష్ట్రంలోనే మొదటి వరుసలో నిలిచింది.

పనులను పరిశీలిస్తున్న జడ్పీ అధికారులు

లక్ష్యానికి చేరువలో..

ఉపాధి హామీ పథకం కింద నాలుగు నెలల ముందే 90 శాతం పనిదినాలు పూర్తి చేసి రాష్ట్రంలో బళ్లారి జిల్లా మొదటి స్థానంలో నిలిచింది. జిల్లాలో ఐదు తాలూకాలకుగాను మొత్తం 42 లక్షల పని దినాలు చేయించాలని లక్ష్యాన్ని ఇవ్వగా నవంబరు చివరికి 37.72 లక్షల పనిదినాలు పూర్తి చేసింది. ఇందుకోసం మొత్తం రూ.113.26 కోట్లను ఖర్చు చేసింది. వాటిలో పనిదినాలకు రూ.104.94 కోట్లు, సామగ్రికి రూ.5.28 కోట్లు ఖర్చు చేశారు. జిల్లాలో 1.08 లక్షల కుటుంబాలకు ఉపాధి కల్పించారు. వాటిలో 127 కుటుంబాలు 100 శాతం పని రోజులు పూర్తి చేశాయి. 5,894 కుటుంబాలు 81 నుంచి 99 శాతం పనులు పూర్తి చేశాయి. 55.34 శాతం మంది మహిళలకు, 30.11 శాతం గిరిజనులు, 19.66 శాతం మంది దళితులకు ఉపాధి కల్పించారు.

చేయించిన పనులివీ..

● భూగర్భ జలాలు పెంచడానికి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారు. వాటిలో బోరుబావులు రీఛార్జ్, వర్షపునీరు భూమిలోకి ఇంకిపోయేలా అటవీ ప్రాంతంలో అడ్డంగా గుంతలను తవ్వారు. చెత్త చెరువులు నిర్మాణం, వాగుల్లో పూడిక తొలగింపు, పొలంలో మట్టి కట్టలు, చెక్‌డ్యామ్‌లు, నీటి కుంటలు, సముదాయ భవనాలు, వ్యక్తిగత పనులు చేయించారు. మొత్తం 2,497 పనులకుగాను ఇప్పటికే 2,123 పనులు పూర్తి చేశారు.

● వ్యవసాయ రంగంలో 1.89 లక్షల పని దినాలు చేయించారు. 400 హెక్టార్లలో మట్టి కట్టలు, 62 నీటి కుంటలను తవ్వించారు. ఉద్యానవనశాఖలో 1.47లక్షల హెక్టార్లలో పని చేయించి, 636 ఎకరాల్లో పండ్ల తోటలు అభివృద్ధి చేశారు. 4 ఉద్యానవన నర్సరీ ప్రదేశాలను అభివృద్ధి చేశారు. అటవీశాఖలో మొక్కలు పెంపకం, వర్షపునీరు భూమిలోకి ఇంకే విధంగా గుంతలను తవ్వించారు.

● గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించడానికి ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు.

● 78 పాఠశాలకు ప్రహరీ నిర్మాణాలు, 102 వంటగదులు, 45 పాఠశాలల్లో మరుగుదొడ్లు, 18 గ్రామ పంచాయతీ కార్యాలయాలు, 28 గోదాములు, 587 సిమెంట్ రహదారులు, 473 మురుగు కాలువలు, తదితర అభివృద్ధి పనులు చేశారు.

అక్షర దాసోహ సహాయకురాలి దాతృత్వం

పాఠశాలలో ఉపాధ్యాయులకు టీవీని అందిస్తున్న హొన్నూర్‌బీ

శ్రీరామనగర్, న్యూస్‌టుడే: కారటగి తాలూకా కుంటోజీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల అక్షర దాసోహ (బిసి ఊట) వంట సహాయకురాలు హొన్నూర్ బీ సోమవారం రూ.23 వేల విలువ చేసే టెలివిజన్‌ను కానుకగా ఇచ్చారు. తన మనవడు అల్తాఫ్ మొదటి పుట్టినరోజును పురస్కరించుకుని బడిలో పిల్లలకు ఉపయోగపడేందుకు టెలివిజన్‌ను ఇచ్చానని తెలిపారు. పాఠశాల అభివృద్ధి సమితి సభ్యులు, ఉపాధ్యాయులు హొన్నూర్‌బీని అభినందించారు.

మానవతా విలువలు అవసరం

మాట్లాడుతున్న ప్రధానాచార్యుడు ఘనమఠదయ్య హిరేమఠ

కంప్లి, న్యూస్‌టుడే: ఆధునికత మోజులో మానవతా విలువలు కనుమరుగవుతున్నాయి. ఇవి విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠ్యాంశాల్లో చేర్చాల్సిన అవసరం ఉందని కంప్లి సాంగత్రయ సంస్కృత పాఠశాల ప్రధానాచార్యుడు ఘనమఠదయ్య హిరేమఠ అభిప్రాయపడ్డారు. స్థానిక గురుమఠంలో సోమవారం జరిగిన శివానుభవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నేటి ఒత్తిడి జీవనంలో రోజూ కొంత సమయం ఆధ్యాత్మిక కార్యక్రమాలకు కేటాయిస్తే మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. పేటె బసవేశ్వర ఆలయ అర్చకుడు కె.ఎం.చంద్రశేఖర స్వామి మాట్లాడుతూ ప్రకృతి సంరక్షణతోనే భూమిపై జీవరాశి మనుగడ సాధ్యం. పరిసరాల సంరక్షణ కేవలం పరిసర దినోత్సవం రోజుకే పరిమితం కాకుండా తరచూ దానిపై దృష్టి సారించాలన్నారు. విశ్రాంత ఉపాధ్యాయుడు కె.చంద్రశేఖర్, బి.ఎం.రుద్రయ్య, అశోక్ కుకనూరు, తిప్పేస్వామి, విశ్వనాథ శాస్త్రి, తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పదవి దళితులకు ఇవ్వాలి

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఛలవాది మహాసభ ఉపాధ్యక్షుడు నరసప్ప

హొసపేటె, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను దించితే ఆ పదవిని దళిత నాయకులకు ఇవ్వడం సమంజసమని రాష్ట్ర ఛలవాది మహాసభ ఉపాధ్యక్షుడు సి.నరసప్ప డిమాండ్ చేశారు. సోమవారం ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర చరిత్రలో దళితులు ఒక్కసారి కూడా ముఖ్యమంత్రి కాలేదని విచారం వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని సమర్థవంతంగా నడిపించే నాయకులైన మల్లికార్జున ఖర్గే, డాక్టర్ పరమేశ్వర్, హెచ్.సి.మహదేవప్ప, మునియప్ప, సతీశ్ జార్కిహొళిల్లో ఒకరికి ముఖ్యమంత్రి పదవి కట్టబెట్టాలన్నారు. లింగాయత, ఒక్కలిగ, వెనుకబడిన వర్గాలవారు ఇప్పటికే సీఎం అయ్యారు. ఈ రెండున్నరేళ్ల అవకాశాన్ని దళితులకు ఇవ్వాలని అధిష్ఠానంపై ఒత్తిడి తీసుకొస్తామని స్పష్టం చేశారు. మహాసభ ప్రముఖులు మత్తిహళ్లి కెంచప్ప, వీరభద్రప్ప, సి.రమేశ్, అజ్జయ్య హొట్టేర్, సి.డి.ఈరణ్ణ పాల్గొన్నారు.

గాంధార విద్యలో శేషసాయి నిష్కల్ సత్తా

బళ్లారి గ్రామీణ, న్యూస్‌టుడే: నగరానికి చెందిన నారాయణ పాఠశాలలో ఏడోతరగతి చదువుతున్న జ్యేష్ఠవేదశేషసాయి నిష్కల్ గాంధార విద్యలో ఉత్తమ ప్రతిభ చాటుతున్నాడు. అతడు ప్రదర్శించిన గాంధార విద్యను చూసి పలువురు అభినందనలు తెలిపారు. పాఠశాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వార్షిక కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమిషనర్ మంజునాథ్ శేషసాయి నిష్కల్‌ను సత్కరించారు. గతంలో జాతీయ స్థాయిలో నోబుల్ బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇండియా బుక్ ఆఫ్‌రికార్డ్స్, ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్‌లను సొంతం చేసుకున్న ఘనత నిష్కల్‌ది. బెంగళూరుకు చెందిన మంజునాథ్ పూజారి వద్ద ఈ విద్యను నేర్చుకుంటున్నానని నిష్కల్ తెలిపాడు. ఈ సందర్భంగా నిష్కల్‌ను విద్యార్థులు, పోషకులు, విద్యాసంస్థల ప్రముఖులు అభినందించారు.

జేష్టవేదశేషసాయి నిష్కల్‌ను అభినందిస్తున్న నగరపాలక సంస్థ కమిషనర్ మంజునాథ్, తదితరులు

కార్పొరేట్ కంపెనీల చేతుల్లో కేంద్రం కీలుబొమ్మ

మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు బసవరాజ్

హొసపేటె, న్యూస్‌టుడే: కార్పొరేట్ కంపెనీల చేతుల్లో కేంద్ర ప్రభుత్వం కీలుబొమ్మగా మారిందని సీపీఎం నాయకుడు యు.బసవరాజ్ దుయ్యబట్టారు. సోమవారం ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 11 ఏళ్ల మోదీ పాలనలో నిరుపేదలు అలాగే మిగిలిపోగా, ధనికులు మరింత ఉన్నత స్థితికి చేరుకున్నారని ధ్వజమెత్తారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కూడా ఆ పార్టీయే అధికారంలోకి రావాలని ఇప్పటినుంచే కుటిల సన్నాహాలు ప్రారంభిస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ పాలన కూడా దొందు దొందే రీతిలో ఉందని మండిపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక ధోరణిని నిరసిస్తూ ఈ నెల 21న బెంగళూరు స్వాతంత్ర్య ఉద్యానవనంలో పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం చేపడతామని వెల్లడించారు. సమావేశంలో పార్టీ నాయకులు ఆర్.ఎస్.బసవరాజ్, ఆర్.భాస్కర్‌రెడ్డి, బిసాటి మహేశ్ పాల్గొన్నారు.

ప్రయోగశాలల సంఖ్యను తగ్గించడం తగదు

ఎమ్మెల్యే గవియప్పకు వినతిపత్రం సమర్పిస్తున్న ప్రభుత్వ వైద్య ప్రయోగశాలల సిబ్బంది

హొసపేటె, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉన్న ప్రయోగశాలల సంఖ్యను తగ్గించాలని ప్రభుత్వం చేపట్టిన ప్రయత్నాలను వెంటనే నిలిపివేయాలని విజయనగర జిల్లా వైద్య ప్రయోగశాల సిబ్బంది సంఘం అధ్యక్షుడు బి.ఎం.బసవరాజయ్య పేర్కొన్నారు. సంఘం సభ్యులు స్థానిక ఎమ్మెల్యే గవియప్పను కలిసి ఇదే అంశంపై వినతిపత్రం సమర్పించారు. అధ్యక్షుడు బసవరాజయ్య మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 54 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఐదు ప్రజాసుపత్రులు ఉన్నాయి. వందలాది మంది ప్రభుత్వ, గుత్తత సిబ్బంది వాటిలో విధులు నిర్వహిస్తున్నారు. 20 వేల జనాభాకు ఒకటిచొప్పున ప్రయోగశాలలు ఉండాలి, ఈ నేపథ్యంలో జనాభా ప్రాతిపదికన ఎక్కువ సంఖ్యలో ఉన్న ప్రయోగశాలలను తగ్గించాలని ప్రభుత్వం సన్నాహాలు చేపట్టింది. జిల్లాలో జనాభాకు అనుగుణంగా ప్రయోగశాలలు ఉన్నాయి, ప్రభుత్వం ఈ జిల్లాలో 19 ప్రయోగశాలలను తగ్గిస్తామని పేర్కొనడం ఆందోళన కలిగించే అంశమన్నారు. వాటిని తగ్గించడంతో ఉన్నవాటిపైన అదనపు భారం పడుతుందని, వాటిలో పని చేసే గుత్తత సిబ్బందికి ఉద్యోగ భద్రత లేకుండా పోతుందని వాపోయారు. ఈ ప్రయత్నాలను నిలిపివేయాలని కోరారు.

10న విద్యుత్తు సరఫరాలో అంతరాయం

బళ్లారి, న్యూస్‌టుడే: కంప్లి జెస్కాం వ్యాప్తిలో మెట్రి 110/11కె.వి. విద్యుత్తు ఉప కేంద్రంలో మరమ్మతుల కారణంగా ఈ నెల 10న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని జెస్కాం అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్రం పరిధిలోని గోనాళ్, మెట్రి, మావినహళ్లి, దేవలాపురం, ఉప్పారహళ్లి ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఎదురవుతుందని పేర్కొన్నారు.

బళ్లారి గ్రామీణ పరిధిలో..

బళ్లారి గ్రామీణ వ్యాప్తిలోని 110/ 11కె.వి. దక్షిణ ఉప కేంద్రం వ్యాప్తిలో మరమ్మతులు జరుగుతుండటంతో ఈ నెల 10న ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని జెస్కాం అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. సిద్ధాపురం, తపాలా వీధి, పారిశ్రామిక వాడ, చుట్టుపక్కల ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఎదురవుతుందన్నారు.

భక్తిశ్రద్ధలతో ఉత్సవం

ఊరేగింపులో పాల్గొన్న ప్రజలు

కంప్లి, న్యూస్‌టుడే: మెట్రి విశ్వారాధ్య గురుకుల మఠం ప్రణవ జ్యోతి మహా క్షేత్రం సంస్థాపకుడు దివంగత హంద్యాళు మఠ మహాదేవ తాత 42వ పుణ్య స్మరణను పురస్కరించుకుని మఠంలో రెండు రోజులుగా జరుగుతున్న ధార్మిక కార్యక్రమాలు సోమవారం ముగిశాయి. రుద్రాభిషేకం, బిల్వార్చన, గణారాధన, తదితర పూజలు జరిగాయి. మఠం నుంచి ప్రారంభమైన ఊరేగింపు బసవణ్ణపేటె ఎదురు బసవణ్ణ కట్ట వద్దకు వెళ్లి తిరిగి మఠానికి చేరుకుంది. ఉజ్జయిని జగద్గురువు సిద్ధలింగ శివాచార్య పురాణ ప్రవచనం ముగిసింది, గ్రామస్థులు, చుట్టు పక్కల గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

సాహిత్య పఠనం అలవాటు కావాలి

వివిధ వేషధారణలతో విద్యార్థులు. చిత్రంలో ఉపాధ్యాయుడు నాగరాజు మసూతి, చిత్రంలో ఉపాధ్యాయులు, సీఆర్‌పీ అధ్యక్షుడు, సభ్యులు

బళ్లారి, న్యూస్‌టుడే: విద్యార్థులు పాఠ్యపుస్తకాలతో పాటు సాహిత్య పుస్తక పఠనం చేయడం అలవాటు చేసుకోవాలని కన్నడ సాహిత్య పరిషత్తు తాలూకా అధ్యక్షుడు, ఉపాధ్యాయుడు నాగరాజ మసూతి పేర్కొన్నారు. గెణికెహాళు క్లస్టర్ స్థాయి (ప్రాథమిక పాఠశాల విభాగం) ఆధ్వర్యంలో సోమవారం బాదనహట్టి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రతిభా కారంజి, కలికోత్సవ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థుల్లో విశేష ప్రతిభ ఉంటుందని, వారి ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలన్నారు. అనంతరం విద్యార్థులు భరతనాట్యం, జానపద నృత్యం, మిమిక్రీ, చిత్రకళ, రంగోలి పోటీలను నిర్వహించారు. ముఖ్య గురువులు గంగాధర, భీమణ్ణ, నిర్మల, సీఆర్‌పీ బసవరాజ, సీఆర్పీ బసవరాజు, ఉపాధ్యాయులు విక్రమ్, షెక్షావలి, మణ్ణూరు బసవరాజు, నాగరాజు, సిద్ధప్ప, గజేంద్ర, దేవణ్ణనాయక్, గంగణ్ణ, రుద్రప్ప, గురుబసప్ప పాల్గొన్నారు.

పాఠ్యేతర కార్యక్రమాలతో మానసిక వికాసం

చెళ్లకెర(చిత్రదుర్గం),న్యూస్‌టుడే: విద్యార్థులు ఎప్పుడూ పుస్తకాలకే పరిమితం కాకుండా పాఠ్యేతర కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా త్వరితగతిన మానసిక వికాసం చెందుతారని డైట్ ప్రిన్సిపల్ నసిరుద్దీన్ పేర్కొన్నారు. సోమవారం ఆయన డైట్ కార్యాలయంలో పురాతత్వ ప్రజ్ఞ రాష్ట్రస్థాయి క్విజ్ పోటీల్లో బంగారు పతకాలు సాధించిన చవళిహళ్లి గొల్లరహట్టి ప్రభుత్వ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థినులు తనుజ, వసుంధర, మార్గదర్శి ఉపాధ్యాయుడు మల్లికార్జున స్వామిని సత్కరించారు. ఇలాంటి పోటీల్లో పాల్గొంటే విద్యార్థుల్లో భాషా నైపుణ్యం, విషయాలపై పట్టు, ఆత్మవిశ్వాసం, జ్ఞాపక శక్తి, పోటీ మనోభావం పెంపొందుతాయన్నారు. ఈ విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీల్లో బంగారు పతకాలు, రూ.30 వేల నగదు బహుమతిని గెలుపొంది జిల్లా కీర్తి ప్రతిష్ఠలను ఇనుమడింపజేశారన్నారు. వైస్ ప్రిన్సిపల్ నాగభూషణ్, అధ్యాపకులు తిప్పేస్వామి, బసవరాజ్, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు శివణ్ణ పాల్గొన్నారు.

విద్యార్థినులు తనుజ, వసుంధర, మార్గదర్శి ఉపాధ్యాయుడు మల్లికార్జున స్వామిని సత్కరించిన డైట్ ప్రిన్సిపల్, సిబ్బంది

సహాయ ధనం కోసం దరఖాస్తుల ఆహ్వానం

బళ్లారి, న్యూస్‌టుడే: ప్రస్తుత సంవత్సరంలో ప్రధాన మంత్రి మత్స్యకార పథకం కింద సహాయ ధనం కోసం అర్హులైన లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆ శాఖ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. కంప్లి, బళ్లారి, కురుగోడు, సిరుగుప్ప, సండూరు తాలూకాల్లోని దళిత లబ్ధిదారులకు ద్విచక్ర, త్రిచక్రవాహనాలు, చేపలు విక్రయించే కేంద్రాలు, తదితర వాటికి 90 శాతం సహాయ ధనం అందిస్తారన్నారు. అర్హులైన వారు ఈ నెల 20వ తేదీ లోపు పూర్తి వివరాలతో కూడిన దరఖాస్తులను తాలూకా కార్యాలయాల్లో సమర్పించాలని కోరారు.

లాంగ్ జంప్‌లో జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

పతకం, పత్రంతో అభి

చెళ్లకెర(చిత్రదుర్గం): సిరిగెర ఎల్‌బీఆర్ గురుకుల ఉన్నత పాఠశాల విద్యార్థి ఎల్.హెచ్.అభి రాష్ట్రస్థాయి అండర్-17 క్రీడల్లో పాల్గొని లాంగ్ జంప్‌లో 6.81 మీటర్ల దూరం దూకి బంగారు పతకం గెలుపొందాడు. ఈ విషయాన్ని తాలూకా విద్యాశాఖ అధికారి గిరిజా తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ అభి రాష్ట్ర స్థాయిలో బంగారు పతకం గెలుపొందటంతో ఈ నెల 13 నుంచి 18 వరకు ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో జరుగనున్న జాతీయ స్థాయి అండర్-17 పోటీల్లో పాల్గొనడానికి అర్హత సాధించారన్నారు. జాతీయ స్థాయిలో కూడా రాణించి పతకంతో తిరిగిరావాలని ఆమె అభిలషించారు. ఈ సందర్భంగా కోచ్ నవీన్‌ను అభినందించారు.

పాఠశాల స్థాయి క్రీడలు ప్రారంభం

శ్రీరామనగర్: శ్రీరామనగర్‌లోని శ్రీవిద్యానికేతన్ పాఠశాలలో స్పోర్ట్స్ ఫిస్టా -2025-26 క్రీడలను విద్యాసంస్థ అధ్యక్షుడు నెక్కంటి సూరిబాబు క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి క్రీడాజ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలి. గెలుపు, ఓటములతో సంబంధం లేకుండా క్రీడల్లో పాల్గొనాలని సూచించారు. పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా మూడు రోజులపాటు క్రీడలు జరగనున్నాయి.

వీధి కుక్కలను దత్తతకు తీసుకోండి

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి నగర పాలికె వ్యాప్తిలో వీధి కుక్కలను దత్తత తీసుకుని వాటికి ఆహారం ఇవ్వాలనుకునే వారు, జంతువులను రక్షించడానికి కట్టుబడినేవారు. జంతువులపై కరుణ ఉన్నావారు, ఆశ్రయం కల్పించి ఆహారం అందించే వారు వెంటనే నగర పాలికె కార్యాలయం అధికారులను సంప్రదించాలని కమిషనర్ మంజునాథ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే వీధి కుక్కలు, వాహనాలను వెంబడించి దాడి చేస్తున్న వీధి కుక్కలను నగర పాలికె అధికారులు పట్టుకుని ఆశ్రయ కేంద్రానికి తరలిస్తున్నట్లు తెలిపారు. స్వచ్ఛంద సంస్థలు, జంతు సంక్షేమ సంస్థలు, జీవి ప్రేమికులు అధికారులను సంప్రదించాలన్నారు.

ల్యాప్‌టాప్‌ల వితరణకు చర్యలు

బళ్లారి, న్యూస్‌టుడే: కుడతిని పట్టణ పంచాయతీ ఆధ్వర్యంలో 2025-26 ఏడాది ఎస్ఎఫ్‌సీ, టీఎస్పీ పథకాల కింద వైద్య, ఇంజినీరింగ్ విద్యాభ్యాసం చేస్తున్న దళిత, గిరిజన, వెనుకబడిన వర్గాల విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు కొనుగోలు చేయడానికి సహాయ ధనం అందజేస్తున్నట్లు ఆ శాఖ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలతో కూడిన దరఖాస్తులను ఈ నెల 22 లోపు కార్యాలయానికి పంపాలన్నారు.

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

08-12-2025 (ఉ॥ 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1621.21	1629.48
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	506	4,070
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	8,791	5,133
నీటి నిల్వ (టి.ఎం.సి)	64.786	92.127

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

ఘనంగా కాశీవిశ్వనాథస్వామి మండల పూజలు

ఇంటూరి నగర్‌లోని కాశీ విశాలాక్షి, విశ్వనాథుడికి పుష్పాలంకరణ

బళ్లారి, బళ్లారి గ్రామీణ, న్యూస్‌టుడే: ఇంటూరినగర్‌లో వెలసిన కాశీ విశాలాక్షమ్మ, విశ్వనాథస్వాముల ఆలయంలో మండల పూజలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రతిష్ఠ జరిగి 42 రోజులను పురస్కరించుకుని మండల పూజలు నిర్వహించినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. అభిషేకాలు, అలంకరణ, హోమపూజలు చేపట్టామన్నారు. పుష్పాలతో స్వామిని అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. మాజీ శాసన సభ్యుడు గాలి సోమశేఖరరెడ్డి పూర్ణాహుతి పూజల్లో పాల్గొన్నారు. ఆయనను ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు. భక్తులందరికీ అన్న సంతర్పణ చేశారు. వెంకట సాయి మురళీకోలాట మండలి మహిళలు ప్రదర్శించిన కోలాటం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. కార్పొరేటర్ వివేక్, మాజీ కార్పొరేటర్ కెరకోడప్ప, వేదపండితుడు సంతోష్, అర్చకుడు రాఘవేంద్ర, ఇంటూరి నగర్ వాసులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పూర్ణాహుతి పూజాద్రవ్యాలను తీసుకువస్తున్న మాజీ శాసనసభ్యుడు సోమశేఖరరెడ్డి, తదితరులు

అభివృద్ధి పనుల్లో జాప్యం తగదు



స్థానిక సంస్థల అధికారులకు సూచనలిస్తున్న జిల్లా పాలనాధికారి కవితా మన్నికేరి

హొసపేటె: స్థానిక సంస్థలు చేపడుతున్న అభివృద్ధి పనుల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ జాప్యం తగదని జిల్లా పాలనాధికారి కవితా మన్నికేరి సూచించారు. సోమవారం జిల్లాలోని స్థానిక సంస్థల అధికారులతో ఏర్పాటు చేసిన ప్రగతి సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. పనులు నత్తనడకన సాగుతున్నాయని వార్డు సభ్యుల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. నిధులు వెనక్కివెళ్లేలోగా పనులు పూర్తి చేయాలి, నిర్లక్ష్యం వహించిన అధికారులు, ఇంజినీర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రహదారులు, మురుగు కాలువలు, విద్యుద్దీపాల ఏర్పాటుకు సంబంధించిన పనులను మొదటి ప్రాధాన్యతగా పూర్తిచేయాలని సూచించారు. దివ్యాంగులు, దళిత, గిరిజన వర్గాల సంక్షేమానికి కేటాయించిన నిధులను సద్వినియోగం చేసుకోవాలని స్పష్టం చేశారు. ఇందిరా క్యాంటీన్లలో స్వచ్ఛత కొరవడిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వెంటనే శుభ్రత పనులు పాటించాలన్నారు. వీధి కుక్కల బెడదను నియంత్రించాలని సూచించారు. జిల్లా ప్రణాళిక సంచాలకుడు మనోహర్ పాల్గొన్నారు.

వరి సాగుకు ప్రత్యామ్నాయంపై నేడు ఫోన్ ఇన్

రాయచూరు, న్యూస్‌టుడే: తుంగభద్ర ఆయకట్టు ప్రాంతంలో వరికి ప్రత్యామ్నాయం గురించి, రబీ సాగులో తెగుళ్ల బెడద నివారణపై రాయచూరు ఆకాశవాణి కేంద్రం మంగళవారం ఫోన్-ఇన్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. వ్యవసాయ విజ్ఞాన విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు ఎం.ఎ.బసవణ్ణప్ప, శివానంద హంచినాళ రైతుల ప్రశ్నలకు సమాధానం ఇస్తారు. ఆసక్తి గల వారు సాయంత్రం 6.51 నుంచి రాత్రి 7.34 గంటల మధ్య 08532 295898, 200312 ల్యాండ్ ఫోన్‌కు డయల్ చేయాలని కార్యక్రమాల నిర్వాహకుడు వెంకటేశ్ బేవినబెంచి కోరుతున్నారు.

(c) eenadu

కుందానగరి.. సభాపర్వ భేరి!

ఉత్సాహంగా ప్రారంభఘట్టం

శాసనసభలోకి వెళ్లే మార్గంలో గణనాథుడికి పుష్పవైభవం

సభాపర్వానికి ముందు.. కళాకారుల సుగమ సంగీత కచేరీ

అలనాటి బసవేశ్వరుని అనుభవమండప చిత్తరువు వీక్షిస్తున్న సిద్ధు

బెళగావి, న్యూస్‌టుడే : కన్నడనాట కుందానగరిగా వినుతికెక్కిన బెళగావిలో శీతాకాల శాసనసభ సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఇటీవల కన్ను మూసిన ప్రముఖులకు ఉభయ సభల్లో నివాళి అర్పించారు. సభ్యులు, అతిథులకు స్వాగతం పలికేందుకు సువర్ణ సౌధ ముందు సంగీత కచేరీ ఏర్పాటు చేశారు. పది రోజుల పాటు వేర్వేరు ప్రాంతాలకు చెందిన కళాకారులు ఇక్కడ ప్రదర్శనలు కొనసాగిస్తారు. సమావేశాలకు పోటీగా మహామేళాను నిర్వహించేందుకు ప్రయత్నించిన మహారాష్ట్ర ఏకీకరణ సమితి నాయకులు, కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేశారు. ఎంఈఎస్ కార్యకర్తలకు పోటీగా ఆందోళనకు దిగిన కన్నడ సంఘాల కార్యకర్తలనూ అదుపులోనికి తీసుకున్నారు. మంత్రులు, సిబ్బంది, పోలీసులు, అధికారుల కోసం నలభీములు ఉత్తర కర్ణాటక శైలి వంటకాలను సిద్ధం చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం సువర్ణ సౌధను ముట్టడిస్తామని భాజపా రాష్ట్రాధ్యక్షుడు విజయేంద్ర ప్రకటించారు. సమస్యలను పరిష్కరించడం సాధ్యం కాకపోతే ముఖ్యమంత్రి రాజీనామా చేసి ఇంటికి వెళ్లాలని ఎగువ సభలో విపక్షనేత చలువాది నారాయణస్వామి డిమాండ్ చేశారు. దిగువ సభతో పోల్చితే.. ఎగువ సభలో కొంత సేపు చర్చలు జోరుగానే సాగాయి. భాజపా నాయకులు చేసిన ఆరోపణలు, సంధించిన ప్రశ్నలకు మంత్రులు మధు బంగారప్ప, ఎంసీ సుధాకర్, మునియప్ప, ఈశ్వర ఖండ్రే, ప్రియాంక్ ఖర్గే తదితరులు బదులిచ్చారు. ప్రభుత్వ పాఠశాలలను మూసివేయడం లేదని మధు బంగారప్ప ఇదే సందర్భంగా స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో జరుగుతున్న తెలంగాణ రైజింగ్ సమ్మిట్‌లో పాల్గొనేందుకు ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ వెళ్లడం ప్రస్తావనార్హం. దిగువసభ.. మధ్యాహ్నం అనంతరం ఖాళీగా కనిపించింది.

ఖాళీగా ఉన్న దిగువ సభలోని ఆసనాలు

దిగువ సభలో మాట్లాడుతున్న అశోక్

మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే బాలకృష్ణ

ఎగువసభలో మాట్లాడుతున్న మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్

సభ్యులకు బదులిస్తున్న మంత్రి ప్రియాంక్ ఖర్గే

అధికార పార్టీ నాయకులపై విరుచుకు పడుతున్న ఎమ్మెల్సీలు రవికుమార్, భారతీశెట్టి తదితరులు

పేదలకు ఇందిరా కిట్ల భాగ్యం!

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : రాష్ట్రంలో బీపీఎల్ కార్డుదారులకు అన్నభాగ్య పథకంలో భాగంగా బియ్యానికి బదులు జనవరి నుంచి వివిధ ఆహారధాన్యాలతో కూడిన 'ఇందిరా కిట్' అందిస్తామని ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి కె.హెచ్.మునియప్ప తెలిపారు. బెళగావిలో సోమవారం ప్రారంభమైన విధానపరిషత్ ప్రశ్నోత్తరాల సమయంలో భాజపా సభ్యుడు సీటీ రవి అడిగిన ప్రశ్నకు ఆయన బదులిస్తూ ఐదుకిలోల బియ్యానికి బదులుగా కందిబేడలు, చక్కెర, ఉప్పు, నూనె తదితరాలను మూటగా చేరవేస్తామన్నారు. అన్నభాగ్య బియ్యం చీకటి బజారులోకి వెళ్లకుండా కఠిన చర్యలు చేపట్టామని, అక్రమ రవాణాపై సీఐడీ దర్యాప్తునకు ఆదేశించినట్లు తెలిపారు. వివిధ సమయాల్లో ఈ అక్రమ రవాణాకు సంబంధించి 570 మందిని అరెస్టు చేశామన్నారు.

సువర్ణ సౌధలోకి వస్తున్న హోం మంత్రి డాక్టర్ పరమేశ్వర్

ఇటీవల కన్నుమూసిన ప్రముఖులకు నివాళి అర్పిస్తున్న ఎగువసభ సభ్యులు, అధ్యక్షుడు, అధికారులు

ప్రముఖులకు పరిషత్ సంతాపం

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : ఇటీవల కన్నుమూసిన ప్రముఖులకు విధాన పరిషత్‌లో మన నివాళులర్పించారు. మాజీ శాసనసభ్యులు హెచ్.వై.మేటి, ఆర్‌వీ దేవరాజ్, సాహితీవేత్త డాక్టర్ ఎస్.ఎల్.భైరప్ప, పర్యావరణ ఉద్యమకారిణి సాలుమరద తిమ్మక్క, బాలీవుడ్ సినీనటుడు ధర్మేంద్ర, కన్నడ నటుడు ఉమేష్ తదితరుల మృతికి సభ్యులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. సమావేశం ప్రారంభమైన తరువాత సభాధ్యక్షుడు బసవరాజ హొరట్టి సంతాప తీర్మానాన్ని ప్రవేశ పెట్టారు. ఉత్తర కర్ణాటక ప్రాంతానికి చెందిన హెచ్.వై.మేటి ప్రజాప్రతినిధిగా అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారని సభ్యులు నివాళులర్పించారు. బీళికెరూరు గ్రామపంచాయతీ అధ్యక్షుడిగా రాజకీయ జీవితాన్ని ప్రారంభించి, బాగల్‌కోట పట్టణాభివృద్ధి ప్రాధికార, ఎంఎస్ఐఎల్ అధ్యక్షుడిగా, డీసీసీ బ్యాంకు డైరెక్టర్‌గా పని చేశారని సభ్యులు గుర్తుచేసుకున్నారు. 1983 నుంచి శాసనసభ్యుడిగా ఎన్నికై మంత్రిగా పని చేశారు, ఒకసారి లోక్‌సభకు ఎన్నికయ్యారని గుర్తు చేశారు. బెంగళూరు నగరానికి చెందిన ఆర్‌వీ దేవరాజ్ 1989లో తొలిసారిగా శాసనసభ్యుడిగా ఎన్నికయ్యారని, 1999లో, 2013లో ఆదే పదవికి ఎన్నికైనట్లు సభ్యులు వివరించారు. 2004 నుంచి 2010 వరకు విధానపరిషత్ సభ్యుడిగానూ ఆయన చేసిన సేవలను మననం చేసుకున్నారు. సభా నాయకుడు బోసు రాజు, ప్రతిపక్షనేత చలవాది నారాయణస్వామి తదితరులు ఈ అంశాలపై ప్రసంగించారు. సభ్యులందరూ లేచి నిలబడి రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం వ్యక్తం చేశారు.

బెంగళూరు విపణిలో కూరగాయల ధరలు

(హాప్‌కామ్స్-కిలో..రూ.లలో)

బీన్స్-	55
క్యారెట్-	70
బీరకాయలు-	55
క్యాబేజి-	35
క్యాలీఫ్లవర్(ఒక్కొటి)-	30
సొరకాయ-	55
దొండకాయలు-	45
పొట్లకాయ-	45
పచ్చి మిరపకాయలు-	80
కాకర కాయలు-	55
టమాటా(నాటు)-	55
టమాటా(సాధారణ)-	45
గుమ్మడి-	35
ఆలుగడ్డ-	35
ఉల్లి(మేలురకం)-	25
ఉల్లి(మాములు)-	20
వెల్లుల్లి-	140
సాంబారు ఉల్లి-	165
బీట్‌రూట్-	55
వంకాయలు-	55
బెండకాయలు-	55
ముల్లంగి-	55
నిమ్మకాయ-	120

పండ్లు, ఫలాలు ధరలు

వాషింగ్టన్ ఆపిల్-	385
సిమ్లా ఆపిల్-	265
గ్రీన్ ఆపిల్-	325
అరటి కాయలు-	35
సపోటా-	65
పైనాపిల్-	65
బొప్పాయి-	30
ఆరంజి-	95
బత్తాయి-	65

(న్యూస్‌టుడే, యశ్వంతపుర)

సేతువుల చెంత స్వచ్ఛందాలు!

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే : అధ్వానపు రహదారులు, నడకదారులు, వంతెనల కింది భాగాలను సర్వాంగ సుందరంగా మార్చడానికి గ్రేటర్ బెంగళూరు ప్రాధికార (జేబీఏ) విడతలవారీ చర్యలకు ఉపక్రమించింది. చెత్తా,చెదారం తొలగించి వంతెనల గోడలకు రంగులు వేస్తున్నారు. ఇటీవల ప్రాధికార చీఫ్ కమిషనర్ మహేశ్వరరావు వివిధ ప్రాంతాల్లో పర్యటించి కింద వంతెన శుభ్రత పనులు చేపట్టాలని దిగువ స్థాయి అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలోనే పారిశుధ్య సిబ్బంది, స్వచ్ఛంద సేవకులకు అడుగు ముందుకేశారు. అతిపెద్దదైన అగర వంతెన కింద మట్టి దిబ్బలు తొలగించారు. గోడలు, బాటలకు రంగులు వేసి అందంగా మార్చారు. ప్రతి వంతెనా ఇలా మెరిసిపోవాలని ఆయన ఆదేశించారు. నగరంలోని 13 అతి పెద్ద వంతెనలను మెరిపిస్తామన్నారు.

నేడిలా.. పరిశుభ్రంగా మారిన వంతెన పరిసరాలు..

నిన్నటిదాకా.. వ్యర్థాలు, దుమ్ముతో అధ్వానంగా కనిపించిన వంతెన కిందిభాగం

ముడిపడకనే ..మృత్యుబాట

● ప్రీవెడ్డింగ్ చిత్రీకరణకు వెళ్లి వధూవరుల దుర్మరణం ● కాబోయే జంట ఇంట కన్నీటి సంద్రం

మరో రెండువారాల్లో వారిద్దరూ మూడు ముళ్ల బంధంతో వివాహం చేసుకోవాలి.. ఇరువైపులా బంధువులందరూ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.. కొత్త జంట ఉత్సాహంగా మధుర క్షణాలను పదిలపరుచుకోవాలని ప్రీవెడ్డింగ్ కోసం వెళ్లింది.. ఉదయం నుంచి సుందరమైన దృశ్యాల నడుమ అందమైన చిత్రాలు, వీడియో దృశ్యాలను చిత్రీకరించుకొన్నారు.. అంతా అయ్యాక కాబోయే భార్యను ఆమె ఇంటి వద్ద దింపాలని వరుడు ద్విచక్రవాహనంపై బయలుదేరాడు.. అంతలోనే కన్నుకుట్టిన మృత్యువు లారీ రూపంలో వచ్చి అమాంతం కబళించింది.. జంట ప్రాణాలను హరించివేసింది.. ఇరుకుటుంబాలను శోక సంద్రంలో ముంచింది..

గంగావతి,న్యూస్‌టుడే: పెళ్లి చేసుకోబోయే కొత్త జంట ప్రీవెడ్డింగ్ చిత్రీకరణకు వెళ్లి రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన హృదయ విదారక ఘటన ఇది. కొప్పళ తలూకా ఇరకల్‌గఢాకు చెందిన కరియప్ప, కారటగి తాలూకా ముష్టూరుకు చెందిన కవితలకు పెళ్లి నిశ్చయం అయింది. ఈ నెల 21న ముహూర్తం ఖరారైంది. ఈ నేపథ్యంలో ప్రీ వెడ్డింగ్ కోసం ఆదివారం తుంగభద్ర జలాశయం పరిసరాల్లో చిత్రీకరణ పూర్తి చేసుకుని గంగావతి తాలూకా చిక్కబెణకల్ కొండ ప్రాంతానికి వచ్చారు. అక్కడ చీకటి పడడంతో ఇళ్లకు తిరిగి వెళ్లాలనుకున్నారు. కాబోయే భార్యను ఇంట్లో దింపేందుకు ద్విచక్రవాహనంపై ఎక్కించుకొని బయలుదేరాడు. సరిగ్గా బండ్రాళ, వెంకటగిరి క్రాస్ వద్ద వేగంగా వచ్చిన కంకర లారీ వీరి వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. వరుడు కరియప్ప మడివాళ (26) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడవగా వధువు కవితా (19) అక్కడికక్కడే మృతి చెందింది. విధి వక్రించి ఇద్దరూ ప్రమాదంలో అసువులు బాయడంతో ఇరు కుటుంబాల సభ్యులు జీర్ణించుకోలేక పోతున్నారు. గంగావతి గ్రామీణ పోలీస్‌స్టేషన్లో కేసు నమోదైంది.

రహదారి ప్రమాదంలో మృతి చెందిన కరియప్ప, కవితా

ముందస్తు సంబరాలు!

క్రిస్మస్ వేడుకలను ఆచరించుకునేందుకు బెంగళూరులోని ఫీనిక్స్ మార్కెట్ సిటీలో 'మ్యాజిక్ ట్రీ హౌస్'ను సోమవారం రాత్రి ఆవిష్కరించారు. నూతన సంవత్సర వేడుకల వరకు ఈ క్రిస్మస్ చెట్టు వద్ద సంగీత కచేరీలు, నృత్య రూపకాలు, బాలలకు పోటీలు, కథలు చెప్పే కార్యక్రమాలను నిర్వహిస్తామని సంస్థ ప్రతినిధి రితు మెహతా తెలిపారు. ఎక్కువ మంది వినియోగదారులను ఆకట్టుకునేందుకు విభిన్నమైన కార్యక్రమాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయని ఆమె వివరించారు.

-న్యూస్‌టుడే, బెంగళూరు (మారతహళ్లి)

విశ్రాంత ఉద్యోగులకు ప్రత్యేక అదాలత్

స్టాళ్ల వద్ద రద్దీని పరిశీలిస్తున్న అధికారులు

బెళగావి, న్యూస్‌టుడే : మరాఠా లైట్ ఇన్‌ఫ్యాంట్రీ రెజిమెంటల్ సెంటర్‌లోని విశ్రాంత ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల కోసం బెళగావిలో ఏర్పాటు చేసిన ర్యాలీ (అదాలత్)ని లెఫ్టినెంట్ కల్నల్ హబీబ్ సోమవారం ప్రారంభించారు. పింఛను, సంక్షేమ కార్యక్రమాలు, ఆరోగ్య, వైద్య పరీక్షలకు సంబంధించి విశ్రాంత ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు నిర్వహించిన అదాలత్‌లో 1200 మంది పాల్గొన్నారు. మహారాష్ట్ర, కర్ణాటక విభాగానికి చెందిన వీర నారి, వీరమాతలకు హబీబ్ బహుమతులు, ప్రమాణపత్రాలు అందించారు. సైనిక దంత వైద్య కేంద్రం, కంటోన్మెంట్ బోర్డ్ ఆసుపత్రి, బెళగావిలోని ఈసీహెచ్ఎస్ పాలి క్లినిక్‌కు చెందిన వైద్యులు, వైద్యేతర సిబ్బంది వారికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఔషధాలు సమకూర్చారు. స్పర్శ్, ఆధార్, పాన్, డీఎల్‌సీ, ఏడబ్ల్యూపీఓ తదితరాలకు సంబంధించిన డాక్యుమెంటేషన్, మార్పులకు సంబంధించి దరఖాస్తులు తీసుకున్నారు. బ్రిగేడియర్ జోయ్‌దీప్ ముఖర్జీ, ఇతర అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

బహుమతి అందిస్తున్న అధికారి

కేబుల్ ఆపరేటర్లకు ఊరట

బెంగళూరు (బాణసవాడి), న్యూస్‌టుడే : నగర, గ్రామీణ ప్రాంతాల్లో కేబుల్‌టీవీ ఆపరేటర్లకు విధిస్తున్న రుసుం 50 శాతానికి తగ్గిస్తామని ఇంధన వనరుల శాఖ మంత్రి కేజే జార్జి వెల్లడించారు. ఆయన సోమవారం బెళగావిలో ప్రారంభమైన విధానపరిషత్ ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యురాలు బల్కీస్‌భాను అడిగిన ప్రశ్నకు పై సమాధానమిచ్చారు. ఆపరేటర్ల విద్యుత్తు స్తంభాలను ఉపయోగించుకుంటున్నారని, ఒక్కో స్తంభంపై రూ.150 వసూలు చేస్తుండగా ఇక ఆ మొత్తాన్ని రూ.75కి తగ్గిస్తామన్నారు. ఇది పరోక్షంగా ప్రజలకూ అనుకూలమవుతుందన్నారు. రాష్ట్రంలో 2,800 కేబుల్‌ఆపరేటర్లు ఉన్నారన్నారు.

● రాష్ట్రప్రభుత్వ పాఠశాలల్లో కనీసం ఒక్క విద్యార్థి ఉన్నా కొనసాగిస్తామేగానీ.. మూసివేయబోమని ప్రాథమిక విద్యాశాఖ మంత్రి మధు బంగారప్ప స్పష్టం చేశారు. విధానపరిషత్ సభ్యులు చిదానందగౌడ, ఉమాశ్రీ అడిగిన ప్రశ్నలకు ఆయన బదులిస్తూ విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండే పాఠశాలలను సమీపంలో ఉన్న పాఠశాల్లోకి విలీనం చేస్తామన్నారు. ఏ పాఠశాలనూ మూసివేయబోమని స్పష్టం చేశారు. నాణ్యమైన విద్యను అందించేందుకు ఇప్పటి వరకు ఐదు వందల కర్ణాటక పబ్లిక్ స్కూల్స్ ప్రారంభించామని, వచ్చే విద్యాసంవత్సరంలో ఆసంఖ్య తొమ్మిది వందలకు పెంచుతామని ప్రకటించారు.

● కర్ణాటక పరీక్షా ప్రాధికార ద్వారా వివిధ ఉద్యోగ ఖాళీల భర్తీకి సంబంధించి నిర్వహించే పరీక్షల కోసం అభ్యర్థుల నుంచి వసూలు చేసే పరీక్ష రుసుంను తగ్గించామని ఉన్నత విద్యా శాఖ మంత్రి డాక్టర్ ఎం.సి.సుధాకర్ తెలిపారు. సభ్యుడు నిరాణి హనుమంతప్ప రుద్రప్ప అడిగిన ప్రశ్నకు ఆయన బదులిస్తూ ప్రశ్నపత్రాలు ముద్రించడం, వాటిని పరీక్ష కేంద్రాలకు తరలింపు తదితర పరీక్ష ప్రక్రియ కోసం అభ్యర్థుల నుంచి తక్కువగా రుసుం వసూలు చేస్తున్నామన్నారు. అభ్యర్థులకు ఎక్కువ భారం కాకూడదనే ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు.

గ్రామీణ బాలల 'మస్త్.. మజా'

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే : రోటరీ బెంగళూరు మిడ్‌టౌన్ నేతృత్వంలో దొడ్డబళ్లాపుర గ్రామీణ ప్రాంతాలకు చెందిన 325 మంది విద్యార్థులను నగరంలోని జక్కూరులో విహారానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. జక్కూరులోని ప్రఖ్యాత 'జానపద లోక'లో వివిధ సాంస్కృతిక వీక్షణకు అవకాశం కల్పించారు. పాటలు, నృత్య ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, యోగా తదితరాలతో సందడి సృష్టించారు. గ్రామీణ బాలల్లో ఆత్మవిశ్వాసం పెంచడంతో పాటు కౌశల్యం, భావనాత్మక అంశాలపై అవగాహన కలిగించేందుకు 'మస్త్ మజా' కార్నివాల్ సోమవారం నిర్వహించినట్లు రోటరీ మిడ్‌టౌన్ అధ్యక్షుడు ఆర్‌టీఎస్ రాజీవ్‌షా వివరించారు.

కార్యక్రమానికి హాజరైన బాలలు, రోటరీ క్లబ్ సభ్యులు

ఆట గలాటలో పురస్కారాల పంట

బెంగళూరు (గాంధీనగర), న్యూస్‌టుడే : బెంగళూరు సాహిత్య ఉత్సవాల్లో పలువురు రచయితలు, ప్రచురణ సంస్థలకు ఆటగలాట సంస్థ పలు పురస్కారాలు ప్రదానం చేసింది. వివిధ విభాగాల్లో అత్యుత్తమ రచనలు చేసిన, ఆయా పుస్తకాల్లో చిత్రాలు గీచిన జీత్ తాయిల్, శాంతను భట్టాచార్య, శ్రీకర్ రాఘవన్, రాజీవ్ ఐప్, రుజుత దివాకర్, దేవశిశ్ మఖీజా, చంద్రిమా ఛటర్జీ, హుతుక సుమి, సాయి సుధ ఆచార్యలకు ట్రోఫీలు, పురస్కారాలను ఆదివారం రాత్రి ప్రదానం చేశారు. ఇకపై స్వాతంత్ర్య ఉద్యానవనంలోనే ప్రతిఏటా సాహిత్య ఉత్సవాలను నిర్వహించాలని నిర్వాహకులు తీర్మానించారు.



అత్యుత్తమ బాల సాహిత్యాన్ని అందించి, పురస్కారం అందుకుంటున్న రచయిత్రి

EENADU e Classifieds

JOBS

అమెరికాలో 1 సం|| బాబు ఆలన, పాలన వ్యక్తిగత సంరక్షణ కొరకు అనుభవంగల ఆడవారు కావలెను. అమెరికా వీసా కల్గినవారు మాత్రమే. ✆ : 9440803362

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలను ఇచ్చుటకు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు.
బళ్ళారి : 9121167525
బెంగుళూరు : 9121167527
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

'డిజైనూరు'.. విస్మయాల తేరు!

బెంగళూరు (హలసూరు), న్యూస్‌టుడే : నిత్య జీవితానికి విన్యాసం పేరిట ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంటీరియర్ డిజైనర్స్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆర్కిటెక్చర్స్‌కు చెందిన విద్యార్థులు, నిపుణులు వేర్వేరు విన్యాసాల్లో ఉత్పత్తులను, పరికరాలను సిద్ధం చేశారు. చిత్రకళా పరిషత్తులో డిసెంబరు 11 నుంచి 14 వరకు 'డిజైనూరు' 5.0 పేరిట వీటిని ప్రదర్శిస్తామని ఇరుసంస్థల ప్రతినిధులు వెల్లడించారు. నాలుగు రోజుల ప్రదర్శనలతో పాటు విద్యార్థులు, కళాకారులు, ఇరు సంస్థలకు చెందిన ఆచార్యులు, అంకుర పరిశ్రమల ప్రతినిధులతో ప్రత్యేక కార్యశాలలు, చర్చాగోష్ఠులను నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. ప్రదర్శనతో పాటు సంప్రదాయక ఉత్తర కర్ణాటక చిత్రకళ, దేశంలోని వివిధ ప్రాంతాల్లో ప్రాచుర్యం పొందిన హస్తకళా ఉత్పత్తులు, లావణి, వీరగాసె, డొల్లుకుణిత తదితర సంప్రదాయ నృత్య ప్రదర్శనలతో కార్యక్రమాలను నిర్వహిస్తామని వెల్లడించారు. డిజైనర్లు, ప్రజల మధ్య అంతరాన్ని తగ్గించే దిశలో డిజైనూరును గత నాలుగేళ్లుగా నిర్వహిస్తూ వస్తున్నారు.

విస్మయం గొలిపే.. త్రీడీ అరల ర్యాక్

వెదురుతో చేసిన డిజైన్ బుట్టల విన్యాసం

నిరంతర శ్రమతో ఆవిష్కరణల పర్వం

బెంగళూరు (రాజాజీనగర), న్యూస్‌టుడే : విద్యార్థులు పెద్ద కలలు కని, వాటిని సాకారం చేసుకునేందుకు శ్రమించాలని ఉప లోకాయుక్త జస్టిస్ కేఎన్ ఫణీంద్ర పిలుపునిచ్చారు. ఆదిమానవుడి నుంచి నేటి వరకు మనిషి నిరంతరం అధ్యయనాలతోనే పలు ఆవిష్కరణలతో ముందుకు సాగుతున్నట్లు గుర్తు చేశారు. బెంగళూరులోని సౌందర్య సెంట్రల్ పాఠశాల వార్షికోత్సవంలో ప్రముఖ వైద్యురాలు డాక్టర్ సుప్రజా చంద్రశేఖర్, సౌందర్య నిపుణురాలు శాలు చావ్లాతో కలిసి ఆయన ఆదివారం రాత్రి సత్కారాన్ని అందుకున్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలను వీక్షించి మాట్లాడారు. ఎవరికీ బాల్యం వెనక్కు తిరిగి రాదని, చిన్నారుల ఆకాంక్షలు, అభిరుచులను గుర్తించి, వారిని ప్రోత్సహించే బాధ్యతలను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులకు పౌష్టికాహారంతో కలిగే ప్రయోజనాలను డాక్టర్ సుప్రజా చంద్రశేఖర్ వివరించారు. వేర్వేరు అంశాలను ఎంచుకుని విద్యార్థులు ఇచ్చిన ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. సంస్థ సీఈఓ కీర్తన్ కుమార్, ఇతర బోధకులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శన

జస్టిస్ ఫణీంద్రను సత్కరిస్తున్న సంస్థ ప్రతినిధులు

(c) eenadu

బెంగళూరు

● బెంగళూరు ● కోలారు ● మైసూరు ● హోసూరు ● చిక్కబళ్లాపుర ● తుమకూరు

దుప్పట్లు, దోమతెరల వితరణ

దుప్పట్లు అందిస్తున్న జయరామ్

చిక్కబళ్లాపుర, న్యూస్‌టుడే: చలికాలంలో పేదలు, నిర్వాసితులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు భారతీయ రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షుడు ఎం.జయరామ్ ముందుకు వచ్చారు. చిక్కబళ్లాపుర ఎంజీ రోడ్డు దర్గా దగ్గర శరణార్థులు, నిర్వాసితులు, పేదలకు దుప్పట్లు, మంకీ క్యాప్‌లు, దోమతెరలు, మస్కిటో కాయిల్స్, వ్యాజిలిన్, బిస్కెట్లు వితరణ చేశారు. చిక్కబళ్లాపురలోని తమ శాఖ ద్వారా ఆసుపత్రుల్లోనూ దుప్పట్లు, ఇతర వస్తువులను వితరణ చేస్తున్నామని ఆయన తెలిపారు.

హవ్వా! ఇదేమి పద్ధతి?

పాదచారి మార్గంలో పడేసిన వ్యర్థాల మూటలు

బెంగళూరు (గాంధీనగర), న్యూస్‌టుడే: కొన్ని హోటళ్ల వారు, కొందరు స్థానికులు వ్యర్థాలను మూటల్లో కట్టి పెట్టి పాదచారి మార్గంలోనే వదిలి వెళ్తున్నారు. పారిశుద్ధ్య కార్మికులు, ఆటో, తోపుడు బండితో వచ్చే వారికి మాత్రమే వ్యర్థాలను అందించాలన్న నిబంధనలపై నిఘా ఉంచేందుకు మార్షల్స్ అందుబాటులో ఉండడం లేదు. మెజెస్టిక్ సమీపంలోని ఓకలిపురం పాదచారి మార్గంలో మూటల్లో నింపిన వ్యర్థాలను నిత్యం ఇలా వదిలి వెళ్తున్నారు.

హోసూరు కబుర్లు

ఏఐఏడీఎంకేలో డీఎంకే కార్యకర్తల చేరిక

ఇతర పార్టీలకు చెందిన కార్యకర్తలను స్వాగతిస్తున్న మాజీ మంత్రి బాలకృష్ణారెడ్డి

హోసూరు, న్యూస్‌టుడే: డి.ఎం.కె. ప్రభుత్వ పాలన మీద అసంతృప్తి చెందిన నియోజకవర్గ కార్యకర్తలు పలువురు ఎ.ఐ.ఎ.డి.ఎం.కె. సభ్యత్వం తీసుకొన్నారు. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రధాన రాజకీయ పార్టీలు బలపడేందుకు అనేక విధాలుగా ప్రయత్నిస్తున్నాయి. ఇందులో భాగంగా హోసూరు ప్రాంతానికి చెందిన 500 మంది వివిధ రాజకీయ పార్టీల నుంచి మాజీ మంత్రి పి.బాలకృష్ణారెడ్డి సమక్షంలో ఏఐఏడీఎంకే సభ్యత్వం పొందారు. వీరిని పార్టీలోకి తీసుకురావడానికి కృషి చేసిన పూనపల్లి హరీష్ రెడ్డికి, బాలకృష్ణారెడ్డి పార్టీ కండువా వేసి ఆహ్వానించి సత్కరించారు. సభ్యులకు నూతన కార్యకర్తలను పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీకి చెందిన స్థానిక ప్రముఖులు, కార్పొరేటర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

క్రీడా మైదానం పనులకు శ్రీకారం

మైదానం నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యేలు

డెంకణీకోట న్యూస్‌టుడే: సందనపల్లి పంచాయతీలోని గల చాపరానపల్లి వద్ద ప్రభుత్వ కళాశాల ఆవరణలో ఆటల మైదానం నిర్మాణానికి తళి ఎమ్మెల్యే రామచంద్రన్, హోసూరు ఎమ్మెల్యే ప్రకాశ్ సోమవారం భూమిపూజ చేశారు. ప్రభుత్వం వీటి నిర్మాణాలకు రూ.3 కోట్లు నిధు మంజూరు చేసింది. తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొని పనులు ప్రారంభించారు. ఈ మైదానంలో ఫుట్‌బాల్, వాలీబాల్, బాస్కెట్ బాల్, ఖో ఖో, హై జంప్, లాంగ్ జంప్, కబడ్డీ, పరుగు పందెం తదితర క్రీడలకు అనువుగా నిర్మిస్తున్నారు. గ్యాలరీ, కాంపౌండు గోడ, తాగునీరు, సోలార్ తదితర వసతులు కల్పిస్తున్నారు. పూజలో పట్టణ పంచాయతీ అధ్యక్షుడు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు అబ్దుల్ కలాం, తళి యూనియన్ మాజీ ఛైర్మన్ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అటు అభివృద్ధి..ఇటు అనాసక్తి

● మహానగర పాలికె విస్తరణతో ప్రగతి ● విలీనంపై పలువురి విముఖత

భారీ ఆంజనేయస్వామి విగ్రహం

తుమకూరు, న్యూస్‌టుడే: మూడు దశాబ్దాలుగా నానుతూ వస్తున్న విస్తరణ ప్రక్రియ కొలిక్కి వచ్చింది. తుమకూరు మహానగర పాలికె విస్తరణ పనులు ఊపందుకున్నాయి. నగరం చుట్టుపక్కల గల తుమకూరు రూరల్ విధానసభా క్షేత్రంలోని 14 గ్రామ పంచాయతీల్లోని 54 గ్రామాలు విలీనం కానున్నాయి. నగర విస్తీర్ణం ప్రస్తుతం ఉన్న 48 చదరపు కిలోమీటర్ల నుంచి మూడురెట్లు అధికం కానుంది. తాజా లెక్కల ప్రకారం నగర విస్తీర్ణం 174.536 చదరపు కిలోమీటర్లకు చేరుకుంటుంది. ఇప్పటికే జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి డాక్టర్ జి.పరమేశ్వర్ నిర్దేశం మేరకు పాలికె నివేదికను సిద్ధం చేసింది. సరిహద్దులను గుర్తించే పనులు ముగిశాయి. నగర జనాభా ప్రస్తుతం 4,07,718 ఉండగా విస్తీర్ణం తర్వాత అదనంగా 2,50, 963 మంది చేరతారు. మొత్తం నగర జనాభా 6,58,681కు చేరుకోనున్నట్లు అంచనా.

బెంగళూరు తరహాలో విస్తరణ

తుమకూరు నగరంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో అయిదు ఇంజినీరింగ్ కాలేజీలు, మూడు మెడికల్ కాలేజీలు, తుమకూరు విశ్వవిద్యాలయం, సిద్ధగంగా విద్యాసంస్థలున్నాయి. పారిశ్రామిక అభివృద్ధి పథంలో సాగుతున్న నగరానికి నిత్యం వేల మంది కార్మికులు వచ్చి పోతుంటారు. రాష్ట్ర హోంమంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి డాక్టర్ జి.పరమేశ్వర్ గ్రేటర్ బెంగళూరు విస్తరణ చేసినట్లుగానే తుమకూరు నగరాన్ని విస్తరిస్తామని స్పష్టం చేశారు.

తుమకూరు మహానగర పాలికె నామఫలకం

14 గ్రామపంచాయతీలు ఇవే

అరకెరె, బెళగుంబ, బుగడడనహళ్లి, దొడ్డనారవంగల, గూళూరు, హెగ్గెరె, హెత్తేనహళ్లి, హిరేహళ్లి, కెసరమడు, మల్లసంద్ర, మైదాళ, స్వాందేనహళ్లి, ఊరకెరె, కె.పాలసంద్ర. ఈ గ్రామ పంచాయతీల్లోని 54 గ్రామాలు పాలికె పరిధిలోకి రానున్నాయి.

జంకుతున్న జనం

ఇప్పటికే తుమకూరు నగరంలో ఇంటి స్థలాల ధరలు, బాడుగలు శరవేగంగా పెరిగిపోతున్నాయి. అభివృద్ధి మాట అటుంచితే ధరల పెరుగుదల పైనే సామాన్యులు భయపడుతున్నారు. పలు గ్రామపంచాయతీల్లోని ప్రజలు పాలికెలో విలీనం పట్ల వ్యతిరేకతను సైతం వ్యక్తం చేస్తున్నారు. గ్రామపంచాయతీలకు చెల్లించే ఇంటి, నీటి పన్నులు పాలికె ప్రకారం చెల్లించాల్సి ఉండడంతో రెట్టింపు కానున్నాయని పలువురు వాపోతున్నారు.

వణికిస్తున్న చలిపులి

ముళబాగిలు, న్యూస్‌టుడే: కోలారు జిల్లా ముళబాగిలులో సోమవారం 5.1 డిగ్రీలు, ముంచంగింపుట్టులో 7.5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మంచుదట్టంగా కురుస్తుండడంతో చలిగాలుల తీవ్రత కొనసాగుతోంది. ఉదయం 9 గంటల వరకు మంచు తెరలు వీడకపోవడంతో సూర్యోదయం ఆలస్యంగా కనిపిస్తోంది.

శ్వాసకోశ వ్యాధుల ముప్పు

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: విపరీతమైన మంచు చలితో కూడిన వాతావరణం బెంగళూరు నగరంలో నెలకొందని తద్వారా వచ్చే వ్యాధులకు ఉపయోగించే మందుల్లో నాణ్యత ప్రతి వ్యక్తి పరిశీలించి వినియోగించాలని మిస్ట్రెమెడ్స్ సంస్థ సీఈఓ సౌరబ్ జైన్ నగరవాసులకు విజ్ఞప్తి చేశారు. సోమవారం ఇక్కడ నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మధుమేహం, ఊబకాయం తదితరాలతో బాధపడే వ్యక్తులకు శ్వాసకోశ వ్యాధులకు గురయ్యే అవకాశం ఉన్నందు వల్ల ఉత్తమ మందులు కోసం ఎలిలిల్లి సంస్థతో కలిసి రోగులకు సేవ చేసేందుకు ముందుకు వచ్చామన్నారు.

అఖండ-2కు అడ్డంకులు తొలగాలని పూజలు

త్రిశూలంతో సందడి చేస్తున్న బాలకృష్ణ అభిమానులు

పావగడ,న్యూస్‌టుడే: నందమూరి బాలకృష్ణ నటించిన సనాతన ధర్మాన్ని ప్రపంచానికి చాటే అఖండ-2 తాండవం చిత్రం విడుదలకు దిష్టి, దుష్టశక్తుల అడ్డంకులు తొలగాలని పావగడలో ఎన్‌బీకే హెల్పింగ్ హ్యాండ్స్ అనంతపురం జగన్ స్థానిక అభిమానులతో కలిసి శని మహాత్ముని దేవాలయం, కోటే ఆంజనేయస్వామి దేవాలయాల్లో ప్రత్యేక పూజలాచరించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ బాలక్రిష్ణ అభిమానులు ఎదురు చూస్తున్న అఖండ-2 చిత్రం కొన్ని కారణాల వల్ల విడుదల కాలేదని ఈనెల12న చిత్రం విడుదలకు సన్నాహాలు జరుగుతున్నాయన్నారు. ఈ చిత్రం దిగ్విజయంగా ప్రదర్శితమవ్వాలని అన్ని పుణ్యక్షేత్రాల్లో పూజలాచరిస్తున్నామన్నారు. అఖండ-2 చిత్రం షూటింగ్‌లో బాలకృష్ణ ఉపయోగించిన వాహనం, త్రిశూలం, డమరుకంతో జగన్ వచ్చాడని తెలిసి అభిమానులు పెద్దఎత్తున ఫొటోలు దిగారు.

ఎండిన కొమ్మలు తొలగింపు

దొమ్మలూరులో తొలగింపు పనుల్లో సిబ్బంది

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: తరుచు ప్రమాదాలకు కారణమవుతున్న ఎండు కొమ్మలు తొలగించే పనులను గ్రేటర్ బెంగళూరు ప్రాధికార(జీబీఏ) అధికారులు చేపట్టారు. ఎండు కొమ్మలు అధికంగా ఉండే ప్రాంతాలను గుర్తించారు. సిబ్బంది యంత్రాలను ఉపయోగించి వాటిని తొలగించడం ప్రారంభించారు. ప్రస్తుతం ఇందిరానగర, న్యూతిప్పసంద్ర, భైరసంద్ర, సీవీరామన్‌నగర, దొమ్మలూరు, పాత విమానాశ్రయం రహదారి, చిక్కపేట, బళేపేట తదితర ప్రాంతాల్లోని చెట్ల ఎండిన కొమ్మలను తొలగించడం ప్రారంభించారు. చిన్నగాలి వీస్తే చాలు కొమ్మలు విరిగి పడుతున్నాయి. వాన, ఎండకాలం అనే తేడా లేకుండా ఎక్కడికక్కడ కొమ్మలు విరిగి వాహనాలపై పడుతున్నాయి. పలువురు వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. జనవరి నుంచి నేటి వరకు కొమ్మలు విరిగిపడి ముగ్గురు వాహనదారులు మృతి చెందగా తొమ్మిది మంది తీవ్రంగా గాయపడిన విషయం తెల్సిందే. ప్రమాదకరమైన కొమ్మలు తొలగించాలని స్థానిక నివాసితుల సంక్షేమ సంఘాలు ఆయా పరిధిలో ఉన్న పాలికె అధికారులకు విన్నవించుకున్నా ప్రయోజనం లేకుండా పోయింది. న్యాయస్థానాలు జోక్యం చేసుకున్నా అధికారుల్లో స్పందన రాలేదు. కొత్తగా ఏర్పడిన పాలికెల పరిధి తక్కువ కావడంతో ఆయా పాలికెల కమిషనర్లు నెలకొన్న సమస్యలకు త్వరగా స్పందిస్తున్నారని నివాసదారులు సంఘాలు ప్రతినిధులు తెలిపారు. అందువల్ల వివిధ ప్రాంతాల్లో ప్రమాదకరంగా మారిన ఎండిన కొమ్మలు తొలగించే పనులు చేపట్టారు.

నియంత్రిక..తాకితే అంతే ఇక!

చుట్టూ అల్లుకున్న మొక్కల తీగలు

ముళబాగిలు, న్యూస్‌టుడే: తాలూకాలోని భైరెడ్డిపల్లె రోడ్డులో విద్యుత్తు నియంత్రిక చుట్టూ పిచ్చి మొక్కల తీగలు అల్లుకొన్నాయి. నిత్యం చుట్టపక్కల గ్రామాలకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. అనేక విద్యాసంస్థలు, దేవాలయంలో శుద్ధ తాగునీటి కేంద్రానికి దగ్గరలో ఉన్న ఈ నియంత్రిక వద్ద తరచూ నిప్పులు ఎగిసి పడుతున్నాయి. ఏక్షణంలో ప్రమాదం జరుగుతుందోనని జనం భీతిల్లుతున్నారు. విద్యుత్తు సరఫరా ఆగినపుడు ఫ్యూజులు వేయాలన్నా భయం కల్గుతోంది. నియంత్రిక చుట్టూ ముళ్లకంపలు, తీగలను తొలగించి ప్రమాదం వాటిల్లకుండా చూడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ప్రియాంక్ ఖర్గేకు తాఖీదులు

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే : గత ఎన్నికల సమయంలో చిత్తాపుర నియోజకవర్గంలో అక్రమాలకు పాల్పడిన ఆరోపణలపై ప్రస్తుత మంత్రి ప్రియాంక్ ఖర్గేకు, ఎన్నికల కమిషన్‌కు సర్వోన్నత న్యాయస్థానం తాఖీదులు జారీ చేసింది. అక్రమాలు జరగలేదని కర్ణాటక హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను ప్రశ్నిస్తూ అశ్వత్థరామ్ రాఠోడ్ వేసుకున్న అర్జీపై సర్వోన్నత న్యాయస్థానం విచారణ చేపట్టి తాజాగా ఈ తాఖీదులు జారీ చేసింది. ఉచిత గ్యారెంటీలకు సంబంధించిన పత్రాలు, టోకెన్లు వితరణ చేసి ప్రియాంక్ ఎన్నికల్లో గెలుపొందారని రాఠోడ్ తన దావాలో ఆరోపించారు.

జాతరను ప్రారంభించిన మఠాధిపతి

మఠాధిపతి విసిరే వేరుసెనక్కాయల కోసం వేచి చూస్తున్న భక్తులు

చిక్కబళ్లాపుర, న్యూస్‌టుడే: ఆదిచుంచనగిరి మఠం చిక్కబళ్లాపుర శాఖ సూలాలప్ప దిన్నె వద్ద శ్రీ వీరాంజనేయ స్వామి వార్షిక వేరుసెనగ జాతరను మఠాధిపతి నిర్మలానందనాథ స్వామి ప్రారంభించారు. జడలతిమ్మనహళ్లి గ్రామం నుంచి వీరాంజనేయ స్వామి ఉత్సవ విగ్రహాన్ని ముత్యాల పల్లకిలో తీసుకువచ్చారు. వీరగాసె, డొల్లుకుణిత కళాకారులు ప్రదర్శనలతో మఠం వరకు వచ్చారు. భక్తులపై నిర్మలానందనాథ స్వామి వేరుసెనగ పొట్లాలు విసిరి జాతరను ప్రారంభించారు. చిక్కబళ్లాపుర, కోలారు జిల్లాలోని గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులు జాతరలో పాల్గొన్నారు.

తైక్వాండోతో శారీరక దృఢత్వం, స్వీయరక్షణ

క్రీడాకారులకు పతకాలు ప్రదానం చేసిన కరిగే కార్యదర్శి అబ్బిగిరి వినోద్, మాస్టర్ కుమార్

బెంగళూరు(బ్యాటరాయణపుర),న్యూస్‌టుడే: తైక్వాండోతో క్రీడాకారుల్లో శారీరక దృఢత్వంతోపాటు స్వీయరక్షణ ఉంటుందని కన్నడ రక్షణవేదిక సంఘటన కార్యదర్శి అబ్బిగిరి వినోద్ పేర్కొన్నారు. ఇక్కడ అబ్బిగిరి ప్రభుత్వ పాఠశాల ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన తైక్వాండో ఛాంపియన్‌షిప్-2025 కార్యక్రమాన్ని ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎం.జి.కుమార్ తైక్వాండో శిక్షణ కేంద్రం ద్వారా నిర్వహిస్తున్న పోటీల్లో ఇతర జిల్లాల నుంచి అనేక మంది పాల్గొనడం శుభపరిణామమన్నారు. పోటీల్లో విజేతలైన వారికి పతకాలు అందించారు. 24 మంది బంగారు, 45 మంది వెండి పతకాలు సాధించడం గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా శిక్షకుడు కుమార్‌ను అభినందించారు.

రాత్రి 8 వరకు నిత్యావసర సరకుల పంపిణీ

జి.హోసళ్లి అదాలత్‌లో ఆహారం ప్యాకెట్లు పంచిపెడుతున్న జిల్లాధికారి శుభాకల్యాణ్

తుమకూరు, న్యూస్‌టుడే: పనులకు వెళ్లే మహిళలకు అనుకూలించే విధంగా తుమకూరు జిల్లా వ్యాప్తంగా ఆహార పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో నిత్యావసర పంపిణీ కేంద్రాలను ఇకపై రాత్రి 8 వరకు తెరిచి ఉంచాలని జిల్లాధికారి శుభాకల్యాణ్ ఆదేశించారు. ఈ మేరకు ఆహార పౌరసరఫరాల శాఖ జాయింట్ డైరెక్టర్ సౌమ్యకు సూచించారు. గుబ్బి తాలూకాలోని జి.హోసళ్లిలోని సముదాయ భవనంలో సోమవారం ఏర్పాటు చేసిన ఆహార అదాలత్ కార్యక్రమంలో జిల్లాధికారి ప్రసంగించారు. రేషన్‌కార్డుదారులు సమస్యలను పరిష్కరించడానికి జిల్లాలోని అన్ని హోబళీ స్థాయిలో ఆహార అదాలత్‌ను చేపడుతున్నామన్నారు. ఒంటరిగా ఉండే 75 ఏళ్ల వయో వృద్ధులకు ఇంటి వద్దకే నిత్యావసరాలు పంపిణీ చేయాలన్నారు. ఈ సందర్భంగా 26 సంవత్సరాల సుమన్‌కు కొత్త రేషన్‌కార్డు అందించారు. 75 ఏళ్ల చంద్రశేఖర్ ఇంటి వద్దకే వెళ్లి జిల్లాధికారి రేషన్ బియ్యాన్ని అందించారు. ఆమె వెంట సబ్‌డివిజనల్ అధికారి నాహిదాజమ్, తహసీల్దార్ ఆరతి, డిప్యూటీ తహసీల్దార్ యశోదమ్మ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ సిద్ధేగౌడ తదితరులు ఉన్నారు.

క్విస్ విద్యార్థుల ప్రతిభ

ఈనాడు, ఒంగోలు: ప్రజలకు మేలుచేసే ఆవిష్కరణలను అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) ఎంతగానో ప్రోత్సహిస్తోంది. ఇంజినీరింగ్ విద్యార్థులు పోటీపడి గొప్ప ఆవిష్కరణలు చేసేవిధంగా పోటీలు నిర్వహిస్తోంది. 'హ్యాకథాన్-2025' పేరిట ఒంగోలు నగరంలోని క్విస్ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం నిర్వహించిన పోటీలకు వివిధ రాష్ట్రాల నుంచి విద్యార్థి బృందాలు హాజరయ్యాయి. వైద్య రంగానికి చేయూత, సౌరశక్తిని మెరుగ్గా వినియోగించుకోవడం, మానసిక సమస్యలను అధిమించడం ఎలా.. సంస్కృతి పరిరక్షణ, దేశంలోని వివిధ పర్యాటక ప్రాంతాల సమాచారం ఇలా ప్రజల అవసరాలకు ఉపయోగడే విధంగా రూపొందించిన యాప్‌లు, వెబ్‌సైట్‌లు ప్రదర్శించారు. వీటికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వినియోగం..ఎలాంటి ప్రయోజనాలు పొందవచ్చో విద్యార్థులు వివరించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న యాప్‌లు కంటే తాము రూపొందించినవి ఎంత మెరుగ్గా పనిచేస్తాయనే దానిని సరిపోలుస్తూ చక్కని ప్రజంటేషన్ ఇచ్చారు.

హ్యాకథాన్ ఫైనల్ పోటీలు షురూ

ఆచార్య కళ్యాణ్ సిన్హాను సత్కరిస్తున్న దీపక్ సైని, కులదీప్ రైన్ తదితరులు

బెంగళూరు (కెంగేరి), న్యూస్‌టుడే: సమాజం ఎదుర్కొనే సమస్యలకు సాంకేతిక పరిజ్ఞానంతో పరిష్కారాలు రూపొందించే లక్ష్యంతో సాఫ్ట్‌వేర్ విభాగ స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ గ్రాండ్ ఫినాలె పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. బెంగళూరులోని ఆర్‌యూఏఎస్‌లో నిర్వహిస్తున్న ఈ జాతీయస్థాయి పోటీలకు ఆంధ్ర, తెలంగాణ, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, కర్ణాటక తదితర రాష్ట్రాలకు చెందిన 12లక్షల విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 1,360 జట్లు ఫైనల్లో పోటీ పడుతున్నాయి. బీఈఎల్, మ్యాథ్ వర్క్స్ ఇండియా సంస్థలు ఇచ్చిన సమస్యలకు పరిష్కారాలు చూపే సాంకేతిక ఆలోచనలను ఎంపిక చేస్తారు. ఈ కార్యక్రమంలోకి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఇండియన్ స్టాటిస్టికల్ సంస్థ మాజీ డైరెక్టర్ ఆచార్య కల్యాణ్ సింగ్ మాట్లాడుతూ ప్రస్తుతం మిషన్ లెర్నింగ్ సాంకేతిక మానవ మేధస్సును దాటి వేగంగా దూసుకుపోతోంది. తక్కువ వ్యయం, తక్కువ తప్పులతో ఎక్కువ ప్రయోజనం కల్గించేలా ఆలోచించాలి. కానీ సాంకేతికత కంటే మన మేధ తక్కువన్న భావన ఉండకూడదన్నారు. ఈ కార్యక్రమంలో ఐఐఎస్‌సీ జెనెటిక్స్ విభాగ ఆచార్యులు దీపక్ సైని, కుల్‌దీప్ కుమార్ రైన్, ఆర్‌యూఏఎస్ కులపతి ఎంఆర్ జయరాం తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాల తొలగింపు

జేసీబీతో భవనం కూల్చివేత

చిక్కబళ్లాపుర, న్యూస్‌టుడే: జాతీయ రహదారి 69 విస్తరణకు అడ్డుగా ఉన్న భవంతులు, అక్రమ కట్టడాలను జాతీయ రహదారి ప్రాధికార అధికారులు తొలగించారు. న్యాయస్థానంలో స్టే ఉందని కొందరు వాదించగా, పరిస్థితి చక్కదిద్దేందుకు పోలీసులు అక్కడకు వచ్చారు. ప్రాధికారకు చెందిన ఈఈఈ రాజారెడ్డి నేతృత్వంలోని అధికారులు, సిబ్బంది తమ వద్ద ఉన్న ఆదేశ పత్రాలు ప్రదర్శించారు. స్టే ఉన్న వాటిని వదిలి మిగిలిన ఇళ్లు, ప్రహరీలు, విస్తరణకు అవసరమైనంత మేర కట్టడాలను తొలగించారు.

తుంగభద్ర నీటితో చెరువులను నింపండి

తహశీల్దారుకు వినతి పత్రం అందచేస్తున్న రైతు సంఘం నాయకులు

పావగడ, న్యూస్‌టుడే: తుంగభద్ర మేల్దండ పథకం కింద మొత్తం 34 చెరువులను నీటితో నింపాలని సోమవారం రాష్ట్ర రైతు సంఘం హసిరు సేన జిల్లాధ్యక్షుడు పూజారప్ప డిమాండు చేశారు. పట్టణంలోని తహసీల్దారు కార్యాలయం ముందు ఆయన రైతులతో కలిసి నిరసన చేపట్టారు. అనంతరం గ్రేడ్-2 తహసీల్దారుకు వినతిపత్రం అందచేశారు. తాలూకాలో వర్షాభావంతో చెరువులు నీరు లేక బురదతో నిండిపోయాయి. కట్టలపై చెట్లు పెరిగి శిథిలావస్థకు చేరుకొంటున్నాయి. పశువులకు, రైతులకు ఉపయోగ పడేలా చెరువులకు మరమ్మతులు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తాలూకా అధ్యక్షుడు శివ, కార్యదర్శి చిత్తయ్య, చిక్కన్న, కృష్ణప్ప, రామాంజనేయ, అక్కులప్ప, కృష్ణమూర్తి, సిద్ధప్ప తదితరులు పాల్గొన్నారు.

1091 పల్స్ పోలియో కేంద్రాల ఏర్పాటు

చిత్రదుర్గం,న్యూస్‌టుడే: జిల్లాలో 5 సం.లోపు 1.26 లక్షల మంది పిల్లలకు ఈ నెల 21-24వ తేదీ వరకు పల్స్ పోలియో మందు చుక్కలను వేయడానికి మొత్తం 1091 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు అదనపు జిల్లా పాలనాధికారి కుమారస్వామి తెలిపారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన పల్స్‌పోలియో జిల్లా స్థాయి నిర్వహణ సమితి సమావేశానికి అధ్యక్షత వహించి మాట్లాడారు. పోలియో కేంద్రాలకు అదనంగా 15 మొబైల్ బృందాలను, 63 ట్రాన్సిట్ పాయింట్లను ఏర్పాటు చేశామన్నారు. ఇందుకోసం 2338 మంది కార్యకర్తలను, 239 మంది పర్యవేక్షకులను నియమించినట్లు తెలిపారు.

పిచ్చి కుక్క దాడి: ఏడుగురికి గాయాలు

చామరాజనగర, న్యూస్‌టుడే: యళందూరులో ఆదివారం పిచ్చికుక్క దాడిలో ఏడుగురు గాయపడ్డారు. చౌడమ్మ, లక్ష్మమ్మ, రత్నమ్మ తదితరులకు కాళ్లు చేతులకు గాయాలు కాగా, వారిని చికిత్స కోసం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి, రేబిస్ ఇంజక్షన్లు ఇచ్చారు. కొళ్లేగాల తాలూకా జాగేరి హాళెకోట ప్రాంతంలో శనివారం సాయంత్రం మేత కోసం విడిచిన మేకల్లో 11 పిల్లలు అనుమానాస్పదంగా మరణించాయి. వీటిపై వేటకుక్కలు దాడి చేసి చంపి ఉంటాయని గొర్రెల కాపర్లు అనుమానిస్తున్నారు.

క్రైం కార్నర్

లారీ ఢీకొని పోలీసు దుర్మరణం

మహేశ్ (దాచిన చిత్రం)

డెంకణీకోట న్యూస్‌టుడే: లారీ ఢీకొన్న ప్రమాదంలో పోలీసు దుర్మరణం పాలయ్యారు. మరో పోలీసు తీవ్రగాయాలతో చికిత్స పొందుతున్నారు. అంచెట్టి శివారు పుదూరు వద్ద వీరు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనాన్ని కంటైనర్ లారీ ఢీకొంది. ఉత్తర కర్ణాటకలోని హాసన్‌కు చెందిన మహేశ్(28), అతని స్నేహితుడు రాయచూరు జిల్లా హలపూరుకు చెందిన శ్రీధర్(30) బెంగళూరులో రిజర్వు బెటాలియన్ పోలీసులుగా పనిచేస్తున్నారు. వీరితో సహా మరో 8 మంది మిత్రులు 5 ద్విచక్ర వాహనాలపై బెంగళూరు నుంచి హొగనేక్కల్‌కు బయలుదేరారు. మహేశ్ నడుపుతున్న వాహనంపై శ్రీధర్ కూర్చున్నారు. మృత్యురూపంలో దూసుకొచ్చిన లారీ వీరు ప్రయాణిస్తున్న వాహనాన్ని ఢీకొనడంతో మహేశ్ అక్కడే చనిపోయాడు. శ్రీధర్ తీవ్రంగా గాయపడగా స్థానికులు డెంకణీకోట ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం బెంగళూరు తీసుకెళ్లారు. సమాచారాన్ని బాధితులు అంచెట్టి పోలీసులకు అందించగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రౌడీల ఇళ్లపై పోలీసుల దాడి

ముళబాగిలు, న్యూస్‌టుడే: కేజీఎఫ్ పరిధిలోని రౌడీల ఇళ్లపై పోలీసులు ఆదివారం సాయంత్రం ఆకస్మిక దాడులు నిర్వహించారు. రాబర్ట్‌సన్‌పేట, అండర్సన్‌పేట, బెమల్‌నగర, బంగారుపేట శివార్లోని 23 మంది రౌడీల ఇళ్లల్లో తనిఖీలు చేపట్టారు. ఎస్పీ శివాంశు రాజ్‌పుత్, డీవైఎస్పీ వి.లక్షయ్య ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అయిదుగురు ఇన్‌స్పెక్టర్లు, 15 మంది పోలీసు సబ్ ఇన్‌స్పెక్టర్లు 120 మంది పోలీసు సిబ్బందితో కూడిన ఆయా బృందాలు దాడులు పాల్గొన్నాయి.

బస్సు ఢీకొని యువకుడి మృతి

చింతామణి, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనాన్ని ప్రైవేట్ బస్సు ఢీకొన్న ప్రమాదంలో యువకుడు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన స్థానిక ఎం.జి.రోడ్డు పోలీసుస్టేషన్ సమీపంలో చోటు చేసుకుంది. మృతుణ్ని దర్గా మొహల్లాకు చెందిన ముస్తాఫ్(22)గా గుర్తించారు. పోలీసులు స్థలానికొచ్చి పరిశీలన చేశారు. మృతదేహాన్ని శవపరీక్షకు కోసం ఆస్పత్రికి తరలించారు. బస్సును స్వాధీనం చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నవజాత శిశువును వదిలి..దంపతుల ఆత్మహత్య

ముళబాగిలు, న్యూస్‌టుడే: శ్రీనివాసపుర తాలూకా ఉప్పనపల్లి గ్రామంలో ఏడు రోజుల నవజాత శిశువును వదిలి దంపతులు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. దంపతులు ఫరీదా(22), కెహ్మాన్(28) స్థానిక శ్రీనివాసరెడ్డి కోళ్ల ఫారంలో 15 రోజులుగా నివసిస్తున్నారు. ఫరీదా ఏడు రోజుల క్రితం ఆడశిశువుకు జన్మనిచ్చింది. మరణానికి కచ్చితమైన కారణం తెలియరాలేదు. రాయల్పాడు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. రాయల్పాడు పోలీసులు ఫిర్యాదు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కన్న తల్లిపైనే అఘాయిత్యం: నీచునికి జీవిత ఖైదు

చింతామణి, న్యూస్‌టుడే: తాగినమైకంలో కన్నతల్లిపైనే అఘాయిత్యానికి ఒడిగట్టిన అశోక్ అనే నీచుడికి చిక్కబళ్లాపుర జిల్లా న్యాయస్థానం జీవిత ఖైవిత ఖైదు విధించింది. ఈ శిక్షతోపాటు రూ.25వేల జరిమానా వేసింది. 2024 ఏప్రిల్ 4వ తేదీ రాత్రి గుడిబండేలో 65 ఏళ్ల వృద్ధ తల్లిపై దారుణానికి పాల్పడ్డాడు. పోలీసులు జిల్లా న్యాయస్థానంలో కేసు దాఖలు చేశారు. 16 నెలల పాటు కేసు విచారణ జరిగింది. నిందితుణ్ని న్యాయమూర్తి ఎస్.వి.కాంతరాజు విచారించి తీర్పు ప్రకటించారు. అతనికి ఇంకా పెద్ద శిక్ష వేయాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

సామాజిక సేవకు సమకూరిన అంబులెన్సులు

అంబులెన్సు తాళాలు అందుకున్న సీబీసీఐ ప్రతినిధులు

బెంగళూరు (మారతహళ్లి), న్యూస్‌టుడే : తమ కార్పొరేట్ సామాజిక బాధ్యతల్లో భాగంగా బంధన్ బ్యాంకు బెంగళూరులో సీబీసీఐ సొసైటీ ఫర్ మెడికల్ ఎడ్యుకేషన్, భారత్ సేవాశ్రమ్ సంఘానికి ప్రత్యేక అంబులెన్స్‌లను సోమవారం వితరణ చేసింది. దేశంలో మొత్తం 10 అంబులెన్సులను వితరణ చేశామని బ్యాంకు సీఈఓ పార్థ ప్రతిమ్‌సేన్‌గుప్త తెలిపారు. ఆసుపత్రులు, వృద్ధాశ్రమాలు, స్వచ్ఛంద సంస్థల్లో అత్యవసరంగా వైద్య సేవలు అందుకోవలసిన వారిని దృష్టిలో ఉంచుకుని వైద్య పరికరాలు, ఔషధాలు ఉన్న అంబులెన్సులను తమ పదో వ్యవస్థాపక దినోత్సవానికి వితరణ చేశామన్నారు. తాము సేవలు అందిస్తున్న 14 రాష్ట్రాల్లోని 82 జిల్లాలలో ప్రతి ఏటా క్రమం తప్పకుండా కార్పొరేట్ సామాజిక బాధ్యతల్లో భాగంగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని వివరించారు.

పారిశుద్ధ్య కార్మికులకు సౌకర్యాలు కల్పించాలి

సమావేశంలో డాక్టర్ రమేశ్, డాక్టర్ శంకర్ తదితరులు

బెంగళూరు(బాణసవాడి),న్యూస్‌టుడే: పారిశుద్ధ్య కార్మికుల సంఖ్య పెంచాలని అఖిల భారత కార్మిక సమన్వయ సమితి సివిక్ వర్కర్ విభాగం అధ్యక్షుడు డాక్టర్ జీహెచ్‌శంకర్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం ఇక్కడ శాసనసభ్యుల సమావేశమందిరంలో ఏర్పాటు చేసిన భేటీకి కార్మిక సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు, కార్మిక సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ నగర జనాభా 1.40కోట్లు మంది ఉండగా దాదాపు వేయి చదరపు కిలోమీటర్ల పరిధిలో ఉన్న గ్రేటర్ బెంగళూరు ప్రాధికార ప్రదేశాలను శుభ్రం చేయడానికి పారిశుద్ధ్య కార్మికుల సంఖ్య 50వేలు మంది ఉండాల్సిందన్నారు. ప్రస్తుతం కేవలం 18వేల మంది ఉన్నారని వెంటనే వారి సంఖ్యను పెంచాలని కోరారు. పారిశుద్ధ్య కార్మికులకు గృహ వసతి, ఆరోగ్యబీమా, పనిగంటలు తదితరాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలను శాసనసభ సమావేశంలో ప్రస్తావించి కార్మికులకు న్యాయం జరిగేలా ప్రయత్నిస్తానని ఎమ్మెల్సీ నాగరాజు యాదవ్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు బయ్యప్పనహళ్లి డాక్టర్ డి.రమేష్, సైయద్ మోషిన్ తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

ర్యాలీగా తరలివెళ్తున్న ఆందోళనకారులు

పశువధ చట్టంలో మార్పులొద్దు

రాయచూరు: పశువధ ప్రతిబంధక, సంరక్షణ-2020 చట్టంలో మార్పులను అసెంబ్లీలో ఆమోదం తెలపవద్దని విశ్వహిందూపరిషత్, బజరంగదళ్ డిమాండు చేశాయి. ఈ మేరకు సోమవారం నగరంలో ర్యాలీ నిర్వహించి, అంబేడ్కర్ కూడలి వద్ద ధర్నాకు దిగాయి. మధ్యాహ్నం ప్రతినిధులు జిల్లా పాలనాధికారి కార్యాలయం అధికారికి వినతిపత్రం ఇచ్చి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి పంపాలని కోరారు. ఇటీవల క్యాబినెట్ సమావేశంలో చట్టంలో మార్పులు చేయాలని తీర్మానించారని తెలిపారు. ఇది రాజ్యాంగ ఆశయానికి భిన్నంగా ఉందని ఆందోళనకారులు పేర్కొన్నారు.

బళ్లారి

• బళ్లారి • రాయచూరు • కొప్పళ • విజయనగర • చిత్రదుర్గ

వరి ప్రత్యామ్నాయంపై నేడు ఫోన్ ఇన్

రాయచూరు, న్యూస్‌టుడే: తుంగభద్ర ఆయకట్టు ప్రాంతంలో వరికి ప్రత్యామ్నాయంగా రబీ సాగులో తెగుళ్ల బెడద నివారణపై రాయచూరు ఆకాశవాణి కేంద్రం మంగళవారం ఫోన్-ఇన్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. వ్యవసాయ విజ్ఞాన విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు ఎం.ఎ. బసవణ్యప్ప, శివానంద హొంబినాళ రైతుల ప్రశ్నలకు సమాధానం ఇస్తారు. మారుతున్న వాతావరణ పరిస్థితుల్లో రైతులు వేసిన పలు రకాల వరి పంటలకు చీడపీడల బెడద ఎక్కువగా ఉంది. ఆసక్తి గల వారు సాయంత్రం 6.51 నుంచి రాత్రి 7.34 గంటల మధ్య 08532 295898, 200312 ల్యాండ్ ఫోన్‌కు డయల్ చేయాలని కార్యక్రమాల నిర్వాహకుడు వెంకటేశ్ కోరుతున్నారు.

కుమారణ్ణ సలహా లౌకికతత్వానికి చేటు

రాయచూరు: పాఠశాల విద్యలో భగవద్గీత బోధించాలని మంత్రి కుమారస్వామి కేంద్ర విద్యాశాఖ మంత్రికి లేఖ రాయడం ఆక్షేపణీయమని జిల్లా సీపీఎం కార్యదర్శి కె.జి.వీరేశ్ ప్రకటనలో పేర్కొన్నారు. కుమారణ్ణ సలహా భారత రాజ్యాంగంలోని లౌకిక తత్వానికి, విద్యార్థుల్లో శాస్త్రీయ భావాలను పెంపొందించాలన్న విద్యా విధానాలకు పూర్తి విరుద్ధమన్నారు. భాజపా సర్కారు హయాంలో రాష్ట్రంలో గీతను పాఠ్యాంశంలో చేర్చాలన్న ప్రయత్నాలను కుమారస్వామి వ్యతిరేకించారని తెలిపారు. కేంద్ర మంత్రిగా కర్ణాటక అభివృద్ధికి అదనంగా నిధులను తేవాలని, కొత్త పథకాలను మంజూరు చేయించాలే తప్పా.. ధార్మిక అంశాన్ని రాజకీయంలోకి జొప్పించవద్దని హితవు పలికారు. సెక్యులర్ భావాలు గల దళ్ శ్రేణులను ఆర్‌ఎస్ఎస్ వైపు మళ్లించేలా ఉన్న తన సలహాను కుమారస్వామి వెనక్కి తీసుకోవాలని కోరారు.

ఎప్పటికయ్యేనో?

కొనసాగుతున్న పునరావాస నిర్మాణాలు

మూడో వంతు పనులు పూర్తయిన గృహాలు

స్లాబ్ దశలోనే

రాయచూరు, న్యూస్‌టుడే: స్థానిక ఆశాపూర్ రహదారికి సమీపంలోని కేంద్రీయ విద్యాలయానికి దగ్గర్లో మాజీ దేవదాసి మహిళల పునర్వాస నిర్మాణ పనులు మందగతిన సాగుతున్నాయి. ప్రస్తుత నిర్మాణ వేగాన్ని గమనిస్తే ఇప్పట్లో పూర్తి అయ్యేలా కన్పించడం లేదు. రాయచూరులో 206 మంది మాజీ దేవదాసి మహిళలు నివసిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. 10 మందికి సొంత గృహాలు ఉన్నందున 196 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. పునరావాసానికి జిల్లా యంత్రాంగం ఐదు ఎకరాల భూమిని కేటాయించింది. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.ఆరున్నర లక్షల వ్యయం అవుతుందని, ఇందులో రూ.లక్ష సొంతంగా లబ్ధిదారులే భరించాలని షరతు విధించారు. ప్రేమ్ జోర్జు గుత్తేదారు ఈ నిర్మాణ పనులను అప్పగించింది.

జాప్యానికి కారణాలివిగో..

2019లో నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. గత ఆర్నెల్లలో ఒక్క గృహాన్ని కూడా పూర్తి చేయలేదు. తొలుత 84 నిర్మాణాలను చేపట్టారు. ఇందులో 42 కట్టడాల్లో 75 శాతం పనులు ముగిశాయి. మిగిలిన 42 గృహాలకు స్లాబ్‌లు నిర్మించి వదిలేశారు. గుత్తేదారు ఉప గుత్తేదార్లకు అప్పగించడం, మహిళలకు ఆర్థిక స్తోమత లేనందున కంతు కట్టడం లేదు. ఇవే జాప్యానికి ప్రధాన కారణాలు. అన్ని ఇళ్లను కట్టి, మౌలిక వసతులు కల్పించిన తర్వాత పంపిణీ చేయాలి..

కంతును ప్రభుత్వమే కట్టాలి

రూ.1500 పింఛన్‌తో కుటుంబాన్ని నెట్టుకొస్తున్న మహిళలు లక్ష రూపాయలు భరించడం అసాధ్యం. ఈ మొత్తాన్ని సర్కారే చెల్లించాలి. మూఢత్వానికి జీవితాలను బలి చేసుకున్న వారికి సర్కారు చేయూత ఇవ్వాల్సిన అవసరం ఉంది. లబ్ధిదారుల్లో కొంతమంది చనిపోయారు. మరి కొందరు వృద్ధులయ్యారు. కట్టడ సామగ్రి, కూలి సొమ్ము పెరిగినందున ఇంటికి అయ్యే వ్యయాన్ని పెంచాలి. - పద్మ (జిల్లా దేవదాసి మహిళా విమోచనా సంఘం అధ్యక్షురాలు)

పాలకులకు పట్టని రైతుల ఇక్కట్లు

ప్రదర్శన చేపట్టిన దళపతులు

రాయచూరు, న్యూస్‌టుడే: ప్రస్తుత బెళగావి శీతాకాల సమావేశాల్లో అన్నదాతల సమస్యలపై ప్రజా ప్రతినిధులు చర్చించాలని, వాటిని ప్రభుత్వం శీఘ్రంగా తీసుకుని పరిష్కరించాలని దళపతులు డిమాండు చేశారు. జిల్లా, రాయచూరు గ్రామీణ జేడీ(ఎస్) శాఖల నేతృత్వంలో సోమవారం అంబేడ్కర్ కూడలి వద్ద ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు విరూపాక్షి, రాయచూరు గ్రామీణ అధ్యక్షుడు నరసింహ నాయక్ ప్రసంగిస్తూ వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు లేక, అతివృష్టి పరిహారం సక్రమంగా అందక, కొనుగోలు కేంద్రాల్లో ఎదురవుతున్న సమస్యలతో రైతులు అష్టకష్టాలు పడుతున్నా సర్కారుకు చీమ కుట్టినట్లు అయినా లేదని దుయ్యబట్టారు. సీఎం కుర్చీ పోట్లాటలో మునిగిపోయిన ప్రభుత్వ పెద్దలకు కర్షకుల సమస్యలు కానరావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు సమస్యలపై చర్చకు ప్రత్యేక సమావేశాన్ని జరపటానికి ఆసక్తి చూపక. అధికారం కోసం అల్పాహారం పేరుతో సమావేశం కావడం శోచనీయమని పేర్కొన్నారు. తుంగభద్ర రైతులకు రెండో సాగుకు నీరు సరఫరా చేయమని చేతులెత్తేసినందున ఎకరాకు పాతిక వేల పరిహారాన్ని ప్రకటించాలని, వరి ధాన్యం క్వింటాలుకు రూ.500 ప్రోత్సాహక ధరన్ని చెల్లించాలని ఒత్తిడి తెచ్చారు. పత్తి కొనుగోలు కేంద్రాల వద్ద నమోదు ప్రక్రియలో ఎదురవుతున్న ఇబ్బందులను తీర్చాలని, జొన్న, ఉల్లిపాయ సేకరణా కేంద్రాలను తెరవాలని డిమాండు చేశారు. జిల్లా కార్యాధ్యక్షుడు శివ శంకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మీపతి, నాయకులు రామకృష్ణ, జంబునాథ్ యాదవ్, నాగరాజ గౌడ, హంపయ్య నాయక్, ఆశాపూరు నరసప్ప, ఆదిరాజ హాజరయ్యారు.

అలరించిన కళా ప్రతిభ

గ్రామీణ నృత్యాన్ని ప్రదర్శిస్తున్న బాలికలు

రాయచూరు, న్యూస్‌టుడే: స్థానిక మారుతీనగర్‌లోని గిరి అభయాంజనేయ దేవాలయం ఆవరణలో ఆదివారం రాత్రి నిర్వహించిన కళా ఉత్సవ సంగీత, సాంస్కృతిక ప్రదర్శనలు ప్రేక్షకులను రంజిప చేశాయి. విద్యార్థినుల సంగీత ఆలాపన, విభిన్న నృత్యాలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. రాగ రంజని కళా బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాలను భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి రవీంద్ర జల్దార్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగిన కళా ప్రతిభను వెలికి తీసి ప్రోత్సహించాలని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను కోరారు. డాక్టర్ అరుణా హీరేమఠ ఉపన్యసిస్తూ కళాకారులకు సంగీత భవనాన్ని నిర్మించేందుకు నగర పాలక సంస్థ సీఏ సైటును కేటాయించేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆలయ సమితి ప్రతినిధులు బసవరాజ్, మహాదేవప్ప, మునిస్వామి, గిరియప్ప దిన్ని, శశిధర్ కట్టిమని, శారదా, దండప్ప బిరాదార్ పాల్గొన్నారు.

20న నగరంలో విశ్వనమన

కరపత్రాలను విడుదల చేస్తున్న ప్రముఖులు

రాయచూరు, న్యూస్‌టుడే: నగరంలో ఈ నెల 20న బన్నంజె విశ్వనమన 90వ బృహత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందుకు సంబంధించిన ప్రచార కరపత్రాన్ని ఆదివారం రాత్రి సావిత్రి కాలనీ జోడు వీరాంజనేయ దేవస్థానంలో విడుదల చేశారు. బన్నంజ గోవిందాచార్య, జనసేనా ప్రతిష్ఠాన్‌లు, శ్రుతి సాహిత్య మేళా ప్రతినిధులు ఆవిష్కరించారు. జనసేన ప్రతిష్ఠాన్ అధ్యక్షుడు త్రివిక్రమజోషి మాట్లాడుతూ విద్వాంసుల ప్రసంగాలు, ప్రముఖ కళాకారుల దాసవాణులు, నాటకాలు ఉంటాయని వివరించారు. మేళా అధ్యక్షుడు మురళీధర కులకర్ణి ప్రసంగిస్తూ విద్యా వాచస్పతి గోవిందాచార్య అన్ని సామాజిక వర్గాల అభ్యున్నతికి శ్రమించారని, కులాలకు అతీతంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. జిల్లా బ్రాహ్మణ సమాజం ప్రతినిధి రమేశ్ కులకర్ణి, వీరాంజనేయ ఆలయం కార్యాధ్యక్షుడు వేణుగోపాల్ ఇనాందార్, విష్ణుతీర్థ, వెంకటేశ్ నవలి, పాండు రంగారావు ఉన్నారు.

అబాకస్ పోటీల్లో 50 మంది విజేతలు

ప్రశంసాపత్రాలతో బాలలు, నిర్వాహకులు

రాయచూరు, న్యూస్‌టుడే: విశ్వం ఎడ్యుటెక్ సంస్థ అబాకస్, గణితంపై నిర్వహించిన ప్రతిభా పోటీల్లో 50 మంది చిన్నారులు విజేతలుగా నిలిచారు. ఆదివారం రాయచూరుకు సమీపంలోని కృష్ణా గార్డెన్ సభా భవనంలో జరిగాయి. 30 జిల్లాలకు చెందిన 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. సోమవారం ప్రశంసాపత్రాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎడ్యుటెక్ సీఈవో హరిచరణ్ ప్రసంగిస్తూ గణితం పట్ల ఉన్న భయాన్ని తొలగించి, ఆసక్తిని పెంపొందించేందుకు పోటీలు పెట్టినట్లు తెలిపారు. ప్రాంతీయ మేనేజర్ ముబీన్ ఖాన్ మాట్లాడుతూ మెదడు చురుకుదనానికి పోటీలు ఉపకరిస్తాయని చెప్పారు. విశ్వం బృందం సేల్స్ హెడ్ పవన్, శివాంజినేయులు, ఉపాధ్యాయులు హాజరయ్యారు.

విశ్రాంత ఉద్యోగులకు ప్రత్యేక అదాలత్

బెళగావి, న్యూస్‌టుడే : మరాఠా లైట్ ఇన్‌ఫ్యాంట్రీ రెజిమెంటల్ సెంటర్‌లోని విశ్రాంత ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల కోసం బెళగావిలో ఏర్పాటు చేసిన ర్యాలీ (అదాలత్)ని లెఫ్టినెంట్ కల్నల్ హబీబ్ సోమవారం ప్రారంభించారు. పింఛను, సంక్షేమ కార్యక్రమాలు, ఆరోగ్య, వైద్య పరీక్షలకు సంబంధించి విశ్రాంత ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు నిర్వహించిన అదాలత్‌లో 1200 మంది పాల్గొన్నారు. మహారాష్ట్ర, కర్ణాటక విభాగానికి చెందిన వీరనారి, వీరమాతలకు హబీబ్ బహుమతులు, ప్రమాణపత్రాలు అందించారు. సైనిక దంత వైద్య కేంద్రం, కంటోన్మెంట్ బోర్డ్ ఆసుపత్రి, బెళగావిలోని ఈసీహెచ్ఎస్ పాలి క్లినిక్‌కు చెందిన వైద్యులు, వైద్యేతర సిబ్బంది వారికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఔషధాలు సమకూర్చారు. స్పర్శ్, ఆధార్, పాన్, డీఎల్‌సీ, ఏడబ్ల్యూపీఓ తదితరాలకు సంబంధించిన డాక్యుమెంటేషన్, మార్పులకు సంబంధించి దరఖాస్తులు తీసుకున్నారు. బ్రిగేడియర్ జోయ్‌దీప్ ముఖర్జీ, ఇతర అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

సౌత్‌జోన్ వాలీబాల్ పోటీలకు ఎంపిక

అమీన్

తిమ్మణ్ణ

సింధనూరు, న్యూస్‌టుడే: సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ పురుషుల వాలీబాల్ పోటీలకు సింధనూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. వీరు రాయచూరులోని ఆదికవి శ్రీమహర్షి వాల్మీకి విశ్వవిద్యాలయం జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించబోతున్నారు. సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ పురుషుల వాలీబాల్ పోటీలు ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ జేఎన్‌టీయూ విశ్వవిద్యాలయం మైదానంలో ఈ నెల 10 నుంచి 14 వరకూ జరగబోతున్నాయి. సింధనూరు ప్రభుత్వ ఫస్ట్‌గ్రేడ్ డిగ్రీ కళాశాలలో బీఏ అయిదో సెమిస్టర్ చదువుతున్న అమీన్, ఒకటో సెమిస్టర్ చదివే తిమ్మణ్ణ ఈ పోటీలకు ఎంపికవడంతో తోటి విద్యార్థులతో అభినందనలు అందుకుంటున్నారు. పోటీలకు కాకినాడ బయలుదేరుతున్న విద్యార్థులు అమీర్, తిమ్మణ్ణను సోమవారం కళాశాల ప్రాచార్యులు ప్రొఫెసర్ పాండు, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ కె.శివ అభినందించి చక్కని ప్రదర్శనతో రాణించాలని వెన్నుతట్టి సాగనంపారు.

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

08-12-2025 (ఉ॥ 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1621.21	1629.48
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	506	4,070
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	8,791	5,133
నీటి నిల్వ (టి.ఎం.సి)	64.786	92.127

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

నిరంతర శ్రమతో ఆవిష్కరణల పర్వం

జస్టిస్ ఫణీంద్రను సత్కరిస్తున్న సంస్థ ప్రతినిధులు

బెంగళూరు (రాజాజీనగర), న్యూస్‌టుడే : విద్యార్థులు పెద్ద కలలు కని, వాటిని సాకారం చేసుకునేందుకు శ్రమించాలని ఉప లోకాయుక్త జస్టిస్ కేఎన్ ఫణీంద్ర పిలుపునిచ్చారు. ఆదిమానవుడి నుంచి నేటి వరకు మనిషి నిరంతరం అధ్యయనాలతోనే పలు ఆవిష్కరణలతో ముందుకు సాగుతున్నట్లు గుర్తు చేశారు. బెంగళూరులోని సౌందర్య సెంట్రల్ పాఠశాల వార్షికోత్సవంలో ప్రముఖ వైద్యురాలు డాక్టర్ సుప్రజా చంద్రశేఖర్, సౌందర్య నిపుణురాలు శాలు చావ్లాతో కలిసి ఆయన ఆదివారం రాత్రి సత్కారాన్ని అందుకున్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలను వీక్షించి మాట్లాడారు. ఎవరికీ బాల్యం వెనక్కు తిరిగి రాదని, చిన్నారుల ఆకాంక్షలు, అభిరుచులను గుర్తించి, వారిని ప్రోత్సహించే బాధ్యతలను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులకు పౌష్టికాహారంతో కలిగే ప్రయోజనాలను డాక్టర్ సుప్రజా చంద్రశేఖర్ వివరించారు. వేర్వేరు అంశాలను ఎంచుకుని విద్యార్థులు ఇచ్చిన ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. సంస్థ సీఈఓ కీర్తన్ కుమార్, ఇతర బోధకులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శన

ముడిపడకనే.. మృత్యుబాట

• ప్రీవెడ్డింగ్ చిత్రీకరణకు వెళ్లి వధూవరుల దుర్మరణం • కాబోయే జంట ఇంట కన్నీటి సంద్రం

మరో రెండువారాల్లో వారిద్దరూ మూడుముళ్ల బంధంతో వివాహం చేసుకోవాలి.. ఇరువైపులా బంధువులందరూ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.. కొత్త జంట ఉత్సాహంగా మధుర క్షణాలను పదిలపరుచుకోవాలని ప్రీవెడ్డింగ్ కోసం వెళ్లింది.. ఉదయం నుంచి సుందరమైన దృశ్యాల నడుమ అందమైన చిత్రాలు, వీడియో దృశ్యాలను చిత్రీకరించుకొన్నారు.. అంతా అయ్యాక కాబోయే భార్యను ఆమె ఇంటి వద్ద దింపాలని వరుడు ద్విచక్రవాహనంపై బయలుదేరాడు.. అంతలోనే కన్నుకుట్టిన మృత్యువు లారీ రూపంలో వచ్చి అమాంతం కబళించింది.. జంట ప్రాణాలను హరించివేసింది.. ఇరుకుటుంబాలను శోక సంద్రంలో ముంచింది..

రహదారి ప్రమాదంలో మృతి చెందిన కరియప్ప, కవిత

గంగావతి,న్యూస్‌టుడే: పెళ్లి చేసుకోబోయే కొత్త జంట ప్రీవెడ్డింగ్ చిత్రీకరణకు వెళ్లి రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన హృదయ విదారక ఘటన ఇది. కొప్పళ తలూకా ఇరకల్‌గఢాకు చెందిన కరియప్ప, కారటగి తాలూకా ముష్ఠూరుకు చెందిన కవితలకు పెళ్లి నిశ్చయం అయింది. ఈ నెల 21న ముహూర్తం ఖరారైంది. ఈ నేపథ్యంలో ప్రీ వెడ్డింగ్ కోసం ఆదివారం తుంగభద్ర జలాశయం పరిసరాల్లో చిత్రీకరణ పూర్తి చేసుకుని గంగావతి తాలూకా చిక్కబెణకల్ కొండ ప్రాంతానికి వచ్చారు. అక్కడ చీకటి పడడంతో ఇళ్లకు తిరిగి వెళ్లాలనుకున్నారు. కాబోయే భార్యను ఇంట్లో దింపేందుకు ద్విచక్ర వాహనంపై ఎక్కించుకొని బయలుదేరాడు. సరిగ్గా బండ్రాళ, వెంకటగిరి క్రాస్ వద్ద వేగంగా వచ్చిన కంకర లారీ వీరి వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. వరుడు కరియప్ప మడివాళ (26) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడవగా వధువు కవిత (19) అక్కడికక్కడే మృతి చెందింది. విధి వక్రించి ఇద్దరూ ప్రమాదంలో మరణించడంతో ఇరు కుటుంబాల సభ్యులు జీర్ణించుకోలేక పోతున్నారు. గంగావతి గ్రామీణ పోలీస్‌స్టేషన్లో కేసు నమోదైంది.

కుందానగరి.. సభాపర్వ భేరి!

ఉత్సాహంగా ప్రారంభఘట్టం

శాసనసభలోకి వెళ్లే మార్గంలో గణనాథుడికి పుష్పవైభవం

సభాపర్వానికి ముందు.. కళాకారుల సుగమ సంగీత కచేరి

అలనాటి బసవేశ్వరుని అనుభవ మండప చిత్తరువు వీక్షిస్తున్న సిద్ధు

బెళగావి, న్యూస్‌టుడే : కన్నడనాట కుందానగరిగా వినుతికెక్కిన బెళగావిలో శీతాకాల శాసనసభ సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఇటీవల కన్నుమూసిన ప్రముఖులకు ఉభయ సభల్లో నివాళి అర్పించారు. సభ్యులు, అతిథులకు స్వాగతం పలికేందుకు సువర్ణ సౌధ ముందు సంగీత కచేరి ఏర్పాటు చేశారు. పది రోజుల పాటు వేర్వేరు ప్రాంతాలకు చెందిన కళాకారులు ఇక్కడ ప్రదర్శనలు కొనసాగిస్తారు. సమావేశాలకు పోటీగా మహామేళాను నిర్వహించేందుకు ప్రయత్నించిన మహారాష్ట్ర ఏకీకరణ సమితి నాయకులు, కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేశారు. ఎంఈఎస్ కార్యకర్తలకు పోటీగా ఆందోళనకు దిగిన కన్నడ సంఘాల కార్యకర్తలనూ అదుపులోనికి తీసుకున్నారు. మంత్రులు, సిబ్బంది, పోలీసులు, అధికారుల కోసం నలభీములు ఉత్తర కర్ణాటక శైలి వంటకాలను సిద్ధం చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం సువర్ణ సౌధను ముట్టడిస్తామని భాజపా రాష్ట్రాధ్యక్షుడు విజయేంద్ర ప్రకటించారు. సమస్యలను పరిష్కరించడం సాధ్యం కాకపోతే ముఖ్యమంత్రి రాజీనామా చేసి ఇంటికి వెళ్లాలని ఎగువ సభలో విపక్షనేత చలువాది నారాయణస్వామి డిమాండ్ చేశారు. దిగువ సభతో పోల్చితే.. ఎగువ సభలో కొంత సేపు చర్చలు జోరుగానే సాగాయి. భాజపా నాయకులు చేసిన ఆరోపణలు, సంధించిన ప్రశ్నలకు మంత్రులు మధు బంగారప్ప, ఎంసీ సుధాకర్, మునియప్ప, ఈశ్వర ఖండ్రే, ప్రియాంక్ ఖర్గే తదితరులు బదులిచ్చారు. ప్రభుత్వ పాఠశాలలను మూసివేయడం లేదని మధు బంగారప్ప ఇదే సందర్భంగా స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో జరుగుతున్న తెలంగాణ రైజింగ్ సమ్మిట్‌లో పాల్గొనేందుకు ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ వెళ్లడం ప్రస్తావనార్హం. దిగువసభ.. మధ్యాహ్నం అనంతరం ఖాళీగా కనిపించింది.

ఖాళీగా ఉన్న దిగువ సభలోని ఆసనాలు

దిగువ సభలో మాట్లాడుతున్న అశోక్

వివరిస్తున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే బాలకృష్ణ

ఎగువసభలో మాట్లాడుతున్న మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్

సభ్యులకు బదులిస్తున్న మంత్రి ప్రియాంక్ ఖర్గే

అధికార పార్టీ నాయకులపై విరుచుకు పడుతున్న ఎమ్మెల్సీలు రవికుమార్, భారతీశెట్టి తదితరులు

సువర్ణ సౌధలోకి వస్తున్న హోం మంత్రి డాక్టర్ పరమేశ్వర్

పేదలకు ఇందిరా కిట్ల భాగ్యం!

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : రాష్ట్రంలో బీపీఎల్ కార్డుదారులకు అన్నభాగ్య పథకంలో భాగంగా బియ్యానికి బదులు జనవరి నుంచి వివిధ ఆహారధాన్యాలతో కూడిన ‘ఇందిరా కిట్’ అందిస్తామని ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి కె.హెచ్.మునియప్ప తెలిపారు. బెళగావిలో సోమవారం ప్రారంభమైన విధానపరిషత్ ప్రశ్నోత్తరాల సమయంలో భాజపా సభ్యుడు సీటీ రవి అడిగిన ప్రశ్నకు ఆయన బదులిస్తూ ఐదుకిలోల బియ్యానికి బదులుగా కందిబేడలు, చక్కెర, ఉప్పు, నూనె తదితరాలను మూటగా చేరవేస్తామన్నారు. అన్నభాగ్య బియ్యం చీకటి బజారులోకి వెళ్లకుండా కఠిన చర్యలు చేపట్టామని, అక్రమ రవాణాపై సీఐడీ దర్యాప్తునకు ఆదేశించినట్లు తెలిపారు. వివిధ సమయాల్లో ఈ అక్రమ రవాణాకు సంబంధించి 570 మందిని అరెస్టు చేశామన్నారు.

ఇటీవల కన్నుమూసిన ప్రముఖులకు నివాళి అర్పిస్తున్న ఎగువసభ సభ్యులు, అధ్యక్షుడు, అధికారులు

ప్రముఖులకు పరిషత్ సంతాపం

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : ఇటీవల కన్నుమూసిన ప్రముఖులకు విధాన పరిషత్‌లో ఘన నివాళులర్పించారు. మాజీ శాసనసభ్యులు హెచ్.వై.మేటి, ఆర్‌వీ దేవరాజ్, సాహితీవేత్త డాక్టర్ ఎస్.ఎల్.భైరప్ప, పర్యావరణ ఉద్యమకారిణి సాలుమరద తిమ్మక్క, బాలివుడ్ సినీనటుడు ధర్మేంద్ర, కన్నడ నటుడు ఉమేష్ తదితరుల మృతికి సభ్యులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. సమావేశం ప్రారంభమైన తరువాత సభాధ్యక్షుడు బసవరాజ హొరట్టి సంతాప తీర్మానాన్ని ప్రవేశ పెట్టారు. ఉత్తర కర్ణాటక ప్రాంతానికి చెందిన హెచ్.వై.మేటి ప్రజాప్రతినిధిగా అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారని సభ్యులు నివాళులర్పించారు. బిల్‌కెరూరు గ్రామపంచాయతీ అధ్యక్షుడిగా రాజకీయ జీవితాన్ని ప్రారంభించి, బాగల్‌కోటె పట్టణాభివృద్ధి ప్రాధికార, ఎంఎస్ఐఎల్ అధ్యక్షుడిగా, డీసీసీ బ్యాంకు డైరెక్టర్‌గా పని చేశారని సభ్యులు గుర్తుచేసుకున్నారు. 1983 నుంచి శాసనసభ్యుడిగా ఎన్నికై మంత్రిగా పని చేశారని, ఓసారి లోక్‌సభకు ఎన్నికయ్యారని గుర్తు చేశారు. బెంగళూరు నగరానికి చెందిన ఆర్‌వీ దేవరాజ్ 1989లో తొలిసారిగా శాసనసభ్యుడిగా ఎన్నికయ్యారని, 1999లో, 2013లో అదే పదవికి ఎన్నికైనట్లు సభ్యులు వివరించారు. 2004 నుంచి 2010 వరకు విధానపరిషత్ సభ్యుడిగానూ ఆయన చేసిన సేవలను మననం చేసుకున్నారు. సభా నాయకుడు బోసురాజు, ప్రతిపక్షనేత చలవాది నారాయణస్వామి తదితరులు ఈ అంశాలపై ప్రసంగించారు. సభ్యులందరూ లేచి నిలబడి రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం వ్యక్తం చేశారు.

(c) eenadu

మూడో ఉక్కు నగరంగా కేంఝర్

• సీఎం మోహన్ చరణ్ మాఝి

రోడ్ షోలో సీఎం మోహన్ అభివాదం

భువనేశ్వర్, న్యూస్‌టుడే: రవుర్కెలా, జాజ్‌పూర్‌ల తర్వాత తృతీయ ఉక్కు నగరంగా కేంఝర్ మారనుందని ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి చెప్పారు. కేంఝర్‌లో ఆదివారం సాయంత్రం జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ భారీ ఉక్కు పరిశ్రమలు ఈ జిల్లాలో ఏర్పాటు కానుండగా, 6 వరుసల రోడ్లు, పెట్టుబడిదారుల అవసరాల మేరకు పనులు చేపడుతున్నామన్నారు. కేంద్రం పరదీప్ నుంచి బర్బిల్ వరకు 8 వరుసల రోడ్డు పనులు ప్రారంభించిందని, దీనివల్ల కేంఝర్‌కు కలిసొస్తుందన్నారు. ఖనిజ సంపదల జిల్లాల (డీఎంఎఫ్) నిధులతో మౌలిక సౌకర్యాలు కల్పిస్తున్నామని, డబుల్ ఇంజిన్ పాలన రాష్ట్రానికి వరంగా సీఎం పునరుద్ఘాటించారు. తమ హయాంలో జరిగిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల గురించి వివరించారు. దీనికి ముందుగా మోహన్ కేంఝర్‌లో రోడ్ షో చేపట్టారు. కేంఝర్ ఎంపీ అనంత నాయక్, అటవీ, పర్యావరణ శాఖల మంత్రి గణేశ్ రామ్‌సింగ్ ఖుంటియా, భాజపా రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మన్మోహన్ సామల్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

విద్యుత్తు రంగం ఆశాజనకం

• ఉప ముఖ్యమంత్రి సింగ్‌దేవ్

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సింగ్‌దేవ్, అధికారులు

గోపాలపూర్, న్యూస్‌టుడే: రాష్ట్ర విద్యుత్తు రంగానికి ఉజ్వల భవిత ఉందని, పెట్టుబడిదారులు నిర్మాణాలకు ఆసక్తి చూపుతున్నారని విద్యుత్తు శాఖ బాధ్యతలు పర్యవేక్షిస్తున్న ఉపముఖ్యమంత్రి కనకవర్ధన్ సింగ్‌దేవ్ చెప్పారు. పూరీలో ఎనర్జీ లీడర్స్ సమ్మిట్-2025 సదస్సు ఆదివారం రాత్రి ముగిసింది. సోమవారం సింగ్‌దేవ్ విలేకర్లతో మాట్లాడుతూ గ్రీన్ ఎనర్జీ, సౌరశక్తి చాలిత ప్రాజెక్టులకు ప్రభుత్వం ప్రాధాన్యమిచ్చిన నేపథ్యంలో సదస్సులో పాల్గొన్న పెట్టుబడిదారులు అంగీకారం తెలిపారన్నారు. త్వరలో ఒప్పందాలు కుదరనున్నాయని, విద్యుత్తు రంగంలో ఒడిశా ఇప్పటికే మిగులు రాష్ట్రంగా నిలిచిందని, భవిష్యత్‌లో రాష్ట్రం మరింత అగ్రగామిగా నిలుస్తుందని చెప్పారు.

జి.ఉదయగిరి... వణుకే మరి

గోపాలపూర్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో చలిగాలులు, మంచు తీవ్రత పెరిగిందని, 12వ తేదీ వరకు ఇదే పరిస్థితి కొనసాగుతుందని గోపాల్‌పూర్ వాతావరణ అధ్యయన కేంద్రం (ఐఎండీ) అధికారి కె.ఎస్.మూర్తి 'న్యూస్‌టుడే'కు సోమవారం చెప్పారు. కంధమాల్ జిల్లాలోని జి.ఉదయగిరిలో అత్యల్ప ఉష్ణోగ్రత 4.3 డిగ్రీలు కాగా, అనుగుల్‌లో 6.3, ఫుల్బాణిలో 7.4, దారింగిబాడిలో 7.5, రవుర్కెలాలో 7.6, చిపిలిమాలో 8.7, కిరైలో 8.8 డిగ్రీలుగా నమోదైందన్నారు. మరో 6 కేంద్రాల్లో 9 నుంచి 10 డిగ్రీలు రాగా, మిగతా కేంద్రాల్లో 10 నుంచి 16 డిగ్రీలుగా నమోదైందన్నారు. మంగళవారం (9న) సుందర్‌గఢ్, కొంధమాల్, అనుగుల్, ఝూర్సుగుడ, కొరాపుట్, సోన్‌పూర్, జగత్సింగ్‌పూర్‌లలో మంచు కురిసే సూచనలున్నందున 'ఎల్లో' హెచ్చరికలు జారీ చేశామన్నారు.

కనిష్ఠ స్థాయికి ఉష్ణోగ్రత

దమన్‌జోడిలో 3.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు సూచిక

సిమిలిగుడ, కొరాపుట్, న్యూస్‌టుడే: కొరాపుట్ జిల్లాలో గత మూడు రోజులుగా చలి తీవ్రత పెరగడంతో ప్రజలు గజగజ వణుకుతున్నారు. చలి తీవ్రతకు వృద్ధులు, పిల్లలు తట్టుకోలేక పోతున్నారు. మూడు రోజులుగా ఉష్ణోగ్రతలు పూర్తిగా పడిపోయాయి. సాయంత్రం 5 గంటల నుంచి చలి ప్రభావం తీవ్రంగా ఉంటుంది. ఉదయం 10 గంటలైతే తప్ప భానుడు కనిపించట్లేదు. దీంతో జలుబు, జ్వరాలతో బాధపడే వారి సంఖ్య పెరుగుతోంది. దమన్‌జోడిలో 3.9 డిగ్రీలు, దేవ్‌మాలిలో 3 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు పడిపోయాయి. సిమిలిగుడను రాష్ట్రంలోనే అత్యధిక చలి ప్రాంతంగా గుర్తించారు. మరో వారం రోజులపాటు చలి తీవ్రత ఎక్కువగా ఉంటుందని వాతావరణం శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ప్రజలు చలిమంటలు వేసుకుంటున్నారు. మరోపక్క మంచు ప్రభావం తీవ్రంగా ఉండడంతో మార్గం కనిపించక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

అన్ని గ్రామాల్లో బ్యాంకింగ్ సేవలే ధ్యేయం

• శాసనసభలో మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని అన్ని గ్రామాలకు బ్యాంకింగ్ సేవలు విస్తరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ముఖ్యమంత్రి మోహన్‌చరణ్‌మాఝి తరఫున న్యాయశాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ చెప్పారు. సోమవారం శాసనసభలో కార్యక్రమాలు ప్రశాంతంగా జరిగాయి. సభాపతి సురమాపాఢి తొలుత ప్రశ్నోత్తరాలకు అనుమతిచ్చారు. సభ్యులు బద్రినారాయణ పాత్ర, సిద్ధాంత మహాపాత్ర, రామచంద్రకదం అడిగిన ప్రశ్నలకు మంత్రి హరిచందన్ సమాధానమిచ్చారు. రాష్ట్రంలోని 6,794 పంచాయతీలకుగాను 4,235 చోట్ల శాశ్వత బ్యాంకు సేవలు అందుబాటులో లేవన్నారు. ఆయాచోట్ల అవుట్‌లెట్లు ఏర్పాటయ్యాయని, సేవలు అందుతున్నాయన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకు సేవలు బాగున్నాయని, ఖాతాదారుల్లో అసంతృప్తి లేదన్నారు.

60 శాతం వైద్యుల పోస్టులు ఖాళీ

రాష్ట్రంలోని ప్రభుత్వాసుపత్రుల్లో 60 శాతం వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆరోగ్యశాఖ మంత్రి ముకేష్ మహాలింగ చెప్పారు. సోమవారం శాసనసభలో సభ్యులు రామచంద్రకదం, ప్రమీలా మల్లిక్, లక్ష్మణమంద అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిస్తూ రాష్ట్రానికి 15,774 మంది వైద్యులు అవసరం కాగా, ప్రస్తుతం 6,271 మంది విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. 1,135 మంది తాత్కాలిక ఉద్యోగులుగా పని చేస్తున్నారన్నారు. ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ చేయాలని ఒడిశా పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఓపీఎస్సీ) యంత్రాంగానికి తెలియపరిచామన్నారు. ప్రాథమిక ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని, ఈ దిశగా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని శూన్యగంటలో ఎమ్మెల్యే గౌతమ్ బుద్ధదాస్ డిమాండ్ చేశారు.

91 శాతం వినతుల పరిష్కారం

ఎమ్మెల్యేలు టంకధర్ త్రిపాఠి, ప్రమీలా మల్లిక్ అడిగిన ప్రశ్నలకు సీఎం తరఫున హరిచందన్ సమాధానమిస్తూ, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వినతుల స్వీకరణ కార్యక్రమం ప్రారంభించిందని, ఇది విజయవంతంగా కొనసాగుతోందన్నారు. భువనేశ్వర్‌లో ముఖ్యమంత్రి, జిల్లాల్లో పాలనాధికారులు, సబ్ కలెక్టర్లు ప్రజల ఇబ్బందులు అధ్యయనం చేసి పరిష్కరిస్తున్నారు. తహసీల్దార్లు, బీడీఓలు తమ సమితుల్లో ప్రతి సోమవారం ప్రజల వద్దకు వెళ్తున్నారన్నారు. 91 శాతం కేసులు పరిష్కారమయ్యాయని, వినతుల స్వీకరణలో ఇంతవరకు 13,253 పరిష్కారమయ్యాయని చెప్పారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇతర శాఖల ప్రిన్సిపల్ కార్యదర్శులూ వినతుల స్వీకరణలో పాల్గొంటున్నారని, దీనికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిచ్చిందన్నారు. ఎమ్మెల్యేలు తమ ప్రాంతాల్లో జరుగుతున్న వినతుల స్వీకరణ కార్యక్రమాల్లో పాల్గొనవచ్చన్నారు.

పదకొండేళ్ల తర్వాత సొంత గూటికి

• బంగ్లాదేశ్ నుంచి మయూర్‌భంజ్‌కు తిరిగొచ్చిన ఒడిశా వాసి

సుదాంను మయూర్‌భంజ్ తీసుకొచ్చిన పోలీసులు

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: గత పదకొండేళ్ల కిందట కనిపించకుండాపోయిన ఒడిశాకు చెందిన ఓ వ్యక్తి ఇన్నాళ్లకు సొంత రాష్ట్రానికి తిరిగొచ్చారు. బంగ్లాదేశ్‌లో తలదాచుకుంటున్న ఆయన పోలీసుల సహకారంతో సొంత గూటికి చేరుకున్నారు. వివరాల్లోకి వెళితే.. మయూర్‌భంజ్ జిల్లా బొడాసాహి సమితి జగన్నాథపూర్ గ్రామానికి చెందిన సుదాం హేంబ్రమ్ (41) పదకొండేళ్ల కింద అదృశ్యమయ్యారు. దీనిపై బాధిత కుటుంబీకులు పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు ఇవ్వనప్పటికీ సుదాం క్షేమంగా ఇంటికి తిరిగి రావడం గమనార్హమైంది. బంగ్లాదేశ్‌లోని చపాయి నవాబ్‌గంజ్ జిల్లాలో హేంబ్రమ్‌ను గుర్తించిన పోలీసులు ఆయనను రాష్ట్రానికి రప్పించారు. ఈ విషయమై ఎస్పీ వరుణ్ గుంటుపల్లి మాట్లాడుతూ ఢాకాలోని భారత ఉన్నత కమిషన్ కార్యాలయం నుంచి జిల్లా పోలీసు కార్యాలయానికి దీనిపై సమాచారం అందిందన్నారు. అక్టోబరు 28న గుర్తించిన సుదాం ఐటెంటిటీని పరిశీలించాల్సిందిగా పోలీసు యంత్రాంగానికి అక్కడ అధికారులు కోరినట్లు వరుణ్ తెలిపారు. దీంతో సుదాం కుటుంబాన్ని కలిసి నిర్ధారించుకున్నాక ఆయన మేనల్లుడు సుభాష్, బావ సిమాందు హేంబ్రం సమక్షంలో పశ్చిమ బెంగాల్‌లోని హరిదాస్‌పూర్ చెక్‌పోస్టు వద్ద శనివారం అప్పగించినట్లు పేర్కొన్నారు. ఆదివారం మధ్యాహ్నం మయూర్‌భంజ్ చేరుకున్న హేంబ్రమ్‌ను చూసి కుటుంబ సభ్యులు ఆనందంతో కళ్లు చెమ్మగిల్చారు. కుటుంబంతో ఎలాంటి తగాదాలు లేని సుదాం ఇళ్లు విడిచి ఎందుకు వెళ్లిపోయాడో తెలియదని, ఇక తిరిగి రాడనుకొన్న సమయంలో ఆయన రాక తమ కుటుంబంలో ఎంతో ఆనందాన్ని నింపిందని బాధిత కుటుంబీకులు పేర్కొన్నారు.

ఏడాదిన్నరలో 271 మంది ఉద్యోగుల అరెస్టు

మోహన్‌చరణ్ మాఝి

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో గత ఏడాదిన్నర సమయంలో 271 మంది ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులను విజిలెన్స్ శాఖ అరెస్టు చేసింది. వీరిలో లంచాలు తీసుకుంటూ 20 మంది పోలీసులు చిక్కడం గమనార్హం. ఎమ్మెల్యే తారాప్రసాద్ వాహినిపతి సోమవారం శాసనసభలో అడిగిన ప్రశ్నకు ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి బదులిస్తూ ఈ వివరాలను వెల్లడించారు. అరెస్టయిన వారిలో 174 మంది అధికారులకు విజిలెన్స్ న్యాయస్థానం శిక్షలు విధించింది. 33 మంది ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులను విధుల నుంచి తొలగించగా, మరో 65 మందికి సంబంధించి పింఛన్లు నిలిపివేశారు. అవినీతికి పాల్పడే వారిపై సర్కారు కఠిన చర్యలు తీసుకుంటుందని సీఎం మోహన్ చరణ్ స్పష్టం చేశారు.

16 నెలల్లో 3,486 సైబర్ కేసులు

ఎమ్మెల్యే రామచంద్ర కడం అడిగిన మరో ప్రశ్నకు ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి బదులిస్తూ 16 నెలల్లో 3,486 సైబర్ కేసులు నమోదయ్యాయన్నారు. వీటికి సంబంధించి 727 మంది సైబర్ నేరగాళ్లను అదుపులోకి తీసుకోగా, 69 డిజిటల్ అరెస్టులు జరిగాయన్నారు. 104 కేసులకు సంబంధించి పోలీసులు ఛార్జిషీట్ దాఖలు చేశారని, దీంతో నిందితులు విచారణ ఎదుర్కొంటున్నట్లు వెల్లడించారు. సైబర్ నేరాల్లో బాధితులు రూ.222 కోట్లకుపైగా నగదు కోల్పోయినట్లు సీఎం పేర్కొన్నారు. వీటిలో 61,36,381ను బాధితుల ఖాతాల్లోకి తిరిగి జమ చేయగా, మరో రూ.6,74,09,434 నగదుకు సంబంధించి నిందితుల ఖాతాలను సీజ్ చేసినట్లు ఆయన స్పష్టం చేశారు.

రూ.60 లక్షల విలువైన బ్రౌన్‌షుగర్ స్వాధీనం

తల్లీ, కుమారుడు అరెస్టు, రూ. కోటి సరకుతో మరొకరి పరారీ

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: రూ.60 లక్షల విలువైన బ్రౌన్‌షుగర్‌తో ఓ తల్లీ, కుమారుడు పట్టుబడగా, రూ.కోటి సరకుతో మరో కుమారుడు పరారయ్యాడు. ఢెంకనాల్‌లో జరిగిన ఈ ఘటనకు సంబంధించి కామాక్ష్యనగర్ ఆబ్కారీ అధికారులు తెలిపిన వివరాల మేరకు.. కామాక్ష్యనగర్ స్టేషన్ పరిధి ముండిదెవులి వీధిలోని ఓ ఇంట్లో అబ్కారీ సిబ్బంది దాడులు నిర్వహించి బ్రౌన్‌షుగర్‌ను గుర్తించారు. అద్దె ఇంట్లో నివాసముంటున్న తల్లీ, ఇద్దరు కుమారులకు బ్రౌన్‌షుగర్ స్మగ్లింగ్ విక్రయంలో హస్తమున్నట్లు తెలుసుకున్నారు. పట్టుబడిన నిందితులు గొలు గ్రామానికి చెందిన మమతా సాహు, ఆమె కుమారుడు ఆకాశ్ సాహుగా గుర్తించారు. వీరి నుంచి బ్రౌన్‌షుగర్‌ను స్వాధీనం చేసుకున్నారు. గోడ దూకి పారిపోయిన బికాశ్ వద్ద సరకు ఉన్నట్లు వెల్లడించారు. పరారీలో ఉన్న నిందితుడిని వీలైనంత త్వరగా పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.

భారత్-సౌతాఫ్రికా జట్ల నెట్ ప్రాక్టీస్

స్టంప్స్ వెనక సంజూ శాంసన్

గంభీర్, సూర్య

శుభమన్ గిల్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: కటక్ బారాబటి స్టేడియంలో సోమవారం భారత్, సౌత్రాఫికా జట్లు నెట్ ప్రాక్టీస్ చేశాయి. దీనిని తిలకించడానికి స్థానికులకు ఉచిత ప్రవేశం కల్పించారు. ఓసీఏ కార్యదర్శి సంజయ్ బెహరా విలేకర్లతో మాట్లాడుతూ స్టేడియం లోపల, వెలుపల పోలీసు యంత్రాంగం గట్టి బందోబస్తు చేసిందన్నారు. ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి మ్యాచ్ ప్రారంభం నుంచి చివరి వరకు పాల్గొంటానని పేర్కొన్నట్లు తెలిపారు. కటక్ పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉంటుందన్నారు. ఈసారి అపశ్రుతులు పునరావృతం కావన్నారు. భారత్ కెప్టెన్ సూర్యకుమార్ విలేకర్లతో మాట్లాడుతూ ఈ మ్యాచ్ గెలుస్తామన్న ధీమా వ్యక్తం చేశారు.

పూర్వ విద్యార్థులు... అపూర్వ వేడుకలు

యోగా, వ్యాయామ గురువు సూర్యనారాయణను సత్కరించిన స్వర్ణోత్సవాల కమిటీ ప్రతినిధులు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: ఆటలు.. పాటలు.. నృత్యాలతో పూర్వ విద్యార్థులు చేసిన సందడి అంతా ఇంతా కాదు. స్థానిక సిటీ హైస్కూల్లో 1975వ సంవత్సరం మెట్రిక్యులేషన్ చదువుకున్న పూర్వ విద్యార్థుల సంఘం 'స్వర్ణోత్సవాలు' ఆదివారం రాత్రి ఘనంగా జరిగాయి. స్థానిక ధర్మనగర్ మెయిన్ రోడ్డులోని శుభం సెలబ్రేషన్స్‌లో సుమారు మూడు గంటలపాటు నిర్వహించిన వేడుకల్లో ఒడిశాతోపాటు రాష్ట్రేతర ప్రాంతాల నుంచి వచ్చిన పూర్వ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉత్సవాల్లో యోగా గురువు, వ్యాయామ శిక్షకుడు, నర్సు, జర్నలిస్టులను స్వర్ణోత్సవ కమిటీ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. సమాజానికి వారు అందిస్తున్న సేవల్ని కొనియాడారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమ జీవిత భాగస్వాములతో కలిసి ప్రదర్శించిన నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మహిళల కోలాటం, వారి కుటుంబ సభ్యుల నృత్యాలు అలరించాయి. స్వర్ణోత్సవాల కమిటీ అధ్యక్షుడు టి.వాసుదేవరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి బ్రహ్మపుర ఎమ్మెల్యే కె.అనిల్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గౌరవ కార్యదర్శి జి.త్రినాథరావు, కోశాధికారి వీవీకే రాజు, కమిటీ ప్రతినిధులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

మహిళల కోలాటం

జీవిత భాగస్వాములతో కలిసి ఉత్సాహంగా డాన్స్ చేస్తున్న పూర్వ విద్యార్థులు

డీడీఆర్‌సీ ఏర్పాటుకు వినతి

సమస్య వివరిస్తున్న సంఘం సభ్యులు

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలో దివ్యాంగుల రక్షణ కేంద్రం ఏర్పాటు చేయాలని జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం కోరింది. ఈ మేరకు సోమవారం సంఘం అధ్యక్షుడు శిశిర్ రవులో, కార్యదర్శి అమరేంద్రనాథ్ తదితరులు భువనేశ్వర్‌లో సామాజిక భద్రత అదనపు కార్యదర్శి భాస్కరచంద్ర రౌయితాను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. జిల్లా సామాజిక సురక్ష అధికారి పోస్టు ఖాళీగా ఉందని, దీంతో సబ్ డివిజనల్ అధికారులపై భారం పడుతోందని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనివల్ల దివ్యాంగులకు సకాలంలో లబ్ధి చేకూరడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

సమర్థత నిరూపించుకుంటున్న దివ్యాంగులు

వేదికపై దివ్యాంగులను సత్కరిస్తున్న తిరుపతి పాణిగ్రహి. చిత్రంలో ఇతర అతిథులు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: దివ్యాంగులు అన్ని రంగాల్లో సమర్థులని, ఎందులోనూ తక్కువ కాదని తమ సమర్థత నిరూపించుకుంటున్నారని హైటెక్ వైద్య, విద్యాసంస్థల అధినేత తిరుపతి పాణిగ్రహి చెప్పారు. సోమవారం భువనేశ్వర్‌లోని బిపినిబిహారీ చౌదరి విద్యాలయం ఆవరణలో రాష్ట్రస్థాయి దివ్యాంగుల మహోత్సవం-2025 జరిగింది. నందిన్ సేవా సంస్థ చేపట్టిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న పాణిగ్రహి మాట్లాడుతూ దివ్యాంగులు ఏ పని చేపట్టినా విజయవంతంగా పూర్తి చేయగలరన్నారు. కార్యక్రమంలో ప్రముఖ సామాజిక కార్యకర్త ప్రభాష్ ఆచార్య, కరుణాకర్ నాయక్, పూరీ శంకరాచార్య ఆశ్రమం ముఖ్య కార్యదర్శి ప్రశాంత్ ఆచార్య, స్కూలు అధ్యక్షురాలు సుచరిత మిశ్ర తదితర ప్రముఖులు, దివ్యాంగులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కొంతమంది ప్రతిభావంతులకు సత్కరించారు. ఈ సందర్భంగా హైటెక్ ఆసుపత్రి వైద్యులు ఇక్కడ ఉచిత చికిత్స శిబిరం నిర్వహించారు.

లాక్‌డౌన్ సమయాన... ప్రతిభకు సాన

కుందన్లతో రూపొందించిన జగన్నాథ, బలభద్ర, సుభద్రల చిత్రాలు

మనీషా కుమారి పండా


లిప్పన్ ఆర్ట్‌తో కాళికా దేవి రూపం

బ్రహ్మపుర బజారు, న్యూస్‌టుడే: సరదాగా వేసిన చిత్రాలు, కొత్త కళాకృతులు, వ్యర్థాలతో రూపొందించిన ఆకృతులతో ఆమెకు ప్రత్యేక గుర్తింపు వచ్చింది. లాక్‌డౌన్ సమయంలో తన ప్రతిభకు తనే మెరుగులు దిద్దుకొని ప్రశంసలు అందుకొంది బ్రహ్మపుర శివారున అంబపువ ప్రాంతానికి చెందిన మనీషా కుమారి పండా. కొవిడ్ లాక్‌డౌన్ సమయంలో కళాశాలలు మూసి వేయడంతో తనలో దాగి ఉన్న కళను వెలికి తీసిందామె. తొలుత వ్యర్థ కాగితాలు, ప్లేటులు, సీడీలు, డీవీడీలు తదితరాలతో అందమైన ఆకృతులను రూపొందించింది. అవి చూసి పలువురు మెచ్చుకోవడంతో అలా కొత్త కళాకృతులను రూపొందించడం ప్రారంభించింది. పరలా మహారాజ ఇంజినీరింగ్ కళాశాలలో సివిల్ ఇంజినీరింగ్ మూడో సంవత్సరం చదువుతున్న మనీషా కుడ్య చిత్రాలు, పెయింటింగ్‌లు, దేవతామూర్తుల చిత్రాలు, కళాఖండాలు రూపకల్పనలో ఆరితేరింది. 2020లో తొలుత ఆమె వ్యర్థాలతో రూపొందించిన దుర్గాదేవి, జగన్నాథుడు కళాఖండాలకు 'నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్సు'లో స్థానం పొందింది. దీంతో ప్రస్తుతం ఆమె పెన్సిల్ డ్రాయింగ్, జానపద కళాచిత్రాలు, మండల ఆర్ట్, లిప్పన్ ఆర్ట్, తాంజోర్ ఆర్ట్‌లతో అందమైన కళాకృతులు తయారు చేస్తోంది. ఆమె కళను గుర్తించిన నిర్వాన్ ఫౌండేషన్, బ్లూహిల్ ఫౌండేషన్, మధుమాయా పాణిగ్రహి ఫౌండేషన్, ఆర్యన్ డాన్స్ అకాడమీ ప్రతిభా సమ్మాన్, ఐడల్ అవార్డులతో మనీషాను సత్కరించాయి. చిరుధాన్యాలు, వ్యర్థాలతో తయారు చేసిన 108 జగన్నాథుని ఆకృతులు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. వివిధ పండగలు, పూజలకు ప్రత్యేకంగా చిత్రాలు గీసి, కొత్త కళాకృతులు తయారు చేసి పలువురికి బహుమతులుగా అందజేయడం తనకెంతో ఆనందంగా ఉందని మనీషా చెబుతోంది. కళా ప్రతిభతోపాటు షాట్‌పుట్ అంశంలో పోటీపడుతున్న మనీషా జిల్లాస్థాయి పోటీల్లో పలు పతకాలు గెలుచుకుంది. భారత కళా సంప్రదాయాల చిత్రాలు, కొత్త కొత్త ఆవిష్కరణలతో అంతర్జాతీయ వేదికలపై గుర్తింపు పొందడమే తన లక్ష్యమని ఆమె 'న్యూస్‌టుడే'కు చెప్పారు.

నెమలి పింఛాలు, వ్యర్థాలతో తయారు చేసిన స్వామి బొమ్మ

మహిళ హత్యతో రెండు గ్రామాల మధ్య ఉద్రిక్తత

మల్కాన్‌గిరి, న్యూస్‌టుడే: నాలుగు రోజుల కిందట జరిగిన మహిళ హత్య ఘటనపై రెండు గ్రామాల మధ్య ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మల్కాన్‌గిరి జిల్లా కోరుకొండ సమితి మరివాడ పంచాయతీ రఖాలుడలో గత వారం రోజులుగా గ్రామానికి చెందిన లకే పోడియామి (51) అనే మహిళ కనిపించడం లేదని కుటుంబ సభ్యులు చాలాచోట్ల గాలించారు. రెండు రోజుల కిందట ఆమె మృతదేహం రఖాల్గుడ గ్రామం వద్ద నది సమీపంలో లభ్యం కావడంతో పోలీసులకు సమాచారం అందజేశారు. మొండెం లేని శరీరం ఉండటంతో గ్రామస్థులు, జిల్లా గిరిజన సంఘం సభ్యులు కలిసి తల దొరికినంతవరకు శవ పరీక్ష చేయరాదని, హత్య చేసిన నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. మరోపక్క గిరిజనులు ఈ హత్యను ఎం.వి.26 గ్రామస్థులు చేశారని ఆరోపిస్తున్నారు. దీనికి సంబంధించి అదివారం సాయంత్రం ఇరు గ్రామాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. సుమారు 50కి పైగా ఇళ్లలో పలువురు ప్రవేశించి వాహనాలు, ఇంటి సామగ్రి ధ్వంసం చేశారు. రెండిళ్లకు నిప్పంటించారు. ఈ ఘటనపై మల్కానిగిరి ఎస్పీ వినోద్ పాటిల్, కలెక్టర్ సోమేశ్ కుమార ఉపాధ్యాయ ఆ గ్రామానికి వెళ్లి పరిస్థితిని పరిశీలించారు. దర్యాప్తు చేసిన తరువాత నష్టపోయిన వాళ్లకి పరిహారం చెల్లిస్తామని చెప్పారు.

కోణార్క్ ఆలయంలో ఇసుకతీతకు శ్రీకారం

డ్రిల్లింగ్ పనులు ప్రారంభం

గోపాలపూర్, న్యూస్‌టుడే: శతాబ్దాల చరిత్ర, కళింగ శిల్పుల నైపుణ్యతకు అద్దం పట్టే పూరీ జిల్లాలోని కోణార్క్ సూర్యనారాయణమూర్తి ఆలయం గర్భగుడిలో ఇసుక వెలికితీత పనులు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఆదివారం పురావస్తుశాఖ (ఏఎస్ఐ)కు చెందిన 10 మంది నిపుణులు ఈ శిల్ప కళారామం పరిశీలించారు.

ఛానెల్ తవ్వకాలు

1903లో నాటి ఆంగ్ల పాలకులు కోణార్క్ ఆలయ గర్భగుడి బలహీనమైందని నిర్ధారించి ఇసుక నింపి మూసేశారు. దీంతో మందిరం లోపల శిల్ప కళా చాతుర్యాన్ని సందర్శకులు చూడలేకపోతున్నారు. కాల ప్రవాహంలో గర్భగుడిలోని ఇసుక ఒక వైపునకు చేరిందని, ఇది ముప్పుగా మారొచ్చని ఏఎస్ఐ అధికారులు గుర్తించారు. 2003లో హైకోర్టులో ఒక వ్యాజ్యం (పిల్) దాఖలైంది. ఆలయ ప్రవేశ ద్వారం తెరిపించాలని పిటిషనర్ న్యాయస్థానాన్ని కోరారు. ఈ నేపథ్యంలో 2009, 2011, 2013లలో ఐఐటీ ఖరగ్‌పూర్, దిల్లీ, చెన్నై నిపుణులతో పరిస్థితి అధ్యయనం చేయించారు. 120 ఏళ్ల తర్వాత గర్భగుడిలో ఇసుక తీయించి లోపల స్టీల్ ఫ్రేమింగ్ చేయించాలని నిర్ణయం తీసుకున్నారు. 2023 జనవరిలో ఇసుకతీత పనులకు పూజలు జరిగాయి. వెంటనే పనులు ప్రారంభించినా తర్వాత నిలిపివేశారు. దీనిపై ప్రభుత్వం ఏఎస్ఐ యంత్రాంగానికి మళ్లీ లిఖిత పూర్వకంగా తెలిపిన తర్వాత నిపుణులొచ్చారు. పనులు ప్రారంభించారు. ఏఎస్ఐ ఉన్నతాధికారి డి.బి.గడనాయక్ విలేకర్లతో మాట్లాడుతూ గర్భగుడి గోడ డ్రిల్లింగ్ చేయించి, టన్నెల్ అమర్చి ఇసుకతీతకు శ్రీకారం చుట్టినట్లు చెప్పారు.

కోణార్క్‌లో జరుగుతున్న పనులు

(c) eenadu

ముగిసిన జాతీయ సైక్లింగ్ ఛాంపియన్‌షిప్

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: ఐదు రోజులుగా సంబల్‌పూర్‌లో నిర్వహిస్తున్న 30వ జాతీయ రోడ్డు సైక్లింగ్ ఛాంపియన్‌షిప్ సోమవారం ముగిసింది. దేశ వ్యాప్తంగా 950 మంది సైక్లిస్టులు, 122 మంది అధికారులు పాల్గొన్న ఇందులో రాజస్థాన్ అత్యధిక పతకాలతో విజేతగా నిలిచింది. ముగింపు కార్యక్రమానికి అర్జున అవార్డు గ్రహీత మినాతి మహాపాత్ర, సంబల్‌పూర్ ఎమ్మెల్యే జయనారాయణ్ మిశ్ర, కలెక్టర్ సిద్ధేశ్వర్ బలిరాం బొందార్, ఎస్పీ ముకేష్‌కుమార్, భారత సైక్లింగ్ సమాఖ్య కార్యదర్శి మణీందర్ పాల్‌సింగ్ తదితరులు పాల్గొని బహుమతులు అందజేశారు. అన్ని కేటగిరీల్లో 21 పతకాలతో రాజస్థాన్ విజేతగా నిలవగా, మహారాష్ట్ర 12, హరియాణా 11 పతకాలతో తరువాత స్థానాల్లో నిలిచాయి. ఒడిశాకు మూడు పతకాలు దక్కాయి.

ట్రోఫీతో అతిథులు, విజేతలు

పరబ్ వేడుకల్లో విద్యార్థినుల సత్తా

సిమిలిగుడ, న్యూస్‌టుడే: పరబ్ వేడుకల్లో సునాబెడ మహిళా కళాశాల బహుమతుల పంట పండింది. జిల్లా సిమిలిగుడ సమితి, సునాబెడ పురపాలక సంస్థ స్థాయి పరబ్ వేడుకల్లో మహిళా కళాశాల విద్యార్థినులు క్రీడ సాంస్కృతిక పోటీల్లో పాల్గొని పలు బహుమతులు గెలుచుకున్నారు. సోమవారం కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో విజేతలను ప్రిన్సిపల్ ఉషారాణి దాస్, అధ్యాపకులు అభినందించారు.

విజేతలతో ప్రిన్సిపల్ ఉషా, అధ్యాపకులు

విశిష్ట సేవలకు సత్కారం

సిమిలిగుడ, న్యూస్‌టుడే: దమన్‌జోడికి చెందిన సర్వోదయ విద్యాలయ దివ్యాంగులు, రక్తదాతల సంఘం అధ్యక్షుడు, జిల్లా యూత్ రెడ్‌క్రాస్ కోఆర్డినేటర్ నరేష్‌చంద్ర సాహుకు నవరంగపూర్‌లో సత్కారం జరిగింది. స్థానిక ప్రభుత్వ కళాశాలలో భారతీయ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా నిర్వహించిన జిల్లా స్థాయి యూత్ రెడ్‌క్రాస్ శిక్షణ శిబిరంలో ఆదివారం వివిధ రంగాల్లో రాణించిన ప్రతిభావంతులను సత్కరించారు. నవరంగపూర్ సంఘ సేవకులు జగన్నాథ్ మహాపాత్ర్, ప్రిన్సిపల్ గోవిందరావు, జిల్లా సమన్వయకర్త దిలీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నరేష్‌చంద్ర సాహుకు సత్కరిస్తున్న దృశ్యం

బెంగాల్‌లో ఎన్నికల సందడి

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో 2026 శాసనసభ ఎన్నికలకు తృణమూల్ కాంగ్రెస్, భాజపా, కాంగ్రెస్ వామపక్ష కూటమి పార్టీలు సమాయత్తమవుతున్నాయి. కార్యకర్తలతో వరుస సమావేశాలు నిర్వహించి ఎన్నికల్లో ఏ అంశాలపై దృష్టి పెట్టి సాగించాలనే అనే వాటిపై అగ్ర నాయకులు దిశా నిర్దేశం చేస్తున్నారు. గ్రూపు తగాదాలు విడిచిపెట్టి కలిసిమెలిసి ఐక్యతగా సాగాలని పార్టీ నాయకులకు సూచిస్తున్నారు.

ప్రజా సమస్యలపై వినతుల స్వీకరణ

పర్లాఖెముండి, రాయగడ గ్రామీణం, మునిగుడ, జయపురం, న్యూస్‌టుడే: గజపతి జిల్లా నువాగడ సమితి రూసింగి గ్రామంలో సోమవారం ఇన్‌ఛార్జ్ కలెక్టర్, రెవెన్యూ ఏడీఎం మునీంద్ర అధ్యక్షతన వినతుల స్వీకరణ కార్యక్రమం జరిగింది. ఎస్పీ జెకె పండా, సబ్ కలెక్టర్ అనూప్ పండా, సమితి అధ్యక్షురాలు మాలతీ ప్రధాన్ పాల్గొని 69 ఫిర్యాదులు స్వీకరించారు. రాయగడ జిల్లా పాలనాధికారి అశుతోష్ కులకర్ణి మునిగుడ సమితి కార్యాలయంలో 76 వినతులు స్వీకరించారు.

పర్లాఖెముండిలో ఫిర్యాదులు పరిశీలిస్తున్న రెవెన్యూ ఏడీఎం మునీంద్ర, సబ్ కలెక్టర్ అనూప్

మహిళల భద్రతపై చైతన్య ప్రదర్శన

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: మహిళలపై జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా 16 రోజుల అభియాన్‌లో భాగంగా సోమవారం బ్రహ్మపుర రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాంపై చైతన్య ప్రదర్శన నిర్వహించారు. గంజాం జిల్లా యంత్రాంగం, ఎవిడెన్స్ స్వచ్ఛంద సంస్థ, ఒన్‌స్టాప్ సెంటర్ సఖి, శక్తిసదన్ సంయుక్త ఆధ్వర్యంలో ఇది ఏర్పాటైంది. మహిళల భద్రత, మహిళల అక్రమ రవాణా తదితర అంశాలపై నిర్వాహక సంస్థల ప్రతినిధులు మాట్లాడారు.

రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాంపై ప్రదర్శనలో అధికారులు, నిర్వాహక సంస్థల ప్రతినిధులు

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండండి

రాయగడ, న్యూస్‌టుడే: మన ప్రమేయం లేకుండా బ్యాంక్ ఖాతాల్లోని నగదును క్షణాల్లో మాయం చేసే సైబర్ నేరగాళ్ల విషయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని చందిలి ఐఐసీ ఉత్తమ్‌కుమార్ సాహు అన్నారు. సోమవారం జడ్పీ సమావేశ భవనంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి మీనతి అధ్యక్షతన ఆన్‌లైన్ భద్రత, సైబర్ నేరాలపై ఏర్పాటు చేసిన అవగాహన శిబిరంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. జాతీయ సమాచార కేంద్రం జాయింట్ డైరెక్టర్ గుణశేఖర్, లీడ్ బ్యాంక్ మేనేజర్ రాజేష్‌దే తదితరులు పాల్గొన్నారు.

ఆహార నాణ్యతపై తనిఖీలు

కొరాపుట్, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలో పర్యాటకులు, స్థానికులకు నాణ్యమైన, ఆరోగ్యకరమైన భోజనాన్ని అందించాలన్న లక్ష్యంతో పురపాలక, ఆరోగ్య, పోలీసు విభాగాల అధికారులతో ఏర్పాటైన ప్రత్యేక బృందం జిల్లా కేంద్రంలోని ఆసుపత్రులు, హోటళ్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తోంది. అవసరమైన చోట భారీ జరిమానాలు విధిస్తున్నట్లు పురపాలిక జ్ఞానరంజన్ త్రిపాఠి తెలిపారు.

పంచాయతీ సమస్యలపై రాస్తారోకో

రాయగడ గ్రామీణం, న్యూస్‌టుడే: కాశీపూర్ సమితిలోని గోరఖ్‌పూర్ పంచాయతీ కేంద్రంలో సోమవారం గ్రామస్థులు రాస్తారోకో చేపట్టారు. పంచాయతీలో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేశారు. ఉదయం 6 నుంచి సాయంత్రం వరకు 12 గంటల పాటు సాగిన నిరసన కారణంగా కాశీపూర్-డొంగశిలి-గోరఖ్‌పూర్ మధ్య వాహన దారుల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

డిమాండ్లతో నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

ప్రయాణికుల ఇబ్బందులు పట్టించుకోండి

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: రైల్వే ప్రయాణికుల ఇబ్బందులు ఆ శాఖ అధికారులు పట్టించుకోవాలని పశ్చిమ మిడ్నాపూర్ సీపీఐ జిల్లా కమిటీ సభ్యుడు వి.శేషగిరిరావు పేర్కొన్నారు. ప్రధాన రైళ్లు కచ్చితంగా వచ్చే ఫ్లాట్ ఫాంల వివరాలు చివరి క్షణం వరకు తెలియడం లేదని, దీంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

జిల్లాస్థాయి నాటక పోటీలు

నవరంగపూర్, న్యూస్‌టుడే: మండేయి మహోత్సవం సందర్భంగా పట్టణంలోని టౌన్‌హాలులో జిల్లాస్థాయి నాటక పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. మొదటిరోజు జగన్నాథ్ బెహరా దర్శకత్వంలో చేసిన 'తితిలి' నాటకం ప్రేక్షకులను అలరించింది. మా బండారమ్మ ఆలయంలో కళాకారులు పూజలు నిర్వహించి పోటీల్లో పాల్గొన్నారు. అదనపు జిల్లా పాలనాధికారి తపన్‌కుమార్ ఖుంటియా, జిల్లా సాంస్కృతిక అధికారి ఘస్నీమా హరిజన్ తదితరులు హాజరయ్యారు. ● మండేయి ఉత్సవాల్లో భాగంగా నవరంగపూర్ మహిళా డిగ్రీ కళాశాలలో మెహందీ పోటీలు సోమవారం ఉత్సాహంగా జరిగాయి. కళాశాల అధ్యక్షురాలు సంజుక్తా పండా అధ్యక్షతన జరిగిన ఈ పోటీల్లో 50 మంది విద్యార్థినులు, స్థానిక మహిళలు పాల్గొన్నారు. విజేతలకు మండేయి ఉత్సవాల్లో బహుమతులు అందజేస్తామని పండా తెలిపారు.

రక్తదాన శిబిరానికి స్పందన

రక్తదానం చేస్తున్న దాతలు

సిమిలిగుడ, న్యూస్‌టుడే: సునాబెడ విద్యుత్తుశాఖ, ఆమో ఒడిశా, సంబాద్ సంస్థలు సంయుక్తంగా సోమవారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటుచేశాయి. విద్యుత్తు శాఖ ఎస్‌డీవో గోపాల్‌కృష్ణ ప్రధాన్ శిబిరాన్ని ప్రారంభించారు. కొరాపుట్ రక్తనిధి అధికారుల పర్యవేక్షణలో 15 యూనిట్లు రక్తాన్ని సేకరించారు. జూనియర్ ఇంజినీర్ గణేష్ సుమంత్ అధ్యక్షతన సంబద్ జయపురం యూనిట్ చీఫ్ నవీన్‌చంద్ర సాహు తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు

చిత్రలేఖన పోటీ విజేతలకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేస్తున్న పాలనాధికారి

జయపురం, న్యూస్‌టుడే: పరబ్ ఉత్సవంలో భాగంగా ఆదివారం జయపురం పట్టణంలో జరిగిన చిత్రలేఖన పోటీల్లో విజేతలకు సోమవారం పాలనాధికారి మనోజ్ సత్యవన్ జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. సబ్‌కలెక్టర్ సస్యరెడ్డి, పురాధ్యక్షుడు నరేంద్ర మహంతి తదితరులున్నారు. ● పరబ్ ఉత్సవం సందర్భంగా జయపురంలోని కల్యాణ మండపంలో జిల్లాస్థాయి సంగీత పోటీలు జరిగాయి. కొరాపుట్ కళలు, కళాకారుల తరపున జరిగిన పోటీలకు ముఖ్య అతిథులుగా పురాధ్యక్షుడు నరేంద్ర మహంతి, బీడీఓ శక్తిమహాపాత్రలు పాల్గొన్నారు. ●జయపురం సమితి కుములిపుట్ పంచాయతీ దండ సేనాగూడలో మాహాండి ఠాకురాణి ఫుట్‌బాల్ టోర్నమెంట్ ప్రారంభమైంది. ఈ నెల 11న జరగనున్న ఈ లీగ్‌లో 16 జట్లు తలపడనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆరంభ మ్యాచ్‌లో కొరాపుట్, జగదల్‌పూర్ పోటీపడగా కొరాపుట్ విజేతగా నిలిచింది. ముఖ్యఅతిథిగా హాజరైన బిజద నేత ధన్‌ఖరా హాజరై టోర్నమెంట్‌ను ప్రారంభించారు.

ఘనంగా అయ్యప్ప ఇరుముడి: మాచ్‌ఖండ్: సమితిలోని ఒనకడిల్లీ ముక్తేశ్వర ఆలయంలో అయ్యప్ప నామస్మరణ మారుమోగింది. సోమవారం 15 మంది అయ్యప్ప దీక్షధారులు ఇరుముళ్లు ధరించి శబరిమలకు పయనమయ్యారు. ప్రత్యేక పూజల నంతరం పీఠం గురుస్వామి బి.రామారావు దీక్షదారులకు ఇరుముడులు కట్టారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు.

EENADU Classifieds
JOBS
అమెరికాలో 1 సం|| బాబు ఆలన, పాలన వ్యక్తిగత సంరక్షణ కొరకు అనుభవంగల ఆడవారు కావలెను. అమెరికా వీసా కల్గినవారు మాత్రమే. ✆ 9440803362

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప. ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

గుమ్మ ప్రాంతంలో ఏనుగుల సంచారం

రాయగడ గ్రామీణం, న్యూస్‌టుడే: రాయగడ జిల్లా కళ్యాణ సింగుపూర్ సమితిలోని గుమ్మ ప్రాంతంలో ఏనుగుల గుంపు సంచరిస్తోంది. ఆదివారం రాత్రి గ్రామ పొలిమేరలో కనిపించినట్లు స్థానికులు తెలిపారు. ఎవరికీ ఎలాంటి హాని తలపెట్టకుండా సమీప కొండ ప్రాంతంలోకి వెళ్లిపోయాయని చెప్పారు. సమాచారం తెలుసుకున్న కె.సింగుపూర్ అటవీ శాఖ అధికారులు సోమవారం ఉదయం గ్రామానికి చేరుకుని అక్కడి వారితో మాట్లాడారు. ఏనుగులు సంచరించే ప్రాంతాన్ని పరిశీలించి ఆనవాళ్లను సేకరించారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97609
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80081 11237

బిజయ కుమార్ రెడ్డికి బహుమతి ప్రదానం

● వాతావరణ అధ్యయన కేంద్రం 'క్యాలెండర్ డిజైన్' పోటీల్లో విజేత

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: కేంద్ర వాతావరణ అధ్యయన కేంద్రం 'ఐఎండీ 150 సంవత్సరాలు' సందర్భంగా నిర్వహించిన జాతీయ స్థాయిలో 'క్యాలెండర్ డిజైన్ పోటీ' నిర్వహించింది. ఇందులో గంజాం జిల్లాకు చెందిన సూక్ష్మ కళాకృతుల కళాకారుడు కె.బిజయ కుమార్ రెడ్డి జాతీయ స్థాయిలో మొదటి స్థానంలో నిలిచారు. భువనేశ్వర్‌లోని వాతావరణ అధ్యయన కేంద్రం కార్యాలయంలో సోమవారం విజేత బిజయ రెడ్డికి రూ.5 వేల నగదు పురస్కారంతోపాటు జ్ఞాపిక అందజేసి సత్కరించారు. కేంద్రం సంచాలకురాలు మనోరమ మహంతి, ఇతర అధికారులు పాల్గొని, వీటిని అందజేశారు. కేంద్ర వాతావరణ అధ్యయన కేంద్రం డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ మహాపాత్ర్ తరఫున కూడా ధ్రువపత్రం, ప్రత్యేక షీల్డ్‌ను రెడ్డికి బహుమతిగా అందజేశారు. వృత్తిరీత్యా రాష్ట్రంలోని ప్రైవేటు విద్యుత్తు సరఫరా సంస్థలో ఇంజినీరుగా పని చేస్తున్న బిజయ కుమార్ రెడ్డి ఇటీవల 1.13 మిల్లీమీటర్ల ఎత్తున తీర్చిదిద్దిన 'కలప స్పూన్ (చెమ్చా) సూక్ష్మ కళాకృతి 'గిన్నిస్ వరల్డ్ రికార్డు'ల్లో స్థానం సంపాదించింది.

కళాకారుడు బిజయ కుమార్ రెడ్డికి జ్ఞాపిక అందజేస్తున్న కేంద్రం సంచాలకురాలు మనోరమ మహంతి తదితరులు

మండీలు తెరవకుంటే ఆందోళనే

రైతులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి రబినారాయణ నందో

జయపురం, న్యూస్‌టుడే: జయపురం ఆర్ఎంసీ యార్డ్ సమీపంలో మాజీ మంత్రి రబినారాయణ నందో నేతృత్వంలో రైతులతో సమీక్షా సమావేశం సోమవారం జరిగింది. ఉమురి ల్యాంప్స్ ఆధీనంలో ఉన్న 11 పంచాయతీలకు చెందిన వందలాది మంది రైతులు కార్యక్రమంలో పాల్గొన్నారు. జిల్లాలో 90 శాతం కోతలు పూర్తయ్యాయని, ఇప్పటివరకు మండీలు తెరవలేదని అన్నదాతలు అసంతృప్తి వ్యక్తం చేశారు. త్వరగా మండీలు ప్రారంభించకుంటే రాస్తారోకో చేస్తామని హెచ్చరించారు. క్వింటాల్‌కు రూ. 2379, అదనపు బోనస్ రూ. 800 ఇవ్వాలని డిమాండ్ చేశారు.

లక్ష్మీబాయికి సన్మానం

లక్ష్మీబాయికి జగన్నాథుని కలప కళాకృతిని అందజేస్తున్న మంత్రి బిభూతి జెనా.

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: బ్రహ్మపురకు చెందిన ప్రముఖ స్త్రీ రోగ, ప్రసూతి నిపుణురాలు డాక్టర్ కె.లక్ష్మీబాయిని ఆదివారం రాత్రి స్థానిక బాబానగర్‌లోని ఆమె నివాసంలో ఉక్కు గనులు, రవాణా శాఖల మంత్రి బిభూతి భూషణ్ జెనా కలిసి సత్కరించారు. జగన్నాథుని కలప కళాకృతిని ఆమెకు అందజేసి కొంతసేపు ముచ్చటించారు. కార్యక్రమంలో భాజపా నాయకులు కన్హుచరణ పతి తదితరులు పాల్గొన్నారు. తన 100వ పుట్టిన రోజు నేపథ్యంలో డాక్టర్ లక్ష్మీ బాయి మహిళల క్యాన్సర్ చికిత్సల కోసం భువనేశ్వర్‌లోని ఎయిమ్స్‌కు ఆమె రూ. 3.40 కోట్లు విరాళంగా ఇచ్చిన సంగతి తెలిసిందే.

కొరాపుట్ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా సందీప్

సిమిలిగుడ, న్యూస్‌టుడే: కొరాపుట్ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా సందీప్ సామంత్రాయ్ ఆదివారం రాత్రి నియమితులయ్యారు. రాష్ట్రంలో 9 జిల్లాల యువజన కాంగ్రెస్ అధ్యక్షుల నియామకం చేసినట్లు కాంగ్రెస్ రాష్ట్ర యువజన విభాగం ఒక ప్రకటన విడుదల చేసింది. జిల్లాకు సంబంధించి యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా మరోసారి సందీప్‌నకు అవకాశం దక్కింది. ఈ సందర్భంగా జయపురం, పొట్టంగి, లక్ష్మీపూర్ ఎమ్మెల్యేలు తారా ప్రసాద్ వాహినిపతి, రామ్‌చంద్ర కడం, పవిత్ర శాంత, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు రూపాక్ తురుక్ తదితరులు అభినందించారు.

జిల్లాలో బిజదను బలోపేతం చేయండి

సిమిలిగుడ, న్యూస్‌టుడే: కొరాపుట్ జిల్లాలో బిజూ జనతా దళ్‌ను బలోపేతం చేయాలని మాజీమంత్రి, పార్టీ ముఖ్యనేత సంజయ్‌దాస్ వర్మ అన్నారు. జిల్లా కేంద్రంలో పార్టీ ముఖ్య నాయకులతో సోమవారం సమావేశం నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు జీను హికాక, మాజీ ఎమ్మెల్యేలు ప్రీతమ్ పాడి, రఘురామ్ పడాల్, మహిళా అధ్యక్షురాలు పార్వతి మస్తీ, యువజన నేతలు అశోక్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు దేవ్‌మాలి, తోలోమాలి పర్వతాలు, భారతమాల రహదారి టన్నెల్, కొరాపుట్‌లో మరి కొన్ని పర్యాటక కేంద్రాలు సందర్శించారు.

అథ్లెటిక్స్‌లో మెరిసిన అబ్కారీ విశ్రాంత అధికారి

పతకాలు చూపిస్తున్న కిశోర్ చంద్ర రథ్

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: తెలంగాణలోని ఉస్మానియా వర్సిటీ మైదానంలో ఆదివారం జరిగిన 7వ సీనియర్ సిటిజన్ ఓపెన్ అథ్లెటిక్స్ ఛాంపియన్-2025 పోటీల్లో గజపతి జిల్లాకు చెందిన అబ్కారీ విశ్రాంత అధికారి కిశోర్ చంద్ర రథ్ పతకాల మోత మోగించారు. 100 మీటర్ల పరుగు పందెంలో కాంస్యం, ట్రిపుల్ జంప్‌లో రజత పతకాలను కైవసం చేసుకున్నట్లు 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

ఖేలో ఇండియా మహిళా హాకీ లీగ్ విజేత ఒడిశా నేవల్ టాటా

ఛాంపియన్ బహుమతితో ఒడిశా నేవల్ టాటా క్రీడాకారిణులు. చిత్రంలో అతిథులు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: భువనేశ్వర్‌లోని కళింగ మైదానంలో ఆదివారం జరిగిన ఖేలో ఇండియా మహిళా హాకీ సిటీ లీగ్-2025 పోటీల్లో ఒడిశా నేవల్ టాటా హాకీ హెచ్‌పీసీ కేంద్రం క్రీడాకారిణులు విజేతగా నిలిచారు. రెండోస్థానంలో కిట్, కిస్, మూడో స్థానంలో కటక్ జట్టు నిలిచింది. పోటీల అనంతరం మైదానంలో నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో అతిథులుగా హాజరైన రాష్ట్ర క్రీడాశాఖ అదనపు కార్యదర్శి బీకే స్వయిన్, ఉపకార్యదర్శి సౌమ్య సార్థక్ మిశ్ర, ఒడిశా హాకీ సంఘం కార్యదర్శి సనాతన్ సాహు వరుసగా మూడు స్థానాల్లో నిలిచిన జట్లకు పసిడి, రజత, కాంస్య పతకాలతోపాటు ట్రోఫీలు ప్రదానం చేశారు

క్రీడాకారులకు..సైకత శుభాకాంక్షలు

సుబల మహరాణా తీర్చిదిద్దిన సైకత శిల్పం

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: కటక్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 9 నుంచి 14 వరకు ఒడిశా మాస్టర్స్ బీడబ్ల్యూఎఫ్ టూర్ సూపర్ 100 బ్యాడ్మింటన్ సిరీస్ జరగనుంది. ఈ నేపథ్యంలో వివిధ దేశాల నుంచి రాష్ట్రానికి చేరుకుంటున్న మాస్టర్ క్రీడాకారులకు రాష్ట్ర క్రీడా శాఖ ఘనస్వాగతం పలుకుతోంది. ఈమేరకు భువనేశ్వర్‌లోని విమానాశ్రయంలో సీనియర్ చిత్రకారుడు, సైకత కళాకారుడు సుబల మహరణా ఆదివారం ఓ సైకత కళా రూపాన్ని తీర్చిదిద్దారు. పోటీల్లో 22 రాష్ట్రాల నుంచి 400 మంది వరకు క్రీడాకారులు తలపడనున్నట్లు నిర్వాహకులు చెప్పారు.

అంతర కళాశాలల అథ్లెటిక్స్ ఛాంపియన్ ఆదివాసీ కళాశాల

బృంద ఛాంపియన్, ఇతర బహుమతులతో ఆదివాసీ కళాశాల క్రీడాకారులు: చిత్రంలో అతిథులు తదితరులు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: బ్రహ్మపుర విశ్వవిద్యాలయం క్రీడల మండలి ఆధ్వర్యంలో భంజవిహార్ క్రీడామైదానంలో రెండురోజులు జరిగిన 57వ అంతర కళాశాలల అథ్లెటిక్స్ పోటీలు సోమవారం సాయంత్రం ముగిశాయి. ఇందులో వివిధ క్రీడాంశాల్లో ఎక్కువ పతకాలు గెలుచుకుని ఓవరాల్ ఛాంపియన్లుగా ఆదివాసీ కళాశాల (బలిగుడ) విద్యార్థులు, గాంధీ గ్లోబర్ బిజినెస్ స్టడీస్ విద్యార్థినులు నిలిచారు. వ్యక్తిగత ఛాంపియన్లుగా నిర్మల్ జెనా, అభిసిస్, సొనాలి బొడెయి ప్రత్యేక బహుమతులందుకున్నారు.

సందడిగా స్పందన సాహితీ సాంస్కృతిక సంస్థ వార్షికోత్సవం

వేణును సత్కరించి జ్ఞాపిక అందిస్తున్న స్పందన నిర్వాహకులు

రాయగడ, న్యూస్‌టుడే: రాయగడలోని రామలింగేశ్వర ఆలయ కల్యాణ మండపంలో ఆదివారం రాత్రి స్పందన సాహితీ సాంస్కృతిక సంస్థ వార్షికోత్సవం సందడిగా సాగింది. ఈ కార్యక్రమానికి విశాఖకు చెందిన ప్రముఖ కవి కేజీ వేణు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అధ్యక్షుడు గుడ్ల గౌరీశంకర ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సభలో పురాధ్యక్షుడు మహేశ్ పట్నాయక్, కార్యదర్శి పతివాడ తులసీదాస్ పాల్గొన్నారు. ఈసందర్భంగా స్పందన నృత్య పాఠశాల విద్యార్థినుల కూచిపూడి నృత్యాలు అలరించాయి. స్థానిక యువ ఇంద్రజాలికుడు పి.మురళీ కృష్ణ పట్నాయక్ ఇంద్రజాల ప్రదర్శన అబ్బురపరిచింది. అతిథులను, కళాకారులను సత్కరించారు. పెద్ద సంఖ్యలో ప్రేక్షకులు హాజరయ్యారు.

నకిలీ కరెన్సీ పేరిట రూ.10 లక్షలు టోకరా

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: ప్రస్తుత రోజుల్లో సరికొత్త ఎత్తుగడలతో మోసాలకు పాల్పడుతున్నారు. శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలో నకిలీ కరెన్సీ పేరిట రూ.10 లక్షలు అసలు నోట్లు పట్టుకుపోయిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే ఒడిశా రాష్ట్రం మంత్రిడి ప్రాంతానికి చెందిన లక్ష్మణరావుకు అజ్ఞాత వ్యక్తులు వాట్సాప్ కాల్ చేసి పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి ఉంటే అసలైన కరెన్సీ తీసుకొస్తే అయిదింతలు నకిలీ నోట్లు ఇస్తామని నమ్మబలికారు. దీంతో ఆయన ఆశపడి రూ.10 లక్షలు ఇచ్చేందుకు ఒప్పుకున్నారు. నగదు తీసుకొని పలాస సమీప మొగిలిపాడు జాతీయ రహదారిపై రావాలని సదరు వ్యక్తులు చెప్పడంతో అక్కడికి చేరుకున్నారు. ముఖానికి వస్త్రం కట్టుకుని ఇద్దరు వ్యక్తులు ద్విచక్రవాహనంపై వచ్చి వారితో తీసుకొచ్చిన సంచిని లక్ష్మణరావు కారులో పెట్టి నగదు తీసుకున్నారు. ఇందులో రూ.50 లక్షలు విలువ చేసే నకిలీ నోట్లు ఉంటాయని తాము వెళ్లిపోయాక సరి చూసుకోవాలని చెప్పి అక్కడ నుంచి ఉడాయించారు. వారు వెళ్లిపోయాక చూడగా అందులో పుస్తకాలు ఉన్నట్లు గుర్తించి, మోసం జరిగిందని తెలుసుకొని లబోదిబోమంటూ ఆ యువకులు పారిపోయిన మార్గంలో కొంత దూరం వెళ్లినప్పటికీ వారి జాడ తెలియరాలేదు. దీనిపై మరింత సమాచారం అందాల్సి ఉందని కాశీబుగ్గ సీఐ వై.రామకృష్ణ పేర్కొన్నారు.

వాహనం అదుపు తప్పి ఒకరి మృతి

జయపురం, న్యూస్‌టుడే: వాహనం అదుపు తప్పి ఒకరు మృతిచెందగా, మరొకరు గాయపడిన ఘటన జయపురం పట్టణం భూత్‌నగర్ శ్మశానం వద్ద జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బొయిపరిగూడ ఠాణా పరిధిలో కర్ణగూడ గ్రామానికి చెందిన బలి(36), చైతన్య ఆదివారం రాత్రి ద్విచక్ర వాహనంపై జయపురం నుంచి స్వగ్రామానికి వెళుతుండగా వాహనం అదుపు తప్పి ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో బలి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. చైతన్య పరిస్థితి విషమించడంతో కొరాపుట్ ఆసుపత్రికి తరలించారు.

రైలు ఢీకొని ఐఐటీ విద్యార్థి మృత్యువాత

భట్టారం శ్రవణ్ పాతచిత్రం

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: రైలు ఢీకొని ఐఐటీ విద్యార్థి మృతిచెందిన ఘటన ఖరగ్‌పూర్ పట్టణంలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి జిల్లాకు చెందిన భట్టారం శ్రవణ్ ఐఐటీలో రీసెర్చ్ స్కాలర్‌గా ఉన్నారు. శనివారం రాత్రి శ్రవణ్ ఐఐటీ సమీపంలోని రైల్వే ట్రాక్ దాటుతుండగా రైలు ఢీకొని గాయపడ్డాడు. విద్యార్థిని ఖరగ్‌పూర్ సబ్ డివిజన్ ఆసుపత్రికి, అక్కడ నుంచి కోల్‌కతాలో ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందినట్లు ఐఐటీ అధికారులు తెలిపారు.

చికిత్స పొందుతూ యువతి కన్నుమూత

భువనేశ్వర్, న్యూస్‌టుడే: సుందర్‌గఢ్ జిల్లా రాజగంగపూర్ పరిధిలోని సిందుతెరంగ గ్రామానికి చెందిన యువతి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందింది. శుక్రవారం సిందుతెరంగ గ్రామానికి చెందిన ప్లస్ త్రీ విద్యార్థిని శరీరంపై కిరోసిన్ పోసుకుని ఆత్మాహుతికి ప్రయత్నించిన సంగతి తెలిసిందే. 90 శాతం శరీరం కాలిపోగా రవుర్కెలా ఐజీహెచ్ ఆసుపత్రిలో చికిత్సకు చేర్పించారు. యువతి మృతి పట్ల విపక్ష నేత నవీన్‌పట్నాయక్ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కాలంలో యువతుల ఆత్మాహుతి ఘటనలు పెరిగాయని, ఇది ఆందోళనకరమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ బాధిత కుటుంబానికి రూ.4 లక్షల ఆర్థిక సాయం ప్రకటించారు.

విలేకరి దుర్మరణం

భువనేశ్వర్, న్యూస్‌టుడే: సంబల్‌పూర్ జిల్లా రెఢాఖోల్‌కు చెందిన ఒక టీవీ ఛానెల్ విలేకరి రమాకాంత్ మహానంద (35) సోమవారం సాయంత్రం రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. ద్విచక్ర వాహనంపై వెళుతూ నకొటి, దెవుళొ వద్ద అదుపు తప్పి చెట్టును ఢీకొనడంతో గాయాలయ్యాయి. ఆయనను బుర్లా విమ్సార్ ఆసుపత్రిలో చికిత్సకు చేర్పించారు. రమాకాంత్ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

మోపెడ్‌ను ఢీకొని యువకుడు..

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా అస్కా ఠాణా పరిధిలోని కొయిపురియా కూడలి వద్ద సోమవారం ఓ మోపెడ్‌ను సరకు వాహనం ఢీకొంది. ఈ దుర్ఘటనలో ముకుందపూర్ గ్రామానికి చెందిన మోపెడ్ చోదకుడు శిబ బిశ్వాళ్ (22) తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు ఆయన చికిత్సకు అస్కాలోని సబ్ డివిజనల్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం పరిస్థితి విషమించడంతో స్థానిక ఎమ్కేసీజీ ఆసుపత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యంలోనే బిశ్వాళ్ మృతిచెందాడు.

పరిశ్రమలో అగ్ని ప్రమాదం

ఎగిసిన పడుతున్న మంటలు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: కటక్ నగరం పరిధిలోని జగత్‌పూర్‌కి చెందిన ఒక పాలిథిన్ తయారీ కేంద్రంలో సోమవారం అగ్నిప్రమాదం జరిగింది. రూ.లక్షల విలువ చేసే సంపద కాలి బూడిదైంది. అగ్నిమాపక శాఖ సిబ్బంది చేరుకుని మంటలు నియంత్రించారు. విద్యుత్తు షార్ట్ సర్క్యూట్ వల్ల ఈ ఘటన జరిగినట్లు తెలిసింది. ● బొలంగీర్ జిల్లా పాలనాధికారి కార్యాలయానికి చేరువలోని పళ్ల మార్కెట్‌లో సోమవారం సాయంత్రం అగ్ని ప్రమాదం జరిగింది. సుమారు 50 దుకాణాలు కాలి బూడిదయ్యాయి. అగ్నిమాపక శాఖ సిబ్బంది చేరుకొని మంటలు నియంత్రణలోకి తెచ్చారు. విద్యుత్తు షార్ట్ సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం జరిగినట్లు తెలిసింది.

ఒకే రాత్రి రెండు చోరీయత్నాలు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా అస్కా ఠాణా పరిధిలో నువాగావ్‌లోని చక్కెర పరిశ్రమ సమీపాన ఆదివారం అర్ధరాత్రి రెండుచోట్ల చోరీయత్నాలు జరిగాయి. అస్కా కేంద్ర సహకార బ్యాంకు నువాగావ్ శాఖ, సమీపంలోని సబ్ పోస్టాఫీసు కార్యాలయం తాళాల్ని విరిచి, చోరీకి ప్రయత్నించి విఫలమయ్యారు. దీనిపై ఆయా సంస్థల అధికారుల ఫిర్యాదు మేరకు సోమవారం ఠాణా అధికారి కళమణి సెఠి సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

ప్లాస్టిక్ క్రికెట్ బ్యాట్‌లలో గంజాయి అక్రమ రవాణా

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతున్న నిందితులు సరికొత్త మార్గాలు అన్వేషిస్తున్నారు. తాజాగా ప్లాస్టిక్ క్రికెట్ బ్యాట్‌లు, బ్యాక్‌ప్యాక్ సంచుల్లో ప్రత్యేక అరల్లో రహస్యంగా రవాణా చేస్తున్న గంజాయిని ఆర్‌పీఎఫ్, సీఐబీ ఖుర్దా రోడ్ సహకారంతో బ్రహ్మపుర జీఆర్పీ ఠాణా అధికారులు ఆదివారం స్వాధీనం చేసుకుని, ఇద్దరు నిందితుల్ని అరెస్టు చేసి న్యాయస్థానానికి తరలించారు. వారు ముర్షిదాబాద్ (పశ్చిమబెంగాల్) జిల్లాకు చెందిన అలీ హొస్సేన్ (22), రోని షేక్ (19)లని జీఆర్పీ ఠాణా అధికారులు సోమవారం విలేకరులకు చెప్పారు. నిందితుల నుంచి పది ప్లాస్టిక్ క్రికెట్ బ్యాట్‌లు, 23 బ్యాక్‌పాక్ సంచుల్లో 17 కిలోల 500 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని వారు పేర్కొన్నారు.

ట్రాక్టర్ సహా 9 ఎకరాల పంట దగ్ధం

నవరంగపూర్, న్యూస్‌టుడే: అగ్ని ప్రమాదం జరిగి వరి చేను, ట్రాక్టర్ కాలి బూడిదైన ఘటన నవరంగపూర్ జిల్లా రాయ్‌ఘర్ సమితి దుంగియాడిహి గ్రామంలో జరిగింది. వివరాల్లోకి వెళితే గ్రామానికి చెందిన రోహిత్‌దాస్ గండ్, బాబుదాస్ గండ్, గాంధీరామ్ గండ్ సోమవారం వరి పంట కోతకు ఛత్తీస్‌గఢ్ నుంచి ఓ ట్రాక్టర్‌ను అద్దెకు తీసుకొచ్చారు. పంట కోస్తుండగా హఠాత్తుగా అగ్నిప్రమాదం చోటుచేసుకుని 9 ఎకరాల్లో వరితోపాటు ట్రాక్టర్ దగ్ధమైంది. స్థానికులు రాయ్‌ఘర్ అగ్నిమాపక శాఖకు సమాచారం ఇవ్వగా సిబ్బంది మంటలను అదుపు చేసేసరికి పంట బూడిదైంది. అధికారులు స్పందించి నష్టపరిహారం అందజేయాలని కోరుతున్నారు.

నాటు తుపాకీ స్వాధీనం

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: నాటు తుపాకితో ఓ వ్యక్తిని ఖరగ్‌పూర్ పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం రాత్రి తమకు అందిన రహస్య సమాచారం మేరకు ఓ కారును వెంబడించి అతుల్ మనీ పాఠశాల దగ్గర పట్టుకున్నట్లు ఎస్‌డీపీవో ధీరజ్ ఠాకూర్, పట్టణ పోలీస్ స్టేషన్ అధికారి పార్థసారథి సోమవారం మీడియాకు తెలిపారు.

(c) eenadu

వేడుకగా సంతోషిమాత ఆలయ వార్షికోత్సవం

పూజలందుకుంటున్న అమ్మవారు

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: ఇచ్ఛాపురం పట్టణ పొలిమేరలో కొలువుదీరిన సంతోషిరూపాదేవి ఆలయ వార్షికోత్సవం వైభవంగా నిర్వహించారు. సోమవారం వార్షికభక్తులు మాటూరి చినసూర్యారావు, లక్ష్మీ దంపతుల ఆధ్వర్యంలో వేడుకలు ప్రారంభమయ్యాయి. పాలు, కొబ్బరినీటితో అమ్మవారికి భక్తులే స్వయంగా అభిషేకించి, పూజలు చేశారు. చినసూర్యారావు దంపతులు అమ్మవారికి పట్టు వస్త్రాలు అందించారు. విశేష అలంకరణ అనంతరం కుంకుమ పూజలు నిర్వహించారు.

జీపును చెబుతున్నా.. జీవితాలతో ఆటలొద్దు!

ముందు.. వెనక.. పైన.. ఎక్కడైనా ఖాళీ ఉందా?
ఎందుకీ ప్రయాణాలు చెప్పండి?
మీరు ఎంతమంది ఉన్నా తీసుకెళ్లడం నాకేం భారం కాదు.
నా కళ్లు(అద్దం) కూడా కనిపించకుండా కూర్చుంటే ఎట్లా?
చోదకుడికి ఏం పోయింది చెప్పండి!
నాలుగు డబ్బులొస్తాయని ఎందరొచ్చినా నో చెప్పడు.
ఘాట్ రోడ్‌లో ఒంపులు తిరగాలంటే ఎంతో భయమేస్తోంది..
అప్పటికీ పైన మీరున్నారనే ఆలోచనతో..
కాళ్లకు చక్రాలున్నా కంట్రోల్ చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నా..
పొరపాటున కాలుజారితే పరిస్థితేంటి చెప్పండి?
మిమ్మల్ని క్షేమంగా చేర్చాలని నిత్యం మొక్కుని దేవుడు లేడు
మీ అందరిని బతిమిలాడుతున్నా.. ఈ ప్రయాణాలు ఆపేయండి
ఇంతమంది వాహనం ఎక్కే వీలు లేదని చోదకుడికి చెప్పేయండి
మీ సమస్యను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లండి.
ఇంటిదగ్గర మీకోసం ఎదురుచూసే ప్రాణాలకు దూరం కాకండి.
- ఇట్లు మీ జీపు

(రవాణా సౌకర్యాలు లేని గిరిశిఖర గ్రామాల నుంచి మైదాన ప్రాంతాలకు చేరాలంటే ఇలాంటి వాహనాలే దిక్కు. సాలూరు మండలంలోని గిరిజన హాట్‌రోడ్డులో అధికారం కనిపించని దృశ్యమిది.)
- న్యూస్‌టుడే, సాలూరు గ్రామీణం

విజిలెన్స్‌కు పూర్తి స్వేచ్ఛ ఇచ్చాం
సీఎం మోహన్



మాట్లాడుతున్న మోహన్‌చరణ్ మాఝి

భువనేశ్వర్, న్యూస్‌టుడే: అవినీతిపై ఉక్కుపాదం మోపాలన్న ధ్యేయం కల తమ ప్రభుత్వం విజిలెన్స్‌కు పూర్తి స్వేచ్ఛ ఇచ్చినట్లు ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి ఎమ్మెల్యే గణేశ్వర్ బెహరా అడిగిన ప్రశ్నకు సోమవారం లిఖిత సమాధానమిచ్చారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 271 మంది అవినీతి అధికారులపై కేసులు నమోదయ్యాయని, 174 మందికి విజిలెన్స్ కోర్టుల్లో శిక్ష పడిందన్నారు. 33 మందిని సస్పెండు చేశామని, 65 మంది పింఛన్లు నిలుపుదల చేశామన్నారు. అవినీతికి పాల్పడిన 20 మంది పోలీసులపైనా కేసులు నమోదైనట్లు తెలిపారు.

21 మంది మావోయిస్టుల ఎన్‌కౌంటర్: గడిచిన 18 నెలల్లో 21 మంది మావోయిస్టులు ఎన్‌కౌంటర్లలో హతమయ్యారని ఎమ్మెల్యే ప్రశాంత్ బెహర అడిగిన ప్రశ్నకు సీఎం లిఖిత సమాధానంగా చెప్పారు. రాష్ట్రంలో మావోయిస్టుల ఏరివేత కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు.

బంగ్లా చొరబాటుదారుల గుర్తింపు

అడ్డగోలుగా రాష్ట్రంలో తిష్టవేసిన బంగ్లాదేశ్ చొరబాటుదారుల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోందని, 20 మందిని వారి దేశానికి పంపించినట్లు సీఎం ఎమ్మెల్యే శారదా ప్రసాద్ జెనా అడిగిన ప్రశ్నకు లిఖితపూర్వకంగా తెలిపారు. 2019 మంది చొరబాటుదారుల వివరాలు పరిశీలనలో ఉన్నాయన్నారు.

సైబర్ నేరాలపై గట్టి నిఘా

ఎమ్మెల్యే సునీల్‌కుమార్ మహంతి అడిగిన ప్రశ్నకు మోహన్ లిఖితపూర్వక సమాధానమిస్తూ సైబర్ నేరాలపై ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. 16 నెలల్లో 3486 కేసుల్లో, రూ. 222 కోట్లు పైచిలుకు సొమ్ము నేరగాళ్ల పరమైందన్నారు. 7176 మందిని అరెస్టు చేశామని, రూ.61.36 లక్షల నగదు స్వాధీనమైందన్నారు. సైబర్ నేరాలు అరికట్టడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

1750 మంది మృతి: ఎమ్మెల్యే సోఫియా ఫిర్దోస్ అడిగిన ప్రశ్నకు సీఎం సమాధానమిస్తూ గత నాలుగేళ్లలో సముద్రం, నదుల్లో 1,750 మంది ప్రమాదవశాత్తూ మృతిచెందారని చెప్పారు. సముద్రం, నదుల తీర ఘాట్‌లలో స్నానాలు చేయరాదని సూచీలు వేలాడదీసినా కొందరు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ నిండుప్రాణాలు తీసుకుంటున్నారని తెలిపారు.

లోక కల్యాణం కోరుతూ సైకిల్ యాత్ర

లోక కల్యాణం కోరుతూ మధ్యప్రదేశ్ రాష్ట్రం భోపాల్‌కు చెందిన సతీష్ కుస్వాహ దేశీయ సైకిల్ యాత్ర సోమవారం కంచిలికి చేరుకుంది. ఈ సందర్భంగా సతీష్ న్యూస్‌టుడేతో మాట్లాడుతూ కాశీవిశ్వనాథ్, దక్షిణేశ్వర్, పూరిజగన్నాథ్ తదితర ఆలయాలను సందర్శించి ప్రజలందరికీ సుఖశాంతులు కలగాలని దేవుడికి ప్రార్థించినట్లు వివరించారు. తిరుమల, రామేశ్వరం క్షేత్రాలను సందర్శించడంతో తన యాత్ర పూర్తవుతుందని పేర్కొన్నారు.
- న్యూస్‌టుడే, కంచిలి గ్రామీణం

యూటీఎఫ్ జిల్లా కార్యదర్శిగా మురళీ ప్రకాష్: కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: పెద్దకర్రివానిపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులు మురళీ ప్రకాష్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శిగా మరోసారి ఎంపికయ్యారు.

మత్తును చిత్తు చేద్దాం

పార్వతీపురం పట్టణం, పురపాలక, న్యూస్‌టుడే: యువత గంజాయి, డ్రగ్స్ లాంటి మత్తుపదార్థాలకు బానిసలైతే బంగారు భవిష్యత్తు అంధకారం అవుతుందని కలెక్టరు ఎన్.ప్రభాకరరెడ్డి, ఎస్పీ మాధవరెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో చేపట్టిన అభ్యుదయ సైకిల్ యాత్రకు ఘన స్వాగతం పలికారు. వర్శి కూడలి వద్ద అదనపు ఎస్పీ వెంకటేశ్వరరావు జెండా ఊపారు. కలెక్టరు, ఎస్పీ, జేసీ యశ్వంత్‌కుమార్‌రెడ్డి, సబ్ కలెక్టర్లు వైశాలి, స్వప్నిల్‌పవార్, ఏఎస్పీ మనీషారెడ్డి యాత్రికులతో కలిసి నాలుగు రోడ్ల కూడలి వరకు సైకిల్ తొక్కుతూ యాత్రలో సాగారు. ఆర్టీసీ కూడలి వద్ద మానవహారం నిర్వహించి, నినాదాలు చేశారు. పాయకరావుపేటలో ప్రారంభమైన సైకిల్‌యాత్ర ఇచ్ఛాపురం వరకు సాగుతుందని, డీఐజీ గోపీనాథ్ సూచనల మేరకు అవగాహన కల్పిస్తూ ముందుకు వెళ్తున్నామన్నారు. పోలీసు బ్యాండ్, తప్పెటగుళ్లు, సన్నాయి వాయిద్యం, గిరిజన విద్యార్థుల నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అంగన్‌వాడీ, ఆశా, స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు పాల్గొన్నారు.

అభ్యుదయ సైకిల్ ర్యాలీలో కలెక్టరు, ఎస్పీ, అధికారులు, పోలీసులు, విద్యార్థులు

విద్యార్థినుల నృత్యం

పిరమిడ్ విన్యాసంతో తప్పెటగుళ్లు

శుద్ధ అబద్ధం..!
అంగన్‌వాడీ కేంద్రాల్లో నిరుపయోగంగా ఆర్వో యంత్రాలు

- న్యూస్‌టుడే, పాతబస్టాండ్, శ్రీకాకుళం గ్రామీణం

అంగన్‌వాడీ కేంద్రాల్లో రూ. లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన శుద్ధజల యంత్రాలు మూలకు చేరాయి. వాటిని అందుబాటులోకి తీసుకురావడంలో అధికారులు విఫలమయ్యారు. కొన్ని అలంకార ప్రాయంగా మారగా.. మరి కొన్ని మరమ్మతులతో మూలకు చేరాయి. జిల్లాలో 60 శాతానికి పైగా కేంద్రాల్లో శుద్ధ జలం అందుబాటులో ఉండట్లేదు. చిన్నారులు ఇంటి నుంచే మంచి నీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

జిల్లాలో వివరాలిలా..
- ★ ఐసీడీఎస్ ప్రాజెక్టులు: 16
- ★ అంగన్‌వాడీ కేంద్రాలు: 3,385
- ★ చిన్నారులు: 85,981

శ్రీకాకుళం గ్రామీణ మండలం బెండిపేట కేంద్రంలో నిరుపయోగంగా శుద్ధజల యంత్రం

★ వైకాపా ప్రభుత్వం 2022లో [illegible] పథకంలో భాగంగా 813 శుద్ధ జల యంత్రాలను అందజేసింది. రెండేళ్లలోపు వాటిల్లోని 540 యంత్రాలు మూలకుచేరాయి. యంత్రాలు మరమ్మతులకు గురైనా ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియక అలాగే వదిలేశారు. మిగిలిన 273 యంత్రాల్లోనూ నీటి సదుపాయం ఉన్న కేంద్రాల్లో మాత్రమే కొన్ని వినియోగంలో ఉన్నాయి.

ఎలా వాడాలో తెలీదు..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ ఏడాది ఫిబ్రవరిలో 14 మండలాల్లోని 153 అంగన్‌వాడీ కేంద్రాలకు నూతన శుద్ధజల యంత్రాలను అందించింది. విద్యుత్తు, నీటి సౌకర్యం ఉన్న చోట మాత్రమే వీటిని ఏర్పాటు చేశారు. కొన్ని చోట్ల వాటిని ఎలా ఉపయోగించాలో తెలియక సిబ్బంది వదిలేశారు. సమస్యలను గుర్తించి వాటిని వినియోగంలోకి తీసుకురావాలని లబ్ధిదారులు కోరుతున్నారు. ఈ విషయమై ఐసీడీఎస్ పీడీ ఐ.విమల మాట్లాడుతూ పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

అడగలేవని అలుసా..?

- న్యూస్‌టుడే, నరసన్నపేట గ్రామీణం, నరసన్నపేట, సారవకోట, పోలాకి, జలుమూరు

నరసన్నపేట నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో పశువైద్య కేంద్రాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. కొన్ని పూర్తిగా అధ్వానంగా మారగా, మరికొన్ని భవనాలు ఏళ్ల తరబడి నిర్మాణ దశలో ఉండి వినియోగంలోకి రాలేదు. దీంతో సిబ్బంది, పాడి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మూగజీవాలకు సేవలందడం గగనంగా మారింది.

తప్పని అవస్థలు

నరసన్నపేట, నడగాంలో మాత్రమే పూర్తిస్థాయిలో భవనాలుండగా, మడపాం పశువైద్యశాల నిర్మాణం అసంపూర్తిగా ఉండటంతో పాతశాల భవనంలో నిర్వహిస్తున్నారు. చోడవరంలోనూ పనులు పూర్తకాక పంచాయతీ కార్యాలయంలో సేవలందిస్తున్నారు. కంబకాయ కేంద్రం అద్దె గదుల్లో కొనసాగుతోంది.

అధ్వానంగా ఉర్లాం పశువైద్య కేంద్రం

శిథిలావస్థలో పశువైద్య కేంద్రాలు

- జలుమూరులో సురవరం, రాణా పశువైద్య కేంద్రాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. మరుగుదొడ్ల సౌకర్యం లేక మహిళా ఉద్యోగులు అవస్థలు పడుతున్నారు.
- ఉర్లాం కేంద్రం పైకప్పు విరిగి, గోడలు బీటలు వారి కూలేందుకు సిద్ధంగా ఉంది. వర్షాకాలంలో దస్త్రాలు, మందులు భద్రపరచడం సిబ్బందికి తలకు మించిన భారంగా మారింది. దేవాదిలో భవనం పూర్తిగా శిథిలమైంది. మాకివలసలో నిర్మాణానికి నోచుకోలేదు.
- పోలాకి, ప్రియాగ్రహారంలో కేంద్రాలు శిథిలావస్థకు చేరాయి. నీరు, మరుగుదొడ్ల సౌకర్యం లేదు. సారవకోటలోని నవతల, బద్రిలో గ్రామీణ పశువైద్య కేంద్రాలు నిర్మించినా. . విద్యుత్తు, మరుగుదొడ్ల సదుపాయాలు కల్పించలేదు. మందులు సారవకోట కేంద్రంలో భద్రపరుస్తున్నామని వైద్యాధికారి కిశోర్ తెలిపారు.

చోడవరంలో అసంపూర్తిగా నిర్మాణం

నరసన్నపేట నియోజకవర్గం వివరాలు

మండలం	పశువైద్య కేంద్రాలు	శిథిలమైనవి	మూగజీవాలు (వేలల్లో)
నరసన్నపేట	7	5	37
పోలాకి	4	1	37
సారవకోట	4	2	22
జలుమూరు	6	2	50

ప్రభుత్వానికి నివేదించాం

శిథిలమైన, నిర్మాణాలు నిలిచిన కేంద్రాలపై ప్రభుత్వానికి నివేదిక పంపాం. నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతాం. సిబ్బంది లేని చోట పక్క పశువైద్య కేంద్ర సిబ్బందితో సేవలందిస్తున్నాం. - జి.ప్రసాద్, సహాయ సంచాలకుడు, పశు సంవర్ధక శాఖ

ప్రభుత్వ నిబంధనలు తప్పక పాటించాలి

సోంపేటలో ఎరువుల దుకాణంలో బస్తాల బరువును పరిశీలిస్తున్న సహాయ సంచాలకులు

సోంపేట, న్యూస్‌టుడే: ఎరువుల డీలర్లు కొనుగోలు, అమ్మకాలు, నిల్వల రికార్డుల విషయంలో ప్రభుత్వం విధించిన నిబంధనలు తప్పక పాటించాలని, లేకపోతే చర్యలు తప్పవని పలాస వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.రామారావు అన్నారు. సోమవారం సోంపేట మండలంలో పలు ఎరువుల దుకాణాలు తనిఖీ చేశారు. లైసెన్సులు, బస్తాల బరువు ఇతర అంశాలు పరిశీలించారు. నాణ్యమైన ఎరువులు మాత్రమే విక్రయించాలని సూచించారు. వ్యవసాయాధికారి బి.నరసింహామూర్తి పాల్గొన్నారు.

మాటల్లోనే ప్రోత్సాహం.. నిధులందక నిరుత్సాహం..!

న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం, మెళియాపుట్టి

ఎన్నికలు లేకుండా పంచాయతీ పాలకవర్గాలను ఏకగ్రీవం చేసుకుంటే నగదు ప్రోత్సాహకాలు అందిస్తామని వైకాపా ప్రభుత్వం ప్రకటించింది. అంతా ఏకతాటిపైకి వచ్చి ప్రజాప్రతినిధులను ఎంపిక చేసుకుంటే అభివృద్ధికి అవకాశముంటుందని భావించి జిల్లావ్యాప్తంగా అనేకచోట్ల ప్రజలు ఏకగ్రీవానికి ముందుకొచ్చారు. పాలకవర్గాల పదవీకాలం ముగింపు దశకు వచ్చినా నిధులు మంజూరు చేయకపోవడంతో ఆయా పంచాయతీలకు నిరాశే మిగిలింది.

మెళియాపుట్టి మండలం సుందరాడలో కాలువలు లేక ప్రధాన రహదారిపై నిలిచిన మురుగు నీరు

అభివృద్ధికి దూరం

★ ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో 1,190 పంచాయతీలున్నాయి. 2021 ఫిబ్రవరిలో నిర్వహించిన ఎన్నికల్లో 137 చోట్ల ఏకగ్రీవమయ్యాయి.

★ మెళియాపుట్టి మండలం మారడికోట, పడ్డ, లావేరు మండలం చిన్న రొంపివలస పంచాయతీల్లో మురుగు కాలువలు అధ్వానంగా ఉన్నాయి. ప్రోత్సాహక నిధులు మంజూరైతే అభివృద్ధికి అవకాశం ఉండేదని ఆయా సర్పంచులు అభిప్రాయపడ్డారు.

★ 2 వేల జనాభా కంటే తక్కువ ఉన్న ఏకగ్రీవ పంచాయతీలు 118 ఉన్నాయి. వైకాపా, కూటమి ప్రభుత్వాలు దశల వారీగా 62 పంచాయతీలకు రూ. 5 లక్షలు చొప్పున మంజూరు చేశాయి. వచ్చే ఏడాది మార్చి 26 నాటికి పాలకవర్గాల పదవీకాలం ముగియనుంది. ఈలోగా ప్రోత్సాహకాలు అందుతాయనే ఆశాభావంతో మిగిలినవి ఎదురుచూస్తున్నాయి.

ఏళ్లుగా ఏకగ్రీవ పంచాయతీల ఎదురుచూపులు

★ సర్పంచులు పోరుబాట పట్టడంతో జగన్ ప్రభుత్వం దిగివచ్చి 2 వేలు దాటిన (రూ.10 లక్షలు చొప్పున), 5 వేలకు (రూ. 15 లక్షలు) పైగా జనాభా కలిగిన పంచాయతీలకు అప్పట్లో నిధులు కేటాయించారు.

★ చిన్న పంచాయతీలకు సొమ్ము అందకపోవడంతో తాగునీటి అవసరాలు, సీసీ కాలువలు, రహదారులు, ఇతర మౌలిక వసతులు కల్పించకపోవడంతో అభివృద్ధికి దూరమయ్యాయి. వీధి దీపాల మరమ్మతులు చేపట్టలేని దుస్థితి నెలకొంది.

ప్రభుత్వానికి నివేదించాం..

ఇప్పటివరకు ప్రోత్సాహకాలు మంజూరు కాని 56 పంచాయతీల వివరాలు ప్రభుత్వానికి నివేదించాం. నిధులు మంజూరు కాగానే సంబంధిత ఖాతాలకు జమ చేస్తాం.
- కె.భారతీసౌజన్య, డీపీవో, శ్రీకాకుళం

మూసేస్తోంది..

పూండి-నౌపడా రోడ్డు నుంచి సీతంపేట వెళ్లే బీటీ రహదారి ఇరువైపులా పెరిగిన పొదలతో మూసుకుపోతోంది. స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, నందిగాం మండలంలోని పలు గ్రామాలకు ఇదే ప్రధాన మార్గం కావడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ఆర్‌అండ్‌బీ శాఖ జేఈ జగదీశ్‌ను వివరణ కోరగా పొదలు తొలగించి, రహదారిని శుభ్రం చేస్తామని చెప్పారు.
- న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు గ్రామీణం

దారి.. అధ్వానంగా మారి

నగరంపల్లి నుంచి పెద్దబాడం వైపు వెళ్లే రోడ్డు గోతులతో అధ్వానంగా మారింది. తారు ఊడి రాళ్లు తేలిపోవడంతో ప్రయాణికులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. అదుపుతప్పి ప్రమాదాల బారిన పడుతున్నట్లు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. త్వరలో రోడ్డు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు పంచాయతీరాజ్ శాఖ ఇంజినీర్ నాగభూషణం తెలిపారు. - న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు

శిథిలం.. భయం భయం

పూండి గోవిందపురం సంతమైదానం వద్ద ఉన్న తుపాను రక్షిత భవనం ప్రస్తుతం శిథిలమై పొదల మధ్య నిరుపయోగంగా ఉంది. గతంలో రైతు భరోసా కేంద్రంగా ఉపయోగపడేది. భవనానికి ఆనుకుని వారపు సంత జరగడం, ప్రధాన రహదారి చెంతనే భవనం ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై తహసీల్దార్ సీతారామయ్యను వివరణ కోరగా భవనం పరిస్థితిని పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు గ్రామీణం

ఇంజినీరింగ్ విద్యార్థుల మేధకు పరీక్ష
సందడిగా స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ గ్రాండ్ ఫినాలే

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వ విద్యా మంత్రిత్వశాఖ ఇన్నోవేషన్ సెల్, అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) సంయుక్తంగా జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ గ్రాండ్ ఫినాలేకు ఏపీలోని ఒంగోలు నగరంలోని క్విస్ ఇంజినీరింగ్ కళాశాల వేదికైంది. 12 రాష్ట్రాలకు చెందిన 126 మంది విద్యార్థులు 18 బృందాలుగా పాల్గొన్నారు. హెరిటేజ్ అండ్ కల్చర్, మెడ్‌టెక్, అగ్రిటెక్, స్టూడెంట్స్ ఇన్నోవేషన్ ఆన్ మిస్‌లేనియస్.. అంశాల్లో ప్రోబ్లమ్ సొల్యూషన్స్‌పై సాఫ్ట్‌వేర్ రూపకల్పనపై పోటీలు ఏర్పాటు చేశారు. 36 గంటలు కొనసాగే పోటీలో విజేతలుగా నిలిచిన నలుగురికి రూ.1.50 లక్షలు బహుమతిగా అందజేస్తారు. విజేతలను ఎంటర్‌ప్రెన్యూర్స్‌గా చేసేందుకు మేక్ ఇన్ ఇండియాలో భాగంగా స్టార్టప్ ఫండ్ ఇస్తారు. కళాశాల అధినేత నిడమానూరి సూర్యకల్యాణ చక్రవర్తి, వైస్ ఛైర్మన్ డాక్టర్ గాయత్రిదేవి, విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ఉప కులపతి అల్లం శ్రీనివాసరావు ప్రారంభ వేడుకలో పాల్గొన్నారు. ఇలాంటి హ్యాకథాన్‌లతో విద్యార్థులు ఉద్యోగాలు వెతుక్కునే పరిస్థితి నుంచి ఉద్యోగాలు ఇచ్చేస్థాయికి ఎదుగుతారని వీసీ పేర్కొన్నారు. కళాశాల ప్రతినిధి బాచిన చెంచుప్రసాద్, ఏఐసీటీఈ నోడల్ ఇన్‌ఛార్జి శ్రుతి భార్గవ చౌబే, టీసీఎస్ కన్సల్టెంట్ ప్రతాప్, కన్వీనర్ డి.బుజ్జిబాబు, ప్రిన్సిపల్ హనుమంతరావు పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా 60 కేంద్రాల్లో ఈ తరహా గ్రాండ్ ఫినాలేలు నిర్వహిస్తుండగా... రాష్ట్రం వరకు క్విస్‌తో పాటు, గుంటూరులోని మరో కళాశాలను ఎంపిక చేశారు.

గ్రాండ్ ఫినాలేలో పాల్గొన్న విద్యార్థులు

బతుకు దెరువుకొచ్చి.. ప్రాణాలు కోల్పోయి..

సారంగాపూర్, న్యూస్‌టుడే: ఒడిశా రాష్ట్రం నుంచి బతుకు దెరువు కోసం వచ్చిన భానుమతి(30) ట్రాక్టర్ కింద పడి ప్రాణాలు కోల్పోయిన ఘటన సోమవారం తెలంగాణలోని నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం చించోలి(బి)లో చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రంలోని సినపల్లి తాలుకా పరిధిలోని మకపదార్ గ్రామానికి చెందిన జగమండ్, భానుమతి దంపతులు ఇద్దరు పిల్లలతో కలిసి ఉపాధి కోసం మూడేళ్ల క్రితం ఇక్కడికి వచ్చారు. భర్త ట్రాక్టర్ నడుపుతుండగా ఆమె కూలిగా తోడుగా వెళ్లేది. ఆదివారం రాత్రి ఇటుక లోడు ఖాళీ చేసి తిరిగి వస్తుండగా ప్రమాదవశాత్తు భానుమతి కింద పడిపోగా ఆమెపై నుంచి ట్రాక్టర్ వెళ్లడంతో తీవ్రంగా గాయపడింది. చికిత్స పొందుతూ ఆసుపత్రిలో సోమవారం మృతి చెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

అయ్యప్పస్వామి ఆలయంలో హోమాలు

హోమంలో పాల్గొన్న స్వాములు

పూండి అయ్యప్పస్వామి ఆలయంలో సోమవారం స్వామికి ప్రత్యేక హోమాలు నిర్వహించారు. అనంతరం పూజలు, అభిషేకాలు చేశారు. అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.
- న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు గ్రామీణం

తీరంలో మృత్యుఘోష..!
అంతరించిపోతున్న సముద్ర తాబేళ్లు

న్యూస్‌టుడే, సోంపేట, వజ్రపుకొత్తూరు

ఇచ్ఛాపురం మండలం డొంకూరు తీరంలో ఆలివ్‌రిడ్లే కళేబరాలు

అరుదైన సముద్ర తాబేళ్లకు (ఆలివ్‌రిడ్లే) రక్షణ కరవైంది. జిల్లాలో తీరప్రాంతానికి కొట్టుకొస్తున్న వాటి కళేబరాలే దీనికి నిదర్శనం. గుడ్లు పెట్టడానికి వచ్చి తిరిగి సముద్రంలోకి వెళ్లలేక మృత్యువాత పడుతున్నాయి. వీటిని పక్షులు, కుక్కలు పీక్కు తింటూ మిగిలిన భాగాలను వదిలేస్తుండటంతో సిక్కోలు తీరంలో దుర్వాసన వ్యాపిస్తోంది. వాటిని పూడ్చే పరిస్థితి లేకపోవడంతో సమీప గ్రామాల ప్రజలు, వేట సాగించే మత్స్యకారులకు ఇబ్బందులు తప్పడం లేదు.

ఇదీ పరిస్థితి

★ జిల్లాలో 193 కి.మీ. మేర తీర ప్రాంతం ఉంది. ఇక్కడ ఇసుక తిన్నెలు, ప్రత్యేక వాతావరణం, సముద్రం నుంచి వచ్చి తిరిగి వెళ్లడానికి అనువైన పరిస్థితులు ఉండటంతో పెద్దవత్తున ఆలివ్‌రిడ్లేలు వస్తున్నాయి.

★ ఏటా 2.80 లక్షలకు పైగా పిల్లల్ని సముద్రంలోకి వదులుతున్నారు. లోపల ఆక్సిజన్ శాతం పెంచి చేపలు, వాటి పిల్లలకు నష్టం కలిగించే జెల్లీఫిష్ మొక్కల్ని తినడం ద్వారా మేలు చేస్తున్నాయి.

★ డిసెంబరు నుంచి మార్చి వరకు ఇచ్ఛాపురం, కవిటి, సోంపేట, వజ్రపుకొత్తూరు, సంతబొమ్మాళి, గార మండలాల పరిధిలో ఏటా తీరానికి వచ్చి ఇసుకలో బొరియలు చేసి 4 లక్షలకు పైగానే గుడ్లు పెడతాయి. ★ ట్రీ ఫౌండేషన్, అటవీ శాఖ సంయుక్తంగా వాటిని సేకరించి హేచరీల్లో పెంచుతున్నాయి.

★ సముద్ర తీరానికి 8 నాటికల్ మైళ్ల దూరం వరకు సంప్రదాయ వేట సాగించాల్సి ఉండగా ఒడిశాలోని పారాదీప్, గోపాల్‌పూర్, విశాఖపట్నం, కాకినాడ తదితర ప్రాంతాల నుంచి మెకనైజ్డ్ బోట్లు, స్టీమర్లలో వస్తున్న వారు నిషేధిత వలలు వినియోగిస్తుండటంతో ఎక్కువగా మృతి చెందుతున్నాయి.

★ గాలి పీల్చుకోడానికి 45 నిమిషాలకు ఒకసారి సముద్ర ఉపరితలానికి వస్తుంటాయి. ఆ సమయంలో వలలు, బోట్లు కింద పడి మృతి చెందుతున్నాయి. మర పడవల వేట కారణంగా ఏటా 10 వేలకు పైగా మృత్యువాత పడుతున్నాయి.

★ ప్లాస్టిక్, పరిశ్రమల వ్యర్థాలతో సముద్ర జలాలు కలుషితమవుతుండటంతో మృతి చెందుతున్నాయి. గుడ్లు పెట్టడానికి వచ్చే సమయంలో కుక్కలు, నక్కలు వాటిపై దాడి చేస్తున్నాయి.

సంరక్షణకు చర్యలు తీసుకుంటాం..

సముద్ర తాబేళ్ల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. మత్స్యకారులకు అవగాహన కల్పించి జాగ్రత్తలు పాటించేలా పర్యవేక్షిస్తాం.
- సత్యనారాయణ, జేడీ, మత్స్య శాఖ, శ్రీకాకుళం

జ్ఞాపకాల మదిలో...
జాతస్య హిధ్రువో మృత్యుః ధ్రువం జన్మ మృతస్యచ
తస్మాద పరిహార్యేర్థే నత్వం శోచితు మర్హసి

మీరు చూపిన ఆత్మీయత..
అనురాగం మా అభివృద్ధికి వేసిన పూబాట..
మీరు భౌతికంగా దూరమైనా మా చెంత ఉన్నట్లే ఉంది..
ఏమిచ్చి రుణం తీర్చుకోము మా యదలోతుల్లోని భావాలను అక్షరరూపంలో నివేదించడం తప్ప..
ప్రకటనలపై జీఎస్టీ 5% శాతం అదనం
నిర్యాణం, వర్ధంతి, జయంతి
ఈనాడు
యాడ్స్ ద్వారా తెలియజేయండి
ఈనాడు ప్రకటనల విభాగం
80085 97609

అధికారంలోకి వస్తే మెరీనాలోని సమాధులను తొలగిస్తాం: సీమాన్



వేళచ్చేరి, న్యూస్‌టుడే: రానున్న ఎన్నికల్లో తాము అధికారంలోకి వస్తే మెరీనా బీచ్‌లో ఉన్న సమాధులను తొలగిస్తామని నామ్ తమిళర్ కట్చి ప్రధాన సమన్వయకర్త సీమాన్ పేర్కొన్నారు. కళ్లకురిచ్చి జిల్లా ఉళుందూర్‌పేటలో ఖాక్ టవర్ వద్ద ఆ పార్టీ తరఫున కుల గణన, సామాజిక న్యాయం, పంచమి భూముల పునరుద్ధరణ తదితర అంశాలపై ఆదివారం రాత్రి బహిరంగ సభ జరిగింది. పాల్గొన్న సీమాన్ ప్రసంగిస్తూ.. తాము అధికారంలోకి వస్తే మెరీనా బీచ్‌లోని సమాధులను తొలగించే ఫైలుపై మొదటి సంతకం చేస్తామని తెలిపారు. పంచమి భూములు 12 లక్షల ఎకరాలుంటే షెడ్యూల్ కులాలు ఉండవని తెలిపారు. తాము అధికారంలోకి వస్తే కనీసం 10లక్షల ఎకరాల భూమిని పొందుతామని చెప్పారు. పీఎంకే వ్యవస్థాపకుడు రాందాస్ ఏళ్లుగా కుల గణన చేపట్టడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారని గుర్తు చేశారు. 10 రోజుల్లో 'సర్' ప్రక్రియను అమలు చేసినప్పుడు 10 నెలల్లో జనగణన చేపట్టలేమా? అని ప్రశ్నించారు. భారత ఉపఖండంలో సామాజిక న్యాయం అనే పదాన్ని ఎక్కువగా ఉచ్చరించేది ద్రావిడ పాలనే అని పేర్కొన్నారు. దేశ ప్రథమ పౌరురాలైన రాష్ట్రపతి కూడా ఆలయంలోకి ప్రవేశించలేని పరిస్థితి ఏర్పడింది. 28శాతం మంది ప్రజలు రాత్రిపూట భోజనం కూడా చేయలేని పరిస్థితి వచ్చిందని, దీనంతటికీ కారణం కులమత బేధాలేనని మండిపడ్డారు. తిరుప్పరంకుండ్రంలో మురుగన్ ఆలయం ఉంటే అక్కడ దీపం వెలిగించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. ఈ సందర్భంగా కళ్లకురిచ్చి, విళుపురం జిల్లాల్లో పార్టీ తరఫున పోటీ చేసే అభ్యర్థి పేర్లను ఆయన ప్రకటించి వారిని పరిచయం చేశారు.

రాష్ట్రపతి పరిశీలనకు సిద్ధ వైద్య వర్సిటీ బిల్లు

చెన్నై, న్యూస్‌టుడే: సిద్ధ వైద్య విశ్వవిద్యాలయం బిల్లును రాష్ట్రపతి పరిశీలనకు గవర్నర్ పంపారు. రాష్ట్రంలో సిద్ధ వైద్య విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసే విషయమై 2022 ఏప్రిల్‌లో బిల్లును శాసనసభలో నెరవేర్చి గవర్నర్ ఆమోదం కోసం పంపారు. దానికి అనుమతి ఇవ్వకుండా పలు ప్రశ్నలు లేవనెత్తుతూ ఇప్పటివరకు నాలుగుసార్లు బిల్లును రాష్ట్ర ప్రభుత్వానికి వెనక్కు పంపారు. అక్టోబరులో బిల్లుకు సవరణలు చేసి మళ్లీ శాసనసభలో ఆమోదించి గవర్నర్‌కు పంపారు. ఈ నేపథ్యంలో ఆ బిల్లును గవర్నర్ ఆమోదించకుండా ప్రస్తుతం రాష్ట్రపతి పరిశీలనకు పంపారు.

డీఎంకే కూటమి విచ్ఛిన్నమవడం ఖాయం

గుమ్మిడిపూండి, న్యూస్‌టుడే: శాసనసభ ఎన్నికల ప్రకటన వెలువడేలోగా డీఎంకే కూటమి విచ్ఛిన్నం కావడం ఖాయమని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ ఎద్దేవా చేశారు. 'తమిళగం తలై నిమిర తమిళనిన్ పయనం' పేరిట ఆయన చేపట్టిన రాష్ట్రవ్యాప్త పర్యటన ఆదివారం రాత్రి తిరువళ్లూరు జిల్లా గుమ్మిడిపూండిలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీవీకేతో పొత్తు కుదుర్చుకోవాలని కాంగ్రెస్, వీసీకే నేతలు తెరవెనక మంతనాలు జరుపుతున్నారని, ఈ విషయం తెలుసుకుని ముఖ్యమంత్రి స్టాలిన్ డీఎంకే కూటమిని బలంగా ఉంచే పనిలో ఉన్నారని విమర్శించారు. ఎన్నికల్లో తమ కూటమి విజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. తిరుప్పరంకుండ్రం వ్యవహారంలో డీఎంకే హిందువుల మనోభావాలను దెబ్బతీస్తోందని ఆరోపించారు.

పళ్లిపట్టు: సభలో ప్రసంగిస్తున్న నాగేంద్రన్

పళ్లిపట్టు: నాగేంద్రన్ పర్యటన సోమవారం తిరువళ్లూరు జిల్లా ఆర్కేపేట యూనియన్ అమ్మయార్ కుప్పంలో జరిగింది. అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగిస్తూ.. ఈ సారి సంక్రాంతికి రేషన్‌కార్డుదారులకు రూ.5000 చొప్పున ఇవ్వాలని సూచించారు. రైతులు, చేనేత కార్మికులు, పవర్‌లూమ్ కార్మికుల కోర్కెలను తమ ప్రభుత్వం ఏర్పాటయ్యాక నెరవేర్చుతామని హామీ ఇచ్చారు.

దర్యాప్తునకు ఎందుకు భయపడుతున్నారు?: అన్బుమణి

సైదాపేట, న్యూస్‌టుడే: డీఎంకే ప్రభుత్వం దర్యాప్తుకు ఎందుకు భయపడుతోందని పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి రాందాస్ ప్రశ్నించారు. సోమవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో.. తమిళనాడు ప్రభుత్వ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖలో ఇంజినీర్లు, అధికారుల నియామకంలో అవినీతిపై కేసు నమోదు చేయాలని ఈడీ.. రాష్ట్ర డీజీపీకి లేఖ రాసిందన్నారు. లేఖ ఎలా బయటపడిందనే విషయమై సీబీసీఐడీ దర్యాప్తునకు రాష్ట్ర పోలీసుశాఖ ఆదేశించిందన్నారు. అవినీతిపై దర్యాప్తునకు ముందుకు రావటం లేదన్నారు. డీఎంకే ప్రభుత్వ అరాచకాలకు త్వరలో ముగింపు వస్తుందని తెలిపారు.

సమాచార బ్యాంక్

☛ మహిళల కోసం ఏర్పాటు చేయనున్న ప్రభుత్వం

☛ ఎక్కడ ఉద్యోగమున్నా అర్హులకు పిలుపు

మహిళలకు సంబంధించి విద్యార్హత, నైపుణ్యాలు, ఆర్థిక పరిస్థితుల కచ్చిత సమాచారం ఇకపై ప్రభుత్వం వద్ద ఉండనుంది. వారిలో ధైర్యం నింపేలా, వారి జీవితానికి బాసటగా నిలిచేలా ఉద్యోగ కల్పన వ్యాపార, పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు చేయూత ఇవ్వనుంది. అతివల కెరీర్‌కు సురక్షిత బాటలు వేయనుంది. - ఈనాడు-చెన్నై

రాష్ట్ర ప్రభుత్వం అందుకుంటున్న వినూత్న బాట.. మహిళా సమాచార బ్యాంకు(డబ్ల్యూఐబీ). మహిళల్ని వారి కెరీర్ మార్గంలో ఉన్నత శిఖరాలు సులువుగా అధిగమించేందుకు ప్రభుత్వం సేకరిస్తున్న డాటా. వారి ఆశలు, ఆకాంక్షలు, అర్హతలు ఇవన్నీ ఎప్పటికప్పుడు సిద్ధంగా ఉంచుకుని సాధికారత దిశగా నడపించేలా ప్రణాళికలు చేస్తోంది. రూ.1,185 కోట్ల ప్రపంచ బ్యాంకు నిధులతో తమిళనాడు ఉమెన్ ఎంప్లాయ్‌మెంట్ అండ్ సేఫ్టీ(టీఎన్‌వి సేఫ్) ప్రాజెక్టు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఈ సమాచార బ్యాంక్ సిద్ధం చేస్తోంది.

తోడ్పాటు ఎలా..

- డబ్ల్యూఐబీ డాటాను ప్రభుత్వ విభాగాలకు అన్వయిస్తారు. అర్హులైన మహిళలకు అనువైన ఉద్యోగాలు, ఉపాధి మార్గాలు ఏ శాఖలో ఉన్నా అధికారుల దృష్టికి వచ్చేలా వ్యవస్థను తెస్తున్నారు. తద్వారా ఆయా మహిళలకు సమాచారమిస్తారు. ప్రత్యేకించి నైపుణ్యాభివృద్ధి, మహిళా సాధికారత, ఎంఎస్‌ఎంఈ, ఆరోగ్య, విద్య, రవాణా.. ఇలా వివిధ శాఖలు దీనిపై పనిచేస్తాయి.
- ఉద్యోగంలో చేరేందుకు, స్వతహాగా ఎదిగేందుకు మహిళలకు నైపుణ్యాలు నేర్పడం, కెరీర్ గైడెన్స్ ఇస్తారు. పారిశ్రామికవేత్తలు కావాలనే లక్ష్యమున్నవారికి ఇతరత్రా సహాయ సహకారాలు అందిస్తారు.
- ఎలాంటి భయం లేకుండా కెరీర్‌లో ఎదిగేలా వివిధరకాల సంక్షేమ కార్యక్రమాల్ని అనుసంధానించనున్నారు. ఉద్యోగ భద్రతలో భాగంగా సురక్షిత వసతిగృహాల్ని అందుబాటులోకి తీసుకురానున్నారు.
- వెళ్లేమార్గంలో తడబాటు రాకుండా, మానసికంగా సన్నద్ధంగా ఉండేలా మానసికోల్లాస తరగతులు నిర్వహించనున్నారు. వారి పిల్లల ఆరోగ్యం, ఇతర వనరులపైనా దృష్టి సారించనున్నారు.
- కెరీర్ ప్రారంభించిన తర్వాత వారి మార్గంలో ఎలాంటి ఇబ్బందులొచ్చినా సహాయ సహకారాలు అందేలా ప్రభుత్వం ప్రత్యేక వ్యవస్థ తెస్తోంది. డిజిటల్ మాధ్యమంగా ఆయా మహిళలు తమ మార్గదర్శకులు, మిత్రులు, వివిధ సంస్థలతో మాట్లాడి సమస్యల్ని పరిష్కరించుకుని ముందుకు సాగేలా కెరీర్‌లో వృద్ధి సాధించేలా అవకాశం కల్పించనున్నారు.
- ప్రతి ఒక్కరి వద్దా ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తేవడంతో పాటు అత్యవసర సమయాల్లో హెల్ప్‌లైన్ల ద్వారా రక్షణ పొందేలా డిజైన్ చేస్తున్నారు. గృహహింస, పనిచేసేచోట వేధింపులు ఇలాంటివన్నీ ధైర్యంగా

డిజిటల్ సురక్ష

ఫిర్యాదుచేసేలా అవకాశం ఇవ్వనున్నారు. ఎస్‌వోఎస్ సదుపాయంతో పాటు పోలీస్‌ల ఫోన్‌నెంబర్లను సైతం అందుబాటులో ఉంచనున్నారు.
- ప్రత్యేకించి మహిళల ఫిర్యాదులపై సత్వరమే స్పందించేలా ఆన్‌లైన్ పర్యవేక్షణ వ్యవస్థ తెస్తున్నారు. వారి రక్షణ బాధ్యతను సాంఘిక సంక్షేమం, మహిళా సాధికారత శాఖ తీసుకుంటుంది.

ప్రధాన లక్ష్యాలివీ..

- మహిళలు పనిచేసే అనువైన విభాగాల్ని ఎంపిక చేసి వారికి అవకాశాలు కల్పించడం. పనితీరును వృద్ధి చేయడం. అవసరమైన నైపుణ్యాల శిక్షణ ఇవ్వడం.
- ఉపాధి పొందేందుకు మహిళల్ని ప్రోత్సహించే వ్యవస్థ తీసుకురావడం. వారికి అవసరమైన ఆర్థిక వనరుల్ని అందుబాటులో ఉంచడం. భద్రతకు హామీ ఇవ్వడం.
- రాష్ట్రంలో పని చేసే మహిళల సామర్థ్యాన్ని పెంచడంతో పాటు విద్య, సాంకేతిక సాయంతో వారి ఉన్నతికి ప్రోత్సహించడం. రాష్ట్ర లక్ష్యంగా ఉన్న ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థలో వారి భాగస్వామ్యాన్ని పెంచడం.

ప్రత్యర్థులను తక్కువ అంచనా వేయొద్దు

☛ జిల్లా కార్యదర్శులకు స్టాలిన్ సూచన

ముఖ్యమంత్రి స్టాలిన్

చెన్నై, న్యూస్‌టుడే: ఎంతటి అనుకూల పరిస్థితులు ఉన్నా ప్రత్యర్థులను తక్కువ అంచనా వేయకూడదని డీఎంకే జిల్లా కార్యదర్శులకు ఆ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్ సూచించారు. సోమవారం క్యాంపు కార్యాలయం నుంచి వీడియో క్ఫారెన్స్ ద్వారా పార్టీ జిల్లా కార్యదర్శులతో 'ఎన్ వాక్కుచావడి-వెట్రి వాక్కుచావడి' పేరిట సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఎందరు ప్రత్యర్థులు వచ్చినా, ఎన్ని వర్గాలు పనిచేసినా రాష్ట్రాన్ని మళ్లీ ఉదయసూర్యుడే ఏలుతాడని ధీమా వ్యక్తం చేశారు. డీఎంకే ప్రభుత్వ పథకాలతో రాష్ట్రవ్యాప్తంగా 1.86 కోట్ల మంది ప్రత్యక్షంగా లబ్ధిపొందుతున్నారని, తమ ఉత్తమ పాలన చూసి తటస్థ ఓటర్లు సైతం మద్దతుగా నిలుస్తున్నారని తెలిపారు. వారందరినీ పరిగణనలోకి తీసుకుంటే రాబోయే ఎన్నికల్లో 2.5 కోట్ల ఓట్లు దాటడం సాధ్యమేనన్నారు. 2021 శాసనసభ ఎన్నికల్లో తమ కూటమి 2.09 కోట్ల ఓట్లను పొందిందన్నారు. సీబీఐ, ఈడీ, ఐటీ, ఎన్నికల కమిషన్‌లను ప్రత్యర్థులు తమకు వ్యతిరేకంగా ఉపయోగిస్తున్నారని పేర్కొన్నారు.

కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా ఆందోళన

సైదాపేట, న్యూస్‌టుడే: కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా సోమవారం చెన్నైలో ఆందోళన జరిగింది. సీపీఎం రాజకీయ పొలిట్‌బ్యూరో సభ్యురాలు వాసుకి, సీపీఐ రాష్ట్ర ఉప కార్యదర్శి పెరియసామి, వీసీకే ఉప ప్రధాన కార్యదర్శి గౌతమ్‌సన్నా, సీపీఐ(ఎంఎల్)ఎల్ రాష్ట్ర కమిటీ సభ్యుడు అదియమాన్ తదితర పలువురు పాల్గొన్నారు. కార్మిక చట్టాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

ట్రిప్లికేన్: కొత్త కార్మిక చట్టాలను వాపస్ తీసుకోవాలని డిమాండ్ చేస్తూ వామపక్షాలు, వీసీకే తరఫున అరియలూరు అన్నా విగ్రహం వద్ద సోమవారం నిరసన జరిగింది. ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపేయాలని, మోటారు వాహన సవరణ చట్టం, మూడు వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలని నినాదాలు చేశారు.

నినాదాలు చేస్తున్న వామపక్ష, వీసీకే నేతలు

హిందూమతంపై సీఎంకు ద్వేషం

☛ వానతి శ్రీనివాసన్

ట్రిప్లికేన్, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి స్టాలిన్‌కు హిందూ మతంపై ద్వేషం బయటపడిందని కోయంబత్తూరు దక్షిణ భాజపా ఎమ్మెల్యే వానతి శ్రీనివాసన్ తెలిపారు. తిరుప్పరంకుండ్రంలో దీపం వెలిగించే విషయమై న్యాయవ్యవస్థ, భారత రాజ్యాంగాన్ని బహిరంగంగా మదురైలో స్టాలిన్ విమర్శించారని తెలిపారు. మైనారిటీల ఓట్ల కోసం హిందువులను కించపరిచే రాజకీయాలు అంతమయ్యే రోజు త్వరలో వస్తుందని ప్రకటనలో పేర్కొన్నారు.

కరూర్ తొక్కిసలాటపై కొనసాగుతున్న దర్యాప్తు

విల్లివాక్కం, న్యూస్‌టుడే: కరూర్ తొక్కిసలాట ఘటనపై సేలం పశ్చిమ జిల్లా టీవీకే కార్యదర్శి వెంకటేశన్ సహా ఐదుగురు సోమవారం సీబీఐ దర్యాప్తునకు హాజరయ్యారు. ఐపీఎస్ అధికారి ప్రవీణ్‌కుమార్ నేతృత్వంలోని అధికారులు వారి నుంచి వివరాలు సేకరించారు. తొక్కిసలాటలో మృతి చెందిన దిండిగల్లు జిల్లా గుజిలియంపారైకి చెందిన శంకర్ భార్య, ఆయన తండ్రి కూడా దర్యాప్తునకు హాజరయ్యారు.

మినీ స్టేడియాల నిర్మాణానికి శంకుస్థాపన

చెన్నై, న్యూస్‌టుడే: రాష్ట్రంలో 23 శాసనసభ నియోజకవర్గాల్లో రూ.69 కోట్లతో నిర్మించనున్న 23 సీఎం మినీ స్టేడియాల నిర్మాణ పనులకు సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖ్యమంత్రి స్టాలిన్ సోమవారం శంకుస్థాపన చేశారు. క్రీడావసతుల్లేని శాసనసభ నియోజకవర్గాల్లో మినీ స్టేడియాలను రూ.3 కోట్లతో నిర్మించనున్నట్లు 2021-2022వ ఏడాది బడ్జెట్‌లో ప్రకటించారు. ఆ మేరకు ప్రస్తుతం చెన్నై జిల్లాలోని మదురవాయల్, తిరు.వి.క నగర్, పెరంబూర్ శాసనసభ నియోజకవర్గాలు సహా పలు జిల్లాల్లో 23 మినీ స్టేడియాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. వాటిలో అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, వాలీబాల్, కబడ్డీ, స్థానిక క్రీడలకు వసతులు కల్పించనున్నారు.

ఒకే రోజు 956 పెంపుడు జంతువులకు టీకాలు

చెన్నై, న్యూస్‌టుడే: చెన్నై మహానగర పాలక సంస్థ(జీసీసీ)లో ఒకేరోజు 956 పెంపుడు జంతువులకు టీకాలు వేశారు. పిల్లి, కుక్క వంటి పెంపుడు జంతువులకు లైసెన్సు పొందే ప్రక్రియను సులభతరం చేసేలా నగరంలోని 7 కేంద్రాల్లో ప్రతి ఆదివారం ప్రత్యేక శిబిరాలను జీసీసీ యంత్రాంగం నిర్వహిస్తోంది. ఈ ఆదివారం జరిగిన శిబిరంలో 956 పెంపుడు జంతువులకు టీకాలు వేసి మైక్రో చిప్ అమర్చి వాటి యజమానులకు లైసెన్సులను అందించారు. ఇప్పటివరకు 96,056 పెంపుడు జంతువుల వివరాలను నమోదు చేసి 49,347 లైసెన్సులు అందించారు. ఈ శిబిరాలకు వచ్చే ఆదివారం గడువు కావడం గమనార్హం.

పోలీసుశాఖ మార్గదర్శకాలు పాటించాలి: టీవీకే

చెన్నై, ఆర్కేనగర్: పుదుచ్చేరిలోని ఉప్పళంలో మంగళవారం ఉదయం 10.30కు ప్రజలతో టీవీకే అధ్యక్షుడు విజయ్ సమావేశం కానున్న నేపథ్యంలో పోలీసుశాఖ మార్గదర్శకాలను తప్పకుండా పాటించాలని ప్రజలు, కార్యకర్తలకు పార్టీ అధిష్ఠానం సూచించింది. ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో.. క్యూఆర్ కోడ్ టికెట్లు కలిగిన 5వేల మందిని మాత్రమే అనుమతిస్తున్నట్లు తెలిపింది. గర్భిణులు, చిన్నపిల్లలతో ఉన్న మహిళలు, వృద్ధులు, ఆరోగ్య సమస్యలు ఉన్నవారు, పిల్లలు, దివ్యాంగులు పాల్గొనేందుకు అనుమతి లేదని పేర్కొంది. పార్టీ అధ్యక్షుడు కార్యక్రమానికి వచ్చేటప్పుడు, వెళ్లేటప్పుడు ఆయన వాహనాన్ని వెంబడించడం, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడం వంటివి చేయకూడదని తెలిపింది. పోలీసుశాఖ అనుమతించిన పాండి మెరినా పార్కింగ్, పాత హార్బరు, ఇందిరాగాంధీ స్టేడియం వెనుకవైపు వంటి ప్రాంతాల్లో మాత్రమే వాహనాలు నిలపాలని పేర్కొంది. ప్రజల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలిగించకూడదని పేర్కొంది. బహిరంగసభకు తమిళనాడు ప్రజలకు అనుమతి లేదని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సి ఆనంద్ తెలిపారు.

కదిలిన ప్రచార వాహనం

ఆర్కేనగర్: బహిరంగసభ నేపథ్యంలో 72 రోజుల తర్వాత టీవీకే ప్రచార వాహనం కదిలింది. సోమవారం సాయంత్రం పుదుచ్చేరికి బయల్దేరి వెళ్లింది. ఆ వాహనం నుంచే విజయ్ ప్రసంగించనున్నారు. కరూర్ దుర్ఘటన అనంతరం వాహనం చెన్నైలోనే ఉండిపోయింది.

కోవైలో ఓపీఎస్, అన్నామలై భేటీ

ఓపీఎస్‌కు శాలువా వేస్తున్న అన్నామలై

కోయంబత్తూరు, న్యూస్‌టుడే: అన్నాడీఎంకే కార్యకర్తల హక్కుల పరిరక్షణ కమిటీ కోయంబత్తూరు జిల్లా కార్యదర్శి మోహన్‌రాజ్ ఇంట్లో జరిగిన కార్యక్రమానికి కమిటీ సమన్వయకర్త ఓపీఎస్, రాష్ట్ర భాజపా మాజీ అధ్యక్షుడు అన్నామలై హాజరయ్యారు. ఇద్దరూ శాలువాలతో సత్కరించుకున్నారు. రాష్ట్రంలో తాజా రాజకీయ పరిస్థితులపై ఇద్దరూ కొంతసేపు చర్చించుకున్నారు. ఈ ఫొటోలను అన్నామలై తన 'ఎక్స్' పేజీలో షేర్ చేశారు.

అవినీతిపరులకు శిక్ష తప్పదు: ఈపీఎస్

సైదాపేట, న్యూస్‌టుడే: అవినీతికి పాల్పడిన డీఎంకే నేతలు అన్నాడీఎంకే అధికారంలోకి వచ్చిన తర్వాత జైలుకు వెళ్లటం ఖాయమని, శిక్ష తప్పదని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, ప్రతిపక్ష నేత ఎడప్పాడి పళనిసామి తెలిపారు. సోమవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో.. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, తాగునీటి సరఫరా శాఖ టెండర్లలో రూ.1,020 కోట్ల అవినీతి జరిగినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ), తమిళనాడు ఇన్‌ఛార్జి డీజీపీకి లేఖ రాసినట్లు వార్తలు వచ్చాయన్నారు. స్టాలిన్ మోడల్ డీఎంకే ప్రభుత్వ మంత్రి కేఎన్ నెహ్రూ తన బంధువుల ద్వారా టెండర్‌కు 10 శాతం వరకు కమీషన్ కొట్టేసినట్లు లేఖ ద్వారా బయటపడిందన్నారు. డీఎంకే మంత్రుల నుంచి అవినీతి డబ్బు స్వాధీనం చేసుకుంటే కోయంబత్తూరు, మదురై మెట్రో రైలు పథకాలను రాష్ట్ర ప్రభుత్వమే అమలు చేయొచ్చని తెలిపారు. పొంగల్‌కు రేషన్ కార్డుకు రూ.5 వేలు ఇవ్వొచ్చన్నారు. రాష్ట్రానికి ఓ ఏడాది బడ్జెట్ దాఖలు చేయొచ్చని ఎద్దేవా చేశారు.

అమ్మ జయంతి రోజున కూటమి నిర్ణయం

కోయంబత్తూరు, న్యూస్‌టుడే: అన్నాడీఎంకేలో అన్ని వర్గాల ఐక్యతకు కృషి చేసిన సెంగోట్టైయన్‌పై చర్యలు తీసుకోవడం సరికాదని ఏఎంఎంకే ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్ తెలిపారు. సోమవారం కోయంబత్తూరులో విలేకరులతో మాట్లాడారు. ఎన్డీయే నుంచి తాను వైదొలగడానికి అన్నామలై కారణం కాదని, పార్టీ తీసుకున్న వ్యక్తిగత నిర్ణయమని స్పష్టం చేశారు. అమ్మ జయంతి రోజున కూటమికి సంబంధించి ప్రధాన నిర్ణయం ప్రకటిస్తామన్నారు. ద్రోహాన్ని ఓడించడమే లక్ష్యమని, అనేక పార్టీల నుంచి పొత్తుకు పిలుపులు వస్తున్నాయని చెప్పారు. తిరుప్పరంకుండ్రాన్ని ఎవరూ అయోధ్యగా మార్చలేరని తెలిపారు. సెంగోట్టైయన్ అనుభవం టీవీకేకు ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

మాట్లాడుతున్న టీటీవీ దినకరన్

ఈడీ కేసు విచారణకు నిషేధం కుదరదు: హైకోర్టు

ప్యారిస్, న్యూస్‌టుడే: ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్(ఈడీ) మాజీ మంత్రి సెంథిల్ బాలాజీ తదితరులపై నమోదు చేసిన కేసు విచారణకు నిషేధం విధించడం కుదరదని మద్రాసు హైకోర్టు స్పష్టం చేసింది. రవాణాశాఖలో ఉద్యోగం పేరుతో నగదు తీసుకుని మోసానికి పాల్పడినట్లు మంత్రి సెంథిల్ బాలాజీ, ఆయన సోదరుడు అశోక్‌కుమార్, చెన్నై మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ మాజీ మేనేజింగ్ డైరక్టరు గణేశన్ తదితరులపై చెన్నై సెంట్రల్ క్రైం బ్రాంచ్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసు ఆధారంగా ఈడీ మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసింది. సెంట్రల్ క్రైం బ్రాంచ్ పోలీసులు నమోదు చేసిన కేసు విచారణ జిల్లా కలెక్టరేట్ కార్యాలయ ప్రాంగణంలోని ప్రత్యేక కోర్టులో, ఈడీ కేసు చెన్నై ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టులో విచారణలో ఉంది. ప్రత్యేక కోర్టులో ఉన్న కేసు విచారణ పూర్తయ్యే వరకు ఈడీ కేసు విచారణ వాయిదా వేయాలని తెలిపి గణేశన్ మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సోమవారం విచారణ జరిపిన హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎమ్ఎస్ రమేష్, జస్టిస్ లక్ష్మీనారాయణన్ ధర్మాసనం రెండింటిపై ఒకేసారి విచారణ జరపడంలో ఎలాంటి ఇబ్బంది ఉండదని తెలిపి పిటిషన్ కొట్టివేసింది.

డిమాండ్ల సాధనకు తమిళనాడు గ్రామీణాభివృద్ధి శాఖ కార్మికుల సంఘం తరఫున సోమవారం చెన్నై సైదాపేటలో పనగల్ మాళిగై వద్ద సమ్మె చేపడుతున్న దృశ్యం

స్నాతకోత్సవంలో గవర్నర్‌ను అవమానించడం ఆమోదయోగ్యం కాదు

☛ మదురై ధర్మాసనం

ప్యారిస్, న్యూస్‌టుడే: స్నాతకోత్సవంలో గవర్నర్‌ను అవమానించడం ఆమోదయోగ్యం కాదని మద్రాసు హైకోర్టు మదురై ధర్మాసనం తెలిపింది. తిరునెల్వేలి మనోన్మణియం సుందరనార్ యూనివర్సిటీ స్నాతకోత్సవం ఈ ఏడాది ఆగస్టు 13న జరిగింది. గవర్నర్ ఆర్ఎన్ రవి విద్యార్థులకు పట్టాలు అందించారు. పీహెచ్‌డీ డిగ్రీ పొందేందుకు వచ్చిన జీన్ జోసఫ్ అనే విద్యార్థిని గవర్నర్ వద్ద పట్టా తీసుకోకుండా పక్కనే ఉన్న ఉపకులపతి చంద్రశేఖర్ వద్ద డిగ్రీ పట్టా చూపి వేదికపై నుంచి వెళ్లిపోయింది. అందరి ముందు సభా గౌరవం లేకుండా ఆమె వ్యవహరించిన తీరు తీవ్ర చర్చనీయాంశమైంది. గవర్నర్ రవి తమిళనాడుకు, తమిళులకు వ్యతిరేకంగా వ్యవహరిస్తుండడంతో ఆయన చేతుల మీదుగా పట్టా పొందడం ఇష్టం లేదని జీన్ జోసఫ్ తెలిపారు. విచారణలో ఆమె నాగర్‌కోవిల్ డీఎంకే డిప్యూటీ కార్యదర్శి రాజన్ భార్య అని తెలిసింది. యూనివర్సిటీ కులపతి గవర్నర్ చేతుల మీదుగా పట్టా పొందేందుకు నిరాకరించిన విద్యార్థిని పీహెచ్‌డీను రద్దు చేయాలని మదురై ధర్మాసనంలో పిటిషన్ దాఖలైంది. విద్యార్థిని ప్రవర్తన ఆమోదయోగ్యం కాదని ధర్మాసనం పేర్కొంది. ఇలా వ్యవహరించిన వారిపై ఉప కులపతి చర్యలు చేపట్టేందుకు యూనివర్సిటీ చట్టంలో అధికారం ఉందా అనేది తెలియజేయాలని చెప్పి విచారణ వాయిదా వేసింది.

తిరుప్పరంకుండ్రంలో కార్తిక దీపంపై ఆగని వివాదం

◗ శతాబ్దకాలంగా కొనసాగుతున్న వైనం

రాతి స్తంభం

చెన్నై, న్యూస్‌టుడే: తిరుప్పరంకుండ్రంలో కార్తిక దీపం ఎక్కడ వెలిగించాలనే వివాదం కొనసాగుతూనే ఉంది. రాతి స్తంభంపై వెలిగించాలని హిందూ సంస్థలు పట్టుబడుతుండగా, ఉచ్చి పిళ్లెయార్ ఆలయంలోనే ఏళ్లుగా వెలిగిస్తున్నారని ప్రభుత్వం చెబుతోంది. తిరుప్పరంకుండ్రం జిల్లా కేంద్రమైన మదురైకి సుమారు 8 కి.మీ దూరంలో ఉన్న సుబ్రహ్మణ్యస్వామి ప్రసిద్ధ పుణ్యక్షేత్రం. ఇక్కడి కొండను సంఘకాల సాహిత్యాల్లో పరంకుండ్రుగా, బ్రిటిష్ ప్రభుత్వ రికార్డుల్లో స్కందర్ మలై, సికందర్ మలైగా పేర్కొన్నారు. ఈ కొండ శైవ, జైన, ముస్లిం మతాలకు ప్రతీక. కొండ దిగువ భాగంలో ఉన్న సుబ్రహ్మణ్యస్వామి గుహాలయాన్ని పాండ్యుల కాలంలో నిర్మించగా, విజయనగర రాజులు అభివృద్ధి చేశారు. ఆలయానికి పైభాగంలో కొంతదూరంలో ఉచ్చి పిళ్లైయార్ ఆలయం, దానికి పైభాగంలో కాశీ విశ్వనాథ దేవాలయం ఉన్నాయి. ఇవన్నీ కొండకు ఓవైపు అర్ధభాగంలో ఉండగా మరో అర్ధభాగంలో హజ్రత్ సుల్తాన్ సికందర్ బాషా అవులియా దర్గా, దానికి కొంత దిగువన సుమారు 2వేల ఏళ్ల నాటి జైనుల రాతి పడకల గుహలు, తమిళ ప్రాచీన శిలాశాసనాలు ఉన్నాయి. సికందర్ బాషా 12వ శతాబ్దానికి చెందిన వ్యక్తి అని, 14వ శతాబ్దంలో మదురైని పాలించిన దిల్లీ సుల్తానులు ఆయనకు కొండపై దర్గాను నిర్మించారని చెబుతున్నారు.

కొండ హక్కుతో మొదలై..

మండపంలో వెలుగుతున్న కార్తిక దీపం

కొండపై ఉన్న నెల్లితోప్పులో ఓ మండపం నిర్మించడానికి 1915లో దర్గా నిర్వాహకులు ప్రయత్నించగా ఆలయ ప్రతినిధులు అడ్డుకున్నారు. ఈ వివాదాన్ని పరిష్కరించడానికి 1916లో నాటి కలెక్టరు ప్రయత్నించినా, సఫలీకృతం కాలేదు. కొండ యాజమాన్య హక్కు తమదేనంటూ దర్గా నిర్వాహకులు 1923లో కోర్టుకెళ్లారు. దర్గా, దర్గాకు వెళ్లే మెట్లదారి, నెల్లితోప్పు మినహాయించి కొండప్రాంతం ఆలయ యాజమాన్యం కిందకే వస్తుందని అదే సంవత్సరం ఆగస్టులో తీర్పు వెలువడింది. బ్రిటిష్ ఇనామ్ ఫెయిర్ రిజిస్టర్ 1862-63లోనూ తిరుప్పరంకుండ్రం కొండ ఆలయ యాజమాన్యం కింద ఉన్నట్లు పేర్కొనడం గమనార్హం. ఈ తీర్పును సవాల్ చేస్తూ అప్పీల్ చేయగా కిందికోర్టు తీర్పును 1931లో నాటి ప్రివి కౌన్సిల్ సమర్థించింది. ఈ వివాదం నడుస్తున్న సమయంలో కార్తిక దీపాన్ని కొండ పైభాగంలో కాకుండా ఉచ్చి పిళ్లైయార్ ఆలయంలో వెలిగించడానికి తాత్కాలిక ఏర్పాట్లు చేశారని, స్వాతంత్ర్యానంతరం కూడా దానినే కొనసాగిస్తున్నారని కొందరు చెబుతున్నారు. కొండను కేంద్ర పురావస్తుశాఖ ఆధీనంలోకి తీసుకురావాలన్న ఓ కేసులోని అభ్యర్థనను ఈ ఏడాది మార్చిలో మద్రాసు హైకోర్టు మదురై బెంచ్ తోసిపుచ్చింది.

దర్గాకు సమీపంలో..

దర్గాకు 300 అడుగుల దూరంలోని రాతిస్తంభంపైనా వివాదం నెలకొంది. ఎప్పటి నుంచో దీనిని విళక్కు తూన్(దీప స్తంభం)గా పిలుస్తున్నారు. ప్రస్తుతం ఇక్కడే కార్తిక దీపం వెలిగించాలని హిందూ సంస్థల నిర్వాహకులు పట్టుబట్టారు. ఇది దర్గా ప్రాంతానికి అత్యంత సమీపంలో ఉండటంతో సున్నిత సమస్యగా పరిగణిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం చెబుతోంది. ఇది దీపస్తంభం కాదని, 1802లో బ్రిటిష్ పాలకులు దేశవ్యాప్తంగా గ్రేట్ ట్రిగ్నోమెట్రికల్ సర్వే నిర్వహించిన సమయంలో కచ్చితమైన సర్వే కోసం ఏర్పాటు చేసిన రాతి స్తంభమని పలువురు వాదిస్తున్నారు. ఇలాంటి రాళ్లు మరో ఆరు ఇక్కడ ఉన్నాయని చెబుతున్నారు. దీనిని హిందూ మున్నని నిర్వాహకులు ఖండిస్తున్నారు. ఎక్కడైనా సర్వే రాళ్లు 7 అడుగుల పొడువు ఉంటాయా అన్నది వారి ప్రశ్న.

రాతి స్తంభంపైనే..

రాతి స్తంభంపైనే దీపం వెలిగించాలని ఎప్పటి నుంచో డిమాండ్లు వినిపిస్తున్నాయి. 2005లో జరిగిన శాంతి కమిటీ సమావేశంలో దర్గాకు 15 మీటర్ల ఆవల కార్తిక దీపం వెలిగించడానికి ఏ అభ్యంతరమూ లేదని దర్గా తరఫున వెల్లడించారు. రాతి స్తంభంలో కార్తిక దీపాన్ని వెలిగించడానికి 2020లోనూ హిందూ సంస్థల ప్రతినిధులు ప్రయత్నించి అరెస్టయ్యారు. దీప స్తంభం వద్ద హనుమంతుడి చిత్రంతో కూడిన శిల్పం ఉండటంతో సమీపాన ఉన్న ముస్లిం జెండా స్తంభాన్ని తీసేయాలంటూ 2021లో జిల్లా కలెక్టర్‌కు హిందూ మున్నని తరఫున పిటిషన్ సమర్పించారు. మదురై ధర్మాసనం 2021 అక్టోబరు 10న ఇచ్చిన తీర్పులో.. తిరుప్పరంకుండ్రం కొండ పైభాగంలోని సికందర్ దర్గా వద్ద కోడి, మేక బలిని నిషేధించింది. కొండను తిరుప్పరంకుండ్రం కొండగానే పిలవాలని ఆదేశించింది.

సికందర్ దర్గా

(c) eenadu

ప్రకృతిని కాపాడటమంటే

మనల్ని మనం రక్షించుకోవడమే

సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మహదేవన్

విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న జస్టిస్ మహదేవన్

ప్యారిస్, న్యూస్‌టుడే: ప్రకృతిని కాపాడటం అంటే మనల్ని మనం రక్షించుకోవడమేనని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆర్.మహదేవన్ తెలిపారు. జాతీయ హరిత ట్రైబ్యునల్ దక్షిణాది ధర్మాసనం తరఫున జరిగిన దక్షిణ భారత స్థాయి పర్యావరణ సదస్సు ముగింపు కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా పలు పోటీల్లో గెలుపొందిన న్యాయ కళాశాల విద్యార్థులకు మహదేవన్ బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సదస్సులో పర్యావరణ చట్టాలు, ఘన, వైద్య వ్యర్థాల నిర్వహణ, సముద్రతీర భద్రత తదితర వాటిపై చర్చలు జరిగాయన్నారు. ప్రజలకు రాజ్యాంగం కల్పించిన పర్యావరణ హక్కును గ్రీన్ ట్రైబ్యునల్ కాపాడుతోందన్నారు. ప్రకృతిని రక్షించడమంటే మనల్ని మనం రక్షించుకోవడం, సమాజాన్ని రక్షించుకోవడం అని పేర్కొన్నారు. అనంతరం గ్రీన్ ట్రైబ్యునల్ సౌత్ జోన్ బెంచ్ జ్యుడిషియల్ మెంబర్ పుష్ప సత్యనారాయణ మాట్లాడుతూ... రాష్ట్ర పర్యావరణశాఖ కార్యదర్శి సుప్రియా సాహు కొన్నాళ్ల క్రితమే ప్లాస్టిక్ నిర్మూలన ఉద్యమాన్ని నీలగిరి జిల్లాలో ప్రారంభించారన్నారు. దేశంలోనే మొదటిసారిగా వస్త్ర సంచులు అందించే ఏటీఎంలను ప్రారంభించారన్నారు. కార్యక్రమంలో పర్యావరణం, అడవులు, వాతావరణ మార్పులశాఖ అదనపు కార్యదర్శి సుప్రియా సాహు, గ్రీన్ ట్రైబ్యునల్ ఛైర్మన్ ప్రకాశ్ శ్రీవాస్తవ, టెక్నికల్ మెంబర్ ప్రశాంత్ కార్గవ, కేంద్ర ప్రభుత్వ అదనపు సొలిసిటర్ జనరల్ సుందరేశన్ తదితరులు పాల్గొన్నారు.

71 ఇండిగో విమాన సర్వీసులు రద్దు

వడపళని, న్యూస్‌టుడే: ఏడో రోజైన సోమవారం చెన్నై విమానాశ్రయం నుంచి బయలుదేరాల్సిన 38, రావాల్సిన 33తో కలిపి మొత్తం 71 ఇండిగో విమానాలు రద్దయ్యాయి. టికెట్లు తిరిగి బుక్ చేసుకోవడానికి ఆలస్యమవుతోందని, ప్రత్యామ్నాయ సర్వీసులు కూడా పరిమితంగా ఉన్నాయని, ఇతర విమాన సంస్థలు టికెట్ల ధరలు భారీగా పెంచాయని ప్రయాణికులు ఆవేదన, ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కోయంబత్తూరు విమానాశ్రయం నుంచి సోమవారం ఎనిమిది సర్వీసులు రద్దయ్యాయి.

కళాకారులకు పురస్కారాలు

వడపళని, న్యూస్‌టుడే: మహారాజపురం విశ్వనాథ అయ్యర్ ట్రస్ట్ తరఫున ఆదివారం మైలాపూర్ రాగసుధా హాలు వేదికగా జరిగిన కార్యక్రమంలో ఏడుగురికి పురస్కారాలు అందజేశారు. 'కళాసేవక' పురస్కారం తిరునెల్వేలి నెల్లై సంగీత సభ గౌరవ కార్యదర్శి ఆరుముగం, చెన్నై బ్రహ్మగాన సభ గౌరవ కార్యదర్శులు ఎన్.బాలసుబ్రమణ్యం, ఎస్.రవిచంద్రన్ అందుకున్నారు. సీనియర్ మ్యూజీషియన్స్ అవార్డులను కెనడా టోరంటోలోని మృదంగ విద్వాంసుడు బి.గౌరిశంకర్, దిల్లీకి చెందిన వివేక్ సదాశివం, యూత్ ఎక్సలెన్స్ అవార్డును రోహిత్ ప్రసాద్‌కు నిర్వాహకులు ప్రదానం చేశారు.

పురస్కార గ్రహీతలతో నిర్వాహకులు

ఇంజినీరింగ్ కళాశాలలకు

ప్రోత్సాహం

ఉద్యోగ నిపుణులను చేర్చుకునేందుకు నిబంధనలు సడలించిన 'ఏఐసీటీఈ'

వడపళని, న్యూస్‌టుడే

పారిశ్రామికరంగ నిపుణులకు వైద్యుల్యాలను పెంపొందించేందుకు, మరిన్ని ఇంజినీరింగ్ కళాశాలలను ప్రోత్సహించడానికి, గత మూడేళ్లలో ఇంజినీరింగ్ కళాశాలలు, ఉద్యోగ నిపుణుల కోసం ప్రత్యేకమైన కోర్సులకు దరఖాస్తు చేసుకోవడానికి 80శాతం హాజరు కలిగి ఉండాలనే నిబంధనలు విధించింది. దీనిపై తాజాగా అఖిల భారత సాంకేతిక విద్యా మండలి(ఏఐసీటీఈ) సడలింపులు చేసింది. కొత్త సడలింపులతో ఎలాంటి లోపాలు లేని, విద్యార్థుల అధ్యాపక నిష్పత్తిని కొనసాగించే విధంగా కళాశాలలు ఉద్యోగ నిపుణుల కోర్సులను ప్రారంభించవచ్చు.

వేతనాలు బాగుండాలి

కళాశాలల్లో మంచి బోధన అందించడానికి అధ్యాపకులకు వేతనాలు కూడా బాగుండాలని అన్నా వర్సిటీ మాజీ ఉపకులపతి ఇ.బాలగురుస్వామి సూచించారు. ఉద్యోగ భద్రత లేకపోవడంతో నిపుణులు విద్యారంగం వైపు రావడానికి ఆసక్తి కనబరచట్లేదని, ఆకర్షణీయమైన వేతనం, మౌలిక సదుపాయాలతో వారిని కళాశాల వైపునకు ఆకర్షింపజేయడంతోపాటు కంప్యూటర్ సంబంధిత కోర్సుల్లో అధ్యాపకుల కొరతను కూడా పరిష్కరించగలదని బాలగురుస్వామి పేర్కొన్నారు.

వారికి కూడా అవకాశం

ప్రస్తుతం ఇంజినీరింగ్ కోర్సుల్లో చేరుతున్న వారిలో 50శాతం కన్నా ఎక్కువ మంది కంప్యూటర్ సంబంధిత కోర్సుల్లో చేరుతున్నారు. ఏఐసీటీఈ సవరించిన నిబంధనలతో పాటు అనుభవంతో కూడిన అభ్యాస కార్యక్రమాలను ప్రయోగాత్మకంగా అమలు చేయడానికి ప్రతిపాదనలు కూడా విడుదల చేసింది. ఏఐసీటీఈ గుర్తింపు ఉన్న విద్యా సంస్థలు అనుభవం కలిగిన వారి కోసం రూ.100 కోట్ల కన్నా ఎక్కువ టర్నోవర్ ఉండే సంస్థలతో భాగస్వాములుగా కూడా ఉండొచ్చని పేర్కొంది. అనుభవపూర్వక అభ్యాసానికి పాఠ్యాంశాలను విద్య, పరిశ్రమ నిపుణులు కలిసి రూపొందించనున్నారు. పనిచేసే నిపుణులు కూడా నైపుణ్యాలను పెంచుకోవచ్చని ఏఐసీటీఈ ప్రతిపాదించింది.

కొత్త కోర్సుల ప్రారంభానికి వీలు

ఏఐసీటీఈ తాజా నిబంధనలను పలు కళాశాలలు స్వాగతించాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో ఉద్యోగ సామర్థ్యాన్ని పెంచేందుకు కోర్సులను అందించేందుకు బాగా ఉపయోగకరంగా ఉండగలదని కళాశాల వర్గాలు పేర్కొన్నాయి. ప్రస్తుతం అన్నా వర్సిటీ క్యాంపస్‌లోని కళాశాలలు, మంచి పేరున్న ఆటోమొబైల్ కళాశాలలు పరిశ్రమల సహకారంతో ఇలాంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నాయి. ఏఐసీటీఈ సవరణలతో 'నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్(ఎన్‌బీఏ)' గుర్తింపు కలిగిన సంస్థలు, బోర్డు ఆమోదించిన కోర్సులకు తగినట్టుగా ప్రవేశాలను పెంచేందుకు లేదా కొత్త కోర్సులను ప్రారంభించడానికి అనుమతించే వీలుంది. ఎన్‌బీఏ గుర్తింపు లేని సంస్థలు కూడా అదనపు కోర్సులను ప్రారంభించేందుకు వీలుంటుంది. ఇలాంటి నియమాలతో కళాశాలలు కంప్యూటర్ సంబంధిత కోర్సుల్లో ప్రవేశాలను పెంచడానికి అనుకూలంగా ఉంటుందని, అయితే ఈ కోర్సులకు అధ్యాపకుల కొరత కూడా ఉందని పలు కళాశాలల ప్రిన్సిపల్స్ పేర్కొంటున్నారు.

లారీల యజమానులు సమ్మె ప్రకటన వెనక్కి తీసుకోండి

విల్లివాక్కం, న్యూస్‌టుడే: లారీ యజమానుల సంఘం సమ్మె ప్రకటనను ఉపసంహరించుకోవాలని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి శివశంకర్ సూచించారు. వాహన ఎఫ్‌సీ ఛార్జీల పెంపునకు నిరసనగా ఈ నెల 9వ తేదీ సమ్మెకు దిగనున్నట్లు లారీ యజమానుల సంఘం ప్రకటించింది. దీని గురించి రవాణా శాఖ మంత్రి శివశంకర్ నామక్కల్ జిల్లా పరమత్తిలో ఆదివారం సాయంత్రం విలేకరులతో మాట్లాడారు. ఎఫ్‌సీ ఛార్జీ పెంపు వ్యవహారంగా ముఖ్యమంత్రితో చర్చలు జరిపి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

'మార్గళి మాట్రం' సంగీతోత్సవాలు ఆరంభం

వడపళని, న్యూస్‌టుడే: 'మార్గళి మాట్రం' ఆరో వార్షిక కర్ణాటక సంగీతోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఎస్‌సీఐఆర్ట్స్‌రూస్, భారతీయ విద్యా భవన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో దివ్యాంగ కళాకారులు సహా పలువురు కళాకారులకు పురస్కారాలు ప్రదానం చేశారు. కార్యక్రమాలకు మైలాపూర్ ఫైనార్ట్స్ క్లబ్ వేదికగా నిలిచింది. రాణి మాగంటి జీవిత సాఫల్య పురస్కారాన్ని కర్ణాటక సంగీత విద్వాంసుడు, రస అంబిక కామేశ్వర్ సంస్థ వ్యవస్థాపక డైరెక్టర్ ఎస్సార్ కృష్ణమూర్తికి మార్గళి మాట్రం క్యురేటర్ రంజనీ కౌశిక్, హంసధ్వని కార్యదర్శి ఆర్.సుందర్, కర్ణాటక సంగీత విద్వాంసురాలు నిత్యశ్రీ మహదేవన్ అందజేశారు. రైజింగ్ స్టార్ అపెక్స్ పురస్కారం గాత్ర కళాకారుడు నామగిరిపేట్టై గోకులకృష్ణన్ స్వీకరించారు. వసంత రామచందర్ మెమోరియల్ స్కాలర్‌షిప్ పురస్కారాన్ని డాక్టర్ జె.జయలలిత మ్యూజిక్ అండ్ ఫైనార్ట్స్ వర్సిటీకి చెందిన ప్రణవ్ రమేష్ తరఫున కర్ణాటక సంగీత విద్వాంసురాలు నిత్యశ్రీ మహదేవన్ అందుకున్నారు. కార్యక్రమంలో భాగంగా ముందుగా 'మౌన రాగం-నిశ్శబ్ద శబ్దాలు' అనే సంజ్ఞతో కూడిన గాత్రం ప్రత్యేకంగా నిలిచింది. క్లార్క్ పాఠశాలలోని వినికిడి సమస్య ఉన్న 200 మంది విద్యార్థులు తమిళ్ తాయ్ వాళ్తు, మనదిల్ ఉరుది వేండుం ను సంజ్ఞలతో ఆలపించారు.

ఎస్సార్ కృష్ణమూర్తికి పురస్కారం అందజేస్తున్న రంజనీ కౌశిక్, ఆర్.సుందర్, నిత్యశ్రీ మహదేవన్

మ్యూజియాలను సందర్శించిన 'పీయూ' విద్యార్థులు

వడపళని, న్యూస్‌టుడే: జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ) మ్యూజియాలజీ ఫీల్డ్ వర్క్‌లో పాండిచ్చేరి విశ్వవిద్యాలయం(పీయూ) ఓ మైలురాయిని సాధించిందని సోమవారం ఓ ప్రకటన విడుదల చేసింది. వర్సిటీలోని చరిత్ర విభాగానికి చెందిన డాక్టర్ రుమాన్ బెనర్జీ తన పీహెచ్‌డీ స్కాలర్ మిస్ రమ్య కేపీతో కలిసి చరిత్ర విభాగం, విద్యా విభాగాల నుంచి జాతీయ విద్యా విధానం(ఎన్ఈపీ) కింద 31 మంది అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులతో అరికమేడు పురావస్తు ప్రదేశం, ప్రభుత్వ మ్యూజియం, పోలీస్ మ్యూజియం, మహాకవి భారతియార్ మ్యూజియం, భారతీదాసన్ మ్యూజియం, పుదువై మ్యూజియాలను 6వ తేదీ సందర్శించినట్టు పేర్కొంది.

పుదువై మ్యూజియం వద్ద విద్యార్థులు

హిందువులు, ముస్లింలు

ఐక్యంగా జీవిస్తున్నారు

ప్యారిస్, న్యూస్‌టుడే: మదురైలో హిందువులు, ముస్లింలు ఐక్యంగా జీవిస్తున్నారని అన్నాడీఎంకే మాజీ మంత్రి సెల్లూర్ రాజు పేర్కొన్నారు. మదురైలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... తమిళనాడు రాజకీయాల్లోకి ఎవరు వచ్చినా ప్రజల మనసులలో ఎంకే స్టాలిన్, ఎడప్పాడి పళనిసామి తదితర ఇద్దరు మాత్రమే ఉంటారన్నారు. తిరుప్పరంకుండ్రం వ్యవహారంలో అరెస్టయిన భాజపా రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ అన్నాడీఎంకే తరఫున ఎమ్మెల్యే రాజన్ చెల్లప్పా మానవత్వంతో కలిశారన్నారు. స్నేహం ఆధారంగా తిరుప్పరంకుండ్రం వ్యవహారంలో భాజపాకు మద్దతు ఇవ్వలేదని, అందులో రాజకీయాలు లేవన్నారు. తాము కూటమిలో ఉన్నా విధానాలు వేర్వేరని, ఎన్నికల్లో భాగస్వాములుగా ఉన్నామని తెలిపారు.

విజయ్ బహిరంగసభకు ప్రత్యామ్నాయ స్థలం

విల్లివాక్కం, న్యూస్‌టుడే: ఈరోడ్‌లో టీవీకే అధ్యక్షుడు విజయ్ బహిరంగ సభకు అనుమతి కోరుతూ పార్టీ నేత సెంగోట్టయ్యన్ జిల్లా కలెక్టర్, ఎస్పీకి వినతిపత్రం సమర్పించిన నేపథ్యంలో ప్రత్యామ్నాయ స్థలాన్ని ఎంపిక చేసుకోవాలని సూచించారు. అనుమతి కోరిన పవళత్తాంపాలయంలో ఎస్పీ సుజాత పరిశీలించారు. అక్కడ స్థలం చాలదని గుర్తించారు. దీంతో అనుమతి నిరాకరించి ప్రత్యామ్నాయ స్థలాన్ని ఎంపిక చేసుకోవాలని సూచించారు. ఆ మేరకు సెంగోట్టయ్యన్ నేతృత్వంలో నిర్వాహకులు పెరుందురై సమీపంలోని సేలం-కొచ్చి జాతీయ రహదారి సమీపంలోని సర్కై ప్రాంతంలో స్థలం ఎంపిక చేయడానికి చర్యలు చేపట్టారు.

నోటీసు విషయం పరిశీలిస్తాం

మంత్రి కేఎన్ నెహ్రూ

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) రెండోసారి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, డీజీపీకి నోటీసు పంపిన విషయాన్ని పరిశీలిస్తానని పురపాలకశాఖ మంత్రి కేఎన్ నెహ్రూ తెలిపారు. తిరుచ్చి జిల్లా డీఎంకే కార్యదర్శులతో సోమవారం సమావేశం జరిగింది. బూత్ కమిటీల పునర్వ్యవస్థీకరణ, పార్టీ బలోపేతంపై చర్చించారు.

మాజీ మంత్రి నివాసానికి బాంబు బెదిరింపులు

ఆర్కేనగర్: పుదుకోట్టై జిల్లా ఇలుప్పూర్‌లోని అన్నాడీఎంకే మాజీ మంత్రి విజయభాస్కర్ ఇంటికి ఇప్పటికే రెండుసార్లు బాంబు బెదిరింపులు వచ్చాయి. ఈ నేపథ్యంలో సోమవారం మరోసారి దుండగులు బెదిరింపులకు పాల్పడ్డారు. దీంతో పోలీసులు, బాంబు స్క్వాడ్ ఆయన నివాసంలో తనిఖీలు చేపట్టారు. ఎలాంటి పేలుడు పదార్థాలు లభించలేదు. ఇందుకు సంబంధించి దర్యాప్తు చేపట్టారు.

ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి

ఆందోళనలో పాల్గొన్న నర్సులు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: నర్సింగ్ అసిస్టెంట్ శిక్షణ పూర్తి చేసిన వారితో ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని సోమవారం చెన్నైలో ఆందోళన జరిగింది. ప్రభుత్వం హామీ ఇచ్చినా ఇప్పటివరకు అమలు చేయలేదని నినాదాలు చేశారు. 2012లో 4004 ఖాళీ పోస్టులను ప్రకటించారని, ఇప్పటివరకు భర్తీ చేయలేదన్నారు.

స్కానర్ విఫలమైనా రెట్టింపు టోల్ వసూలు

'ఎన్‌హెచ్‌ఏఐ'కి జరిమానా

వడపళని, న్యూస్‌టుడే: ఫాస్ట్ ట్యాగ్ ఖాతాలో తగినంత బ్యాలెన్స్ లేదని తప్పుగా చెప్పి, రెట్టింపు టోల్ వసూలు చేయడంపై జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ)కు జరిమానా విధించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 20న ఈరోడ్ నుంచి చెన్నైకి తన స్నేహితుడి కుటుంబం వస్తున్నారని న్యాయవాది యు.అజారుద్దీన్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. తెల్లవారుజామున 3.06 గంటల ప్రాంతంలో ఆతూర్ లేన్‌వద్ద వారి వాహనం ఆపారు. తమ ఫాస్ట్ ట్యాగ్ ఖాతాలో బ్యాలెన్స్ లేదని సిబ్బంది చూపించి వారి నుంచి రూ.140 వసూలు చేశారని పేర్కొన్నారు. ఆ సమయంలో ఫాస్ట్ ట్యాగ్ ఖాతాలో రూ.863 బ్యాలెన్స్ ఉందని పిటిషన్‌లో వివరించారు. టోల్ ప్లాజా వద్ద ఆటోమేటెడ్ సిగ్నల్ పని చేయడం లేదని, సిబ్బందికి ఈ లోపం గురించి తెలుసునన్నారు. బ్యాలెన్స్‌ను మాన్యువల్‌గా తనిఖీ చేయకుండా, సిబ్బంది దురుసు పదజాలంతో గొడవకు దిగారని, కుటుంబీకులు ఇబ్బంది పడ్డారని చెన్నై(ఉత్తర) జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ గుర్తించింది. ఎలక్ట్రానిక్ టోల్ కలెక్షన్(ఈటీసీ) వ్యవస్థ పనిచేయనప్పుడు, తగినంత నిధులతో కూడిన ఫాస్ట్‌ట్యాగ్ ఉన్న వాహనాన్ని చెల్లింపు లేకుండా అనుమతించాలని కమిషన్ సూచించింది. జీరో లావాదేవీ రసీదు కూడా జారీ చేయాలని, ఆతూర్ టోల్ ప్లాజా వద్ద దీన్ని సక్రమంగా పాటించలేదని తన ఉత్తర్వులో పేర్కొంది. పరిహారంగా రూ.10వేలు, వ్యాజ్యం ఖర్చు కింద రూ.5 వేలు, జాప్యంపై 9శాతం వార్షిక వడ్డీతో రెండు నెలల్లోపు చెల్లించాలని ఆదేశించింది.

చెన్నైలో అతిపెద్ద పార్కు జనవరిలో ప్రారంభం

విల్లివాక్కం, న్యూస్‌టుడే: చెన్నై మణలి సమీపం కడప్పాక్కంలో చెన్నైలోనే అతిపెద్ద ఎకో పార్కు వచ్చే ఏడాది జనవరిలో ప్రారంభం కానుంది. 134.89 ఎకరాల జలవనరును పర్యావరణ ఉద్యానవనంగా చెన్నై మహానగర పాలక సంస్థ మార్చుతోంది. ఉత్తర చెన్నై సరస్సు కొసస్థలైయర్ బేసిన్‌లో ఉంది. ఇది 13.4 చదరపు కి.మీ పరీవాహక ప్రాంతం నుంచి నీటి ప్రవాహాన్ని సేకరిస్తుంది. ఆసియా అభివృద్ధి బ్యాంకు మంజూరు చేసిన రూ.46.30 కోట్లతో ప్రాజెక్టు పూర్తికానుంది. కేంద్ర భాగంలో ఐదెకరాల పక్షుల ద్వీపం ఏర్పాటు చేశారు. ఇది బురదను పట్టుకొని నీటి నాణ్యతను స్థిరీకరిస్తుంది. సుమారు లక్ష మొక్కలు నాటనున్నారు. పూడికతీత, కట్టలను బలోపేతం చేయడం, ఇన్‌లెట్‌లు, అవుట్‌లెట్‌లు, మిగులు జలాల అడ్డుకట్టల పునరుద్ధరణ, తోటల పెంపకంలాంటి ప్రధాన పనులు పూర్తయినట్టు జీసీసీ డిప్యూటీ కమిషనర్ (పనులు) శివకృష్ణమూర్తి తెలిపారు.

మణలిలోని సరస్సు

డీజీపీకి ఈడీ రాసిన లేఖ

ఎలా బయటికొచ్చింది?

ప్యారిస్, న్యూస్‌టుడే: డీజీపీకి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఈడీ) రాసిన లేఖ బయటకొచ్చిన వ్యవహారం సీబీసీఐడీ దర్యాప్తునకు బదిలీ అయింది. తిరుచ్చికి చెందిన లాయరు పరంజ్యోతి మద్రాసు హైకోర్టు మదురై ధర్మాసనంలో దాఖలు చేసిన పిటిషన్‌లో.. కేసు విచారణకు గత నెల 26న మదురై ధర్మాసనంలో హాజరయ్యారని, మరుదు సేనై అధ్యక్షుడు ఆది నారాయణన్ దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యం విచారణకు వచ్చిందన్నారు. ఆయన తన పిటిషన్‌లో తమిళనాడు డీజీపీకి ఈడీకి పంపిన రహస్య లేఖ నకలు జత చేసి, దాని ఆధారంగా కేసు నమోదు చేయాలని కోరారని చెప్పారు. ఆది నారాయణన్‌పై రాష్ట్రంలో పలు క్రిమినల్ కేసులు ఉన్నాయని, డీజీపీకి పంపిన లేఖ ఆయనకు ఎలా వచ్చిందో అర్థం కాలేదన్నారు. పలు క్రిమినల్ కేసులతో సంబంధం ఉన్న వ్యక్తికి ఈడీ రహస్య లేఖ ఎలా లభించిందో విచారించి, చర్యలు చేపట్టాలని కోరారు. ఈ పిటిషన్ న్యాయమూర్తి జస్టిస్ శ్రీమది ఎదుట విచారణకు వచ్చింది. ప్రభుత్వం తరఫున.. ఈడీ రహస్య లేఖ బయటకు వచ్చిన వ్యవహారమై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, లాయర్లపై కేసు నమోదు చేసి ప్రాథమిక దర్యాప్తు ప్రారంభమైనట్లు తెలిపారు. ఇది నమోదు చేసుకున్న న్యాయమూర్తి కేసును ముగించేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఈడీ రాసిన రహస్య లేఖ బయటికొచ్చిన వ్యవహారమై సీబీసీఐడీ దర్యాప్తు చేయాలని డీజీపీ వెంకటరామన్‌కు ఉత్తర్వులు ఇచ్చారు.

వేళచ్చేరి, న్యూస్‌టుడే: కడలూర్ జిల్లా చిదంబరం సమీపం కె.ఆడూర్ గ్రామంలోని కొలనులో ఆదివారం కొందరు చేపల కోసం వలలు విసిరారు. ఓ వలలో సుమారు 5 అడుగుల పొడవు, 30 కిలోల బరువున్న మొసలి పిల్ల చిక్కింది. భయాందోళనకు గురైన గ్రామస్థులు చిదంబరం అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. సిబ్బంది అక్కడకు చేరుకుని మొసలి పిల్లను తాళ్లతో కట్టి తీసుకెళ్లి వక్కిరమేరి చెరువులో వదిలారు.

క్యూ స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్‌లో

దక్షిణ రైల్వే జట్టుకు బంగారు పతకం

వడపళని, న్యూస్‌టుడే: సెంట్రల్ రైల్వే స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముంబయి పరేల్ సీఆర్ఎస్ఏ మైదానంలో జరిగిన 57వ అఖిల భారత రైల్వే క్యూ స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్ 2025-26 పోటీల్లో ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను దక్షిణ రైల్వే జట్టు కైవసం చేసుకుంది. తుది పోరులో తూర్పు రైల్వే జట్టును ఓడించి బంగారు పతకాన్ని సాధించిందని దక్షిణ రైల్వే సోమవారం ఓ ప్రకటనలో పేర్కొంది. బిలియర్డ్స్ ఈవెంట్‌లో కూడా కాంస్య పతకం గెలిచిందని, జట్టు ఛాంపియన్‌షిప్‌లో మొత్తం మీద మూడో స్థానాన్ని దక్కించుకున్నట్లు తెలిపింది. ఈ నెల రెండో వారంలో చండీఘర్‌లో జరగనున్న ఆలిండియా పూల్ ఛాంపియన్‌షిప్ పోటీలకు దక్షిణ రైల్వే జట్టు ఎంపికైనట్లు పేర్కొంది.

దక్షిణ రైల్వే జట్టుకు బంగారు పతకం అందజేస్తున్న సెంట్రల్ రైల్వే జీఎం

తిరుప్పరంకుండ్రం అయోధ్యగా మారితే తప్పేంటి?

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: తిరుప్పరంకుండ్రం అయోధ్యగా మారితే తప్పేమిటని భాజపా సీనియర్ నేత హెచ్.రాజా ప్రశ్నించారు. పుదుకోట్టై జిల్లా ఆలంగుడిలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. తమిళనాడులో హిందూ దేవదాయ శాఖ ఆస్తుల నిర్వహణ సరిగా లేదన్నారు. డీఎంకే హిందూ వ్యతిరేక శక్తి అని విమర్శించారు. తిరుప్పరంకుండ్రం వ్యవహారాన్ని ఆధారంగా చేసుకొని డీఎంకే ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు. దీప స్తంభం వద్ద కార్తికదీపం వెలిగించడాన్ని ముస్లింలు వ్యతిరేకించలేదన్నారు. కోర్టు తీర్పు అమలుచేయడంలో డీఎంకేకు సమస్యేమిటన్నారు.

మాట్లాడుతున్న హెచ్ రాజా

12వ తేదీలోపు దీపం వెలిగించాలి.. విల్లివాక్కం: తిరుప్పరంకుండ్రం కొండపై 12వ తేదీ లోపు దీపం వెలిగించాలని భాజపా జాతీయ కార్యవర్గ సభ్యుడు హెచ్.రాజా పేర్కొన్నారు. ఈరోడ్ జిల్లా గోపిచెట్టిపాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం హిందూ వ్యతిరేకిగా వ్యవహరిస్తోందన్నారు.

నోటీసు

మహారాజశ్రీ గుంటూరు 4వ అదనపు సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో

ఒ.యస్.నెం.170/2023 మరియు ఐ.ఎ.నెం.473/2023

బిట్వీన్:

శ్రీనివాసబాబు మంచికలపూడి గారి తరపున జి.పి.ఏ. హోల్డర్ రాంబాబు బోడపాటి ..వాది(పిటీషనరు)

మరియు

నాగండ్ల హైమావతి వగైరాలు.

...ప్రతి వాదులు(రెస్పాండెంట్లు)

టు,

D-8(R-8):చావా మెహర్ చంద్ వీరేష్, తండ్రి.సాంబ శివ రావు, నివాసం.28,టి-నగర్, చెన్నై, తమిళనాడు రాష్ట్రం

పై నెంబరు దావాలో 8వ ప్రతివాది మరియు ఐ.ఎ.నెం.473/2023 ఇన్ ఒ.యస్.నెం.170/2023 పిటీషనులో 8వరెస్పాండెంటు అయిన మీకు పై కోర్టు వారి నుండి ఎన్ని సార్లు సమన్లు/నోటీసులు పంపించినను ముట్టనందున మీకు సమన్లు/నోటీసులు ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయమని **ది.05-01-2026**కి వాయిదా వేసినారు. కావున వాయిదా రోజు **ఉ.గం.10-30ని.**లకు పై కోర్టు వారి యెదుట మీరు స్వయంగా కాని లేదా మీ తరపు న్యాయవాది ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనిచో సదరు దావా మరియు పిటీషను మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం)

వాయిదా తేది:05-01-2026

పెద్ది రాజేంద్ర ప్రసాద్,వాది(పిటీషనరు)తరపు అడ్వకేట్, గుంటూరు, సెల్. 98483 66343

నకిలీ మందుల వ్యవహారం

పుదుచ్చేరి శాసనసభ ముట్టడికి యత్నం

డీఎంకే ఎమ్మెల్యేల అరెస్ట్

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: నకిలీ మందుల తయారీ వ్యవహారంలో నిందితులను అరెస్ట్ చేయాలని పుదుచ్చేరి అసెంబ్లీని ముట్టడించేందుకు యత్నించిన నలుగురు డీఎంకే ఎమ్మెల్యేలతో సహా వందలాది మంది కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేశారు. పుదుచ్చేరిలో నకిలీ మందులు తయారుచేసిన పరిశ్రమలు, 10 గోదాములకు సీల్ వేయడంతోపాటు యజమాని రాజా సహా 10మంది కోసం సీబీసీఐడీ పోలీసులు గాలిస్తున్నారు. ఈ నేపథ్యంలో భాజపా-ఎన్నార్ కాంగ్రెస్ ప్రభుత్వ తీరును ఖండిస్తూ డీఎంకే రాష్ట్ర ఆర్గనైజర్, ప్రతిపక్షనేత శివ నేతృత్వంలో ఎమ్మెల్యేలు అనిబాల కెన్నడి, సెంథిల్‌కుమార్, సంపత్ తదితరులు ర్యాలీగా బయల్దేరారు. పోలీసులు అడ్డుకున్నా బారికేడ్లు దాటి వెళ్లడంతో అరెస్ట్ చేశారు. ప్రభుత్వం వైద్యనిపుణులతో కమిటీని ఏర్పాటు చేయలేదని శివ ఆరోపించారు. కేసు దర్యాప్తు సీబీఐకి అప్పగించాలన్నారు.

ఆందోళనలో మాట్లాడుతున్న ప్రతిపక్షనేత శివ

చట్ట విరుద్ధంగా మట్టి తరలింపు

ఇటుక బట్టీలకు భారీ జరిమానాకు సిఫారసు

ట్రిప్లికేన్, న్యూస్‌టుడే: కోయంబత్తూరు జిల్లాలోని చిన్నతడాగం, వీరపాండి, సోమైపాళ్యం, పన్నిమడై తదితర ప్రాంతాల్లో ఇటుక బట్టీలకు భారీ జరిమానా విధించాలని సిఫారసు వచ్చింది. బట్టీలకు సమీపంలోని వాగులు, జలమార్గాల నుంచి సుమారు 110 మిలియన్ క్యూబిక్ మీటర్ల మట్టి అక్రమంగా తరలించారని ఆరోపణలు ఉన్న నేపథ్యంలో కోర్టు 177 ఇటుక బట్టీలు మూసివేయాలని ఆదేశించింది. బట్టీల కారణంగా పర్యావరణానికి కలిగే నష్టానికి యజమానుల నుంచి పరిహారం కోరుతూ పర్యావరణ కార్యకర్తలు మద్రాసు హైకోర్టులో కేసు వేశారు. ఈ నేపథ్యంలో దిల్లీలో ఇంధన పరిశోధన సంస్థ నిపుణులు దాదాపు 4 నెలల పాటు అధ్యయనం నిర్వహించి రూ.3 వేల కోట్ల జరిమానా విధించవచ్చని కాలుష్య నియంత్రణ మండలికి సిఫారసు చేశారు. సవరించిన అంచనా మేరకు తాజాగా రూ.900కోట్ల జరిమానా విధించాలని సిఫారసు చేసింది. కాలుష్య నియంత్రణ మండలి ఈ నివేదికను హైకోర్టుకు సమర్పించనుంది.

అనాథ పిల్లలకు ప్రభుత్వ సాయం

చెన్నై: తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మారిన ఒకే కుటుంబానికి చెందిన నలుగురికి ప్రభుత్వ సాయాన్ని ముఖ్యమంత్రి అందించారు. కళ్లకురిచ్చి జిల్లా పూట్టై గ్రామానికి చెందిన కమలకన్నన్, వసంతి దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. అనారోగ్యంతో 2017లో వసంతి మరణించగా కమలకన్నన్ గత నెల 14న మృతి చెందాడు. నలుగురు పిల్లలను ముఖ్యమంత్రి సోమవారం సచివాలయానికి రప్పించారు. వారి భవిష్యత్తు దృష్ట్యా ఇంటి స్థలపట్టా, కలైజ్ఞరిన్ కనవు ఇల్లం పథకం కింద ఇంటి కేటాయింపు, ఉద్యోగ నియామక ఉత్తర్వు, అన్బుకరంగళ్ పథకం కింద ఆర్థిక సాయం, నైపుణ్య శిక్షణ కోసం ఉపకారవేతనంవంటివాటిని అందించారు.

ముఖ్యమంత్రితో సాయం పొందిన చిన్నారులు

పురుషుల జూనియర్ హాకీ ప్రపంచ కప్ పోటీల్లో పాల్గొంటున్న పలు దేశాల క్రీడాకారులు చెన్నై వళ్లువర్‌కోట్టంలో సోమవారం ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్‌తో ఫొటోలు తీసుకున్నారు. క్రీడాకారులు పంచె, చొక్కాలు ధరించటం గమనార్హం.

- సైదాపేట, న్యూస్‌టుడే

కోర్టు ధిక్కరణ కేసులో ఈడీ అధికారులు హాజరవ్వాలి: హైకోర్టు

ప్యారిస్, న్యూస్‌టుడే: సినీ నిర్మాత ఆకాష్ భాస్కరన్ దాఖలు చేసిన కోర్టు ధిక్కరణ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఈడీ) అధికారులు హాజరవ్వాలని హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. టాస్మాక్ అవినీతి వ్యవహారమై ఆకాష్ భాస్కరన్, పారిశ్రామికవేత్త రవీంద్రన్‌లకు చెందిన ప్రాంతాల్లో సోదాలు జరిపిన ఈడీ ఆకాష్ భాస్కరన్ నుంచి పత్రాలు స్వాధీనం చేసుకుంది. దీనిని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ జరిపిన హైకోర్టు స్వాధీనం చేసుకున్న పత్రాలను తిరిగి అప్పగించాలని ఉత్తర్వులు ఇచ్చింది. చర్యలు చేపట్టడానికి నిషేధం విధించింది. ఆకాష్ భాస్కర్‌కు ఈడీ సమన్లు జారీచేయడంతో ఆయన కోర్టు ధిక్కరణ కేసు దాఖలు చేశారు. సోమవారం విచారించిన మద్రాసు హైకోర్టు ఈడీ అధికారులు హాజరై వివరణ ఇవ్వాలని ఉత్తర్వులు ఇచ్చి విచారణ వాయిదా వేసింది.

EENADU Classifieds

JOBS

అమెరికాలో 1 సం॥ బాబు ఆలన, పాలన వ్యక్తిగత సంరక్షణ కొరకు అనుభవంగల ఆడవారు కావలెను. అమెరికా వీసా కల్గినవారు మాత్రమే. ✆ 9440803362.

(c) eenadu

సెంథిల్ బాలాజీ వారానికి రెండుసార్లు ఎందుకు హాజరవ్వాలి?

ఈడీని ప్రశ్నించిన సుప్రీంకోర్టు

ప్యారిస్, న్యూస్‌టుడే: మాజీ మంత్రి సెంథిల్ బాలాజీ నేరుగా హాజరైతే మీకేం రాబోతుందని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ)ను సుప్రీంకోర్టు ప్రశ్నించింది. సెంథిల్ బాలాజీ బెయిల్ నిబంధనలు సడలించాలని దాఖలైన పిటిషన్ సోమవారం సుప్రీంకోర్టులో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మల్యా బాగ్చీ ధర్మాసనంలో విచారణకు వచ్చింది. ఇరు తరపు వాదనలు విన్న ధర్మాసనం.. చెన్నైలో ఉన్న ఈడీ కార్యాలయంలో సెంథిల్ బాలాజీ వారానికి రెండుసార్లు ఎందుకు హాజరవ్వాల'ని ప్రశ్నించారు. ఈడీ తరపున బెయిల్ నిబంధనలను న్యాయస్థానం సవరించవచ్చ'ని తెలిపారు. దీనిని రాజకీయ జోక్యం, బెదిరింపులు, వేధింపులు అని అర్థం చేసుకోవచ్చా అని న్యాయమూర్తులు ప్రశ్నించారు. ఫిర్యాదుదారులను రాజీ కుదిర్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఈడీ తరపున తెలిపారు. సెంథిల్ బాలాజీ నెలకు ఒకసారి హాజరైతే సరిపోదా అని న్యాయమూర్తులు ప్రశ్నించారు. ఈడీ దర్యాప్తునకు అవసరమైనప్పుడు సెంథిల్ బాలాజీ హాజరవ్వాలని, అందుకు ముందుగానే నోటీసు పంపాలని ఉత్తర్వులు ఇచ్చారు. నగదు మోసం కేసులో కోర్టులో హాజరవ్వాలన్న నిబంధనను సడలించారు.

ఆర్కేనగర్: పళని ఆలయంలో కుంభాభిషేకాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు శేఖర్‌బాబు, చక్రపాణి

పాల్గొన్న భక్తులు

వైభవంగా ఏకాంబరనాథర్ ఆలయ మహా కుంభాభిషేకం

కాంచీపురం, న్యూస్‌టుడే: కాంచీపురంలోని ప్రసిద్ధ ఏకాంబరనాథర్ ఆలయంలో చేపట్టిన పునరుద్ధరణ పనులు పూర్తికావడంతో సోమవారం మహా కుంభిషేకం ఘనంగా నిర్వహించారు. కంచి కామకోటి పీఠాధిపతులు శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి, శ్రీ సత్య చంద్రశేఖరేంద్ర సరస్వతి దగ్గరుండి క్రతువు జరిపించారు. ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ వేల్‌మురుగన్, ధర్మకర్తలు, ఆలయ అధికారులు, కాంచీపురం తొండై మండల ఆధీనం చిదంబరస్వామి, ధర్మపురం ఆధీనం మాశిలామణి దేశిక జ్ఞాన సంబంధ పరమాచార్య, మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వేల్‌మురుగన్, ఎమ్మెల్యే సీవీఎంపీ ఎళిలరసన్, జిల్లా న్యాయమూర్తి దీప్తి అరివుమతి, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంచీపురం నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. పాఠశాలలకు సెలవు ప్రకటించారు. నగరంలో అనేకచోట్ల దాతలు భక్తులకు అన్నదానం నిర్వహించారు.

కలశానికి పూజలు నిర్వహిస్తున్న కంచి కామకోటి పీఠాధిపతులు

పళని మురుగన్ క్షేత్రంలో...

ఆర్కేనగర్: దిండుక్కల్ జిల్లా పళని దండాయుధపాణి ఆలయంలో 12ఏళ్ల తర్వాత కుంభాభిషేకం సోమవారం నిర్వహించారు. మంత్రులు శేఖర్‌బాబు, చక్రపాణి, ఎమ్మెల్యే సెంథిల్‌కుమార్ జెండా ఊపి వేడుకను ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. వారికి విబూది, కుంకుమ, మురుగన్ చిత్రపటం, పంచామృతం, పవిత్ర జలాలతో కూడిన సంచి అందజేశారు. ఆలయ మహిళా ఆర్ట్స్ కళాశాల తరపున పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు.

ఫిషింగ్ హార్బర్లు ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి

ఫిషింగ్ హార్బర్లు ప్రారంభం

చెన్నై, న్యూస్‌టుడే: మత్స్యశాఖ తరఫున రూ.98.92 కోట్లతో అభివృద్ధి చేసిన కన్యాకుమారి జిల్లా తేంగాపట్టణం, తరంగంబాడిలోని ఫిషింగ్ హార్బర్లు, తెన్కాశి జిల్లా కడనా గ్రామంలో నిర్మించిన చేపపిల్లల క్షేత్రాన్ని సచివాలయం నుంచి ముఖ్యమంత్రి సోమవారం ప్రారంభించారు.

వృషభ వాహనంపై చండికేశ్వరస్వామి ఊరేగింపు

తిరువణ్ణామలై, న్యూస్‌టుడే: తిరువణ్ణామలై అరుణాచలేశ్వర స్వామి ఆలయంలో కార్తిక మహా దీపోత్సవాలు పది రోజులపాటు జరిగి ముగిశాయి. తర్వాత అయ్యన్ కోనేరులో మూడు రోజులపాటు తెప్పోత్సవాలు జరిగాయి. ఇందులో భాగంగా చివరిగా ఆదివారం రాత్రి చండికేశ్వరస్వామిని వృషభ వాహనంపై కొలువుదీర్చి ఆలయ మాడ వీధుల్లో ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వృషభ వాహనంపై చండికేశ్వరస్వామి

క్రీడాకారిణులకు ఘన స్వాగతం

సైదాపేట, న్యూస్‌టుడే: మాల్దీవుల్లో జరిగిన 7వ ప్రపంచకప్ క్యారమ్స్ పోటీల్లో 17 దేశాలకు చెందిన 150 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. భారతదేశం తరపున తమిళనాడుకు చెందిన కీర్తన, ఖాసిమా, మిత్ర పాల్గొని మూడు విభాగాల్లో పసిడి పతకాలు సాధించారు. ఈ నేపథ్యంలో ఆదివారం చెన్నై చేరుకున్న వారికి చెన్నై విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. తమిళనాడు క్రీడాభివృద్ధి కమిషన్ అధికారులు, వారి తల్లిదండ్రులు, బంధువులు ఘన స్వాగతం పలికారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో టీజేఎస్ విద్యార్థుల ప్రతిభ

గుమ్మిడిపూండి, న్యూస్‌టుడే: చెన్నై రామాపురంలోని ఎస్ఆర్ఎం సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలో 'టెక్నోవేట్-2025' పేరిట రాష్ట్రస్థాయి పోటీలు సోమవారం నిర్వహించారు. తిరువళ్లూరు జిల్లాలోని 40కి పైగా పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. గుమ్మిడిపూండి సమీపం పెరువాయల్‌లోని టీజేఎస్ పబ్లిక్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఇనియన్, ఆశిక్ బాషా, తమిళరసు, గౌతమ్ సిర్ని, అక్షయ, కరిష్మా.. హైడ్రోజన్ ఇంధనంతో నడిచే వాహనం, నిద్రను గుర్తించే అలారం, సరికొత్త అద్దాలను ప్రదర్శనలో ఉంచి బంగారు పతకాలు సాధించారు. వీరిని పాఠశాల కరస్పాండెంటు తమిళరసన్, ప్రిన్సిపల్ కస్పార్ ప్రశంసించారు.

ముఖ్యమంత్రి స్టాలిన్‌ను సోమవారం క్యాంపు కార్యాలయంలో డీఎంకే యువజన విభాగ కార్యదర్శి, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ కలిసి తిరువణ్ణామలైలో 14న జరగనున్న పార్టీ యువజన విభాగం ఉత్తర జోన్ నిర్వాహకుల సమావేశానికి ఆహ్వానం పలికారు. – న్యూస్‌టుడే, చెన్నై

అయ్యప్ప ఆలయానికి భక్తుల పాదయాత్ర

పెరియపాళ్యం, న్యూస్‌టుడే: తిరువళ్లూరు జిల్లా పెరియపాళ్యం సమీపం కన్నిగైపేర్‌లోని అయ్యప్పస్వామి ఆలయంలో 35వ వార్షిక దీప పూజ ఆదివారం రాత్రి నిర్వహించారు. అలంకరించిన వాహనంపై అయ్యప్పస్వామి ప్రతిమను కొలువుదీర్చి పుర వీధుల్లో ఊరేగించారు. డీఎంకే ఐటీ విభాగ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే సీహెచ్ శేఖర్ ముఖ్య అతిథిగా హాజరై కన్నెస్వాములు 150 మందికి టీషర్టులు అందజేశారు. అనంతరం చెన్నై అయ్యప్పన్‌తాంగల్‌లోని అయ్యప్ప ఆలయానికి పాదయాత్రగా బయలుదేరిన భక్తులకు పళ్లు, బిస్కెట్లు, దుప్పట్లు అందజేశారు.

కన్నె స్వాములకు టీషర్టులు అందజేస్తున్న సీహెచ్ శేఖర్

దుకాణదారుల నుంచి విరాళం సేకరిస్తున్న కలెక్టరు తర్పగరాజ్

ఫ్లాగ్ డే విరాళాల సేకరణ

తిరువణ్ణామలై, న్యూస్‌టుడే: తిరువణ్ణామలై జిల్లా కలెక్టరు తర్పగరాజ్ సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట ఫ్లాగ్ డేపై అవగాహన కల్పించే విధంగా ఏర్పాటైన ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా దుకాణదారులు, వ్యాపారుల నుంచి విరాళాలు సేకరించారు.

కాజ్‌వేపై ప్రమాదకరంగా వెళ్తున్న వాహనదారులు

కాజ్‌వే నిర్మాణంలో లోపం.. వాహనదారులకు శాపం

అరక్కోణం, న్యూస్‌టుడే: రాణిపేట జిల్లా అరక్కోణం సమీపం తక్కోలం-పేరంబాక్కం రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. ఈ మార్గంలో సరస్సుపై ఏడాది క్రితం కాజ్‌వే నిర్మించారు. నిర్మాణంలో నాణ్యత లోపించిందని, గుంతలు ఏర్పడ్డాయని సమాజ సేవకులు పలువురు ఆరోపించారు. ఈ క్రమంలో సరస్సు ఉద్ధృతంగా ప్రవహిస్తుండటంతో కాజ్‌వే ప్రహరీ కూలి వంతెనపై నీరు ప్రవహిస్తోంది. దీంతో కాజ్‌వేకు ఇరువైపులా వాహనాలు నిలిపివేస్తున్నారు. కొందరు వాహనదారులు ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

అరక్కోణం, న్యూస్‌టుడే: రాణిపేట జిల్లా అరక్కోణం సమీపం బంగారమ్మ కండ్రిగై వద్ద ఉన్న వి.గెంగుస్వామి నాయుడు మెట్రిక్యులేషన్ మహోన్నత పాఠశాల వార్షికోత్సవం సోమవారం జరిగింది. కార్యక్రమానికి తమిళనాడు కమ్మనాయుడు మహాజన సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు మోహన్ నేతృత్వం వహించారు. రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ కన్నప్పన్ పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ట్రోఫీలు, ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల కోశాధికారి వాసుదేవన్, అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, కరస్పాండెంట్ అశోకన్, పిన్సిపల్ వనిత, ఉపాధ్యక్షుడు ఎత్తిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నడి రోడ్డుపై మహిళ దారుణహత్య

విజయ (పాతచిత్రం)

విల్లివాక్కం, న్యూస్‌టుడే: ఈరోడ్ జిల్లా పెరుందురై సమీపం తీర్థాంపాళయానికి చెందిన సెంగోట్టైయ్యాన్(60), విజయ(52) దంపతులు అభిప్రాయబేధాల కారణంగా విడిపోయారు. తర్వాత సెంగోట్టైయ్యాన్ రెండో పెళ్లి చేసుకున్నారు. ప్రస్తుతం ఆయనకు ఓ కుమార్తె, కుమారుడున్నారు. ఇదిలా ఉండగా సెంగోట్టైయ్యాన్ తన ఆస్తిని విక్రయించడానికి యత్నించగా కొనుగోలుదారులు దస్తావేజులపై మొదటి భార్య సంతకం కావాలన్నారు. విజయ తన సంతకం పెట్టాలంటే తాను అడిగిన డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మరీ ఎక్కువ అడగడంతో సెంగోట్టైయ్యాన్ కుదరదని చెప్పాడు. ఈ నేపథ్యంలో ఆదివారం మధ్యాహ్నం పెరుందురై కాంచీకోవిల్ రోడ్డులో నడిచి వెళ్తున్న విజయపై కత్తితో దాడిచేసి పారిపోయాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని నిందితుడి కోసం గాలిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులు, కోడలి మృతి

మృతులు (పాతచిత్రాలు)

వేళచ్చేరి, న్యూస్‌టుడే: తిరువళ్లూరు జిల్లా కారమడై ప్రాంతానికి చెందిన గోవిందరాజ్, తిరుప్పావై దంపతులు. వీరి కుమారుడు వెంకటేశన్ స్థానికంగా ద్విచక్ర వాహన సర్వీస్ సెంటర్ నిర్వహిస్తున్నారు. ఇదిలా ఉండగా వెంకటేశన్.. తల్లిదండ్రులు, భార్య కల్పనమల్లి, కుమార్తెలు మృదులాశ్రీ, హనన్యశ్రీ, అక్క బృంద, ఆమె భర్త శరవణన్‌తో కలిసి కారులో ఆదివారం ఉదయం విళుపురం సమీపంలోని మదుర వీరన్ ఆలయానికి వెళ్లారు. అక్కడి నుంచి సాయంత్రం తిరుగు పయనమయ్యారు. దిండివనం సమీపం జగ్గంపేటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రి వద్ద వెళుతుండగా ఎదురుగా వచ్చిన ద్విచక్ర వాహనాన్ని తప్పించడానికి వెంకటేశన్ కారును పక్కకు తిప్పాడు. అదుపుతప్పిన కారు దిడివనం-తిరుచ్చి జాతీయ రహదారిలో రోడ్డు పక్కనున్న చెట్టును ఢీకొని బోల్తాపడింది. ఘటనలో కల్పనమల్లి, తల్లిదండ్రులు అక్కడికక్కడే మృతి చెందారు. ఇద్దరు కుమార్తెలు, అక్క, బావ, ద్విచక్ర వాహనంపై వచ్చిన తెన్‌కలవాయ్ గ్రామానికి చెందిన సెల్వం గాయపడ్డారు. వారిని మైలం పోలీసులు దిండివనం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బావిలో జారిపడి బాలుడు...

విల్లివాక్కం: కరూర్ జిల్లా కుళిత్తలై సమీపం కురిచ్చికి చెందిన మణిగండన్ కుమారుడు సుజన్(4) స్థానికంగా పాఠశాలలో యూకేజీ చదువుతున్నాడు. ఇదిలా ఉండగా ఆ ప్రాంతానికి చెందిన పిల్లలతో కలిసి ఇంటి సమీపంలో ఉన్న వ్యవసాయ బావిలో చేపలు పట్టడానికి వెళ్లాడు. అక్కడ సుజిన్ కాలు జారి బావిలో పడిపోయాడు. సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకొని మృతదేహాన్ని వెలికితీశారు. నంగవరం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పదంగా యువకుడు...

రెడ్‌హిల్స్: తిరువణ్ణామలై జిల్లా వందవాసికి చెందిన చంద్రు(26) తిరువళ్లూరు సమీపం మనవాళనగర్‌లోని ప్రైవేటు కర్మాగారంలో పనిచేస్తున్నారు. ఈయన సోమవారం నివాసం ఉంటున్న అద్దె ఇంట్లో ఉరికి వేలాడుతుండటాన్ని ఇంటి యజమాని శక్తివేల్ గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్లస్‌టూ విద్యార్థిని ఆత్మహత్య

వేళచ్చేరి, న్యూస్‌టుడే: కడలూర్ సమీప తూర్పు రామాపురానికి చెందిన జ్ఞానశేఖరన్ కుమార్తె దేవిక(17) ప్లస్‌టూ చదువుతోంది. జ్ఞానశేఖరన్ దంపతులు ఆదివారం ఆలయ కుంభాభిషేకంలో పాల్గొనడానికి బయలుదేరారు. అప్పుడు దేవిక.. తాను కూడా వస్తానని అడిగింది. తల్లిదండ్రులు వద్దని తీసుకెళ్లలేదు. దీంతో మనస్తాపానికి గురైన బాలిక ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఆలయం నుంచి ఇంటికి వచ్చిన తల్లిదండ్రులు ఉరికి వేలాడుతున్న కుమార్తెను చూసి దిగ్భ్రాంతి చెందారు. తిరుప్పాదిరిప్పులియూర్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి దర్యాప్తు జరుపుతున్నారు.

ఇద్దరు యువకులపై హత్యాయత్నం

మహాబలిపురం, న్యూస్‌టుడే: చెంగల్పట్టు జిల్లా తాంబరం సమీపం శానిటోరియం రైల్వే స్టేషన్ వద్ద ఉన్న టాస్మాక్ మద్యం దుకాణంలో చెయ్యార్‌కు చెందిన దినేష్, సెంబియంకు చెందిన అబ్దుల్ రహీం ఆదివారం రాత్రి మద్యం సేవించారు. ఆ సమయంలో అక్కడికి వచ్చిన గుర్తు తెలియని వ్యక్తులు వారిపై మారణాయుధాలతో దాడి చేసి పారిపోయారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరిని స్థానికులు తాంబరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై తాంబరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపారు. గత వారం అంత్యక్రియల ఊరేగింపు సందర్భంగా జరిగిన గొడవ కారణంగా దినేష్ అక్కడి నుంచి వెళ్లిపోయాడని, గత 3 రోజులుగా చెన్నైలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడని తెలిసింది.

ఇన్‌స్టా రీల్స్ చేస్తున్న ఇద్దరు యువకులను ఢీకొట్టిన ద్విచక్ర వాహనం

ఐదుగురికి తీవ్రగాయాలు

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: తిరువళ్లూరుకు చెందిన యువకులు శశి, ధనుష్ ద్విచక్ర వాహనంపై సోమవారం ఉదయం చెన్నైకి బయలుదేరారు. మాంగాడు సమీపం మలయంబాక్కం వద్ద ఆగి ఇన్‌స్టా రీల్స్ చేస్తుండగా ఎదురుగా ముగ్గురు వ్యక్తులతో వచ్చిన మరో ద్విచక్ర వాహనం ఢీకొంది. ప్రమాదంలో శశి, ధనుష్, ఢీకొట్టిన బైక్‌పై ఉన్న ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వారిని స్థానికులు చెన్నై కీల్పాక్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆవడి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్రైం కార్నర్

డ్రగ్స్ కేసులో సినీ నిర్మాత దినేష్ రాజ్ అరెస్టు



దినేష్ రాజ్

ప్యారిస్, న్యూస్‌టుడే: మత్తుపదార్థాల కేసులో సినీ నిర్మాత దినేష్‌రాజ్‌ని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. గత నెల 19వ తేదీ మత్తుపదార్థాలు విక్రయిస్తున్న దియానేశ్వరన్ అనే వ్యక్తిని చెన్నై తిరుమంగళం పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద జరిపిన దర్యాప్తు ఆధారంగా చెన్నై వళసరవాక్కానికి చెందిన ఎంబీఏ గ్రాడ్యుయేట్ శరత్, ముగప్పేర్‌కి చెందిన లా గ్రాడ్యుయేట్ శ్రీనివాసన్, తేనాంపేటలో ఉంటున్న సర్బుద్దీన్‌ని అరెస్టు చేశారు. సర్బుద్దీన్ నాలుగేళ్ల క్రితం నటుడు శింబు వద్ద సహాయకుడిగా పనిచేశాడని, శింబు నటించిన 'ఈశ్వర్' సినిమాకు సహాయ నిర్మాతగా వ్యవహరించినట్లు తెలిసింది. అనంతరం సర్బుద్దీన్, శరత్‌ని పోలీసులు కస్టడీకి తీసుకొని విచారించారు. సర్బుద్దీన్ సమాచారం మేరకు నుంగంబాక్కంకి చెందిన సినీ నిర్మాత దినేష్‌రాజ్‌ని పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. ఈయన సర్బుద్దీన్ నుంచి మత్తుపదార్థాలు కొనుగోలు చేసి వినియోగించాడని, స్నేహితులకు విక్రయించాడని తేలింది. దినేష్‌రాజ్ ప్రస్తుతం నటుడు ధనుష్ మేనల్లుడు పవిష్ నటిస్తున్న 'లవ్ ఓ లవ్' సినిమాను నిర్మిస్తున్నారు.

ఇద్దరు బాలికలపై అత్యాచారానికి పాల్పడిన యువకుడు...

ప్యారిస్: ఇద్దరు బాలికలను ప్రేమ పేరుతో వంచించి అత్యాచారానికి పాల్పడిన యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. వారి వివరాల మేరకు... కన్నియాకుమరికి చెందిన 17ఏళ్ల బాలిక గత నెల 10వ తేదీ ఇంటి నుంచి వెళ్లిపోయింది. కొన్ని రోజుల తర్వాత తిరిగి వచ్చింది. తల్లిదండ్రులు నిలదీయగా.. తనకు ఇన్‌స్టాగ్రామ్‌లో పీటర్ అనే పేరుతో ఓ యువకుడు పరిచయమయ్యాడని, తనను ప్రేమించానని, పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి తీసుకెళ్లాడని, ఓ గదిలో ఉంచి అత్యాచారానికి పాల్పడి తన వద్ద ఉన్న బంగారు నగలు తీసుకుని పారిపోయాడని తెలిపింది. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడి కోసం గాలించారు. అతను తేనిలో ఓ ఇంట్లో ఉన్నట్లు గుర్తించి అక్కడకు వెళ్లారు. అక్కడ ఉన్న ఓ మహిళను విచారించగా.. అతను కేరళకు చెందిన బిను అని, కేరళ వెళ్లిపోయాడని చెప్పింది. దీంతో పోలీసులు కేరళకి వెళ్లి ఓ హోటల్‌లో బాలికతో పాటు ఉన్న నిందితుడిని అరెస్టు చేశారు. ఆ బాలికను కూడా అత్యాచారం చేసినట్లు గుర్తించారు. 10కి పైగా ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలను ప్రారంభించి బాలికలను ప్రేమ పేరుతో వంచిస్తున్నట్లు తేలింది. అనంతరం కోర్టులో హాజరుపరిచి ఆదివారం రిమాండ్‌కి తరలించారు.

రైలులో గంజాయి తరలిస్తున్న ఇద్దరు...

టీనగర్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, కాకినాడ నుంచి రైలులో చెన్నైకి గంజాయి తరలిస్తున్న ఇద్దరు నిందితులను రైల్వే భద్రతా దళం పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. వారి వివరాల మేరకు... కాకినాడ నుంచి పుదుచ్చేరి వెళ్లే ప్రత్యేక రైలు చెన్నై ఎగ్మూరు స్టేషనులో సోమవారం ఉదయం ఆగింది. ఓ బోగీలో ఇద్దరు ప్రయాణికులు అనుమానాస్పదంగా కనిపించడంతో ఆర్పీఎఫ్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. ఒకరి బ్యాగులో తొమ్మిది, మరొకరి బ్యాగులో 16 కిలోల గంజాయి ప్యాకెట్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిందితులు త్రిపుర రాష్ట్రానికి చెందిన అసిమ్ దాస్(24), ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కాతగిరి కన్నయ్య (21)గా గుర్తించారు. నిందితులను నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ)కు అప్పగించారు.

పోలీసు చెయ్యి కొరికిన కేసులో ఐదుగురు టీవీకే కార్యకర్తలు...

అరెస్టయిన జెమినీ

విల్లివాక్కం: ధర్మపురి జిల్లా పాలక్కోడు టమోటా మార్కెట్ సమీపంలో కొత్తగా ప్రారంభించిన మద్యం బార్‌తో కూడిన రిక్రియేషన్ క్లబ్ మూసేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం టీవీకే తరపున ఆందోళన చేపట్టారు. పోలీసులు అడ్డుకున్నారు. అప్పుడు జెమినీ అనే కార్యకర్త పోలీసు చెయ్యి కొరికాడు. ఇందుకు సంబంధించి 12 మందిపై కేసు నమోదు చేసిన పోలీసులు జెమినీ, జయప్రకాశ్, గణేశన్, కృష్ణన్, వినోద్ కుమార్‌లను అరెస్ట్ చేశారు.

మహిళలు, నిరుద్యోగులే లక్ష్యంగా మోసాలకు పాల్పడుతున్న మహిళ...

అహల్య

వేళచ్చేరి: కడలూర్ జిల్లా కాట్టుమన్నార్ కోవిల్ సమీపం వీరాణ్‌నల్లూర్ ప్రాంతానికి చెందిన అమల్‌రాజ్, అహల్య(46) దంపతులు. కుటుంబ కలహాలతో అహల్య భర్త నుంచి విడిపోయి తన ఇద్దరు పిల్లలతో జీవిస్తోంది. ఇదిలా ఉండగా ఆమె ఆ ప్రాంతంలోని ప్రైవేట్ బ్యాంకు, మహిళా స్వయం సహాయక బృందాల సభ్యులు ఎక్కువగా గుమిగూడే చోట్ల నిలబడి.. బ్యాంకులో తాకట్టు పెట్టిన ఆభరణాలు విడిపించుకునే మహిళలను గమనిస్తుంది. వారి వద్దకు వెళ్లి తాను చిదంబరంలోని ఓ కళాశాలలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నానని, తనకు తెలిసిన ఒకరి వద్ద రూ.కోట్లలో నల్లధనం ఉందని, ఆయన నుంచి ఆభరణాలకు వడ్డీ లేకుండా రుణాలు తీసిస్తానని నమ్మబలుకుతుంది. నగలను కలెక్టరు కార్యాలయంలోని ట్రెజరీ లాకర్‌లో ఉంచుతానని, రెండు రోజుల్లో రూ.20 లక్షల వరకు రుణం డబ్బులు బ్యాంకు ఖాతాల్లో జమవుతాయని చెబుతుంది. అందుకుగాను జిల్లా కలెక్టరు, ఎస్పీ సంతకాలున్న నకిలీ పత్రాలను చూపుతుంది. ఈ క్రమంలో ఆమె మాటలు నమ్మిన కొందరు మహిళలు బ్యాంకులో తాకట్టు పెట్టిన 100 సవర్ల నగలను తీసి అహల్యకు ఇచ్చారు. అదేవిధంగా అనేక మంది నిరుద్యోగ యువకులకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని రూ.50లక్షల మేర నగదు తీసుకుంది. ఇలా రెండేళ్లుగా మోసాలకు పాల్పడుతోంది. ఈ నేపథ్యంలో నగలు, నగదు ఇచ్చిన వారు అహల్యను నిలదీశారు. సరైన సమాధానం రాకపోవడంతో కాట్టుమన్నార్ కోవిల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి అహల్యను సోమవారం అరెస్టు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

జూదగాళ్లు నలుగురు...

పళ్లిపట్టు: తిరువళ్లూరు జిల్లా ఆర్కేపేట సమీపం వేణుగోపాలపురం చెరువు కట్ట వద్ద కొందరు డబ్బులు పెట్టి జూదం ఆడుతున్నట్లు ఆర్కేపేట పోలీసులకు సమాచారం అందింది. ఆ మేరకు సబ్ ఇన్‌స్పెక్టరు రాఖీకుమారి నేతృత్వంలో పోలీసులు సోమవారం ఆ ప్రాంతానికి వెళ్లారు. వారిని చూసిన జూదగాళ్లు పారిపోవడానికి యత్నించారు. అందులో నలుగురిని పోలీసులు పట్టుకున్నారు. వారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలం బండపల్లి గ్రామానికి చెందిన కుమారరాజా(44), చిత్తూరు జిల్లా గ్రీంపేటకు చెందిన దయానంద (55), చిత్తూరు జిల్లా ఎస్.ఆర్.పురం మండలం పద్మాపురం గ్రామానికి చెందిన నవీన్‌కుమార్(28), చిత్తూరు జిల్లా కొంగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన సురేష్‌కుమార్(42)గా తెలిసింది. వారిని అరెస్టు చేసి రూ.4 లక్షల నగదు, 5 ద్విచక్ర వాహనాలు, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న చిత్తూరుకు చెందిన చంద్రన్ అనే వ్యక్తి కోసం గాలిస్తున్నారు.

ప్రభుత్వ బస్సు డ్రైవరుపై దాడి

టీనగర్, న్యూస్‌టుడే: తిరునెల్వేలి జిల్లా పాపనాశం నుంచి ఆదివారం నెల్లై వైపుగా ఓ ప్రభుత్వ బయల్దేరింది. దాని వెనుక ఓ వ్యాను వెళ్తోంది. వ్యాను డ్రైవరు బస్సును ఓవర్ టేక్ చేయడానికి ప్రయత్నించగా బస్సు డ్రైవరు దారివ్వనట్లు తెలుస్తోంది. కాసేపటి తర్వాత బస్సు ఆగింది. ఆగ్రహించిన వ్యాను డ్రైవరు మరో వ్యక్తితో కలిసి బస్సు డ్రైవరు దినకరన్‌పై దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన డ్రైవరును ప్రయాణికులు ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు పరారీలో ఉన్న వ్యాను డ్రైవరు, అతని సహచరుడి కోసం గాలిస్తున్నారు.

తిరునెల్వేలిలో భారీగా గంజాయి పట్టివేత

- ప్రధాన సూత్రధారి ఆత్మహత్య

టీనగర్, న్యూస్‌టుడే: తిరునెల్వేలి జిల్లాలో భారీగా గంజాయి పట్టుబడింది. ఈ స్మగ్లింగ్ నెట్‌వర్క్‌కు ప్రధాన సూత్రధారి భయంతో విషం తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల మేరకు.. తూత్తుక్కుడి నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో పోలీసులు శనివారం రాత్రి తిరునెల్వేలి-మదురై జాతీయ రహదారిలోని పాళయంగోట్టయ్ పొట్టల్ విళక్కు ప్రాంతంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. అటుగా వేగంగా వచ్చిన మినీ వ్యాను, దాని వెనుక వస్తున్న కారును ఆపేందుకు ప్రయత్నించారు. మినీ వ్యాను ఆగగా, కారు ఆగకుండా వేగంగా వెళ్లింది. వ్యానులో తనిఖీ చేసి సుమారు 80 కిలోల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. డ్రైవరు తాళయూత్తుకు చెందిన నితీష్‌కుమార్‌ను అరెస్టు చేశారు. అతనిచ్చిన సమాచారంతో గంగైకొండాన్ ప్రాంతానికి చెందిన సురేష్‌కుమార్(25)ను అరెస్టు చేశారు.

తచ్చానల్లూరు ప్రాంతంలో..: అదే సమయంలో తచ్చానల్లూరు ప్రాంతంలో ఇన్‌స్పెక్టరు సురేందర్ నేతృత్వంలోని బృందం గస్తీ నిర్వహించింది. కరయిరుప్పు వద్ద అనుమానాస్పదంగా నిలిచి ఉన్న కారు అద్దాలు పగులగొట్టి 140 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన సురేష్‌కుమార్‌ను విచారించగా.. ఈ మెగా స్మగ్లింగ్ దందాను నడిపిస్తుంది అతని తండ్రి కలైజ్ఞర్ పాండి(45) అని తెలిసింది. ఈ క్రమంలో తిరునెల్వేలి తాళయూత్ రామ్‌నగర్‌లో నివసిస్తున్న కలైజ్ఞర్ పాండి పోలీసులు అరెస్టు చేస్తారన్న భయంతో పురుగుల మందు తాగాడు. స్థానికులు అతనిని తిరునెల్వేలి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందాడు. కలైజ్ఞర్ పాండి తమిళనాడు నుంచి రేషన్ బియ్యాన్ని ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాలకు లారీల ద్వారా పంపి, తిరిగి వచ్చేటప్పుడు వాటిలోనే గంజాయి తీసుకొస్తున్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది.

దొంగకు దేహశుద్ధి

పొన్నేరి, న్యూస్‌టుడే: తిరువళ్లూరు జిల్లా పొన్నేరి సమీపం తిరువేంగడపురంలోని ఓ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తి ఆదివారం రాత్రి చోరీకి యత్నించాడు. స్థానికులు అతనిని పట్టుకుని దేహశుద్ధి చేసి పొన్నేరి పోలీసుస్టేషన్లో అప్పగించారు. నిందితుడు మరాఠీ మాట్లాడుతున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్యాస్ ట్యాంకర్ లారీ బోల్తా

పొన్నేరి, న్యూస్‌టుడే: తిరువళ్లూరు జిల్లా మీంజూరు సమీపం అత్తిపట్టు పుదునగర్‌లో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌కు చెందిన వంట గ్యాస్ ప్లాంట్ ఉంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కడప నుంచి ఓ గ్యాస్ ట్యాంకర్ లారీ ఆదివారం రాత్రి అత్తిపట్టు పుదునగర్‌కు బయలుదేరింది. మురుగన్ డ్రైవర్. సోమవారం ఉదయం 6 గంటలకు మీంజూరు సమీపంలో లారీ అదుపుతప్పి రోడ్డు పక్కన బోల్తాపడింది. డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది, ప్లాంట్ నిపుణులు అక్కడకు చేరుకున్నారు. గ్యాస్ లీకవలేదని నిర్ధారించారు. క్రేన్ల సాయంతో ట్యాంకర్ లారీని పక్కన పెట్టారు.

ఏనుగు దంతాలు స్వాధీనం

ప్యారిస్, న్యూస్‌టుడే: రామనాథపురం నుంచి సముద్ర మార్గంగా శ్రీలంకకు ఏనుగు దంతాలను తరలిస్తున్నట్లు పోలీసులకి సమాచారం అందింది. ఆ మేరకు మెరైన్ పోలీసులు గస్తీ నిర్వహించి ఓ ప్రాంతంలో శ్రీలంకకు తరలించడానికి సిద్ధంగా ఉంచిన ఏనుగు దంతాలను సోమవారం స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.కోటి ఉంటుందని తెలిపారు. ఇందుకు సంబంధించి ముగ్గురిని అరెస్టు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

21 సవర్ల బంగారు నగల చోరీ

వేలూరు, న్యూస్‌టుడే: వేలూరు సమీపంలోని కృష్ణా నగర్‌కు చెందిన మారుతన్(47) స్థానికంగా ఆటో మొబైల్ దుకాణం నడుపుతున్నారు. ఆదివారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి ఇంట్లో నిద్రించారు. అర్ధరాత్రి దాటిన తర్వాత దొంగలు ఇంటి వెనుక గేటు తాళం పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. బీరువాలోని 21 సవర్ల బంగారు నగలు, రెండు కిలోల వెండి వస్తువులను ఎత్తుకెళ్లారు. మారుతన్ ఫిర్యాదు మేరకు వేలూరు సౌత్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తిరుత్తణి ఆలయ అఖిలాండం వద్ద చెలరేగిన మంటలు

తిరుత్తణి, న్యూస్‌టుడే: తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామి ఆలయం రాజగోపురం ఎదురుగా ఉన్న మాడ వీధిలోని అఖిలాండం వద్ద భక్తులు నెయ్యి దీపాలు వెలిగిస్తుంటారు. ఇందుకోసం ప్రత్యేక స్టాండులను ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం మహిళలు దీపాలు వెలిగించి పూజలు చేస్తుండగా ఒక్కసారిగా పక్కక్కనే ఉన్న ప్రమిదలకు మంటలు అంటుకుని పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. దీంతో భక్తులు భయాందోళన చెందారు. ఆలయ సిబ్బంది వెంటనే మంటలను అదుపు చేశారు.

మంటలార్పుతున్న సిబ్బంది

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Ph: 044-28232390
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 97910 83205, 97910 74993

(c) eenadu

సరిపడా ఇవ్వరు.. సరిగానూ లేవు

ఈనాడు-ఏలూరు, చింతలపూడి, న్యూస్‌టుడే

ఒకవైపు సంచులు సరఫరా చేయకుండా, మరోవైపు తేమశాతం చూడకుండా యంత్రాంగం రైతులను ముప్పుతిప్పలు పెడుతోంది. కేంద్రాల్లో సర్వర్ పనిచేయక, బిల్లులు రాక ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియలో జాప్యం జరుగుతోంది. దీంతో ఎలా అమ్ముకోవాలని రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు, మిల్లర్ల దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సిన పరిస్థితి. క్షేత్రస్థాయిలో 'ఈనాడు' పరిశీలించగా సంచులు ఇవ్వట్లేదని, తేమశాతం చూడటం లేదని కర్షకులు వాపోతున్నారు.

వారం నుంచి కల్లం వద్దే

తేమశాతం చూసి వారమైంది. ఇచ్చిన సంచులు సరిపోక నింపలేదు. చాలా వరకు చిరిగిపోయి ఉన్నాయి. ఆరబెట్టడం, సాయంత్రానికి కుప్ప చేసి మంచు కురవకుండా.. అకాల వర్షం పడినా తడవకుండా పరదాలు కప్పి కాపాడుతున్నా. ఉదయం లేవగానే ఎండకు తిరిగి ఆరబెట్టాల్సి వస్తోంది. చేతి వృత్తి వదిలేసి వారం నుంచి కల్లం వద్దే ఉంటున్నాం.

- నూజివీడు శివయ్య, కృష్ణానగర్, లింగపాలెం మండలం

సంచుల కోసం రైతుల వేడుకోలు మందకొడిగా ధాన్యం కొనుగోళ్లు

పరిశీలన

కొరతకి కారణమిదే

సంచులు చిరిగిపోయి ఉన్నాయి. వాటిని కొందరు రైతులు తీసుకోవటానికి ఇష్టపడటం లేదు. మిల్లర్లు ధాన్యం అన్లోడ్ చేసుకుని వాటిని రైతులకు చేరవేసే విషయంలోనూ ఆలస్యం చేస్తున్నారు. ఇలా సంచుల కొరత వస్తోంది. కొందరు మిల్లర్లు బ్యాంకు గ్యారెంటీలు ఇవ్వక కొనుగోళ్లు ఆలస్యం చేస్తున్నారు. ఇలా జిల్లాలో కొనుగోళ్లు మందగించాయి. కొనాల్సిన ధాన్యం ఇంకా పెద్దమొత్తంలోనే ఉంది.

రోజూ ఎదురుచూపులే

ఏరోజుకారోజు సంచులిస్తారని, తేమశాతం చూడటానికి సిబ్బంది వస్తారని ఆశగా ఎదురుచూడటమే తప్ప ఎప్పుడొస్తారో స్పష్టత లేకుండా ఉంది. సంచులకొరత దృష్ట్యా ఇంకా తేమ శాతం ఎక్కువ ఉందని ఇబ్బంది పెడుతున్నారని రైతులు వాపోతున్నారు. కట్టకు 50 సంచులు. వాటిల్లో ఏడెనిమిది దాకా చిరిగి అతుకులు బొతుకులతో ఉన్నాయి. చాలా పాత సంచులిస్తున్నారు.

సర్వర్ ఆగిపోయిందంటున్నారు

రెండు రోజుల్లో సంచులు ఇస్తాం. పట్టుకురావాలని చెప్పి వారం గడిచిపోయింది. ఎందుకు ధాన్యం తీసుకోవటం లేదు అని అడిగితే సర్వర్ పనిచేయటం లేదు... బిల్లు రాకుండా ఏం చేయలేమని చెబుతున్నారు. ఏ పనికీ వెళ్లకుండా రోజూ ధాన్యం వద్దే కాపలా ఉంటున్నా. రోజుకు పరదాల అద్దె రూ.200 దాకా అవుతోంది.

- భీమేశ్వరరావు, కొవ్వూరుగూడెం, చింతలపూడి

వేగవంతం చేస్తాం : వారం క్రితం సంచుల సమస్య రాగా అధిగమించాం. ప్రస్తుతం సమకూరాయి. ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేస్తాం. ఇప్పటి వరకు 2.30 లక్షల టన్నులు కొన్నాం. 4.50 లక్షల కొనాలనేది లక్ష్యం' అని పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ పి.శివరామమూర్తి తెలిపారు.

రేపట్నుంచి 'టెట్'

హాజరుకానున్న 3,341 మంది అభ్యర్థులు

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: జిల్లాలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)ను ఈ నెల 10 నుంచి 21 వరకు ఆన్‌లైన్ విధానంలో నిర్వహించనున్నారు. జిల్లాలో రెండు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇన్‌సర్వీసు ఉపాధ్యాయులతోపాటు ఇతర అభ్యర్థులు పరీక్ష రాసేందుకు దరఖాస్తు చేసుకున్నారు. మొత్తం 3,341 మంది హాజరుకానున్నారు. ఏలూరు సమీప సిద్ధార్థ క్వెస్ట్ సీబీఎస్ఈ పాఠశాల, సీఆర్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో పరీక్షలు జరగనున్నాయి. సీఆర్ఆర్‌లో ఈ నెల 13, 14, 20 తేదీల్లో మాత్రమే ఉంటాయి. ఆయా తేదీల్లో ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలుంటాయి. ప్రతి పరీక్ష కేంద్రానికి విభాగాధికారిని నియమించినట్లు డీఈవో వెంకట లక్ష్మమ్మ తెలిపారు.

రైతేరాజు
మిశ్రమ సాగు.. ఫలితాలు బాగు..! 6లో

శంబాల.. ఆధ్యాత్మిక హేల

అమ్మవారికి నమస్కరిస్తున్న చిత్ర బృందం

ఫొటోలు తీసేందుకు ఎగబడుతున్న నగరవాసులు

ఏలూరు పడమర వీధి గంగానమ్మ జాతరలో భాగంగా.. శంబాల చిత్ర బృందం సోమవారం సందడి చేసింది. చిత్ర ప్రచారంలో భాగంగా నగరానికొచ్చిన కథానాయకుడు ఆది సాయికుమార్, కథానాయిక అర్చన అయ్యర్, దర్శకుడు యుగంధర్ ముని, నిర్మాతలు మేడలో కొలువైన అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. వారికి జాతర కమిటీ అధ్యక్షుడు చోడే బాలు, సభ్యులు స్వాగతం పలికారు. పడమర వీధి జాతరలో పాల్గొని అమ్మవారిని దర్శించడం ఆనందంగా ఉందని ఆది తెలిపారు. చిత్ర బృందంతో సెల్ఫీలు దిగేందుకు నగరవాసులు పోటీ పడ్డారు. - న్యూస్‌టుడే, ఏలూరు ఆధ్యాత్మికం

పశువులకూ వసతి గృహాలు

నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఏర్పాటుకు కసరత్తు

నూజివీడు, న్యూస్‌టుడే: పశువులకు నియోజకవర్గానికి ఒకటి చొప్పున వసతి గృహాలను నిర్మించి వాటి సంరక్షణకు ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది.

జిల్లాలో పశు సంపద	
ఆవులు:	1,35,607
గేదెలు:	5,06,110
గొర్రెలు:	5,26,836
మేకలు:	1,98,810

పశు వసతి గృహాలకు నీరు, పశుగ్రాసాల పెంపకం, బయోగ్యాస్ ప్లాంట్ వంటి సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంది. పశువుల సంరక్షణ, పోషణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.10 లక్షలు కేటాయించే అవకాశం ఉంది. సహకార సంఘాల ద్వారా గడ్డి కత్తిరింపు, పాలు పితికే యంత్రాలు సమకూర్చుతారు. ఇక్కడ లభ్యమయ్యే పేడ నుంచి సేంద్రియ ఎరువు, బయోగ్యాస్ ఉత్పత్తి చేస్తారు. వాటితో వచ్చే ఆదాయంతో నిర్వహణ ఖర్చులు భరిస్తారు. నిర్వహణ బాధ్యతలను ఆయా గ్రామాల పరిధిలోని మహిళా, రైతు సంఘాలు, సొసైటీలకు అప్పగిస్తారు. పశుపోషకులు అత్యవసర సమయాల్లో ఇతర ప్రాంతాలకు వెళ్లినప్పుడు తమ పశువులను ఇక్కడ ఉంచొచ్చు. ఇందుకు నామ మాత్రపు రుసుం చెల్లించాలి. పట్టణాల్లో సంరక్షణ లేని పశువులను ఇందులో ఉంచి వాటి పోషణ చూస్తారు. 'వసతి గృహాల ఏర్పాటుతో పాల ఉత్పత్తుల పెంపుతో పాటు పశువుల ఆరోగ్యం, మేతకు భరోసా ఉంటుంది. జిల్లాలో వీటి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం' అని పశుసంవర్ధక శాఖ జేడీ బి.ప్రసాదరావు తెలిపారు.

12న ఉద్యోగ మేళా

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: ఏలూరు సమీప ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో జిల్లా ఉపాధి కార్యాలయం, ఎన్‌సీఎస్, నైపుణ్యాభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యాన ఈ నెల 12న ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి రమేశ్ కుమార్ తెలిపారు. పది నుంచి డిగ్రీ వరకు చదువుకున్న యువత హాజరు కావచ్చన్నారు. అర్హులు https://naipunyam.ap.gov.in/user-registrationలో పేర్లు నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 81848 87146 నంబరును సంప్రదించాలని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఎంతో దూరం.. ఎందుకీ భారం

● పొరుగు జిల్లాలకు వెళ్లాల్సిందేనా? ● వాహనదారులకు సహన పరీక్ష

చింతలపూడి, న్యూస్‌టుడే

రవాణా వాహనాలకు ఫిట్‌నెస్ అంటేనే వాహనదారులు హడలిపోతున్నారు. ఇంతకు ముందు ఏలూరులో వాహన సామర్థ్య పరీక్షలు చేయించేవారు. అయితే కేంద్ర ప్రభుత్వం ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ల(ఏటీఎస్)లోనే చేయించాలని సూచించడంతో ఇక పొరుగు జిల్లాల్లో ఉన్న కేంద్రాలకు పరుగులు పెట్టాల్సి వస్తోంది. ఉమ్మడి జిల్లాలోని వాహనదారులు ఈ నెల ఒకటో తేదీ నుంచి మచిలీపట్నం, విజయవాడ సమీపంలోని నున్న, రాజమహేంద్రవరం దగ్గర రాజానగరంలో వాహనాలకు సామర్థ్య పరీక్షలకు వెళ్లాల్సిన పరిస్థితి తలెత్తింది. ఐచ్ఛికంగా నమోదు చేసుకొనే వెసులుబాటు ఉన్నా అప్పటికే పరిమిత స్లాట్లు పూర్తయితే దూరమైనా వెళ్లక తప్పడం లేదు. దీంతో రోజంతా ఈ పరీక్షల కోసం వెచ్చించాల్సి వస్తోందని వాహనదారులు వాపోతున్నారు.

➡ లింగపాలేనికి చెందిన పంతం శ్రీను తన రవాణా వాహనం సామర్థ్య పరీక్షల కోసం ఇటీవల దరఖాస్తు చేశారు. విజయవాడ సమీపంలోని నున్న ఏటీఎస్‌లో ఫిట్‌నెస్ చేయించుకునేందుకు తేదీని కేటాయించారు. ఇదేంటి అని ఏజెంట్‌ను అడిగితే ప్రభుత్వం నిబంధనలను మార్చింది సమాధానం ఇచ్చాడు. పంతం శ్రీను తన గ్రామం నుంచి సుమారు 90కి.మీ ఉన్న నున్నకి వాహనం ఫిట్‌నెస్‌కి వెళ్లాల్సి వస్తోంది.

➡ చింతలపూడికి చెందిన యమిజాల సత్యనారాయణ మూర్తి తన లారీని ఫిట్‌నెస్ చేయించేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తే 100కి.మీ దూరంలో ఉన్న నున్నలో చేయించాలని ఈ నెలలో తేదీ కేటాయించారు.

ఇప్పటి వరకు సరకు, ప్రయాణికుల రవాణా వాహనాలకు జారీ చేసే ఎఫ్‌సీల కోసం ఫిట్‌నెస్ పరీక్షలను మోటారు వాహన ఇన్‌స్పెక్టర్లు(ఎంవీఐ), ఏఎంవీఐలే నిర్వహిస్తున్నారు. ఈ సమయంలో ప్రభుత్వానికి చెల్లించాల్సిన ఫీజు కంటే అదనంగా లంచాలు వసూలు చేయడం పరిపాటిగా మారింది. ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్(ఏటీఎస్)లు ఏర్పాటు చేసి, యంత్రాల ద్వారా ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించి ఎఫ్‌సీలు జారీ చేయాలని కేంద్రప్రభుత్వం ఆదేశించింది. అయితే ఏలూరు జిల్లాలో ఏటీఎస్ కేంద్రం ఏర్పాటు చాలాకాలంగా పెండింగ్‌లో ఉంది. సకాలంలో కేంద్రం పెట్టకపోవడంతో పొరుగు జిల్లాలకు వెళ్లాల్సి వస్తోంది.

ఏలూరు జిల్లా ప్రధాన ప్రాంతాల నుంచి కొన్ని ఏటీఎస్ కేంద్రాలకు దూరం ఇలా..

ఎక్కడి నుంచి ఎక్కడకి	కి.మీ	ప్రయాణం (గంటలు)
పోలవరం-విజయవాడ	150	4
జంగారెడ్డిగూడెం-రాజమహేంద్రవరం	73	2
చింతలపూడి-విజయవాడ	100	3
ఏలూరు-విజయవాడ	60	గంటన్నర

రవాణా వాహనం ఎనిమిదేళ్ల లోపుదైతే రెండేళ్లకోసారి, అది దాటితే ఏడాదికోసారి ఎఫ్‌సీ చేయించాలి. ఆ కేటగిరీ వాహనాలు రెండు జిల్లాల్లో కలిపి 78,339 ఉన్నాయి. ఏలూరు జిల్లాలో సుమారు 40 వేల వాహనాలున్నాయి. వీరంతా ఎఫ్‌సీ కోసం వెళ్తే ఖర్చుల భారం పెరగడంతో పాటు రానూపోనూ వందల కి.మీ వెళ్లాల్సి వస్తోంది.

ప్రభుత్వం ఏటీఎస్ కేంద్రాల్లోనే ఎఫ్‌సీ చేయించాలని ప్రభుత్వం సూచనలు చేసింది. జిల్లాలో ఏటీఎస్ కేంద్రం ఏర్పాటుపై ఇంకా మాకు పూర్తి సమాచారం లేదు. - **కృష్ణారావు, జిల్లా రవాణా అధికారి**

సవాళ్ల గమనం గెలుపు పావనం!

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: నిరంతర సాధన.. సవాళ్లను ఎదుర్కొనే ఆత్మస్థైర్యం ఆమె సొంతం. తండ్రి లేకున్నా.. తల్లి రెక్కల కష్టం వృథా కాకుండా.. గెలుపే గమనం.. గమ్యంగా ముందుకు సాగుతోంది.. జంగారెడ్డిగూడేనికి చెందిన కోండ్రు పావన లక్ష్మీ ప్రసన్న స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతూ వాలీబాల్‌లో రాణిస్తోంది. తల్లి సురేఖ వస్త్ర దుకాణంలో పనిచేస్తూ కూతుళ్లిద్దరిని చదివిస్తోంది. భారత వాలీబాల్ జట్టుకు ఎంపికవడంతోపాటు నావికాదళంలో చేరాలనే లక్ష్యంతో నిరంతర సాధన చేస్తున్నారు. లక్ష్మీప్రసన్న సోదరి శ్రీవల్లి కూడా వాలీబాల్ క్రీడాకారిణి. చెల్లిని స్ఫూర్తిగా తీసుకొని విశ్రాంత పీడీ నరసింహరాజు వద్ద మూడేళ్లుగా కఠోర శిక్షణ తీసుకుంటున్నారు. ఈ ఏడాది నన్నయ్య విశ్వవిద్యాలయం జట్టుకు ఎంపికయ్యారు. అండర్ - 21 విభాగంలో చెన్నైలో డిసెంబరు 10 నుంచి 14 వరకు జరగనున్న సౌత్ జోన్ మహిళా వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారు ఈ ఏడాది ఆగస్టులో కాకినాడలో జరిగిన జోనల్ పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టు తరఫున ఆడి రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యారు. తిరుపతిలో జరిగిన పోటీల్లో జోనల్ జట్టు తరఫున రాష్ట్ర పోటీల్లో పాల్గొన్నారు.

వారసత్వ సంపద.. నేర్చుకుందాం పద!

మన ప్రాచీన సాంస్కృతిక, సామాజిక, ఆధ్యాత్మిక, కళా రంగాలకు సంబంధించిన విజ్ఞానాన్ని అందించాలనే సంకల్పంతో భీమవరంలోని ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలోని సృజన వాటికను ఏర్పాటు చేశారు. ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్(ఐకేఎస్)లో భాగంగా అరుదైన వారసత్వ సంపదను ప్రదర్శనగా ఉంచి విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస నిపుణులు ఈదరపల్లి సీతారామరాజు అవగాహన కల్పిస్తున్నారు. పండగలు, ఆహార వ్యవహారాలపై ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టి భారతీయ స్ఫూర్తిని రేకెత్తిస్తున్నారు. ఈ సృజన వాటికలో గిరిజనులు సంప్రదాయ వేటకు వినియోగించే విల్లు, బాణాలు, జంతువుల కొమ్ములతో తయారు చేసిన బూరలు, వెదురు, తాటి, ఈత, జమ్ము, వరి, ఖర్జూరం ఆకులతో తయారైన ఉత్పత్తులు, సిమెంట్, థర్మాకోల్ వ్యర్థాలతో తీర్చిదిద్దిన జలపాతం ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. దేశవాళీ వరిరకాల గురించి వివరిస్తున్నారు. - **ఈనాడు, భీమవరం**

విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ..

కొమ్ములతో తయారు చేసిన బూరలు, పాత్రలు

కృత్రిమ జలపాతం

తేజస్సు లేని మనసు!

యువకుడి దుర్మరణంతో దిక్కులేని తల్లీకూతుళ్లు

ఆమెకు భర్తే తేజస్సు..
అతడికి కుమార్తె ఉషస్సు..
ఆ ఆప్యాయతతో ఉప్పొంగేది మనసు..
ముచ్చటైన కుటుంబం వారిది..
మమతానురాగాల బంధం అల్లుకుంది..
సంతోషాల పొదరిల్లు కట్టుకుంది..
వీరిపై విధికి కన్నుకుట్టింది..
ప్రమాదంలో మృత్యువు కబళించింది..
కుటుంబాన్ని దుఃఖసాగరంలో ముంచింది

భార్య, కుమార్తెతో తేజ(పాత చిత్రం)

దెందులూరు, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. ఏలూరు శివారు చాటపర్రు ప్రాంతం సగర్లపేటకు చెందిన అత్తిలి తేజ(24)కు భార్య, ఏడాది వయసున్న కుమార్తె ఉన్నారు. కూలి పనులు చేస్తూ.. వారిని కంటికి రెప్పలా చూసుకుంటున్నారు. సోమవారం గంగన్నగూడెంలోని మేనమామ ఇంటికి తేజ ద్విచక్ర వాహనంపై వెళ్లారు. ఈ నెలలోనే కుమార్తె తొలి పుట్టిన రోజు ఉండటంతో.. దుస్తులు కొనేందుకు ఇద్దరు వేర్వేరు ద్విచక్ర వాహనాల్లో ఏలూరు బయల్దేరారు. మార్గం మధ్యలోని వేగవరం వద్ద ఏలూరు నుంచి జంగారెడ్డిగూడెం వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ఘటనలో తేజ అక్కడికక్కడే మృతి చెందారు. పెట్రోలు ట్యాంకు నుంచి మంటలు చెలరేగడంతో.. ద్విచక్ర వాహనం పూర్తిగా దగ్ధమైంది. తేజ మృతితో సగర్లపేటలో విషాదం అలముకుంది. ఇక తమకు దిక్కెవరంటూ కుటుంబ సభ్యులు రోదించడం పలువురిని కలచివేసింది. మృతదేహాన్ని సర్వజన ఆసుపత్రి శవాగారానికి తరలించారు. దెందులూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

బాగుంటే 4 లేకుంటే 1

ప్రభుత్వ బడుల్లో సామాజిక తనిఖీ

కొయ్యలగూడెం గ్రామీణ, టి.నరసాపురం, భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: పాఠశాలకు ప్రహరీ ఉందా.. దానికి అమర్చిన ప్రవేశద్వారం(గేటు) బాగుందా? మధ్యాహ్న భోజనం ఎక్కడ వండుతున్నారు..వంటశాల ఎక్కడ ఉంది. మరుగుదొడ్ల వాడకం, వాష్‌బేసిన్ అందుబాటులో ఉందా.. సబ్బు వాడుతున్నారా మొదలైన అంశాలతో పాటు మిగిలిన అన్ని అంశాలను పరిశీలిస్తూ కొన్నిరోజులుగా ప్రభుత్వ పాఠశాలల్లో సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నారు. ఈ సమాచారం ఆధారంగా బడులకు 1 నుంచి 4 వరకు స్థాయిలను నిర్ణయించనున్నారు. అన్నీ బాగుంటే లెవల్ 4, లేకుంటే 1గా పరిగణిస్తారు. ✦ మండల, జిల్లాపరిషత్తు, ఎయిడెడ్, ప్రభుత్వ పాఠశాలలతోపాటు వివిధ గురుకులాలు, సంక్షేమ వసతిగృహాల్లో తనిఖీలు చేస్తున్నారు.

బొర్రంపాలెం జడ్పీఉన్నత పాఠశాలలో సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న సీఆర్పీ

ఏమేం పరిశీలిస్తున్నారంటే: తరగతి గదుల్లో వెలుతురు, విద్యుతు సదుపాయం, సరిపడా ఫ్యాన్లు ఉన్నాయా, స్విచ్‌బోర్డులు ఎంత ఎత్తులో ఉన్నాయన్న అంశాలపై ఆరా తీస్తున్నారు. గ్రీన్‌చాక్ బోర్డుల లభ్యత, విద్యార్థులు, ఉపాధ్యాయులకు అవసరమైన బల్లలు, కుర్చీల సంఖ్య, వ్యర్థాల నిర్వహణ, బడి తోట, ఆర్వోప్లాంట్ల పని తీరు, బడి పరిసరాల్లో ప్రమాదాలకు ఆస్కారం ఉన్న కట్టడాలు, గుంతలు, విద్యుత్తు పరికరాలు, అగ్నిప్రమాదాల నుంచి రక్షణ, భద్రత ఏర్పాట్లు, మొదలైన వాటితో పాటు పరీక్షల నిర్వహణ, అదనపు తరగతులు, దూరప్రాంత విద్యార్థుల కోసం తీసుకున్న చర్యలు మొదలైన అంశాలు.

జిల్లా:	ఏలూరు	పశ్చిమగోదావరి
పాఠశాలలు:	1748	1340
క్లస్టర్లు:	111	89
తనిఖీలో పాల్గొంటున్న సీఆర్ఎంటీలు	98	94
క్లస్టర్ కాంప్లెక్సు ఛైర్మన్లు	13	-

తల్లిదండ్రుల కమిటీ సమక్షంలో

తల్లిదండ్రుల కమిటీ అధ్యక్షుడు, సభ్యులు, ప్రధానోపాధ్యాయుల సమక్షంలో సీఆర్పీ(సీఆర్ఎంటీ)లు ఆడిట్ వివరాలను చరవాణి యాప్‌లో నమోదు చేస్తున్నారని ఏలూరు సమగ్రశిక్షా సీఎంవో యెహోషువా చెప్పారు.

రొయ్య ధర హాసం!

క్రమంగా పుంజుకుంటున్న వైనం

కౌంటు	18.11.2025 ధర (రూ..లో)	08.12.2025 ధర (రూ..లో)
100	230	260
90	240	270
80	260	290
70	290	320
60	310	340
50	330	360
40	360	390
30	430	470

కలిదిండి, న్యూస్‌టుడే: 'మూడెకరాల్లో రొయ్యలు పండిస్తున్నా. గతేడాది మే నెల నుంచి వరుసగా మూడు పంటల్లో రూ.12-15 లక్షల వరకు నష్టపోయా. నాలుగో పంటలో 40 కౌంటు వస్తుందని ఆశిస్తున్నా. దీని ధర రూ.390-400 వరకు పలుకుతోంది' అని చెబుతున్నారు గోపాలపురం గ్రామానికి చెందిన పంచదార సురేశ్.

రొయ్యల ధరలు రోజురోజుకూ పుంజుకుంటున్నాయి. నెల రోజుల వ్యవధిలో ఒక్కో కౌంటుపై కిలోకు రూ.30-40 వరకు పెరిగింది. అమెరికా సుంకాల నేపథ్యంలో ఎగుమతులు, ధరలపై ఆందోళనలో ఉన్న సాగుదారుల్లో నిలకడగా పెరుగుతున్న ధరలు ఆశలు పుట్టిస్తున్నాయి.

రూ.260కు చేరి..

ఈ ఏడాది నవంబరు 18 నాటికి 100 కౌంటు కిలో ధర రూ.230 పలికింది. నెలాఖరునాటికి క్రమంగా రూ.240కి చేరింది. డిసెంబరు ఆరంభం నుంచి మరింత వేగం పుంజుకుంది. ఈనెల 7న రూ.250కి చేరిన ధర 8కి రూ.260 మార్కును తాకింది. గతంలో ఆన్‌లైన్‌లో ప్రకటించిన ధరల కంటే క్షేత్రస్థాయిలో కిలోకు రూ.20-30 వరకు తగ్గించి కొనుగోలు చేసేవాళ్లు. ప్రస్తుతం ఆన్‌లైన్ ధర కంటే రూ.10-20 ఎక్కువకే కొనడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సరకు లేక..

అమెరికా సుంకాల నేపథ్యంలో 20 శాతం వరకు సాగుదారులు పంట వేయలేదు. కొన్ని రోజులుగా వాతావరణం బాగా చల్లబడిపోవడంతో రొయ్యలు ప్రాణ వాయువు సమస్యతో మృత్యువాత పడుతున్నాయి. సరకు తగ్గిపోవడంతో డిమాండ్ పెరిగి మార్కెట్ కంటే హెచ్చు ధరకు కొంటున్నారని సాగుదారులు చెబుతున్నారు.

'మీ కోసం'లో 363 అర్జీలు

వినతి పత్రాలు రాయించుకుంటున్న ప్రజలు

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశపు మందిరంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ(మీ కోసం) నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి అర్జీదారులు తరలివచ్చారు. వారి నుంచి జేసీ అభిషేక్ గౌడ, డీఆర్వో విశ్వేశ్వరరావు, ఇతర అధికారులు వినతులు స్వీకరించారు. అంతకుముందు అర్జీలు రాసుకునేందుకు, ఆన్‌లైన్ నమోదుకు ప్రజలు చాలా సేపు నిరీక్షించాల్సి వస్తోంది. జేసీ మాట్లాడుతూ.. మీ కోసంలో మొత్తం 363 మంది వినతులు అందజేశారన్నారు. ఆయా ఫిర్యాదులను వీలైనంత త్వరగా పరిష్కరించాలని ఆయన ఆదేశించారు.

చీకట్లో అరణ్యరోదన

జాతీయ రహదారిపై దీపాల్లేక కష్టాలు

మండవల్లి, న్యూస్‌టుడే: జాతీయరహదారి 165కి ఇరువైపులా వీధిదీపాలు లేకపోవడం ప్రాణాల మీదకు తెస్తోంది. రోడ్డు విస్తరణ పనులు పూర్తై స్తంభాలను ఏర్పాటు చేసినా ఇప్పటికీ విద్యుత్తు దీపాలు మాత్రం వేయలేదు. ముదినేపల్లి, మండవల్లి మండలాల్లోని పలు గ్రామాలు అంధకారంలో మగ్గుతున్నాయి.

మండవల్లి మండలం కానుకొల్లు, లింగాల, పెరికెగూడెం, మండవల్లి, భైరవపట్నం, ముదినేపల్లి మండల పెదపాలపర్రు, దాకరం, పెయ్యేరు గ్రామాల పరిధిలో 25 కిలో మీటర్ల మేర రోడ్డు నిర్మాణం పూర్తయ్యింది. విశాలంగా రోడ్డు ఉండటంతో వాహనాలు రయ్‌రయ్‌మంటూ పరుగులు పెడుతున్నాయి. అదే స్థాయిలో ప్రమాదాలకు గురవుతున్నాయి. దీనిపై ఎన్‌హెచ్ డీఈ సత్యనారాయణను వివరణ కోరగా రోడ్డు నిర్మాణంతో పాటు వీధి దీపాల బాధ్యత గుత్తేదార్లదేనన్నారు. త్వరలో దీపాలు వేసే అవకాశం ఉందన్నారు.

ప్రమాదాలు ఇలా..

✦ గతేడాది భైరవపట్నం బస్టాండ్‌కు కూతవేటు దూరంలో రోడ్డుపక్కనే ఉన్న గుట్టను ఢీకొట్టి బాబూరావు(24) మృతి చెందడంతో తండ్రి లేని ఆ కుటుంబం ఉన్న ఒక్క మగదిక్కునూ పోగొట్టుకుని రోడ్డున పడింది.

✦ మూడు నెలల క్రితం రాత్రివేళ ఇస్రో విశ్రాంత శాస్త్రవేత్త చందు వెంకటేశ్వరరావు హైదరాబాద్ నుంచి స్వగ్రామం లింగాలకు కారులో వస్తుండగా ముదినేపల్లి వద్ద అదుపుతప్పి పక్కనే ఉన్న కాలువలోకి దూసుకు పోయింది. వెంకటేశ్వరరావు మృతి చెందారు. భార్యను స్థానికులు కాపాడారు.

✦ మరుసటిరోజే లింగాల సమీపంలో ద్విచక్రవాహన ప్రమాదంలో భీమవరానికి చెందిన వ్యక్తి మృతి చెందారు.

ఆరు ప్రత్యేక రైళ్ల రద్దు

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: రైల్వే లైన్ల పునరుద్ధరణ పనుల్లో భాగంగా ఈ నెల 25, 26, 27 తేదీల్లో పలు రైళ్లను రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ పీఆర్వో కార్యాలయ అధికారులు తెలిపారు. ఈ నెల 25న చర్లపల్లి- నరసాపురం(07144), కాకినాడ టౌన్- చర్లపల్లి(07155), 26న నరసాపురం- చర్లపల్లి(07145), చర్లపల్లి- కాకినాడ టౌన్(07156), హైదరాబాద్- కాకినాడ టౌన్(07157), 27న కాకినాడ టౌన్- హైదరాబాద్(07158) రైళ్లను రద్దు చేసినట్లు వారు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

16న సర్వోదయ స్ఫూర్తి కార్యక్రమం

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: సర్వోదయ మండలి నాయకుడు, విద్యాదాత చింతలపాటి వరప్రసాద మూర్తిరాజు జయంతి సందర్భంగా.. నిడమర్రు మండలం పెదనిండ్రకొలనులోని మహాత్మాగాంధీ భవనంలో ఈ నెల 16న సర్వోదయ స్ఫూర్తి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ మండలి ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు తెలిపారు. విద్య, సాంస్కృతిక రంగాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు పురస్కారాల ప్రదానం చేయనున్నట్లు ఆయన సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

(c) eenadu

సత్తా చాటి.. పతకాలు సాధించి

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: నూజివీడుకు చెందిన పలువురు యువ క్రీడాకారులు బాస్కెట్ బాల్‌లో ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్నారు. ఉదయం, సాయంత్రం నిబద్ధతతో సాధన చేస్తున్నారు. తల్లిదండ్రుల మద్దతుతో శిక్షకుల తర్ఫీదుతో రాటుదేలుతున్నారు. ఇటీవల జరిగిన పలు పోటీల్లో అనేక పతకాలను సాధించి సత్తా చాటారు.

బాస్కెట్‌బాల్‌లో రాణిస్తున్న క్రీడాకారులు

జాతీయ డిఫెన్స్ అకాడమీలో చేరాలని..

తల్లి మిషన్ కుడుతూ నన్ను బాస్కెట్ బాల్ ఆటలో ప్రోత్సహిస్తున్నారు. అండర్ 14, 17లో మూడు బంగారు, అండర్ 19లో కాంస్య పతకాలు సాధించా. జాతీయ స్థాయిలో అండర్ 19 విభాగంలో రాజస్థాన్‌లో జరిగే పోటీలకు ఎంపికయ్యా. నేషనల్ డిఫెన్స్ అకాడమీలో చేరాలన్నది లక్ష్యం. -భీమవరపు బాలాజీ

పైలట్ అవుతా... బెస్ట్ డిఫెండర్‌గా ఉంటూ ప్రత్యర్థి జట్టులో క్రీడాకారులను అడ్డుకోవడంలో నైపుణ్యం సాధిస్తున్నా. పైలట్ కావాలన్నది నా లక్ష్యం. ఇప్పటికే అండర్ 17, అండర్ 19లో మొదటి స్థానం సాధించా. జాతీయ స్థాయిలో రాజస్థాన్‌లో జరుగుతున్న పోటీల్లో పాల్గొంటున్నా. -బి.స్నేహలత దుర్గ

ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని.. తల్లిదండ్రులు కూలి పనులు చేస్తూ ఆరో తరగతి నుంచే ఈ ఆటలో ప్రోత్సహిస్తున్నారు. పాయింట్ గార్డుగా ఉంటూ డిఫెన్స్‌ను ఛేదించే క్రీడాకారిణిగా కోచ్‌లు నాతో సాధన చేయిస్తున్నారు. ఉత్తరాఖండ్‌లో జాతీయ పోటీల్లో ఏపీ జట్టుకు ప్రాతినిధ్యం వహించా. జాతీయ స్థాయిలో మధ్యప్రదేశ్‌లో జరిగే పోటీల్లో ఏపీ కెప్టెన్‌గా పాల్గొంటున్నా. ప్రభుత్వ ఉద్యోగం సాధించడమే లక్ష్యం. -ఎం.కావ్యశ్రీ

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: సైబర్ నేరాలపై విశ్రాంత ఉద్యోగులు, వృద్ధులు, యువత అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ ప్రతాప్ శివ కిశోర్ సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం నిర్వహించారు. ... స్వయంపై ఫిర్యాదులు చేశారు. ఆయన మాట్లాడుతూ.. బాధితులు అర్జీలిచ్చేందుకు ఏలూరు కావాల్సిన పని లేదని.. ఆన్‌లైన్‌లోనూ ఫిర్యాదులు చేయెచ్చన్నారు. ఫిర్యాదుల స్థితిని తెలుసుకునేందుకు టోల్‌ఫ్రీ నంబరు 1100ను సంప్రదించాలన్నారు. ఎవరైనా సైబర్ మోసాలకు గురైతే 1930 నంబరుకు ఫోను చేయాలని ఆయన సూచించారు. ఏఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

దివ్యాంగుడి వద్దకొచ్చి సమస్య తెలుసుకుంటున్న ఎస్పీ

శ్రీనివాసుడికి బ్రహ్మ కమలాలతో అర్చన

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: గోకుల తిరుమల పారిజాతగిరి వేంకటేశ్వరస్వామికి శనివారం 108 బ్రహ్మకమలాలతో ... అర్చకుడు రవికుమారాచార్యులు తెలిపారు. పట్టణానికి చెందిన కరుటూరి సుబ్బారావు ఇంట్లో పెద్ద ఎత్తున వికసించిన కమలలను స్వామికి సమర్పించారు. ఒకే సారి ఇన్ని బ్రహ్మకమలాలు వికసించడాన్ని విశేషంగా భావిస్తున్నారు.

12న క్రాస్ కంట్రీ జిల్లా క్రీడాకారుల ఎంపిక

ఏలూరు నగరం, న్యూస్‌టుడే: కామవరపుకోట జడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో ఈ నెల 12న అండర్-16, 18, 20 బాలబాలికలు, స్త్రీ, పురుష విభాగాల్లో క్రాస్ కంట్రీ జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గొల్ల ప్రసాదరావు, దేవరపల్లి ప్రసాద్ తెలిపారు. ఇక్కడ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఈ నెల 24న కాకినాడ జిల్లా పెద్దాపురం వేదికగా నిర్వహించే రాష్ట్ర పోటీలకు ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. క్రీడాకారులు 62814 31202, 86865 40555 నంబర్లను సంప్రదించాలని వారు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పరీక్ష పే చర్చ దరఖాస్తు గడువు పెంపు

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: ప్రధాన మంత్రి నరేంద్రమోదీతో నిర్వహించనున్న పరీక్ష పే చర్చ-2026 దరఖాస్తు గడువును జనవరి 11 వరకు పొడిగించినట్లు తూర్పుగోదావరి జిల్లా దూబచర్ల డైట్ ప్రధానాచార్యురాలు ఎం.కమలకుమారి తెలిపారు. అన్ని యాజమాన్యాల పాఠశాలల విద్యార్థులు అర్హులని చెప్పారు. పరీక్ష పే చర్చకు నోడల్ అధికారిగా డీఈవో, సమన్వయకర్తగా తాను వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు innovateindia.mygov.in వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

గిరిజన పాఠశాలల్లో అదనపు సదుపాయాలు

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: మన్యంలోని బుట్టాయగూడెం మండలం కేఆర్‌పురం గిరిజన బాలుర గురుకుల, నూతిరామన్నపాలెం బాలుర, జీలుగుమిల్లి మండలం అంకన్నగూడెం బాలికల ఆశ్రమ పాఠశాలలకు అదనపు సదుపాయాలు సమకూరుతున్నాయి. ధర్తీ ఆబ జన్‌జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ పథకం కింద కూటమి ప్రభుత్వం రూ. 10.49 కోట్లు మంజూరు చేయగా.. కేఆర్‌పురం ఐటీడీఏలోని గిరిజన సంక్షేమశాఖ ఇంజినీరింగ్ విభాగం పర్యవేక్షణలో పనులు చేపట్టారు.

నూతిరామన్నపాలెం పాఠశాలలో భవన నిర్మాణానికి తవ్విన పునాదులు

తీరనున్న విద్యార్థుల కష్టాలు.. నూతిరామన్నపాలేనికి రూ. 3.85 కోట్లు, అంకన్నగూడేనికి రూ. 1.89 కోట్లు, కేఆర్‌పురానికి రూ. 4.74 కోట్లు మంజూరు చేశారు. ఈ మూడు పాఠశాలల్లో అదనపు తరగతి గదుల భవనాలు, డార్మెంటరీ, భోజనశాల భవనాలు, మరుగుదొడ్ల బ్లాకల నిర్మాణంతో పాటూ ఇతర మరమ్మతులు చేస్తారు. అంకన్నగూడెం, నూతిరామన్నపాలెం పాఠశాలల్లో భవనాల నిర్మాణం, మరమ్మతులతో పాటు సిబ్బంది నివాస క్వార్టర్ల భవనాలను నిర్మించనున్నారు. తాజాగా ఈ పనులను చేపట్టారు. నూతిరామన్నపాలెంలో పునాదులు తవ్వి, నిర్మాణ సామగ్రిని సిద్ధం చేశారు. అంకన్నగూడెంలో మార్కింగ్ వేశారు. కేఆర్‌పురంలో శిథిలస్థితిలో ఉన్న పాత భవనాన్ని తొలగించారు. ఈ పనులు పూర్తయితే విద్యార్థుల కష్టాలు తీరనున్నాయి. పనులను చురుగ్గా పూర్తి చేసేందుకు కృషి చేస్తామని గిరిజన సంక్షేమ శాఖ డీఈ ఎం.శ్రీనివాసు తెలిపారు.

గంగానమ్మ సేవలో.. వ్యాసాశ్రమ పీఠాధిపతి

పవరుపేట(ఏలూరు నగరం), న్యూస్‌టుడే: పవరుపేట గంగానమ్మ జాతర వైభవోపేతంగా సాగుతోంది. ఇందులో భాగంగా తిరుపతి జిల్లా ఏర్పేడులోని వ్యాసాశ్రమ పీఠాధిపతి పరిపూర్ణానందగిరి స్వామిజీ, ఉత్తరాధికారి అసంఘానంద స్వామిజీ మేడలోని అమ్మవార్లను సోమవారం దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు వారికి జాతర కొలుపుల కమిటీ అధ్యక్షుడు మామిళ్లపల్లి పార్థసారథి, సభ్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామిజీలు భక్తులనుద్దేశించి ప్రసంగించారు. వారి వెంట కళా రత్న కేవీ సత్యనారాయణ, జవ్వాజి మోహన విఠల్, ఘంటా బాజ్జీ, గారపాటి వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

రైతేరాజు

మిశ్రమ సాగు.. ఫలితాలు బాగు..!

కూరగాయల సాగులో లాభాలు పండిస్తున్న రైతు

జంగారెడ్డిగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: వ్యవసాయాన్ని లాభసాటిగా చేయాలనుకున్న ఆ రైతు సంకల్పం నెరవేరింది. కష్టనష్టాలను అధిగమించి ఏడాది పొడవునా ఆదాయం గడిస్తున్నారు జంగారెడ్డిగూడెం మండలం వేగవరం గ్రామానికి చెందిన రైతు బొంతు సత్యనారాయణ. స్వతహాగా సత్యనారాయణది వ్యవసాయ కుటుంబం కావడంతో సుమారు 30 ఏళ్లుగా సంప్రదాయ పంటలైన వరి, మొక్కజొన్నతోపాటు జీడిమామిడి, కొబ్బరి, పత్తి తదితరాలు సాగుచేసేవారు. అయితే కొన్ని సందర్భాల్లో సరైన గిట్టుబాటు ధరలు రాకపోవడం, ప్రకృతి వైపరీత్యాలు, ఇతరత్రా కారణాలతో పంట దిగుబడులలో వ్యత్యాసం, విపరీతంగా పెరిగిన కూలీ ఖర్చుల కారణంగా ప్రత్యామ్నాయ పంటలను సేద్యం చేయాలని అనుకున్నారు. ఈ క్రమంలో కూరగాయల సాగు ఆరంభించారు.

మూడెకరాల్లో.. మూడేళ్లుగా.. మూడేళ్లుగా గ్రామ శివారులో మూడెకరాల భూమిని కౌలుకు తీసుకుని అందులో కాకర, వంగ, దొండ ఇతర కూరగాయల పంటలను పండిస్తున్నాడు. ఏడాది పొడవునా ఆదాయం వచ్చేలా ప్రత్యేక ప్రణాళిక అమలు చేస్తున్నారు. కాకర విత్తనాలను దొమ్మేరు నుంచి, దొండ మొక్కలను కడియపులంక నుంచి తీసుకొచ్చారు. కాకర నాటిన 45 రోజుల నుంచి కాపు ప్రారంభమై ఆరు నెలల వరకూ ఉంటుంది. దొండ మూడేళ్లు, వంగ ఏడాది పాటు దిగుబడి అందిస్తున్నాయి. వీటిని 15 లేదా 50 కిలోల సంచుల్లో నింపి ఖమ్మం, జంగారెడ్డిగూడెంతోపాటు ఇతర మార్కెట్‌లలో రైతు విక్రయిస్తున్నారు. కూరగాయల సాగులో ఉత్తమ సస్యరక్షణ చర్యలను అవలంబిస్తున్నారు. పంటలకు సరైన పద్ధతిలో నీటిని అందించడంతోపాటు మొక్క మొదట్లో పశువుల పెంట, జీవామృతం, ఇతర కషాయాలను వాడుతున్నారు.

ఆదాయం బాగుంది..

'తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం వచ్చేలా రైతులు వ్యవసాయం చేయాలి. ఏకకాలంలో రెండు, మూడు రకాల పంటలను పండిస్తున్నా. వీటివల్ల ఏడాది పొడవునా ఆదాయం వస్తోంది. ఖర్చులు పోనూ ఏడాదికి రూ. 2 లక్షల పైగా ఆదాయం గడిస్తున్నా..' అని రైతు సత్యనారాయణ తెలిపారు.

మిరప సాగులో నిర్లక్ష్యం వద్దు

పెనుమంట్ర, న్యూస్‌టుడే: మిరప పంటలను ఆశించే తెగుళ్ల విషయంలో రైతులు కాస్త అప్రమత్తం ఉండాలని లేదంటే నష్టం ఎక్కువగా ఉంటుందని ఉద్యాన అధికారి ప్రియదర్శిని తెలిపారు. వివిధ రకాల తెగుళ్ల విషయంలో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై ఆమె వివరించారు. ... మొదళ్లలో పోయాలి. ఆకుమచ్చ తెగులు నివారణకు కార్బండజిం ఒక గ్రాము లేదంటే మంకోజెబ్ 2.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. వర్షాలు కురిసిన సందర్భంలో తగ్గిన వెంటనే 19:19:19 లేదంటే 13:0:45 లేదా యూరియా మూడు నుంచి ...

ప్రశ్న: అరటిలో సిగటోక ఆకు పచ్చ తెగులుని ఎలా నివారించాలి. -తాతారావు, వేల్పూరు

ఉద్యాన విశ్వవిద్యాలయం న్యూస్‌టుడే

డా. పి.విజయలక్ష్మి, ప్రధాన శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం, వెంకట్రామన్నగూడెం

మీరూ అడగొచ్చు ✆ చరవాణి 73826 33692

సమాధానం: ... /లీటరు నీటికి), రెండోసారి కార్బండిజమ్+మంకోజెబ్ మిశ్రమం (1 గ్రా/లీటరు నీటికి), మూడోసారి ట్రైఫ్లోక్సీస్ట్రోబిన్+టెబ్యుకొనజోల్ మిశ్రమం (1.4 గ్రా/లీటరు నీటికి), నాలుగోసారి డైఫనో కొనజోల్ 1 మి.లీ/లీటరు నీటికి) పిచికారీ చేసుకోవాలి.

పొగాకులో పురుగుల నివారణ తప్పనిసరి

కొయ్యలగూడెం, న్యూస్‌టుడే: ... వర్జీనియా పొగాకు తోటలు వేసే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. అయితే ఈ తోటల్లో పురుగుల నివారణకు సరైన యాజమాన్య పద్ధతులను అనుసరించకుంటే పురుగుల ఉద్ధృతికి ఎక్కువై నష్టపోయే పరిస్థితి ఉందని కొయ్యలగూడెం వేలం కేంద్రం సూపరింటెండెంటు గ్రేస్ మార్గరెట్ పేర్కొన్నారు. సస్యరక్షణ చర్యలు సూచిం... వరుసల్లో నాటుకుంటే తల్లి రెక్కల పురుగు బంతి పువ్వులపై గుడ్లు పెడుతుంది. వాటి సంతతిని నాశనం చేయడం ద్వారా పొగాకు మొక్కలను కాపాడుకోవచ్చు. హెక్టారుకు 10చొప్పున పక్షి స్థావరాలను ఏర్పాటు చేస్తే పురుగులను నివారిస్తాయి.

లద్దె పురుగు: ఉద్ధృతి ఎక్కువగా ఉంటే 0.5శాతం వేపగింజల కషాయాన్ని.. లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ 5 ఎస్‌జీని 10 లీటర్ల నీటికి 5 గ్రాములు చొప్పున పిచికారీ చేస్తే నివారించవచ్చు.

శనగపచ్చ పురుగు.. పురుగుల ఉద్ధృతి 10 శాతం కంటే ఎక్కువ ఉంటే ఫ్లూబెండియమైడ్‌ను 480 ఎస్‌సీని 2.5 మి.లీ లేదా క్లోరాంట్రనిలిప్రోల్‌ను 18.5 ఎస్‌సీని 3 మి.లీటర్లను 10 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

వరి దుబ్బులు కాలిస్తే నష్టమే అధికం

మార్టేరు, న్యూస్‌టుడే

వరి మోడులను కాల్చడం వల్ల భూమి వేడెక్కి పంట దిగుబడికి అవసరమైన భాస్వరం, పొటాష్, జింక్ నత్రజని, సల్ఫర్ తదితర మూలకాలు నశించి భూసారం తగ్గి దిగుబడిపై ప్రభావం చూపుతుందని మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం పరిశోధనా సహ సంచాలకులు డాక్టర్ టి.శ్రీనివాస్ తెలిపారు. విపరీతమైన పొగ ఏర్పడటంతో కార్బన్ డైఆక్సైడ్ విడుదలై వాయు కాలుష్యంతో పర్యావరణానికి నష్టం వాటిల్లుతోంది. రైతులకు మేలు చేసే వానపాములు, నత్తలు, పీతలు, ఇతర మిత్రపురుగులు వేడికి చనిపోతాయి. వానపాములు భూమిపై వ్యర్థాలను తిని విసర్జిస్తాయి. దానిలో నత్రజని ఉంటుంది. నత్తలు, పీతలు వరి చేలోని నీటిపై ఉండే దోమల గుడ్లను ఆహారంగా తీసుకుంటాయి. సహజ సిద్ధంగా భూమిలో ఉండే మేలు జాతి సూక్ష్మజీవులు, భాస్వరాన్ని కరిగించే బ్యాక్టీరియా వంటివి అంతమవుతాయి.

ఇలా చేయండి...

దమ్ము చేసే ముందు వరి మోడులకు అయిదు రోజులు పాటు నీరు పెట్టాలి. అనంతరం సూపర్ పాస్ఫేట్, యూరియా చల్లుకోవాలి. సూపర్ పాస్ఫేట్ వరి మోడును కుళ్లేలా, యూరియా మెత్తబడేలా చేసి భూసారం పెంపునకు దోహదపడుతుంది. లేదంటే జీవ నియంత్రణ పద్ధతిలో డికంపోజర్ ద్రావణాన్ని 5 కిలోల బెల్లం, 20లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయడం ద్వారా మోడు కుళ్లుతుంది.

పత్తేపురంలో.. 'తెల్ల కాగితం'

నిడమర్రు మండలం పత్తేపురంలో సందడి నెలకొంది. సోమవారం గ్రామంలో తెల్ల కాగితం సినిమా చిత్రీకరణ ప్రారంభమైంది. గ్రామ పంచాయతీ కార్యాలయ పరిసరాల్లో కథానాయకుడు హర్ష రోషన్, కథానాయిక వైష్ణవి, నటుడు అజయ్‌పై పలు సన్నివేశాలు చిత్రీకరించారు. దీన్ని తిలకించేందుకు చుట్టుపక్కల ప్రజలు తరలిరావడంతో గ్రామంలో హడావుడి నెలకొంది. - న్యూస్‌టుడే, నిడమర్రు

టేకుకు చెద.. వేలం వేయాలి కదా...

పోలవరం, న్యూస్‌టుడే: జగనన్న నవరత్నాల కార్యక్రమంలో భాగంగా పోలవరం పంచాయతీ పరిధిలో రైతుల నుంచి అధికారులు ఇంటి స్థలాలు సేకరించారు. స్థలంతో పాటు అందులోని చెట్లకు నష్టపరిహారం రూ. లక్షల్లో చెల్లించారు. అందులోని టేకు చెట్లు 2021లో నరికించిన అధికారులు కలపను పోలవరం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో నిల్వ చేశారు. ఏళ్లు గడిచిపోతున్నా వేలం వేయకపోవడంతో ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ కలపనకు చెదలు పట్టి మట్టిలో కలిసిపోతుంది. అప్పట్లో రైతులకు చెల్లించిన మొత్తంలో సగం కూడా రాదని స్థానికులు చెబుతున్నారు. కలప విషయమై తహసీల్దార్ సాయిరాజును సంప్రదించగా వేలం వేయడానికి చర్యలు తీసుకున్నామని త్వరలో టేకు కలప వేలం వేస్తామని చెప్పారు.

తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో తుప్పల మధ్య కలప

జగన్ తీరు సిగ్గుచేటు: మంత్రి నిమ్మల

పాలకొల్లు, న్యూస్‌టుడే: పరకామణిలో చోరీ వ్యవహారం చిన్నదంటూ మాజీ సీఎం, వైకాపా అధినేత జగన్‌మోహన్‌రెడ్డి సమర్థించడం సిగ్గుచేటని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. పాలకొల్లులోని తన కార్యాలయంలో ఆయన సోమవారం విలేకర్లతో మాట్లాడారు. పవిత్ర తిరుమల క్షేత్రంలో మాఫియాను నడిపిన జగన్ అంటూ ఎద్దేవా చేశారు. 16 ఛార్జిషీట్లలో ఎ1గా ఉన్న వ్యక్తికి రూ. 75 వేల దేవుడి సొమ్ము చోరీ చిన్నదిగానే కనిపిస్తుందన్నారు. జగన్‌కు ప్రజల కంటే దొంగలు, దోపిడీదారులపైనే ప్రేమ ఎక్కువని తేల్చిచెప్పారు. ప్రజలు ప్రతిపక్ష హోదా లేకుండా చేసినా జగన్ వైఖరిలో మార్పు కనిపించడం లేదన్నారు.

రైతులను ఇబ్బంది పెడితే చర్యలు తప్పవు

చింతలపూడి, న్యూస్‌టుడే: ఆర్‌ఎస్‌కే రైతులకు ఇబ్బంది కలిగేలా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని వ్యవసాయశాఖ జేడీ హబీబ్ బాషా అన్నారు. పౌరసరఫరాలశాఖ డీఎం శివరామమూర్తితో కలిసి రైతు ఉత్పత్తి సంఘం ఆధ్వర్యంలో నడుస్తున్న యడవల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సోమవారం పరిశీలించారు. రైతుల వద్ద నుంచి అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నారని ఫిర్యాదు రావడంతో విచారణ చేపట్టారు. తేమశాతం పేరుతో రైతు వద్ద రూ. 15 వేలు డబ్బులు వసూలు చేయడంపై కొనుగోలు కేంద్రం సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

రాష్ట్రస్థాయి రోడ్ రన్ పోటీలకు 22 మంది

తణుకు, న్యూస్‌టుడే: జిల్లా అండర్-16, 18, 20 బాలురు, బాలికలు, పురుషులు, మహిళలు క్రాస్ కంట్రీ (రోడ్ రన్) జట్ల ఎంపికలు సోమవారం స్థానిక డీమార్ట్ రోడ్డులో నిర్వహించినట్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సంకు సూర్యనారాయణ తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 200 మంది క్రీడాకారులు హాజరవ్వగా ఉత్తమ ప్రతిభ కనబరచిన 22 మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎంపికైన జట్లు ఈ నెల 24న పెద్దాపురంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాయన్నారు.

వృద్ధుడి హత్య కేసులో నిందితుడికి అయిదేళ్ల జైలు

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ఇంట్లో ఎవరూ లేని సమయంలో.. వృద్ధుడు తీవ్రం గాయపడ్డారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయనపై ఎవరు దాడి చేశారు? ఎలా చనిపోయాడు? అన్న విషయాలు తెలియవు. ఈ కేసు పోలీసులకు సవాల్‌గా మారింది. చివరకు హంతకుడిని సీసీ ఫుటేజ్‌లు పట్టించాయి. ఈ కేసు తుది విచారణలో భాగంగా నిందితుడికి అయిదేళ్లు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. అధికారుల కథనం మేరకు.. ఏలూరు రెండో పట్టణం చాణక్యపురి కాలనీ 7వ రోడ్డులో డాక్టర్ రాజేశ్వరరావు నివాసముంటున్నారు. తన సోదరుడు గల్లా నాంచారయ్య(81)తో కలిసి ఒకే ఇంట్లో ఉంటున్నారు. 2017 నవంబరు 24న రాజేశ్వరరావు ఓ పనిపై ఊరెళ్లారు. అదే రోజు నాంచారయ్య ఇంటి సమీప డ్రెయిన్‌పై తీవ్ర గాయాలతో పడి ఉండటాన్ని స్థానికులు గమనించి, హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అదే నెల 27న మృతి చెందారు. అప్పట్లో కేసు నమోదు చేసిన రెండో పట్టణ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఆ ఇంటి వద్దనున్న సీసీ ఫుటేజ్‌లు పరిశీలించగా.. అసలు విషయం వెలుగు చూసింది. ఇంటి సమీపంలోని ఓ వ్యక్తి వద్ద కారు డ్రైవరుగా పని చేసే బ్రహ్మయ్య అలియాస్ రాంబాబుకు, వృద్ధుడికి కారు నిలుపుదల విషయమై గొడవ జరిగింది. దాంతో డ్రైవరు వృద్ధుడిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. నాంచారయ్యను కొట్టినప్పుడు గాయాలై రక్తం కారగా.. ఆ మరకలను రాంబాబు మరకలను శుభ్రం చేసినట్లుగా ఫుటేజ్‌ల్లో బయట పడింది. దాంతో పోలీసులు అతడిని అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపరిచారు. సోమవారం కేసు తుది విచారణ జరగ్గా... నేరం రుజువు కావడంతో జిల్లా రెండో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి ఇందిరా ప్రియదర్శిని నిందితుడికి అయిదేళ్ల జైలు శిక్ష విధించారు.

తాతని చూడటానికి వెళ్లొస్తూ.. మృత్యు ఒడికి..

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: తాతని చూడటానికి వెళ్లి తిరిగొస్తున్న యువకుడిని ట్రాక్టర్ రూపంలో మృత్యువు కబళించింది. ద్వారకాతిరుమల పోలీసుల కథనం ప్రకారం.. కామవరపుకోట మండలం వడ్లపల్లికి చెందిన కంచర్ల తనూజ్ కుమార్ (25) ఆయిల్‌పామ్ లోడింగ్ పాయింట్ వద్ద పని చేస్తున్నారు. సోమవారం సూర్యచంద్రరావుపేటలో ఉంటున్న తాతని చూసేందుకు వెళ్లారు. అనంతరం ద్విచక్ర వాహనంపై తనూజ్‌కుమార్ ఇంటికి బయల్దేరారు. మార్గం మధ్యలో గుండుగొలనుకుంట వద్దకు వచ్చే సరికి ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో తనూజ్‌కుమార్ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా) (కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -130 రిటైల్ ధర 157 చికెన్ విత్ స్కిన్ - 228, చికెన్ స్కిన్‌లెస్ - 259. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 149, 158, 169 చికెన్ విత్ స్కిన్ - 284 చికెన్ స్కిన్‌లెస్ - 294.

సారా స్థావరాలపై దాడులు.. ఇద్దరి అరెస్టు

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: చింతలపూడి మండలం తల్లార్లపల్లి, టి.నరసాపురం మండలం బండివారిగూడెంలో సారా తయారీ, విక్రయాలపై సోమవారం ఎక్సైజ్ అధికారులు విస్తృత దాడులు చేపట్టారు. సారా విక్రయిస్తున్న దేశావతు దేవి, మడకం పుల్లారావును అరెస్టు చేసి.. వారి నుంచి 12 లీటర్ల సరకు స్వాధీనం చేసుకున్నారు. పుల్లారావుకు బెల్లం సరఫరా చేస్తున్న నాగేంద్ర ప్రసాద్‌పై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ జిల్లా అధికారి ఆవులయ్య మాట్లాడుతూ.. సారా కార్యకలాపాలను పూర్తిగా అడ్డుకునేలా చర్యలు చేపట్టామన్నారు. నవోదయ 2.0లో భాగంగా ఎక్కడా అమ్మకాలు, తయారీ జరగకుండా నిఘా ఉంచినట్లు పేర్కొన్నారు.

కీచక ఉపాధ్యాయుడిపై సస్పెన్షన్ వేటు

భీమవరం గ్రామీణ, న్యూస్‌టుడే: భీమవరం మండలం గొల్లవానితిప్ప ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడు బి.సుధీర్‌బాబును విద్యాశాఖ ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. అసభ్యంగా ప్రవర్తిస్తూ, లైంగిక వేధింపులకు గురి చేశాడంటూ విద్యార్థులు గ్రామస్థులతో కలిసి ఇటీవల మూకుమ్మడిగా ఫిర్యాదు చేశారు. దానిపై విచారణ చేసిన అధికారులు ఆరోపణలు నిజమని తేలడంతో తాజాగా చర్యలు తీసుకున్నారు. సస్పెన్షన్ ఉత్తర్వులను సదరు ఉపాధ్యాయుడికి పంపినట్లు ఉప విద్యాశాఖాధికారి రమేశ్ సోమవారం వెల్లడించారు.

92.7 FM Rajamahendravaram ఈ FM 92.7 Mee FM

ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 9000180626, 9989993175

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

అసెట్ రికవరీ బ్రాంచ్, డోర్ నెం.26-15-150, ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్, చెంగలరావుపేట, విశాఖపట్నం-530001. ఫోన్ : 0891-2537792 / 82, మొబైల్ నెం. : 93245 17291. ఇ-మెయిల్ : ubin0817295@unionbankofindia.bank

స్థిరాస్తి అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

APPENDIX-IV-A [(See Proviso to Rule 8(6)]

ఇ-వేలం తేది మరియు సమయం : 30-12-2025, మ॥ 12.00 గం॥ల నుండి సా॥ 05.00 గం॥ల వరకు

https://www.unionbankofindia.co.in/auction-property/view-auction-property.aspx మరియు www.unionbankofindia.co.in

తేది : 02.12.2025 స్థలం : విశాఖపట్నం

EENADU Classifieds

BUSINESS SERVICES

MARKETING/ SALES

JOBS

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం CLASSIFIEDS

ఏలూరు
•ఏలూరు •దెందులూరు •ఉంగుటూరు

కరాటేలో సుష్మకు స్వర్ణం

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: శ్రీపర్రుకు చెందిన ఆరో తరగతి విద్యార్థిని ఘంటసాల సుష్మ రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో సత్తా చాటి స్వర్ణ పతకం కైవసం చేసుకున్నారు. తూర్పుగోదావరి జిల్లా అనపర్తిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అటల్జీ ఏపీ స్టేట్ కరాటే ఛాంపియన్ షిప్-2025లో ప్రథమ స్థానం సాధించారు. విద్యార్థినిని రాష్ట్ర వడ్డీల సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ ఘంటసాల వెంకటలక్ష్మి సోమవారం అభినందించారు.

కమనీయం.. సీతారాముల కల్యాణం

భీమడోలు, న్యూస్‌టుడే: గుండుగొలనులోని సీతారామస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. తొలుత అభిషేకం, తులసీ దళార్చన చేసి విశేషంగా అలంకరించారు. ఆలయ ముఖ మండపంలో శాంతి కల్యాణోత్సవం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవారి పరిణయాన్ని తిలకించి తరించారు.

ఉంగుటూరు: నారాయణపురంలోని దుర్గమ్మ ఆలయంలో సూర్నేడ్డి సేవా సంస్థ ఆధ్వర్యాన ఈ నెల 9 నుంచి 11 వరకు అన్నదానం నిర్వహిస్తున్నట్లు సంస్థ ఛైర్మన్ శ్రీనివాసరావు తెలిపారు.

విజేతలతో ఉపాధ్యాయులు

బాలల వాగ్ధాటి!

'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీ

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: స్థానిక ఈదర సుబ్బమ్మదేవి నగరపాలకోన్నత పాఠశాలలో సోమవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'విద్యార్థుల జీవితాలపై చరవాణి ప్రభావం' అంశంపై పలువురు విద్యార్థులు అనర్గళంగా మాట్లాడారు. తమ వాగ్ధాటితో న్యాయ నిర్ణేతలను మెప్పించారు. వై.దివ్యశ్రీ, జి.లిఖిత, వి.ఉదయ లహరి వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు కైవసం చేసుకున్నారు. వారికి ఉపాధ్యాయులు కె.షద్రక్, కె.లావణ్య, కె.రజని బహుమతులు ప్రదానం చేశారు.

ఆశల చిగురింత.. విద్యార్థుల పులకింత!

జూనియర్ కళాశాలకు కొత్త భవనం నిర్మిస్తామని సీఎం హామీ

నారాయణపురం(ఉంగుటూరు), న్యూస్‌టుడే: నియోజకవర్గ కేంద్రం ఉంగుటూరుతో పాటు పరిసర ప్రాంతాల పిల్లలకు 55 ఏళ్లుగా ఇంటర్మీడియట్ విద్యనందిస్తున్న నారాయణపురం మహాత్మాగాంధీ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు పునర్వైభవం రానుంది. కొత్త భవనాలు నిర్మితం కానున్నాయి. ఈ నెల 1న నల్లమాడులో నిర్వహించిన ప్రజా వేదికలో ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు.. శిథిలావస్థకు చేరిన కళాశాల భవనాల విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన తక్షణం స్పందిస్తూ.. కొత్త భవనం నిర్మాణానికి హామీ ఇచ్చారు.

55 ఏళ్లు దాటడంతో.. విద్యా దాత, మాజీ మంత్రి దివంగత చింతలపాటి వర ప్రసాద మూర్తి రాజు 1969లో ఇంటర్మీడియట్ కళాశాలను స్థాపించారు. ప్రస్తుతం భవనాల పైకప్పు ఎక్కడికక్కడ పెచ్చులూడింది. గదుల్లోని బీమ్‌లు దెబ్బతిన్నాయి. గోడలు బీటలు వారాయి. కళాశాల నిర్మించి 55 ఏళ్లు దాటడంతో.. దృఢత్వం లోపించింది. ఇక్కడ తరగతుల నిర్వహణ ప్రమాదకరమని ర.భ.శా. శాఖ అధికారులు 2022 జనవరి 19న నివేదిక ఇచ్చారు.

పూర్తిగా దెబ్బతిన్న నారాయణపురం ఇంటర్ కళాశాల భవనం

షిఫ్ట్ విధానంలో.. దీంతో పక్కనున్న శ్రీఅరవింద శత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంటర్ తరగతులు నిర్వహిస్తున్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.40 గంటల వరకు ఇంటర్, మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు డిగ్రీ తరగతులు షిఫ్టు విధానంలో నిర్వహిస్తున్నారు. భౌతిక, రసాయన, వృక్ష, జంతు శాస్త్రాలకు సంబంధించి ప్రయోగశాలలు, గ్రంథాలయం శిథిల భవనంలోనే నిర్వహించాల్సి వస్తోంది.

రూ.6.30 కోట్లతో.. గతేడాది మార్చిలో కళాశాల కొత్త భవనానికి రూ.6.30 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. ప్రస్తుతం దస్త్రం విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి కోన శశిధర్ కార్యాలయంలో ఉంది. జీ+2 భవనంలో 16 గదులు నిర్మించేలా ప్రతిపాదనలో పేర్కొన్నారు. 19 నెలలు పూర్తైన నిధులు మంజూరు కాలేదు. తాజాగా సీఎం చంద్రబాబు హామీతో కొత్త భవనం కల నెరవేరనుంది. కలెక్టరేట్ నుంచి కళాశాల భవనానికి సంబంధించిన వివరాలు తీసుకున్నారని ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ బెళగం వెంకట శ్రీనివాస్ తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

ఏలూరు అర్బన్:	80085 74486	ఏలూరు టూటౌన్:	80085 74487
దెందులూరు:	80085 74535	పెదపాడు, పెదవేగి:	80085 74483
భీమడోలు:	80085 74527	నిడమర్రు గ్రామీణం:	97040 21765
ఉంగుటూరు:	94939 90333	గణపవరం:	99480 66777

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ? తంగెళ్లమూడి శివారు చెరువు గట్టు ప్రాంతంలో వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రివేళ చీకట్లో విష సర్పాలు సంచరిస్తున్నాయి. ఇంట్లో బయటకొచ్చేందుకు పిల్లలు, వృద్ధులు భయపడుతున్నారు. **- సుబ్బారావు, స్థానికుడు**

✔ సిబ్బందిని పంపి మరమ్మతులు చేయిస్తాం. అవసరమైతే కొత్తవి ఏర్పాటు చేయిస్తాం. **- పవన్, విద్యుత్తు ఏఈ**

దెందులూరు, న్యూస్‌టుడే: ? గోపన్నపాలెంలో దోమలు విజృంభిస్తున్నాయి. రాత్రయితే ఇళ్లలోకి వచ్చి.. కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. దోమల వ్యాప్తి కారణంగా పిల్లలు అనారోగ్యం బారిన పడుతున్నారు. **- రామకృష్ణ, గ్రామస్థుడు**

✔ దోమల నివారణకు మందులు పిచికారీ చేయిస్తాం. స్థానికులకు ఇబ్బందుల్లేకుండా చూస్తాం. **- స్టానిష్‌బాబు, పంచాయతీ కార్యదర్శి**

ధర్నా విజయవంతానికి పిలుపు

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: స్థానిక కలెక్టరేట్ ఎదుట ఈ నెల 15న నిర్వహించ తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని ఏపీ ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘ నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక తంగెళ్లమూడి పరిసర ప్రాంతాల్లో సోమవారం ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గోడపత్రాలు ఆవిష్కరించారు. సంఘ నగర ప్రధాన కార్యదర్శి నౌడు నెహ్రూ బాబు మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కోరారు. నాయకులు రత్నబాబు, సత్యనారాయణ, సూరిబాబు, భాస్కర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రహదారుల విస్తరణకు ప్రాధాన్యం: బడేటి

నాణ్యతను పరిశీలిస్తున్న చంటి

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా రహదారుల విస్తరణకు ప్రాధాన్యమిస్తున్నట్లు ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. తంగెళ్లమూడి- జంగారెడ్డిగూడెం రహదారి విస్తరణ పనులను సోమవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. ఇరుకు దారులు, ప్రమాదకర మలుపు, ఏక, ద్వి వరుస రోడ్ల విస్తరణ పనులను విరివిగా చేపడుతున్నామని చెప్పారు. రూ.34 లక్షల అంచనా వ్యయంతో తంగెళ్లమూడి రోడ్డును నాలుగు వరుసల రహదారిగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఈడా ఛైర్మన్ శివప్రసాద్, ఏఎంసీ ఛైర్మన్ పార్థసారథి, కో-ఆప్షన్ సభ్యులు వెంకటరత్నం, పెదబాబు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి రానీయొద్దు: చింతమనేని

జేసీతో మాట్లాడుతున్న ప్రభాకర్

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: 'ఏలూరు- కృష్ణా కాలువకు సొరంగ మార్గం నిర్మిస్తున్నందున.. నీటి విడుదలను నిలుపుదల చేస్తున్నారు. తిరిగి సరఫరాను పునరుద్ధరించే వరకూ ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడకుండా చూడాలి' అని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన 'మీ కోసం'లో జేసీ అభిషేక్ గౌడకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. జనవరి 1 నుంచి జూన్ వరకు కృష్ణా కాలువకు నీరు ఆపేస్తున్నట్లు జలవనరుల శాఖాధికారులు సమాచారం ఇచ్చారన్నారు. ఈ నిర్ణయంతో పెదపాడు, ఏలూరు గ్రామీణ మండలాల ప్రజలు ఇబ్బంది పడకుండా పోలవరం కుడి ప్రధాన కాలువ నుంచి నీరు సరఫరా చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఏలూరు సినిమాలు

అంబిక డీలక్స్	కొదమసింహం
అంబిక మినీ	రాజు వెడ్స్ రాంబాయి
సాయిబాలాజీ	దురంధర్
బాలాజీ	జుటోపియా
విజయలక్ష్మి వీమ్యాక్స్ 1	మఫ్టీ పోలీస్
విజయలక్ష్మి వీమ్యాక్స్ 2	ఆంధ్రా కింగ్ తాలూకా
విజయలక్ష్మి వీమ్యాక్స్ 3	అమరకావ్యం
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 1	ఆంధ్రా కింగ్ తాలూకా
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 2	ప్రేమంటే
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 3	12ఏ రైల్వేకాలనీ

పేదల సంజీవని సీఎంఆర్ఎఫ్: పత్సమట్ల

చెక్కు ఇస్తున్న ధర్మరాజు

ఉంగుటూరు, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు సంజీవనిగా పని చేస్తోందని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. స్థానిక విడిది కార్యాలయంలో నియోజకవర్గంలోని 72 మందికి సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ.40,18,073 విలువైన చెక్కులను సోమవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఇప్పటి వరకు 451 మందికి రూ.3,69,20,557 మంజూరు చేయించినట్లు తెలిపారు. ★ భీమడోలు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 9 మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ప్రభుత్వం పూర్తి స్థాయి కేంద్రాలుగా వర్గోన్నతి కల్పించింది. ఈ మేరకు సీడీపీవో ఎంఎస్ రాజశేఖర్ ఆధ్వర్యాన ఆయా కేంద్రాల కార్యకర్తలు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

రూర్బన్ పంచాయతీగా మార్పునకు వినతి

వీరాంజనేయులుకు అర్జీ ఇస్తున్న నాయకులు

భీమడోలు, న్యూస్‌టుడే: అభివృద్ధి, ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని.. పూళ్లను రూర్బన్ పంచాయతీగా మార్చాలని అఖిలపక్ష నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులును పూళ్ల, ఎం.ఎం.పురం, నాగేశ్వరపురం, సాయిన్నపాలెం గ్రామాలకు చెందిన తెదేపా, జనసేన, వైకాపా నాయకులు, గ్రామ పెద్దలు సోమవారం వేర్వేరుగా కలిసి వినతి పత్రాలు అందజేశారు. మేజరు పంచాయతీ పూళ్లను విభజించకుండా ప్రజాకాంక్షలకు అనుగుణంగా రూర్బన్‌గా మార్పు చేయాలని వినతిలో పేర్కొన్నారు. డీసీసీబీ మాజీ డైరెక్టర్ శ్రీనివాసు, సొసైటీ అధ్యక్షుడు నారాయణ, నీటి సంఘం డీసీ అధ్యక్షుడు లక్ష్మణ్, ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాస్, బాబి, మోహన్, జయరామ్ పాల్గొన్నారు.

ఇబ్బందులున్నాయా.. చెప్పండి: జేసీ

రైతులతో మాట్లాడుతున్న అభిషేక్ గౌడ

దెందులూరు, న్యూస్‌టుడే: ధాన్యం సేకరణ ఏవైనా ఇబ్బందులుంటే.. రైతులు నేరుగా తనతో చెప్పాలని జేసీ అభిషేక్ గౌడ సూచించారు. దెందులూరు మండలం పోతునూరులో సోమవారం పర్యటించారు. ధాన్యం కొనుగోలు, కేంద్రాల నిర్వహణ, గోనె సంచులు, టార్పాలిన్ల పంపిణీ, రైసు మిల్లుల పరిస్థితి తదితరాలపై అన్నదాతలను ఆరా తీశారు. రైతులకు ఎక్కడా సమస్యల్లేకుండా చూడాలని, ఏవైనా లోటుపాట్లు ఉంటే తన దృష్టికి తేవాలని అధికారులను జేసీ ఆదేశించారు. ఆయన వెంట ఆర్డీవో అచ్యుత్ అంబరీశ్, తహసీల్దార్ బి.సుమతి, సిబ్బంది ఉన్నారు.

తప్పనిసరిగా నిబంధనల పాటింపు..

ఉంగుటూరు, న్యూస్‌టుడే: పెట్రోలు బంకు నిర్మాణంలో ప్రభుత్వ నిబంధనలు తప్పకుండా పాటించాలని జేసీ అభిషేక్ గౌడ ఆదేశించారు. ఉంగుటూరులో పెట్రోల్ బంకు ఏర్పాటుకు ఓ వ్యక్తి దరఖాస్తు చేసుకోగా.. సోమవారం జేసీ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బంకు నిర్మాణ భూమి, పత్రాలను తనిఖీలు చేశారు. ఆయన వెంట తహసీల్దారు పూర్ణచంద్రప్రసాద్, వీఆర్వోలు ఉన్నారు.

యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా శీతాల

ఉంగుటూరు, న్యూస్‌టుడే: యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా కాగుపాడు జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు శీతాల సత్యనారాయణ ఎన్నికయ్యారు. బొమ్మిడి-2 ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ శ్రీధర్ వరసగా నాలుగోసారి జిల్లా కార్యదర్శి పదవి దక్కించుకున్నారు. జిల్లా కార్యవర్గ సభ్యులుగా అల్లు శ్రీను, పుప్పాల నరసింహారావు, పిరిడి ప్రసాద్‌ను ఎన్నుకున్నారు.

గురువోత్తముడికి జ్ఞాపిక ఇస్తున్న అనిల్ కుమార్

విద్యార్థుల ఉన్నతికి తోడ్పాటు

గణపవరం, న్యూస్‌టుడే: జల్లికొమ్మర ఉన్నత పాఠశాలకు స్కిల్‌బుక్ సాఫ్ట్‌వేర్ సంస్థ సీఈవో, పూర్వవిద్యార్థి జుజ్జువరపు అనిల్‌కుమార్ విలువైన కుర్చీలను సోమవారం సమకూర్చారు. ఈ సందర్భంగా పలువురు గురువులను సత్కరించారు. అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. పది ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచే విద్యార్థుల అభ్యున్నతికి తోడ్పాటునిస్తానని హామీ ఇచ్చారు. ఏటా మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో తమ సంస్థ తరఫున గురు పూజోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తామని ప్రకటించారు. ఎంఈవో జె.బాలయ్య, సర్పంచి వెంకటరత్నం, ప్రధానోపాధ్యాయులు పుష్ప సూర్యప్రకాశ్, సుందర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డీఈవోకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

బెదిరింపులకు పాల్పడటం హేయం

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: కొందరు ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులకు ఫోన్లు చేసి బెదిరింపులకు పాల్పడటం హేయమని ఏపీ ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మురళీకృష్ణ, రవీంద్ర డిమాండ్ చేశారు. స్థానిక జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో డీఈవో వెంకట లక్ష్మమ్మను సోమవారం కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. భీమడోలు ఎంఈవో-2 భాస్కర్‌కు ఓ వ్యక్తి ఫోను చేసి తాను ఎండీఎం రాష్ట్ర కార్యాలయంలో ఆహార కమిషన్ సభ్యుడిగా పని చేస్తున్నాని.. మీ మండలంలో మధ్యాహ్న భోజన పథకం సరిగా అమలవ్వడం లేదని బెదిరించారన్నారు. డబ్బులిస్తే ఇలాంటి ఫిర్యాదులను పట్టించుకోమంటూ బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని ఆరోపించారు. ఇలాగే మరికొందరు ఎంఈవోలకు ఫోన్లు వచ్చాయని ఆవేదన వ్యక్తం చేశారు.

విసిగివేశారి.. వినతులతో మరోసారి!

'మీ కోసం'లో అర్జీల అందజేత

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: వారు విధి వంచితులు. ఒకరి తోడు లేనిదే.. ఇంట్లో నుంచి బయటకు రాలేరు. వారికి చేయూతనిచ్చి.. సంక్షేమ ఫలాలు అందజేయాల్సిన అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తుండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని మండల స్థాయిలో పలుమార్లు విన్నవించుకున్నా.. స్పందన లేకపోవడంతో జిల్లా కేంద్రానికొచ్చారు. గట్టెక్కించేవాళ్లు లేక.. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన 'మీ కోసం'లో జిల్లా అధికారులకు వినతులు అందజేశారు.

కాలు తొలగించారు..

నా పేరు కాపుదాసి ప్రసాద్. ఏలూరు మండలం శనివారపుపేటలో నివాసం ఉంటున్నా. నాకు మధుమేహం ఎక్కువై.. వైద్యులు కాలు తొలగించారు. అప్పట్నుంచి ఏ పని చేయలేకపోతున్నా. దివ్యాంగుల విభాగంలో పింఛనుకు దరఖాస్తు చేసుకున్నా. అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో సదరం శిబిరానికి వెళ్లి వైద్య ధ్రువపత్రం పొందాలని అధికారులు తెలిపారు. ఒంటి కాలితో అంత దూరం ఎలా వెళ్లగలను. ఏలూరులోనే వైద్య ధ్రువపత్రం పొందే అవకాశం కల్పించాలి.

90 శాతం వైకల్యమున్నా..

నా పేరు కూనపాము రాజు. కొయ్యలగూడెంలో నివాసం ఉంటున్నా. బాల్యం నుంచి రెండు కాళ్లు పని చేయడం లేదు. దివ్యాంగుల విభాగంలో రూ.6 వేల పింఛను ఇస్తున్నారు. 90 శాతం వైకల్యమున్నా.. రూ.15 వేల పింఛను ఇవ్వడం లేదు. ఈ మొత్తం పెంచాలని పలుమార్లు మండల అధికారులకు అర్జీలిచ్చా. వారు స్పందించలేదు. తప్పనిసరి పరిస్థితుల్లో కలెక్టరేట్‌కు రావాల్సి వచ్చింది. ఇక్కడైనా న్యాయం చేస్తారని ఆశిస్తున్నా.

మరికొన్ని.. ★ ద్వారకాతిరుమల మండలం దొరసానిపాడులో రహదారి స్థలాన్ని కొందరు ఆక్రమించేశారు. అక్రమంగా కట్టడాలు నిర్మిస్తున్నారు. దీనిపై చర్యలు తీసుకుని.. భవన నిర్మాణాలను నిలుపుదల చేయాలని పాటి శ్రీనివాసరావు ఫిర్యాదు చేశారు. ★ దివ్యాంగురాలైన తన కుమార్తెకు పింఛను నిలుపుదల చేశారని, దాన్ని పునరుద్ధరించాలని కామవరపుకోట మండలం కళ్లచెరువుకు చెందిన విజయ అర్జీ సమర్పించారు.

ఎమ్మార్పీఎస్ నాయకుల ఆందోళన

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: పెదవేగి మండలం నడుపల్లికి చెందిన దొండపాటి మహేశ్‌పై దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ.. మహేశ్‌పై కొందరు ఉద్దేశపూర్వకంగా దాడి చేశారని.. దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. అనంతరం మీ కోసంలో వినతి పత్రం అందజేశారు.

ఆలయాల పునర్నిర్మాణ పనుల పరిశీలన

ఏలూరు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: అగ్రహారంలోని నగరేశ్వర, కన్యకాపరమేశ్వరి ఆలయాల పునర్నిర్మాణ పనులను ఎమ్మెల్యే బడేటి చంటి సోమవారం పరిశీలించారు. తొలుత ఆలయంలో స్వామి, అమ్మవార్లను వేర్వేరుగా దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట ఇడా ఛైర్మన్ శివప్రసాద్, ఈవో నాగబాబు, స్తపతి సతీశ్, ఆలయ ఛైర్మన్ శ్రీనివాసరావు ఉన్నారు.

విలువలతో విద్యా బోధన: డీవైఈవో

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: స్థానిక ఏఆర్‌డీజీకే నగరపాలకోన్నత పాఠశాలను ఉప విద్యా శాఖాధికారిణి రవీంద్రభారతి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించారు. విద్యార్థుల హాజరు పట్టీని తనిఖీ చేశారు. తరచూ పాఠశాలకు గైర్హాజరయ్యే విద్యార్థుల ఇళ్లకెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడాలని ఉపాధ్యాయులకు సూచించారు. పిల్లలకు విలువలతో కూడిన విద్య బోధించాలని ఆమె ఆదేశించారు.

దొంగతనం కేసులో నిందితుడి అరెస్టు

వివరాలు వెల్లడిస్తున్న సీఐ రజనీకుమార్

నిడమర్రు గ్రామీణం, న్యూస్‌టుడే: తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడిన కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు సీఐ రజనీకుమార్ తెలిపారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. గుణపర్రుకు చెందిన కిర్లంపూడి ఏసుబాబు సెప్టెంబర్ 29న ఇంటికి తాళమేసి కుటుంబ సభ్యులతో ఊరెళ్లారు. మరుసటి రోజు ఇంటికొచ్చే సరికి తాళం పగులగొట్టి ఉంది. బాధితుడి ఫిర్యాదు మేరకు నిడమర్రు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి అదే గ్రామానికి చెందిన నిందితుడు కాకులపాటి పూర్ణ సుభాశ్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి రూ.6 లక్షలు విలువ చేసే 48 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ పేర్కొన్నారు.

ఇంటి తలుపు తాళాలు పగులగొట్టి చోరీ

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ఏలూరు రెండో పట్టణం కొత్తపేట పప్పులవారివీధిలో నివాసముంటున్న సింగవరపు కొండలరావు పూల వ్యాపారం చేస్తుంటారు. ఇటీవల ఆయన తల్లి మరణించడంతో ఆ ఇంట్లో కొన్నాళ్లు ఉండకూడదన్న ఉద్దేశంతో.. భార్యాపిల్లలతో సహా ఏలూరులోనే మరో ప్రాంతంలో ఉంటున్న సోదరి వద్దకెళ్లారు. సోమవారం ఇంటికి రాగా, తలుపు తాళాలు పగులగొట్టి ఉండటంతో పోలీసులకు సమాచారం అందించారు. సీఐ అశోక్ కుమార్ తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. దొంగలు బంగారు నగలు, నగదు దోచుకుపోయినట్లు గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

డిమాండ్ల సాధనకు దశలవారీగా నిరసన

బ్రాంచి మేనేజర్‌కు వినతి ఇస్తున్న ఉద్యోగులు

భీమడోలు, న్యూస్‌టుడే: తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు దశలవారీగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నామని వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల ఐక్య వేదిక నాయకులు పేర్కొన్నారు. స్థానిక డీసీసీబీ బ్రాంచి కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేశారు. మధ్యంతర భృతి ఇవ్వాలని, గ్రాట్యూటీ సీలింగు ఎత్తివేయాలని, ఉద్యోగ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం డీసీసీబీ బ్రాంచి మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. భీమడోలు, గుండుగొలను, సీతంపేట, పూళ్ల, గుణ్ణంపల్లి సొసైటీల సీఈవోలు, ఉద్యోగులు హాజరయ్యారు.

యర్రమిల్లిపాడులో కారు దగ్ధం

ఉంగుటూరు, న్యూస్‌టుడే: యర్రమిల్లిపాడుకు చెందిన తమ్మిన రోహిత్ చౌదరి తన స్నేహితుడితో కలిసి ఆదివారం దేవరపల్లి వెళ్లారు. పనులు ముగించుకొని స్వగ్రామం బయల్దేరారు. లక్ష్మీనగరం-యర్రమిల్లిపాడు రోడ్డులో కారు ముందు భాగం నుంచి పొగ రావడంతో వారు అప్రమత్తమయ్యారు. కారు రోడ్డు పక్కన నిలిపి బయట కొచ్చేశారు. బోనెట్ తెరిచే వ్యాపించడంతో.. కారు పూర్తిగా దగ్ధమైంది. భీమడోలు అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకొని మంటలు అదుపు చేశారు.

17వ వర్ధంతి

మంచితనము, మానవత్వము మూర్తీభవించిన మహోన్నత వ్యక్తి, మా అందరికీ మార్గదర్శకులు

కీ॥శే॥ గురజాడ సీతారామారావు గారు

మా నుండి దూరమై 17 సం॥లు గడిచినప్పటికీ మీ మధురస్మృతులు మా మదిలో ఎప్పటికీ నిలిచివుంటాయి. వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని

శ్రీ గురజాడ సీతారామారావు గారు
M.Com., M.B.A., F.C.A.
చార్టర్డ్ అకౌంటెంట్, ఏలూరు

కుటుంబసభ్యులు

నేర్చారు.. మిన్నకున్నారు!

కుట్టు యంత్రాలకు మహిళల నిరీక్షణ

☛ గణపవరానికి చెందిన రుద్రరాజు సౌమ్య కుట్టు శిక్షణ పొంది నాలుగు నెలలు పూర్తవుతోంది. కుట్టు యంత్రాలు ఎప్పుడిస్తారంటూ ఇప్పటి వరకు కనీసం పది సార్లు సచివాలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. అక్కడ సరైన సమాధానం చెప్పడంతో.. నిరాశగా ఇంటికొస్తున్నారు.

☛ పిప్పరకు చెందిన కృష్ణవేణి గణపవరంలో కుట్టు శిక్షణ పొందారు. ఇప్పటి వరకు ధ్రువపత్రం, కుట్టు యంత్రం, బ్యాంకు రుణం మంజూరు చేయలేదు. యంత్రమిస్తే కొంత మొత్తాన్ని జోడించి దర్జీ దుకాణం పెట్టుకోవాలని అనుకున్నా[illegible] ఆవేదన వ్యక్తం చేశారు.

గణపవరం, న్యూస్‌టుడే: మహిళల ఆర్థిక స్వావలంబనకు కూటమి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోంది. వారి జీవనశైలి, ఆర్థికాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. వెనుకబడిన తరగతుల సహకార ఆర్థిక సంస్థ ఆధ్వర్యాన ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. తద్వారా నియోజకవర్గంలో సుమారు 560 మంది శిక్షణ పొందేలా ప్రణాళిక రూపొందించింది.

గణపవరంలో శిక్షణ పొందుతూ..

మూడు నెలల శిక్షణ.. నియోజకవర్గంలో నాలుగు మండలాలున్నాయి. మండలానికి 140 మందిని రెండు బ్యాచ్‌లుగా విభజించి శిక్షణనిచ్చారు. 85 శాతం హాజరు ఉండాలన్న నిబంధన విధించారు. ఒక్కో మండలం నుంచి 110 మంది చొప్పున సుమారు 440 మంది అర్హత సాధించారు. వీరికి ధ్రువపత్రంతో పాటు ఉచిత కుట్టు యంత్రం అందించేలా మార్గదర్శకాలు రూపొందించారు. మహిళలు నేరుగా దర్జీ దుకాణాలు ఏర్పాటు చేసుకునేలా బ్యాంకుల నుంచి రుణ సదుపాయం కల్పించాల్సి ఉంది.

కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా.. శిక్షణ పూర్తై నాలుగు నెలలవుతున్నా.. నేటికీ మహిళలకు కుట్టు యంత్రాలు అందించలేదు. వారు రోజూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. సరైన సమాధానం చెప్పే వారు కరవయ్యారు. పలు మండలాల్లో ధ్రువపత్రాలు అందించలేదు. 'కుట్టు యంత్రాల పంపిణీ అంశం ఉన్నతాధికారుల పరిధిలో ఉంది. అన్ని మండలాల లబ్ధిదారులకు ఒకేసారి అందజేస్తామని తెలిపారు. త్వరలోనే [illegible] అందజేసే అవకాశముంది' అని గణపవరం ఎంపీడీవో జీవీ శ్రీలక్ష్మి తెలిపారు.



పోలవరం

•పోలవరం • చింతలపూడి

13న జాతీయ లోక్ అదాలత్

న్యాయవాదులతో సమావేశమైన జడ్జి మధుబాబు

చింతలపూడి, న్యూస్‌టుడే: ఈ నెల 13న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్.మధుబాబు అన్నారు. బార్ అసోసియేషన్ సభ్యులతో న్యాయమూర్తి మధుబాబు స్థానిక కోర్టు ఆవరణలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో రాజీ చేసుకోదగ్గ కేసులను రాజీ చేసుకునేలా కక్షిదారులకు అవగాహన కల్పించారన్నారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్ చక్కని వేదికని చెప్పారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మాణిక్యాలరావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

10 AM to 1 PM మేమున్నాం.. మీకు తోడుగా..
జంగారెడ్డిగూడెం: 80085 74478
కొయ్యలగూడెం: 80085 74947
చింతలపూడి: 76759 19086

చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే: ? చింతలపూడి పట్టణం అగ్నిమాపక కూడలి ఆయిల్‌మిల్లు పరిసరాల్లో పందుల సంచారం ఎక్కువగా ఉంది. - **నవీన్, మెకానిక్**

✔ పందులను పట్టణానికి దూరంగా తరలించే విధంగా చర్యలు తీసుకుంటాం. - **రాంబాబు, నగర పంచాయతీ కమిషనర్.**

? రత్నావిలేజ్‌కు వెళ్లే దారి ఇరువైపులా డ్రెయిన్లు లేకపోవడంతో మురుగు రహదారిపై ప్రవహిస్తోంది. - **దుర్గారావు**

✔ మురుగు రహదారిపైకి రాకుండా చర్యలు తీసుకుంటాం. - **రాంబాబు, నగర పంచాయతీ కమిషనర్.**

కొయ్యలగూడెం, న్యూస్‌టుడే: ? కొయ్యలగూడెంలోని ఎస్సీ కాలనీ వద్ద ఉన్న ఎంపీపీ పాఠశాలలో చెత్త పేరుకుపోయింది. చాలా రోజులుగా పట్టించుకోవడం లేదు. **- రత్నరాజు**

✔ వెంటనే తొలగిస్తాం. **-జగదీశ్, పంచాయతీ కార్యదర్శి**

టి.నరసాపురం, న్యూస్‌టుడే: ? గ్రామంలో డ్రెయినేజీ సమస్య ఉంది. పరిష్కారానికి చర్యలు చేపట్టాలి. **- రాంబాబు, అల్లంచర్లకొత్తగూడెం.**

✔ వెంటనే చర్యలు తీసుకుంటాం. - **నార్ని వెంకట్రావు, సర్పంచి, అల్లంచర్లరాజుపాలెం**

గుంతలు ఉండవు.. గతుకులు కనిపించవు..

ప్రారంభమైన రహదారుల పనులు

జంగారెడ్డిగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: గ్రామీణ రహదారులపై ప్రయాణం ఇక సాఫీగా సాగనుంది. గతుకులు, గుంతలు లేని రోడ్లే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికతో పనులు చేపట్టింది. ఇప్పటికే పాడైన, శిథిలస్థితికి చేరిన రహదారులను గుర్తించి నిధులు మంజూరు చేయడంతో నూతన నిర్మాణాలు ఊపందుకున్నాయి. గత అయిదేళ్లలో పట్టణాల నుంచి గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే ప్రధాన రహదారులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. గత వైకాపా హయాంలో తట్టెడు మట్టి పోసి గుంతలు కూడా పూడ్చిన దాఖలాలు లేవు. ఆ మార్గాల మీదుగానే ఎన్నో వ్యయప్రయాసలతో ప్రజలు రాకపోకలు సాగించారు.

జంగారెడ్డిగూడెం మండలం లక్కవరం వద్ద జరుగుతున్న రోడ్డు పనులు

రెండు నియోజకవర్గాల్లో..

➤ చింతలపూడి, పోలవరం నియోజకవర్గాల్లో పంచాయతీరాజ్, ర.భ.శాఖ పరిధిలో దెబ్బతిన్న పలు గ్రామీణ రహదారులను గుర్తించి పనులు చేపట్టారు.

➤ జంగారెడ్డిగూడెం మండలం దేవులపల్లి నుంచి లక్కవరం గ్రామానికి వెళ్లే ఆర్అండ్‌బీ రహదారి రూ.70 లక్షలతో పనులు ప్రారంభించారు.

➤ జంగారెడ్డిగూడెం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం నుంచి బైపాస్ వరకూ రూ.80 లక్షలతో పనులు జరుగుతున్నాయి.

➤ బయ్యనగూడెం - రేగులగుంట గ్రామాల మధ్య 7 కి.మీ రహదారికి రూ.3 కోట్లు, అలాగే రూ.3.40 కోట్లతో 5 కి.మీ మేర కన్నాపురం- కొయ్యలగూడెం రోడ్డు నిర్మాణం చేపట్టారు.

➤ టి.నరసాపురం నుంచి బొర్రంపాలెం వరకు రూ.4.22 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణం పూర్తయింది.

➤ వేలేరుపాడు మండలంలో రూ.5.5 కోట్లతో 6 రోడ్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయని ఆర్అండ్‌బీ అధికారులు చెబుతున్నారు.

➤ జంగారెడ్డిగూడెం బైపాస్ నుంచి శ్రీనివాసపురం మీదుగా ములగలంపల్లి వరకూ రూ.4 కోట్లు, శ్రీనివాసపురం శివారు నుంచి అక్కంపేట గ్రామానికి వెళ్లే 2 కి.మీ. రోడ్డు రూ.90 లక్షలు మంజూరు కాగా గుత్తేదారులు పనులు చేపట్టారు.

ప్రతిపాదనలు పంపాం .. 'జంగారెడ్డిగూడెం డివిజన్‌లోని 10 మండలాల్లో సుమారు 250 కి.మీ. రహదారుల మరమ్మతులు, నిర్మాణాలను గుర్తించామని వాటికి సంబంధించి రూ.170 కోట్లకు ప్రతిపాదనలు పంపామని'..పంచాయతీరాజ్ ఏఈ అంకిరెడ్డి తెలిపారు.

➤ 'జంగారెడ్డిగూడెం నుంచి కామవరపుకోటకు వెళ్లే ప్రధాన రహదారికి రూ.4 కోట్లు, లక్కవరం గ్రామం నుంచి పొంగుటూరుకు రూ.2 కోట్లుతోపాటు పలు రహదారులకు సంబంధించి అంచనాలను సిద్ధం చేసి ఉన్నతాధికారులకు నివేదించాం..' అని ర.భ.శాఖ డీఈ హరికృష్ణ తెలిపారు.

విద్యార్థులకు సేవా కార్యక్రమాలపై అవగాహన

బాలలకు క్రీడా పరికరాలు అందజేసిన సంస్థ సభ్యులు

పోలవరం, న్యూస్‌టుడే: గూటాల జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం హైదరాబాద్ సీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులకు క్రీడలపై ఆసక్తి పెంచడం కోసం రూ.20వేలు విలువైన క్రీడ సామగ్రి అందజేశారు. సైబర్ సెక్యూరిటీ మరియు ఆన్‌లైన్ భద్రతపై అవగాహన కల్పించారు. ఫిజికల్ ఫిట్‌నెస్ ప్రాముఖ్యాన్ని వివరించారు. పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు జరిపారు. పదో తరగతి విద్యార్థులకు పరీక్ష కిట్‌లు అందజేశారు. ఎంపీపీ ఎస్.వెంకటరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఎంఈవో వీఎస్ఎన్ మూర్తి, ప్రధానోపాధ్యాయుడు జె.చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు పోడియం అందజేత

పోలవరం, న్యూస్‌టుడే: పట్టిసీమ జడ్పీ ఉన్నత పాఠశాలకు హైదరాబాద్ స్ట్రీట్‌కాజ్ సేవా సంస్థ సభ్యులు సోమవారం పోడియం అందజేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వీఎస్ఎన్.మూర్తి చెప్పారు. పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పి.వెంకటకృష్ణవడయార్ రూ.13,500 విలువైన మెగా ఫోన్‌ను అందజేశారని చెప్పారు.

దివ్యాంగులకు వివరణ

కొయ్యలగూడెం, న్యూస్‌టుడే: కొయ్యలగూడెంలోని దివ్యాంగుల ఆశ్రమం వద్ద సర్పంచి ముప్పిడి విజయకుమారి ఆధ్వర్యంలో 50మందికి దుప్పట్లు పంపిణీ చేశారు.

తన పొలం మరొకరి పేరున ఆన్‌లైన్ చేయడంపై ఫిర్యాదు

తన పొలాన్ని సర్వే చేయాలని కోరుతూ ఆర్డీవో రమణకు విన్నవిస్తున్న రైతు

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే : జీలుగుమిల్లి మండలం దాట్లవారిగూడెంలో తనకు 58వ సర్వే నంబరులో 10.29 ఎకరాల భూమి ఉండగా దీనిని ఇతరుల పేరున అధికారులు ఆన్‌లైన్ చేశారని ఆరోపిస్తూ గిరిజన మహిళ కుంజా రామలక్ష్మి సోమవారం జరిగిన మీ కోసం కార్యక్రమంలో ఆర్డీవో ఎంవీ రమణకు ఫిర్యాదు చేశారు. మైసన్నగూడెంలోని తన భూమిని సర్వే చేయాలని గణపతిరావు అనే రైతు దరఖాస్తు చేశారు. తనను భర్త, అత్తమామలు వేధిస్తున్నారని నీరజ మహేశ్వరి, తన భార్యను కాపరానికి పంపడం లేదని అత్తమామలపై శివకిశోర్ ఫిర్యాదు చేశారు. రెడ్డిగణపవరంలో తన భూమిని కొందరు అక్రమంగా ఆర్అండ్ఆర్‌లో అమ్ముతున్నారని పవన్‌కల్యాణ్ అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. అర్జీలు పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని ఆర్డీవో తెలిపారు.

పొలాల్లోకి వెళ్లడానికి దారి చూపాలని వినతి

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే : సుమారు 25 ఎకరాల్లోకి వెళ్లే దారి సదుపాయం కల్పించాలని లక్కవరం గ్రామానికి చెందిన పలువురు రైతులు తహసీల్దారు స్లీవజోజికి సోమవారం మీ కోసంలో విన్నవించారు. పంట చేలలోకి వెళ్లాలన్నా, పంట తెచ్చుకోవాలన్న ఓ ఇద్దరు రైతుల పొలంలో నుంచి తామందరం వెళ్లాల్సి వస్తోందని పేర్కొన్నారు. వారి పొలం దాటి ఎవరినీ ఉచితంగా వెళ్లనీయడం లేదని తహసీల్దారుకు వివరించారు.

పీజేఆర్ఎస్‌లో డ్వాక్రా మహిళల ఫిర్యాదు

పోలవరం, న్యూస్‌టుడే: డ్వాక్రా గ్రూపు మహిళల విషయంలో ఏపీఎం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ పోలవరంలోని మహబూబ్‌సుభాని స్వయం సహాయక సంఘ సభ్యులు సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన పీజేఆర్ఎస్‌లో తహసీల్దార్ సాయిరాజుకు వినతి పత్రం అందజేశారు. గ్రూపులోని సభ్యులకు స్త్రీ నిధి మంజూరైందని తీర్మానం చేసుకుని సంతకాల కోసం వెలుగు కార్యాలయానికి వెళ్తే సమావేశంలో ఉన్నామని కాసేపు కూర్చోమని చెప్పడంతో సంతకం కోసం గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చిందని సభ్యులు షేక్.మల్లిక, సయ్యద్ ఆన్సారి తదితరులు వినతి పత్రంలో పేర్కొన్నారు. దీనిపై ఏపీఎం జేమ్స్‌ను సంప్రదించగా సభ్యుల వివరాలు కంప్యూటర్‌లో పరిశీలించి తీర్మానంపై సంతకం చేయడం జరిగిందన్నారు.

మినీ కేంద్రాలకు వర్గోన్నతి

కార్యకర్తలకు ఉత్తర్వు అందజేస్తున్న సరళ

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: ఐసీడీఎస్ కొయ్యలగూడెం ప్రాజెక్టు పరిధిలోని 25 మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ప్రధాన (మెయిన్) అంగన్‌వాడీ కేంద్రాలుగా వర్గోన్నతి చేస్తూ.. సంబంధిత కేంద్రాల కార్యకర్తలకు ఉత్తర్వులు అందజేసినట్లు సీడీపీవో సరళ సోమవారం తెలిపారు. వీటిలో కొయ్యలగూడెం మండలంలో 15, పోలవరంలో 10 కేంద్రాలు ఉన్నాయని చెప్పారు. మొత్తం 37మినీ కేంద్రాలకు సాంకేతిక అంశాల నేపథ్యంలో 12కేంద్రాలకు వర్గోన్నతి ప్రక్రియలో జాప్యం నెలకొందన్నారు. వర్గోన్నతి పొందిన కేంద్రాల కార్యకర్తలకు గౌరవ వేతనం రూ.7వేల నుంచి రూ.11500లకు పెరిగిందని వివరించారు.

పోలవరం జిల్లాలో కలపండి

కుక్కునూరు, న్యూస్‌టుడే: పోలవరం నియోజకవర్గంలోని ఎస్టీ మండలాలు, మైదాన ప్రాంతంలోని షెడ్యూల్ గ్రామాలను పోలవరం జిల్లాలో కలపాలని సీపీఎం కోరింది. సోమవారం ఆ పార్టీ ఆధ్వర్యంలో మాధవరం సచివాలయం వద్ద ధర్నా నిర్వహించి, ఆ మేరకు ఓ వినతిపత్రం అందజేశారు.



2027లో రై రై బుల్లెట్ రైల్

● అదే ఏడాది ఆగస్టులో ట్రయల్ రన్ ● గుజరాత్‌లో వేగంగా ప్రాజెక్టు పనులు ● ప్రతి స్టేషన్ నిర్మాణమూ ప్రత్యేకమే

గుజరాత్ నుంచి
ఈనాడు ప్రత్యేక ప్రతినిధి

నిర్మాణంలో ఉన్న అహ్మదాబాద్ బుల్లెట్ ట్రైన్ స్టేషన్ ★ సబర్మతిలో నిర్మించిన మల్టీ ట్రాన్స్‌పోర్ట్ హబ్

దేశంలో మొదటి బుల్లెట్ ట్రైన్ పరుగులు పెట్టనున్న గుజరాత్‌లో ప్రాజెక్టు పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈ ట్రాక్ వెళ్లే అహ్మదాబాద్, సబర్మతిలలో స్టేషన్లను సంస్కృతి ప్రతిబింబించేలా అదే సమయంలో అత్యాధునిక వసతులు ఉండేలా తీర్చిదిద్దుతున్నారు. అహ్మదాబాద్-ముంబయి మధ్య నడవనున్న బుల్లెట్ రైలు.. 508 కిలోమీటర్ల దూరాన్ని 2 గంటల 7 నిమిషాల్లోనే చేరుకుంటుంది. దీనికి సంబంధించి 2027 ఆగస్టులో గుజరాత్‌లోని సూరత్-బిలిమోరా మధ్య 50 కి.మీ. దూరానికి ట్రయల్ చేపట్టనున్నట్టు నేషనల్ హైస్పీడ్ రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ అహ్మదాబాద్ సివిల్ పనుల విభాగం ప్రిన్సిపల్ చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ రాజేష్ అగర్వాల్ వివరించారు. ఈ ప్రాజెక్టు మొత్తం వ్యయం రూ.1.08 లక్షల కోట్లు కాగా గంటకు 350 కి.మీ. వేగంతో దూసుకుపోయే సామర్థ్యం ఈ బుల్లెట్ రైలుకు ఉంటుంది. అత్యాధునిక ట్రాక్‌తో పాటు మెట్రో, బస్సు, రైలు, బుల్లెట్ రైలు మార్గాలను అనుసంధానించేలా పూర్తి స్థాయి వసతులతో మొత్తం 12 స్టేషన్లు నిర్మిస్తున్నారు. సబర్మతిలో మల్టీమోడల్ ట్రాన్స్‌పోర్ట్ హబ్ నిర్మాణం ఇప్పటికే పూర్తయింది. ఇది 2026లో అందుబాటులోకి రానుందని రాజేష్ వివరించారు. అహ్మదాబాద్, సబర్మతిలలో కొన్ని చోట్ల పనులు ఇప్పటికే పూర్తికాగా, మరి కొన్నిచోట్ల వివిధ దశల్లో ఉన్నాయి. ఈనాడు ప్రతినిధి ఈ ప్రాజెక్ట్ పనులను క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు. వివరాలివీ....

అహ్మదాబాద్ బుల్లెట్ ట్రైన్ స్టేషన్

● అహ్మదాబాద్ బుల్లెట్ ట్రైన్ స్టేషన్ నిర్మాణాన్ని నగర సాంస్కృతిక, చారిత్రక వారసత్వం ప్రతిబింబించేలా రూపొందించారు. సుమారు 38,000 చదరపు మీటర్ల విస్తీర్ణంలో నేల పైనుంచి 33.7 మీటర్ల ఎత్తులో ఈ స్టేషన్ ఉంటుంది. ప్రస్తుతం నిర్మాణ పనులు సాగుతున్నాయి. ● ప్రయాణికుల సౌలభ్యం కోసం లాంజ్, మరుగుదొడ్లు, ఉద్యానవనాలు, వాణిజ్య దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. ● బుల్లెట్ ట్రైన్ స్టేషన్‌ను మెట్రో, ఆర్టీసీ, క్యాబ్ సర్వీసులతో అనుసంధానించేందుకు ఇంటిగ్రేటెడ్ భవనం నిర్మిస్తున్నారు. అహ్మదాబాద్ రైల్వే స్టేషన్‌తోనూ బుల్లెట్ ట్రైన్ స్టేషన్ అనుసంధానమై ఉంటుంది. ● ఇక్కడి నుంచి అహ్మదాబాద్ విమానాశ్రయం దాదాపు 10 కి.మీ., గీతా మందిర్ సెంట్రల్ బస్ స్టాండ్‌కు 3.5 కి.మీ. దూరంలోనే ఉంటాయి.

సబర్మతి మల్టీమోడల్ హబ్

● హై స్పీడ్ రైల్ మల్టీమోడల్ హబ్ ఒక ఆధునిక భవనం. సబర్మతి రైల్వే స్టేషన్లు, మెట్రో స్టేషన్, నిర్మాణంలో ఉన్న సబర్మతి బుల్లెట్ ట్రైన్ స్టేషన్, బస్ ర్యాపిడ్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్‌తో నిరంతర కనెక్టివిటీ అందించడానికి దీనిని డిజైన్ చేశారు. ● ఈ ప్రతిష్ఠాత్మక నిర్మాణం ముందు భాగం దండి మార్చ్ ఉద్యమాన్ని ప్రతిబింబిస్తుంది. ఈ భవన నిర్మాణం దాదాపుగా పూర్తయింది. ● ఆరు అంతస్తుల ఈ భవనంలో బ్యాంకెట్ హాళ్లు, కాన్ఫరెన్స్ రూమ్‌లు, స్విమ్మింగ్ పూల్, రెస్టారెంట్‌తో కూడిన హోటల్.. మొదలైనవి ఉంటాయి. ● పర్యావరణానికి హాని కలిగించని రీతిలో గ్రీన్ బిల్డింగ్‌గా ఈ హబ్‌ను తీర్చిదిద్దనున్నారు.

సబర్మతి బుల్లెట్ ట్రైన్ స్టేషన్

● సబర్మతి టెర్మినల్ స్టేషన్ మహాత్మా గాంధీ సబర్మతి ఆశ్రమంలోని చరఖా నుంచి ప్రేరణ పొందింది. ● ఈ స్టేషన్ మొత్తం నిర్మాణ విస్తీర్ణం: 45,094 చదరపు మీటర్లు కాగా భూమి నుంచి 44 మీటర్ల ఎత్తులో ఉంటుంది. నిర్మాణం కొనసాగుతోంది.

నేలపాలు చేసిన ద్రవ ఉక్కు

1,500 టన్నుల ద్రవ ఉక్కు నేలపాలు

ఉక్కునగరం (స్టీల్ సెక్టారు-3), న్యూస్‌టుడే: విశాఖ ఉక్కు కర్మాగారంలో సోమవారం 1,500 టన్నుల ద్రవ ఉక్కును నేలపాలు చేశారు. ఎ.షిఫ్ట్‌లో 600 టన్నులు, బి.షిఫ్ట్‌లో 900 టన్నుల చొప్పున ద్రవ ఉక్కును ఇలా పారబోశారు. విశాఖ ఉక్కు యాజమాన్యం విలువైన ఉక్కును తుక్కు (స్క్రాప్) పేరుతో నేలపాలు చేస్తోందని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఉక్కు తయారీకి పంపకుండా ఫుల్ ఐరన్ పేరుతో తుక్కుగా మార్చడం తగదని అంటున్నాయి. ఫుల్ ఐరన్ తయారు చేయాలన్నా కమిటీ అనుమతులు ఉండాలని.. అధికారులు తీసుకోకుండానే ఇలా చేస్తున్నారని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎవరికి లబ్ధి చేకూర్చేందుకు ఈ విధంగా చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు.

కర్ణాటక సీఎంకు 'సుప్రీం' తాఖీదులు

ఈనాడు, బెంగళూరు: కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు సుప్రీంకోర్టు తాఖీదులు జారీ చేసింది. 2023లో విధానసభ ఎన్నికల సమయంలో మైసూరు జిల్లా వరుణ నియోజకవర్గం నుంచి సిద్ధరామయ్య గెలిచేందుకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 'గ్యారంటీ పథకాల భరోసా' కారణమని, అవి ఎన్నికల నియమావళిని ఉల్లంఘించడమేనని అభ్యంతరం తెలుపుతూ అదే నియోజకవర్గానికి చెందిన శంకర్ అనే ఓటరు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ధర్మాసనం వివరణ ఇవ్వాల్సిందిగా సిద్ధరామయ్యకు తాఖీదులు జారీ చేసింది. ఎన్నికల ముందు ఇచ్చే గ్యారంటీ హామీలు ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951 ప్రకారం అవినీతిగా పరిగణించాలని, మహిళలకు మాత్రమే బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించటం పురుషులపై వివక్షగా భావించాలని శంకర్ గతంలో కర్ణాటక హైకోర్టులో పిటిషన్ వేశారు. దీన్ని విచారించిన కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సునీల్‌దత్ యాదవ్.. పిటిషన్‌లో చట్టాలను ఉల్లంఘించేంత కారణాలేవీ లేవన్నారు. పార్టీ రూపొందించిన ఎన్నికల ప్రణాళికలకు ఓ అభ్యర్థిని ఎలా బాధ్యుడిని చేస్తామని ప్రశ్నించారు. ఇలాంటి పిటిషన్లు గతంలోనూ దాఖలైనట్లు గుర్తుచేస్తూ శంకర్ అభ్యంతరాలను కొట్టివేశారు. ఈ తీర్పును సవాలు చేస్తూ పిటిషనర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

పాతికేళ్ల ప్రతీకారం.. రియల్టర్ దారుణ హత్య

● వేటకొడవళ్లతో నరికి...
తుపాకీతో కాల్చిన ఆరుగురు..

ఈనాడు-హైదరాబాద్, జవహర్‌నగర్, న్యూస్‌టుడే: స్థిరాస్తి వ్యాపారిని ఆటోతో గుద్దించి..కత్తులతో విచక్షణ రహితంగా నరకడంతోపాటు తుపాకీతో కాల్చి మరీ హతమార్చిన ఉదంతంతో హైదరాబాద్ ఉలిక్కిపడింది. సుమారు 25 ఏళ్ల క్రితం జరిగిన తన తండ్రి ఎన్‌కౌంటర్‌కు ప్రతీకారంగా.. ఆయన కుమారుడు.. స్నేహితులతో కలిసి ఈ దారుణానికి ఒడిగట్టినట్లు, అనంతరం పోలీసులకు లొంగిపోయినట్లు సమాచారం. సోమవారం తెల్లవారుజామున మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిందీ దారుణం.

ఆటోతో ఢీకొట్టి.. కిరాతకంగా హత్య

ఏపీలోని కృష్ణా జిల్లా మైలవరానికి చెందిన గంటా వెంకటరత్నం(54)..ముప్పై ఏళ్లకు పూర్వమే హైదరాబాద్ వచ్చాడు. చాలా కాలంగా స్థిరాస్తి వ్యాపారం చేస్తున్నాడు. ఐదేళ్లుగా జవహర్‌నగర్ ఠాణా పరిధి సాకేత్ కాలనీలో నివసిస్తున్నాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు. ఎప్పటిలానే సోమవారం ఉదయం కుమార్తెను అదే కాలనీలోని స్కూల్ దగ్గర వదిలిపెట్టాడు. ఉదయం 7.55 గంటల సమయంలో ఇంటికి తిరిగి వెళ్తుండగా.. ద్విచక్రవాహనంపై ఇద్దరు, ఆటోలో నలుగురు వెంబడించారు. తొలుత వెంకటరత్నం ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనాన్ని రాంగ్ రూట్‌లో వచ్చి ఆటోతో ఢీకొట్టారు. కిందపడిపోయిన ఆయన తేరుకునేలోపే.. వేటకొడవళ్లతో మెడ, తల, ఇతర శరీరభాగాలపై దాదాపు 25 సార్లు నరికారు. తర్వాత సమీపంలోని

హత్యకు గురైన వెంకటరత్నం

బండరాయి తీసుకొచ్చి తలపై మోదారు. ఇదంతా జరుగుతుండగానే.. నిందితుల్లో ఒకడు తుపాకీతో ఒక రౌండు కాల్చడంతో వెంకటరత్నం అక్కడికక్కడే మృతి చెందాడు. హత్యోదంతం.. అనంతరం నిందితులు అక్కడ్నుంచి పరారైన దృశ్యాలు సమీపంలోని సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. జవహర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదయ్య, మల్కాజిగిరి డీసీపీ శ్రీధర్ ఘటనాస్థలిని సందర్శించారు. ఘటనా స్థలంలో పడి ఉన్న తూటా, వేట కొడవలిని స్వాధీనం చేసుకున్నారు. హత్య జరిగిన తర్వాత నిందితులు సౌత్‌వెస్ట్ జోన్ డీసీపీ కార్యాలయంలో లొంగిపోయినట్లు విశ్వసనీయంగా తెలిసింది.

పాతకక్షల కారణంగానే..: పాతకక్షల కారణంగానే హత్య చేసినట్లు ప్రధాన నిందితుడు, నగరంలోని జుమ్మేరాత్‌బజార్‌కు చెందిన చందన్‌సింగ్(33) చెప్పినట్లు సమాచారం. ఆ ప్రకారం..'చందన్‌సింగ్ తండ్రి సుదేశ్‌సింగ్ రౌడీషీటర్. పాతికేళ్ల క్రితం నగరంలో భూదందాలు, సెటిల్‌మెంట్లు చేసే వాడు. అప్పట్లో వెంకటరత్నం ఆయనకు ప్రధాన అనుచరుడిగా ఉండేవాడు. సుదేశ్‌సింగ్ 2001 ఏప్రిల్‌లో జరిగిన పోలీస్ ఎన్‌కౌంటర్‌లో మరణించాడు. వెంకటరత్నం పోలీస్ ఇన్‌ఫార్మర్‌గా వ్యవహరించడమే తన తండ్రి మరణానికి కారణమని భావించిన చందన్ సింగ్ పగ పెంచుకున్నాడు. ఈ క్రమంలోనే తన స్నేహితులైన వడ్డే వెంకటనారాయణ(39), కె.నరేశ్‌కుమార్(28), ఈషాన్‌శర్మ(19), ఎన్.పవన్‌కుమార్(20), నర్సింగ్(26) సాయంతో హత్యకు ప్రణాళిక రచించాడు.

రెరాపై నెలకో ఉమ్మడి జిల్లాలో అవగాహన సదస్సు

● 10న తిరుపతిలో శ్రీకారం
● ఏపీ రెరా ఛైర్మన్ శివారెడ్డి వెల్లడి

ఈనాడు, అమరావతి: రెరా చట్టంపై బిల్డర్లు, కొనుగోలుదారులకు అవగాహన కల్పించేందుకు నెలకో ఉమ్మడి జిల్లాలో సదస్సులు నిర్వహించనున్నట్లు ఏపీ రెరా ఛైర్మన్ ఎ.శివారెడ్డి తెలిపారు. ఈనెల 10న తిరుపతిలో మొదటి సదస్సు జరగనుందని ఆయన చెప్పారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని అన్ని పుర, నగరపాలక సంస్థల పరిధిలోని బిల్డర్లు, కొనుగోలుదారులు, సంబంధిత ప్రభుత్వశాఖల అధికారులను ఆహ్వానిస్తున్నామని వివరించారు. విజయవాడలోని రెరా కార్యాలయాన్ని రాజధాని అమరావతిలో కొత్తగా ప్రారంభించిన సీఆర్‌డీఏ కార్యాలయం ప్రాంగణంలోకి తరలించిన విషయం తెలిసిందే. కొత్త కార్యాలయంలో డైరెక్టర్లతో కలిసి ఛైర్మన్ శివారెడ్డి సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'ఇళ్లు, స్థలాల కొనుగోలుదారులకు రెరా చట్టం కల్పిస్తున్న హక్కులపై ఇంకా అవగాహన అవసరం. బిల్డర్లు, లేఔట్‌లు వేసే వారికి కూడా కొత్తగా ప్రారంభించే ప్రాజెక్టులకు రెరా రిజిస్ట్రేషన్ తప్పనిసరన్న విషయంపై అవగాహన కల్పించాలన్న ఉద్దేశంతో సదస్సులు నిర్వహించాలని నిర్ణయించాం' అని ఛైర్మన్ వివరించారు.

సాధ్యంకాని హామీలు ఇవ్వొద్దు..

'బిల్డర్లు ఎంత చేయగలరో ఆ మేరకే బ్రోచర్లలో ముద్రించాలి. ఎక్కువ చేస్తామని చెప్పి చేయకపోతే తర్వాత ఇబ్బందుల్లో పడతారు. సాధ్యంకాని హామీలు ఇవ్వొద్దు. ప్రాజెక్టుల పనులు గడువులోగా పూర్తి చేయాలి. కొనుగోలుదారులకు నష్టం జరిగితే ఎట్టి పరిస్థితుల్లోనూ విడిచిపెట్టేది లేదు. ప్రాజెక్టుల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి బిల్డర్లు అన్ని దస్తావేజులు పక్కాగా అప్‌లోడ్ చేస్తే ..గంట వ్యవధిలో రిజిస్ట్రేషన్లు పూర్తి చేయడానికి సిద్ధంగా ఉన్నాం' అని శివారెడ్డి అన్నారు.

ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయొచ్చు

ఇళ్లు, స్థలాల కొనుగోలుదారులు నష్టం జరిగిందని భావిస్తే...ఏపీ రెరాకు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయొచ్చు. కార్యాలయం అమరావతికి మార్చినా ఫిర్యాదుదారులకు ఎలాంటి ఇబ్బంది లేదు. బాధితులకు న్యాయం చేయడానికే ప్రయత్నిస్తాం. మహారాష్ట్ర, దిల్లీ, గుజరాత్ రాష్ట్రాల్లో రెరాలో అమలు చేస్తున్న ఉత్తమ విధానాలపై అధ్యయనం కోసం త్వరలో వెళ్లనున్నాం. వాటిలో ముఖ్యమైనవి రాష్ట్రంలోనూ అమలు చేయడానికి ప్రయత్నిస్తాం' అని శివారెడ్డి తెలిపారు. 'ఈ ఏడాది సెప్టెంబరు 17న బాధ్యతలు చేపట్టిన నుంచి ఇప్పటివరకు 270 కొత్త స్థిరాస్తి వ్యాపార ప్రాజెక్టులకు అత్యంత పారదర్శకంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేశాం. కొనుగోలుదారుల ఫిర్యాదులపై విచారణకు గురు, శుక్రవారాల్లో రెండు రోజులపాటు బెంచ్ భేటీ అవుతోంది. గతంలో వారంలో ఒక రోజే ఉండేది' అని రెరా డైరెక్టర్ దామచర్ల శ్రీనివాసరావు వివరించారు. డైరెక్టర్లు కామేశ్వరరావు, కులదీప్, జగన్నాథరావు, వెంకటరత్నంతోపాటు రెరా పట్టణ ప్రణాళిక విభాగం డైరెక్టర్ నాగసుందరి పాల్గొన్నారు.

మంత్రి నెహ్రూ అవినీతికి పాల్పడ్డారు

● కేసు నమోదు చేయండి ● తమిళనాడు డీజీపీకి ఈడీ లేఖ

చెన్నై (ప్యారిస్), న్యూస్‌టుడే: తమిళనాడు పురపాలక, నీటి సరఫరా శాఖల మంత్రి కేఎన్ నెహ్రూ రూ.1,020 కోట్ల మేర అవినీతికి పాల్పడ్డారని, ఆయనపై కేసు నమోదు చేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఆ రాష్ట్ర డీజీపీకి లేఖ రాసింది. అందులో.. మంత్రి కేఎన్ నెహ్రూ నిర్వహిస్తున్న శాఖల్లో భవనాలు, మరుగుదొడ్ల నిర్మాణం, పొరుగు సేవల నియామకం, నాబార్డ్ నిధులు, పారిశుద్ధ్య పనులకు సంబంధించిన ఒప్పందం, పారిశుద్ధ్య కార్మికుల గృహ నిర్మాణ ప్రాజెక్టులకు సంబంధించిన టెండర్లు, ఒప్పందాల్లో అవకతవకలు జరిగాయని తెలిపింది. టెండర్లు, ఒప్పందాలు ముందుగానే ఎవరికి ఇవ్వాలో నిర్ణయించి, ఒక్కో టెండరుకు 7.5 శాతం నుంచి 10 శాతం వరకు కమీషన్ తీసుకున్నారని, ఈ అవినీతి రూ.1,020 కోట్ల మేర జరిగినట్లు ఆరోపించింది. కమీషన్‌గా పొందిన నగదు విదేశాలకు హవాలా ద్వారా బదిలీ అయి ఉండొచ్చని పేర్కొంటూ 259 పేజీల పత్రాలను తమిళనాడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీలకు పంపింది. ఇందుకు సంబంధించి కేసు నమోదు చేయాలని కోరింది. మంత్రి కేఎన్ నెహ్రూపై అవినీతి ఆరోపణలు చేస్తూ కేసు నమోదు చేయాలంటూ డీజీపీకి ఈడీ రాసిన రెండో లేఖ ఇది కావడం గమనార్హం. ఇదివరకు ఆయన శాఖలోని ఖాళీల భర్తీలో భారీగా అవినీతి జరిగిందని, ఒక్కో పోస్టుకు రూ.25 లక్షల నుంచి రూ.35లక్షల వరకు లంచం తీసుకున్నారని ఆరోపణలు చేసింది.

మహిళలకు అన్ని రంగాల్లోనూ సమాన అవకాశాలు

మాట్లాడుతున్న అచ్యుత శ్రీనివాసరావు

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే : గతం కంటే మన దేశంలో మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో సమాన అవకాశాలు అందుకుంటున్నారని జంగారెడ్డిగూడెం బార్ అసోసియేషన్ పూర్వ అధ్యక్షుడు అచ్యుత శ్రీనివాసరావు అన్నారు. స్థానిక సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో లింగ సమానత్వంపై అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళ చట్టాలపై విద్యార్థులకు శ్రీనివాసరావు అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ ఎన్.ప్రసాద్‌బాబు మాట్లాడారు. మహిళా సాధికారత ప్రతినిధులు విజయదీపిక, శిరీష, రమాదేవి, వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేలపై దాడి

టి.నరసాపురం, న్యూస్‌టుడే: మర్రిగూడెంలో పోలీసులు సోమవారం రాత్రి కోడి పందేలపై దాడి చేశారు. ఎనిమిది మందిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.9,100 నగదు, మూడు కోడిపుంజులు, రెండు కోడి కత్తులు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఎం.జయబాబు తెలిపారు.

పేపర్ ప్రకటన

మహారాజశ్రీ పెద్దాపురం అడిషనల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో:
E.P.No.5 of 2024 in O.S.No. 195 of 2022
Between:
పరకాల శ్రీరామ్ ... D.Hr
And
సరియం శాంత కుమారి వగైరా... J.Drs
2వ J.Dr. సరియం అరుణ
2వ J.Dr. సరియం అరుణ, D/o లేట్ సరియం సింగరాజు, వయస్సు 22 సం.లు, హిందువు, విద్యార్థి, వెలుతురువారిగూడెం, బుట్టాయిగూడెం మండలం, జంగారెడ్డిగూడెం
J.C.J.C. W.G. Dist.
పై నంబరు పిటిషన్ ది 10-12-2025న వాయిదా అయి వున్నది. ఆ రోజున మీరు స్వయంగా గాని, మీ న్యాయవాదితో గాని ఉదయం 10-30 గంటలకు పై కోర్టు నందు హాజరు అయి మీ వాదనను తెలుపుకొనవలెను. లేనియెడల శ్రీ కోర్టు వారు మీకు పరోక్షంగా తీర్పు చెబుదురు.
శ్రీ కోర్టు వారి ఆర్డరు ప్రకారం
పెద్దాపురం, Dt.29-11-2025. M.K.MOHIUDDIN ADVOCATE PEDDAPURAM

సమాచార హక్కు చట్టంపై అవగాహన

చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే: చింతలపూడి మహిళా సమాఖ్య భవనంలో ఇండియన్ యాక్ట్స్ అవేర్నెస్ వాలంటరీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సమాచారం హక్కు చట్టం 2005పై సోమవారం మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ సభ్యులు మీర్జాఫర్ అలీ సయ్యద్ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల్లో తమకు కావాల్సిన సమాచారం తెలుసుకునేందుకు 2005లో సమాచార హక్కు చట్టం అందుబాటులోకి వచ్చినట్లు చెప్పారు. ప్రజలంతా ఈ చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.



అశ్రునివాళి
మీరు మాపై చూపిన ప్రేమ, ఆప్యాయతలు, మా భవిష్యత్తును నిర్మించిన మీ కృషి మా మనస్సులో ఎప్పటికీ నిలిచే ఉంటాయి. కుటుంబ ఉన్నతికై అహర్నిశలు శ్రమించి మా భవితకు బంగారు బాటలు వేసి అనంతలోకాలకు వెళ్ళిన మీ పవిత్రాత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ..
కీ॥శే॥ శ్రీ పువ్వాడ సూర్యనారాయణమూర్తి గారు
రిటైర్డ్ హెడ్మాస్టర్, ములగలంపల్లి
జననం: 04-08-1943 మరణం: 30-11-2025
ఇట్లు కుటుంబసభ్యులు
వైకుంఠ సమారాధన: ది 11-12-2025 గురువారం జంగారెడ్డిగూడెంలో మా స్వగృహమునందు జరుపబడును. సెల్: 93944 84449

హలో.. కొత్త చరవాణులొచ్చాయి..!

ఈ నెల 11 తర్వాత పంపిణీకి ఏర్పాట్లు

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కార్యకర్తలు, పర్యవేక్షకులకు ప్రభుత్వం త్వరలో కొత్త చరవాణులు అందించనున్నారు. ఈసారి ఖరీదైన 5జీ సెల్‌ఫోన్లు ఇస్తున్నారు. అంగన్‌వాడీల విధులు చాలా వరకు వాటితోనే ముడిపడి ఉంటున్నాయి. పోషణ్ ట్రాకర్, బాల సంజీవని యాప్‌లు ప్రతి రోజు వినియోగిస్తున్నారు. చిన్నారుల హాజరు నుంచి టేక్ హోమ్ రేషన్ వరకు అన్నీ ఆన్‌లైన్, చరవాణి ద్వారానే నమోదు చేస్తున్నారు. గతంలో రెండు సార్లు ప్రభుత్వం నుంచి అందుకున్నారు. ప్రస్తుతం ముచ్చటగా మూడో సారి అందకోనున్నారు. జంగారెడ్డిగూడెం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 219 కేంద్రాలు ఉండగా కార్యకర్తలు, పర్యవేక్షకులకు 228 సెల్‌ఫోన్లు అందాయని పీవో బ్యూలా తెలిపారు. ఈ నెల 11న రాష్ట్ర వ్యాప్తంగా వీటి పంపిణీని ప్రభుత్వం అధికారికంగా చేపట్టే అవకాశం ఉంది. అంగన్‌వాడీ కార్యకర్తలకు సీయూజీ నంబర్లు ప్రభుత్వమే ఇచ్చింది. వాటి రీఛార్జి కూడా ప్రభుత్వమే చేస్తోంది.

పేదలకు భూమిపై హక్కు కల్పించండి

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: యర్రంపేట పరిధిలోని 245, 246, 247సర్వే నంబర్లలోని 26.2 ఎకరాల కొండ పోరంబోకు భూమిలో 2005వ సంవత్సరం నుంచి సాగు చేసుకుంటున్న 46మంది పేదలకు రక్షణ కల్పించాలని సీపీఐ మండల కార్యదర్శి టి.ఆంజనేయ రాజు తహసీల్దారు ఎన్.నాగరాజుకు విజ్ఞప్తి చేశారు. తహసీల్దారు కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సోమవారం ఆయన పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొని కారు పల్టీ

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమలలో ఓ ప్రైవేటు లాడ్జి ఎదురుగా సోమవారం రాత్రి పెను ప్రమాదం తప్పింది. ఆకివీడుకు చెందిన ఓ భక్తుడు ద్వారకాతిరుమల శ్రీవారి దర్శనానికి కారులో వచ్చాడు. స్వామి దర్శనానంతరం అతను తిరిగి స్వగ్రామం బయలుదేరారు. ఘటనా స్థలం వద్దకు వచ్చే సరికి ముందు వెళ్తున్న మోటార్ సైకిల్‌ను తప్పించబోయి అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో కారు పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఏమీ కాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

సమస్యలు తీర్చాలంటూ సొసైటీ సిబ్బంది ధర్నా

వేగవరం డీసీసీబీ మేనేజర్‌కు వినతి పత్రాన్ని అందిస్తున్న సిబ్బంది

జంగారెడ్డిగూడెం గ్రామీణ, కామవరపుకోట, ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం మండలం వేగవరంలోని డీసీసీబీ వద్ద పలు సహకార సంఘాల సిబ్బంది సోమవారం ధర్నా నిర్వహించారు. ఉద్యోగ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని, గ్రాట్యూటీ చట్టప్రకారం చెల్లించడం, 2019 తర్వాత నియమించిన ఉద్యోగులను పర్మినెంట్ చేయడం వంటి న్యాయమైన కోర్కెలు తీర్చాలని సిబ్బంది కోరారు. అనంతరం డీసీసీబీ మేనేజర్‌కు వినతి పత్రాన్ని అందించారు. వేగవరం, ములగలంపల్లి, తాడువాయి, దర్భగూడెం, జీలుగుమిల్లి సొసైటీల సీఈవోలు సయ్యద్ అజ్మత్ అలీ, కొల్లా మధుసూదనరావు, మాదాసు వెంకట సత్యనారాయణ, కె.వెంకన్నబాబు, పసల జయంత్‌కుమార్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు. కామవరపుకోట, ద్వారకాతిరుమల డీసీసీబీల ఎదుట వాటి పరిధిలోని సంఘాల సీఈవోలు, సిబ్బంది ధర్నా చేశారు.

కొయ్యలగూడెం గ్రామీణ, పోలవరం, న్యూస్‌టుడే: సహకార సంఘాల ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోరుతూ కొయ్యలగూడెం, పోలవరం కేంద్ర సహకార బ్యాంకు శాఖల వద్ద ఉద్యోగులు ధర్నా చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆయా మేనేజర్లకు అందజేశారు.

చెరువు గట్టు.. ఆక్రమణల లోగుట్టు..

తడికలపూడి నాగులచెరువు గట్టుపై ఇలా..

కామవరపుకోట, న్యూస్‌టుడే: మెట్ట ప్రాంతాల్లో పర్యావరణం, భూగర్భ జలాల పరిరక్షణతోపాటు తాగు, సాగు నీటి అవసరాలపై దూరదృష్టితో ఏర్పాటు చేసిన చెరువులు ఆక్రమణలతో కుచించుకుపోతున్నాయి. చెరువులు, వాటి గట్లు అన్యాక్రాంతమవుతున్నాయి. మండలంలోని తడికలపూడి పంచాయతీ పరిధి నాగులచెరువు గట్టు ఆక్రమించి ఇళ్లు నిర్మించుకున్నారు. దీంతో కుచించుకుపోయిన గట్టు దారిలోనే పాపయ్యపాలెం వాసులు, స్కూలు పిల్లలు ప్రయాణించటం కష్టతరంగా మారింది. గట్టు ఆక్రమణదారులలో కొంత మందికి గంగానమ్మ ఆలయం సమీపంలోను, మరి కొంత మందికి పాపయ్యపాలెం సమీపంలో ప్రభుత్వం స్థలాలు, గృహాలు మంజూరు చేసింది. అయినా ఆక్రమణలు యథాతథంగా ఉన్నాయి. ఈ విషయమై అధికారులకు ఫిర్యాదులు అందినా చర్యలు చేపట్టకపోవటంపై విమర్శలు చెలరేగుతున్నాయి. అధికారులు స్పందించి చెరువు ఆక్రమణలతోపాటు గట్టుపై ఉన్న అక్రమ ఆవాసాలను తొలగించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఎట్టకేలకు గుంతల్లో తారు

పోలవరం, న్యూస్‌టుడే: పట్టిసీమ ఎత్తిపోతల పథకం ఎదుట రహదారి గుంతలమయం కావడంతో ఇరవై రోజుల కిందట ర.భ.శాఖ అధికారులు గుత్తేదారుడికి చెప్పి వెట్‌మిక్స్ వేయించారు. పైన తారు వేయకపోవడంతో ప్రాజెక్టుకు భారీ వాహనాల రాకపోకల కారణంగా కంకర లేచిపోవడంతో ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు దుమ్ముధూళి లేస్తుండటంతో వెనుక ప్రయాణం చేయడం ఇబ్బందికరంగా ఉందని వాపోతున్నారు. ఎట్టకేలకు ర.భ.శాఖ అధికారులు సోమవారం మరమ్మతుల పనులు చేపట్టారు.

మురుగుతో ఇక్కట్లు

చింతలపూడి, న్యూస్‌టుడే: పాతచింతలపూడి ప్రధాన రహదారి కల్వర్టు వద్ద మురుగు నీరు నిలిచి చుట్టుపక్కల నివాసం ఉంటున్న ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. ఇక్కడ ఉన్న కల్వర్టు పూడిపోవడంతో మురుగు వెళ్లే దారి లేక ప్రధాన రహదారి పైకి వచ్చి నిలిచిపోతున్నాయి. దీంతో మురుగు వాసన రావడంతోపాటు దోమల బెడద కూడా ఎక్కువైందని స్థానికులు వాపోతున్నారు. కల్వర్టును పరిశీలించి పూడిక తీయిస్తామని కమిషనర్ రాంబాబు తెలిపారు.

జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపిక

కామవరపుకోట, న్యూస్‌టుడే: కామవరపుకోట మండలం ఆడమిల్లి జడ్పీ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థిని కొండపర్తి పూజిత జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం గంటా రవిచంద్ర మోహన్ తెలిపారు. చిత్తూరు జిల్లా కలికిరిలో గత నెలలో జరిగిన పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచిన పూజిత త్వరలో రాజస్థాన్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు.

ఆటగాళ్లతో అజీజ్, సుబ్బరాయన్ తదితరులు

'క్రీడాస్ఫూర్తిని మరింత పెంపొందించుకోవాలి'

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: మన్యం గ్రామాల్లోని గిరిజన యువత క్రీడాస్ఫూర్తిని మరింత పెంపొందించుకోవాలని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ఎస్ఏ అజీజ్ సూచించారు. కేఆర్‌పురంలో ఐటీడీఏ మైదానంలో రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో పెసా కమిటీల గ్రామాల పరిధిలోని గిరిజన యువతకు సోమవారం జిల్లా స్థాయి క్రీడల ఎంపిక పోటీలు నిర్వహించారు. జంగారెడ్డిగూడెం డీఎల్‌పీవో ఏవీ సుబ్బరాయన్ పోటీలను ప్రారంభించారు. పరుగు పందెం (మారథాన్), కబడ్డీ పోటీలను పురుషులు, మహిళలకు విడివిడిగా నిర్వహించారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు విశాఖపట్నంలో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. కేఆర్‌పురం పంచాయతీ కార్యదర్శి మంగరాజు, పలువురు ఫిజికల్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

రాష్ట్ర జట్టుకు సాయిదీపక్

అభినందిస్తున్న తహసీల్దార్ సత్యసాయిబాబా

టి.నరసాపురం, న్యూస్‌టుడే: క్రికెటు అండర్ 14 విభాగంలో రాష్ట్రజట్టు తరపున జాతీయ స్థాయి పోటీకి ఎంపికైన టి.నరసాపురం ఉన్నత పాఠశాల విద్యార్థి సాయిదీపక్‌ను తహసీల్దార్ సత్యసాయిబాబాతో పాటు రెవెన్యూ సిబ్బంది సోమవారం అభినందించారు.

చదరంగంలో విద్యార్థుల ప్రతిభ

టి.నరసాపురం, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెంలో ఆదివారం మమత ఆసుపత్రి సౌజన్యంతో నిర్వహించిన జిల్లాస్థాయి అండర్ 15 చదరంగం టోర్నమెంటులో మక్కినవారిగూడెం ఉన్నత పాఠశాల విద్యార్థులు చక్కటి ప్రతిభ కనబరిచినట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వరరావు తెలిపారు.

గేట్ వాల్వుకు మరమ్మతులు

ఈనాడు కథనానికి స్పందన

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: గవరవరం శివారు ప్రాంతాలకు వారం రోజులుగా తాగునీరు సరఫరా కావడం లేదంటూ ఈ నెల 7న 'ఈనాడు'లో 'మేమున్నాం..మీకు తోడుగా..' శీర్షికతో ప్రచురితమైన సమస్యపై పంచాయతీ కార్యదర్శి రాజారావు స్పందించారు. గేట్ వాల్వు మరమ్మతులు చేయించి అదే రోజు రాత్రి నుంచి తాగునీటి సరఫరా పునరుద్ధరించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

(c) eenadu

నూజివీడు
• నూజివీడు • కైకలూరు

మద్దతు ధరకే ధాన్యం విక్రయించుకోవాలి

మహిళా రైతుతో మాట్లాడుతున్న ఏవో వేణుమాధవ్‌

ముదినేపల్లి, న్యూస్‌టుడే: రైతులు ఆర్‌ఎస్‌కే ద్వారా మద్దతు ధరకే ధాన్యాన్ని విక్రయించుకోవాలని మండల వ్యవసాయాధికారి బి. వేణుమాధవ్‌ సూచించారు. దాకరం వద్ద ధాన్యం ఆరబెట్టుకుంటున్న రైతులతో ఆయన మాట్లాడారు. 17 శాతం తేమ వచ్చేవరకు ఆరబెట్టుకుని విక్రయిస్తే ప్రభుత్వం నిర్దేశించిన కనీస మద్దతు ధర పొందవచ్చన్నారు. దళారులను ఆశ్రయించవద్దని, అవసరమైన సంచులు, ముఠా ఖర్చులు, రవాణా ఛార్జీలు సైతం ప్రభుత్వమే భరించి మద్దతు ధర అందిస్తుందని వివరించారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

తహసీల్దారు ఎదుట హాజరుపరిచిన ఎస్సై

ముదినేపల్లి, న్యూస్‌టుడే: సత్ప్రవర్తనతో మెలగకుండా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్సై వీరభద్రరావు హెచ్చరించారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో సోమవారం ఆయన రౌడీషీటర్లకు కౌన్సెలింగ్‌ నిర్వహించారు. అనంతరం పోలీసు స్టేషన్‌ నుంచి మండల తహసీల్దార్‌ కార్యాలయం వరకు కాలినడకన తీసుకువెళ్లి తహసీల్దారు లతీఫ్‌ పాషా ముందు పదిమందిని బైండోవర్‌ చేశారు. శాంతియుత జీవనం సాగించాలని, అల్లర్లకు, గొడవలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

రామలింగేశ్వరుడికి ప్రత్యేక అభిషేకాలు

ముసునూరు, న్యూస్‌టుడే: ముసునూరు మండలం బలివే రామ లింగేశ్వర స్వామి ఆలయానికి సోమవారం భక్తుల తాకిడి పెరిగింది. అర్చకులు అమరబాబు, భాస్కరరావు స్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, పంచామృతాభిషేకాలు, ఆకుపూజ, రాజరాజేశ్వరిదేవికి విశేష పూజలు నిర్వహించారు. ఈవో పామర్తి సీతారామయ్య, ఛైర్మన్‌ బొమ్మకంటి శ్యామలరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రాములోరికి పూజలు

ముదినేపల్లి, న్యూస్‌టుడే: సింగరాయపాలెం బావాజీ మఠంలోని కోదండరామునిజన్మనక్షత్రం పునర్వసు సందర్భంగా సోమవారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆసూరి రంగనాథాచార్యులు ఆధ్వర్యంలో స్వామికి అభిషేకాలు నిర్వహించి విశేషంగా అలంకరించారు. హైదరాబాద్‌కు చెందిన పి. లీలాఫణికుమార్, అశ్విని దంపతుల వితరణతో అన్నసమారాధన నిర్వహించారు.

గణపతికి విశేష అర్చన

కోరుకొల్లు (కలిదిండి), న్యూస్‌టుడే: సంకట హర చతుర్దశి పర్వదినాన్ని పురస్కరించుకుని కోరుకొల్లులోని సోమవారం మార్కెట్‌ రోడ్డులో వినాయక స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుడు ఓం ఆధ్వర్యంలో ఉదయం అభిషేకాలు, సాయంత్రం అర్చన నిర్వహించారు.

పట్టించుకుంటే.. పనిచేస్తాయి

కైకలూరు, న్యూస్‌టుడే: ప్రజలకు సురక్షిత నీటిని అందించే శుద్ధ జల సరఫరా కేంద్రాలు నిరుపయోగంగా మారుతున్నాయి. గత తెదేపా ప్రభుత్వ హయాంలో ఎన్టీఆర్‌ సుజల స్రవంతి పథకంలో నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు 12 నీటి శుద్ధి కేంద్రాలు నిర్మించారు. వీటితో పాటు నాంది సంస్థ ఆధ్వర్యంలో నాలుగు మండలాల్లో పదుల సంఖ్యలో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేశారు. వీటిపై పూర్తి అజమాయిషీ గ్రామ పంచాయతీలకు అప్పగించారు. వైకాపా ప్రభుత్వ హయాంలో వీటి నిర్వహణను గాలికి వదిలేయడంతో అలంకార ప్రాయంగా దర్శనమిస్తున్నాయి.

కైకలూరులో అలంకారప్రాయంగా ఆర్వోప్లాంటు

వేలాది మందికి బాసటగా..

కైకలూరు, ఆటపాక, తామరకొల్లు, చిగురుకోట, కలిదిండి, మండవల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన నీటి పథకాలు నిత్యం వేలాది మంది దప్పికను తీర్చేవి. ప్రైవేటు ప్లాంట్లు పేదల జేబులు గుల్ల చేస్తున్న తరుణంలో హానికర రసాయనాలు వాడకుండా 20 లీటర్ల నీటిని రూ.5కే అందించి గ్రామీణులకు బాసటగా నిలిచాయి.

● వందలాది మందికి ఆధారంగా నిలిచిన ఆటపాక ఎన్టీఆర్‌ సుజల స్రవంతి పథకాన్ని వైకాపా పూర్తిగా నిర్వీర్యం చేసింది. చిన్నపాటి మరమ్మతులు చేయకుండా శుద్ధ జల కేంద్రాన్నే కూల్చివేశారు. అదేచోట అంగన్‌వాడీ భవనం నిర్మించి అసంపూర్తిగా వదిలేశారు.

● రోజుకు 2 వేలకు పైగా జనాభాకు శుద్ధ జలం అందించిన కైకలూరు పంచాయతీ ఆర్వో ప్లాంటు మూత పడింది. పదేళ్ల కిందట నాంది ఫౌండేషన్‌ సంస్థ సహకారంతో ఈకేంద్రాన్ని ఏర్పాటు చేసి నిర్వహణ బాధ్యతలను పంచాయతీకి అప్పగించారు. ఆ పాలకవర్గ ఆమోదంతో ఏడాదికి రూ.50 వేల ఆదాయం సమకూర్చి ప్రైవేటు వ్యక్తులకు నిర్వహణ అప్పగించారు. వైకాపా హయాంలో అప్పటి పాలకులకు నిర్వాహకులు నచ్చక వారిని తప్పించారు. అప్పుడు వేసిన తలుపులు నేటికీ తెరచుకోలేదు. రూ. లక్షలు విలువ చేసే యంత్ర సామగ్రి తుప్పు పట్టి పాడవుతోంది. ఆదాయ వనరుగా ఉండి సుమారు 8 కాలనీల జనాభాకు అక్కరకు వస్తున్న ఈ కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు డిమాండ్‌ చేస్తున్నారు. దీనిపై పంచాయతీ ఈవో వై.ప్రసాద్‌ను సంప్రదించగా వినియోగంలోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

ఎరువుల నిల్వలు నమోదు చేయండి

చాట్రాయి, న్యూస్‌టుడే: ఎరువుల దుకాణాల్లో అమ్మకాలను రికార్డుల్లో నమోదు చేయకపోతే కేసులు నమోదు చేస్తామని ఏడీఈ జి.వెంకటమణి హెచ్చరించారు. మర్లపాలెం, సోమవరం గ్రామాల్లో ఎరువుల దుకాణాలను సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. మర్లపాలెంలో రూ.8.75 లక్షల విలువైన అమ్మకాల్లో తేడా రాగా 6ఎ కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ దుకాణాల్లో రైతులు క్రిమిసంహారక మందులు, ఎరువులు కొనుగోలు చేసినప్పుడు విధిగా రశీదులు తీసుకోవాలని సూచించారు. ఏవో బండారు శివశంకర్‌ పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నూజివీడు	:80085 74698	ఆగిరిపల్లి:	9121229090
ముసునూరు	:93983 81268	చాట్రాయి:	8008574700
కైకలూరు	:73060 88555	మండవల్లి:	8106099008
కలిదిండి	:90594 84862	ముదినేపల్లి:	8008574693

స్పందనకు వందనం

కైకలూరు, న్యూస్‌టుడే: మండలంలోని ఆటపాక పంచాయతీ కార్యాలయానికి వెళ్లే మార్గంలో మురుగునీరు నిలిచి దుర్వాసన వస్తోందని స్థానికుడు రాము 'మేమున్నాం మీకుతోడుగా' ద్వారా సమస్యను పంచాయతీ ఈవో ఎం.రవికిరణ్‌ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన మురుగునీరు మళ్లించి పారిశుద్ధ్య చర్యలు నిర్వహించారు.

★ మండలంలోని సీతనపల్లి-నరసాయిపాలెం వెళ్లే రోడ్డు మార్గంపై డ్రెయినేజీ నీరు నిలిచి రాకపోకలకు ప్రజలు ఇక్కట్లు పడుతున్నారని స్థానికుడు రాఘవ 'ఈనాడు' 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా సమస్యను పంచాయతీ ఈవో కుమారి దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆమె రోడ్డుకు ఇరువైపుల సైడు బోదెలను ఏర్పాటు చేయించి మురుగు నీరు మళ్లించారు.

గంగానమ్మకు నమస్కరిస్తున్న పార్థసారథి తదితరులు

గంగానమ్మ సేవలో మంత్రి

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: రావిచర్లలో గంగానమ్మ ఉత్సవాలను సోమవారం వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి హాజరయ్యారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఆశీస్సులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై, ప్రజలందరిపై ఉండి సుఖ సంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో తెదేపా మండల అధ్యక్షులు యనమదల వాసు, ఏఎంసీ మాజీ ఛైర్మన్‌ కాపా శ్రీనివాసరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు బాలు ప్రసాద్‌ తదితరులు పాల్గొన్నారు.

సహకార రంగంపై దృష్టి

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: విద్యార్థి దశ నుంచే సహకారంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని సబ్‌కలెక్టరు బొల్లిపల్లి వినూత్న అన్నారు. సోమవారం నూజివీడులోని అమర్‌ భవన్‌లో సహకార సదస్సు బ్యాంక్‌ డైరెక్టర్‌ చెన్నం కోటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సబ్‌కలెక్టరు మాట్లాడుతూ దేశంలో 30 కోట్ల మంది ప్రజలు సహకార రంగం ఫలాలు అందుకుంటున్నారన్నారు. అంతరాలు లేని సమాజం సహకార రంగంతోనే సాధ్యమని విశాఖ కోఆపరేటివ్‌ బ్యాంక్‌ వైస్‌ ఛైర్మన్‌ చలసాని రాఘవేంద్రరావు అన్నారు. నూజివీడు డివిజన్‌ కోఆపరేటివ్‌ రిజిస్ట్రార్‌ ఎం.రవికుమార్‌, కృష్ణా జిల్లా కేంద్ర సహకార బ్యాంకు జీఎం రంగబాబు, కోఆపరేటివ్‌ బ్యాంక్‌ మాజీ డైరెక్టర్‌ కొమ్మన నాగేశ్వరరావు, కృష్ణా మిల్క్‌ యూనియన్‌ డైరెక్టర్‌ ఎస్‌.జ్యోతి సహకార రంగం గురించి మాట్లాడారు. అనంతరం సహకార రంగం లోగోను సబ్‌కలెక్టర్‌ తదితరులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నూజివీడు పట్టణంలోని పలు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు సహకార రంగంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు సబ్‌కలెక్టర్‌, ఇతర అతిథులు బహుమతులు అందించారు.

లోగోను ఆవిష్కరిస్తున్న సబ్‌కలెక్టరు వినూత్న, బ్యాంకు వైస్‌ ఛైర్మన్‌ రాఘవేంద్రరావు తదితరులు

మాట్లాడి.. మైమరపించి

విజేతలకు బహుమతులు అందిస్తున్న ప్రిన్సిపల్‌ మనోజ్‌కుమార్‌

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: నేటి యువత చరవాణుల మోజులో పడి విలువైన సమయం వృథా చేస్తున్నారని నూజివీడు ఎస్‌డీఏ పాఠశాల ప్రిన్సిపల్‌ కె.మనోజ్‌కుమార్‌ తెలిపారు. సోమవారం నూజివీడులో ఆ పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో 'విద్యార్థులపై సెల్‌ ఫోన్‌ ప్రభావం' అనే అంశంపై ఉపన్యాస పోటీ నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో కె.అనురాగ్‌(9వ తరగతి), బి.లలిత(9వ తరగతి), కె.ప్రభాస్‌(7వ తరగతి) నిలిచారు. విజేతలకు బహుమతులను అందించారు.

సినిమా

నూజివీడు పట్టణం

సత్యనారాయణ	అమరకావ్యం
సత్యనారాయణ మినీ	రాజు వెడ్స్‌ రాంబాయి
ద్వారక సినిమాస్‌ స్క్రీన్‌ 1	ఆంధ్రా కింగ్‌ తాలూకా
ద్వారక సినిమాస్‌ స్క్రీన్‌ 2	....
ద్వారక సినిమాస్‌ స్క్రీన్‌ 3	....
ఆగిరిపల్లి: శ్రీఅను డీలక్స్‌	తెలుసు కదా
కైకలూరు: శ్రీవిజయలక్ష్మి జీ3	రాజు వెడ్స్‌ రాంబాయి
మాగంటి సినిమాస్‌	ఆంధ్రా కింగ్‌ తాలూకా
శ్రీవెంకటరమణ సినిమాస్‌	ప్రేమంటే
ముదినేపల్లి: పూర్ణిమ	ఆంధ్రా కింగ్‌ తాలూకా

వినతుల వెల్లువ

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వస్తున్న సమస్యలపై అన్ని శాఖల అధికారులు దృష్టి పెట్టి వెంటనే పరిష్కరించాలని నూజివీడు సబ్‌కలెక్టర్‌ బొల్లిపల్లి వినూత్న తెలిపారు. సోమవారం నూజివీడు సబ్‌కలెక్టరు కార్యాలయంలో వివిధ సమస్యల పరిష్కారం నిమిత్తం వచ్చిన అర్జీదారులతో మాట్లాడారు. మొత్తం 33 దరఖాస్తులు వచ్చాయి. ★ బాపునగర్‌కు చెందిన లాగు నారాయణను ఈ వారం ఉత్తమ పారిశుద్ధ్య కార్మికుడిగా ఎంపిక చేశారు. సబ్‌కలెక్టర్‌ ఆయనకు దుస్తులతో పాటు ఒక జత చెప్పులు అదనంగా అందించారు.

ఎన్జీవోల సంఘం అధ్యక్షుడిగా కొండలు

నూతన కార్యవర్గ సభ్యులతో నాయకులు

మండవల్లి, న్యూస్‌టుడే: ఏపీ ఎన్జీవో సంఘం మండవల్లి యూనిట్‌ తాలూకా అధ్యక్షుడిగా ముదినేని కొండలు ఎన్నికయ్యారు. స్థానిక మండల పరిషత్తు సమావేశ మందిరంలో సోమవారం ఎన్నిక ప్రక్రియ నిర్వహించారు. జిల్లా నాయకులు మెరుగు ఫణికుమార్, పి.సాంబశివరావు, లీలావతి ఎన్నికల నిర్వహణ, పరిశీలకులుగా వ్యవహరించారు. గౌరవ అధ్యక్షురాలిగా నారగాని పద్మ, కార్యదర్శిగా ఎం.వి.సుబ్బారావు మరికొందరు సభ్యులుగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు వీరితో ప్రమాణస్వీకారం చేయించి ఘనంగా సత్కరించారు.

జగన్‌ బహిరంగ క్షమాపణ చెప్పాలి

కైకలూరు, న్యూస్‌టుడే: బీసీ సామాజిక వర్గానికి చెందిన ఐపీఎస్‌ అధికారులపై మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు సరికాదని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బూరుజోయిన శ్రీనివాస్‌ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్‌ చేశారు. ఇటీవల ఒక మీడియా సమావేశంలో జగన్‌ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మన్‌ పి.కృష్ణయ్య, సీనియర్‌ ఐపీఎస్‌ అధికారి గోపినాథ్‌జెట్టిలను వాడు..వీడు అంటూ సంబోధించి అనుచితంగా మాట్లాడారని తెలిపారు. తక్షణం బహిరంగ క్షమాపణ చెప్పాలని లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వైకాపా కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు.

పాఠశాలల్లోనే వంట చేయాలి

భోజనం తనిఖీ చేస్తున్న ఎంఈవో 1,2

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: ఏజెన్సీ నిర్వాహకులు ప్రభుత్వ పాఠశాలల్లోనే విధిగా వంట చేసి విద్యార్థులకు అందించాలని ఎంఈవో 2 ఎం.దేవ వర ప్రసాదరావు సూచించారు. సోమవారం నూజివీడులోని ఎస్‌కేపీవీ పాఠశాలను ఎంఈవో 2 ఎస్‌.జమలయ్యతో కలిసి సందర్శించారు. వంటకు ఉపయోగించే నీటిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలో ప్రధాన వంట మనిషి మాత్రమే వంట చేయాలని సూచించారు. బ్రాండెడ్‌ వస్తువులతో పాటు కారం తయారు చేసుకోవడంపై సూచనలిచ్చారు. ప్రధానోపాధ్యాయిని జీపీ.సుశీల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం ఎంఈవో 2 సుంకొల్లులో పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు.

అంగన్‌వాడీ కార్యకర్తకు నియామక పత్రం అందిస్తున్న దీప్తి

బాధ్యతగా విధులు నిర్వర్తించాలి: సీడీపీవో

కైకలూరు, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే ప్రతి చిన్నారి సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సీడీపీవో ఆర్‌.దీప్తి సూచించారు. కైకలూరు ప్రాజెక్టు పరిధిలోని 9 మంది మినీ అంగన్‌వాడీ కార్యకర్తలు మెయిన్‌ వర్కర్లుగా ఉద్యోగోన్నతి పొందారు. సోమవారం స్థానిక ఐసీడీఎస్‌ కార్యాలయంలో సీడీపీవో వీరికి నియామక పత్రాలను అందించారు. ఈ సందర్భంగా యూనియన్‌ నాయకులు చల్లమ్మ, మీనాకుమారి మాట్లాడుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు 42 రోజుల పాటు చేసిన సమ్మె ఫలితంతోనే ప్రభుత్వం ఉద్యోగోన్నతులు కల్పించిందని పేర్కొన్నారు.

పాఠశాల విద్యే ఉన్నత చదువులకు మూలం

కైకలూరు, న్యూస్‌టుడే: పాఠశాల స్థాయి నుంచే నిర్దిష్టమైన ప్రణాళిక రూపొందించుకుంటే విద్యార్థుల ఉన్నత చదువులకు ఉపయుక్తంగా ఉంటుందని మానవత స్వచ్ఛంద సంస్థ ఉమ్మడి కృష్ణాజిల్లా కెరీర్‌ గైడెన్స్‌ ఛైర్మన్‌ ప్రొఫెసర్‌ సుధాబత్తుల విజయ్‌కుమార్‌ అన్నారు. సంస్థ అధ్యక్షుడు గుర్రం శ్యామ్‌కుమార్‌ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని భుజబలపట్నం జడ్పీ ఉన్నత పాఠశాలలో పదోతరగతి, ఇంటర్‌ విద్యార్థులకు కెరీర్‌ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సాంకేతికత, వ్యవసాయం, వైద్య, వృత్తి విద్యా, సివిల్‌ సర్వీసులు, దేశ రక్షణ, బ్యాంకు, బీమా రంగాల్లోని నైపుణ్యతపై అవగాహన కల్పించారు. సంస్థ కైకలూరు శాఖ ఛైర్‌పర్సన్‌ కొండ్రెడ్డి చిట్టెమ్మ ప్రధానోపాధ్యాయుడు పి.నరసిహరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మండవల్లిలో ర్యాలీ చేస్తున్న వెలుగు సిబ్బంది

స.హ చట్టంపై అవగాహన అవసరం

మండవల్లి, న్యూస్‌టుడే: సమాచారహక్కు చట్టంపై మండల సమాఖ్య సభ్యులు తప్పక అవగాహన కలిగి ఉండాలని ఏపీఎం రాజేశ్వరి తెలిపారు. మండవల్లి వెలుగు కార్యాలయంలో సోమవారం ఆర్టీఐ, లింగ సమానత్వంపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి రహితంగా, పారదర్శకంగా సేవలందించేందుకు ఆర్టీఐ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో అధ్యక్షురాలు ఆవుల స్వర్ణకుమారి, పెద్దఎత్తున వీవోఏలు పాల్గొన్నారు.

చెరువును ఆక్రమిస్తున్నారని ఫిర్యాదు

అర్జీ అందిస్తున్న సర్పంచి నాంచారయ్య

ముదినేపల్లి, న్యూస్‌టుడే: చిన కామనపూడి పంచాయతీలోని 2.35 ఎకరాల ఊరచెరువు, 62 సెంట్ల మందబైలను ఆక్రమణల నుంచి కాపాడాలని గ్రామ సర్పంచి చిట్టూరి నాంచారయ్య, పాలకవర్గ సభ్యులు సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో వినతిపత్రాన్ని అందించారు. గత మూడేళ్లుగా సర్వే చేసి ఆక్రమణలు తొలగించి, పంచాయతీ ఆదాయం పెంచాలని కోరుతూ తీర్మానం చేసి అధికారులకు అనేకసార్లు అర్జీలు అందించినా ప్రయోజనం లేదని తెలిపారు. ఆక్రమణలతో చెరువులో పూడిక తీయలేకపోతున్నామని, రానున్న వేసవిలో ప్రజలతో పాటు పశువులు ఇబ్బందులు పడతాయని వాపోయారు.

డంపింగ్‌ యార్డా.. బస్సు స్టాండా?

మండవల్లి, న్యూస్‌టుడే: మండవల్లి ప్రధాన సెంటర్లోని బస్సు స్టాండ్‌ డంపింగ్‌ యార్డు కంటే దారుణంగా తయారయ్యింది. జాతీయ రహదారి 165 విస్తరణతో బస్సు స్టాండ్‌ భవనం లోతట్టుగా మారింది. దీంతో ప్రమాదాలకు కారణమైన, కేసులతో సంబంధం ఉన్న వాహనాలను పోలీసులు అందులోనే పడేశారు. ప్రయాణికులు వేచి ఉండాల్సిన చోట పాడైన వాహనాలు ఉండటంతో ప్రయాణికులు ఎండలోనే వేచి చూడాల్సి వస్తోంది. ఇక రాత్రి వేళల్లో మందుబాబులకు అడ్డాగా మారి అసాంఘిక కార్యకలాపాలకు నెలవుగా తయారైంది. బస్సు స్టాండ్‌ను అభివృద్ధి చేసి ప్రయాణికులు అనువుగా మార్చాలని ప్రజలు కోరుతున్నారు.

గుంత.. గమనించకుంటే చింత

కైకలూరు, న్యూస్‌టుడే: కైకలూరు మండలం గోనెపాడు ఎంపీపీ పాఠశాల సమీపంలో జాతీయ రహదారి 165పై ఏర్పడిన గుంత వాహనదారులకు ప్రమాద హెచ్చరిక జారీ చేస్తుంది. ఎస్‌ మలుపునకు కూతవేటు దూరంలో రోడ్డు మధ్య రెండడుగుల గుంత ఏర్పడింది. దీనికి తోడు సమీప నివాసాల వారు గృహాల్లో వాడిన వ్యర్థ నీటిని రోడ్డుపైకి వదులుతున్నారు. ఆ నీరంతా ఈ గుంతలో చేరి ప్రమాదాలకు నిలయమైంది. దగ్గరకు వస్తే తప్పా కనిపించని గుంతను గమనించక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో రాత్రి వేళల్లో ప్రమాదాన్ని గుర్తించలేక ఇటీవల అనేకమంది ద్విచక్ర వాహనదారులు గాయాలపాలయ్యారు. స్థానికులు ప్రమాదం గుర్తించేలా గుంతలో ప్లాస్టిక్‌ బకెట్‌లో వెదురు కర్రకు తెల్లటి సంచి తొడిగి ప్రమాద సూచికగా ఏర్పాటు చేశారు. భారీ ప్రమాదం జరగక ముందే రోడ్డు మరమ్మతు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

మండవల్లి, న్యూస్‌టుడే: విద్యార్థులు పట్టుదలతో నిరంతరం శ్రమించి నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించుకోవాలని ప్రధానోపాధ్యాయుడు చిరిగిరి పిచ్చోడు మాస్టారు అన్నారు. పెరికెగూడెం పాఠశాల ఉపాధ్యాయుడు డీవీ. సుబ్రహ్మణ్యం ఆర్థిక సహకారంతో మండలంలోని లోకుమూడి జడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు యూటీఎఫ్‌ ముద్రించిన మోడల్‌ టెస్టు పేపర్స్‌ పుస్తకాలను సోమవారం అందించారు. విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చేలా విద్యార్థులు పాటు పడాలని సూచించారు. పలువురు ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

జూద శిబిరంపై దాడి

చాట్రాయి, న్యూస్‌టుడే: కృష్ణారావుపాలెం గ్రామ శివారులో జూద శిబిరంపై ఎస్‌ఐ డి.రామకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన దాడిలో అయిదుగుర్ని అదుపులో తీసుకున్నారు. వీరి నుంచి రూ.3,570 నగదు, అయిదు ద్విచక్ర వాహనాలు, నాలుగు చరవాణులు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వంద రోజుల ప్రణాళికతో సత్ఫలితాలు

విద్యార్థులకు సూచనలు ఇస్తున్న సుబ్బారావు

ముసునూరు, న్యూస్‌టుడే: వందరోజుల ప్రణాళికను పకడ్బందీగా అమలు చేసి పదో తరగతి పరీక్షల్లో సత్ఫలితాలు సాధించాలని ఎంఈవో బీవీఎస్‌ సుబ్బారావు అన్నారు. సోమవారం ముసునూరు మండలం చెక్కపల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. ప్రతి విద్యార్థి ఉత్తీర్ణులయ్యే విధంగా సబ్జెక్టు ఉపాధ్యాయులు తర్ఫీదు ఇవ్వాలని సూచించారు. ఉన్నత పాఠశాలల్లో వందరోజుల కార్యాచరణ ప్రణాళికను పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు. మధ్యాహ్న భోజనాన్ని, దస్త్రాలను పరిశీలించారు. ప్రధానోపాధ్యాయుడు అల్లాభక్షు, పద్మకిశోర్, గుడిమెళ్ల రాంబాబు పాల్గొన్నారు.

అన్ని శాఖల అధికారులు హాజరుకండి

సమస్య తెలుసుకుంటున్న అధికారులు

మండవల్లి, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమానికి అన్నిశాఖల అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలని తహసీల్దారు గోపాల్‌ తెలిపారు. మండలస్థాయిలో సమస్యలను తెలుసుకుని పరిష్కరించగలిగితే జిల్లాస్థాయి వరకు లబ్ధిదారులు వెళ్లే అవకాశం ఉండదన్నారు. ఎంపీడీవో రమణబాబు, ఈవోపీఆర్డీ నారాయణ, ఎన్‌ఆర్జీఎస్‌, హౌసింగ్‌, పోలీసు, ఐసీడీఎస్‌ అధికారులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: కుమార్తె ఆచూకీ లేదని అందిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశామని భీమవరం రెండో పట్టణ ఎస్సై రెహమాన్‌ తెలిపారు. ఏలూరు జిల్లా భుజబలపట్నానికి చెందిన వివాహిత భీమవరంలోని ఆసుపత్రికి వెళ్తున్నానని చెప్పి ఈ నెల 2న వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. చుట్టుపక్కల, బంధువుల ఇళ్ల దగ్గర వెతికినా.. ఎలాంటి ఆచూకీ లేకపోవడంతో బాధిత మహిళ తండ్రి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గౌడ బజారు రోడ్డులో తూము ఏర్పాటు పనులు

హామీ ఇచ్చారు.. అమలు చేశారు

చాట్రాయి, న్యూస్‌టుడే: మంత్రి పార్థసారథి శనివారం చనుబండలో పర్యటించిన సమయంలో గౌడ బజారులో ప్రధాన రహదారి నుంచి పీహెచ్‌సీకి వెళ్లే మార్గంలో కాలువపై తూము ఏర్పాటు చేయడం లేదని స్థానికులు ఆయనకు మొరపెట్టుకున్నారు. రాత్రి సమయాల్లో వారు పడుతోన్న ఇబ్బందులను ఏకరవు పెట్టారు. సమస్యను పరిష్కరిస్తామని మంత్రి వారికి హామీ ఇచ్చారు. ఈ మేరకు ఆయన సొంత నిధులతో తూమును సమకూర్చి యంత్రంతో సోమవారం పనులు నిర్వహించారు. తెదేపా నాయకులు మోరంపూడి శ్రీనివాసరావు, శిదిరాల మారేశ్వరరావు, కందుల కృష్ణ, మోరంపూడి మురళి, నక్కా రాము, పీర్‌ ఏఈ రఘు, ఇంజినీరింగ్‌ అసిస్టెంట్‌ దివ్య పర్యవేక్షించారు.

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌

మండవల్లి: నిరసన వ్యక్తం చేస్తున్న సహకార బ్యాంకు ఉద్యోగులు

ఆగిరిపల్లి, కలిదిండి, ముదినేపల్లి, ముసునూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వం తక్షణమే తమ సమస్యలను పరిష్కరించాలని సహకార సంఘాల ఉద్యోగులు డిమాండ్‌ చేశారు. ఈ మేరకు ఆగిరిపల్లి కేడీసీసీ బ్యాంకు దగ్గర సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ రాష్ట్ర వ్యవసాయ సహకార సంఘాల జిల్లా కమిటీ సభ్యుడు రమేశ్‌ బాబు మాట్లాడుతూ ప్రభుత్వం జీవో నంబర్‌ 36ను వెంటనే అమలు చేయాలని, 2019 తరువాత విధుల్లో చేరిన ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, ఉద్యోగులకు రూ.5 లక్షల ఆరోగ్య బీమా వర్తింపజేయాలని, ఉద్యోగ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచాలని డిమాండ్‌ చేశారు.

★ ఏపీ అగ్రికల్చర్‌ కోఆపరేటివ్‌ జేఏసీ పిలుపు మేరకు కలిదిండి సొసైటీ వద్ద ఉద్యోగులు, సిబ్బంది ధర్నా నిర్వహించారు. సంఘం మండల అధ్యక్షుడు మన్నె వెంకటరత్నం, జిల్లా సభ్యుడు పీవీవీ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

★ ముదినేపల్లి కేడీసీసీ బ్యాంకు వద్ద రాష్ట్ర పీఏసీఎస్‌ ఉద్యోగుల యూనియన్ల ఐక్యవేదిక ఆధ్వర్యంలో మండలంలోని ఉద్యోగులు ధర్నా కార్యక్రమం నిర్వహించారు. సంఘ జిల్లా కార్యదర్శి పళ్లెం శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి అయిదేళ్లకు వేతన సవరణ చేయాల్సి ఉండగా 2019, 2024 వేతనసవరణలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు.

★ మండవల్లిలోని కేడీసీసీ బ్యాంకు వద్ద మండలంలోని ఏడు సహకార బ్యాంకుల ఉద్యోగులు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ★ నూజివీడు పట్టణంలోని కేడీసీసీ బ్రాంచ్‌ వద్ద పీఏసీఎస్‌ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఏపీ కోఆపరేటివ్‌ సొసైటీ ఎంప్లాయీస్‌ అసోసియేషన్‌ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంజనేయప్రసాద్‌ మాట్లాడారు. ★ ముసునూరులో సహకార సంఘ ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మేనేజర్‌ రంగప్రసాద్‌కు సమర్పించారు. ★ చాట్రాయి కేడీసీసీ బ్యాంకు ఎదుట మండలంలోని పీఏసీఎస్‌ ఉద్యోగులు ధర్నా నిర్వహించారు.

కారు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: మర్రిబంధం వద్ద కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఘటనలో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. సోమవారం ఉదయం మర్రిబంధం నుంచి సీతారామపురం వైపు ద్విచక్ర వాహనంపై వెళుతున్న కె.దుర్గాప్రసాద్‌ను నూజివీడు నుంచి హనుమాన్‌ జంక్షన్‌ వైపు వెళుతున్న కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన దుర్గాప్రసాద్‌ను 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు. రూరల్‌ పోలీసులు ఈ ఘటనపై వివరాలు సేకరించారు.

వీటిని రహదారులంటారా..

సిద్ధార్థనగర్‌ నుంచి వెంకటాయపాలెం వెళ్లే రోడ్డు దుస్థితి

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: పలు రహదారులు అధ్వానంగా ఉండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నూజివీడు నుంచి రామన్నగూడెం మీదుగా ఈదులగూడెం, ఆగిరిపల్లి వెళ్లే రహదారి, నూజివీడు నుంచి ముసునూరు, గోపవరం మీదుగా జిల్లా కేంద్రం ఏలూరుకు వెళ్లే రహదారి, సిద్ధార్థనగర్‌ నుంచి వెంకటాయపాలెం మీదుగా అన్నవరం రహదారి, మిట్టగూడెం నుంచి అన్నేరావుపేట మీదుగా రెడ్డిగూడెం వెళ్లే రహదారి, తదితర ప్రాంతాల్లో ఉన్న రహదారులు ప్రయాణికులకు నరకాన్ని చూపెడుతున్నాయి. ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్‌ అధికారులు ప్రతిపాదనలు పంపామంటారే తప్ప ఆ ఫైల్‌ ఏ స్థాయిలో ఉందో పట్టించుకునే నాథుడే లేరు. సమస్యలకు పరిష్కారం చూపడం లేదు.

శ్రమదానంతో ముళ్లకంప తొలగింపు

మండవల్లి, న్యూస్‌టుడే: శింగనపూడి నుంచి మండవల్లికి వెళ్లే రహదారికి ఇరువైపులా పెద్దఎత్తున ముళ్లకంపలు పెరిగిపోయి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాటిని తొలగించాలని ఎన్నిసార్లు పంచాయతీ అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోకపోవడంతో స్థానికులు లక్ష్మారెడ్డి, గోపిశెట్టి రవి, పెద్దిరెడ్డి బాచి, కామేశ్వరరావు, కిషోర్, భాస్కరరావు, బాలకృష్ణ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి శ్రమదానం చేశారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న ముళ్లకంపలను తొలగించి ఇబ్బందులకు ఉపశమనాన్ని కల్పించారు. యువకులను గ్రామస్థులు అభినందించారు.

పేదలకు వితరణ

చాట్రాయి, న్యూస్‌టుడే: సీఎస్‌ఎ సంస్థలో పని చేస్తున్న సిస్టర్‌ శవిరీ, గ్రంథాల రూపవతి, బుర్రి పండుల ఆధ్వర్యంలో సోమవారం పేదలకు చలికోట్లు పంపిణీ చేశారు. చాట్రాయిలో వస్త్ర వ్యాపారి వీసం నరసింహారావు కుమారుడు బుల్లిబాబు పుట్టిన రోజు పురస్కరించుకుని చాట్రాయిలో 20, చిన్నంపేటలో 15 మందికి వస్త్ర దానం నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకుడు కొమ్ము ఆనంద్‌, జనసేన నాయకుడు సవరం రామారావు, పాస్టర్‌ రమేశ్‌ పాల్గొన్నారు.

(c) eenadu

మాట.. ఆట.. మనవిగా ఉండాలి
మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

ఈనాడు, రాజమహేంద్రవరం, న్యూస్‌టుడే, రాజానగరం: "దైనందిన జీవితంలో మాతృభాష భాగమవ్వాలి. పరాయి భాషను విడనాడాలి. అమ్మభాష నేర్చుకున్నాకే సోదర, అన్యభాషలపై దృష్టి పెట్టాలి" అని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు సూచించారు. నన్నయ విశ్వ విద్యాలయంలో ఉపకులపతి డా.ఎస్.ప్రసన్నశ్రీ అధ్యక్షతన నిర్వహించిన 'భారతీయ భాషల్లో ఏకరూప శాస్త్రీయ సాంకేతిక పదజాలం' కార్యశాలకు ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. సంప్రదాయాలు పాటించాలని.. మన కట్టు.. బొట్టు.. మాట.. ఆట.. పాట.. భాష.. యాస.. గోస అన్నీ మనవిగా ఉండాలన్నారు. ఆంగ్లం స్థానంలో అనేక నూతన భారతీయ భాషా పదాల సృష్టికి ఈ కార్యక్రమం ఊతమివ్వాలన్నారు. భాష ఔన్నత్యం, కవులు, సంస్కృతి గురించి తానా మాజీ అధ్యక్షులు, సాహితీ సమితి అధ్యక్షులు తోటకూర ప్రసాద్ వివరించారు. తెలుగు, సంస్కృత అకాడమీ అధ్యక్షులు ఆర్.డి.విల్సన్ (శరత్‌చంద్ర) మాట్లాడుతూ ప్రాంతీయ భాషలు సాంకేతికంగా సుసంపన్నమైనప్పుడే గ్రామీణ విద్యార్థులు మాతృభాషలో ఏఐ (కృత్రిమమేధ), ఎంఎల్ (మెషిన్ లెర్నింగ్, మరప్రజ్ఞ/యంత్రాభ్యాసం)పై పట్టు సాధిస్తారని చెప్పారు. సాంకేతిక పదజాలం మాతృభాషలోకి తెస్తే మేలని, ఏకరూపత ఉన్న శాస్త్రీయ పదజాలం అవసరమని పేర్కొన్నారు. 65 ఏళ్లనాటి రచనలను పునఃముద్రిస్తామని తెలిపారు.

స్టాల్‌ను తిలకిస్తున్న వెంకయ్యనాయుడు, చిత్రంలో వీసీ ప్రసన్నశ్రీ, తెలుగు, సంస్కృత అకాడమీ అధ్యక్షుడు విల్సన్ తదితరులు

పుస్తకాల ఆవిష్కరణ.. విశ్రాంత డీఎస్పీ, సైకాలజిస్ట్ నామగిరి బాబ్జి రచించిన 'హ్యాండ్‌బుక్ ఆఫ్ డ్రగ్ ఎడిక్షన్ అండ్ ది రోల్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్' ..నన్నయ సోషల్‌వర్క్ విభాగ అధ్యాపకులు మల్లిభాస్కర్ రచన 'మస్తాన్‌బాబు జీవన చిత్రం', నర్సరీ రైతు పుల్లా చినసత్యనారాయణ 'ధరణిపుత్రులు' పుస్తకాలను వెంకయ్యనాయుడు ఆవిష్కరించారు.

బతుకుబండి నడిపించరూ..

పిఠాపురం మండలం చిత్రాడ నివాసి కొల్లుబోయిన మంగ 2019లో జరిగిన ప్రమాదంలో ఎడమ కాలు కోల్పోయి మంచానికే పరిమితమయ్యారు. భర్త వీర వెంకటరావు కొన్నేళ్ల కిందటి వరకు డ్రైవర్‌గా పని చేసి ప్రస్తుతం వయస్సు మీద పడటంతో ఇంటివద్దే ఉంటున్నారు. దీంతో జీవనం గడవటమే కష్టంగా మారింది. ప్రస్తుతం ఈమెకు దివ్యాంగులకు ఇచ్చే రూ.6 వేల పింఛను ప్రభుత్వం ఇస్తుంది. మంచానికే పరిమితమైన వారికి ఇచ్చే రూ.15 వేలు పింఛను మంజూరు చేసి ఆదుకోవాలని వేడుకుంటున్నారు. దీనిపై సోమవారం కాకినాడ కలెక్టర్ కార్యాలయంలో పీజీఆర్ఎస్‌లో అధికారులకు విన్నవించుకున్నారు.

కాకినాడ గ్రామీణ మండలం సర్పవరం మండపం కాలనీ నివాసి గుడిమూడి సత్యనారాయణకు మధుమేహ వ్యాధితో గత ఏడాది నవంబరులో ఎడమ కాలును వైద్యులు తొలగించారు. కృత్రిమ కాలును అమర్చుకుని అతి కష్టం మీద నడుస్తున్నారు. రోజువారీ కార్యక్రమాలు చేసుకొనేందుకు వీలుగా ట్రైసైకిల్ మంజూరు చేయాలని కోరుతున్నారు. దీనిపై కలెక్టరేట్‌లో సోమవారం అధికారులకు విన్నవించారు. - ఈనాడు, కాకినాడ

తీరం.. కొంగొత్త పారిశ్రామిక నగరం

రాష్ట్రంలో సుదీర్ఘంగా ఉన్న తీర ప్రాంత అభివృద్ధి ద్వారా పెట్టుబడులను ఆకర్షించి వేలాదిమందికి ఉపాధి కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ప్రధాన పోర్టుల చుట్టూ వంద కి.మీ పరిధిలోని పరిసరాలను ప్రాక్సిమల్ ఏరియాగా గుర్తించింది. కాకినాడ పోర్టు పరిధిలో పెట్రోలియం, లాజిస్టిక్స్, వ్యవసాయోత్పత్తుల క్లస్టర్ ఏర్పాటుకు నిర్ణయించడంతో ఆసక్తి నెలకొంది. తగిన సదుపాయాలను పీపీపీ విధానంలో కల్పించి తీరం వెంబడి సరికొత్త పారిశ్రామిక నగరం తీర్చిదిద్దనున్నారు. - ఈనాడు, కాకినాడ

కాకినాడ పోర్టు పరిధిలో పెట్రోలియం, లాజిస్టిక్ క్లస్టర్

కాకినాడ సీ పోర్ట్

ఇక్కడే ఎందుకు అనువంటే..

తూర్పు తీరంలో కాకినాడ ఓడరేవు ముఖ్యమైనది. ఇందులో చారిత్రక యాంకరేజ్ పోర్టు, ఆధునిక డీప్ సీ వాటర్ పోర్టు, నిర్మాణంలో ఉన్న గేట్‌వే పోర్టు, ఉప్పాడ చేపల రేవు, షిప్ బ్రేకింగ్ యూనిట్ ఉన్నాయి. తెలంగాణ బియ్యం ఎగుమతులు ఇక్కడి నుంచే చేపడుతుంది. ఓఎన్‌జీసీ, రిలయన్స్‌లు పెట్రోలియం ఉత్పత్తులు చేస్తున్నాయి. డీప్‌సీ, గేట్‌వే పోర్టుల్లో ఇంధన ఎగుమతి, దిగుమతులకు వీలుగా టెర్మినళ్ల నిర్మిస్తున్నాయి. ఏఎం గ్రీన్, ఏఎంజీ మెటల్స్ వంటి సంస్థలు గ్రీన్ అమ్మోనియా, గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తికి అడుగులు వేస్తున్నాయి. శాన్‌మెరైన్, మ్యాట్ మెరైన్ సంస్థలు నౌకల నిర్మాణాలు, మరమ్మతులు చేపడుతున్నాయి. ఇవన్నీ ఒకే క్లస్టర్‌గా ఇటు యానాం నుంచి అటు తుని వరకు అభివృద్ధిలో కీలకం కానున్నాయి.

డీప్ వాటర్ పోర్టు..
- 20 మిలియన్ టన్నుల సరకు రవాణా సామర్థ్యం
- చుట్టూ పెట్రోకెమికల్, ఆయిల్, గ్యాస్ సేవల యార్డులకు అవకాశం
- ఎరువులు, రసాయనాలు, ఆహారశుద్ధి యూనిట్లు, మెషినరీ, స్టీల్ ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పుతారు.
- కంటైనర్ యార్డులు, బల్క్ కార్గో, చేపల ఎగుమతులకు శీతల గిడ్డంగులు వస్తాయి.

యాంకరేజ్ పోర్టు
- 4 మిలియన్ టన్నుల సరకు రవాణా సామర్థ్యం
- బియ్యం, మొక్కజొన్న, సిమెంటు ఎగుమతులు.. వంట నూనెల దిగుమతులు
- సెనెగల్, నైజీరియా, ఐవరీకోస్ట్, బంగ్లాదేశ్, ఇండోనేషియా దేశాలకు వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతి
- సాగరమాల ప్రాజెక్టులో రూ.85 కోట్లతో ఈ పోర్టు ఆధునికీకరణ.. రోడ్డు, రైలు మార్గాలతో అనుసంధాన ప్రతిపాదన

కాకినాడ గేట్‌వే పోర్ట్..
- బహుళ సరకు రవాణా కేంద్రం. దీనిని ఆనుకుని 5,600 ఎకరాల్లో సెజ్ ఉంది. రసాయనాలు, పెట్రో కెమికల్స్, గ్యాస్ రవాణాకు వీలుగా కంటైనర్ టెర్మినళ్లు వస్తాయి.
- సెజ్‌లో రూ.1,310 కోట్లతో సముద్రనీటిని మంచినీటిగా మార్చే ప్లాంట్ నిర్మిస్తారు.
- భారతమాల కింద వాకలపూడి-అన్నవరం వరకు 40 కి.మీ తీర ప్రాంతం వెంబడి రూ.1,040 కోట్లతో హైవే నిర్మాణం జరగనుంది.

పసిగట్టారు.. పట్టుకున్నారు..!

వేట్రోలు పట్టు పరిశ్రమ కేంద్రంలోని పట్టుగూళ్ల మార్కెట్‌లో ఎలక్ట్రానిక్ కాటా సాంకేతిక లోపం కారణంగా తాము నష్టపోతున్నామని రైతులు సోమవారం ఆందోళన నిర్వహించారు. కాటాపై 50 కేజీల రాళ్లు ఉంచగా.. 48.860 గ్రాములు చూపుతోందన్నారు. 100 కేజీలకు రెండున్నర కేజీల చొప్పున అక్రమంగా తీసుకుంటున్నారన్నారు. కొన్నప్పట్నుంచి కాటాను తూనికలు-కొలతల శాఖ అధికారుల తనిఖీకి పంపలేదని.. దాంతో ఏళ్లుగా తాము దోపిడీకి గురవుతున్నామని వాపోయారు. వెంటనే తనిఖీ చేయించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆ మేరకు పాడా పీడీకి వినతిపత్రం అందజేశామన్నారు. సీహెచ్ చక్రబాబు, రాంబాబు, ఏసుబాబు, శివ, గంగాధర్, రామారావు, వెంకటరమణ, శ్రీను తదితర రైతులు ఆందోళనలో పాల్గొన్నారు. 2019లో కాటాను కొన్నారని పట్టు పరిశ్రమ కేంద్రం అధికారి సత్యనారాయణ తెలిపారు. లోపాన్ని రెండు రోజుల క్రితం గుర్తించి మరో యంత్రం వాడుతున్నామని చెప్పారు. - న్యూస్‌టుడే, గొల్లప్రోలు

కేంద్రంలోని కాటా వద్ద రైతుల నిరసన

50 కేజీల రాళ్లకు చూపిస్తున్న కొలత

నూరుశాతం ఉత్తీర్ణతకు సంకల్ప్!
ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రత్యేక ప్రణాళిక

న్యూస్‌టుడే, కాకినాడ నగరం

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో వంద శాతం ఫలితాలు సాధించేందుకు ఇంటర్ బోర్డు చర్యలు చేపట్టింది. ఇందుకోసం 'సంకల్ప్-2026' పేరుతో 50 రోజుల ప్రణాళికను అమలు చేసేందుకు కార్యాచరణ రూపొందించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇంటర్ విద్యపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రధానంగా ఈ ఏడాది నుంచి మొదటి సంవత్సరం విద్యార్థులకు సీబీఎస్ఈ సిలబస్‌ను ప్రవేశపెట్టారు. అలాగే మధ్యాహ్న భోజన పథకాన్ని పునరుద్ధరించటంతో పాటు ఉచిత పాఠ్యపుస్తకాలను అందించారు. దీంతోపాటు నీట్, జేఈఈ మెయిన్స్ శిక్షణ ఇస్తున్నారు. పుస్తకాలను సైతం ఉచితంగానే పంపిణీ చేశారు. ఇప్పుడు మెరుగైన ఫలితాల లక్ష్యంగా కార్యాచరణ రూపొందించారు.

పీఆర్ జూనియర్ కళాశాలలో ప్రత్యేక తరగతుల్లో విద్యార్థులు

ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ఫిబ్రవరి 23 నుంచి మార్చి 24 వరకు జరగనున్నాయి. ప్రయోగ పరీక్షలు (వృత్తి విద్య) జనవరి 27 నుంచి ఫిబ్రవరి 10 వరకు, సాధారణ కోర్సులకు ఫిబ్రవరి 1 నుంచి 10 వరకు జరుగుతాయి.

సిలబస్ పూర్తి

ఈ నేపథ్యంలో సంకల్ప్ పేరుతో ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నారు. ఇప్పటికే దాదాపు సిలబస్‌ను పూర్తి చేశారు. ఈ నెల 15 నుంచి 20 వరకు ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహించేందుకు సన్నద్ధమవుతున్నారు.

గ్రేడుల వారీగా విభజించి..

కళాశాల స్థాయిలో నిర్వహించిన పరీక్షల ఆధారంగా విద్యార్థులను ఏ,బీ,సీ,డీ గ్రేడులుగా విభజించాం. వెనకబడిన విద్యార్థులకు ప్రత్యేక తర్ఫీదు ఇస్తున్నాం. ఇందుకోసం ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సబ్జెక్టు ఉపాధ్యాయులతో తరగతులు నిర్వహిస్తున్నాం. ప్రధానంగా సీ, డీ గ్రేడు వారు ఉత్తీర్ణత సాధించేలా చర్యలు చేపడుతున్నాం. ప్రతి కళాశాలలో ప్రత్యేక తరగతులు మొక్కుబడిగా కాకుండా, పూర్తి పారదర్శకతతో నిర్వహించేలా నిఘా పెడుతున్నాం. ఆకస్మిక తనిఖీలు చేపడతాం.
- శారద, ఇంటర్ విద్య జిల్లా అధికారిణి

జిల్లాలో ప్రభుత్వ పరిధిలో..	
మొత్తం కళాశాలలు:	44
ప్రభుత్వ:	14
ఎయిడెడ్:	3
సాంఘిక సంక్షేమ శాఖ:	08
కేజీబీవీలు:	4
హైస్కూల్ ప్లస్:	15
మొత్తం విద్యార్థులు	40 వేలు

పలు రైళ్లు రద్దు

సాంబమూర్తినగర్(కాకినాడ), న్యూస్‌టుడే: నిర్వహణ పనులతో పలు రైళ్లు రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25న కాకినాడ టౌన్ - చర్లపల్లి (07155), 26న చర్లపల్లి - కాకినాడ టౌన్ (07156), హైదరాబాదు - కాకినాడ టౌన్ (07157), 27న కాకినాడ టౌన్ - హైదరాబాదు (07158) రైళ్లు రద్దయ్యాయని వెల్లడించారు.

రేపటి నుంచి టెట్

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)ను బుధవారం నుంచి ఈ నెల 21 వరకు నిర్వహించనున్నారు. జిల్లాలోని 5 కేంద్రాల్లో ఉదయం 9.20 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు విడతలుగా పరీక్షలు జరగనున్నాయి. ఐయాన్ డిజిటల్ జోన్ (ఎస్.అచ్యుతాపురం, కాకినాడ), సాఫ్ట్ టెక్నాలజీ (రాయుడుపాలెం, కాకినాడ గ్రామీణం), ఆదిత్య ఇంజినీరింగు కళాశాల (సూరంపాలెం)లలో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో నిర్వహణకు ఏర్పాటు చేసినట్లు డీఈవో పిల్లి రమేష్ తెలిపారు. పరీక్షలకు జిల్లాలోని 9,659 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని చెప్పారు. పరీక్షల సమాచారం, ఇతర వివరాలకు 98480 82815, 77996 98462 నంబర్లలో సంప్రదించాలని డీఈవో సూచించారు.

అన్నదాతకు అండగా నిలిచేందుకు విభిన్న కథనాల సమాహారం

-6లో

అర్జీల వెల్లువ
పీజీఆర్ఎస్‌కు 482 వినతులు

అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న జేసీ అపూర్వభరత్, అధికారులు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లా నూతన సంయుక్త కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అపూర్వభరత్ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో ప్రజలతో మమేకమయ్యారు. అర్జీదారుల సమస్యలు విని, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ఆయన అసిస్టెంట్ కలెక్టర్ మనీషా, డిప్యూటీ కలెక్టర్లు శ్రీధర్, రత్నమణి, సీపీవో త్రినాథతో కలిసి వినతులు స్వీకరించారు. భూసమస్యలు, రీ-సర్వే, ఉపాధి, ఉద్యోగం, సంక్షేమ పథకాల వర్తింపు, ఆక్రమణల తొలగింపు, మౌలిక సదుపాయాల కల్పన వంటి అనేక సమస్యలపై 482 అర్జీలు వచ్చాయి. జేసీ భరత్ మాట్లాడుతూ వినతులపై సమగ్ర విచారణ చేపట్టాలని జిల్లాస్థాయి అధికారులను ఆదేశించారు. గడువులోగా వీటిని పరిష్కరించి, ప్రజలు సంతృప్తి చెందేస్థాయికి తీసుకురావాలన్నారు.

స్క్రబ్ టైఫస్‌పై ఆందోళన వద్దు

వైద్యాధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: స్క్రబ్ టైఫస్ వ్యాధిపై ప్రజలు ఆందోళన చెందవద్దని కలెక్టర్ షాన్‌మోహన్ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆయన వైద్య,ఆరోగ్యశాఖ అధికారులతో సమీక్షించారు. బాధితులకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స అందిస్తున్నామన్నారు. ఇది వైరస్ కాదని, బ్యాక్టీరియాతో వస్తుందన్నారు. కీటకం కుట్టిన చోట నల్లటి మచ్చ ఏర్పడటం దీని ప్రధాన లక్షణమని, సకాలంలో గుర్తించి చికిత్స అందించకపోతే పరిస్థితి విషమిస్తుందని చెప్పారు. దీని నివారణకు ఔషధాలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పొదలు, గడ్డి ప్రదేశాల్లో సంచరించేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రుల్లోని వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ వ్యాధిపై వదంతులు నమ్మవద్దన్నారు. డీఎంహెచ్‌వో నరసింహనాయక్, జీజీహెచ్ పర్యవేక్షకులు లావణ్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం మానై.. వంతెనకు ప్రమాదమై..

నిత్యం వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగించే కాకినాడలోని ఉప్పుటేరుపై అత్యంత ముఖ్యమైన జగన్నాథపురం వంతెన ఇది. నగరం నుంచి అమలాపురం వెళ్లాలన్నా, అటు నుంచి వాహనాలు నగరంలోకి ప్రవేశించాలన్నా ఈ వంతెన దాటాల్సిందే. అంతటి ముఖ్యమైన ఈ వారధి ప్రస్తుతం ప్రమాదంలో చిక్కుకుంది. వంతెనకు ఇరువైపులా రావి, ఇతర మొక్కలు మొలచి ప్రస్తుతం ఏపుగా పెరిగాయి. దీంతో బీటలు వారి భద్రతే ప్రశ్నార్థకంగా మారింది. అధికారులు వీటిని తొలగించి వంతెన రక్షణకు చర్యలు చేపట్టాల్సిన అవసరముంది. - ఈనాడు, కాకినాడ

కూడలి.. ఎన్నాళ్లిలా?

కాకినాడ నగరంలోని కొండయ్యపాలెం వంతెన సమీపంలో అర్ధంతరంగా నిలిచిపోయిన కూడలి నిర్మాణం ఇది.. ఎంతో ముఖ్యమైన ఈ కూడలిని వాహనదారులకు అనువుగా సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు నగరపాలక సంస్థ అధికారులు రోటరీ క్లబ్ ప్రతినిధులకు అప్పజెప్పారు. ఇటీవల ఇక్కడ జరిగిన ఓ సంఘటనతో వివాదం తలెత్తింది. దీంతో పనులు నిలిచిపోయాయి. ఇప్పటికైనా అధికారులు కూడలి నిర్మాణానికి చొరవ చూపించాలంటూ నగరవాసులు కోరుతున్నారు. - ఈనాడు, కాకినాడ

మునగ @25

మార్కెట్‌లో మునగకాయల ధర మండిపోతోంది. కార్తిక మాసం వెళ్లినప్పటి నుంచి స్థానికంగా వీటి దిగుబడి పడిపోయింది. చెన్నై తదితర దూర ప్రాంతాల నుంచి తీసుకొచ్చి వ్యాపారులు విక్రయిస్తున్నారు. కార్తికంలో కిలో కాయలు రూ.100 ఉండేది. ఒకటి రూ.10కు లభించేది. ప్రస్తుతం దిగుబడి గణనీయంగా పడిపోవడంతో మార్కెట్‌లో గత పదిహేను రోజులుగా ఒక కాడ రూ.25 నుంచి రూ.30 వరకు పలుకుతోంది. చిన్నగా ఉంటే రూ.20 చొప్పున విక్రయిస్తున్నారు. కొంతమంది టోకు వ్యాపారులు విక్రయాలు మానుకున్నారు. అమ్మకం లేకపోతే నష్టం వస్తుందని, అందుకే తేవడం తగ్గించేశామని పి.గన్నవరం గ్రామానికి చెందిన వ్యాపారి అడ్డగళ్ల పవన్ తెలిపారు. - న్యూస్‌టుడే, పి.గన్నవరం

నాణ్యత మమ.. బిల్లు జమ
- ఓదూరు కాలువ పనుల వ్యవహారం
- ఏడుగురు ఇంజినీర్లపై అభియోగాల నమోదు

ఈనాడు, కాకినాడ: రామచంద్రపురం మండలం ఓదూరులో ఆరేళ్ల క్రితం చేపట్టిన అభివృద్ధి పనుల్లో డొల్లతనానికి సంబంధించి ఎట్టకేలకు ఉచ్చు బిగుసుకుంటుంది. సంబంధిత అధికారులపై రేపోమాపో చర్యలు తీసుకోబోతున్నారు. ఇక్కడ సుమారు రూ.7 కోట్ల అంచనా వ్యయంతో పంట, మురుగు కాలువల మధ్య నాడు రక్షణ గోడ నిర్మించారు. నాణ్యతకు తిలోదకాలిచ్చినా జలవనరులశాఖ ఇంజినీరింగ్ అధికారులు గుడ్డిగా బిల్లులు చేసేశారు. ఫిర్యాదులందడంతో 2023లో విజిలెన్స్ విచారణ సాగింది. ధవళేశ్వరం, కాకినాడలోని నాణ్యత విభాగం నుంచి రికార్డులు తెచ్చి పరిశీలించారు. గోడ నమూనాలు తీసుకుని విశాఖలోని ఎన్ఏబీఎల్ అక్రిడేషన్ ల్యాబ్‌లో పరీక్షించగా నాణ్యత తీసికట్టుగా తేలింది. అప్పట్లో వివిధ హోదాల్లో పనిచేసిన డీఈఈలు తూరంగి శ్రీనివాస్, వీవీ సత్యనారాయణ మట్టపర్తి, జగం సురేష్‌బాబు, ఈఈలు బీవీవీ గోపాలరాజు, పీలా అప్పలనాయుడు, ఏఈఈలు గొంప ప్రవీణ్ యాదవ్, బొల్లింకల అప్పలరాజు రెడ్డిని బాధ్యులుగా గుర్తించి అభియోగాలు నమోదుచేశారు. వీరిలో గోపాలరాజు గతంలో ఉద్యోగవిరమణ చేశారు. శాఖాపరమైన విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాల్సిందిగా ఆ శాఖ ముఖ్యకార్యదర్శి సాయిప్రసాద్ తాజాగా ఉత్తర్వులు జారీచేశారు.

ఇవీ లోపాలు
- రక్షణ గోడ పునాది లోతు తక్కువ.
- నాసిరకం ఇసుక, సిమెంటు.. సామర్థ్యం తక్కువున్న ఐరన్ ఊచల వినియోగం
- గోడ ఎం20 గ్రేడ్ నాణ్యత ఉండాలి. పరీక్షించినప్పుడు ఎం10 గ్రేడ్ కూడా రాలేదు.
- గోడ ఎడమ భాగంలో చ.మి.మీటరుపై 15 న్యూటన్ బలం తట్టుకునేలా ఉండాలి. ఆ సామర్థ్యం 6.10 గాను, పైభాగంలో 5.8 గా నమోదైంది.
- నాణ్యత లోపం విలువ రూ.కోటి ఉంటుందని అంచనా వేసిన విజిలెన్స్.. రికవరీ చేయాల్సిన అవసరం ఉందని పేర్కొంది.

మకరందం విందు.. భలే పసందు

సన్‌బర్డ్.. కోనసీమ ప్రాంతంలో కనిపించే అందమైన పక్షి. ఇళ్ల వద్ద తోటలు, పూల మొక్కలు ఉన్న ప్రదేశాల్లో ఎక్కువగా కనిపిస్తుంది. ఇది పుష్పాల్లోని మకరందం తాగేందుకు ఇష్టపడుతుంది. దానికి అనుగుణంగా ముక్కు పొడవుగా సూదిగా ఉంటుంది. చిన్న పురుగులు, సాలీడు వంటి వాటినీ తింటుంది. పూల దగ్గర మకరందం తాగే సమయంలో పతంగుల్లా గాల్లో తేలుతూ నిలబడతాయి. సోమవారం అయినవిల్లి మండలం నేదునూరులో ఇలా కనిపించింది.
-న్యూస్‌టుడే, కోనసీమ

వికెట్లు పడగొడుతూ.. బౌండరీలు బాదేస్తూ..
క్రికెట్‌లో రాణిస్తున్న కాకినాడ కుర్రోళ్లు

న్యూస్‌టుడే, గాంధీనగర్

వారిద్దరూ బ్యాటు పడితే బౌండరీలూ కొట్టగలరు.. బాల్ వేస్తే వికెట్లూ పడగొట్టగలరు.. చిన్ననాటి నుంచి క్రికెట్‌పై మక్కువతో ఆటలో ఆరితేరారు. ఆల్‌రౌండర్లుగా రాణిస్తూ బీసీసీఐ విజయ్ మర్చంట్ క్రికెట్ ట్రోఫీ(అండర్-16)లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ జట్టుకు ఎంపికయ్యారు. వారే కాకినాడ శ్రీప్రకాష్ సినర్జీ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి కె.తమన్, పదకొండో తరగతి విద్యార్థి జి.లక్ష్మీ గౌతమ్. ఉమ్మడి జిల్లా నుంచి ఈ టోర్నీకి ఎంపికైన వారు వీరిద్దరే కావడం విశేషం.

అశ్విన్ స్ఫూర్తితో

గున్నాబత్తుల లక్ష్మీ గౌతమ్‌ది సామర్లకోట. కాకినాడలో ప్లస్ వన్ చదువుతున్నాడు. నాన్న దుర్గాప్రసాద్ క్రికెట్ కోచ్ కావడంతో చిన్నప్పటి నుంచి ఆటపై ఇష్టం పెంచుకున్నాడు. మూడో తరగతి నుంచే శిక్షణ ప్రారంభించాడు. బాలుర జిల్లా జట్టులో స్థానం సంపాదించి 200 వరకూ మ్యాచ్‌లు ఆడాడు. తొలిసారిగా రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యాడు. ఆఫ్ స్పిన్నర్‌గా రాణిస్తున్న అతనికి ప్రముఖ ఆటగాడు అశ్విన్ స్ఫూర్తి. అతనిలా ఆల్‌రౌండర్‌గా పేరు తెచ్చుకోవాలని సాధన చేస్తున్నాడు. రంజీట్రోఫీలో ఆడి టీమిండియాలో చోటు దక్కించుకోవాలనేది తన కల అని చెబుతున్నాడు.

ఆల్‌రౌండర్‌గా సత్తా..

కోటగిరి తమన్ సామర్లకోటలో ఉంటూ కాకినాడలో పదో తరగతి చదువుతున్నాడు. నాన్న మురళీకృష్ణ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. అమ్మ డాక్టర్ ప్రవీణ సామర్లకోట ప్రభుత్వ వైద్యశాలలో దంత వైద్యురాలు. తమన్ ఏడోతరగతి నుంచి పాఠశాలలో క్రికెట్ కోచింగ్ తీసుకుంటున్నాడు. ప్రతిరోజూ ఉదయం 6 గంటల నుంచి 9 వరకూ, సాయంత్రం 4గంటల నుంచి 6.30 వరకూ సాధన చేస్తున్నాడు. లెఫ్టార్మ్ స్పిన్నర్, లెఫ్ట్‌హ్యాండ్ బ్యాటర్‌గా సత్తా చాటుతున్నాడు. ఇటీవల రాష్ట్రస్థాయిలో జరిగిన మూడు మ్యాచుల్లో 9 వికెట్లు తీశాడు. ఇప్పటి వరకు సుమారు 50కు పైగా మ్యాచ్‌లు ఆడాడు. రవీంద్ర జడేజా అభిమాని అయిన తమను అతనిలా ఆల్‌రౌండర్‌గా రాణిస్తానని చెబుతున్నాడు. విజయ్ మర్చంట్ క్రికెట్ ట్రోఫీకి ఎంపిక కావడం ఆనందంగా ఉందని, భారత జట్టులో స్థానమే తన లక్ష్యమని పేర్కొన్నాడు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97607
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80082 34669



(c) eenadu

ఇంటర్న్‌షిప్‌కు రూ.20 వేలు అడుగుతున్నారు..!

బీఎస్సీ(ఎంఎల్‌టీ) విద్యార్థుల గగ్గోలు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కాకినాడలోని రావువ పారామెడికల్ కళాశాలలో బీఎస్సీ(ఎంఎల్‌టీ) మూడేళ్ల కోర్సు పూర్తి చేసిన తమకు జీజీహెచ్‌లో ఇంటర్న్‌షిప్‌నకు అనుమతించాలంటే కళాశాల యాజమాన్యం డబ్బులు డిమాండ్ చేస్తోందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై సోమవారం కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌లో జేసీ అపూర్వభరత్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ కోర్సు పూర్తి చేసిన తాము జీజీహెచ్‌లో ఏడాది పాటు ఇంటర్న్‌షిప్ చేయాల్సి ఉందని, దీనికి ఒక్కొక్కరు రూ.20వేలు ఇస్తేనే పంపిస్తామని 80 మంది విద్యార్థులను కళాశాల ఎండీ వేధిస్తున్నారని ఆరోపించారు. [illegible] వేదనను గుర్తించి [illegible] వివరించారు. దీనిపై జేసీ స్పందిస్తూ ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఆదుకోవాలని వేడుకుంటున్న విద్యార్థులు

లింగరూపం.. అలంకారప్రియం

గొల్లప్రోలు: దుర్గాడ శివాలయంలో సంకటహర చతుర్థి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తు వేద మంత్రోచ్ఛారణల మధ్య ఉపనిషత్ పారాయణం నిర్వహించారు. మహాగణపతికి 11 రకాల ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. రామలింగేశ్వరస్వామికి పత్రాలు, పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు.

సూక్ష్మ పరిశ్రమల ఏర్పాటుతో 1.28 లక్షల ఉద్యోగాలు

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: ఏపీలో సూక్ష్మ పరిశ్రమల ఏర్పాటుతో ఉపాధి అవకాశాలు మెరుగుపడుతున్నాయని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. రాజ్యసభలో సోమవారం ఎంపీ సానా సతీష్‌బాబు అడిగిన ప్రశ్నకు కేంద్రం సమాధానమిచ్చింది. ఈ విషయాన్ని రాజ్యసభ సభ్యుడు (ఎంపీ) సానా స్వయంగా విలేకరులకు వెల్లడించారు. ఏపీలో ఉపాధి అవకాశాలు, గ్రామీణస్థాయి యువతకు స్వయం ఉపాధి అవకాశాల కల్పనపై ఆయన ప్రశ్నించారు. దీనిపై కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమ శాఖ సహాయ మంత్రి సుశ్రీ శోభా కరండ్లాజే సమాధానమిచ్చారు. 2020-25 మధ్య కాలంలో ఏపీలో రూ.614 కోట్లు పరిశ్రమలకు మార్జిన్ మనీ సబ్సిడీగా విడుదల చేశారని, 16,053 సూక్ష్మపరిశ్రమలను నెలకొల్పినట్లు వివరించారు. రాష్ట్రంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా 1.28 లక్షల మందికి ఉపాధి చేకూరినట్లు కేంద్ర మంత్రి వెల్లడించారు. భవిష్యత్తులో ఏపీలో యువతకు మరిన్ని ఉపాధి అవకాశాలు సమకూరనున్నాయని కేంద్రం తెలిపినట్లు ఎంపీ సతీష్‌బాబు పేర్కొన్నారు.

మాట్లాడుతున్న ఎంపీ సతీష్‌బాబు

ఆరోగ్యం.. ఆదాయం.. సాంకేతికత

ఆదర్శ రైతుకు సీఎం సత్కారం

స్ఫూర్తి

న్యూస్‌టుడే, గోపాలపురం, దేవరపల్లి, నల్లజర్ల

పంటలకు ఎటువంటి రసాయనాలు వినియోగించకుండా తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం సాధిస్తున్నారు తూర్పుగోదావరి జిల్లాకు చెందిన పలువురు రైతులు. ఈ నెల 9న నల్లజర్లలో జరిగిన రైతన్నా.. మీ కోసం ముగింపు కార్యక్రమంలో ఆదర్శ రైతులుగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా సత్కారం అందుకున్నారు.

చెరకు తోటలో జోగేంద్రప్రసాద్

చేశారు. 6 ఎకరాల్లో చెరకు, మిరప పంటను సేంద్రియ పద్ధతిలో సాగుచేస్తున్నారు. తన కుటుంబ అవసరాలకు వినియోగించుకొని మిగిలిన పంటను అమ్ముకుంటున్నారు. చెరుకుతో స్వయంగా బెల్లం తయారు చేసి అమ్మితే ఎకరాకు రూ.60 వేల నుంచి రూ.80 వేలు, మిరప పంటకు అన్ని ఖర్చులు పోగా రూ.25 వేల వరకు ఆదాయం వస్తుందని ఆయన చెబుతున్నారు.

చెరకు, మిరప పండిస్తూ..

గోపాలపురం మండలం వాదాలకుంట చెందిన రైతు జోగేంద్రప్రసాద్ ఎమ్మెస్సీ పూర్తి

కొబ్బరి, కోకో సాగు..

దేవరపల్లి మండలం కురుకూరుకు చెందిన యలమాటి భాస్కరరావు పదెకరాల్లో కొబ్బరి, కోకో వేశారు. మూడేళ్లుగా సేంద్రియ విధానం అవలంబిస్తున్నారు. దీంతో ఖర్చు తగ్గింది. ఆదాయం కూడా అనుకున్న స్థాయిలో వస్తుంది. ఎకరాకు ఏడాదికి రూ.2.10 లక్షల ఆదాయం వస్తుందని దానిలో పెట్టుబడి రూ.90 వేలు పోగా రూ.1,10,000 నికర ఆదాయం మిగులుతుందన్నారు.

మిశ్రమ విధానంలో..

నల్లజర్ల మండలం సింగరాజుపాలెంకి చెందిన దొండపాటి లక్ష్మీనారాయణ 5 ఎకరాల ఆయిల్‌పామ్ తోటలో చేపలు, నాటు కోళ్లు, ఆవులు, గేదెలు పెంచుతున్నారు. వ్యవసాయ క్షేత్రంలో చిన్న చెరువు తవ్వి దానిలో చేపలు వేసి ఆవులు, గేదెలు వేసిన పేడను వినియోగిస్తున్నారు. పొలంలో క్రిమికీటకాలు తిని కోళ్లు పెరుగుతున్నాయి. ఏడాదికి ఖర్చు రూ.5 లక్షలు అవుతుందని అన్నింటితో కలిపి ఏడాదికి సుమారు రూ.11 లక్షలు ఆదాయం ఆర్జిస్తున్నట్లు తెలిపారు.

రైతేరాజు

మల్లె కొమ్మ కత్తిరింపులో పాటించాల్సిన జాగ్రత్తలు

మీ కోసం

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: మల్లె సాగులో యాజమాన్య పద్ధతులు అవలంబిస్తే అధిక దిగుబడులు వస్తాయని ఉద్యానాధికారి కోటేశ్వరరావు పేర్కొంటున్నారు. నాటిన ఏడాది నుంచి దిగుబడి ప్రారంభమై 12-15 ఏళ్ల వరకు పొందొచ్చు. కత్తిరింపుల చేసే ముందు నవంబరు నుంచి నీటితడులు ఇవ్వకుండా చెట్లను వాడు ముఖం పట్టించాలి. ఆయిదేళ్ల లోపు వయసున్న తోటలో కొమ్మలు భూమి నుంచి రెండు, ఆయిదేళ్లు దాటితే మూడు అడుగుల ఉంచి మిగిలిన పైభాగాన్ని కత్తిరించాలి. తాజాదనం కోసం, మొగ్గల సువాసనలు రెండు, మూడు రోజులు వెదజల్లాలంటే సుక్రోస్ లేదా బోరిక్ యాసిడ్ 10 గ్రాములు లేదా అల్యూమినియం సల్ఫేటు ఒక గ్రాము లీటరు నీటికి కలిపిన ద్రావణంలో 10 నిమిషాల పాటు ఉంచి అనంతరం ఆరబెట్టాలి.

వాడపల్లిలో సాగవుతున్న మల్లెతోట

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మంచి ప్రజలు, మంచి బ్యాంక్

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

అసెట్ రికవరీ బ్రాంచ్, డోర్ నెం.26-15-150, ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్, చెంగలరావుపేట, విశాఖపట్నం-530001.
ఫోన్ : 0891-2537792 / 82, మొబైల్ నెం. : 93245 17291. ఇ-మెయిల్ : ubin0817295@unionbankofindia.bank

స్థిరాస్తి అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

APPENDIX-IV-A [(See Proviso to Rule 8(6)]

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లో రూల్ 8(6) ప్రొవిజన్‌తో చదివే సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం స్థిరాస్తుల ఇ-వేలం అమ్మకం ప్రకటన

ఇందుమూలముగా "ఋణగ్రహీత(లు) / హామీదారు(లు)"లకు మరియు ప్రత్యేకంగా సాధారణ ప్రజానీకానికి నోటీసు జారీచేస్తూ తెలియజేయునది ఏమనగా, సెక్యూర్డ్ క్రెడిటార్ తనఖాలో / ఛార్జీలో ఉన్న దిగువ తెలిపిన స్థిరాస్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, (సెక్యూర్డ్ క్రెడిటార్) అధీకృత అధికారిచే స్వాధీనం తీసుకొనబడి వాటిని "ఎక్కడ ఉన్నది అలాగే" "ఏది ఉంటే అది & అక్కడ ఏది ఉన్నా అలాగే" పద్ధతిలో వెబ్‌సైట్ https://baanknet.com ద్వారా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఋణ వసూలు శాఖ, విశాఖపట్నం సెక్యూర్డ్ క్రెడిటార్ కి (ప్రస్తుతం ఈ దిగువ తెలిపిన ఖాతా ఋణ వసూలు శాఖ, విశాఖపట్నం వారికి బదిలీ చేయబడినది) చెల్లించవలసిన బకాయి సొమ్ము దిగువ తెలిపిన మొత్తము + వడ్డీ & ఇతర ఖర్చులతో సహా దిగువ తెలిపిన ఋణగ్రహీతలు & హామీదారుల నుండి రాబట్టుకొనుటకు తేది.09-01-2026 న ఆన్‌లైన్ ఈ-వేలం ద్వారా అమ్మకం చేయుటకు నిర్ణయించినారు. ధరావత్తు & రిజర్వు ధర దిగువ తెలుపబడినవి.

1 ఋణగ్రహీత(లు): శ్రీ విశ్వనాథుల అర్జునరావు, తండ్రి: శేషగిరి, చిరునామా 1: డో.నెం. 9-145/2, ఫ్లాట్ నెం ఎఫ్.-2, శ్రీ భవానీ రెసిడెన్సీ, ఎం.పి.డి.ఓ. కార్యాలయం దగ్గర, సత్యనారాయణపురం, రమణయ్యపేట, కాకినాడ మండలం, కాకినాడ జిల్లా ఆంధ్రప్రదేశ్-533005. శ్రీ విశ్వనాథుల అర్జునరావు, తండ్రి : శేషగిరి, చిరునామా 2 : డో.నెం. 70-17ఎ/8/1, శశికాంత్ నగర్, కాకినాడ మండలం మరియు జిల్లా, ఆంధ్రప్రదేశ్-533005. సహ-ఋణగ్రహీత: శ్రీమతి విశ్వనాథుల సూర్య ప్రసన్న, భర్త: అర్జునరావు, చిరునామా 1: డో.నెం.9-145/2, ఫ్లాట్ నెం.ఎఫ్.-2, శ్రీ భవాని రెసిడెన్సీ, ఎం.పి.డి.ఓ.కార్యాలయం దగ్గర, సత్యనారాయణపురం, రమణయ్యపేట, కాకినాడ మండలం, కాకినాడ జిల్లా ఆంధ్రప్రదేశ్-533005. శ్రీమతి విశ్వనాథుల సూర్య ప్రసన్న, భర్త: అర్జునరావు, చిరునామా 2: డో.నెం.70-17ఎ/8/1, శశికాంత్ నగర్, కాకినాడ మండలం మరియు జిల్లా, ఆంధ్రప్రదేశ్-533005. తనఖాదారు : శ్రీ విశ్వనాథుల అర్జునరావు, తండ్రి: శేషగిరి చిరునామా 1:- డో.నెం.9-145/2, ఫ్లాట్ నెం. ఎఫ్-2, శ్రీ భవాని రెసిడెన్సీ, ఎం.పి.డి.ఓ. ఆఫీసు దగ్గర, సత్యనారాయణపురం, రమణయ్యపేట, కాకినాడ మండలం, కాకినాడ జిల్లా ఆంధ్రప్రదేశ్-533005. శ్రీ విశ్వనాథుల అర్జునరావు, తండ్రి : శేషగిరి, చిరునామా 2 : డో.నెం.70-17ఎ/8/1, శశికాంత్ నగర్, కాకినాడ మండలం మరియు జిల్లా, ఆంధ్రప్రదేశ్-533005

బకాయి మొత్తం : రూ.87,12,730.24 పై. (ఎనభై ఏడు లక్షల పన్నెండు వేల ఏడు వందల ముప్పై పైసలు ఇరవై నాలుగు మాత్రమే) అధనంగా వడ్డీ, ఖర్చులు మరియు ఛార్జీలు.

సెక్యూరిటీ వివరములు : ఆస్తి శ్రీ విశ్వనాథుల అర్జునరావు గారికి చెందిన ఆస్తి : షెడ్యూల్ 'ఏ' : ప్రస్తుతం సర్పవరం సబ్ రిజిస్ట్రీ జ్యూరిస్‌డిక్షన్ పరిధిలోని, రమణయ్యపేట గ్రామ పంచాయితీ, రమణయ్యపేట గ్రామం, సర్వే నెం.73/4 వద్ద డి.నెం.9-145/2 వద్ద ఉన్న సర్వే నెం. 73/4 లో ఉన్న మొత్తం 314.44 చదరపు గజాల భూమిలో 39.30 చదరపు గజాల అవిభాజ్యపు మరియు అనిర్దిష్టపు భూమి హద్దులు : భూమి హద్దులు: తూర్పు: కొమ్మిరెడ్డి మహాలక్ష్మమ్మ గారు మరియు మరొకరు ఇతరులకు విక్రయించిన స్థలం, పడమర : సిమెంట్ రోడ్డు, ఉత్తరం: కనకాల వెంకటేశ్వరరావు గారికి చెందిన స్థలం, దక్షిణం : బత్తుల శిరీష గారికి చెందిన డోర్ నెం.9-145/1తో గల ఇల్లు.

షెడ్యూల్ బీ : షెడ్యూల్ 'ఏ' లో పేర్కొన్న భూమిపై నిర్మించిన "శ్రీ భవానీ రెసిడెన్సీ" అనే అపార్ట్‌మెంట్‌లోని కామన్ ఏరియా, పార్కింగ్ స్థలాలతో పాటు మొదటి అంతస్తులో 1125.00 చదరపు అడుగుల విస్తీర్ణంలో నివాస ఫ్లాట్ నెం.ఎఫ్-2.

ఫ్లాట్ సరిహద్దులు : తూర్పు : ఓపెన్ టు స్కై, పడమర : కామన్ కారిడార్ కొంతమేరమెట్లు కొంతమేర, లిఫ్టు కొంతమేర మరియు తదుపరి వెలుగుబంట్ల సత్యనారాయణ గారికి చెందిన ఫ్లాటు, ఉత్తరం : ఓపెన్ టు స్కై, దక్షిణం : ఓపెన్ టు స్కై

రిజర్వు ధర : రూ.28,40,000/- ధరావత్తు : రూ.28,40,00/- బిడ్ పెంపుదల మొత్తం : రూ.29,000/-

ఇ-వేలం తేది మరియు సమయం : 09-01-2026, మ॥ 12.00 గం॥ల నుండి సా॥ 05.00 గం॥ వరకు
(వేలము పూర్తి అగు వరకు 10 నిముషముల చొప్పున సమయం పొడిగించబడును)

బ్యాంకుకు తెలిసినంతవరకు ఆస్తిపై ఎటువంటి ఎన్‌కంబరెన్స్‌లు లేవు.
విక్రయం యొక్క వివరణాత్మక నిబంధనలు మరియు షరతుల కోసం, దయచేసి https://www.unionbankofindia.co.in/auction-property/view-auction-property.aspx మరియు www.unionbankofindia.co.inలో అందించిన లింక్‌ను సందర్శించండి.

తేది : 05.12.2025
స్థలం : విశాఖపట్నం

సం/- అధీకృత అధికారి & అసిస్టెంట్ జనరల్ మేనేజర్
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అసెట్ రికవరీ బ్రాంచి

భక్తులకు ఆలస్యం లేకుండా అన్నప్రసాదం

అన్నవరం, న్యూస్‌టుడే : అన్నవరం సత్యదేవుని దర్శనానికి వచ్చే భక్తులకు ఆలస్యం లేకుండా అన్నప్రసాదం అందించాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. నిత్యాన్నదానం అమలు, భక్తులకు ఎదురవుతున్న ఇబ్బందులపై ఈవో సుబ్బారావు, ఇంజినీరింగ్, అన్నదాన విభాగ అధికారులతో ఆయన సోమవారం కాకినాడలో సమీక్షించారు. నిత్యాన్నదానం కోసం భక్తులు ఎక్కువసేపు క్యూలైన్లలో ఉండకుండా 10-15 నిమిషాల్లోనే భోజనాలు అందించేలా ప్రణాళిక చేయాలన్నారు. ప్రస్తుత భవనంలోని రెండు అంతస్తుల్లో లోపల ప్రాంగణాన్ని విస్తరించడానికి చర్యలు చేపడతామని కలెక్టర్‌కు అధికారులు వివరించారు. దీని ద్వారా దిగువ అంతస్తులో ఒకేసారి సుమారు 450 మందికి, పై అంతస్తులో బఫే విధానం ద్వారా 350 మందికి భోజనాలు అందిస్తామన్నారు. కేంద్రప్రభుత్వ పథకం ప్రసాద్ ద్వారా నిత్యాన్నదాన భవనం వచ్చే ఏడాది ఆగస్టు నాటికి పూర్తయ్యే అవకాశమున్న నేపథ్యంలో అప్పటి వరకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఆలయ ప్రాంగణాల్లో మరిన్ని మరుగుదొడ్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నారు.

బాయిలర్ కోడిపిల్లలకు కుంపట్లు అమర్చి ఉష్ణోగ్రతలు అందిస్తున్న రైతు

చలికాలంలో కోడిపిల్లల రక్షణ ఇలా..

తెలుసుకుందాం..

జగ్గంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: బాయిలర్ కోడిపిల్లలకు శీతాకాలంలో తగిన ఉష్ణోగ్రతలు అందిస్తూ జాగ్రత్తలు పాటించాలని జగ్గంపేట పశుసంవర్ధక శాఖ ఏడీఏ తాతయ్య సూచించారు. నాణ్యత కలిగిన పిల్లలను ఎంపిక చేసుకొని మొదటి వారంలో 32-35 సెల్సియస్ వేడిని అందించాలి. దీనికోసం కుంపట్లు, గ్యాస్‌బ్రూడర్లు అమర్చుకోవాలి. షెడ్ల చుట్టూ పరదాలు కప్పితే చలిగాలి రాకుండా అడ్డుకోవచ్చు. కోడిపిల్ల వయసు పెరిగేకొద్దీ 39.5-41 సెల్సియస్ మధ్య ఉంచడం ఉత్తమం. నాభి లేదా మలద్వారం వద్ద థర్మామీటరు ఉంచడం ద్వారా ఉష్ణోగ్రతలు తెలుసుకోవచ్చు. తగినంత ఉష్ణోగ్రతలు అందించని పక్షంలో శ్వాసకోశ ఇబ్బంది, బద్ధకం, ఆకస్మిక మరణం సంభవించి నష్టం వాటిల్లుతుంది.

వెదురు.. లాభాలతో ఎదుగుదాం

40 ఏళ్ల వరకు ఆదాయం

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: వెదురును ప్రధాన పంటగా గాని, పొలం చుట్టూ రక్షణగా గాని వేసుకుంటే తక్కువ పెట్టుబడితో 40 ఏళ్ల వరకూ ఆదాయం పొందొచ్చు. సాగు విధానం, లాభాలు, రాయితీల గురించి ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త చల్లా వెంకటనరసింహారావు వివరించారు. ● 5×5 మీటర్ల ఎడంతో ఎకరాకు 160 మొక్కలు నాటొచ్చు. ● ఎటువంటి భూముల్లోనైనా సాగు చేయొచ్చు. చదును నేలల్లో పొదవు రకాలు, ఏటవాలు భూముల్లో పొట్టి రకాలు వేసుకోవాలి. ● మొక్కలు నాటిన రెండేళ్ల వరకు అంతర పంటలుగా అల్లం, పసుపు, అశ్వగంధ వంటి ఔషధ పంటలు సాగు చేసుకుని అదనపు ఆదాయం పొందొచ్చు. ● మూడవ సంవత్సరం నుంచి ఏడాదికి ఎకరాకు 13 నుంచి 15 టన్నుల వెదురు లభిస్తుంది. టన్ను వెదురు రూ.4-5 వేలు ధర ఉండగా ఏడాదికి రూ.65-70 వేలు ఆదాయం లభిస్తుంది. ● రైతులకు మొక్కకు రూ.150 చొప్పున హెక్టారుకు రూ.60 వేలు ఉద్యానశాఖ రాయితీ అందిస్తుంది. ● సరుగుడు కంటే సాగు సులభం. పెట్టుబడి తక్కువ. లాభాలు అధికం. మార్కెట్ అవకాశాలు అధికం. ● కాగితం, నిర్మాణ రంగం, చేనేత, గృహోపకరణాల పరిశ్రమలకు, డెక్కింగ్, ఫ్లోరింగ్, అగరబత్తీల తయారీకి ముఖ్యమైన వనరును అందిస్తాయి.

వెదురు మొక్కలు

గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

కాజులూరు, న్యూస్‌టుడే: దేశానికి పట్టుగొమ్మలైన గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. సోమవారం కోలంక గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రి శ్రీకారం చుట్టారు. గ్రామాల్లో శుభ్రతకు ప్రభుత్వం స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ద్వారా మంజూరుచేసిన అయిదు ట్రాక్టర్లు, ట్రక్కులను ఆయన ప్రారంభించి కోలంక, దుగ్గుదూరు, శీల, మంజేరు, కుయ్యేరు గ్రామాల సర్పంచులకు అందించారు. కోలంక గ్రామంలో ఆర్‌అండ్‌బీ పరిధిలో రూ.85 లక్షల అంచనా వ్యయంతో నిర్మించే సీసీరోడ్డు పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జె.రాంబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ పద్మరూప, ఆర్‌అండ్‌బీ ఏఈ ప్రసన్న, ఎలక్ట్రికల్ ఏఈ వీరేడ్డి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కోలంకలో ట్రాక్టర్ నడుపుతున్న మంత్రి సుభాష్

జిల్లా జడ్జి పరీక్షల్లో కాకినాడ యువతి ప్రతిభ

మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: కాకినాడ బార్ అసోసియేషన్‌లో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్న పెదగాడి లాలస జిల్లా జడ్జి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించారు. ఈ ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. ఈమె బీఎస్సీ ఎల్ఎల్‌బీ చదివారు. కాకినాడ బార్ అసోసియేషన్‌లో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. ఈమె తండ్రి పెదగాడి వెంకటరమణ, సోదరుడు ధన్విన్ కూడా న్యాయవాదులే. జిల్లా జడ్జిగా ఎంపికైన లాలసకు కాకినాడ బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఏలూరి సుబ్రహ్మణ్యం, చక్కపల్లి వీరభద్రరావు(చంటి), న్యాయవాదులు అభినందనలు తెలిపారు.

పెదగాడి లాలస

దావా సమను ప్రకటన

మహారాజశ్రీ పెద్దాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టు వారి సముఖమునకు

OS No.131/2025

వాది : పైడిశెట్టి సత్యనారాయణ
ప్రతివాదులు : కనపర్తి లక్ష్మణరావు వగైరాలు
4వ ప్రతివాది : కనపర్తి సత్యనారాయణ S/o కృష్ణ, డో.నెం. 68-10-25/2 వశిష్టవారి వీధి, ఐడియల్ కాలేజి దగ్గర, విద్యుత్ నగర్, కాకినాడ.
6వ ప్రతివాది: కనపర్తి లక్ష్మి, W/o వీర్రాజు, డో.నెం. 68-4-5 అశోక్ నగర్, కమల్ వీర్ థియేటర్ల దగ్గర, కాకినాడ.

పై నెంబరు దావా పరిహారం నిమిత్తం మీ పైన కోర్టులో వాది అను వారు దావా దాఖలు చేసినందున అందుకు ఆక్షేపణలు తెలియచేయుటకు మీరు పై కోర్టు వారి ఎదుట ది.05-01-2026 ఉదయం గం 10-30ని॥లకు హాజరు కావలెను. లేనిచో మీ పరోక్షమున విచారించి తీర్మానం చేయుదురని తెలియచేయడమైనది.

వాది తరపున అడ్వకేట్
చావలి కృష్ణారావు
D.No. 9-1-32, పెద్దాపురం

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మంచి ప్రజలు, మంచి బ్యాంక్

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

అసెట్ రికవరీ బ్రాంచ్, డోర్ నెం.26-15-150, ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్, చెంగలరావుపేట, విశాఖపట్నం-530001.
ఫోన్ : 0891-2537792 / 82, మొబైల్ నెం. : 93245 17291. ఇ-మెయిల్ : ubin0817295@unionbankofindia.bank

స్థిరాస్తి అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

APPENDIX-IV-A [(See Proviso to Rule 8(6)]

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లో రూల్ 8(6) ప్రొవిజన్‌తో చదివే సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం స్థిరాస్తుల ఇ-వేలం అమ్మకం ప్రకటన

ఇందుమూలముగా "ఋణగ్రహీత(లు) / హామీదారు(లు)"లకు మరియు ప్రత్యేకంగా సాధారణ ప్రజానీకానికి నోటీసు జారీచేస్తూ తెలియజేయునది ఏమనగా, [illegible] https://baanknet.com [illegible] తేది.30-12-2025 న [illegible]

1 ఋణగ్రహీత(లు): [illegible]

బకాయి మొత్తం : [illegible]

రిజర్వు ధర : రూ.1,23,00,000/- ధరావత్తు : రూ.12,30,000/- బిడ్ పెంపుదల మొత్తం : రూ.1,23,000/-

2 ఋణగ్రహీత(లు): [illegible]

చిరునామా-3: డి.నెం.7-124, మారుతి నగర్, కాకినాడ, తూర్పు గోదావరి జిల్లా (ప్రస్తుతం కాకినాడ జిల్లా), ఆంధ్రప్రదేశ్-533005.

బకాయి మొత్తం:రూ.46,16,566.07 పై. (అక్షరాల నలభై ఆరు లక్షల పదహారు వేల ఐదు వందల అరవై ఆరు రూపాయల ఏడు పైసలు మాత్రమే)+ఒప్పంద రేటు ప్రకారం తదుపరి వడ్డీతో పాటు వ్యయాలు మరియు ఇతర ఖర్చులు.

స్థిరాస్తి వివరములు : ఆంధ్రప్రదేశ్-533005, తూర్పు గోదావరి జిల్లా (ప్రస్తుతం కాకినాడ జిల్లా), కాకినాడ, కాకినాడ రూరల్ మండలం, పెనుమర్తి గ్రామంలోని ఆర్.ఎస్.నెం.58/5లో ఉన్న డోర్ నెం.2-161, ప్లాట్ నెం.1, టీ.ఎల్.పి. నెం.28/2015 నందు 146.66 చదరపు గజాల విస్తీర్ణంతో (భవనం ప్లింత్ ఏరియా 797.28 చదరపు అడుగులు) గల క్రింది అంతస్థు లోని నివాసిత భవనము శ్రీ సాగి శివ రామ కృష్ణంరాజు గారికి చెందినది. హద్దులు: తూర్పు: ప్లాట్ నెం. 6కి చెందిన స్థలం, పడమర: 33 అడుగుల వెడల్పు రహదారి, ఉత్తరం: ప్లాట్ నెం. 2కి చెందిన స్థలం, దక్షిణం: ఇతరుల భూమి. (రిజిస్టర్డ్ అమ్మకపు దస్తావేజు నెం. 648/2016 తేది: 12.01.2016)

రిజర్వు ధర : రూ.31,00,000/- ధరావత్తు : రూ.3,10,000/- బిడ్ పెంపుదల మొత్తం : రూ.35,000/-

ఆంధ్రప్రదేశ్-530055, తూర్పు గోదావరి జిల్లా, కాకినాడ రూరల్ మండలం, కాకినాడ మండలం, తూరంగి గ్రామం, డోర్‌నెం.9-344/1 సమీపంలో, సర్వే నెం.160/4 లో ఉన్న ప్లాట్ నెం.9లో గల 168.88 చదరపు గజాల విస్తీర్ణంలోని నివాస ఖాళీ స్థలం శ్రీ సాగి శివ రామ కృష్ణం రాజుగారికి చెందినది. హద్దులు: తూర్పు: ప్లాట్ నెం. 24 యొక్క స్థలం, పడమర: 33 అడుగుల వెడల్పు రహదారి, ఉత్తరం: శ్రీ బి.వి. కృష్ణా మోహన్, ఎన్. రవి కిషోర్ మరియు జి.బి.ఎస్. ప్రకాష్ ల ఆస్తి, దక్షిణం: ప్లాట్ నెం. 10 యొక్క స్థలం. (రిజిస్టర్డ్ అమ్మకపు దస్తావేజు నెం. 3685/2017 తేది: 31.05.2017) గమనిక : SA /285/2024 ఫలితానికి లోబడి అమ్మకం విజయవంతమైనదని ప్రకటించబడుతుంది.

రిజర్వు ధర : రూ.26,00,000/- ధరావత్తు : రూ.2,60,000/- బిడ్ పెంపుదల మొత్తం : రూ.30,000/-

ఇ-వేలం తేది మరియు సమయం : 30-12-2025, మ॥ 12.00 గం॥ల నుండి సా॥ 05.00 గం॥ వరకు
(వేలము పూర్తి అగు వరకు 10 నిముషముల చొప్పున సమయం పొడిగించబడును)

బ్యాంకుకు తెలిసినంతవరకు ఆస్తిపై ఎటువంటి ఎన్‌కంబరెన్స్‌లు లేవు.
విక్రయం యొక్క వివరణాత్మక నిబంధనలు మరియు షరతుల కోసం, దయచేసి https://www.unionbankofindia.co.in/auction-property/view-auction-property.aspx మరియు www.unionbankofindia.co.inలో అందించిన లింక్‌ను సందర్శించండి.

తేది : 02.12.2025
స్థలం : విశాఖపట్నం

సం/- అధీకృత అధికారి & అసిస్టెంట్ జనరల్ మేనేజర్
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అసెట్ రికవరీ బ్రాంచి

చేబ్రోలు పీహెచ్‌సీలో ఆర్డీ విచారణ

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: గొల్లప్రోలు మండలం చేబ్రోలు పీహెచ్‌సీలో ఈ నెల 2న తెల్లవారుజామున పీహెచ్‌సీకి తాళాలు వేసి ఉండడం, సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో అరుగుపైనే ఇమంది మాణిక్యం అనే హృద్రోగి మృతి చెందిన ఘటనపై వైద్యారోగ్యశాఖ ఆర్డీ డాక్టర్ పద్మాశశిధర్ సోమవారం విచారణ నిర్వహించారు. ఈ ఘటనకు బాధ్యుడుగా పేర్కొంటూ పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ సాయిరతన్‌ను సస్పెండ్ చేసి, స్టాఫ్‌నర్స్‌కు తాఖీదులు జారీ చేసిన అంశాలపై వివరాలు సేకరించారు. స్థానికులను, వైద్యులు, సిబ్బందిని విచారించి రాతపూర్వకంగా వివరాలు నమోదు చేసుకున్నారు. పీహెచ్‌సీలో దస్త్రాలు తనిఖీ చేశారు. చేబ్రోలు పీహెచ్‌సీలో సిబ్బంది కొరత, నెలకొన్న సమస్యల గురించి జిల్లా వైద్యారోగ్యశాఖాధికారికి నాలుగు దఫాలు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని కూటమి నాయకులు ఆమెకు వివరించారు. వ్యక్తి మృతిచెందిన తరువాత నలుగురు సిబ్బందిని తిరిగి నియమించారన్నారు. వైద్యుడ్ని సస్పెండ్ చేయడం సరికాదన్నారు. రాత్రిపూట పీహెచ్‌సీలో సేవలందించేలా మహిళా, పురుష సిబ్బందిని నియమించాలని కోరారు.

ఆసుపత్రిలో వివరాలు సేకరిస్తున్న ఆర్డీ పద్మాశశిధర్

హత్య కేసులో నిందితుడి అరెస్టు

జగ్గంపేట గ్రామీణం, కిర్లంపూడి: భూపాలపట్నంలో ఇటీవల హత్యకు గురైన కాకర అప్పారావు కేసులో నిందితుడ్ని అరెస్టు చేసినట్లు పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు తెలిపారు. జగ్గంపేటలో సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం వివరాలు వెల్లడించారు. గ్రామంలో అంబేడ్కర్ బొమ్మ వద్ద సోదరులు కుళ్ల రాజాబాబు, నాగేశ్వరరావు అదే సామాజిక వర్గానికి చెందిన కాకర అప్పారావుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో సోదరులిద్దరూ పక్కనే ఉన్న ఇనుపరాడ్డులతో అప్పారావు తలపై కొట్టి హత్య చేసి పరారయ్యారు. అప్పటి నుంచి పోలీసులు గాలిస్తుండగా రాజాబాబును రామవరం హైవేపై సోమవారం ఉదయం అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. నాగేశ్వరరావు ఇంకా పరారీలో ఉన్నాడన్నారు. ఇరువురి మధ్య 2024లో జరిగిన పాత గొడవలే వివాదానికి దారితీశాయని పోలీసులు చెబుతున్నారు.

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి.. భూపాలపట్నం ఘటనలో కాకర అప్పారావు హత్యకు బాధ్యులపై కేసులు నమోదు చేసి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని మాజీ మంత్రి తోట నరసింహం డిమాండ్ చేశారు. వీరవరంలో ఆయన విలేకరులతో మాట్లాడారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి	18,500
కురిడీ (వెయ్యింటికి):	
పాతకాయ: గండేరా	28,000
గటగట	25,000
కొత్తకాయ: గండేరా	27,000
గటగట	24,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	15,000-16,000
కొత్త (పచ్చి) కాయ	14,000-15,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	6,000
కిలో	400

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	130-00
రిటైల్ లైవ్	157-00
డ్రెస్డ్	228-00
స్కిన్‌లెస్	259-00

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

బంగారం బ్యాంకులలో, ముత్తూట్, మనప్పురం, ప్రైవేట్ సంస్థల్లో తాకట్టులో ఉన్నవి విడిపించి, ఈ రోజు మార్కెట్ ప్రకారం కొనబడును. స్పాట్‌క్యాష్. ✆ 98491 38626.

శ్రీసాయి గోల్డ్: తాకట్టులో ఉన్న బంగారం, ఏ బ్యాంక్/ ప్రైవేట్ సంస్థల నుండి అయినా విడిపించి ఆరోజు మార్కెట్ రేట్‌కి కొనబడును. స్పాట్ క్యాష్, ✆ 94933 38823

REAL ESTATE

HOUSE FOR SALE

RAJAMAHENDRAVARAM CITY

రాజమండ్రి లాలాచెరువు హౌసింగ్ బోర్డ్ కాలనీ MIG-418లో 277 చ॥గ॥ల్లో ఈస్ట్ ఫేసింగ్ ఇల్లు అమ్మకమునకు కలదు. Contact Cell: 63055 24046.

JOBS

Wanted Managers to Motivate Team/ Targets/ Salary upto 50K/ Tanuku/ age above 30Yr/ must Insurance Exp. ✆ 98494 21277.

EENADU for Advertisement Contact: 8008597607

EENADU Classifieds

Wanted Eng., Mat. Teacher for 6,7th. Sal: 18,000 Negotiable. Prakasham EM Hi-School, Madhuranagar, Kkd. 6302305325, 99488 81449(Wtsap)

వైజాగ్ SKLM VZM జిల్లాలలో స్కూల్స్ హాస్పిటల్స్ బ్యాంక్‌లలో ఔట్‌సోర్సింగ్ & కాంట్రాక్ట్ బేస్ ద్వారా పనిచేయుటకు అటెండర్స్, రికార్డ్స్, జూనియర్ అసిస్టెంట్స్, కంప్యూటర్ ఆపరేటర్స్ బుకింగ్ క్లర్క్స్ బీట్ ఆఫీసర్స్ హెల్ప్‌డెస్క్, గార్డెనర్స్ MNO FNO ల్యాబ్‌టెక్నీషియన్స్ ANM GNM చేసినవారు M/F అర్జెంట్‌గా కావలెను. 10th నుండి బీటెక్ వరకు జీ: 20K to 40K ✆ 9160226051.

అమెరికాలో 1 సం॥ బాబు ఆలన, పాలన వ్యక్తిగత సంరక్షణ కొరకు అనుభవంగల ఆడవారు కావలెను. అమెరికా వీసా కల్గినవారు మాత్రమే. ✆ 9440803362

అకౌంటెంట్స్, సూపర్‌వైజర్స్, ఐషర్ డ్రైవర్స్ కావలెను. గోకవరం మండలం, పెంటపల్లి గ్రామంలోఉన్న పేపర్ మిల్లులో పనిచేయుటకు. 78935 55551, 90300 56553.

హైదరాబాద్‌లో పనిచేయడానికి M/F కేర్‌టేకర్స్ కావలెను. జీతం:20,000+ భోజనము+ వసతి. ఈ జీతం నెల 20లోపు జాయిన్ అయిన వారికి మాత్రమే. +91 76809 22316.

వైజాగ్‌లో ప్రముఖ షాపింగ్ మాల్స్‌లో పనిచేయుటకు 18-35వ యువతి యువకులు కావలెను. జీతం 10000-13500 ఫుడ్‌రూము 9704637370, 9949904532.

ఆర్మీ NAVY ఎయిర్‌ఫోర్స్ రైల్వే, SSC, బ్యాంకులలో ఉద్యోగావకాశాలు. అర్హత: 10th-డిగ్రీ. Age:16-25. శిక్షణ 3 నెలలు శిక్షణాకాలంలో హాస్టల్, 10th, ఇంటర్, డిగ్రీ డిస్టెన్స్ కోర్సులు కలవు. ★ ముందుగా ఎటువంటి ఫీజులేదు ★క్రిస్టియన్ ఎడ్యుకేషన్ అకాడమీ, వైజాగ్. ✆ 91212 32328.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 6-50 పై॥
అనపర్తి ఆఫీసు: 08857-226908

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

కాకినాడ

నేడు, రేపు పీఎంజీఎస్‌వై సదస్సు

కాకినాడ కలెక్టరేట్: ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన(పీఎంజీఎస్‌వై) పథకం అమల్లోకి వచ్చి 25 ఏళ్లు పూర్తవుతున్న సందర్భాన్ని పురస్కరించుకుని ఈ నెల 9,10 తేదీల్లో కాకినాడ జేఎన్‌టీయూలో సదస్సు నిర్వహించనున్నట్లు పంచాయతీరాజ్‌శాఖ జిల్లా పర్యవేక్షక ఇంజినీరు ఏవీఎస్ శ్రీనివాస్ సోమ వారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి పంచా యతీరాజ్ ఇంజినీరింగ్ ఇన్ చీఫ్ బి. బాలునాయక్, జేఎన్‌టీయూకే వైస్ ఛాన్సలర్ సీఎస్ఆర్‌కే ప్రసాద్, కాకినాడ, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదా వరి, అల్లూరి సీతారామరాజు జిల్లాల కలెక్టర్లు ముఖ్య అతిథులుగా హాజరవుతారని పేర్కొన్నారు.

తెరపై ఈనాడు గాంధీనగర్: ఆనంద్ సినిమాస్ 4ఫ్రేమ్స్- ఆంధ్ర కింగ్ తాలూకా, దురంధర్, దేవీ మల్టీ ప్లెక్స్ 4ఫ్రేమ్స్- ఆంధ్ర కింగ్ తాలూకా, అమరకావ్యం, లక్ష్మి- అమరకావ్యం, సత్య గౌరి - ఆంధ్ర కింగ్ తాలూకా, తిరుమల- బైసన్, సీఎంఎస్ 1- దురంధర్, సీఎంఎస్ 2- బిజినెస్‌మేన్, శ్రీప్రియ - ఆంధ్ర కింగ్ తాలూకా, పద్మప్రియ- రాజు వెడ్స్ రాంబాయి, సూర్య1(వాకలపూడి) - రాజు వెడ్స్ రాంబాయి.

మేమున్నాం.. మీకు తోడుగా

పూడిపోయిన కాలువ

కాకినాడ అశోక్‌నగర్ ప్రధాన రహదారిలో ఆర్మీ మార్గ్ వద్ద మురుగు కాలువ చెత్తాచెదారం, ఎండు ఆకులతో పూడిపోయింది. దీంతో మురుగు పారుదలకు ఆటంకం ఏర్పడుతోంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మట్టి తొలగించండి..

కాకినాడ బర్మా కాలనీలోని గుడి మలుపు వద్ద రోడ్డు ఇసుక వేసి వదిలేయడంతో వాహనదారుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మలుపు తిరిగే క్రమంలో జారి ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి మట్టిని తొలగించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వీధి దీపం వెలిగింది..

స్పందనకు వందనం

కాకినాడ శాంతినగర్ నగర పాలక గ్రీన్‌బెల్ట్ రహదారిలో మలుపు వద్ద వీధి దీపం వెలగడం లేదని 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టారు. -న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: ఉ. 10 - మ. 1

కాకినాడ నగరం	80085 74157
సాంబమూర్తినగర్	91548 46719
మసీదుసెంటర్	91541 18210
గాంధీనగర్	80085 74159
బాలాజీచెరువు	80085 74154

ఎస్టీయూ జిల్లా ఆర్థిక కార్యదర్శిగా రామ్‌తేజ్

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) జిల్లా కమిటీ ఆర్థిక కార్యదర్శిగా గుమ్మాపు రామ్‌తేజ్ ఎన్నికయ్యారు. సోమవారం స్థానిక ఎస్టీయూ భవన్‌లో జరిగిన జిల్లా కౌన్సిల్ సమావేశంలో రామ్‌తేజ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈయన కాకినాడ నగరపాలక సంస్థ పాఠశాలలో ఎస్జీటీగా పనిచేస్తున్నారు. ఆయనను ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పీవీ సత్యనారాయణరాజు, రాష్ట్ర కౌన్సిలర్ ఎన్ఎస్ఎస్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆకర్షణ వీడు.. లక్ష్యమే తోడు

'ఈనాడు' ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు

మాట్లాడుతున్న జిల్లా బాలల పరిరక్షణ అధికారి సీహెచ్.వెంకటరావు ● ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థినులు

న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్(కాకినాడ): లక్ష్యసాధనకు మంచి మార్గాన్ని ఎంచుకుంటేనే భవిష్యత్తు బాగుంటుందని జిల్లా బాలల పరిరక్షణ అధికారి సీహెచ్.వెంకటరావు అన్నారు. కాకినాడ అశోక్‌నగర్‌లోని నెహ్రూ ఎయిడెడ్ పాఠశాలలో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు 'ఈనాడు' ఆధ్వర్యంలో బాల్య వివాహాలు, 'గుడ్ టచ్-బ్యాడ్ టచ్', పోక్సో చట్టంపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జానకిరత్నం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బాలల సంరక్షణ అధికారులు కె.శ్రీనివాసరావు, జె. విజయ, కౌన్సెలర్ దుర్గారాణి పాల్గొన్నారు. వెంకటరావు మాట్లాడుతూ తెలిసీ తెలియని వయసులో ప్రేమకు ఆకర్షితులై తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని, నిజమైన ప్రేమ తల్లిదండ్రుల నుంచే లభిస్తుందన్నారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా కలలను సాకారం చేయాలన్నారు. విజయ, దుర్గారాణి మాట్లాడుతూ బాలికలు ఎప్పుడైనా వేధింపులకు గురవుతున్నట్లు గుర్తిస్తే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కి సమాచారం అందించాలని సూచించారు. సురక్షిత, అసురక్షిత స్పర్శపై అవగాహన కల్పించారు. ఎవరైనా అపరిచితులు అసభ్యకరంగా, అనుచితంగా ప్రవర్తిస్తే అందరికీ వినిపించేలా గట్టిగా కేకలు వేయాలన్నారు. బాల్య వివాహాలు చేసినా, ప్రోత్సహించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. చిన్న వయసులోనే వివాహాలు చేయడం వల్ల ఎన్నో అనర్థాలు సంభవిస్తాయన్నారు. అనంతరం పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయురాలు జానకిరత్నం మాట్లాడుతూ మంచి స్నేహితులంటే తల్లిదండ్రులేనని చెప్పారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఎస్. చినబాబు, దుర్గాభవానీ, ఉపాధ్యాయులు ఎ. అమ్మాజీ, ఎంఎస్‌వీ రమణమూర్తి, ఎంఎన్‌వీ విజయకుమారి, సుబ్బలక్ష్మి, లక్ష్మి, కామాక్షి తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కలిగింది..

సదస్సు ద్వారా పలు అంశాలపై అవగాహన కలిగింది. సమాజంలో బాలికలు ఏవిధంగా నడుచుకోవాలనే అంశాలు వివరించారు. ప్రస్తుతం జరిగే అనేక అంశాలపై విపులంగా వివరించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

-గనిశెట్టి శ్రావ్యశ్రీ

సందేహాల నివృత్తి

బాల్య వివాహాలు, పోక్సో చట్టం తదితర అంశాలపై వివరించారు. ప్రస్తుతం బయట జరుగుతున్న విషయాలపై అవగాహన కలిగింది. వాటి ఎలా ఎదుర్కోవాలో చెప్పారు. పలు సందేహాలను అధికారులు నివృత్తి చేశారు.

-శ్రీఅమృత, తొమ్మిదో తరగతి

కలెక్టర్‌కు మొక్క అందజేస్తున్న జేసీ అపూర్వభరత్

కలెక్టర్‌ను కలిసిన జేసీ

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కాకినాడ జిల్లా నూతన సంయుక్త కలెక్టర్‌గా శనివారం బాధ్యతలు స్వీకరించిన అపూర్వభరత్ సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ షాన్‌మోహన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా అభివృద్ధికి సంబంధించి పలు అంశాలపై వారు చర్చించారు.

'విజన్' కార్యాచరణ ప్రణాళిక సూచీలను పాటించాలి

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లా, నియోజకవర్గం, మండల స్థాయిలో రానున్న అయిదేళ్లకు రూపొందించిన విజన్ యాక్షన్ ప్లాన్ సూచీలను కచ్చితంగా పాటిస్తూ ప్రగతిని సాధించాలని కలెక్టర్ షాన్‌మోహన్ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆయన జేసీ అపూర్వభరత్, అసిస్టెంట్ కలెక్టర్ మనీషాతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. దీని కింద వివిధ శాఖలకు నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు ప్రగతి నివేదికలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. రానున్న మూడు రోజులు జిల్లాస్థాయి అధికారులు ప్రత్యేక దృష్టి సారించి ఆయాశాఖల వివరాలను పొందుపర్చాలని సూచించారు. డీఆర్వో వెంకటరావు, సీపీవో త్రినాథ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లపై జేసీ సమీక్ష

కాకినాడ కలెక్టరేట్: జిల్లాలో ధాన్యం కొనుగోళ్లపై సోమవారం కలెక్టరేట్‌లో జేసీ అపూర్వభరత్ అధికారులతో సమీక్షించారు. కొనుగోలు కేంద్రాలు, సిబ్బంది, సీఎంఆర్ రైస్ మిల్లులు, గోనె సంచులు, వాహనాలు తదితర అంశాలపై ఆయన ఆరా తీశారు. ఇప్పటికి 1.50 లక్షల టన్నుల మేర ధాన్యాన్ని రైతుల వద్ద నుంచి సేకరించామని, 48 గంటల్లో సొమ్ములు వారి ఖాతాలకు చెల్లిస్తున్నారని అధికారులు వివరించారు. నిర్దేశించిన లక్ష్యాల మేరకు ధాన్యం సేకరణ చేపట్టాలని ఆయన సూచించారు. పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజరు ఎం.దేవులనాయక్, జిల్లా పౌరసరఫరాల అధికారి రుద్రరాజు సత్యనారాయణరాజు, సహాయ సరఫరా అధికారిణి తుమ్మల ప్రసన్నలక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

కోర్టుల్లో వసతులు కల్పించాలని విజ్ఞప్తి

మసీదుసెంటర్: ఇటీవల రాజమహేంద్రవరంలో న్యాయమూర్తుల సమీక్షా సమావేశానికి హాజరైన రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.దేవానంద్‌ను ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు పృథ్వీరాజ్ బృందం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం పలు సమస్యల పరిష్కారంపై వినతిపత్రాన్ని అందజేశారు. అన్ని కోర్టు ప్రాంగణాల్లో మౌలిక వసతులు కల్పించాలని, నూతన కోర్టు భవనాలకు నిధులు మంజూరు చేయాలని, మైనరు రిపేర్లు చేపట్టాలని, కాకినాడలో డెట్ రికవరీ ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలని న్యాయమూర్తికి విన్నవించారు.

మత స్వేచ్ఛను అడ్డుకోవడం తగదు

కాకినాడ కలెక్టరేట్: మత స్వేచ్ఛను అడ్డుకోవడం తగదని గొల్లప్రోలు నగర పంచాయతీలోని కొత్తపేటకు చెందిన క్రైస్తవులు, పాస్టర్లు విన్నవించారు. సోమవారం కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌లో జేసీ అపూర్వభరత్‌కు వినతి పత్రం అందజేశారు. ఆదివారం గొల్లప్రోలు, కొత్తపేటలో ప్రార్థనలు చేసుకుంటే కొంత మంది వచ్చి దౌర్జన్యం చేశారని, తర్వాత కాకినాడ ఆర్డీవో వచ్చి చర్చికి తాళాలు వేశారని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా ఉన్నతాధికారులు న్యాయం చేయకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని తెలిపారు.

ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ

పోలీస్ పీజీఆర్ఎస్‌కు 39 అర్జీలు

మసీదుసెంటర్(కాకినాడ): పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యమివ్వాలని ఎస్పీ జి.బిందుమాధవ్ అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. 39 మంది ఫిర్యాదుదారులు హాజరై తమ సమస్యలను విన్నవించారు. వాటిపై సంబంధిత పోలీసు అధికారులతో ఎస్పీ నేరుగా మాట్లాడి, సకాలంలో సమస్యలు పరిష్కరించాలని సూచించారు.

వాలీబాల్ పోరుకు సర్వం సిద్ధం

10 నుంచి జేఎన్‌టీయూకేలో సౌత్‌జోన్ అంతర్ యూనివర్సిటీ పోటీలు

కోర్టులు సిద్ధం చేస్తున్న సిబ్బంది

గాంధీనగర్, న్యూస్‌టుడే: దక్షిణ భారతదేశంలోని యూనివర్సిటీలకు చెందిన వాలీబాల్ క్రీడాకారులంతా కాకినాడలో సందడి చేయనున్నారు. అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో జరిగే సౌత్ జోన్ అంతర్ వర్సిటీ వాలీబాల్ టోర్నమెంట్‌కు కాకినాడ జేఎన్‌టీయూకే ఆతిథ్యం ఇవ్వనుంది. ఇక్కడి క్రీడా మైదానంతో పాటు, మరో రెండు ప్రదేశాల్లో మ్యాచ్‌లు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

ఆరు రాష్ట్రాలు...138 జట్లు

పోటీలను ఈనెల 10వతేది నుంచి 14వతేది వరకూ నిర్వహించనున్నారు. ఈ టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి రాష్ట్రాలకు చెందిన సుమారు 138 జట్లు పాల్గొననున్నాయి. వీటిని 4 పూల్స్‌గా విభజించారు. పూల్ ఏ, బీ మ్యాచ్‌లు జేఎన్‌టీయూకే స్టేడియంలో మైదానంలో, పూల్- సి అచ్చంపేటలోని రాజీవ్‌గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ మైదానంలో, పూల్-డి మ్యాచ్‌లు సూరంపాలెంలోని ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో జరుగుతాయి. రాత్రి సమయాల్లోనూ మ్యాచ్‌లు జరిగేలా ఫ్లడ్‌లైట్లు ఏర్పాటు చేస్తున్నారు.

రెండువేల మంది క్రీడాకారులు..

టోర్నమెంట్‌కు ఆరు రాష్ట్రాల నుంచి సుమారు 2 వేల మంది క్రీడాకారులు హాజరుకానున్నారు. అలాగే కోచ్‌లు, మేనేజర్లు, వాలీబాల్ టెక్నికల్ ఆఫీషియల్స్ సుమారు 300 మంది వరకూ పాల్గొననున్నారు. వీరి వసతి, భోజన ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ టోర్నీలో మొదటి నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లు జాతీయ పోటీలకు అర్హత సాధిస్తాయి.

కమనీయం.. సీతారాముల కల్యాణం

గాంధీనగర్, న్యూస్‌టుడే: శ్రీరామచంద్రమూర్తి జన్మనక్షత్రమైన పునర్వసు సందర్భంగా సోమవారం మెయిన్‌రోడ్డులోని శ్రీసీతారామస్వామివారి దేవస్థానంలో శాంతి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ఛైర్మన్ పులవర్తి విశ్వనాథం, పాలక మండలి సభ్యుల ఆధ్వర్యంలో అర్చకులు శాస్త్రోక్తంగా కల్యాణ క్రతువు జరిగింది. ఈవో యర్రా వెంకటేశ్వరరావు, భక్తులు పాల్గొన్నారు.

విలువలు, నైపుణ్యంతో ఉన్నత సమాజం

గాంధీనగర్, న్యూస్‌టుడే: ప్రస్తుత పోటీ ప్రపంచంలో ముందుకు వెళ్లాలంటే ప్రతి విద్యార్థి మారుతున్న సాంకేతికతను అందిపుచ్చుకోవాలని, అదే సమయంలో కుటుంబ, సామాజిక విలువలు పాటించాలని జేఎన్‌టీయూకే ప్రొఫెసర్ ఆలపాటి శ్రీనివాసు అన్నారు. సోమవారం జగన్నాథపురంలోని ఎంఎస్ఎన్ ఛారిటీస్ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు మానవ విలువలు, నైపుణ్యాలు, కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమం జరిగింది. ప్రిన్సిపల్ ఉషారాణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఆలపాటి శ్రీనివాసు, మానికిరెడ్డి హెల్త్‌కేర్ ఫౌండేషన్ ఛైర్మన్ మానికిరెడ్డి సత్యనారాయణ హాజరై మాట్లాడారు. కన్వీనర్ రజనీదేవి, అధ్యాపకులు ఏడుకొండలు, సుబ్బారావు, వై.వి.రమణ, ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

కాకినాడ ఒకటో డివిజన్ పరిధిలోని వైద్య నగర్ రోడ్డు నంబరు 1 మలుపు వద్ద వీధి దీపాల స్తంభానికి ఏర్పాటు చేసిన విద్యుత్తు బాక్సుకు మూత లేక ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. చేతికి అందేంత తక్కువ ఎత్తులో ఉండటంతో పిల్లలు తాకే ప్రమాదముందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి మూత ఏర్పాటు చేయాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. -న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్

రహదారి కోత

కాకినాడ అశోక్‌నగర్ ప్రాంతంలోని నారాయణ పాఠశాల వద్ద రోడ్డు కోతకు గురవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. మురుగు కాలువ సైతం శిథిలమవడంతో మురుగంతా రోడ్డుపైకి చేరుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దుర్వాసనతోపాటు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వాహనదారులు విన్నవిస్తున్నారు. -న్యూస్‌టుడే, భానుగుడిసెంటర్

మురుగు తాండవం

కాకినాడ చిన మార్కెట్ ప్రధాన రహదారిపై మురుగు పారుతోంది. పక్కనే ఉన్న మ్యాన్‌హోల్‌లో పూడిక తీయకపోవడంతో మొత్తం రహదారిపై చేరింది. దాంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులకు గురయ్యారు. దుర్వాసన వెదజల్లడంతో పాటు దోమల వ్యాప్తి చెంది వ్యాధులబారిన పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, మసీదు సెంటర్ (కాకినాడ)

సైబర్ నేరం... ఆరుగురి అరెస్టు

ఎండాడ, న్యూస్‌టుడే: అంతర్జాతీయ సైబర్ ముఠాలకు బ్యాంకు ఖాతాలు అందించి నేరాలకు పాల్పడుతున్న ఆరుగురిని సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేశారు. విశాఖలోని ఎంవీపీ కాలనీలో నివసిస్తున్న ఎ.రజని కుమారి(63)కి ఈ ఏడాది మేలో మోహన్‌కుమార్ అనే వ్యక్తి నుంచి ఫోన్ కాల్ వచ్చింది. హవాలా లావాదేవీలకు సంబంధించి మీపై కేసు నమోదైందని భయపెట్టాడు. అరెస్టు చేస్తామని బెదిరించి నగదు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. రెండు రోజుల తర్వాత వెంకట్రామన్ అనే వ్యక్తి ఫోన్ చేసి డబ్బు చెల్లించకపోతే ముంబయి స్టేషన్‌లో డివిజన్ కారాగారంలో పెడతామని చెప్పాడు. ఆమె రూ.8.50 లక్షలు ఆన్‌లైన్‌లో పంపించారు. మరింత నగదు ఇవ్వాలని డిమాండ్ చేయడంతో మోసపోయినట్లు తెలుసుకుని సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసులో వి.సత్యనారాయణ(సామర్లకోట), నార్ని సతీష్ చంద్ర(కాకినాడ)తో పాటు మరో నలుగురిని అరెస్టు చేశారు. వీరంతా పలువురికి నగదు ఆశ చూపి వారి నుంచి టెలిగ్రాం ఛానల్ ద్వారా కరెంటు ఖాతాలు తెరచి సైబర్ ముఠా సభ్యులకు అప్పగిస్తున్నట్లు గుర్తించారు. డెబిట్ కార్డులు, పాస్ పుస్తకాలు, యూపీఎస్ స్కానర్స్, స్వైపింగ్ యంత్రాలు తదితరాలు స్వాధీనం చేసుకున్నారు.

ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరించాలి

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ కేటీ సుధాకర్ అన్నారు. సోమవారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. వివిధ వార్డుల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఉప కమిషనర్ శ్రీనివాస్, ఎస్ఈ వెంకట్రావు, డీసీపీ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కుల పరిరక్షణే లక్ష్యం

గోడపత్రికను ఆవిష్కరిస్తున్న జేసీ అపూర్వభరత్

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: వినియోగదారుల హక్కుల పరిరక్షణే లక్ష్యమని జేసీ అపూర్వభరత్ అన్నారు. ఈనెల 24న నిర్వహించనున్న జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని రూపొందించిన అవగాహన గోడ పత్రికను ఆయన ఆవిష్కరించారు. ఈనెల 18 నుంచి అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులకు వినియోగదారుల హక్కులపై వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య కార్యదర్శి హెచ్ఎస్ రామకృష్ణ, డీసీపీసీ సభ్యుడు కొమ్మూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దళితులపై వివక్ష చూపుతున్నారని ఆందోళన

నిరసన తెలుపుతున్న పేదలు, సంఘాల కార్యకర్తలు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: పెద్దాపురం మండలం, ఆనూరు గ్రామంలోని అల్లూరి సీతారామరాజు కాలనీలో నివసిస్తున్న దళిత కుటుంబాలపై వివక్ష చూపుతున్నారని, మౌలిక సదుపాయలు కల్పించడం లేదని, సంక్షేమ పథకాలు వర్తింప చేయడంలేదని ఆరోపిస్తూ సోమవారం కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం(ఏపీఆర్‌సీఎస్), ప్రగతిశీల మహిళా సంఘం(విముక్తి), పీడీఎస్‌యూ(వి) ఉమ్మడి జిల్లా శాఖల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏపీఆర్‌సీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ ఓటు వేయలేదనే నెపంతో మాజీ సర్పంచి కక్షకట్టి దళితులకు పథకాలు రాకుండా అడ్డుకుంటున్నారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం జేసీ అపూర్వభరత్‌కు వినతి పత్రం అందజేశారు. వల్లూరి రాజబాబు, కుంచే అంజిబాబు, మడికి సత్యం, కడితి సతీశ్, రెడ్డి దుర్గాదేవి, పైడిమల్ల యమున, బత్తిన శిరీష తదితరులు పాల్గొన్నారు.

దూరవిద్య కోర్సులను సద్వినియోగం చేసుకోవాలి

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: దూర విద్య కోర్సులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వ విద్యాలయం (ఇగ్నో) ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ ఇ.కృష్ణారావు సూచించారు. స్థానిక విద్యుత్‌నగర్ ఐడియల్ కళాశాల ఇగ్నో అధ్యయన కేంద్రం ద్వారా ప్రవేశాలు పొందిన పీజీ, యూజీ కోర్సుల విద్యార్థులకు సోమవారం పరిచయ కార్యక్రమం జరిగింది. అధ్యయన కేంద్ర ఇన్‌ఛార్జి సమన్వయకర్త జి.శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కృష్ణారావు హాజరై మాట్లాడారు. ఇగ్నో ద్వారా ఏడాదికి రెండు సార్లు (జులై, జనవరి) ప్రవేశాలు కల్పిస్తామని, అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆలయ పునఃనిర్మాణానికి విరాళాలిచ్చేవారు రసీదు పొందాలి

గాంధీనగర్, న్యూస్‌టుడే: నగరంలోని మెయిన్‌రోడ్డులో శ్రీసీతారామస్వామి వారి ఆలయ పునః నిర్మాణానికి సీజీఎఫ్ గ్రాంటు కోసం విరాళాలు సేకరిస్తున్నామని ఆలయ ఈవో యర్రా వెంకటేశ్వరరావు తెలియజేశారు. దాతలు ఆలయ ఈవో, ఛైర్మన్లను మాత్రమే సంప్రదించాలని , విరాళాలు ఇచ్చిన తరువాత తగు రసీదు పొందాలన్నారు. ఇతరులకు ఎవరికీ ఇవ్వొద్దని సూచించారు.

అప్రోచ్ దారులు నిర్మించాలి

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: కాకినాడ రామారావుపేట శివాలయం జంక్షన్ నుంచి నిర్మించిన ముత్తా వారధి (ఆర్వోబీ) వద్ద అప్రోచ్ రోడ్లను పూర్తిచేయించాలని మాజీ మున్సిపల్ కౌన్సిలర్ జీవీఎస్ శర్మ కోరారు. సోమవారం ఆయన స్థానికులతో కలిసి నగర ఎమ్మెల్యే వనమాడి కొండబాబుకు వినతిపత్రాన్ని అందించారు.

ప్రొఫెసర్ రాజీనామా ఆమోదం

సాంబమూర్తినగర్: కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో సీటీ శస్త్ర చికిత్స ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డా.ఎల్.హరివదాన్ రాజీనామాకు ఆమోదం తెలుపుతూ రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి సౌరభ్ గౌర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. 2024 మే నుంచి హరివదాన్ రాజీనామాను ఆమోదిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎంఎస్ఎన్ ఛారిటీస్ ఈవోగా సురేష్‌నాయుడు

గాంధీనగర్, న్యూస్‌టుడే: ఎంఎస్ఎన్ ఛారిటీస్ సహాయ కమిషనర్, ఈవోగా చాగంటి సురేష్ నాయుడు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు ఛారిటీస్ వంశపారంపర్య ధర్మకర్త, ఛైర్మన్ మల్లాడి కార్తీక్ నాయకర్, ధర్మకర్తల మండలి సభ్యులు పుష్ప గుచ్ఛాలతో అభినందించారు. అనంతరం ఆయన మర్యాద పూర్వకంగా కాకినాడ నగర ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావును కలిశారు.

దేవాదాయశాఖ దుకాణం అప్పగింత

గాంధీనగర్, న్యూస్‌టుడే: దేవాదాయ శాఖకు చెందిన విడోస్ హోంలోని ఓ దుకాణానికి లీజు సక్రమంగా చెల్లించడం లేదని రెండునెలల కిందట అధికారులు సీల్ వేశారు. దీనితో సంబంధిత దుకాణదారుడు కోర్టును ఆశ్రయించడంతో, అతనికి అప్పగించాలంటూ తీర్పునిచ్చింది. దీంతో సోమవారం సాయంత్రం సీల్‌ను తొలగించి లీజుదారుడైన బలువూరి రామకృష్ణకు అప్పగించారు. తనిఖీదారు ఫణీంద్రకుమార్, విడోస్ హోం వ్యవస్థాపక ధర్మకర్త, ఛైర్మన్ పైడా రామకృష్ణారావు, ఆశాఖ ఈవోలు హాజరై పోలీసు సమక్షంలో దుకాణాన్ని తెరిచి, పంచనామా అనంతరం అప్పగించారు.

ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలని, 2029లో మళ్లీ వైకాపా అధికారంలోకి వస్తుందని, కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తను గుర్తించుకుంటామని వైకాపా కాకినాడ నగర నియోజకవర్గం సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక డీ-కన్వెన్షన్ హాల్లో నియోజకవర్గస్థాయి కార్యకర్తల సమావేశాన్ని వైకాపా నగర అధ్యక్షురాలు, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైద్య కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ప్రజల నుంచి సేకరించిన సంతకాల ప్రతులను ఈనెల 10న వైకాపా జిల్లా కార్యాలయంలో అందజేస్తామన్నారు. కుడా మాజీ ఛైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, పసుపులేటి వెంకటలక్ష్మి, సుంకర విద్యాసాగర్, రాగిరెడ్డి బన్నీ, మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్నాం.. ఆదుకోండయ్యా!

కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌లో వేడుకోలు

న్యూస్‌టుడే, కాకినాడ కలెక్టరేట్

కడుపున పుట్టిన బిడ్డలు సాకడం లేదని, వృద్ధాప్యంలో ఆశ్రయం లేక అల్లాడుతున్నామని, ఎన్నో ఏళ్లుగా గూడు నిర్మించుకుని ఉంటున్న మమ్మల్ని తరిమేశారని, ఇళ్లు కూల్చివేశారని, ఎన్టీఆర్ భరోసా పింఛను ఇప్పించాలని.. ఇలా అనేక సమస్యలతో ప్రజలు అధికారులకు కోరారు. తమను ఆదుకోవాలని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో వినతిపత్రాలు అందజేశారు. ఆసరా కల్పించి సాంత్వన చేకూర్చాలని మొరపెట్టుకున్నారు.

సదరం ధ్రువపత్రం ఇవ్వండయ్యా..

కూలీ పనులు చేసుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. నాలుగున్నరేళ్ల మా కుమారుడు కుమార సూర్య గంగకు బ్రెయిన్ వ్యాధి సోకడంతో మంచానికే పరిమితమయ్యాడు. 2024, నవంబరు 24న జీజీహెచ్‌లోని సదరం శిబిరంలో వైద్య పరీక్షలు చేశారు. ఇప్పటి వరకు ధ్రువపత్రం ఇవ్వలేదు. నా బిడ్డకు ప్రతినెలా రూ.10 వేల ఔషధాలు కొని వాడుతున్నాం. చాలా పేద కుటుంబం మాది. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం. నా బిడ్డకు పింఛను ఇప్పించి, ఆదుకోండయ్యా. - కొప్పిరెడ్డి దుర్గాదేవి, కాజులూరు

బిడ్డలు తరిమేశారు.. ఆశ్రయం కల్పించరూ



నాకు నలుగురు బిడ్డలు. ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె. అందరికీ వివాహాలు అయ్యాయి. వేరు కాపురాలు ఉంటునానరు. పిఠాపురంలో నాకున్న ఇంటిని 16 ఏళ్ల కిందట విక్రయించి పిల్లలకు డబ్బులు ఇచ్చాను. నా ముగ్గురు బిడ్డలు నన్ను పట్టించుకోలేదు. కూతురు వద్ద అద్దె ఇంటిలో ఆశ్రయం పొందుతున్నాను. నాకు ఆసరా కల్పించండి. 94 ఏళ్ల వయసులో తలదాచుకోడానికి నీడలేక అల్లాడుతున్నాను. నాకు ఆశ్రయం కల్పించి ఆదుకోండి.

- అడబాల అచ్చిరాజు, వెంకట్‌నగర్, కాకినాడ

అర్ధరాత్రి అక్రమంగా ఇల్లు కూల్చేశారు

కాకినాడ నగరంలోని 25వ డివిజన్, పురంవారి వీధిలో మాకున్న స్థలంలో షెడ్ వేసుకుని జీవనం సాగిస్తున్నాం. ఈ నెల 5న అర్ధరాత్రి దాటిన తర్వాత గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి జేసీబీతో మా షెడ్‌ను కూల్చేశారు. అలజడి జరుగుతుందని గుర్తించి ఇంటి నుంచి బయటకు వచ్చేశాం. దీనికి కారణమైన వ్యక్తులపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. ఎన్నో ఏళ్లుగా 11 కుటుంబాలు ఇక్కడ నివసిస్తున్నాం. మాపై దౌర్జన్యం చేస్తున్నారు. మాకు రక్షణ కల్పించండి.

- వాడ్రేవు గంగమ్మ, స్థానికులు, పురంవారి వీధి, జగన్నాథపురం, కాకినాడ

బహిరంగ వేలం ప్రకటన

కాకినాడ నగరం, పేర్రాజుపేటలో వేంచేసియున్న శ్రీ కనకదుర్గ అమ్మవారి దేవస్థానం నందు కొబ్బరికాయలు, అరటిపళ్ళు, పూజా సామాగ్రి తోపుడు బండిపై దుకాణము పెట్టుకొని అమ్ముటకు 1-1-2026 నుండి 31-12-2027 వరకు 2 సంవత్సరాలు కాలమునకు మరియు అమ్మవారికి భక్తులచే సమర్పించబడిన కొబ్బరి చెక్కలు కొట్టగా వచ్చిన సగ భాగము అనుభవించు హక్కును 1-2-2026 నుండి 31-1-2028 వరకు రెండు సంవత్సరాలు కాలమునకు ది.17-12-2025 బుధవారం ఉదయం గం. 10.00కు వేలం జరుగును. మరియు 5-1-2026 సోమవారం ఉదయం గం.10.00 గంటలకు చీరలు పాట దేవస్థానం వద్ద బహిరంగ వేలం దేవాదాయశాఖ అధికారుల సమక్షంలో జరుగును.

కె.యస్.శర్మ, అర్చకస్వామి, శ్రీ నవదుర్గా సమాజం

(c) eenadu

కాకినాడ గ్రామీణం

• కాకినాడ గ్రామీణం • పెద్దాపురం • పిఠాపురం

గీతాసారం.. మురిసె నవతరం

సర్పవరం(కరప): భగవద్గీత సారం ఆచరించడం ద్వారా జీవితాన్ని సంతోషంగా గడపవచ్చని ఇస్కాన్ కాకినాడ ప్రతినిధి శ్రీధరదాస్ అన్నారు. సర్పవరం భావనారాయణస్వామి ఆలయంలో గీతా జయంతి వేడుకల్లో భాగంగా సోమవారం ఆయన భగవద్గీత పుస్తకాలను ఈవో శ్రీనివాసరావు చేతులమీదుగా కళాశాల విద్యార్థులకు అందజేశారు. భగవద్గీతను భక్తులందరూ చదవాలని ఆయన కోరారు.

క్షేత్రంలో పాఠం.. విద్యార్థుల ఉత్సాహం

గొల్లప్రోలు: పిఠాపురం ఆర్‌బీకేవీఎస్ జూనియర్ కళాశాలలో వృత్తి విద్య ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 52 మంది సోమవారం చేబ్రోలు పట్టు పరిశ్రమ కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ పెంచుతున్న మల్బరీ నర్సరీ, తోటలను, మార్కెట్‌లోని పట్టుగూళ్ల విక్రయాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. పట్టు పరిశ్రమ కేంద్రం అధికారి సత్యనారాయణ, అధ్యాపకులు మాధవి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పట్టు గూళ్లు పరిశీలిస్తున్న విద్యార్థులు

విహారంతో విజ్ఞానం

సర్పవరం(కరప): విద్యార్థులకు ఒత్తిడి లేని విద్య అందించేందుకు విజ్ఞాన విహార యాత్రలు ఎంతో దోహదం చేస్తాయని హెచ్‌ఎం సత్యవోలు శ్రీనివాస్ అన్నారు. కాకినాడ గ్రామీణ మండలం ఏపీఎస్పీ పాఠశాల విద్యార్థులను పీఎంశ్రీ ఎక్స్‌పోజర్ విజిట్‌లో కాకినాడ నుంచి రాజమహేంద్రవరానికి తీసుకెళ్లారు. నాగేశ్వరరావు, మూర్తి, హరిబాబు, నాగేశ్వరరావు, బాషా, సుమన్, త్రిమూర్తులు, విశాలాక్షి, రమాకుమారి, శ్రీలక్ష్మి, సుబ్బయ్య పాల్గొన్నారు.

మహిళలకు చేయూత

సర్పవరం(కరప): మహిళా సంక్షేమానికి ప్రభుత్వాలు సంక్షేమ పథకాలు అందిస్తున్నాయని ఎమ్మెల్యే నానాజీ అన్నారు. గొడారిగుంటలో సోమవారం ఎమ్మెల్సీ పద్మశ్రీ, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, ఇతర కూటమి నాయకులతో కలిసి 763 మంది మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఇతర కిట్లను అందజేశారు. ఎంపీపీ అనంతలక్ష్మి, డా. చప్పిడి వెంకటేశ్వరరావు, కడలి ఈశ్వరి పాల్గొన్నారు.

లయన్స్ తోవ.. విద్యాసేవ

సర్పవరం(కరప): నిరుపేద విద్యార్థుల అభ్యున్నతికి లయన్స్‌క్లబ్ విశేష కృషి చేస్తోందని లయన్స్ జోనల్ ఛైర్మన్ మిరియాల రామచంద్రన్ పేర్కొన్నారు. కాకినాడ గ్రామీణం అచ్చంపేట జంక్షన్‌లో సోమవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆయన రూ. 50 వేల నగదును పది మంది విద్యార్థులకు అందజేశారు. మాదిని ప్రసాద్ నాయుడు, శ్రీనివాస్, ఈశ్వరకుమార్, విశ్వేశ్వరరావు, రామచంద్రరావు, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

విజేత విల్లో వారియర్స్

పెద్దాపురం: పెద్దాపురం పట్టణంలోని వీర్రాజు ఎయిడెడ్ ఉన్నత పాఠశాల ఆవరణలో పెద్దాపురం చాంపియన్స్ లీగ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌లో సోమవారం జరిగిన మ్యాచ్‌లో యంగ్ ఫైటర్స్ జట్టుపై విల్లో వారియర్స్ జట్టు విజయం సాధించింది. పోటీలో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ సాధించిన గోలి విజయ్ కుమార్‌కు పట్టణానికి చెందిన భారత్ సోలార్ యజమాని శివాజీ ట్రోఫీ అందించారు.

ఆవేదన.. కోరుతోంది సాంత్వన

పిఠాపురం: పీజీఆర్‌ఎస్‌లో ఇచ్చిన అర్జీల స్థితిని 1100 నంబరుకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని పాడా పీడీ శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం పిఠాపురంలోని కార్యాలయంలో అర్జీలు స్వీకరించారు. 43 అర్జీలు రాగా అక్కడికక్కడే వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులతో చర్చించారు. తహసీల్దార్ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దారి బాగుకు నిధులు

– న్యూస్‌టుడే, పిఠాపురం

వైకాపా హయాంలో ర.భ.శాఖ రహదారులన్నీ గుంతలతో కనిపించేవి. ప్రయాణికులు తాము సురక్షితంగా గమ్యం చేరుతామనే నమ్మకం ఉండేది కాదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రహదారులు మెరుగుపడుతున్నాయి. ఇప్పటికే భారీగా రహదారులకు మరమ్మతులు చేయగా, రోడ్ల నిర్మాణాలకుసైతం నిధులు మంజూరయ్యాయి. పిఠాపురం నియోజకవర్గంలో ముఖ్యమైన రహదారులకు గతేడాది డిసెంబరులో మరమ్మతులు చేపట్టారు. వరదలు, వర్షాల కారణంగా దెబ్బతిన్న రోడ్లు ఈ ప్రాంతంలో చాలా ఉన్నాయి. వైకాపా అయిదేళ్ల పాలనలో ఓ ఒక్క రోడ్డునూ నిర్మించలేదు. దాంతో అడుగడుగునా గుంతలతో ఛిద్రమై కనిపిస్తున్నాయి. ● ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశాలతో ముఖ్యమైన రహదారులు ఇప్పటికే బాగుపడ్డాయి. మరికొన్నింటికి మరమ్మతులు చేశారు. ఈ నేపథ్యంలో పిఠాపురం, కొత్తపల్లి, గొల్లప్రోలు మండలాల్లోని ర.భ.శాఖ రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. అధికారులు టెండర్ల ప్రక్రియ పూర్తి చేశారు. గుత్తేదారులకు పనుల కేటాయింపు పూర్తయ్యింది. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఈ నెల 20వ తేదీ లోపు ఈ రోడ్ల పనులకు శంకుస్థాపన చేసి రోడ్డు నిర్మాణ పనులు మొదలు పెట్టే అవకాశం ఉన్న నేపథ్యంలో అధికారులు ఆ దిశగా ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మరో రెండు మూడు నెలల్లో ప్రధాన రహదారులన్నీ మెరుగుపడనున్నాయని అధికారులు చెబుతున్నారు. ఆ పనుల వివరాలివీ.

మల్లాం నుంచి ఎల్ఎన్‌పురం వెళ్లే దారి

పిఠాపురంలో..

✦ జల్లూరు నుంచి మల్లాం మీదుగా ఎల్ఎన్‌పురం వెళ్లే 1.7 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ.95 లక్షలు. ✦ కుమారపురం నుంచి పిఠాపురం మీదుగా ఉప్పాడ వెళ్లే 10 కిలోమీటర్ల రోడ్డుకు రూ.5.10 కోట్లు. ✦ పిఠాపురం నుంచి నేమాం వెళ్లే 5.5 కిలోమీటర్ల రోడ్డుకు రూ.2.10 కోట్లతో మరమ్మతులు చేయనున్నారు.

కొత్తపల్లిలో..

✦ కాకినాడ గ్రామీణంలోని పండూరు నుంచి ఉప్పాడ కొత్తపల్లి వెళ్లే 9.5 కిలోమీటర్ల పొడవు రహదారికి రూ.2.30 కోట్లు. ✦ అమీనాబాదు నుంచి ఉప్పాడ 5.5 కి.మీ.కి రూ.4.20 కోట్లు మంజూరయ్యాయి, టెండర్లు పిలవాల్సిఉంది.

గొల్లప్రోలులో..

✦ గొల్లప్రోలు పట్టణం నుంచి చేబ్రోలు గ్రామానికి వెళ్లే 9 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ.3.90 కోట్లు. ✦ గొల్లప్రోలు నుంచి రాపర్తి వెళ్లే 5.5 కిలోమీటర్లకు రూ.2 కోట్లు అవసరమని ప్రతిపాదనలు వెళ్లాయి.

అంతటా బాగు చేస్తాం

పిఠాపురం నియోజకవర్గంలోని ర.భ.శాఖ రహదారులన్నింటినీ బాగు చేస్తున్నాం. పిఠాపురం-సామర్లకోట దారి పూర్తయ్యింది. భీమ్‌నగర్ నుంచి గోకివాడ వెళ్లే రోడ్డు సౌకర్యంగా మారింది. ప్రతిపాదనలు పంపిన రోడ్లకు త్వరలోనే నిధులు విడుదలవుతాయి. టెండర్లు పూర్తయిన పనులకు ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ శంకుస్థాపన చేస్తారు.

– లోవరాజు, ర.భ.శాఖ, ఏఈ, పిఠాపురం

29న అపూర్వ స్వాగత సమ్మేళనం

పెద్దాపురం: పెద్దాపురం పట్టణంలోని రామారావుపేటలో ఉన్న శ్రీప్రకాష్ సినర్జీ స్కూల్‌లో ఈ నెల 26న హిందూ బంధువుల అపూర్వ స్వాగత సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు హిందూ ఐక్య సంఘం సోమవారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఆ రోజు మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించే కార్యక్రమానికి ప్రతి ఇంటి నుంచి హాజరు కావాలని కోరారు.

సంపూర్ణ పారిశుద్ధ్యం సాధిద్దాం

గొల్లప్రోలు: గ్రామాల్లో సంపూర్ణ పారిశుద్ధ్యం సాధించే దిశగా చర్యలు చేపడుతున్నట్లు ఎంపీడీవో సలాట్ రాజు తెలిపారు. దుర్గాడలో సోమవారం పర్యటించి చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ తీరును తనిఖీ చేశారు. ఇంటి పన్నుల వసూలుపై సిబ్బందితో చర్చించారు. డిప్యూటీ ఎంపీడీవో కుమార్, వెంకటేశ్వరరావు, కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE VI ADDL. DISTRICT JUDGE KAKINADA

E.P. No.756 / 2024 IN ARC NO. 589 of 2021

Between:
M/s Shiram Finance Ltd., (Erstwhile M/s Shiram City Union Finance Ltd)Kakinada Branch, Rep. by its Cheif Business Manager O.Krishna Kumar S/o O.V.V Subbarao, Kakinada
....Decred Holder

And

1.Chepala Tata Rao @Thata Rao
2. Chepala Satyavathi
3.Chepala Trimurthulu
4.Pavan Teja Real Estates Rep by its Proprietor Chepala Tata Rao
....Judgement Debtors

JDR4: Pavan Teja Real Estates Rep by its Proprietor Chepala Thata Rao, S/o Masenu, D.No.3-402/22, Opp: Jewel Medows, RTC Colony, Sarpavaram,Kakinada Rural, Kakinada District, Kakinada J.C.J.C.

[illegible] JDR [illegible] 18.12.2025 [illegible] 10.30 [illegible]

(కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
Gurram Srimannarayana Swami
Gurram Atchyutha Satya Sai Jyothi
Advocates, Kakinada
Cell No. 9866191397

అట్రాసిటీ కేసు నమోదుకు డిమాండ్

పెద్దాపురం: సంక్షేమ పథకాలు దళితులకు అందకుండా అడ్డుకుంటున్న పెద్దాపురం మండలం ఆనూరు మాజీ సర్పంచి అరవింద్‌పై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలంటూ ఏపీ రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో దళితులు సోమవారం ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఓటు వేయలేదని నెపంతో ఈ వివక్షకు పాల్పడుతున్నట్లు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరాంజనేయులు ఆరోపించారు. పథకాలు అందకుండా వివక్షకు పాల్పడుతున్న అతనిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్డీవో శ్రీరమణికి వినతి పత్రం అందజేశారు. రాజబాబు, అంజిబాబు, సత్యం, సతీష్, దుర్గాదేవి తదితరులు పాల్గొన్నారు. అనంతరం కాకినాడ కలెక్టరేట్‌లో జేసీకి వినతి పత్రం ఇచ్చారు.

ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న రైతుకూలీ సంఘం నాయకులు

అక్రమ వసూళ్లపై చర్యలు తీసుకోవాలి

గాంధీనగర్: తాళ్లరేవు ఉప్పంగలలో శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయానికి సంబంధించి ఇటీవల పరిణామాలు భక్తులను వేదనకు గురి చేసేలా ఉన్నాయని, చర్యలు తీసుకోవాలని ఎండోమెంట్ అధికారి నాగేశ్వరరావుకు గ్రామస్థులు, భక్తులు ఫిర్యాదు చేశారు. మహా రుద్రాభిషేకం నిర్వహిస్తున్నామంటూ గత నెలలో భక్తుల నుంచి భారీగా సొమ్ము వసూలు చేశారని, వాటికి ఎటువంటి లెక్కలు చూపించడం లేదని పేర్కొన్నారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా Union Bank of India — గాంధీనగర్ బ్రాంచి, 8-5-5/1, వెంకటనారాయణ స్ట్రీట్, గాంధీనగర్, కాకినాడ

స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి కొరకు)

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8(1))

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 ప్రకారము యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా [illegible] రూ.19,42,726.47 [illegible] తేది.02.08.2025 [illegible] 04.12.2025 [illegible] రూ.19,42,726.47 [illegible]

తనఖావుంచిన ఆస్తి వివరములు

[illegible] నెం. 225 లో మొత్తం 388 చ॥గు॥ల లో 300 చ॥గు॥లు లేదా 250.83 చ॥మీ॥ విస్తీర్ణంలో ఉన్న నివాస స్థలము మరియు భవనం **శ్రీమతి వట్టిప్రోలు మరియమ్మ @ మేరి, భర్త: విజయ్ అనిల్ కుమార్** గారికి చెందిన ఆస్తికి **హద్దులు: తూర్పు** : 32.00 అ॥ బుచ్చంపేట రోడ్, **పడమర** : 32.00 అ॥ ఎ వి రాజు మరియు ఇతరులకు చెందిన స్థలము, **ఉత్తరం** : 86.11 అ॥ క్లైమెంట్ ఆస్తి, **దక్షిణం** : 81.84 అ॥ బి ఎస్ ఎస్ బి ఆర్ వి ఎస్ జె ఎం గోపాలరావు గారి స్థలము.

ప్రదేశం : కాకినాడ
తేది : 04.12.2025
సం/- ఛీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి

సహకార ఉద్యోగుల నిరసన

పెద్దాపురం: సహకార సంఘ ఉద్యోగులు న్యాయమైన కోర్కెలు తీర్చాలని కోరుతూ సోమవారం స్థానిక డీసీసీబీ బ్రాంచి కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. జీవో నంబరు 36ను అమలు చేయాలని, 2019 తరువాత చేరిన ఉద్యోగులను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 29న విజయవాడలో నిర్వహించే ధర్నాలో అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. అనంతరం బ్రాంచి మేనేజర్ జ్యోతికి వినతిపత్రం అందజేశారు. సత్యనారాయణ, నాగభూషణం, అర్జునుడు, శ్రీనివాస్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సామర్లకోట: సామర్లకోట డీసీసీబీ బ్రాంచి వద్ద సిబ్బంది నిరసన కార్యక్రమం నిర్వహించారు. సీఈవో వెంకటేశ్వరరావు, మార్చిబాబు, సాంబశివరావు, శ్వేత, నవీన్, వీరబాబు పాల్గొన్నారు.

పెదపూడి: పెదపూడి సొసైటీ బ్యాంకు మండలంలోని నాలుగు సొసైటీల సిబ్బంది సోమవారం ధర్నా చేశారు. తాళ్లరేవు: నాయకులు గౌరీ శంకర్, సంపత్‌కుమార్, రామన్న తాళ్లరేవు సహకార బ్యాంకు వద్ద నిరసన తెలిపారు.

పెద్దాపురం: మేనేజర్‌కు వినతి పత్రం ఇస్తున్న ఉద్యోగులు

విద్యార్థికి న్యాయం చేయాలని విన్నపం

పవన్‌కల్యాణ్ నివాసం వద్ద బైఠాయించిన బంధువులు

గొల్లప్రోలు: చేబ్రోలులోని పవన్‌కల్యాణ్ నివాసం వద్ద గొల్లప్రోలుకు చెందిన ఇంటర్ విద్యార్థి ఆదిత్య హేమంత్ బంధువులు సోమవారం బైఠాయించి ఆందోళన నిర్వహించారు. రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఆత్మహత్యాయత్నం చేసిన హేమంత్ చికిత్స పొందుతూ మృతి చెందాడని, ఉపముఖ్యమంత్రి చొరవ చూపాలని విన్నవించారు. వారితో ఎస్సై రామకృష్ణ, జనసేన నాయకులు చర్చించారు.

సభకు ఆహ్వానం పిఠాపురం: ఎస్‌ఎఫ్ఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సిద్ధూ, శ్రీకాంత్ పిలుపునిచ్చారు. సోమవారం పిఠాపురం ఆర్‌బీకేవీఎస్ కళాశాలలో సమావేశం అనంతరం గోడ పత్రికలు ఆవిష్కరించారు.

ఇళ్లకు విన్నపం సామర్లకోట: టిడ్కో గృహాల రుణాలు రద్దు చేయాలని పురపాలిక కార్యాలయం వద్ద జగ్గమ్మగారిపేట, ఉప్పువారిపేట టిడ్కో గృహాల లబ్ధిదారులు, ఐద్వా నాయకులు సోమవారం ధర్నా నిర్వహించారు. ఉచితంగా ఫ్లాట్లు ఇవ్వాలన్నారు. కమిషనర్ శ్రీవిద్యకు వినతిపత్రం అందజేశారు.

చర్యలు చేపడతాం తాళ్లరేవు: రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు ఏఎస్పీ మనీష్ అన్నారు. కోరింగ పోలీస్ స్టేషన్‌ను ఆయన సోమవారం సందర్శించారు.

దారి మళ్లిస్తున్నాం తాళ్లరేవు: సుంకరపాలెం జాతీయ రహదారి నుంచి స్థానిక శివాలయం వరకు సీసీరోడ్డు నిర్మాణ పనులను మంగళవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు జేఈ లక్ష్మీప్రసన్న తెలిపారు. ట్రాఫిక్‌ను ఐలవరం నుంచి ఆదిలక్ష్మీనగర్ మీదుగా జాతీయ రహదారిపైకి మళ్లిస్తున్నామన్నారు.

వివక్షపై ఆగ్రహం కొత్తపల్లి: యు.కొత్తపల్లి మండలంలోని ఉప్పాడ జడ్పీ పాఠశాలలో విద్యార్థులపై వివక్ష చూపిన ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని సోమవారం దళిత నాయకులు డిమాండ్ చేశారు. గ్రామీణ కొత్తపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

నిరసన స్వరం కాకినాడ కలెక్టరేట్: మత స్వేచ్ఛను అడ్డుకోవడం తగదని గొల్లప్రోలులోని క్రైస్తవులు పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ పీజీఆర్‌ఎస్‌లో జేసీ అపూర్వభరత్‌కు వినతిపత్రం అందజేశారు. ఆదివారం ప్రార్థనలు చేసుకుంటే కొందరు దౌర్జన్యం చేశారని పేర్కొన్నారు.

సాగుకు సన్నద్ధం పిఠాపురం: పీబీసీ నుంచి నీరు విడుదలవుతోందని, రబీ సాగు సకాలంలో పూర్తిచేయాలని తూర్పుడెల్టా ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ సునీల్‌కుమార్ రైతుల్ని కోరారు. సోమవారం చిత్రాడ, యండపల్లిల్లో పర్యటించారు.

భూమి ఆక్రమించి.. మట్టి తరలింపు

తాళ్లరేవు, న్యూస్‌టుడే: పటవల- పాతకోరంగి సరిహద్దులో ఆలపాటి వెంకన్న, చింతా సముద్రుడికి 36 సెంట్ల అసైన్డ్ భూమి ఉంది. దానిని కొందరు ఆక్రమించి మట్టి తరలించుకుపోతున్నారని వెంకన్న, సముద్రుడి వారసులు రామకృష్ణ, శ్రీనివాస్, కృష్ణవరాజు, లక్ష్మీనారాయణ సోమవారం ఆవేదన వ్యక్తం చేశారు. అసైన్డ్ భూమిలో మట్టి తరలిస్తున్నారని పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పట్టించుకోవాలన్నారు. ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు టేకుమూడి ఈశ్వరరావు, కొప్పిరిశెట్టి సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

వాజ్‌పేయీ వ్యక్తిత్వం ప్రజలకు వివరిద్దాం

సర్పవరం(కరప): మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయీ వ్యక్తిత్వాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన ఆవశ్యకత ఎంతైనాఉందని రాష్ట్ర [illegible] వెల్ఫేర్ కార్పొరేషన్ ఛైర్మన్ సూర్యనారాయణరాజు అన్నారు. కాకినాడ గ్రామీణంలో సోమవారం ఆయన ఎమ్మెల్యే నానాజీని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. కాకినాడలో వాజ్‌పేయీ విగ్రహాలు ఏర్పాటు చేయాలని కోరారు.

అర్హులకు స్థలాలు చూపించాలి

పిఠాపురం: గత ప్రభుత్వ హయాంలో పేదలకు ఇళ్ల పట్టాలిచ్చినా.. స్థలాలు చూపించలేదని సీపీఐ నాయకుడు సాకా రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం పిఠాపురం పాడా పీడీకి వినతిపత్రం ఇచ్చారు.

మహాసభల జయప్రదానికి పిలుపు

సర్పవరం(కరప): సీఐటీయూ 18వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని సీఐటీయూ కాకినాడ గ్రామీణ మండల కార్యదర్శి తొట్టిపూడి రాజు కోరారు. వలసపాకలలో సోమవారం ఆయన ఆ సంస్థ ప్రతినిధులతో కలిసి జాతీయ మహాసభల గోడపత్రికలను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఈ నెల 31 నుంచి జనవరి 4వ తేదీవరకు విశాఖపట్నం కేంద్రంగా జాతీయ మహాసభలు జరగనున్నాయన్నారు. ప్రభుత్వరంగ సంస్థల రక్షణ, అసంఘటితరంగ కార్మికుల సామాజిక భద్రత, కనీస వేతనం, లేబర్‌కోడ్‌ల రద్దు డిమాండ్ తదితర అంశాలపై చర్చిస్తామన్నారు. నాయకులు అజయ్‌కుమార్, నూకరాజు, రామకృష్ణ, సింహాద్రి, విశ్వనాథ్, త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు. ✦ పెద్దాపురం: మహాసభల విజయవంతం కోరుతూ పెద్దాపురంలో నాయకులు శ్రీనివాస్, సత్యనారాయణ, శ్రీను, గంగా, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ మహాసభల గోడపత్రికను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

ఇద్దరు కనిపించడం లేదని పోలీసులకు వేర్వేరు ఫిర్యాదులు

గొల్లప్రోలు: దుర్గాడకు చెందిన 17 ఏళ్ల బాలిక ఈ నెల 7న ఇంటి నుంచి కనిపించడం లేదని తండ్రి ఫిర్యాదు చేయగా సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు. ✦ గొల్లప్రోలు: చేబ్రోలు హరేరామ నగర్‌కు చెందిన బీటెక్ విద్యార్థి ఈ నెల 6 నుంచి కనిపించడం లేదనే ఫిర్యాదుపై కేసు నమోదు చేశామని ఎస్సై రామకృష్ణ సోమవారం తెలిపారు. ఫోన్‌తోనే ఉంటున్నాడని తండ్రి మందలించడంతో ఎటో వెళ్లిపోయాడన్నారు.

ఆక్రమణలపై అధికారుల సర్వే

గొల్లప్రోలు: గొల్లప్రోలులోని కొత్తపేట వీధి 15వ వార్డులో వీధి రోడ్డు స్థలం ఆక్రమణకు గురైందని స్థానికులు చేసిన ఫిర్యాదుపై అధికారులు సోమవారం సర్వే చేపట్టారు. ఉన్నతాధికారులకు నివేదిస్తామని టీపీవో నీలిమ తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలపై అవగాహన పెంచాలి

సామర్లకోట: ప్రభుత్వ పాఠశాలలపై ప్రజలకు అవగాహన పెంచి పిల్లల్ని చేర్పించేలా అధికారులు చొరవచూపాలని మానవహక్కుల పరిరక్షణ సంఘం జిల్లా అధ్యక్షుడు నూతలపాటి అప్పలకొండ కోరారు. సోమవారం పురపాలిక కమిషనర్ శ్రీవిద్యకు వినతిపత్రం అందజేశారు.

यूनियन बैंक ऑफ इंडिया भारत सरकार का उपक्रम — యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, భారత ప్రభుత్వ రంగ సంస్థ

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
రమణయ్యపేట బ్రాంచి, గంగరాజునగర్, కాకినాడ.

స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి కొరకు)

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8(1))

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (సెకండ్) యాక్ట్, 2002 (యాక్ట్ 54 ఆఫ్ 2002) ప్రకారము **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, రమణయ్యపేట బ్రాంచి, గంగరాజునగర్, వలసపాకల, కాకినాడ, పిన్‌కోడ్-533005** యొక్క అధీకృత అధికారి అయిన ఈ దిగువ సంతకందారుడు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు 2002 నందలి సెక్షన్ 13(12)కు అనుబంధమైన నిబంధన 3 ప్రకారము సంక్రమించిన అధికారములతో **ఋణగ్రహీతలు / సహ-దరఖాస్తుదారు / హామీదారులు: 1) శ్రీమతి అన్నెం జానకి, భర్త: నాగేశ్వరరావు,** డి.నెం.8-1-104, స్టువర్ట్‌పేట, రామాలయం రోడ్డు, పిఠాపురం, కాకినాడ జిల్లా-533450. **2) శ్రీ అన్నెం నాగేశ్వరరావు, తండ్రి: రాజయ్య,** డి.నెం.8-1-104, స్టువర్ట్‌పేట, రామాలయం రోడ్డు, పిఠాపురం, కాకినాడ జిల్లా-533450. **3) శ్రీ విశ్వనాథుల అర్జున్‌రావు, తండ్రి: శేషగిరి,** డి.నెం.9-145/2, ప్లాట్ నెం.F2, శ్రీ భవానీ రెసిడెన్సీ, MPDO ఆఫీస్ దగ్గర, రమణయ్యపేట, కాకినాడ, కాకినాడ జిల్లా-533005 వారు చెల్లించవలసిన బకాయిమొత్తం **రూ.27,62,050/- (అక్షరాల ఇరవై ఏడు లక్షల అరవై రెండు వేల యాభై రూపాయలు మాత్రమే)** + వడ్డీ సదరు నోటీసు తేదీనుండి 60 రోజులలోగా చెల్లించవలసినదిగా **తేది.11-08-2025న డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.**

ఋణగ్రహీత(లు) / సహ-దరఖాస్తుదారు(లు) మరియు జామీనుదారులు ఋణ మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున, ఇందుమూలముగా సదరు ఋణగ్రహీతలకు / సహ-దరఖాస్తుదారులకు / జామీనుదారులకు మరియు సాధారణ ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా... సదరు చట్టం లోని సెక్షన్ 13(4) మరియు ఆ నిబంధనల లోని రూల్ 8 ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ, ఈ క్రింద సంతకం చేసిన అధికారి, దిగువ వివరించిన ఆస్తిని **04 డిసెంబర్ 2025 వ తేదీన తన స్వాధీనంలోకి తీసుకున్నారు.**

ముఖ్యంగా ఋణగ్రహీతను మరియు సాధారణ ప్రజానీకమును ఇందుమూలముగా హెచ్చరించునది ఏమనగా సదరు ఆస్తులతో ఎవ్వరూ ఎటువంటి లావాదేవీలు జరుపరాదనియు మరియు సదరు ఆస్తులతో జరిపే ఏ లావాదేవీలైనా బకాయిమొత్తం **రూ.27,62,050/- (అక్షరాల ఇరవై ఏడు లక్షల అరవై రెండు వేల యాభై రూపాయలు మాత్రమే)** మరియు వడ్డీతో మొ॥ **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా** వారి ఛార్జీకి లోబడి ఉంటాయి.

సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు గాను ఋణగ్రహీత / సహ-దరఖాస్తుదారు / హామీదారులకు అందుబాటులో ఉన్న సమయానికి సంబంధించి, సదరు చట్టం లోని సెక్షన్ 13(8) నిబంధనలను గమనించవలసిందిగా ఋణగ్రహీత / సహ-దరఖాస్తుదారు మరియు హామీదారుల దృష్టికి తీసుకురావడమైనది.

తనఖావుంచిన ఆస్తి వివరములు

షెడ్యూల్-A: (తేదీ 15-02-2017 నాటి రిజిస్టర్డ్ సేల్ డీడ్ మరియు డాక్యుమెంట్ నెంబరు 517/2017 ప్రకారం, దరఖాస్తుదారురాలైన **శ్రీమతి అన్నెం జానకి, భర్త నాగేశ్వర రావు గారి పేరిట ఉన్నది):**

తూర్పు గోదావరి జిల్లా, పిఠాపురం, పిఠాపురం మండలం, పిఠాపురం మున్సిపాలిటీ ఏరియా, పిఠాపురం సబ్-రిజిస్ట్రీ, స్టువర్ట్‌పేట, సర్వే నెం: 250/1, డోర్ నెం: 8-1-98 & 8-1-99 లో గల 77.75 చదరపు గజములు లేదా 64.53 చదరపు మీటర్ల స్థలము మరియు అందులో ఉన్న ఆర్‌సీసీ రూఫ్ గ్రౌండ్ + మొదటి అంతస్తు నివాస భవనము, అన్ని నిర్మాణములు మరియు అనుబంధములతో కూడిన ఆస్తి. దీని **సరిహద్దులు:**

ఐటమ్ నెం-1: (డోర్ నెం: 8-1-99 తో కూడిన 53.5 చదరపు గజముల లేదా 44.405 చదరపు మీటర్ల స్థలము) **తూర్పు:** 28'-06'' - దిగువ పేర్కొన్న ఐటమ్ నెం: 3, **దక్షిణం:** 16'-11'' - దుడ్డు రామకృష్ణ గారి ప్రహరీ గోడ, **పడమర:** 28'-06'' - దాకోజు పాపి గారి ప్రహరీ గోడ, **ఉత్తరం:** 16'-11'' - దిగువ పేర్కొన్న ఐటమ్ నెం: 2.

ఐటమ్ నెం-2: (డోర్ నెం: 8-1-98 తో కూడిన 18 చదరపు గజముల లేదా 14.94 చదరపు మీటర్ల స్థలము): **తూర్పు:** 10'-00'' - దిగువ పేర్కొన్న ఐటమ్ నెం: 3, **దక్షిణం:** 16'-03'' - పైన తెలిపిన ఐటమ్ నెం: 1, **పడమర:** 10'-00'' - దాకోజు పాపి గారి ప్రహరీ గోడ, **ఉత్తరం:** 16'-03'' – కొనుగోలుదారు అన్నెం జానకి గారు, బాదం రాజా వెంకట పవన్ హరీష్ నుండి కొనుగోలు చేసిన స్థలము.

ఐటమ్ నెం-3: (డోర్ నెం: 8-1-99 తో కూడిన మొత్తం 12.5 చదరపు గజములు లేదా 10.37 చదరపు మీటర్ల స్థలములోని అవిభక్త 1/2 వంతు వాటా అంటే 6.25 చదరపు గజములు లేదా 5.18 చదరపు మీటర్ల స్థలము): **తూర్పు:** 28'-06' - కొనుగోలుదారు అన్నెం జానకి గారు, బాదం రాజా వెంకట పవన్ హరీష్ నుండి కొనుగోలు చేసిన స్థలము, **దక్షిణం:** 03'-06'' - దుడ్డు రామకృష్ణ గారి ప్రహరీ గోడ, **పడమర:** 28'-06'' - పైన తెలిపిన ఐటమ్ నెం: 1, ఉత్తరం: 03'-06'' – ఉమ్మడి దారి.

పైన తెలిపిన ఐటమ్ నెంబర్లు 1 నుండి 3 సరిహద్దుల మధ్య ఉన్న మొత్తం 77.75 చదరపు గజముల లేదా 64.53 చదరపు మీటర్ల స్థలము, అన్ని ఉమ్మడి దారులు, నీటి వనరులు మరియు అన్ని ఈజ్‌మెంట్ హక్కులతో సహా.

షెడ్యూల్-B: (తేదీ 15-02-2017 నాటి రిజిస్టర్డ్ సేల్ డీడ్ మరియు డాక్యుమెంట్ నెంబరు 518/2017 ప్రకారం, దరఖాస్తుదారురాలైన **శ్రీమతి అన్నెం జానకి, భర్త నాగేశ్వర రావు గారి పేరిట ఉన్నది):**

తూర్పు గోదావరి జిల్లా, పిఠాపురం, పిఠాపురం మండలం, పిఠాపురం మున్సిపాలిటీ ఏరియా, పిఠాపురం సబ్-రిజిస్ట్రీ, స్టువర్ట్‌పేట, సర్వే నెం: 250/1, డోర్ నెం: 8-1-98 & 8-1-99 లో గల 79.25 చదరపు గజములు లేదా 65.77 చదరపు మీటర్ల స్థలము మరియు అందులో ఉన్న RCC రూఫ్ గ్రౌండ్ + మొదటి అంతస్తు నివాస భవనము, అన్ని నిర్మాణములు మరియు అనుబంధములతో కూడిన ఆస్తి.

ఐటమ్ నెం-1: (డోర్ నెం: 8-1-99 తో కూడిన 60.5 చదరపు గజముల లేదా 50.21 చదరపు మీటర్ల స్థలము): **తూర్పు:** 28'-06'' – కోసూరి సుబ్బారావు గారికి చెందిన స్థలము, **దక్షిణం:** 19'-01'' - దుడ్డు రామకృష్ణ గారికి చెందిన స్థలము, **పడమర:** 28'-06'' - దిగువ పేర్కొన్న ఐటమ్ నెం: 3, **ఉత్తరం:** 19'-01'' - అనుకుల సత్యనారాయణ గారికి చెందిన స్థలము.

ఐటమ్ నెం-2: (డోర్ నెం: 8-1-98 తో కూడిన 12.5 చదరపు గజముల లేదా 10.375 చదరపు మీటర్ల స్థలము): **తూర్పు:** 06'-10'' – 3 అడుగుల 6 అంగుళాల వెడల్పు గల ఉమ్మడి దారి, **దక్షిణం:** 16'-03'' - కొనుగోలుదారు అన్నెం జానకి గారు, బాదం మోహన్ బాబు నుండి కొనుగోలు చేసిన స్థలము, **పడమర:** 06'-10'' - దాకోజు పాపి గారి ప్రహరీ గోడ, **ఉత్తరం:** 16'-03'' – గోలి అర్జున రావు గారికి చెందిన ఆస్తి వాటా.

ఐటమ్ నెం-3: (డోర్ నెం: 8-1-99 తో కూడిన మొత్తం 12.5 చదరపు గజములు లేదా 10.37 చదరపు మీటర్ల స్థలములోని అవిభక్త 1/2 వంతు వాటా అంటే 6.25 చదరపు గజములు లేదా 5.18 చదరపు మీటర్ల స్థలము): **తూర్పు:** 28'-06'' - పైన తెలిపిన ఐటమ్ నెం: 1, **దక్షిణం:** 03'-06'' - దుడ్డు రామకృష్ణ గారి ప్రహరీ గోడ, **పడమర:** 28'-06'' - కొనుగోలుదారు అన్నెం జానకి గారు, బాదం మోహన్ బాబు నుండి కొనుగోలు చేసిన స్థలము, **ఉత్తరం:** 03'-06'' – ఉమ్మడి దారి.

పైన తెలిపిన ఐటమ్ నెంబర్లు 1 నుండి 3 సరిహద్దుల మధ్య ఉన్న మొత్తం 79.25 చదరపు గజములు లేదా 65.77 చదరపు మీటర్ల స్థలము, అన్ని ఉమ్మడి దారులు, నీటి వనరులు మరియు అన్ని ఈజ్‌మెంట్ హక్కులతో సహా.

మొత్తం ఆస్తి వివరాలు: పైన తెలిపిన షెడ్యూల్-A మరియు షెడ్యూల్-B ఆస్తుల పరిధిలో ఉన్న మొత్తం 157 చదరపు గజముల స్థలము, దానిలో ప్రతిపాదిత ఆర్‌సిసి రూఫ్ గ్రౌండ్ + మొదటి అంతస్తు నివాస భవన నిర్మాణము, అన్ని సూపర్ స్ట్రక్చర్లు, అనుబంధాలు మరియు అన్ని ఉమ్మడి దారులు, నీటి మార్గాలు మరియు అన్ని ఈజ్‌మెంట్ హక్కులతో సహా.

తేది: 04.12.2025, ప్రదేశము: పిఠాపురం — సం/- ఛీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

ఊక లారీ.. ఇతరులకు వర్రీ..

కరప మండల పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి వెళ్తున్న ఊక లారీలతో వాహన చోదకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఊక లారీలకు ఇరుపక్కలా బరకాలు వేసి అధిక లోడుతో పగటి పూటే రవాణా చేస్తుండటంతో రోడ్డంతా ఆక్రమిస్తున్నాయి. దాంతో ఇతర వాహనదారులు వెళ్లలేని పరిస్థితి. ఎస్సై సునీత చర్యలు తీసుకుంటామన్నారు.

– న్యూస్‌టుడే, కరప



దారి కోత.. జనానికి వెత

పెద్దాపురం మండలం గోరింట నుంచి పులిమేరు వెళ్లే ప్రధాన రహదారి కోతకు గురైంది. ఏలేరు కాలువలో నీటి ప్రవాహం వల్ల రహదారి అప్రోచ్ దెబ్బతింది. ఈ ప్రాంతంలో మలుపు ఉండటంతో వాహనాలు కాలువలోకి దూసుకు వెళ్లే పరిస్థితి. ర.భ. శాఖ డీఈఈ రాఘవరావును సమస్య గురించి అడగ్గా నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, పెద్దాపురం



ఖాళీ జాగా.. ఉండేదిలాగా..?

పిఠాపురంలోని విద్యుత్తునగర్‌లోని పలు ప్రాంతాల్లో ఖాళీ స్థలాలు ఉన్నాయి. కాలువల్లో మురుగు నీరంతా ఆయా స్థలాల్లో చేరుతోంది. దాంతో దుర్వాసన, దోమల వ్యాప్తి పెరిగి చుట్టూ ఇళ్లలోని వారు అక్కడ నివాసం ఉండలేని పరిస్థితి నెలకొంది. కమిషనర్ రాజు మురుగు నీరు వెళ్లకుండా చర్యలు చేపడతామన్నారు.

– న్యూస్‌టుడే, పిఠాపురం

మురుగు.. ఎన్నడు తొలగు..

గొల్లప్రోలులోని దేవునిగుడి రామాలయం దగ్గర మురుగు నీరు ప్రధాన రహదారిపై ప్రవహిస్తోంది. డ్రెయిన్ వ్యర్థాలతో మూసుకుపోయి మురుగు కిందకు వెళ్లేదారిలేక రోడ్డుపైకొస్తోంది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. డ్రెయిన్‌లో వ్యర్థాలు తొలగించే పనులు చేపడతామని పారిశుద్ధ్య పర్యవేక్షణాధికారి రఘుప్రసాద్ తెలిపారు.

– న్యూస్‌టుడే, గొల్లప్రోలు

(c) eenadu

తుని
•తుని •ప్రత్తిపాడు •జగ్గంపేట

లోవ దేవస్థానం సేవలు @ మనమిత్ర
తుని గ్రామీణం: మనమిత్ర యాప్ ద్వారా లోవ ఆలయంలో భక్తులకు సేవలు అందేవిధంగా ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రధానంగా దేవస్థానంలో ప్రత్యక్ష, పరోక్ష సేవలు, పూజలు, వసతి గదులకు మనమిత్ర యాప్ ఫోన్ నంబరు 95523 00009 ద్వారా నమోదు చేసుకొనే అవకాశం ఉందని డీసీ విశ్వనాథరాజు తెలిపారు.

నిత్యాన్నదానానికి రూ.1,01,116 విరాళం
అన్నవరం, న్యూస్‌టుడే : అన్నవరం దేవస్థానంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి ఓ భక్తుడు రూ.1,01,116 విరాళాన్ని సోమవారం అందించారు. హైదరాబాద్‌కు చెందిన చింతా గోవింద్ విశ్వేశ్, స్వప్న ప్రియ దంపతులు విరాళాన్ని ఈవో సుబ్బారావుకు అందించి ఏటా డిసెంబరు 17న తమ పేరుమీద అన్నదానం చేయాలని కోరారు.

డబ్బు పంపమని అడిగితే సైబర్ మోసమే: సీఐ
ప్రత్తిపాడు: ఫోన్ చేసి డబ్బు పంపమని అడిగితే సైబర్ మోసంగానే భావించాలని సీఐ బి.సూర్యఅప్పారావు స్పష్టం చేశారు. ఇటీవల సర్కిల్ పరిధిలో పలువురికి వచ్చిన ఫోన్‌కాల్స్ విషయమై ఆయన ప్రజలను అప్రమత్తం చేశారు. ఒమ్మంగిలో పెట్రోలు బంకు యజమానికి ఓ వ్యక్తి పోలీసునని తాను పంపిన స్కానర్‌కు డబ్బులు పంపమని ఫోన్ చేశాడన్నారు. అప్రమత్తమవ్వడంతో నష్టపోలేదన్నారు.

పేదల ఆకలితీరుస్తున్న అన్న క్యాంటీన్
జగ్గంపేట గ్రామీణం: ఆకలితో ఇబ్బందులు పడే చిరు వ్యాపారులు, బాటసారుల ఆకలి తీర్చేందుకు అన్న క్యాంటీన్లు ఉపయోగపడుతున్నాయని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. జగ్గంపేట ఎన్టీఆర్ స్మారక మందిరం వద్ద సోమవారం ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌లో భోజనాలు వడ్డించారు. మల్లిసాలకి చెందిన మట్టే శ్రీనివాస్, సింగరపద్మరాజు, శ్రీహర్ష సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

మేమున్నాం.. మీకు తోడుగా
ఉ॥ 10 - మ॥ 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: తుని: 9100020946, ప్రత్తిపాడు: 98669 62946 జగ్గంపేట: 80086 22066

తాగునీటి వృథాను అరికట్టరూ..!
సమస్య: ఎన్ఎస్‌వీ నగరంలో తాగునీటి కొళాయిలకు మూతలు లేకపోవడంతో నీటి వృథా కావడంతోపాటు రోడ్లు చిత్తడిగా మారుతున్నాయి. - వెంకటరమణ, స్థానికుడు
సమాధానం: సమస్యను పంచాయతీ కార్యదర్శికి తెలియజేసి కొళాయిలకు మూతలు ఏర్పాటు చేయిస్తాం. - మరిడయ్య, డిప్యూటీ ఎంపీడీవో

ఆక్రమణలను నిలువరించరూ..!
సమస్య: స్థానిక ఊర చెరువు కాలనీ రహదారి ఆక్రమణలకు గురవుతుంది. అధికారులు స్పందించి రహదారి ఆక్రమణకు గురి అవకుండా చూడాలి. - బాబూరావు, గ్రామస్థుడు
సమాధానం: రహదారి ఆక్రమణకు ప్రయత్నిస్తున్న విషయం మా దృష్టికి వచ్చింది. వారికి నోటీసులు ఇచ్చి ఆక్రమణకు గురి కాకుండా చూస్తాం. - రాజ్యలక్ష్మి, వీఆర్వో

కాలువలను శుభ్రం చేయరూ..!
సమస్య : మండలంలోని తిరుమాలిలో మురుగు కాలువల్లో చెత్త పేరుకుపోయి నీరు ముందుకు ప్రవహించకపోవడంతో దోమల సమస్య అధికమైంది. - వీరబాబు, తిరుమాలి.
సమాధానం: సిబ్బందిని పంపి కాలువలను శుభ్రం చేయించేందుకు చర్యలు తీసుకుంటాం. - సూతి కృష్ణ ప్రసాద్, సర్పంచి, తిరుమాలి

– న్యూస్‌టుడే, తుని గ్రామీణం, తొండంగి, ఏలేశ్వరం

పదిలో నూరు అడుగులు
● ఈనెల ఆరు నుంచి ప్రణాళిక

శంఖవరం, రౌతులపూడి, న్యూస్‌టుడే: విద్యార్థుల భవిష్యత్తుకు కీలకమైన 'పది'లో మెరుగైన ఫలితాల సాధనకు ఉపాధ్యాయులు కృషిచేస్తున్నారు. శతశాతం ఉత్తీర్ణతకు విద్యాశాఖ రూపొందించిన వంద రోజుల ప్రణాళిక ఈ నెల 6 నుంచి మార్చి 15 వరకు కొనసాగనుంది. అదనపు తరగతుల నిర్వహణతో పాటు సెలవు రోజుల్లోనూ ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నారు. విద్యార్థుల్లో అభ్యసన స్థాయి పెరిగి ఆత్మస్థైర్యం పెంపొందించుకోవడానికి ఈ ప్రణాళిక ఉపయోగపడుతుందని పలువురు ఉపాధ్యాయులు చెబుతున్నారు.

ప్రత్తిపాడు నియోజకవర్గంలోని 32 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 3,200 మంది విద్యార్థులు 'పది' చదువుతున్నారు. రానున్న పరీక్షల నేపథ్యంలో ఉపాధ్యాయులు వంద రోజుల ప్రణాళికలో భాగంగా రోజూ ఉదయం 8 నుంచి సాయంత్రం 4గంటల వరకు వివిధ సబ్జెక్టులను నాలుగు విడతలుగా చదివిస్తారు. చివరి విడతలో నిపుణులు తయారుచేసిన ప్రశ్నాపత్రాల్ని ఆన్‌లైన్ నుంచి సేకరించి పరీక్షలు నిర్వహిస్తారు. అందులో వచ్చిన మార్కులను ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తారు. రెండో శని, ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు తరగతులు నిర్వహిస్తారు. సెలవు దినాల్లో సైతం విద్యార్థులకు భోజన వసతి ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రీ ఫైనల్ పరీక్షలు ఫిబ్రవరి 12 నుంచి 19 వరకు, గ్రాండ్ టెస్ట్ మార్చి 2 నుంచి 12 వరకు నిర్వహిస్తారు. వార్షిక పరీక్షలు మార్చి 16 నుంచి ప్రారంభం కానున్నాయి.

మార్గదర్శకాలు ఇవీ..
విద్యార్థుల సామర్థ్యం ఆధారంగా లెవెల్-1,(ఎ, బి), లెవెల్-2 (సి,డి) కేటగిరీలుగా విభజించారు. రోజూ ఉదయం 8 నుంచి 9 గంటల వరకు రెమిడియల్ బోధనతో పాటు సందేహాలను నివృత్తి చేస్తారు. లెవెల్-1 విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించేలా, లెవెల్-2 విద్యార్థులు ఉత్తీర్ణత సాధించేలా తీర్చిదిద్దడంతో పాటు పరీక్షలంటే భయం పోగొట్టేలా శిక్షణ ఇస్తున్నారు.


విద్యార్థులకు సందేహాలను నివృత్తి చేస్తున్న ఎంఈవో ఎస్వీరమణ

శతశాతం ఉత్తీర్ణతకు దోహదం
'పది'లో మెరుగైన ఫలితాలు సాధించే దిశగా విద్యాశాఖ ఈ కార్యక్రమాన్ని రూపొందించింది. అన్ని పాఠశాలల్లో 100 రోజులు ప్రణాళిక ప్రారంభించాం. విద్యార్థుల సామర్థ్యం ఆధారంగా లెవెల్-1, 2లుగా విభజించి, వారి ప్రతిభను తల్లిదండ్రులకు ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నాం. - ఎస్వీరమణ, ఎంఈవో శంఖవరం

పేదరిక నిర్మూలనకు పక్కా ప్రణాళిక
ప్రత్తిపాడు: పక్కా ప్రణాళికతో సమష్టిగా కృషి చేస్తే నియోజకవర్గంలో పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. పెదశంకర్లపూడిలోని తన కార్యాలయంలో పీ4 కార్యక్రమాన్ని అధికారులతో సోమవారం సమీక్షించారు. ప్రైవేటు, ప్రభుత్వం, ప్రజల భాగస్వామ్యంతో గ్రామాల సమగ్ర అభివృద్ధికి చేపట్టే పనుల వివరాలను ఆరా తీశారు. ఎంపీడీవో కుమార్‌బాబు పాల్గొన్నారు.

పాఠశాలకు క్రీడా సామగ్రి అందజేత
కోటనందూరు: కోటనందూరు ప్రాథమిక పాఠశాలకు మళ్ల సుమిత్రారావు, వరలక్ష్మీ దంపతులు క్రీడా సామగ్రిని సమకూర్చారు. వాటిని పాఠశాల విద్యాకమిటీ ఛైర్మన్ గింజాల దేవి, హెచ్‌ఎం సత్యవతికి దాతల తరఫున దాడి కొండబాబు సోమవారం అందజేశారు. వారు మాట్లాడుతూ.. క్రీడలపై ఆసక్తి పెంచుకోవడం ద్వారా భవిష్యత్తు మంచి మార్గంలో నడుస్తుందన్నారు.

ఎనిమిది లారీలపై కేసులు

తొండంగి, న్యూస్‌టుడే: భద్రత నియమాలు పాటించకుండా తొండంగి-అన్నవరం ప్రధాన రహదారిలో రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ వాహనాల వల్ల గ్రామస్థులు భయాందోళనకు చెందుతున్నారు. ఈ సమస్యపై సోమవారం ఈనాడులో 'బండరాళ్లు జారితే అంతే' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ వార్తకు కత్తిపూడి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ బి.శ్రీవాస్, సిబ్బంది చర్యలు చేపట్టారు. సోమవారం పరదాలు కప్పకుండా సామగ్రిని తరలిస్తున్న ఎనిమిది లారీలపై కేసులు నమోదు చేశారు. రెండో సారి నిబంధనలు పాటించకుండా అతిక్రమిస్తే లైసెన్స్ రద్దు చేస్తామని ఎంవీఐ హెచ్చరించారు.

ప్రజలు మెచ్చేలా ఆసుపత్రి సేవలు ఉండాలి
ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: ప్రత్తిపాడు సీహెచ్‌సీ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ ఎ.సోము సోమవారం పెదశంకర్లపూడిలోని కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆసుపత్రి నిర్వహణ, సేవలు ప్రజలు మెచ్చేలా ఉండాలని ఎమ్మెల్యే అన్నారు. ప్రభుత్వం కల్పించిన ప్రతి సౌకర్యం సద్వినియోగం కావాలని, పాలనా వ్యవహారాలు పారదర్శకంగా ఉండాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు వెలుగుల నాని ఉన్నారు.

రక్షణ చర్యలపై విద్యార్థులకు అవగాహన
జగ్గంపేట గ్రామీణం: ప్రమాదాలు జరిగినపుడు చేపట్టాల్సిన రక్షణ చర్యలపై ఎన్‌డిఆర్ఎఫ్ సిబ్బంది విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రాజపూడి, మల్లిసాల, రామవరం గ్రామాల్లో ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు సోమవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలు సంభవించినపుడు వ్యక్తిని రక్షించడం, తుపాను, అగ్నిప్రమాదాల్లో చిక్కుకున్న వారిని రక్షించే విధానాలు ప్రయోగాత్మకంగా వివరించారు. హెచ్ఎం నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రామవరం జడ్పీ పాఠశాల విద్యార్థులకు అవగాహన

డిపో వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

బస్సుల సంఖ్య పెంచాలి
తుని పట్టణం: స్త్రీ శక్తి ఉచిత బస్సు ప్రయాణ పథకం ద్వారా ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరించాలని ఏపీఎస్ఆర్టీసీ యునైటెడ్ వర్కర్స్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో తుని డిపో ఆవరణలో సోమవారం సమావేశం నిర్వహించి నినాదాలు చేశారు. నాయకులు కే.ఎస్.పీ.రావు, డి.సాయిహరిత, ఎం.ఎస్.నారాయణ తదితరులు మాట్లాడారు. బస్సుల సంఖ్య పెంచాలని, హైడ్రాలిక్ డోర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వినతిపత్రాన్ని అధికారులకు అందజేశారు.

వైష్ణవి జూనియర్ కళాశాలలో ప్రసంగిస్తున్న విద్యార్థిని

ఉపన్యసించారు.. బహుమతులు సాధించారు
▲ 'ఈనాడు- ఈటీవీ' ఆధ్వర్యంలో ప్రతిభాపాటవ పోటీలు

తుని, న్యూస్‌టుడే: 'ఈనాడు - ఈటీవీ' ఆధ్వర్యంలో పట్టణంలోని వైష్ణవి జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ప్రతిభాపాటవ పోటీలు సోమవారం జరిగాయి. 'కృత్రిమ మేధ (ఏఐ) వల్ల భవిష్యత్తులో వచ్చే మార్పులు' అనే అంశంపై విద్యార్థులు ఉపన్యాసం ఇచ్చారు. కళాశాల అధ్యాపకులే న్యాయనిర్ణేతలుగా వ్యవహరించి విజేతలను ఎంపిక చేశారు. ఈ పోటీల్లో వి.పావని లలిత, జె.మహాలక్ష్మి, వై.రేణుక సాయి వరుసగా మూడు స్థానాల్లో నిలిచారు. ఈనాడు సమాచార్ల బహుమతులు, ప్రశంసాపత్రాలను ప్రిన్సిపల్ వి.వీరభద్రరావు, అధ్యాపకులు ఎస్.లత, వి.దుర్గాదేవి అందజేశారు.

బహుమతులు అందుకున్న విజేతలతో ఉపాధ్యాయులు

దుర్గాదేవికి ఇత్తడి తోరణం బహూకరణ
జగ్గంపేట గ్రామీణం, కిర్లంపూడి, న్యూస్‌టుడే: జె.కొత్తూరు శివారులో కొలువైన కనకదుర్గాదేవి అమ్మవారికి రూ.30 వేల విలువైన ఇత్తడి మకర తోరణం బహూకరించారు. మల్లేపల్లికి చెందిన తేలు రామకృష్ణ రాజేశ్వరి దంపతులు 18 కిలోల ఇత్తడితో మకర తోరణం తయారు చేయించి అందజేశారు. దుర్గాదేవి జాతర పురస్కరించుకుని ఎస్ఐ రఘునాథరావు చేతుల మీదుగా ఆలయకమిటీ సభ్యులు, గ్రామ పెద్దలకు అందజేశారు. సోమవారం అమ్మవారికి అలంకరించినట్లు కమిటీ చైర్మన్ నకిరెడ్డి శివ తెలిపారు.

వార్షికోత్సవ పూజలు..: రామచంద్రపురంలో కనకదుర్గాదేవి అమ్మవారి వార్షికోత్సవ పూజలు ఘనంగా నిర్వహిస్తున్నారు. 5 రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తుండగా అమ్మవారిని వెండి చీరతో సుందరంగా అలంకరించారు. జగ్గంపేట నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి తుమ్మలపల్లి రమేష్, సర్పంచి సాయిగణేశ్వర్, గ్రామ పెద్దలు అమ్మవారికి పూజలు నిర్వహించారు.

అమ్మవారికి ఇత్తడి మకరతోరణం అలంకరణ

హైవేపై మంట.. వాహనదారులకు తంటా
హైవే నిర్వహణలోపం అడుగడుగునా కనిపిస్తోంది. తుని గ్రామీణ మండల పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో హైవే కంపోస్టుయార్డులను తలపిస్తోంది. దీంతో చెత్తను మంట పెట్టడంతో బూడిద ద్విచక్ర వాహనదారుల కళ్లల్లో పడుతోంది. దీంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. వి.కొత్తూరు కూడలి, జగన్నాథగిరి తదితర ప్రాంతాల్లో ఈ పరిస్థితి నెలకొంది. - న్యూస్‌టుడే, తుని గ్రామీణం

కోతులు బాబోయ్..!
తుని పట్టణంలో కోతుల బెడద అధికంగా ఉంది. సీతారాంపురం, అమ్మాజీపేట, కొత్తపేట తదితర ప్రాంతాల్లో రోజూ ఇళ్లలోకి చొరబడి దాడి చేస్తుండటంతో పిల్లలు, పెద్దలు ఆందోళనకు గురవుతున్నారు. రైల్వేస్టేషన్, ఆర్టీసీ కాంప్లెక్స్‌లోనూ మకాం వేసి ప్రయాణికుల చేతుల్లో ఉన్న తినుబండారాలు లాక్కొని పారిపోతున్నాయి. దీనిపై శానిటరీ ఇన్‌స్పెక్టర్ సలీమ్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా చర్యలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, తుని

హెచ్చరిక బోర్డు వద్దనే చెత్త
కొత్త యర్రవరం ర.భ.శాఖ ప్రధాన రహదారి చెంత ఉన్న ఇక్కడ చెత్త వేస్తే జరిమానా అనే హెచ్చరిక బోర్డు వద్దనే స్థానికులు చెత్త వేస్తున్నారు. చెత్తను తరలించకపోవడంతో మినీ డంపింగ్ యార్డులా మారి రోడ్డుపైకి చేరుతోంది. దీంతో సమీపాన ఉన్న ధనలక్ష్మీ తల్లి ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, ఏలేశ్వరం

తేమ తగ్గాలి.. ధర రావాలి
పంపా రిజర్వాయర్ పరిధిలో ఉన్న ఆయకట్టు పొలాల్లో రెండో పంట వేసుకునేందుకు కూటమి ప్రభుత్వం సాగునీరు అందివ్వనుంది. ఈ నేపథ్యంలో రైతులు యంత్రాలతో వరి కోతలు ప్రారంభించారు. యంత్రాలతో కోసిన ధాన్యంలో తేమ శాతం ఎక్కువగా ఉంటుంది. ప్రభుత్వం తేమ శాతం 17 ఉంటే నాణ్యమైన ధర అందిస్తుంది. రైతులు సోమవారం తొండంగి-తుని ప్రధాన రహదారిలో కల్లాలుగా వేసి ధాన్యాన్ని ఇలా ఆరబెట్టారు. - న్యూస్‌టుడే,తొండంగి

పరిమితి దాటి.. ప్రమాదానికి తావిచ్చి..
వి.కొత్తూరు జాతీయ రహదారి కూడలిపై వాహనంపై పరిమితికి మించిన లోడుతో పరుగులు తీస్తున్న వాహనంతో వెనుక, ముందు వెళ్లే వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. తుని నియోజకవర్గ పరిధిలోని హైవే వెంబడి తుని రూరల్‌పోలీసు స్టేషన్, కత్తిపూడి ఆర్టీవో కార్యాలయాలు ఉన్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం లేదు. - న్యూస్‌టుడే, తుని గ్రామీణం

అప్పారావు మాస్టారు సేవలు మరువలేనివి

నివాళులర్పిస్తున్న సత్యసాయి సేవాసంస్థల జిల్లా అధ్యక్షులు గోవిందరాజులు

జగ్గంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యార్థులకు నైతిక విలువలు నేర్పించడంలో, పాఠశాల విద్యాభివృద్ధిలోనూ అప్పారావు మాస్టారు సేవలు మరువలేనివని సత్యసాయి సేవాసంస్థల జిల్లా అధ్యక్షులు యార్లగడ్డ గోవిందరాజులు అన్నారు. జగ్గంపేట టీచర్స్‌కాలనీలో సత్యసాయి బాలవికాస్ గురువు మండపాక అప్పారావు సంస్మరణ కార్యక్రమానికి విచ్చేసి ఆయన సేవలను కొనియాడారు. సత్యసాయి సేవా సంస్థల్లో సేవలందిస్తూ విశిష్టమైన సేవలందించారన్నారు. సత్యసాయి సేవా సంస్థల తూ.గో.జిల్లా అధ్యక్షుడు బులుసు వెంకటేశ్వర్లు, కన్వీనర్ గట్టిం సుబ్బారావు, తుని సబ్‌జోన్ కన్వీనర్ తుమ్మలపల్లి జోగేంద్రనాథ్, తుమ్మలపల్లి చిట్టికామేశ్వరి తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

వెంకటరాజు మృతికి సంతాపం


తుని పట్టణం, న్యూస్‌టుడే: బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, వీహెచ్‌పీ ఉమ్మడి రాష్ట్ర అధ్యక్షుడు కనుమూరి వెంకటరాజు (92) మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు. అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆయన ఆదివారం కన్నుమూశారు. దీంతో సోమవారం సరస్వతి శిశుమందిర్‌లో ఏర్పాటు చేసిన సంతాపసభలో ఆయన చిత్రపటానికి ప్రముఖులు, భాజపా నాయకులు డీఎన్‌మూర్తి, రాయపరాజు, ఆకెళ్లశాస్త్రి, ఎండీ జుల్ఫీకర్ అహ్మద్, ఆజాద్ స్వామి, కాదంబరి రామకృష్ణ తదితరులు నివాళి అర్పించారు. పలువురు వెంకటరాజు సేవలను గుర్తుచేసుకున్నారు.

పశువులను తరలిస్తున్న ఇద్దరి అరెస్టు
తుని పట్టణం, న్యూస్‌టుడే: అనకాపల్లి నుంచి వరంగల్‌కు వాహనంలో పశువులు అక్రమంగా తరలిస్తున్న ఇద్దరిని అరెస్టు చేశామని ఎస్సై జె.విజయబాబు తెలిపారు. వాహనంలో 5 ఆవులతోపాటు ఓదూడ కూడా ఉందన్నారు. నిందితుల్లో ఎం.మణీంద్ర అనకాపల్లి జిల్లా సోమవారంనకు చెందినవాడు కాగా, మనోజ్ వరంగల్‌కు చెందినవాడన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత
రౌతులపూడి, న్యూస్‌టుడే: రేషన్ బియ్యం అక్రమ రవాణాపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రౌతులపూడి ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు. పౌరసరఫరాలశాఖ అధికారులతో కలిసి తనిఖీలు చేస్తుండగా, గిడజాం సమీపంలో సతీష్ అనే వ్యక్తి ఆటోలో రూ.22,785 విలువైన 490 కేజీల బియ్యాన్ని తరలిస్తుండగా గుర్తించామన్నారు.

డిమాండ్లు పరిష్కరించాలని ధర్నా
తుని పట్టణం, ఏలేశ్వరం, న్యూస్‌టుడే: న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ తుని పట్టణంలోని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు సిబ్బంది ధర్నా చేశారు. ప్రభుత్వం జీవో 36 తక్షణం అమలు చేయాలని, ఉద్యోగ విరమణను 62 ఏళ్లకు పెంచాలని, వేతన సవరణ అమలు చేయాలన్నారు. 2019 తర్వాత చేరిన వారిని క్రమబద్ధీకరించాలని, ఆరోగ్య బీమా కల్పించాలని, సంఘాల ద్వారా మాత్రమే రైతులకు రుణాలు ఇవ్వాలన్నారు. సహకార ఉద్యోగులకు గ్రాట్యుటీ చట్టం అమలు చేయాలని, డీఎల్ఎస్ఎఫ్ ద్వారా జీతాలు చెల్లించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు నక్కళ్ల శ్రీనివాస్, ఉద్యోగ సంఘ నాయకులు రామునాయుడు, సింహాచలం, సతీష్, శివ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

● సహకార ఉద్యోగుల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని సంఘ జిల్లా అధ్యక్షుడు కడగల ఆదినారాయణ, ఏలేశ్వరం, లింగంపర్తి సొసైటీ సీఈవోలు జ్యోతుల శ్రీనివాస్, ఉప్పలపు విజయ్‌కుమార్ రాజు అన్నారు. సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరుతూ సోమవారం పట్టణంలోని డీసీసీబీ కార్యాలయం వద్ద రాజాబొమ్మంగి, అడ్డతీగల, ఏలేశ్వరం, లింగంపర్తి సహకార పరపతి సంఘాల ఉద్యోగులు నిరసనకు దిగారు. నాయకులు జె.గోపాలకృష్ణ, ఎ.మణిరాజు పాల్గొన్నారు.

ఏలేశ్వరం కార్యాలయం వద్ద నిరసన శిబిరంలో ఉద్యోగులు

మెగా క్రిస్మస్ వేడుకలు

వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సత్యప్రభ, ప్రజాప్రతినిధులు

ఏలేశ్వరం, రౌతులపూడి, న్యూస్‌టుడే: దయా గుణాన్ని అలవర్చుకుని ఇతరులకు సాయపడే వారే క్రీస్తు కృపకు పాత్రులవుతారని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. ఏలేశ్వరం వెంకటేశ్వర సమావేశ మందిరంలో మండల పాస్టర్ల ఫెలోషిప్ ఆధ్వర్యంలో సోమవారం మెగా క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కొవ్వొత్తి వెలిగించి కేకు కోసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కౌన్సిలర్లు అలమండ చలమయ్య, బొదిరెడ్డి గోపాలకృష్ణ, మూది నారాయణస్వామి, నాయకులు చిక్కాల లక్ష్మణరావు, నూకతాటి ఈశ్వరుడు పాల్గొన్నారు.
● రౌతులపూడిలో యునైటెడ్ పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం మెగా క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే సత్యప్రభ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఫెలోషిప్ సభ్యులకు బహుమతులు అందించారు. పాస్టర్లు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

వీధి కుక్కలకు కు.ని. శస్త్రచికిత్సలు
తుని, న్యూస్‌టుడే: పురపాలక సంఘం ద్వారా వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకున్నామని ఛైర్‌పర్సన్ నార్ల భువన సుందరి అన్నారు. పట్టణంలోని వీరవరపుపేట పశువుల ఆసుపత్రిలో కొత్తగా నిర్మించిన శస్త్రచికిత్స విభాగంలో కుక్కలకు కు.ని. ఆపరేషన్లు చేయించే ప్రక్రియ సోమవారం ప్రారంభించారు. పురవీధుల్లో ఉన్న సుమారు 1,100 కుక్కలకు ఆపరేషన్లు చేయించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. కాకినాడకు చెందిన ఓ సంస్థ ద్వారా ఈ ప్రక్రియ జరుగుతోందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కర్రి శ్రీదేవి, డీఈ నాగసతీష్ తదితరులు పాల్గొన్నారు.

అతిథి గృహం.. వినియోగానికి దూరం
● అన్యాక్రాంతమవుతున్నా పట్టలేదు

ఏలేశ్వరం, న్యూస్‌టుడే: ఏలేశ్వరం నడిబొడ్డున గజం జాగా రూ.లక్ష. కాస్త లోపలకు వెళ్తే రూ.16 వేల నుంచి రూ.18 వేలు ఉంది. పట్టణంలో రోజురోజుకు స్థలాల ధరలకు రెక్కలు వస్తున్నాయి. ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతమవుతున్నా సంబంధిత అధికారులకు పట్టడంలేదు. ఈ క్రమంలో ప్రభుత్వ స్థలాలు, నిర్మాణాలను కొందరు వ్యక్తిగత అవసరాలకు వినియోగిస్తున్నారు. రాబోయే రోజుల్లో తమదేనంటూ కబ్జా చేయొచ్చు. అధికారుల నిర్లిప్తతకు ఏలేశ్వరంలోని అతిథి గృహాలు, ప్రాంగణాలే ప్రత్యక్ష నిదర్శనాలు.

నేలమట్టం అవుతున్నా పట్టదాయె..
ఏలేశ్వరం కళాశాల రోడ్డు చెంతనే జడ్పీకి చెందిన 8 సెంట్లకు పైగా స్థలంలో అతిథి గృహం ఉంది. పదేళ్ల కిందట వాచ్‌మెన్ ఉద్యోగ విరమణ పొందడంతో నిర్మాణానికి గ్రహణం పట్టింది. అతిథి గృహం క్రమేణా కూలుతోంది. ప్రహరీలను కూలగొట్టి విశాలమైన ఆవరణను వ్యక్తిగత అవసరాలకు కొందరు ఉపయోగిస్తున్నారు. రోజూ అధికారులు ఈ మార్గం మీదుగానే వెళ్లి వస్తున్నా.. పర్యవేక్షణ మాత్రం లేదు. గతంలో ఎమ్మెల్యేలు, మంత్రులు, ఉన్నతస్థాయి అధికారులు ఇక్కడే సమీక్ష సమావేశాలు నిర్వహించేవారు. ప్రస్తుతం పాడుబడ్డ బంగ్లాను తలపిస్తోంది.

ఏలేరు అతిథి గృహం

ఏలేరు ప్రాజెక్ట్ అతిథి గృహం కూడా..
ఏలేశ్వరంలో ఏలేరు ప్రాజెక్ట్ అతిథి గృహం నిర్వహణకు దూరమైంది. విశాఖ పారిశ్రామిక అవసరాలకు, 65 వేల ఎకరాలకు సాగునీరు అందించే ఏలేరు బాధ్యతలను చూసే అధికారులు అప్పట్లో విశాలమైన అతిథి గృహాన్ని నిర్మించారు. నిధుల కొరత పేరు చెప్పి.. నిర్వహణను గాలికొదిలేశారు. కొందరు పశువులను ఇక్కడే కడుతున్నారు. జూదం తదితర అసాంఘిక కార్యకలాపాలకు వేదికగా మారింది. ఈఈ, డీఈలు, ఏఈల్లో ఏ ఒక్కరూ పరిశీలించిన దాఖల్లాలేవు. అధికారులు స్పందించకుంటే జడ్పీ అతిథి గృహం మాదిరిగా శిథిలావస్థకు చేరుతుంది.

గోటి తలంబ్రాలు ధాన్యం సేకరణ
కిర్లంపూడి: సీతారాముల కల్యాణంలో తలంబ్రాలుగా వాడే ధాన్యం సేకరణకు సోమవారం జగపతినగరంలో అంకురార్పణ చేశారు. శ్రీరామ భక్తుడు మద్దాల త్రినాథరావు(విష్ణు) సొంత పొలంలో గోటితో వలిచే తలంబ్రాల కోసం వరిపంటను పండించారు. పంట కోతకు రావడంతో వరిపొలంలో రామభక్తులతో సీతారాముల పటాలు పెట్టి పూజలు నిర్వహించారు. అనంతరం కాషాయ జెండాలు చేతబట్టి వరి కోతను ప్రారంభించారు. ఈ విధంగా తయారైన తలంబ్రాలను అయోధ్య, భద్రాచలం, ఒంటిమిట్ట గొల్లలమామిడాడ, రామాలయాలకు ఇస్తారు.

మండల అభివృద్ధిపై సమీక్ష సమావేశం
కోటనందూరు: మండల అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ఎంపీడీవో పి.వెంకటనారాయణ సమీక్ష సమావేశం నిర్వహించారు. సోమవారం పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ సిబ్బందితో ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను సక్రమంగా వినియోగించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి
ప్రత్తిపాడు: శరభవరం పాండవులపాలెం దారిలో ఆదివారం రాత్రి జరిగిన ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై లక్ష్మీకాంతం కథనం ప్రకారం రౌతులపూడి మండలం ఎస్.పైడిపాలకు చెందిన డి.కొండబాబు(45) గేదెల వ్యాపారం నిమిత్తం శరభవరం వచ్చాడు. ద్విచక్రవాహనంపై ఇంటికి తిరిగివెళ్తూ అదుపుతప్పి రహదారి పక్కన ఉన్న గోతిలో పడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతణ్ని ఆసుపత్రిలో చేర్చే క్రమంలో మృతి చెందాడని ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

NAME CHANGE
I, Banda Venkata Atchamamba, W/o Raja Raja Pawan Kumar, Door No: 8-106, Old Court Road, Prathipadu Village, Prathipadu Mandal, Kakinada District, Andhra Pradesh, India - 533432. Have Changed My Name From Kalla Venkata Atchamamba (Old Name) to Banda Venkata Atchamamba (New Name). As per Affidavit Dated 04/12/2025.

(c) eenadu

భక్తజన అజెండా

మాస్టర్ ప్లాన్ అమలుపై దృష్టి

మల్లన్న స్పర్శ దర్శనం.. అతిశీఘ్ర దర్శనం టికెట్లు పొందిన భక్తులకు ఉచితంగా లడ్డూలు ఇవ్వడం.. దర్శన ముగింపు సమయాన్ని రాత్రి 10 నుంచి 11 గంటలకు పెంపు.. భక్తులు సమర్పించిన చీరలు, పంచెలు చెంచుగూడేల్లో గిరిజనులకు ఉచితంగా పంపిణీ.. భక్తుల నుంచి సూచనలు, ఫిర్యాదులు స్వీకరించడానికి డయల్ యువర్ ఈవో, ఛైర్మన్ కార్యక్రమం పునరుద్ధరణ వంటి భక్తజన అజెండాకు శ్రీశైల దేవస్థానం నూతన ధర్మకర్తల మండలి ఆమోద ముద్ర వేసింది.
– న్యూస్‌టుడే, శ్రీశైలం ఆలయం

- ఇల కైలాసమైన శ్రీశైల మల్లికార్జునుడి క్షేత్రం చెంత గత వైకాపా సర్కారు రాజకీయం చేసింది. అస్మదీయులకు ఆలయ బాధ్యతలు అప్పగించి అక్రమాలు పెంచిపోషించారు.
- 'కూటమి' ప్రభుత్వం వచ్చిన తర్వాత భక్తజన అజెండాపై దృష్టి సారించింది. ఈవో ఎం.శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి ఛైర్మన్ రమేష్‌నాయుడు, సభ్యులు సరికొత్త ఆలోచనలకు శ్రీకారం చుట్టారు.
- మాస్టర్ ప్లాన్ త్వరగా అమలు చేయడానికి విరాళాల స్వీకరణ.. దేవస్థానం పరిధిలోని అన్ని వీఐపీ కాటేజీలు, వసతి గదుల్లో మరమ్మతులు చేయాలని నిర్ణయించారు.

రాత్రి 10 గంటల వరకు అనుమతి

యాత్రికులకు అటవీశాఖ చెక్‌పోస్టుల సమయ వేళలతో ఇబ్బందులున్నాయి. రోజులో 15 గంటల సమయంలో మాత్రమే శ్రీశైలానికి వచ్చి వెళ్లాల్సి ఉంటుంది. కనీసం 10 నిమిషాలు ఆలస్యమైనా అనుమతి ఉండదు. ధర్మకర్తల మండలి ఉదయం 5 నుంచి రాత్రి 10 గంటల వరకు వాహనాలను అనుమతించాలని ప్రతిపాదించారు.

ఏడాదిలో ఏ రోజైనా రావొచ్చు

- రెండేళ్ల కిందట దేవస్థానంలో నూతనంగా రూ. 1,01,116లతో ఉదయాస్తమానసేవ ప్రారంభించారు. ఈ టికెట్ తీసుకొన్న భక్తులు తెల్లవారుజామున సుప్రభాతసేవ మొదలుకొని రాత్రి ఏకాంతసేవ వరకు 14 రకాల సేవల్లో భక్తులు పాల్గొనవచ్చు.
- టికెట్ పొందిన రోజుకే పరిమితం చేయడంతో ఆదరణ కొరవడింది. పదేళ్ల కాలపరిమితికి ఏడాదిలో భక్తులు కోరుకున్న రోజు సేవ చేసుకొనేలా ప్రతిపాదనలు రూపొందించారు.

కౌసల్య బ్యాటింగ్ భళా

ముంబయిలో బీసీసీఐ ఆధ్వర్యంలో ఈనెల 13 నుంచి జరిగే అండర్-19 పోటీలకు కౌసల్య బాయి ఎంపికైంది. వెల్దుర్తి మండలం ఎల్.బండకు చెందిన ఆమె నగరంలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. చిన్నప్పుడు సోదరుడు శంకర్‌నాయక్‌తో కలిసి టీవీల్లో క్రికెట్ చూసేది. అలా క్రికెట్‌పై ఆసక్తి పెరిగింది. ఆమె ఆసక్తిని గమనించి 2022లో కర్నూలు డీఎస్ఏ స్టేడియంలో శిక్షణ ఇప్పించారు. ఓ వైపు చదువుకుంటూనే మరోవైపు ఆటలో మెలకువలు నేర్చుకుంది. గతేడాది వైజాగ్‌లో ఏసీఏ ఆధ్వర్యంలో జరిగిన అంతర జిల్లాల క్రికెట్ పోటీల్లో ప్రతిభ చాటింది. అదే ఏడాది సెప్టెంబరులో వైజాగ్‌లో జరిగిన దక్షిణ మండలం పోటీల్లో కేవలం రెండు పోటీల్లో పాల్గొని 80 పరుగులు చేసింది. ఈ ఏడాది జులై 3 నుంచి 9వ తేదీ వరకు నెల్లూరులో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన అంతర జిల్లాల అండర్-19 బాలికల క్రికెట్ పోటీల్లో ఐదు విభాగాల్లో పాల్గొని 292 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలిచింది. ఈ పోటీల్లో చిత్తూరు జట్టుపై 117 పరుగులు చేయడం విశేషం. ఈ ఏడాది ఆగస్టు 21 నుంచి 30వ తేదీ వరకు వైజాగ్‌లో జరిగిన రాష్ట్ర ప్రాబబుల్స్‌లో (రెండు పోటీలు) 119 పరుగులు సాధించింది. "ప్రస్తుతం అండర్-19 పోటీలకు ఎంపికవ్వడంపై ఆమె మాట్లాడుతూ జాతీయస్థాయి జట్టులో స్థానం సాధించడమే తన లక్ష్యమని" పేర్కొంది. – న్యూస్‌టుడే, కర్నూలు క్రీడలు, వెల్దుర్తి

బెంగళూరు దారి

ఈనాడు, కర్నూలు : జాతీయ దారి.. హైదరాబాద్- బెంగళూరు మార్గంలో 24 గంటలూ రయ్..రయ్ మంటూ వాహనాలు దూసుకెళ్తుంటాయి. ఏ ఒక్క వాహనం 100 కి.మీ. వేగం కంటే తక్కువ కాకుండా పరుగులు పెడుతుంటాయి.. అక్టోబరు 24వ తేదీన చెట్లమల్లాపురం వద్ద ప్రైవేటు బస్సు ప్రమాదానికి గురై 19 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇంత పెద్ద ప్రమాదం జరిగినా రహదారిపై లోపాలు సరిదిద్దలేదు. ఉమ్మడి కర్నూలు జిల్లా పరిధిలో 18 బ్లాక్‌స్పాట్లు గుర్తించి వదిలేశారు.

ఉమ్మడి జిల్లాలో పొడవు	వాహనాల రాకపోకలు	టోలు వసూలే (నిత్యం)	బ్లాక్ స్పాట్లు
83 కి.మీ	15 వేలు	రూ. 20 లక్షలు (అమకతాడు టోల్‌ప్లాజా)	18

సర్వీసు రహదారులు నిర్మించక..

- కర్నూలు శివారు.. చిన్నటేకూరు వద్ద సర్వీసు మార్గం లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వెల్దుర్తి కూడలి, డోన్ పరిధిలోని పోతుదొడ్డి, దేవరబండ, ఓబులాపురం మెట్ట, కొత్తపల్లి తదితర చోట్ల సర్వీసు రహదారులు లేకపోవడంతో వాహనదారులు రాంగ్‌రూట్లో ప్రయాణిస్తున్నారు.
- దొరపల్లి వద్ద సర్వీసు మార్గంలో వంతెన లేకపోవడంతో చాలామంది అపసవ్య దిశలో ప్రయాణిస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. గత మూడేళ్లలో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. సర్వీసు రోడ్డుతోపాటు పైవంతెన నిర్మించాలని ప్రతిపాదించినప్పటికీ కార్యరూపం దాల్చలేదు.

కానరాని ఏటీఎంఎస్ వ్యవస్థ

- జాతీయ రహదారుల్లో ఏటీఎంఎస్ (అడ్వాన్స్‌డ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్)ను ఏర్పాటు చేస్తున్నారు. వాహనం ఎంత వేగంతో వెళ్తుందో ఇట్టే తెలిసిపోతుంది. ఎలక్ట్రానిక్ బోర్డుల్లో కనిపిస్తోంది. పోలీసులకు సమాచారం అందుతుంది. దీంతో తనిఖీలు చేసి చర్యలు తీసుకోవడం ద్వారా వేగాన్ని నియంత్రించడంతోపాటు ప్రమాదాలు తగ్గించడానికి వీలుంటుంది. 2010లో విస్తరించిన ఈ మార్గంలో ఏటీఎంఎస్ వ్యవస్థ లేకపోవడం గమనార్హం.

రూ.70 కోట్లతో ప్రతిపాదనలు

"కర్నూలు నుంచి అనంతపురం వరకు సుమారు 150 కి.మీ. మేర జాతీయ రహదారిపై కొత్త పొర వేసేందుకు రూ. 70 కోట్లతో ప్రతిపాదనలు పంపాం. వచ్చే ఏడాది వంద శాతం పనులు ప్రారంభించి పూర్తి చేస్తాం. విభాగినులపై పూర్తిస్థాయిలో మొక్కలు పెంచేలా చర్యలు తీసుకుంటున్నాం" అని ఎన్‌హెచ్ఏఐ పీడీ (అనంతపురం) తరుణ్ తెలిపారు.

సంవత్సరం	మృతి చెందిన వారు
2023	19
2024	27
2025	18

వీటిని పట్టించుకోరు

- మితిమీరిన వేగంతో ప్రయాణించే వాహనాలను దూరం నుంచే గుర్తించేందుకు 'స్పీడ్‌లేజర్ గన్లు' అవసరం. ఉమ్మడి కర్నూలు జిల్లాలో కేవలం ఒకే ఒక్కటే ఉండటం గమనార్హం.
- కర్నూలు నుంచి డోన్ వెళ్లే మార్గంలో టోల్‌గేటు దగ్గర నిఘా కెమెరాలు లేవు. అధునాతన సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్న పోలీసుల ప్రతిపాదనను టోల్‌గేటు నిర్వాహకులు పట్టించుకోవడం లేదు.
- జాతీయ రహదారి మార్జిన్లలో పలుచోట్ల ఇసుక మేట వేసింది. ఫలితంగా వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతున్నాయి. మట్టి లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాల్సి ఉండగా పట్టించుకోవడం లేదు.
- విభాగినులపై నాలుగైదు అడుగుల ఎత్తున గుబురు మొక్కలు పెంచితే రాత్రివేళలో ఎదురుగా వచ్చే వాహనాల లైటింగ్ డ్రైవర్ల కళ్లలో పడదు. జాతీయ రహదారిపై ఎక్కడా మొక్కలు కనిపించడం లేదు.

రేపటి నుంచి టెట్

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : జిల్లాలో 10వ తేదీ నుంచి 21వ తేదీ వరకు జరిగే ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డీఈవో శామ్యూల్‌పాల్ సోమవారం తెలిపారు. మొత్తం 39,485 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని చెప్పారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు విడతల్లో పరీక్ష ఉంటుందన్నారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి గంట ముందే చేరుకోవాలన్నారు. ఏవైనా సమస్యలుంటే 81218 21266, 90323 97231, 96036 83182 నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

- నంద్యాల జిల్లాలో శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాల, ఆర్‌జీఎం ఇంజినీరింగ్ కళాశాల, నంద్యాల రామకృష్ణ డిగ్రీ కళాశాల, నంద్యాల పట్టణంలోని ఎస్‌బీఐ కాలనీలోని రామకృష్ణ పీజీ కళాశాలలో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

కుమార్తెకు భోజనం తినిపిస్తున్న తల్లి ఖాసీంబీ

25 ఏళ్లు దాటాయి.. అమ్మా.. ఆకలని అడగలేరు

మొదట బాబు.. రెండోసారి పాప.. మూడోసారి మళ్లీ బాబు.. ఆ ముగ్గురు సంతానాన్ని చూసుకుని ఆ తల్లిదండ్రులు మురిసిపోయారు.. ఏళ్లు నిండుతున్నా వారిలో చురుకుదనం.. మానసిక ఎదుగుదల లేదు.. ఎన్నో ఆసుపత్రుల చుట్టూ తిరిగారు.. ముగ్గురికి 25 ఏళ్లు దాటాయి.. అమ్మా ఆకలి అని నోరు తెరచి అడగలేరు.. ఇరవైఏళ్లు వచ్చినా పసికందు కిందే ఆ తల్లిదండ్రులు సేవ చేస్తున్నారు. బనగానపల్లి మండలం యనకండ్లకు చెందిన చాంద్‌బాషా, ఖాసీంబి దంపతులకు ముగ్గురు సంతానం. పెద్దోడు హసన్ (31), రెండో కుమారుడు మాబువలి (24), కుమార్తె అఫ్రిన్ (27)లు శారీరక, మానసిక వైకల్యంతో బాధపడుతున్నారు. పుట్టినప్పటి నుంచీ మంచానికే పరిమితమయ్యారు. వయోభారంతో బాధపడుతున్నా కూలి పనులు చేస్తూనే పిల్లలను జాగ్రత్తగా చూసుకుంటున్నారు. బిడ్డల భవిష్యత్తు తలచుకుని తల్లడిల్లుతున్నారు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. తల్లి ఖాసీంబి ఇంటి పట్టునే ఉండి పిల్లల బాగోగులు చూస్తున్నారు. ముగ్గురికీ ప్రభుత్వం సామాజిక పింఛను మంజూరు చేస్తున్నా సరిపోవడం లేదని దాతలు తమను ఆదుకోవాలని ఎదురుచూస్తున్నారు. – న్యూస్‌టుడే, బనగానపల్లి గ్రామీణం

గీతా పఠనంలో స్వర్ణం

నిత్యం భగవద్గీత పారాయణం చేస్తూ గీత పఠనంలో 'స్వర్ణం' సాధించారు కొలిమిగుండ్లకు చెందిన స్వర్ణగౌరీ. ఉయ్యాలవాడలోని వేణుగోపాలస్వామి ఆశ్రమానికి వెళ్తూ గీతాపారాయణం సాధన చేశారు. ఇంట్లోనూ భగవద్గీత పఠిస్తూ పట్టు సాధించారు. ఆన్‌లైన్‌లోనూ ఆధ్యాత్మిక తరగతులను వీక్షిస్తూ గ్రంథంలోని 700 శ్లోకాలు ఉచ్చారణ, అక్షర దోష లోపాలు లేకుండా చెప్పగలిగే ప్రతిభను సాధించారు. ఇటీవల మైసూర్‌లోని దత్తపీఠం ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో కర్ణాటకతోపాటు ఉమ్మడి తెలుగు రాష్ట్రాలకు భగవద్గీత శ్లోకాలపై మహిళలకు పోటీ పరీక్షలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ చూపినవారిని శ్రేణులవారీగా ఎంపిక చేసి ఈనెల 1న గీతా జయంతి సందర్భంగా మైసూరులో దత్తపీఠం ఆధ్వర్యంలో గీతాపారాయణం పోటీలు నిర్వహించారు. పోటీల్లో స్వర్ణగౌరీ ప్రతిభను చూపి పీఠాధిపతి గణపతి సచ్చిదానందస్వామి చేతుల మీదుగా బంగారు పతకం అందుకున్నారు. – న్యూస్‌టుడే, కోవెలకుంట్ల, కొలిమిగుండ్ల

పట్టు చేజరీ

పట్టు మగ్గాలు	10 వేలు
కార్మికులు	13 వేలు
ఏడాదికి	4.20 లక్షల చీరలు

పెరిగిన వెండి, బంగారం ధరల ప్రభావం చేనేత రంగాన్ని కుదేలుచేస్తోంది. ధరలు రెండింతలు పెరగడంతో కార్మికులపై ఆర్థిక భారం పడుతోంది. పట్టు చీరల తయారీలో జరీ వినియోగం తప్పనిసరి. ఉమ్మడి జిల్లాలో చేనేత కార్మికులు, మాస్టర్ వీవర్స్ గుజరాత్‌లోని సూరత్ నుంచి జరీని దిగుమతి చేసుకొంటున్నారు. చిన్న చీరకు మూడు ముట్టలు, మధ్య చీరకు నాలుగు, పెద్ద బార్డర్ చీరకు ఆరు ముట్టలు(మార్కులు) వినియోగిస్తారు. జరీ తయారీలో అధికంగా వెండిని వినియోగిస్తారు. ఒక్కో జరీ ముట్ట(మార్కు) రూ. 200లకు పైగానే పెరిగింది. ఆరు నెలల కిందట జరీ ధర రూ. 450 ఉండేది. ప్రస్తుతం రూ. 650 నుంచి రూ. 700 చేరింది. ముడి సరకు ధర రూ. 4100 నుంచి ఏకంగా రూ. 6500కు పెరిగింది. ఒక్కో పట్టుచీరపై జరీ, ముడి సరకుపై కనీసం రూ. 1000 నుంచి రూ. 1200 భారం పడుతోంది. దీంతో వ్యాపారులు దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు. ప్రభుత్వం స్పందించి వ్యాపారులను ఆదుకోవాలని చేనేత కార్మికులు, మాస్టర్ వీవర్స్ రంగన్న, వెంకటేశు కోరారు. – న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు



కాలు జారితే కాల్వలోకే

తుంగభద్ర దిగువ కాల్వపై ఇనుప వంతెనలు ప్రమాదకరంగా మారాయి. కాల్వకు ఇరువైపులా ఉన్న గ్రామస్థులు, రైతులు వెళ్లేందుకు వీలుగా వీటిని ఏర్పాటు చేశారు. హొళగుంద మండలం వందవాగిలి గ్రామ సమీపంలోని దిగువ కాల్వ 203 కి.మీ. వద్ద ఉన్న ఇనుప వంతెనపై రంధ్రం పడి ప్రమాదకరంగా మారింది. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, హొళగుంద

భూపత్రం.. కాసుల యంత్రం

ఎమ్మిగనూరులో దందా ● తహసీల్దార్‌పై చర్యలు

ఎమ్మిగనూరు తహసీల్దారు కార్యాలయం అక్రమాలకు వేదికగా మారింది. రెండేళ్ల కిందట కార్యాలయంలో లంచం తీసుకుంటూ వీఆర్వో, ఓ రెవెన్యూ ఉద్యోగి అవినీతి నిరోధక శాఖ అధికారులకు పట్టుబడ్డారు. అయినా సిబ్బందిలో మార్పుకానరావడం లేదు. దళారులు, కిందిస్థాయి సిబ్బందిని అడ్డంపెట్టుకొని అవినీతికి పాల్పడినట్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందడంతో తహసీల్దారు శేషఫణిని కలెక్టరేట్‌కు సరెండర్ చేశారు.
– న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు గ్రామీణం, ఎమ్మిగనూరు

రీసర్వే వసూళ్ల పర్వం

ఎమ్మిగనూరు మండలంలో 18 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. వైకాపా హయాంలో గ్రామాల్లో చేపట్టిన రీసర్వే అస్తవ్యస్తంగా జరిగింది. భూ వివాదాలు పెరిగాయి. ఇది రెవెన్యూ అధికారులకు కాసుల పంటగా మారింది. పలువురు రైతులకు ఒకే ఎల్పీ నంబరు కేటాయించడం, భూ కొలతల్లో తేడాలు, ఇలా పలు సమస్యలు తలెత్తాయి. వీటిని సరి చేసేందుకు రూ. 20వేల నుంచి రూ. లక్ష వరకు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఏడాది కాలంలో దాదాపు రూ. 50 లక్షల వరకు వసూలు చేసినట్లు తెలుస్తోంది.

అక్రమాలు చెట్టాపట్టాలు

- పట్టణంలోని మిలట్రీ కాలనీలో ఏడాదిలో దాదాపు 50 ఇళ్ల పట్టాల మార్పిడి జరిగింది. పేదలకు ఇచ్చిన ఇంటి స్థలం సెంటు రూ. 4 లక్షలకు అమ్ముడు పోతుండటంతో పట్టాల దందా కొనసాగుతోంది. పట్టాను మార్చేందుకు రూ. 30వేల నుంచి రూ. 50 వేలు ఇవ్వాల్సిందే. పట్టాల మార్పిడిలో ఏడాదిలో రూ. 25 లక్షలు వసూలు చేసినట్లు చర్చించుకుంటున్నారు.
- ఇంటి పట్టా అందజేయాలని గతంలో కలెక్టర్ ఆదేశించినా తహసీల్దారు పట్టా ఇవ్వకుండా ఏడాదిగా తిప్పుకుంటున్నారంటూ గోవిందమ్మ ఇటీవల తహసీల్దారు కార్యాలయం ఎదుట గుడిసె వేసేందుకు గుంతలు తవ్వడం కలకలంగా మారింది.

ఖద్దరు అండదండలు

- కొందరు వీఆర్వోలు రాజకీయ పైరవీలతో ఏళ్లుగా తిష్ఠ వేశారు. వీరు తహసీల్దారు కార్యాలయంలోనే అధికంగా ఉండటంతో రైతులు, ప్రజలు పనుల నిమిత్తం గ్రామాల నుంచి వ్యయప్రయాసకోర్చి తహసీల్దారు కార్యాలయానికి రావాల్సి వస్తోంది. పాసు పుస్తకాలు, భూసమస్యలు వంటి వాటి కోసం వస్తే రూ. 20వేల నుంచి రూ. 50వేల వరకు ముక్కుపిండి వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.
- దళారులు, పైరవీకారులను ఆశ్రయిస్తేనే కార్యాలయంలో పనులు జరుగుతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్న పనులూ చేయకపోవడంతో జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు ప్రజలు వెళ్లాల్సి వస్తోంది.

గెలుపు గోల్

కర్నూలు డాక్టర్స్ కాలనీలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో గత రెండు రోజులుగా జరుగుతున్న క్లస్టర్ విశ్వవిద్యాలయ క్రీడా పోటీలు ముగిశాయి. సోమవారం జరిగిన ఫుట్‌బాల్ తుది పోరులో ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల జట్టు ప్రతిభ చాటి ట్రోఫీ కైవసం చేసుకుంది. రన్నర్స్ ట్రోఫీని సిల్వర్‌జూబ్లీ కళాశాల జట్టు దక్కించుకుంది. క్రికెట్ పోటీల్లో ప్రభుత్వ పురుషుల కళాశాల జట్టు.. సిల్వర్‌జూబ్లీ కళాశాల జట్టుపై గెలుపొంది ట్రోఫీ అందుకుంది. – న్యూస్‌టుడే, కర్నూలు బీక్యాంపు

ఇంటి పన్నుతో కనెక్షన్

● పేదింటికి కుళాయి దూరం

ఆదోని పట్టణ శివారులోని అమరావతి నగర్‌లో ప్రభుత్వం ఇచ్చిన సెంటున్నర స్థలంలో షాహీన్‌బా ఇల్లు నిర్మించుకుంటున్నారు. కుళాయి కనెక్షన్ కోసం పురపాలిక అధికారులను సంప్రదిస్తే ఇంటి పన్ను రూ. వెయ్యి దాటింది.. జనరల్ కనెక్షన్ మంజూరవుతుందన్నారు. రూ. 8 వేల భారం భరించలేక ఆమె పక్కింటి నుంచి నీటిని తెచ్చుకొంటున్నారు.

ఆస్తిపన్ను చెల్లింపుదారులు	పురపాలిక	కుళాయి కనెక్షన్లు
1,16,216	కర్నూలు	80,000
36,245	ఆదోని	24,500
49,274	నంద్యాల	32,000
16,760	డోన్	10,170
24,555	ఎమ్మిగనూరు	14,639

గత వైకాపా ప్రభుత్వం తీసుకొచ్చిన ఆస్తి పన్ను విధానంతో పేదలు కుళాయి కనెక్షన్ పొందలేకపోతున్నారు. సమస్యను గుర్తించి 'కూటమి' ప్రభుత్వం సరి చేయాలని పుర పేదలు విన్నవిస్తున్నారు.
– న్యూస్‌టుడే, ఆదోని, కర్నూలు, ఎమ్మిగనూరు, నంద్యాల పురపాలికలు, డోన్ పట్టణం

రూ.వెయ్యి పన్ను దాటితే అంతే

- గత వైకాపా ప్రభుత్వం ఇష్టానుసారంగా ఆస్తి పన్ను సవరణలు చేసింది. చిన్నపాటి ఇంటికి సైతం పన్ను రూ. వెయ్యి దాటుతోంది. దీంతో ఏడాదికి రూ. 1,000 ఇంటి పన్ను దాటితే బీపీఎల్ కనెక్షన్లు పొందలేని పరిస్థితి ఏర్పడింది. గతంలో తెల్లరేషన్ కార్డు ఉంటే చాలు.. బీపీఎల్ కనెక్షన్లు పొందేందుకు వీలుండేది.
- ప్రస్తుతం జనరల్ కుళాయి కనెక్షన్ కింద డొనేషన్ రూ. 8 వేల నుంచి రూ. 10 వేలు.. ఆరు మాసాల నీటి పన్ను ముందస్తుగా చెల్లింపునకు రూ. 720. ఛార్జీల కింద మీటరుకు రూ. 1,500 విధిస్తారు.
- అదే బీపీఎల్ కనెక్షన్ అయితే ఎలాంటి డొనేషన్ లేకుండా కేవలం ఆరు నెలల నీటి పన్ను రుసుం వసూలు చేస్తారు. గుంత తవ్వేందుకు రూ. 4-5 వేలు, కుళాయి సామగ్రికి రూ. 5-8 వేల వరకు ఖర్చవుతుంది. మొత్తం లెక్కిస్తే జనరల్ కుళాయి కనెక్షన్‌కు సరాసరి రూ. 20-25 వేల వరకు ఖర్చు అవుతుంది. ఇది పేద కుటుంబానికి ఆర్థిక భారంగా పరిణమిస్తోంది.

వైకల్య భారం.. గుర్తించి ఆదుకోరూ

శరీరం సహకరించక.. సొంతంగా పనులు చేసుకోలేక నరకయాతన అనుభవిస్తున్నారు. సదరం ధ్రువీకరణ పత్రం అందించాలని కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఏళ్లు గడుస్తున్నా ధ్రువీకరణ పత్రం ఇవ్వడం లేదు. పింఛను కోసం తిరిగి తిరిగి అలసిపోయిన వీరు సోమవారం కర్నూలు కలెక్టరేట్‌కు చేరుకున్నారు. తమ సమస్యలు విన్నవించి పరిష్కరించాలని అధికారులకు విన్నవించుకున్నారు.
– న్యూస్‌టుడే, కర్నూలు సచివాలయం

నడవలేక.. అన్నం తినలేక

ఆస్పరి మండలం బిల్లేకల్లుకు చెందిన సురేంద్ర, భారతి కుమార్తె వైష్ణవి (9) నాలుగేళ్ల వయస్సులో అనారోగ్యం బారిన పడింది. ఆడుతూ పాడుతూ బడికెళ్లాల్సిన బాలిక నరాల బలహీనతతో నిలబడలేని పరిస్థితి. తల్లిదండ్రులే అన్నం తినిపించాల్సిన పరిస్థితి. కుమార్తెకు వైకల్య ధ్రువీకరణ పత్రం కోసం తల్లిదండ్రులు గత కొన్నేళ్లుగా ప్రయత్నిస్తూనే ఉన్నారు. ఆలూరు, పాణ్యంలో సదరం స్లాట్ బుకింగ్ చేసుకున్నా ప్రయోజనం లేకపోయింది. "గతేడాది అక్టోబరు 10న స్లాట్ బుకింగ్ చేసుకోగా ఈ ఏడాది జూన్ 17న బనగానపల్లి ఆసుపత్రిలో పరీక్షలు చేశారు. ఆరు నెలలైనా వైకల్య ధ్రువీకరణ పత్రం ఇవ్వలేదు" అని తండ్రి సురేంద్ర ఆవేదన వ్యక్తం చేశారు. వైకల్య ధ్రువపత్రం అందించి దివ్యాంగుల పింఛను మంజూరు చేయించాలని అధికారులను కోరారు.

పరీక్ష చేసి ఏడాదైంది..

కర్నూలు ముజఫర్ నగర్‌లో ఉంటున్న పెద్దయ్య గత ఎనిమిదేళ్లుగా పక్షవాతం, నరాల బలహీనతతో బాధపడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో సదరం ధ్రువపత్రం కోసం దరఖాస్తు చేసుకున్నా ఇవ్వలేదు. గతేడాది జులై 8న సదరం స్లాట్ బుకింగ్ చేసుకున్నారు. డిసెంబరులో 31వ తేదీన ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పరీక్షలు చేశారు. ఇప్పటివరకు ధ్రువీకరణ పత్రం ఇవ్వలేదని పెద్దయ్య భార్య వన్నూర్‌బీ పేర్కొన్నారు. ఏడాదిగా పత్రం కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నామని పేర్కొన్నారు.

నిర్ధారణకు గిద్దలూరు వెళ్లాలట

కర్నూలులో గౌండ పనిచేసుకుంటూ జీవనం సాగించేవాడిని. ఏడాది కిందట కుడి కాలికి గాయమైంది. ఇన్‌ఫెక్షన్ కారణంగా కాలును సగం వరకు వైద్యులు తొలగించారు. గత నెల 14న వైకల్య ధ్రువీకరణ కోసం సదరం స్లాట్ బుకింగ్ చేసుకున్నా. ఈనెల 15, 16 తేదీల్లో ప్రకాశం జిల్లా గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలలో వైకల్య ధ్రువీకరణ కోసం రమ్మంటూ సమాచారం పంపారు. అంతదూరం వెళ్లలేనని, స్పందించి సదరం వైకల్య ధ్రువపత్రం అందించాలని కర్నూలు బుధవారపేటకు చెందిన పట్టాభిరాముడు పేర్కొన్నారు.

నిత్యం పరీక్ష.. పదింతల సాధన

పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్నాయి. జీవితంలో ఉన్నతంగా రాణించాలంటే 'పది' మార్కులు ఎంతో కీలకం. ఇప్పటినుంచి ప్రణాళికాబద్ధంగా చదివితేనే ఉత్తమ మార్కులు సాధ్యం. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వంద రోజుల ప్రణాళికను సిద్ధం చేసి జిల్లా విద్యా శాఖకు పంపింది. దీంతోపాటు అధికారులు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. సబ్జెక్టు టీచర్ల కొరత ఉన్న పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు బోధించేందుకు ప్రత్యేకంగా అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల నియామకం చేపట్టారు. ఈసారి వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. కర్నూలు జిల్లాలో 160, నంద్యాల జిల్లాలో 80 మంది అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను త్వరలో నియమించనున్నారు.
– న్యూస్‌టుడే, కర్నూలు, ఆదోని విద్య

అంశం	కర్నూలు	నంద్యాల
ఆదర్శ పాఠశాలలు	1,443	1,817
గురుకులాలు	1,162	1,147
కస్తూర్బా	1,051	1,042
జిల్లా పరిషత్తు	18,126	9,694
మున్సిపల్	2,077	380
ఎయిడెడ్	229	607
ప్రభుత్వ	1,989	1,442
ఆశ్రమ	54	135
ప్రైవేటు	10,295	10,257

కార్యాచరణ ప్రణాళిక ఇలా..

1. విద్యార్థులందరూ ఉత్తీర్ణత సాధించేలా ఎస్‌సీఈఆర్‌టీ ఇప్పటికే వంద రోజుల ప్రణాళిక రూపొందించింది. డిసెంబరు నుంచి పది వార్షిక పరీక్షల వరకు ప్రణాళిక అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలిచ్చింది.
2. ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 వరకు ఆరు పీరియడ్లు, స్టడీ అవర్లు నిర్వహించాలి.
3. ఆరో పీరియడ్‌లో ప్రతిరోజూ పరీక్ష పెట్టాలి. స్టడీ అవర్‌లో పాల్గొనే ఉపాధ్యాయులకు సీసీఎల్ మంజూరు చేస్తారు.
4. ప్రతిరోజు సబ్జెక్ట్ నిపుణులు తయారుచేసిన ప్రశ్నపత్రాన్ని ఆన్‌లైన్‌లో తీసుకొని విద్యార్థుల చేత రాయించాలి.
5. ఫార్మెటివ్ అసెస్‌మెంటులో వచ్చిన మార్కుల ఆధారంగా విద్యార్థి స్థాయిని బట్టి ఏ, బీ, సీ, డీగా నిర్ణయించాల్సి ఉంటుంది. చదువులో వెనుకబడిన వారిపై ప్రత్యేక దృష్టి సారించడంతోపాటు ఉపాధ్యాయులు దత్తత తీసుకోవాల్సి ఉంటుంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో సీ, డీ గ్రేడ్‌లో 14,320 మంది విద్యార్థులు ఉన్నట్లు గుర్తించారు.
6. సీ, డీ గ్రేడ్‌లో ఉన్న విద్యార్థులను ఒక్కో ఉపాధ్యాయుడు ఆరు నుంచి 8 మంది విద్యార్థులను దత్తత తీసుకోవాలి. వారు మంచి మార్కులు సాధించేలా మెలకువలు నేర్పించాలి.

రైతేరాజు అల్లాబకాష్.. పాడి లాభాల్లో శెభాష్ 6

S.B.V.R. అగ్రికల్చరల్ కళాశాల, బద్వేలు
ఇంటర్మీడియట్ నందు Bi.P.C విభాగంలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు చివరి అవకాశం. కడప జిల్లా బద్వేలులో I.C.A.R., NEW DELHI వారిచే గుర్తింపు పొందిన S.B.V.R. అగ్రికల్చరల్ కాలేజి (S.B.V.R. A.G.B.Sc), నందు B.Sc (Hons.) Agricultureలో అడ్మిషన్ కొరకు ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకున్నా చేసుకోకపోయినా కన్వీనర్ కోటాలో అగ్రికల్చరల్ బి.ఎస్సీ చేరుటకు చిట్ట చివరి అవకాశం కలదు.
వివరములకు సంప్రదించవలసినది : 94400 33523, 91825 05395, 94928 56652.
కరెస్పాండెంట్, S.B.V.R. అగ్రికల్చరల్ కళాశాల

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99899 97628
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80085 13479

(c) eenadu

తెగుళ్లు తరిమేద్దాం.. కందిని రక్షించుకుందాం

బేతంచెర్ల, న్యూస్‌టుడే: కంది పంట పూత, పిందె దశలో ఉన్నప్పుడు సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చని బేతంచెర్ల వ్యవసాయ శాఖాధికారి విజయ్‌కుమార్‌రెడ్డి సూచించారు. ప్రస్తుతం కంది పంట పూత దశలో ఉంది. రైతులు తప్పనిసరిగా సస్యరక్షణ చర్యలు పాటిస్తే నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని సూచించారు.

● **మారుకా మచ్చల పురుగు:** దీన్ని వాడుకలో బూజులో పూత, పురుగు లేదా గూడు పురుగు లేదా బూజు పురుగు అని పిలుస్తారు. ఈ పురుగు ఒకటి, రెండు దశలను పూమొగ్గల లోపలే ఉంటూ తినేస్తాయి. తర్వాత దశలో లేతాకులను, పూతను, లేత పిందెలను, కాయలను కలిపి గూడులా చేసుకొని కాయ అడుగు భాగంలో చిన్న రంధ్రం చేసి లోపలికి వెళ్లి కాయలోని గింజలను తిని, వాటిని డొల్లగా చేస్తాయి.

● దీని నివారణకు లీటరు నీటికి థయోడికార్బ్ ఒక గ్రాము లేదా నొవాల్యురాన్ ఒక మి.లీ. లేదా ఫ్లుబెండమైడ్ 0.2 మి.లీ. కలిపి వారం రోజులకొకసారి మందులను మార్చి పిచికారీ చేయాలి.

కాయ ఈగ: ఈ పురుగు ఆశించినప్పుడు నష్టం బయటకు కనిపించదు. వీటి పిల్ల పురుగులు కాయ లోపలే ఉండి గింజలను తింటాయి. ఈ పురుగు అన్ని దశలను కాయ లోపలే పూర్తి చేసుకొని, తల్లి పురుగు లేత పిందె దశలో కాయలపై గుడ్లు పెడుతుంది.

● పిందె దశలో 5 శాతం వేపగింజల కషాయం పిచికారీ చేసి, చెట్లపై పురుగులు గుడ్లు పెట్టకుండా నివారించవచ్చు.

● గింజ గట్టిపడే దశలో లీటరు నీటికి మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లేదా డైమిథోయేట్ 2 మి.లీ. లేదా ప్రొఫినోఫాస్ 2 మి.లీ. కలిపి పిచికారీ చేయాలి.

కాయ తొలుచు పురుగు: ఎకరాకు నాలుగు లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేయాలి. పురుగులను తినే పక్షులను ఆకర్షించేలా ఎకరాకు 20 పక్షి స్థావరాలను సిద్ధం చేయాలి. పురుగు గుడ్లను, తొలి దశలో పురుగులను గమనించిన వెంటనే ఐదు శాతం వేపగింజల కషాయాన్ని లేదా వేప సంబంధమైన మందు (అజాడిరక్టిన్) లీటరు నీటికి 5 మి.లీ. కలిపి పిచికారీ చేయాలి.

● ఎకరాకు 200 లార్వాలకు సమానమైన ఎన్‌పీవీ ద్రావణాన్ని లేదా 400 గ్రాముల బ్యాక్టీరియా సంబంధమైన మందును 200 లీటర్ల నీటితో కలిపి వారం తేడాతో రెండు సార్లు చలికాలంలో సాయంత్రం వేళ పిచికారీ చేయాలి.

పైన చెప్పిన చర్యలను సకాలంలో చేపట్టలేనప్పుడు తప్పనిసరైతే పురుగు ఉధృతిని బట్టి మొగ్గ-తొలిపూత దశలో ఉన్నప్పుడు క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లేదా ఎసిఫేట్ 1.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

● ఈ మందులు వాడిన తర్వాత కూడా శనగపచ్చ పురుగును నివారించలేకపోతే లీటరు నీటికి ఇండాక్సికార్బ్ 1 మి.లీ. లేదా స్పైనోసాడ్ 0.3 మి.లీ. కలిపి పిచికారీ చేయాలి.

సందేహాలు సమాధానాలు

?: వరి కోతలు కోస్తున్నాం. ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి?
- రామమోహన్‌రెడ్డి, నందవరం

ధనలక్ష్మి, కేవీకే

✔: వరి కోతల సమయంలో పది రోజుల ముందు ఆకారు తడి నీటిని పెట్టుకోవాలి. పంట 70 శాతం బంగారు రంగులోకి వచ్చాక కోతలు చేపట్టాలి. చేను 12 శాతం కంటే తక్కువగా ఉండేలా చూసుకోవాలి. వర్షం పడే సూచనలు ఉన్నప్పుడు కోత కోయరాదు. కోత కోసే ముందు వరిమడిలో నీరు లేకుండా చూసుకోవాలి. విత్తన వడ్లు తీసుకునే రైతులు మనుషులచేత కోత కోయించడం మంచిది.
– న్యూస్‌టుడే, బనగానపల్లి

కుందేటి వెర్రితో పశువులకు ప్రాణగండం

ఆళ్లగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే: పశువుల్లో వచ్చే ప్రాణాంతకమైన వ్యాధుల్లో కుందేటి వెర్రి ఒకటి. దీన్ని ట్రిపనోసోమియాసిస్ లేదా సర్రా అనే పేర్లతో పిలుస్తారు. జోరీగలు కుట్టడం వల్ల ఈ వ్యాధి వ్యాపిస్తుంది. ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకల్లో ఎక్కువగా కనిపిస్తుంది. సరైన సమయంలో చికిత్స అందించకపోతే.. మరణానికి దారి తీస్తుందని ఆళ్లగడ్డ పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు వరప్రసాద్ తెలిపారు.

● మురుగు ప్రదేశాల నుంచి వచ్చే టాబనిడ్ ఈగల నుంచి ఈ వ్యాధి వ్యాపిస్తుంది. ఇవి కాటు వేయడంతో పశువులకు వ్యాధి సోకుతుంది. వ్యాధిగ్రస్థమైన పశువుల నుంచి ఆరోగ్యకరమైన వాటికి సైతం వ్యాపిస్తుంది.

లక్షణాలు: తీవ్రమైన జ్వరం వల్ల మేత తీసుకోకపోవడం. కళ్లపై తెల్లటి పొరలు ఏర్పడి, కంటి నుంచి నీరు కారడం, గుండ్రంగా తిరగడం, తూలుతూ నడుస్తుంటాయి. వెర్రి చూపులు, పళ్లు కొరకటం, చొంగ కార్చడం వంటి లక్షణాలు ఉంటాయి. కాళ్లు, పొట్ట కింది భాగం, గొంతుపైన నీరు చేరడంతో పాటు కండరాల వణుకు, ఫిట్స్ లక్షణాలు కనిపిస్తాయి. కొన్ని పశువుల్లో లక్షణాలు కనిపించి గుర్తించేలోపు ఫిట్స్ వచ్చి చనిపోతాయి. ఈ వ్యాధి సోకిన గేదెల పాల దిగుబడి గణనీయంగా తగ్గుతుంది. గర్భం దాల్చిన పశువుల్లో గర్భస్రావాలు, నిర్జీవ జననాలు సైతం సంభవిస్తాయి. చికిత్స ఆలస్యమైతే పశువు రక్తహీనతకు లోనవుతుంది. సకాలంలో వైద్యం అందకుంటే అవి చనిపోయే ప్రమాదముంది.

చికిత్స: ఈ వ్యాధికి ప్రధానంగా ట్రిపనోసైడల్ మందులతో చికిత్స అందిస్తారు. సాధారణంగా ఉపయోగించే మందుల్లో డైమినజీన్ అసిటురేట్, ఐసోమెటామిడియం క్లోరైడ్ ముఖ్యమైనవి. ఈ మందులు ట్రిపనోసోమియా జాతుల వల్ల కలిగే తీవ్రమైన, దీర్ఘకాలిక ఇన్ఫెక్షన్లను తగ్గిస్తాయి. వ్యాధి చికిత్సలో గ్లూకోజ్ కీలకమైన పాత్ర పోషిస్తుంది. రక్తహీనత సమస్యను నివారించేందుకు హేమటానిక్స్ వాడాలి.

అల్లాబకాష్.. పాడి లాభాల్లో శెభాష్

డోన్, న్యూస్‌టుడే: డోన్ మండలంలోని తాడూరుకు చెందిన అల్లాబకాష్ ఆవులను పెంచుతూ రోజుకు 150 లీటర్ల పాల దిగుబడి సాధిస్తూ.. స్వయం ఉపాధి పొందుతున్నారు. డిగ్రీ చదివిన అల్లాబకాష్ ఉద్యోగ ప్రయత్నాల్లో భాగంగా 2015లో వైమానిక దళానికి ఎంపికయ్యారు. అనారోగ్య కారణాలతో వెనుదిరగాల్సి వచ్చింది. ఉద్యోగ ప్రయత్నాలకంటే స్వతహాగా ఉపాధి మార్గం వైపు నడవాలనుకున్నారు. సొంతూరులోనే 2023లో రూ.3 లక్షలతో చిన్నషెడ్డు నిర్మించి మూడు ఆవులు కొనుగోలు చేసి వాటి పెంపకం చేపట్టారు. ప్రస్తుతం డెయిరీలో 20 ఆవుల పోషణతో లాభాలు గడిస్తున్నారు. రోజూ 150 లీటర్ల పాలను పత్తికొండలోని ఓ డెయిరీ ఫాంకు లీటరు రూ.40 చొప్పున విక్రయిస్తామన్నారు. రోజుకు రూ.6 వేల వరకు రాబడి వస్తుండగా ఖర్చులు పోనూ రూ.2,500 లాభం పొందుతున్నారు.

డెయిరీ ఫాంలో రైతు అల్లాబకాష్

మేత ఎంపికలో మెలకువలు

పశువులకు పాల దిగుబడి పెరగాలంటే మేత ఎంతో ముఖ్యం. ఇందుకోసం ఆయన పచ్చిమేతపై ప్రత్యేక దృష్టి సారించారు. సూపర్ నేపియర్ 4జీ బుల్లెట్, గరుడ అనే నేపియర్ గడ్డిరకాలను ఎంపిక చేసుకొని పొలంలో వాటిని పెంచుతున్నారు. ఈ గడ్డిని ఆవులకు పచ్చిమేతగా వేస్తుండటంతో మంచి పాలదిగుబడి వస్తుందని ఆయన పేర్కొన్నారు. దీంతో పాటు గానుగచెక్క, దాణాను ఇస్తున్నారు.

ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి

కర్నూలు సచివాలయం, కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే: బాలికలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని, బాగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ డా.రాయపాటి శైలజ అన్నారు. నగరంలోని ప్రభుత్వ వెనుకబడిన తరగతుల బాలికల సంక్షేమ వసతిగృహాన్ని సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం వివిధ పథకాలను అమలుచేస్తోందని, వీటన్నింటిని సద్వినియోగం చేసుకుని ఉన్నతంగా రాణించాలని చెప్పారు.

■ జిల్లా పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ డా.రాయపాటి శైలజను కలెక్టర్ డా.ఎ.సిరి మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందించారు.

విద్యార్థినులతో మాట్లాడుతున్న డా.రాయపాటి శైలజ

సొంత నిధులతో కాపు, బీసీ భవన నిర్మాణాలు

పూజా కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి టీజీ భరత్

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: కాపు, బీసీ భవన నిర్మాణాలను సొంత నిధులతో పూర్తి చేసేలా కృషి చేస్తున్నామని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు. కర్నూలు బి.క్యాంపులో కాపు, బీసీ భవనాల పునర్నిర్మాణానికి మంత్రి సోమవారం పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ 2014-19 మధ్య కాలంలో అప్పటి తెదేపా ప్రభుత్వం కాపు, బీసీ భవనాల నిర్మాణానికి చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం ఈ పనులను ఆపేసిందని చెప్పారు. కాపు భవనానికి రూ.1.50 కోట్లు, బీసీ భవన నిర్మాణానికి రూ.2 కోట్లను టీజీవీ సంస్థల ద్వారా కేటాయించి ఎనిమిది నెలల్లో పూర్తి చేయిస్తామన్నారు. ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌కు ప్రపంచవ్యాప్తంగా రూ.10 వేల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయని.. రూ.7 వేల కోట్లతో అగస్త్య కంపెనీ వస్తోందని పేర్కొన్నారు. నగరంలో రహదారులను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాపు, బలిజ సంఘాల నాయకులు నారాయణరెడ్డి, డా.కుళ్లాయప్ప, పత్తి ఓబులయ్య, సోమశేఖర్, జనసేన పార్టీ నేత చింతా మోహన్, బీసీ నాయకులు శ్రీధర్, శ్రీనివాసులు, రాంబాబు, రామకృష్ణ, బీసన్న తదితరులు పాల్గొన్నారు.

అర్జీలు వేగంగా పరిష్కరించాలి

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చిన అర్జీలను వేగంగా పరిష్కరించాలని కలెక్టర్ డా.ఎ.సిరి ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం పీజీఆర్ఎస్ నిర్వహించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. అర్జీలను మరింత సమర్థంగా పరిష్కరించేందుకు నోడల్ అధికారులను నియమిస్తున్నట్లు చెప్పారు.

☛ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థుల్లో సుమారు 450 మంది పాఠశాలలకు గైర్హాజరైనట్లు గుర్తించామని, వారిని తిరిగి బడుల్లో చేరేలా చర్యలు తీసుకోవాలని డీఈవో, ఆర్డీవోలను కలెక్టర్ ఆదేశించారు. తల్లిదండ్రులు వలస వెళ్లినట్లైతే విద్యార్థులను సీజనల్ హాస్టళ్లలో చేర్పించాలని, పదో తరగతి విద్యార్థుల కోసం రూపొందించిన వంద రోజుల ప్రణాళికను సమర్థంగా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో వెంకట నారాయణమ్మ, హౌసింగ్ పీడీ చిరంజీవి, ప్రత్యేక ఉప కలెక్టర్లు అనురాధ, కొండయ్య, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బాధితులతో మాట్లాడుతున్న కలెక్టర్ డా.ఎ.సిరి

ఉద్యోగాల పేరుతో మోసం

● ఎస్పీకి బాధితుల ఫిర్యాదు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి డబ్బులు తీసుకుని మోసగించారని పలువురు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. కర్నూలు కొత్తపేటలోని క్యాంపు కార్యాలయంలో ఎస్పీ విక్రాంత్‌పాటిల్ ఆధ్వర్యంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి బాధితులు వచ్చి సమస్యలు విన్నవించారు. విచారణ జరిపి చట్టపరిధిలో న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అదనపు ఎస్పీ హుస్సేన్ పీరా, సీఐలు పాల్గొన్నారు.

బాధితుల సమస్య వింటున్న ఎస్పీ విక్రాంత్‌పాటిల్

వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని..

◆ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి కర్నూలుకు చెందిన కిశోర్ అనే వ్యక్తి రూ.11.10 లక్షలు తీసుకుని మోసగించాడని హైదరాబాద్‌కు చెందిన దీప ఆవేదన వ్యక్తం చేశారు.

◆ గూడూరుకు చెందిన సుధాకర్ అనే వ్యక్తి సమగ్ర శిక్షాలో ఫీల్డ్ అసిస్టెంట్ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి రూ.లక్ష తీసుకుని నకిలీ పత్రం ఇచ్చి మోసగించారని కర్నూలు శ్రీరామ్‌నగర్‌కు చెందిన అన్నమ్మ ఫిర్యాదు చేశారు.

◆ కర్నూలుకు చెందిన కాశీం వలి ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి రూ.5 లక్షలు తీసుకున్నాడని.. బాలాజీనగర్‌కు చెందిన భారతి పేర్కొన్నారు.

◆ కర్నూలు మండలం వెంకాయపల్లె పరిధిలో 1.40 ఎకరాలను కబ్జా చేశారని.. చర్యలు తీసుకుని న్యాయం చేయాలని మిలిటరీ కాలనీకి చెందిన చంద్రమ్మ కోరారు.

◆ తన ఇద్దరు కుమారులు అన్నం పెట్టకుండా ఇంట్లో నుంచి గెంటేశారని.. న్యాయం చేయాలని గూడూరుకు చెందిన అంజనమ్మ విన్నవించారు.

ఆదోనిలో స్వర్ణామృత ప్రాసన ఔషధం పంపిణీ నేడు

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలో ఆవోపా ఆధ్వర్యంలో మంగళవారం స్వర్ణామృత ప్రాసన ఔషధం పంపిణీ చేస్తున్నట్లు ఆవోపా అధ్యక్షుడు శ్రీనాథ్‌గుప్తా సోమవారం తెలిపారు. త్రిదండి చిన జీయర్ స్వామి మంగళ శాసనాలతో వికాసతరంగిణి సహకారంతో ఉదయం 7 గంటలకు రెండో పట్టణ పోలీసు స్టేషన్ ప్రాంతంలో అభయాంజనేయ స్వామి ఆలయ ఆవరణలో పంపిణీ చేస్తామన్నారు. ఆరు నెలల చిన్నారుల నుంచి 16 ఏళ్ల పిల్లల వరకు ఔషధం తీసుకోవచ్చన్నారు.

లంచం కేసులో జైలుశిక్ష

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: లంచం తీసుకున్న కేసులో దక్షిణ మధ్య రైల్వే గుంతకల్ డివిజనల్ ఫైనాన్స్ కార్యాలయ అకౌంట్స్ అసిస్టెంట్‌గా పనిచేసిన చల్లా శ్రీనివాసులుకు (ప్రస్తుతం రిటైర్డ్) రెండేళ్ల జైలుశిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధిస్తూ కర్నూలు సీబీఐ కోర్టు న్యాయమూర్తి ఎం.శోభారాణి సోమవారం తీర్పు ఇచ్చారు. గుత్తేదారు డైన సీహెచ్‌డీ రాజులు నాయుడు.. తాను చేసిన పనులకు సంబంధించి రూ.30 లక్షల విలువైన బిల్లులు పెట్టారు. దీనిని మంజూరు చేసేందుకు నిందితుడు రూ.15 వేలు లంచం డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు సీబీఐని ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. 2017, నవంబరు 20న గుత్తేదారుడు లంచం ఇస్తుండగా సీబీఐ అధికారులు దాడి చేసి పట్టుకుని అరెస్టు చేశారు. కోర్టు విచారణలో నిందితుడిపై నేరం రుజువవడంతో జైలుశిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చేశారు. ప్రాసిక్యూషన్ తరఫున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సిరికొండ మనోహర్ వాదించారు.

'సిలికాసాండ్ మైనింగ్'పై రైతుల నిరసన

వెల్దుర్తి, న్యూస్‌టుడే: మండలంలోని బుక్కాపురం పరిధిలోని సర్వే నెంబర్ 214లో సిలికా సాండ్ పరిశ్రమ ఏర్పాటుకు వ్యతిరేకంగా రైతులు సోమవారం తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. రైతులకు సమాచారం అందించకుండా కాలుష్య నియంత్రణ, రెవెన్యూ అధికారులు ఈ నెల 6న ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారని, తామంతా వద్దని చెప్పినా పరిగణలోకి తీసుకోలేదని విమర్శించారు. పరిశ్రమ ఏర్పాటు చేస్తే కాలుష్యం వల్ల పంటలు పండవని చెబుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఈ పరిశ్రమను ఏర్పాటు చేస్తే ఆందోళనలు చేపడతామని రైతులు అధికారులకు తెలిపారు. కార్యక్రమంలో రైతులు శంకరరెడ్డి, ఈశ్వరరెడ్డి, రామచంద్రారెడ్డి, చిన్నమద్దిలేటి, బసవయ్య గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న బుక్కాపురం రైతులు

లీకేజీల నివారణకు చర్యలు

స్పందనకు వందనం

కర్నూలు జలమండలి, న్యూస్‌టుడే: సుంకేసుల జలాశయం పరిధిలో లీకేజీలను పూర్తిస్థాయిలో అరికట్టాలని జలవనరుల శాఖ కర్నూలు సర్కిల్ ఎస్ఈ బి.బాలచంద్రారెడ్డి ఆదేశించారు. 'సుంకేసులకు గండం' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించి సోమవారం సాయంత్రం పరిశీలించారు. ఎన్ని గేట్ల వద్ద లీకేజీలవుతున్నాయి.. తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. 9 గేట్ల నుంచి లీకేజీలు అవుతున్నాయని, సాంకేతిక సిబ్బంది సాయంతో ఒక గేటు వద్ద పని పూర్తి చేశామని కేసీసీ కర్నూలు డీఈఈ ప్రసాదరావు వివరించారు. వేసవిలో ఎదురయ్యే నీటి సమస్యను దృష్టిలో ఉంచుకుని అన్ని గేట్ల వద్ద లీకేజీలు అరికట్టాలని ఎస్ఈ ఆదేశించారు.



జలాశయం వద్ద గేట్లను పరిశీలిస్తున్న ఎస్ఈ బాలచంద్రారెడ్డి, డీఈఈ ప్రసాదరావు

ఆదోని జిల్లా సాధనకు కలిసికట్టుగా పోరాటం

● 10న బందుకు పిలుపు

ఆదోని ఎస్కేడీ కాలనీ, న్యూస్‌టుడే: ఆదోని జిల్లా సాధనకు డివిజన్ పరిధిలోని ఆదోని, పత్తికొండ, ఆలూరు, మంత్రాలయం, ఎమ్మిగనూరు నియోజకవర్గాల ప్రజలు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాలు, ఉద్యోగ, కార్మికులు తదితర అన్ని వర్గాల ప్రజలు కదలిరావాలని ఆదోని జిల్లా సాధన సమితి ఐక్య కార్యాచరణ కమిటీ(జేఏసీ) నాయకులు రఘురామయ్య, కృష్ణమూర్తిగౌడు, దేవిశెట్టి ప్రకాశ్, లలితమ్మ, దస్తగిరినాయుడు, కోదండ, అశోకానందరెడ్డి, ప్రకాశ్‌జైన్ తదితరులు పిలుపునిచ్చారు. ఆదోని జిల్లా సాధన కోసం ఆదోని పట్టణంలోని కోట్ల కూడలి వద్ద చేపట్టిన రిలే నిరహారదీక్షలు సోమవారం 23వ రోజుకు చేరుకుంది. ఈ నెల 10వ తేదీన ఐకాస ఆధ్వర్యంలో ఆదోని బందుకు పిలుపునిచ్చారు. వ్యాపారులు, ఉద్యోగులు, కార్మికులు, ప్రజలు స్వచ్ఛందంగా బందు చేసి మద్దతు తెలిపాలని పేర్కొన్నారు.

రిలే దీక్షల్లోలు పద్మశాలి యువజన సేవా సంఘం సభ్యులు

☛ ఆదోని పట్టణానికి చెందిన పద్మశాలి యువజన సేవా సంఘం సభ్యులు దీక్షలో కూర్చొని తమ మద్దతు తెలిపారు. దీక్షలో సంఘం సభ్యులు బూదరపు లక్ష్మన్న, చిలక శేఖర్, బూదరపు నాగరాజు, చిలక కృష్ణ, గంజి వీరభద్రస్వామి, సిరసాల నారాయణ, జెరుబండి కృష్ణమూర్తి, జి.రామాంజనేయులు, వై.రాఘవేంద్ర కూర్చొని మద్దతు ఇచ్చారు.

☛ ఆదోని పట్టణంలోని చిన్మయ విద్యాలయం విద్యార్థులు మద్దతుగా నిలిచారు. పాఠశాల నుంచి పట్టణ ప్రధాన రహదారిపై పెద్దఎత్తున విద్యార్థులు ప్రదర్శన నిర్వహించారు.

ఆదోని కోట్ల కూడలిలో విద్యార్థుల మానవహారం

జిల్లాగా ప్రకటించాలని ముఖ్యమంత్రికి విన్నపం

ఆదోని ఎస్కేడీ కాలనీ, న్యూస్‌టుడే: ఆదోని కొత్త జిల్లాగా ఏర్పాటు చేయాలని ఎమ్మెల్సీ బి.టి.నాయుడు సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి అభ్యర్థించారు. గత కొన్ని రోజులుగా ఆదోని జిల్లా సాధనకు చేస్తున్న ఉద్యమాలు, రిలే నిరాహారదీక్షలు, వివిధ సంఘాలు చేస్తున్న పోరాటాలపై చంద్రబాబుకు వివరించారు. జిల్లా అయ్యే పూర్తి అర్హతలు ఉన్నాయని, ప్రజల అభ్యర్థనలు, భౌగోళిక పరిపాలన అవసరాలను పరిగణలోకి తీసుకొని ఆదోనిని కొత్త జిల్లాగా ప్రకటించాలని కోరారు.

ముఖ్యమంత్రి చంద్రబాబుకు విన్నవిస్తున్న ఎమ్మెల్సీ బి.టి.నాయుడు

సమస్యలు పరిష్కరించేదాకా ఉద్యమిస్తాం

నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే: కర్నూలు డిపో-2 డిపోలో నెలకొన్న సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమం కొనసాగిస్తామని ఎంప్లాయీస్ యూనియన్ డిపో కార్యదర్శి జి.మహేశ్వరరావు అన్నారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆ యూనియన్ నాయకులు సోమవారం కర్నూలు-1, 2 డిపోల వద్ద గేట్ మీటింగ్ పెట్టారు. ఎర్రబ్యాడ్జీలు ధరించి ఆందోళన చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం డిపో అధ్యక్షుడు జీవీ రెడ్డి, నాయకులు వీరేష్, శివకేశన్న, సుజయ్‌రాజు, కృష్ణ, రామకృష్ణ, సులోచన, రామ లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

పరిశోధనలకు ప్రాధాన్యమివ్వాలి

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: వర్సిటీ క్యాంపస్‌లో పరిశ్రమల ఏర్పాటు మహోన్నతమైన కార్యక్రమమని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు. నగర పరిధిలోని బి.తాండ్రపాడులో ఉన్న శ్రీచైతన్య కళాశాల బాలుర హాస్టల్ క్యాంపస్‌లో కేఎల్ యూనివర్సిటీ, శ్రీచైతన్య విద్యా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో 'ఇంటర్ విద్యార్థులు.. వ్యక్తిత్వ వికాసం' అంశంపై సోమవారం సదస్సు నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ నైపుణ్యాభివృద్ధి అత్యంత అవసరమని చెప్పారు. కేఎల్ వర్సిటీ డైరెక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ లక్ష్య సాధనకు చేరుకోవాలంటే ప్రణాళికతో ముందుకెళ్లాలన్నారు. తమ వర్సిటీ పరిశోధనలకు ప్రాధాన్యమిస్తోందని చెప్పారు. శాటిలైట్ ప్రయోగాలతో జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో కేఎల్ వర్సిటీ రాయలసీమ జోనల్ హెడ్ కేశవగౌడ్, శ్రీచైతన్య విద్యాసంస్థల ఏజీఎం మురళీకృష్ణ, డీన్ బాలాజీ, జోనల్ ఇన్‌ఛార్జి కృపారాజు తదితరులు పాల్గొన్నారు.

పత్రాలు ఆవిష్కరిస్తున్న మంత్రి టీజీ భరత్ తదితరులు

కోవెలకుంట.. ఆక్రమణల పుట్ట

■ ఐదు వందల ఎకరాలు మాయం

■ ఉన్న పొలానికీ వేలం కరవు

కోవెలకుంట్లలో పాండురంగస్వామి ఆలయ భూమిలో నిర్మాణాలు

నంద్యాల పట్టణం, కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: జిల్లాలో ఆలయ భూములు హారతి కర్పూరంలా కరిగిపోతున్నాయి. కోవెలకుంట్ల మండల కేంద్రంలోని పాండురంగ స్వామి ఆలయానికి ఒకప్పుడు వందల ఎకరాల పొలం ఉండేది. కోవెలకుంట్ల, చింతకుంట పొరుగు గ్రామాలుగా ఉండేవి. వీటి పరిధిలో ఆలయ భూమి ఉండేది. రెండు గ్రామాలు కలిసిపోయి ప్రస్తుతం కోవెలకుంట్లగా మారింది. ఈ ఆలయం భూమి కనుమరుగైపోయింది. ప్రస్తుతం మండల కేంద్రంగా ఉన్న కోవెలకుంట్లలో గృహాలు, దుకాణాల సదుపాయాలు, ఇతర నిర్మాణాలు 50శాతానికి పైగా ఈ ఆలయానికి చెందిన భూమిలోనే ఉన్నాయి.

వెలిసిన గోదాములు

ఆలయ పరిధిలో ఒకప్పుడు 750 ఎకరాల పొలం ఉండేది. మూడు దశాబ్దాల కిందట అప్పటి ప్రజాప్రతినిధి ఒకరు ఆలయానికి సేవలు చేసే వివిధ వర్గాలకు 'కోవెల' భూమిని ఇళ్ల పట్టాల పేరుతో పంపిణీ చేశారు. ఇదే అదనుగా మరికొందరు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. వర్గాలుగా విభజించుకుని పంచేసుకున్నారు. ఐదు వందల ఎకరాల వరకు అన్యాక్రాంతమైంది. గోదాములు, వాణిజ్య సముదాయాలు నిర్మించారు. బాడుగులకు ఇచ్చి సొమ్ము చేసుకొంటున్నారు. వందల సంఖ్యలో ఇళ్లు వెలిశాయి. వీటిలో కొన్ని నిర్మాణాలకు రిజిస్ట్రేషన్లు లేవు. ఆలయ నిర్వహణకు ఇబ్బందిగా ఉండడంతో దాతల సహాయంతో వాణిజ్య సముదాయాలు నిర్మించారు. వచ్చిన డబ్బులతో ఆలయ నిర్వహణ చేస్తున్నారు.

62.5 ఎకరాలు ఎక్కడ

● ప్రస్తుతం కోవెలకుంట్ల మండలం సౌదరదిన్నె గ్రామ పరిధి సర్వే నంబరు 93లో 2.44 ఎకరాలు, 916లో 8.81 ఎకరాలు కలిపి మొత్తం 11.25 ఎకరాలు, చింతకుంట గ్రామ పరిధిలో సర్వే నంబరు 173లో 9.89 ఎకరాలు, 174-1లో 5.50 ఎకరాలు, 174-2లో 11.06 ఎకరాలు, 174-3లో 5.6 ఎకరాలు, 138-బీలో 1.08, 154లో 13.22, 198లో రెండు ఎకరాలు, 234-2లో 0.56 ఎకరాలు, 71లో 0.26 ఎకరాలు, 73-ఏలో 2.08 ఎకరాలు కలిపి మొత్తం 51.25 ఎకరాల భూమి ఉంది. ప్రస్తుతం మొత్తం 62.5 ఎకరాల భూమి ఉంది.

● ఈ భూమి కౌలుకు అధికారికంగా వేలం పాటలు నిర్వహించలేదు. దస్త్రాల్లో భూమి ఉన్నా ఎవరి ఆధీనంలో ఉంది, సాగు చేస్తున్నది ఎవరు? క్షేత్రస్థాయిలో భూమి స్వరూపం ఎలా ఉందని ఆలయ అధికారులకు తెలియని దుస్థితి. రూ.కోట్లలో విలువ చేసే భూములు ఆక్రమణలో ఉన్నా అధికారుల చర్యలు లేవు.

తుంగభద్రలో ఆగని అక్రమ ఇసుక రవాణా

నాగలదిన్నె గ్రామంలో తుంగభద్ర నది నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లు

నందవరం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని ప్రవేశపెట్టినా కొందరు నాయకులు అండతో ఇంకా ఇసుకను అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. సోమవారం మండల పరిధిలోని నాగలదిన్నె, నదికైరవాడి, గంగవరం గ్రామాల్లో తుంగభద్ర నదిలోని ఇసుకను ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. నందవరం పోలీస్‌స్టేషన్ ఎదురుగానే ఇసుక ట్రాక్టర్లు అక్రమంగా తరలిస్తున్నా పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇసుకను యథేచ్ఛగా దోచుకెళ్తున్నారు. అక్రమ రవాణాలో విసుగెత్తిన గ్రామస్థులు పలుమార్లు మండల అధికారులకు ఫిర్యాదు చేసిన ఫలితం లేకుండా పోయిందని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు అక్రమ ఇసుక మాఫియాకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

EENADU Classifieds

JOBS

అమెరికాలో 1 సం|| బాబు ఆలన, పాలన వ్యక్తిగత సంరక్షణ కొరకు అనుభవంగల ఆడవారు కావలెను. అమెరికా వీసా కల్గినవారు మాత్రమే. ✆ 94408 03362.

సాయికీర్తి డెంటల్ క్లినిక్ నందు పనిచేయుటకు అటెండర్/ హెల్పర్ కావలెను. అర్హత: 10th/ ఇంటర్. అడ్రస్: గాంధీ నగర్, కర్నూలు. Ph: 98851 02384.

కర్నూలులోని ప్రముఖ మహిళా కళాశాల హాస్టల్ నందు ఉండి పనిచేయుటకు లేడీ హాస్టల్ వార్డెన్స్ కావలెను. భోజన & వసతి సౌకర్యం కల్పించబడును. అనుభవం గల వారికి ప్రాధాన్యత. ✆ 8919234655.

అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు
B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే.
కలర్ 5 లైన్ల ప్రకటన రూ. 555/- మాత్రమే.
ప్రకటనలపై 5% GST వర్తించును.
వివరాలకు: 99899 97628

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

ఆదోని

• ఆదోని • ఆలూరు • పత్తికొండ

ప్రతిజ్ఞ చేస్తున్న సబ్ కలెక్టర్ అజయ్‌కుమార్, సీడీపీవో ఢిల్లీశ్వరి, తదితరులు

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేద్దాం

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: బాల్య వివాహాల నిర్మూలనకు సమష్టిగా అందరం కృషి చేద్దామని ఆదోని సబ్ కలెక్టర్ అజయ్‌కుమార్ అన్నారు. ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలనపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఆదోని సీడీపీవో ఢిల్లీశ్వరి, సబ్ కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారిణి వసుంధర, పర్యవేక్షకులు తదితరులు పాల్గొన్నారు.

దుకాణాల్లో చోరీ

ఆలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ఆలూరు పట్టణంలోని గుంతకల్లు రహదారిలో ఏర్పాటు చేసుకున్న వైన్స్ షాపు సమీపంలో ఏర్పాటు చేసుకున్న దుకాణాల్లో చోరీ జరిగింది. గమనించిన దుకాణాల యజమానులు రంగనాథ్, నాగరాజులు తెలిపారు. రెండు దుకాణాల్లో సిగరెట్లు, నగదు, ఇతరత్రా వస్తువులు మొత్తం రూ.30 వేలు దోచుకెళ్లినట్లు బాధితులు వెల్లడించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM) ఆదోని: 77996 66004 ఆలూరు: 80085 62277 పత్తికొండ: 80085 73822

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: ?: నలకదొడ్డి గ్రామం నుంచి ఆస్పరి-బళ్లారి రోడ్డుకు వెళ్లే మార్గంలోని చెరువుకట్ట మలుపు వద్ద రోడ్డు దెబ్బతిని ప్రమాదకరంగా మారింది. - గ్రామస్థులు, నలకదొడ్డి

✓: రహదారిని పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటాం. - దివ్య, పంచాయతీ కార్యదర్శి

హొళగుంద, న్యూస్‌టుడే: ?: ఎల్లార్తి గ్రామంలో ప్రధాన రహదారి అంచున సీసీరోడ్డు బ్యాంకుకు ఓ వైపు కుళాయి లీక్ వల్ల వృథా అవుతోంది. సమస్య పరిష్కరించండి. - సలీం, ఎల్లార్తి

✓: పంచాయతీ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తాం. - చాముండేశ్వరి, సర్పంచ్, ఎల్లార్తి

మద్దికెర, న్యూస్‌టుడే: ?: మద్దికెరలోని పెద్దనగరి ముందు సిమెంటు రహదారిపై గుంతలు పడ్డాయి. - లింగప్ప, మద్దికెర

✓: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. - విజయ్, పంచాయతీ కార్యదర్శి, మద్దికెర

చిప్పగిరి, న్యూస్‌టుడే: ?: చిప్పగిరి మండలంలోని సంగాల ప్రధాన రహదారిలో మురుగు పరుగులు తీస్తోంది. - భాస్కర్, సంగాల

✓: సీసీ రహదారులు, మురుగు కాల్వల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు రాగానే పనులు చేపడతాం. - బాలన్న, పంచాయతీ కార్యదర్శి నేమకల్లు

సీసీ రహదారుల నిర్మాణానికి రూ.1.20 కోట్లు

చిప్పగిరి: మండలంలో సీసీ రహదారుల నిర్మాణానికి రూ.1.20 కోట్లు మంజూరైనట్లు మండల ఇంజినీరు సోమప్ప సోమవారం తెలిపారు. నేమకల్లు, రామదుర్గం, నగరడోణ, డేగలహల్, నంచెర్ల, చిప్పగిరి, కుందనగుర్తి గ్రామాల్లో ఈ నిధులతో సీసీ రహదారులు నిర్మిస్తామని ఆయన చెప్పారు. నేమకల్లులో సీసీ రహదారుల నిర్మాణం ముమ్మరంగా సాగుతోందన్నారు.

తపాలా కార్యాలయంలో విచారణ

మద్దికెర, న్యూస్‌టుడే: మద్దికెర తపాలా కార్యాలయంలో గతంలో ఉన్న ఓ అధికారి వల్ల తప్పు జరిగిందని విచారణ అధికారులు తేల్చారు. మద్దికెరకు చెందిన గొడుగు మల్లికార్జున తన కుమార్తె పేరుపై సుకన్య సమృద్ధి యోజన కింద ఏటా రూ.20వేలు చెల్లిస్తున్నారు. 2023లో రూ.20వేలు చెల్లించగా పాసుపుస్తకంలో రూ.20వేలు నమోదు చేసిన తపాలా అధికారి ఆన్‌లైన్‌లో మాత్రం రూ.2వేలు చేశారు. దీనిపై 'డిపాజిట్ల లెక్క తప్పుతోంది' అనే శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి తపాలా శాఖ ఆదోని ప్రధాన కార్యాలయం అధికారులు స్పందించారు. సోమవారం విచారణ అధికారి జయకృష్ణ, ప్రస్తుత తపాలా అధికారి రమేశ్ దస్త్రాలు తనిఖీ చేసి అవకతవకలు జరిగినట్లు నిర్ధారించారు. బాధితుడికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు.

డి-పట్టా రైతులకు అష్టకష్టాలు

వెల్దుర్తి, న్యూస్‌టుడే: నిరుపేద రైతులకు వ్యవసాయ సాగుకోసం ప్రభుత్వం డి-పట్టాలు అందించింది. ఆ పొలాల్లో సాగుచేస్తున్న రైతులకు ప్రభుత్వ పథకాలు అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం అందిస్తున్న అన్నదాత సుఖీభవ అందకపోవడంతో పాటు, వ్యవసాయ రుణాలు పొందేందుకు ఇబ్బందులు పడుతున్నారు.

అంతర్జాలంలో విస్తీర్ణం మాయం

వెల్దుర్తికి చెందిన బస్తిపాటి ఎల్లప్పకు 2263 ఖాతాకు సంబంధించి 2.15 ఎకరాల భూమి ఉంది. వీటిలో 113-9 సర్వే నెంబరు ప్రైవేటు భూమిలో 1.36 ఎకరాలు ఉంది. సర్వే నెంబర్ 1239-7 ప్రభుత్వ భూమికి సంబంధించి 77 సెంట్ల భూమి ఉంది. దీంతో అన్నదాత సుఖీభవకు ఎంపిక కాలేదు. ప్రైవేటు భూమి ఉన్నా.. పథకం వర్తించలేదు. వ్యవసాయాధికారులకు సైతం విన్నవించారు. వారు సైతం నమోదు చేసినా.. నేటికీ ప్రభుత్వ పథకాలు అందడంలేదు. వీటితో పాటు ప్రస్తుతం అంతర్జాలంలో సైతం ప్రభుత్వ భూమికి సంబంధించిన విస్తీర్ణం కనపించకపోవడంతో రైతు ఆందోళన చెందుతున్నారు.

ఈ ఏడాది ఫిబ్రవరిలో ఉన్న భూమి వివరాలు నవంబరులో తొలగింపు

సూదేపల్లి గ్రామానికి చెందిన రాజుకు 169-2 సర్వేనెంబర్‌లో భూమి ఉంది. రెవెన్యూ దస్త్రాల్లో సైతం ఆయన పేరుంది. ఇప్పటి వరకు అన్నదాత సుఖీభవ రాలేదు. పలుసార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోయింది. ప్రభుత్వ అందించిన డీపట్టా భూములకు అన్నదాత సుఖీభవ అందించేందుకు అవకాశం కల్పించలేదని అధికారులు చెబుతున్నారు. కొన్నేళ్లుగా వ్యవసాయాన్ని నమ్ముకొని జీవనం సాగిస్తున్న ఇతనికి ప్రభుత్వ పథకాలు అందకపోవడంతో ఆవేదన చెందుతున్నారు.

ప్రోత్సాహకాలు దూరం

పత్తికొండ నియోజకవర్గంలో సుమారు 5,800 మంది రైతులు అర్హత ఉన్నా అన్నదాత సుఖీభవ పథకం అందకపోవడంతో వాటి కోసం ఎదురుచూస్తున్నారు. వెల్దుర్తి మండలంలో 1200, కృష్ణగిరిలో 1100, పత్తికొండలో 900 మంది రైతులకు డీ-పట్టా భూములతో పాటు, ఇతర కారణాలతో ప్రభుత్వం అందిస్తున్న నగదు ప్రోత్సాహకాలు అందక ఇబ్బందులు పడుతున్నారు.

★ జమకాని అన్నదాత సుఖీభవ
★ వ్యవసాయ అవసరాలకు తప్పని తిప్పలు

అందని రుణాలతో అవస్థలు

ప్రభుత్వ భూములకు సంబంధించిన వివరాలు అంతర్జాలంలో చూపకపోవడంతో డీపట్టా సాగు చేస్తున్న రైతులు వ్యవసాయ రుణాలు పొందేందుకు ఇబ్బందులు పడుతున్నారు. బ్యాంకుల్లో వ్యవసాయ రుణాలు పొందాలంటే మీసేవ, సచివాలయాల్లో భూమికి సంబంధించిన 1-బి, అడంగల్ పత్రాలు తీసుకెళ్లాలి. వాటిలో వివరాలు కనిపించకపోవడంతో రుణాలు పొందే సమయంలో అవస్థలు పడుతున్నారు. రెవెన్యూ కార్యాలయాలకు వెళ్లి భూమి ఉన్నట్లు వీఆర్వో, తహసీల్దారుతో సంతకాలు చేయించుకుంటే రుణం అందిస్తున్నారు. దీంతో రైతులు రెవెన్యూ కార్యాలయాలకు ప్రదక్షిణలు చేయాల్సి వస్తుంది. కొన్ని సమయాల్లో రెవెన్యూ అధికారులు అందుబాటులో లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

ఇబ్బందులు లేకుండా చర్యలు

- చంద్రశేఖరవర్మ, తహసీల్దార్, వెల్దుర్తి

డీ-పట్టా ఉన్న రైతులకు రుణాలు పొందేందుకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. పంట రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న రైతులకు వెబ్‌ల్యాండ్ రికార్డుల ఆధారంగా వీఆర్వో, తహసీల్దారు సంతకాలు చేసి ఇవ్వడంతో బ్యాంకులు రుణాలు అందిస్తున్నాయి. వాటికి ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం.

వసతి గృహాల సమస్యలపై ఏబీవీపీ సర్వే

ఆదోని విద్య, న్యూస్‌టుడే: వసతి గృహాల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకునేందుకు 2025 ఫిబ్రవరి నుంచి ఏబీవీపీ ఆధ్వర్యంలో 'హాస్టల్ సర్వే' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు గేటు ఎర్రిస్వామి తెలిపారు. గత నెల ఉత్తరాఖండ్ రాజధాని డెహ్రాడూన్‌లో జరిగిన ఏబీవీపీ జాతీయ మహాసభలు విజయవంతంపై ఆదోని పట్టణంలో ఏబీవీపీ సమావేశం నిర్వహించారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సమావేశంలో ఏబీవీపీ జిల్లా కన్వీనరు వీరేశ్, సభ్యులు గోవిందు, ఉమామహేశ్, శివ తదితరులు పాల్గొన్నారు.

కలుషితమైతే.. విషమే

తాగునీటి పథకం పైపులైను మురుగులో కలిసిపోయింది. పైపులైన్ లీకేజీ వల్ల మురుగు తాగునీటిలో కలుస్తోంది. కుళాయిల్లో వచ్చే నీరు ఒక్కోసారి దుర్వాసన వస్తోందని స్థానికులు రామకృష్ణ, రవి తదితరులు ఆరోపిస్తున్నారు. పలుమార్లు పంచాయతీ సిబ్బందికి విన్నవించినా పట్టించుకోవడం లేదని నిరసన వ్యక్తం చేస్తున్నారు. మద్దికెరలోని పందుల కుంట సమీపంలోని కూడలిలో మురుగు కాల్వలోనే నీటి పథకం పైపులైను వేశారు. నిత్యం లీకవుతోంది. ఇప్పటికైనా మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, మద్దికెర

భయపెడుతున్న శునకాలు

పత్తికొండ పట్టణంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల విద్యార్థులను మధ్యాహ్న భోజన సమయంలో కుక్కలు ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఈ పాఠశాలలో సుమారు 1200 మంది విద్యార్థులు ఉన్నారు. ఓ వైపు పాఠశాల ప్రహరీ ఎత్తు తక్కువగా ఉండటంతో వీధి కుక్కలు పాఠశాల ఆవరణలోకి చొరబడుతున్నాయి. కుక్కలు కొట్లాడుతూ.. ఎక్కడ కరుస్తాయోనని విద్యార్థులు, మధ్యాహ్న భోజన నిర్వాహకులు హడలిపోతున్నారు. ప్రశాంతంగా భోజనం చేయలేని పరిస్థితి నెలకొంది. వీధి కుక్కలు పాఠశాల ఆవరణంలోకి రాకుండా చర్యలు తీసుకోవాలని వారు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. – న్యూస్‌టుడే, పత్తికొండ గ్రామీణం

రథోత్సవానికి లడ్డూ ప్రసాదం

హాలహర్వి మండలం గూళ్యం గ్రామంలో వెలసిన గాదిలింగేశ్వరస్వామి పూల రథోత్సవం ఈ నెల 11న జరగనుంది. ఈ జాతర తిలకించేందుకు వేలాది మంది భక్తులు తరలివస్తారు. వచ్చే భక్తులకు లడ్డూ ప్రసాదం అందించేందుకు ఆలయ కమిటీ నిర్వాహకులు చర్యలు చేపట్టారు. రెండు రోజుల పాటు ప్రసాదం తయారు చేసేందుకు చర్యలు తీసుకున్నారు. సుమారు 25 క్వింటాళ్ల చక్కెర వినియోగించనున్నారు. రథోత్సవం రోజు ఉదయం 11 నుంచి రాత్రి 10 గంటల వరకు భక్తులకు అందించే అన్నదానంలో ఈ లడ్డూ ప్రసాదం వడ్డించనున్నారు. – న్యూస్‌టుడే, హాలహర్వి

ఆలూరులో శాంతియుత నిరసన దీక్షాశిబిరం

ఆలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ఆదోనిని జిల్లా చేయాల్సిందేనని సాధన సమితి సభ్యులు కత్తి రామాంజనేయులు, భూపేష్, రాము అన్నారు. సోమవారం ఆలూరులో వారు విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం ఏదైనా జిల్లా కలెక్టర్, ఎస్పీని కలిసి సమస్య విన్నవించాలంటే వంద కి.మీ. పైనే ప్రయాణం చేయాల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇకపై ఆలూరు పట్టణంలో శాంతియుత నిరసన దీక్షాశిబిరం ఏర్పాటు చేస్తామన్నారు. ఈ విషయమై ఆలూరు సీఐ రవిశంకర్‌రెడ్డి, ఎస్సై మన్మథ విజయ్‌ని కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రవీంద్రరావు, గోపాల్‌నాయుడు, బంగారు రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఒకే మాటపై ఉందాం

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: ఆదోనిని జిల్లా చేయడంతో పాటు నాలుగు మండలాలుగా చేయాలనే ఒకే మాటపైనే మనమంతా నిలబడుదామని ఎమ్మెల్యే పార్థసారథి అన్నారు. కొత్తగా ఏర్పడనున్న పెద్దహరివాణం మండలంలో తమ గ్రామాలను విలీనం సరికాదని రామస్వామి, గోపాల్‌రెడ్డి తదితరులు నేతృత్వంలో ఆయా గ్రామాల పెద్దలు ఎమ్మెల్యే నివాసంలో డాక్టర్ పార్థసారథిని సోమవారం కలిసి విన్నవించారు. వచ్చిన వారితో పాటు ఎమ్మెల్యే కూడా ఆదోనిని జిల్లా చేయాలి, ఇక్కడి మండలాన్ని నాలుగు మండలాలుగా విభజించాలని నినాదాలు చేశారు.

ఆదోనిని జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయాలి

ముఖ్యమంత్రితో తెదేపా ఆదోని మైనారిటీ నాయకులు

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: ఆదోని డివిజన్‌ను జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయాలని తెదేపా రాష్ట్ర మైనారిటీ విభాగం రాష్ట్ర కార్యదర్శి గడ్డా ఫక్రుద్దీన్, మైనారిటీ నాయకులు బషీర్ అహ్మద్, గౌస్ బాషా, నిజామి, హుసేన్ అహ్మద్, జిలానీ బాషా అన్నారు. మంగళగిరి తెదేపా కేంద్ర కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిసి వినతి పత్రం అందజేశారు. ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం, పత్తికొండ, ఆలూరు నియోజకవర్గాలను కలిపి ఆదోని జిల్లా కేంద్రంగా చేయాలన్నారు.

ఆ మండలంలో విలీనం చేయొద్దు

ఆదోని ఎమ్మెల్యేకు సమస్య విన్నవిస్తున్న నాయకులు

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆదోని నియోజకవర్గంలో కొత్తగా ఏర్పడనున్న పెద్దహరివాణం మండలంలో తమ గ్రామాలను కలపొద్దని 16 గ్రామాల నాయకులు, ప్రజలు సోమవారం సాయంత్రం ఆదోని ఎమ్మెల్యే డాక్టరు పార్థసారథిని కలిసి విన్నవించారు. ఆదోని మండలానికి ఐదు నుంచి 10 కి.మీ.ల దూరంలోని ఢణాపురం, చాగి, నారాయణపురం, కడితోట, గణేకల్లు, మదిరె, చిన్నహరివాణం, నాగనాథనహళ్లి తదితర గ్రామాలను 35 కి.మీ.ల దూరంలోని పెద్దహరివాణం మండలంలో కలపడం వల్ల గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటామని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో గ్రామాల నాయకులు గోనేహాలు వేణుగోపాలరెడ్డి, బసాపురం రామస్వామి, ఢణాపురం మల్లికార్జున, హనవాలు మహబూబ్‌బాషా, సుజ్ఞానమ్మ, కారుమంచప్ప, నరేంద్రకుమార్‌రెడ్డి, మదిరె నారాయణ, లోక్‌నాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల బస్సుల నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

ఆదోనిలో ప్రైవేటు బస్సును పరిశీలిస్తున్న మోటర్ వెహికల్ అధికారిణి శిశిరదీప్తి

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: విద్యార్థులు ప్రయాణం చేసే ప్రైవేటు పాఠశాలల బస్సులు కండిషన్‌లో లేకపోతే కేసు నమోదు చేస్తామని ఆదోని మోటర్ వెహికల్ అధికారిణి శిశిరదీప్తి అన్నారు. ఆదోని డివిజన్ పరిధిలో సోమవారం ప్రైవేటు పాఠశాలల బస్సులను అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలో కొందరు బస్సు ఫిట్‌నెస్‌ను రెన్యూవల్ చేయలేదని, మరికొందరు పర్మిట్, పన్నులు చెల్లించలేదని గుర్తించి బస్సులపై రూ.20 వేల నుంచి రూ.లక్ష వరకు జరిమానా విధించామన్నారు. బస్సులో ప్రయాణం చేసే విద్యార్థుల భద్రతే ప్రధాన లక్ష్యమన్నారు. నిర్లక్ష్యం వహిస్తే కేసులు తప్పవన్నారు.

హొళగుందలోనే కొనసాగించాలి

సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న గ్రామస్థులు

ఆదోని ఎస్కేడీ కాలనీ, న్యూస్‌టుడే: ఆదోని మండలంలో కొత్తగా ఏర్పాటు చేయనున్న పెద్దహరివాణం మండలంలో తమ గ్రామాలను కలపరాదని హొళగుంద మండలం గజ్జహళ్లి, వందవాగిలి గ్రామాల ప్రజలు ఆందోళన చేపట్టారు. గ్రామాల నుంచి సోమవారం పెద్దఎత్తున ద్విచక్ర వాహనాలతో ర్యాలీ నిర్వహిస్తూ.. ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు. ధర్నా నిర్వహించి, సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు.

పల్లె కబుర్లు

మదార్‌పురం(వెల్దుర్తి), న్యూస్‌టుడే: మదార్‌పురం గ్రామంలో చేపడుతున్న సంచార చికిత్స వైద్యశిబిరాన్ని నోడల్ అధికారి డాక్టర్.రఘు సోమవారం తనిఖీ చేశారు. చిన్నారుల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పోషకాహారం అందించాలన్నారు. వయసుకు తగిన బరువు ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు శ్రీధర్‌రెడ్డి, పర్యవేక్షకురాలు నాగలక్ష్మి, ఆరోగ్య అధికారి ఆదిలక్ష్మి, అంగన్‌వాడీ సిబ్బంది భారతి తదితరులు పాల్గొన్నారు.

చెరుకులపాడు(వెల్దుర్తి), న్యూస్‌టుడే: చెరుకులపాడులోని ప్రాథమిక, జడ్పీ ఉన్నత పాఠశాలను మండల విద్యాధికారి ఇందిర సోమవారం తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ.. వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు.

కరాటే ఛాంపియన్‌షిప్‌లో ప్రతిభ

ఆదోని క్రీడలు, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలోని భాష్యం ఉన్నత పాఠశాల ఆరో తరగతి విద్యార్థులు వై.జి.హేమంత్, మల్లికార్జున సౌత్ ఇండియా కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో బంగారు పతకం సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపల్ సురేంద్రబాబు తెలిపారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులను, కోచ్ కేశవ్ మాస్టర్‌ను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ భార్గవ్‌పవన్, ప్రధానోపాధ్యాయిని శిరీష తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ సురేంద్రబాబు తదితరులు

విద్యార్థిని అభినందిస్తున్న క్రికెట్ అసోసియేషన్ సభ్యులు

జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక

ఆదోని క్రీడలు, న్యూస్‌టుడే: ఆదోని తాలుకా క్రికెట్ అసోసియేషన్ నిర్వహిస్తున్న కోచింగ్ శిబిరంలో శిక్షణ పొందుతున్న ఆదోని పట్టణానికి చెందిన వాగి శంకర్‌రెడ్డి ఎస్‌జీఎఫ్ అండర్-14 జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు అసోసియేషన్ తాలుకా అధ్యక్షుడు విట్టా రమేశ్ తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత నెల గుంటూరులో జరిగిన రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల్లో జిల్లా జట్టు తరపున క్రీడాకారుడు వాగి శంకర్‌రెడ్డి ఆల్‌రౌండర్‌గా ప్రతిభ చాటాడన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరచి అండర్-14 రాష్ట్ర క్రికెట్ జట్టుకు ఎంపికయ్యాడని, జట్టుకు కెప్టెన్‌గా కూడా వ్యవహరిస్తున్నాడన్నారు. జనవరిలో రాజస్థాన్‌లో జరగనున్న జాతీయ స్థాయి క్రికెట్ పోటీల్లో పాల్గొంటాడని తెలిపారు. క్రీడాకారుడు ప్రతిభ పట్ల అసోసియేషన్ సభ్యులు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ముజీబ్, కార్యదర్శి వెంకటేశు, కోచ్ బాలాజీరావు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీలకు..

విద్యార్థికి జ్ఞాపిక అందజేస్తున్న ఉపాధ్యాయులు

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: ఆదోని మండలం పెద్దహరివాణం జడ్పీ పాఠశాల ఎనిమిదో తరగతి తౌఫిక్ రాష్ట్ర స్థాయి కౌశల్ క్విజ్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామచంద్రారెడ్డి, జీవశాస్త్ర ఉపాధ్యాయుడు చిరంజీవి సోమవారం తెలిపారు. ఆన్‌లైన్‌లో జరిగిన జిల్లా స్థాయి కౌశల్ క్విజ్ పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపాడన్నారు. ఈ నెల 27న తిరుపతిలోజరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థి తౌఫిక్ పాల్గొన్నట్లు పేర్కొన్నారు.

దారులకు మరమ్మతులు చేపట్టాలి

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పత్తికొండ పట్టణంతో పాటు మండల పరిధిలోని వివిధ మార్గాల్లో దెబ్బతిన్న ప్రధాన రహదారులకు మరమ్మతులు చేపట్టాలని సీపీఐ రాష్ట్ర నేత పి.రామచంద్రయ్య కోరారు. పత్తికొండ పట్టణ శివారులోని హంద్రీనీవా కాల్వ సమీపంలో దెబ్బతిన్న ప్రధాన రహదారిలో రాళ్లు, మట్టి వేసి సోమవారం శ్రమదానం చేశారు. సీపీఐ పట్టణ కార్యదర్శి రామాంజనేయులు ఆధ్వర్యంలో చేపట్టిన శ్రమదానం కార్యక్రమంలో సీపీఐ, ప్రజా సంఘాల నాయకులు కారుమంచి, కారన్న, పెద్దఈరన్న, నెట్టేకంరయ్య, ఖాన్, శంకర్, బాషా, హుసేని, పెద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రమదానం చేస్తున్న సీపీఐ నాయకులు రామచంద్రయ్య తదితరులు

అసంపూర్తి పనులు.. పాఠాలకు ఆటంకాలు

మండలం ❖ పాఠశాలలు ◆ విద్యార్థులు ★

పరిశీలన

ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చాలని గత ప్రభుత్వం నాడు- నేడు పనుల కింద పనులు ప్రారంభించింది. నిధుల కొరత, బిల్లులు చెల్లించకపోవడం, కొరవడిన పర్యవేక్షణ వెరసి.. అసంపూర్తి పనులే మిగిలాయి. ఆలూరు, పత్తికొండ నియోజకవర్గాల్లోని పలు పాఠశాలలను 'న్యూస్‌టుడే' పరిశీలించింది.



ఆరుబయట చదువులే

❖ తుగ్గలి ◆ 66 ★ 7,000

తుగ్గలి, న్యూస్‌టుడే: రాతన జడ్పీ ఉన్నత పాఠశాలలో గదుల కొరతతో ఆరుబయట చదువులు తప్పడం లేదు. ఐదు తరగతులకు మొత్తం 237 మంది విద్యార్థులు ఉన్నారు. ఉన్న నాలుగు గదుల్లో ఒకటి స్టాఫ్ రూమ్, మరో గదిలో శుద్ధజల కేంద్రానికి సంబంధించిన పరికరాలు, మరో గదిలో మధ్యాహ్న భోజనానికి సంబంధించిన బియ్యం బస్తాలు, పుస్తకాలతో ఇరుకుగా ఉంది. ఉన్న వాటిలోనూ ఇరుకు గదుల్లో నిత్యం విద్యార్థులు సతమవుతున్నారు. గదులు చాలక చెట్ల కింద రెండు తరగతులు నిర్వహిస్తున్నారు. గత ప్రభుత్వంలో నాడు- నేడు కింద ఊరికి దూరంగా రాతన చెరువు కట్ట సమీపంలో కొత్తగా నాలుగో తరగతి గదులు నిర్మాణం చేపట్టారు. అవి అసంపూర్తిగానే మిగిలాయి. ఉన్నతాధికారులు సమస్య పరిష్కరించాలని విద్యార్థులు, గ్రామస్థులు కోరుతున్నారు.

వంట గదిలోనే బోధన

❖ దేవనకొండ ◆ 57 ★ 8,700

దేవనకొండ, న్యూస్‌టుడే: కుంకనూరు గ్రామ సమీపంలోని ఉన్నత పాఠశాలలో 251 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇక్కడ చేపట్టిన నాడు-నేడు పనులు మధ్యలో నిలిచిపోయాయి. ఎనిమిదో తరగతి విద్యార్థులు 50 మంది వంటగదిలోనే కూర్చొని పాఠాలు వింటున్నారు. నేలపైనే విద్యార్థులు చదువుతున్నారు. సమస్యను పరిష్కరించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

మూడేళ్లుగా.. ముందుకు సాగక

❖ ఆస్పరి ◆ 53 ★ 8,900

ఆస్పరి, న్యూస్‌టుడే: మండలంలోని తంగరడోణ గ్రామంలో ప్రాథమిక, జిల్లా పరిషత్తు పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం ఒకే చోట ఉన్నాయి. కొత్తగా మరో చోట మూడేళ్ల కిందట రూ.80 లక్షలతో ఐదు గదులు, మురుగుదొడ్ల నిర్మాణం చేపట్టారు. పూర్తిస్థాయిలో నిధులు మంజూరు కావడంతో పైకప్పు వరకు వచ్చి పనులు నిలిచి పోయాయి. ఆవరణలో ముళ్ల కంప మొలిచింది. పైకప్పు కోసం తెచ్చిన ఇనుప కడ్డీలు పూర్తిగా తుప్పుపట్టాయి. నిలిచి పోయిన పనులు పూర్తిచేసి, సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

ఎమ్మిగనూరు

• ఎమ్మిగనూరు • మంత్రాలయం • కోడుమూరు

అక్రమ దుకాణాలు తొలగించండి

కలెక్టరుకు సమస్య విన్నవిస్తున్న నాయకులు

కోడుమూరు, కోడుమూరు పట్టణం, న్యూస్‌టుడే: కోడుమూరు పట్టణంలోని స్థానిక బాలికల, బాలుర జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న అక్రమంగా వేసుకున్న దుకాణాలను తక్షణమే తొలగించాలని సోమవారం జిల్లా కలెక్టరు డా.సిరిని విద్యార్థి సంఘం నేతలు కోరారు. ఈ దుకాణాల్లో గుట్కా, సిగరెట్ వంటివి విక్రయిస్తుండటంతో విద్యార్థులు చెడు అలవాట్లకు బానిసలయ్యే అవకాశం ఉందని ఫిర్యాదు చేశారు. ఆదర్శ పాఠశాలకు సీసీ దారిని ఏర్పాటు చేయాలని కలెక్టరుకు విన్నవించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రంగస్వామి, మండల కార్యదర్శి అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఆదోని జిల్లాతోనే అభివృద్ధి సాధ్యం

మంత్రాలయం, న్యూస్‌టుడే: ఆదోని జిల్లాతోనే అభివృద్ధి సాధ్యమని, జిల్లాగా ప్రకటించాలని ప్రజా సంఘాల నాయకులు, రైతులతో కలిసి సోమవారం పాదయాత్ర నిర్వహించారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి భాస్కర్ యాదవ్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని వగరూరు గ్రామంలో సీపీఐ కార్యాలయం నుంచి సచివాలయం వరకు గ్రామ వీధుల్లో రైతులతో కలిసి పాదయాత్ర చేశారు. ఆదోని జిల్లా సాధనతోనే పట్టణ, పారిశ్రామికాభివృద్ధి జరుగుతుందని తెలిపారు. వలసల నివారించవచ్చని అన్నారు. ఆదోని డివిజన్ ప్రజల ఆకాంక్ష మేరకు జిల్లాలోని ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు ఏకతాటిపైకి వచ్చి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చి ఆదోని జిల్లా సాధించాలని డిమాండ్ చేశారు. సీపీఐ మండల కార్యదర్శి లక్ష్మణ్ నాయక్, రైతు సంఘం నాయకుడు మహమ్మద్ అనీఫ్, నరసప్ప, హనుమంతు, నిజామ్, నరసింహులు, శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్ర చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు, రైతులు

రైతులకు యూరియా పంపిణీ

కోసిగి, న్యూస్‌టుడే: రబీ సీజన్‌కు సంబంధించి రైతులకు యూరియా, విత్తనాలను ఏవో వరప్రసాద్ పంపిణీ చేశారు. సోమవారం కోసిగిలోని రైతు సేవ కేంద్రంలో రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం రైతులకు 100శాతం సబ్సిడీపై మినుములు, 40శాతం సబ్సిడీపై వేరుసెనగ విత్తనాలు ఇచ్చారు. వేరుసెనగ విత్తనాలు ఈనెల 2వ వారం విత్తుకుంటే మంచి దిగుబడి సాధించవచ్చని ఆయన రైతులకు సూచించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM) ఎమ్మిగనూరు 8008573824 కోడుమూరు 9885988357 కౌతాళం 8008574913

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ?: హెచ్‌బీఎస్ కాలనీలో మూడో లైన్‌లో వీధి దీపం వెలగడం లేదు. రాత్రి వేళల్లో చీకటిగా ఉంటోంది. -రాజు, కాలనీవాసి

✔: కొత్త వీధి దీపం అమర్చుతాం. -నీరజ, డీఈ

?: సంజీవనగర్ కాలనీలో శివారు నీరు ఒంగ్డు పట్టోంది -లక్ష్మన్న, కాలనీవాసి

సమాధానం: నీటిని పరిశీలిస్తాం -నీరజా, డీఈ

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: ?: మండలంలోని నాగలాపురం గ్రామంలో చాలా రోజుల నుంచి మురుగు కాల్వలు శుభ్రం చేయడం లేదు. రాత్రి పూట దోమల బెడద ఎక్కువైంది. -లక్ష్మన్న, నాగలాపురం గ్రామం.

✔: గ్రామంలో నెలకొన్న అపరిశుభ్రత సమస్యను గ్రామ కార్యదర్శి సర్పంచి దృష్టికి తీసుకెళ్తాం. -ప్రభావతీదేవి, ఎంపీడీవో, పెద్దకడబూరు.

మంత్రాలయం, న్యూస్‌టుడే: ?: రచ్చుమర్రి గ్రామం ఎస్సీ కాలనీలో గత నాలుగు రోజులుగా కుళాయిల్లో నీళ్లు రావడం లేదు. -ఆనంద్ కుమార్, రచ్చుమర్రి

✔: మరమ్మతులు చేయించి ఇబ్బందులు లేకుండా చేస్తాం. -వేణుగోపాల్, ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి

నందవరం, న్యూస్‌టుడే: ?: మండల పరిధిలోని మాచాపురం గ్రామంలో మురుగు కాల్వలను శుభ్రం చేయాలి. -సురేష్, కాలనీవాసులు

✔: విషయం సంబంధిత అధికారులకు తెలియజేసి, మురుగు కాల్వలను శుభ్రం చేయిస్తాం. -సందీప్, ఈవోఆర్డీ, నందవరం

తీరని సమస్యలు

☛ ప్రజా వేదికకు అరకొరగా అధికారులు హాజరు

ఎమ్మిగనూరులో కొందరే హాజరైన అధికారులు

కోసిగి, ఎమ్మిగనూరు, కోడుమూరు పట్టణం, కోడుమూరు, న్యూస్‌టుడే: సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహిస్తోంది. ప్రతి సోమవారం ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉండి ప్రజలు ఇచ్చిన వినతులకు సమాధానం ఇవ్వాలి. ప్రభుత్వ కార్యక్రమంలో అధికారులందరూ పాల్గొనాలని ఆదేశించినా తూతూ మంత్రంగా హాజరై మమ అనిపిస్తున్నారు. ప్రధాన శాఖల్లో కొందరు మాత్రమే హాజరు కావడం గమనార్హం. ప్రజలు ఇచ్చిన సమస్యలకు సమాధానం ఇచ్చే వారే లేరు.

ప్రతివారం 30 వినతులు

పరిశీలన

ఎక్కడబడితే పేరుకున్న సమస్యలు పరిష్కరించడంలో అధికారులు విఫలమవుతున్నారు. ఎమ్మిగనూరు, మంత్రాలయం, కోడుమూరు నియోజకవర్గాల పరిధిలో ప్రతివారం కనీసం 20 నుంచి 30 సమస్యలు ప్రజలు విన్నవిస్తున్నారు. వీటిలో ఎక్కువగా భూ సమస్యలు, రీసర్వే, రెడేమార్కు, తొలగింపు, సర్వే నంబర్లలో తప్పులు, భూముల లాక్ వంటివి ఎక్కువగా విన్నవిస్తున్నారు.

పరిష్కరించాల్సిన అధికారులు కనీసం స్పందించడం లేదు. సోమవారం జరిగిన సమావేశంలో ఎమ్మిగనూరులో డిప్యూటీ తహసీల్దార్ వీరేంద్రగౌడ్, ఎంఈవో ఆంజనేయులు, అంగన్వాడీ సూపర్‌వైజర్, మరో రెండు శాఖల అధికారులు మాత్రమే పాల్గొన్నారు. మిగిలిన శాఖల అధికారులు కనీసం హాజరుకాలేదు. కోసిగి తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వేణుగోపాల్ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. బెళగల్ గ్రామానికి చెందిన 95, భూంపల్లి 130, కామనదొడ్డి 15, బదినేహల్ 30, నేలకొసిగి 30, సాతనూరు 14 మంది రైతులకు ఆన్‌లైన్ రికార్డుల్లో పేర్లు చేర్చాలని ఫిర్యాదు అందజేశారు. ఒక్క రోజే మొత్తం 309 మంది బాధితులు ఫిర్యాదులు అందజేశారు.

న్యాయం చేయండి -సురేష్ గౌడ్, పులకుర్తి, కోడుమూరు మండలం

గ్రామంలో మా నాన్న రామన్న గౌడ్ నుంచి వచ్చిన 3.81 ఎకరాల భూమిని నా భార్య వెంకటేశ్వరమ్మకు రిజిస్ట్రేషన్ చేశా. వైకాపా ప్రభుత్వ హయాంలో 2023లో భూ రీసర్వే నిర్వహించారు. ఆ సమయంలో నేను అందుబాటు లేకపోవడంతో మా భూమి 3.68 ఎకరాలుగా ధ్రువీకరించారు. దీంతో 13 సెంట్లు తగ్గింది. కోడుమూరు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసి ఏడాది గడుస్తున్నా పరిష్కారం కాలేదు. మళ్లీ సోమవారం తహసీల్దార్ నాగరాజుకు వినతిపత్రం ఇచ్చాను. న్యాయం చేయాలని కోరాను.

పేర్లు చేర్చడం లేదు -హరిజన ఏసన్న, చిన్న భూంపల్లి



గ్రామంలో సర్వే నంబరు 542లో 5ఎకరాల పొలం ఉంది. 15 ఏళ్ల క్రితం మా వదిన ఇస్తారమ్మకు వచ్చిన 2.45 ఎకరాల భూమిని పాసు పుస్తకంతో పాటు ఆన్‌లైన్‌లో కూడా చేర్చుకున్నారు. నా భాగానికి వచ్చిన 2.65 ఎకరాల పొలానికి పాసుపుస్తకం ఉంది. కార్యాలయంలో ఫిర్యాదులు అందజేసినా రెవెన్యూ అధికారులు ఇప్పటి వరకు ఆన్‌లైన్ రికార్డుల్లో పేర్లు చేర్చలేదు.

వితంతు పింఛను రాక.. -జెట్టి రంగమ్మ, జాలికెల్, గూడూరు మండలం

మూడేళ్ల క్రితం భర్త చిన్నరాము మృతి చెందటంతో వితంతు పింఛను కోసం సచివాలయం, ఎంపీడీవో, తహసీల్దారు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. జిల్లా కలెక్టరుకు విన్నవించుకున్నా న్యాయం జరగలేదు. కుటుంబ పెద్ద మృతి చెందడంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. కొత్త పింఛన్లు వస్తే కానీ పింఛన్ రాదంటున్నారు. పలురకాల పత్రాలు లేవని సాకులు చెబుతున్నారే కానీ ఇవ్వడంలేదు.

యువత సేవా కార్యక్రమాలు చేపట్టాలి

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై స్వచ్ఛందంగా సేవా కార్యక్రమాలు యువత చేపట్టాలని ఎర్రకోట సెయింట్ జాన్స్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ సుధాకర్ పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని కడిమెట్ల గ్రామంలో పర్యటించారు. ఈ కార్యక్రమంలో సుధాకర్ మాట్లాడుతూ సేవ కార్యక్రమాల రూపంలో తాగునీరు, రోడ్లు, సమస్యలు ఉంటే గుర్తించి పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ రాము, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

తొలగని మురుగు.. తప్పని ఇబ్బందులు

కోడుమూరు కొత్త బస్టాండు పరిసరాల్లోని కాల్వల్లో మురుగు నిలిచి స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండు నుంచి బస్సులు బయటకు వచ్చే మార్గంలో దుర్వాసన వస్తోంది. దీంతో ప్రయాణికులు ముక్కు మూసుకొని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. నెలలు గడుస్తున్నా.. స్థానిక అధికారుల స్పందన, పర్యవేక్షణ కరవైందని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ప్రతిరోజు ఈ బస్టాండు నుంచి వేల మంది ప్రయాణిస్తుంటారు. సంబంధిత అధికారులు స్పందించి మురుగు శుభ్రం చేయాలని ప్రజలు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, కోడుమూరు పట్టణం

ప్రహరీ లేక.. పట్టించుకోక

మండలంలోని పెద్దనెలటూరు గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలకు విశాలమైన మైదానం ఉంది. గతంలో ప్రహరీ నిర్మాణ పనులను అసంపూర్తిగా వదిలేశారు. దీంతో పాఠశాలకు రక్షణ కరవైంది. పాఠశాల ఆవరణంలోని విలువైన సామగ్రితో ఆకతాయిలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. మరుగుదొడ్లు, మూత్రశాలలు ధ్వంసం చేశారు. ప్రహరీకి నిధులు విడుదల చేసి.. అసంపూర్తిగా నిలిచిపోయిన పనులను పూర్తి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, గోనెగండ్ల

ఆలయ దారి.. అధ్వానంగా మారి

వెంకటగిరిలో ప్రముఖ క్షేత్రం శ్రీగిడ్డాంజనేయస్వామి ఆలయానికి వెళ్లే ప్రధాన రహదారి చెత్తతో మూసుకుపోయింది. అపరిశుభ్రంగా మారడంతో వీధి వాసులు, రాకపోకలు సాగించే భక్తులు దుర్వాసన భరించలేక పోతున్నారు. క్షేత్రం నుంచి అమడగుంట్ల, అనుగొండ, గోరంట్ల వైపు వెళ్లే వాహన చోదకులు, రైతులు ముక్కు మూసుకొని ముందుకెళ్తున్నారు. పారిశుద్ధ్య పనులు చేపట్టాలని కోరుతున్నారు.

-న్యూస్‌టుడే, కోడుమూరు గ్రామీణం

నిధులు లేక.. నిలిచిన నిర్మాణం

నందవరం మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో గత వైకాపా హయాంలో రెండో విడత నాడు-నేడు కింద రూ.94 లక్షలతో చేపట్టిన అదనపు గదుల నిర్మాణాలు నిధులు లేకపోవడంతో మధ్యలో నిలిచిపోయాయి. పనులు ప్రారంభించి మూడేళ్లకు పైగా కావస్తోంది. సుమారు 8 గదులు నిర్మిస్తున్నారు. పాఠశాలలో 253 మంది విద్యార్థులు చదువుతున్నారు. గదులు లేక విద్యార్థులు అసంపూర్తి గదుల్లో విద్యనభ్యసించే దుస్థితి ఉంది. -న్యూస్‌టుడే, నందవరం

మొక్కజొన్నలో కత్తెర పురుగు సమస్య

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలో కత్తెర పురుగు గుర్తించామని, నివారణ చర్యలు చేపట్టాలని ఏడీఏ ఎస్.మహమ్మద్‌ఖాద్రీ అన్నారు. సోమవారం కల్లపరిలో మొక్కజొన్న, మిరప, వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ కత్తెర పురుగు మొక్కజొన్న సుడుల్లో అంకురం తినడం వల్ల ఎదుగుదల ఆగిపోతుందన్నారు. నివారణకు ఎమామెక్టిన్‌బెంజోయేట్ 0.4గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. మిరపలో అంత్రక్నోజ్ తెగులు ఆశించిందని నివారణకు డైఫెనోకొనజోల్ 1మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. మిరప పొలం చుట్టూ ఉన్న పార్థీయం గడ్డిని తొలగించాలన్నారు. వెంట ఏవో శివశంకర్, ఏఈవో నరసింహులు, వీఏహెచ్ నాగరాజు పాల్గొన్నారు.

ఆర్థికంగా ఎదగాలి

కోసిగి, న్యూస్‌టుడే: ఉప్పర కులస్థులు ఆర్థికంగా ఎదగాలని జిల్లా సంఘం అధ్యక్షుడు గోపాల్, కార్యదర్శి వీరేంద్ర అన్నారు. సోమవారం కోసిగి మండల పరిధిలోని సజ్జలగుడ్డం గ్రామంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు.

భాజపా బలోపేతానికి కృషి

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో భాజపా బలోపేతానికి కృషి చేయాలని రజక రాష్ట్ర ఫెడరేషన్ ఛైర్‌పర్సన్ సావిత్రి అన్నారు. సోమవారం పట్టణంలోని భాజపా కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి పార్టీని విస్తరించేలా కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కర్నూలులో ఈనెల 12న జరిగే కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో నాయకులు దయాసాగర్, గురురాజదేశాయ్, బీఎల్ నారాయణ, శిల్పి భాస్కర్, మాధవిలత, కురురబడేసాబ్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సావిత్రి

చేనేత కార్మికులను ఆదుకోవాలి

కోడుమూరు పట్టణం, న్యూస్‌టుడే: చేనేత కార్మికులను కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని రాష్ట్ర చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు బి. మాధవస్వామి డిమాండు చేశారు. కోడుమూరు పట్టణంలో అనేక మంది చేనేతలు అర్హత ఉన్నప్పటికి ఇంతవరకు పింఛన్లు మంజూరు కాలేదని అన్నారు. సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికలో చేనేత మహిళ కార్మికులు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సుకన్య, జయమ్మ, శ్రీరాములు, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

తెదేపాలో పలువురి చేరిక

కర్నూలు గ్రామీణ, సి.బెళగల్, న్యూస్‌టుడే : సి.బెళగల్ మండలం మారందొడ్డి గ్రామానికి చెందిన పలువురు వైకాపా నాయకులు తెదేపాలో చేరారు. కర్నూలు నగరంలో తెదేపా సీనియర్ నేత, కేడీసీసీబీ ఛైర్మన్ డి.విష్ణువర్ధన్‌రెడ్డి సమక్షంలో గ్రామ మాజీ సర్పంచి రుక్మంద, మరో 250 మంది సోమవారం తెదేపా కండువా కప్పుకున్నారు. వారు మాట్లాడుతూ విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో తెదేపా బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, అమర్, సుధాకర్, ఉప్పర సోమన్న, ఎల్లప్ప పాల్గొన్నారు.

విష్ణువర్ధన్‌రెడ్డి సమక్షంలో తెదేపాలో చేరిన వైకాపా నేతలు

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కోడుమూరు పట్టణం, న్యూస్‌టుడే: సహకార సంఘాల బ్యాంకుల్లో పనిచేసే ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలను వెంటనే పరిష్కరించేలా చూడాలని లద్దగిరి సొసైటీ సీఈఓ జి.దేవకుమార్ డిమాండు చేశారు. సోమవారం కోడుమూరు నియోజకవర్గ పరిధిలో భాగంగా పట్టణంలోని విజయ భాస్కర్ రెడ్డి కూడలి సమీపంలో నిరసనలు వ్యక్తం చేశారు. ఉద్యోగుల కోసం ఏర్పాటు చేసిన జీవోల అమలుతో పాటు అందరిని రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గోపాల్ రెడ్డి, మధు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల దినోత్సవాన్ని విజయవంతం చేయండి

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: కోడుమూరు ఎంపీడీవో కార్యాలయంలో ఈనెల 10వ తేదీన నిర్వహించే దివ్యాంగుల దినోత్సవాన్ని విజయవంతం చేయాలని వికలాంగుల సంక్షేమ సంఘం జిల్లా నాయకుడు సురేష్, మండల కమిటీ పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం వారు కేడీసీసీ జిల్లా ఛైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డిని, కోడుమూరు మార్కెట్ యార్డు ఛైర్మన్ ఎల్లప్పనాయుడు, తెదేపా పట్టణాధ్యక్షుడు గంగాధర్‌నాయుడు తదితరులను మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమానికి రావాలని కోరారు.

జిల్లా స్థాయి క్రైస్తవ పాటల పోటీలు

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని ఏబీఎం చర్చిలో క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని జిల్లా స్థాయి క్రైస్తవ పాటల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఐక్యత యూత్ నిర్వహకులు తెలిపారు. ఈ నెల 17, 19 తేదీల్లో పోటీలు ఉంటాయని తెలిపారు.

రాజీమార్గంతో కేసుల పరిష్కారం

మాట్లాడుతున్న జడ్జి హేమ

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: రాజీ మార్గాల ద్వారా కేసులను సులభంగా పరిష్కరించుకోవచ్చని ఎమ్మిగనూరు జూనియర్ సివిల్ జడ్జి హేమ అన్నారు. లోక్ అదాలత్ కార్యక్రమంలో భాగంగా సోమవారం కోర్టులో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి హేమ మాట్లాడుతూ రాజీమార్గాల ద్వారా కేసులు పరిష్కరిస్తే కొత్త వారికి న్యాయం కల్పించేందుకు అవకాశం దొరుకుతుందని అన్నారు. ఈనెల 13వ తేదీన మెగా లోక్ అదాలత్ కార్యక్రమం ఉందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పాల్గొన్నారు.

కొండలపై ఇచ్చిన ఇళ్ల స్థలాలు రద్దు చేయాలి

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: గత జగన్ ప్రభుత్వంలో కొండలపై ఇచ్చిన ఇంటి స్థలాలను రద్దు చేసి నివాస యోగ్యమైన స్థలాలను కేటాయించాలని సీపీఐ మండల కార్యదర్శి రాజు కోరారు. తహసీల్దార్ కార్యాలయంలో ఇంటి స్థలాలు ఇవ్వాలని కోరుతూ సీపీఐ, దాని అనుబంధ సంఘాల నాయకులు ధర్నా చేశారు. మండల కార్యదర్శి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కోడుమూరు, వర్కూరు ప్రజలకు దాదాపు 1100లకు పైగా ఇంటి పట్టాలు ఇచ్చారన్నారు. కొండలపై, 8కి.మీ. దూరంలో ఇవ్వటంతో ఎవరూ ఆసక్తి చూపలేదన్నారు. అనువైన స్థలాలు ఇవ్వాలని గతంలో లబ్ధిదారులు కోరినా పట్టించుకోలేదన్నారు. వాటిని తక్షణమే రద్దు చేసి కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు అప్పటి లబ్ధిదారులతో పాటు కొత్త వారికి ఇంటి స్థలాలు, గృహాలు మంజూరు చేయాలన్నారు. పాత వారికి తిరిగి దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించాలన్నారు. సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందచేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు రాముడు, సులోచనమ్మ, దేవమ్మ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించడంలో విఫలం

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వ హయాంలో ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకన్న ఆరోపించారు. ఎస్టీయూ సమావేశాన్ని సోమవారం ఎమ్మిగనూరు పట్టణంలో నిర్వహించారు. సుంకన్న మాట్లాడుతూ రాష్ట్రంలో పీఆర్సీ, పాత బకాయిలు చెల్లింపులో నిర్లక్ష్యం చేస్తుందన్నారు. ఎన్నికల ముందు ఉపాధ్యాయుల పాత బకాయిలు చెల్లిస్తామని హామీ ఇచ్చి మోసం చేసిందన్నారు. విద్యా రంగంలో నాడు-నేడు కింద చేపట్టిన పనులను అసంపూర్తిగా వదిలేయడంతో చాలా పాఠశాలల్లో విద్యార్థులకు తరగతి గదులు లేక ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. యాప్‌లను ప్రవేశపెట్టి ఉపాధ్యాయులను వేధింపులకు గురి చేస్తున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో కూటమి సర్కార్ చేస్తున్న నిర్లక్ష్యంపై ఉద్యమాలు చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఎస్టీయూ నాయకులు నాగరాజు, ప్రసన్నరాజు, బసవరాజు, ఎల్లప్ప, బాబయ్య, రామచంద్ర, ఎర్రిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఒలింపిక్స్‌లోనూ రాణించాలి

మంత్రాలయం, న్యూస్‌టుడే: ఒలింపిక్స్‌లో బంగారు పతకం సాధించి దేశ ఖ్యాతిని, మంత్రాలయం పేరుప్రఖ్యాతలను ప్రపంచ వ్యాప్తంగా చాటాలని అథ్లెటిక్స్ విజేత వెంకట్రామిరెడ్డిని పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు ఆశీర్వదించారు. ఈ నెల 4న జయపురలో జరిగిన జాతీయ స్థాయి పరుగు పందెంలో హాలహర్వి గ్రామానికి చెందిన వెంకట్రామిరెడ్డి ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించారు. వెంకట్రామిరెడ్డిని పీఠాధిపతి సోమవారం శేష వస్త్రం, ఫలమంత్ర అక్షింతలు ఇచ్చి ఆశీర్వదించారు. శ్రీమఠం పాఠశాల కరస్పాండెంట్ సురేశ్ కోణాపూర్, ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్, వ్యాయామ ఉపాధ్యాయులు వెంకటేశ్, మల్లికార్జునలు సంతోషం వ్యక్తం చేశారు.

వెంకట్రామిరెడ్డిని ఆశీర్వదిస్తున్న పీఠాధిపతి

సహకార సంఘం ఉద్యోగుల నిరసన

గూడూరు గ్రామీణం,న్యూస్‌టుడే: సహకార సంఘ ఉద్యోగుల వేతన సవరణ, గ్రాట్యుటీ, ఆరోగ్య బీమా తదితర న్యాయమైన డిమాండ్లను అమలు చేయాలని కోరుతూ సోమవారం గూడూరు కేడీసీసీ బ్రాంచ్‌లో సహకార సంఘ ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఉద్యోగులు నిర్వహిస్తున్న సమ్మెకు గూడూరు పీఏసీ ఛైర్మన్ దానమయ్య, గూడూరు కేడీసీసీ బ్యాంకు మేనేజర్ యూనిటీ, సి.బెళగల్ పీఏసీ ఛైర్మన్ తిమ్మప్ప, పోలకల్ జేఎఫ్‌సీఎస్ అధ్యక్షులు ధనవంతుడు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని సొసైటీ సీఈవోలు శివకుమార్ రెడ్డి, ఖాజహేస్సేన్, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

తల్లికి వందనం వర్తింపజేయాలి

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: తమ పిల్లలకు తల్లికి వందనం వర్తింపజేయాలని మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు రాముడు డిమాండు చేశారు. పురపాలక కార్యాలయంలో సోమవారం ధర్నా నిర్వహించి పురపాలక మేనేజర్ అస్లాంబాషాకు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో రాముడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత సంక్షేమ పథకాల్లో కోత విధించడం బాధాకరమన్నారు. పారిశుద్ధ్య పనులు నిర్వహించే కార్మికుల కడుపు కొట్టడం దారుణమన్నారు. ప్రభుత్వం స్పందించి తలికి వందనం కార్యక్రమంలో ఎంపిక చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు కేశన్న, బడేసాబ్, బాషా, నరసప్ప, రవి, దాస్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తిమీర ధర నేల చూపు

ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే: కొత్తిమీర ధర ఒక్కసారిగా అమాంతంగా తగ్గింది. కొద్ది రోజుల కిందట ధర ధగధగలాడి కొత్తిమీర వేసిన రైతులకు మంచి లాభాలు వచ్చాయి. దీంతో ఉప విభాగంలోని గుడేకల్, ఎమ్మిగనూరు, కందనాతి, హనుమాపురం, గోనెగండ్ల, కలుగొట్ల తదితర గ్రామాల్లో బోర్ల కింద పత్తి, ఉల్లి తొలగించిన రైతులు కొత్తిమీర వేశారు. ప్రస్తుత వాతావరణానికి కొత్తిమీర మంచి దిగుబడి వస్తుందని రైతులు అధికంగా సాగు చేశారు. కొత్తిమీర విత్తనాలు చల్లిన నెల రోజుల్లో కోతకు వస్తుంది. పెట్టుబడి ఎకరానికి రూ.20వేల వరకు అవుతుంది. దీంతో బోర్ల కింద చిన్న, సన్నకారు రైతులు రెండు వందల ఎకరాల వరకు కొత్తిమీర వేశారు. పంటంతా ఒక్కసారిగా కోతకు రావడంతో ధర పడిపోయింది. దీంతో రైతులకు పెట్టుబడి తిరిగిరాని పరిస్థితి ఏర్పడింది. కొత్తిమీరను కోత కోసి వాహనాల్లో వ్యాపారులు బెంగళూరు, గుంటూరు, రాయచూరు వంటి ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు.

కొత్తిమీర కోస్తున్న కూలీలు

నిరుద్యోగులకు నిరాశ

☛ డీఆర్‌డీఏ కేంద్రం మూతపడి ఏడాది

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన కోసం ప్రభుత్వాలు అనేక పథకాలు ప్రవేశపెడుతున్నాయి. ప్రస్తుత పోటీ ప్రపంచంలో వ్యాపార రంగం రోజురోజుకు పుంజుకుంటోంది. అందుకు అనుగుణంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఏర్పాటు చేసిన శిక్షణ కేంద్రం మూతపడింది. పశ్చిమ ప్రాంతంలో అత్యధికంగా నిరుద్యోగులు ఉండడంతో ఎమ్మిగనూరు కేంద్రంగా డీఆర్‌డీఏ కేంద్రాన్ని ఏర్పాటు చేసి శిక్షణ ఇచ్చారు. ఏడాదిన్నరగా అది మూతపడింది.

2018లో శిక్షణ కేంద్రం ఏర్పాటు

పశ్చిమ ప్రాంతంలో ఎమ్మిగనూరు కేంద్రంగా 2018లో శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. వీటిలో నిరుద్యోగులకు మూడు నెలల పాటు ఉచితంగా శిక్షణ ఇచ్చారు. 2018 నుంచి 2024 వరకు శిక్షణ తీసుకున్న వారిలో దాదాపు 900 మందికిపైగానే ఉద్యోగాలు సాధించారు. ముఖ్యంగా ఆలూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని, పత్తికొండ నియోజకవర్గాలకు ఈ కేంద్రమే కీలకం. 2024లో ఎన్నికల ముందు మూతపడిన కేంద్రాన్ని నేటికీ ప్రారంభించలేదు. దారిద్ర రేఖకు దిగువున ఉన్న నిరుద్యోగులకు ఎక్కువగా ఉద్యోగ అవకాశాలు లభించేవి. ఏడాదిన్నరగా ప్రతి రోజూ కేంద్రం వద్ద అధికారులను నిరుద్యోగులు ఆరా తీసి నిరాశతో వెనుతిరుగుతున్నారు.

శిక్షణ పొందుతున్న యువత (పాత చిత్రం)

ఎంతో చేయూతగా..

గ్రామీణ నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించింది. కంప్యూటర్ శిక్షణ, మౌఖిక పరీక్షలు, నైపుణ్యాభివృద్ధి వంటి కోర్సులను నేర్పిస్తారు. ఈ శిక్షణను మూడు నెలలు పాటు నిర్వహిస్తారు. ఒక బ్యాచ్‌లో 35 మంది విద్యార్థులకు శిక్షణ ఇస్తారు. రెండు బ్యాచ్‌లకు అవకాశం కల్పిస్తారు. శిక్షణ పొందుతున్న వారి కోసం యూనిఫాం, మెటీరియల్, భోజనాలు, ఉచిత వసతి కల్పిస్తారు. 75 రోజుల తర్వాత ఉద్యోగ అవకాశాల కోసం స్వయంగా పంపిస్తారు. ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం సాధించిన యువతకు అక్కడ జీతంతో పాటు అదనంగా ప్రభుత్వం నెలకు రూ.1000 ఉపకార వేతనం కింద చెల్లిస్తోంది. ప్రస్తుతం కర్నూలులో మాత్రమే ఉంది. అయితే గతంలో ఎమ్మిగనూరు కేంద్రంలో ఉండడంతో నిరుద్యోగులకు మంచి అవకాశాలు లభించేవి. ఇప్పుడు లేకపోవడంతో పశ్చిమ ప్రాంతాల నిరుద్యోగులు ఉన్నత చదువులు చదివినా ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లే పరిస్థితి ఏర్పడింది. అధికారులు చొరవ తీసుకొని ఎమ్మిగనూరు ప్రాంతంలో మళ్లీ డీఆర్‌డీఏ ద్వారా శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే వేలాది మంది నిరుద్యోగుల జీవితాలకు వెలుగులు ఇచ్చిన వారు అవుతారు.

ఆటో బోల్తా.. తెగిన మహిళ చేయి

ఎల్లమ్మ చేతికి చికిత్స చేస్తున్న వైద్య సిబ్బంది

కోసిగి, న్యూస్‌టుడే: కూలీ పనులకు వెళ్తుండగా.. ఆటో బోల్తాపడి మహిళ తీవ్రంగా గాయపడిన ఘటన కోసిగి మండలం వందగల్లు గ్రామ సమీపంలో సోమవారం జరిగింది. ఎస్సై తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కౌతాళం మండలం కరణి గ్రామం నుంచి కూలీలు ఆటోలో పత్తి పనులకు బయలుదేరారు. ఆటో డ్రైవర్ అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుతుండటంతో కూలీలు పలుమార్లు హెచ్చరించారు. అయినా వినిపించుకోకుండా వేగంగా వెళ్లి వందగల్లు సమీపంలో ఆటో అదుపుతప్పి బోల్తా పడిపోయింది. ప్రమాదంలో ఎల్లమ్మ అనే కూలీ చేయి ఆటో కింద ఇరుక్కొని తెగిపోయింది. తలకు గాయమైంది. మిగతా కూలీలు సురక్షితంగా బయటపడ్డారు. గాయపడిన ఎల్లమ్మను తోటి కూలీలు కోసిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు తెగిన చేయికి, తలకు ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం ఆదోని ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. కూలీల ఫిర్యాదు మేరకు ఆటోను సీజ్ చేసి డ్రైవర్ మహేంద్రపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్సై రమేష్ రెడ్డి తెలిపారు.

(c) eenadu

మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

ఆర్థిక స్వావలంబన సాధించాలి

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే: పొదుపు మహిళలు ఆర్థికంగా బలపడేందుకు ప్రభుత్వం అన్నివిధాలా చేయూతనిస్తుందని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి తెలిపారు. కల్లూరు 37వ వార్డు వీకర్ సెక్షన్ కాలనీలో డీజీ లక్ష్మి కామన్ సర్వీసు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించి మాట్లాడారు. పొదుపు మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలన్నారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు

•కర్నూలు •పాణ్యం

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : నగరంలో మంగళవారం ఉదయం 7 నుంచి 9 గంటల మధ్యలో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని కర్నూలు డివిజన్ ఈఈ శేషాద్రి ఒక ప్రకటనలో తెలిపారు. సోమప్ప కాలనీ, మహాలక్ష్మి నగర్, ఎన్‌సీసీ క్వార్టర్స్, జేసీ బంగ్లా, బీక్యాంపు తదితర ప్రాంతాల్లో సరఫరాలో అంతరాయం ఉంటుందని డీ2 సెక్షన్ డీఈఈ చంద్రమోహన్ చెప్పారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM) కర్నూలు : 80085 52632, వ్యాట్సాప్ నెం : 85010 05408, ఓర్వకల్లు : 63004 66875

? అశోక్‌నగర్ డ్రైన్ వంతెన కింద పెద్దఎత్తున మురుగు నీరు నిలిచిపోయింది. రాపోలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. - గోవింద్

? దర్గాపేట, నరసింహారెడ్డి నగర్‌లో వెంటనే కాలువలు శుభ్రం చేయాలి. - స్థానికులు

✔ ఆయా ప్రాంతాల్లోని సమస్యలను పరిశీలించి పరిష్కరిస్తాం. - నగరపాలక సంస్థ అధికారులు

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: ఆర్థిక ఇబ్బందులు ఉన్నా అధిగమించి రాష్ట్రాన్ని అభివృద్ధి బాట వైపు సీఎం చంద్రబాబు నాయుడు తీసుకెళ్తున్నారని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. స్థానిక 42వ వార్డులో సోమవారం వార్డు పర్యటన చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసి అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించారు. వార్డులో రూ.2 కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు. వార్డుల్లో ఎలాంటి సమస్యలున్నా తమ వారి ద్వారా తెలుసుకొని పరిష్కరిస్తున్నామన్నారు. తమ ప్రభుత్వ పాలనపై ప్రజల్లో పూర్తి సంతృప్తి వ్యక్తమవుతోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో నగరపాలక కమిషనర్ విశ్వనాథ, తెదేపా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

స్థానికులతో మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్

స్థానిక యువతకు ప్రాధాన్యం

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: చదువుతో పాటు నైపుణ్యాలపై పట్టు ఎంతో అవసరమని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు. కేవీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో మెగా ఉద్యోగ మేళాను సోమవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు పేర్కొన్నారు. ఓర్వకల్లు పారిశ్రామిక హబ్‌కు వివిధ కంపెనీలు వస్తున్నాయని.. వీటిల్లో యువతకు ప్రాధాన్యముంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారిణి దీప్తి, కళాశాల ప్రిన్సిపల్ కొండయ్య, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ఆనంద్ రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నవి కూల్చేసి.. నిధులు ఊడ్చేసి

● నగరంలో భారీగా ప్రజాధనం వృథా

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: నగరంలో సుందరీకరణ పనుల పేరుతో నిధులను ఇష్టానుసారంగా ఖర్చు చేస్తున్నారు. కొన్ని నెలల కిందట పనులు దక్కించుకున్న పలువురు గుత్తేదారులు ఇటీవల చేపట్టారు. కాగా ఉన్నవాటిని కూల్చేసి పనులు చేపట్టడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రజాధనం వృథా అవుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.

ఈ చిత్రం.. బంగారుపేట కూడలి నుంచి రాజ్‌విహార్‌కు వెళ్లే మార్గం. ఈ దారి గుండా ఉన్న విభాగిని తొలగించారు. ఇప్పుడు కొంచెం వెడల్పుతో కొత్తగా విభాగిని నిర్మించేలా చర్యలు తీసుకుంటున్నారు. ఉన్నదానిని తొలగించి మళ్లీ నిర్మించడంపై విమర్శలు రేగుతున్నాయి. పనులు చేపట్టేందుకు గాను సుమారు రూ.50 లక్షలు వెచ్చిస్తున్నారు. బాగున్న వాటిని కూల్చి నిధులు ఖర్చు చేస్తుండటంపై జనం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజా సమస్యలు పట్టించుకోక..

కర్నూలు నగర పరిధిలో సుమారు 8 లక్షల జనాభా ఉంది. నగరపాలక సంస్థకు ఏటా పన్నుల రూపంలో రూ.90 కోట్లకుపైగా సమకూరుతుంది. ఈ నిధులతో కాలనీల్లో అవసరమైన సదుపాయాలు కల్పించాల్సి ఉంది. కానీ అధికారులు మాత్రం గుత్తేదారుల లబ్ధి కలిగించేలా చర్యలు తీసుకుంటున్నారు. అవసరం లేని ప్రాంతాల్లో పనులు మంజూరు చేస్తున్నారు. కట్టడాలు తొలగించి మళ్లీ నిర్మించేలా చేస్తూ ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారు. నగర పరిధిలో 1,100కుపైగా కాలనీలు ఉన్నాయి. చాలా ప్రాంతాల్లో కనీసం రహదారులు, మురుగు కాలువల నిర్మాణాలు జరగలేదు. ఆ పనులు చేయాల్సి ఉండగా పట్టించుకోవడం లేదు.

అధికారుల పర్యవేక్షణ కరవు

నగర సుందరీకరణ అవసరమైనప్పటికీ ఉన్న నిర్మాణాలను కూల్చి మళ్లీ కొత్తవి నిర్మించడంపై ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల కాలంలో నగరంలో విభాగినులు, కూడళ్లకు రంగులు వేశారు. దీనికి గాను రూ.కోటికి పైగా నిధులను నగరపాలక ఖర్చు చేసింది. రంగులు వేసి నెలలు కాకముందే మాయమయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. నాసిరకమైన రంగులు వాడుతుండటంతో ఈ పరిస్థితి నెలకొంది. అయినప్పటికీ నగరపాలక అధికారులు ఏమాత్రం దృష్టి సారించడం లేదు. ఈ నేపథ్యంలో ఇకనైనా తగిన స్పందించి పనులు పారదర్శకంగా జరిగేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

కేడీసీసీబీ ఛైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి సమక్షంలో తెదేపాలో చేరిన వైకాపా నాయకులు

తెదేపాలో పలువురి చేరిక

కర్నూలు గ్రామీణ, న్యూస్‌టుడే: సి.బెళగల్ మండలం మారందొడ్డి గ్రామానికి చెందిన పలువురు వైకాపా నాయకులు తెదేపాలో చేరారు. కర్నూలు నగరంలో తెదేపా సీనియర్ నేత, కేడీసీసీబీ ఛైర్మన్ డి.విష్ణువర్ధన్‌రెడ్డి సమక్షంలో గ్రామ మాజీ సర్పంచి రుక్మంద, మరో 250 మంది తెదేపా కండువా కప్పుకొన్నారు. వారు మాట్లాడుతూ విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో తెదేపా బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, అమర్, సుధాకర్, ఉప్పర సోమన్న, ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆశయం నీరుగారి..

సంతోష్‌నగర్ సమీపంలోని మమత నగర్‌లో స్థానికులకు తాగునీటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకుగాను నీటి ట్యాంకు ఏర్పాటు చేశారు. గత కొన్ని నెలలుగా ఇది నిరుపయోగంగా ఉంది. దీనిని అందుబాటులోకి తీసుకొస్తే మేలు జరుగుతుందని స్థానికులు పేర్కొంటున్నారు. ఇకనైనా నగరపాలక అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

– న్యూస్‌టుడే, కర్నూలు నగరపాలక సంస్థ

వ్యర్థాలు కదలక.. దుర్గంధం వదలక

కర్నూలు వ్యవసాయ మార్కెట్‌లోని ఎండుమిర్చి షెడ్ల వద్ద వ్యర్థాలు పెద్దఎత్తున పేరుకుపోయాయి. ఇటీవల మార్కెట్ యార్డును సందర్శించిన జేసీ నూరుల్ ఖమర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. పరిసరాలు శుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని మార్కెట్ కమిటీ అధికారులకు ఆదేశించారు. అయినా ప్రయోజనం లేకపోయింది. చెత్తాచెదారాలను తొలగించడం లేదు. ఫలితంగా అపరిశుభ్ర వాతావరణం నెలకొంది.

– న్యూస్‌టుడే, కర్నూలు సచివాలయం

డా.మునురాజ్‌కు పత్రం ఇస్తున్న వైద్య కళాశాల ప్రిన్సిపల్ డా.చిట్టినరసమ్మ, హెచ్‌వోడీ డా.శ్రీదేవి తదితరులు

ప్రతిభ చూపి.. ప్రశంసలు అందుకొని

కర్నూలు వైద్య కళాశాలలోని డీవీఎల్ విభాగంలో పీజీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న డాక్టర్ మునురాజ్ ప్రతిభ చాటాడు. తిరుపతిలో జరిగిన రాష్ట్రస్థాయి సదస్సులో పేపర్ ఇన్ కేస్ రిపోర్టింగ్‌లో ఉత్తమ పేపర్ ప్రజంటేషన్‌కుగాను అవార్డు లభించింది. ఈ సందర్భంగా అతను ఆ విభాగం హెచ్‌వోడీ డా.శ్రీదేవి ఆధ్వర్యంలో వైద్య కళాశాల ప్రిన్సిపల్ డా.చిట్టినరసమ్మను సోమవారం కలవగా ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో డా.గౌతమి తదితరులు పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, కర్నూలు వైద్యాలయం

ఆలయాల అభివృద్ధికి చేయూతనివ్వండి

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే: రూపాల సంగమేశ్వర స్వామి ఆలయాన్ని అభివృద్ధి చేయాలని విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ నాయకులు కోరారు. వారు సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ డా.సిరిని కలిసి వినతిపత్రం అందజేశారు. జగన్నాథగట్టు సమీపంలోని వినాయక, అయ్యప్ప స్వామి తదితర ఆలయాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయలేదని చెప్పారు. తాగునీటి కొరత వేధిస్తోందని.. అభిషేకాలు చేసేందుకు అర్చకులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ నాయకులు గోవిందరాజు, గిరిబాబు, సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బాలికకు అరుదైన చికిత్స

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే : ఓ బాలికకు అరుదైన చికిత్స చేసి అడ్రినల్ గ్రంధిలో ఉన్న కణితి తొలగించి ప్రాణాలు నిలిపినట్లు కిమ్స్ ఆసుపత్రి వైద్యులు సాయిప్రసూన సోమవారం తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు.. నంద్యాల ప్రాంతానికి చెందిన ఓ బాలిక (12) విపరీతమైన తొలనొప్పితో బాధపడుతుండేది. పలు ప్రాంతాల్లో చూపించినా నయం కాలేదు. ఈ నేపథ్యంలో తల్లిదండ్రులు కిమ్స్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. వైద్యులు పాపను పరీక్షించి అల్ట్రా సౌండ్ స్కానింగ్ చేయగా అడ్రినల్ గ్రంధిలో కణితి ఉన్నట్లు తేలింది. సాధారణంగా 30, 40 ఏళ్లు పైబడిన వారిలోనే ఇలాంటి సమస్యలు వస్తుంటాయి. కాగా బాలికకు బీపీ ఎక్కువగా ఉండటంతో ముందుగా దానిని తగ్గించేలా వైద్యులు చర్యలు తీసుకున్నారు. బీపీ అదుపులోకి వచ్చిన తర్వాత ల్యాప్రోస్కోపిక్ పద్ధతిలో కణితిని తొలగించారు. ప్రస్తుతం పాప ఆరోగ్యంగా ఉందని వైద్యులు తెలిపారు.

రుసుముల పెంపు దారుణం

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : పాత వాహనాలకు సంబంధించి కేంద్రం తీసుకొచ్చిన విధానాన్ని వెంటనే రద్దు చేయాలని లారీ యాజమానుల సంఘం నాయకులు ప్రసన్నకుమార్, వెంకటేశ్వర్లు కోరారు. వారు సోమవారం మాట్లాడుతూ హెవీ వాహనాలకు వసూలు చేస్తున్న ఫిట్‌నెస్ రుసుం రూ.1,340గా ఉండేదని.. ప్రస్తుతం 20 ఏళ్లు దాటిన వాహనాలకు రూ.33,040 వసూలు చేస్తున్నారన్నారు. 13 ఏళ్లు పైబడిన వాహనాలపై ఫిట్‌నెస్ ఛార్జీలను గణనీయంగా పెంచారన్నారు. ఫిట్‌నెస్ రుసుములు తగ్గించాలని కోరుతూ డిసెంబరు 9వ తేదీ రాత్రి నుంచి 10వ తేదీ వరకు రైల్వే గూడ్స్ షెడ్ల నుంచి సరకు రవాణా ఆపేసి నిరసన తెలుపుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కర్నూలు టిప్పర్ యాజమానుల సంఘం నేతలు జగన్‌గౌడ్, లక్ష్మీనారాయణ మినీ లారీ యాజమానుల సంఘం నేతలు రామకృష్ణ, శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

దస్త్రాలతో హాజరుకండి

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : తమకు న్యాయం చేయాలని కోరుతూ నాలుగో తరగతి ఉద్యోగ గృహ నిర్మాణ సముదాయ సంఘం బాధితులు సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ డా.సిరిని కలిశారు. తమ ఇబ్బందులను వివరించారు. ఈ నేపథ్యంలో సహకార శాఖ అధికారుల తీరుపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నాలుగో తరగతి ఉద్యోగుల గృహ నిర్మాణ సముదాయ సంఘానికి సంబంధించిన దస్త్రాలతో తన ఎదుట హాజరుకావాలని జిల్లా సహకార శాఖ అధికారులు, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ అధికారులను ఆదేశించారు.

ఎండుమిర్చి క్వింటా గరిష్ఠ ధర రూ.16,259

కర్నూలు మార్కెట్, న్యూస్‌టుడే : కర్నూలు వ్యవసాయ మార్కెట్‌కు సోమవారం వివిధ పంట ఉత్పత్తులు వచ్చాయి. ఎండుమిర్చి క్వింటా గరిష్ఠ ధర రూ.16,259 పలికింది. వేరుసెనగకాయలు రూ.6,899, ఆముదాలు రూ.5,931, మొక్కజొన్న రూ.1,869, కందులు రూ.6,800, కందులు వడకలు రూ.2,756, ఉల్లి రూ.1,311, మినుములు రూ.6,919, సజ్జలు రూ.2,499కు వ్యాపారులు ఈ.నామ్ పద్ధతిలో రైతుల నుంచి కొనుగోలు చేశారు.

సెమినార్ జయప్రదానికి పిలుపు

కరపత్రాలు ఆవిష్కరించిన న్యాయవాదులు

కర్నూలు గాయత్రీ ఎస్టేట్, న్యూస్‌టుడే : 'రాజ్యాంగం సవాళ్లు.. పౌరుల బాధ్యత' అంశంపై ఈనెల 13న కర్నూలులోని టీజీవీ కళాక్షేత్రంలో జరిగే సెమినార్‌కు మద్రాస్ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రు హాజరవుతున్నారని.. న్యాయవాదులు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జిల్లా బార్ అసోసియేషన్ నాయకులు పిలుపునిచ్చారు. దీనికి సంబంధించిన కరపత్రాలను నగరంలోని జిల్లా బార్ అసోసియేషన్ కార్యాలయం వద్ద అధ్యక్షుడు హరినాథ్‌చౌదరి, కార్యదర్శి వెంకటేశ్వర్లు, లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక గౌరవ సలహాదారు.. సీనియర్ న్యాయవాది జయరాజు తదితరులు ఆవిష్కరించారు.

ఫ్రీ లోక్‌అదాలత్‌ను వినియోగించుకోండి

కర్నూలు గాయత్రీ ఎస్టేట్, న్యూస్‌టుడే : ఈనెల 13న జరిగే జాతీయ లోక్‌అదాలత్‌ను పురస్కరించుకుని నిర్వహిస్తున్న ఫ్రీ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకుని కేసులు పరిష్కరించుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి లీలావెంకటశేషాద్రి సూచించారు. స్థానిక న్యాయ సేవాసదన్‌లో మున్సిపల్, సచివాలయ ఉద్యోగులతో సోమవారం సమావేశం నిర్వహించారు.

మహిళా దినోత్సవంగా ప్రకటించాలి

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే: సావిత్రిబాయి పులె జయంతిని మహిళా దినోత్సవంగా ప్రకటించాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ మహిళా ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి డిమాండ్ చేశారు. ఆ వేదిక ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సావిత్రిబాయి పులె, ఫాతిమా షేక్ జయంతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మి, ఓబీసీ మోర్చా సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు డా.కంచర్ల హరిప్రసాద్, సీపీఐ నేత జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

ఆందోళనలో పాల్గొన్న వివిధ సంఘాల నాయకులు

మాదకద్రవ్యాలతో జీవితం నాశనం

గోడపత్రాలు ఆవిష్కరిస్తున్న అదనపు ఎస్పీ హుస్సేన్ పీరా, పోలీసు అధికారులు, ఏఐవైఎఫ్ నాయకులు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : మాదకద్రవ్యాలకు విద్యార్థులు, యువకులు దూరంగా ఉండాలని జిల్లా అదనపు ఎస్పీ హుస్సేన్‌పీరా కోరారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి రూపొందించిన 'హలో యువత మేలుకో.. మత్తు పదార్థాల నుంచి నిన్ను నువ్వు కాపాడుకో' గోడపత్రాలను సోమవారం ఆవిష్కరించారు. తల్లిదండ్రులు నిత్యం తమ పిల్లలను పర్యవేక్షిస్తూ కాపాడుకోవాలని చెప్పారు. ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీరాములు, కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీఐలు శ్రీధర్, చాంద్‌బాషా, ఏఐవైఎఫ్ నగర అధ్యక్షుడు నాగరాజు, చంటి, దస్తగిరి పాల్గొన్నారు.

35 మందికి ఉద్యోగావకాశాలు

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే: నగర శివారు.. దూపాడు సమీపంలోని డా.కేవీ సుబ్బారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు సోమవారం ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. 50 మంది విద్యార్థులు పాల్గొనగా 35 మంది ఎంపికైనట్లు కళాశాల నిర్వాహకులు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను అభినందించారు. నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

వినతులకు సత్వర పరిష్కారం

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: నగర ప్రజలు ఇచ్చే వినతులను సత్వరం పరిష్కరించాలని కమిషనర్ పి.విశ్వనాథ ఆయా విభాగ అధికారులను ఆదేశించారు. ఎస్బీఐ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు.

సమస్య తెలుసుకుంటున్న కమిషనర్ పి.విశ్వనాథ

ప్రజల నుంచి 28 వినతులు స్వీకరించారు.

నైపుణ్యాలతోనే ఉత్తమ ఫలితాలు

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే : జాన్సన్ అండ్ జాన్సన్ ఇన్‌స్టిట్యూట్ ఆన్ వీల్ ఆధ్వర్యంలో వాహనంలో ఏర్పాటు చేసిన స్కిల్ ల్యాబ్‌తో ఎంతో ఉపయోగం కలుగుతుందని.. శస్త్రచికిత్సల్లో నైపుణ్యాలను యువ వైద్యులు పెంపొందించుకోవచ్చని వైద్య కళాశాల ప్రిన్సిపల్ డా.చిట్టినరసమ్మ తెలిపారు. సర్వజన వైద్యశాలలోని ఓల్డ్ సీఎల్‌జీ వద్ద జాన్సన్ అండ్ జాన్సన్ ఇన్‌స్టిట్యూట్ ఆన్ వీల్ ఆధారిత స్కిల్ ల్యాబ్‌లో రెండు రోజుల కార్యశాలను ఆసుపత్రి పర్యవేక్షకుడు డా.వెంకటేశ్వర్లుతో కలిసి సోమవారం ప్రారంభించారు.

ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న వైద్య కళాశాల ప్రిన్సిపల్

బాలసదన్ తనిఖీ

పెద్దపాడు (కల్లూరు గ్రామీణ), న్యూస్‌టుడే: కల్లూరు పరిధి పెద్దపాడులోని బాలసదన్‌ను రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ డా.రాయపాటి శైలజ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. బాలసదన్‌లో చిన్నారులకు అందించే భోజనం, వసతిపై ఆరా తీశారు.

చిన్నారులతో రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ శైలజ, ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి తదితరులు

సంక్షిప్త సమాచారం

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : 36, 37, 41 వార్డుల్లో ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్‌కు సోమవారం వినతిపత్రం అందించినట్లు సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు అలివేలు, నగేష్ తెలిపారు.

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే: కర్నూలు మండల పరిధిలోని ఎదురూరు, ఆర్కే దుద్యాల తదితర గ్రామాలకు వెళ్లే రహదారులకు మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్‌కు సోమవారం వినతిపత్రం అందించినట్లు సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రామకృష్ణ, మండల కార్యదర్శి హుస్సేనయ్య తెలిపారు.

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: ఆస్తి పన్నులు చెల్లిస్తున్న వాణిజ్య సముదాయాల యజమానుల సహకారం అభినందనీయమని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ తెలిపారు. మూడు వాణిజ్య దుకాణాల నుంచి వచ్చిన రూ.10.64 లక్షల చెక్కును అందుకున్నారు.

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: రహదారులపై పశువులను వదిలితే వాటి యజమానులపై నగరపాలక సంస్థ చర్యలు తీసుకుంటుందని కమిషనర్ పి.విశ్వనాథ సోమవారం హెచ్చరించారు. గోవుల కారణంగా ఏదైనా ప్రమాదం జరిగితే పూర్తి బాధ్యత యజమానులదేనని స్పష్టం చేశారు.

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే : రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పార్వతమ్మ భర్త కె.లక్ష్మయ్య ఆచారి సోమవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, తెదేపా నేత గౌరు వెంకటరెడ్డి తదితరులు ఆయన మృతదేహానికి పూలమాలలు వేసిన నివాళులర్పించారు.

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : పీజీఆర్ఎస్ పనితీరు విశ్లేషణలో భాగంగా సీఎం కార్యాలయం నుంచి వచ్చిన నివేదికల ప్రకారం నవంబరులో ఇంప్రాపర్ రెడ్రెస్సల్ శాతం బాగా తగ్గిందని, డిసెంబరులో ఇంకా ఎక్కువగా తగ్గించాలని కలెక్టర్ డా.ఎ.సిరి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో పలు అంశాలపై అధికారులతో సమీక్షించారు. పాఠశాలలు, కళాశాలలు, వసతి గృహాల లోపలికి వీధి కుక్కలు రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే: దళితులు పారిశ్రామిక వేత్తలుగా మారకుండా ప్రైవేటు బ్యాంకులు అడ్డుపడుతున్నాయని కేవీపీఎస్, డీవైఎఫ్ఐ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవీపీఎస్, డీవైఎఫ్ఐ సంయుక్త ఆధ్వర్యంలో బి.క్యాంపులోని జిల్లా పరిశ్రమల కేంద్రం వద్ద సోమవారం ధర్నా చేశారు.

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే: భాజాపా రాష్ట్ర మీడియా కో-కన్వీనర్‌గా జిల్లా నుంచి తెలుగు అంబన్నను నియమిస్తూ రాష్ట్ర ఓబీసీ మోర్చా అధ్యక్షుడు గోపి శ్రీనివాస్ ఉత్తర్వులు జారీ చేశారు.

ట్రోఫీతో విద్యార్థులు

కరాటేలో విద్యార్థుల సత్తా

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే: టీజీవీ కళాక్షేత్రంలో ఈనెల 7వ తేదీన జరిగిన షిటోకయి కరాటే అసోసియేషన్ పోటీల్లో పీస్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చాటినట్లు పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ షేక్ నాసిర్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థులు జె.ఫయాజ్ (స్వర్ణం), షిహాన్ (సిల్వర్), ఆరిఫ్ హుస్సేన్ (కాంస్యం)ను ఆయన అభినందించారు.

స్టాండింగ్ కమిటీ సమావేశం మళ్లీ వాయిదా

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: నగరపాలకసంస్థ స్టాండింగ్ కమిటీ సమావేశం మళ్లీ వాయిదా పడింది. ఎస్బీఐ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో సోమవారం సమావేశం నిర్వహించారు. 22 అంశాలను ప్రవేశపెట్టగా 4 తీర్మానాలకు ఆమోదం తెలిపారు. 18 అంశాలను వాయిదా వేశారు. తమ వార్డుల్లో అభివృద్ధి పనులను ఎందుకు చేపట్టలేదని సభ్యులు ఆగ్రహించి వెనుదిరిగారు. వివిధ అభివృద్ధి పనులకు నిధులు కేటాయించారు. ఈ కార్యక్రమంలో మేయర్ బీవై రామయ్య, కమిషనర్ పి.విశ్వనాథ, సభ్యులు షేక్ అహ్మద్, సాంబశివరావు, మునెమ్మ, నారాయణరెడ్డి, వై.వెంకటేశ్వర్లు, అధికారులు పాల్గొన్నారు.

పంచ్ విసిరి.. పతకాలతో మెరిసి

■ ఉషూలో రాణిస్తున్న క్రీడాకారిణులు

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే : నగరంలో చదువుకుంటున్న పలువురు విద్యార్థినులు మార్షల్ ఆర్ట్స్‌పై దృష్టి సారించారు. ఉషూ శిక్షకుడు శ్రీనివాసులు ఆధ్వర్యంలో తర్ఫీదు తీసుకున్నారు. అవసరమైన మెలకువలు నేర్చుకున్నారు. జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు సాధించి అందరి మన్ననలు అందుకున్నారు. జాతీయస్థాయి పోటీల్లో పతకాలు సాధించడమే లక్ష్యంగా నిత్యం సాధన చేస్తున్నారు.

నవీన.. నిత్య సాధన

కర్నూలు కేవీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో దాసరి నవీన బీఏ తృతీయ సంవత్సరం చదువుతున్నారు. ఈమెది చిప్పగిరి స్వగ్రామం. ఆత్మరక్షణ కోసం తల్లిదండ్రులు ఉషూ క్రీడ నేర్పించారు. ఈ నేపథ్యంలో కరాటేపై దృష్టి పెట్టిన నవీన నిత్యం సాధన చేయడం ప్రారంభించారు. గతేడాది అక్టోబరులో రాజమండ్రిలో జరిగిన రాష్ట్రస్థాయి ఉషూ పోటీల్లో స్వర్ణ పతకం గెలుచుకున్నారు. ఈ ఏడాది మేలో నగరంలో జరిగిన ఉషూ రాష్ట్రస్థాయి పోటీల్లో శాన్షు ఫైట్ విభాగంలో వెండి పతకం అందుకున్నారు. ఆగస్టులో కర్నూలు డీఎస్‌ఏ స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి ఖేలో ఇండియా పోటీల్లోనూ పసిడితో మెరిశారు. జాతీయస్థాయి పోటీలే లక్ష్యంగా సాధన చేస్తున్నట్లు నవీన చెప్పారు.

విజయాల శ్రావణి

నగరంలోని కేవీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో శ్రావణి బీకాం తృతీయ సంవత్సరం చదువుతున్నారు. ఆత్మరక్షణ కోసం ఆమె ఉషూపై దృష్టి సారించారు. గతేడాది అక్టోబరులో రాజమహేంద్రవరంలో జరిగిన రాష్ట్రస్థాయి ఉషూ పోటీల్లో నాన్ క్వాన్ విభాగంలో స్వర్ణ పతకం అందుకున్నారు. ఈ ఏడాది మేలో కర్నూలులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పసిడి పతకం సాధించారు. జులైలో జైపుర్‌లో జరిగిన జాతీయస్థాయి ఉషూ పోటీల్లో ఏపీ తరపున ప్రాతినిధ్యం వహించారు. ఆగస్టులో కర్నూలు డీఎస్‌ఏ స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి ఖేలో ఇండియా పోటీల్లో నాన్ క్వాన్ విభాగంలో స్వర్ణ పతకంతో మెరిశారు. ఈ సందర్భంగా శ్రావణి మాట్లాడుతూ త్వరలో జరిగే పోటీల్లో పతకాలు సాధించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు.

మంటలు చెలరేగి టిప్పర్ దగ్ధం

కర్నూలు నేరవిభాగం, కర్నూలు గ్రామీణ, న్యూస్‌టుడే : కర్నూలు మండల పరిధిలో నిడ్జూరు-ఎదురూరు మధ్య నిర్మాణంలో ఉన్న సూరత్ హైవే వంతెనపై సోమవారం ఉదయం ఓ టిప్పర్ అగ్నిప్రమాదానికి గురైంది. జగన్నాథగట్టు నుంచి ఓ టిప్పర్ (ఏపీ39 యూఎం 8939) మట్టి తరలిస్తోంది. ఈ క్రమంలో సైలెన్సర్ నుంచి మంటలు రేగి టైర్లకు అంటుకుంది. వాహన చోదకుడు ప్రమాదానికి గుర్తించి కిందకు దూకి తప్పించుకున్నాడు. మంటలు ఒక్కసారిగా వాహనాన్ని చుట్టుముట్టాయి. కర్నూలు అగ్నిమాపకశాఖ కర్నూలు కేంద్రం సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పేశారు. వాహన యజమాని శివమాధవ్‌గా గుర్తించారు. కర్నూలు తాలూకా అర్బన్ పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు.

13న జిల్లాస్థాయి ఎంపిక పోటీలు

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే: స్థానిక డీఎస్‌ఏ స్టేడియంలో 13వ తేదీన సీనియర్ స్త్రీ, పురుషుల విభాగాల్లో జిల్లాస్థాయి షూటింగ్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా సంఘం కార్యదర్శి ఈశ్వర్‌నాయుడు తెలిపారు. ప్రతిభ చూపిన క్రీడాకారులు డిసెంబరు 18 నుంచి 21వ తేదీ వరకు కర్నూలు జిల్లాలో జరిగే 44వ రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. వివరాలకు 99899 82655 70138 86343 నంబర్లను సంప్రదించాలని కోరారు.

జీవోను వెంటనే అమలు చేయాలి

ధర్నా చేస్తున్న సంఘం నాయకులు తదితరులు

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే: జీవో నంబరు 36ను వెంటనే అమలు చేయాలని సహకార యూనియన్ నాయకులు కోరారు. రాష్ట్ర సహకార సంఘాల యూనియన్ పిలుపు మేరకు కృష్ణానగర్‌లోని సహకార బ్యాంకు వద్ద నాయకులు సోమవారం ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ 2019, 2024 తాలూకు పెండింగ్‌లో ఉన్న వేతన సవరణ చేయాలని. . అప్పటివరకు మధ్యంతర భృతి ఇవ్వాలన్నారు. సహకార సంఘాల్లో పనిచేసే ఉద్యోగులకు సైతం ఉద్యోగ విరమణ వయస్సును 62 ఏళ్లకు పెంచాలన్నారు.

విత్తన, విద్యుత్తు బిల్లులను వ్యతిరేకించండి

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే: శీతాకాల సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న విత్తనాలు, విద్యుత్తు బిల్లులను ఎంపీలు వ్యతిరేకించాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం డిమాండు కోరారు. కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా చేశారు.

మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం

(c) eenadu

ఈనాడు నంద్యాల

మంగళవారం డిసెంబరు 9, 2025 | 5

విళక్కు మహోత్సవం

జిల్లా కేంద్రం పరిధిలోని గుడిపాటిగడ్డలోని అయ్యప్ప ఆలయంలో మండల విళక్కు మహోత్సవం నిర్వహించారు. కన్నెస్వాములు 108 కలశాల్లో నీటిని శోభాయాత్రగా తీసుకెళ్లారు. మణికంఠునికి విశేష తిరుమంజనం, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు.

– న్యూస్‌టుడే, నంద్యాల బొమ్మలసత్రం, నంద్యాల పురపాలకం

కుమార్తెకు భోజనం తినిపిస్తున్న తల్లి ఖాసీంబి

25 ఏళ్లు దాటాయి.. అమ్మా.. ఆకలని అడగలేరు

మొదట బాబు.. రెండోసారి పాప.. మూడోసారి మళ్లీ బాబు.. ఆ ముగ్గురు సంతానాన్ని చూసుకుని ఆ తల్లిదండ్రులు మురిసిపోయారు.. ఏళ్లు నిండుతున్నా వారిలో చురుకుదనం.. మానసిక ఎదుగుదల లేదు.. ఎన్నో ఆసుపత్రుల చుట్టూ తిరిగారు.. ముగ్గురికి 25 ఏళ్లు దాటాయి.. అమ్మా ఆకలి అని నోరు తెరచి అడగలేరు.. ఇరవైఏళ్లు వచ్చినా పసికందు కిందే ఆ తల్లిదండ్రులు సేవ చేస్తున్నారు. బనగానపల్లి మండలం యనకండ్లకు చెందిన చాంద్‌బాషా, ఖాసీంబి దంపతులకు ముగ్గురు సంతానం. పెద్దోడు హసన్ (31), రెండో కుమారుడు మాబువలి (24), కుమార్తె అఫ్రిన్ (27)లు శారీరక, మానసిక వైకల్యంతో బాధపడుతున్నారు. పుట్టినప్పటి నుంచీ మంచానికే పరిమితమయ్యారు. వయోభారంతో బాధపడుతున్నా కూలి పనులు చేస్తూనే పిల్లలను జాగ్రత్తగా చూసుకుంటున్నారు. బిడ్డల భవిష్యత్తు తలచుకుని తల్లడిల్లుతున్నారు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. తల్లి ఖాసీంబి ఇంటి పట్టునే ఉండి పిల్లల బాగోగులు చూస్తున్నారు. ముగ్గురికీ ప్రభుత్వం సామాజిక పింఛను మంజూరు చేస్తున్నా సరిపోవడం లేదని దాతలు తమను ఆదుకోవాలని ఎదురుచూస్తున్నారు.

– న్యూస్‌టుడే, బనగానపల్లి గ్రామీణం

గీతా పఠనంలో స్వర్ణం

నిత్యం భగవద్గీత పారాయణం చేస్తూ గీత పఠనంలో 'స్వర్ణం' సాధించారు కొలిమిగుండ్లకు చెందిన స్వర్ణగౌరీ. ఉయ్యాలవాడలోని వేణుగోపాలస్వామి ఆశ్రమానికి వెళ్తూ గీతాపారాయణం సాధన చేశారు. ఇంట్లోనూ భగవద్గీత పఠిస్తూ పట్టు సాధించారు. ఆన్‌లైన్‌లోనూ ఆధ్యాత్మిక తరగతులను వీక్షిస్తూ గ్రంథంలోని 700 శ్లోకాలు ఉచ్చారణ, అక్షర దోష లోపాలు లేకుండా చెప్పగలిగే ప్రతిభను సాధించారు. ఇటీవల మైసూర్‌లోని దత్తపీఠం ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో కర్ణాటకతోపాటు ఉమ్మడి తెలుగు రాష్ట్రాలకు భగవద్గీత శ్లోకాలపై మహిళలకు పోటీ పరీక్షలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ చూపినవారిని శ్రేణులవారీగా ఎంపిక చేసి ఈనెల 1న గీతా జయంతి సందర్భంగా మైసూరులో దత్తపీఠం ఆధ్వర్యంలో గీతాపారాయణం పోటీలు నిర్వహించారు. పోటీల్లో స్వర్ణగౌరీ ప్రతిభను చూపి పీఠాధిపతి గణపతి సచ్చిదానందస్వామి చేతుల మీదుగా బంగారు పతకం అందుకున్నారు.

– న్యూస్‌టుడే, కోవెలకుంట్ల, కొలిమిగుండ్ల

కౌసల్య బ్యాటింగ్ భళా

ముంబయిలో బీసీసీఐ ఆధ్వర్యంలో ఈనెల 13 నుంచి జరిగే అండర్-19 పోటీలకు కౌసల్య బాయి ఎంపికైంది. వెల్దుర్తి మండలం ఎల్.బండకు చెందిన ఆమె నగరంలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. చిన్నప్పుడు సోదరుడు శంకర్‌నాయక్‌తో కలిసి టీవీల్లో క్రికెట్ చూసేది. అలా క్రికెట్‌పై ఆసక్తి పెరిగింది. ఆమె ఆసక్తిని గమనించి 2022లో కర్నూలు డీఎస్ఏ స్టేడియంలో శిక్షణ ఇప్పించారు. ఓ వైపు చదువుకుంటూనే మరోవైపు ఆటలో మెలకువలు నేర్చుకుంది. గతేడాది వైజాగ్‌లో ఏసీఏ ఆధ్వర్యంలో జరిగిన అంతర జిల్లాల క్రికెట్ పోటీల్లో ప్రతిభ చాటింది. అదే ఏడాది సెప్టెంబరులో వైజాగ్‌లో జరిగిన దక్షిణ మండలం పోటీల్లో కేవలం రెండు పోటీల్లో పాల్గొని 80 పరుగులు చేసింది. ఈ ఏడాది జులై 3 నుంచి 9వ తేదీ వరకు నెల్లూరులో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన అంతర జిల్లాల అండర్-19 బాలికల క్రికెట్ పోటీల్లో ఐదు విభాగాల్లో పాల్గొని 292 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలిచింది. ఈ పోటీల్లో చిత్తూరు జట్టుపై 117 పరుగులు చేయడం విశేషం. ఈ ఏడాది ఆగస్టు 21 నుంచి 30వ తేదీ వరకు వైజాగ్‌లో జరిగిన రాష్ట్ర ప్రాబబుల్స్‌లో (రెండు పోటీలు) 119 పరుగులు సాధించింది. ''ప్రస్తుతం అండర్-19 పోటీలకు ఎంపికవ్వడంపై ఆమె మాట్లాడుతూ జాతీయస్థాయి జట్టులో స్థానం సాధించడమే తన లక్ష్యమని'' పేర్కొంది.

– న్యూస్‌టుడే, కర్నూలు క్రీడలు, వెల్దుర్తి

పట్టు చేజరీ

పట్టు మగ్గాలు : 10 వేలు
కార్మికులు : 13 వేలు
ఏడాదికి : 4.20 లక్షల చీరలు

పెరిగిన వెండి, బంగారం ధరల ప్రభావం చేనేత రంగాన్ని కుదేలుచేస్తోంది. ధరలు రెండింతలు పెరగడంతో కార్మికులపై ఆర్థిక భారం పడుతోంది. పట్టు చీరల తయారీలో జరీ వినియోగం తప్పనిసరి. ఉమ్మడి జిల్లాలో చేనేత కార్మికులు, మాస్టర్ వీవర్స్ గుజరాత్‌లోని సూరత్ నుంచి జరీని దిగుమతి చేసుకొంటున్నారు. చిన్న చీరకు మూడు ముట్టలు, మధ్య చీరకు నాలుగు, పెద్ద బార్డర్ చీరకు ఆరు ముట్టలు(మార్కులు) వినియోగిస్తారు. జరీ తయారీలో అధికంగా వెండిని వినియోగిస్తారు. ఒక్కో జరీ ముట్ట(మార్క్) రూ.200లకు పైగానే పెరిగింది. ఆరు నెలల కిందట జరీ ధర రూ.450 ఉండేది. ప్రస్తుతం రూ.650 నుంచి రూ.700 చేరింది. ముడి సరకు ధర రూ.4100 నుంచి ఏకంగా రూ.6500కు పెరిగింది. ఒక్కో పట్టుచీరపై జరీ, ముడి సరకుపై కనీసం రూ.1000 నుంచి రూ.1200 భారం పడుతోంది. దీంతో వ్యాపారులు దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు. ప్రభుత్వం స్పందించి వ్యాపారులను ఆదుకోవాలని చేనేత కార్మికులు, మాస్టర్ వీవర్స్ రంగన్న, వెంకటేశు కోరారు.

– న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు

రేపటి నుంచి టెట్

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డీఈవో జనార్దన్‌రెడ్డి తెలిపారు. ఈనెల 10 నుంచి 21వ తేదీ వరకు ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు విడతల్లో పరీక్షలు జరుగుతాయని సోమవారం వెల్లడించారు. శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాల, ఆర్‌జీఎం ఇంజినీరింగ్ కళాశాల, నంద్యాల రామకృష్ణ డిగ్రీ కళాశాల, నంద్యాల పట్టణంలోని ఎస్‌బీఐ కాలనీలోని రామకృష్ణ పీజీ కళాశాలలో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సందేహాల నివృత్తికి హెల్ప్‌లైన్ డెస్క్‌లోని 73862 39784, 81798 55575, 96424 44745 నంబర్లను సంప్రదించాలని కోరారు.

దుమ్ము స్వర్గం

బేతంచెర్ల పట్టణం నుంచి 4 కి.మీ. దూరంలోని కనుమకిందికొట్టాల శివారులో ప్రసిద్ధిగాంచిన బిల్వస్వర్గం గుహలకు వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. దీంతో ఆ మార్గం గుండా వాహనాలపై వెళ్లే పర్యాటకుల కళ్లలో దుమ్మూధూళి పడి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వైకాపా హయాంలో గుహల అభివృద్ధికి రూ.2 కోట్లతో నిధులు వెచ్చించినా రహదారి నిర్మాణం పూర్తి కాకపోవడంతో పర్యాటకులకు ఇబ్బందులు తప్పడం లేదు. పలుకూరు, రామకృష్ణాపురం గ్రామాల పరిధిలోని నాపరాయి క్వారీల నుంచి అధికలోడుతో నాపరాయిని బేతంచెర్లకు తీసుకెళ్లే క్రమంలో విపరీతంగా దుమ్ము లేస్తోంది.

– న్యూస్‌టుడే, బేతంచెర్ల

కోవెలకుంట.. ఆక్రమణల పుట్ట

■ ఐదు వందల ఎకరాలు మాయం
■ ఉన్న పొలానికీ వేలం కరవు

కోవెలకుంట్లలో పాండురంగస్వామి ఆలయ భూమిలో నిర్మాణాలు

నంద్యాల పట్టణం, కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: జిల్లాలో ఆలయ భూములు హారతి కర్పూరంలా కరిగిపోతున్నాయి. కోవెలకుంట్ల మండల కేంద్రంలోని పాండురంగస్వామి ఆలయానికి ఒకప్పుడు వందల ఎకరాల పొలం ఉండేది. కోవెలకుంట్ల, చింతకుంట పొరుగు గ్రామాలుగా ఉండేవి. వీటి పరిధిలో ఆలయ భూమి ఉండేది. రెండు గ్రామాలు కలిసిపోయి ప్రస్తుతం కోవెలకుంట్లగా మారింది. ఈ ఆలయం భూమి కనుమరుగైపోయింది. ప్రస్తుతం మండల కేంద్రంగా ఉన్న కోవెలకుంట్లలో గృహాలు, దుకాణాల సదుపాయాలు, ఇతర నిర్మాణాలు 50శాతానికి పైగా ఈ ఆలయానికి చెందిన భూమిలోనే ఉన్నాయి.

వెలిసిన గోదాములు

ఆలయ పరిధిలో ఒకప్పుడు 750 ఎకరాల పొలం ఉండేది. మూడు దశాబ్దాల కిందట అప్పటి ప్రజాప్రతినిధి ఒకరు ఆలయానికి సేవలు చేసే వివిధ వర్గాలకు 'కోవెల' భూమిని ఇళ్ల పట్టాల పేరుతో పంపిణీ చేశారు. ఇదే అదనుగా మరికొందరు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. వర్గాలుగా విభజించుకుని పంచేసుకున్నారు. ఐదు వందల ఎకరాల వరకు అన్యాక్రాంతమైంది. గోదాములు, వాణిజ్య సముదాయాలు నిర్మించారు. బాడుగులకు ఇచ్చి సొమ్ము చేసుకొంటున్నారు. వందల సంఖ్యలో ఇళ్లు వెలిశాయి. వీటిలో కొన్ని నిర్మాణాలకు రిజిస్ట్రేషన్లు లేవు. ఆలయ నిర్వహణకు ఇబ్బందిగా ఉండడంతో దాతల సహాయంతో వాణిజ్య సముదాయాలు నిర్మించారు. వచ్చిన డబ్బులతో ఆలయ నిర్వహణ చేస్తున్నారు.

62.5 ఎకరాలు ఎక్కడ

- ప్రస్తుతం కోవెలకుంట్ల మండలం సౌదరదిన్నె గ్రామ పరిధి సర్వే నంబరు 93లో 2.44 ఎకరాలు, 916లో 8.81 ఎకరాలు కలిపి మొత్తం 11.25 ఎకరాలు, చింతకుంట గ్రామ పరిధిలో సర్వే నంబరు 173లో 9.89 ఎకరాలు, 174-1లో 5.50 ఎకరాలు, 174-2లో 11.06 ఎకరాలు, 174-3లో 5.6 ఎకరాలు, 138-బీలో 1.08, 154లో 13.22, 198లో రెండు ఎకరాలు, 234-2లో 0.56 ఎకరాలు, 71లో 0.26 ఎకరాలు, 73-ఏలో 2.08 ఎకరాలు కలిపి మొత్తం 51.25 ఎకరాల భూమి ఉంది. ప్రస్తుతం మొత్తం 62.5 ఎకరాల భూమి ఉంది.
- ఈ భూమి కౌలుకు అధికారికంగా వేలం పాటలు నిర్వహించలేదు. దస్త్రాల్లో భూమి ఉన్నా ఎవరి ఆధీనంలో ఉంది, సాగు చేస్తున్నది ఎవరు? క్షేత్రస్థాయిలో భూమి స్వరూపం ఎలా ఉందని ఆలయ అధికారులకు తెలియని దుస్థితి. రూ.కోట్లలో విలువ చేసే భూములు ఆక్రమణలో ఉన్నా అధికారుల చర్యలు లేవు.

కదళి రైతు కష్టాలు

చాగలమర్రి మండలంలోని చిన్నవంగలి గ్రామంలో అరటి ధర లేక రైతన్నలు సాగు చేసిన తోటలను దున్నేస్తున్నారు. గ్రామానికి చెందిన సంజీవరాయుడు సాగు చేసిన రెండెకరాల్లో అరటి తోటను సోమవారం ట్రాక్టరుతో దున్నేశారు. ఎకరానికి రూ.లక్ష మేర పెట్టుబడి పెట్టి సాగు చేసిన అరటి ప్రస్తుతం కిలో రూ.2 నుంచి రూ.5 అడుగుతుండటంతో పెట్టిన పెట్టుబడి కూడా రాదని ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకునేందుకు దున్నేస్తున్నామని వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, చాగలమర్రి

కర్షకుడి కన్నీటి వేదన

గోస్పాడు మండలం చింతకుంట్ల గ్రామానికి చెందిన చిన్న హుసేనయ్య పదేళ్లుగా న్యాయం చేయాలంటూ ఆందోళన చేస్తున్నారు. నంద్యాల జిల్లా నీటిపారుదల శాఖ కార్యాలయం గేటు ఎదుట సోమవారం ఆందోళనకు దిగారు. గతంలో కానాల గ్రామంలోని చెరువు తూము మూసి వేయడంతో పంట పొలాలకు సాగునీరు అందించే కాల్వను రైతులు పూడ్చివేశారన్నారు. దీంతో పంటపొలాలకు నీరు అందక ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తూము తెరిచి, పంట కాల్వను పునరుద్ధరించాలని కోరుతున్నారు.

–న్యూస్‌టుడే, నంద్యాల రైతునగరం

జిల్లా కోర్టు కాంప్లెక్స్‌కు 10 ఎకరాలు

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని కౌలూరు గ్రామ పరిధిలో నంద్యాల జిల్లా కోర్టు కాంప్లెక్స్ కోసం అవసరమైన 10 ఎకరాలను పరిశీలిస్తున్నట్లు తహసీల్దారు నరేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. కౌలూరు గ్రామ పరిధిలో ఎల్‌పీ నంబరు 376లో 10.70 ఎకరాలకు సంబంధించి అభ్యంతరాలు, సమస్యలను 15 రోజుల్లోపు తెలియజేసేందుకు అవకాశం ఇచ్చామన్నారు. ఈ విషయాన్ని గ్రామ సచివాలయంలో నోటీసు బోర్డులో ఉంచామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో స్థలాన్ని చూసి నివేదికలు ఇచ్చామని వివరించారు.

బెంగళూరు దారి

ఈనాడు, కర్నూలు : జాతీయ దారి.. హైదరాబాద్- బెంగళూరు మార్గంలో 24 గంటలూ రయ్..రయ్ మంటూ వాహనాలు దూసుకెళ్తుంటాయి. ఏ ఒక్క వాహనం 100 కి.మీ. వేగం కంటే తక్కువ కాకుండా పరుగులు పెడుతుంటాయి.. అక్టోబరు 24వ తేదీన చెట్లమల్లాపురం వద్ద ప్రైవేటు బస్సు ప్రమాదానికి గురై 19 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇంత పెద్ద ప్రమాదం జరిగినా రహదారిపై లోపాలు సరిదిద్దలేదు. ఉమ్మడి కర్నూలు జిల్లా పరిధిలో 18 బ్లాక్‌స్పాట్లు గుర్తించి వదిలేశారు.



ఉమ్మడి జిల్లాలో పొడవు	వాహనాల రాకపోకలు	టోలు వసూలే (నిత్యం)	బ్లాక్ స్పాట్లు
83 కి.మీ	15 వేలు	రూ. 20 లక్షలు (అమకతాడు టోల్‌ప్లాజా)	18

సర్వీసు రహదారులు నిర్మించక..

- కర్నూలు శివారు.. చిన్నటేకూరు వద్ద సర్వీసు మార్గం లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వెల్దుర్తి కూడలి, డోన్ పరిధిలోని పోతుదొడ్డి, దేవరబండ, ఓబులాపురం మెట్ట, కొత్తపల్లి తదితర చోట్ల సర్వీసు రహదారులు లేకపోవడంతో వాహనదారులు రాంగ్‌రూట్లో ప్రయాణిస్తున్నారు.
- దొరపల్లి వద్ద సర్వీసు మార్గంలో వంతెన లేకపోవడంతో చాలామంది అపసవ్య దిశలో ప్రయాణిస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. గత మూడేళ్లలో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. సర్వీసు రోడ్డుతోపాటు పైవంతెన నిర్మించాలని ప్రతిపాదించిన ప్పటికీ కార్యరూపం దాల్చలేదు.

కానరాని ఏటీఎంఎస్ వ్యవస్థ

- జాతీయ రహదారుల్లో ఏటీఎంఎస్ (అడ్వాన్స్‌డ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్)ను ఏర్పాటు చేస్తున్నారు. వాహనం ఎంత వేగంతో వెళ్తుందో ఇట్టే తెలిసిపోతుంది. ఎలక్ట్రానిక్ బోర్డుల్లో కనిపిస్తోంది. పోలీసులకు సమాచారం అందుతుంది. దీంతో తనిఖీలు చేసి చర్యలు తీసుకోవడం ద్వారా వేగాన్ని నియంత్రించడంతోపాటు ప్రమాదాలు తగ్గించడానికి వీలుంటుంది. 2010లో విస్తరించిన ఈ మార్గంలో ఏటీఎంఎస్ వ్యవస్థ లేకపోవడం గమనార్హం.

రూ.70 కోట్లతో ప్రతిపాదనలు

"కర్నూలు నుంచి అనంతపురం వరకు సుమారు 150 కి.మీ. మేర జాతీయ రహదారిపై కొత్త పొర వేసేందుకు రూ.70 కోట్లతో ప్రతిపాదనలు పంపాం. వచ్చే ఏడాది వంద శాతం పనులు ప్రారంభించి పూర్తి చేస్తాం. విభాగినులపై పూర్తిస్థాయిలో మొక్కలు పెంచేలా చర్యలు తీసుకుంటున్నాం" అని ఎన్‌హెచ్ఏఐ పీడీ (అనంతపురం) తరుణ్ తెలిపారు.

సంవత్సరం	మృతి చెందిన వారు
2023	19
2024	27
2025	18

వీటిని పట్టించుకోరు

- మితిమీరిన వేగంతో ప్రయాణించే వాహనాలను దూరం నుంచే గుర్తించేందుకు 'స్పీడ్‌లేజర్ గన్లు' అవసరం. ఉమ్మడి కర్నూలు జిల్లాలో కేవలం ఒకే ఒక్కటే ఉండటం గమనార్హం.
- కర్నూలు నుంచి డోన్ వెళ్లే మార్గంలో టోల్‌గేటు దగ్గర నిఘా కెమెరాలు లేవు. అధునాతన సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్న పోలీసుల ప్రతిపాదనను టోల్‌గేటు నిర్వాహకులు పట్టించుకోవడం లేదు.
- జాతీయ రహదారి మార్జిన్లలో పలుచోట్ల ఇసుక మేట వేసింది. ఫలితంగా వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతున్నాయి. మట్టి లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాల్సి ఉండగా పట్టించుకోవడం లేదు.
- విభాగినులపై నాలుగైదు అడుగుల ఎత్తున గుబురు మొక్కలు పెంచితే రాత్రివేళలో ఎదురుగా వచ్చే వాహనాల లైటింగ్ డ్రైవర్ల కళ్లలో పడదు. జాతీయ రహదారిపై ఎక్కడా మొక్కలు కనిపించడం లేదు.

కుమారుడి బలవన్మరణం.. 'తల్లి'డిల్లి కాల్వలో దూకి

నందికొట్కూరు, గ్రామీణం న్యూస్‌టుడే: ఉరేసుకొని కుమారుడు మృతి చెందగా.. తట్టుకోలేక కాల్వలో దూకిన తల్లిని మత్స్యకారుడు కాపాడారు. నందికొట్కూరు మండలం వడ్డెమానుకు చెందిన సగినేల ఏసమ్మ కుమారుడు సునీల్‌కుమార్(23) నివాసం ఉంటున్నారు. ఇటీవల తండ్రి అనారోగ్యంతో మృతి చెందారు. తల్లి ఆదివారం ప్రార్థన నిమిత్తం గుత్తికి వెళ్లగా.. సోమవారం ఉదయం ఇంటికొచ్చి తలుపులు తీసి చూడగా.. కుమారుడు ఫ్యాన్‌కు ఉరేసుకొని చనిపోయి ఉన్నాడు. కొడుకు మృతిని తట్టుకోలేకపోయిన ఏసమ్మ కంబాలపల్లి సమీపంలో బస్సు దిగి ఎస్సార్ఎంసీ కాలువలోకి దూకారు. అక్కడే చేపలు పడుతున్న సుబ్బయ్య అనే మత్స్యకారుడు ఆమెను సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు.

భక్తజన అజెండా

■ శ్రీకారం చుట్టిన ధర్మకర్తల మండలి

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: మల్లన్న స్పర్శ దర్శనం.. అతిశీఘ్ర దర్శనం టికెట్లు పొందిన భక్తులకు ఉచితంగా లడ్డూలు ఇవ్వడం.. దర్శన ముగింపు సమయాన్ని రాత్రి 10 నుంచి 11 గంటలకు పెంపు.. భక్తులు సమర్పించిన చీరలు, పంచెలు చెంచుగూడేల్లో గిరిజనులకు ఉచితంగా పంపిణీ.. భక్తుల నుంచి సూచనలు, ఫిర్యాదులు స్వీకరించడానికి డయల్ యువర్ ఈవో, ఛైర్మన్ కార్యక్రమం పునరుద్ధరణ వంటి భక్తజన అజెండాకు శ్రీశైల దేవస్థానం నూతన ధర్మకర్తల మండలి ఆమోద ముద్ర వేసింది.

మాస్టర్ ప్లాన్ అమలుపై దృష్టి

- ఇల కైలాసమైన శ్రీశైల మల్లికార్జునుడి క్షేత్రంచెంత గత వైకాపా సర్కారు రాజకీయం చేసింది. ఎక్కడికక్కడ దేవాలయ వ్యవహారాలను ఏదో ఓ విధంగా వివాదాస్పదం చేసి భక్తజన విశ్వాసాలతో ఆడుకున్నారు. అస్మదీయులకు ఆలయ బాధ్యతలు అప్పగించి అక్రమాలు పెంచిపోషించారు.
- 'కూటమి' ప్రభుత్వం వచ్చిన తర్వాత భక్తజన అజెండాపై దృష్టి సారించింది. ఈవో ఎం.శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి ఛైర్మన్ రమేష్‌నాయుడు, సభ్యులు సరికొత్త ఆలోచనలకు శ్రీకారం చుట్టారు.
- మాస్టర్ ప్లాన్ త్వరగా అమలు చేయడానికి విరాళాల స్వీకరణ.. దేవస్థానం పరిధిలోని అన్ని వీఐపీ కాటేజీలు, వసతి గదుల్లో మరమ్మతులు చేయాలని నిర్ణయించారు.

ఏడాదిలో ఏ రోజైనా రావొచ్చు

- రెండేళ్ల కిందట దేవస్థానంలో నూతనంగా రూ.1,01,116లతో ఉదయాస్తమాన సేవ ప్రారంభించారు. ఈ టికెట్ తీసుకొన్న భక్తులు తెల్లవారుజామున సుప్రభాతసేవ మొదలుకొని రాత్రి ఏకాంతసేవ వరకు 14 రకాల సేవల్లో భక్తులు పాల్గొనవచ్చు.
- టికెట్ పొందిన రోజుకే పరిమితం చేయడంతో ఆదరణ కొరవడింది. పదేళ్ల కాలపరిమితికి ఏడాదిలో భక్తులు కోరుకున్న రోజు సేవ చేసుకొనేలా ప్రతిపాదనలు రూపొందించారు.

వీటిలో మార్పులు తీసుకురావాలని

- స్పర్శ దర్శనం(వీఐపీ) టికెట్లు త్వరగా జారీకి కొత్త సాఫ్ట్‌వేర్ అభివృద్ధి, ప్రత్యేక కౌంటర్ల ద్వారా జారీ చేయాలని నిర్ణయించారు.
- శ్రీశైల టీవీ ఛానల్‌ను అభివృద్ధి చేయడం, గోశాలలో పశు వైద్యుల నియామకం. సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం.
- ప్రసాద్ పథకం ద్వారా ఏర్పాటు చేసిన లేజర్‌షో నాగులకట్ట నుంచి నక్షత్రవనం వైపు నిర్మాణం.
- దేవస్థానంలోని ఆయా విభాగాల పనితీరును పర్యవేక్షించడానికి ధర్మకర్తల మండలి సభ్యులకు బాధ్యతలు అప్పగించాలి.

రాత్రి 10 గంటల వరకు అనుమతి

శ్రీశైలం యాత్రికులకు అటవీశాఖ చెక్‌పోస్టుల సమయ వేళలతో ఇబ్బందులున్నాయి. రోజులో 15 గంటల సమయంలో మాత్రమే శ్రీశైలానికి వచ్చి వెళ్లాల్సి ఉంటుంది. కనీసం 10 నిమిషాలు ఆలస్యమైనా అనుమతి ఉండదు. ధర్మకర్తల మండలి ఉదయం 5 నుంచి రాత్రి 10 గంటల వరకు వాహనాలను అనుమతించాలని ప్రతిపాదించారు. ఉదయం, రాత్రి గంట చొప్పున అదనంగా కేటాయించేలా అటవీశాఖ ఉన్నతాధికారులను ఒప్పించాలని నిర్ణయించారు.

రైతేరాజు: అల్లాబకాష్.. పాడి లాభాల్లో శెభాష్ 6

నిత్యం పరీక్ష.. పదింతల సాధన

పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్నాయి. జీవితంలో ఉన్నతంగా రాణించాలంటే 'పది' మార్కులు ఎంతో కీలకం. ఇప్పటినుంచి ప్రణాళికాబద్ధంగా చదివితేనే ఉత్తమ మార్కులు సాధ్యం. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వంద రోజుల ప్రణాళికను సిద్ధం చేసి జిల్లా విద్యా శాఖకు పంపింది. దీంతోపాటు అధికారులు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. సబ్జెక్టు టీచర్ల కొరత ఉన్న పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు బోధించేందుకు ప్రత్యేకంగా అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల నియామకం చేపట్టారు. ఈసారి వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. కర్నూలు జిల్లాలో 160, నంద్యాల జిల్లాలో 80 మంది అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను త్వరలో నియమించనున్నారు.

– న్యూస్‌టుడే, కర్నూలు, ఆదోని విద్య

అంశం	కర్నూలు	నంద్యాల
ఆదర్శ పాఠశాలలు	1,443	1,817
గురుకులాలు	1,162	1,147
కస్తూర్బా	1,051	1,042
జిల్లా పరిషత్తు	18,126	9,694
మున్సిపల్	2,077	380
ఎయిడెడ్	229	607
ప్రభుత్వ	1,989	1,442
ఆశ్రమ	54	135
ప్రైవేటు	10,295	10,257

కార్యాచరణ ప్రణాళిక ఇలా..

1. విద్యార్థులందరూ ఉత్తీర్ణత సాధించేలా ఎన్‌సీఈఆర్‌టీ ఇప్పటికే వంద రోజుల ప్రణాళిక రూపొందించింది. డిసెంబరు నుంచి పది వార్షిక పరీక్షల వరకు ప్రణాళిక అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలిచ్చింది.
2. ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 వరకు ఆరు పీరియడ్లు, స్టడీ అవర్లు నిర్వహించాలి.
3. ఆరో పీరియడ్‌లో ప్రతిరోజూ పరీక్ష పెట్టాలి. స్టడీ అవర్‌లో పాల్గొనే ఉపాధ్యాయులకు సీసీఎల్ మంజూరు చేస్తారు.
4. ప్రతిరోజు సబ్జెక్ట్ నిపుణులు తయారుచేసిన ప్రశ్నపత్రాన్ని ఆన్‌లైన్‌లో తీసుకొని విద్యార్థుల చేత రాయించాలి.
5. ఫార్మెటివ్ అసెస్‌మెంటులో వచ్చిన మార్కుల ఆధారంగా విద్యార్థి స్థాయిని బట్టి ఏ, బీ, సీ, డీగా నిర్ణయించాల్సి ఉంటుంది. చదువులో వెనుకబడిన వారిపై ప్రత్యేక దృష్టి సారించడంతోపాటు ఉపాధ్యాయులు దత్తత తీసుకోవాల్సి ఉంటుంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో సీ, డీ గ్రేడ్‌లో 14,320 మంది విద్యార్థులు ఉన్నట్లు గుర్తించారు.
6. సీ, డీ గ్రేడ్‌లో ఉన్న విద్యార్థులను ఒక్కో ఉపాధ్యాయుడు ఆరు నుంచి 8 మంది విద్యార్థులను దత్తత తీసుకోవాలి. వారు మంచి మార్కులు సాధించేలా మెలకువలు నేర్పించాలి.

S.B.V.R. అగ్రికల్చరల్ కళాశాల, బద్వేలు

ఇంటర్మీడియట్ నందు Bi.P.C విభాగంలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు చివరి అవకాశం. కడప జిల్లా బద్వేలులో I.C.A.R., NEW DELHI వారిచే గుర్తింపు పొందిన S.B.V.R. అగ్రికల్చరల్ కాలేజ్ (S.B.V.R. A.G.B.Sc). నందు B.Sc (Hons.) Agricultureలో ...

వివరములకు సంప్రదించవలసిన: 94400 33523, 91825 05395, 94928 56652.
కరస్పాండెంట్, S.B.V.R. అగ్రికల్చరల్ కళాశాల

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99899 97628
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80085 13479

(c) eenadu

తెగుళ్లు తరిమేద్దాం.. కందిని రక్షించుకుందాం

బేతంచెర్ల, న్యూస్‌టుడే

కంది పంట పూత, పిందె దశలో ఉన్నప్పుడు సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చని బేతంచెర్ల వ్యవసాయ శాఖాధికారి విజయ్‌కుమార్‌రెడ్డి సూచించారు. ప్రస్తుతం కంది పంట పూత దశలో ఉంది. రైతులు తప్పనిసరిగా సస్యరక్షణ చర్యలు పాటిస్తే నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని సూచించారు.

● **మారుకా మచ్చల పురుగు:** దీన్ని వాడుకలో భాషలో పూత, పురుగు లేదా గూడు పురుగు లేదా బూజు పురుగు అని పిలుస్తారు. ఈ పురుగు ఒకటి, రెండు దశలను పూమొగ్గల లోపలే ఉంటూ తినేస్తాయి. తర్వాత దశలో లేతాకులను, పూతను, లేత పిందెలను, కాయలను కలిపి గూడులా చేసుకొని కాయ అడుగు భాగంలో చిన్న రంధ్రం చేసి లోపలికి వెళ్లి కాయలోని గింజలను తిని, వాటిని డొల్లగా చేస్తాయి.

● దీని నివారణకు లీటరు నీటికి థయోడికార్బ్ ఒక గ్రాము లేదా నొవాల్యురాన్ ఒక మి.లీ. లేదా ఫ్లూబెండమైడ్ 0.2 మి.లీ. కలిపి వారం రోజులకోసారి మందులను మార్చి పిచికారీ చేయాలి.

కాయ ఈగ: ఈ పురుగు ఆశించినప్పుడు నష్టం బటకు కనిపించదు. వీటి పిల్ల పురుగులు కాయ లోపలే ఉండి గింజలను తింటాయి. ఈ పురుగు అన్ని దశలనూ కాయ లోపలే పూర్తి చేసుకొని, తల్లి పురుగు లేత పిందె దశలో కాయలపై గుడ్లు పెడుతుంది.

● పిందె దశలో 5 శాతం వేపగింజల కషాయం పిచికారీ చేసి, చెట్లపై పురుగులు గుడ్లు పెట్టకుండా నివారించవచ్చు.

● గింజ గట్టిపడే దశలో లీటరు నీటికి మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లేదా డైమిథోయేట్ 2 మి.లీ. లేదా ప్రొఫినోఫాస్ 2 మి.లీ. కలిపి పిచికారీ చేయాలి.

కాయ తొలుచు పురుగు: ఎకరాకు నాలుగు లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేయాలి. పురుగులు తినే పక్షులను ఆకర్షించేలా ఎకరాకు 20 పక్షి స్థావరాలను సిద్ధం చేయాలి. పురుగు గుడ్లను, తొలి దశలో పురుగులను గమనించిన వెంటనే ఐదు శాతం వేపగింజల కషాయాన్ని లేదా వేప సంబంధమైన మందు (అజాడిరక్టిన్) లీటరు నీటికి 5 మి.లీ. కలిపి పిచికారీ చేయాలి.

● ఎకరాకు 200 లార్వాలకు సమానమైన ఎన్‌పీవీ ద్రావణాన్ని లేదా 400 గ్రాముల బ్యాక్టీరియా సంబంధమైన మందును 200 లీటర్ల నీటితో కలిపి వారం తేడాతో రెండు సార్లు చలికాలంలో సాయంత్రం వేళ పిచికారీ చేయాలి.

పైన చెప్పిన చర్యలను సకాలంలో చేపట్టలేనప్పుడు తప్పనిసరైతే పురుగు ఉద్ధృతిని బట్టి మొగ్గ-తొలిపూత దశలో ఉన్నప్పుడు క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లేదా ఎసిఫేట్ 1.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

● ఈ మందులు వాడిన తర్వాత కూడా శనగపచ్చ పురుగును నివారించలేకపోతే లీటరు నీటికి ఇండాక్సికార్బ్ 1 మి.లీ. లేదా స్పైనోసాడ్ 0.3 మి.లీ. కలిపి పిచికారీ చేయాలి.

సందేహాలు సమాధానాలు

?: వరి కోతలు కోస్తున్నాం.. ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి?

- రామమోహన్‌రెడ్డి, నందవరం

✔: వరి కోతల సమయంలో పది రోజుల ముందు ఆఖరు తడి నీటిని పెట్టుకోవాలి. పంట 70శాతం బంగారు రంగులోకి వచ్చాక కోత కోయాలి. తేమ 12 శాతం కంటే తక్కువగా ఉండేలా చూసుకోవాలి. వర్షం పడే సూచనలు ఉన్నప్పుడు కోత కోయరాదు. కోత కోసే ముందు వరిమడిలో నీరు లేకుండా చూసుకోవాలి. విత్తన వడ్లు తీసుకునే రైతులు మనుషులచేత కోత కోయించడం మంచిది.

ధనలక్ష్మి, శాస్త్రవేత్త, కేవీకే

– న్యూస్‌టుడే, బనగానపల్లి

కుందేటి వెర్రితో పశువులకు ప్రాణగండం

ఆళ్లగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే: పశువుల్లో వచ్చే ప్రాణాంతకమైన వ్యాధుల్లో కుందేటి వెర్రి ఒకటి. దీన్ని ట్రిపనోసోమియాసిస్ లేదా సర్రా అనే పేర్లతో పిలుస్తారు. జోరీగలు కుట్టడం వల్ల ఈ వ్యాధి వ్యాపిస్తుంది. ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకల్లో ఎక్కువగా కనిపిస్తుంది. సరైన సమయంలో చికిత్స అందించకపోతే.. మరణానికి దారి తీస్తుందని ఆళ్లగడ్డ పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు వరప్రసాద్ తెలిపారు.

● మురుగు ప్రదేశాల నుంచి వచ్చే టాబనిడ్ ఈగల నుంచి ఈ వ్యాధి వ్యాపిస్తుంది. ఇవి కాటు వేయడంతో పశువులకు వ్యాధి సోకుతుంది. వ్యాధిగ్రస్థమైన పశువుల నుంచి ఆరోగ్యకరమైన వాటికి సైతం వ్యాపిస్తుంది.

లక్షణాలు: తీవ్రమైన జ్వరం వల్ల మేత తీసుకోకపోవడం. కళ్లపై తెల్లటి పొరలు ఏర్పడి, కంటి నుంచి నీరు కారడం, గుండ్రంగా తిరగడం, తూలుతూ నడుస్తుంటాయి. వెర్రి చూపులు, పళ్లు కొరకటం, చొంగ కార్చడం వంటి లక్షణాలు ఉంటాయి. కాళ్లు, పొట్ట కింది భాగం, గొంతుపైన నీరు చేరడంతో పాటు కండరాల వణుకు, ఫిట్స్ లక్షణాలు కనిపిస్తాయి. కొన్ని పశువుల్లో లక్షణాలు కనిపించి గుర్తించేలోపు ఫిట్స్ వచ్చి చనిపోతాయి. ఈ వ్యాధి సోకిన గేదెల పాల దిగుబడి గణనీయంగా తగ్గుతుంది. గర్భం దాల్చిన పశువుల్లో గర్భస్రావాలు, నిర్జీవ జననాలు సైతం సంభవిస్తాయి. చికిత్స ఆలస్యమైతే పశువు రక్తహీనతకు లోనవుతుంది. సకాలంలో వైద్యం అందకుంటే అవి చనిపోయే ప్రమాదముంది.

చికిత్స: ఈ వ్యాధికి ప్రధానంగా ట్రిపనోసైడల్ మందులతో చికిత్స అందిస్తారు. సాధారణంగా ఉపయోగించే మందుల్లో డైమినజీన్ అసిటురేట్, ఐసోమోటామీడియం క్లోరైడ్ ముఖ్యమైనవి. ఈ మందులు ట్రిపనోసోమియా జాతుల వల్ల కలిగే తీవ్రమైన, దీర్ఘకాలిక ఇన్ఫెక్షన్లను తగ్గిస్తాయి. వ్యాధి చికిత్సలో గ్లూకోజ్ కీలకమైన పాత్ర పోషిస్తుంది. రక్తహీనత సమస్యను నివారించేందుకు హెమటానిక్స్ వాడాలి.

అల్లాబకాష్.. పాడి లాభాల్లో శెభాష్

డోన్, న్యూస్‌టుడే: డోన్ మండలంలోని తాడూరుకు చెందిన అల్లాబకాష్ ఆవులను పెంచుతూ రోజుకు 150 లీటర్ల పాల దిగుబడి సాధిస్తూ.. స్వయం ఉపాధి పొందుతున్నారు. డిగ్రీ చదివిన అల్లాబకాష్ ఉద్యోగ ప్రయత్నాల్లో భాగంగా 2015లో వైమానిక దళానికి ఎంపికయ్యారు. అనారోగ్య కారణాలతో వెనుదిరగాల్సి వచ్చింది. ఉద్యోగ ప్రయత్నాలకంటే స్వతహాగా ఉపాధి మార్గం వైపు నడవాలనుకున్నారు. సొంతూరులోనే 2023లో రూ.3 లక్షలతో చిన్నషెడ్డు నిర్మించి మూడు ఆవులు కొనుగోలు చేసి వాటి పెంపకం చేపట్టారు. ప్రస్తుతం డెయిరీలో 20 ఆవుల పోషణతో లాభాలు గడిస్తున్నారు. రోజూ 150 లీటర్ల పాలను పత్తికొండలోని ఓ డెయిరీ ఫాంకు లీటరు రూ.40 చొప్పున విక్రయిస్తామన్నారు. రోజుకు రూ.6 వేల వరకు రాబడి వస్తుండగా ఖర్చులు పోనూ రూ.2,500 లాభం పొందుతున్నారు.

డెయిరీ ఫాంలో అల్లాబకాష్

మేత ఎంపికలో మెలకువలు

పశువులకు పాల దిగుబడి పెరగాలంటే మేత ఎంతో ముఖ్యం. ఇందుకోసం ఆయన పచ్చిమేతపై ప్రత్యేక దృష్టి సారించారు. సూపర్ నేపియర్ 4జీ బుల్లెట్, గరుడ అనే నేపియర్ గడ్డిరకాలను ఎంపిక చేసుకొని పొలంలో వాటిని పెంచుతున్నారు. ఈ గడ్డిని ఆవులకు పచ్చిమేతగా వేస్తుండటంతో మంచి పాలదిగుబడి వస్తుందని ఆయన పేర్కొన్నారు. దీంతో పాటు గానుగచెక్క, దాణాను ఇస్తున్నారు.

సన్మార్గానికి పురాణాలు దోహదం

హరివరం(ఉయ్యాలవాడ), న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడిచేందుకు పురాణ గాథలు ఉపకరిస్తాయని పుట్టపర్తికి చెందిన ప్రవచనకర్త అన్నాజీ సాయిరాం తెలిపారు. హరివరంలో పురాణ గ్రంథాల గొప్పదనంపై సోమవారం ఏర్పాటైన ఆధ్యాత్మిక సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. రామాయణం, భారత, భాగవత గ్రంథాల్లోని ప్రధాన ఘట్టాలను ఆయన వినిపించారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ప్రసంగాన్ని వింటున్న గ్రామస్థులు

కమనీయం.. పల్లకి ఉత్సవం

పల్లకి సేవలో భక్తులు

యాగంటి (బనగానపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయంలో సోమవారం నేత్రపర్వంగా ఉమామహేశ్వరుడి పల్లకి ఉత్సవం ఆలయాధికారి పాండురంగారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లకిలో ఉత్సవ విగ్రహాలుంచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రాకార ఉత్సవం గావించారు. కార్యక్రమంలో పాతపాడు సర్పంచి మహేశ్వరరెడ్డి, యాగంటిపల్లి మౌళీశ్వరరెడ్డి తదితరులు ఉన్నారు.

స్వర్ణామృత ఔషధం పంపిణీ నేడు

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలో ఆవోపా ఆధ్వర్యంలో మంగళవారం స్వర్ణామృత ప్రాసన ఔషధం పంపిణీ చేస్తున్నట్లు ఆవోపా అధ్యక్షుడు శ్రీనాథ్‌గుప్తా సోమవారం తెలిపారు. త్రిదండి చిన జీయర్ స్వామి మంగళ శాసనాలతో వికాసతరంగిణి సహకారంతో ఉదయం 7 గంటలకు రెండో పట్టణ పోలీసు స్టేషన్ ప్రాంతంలో అభయాంజనేయ స్వామి ఆలయ ఆవరణలో పంపిణీ చేస్తామన్నారు. ఆరు నెలల చిన్నారుల నుంచి 16 ఏళ్ల పిల్లల వరకు ఔషధం తీసుకోవచ్చున్నారు.

శ్రీశైల మల్లన్నకు సహస్ర దీపాలంకరణ సేవ

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: శ్రీశైల మహాక్షేత్రంలో శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామివార్లకు సోమవారం రాత్రి వైభవంగా సహస్ర దీపాలంకరణ సేవ జరిగింది. ఆలయ ప్రాంగణంలో శ్రీస్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను నేత్రశోభితంగా ముస్తాబు చేశారు. అనంతరం అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు చేసి సహస్ర దీపాలు వెలిగించి, మంగళహారతులు సమర్పించారు. ఆలయ ప్రాంగణంలో వెండి రథోత్సవం జరిగింది. శ్రీశైలం ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగింది.

ఉత్సవమూర్తులకు పూజలు చేస్తున్న ఉపప్రధానార్చకులు

ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టండి

సమస్యలు వింటున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే వినతులపై ప్రత్యేక దృష్టి సారించి, పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాజకుమారి పేర్కొన్నారు. పీజీఆర్ఎస్‌లో సోమవారం ఆమె ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమానికి 292 దరఖాస్తులు అందాయి. కలెక్టర్ మాట్లాడుతూ..జిల్లాలో రీఓపెన్ అయిన 592 దరఖాస్తులను వారం రోజుల్లో క్లియర్ చేయాలన్నారు. పెండింగ్ వినతుల ఆడిట్‌ను నిరంతర ప్రక్రియగా తీసుకోవాలన్నారు. డీఆర్వో రామునాయక్, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

'ఐ గాట్ కర్మయోగి'తో ఉద్యోగుల నైపుణ్యాభివృద్ధి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉద్యోగులు నైపుణ్యాలు పెంచుకునేందుకు 'ఐ గాట్ కర్మయోగి' యాప్ ముఖ్యపాత్ర పోషిస్తుందని కలెక్టర్ జి.రాజకుమారి పేర్కొన్నారు. సోమవారం పీజీఆర్ఎస్ భవనంలో ఆమె వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, డీఆర్వో రామునాయక్‌తో కలిసి సమీక్షించారు. ఉద్యోగులకు అవసరమైన ప్రవర్తనా నియమాలు, సీసీఏ నిబంధనలు వంటి కోర్సులు ఈ యాప్ ద్వారా వీడియో రూపంలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రశ్నావళికి సమాధానాలు ఇస్తే ఉద్యోగి పేరుతో ధ్రువపత్రం జారీ అవుతుందన్నారు. జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాల్లో వంద శాతం ఈ-ఆఫీసు అమలు చేయాలని ఆదేశించారు.

సచివాలయ సేవల్లో పురోగతి సాధించాలి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలోని సచివాలయాల ద్వారా మెరుగైన సేవలు అందించి పురోగతి సాధించాలని కలెక్టర్ జి.రాజకుమారి అధికారులను ఆదేశించారు. తన క్యాంపు కార్యాలయం నుంచి ఆమె మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఈవోఆర్డీలతో సోమవారం గ్రామ సచివాలయ సేవలు స్వామిత్వ పురోగతిపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. డీఎల్‌డీవో శివారెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి లలితాబాయి తదితరులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ..సిటిజన్ ఈ-కేవైసీ విషయంలో నంద్యాల అర్బన్, పాములపాడు, పగిడ్యాల, కొత్తపల్లి, బండిఆత్మకూరు, కొలిమిగుండ్ల, శిరివెళ్ల చాగలమర్రి, బనగానపల్లి గ్రామీణ ఆత్మకూరు మండలాల్లో పురోగతి తగ్గిందన్నారు. సచివాలయ సిబ్బంది హాజరు శాతాన్ని మెరుగుపరచాలన్నారు. స్క్రబ్ టైఫస్ వ్యాధిని ఎలిసా పరీక్ష ద్వారా నిర్ధారించవచ్చని, ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు.

నృసింహస్వామి విగ్రహం విరాళం

ప్రధాన అర్చకుడికి స్వామి విగ్రహాన్ని అందజేస్తున్న దాత విజయ్‌కుమార్

అహోబిలం(ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: అహోబిలం లక్ష్మీనృసింహస్వామి ఆలయానికి బలిజ అన్నదాన సత్రం అధ్యక్షుడు, అహోబలం సినిమా నిర్మాత శెట్టి విజయ్‌కుమార్ లక్ష్మీనృసింహస్వామి విగ్రహాన్ని విరాళమిచ్చారు. పంచలోహాలతో తయారు చేసిన ఐదు కేజీల బరువు ఉన్న మాలోల నృసింహ స్వామి విగ్రహాన్ని ఆలయ ప్రధానార్చకుడు కిడాంబి వేణుగోపాలన్‌కు అందజేశారు. అహోబిలం మఠంలో కొలువుంచి స్వామికి కైంకర్యాలు చేయాలని ఆయన కోరారు. అహోబిలం వైభవాన్ని ప్రపంచానికి చాటి చెప్పాలని అహోబలం సినిమా నిర్మిస్తున్నట్లు ఆయన తెలిపారు.

గెలుపోటములు సమానంగా స్వీకరించాలి

విజేతకు బహుమతి అందజేస్తున్న బీసీ రాజారెడ్డి

బనగానపల్లి, న్యూస్‌టుడే: క్రీడల్లో గెలుపోటములు సమానంగా స్వీకరించాలని బనగానపల్లి మాజీ సర్పంచి బీసీ రాజారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలో రెండు రోజుల పాటు జరిగిన రాష్ట్రస్థాయి కరాటే పోటీలు సోమవారం ముగిశాయి. పోటీల్లో విజయం సాధించి జాతీయస్థాయి పోటీలకు పలువురు విద్యార్థులు ఎంపికయ్యారు. వీరికి బీసీ రాజారెడ్డి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువును నిర్లక్ష్యం చేయకుండా తమకు ఇష్టమైన క్రీడల్లో పాల్గొని విజయం సాధించాలన్నారు. ఆటల్లో ప్రతిభ కనబరిచే విద్యార్థులకు ఉద్యోగావకాశాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఏపీ కరాటే అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రతాప్‌కుమార్, ప్రధాన కార్యదర్శి విజయ్, జిల్లా అధ్యక్షుడు కల్యాణ్, ప్రధాన కార్యదర్శి సూర్యవంశీ పాల్గొన్నారు.

అనుమతి ఉన్న ఎరువులు విక్రయించాలి

నంద్యాల వ్యవసాయం, న్యూస్‌టుడే: ప్రభుత్వం నుంచి అనుమతులున్న ఎరువులనే విక్రయించాలని జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు అన్నారు. నంద్యాల పట్టణంలోని పలు ఎరువుల దుకాణాల్లో సోమవారం తనిఖీలు చేపట్టారు. ఎరువులకు సంబంధించి బిల్లు పుస్తకాలు, నిల్వ, అమ్మకపు వివరాలు పరిశీలించారు. దుకాణంలో ఎంత నిల్వ ఉందో, వాటి ధరల వివరాలతో బోర్డులో ప్రదర్శనగా ఉంచాలన్నారు. అధిక ధరలకు విక్రయించడం, అనుమతి లేని ఎరువులను అమ్మితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దస్త్రాలు తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు

21న పల్స్ పోలియో కార్యక్రమం

సమీక్షిస్తున్న డీఎంహెచ్‌వో డా.వెంకటరమణ

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలో ఈనెల 21న పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.ఆర్.వెంకటరమణ పేర్కొన్నారు. జిల్లాలో ఐదేళ్లలోపు చిన్నారులు 2,38,404 మంది ఉన్నారని వెల్లడించారు. పల్స్ పోలియోపై జిల్లా స్థాయి అధికారులతో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పల్స్ పోలియో కార్యక్రమం కోసం 1318 బూత్‌లు ఏర్పాటు చేశామన్నారు. 5,272 మంది సిబ్బంది చిన్నారులకు చుక్కలు వేస్తారన్నారు. మిగిలిన పిల్లలకు ఈనెల 22, 23 తేదీల్లో ఇంటింటికీ తిరిగి వేస్తారన్నారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డా.సుదర్శన్‌బాబు మాట్లాడుతూ..ఆర్టీసీ బస్టాండుల్లో, రైల్వేస్టేషన్‌లలో, సంత మార్కెట్ల దగ్గర కూడా ట్రాన్సిట్ పాయింట్స్ ఏర్పాటు చేసి చుక్కలు వేస్తామన్నారు. చిన్నారుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని విధిగా పోలియో చుక్కలు వేయించాలన్నారు. బంగారు భవిష్యత్తును అందించాల్సిన బాధ్యత అందరి చేతుల్లో ఉందన్నారు. డీసీహెచ్ఎస్ డా.లలిత, ప్రోగ్రామ్ అధికారులు డా.ప్రసన్నలక్ష్మి, డా.శ్రీజ, డా.శ్రీనివాసులు, పంచాయతీరాజ్, విద్యుత్తు, విద్యా, రవాణా అధికారులు పాల్గొన్నారు.

రుద్రవరంలో పులుల గణన పూర్తి

రుద్రవరం, న్యూస్‌టుడే: అఖిల భారత పులుల అంచనా 2026 కార్యక్రమంలో భాగంగా నల్లమల ప్రాంతంలోని రుద్రవరం అటవీ క్షేత్రంలో పులుల గణన సోమవారం ముగిసినట్లు రేంజర్ మూర్తుజావలి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబరు 1వ తేదీన ప్రారంభమైన పక్రియ మొదటి విడతలో ఎనిమిది రోజుల పాటు సాగిందన్నారు. సిబ్బంది ప్రతి బీట్ పరిధిలో కాలిబాటన జంతువులు, వృక్షాలను గణన చేశారన్నారు.

'సిలికాసాండ్ మైనింగ్'పై రైతుల నిరసన

వెల్దుర్తి, న్యూస్‌టుడే: మండలంలోని బుక్కాపురం పరిధిలోని సర్వే నెంబర్ 214లో సిలికాసాండ్ పరిశ్రమ ఏర్పాటుకు వ్యతిరేకంగా రైతులు సోమవారం తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. రైతులకు సమాచారం అందించకుండా కాలుష్య నియంత్రణ, రెవెన్యూ అధికారులు ఈ నెల 6న ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారని, తామంతా వద్దని చెప్పినా పరిగణలోకి తీసుకోలేదని విమర్శించారు. పరిశ్రమ ఏర్పాటు చేస్తే కాలుష్యం వల్ల పంటలు పండవని చెబుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఈ పరిశ్రమను ఏర్పాటుచేస్తే ఆందోళనలు చేపడతామని రైతులు అధికారులకు తెలిపారు. అనంతరం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఇన్‌ఛార్జి తహసీల్దారు గురుస్వామిరెడ్డికి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో రైతులు శంకరరెడ్డి, ఈశ్వరరెడ్డి, రామచంద్రారెడ్డి, చిన్నమద్దిలేటి, బసవయ్య గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న బుక్కాపురం రైతులు

ప్రమాదాలు జరుగుతున్నా.. మారరే!

వీరంతా రోజువారీ మహిళా కూలీలు. ఎక్కడ పని దొరికితే అక్కడికి వెళ్తుంటారు. పని ప్రాంతాలకు చేరుకోవడానికి ట్రాక్టర్లు, ట్రాలీ ఆటోలను ఆశ్రయిస్తారు. కోవెలకుంట్ల మండలం అమడాల గ్రామ సమీపంలో సోమవారం ఓ ట్రాక్టరుపై వ్యవసాయ కూలీలు ప్రమాదకరంగా ప్రయాణించారు. ట్రాక్టరు ఇంజిను వెనుక వైపు వ్యవసాయ సామగ్రి బిగించారు. వాటిపై కూలీలు కూర్చొని ప్రయాణించారు. ఏమాత్రం అదుపుతప్పినా ప్రమాదం తప్పదు. **– న్యూస్‌టుడే, కోవెలకుంట్ల పట్టణం**

పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో జనార్దన్‌రెడ్డి

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే: పదో తరగతిలో 100శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలని డీఈవో జనార్దన్‌రెడ్డి అన్నారు. మండలంలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న ఏపీ గిరిజన గురుకుల బాలుర పాఠశాలను సోమవారం సందర్శించారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి పరీక్షలపై అవగాహన కల్పించారు. వెనుకబడిన విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని వారిపై శ్రద్ధ చూపాలన్నారు. ఎంఈవో సుబ్రహ్మణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి పన్నుతో కనెక్షన్

● పేదింటికి కుళాయి దూరం

రూ.వెయ్యి పన్ను దాటితే అంతే

ఆదోని పట్టణ శివారులోని అమరావతి నగర్‌లో ప్రభుత్వం ఇచ్చిన సెంటున్నర స్థలంలో షాహిన్‌బా ఇల్లు నిర్మించుకుంటున్నారు. కుళాయి కనెక్షన్ కోసం పురపాలిక అధికారులను సంప్రదిస్తే ఇంటి పన్ను రూ.వెయ్యి దాటింది.. జనరల్ కనెక్షన్ మంజూరవుతుందన్నారు. రూ.8 వేల భారం భరించలేక ఆమె పక్కింటి నుంచి నీటిని తెచ్చుకొంటున్నారు.

ఆస్తిపన్ను చెల్లింపుదారులు	పురపాలిక	కుళాయి కనెక్షన్లు
1,16,216	కర్నూలు	80,000
36,245	ఆదోని	24,500
49,274	నంద్యాల	32,000
16,760	డోన్	10,170
24,555	ఎమ్మిగనూరు	14,639

గత వైకాపా ప్రభుత్వం తీసుకొచ్చిన ఆస్తి పన్ను విధానంతో పేదలు కుళాయి కనెక్షన్ పొందలేకపోతున్నారు. సమస్యను గుర్తించి 'కూటమి' ప్రభుత్వం సరి చేయాలని పుర పేదలు విన్నవిస్తున్నారు.

● గత వైకాపా ప్రభుత్వం ఇష్టానుసారంగా ఆస్తి పన్ను సవరణలు చేసింది. చిన్నపాటి ఇంటికి సైతం పన్ను రూ.వెయ్యి దాటుతోంది. దీంతో ఏడాదికి రూ.1,000 ఇంటి పన్ను దాటితే బీపీఎల్ కనెక్షన్లు పొందలేని పరిస్థితి ఏర్పడింది. గతంలో తెల్లరేషన్ కార్డు ఉంటే చాలు.. బీపీఎల్ కనెక్షన్లు పొందేందుకు వీలుండేది.

● అదే బీపీఎల్ కనెక్షన్ అయితే ఎలాంటి డొనేషన్ లేకుండా కేవలం ఆరు నెలల నీటి పన్ను రుసుం వసూలు చేస్తారు. గుంత తవ్వేందుకు రూ.4-5 వేలు, కుళాయి సామగ్రికి రూ.5-8 వేల వరకు ఖర్చవుతుంది. మొత్తం లెక్కిస్తే జనరల్ కుళాయి కనెక్షన్‌కు సరాసరి రూ.20-25 వేల వరకు ఖర్చు అవుతుంది. ఇది పేద కుటుంబానికి ఆర్థిక భారంగా పరిణమిస్తోంది.

● ప్రస్తుతం జనరల్ కుళాయి కనెక్షన్ కింద డొనేషన్ రూ.8 వేల నుంచి రూ.10 వేలు. ఆరు మాసాల నీటి పన్ను ముందస్తుగా చెల్లింపునకు రూ.720. అంచనా ఛార్జీల కింద మీటరుకు రూ.1,500 విధిస్తారు.

– న్యూస్‌టుడే, ఆదోని, కర్నూలు, ఎమ్మిగనూరు, నంద్యాల పురపాలికలు, డోన్ పట్టణం

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

పలుకూరు(బనగానపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో సురేంద్ర(44) అనే వ్యక్తి మృతి చెందిన సంఘటన పలుకూరు గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన సురేంద్ర ఇంట్లో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ఈ నేపథ్యంలో మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు తీగలు తగిలి అపస్మారక స్థితికి చేరుకున్నారు. కుటుంబ స్థానిక వైద్యుడి వద్దకు తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందాడు. నందివర్గం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విష ద్రావణం తాగి వృద్ధుడి ఆత్మహత్య

నందికొట్కూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పురుగుల మందు తాగి ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన పాములపాడు మండలంలోని కృష్ణానగర్ గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బాలయ్య(60) తరచూ మద్యం సేవిస్తుండేవారు. మద్యం తాగొద్దని కుటుంబ సభ్యులు ఆయనను మందలించారు. మనస్తాపానికి గురైన ఆయన ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో పురుగుల మందు తాగారు. ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై సురేష్‌బాబు తెలిపారు.

EENADU e Classifieds

JOBS

అమెరికాలో 1 సం|| బాబు ఆలన, పాలన వ్యక్తిగత సంరక్షణ కొరకు అనుభవంగల ఆడవారు కావలెను. అమెరికా వీసా కల్గినవారు మాత్రమే. ✆ 94408 03362.

సాయికీర్తి డెంటల్ క్లినిక్ నందు పనిచేయుటకు అటెండర్/ హెల్పర్ కావలెను. అర్హత: 10th/ ఇంటర్. అడ్రస్: గాంధీ నగర్, కర్నూలు. Ph: 98851 02384.

కర్నూలులోని ప్రముఖ మహిళా కళాశాల హాస్టల్ నందు ఉండి పనిచేయుటకు లేడీ హాస్టల్ వార్డెన్స్ కావలెను. భోజన & వసతి సౌకర్యం కల్పించబడును. అనుభవం గల వారికి ప్రాధాన్యత. ✆ 8919234655.

అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు
B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే.
కలర్ 5 లైన్ల ప్రకటన రూ. 555/- మాత్రమే.
ప్రకటనలపై 5% GST వర్తించును.
వివరాలకు: 99899 97628

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటన కర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

ఎస్పీ కార్యాలయంలో పీజీఆర్ఎస్

ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ సునీల్ షొరాణ్

నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే: నంద్యాల జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని ఎస్పీ సునీల్ షొరాణ్ నిర్వహించారు. బాధితుల నుంచి 95 ఫిర్యాదులను ఆయన స్వీకరించి సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులపై పూర్తిస్థాయి విచారణ జరిపి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చట్టపరిధిలో చట్టపరంగా ఉన్న సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలన్నారు.

నంద్యాల

• నంద్యాల • నందికొట్కూరు • శ్రీశైలం • పాణ్యం

పరమశివునికి సోమవార వ్రత పూజలు

గాజులపల్లె(మహానంది), న్యూస్‌టుడే: మహానంది మండలం గాజులపల్లె గ్రామంలోని శివాలయంలో పార్వతీ పరమేశ్వరులకు సోమవార వ్రత పూజలు భక్తిశ్రద్ధలతో చేశారు. మార్గశిర మాసం సోమవారం సందర్భంగా పరమశివునికి విశేష ద్రవ్యాలు, పంచామృతాభిషేకాలు, పార్వతీదేవి అమ్మవారికి కుంకుమార్చనలు, నామార్చన పూజలను రుత్వికులు వేదోక్తంగా నిర్వహించారు. శివపంచాక్షరీ మంత్ర పఠనంతో భజనలు చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
నందికొట్కూరు : 94403 61729
ఆత్మకూరు : 90149 09024
నంద్యాల : 98853 28120

నంద్యాల గాంధీచౌక్, న్యూస్‌టుడే: ?: పట్టణంలోని తెలుగుపేటలో కాల్వలు శుభ్రం చేయడం లేదు **- బాలు**

?:నీలి వీధిలో కుక్కల సంచారం అధికంగా ఉంది. **- సుధా,**

?: పెద్దబండ వీధిలో కుక్కల బెడద అధికంగా ఉంది. **- అన్నయ్య**

✔: సిబ్బందితో కాల్వలు శుభ్రం చేయించడంతోపాటు కుక్కలను పట్టుకుని తరలించే కార్యక్రమం చేపట్టాం.

- లక్ష్మీనారాయణశర్మ, శానిటరీ ఇన్‌స్పెక్టర్

మిడుతూరు, న్యూస్‌టుడే : ?: మండలంలోని చింతలపల్లిలో పలుచోట్ల వీధిదీపాలు వెలగడం లేదు. రాత్రిళ్లు గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు.

- జనార్దన్, చింతలపల్లి.

✔: దీపాలు వెలగని చోట కొత్తవాటిని ఏర్పాటు చేసి గ్రామస్థుల అంధకారాన్ని తొలగిస్తాం.

- వినయ్, తాత్కాలిక కార్యదర్శి, చింతలపల్లి.

?: మండలంలోని కదుమూరులో పైపులైన్ గ్రామానికి వెళ్లే దారిలో గుడిసెట్టు అపరిశుభ్ర వాతావరణంతో నిండి ఉంది. వ్యర్థాలు తొలగించాలి. **- గౌడ్, కదుమూరు.**

✔: గుడిసెట్టు ఉన్న చెత్తను తొలగించి పరిసరాలను శుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకుంటాం.

- కల్యాణ్ సింగ్, గ్రామ కార్యదర్శి, కదుమూరు.

ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే: ?:ఏకలవ్యనగర్‌లో గుంతకమ్మ కాల్వ వెంబడి వ్యర్థాలు పేరుకుపోయాయి. దోమలు బెడద అధికమైంది. **-వెంకటేశ్వర్లు, స్థానికుడు.**

✔: సిబ్బందితో శుభ్రం చేయిస్తాం.

-జీవన్, శానిటరీ ఇన్‌స్పెక్టరు

?: అర్బన్‌కాలనీలో పాఠశాల మార్గంలో పైపులైన్ మరమ్మతుల కోసం గుంత తవ్వడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. **-రాజు, స్థానికుడు.**

✔: గుంత పూడ్చివేస్తాం.

- షాహీర్‌బాషా, పురపాలక ఏఈ

ఉపన్యాస పోటీల్లో మాట్లాడుతున్న రావూస్ జూనియర్ కళాశాల విద్యార్థిని

బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

వాణి వినిపించి.. విజేతలుగా నిలిచి

నంద్యాల గాంధీచౌక్, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతోపాటు నైపుణ్యాలు పెంపొందించుకోవాలని నంద్యాల రావూస్ కళాశాల డైరెక్టర్ మోహనచంద్ర పేర్కొన్నారు. 'ఈనాడు' ఆధ్వర్యంలో బాలాజీ కాంప్లెక్స్‌లోని రావూస్ మహిళా జూనియర్ కళాశాలలో 'కృత్రిమ మేధ(ఏఐ)తో భవిష్యత్తులో వచ్చే మార్పులు' అంశంపై ఉపన్యాస పోటీలు నిర్వహించారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన నఫియాబాషా, అఫ్రీన్, ఫిర్దోస్‌లకు డైరెక్టర్‌తోపాటు ప్రిన్సిపల్ సంగమేశ్వరయ్య బహుమతులు ప్రదానం చేశారు.

పోటీల్లో పాల్గొన్న నారాయణ పాఠశాల విద్యార్థి, విజేతలకు బహుమతులు అందజేసిన ఉపాధ్యాయులు

నంద్యాల గాంధీచౌక్, న్యూస్‌టుడే: ప్రతిభా పాటవ పోటీలు విద్యార్థులకు విజ్ఞానాన్ని పెంచుతాయని నారాయణ పాఠశాల ప్రిన్సిపల్ అంజనీదేవి అన్నారు. నంద్యాల పట్టణం పద్మావతినగర్‌లో ఉన్న నారాయణ పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. 'విద్యార్థుల జీవితాలపై చరవాణి ప్రభావం' అంశంపై ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన సిద్ధార్థ, దేవాన్ష్, అబ్దుల్‌సన్నీలకు ప్రిన్సిపల్‌తోపాటు ఉపాధ్యాయులు గాయత్రి, సౌజన్య బహుమతులు అందజేశారు.

అక్రమ అంతస్తులు

☛ నంద్యాలలో నిబంధనలు ఉల్లంఘిస్తూ కట్టడాలు

నంద్యాల రైతునగరం, పురపాలకం, న్యూస్‌టుడే: నంద్యాల జిల్లా కేంద్రంలో బహుళ అంతస్తుల సంస్కృతి ఇటీవల జోరందుకుంది. పది సెంట్ల స్థలం ఉన్నా పెద్ద భవనాలు నిర్మిస్తున్నారు. బహుళ అంతస్తుల భవనం నిర్మించాలంటే కనీసం 30 అడుగుల రోడ్డు ఉండాలి. 10 నుంచి 15 అడుగుల రోడ్డున్నా దస్త్రాల్లో 30 అడుగుల రోడ్డుగా చూపి మూడు, నాలుగు, ఐదు అంతస్తుల భవనాలు నిర్మించారు. సెట్‌బ్యాక్ నిబంధనలు పాటించడం లేదు. అత్యవసర సమయంలో అగ్నిమాపక వాహనం, అంబులెన్సులు వెళ్లడం సాధ్యపడదు. పుర ఆదాయానికి గండి పడుతున్నా.. పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు మామూళ్లు తీసుకుని పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి.

అనుమతులు ఒకలా.. నిర్మాణాలు మరోలా..

కొందరు నిర్మాణదారులు పట్టణ ప్రణాళిక విభాగం నుంచి జీ+2 నిర్మాణానికి అనుమతులు తీసుకొని జీ+4 భవనాలు నిర్మిస్తున్నారు. కొన్నిచోట్ల వాణిజ్య భవనాలకు పార్కింగ్ చూపిస్తూ ప్రణాళికకు అనుమతి పొంది తర్వాత పార్కింగ్ ప్రాంతంలో దుకాణాలు నిర్మించి అద్దెకు ఇస్తున్నారు. ప్రతి వార్డులోని సచివాలయాల్లో ప్రణాళిక కార్యదర్శులు ఉన్నారు. వార్డు పరిధిలో అక్రమ నిర్మాణాలపై సమాచారం ఉన్నా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడం లేదనే విమర్శలు న్నాయి. కొందరు నిర్మాణదారుల నుంచి డబ్బులు తీసుకొని అనుమతిలేని కట్టడాలను చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

పట్టణంలోని ఈ ప్రాంతాల్లో..

◆ శ్రీనివాసనగర్ ప్రధాన రహదారిలో అనుమతులకు విరుద్ధంగా ఓ భవనాన్ని నిర్మించారు. రెండు నంబర్లతో అనుమతులు తీసుకొని ఒకే భవనాన్ని నిర్మించినా చర్యలు చేపట్టలేదు. ◆ నిబంధనలకు విరుద్ధంగా పట్టణంలోని చామ కాలువ వద్ద పెద్ద అంతస్తు నిర్మిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ◆ పద్మావతినగర్‌లోని ఓ భవనం అనుమతులకు విరుద్ధంగా నిర్మించినప్పటికీ అధికారులు చర్యలు తీసుకోలేదు. ◆ సెట్‌బ్యాక్ స్థలాన్ని వదలకుండా నిర్మాణం చేపట్టారు. కేవలం నోటీసులతోనే సరిపెట్టారు. ◆ రైతునగర్ శివారులో ఐదు అంతస్తుల భవనాన్ని అనుమతులకు విరుద్ధంగా నిర్మించారు. ప్రణాళిక కార్యదర్శి గుర్తించి నోటీసులిచ్చినా, ఉన్నతాధికారులు చర్యలు చేపట్టలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ◆ ఎన్జీవోస్ కాలనీ, ప్రైవేట్ కాలనీ, పద్మావతినగర్, జగజ్జననీనగర్ తదితర ప్రాంతాల్లో ప్రణాళికకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్నా చర్యలు చేపట్టడం లేదనే విమర్శలున్నాయి.

నంద్యాలలో నిర్మాణంలో భవనం

400లకు పైగా అక్రమ కట్టడాలు గుర్తించాం : నరసింహమూర్తి, అసిస్టెంట్ సిటీ ప్లానర్, నంద్యాల

నంద్యాలలో 400లకు పైగా అక్రమ కట్టడాలు గుర్తించాం. వాటిపై గుర్తులు వేశాం. బీపీఎస్ కింద దరఖాస్తుతో సక్రమం చేసుకొని అనుమతులు పొందాలని భవన యజమానులకు నోటీసులిస్తున్నాం. అనుమతులు పొందకపోతే చర్యలు చేపడతాం.

బ్రేకర్ ఏర్పాటు

స్పందనకు వందనం

గడివేముల: గడివేముల నుంచి పెసరవాయి గ్రామానికి ఉన్న విద్యుత్తు లైన్‌పై భారం అధికంగా ఉండడంతో వేల్పనూరు విద్యుత్తు ఉపకేంద్రం నుంచి ప్రత్యేకంగా విద్యుత్తు లైన్ ఏర్పాటు చేశారు. బ్రేకర్ ఏర్పాటు చేయకపోవడంతో ఈ లైన్ ఉపయోగంలోకి రాలేదు. దీంతో నవంబర్ 29న 'ఈనాడు'లో కథనం రాగా అధికారులు స్పందించారు. పెసరవాయి విద్యుత్తు లైన్‌కు బ్రేకర్‌ను ఏర్పాటు చేశారు.

తాత్కాలిక రోడ్డు నిర్మాణానికి చర్యలు

సున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే: సున్నిపెంటలోని ప్రభుత్వ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో తాత్కాలిక రహదారి నిర్మించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. పాఠశాల ఆవరణలో వర్షం నీరు నిల్వ ఉండటంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. దీనిపై గతనెల 6వ తేదీన 'ఈనాడు'లో 'వర్షం పడింది... పాఠశాల మూశారు' శీర్షికన చిత్ర కథనం ప్రచురితమైంది. స్పందించిన జిల్లా అధికారులు తాత్కాలిక రహదారిని నిర్మాణానికి చర్యలు చేపట్టారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించండి

కొత్తపల్లి, న్యూస్‌టుడే: వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని ఎస్సై జయశేఖర్ సూచించారు. దుద్యాల సమీపంలో సోమవారం వాహనాల తనిఖీ చేపట్టారు. పలువురికి జరిమానాలు విధించారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే: కర్నూలులో ఆదివారం నిర్వహించిన సౌత్‌జోన్ కరాటే పోటీల్లో నంద్యాలకు చెందిన 15మంది క్రీడాకారులు ప్రతిభ చాటి బంగారు, వెండి పతకాలు సాధించినట్లు అసోసియేషన్ ఉపాధ్యక్షుడు నూర్‌బాషా తెలిపారు. ప్రతిభ చూపిన క్రీడాకారులను ఆయన సోమవారం అభినందించారు. అనంతరం మాట్లాడుతూ..కరాటే ఆత్మరక్షణ కోసం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. చాలామంది క్రీడాకారులు బ్లాక్‌బెల్టులతోపాటు బంగారు పతకాలు సాధించారని తెలిపారు.

క్రీడాకారులతో అసోసియేషన్ సభ్యులు

ప్రమాదకరంగా విద్యుత్తు స్తంభం

నంద్యాల పట్టణంలోని ఆత్మకూరు బస్టాండు నుంచి నడిగడ్డకు వెళ్లే దారిలో ఓ విద్యుత్తు స్తంభం రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా మారింది. నిత్యం వాహనదారులతో రద్దీగా ఉండడంతో వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి పక్కకు మార్చాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, నంద్యాల బొమ్మలసత్రం

రహదారిపై గుంత.. ప్రయాణికుల చింత

నంద్యాల పట్టణం నూనెపల్లెలో ప్రధాన రహదారిపై గుంత ఏర్పడి ప్రమాదకరంగా మారింది. రాత్రి సమయాల్లో గుంతను గమనించకుండా ప్రయాణిస్తూ పలువురు ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి, చర్యలు చేపట్టి గుంతను పూడ్చివేయించాలని ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, నంద్యాల రైతునగరం

అడ్డదిడ్డంగా వాహనాలు

శ్రీశైల మహాక్షేత్రంలో భక్తుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. సొంత, ప్రైవేటు వాహనాల్లో ఎక్కువ మంది వస్తున్నారు. క్షేత్ర పరిధిలో సరైన పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో వాహనాలను ఎక్కడపడితే అక్కడ అడ్డదిడ్డంగా నిలిపివేస్తున్నారు. నంది సర్కిల్ వద్ద రహదారులకు ఇరువైపులా వాహనాలను నిలిపివేయడంతో పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై అధికారులు దృష్టి సారించాలని భక్తులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, శ్రీశైలం, నంది సర్కిల్

సంక్షిప్త సమాచారం

పగిడ్యాల: విద్యుత్తు ఛార్జీల పెంపుతో సామాన్యులపై ఆర్థికభారం మోపుతున్నారని సీపీఎం మండల కన్వీనర్ పక్కీర్‌సాహెబ్ విమర్శించారు. భీరవోలు గ్రామంలో సోమవారం విద్యుత్ ఛార్జీలు పెంపునకు నిరసనగా సీపీఎం పార్టీ నాయకులు నిరసన చేపట్టారు.

గడివేముల: గడివేములలోని రైతు సేవాకేంద్రానికి 530 బస్తాల యూరియాను సరఫరా చేశారు. రైతులకు ఒక్కొక్కరికి మూడు బస్తాల చొప్పున అందజేశారు.

నంద్యాల పాతపట్టణం: పట్టణంలో ఈనెల 13న వాజ్‌పేయీ విగ్రహాన్ని ప్రతిష్ఠ చేయనున్నట్లు భాజపా జిల్లా అధ్యక్షుడు డా.అభిరుచి మధు ప్రకటనలో తెలిపారు.

ఎం.చింతకుంట్ల(గోస్పాడు): ఖరీఫ్‌లో వరి పంటలో ఎకరాకు 31 బస్తాలు వచ్చాయని ఏవో స్వప్నిక తెలిపారు. ఎం.చింతకుంట్లలో పంటకోత ప్రయోగం చేశారు. పైరులో పంట ధాన్యం తీయగా 14.120 కిలోల దిగుబడి వచ్చిందన్నారు.

నంద్యాల రైతునగరం: అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని ఈనెల 10వ తేదీన నంద్యాల వైఎస్సార్‌సెంటనరీ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి జిల్లాల విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకుడు రయిస్ ఫాతిమా పేర్కొన్నారు.

నంద్యాల రైతునగరం: ట్రాఫిక్ అధికంగా ఉన్న ప్రాంతాల్లో విగ్రహాలు ఏర్పాటు చేయొద్దని సీపీఎం పట్టణ కార్యదర్శి లక్ష్మణ్, కార్యదర్శివర్గ సభ్యుడు మహమ్మద్ గౌస్ కోరారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ రాజకుమారికి వినతి పత్రం అందజేశారు.

నంద్యాల గ్రామీణం: విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించుకోవాలని ఎస్వీఆర్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డా.వై.హరిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. కళాశాలలో సౌత్ ఇండియా ఓపెన్ కరాటే పోటీల్లో బహుమతులు సాధించిన కల్పన, శ్రీనిధిలను సోమవారం అభినందించారు.

పాణ్యం గ్రామీణం: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని తహసీల్దారు నరేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం తహసీల్దారు కార్యాలయంలో నిర్వహించిన 12 దరఖాస్తులు అందజేసినట్లు తెలిపారు.

పాణ్యం గ్రామీణం: శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాలలో ఈనెల 12, 13వ తేదీల్లో నిర్వహించే శాంతిరాం మహా సంగ్రామ్ 2025 క్రీడా పోటీల బ్రోచర్‌ను విడుదల చేశారు.

పాణ్యం గ్రామీణం: సాంకేతిక పద్ధతులు అందుబాటులో ఉండటంతో భూకంప ప్రతిస్పందనలు ముందుగానే గుర్తించే అవకాశం ఉందని కేంద్ర నిర్మాణ పరిశోధనా సంస్థ డైరెక్టర్ రామంచర్ల ప్రదీప్‌కుమార్ అన్నారు. మండలంలోని ఆర్జీఎం ఇంజినీరింగ్ కళాశాల సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో ప్రిన్సిపల్ జయచంద్రప్రసాద్ ఆధ్వర్యంలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహించారు.

కొత్తపల్లి: గువ్వలకుంట్ల గ్రామంలో వివాదస్పదంగా మారిన చెన్నున్ని అరుగు స్థలాన్ని ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే రవీంద్రపాల్, మండల సర్వేయర్ రాజశేఖర్, వీఆర్వో శేఖర్‌తో కలిసి సోమవారం పరిశీలించారు. సర్వే పక్కాగా చేసి హద్దులు ఏర్పాటు చేస్తామన్నారు.

అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి

రహదారి నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

పగిడ్యాల, న్యూస్‌టుడే: అన్ని వర్గాల అభ్యున్నతికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. పగిడ్యాల నుంచి నంది కొట్కూరు వరకు రూ.4కోట్లతో నిర్మించనున్న బీటి రోడ్డుకు సోమవారం ఆయన భూమి పూజ చేశారు. కూటమి ప్రభుత్వం మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తోందన్నారు. రహదారిని త్వరగా పూర్తి చేయాలని గుత్తేదారుడికి సూచించారు. ఆర్అండ్‌బీ, మండల స్థాయి అధికారులు, తెదేపా నాయకులు దామోదర్‌రెడ్డి, మద్దిలేటిగౌడు, మాజీ ఉప సర్పంచి గోవిందు, జనసేన పార్టీ నియోజకవర్గ నాయకుడు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులు ముమ్మరం

ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే: కర్నూలు నుంచి దోర్నాల వరకు నిర్మిస్తున్న జాతీయ రహదారి రెండు ప్యాకేజీ పనులు పూర్తయ్యాయి. రహదారి నిర్మాణ సమయంలో జరిగిన తప్పులను గుత్తేదారు సంస్థ ఉన్నతాధికారులు గుర్తించి సరిదిద్దుకునే పనుల్లో నిమగ్నమయ్యారు. జన సంచారం ఉన్న ప్రాంతాల్లోని సర్వీసు రోడ్డు ఏడున్నర మీటర్ల విస్తీర్ణంలో ఉండాలి. కొన్ని ప్రాంతాల్లో ఐదు మీటర్లే ఉండటంతో ఆ ప్రాంతాల్లో రోడ్డును విస్తరణ పనులు చేపట్టారు. సోమవారం ఆత్మకూరు మండలంలోని కరివేన గ్రామం వద్ద జాతీయ రహదారిపై నిర్మించిన మురుగు కాల్వను భూమి అడుగు భాగం వరకు ప్రొక్లయిన్‌తో తొలగిస్తున్నారు. మట్టిని టిప్పర్లు, ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. ఏడు మీటర్ల కన్నా తక్కువ ఉన్న ప్రాంతాల్లోని హోటళ్లు, దుకాణాలు తొలగించేందుకు గుత్తేదారు సంస్థ సిబ్బంది హెచ్చరికలు జారీ చేశారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

నందికొట్కూరు, న్యూస్‌టుడే: దీర్ఘకాలికంగా ఉన్న అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని సొసైటీ సంఘం ఉద్యోగులు డిమాండు చేశారు. స్థానిక కేడీసీసీ బ్యాంకు వద్ద సోమవారం ధర్నా చేపట్టారు. ఉద్యోగులు మాట్లాడుతూ.. ఉత్తర్వు నం.36ను వెంటనే విడుదల చేయాలన్నారు. ఆరోగ్య బీమా, ఇన్సూరెన్స్ పాలసీ ద్వారా కుటుంబాలకు భరోసా కల్పించాలన్నారు. కంప్యూటర్ ఆపరేటర్లకు పదోన్నతి కల్పించి సీఈవో పదవులు ఇవ్వాలన్నారు. నాలుగు మండలాల్లోని ఐదు సొసైటీల సీఈవోలు రబ్బానీ, ఖాజాఉస్సేన్, అశోక్‌కుమార్, చంద్రశేఖర్ గౌడ్, మల్లికార్జున, సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు

గోపవరం, (మహానంది), న్యూస్‌టుడే: బాల్య వివాహాలతో అనర్థాలున్నాయని శక్తియాప్ నంద్యాల పోలీసు బృందం వారు హెడ్‌కానిస్టేబుల్ డీఎన్ ప్రసాద్, వెంకటేశ్వర్లు అన్నారు. మహానంది మండలం గోపవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం శక్తియాప్‌పై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు, మానవ అక్రమ రవాణా, వన్‌స్టాప్ సెంటర్‌ల గురించి వివరించారు. కానిస్టేబుల్ రఫీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే : సోలార్ ప్రాజెక్టులో భూములు కోల్పోయిన గిరిజన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని జీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి రవినాయక్, బాధిత రైతు లక్ష్మణ్ నాయక్ డిమాండు చేశారు. నంద్యాల కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో బాధిత రైతులు, జీపీఎస్ నాయకులు కలిసి కలెక్టర్ రాజకుమారికి వినతి పత్రం అందజేశారు.

ప్రైవేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకోండి

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: ర్యాంకుల కోసం విద్యార్థులపై ఒత్తిడి చేసి బోధిస్తున్న ప్రైవేటు విద్యాసంస్థలపై అధికారులు చర్యలు తీసుకోవాలని షెడ్యూల్డ్ ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అంజనప్ప డిమాండు చేశారు. నంద్యాల కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో డీఈఓ జనార్దన్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు.

మత సామరస్యానికి ప్రతీక నంద్యాల

నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే: నంద్యాల మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని తెదేపా జిల్లా కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ అన్నారు. నంద్యాల ఐఎంఏ ఆధ్వర్యంలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఐఎంఏ వైద్యులతోపాటు ఎన్ఎండీ ఫిరోజ్, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డా.రవికృష్ణ తదితరులు పాల్గొని కేకు కోసి సంబరాలు నిర్వహించారు. ఐఎంఏ వైద్యుడు నంద్యాల అధ్యక్షుడు డా.శ్రీనివాసరావు, వైద్యులు డా.మహమ్మద్ రఫీ, డా.జఫ్రుల్లా, డా.వసుధ, డా.మాధవి, డా.గెలివి సహదేవుడు తదితరులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణుల అభివృద్ధికి సహకరించండి

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: అమరావతిలో సీఎం చంద్రబాబునాయుడిని ఆదివారం విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ఏలూరి కోటేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. విశ్వబ్రాహ్మణుల అభ్యున్నతికి సహాయసహకారాలు అందించాలని కోరారు. బ్రహ్మంగారి మఠం అభివృద్ధితో పాటు ఒంగోలులో స్థపతి శిల్పి శిక్షణ కేంద్రం ఏర్పాటుపై సీఎంతో చర్చించినట్లు తెలిపారు.

బాధితులను గుర్తించడంలో జాప్యం చేయవద్దు

వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ జగదీష్‌చంద్రారెడ్డి

బుక్కాపురం, (మహానంది), న్యూస్‌టుడే: కుష్ఠువ్యాధి బాధితులను గుర్తించడంలో జాప్యం చేయవద్దని జాతీయ కుష్ఠు వ్యాధి నిర్మూలన కార్యక్రమం జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ జగదీష్ చంద్రారెడ్డి సూచించారు. మహానంది మండలం బుక్కాపురం గ్రామ సచివాలయంలో సోమవారం 104 వైద్య సేవలు నిర్వహించారు. తిమ్మాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ భగవాన్‌దాస్ అనుమానిత కుష్ఠు వ్యాధిగ్రస్థులను పరిశీలించారు. ఎంపీహెచ్ఈవో బీసీ హుస్సేన్‌రెడ్డి, పర్యవేక్షకుడు నరసింహారావు, హేమలత, పరిమళ, సుభాషిణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలకించండి.. ఆదరించండి

☛ కలెక్టరేట్‌లో బాధితుల వేడుకోలు

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: సొంత భూమికి వారసులం అంటున్నా పట్టించుకోరు.. తగిన ఆధారాలు చూపించినా వినరు.. ఏళ్లుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా జాప్యం చేస్తున్నారు.. ముదిమి వయసులో నడవలేని స్థితిలో వృద్ధ అక్కాచెల్లెళ్లు. భర్త చనిపోతే వితంతు పింఛనుకు దరఖాస్తు చేసుకున్నా.. నాలుగేళ్లుగా మంజూరు చేయడం లేదు. జీవనాధారం లేని తనకు న్యాయం చేయాలని వేడుకుంటున్న మహిళ. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చారు. తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఇక్కడైనా తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.

నాలుగేళ్లుగా వితంతు పింఛను లేదు : నకల శివమ్మ

నంద్యాల పట్టణం దేవనగర్‌కు చెందిన 28ఏళ్ల నకల శివమ్మ భర్త నాలుగేళ్ల క్రితం మృతి చెందారు. సొంత ఇల్లు లేదు. ఇద్దరు పిల్లలు. తనకు వితంతు పింఛను ఇప్పించాలని మున్సిపల్ కార్యాలయం, తహసీల్దారు, డీఆర్‌డీఏ, మెప్మా కార్యాలయాల చుట్టూ ఏళ్లుగా తిరుగుతున్నా అధికారుల్లో మాత్రం ఉలుకు పలుకూ లేదు. ఆ కార్యాలయానికి పో.. ఈ కార్యాలయంలో దరఖాస్తు చేయి అంటూ సలహాలు మాత్రమే ఇస్తూ నాలుగేళ్లుగా ఇబ్బందులు పెడుతున్నారని వాపోతున్నారు. పేద కుటుంబానికి చెందిన తనకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.

సర్వే చేసి న్యాయం చేయాలి: నయామున్నిసా, రహమున్నిసా

జూపాడుబంగ్లా మండలం బన్నూరు గ్రామానికి చెందిన కరిమున్నిసా బేగం పేరిట గ్రామంలోని సర్వే నంబరు 100 బీ1, 100 బీ3 లలో 5.35 ఎకరాల భూమి ఉంది. కరిమున్నిసా బేగంతోపాటు ఆమె భర్త మృతి చెందారు. వీరికి నలుగురు సంతానం కాగా.. వీరిలో ఇద్దరు మృతి చెందారు. ప్రస్తుతం కుమార్తెలు నయామున్నిసా, రహమున్నిసా ఉన్నారు. పట్టా భూమి అయినా ఆన్‌లైన్‌లో పేరు చూపించడం లేదు. దీన్ని మార్చాలని ఏళ్లుగా తిరుగుతున్నారు. ఎలాంటి వివాదం లేని భూమిని సర్వే చేసి ఎవ్వరికి చెందుతుందో వారికే ఇవ్వాలని. . న్యాయం చేయాలని వేడుకుంటున్నా, తహసీల్దారు, ఆర్డీవో కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని వాపోయారు. 75ఏళ్ల వయసులో నడవడానికి ఇబ్బంది పడుతున్నామని.. అనారోగ్య సమస్యలు వెంటాడుతున్నాయని, న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.

బస్సు ఆపలేదని కండక్టర్‌పై మహిళల ఆగ్రహం

గాజులపల్లె, (మహానంది), న్యూస్‌టుడే: మహానంది మండలంలోని నంద్యాల-ప్రకాశం జిల్లాలను కలిపే ప్రధాన రహదారిలోని గాజులపల్లె గ్రామంలో పెట్రోల్ బంక్ వద్ద ఆర్టీసీ బస్సు ఆపకపోవడంతో కండక్టర్, డ్రైవర్‌పై మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం మధ్యాహ్నం 3.30 గంటలకు ప్రకాశం జిల్లా గిద్దలూరు డిపోనకు చెందిన ఏపీ27జెడ్0121 బస్సు నంద్యాల నుంచి తిరిగి బయలుదేరింది. గాజులపల్లెలోని పెట్రోల్ బంక్ సమీపంలోని కూడలివద్ద వద్ద ఆపకుండా గాజులపల్లె మెట్ట వద్ద డ్రైవర్ ఆపారు. ఆగ్రహించిన మహిళలు అక్కడికి చేరుకుని కండక్టర్, డ్రైవర్‌తో వాగ్వాదానికి దిగారు. దీంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడి బస్సులు, ఇతర వాహనాలు సాయంత్రం 5గంటల వరకు ఆగిపోయాయి. సమాచారం అందుకున్న మహానంది ఎస్సై ఎన్. రామమోహన్‌రెడ్డి అక్కడికి చేరుకొని ఇరువర్గాలను శాంతింపజేశారు.

కండక్టర్, డ్రైవర్‌తో వాగ్వాదానికి దిగిన ప్రయాణికులు

ఆత్మకూరులో విజిలెన్స్ దాడులు

ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే: ఆత్మకూరు పురపాలక సంఘంలోని హోటళ్లు, బేకరీలపై సోమవారం విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం, ఆహార భద్రత అధికారులు మెరుపు దాడులు చేశారు. విజిలెన్స్ ఎస్టీవో వెంకటరమణ, ఆహార భద్రత అధికారి ఖాసింవలి అతిథి హోటల్‌లో ఆహార నమునాలు, అనూస్ బేకరీతో పాటు ఇతర బేకరీల్లో కేకు నమూనాలు సేకరించారు. ఖాసింవలి మాట్లాడుతూ.. నిబంధలను పాటించని అతిథి హోటల్‌కు రూ.10 వేలు, అనూస్ బేకరికి రూ.8వేలు జరిమానా విధించామన్నారు. అతిథి హోటల్ ఆహార నమూనాలను ప్రయోగశాలకు పంపుతున్నట్లు తెలిపారు. శానిటరీ ఇన్‌స్పెక్టరు జీవన్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

శివశంకర్ (పాతచిత్రం)

కొత్తపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని ఎదురుపాడు గ్రామానికి చెందిన తేనె శివశంకర్(35) కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక ఆదివారం మృతి చెందినట్లు హెడ్‌కానిస్టేబుల్ రవీంద్రబాబు తెలిపారు. రవీంద్రబాబు వివరాల మేరకు..గ్రామానికి చెందిన తేనె శివశంకర్ తన భార్య శశికళ ఇంట్లో మరుగుదొడ్డి నిర్మించేంతవరకు ఇంటికి రానంటూ పది రోజుల కిందట పుట్టినిల్లు జూపాడు బంగ్లాకు వెళ్లారు. మనస్తాపానికి గురైన అతడు ఈనెల 6న పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. మృతుడి తల్లి భాగ్యమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

(c) eenadu

ఆళ్లగడ్డ
• ఆళ్లగడ్డ • బనగానపల్లి • డోన్

ఘనంగా చర్చి వార్షికోత్సవం

చాగలమర్రి, న్యూస్‌టుడే: ముత్యాలపాడు గ్రామంలో పురాతన చర్చి పరిశుద్ధ జన్మస్థలాయం 133వ వార్షికోత్సవ వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. డీసీసీ చైర్మన్ రెవ. చంద్రశేఖర్ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామంలో స్థానిక చర్చిలో సోమవారం ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. సంధ్యాల బిషప్, ముఖ్య అతిథుల రాక, ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు.

నేడు గిద్దలూరులో పశు వైద్య శిబిరం

సంజామల, న్యూస్‌టుడే: గిద్దలూరులో మంగళవారం ఉచిత పశు గర్భకోశ వ్యాధుల నివారణ చికిత్స శిబిరం ఏర్పాటు చేసినట్లు పశుసంవర్ధక శాఖ ఏడీ డా. కొండారెడ్డి చెప్పారు. ఆయన మాట్లాడుతూ పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ సౌజన్యంతో శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎదురాని పశువులకు, గర్భకోశవ్యాధికి గురైన పశువులకు చికిత్సలు చేసి మందులను పంపిణీ చేస్తామన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి

ప్యాపిలి, న్యూస్‌టుడే: ప్యాపిలి పోలీసుస్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా దాదాపీర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన నంద్యాల నుంచి బదిలీపై ప్యాపిలికి వచ్చారు. ఎస్సై మాట్లాడుతూ ప్యాపిలి స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. అసాంఘిక కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. సిబ్బంది ఎస్సైని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రయాణ సమస్యలా?

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: డోన్ ఆర్టీసీ డిపో పరిధిలో బస్సుల రాకపోకల వేళలు, వాహనాల కండిషన్, పల్లెకు బస్సు సర్వీసులు, స్టాపింగ్, పాఠశాలల విద్యార్థి బస్సు సౌకర్యం, బస్టాండులో ప్రయాణికులకు సౌకర్యాలు తదితర సమస్యలపై 'ఈనాడు' ఫోన్ ఇన్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహిస్తోంది. ప్రజలు, విద్యార్థులు బస్సు ప్రయాణ సమస్యలు ఉంటే డోన్ ఆర్టీసీ డిపో మేనేజర్ వెంకటేశ్వరరావు దృష్టికి తీసుకురావచ్చు.

తేదీ: డిసెంబరు 9 (మంగళవారం)
సమయం: ఉదయం 11 నుంచి 12 గంటల వరకు
ఫోన్ నంబర్లు: 9958225795, 9440857790

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: ప్రజల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాశ్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని పలు గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే కోట్లకు సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకెళ్తున్నట్లు పేర్కొన్నారు. ఆర్టీసీ డిపో మేనేజర్ వెంకటేశ్వరరావు ఎమ్మెల్యేను కలిసి డిపోకు సంబంధించిన విషయాలపై చర్చించారు. బీసీ బాలికల గురుకుల పాఠశాలలో నెలకొన్న తాగునీటి సమస్యను ప్రిన్సిపల్ సంగీతకుమారి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు.


సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కోట్ల

మౌలిక వసతులు కల్పించాలని వినతి

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని శ్రీరామానగర్, వైఎస్సార్ నగర్, నల్లగుట్ట, ఇందిరానగర్, తారకరామానగర్, నెహ్రూనగర్, సుందర్‌సింగ్ కాలనీ, టీచర్స్‌కాలనీ, శ్రీనివాసనగర్ తదితర కాలనీల్లో మౌలిక వసతుల కల్పించాలని నంద్యాల జిల్లా భాజపా ఐటీ కన్వీనర్ ఆరబోలు వీరేష్‌బాబు, ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి అశోక్‌కుమార్ తదితరులు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ప్రసాద్‌గౌడ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. మున్సిపల్ అధికారులు స్పందించి సదుపాయాలను కల్పించాలని కోరారు.

కరవైన మైదానం.. ఆటలకు దూరం

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: బడి అన్నాక చదువుతోపాటు, ఆటలు కావాలి. విద్యార్థులకు చదువు అనే ఒకే అంశం బోధిస్తుంటే మానసికంగా ఇబ్బందులు తప్పవు. అందుకే పాఠశాలల్లో చదువుతో పాటు, ఆటలకూ ప్రాధాన్యం అవసరం. అయితే బడుల్లో ఆటలు ఆడేందుకు మైదానాలు కరవయ్యాయి. ఇలాంటి స్థితి ఉన్న పాఠశాలల్లో విద్యార్థులు చదువు ఒక్కటే అందుతోంది. మానసికోల్లాసం ఇచ్చే ఆటలు ఆడేందుకు ఆట స్థలాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

మైదానం లేని ఆళ్లగడ్డలోని ప్రభుత్వ ఉర్దూ పాఠశాల

ఆటస్థలాలు లేక విద్యార్థుల అవస్థలు

పరిశీలన

● ఆళ్లగడ్డ పట్టణంలోని ప్రభుత్వ ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాల. ఇందులో 80 విద్యార్థులు చదువుకుంటున్నారు. ఆడుకునేందుకు ఆటస్థలం లేకపోవడం గమనార్హం. ఉదయం నుంచి పాఠశాల వదిలే వరకు చదువులకు తప్ప ఆటలకు సమయం ఇవ్వడం లేదని విద్యార్థులు వాపోతున్నారు. ఆళ్లగడ్డ పట్టణంలోని మెయిన్, వార్డు 1, 2, ఆచారి కాలనీ, బీబీఆర్ నగర్‌లోని పాఠశాలలకు మైదానాలు లేకుండా పోయాయి.

● ఆళ్లగడ్డ నియోజకవర్గవ్యాప్తంగా ఆట మైదానాల కొరత విద్యార్థులను వేధిస్తోంది. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో మైదానాలు పర్వాలేదనే స్థాయిలో ఉన్నా ప్రాథమిక పాఠశాలల్లో మాత్రం మైదానాలు కన్పించడం లేదు.

● ఆళ్లగడ్డ మండలంలో 38 పాఠశాలలు ఉన్నాయి. మొత్తంగా 3,800 మంది విద్యార్థులు ఉన్నారు. అధికారికంగా ఎనిమిది పాఠశాలల్లో మైదానాలు లేనివి గుర్తించారు. అయితే వాస్తవంగా 8 ఉన్నత పాఠశాలలు, 4 ప్రాథమికోన్నత పాఠశాలల్లో తప్ప మిగిలిన ప్రాథమిక పాఠశాల్లో మైదానాల కొరత ఉంది.

కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

● చాగలమర్రి మండలంలో 45 పాఠశాలల్లో 7,200 మంది విద్యార్థులు ఉండగా గొడిగనూరు, మద్దూరు, పెద్దబోదనంలోని ఉన్నత పాఠశాలల్లో మైదానాలు లేక విద్యార్థులు ఆటలకు దూరమవుతున్నారు. ఇక ప్రాథమిక పాఠశాలల్లో పరిస్థితి మరీ దుర్భరంగా మారింది.

● రుద్రవరం మండలంలో 56 పాఠశాలల్లో 6,800 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ మండలంలోనూ ఉన్నత పాఠశాల్లో తప్ప ప్రాథమిక పాఠశాలల్లో వేలాది విద్యార్థులు మైదానాలు లేక ఆటలకు దూరమవుతున్నారు.

● శిరివెళ్ల మండలం కేంద్రంలో 750 మంది విద్యార్థులు ఉన్న జడ్పీ ఉన్నత పాఠశాలకు మైదానం లేకపోవడం గమనార్హం. కస్తూర్బా పాఠశాలలకు సైతం మైదానం లేకపోవడంతో విద్యార్థినులకు ఆటలు ఆడేందుకు అవస్థలు పడాల్సి వస్తోంది. కూటమి ప్రభుత్వం స్పందించి అవసరమైన చోట్ల ఆట స్థలాలు ఏర్పాటు చేయాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఆళ్లగడ్డ: 80008 57491
డోన్ పట్టణం: 94408 57790
బనగానపల్లి: 80085 73763

సంజామల, న్యూస్‌టుడే: ?: ఆకుమల్ల గ్రామంలోని ప్రధాన రహదారులపై మురుగు చేరడంతో ఇబ్బందులు పడుతున్నాం. **- వెంకటేశ్వర్లు, ఆకుమల్ల**
✔: వీధుల్లో పరిశీలించి పారిశుద్ధ్య పనులు చేపడతాం. **- సల్మాన్, ఎంపీడీవో, సంజామల.**

బేతంచెర్ల, న్యూస్‌టుడే: ?: పట్టణంలో ప్రధాన రహదారి పక్కన పైపు లీకేజీ అవ్వడంతో నీరు వృథాగా పారుతోంది. **- కాలనీవాసులు.**
✔: సిబ్బందితో మరమ్మతులు చేసి సమస్యను పరిష్కరిస్తాం. **- మధుతేజరెడ్డి, ఏఈ.**

?: బైటిపేట కాలనీలో మురుగు కాల్వ శుభ్రం చేయకపోవడంతో చెత్తాచెదారం నిండి పోయింది. దుర్వాసన భరించలేకపోతున్నాం. **- కాలనీవాసులు.**
✔: కార్మికులతో కాల్వను శుభ్రం చేయిస్తాం. **- మధుకుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్.**

చాగలమర్రి, న్యూస్‌టుడే: ?: ముత్యాలపాడు గ్రామంలో పారిశుద్ధ్యం లోపించింది. చర్యలు తీసుకోండి. **- మాబాషా, ముత్యాలపాడు.**
✔: పారిశుద్ధ్యం మెరుగునకు చర్యలు చేపడతాం. **- వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి.**

శిరివెళ్ల: ?: శిరివెళ్లలోని ఆదర్శ పాఠశాల మధ్యలో నిలిచిన ప్రహరీ నిర్మాణాన్ని పూర్తి చేయాలి. **- కిరణ్‌కుమార్.**
✔: త్వరలో ప్రహరీ నిర్మాణం పూర్తి చేయిస్తాం. **- విజయ్‌కుమార్, పీఆర్ ఏఈ, శిరివెళ్ల.**

బనగానపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: ?: బనగానపల్లి మండలం క్రిష్ణగిరి మెట్ట సమీపంలో నీటి ట్యాంకు అపరిశుభ్రంగా ఉంది. **- లక్ష్మీదేవి, కాలనీవాసి.**
✔: సమస్యను గుర్తించి చర్యలు తీసుకుంటాం. **- నాగరాజు, ఎంపీడీవో, బనగానపల్లి**

పరికరాలు ఇలా.. వ్యాయామం చేసేదెలా?

ఆళ్లగడ్డ మున్సిపాలిటీలో 2017లో కొనుగోలు చేసిన రూ.3 లక్షల విలువైన వ్యాయామ పరికరాలు నేటికీ వినియోగంలోకి రావడం లేదు. వీటిని పార్కులో వీటిని ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే ఆళ్లగడ్డలో పార్కులేకపోవడంతో వీటిని ఏళ్లుగా పురపాలిక కార్యాలయంలో ఆవరణలోనే వృథాగా పడేశారు. పార్కును నిర్మించి, వ్యాయామ పరికరాలు ఏర్పాటు చేయాలని పుర ప్రజలు కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, ఆళ్లగడ్డ

శీతాకాలంలో తాటి ముంజలు

బనగానపల్లి మండలం చిన్నరాజుపాలెం గ్రామ సమీపంలో చలికాలంలో తాటిముంజలు అమ్ముతున్నారు. చలికాలంలో తాటిముంజలు రావడంతో పలువురు ఆసక్తిగా కొనుకుంటున్నారు. డజను రూ.100 చొప్పున స్థానిక రైతు చెట్లపై నుంచి సేకరించి విక్రయిస్తున్నారు. ఆ దారి గుండా వెళ్లే ప్రయాణికులు కొంటున్నారు. సాధారణంగా ముంజలు వేసవిలో వస్తుంటాయి. **- న్యూస్‌టుడే, బనగానపల్లి గ్రామీణం**

పంట వ్యర్థాలు.. ప్రయాణికులకు తిప్పలు

రహదారులపై పంట దిగుబడులు ఆరేసిన రైతులు కోత కోసిన తర్వాత వాటి వ్యర్థాలను అలాగే వదిలేస్తున్నారు. ఫలితంగా రోడ్లపై వ్యర్థాల కుప్పలు పేరుకుపోయి రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఆళ్లగడ్డ- అహోబిలం రహదారిలో మొక్కజొన్న దిగుబడుల వ్యర్థాలను రైతులు రోడ్లపైనే వదిలేశారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి సమయాల్లో కుప్పలు గుర్తించక ప్రమాదాలు చోటుచేసుకునే వీలుంది.
- న్యూస్‌టుడే, ఆళ్లగడ్డ గ్రామీణం

దారిపై యమపాశాలు

బేతంచెర్ల మండలంలోని తవిశికొండ-హుస్సేనాపురం గ్రామాల మధ్య చిన్నకొలుములపల్లె వెళ్లే దారిలో ఏపీ ట్రాన్స్‌కో విద్యుత్తు తీగలు కిందికి వాలి ప్రమాదకరంగా ఉన్నాయి. దీంతో రైతులు, వాహనదారులు ఆందోళనకు గురవుతున్నారు. టవర్ లైన్లు ఏర్పాటు చేసి కిందికి వాలిన తీగలను సరిచేయాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని రైతు లింగారెడ్డి తదితరులు వాపోతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, హుస్సేనాపురం(బేతంచెర్ల)

మొక్కలు నాటుతున్న ఐసీడీఎస్ అధికారిణులు, విద్యార్థినులు

శిరివెళ్ల, న్యూస్‌టుడే: గ్రామాల్లో ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తే సంబంధిత దుకాణాలపై చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో శివమల్లేశ్వరప్ప సోమవారం పేర్కొన్నారు.

శిరివెళ్ల, న్యూస్‌టుడే: వాహన డ్రైవర్లు లైసెన్స్ పత్రాలు లేకుండా వాహనాలు నడిపితే చట్టప్రకారం కేసులు నమోదు చేస్తామని ఎస్సై చిన్నపీరయ్య యాదవ్ హెచ్చరించారు.

శిరివెళ్ల, న్యూస్‌టుడే: భూసార పరీక్షలపై అన్నదాత అవగాహనను కలిగి ఉండాలని ఏవో సుధాకర్ పేర్కొన్నారు. గ్రామంలోని రైతు సేవా కేంద్రాన్ని ఏవో సోమవారం తనిఖీ చేశారు.

శిరివెళ్ల, న్యూస్‌టుడే: గ్రామాల్లో నీటి ట్యాంకులను నిర్ణీత వ్యవధిలో శుభ్రపరచాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ త్రిలింగేశ్వరరెడ్డి సోమవారం పేర్కొన్నారు

ప్యాపిలి, న్యూస్‌టుడే: వృద్ధులకు ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించాలని వృద్ధుల సంఘం నాయకులు మత్తుబాబాసాహెబ్, శాంసన్ ప్రభుత్వాన్ని కోరారు.

ఆలమూరు(రుద్రవరం), న్యూస్‌టుడే: ఆలమూరులో విద్యుత్తు లైన్‌మెన్ శ్రీనివాసులు విద్యుత్తు కనెక్షన్లకు సంబంధించి గ్రామస్థుల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు గ్రామస్థుడు గోవిందరెడ్డి ఆరోపించారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రభాకర్ ఆర్థిక సహకారంతో ఇందిరానగర్‌లో పేద మహిళలకు ఉచితంగా చీరలను పంపిణీ చేసినట్లు ప్రార్థనాసమయం నిర్వాహకుడు జ్ఞానప్రభాకర్ తెలిపారు.

సంక్షిప్త సమాచారం

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ సిబ్బంది సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు మాణిక్యంశెట్టి, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాలు సుమలత తెలిపారు. సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 12న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నామన్నారు.

సంజామల, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నట్లకొత్తూరు గ్రామం ఫీల్డ్ అసిస్టెంట్ వై. చంద్రశేఖర్ రెడ్డి ఎంపికయ్యారు. ఫీల్డ్ అసిస్టెంట్‌ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: విద్యా సంస్థల యాజమాన్యాలు విద్యార్థులందరికీ అపార్ ఐడీ వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంఈవో ప్రభాకర్ సోమవారం తెలిపారు. ఆధార్ మార్పుల విషయంలో ప్రధానోపాధ్యాయులు ఒక్కో ఉపాధ్యాయుడికి కొంత మంది విద్యార్థులను కేటాయించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

బనగానపల్లి, న్యూస్‌టుడే: వసుధ ఫౌండేషన్ సేవలు పేదలకు వరంగా మారాయని తెదేపా వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు టంగుటూరి శీనయ్య పేర్కొన్నారు. ఆర్థిక సమస్యతో బాధపడుతున్న మహమ్మద్ కుటుంబానికి రూ.15వేల ఆర్థిక సాయం, సరకులను ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం పంపిణీ చేశారు

చాగలమర్రి, న్యూస్‌టుడే: తోడేండ్లపల్లె గ్రామానికి చెందిన రైతు అంకాల్‌రెడ్డి కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారులు స్పందించడం లేదని వాపోయారు. తహసీల్దారు కార్యాలయంలో ప్రజా సమస్యల ఫిర్యాదు వేదిక కార్యక్రమం నిర్వహించారు.

బేతంచెర్ల, న్యూస్‌టుడే: ఆర్‌ఎస్ రంగాపురం గ్రామానికి చెందిన ఓ యువతి ఆదివారం రాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఆచూకీ కోసం కన్పించకపోవడంతో అదృశ్యం కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై వెంకటేశ్వర్లు శెట్టి సోమవారం తెలిపారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ఆధ్యాత్మికం

సంజామల, న్యూస్‌టుడే: మండలంలోని ముదిగేడులో వెలసిన వరసిద్ధి వినాయకస్వామి దేవాలయంలో సోమవారం ఆలయ ప్రథమ వార్షికోత్సవం కార్యక్రమం గ్రామపెద్దల సమక్షంలో అర్చకులు శరత్‌కుమార్ ఆధ్వర్యంలో గ్రామస్థులు వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పూజల్లో పాల్గొన్నారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.

పూజల్లో పాల్గొన్న భక్తులు

బనగానపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: నందవరం గ్రామంలోని చౌడేశ్వరి అమ్మవారి మాలధారులు సోమవారం నందవరం ఆలయం నుంచి యాగంటి ఆలయానికి పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు.

ఈ నెల 13న తిరుమలకు పాదయాత్ర

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: తిరుమల పాదయాత్ర సేవా సమితి ఆధ్వర్యంలో ఈనెల 13న తిరుమలకు భక్తి చైతన్య పాదయాత్ర చేపడుతున్నట్లు సమితి అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, దామోదరాచారి, లక్ష్మీనారాయణలు సోమవారం తెలిపారు. పాదయాత్రలో పాల్గొనేవారు ఎలాంటి డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదని, సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత భోజనం, మందుల వసతి కల్పిస్తామన్నారు. వివరాలకు 9441137699కు సంప్రదించవచ్చన్నారు.

సేవలు మరింత విస్తృతం చేస్తాం

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: కర్రా రామసుబ్బారెడ్డి ఫౌండేషన్, మానవతా సంస్థల ఆధ్వర్యంలో సేవలను మరింత విస్తృతం చేస్తామని కర్రా రామసుబ్బారెడ్డి ఫౌండేషన్, మానవతా సంస్థ ఛైర్మన్‌లు కర్రా తేజవర్ధన్‌రెడ్డి, డాక్టర్ వెంకటేశ్వరరెడ్డి అన్నారు. కోవెలకుంట్లలోని మానవతా స్వచ్ఛంద సంస్థ కార్యాలయం దగ్గర కర్రా సుబ్బారెడ్డి ఫౌండేషన్, మానవతా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని సోమవారం నిర్వహించారు.

శిబిరంలో మాట్లాడుతున్న తేజవర్ధన్‌రెడ్డి

నంద్యాల శాంతిరామ్ ఆసుపత్రి వైద్యులు 200 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైకాపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్రా హర్షవర్ధన్‌రెడ్డి, లాయర్‌బాబు, జీవీసుబ్బారెడ్డి, మల్లికార్జునరావు, రామసుబ్బారెడ్డి, చెన్నకృష్ణారెడ్డి, శివశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

కోటకందుకూరు(ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ సీడీపీవో తేజేశ్వరి పేర్కొన్నారు. మండలంలోని కోటకందుకూరు ఆదర్శ పాఠశాలలో పిల్లల సంరక్షణ, సైబర్ నేరాలు, బాల్య వివాహాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పిల్లలు చరవాణులకు దూరంగా ఉండి చదువుపై దృష్టి సారించి భవిష్యత్తును విజయవంతంగా మలచుకోవాలని కోరారు. అనంతరం బడి ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పార్వతి, ప్రధానాచార్యులు రాజు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో చిన్నారుల ప్రతిభ

పతకాలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

బేతంచెర్ల, న్యూస్‌టుడే: సౌత్ స్టేట్ కరాటే పోటీల్లో బేతంచెర్ల పట్టణంలోని హనుమాన్‌నగర్ ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈనెల 7న కర్నూలులో జరిగిన సౌత్ స్టేట్ కరాటే పోటీల్లో ఐదుగురు విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా కటా విభాగంలో పాల్గొని రెండు స్వర్ణ పతకాలు, ఒక వెండి పతకం, రెండు కాంస్య పతకాలు సాధించినట్లు ప్రధానోపాధ్యాయులు లక్ష్మన్న తెలిపారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన విద్యార్థులను కోచ్ చంద్రమోహన్‌గౌడ్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఆందోళన చేస్తున్న సంఘం నాయకులు

కేంద్ర విధానాలకు వ్యతిరేకంగా ఆందోళన

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: విద్యుత్తు బిల్లు 2025 చట్ట రూపంలోకి తెచ్చి ప్రభుత్వరంగ విద్యుత్తు పంపిణీ సంస్థలను ప్రైవేట్ పరం చేయాలని కేంద్ర ప్రభుత్వం చూస్తోందని రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామచంద్రుడు, ఉపాధ్యక్షుడు సుబ్బరాయుడులు పేర్కొన్నారు. ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం బేతంచెర్ల సర్కిల్‌లో విద్యుత్తు బిల్లు, విత్తన బిల్లులకు వ్యతిరేకంగా ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో ఈ బిల్లును పార్లమెంటులో ఆమోదం చేయించుకోవాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ధ్వజమెత్తారు. ఈ బిల్లు చట్ట రూపం దాల్చితే వ్యవసాయానికి ఉచిత విద్యుత్తు ఉండదన్నారు. నాయకులు నాగమద్దయ్య, కొండయ్య, భాస్కర్‌రెడ్డి, శివరాం, మాణిక్యంశెట్టి పాల్గొన్నారు.

సహకార సంఘం ఉద్యోగుల ఆధ్వర్యంలో..

బనగానపల్లి, న్యూస్‌టుడే: ప్రభుత్వం తమ న్యాయమైన కోర్కెలను తీర్చాలని వ్యవసాయ సహకార సంఘం కార్యదర్శి సయ్యద్ అబ్దుల్ మునాఫ్ డిమాండు చేశారు. సోమవారం జిల్లా సహకార బ్యాంకు ఎదుట నిరసన చేశారు. నాయకులు దస్తగిరి, ఘనమద్దిలేటి, షామీర్, మాధవరెడ్డి పాల్గొన్నారు.

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఉద్యోగులు డిమాండ్ చేశారు. కోవెలకుంట్లలోని డీసీసీబీ బ్యాంకు దగ్గర 15 సహకార సంఘాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు సోమవారం ధర్నా నిర్వహించారు. జీవో నెం.36ను వెంటనే అమలు చేయాలన్నారు. ధర్నాకు డీసీసీబీ బ్యాంకు ప్రధాన మేనేజర్ అమర్నాథరెడ్డి, సూపర్‌వైజర్లు ప్రతాప్‌రెడ్డి, ఇస్మాయిల్, రామసుబ్బయ్య తదితరులు మద్దతు తెలిపారు.

కోవెలకుంట్ల: బ్యాంకు ఎదుట ధర్నా చేస్తున్న ఉద్యోగులు

కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలో హిందూ సమ్మేళనం కార్యక్రమంలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధి యుగంధర్‌జీ కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 14వ తేదీన పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వక్తలు చెప్పే విషయాలను విని సమాజంలో బాధ్యతగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో హిందూ సమ్మేళన నిర్వహణ సమితి నాయకులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న సమితి నాయకులు

శౌచాలయానికి ఉపాధ్యాయుల చేయూత

గూటుపల్లె(బేతంచెర్ల), న్యూస్‌టుడే: మండలంలోని గూటుపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు పాఠశాల అభివృద్ధికి తోడ్పాటు అందించి అభివృద్ధికి కృషి చేశారు. ఈ పాఠశాలలో 60 మంది బాలికలు చదువుతున్నారు. అత్యవసరాలు తీర్చుకోవాలంటే ఇబ్బంది పడుతుండటంతో ప్రధానోపాధ్యాయుడు ఆదినారాయణశెట్టితోపాటు ఉపాధ్యాయులు విరాళాలు రూ.50 వేల వరకు జమచేశారు. ఈ నిధులతో మరుగుదొడ్డి ఇటీవల నిర్మించారు. ఈ సందర్భంగా బాలికల తల్లిదండ్రులు ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు.

తిరుపతిలో ఎస్ఎఫ్ఐ మహాసభలు

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఎస్ఎఫ్ఐ 25వ రాష్ట్ర మహాసభల గోడపత్రాలను ఆ సంఘం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం. ఆర్. నాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు రాజాలు మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ మహాసభలు తిరుపతిలో ఈ నెల 12, 13, 14వ తేదీల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సభలకు వేలాది మంది విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. రాజు, పఠాన్, సతీష్ పాల్గొన్నారు.

పన్నులు చెల్లించకపోతే చర్యలు

జరిమానా విధిస్తున్న ఎంవీఐ క్రాంతికుమార్

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: రహదారి పన్నులు చెల్లించకపోతే చర్యలు తీసుకుంటామని ఎంవీఐ క్రాంతికుమార్ తెలిపారు. జగదుర్తి గ్రామం సమీపంలో సోమవారం హైవేపై వెళ్తున్న పలు వాహనాలను తనిఖీలు చేశారు. రహదారి నిబంధనలు పాటించని బిహార్ రాష్ట్రానికి చెందిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సును తనిఖీలు చేసి రూ.4.91లక్షలు జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

శివారు దారులు.. వెళ్లలేక అవస్థలు

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: డోన్ మున్సిపల్ పరిధిలోని శివారు ప్రాంతాల్లో అంతర్గత రహదారులు అధ్వానంగా ఉన్నాయి. వర్షం వస్తే చాలు రహదారులు బురదమయంగా మారుతున్నాయి. మున్సిపల్ అధికారులు కొన్ని శివారు ప్రాంతాల్లో మాత్రమే మట్టిని వేసి మమ అనిపిస్తున్నారు తప్ప రహదారి నిర్మాణం చేపట్టడం లేదు. దీంతో ఆయా ప్రాంతాల్లో పుర ప్రజలు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు.

పన్నులు చెల్లిస్తున్నా చర్యలు శూన్యం

డోన్ పట్టణంలో 32 వార్డులకు గాను 16 వేలకు పైగా గృహాలు, 75 వేలకు పైగా జనాభా నివసిస్తోంది. ప్రభుత్వం నుంచి రూ. కోట్ల నిధులు మంజూరవుతున్నా శివారు ప్రాంతాల్లోని వీధులపై అధికారులు దృష్టి సారించడం లేదు. శివారు కాలనీల్లోని ప్రజలు వివిధ రకాల పన్నులను చెల్లిస్తున్నా సీసీ రహదారుల నిర్మాణాలు చేపట్టడం లేదని వారు అసహనం చెందుతున్నారు.

సీసీ రహదారికి నోచుకోని వైఎస్సార్ నగర్

సమస్యలు ఉన్న ప్రాంతాలివే..

● వైఎస్సార్ నగర్‌లో 450కి పైగానే గృహాలు ఉంటాయి. 2 వేలకు పైగా జనాభా నివసిస్తోంది. రెండు, మూడు వీధుల్లో మాత్రమే సీసీ రహదారుల నిర్మాణాలు చేపట్టారు. మిగతా వీధుల్లో వాటి ఊసే లేకుండా పోయింది. పలు వీధుల్లో రహదారులపై మురుగు ప్రవహిస్తూ అధ్వానంగా తయారయ్యాయి.

● కృష్ణానగర్‌లో 300 దాకా ఇళ్లు, 1,500 దాకా జనాభా నివసిస్తోంది. వీధుల్లో దారులు అధ్వానంగా ఉన్నాయి. దారులపై నీరు నిల్వ ఉండి అస్తవ్యస్తంగా మారాయి. సీసీ రహదారుల కల్పనలో మున్సిపల్ యంత్రాంగం విఫలమవుతోంది.

● శ్రీనివాసనగర్‌లోని పలు వీధుల్లోని రహదారులతో పాటు శ్రీరామానగర్, నల్లగుట్ట, త్రివర్ణకాలనీ, రైతుమిత్ర కాలనీ, జంగాల కాలనీ, వెంకటేశ్వర నగర్, సుజాతమ్మనగర్, విజయభాస్కరరెడ్డి నగర్, పాతపేట శివారు, చిగురుమానుపేట, అయ్యప్పస్వామి గుడి ఏరియా, న్యూ స్వీపర్స్ కాలనీ తదితర కాలనీల్లో పలు వీధులు సీసీ రోడ్లకు నోచుకోలేదు. ప్రభుత్వాలు, అధికారులు మారుతున్నా శివారు ప్రాంతాల్లోని రహదారుల పురోగతి మారడం లేదు.

● సాధారణ నిధుల కింద పట్టణ ముఖ్య ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నారే గానీ.. శివారు ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణాలు చేపట్టే వారే కరవయ్యారు.

IN THE COURT OF THE CIVIL JUDGE (SENIOR DIVISION), ALLAGADDA
E.P.No.24 of 2021 in O.S.No.64 of 2006
Cheppali Reddy Nagi Reddy (Died) by his LRs C.Naramma (Died) by LRs C.Rama Krishna Reddy and others ... **Decree Holders**
Versus
Katha Nageswara Reddy ...**Judgement Debtor**
Pursuant to the orders of the Hon'ble Court in the above Execution Petition, the under mentioned property belonging to the Judegment Debtor will be brought to public auction on 17.12.2025 at 10:30 A.M. in the Court premises of the Civil Judge (Senior Division), Allagadda, to recover the decree amount due to the Decree Holders.
Schedule of Property: Open site situated within the village limits of Gulladurthy Village, Koilakuntla Sub- Registration, Kurnool District. Survey No.: 27
Boundaries: East: House of Katha Machalapuni Venkata Subba Reddy, **West:** House of Katha Chennamma, **North:** Rasta, **South:** Open site of Chireddy Rama Lakshamma.
Measurements: East-West: 11 feet, **North-South:** 65 feet.
Upset Price(Decree Holder's Valuation): ₹ 1,00,000/- (Rupees one lakh only) (Ameen value): ₹ 1,75,000/- (Rupees one lakh seventy five thousand only) (Present market value): ₹ 95,328/- (Rupees ninty five thousand and three hundred and twenty eight only)
By Order of the Court
Civil Judge (Senior Division), Allagadda
sd/-C.V.Ramana Rao, Advocate, Allagadda. Cell.No.99855 47550

(c) eenadu

అలరించిన జానపదం.. పరవశించిన యువతరం

ఏఎన్‌యూ, న్యూస్‌టుడే : ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలో యువజనోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య గంగాధర్ వీటిని ప్రారంభించారు. ఉత్సవాల్లో తొలిరోజు దాదాపు 22 కళాశాలల నుంచి 400 మంది విద్యార్థులు పాల్గొన్నారు. తొలిరోజు బృంద నృత్యాలు, జానపద గేయాలు, మైమ్స్, థియేటర్ ఆర్ట్స్, సంగీతం, చిత్రలేఖనాలతో అలరించారు. సిమ్స్ విద్యార్థుల జానపద గేయాలు ఆకట్టుకున్నాయి. ఏఎన్‌యూ విద్యార్థులు వేసిన మైమ్స్ ఆలోచింపజేశాయి.

ఈనాడు పల్నాడు
మంగళవారం డిసెంబరు 9, 2025

ధాన్యం నిల్వ

పంట తేమ ఆరదు.. కంట నీరు ఆగదు

న్యూస్‌టుడే, గురజాల, మాచర్ల

బియ్యం మిల్లర్ల మాయాజాలం

పల్నాడులో బాయిల్డ్ రైస్‌మిల్లుల యజమానులు సిండికేట్‌గా మారి రైతుల కష్టాన్ని సొమ్ము చేసుకుంటున్నారు. తేమ పేరుతో రైతులను దోపిడీ చేస్తున్నారు. గురజాల, మాచర్ల నియోజకవర్గాల పరిధిలో 12 భారీ బాయిల్డ్ రైస్‌మిల్లులు, 5 చిన్న మిల్లులు ఉన్నాయి. వీటితో రైతులకు మేలు జరుగుతుందని అంతా భావించారు. ధాన్యాన్ని స్థానికంగా అమ్ముకోవచ్చని, అధిక ధర లభిస్తుందని ఆశించారు. కానీ యజమానులు కుమ్మక్కై ధాన్యం ధరలు భారీగా తగ్గిస్తున్నారు. దూర ప్రాంతం వెళ్లి విక్రయించలేక, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు సరిగా పనిచేయక అన్నదాతలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. కొందరు అందినకాడికి అమ్ముకుంటున్నారు.

తెలంగాణకు వెళ్లి..

కొందరు మిల్లర్లు తెలంగాణలో భారీగా ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. ఆ రాష్ట్ర పరిధిలోని కృష్ణానది తీరంలో పంట దిగుబడి నెల ముందుగానే వస్తుంది. ఇప్పటికే మిల్లర్లు భారీగా కొనుగోలు చేసి నిల్వ చేశారు. ధర తగ్గించడానికి ఇది కూడా ఓ కారణమని తెలుస్తోంది. ఏపీలో పండించే ధాన్యం తెలంగాణలోకి రానివ్వకుండా అక్కడి అధికారులు అడ్డుకుంటున్నారు. తెలంగాణ నుంచి ఇక్కడికి ధాన్యం వస్తున్నా పట్టించుకునే వారు లేరని రైతులు వాపోతున్నారు.

భారీగా ధర కోత

75 కిలోల ధాన్యం బస్తా రూ. 1200 నుంచి రూ.1300 వరకు పలుకుతోంది. ఒక్కోసారి రూ.1100కు రైతులు విక్రయిస్తున్నారు. 75 కిలోల ధాన్యం మర ఆడిస్తే 50 కిలోల బియ్యం వస్తుంది. ఆ బియ్యం మార్కెట్లో రూ.2500 నుంచి రూ.2600 వరకు అమ్ముతున్నారు. ధాన్యం, బియ్యం ధరలో సుమారు రూ.1200 వ్యత్యాసం ఉంది. దీనిపై ఆర్డీవో మురళీకృష్ణ మాట్లాడుతూ మిల్లర్లు రైతుల నుంచి తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేస్తుండటంపై విచారణ చేయిస్తామని చెప్పారు.

ప్రశ్నిస్తే బెదిరింపులు..

బాయిల్డ్ రైస్ మిల్లుల యజమానులు సిండికేట్‌గా మారారు. రైతు ధాన్యం తీసుకెళితే 14 శాతం తేమ ఉందని ధర తగ్గిస్తున్నారు. బాగా ఆరబెట్టుకొని వెళితే 26 శాతం మాయిశ్చర్ ఉందని, బియ్యం విరుగుతున్నాయని కోత విధిస్తున్నారు. విధిలేని పరిస్థితిలో మిల్లర్లు చెప్పిన ధరకు రైతులు అమ్ముకోవాల్సి వస్తోంది. ఎవరైనా ప్రశ్నిస్తే ధాన్యం అవసరం లేదని బెదిరింపులకు దిగుతున్నట్లు తెలుస్తోంది.

ఈ-పంటలో నమోదైతే ధాన్యం కొనుగోలు

నరసరావుపేట వ్యవసాయం: నిబంధనల ప్రకారం ఈ-పంటలో నమోదైన ప్రతి రైతు వద్ద రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజరు బి.నారద ముని తెలిపారు. 'దాచుకోలేరని.. దోచుకుంటున్నారు' శీర్షికన ఈనెల 8న 'ఈనాడు'లో ప్రచురించిన కథనానికి ఆయన స్పందించారు. జిల్లా వ్యాప్తంగా 100 క్లస్టర్ రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని, రైతులకు అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటి వరకు 26 మంది రైతుల నుంచి 272.64 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రూ.19 లక్షలు చెల్లింపులు చేశామన్నారు. రైతులు తమ ధాన్యాన్ని అమ్ముకోవటానికి క్లస్టర్ రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని కోరారు.

పాముకాటు.. భయమే చేటు

ఈనాడు డిజిటల్, నరసరావుపేట, న్యూస్‌టుడే, పెదకూరపాడు

- పెదకూరపాడు మండలంలో 20 రోజుల వ్యవధిలో ఆరుగురు పాముకాటుకు గురవగా ఒకరు మృతిచెందారు. మిగతా ఐదుగురు ప్రాణాపాయం నుంచి బయటపడి ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు.
- పంటపొలాల్లో పనులకు వెళ్లే వారు అధికంగా పాముకాటుకు గురవుతున్నారు. రొంపిచర్ల, క్రోసూరు, నకరికల్లు, రాజుపాలెం మండలాల్లో ఈ ఘటనలు అధికం. రెండ్రోజుల కిందట వినుకొండ మండలం భారతాపురం గ్రామానికి చెందిన రైతు గడ్డి కోస్తుండగా పాముకాటుకు గురై ప్రాణాలు విడిచాడు.

సకాలంలో ఆసుపత్రికి వెళితే ప్రాణాలు పదిలం

కాటేసిన పాముతో పెద్దమక్కెనకు చెందిన కొమ్ము భిక్షం

పొలాలు, గడ్డిపొదలు..

పాములు ఎక్కువగా పొలాలు, గడ్డిపొదల్లో ఉంటున్నాయి. రైతులు అప్రమత్తంగా ఉండాలి. చేల్లోకి వెళ్లేటప్పుడు బూట్లు ధరించడం మేలు. గడ్డికోసేటప్పుడు.. పత్తి తీసేటప్పుడు.. ఇతర పొలం పనులు చేసేటప్పుడు పరిసర ప్రాంతాలను ఒకటికి రెండుసార్లు పరిశీలించాలి. ఏమైనా పురుగుపుట్ర ఉన్న ఆనవాళ్లు ఉంటే అటువైపు వెళ్లకపోవడం ఉత్తమం. ఒకప్పుడు కోతలు కోసే సమయంలో కూలీలు పాముకాట్లకు గురయ్యేవారు. ప్రస్తుతం యంత్రాలతో వరికోతలు జరుగుతుండటంతో అలాంటి ఘటనలు తగ్గుముఖం పట్టాయి.

ఏడాదిలో..

జిల్లాలో మొత్తం పాముకాటుకు గురైనవారు: 30 మంది
మృతులు: 20 మంది

తక్షణం చేయాల్సినవి..

❖ కాటు వేసిన ప్రాంతాన్ని సబ్బు, నీటితో సున్నితంగా శుభ్రం చేయాలి. ❖ భయం వల్ల గుండె వేగంగా కొట్టుకుంటుంది. ఇది విషం వ్యాప్తిని పెంచుతుంది. గట్టిగా శ్వాస తీసుకుని ప్రశాంతంగా ఉండాలి. భయపడకుండా ఉంటే ప్రమాదం నుంచి గట్టెక్కవచ్చు. ❖ కరిచిన భాగాన్ని (చేయి, కాలు) కదపకుండా ఉంచాలి. పరిగెత్త కూడదు. అలా చేస్తే గుండె కొట్టుకునే వేగం పెరుగుతుంది. అప్పుడు విషం వేగంగా శరీరమంతా వ్యాపిస్తుంది. ❖ వీలైతే పామును దూరం నుంచి చూసి గుర్తుపెట్టుకోవడానికి ప్రయత్నించండి. దానిని పట్టుకోవడానికి ప్రయత్నించొద్దు. పాము రంగు, పొడవు, చారలు, మెడరేఖ మొదలైన వాటి గురించి సమాచారం అందిస్తే చికిత్స సులువవుతుంది.

❖ పాము కాటేసినప్పుడు ఒంటరిగా ఉంటే వెంటనే 108కు ఫోన్‌చేయాలి. వీలైనంత త్వరగా ఆసుపత్రికి వెళ్లాలి. ❖ పాముకాటుకు అన్ని పీహెచ్‌సీల్లో మందులున్నాయి. సమయానికి ఆసుపత్రికి వస్తే ప్రాణాపాయం నుంచి బయట పడవచ్చని డీఎం హెచ్‌వో రవి చెప్పారు.

కుమారుడి అక్రమాలు.. తండ్రి పాత్రపై అనుమానాలు

ఈనాడు డిజిటల్, నరసరావుపేట: బ్రేక్ ఇన్‌స్పెక్టర్ పేరిట కుమారుడి అరాచకం వెలుగులోకి రావడంతో తండ్రి ఏఎస్సై వ్యవహారం పోలీసు వర్గాల్లో చర్చనీయాంశమైంది. కుమారుడి నేరాల చిట్టాలో తండ్రి పాత్ర ఏమిటి? అనేది తేలుస్తారా? ఇప్పటికే ఎస్పీ వద్ద ఉన్న పాత ఫైల్‌ను ఏం చేస్తారనేది ఆసక్తిగా మారింది. 15 ఏళ్లుగా నరసరావుపేటలోనే ఎందుకు పోస్టింగ్‌లో ఉంటున్నాడు? అనే దానిపై ఎస్పీ ఆరా తీస్తారా? అన్నది వేచి చూడాలి. బ్రేక్ ఇన్‌స్పెక్టర్ అవతారం ఎత్తిన వెంకటనాయుడు తన తండ్రి పోలీసు అధికారాన్ని అడ్డుపెట్టుకుని మొదటి నుంచీ అడ్డగోలుగా వ్యవహరించేవాడని.. పోలీసుస్టేషన్‌లో ఎవరినీ లెక్కచేసేవాడు కాదని తెలిసింది. నరసరావుపేట గ్రామీణ పోలీసుస్టేషన్‌లో తండ్రి పనిచేస్తున్న సమయంలో గంజాయి కేసులో ఓ ద్విచక్ర వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసు సిబ్బంది చూస్తుండగానే కుమారుడు వచ్చి దర్జాగా వాహనాన్ని తీసుకెళ్లిపోవడం దుమారం రేపింది. ప్రస్తుతం గురజాల డీఎస్పీగా ఉన్న జగదీశ్ అప్పట్లో ట్రైనీ డీఎస్పీగా అక్కడ ఉన్నారు. దీన్ని సీరియస్‌గా తీసుకుని వెంకటనాయుడిని మందలించి, ఆపై కౌన్సెలింగ్ ఇచ్చి వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. జాతీయ రహదారులపై భారీ వాహనాలను ఆపి బెదిరించి అందినకాడికి వసూలు చేయడం వెంకటనాయుడికి పరిపాటిగా మారింది. చిత్తూరుకు చెందిన ఓ పారిశ్రామికవేత్తను ఇలానే బెదిరించి భారీగానే వసూలు చేసినట్లు తెలిసింది. నరసరావుపేట డీఎస్పీగా ఉద్యోగ విరమణ చేసిన వ్యక్తికి కలెక్షన్ ఏజెంట్‌గా ఏఎస్సై వ్యవహరించాడని పోలీసువర్గాల్లోనే చర్చ నడుస్తోంది. గతంలో కోటప్పకొండ తిరునాళ్లకు బాగా వసూళ్లు చేసి వెనకేసుకున్నట్లు వార్తలొచ్చాయి. ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల చేయిత డిపి జిల్లా కేంద్రంలోనే తిష్ఠ వేస్తున్నట్లు సమాచారం. గత ప్రభుత్వంలో ఓ ఎమ్మెల్యే (ప్రస్తుతం మాజీ)తో సత్సంబంధాలు నడిపి పోలీసుల పోస్టింగ్‌లో కీలకంగా వ్యవహరించి వసూలు చేసినట్లు తెలిసింది. ఇటీవల కోటసెంటర్‌లోని ఓ షాపింగ్‌మాల్‌లో అగ్నిప్రమాదం జరిగిన తర్వాత దుకాణంలో చీరలు మాయమవడం.. అక్కడ సదరు ఏఎస్సై విధుల్లో ఉండడం పలు అనుమానాలకు తావిచ్చింది. కానీ విషయం బయటకు రాకుండా జాగ్రత్తపడ్డారు. కుమారుడి లీలలు వెలుగు చూసిన నేపథ్యంలో తండ్రి వ్యవహారాలపై ఉక్కుపాదం మోపాల్సిన అవసరం ఉందని పోలీసు వర్గాల్లోనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

నరసరావుపేటలోనే 15 ఏళ్లుగా పోస్టింగ్

ఉన్నతాధికారులకు వసూళ్ల ఏజెంట్‌గా ఏఎస్సై కార్యకలాపాలు

చారిత్రక శిలలు.. వదిలేశారిలా..!

చరిత్రను భావితరాలకు తెలియజేసేందుకు ప్రభుత్వం రూ.లక్షలు ఖర్చు చేస్తోంది. చరిత్రకారులు చారిత్రక సాక్ష్యాలను శోధించి భవిష్యత్తు తరాలకు తెలియజేస్తారు. అటువంటి చారిత్రక సాక్ష్యాలను అమరావతిలోని కాల చక్ర మ్యూజియంలో నిర్లక్ష్యంగా వదిలేశారు. కొన్నాళ్ల క్రితం మ్యూజియంలోని రెండు శిలలను లండన్‌లో జరిగిన ప్రపంచస్థాయి పురావస్తు ప్రదర్శనకు తీసుకెళ్లారు. అక్కడ రెండు నెలల పాటు ప్రదర్శనలో ఉంచారు. తిరిగి కాలచక్ర మ్యూజియానికి తెచ్చారు. మ్యూజియం మూత ఉండటంతో బయట పడేశారు.

– న్యూస్‌టుడే, అమరావతి

కాశీ వేణుగోపాలుడే సాక్ష్యం

గురజాల మండలం చర్లగుడిపాడులోని సాక్షి వేణుగోపాలస్వామి ఆలయానికి చారిత్రక నేపథ్యం ఉంది. పూర్వం చోళరాజుల పాలనలో కాశీ నగరంలో ఓ బ్రాహ్మణోత్తముడు భిక్షాటన చేస్తూ జీవించేవాడు. ఆయనకు గూని ఉండటంతో వివాహానికి నోచుకోలేదు. అతడు దాచిన ధనాన్ని అపహరించేందుకు మరో బ్రాహ్మణుడు కుట్ర పన్నాడు. తనకు తెలిసిన యువతి ఉందని, ఆమెతో వివాహం జరిపిస్తానని నమ్మబలికి అతడి వద్ద ఉన్న ధనం తీసుకుని కనిపించకుండా వెళ్లిపోయాడు. బీద బ్రాహ్మణుడు చింతిస్తున్న సమయంలో ఆ నగరానికి చెందిన పలువురు పరామర్శించగా జరిగిన విషయం తెలియజేశాడు. నగదు ఇచ్చిన సమయంలో సాక్షిగా ఎవరైనా ఉన్నారా? అని అడగ్గా వేణుగోపాలుడే సాక్ష్యం అని చెప్పగా.. అది విన్నవారు రకరకాలుగా మాట్లాడి వెళ్లిపోయారు. ఈ క్రమంలో బీద బ్రాహ్మణుడికి రాత్రి కలలో వేణుగోపాలస్వామి కనబడి నగరంలో అధర్మం, దుర్మార్గం ఎక్కువగా ఉందని, ఇక్కడి నుంచి వెళ్లిపోతున్నానని, తనను బండిపై తీసుకెళ్లాలని, ఎద్దులు కదలకుండా ఎక్కడ ఆగుతాయో అక్కడ ప్రతిష్ఠించాలని చెప్పి అదృశ్యం అయ్యారు. అలా బీద బ్రాహ్మణుడు బండి కట్టుకుని బయలుదేరాడు. ఆ బండి గురజాల మండలం చర్లగుడిపాడు పొలిమేరకు వచ్చి ఆగింది. ఎద్దులను ఎంత కొట్టినా అక్కడినుంచి కదలలేదు. అదే సమయంలో నగదు కాజేసిన బ్రాహ్మణుడు తారసపడ్డాడు. ఇద్దరూ వాదోపవాదాలు చేసుకుంటుండగా గ్రామస్థులు వచ్చి చోళరాజు వద్దకు తీసుకెళ్లారు. ఇద్దరూ జరిగిన విషయం తెలియజేశారు. అప్పుడు భూపతిరాజు సాక్ష్యం ఎవరని అడగ్గా తన బండిలో కాశీ వేణుగోలస్వామి ఉన్నారని, ఆయనే సాక్ష్యమని చెప్పారు. సత్యం గ్రహించిన బ్రాహ్మణుడు నగదును తిరిగి ఇచ్చాడు. అనంతరం చోళరాజులు వేణుగోపాలుడిని చర్లగుడిపాడులో ప్రతిష్ఠించారు. అప్పట్నుంచి సాక్షి వేణుగోపాలుడిగా ప్రసిద్ధి పొంది, పూజలు అందుకుంటున్నారు. – న్యూస్‌టుడే, గురజాల గ్రామీణ

పేరేచర్లలో మరో స్క్రబ్ టైఫస్ కేసు

మేడికొండూరు: మేడికొండూరు మండలంలో మరో స్క్రబ్ టైఫస్ కేసు వెలుగులోకి వచ్చింది. మండలంలోని పేరేచర్ల లక్ష్మీనరసింహా కాలనీకి చెందిన 76 ఏళ్ల వృద్ధుడు దగ్గు, ఆయాసంతో బాధ పడుతున్నారు. గత నెలలో ఆరు బయటకు వెళ్లిన సమయంలో ఆయన్ను కీటకం కుట్టింది. తర్వాత కొద్ది రోజుల వ్యవధిలో విపరీతమైన జ్వరం వచ్చింది. తొలుత గ్రామంలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స తీసుకున్నా ఫలితం లేకపోవడంతో మెరుగైన చికిత్సకు గత నెల 21న గుంటూరు సర్వజనాసుపత్రికి వెళ్లారు. అక్కడ వైద్య పరీక్షలు చేయగా స్క్రబ్ టైఫస్‌గా నిర్ధారణ అయ్యింది. దీంతో గ్రామంలో మొత్తం రెండు కేసులు నమోదైనట్లు స్థానిక వైద్య సిబ్బంది చెప్పారు.

నైపుణ్యం పెంచుకో.. అవకాశం అందుకో..

న్యూస్‌టుడే, నరసరావుపేట

నిరుద్యోగ యువతకు వెన్నుదన్నుగా స్కిల్‌హబ్‌లు

విద్యార్హతకు తగిన ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లేక ఇబ్బంది పడుతున్న నిరుద్యోగ యువతకు ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ అండగా నిలుస్తోంది. బహుళజాతి సంస్థలు, పెద్దఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పించే సంస్థలు కోరుకునే విధంగా యువతకు నైపుణ్య శిక్షణ ఇస్తోంది. ఆయా కంపెనీలతో జాబ్‌మేళాలు ఏర్పాటు చేసి ఉద్యోగాలు కల్పిస్తోంది.

ఏడుచోట్ల కేంద్రాలు..

నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు నియోజకవర్గానికి ఒకటి చొప్పున జిల్లాలో ఏడు స్కిల్‌హబ్‌లను ఏర్పాటు చేశారు. సత్తెనపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల, క్రోసూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, నరసరావుపేటలోని నాక్ కేంద్రం, పిడుగురాళ్లలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, వినుకొండలోని ఎస్‌జీకే డిగ్రీ కళాశాల, మాచర్లలోని ఎస్‌కేబీఆర్ డిగ్రీ కళాశాల, చిలకలూరిపేటలోని రాగన్నపాలెం కమ్యూనిటీ హాలులో స్కిల్‌హబ్‌లు ఏర్పాటై యువతకు సేవలందిస్తున్నాయి.

శిక్షణలో నిరుద్యోగ యువత

ఉపాధి, ఉద్యోగాలిచ్చే కోర్సుల్లో శిక్షణ

ఇండస్ట్రియల్ ఎలక్ట్రీషియన్, ప్లంబర్, జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్, డొమెస్టిక్ బయోమెట్రిక్ ఆపరేటర్, ఫీల్డ్ టెక్నీషియన్ కంప్యూటింగ్, పెరిఫరల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్, బేసిక్స్ ఎంఎస్ ఆఫీస్ తదితర కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నాయి. కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్ డొమెస్టిక్ వాయిస్ కోర్సుల్లో జిల్లాలో ఒక్కో బ్యాచ్‌లో 660 మందికి శిక్షణ ఇస్తున్నారు.

విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు

ఐటీఐ, డిప్లొమో పూర్తి చేసి రెండు నుంచి మూడేళ్ల అనుభవం ఉన్న యువకులు, నర్సింగ్ కోర్సు పూర్తి చేసిన వారికి జర్మనీ, దుబాయ్‌లో ఉద్యోగాలు కల్పిస్తున్నారు. అక్కడి భాషతోపాటు నైపుణ్య శిక్షణ ఎనిమిది వారాలపాటు ఇస్తున్నారు. నైపుణ్య శిక్షణను సద్వినియోగం చేసుకుని నిరుద్యోగులు, విద్యార్థులు భవితను మార్చుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి తమ్మాజీరావు చెప్పారు.

❖ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాలో ఏర్పాటు చేసిన జాబ్‌మేళాలు: 52

❖ జాబ్‌మేళాలో పాల్గొన్న ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే సంస్థలు : 297

❖ ఇప్పటివరకు ఉద్యోగాలు పొందిన వారు : 2,632 మంది

ఏఆర్‌టీ కేంద్రానికి జాతీయ పురస్కారం

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలో హెచ్‌ఐవీ నియంత్రణ, ఎయిడ్స్ బాధితులకు అందించిన సేవలకు నరసరావుపేటలోని ప్రభుత్వ ఏఆర్‌టీ కేంద్రానికి జాతీయ స్థాయిలో రెండో స్థానం, రాష్ట్రంలో ప్రథమ స్థానం లభించింది. జిల్లాలో ఎయిడ్స్ బాధితుల గుర్తింపు, అవగాహన కార్యక్రమాల నిర్వహణ, హెచ్‌ఐవీ పరీక్షల నిర్వహణ, అనంతరం ఔషధాల అందజేత, కౌన్సెలింగ్ తదితర అంశాలపై ఏఆర్‌టీ వైద్యులు చేసిన కృషికి ఉత్తమ పురస్కారం దక్కింది. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ఈనెల 1న విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ నీలకంఠారెడ్డి నరసరావుపేట ఏఆర్‌టీ కేంద్రం వైద్యురాలు డాక్టర్ శారదకు పురస్కారాన్ని అందజేశారు. ఈసందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ రవి ఏఆర్‌టీ కేంద్రం వైద్యులు, అధికారులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో 53 శాతంగా ఉన్న వైద్య సేవలను 75 శాతానికి పెంచారని, అదే స్ఫూర్తితో నూరు శాతం పనితీరు కనబరచాలన్నారు. జిల్లా టీబీ, ఎయిడ్స్ లెప్రసీ నివారణ విభాగం అధికారిణి డాక్టర్ మాధవీలత, సిబ్బంది ఉన్నారు.

డాక్టర్ శారదను అభినందిస్తున్న డీఎంహెచ్‌వో

ఏపీ టెట్ నిర్వహణకు ఐదు కేంద్రాల గుర్తింపు

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలో ఏపీ టెట్ అక్టోబరు-2025 పరీక్షల నిర్వహణకు ఐదు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు డీఈవో చంద్రకళ తెలిపారు. ఈనెల 10 నుంచి 21వ తేదీ వరకు రెండు సెషన్లలో పరీక్షలు ఉంటాయన్నారు. ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల, నరసరావుపేట ఇంజినీరింగ్ అటానమస్ కళాశాల (యల్లమంద), ఏఎంరెడ్డి స్మారక ఇంజినీరింగ్ కళాశాల (పెట్లూరివారిపాలెం), ఎంఏఎం మహిళా ఇంజినీరింగ్ కళాశాల (కేశానుపల్లి), తిరుమల ఇంజినీరింగ్ కళాశాల (జొన్నలగడ్డ) కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు.

రైతేరాజు
ఆదాయ వనరు పొట్ల సాగు 6లో
ధాన్యం నిల్వలో అప్రమత్తత అవసరం

సామర్థ్య పరీక్షలు.. దూరం.. భారం

న్యూస్‌టుడే, సత్తెనపల్లి, పిడుగురాళ్ల

రవాణా వాహనదారులకు తిప్పలు

రవాణా వాహనాలకు సామర్థ్య పరీక్షలు(ఎఫ్‌సీ) చేయించుకోవాలంటే పొరుగు జిల్లాకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. మొన్నటివరకు రవాణాశాఖ కార్యాలయాల వద్ద ఎఫ్‌సీలు జరిగేవి. ఈ నెల ఒకటో తేదీ నుంచి ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ల(ఏటీఎస్)లోనే వాటిని చేయించుకోవాలని కేంద్రం ఆదేశాలు ఇచ్చింది. జిల్లాలో ఏటీఎస్ ఒక్కటీ లేదు. దీంతో గుంటూరు జిల్లాకు వాహనదారులు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.

❖ జిల్లాలో ఎఫ్‌సీల పరిధిలోకి వచ్చే వాహనాలు 59 వేల వరకు ఉన్నాయి. రవాణా వాహనం ఎనిమిదేళ్లలోపు అయితే రెండేళ్లకోసారి, అది దాటితే ఏడాదికి ఒకసారి తప్పనిసరిగా ఎఫ్‌సీ చేయించుకోవాలి. గత నెలాఖరు వరకు నరసరావుపేట, పిడుగురాళ్ల, చిలకలూరిపేట, మాచర్ల రవాణాశాఖ కార్యాలయాల పరిధిలో వాటిని చేశారు. తమకు దగ్గర్లోని కార్యాలయాల్లో వాహనదారులు ఎఫ్‌సీలు చేయించుకునేవారు. ఇప్పుడు ప్రభుత్వం కాకుండా ప్రైవేట్ సంస్థల ఆధ్వర్యంలో నడుస్తున్న ఏటీఎస్‌ల వద్దకు వాహనదారులు వెళ్లాల్సి వస్తుంది.

❖ నూతన విధానంలో సామర్థ్య పరీక్ష కోసం పొరుగు జిల్లాకు వెళ్లాలంటే శ్రమతో కూడుకున్న పని. ఎఫ్‌సీకి గుంటూరు జిల్లాలోని బుడంపాడుకు వెళ్తే వెంటనే ఆ ప్రక్రియ పూర్తవుతుందనే నమ్మకం లేదు. వాహనాలు బారులు తీరి ఉన్నా.. సాంకేతిక సమస్య ఎదురైనా మరుసటి రోజు వరకు వేచి ఉండాల్సిందే.



❖ మాచర్ల నుంచి బుడంపాడుకు 134 కిలోమీటర్ల దూరం. వినుకొండ నుంచి అయితే 100 కి.మీ. అంత దూరం ప్రయాణించి వాహన సామర్థ్య పరీక్షలు చేయించుకోవాల్సి రావడం ఆర్థికంగా వాహనదారులకు భారం. అన్నిరకాల రవాణా వాహనాలకు ఎఫ్‌సీ తప్పనిసరి. అది చేయించుకోకుండా రోడ్లపై తిరిగితే జరిమానాలు పడతాయి. చాలా సందర్భాల్లో వాహనాల్ని రవాణాశాఖ అధికారులు నిలిపేస్తారు. దీంతో ఏటీఎస్‌లు జిల్లాలో అందుబాటులో ఉంటే మంచిదనే అభిప్రాయాన్ని లారీ ఓనర్స్ అసోసియేషన్, ఆటో యజమానుల సంఘాల బాధ్యులు కోరుతున్నారు. రొంపిచర్లలోని ఏటీఎస్‌ను పూర్తిస్థాయిలో వాడుకలోకి తెచ్చే చర్యలు తీసుకుంటున్నామని త్వరలోనే సేవలు అందుబాటులోకి వస్తాయని రవాణాశాఖ అధికారులు తెలిపారు.

మాచర్లకు మూడుగంటలా!

పల్లెవెలుగు బస్సులతో ప్రయాణికుల తిప్పలు

ఈనాడు డిజిటల్, నరసరావుపేట: మాచర్లకు వెళ్లాలంటేనే నరసరావుపేట వాసులు భయపడుతున్నారు. ఏకంగా మూడు గంటల ప్రయాణం సమయాన్ని మింగేస్తుండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్టీసీ పల్లెవెలుగు సర్వీసులే తప్పించి, ఎక్స్‌ప్రెస్‌లు లేకపోవడంతో సమస్య వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కేంద్రం నరసరావుపేటకు మాచర్ల వాసులు రావాలన్నా.. నరసరావుపేట నుంచి ఎవరైనా మాచర్ల వెళ్లాలన్నా కేవలం పల్లెవెలుగు సర్వీసులే దిక్కు. గుంటూరు నుంచి మాత్రమే ఎక్స్‌ప్రెస్ సర్వీసులు నడుస్తున్నాయి. అవికూడా సత్తెనపల్లి, పిడుగురాళ్ల, గురజాల మీదుగా మాచర్లకు వెళుతున్నాయి. నరసరావుపేట నుంచి వయా కారంపూడి మీదుగా ఒక్క ఎక్స్‌ప్రెస్ సర్వీసు కూడా లేదు. ఈ మార్గంలో గ్రామాలు ఎక్కువ. స్టాప్‌లు ఎక్కువ, రోడ్డు కొన్నిచోట్ల గుంతలు ఉండటం, వన్‌వే కావడంతో బస్సు మాచర్ల నుంచి నరసరావుపేట చేరుకోవడానికి మూడు గంటలు పడుతోంది.

ముఖ్యంగా ఈ మార్గంలో నడిపే పల్లెవెలుగు బస్సులన్నీ చాలా పాతవి. వేగంగా నడవడం లేదు. మహిళలకు ఉచిత ప్రయాణం ఉండటంతో వారి సంఖ్య పెరిగింది. ప్రతిస్టాప్‌లో ఎక్కువ మంది ఎక్కి దిగడం వల్ల బస్సు నిలిపే సమయం పెరిగింది. ఇది వరకు కంటే అరగంట సమయం అదనంగా పెరిగింది. ప్రభుత్వ ఉద్యోగులతో పాటు ప్రైవేటు ఉద్యోగులు కూడా మాచర్ల నుంచి నరసరావుపేటకు రాకపోకలు సాగిస్తున్నారు. కనీసం తమకోసమైనా ఉదయం, సాయంత్రం వేళల్లో ఎక్స్‌ప్రెస్ నడపాలని కోరుతున్నారు. మొన్నటివరకు ఈ మార్గంలో ఎక్స్‌ప్రెస్ ఆక్యుపెన్సీ లేదని నడపలేదని ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఇప్పుడు స్త్రీశక్తి పథకంలో మహిళల సంఖ్య పెరగడంతో ఎక్స్‌ప్రెస్‌లో కూడా ఉచితం ఉండటంతో మాచర్లకు నరసరావుపేట నుంచి వయా కారంపూడి మార్గంలో ఎక్స్‌ప్రెస్ సర్వీసులు నడపాలనే డిమాండ్లు పెరిగాయి. దీనిపై డీపీటీవో అజితకుమారి మాట్లాడుతూ స్త్రీశక్తి పథకం అమల్లోకి వచ్చాక జిల్లాలో మాచర్ల, చీరాల రూట్‌లు పల్లెవెలుగు సర్వీసులు బాగా నిండుతున్నాయి. మాచర్ల మార్గంలో ఎక్స్‌ప్రెస్ నడపాలంటే బస్సులు అదనంగా రావాల్సి ఉందని చెప్పారు.

S.B.V.R. అగ్రికల్చరల్ కళాశాల, బద్వేలు

ఇంటర్మీడియట్ నందు Bi.P.C విభాగంలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు చివరి అవకాశం. కడప జిల్లా బద్వేలులో I.C.A.R., NEW DELHI వారిచే గుర్తింపు పొందిన S.B.V.R. అగ్రికల్చరల్ కాలేజ (S.B.V.R. A.G.B.Sc), నందు B.Sc (Hons.) Agricultureలో అడ్మిషన్ కొరకు ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకున్నా, చేసుకోకపోయినా కన్వీనర్ కోటాలో అగ్రికల్చరల్ బి.ఎస్సీ చేరుటకు చిట్ట చివరి అవకాశం కలదు.

వివరములకు సంప్రదించవలసినది : 94400 33523, 91825 05395, 94928 56652.
కరెస్పాండెంట్, S.B.V.R. అగ్రికల్చరల్ కళాశాల

(c) eenadu

అర్జీదారుల్లో మహిళలే అధికం

ఫిర్యాదుదారుతో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా

నరసరావుపేట అర్బన్: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు మహిళలు పెద్ద ఎత్తున హాజరై తమ సమస్యలు పరిష్కరించాలని అర్జీలు సమర్పించారు. కలెక్టర్ కృతికా శుక్లా, డీఆర్వో మురళి, జిల్లా అధికారులు అర్జీలను స్వీకరించారు. 134 అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. వాటిలో ఇళ్ల స్థలాలు కేటాయించాలని మహిళలు అర్జీలు సమర్పించారు. ఎస్ఆర్‌కేటీ కాలనీలో వసతులు కల్పించాలని కోరారు. పింఛన్లు ఇప్పించాలని వినతులు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ అర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేకదృష్టి పెట్టాలని ఆదేశించారు. నిర్ణీత కాలంలో అర్జీలు పరిష్కారం కావాలని స్పష్టం చేశారు. అధికారులు చూపే పరిష్కారం నాణ్యమైనదిగా ఉండాలన్నారు. అలాగే పీజీఆర్ఎస్‌పై ఆడిట్ పూర్తి చేయాలని చెప్పారు. జిల్లా అధికారులు ఉన్నారు.

సమస్యలకు పరిష్కారం చూపుతాం

సమస్య తెలుసుకుంటున్న అదనపు ఎస్పీ సంతోష్

మల్లమ్మ సెంటర్(నరసరావుపేట), న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ప్రతి ఫిర్యాదును పరిష్కరించనున్నట్లు అదనపు ఎస్పీ జె.వి.సంతోష్ తెలిపారు. పట్టణంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. భార్యభర్తల తగాదాలు-29, ఆస్తి తగాదాలు-24, ఆర్థికపరమైన నేరాలు-20, భూవివాదాలు-18, ఆర్థిక మోసాలు-20, కుటుంబ సమస్యలపై-13 ఇతరులు-10 మొత్తం 134 అర్జీలు అందినట్లు తెలిపారు.

అదనపు కట్నం కోసం వేధింపులు..

బెల్లంకొండ మండలం వెంకటాయపాలెం గ్రామానికి చెందిన యువతికి, అదే మండలం పాపాయపాలేనికి చెందిన వ్యక్తితో 2019లో వివాహమైంది. కొన్నేళ్ల తర్వాత భార్యాభర్తల మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. దీనికి తోడు ఆమెకు సంతానం కలగపోవడంతో ఇదే సాకుగా చూపి తన భర్తకు మరో వివాహం చేయాలని చూస్తున్నారని, ఈ కారణంతో అదనపు కట్నం తీసుకు రావాలని వేధింపులకు గురి చేసి పుట్టింటికి పంపేశారని అదనపు ఎస్పీ వద్ద బాధితురాలు వాపోయారు. తనకు న్యాయం చేయాలని కోరారు.

శ్రీ గంగాభ్రమరాంబ మల్లేశ్వర స్వామి దేవస్థానము,
కురగల్లు (గ్రా), మంగళగిరి (మం), గుంటూరు జిల్లా.
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
కురగల్లు (గ్రా), మంగళగిరి (మం), గుంటూరు జిల్లా శ్రీ గంగాభ్రమరాంబ మల్లేశ్వర స్వామి దేవస్థానము పునఃనిర్మాణము కొరకు టెండర్లు ప్రకటన చేయడమైనది. మిగిలిన వివరముల కొరకు https://tender.apeprocurement.gov.in లో చూడవచ్చును.
సంప: కార్యనిర్వహణాధికారి,
శ్రీ గంగా భ్రమరాంబ మల్లేశ్వర స్వామి దేవస్థానము, కురగల్లు (గ్రా), మంగళగిరి (మం), గుంటూరు జిల్లా

రసవత్తరంగా ఎడ్ల పోటీలు

గురజాల, న్యూస్‌టుడే: పాతపాటమ్మ తిరునాళ్లను పురస్కరించుకుని చేపట్టిన ఎద్దుల బండలాగుడు పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. సోమవారం జరిగిన 6 పళ్ల విభాగంలో దాచేపల్లి మండలం కేశానుపల్లి గ్రామానికి చెందిన నెల్లూరి రామకోటయ్య ఎడ్లజత 4014.10 అడుగుల దూరం లాగి మొదటి బహుమతి దక్కించుకున్నాయి. బాపట్ల మండలం యద్దనపూడికి చెందిన బాదర్ మస్తాన్‌రావు, మరిపప్పుడికి చెందిన గాదె ఆశీర్, సుమన్‌రెడ్డికి చెందిన సంయుక్త ఎడ్లజత 3886.8 అడుగుల దూరం లాగి రెండో బహుమతి అందుకున్నాయి. కృష్ణా జిల్లా పెనుమలూరు మండలం యనమలకుదురు గ్రామానికి చెందిన అనంతనేని శ్రీవాస్య, శ్రీమధు ఎడ్లజత 3871 అడుగుల దూరం లాగి మూడో బహుమతి పొందాయి. పోటీలను రైతు సంఘం ప్రతినిధులు ఎన్.ఉమ్మయ్య, ఎస్.మల్లయ్య, టి.బుచ్చిబాబు, పి.నాగేశ్వరరావు, ఎన్.శ్రీరామమూర్తి పర్యవేక్షించారు.

నిరాశ్రయులకు ఎన్టీఆర్ వైద్యసేవ కార్డులు

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలో అనాథలు, నిరాశ్రయులకు ఉచిత వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ కృతికా శుక్లా అన్నారు. డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ విస్తరణలో భాగంగా జిల్లాలో శిశు సంరక్షణ గృహాల్లో ఉంటున్న 45 మందికి అమృత్ వైద్య సేవ కార్డులను ఆమె సోమవారం అందజేశారు. డీఎంహెచ్‌వో డాక్టర్ రవి, ఎన్టీఆర్ వైద్యసేవ సమన్వయకర్త డాక్టర్ చంద్రశేఖర్ ఉన్నారు.

యూనియన్ బ్యాంక్ Union Bank of India
పండరీపురం బ్రాంచ్ (14421)
పల్నాడు జిల్లా-522616, ఫోన్: 8356814421, Email: ubin0814423@unionbankofindia.bank
ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టము 2002 యొక్క సెక్షన్ 13(2) ప్రకారము (SARFAESI ACT) డిమాండ్ నోటీసు

[illegible]

సౌకర్యము	NPA తేదీ 28.05.2025	28-05-2025 నుండి 13-10-2025 వరకు వడ్డీ			మొత్తం బాకీ
[illegible]	రూ.3,36,129/-	రూ.13,435/-	---	రూ.18,682/-	రూ.3,68,246/-
మొత్తం బాకీ					రూ.3,68,246/-

[illegible]

సదరు చట్టం యొక్క సెక్షన్ 13(13) ప్రకారం ఈ నోటీసు పొందిన అనంతరం మీరు పైన చెప్పబడిన ఆస్తులను సాధారణ వ్యాపార కార్యకలాపాలు తప్ప బ్యాంకు వారి అనుమతి లేకుండా విక్రయించరాదు మరియు లావాదేవీలు జరుపరాదు. సదరు సెక్షన్‌లో నిబంధనలలో ఏవిధమైన అతిక్రమణ జరిగిన తీవ్ర పరిణామాలకు దారి తీస్తుందని గమనించగలరు.
SARFAESI చట్టములోని సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) ప్రకారం ఋణగ్రహీత తనఖా ఆస్తిని గడువులోపల విడిపించుకొనుటకు గాను దృష్టిసారించవలసి ఉన్నది.
స్థలం : చిలకలూరిపేట, సం/- చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి,
తేది: 04-11-2025 యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పండరీపురం బ్రాంచ్, పల్నాడు జిల్లా.

దివ్యాంగుల అభ్యున్నతికి కృషి

పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అరవిందబాబు

నరసరావుపేట అర్బన్, సెంట్రల్: రాష్ట్రంలో దివ్యాంగుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే అరవింద బాబు అన్నారు. సమగ్రశిక్షా ఆధ్వర్యంలో జిల్లాస్థాయి పారా ఒలింపిక్స్ క్రీడలను సోమవారం జడ్పీ ఉన్నత పాఠశాల శంకరభారతిపురంలో నిర్వహించారు. డీఈవో చంద్రకళతో కలిసి పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ శారీరక వికలాంగుల కంటే దివ్యాంగులే బలవంతులని చెప్పారు. డీఈవో మాట్లాడుతూ జిల్లాలో సుమారు 6 వేల మంది దివ్యాంగ విద్యార్థులు ఉన్నారన్నారు. 28 మండలాల్లో భవితసెంటర్లు ఉన్నాయని, వీటి ద్వారా వారికి అవసరమైన సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. ప్రధానోపాధ్యాయిని పార్వతి, కూటమి పార్టీల నేతలు రంగిశెట్టి రామకృష్ణ, కపలవాయి విజయ్‌కుమార్, భవిత పాఠశాలల సమన్వయకర్త సెల్వరాజ్ ఉన్నారు.

ఆదాయ వనరు పొట్ల సాగు

చినగంజాం, న్యూస్‌టుడే: చినగంజాం మండలంలోని సోపిరాల, పూలవారిపాలెం, కడవకుదురు, మోటుపల్లి, పెదగంజాం, కొత్తపాలెం తదితర గ్రామాల్లో రైతులకు పందిరి పొట్ల ఆదాయ వనరుగా మారింది. ఇసుక భూముల్లో విద్యుత్తు మోటార్ల సాయంతో ఈ సాగు చేస్తున్నారు. ఇది ఖర్చుతో కూడినది.

పందిరిలో కాసిన పొట్ల కాయలు

ఐదు సెంట్ల విస్తీర్ణం నుంచి 20 సెంట్ల వరకు పందిళ్లను ఏర్పాటు చేస్తున్నారు. ముందుగా భూమిని రెండు సార్లు దున్ని, వాటిలో పాదులు పెడతారు. 5 సెంట్ల భూమిలో 25 పాదులు ఏర్పాటు చేస్తారు. పాదుకు 5 విత్తనాలు విత్తుతారు. ఇవి వారం రోజుల్లో మొలకెత్తుతాయి. అక్కడ నుంచి పాదులకు మొక్కల నుంచి పొట్ల తీగలు పందిరికి పాకేలా కర్రలతో గూడలు కడతారు. 60 రోజుల నుంచి కాయలు కాస్తాయి. ఏడాది పొట్ల విత్తనాల ధర రూ.500 నుంచి రూ.700 ఉంది. 5 సెంట్లలో సాగుకు సుమారు రూ.10 వేల ఖర్చవుతుందని రైతులు తెలిపారు. పంట కాలంలో సుమారు 1,000 నుంచి 1,200 కాయలు కాస్తాయన్నారు. ప్రస్తుతం ఒక్కో కాయను రూ.25 నుంచి రూ.30 వరకు అమ్ముతున్నారు. రూ.25 వేల ఆదాయం వస్తుందని, అన్ని ఖర్చులు పోగా రూ.15 వేల మిగులుతుందని కర్షకులు తెలిపారు.

నా పేరు ఎం.కోటేశ్వరి. మాది చినగంజాం. శాంతి డ్వాక్రా సంఘంలో సభ్యురాలిని. 5 సెంట్ల భూమిలో పొట్ల సాగు చేశా. పందిరి వద్దే కాయ రూ.25 నుంచి రూ.30 అమ్ముతున్నా. కుటుంబ సభ్యులందరూ కలిపి పొట్ల, మిరప, ఇతర కూరగాయలు సాగు చేస్తాం. వీటి ద్వారా వచ్చే ఆదాయంతో కుమారుడు రాము బీహెచ్ఎంఎస్, కుమార్తె స్రవంతిని ఫార్మసీ చదివిస్తున్నాం. పొదుపు సంఘం నుంచి తీసుకున్న రుణాన్ని నెలనెలా క్రమం తప్పకుండా చెల్లిస్తున్నా.

బంతి పూల సిరులు

మక్కెనవారిపాలెం (సంతమాగులూరు), న్యూస్‌టుడే: సంతమాగులూరు మండలం మక్కెనవారి పాలెం, కొమ్మాలపాడు రైతులు బంతి పూల సాగుతో సిరులు పండిస్తున్నారు. ఈ గ్రామాల్లో 30 ఎకరాలకు పైగా పూల తోటల సాగు చేపట్టారు. మొక్క నాటిన తర్వాత 55 రోజుల నుంచి పూలు పూస్తాయి. ఏడాది పొడవునా పూస్తూనే ఉంటాయి.

కొమ్మాలపాడులో సాగు చేసిన బంతి పూల తోట

ఎకరా సాగుకు నారు దగ్గర నుంచి పూలు పూర్తిగా కోసే వరకు రూ.80 వేల నుంచి రూ.లక్ష మేర అవుతుంది. 80 నుంచి వంద క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. సగటున క్వింటా రూ.3 వేల వంతున వంద క్వింటాళ్లకు రూ.3 లక్షలకు పైగా ఆదాయం సమకూర వీలుంది. దీనిలో పెట్టుబడి ఖర్చులు పోను రూ.2 లక్షల మేర లాభం ఉండటంతో బంతి పూల సాగుకు రైతులు మొగ్గు చూపుతున్నారు.

వ్యర్థాలకు నిప్పు.. భూసారానికి ముప్పు

వరికోత తర్వాత రబీ సాగు చేసే ముందు పంట మొదలును రైతులు నిప్పుపెట్టడంతో భూమిలో ఎరువుగా ఉపయోగపడే సూక్ష్మ పోషకాలకు హాని జరుగుతుందని పొన్నూరు వ్యవసాయశాఖ అధికారి రాజశేఖర వెంకటేశ్వరరావు తెలిపారు. భూమి భౌతిక పరిస్థితి దెబ్బతింటుంది. మిత్ర పురుగులు కాలిపోతాయి. నేల పైపొరలోని సూక్ష్మపోషకాల స్థాయి తగ్గుతుంది. దిగుబడులపై ప్రభావం చూపుతుంది. కార్బన్ మోనాక్సైడ్ విడుదలై వాయు కాలుష్యానికి కారణమవుతుంది. భూసారానికి నష్టం కలుగుతుంది. గడ్డి అలా వదిలేస్తే.. కుళ్లి సేంద్రియ ఎరువుగా మారుతుంది. రబీలో సాగు చేసే పంటకు పొటాషియం, నత్రజని, స్వరం తదితర పోషకాలు అందుతాయి. **న్యూస్‌టుడే, పొన్నూరు**

రైతేరాజు

ధాన్యం నిల్వలో అప్రమత్తత అవసరం

అమృతలూరు, న్యూస్‌టుడే: మారుతున్న వాతావరణ పరిస్థితులు అనగా అధిక ఉష్ణోగ్రత, వర్షాలు, అల్ప ఉష్ణోగ్రతలు పంటకు నష్టం కలిగిస్తాయి. కీటకాలు, శిలీంద్రాలు, కలుపు మొక్కల కారణంగా కోతకు ముందే 20 నుంచి 30 శాతం, కోత అనంతరం నిల్వ చేసుకునే చర్యలతో 10 నుంచి 25 శాతం వరకు నష్టం వాటిల్లుతుందని ఏవో భరత్‌కుమార్ తెలిపారు.

తేమ శాతం తగ్గేందుకు ఆరబోసిన ధాన్యం

తేమ, ఉష్ణోగ్రతలు తక్కువ ఉండేటట్లు చూసుకుని ధాన్యం జీవిత కాలాన్ని పెంచుకోవాలని చెప్పారు. ధాన్యం నిల్వ చేయడంలో మెలకువలను వివరించారు.

❖ కీటకాలు, శిలీంద్రాలు త్వరగా అభివృద్ధి చెందడానికి తేమ ఉత్ప్రేరకంగా పనిచేస్తుంది. నిల్వకు ముందుగానే ధాన్యాన్ని ఎండలో ఆరబెట్టి, చల్లటి ధాన్యాన్ని మాత్రమే దాచుకోవాలి. శాస్త్రీయంగా నిర్మించిన మంచి గాలి వెలుతురు కలిగిన ధాన్యాగారాలను ఎంపికచేసుకుని నిల్వ చేసుకోవాలి. నేల ద్వారా చెమ్మ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఆరబెట్టిన సమయంలో ధాన్యం తేమ శాతం 12 ఉండాలి. అంతకన్నా అధికంగా ఉన్న సమయంలో కీటకనాశినలు వాడుకోవాలి. వేపాకు, వేప నూనె, వేప, సీతాఫలం గింజలపొడిలో ఏదో ఒకటిని ధాన్యంలో కలిపి నిల్వ చేసుకుంటే ఆరు నెలల నుంచి ఏడాది వరకు పురుగు పట్టకుండా కాపాడుకోవచ్చని ఆయన వివరించారు.

రైతు ప్రశ్న? శాస్త్రవేత్త సలహా

? సెనగ పంటను ఎండు తెగులు ఆశించి నష్టపరుస్తోంది. నివారణ చర్యలు ఏమిటి? –**కాలారి శ్రీనివాసరావు, తాడికొండ**

✔ శనగ పంటలో ఎండు తెగులు అనేది పుసరిమ్ అనే బూజు ఆశించడం వల్ల వస్తుంది. దీనివల్ల మొక్కలు ఒడలి పసుపు రంగులోకి మారి పూత, కాయ లేకుండా ఎండిపోతాయి. మొదట పొలంలో అక్కడక్కడ మొక్కలు ఎండిపోయి తరువాత పొలమంతా వ్యాపించి మొక్కలు మొత్తం ఎండి పోతాయి. దీని నివారణకు సస్యరక్షణ చర్యలు పాటించాలి.

❖ ఎండు తెగులు తట్టుకునే ఎన్‌బీఈజీ-776, 778, 452, 857 వంగడాలను సాగు చేసుకోవాలి.

❖ కిలో శనగ విత్తనానికి 10 గ్రా. ట్రైకోడెర్మవిరిడీని కలిపి విత్తన శుద్ధి చేసుకోవాలి.

❖ 90 కిలోల పశువుల ఎరువు, 10 కిలోల వేప పిండి, 2 కిలోల ట్రైకోడెర్మవిరిడి పొడిని కలుపుకోవాలి. దీనిని నీడ కింద కుప్పగా చేసి గోనె పట్టా కప్పి రోజు లేదా రెండు రోజులకు ఒకసారి నీటిని చిలకరించాలి. 20 రోజుల తర్వాత కుప్ప మీద బూజు వచ్చిన తర్వాత పొలంలో ఆఖరి దుక్కి ముందు దీనిని చల్లుకుని విత్తుకోవాలి. ప్రతి సంవత్సరం ఈ తెగులు ఆశిస్తున్నట్లయితే జొన్న లేదా మొక్కజొన్న పంటలతో పంట మార్పిడి చేసుకోవాలి.

– గుంటూరు, న్యూస్‌టుడే

కత్తెర పురుగును కట్టడి చేద్దాం

పల్నాడు ప్రాంతంలో రబీ పంటగా మొక్కజొన్నను ఎక్కువగా సాగుచేస్తున్నారు. ఇటీవల ఈ పంటకు కత్తెర పురుగు ఆశించడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. రాత్రి పూట ఉష్ణోగ్రతలు తగ్గి, పొడి వాతావరణం ఉన్న పరిస్థితుల్లో ఈ పురుగు వ్యాపిస్తోంది. మొక్క దశలోనే గుర్తిస్తే ఉధృతిని చాలా వరకు నివారించొచ్చని పిడుగురాళ్ల ఏడీఏ శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. మొదటి నెల రోజుల వ్యవధిలో ఎకరా పొలంలో మోనోక్రోటోఫాస్ లేదా క్వినాల్‌ఫాస్ లేదా క్లోరోపైరిపాస్ ఏదో ఒక మందును లీటరు నీటికి 2మి.లీ, పిచికారీ చేయాలి. లేదా 5మి.లీ వేప నూనెను 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. పది శాతం మొక్కలకు పురుగులు ఆశిస్తే ఎకరానికి స్పైనిటోరమ్ 100 మి.లీ 80 గ్రాముల వంతున పిచికారీ చేయాలి. కత్తెర పురుగు ఎక్కువగా మొవ్వును ఆశిస్తుంది. రైతులు పురుగు మందులు మొవ్వు తడిసేలా పిచికారీ చేయాలని ఏడీఏ సూచించారు.

- గురజాల గ్రామీణ, న్యూస్‌టుడే

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యం

నరసరావుపేట వ్యవసాయం, న్యూస్‌టుడే: ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పండించిన ఉత్పత్తులు రుచికరంగా, ఆరోగ్యకరంగా ఉంటాయని డీపీఎం కె.అమలకుమారి అన్నారు. కలెక్టర్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక స్టాల్‌లో విక్రయిస్తున్న ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పండించిన ఉత్పత్తులను ఆమె సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి సోమవారం 28 మండలాల్లో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మహిళలు, ఉద్యోగులు ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేసి కుటుంబాలకు ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించాలన్నారు. ప్రత్యేక స్టాళ్లలో ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, కందిపప్పు, పసుపు, రెండు రకాల కారంపొడి, కుజీ పటాలియా నాటురకం బియ్యం తదితర ఉత్పత్తులు లభిస్తాయన్నారు. ప్రకృతి వ్యవసాయ రైతులు స్వయంగా ముందుకు వచ్చి ఆరోగ్యకరమైన ఉత్పత్తులు ప్రజలకు అందించటానికి ఈ స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నారని, వారిని ప్రోత్సహించేందుకు అందరూ ఈ ఉత్పత్తులను కొనుగోలు చేయాలని సూచించారు. ఎన్ఎఫ్ఏ మేరీ, మార్కెటింగ్ మాస్టర్ ట్రైనర్ సుబ్బారెడ్డి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది శివయ్య, సాంబయ్య, అమరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫ్లోర్‌బాల్‌లో పల్నాడు జిల్లాకు మూడో స్థానం

తృతీయ బహుమతి అందుకుంటున్న పల్నాడు జిల్లా మహిళల జట్టు

నరసరావుపేట క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి సీనియర్ పురుషులు, మహిళల ఫ్లోర్‌బాల్ అంతర్ జిల్లాల పోటీలు సోమవారం ముగిశాయి. స్థానిక ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ క్రీడా మైదానంలో నిర్వహించిన పోటీలకు హాజరైన 14 జట్లకు సుమారు 250 మంది క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించారు. పురుషుల విభాగంలో కృష్ణా, తిరుపతి జట్లు ఫైనల్‌లో తలపడగా, మహిళల విభాగంలో తిరుపతి, సత్యసాయి జిల్లాల జట్లు ఆడాయి. పోటీల ముగింపు కార్యక్రమానికి ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఛైర్మన్ డాక్టర్ నాగోతు ప్రకాష్, డైరెక్టర్ సబిత హాజరయ్యారు. గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏపీ ఫ్లోర్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి రత్నకుమార్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కిషోర్‌బాబు, సురేంద్ర పాల్గొన్నారు.

పురుషుల విభాగం విజేతలు : కృష్ణా జిల్లా (ప్రథమ), తిరుపతి జిల్లా (ద్వితీయ), ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్, నరసరావుపేట, పల్నాడు జిల్లా (తృతీయ)

మహిళల విభాగంలో.. తిరుపతి జిల్లా (ప్రథమ), సత్యసాయి జిల్లా (ద్వితీయ), పల్నాడు జిల్లా (తృతీయ)

నకిలీ బంగారం విక్రయ ముఠా అరెస్టు

సూర్యాపేట నేరవిభాగం: నకిలీ బంగారు బిస్కెట్లు అంటగట్టి మోసం చేస్తున్న నలుగురు అంతర్రాష్ట్ర ముఠా సభ్యులను సూర్యాపేట గ్రామీణ పోలీసులు సోమవారం అరెస్టు చేసినట్లు ఎస్పీ నరసింహ తెలిపారు. నిందితుల నుంచి 20 గ్రాముల ఐదు నకిలీ బిస్కెట్లు, రూ.12 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. నరసరావుపేటకు చెందిన ప్రధాన నిందితుడు నాగేశ్వరరావు అలియాస్ రాజారావు, బాల, మేడి ఆదినారాయణ తదితరులు తొమ్మిది మంది ముఠాగా ఏర్పడి మాయమాటలతో నకిలీ బంగారాన్ని తులం రూ.90 వేల చొప్పున విక్రయించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, నలుగురు నిందితులను పట్టుకున్నట్లు ఎస్పీ వివరించారు.

హోరాహోరీగా ఫుట్‌బాల్ పోటీలు

పురుషుల జట్ల మధ్య పోటీ

నరసరావుపేట క్రీడలు: ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 69వ రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల అండర్-17 బాల బాలికల ఫుట్‌బాల్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. పట్టణంలోని డాక్టర్ కోడెల శివప్రసాదరావు స్టేడియంలో సోమవారం రెండో రోజు బాలుర విభాగంలో తూర్పుగోదావరి- విశాఖపట్నం జట్ల మధ్య లీగ్ పోటీలను ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా 26 ఎకరాల్లో అన్ని వసతులు కలిగిన స్టేడియాన్ని ప్రజలకు మాజీ సభాపతి కోడెల శివప్రసాదరావు అందుబాటులోకి తెచ్చారన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఎన్.సురేష్‌కుమార్ మాట్లాడుతూ వివిధ జిల్లాల నుంచి 13 జట్లు పోటీల్లో పాల్గొంటున్నాయని, ప్రతిభ చూపిన క్రీడాకారులను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేస్తామన్నారు.

సెమీస్ దశకు చేరిక.. బాలుర విభాగంలో విజయనగరం, వైఎస్సార్ కడప, కర్నూలు జట్లు సెమీస్‌కు చేరగా ప్రకాశం- విశాఖ జట్లు సెమీస్ స్థానం కోసం తలపడనున్నాయి. బాలికల విభాగంలో కడప, విశాఖ, అనంతపురం జట్లు సెమీస్‌కు చేరాయి. నెల్లూరు- తూర్పుగోదావరి జట్లు సెమీస్ బెర్త్‌కు పోటీ పడనున్నాయి.

రాజీ మార్గంపై కక్షిదారులకు అవగాహన కల్పించండి

మాట్లాడుతున్న 13వ అదనపు జిల్లా కోర్టు ఇన్‌ఛార్జి న్యాయాధికారి శ్యామ్‌బాబు

నరసరావుపేట లీగల్, న్యూస్‌టుడే: ఈనెల 13న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో రాజీమార్గంలో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చూడాలని 13వ అదనపు జిల్లా న్యాయస్థాన ఇన్‌ఛార్జి న్యాయాధికారి కె.శ్యామ్‌బాబు న్యాయవాదులకు సూచించారు. న్యాయవాద సంఘ కార్యాలయంలో న్యాయవాదులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అదాలత్‌కు వచ్చిన కక్షిదారులకు తగిన సూచనలు ఇచ్చి కేసులు రాజీ మార్గంలో పరిష్కరించుకునేలా చూడాలని, తద్వారా నగదు, సమయం ఆదా కావడంతో పాటు కోర్టు ఫీజు వాపసు ఇస్తారని తెలియజేయాలని న్యాయవాదులకు తెలిపారు. సమావేశంలో న్యాయాధికారులు కె.మధుస్వామి, ఆశీర్వాదంపాల్, ఎన్.లావణ్య, సలోమి, న్యాయవాద సంఘ అధ్యక్షులు సుబ్బారావు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

ములకలూరులో స్క్రబ్‌టైఫస్ కలకలం!

ఇంటింటి సర్వే చేసిన ఆరోగ్య సిబ్బంది

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే: మండలంలోని ములకలూరు గ్రామంలో ఏసుపాదం అనే వ్యక్తి స్క్రబ్‌టైఫస్ వ్యాధి లక్షణాలు ఉన్నాయనే అనుమానంతో వైద్యఆరోగ్య సిబ్బంది సోమవారం గ్రామంలో ఇంటింటి సర్వే నిర్వహించారు. ఇతను నాలుగు రోజులుగా జ్వరం, ఒళ్లు నొప్పులతో బాధపడుతూ గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. అతను గ్రామ సమీపంలోని ఓ వెంచర్‌లో ఉండగా పురుగు కుట్టిందని, అప్పటి నుంచి తీవ్ర అనారోగ్యంగా ఉండటంతో గుంటూరు తరలించినట్లు వారి కుటుంబ సభ్యులు తెలిపారని వైద్య సిబ్బంది చెప్పారు. ఆసుపత్రిలో నిర్వహించిన పరీక్షల నివేదిక వస్తే స్క్రబ్‌టైఫస్ సోకిందా లేకా మరేదైనా కారణమా? అనేది తెలియజేస్తామని వారు తెలిపారు. ఇంటింటి సర్వేలో ఎక్కడా ఒక్కరికి కూడా జ్వరం, ఇతర అనారోగ్య సమస్యలు లేవని తెలిపారు. ఇంటింటి సర్వేలో ఆరోగ్య సిబ్బందితో పాటు పంచాయతీ కార్యదర్శి రామసీత ఉన్నారు.

ప్రమాదానికి కారణమైన వాహనం తనిఖీ

వాహనం నడిపి తనిఖీ చేస్తున్న ఎంవీఐ గోపాల్

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే : నాదెండ్ల మండలం గణపవరం వద్ద ఘోర రోడ్డు ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్ల లోడుతో వెళ్తున్న కంటైనర్‌ను చిలకలూరిపేట ఎంవీఐ ఎన్.గోపాల్ సోమవారం తనిఖీ చేశారు. స్వయంగా ఆయన వాహనాన్ని నడిపి బ్రేక్‌లు సక్రమంగా ఉన్నాయా.. లేదా పరిశీలించారు. ఈ వాహనం 2024 ఆగస్టులో కొనుగోలు చేసినట్లు గుర్తించామన్నారు. కొత్త వాహనం కావడంతో కండిషన్ అంతా బాగుందన్నారు.

91.9 FM Vijayawada ఈ FM 91.9 Mee FM
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
80080 03297

సస్పెన్షన్ ఉత్తర్వుల రద్దుకు అంగీకారం

కమిషనర్‌తో మాట్లాడుతున్న ఏపీ ఎన్జీవో సంఘం నేతలు

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: నాదెండ్ల మండలం గణపవరం పీహెచ్‌సీ కేంద్రం సిబ్బందిపై తీసుకున్న సస్పెన్షన్ నిర్ణయాన్ని రద్దు చేసేందుకు వైద్య, ఆరోగ్యశాఖ కమిషనర్ అంగీకరించారని జిల్లా ఏపీ ఎన్జీవో సంఘం అధ్యక్షుడు మర్లపాటి రామకృష్ణ తెలిపారు. ఈనెల 3న కమిషనర్ ఆకస్మిక తనిఖీ సందర్భంగా ఆరోగ్య కేంద్రానికి తాళాలు వేసి ఉండడంతో సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులకు ఆదేశాలిచ్చారు. ఈ నేపథ్యంలో ఎన్జీవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్ విజయవాడలో కమిషనర్‌ను సోమవారం కలిసి సిబ్బందిని సస్పెండ్ చేయడంపై పునరాలోచించాలన్నారు. అలాగే రాత్రివేళల్లో విధుల్లో ఉండే మహిళా సిబ్బంది భద్రతకు చర్యలు తీసుకోవాలని కోరినట్లు పేర్కొన్నారు. దీంతో కమిషనర్ సస్పెన్షన్ ఉత్తర్వుల రద్దుకు సుముఖత వెలిబుచ్చారని రామకృష్ణ తెలిపారు. కమిషనర్‌ను కలిసిన వారిలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీవీ రమణ, గుంటూరు జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు ఉన్నారు.

బ్రాయిలర్ ధరలు
(కిలో ₹కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 135, రిటైల్ ధర - 162, చికెన్ విత్‌స్కిన్ - 235, చికెన్ స్కిన్‌లెస్ - 267.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -130 రిటైల్ ధర 157 చికెన్ విత్ స్కిన్ - 228, చికెన్ స్కిన్‌లెస్ - 259.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 143, 152, 163 చికెన్ విత్ స్కిన్ - 274 చికెన్ స్కిన్‌లెస్ - 284.

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి అధికధరకు కొనబడును (స్పాట్ క్యాష్). ✆ 87907 41166.

EDUCATION

SPOT admissions by Govt AP 12/12: M.Com/MA English/MSW only Rs 5000 per sem, PLNM Degree College, 91774 08565.

PEOPLE CARE

OLD AGE HOME

రామకృష్ణ గ్రూప్, GNT, వృద్ధులకు, పేషెంట్ల సేవకు ఇంటి/వంట, బేబి కేర్‌కు వర్కర్లను భారతదేశం అంతటా పంపగలము. ✆ 91540 85588, 91549 35588

Book your 5 lines Classified Colour Rs.770/- 3Ads Package Rs.1945/-
5 lines Classified B/W Rs.650/- 3Ads Package Rs.1625/-
ప్రకటనపై 5% జి.ఎస్.టి. అదనం

REAL ESTATE

PLOT FOR SALE

GENERAL

133.33 Sq.Yds. కేవలం 1,00,000/- మాత్రమే. వినుకొండ, పల్నాడు డిస్ట్రిక్ట్‌లో లిమిటెడ్ ఆఫర్. ఫోన్: 9133445755.

JOBS

Wanted Sales Executives For Guntur, Ongole for Mahesh Extruions (P) Ltd Bellari Send Your Resumes maheshpvcpipes@gmail.com.

గుంటూరు, లక్ష్మీపురం నందు క్రొత్తగా ప్రారంభించిన బోటిక్ నందు పనిచేయుటకు Sitching వర్క్ వచ్చిన లేడీస్ కావలెను. 80192 08772.

గుంటూరు, బ్రాడీపేటలోని ప్రముఖ జ్యూయలరీ షోరూంవారికి 25-30 సం||ల వయస్సు జ్యూయలరీ సేల్స్‌లో 2సం|| అనుభవమున్న సేల్స్‌మెన్స్/గర్ల్స్ కావలెను. ✆ 98485 58182.

అమెరికాలో 1 సం|| బాబు ఆలన, పాలన వ్యక్తిగత సంరక్షణ కొరకు అనుభవంగల ఆడవారు కావలెను. అమెరికా వీసా కల్గినవారు మాత్రమే. ✆ 9440803362

గుంటూరు &నరసరావుపేటలోని ప్రముఖ అడ్వకేటు ఆఫీసునందు లీగల్ Openions టైపుచేయుటకు అనుభవం కలిగిన అభ్యర్థులు కావలెను. Ph: 9346983822.

అకౌంటెంట్స్, సూపర్‌వైజర్స్, ఐషర్ డ్రైవర్స్ కావలెను. చిలకలూరిపేట మం. యడవల్లి గ్రామంలోఉన్న పేపర్ మిల్లులో పనిచేయుటకు. 93906 33593, 90595 14555.

30-65Yrs బ్యాంక్ అనుబంధ సంస్థలో జీతం+Inc 35వేలు టీంమేనేజర్స్, ఎగ్జిక్యూటివ్స్. Q:10th, డిగ్రీ. రిటైర్డ్ బిజినెస్ ఇన్సూరెన్స్ ఏజంట్స్ మ్యూచువల్‌ఫండ్స్. నోటార్గెట్. ✆90524 70111

SHO కు MLT, DMLT,BSc - MLT, ANM, GNM లు కావలెను. జీతం 8-10 వేలు. సంప్ర: SHO, 2/1 బ్రాడీపేట, గుంటూరు. ✆: 98483 91212.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం.. ఈనాడు లో ప్రకటన ఇవ్వటం
పూర్తి వివరాలకు సంప్రదించండి: 8008510541

(c) eenadu

నరసరావుపేట

•నరసరావుపేట • వినుకొండ • చిలకలూరిపేట

ఆడపిల్లలను భారంగా భావించొద్దు

శ్రీనివాసనగర్(నరసరావుపేట), న్యూస్‌టుడే: చిన్న వయసులో ఆడపిల్లలకు వివాహం చేస్తే ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని లాల్‌బహదూర్ మున్సిపల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సాంబయ్య అన్నారు. స్థానిక పాఠశాలలో సోమవారం ఐసీడీఎస్ నేతృత్వంలో 'బాల్య వివాహాల'పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు ఆడపిల్లలను భారంగా భావించకూడదన్నారు. విద్యతోనే ఉన్నతస్థాయికి ఎదగొచ్చని, చిన్నారులకు బాల్యంలో వివాహం చేస్తే బంగారు భవిష్యత్తు నాశనమవుతుందన్నారు. బాలిక విద్యకై తల్లిదండ్రులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజరు జోజమ్మ, సిబ్బంది శ్రీలక్ష్మి, కమరున్, గోవిందమ్మ, ఈశ్వరదేవి, సిలార్‌బీ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నరసరావుపేట అర్బన్ : 80085 73156
యడ్లపాడు : 8008145652 వినుకొండ గ్రామీణ : 9440009293

? పట్టణంలో బరంపేట చాకలిగుంటలో కత్వా వాగు పక్క వీధిలో రెండు నెలలుగా డ్రెయినేజీ పూడిక తీయడం లేదు. దోమలు వృద్ధి చెంది రోగాలు ప్రబలుతున్నాయి. అధికారులు పట్టించుకోవడం లేదు. - **దీనమ్మ, స్థానికురాలు**

✔ సిబ్బందిని పంపి పూడిక తొలగిస్తాం. - **రామకోటయ్య, పారిశుద్ధ్య అధికారి - న్యూస్‌టుడే, మల్లమ్మ సెంటర్(నరసరావుపేట)**

? పట్టణంలో తూర్పుమాలపల్లిలో పాఠశాల ప్రాంతంలో కాలువ పిచ్చిమొక్కలతో పూడి పోయాయి. మురుగునీరు పారడం లేదు. - **బాబూరావు**

✔ కాలువలను పూడిక తీయించి మురుగునీరు సక్రమంగా పారేలా చర్యలు తీసుకుంటాం. - **రమణారావు, పారిశుద్ధ్య అధికారి - న్యూస్‌టుడే, చిలకలూరిపేట పట్టణం**

గణపవరం ప్రమాద కారకులను కఠినంగా శిక్షించాలి

★ విద్యార్థుల కుటుంబ సభ్యుల డిమాండ్

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే: చిలకలూరిపేట బైపాస్ రహదారిలో నాదెండ్ల మండలం గణపవరం వద్ద ఈనెల 4న జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఐదుగురు విద్యార్థులు మృతిచెందిన విషయం తెలిసిందే. ట్రక్కు లోడుతో వెళ్తున్న తన వాహనానికి ముందు ఓ కారులో వచ్చిన వ్యక్తి నిలపాలని ఆదేశించడంతో బ్రేక్ వేసినట్లు పోలీసులకు చెప్పారు. సీసీ ఫుటేజీలోనూ ఇదే విషయం స్పష్టం కావడం, ప్రమాదం తీరుపై 'ఈనాడు'లో వరుస కథనాలు రావడంతో మృతుల కుటుంబ సభ్యులు సోమవారం చిలకలూరిపేట వచ్చారు. పోలీసులను కలిసి ప్రమాదానికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తమ కుటుంబాలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

చీఫ్ విప్ పరామర్శ.. నూజండ్ల: రోడ్డు ప్రమాదంలో మరణించిన బీటెక్ విద్యార్థుల కుటుంబాలను ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు సోమవారం పరామర్శించారు. మండలంలోని ములకలూరు వెళ్లి యశ్వంత్‌సాయి తల్లిదండ్రులు సుబ్బారావు, కుమారిని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. విద్యార్థి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మరో విద్యార్థి వాసు తల్లిదండ్రులు వెంకయ్య, నాగరాణిలను ఓదార్చారు. ఆయన వెంట జనసేన నాయకులు నాగశ్రీను రాయల్, మండల తెదేపా అధ్యక్షుడు గంగినేని బాబు, చంద్రశేఖర్, కుంట కోటిరెడ్డి, సోమేపల్లి బ్రహ్మయ్య, రజబాబు, వెంకట్రావు తదితరులున్నారు.

చాకుతో దాడి చేసి.. ఆసుపత్రిలో చేర్పించి..

మేడికొండూరు, న్యూస్‌టుడే: అకారణంగా చాకుతో దాడి చేసి గాయపరిచిన వ్యక్తే.. క్షతగాత్రుడిని ఆసుపత్రిలో చేర్పించిన ఘటనపై సోమవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన కథనం మేరకు.. పల్నాడు జిల్లా వినుకొండ మండలం సీతారామపురం తండాకు చెందిన రామావత్ రామునాయక్ కొన్నేళ్లుగా గుంటూరులో ఒక హోటల్లో పని చేస్తూ అక్కడే అద్దె గదుల్లో నివాసం ఉంటున్నారు. ఆదివారం సాయంత్రం పని ముగించుకుని తిరిగి వస్తున్న సమయంలో అదే హోటల్లో పని చేసే శివ అతడి వద్దకు వచ్చాడు. మేడికొండూరు మండలం విశదల గ్రామంలో పని ఉందని చెప్పాడు. ఈ క్రమంలో ఇద్దరూ కలిసి ద్విచక్ర వాహనంపై విశదల వద్దకు వచ్చారు. ఆ సమయంలో శివ ఒక్కసారిగా చాకు తీసుకుని బెదిరిస్తూ రామునాయక్‌పై దాడి చేయగా.. అతడి గొంతు వద్ద రక్త గాయమైంది. అనంతరం క్షతగాత్రుడిని.. శివ ద్విచక్రవాహనంపై ఎక్కించుకుని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి పరారయ్యాడు. పట్టాభిపురం పోలీసులు బాధితుడి వివరాలు నమోదు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చెత్త పేరుతో జేబులు నింపుకొంటున్నారు!

జిల్లా కేంద్రంలో అనధికారికంగా పన్ను వసూళ్లు

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే

వైకాపా పాలనలో చెత్తపై పన్ను వసూలు చేసి ప్రజలను ఇబ్బందులకు గురిచేసిన విషయం తెలిసిందే. గత ఏడాది సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చెత్తపై పన్ను వసూలును రద్దు చేసింది. అయినా జిల్లా కేంద్రంలో నేటికీ వసూలు చేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



అపార్టుమెంట్ వారికి ఈనెల 7న ఇచ్చిన చెత్త పన్ను రసీదు

నెలకో రకంగా రసీదు

'చెత్త పన్ను వసూలు చేస్తే చేశారు.. బిల్లులు లేకుండా చేసుకోండి' అని స్వయంగా మున్సిపల్ కార్యాలయంలో ఓ అధికారి చెత్త పన్ను వసూలు చేసే ఆర్ట్ మార్కెటింగ్ ఏజెన్సీ పరివారాన్ని ఆదేశించారు. ఇదే అదనుగా భావించిన వసూలు దారులు కొత్త పంథాకు తెరతీశారు. గతంలో చెత్త పన్ను వసూలుకు పురపాలక సంఘం ఆధ్వర్యంలో రిజిస్టర్ నంబర్‌తో రసీదు ఇచ్చేవారు. చెత్త పన్ను వసూలుపై కథనాలు వస్తుండటంతో ఈ నెల 'పురపాలక సంఘం' పేరుతో రసీదు ఇస్తూ, రిజిస్టర్ నంబర్ అనే వివరాలు లేకుండా రసీదు ఇవ్వటం జిల్లా కేంద్రంలో చర్చనీయాంశమైంది.

బహుళ అంతస్తులు.. వాణిజ్య సముదాయాలు లక్ష్యం.. పట్టణంలో బహుళ అంతస్తుల భవనాలు, వాణిజ్య సముదాయాలు, ఆసుపత్రులు, హోటళ్లు, రెస్టారెంట్ల నుంచి చెత్త పన్ను వసూలు చేస్తున్నారని ఆరోపణలున్నాయి. ఒక అపార్టుమెంటులో 40 ఫ్లాట్లు ఉంటే ఒక్కో ఫ్లాటుకు రూ.40 చొప్పున సుమారు రూ.1500 వసూలు చేసి రసీదు ఇస్తున్నారు. అదే 60 ఫ్లాట్లు ఉంటే రూ.3వేలు చొప్పున వసూలు చేస్తున్నారు. ఇలా పన్ను వసూలు చేస్తున్నా మున్సిపాలిటీకి జమ చేస్తున్న దాఖలాల్లేవు. కొందరు అధికార పార్టీ నాయకుల అండదండలతోనే ఇష్టారాజ్యంగా నగదు వసూలు చేసి అటు అధికారులు, ఇటు నాయకుల జేబుల్లో వేసుకుంటున్నారని మున్సిపల్ కార్యాలయంలో కొంతమంది సిబ్బంది ఆరోపిస్తున్నారు. ఇంత జరుగుతున్నా మున్సిపల్ ప్రత్యేక అధికారి తనకేమీ పట్టనట్లు వ్యవహరించడం గమనార్హం. ఇటీవల ప్లాస్టిక్ నిషేధం పేరుతో చిరు వ్యాపారులపై నిరంతరం దాడులు చేసి జరిమానాలు విధిస్తున్నారు. దీంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

జిల్లా కేంద్రంలో	
అపార్టుమెంట్లు	200
కల్యాణ మండపాలు	40
హోటళ్లు, రెస్టారెంట్లు	122
ఆసుపత్రులు	165
ఇంకా పలు వాణిజ్య సముదాయాలు ఉన్నాయి	

ఎవరూ చెల్లించొద్దు

పట్టణంలో చెత్త పన్ను వసూలు విషయమై మున్సిపల్ కమిషనర్ జస్వంతరావును వివరణ కోరగా మున్సిపాలిటీ నుంచి చెత్త పన్ను వసూలు చేయడం లేదన్నారు. ఎవరూ చెల్లించవద్దని పత్రికల్లో, మైక్ ద్వారా ప్రజలకు తెలియజేస్తున్నామన్నారు. అనధికారికంగా చెత్త పన్ను వసూలు చేసే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలెవరూ పన్ను చెల్లించవద్దని, ఎవరైనా వచ్చి నగదు అడిగితే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు.

'పది'లో ప్రథమ స్థానం సాధిస్తే సింగపూర్ పంపుతాం

మాట్లాడుతున్న ప్రభుత్వ చీఫ్ విప్ ఆంజనేయులు, వేదికపై విద్యాశాఖాధికారులు

వినుకొండ, న్యూస్‌టుడే: పదోతరగతి పరీక్షల్లో ప్రథమ స్థానం సాధించిన పాఠశాల ఉపాధ్యాయులను సింగపూర్ పర్యటనకు పంపిస్తామని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు తెలిపారు. ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం పట్టణంలోని తిమ్మాయపాలెం రోడ్డులోని ఓ ఫంక్షన్ హాలులో సోమవారం నిర్వహించగా ఆయన మాట్లాడారు. విద్యలో వినుకొండ ప్రాంతాన్ని ముందంజలో ఉంచేందుకు తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేసి మంచి ఫలితాలు సాధిస్తారని ఆశిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంక్ వచ్చిన విద్యార్థికి రూ.5లక్షలు, జిల్లా అయితే రూ.2లక్షలు, నియోజకవర్గం పరిధిలో వారికి రూ.లక్ష ప్రోత్సాహక బహుమతి ఇస్తామన్నారు. సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులను ఎంపిక చేసి ఉత్తమ అవార్డులు అందజేస్తామన్నారు. క్రీడలు, విద్య రెండింటిలోనూ ఫలితాలు సాధించిన వారికి నగదు అందజేస్తామని చెప్పారు. శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ ఈ ఖర్చు భరిస్తుందన్నారు. విద్యాప్రమాణాలు పెంచేందుకు మంత్రి నారా లోకేశ్ చేస్తున్న కృషిని స్ఫూర్తిగా తీసుకుని విద్యపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా ఉప విద్యాశాఖాధికారి సుభాని, మండల విద్యాశాఖాధికారులు జ్వాల్లా, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

కొండవీడు సమగ్రాభివృద్ధికి సహకరించండి

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే: ఏకో 'హెరిటేజ్, టెంపుల్ టూరిజం అభివృద్ధి' అర్హతకు అవకాశం ఉన్న కొండవీడు కోట సమగ్రాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు సీఎం చంద్రబాబును విజ్ఞప్తి చేశారు. సచివాలయంలో సీఎం చంద్రబాబును సోమవారం మర్యాద పూర్వకంగా కలిసిన ఆయన నియోజకవర్గ సమస్యలు, పొగాకు రైతుల ఇబ్బందులు, పత్తి కొనుగోళ్లలో రైతులు ఎదుర్కొంటున్న సాంకేతిక సమస్యలను సీఎంకు విన్నవించారు. కొండవీడు మార్గాన్ని నేరుగా జాతీయ రహదారికి అనుసంధానిస్తే పర్యాటకుల రాక పెరుగుతుందన్నారు. చిలకలూరిపేట మండలం బొప్పూడి వద్ద రూ.18 కోట్లతో నిర్మించ తలపెట్టిన మైనార్టీ బాలికల పాఠశాల నిర్మాణాన్ని గత ప్రభుత్వం అటకెక్కించిందని, వీలైనంత త్వరగా పాఠశాల నిర్మాణానికి అవసరమైన నిధులు కేటాయించాలని కోరారు.

ముఖ్యమంత్రి చంద్రబాబుకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే: విద్యావిధానాల అమలులో మంత్రి లోకేశ్ ప్రజాభిప్రాయానికి విలువ ఇస్తున్నారని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. నాదెండ్ల మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో రూ.70లక్షలతో నిర్మించనున్న నూతన తరగతి గదులకు సోమవారం శంకుస్థాపన చేసి మాట్లాడారు. చిలకలూరిపేటలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం అభివృద్ధికి ప్రభుత్వం రూ.1.60 లక్షలు కేటాయించిందన్నారు. తొలుత మహాత్మాగాంధీ, కస్తూర్బాగాంధీ, సావిత్రిబాయి ఫులే, బి.ఆర్.అంబేడ్కర్ చిత్రపటాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాలికలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఎంఈవో నారాయణరెడ్డి, ప్రిన్సిపల్ మాధవీలత, తెదేపా నాయకులు బండారుపల్లి సత్యనారాయణ, మద్దూరి వీరారెడ్డి, నెల్లూరి హరిబాబు, మల్లెల శివనాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినుల వినూత్న నృత్య ప్రదర్శన

అభివృద్ధికి సహకారించాలి.. ప్రభుత్వం, ప్రజలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాల్లో సంపన్నులు భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పిలుపునిచ్చారు. పమిడి శేషమ్మ వర్ధంతి పురస్కరించుకుని వైద్యురాలు కందిమళ్ల జయమ్మ సహకారంతో ఒయాసిస్ వెల్ఫేర్ సంస్థ ఆధ్వర్యంలో మురికిపూడి గ్రామ ఆశ్రమంలో సంస్థ సభ్యులతో కలిసి సోమవారం మొక్కలు నాటి ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, ఒయాసిస్ అధ్యక్షురాలు కందిమళ్ల జయమ్మ, జనసేన ఇన్‌ఛార్జి తోట రాజరమేష్, తెదేపా సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు తదితరులు పాల్గొన్నారు.

వైద్యశాల ఘటనలో వైకాపా కుట్ర

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: ప్రభుత్వ వైద్యశాలలో ఓ మహిళకు ట్యుబెక్టమీ చేసిన సమయంలో బ్లేడ్ చొచ్చుకుపోయిన ఘటనపై సమగ్ర విచారణ చేపడుతున్నామని ఎమ్మెల్యే అరవిందబాబు అన్నారు. తన కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి స్వయంగా వైద్యుడై ఉండి విచక్షణ కోల్పోయి మాట్లాడుతున్నారన్నారు. ప్రభుత్వ వైద్యశాలపై నిందలు వేయడం తగదన్నారు. ఈ అంశంలో వైకాపా కుట్ర ఉందన్నారు. వ్యక్తిగత ఆరోపణలు తగదని, మెరుగైన వైద్యసేవలందించేందుకు సూచనలు చేయాలన్నారు. వైకాపా పాలనలో ప్రభుత్వ వైద్యశాలలో అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. పట్టణ తెదేపా అధ్యక్షుడు జి.శేఖర్, భాజపా నేత రంగిశెట్టి రామకృష్ణ పాల్గొన్నారు.

అవినీతి నిరూపించండి

నరసరావుపేట వ్యవసాయం, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన మహిళకు వైద్యం చేయడంలో నిర్లక్ష్యంగా ఉన్న వైద్యుడిని వెనకేసుకు రావడం తగదని, బాధితురాలికి అండగా ఉండాల్సింది పోయి ఆరోపణలు చేయడం ఏమిటని వైకాపా జిల్లా అధ్యక్షుడు గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ప్రశ్నించారు. గుంటూరు రోడ్డులోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైద్యుడు తప్పు చేయకపోతే ప్రభుత్వం ఎందుకు సస్పెండ్ చేసిందన్నారు. ఆ ఉత్తర్వులను ఎందుకు ఉపసంహరించుకోలేదని ప్రశ్నించారు. ఎమ్మెల్యే చదలవాడ దమ్ముంటే గత వైకాపా హయాంలో ప్రభుత్వ వైద్యశాలలో అవినీతిని నిరూపించాలని ఛాలెంజ్ విసిరారు. ప్రతిపక్ష పార్టీగా ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడం తప్పా? అని ప్రశ్నించారు.

తెదేపా కార్యకర్తకు మంత్రి లోకేశ్ భరోసా

ఆర్థిక సాయం ప్రకటించిన ఎమ్మెల్యే జీవీ

వినుకొండ, న్యూస్‌టుడే: ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఓ కార్యకర్తకు తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సూచన మేరకు ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ఆర్థికసాయం ప్రకటించారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా.. బొల్లాపల్లి మండలం గరికపాడు గ్రామ తెదేపా అధ్యక్షుడు రామారావు తన ఇబ్బందులను ఇటీవల మంత్రి లోకేశ్ దృష్టికి తెచ్చారు. పార్టీ కోసం కష్టపడి పనిచేశానని ఇప్పుడు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నానని, తన ఇద్దరు ఆడపిల్లలను చదివించుకునే స్థోమత లేదని చెప్పారు. ఈ విషయాన్ని లోకేశ్ ట్విట్టర్ ద్వారా జీవీ ఆంజనేయులుకు తెలిపారు. దీనిపై స్పందించిన ఆయన రామారావు దంపతులను పిలిపించి ధైర్యం చెప్పారు. రూ.లక్ష ఆర్థిక సాయం అందించడంతో పాటు ప్రభుత్వ పరంగా ఇల్లు కట్టిస్తానని హామీ ఇచ్చారు. మనోధైర్యం కోల్పోవద్దని సూచించారు.

'పరీక్షా పే చర్చా'కు పేర్ల నమోదు

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: ప్రధాని నరేంద్రమోదీతో నిర్వహించనున్న 'పరీక్షా పే చర్చా' కార్యక్రమంలో నేరుగా పాల్గొనేందుకు విద్యార్థులు పేర్లు నమోదు చేసుకోవాలని డీఈవో చంద్రకళ అన్నారు. మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో పేర్ల నమోదును సోమవారం ప్రారంభించారు. విద్యార్థులకు ఏఎంవో పూర్ణచంద్రరావు అవగాహన కల్పించారు. 6 నుంచి 12వ తరగతి విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. డీవైఈవో సుభాని, ఎంఈవోలు, కార్యక్రమ నోడల్ అధికారిణి నాగదుర్గ, ప్రధానోపాధ్యాయుడు రవికాంత్ ఉన్నారు.

నోటీసు

పల్నాడు జిల్లా నరసరావుపేట పట్టణం లోని శ్రీరాంపురం జామియా మసీదు వెనుక TS No. 1422,1423లలో అహ్లెసున్నత్ జామియా మసీదు సంఘం నరసరావుపేట శ్రీరాంపురం, వారి సహకారంతో నిర్మాణం అవుతున్న అంజుమన్ షాపింగ్ కాంప్లెక్స్‌కు చెందిన గత అద్దెదారులకు తెలియజేయు ఏమనగా గత 2నెలలు గా షాపుల నిర్మాణం కొరకు సహకరించి చెల్లించవలసిన డబ్బులను చెల్లించవలసినదిగా అంజుమన్ సెక్రటరీ వారు ఫోన్ ద్వారా వాట్స్ అప్ గ్రూప్ ద్వారా డబ్బులను చెల్లించవలసినదిగా మనవిచేస్తున్నారు. కావున ఇప్పటికిని డబ్బులు చెల్లించని వారు నేటి నుండి వారం రోజుల వరకు అనగా ది.18-12-2025 లోపు డబ్బులు చెల్లించవలెను. లేని పక్షంలో వారి వారి పేర్లను గత అద్దె దారుల లిస్టు నుండి తొలగించబడును. కావున తెలియజేయటంమైనది.

ఇట్లు
అహ్లెసున్నత్ జామియ మసీదు సంఘం, నరసరావుపేట శ్రీరాంపురం.
పల్నాడు. జిల్లా,
రిజిష్టర్డ్ నెం: 181/2025

పోట్లూరు పంచాయతీ వ్యవహారంపై విచారణ

పోట్లూరు(శావల్యాపురం), న్యూస్‌టుడే : పోట్లూరు పంచాయతీ సర్పంచి పోపూరి జ్యోతి విధులను సక్రమంగా నిర్వహించడం లేదని, గ్రామంలో ప్రజలకు మౌలిక వసతులు కల్పించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెదేపా మండల తెలుగు యువత అధ్యక్షుడు గోనుగుంట్ల ధనుంజయ్, మాజీ నీటి సంఘం అధ్యక్షుడు పొందూరి సుబ్బారావు సోమవారం గ్రీవెన్స్‌లో జిల్లా పంచాయతీ అధికారి నాగేశ్వరనాయక్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉందని, వీధి దీపాలు సక్రమంగా లేవని పేర్కొన్నారు. దీనిపై స్పందించిన డీఎల్‌పీవో పంచాయతీ కార్యాలయానికి వెళ్లి పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి వారం రోజుల్లోగా నివేదిక అందించాలని డిప్యూటీ ఎంపీడీవో కె.వివేకానందను ఆదేశించారు.

రైతులకు ఇబ్బంది రానీయం

కారుమంచి(శావల్యాపురం), న్యూస్‌టుడే: కారుమంచి రైతు సేవా కేంద్రానికి శావల్యాపురం వీఏఏ వెంకాయమ్మను ఇన్‌ఛార్జిగా నియమించినట్లు మండల వ్యవసాయాధికారి రామినేని రామారావు తెలిపారు. సోమవారం శావల్యాపురం రైతు సేవా కేంద్రంలో ఆయన మాట్లాడుతూ రబీలో ఈ-పంట నమోదు, వ్యవసాయ పథకాల గురించి తెలియచేస్తారన్నారు. గతంలో ఈ స్థానంలో విధులు నిర్వహించిన చక్రవర్తి ఖరీఫ్‌లో ఈ-పంట నమోదు చేశారన్నారు.

డిమాండ్ల సాధనకు దశలవారీ ఆందోళన

వినుకొండ: మోకాళ్లపై నిలబడి పీఏసీఎస్ ఉద్యోగుల ఆందోళన

వినుకొండ, నరసరావుపేట వ్యవసాయం, సంతగుడిపాడు(రొంపిచర్ల), చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే: పెండింగ్‌లో ఉన్న 2019, 2024 వేతన సవరణల అమలుతో పాటు మధ్యంతర భృతి చెల్లింపు, ఇతర డిమాండ్లు నెరవేర్చాలని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల ఉద్యోగుల యూనియన్ ఐక్యవేదిక నేతలు ధర్నా చేపట్టారు. వినుకొండలో రాష్ట్ర కార్యదర్శి వైవీ నారాయణ మాట్లాడుతూ తమ డిమాండ్ల పరిష్కారానికి దశల వారీ ఆందోళన కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఇందులో భాగంగా 16న జిల్లా సహకార కార్యాలయాల వద్ద, 22 డీసీసీబీ ప్రధాన కార్యాలయాల వద్ద, 29న విజయవాడ ధర్నా చౌక్ వద్ద మహాధర్నా చేస్తామన్నారు. అప్పటికీ తమ సమస్యలు పరిష్కారం కానట్లయితే జనవరి 5నుంచి అక్కడే రిలే నిరాహార దీక్షలు చేపడతామన్నారు. నరసరావుపేటలో స్థానిక బ్యాంకు మేనేజర్ రమాదేవికి యూనియన్ నేతలు వినతిపత్రం అందజేశారు.

ఎట్రాసిటి కేసు విచారణ

చిరుమామిళ్ల(చిలకలూరిపేట గ్రామీణ): నాదెండ్ల మండలం చిరుమామిళ్ల సచివాలయంలో ఇటీవల ఓ ఉద్యోగి కుర్చీలో కూర్చున్న వైకాపా నాయకుడు సింగారెడ్డి కోటిరెడ్డిని కత్తి శంకర్ ప్రశ్నించిన విషయం తెలిసిందే. ఆ సమయంలో తనను కులం పేరుతో దూషించినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కోటిరెడ్డిపై పోలీసులు ఎస్సీ, ఎస్టీ ఎట్రాసిటీ కేసు నమోదు చేశారు. నరసరావుపేట డీఎస్పీ హనుమంతరావు సోమవారం గ్రామానికి వచ్చి విచారణ నిర్వహించారు. నాదెండ్ల ఎస్సై పుల్లారావు ఉన్నారు.

32వ వార్డు తెదేపా కార్యవర్గం ఎన్నిక

చిలకలూరిపేట పట్టణం: తెదేపా సంస్థాగత ఎన్నికల్లో భాగంగా చిలకలూరిపేట 32వ వార్డు కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా రాములునాయక్, వీరకుమారి నియమితులయ్యారు. ఉపాధ్యక్షుడిగా ఇ.బెంజిమేన్ ఎన్నికయ్యారు.

ప్రభుత్వ భూమిని పేదలకు పంపిణీ చేయాలి

బొల్లాపల్లి, న్యూస్‌టుడే: గండిగనుమల గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వే నెంబరు 430లోని 170 ఎకరాల ప్రభుత్వానికి చెందిన బంజరు భూమిని గ్రామంలో భూమి లేని నిరుపేదలకు పంపిణీ చేయాలని గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోటానాయక్ కోరారు. ఈ మేరకు గిరిజన, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో అనేక సార్లు జిల్లా అధికారులకు వినతిపత్రాలు ఇచ్చామన్నారు. సంబంధిత భూమి సమగ్ర సర్వే నిర్వహించి జరిపి పేదలకు న్యాయం చేయాలని ఆర్ఐ రామకోటయ్యకు వినతిపత్రం అందచేశారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు వేతనాలు పెంచరూ!

మల్లమ్మ సెంటర్(నరసరావుపేట), న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కార్యకర్తలకు వేతనాలు పెంచాలని అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ అధ్యక్షురాలు గుంటూరు మల్లేశ్వరి కోరారు. ఈ మేరకు స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీవో కాంతకుమారికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్‌వాడీలపై రాజకీయ వేధింపులు ఆపాలన్నారు. పెండింగ్‌లో ఉన్న 164 సూపర్‌వైజర్ల పోస్టులు వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఆమె వెంట యూనియన్ నాయకులు నిర్మల, సాయికుమారి ఉన్నారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనాన్ని వెనుక నుండి కారు ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన కర్నూలు - గుంటూరు జాతీయ రహదారిపై విఠంరాజుపల్లి పరిధిలోని సంగం డెయిరీ వద్ద సోమవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వినుకొండ మండలం నరగాయపాలెంకు చెందిన మాలపాటి చిన్న వెంకటేశ్వరరెడ్డి (46) ద్విచక్ర వాహనంపై వినుకొండ నుండి విఠంరాజుపల్లి వైపు వెళ్తున్నాడు. కృష్ణాజిల్లాకు చెందిన వ్యక్తులు కారులో శ్రీశైలం నుండి స్వగ్రామం వెళ్తున్నారు. సంగం డెయిరీ వద్దకు రాగానే ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో చిన్న వెంకటేశ్వరరెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు.



చిన్న వెంకటేశ్వరరెడ్డి (పాత చిత్రం)

మిరపకు నల్లతామర ముప్పు

వినుకొండ, న్యూస్‌టుడే: మిరపకు నల్లతామర పురుగు ముప్పుగా పరిణమించింది. మంచుతో పాటు తేమ వాతావారణం వల్ల తెగులు ఉద్ధృతి కావడంతో నివారణకు రైతులు అధికంగా ఖర్చు పెడుతున్నారు. కొందరు పంటను కాపాడుకునేందుకు రోజు మార్చి రోజు మందులు పిచికారీ చేస్తున్నారు. సకాలంలో వర్షాలు కురవడం, సాగర్ కాల్వలకు నీరు విడుదల చేయడంతో జిల్లాలో ఈ ఏడాది 1.15లక్షల ఎకరాల్లో మిరప సాగు చేశారు. వినుకొండ నియోజకవర్గంలో బొల్లాపల్లి, వినుకొండ తదితర మండలాల్లో సుమారు 35వేల ఎకరాల్లో పైరు వివిధ దశల్లో ఉంది. మూడేళ్ల నుంచి ఎదురవుతున్న నల్లి బెడద ఈ ఏడాదీ తప్పలేదు. నివారణకు సైయాన్ట్రనిలిప్రోల్ 240 మి.లీ లేదా ఇమిడాక్లోప్రిడ్ 40 శాతం, ఫెప్రోనిల్ 40శాతం 50గ్రాములు కలిపి ఎకరానికి నీటిలో కలిపి పిచికారీ చేయాలని ఉద్యానశాఖాధికారి ఎస్‌కే నబిరసూల్ తెలిపారు. ముందు జాగ్రత్తగా ఎకరంలో 20 నుంచి 30 నీలి, పసుపు రంగు జిగురు అట్టలు అమర్చాలని సూచించారు. తెల్లదోమ వల్ల వైరస్ వ్యాప్తిని నివారించేందుకు ఎసిటామిప్రిడ్ 20శాతం ఎస్పీ 0.2 గ్రాములు లేదా థాయెమిథాగ్సం 0.4 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని కోరారు.

చిలకలూరిపేట: మిరప పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త రవీంద్రబాబు, చిత్రంలో హెచ్‌వో శ్రీలక్ష్మి

సస్యరక్షణ చేపట్టాలి.. చిలకలూరిపేట గ్రామీణ: మిరపలో రసం పీల్చే పురుగుల నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని దర్శి ఉద్యానవన పరిశోధన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.రవీంద్రబాబు సూచించారు. చిలకలూరిపేట మండలం గోవిందపురం గ్రామంలో సోమవారం క్షేత్రస్థాయిలో రైతులతో కలిసి పంటను పరిశీలించి జాగ్రత్తలను వివరించారు. తామర తల్లి, పిల్ల పురుగుల వల్ల ఆకులపై బొబ్బలు ఏర్పడి అంచులు పైకి ముడుచుకుపోతాయన్నారు. వీటి నివారణకు రైతులు సామూహికంగా నీలి, పసుపురంగు అట్టలను పొలంలో ఎకరాకు 50 నుంచి 100 చొప్పున అక్కడక్కడ అమర్చి పురుగు ఉద్ధృతిని గమనించాలన్నారు. అనంతరం అజాడిరక్టిమ్ 10వేల పీపీఎంను 2 మి.లీ, 0.5 గ్రాముల సర్ఫ్ లేదా ట్రైటాన్ 100 శాతం లీటరు నీటికి 2 మి.లీ. చొప్పున కలుపుకొని పిచికారీ చేయాలన్నారు. ప్రస్తుతం మిరప పిందె దశలో ఉన్నందున సూక్ష్మ పోషక మిశ్రమమైన ఫార్ములా-4ను 5 గ్రాముల చొప్పున పొటాషియం నైట్రేట్‌ను లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. ఆయన వెంట ఉద్యాన అధికారి శ్రీలక్ష్మి పాల్గొన్నారు. మండల కేంద్రం నాదెండ్లలో బొప్పాయి రైతులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో డాక్టర్ రవీంద్రబాబు పాల్గొని మాట్లాడారు. బొప్పాయి సాగు ద్వారా అధిక దిగుబడులు సాధించి మంచి ఆదాయం పొందవచ్చునన్నారు.

వైభవంగా అమలోద్భవి మాత మహోత్సవం

రావిపాడు (నరసరావుపేట సెంట్రల్), న్యూస్‌టుడే: మండలంలోని రావిపాడులో అమలోద్భవి మాత మహోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. రోజంతా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పరిసర గ్రామాల ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. దీంతో గ్రామంలో సందడి నెలకొంది. విద్యుత్తు దీపాలంకరణలో చర్చి నూతన శోభ సంతరించుకుంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా గ్రామీణ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

IN THE COURT OF THE ADDITIONAL CIVIL JUDGE (SENIOR DIVISION), NARASARAOPET

IP.No. 32 of 2025

BETWEEN: Ravi Sudhakar S/o Ramaiah R/o H.No. 33-620/3, N.H.-5 Road, Chilakaluripeta Town, Palnadu District, Pin: 522 616, Andhra Pradesh, Cell No. 9848361546. **... Petitioner**

AND

1. Kandimalla Anjana Devi,W/o Kandimalla Anji Babu, R/o.D.No.4-338/1, 3rdLane, Pandaripuram, Chilakaluripeta, PALNADU District - 522 616. Cell No. 9849638244.
2. Kandimalla Anji Babu, S/o Venkatanarayana, R/o. D.No.4-338/1, 3rdLane, Pandaripuram, Chilakaluripeta, PALNADU District - 522 616. Cell No. 9849638244 .
3.Kandimalla Chandra Sekhar, S/o Venkateswarlu, R/o. Kolalapudi Village, Marturu Mandal, PRAKASAM District - 523 261. Cell No. 9381359998.
4.Kandimalla Madhusudhana Rao, S/o Venkateswarlu, R/o.Kolalapudi Village, Marturu Mandal, PRAKASAM District - 523 261. Cell No. 9642676271.
5. Tati SubbaRao, S/o Tati Venkaiah, R/o Kolalapudi Village, Marturu Mandal, PRAKASAM District - 523 261.
6. Tati Anjaneyulu, S/o Venkateswarlu, R/o Kolalapudi Village, Marturu Mandal, PRAKASAM District - 523 261.
7. M.Ram Mohan Rao, R/o Pandaripuram, Opp.to PrattipatiPulla Rao House, Chilakaluripeta, Palnadu District - 522 616.
8. Somepalli Prasada Rao, S/o Venkateswarlu, R/o House No. 3-194, 7th Lane, Pandaripuram Chilakaluripeta, PALNADU District - 522 616. Cell No 9398666590.
9. Official Receiver, O/o Official Receiver, District Court Premises, GUNTUR - 522 002. **... Respondents**

పై నెంబరు ఐ.పిలోని పిటీషనరు తనను ఇన్‌సాల్వెంట్‌గా డిక్లేర్ చేయమని దాఖలు చేయగా సదరు పిటీషన్‌పై ఎవరికైనా అభ్యంతరములు ఉంటే తెలుపుకొనవలసిందిగా శ్రీ కోర్టువారు జనరల్ నోటీసు నిమిత్తం ది.05-01-2026 వాయిదా వేసినారు కావున ఆరోజున ఉ॥ గం॥ 10:30 ని॥లకు పై కోర్టువారి ఎదుట స్వయంగా గాని, మీ తరపు వకీలుగారి ద్వారా గాని హాజరై మీకు గల అక్షేపణలు తెలుపుకోగలరు. లేనిచో శ్రీ కోర్టు వారిచే పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది: 05-01-2026.

వీరగాని లీలాకృష్ణ, పిటీషనరు తరపు అడ్వకేటు, 18/2 అరండల్‌పేట, గుంటూరు. సెల్: 98483 41985.

సత్తెనపల్లి

• సత్తెనపల్లి • పెదకూరపాడు • మాచర్ల • గురజాల

సీఆర్డీఏ కార్యాలయాలకు భవనాల పరిశీలన

అమరావతి, న్యూస్‌టుడే: రాజధాని అమరావతికి రెండో విడత భూసమీకరణకు ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేస్తోంది. భూసమీకరణ గ్రామాల్లో సీఆర్డీఏ అధికారులు ఉండి, రైతుల నుంచి భూసమీకరణ చేసేందుకు కార్యాలయాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. సోమవారం ఆర్డీవో రమణకాంత్‌రెడ్డి, సీఆర్డీఏ డిప్యూటీ కలెక్టర్ చెన్నకేశవరావు, తహసీల్దార్ డానియేలు పెదమద్దూరు, వైకుంఠపురం, కర్లపూడి, యండ్రాయి గ్రామాల్లో పర్యటించి భవనాలను పరిశీలించారు.

భవనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

జంతు గణన పూర్తి

అచ్చంపేట, న్యూస్‌టుడే: జిల్లాలోని అటవీ ప్రాంతంలో వారం రోజులపాటు సిబ్బంది చేపట్టిన జంతు గణన సోమవారంతో ముగిసింది. జిల్లాలోని నాలుగు అటవీ రేంజ్‌లు, 14 అటవీ సెక్షన్లు, 44 బీట్ల పరిధిలో వన్యప్రాణుల ఆనవాళ్లను పరిశీలించినట్లు అచ్చంపేట అటవీ సెక్షన్ డీఆర్వో కుసుమకుమారి తెలిపారు. వీటిని మొబైల్ యాప్‌లో నమోదు చేశామన్నారు. వివరాలు జాతీయ టైగర్ రిజర్వు అధికారులకు అందజేస్తామన్నారు.

10 నుంచి ఎన్ఎస్ఎస్ శిబిరం

విజయపురిసౌత్, న్యూస్‌టుడే: ఈనెల 10 నుంచి 16 వరకు మాచర్ల మండలం బ్రహ్మానందపురంతండాలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం నిర్వహించనున్నట్లు ఏపీఆర్‌డీసీ ప్రిన్సిపల్ నయామ్‌భాను తెలిపారు. శిబిరంలో 50 మంది వలంటీర్లతో పర్యావరణ సంరక్షణ, ఆరోగ్యం, విద్య, గ్రామ శుభ్రత వంటి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వివరించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

సత్తెనపల్లి: 80085 73171 పెదకూరపాడు: 80088 31888
కారంపూడి: 80085 73185 గురజాల: 80085 7 3176

? గంగవరంలోని డీఈడీ కళాశాల ఎదురుగా విద్యుత్తు స్తంభానికి పిచ్చిమొక్కలు ఎగబాకాయి. ప్రమాదకరంగా మారింది. - **రాజు, స్థానికుడు** ✔ పిచ్చి మొక్కలు తొలగిస్తాం. - **ప్రసాద్, ఏఈ, గురజాల** – న్యూస్‌టుడే, గురజాల గ్రామీణ

? కేసానుపల్లిలో ప్రధాన రహదారి పక్కన స్థానికులు చెత్తను కుప్పలుగా పడేస్తున్నారు. దుర్వాసన వస్తోంది. - **రవికుమార్, స్థానికుడు** ✔ పరిశీలించి, వెంటనే చెత్తను తొలగించేలా చర్యలు తీసుకుంటాం. - **వెంకటేశ్వర్లు, ఎంపీడీవో** – న్యూస్‌టుడే, దాచేపల్లి

అనధికార ప్రచారాలకు కళ్లెం

హోర్డింగ్‌ల ఏర్పాటుకు నూతన మార్గదర్శకాలు
నేడు ఏజెన్సీల బాధ్యులతో సమావేశం

సత్తెనపల్లి, పిడుగురాళ్ల, మాచర్ల, న్యూస్‌టుడే

పురపాలక సంఘాలు, నగర పంచాయతీల్లో ఇష్టారాజ్యంగా హోర్డింగ్‌లు, ఇతర వ్యాపార ప్రకటనల బోర్డులు ఏర్పాటు చేస్తామంటే ఇక నుంచి కుదరదు. వాటితో ఆదాయం లభించేలా.. అనధికార ప్రచారాలకు ఆదిలోనే కళ్లెం వేసేలా ప్రభుత్వం నూతన మార్గదర్శకాలు విడుదల చేసింది. హోర్డింగ్‌లతో వచ్చే ఆదాయంపై ఇప్పటివరకు మున్సిపాలిటీలు దృష్టి సారించలేదు. ఇక నుంచి ప్రత్యేక శ్రద్ధ చూపనున్నారు. నూతన మార్గదర్శకాలపై ప్రైవేట్ యాడ్ ఏజెన్సీల బాధ్యులు, ఫ్లెక్సీ దుకాణాల నిర్వాహకులు, వ్యాపారులతో సత్తెనపల్లిలో మంగళవారం సాయంత్రం సమావేశం నిర్వహించనున్నారు.

☛ సత్తెనపల్లి, పిడుగురాళ్ల, మాచర్ల పట్టణాల్లో వందల్లో హోర్డింగ్‌లు, వ్యాపార ప్రకటనల బోర్డులు ఉన్నాయి. గురజాల, దాచేపల్లి నగర పంచాయతీల్లో పదుల సంఖ్యలో ఏర్పాటు చేశారు. సత్తెనపల్లి పట్టణం 21 కిలోమీటర్ల పరిధిలో విస్తరించి ఉంది. ప్రధాన జాతీయ రహదారితోపాటు నరసరావుపేట, అచ్చంపేట, పిడుగురాళ్ల, గుంటూరు రోడ్లలో హోర్డింగ్‌లు ఏర్పాటు చేశారు. మిగిలిన చోట్ల కూడా ఇదే పరిస్థితి. వీటిలో ఒకటి, రెండు ఏజెన్సీలు మాత్రమే పురపాలక సంఘం నుంచి పూర్తిస్థాయిలో అనుమతి తీసుకుని ఏర్పాటు చేశారు.

మున్సిపాలిటీలో హోర్డింగ్‌లు

రోజుకు రూ.50 వేలు జరిమానా

☛ అనుమతులు లేకుండా హోర్డింగ్‌లు ఏర్పాటు చేస్తే రోజుకు రూ.50 వేలు జరిమానా విధిస్తారు. ఉల్లంఘన పునరావృతమైతే ఏజెన్సీ అనుమతులు రద్దుచేసే అధికారం మున్సిపాలిటీలకు ప్రభుత్వం అప్పగించింది. ☛ ఇక నుంచి హోర్డింగ్‌పై అనుమతి నంబరు, ప్రింటర్ వివరాలు, ఫోన్ నంబరు ముద్రించాలి. ☛ ఏజెన్సీలు లైసెన్సు కోసం పురపాలిక నుంచి అనుమతి తీసుకోవాలి. ఈ లైసెన్సు మూడేళ్లపాటు అమల్లో ఉంటుంది. ☛ అనుమతులు ఇచ్చే పోర్టల్ అందుబాటులోకి రానుంది. దరఖాస్తులు, నూతన లైసెన్సులు, ఫీజుల చెల్లింపు, అనుమతులు, పర్యవేక్షణ పోర్టల్ ద్వారా జరగనుంది. ☛ పురపాలక సంఘాల్లోని అన్ని ప్రాంతాల్లో నిశిత పరిశీలన చేసి హోర్డింగ్‌లు, వ్యాపార ప్రకటనల ద్వారా మున్సిపాలిటీల ఆదాయం పెంచేలా చర్యలు తీసుకుంటామని కమిషనర్లు 'న్యూస్‌టుడే' బృందంతో చెప్పారు. నూతన మార్గదర్శకాలపై ఏజెన్సీలకు అవగాహన కల్పిస్తామన్నారు.

రక్తదానంపై అపోహలు తొలగిద్దాం

రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా, సత్తెనపల్లి శాఖ నూతన బాధ్యులతో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: రక్తదానం ప్రాణదానంతో సమానమని, రక్తదానంపై ప్రజల్లో అపోహలను తొలగించేలా రెడ్‌క్రాస్ సొసైటీ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ సూచించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సత్తెనపల్లిశాఖ నూతన బాధ్యుల బాధ్యతల స్వీకరణ, పరిచయ కార్యక్రమాన్ని సోమవారం పట్టణంలో నిర్వహించారు. ఎమ్మెల్యే కన్నా మాట్లాడుతూ సామాజిక సేవలో రెడ్‌క్రాస్ ఆదర్శంగా నిలుస్తుందన్నారు. క్లబ్ ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. బాధ్యులు శేషగిరిరావు, సాంబశివరావు, శ్రీనివాసగుప్తా, ఆళ్ల చంద్రశేఖర్, రామకోటేశ్వరరావు, రోశయ్య, వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

★ నియోజకవర్గానికి చెందిన అయ్యప్ప భక్తులు శబరిమల యాత్రకు బయలుదేరారు. స్థానిక రైల్వేస్టేషన్‌లో వారికి పండ్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు.

మున్సిపల్ ఎన్నికల్లో విజయమే లక్ష్యం.. త్వరలో జరిగే మున్సిపల్ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ సూచించారు. పట్టణంలోని 12వ వార్డులో సోమవారం రాత్రి పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏడాదిన్నరలో వార్డులో రూ.46 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగులతో మాట్లాడారు. ప్రజలకు పౌరసేవలందించే విషయంలో నిర్లక్ష్యం వ్యవహరిస్తే ఊరుకునేది లేదన్నారు. వార్డులోని వాల్మీకి విగ్రహానికి కన్నా పూలమాలలువేసి నివాళులర్పించారు. నాయకులు నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, డాక్టర్ పవన్‌కుమార్, మస్తాన్‌వలి, జానిబాబు, అంబికా తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థుల గొడవ

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: తరగతి గదిలో పదో తరగతి విద్యార్థులు కొట్టుకున్న ఘటన సోమవారం స్థానిక జిల్లా పరిషత్ సుగాలి ఉన్నత పాఠశాలలో చోటుచేసుకుంది. ఉపాధ్యాయుడు లేని సమయంలో తెరపై పాఠాలకు ఏర్పాటు చేసిన ఎల్ఈడీలోని ప్రోగ్రామింగ్ స్క్రీన్ మార్చే విషయంలో ఇద్దరు విద్యార్థుల మధ్య వాగ్వాదం జరిగింది. అదికాస్తా గొడవగా మారి కొట్టుకున్నారు. ఓ విద్యార్థి సొమ్మసిల్లి పడిపోయాడు. విషయం విద్యార్థి కుటుంబ సభ్యులు, బంధువులకు తెలియడంతో ఉపాధ్యాయుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థిని మెరుగైన చికిత్స కోసం గుంటూరు సమగ్రాసుపత్రికి తరలించారు.

రోగులకు పౌష్టికాహారం నగదు అందిస్తాం

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: క్షయ రోగులకు డీబీటీ విధానంలో నిక్షయ్ పోషణ యోజన పౌష్టికాహారం నగదు త్వరలోనే అందుతుందని టీబీ నియంత్రణ విభాగం జిల్లా అధికారులు తెలిపారు. క్షయ రోగుల ఇబ్బందులపై 'సాయం అందదు.. పౌష్టికాహారం ఉండదు' శీర్షికన సోమవారం 'ఈనాడు' మినీలో ప్రచురితమైన కథనానికి స్పందించారు. జిల్లాకు నిధుల కేటాయింపులు జరిగిన వెంటనే రోగుల ఖాతాలకు సర్దుబాటు చేస్తామని చెప్పారు.

ఈనాడు కథనానికి స్పందన

రైతు వ్యతిరేక విధానాలపై నిరసన

ముప్పాళ్ల, న్యూస్‌టుడే: రైతు వ్యతిరేక విధానాలను కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తోందని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గుంటుపల్లి బాలకృష్ణ అన్నారు. మండలంలోని మాదలలో రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం నూతన విత్తన చట్టంతోపాటు ఇతర చట్టాల నకళ్లను దహనం చేశారు. నాయకులు వెంకటరెడ్డి, సాంబశివరావు, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలపై అవగాహన

దుర్గి, న్యూస్‌టుడే: దుర్గి ఆదర్శ పాఠశాలలో సోమవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు భూసార పరీక్షలపై అవగాహన కల్పించారు. శాస్త్రవేత్త యాకోబు తదితరులు మట్టి ఆరోగ్యం, ప్రాముఖ్యత, సేంద్రియ పదార్థాల వినియోగం తదితర వాటిపై 7,8,9 తరగతుల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఏవోలు అరుణ, అమీర్‌రెడ్డి పాల్గొన్నారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటా

లగడపాడు(పెదకూరపాడు), న్యూస్‌టుడే: 'ఏం శివయ్య అన్నా బాగున్నావా.. పంటలు ఎలా ఉన్నాయి.. బామ్మ పింఛన్ అందుతుందా? బాబాయి సర్వే సమస్య పరిష్కారమైందా.. సుబ్బారావు మీ ఏరియాలో పారిశుద్ధ్య చర్యలు చేపడుతున్నారా.. చిన్నమ్మ ఉచిత బస్సు పథకం ఎలా ఉంది?' అంటూ ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ లగడపాడు గ్రామంలో పర్యటించారు. '100 రోజులు వంద గ్రామాలు' కార్యక్రమం సోమవారం మండలంలోని లగడపాడు గ్రామంలో చేపట్టారు. ఎమ్మెల్యే వీధుల్లో తిరుగుతూ వృద్ధులు, మహిళలు, యువకులు, దివ్యాంగులు, రైతు కూలీలు, భవన నిర్మాణ కార్మికులతో మమేకమై వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అధైర్య పడొద్దు.. అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అనంతరం గ్రామ సచివాలయం వద్ద ప్రజాదర్బార్ ఏర్పాటు చేసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. సమస్యలకు పరిష్కారం చూపుతామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు ధనలక్ష్మి, ఎంపీడీవో సాయిలీల, మండల తెదేపా అధ్యక్షుడు ఏటుకూరి బ్రహ్మయ్య, సొసైటీ అధ్యక్షుడు ఏటుకూరి రత్న, గ్రామ నాయకులు శివరామకృష్ణయ్య, నాగమల్లేశ్వరరావు, వెంకటేశ్వర్లు, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

ఎరువుల దుకాణాల్లో తనిఖీ

తనిఖీలు చేస్తున్న అధికారులు

సత్తెనపల్లి గ్రామీణ, న్యూస్‌టుడే: సత్తెనపల్లి పట్టణంలోని రెండు ఎరువుల దుకాణాల్లో సోమవారం గుంటూరు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులు తనిఖీలు చేపట్టారు. విజిలెన్స్ సీఐ చంద్రశేఖర్ మాట్లాడుతూ అచ్చంపేట రోడ్డులోని దుకాణంలో రికార్డులు సక్రమంగా లేకపోవడంతో రూ.10 లక్షల విలువైన ఎరువులు, పురుగు మందుల అమ్మకాలను నిలుపుదల చేశామన్నారు. మరో దుకాణంలో అనధికారికంగా నిల్వ ఉంచిన రూ.10 లక్షల విలువైన బయోఉత్పత్తులను సీజ్ చేసి 6ఏ కేసు నమోదు చేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేశామన్నారు.

అనర్గళంగా మాట్లాడి.. బహుమతులు సాధించి

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: పట్టణంలోని కామినేని పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలను సోమవారం నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం అనే అంశంపై ఉపన్యాస పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఎ.కార్తీక, జి.తేజశ్విని, బి.భవ్య ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరికి ఉపాధ్యాయుడు ఎస్.కె.కనిష్‌బాషా బహుమతులు అందజేశారు.

విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయుడు కనిష్‌బాషా

మౌలిక వసతులు కల్పించరూ..

పిడుగురాళ్ల: జిల్లాలోని వినుకొండ, గురజాల, శ్యావల్యాపురం రైల్వేస్టేషన్లలో ప్రయాణికులకు మౌలిక వసతులు కల్పించాలని దక్షిణ మధ్య రైల్వే బోర్డు సభ్యురాలు కొంకా రాధ కోరారు. సోమవారం గుంటూరులోని రైల్వే కార్యాలయంలో డీఆర్ఎం, ఏడీఆర్ఎంలను కలిసి విన్నవించారు.

కంటి వైద్య శిబిరం

విజయపురిసౌత్: మాచర్లకు చెందిన రామలింగారెడ్డి మ్యాక్సివిజన్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో విజయపురిసౌత్‌లో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 51 మందికి వైద్య బృందం పరీక్షలు చేశారు.

కళాభినేత్రి సావిత్రికి నివాళి

క్రోసూరు(అచ్చంపేట): కళాభినేత్రి, నటీమని సావిత్రి చలనచిత్ర పరిశ్రమకు వన్నె తెచ్చారని ఘంటసాల కళా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు శ్యాంసన్ అన్నారు. సోమవారం క్రోసూరులోని ప్రయాణికుల విశ్రాంతి మందిరం వద్ద సావిత్రి జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమితి నాయకులు మస్తాన్, తెదేపా నాయకుడు మైసూరుబాబు, సింగర్ మస్తాన్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రి చుట్టూ అపరిశుభ్రత

నకరికల్లు ఆయుర్వేద ఆసుపత్రి భవనం శిథిలావస్థకు చేరింది. ప్రాంగణంలో అపరిశుభ్రత నెలకొంది. మురుగు వ్యర్థాల కుప్పలు దర్శనమిస్తున్నాయి. దీంతో స్థానికంగా నివాసం ఉండే వారు ఇబ్బందులు పడుతున్నారు. శ్లాబ్ పైకప్పు పెచ్చులు ఊడి పడుతున్నాయి. గోడల నుంచి ఇనుప ఊచలు బయటపడ్డాయి. అలానే ఆసుపత్రి చుట్టూ స్థలం ఆక్రమణలకు గురవుతోంది. పోలీసుస్టేషన్ పక్కనే ఉన్నా ఆసుపత్రి రక్షణ పట్టడంలేదని, తక్షణమే అధికారులు చర్యలు తీసుకుని ఆక్రమణలు, చెత్త తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, నకరికల్లు**

మంచు కురిసే వేళలో..

జిల్లాలో వాతావరణంలో వచ్చిన మార్పులు ప్రజలకు ఆహ్లాదంతోపాటు ఆందోళనను కలిగిస్తున్నాయి. పల్నాడులో ఉష్ణోగ్రతలు పడిపోయాయి. ఉదయం మంచు ప్రభావం 9గంటల వరకు ఉంటోంది. ఈ మార్పులు కొంత ఆహ్లాదకరంగా ఉండగా, జలుబు, గొంతునొప్పి, తలనొప్పి లాంటి సమస్యలతో కొందరు బాధపడుతున్నారు. ఉదయం 8 గంటలకు కూడా వాహనాలు లైట్లు వేసుకుని వెళుతున్నాయి. **- న్యూస్‌టుడే, సత్తెనపల్లి, దాచేపల్లి**

దాచేపల్లి వద్ద ఇలా..

అంగన్‌వాడీలకు గుడ్ల సరఫరాపై నిర్లక్ష్యం

అమరావతి, న్యూస్‌టుడే

ఆరోగ్య భారత్.. ఆరోగ్యాంధ్ర లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.కోట్లు ఖర్చు చేస్తున్నాయి. అందులో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తోంది. క్షేత్రస్థాయిలో మాత్రం అధికారుల నిర్లక్ష్యంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరకుండా పోతోంది. పిల్లలకు పౌష్టికాహారం సక్రమంగా అందడం లేదు. గత పది రోజులుగా అంగన్‌వాడీలకు గుడ్లు సరఫరా నిలిచిపోయింది. సరఫరా చేసే గుత్తేదారు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. అమరావతి మండలంలో 64 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 314 మంది పిల్లలు ఉన్నారు. వీరితోపాటు గర్భిణులు, బాలింతలకు ప్రతి రోజు గుడ్లు అందించాల్సి ఉంది. గుత్తేదారు ప్రతి నెల నాలుగు దఫాలుగా కేంద్రాలకు సరఫరా చేయాలి. ఈ నెల 1వ తేదీ నుంచి సరఫరా ఆగింది. కొన్ని కేంద్రాల్లో నిల్వ ఉన్న గుడ్లను పిల్లలకు అందిస్తున్నారు. నిల్వ ఉన్న వాటిలో కొన్ని పాడైపోయాయి. దీనిపై సీడీపీవో వెంకటరమణను అడగ్గా. . సరఫరాదారులకు సమాచారం ఇచ్చామని, ఒకటి రెండ్రోజుల్లో గుడ్లు సరఫరా అవుతాయని తెలిపారు.

పాడైపోయిన గుడ్లు

నియంత్రిక ధ్వంసం

మాచవరం, న్యూస్‌టుడే: ట్రాన్స్‌ఫార్మర్ దొంగలు చెలరేగిపోతున్నారు. ఇటీవల మోర్జంపాడు, శ్రీరుక్మిణీపురం పొలాల్లోని వ్యవసాయ విద్యుత్తు నియంత్రికలను పగులగొట్టి, అందులోని రాగి తీగను చోరీ చేశారు. తాజాగా ఆదివారం అర్ధరాత్రి ఇలాంటి ఘటనే మరొకటి జరిగింది. కొత్తపాలేనికి చెందిన రైతు రామారావుకు మాచవరం-తురకపాలెం రహదారి పక్కన వ్యవసాయ పొలం ఉంది. మిర్చి సాగు చేశారు. గుర్తుతెలియని వ్యక్తులు పొలంలోని నియంత్రికను పగులగొట్టి, రాగి తీగను ఎత్తుకెళ్లారు. సోమవారం ఉదయం పొలం వెళ్లిన రైతు చూసి, అధికారులకు సమాచారం ఇచ్చారు. సుమారు రూ.1.80 లక్షల నష్టం జరిగిందని ఇన్‌ఛార్జి ఏఈ భగవాన్ తెలిపారు.

సహకార సంఘ ఉద్యోగుల ధర్నా

పెదకూరపాడు, న్యూస్‌టుడే: వ్యవసాయ సహకార సంఘ ఉద్యోగుల సమస్యలను సత్వరం పరిష్కరించాలంటూ పెదకూరపాడు సెంట్రల్ బ్యాంకు వద్ద సీఈవోలు, సిబ్బంది ధర్నా చేపట్టారు. జీవో నంబరు 36 అమలుపరచి పెండిగ్‌లో ఉన్న వేతన సవరణ చేపట్టి మధ్యంతర భృతి ప్రకటించాలంటూ సీఈవోలు శ్రీనివాసరావు, జాన్ సైదా, శివకుమారి, అర్చన తదితరులు డిమాండ్ చేశారు. అనంతరం సిబ్బందితో కలిసి జీడీసీసీ బ్యాంకు మేనేజర్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు.

గురజాల, న్యూస్‌టుడే: జీవో నంబరు 36ను వెంటనే అమలు చేయాలని కోరుతూ సహకార సంఘాల సీఈవోలు గురజాల సహకార బ్యాంకు ఎదుట సోమవారం నిరసన వ్యక్తం చేశారు. డీఎల్ఎఫ్ఎస్ కమిటీ ద్వారా జీతాలు చెల్లించాలని, గ్రాట్యుటీ చట్టం అమలు చేయాలని, పలు డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. నల్లబ్యాడ్జీలతో చేపట్టిన నిరసన కార్యక్రమంలో సీఈవోలు ఎం.గురవయ్య, ఐజాక్, ఎస్.జానీబాషా, పీరు అహ్మద్, సాంబశివరావు పాల్గొన్నారు.

గురజాలలో నిరసన వ్యక్తం చేస్తున్న సీఈవోలు

మూగజీవికి చికిత్స

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: 'ఈనాడు' పిలుపుతో సేవకులు ముందుకొచ్చి ఆవు, దూడ సంరక్షణకు చర్యలు చేపట్టారు. స్థానిక ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాల గేటు ఎదురుగా ప్రధాన రహదారిపై కాలికి గాయంతో విలవిల్లాడుతున్న దూడ, దాని పక్కనే ఉన్న ఆవును చూసి రక్షించాలని ఓ పాఠకుడు 'ఈనాడు' దృష్టికి వీడియో పంపించారు. దూడను కారు ఢీకొనడంతో కాలు నుజ్జునుజ్జు అయ్యింది. ఆర్యవైశ్య యువజన సంఘం రాష్ట్ర నాయకుడు కొత్తా రామకృష్ణ దృష్టికి విషయాన్ని 'న్యూస్‌టుడే' తీసుకెళ్లగా వెంటనే ఆయన స్పందించారు. ఆటోలో ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. సమాచారం అందుకున్న గోశాల అధ్యక్షుడు మల్లయ్య ఆసుపత్రికివచ్చి మెరుగైన చికిత్స అందేలా శ్రద్ధ తీసుకున్నారు. దూడకు చికిత్స చేయించి గోశాలకు తీసుకెళ్లారు.

దూడకు చికిత్స అందిస్తున్న సిబ్బంది

ఖరీదైన బైక్‌లే లక్ష్యంగా చోరీలు

నందిగామ, న్యూస్‌టుడే: వ్యసనాలకు బానిసలైన యువకులు ఖరీదైన బైక్‌లే లక్ష్యంగా చోరీలకు పాల్పడ్డారు. తెలుగు రాష్ట్రాల్లో వాహనాలను చోరీ చేసి వాటిని విక్రయించారు. వీరంతా తెలంగాణ రాష్ట్రంలోని నల్గొండ జిల్లాకు చెందిన వారే. ఎన్టీఆర్ జిల్లా నందిగామ పోలీసులు నందిగామ వై.జంక్షన్ వద్ద ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి 15 ఖరీదైన బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. నందిగామ, పిడుగురాళ్ల, నరసరావుపేట, పెనమలూరు, కృష్ణలంక, రెంటచింతల పోలీస్ స్టేషన్‌ల పరిధిలో చోరీకి గురైన బైక్‌లను స్వాధీనం చేసుకున్నామని పోలీసులు తెలిపారు.

ప్రత్యేకాధికారుల బాధ్యతల స్వీకరణ

అచ్చంపేట, క్రోసూరు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం గ్రామ సచివాలయాల వ్యవస్థను పటిష్టపరచడంలో భాగంగా మండలాలకు పర్యవేక్షణ ప్రత్యేకాధికారులను నియమించారు. అచ్చంపేట మండలానికి కె.శ్రీనివాసరావు, క్రోసూరు మండలానికి సుభానీ బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీవోలతో కలిసి గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు కృషి చేస్తామని వారు తెలిపారు.

ఆకట్టుకున్న హస్తకళా ప్రదర్శన

క్రోసూరు(అచ్చంపేట), న్యూస్‌టుడే: విద్యార్థుల్లో దాగిఉన్న ప్రతిభను వెలికితీసేందుకు హస్తకళా ప్రదర్శన దోహదం చేస్తుందని క్రోసూరు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ మేరిసూజన్ తెలిపారు. సోమవారం స్థానిక ఆదర్శ పాఠశాలలో పీఎంశ్రీ ద్వారా ప్రదర్శన ఏర్పాటు చేశారు. విద్యార్థులు సృజనాత్మకంగా రూపొందించిన చిత్రాలు, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన నమూనాలు, వ్యర్థాలతో తయారుచేసిన వస్తువులు, సంప్రదాయ కళారూపాలు ఆకర్షణగా నిలిచాయి.

మురుగు సమస్యకు పరిష్కారం

సత్తెనపల్లి: దీర్ఘకాలంగా వేధిస్తున్న మురుగు సమస్యకు చెక్ పెట్టేలా శాశ్వత డ్రైనేజీ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డులో వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి స్టేషన్ వరకు కాలువ నిర్మాణం రూ.9 లక్షలతో చేపడుతున్నారు.

విద్యార్థుల విజ్ఞానయాత్ర

దుర్గి: దుర్గి జడ్పీ పాఠశాలలో ప్రతిభ చాటుతున్న 80 మంది విద్యార్థులను పీఎంశ్రీ పథకంలో భాగంగా ఆదివారం విహారయాత్రకు తీసుకెళ్లారు. అమరావతి ఆలయం, బుద్ధుని విగ్రహం, అసెంబ్లీ, ఉండవల్లి గుహలు విద్యార్థులు తిలకించి ఆనందం వ్యక్తం చేశారు.

పంట కోతపై శిక్షణ

మాచర్ల (కారంపూడి), న్యూస్‌టుడే: పంటల కోత ప్రయోగాలపై ఉద్యాన సహాయకులకు సోమవారం మాచర్ల వ్యవసాయ కార్యాలయంలో ఒక రోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. పంట కోత ప్రయోగం ద్వారా దిగుబడి అంచనా వేయొచ్చన్నారు.

క్రీడలు విద్యలో భాగమే

రెంటచింతల, న్యూస్‌టుడే: క్రీడలు విద్యలో భాగమని ఎంఈఓ-2 శివనాగేశ్వరరావు తెలిపారు. సోమవారం స్థానిక సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాలలో గురజాల, మాచర్ల నియోజకవర్గ స్థాయిలో విజ్ఞాన్ జోనల్-1 పోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయన్నారు. 150 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల జట్లు పోటీల్లో పాల్గొన్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన్ యూనివర్సిటీ ప్రతినిధులు రమేష్‌నాయుడు, సురేష్, రాఘవేంద్ర, ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంఈవో శివనాగేశ్వరరావు

లక్ష్యాన్ని ఎంచుకుని చదవాలి

మాచర్ల (కారంపూడి), న్యూస్‌టుడే: విద్యార్థులు లక్ష్యాలను ఎంచుకుని క్రమశిక్షణ, పట్టుదలతో చదవాలని పల్నాడు కళాశాల కరస్పాండెంట్ నాగుర్‌వలి తెలిపారు. సోమవారం మాచర్లలోని నరిశెట్టి కల్యాణ మండపంలో వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆటపాటలతో అలరించారు. ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. కళాశాల ఛైర్మన్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ తుది పరీక్షల్లో విద్యార్థులు ప్రతిభ చూపి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు మంచిపేరు తేవాలన్నారు. ప్రిన్సిపల్ శివభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బహుమతులు అందిస్తున్న అధ్యాపకులు

పల్లెల్లో శుభ్రత ఎక్కడ?

దాచేపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్రంలో వచ్చే జనవరి నుంచి ఎక్కడా వ్యర్థాలు కనిపించరాదు. వీధుల్లో చెత్త కుప్పలు కనిపిస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని గత సెప్టెంబరులో కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేసిన విషయం విదితమే. ప్రభుత్వం పల్లెల్లో శుభ్రతకు ప్రాధాన్యత ఇస్తున్నా అధికారుల తీరు నిరాశకు గురిచేస్తోంది. దాచేపల్లి మండలంలోని ఏ పల్లె చూసినా.. చెత్తాచెదారం, మురుగు కనిపిస్తోంది. వ్యర్థాల సేకరణ, స్వచ్ఛతపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు మొక్కుబడిగా సాగుతున్నాయి. రహదారుల వెంబడి గుట్టలుగా చెత్త వేసి నిప్పు పెడుతున్నారు.

ముత్యాలంపాడు ప్రధాన రహదారి పక్కన చెత్త

సంపద కేంద్రాలు నిరుపయోగం..

ప్రతి పంచాయతీలోనూ చెత్త నుంచి సంపద సృష్టించేందుకు రూ.లక్షలు వెచ్చించి షెడ్లు నిర్మించారు. అవి నిరుపయోగంగా మారాయి. మండలంలో 17 పంచాయతీలు ఉన్నాయి. ఎక్కడా సంపద సృష్టి జరగడం లేదు. స్వచ్ఛత కార్యక్రమాన్ని నీరుగార్చేస్తున్నారు. ప్రధానంగా ముత్యాలంపాడు, మాదినపాడు, తంగెడ, గామాలపాడు, తక్కెళ్లపాడు తదితర గ్రామాల్లో చెత్త నిర్వహణ, పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది.

సర్వే వ్యవస్థను ప్రక్షాళన చేయాలి

మాచర్ల (కారంపూడి), న్యూస్‌టుడే: ప్రభుత్వం ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావేదికల్లో భూ సమస్యపై అధికంగా ఫిర్యాదులు వస్తున్నాయని, వాటి పరిష్కారానికి సర్వే వ్యవస్థను పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేయాల్సిన అవసరముందని కాంగ్రెస్ నాయకుడు రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం మాచర్లలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఏకోనాంపేటలో భారీ ఎత్తున జరుగుతున్న భూ లావాదేవీలపై నిఘా పెట్టాలన్నారు. భూ సమస్యలకు పరిష్కారం చూపకపోతే కాంగ్రెస్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ముట్టడి చేపడతామన్నారు.

మిరపలో సస్యరక్షణ తప్పనిసరి

ముప్పాళ్ల, న్యూస్‌టుడే: మిరప సాగులో సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సత్తెనపల్లి ఉద్యాన అధికారి సురేష్ చెప్పారు. మండలంలోని మాదల గ్రామంలో సాగవుతున్న మిరప పైరును సోమవారం ఆయన పరిశీలించారు. రసం పీల్చే నల్లతామర పురుగు, తెల్లదోమ, నల్లి, పేనుబంక నివారణకు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. తామర పురుగుల నివారణకు రైతులు సామూహికంగా నీలి, పసుపు రంగు అట్టలను పొలంలో ఎకరాకు 20 చొప్పున ఏర్పాటు చేయాలని సూచించారు.

పరిశ్రమల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి

పెదకూరపాడు, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంత యువతకు స్థానికంగా ఉపాధి కల్పించడమే లక్ష్యంగా పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేయాలని రాష్ట్ర చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి డైరెక్టర్ గుడిపూడి చిన్నరాజుకు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సూచించారు. సోమవారం రాత్రి పెదకూరపాడులో చిన్నరాజు పుట్టిన రోజు సందర్భంగా స్థానిక పంచాయతీరాజ్ అతిథి గృహంలో కూటమి నేతలు నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. నేతల సమక్షంలో రాజు కేకును కోసి ఆనందాన్ని పంచుకున్నారు.

చిన్నరాజుతో కలిసి కేకు కోస్తున్న ఎమ్మెల్యే ప్రవీణ్, నాయకులు

(c) eenadu

మిల్లర్లతో మాట్లాడుతున్న కలెక్టరు ప్రభాకరరెడ్డి, అధికారులు

నిబంధనలు పాటించకుంటే బ్లాక్‌లిస్టులోకి..

పార్వతీపురం, న్యూస్‌టుడే: నిబంధనలు, భద్రతా ప్రమాణాలు పాటించని మిల్లర్లను ఎటువంటి వ్యాపారం చేసేందుకు అనుమతి లేకుండా బ్లాక్‌లిస్టులో పెట్టాలని కలెక్టరు ప్రభాకరరెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం మిల్లర్లతో కలెక్టరు ప్రత్యేకంగా సమావేశాన్ని నిర్వహించారు. మిల్లుల్లో అగ్నిప్రమాదాలను ఎదుర్కొనేందుకు వీలుగా పాటించాల్సిన భద్రతా ప్రమాణాలు లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే రెండు యాజమాన్యాలకు శ్రీముఖాలు జారీ చేసినట్లు వెల్లడించారు. బ్యాంకు గ్యారెంటీల విషయంలో వాస్తవ పరిస్థితిని తెలియజేయాలని పౌరసరఫరాల సంస్థ జిల్లా ప్రబంధకుడిని ఆదేశించారు. ధాన్యం సేకరణ అంశాలపై రైతులకు అవగాహన కార్యక్రమాలను మళ్లీ నిర్వహించాలని ఆదేశించారు. జేసీ యశ్వంత్‌కుమార్‌రెడ్డి, సబ్‌కలెక్టర్లు వైశాలి(పార్వతీపురం) పవర్‌స్వప్నిల్ జగన్నాథ్(పాలకొండ), జిల్లా వ్యవసాయాధికారి ఆర్.అన్నపూర్ణ, డీఎం (పౌరసరఫరాలు) శ్రీనివాసు, డీఎస్‌వో బాలసరస్వతి పాల్గొన్నారు.

వస్తున్నాయ్.. క్రీడా పాఠశాలలు

న్యూస్‌టుడే, పార్వతీపురం

జిల్లాలో క్రీడాభివృద్ధికి యంత్రాంగం నడుం కట్టింది. ఆటలంటే ఆసక్తి ఉన్న విద్యార్థులను పాఠశాలల వారీ గుర్తించి, ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు కలెక్టరు ప్రభాకర్‌రెడ్డి ప్రత్యేక ప్రణాళికను రూపొందించారు. త్వరలోనే ఇది అమలయ్యేలా విద్యాశాఖకు దిశానిర్దేశం చేశారు. సంబంధిత సమాచారాన్ని సోమవారం కలెక్టర్ వెల్లడించారు.

మన్యంలో నాలుగు చోట్ల ఏర్పాటుకు అడుగులు

జిల్లాలో క్రీడల అభివృద్ధికి వనరులు, అవకాశం ఉన్న గుమ్మలక్ష్మీపురం, తోటపల్లి, సీతంపేట, సాలూరు కేంద్రాల్లో క్రీడా పాఠశాలలు ఏర్పాటు చేయాలని యోచిస్తున్నారు.

ఈ ఆటలకు..

కబడ్డీ, వాలీబాల్, విలువిద్య, ఖోఖో, హ్యాండ్‌బాల్, బ్యాడ్మింటన్ వంటి 13 క్రీడలను గుర్తించారు. నియామకంపై కసరత్తు జరుగుతోంది.

విద్యాశాఖ మంత్రి దృష్టికి..

రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఇటీవల భామిని వచ్చినప్పుడు జిల్లాలో క్రీడాభివృద్ధికి చేపట్టనున్న ఈ కార్యక్రమం గురించి కలెక్టర్ ప్రభాకరరెడ్డి వివరించారు. దీన్ని మంత్రి ప్రశంసించడంతోపాటు రాష్ట్రవ్యాప్తంగా అమలుచేసే దిశగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్న విషయాన్ని కలెక్టర్ అధికారులతో పంచుకున్నారు.

ఏర్పాటు ఎలా?

★ క్రీడలపై ఆసక్తి ఉన్న విద్యార్థులను ఎంపిక చేస్తారు. వారికి తొలుత గ్రామస్థాయి, ఆపై జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించి ప్రతిభావంతుల్ని గుర్తిస్తారు.

★ ఒక క్రీడలో ప్రవేశం ఉన్న వారిలో ప్రతిభను సానబెట్టేందుకు అందరినీ ఓచోట చేర్చుతారు.

★ భోజనం, వసతి తదితర అంశాలపై జిల్లా యంత్రాంగం, విద్యాశాఖ, సంక్షేమశాఖలు సంయుక్తంగా ప్రణాళికను రూపొందిస్తున్నాయి. ప్రత్యేకంగా పోషక విలువలు ఉన్న ఆహారాన్ని అందించేలా ఏర్పాట్లు చేస్తారు.

★ ఒక్కోచోట మూడు, నాలుగు క్రీడలకు సంబంధించి గుర్తించిన విద్యార్థులను చేర్చుతారు.

గతంలో విఫలం

1994-95 ప్రాంతంలో పార్వతీపురం ఐటీడీఏ పరిధిలోని పాచిపెంట మండలం తోణాం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను క్రీడా పాఠశాలగా తీర్చిదిద్దే ప్రయత్నం చేశారు. అది వికటించి, పలువురు ఉపాధ్యాయులపై కేసులు నమోదయ్యే వరకు వెళ్లింది. ఆ తర్వాత రావాడ-రామభద్రపురంలో క్రీడా పాఠశాల ఏర్పాటుకు ప్రయత్నించారు. అదీ ఫలితాన్నివ్వలేదు. ఈసారైనా పక్కా ప్రణాళికతో వీటిని అందుబాటులోకి తేవాలని జిల్లావాసులు కోరుతున్నారు.

బానిసగా మారొద్దు.. భవిత వదులుకోవద్దు..

యువత గంజాయి, డ్రగ్స్ వంటి మత్తుపదార్థాలకు బానిసలైతే బంగారు భవిష్యత్తు అంధకారం అవుతుందని కలెక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి, ఎస్పీ మాధవరెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రానికి చేరిన అభ్యుదయ సైకిల్ యాత్రకు ఘన స్వాగతం పలికారు. చర్చి కూడలి వద్ద అదనపు ఎస్పీ వెంకటేశ్వరరావు యాత్రకు జెండా ఊపగా... కలెక్టర్, ఎస్పీ, జేసీ యశ్వంత్‌కుమార్‌రెడ్డి, సబ్ కలెక్టర్లు వైశాలి, స్వప్నిల్‌పవర్, ఏఎస్పీ మనీషారెడ్డి యాత్రికులతో కలిసి నాలుగు రోడ్ల కూడలి వరకు సైకిల్ తొక్కుతూ సాగారు. ఆర్టీసీ కూడలి వద్ద మానవహారం నిర్వహించి.. నినాదాలు చేశారు. పోలీసు బ్యాండ్, తప్పెటగుళ్లు, సన్నాయి వాద్యం, గిరిజన విద్యార్థుల నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

– న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం, పురపాలక, గ్రామీణం

నేడు పార్వతీపురంలో క్రీడా ఎంపికలు

సీతంపేట, న్యూస్‌టుడే: శాప్ ఆధ్వర్యంలో షెడ్యూల్డ్ ప్రాంతం (పీసా)లోని గిరిజన క్రీడాకారులకు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలు నిర్వహించడానికి అధికారులు నిర్ణయించారని ఐటీడీఏ క్రీడా అధికారి ఎన్.జాకోబ్ దయానందం తెలిపారు. పార్వతీపురంలో మంగళవారం జిల్లాస్థాయి ఎంపిక పోటీలు నిర్వహిస్తామన్నారు. 18 ఏళ్లు పైబడిన స్త్రీ, పురుషులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. ఈ నెల 10, 11 తేదీల్లో రాష్ట్ర స్థాయి పోటీలు, 23, 24 తేదీల్లో జాతీయ స్థాయి పోటీలు విశాఖలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కబడ్డీ, విలువిద్య, పరుగు పందెంలో పోటీలు జరుగుతాయన్నారు.

రైతేరాజు 6లో

ఆప్కాబ్ నుంచి జిల్లాకు రూ.100 కోట్లు

● రుణాల మంజూరుకు చర్యలు

చీపురుపల్లి, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లా రైతులకు తోడ్పాటు అందించడానికి ఆప్కాబ్ నుంచి అదనపు ఫైనాన్స్ కింద రూ.100 కోట్లు మంజూరు చేసినట్లు డీసీసీబీ ఛైర్మన్, తెదేపా విజయనగరం పార్లమెంటరీ అధ్యక్షుడు కిమిడి నాగార్జున తెలిపారు. సోమవారం చీపురుపల్లిలో విలేకరులతో మాట్లాడారు. కొద్ది రోజుల కిందట అమరావతిలో ఆప్కాబ్ ఛైర్మన్, ఎండీని కలిసి జిల్లా సమస్యలు తెలియజేశామని, ఈ మేరకు రుణాలు ఇచ్చేందుకు మంజూరు చేశారన్నారు. అర్హులైన నూతన సభ్యులకు ఇవ్వాలని బ్యాంకు అధికారులకు ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. ఛైర్మన్లు, సభ్యులు, సీఈవోలు వారి సంఘం పరిధిలోని అర్హత గల రైతులకు పంట రుణాల ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. సక్రమంగా చెల్లించినవారికి కేంద్ర ప్రభుత్వం 3 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 4 శాతం వడ్డీ తిరిగి ఇస్తారన్నారు. అవకాశాన్ని ఉమ్మడి జిల్లా రైతులు వినియోగించుకోవాలని కోరారు.

● ఇటీవల పాలకొండ మండలం బుక్కూరు గ్రామానికి చెందిన రైతు ధాన్యం విక్రయించేందుకు మిల్లుకెళ్లాడు. 80 కిలోలకు అదనంగా నాలుగు కిలోలు డిమాండ్ చేశారు. లేదంటే కొనుగోలు చేయమని మిల్లరు తెగేసి చెప్పడంతో ఇవ్వాల్సిన పరిస్థితి.

● ఎం.సింగుపురం గ్రామానికి చెందిన రైతు మిల్లుకు ధాన్యం తీసుకెళ్లారు. తుపాను కారణంగా గుడిగా వస్తుందన్న సాకుచూపి 80 కిలోలకు ఆరు కిలోలు అదనంగా ఇవ్వాల్సొచ్చిందన్నారు.

● కొండాపురం గ్రామానికి చెందిన ఓ రైతు తన 550 బస్తాల ధాన్యం శ్రీకాకుళం జిల్లాకు తరలించారు. 80 కిలోల బస్తాకు రెండున్నర కిలోలు అదనంగా ఇచ్చుకోక తప్పలేదు. స్థానికంగా కంటే ఆ జిల్లాలో తక్కువ డిమాండ్ చేయడంతో అక్కడే విక్రయించాడు.

ముక్కలంటారు.. అదనంగా ఇస్తేనే ముడతారు

★ ధాన్యం కొనుగోలులో మిల్లర్ల తీరుతో రైతన్న వేదన

ఈనాడు, పార్వతీపురం మన్యం, న్యూస్‌టుడే, పాలకొండ

'ధాన్యంలో తేమ శాతం ఎక్కువగా ఉంది.. బియ్యం ముక్కలవుతోంది.. మరాడితే రవ్వలా మారుతోంది.. అదనంగా పంపిస్తేనే తీసుకుంటాం.. లేదంటే ఉంచుకోండి'. ఉమ్మడి జిల్లాలో పలువురు మిల్లర్ల మాటలివి. వివిధ కారణాలు చెప్పి అన్నదాతల సంపదను దోచేస్తున్నారు. ఇందులో దళారీలదే ప్రధాన పాత్ర. సేకరణ నుంచి తరలింపు వరకు వారే ఉండడంతో రైతుకు నష్టం తప్పడం లేదు.

నిబంధనల ప్రకారం కొనుగోలు చేయాలి

రైతులకు ఆర్ఎస్‌కేల్లో నిర్ణయించిన ధర ప్రకారం మిల్లర్లు కొనుగోలు చేయాలి. ఇందుకు సంబంధించి ప్రత్యేక నిబంధనలు ఉన్నాయి. అదనంగా వసూలు చేస్తే రైతులు నేరుగా ఫిర్యాదు చేయాలి.

– రత్నకుమారి, ఏడీ, వ్యవసాయశాఖ

కొనుగోలు కేంద్రానికి తరలిస్తున్న ధాన్యం

తెగుళ్ల సాకుతో..

గతంలో ప్రభుత్వం సరఫరా చేసే 1021 రకాన్ని వేసేవారు. తెగుళ్లు సోకుతున్నాయని.. పెట్టుబడి పెరుగుతోందని.. కొందరు ఈసారి సంపద స్వర్ణ రకం వైపు మొగ్గు చూపారు. సాధారణ రకాల కంటే అయిదారు బస్తాలు, సారవంతమైన నేలలో అన్నీ అనుకూలిస్తే పది బస్తాల కంటే ఎక్కువ దిగుబడి వస్తుండడంతో ఆశ పడ్డారు. ఈ ఏడాది విజయనగరం జిల్లాలో 57 వేల ఎకరాలు, మన్యంలో 25,875 ఎకరాల్లో సాగు చేపట్టారు. తుపాన్లు, ఈదురుగాలుల కారణంగా చాలావరకు పంట దెబ్బతింది. అమ్మే నాటికి ముక్కలవుతోందని చెబుతుండడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. అధికారులు అదనపు వసూళ్లు వద్దంటున్నా మిల్లర్లు మాత్రం ఆదేశాలు పట్టించుకోవడం లేదు. సాకులు చెప్పి కర్షకుల కష్టాన్ని దోచుకుంటున్నారు. తుపాను ప్రభావంతో బియ్యం ముక్క అవుతుందనే సాకును చూపుతున్నారు.

లంచం అడిగితే.. ఇలా చేయండి

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: ప్రభుత్వ కార్యాలయాల్లో పౌర సేవలు, సంక్షేమ పథకాల అమలు, ధ్రువపత్రాల మంజూరు, భూముల రిజిస్ట్రేషన్.. ఇలా ఏ పని చేయాలన్నా అడిగినంత ఇవ్వకుంటే కొందరు ఉద్యోగులు ప్రజలను కాళ్లరిగేలా తిప్పిస్తుంటారు. ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే ఎన్నో ఘటనలు జరిగాయి. బాధ్యతాయుతమైన ఉద్యోగం చేస్తూ.. ప్రభుత్వ జీతం తీసుకొని లంచం ఆశించే వారిపై ఫిర్యాదుకు అనేక మార్గాలు ఉన్నాయి. మంగళవారం అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినం. ఈ సందర్భంగా ఆ నంబర్ల వివరాలు మీ కోసం...

★ లంచం సమస్య ఎదురైతే నంబరు: 1064 టోల్ ఫ్రీ, 0866-2428770, 94404 40057

★ విజయనగరం అనిశా డీఎస్పీ: 94404 46174, సీఐ: 94404 46176

★ ఆన్‌లైన్‌లో రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలంటే.. : https://acb.ap.gov.in

టిడ్కో తలుపులు.. తెరుచుకునేదెప్పుడు?

అసంపూర్తిగా మురుగు నీటి సరఫరా పనులు

సాలూరులో పట్టణ పేదలకు ప్రభుత్వం మంజూరు చేసిన టిడ్కో గృహ సముదాయానికి మౌలిక సదుపాయాలు కల్పించక రెండేళ్లుగా వృథాగా ఉన్నాయి. 2018లో తెదేపా ప్రభుత్వం 1,440 గృహాలను మంజూరు చేసింది. రివర్స్ టెండర్ల నెపంతో 192 గృహాలను వైకాపా ప్రభుత్వం రద్దు చేసింది. మరో 192 ఇళ్లు పనులు పూర్తి కాలేదు. 1,056 ఇళ్ల పనులు పూర్తిచేసి గతేడాది ఫిబ్రవరిలో గృహప్రవేశాలు చేశారు. తాగునీరు, రోడ్డు, కాలువ పనులు చేయక పోవడంతో పాలుపోంగించి.. లబ్ధిదారులు ఇళ్లకు తాళాలు వేశారు. నాటి నుంచి నేటి వరకు తలుపులు తెరుచుకోలేదు. లబ్ధిదారులు అద్దె ఇళ్లకే పరిమితమయ్యారు. ఈ ఏడాది జులైలో టిడ్కో ఛైర్మన్ ఈ గృహాలను సందర్శించారు. పేదలు సొంతింట్లో సంక్రాంతి పండగ చేసుకునేలా పనులు పూర్తిచేస్తామన్నారు. ఇప్పటి వరకు పనుల్లో ప్రగతి లేదు. గుత్తేదారుకు బకాయి బిల్లులు చెల్లించక పనులు నిలిపేశారని, పూర్తిచేయాలని కోరుతున్నామని టిడ్కో డీఈ శశిధర్ చెబుతున్నారు.

గృహాలను అల్లుకుంటున్న పొదలు

– న్యూస్‌టుడే, సాలూరు

ఈసారి 13,985 మందే..

ఉమ్మడి జిల్లాలో టెట్‌కు తగ్గిన పోటీ

– న్యూస్‌టుడే, విజయనగరం విద్యావిభాగం

ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)కు పోటీ తగ్గుముఖం పట్టింది. ఈసారి ఉమ్మడి జిల్లాలో 13,985 మందే ముందుకొచ్చారు. తొలిసారిగా ఉపాధ్యాయ అభ్యర్థులతో పాటు ఇన్‌సర్వీసు ఉపాధ్యాయులు పరీక్ష రాయనుండడంతో పోటీ ఎక్కువగా ఉంటుందని అంతా భావించారు. గతంలో రెండు టెట్‌లు రాసి ఉండడం, కొందరికి మంచి స్కోరింగ్ ఉండడంతో దరఖాస్తు చేయనట్లు తెలుస్తోంది. ఈసారి తగినంత వ్యవధి కూడా లేకపోవడంతో స్కోరింగ్ చేయలేమన్న భావనతో వెనకడుగు వేసినట్లు మరికొందరు పేర్కొంటున్నారు.

శిక్షణ పొందుతున్న అభ్యర్థులు

గతంలో 28,889 మంది..

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత తొలిసారిగా గతేడాది అక్టోబరులో నిర్వహించిన టెట్‌కు 28,889 మంది బరిలో నిలిచారు. అప్పట్లో 2023-25 బ్యాచ్ డీఎల్ఈడీ, బీఎడ్ అభ్యర్థుల(చివరి సంవత్సరం వారు)కు డీఎస్సీకి అవకాశం కల్పించకపోవడంతో వారంతా ఇప్పుడు పోటీపడే అవకాశముంది. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఇన్‌సర్వీసు ఉపాధ్యాయులకు టెట్‌ను పాఠశాల విద్యాశాఖ తప్పనిసరి చేసింది. ఒక్క విజయనగరం జిల్లాలోనే 7,134 మంది ఉన్నారు. మన్యం జిల్లాతో కలిపితే ఆ సంఖ్య పదివేల పై మాటే. వీరిలో 3 వేల నుంచి 4 వేల మంది వరకు పోటీలో ఉన్నట్లు అంచనా.

10 నుంచి పరీక్షలు

ఈనెల 10 నుంచి 21 వరకు పరీక్షలు జరగనున్నాయి. 5 కేంద్రాల్లో ఆన్‌లైన్ విధానంలో రోజూ ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు, 2.30 నుంచి సాయంత్రం 5 వరకు రెండు సెషన్లుగా నిర్వహించనున్నారు.

పరీక్ష కేంద్రం	అభ్యర్థులు
అయాన్ డిజిటల్ జోన్	3,129
ఎంవీజీఆర్ కళాశాల	4,035
లెండి కళాశాల	4,800
సీతం ఇంజినీరింగ్ కళాశాల	1,571
అవంతి కళాశాల	450

సందేహాల నివృత్తి..

ఎలాంటి సందేహాలున్నా 94933 13271, 95503 94572, 86397 91622 నంబర్లను సంప్రదిస్తే నివృత్తి చేస్తాం. హాల్‌టికెట్, నామినల్ రోల్‌లో తప్పులను సవరించేందుకు అన్ని కేంద్రాల వద్ద డిపార్టుమెంట్ అధికారులకు డాక్యుమెంట్ల జిరాక్స్‌లను అందజేయాలి.

– మురళీ, ఇన్‌ఛార్జి డీఆర్వో, యు.మాణిక్యం నాయుడు, డీఈవో

నిమిషం ఆలస్యమైనా..

★ హాల్‌టికెట్‌తో పాటు ఏదైనా గుర్తింపు కార్డు తప్పనిసరి
★ అరగంట ముందుగా కేంద్రానికి చేరుకోవాలి
★ నిమిషం ఆలస్యమైనా అనుమతి నిరాకరణ
★ వీహెచ్, పీహెచ్ అభ్యర్థులకు 50 నిమిషాల అదనపు సమయం
★ ఎలక్ట్రానిక్ పరికరాలు నిషిద్ధం

వైకాపాది పరదాల చాటు పాలన

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

సాలూరు, న్యూస్‌టుడే: 'వైకాపాది పరదా చాటు పాలన. 2023లో 66 మంది విద్యార్థులు చనిపోతే కనీసం వారి కుటుంబాలను పరామర్శించలేదు. విద్యార్థుల బాగోగులు చూడని వైకాపా నేతలకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం అంటే ఏం తెలుస్తుంద'ని గిరిజన శాఖ మంత్రి జి.సంధ్యారాణి అన్నారు. సినీ సెట్టింగులతో మెగా పీటీఎం అని వైకాపా నేతలు విమర్శించడం సిగ్గుచేటన్నారు. తన కార్యాలయంలో సోమవారం సాలూరులో విలేకర్లతో మాట్లాడారు. జాతీయస్థాయిలో జరిగే ఉద్భవ్ ఉత్సవాలకు రాష్ట్రం తరఫున తాను హాజరైతే.. వైకాపా నేతలకు కడుపు మంట ఎందుకని ప్రశ్నించారు. వైకాపా ప్రభుత్వ హయాంలో విద్యార్థుల డైట్ బిల్లులు చెల్లించలేదని, గ్లాసులు, కంచాలు, పెట్టెలు ఇవ్వలేదన్నారు. కూటమి ప్రభుత్వంలో గిరిజన గ్రామాలకు రూ.1,300 కోట్లతో రోడ్లు వేయిస్తున్నామని, పాఠశాలల మరమ్మతులకు రూ.155 కోట్లు మంజూరు చేశామని, ఆర్వో ప్లాంట్లు, విద్యార్థులకు పెట్టెలు, కంచాలు, క్రీడా పరికరాలు, స్టేషనరీ ఇచ్చామని చెప్పారు.

అక్కడ పచ్చదనమే పలకరిస్తుంది..

అబ్బురపరుస్తున్న కొత్తవలస ఆశ్రమ పాఠశాల ప్రాంగణం

ఎక్కడికైనా వెళ్తే అతిథులను బంధువులు స్వాగతం పలకడం చూస్తుంటాం. ఆ విద్యాలయంలో మాత్రం రకరకాల రంగులతో పూలు స్వాగతం పలుకుతాయి. పండ్లు నోరూరిస్తాయి. నచ్చినది తీసుకుని వండుకోండని కాయగూరలు పిలుస్తుంటాయి. సాలూరు మండలం కొత్తవలసలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలోని వసతిగృహంలో ఏళ్లుగా సిబ్బంది, విద్యార్థినుల శ్రమకు ప్రతిఫలమిది.

– న్యూస్‌టుడే, సాలూరు గ్రామీణం

దాదాపు 600 మంది బాలికలు ఈ పాఠశాలలో చదువుకుంటున్నారు. ఆరున్నర ఎకరాల విస్తీర్ణం ఉన్న ప్రాంగణంలోని ఖాళీ ప్రాంతంలో ప్రధానోపాధ్యాయురాలు సంధ్యారాణి ఆధ్వర్యంలో మొక్కలు పెంచుతున్నారు. 2017-18లో నాటిన పళ్ల మొక్కలు ఇప్పుడు వృక్షాలై ఫలాలు అందిస్తున్నాయి. 2022 నుంచి కాయగూరలు, ఆకుకూరలు పండిస్తూ ఆవరణంతా పచ్చదనంతో నింపుతున్నారు.

ఆవరణలో పూలమొక్కలు

ప్రాంగణమంతా పచ్చగా..

ఏఏ మొక్కలంటే...

సపోటా, మామిడి, జామ, బొప్పాయి, వాటర్ యాపిల్‌తో పాటు గులాబీలు, చామంతులు, బంతి పూల మొక్కలు ఎంతో ఇష్టంగా పెంచుకుంటున్నారు. ఆకు కూరలతో పాటు వంకాయ, ముల్లంగి, టమాటా, బీర వంటి కాయగూరలు ఎలాంటి రసాయనాలు లేకుండా పండిస్తున్నారు. ఈ పంటనే వంటకు వినియోగిస్తున్నారు.

★ వసతిగృహ ఆవరణలో ఉన్న క్వార్టర్స్ వద్ద ఉపాధ్యాయులు నివాసముంటూ మొక్కల సంరక్షణపై మక్కువ చూపిస్తున్నారు. పచ్చదనం నింపడంతోపాటు ఆరోగ్య, ఆహ్లాదకర వాతావరణాన్ని నెలకొల్పుతున్నారు. 'నిత్యం కొంత సమయం కేటాయిస్తూ అందరం కలిసి ఈ క్రతువు చేపడుతున్నామని చెబుతున్నారు హెచ్ఎం సంధ్యారాణి.

అద్దంలా మెరవాలి.. ఆరోగ్యం పంచాలి

వసతి గృహాల్లో పారిశుద్ధ్య సిబ్బంది నియామకం

న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం

కూటమి ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాల అభివృద్ధి, వసతుల కల్పనకు ప్రత్యేక దృష్టిసారిస్తోంది. ఇప్పటికే భవనాల మరమ్మతులు, నీటి సరఫరా, విద్యుత్తు వంటి సౌకర్యాలు మెరుగుపరుస్తున్నారు. తాజాగా ఎస్సీ వసతి గృహాల్లో పొరుగు సేవల విధానంలో పారిశుద్ధ్య సిబ్బందిని నియమించేందుకు పచ్చజెండా ఊపింది. రాష్ట్రవ్యాప్తంగా 1,051 వసతి గృహాల్లో 1,365 మంది నియామకానికి అనుమతులు విడుదల చేశారు. బీసీ వసతి గృహాల నుంచి జాబితా కావాలని ప్రభుత్వం కోరడంతో ఆ శాఖ కూడా నివేదించింది. త్వరలో దీనికి సంబంధించిన జీవో కూడా విడుదలయ్యే అకాశం ఉంది.

జిల్లాలో ప్రీ మెట్రిక్, పోస్టు మెట్రిక్ ఎస్సీ వసతి గృహాలు 13 ఉన్నాయి. వీటిలో 813 మంది విద్యార్థులు చదువుతున్నారు. బీసీ వసతి గృహాలు 16 ఉండగా వీటిలో 850 మంది వరకు ఉన్నారు. అప్పుడప్పుడు బయట వ్యక్తులతో మరుగుదొడ్లు, స్నానాల గదులు శుభ్రం చేయిస్తున్నారు. దీంతో పారిశుద్ధ్యం మెరుగ్గా లేదు. కొత్త విధానంతో ప్రాంగణాలు పరిశుభ్రంగా మారనున్నాయి.

ఇదే మొదటిసారి: వసతి గృహాల ఆవిర్భావం నుంచి ఇప్పటివరకు పారిశుద్ధ్య పనివారి నియామకాలు జరగలేదు. కుక్, అటెండర్, నైట్ వాచ్‌మెన్ ముగ్గురే సిబ్బంది. ఈ ప్రభావం విద్యార్థుల ఆరోగ్యంపై పడేది. తొలిసారిగా పారిశుద్ధ్య కార్మికుల నియామకానికి చర్యలు చేపట్టారు. వసతి గృహంలో 100 మంది విద్యార్థులుంటే ఒకరు, అంతకుమించి ఉంటే ఇద్దరు చొప్పున సిబ్బందిని నియమించనున్నారు.

చర్యలు చేపడుతున్నాం

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎస్సీ వసతి గృహాల్లో పారిశుద్ధ్య పనివారి నియామకానికి చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వం బీసీ వసతి గృహాల వివరాలు కూడా అడిగింది.

– శ్యామల, అప్పన్న, సాంఘిక, వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారత అధికారులు

నలుగురు డీఈవోల తొలగింపు

పార్వతీపురం: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అవకతవకలకు కారకులైన నలుగురు డేటా ఎంట్రీ ఆపరేటర్లను తొలగిస్తూ జేసీ యశ్వంత్‌కుమార్‌రెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. మక్కువ మండలం వెంకటభైరిపురం, పార్వతీపురం మండలం పెదబొండపల్లి, డీకే పట్నం, బలిజిపేట మండలం పలగర, గరుగుబిల్లి మండలం చినగుడబ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు సంస్థలు నియమించిన డీఈవోలు చేతివాటం ప్రదర్శించినట్లు గుర్తించారు. ధాన్యం తరలింపునకు వాహనాలు లేకుండానే ట్రక్కు షీట్లను డేటా ఎంట్రీ ఆపరేటరు లాగిన్‌లో పొందుపరిచారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన పి.చిన్నారావు, సుధారాణి, బి.పృథ్వీ, డి.సాగర్, జి.రవి లను విధుల నుంచి తొలగించారు.



శరీర సౌష్ఠవ పోటీల్లో సత్తా

సూర్యనారాయణను అభినందిస్తున్న ఎస్పీ దామోదర్, చిత్రంలో దయానంద్

విజయనగరం అయ్యన్నపేట, న్యూస్‌టుడే: ముంబయిలో ఇటీవల జరిగిన జాతీయ స్థాయి శరీర సౌష్ఠవ పోటీల్లో విజయనగరానికి చెందిన ఈదుబిల్లి సూర్యనారాయణ సత్తా చాటాడు. వీల్‌ఛైర్(దివ్యాంగులు) విభాగంలో బంగారు పతకం సాధించి అంతర్జాతీయ మీట్‌కు ఎంపికయ్యాడు. వచ్చే ఏడాది మార్చిలో అమెరికాలో జరగనున్న టోర్నమెంటుకు హాజరుకానున్నాడు. ఈ సందర్భంగా సోమవారం ఎస్పీ దామోదర్ అభినందించారు. ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. పారా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు కె.దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

పెండలం కిలో రూ.15

సీతంపేట సంతలో విక్రయించేందుకు తీసుకువచ్చిన పెండలం దుంపలు

సీతంపేట మన్యంలో విస్తారంగా పండే పెండలం వారపు సంతలకు, మార్కెట్లకు భారీగా వస్తోంది. సీజన్ ప్రారంభం కావడంతో గిరిజనులు పంటను సేకరించి అమ్మకాలకు తీసుకువస్తున్నారు. కిలో రూ.15 లోపే ధర పలుకుతోందని చెబుతున్నారు. పూర్తిగా సేంద్రియ పద్ధతిలో పండిస్తుండడంతో రుచిగా ఉంటుందని కొనుగోలు చేసేందుకు వ్యాపారులు, ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. ధర ఏ మాత్రం గిట్టుబాటు కాకపోవడంతో గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. – న్యూస్‌టుడే, సీతంపేట

ఉక్కు కర్మాగారానికి భూములివ్వం

విజయనగరంలోని కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న వివిధ గ్రామాల రైతులు, నాయకులు

విజయనగరం ఉడాకాలనీ, న్యూస్‌టుడే: తోటపల్లి జలాలతో ఏటా రెండు పంటల సాగు, పశు పోషణకు ఆధారమైన తమ భూములను ప్రైవేటు ఉక్కు కర్మాగారానికి ఇవ్వబోమని గుర్ల మండలంలోని దమరసింగి, వల్లాపురం, బెల్లాన్‌పేట, మణిపూర్‌పేట, ఎస్‌ఎస్‌ఆర్‌పేట, కెల్ల గ్రామస్థులు వాపోయారు. సోమవారం విజయనగరంలోని కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టారు. సమాచారం ఇవ్వకుండానే రెవెన్యూ అధికారులు భూములను పరిశీలించడం, సర్వేలకు పూనుకోవడం దారుణమన్నారు. పచ్చదనంతో నిండిన పల్లెలను పరిశ్రమలకు కేటాయించడం తగదన్నారు. కర్మాగారం వస్తే తమకు తాగు, సాగునీరు అందదని, విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, ఉపాధికి గండి పడుతుందన్నారు. అనంతరం ఇన్‌ఛార్జి డీఆర్వో మురళికి వినతిపత్రం అందజేశారు. ఏపీ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు వెంకటేశ్వర్లు, సూర్యనారాయణ, స్టీల్‌ప్లాంట్ వ్యతిరేక పోరాట కమిటీ గౌరవాధ్యక్షుడు బి.రాంబాబు, కన్వీనర్ మీసాల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పారాది కాజ్‌వేపై రాకపోకల పునరుద్ధరణ

బొబ్బిలి గ్రామీణం, న్యూస్‌టుడే: బొబ్బిలి మండలంలోని పారాది వద్ద వేగావతి నదిపై నిర్మించిన కాజ్‌వే జలవనరుల మరమ్మతులకు గురైంది. దీంతో రాకపోకలు నిలిపివేశారు. స్థానిక ఎమ్మెల్యే బేబీనాయన కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో మరమ్మతులకు రూ.15 లక్షలు మంజూరు చేశారు. పనులు పూర్తవడంతో సోమవారం రాకపోకలను పునరుద్ధరించారు.

గిరిజనుల సంప్రదాయాలు గొప్పవి

అక్కన్నగూడలో స్థానికులతో మాట్లాడుతున్న గోరటి వెంకన్న

సీతంపేట, న్యూస్‌టుడే: సీతంపేట మండలంలోని అక్కన్నగూడ గిరిజన గ్రామాన్ని తెలంగాణ ఎమ్మెల్సీ, ప్రజా కవి గోరటి వెంకన్న సోమవారం సందర్శించారు. స్థానికులతో మాట్లాడి గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు, ఆహార వ్యవహారాలను అడిగి తెలుసుకున్నారు. వారి జీవన విధానం గొప్పదన్నారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించారు. ఆదివాసీ సవర భాషపై పిల్లలకు ఉన్న పట్టును పరిశీలించారు. సీఎంఓ పీహెచ్.విరంజీవులు, బద్దమానిగ్గ ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.కోటిబాబు, గిరిజన సంఘ ఉపాధ్యాయ నాయకుడు మూటక చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
పురపాలక మరియు పట్టణ అభివృద్ధి శాఖ
బొబ్బిలి పట్టణ అభివృద్ధి సంస్థ, బొబ్బిలి
ఈ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీసు
Roc.No.15A/2025/PLG/BUDA
... GIS Based Perspective Plan ... RFP ... e-procurement ...
08/12/2025 ... 08/01/2026 ...
Sd/- ఉపాధ్యక్షులు, బొబ్బిలి పట్టణ అభివృద్ధి సంస్థ, బొబ్బిలి.

THE DISTRICT CO-OPERATIVE CENTRAL BANK Ltd., VIZIANAGARAM (HO).
D.No.18-2-9, AG Road, Vizianagaram
CO/L&A-Gold/2025-26 ప్రకటన Dated. 08.12.2025.
... Website: https://vizianagaramdccb.bank.in , Ph: 95501 65370 & 99897 73059.
స్థలం విజయనగరం, తేది: 08.12.2025.
Sd/- సి.హెచ్. ఉమామహేశ్వరరావు, ముఖ్య కార్యనిర్వహణాధికారి

జనవరి 4న జిల్లాస్థాయి హిందీ ప్రతిభ పరీక్ష


వల్లాపురంలోని జడ్పీహెచ్‌ఎస్‌లో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: హిందీ సేవా సదన్ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం పాఠశాల స్థాయిలో హిందీ ప్రతిభ పరీక్ష జరిగింది. ఉమ్మడి జిల్లాలోని 12 పాఠశాలల్లో నిర్వహించగా సుమారు వెయ్యి మంది విద్యార్థులు హాజరయ్యారు. ఉమ్మడి జిల్లాల నుంచి 3 వేల మంది రాసినట్లు ఉత్తరాంధ్రా కార్యదర్శి కె.శ్రీధర్ తెలిపారు. ప్రతిభ చూపిన వారు జనవరి 4న జిల్లాస్థాయిలో నిర్వహించే పరీక్షకు హాజరు కావాలని సూచించారు.

క్యాలీఫ్లవర్ సాగు.. లాభాలు బాగు

న్యూస్‌టుడే, రామభద్రపురం

సాగుపై రైతులకు సూచనలిస్తున్న ఉద్యానాధికారి మోహన్‌కృష్ణ

సరైన సాగు విధానం అవలంబిస్తూ.. ఉద్యానాధికారుల సూచనలతో సస్యరక్షణ చేపడితే క్యాలీఫ్లవర్ సాగులో సిరులు కురిపిస్తున్నారు రామభద్రపురం మండలంలోని ఆరికతోటకు చెందిన రైతు వర్రి శివుడు. ఈయన 60 సెంట్లలో ఈ సాగు చేపట్టి రూ.లక్ష వరకూ లాభం ఆర్జించారు. సాగు విధానం ఆయన మాటల్లోనే..

ఇదీ సాగు విధానం...: తొలుత రెండు, మూడు సార్లు దుక్కులు వేసుకోవాలి. ఎకరాకు ఆఖరి దుక్కిలో వేపపిండి 100 కిలోలు, పశువుల గత్తం 10 టన్నులు వేసుకోవాలి. మొక్కనాటక ముందు భాస్వరం 40 కిలోలు, పొటాష్ 40 కిలోలు వేయాలి. విత్తనశుద్ధి చేసుకోవాలి. విత్తనాలు నారుమడుల్లో పెంచి 30 రోజుల వయసు గల మొక్కలను 45 సెం.మీ. దూరంలో ఉండేలా నాటుకోవాలి. నాటిన తర్వాత 10 రోజులకోసారి నీటితడులివ్వాలి. మడుల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. 60 నుంచి 75 రోజుల మధ్యలో పంట కోతకు వస్తుంది. డ్రిప్ ద్వారా నీరందిస్తే తక్కువ ఖర్చుతో 25 శాతం దిగుబడి పెరుగుంది.

తెగుళ్ల నివారణ..: రెక్కలపురుగు లార్వా ఆశిస్తే ఆకువెనుక భాగాన చేరి పంటలను నాశనం చేస్తుంది. దీని నివారణకు 10 లీటర్ల నీటిలో ఫ్లుబెండయమైడ్ 3 గ్రాముల మందు కలిపి పిచికారీ చేయాలి. పశుపు రంగు చిగురుపోసిన అట్టముక్కలు ఎకరానికి 20 పెట్టుకుంటే రసం పీల్చు పురుగుల తాకిడి తగ్గుతుంది.

వర్రి శివుడు, రైతు

పెట్టుబడి.. లాభం పంటలో దుక్కులకు రూ.4వేలు, పశువుల గత్తం రూ.10వేలు, విత్తనాలు రూ.4వేలు, పురుగు మందులు రూ.6వేలు, ఎరువులకు రూ.5వేలు, కలుపు నివారణకు రూ.5వేలు కూలీల ఖర్చులు రూ.6వేలు మొత్తం రూ.40 వేలు వెచ్చించాను. 350 కేట్ల పంట దిగుబడి వచ్చింది. ఒక కేటు (22 పువ్వులు) రూ.400 వరకు మార్కెట్లో అమ్ముడుపోయింది. ఆ లెక్కన రూ.1,40,000 ఆదాయం రాగా ఖర్చులు పోనూ రూ.లక్ష లాభం వచ్చింది.

రైతేరాజు

జీడిమామిడిలో పూత రక్షణ తప్పనిసరి

జీడిమామిడిలో పూత రక్షణకు చర్యలు తీసుకుంటే దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయని రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డా.అమృతవీణ తెలిపారు. లేత చిగురు, పుష్పగుచ్ఛాలను ఆశించే టీ దోమ, ఆకుముడత, కాయ, గింజ తినే, తామర పురుగులు సాధారణంగా డిసెంబరు నుంచి మార్చి వరకు ఎక్కువగా ఆశిస్తాయి. వీటి నివారణకు ఈ నెలలో అవసరాన్ని బట్టి రెండు నుంచి మూడు దఫాలుగా మందులను పిచికారీ చేసుకోవాలి. కొత్త చిగుర్లు వచ్చేటప్పుడు మొదటి దఫా లీటరు నీటికి మోనోక్రాటోఫాస్ 1.6 మి.లీ. కలిపి చెట్టు కొమ్మలు, కాండంపై వేయాలి. పూత వచ్చిన తర్వాత లీటరు నీటికి లామ్డాసైహలోత్రిన్ 0.6 మి.లీ. కలిపి పిచికారీ చేయాలి. మూడోసారి గింజ బఠాణీ సైజులో ఉన్నప్పుడు ప్రొఫెనోఫాస్ 1.0 మి.లీ. లీటరు నీటికి కలిపి 10 నుండి 25 రోజుల వ్యవధిలో పురుగు ఉధృతిని బట్టి వేయాలి.

– న్యూస్‌టుడే, కురుపాం గ్రామీణం



సరైన సస్యరక్షణతో చీడపీడలు దూరం

కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే

సాగులో సరైన సస్యరక్షణ చర్యలతో తెగుళ్లు నివారించి చీడపీడల నుంచి పంటను కాపాడుకుని అధిక దిగుబడులు సాధించొచ్చని రస్తాకుంటుబాయి కేవీకే శాస్త్రవేత్త డా.ఎస్.స్రవంతి తెలిపారు. రైతుల ప్రశ్నలకు ఆమె సమాధానమిచ్చారు.

డా.ఎస్.స్రవంతి, కేవీకే సస్యపోషణ శాస్త్రవేత్త, రస్తాకుంటుబాయి

ప్రశ్న: మినుములో బూడిద తెగులు ఆశిస్తే ఏం చేయాలి? – టి.రామకృష్ణ, డి.ములగ గ్రామం

సమాధానం: రబీలో ఈ తెగులు వ్యాప్తి ఎక్కువ. నివారణకు లీటరు నీటికి గ్రాము కార్బన్‌డిజం కలిపి పిచికారీ చేయాలి. లేదా లీటరు నీటికి మైక్రో బుటానిల్ ఒక గ్రాము కలిపి పంటకు వేయాలి.

ప్రశ్న: నువ్వులు విత్తుకోవడానికి అనుకూలమైన సమయం ఏది? – జయప్రకాశ్, కొత్తగూడ

సమాధానం: నువ్వులు డిసెంబరు ద్వితీయ పక్షం నుంచి జనవరి రెండో పక్షం మధ్యలో విత్తుకుంటే అధిక దిగుబడి వస్తుంది.

ప్రశ్న: మినుములో పల్లాకు తెగులును తట్టుకునే రకాలేవి? - జి.నాగేశ్వరరావు, పెదమేరంగి

సమాధానం: పల్లాకు తెగులును మినుములోని ఎల్‌బీజీ-884, 904, 129, 104 రకాలు తట్టుకుంటాయి. ఖరీఫ్, రబీల్లో వరి మాగానుల్లో వేసుకోవడానికి అనుకూలమే.

ఫోన్ కొట్టు.. సలహా పొందు

చలికాలంలో పశువులు, మేకలు, గొర్రెలు, కోళ్ల పెంపకంలో చేపట్టాల్సిన సంరక్షణ చర్యలు, ఎలాంటి దాణా వేయాలి, ముందస్తు టీకాలు వంటి సలహాలకు 83328 18498 నంబరును సంప్రదించాలని కురుపాం పశువైద్యురాలు కె.శైలజ తెలిపారు.

తీగజాతి తోటల్లో బంక తెగులు నివారణ

ఈ సీజనులో తీగజాతి కూరగాయల తోటల్లో బంక తెగులు ఆశించి నష్టాన్ని కలగచేస్తాయి. సొరకాయ, పుచ్చ, కీరదోస, గుమ్మడి, బూడిద గుమ్మడి, బీర, కాకర, దొండ, ఇతర రకాల పంటలకు విత్తనం మొలక నుంచి కాయల కోత వరకు అన్ని దశల్లో వ్యాప్తి చెందుతుందని ఉద్యానాధికారిణి సీహెచ్.గిరిజ తెలిపారు. నష్టం, నివారణ ఆమె వివరించారు. అధిక తేమ, చల్లని వాతావరణం పరిస్థితుల్లో ఇది తీవ్రంగా వ్యాపిస్తుంది. ఇది సోకితే కాయలపై నల్ల మచ్చలు ఏర్పడతాయి. వేర్లు తప్ప మిగతా అన్ని భాగాల్లోనూ తెగులు లక్షణాలు కనిపిస్తాయి. ఆకుల అంచులు మొదట లేత నుంచి ముదురు గోధుమ వర్ణంలోకి మారి ఎండిపోతాయి. కొన్ని సందర్భాల్లో బీజ దశలపై నీటితో కూడిన మచ్చలు ఏర్పడి వడలిపోయి మొలకలు చనిపోతాయి. కాండంపైన బంకతో గజ్జి మచ్చలు ఏర్పడి ఎర్రని బంక లాంటి పదార్థం ఏర్పడుతుంది.

ఏం చేయాలి..?

సాగుకు మునుపు రైతులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని నాణ్యమైన నారు ఎంపిక చేసుకోవాలి. ఒకే పొలంలో పదేపదే సాగు చేయడంతో ఎక్కువగా వ్యాప్తి చెందుతుంది. తెగులు సోకినట్లు రైతులు గుర్తించగానే సస్యరక్షణ మందులను పిచికారీ చేయాలి. లీటరు నీటికి మాంకోజెబ్ 2.5 గ్రాములు లేదా క్లోరోథలోనిక్ 1.5 గ్రాములు లేదా మేటిరం జిపైర్లోస్ట్రోబిన్ 3 గ్రాములు చొప్పున కలిపి పిచికారీ చేస్తే బంక తెగులు నివారణ సాధ్యం.

– న్యూస్‌టుడే, కురుపాం గ్రామీణం

EENADU Classifieds

HEALTH & CARE

NEURO

నిర్మల న్యూరో & జనరల్ మెడికల్ సెంటర్
మెదడు, నరములు & వెన్నెముక వ్యాధి నిపుణులు
Dr.Nimala Vangapandu
M.D.(Gen.Med) DM (Neuro) JIPMER
Specialist in Brain & Nerve Problems & General Physician
R.T.C.కాంప్లెక్స్ ఎదురుగా, INOX మల్టీప్లెక్స్ వెనుక వైపు,VZM
FOR APPOINTMENT : 63054 71147

REAL ESTATE

FLAT FOR SALE

2 BHK 1050, N/F Carparking, Generator, Plot:303, Sri Raga Enclave, Fort City School, Nr. KVR New Layout C:7893476789.

ధర్మపురి 80 అడుగుల రోడ్డుకు అతి దగ్గరలో 1000sft 2BHK E/F Flat అతి తక్కువ ధరలో అమ్మకానికి కలదు. ✆ 7995588192

HOUSE FOR SALE

Semi-Finished Independent House 108 Sqyds (D-Form Patta-15 Years), Construction Done upto 1st Slab. at Enuguraya Colony, Behind 100 Feet Ring Road, Vizianagaram. Price. 28Lakhs. 6281169648

LAND FOR SALE

గుర్ల మెయిన్ రోడ్ (2km) సమీపంలో 2 ఎకరాల భూమి అమ్మకానికి కలదు. విజయనగరం నుండి 12 కిమీ దగ్గరలో. ✆ 8790012309, 9908664019

PLOT FOR SALE

చెల్లూరు హైవే రోడ్డు 167 గ|| 58 ల|| & అయ్యన్నపేట జం|| 167 గ|| 78 ల|| ఇల్లు కట్టించి ఇవ్వబడును. ఈ నెలాఖరు వరకు ఆఫర్. C: 9701519395.

TO LET

To-let 3BHK Indp. House G/F, Carparking, Hajiali Nagar, Nr. Venkateswara Kalyana Mandapam, Phoolbagh Jn., VZM. ✆ 9849559024.

COMMERCIAL

1500 Sq. ft. Commercial second floor Nr.Ambati Satram above Samsung Plaza, Near Sonovision Ph: 7013745282.

JOBS

వైజాగ్ SKLM VZM జిల్లాలలో స్కూల్స్ హాస్పిటల్స్ బ్యాంక్‌లలో ఔట్‌సోర్సింగ్ & కాంట్రాక్ట్ బేస్ ద్వారా పనిచేయుటకు అటెండర్స్, రికార్డ్, జూనియర్ అసిస్టెంట్స్, కంప్యూటర్ ఆపరేటర్స్ బుకింగ్ క్లర్క్స్ బీట్ ఆఫీసర్స్ హెల్ప్‌డెస్క్ గార్డెనర్స్ MNO FNO ల్యాబ్‌టెక్నీషియన్స్ ANM GNM చేసినవారు M/F అర్జెంట్‌గా కావలెను. 10th నుండి బీటెక్ వరకు జీ: 20K to 40K ✆ 8019265353.

అమెరికాలో 1 సం|| బాబు ఆలన, పాలన వ్యక్తిగత సంరక్షణ కొరకు అనుభవంగల ఆడవారు కావలెను. అమెరికా వీసా కలిగినవారు మాత్రమే. ✆ 9440803362

ఉచిత శిక్షణ, భోజనం మరియు వసతి సౌకర్యం & ఉద్యోగావకాశాలు. గాజువాకలో అర్హత: 10 ఆపైన. వయస్సు: 18-30. ✆ 9573366622, 9573366611.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం
ఈనాడు క్లాసిఫైడ్స్
5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే
సంప్రదించండి: 8008597609

వైజాగ్‌లో ప్రముఖ షాపింగ్ మాల్స్‌లో పనిచేయుటకు 18-35వ యువతి యువకులు కావలెను. జీతం 10000-13500 ఫుడ్‌రూము 9704637370, 9949904532.

పైడిభీమవరం, పరవాడ ఫార్మా కంపెనీలో సూపర్‌వైజర్స్, QC, QA, R&D, మేనేజర్స్, ఫైర్& సెఫ్టీ హెల్పర్స్, సెక్యూరిటీ కావలెను. Olf 10th-డిగ్రీ MBA, B.ఫార్మా, జీ॥28K to 38K. 9573635594, 9121044796

ఆర్మీ NAVY ఎయిర్‌ఫోర్స్ రైల్వే, SSC, బ్యాంకులలో ఉద్యోగావకాశాలు. అర్హత:10th-డిగ్రీ. Age:16-25. శిక్షణ 3నెలలు శిక్షణాకాలంలో హాస్టల్, 10th, ఇంటర్, డిగ్రీ డిస్టెన్స్ కోర్స్‌లు కలవు. *ముందుగా ఎటువంటి ఫీజులేదు * క్రిస్టియన్ ఎడ్యుకేషన్ అకాడమీ, వైజాగ్. 9121232326.

FACULTY/ TEACHERS

Required Social, Physics Teachers for 6th to 10th (Experienced & English Spoken skills must) Vizianagaram. C: 8341356488.

SECURITY GUARDS

క్షైగజేష్ సెక్యూరిటీసంస్థలో విశాఖస్టీల్‌ప్లాంటు ఏరియాలో సెక్యూరిటీగార్డ్స్ 150 మంది 8గం|| డ్యూటీ జీతం 18815/- PF, ESI సెక్యూరిటీ సూపర్‌వైజర్స్ 11మంది (Ex -Service) జీతం: 22690/- సెక్యూరిటీ ఆఫీసర్ (Ex or Rtd పోలీస్ ఆఫీసర్) జీతం:30,000/- యూనీఫామ్-ఫ్రీ. ✆ 63091 17776.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు. ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

అంగన్‌వాడీ కేంద్రాలకు మహర్దశ

– న్యూస్‌టుడే, విజయనగరం అయ్యన్నపేట

● 52 కేంద్రాల్లో మరుగుదొడ్లు ● 144 చోట్ల తాగునీటి సౌకర్యం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అంగన్‌వాడీ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పటికే బాల సంజీవని, పోషణ ట్రాకర్ యాప్‌లను నవీకరించడంతో పాటు.. వంట కష్టాలను తీర్చేందుకు విద్యుత్తు ఆధారిత స్టవ్‌లను అందజేసింది. అంతే కాకుండా మినీలను ప్రధాన కేంద్రాలుగా చేసేందుకు ఇప్పటికే జీవోలను జారీ చేసింది. ప్రస్తుతం ఆ ప్రక్రియ వేగవంతమవుతోంది. తాజాగా మరుగుదొడ్ల నిర్మాణానికి, మంచినీటి సదుపాయం కల్పించేందుకు పూనుకొంది.

జిల్లాలో ఇదీ పరిస్థితి..

కేంద్రాలు	2499
అద్దె భవనాలు	1182
సొంతవి	793
అద్దె ఉచితం	524
గర్భిణులు	7,093
బాలింతలు	6,457
మూడేళ్లలోపు పిల్లలు	41,078
ఆరేళ్లలోపు	17,415

రూ.43.20 లక్షలు విడుదల..

జిల్లాలోని 52 కేంద్రాల్లో శౌచాలయాల నిర్మాణానికి రూ.18.72 లక్షలు, 144 కేంద్రాల్లో మంచినీటి సౌకర్యం కల్పించేందుకు రూ.24.48 లక్షలు కేటాయించారు. ఒక్కో మరుగుదొడ్డికి రూ.36 వేలు, తాగునీటి కల్పనకు రూ.17 వేల చొప్పున వెచ్చించనున్నారు.

తీరనున్న సమస్యలు.. ప్రస్తుతం చాలా చోట్ల మరుగుదొడ్లు లేవు. దీంతో చిన్నారులు, గర్భిణులు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొందరు ఇళ్లకే వెళ్లాల్సిన పరిస్థితి. కేంద్రాల వద్ద అపరిశుభ్రత తాండవిస్తోంది. దుర్గంధం, దోమల విజృంభణతో బాలలకు అవస్థలు తప్పడం లేదు. తాగునీటిని చాలామంది ఇళ్ల నుంచే తీసుకెళ్తున్నారు. ఇక నుంచి ఈ కష్టాలు తప్పనున్నాయి.

త్వరలోనే పనులు..

'ఇటీవల నిధులు మంజూరయ్యాయి. దశల వారీగా అన్ని కేంద్రాల్లో పనులు ప్రారంభిస్తాం. కేంద్రాల నిర్వహణ, సమస్యల పరిష్కారంపై ప్రత్యేకంగా దృష్టిసారించాం. కార్యకర్తలతో ఎప్పటికప్పుడు మాట్లాడుతున్నాం. ఎలాంటి ఇబ్బందులున్నా నేరుగా తెలియజేయొచ్చు' అని **ఐసీడీఎస్ పీడీ విమలారాణి** తెలిపారు.

శోకసంద్రమైన కె.కొత్తవలస

రామకృష్ణ కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న మంత్రి

దత్తిరాజేరు, న్యూస్‌టుడే: తమిళనాడులో జరిగిన కారు ప్రమాదంలో జిల్లాకు చెందిన నలుగురు మరణించగా.. సోమవారం మృతదేహాలను తీసుకొచ్చారు. దత్తిరాజేరు మండలం కె.కొత్తవలస గ్రామానికి చెందిన ఎం.అప్పలనాయుడు, వి.రామకృష్ణ, ఎం.రాము భౌతికకాయాలకు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఒకే గ్రామానికి చెందిన ముగ్గురు మరణించడం బాధాకరమన్నారు. బాధిత కుటుంబాలకు ధైర్యం చెప్పారు. ప్రభుత్వ పరంగా అన్నివిధాలా ఆదుకుంటామన్నారు. మాజీ ఎమ్మెల్సీ రఘువర్మ, ఎంపీపీ అప్పలనాయుడు, తెదేపా మండల కన్వీనరు చప్ప చంద్రశేఖర్, నాయకులు ఈశ్వరరావు, సత్తిబాబు, మోహన్, సత్యారావు తదితరులు పాల్గొన్నారు. * ఇదే ఘటనలో గజపతినగరం మండలం మరుపల్లి వాసి బి.చంద్రరావు దుర్మరణం చెందారు. బాధిత కుటుంబాన్ని మంత్రి పరామర్శించారు. ఏఎంసీ అధ్యక్షుడు పి.వి.వి.గోపాలరాజు, తెదేపా మండలాధ్యక్షురాలు గంట్యాడ శ్రీదేవి తదితరులున్నారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	147	264	274

ట్రాక్టర్ నుంచి జారిపడి విద్యార్థికి తీవ్రగాయాలు

గాయపడిన ఆకాష్

చీపురుపల్లి, న్యూస్‌టుడే: ట్రాక్టర్ పైనుంచి జారిపడి పాలిటెక్నిక్ విద్యార్థి తీవ్రంగా గాయపడిన ఘటన చీపురుపల్లిలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. జామి మండలం అలమండకు చెందిన ఆకాష్ చీపురుపల్లిలోని జీబీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల(ఎలక్ట్రికల్ బ్రాంచి రెండో ఏడాది)లో చదువుతున్నాడు. సాంఘిక సంక్షేమశాఖ కళాశాల వసతి గృహంలో ఉంటున్నాడు. తరగతులు ముగించుకుని, చీపురుపల్లి వైపు వచ్చేందుకు స్నేహితులతో కలిసి ఓ ట్రాక్టర్‌ను ఆపి లిఫ్ట్ అడిగాడు. అయిదుగురు విద్యార్థులు తొట్టెలో ఎక్కారు. ట్రాక్టర్ కదిలేసరికి ఆకాష్ ప్రమాదవశాత్తు జారి తొట్టె, ఇంజిన్ మధ్యలో పడిపోయాడు. నడుము సమీపం నుంచి వెనుక చక్రం వెళ్లిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానిక ప్రాంతీయాసుపత్రిలో చికిత్స అనంతరం వార్డెన్ శ్రీనివాసరావు విజయనగరం ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి విశాఖకు తీసుకెళ్లారు. విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97609
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80081 11237

వేధింపులు భరించలేకే చంపేశాడు

చోదకుడి హత్య కేసులో తండ్రే హంతకుడు

పాలకొండ, గ్రామీణం, న్యూస్‌టుడే: అల్లారు ముద్దుగా పెంచిన కన్న తండ్రే కొడుకును చంపేశాడు. వేధింపులు భరించలేక విచక్షణ కోల్పోయి ఈ ఘాతుకానికి పాల్పడినట్లు పోలీసులకు చెప్పాడు. ఆర్టీసీ ఉద్యోగి అనుమానాస్పద మృతి మిస్టరీ ఎట్టకేలకు వీడింది. ఈ కేసు వివరాలను సీఐ ప్రసాదరావు సోమవారం వెల్లడించారు. పాలకొండ మండలం బుక్కూరుకు చెందిన ఆర్టీసీ చోదకుడు విఠల్‌రావు ఈనెల 2న ఇంట్లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. అతని భార్య కరుణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేయగా.. తండ్రి రామప్పుడు హత్య చేసినట్లు నిర్ధారణ అయింది. మద్యం తాగి తరచూ ఇంట్లో వేధింపులకు గురిచేస్తుండడంతో విసిగిపోయిన ఆయన.. విఠల్‌రావు నిద్రిస్తున్న సమయంలో గొడ్డలితో నరికి చంపేశాడు. గొడ్డలిని స్వాధీనం చేసుకుని, నిందితుడిని అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. విఠల్‌రావుకు ఇప్పటికే నాలుగు వివాహాలు జరిగినట్లు పోలీసులు చెబుతున్నారు. ఎవరితోనూ సరిగా ఉండకపోవడంతో ఇప్పటికే ముగ్గురు భార్యలు దూరమయ్యారని, ఈక్రమంలో కొన్ని నెలల కిందట శ్రీకాకుళం జిల్లాకు చెందిన కరుణను వివాహం చేసుకున్నాడన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యవసాయ కూలీ మృతి

పాలకొండ, గ్రామీణం, న్యూస్‌టుడే: పాలకొండ- వీరఘట్టం ప్రధాన రహదారిలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. బుక్కూరుకు చెందిన పి.రామినాయుడు(50) పనుకువలస నుంచి నడుచుకుంటూ వెళ్తున్న సమయంలో పాలకొండ వైపు వస్తున్న ఓ ద్విచక్ర వాహనం పనుకువలస కూడలిలో బలంగా ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితికి చేరారు. బాధితుడ్ని పాలకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. రామినాయుడు పశువుల కాపరిగా, వ్యవసాయ కూలీగా పనులకు వెళ్లేవారు. గతంలో భార్య చిన్నమ్మడు మృతి చెందింది. కుమార్తె ఉంది. తల్లిదండ్రులను కోల్పోవడంతో బోరున విలపిస్తోంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రయోగమూర్తి తెలిపారు.

ఒత్తిడి వల్లే మా అమ్మ మరణించింది

ఆశా కార్యకర్త మృతిపై కుమార్తె ఆరోపణ

మాట్లాడుతున్న జ్యోత్స్న, నాయకులు

పార్వతీపురం, కలెక్టరేట్ ప్రాంగణం, మక్కువ, న్యూస్‌టుడే: మక్కువ పీహెచ్‌సీ పరిధిలోని డి.శిర్లాంలో ఆశా కార్యకర్తగా పనిచేసిన పొందూరు విద్యావతి అదే పీహెచ్‌సీ వైద్యాధికారిగా గతంలో పనిచేసిన హరికృష్ణ, గ్రామానికి చెందిన తెదేపా నాయకుడు డి.గౌరునాయుడి వేధింపులతోనే గుండె పోటుకు గురై.. మరణించారని ఆమె కుమార్తె జ్యోత్స్న, ఎమ్మార్పీఎస్ నాయకులు ఆరోపించారు. సోమవారం తన తండ్రి శ్రీనివాసరావుతో కలిసి కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్‌ఎస్‌లో వినతిపత్రం అందించారు. విద్యావతి ఆరోగ్యవంతురాలిగా ఉండగానే ఆమెను తొలగించేందుకు కుట్రపూరితంగా వ్యవహరించి, తప్పుడు ఫిర్యాదులు చేశారు. న్యాయం చేయాలని వైద్యాధికారిని కోరగా.. తెదేపా నాయకుడు చెప్తేనే ఉద్యోగంలో చేర్చుకుంటామని చెప్పారన్నారు. ఈ విషయంలో మంత్రి సంధ్యారాణి దగ్గరకు వెళ్లినా ఫలితం లేకపోయిందన్నారు. చివరకు మానసిక ఒత్తిడితో గుండెపోటు వచ్చి సెప్టెంబరు 24న తన తల్లి మృతిచెందిందని కుమార్తె పేర్కొన్నారు. మరణానికి కారణమైన వైద్యుడు, తెదేపా నాయకుడిపై చర్యలు తీసుకోవాలని కోరారు. విషయాన్ని వైద్యాధికారి హరికృష్ణ వద్ద ప్రస్తావించగా.. వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారులకు ఆమెపై కొందరు ఫిర్యాదు చేశారని, దీనిపై విశాఖ ఆర్డీ ఇటీవల విచారణ కూడా చేశారని చెప్పారు. వారి ఆదేశాలు, నిబంధనల ప్రకారమే విధుల నుంచి తొలగించినట్లు పేర్కొన్నారు. అనారోగ్య సమస్యల కారణంగా ఆమె విధులు నిర్వహించలేకపోయేవారని వెల్లడించారు.

'ఆశా కార్యకర్త విద్యావతి ఏడాది కిందట ఒకసారి నా వద్దకు వచ్చి సమస్య చెప్పింది. పక్షవాతంతో మంచం పట్టిన ఆమె రెండేళ్లు విధులు నిర్వహించలేదని గ్రామ ప్రజలు తెలిపారు. ఆమె సమస్యను పరిష్కరించాలని అధికారులకు సూచించానని' మంత్రి సంధ్యారాణి చెప్పారు.

ఇంజినీరింగ్ విద్యార్థుల మేధకు పరీక్ష

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వ విద్యా మంత్రిత్వశాఖ ఇన్నోవేషన్ సెల్, అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) సంయుక్తంగా జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ గ్రాండ్ ఫినాలేకు ఒంగోలు నగరంలోని క్విస్ ఇంజినీరింగ్ కళాశాల వేదికైంది. 12 రాష్ట్రాలకు చెందిన 126 మంది విద్యార్థులు 18 బృందాలుగా పాల్గొన్నారు. హెరిటేజ్ అండ్ కల్చర్, మెడ్‌టెక్, అగ్రిటెక్, స్టూడెంట్స్ ఇన్నోవేషన్ ఆన్ మిస్‌లేనియస్.. అంశాల్లో ప్రోబ్లమ్ సొల్యూషన్స్‌పై సాఫ్ట్‌వేర్ రూపకల్పనపై పోటీలు ఏర్పాటు చేశారు. 36 గంటలు కొనసాగే పోటీలో విజేతలుగా నిలిచిన నలుగురికి రూ.1.50 లక్షలు బహుమతిగా అందజేస్తారు. విజేతలను ఎంటర్‌ప్రెన్యూర్స్‌గా చేసేందుకు మేక్ ఇన్ ఇండియాలో భాగంగా స్టార్టప్ ఫండ్ ఇస్తారు.

(c) eenadu

కిటికీలు.. తలుపులు లేవంతే!

గొందివలస ప్రాథమిక పాఠశాల దుస్థితి ఇది. దాదాపు 12 ఏళ్ల క్రితం పాఠశాల భవన నిర్మాణం ప్రారంభించి నిధుల లేమితో మధ్యలో ఆపేశారు. ఇక్కడ 18 మంది విద్యార్థులు చదువుతున్నారు. కానీ ఈ పాఠశాలకు కనీసం కిటికీలు, తలుపులు కూడా లేవు. గతంలో ఉపాధ్యాయులు సొంత నగదుతో గ్రిల్సు వేయించినప్పటికీ అవి సరిగ్గా లేకపోవడంతో పరదాలు వేసుకుని కూర్చుంటున్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని ఎంఈవో వెంకటరమణ అన్నారు. – న్యూస్‌టుడే, సాలూరు గ్రామీణం

అటో.. ఇటో.. ఎటో మరి

గరుగుబిల్లి మండలం తోటపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల మలుపు వద్ద ఉన్న ప్రమాద హెచ్చరిక బోర్డు నేలకొరిగింది. పార్వతీపురం, పాలకొండ నుంచి కురుపాం, ఒడిశా ప్రాంతాలకు ఇటువైపే వాహనాలు ప్రయాణిస్తుంటాయి. కూలిన సూచిక సరిచేసి ప్రమాదాలు నివారించాలని స్థానికులు కోరుతున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి, నేలకొరిగిన బోర్డులు సరిచేస్తున్నామని ఆర్‌అండ్‌బీ శాఖ డీఈఈ రామ్మోహనరావు అన్నారు. – న్యూస్‌టుడే, గరుగుబిల్లి గ్రామీణం

ఇరుకు రహదారితో అవస్థలు

పాలకొండ పట్టణ ప్రధాన రహదారిలో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్టీసీ కాంప్లెక్సు నుంచి కార్లిల్ కూడలి వరకు కిలోమీటరు మేర అవస్థలే. అంతర్రాష్ట్ర రహదారి కావడంతో నిత్యం వందలాది వాహనాలు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటాయి. భారీ వాహనాలు ఇటువైపు నుంచే ప్రయాణిస్తున్నాయి. ఆక్రమణలతో రోడ్డు ఇరుగ్గా మారడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఎప్పటికప్పుడు ట్రాఫిక్ స్తంభిస్తోంది. రహదారి విస్తరణకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని కమిషనర్ రత్నరాజ్ తెలిపారు. – న్యూస్‌టుడే, పాలకొండ

పలకలు పొడై.. పిల్లర్లు తుప్పు పట్టి..

వెంకటరాయుడుపేట ప్రాథమిక పాఠశాల అదనపు భవనం పనులు ఆరంభంలోనే నిలిచాయి. గచ్చుల కోసం తెచ్చిన విలువైన గ్రానైట్ పలకలు మట్టిలో కలుస్తున్నాయి. స్తంభాల గజాలు తుప్పు పడుతున్నాయి. నాలుగేళ్ల క్రితం నాడు-నేడు కింద ఇక్కడ అదనపు భవనం మంజూరైంది. ఇసుక, సిమెంటు, గ్రానైట్ పలకలు వెంటనే అందించారు. పునాదులు, పిల్లర్ల పనులు జరిగాయి. ఆపై బిల్లులు రాక గుత్తేదారు మిన్నకున్నారు. పనుల కొనసాగింపునకు ప్రతిపాదనలు చేశామని ఎస్ఎస్ఏ ఏఈ శ్రీకర్ అన్నారు. – న్యూస్‌టుడే, పార్వతీపురం గ్రామీణం

వేతనాలివ్వండి.. వేదన తీర్చండి

మెకాలిస్టు ఉపాధ్యాయుల ఆందోళన

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ప్రభుత్వ వేతనాల చెల్లింపులో తీవ్ర జాప్యం జరుగుతోందని, దీన్ని నివారించాలని ఐక్య ఉపాధ్యాయ సమాఖ్య ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు డిమాండు చేశారు. సోమవారం రాత్రి పార్వతీపురం ఐటీడీఏ కార్యాలయం ఎదుట మెకాలిస్టుతో నిలబడి వినూత్న నిరసన తెలిపారు. నెలలో మొదటి వారం పూర్తయినా ఇప్పటికీ జీతాలు చెల్లించకపోతే ఎలా బతకాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.మురళీమోహన్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.భాస్కరరావు, జిల్లా సహాధ్యక్షురాలు జ్యోతి తదితరులు వాపోయారు. – న్యూస్‌టుడే, పార్వతీపురం

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

పార్వతీపురం	-8008566244
పాలకొండ	-8008574299
సాలూరు	-8008786820
కురుపాం	-9849044696

?: పాలకొండ నుంచి అంపిలి గ్రామానికి వెళ్లే మార్గం రాత్రుల్లో చీకటిగా ఉంటోంది. -వాసు, వ్యాపారి ★ విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేసి సమస్య పరిష్కరిస్తాం. - దేవీవరప్రసాద్, ఏఈ - న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం

?: పెదబొండపల్లి ఎస్సీ కాలనీలో కాలువలు పాడయ్యాయి. కొన్నిచోట్ల వాడుక నీరు రహదారులపైకి వస్తోంది. - సోమయ్య, పెదబొండపల్లి ★ చర్యలు తీసుకోవాలని కార్యదర్శికి సూచిస్తాం. - పాపారావు, ఉప ఎంపీడీవో- న్యూస్‌టుడే, పార్వతీపురం గ్రామీణం

?: కొత్తవలస గ్రామ రక్షిత మంచినీటి పథకం ఓవర్ హెడ్ ట్యాంకు పనులు అసంపూర్తిగా మిగిలాయి. - రామారావు, స్థానికుడు ★ ట్యాంకు నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం. - పవన్‌కుమార్, ఏఈ - న్యూస్‌టుడే, సీతానగరం

కాలువలు శుభ్రం

స్పందనకు వందనం

సాలూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని రామాకాలనీకి వెళ్లేదారిలో మురుగుతో నిండిన కాలువలను పారిశుద్ధ్య కార్మికులు శుభ్రం చేశారు. 'ఈనాడు'లో 'మురుగు కదలనంటోంది' శీర్షికతో సోమవారం ప్రచురితమైన వార్తకు స్పందించిన పారిశుద్ధ్య అధికారి బాలకృష్ణ పూడిక తొలగించాలని ఆదేశించారు.

ధాన్యం సేకరణపై కలెక్టరుకు రైతుల ఫిర్యాదులు

ఆరుగాల కష్టం.. అరువుగా అడుగుతున్నారు!

పార్వతీపురం, కలెక్టరేట్ ప్రాంగణం, న్యూస్‌టుడే

"సార్.. ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యం కొనుగోలులో మిల్లర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. బస్తాకు అదనంగా 5 కిలోలు తీసుకుంటున్నారు. కొనుగోలు కేంద్రాల్లో తూనిక కంటే మిల్లులో తక్కువ నమోదు చేస్తున్నారు. అందుకే చెల్లింపులు కూడా తక్కువగా అవుతున్నాయి.." – పీజీఆర్ఎస్‌లో రమణబాబు, గణపతిరావు (సీతానగరం), అప్పలనాయుడు (పాలకొండ)

కలెక్టరుకు సమస్యలు వివరిస్తున్న అర్జీదారులు

పార్వతీపురం కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో కలెక్టరు ప్రభాకరరెడ్డి, డీఆర్వో హేమలత, డీఆర్‌డీఏ పీడీ సుధారాణి, ఎస్‌డీసీ దిలీప్‌చక్రవర్తి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలులో ఇబ్బందులపై అధికంగా వినతులు అందాయి. ఈ నేపథ్యంలో కలెక్టర్ స్పందిస్తూ.. ఎవరైనా అదనంగా అడిగితే తనకు ఫిర్యాదు చేయాలన్నారు. కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

- సాలూరు పట్టణంలో ఒక ఉద్యోగినిని లైంగికంగా వేధించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఐద్వా, ప్రగతిశీల మహిళా సమాఖ్య నాయకులు కలెక్టరును కోరారు.
- సామాజిక ఆరోగ్య కార్యకర్తలకు గత మూడునెలలుగా వేతనాలు చెల్లించడంలేదని, బ్యాంకు ఖాతాలు సరిగా లేవని ఎప్పటికప్పుడు అధికారులు చెబుతున్నారని సీఐటీయూ నాయకులు తెలిపారు.
- తమ స్థలం నిషిద్ధ భూమిగా నమోదైందని, దాన్ని జిరాయితీగా మార్చాలని ఆగస్టులో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో కోరగా.. ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదని తాళ్లబురిడికి చెందిన ఆచారి అధికారుల దృష్టిలో పెట్టారు. తమ సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు.
- ప్రజా పంపిణీ వ్యవస్థలో సరకులు తీసుకోవడానికి దుకాణాలకు వెళితే ఇతర సరకులు కొనుగోలు చేయాలని ఒత్తిడి చేస్తున్నారని, కాదంటే భౌతిక దాడులకు పాల్పడుతున్నారని కొదమ పంచాయతీ మోణంగికి చెందిని కార్డుదారులు ఫిర్యాదు చేశారు.
- వీరఘట్టం మండలం వండువలో ఇనాం భూముల సాగుదారుల్లో కొందరికి మాత్రమే అన్నదాత సుఖీభవ నగదు జమయ్యిందని, దాదాపు 300 మందికి ఇంకా కాలేదని ఆ గ్రామానికి చెందిన రైతులు కోరారు.
- గుమ్మలక్ష్మీపురంలో ప్రభుత్వ భూమిని ఆక్రమించి ప్రార్థనా మందిరం నిర్మిస్తున్నారని, దీన్ని తొలగించి, ప్రభుత్వ భూమిని రక్షించాలని ప్రసాదరావు కోరారు.
- పార్వతీపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని నర్సిపురం, తాళ్లబురిడి అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యకర్తలుగా పనిచేస్తున్న తమకు పదోన్నతి కల్పించాలని కోరుతూ ఆయా కేంద్రాల సహాయకులు కల్యాణి, సుజాత కలెక్టరుకు వినతిపత్రం సమర్పించారు. దీనిపై పీడీ కనకదుర్గతో కలెక్టరు ప్రభాకరరెడ్డి మాట్లాడారు.

అన్నదాతల ఆందోళన

మిల్లర్లు దోపిడి చేస్తున్నారని.. రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయాలని రైతు సంఘ జిల్లా కార్యదర్శి బి.అప్పలనాయుడు కోరారు. కలెక్టరేట్ వద్ద పాలకొండ రైతులతో కలిసి నిరసన చేపట్టారు.

ఐటీడీఏకు 35 వినతులు

అర్జీ పరిశీలిస్తున్న పీహెచ్‌వో గణేష్

సీతంపేట, న్యూస్‌టుడే: సీతంపేట ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం పీహెచ్‌వో ఎన్.వి. గణేష్ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఐటీడీఏ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన గిరిజనులు హాజరై తమ వ్యక్తిగత, గ్రామ సమస్యలపై 35 వినతులు అందజేశారు. జమ్మదుగూడకు చెందిన ఎస్.ఆనందరావు రెండు నెలల బాబుకి పాల పౌడర్లు మంజూరు చేయాలని, కుసుమూరుకు చెందిన బి.దేవి ఏఎన్ఎం పోస్టు ఇప్పించాలని, బర్నికు చెందిన మర్రి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రానికి మరమ్మతులు జరపాలని, జోడిమానుగూడకు చెందిన ఎస్.మాసిడ సాగులో ఉన్న వ్యవసాయ భూములను దస్త్రాల్లో సరి చేయాలని, కె.బంబంగూడకు చెందిన ఎస్.అయమ్మ, సీలగాం చెందిన అప్పలమ్మ కిరణా దుకాణానికి రుణం ఇప్పించాలని, దోనుబాయికి చెందిన వెంకటరావు, ఇతరులు మండల పరిధిలో గల అటవీహక్కుల చట్టం కింద పట్టా భూములు ఉన్న గిరిజన రైతులకు అన్నదాత సుఖీభవ పథకం వర్తింప చేయాలని, ఒండ్రుజోలకు చెందిన సునేమి అంగన్‌వాడీ ఆయాకు సంబంధించి 19 నెలల పెండింగ్ జీతాలు మంజూరు చేయాలని అర్జీలు ఇచ్చారు. డిప్యూటీ డీఈవో జి.రామ్మోహనరావు, జీసీసీ మేనేజర్లు డి.కృష్ణ, నర్సింహులు, ఏపీడీ శ్రీహరిరావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో కె.విజయపార్వతి, ఏడీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురంలో ప్రసంగిస్తున్న విద్యార్థిని

పార్వతీపురం: విజేతలకు బహుమతులు అందజేస్తున్న హెచ్ఎం శ్రీధర్, ఉపాధ్యాయులు

విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందించిన పాలకొండ వివేకానంద పాఠశాల ప్రిన్సిపల్ పారినాయుడు

ఉపన్యసించారు.. ప్రశంస పొందారు

'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో సోమవారం ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ల ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పార్వతీపురం పట్టణంలోని డీవీఎంఎం ఉన్నత పాఠశాలలో 9వ తరగతి విద్యార్థులు డి.హేమాని, ఎం.మోహిత్‌నాయుడు, ఆర్.మోక్షిత్ మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. విజేతలకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.శ్రీధర్, ఉపాధ్యాయులు భాస్కరరావు, రత్నకుమారి, భారతి బహుమతులను అందజేశారు. పాలకొండ పట్టణంలోని వివేకానంద పాఠశాలకు చెందిన ముగడ వాగ్దేవి (తొమ్మిదో తరగతి), వారణాసి ప్రణతి (తొమ్మిదో తరగతి), ఎన్ని నిహారిక (ఎనిమిదో తరగతి) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరికి ప్రిన్సిపల్ జి.పారినాయుడు, ఉపాధ్యాయులు ధ్రువపత్రాలు, బహుమతులు అందించారు. రవీంద్రభారతి పాఠశాలలో నిర్వహించిన పోటీల్లో పి.గౌతమ్‌కృష్ణ (తొమ్మిదో తరగతి), బి.సాయిప్రమోదపాత్రో (ఎనిమిదో తరగతి), జి.తనుశ్రీ (ఎనిమిదో తరగతి) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరికి ప్రిన్సిపల్ టి.సుబ్రహ్మణ్యం ప్రశంసా పత్రాలు, బహుమతులు అందించారు. – న్యూస్‌టుడే, పార్వతీపురం, పాలకొండ

విజేతలతో పాలకొండ రవీంద్రభారతి పాఠశాల ప్రిన్సిపల్ సుబ్రహ్మణ్యం

అపూర్వం.. ఆత్మీయ సమ్మేళనం

బలిజిపేట, న్యూస్‌టుడే: మండలంలోని నారన్నాయుడువలస గ్రామ జడ్పీ ఉన్నత పాఠశాల 1994-95 పదో తరగతి విద్యార్థులంతా ఒక్కచోట కలిశారు. అప్పట్లో తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు గంటా తిరుపతిరావు, చోడవరపు నారాయణమూర్తి, నడుకూరు రాందాస్, అల్లు సూర్యనారాయణ, సిద్ధాంతం సంగం మాస్టార్లను సత్కరించారు. చదువుకున్న రోజులను గుర్తు చేసుకున్నారు.

పాలకొండ డీఎంగా మూర్తి

డీఎంను అభినందిస్తున్న ఉద్యోగులు

పాలకొండ, న్యూస్‌టుడే: పాలకొండ ఆర్టీసీ డిపో మేనేజర్‌గా బీఎస్ఆర్ మూర్తి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా ప్రజా రవాణాధికారి వెంకటేశ్వరరావు, ఉద్యోగుల సంఘం జోనల్ కార్యదర్శి భాసూరు కృష్ణమూర్తి, జిల్లా నాయకులు నారాయణ, నాగరాజు తదితరులు డీఎంను అభినందిస్తూ.. సన్మానించారు.

'సాధారణ బదిలీలు కాకపోవడంతో ఇబ్బందులు'

బలిజిపేట, న్యూస్‌టుడే: రాష్ట్రంలో పనిచేస్తున్న ఎంఈవోల సమస్యలు పరిష్కరించాలని ఎంఈవోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, బలిజిపేట ఎంఈవో-1 సామల సింహాచలం కోరారు. బలిజిపేటలో సోమవారం 'న్యూస్‌టుడే'తో మాట్లాడారు. 2017 నుంచి తమకు సాధారణ బదిలీలు నిర్వహించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. సమస్యలపై మంత్రి నారా లోకేశ్‌కు ఇటీవల వినతిపత్రం అందజేశామని తెలిపారు.

ప్రతి సమస్య పరిష్కరిస్తాం

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామని, సద్వినియోగించుకోవాలని ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి తెలిపారు. సోమవారం గుమ్మలక్ష్మీపురంలో వినతులు స్వీకరించారు. ఐదు మండలాల నుంచి ప్రజలు హాజరై సమస్యలు తెలియజేశారు. కొన్నింటిని తక్షణమే పరిష్కరించారు.

తేనెటీగల దాడిలో తీవ్ర గాయాలు

రైతు శరీరంపై తేనెటీగల ముళ్లు తీస్తున్న వైద్యులు

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: జమ్మడివలసకు చెందిన రైతు మూడడ్ల విశ్వనాథం పొలం పనుల్లో ఉండగా తేనెటీగలు దాడి చేశాయి. శనివారం ఒంటినిండా తేనెటీగల ముళ్లతో వచ్చిన 75 ఏళ్ల వృద్ధుడికి బంధలుప్పి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి శంకరరావు బృందం చికిత్స చేసింది. ఆపై మెరుగైన సేవలకు పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి పంపామని తెలిపింది. సుమారు వందకుపైగా తేనెటీగలు ఒక్కసారిగా దాడి చేశాయని, ఆరోగ్యం నిలకడగానే ఉందని చెప్పింది.

ఆటో డ్రైవర్ నిజాయతీ

కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: కురుపాంలో ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్న మీసాల సాగర్ నిజాయతీ చాటుకున్నారు. సోమవారం మూలిగూడ కూడలి వద్ద దొరికిన ఒక మొబైల్ ఫోన్‌ను యజమానికి అప్పగించారు. దురిబిలి పాఠశాలలో ఉపాధ్యాయుడు శంకరరావు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఫోన్ జారిపడిందని తెలుసుకుని, అందజేశారు.

ఆరుగురి అరెస్టు

వీరఘట్టం, న్యూస్‌టుడే: నడుకూరు సరిహద్దు ప్రాంతంలో జూదం ఆడుతున్న ఆరుగురిని సోమవారం అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై జి.కళాధర్ తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.43,500 నగదు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

నష్ట పరిహారం ఇవ్వండి

కలెక్టరేట్ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఇటీవల తుపాను ప్రభావంతో దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కె.మన్మథరావు అన్నారు. కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. వర్షాల కారణంగా వరి, పత్తి, మొక్కజొన్నకు నష్టం జరిగిందని వాపోయారు. ఆర్వీఎస్ కుమార్, రవి, రైతులు పాల్గొన్నారు.

ఉద్యోగులు నాణ్యమైన సేవలందించాలి

సిబ్బంది నుంచి వివరాలు సేకరిస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ

పాలకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: సచివాలయ ఉద్యోగులు ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని శాసనసభ్యుడు నిమ్మక జయకృష్ణ సూచించారు. సోమవారం చినమంగళాపురం, గొట్టమంగళాపురం, బుక్కూరు గ్రామాల్లో పర్యటించి సచివాలయ ఉద్యోగులతో మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురు సచివాలయ ఉద్యోగులు తమ సమస్యలను విన్నవించారు. ఎంపీపీ బి.భాను, కూటమి నాయకులు కె.అప్పలనాయుడు, జె.శ్రీధర్, కాశీనాయుడు తదితరులు పాల్గొన్నారు. ● గొట్టమంగళాపురంలో 'అన్నదాత సుఖీభవ' పథకంలో నగదు జమకాని రైతుల పేర్లు తెలియజేయాలని సిబ్బందిని జయకృష్ణ కోరారు. పేర్ల జాబితా లేదని చెప్పడంతో అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పనితీరు మెరుగుపర్చుకోవాలని మందలించారు.

ఒడిశా కాదు.. ఆంధ్రాలో ఉంటాం

సమావేశమైన గ్రామస్థులు

సాలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: కొఠియా గ్రామ పంచాయతీలైన పట్టుచెన్నూరు, పగులుచెన్నూరు ప్రాంతాల్లోని గిరిజనం ఆంధ్రాలోనే ఉంటామని తేల్చి చెబుతున్నారు. ఆది, సోమవారాల్లో పట్టుచెన్నూరు సమీపంలో సమావేశమయ్యారు. అనంతరం మంత్రి సంధ్యారాణిని కలిసి ఒడిశా ప్రభుత్వ అధికారులు తమను ఇబ్బంది పెడుతున్నారని, ఆంధ్రా అధికారులను రానివ్వకుండా ఆంక్షలు విధిస్తున్నారని చెప్పారు. తాము ఆ ప్రభుత్వం అందించే రేషన్, పింఛన్లు ఇతరత్రా పథకాలన్నింటినీ వదులుకుంటామన్నారు. ఏపీలోనే పూర్తిగా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం సహాయ సహకారాలను అందించాలని కోరాగా.. మంత్రి భరోసా ఇచ్చారు.

నిల్వ నీటితో అనారోగ్యం

రంగలగూడ గెడ్డ నీటిలో లార్వాను పరిశీలిస్తున్న డీఎంవో మణి బృందం

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: నీరు నిల్వ ఉండే ప్రదేశాల్లో అనారోగ్య కారకాలు ఉంటాయని, అలాంటి జలం సేవించొద్దని జిల్లా మలేరియా అధికారిణి మణి అన్నారు. సోమవారం రావికోన పంచాయతీ రంగాలగూడ, చుట్టుపక్కల ప్రదేశాల్లో లార్వా అభివృద్ధి పరిస్థితులను పరిశీలించారు. గ్రామంలో ఇళ్లు, చుట్టుపక్కల లార్వా బ్రీడింగు పాయింట్లను తనిఖీ చేశారు. గూడలో అందరికీ ఆర్డీటీ పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి రక్తపరీక్షలు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అవసరమైన వారికి సంబంధిత వ్యాధి నివారణ మందులు ఇవ్వాలన్నారు. హెచ్ఎస్ శంకరరావు, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, ఆశా, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి స్మార్ట్ ఫోన్

కలెక్టరేట్ ప్రాంగణం, న్యూస్‌టుడే: గరుగుబిల్లి మండల కేంద్రానికి చెందిన దివ్యాంగుడు అఖిల్ తనకు స్మార్ట్ ఫోన్ కావాలని సోమవారం కలెక్టర్ ప్రభాకరరెడ్డికి అర్జీ అందించారు. ఆయన వెంటనే విభిన్న ప్రతిభావంతుల శాఖ సిబ్బందితో మాట్లాడి.. చరవాణి అందజేశారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ

పార్వతీపురం పట్టణం, గరుగుబిల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి జిల్లా విద్యార్థులు ప్రతిభ చూపారు. సోమవారం గుంటూరు జిల్లాలో జరిగిన పోటీల్లో ఉమ్మడి జిల్లా బాలుర జట్టు ప్రథమ, బాలికల జట్టు తృతీయ స్థానాల్లో నిలిచాయి. వీరిలో వ్యక్తిగత ప్రతిభ ఆధారంగా ముగ్గురిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. గరుగుబిల్లి మండలం ఉల్లిభద్ర జడ్పీ పాఠశాలకు చెందిన ఎస్.చరణ్, పీఎన్ బొడ్డవలసకు చెందిన సాయి, పారాది పాఠశాల విద్యార్థి మోహనరావుకు అవకాశం దక్కినట్లు కోచ్ సీహెచ్ సత్యనారాయణ తెలిపారు. హెచ్ఎం శ్రీనివాసరావు, పీడీ ఆర్.అప్పలరాజు, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రథమ స్థానంలో నిలిచిన బాలుర జట్టు

ఫెన్సింగ్‌లో సత్తా

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: కొత్తగూడ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థులు ఫెన్సింగ్ అండర్-14 పోటీలకు ఎంపికయ్యారు. బిడ్డిక హర్షవర్ధన్, బిడ్డిక అరవింద్, బిడ్డిక సిద్ధార్థ, ఆరిక సుధీర్, తాడంగి తనీష్, మండంగి ప్రదీప్ విజయనగరంలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబర్చారు. ఈనెల 9 నుంచి నెల్లూరులో నిర్వహించనున్న పోటీల్లో పాల్గొనేందుకు సోమవారం పయనమయ్యారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, శిక్షకుడు మాధవరావు అభినందనలు తెలిపారు. ఇదే పాఠశాలలో చదువుతున్న మండంగి అఖిల్ చంద్రదేవ్ అండర్-17 విభాగంలో రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికయ్యాడు. కడప జిల్లాలో నిర్వహించనున్న పోటీల్లో పాల్గొననున్నాడు.

ఎస్పీ కార్యాలయంలో పీజీఆర్ఎస్

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారమే లక్ష్యమని ఎస్పీ మాధవరెడ్డి అన్నారు. సోమవారం తన కార్యాలయంలో పీజీఆర్ఎస్‌లో వినతులు స్వీకరించి, బాధితులతో మాట్లాడారు. భార్య, భర్తల గొడవలు, ఆస్తి తగాదాలు, అత్తారింటి వేధింపులు, ప్రేమ పేరుతో మోసం, కుటుంబ కలహాలకు సంబంధించి ఫిర్యాదులు ఎక్కువగా వచ్చాయి. అదనపు ఎస్పీ వెంకటేశ్వరరావు, డీసీఆర్బీ సీఐ ఆదాం, ఎస్సై రమేష్ నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

PUBLIC NOTICE

Under the instructions of my client **M/S SHRIRAM FINANCE LIMITED, Parvathipuram Branch, Parvathipuram Manyam District,** I issue the following notice to general public. My client intends to grant loan to **SMT. CHAKKA SANTHOSHI KUMARI** W/o Chakka Subash by keeping the below mentioned schedule property as security by way of Registered Mortgage. As such if any one have any claims, charges, mortgages Sale Agreements, Court Attachments, Court disputes etc., shall be informed to the address mentioned below in-writing within seven days from the date of this notices. Otherwise, later objections will not bind my client in this regard.

SCHEDULE OF THE PROPERTY

Erstwhile Vizianagaram District, Presently Parvathipuram Manyam District, Bobbili Sub-District, Sitanagaram Mandalam, Surampeta Gram panchayat and Maripivalasa Village accounts, Western side of R & B road leading from Bobbili to Parvathipuram, covered by S. Nos. 15-16, 15-17, 15-19, 15-20, 15-22 & 15-23, developed into house plots in which Plot Nos. 20, 29, 30, 31, 32, 33, 34, 35, 36 & 37 totaling 916.63 sq. yards or 769.96 Sq. meters of are measured and bounded by:

Item no.01: Plot No.20 measuring East to West 50 feet or 15.25 meters and North to South 15 feet or 4.57 meters totaling 83.33 Sq. yards or 69.99 Sq. meters of vacant site is bounded by: **East:** 20 feet wide road; **South:** Plot No.21 site; **West:** Plot No.36 site; **North:** Plot No.19 site.

Item no.02: Plot Nos.29, 30, 31, 32, 33,34, 35, 36, 37 & 38 measuring East to West 50 feet or 15.25 meters and North to South 150 feet or 45.75 meters totaling 833.33 Sq. yards or 699.99 Sq. meters of vacant site is bounded by: **East:** Plot nos. 18, 19, 20,21,22,23, 24 25, 26 & 27 sites; **South:** Plot No.28 site; **West:** 20 wide road; **North:** Plot No.39 site.

KODURI SREENIVASA RAO
SMT. SIVA KUMARI JALADI
Advocates,
S-2, Bharat Apartments, Seethammadhara, Visakhapatnam-13. **Mobile: 9885166648**
Mail: sreenivaskoduri@gmail.com

Visakhapatnam
Dt.08.12.2025

టీకాల ప్రక్రియ వేగవంతం

మందులను పరిశీలిస్తున్న విజయమోహన్

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాలో ఇమ్యునైజేషన్ టీకాల ప్రక్రియ వేగంగా పూర్తిచేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి విజయమోహన్ ఆదేశించారు. సోమవారం ఓని పెదబొండపల్లి పీహెచ్‌సీలో తనిఖీలు నిర్వహించారు. ఫ్రిడ్జ్‌లోని మందులు, ఆసుపత్రి దస్త్రాలను చూసి.. సిబ్బందికి సూచనలు చేశారు. ఈనెల 21న నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమం ఎటువంటి లోపం లేకుండా నిర్వహించాలని వైద్యులకు సూచించారు. పీహెచ్‌సీ పరిధిలో ఎల్‌సీడీసీ, ఎన్‌సీడీసీడీ కేసులు గుర్తించి, రిఫర్ చేయాలన్నారు. వైద్యాధికారిణి ధరణి, పీఎల్ గోపాలకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

భామిని, న్యూస్‌టుడే: ఘనసరలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని జనసేన పార్టీ మండల ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్ అన్నారు. సోమవారం ఆయన ఆధ్వర్యంలో విజయ మల్టీ స్పెషాల్టీ ఆసుపత్రి వారి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 80 మందికి పలు రకాల వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశామన్నారు. వైద్యాధికారి సాయిశంకర్, సిబ్బందితోపాటు తెదేపా నాయకులు బి.ఆనందరావు ఉన్నారు.

వేతన సవరణకు డిమాండు

కలెక్టరేట్ ప్రాంగణం, పాలకొండ, పార్వతీపురం పురపాలకం, న్యూస్‌టుడే: సహకార సంఘ ఉద్యోగుల వేతన సవరణ చేపట్టాలని రాష్ట్ర పీఏసీఎస్ సంఘ గౌరవ అధ్యక్షుడు రవికుమార్ కోరారు. డీసీసీబీ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఉద్యోగులకు గ్రాట్యుటీ చట్టం అమలు చేయాలన్నారు. 2019 తర్వాత విధుల్లో చేరిన ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండు చేశారు. జిల్లా అధ్యక్షుడు రెడ్డి సత్యారావు తదితరులు ఉన్నారు. యూనియన్ల ఐక్యవేదిక ఆధ్వర్యంలో పాలకొండలో డీసీసీబీ బ్యాంకు వద్ద ప్లకార్డులతో నినాదాలు చేశారు.

రైతు సంఘాల అభిప్రాయాలు తీసుకోవాలి

పాలకొండ, న్యూస్‌టుడే: ప్రతిపాదిత విత్తన చట్టంపై రైతులు, సంఘాల అభిప్రాయానికి కేంద్రం ఆరు నెలలు గడువు ఇవ్వాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అప్పలనాయుడు అన్నారు. పాలకొండలో ఆందోళన చేపట్టారు. కేంద్రం తీసుకొచ్చిన విత్తన చట్టం స్వదేశీ విత్తన తయారీ సంస్థల హక్కులు కాలరాస్తోందన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు వావిలపల్లి రమణమూర్తి, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కిమిడి రామ్మూర్తినాయుడుతో పాటు పలువురు నాయకులు, రైతులు పాల్గొన్నారు.

రైతు సంఘం నాయకుల ఆందోళన

(c) eenadu

ట్యాంకరొస్తేనే డయాలసిస్‌

ఒంగోలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి ప్రతిరోజూ 4 లక్షల లీటర్ల నీరు అవసరం. నగరపాలక సంస్థ ద్వారా 3 లక్షల లీటర్లు మాత్రమే అందుతున్నాయి. ఆసుపత్రిలోని వార్డులకు తాగునీరు చాలకపోవడంతో ఇలా ట్యాంకర్లతో నీటిని తెప్పించుకుని డ్రమ్ముల్లో నింపుకొని వాడుకుంటున్నారు. ఇక్కడ మంచి నీటి వసతి లేకపోవడంతో డయాలసిస్‌ వార్డు సిబ్బంది ట్యాంకరుతో నీటిని తెప్పించి రోగులకు డయాలసిస్‌ చేయాల్సి వస్తోంది.

–ఈనాడు, ఒంగోలు
న్యూస్‌టుడే, ఒంగోలు నగరం

జాగ్రత్తగా వెళితే తరగతికి.. పట్టు జారితే ఆసుపత్రికి..

ఆటో వెనుక ప్రమాదకరంగా వేలాడుతూ ప్రయాణిస్తున్నవారు హెచ్‌ఎంపాడు మండలం దాసరిపల్లి నుంచి కొనకనమెట్ల మండలం గొట్లగట్టు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు వెళుతున్న విద్యార్థులు. వీరందరూ బడికెళ్లాలంటే నిత్యం ఇలా ఆటోల్లో ప్రమాదకర ప్రయాణం చేయాల్సిందే. హెచ్‌ఎంపాడు-దాసరిపల్లి గ్రామాల మధ్య నిత్యం విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారు. దాసరిపల్లి, కొండారెడ్డిపల్లి గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో ఇలా ప్రయాణిస్తున్నారు. ఆటోల్లో ప్రయాణంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, ఆర్టీసీ బస్సులు వేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

–న్యూస్‌టుడే, హెచ్‌ఎంపాడు

రేపటి నుంచి ఉపాధ్యాయులకు టెట్‌

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులకు ఈ నెల 10వ తేదీ నుంచి ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్‌) పరీక్షలు ప్రారంభం కానున్నాయి. జిల్లాలో ఏర్పాటు చేసిన 8 కేంద్రాల్లో ఈ నెల 21వ తేదీ వరకు పరీక్షలు కొనసాగుతాయి. ఆన్‌లైన్‌ (సీబీటీ) ద్వారా జరిగే పరీక్షలకు దరఖాస్తు చేసిన వారికి తేదీలు కేటాయించారు. ప్రతిరోజూ ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు, తిరిగి మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తారు. మార్కాపురంలోని కృష్ణచైతన్య ఇంజినీరింగ్‌ కళాశాల, డాక్టర్‌ శామ్యూల్‌ జార్జి కళాశాల, ఒంగోలులోని నేషనల్‌ కాన్సెప్ట్‌ పర్‌ చర్చి, బ్రిలియంట్‌ కంప్యూటర్‌ ఎడ్యుకేషన్‌ సంస్థ, పేస్‌ ఇంజినీరింగ్‌, క్విస్‌ ఇంజినీరింగ్‌, రైజ్‌ ఇంజినీరింగ్‌ కళాశాలలో రెండు కేంద్రాలను ఎంపిక చేశారు. ఆన్‌లైన్‌ పరీక్షకు హాజరయ్యే ఉపాధ్యాయులు పరీక్ష సమయానికి గంటన్నర ముందు రావాలని డీఈవో ఎ.కిరణ్‌కుమార్‌ సూచించారు.

ఎన్టీఆర్‌ వైద్యసేవలకు ప్రైవేట్‌ ల్యాబ్‌లతో ఒప్పందం

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: ఎన్టీఆర్‌ వైద్యసేవ కింద ఒంగోలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి చికిత్స నిమిత్తం వచ్చేవారికి ఇబ్బందులు కలగకుండా ప్రైవేటు ల్యాబ్‌లతో ఒప్పందం చేసుకోవాలని నిర్ణయించారు. ఈ మేరకు ఔత్సాహికుల నుంచి దరఖాస్తులు, కొటేషన్లు ఆహ్వానిస్తూ ప్రకటన జారీ చేశారు. ఆసుపత్రిలో అందుబాటులో లేని వ్యాధినిర్ధారణ పరీక్షలను ప్రైవేటు ల్యాబ్‌లు, డయాగ్నోస్టిక్‌ సెంటర్లలో చేయించి ఖర్చులను ఎన్టీఆర్‌ వైద్య సేవ ట్రస్టు ద్వారా చెల్లించనున్నారు. ప్రభుత్వాసుపత్రిలో దాదాపు 120 రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు అందుబాటులో ఉండగా, కొన్ని ప్రత్యేక పరీక్షలకు ప్రైవేటు ల్యాబ్‌లను ఆశ్రయించాల్సి వస్తోంది. అక్కడయ్యే ఖర్చులకు సంబంధించిన రసీదులను రోగులు తీసుకొచ్చి ఆసుపత్రిలో సమర్పించడం సమస్యగా మారింది. ఇకపై ఇబ్బందుల్లేకుండా ప్రైవేటు ల్యాబ్‌లతో ఒప్పందం కుదుర్చుకుని అక్కడ పరీక్షలు చేయిస్తారు. ఈ విషయమై సూపరింటెండెంట్‌ మాణిక్యరావు మాట్లాడుతూ విటమిన్‌-డి, బీ-12, ఎంఆర్‌ఐ యాంజియోగ్రఫీ, హెచ్‌సీజీ క్యాన్సర్‌ పరీక్షలు లాంటివి అందుబాటులో లేనందున బయట చేయించుకోవాల్సి వస్తోందని, ఒప్పందం పూర్తయితే త్వరితగతిన మెరుగైన వైద్యసేవలు అందించడానికి వీలవుతుందని వివరించారు.

జనహితమే యువ మంత్రం!

▶ బహుళ ప్రయోజనాలిచ్చే యాప్‌ల రూపకల్పన
▶ హ్యాకథాన్‌-2025లో వివిధ రాష్ట్రాల విద్యార్థులు

ప్రజలకు మేలుచేసే ఆవిష్కరణలను అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) ఎంతగానో ప్రోత్సహిస్తోంది. ఇంజినీరింగ్‌ విద్యార్థులు పోటీపడి గొప్ప ఆవిష్కరణలు చేసేవిధంగా పోటీలు నిర్వహిస్తోంది. 'హ్యాకథాన్‌-2025' పేరిట ఒంగోలు నగరంలోని క్విస్‌ ఇంజినీరింగ్‌ కళాశాలలో సోమవారం నిర్వహించిన పోటీలకు వివిధ రాష్ట్రాల నుంచి విద్యార్థి బృందాలు హాజరయ్యాయి. వైద్య రంగానికి చెందిన, సౌకర్యాల మెరుగు వినియోగించుకోవడం, మానసిక సమస్యలను అధిగమించడం ఎలా.. సంస్కృతి పరిరక్షణ, దేశంలోని వివిధ పర్యాటక ప్రాంతాల సమాచారం ఇలా ప్రజల అవసరాలకు ఉపయోగపడే విధంగా రూపొందించిన యాప్‌లు, వెబ్‌సైట్‌లు ప్రదర్శించారు. వీటికి ఆర్టిఫిషియల్‌ ఇంటెలిజెన్స్‌ వినియోగం.. ఎలాంటి ప్రయోజనాలు పొందవచ్చో విద్యార్థులు వివరించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న యాప్‌ల కంటే తాము రూపొందించినవి ఎంత మెరుగ్గా పనిచేస్తాయనే దానిని సరిపోలుస్తూ చక్కని ప్రజంటేషన్‌ ఇచ్చారు.

–ఈనాడు, ఒంగోలు

కళ్ల ముందు ప్రాచీన సంపద

భారతదేశంలోని కేదారనాథ్‌ ఆలయం, తాజ్‌మహల్‌, చార్మినార్‌.. తదితర చారిత్రక కట్టడాల వీక్షణకు అక్కడకు వెళ్లలేని వారు త్రీడీలో కళ్లకు కట్టినట్లు చూపించేలా కోయంబత్తూరుకు చెందిన శ్రీకృష్ణ ఇంజినీరింగ్‌ కళాశాల విద్యార్థులు యాప్‌ రూపొందించారు. రాష్ట్రాల వారీగా సంప్రదాయ నృత్య రీతులు, అక్కడి సంస్కృతిని ప్రతిబింబించే ప్రజల ఆహార వ్యవహారాలు ఇలాంటివి ఎన్నో ప్రజలు తెలుసుకునేవిధంగా యాప్‌ను తీర్చిదిద్దారు.

ఆపన్నుల ఆకలి తీర్చేలా..

మిగిలిన ఆహార పదార్థాలు బయట పడేయకుండా వాటిని ఆకలితో ఉన్నవారికి పెట్టేవిధంగా 'డోనెట్‌' యాప్‌ను చెన్నైకు చెందిన దామిష్‌ అహ్మద్‌ కళాశాల విద్యార్థులు రూపొందించారు. ఆహారాన్ని పంచిపెట్టే వలంటీర్లు, మిగిలిన ఆహారం ఇచ్చే కల్యాణ మండపం, హోటల్‌ నిర్వాహకులు యాప్‌లో నమోదవుతారు. ఇదే మాదిరి ఇంట్లో పాత వస్తువులను ఉచితంగా ఇచ్చేవారు కూడా నమోదు చేసుకోవచ్చు. వస్తువులు కావాల్సినవారు (రిసీవర్లు) కూడా ఏమేమి కావాలో యాప్‌లో నమోదు చేసుకుంటే వాటిని ఉచితంగా పొందవచ్చునని విద్యార్థులు తెలిపారు.

మూగవారికి ఓ ఆయుధం

బధిరులు తాము చేసే సైగలు సామాన్యులు అర్థం చేసుకునేవిధంగా పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతాకు చెందిన ఇంజినీరింగ్‌ విద్యార్థులు రూపొందించారు. వాళ్లు సైగ చేసిన వెంటనే ఫోన్‌లో అక్షరాలు రావడంతో పాటు శబ్దం వినిపిస్తుంది. హిందీ, ఆంగ్లంతో పాటు భారతీయ భాషల్లో కనిపిస్తుందన్నారు.

ఆలయ వ్యర్థాలకు ఓ అర్థం

దేశవ్యాప్తంగా ఆలయాల్లో పూజలకు వినియోగించే సామగ్రితో వేల టన్నుల వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. ఆ వ్యర్థాలతో ఆయుర్వేద ఉత్పత్తులు తయారు చేసి ఆదాయం పొందవచ్చని బెంగళూరుకు చెందిన ఎన్‌ఎంఐటీ ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ టెక్నాలజీ విద్యార్థి బృందం 'టెంపుల్‌ టు ఆయుర్వేద' వెబ్‌సైట్‌ రూపొందించారు. ఆలయంలో వ్యర్థాలు కన్వేయర్‌ బెల్టు ద్వారా ప్రత్యేక గదిలోకి చేర్చి వేరుచేసేలా రూపొందించారు. అక్కడ ఏఐ సాంకేతికతతో పువ్వులు, ప్లాస్టిక్‌, కొబ్బరి, దుస్తులు.. ఇలా వేర్వేరు డబ్బాల్లో వేర్వేరుగా పడతాయి. వీటిని ఉపయోగించి అగరబత్తీలు, ఇతర ఉత్పత్తులు తయారు చేసి కొంతమంది ఉపాధి పొందవచ్చునని, తద్వారా కాలుష్యం నివారించవచ్చునని విద్యార్థులు వివరించారు.

కృష్ణమ్మ పరవళ్లు

రామతీర్థం జలాశయం దిగువ భాగంలో ఒంగోలు బ్రాంచి కాలువలో సాగరు జలాలు పరవళ్లు తొక్కుతున్నాయి. రిజర్వాయరు నుంచి కొంతకాలంగా నిరంతరాయంగా 250 క్యూసెక్కులకుపైగా నీటిని విడుదల చేస్తున్నారు. ఒంగోలు బ్రాంచి కాలువ కింద ఉన్న అన్ని మేజర్‌, మైనర్‌ కాలువలకు ఈ నీటిని ఇస్తున్నారు. రామతీర్థం జలాశయం పూర్తిస్థాయి నీటి మట్టం 85.34 మీటర్లు కాగా, సోమవారం సాయంత్రానికి 82.825 మీటర్లుగా ఉంది. రిజర్వాయరులోకి 120 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా, దిగువకు 260 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

–న్యూస్‌టుడే, చీమకుర్తి

ఊరికో బ్యాంకు

▶ జిల్లాలోని ప్రధాన తపాలాశాఖ కార్యాలయాలు: 03
▶ శాఖలు: 588
▶ ఉప శాఖలు: 84
▶ ఏటీఎంలు: 10

తపాలాశాఖ ఊరికో బ్యాంకు ఏర్పాటుకు రంగం సిద్ధం చేసింది. ఇండియా పోస్ట్‌ పేమెంట్‌ బ్యాంకు (ఐపీపీబీ) ద్వారా పట్టణ, గ్రామీణ ప్రజలకు తపాలా బ్యాంకింగ్‌ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చింది. నగర, పట్టణ పరిధిలోని ప్రధాన తపాలాశాఖ కార్యాలయాలు, గ్రామాల్లో శాఖలు, ఉపశాఖల్లో బ్యాంకు తరహా సేవలందిస్తోంది. గ్రామాల్లోని తపాలాశాఖ కార్యాలయాలకు ఆధార్‌ కార్డు, చరవాణి నంబరు తీసుకెళ్లి రూ.250 చెల్లిస్తే ఖాతా తెరిచి క్యూఆర్‌ కోడ్‌తో డిజిటల్‌ కార్డు ఇస్తారు. నగదు అవసరమైనప్పుడు కార్డును వినియోగించి నగదు లావాదేవీలు చేసుకోవచ్చు. చరవాణిలో ఐపీపీబీ యాప్‌ డౌన్‌లోడు చేసుకుని ఆన్‌లైన్‌ బ్యాంకింగ్‌ సేవలు సైతం పొందవచ్చు. ప్రధాన తపాలా శాఖ కార్యాలయాల్లో రోజుకు రూ.2 లక్షలు, శాఖ, ఉపశాఖల్లో రూ.25 వేల వరకు కార్డు ద్వారా లావాదేవీలు చేసుకోవచ్చు.

–న్యూస్‌టుడే, అర్థవీడు

జిల్లాలో అనుమానిత స్క్రబ్‌ టైఫస్‌ కేసు!

ఒంగోలు నగరం, సంతనూతలపాడు, న్యూస్‌టుడే: జిల్లాలో సోమవారం ఒక అనుమానిత స్క్రబ్‌ టైఫస్‌ జ్వరం కేసు వెలుగులోకి వచ్చింది. సంతనూతలపాడు మండలం రుద్రవరానికి చెందిన 56 ఏళ్ల మహిళకు పొలంలో పురుగు కుట్టి... జ్వరం, దగ్గు, జలుబు, శ్వాస సంబంధిత సమస్యలు తలెత్తాయి. వెంటనే ఆమెను కుటుంబసభ్యులు ఒంగోలులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. స్క్రబ్‌ టైఫస్‌ అనుమానిత లక్షణాలుండడంతో వైద్యుల సూచన మేరకు రెండు రోజుల కిందట గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. పరీక్షల్లో పాజిటివ్‌ వచ్చినట్లు సమాచారం కాగా, అధికారికంగా ప్రకటించలేదు. జనవరి నుంచి ఇప్పటివరకు జిల్లాలో 108 మంది అనుమానితులకు పరీక్షలు చేయగా 16 మందికి వ్యాధి నిర్ధారణ అయ్యింది. వీరిలో యర్రగొండపాలేనికి చెందిన మహిళ మృతి చెందగా, మిగిలిన వారు కోలుకున్నారు. నవంబరులో ఏడు, ఈ నెలలో ఇప్పటివరకు మూడు పాజిటివ్‌ కేసులు నమోదయ్యాయి. రుద్రవరం, ముండ్లమూరు గ్రామాల్లో సోమవారం వైద్య బృందం పర్యటించి అనుమానిత లక్షణాలున్న ఇద్దరి నుంచి రక్త నమూనాలు సేకరించి పరీక్షలకు పంపారు.

సమష్టిగా సాగితే ఉత్తమ ఫలితాలు

ప్రశంసాపత్రాలు అందుకున్నవారితో మంత్రి స్వామి, ఎమ్మెల్యే దామచర్ల, కలెక్టర్‌ రాజాబాబు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: యంత్రాంగం సమన్వయంతో పని చేస్తే ఉత్తమ ఫలితాలు సాధ్యమవుతాయని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి పేర్కొన్నారు. యాస్పిరేషనల్‌ మండలంగా యర్రగొండపాలేన్ని గుర్తించిన నేపథ్యంలో జీజీహెచ్‌ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రత్యేక సభలో ఆయన మాట్లాడారు. యర్రగొండపాలెం మండల అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది పనితీరు జిల్లా మొత్తానికి స్ఫూర్తిదాయకంగా నిలిచిందన్నారు. కలెక్టర్‌ రాజాబాబు మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను సమ్మిళితం చేస్తూ ప్రతి రెవెన్యూ డివిజన్‌లో ఒక గ్రామాన్ని పైలట్‌ ప్రాజెక్టుగా తీసుకుంటున్నట్లు తెలిపారు. ఉత్తమ పనితీరుకు ఎల్లప్పుడూ గుర్తింపు లభిస్తుందని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలు చేరుకునేలా పర్యవేక్షించిన జిల్లా స్థాయి అధికారులను ఘనంగా సత్కరించారు. తెదేపా యర్రగొండపాలెం నియోజకవర్గ బాధ్యుడు గూడూరి ఎరిక్షన్‌బాబు, సీపీవో సుధాకర్‌రెడ్డి, డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మానాయక్‌ తదితరులు పాల్గొన్నారు.

10న మంత్రి నిమ్మల రాక

పెద్దదోర్నాల, న్యూస్‌టుడే: పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు రెండో సొరంగం లైనింగ్‌ పనులను పరిశీలించేందుకు ఈనెల 10వ తేదీన రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామా నాయుడు రానున్నారు. ఉదయం 8.30 గంటలకు పనులు పరిశీలించిన అనంతరం ఇంజినీరింగ్‌ అధికారులు, ఏజెన్సీ ప్రతినిధులతో సమీక్ష నిర్వహించనున్నట్లు మంత్రి కార్యాలయం సోమ వారం ప్రకటనలో తెలిపింది.

S.B.V.R. అగ్రికల్చరల్‌ కళాశాల, బద్వేలు
ఇంటర్మీడియట్‌ నందు Bi.P.C విభాగంలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు చివరి అవకాశం. కడప జిల్లా బద్వేలులో I.C.A.R., NEW DELHI వారిచే గుర్తింపు పొందిన S.B.V.R. అగ్రికల్చరల్‌ కాలేజి (S.B.V.R. A.G.B.Sc), నందు B.Sc (Hons.) Agricultureలో అడ్మిషన్‌ కొరకు ఆన్‌లైన్‌లో రిజిస్టర్‌ చేసుకున్నా చేసుకోకపోయినా కన్వీనర్‌ కోటాలో అగ్రికల్చరల్‌ బి.ఎస్సి చేరుటకు చిట్ట చివరి అవకాశం కలదు.
వివరములకు సంప్రదించవలసినది : 94400 33523, 91825 05395, 94928 56652.
కరెస్పాండెంట్‌, S.B.V.R. అగ్రికల్చరల్‌ కళాశాల

జిల్లాపై మంచు దుప్పటి!

జిల్లాలో సోమవారం ఉదయం 8 గంటల వరకు మంచు దుప్పటి కప్పేసింది. ప్రధాన రహదారులపై వాహన దీపాల వెలుగులో చోదకులు రాకపోకలు సాగించాల్సివచ్చింది. పప్పుశనగ సాగుకు మంచు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని రైతులు చెబుతున్నారు. కొమరోలు ప్రధాన రహదారిలో పొగ మంచులో రాక పోకలు సాగిస్తున్న వాహనాలను చిత్రంలో చూడొచ్చు.

–న్యూస్‌టుడే, కొమరోలు గ్రామీణం

రైతేరాజు
పొగాకు.. ఆచితూచి సాగు
6లో..

ట్యాంకరు చోదకుడు సజీవ దహనం!

రెండు లారీలు ఢీకొన్న ప్రమాదంలో ఘోరం

బేస్తవారపేట, న్యూస్‌టుడే: బేస్తవారపేట మండలం పెంచికలపాడు సమీపంలో అనంతపురం-అమరావతి జాతీయ రహదారిపై సోమవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఓ చోదకుడు సజీవ దహనం కాగా, మరో చోదకుడు గాయపడ్డారు. బేస్తవారపేట పోలీసులు తెలిపిన వివరాల మేరకు ధర్మవరానికి చెందిన కుంపటి ఆదిశేషయ్య మినీ లారీలో టమాట లోడుతో అనంతపురం నుంచి రాజమహేంద్రవరానికి బయలుదేరారు. ఈ క్రమంలో పెంచికలపాడు సమీపంలోకి రాగానే లారీ టైరు ఒక్కసారిగా పేలిపోవడంతో అదుపుతప్పి ఎదురుగా వస్తున్న మడ్డి ఆయిల్‌ ట్యాంకరును బలంగా ఢీకొట్టింది. ప్రమాద ధాటికి మినీ లారీ బోల్తా పడగా ట్యాంకరు ముందు భాగం పూర్తిగా దెబ్బతింది. అనంతరం కొద్ది క్షణాల్లోనే రెండు లారీల ఇంజిన్లకు పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. దీంతో చోదకుడు ఆదిశేషయ్య అప్రమత్తమై లారీలో నుంచి బయటపడ్డారు. ఆయిల్‌ ట్యాంకరు చోదకుడు పైడికొండల దుర్గారావు (40) క్యాబిన్‌ ధ్వంసమై పూర్తిగా మూసుకుపోవడంతో బయటకొచ్చే మార్గం లేక అందులోనే ఇరుక్కుపోవడంతో సజీవ దహనమయ్యారు. ఈయనది పశ్చిమ గోదావరి జిల్లా దేవరపల్లి కాగా, సోమవారం విశాఖపట్నం సమీపంలోని పరవాడ వద్ద మడ్డి ఆయిల్‌ను ట్యాంకర్‌ లారీలో లోడ్‌ చేసుకున్నారు. దాన్ని తాడిపత్రిలోని ఓ సిమెంటు పరిశ్రమకు తరలిస్తుండగా ప్రమాదం చోటుచేసుకుంది. సమాచారం తెలుసుకున్న గిద్దలూరు అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. మార్కాపురం డీఎస్పీ నాగరాజు, ఎస్‌.ఐ.రవీంద్రారెడ్డి వివరాలను సేకరించారు. టమాట లారీ చోదకుడు ఆదిశేషయ్యకు స్వల్ప గాయాలు కావడంతో కంభం ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మంటలు అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ధాన్యం సేకరణకు 45 క్లస్టర్‌ కొనుగోలు కేంద్రాలు

ఒంగోలు కలెక్టరేట్‌, న్యూస్‌టుడే: రైతుల నుంచి ధాన్యం సేకరణ నిమిత్తం 201 రైతు సేవా కేంద్రాలను అనుసంధానం చేస్తూ 45 క్లస్టర్‌ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు జేసీ రోణంకి గోపాలకృష్ణ తెలిపారు. ధాన్యం సేకరణపై స్థానిక రామనగర్‌లోని రైస్‌ మిల్లర్స్‌ అసోసియేషన్‌ హాలులో సోమవారం అధికారులు, ఉద్యోగులకు శిక్షణ నిర్వహించారు. 2025-26 సంవత్సరానికి జిల్లావ్యాప్తంగా 38,036 ఎకరాల విస్తీర్ణంలో సాగు చేయగా; 94,768 మెట్రిక్‌ టన్నుల దిగుబడి రానున్నట్లు అంచనా వేసినట్లు తెలిపారు. ఈ నెల 12న అన్ని రైతు సేవా కేంద్రాల్లో రైతులకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కంట్రోల్‌రూం ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని సూచించారు. దళారులను నమ్మి రైతులెవరూ మోసపోవద్దని సూచించారు.

అమృతమూర్తికి అశ్రునివాళి

జననం: 17-05-1955
మరణం: 30-11-2025
కీ॥శే॥ శ్రీమతి తిరుపతి నిర్మల గారు
మా ఇంటి ఆరాధ్యదైవం శ్రీమతి తిరుపతి నిర్మల గారు తేది: 30-11-2025 ఆదివారం స్వర్గస్తులైనారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ... అశ్రునయనాలతో...
భర్త: తిరుపతి వెంకటేశ్వర్లు (Retired Union Bank Manager)
కుమారుడు: సతీష్‌కుమార్‌ తిరుపతి - కోడలు: స్మృతి చంద్రగిరి
కుమార్తె: సురేఖ అల్లుడు: బెజ్జం రాంబాబు
మనుమలు, మనుమరాలు మరియు కుటుంబ సభ్యులు
పెద్దకర్మ: తేది: 10-12-2025 బుధవారం సాయంత్రం 6 గంటలకు మా స్వగృహం నందు (కనుమళ్ళరోడ్డ్‌, సింగరాయకొండ) జరుగునని బంధుమిత్రులకు తెలియజేయడమైనది.

జల సురక్ష.. ప్రజలకు రక్ష!

● జిల్లాలోని రక్షిత తాగునీటి పథకాల శుభ్రతకు చర్యలు
● కలెక్టర్‌ ఆదేశాలపై నెల రోజుల కార్యాచరణ

కలుషిత నీటితోనే 70 శాతం రోగాలొస్తున్నాయి.. ప్రధానంగా తాగునీటి ట్యాంకులు సక్రమంగా శుభ్రం చేయకపోవడం, లీకేజీలతో గొట్టాల్లోకి మురుగునీరు చేరడం, సంపులు అపరిశుభ్ర వాతావరణంలో ఉండడంతో పురుగులు చేరడం తదితర కారణాలతో తాగునీరు కలుషితమవుతోంది. సమస్యను గుర్తించిన కలెక్టర్‌ రాజాబాబు రక్షిత తాగునీటి పథకాల దుమ్ము దులిపేవిధంగా జల సురక్ష మాసం పేరుతో డిసెంబరు అంతా చేసేందుకు ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్నారు.

- ఈనాడు, ఒంగోలు

ఒంగోలు నగరంలోని రక్షిత తాగునీటి పథకాన్ని పరిశీలిస్తున్న కమిషనర్‌ వెంకటేశ్వర్లు, సిబ్బంది

జిల్లాలోని గ్రామ పంచాయతీలు 729
రక్షిత తాగునీటి పథకాలు 1,856
గొట్టాలకు మరమ్మతులు చేయాల్సినవి 122
ఇప్పటి వరకు పూర్తయినవి 31

◗ సాధారణంగా ప్రతి 15 రోజులకొకసారి తాగునీటి ట్యాంకులు, సంపులు శుభ్రం చేయాలి. వీటిని ఏళ్ల తరబడి పట్టించుకోకపోవడంతో బురద, నాచు పెద్దఎత్తున పేరుకుపోయాయి. మార్కాపురం మండలం వేములకోటలో ఎప్పుడో శుభ్రం చేసిన ట్యాంకులో పేరుకుపోయిన నాచు తొలగించి బ్లీచింగ్‌ చల్లారు. కొండపి మండలం ఉప్పలపాడులో ట్యాంకు చుట్టూ అడవిలా పెరిగిన మొక్కలను సోమవారం జేసీబీతో తొలగించారు. సీఎస్‌పురం మండలం అంబవరం కొత్తపల్లిలో ట్యాంకును శుభ్రం చేయడంతో పాటు రంగులు వేశారు. జిల్లాలో గ్రామాల వారీగా 426 చోట్ల వేర్వేరు పనులు చేపట్టారు. ఎప్పుడు పట్టించుకోని అధికారులు ప్రత్యేకంగా చేయడంపై గ్రామస్థులు ఆసక్తిగా పరిశీలిస్తున్నారు. ఒంగోలు నగరంతో పాటు పట్టణాల్లోనూ కార్యక్రమం చేపట్టారు. పని చేపట్టక ముందు, తరువాత ఫొటోలను అధికారులు తీస్తున్నారు. ఈనెలాఖరు నాటికి అన్ని పంచాయతీల్లో పనులు పూర్తిచేస్తామని ఆర్‌డబ్ల్యూఎస్‌ ఎస్‌ఈ బాలశంకరరావు పేర్కొన్నారు.

ప్రజారోగ్యం దృష్ట్యా..

తాగునీటి కలుషితంతో పలుచోట్ల ఎదురవుతున్న సమస్యలను గుర్తించి పరిష్కరిస్తున్నాం. పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్‌ శాఖల అధికారులతో నిత్యం సమావేశాలు నిర్వహిస్తున్నాం. తాగునీటి ట్యాంకులు శుభ్రం చేయాలనే విషయం చాలాచోట్ల మరిచిపోవడం గుర్తించాం. శుభ్రంగా ఉంచుకోవాలనే స్పృహ ప్రజల్లో పెరగాలనే ఉద్దేశంతో పనులు చేసేటప్పుడు వారిని కూడా పిలవమని చెబుతున్నాం.

– రాజాబాబు, కలెక్టర్‌

పథకం పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నవి	ఇంతవరకు శుభ్రం చేసినవి	మోటార్లు, తీగల మరమ్మతులు చేయాల్సినవి	ఇప్పటివరకు పూర్తయినవి	ట్యాంకుల లీకేజీ అరికట్టాల్సినవి, రంగులు వేయాల్సినవి	పనులు పూర్తి చేసినవి
461	42	51	04	285	09

స్టార్‌ హాస్పిటల్స్‌ వైద్యనిపుణులను ఇప్పుడు స్టార్‌ ఇన్ఫర్మేషన్‌ సెంటర్‌ & సూపర్‌ స్పెషాలిటీ క్లినిక్స్‌, ఒంగోలులో సంప్రదించగలరు
STAR HOSPITALS Expertise • Excellence • Empathy Hyderabad

డా. ప్రవీణ్‌ మెరెడ్డి
MBBS, MS (Ortho), DNB (Ortho), MRCS (Ed), M.Ch (Ortho), FRCS (Ortho)
మీరు ఈ క్రింది సమస్యలతో బాధపడుతున్నారా?
• జాయింట్‌ పెయిన్స్‌ (తుంటి, మోకాలు, భుజాలు, చీలమండ)
• అన్ని లిగమెంట్‌ టియర్స్‌తో సహా స్పోర్ట్స్‌ గాయాలు
• నాన్‌ హీలింగ్‌ ఫ్రాక్చర్స్‌

డా. శ్రీకాంత్‌ ఎర్రం
MBBS, MD, DM (JIPMER), Fellowship in Interventional Cardiology UK
కన్సల్టెంట్‌ - ఇంటర్వెన్షనల్‌ కార్డియాలజీ
మీరు ఈ క్రింది సమస్యలతో బాధపడుతున్నారా?
• ఛాతి నొప్పి • తిమ్మిరి
• శ్వాస ఆడకపోవుట • మూర్ఛ
• రాత్రిపూట దగ్గు • స్పృహ కోల్పోవడం
• గుండె దడ • కాళ్ళ వాపు

10 డిసెంబర్‌, 2025
(ప్రతి నెల 2వ బుధవారం అందుబాటులో కలరు)
ఉ॥ 10:00 - సా॥ 04:00
స్టార్‌ ఇన్ఫర్మేషన్‌ సెంటర్‌ & సూపర్‌ స్పెషాలిటీ క్లినిక్స్‌
వేమూరి మెడికల్స్‌ వెనుక, సుందరయ్య భవన్‌ రోడ్‌, ఒంగోలు
అపాయింట్‌మెంట్స్‌ కొరకు, కాల్‌ చేయండి:
9063 443 707 | 9849 133 956
స్టార్‌ హాస్పిటల్స్‌: నానక్‌రామ్‌గూడ । బంజారాహిల్స్‌

(c) eenadu

ఇంజినీరింగ్ విద్యార్థుల మేధకు పరీక్ష

● సందడిగా స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ గ్రాండ్ ఫినాలే

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వ విద్యా మంత్రిత్వశాఖ ఇన్నోవేషన్ సెల్, అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) సంయుక్తంగా జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ గ్రాండ్ ఫినాలేకు ఒంగోలు నగరంలోని క్విస్ ఇంజినీరింగ్ కళాశాల వేదికైంది. 12 రాష్ట్రాలకు చెందిన 126 మంది విద్యార్థులు 18 బృందాలుగా పాల్గొన్నారు. హెరిటేజ్ అండ్ కల్చర్, మెడ్‌టెక్, అగ్రిటెక్, స్టూడెంట్ ఇన్నోవేషన్ అనే మిస్‌లేనియస్.. అంశాల్లో ప్రాబ్లమ్ సొల్యూషన్స్‌పై సాఫ్ట్‌వేర్ రూపకల్పనపై పోటీలు ఏర్పాటు చేశారు. 36 గంటలు కొనసాగే పోటీలో విజేతలుగా నిలిచిన నలుగురికి రూ.1.50 లక్షలు బహుమతిగా అందజేస్తారు. విజేతలను ఎంటర్‌ప్రెన్యూర్లుగా చేసేందుకు మేక్ ఇన్ ఇండియాలో భాగంగా స్టార్టప్ ఫండ్ ఇస్తారు. కళాశాల అధినేత నిడమనూరి సూర్యకల్యాణ చక్రవర్తి, వైస్ ఛైర్మన్ డాక్టర్ గాయత్రీదేవి, విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ఉప కులపతి అల్లం శ్రీనివాసరావు ప్రారంభ వేడుకలో పాల్గొన్నారు. ఇలాంటి హ్యాకథాన్‌లతో విద్యార్థులు ఉద్యోగాలు వెతుక్కునే పరిస్థితి నుంచి ఉద్యోగాలు ఇచ్చేస్థాయికి ఎదుగుతారని వీసీ పేర్కొన్నారు. కళాశాల ప్రతినిధి బాధిన వెంకటప్రసాద్, ఏఐసీటీఈ నోడల్ ఇన్‌చార్జి శ్రుతి భార్గవ చౌటే, టీసీఎస్ కన్సల్టెంట్ ప్రశాంత్, జస్టిస్ నర్ డి.బుజ్జిబాబు, ప్రిన్సిపల్ హనుమంతరావు పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా 60 కేంద్రాల్లో ఈ తరహా గ్రాండ్ ఫినాలేలు నిర్వహిస్తుండగా.. రాష్ట్రం వరకు క్విస్‌తో పాటు, గుంటూరులోని మరో కళాశాల ఎంపిక చేశారు.

పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఏఎంసీలో అవినీతిపై విచారణ జరపాలి

అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజాబాబు, జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: మద్దిపాడు, సంతనూతలపాడు మండలాల్లో ఏఎంసీ కార్యదర్శి, సిబ్బంది అవకతవకలకు పాల్పడ్డారని... విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని సంతనూతలపాడు మండల రైతులు కలెక్టర్ పి.రాజాబాబుకు ఫిర్యాదు చేశారు. ప్రకాశం భవన్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి కలెక్టర్ అర్జీలు స్వీకరించారు. ఆయా వినతులను సంబంధిత విభాగాలకు పంపి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. జేసీ రోణంకి గోపాలకృష్ణ, డీఆర్వో ఓబులేసు, ఎస్‌డీసీలు శ్రీధర్‌రెడ్డి, శ్రీకుమార్, జాన్సన్, కళావతి, విజయజ్యోతి తదితరులు పాల్గొన్నారు. * 2022లో అప్పటి టంగుటూరు ఏపీఎం బెజ్జం రమేష్ ఒంగోలులో జరిగిన నాటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సభకు అద్దె బస్సుల్లో మూడు వేల మంది మహిళలను తరలించారు. అందుకు రూ.2.57 లక్షలు ఖర్చయ్యాయి. ప్రస్తుత పాలకవర్గం నుంచి ఆ నిధులు ఇవ్వాలని ఒత్తిడి తెస్తున్నారని టంగుటూరు మండల మహిళా సమాఖ్య సభ్యులు కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. మహిళా మార్టులో చోటుచేసుకున్న అక్రమాలకు సంబంధించిన నిధులు రికవరీ చేయాలని కోరారు. ● చీమకుర్తి నగర పంచాయతీ పరిధిలో పెంచిన కుళాయి పన్నులు తగ్గించాలని భాజపా జిల్లా ఉపాధ్యక్షుడు జి.శ్రీనివాసరావు కోరారు.

కుమారుడే హింసిస్తున్నాడు!

◆ పోలీసు గ్రీవెన్స్‌లో తల్లిదండ్రుల ఫిర్యాదు

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: కుమారుడు తమను శారీరకంగా, మానసికంగా హింసిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నాడని.. తమకు న్యాయం చేయాలని కొత్తపట్నంకు చెందిన తల్లిదండ్రులు పోలీసు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎస్పీ హర్షవర్ధన్‌రాజు.. బాధితుల ఇంటికి వెళ్లి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అక్కడి పోలీసు సిబ్బందిని ఆదేశించారు. ఎక్కడైనా ఈ తరహా ఫిర్యాదులు వచ్చినా ఇదే పంథా అనుసరించాలన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు జిల్లా నలుమూలల నుంచి అర్జీదారులు తరలివచ్చారు. ఎస్పీ పలువురితో ముఖాముఖి మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. సంబంధిత స్టేషన్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. నిబంధనలకు లోబడి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. వృద్ధులు, నడవలేని స్థితిలో ఉన్న వారి వద్దకే స్వయంగా వచ్చి పరిష్కరించారు. మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ వి.వి.రమణకుమార్, పీసీఆర్ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్, సింగరాయకొండ, దర్శి, మార్కాపురం, కొండపి సీఐలు హజరయ్య, వై.రామారావు, సుబ్బారావు, సోమశేఖర్, ఎస్సై జనార్దన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు. ● ఒంగోలు సత్యనారాయణపురానికి చెందిన వ్యక్తి నాలుగు రోజులు తన కారు బాడుగకు తీసుకుని.. నాలుగు నెలలు దాటినా కారు, బాడుగ డబ్బులు ఇవ్వకుండా వేధిస్తున్నారని జప్తీ కాలనీకి చెందిన వ్యక్తి ఫిర్యాదు చేశారు. ● తన కుమారుడికి రైల్వేలో టీసీ ఉద్యోగం ఇప్పిస్తానని ఒంగోలు పార్కులో పనిచేస్తున్న ఓ వ్యక్తి రూ.4 లక్షలు తీసుకుని మోసం చేశాడని ఒంగోలు సంతపేటకు చెందిన మహిళ ఫిర్యాదు చేశారు.

ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ హర్ష వర్ధన్‌రాజు

సాగర్ కాలువలో మిర్చి వ్యాపారి గల్లంతు

త్రిపురాంతకం, న్యూస్‌టుడే: త్రిపురాంతకం మండలం దూపాడు సమీపంలోని సాగర్ కాలువలో మిర్చి వ్యాపారి గల్లంతైన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గుంటూరు జిల్లా నల్లపాడుకు చెందిన వి.శ్రీనివాసరావు మిర్చి కమీషన్ వ్యాపారం చేస్తుంటారు. ఈ క్రమంలో వచ్చే మిర్చి పంట గురించి రైతులతో మాట్లాడేందుకు శనివారం త్రిపురాంతకం వచ్చారు. ఆదివారం ఉదయం దూపాడు సమీపంలోని సాగర్ కాలువపై ద్విచక్ర వాహనం, చెప్పులు అనుమానాస్పదంగా ఉండడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్సై శివ బసవరాజు ద్విచక్ర వాహనం నంబర్ ఆధారంగా శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అయితే శనివారం అర్ధరాత్రి దాటిన తరువాత బంధువులకు ఫోన్ చేశారు. తిరిగి ఆదివారం ఉదయం నుంచి ఫోన్ చేస్తే శ్రీనివాసరావు అందుబాటులోకి రాలేదని కుటుంబ సభ్యులు తెలిపారు. దీంతో కాలువలో గల్లంతైనట్లు భావించి స్థానికుల సహాయంతో పోలీసులు సాగర్ కాలువలో గాలింపు చేపట్టారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అక్రమంగా మద్యం విక్రయించిన మహిళకు ఏడాది జైలు

సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని మూలగుంటపాడు పరిధిలోని జాతీయ రహదారి వెంబడి అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మహిళకు ఏడాది జైలు శిక్ష, రూ.12 వేలు జరిమానాను న్యాయమూర్తి విధించారు. ఎస్సై మహేంద్ర సోమవారం తెలిపిన వివరాల ప్రకారం.. నెల్లూరు జిల్లా కందుకూరు మండలం విక్కిరాలపేటకు విజయలక్ష్మి పొరుగు రాష్ట్రాల నుంచి మద్యం తీసుకొచ్చి అధిక ధరలకు విక్రయిస్తుంది. గత ఏడాది ఏఎస్సై మెహబూబ్‌బాషా సిబ్బందితో దాడి చేసి ఆమెను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. నిందితురాలిని సింగరాయకొండలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపరచగా.. నేరారోపణ రుజువుకావడంతో న్యాయమూర్తి వి.లీలాశ్యాంసుందరి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. ఇటీవల మద్యం తాగి జాతీయ రహదారిపై వాహనాలు నడుపుతున్న నలుగురు వ్యక్తులకు ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు.

డ్వాక్రా నగదు స్వాహాపై కేసు నమోదు

సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని బింగినపల్లిలో స్వయం సహాయక సంఘాల సభ్యులను వీవోఏ మోసం చేసిన సంఘటనపై సోమవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామంలో వీవోఏగా పనిచేస్తున్న గొడ్డేటి ఈశ్వరి పది నెలల క్రితం రెండు సంఘాల సభ్యుల నుంచి రుణాలకు సంబంధించిన రూ.14.9 లక్షల నగదు వసూలు చేసి బ్యాంకుకు చెల్లించలేదు. నాలుగు నెలల క్రితం సభ్యులు ఆమెను ప్రశ్నించినా డబ్బులు చెల్లించకపోవడంతో అధికారులు, గ్రామ పెద్దలను కలిసి న్యాయం చేయాలని బాధిత మహిళలు నిరసన చేపట్టారు. అయినా బ్యాంకులో నగదు జమ చేయకపోవడంతో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు షేక్ రసూల్‌బీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై మహేంద్ర తెలిపారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
కందుకూరు మెయిన్ బ్రాంచ్
వెంగమాంబ ఫంక్షన్ హాల్ ఎదురుగా, పామూరు రోడ్డు,
కందుకూరు, SPSR నెల్లూరు జిల్లా-523105. ఫోన్ : 91599 16991
ఇ-మెయిల్: ubin0803049@unionbankofindia. bank

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియజేస్తూ 30 రోజుల ప్రకటన
(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క నిబంధన 6(2)/8(6) ప్రకారం)

టు:
లేటు లక్ష్మీ కాంత రెడ్డి గుండాల గారి చట్టరీత్యా వారసులు (ఋణగ్రహీత/తనఖాదారు :
1) గుండాల సుందర రామి రెడ్డి (లేటు లక్ష్మీకాంత రెడ్డి గుండాల యొక్క తండ్రి)
2) గుండాల రమా దేవి (లేటు లక్ష్మీకాంత రెడ్డి గుండాల యొక్క తల్లి)
3) గుండాల జ్యోత్స్న, భర్త: లేటు లక్ష్మీకాంత రెడ్డి గుండాల
డియర్ సార్/మేడమ్,

విషయం: సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు, 2002 క్రింద బ్యాంక్‌కు చెల్లించవలసిన బకాయి వసూలు కొరకు లేటు గుండాల లక్ష్మీ కాంత రెడ్డి గారికి చెందిన ఆస్తి అమ్మకం.

బ్యాంకు వారికి చెల్లించవలసిన బకాయి మొత్తములను నోటీసులో తెలిపిన నిర్ణీతకాలంలోగా చెల్లించవలసినదిగా సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 యొక్క 13(2) సెక్షన్ క్రింద యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కందుకూరు మెయిన్ బ్రాంచ్ సెక్యూర్డ్ క్రెడిటార్ వారు మీకు డిమాండ్ నోటీసు తేది 22.08.2025 న జారీచేసినారు. అయినప్పటికీ మీరు సదరు నోటీసులో సూచించిన నిర్ణీత కాలంలోగా బకాయి మొత్తము చెల్లించుటలో విఫలమైనందున సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు-2002 యొక్క 6/8 వ రూలుతో కూడిన సదరు చట్టం 13(4) సెక్షన్ క్రింద స్థిర సెక్యూర్డ్ ఆస్తులను అధీకృత అధికారి గారు ఆస్తిని తేది 28.11.2025 న స్వాధీన పరుచుకున్నారు.

సెక్యూర్డ్ ఆస్తులు స్వాధీన పరచుకున్న తరువాత కూడా మీరు బ్యాంకు యొక్క బకాయి మొత్తము చెల్లించలేదు. అందువలన ఈ నోటీసు స్వీకరణ తేదీ నుండి 30 రోజులు తరువాత బహిరంగ ఇ-వేలం నిర్వహించుట ద్వారా ఆన్‌లైన్ పద్ధతిలో దిగువ తెలిపిన ఆస్తులను విక్రయించవలసిన అవసరం ఉంటుంది. ఇ-వేలం తేదీ మరియు సమయంతో పాటు ఆస్తి యొక్క రిజర్వ్ ధర మరియు ఇ-వేలం నిర్వహించు సర్వీస్ ప్రొవైడర్ వివరములు మీకు విడిగా తెలియజేయబడతాయి.

కాబట్టి, అమ్మకం ప్రకటన ప్రచురణ తేదీకి ముందుగా మీరు బ్యాంకు వారికి చెల్లించవలసిన బకాయి మొత్తముతో పాటు దానిపై తదుపరి వడ్డీ, బ్యాంకు వారికి సంభవించిన ఖర్చులు, ఛార్జీలు మరియు వ్యయాలు చెల్లించినచో, ఆస్తి అమ్మకంపైన తదుపరి చర్యలు చేపట్టబడవు మరియు సదరు చట్టం 13(8) సెక్షన్ పరిధిలో మీ తనఖా ఆస్తులను మీరు విడిపించుకోవచ్చును.

స్థిరాస్తి వివరములు
ఆంధ్రప్రదేశ్-523109, ప్రకాశం జిల్లా, పొన్నలూరు మండలం, సింగరబొట్లపాలెం గ్రామం, డోర్ నెం. 1-61, సర్వే నెం. 3/3A నందు విస్తీర్ణం 290.44 చ॥గ॥లలోని ఇంటి స్థలంతో పాటు గ్రౌండ్ ఫ్లోర్ నందు ఆర్‌సిసి రూఫ్ రెసిడెన్షియల్ భవనం లేటు గుండాల లక్ష్మీకాంత రెడ్డి, తండ్రి : సుందర రామిరెడ్డి గారికి చెందినది. హద్దులు : తూర్పు : గ్రామ పంచాయితీ రోడ్డు (కోవూరు రోడ్డు), దక్షిణం : అప్పనబోయిన తిరుపతయ్య గారి స్థలం, పడమర : వాసిపల్లి వెంకటేశ్వర రెడ్డి గారి స్థలం, ఉత్తరం : గుండాల వెంకటేశ్వర రెడ్డి గారి స్థలం.

తేది : 05.12.2025 సం/- అధీకృత అధికారి,
స్థలం: కందుకూరు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

తల్లిదండ్రులు మందలించారని విద్యార్థి ఆత్మహత్య

పొన్నలూరు న్యూస్‌టుడే: కళాశాలకు వెళ్లి చదువుకోవాలని తల్లిదండ్రులు మందలించారనే కారణంతో ఓ విద్యార్థి బలవన్మరణానికి పాల్పడిన సంఘటన ఆదివారం అర్ధరాత్రి మండలంలోని రావులకొల్లులో జరిగింది. ఎస్సై అనూక్ తెలిపిన వివరాల ప్రకారం.. దాసరి ప్రశాంత్ (18), పల్నాడు జిల్లా నరసరావుపేటలోని ఓ ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలలో రెండో ఏడాది చదువుతున్నాడు. ఇటీవల స్వగ్రామం వచ్చి తల్లిదండ్రుల వద్దే ఉంటున్నాడు. తండ్రి మల్లికార్జున కళాశాలకు వెళ్లాలని చెప్పడంతో సోమవారం వెళ్తానని చెప్పిన సమీపంలోని తన తాత ఇంటి వద్దకు వెళ్లి నిద్రించాడు. అర్ధరాత్రి సమయంలో ఫ్యానుకు చీరతో ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

ఇంటర్ విద్యార్థిని బలవన్మరణం

● యువకుడిపై పోక్సో కేసు

దర్శి, న్యూస్‌టుడే: ప్రేమించిన యువకుడు మోసం చేయడంతో బాలిక ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఈ నెల 1న చోటు చేసుకోగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్సై మురళి తెలిపిన వివరాల మేరకు.. మండలంలో ఓ గ్రామానికి చెందిన బాలిక (16), దర్శిలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ చదువుతుంది. ఆమె తల్లిదండ్రులు బేల్దారీ పనుల నిమిత్తం హైదరాబాద్‌లో ఉంటున్నారు. అమ్మమ్మ, తాతయ్యల వద్ద ఉంటూ రోజూ కళాశాలకు వచ్చి వెళుతుంది. అదే గ్రామానికి చెందిన నరేంద్ర అనే యువకుడు బాలికను ప్రేమించి వివాహం చేసుకుంటానని మోసగించాడు. అనంతరం పెళ్లి చేసుకునేందుకు అతడు నిరాకరించడంతో గత నెల 30న బాలిక ఎలుకల మందు తాగింది. పరిస్థితి విషమంగా ఉండడంతో అమ్మమ్మ, తాతయ్యలు పొదిలిలోని ప్రైవేటు వైద్యశాలలో ఈ నెల 1న చేర్చారు. పరిస్థితి విషమించడంతో అదేరోజు విద్యార్థిని మృతి చెందింది. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు యువకుడిపై పోక్సో నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

లాడ్జిలో ఉరేసుకుని..

పామూరు, న్యూస్‌టుడే: పామూరులోని నెల్లూరు రోడ్డులోని ఒక లాడ్జిలో వ్యక్తి ఉరేసుకుని మృతి చెందిన సంఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వరికుంటపాడు మండలం కనియంపాడు గ్రామానికి చెందిన సంకే వెంగబాబు(34), కొన్ని రోజులుగా బాలాజీ రెసిడెన్సీలో ఉంటున్నాడు. రెండు రోజుల నుంచి అద్దె చెల్లించకపోగా ఆదివారం రాత్రి లాడ్జీ సిబ్బంది కిటికీలోంచి చూడగా ఫ్యానుకు ఉరివేసుకుని వేలాడుతున్నాడు. విషయాన్ని లాడ్జీ నిర్వాహకులు పోలీసులకు సమాచారం ఇవ్వగా సోమవారం ఉదయం వీఆర్వో దినేష్ సమక్షంలో గది తలుపు పగులగొట్టి మృతదేహాన్ని బయటకు తీశారు. ఈ ఘటనపై ఎస్సై వెంకటేశ్వరనాయక్ కేసు నమోదు చేశారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

పెద్దదోర్నాల, న్యూస్‌టుడే: వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన పెద్దదోర్నాలలోని సుందరయ్య కాలనీ వెనుక వైపు అంబరాయకట్ట వెళ్లే రహదారిలో సోమవారం జరిగింది. ఈ సంఘటనలో అయినముక్కులకు చెందిన దర్శనం చిన్న ఏసులు (56) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చిల్లచెట్లలో మృతదేహం ఉందని సమాచారం అందడంతో అక్కడికి వెళ్లి చూడగా మృతదేహం మెడకు ఉరితాడు ఉంది. మృతదేహం నేలను ఆనుకుని ఉండటంతో ఎవరో అతనిని చంపి వేలాడి దీసి ఉంటారని బంధువులు అనుమానాలు వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న సీఐ అజయ్, ఎస్సై మహేష్‌లు మృతదేహాన్ని పరిశీలించారు. మృతుని భార్య ఎలిసమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతునికి భార్య, ముగ్గురు అబ్బాయిలు, ఇద్దరు అమ్మాయిలు ఉన్నారు.

జిల్లాలో వరి కోత దశకు వచ్చింది. కొన్నిచోట్ల ఇప్పటికే యంత్రాల ద్వారా కోసి ధాన్యం విక్రయాలు జరుగుతున్నాయి. మిరప కాయలను సైతం కోస్తున్నారు. ఈ సమయంలో పంట నష్టం జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి దర్శి కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ రమేష్ వివరించారు. - న్యూస్‌టుడే, దర్శి

చేతికొచ్చిన పంట.. జాగ్రత్తంట

మిరపకాయలను పరదాలపై ఎండబెట్టిన రైతులు

వరి..: చేను పూర్తిగా ఎండి పోయే వరకు కాకుండా 80-90 శాతం గింజలు పసుపు రంగులోకి మారుతున్నప్పుడు కోయాలి. వీటిలో 18-24 శాతం తేమ ఉంటుంది. పక్వానికి వచ్చిన అనంతరం పొలంలో ఉంచితే దిగుబడి తగ్గటంతో పాటు గింజలపై పగుళ్లు ఏర్పడతాయి. మరపట్టే సమయంలో నూకశాతం పెరుగుతుంది. ● గింజల్లో తేమ శాతాన్ని తగ్గించటానికి కోసిన పంటను పొలంలో 4-5 రోజులు ఎండబెట్టటంతో పాటు పనలు తిరగతిప్పటం ద్వారా సమానంగా ఎండేలా చేయవచ్చు. ఈ సమయంలో వర్షం పడితే ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేస్తే రంగు ధాన్యం రంగు మారవు. ● ఆరబెట్టిన ధాన్యంలో 11-12 తేమ శాతం ఉంటే నిల్వ సమయంలో 6-12 నెలలు పురుగుపట్టకుండా ఉంటుంది. నిల్వ సమయంలో రసాయనాలకు బదులుగా వృక్ష సంబంధిత పదార్థాలైన వేపాకు, వేపనూనె, పొడి, సీతాఫలం గింజల పొడి ధాన్యంలో కలపడం వల్ల 6 నెలలు నిల్వ చేయవచ్చు. ● నిల్వ ధాన్యంలో ఇసుక, వరిపొట్టు లేదా పిడకలు కాల్చగా వచ్చిన బూడిద వంటివి కలపటం ద్వారా పురుగుపట్టకుండా జాగ్రత్తపడవచ్చు. అధిక సాంద్రత కలిగిన పాలిథిన్, పీవీసీలతో తయారు చేసినవి, గాలి, తేమ చొరబడని సంచుల్లో ధాన్యాన్ని నిల్వ చేసుకుంటే మంచిది.

మిరప...: మొక్కలమీద మిరపకాయలు బాగా పండిపోతే నాణ్యత తగ్గుతుంది. ఎప్పటికప్పుడు కోయడం ద్వారా దిగుబడులు పెంచవచ్చు. ● పాలిథిన్ పట్టలు లేదా సిమెంటు గచ్చుమీద ఎండబెట్టాలి. మంచు బారిన పడకుండా కప్పాలి. ● 10 శాతానికి మించి తేమ ఉండకుండా ఎండబెట్టాలి. దుమ్ము, ధూళి, చెత్తా, చెదారం చేరకుండా కాయలు శుభ్రంగా ఉండేలా జాగ్రత్తపడాలి. ● తాలు, మచ్చ కాయలను ఎప్పటికప్పుడు వేరు చేయాలి. తేమ లేనటువంటి శుభ్రమైన గోనె సంచుల్లో నింపాలి. ఈ సమయంలో నీరు చిలకరించరాదు. ● తేమ తగలకుండా వరిపొట్టు లేదా చెక్క బల్లలపై 50-60 సెం.మీ దూరంలో నిల్వ చేయాలి. శీతల గిడ్డంగుల్లో అయితే నాణ్యత కాపాడవచ్చు.

మీ కోసం

పొగాకు.. ఆచితూచి సాగు

పొగాకు సాగులో ప్రారంభం నుంచే కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకుంటే మేలైన దిగుబడులు సాధించవచ్చని రాచర్ల వ్యవసాయాధికారి షేక్.మహబూబ్‌బాష తెలిపారు.

● **ఎరువుల యాజమాన్యం..** నత్రజని 40 కిలోలు, భాస్వరం 20 కేజీలు పొటాషియం 40 కిలోలు ఎకరానికి వేయాలి. పొగాకు నాణ్యతకు పొటాషియం ముఖ్యం. పొటాషియం సల్ఫేట్ రూపంలో మొక్కకు అందించడం మంచిది. భాస్వరం మొత్తాన్ని పొటాషియం కొంత భాగాన్ని ఆఖరి దుక్కిలో లేదా నాటే ముందు బోదెల్లో వేసుకోవాలి. నత్రజని, మిగిలిన పొటాషియం 2-3 దఫాలుగా విభజించి నాటిన 20 నుంచి 50 రోజుల మధ్యలో వేయాలి.

● **నీరు అందించే తీరు:** పొగాకు పంటకు అదనపు నీరు ఎక్కువగా అవసరం లేదు. ఇది అదనపు తేమను తట్టుకోలేదు. పారుదల నీటిలో క్లోరైడ్ శాతం 50 పీపీఎం కంటే తక్కువగా ఉండాలి. బిందు సేద్యం పరికరాలతో నీటిని అందించడం మంచిది.

● **చీడపీడల నివారణ:** పొగాకులో చీడపీడల యాజమాన్యం ముఖ్యం. వాటిని నివారిస్తేనే నాణ్యమైన పొగాకు వస్తుంది.

● **కాండం తొలుచు పురుగు..:** ఇది ఆకులు, కాండాలను తొలచి నష్టాన్ని కలుగజేస్తుంది. నివారణకు పొలంలో కనిపించే పురుగులను మొదటగా చేతితో ఏరి నాశనం చేయాలి. క్లోరాంట్రనిలిప్రోల్ 18.5 ఎస్సీ 3 మి.లీ. 10 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలి.

● **పేనుబంక, తెల్లదోమ..:** ఈ పురుగులు ఆకుల నుంచి రసాన్ని పీల్చి పంటను బలహీనపరుస్తాయి. నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 3 ఎంఎల్ లేదా థయోమిథాక్సిను 2 గ్రా 10 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి.

● **ఆకు ఎండు తెగులు..:** మొక్క ఆకులు ఎండిపోయేలా చేస్తుంది. దీని నివారణకు అజాక్సిస్ట్రోబిన్ 0.5 ఎంఎల్ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

● **మాను మచ్చ తెగులు..:** ఇది కాండం, వేర్లను ప్రభావితం చేసే తీవ్రమైన ఫంగస్ తెగులు. నివారణకు అజాక్సిస్ట్రోబిన్ 0.5 ఎంఎల్ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

-న్యూస్‌టుడే, కంభం

తొలి దశలో ఉన్న పొగాకు తోట

రైతేరాజు

సమస్య • పరిష్కారం

సమస్య: మా పెరటి కోళ్లు తెల్లగా పారుకుంటున్నాయి. కారణం ఏమిటి?

- నరసింహులు, తురిమెళ్ల

సమాధానం : ఇది సాల్మోనెల్లోసిస్ వ్యాధి ముఖ్య లక్షణం. చికిత్స కోసం ఎన్రోఫ్లాక్ససిస్ వంటి మందులను తగిన మోతాదులో నీటిలో కలిపి అందించాలి.

సమస్య: మా జీవాల్లో కొన్నింటి నోటిలో పుండ్లు తరచుగా ఏర్పడుతున్నాయి. నివారణ చర్యలు తెలియజేయండి.

- సుబ్బయ్య, తురిమెళ్ల

సమాధానం : జీవాల నోట్లో పుండ్లు గాలికుంటు వ్యాధి వల్ల వస్తాయి. చిన్న పారుడు లేదా నీలి నాలుక వ్యాధి కారకాలు. ఏ వ్యాధి వల్ల నోట్లో గాలయాలు ఏర్పడినా వాటి చికిత్స కోసం బోరిక్ ఆసిడ్, గ్లిజరిన్ మిశ్రమాన్ని లేపనంగా పూయాలి. నొప్పి నివారణ మందులు, ఆంటిబయోటిక్ మందులు పశువైద్యుని సలహా మేరకు వాడాలి.

శ్రీధర్, పశువైద్యాధికారి, తురిమెళ్ల

- న్యూస్‌టుడే, బేస్తవారపేట గ్రామీణం

కరివేపాకు తోట.. సేంద్రియ బాట

సేంద్రియ పద్ధతిలో సాగు చేసిన కరివేపాకు తోట

రసాయన ఎరువులు వేసి పండించే పంటల కన్నా సేంద్రియ పద్ధతిలో సాగు ఎంతో లాభదాయకంగా ఉంటుందని నిరూపించారు తాళ్లూరు మండలం సోమవరప్పాడుకు చెందిన **విశ్రాంత ఉద్యోగి పోగుల ప్రభాకర్,** ఆయన సోదరుడు యలమంద. వీరిద్దరూ కలిసి తమ అయిదెకరాల పొలంలో ఏడాదిన్నర క్రితం కరివేపాకు సాగు చేపట్టారు. తొలి ఏడాదిలో రసాయన ఎరువుల వాడకం, ఇతర కారణాల వల్ల దాదాపు రూ. 2. 50 లక్షల వరకు పెట్టుబడి పెట్టి పంటను కాపాడుకున్నారు. ఇప్పటికి మూడుసార్లు కరివేపాకు కోతకు వచ్చింది. గతంలో టన్ను ధర రూ. 20 వేలే ఉండేది. వాటి విక్రయాలతో పెట్టుబడులైతే వచ్చాయిగాని వారు పడిన శ్రమ వృథా అయింది. ఇలాంటి పరిస్థితుల్లో వ్యవసాయ అధికారులను సంప్రదించగా.. సేంద్రియ పద్ధతులు పాటించాలని సూచించారు. దీంతో ఆ దిశగా అడుగులు వేశారు. భూసారం పెంపుకోసం ద్రవ, ఘన జీవామృతాలను తయారు చేసి ఉపయోగించారు. క్రిమి, కీటకాలు, తెగుళ్ల నివారణకు పుల్లటి మజ్జిగ, కషాయాలను ఉపయోగించడంతో మంచి దిగుబడులు వచ్చాయని వారు తెలిపారు. రాబోయే పంట కోతలో పాతిక టన్నుల మేరకు కరివేపాకు దిగుబడులు వస్తాయని, ప్రస్తుతం ధర బాగున్నందువల్ల లాభాలు వస్తాయని చెబుతున్నారు. - న్యూస్‌టుడే, తాళ్లూరు

నకిలీ బంగారం విక్రయ ముఠా అరెస్టు

● రూ.20 లక్షల స్వాధీనం

సూర్యాపేట నేరవిభాగం, న్యూస్‌టుడే: నకిలీ బంగారు బిస్కెట్లు అంటగట్టి మోసం చేస్తున్న నలుగురు అంతర్రాష్ట్ర ముఠా సభ్యులను సూర్యాపేట గ్రామీణ పోలీసులు సోమవారం అరెస్టు చేసినట్లు ఎస్పీ నరసింహ తెలిపారు. నిందితుల నుంచి 20 గ్రాముల ఐదు నకిలీ బిస్కెట్లు, రూ.12 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. ఎస్పీ తెలిపిన ప్రకారం.. ఏపీలోని పల్నాడు జిల్లా నరసారావుపేటకు చెందిన ప్రధాన నిందితుడు నాగేశ్వరరావు అలియాస్ రాజారావు, బాల, మేడి ఆదినారాయణ, ప్రకాశం జిల్లా పెద్ద ఆరవీడు మండలానికి చెందిన కుందూరు యోగిరెడ్డి, పిట్ట నాగేంద్రరెడ్డి, ఇదే జిల్లా రాజులపాడుకు చెందిన చంద్ర, గుంటూరుకు చెందిన శ్రీనివాస్‌రావు, హుజూర్‌నగర్‌కు చెందిన ఇర్రి నరేష్, ఖమ్మం జిల్లా వైరాకు చెందిన సుధాకర్ మొత్తం తొమ్మిది మంది ఒక ముఠాగా ఏర్పడి అమాయక ప్రజలకు మాయమాటలు చెప్పి నకిలీ బంగారాన్ని తులం రూ.90 వేల చొప్పున విక్రయించారు. ఇలా వచ్చిన డబ్బులో పది శాతం కమీషన్ ఇస్తానని ప్రధాన నిందితుడు నాగేశ్వరరావు మిగిలిన నిందితులకు చెప్పాడు.

● విక్రయించగా వచ్చిన డబ్బు పంచుకోవడానికి ఖమ్మం జాతీయ రహదారి పైవంతెన వద్దకు వచ్చారు. సూర్యాపేట గ్రామీణ సీఐ రాజశేఖర్, ఎస్సై బాలునాయక్ తన సిబ్బందితో కలిసి దాడి చేయడంతో నలుగురు నిందితులను, ఐదు నకిలీ బిస్కెట్లు, రూ.12 లక్షలను పట్టుకున్నారు. మిగిలిన ఐదుగురు నిందితులు పరారయ్యారు.



నిందితులతో అటవీ అధికారి ప్రసన్నజ్యోతి తదితరులు

అడవి జంతువులను వేటాడిన నలుగురి పట్టివేత

యర్రగొండపాలెం పట్టణం, న్యూస్‌టుడే: అడవి జంతువులను వేటాడి నందుకు నలుగురు నిందితులను అటవీ అధికారులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. సోమవారం సాయంత్రం స్థానిక అటవీ శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వై.పాలెం ఫారెస్ట్ రేంజర్ ప్రసన్న జ్యోతి వివరాలను వెల్లడించారు. త్రిపురాంతకం మండలం అన్నసముద్రం మెట్ట వద్ద పల్నాడు జిల్లా వినుకొండకు చెందిన షేక్. హుస్సేన్‌సాహెబ్, ఎస్కే.మాబులు కుందేళ్లను చంపి విక్రయిస్తుండగా అందిన సమాచారం మేరకు పట్టుకుని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి ఒక బైక్, వలలు స్వాధీనం చేసుకున్నారు. ఇదే విధంగా త్రిపురాంతకం మండలం రాజుపాలెం పెట్రోల్ బంకు వద్ద పందులను చంపి ఆరు కేజీల మాంసం విక్రయిస్తున్నందుకు విశ్వనాథపురం గ్రామానికి చెందిన కుంభ అరవింద్, పాలపర్తి ఏసుబాబులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రెండు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఈ రెండు కేసుల్లో దొరికిన కుందేలు, పంది మాంసాలను స్థానిక పశువైద్యుడు సాంబ చేత పోస్టుమార్టం చేయించారు. అడవి జంతువులను వేటాడినా, వాటికి హాని కలిగించినా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో డి.శివశంకర్, బీట్ అధికారి జి.వెంకటయ్య, ఎఫ్‌బీవో చైతన్య తదితరులు పాల్గొన్నారు.

ఆశ కార్యకర్తల పోస్టుల భర్తీకి ధ్రువపత్రాల పరిశీలన

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: జిల్లాలో ఇటీవల ఖాళీ అయిన 60 ఆశా కార్యకర్తల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానించగా 152 మంది దరఖాస్తు చేశారు. డీఎంహెచ్‌వో డి.వెంకటేశ్వర్లు నేతృత్వంలో సోమవారం ధ్రువపత్రాల పరిశీలన చేపట్టారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈ ప్రక్రియ కొనసాగింది. 133 మంది హాజరయ్యారు. ప్రస్తుతం అన్ని మండలాల్లో ఒకటి రెండు పోస్టులు అందుబాటులో ఉన్నాయి. దరఖాస్తు చేసినవారు ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలకోసం తిరుగుతున్నారు. మార్కాపురం, కనిగిరి, దర్శి నియోజకవర్గాల్లోని కొన్ని గ్రామాల్లో ఇద్దరు చొప్పున పోటీ పడుతున్నారు. త్వరలో తుది జాబితా ప్రకటించనున్నారు.

ధ్రువపత్రాల పరిశీలనకు వచ్చిన అభ్యర్థులు

ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 135, రిటైల్ లైవ్ - 162, చికెన్ విత్ స్కిన్ - 235, చికెన్ స్కిన్‌లెస్- 267

EENADU Classifieds

BUSINESS SERVICES
బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

EDUCATION
SPOT admissions by Govt AP 12/12: M.Com/MA English/MSW only Rs 5000 per sem, PLNM Degree College, 91774 08565.

అధిక స్పందనలు పొందండి. వాహనాలు అమ్మకం, ఉద్యోగాల భర్తీ, ఇళ్లు, ప్లాట్లు, స్థలాలు అమ్మకాలు, కొనుగోళ్లు, ఇళ్లు, షాపులు, ప్లాట్లు అద్దెకు మరియు అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు... B/W 5 లైన్ల ప్రకటన రూ.275/- మాత్రమే
వివరాలకు..
97011 12824
ఒంగోలు
80087 09902
మార్కాపురం
80081 11050
మీ చిన్నారులకు పుట్టినరోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి.
B&W : రూ. 500
Colour : రూ. 700
ప్రకటనలపై 5% GST వర్తించును

REAL ESTATE
PLOT FOR SALE
East Facing 364 Sq.Yards Plot in SBI Colony, Kurnool Road, Ongole. is for URGENT sale. No Brokers. Ph: 83285 05374.
ఒంగోలు మంగమూరు రోడ్డు మిలటరీ కాలనీ ఎక్స్టెన్షన్‌లో ఈస్ట్ ఫేస్ 13 గదులు. 16 వెడల్పు 61 లోతు స్థలం అమ్మబడును. సెల్: 92478 46496.

JOBS
Wanted Sales Executives For Guntur, Ongole for Mahesh Extruions (P) Ltd Bellari Send Your Resumes maheshpvcpipes@gmail.com.
అమెరికాలో 1 సం॥ బాబు ఆలన, పాలన వ్యక్తిగత సంరక్షణ కొరకు అనుభవంగల ఆడవారు కావలెను. అమెరికా వీసా కల్గినవారు మాత్రమే. ✆ 9440803362
ఎలక్ట్రికల్ & ప్లంబింగ్ వర్క్ తెలిసినవారు A/C టెక్నీషియన్ కావలెను. జీతం 18 వేలు నుండి ITI, DIPLOMA అనుభవం గల వారికి ప్రాధాన్యత. సెల్: 70326 66008.
రాఘవ ఆటో ఫైనాన్స్, మార్కాపురం నందు బిజినెస్ & కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. సంప్ర॥ T.D.P ఆఫీస్ ప్రక్కన, ఒంగోలు. 9100904979, 7680015749.
అగ్రికల్చర్‌కు సంబంధించిన ప్రాజెక్ట్‌లో ఫీల్డ్ వర్క్ చేయుటకు మండలాల వారీగా PROలు, జిల్లా కో ఆర్డినేటర్లు అర్జెంటుగా కావలెను. Q: 10 to డిగ్రీ. జీ॥ 15వేలు - 18వేలు. సంప్ర॥ 9391989399, 08592 460954.
అకౌంటెంట్స్, సూపర్‌వైజర్స్, ఐషర్ డ్రైవర్స్ కావలెను. చిలకలూరిపేట మం. యడవల్లి గ్రామంలో ఉన్న పేపర్ మిల్లులో పనిచేయుటకు. 9390633593, 9059514555.
ప్రముఖ కంపెనీలో మార్కెటింగ్ ఫీల్డ్‌లో ఒంగోలు టౌన్‌లో పని చేయుటకు అనుభవం/ఫ్రెషర్స్ గల అభ్యర్థులు కావలెను. Q: Any Degree. Attractive Salary. ✆ 9703402722
ఒంగోలు కర్నూలురోడ్డులోని న్యూ గ్రానైట్ ఆఫీసు నందు పని చేయుటకు డిగ్రీ అర్హతగల వివాహమైన లేడీ అకౌంటెంట్ కావలెను. ఒంగోలు వారు మాత్రమే సంప్ర॥ 98664 18899

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటన దారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయం లో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బు ను వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మ రియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

మార్కాపురం

•మార్కాపురం • గిద్దలూరు • యర్రగొండపాలెం

దర్శిని కలపాలని కోరుతూ సంతకాల సేకరణ



పాల్గొన్న మేధావులు, విద్యావంతులు

మార్కాపురం పట్టణం: మార్కాపురం జిల్లాలో దర్శి నియోజకవర్గాన్ని కలపాలని కోరుతూ విద్యావంతులు, మేధావుల వేదిక ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్ వద్ద సంతకాల సేకరణ కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో వయోజన విద్య విశ్రాంత్ డిప్యూటీ డీఈవో ఏ.వీరారెడ్డి, సీనియర్ పాత్రికేయులు, ఓ.మల్లిక్, డి.నాగేంద్రుడు, భాషా, నారాయణరెడ్డి, నాయక్ తదితరులు పాల్గొన్నారు.

చెక్‌డ్యాం నిర్మాణంతో దీర్ఘకాలిక ప్రయోజనాలు

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి

బేస్తవారపేట, న్యూస్‌టుడే: మండలంలోని పూసలపాడులో నామ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.80 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన నూతన చెక్‌డ్యాం నిర్మాణానికి ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి సోమవారం భూమిపూజ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చెక్‌డ్యాం ఏర్పాటుతో భూగర్భ జలాలు పెరగడమే కాకుండా స్థానిక వ్యవసాయ అభివృద్ధికి దీర్ఘకాలిక ప్రయోజనం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నరసింహ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

❖ ఒంగోలు గ్రామీణం: గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి స్థానిక ప్రకాశం భవన్‌లోని ఛాంబర్‌లో సోమవారం కలెక్టర్ పి.రాజాబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. పలు అభివృద్ధి పనులపై చర్చించారు.

దశాబ్దాల కల నెరవేర్చిన సీఎం చంద్రబాబు

ఎమ్మెల్యే నారాయణరెడ్డిని సన్మానిస్తున్న వార్డు నాయకులు

మార్కాపురం పట్టణం, న్యూస్‌టుడే: దశాబ్దాల పశ్చిమ ప్రాంత ప్రజల ఆకాంక్షను సాకారం చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు ఈ ప్రాంత ప్రజలు రుణపడి ఉంటారని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. మార్కాపురం జిల్లాగా ప్రకటించిన సందర్భంగా సోమవారం రాత్రి పట్టణంలోని 15వ వార్డులో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చెప్పిన మాట ప్రకారం మార్కాపురం జిల్లాగా ప్రకటించి ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షను నెరవేర్చారన్నారు.

ప్రత్యేక జిల్లాతోనే అభివృద్ధి సాధ్యం

సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న తెదేపా నాయకులు

పొదిలి, న్యూస్‌టుడే: తెదేపా అధినేత, సీఎం చంద్రబాబునాయుడు మార్కాపురం జిల్లాను ప్రకటించి ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షను సాకారం చేశారని తెదేపా నాయకులు అన్నారు. సోమవారం మండలంలోని కుంచేపల్లి ఎస్సీకాలనీలో సర్పంచి వరికుంట్ల కాంతమ్మ, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వి.అనిల్ ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబునాయుడు, ఎమ్మెల్యే కె.నారాయణరెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తెదేపా మండల అధ్యక్షులు డి.అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాజీ సైనికులకు సత్కారం

కంభం, న్యూస్‌టుడే: సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రకాశం భవనంలోని ప్రజా వేదికలో కలెక్టర్ రాజాబాబు విశ్రాంత సైనికులు కెప్టెన్ జీసీ అంకన్న, కోటిరెడ్డి, శెట్టం వేణుగోపాల్, సంగతాల ప్రసాద్, ఎన్.పోలయ్యలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జేసీ గోపాలకృష్ణ, జిల్లా సైనిక వెల్ఫేర్ అధికారి అబ్దుల్ రహీం తదితరులు పాల్గొన్నారు.

కెప్టెన్ అంకన్నను సత్కరిస్తున్న కలెక్టర్ రాజాబాబు

పద్ధతిగా అధ్యయనం.. భవిత ఉజ్వలం

❖ పది విద్యార్థులకు ప్రారంభమైన వంద రోజుల ప్రణాళిక

న్యూస్‌టుడే, పొదిలి:

ప్రభుత్వ పాఠశాలల్లో పది విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా శనివారం నుంచి అన్ని ప్రభుత్వ, జడ్పీ, కస్తూర్బా ఉన్నత పాఠశాలల్లో 'వంద రోజుల ప్రణాళిక' అమలు ప్రారంభమైంది. దీనికి అనుగుణంగా గిద్దలూరు, మార్కాపురం, వై.పాడు నియోజకవర్గాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో కార్యాచరణ చేపట్టారు.

పొదిలి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో తరగతుల నిర్వహణ

నేర్చుకున్న దానిపై పరీక్ష ద్వారా నిర్ధారణ

ఇప్పటికే ఆయా పాఠశాలల్లో వార్షిక సిలబస్ పూర్తయింది. వంద రోజులపాటు అమలుచేసే ప్రణాళికలో ప్రతిరోజు రెండు సబ్జెక్టులను చదివించడం, విద్యార్థులు ఎంత వరకు నేర్చుకున్నారో పరీక్ష ద్వారా నిర్ధారించనున్నారు. వారంలో ఒకరోజు అన్ని సబ్జెక్టులకు సంబంధించిన పరీక్షలు నిర్వహిస్తారు. విద్యార్థులకు వచ్చిన మార్కులను ఆయా సబ్జెక్టు ఉపాధ్యాయులు లీప్ యాప్‌లో తప్పనిసరిగా నమోదు చేయాల్సి ఉంది. తద్వారా వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారు సైతం మంచి మార్కులు సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించనున్నారు. పొదిలి బాలికల ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన స్టడీ అవర్స్‌లో విద్యార్థులు ఎక్కువ మంది హాజరయ్యారు. స్టడీఅవర్స్ నిర్వహణ వల్ల కలిగే ఉపయోగాలను ఆయా విద్యార్థుల మాటల్లో...

చదువుపై ఏకాగ్రత పెరుగుతుంది

పాఠశాలలో నిర్వహిస్తున్న స్టడీఅవర్స్ వల్ల పది మంది విద్యార్థులతో కలిసి చదువుకుంటాం. చదువుపై ఏకాగ్రత పెరుగుతుంది.

– ఎస్కే నసీమా, పొదిలి

సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు

స్టడీ అవర్స్‌లో చదవడం వల్ల ఆయా సబ్జెక్టుల్లో సందేహాలు ఉంటే వెంటనే ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవచ్చు. దూరమైనా కచ్చితంగా వస్తున్నాను.

– బి.నాగలక్ష్మి, గురుగుపాడు

పోటీతత్వం అలవడుతుంది

స్నేహితులతో కలిసి స్టడీఅవర్స్‌లో చదవడం వల్ల వాళ్ల కంటే ఎక్కువ మార్కులు సాధించాలన్న పోటీతత్వం పెరుగుతుంది. పరీక్షల్లో సమయపాలన ఎలా పాటించాలో తెలుస్తుంది. – ఎస్.శృతి, పొదిలి.

సీజీఆర్ఎఫ్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

పొదిలి: సీజీఆర్ఎఫ్ విజయవాడ వారి ఆధ్వర్యంలో దర్శిలోని పి.టి.ఎస్. కన్వెన్షన్‌హాలులో మంగళవారం అదాలత్ జరుగుతుందని విద్యుత్తు శాఖ దర్శి ఈఈ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ అదాలత్‌లో ఛైర్మన్ ఎన్.విక్టర్ ఇమ్మానుయేల్, విద్యుత్తుశాఖ ఎస్ఈ కె.వెంకటేశ్వర్లు, ఇతర విద్యుత్తుశాఖ అధికారులు పాల్గొంటారన్నారు. దర్శి డివిజన్‌లోని విద్యుత్తు వినియోగదారులు తమ ఫిర్యాదులను రాతపూర్వకంగా అందజేయాలన్నారు.

దివ్యాంగ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

త్రిపురాంతకం గ్రామీణం: దివ్యాంగ విద్యార్థుల అభివృద్ధి పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంఈవో-2 టి.రాజశేఖరెడ్డి అన్నారు. స్థానిక భవిత కేంద్రంలో సోమవారం జరిగిన ఫిజియోథెరపీ క్యాంపును ఆయన పరిశీలించి మాట్లాడారు.

ఆకట్టుకున్న క్రీస్తు జననం నాటిక

రాచర్ల, న్యూస్‌టుడే: రాచర్ల మండలంలోని యడవల్లి గ్రామంలోని క్రిస్మస్ ముందస్తు వేడుకల్లో భాగంగా చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. చిన్నారులు క్రీస్తు జననం నాటికను ప్రదర్శించారు. బొల్లు మెషయ్యబాబు, బైళ్ల రమేష్ ఆరాధన చేశారు. క్రీస్తు సందేశం వినిపించారు. కార్యక్రమంలో సతీష్‌బాబు, సంఘ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

రాళ్ల దారులు.. వెళ్లాలంటే ఇక్కట్లు

దోర్నాల మండలంలోని మర్రిపాలెం, పెద్దచామ, పెద్దమంతనాల చెరువు గూడేలకు వెళ్లే రహదారులు రాళ్లు తేలి అధ్వానంగా ఉన్నాయి. దీంతో ఆయా గూడేల్లోని చెంచు గిరిజనులు రాకపోకలు సాగించాలంటే అనేక అవస్థలు పడుతున్నారు. రహదారులు బాగు చేసేందుకు అటవీ శాఖ అనుమతులు ఇవ్వకపోవడంతో ఈ పరిస్థితి నెలకొందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తారు రోడ్లు వేయాలని వారు కోరుతున్నారు.– న్యూస్‌టుడే, పెద్దదోర్నాల

రూ.లక్షల వ్యయం... లక్ష్యానికి దూరం



కొమరోలు మండలంలో కొమరోలు-2, 3 సచివాలయాలకు గత వైకాపా ప్రభుత్వంలో ఒక్కో భవనాన్ని రూ.30 లక్షల వ్యయంతో నిర్మించారు. కార్యకలాపాలు మాత్రం నిర్వహించటం లేదు. కొమరోలు గ్రామ పంచాయతీ కార్యాలయంలోని ఒకటో సచివాలయంలోనే 2, 3 సచివాలయాలను పై అంతస్థులో నిర్వహిస్తున్నారు. దీంతో వృద్ధులు, మహిళలు తీవ్ర ఇబ్బంది పడాల్సి వస్తోంది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అయినా నిర్మాణం పూర్తయిన సచివాలయాలను వినియోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు. విద్యుత్తు సౌకర్యం కోసం సంబంధిత కార్యదర్శులకు తెలియజేశామని పీఆర్ ఏఈ ఈరయ్య తెలిపారు. – న్యూస్‌టుడే, కొమరోలు గ్రామీణం

పొదిలిలో పార్కు ఏర్పాటుకు చర్యలు

పొదిలి, న్యూస్‌టుడే: పొదిలి ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఎన్ఏపీ ఓవర్‌హెడ్ ట్యాంకు ముందున్న ఖాళీ స్థలంలో పార్కు ఏర్పాటు చేసేందుకు పనులు చేపట్టినట్లు కమిషనరు కె.ఎల్.నారాయణరెడ్డి చెప్పారు. మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఈ స్థలంలో ఏర్పాటుచేస్తే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని ఎమ్మెల్యే సూచించారన్నారు. దీంతో మూడు రోజులుగా ఆ ప్రాంతంలో భూమి చదును చేయించామన్నారు. నగర పంచాయతీపై ఎటువంటి ఆర్థికభారం లేకుండా పనులు చేయిస్తున్నట్లు కమిషనరు చెప్పారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

మార్కాపురం : 8008631313
గిద్దలూరు పట్టణం : 8008574135
యర్రగొండపాలెం : 8008552658

కంభం, న్యూస్‌టుడే:

?: మండలంలోని దేవనగరం నుంచి గోవిందాపురం వరకూ రహదారి గుంతలమయంగా మారింది. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేయించాలి. – సురేష్, వాహనదారుడు

✓: రహదారిని బాగు చేయించేందుకు ప్రతిపాదనలు పంపిస్తాం. నిధులు మంజూరైన వెంటనే బాగు చేయిస్తాం.

– సుబ్బారావు, జేఈ, పంచాయతీ రాజ్

కొనకనమిట్ల, న్యూస్‌టుడే:

?: కొనకనమిట్ల మండలంలోని వింజవర్తిపాడు గ్రామంలో చేతి పంపులు మరమ్మతులకు గురి కావడంతో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే చర్యలు తీసుకోగలరు. – వెంకటకృష్ణ, వింజవర్తిపాడు.

✓:పంచాయతీ కార్యదర్శి మాట్లాడి రెండు రోజుల్లో చేతిపంపు మరమ్మతులు చర్యలు తీసుకుంటాం. – శ్రీదేవి, ఈవోఆర్డీ

మంగాపురం, (కొనకనమిట్ల), న్యూస్‌టుడే:

?:కొనకనమిట్ల మండలంలోని మంగాపురం పంచాయతీలో మురుగు కాలువలు వ్యర్థాలతో నిండిపోవడం దోమలు వ్యాప్తి చెంది ప్రజలు రాత్రి సమయంలో ఇబ్బంది పడుతున్నారు.

– అశోక్ కుమారు, మంగాపురం.

✓:మురుగు కాలువల్లో వ్యర్థాలను తర్వలో తొలగించి సమస్య పరిష్కరిస్తాం.

– శ్రీదేవి, ఈవోఆర్డీ

పొదిలి, న్యూస్‌టుడే:

?: పొదిలి కొత్తూరులో ప్రధాన రహదారికి ఇరువైపులా మురుగునీటి కాలువలు సక్రమంగా లేవు. వర్షం వస్తే కాలువలు పొంగి దుకాణాల ముందుగా నీరు ప్రవహిస్తోంది. సమస్య పరిష్కరించగలరు.

– శ్రీనివాసులు, పొదిలి.

✓: నగర పంచాయతీలో ప్రధాన రహదారికి ఇరువైపులా కాలువల నిర్మాణానికి, సెంటర్ లైటింగ్ తదితర పనులకు ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైతే పనులు చేయిస్తాం. – కె.ఎల్.నారాయణరెడ్డి, కమిషనరు, పొదిలి.

సాయుధ దళాల పతాక నిధికి విరాళం

కంభం, న్యూస్‌టుడే : సాయుధ దళాల పతాక నిధికి కంభం మాజీ సైనికుల సంఘం ఆధ్వర్యంలో రూ.58,000 సేకరించి జిల్లా సైనిక వెల్ఫేర్ అధికారి అబ్దుల్ రహీంకు సోమవారం అందజేశారు. పదేళ్లుగా అత్యధిక నిధులు సేకరించడంలో మొదటి స్థానంలో ఉందని ఆ సంఘం అధ్యక్షుడు శెట్టం వేణుగోపాల్ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు అంకయ్య, పుల్లయ్య, ఎస్.ప్రసాద్, పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

పునాదులు తొలగిస్తున్న అధికారులు

పొదిలమ్మ దేవాలయ భూమిలో నూతన నిర్మాణాల తొలగింపు

పొదిలి, న్యూస్‌టుడే: పట్టణంలోని పొదిలమ్మ దేవాలయం భూమిలో నూతనంగా నిర్మిస్తున్న గృహనిర్మాణాన్ని సోమవారం దేవాదాయశాఖ ఈవో ఎన్.నారాయణరెడ్డి, సిబ్బంది నిలిపివేయించారు. సుమారు 20 ఏళ్లుగా పొదిలమ్మ భూమిలో ఎన్.నాగరాజు, సుజాత దంపతులు తాత్కాలిక గృహం వేసుకుని నివాసం ఉంటున్నారు. ఇటీవల ఈ ప్రాంతంలో ఎక్కువ మంది తాత్కాలిక రేకులషెడ్లు వేసుకుంటుండటంతో వీరు కూడా పిల్లర్లు వేసుకుని కొత్తనిర్మాణ పనులు మొదలుపెట్టారు. విషయం తెలుసుకున్న ఈవో నారాయణరెడ్డి, సిబ్బంది పొక్లయిన్‌తో అక్కడకు వచ్చి పునాదులను తొలగించారు. దీంతో ఎన్.సుజాత మనోవేదనకు గురై పెట్రోలు పోసుకుని నిప్పటించుకునే ప్రయత్నం చేశారు. పక్కవారు గమనించి ఆమెను వారించారు. ఆ ప్రాంతంలో దేవాదాయశాఖ బోర్డు ఏర్పాటు చేశారు. ఆక్రమణల విషయమై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు అందడంతో వారి ఆదేశాల మేరకు తొలగించినట్లు ఈవో తెలిపారు.

రహదారి ప్రమాదంలో యువకుడికి గాయాలు

పెద్దదోర్నాల, న్యూస్‌టుడే: పెద్దదోర్నాల-శ్రీశైలం ఘాట్ రోడ్డులోని చింతల సమీపంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి పడిపోవడంతో చోదకుడికి గాయాలైన సంఘటన సోమవారం జరిగింది. యర్రగొండపాలెం మండలం అమానిగుడిపాడుకు చెందిన సీహెచ్ వెకంటేశ్వర్లు తన స్నేహితుడితో ద్విచక్ర వాహనంపై శ్రీశైలం వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. అతను ద్విచక్ర వాహనంపై నుంచి పడిపోవడంతో కాలుకు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది క్షతగాత్రుడిని పెద్దదోర్నాల సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్యసిబ్బంది ప్రాథమిక చికిత్సలు అందించారు. మెరుగైన వైద్యం కోసం నరసరావుపేట తరలించారు.

పొదిలి విశ్రాంత ఆర్ఐపై విచారణకు ఆదేశం

పొదిలి, న్యూస్‌టుడే: పొదిలిలో 2017 నుంచి 2020 వరకు ఆర్.ఐ.గా పనిచేసిన ఎస్.సుబ్బరాయుడుపై విచారించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ సమయంలో దర్శి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన ఐ.పెద్దనాగిరెడ్డి వారి బంధువులకు సంబంధించిన భూమిని మ్యుటేషన్ చేసేందుకు దరఖాస్తు చేసుకోగా సుబ్బరాయుడు ఇబ్బందులకు గురిచేశారని, నగదు డిమాండ్ చేశారని అప్పట్లో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా అతడిపై ప్రాథమిక విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఆదేశాలు జారీచేసినట్లు తెలిసింది. ఆయన 2021 మార్చి 31న ఉద్యోగ విరమణ చేశారు. ఈ విషయమై పొదిలి తహసీల్దార్ క్రిష్టారెడ్డిని 'న్యూస్‌టుడే' వివరణ కోరగా ఈ విషయమై మాకు ఎలాంటి ఆర్డరు అందలేదని చెప్పారు.

సాంకేతిక సాయం.. సాగుకు బలం

కృష్ణంశెట్టిపల్లెలో డ్రోన్ ద్వారా పురుగు మందు పిచికారీ

న్యూస్‌టుడే, గిద్దలూరు పట్టణం: రైతులు వ్యవసాయంలో ఆధునిక సాంకేతిక పద్ధతులను అందిపుచ్చుకుంటున్నారు. గతంలో పొలంలో పురుగుమందులు పిచికారీ చేసేందుకు స్ప్రేయర్లు వాడేవారు. ఆ సమయంలో పొలంలో పంటకు సక్రమంగా రసాయనిక ఎరువులు పిచికారీ కాకపోవడం, గాలులు వీచిన సమయంలో రసాయనిక మందులు పీల్చడం ద్వారా రోగాల బారిన పడేవారు.

రాయితీపై రైతులకు అందజేత

డ్రోన్లు అందుబాటులోకి రావడంతో రైతులకు శ్రమ తగ్గుతోంది. ప్రస్తుతం డ్రోన్ ద్వారా పురుగు మందులు పిచికారీ చేస్తుండటంతో రైతులకు ఆరోగ్య పరంగానూ మేలు కలుగుతోంది. కూటమి ప్రభుత్వం రాయితీపై డ్రోన్ యంత్రాలను అందజేస్తుడంతో రైతులు రాయితీని సద్వినియోగం చేసుకొని డ్రోన్‌లను కొనుగోలు చేస్తున్నారు.

❖ ఎకరా పొలంలో డ్రోన్ ద్వారా రసాయనిక ఎరువులు పిచికారీ చేసేందుకు రూ.400 వంతున వసూలు చేస్తున్నారు. ఖర్చు తక్కువగా ఉండటం, సమయం ఆదా కావడంతో రైతులు డ్రోన్ ద్వారా పురుగు మందులు పిచికారీ చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. వీటి వినియోగంపై ఇతర రైతులూ ఉత్సాహం చూపాల్సిన అవసరం ఉంది. అందుకు అధికారులు ప్రత్యేక శిక్షణ తరగతులు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

వేళకు బస్సు నడపాలంటూ విద్యార్థుల ధర్నా

బేస్తవారపేట, న్యూస్‌టుడే: ఆర్టీసి బస్సు కొన్ని రోజులుగా వేళకు రాకపోవడంతో పాఠశాల నుంచి తమ గ్రామాలకు అక్కడి నుంచి పాఠశాలలకు చేరుకునేందుకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని విద్యార్థులు ఆందోళనకు దిగారు. స్థానిక జడ్పీ బాలురు, బాలికల ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు సోమవారం జాతీయ రహదారిపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. గిద్దలూరు డిపోకు చెందిన గొల్లపల్లి రూటు ఆర్టీసీ బస్సు పాఠశాలల వేళకు సక్రమంగా రావడంలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ధర్నా కారణంగా కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. తహసీల్దార్ జితేంద్రకుమార్ పోలీసులతో అక్కడికి చేరుకుని సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని విద్యార్థులకు నచ్చజెప్పి వారిని కనిగిరి బస్సుకు ఎక్కించి అక్కడి నుంచి ఇళ్లకు పంపించారు.

జాతీయ రహదారిపై బైఠాయించిన విద్యార్థులు

సహకార ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఆందోళన

పొదిలి: సహకార సంఘంలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో పొదిలి పీడీసీసీ బ్యాంకు ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ డివిజన్ నాయకులు ఎన్.వెంకటేశ్వరరెడ్డి మాట్లాడారు.

అభ్యసన సామర్థ్యాల మెరుగుకు కృషి

బేస్తవారపేట, న్యూస్‌టుడే: విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల మెరుగుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవో-1 మధుసూదన్‌రెడ్డి అన్నారు. సోమవారం బేస్తవారపేటలోని ప్రాథమిక పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు.

నల్లమలలో పురాతన శాసనాలు లభ్యం

పెద్దారవీడు: గుండంచర్ల సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన వేనూతల కాటమరాజు గంగాభవానీ ఆలయం వద్ద 1180 నాటి పురాతన శాసనాలు లభ్యమయ్యాయి. ఆ కాలం నాటి లిపితో రాసి ఉన్న శాసనాల్లో శకం 1180 కాలయుక్త, శ్రావణం, శు.1, గురువారం 1258 ఈసీ కాలాన్ని తెలియజేస్తుందని ఆర్కియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్ మునిరత్నంరెడ్డి వివరించారు. ఈ శాసనాలను ఆసక్తితో ఆర్కియాలజికల్ డైరెక్టర్‌కు పంపగా వారు ధృవీకరించినట్లు తురిమెళ్ల శ్రీనివాస ప్రసాద్ తెలిపారు.

చరవాణులు కాదు.. పుస్తకాలు చదవండి

కంభం: మండలంలోని జంగంగుంట్ల జడ్పీ ఉన్నత పాఠశాలకు గ్లోబల్ ఎన్ఆర్ఐ ఫోరం వారి సహకారంతో రూ.2 లక్షల విలువైన ఆర్వో ప్లాంట్‌ను సోమవారం అందజేశారు. ఫోరం వ్యవస్థాపకులు గుళ్లపల్లి శ్రీనివాసులు ప్లాంట్‌ను ప్రారంభించారు. బడికి రూ.20 వేల విలువైన గ్రంథాలయ పుస్తకాలను అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులు బాగా చదువుకోవాలని, చరవాణులను వదిలి పుస్తకాలు చదవాలని సూచించారు. సంస్థ సభ్యులు సీఏ ప్రసాద్, సర్పంచి మానుమాచు సుజాత, తెల్లా అరుణ, శాటివనం వ్యవస్థాపకులు వెంకటేశ్వరరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు గని వెంకటేశ్వర్లు, తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

కోలభీమునిపాడులో ప్రచారంలో పాల్గొన్న నిర్వాహకులు, ప్రచార రథం

వేమన పద్యాల్లో ఆధ్యాత్మిక జ్ఞానం

మార్కాపురం గ్రామీణం: త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచార కమిటీ నిర్వాహకులు సోమవారం మండలంలోని కోలభీమునిపాడు, కె.కొత్తపల్లి, ఎల్బీఎస్ నగర్ పరిసర ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా 'త్రైత సిద్ధాంతం-ప్రబోధ సేవాసమితి హిందూ జ్ఞానవేదిక, దొనకొండ కమిటీ అధ్యక్షులు టి.ఏడుకొండలు మాట్లాడుతూ హిందూ ధర్మంలోని జ్ఞానార్థాలు యోగి వేమన పద్యాల్లో విపులంగా తెలిపారని, ప్రతి ఒక్కరూ యోగ మార్గంలో ప్రయాణించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు చెన్నకేశవులు, బాలరంగయ్య, సుబ్బులు, వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు దుప్పట్ల పంపిణీ

యర్రగొండపాలెం పట్టణం, న్యూస్‌టుడే: వై.పాలెంలో ముందస్తు క్రిస్మస్ వేడుకల సందర్భంగా సోమవారం స్థానిక నవజీవన పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు సంఘం అధ్యక్షుడు మాకం జీవయ్య చేతుల మీదుగా దుప్పట్లు పంపిణీ చేశారు.

సమస్యల వలయం.. విద్యా వనరుల కేంద్రం

న్యూస్‌టుడే, కొనకనమిట్ల:

కొనకనమిట్ల మండలం విద్యా వనరుల కేంద్రంలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. దీంతో వివిధ పనుల నిమిత్తం వచ్చే వారు అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరినా పట్టించుకునే వారు లేకపోయారు.

కనీసం తాగునీటి సౌకర్యం లేదు

ఉపాధ్యాయులకు శిక్షణ సమావేశాలు మండల స్థాయిలో ఇక్కడే నిర్వహిస్తారు. విద్యా శాఖాధికారితో పాటు కంప్యూటర్ సిబ్బంది ఈ కార్యాలయంలో విధులు నిర్వహిస్తుంటారు. మండలంలోని అన్ని పాఠశాలలకు ఈ కేంద్రంలో నుంచే పాఠ్య పుస్తకాలు, మరుగుదొడ్ల సామగ్రితో పాటు వాటి శుభ్రం చేసే వస్తువులు ఇక్కడ నుంచే పంపిణీ చేస్తుంటారు. ఇలాంటి కేంద్రంలో కనీసం తాగు నీటి సౌకర్యం కూడా లేదు. మరుగు దొడ్ల తలుపులు దెబ్బతిన్నాయి. ❖ మహిళా ఉపాధ్యాయులు సమావేశానికి హాజరైనప్పుడు కాలకృత్యాలు తీర్చుకోవాలంటే మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారు. ❖ నాడు.. నేడు కింద పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నప్పటికీ ఎంఆర్‌సీ కేంద్రంలో మరుగుదొడ్లు మరమ్మతులు చేయించలేక పోవడమేమిటని పలువురు విమర్శిస్తున్నారు. ఎంఆర్‌సీ భవనం బయట మాత్రం రంగులు వేసి ఆర్భాటం చేశారన్నారు. మిగతా సౌకర్యాలు వెంటనే కల్పించాలని కోరుతున్నారు.

శిథిల దశలో మరుగుదొడ్లు

చెట్టు నరికినందుకు రూ.39 వేలు జరిమానా

యర్రగొండపాలెం పట్టణం, న్యూస్‌టుడే: వై.పాలెంలో ఇటీవల కొత్త విద్యుత్తు స్తంభాల ఏర్పాటులో భాగంగా విద్యుత్తు పనులు నిర్వహించే గుత్తేదారు ప్రభుత్వ వైద్యశాల్లోని దిర్శినం అనే పేరు గల పెద్ద చెట్టును నరికి వేశారు. ఈ విషయం తెలుసుకున్న అటవీశాఖ రేంజ్ అధికారి ప్రసన్న జ్యోతి చెట్టును పరిశీలించారు. అటవీ అధికారుల అనుమతి లేకుండా ఏ చెట్టూ నరికి వేయకూడదని ఇందుకు చెట్టు నరికించిన రసూల్ మహమ్మద్ అనే గుత్తేదారునికి రూ. 39,910లు జరిమానా విధించామనీ, అతడు చెల్లించాడనీ తెలిపారు.

CHANGE OF NAME

I, **JAYALAKSHMI DEVARAPALLE** W/o Devarapalle Ramulu, Resident of D.No.7-662-O-26-F, Sivaji nagar, 2nd line, Markapur Town and Mandal, Prakasam District - 523316, A.P. In my records my name was mentioned **JAYALAKSHMI DEVARAPALLE**, I have Changed my name from **JAYALAKSHMI DEVARAPALLE** to **DEVARAPALLE JAYALAKSHMI** (Adhar No.702340534589 & other personal records) Affidavit No.BB989852 Date: 8-12-2025

కనిగిరి

•కనిగిరి •దర్శి •కొండపి

మేమున్నాం.. మీకు తోడుగా

కనిగిరి : 8008574114, (10 AM TO 1 PM)
దర్శి: 9848 671678, కొండపి: 96424 56296

?:మర్రిపూడి మండలంలోని గార్లపేట పాత పంచాయతీ కార్యాలయం సమీపంలో మురుగునీరు నిలిచిపోయి దోమలకు నిలయంగా మారుతుంది. -బ్రహ్మయ్య, స్థానికుడు
✓: వెంటనే పారిశుద్ధ్య పనులు చేయిస్తాం.
-నరసింహారావు, పంచాయతీ కార్యదర్శి

?: దొనకొండలోని గౌతమి డిగ్రీ కళాశాల సమీపంలో ఉన్న గృహాలకు ఎన్ఏపీ కొళాయి నీరు సరఫరా కావడం లేదు. అధికారులను అడుగుతున్నా పట్టించుకోక పోవటంతో కిలోమీటరు దూరంలో ఉన్న శుద్ధిజల ప్లాంటు వద్దకు వెళ్లి నగదు ఇచ్చి తెచ్చుకుంటున్నాం. - గురుమూర్తి, దొనకొండ
✓: పైపులు కొన్ని మరమ్మతులకు గురయ్యాయి. పరిశీలించి వెంటనే సరఫరా జరిగేలా చూస్తాం.
- కిరణ్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

?: హెచ్ఎంపాడు - హాజీపురం రహదారి వర్షంవస్తే గుంతల్లో నీరుచేరి వాహనాలు నడవడంలేదు. మండల కేంద్రానికి హాజీపురం నుంచి రావాలంటే చుట్టూతిరిగా అడ్డరోడ్డు మీదుగా రావాల్సి వస్తుంది. -డి.వెంకటసుబ్బయ్య, హాజీపురం
✓: ఆర్థిక సంఘం నిధులు వెచ్చించి గుంతలు పూడ్చేలా ఏర్పాట్లు చేస్తాం. -బ్రహ్మయ్య, పంచాయతీరాజ్ ఏఈ

?:కురిచేడు మండలం బోధనంపాడులో దోమల బెడద ఎక్కువగా ఉంది. రాత్రి పూట నిద్రలేకుండా చేస్తున్నాయి. వాటి నివారణకు చర్యలు తీసుకోవాలి. - సత్యం, స్థానికుడు
✓:రెండు రోజుల్లో దోమల నివారణకు చర్యలు చేపడతాం.
- వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి
- న్యూస్‌టుడే, మర్రిపూడి, దొనకొండ, హనుమంతునిపాడు, కురిచేడు

పాఠశాలకు దాత సాయం

సి.ఎస్.పురం: మండలంలోని డీజీపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో బిర్రె వెంకటసుబ్బయ్య, రత్నమ్మ దంపతులు స్టాఫ్ గదిని నిర్మించారు. దీనిని ప్రధానోపాధ్యాయుడు పి.ఎం.రసూల్ సోమవారం ప్రారంభించారు. దాత సమకూర్చిన రూ.50 వేల నగదుతో గణిత ఉపాధ్యాయుడు జి.వెంకటేశ్వర్లు, సీఎంఆర్‌టీ జీవీ రమణయ్య వరండాలో ప్రత్యేక గదిని నిర్మించారు. ఈ సందర్భంగా దాత దంపతులను ఉపాధ్యాయులు అభినందించారు.

ఉపాధ్యాయుడికి అభినందనలు

పీసీపల్లి: జాతీయ స్థాయి యోగా పోటీల్లో రాణించి ప్రకాశం జిల్లా పేరు నిలబెట్టాలని ఉపాధ్యాయుడు స్వర్ణ వెంకట రమణయ్యనుద్దేశించి జిల్లా కలెక్టర్ రాజాబాబు అన్నారు. ఇటీవల విజయవాడలో రాష్ట్రస్థాయిలో జరిగిన అఖిలభారత సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల యోగా పోటీల్లో పీసీపల్లి మండలం వెంగళాయపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడైన ఆయన అత్యుత్తమ ప్రతిభచూపి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా సోమవారం ఒంగోలులో కలెక్టరు, జేసీ గోపాలకృష్ణను కలిసిన సందర్భంగా వారు అభినందించారు.

మిట్టపాలెం ఆలయ ఆదాయం రూ.1.23 లక్షలు

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: మిట్టపాలెం నారాయణ స్వామి దేవస్థానం ఆదివారం ఆదాయం రూ.1,23,368 వచ్చిందని కార్యనిర్వహణాధికారి ఎస్.నరసింహబాబు తెలిపారు. స్వామివారి దర్శన టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.58,420, లడ్డూ ప్రసాదం అమ్మకం ద్వారా రూ.30,220, స్వామివారి పంచామృత అభిషేకాలకు రూ.16,548, శాశ్వత అన్నదాన పథకానికి రూ.18,180 విరాళాలు వచ్చినట్లు పేర్కొన్నారు.

పొలాలకు వెళ్లాలంటే సాహసం చేయాల్సిందే..!

❑ డొంకరోడ్లు సరిగా లేక అన్నదాతల అవస్థలు

న్యూస్‌టుడే, కనిగిరి, పామూరు

పొలాలకు వెళ్లే డొంకరోడ్లు అధ్వానంగా ఉండడంతో రైతులు అవస్థలు పడుతు న్నారు. కనిగిరి నియోజకవర్గంలోని కనిగిరి, పామూరు, సీఎస్‌పురం, పీసీపల్లి, వెలిగండ్ల, హనుమంతునిపాడు మండలాల్లో వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లే లింకు దారులు దారుణంగా మారాయి.

వర్షాలకు పూర్తిగా ఛిద్రమై..

మొంథా తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు పొలాల్లోకి వెళ్లే దారులన్నీ దెబ్బతిన్నాయి. మరికొన్ని గ్రామాల్లో చిల్లచెట్లతో నిండిపోయి రాకపోకలు సాగించేందుకు వీలు లేకుండా ఉంది. ప్రస్తుతం పంట చేతికొచ్చే సరికి తుపాన్లు రావడం, అల్పపీడనాలు ఏర్పడం, వాతావరణంలో మార్పులు వస్తున్నాయి. ఇలాంటి తరుణంలో పొలాల్లో నుంచి పంటను ఇళ్లకు, భద్రమైన ప్రాంతాలకు తరలించేందుకు వీల్లేకపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రధానంగా ఈ గ్రామాల్లో..

కనిగిరి మండలం తుమ్మగుంట, కాశీపురం, చల్లగిరగల, దరిశవంచ, నందనమారెళ్ల, బడుగులేరు, చాకిరాల, తురకపల్లి, మాచవరం, పోలవరం, చినఇర్లపాడు, గానుగపెంట, యడవల్లి తదితర గ్రామాల నుంచి పొలాలకు వెళ్లే దారులన్నీ చిల్లచెట్లతో మూసుకుపోయాయి. మరోవైపు రాళ్లూరప్పలతో దారుణంగా మారాయి.

● పామూరు మండలంలోని ఇనిమెర్ల, లక్ష్మీనర్సాపురం, మార్కొండాపురం, నాశికా త్రయంబకం, కోడిగుంపల, రావిగుంటపల్లి, అయ్యవారిపల్లి, అయ్యన్న కోట, మోపాడు, బొట్లగూడూరు, కంభాలదిన్నె, రేణిమడుగు, బోడవాడ, రజాసాహెబ్‌పేట, అక్కంపేటతదితర గ్రామాలకు నుంచి పొలాలకు వెళ్లే దారులు అధ్వానంగా ఉన్నాయి.

● వెలిగండ్ల మండలం కంకణంపాడు, అగ్రహారం, మొగళ్లూరు, గుడిపాటిపల్లి, పందువ, గన్నవరం, మరపగుంట్ల, ఇమ్మడిచెరువు, వెదుళ్లచెరువు తదితర గ్రామాల నుంచి పొలాలకు వెళ్లే మార్గాలు దుస్థితికి చేరాయి.

● పీసీపల్లి మండలం లక్ష్మక్కపల్లి, అడవిలోపల్లి, పెద ఇర్లపాడు, గుంటుపల్లి, కోదండరామాపురం, మురుగుమ్మి, నేరేడుపల్లి, తలకొండపాడు, దేశిరెడ్డిపల్లి తదితర ప్రాంతాలతో పాటు, హనుమంతునిపాడు, సీఎస్‌పురం మండలాల్లోనూ డొంక రోడ్లు రూపురేఖలు కోల్పోయాయి.

యడవల్లి నుంచి పొలాలకు వెళ్లే రోడ్డు పరిస్థితి..

ప్రతిపాదనలు పంపించాం..

పొలాలకు వెళ్లే రోడ్లు సరిగా లేకపోవడంతో పండించిన పంట ఉత్పత్తులను ఇంటికి తెచ్చుకోవడానికి రైతులు ఇబ్బందులు పడుతున్న మాట వాస్తవమే. ఆయా శాఖల అధికారులకు లింకు రోడ్లు మంజూరుకు ప్రతిపాదనలు పంపాం. నిధులు రాగానే నిర్మాణ పనులు చేపడతాం. రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం.
-షేక్ జైనులబ్దీన్, ఏడీఏ, కనిగిరి

బాలికల విద్యాలయం.. సమస్యల వలయం

న్యూస్‌టుడే, జరుగుమల్లి

వారంతా పేద కుటుంబాలకు చెందిన బాలికలు. తల్లిదండ్రులను విడిచిపెట్టి సుదూర ప్రాంతాల నుంచి వచ్చి బిట్రగుంటలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో చదువుకుంటున్నారు. ఆ పాఠశాల ఆవరణలో మురుగునీరు కదలక దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నారు. విద్యార్థినులు వినియోగిస్తున్న నీరు పాఠశాల బయటకు పోయేందుకు వీలు లేకపోవడంతో అక్కడ పారిశుద్ధ్య సమస్యలు నెలకొన్నాయి. దీనికితోడు దోమలు సైతం వ్యాప్తి చెందుతున్నాయి. దీనికి దగ్గరలోనే తరగతి గదులు ఉండడంతో ఉపాధ్యాయులు చెప్పే పాఠాల మీద శ్రద్ధ పెట్టలేకపోతున్నామని విద్యార్థినులు వాపోతున్నారు. పాఠశాల ఆవరణలో పెరిగిన పిచ్చి మొక్కల వల్ల పాములు, విష పురుగులు తిరిగే ప్రమాదం ఉందని భయాందోళన చెందుతున్నారు. వర్షం పడినప్పుడల్లా పాఠశాల ప్రాంగణం బురదమయమవుతుంది. దీంతో తరగతి గదులు, హాస్టల్ మధ్య రాకపోకలు సాగించడం మరింత కష్టంగా మారిందని బాలికలు చెబుతున్నారు. పాఠశాల శుభ్రత, మురుగు నీటి పారుదలపై అధికారులు చొరవ తీసుకోవాలని విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు. దీనిపై ప్రిన్సిపల్ శ్రవంతి మాట్లాడుతూ.. విద్యార్థినుల భద్రత దృష్ట్యా పిచ్చి మొక్కలు తొలగించడం, మురుగు నీటి నిర్వహణకు శాశ్వత చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. ఈ మేరకు అధికారులకు తెలియజేశామని ఆమె తెలిపారు.

కేజీబీవీలో తరగతి గదులకు ఎదురుగా కాలువలో నిలిచిన మురుగు నీరు

వెలిగండ్లలో పారిశుద్ధ్య పనులు

వెలిగండ్ల, న్యూస్‌టుడే: మండల కేంద్రమైన వెలిగండ్లలో నెలకొన్న సమస్యలపై సోమవారం 'ఈనాడు'లో 'మండల కేంద్రం. . సమస్యలకు నిలయం' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. అందుకు స్పందించిన ఎంపీడీవో గంగాధర్, సర్పంచి సురేష్ గ్రామంలో మురుగు ఉన్న వీధుల్లో శుభ్రం చేయించి బ్లీచింగ్ చల్లించారు. మంచినీటి ట్యాంకు చుట్టూ కూడా బ్లీచింగ్ చల్లించి శుభ్రం చేయించారు.

ఈనాడు కథనానికి స్పందన

హరిదాసునగర్‌లో అధికారుల పరిశీలన

తాళ్లూరు, న్యూస్‌టుడే: మండలంలోని తూర్పుగంగవరం పంచాయతీ పరిధి హరిదాసునగర్‌లో మురుగునీటి సమస్యపై అధికారులు సోమవారం విచారణ చేపట్టారు. ఈ సమస్యపై 'ఈనాడు'లో సోమవారం 'మురుగు తొలగదు.. దోమల వదలవు' అనే శీర్షికన ప్రచురితమైన చిత్ర వార్తకు డీపీవో ఎం.వెంకటేశ్వరరావు స్పందించారు. అక్కడి సమస్యను పరిష్కరించాలని ఎంపీడీవో పి.అజిత, డిప్యూటీ ఎంపీడీఓ శ్రీనివాసరావులను ఆదేశించారు. దీంతో డిప్యూటీ ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శి మల్లీశ్వరి తదితరులు కాలనీకి వచ్చి పరిశీలించారు. వీలైనంత త్వరలోనే సమస్యను పరిష్కరించాలని నిర్ణయించారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

పామూరు, న్యూస్‌టుడే: మండలంలోని కోడిగుంపల, బలిజపాలెం, తుమాటివారిపాలెం, మీరాపురం, బొట్లగూడూరు గ్రామాల్లో ఆర్‌డీఎస్‌ఎస్ పనుల కారణంగా మంగళవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్తు సరఫరా ఉండదని ఏఈ జిలానిబాషా తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

మాట్లాడుతున్న డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

కొండపి (గ్రామీణం), న్యూస్‌టుడే: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కనిగిరి డీఎస్పీ సాయి ఈశ్వర్‌యశ్వంత్ హెచ్చరించారు. సోమవారం కొండపి సర్కిల్ కార్యాలయం పరిధిలోని పొన్నలూరు, మర్రిపూడి, కొండపి మండలాల రౌడీషీటర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడ వద్దన్నారు. సమాజంతో సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. తీరుమార్చుకున్న వారిపై రౌడీషీట్ తొలగించనున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఎస్సైలు ప్రేమ్‌కుమార్, అనూక్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

దర్శిలో సెమీ క్రిస్మస్ సందడి

దర్శి, న్యూస్‌టుడే: పట్టణంలో క్రిస్మస్ వేడుకలు ప్రారంభమయ్యాయి. స్థానిక క్రిస్టియన్‌పాలెంలోని పలు చర్చిలతో పాటు, పొదిలి రోడ్డులోని జేవియర్ చర్చి వద్ద విద్యుత్తు దీపాలతో స్టార్, శిలువ ఆకారంలో వెలుగులు విరజిమ్మేలా ఏర్పాటు చేశారు. క్రీస్తు జననం, ఇతర విషయాలు తెలిపేలా జీవనదో చర్చిలో ప్రదర్శన ఏర్పాటు చేశారు. చర్చిలను విద్యుత్తు దీపాలతో అలంకరించారు. పలు చోట్ల సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్నారు. క్రీస్తు గురించి గీతాలు ఆలపించి, సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నారు. పట్టణంలోని ఎల్‌ఈఎఫ్ చర్చిలో సెమీ క్రిస్మస్ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. పాస్టర్ డానియల్‌పాల్ ఆధ్వర్యంలో ఆరాధన చేశారు. పాస్టర్ అబ్రహం క్రీస్తు సందేశం ఇచ్చారు. వేడుకల్లో భాగంగా కేక్ కోయడంతో పాటు, కొవ్వొత్తులతో మహిళలు ర్యాలీ చేపట్టారు. పిల్లలు చేసిన నృత్యాలు అలరించాయి.

కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ చేస్తున్న మహిళలు

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

పామూరు, న్యూస్‌టుడే: మండలంలోని లక్ష్మీనరసాపురం జడ్పీ హైస్కూల్‌లో 10వ తరగతి విద్యార్థులకు స్వయం కృషి సేవాసంస్థ అధ్యక్షుడు నాయబ్ రసూల్ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదివి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాకారులకు దుస్తుల అందజేత

కొండపి (గ్రామీణం): మండలంలోని పెదకండ్లగుంట జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం కల్లా మోహన్ రూ.15 వేలు విలువ కలిగిన క్రీడా దుస్తుల అందజేసినట్లు ప్రధానోపాధ్యాయుడు భాస్కర్ తెలిపారు. అంతర విద్యార్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో దాత మాట్లాడుతూ.. చదువుతో పాటు ఆటల్లో రాణించి పాఠశాలకు గుర్తింపు తీసుకురావాలని సూచించారు. క్రీడలు శారీరక ధృఢత్వానికి దోహదపడతాయని, భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగాలకు ఉపయోగకరంగా ఉంటుందని వివరించారు. ఎస్ఎంసీ ఛైర్మన్ లక్ష్మీనారాయణ, గ్రామస్థులు పాల్గొన్నారు.

బ్యాంకు వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

సహకార ఉద్యోగుల ధర్నా

ముండ్లమూరు: సహకార సంఘ ఉద్యోగుల దీర్ఘ కాలిక సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ ముండ్లమూరులోని ఆ బ్యాంకు వద్ద సిబ్బంది ధర్నా చేపట్టారు. సంఘం పిలుపు మేరకు సోమవారం డిమాండ్ పత్రాలతో ఆందోళన చేపట్టి నినాదాలు చేశారు. ఈ నెల ఆరో తేదీ నుంచి జనవరి 5 వరకు వివిధ రూపాల్లో నిరసనలు, ధర్నాలు చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించే వరకు పోరాడతామని వారు తెలిపారు. వెంకటేశ్వర్లు, ఈశ్వర్, శంకర్, బ్రహ్మారెడ్డి, రామాంజనేయులు, నరసయ్య పాల్గొన్నారు.

ప్రధాన దారి.. అధ్వానంగా మారి

తూర్పుగంగవరం-చీమకుర్తి ప్రధాన రహదారిలో తూర్పుగంగవరం శివారున పెట్రోల్ బంకు సమీపాన రహదారి అధ్వానంగా మారింది. తారు లేచి గోతులమయమైంది. తాళ్లూరు, ముండ్లమూరు, దర్శి, చీమకుర్తి, సంతనూతలపాడు, ఒంగోలు తదితర మండలాల ప్రజలు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటారు. సంబంధిత అధికారులు సత్వరం స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఈ విషయమై ర.భ.శాఖ డీఈ గోపీకృష్ణను సంప్రదించగా త్వరలోనే మరమ్మతులు చేయిస్తామని తెలిపారు. -న్యూస్‌టుడే, తాళ్లూరు

నిర్లక్ష్యం నిప్పురవ్వలు రాల్చుతుంది!

కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని కాశీపురానికి వెళ్లే మార్గంలో విద్యుత్తు స్తంభానికి తీగలు అల్లుకున్నాయి. దీని వల్ల తరచూ నిప్పురవ్వలు పడుతున్నాయని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు నిత్యం విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని వాపోతున్నారు. వెంటనే విద్యుత్తు అధికార్లు స్పందించి తీగలను తొలగించాలని కోరుతున్నారు. ఈ విషయమై ఏఈఈ పవన్‌కుమార్‌ను వివరణ కోరగా.. విద్యుత్తు స్తంభానికి అల్లుకున్న తీగలను తొలగించి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూస్తామని తెలిపారు. -న్యూస్‌టుడే, కనిగిరి

పల్లెల్లో భౌభౌల బెడద!

ముండ్లమూరు మండలంలో కుక్కల బెడద అధికంగా ఉంది. వేంపాడు, తమ్మలూరు, మారెళ్ల గ్రామాల్లో గుంపులుగా సంచరిస్తున్నాయి. మనుషులు, గొర్రెలు, మేకలు, పాడి పశువులపై దాడులు చేసి గాయపరుస్తున్నాయి. దీంతో చిన్నారులు బయటకు వెళ్లాలంటే భయపడుతున్నారు. మారెళ్ల బీసీ కాలనీలో ఇటీవల 21 మంది కుక్కకాటుకు గురయ్యారు. వేంపాడులో రోడ్డుపై శునకాలు తిరుగుతున్న చిత్రమిది. ఈ విషయమై డిప్యూటీ ఎంపీడీవో ఆర్.జనార్దన్‌ను వివరణ కోరగా.. పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడి త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. -న్యూస్‌టుడే, ముండ్లమూరు

చెత్త.. తొలగించక చింత

మండల కేంద్రమైన పొన్నలూరు ప్రధాన రోడ్డు పక్కనే వ్యర్థాలు పేరుకుపోయాయి. పంచాయతీ అధికారులు పారిశుద్ధ్య నిర్వహణపై దృష్టిసారించకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. పొన్నలూరు-కనిగిరి మార్గంలో రాకపోకలు సాగించే ప్రజలు దుర్వాసన కారణంగా అసౌకర్యానికి గురవుతున్నారు. రోడ్డు వెంబడి చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి నారాయణను వివరణ కోరగా.. చెత్తను తొలగిస్తామని తెలిపారు. -న్యూస్‌టుడే, పొన్నలూరు

మంచినీరు నేలపాలు

తాళ్లూరు మండలంలోని తూర్పుగంగవరం పరిధి సోమవరప్పాడు ప్రధాన వీధిలో కుళాయి నుంచి మంచినీరు వృథాగా పోతోంది. పైపులకు కుళాయి లేక పోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. డీప్ బోరు పని చేస్తున్నంత సేపూ నీరు నేలపాలవుతుంది. ఈ విషయమై ఎంపీడీవో పి.అజితను సంప్రదించగా త్వరితగతిన ట్యాపును ఏర్పాటు చేయించి సమస్యను పరిష్కరిస్తామన్నారు. -న్యూస్‌టుడే, తాళ్లూరు

విద్యుత్తు అధికారుల దాడులు

వెలిగండ్ల, న్యూస్‌టుడే: వెలిగండ్ల, మొగళ్లూరు, కంకణంపాడు, మరపగుంట్ల, వెదుళ్లచెరువు, ఇమ్మడిచెరువు తదితర గ్రామాల్లో సోమవారం విద్యుత్తు శాఖ అధికార్లు 28 బృందాలుగా ఏర్పడి విస్తృత తనిఖీలు చేపట్టారు. మీటరు ఉండి విద్యుత్తు చౌర్యానికి పాల్పడుతున్న ఇద్దరికి రూ.20 వేలు, అనుమతి లోడుకంటే అధికంగా కరెంటు వాడుతున్న 17 మందిపై రూ.1.25 లక్షలు, మీటర్లు లేకుండా నేరుగా విద్యుత్తు వినియోగిస్తున్న నలుగురికి రూ.12,500లు, ఇతర సర్వీసుల ద్వారా రూ.80 వేలు, మొత్తం రూ. 2.37 లక్షలు అపరాధ రుసుం విధించినట్లు కనిగిరి విద్యుత్తు ఈఈ ఉమాకాంత్ తెలిపారు. ఈఈ టి.హైమావతి, పామూరు డీఈఈ వి.కృష్ణారెడ్డి, విజిలెన్స్ డీఈఈ కె.వెంకటేశ్వర్లు, ఏఈలు కె.కోటయ్య, బి.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ కల్తీ జరిగిందంటూ ఆందోళన

కనిగిరి: పట్టణంలోని రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెట్రోల్ బంకులో కల్తీ జరిగిందంటూ కొందరు వాహన దారులు సోమవారం రాత్రి ఆందోళన చేశారు. పెట్రోల్ పోయించుకున్న కొద్దిసేపటికే ద్విచక్రవాహనాలు ఆగిపోయాయంటూ ఇద్దరు వాహన చోదకులు ఆందోళనకు దిగారు. ఈ విషయమై డీఎం సయానా బేగంను వివరణ కోరగా.. అలాంటిదేమి లేదని పెట్రోల్ కల్తీ జరగడానికి ఆస్కారం లేదన్నారు. ఈ విషయాన్ని జిల్లా అధికార్ల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

ట్రాక్టర్ ఢీకొని ఒకరికి గాయాలు

పీసీపల్లి, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనాన్ని ట్రాక్టర్ ఢీకొన్న ప్రమాదంలో ఒకరికి గాయాలైన సంఘటన మండలంలోని పోతవరంలోని ప్రాథమిక పాఠశాల వద్ద సోమవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నేరేడుపల్లి నుంచి ద్విచక్రవాహనంపై అదే గ్రామానికి చెందిన దేవేంద్ర అనే వ్యక్తి వెంగళాపురం వైపు వెళుతుండుగా ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టి పక్కనే ఉన్న పాఠశాల ప్రహరీకి తగిలి నిలిచిపోయింది. ఈ ప్రమాదంలో దేవేంద్రకు గాయాలయ్యాయి. పాఠశాల గోడ కూలి పోయింది. వెంటనే స్థానికులు గమనించి క్షతగాత్రుడిని చికిత్స కోసం కనిగిరి తరలించారు.

ప్రమాద స్థలంలో ద్విచక్ర వాహనం, ట్రాక్టర్ ఢీకొనడంతో కూలిన పాఠశాల గోడ

ఆచితూచి వెళ్లండి!

అసలే ఇరుకు రహదారి. ఆపై గుంతలు.. దీనికి తోడు చెరువులో నీరుచేరి మూడు తూముల నుంచి నిత్యం వృథాగా రోడ్డు పైనుంచే ప్రవహిస్తుండటంతో వాహన చోదకులకు అవస్థలు తప్పడం లేదు. టంగుటూరు-పొదిలి ప్రధాన రహదారిలోని మర్రిపూడి చెరువు కట్ట కింద రహదారిపై తారు లేచిపోయి గుంతలు ఏర్పడ్డాయి. మొంథా తుపాన్ కారణంగా చెరువుకు పూర్తిస్థాయిలో నీరు చేరింది. ఇది పంట పొలాల్లోకి వెళ్లేందుకు ఏర్పాటుచేసిన తూములు దశాబ్దాల కాలంగా మరమ్మతులు చేయించిన దాఖలాలు లేవు. దీంతో చెరువులోని నీరు వృథా అవుతుంది. దీనికి అడ్డుకట్ట వేసేందుకు తూములను ఇసుకబస్తాలు, మట్టితో పూడ్చివేశారు. అయినప్పటికీ నీరు కొంతమేర పోతూనే ఉంది. రోడ్డుపై ఇప్పటికీ ప్రవహిస్తుండటంతో తారులేచి గుంతలు ఏర్పడి.. అందులో నీళ్లు నిలిచిపోతున్నాయి. దీంతో ప్రధాన రహదారిలో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. రాత్రి పూట అయితే గుంతలు సరిగా కనిపించక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ విషయమై ర.భ శాఖ ఏఈ దీప్తిని వివరణ కోరగా.. మరమ్మతులు చేసేందుకు ప్రతిపాదనలు పంపించామని.. త్వరలోనే పనులు చేపడతామని తెలిపారు. - న్యూస్‌టుడే, మర్రిపూడి

గుంతలమయమైన రహదారిపై నిలిచిన నీరు

దొనకొండ, కురిచేడులను మార్కాపురం జిల్లాలో కలపాలి

తాళ్లూరు: మార్కాపురానికి బాగా దగ్గరగా ఉన్న దొనకొండ, కురిచేడు మండలాలను కొత్తగా ఏర్పాటు కానున్న ఆ జిల్లాలోనే కలపాలని దర్శి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త కైపు వెంకటకృష్ణారెడ్డి సోమవారం జిల్లా కలెక్టరు పి.రాజాబాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఒంగోలులోని జిల్లా కలెక్టరు కార్యాలయానికి వెళ్లి ప్రకాశం జిల్లాలో ఆ రెండు మండలాలను కొనసాగిస్తే ఎదురయ్యే ఇబ్బందులు గురించి తెలియజేశారు. మార్కాపురమే వారికి సౌకర్యవంతంగా ఉంటుందని, ఇందుకోసం ఆ జిల్లాలో కలిపేలా తగుచర్యలు చేపట్టాలని విన్నవించారు.

టంగుటూరు మహిళా మార్టులో అవినీతిపై విచారణకు వినతి

టంగుటూరు, న్యూస్‌టుడే: టంగుటూరులో వెలుగు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహిళా మార్టులో జరిగిన అవినీతిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపించాలని నూతన కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీ కోసంలో వినతి పత్రం అందించారు. అందులో పేర్కొన్న వివరాల ప్రకారం.. 2022 డిసెంబర్‌లో టంగుటూరులో చేయూత మహిళా మార్టును షేర్ క్యాపిటల్ కింద డ్వాక్రా సంఘాల సభ్యులు ఒక్కొక్కరి నుంచి రూ.200 చొప్పున రూ.29,79,800 నగదు వసూలు చేశారని తెలిపారు. మార్టులో సరకులు కొనుగోలు విషయంలో నాణ్యత లేనివి కొనుగోలు చేసి కమీషన్లు పొందడం, క్రయవిక్రయాల్లో నగదు గోల్‌మాల్ చేయడంపై గతంలో జిల్లా ఉన్నతాధికారులు విచారణ చేపట్టినా తూతూ మంత్రంగా ముగించారు. పూర్వపు కలెక్టర్ తమీమ్ అన్సారియా జడ్పీ అధికారులతో త్రిసభ్య కమిటీ వేసి విచారణ చేయించారు. అక్రమాలు వెలుగులోకి వచ్చినా సంబంధిత అధికారులపై ఎలాంటి చర్యలు లేవు. అనంతరం అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం మార్టుకి నూతన కార్యవర్గ సభ్యులను నియమించింది. దీంతో వారు మరోమారు విచారణ చేపట్టి సంబంధిత అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

భూ సమస్యలపైనే ఎక్కువ అర్జీలు

హనుమంతునిపాడు: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం జరిగిన మీకోసం కార్యక్రమంలో భూములు ఆన్‌లైన్ చేయాలని కోరుతూ రెండు అర్జీలు అందినట్లు తహసీల్దారు నాగుల్‌మీరా తెలిపారు. ◆ తాళ్లూరు: మండలానికి చెందిన అయిదుగురు రైతులు తహసీల్దారు బీవీ.రమణారావుకు భూ సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. వితంతు పింఛను మంజూరు చేయించాలని మరో మహిళ అర్జీ అందజేశారు.

ఎస్టీయూ పీసీపల్లి అధ్యక్షుడిగా సురేష్

పీసీపల్లి, న్యూస్‌టుడే: మండల ఎస్టీయూ అధ్యక్షుడిగా ఎంవీ సురేష్ నియమితులైనట్లు ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి. నరసింహారెడ్డి తెలిపారు. సోమవారం పీసీపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎన్నికలు జరిగాయి. మండల ప్రధాన కార్యదర్శిగా ఐ. వెంకటేశ్వర్లు, ఆర్థిక కార్యదర్శులుగా నరసింహారావు, నరసింహారెడ్డి, మోహనరావు,, వెంకటేశ్వరరెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నందనవనంలో వైద్య శిబిరం

హనుమంతునిపాడు, న్యూస్‌టుడే: మండలంలోని నందనవనంలో సోమవారం ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో హెచ్ఎంపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి సందీప్ ఆధ్వర్యంలో 60 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యసిబ్బంది సూచించారు. జ్వరాలు ఉన్నట్లు అనుమానం వస్తే వెంటనే స్థానిక పీహెచ్‌సీకి ఆరోగ్య కార్యకర్తలు సమాచారం ఇవ్వాలని కోరారు.

అండర్-19 బాలికల కబడ్డీ జట్టుకు ఎంపిక

సింగరాయకొండ గ్రామీణం: సింగరాయకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని కుర్రు త్రిగుణ అండర్-19 బాలికల కబడ్డీ రాష్ట్ర జట్టుకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ సౌజన్య సోమవారం తెలిపారు. ఆమె వెల్లడించిన వివరాల ప్రకారం.. ఇంటర్ రెండో ఏడాది చదువుతున్న ఆమె ఇటీవల పల్నాడు జిల్లా వినుకొండలో జరిగిన రాష్ట్ర స్థాయి బాలికల కబడ్డీ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిందన్నారు. త్వరలో హిమాచల్‌ప్రదేశ్‌లో జాతీయ స్థాయి పోటీలు నిర్వహిస్తారని, ఈ పోటీల్లో సత్తా చాటాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆమెను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జయమణి, డీటీ ప్రసాదు, డాక్టర్ వంశీధర్, పీడీ శంకరరావు, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

త్రిగుణను అభినందిస్తున్న కళాశాల సిబ్బంది, అధికారులు

ఆట ఏదైనా.. గెలిచేది వీరే!

న్యూస్‌టుడే, తాళ్లూరు

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలనే పట్టుదలతో ఆ విద్యార్థులు నిరంతరం సాధన చేస్తూ పోటీల్లో సత్తా చాటుతున్నారు. వారే తాళ్లూరు మండలం బొద్దికూరపాడు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు. వ్యాయామోపాధ్యాయుడు పి.రవిప్రసాదరెడ్డి వారికి మెలకువలు నేర్పిస్తున్నారు. దీంతో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో తలపడి ప్రశంసలందుకుంటున్నారు. ఈ పాఠశాలకు చెందిన సుమారు వంద మంది క్రీడాకారులు గత మూడేళ్లలో రగ్బీ, హ్యాండ్‌బాల్, ఇతర క్రీడల్లో రాష్ట్రస్థాయి పోటీల్లో తలపడ్డారు. మరో పది మంది జాతీయస్థాయి పోటీల్లోనూ పాల్గొన్నారు. పదోతరగతి విద్యార్థులు డి.కృపాకిరణ్, వై.తులసీహర్షిణిలు రెండు ఆటల్లోనూ దూసుకెళ్తున్నారు. ఇంకా వారు చేస్తున్న కృషిని ఒకసారి తెలుసుకుందాం.

హ్యాండ్‌బాల్ సాధన చేస్తున్న విద్యార్థినులు

రెండు క్రీడల్లోనూ ప్రతిభ..



డి.కృపాకిరణ్ ఇటీవల పిడుగురాళ్లలో జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ హ్యాండ్‌బాల్ పోటీల్లో ప్రతిభ చాటాడు. దీంతోపాటు జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించాడు. గత నెలలో నెల్లూరు జిల్లాలో జరిగిన అండర్-17 విభాగం రగ్బీ పోటీల్లో జిల్లా జట్టు తరఫున ఆడాడు. ఆ జట్టుకు ద్వితీయ స్థానం దక్కింది.

రగ్బీలో రాష్ట్ర జట్టు తరఫున..



వై.తులసీహర్షిణీ పిడుగురాళ్లలో జరిగిన రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో సత్తా చాటింది. జాతీయస్థాయి పోటీలకు వెళ్లనుంది. గతేడాది అహ్మదాబాద్‌లో జరిగిన జాతీయస్థాయి రగ్బీ పోటీల్లో రాష్ట్ర జట్టు తరఫున పాల్గొని ప్రతిభ చాటింది. మరింత రాణించేలా నిత్యం సాధన చేస్తుంది.

(c) eenadu

ఒంగోలు

• ఒంగోలు • సంతనూతలపాడు

విజేతలతో ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ ఆలీబాబా

బహుమతులు అందజేస్తున్న శ్రీహర్షిణి కళాశాల ప్రతినిధులు

ఏఐతో సరికొత్త ప్రపంచం ఆవిష్కరణ

ఒంగోలు విద్య, న్యూస్‌టుడే: 'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా నగరంలోని ప్రభుత్వ, శ్రీహర్షిణి జూనియర్ కళాశాలల్లో సోమవారం నిర్వహించిన ఉపన్యాస పోటీలు సందడిగా సాగాయి. ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని 'ఏఐతో జీవితాల్లో వచ్చే మార్పులు' అన్న అంశంపై మాట్లాడారు. ఏఐతో మేలిమలుపులు, సరికొత్త ప్రపంచం ఆవిష్కృతం అవకాశం ఉందని... మానవ మేధకు ఇది ప్రత్యామ్నాయం కాదన్న అభిప్రాయాన్ని ఎక్కువ మంది వెల్లడించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జి.జాన్సన్, ఎ.శీలవాత్సల్య, వై.పల్లవి... ప్రతిభ చాటి తొలి మూడు స్థానాల్లో నిలిచారు. ప్రిన్సిపల్ ఆలీబాబా చేతులమీదుగా వీరికి బహుమతులు అందజేశారు. • శ్రీ హర్షిణి కళాశాలలో ఎస్కే కరీముల్లా, జోసెఫ్, అమూల... వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. వీరికి కళాశాల డీన్ డి.ఆంజనేయులు, అధ్యాపకులు బహుమతులు అందజేశారు.

బీపీఎస్‌ను సద్వినియోగం చేసుకోండి

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: అనుమతులు, ప్రణాళిక లేకుండా నిర్మించిన భవనాలు, బహుళ అంతస్తులు, ఇతర నిర్మాణాల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం అవకాశం కల్పించినందున సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ విజ్ఞప్తి చేశారు. క్యాంపు కార్యాలయంలో సోమవారం రాత్రి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే ఏడాది మార్చి 11 వరకే ఈ వెసులుబాటు ఉంటుందని... తరువాత పొడిగించే అవకాశం లేదన్నారు. ఒంగోలు నగరంలో లైసెన్స్‌డ్ ఇంజినీర్ల ద్వారా రూ.10 వేలు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. సందేహాలుంటే నగర పాలక సంస్థ ప్రణాళిక విభాగంలో సంప్రదించాలని సూచించారు. 2019-24 మధ్య మెప్మాలో చోటు చేసుకున్న అక్రమాలపై... జేసీ ఆధ్వర్యంలోని త్రిసభ్య కమిటీతో విచారణ జరుగుతోందన్నారు. ఆ నివేదిక ఆధారంగా బాధ్యులపై చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. కమిషనర్ కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నందనవనంలా రంగారాయుడు చెరువు!

నగరం నడిబొడ్డున ఉన్న రంగారాయుడు చెరువు, గాంధీ పార్కు, ప్రాంతాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు నగరపాలక సంస్థ చర్యలు చేపట్టింది. ఇక్కడి రహదారిని విస్తరించడంతో పాటు కూడళ్లలో ఫౌంటెయిన్‌లు ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం ఈ పనులు చురుగ్గా సాగుతున్నాయి. - న్యూస్‌టుడే, ఒంగోలు నగరం

• యుద్ధప్రాతిపదికన సుందరీకరణ పనులు

పార్కు గోడ తొలగించి నూతనంగా నిర్మిస్తున్న ప్రహరీ

రహదారి విస్తరణ...

వాహనాల రద్దీ పెరిగిన నేపథ్యంలో అందుకు అనుగుణంగా మంగమూరు రోడ్డులోని ప్రకాశం పంతులు విగ్రహం కూడలి నుంచి పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాల వరకు రహదారిని విస్తరిస్తున్నారు. ప్రస్తుతం 30 అడుగులుగా ఉన్న మార్గాన్ని మరో ఐదడుగులు పెంచారు. ఇందుకోసం గాంధీ పార్కు ప్రహరీని తొలగించి అయిదు అడుగుల మేర వెనక్కు జరిపి నూతనంగా గ్రిల్స్‌తో కూడిన గోడ నిర్మించారు. దక్షిణం వైపునా ఇదే తరహాలో పనులు చేపట్టారు. చెరువు కట్ట మట్టిని సైతం ఆ మేరకు తొలగిస్తున్నారు. దారిలో ఉన్న విద్యుత్తు స్తంభాలను తొలగించి... కొత్తగా నిర్మిస్తున్న కాలువ పక్కన ఏర్పాటు చేయనున్నారు. ఈ పనులకు మొత్తం రూ.56 లక్షలు కేటాయించారు.

కూడళ్లలో ప్రత్యేక ఆకర్షణ...

పీవీఆర్ స్కూల్ నుంచి అంజయ్య రోడ్డుకు వెళ్లే కూడలిలో ఫౌంటెయిన్, హైమాస్ట్ దీపాలు ఏర్పాటు చేస్తారు. రహదారి మధ్యలో డివైడర్ నిర్మించి ఆహ్లాదం పంచేలా పచ్చదనం, దీపాలు వేయనున్నారు. పార్కులో మహిళలకు ప్రత్యేకంగా ఓపెన్ జిమ్ అందుబాటులోకి తెస్తున్నారు. పిల్లలకు ఆట పరికరాలు ఏర్పాటు చేస్తున్నారు. నగరానికి వచ్చే సందర్శకుల కోసం అధునాతన మరుగుదొడ్లు నిర్మించనున్నారు. సంక్రాంతి నాటికి పనులు పూర్తయ్యేలా ప్రణాళిక రూపొందించినట్లు కమిషనర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు.

జీజీహెచ్‌లో యథావిధిగా థైరాయిడ్ పరీక్షలు

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: జీజీహెచ్ సెంట్రల్ ల్యాబ్‌లో థైరాయిడ్ పరీక్షలు యథావిధిగా జరుగుతున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ మాణిక్యరావు తెలిపారు. మరమ్మతులకు గురైన థైరాయిడ్ ఎనలైజర్‌ను బాగు చేసి తిరిగి పరీక్షలు కొనసాగిస్తున్నట్లు చెప్పారు. ఎలక్ట్రోలైట్స్ పరీక్షలు సైతం జరుగుతున్నాయని... ల్యాబ్‌లో ఏసీల కోసం ఇప్పటికే ఆర్డర్ పెట్టామని వివరించారు. జీజీహెచ్ ఆవరణలో కొనసాగుతున్న నిర్మాణాల వల్ల... రోగుల సహాయకులతో పాటు, బయట పనులపై వచ్చే వారికి అక్కడ వసతి కల్పించాలన్నది లక్ష్యమని పేర్కొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం: ఎమ్మెల్యే

సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే జనార్దన్

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ తెలిపారు. గుంటూరురోడ్డులోని తెదేపా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాదర్బారులో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. పింఛన్లు, ఇంటి స్థలాలు, స్వయం ఉపాధి రుణాలు, సంక్షేమ పథకాల మంజూరు కోరుతూ పలువురు అర్జీలు అందజేశారు. వాటి పరిష్కారం దిశగా సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ఒంగోలు, కొత్తపట్నం మండలాల నుంచి పెద్ద సంఖ్యలో అర్జీదారులు వచ్చారు.

గుండాయపాలెం సర్పంచి రాజీనామా

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ఒంగోలు మండలం గుండాయపాలెం పంచాయతీ సర్పంచి రేవు సౌజన్య తన పదవికి రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలో తదుపరి ఎన్నికలు నిర్వహించే వరకు ఉప సర్పంచికి బాధ్యతలు అప్పగిస్తున్నట్లు డీపీవో ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. పంచాయతీ సాధారణ, ఆర్థిక సంఘం నిధులను డిప్యూటీ ఎంపీడీవో ఆమోదం మేరకు మాత్రమే డ్రా చేసేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు తోడ్పాటు: పీడీ

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: రైతు ఉత్పత్తిదారుల సంఘాల బలోపేతానికి అన్ని విధాలా సహకారం అందిస్తామని డీఆర్డీఏ పీడీ టి.నారాయణ తెలిపారు. సంపూర్ణ డైరెక్టర్లు, జిల్లాలోని ఏపీఎంలు, సీసీలకు భాగ్యనగర్‌లోని టీటీడీసీ భవన్‌లో సోమవారం నిర్వహించిన శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. రైతులకు సాగు ఖర్చులతో పాటు నాణ్యమైన ఉత్పత్తుల సాధనకు వీలుగా ప్రోత్సాహక రుణాలు అందించనున్నారు. ఏపీఎంఐపీ, ఉద్యానశాఖ ద్వారా రాయితీపై బిందు సేద్యం పరికరాలు; చిన్న, సన్నకారు రైతుల సంక్షేమానికి పలు పథకాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్‌నాయక్, జిల్లా ఉద్యాన అధికారి గోపీచంద్, ఎల్‌డీఎం రమేష్... ఆయా శాఖల ద్వారా అందిస్తున్న పథకాలను వివరించారు. డీఆర్డీఏ డీపీఎం రజనీకాంత్, ఏపీఎంలు జి.నారాయణ, ఆనందకుమారి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డీఆర్డీఏ పీడీ నారాయణ

పల్స్ పోలియోను విజయవంతం చేయండి

ఒంగోలు కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఈ నెల 21న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ పి.రాజాబాబు సూచించారు. ఈ మేరకు ముద్రించిన అవగాహన గోడప్రతులను ప్రకాశం భవన్‌లో సోమవారం ఆవిష్కరించారు. 22, 23 తేదీల్లో గృహ సందర్శన ద్వారా పోలియో చుక్కలు వేయనున్నట్లు వివరించారు. అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి అయిదేళ్లలోపు పిల్లలందరికీ అందిస్తారని... వందశాతం లక్ష్య సాధనలో భాగంగా బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్లలోనూ శిబిరాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. సంచార వాహనాల ద్వారానూ టీకాలు అందిస్తారని వివరించారు. జేసీ గోపాలకృష్ణ, డీఆర్వో ఓబులేసు, డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు, డీఐవో కమలశ్రీ తదితరులు పాల్గొన్నారు.

గోడప్రతులను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాజాబాబు, జేసీ గోపాలకృష్ణ, అధికారులు

11 మంది పిల్లలకు వైద్యకార్డుల అందజేత

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ఒంగోలులోని బాలసదన్‌కు చెందిన 11 మంది పిల్లలకు అమృత వైద్య బీమా పథకం కింద ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆరోగ్యకార్డులు మంజూరయ్యాయి. కలెక్టర్ రాజాబాబు చేతుల మీదుగా సోమవారం వాటిని పంపిణీ చేశారు. ఈ కార్డుల ద్వారా అన్ని ప్రైవేటు వైద్యశాలల్లో ఉచిత వైద్య సదుపాయాలు పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మహిళా, శిశు సంక్షేమశాఖ అధికారిణి సువర్ణ, బాలల సంరక్షణ అధికారి పి.దినేష్ కుమార్ పాల్గొన్నారు.

వసతి గృహంలో సదుపాయాల పరిశీలన

నాగులుప్పలపాడు, న్యూస్‌టుడే: అమ్మనబ్రోలులోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాన్ని ఎంపీడీవో రవికుమార్... సోమవారం రాత్రి తనిఖీ చేశారు. అక్కడి సదుపాయాలు, విద్యార్థులకు అందిస్తున్న భోజనం, భవనం పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. జడ్పీ మాజీ ఛైర్మన్ ఈదర హరిబాబు, ఏంఈవో రవి, తెదేపా మండల అధ్యక్షుడు తేళ్ల మనోజ్‌కుమార్, ఏపీవో రవి, వార్డెన్ లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీడీవో రవికుమార్, జడ్పీ మాజీ ఛైర్మన్ హరిబాబు

ప్రమాణం చేస్తున్న నూతన కమిటీ సభ్యులు

ఎస్టీయూ జిల్లా కమిటీ ఎన్నిక

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి పి.రమణారెడ్డి, పరిశీలకుడు బి.శ్రీనివాసరావు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు కె.ఎర్రయ్య అధ్యక్షతన మల్లయ్య లింగం భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఈ ఎంపిక చేపట్టారు. అధ్యక్షుడిగా చేతల వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా గవిని శివశంకర్, గౌరవాధ్యక్షుడిగా కడియాల ప్రసాద్, రాష్ట్ర కౌన్సిలర్లుగా వేమా శేషు, చల్లా శ్రీనివాసులు, పొతకమూరి కృష్ణయ్య, పిగిలి కొండయ్య, జి.నాగయ్య ఎన్నికయ్యారు. సీపీఎస్ రద్దు చేయాలని, ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. సీపీఐ జిల్లా కార్యదర్శి నారాయణ, వెంకట్రావు, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

కొత్త చట్టాలతో కర్షకులకు నష్టం

మద్దిపాడు, న్యూస్‌టుడే: కేంద్రం తెచ్చిన మూడు కొత్త చట్టాలు రైతులకు నష్టం కలిగించేలా ఉన్నాయని... వెంటనే వాటిని వెనక్కు తీసుకోవాలని రైతు సంఘం జాతీయ నాయకుడు చుండూరి రంగారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు పెదకొత్తపల్లిలో సోమవారం చేపట్టిన నిరసనలో మాట్లాడారు. రైతులు, కార్మికుల హక్కులు కాలరాసేలా కేంద్రం వ్యవహరిస్తోందని విమర్శించారు. కార్పొరేట్ శక్తుల కోసమే కొత్త చట్టాలు తెచ్చారని ఆరోపించారు. జీవో ప్రతులను తగులబెట్టారు. రైతు సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని మాజీ సర్పంచి జజ్జర శరత్‌బాబు విమర్శించారు. రైతు సంఘం మండల అధ్యక్షుడు కనపర్తి సుబ్బారావు, చుండూరి సుబ్బారావు, మార్నేని నాగేంద్రం, శ్రీదేవి, సుశీల, రజిని, పద్మావతి, ప్రసాదరావు, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

చట్టాల ప్రతులను దహనం చేస్తున్న రైతు సంఘం నాయకులు

పరీక్ష రాస్తున్న విద్యార్థిని

ప్రతిభా 'కౌశలం'

యువతలో నైపుణ్యాలు పెంచి ఇంటి నుంచే ఉపాధి పొందడం, అర్హతకు అనుగుణంగా ఉద్యోగం కల్పించడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా 'కౌశలం' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా గ్రామాల వారీగా సచివాలయ సిబ్బంది సర్వే నిర్వహించి... పది, ఇంటర్, డిగ్రీ, పీజీ, బీటెక్, డిప్లొమా, ఐటీఐ తదితర విద్యార్హతలు కలిగిన వారి వివరాలు సేకరించారు. ప్రస్తుతం వారికి ఆయా సచివాలయాల్లోనే అర్హత ఆధారంగా ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. రోజుకు ఇద్దరు చొప్పున రాస్తున్నారు. కొత్తపట్నం మండలంలో మొత్తం 2,284 మంది వివరాలు సేకరించగా ప్రస్తుతం 1,265 మంది అందుబాటులో ఉన్నారు. ఔత్సాహికులు పరీక్షకు హాజరవుతున్నారు.

- న్యూస్‌టుడే, కొత్తపట్నం

రేషన్ దుకాణాలను విభజించాలి

మద్దిపాడు, న్యూస్‌టుడే: మండల పరిధిలోని రేషన్ దుకాణాలను జీవో నంబరు 10 ప్రకారం హేతుబద్ధీకరించాలని భాజపా మండల అధ్యక్షుడు చెన్నుపల్లి వెంకటరమణ విజ్ఞప్తి చేశారు. ఈమేరకు సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో తహసీల్దార్ ఆదిలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. కార్డుల సంఖ్య ఆధారంగా దుకాణాలను విభజించి కొత్తవి ఏర్పాటు చేయాలన్నారు. గ్రీవెన్స్‌కు వివిధ సమస్యలపై నాలుగు వినతులు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు.

విద్యార్థులకు అభ్యసన సామగ్రి అందజేత

చీమకుర్తి, న్యూస్‌టుడే: పదో తరగతి విద్యార్థుల కోసం యూటీఎఫ్ వారు రూపొందించిన పుస్తకాలను... చీమకుర్తి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మండలంలోని పలు పాఠశాలలకు సోమవారం అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు తొగటి శ్రీనివాసరావు ఉమాదేవి దంపతుల సహకారంతో పంపిణీ చేశారు. బండ్లమూడి, పల్లామల్లి, గాడిపర్తి వారిపాలెం, దేవరపాలెం, ఆర్ఎల్‌పురం, పులికొండ, పి.నాయుడుపాలెం, పొదిలి మండలం ఉప్పలపాడు పాఠశాలల విద్యార్థులకు వీటిని అందజేశారు. క్లబ్ కార్యదర్శి శ్రీనివాసరావు, పూర్వ కార్యదర్శి ఎ.వీరారెడ్డి, ఎన్.వెంకటేశ్వరరావు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు. * మార్కాపురం మండలం గజ్జలకొండ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రోటరీ క్లబ్ సభ్యుడు పిల్లి ఆదినారాయణరెడ్డి సహకారంతో పుస్తకాలు అందజేశారు.

పుస్తకాలతో బండ్లమూడి పాఠశాల విద్యార్థులు

దోమల నివారణతోనే వ్యాధులకు అడ్డుకట్ట

మద్దిపాడు, న్యూస్‌టుడే: పెదకొత్తపల్లి పంచాయతీ పరిధి అంజయ్యనగర్‌లో సోమవారం దోమల నివారణ చర్యలు చేపట్టారు. ఎబేట్, ఇతర మందులు పిచికారీ చేశారు. మద్దిపాడు పీహెచ్‌సీ వైద్యుడు శ్రవణ్‌కుమార్, సర్పంచి శైలజ, కార్యదర్శి డేవిడ్ పర్యవేక్షించారు. జిల్లా మలేరియా నివారణ అధికారి మధుసూదనరావు, సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసరావు... యాంటీ లార్వా ఆపరేషన్, దోమల నివారణ చర్యలపై సూచనలు చేశారు. హెల్త్ సూపర్‌వైజర్ బాలకోటయ్య, ఏఎన్ఎం జయమణి, నాగరాజి, దరియా తదితరులు పాల్గొన్నారు.

నీటి డ్రమ్ములను పరిశీలిస్తున్న మలేరియా నివారణ అధికారి మధుసూదనరావు

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

ఒంగోలు నగరం: 8008574067
ఒంగోలు గ్రామీణం : 8008564455
ఒంగోలు అంజయ్య రోడ్డు : 8247324766
కొత్తపట్నం : 8464085451
ఎస్.ఎన్.పాడు: 8008552692

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

?: **ఒంగోలు అంజయ్యరోడ్డు:** నగరంలోని పులివెంకటరెడ్డి కాలనీలో దోమల సమస్య తీవ్రంగా ఉంది. **- శ్రీను**

✓: దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తాం.

- ఎన్.పిచ్చయ్య, శానిటరీ సూపర్‌వైజర్

?: **కొత్తపట్నం:** సంకువారికుంట గ్రామానికి వెళ్లే దారిలోని దీపాలు చాన్నాళ్లుగా వెలగడం లేదు. స్థానిక సిబ్బందికి చెప్పినా పట్టించుకోవడం లేదు. **- విజయ్‌కుమార్**

✓: పరిశీలించి... సమస్య పరిష్కరిస్తాం.

- వేణుగోపాల కృష్ణమూర్తి, డిప్యూటీ ఎంపీడీవో

?: **మద్దిపాడు:** గుండ్లాపల్లి సచివాలయం ఎదుటే కొందరు మద్యం తాగుతుండడంతో వివిధ పనుల నిమిత్తం వచ్చే వారు ఇబ్బంది పడుతున్నారు. **- ఎం.సుధాకర్**

✓: పోలీసులకు సమాచారం ఇచ్చి అవసరమైన చర్యలు తీసుకుంటాం.

- సురేష్, ఇన్‌ఛార్జి కార్యదర్శి

?: **మద్దిపాడు:** పారిశ్రామికవాడలోని ఐలా కార్యాలయం వెనుక ప్రాంతం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. కార్మికులు, పరిశ్రమల యజమానులు ఇబ్బంది పడుతున్నారు. **- పారిశ్రామికవాడ సిబ్బంది**

✓: సిబ్బందిని పంపి వాటికి అడ్డుకట్ట వేస్తాం.

- వెంకటసూర్య, ఎస్సై

ప్రజా సమస్యలపై పోరుబాట

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యలపై కార్యకర్తలు ఉద్యమించాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు డి.రమాదేవి పేర్కొన్నారు. సుందరయ్య భవన్‌లో నిర్వహిస్తున్న సీపీఎం జిల్లా స్థాయి కార్యకర్తల సమావేశంలో సోమవారం మాట్లాడారు. నిత్యం క్షేత్రస్థాయిలో ఉంటూ ప్రజా సమస్యలను గుర్తించాలన్నారు. వాటి పరిష్కారానికి చొరవ చూపడం ద్వారా ప్రజల్లో విశ్వాసం పెరుగుతుందన్నారు. కేంద్రంలోని భాజపా ప్రభుత్వం సాంస్కృతిక రంగంపై చేస్తున్న దాడులు... శాస్త్రీయ దృక్పథాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో ప్రజా సమస్యలపై మరింత బలమైన పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని పార్టీ జిల్లా కార్యదర్శి షేక్ మాబు పేర్కొన్నారు. నాయకులు జీవీ.కొండారెడ్డి, పూనాటి ఆంజనేయులు, చీకటి శ్రీనివాసరావు, కంకణాల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు రమాదేవి

అందుబాటులోకి పట్టణ ఆరోగ్య కేంద్రం

చీమకుర్తి, న్యూస్‌టుడే: చీమకుర్తి అర్బన్ ఆరోగ్య కేంద్రం భవనం ఎట్టకేలకు సాకారమైంది. గత ప్రభుత్వ హయాంలో ఈ నిర్మాణానికి రూ.80 లక్షల కేటాయించినా... పలు అవాంతరాలు అధిగమించాక పనులు ప్రారంభమయ్యాయి. అవి పూర్తికాకుండానే గుత్తేదారు చేతులెత్తేశారు. ఈ విషయమై 'ఈనాడు'లో పలుమార్లు కథనాలు ప్రచురితమయ్యాయి. తరువాత వచ్చిన కూటమి ప్రభుత్వం సమస్యపై దృష్టి సారించి... మిగతా పనుల పూర్తికి రూ.26 లక్షలు కేటాయించింది. ఈ మొత్తంతో విద్యుత్తు, వాటరింగ్ పనులు, రంగులు వేయడం, ప్రహరీ నిర్మాణం పూర్తిచేశారు. అన్ని హంగులు సమకూరిన భవనాన్ని ఇటీవలే ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ ప్రారంభించారు. అద్దె భవనంలోని సామగ్రిని కొత్త ప్రాంగణంలోకి తరలిస్తున్నారు.

మిట్టపాలెం ఆలయ ఆదాయం రూ.1.23 లక్షలు

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానానికి ఆదివారం వివిధ రూపాల్లో రూ.1,23,368 ఆదాయం వచ్చిందని కార్యనిర్వహణాధికారి ఎస్.నరసింహబాబు తెలిపారు. .

ఆటో బోల్తా... ముగ్గురికి గాయాలు

చీమకుర్తి, న్యూస్‌టుడే: చీమకుర్తి బైపాస్‌లో సోమవారం రాత్రి... ఆటో అదుపు తప్పి బోల్తాపడిన ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. రామతీర్థం నుంచి చీమకుర్తి వైపు వస్తుండగా... మువ్వవారిపాలెం డొంక సమీపంలో ద్విచక్రవాహనాన్ని తప్పించే క్రమంలో ఆటో అదుపు తప్పింది. క్షతగాత్రులను ఒంగోలు ఆసుపత్రికి తరలించారు. వారి వివరాలు తెలియాల్సి ఉంది. సీఐ డి.ప్రసాద్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

చీమకుర్తిలో అగ్నిప్రమాదం

చీమకుర్తి, న్యూస్‌టుడే: చీమకుర్తిలోని రచ్చమిట్ట ప్రాంతంలో సోమవారం సాయంత్రం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. విద్యుత్తు షార్ట్ సర్క్యూట్ కారణంగా శ్రీనివాసరావు అనే వ్యక్తి ఇంట్లో మంటలు రేగాయి. ఫ్రిజ్, ఇతర గృహోపకరణాలు పూర్తిగా కాలిపోయాయి. స్థానికులు స్పందించి మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. ఒంగోలు నుంచి వచ్చిన అగ్నిమాపక సిబ్బంది పరిస్థితిని పూర్తిగా అదుపులోకి తెచ్చారు.

ఎస్.ఎన్.పాడులో అవకతవకలపై ఫిర్యాదు

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: సంతనూతలపాడు పంచాయతీలో చోటుచేసుకున్న అవకతవకలపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని టీఎన్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు మందాడి వెంకటేశ్వర్లు... కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజాసమ్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. జమా పుస్తకాలు నిర్వహించకుండా నిర్మాణాలు, చెల్లింపులు, కుళాయి కనెక్షన్ల విషయంలో పంచాయతీ కార్యదర్శి అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. బ్లీచింగ్, వీధిదీపాలు, స్టేషనరీ కొనుగోళ్లలో అవకతవకలకు పాల్పడ్డారన్నారు. ఒడ్డెరపాలెం పాఠశాలలో నాడు-నేడు కింద చేపట్టిన కొన్ని పనులకు పంచాయతీ నుంచి బిల్లులు చెల్లించారన్నారు. పలు ఇతర ఆరోపణలూ చేశారు.

ఆలయ నిధుల దుర్వినియోగం...

నాగులుప్పలపాడు, న్యూస్‌టుడే: ఉప్పుగుండూరులోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం సొమ్ము దుర్వినియోగంపై విచారణకు ప్రత్యేకాధికారిని నియమించాలని పాలక మండలి ఛైర్మన్ మాగులూరి సత్యనారాయణ కోరారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. దశాబ్దకాలంగా ఈవోగా పనిచేసిన అధికారి పెద్ద మొత్తంలో అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఉత్సవాలు నిర్వహించకుండానే నిర్వహించినట్లు చూపారని, కౌలు ఆదాయం పక్కదారి పట్టించారని పేర్కొన్నారు. ఈ విషయమై ఇప్పటికే ఫిర్యాదు చేసినా చర్యలు లేవని... ఇప్పటికైనా విచారణ చేపట్టాలని గ్రామస్థులతో కలిసి కోరారు.

నగర రహదారుల్లో జీబ్రా లైన్లు

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: నగరంలో ట్రాఫిక్ నిబంధనలను పక్కాగా అమలు చేసేందుకు అవసరమైన చోట జీబ్రా లైన్లు వేశారు. చర్చి సెంటర్, మంగమూరు రోడ్డు, కర్నూలు రోడ్డు, కొత్తపట్నం బస్టాండ్, వీఐపీ రోడ్డు, ట్రంక్ రోడ్డు, రైల్వేస్టేషన్ రోడ్డు కూడలిలో పసుపు రంగుతో కూడిన లైన్లు వేశారు.

ఆధార్ కేంద్రం పునరుద్ధరణ

చీమకుర్తి, న్యూస్‌టుడే: చీమకుర్తి తపాలా కార్యాయలంలో ఆధార్ సేవలు పునరుద్ధరించారు. గత కొన్నాళ్లుగా ఇక్కడ సేవలు నిలిచిపోవడంతో పట్టణవాసులు ఇబ్బంది పడ్డారు. ఈ విషయమై 'ఈనాడు' లోనూ కథనం ప్రచురితమైంది. కేంద్రం పునరుద్ధరణ దిశగా చర్యలు చేపడతామని అప్పట్లో అధికారులు ప్రకటించారు. ఎట్టకేలకు సేవలు పునఃప్రారంభించారు. రోజూ మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం వరకు సేవలు కొనసాగుతాయని తపాలా అధికారి రామారావు తెలిపారు. పట్టణవాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పేర్నమిట్ట... వ్యర్థాల గుట్ట

• తూతూమంత్రంగా పారిశుద్ధ్య పనులు

న్యూస్‌టుడే – ఒంగోలు అర్బన్

ఒంగోలు నగర పాలక సంస్థలో విలీనమైన అతి పెద్ద పంచాయతీ పేర్నమిట్ట. నాలుగు డివిజన్లు, 15కు పైగా శివారు కాలనీలు ఉన్నాయి. నలభై వేల మేర జనాభా ఉన్నారు. ఇంతటి ప్రాధాన్యం ఉన్న ప్రాంతంలో పారిశుద్ధ్య నిర్వహణ మరీ తీసికట్టుగా ఉంది. చెత్త సేకరణ, వ్యర్థాల తరలింపు, కాలువల శుభ్రత పనులు సరిగా చేపట్టక సమస్య నెలకొంటోంది.

దారుల పక్కనే వ్యర్థాలు...

ప్రస్తుతం పల్లెల్లో సైతం ఇంటింటికీ తిరిగి తడి, పొడి చెత్త సేకరించి సంపద కేంద్రాలకు తరలిస్తున్నారు. పేర్నమిట్టలో మాత్రం ఆ ప్రక్రియ సరిగా సాగడం లేదు. నాలుగు సచివాలయాలకు నాలుగు చెత్త సేకరణ ఆటోలు, ఓ ట్రాక్టర్ కేటాయించారు. 42 మంది సిబ్బందితో పారిశుద్ధ్య పనులు చేపడుతున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా... చెత్త సేకరణ ఆటోలు రావడం లేదన్న విమర్శలున్నాయి. శివారు కాలనీల ముఖమూ చూడడం లేదని అక్కడి వారు చెబుతున్నారు. సేకరించిన వ్యర్థాలను సైతం రహదారుల వెంబడి, శ్మశాన స్థలాలు, కుంటల్లో పారబోస్తున్నారు.

కాలువలదీ అదే తీరు...

కాలువల శుభ్రతా అంతంత మాత్రంగానే ఉంటోంది. కొన్ని చోట్ల అవి పూడిపోయి పిచ్చి మొక్కలు మొలిచాయి. పలు ప్రాంతాల్లో దారుల పైనే మురుగు పారుతోంది. ఈ కారణంగా దోమల సమస్య పెరిగింది. వీటి నియంత్రణకు ఫాగింగ్ వంటి కనీస చర్యలూ చేపట్టడం లేదు. అధికారుల పర్యవేక్షణ లేకనే సమస్య నెలకొందని... ఇప్పటికైనా తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

చెరువు కట్ట సమీపంలో పేరుకుపోయిన చెత్త నిల్వలు

(c) eenadu

నెల్లూరే ముద్దు.. తిరుపతిలో కలపొద్దు

కలెక్టరేట్ ఎదుట సేవ్ నెల్లూరు ధర్నా

నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: రాపూరు, కలువాయి, సైదాపురం మండలాలను నెల్లూరు జిల్లాలోనే ఉంచాలని.. ప్రకృతి సంపదలైన ఎర్రచందనం, మైకా, నీటి వనరుల విభజన పేరుతో తిరుపతి జిల్లాలో కలపవద్దని కోరుతూ సోమవారం కలెక్టరేట్ ఎదుట సేవ్ నెల్లూరు ధర్నా పేరుతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు, భాజపా నాయకుడు మిడతల రమేశ్ మాట్లాడుతూ.. మూడు మండలాలను తిరుపతి జిల్లాలో కలిపితే జల వివాదాలు నెలకొంటాయని, కరవు సమయంలో పొదలకూరు, మనుబోలు ఆయకట్టుదారులు తీవ్ర నీటి సమస్యను ఎదుర్కొంటారని ఆందోళన వ్యక్తం చేశారు. కలువాయి నుంచి 60 కి.మీ. కాగా.. తిరుపతి 140 కి.మీ. దూరమని.. ప్రజలకు ప్రయాణ భారం కూడా ఎదురవుతుందన్నారు. చేనేత ఐక్య వేదిక జిల్లా కన్వీనరు బుధవారపు బాలాజీ రాపూరు, కలువాయి, సైదాపురం మండలాలను తిరుపతి జిల్లాలో కలపాలన్న నిర్ణయాన్ని తప్పుబట్టారు. నాయకులు కందికట్ల రాజేశ్వరి, బైరి శ్రీనివాస్, నరాల సుబ్బారెడ్డి, అనూరాధ, హజరత్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లిప్తత..

అలసిన మాజీ సైనికుడు

కావలి, న్యూస్‌టుడే: ఆయన ఓ మాజీ సైనికుడు. విధుల్లో ఉండగా పాకిస్థాన్‌తో 1971లో జరిగిన యుద్ధంలో వీరోచితంగా పోరాడారు. ఉద్యోగ విరమణ అనంతరం.. జీవన సమరంలో మన అధికారుల నిర్లిప్తతతో పోరాడలేకపోతున్నారు కలిగిరి మండలం లక్ష్మీపురానికి చెందిన బెల్లంకొండ సుబ్బానాయుడు. ఈయనకు పాతికేళ్ల కిందట ప్రభుత్వం భూమి మంజూరు చేసింది. సర్వే నంబరు 151-1లో 1.34 ఎకరాల్లో వరి, పత్తి తదితర పంటలు సాగు చేస్తున్నారు. ఇటీవల జరిగిన రీ సర్వేలో సదరు భూ రికార్డులో సుబ్బానాయుడు పేరు మాయమైంది. సమస్యను పరిష్కరించి న్యాయం చేయాలని తహసీల్దారు మొదలు ఆర్డీవో కార్యాలయం వరకు ప్రదక్షిణలు చేస్తున్నారు. ఎన్నిసార్లు అడిగినా విచారణ చేస్తున్నామన్న మాటతో సరిపెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరా తీయగా.. తన భూమితో పాటు సమీపంలో ఉన్న 16.24 ఎకరాల వరకు కొండ పోరంబోకుగా నమోదైనట్లు తెలిసిందన్నారు. అనాధీనం పద్దులోకి మార్చిన తర్వాత.. రైతుల పేరుతో నమోదవుతుందని చెబుతున్నా.. ఆ దిశగా అడుగులు పడటం లేదంటున్నారు. సోమవారం మరోసారి కావలి ఆర్డీవో సన్నీవంశీకృష్ణకు విజ్ఞప్తి చేశారు. ఆయన కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని బదులిచ్చారు.

కావలి ఆర్డీవోకు విన్నవిస్తున్న బెల్లంకొండ సుబ్బానాయుడు

తీరం.. తాగునీటికేదీ ఆధారం!

ప్రతిపాదనలు దాటని డీసాలినేషన్ ప్లాంట్ నిర్మాణం

ఈనాడు, నెల్లూరు: కార్పొరేషన్, న్యూస్‌టుడే

తీరం తాగునీటికి అల్లాడుతోంది. భూగర్భంలోకి సముద్రపు నీరు చొచ్చుకురావడంతో.. ఉప్పులుగా మారుతున్న పరిస్థితి. అక్కడక్కడా మంచినీరు పడుతున్నా.. కొందరు అక్రమార్కులు వాటిని పరిశ్రమల అవసరాల కోసమని ఇష్టానుసారం తోడేస్తుండటంతో సమీప గ్రామాల్లోని బోరు నీరు సముద్ర జలాలను తలపిస్తోంది. దీన్ని ముందుగానే అంచనా వేసిన యంత్రాంగం అయిదేళ్ల కిందటే జిల్లా భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని.. సముద్రపు నీటి నుంచి మంచినీటిని ఉత్పత్తి చేయాలని యోచించారు. తమిళనాడులోని మింజూరు, నెమ్మెలి తరహా నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. డీపీఆర్‌ను సిద్ధం చేసేందుకు ప్రయత్నించారు. కానీ, అప్పటి అధికారులు బదిలీ కావడం.. కొత్తగా వచ్చిన అధికారులకు అవగాహన లేకపోవడం.. స్థానిక ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో.. ఆ ప్రతిపాదనలు పత్రాలకే పరిమితమయ్యాయి. ప్రజలకు అవస్థలు అధికమయ్యాయి.

ముత్తుకూరు సమీపంలో ఇష్టానుసారంగా తాగునీటి తోడకం

‘ఈ ప్రాజెక్టుకు రూ. 950 కోట్ల మేర ఖర్చవుతుందని ప్రాథమికంగా అంచనా వేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ప్రాథమిక నివేదికను కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి పంపించారు. కృష్ణపట్నం దగ్గర ఏర్పాటు చేయాలని నిర్ణయించినా.. నేటికీ అడుగులు పడటం లేదు.’

‘దామోదరం సంజీవయ్య థర్మల్ విద్యుదుత్పత్తి కేంద్రం(జెన్‌కో)లో ఇప్పటికే 6 ఎంఎల్‌డీ, 23 ఎంఎల్‌డీ సామర్థ్యం కలిగిన రెండు డీసాలినేషన్ ప్లాంట్లు ఏర్పాటు చేశారు. అవసరాలకు తగ్గట్టుగా నీటిని శుద్ధి చేసి వినియోగిస్తున్నారు. మిగిలిన పరిశ్రమలు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు.’

‘కొందరు సుమారు 15 ఏళ్లుగా ప్రభుత్వానికి ఎలాంటి రుసుం చెల్లించకుండా నీటిని తోడేస్తుండగా- వీరి చర్యల ఫలితంగా కృష్ణపట్నం, గోపాలపురం గ్రామాల్లో తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ప్రతి ఇంటి ముందు కనిపించే డ్రమ్ములే అక్కడి పరిస్థితులకు అద్దం పడుతున్నాయి.’

నెల్లూరు నుంచి పరిశ్రమలకా?

నగరంలో 54 డివిజన్లు ఉండగా- పది లక్షలకుపైగా జనాభా ఉన్నారు. తలసరి 135 లీటర్ల నీరు అవసరమవుతుండగా- 2050 వరకు తాగునీటికి ఇబ్బంది లేకుండా ఉండేందుకు రూ. 556.77 కోట్ల అంచనాతో మహమ్మదాపురం కొండపైన 122 ఎంఎల్‌డీ సామర్థ్యంతో నూతన పథకాన్ని ఏర్పాటు చేశారు. ఇప్పటికే 724 కి.మీ. పైప్‌లైన్ల నిర్మాణం పూర్తి చేశారు. 32 ట్యాంకులను పూర్తి చేసి గత రెండేళ్లుగా తాగునీటిని నగరానికి అందిస్తున్నారు. ప్రస్తుతం 72 ఎంఎల్‌డీ నీరు సరిపోతుండగా.. మిగిలిన నీటిని కృష్ణపట్నం పరిధిలోని పరిశ్రమలకు విక్రయించేందుకు చేస్తున్న ప్రయత్నాలపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కసిరిన విధి.. కన్నీటి సుడి

రోడ్డు ప్రమాదంలో కుమారుడి దుర్మరణం

విద్యుదాఘాతంతో నాలుగు నెలల కిందట భర్త

బిడ్డ మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి మనోజ కుమారి

ఇందుకూరుపేట, న్యూస్‌టుడే: వారిద్దరు.. వారికి ఇద్దరు బిడ్డలు.. ఉన్నంతలో ఆనందంగా సాగిపోతున్న ఆ కుటుంబంపై విధి కర్కశంగా పంజా విసిరింది. ఆ ఇంటి పెద్ద. . భర్తను అర్ధాంతరంగా పొట్టనపెట్టుకుంది. ఆ దుర్ఘటన జరిగి నాలుగు నెలలే.. అంతలోనే మామ మృతి.. గుండెను ధిటవు చేసుకుని.. ధైర్యం కూడదీసుకుని.. బిడ్డలతో తదనంత క్రతువు పూర్తి చేయించడంలో నిమగ్నమై ఉండగానే.. అప్పటికే దయగలగనట్లు ఆ ఇంటి బిడ్డను రోడ్డు ప్రమాదంలో నిర్దయగా బలి తీసుకుంది. అసలే భర్త దూరమై.. ఇద్దరు బిడ్డలే ప్రపంచంగా బతుకుతున్న ఆ తల్లికి అంతులేని శోకాన్ని మిగిల్చింది.

స్థానికుల కథనం మేరకు...

గంగపట్నం గిరిజన కాలనీకి చెందిన పులి మురళి, మనోజకుమారి దంపతులు. వీరికి ప్రదీప్, కిరణ్ అనే ఇద్దరు కుమారులు. కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటారు. నాలుగు నెలల కిందట విద్యుదాఘాతంతో మురళి మృతి చెందారు. ఇంటి పెద్దను కోల్పోయిన బాధ నుంచి.. ఆ కుటుంబం ఇంకా తేరుకోనేలేదు. ఆదివారం మురళి నాన్న చనిపోగా. . మనవడైన ప్రదీప్ అంత్యక్రియలు చేశారు. సోమవారం కర్మకాండలు నిర్వహించేందుకు ప్రదీప్, అతడి తమ్ముడు కిరణ్(11)తో కలిసి తాత ఇంటికి సైకిల్‌పై వెళుతున్నారు. సరిగ్గా గ్రామంలోని మలుపు వద్దకు వీరు చేరుకోగానే.. ఆర్టీసీ బస్సు ఢీకొంది. ప్రదీప్ పక్కనున్న కాలువలో పడిపోగా.. కిరణ్ తలపైకి బస్సు చక్రాలు ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న తల్లి మనోజ కుమారి సంఘటనా స్థలానికి చేరుకుని తల్లడిల్లిపోయారు. ఆమె రోదనలు మిన్నంటాయి. ఓదార్చడం ఎవరి తరమూ కాలేదు. అక్కడి దృశ్యాలు చూపరులను కంటతడి పెట్టించాయి. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగార్జునరెడ్డి తెలిపారు.

చివరకు మిగులుతోంది...

ప్రయాస.. నిరాశ!

‘ఏఎస్‌పేట మండలానికి చెందిన ఓ రైతు కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీ సమర్పించారు. తన సమస్య పరిష్కరించకుండానే.. పరిష్కరించినట్లు కంప్యూటర్‌లో నిక్షిప్తం చేయడం తెలిసి అవాక్కయ్యారు.’ - ఈ సమస్య ఈయన ఒక్కరిదే కాదు.. ఇలాంటి వారు జిల్లాలో ఎంతో మంది ఉన్నారు. కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నారు.

న్యూస్‌టుడే, నెల్లూరు(కలెక్టరేట్)

సుదూర ప్రాంతాల నుంచి.. వ్యయ ప్రయాసలకు ఓర్చి.. కలెక్టరేట్‌కు వచ్చి.. ‘ప్రజా సమస్యల పరిష్కార వేదిక’లో అర్జీలు సమర్పిస్తున్న వారిలో అత్యధికులకు నిరాశే మిగులుతోంది. కారణం.. ఇక్కడ కలెక్టర్‌తో పాటు జిల్లా అధికారులకు ఇస్తున్న అర్జీలను డివిజన్, మండల అధికారులకు పంపిస్తుండగా.. అక్కడా పరిష్కారం కావడం లేదు. దాంతో బాధితులు తిరిగి జిల్లా కేంద్రానికే తరలివస్తున్నారు. ఈ క్రమంలో బాధితుల సంతృప్తి స్థాయి 30 శాతమే ఉండటం గమనార్హం.

మళ్లీ మళ్లీ రాక...

కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత.. 2024 జూన్ 15వ తేదీ నుంచి ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నారు. ఇందులో అన్ని ప్రభుత్వశాఖలకు కలిపి ఈ ఏడాది నవంబరు 28వ తేదీ వరకు 57,294 మంది అందజేశారు. వీటిలో 49,646 వినతులు పరిష్కరించినట్లు, 3,467 పురోగతిలో ఉన్నట్లు, 4,181 రీ ఓపెన్ అయినట్లు చూపుతున్నారు. ఇందులో రెవెన్యూశాఖ సంబంధించినవే 23,687 ఉండగా.. 19,887 పరిష్కరించినట్లు, 2,157 పురోగతిలో, 1643 రీఓపెన్‌గా ఉన్నట్లు లెక్క చెబుతున్నారు. ఈ లెక్కలు చాలా వరకు తప్పు అన్న విమర్శలు ఉన్నాయి. ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో సగటున 400కుపైగా అర్జీలు అందుతుండగా.. చిన్న చిన్న సమస్యలు సైతం పరిష్కరించడం లేదన్న అసంతృప్తి, నిర్దేశిత గడువు వరకు పట్టించుకోరనే అపవాదు.. ఆ క్రమంలోనే చివర్లో పరిష్కరించకుండానే.. పరిష్కరించినట్లు ముగింపు పలుకుతున్నారనే విమర్శలు ఉన్నాయి. ఒకే సమస్యపై పదేపదే అర్జీలు రావడమే అందుకు నిదర్శనమని అంటున్నారు.

అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, అధికారులు

అధికారిక లెక్కల ప్రకారం.. 2024 జూన్ 15 నుంచి నవంబరు 28 వరకు వచ్చిన అర్జీలు

విభాగం	మొత్తం	పరిష్కారం
అన్ని శాఖలు	57,294	49,646
రెవెన్యూ	23687	19887
సర్వే	10670	9693
పోలీసు	6452	5716
పంచాయతీరాజ్	3261	2886
మున్సిపల్	3136	2791
సివిల్ సప్లయ్	1286	1153

ఏపీ టెట్‌కు కేంద్రాల ఎంపిక

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే: జిల్లాలో ఏర్పాటు చేసిన ఆరు కేంద్రాల్లో ఈ నెల 10 నుంచి 21వ తేదీ వరకు ఉదయం, మధ్యాహ్నం ఆన్‌లైన్ విధానంలో ఏపీ టెట్ నిర్వహించనున్నట్లు డీఈవో ఆర్.బాలాజీరావు ప్రకటనలో పేర్కొన్నారు. పరీక్ష జొన్నవాడ మార్గంలోని అయాన్ డిజిటల్ కేంద్రం, సాయిశ్రీరామ్ ఇన్‌ఫ్రా ఐటీ సొల్యూషన్స్, కావలిలోని పీబీఆర్ విశ్వోదయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, కావలిలోని రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల, నెల్లూరులోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాల, గంగవరంలోని గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాలల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు హాల్ టికెట్లు ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని.. వివరాలకు హెల్ప్‌డెస్క్ నంబర్లు 99890 02174, 93910 61007 సంప్రదించాలన్నారు.

సెలవు రోజుల్లోనూ

మధ్యాహ్న భోజనం

29,831 మందికి ప్రయోజనం

న్యూస్‌టుడే, నెల్లూరు(విద్య)

వంద రోజుల ప్రణాళికలో భాగంగా పదో తరగతి విద్యార్థులకు సెలవు రోజుల్లోనూ మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్నారు. జిల్లాలో 675 ఉన్నత పాఠశాలల నుంచి 29,831 మంది పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరు కానున్నారు. పరీక్షల్లో వంద శాతం ఫలితాల సాధనకు రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ వంద రోజుల ప్రణాళిక అమలు చేయాలని ఆదేశాలు ఇచ్చింది. ఆదివారం నుంచి శ్రీకారం చుట్టారు. ఈ మేరకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు భోజన సదుపాయం కల్పించారు. రోజూ ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు అదనపు తరగతులు నిర్వహించనున్నారు. ఆదివారం, సెలవు రోజుల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు రెండు సబ్జెక్టులపై అదనపు తరగతులు జరుగుతాయి. తరగతుల అనంతరం విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేశాక ఇళ్లకు పంపుతారు.

పక్కాగా అమలు చేస్తాం : ఆర్.బాలాజీరావు డీఈవో

వంద రోజుల ప్రణాళికలో భాగంగా పదో తరగతి చదువుతున్న ప్రతి విద్యార్థి కచ్చితంగా అన్నిరోజులు బడికి వచ్చేలా చూడాలని ఉపాధ్యాయులను ఆదేశించాం. వీరికి సెలవు రోజుల్లోనూ మధ్యాహ్న భోజనం అందిస్తాం.

యువత..

మారాలి నడత

న్యూస్‌టుడే, నెల్లూరు(నేర విభాగం)

పూటుగా మద్యం తాగి రోడ్లపై జులాయిగా తిరగడం... స్నేహితులతో కలిసి రోడ్లపై బాతాఖాని వేయడం.. పుట్టిన రోజు వేడుకలంటూ అపరాత్రి వరకు జల్సాలు చేయడం... ఇదీ నగరంలో జరుగుతున్న తంతు. ఆదివారం రాత్రి ఓ ప్రైవేటు బస్సు డ్రైవరు, కండక్టరుపై అయిదుగురు బ్లేడ్లతో విచక్షణ రహితంగా దాడి చేసిన నేపథ్యంలో పోలీసులు 11 గంటల నుంచి అర్ధరాత్రి 1 గంట వరకు నాకాబందీ నిర్వహించారు. చిన్నబజారు, నవాబుపేట, సంతపేట, దర్గామిట్ట, వేదాయపాలెం, బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్లు సిబ్బందితో ఇందులో భాగస్వాములయ్యారు. వాహనాలతో పాటు ప్రధాన కూడళ్ల, రద్దీ ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. రోడ్లపై ఎందుకు తిరుగుతున్నారు? అందుకు కారణాలు ఏమిటి? అన్నది ఆరా తీయడంతో పాటు గుర్తింపు కార్డులు పరిశీలించారు. మద్యం మత్తులో తిరుగుతున్న, స్నేహితులతో కలిసి వాహనాల్లో దూసుకువెళుతున్న సుమారు 79 మంది యువకులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. సోమవారం ఉదయం తల్లిదండ్రులను పిలిపించి.. కౌన్సెలింగ్ చేసి పంపించారు.

స్టేషన్	అదుపులోకి
చిన్నబజారు	5
నవాబుపేట	21
సంతపేట	13
దర్గామిట్ట	10
వేదాయపాలెం	6
బాలాజీనగర్	24

కొనసాగిన ప్రత్యేక డ్రైవ్

నెల్లూరు(నేర విభాగం): సోమవారం రాత్రి కూడా పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. కాగా ఆదివారం తనిఖీల్లో బహిరంగ మద్యపానంపై 24, డ్రంక్ అండ్ డ్రైవ్‌పై 45, ర్యాష్ డ్రైవింగ్‌పై 11 కేసులు నమోదు చేశారు. 213 కేసులు నమోదు చేసి రూ.1,69,480 జరిమానా విధించారు.

S.B.V.R. అగ్రికల్చరల్ కళాశాల, బద్వేలు
ఇంటర్మీడియట్ నందు Bi.P.C విభాగంలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు చివరి అవకాశం. కడప జిల్లా బద్వేలులో I.C.A.R., NEW DELHI వారిచే గుర్తింపు పొందిన S.B.V.R. అగ్రికల్చరల్ కాలేజ (S.B.V.R. A.G.B.Sc), నందు B.Sc (Hons.) Agricultureలో అడ్మిషన్ కొరకు ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకున్నా చేసుకోకపోయినా కన్వీనర్ కోటాలో అగ్రికల్చరల్ బి.ఎస్సి చేరుటకు చిట్ట చివరి అవకాశం కలదు.
వివరములకు సంప్రదించవలసినది : 94400 33523, 91825 05395, 94928 56652.
కరెస్పాండెంట్, S.B.V.R. అగ్రికల్చరల్ కళాశాల

హత్య కేసులో ఏడుగురికి జీవితఖైదు

నెల్లూరు(లీగల్), అనంతసాగరం, న్యూస్‌టుడే: ఎన్నికల్లో రెండు వర్గాల మధ్య తలెత్తిన వివాదంలో రమణమ్మ అనే మహిళపై దాడి చేసి హత్య చేసిన కేసులో నేరం రుజువు కావడంతో ఏడుగురు నిందితులకు జీవిత ఖైదుతో పాటు ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున జరిమానా విధిస్తూ 8వ అదనపు జిల్లా సెషన్స్ న్యాయమూర్తి ఎంఏ సోమశేఖర్ సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. అనంతసాగరం మండలం పి.కె.పాడుకు చెందిన ఫిర్యాది కేతా నారయ్య వర్గానికి, నిందితులు వద్దిబోయిన వెంకటేశ్వర్లు, రత్నయ్య, సుబ్బారెడ్డి, సుధాకర్‌రెడ్డి, కేసరి వెంకటేశ్వరరెడ్డి, కలువాయి యల్లారెడ్డి, నాగులకుంట రమణారెడ్డిల వర్గానికి మధ్య రాజకీయ కక్షలు ఉన్నాయి. 2014లో వచ్చిన ఎంపీటీసీ సభ్యుల ఎన్నికల్లో అభ్యర్థి వద్దిబోయిన లక్ష్మీరెడ్డికి నారయ్య వర్గం మద్దతుగా నిలిచింది. ఎన్నికల్లో ఆయన గెలుపొందారు. అప్పటి నుంచి రెండు వర్గాల మధ్య రాజకీయ కక్షలు, వివాదాలు ఎక్కువయ్యాయి. ఈ క్రమంలో నారయ్య తమ్ముడు కొండయ్య గ్రామస్థుల సౌకర్యార్థం నిందితుల ఇళ్ల ముందు పబ్లిక్ స్థలంలో కుళాయిని ఏర్పాటు చేశారు. రెండో నిందితుడు రత్నయ్య దాన్ని ధ్వంసం చేశారు. దాంతో ఎంపీటీసీ సభ్యుడు లక్ష్మీరెడ్డి ద్వారా ఎంపీడీవో, ఉన్నతాధికారులకు నారయ్య వర్గం ఫిర్యాదు చేసింది. ఉన్నతాధికారులు 2014 నవంబర్ 5న విచారణ జరిపారు. రమణమ్మ కుమారుడు మల్లికార్జునరెడ్డి అధికారుల పట్ల నిందితుల వైఖరి, దౌర్జన్యాన్ని తప్పుబట్టాడు. దీంతో అక్కడే ఉన్న నిందితులు ఆగ్రహంతో మల్లికార్జునరెడ్డిపై కర్రలతో దాడికి దిగారు. రమణమ్మ కుమారుడిని రక్షించేందుకు అడ్డుపోయింది. నిందితులు ఆమెపై విచక్షణారహితంగా కర్రలతో దాడికి దిగాడు. తీవ్ర రక్తగాయాలతో ఆమె చికిత్స పొందుతూ నవంబరు 7న మృతి చెందారు. సాక్ష్యాధారాలు లేనందున 8వ నిందితుడు దుగ్గిరెడ్డి రత్నారెడ్డిపై కేసు కొట్టివేశారు.

ఉత్తరక్రియలు
గాంధేయవాది, మానవతావాది, మా తాత గారు స్వర్గీయ చింతా జయప్రకాష్‌రెడ్డి గారు
(కీ॥శే॥ చింతా వెంకటసుబ్బారెడ్డి - రమణమ్మ గార్ల కుమారుడు)
తేది: 26-11-2025 బుధవారం స్వర్గస్తులైనారు.
స్వర్గీయ చింతా జయప్రకాష్‌రెడ్డి గారు
కోవూరు
పెద్దకర్మ : తేది: 10-12-2025 బుధవారం ఉ॥ 10.30 గం॥లకు, నెల్లూరు జిల్లా, కోవూరు, కాపువీధిలోని మా స్వగృహము నందు జరుగునని తెలియజేయడమైనది. వారి ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ... శోకతప్త హృదయాలతో...
మనుమడు : జ్ఞానేష్‌రెడ్డి మరియు కుటుంబసభ్యులు
సెల్ : 79899 16006, 86396 38809

విద్యా వనం..

పనుల్లో వేగం

ప్రతిపాదిత స్థలంలో నిర్మాణాలు

వెంకటాచలం, న్యూస్‌టుడే: వెంకటాచలం మండలం చవటపాళెం వద్ద జాతీయ విద్యా పరిశోధనా శిక్షణ సంస్థ(ఎన్‌సీఈఆర్టీ) ప్రాంతీయకేంద్రం భవన నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. కేంద్రం ఏర్పాటుకు 50 ఎకరాలు కేటాయించగా- భవన నిర్మాణాలకు ప్రభుత్వం తొలి విడత రూ. 347.96 కోట్లు కేటాయించింది. టెండర్ల ప్రక్రియ ముగిసిన అనంతరం ఈ ఏడాది జులై 29న శంకుస్థాపనచేసి.. పనులు ప్రారంభించారు. ప్రహరీ నిర్మాణంతో పాటు అవసరమైన చోట బోర్లు. . భవన నిర్మాణాలకు పునాదులు వేస్తున్నారు.

అప్పుడే పూర్తి కార్యకలాపాలు

వీఆర్ కళాశాలలో తాత్కాలికంగా ఎన్‌సీఈఆర్టీ పాఠశాలతో పాటు పరిపాలనా విధులు నిర్వహిస్తున్నా.. పూర్తిస్థాయిలో కార్యకలాపాల నిర్వహణకు సాధ్యం కావడం లేదు. శాశ్వత భవనాలు పూర్తయితే.. ఆ దిశగా అడుగులు పడే అవకాశం ఉంది. ఓఎస్డీ రమేశ్‌బాబు నిర్మాణ పనులను పరిశీలిస్తుండగా.. కలెక్టర్ హిమాన్షుశుక్లా సైతం ఎప్పటికప్పుడు ఆరా తీస్తూ.. వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సూచిస్తున్నారు.

రూ. 936 కోట్లతో..

మూడు విడతల్లో.. మొత్తం రూ. 936 కోట్లతో. . శాశ్వత భవన నిర్మాణ పనులు పూర్తి చేయనున్నారు. తొలి విడత కేటాయించిన నిధులతో ప్రహరీతో పాటు పాఠశాల, అకడమిక్ భవనాలు, గ్రంథాలయం, ల్యాబ్‌లు, సిబ్బంది నివాస గృహాలు, విద్యార్థులకు వసతిగృహాలు చేపడుతున్నారు. ఇవి పూర్తయిన అనంతరం రెండు, మూడో విడత పనులు వరుసగా చేపట్టనున్నారు. తెలంగాణ, తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాలకూ ఈ కేంద్రం ఉపయుక్తం కానుంది.

జిల్లాకు మూడు డ్రైవింగ్

సామర్థ్య తనిఖీ పరీక్ష కేంద్రాలు

నెల్లూరు(పద్మావతి సెంటర్): జిల్లాలో మూడు మానవ రహిత డ్రైవింగ్ సామర్థ్య తనిఖీ పరీక్ష కేంద్రాలు ఏర్పాటు కానున్నాయి. ఇప్పటి వరకు నెల్లూరు నగరంలోని ఆర్టీవో కార్యాలయంలోనే ఈ తరహా కేంద్రం ఉండగా- నూతనంగా పది లక్షల జనాభాకు ఒకటి చొప్పున ఏర్పాటు చేయనున్నారు. వీటి బాధ్యతలను ప్రైవేటుకు అప్పగించనున్నారు. ఇప్పటికే ముగ్గురు వ్యక్తులు ఇందుకు దరఖాస్తు చేసుకోగా.. ఆసక్తిగల వారు నగరంలోని భక్తవత్సల నగర్‌లోని ఆర్టీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఉప రవాణాశాఖ డిప్యూటీ కమిషనర్ చందర్ తెలిపారు. ఎల్ఎల్ఆర్‌లు, లైసెన్సులు ఈ కేంద్రాల్లోనే ఇస్తారని ఆయన వివరించారు. వచ్చిన దరఖాస్తులను ఉన్నతాధికారులకు పంపి.. పరిశీలన అనంతరం అర్హులకు కేటాయిస్తామన్నారు. ఒక్కో కేంద్రం ప్రాజెక్టు విలువ రూ. 3 కోట్లని, ఇందులో ప్రభుత్వ రాయితీ కూడా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

లక్ష్యం..

సూపర్ స్పెషాలిటీ వైద్యం

ఈఎస్ఐ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.శ్యామ్‌బాబు

తిరుపతి, నెల్లూరు(వైద్యవిభాగం), న్యూస్‌టుడే: ఉమ్మడి రాయలసీమ, నెల్లూరు జిల్లాలకు చెందిన కార్మిక రాజ్య బీమా(ఈఎస్ఐ) కార్డుదారులు.. వారి కుటుంబ సభ్యులు సరాసరిన 20 లక్షల మందికి ఆరోగ్య భరోసా కల్పించాల్సిన బాధ్యత తిరుపతి ఈఎస్ఐ ఆసుపత్రిపై ఉందని మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మల్లి శ్యామ్ బాబు తెలిపారు. కూటమి ప్రభుత్వం, ఉన్నతాధికారుల తోడ్పాటుతో సరిపడా పడకలు, పరికరాలు, వైద్య సిబ్బందిని సమకూర్చుకుని సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నట్లు వెల్లడించారు. ఏడాదిలో తెచ్చిన మార్పులపై ‘న్యూస్‌టుడే’తో ప్రత్యేకంగా మాట్లాడారు.

రోజువారీ సేవలు ఇలా..	
పడకలు	100
ఓపీ	300–350
ఐపీ	60–70
మొత్తం కార్డుదారులు	5 లక్షలు

ఓపీని రెట్టింపు చేశాం

ప్రతి నెలా రెండు వైద్య శిబిరాలు నిర్వహించి కార్మికులకు ఈఎస్ఐపై నమ్మకం పెంచుతున్నాం. ఒకప్పుడు నెలకు 4,500 ఉన్న ఓపీని. . గత సెప్టెంబరులో 7,884కు తీసుకొచ్చాం. నవజాత శిశువులకు టీకా వేసేందుకు నేషనల్ ఇమ్యునైజేషన్ స్కీమ్‌లో చేర్చి నెలకు 275 వేసేస్థాయికి చేరాం. ఒకప్పుడు వేయికి మించని ల్యాబ్ పరీక్షలను 8వేలకు పెంచాం.

రెఫరల్ అవసరం లేకుండా...

పెద్ద శస్త్రచికిత్సలు మినహా.. ఈఎస్ఐ నుంచి అనుబంధ ఆసుపత్రులకు రోగులను పంపకుండా(రెఫరల్) ఇక్కడే సేవలు మెరుగుపరిచాం. నెలకు 200 వరకు కాన్పులు, శస్త్రచికిత్సలు చేస్తున్నాం. ట్రూనాట్ మిషన్ ద్వారా క్షయ బాధితులను గుర్తించే పరీక్షలు నిర్వహిస్తున్నాం. మందుల కొరత లేకుండా చేశాం. రోగులతోపాటు ఓ సహాయకుడికి భోజనం అందిస్తున్నాం.

ఎన్ఏబీహెచ్ సాధనే లక్ష్యం

తిరుపతి ఈఎస్ఐ ఆసుపత్రికి నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఆఫ్ హాస్పిటల్స్ (ఎన్ఏబీహెచ్) గుర్తింపు వస్తే మెడిసిన్, గైనకాలజీ, ఆర్థో, జనరల్ సర్జరీ విభాగాలకు పీజీసీట్లు.. నిధులు మంజూరవుతాయి. తద్వారా పడకల పెంపు, ఆసుపత్రి అభివృద్ధి సాధ్యమవుతుంది. సీటీ స్కాన్ కోసం విన్నవించాం.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి
లీగల్ ప్రకటనలు
ఈనాడు క్లాసిఫైడ్స్
వేడుక ఏదైనా.. ఈనాడు ను చేసుకోండి వేదిక
పదవీ విరమణ శుభాకాంక్షలు
జన్మదిన శుభాకాంక్షలు
అంత్యక్రియలు, వర్ధంతి, జయంతి
ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి
జి.ఎస్.టి. 5% అదనం
ప్రకటనల కొరకు సంప్రదించండి: 800 800 1790

(c) eenadu

సమాచార స్రవంతి

బంగారం ధరలు

గ్రాముధర: (3 శాతం జీఎస్టీ కలిసిన ధర)	రూ.12,314
సవర ధర:	రూ.98,512
వెండి గ్రాము :	రూ.188.90

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్	150
లేయర్	125
బ్రాయిలర్స్	270
బ్రాయిలర్స్కిన్‌లెస్	294
లేయర్ మాంసం	212

15,16 తేదీల్లో అంచనాల కమిటీ పర్యటన

నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: రాష్ట్ర శాసనసభ అంచనాల కమిటీ ఈనెల 15, 16 తేదీల్లో జిల్లాలో పర్యటించనున్నట్లు కలెక్టర్ హిమాన్షు శుక్లా ప్రకటనలో తెలిపారు. ఈనెల 15న సాయంత్రం నెల్లూరుకు చేరుకుని ఇక్కడే బస చేస్తారన్నారు. 16న మధ్యాహ్నం రెండు గంటలకు కలెక్టరేట్‌లో అధికారులతో 2019-20, 2020-21, 2021-22 ఆర్థిక సంవత్సరాల బడ్జెట్‌లపై సమీక్ష సమావేశం నిర్వహిస్తారన్నారు.

ANNAMACHARYA UNIVERSITY
(Estd. under AP Private Universities (Establishment and Regulation) Act, 2016)
(University listed in the UGC as per section 2(f) of the UGC Act, 1956)

Advt. No. Notification/05/2025 Dt: 09.12.2025

RECRUITMENT NOTIFICATION

We are currently looking for qualified and experienced academicians in the following disciplines. Eligible and interested candidates can apply through email: hr@annamacharyauniversity.edu.in on or before **20.12.2025.**

College / Dept.	Post	Qualification & Experience
CSE, AIML, AIDS, CSE(AI), CSE(DS), CSE (IoT & CS) & ECE	Professor / Associate Professor / Assistant Professor	Eligibility as per AICTE / UGC norms
Physics, Chemistry Mathematics, English	Assistant Professor	Ph.D./M.Sc. in relevant discipline
College of Law	Dean & Assistant Professor	Dean: LL.M & Ph.D in Law Asst. Prof: LL.M
College of Agriculture	Assistant Professors in Agriculture Economics, Plant Pathology and Horticulture	Ph.D./M.Sc. in relevant discipline ICAR NET Preferable
College of Allied Health Sciences	Assistant Professor in Anaesthesiology Technology and Operation Technology/ Medical Lab Technology / Physiotherapy	M.Sc./MPT in relevant discipline
Candidate's with M.Sc. Medical Anatomy / M.Sc. in Medical Bio-Chemistry qualifications can also submit your resumes		
Accountant/Office Assistants		Accountant: M.Com / B.Com. with relevant experience Office Assistant: Any degree from reputed Institutions
Assistant Librarian		M.Li.SC./B.Li.Sc. with relevant experience

Salary will be commensurate with the candidate's qualifications, experience, and performance. Candidates will be shortlisted based on their profiles and will be invited for an interview at **Annamacharya University** during the Fourth week of December 2025. **Sd/- REGISTRAR**

RAJAMPET, ANNAMAYYA DISTRICT-516 126, ANDHRA PRADESH, INDIA

కొలువులకు వేళ.. పుస్తకాలు లేక డీలా

మూడేళ్లుగా గ్రంథాలయాలకు సరఫరా నిలిపివేత

గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు

గ్రంథాలయాల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోంది. కనీస సౌకర్యాల మాట అటుంచితే పుస్తకాలు కూడా అందుబాటులో ఉండని పరిస్థితి నెలకొంది. జిల్లాలో మూడేళ్లుగా పుస్తకాల కొనుగోలు నిలిచిపోయింది. నిధులు లేక 2022 తర్వాత నుంచి పూర్తిగా కొనుగోలు నిలిచిపోవడంతో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

– న్యూస్‌టుడే, నెల్లూరు(మార్కెట్ సెంటర్)

జిల్లాలో..

కేంద్ర గ్రంథాలయం:	1
శాఖ గ్రంథాలయాలు:	61
గ్రామీణ.. :	2
మినీ.. :	67
ఇన్‌ఛార్జులతో నడుస్తున్నవి:	11
వసూలు కావాల్సిన పన్ను:	రూ.49 కోట్లపైనే..

రూ.89లక్షల బకాయిలు

జిల్లాలో 2022 ఫిబ్రవరిలో పుస్తకాల కొనుగోలుకు సంబంధించిన రూ.89 లక్షల బకాయిలు ఇంకా విడుదల కాలేదు. నిధులు రాకపోవడం, రావాల్సిన సెస్ బకాయిలు పేరుకుపోతుండటంతో గ్రంథాలయాలు ఆర్థిక సమస్యల్లో కూరుకుపోతున్నాయి. ప్రభుత్వం అవసరమైన పుస్తకాలను అందించాలని విద్యార్థులు కోరుతున్నారు.

నెల్లూరులోని జిల్లా కేంద్ర గ్రంథాలయానికి రోజూ 250 నుంచి 300 మంది పాఠకులు వస్తుంటారు. వీరిలో ఎక్కువగా పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులే ఉంటారు. గతంలో పాఠకులు కోరే పుస్తకాలు తెప్పించేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో లేవు. దీంతో జిల్లా గ్రంథాలయ సంస్థ అధికారులు దాతల సహకారంతో కొన్నింటిని తీసుకువచ్చి విద్యార్థులకు అందిస్తున్నారు. గత ఏడాది దాతల చేయూతతో దాదాపు రూ.40వేలు వెచ్చించి పుస్తకాలను తీసుకువచ్చారు. అయినా అవసరమైన పుస్తకాలను పూర్తిస్థాయిలో అందించలేకున్నారు. పోటీ పరీక్షలకు సంబంధించిన కొత్త పుస్తకాలు అందుబాటులో లేక ఆవేదన చెందుతున్నారు.

● దాతల సహకారంతో విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు సమకూర్చుతున్నాం. పన్ను బకాయిలు ఇప్పుడిప్పుడే వసూలు అవుతున్నాయి. ప్రభుత్వం ద్వారా పుస్తకాల కొనుగోలుకు చర్యలు తీసుకుంటున్నాం.

– కుమార్ రాజా, జిల్లా గ్రంథాలయ కార్యదర్శి

గోతులు.. పడితే ఆసుపత్రికే!

కలిగిరి- సంగం ప్రధాన రహదారిపై పాతనాపురం క్రాస్ రోడ్డు నుంచి కాలనీకి వెళ్లే రహదారి దారుణంగా ఉంది. అర కిలోమీటరు పొడవునా బావుల మాదిరి గోతులతో ప్రజలు నానాఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళల్లో ఆ మార్గంలో తిరగలేకున్నామని స్థానికులు వాపోతున్నారు.

– న్యూస్‌టుడే, కలిగిరి

ఎల్‌ఆర్‌ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ఉదయగిరి: జిల్లాలో అనధికార లేఅవుట్లు, భవన నిర్మాణాల యజమానులు ఎల్‌ఆర్‌ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలని నుడా సహాయ ప్లానింగ్ అధికారి చంద్రశేఖర్, ప్లానింగ్ సెక్షన్ పంచాయతీ కార్యదర్శి శ్రీధర్ చౌదరి పేర్కొన్నారు. ఉదయగిరి పట్టణంలో అనధికార లేఅవుట్లు, భవన నిర్మాణాలను సోమవారం పరిశీలించారు. నిబంధనలు అతిక్రమించిన వారికి నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో అన్ని మున్సిపాలిటీలు, పంచాయతీలను నుడా పరిధిలోకి చేర్చారన్నారు. గతంలో 14 శాతం ఉన్న ఫీజును ప్రభుత్వం ఏడుకు తగ్గించిందన్నారు. జిల్లాలో 473 అనధికార లేఅవుట్లను గుర్తించగా ఇప్పటివరకు 100 మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారన్నారు. అనుమతులు పొందని లేఅవుట్లు, భవన నిర్మాణాల యజమానులపై నిబంధనల ప్రకారం చర్యలుంటాయన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో మోహన్‌రావు, నుడా సర్వేయర్ గిరీష్‌కుమార్, పంచాయతీ ఈవో కరిముల్లా, సిబ్బంది పాల్గొన్నారు.

లేఅవుట్‌ను పరిశీలిస్తున్న నుడా అధికారులు

సముద్రతీరంలో కోస్టల్ సెక్యూరిటీ అధికారులు

మత్స్యకారులకు కోస్టల్ పోలీసుల అవగాహన

కావలి గ్రామీణం, న్యూస్‌టుడే: మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లినప్పుడు అప్రమత్తంగా ఉండాలని కోస్టల్ ఇన్‌స్పెక్టర్ శేషయ్య సూచించారు. సోమవారం చెన్నాయపాలెంలో జరిగిన కమ్యూనిటీ అవేర్‌నెస్ కార్యక్రమంలో పాల్గొన్నారు. సముద్రంలో కొత్త వ్యక్తులు, బోట్లు కనిపిస్తే కోస్టల్ సెక్యూరిటీకి తెలియజేయాలన్నారు. బోట్లకు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. కోస్టల్ ఇన్‌స్పెక్టర్ జానకిరామిరెడ్డి, సీఎస్‌పీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

పసుపు కొమ్ములకు విలువ జోడింపుపై శిక్షణ

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని సీటీఆర్ఐ ఆవరణలో మహిళలకు పసుపు కొమ్ముల ప్రాసెసింగ్, విలువ జోడింపుపై మూడు రోజుల శిక్షణ కార్యక్రమం సోమవారం ప్రారంభించారు. సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.ప్రసాద్ బాబు మాట్లాడుతూ పసుపు కొమ్ముల ప్రాసెసింగ్‌లో సాంకేతికతను అనుసరిస్తే నాణ్యతతో పాటు అధిక ఆదాయం పొందవచ్చని వివరించారు. గృహ విజ్ఞాన శాస్త్రవేత్త నిహారిక విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై శిక్షణ ఇచ్చారు. ప్రాసెసింగ్ యంత్రాల కొనుగోలుకు పీఎంఎఫ్ఎంఈ పథకం ద్వారా లభించే రాయితీ రుణాల గురించి ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ప్రతినిధి భానుచంద్ర వివరించారు.

మహిళలకు శిక్షణ ఇస్తున్న శాస్త్రవేత్త నిహారిక

బాధితులకు న్యాయం చేస్తాం : ఎస్పీ

నెల్లూరు(నేర విభాగం), న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ప్రతి ఫిర్యాదును పరిశీలించి విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామని ఎస్పీ అజిత వేజెండ్ల తెలిపారు. సోమవారం పోలీసు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 148 ఫిర్యాదులు వచ్చాయి. వాటిని పరిశీలించిన ఎస్పీ.. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడి తక్షణం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ సీహెచ్ సౌజన్య, నెల్లూరు(గ్రామీణ) డీఎస్పీ జి.శ్రీనివాస రావు, న్యాయ సలహాదారు శ్రీనివాసులు రెడ్డి, పీసీఆర్ సీఐ భక్తవత్సల రెడ్డి, మహిళా పోలీసు స్టేషన్ సీఐ సుబ్బారావు, ఎస్‌బీ సీఐ-1, 2 వెంకటేశ్వర రావు, శ్రీనివాస రెడ్డిలు పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో ఇలా.. తన కుమారుడి మృతిపై అనుమానం ఉందని, నీటి గుంట లేని ప్రాంతంలో నీట మునిగిపోయి చనిపోయినట్లు తెలిపారని, విచారించి న్యాయం చేయాలని టీపీ గూడూరు మండలానికి చెందిన ఓ వ్యక్తి ఫిర్యాదు చేశారు. ప్రేమిస్తున్నానని.. పెళ్లి చేసుకుంటానని చెప్పి తొమ్మిది నెలలు కలిసి తిరిగి.. ఇప్పుడు పెళ్లికి నిరాకరిస్తున్నాడని నెల్లూరు(గ్రామీణ) మండలానికి చెందిన హేమంత్‌పై వేదాయపాలెంకు చెందిన మహిళ ఫిర్యాదు చేశారు. తన కుమారుడు ఇంటి నుంచి గెంటేశాడని కావలి రెండో పట్టణానికి చెందిన ఓ వృద్ధుడు ఫిర్యాదు చేశారు.

సమస్యలు వింటున్న ఎస్పీ

ఇనాం భూముల స్థితిగతులపై నివేదిస్తాం

సంగం, న్యూస్‌టుడే: దేవాదాయశాఖ పరిధిలోని ఆలయాల్లో సేవలందించే వివిధ వృత్తుల వారికి కేటాయించిన ఇనాం భూముల స్థితిగతులను పరిశీలించి ప్రభుత్వానికి నివేదించనున్నట్లు దేవాదాయశాఖ సహాయ కమిషనర్ జనార్దనరెడ్డి తెలిపారు. సోమవారం సంగంలో పర్యటించారు. రజక, నాయీబ్రాహ్మణులకు ఇచ్చిన భూములను పరిశీలించారు. జిల్లాలోని 12 మండలాల పరిధిలో 300 ఎకరాలకు పైగా ఈ భూములున్నాయని, గతంలో రజకులు, నాయీబ్రాహ్మణులు విక్రయాలు జరిపినా, సుప్రీం కోర్టు ఉత్తర్వుల మేరకు రద్దు అయ్యాయన్నారు. ప్రస్తుతం రెవెన్యూ దస్త్రాల్లో వివరాలు, భూముల అనుభవదారుల ఇతర అంశాలను పరిశీలిస్తున్నామన్నారు. వీటిపై ప్రభుత్వం తగు నిర్ణయం తీసుకుంటుందన్నారు. సర్వేయర్ రాజా, ఆర్.ఐ సల్మా, వీఆర్వో అరుణ, దేవాదాయ శాఖ కార్యనిర్వహణాధికారి రఘురామయ్య హాజరయ్యారు.

సంగంలో సర్వేనెం ఇనాం భూమి పరిశీలిస్తున్న దేవాదాయ, రెవెన్యూ అధికారులు

నీటి సంపులో పడి ఒకరి మృతి

వెంకటాచలం : మండలంలోని సంపులో పడి ఒకరు మృతి చెందిన ఘటన మండలంలోని చెముడుగుంట పంచాయతీ బురాన్‌పూర్ వద్ద సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు నెల్లూరు నగరానికి చెందిన కంటే ప్రకాశ్‌రావు (55) బురాన్‌పూర్ వద్ద ఉన్న ఓ సైపుల కర్మాగారంలో అకౌంటెంట్‌గా పనిచేస్తున్నారు. ఉదయం విధులకు వచ్చిన ఆయన కర్మాగారంలో కనిపించకపోవడంతో తోటి ఉద్యోగులు, కార్మికులు సమీపంలో గాలించారు. కర్మాగారం వెనుక ఉన్న నీటి సంపులో మృతదేహం ఉండటాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

యువకుడి బలవన్మరణం

వరికుంటపాడు: ఐటీ ఉద్యోగం చేసే యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ప్రకాశం జిల్లా పామూరు లాడ్జిలో సోమవారం వెలుగు చూసింది. స్థానికులు, కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. మండలంలోని కనియంపాడుకు చెందిన సంకే వెంకటబాబు (33) కొన్నాళ్లుగా బెంగళూరులో సాఫ్ట్‌వేర్ సెంటర్ నిర్వహిస్తున్నారు. అప్పులు కావడంతో జీవితం మీద విరక్తి చెంది ఈనెల రెండో తేదీ బెంగళూరు నుంచి పామూరుకు చేరుకొని లాడ్జిలో ఉంటున్నారు. సోమవారం గది తలుపులు తీయకపోవడంతో అనుమానం వచ్చిన యాజమాన్యం పోలీసులకు సమాచారం అందించారు.. వచ్చి బలవంతంగా తలుపులు పగలగొట్టగా ఫ్యానుకు వేలాడుతూ కనిపించారు. కనిగిరి వైద్యశాలలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. పామూరు పోలీసులు కేసుమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అతివేగంతో సెక్యూరిటీని ఢీకొన్న జేసీ కారు

నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: జేసీ మొగిలి వెంకటేశ్వర్లు కారు డ్రైవర్ అతివేగానికి కలెక్టరేట్ సెక్యూరిటీ గార్డు కిరణ్ గాయపడ్డారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి అర్జీదారులు, ఉద్యోగులు భారీగా తరలివచ్చారు. తిక్కన ప్రాంగణం సమీపంలో సెక్యూరిటీ గార్డు విధుల్లో ఉన్నారు. కారు డ్రైవర్ జనాల మధ్య అతి వేగంగా రావడాన్ని గమనించిన సెక్యూరిటీ పక్కకు తప్పుకొనేందుకు ప్రయత్నించారు. అయినా కారు ఢీకొనడంతో పది అడుగుల దూరంలో ఎగిరిపడ్డారు. చిన్నపాటి దెబ్బలు తగలడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. జేసీ డ్రైవర్ కారు దిగి బాధితుడిని పరామర్శించలేదు. విషయం ఎక్కడ బయటపడుతుందోనని ఆ తరువాత కలెక్టరేట్‌లోకి తీసుకెళ్లి విశ్రాంతి తీసుకోవాలని ఇంటికి పంపించారు. డ్రైవర్ ఒక్కడే కాదు.. అధికారి కారు చెప్పుకొని కొందరు సిబ్బంది దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఆరోపణలున్నాయి.

ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి

ప్రాంతీయ కార్యాలయం, ఫ్లాట్ నెం. I, ప్రశాంతినగర్, పొదలకూరు రోడ్, నెల్లూరు క్లబ్ దగ్గర, నెల్లూరు - 524003. ఫోన్ నెం. 98667 76736 e-mail: ronlr-ee1@appcb.gov.in

పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ

పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం వారి ప్రకటన నెం. S.O.1533(E) తేది: 14 సెప్టెంబర్, 2006 మరియు దాని తదుపరి సవరణలో పేర్కొన్న విధముగా మెస్సర్స్ గూడూర్ మినరల్స్ ప్రైవేట్ లిమిటెడ్ వారు రూ. 65.0 లక్షల పెట్టుబడితో మొలకలపూండ్ల గ్రామం, సైదాపురం మండలం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా లోని సర్వే నెం. 793 వద్ద 10.117 హెక్టార్ల లీజ్ స్థలములో మైనింగ్ సంవత్సరమునకు మైకా - 10,305 టన్నులు, క్వార్ట్జ్ - 1,03,051 టన్నులు మరియు ఫెల్డ్‌స్పార్ - 37,098 టన్నులు తవ్వకము జరిపే ప్రతిపాదనకు సంబంధించి పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ జరపబడును అని ఇందుమూలముగా తెలియజేయడమైనది. ఈ ప్రతిపాదిత ప్రాజెక్ట్ యొక్క వివరములు దిగువ పేర్కొనబడినవి.

1	కంపెనీ పేరు చిరునామాతో	మెస్సర్స్ గూడూర్ మినరల్స్ ప్రైవేట్ లిమిటెడ్, పి.ఉదయ్ భాస్కర్ రావు, మేనేజింగ్ పార్ట్‌నర్, D.No. 27-1-1642, లక్ష్మీనగర్, బాలాజీనగర్, నెల్లూరు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా,
2	ప్రతిపాదిత ప్రాజెక్ట్ ప్రదేశం సర్వే నెం.	సర్వే నెం. 793, సైదాపురం మండలం, మొలకలపూండ్ల గ్రామం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.
3	భూమి విస్తీర్ణం	10.117 హెక్టార్లు
4	సంప్రదించవలసిన అధికారిక వ్యక్తి పేరు, చిరునామా & ఫోన్ నెం.	పి.ఉదయ్ భాస్కర్ రావు, మేనేజింగ్ పార్ట్‌నర్, D.No. 27-1-1642, లక్ష్మీనగర్, బాలాజీనగర్, నెల్లూరు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, ఫోన్ నెం. 89192 85553
5	ప్రాజెక్ట్ వ్యయం	రూ. 65.0 లక్షలు
6	కార్యకలాప వివరములు మరియు సామర్థ్యం	మైకా- 10,305 టన్నులు, క్వార్ట్జ్ - 1,03,051 టన్నులు మరియు ఫెల్డ్‌స్పార్- 37,098 టన్నుల మైనింగ్ సంవత్సరమునకు
7	బహిరంగ విచారణ తేది/ ప్రదేశం/ సమయం	తేది : 08.01.2026 సమయం : ఉదయం 11.30 గంటలకు, ప్రదేశం : ప్రతిపాదిత ప్రాజెక్ట్ సమీపంలో సర్వే నెం. 793, మొలకలపూండ్ల గ్రామం, సైదాపురం మండలం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.
8	ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన పర్యావరణ ప్రభావ అంచనా నివేదిక మరియు సంక్షిప్త సారాంశ నివేదికలు ప్రజల పరిశీలనార్థం ఈ క్రింద పేర్కొనబడిన కార్యాలయంలో అందుబాటులో ఉంచడమైనది.	
	i. కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్ వారి కార్యాలయం, నెల్లూరు, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.	
	ii. చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వారి కార్యాలయం, జిల్లా పరిషత్, నెల్లూరు	
	iii. రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ వారి కార్యాలయం, నెల్లూరు, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.	
	iv. జనరల్ మేనేజర్ వారి కార్యాలయం, జిల్లా పరిశ్రమల కేంద్రం, ఎ.కె.నగర్, నెల్లూరు.	
	v. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, పర్యావరణం, అటవీ, సైన్స్ & టెక్నాలజీ శాఖ, ఆంధ్రప్రదేశ్ సెక్రటేరియట్ కాంప్లెక్స్, బిల్డింగ్ నెం.4, గ్రౌండ్ ఫ్లోర్, వెలగపూడి, గుంటూరు జిల్లా	
	vi. జాయింట్ డైరెక్టర్ (ఎస్), వారి కార్యాలయం, పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ, ఇంటిగ్రేటెడ్ ప్రాంతీయ కార్యాలయం, విజయవాడ, గ్రీన్ హౌస్ కాంప్లెక్స్, విజయవాడ- 520010.	
	vii. మెంబర్ సెక్రటరీ వారి కార్యాలయం, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, పర్యావరణ్ భవన్, APIIC కాలనీ రోడ్, గురునానక్ కాలనీ, ఆటోనగర్, విజయవాడ - 520007.	
	viii. జాయింట్ చీఫ్ ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ వారి కార్యాలయం, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, జోనల్ ఆఫీస్, 3వ అంతస్తు, పర్యావరణ్ భవన్, N.T. రోడ్, తిరుపతి - 517501	
	ix. ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ వారి కార్యాలయం, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, ప్రాంతీయ కార్యాలయం, ఫ్లాట్ నెం. 1, ప్రశాంతినగర్, పొదలకూరు రోడ్, నెల్లూరు క్లబ్ దగ్గర, నెల్లూరు - 524003.	
	x. తహసిల్దార్ వారి కార్యాలయం, మండల రెవెన్యూ కార్యాలయం, సైదాపురం మండలం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా	
	xi. మండల ప్రజా పరిషత్ అభివృద్ధి ఆఫీసర్ వారి కార్యాలయం, సైదాపురం మండలం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా	
	xii. పంచాయితీ సెక్రటరీ వారి కార్యాలయం, మొలకలపూండ్ల గ్రామం, సైదాపురం మండలం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా	

కేంద్ర పర్యావరణ మరియు అటవీ మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం వారి మరియు దాని తదుపరి సవరణలో పేర్కొనబడిన విధంగా ఈ ప్రతిపాదిత కార్యకలాపాల వలన స్థానభ్రంశం చెందువారు, పర్యావరణపరంగా ఇబ్బందులు ఎదుర్కొనువారు తమ అభిప్రాయాలు, సలహాలు, సూచనలు లేక అభ్యంతరములు ఈ ప్రకటన వెలువడిన 30 రోజుల లోపు లిఖిత పూర్వకముగా క్రింద సంతకందారునకు తెలియపరచమని కోరడమైనది మరియు పైన పేర్కొనబడిన వేదిక, తేది, సమయము నందు జరుగు ప్రజాభిప్రాయ సేకరణలో స్వయంగా పాల్గొని తమ అభిప్రాయములను తెలియజేయవచ్చును.

ప్రదేశం : నెల్లూరు
తేది : 08.12.2025

సం/- ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, ప్రాంతీయ కార్యాలయం, నెల్లూరు.

EENADU Classifieds

EDUCATION

DISTANCE EDUCATION

10th/Inter, BA, B.Com, B.Sc, BBA, BCA, BLIS, MA,M.Com, M.Sc, MCA, MBA,MLIS, Dip, B.Tech, M.Tech, M.Phil, Ph.D., BNYS, BPT, LLB, BA LLB, D.Pharmacy, B.Pharmacy, 9030030125

REAL ESTATE

HOUSE FOR SALE

B.V.నగర్ RTO ఆఫీసు, పోలేరమ్మగుడి దగ్గర, తూర్పుఫేస్, ఉడ్‌వర్క్ గల 17.5 అం|| స్థలం 33 అం|| కట్టుబడి G+1 (రెండు 2BHK హౌసెస్) అమ్మబడును. Contact ✆ 98493 98031

PLOT FOR SALE

నెల్లూరు, మూలాపేట, గొల్లవీధి మొదట్లో 12 అం|| స్థలం (పాత కట్టుబడి) అంకణం: 3,25,000/-.లకు అమ్మబడును. సంప్ర|| ✆ 91008 26595, 98666 92102

JOBS

Wanted Male Marketing Staff (Incharges and Executives), Administrative staff and Female Telecallers. Salary: 10000/- to 25000/-. Qualification any Degree, Age limit: 25 to 45 years. Working location: Master Minds College, Nellore. Contact Number : 89784 80430.

నెల్లూరు హైవే దగ్గర గల ప్రముఖ రెస్టారెంట్‌లో పనిచేయుటకు అనుభవంగల వెయిటర్స్, కెప్టెన్స్ (Male/Female) కావలెను. జీతం: 18,000/-. ✆ 9858598555

అమెరికాలో 1 సం|| బాబు ఆలన, పాలన వ్యక్తిగత సంరక్షణ కొరకు అనుభవంగల ఆడవారు కావలెను. అమెరికా వీసా కల్గినవారు మాత్రమే. ✆ 9440803362

ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీలో పనిచేయుటకు అందమైన, కంప్యూటర్ నాలెడ్జ్ కలిగిన టెలికాలర్ కావలెను. ✆ 99595 90545, 70951 99909

B.Com, M.Com, చదివిన వాళ్ళు, CA ఇంటర్, CMA ఇంటర్ లేటెస్ట్ పాస్ అభ్యర్థులు నెల్లూరులో ఆడిటర్ ఆఫీసులో పనిచేయుటకు కావలెను. ✆ 99497 98044

MARKETING/ SALES

35000 శాలరీ, స్టార్టప్ కంపెనీకి హైదరాబాద్‌లో పని చేయుటకు HR ఫీల్డ్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ కావలెను, బైక్ & హిందీ తప్పనిసరి. ✆ 9963630236

అధిక స్పందనలు పొందండి. వాహనాలు అమ్మకం, ఉద్యోగాల భర్తీ, ఇళ్లు, ప్లాట్లు, స్థలాలు అమ్మకాలు, కొనుగోళ్లు, ఇళ్లు, షాపులు, ప్లాట్లు అద్దెకు మరియు అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు... B/w 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే. వివరాలకు.. నెల్లూరు 80080 01790

మీ చిన్నారులకు పుట్టినరోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి. B&W : రూ. 600 Colour : రూ. 800

ప్రకటనలపై 5% GST వర్తించును

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటన దారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

రీజనల్ కార్యాలయం, 2వ అంతస్థు, ఇంపీరియల్ టవర్స్, మాగుంట లేఔట్, SPSR నెల్లూరు-524003

ఇ-వేలం అమ్మకం ప్రకటన (చర / స్థిరాస్తుల అమ్మకం కొరకు)

విషయం : సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూల్ 8 ప్రకారం స్థిరాస్తుల 15 రోజుల అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లో రూల్ 8(6) ప్రొవిజన్‌తో చదివే సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం స్థిరాస్తుల ఇ-వేలం అమ్మకం ప్రకటన

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, దిగువ తెలిపిన బ్రాంచ్‌ల అధీకృత అధికారి స్వాధీనంలోకి తీసుకోబడినదైన సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తాకట్టు పెట్టిన/ఛార్జి చేయబడిన ఈ కింద పేర్కొన్న స్థిర ఆస్తిని, సంబంధిత రుణగ్రహీతల నుంచి బ్యాంక్/సెక్యూర్డ్ క్రెడిటార్‌కు బకాయిపడిన మొత్తాన్ని ఈ దిగువ తెలిపిన విధంగా భవిష్యత్తు వడ్డీ మరియు లీగల్ ఇతర ఖర్చులతో కలిసి తిరిగి రాబట్టుటకు "ఎక్కడ ఎలా ఉన్నది అలాగే", "అక్కడ ఏమి ఉన్నది అదే" మరియు "అక్కడ ఏది ఉన్నా" అను ప్రాతిపదికపై తేదీ:09-01-2026, మధ్యాహ్నం 12.00 గం.ల నుంచి 5:00 గం.ల వరకు బహిరంగ ఇ-వేలం ద్వారా సెక్యూరిటీ క్రెడిటార్ విక్రయించెదరని ప్రత్యేకించి ఈ కింద పేర్కొన్న రుణగ్రహీత(లు) మరియు సాధారణ ప్రజలకు తెలియజేయడమైనది.

బివి నగర్ బ్రాంచ్, సర్వోదయ కాలేజ్ కాంపౌండ్, ఆర్టీసి బస్టాండ్ ఎదురుగా, ట్రంక్ రోడ్, SPSR నెల్లూరు-524003, ఫోన్: 76192 82679

1. ఋణగ్రహీత/ తనఖాదారు: శ్రీమతి విజయ లక్ష్మి చేగుడి, భార్య: సి.హెచ్.వెంకట కృష్ణయ్య, LIG 2-88, కె.పి.హౌసింగ్ బోర్డు కాలనీ, నెల్లూరు రూరల్, కల్లూరుపల్లి, SPSR నెల్లూరు-524004
సహ-దరఖాస్తుదారు: శ్రీ చేగూడి అనుదీప్, తండ్రి: వెంకట కృష్ణయ్య LIG 2-88, కె.పి.హౌసింగ్ బోర్డు కాలనీ, నెల్లూరు రూరల్, కల్లూరుపల్లి, SPSR నెల్లూరు-524004
బకాయి మొత్తం: తేది.08.05.2024 నాటికి రూ.16,16,388.62 పై. + తదుపరి వడ్డీ, కాస్ట్స్ & ఇతర చార్జీలు.
స్థిరాస్తి వివరములు: SPSR నెల్లూరు జిల్లా, గూడూరు రిజిస్ట్రేషన్ జిల్లా, బుజ బుజ నెల్లూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, కల్లూరుపల్లి, నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్, సర్వే నెం.4, LIG-2, ఇంటి నెం.88లో 116 చదరపు గజాల స్థలం లోని నివాస భవనం.
హద్దులు: తూర్పు: LIG-2-ఇంటి నెం.87, దక్షిణం: 20 అడుగుల రహదారి, పడమర: LIG-2-ఇంటి నెం.89, ఉత్తరం: LIG-2-ఇంటి నెం.61.
రిజర్వ్ ధర : రూ.30,00,000/- ధరావతు : రూ.3,00,000/- బిడ్ పెంపుదల మొత్తం : రూ.30,000/-

2. ఋణగ్రహీత/ తనఖాదారు: శ్రీమతి పనికి రమణమ్మ, భర్త: చెన్నయ్య డి.నెం. 20-6-218, మెక్లెన్స్ రోడ్, వీబీఎస్ కళ్యాణమండపం, కోటమిట్ట, SPSR నెల్లూరు-524001
సహ-రుణగ్రహీత: శ్రీమతి కథారి లక్ష్మి, డి.నెం.20-6-218, మెక్లెన్స్ రోడ్, వీబీఎస్ కళ్యాణమండపం, కోటమిట్ట, SPSR నెల్లూరు-524001
హామీదారు: శ్రీ కథారి రామ మస్తానయ్య, డి.నెం. 20-6-218, మెక్లెన్స్ రోడ్, వీబీఎస్ కళ్యాణమండపం, కోటమిట్ట, SPSR నెల్లూరు-524001
బకాయి మొత్తం: తేది.31.10.2025 నాటికి రూ.9,42,286.80 పై. + తదుపరి వడ్డీ, కాస్ట్స్ & ఇతర చార్జీలు.
స్థిరాస్తి వివరములు: SPSR నెల్లూరు జిల్లా, నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్, కోటమిట్ట ఏరియా, శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయం మరియు కళ్యాణ మండపం దగ్గర, మెక్లెన్స్ రోడ్, కొత్త డి.నెం.20/6/1553, పాత డి.నెం.1334, సర్వే నెం.337/2లో ఉన్న 12 అంకణాలు 6 చదరపు అడుగుల స్థలంలో నిర్మించిన జి+1 ఆర్‌సిసి నివాస భవనం శ్రీమతి పానికి రమణమ్మ, భర్త: చెన్నయ్య గారి పేరున కలదు. (రిజిస్టర్డ్ డాక్యుమెంట్ నెం.7408/1995 తేది.18.09.1995 ప్రకారం)
హద్దులు: తూర్పు: ప్లాట్ నెం.6 – ఈ దిశలో కొలత 29 అడుగులు, దక్షిణం: ప్లాట్ నెం.13, 14 – ఈ దిశలో కొలత 29 అడుగులు, పడమర: ఈ ప్లాట్‌లో మిగిలిన స్థలం – ఈ దిశలో కొలత 28 అడుగులు, ఉత్తరం: నెలపూడి శామ్యూల్ స్థలం కొంతమేర, 5 అడుగుల వెడల్పు 46 అడుగుల పొడవు ఉమ్మడి మార్గం – ఈ దిశలో కొలత 24 అడుగులు.
రిజర్వ్ ధర : రూ.18,00,000/- ధరావతు : రూ.1,80,000/- బిడ్ పెంపుదల మొత్తం : రూ.20,000/-

ఆత్మకూరు బ్రాంచ్, మెయిన్ బజార్, ఆత్మకూరు, SPSR నెల్లూరు జిల్లా-524322, ఫోన్: 95500 77092

3. ఋణగ్రహీత/ తనఖాదారు: శ్రీ షేక్ మహబూబ్ బాషా, తండ్రి: షేక్ ఖాజా రసూల్, డి.నెం.2-226ఎ, జెఆర్ పేట, ఆత్మకూరు, SPSR నెల్లూరు జిల్లా-524322
సహ-ఋణగ్రహీత: శ్రీమతి షేక్ పర్వీన్, భర్త: షేక్ మహబూబ్ బాషా, డి.నెం.2-226ఎ, జెఆర్ పేట, ఆత్మకూరు, SPSR నెల్లూరు జిల్లా-524322
సహ-పూచీదారులు: శ్రీమతి రాజా మోహన లక్ష్మి, భర్త: రాజా శ్రీనివాసరావు, మెయిన్ రోడ్, ఆత్మకూరు, SPSR నెల్లూరు జిల్లా-524322
బకాయి మొత్తం: తేది.31.10.2025 నాటికి రూ.10,28,667.59 పై. + తదుపరి వడ్డీ, కాస్ట్స్ & ఇతర చార్జీలు.
స్థిరాస్తి వివరములు: SPSR నెల్లూరు జిల్లా, ఆత్మకూరు మండలం మరియు మున్సిపాలిటీ, జె.ఆర్.పేట పొడిగింపు, కోరు మెట్ట సర్వే నెం.955-1, పట్టా నెం.680, డి.నెం.2-226ఎ లోని 136 చదరపు గజాలు లేదా 17 అంకణాలు విస్తీర్ణం గల స్థలము మరియు అందుగల నివాస భవనముతో కూడిన ఆస్తి శ్రీ షేక్ మహబూబ్ బాషా, తండ్రి: షేక్ ఖాజా రసూల్ గారి పేరున గలదు.
హద్దులు: తూర్పు: బజార్, దక్షిణం: షేక్ ఖాజా రసూల్ గారి ఖాళీ స్థలం, పడమర: బెల్దారి వెంకటేశ్వర్లు గారి ఖాళీ స్థలం, ఉత్తరం: మద్దిరెడ్డి ఆంజనేయులు గారి ఖాళీ స్థలం.
రిజర్వ్ ధర : రూ.12,20,000/- ధరావతు : రూ.1,22,000/- బిడ్ పెంపుదల మొత్తం : రూ.15,000/-

4. ఋణగ్రహీత/ తనఖాదారు: శ్రీ తూమాటి హరికృష్ణా రెడ్డి, తండ్రి: తూమాటి నారాయణ రెడ్డి, నందవరం పోస్ట్, మర్రిపాడు మండలం, SPSR నెల్లూరు-524322
శ్రీమతి మల్లేశ్వరి తూమాటి, భర్త: హరికృష్ణ రెడ్డి, నందవరం పోస్ట్, మర్రిపాడు మండలం, SPSR నెల్లూరు-524322
హామీదారు: శ్రీ శివయ్య నాగులపాటి, లైన్‌మెన్ (APSPDCL), తండ్రి: నాగులపాటి శ్రీనివాసులు రెడ్డి ఈస్ట్ స్ట్రీట్, ఆత్మకూరు, SPSR నెల్లూరు-524322
బకాయి మొత్తం: తేది.31.10.2025 నాటికి రూ.14,88,838.26 పై. + తదుపరి వడ్డీ, కాస్ట్స్ & ఇతర చార్జీలు.
స్థిరాస్తి వివరములు: SPSR నెల్లూరు జిల్లా, ఆత్మకూరు, ఆత్మకూరు పట్టణం మరియు మునిసిపాలిటీ, ఆర్.కె.స్పార్క్ సిటీ లేఅవుట్, సర్వే నెం.895-1, 896-1 మరియు 897-1, ప్లాట్ నెం.123 లోని ఆర్.కె.స్పార్క్ సిటీ లేఅవుట్‌లో 25.20 అంకణాలు లేదా 202 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న ఆర్‌సిసి రూఫ్ ఇంటి భవనం శ్రీ హరికృష్ణా రెడ్డి తూమాటి మరియు శ్రీమతి మల్లేశ్వరి తూమాటి గారి పేరున గలదు.
హద్దులు: తూర్పు: 30 అడుగుల వెడల్పు రోడ్డు, ఉత్తరం: ప్లాట్ నెం.124, దక్షిణం: 30 అడుగుల వెడల్పు రహదారి, పడమర: ప్లాట్ నెం.110.
రిజర్వ్ ధర : రూ.38,50,000/- ధరావతు : 3,85,000/- బిడ్ పెంపుదల మొత్తం : రూ.40,000/-

బ్యాంకు వారికి తెలిసిన తాకట్టు ఋణభారములు : లేవు

ఇ-వేలం తేది మరియు సమయం : 09-01-2026, మ|| 12.00 గం||ల నుండి సా|| 05.00 గం|| వరకు
(వేలము పూర్తి అగు వరకు 10 నిముషముల చొప్పున సమయం పొడిగించబడును)

వేలం విక్రయం వివరణాత్మక నిబంధనలు మరియు షరతులు రిజిస్ట్రేషన్ & లాగిన్, బిడ్డింగ్ రూల్స్ కొరకు దయచేసి వెబ్‌సైట్: https://baanknet.com మరియు https://www.unionbankofindia.co.in/auction-property/view-auction-property.aspx ను సందర్శించగలరు.

తేది: 08.12.2025, ప్రదేశం: నెల్లూరు సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

(c) eenadu

కావలి

•కావలి • ఉదయగిరి • కందుకూరు

పీ-4తో మెరుగైన సమాజం: ఆర్డీవో

కావలి, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న పీ-4 కార్యక్రమంతో మెరుగైన సమాజానికి బాటలు పడుతున్నాయని కావలి ఆర్డీవో ఎం.సన్నీవంశీకృష్ణ అన్నారు. సోమవారం పట్టణంలో రెడ్‌క్రాస్ విపత్తుల సహాయ విభాగం కన్వీనర్ జనిగర్ల మనోహర్ పేదలకు అందజేసిన నిత్యావసరాల పంపిణీని ప్రారంభించారు. ప్రతినిధులు బెజవాడ రవికుమార్, ప్రసన్నకుమార్, డాకారపు రవిప్రకాశ్, కలికి శ్రీహరిరెడ్డి, గాదిరెడ్డి హరనాథ్, హరినారపరెడ్డి పాల్గొన్నారు.

రెవెన్యూ డివిజన్ చేయాలి

ఉదయగిరి, న్యూస్‌టుడే : నియోజకవర్గంలోని ఎనిమిది మండలాలను కలిపి ఉదయగిరి కేంద్రంగా రెవెన్యూ డివిజన్ చేయాలని విశ్రాంత ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఉదయగిరి తహసీల్దారు షాజియాకు సోమవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జేవీవీ నాయకులు, విశ్రాంత ఉపాధ్యాయులు, ఉద్యోగులు షేక్ ఎండీ బాషా, దస్తగిరిఅహ్మద్, గౌస్, జిలానీ, మజీద్, జమీర్, జాఫర్‌మొహిద్దీన్ పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణపై అవగాహన

ఉదయగిరి, న్యూస్‌టుడే : ద్విచక్ర వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రాణ రక్షణ పొందాలని సీఐ వెంకట్రావు పేర్కొన్నారు. స్థానిక విద్యుత్తు శాఖ ఉప కేంద్రం కూడలి 167 బీజీ జాతీయ రహదారిపై సోమవారం వాహనచోదకులకు అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించి వెళుతున్న వారిని అభినందించారు. కార్యక్రమంలో ఎస్సై ఇంద్రసేనారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM)

కావలి : 80080 51666, 91548 46698
కందుకూరు:70939 81624, ఉదయగిరి : 80085 73944

సమస్య: మా గ్రామంలో ఎస్సీ కాలనీకి వెళ్లే రోడ్డు పక్కన పాఠశాల సమీపంలో వీధి దీపం వెలగడం లేదు. - కోటయ్య, అంకభూపాలపురం

సమాధానం: పరిశీలించి వెలిగేలా మరమ్మతులు చేయిస్తాం. -గణేష్, పంచాయతీ కార్యదర్శి - వలేటివారిపాలెం, న్యూస్‌టుడే

? మాగ్రామంలోని దళితవాడలో తాగునీరు సక్రమంగా రావడం లేదు. - కోటయ్య, అల్లూరు

✓ పరిశీలించి చర్యలు తీసుకుంటాం. -ఉమామహేశ్వరరావు, కమిషనర్, అల్లూరు నగర పంచాయతీ - అల్లూరు, న్యూస్‌టుడే

? మాగ్రామంలోని ప్రధాన వీధిలో మురుగు నీరు నిల్వ కావడంతో పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. -ముకేశ్, మిట్టపాలెం

✓ కాలువలో పూడిక తీయించి నీరు నిల్వ కాకుండా చూస్తాం. - నరేశ్, పంచాయతీ కార్యదర్శి - గుడ్లూరు, న్యూస్‌టుడే

? కమ్మవారిపాలెం- లక్ష్మీపురం వెళ్లే మార్గంలో రహదారిపై నీరు నిలిచిపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. -రవి, సానికుడు

✓ పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. - హజరత్, పీఆర్ ఏఈ -దుత్తలూరు, న్యూస్‌టుడే

? ఉప్పలపెంట రోడ్డు నుంచి పాపిరెడ్డి చెరువు కట్ట కాలువ తవ్వారు. - రామేశ్వరయ్య, రైతు, కావలి

✓ ప్రతిపాదనలు పంపించి నిధులు మంజూరైతే కాలువ పనులకు కృషి చేస్తాం. - కిరణ్, ఏఈ, కావలి - న్యూస్‌టుడే, కావలి

? మా ప్రాంతంలో కోతుల బెడద ఎక్కువగా ఉంది. -ఇంటూరి రమణయ్య, ముసునూరు

✓ సమస్య పరిష్కరించేలా చూస్తాం. - ఎం.సన్నీవంశీకృష్ణ, ఆర్డీవో, కావలి

? కావలి నుంచి తిరుపతికి ఉదయం 6.15 గంటలకు వెళ్లే బస్సును రిజర్వేషన్ సౌకర్యం కల్పించాలి. - శ్రీనివాసరావు, రాజ వీధి

✓ పరిశీలించి చర్యలు తీసుకుంటాం. - షేక్ షమీమ్, ఆర్ఎం, ఆర్టీసీ - కావలి, న్యూస్‌టుడే

ఉపన్యాసంలో మెరిసి.. బహుమతులు గెలిచి

కావలి, న్యూస్‌టుడే: పట్టణంలోని క్రాంతి ఉన్నత పాఠశాలలో సోమవారం 'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. వీటిలో భాగంగా 'విద్యార్థులపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై ఉపన్యాస పోటీలు నిర్వహించారు. బాలలు ఉత్సాహంగా పాల్గొన్నారు. వీటిలో కేవీ సూర్యతేజ, జ్యోతి అభిలేష్‌కుమార్, జీ.వంశీ విజేతలుగా నిలిచారు. వారికి ప్రిన్సిపల్ సుజాత బహుమతులు అందజేశారు.

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఉన్నత పాఠశాల ప్రిన్సిపల్

వైభవం.. పాశుపత మహాయజ్ఞం

యజ్ఞంలో పాల్గొన్న భక్తులు

దగదర్తి : గ్రామంలోని దుర్గాభవాని రామలింగేశ్వర స్వామి ఆలయంలో శ్రీకృష్ణ వాసుదేవ పాశుపత మహా యజ్ఞాన్ని భక్తులు ఆదివారం రాత్రి నుంచి సోమవారం వేకువజాము వరకు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వందలాది జంటలు పాల్గొన్నారు. వేదపండితులు విజయకుమార్ శివాచార్య ఆధ్వర్యంలో వారితో నిర్వహింపజేశారు. నిర్వాహకుడు మేకల కిషోర్ భక్తులకు ఏర్పాట్లు చేశారు.

అక్రమంగా మద్యం విక్రయించిన మహిళకు ఏడాది జైలు

సింగరాయకొండ గ్రామీణం : మండలంలోని మూలగుంటపాడు పరిధిలోని జాతీయ రహదారి వెంబడి అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మహిళకు ఏడాది జైలు శిక్ష, రూ.12 వేల జరిమానా న్యాయమూర్తి విధించారు. ఎస్సై మహేంద్ర సోమవారం తెలిపిన వివరాల ప్రకారం.. నెల్లూరు జిల్లా కందుకూరు మండలం విక్కిరాలపేటకు చెందిన విజయలక్ష్మి పొరుగు రాష్ట్రాల నుంచి మద్యం తీసుకొచ్చి అధిక ధరలకు విక్రయిస్తుంది. గత ఏడాది ఏఎస్సై మెహబూబ్‌బాషా సిబ్బందితో దాడి చేసి ఆమెను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. నిందితురాలిని సింగరాయకొండలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపర్చగా.. నేరారోపణ రుజువుకావడంతో న్యాయమూర్తి వి.లీలాశ్యాంసుందరి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. ఇటీవల మద్యం తాగి జాతీయ రహదారిపై వాహనాలు నడుపుతున్న నలుగురు వ్యక్తులకు ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు.

ఏళ్లుగా నిరీక్షణ
నెరవేరని కల
ప్రతిపాదనల్లోనే రిజర్వాయరు ఏర్పాటు

ఈనాడు పరిశీలన

వింజమూరు, న్యూస్‌టుడే: దశాబ్దాలుగా పాలకులు హామీలు ఇస్తున్నారు. ఎన్నికలు వస్తే ప్రచారాస్త్రంగా వాడుతున్నారు. ఆతరువాత మరిచిపోతున్నారు. దీంతో ప్రజలకు నీటి కష్టాలు తప్పడం లేదు. ఇదీ వింజమూరు వాసులకు తాగునీరు అందించేందుకు ప్రతిపాదించిన సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు కథ. తాగునీటి సమస్యకు సోమశిల జలాలు తీసుకురావాలని ఆరేళ్ల క్రితం వింజమూరు పట్టణ వాసులు ఉద్యమించారు. 2018 సెప్టెంబరు 24న సమ్మర్ స్టోరేజ్ సాధన సమితి పేరుతో ఏర్పడ్డారు. అక్టోబరులో నిరాహార దీక్షలు చేశారు. అక్టోబరు 14న అప్పటి ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు వచ్చి 2018 డిసెంబరు 31 లోగా ఏఎస్ పేట మండలం రాజవోలు వద్ద ఉత్తర కాలువ నుంచి వింజమూరు పాతూరు చెరువుకు నీరు తెప్పించేలా ప్రభుత్వంతో ప్రకటన చేయిస్తానని హామీ ఇవ్వగా.. దీక్ష విరమించారు.

ఆర్‌డబ్ల్యూఎస్ శాఖకు స్వాధీనం చేసిన పాతూరు చెరువు

నీరు కేటాయించినా..

సోమశిల కాలువ ద్వారా 0.0386 టీఎంసీలు పాతూరు చెరువుకు ఇచ్చేందుకు కేటాయిస్తూ 2018 నవంబరు 16న నాడు ఎమ్మెల్యే రామారావు ఉత్తర్వులు తీసుకొచ్చారు. ఈమేరకు చెరువును జలవనరుల శాఖ నుంచి ఆర్‌డబ్ల్యూఎస్‌కు బదిలీ చేస్తూ 2018 డిసెంబరు 19న ఆదేశాలు వచ్చాయి. 2018 నవంబరు 20న నెల్లూరు వచ్చిన అప్పటి, ప్రస్తుత సీఎం చంద్రబాబునాయుడు రూ.35 కోట్లు మంజూరైనట్లు ప్రకటించారు. కానీ పనులు ప్రారంభం కాలేదు. వర్షాభావంతో భూగర్భ జలం అడుగంటి తాగునీటి సమస్య తీవ్రమవుతుంది. 2015 నుంచి 2020 వరకు ట్యాంకర్లతో ఇళ్లకు సరఫరా చేశారు.

ఎత్తిపోతల విధానంలో ఇవ్వాలి..

తాగు, సాగు నీటి సమస్య పరిష్కారానికి సోమశిల కాలువ నుంచి ఎత్తిపోతల పథకం ద్వారా మూడు చుట్టుపక్కల ఉన్న మూడు చెరువుల్లో నీరు నింపి వెయ్యి ఎకరాలకు ఇవ్వాలని ఐడీసీ అధికారులు గతంలో పరిశీలించారు. ఈమేరకు ఉత్తర కాలువను వెడల్పు పెంచే పనులు జరుగుతున్నందున నీటి లభ్యతపై అధికారులు కొన్నాళ్ల క్రితం పరిశీలించారు. ఉత్తర కాలువ మండలం ఆరవేడు సమీపంలో సోమశిల కాలువ వద్ద నీటిని ఎత్తిపోతల ద్వారా పంపింగ్ పాయింట్లు ఏర్పాటుకు పరిశీలించారు. అక్కడి నుంచి వింజమూరు కొండ వరకు ఎత్తిపోసి కాలువల ద్వారా చెరువులకు అందించాలని ప్రతిపాదన చేశారు. ఇదీ కార్యరూపం దాల్చలేదు.

హామీ అమలుచేయాలి

ఎన్నికలప్పుడు నాయకులు సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ సాధిస్తామని హామీలు ఇస్తున్నారు. అనంతరం పట్టించుకోవడం లేదు. వెంటనే సోమశిల ఉత్తర కాలువ పోతున్నా నీరందే అవకాశం లేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి మా కల నిజం చేయాలి. - వడ్లమూడి రవికుమార్, వింజమూరు

ప్రతిపాదనలు లేవు

పట్టణంలో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు ఏర్పాటు గతంలో ప్రతిపాదనలు చేసినమాట వాస్తవమే. తాజాగా ఈ విషయమై ఎలాంటి ప్రతిపాదనలు లేవు. జల్‌జీవన్ పథకంలో ద్వారా ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటుచేసి తాగునీరందించే పథకం మంజూరైంది. - బి.భావనారాయణ, డీఈ, ఆర్‌డబ్ల్యూఎస్

యూటీఎఫ్ బాధ్యుడిగా సూర్యనారాయణ

గుడ్లూరు, న్యూస్‌టుడే: ఐక్య ఉపాధ్యాయ సంఘం (యూటీఎఫ్) మండల బాధ్యుడిగా సాలి సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా మక్కెన రమేశ్ ఎంపికైనట్లు గౌరవాధ్యక్షుడు యర్రజొన్న మాల్యాద్రి సోమవారం తెలిపారు. సహాధ్యక్షులుగా బీవీఎల్ఎన్ మూర్తి, ప్రసన్నకుమారి, కోశాధికారిగా చల్లా శ్రీనివాసులు, జిల్లా కౌన్సిలర్లుగా శ్రీనివాసులరెడ్డి, మధుసూదన్‌రావు, జ్యోతికుమారి, సుధాకరరావు, టీపీ మాల కొండయ్య వీరంరాజు, మురళి, చిన్నకొండయ్య, వరమునికుమార్, ప్రసూన తదితరులు ఎంపికయ్యారు. ఉదయగిరి : స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో నూతనంగా ఎంపికైన యూటీఎఫ్ కార్యవర్గ సభ్యులు ఎంఈవోలు వెంకటేశ్వర్లు, శ్రీనివాసులును కలిశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఎంఈవోలకు లగేజీ బ్యాగులు అందజేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ చంద్రశేఖర్‌రెడ్డి, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సురేష్, మహమ్మద్‌హనీఫ్ పాల్గొన్నారు.

సర్వేలు ఎప్పటికప్పుడు పూర్తి చేయాలి

కందుకూరు గ్రామీణం,న్యూస్‌టుడే: సచివాలయ సిబ్బంది క్షేత్రస్థాయిలో ప్రభుత్వ సర్వేలను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారి పి.శ్రీనివాస్ సూచించారు. సోమవారం మండలంలోని కొండముడుసుపాలెం సచివాలయాన్ని తనిఖీ చేశారు. సిబ్బంది హాజరుపట్టిక, మూవ్‌మెంట్ రిజిస్టర్, సర్వేల తీరును పరిశీలించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి హనుమంతరావు, సిబ్బంది ఉన్నారు.

ఆర్థిక సాయం అందజేత

కలిగిరి, న్యూస్‌టుడే: మండలంలోని పడమటిగుడ్డిపాడు ఎస్సీ కాలనీలో అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సూచనలతో కాకర్ల ఛారిటబుల్ ట్రస్టు తరఫున రూ.10 వేల ఆర్థిక సాయాన్ని సోమవారం ఆ ట్రస్టు సభ్యులు, తెదేపా నాయకులు అందజేశారు. విద్యుత్తు షార్ట్ సర్క్యూట్‌తో బుట్టి శ్రీనువాసులు ఇల్లు ఇటీవల పూర్తిగా కాలిపోయింది. ఈ విషయం తెలిసిన ఎమ్మెల్యే వారికి సాయం అందించారని తెదేపా నాయకులు రాధాకృష్ణ, రమేష్ తెలిపారు.

కాలనీలో సౌకర్యాల కల్పనకు చర్యలు

దగదర్తి : మండలంలోని తడకలూరు గిరిజన కాలనీలో సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం మండలంలోని తడకలూరు గిరిజన కాలనీలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బురద కాదిది.. తాగునీరు

ఇది మడుగు అనుకుంటే పొరపాటే. పట్టణంలోని ప్రజలకు సరఫరా అయ్యే తాగునీరు. పైపులైన్ లీకు కావడంతో ఇలా వస్తోంది. పట్టణంలోని బుడమగుంట రైల్వే గేటు వద్ద కనిపించిన ఈ దృశ్యాన్ని 'న్యూస్‌టుడే' క్లిక్‌మనిపించింది. పురపాలక డీఈఈ సాయిరాం స్పందిస్తూ సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని వివరించారు. - కావలి, న్యూస్‌టుడే

ఒట్టు.. ఇది సిమెంటు రోడ్డే !

ఇది సిమెంటు రోడ్డే. మండలంలోని శ్రీరామపురంలో దళిత కాలనీ రోడ్డు వర్షాలకు ఇలా తయారైంది. దశాబ్దం క్రితం 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.10 లక్షలతో దీన్ని నిర్మించారు. శ్రీరామపురం - చవటపుత్తేడు ప్రధాన రహదారి కన్నా తక్కువ ఎత్తులో ఉండడంతో నీరంతా దీనిపైగా ప్రవహిస్తోంది. దీనిపై ఎంపీడీవో వెంకటేశ్వరు మాట్లాడుతూ చర్యలు తీసుకుంటానని తెలిపారు. - దగదర్తి, న్యూస్‌టుడే

బావి.. చూడకుంటే ప్రమాదమే!

దుత్తలూరు- వింజమూరు మార్గంలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలో 167 బీజీ రహదారి పక్కనే బావి ఉండడంతో ఏ క్షణాన ఏప్రమాదం జరుగుతుందోనని వాహనచోదకులు భయభ్రాంతులకు గురవుతున్నారు. గుత్తేదారులు రక్షణ చర్యలు తీసుకోకపోవడంపై ప్రజలు మండిపడుతున్నారు. ఈవిషయమై ఎన్‌హెచ్‌ఐ డీఈ నాగిరెడ్డి మాట్లాడుతూ పరిశీలించి చర్యలు తీసుకుంటామని వివరించారు. - దుత్తలూరు, న్యూస్‌టుడే

ట్యాంక్ ఉన్నా తాగునీరు రాదన్నా..

మండలంలోని శింగరపాలెంలో రెండేళ్ల క్రితం జలజీవన్ మిషన్ పథకం నిధులతో నిర్మించిన మంచినీటి ట్యాంక్ నిరుపయోగంగా మారింది ఈవిషయమై ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ రాజశేఖర్ మాట్లాడుతూ గ్రామంలో నిర్మించిన అంతర్గత పైపులైనులో సమస్య ఉందన్నారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని వివరించారు. - లింగసముద్రం, న్యూస్‌టుడే

అలుగు మార్గం.. అవస్థలమయం

మండలంలోని మొగళ్లూరు చిన్నచెరువు అలుగు వద్ద కాంక్రీటు రహదారి అధ్వానంగా తయారైంది. వర్షాలకు చెరువు నిండి నీరు అలుగు ద్వారా దిగువకు ప్రవహిస్తోంది. గుడ్లూరు నుంచి నరసాపురానికి ప్రజలు ఇటుగా వెళుతుంటారు. ఈ రహదారిలో మొగళ్లూరు, చినలాటరపి, పెదలాటరపి, జానికంపేట, నరసాపురం, కావలి ప్రాంతాలకు వాహన రాకపోకలు సాగుతుంటాయి. - గుడ్లూరు, న్యూస్‌టుడే

ఉత్తర్వులు అమలు చేయాలని ఆందోళన

ధర్నా చేస్తున్న వ్యవసాయ సహకార సంఘాల సిబ్బంది

వింజమూరు, న్యూస్‌టుడే : జీవో నంబరు 36 అమలు చేయాలని వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగులు గ్రామంలోని బ్రాంచి వద్ద సోమవారం ధర్నా చేశారు. జీవో ప్రకారం వేతన సవరణలు చేసి, మధ్యంతర భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బ్యాంకు చీఫ్ మేనేజరు సీహెచ్‌వీ సుబ్బారెడ్డి, మేనేజర్ పి.నళిని, సొసైటీల సీఈవోలు మేకల రమణయ్య, ఖాజామస్తాన్, వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు. ఉదయగిరి : సమస్యలు పరిష్కరించాలని స్థానిక సహకార బ్యాంకు ఎదుట ఉదయగిరి, సీతారామపురం, దుత్తలూరు, వరికుంటపాడు, మర్రిపాడు మండలాల్లోని సొసైటీ బ్యాంకుల ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. మేనేజర్ రాజశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆయా మండలాల సీఈవోలు పోలయ్య, శ్రీనివాసులు, ఎన్.శ్రీను, ఎం.రత్తయ్య, సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న ఉద్యోగులు

చెరువు గట్లా.. బీడు భూములా!

చెరువు కట్టపై కంపచెట్లు

అల్లూరు, న్యూస్‌టుడే మండలంలోని చెరువులు అధ్వానంగా తయారయ్యాయి. వీటి పరిరక్షణకు అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. దీంతో కట్టలపై కంప చెట్లు విపరీతంగా పెరుగుతున్నాయి. అల్లూరు, రామన్న చెరువు కట్టలే ఇందుకు నిదర్శనం. వీటితో బీడు భూములుగా దర్శనమిస్తున్నాయి. చెట్ల కారణంగా కట్టలు దెబ్బతినే ప్రమాదం ఉంది. నిండుగా నీరు చేరితే పగుళ్లు ఏర్పడతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో వేలాది ఎకరాల్లో సాగు ప్రశ్నార్థకంగా మారుతోంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. చర్యలు తీసుకుంటామని జలవనరుల శాఖ ఏఈ సుధీర్ వివరించారు.

కూలితే కడగండ్లే

బిట్రగుంట, న్యూస్‌టుడే

రైల్వే శాఖకు నీరు సరఫరా చేసే ఓవర్ హెడ్ ట్యాంక్ కూలేందుకు సిద్ధంగా ఉంది. పిల్లర్లు పెచ్చులూడి ఇనుప కమ్మీలు తుప్పు పట్టాయి. బలమైన గాలులు వీస్తే పడిపోయేలా ఉంది. బిట్రగుంట రైల్వే క్రీడామైదానం, విద్యుత్తు సబ్‌స్టేషన్ సమీపంలో ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంక్ దశాబ్దాల క్రితం నిర్మించడంతో కాలం తీరింది. ఐవోడబ్ల్యూ కార్యాలయం నుంచి మూడేళ్లుగా ఏటా ప్రత్యామ్నాయ ట్యాంక్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు వెళుతున్నా ఆమోదం రాలేదని తెలిసింది. తాజాగా రూ.2.50 కోట్లతో మంచినీరు అందించే బావిలో పూడిక తీత, అక్కడి నుంచి పైప్ లైను, దెబ్బతిన్న వాటర్ ట్యాంక్ స్థానంలో కొత్తది నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపినట్లు సమాచారం. ఇంకా జాప్యం చేస్తే రైల్వే కాలనీల్లోని కార్మికులు, కార్యాలయాలు, స్టేషన్‌కు నీటి సరఫరా నిలిచిపోయే పరిస్థితి ఉంది. సంబంధిత విభాగం అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కార్మిక సంఘాలు కోరుతున్నాయి.

కూలే స్థితిలో ఓవర్‌హెడ్ ట్యాంక్

రహదారి ఆక్రమిస్తున్నారని ఫిర్యాదు

గుడ్లూరు, న్యూస్‌టుడే: గ్రామంలోని రెడ్డిపాలెం చివరి వీధిలో ఇంటి మెట్లు సిమెంటు రహదారి మీదకు నిర్మిస్తున్నారంటూ ఆ వీధివాసులు సోమవారం మండల అధికారులకు ఫిర్యాదు చేశారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని తహసీల్దారు, ఎంపీడీవో వెంకటేశ్వరరావు వారికి హామీ ఇచ్చారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో జగన్‌మోహనరెడ్డి, శంకరారెడ్డి, మాల కొండయ్య తదితరులు ఉన్నారు.

రేపు గంధ మహోత్సవం

ఉదయగిరి, న్యూస్‌టుడే : గ్రామంలోని దుర్గంపై ఉన్న అబ్దుల్ ఖాదర్ ఖాదిర్వావలి గంధ మహోత్సవం బుధవారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హక్కుదారుల ఇంటి నుంచి గంధం ఊరేగింపుగా దర్గాకు చేరుతుందన్నారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం భక్తులకు పంచిపెడతారు.

ఆలయాల్లో దొంగతనం

వరికుంటపాడు : మండలంలోని విరువూరు, మారుతీనగర్‌లలోని రామాలయాల్లో ఆదివారం అర్ధరాత్రి దాటాక దుండగులు చోరీకి పాల్పడ్డారు. గేటు తాళాలు పగలకొట్టి విరువూరు రామాలయంలోకి ప్రవేశించి హుండీని పగలకొట్టి అందులోనినగదు తీసుకెళ్లారు. అలాగే మారుతీనగర్ రామాలయంలో హుండీఎత్తుకెళ్లారు. కోటివర్ధిపల్లిలో చింతలపూడి రత్తయ్య ఇంటి వరండాలో నిద్రిస్తుండగా అతని చొక్కా జేబులో నుంచి రూ.వెయ్యి నగదుతో పాటు తలగడ దగ్గర పెట్టిన రూ. 18 వేల విలువైన చరవాణిని తీసుకెళ్లారు.

కారు చోరీ కేసులో నలుగురి అరెస్టు

వరికుంటపాడు, న్యూస్‌టుడే: కారు చోరీ చేసిన కేసులో నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు. గ్రామంలోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ఉన్న కారును దుండగులు ఆదివారం అపహరించారు. దీని యజమాని కృష్ణంపల్లికి చెందిన రాజారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కారు స్వాధీనం చేసుకొని గోపాల్, సతీష్, పాలాక్ష, సుబ్రమణ్యం అనే నిందితులను అరెస్టు చేసి సోమవారం కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్సై రఘునాథ్ తెలిపారు.

విద్యార్థులకు వసతి ఏర్పాట్ల పరిశీలన

కొండాపురం, న్యూస్‌టుడే: గ్రామంలోని బీసీ వసతి గృహ భవనం కూలే స్థితిలో ఉండడంతో పాత జూనియర్ కళాశాల భవనాలను ఉపయోగించుకునేందుకు మరమ్మతులు చేయిస్తున్నారు. ఇక్కడ మరుగుదొడ్లు అవసరమని వార్డెన్ నరసింహం ఎంపీడీవో ఆదినారాయణ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సోమవారం మరమ్మతులు, విద్యుత్తు పనులను పరిశీలించారు. పంచాయతీ సర్పంచితో మాట్లాడి మరుగుదొడ్లు, ఆవరణ చదునుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

విద్యార్థుల శ్రమదానం : విద్యార్థులు సేవాభావంతో మెలగాలని కొండాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ విజయలక్ష్మి సూచించారు. సోమవారం కళాశాల ఆవరణలో ఎన్ఎస్ఎస్ శిబిరం నిర్వహించారు. ఆవరణలోని మొక్కలు, చెత్తాచెదారం తొలగించారు. క్రీడా ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే రూ.10 వేల జరిమానా

కావలి : మద్యం తాగి వాహనాలను నడిపే వారిపై రూ.10 వేలు జరిమానా విధిస్తున్నట్లు కావలి గ్రామీణ స్టేషన్ సీఐ రాజేశ్వరరావు తెలిపారు. సోమవారం అయిదుగురిని పట్టుకుని న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచినట్లు చెప్పారు. వారి నుంచి రూ.50 వేలు వసూలు చేసినట్లు తెలిపారు.

కారణం లేకుండా సంచరిస్తే చర్యలు

అల్లూరు, న్యూస్‌టుడే : రాత్రి పది గంటల తరువాత అకారణంగా వీధుల్లో సంచరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై శ్రీనివాసులురెడ్డి హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం చట్టవిరుద్ధమన్నారు. రాత్రి సమయాల్లో ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేసినట్లు వివరించారు.

విద్యార్థులు
సమాజ సేవకులు

మొక్క నాటుతున్న విద్యార్థులు

కావలి, న్యూస్‌టుడే: పట్టణంలోని జవహర్ భారతి డిగ్రీ కళాశాల విద్యార్థులు సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. పేదల నివాస ప్రాంతాల్లో శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తున్నారు. అక్షరాస్యత పెంపుతోపాటు బాల్య వివాహాలతో కలిగే అనర్థాలపై పిల్లలున్న తల్లిదండ్రులకు ప్రత్యేకంగా సూచనలు చేస్తున్నారు. జనావాసాల్లో మొక్కల పెంపకంతో కలిగే ప్రయోజనాలను వివరిస్తున్నారు. వారితో నాటించి పెంచేలా చేస్తున్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్లు పి.నాగేశ్వరరావు, అయూబ్ అహ్మద్ ఆధ్వర్యంలో గ్రామీణుల సేవలో విద్యార్థులు సాగుతున్నారు. ఇటీవల వారం రోజుల పాటు కావలి శివారులోని పెంకుల కర్మాగార సంఘంలో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటుచేశారు.

ప్లాస్టిక్ వద్దని వివరిస్తున్నాం: హజరత్తయ్య

ఏక వినియోగ ప్లాస్టిక్‌తో దుష్పరిణామాలు ఉన్నాయి. వీటితో మానవాళి ఆరోగ్యం దెబ్బతింటుంది. భూమి, నీరు కలుషితమవుతోంది. ఈనేపథ్యంలో వీటిని వినియోగిస్తే కలిగే నష్టాలను సోదాహరణంగా వివరిస్తున్నాం. బజారుకు వెళ్లేటప్పుడు ఇంటి నుంచే వస్త్ర సంచులు తీసుకెళ్లాలని తెలియజేస్తున్నాం.

సమాజ సేవ అలవడుతోంది

గ్రామాలకు వెళ్లి సేవ చేయడంతో ఎన్నో విషయాలు తెలుస్తాయి. సమాజ సేవలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలి. తరచూ కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. పేదల కోసం చేపట్టే వైద్యశిబిరాల్లోనూ భాగస్వాములవుతున్నాం. శిబిరాలతో సేవాగుణం అలవడుతోంది.

- బీఎస్ఎస్ సాయిసుధ, బీఎస్సీ, సీబీజెడ్

మార్పు రావాలని.. : టైటస్

పేదల ప్రాంతాలను తరచూ సందర్శిస్తున్నాం. మా సూచనలు చాలా మంది పాటిస్తుండడం సంతోషం. మేము నాటిన మొక్కలను చెట్లుగా ఎదిగేలా చూస్తున్నాం. వాటి పర్యవేక్షణ గ్రామస్థులకు అప్పగించడంతో మంచి ఫలితాలు వస్తున్నాయి.

పేదల సేవలోనే తృప్తి

ప్రజలంతా వ్యక్తిగత శుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రతకు పాటుపడాలనే విషయాలను తెలియజేస్తున్నాం. శుభ్రతతో వ్యాధులకు అడ్డుకట్ట పడుతుంది. పేదలకు ఉచితంగా వైద్య సేవలందేలా చూస్తున్నాం. దీంతో తృప్తి కలుగుతోంది. - వైష్ణవి, అక్వాకల్చర్

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
కందుకూరు మెయిన్ బ్రాంచ్
వెంగమాంబ ఫంక్షన్ హాల్ ఎదురుగా, పామూరు రోడ్డు, కందుకూరు, SPSR నెల్లూరు జిల్లా-523105. ఫోన్ : 91599 16991
ఇ-మెయిల్: ubin0803049@unionbankofindia. bank

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియజేస్తూ 30 రోజుల ప్రకటన
(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క నిబంధన 6(2)/8(6) ప్రకారం)

టు:
లేటు లక్ష్మీ కాంత రెడ్డి గుండాల గారి చట్టరీత్యా వారసులు (ఋణగ్రహీత/తనఖాదారు :
1) గుండాల సుందర రామి రెడ్డి (లేటు లక్ష్మీకాంత రెడ్డి గుండాల యొక్క తండ్రి)
2) గుండాల రమా దేవి (లేటు లక్ష్మీకాంత రెడ్డి గుండాల యొక్క తల్లి)
3) గుండాల జ్యోత్స్న, భర్త: లేటు లక్ష్మీకాంత రెడ్డి గుండాల
డియర్ సార్/మేడమ్,

విషయం: సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు, 2002 క్రింద బ్యాంక్‌కు చెల్లించవలసిన బకాయి వసూలు కొరకు లేటు గుండాల లక్ష్మీ కాంత రెడ్డి గారికి చెందిన ఆస్తి అమ్మకం.

బ్యాంకు వారికి చెల్లించవలసిన బకాయి మొత్తములను నోటీసులో తెలిపిన నిర్దీతకాలంలోగా చెల్లించవలసినదిగా సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 యొక్క 13(2) సెక్షన్ క్రింద యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కందుకూరు మెయిన్ బ్రాంచ్ సెక్యూర్డ్ క్రెడిటార్ వారు మీకు డిమాండ్ నోటీసు తేది 22.08.2025 న జారీచేసినారు. అయినప్పటికీ మీరు సదరు నోటీసులో సూచించిన నిర్దీత కాలంలోగా బకాయి మొత్తము చెల్లించుటలో విఫలమైనందున సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్-2002 యొక్క 6/8 వ రూలుతో కూడిన సదరు చట్టం 13(4) సెక్షన్ క్రింద స్థిర సెక్యూర్డ్ ఆస్తులను అధీకృత అధికారి గారు ఆస్తిని తేది 28.11.2025 న స్వాధీన పరుచుకున్నారు.

సెక్యూర్డ్ ఆస్తులు స్వాధీన పరచుకున్న తరువాత కూడా మీరు బ్యాంకు యొక్క బకాయి మొత్తము చెల్లించలేదు. అందువలన ఈ నోటీసు స్వీకరణ తేదీ నుండి 30 రోజుల తరువాత బహిరంగ ఇ-వేలం నిర్వహించుట ద్వారా ఆన్‌లైన్ పద్ధతిలో దిగువ తెలిపిన ఆస్తులను విక్రయించవలసిన అవసరం ఉంటుంది. ఇ-వేలం తేదీ మరియు సమయంతో పాటు ఆస్తి యొక్క రిజర్వుధర మరియు ఇ-వేలం నిర్వహించు సర్వీస్ ప్రొవైడర్ వివరములు మీకు విడిగా తెలియజేయబడతాయి.

కాబట్టి, అమ్మకం ప్రకటన ప్రచురణ తేదీకి ముందుగా మీరు బ్యాంకు వారికి చెల్లించవలసిన బకాయి మొత్తముతో పాటు దానిపై తదుపరి వడ్డీ, బ్యాంకు వారికి సంభవించిన ఖర్చులు, ఛార్జీలు మరియు వ్యయాలు చెల్లించినచో, ఆస్తి అమ్మకంపైన తదుపరి చర్యలు చేపట్టబడవు మరియు సదరు చట్టం 13(8) సెక్షన్ పరిధిలో మీ తనఖా ఆస్తులను మీరు విడిపించుకోవచ్చును.

స్థిరాస్తి వివరములు

ఆంధ్రప్రదేశ్-523109, ప్రకాశం జిల్లా, పొన్నలూరు మండలం, సింగరబొట్లపాలెం గ్రామం, డోర్ నెం. 1-61, సర్వే నెం. 3/3A సర్వ విస్తీర్ణం 290.44 చ॥గ॥లులోని ఇంటి స్థలంతో పాటు గ్రౌండ్ ఫ్లోర్ నందు ఆర్‌సిసి రూఫ్ రెసిడెన్షియల్ భవనం లేటు గుండాల లక్ష్మీకాంత రెడ్డి, తండ్రి : సుందర రామిరెడ్డి గారికి చెందినది. హద్దులు : తూర్పు : గ్రామ పంచాయితీ రోడ్డు (కోవూరు రోడ్డు), దక్షిణం : అప్పనబోయిన తిరుపతయ్య గారి స్థలం, పడమర : వాసిపల్లి వెంకటేశ్వర రెడ్డి గారి స్థలం, ఉత్తరం : గుండాల వెంకటేశ్వర రెడ్డి గారి స్థలం.

తేది : 05.12.2025
స్థలం: కందుకూరు

సం/- అధీకృత అధికారి,
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

(c) eenadu

కోవూరు

• కోవూరు • సర్వేపల్లి • ఆత్మకూరు

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) కోవూరు :79950 67034, సర్వేపల్లి : 80085 73980, ఆత్మకూరు: 8008573949

సమస్య: అనంతసాగరం మండలం మినగల్లు ఎస్సీ కాలనీ వద్ద ప్రధాన రహదారిలో పేడ దిబ్బలను వేస్తున్నారు. వర్షాలు కురిసినప్పుడు దుర్వాసన, దోమలతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. – సుధాకర్, గ్రామస్థుడు

సమాధానం: సిబ్బందిని పంపి పేడ దిబ్బలను తొలగిస్తాం.– రమణారావు, పంచాయతీ కార్యదర్శి

? పొదలకూరు రూరల్ పరిధిలోని మర్రిపల్లి గ్రామంలో విద్యుత్తు స్తంభం కిందకు వాలి ప్రమాదకరంగా ఉంది. – వెంకటేష్, స్థానికుడు

✓ పరిశీలించిన వెంటనే స్తంభాన్ని సరి చేయిస్తాం. ఎలాంటి సమస్య లేకుండా చూస్తాం. – శ్రీనివాసులు, ఏఈ డిస్కం

? విడవలూరులోని మసీదు దగ్గర చెత్త, వ్యర్థాలు పేరుకుపోయి దోమలు ప్రబలుతున్నాయి. చర్యలు తీసుకోవాలి. – స్థానికులు

✓ సిబ్బందికి తెలిపి చెత్తను వెంటనే తొలగిస్తాం. అక్కడపారిశుద్ధ్యం మెరుగుపరుస్తాం. –జగదీష్,పంచాయతీ కార్యదర్శి

? కోవూరు మండలం వెన్నవదుగుపాడు కాలనీలోని ఇందిరమ్మ విగ్రహం వద్ద వీధి దీపాలు వెలగడంలేదు. రాత్రిళ్లు ఇబ్బందులు పడుతున్నాం. – ప్రభాకర్, స్థానికుడు

✓ మరమ్మతులు చేయించి వెలిగే ఏర్పాటు చేయిస్తాం.– శ్రీనివాసులు, ఈవోపీఆర్డీ

? కోవూరు పట్టణంలో బజారు కూడలి సమీపంలోని బుడ్డివారి వీధిలో తాగునీటి సరఫరా ఆగిపోయింది. – స్థానికులు

✓ మోటారు మరమ్మతులకు గురైంది. వెంటనే బాగు చేసి తాగునీరందిస్తాం. –శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి

? ఇటీవల కురిసిన వర్షాలకు పొదలకూరు-నెల్లూరు ప్రధాన రహదారిపై గుంతలు పడి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. వెంటనే గుంతలను పూడ్చాలి. – వెంకటేశ్వర్లు

✓ మరమ్మతులు చేయించేలా చర్యలు తీసుకుంటాం.– శ్రీనివాసులు, ర.భ. ఏఈ

? సంగంలోని తిరుమలశెట్టి గిరిజన కాలనీలో మురుగు నీటి కాలువలో పూడిక తీయించాలి. వీధుల్లో అపరిశుభ్రంగా మారాయి. – వెంకయ్య, స్థానికుడు

✓ వెంటనే పూడిక తొలగించి మురుగునీరు వీధుల్లోకి రాకుండా చేస్తాం. – ఆర్.సరసయ్య, పంచాయతీ కార్యదర్శి

? తోటపల్లిగూడూరు మండలం ఇస్కపాలెంలో రోడ్డు పక్కనే వ్యర్థాలు పడేస్తున్నారు. వెంటనే వాటి తొలగింపునకు చర్యలు తీసుకోవాలి – రామయ్య, స్థానికుడు

✓ పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం. – లక్ష్మీనారాయణ, డిప్యూటీ ఎంపీడీవో

? తోటపల్లిగూడూరు మండలం మల్లికార్జునపురం వద్ద నీటికాలువలో పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. వర్షాలు పడే సమయంలో నీటి పారుదలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి.– పరమేష్, స్థానికుడు

✓ మొక్కల తొలగింపునకు చర్యలు తీసుకుంటాం.– అలీ, ఏఈ, నీటిపారుదలశాఖ

గ్రామ సచివాలయాల్లో సాదాబైనామా భూముల క్రమబద్ధీకరణ

విడవలూరు: సాదాబైనామా ద్వారా కొనుగోలు చేసిన భూములను క్రమబద్ధీకరించుకునే గడువును 2027 డిసెంబరు 31 వరకు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని రైతులు అవకాశాన్ని వినియోగించుకోవాలని తహసీల్దార్ చంద్రశేఖర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2024 జూన్ 15వ తేదీకి ముందు అగ్రిమెంట్ ద్వారా కొనుగోలు చేసిన పట్టా భూముల సంబంధించి సరైన పత్రాలతో సమీప గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసి క్రమబద్ధీకరించుకోవచ్చని పేర్కొన్నారు.

ఓటర్ల జాబితాలో పురోగతి లేకపోతే చర్యలు

సంగం, అనుమసముద్రంపేట, న్యూస్‌టుడే: ఓటర్ల జాబితా మ్యాపింగ్ ప్రక్రియలో పురోగతి లేని పోలింగ్ కేంద్రాల సిబ్బందిపై చర్యలు తప్పవని ఆత్మకూరు ఆర్డీవో బి.పావని స్పష్టం చేశారు. సంగంలోని తహసీల్దారు కార్యాలయంలో సోమవారం సమీక్ష నిర్వహించి మాట్లాడారు. పలువురు బీఎల్వోలు ఇప్పటికీ 40 శాతం చేయలేదని, రెండురోజుల్లో వారు 50 శాతం అధిగమించాలన్నారు. 2002 ఓటర్ల జాబితా ప్రకారం ప్రస్తుత ఓటర్ల వివరాలు సక్రమంగా పరిశీలించాలని, సంబంధిత వివరాలతో తహసీల్దారులు నివేదిక ఇవ్వాలన్నారు. తహసీల్దార్ సోమ్లానాయక్ తదితరులు హాజరయ్యారు. అంతకుముందు ఏఎస్‌పేట మండల రెవెన్యూ కార్యాలయంలో బీఎల్వోలతో సమావేశం నిర్వహించారు. తహసీల్దారు అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వసతులు మరిచారు.. వెతలు మిగిల్చారు

న్యూస్‌టుడే, మర్రిపాడు(ఆత్మకూరు గ్రామీణం)

గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన కాలనీల్లో కనీస వసతులు లేక లబ్ధిదారులు నేటికీ ఇబ్బందులు పడుతున్నారు. నాడు పేదలకు స్థలాలిచ్చి, ఇళ్లు కట్టిస్తామని ప్రచారం చేసిందే తప్ప ఎక్కడా పూర్తిస్థాయిలో నిర్మించి ఇచ్చిన దాఖలాలు లేవు. అయినా కొందరు అప్పులు చేసి ఇళ్లు నిర్మించుకొన్నా.. లేఅవుట్లలో సీసీ రోడ్లు, డ్రెయిన్లు, తాగునీరు, వీధి దీపాలు వంటి వసతులు లేక నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

మర్రిపాడు లేఅవుట్‌లో మట్టి రోడ్డు

గ్రామాలకు దూరంగా..

గత ప్రభుత్వం జగనన్న కాలనీల పేరిట గ్రామీణ ప్రాంతాల్లో సెంటున్నర చొప్పున లబ్ధిదారులకు నివాస స్థలాలు కేటాయించారు. ఆత్మకూరు నియోజకవర్గంలో 5,552 మందికి ఇళ్ల పట్టాలు అందజేశారు. 90శాతం పైగా కాలనీలు గ్రామాలకు దూరంగా ఉండటంతో ఇళ్లు నిర్మించుకోవడానికి కొందరు ముందుకు రాలేదు. పునాదుల దశ దాటనివి 2134 ఉండగా, వివిధ దశల్లో 1994 ఉన్నాయి. పూర్తయినవి 622 ఉండగా.. 802 అసలు ప్రారంభానికి నోచుకోలేదు. మర్రిపాడు మండల పరిధిలో 28 లేఅవుట్లు ఏర్పాటు చేశారు. 12 చోట్ల ఇళ్ల నిర్మాణం ప్రారంభించగా, 16 చోట్ల పనులు చేపట్ట లేదు. ఇర్లపాడులో 50, నందవరంలో 34, పొంగూరులో 52 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చినా నివాసయోగ్యంగా లేకపోవడం, ఊరికి దూరంగా ఉన్నాయని వాటి వైపు చూడలేదు. ప్రస్తుతం చిట్టడవులను తలపిస్తున్నాయి. బూదవాడ, తిక్కవరం, బ్రహ్మణపల్లి, మర్రిపాడు, వాబోలు తదితర గ్రామాల్లో కొందరు నిర్మించుకున్నా అర్హత వసతులు లేక ఇబ్బందులు పడుతున్నామని లబ్ధిదారులు వాపోతున్నారు.

ఈ విషయమై మర్రిపాడు గృహ నిర్మాణశాఖ ఏఈ రవి మాట్లాడుతూ కొన్ని లేఅవుట్లల్లో వసతులు కల్పించాం. సమస్యలపై లబ్ధిదారులు తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

వసతులు కరవు

ఆయా కాలనీల్లో సీసీరోడ్లు, మురుగు కాలువల వ్యవస్థ లేదు. కొన్నిచోట్ల విద్యుత్తు దీపాలు లేకపోవడంతో సాయంత్రం 7 గంటల తరువాత బయటకు రాలేకపోతున్నామని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కంపచెట్లు, పిచ్చి మొక్కలు పెరిగి విష పురుగులకు ఆవాసాలుగా మారాయి. మరికొన్నిచోట్ల బోర్లు వేయలేదు. తాగునీటికి ఇబ్బందులు తప్పడం లేదు. వేసిన చోట మోటార్లు బిగించలేదు. విద్యుత్తు కనెక్షన్లు ఇవ్వలేదు. మట్టిదారులు కావడంతో వర్షం వస్తే చిత్తడిగా మారుతోంది. అధికారుల ఆర్భాటాలే తప్ప క్షేత్రస్థాయిలో పరిస్థితులు బాగాలేవని లబ్ధిదారులు చెబుతున్నారు.

జిల్లాలోనే కొనసాగించాలంటూ ఆందోళన

నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఐకాస సభ్యులు.. వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

రాపూరు, న్యూస్‌టుడే: సైదాపురం,కలువాయి, రాపూరు మండలాలను నెల్లూరు జిల్లాలోనే ఉంచాలంటూ తెదేపా ఆధ్వర్యంలో రాపూరులో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఎమ్మార్పీఎస్ కార్యకర్తలతో కలిసి తహసీల్దార్ లక్ష్మీనరసింహానికి వినతి పత్రం అందజేశారు. జడ్పీ ఉపాధ్యక్షురాలు చిగురుపాటి ప్రసన్న, ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి కొండాపురం వెంకటేశ్వర్లు, నాయకులు చెన్ను తిరిపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు. భాజపా నాయకులు రాపూరులో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. **కలువాయి:** కలువాయి మండలాన్ని తిరుపతి జిల్లాలో కలపొద్దంటూ స్థానికులు, ఐకాస సభ్యులు సోమవారం నిరసన చేపట్టారు. కలువాయి బస్టాండ్‌లో నల్లబ్యాడ్జీలు ధరించి రోడ్డుపై బైఠాయించి నినాదాలు చేశారు. అనంతరం గ్రామంలో ప్రజల నుంచి సంతకాలు సేకరించారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలు

గోడప్రతులు ఆవిష్కరిస్తున్న భీమతాటి వెంకటరమణయ్య తదితరులు

బుచ్చిరెడ్డిపాళెం, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి అండర్ 14 ఫెన్సింగ్ పోటీలు మంగళవారం నుంచి జరగనున్నట్లు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి భీమతాటి వెంకటరమణయ్య తెలిపారు. సోమవారం బుచ్చిరెడ్డిపాళెం పురపాలకసంఘంలో గోడప్రతులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సెయింట్ మేరీ జూనియర్ కళాశాలలో ఈనెల 9,10,11 తేదీల్లో బాల,బాలికలకు పోటీలు జరుగుతాయన్నారు.

బుచ్చిలో సినిమా చిత్రీకరణ

బుచ్చిరెడ్డిపాళెం, న్యూస్‌టుడే: బుచ్చిరెడ్డిపాళెం పురపాలకసంఘంలో బైపాస్ ప్రాంతంలో సోమవారం 'లవ్ పెటల్స్' సినిమా షూటింగ్ జరిగింది. ఈ సందర్భంగా పలు కీలకసన్నివేశాలను చిత్రీకరించారు. డైరెక్టర్ వంశీ, నిర్మాత ఆద్యారెడ్డి తదితరులు పాల్గొన్నారు. షూటింగ్‌ను తిలకించేందుకు స్థానికులు ఆసక్తిచూపారు.

జాతీయ రహదారిపై సంయుక్త పరిశీలన

జాతీయ రహదారిపై పరిశీలిస్తున్న పోలీసులు,రవాణాశాఖాధికారులు

సంగం, ఆత్మకూరు, న్యూస్‌టుడే: నెల్లూరు-ముంబయి జాతీయరహదారిపై అధికారులు సంయుక్త పరిశీలన చేశారు. జాతీయరహదారులపై ప్రమాదాలు ఎక్కువగా జరగకుండా సోమవారం ఈనాడులో 'జాతీయరహదారులపై రక్తదాహం' అనే శీర్షిక కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఎస్పీ అజిత వేజెండ్ల రహదారి స్థితిగతులపై పరిశీలనకు ఆదేశించారు. దాంతో ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్, రవాణాశాఖాధికారి రాములు, సీఐ గంగాధర్, సంగం ఎస్సై పి.రాజేష్, జాతీయరహదారుల విభాగం సిబ్బందితో కలిసి దువ్వూరు నుంచి బ్లాక్‌స్పాట్లను పరిశీలించారు. రహదారి పక్కన ముళ్లచెట్లు, పిచ్చిమొక్కలు విపరీతంగా ఉండటం గమనించారు. వెంటనే తొలగించి, వాహనాల వేగ నియంత్రణ కోసం చేపట్టాల్సిన జాగ్రత్తలు, రాత్రి వేళల్లో దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని ప్రతిపాదించారు.

యూటీఎఫ్ నూతన కమిటీ ఎన్నిక

అనుమసముద్రంపేట, న్యూస్‌టుడే: ఏఎస్‌పేట మండల యూటీఎఫ్ నూతన కమిటీ ఎన్నిక సోమవారం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా యూటీఎఫ్ కార్యదర్శి జి.గంగాధర్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. నూతన మండల కమిటీ గౌరవ అధ్యక్షుడిగా షేక్ జిలానీబాషా, అధ్యక్షుడిగా ఎస్.డి. ఫయాజ్‌అలీ, అసోసియేట్ అధ్యక్షులుగా శ్రీనివాసులు,యశోద, ఇతర సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సమావేశానికి హాజరైన సభ్యులు

జలాశయానికి 14,156 క్యూసెక్కుల వరద

అనంతసాగరం : సోమశిల జలాశయంలో సోమవారం సాయంత్రానికి ఎగువ ప్రాంతాల నుంచి 14,156 క్యూసెక్కుల వరద వస్తున్నట్లు అధికారులు తెలిపారు. జలాశయంలో 73.667 టీఎంసీల నీరునిల్వ ఉంది. -17, -18 రివర్స్ స్లూయిస్ ద్వారా 50, పవర్ టన్నల్ ద్వారా 2,600, 5వ క్రస్ట్‌గేట్ ద్వారా 4,000 క్యూసెక్కులు డెల్టాకు విడుదల చేస్తున్నారు. నాన్‌డెల్టాలైన కండలేరు వరద కాలువకు 2,000, దక్షిణ, ఉత్తర కాలువకు 200, 50 చొప్పున క్యూసెక్కులు విడుదలవుతోంది.

పాఠశాలకు కంప్యూటర్, ప్రింటర్ వితరణ

మర్రిపాడు, న్యూస్‌టుడే: : కంపసముద్రం ఉన్నత పాఠశాలకు గోపవరం కాంతారెడ్డి సోమవారం కంప్యూటర్, ప్రింటర్ అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు సుబ్బారెడ్డి దాతను సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

యూరియా.. ఏదయ్యా..!

బుచ్చిరెడ్డిపాళెం, న్యూస్‌టుడే: మండలంలోని రెండు సొసైటీల్లో వారం రోజుల నుంచి యూరియా లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా వవ్వేరు కోపరేటివ్ బ్యాంకు, రేబాల కోపరేటివ్ సొసైటీల్లో గత వారం నుంచి యూరియా లేదని రైతులు వాపోతున్నారు. ఏ రోజుకారోజే వస్తుందని అధికారులు మభ్యపెడుతున్నారన్నారు. ప్రైవేటు దుకాణాల్లో కాంప్లెక్స్ ఎరువులు కొంటేనే యూరియా ఇస్తామని చెబుతున్నారని రైతులు వాపోతున్నారు. దీనిపై ఏవో శ్రీహరి మాట్లాడుతూ బుచ్చిరెడ్డిపాళెం మండలంలో మొత్తం 1600 టన్నుల ఇండెంట్ పెట్టడం జరిగిందన్నారు. ప్రస్తుతానికి 800 మెట్రిక్ టన్నులు రైతులకు ఇవ్వడం జరిగిందన్నారు. వవ్వేరు, రేబాల సొసైటీల్లో యూరియా లేదని మంగళవారం 26 టన్నులు యూరియా వస్తుందన్నారు.

PASSPORT LOST

I, **ETUKURI SUNIL KUMAR** S/o. **ETUKURI SRINIVASULU NAIDU,** Residing at D. No. 24-2-544, Venkatadri Apartments, Opp. Ratnam School, Saraswathi Nagar, Nellore - 524004, SPSR Nellore Dt., AP. I have lost my Passport bearing No. G7251824, While I was travelling from Saraswathi Nagar to Passport Office, Near Collector Office on the way. If anyone found please inform at the above address.

ఆత్మకూరు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

E.P.No.74 / 2016
O.S.No. 2 / 2013

1. బొమ్మిరెడ్డి సావిత్రమ్మ (Died)
2. బొమ్మిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి
3. బొమ్మిరెడ్డి దశరథరామిరెడ్డి ..D.Hrs

Vs

బొమ్మిరెడ్డి కనకమ్మ ..J.Dr.

పై నెంబరున E.P.లో రావలసిన మొత్తమును రాబట్టుకొనుటకు షెడ్యూలు దాఖలా ఆస్తిని పై కోర్టులో తే: 26-12-2025దిన, ఉదయం గం॥ 10-30 ని॥ల నుండి బహిరంగముగా వేలం వేయబడును. పాడదలచుకున్నవారు పాటలో పాల్గొనవచ్చును.

షెడ్యూలు

SPSR నెల్లూరు జిల్లా రిజిస్ట్రేషన్, ఆత్మకూరు సబ్ డిస్ట్రిక్ట్, ఆత్మకూరు మండలం, బండారుపల్లి గ్రామము.

సర్వే నెం.	పూర్తి వి॥	అనుభవం	తరగతి
62	య.8-76	య.1-12	మెట్ట
63-1	య.8-26	య.0-60	మెట్ట
		1.72	ఏకప్రదేశం

పై భూమిలోని ఫిల్టర్ పాయింట్, మోటారుతో సహా హద్దులు: (తూ) J.Dr కుటుంబ భూమి, (ద) డొంక, (ప) చిట్టేపాళెం లక్ష్మమ్మ, బైనబోయిన లక్ష్మయ్య గార్ల భూమి, (ఉ) చిట్టేపాళెం కృష్ణయ్య వగైరాల భూమి.

D.Hr క్రయం Rs. 1,00,000/-
అమీనా క్రయం Rs. 5,16,000/-
S.మహదేవరెడ్డి, M.Com., L.L.B., D.Hrs అడ్వకేట్

మహారాజశ్రీ కోవూరు ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S. 199 / 2023

ఆకురాతి లత ..వాది

Vs

1. పొట్టేపాళెం శైలజ, W/o. Dr. శ్రీనివాసులు
2. పొట్టేపాళెం కృష్ణప్రియ, W/o. మేడిశెట్టి ప్రసాద్, D/o. Dr. శ్రీనివాసులు,

D.No.B-13-411, రామచంద్ర నర్సింగ్ హోమ్, బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ, SPSR నెల్లూరు జిల్లా ..ప్రతివాదులు

పై నెంబర్న వాది మీపై Specific Performance కోరుచూ దావా దాఖలు చేసియున్నందున మీకు నోటీసు నిమిత్తం తే: 16-12-2025దికి వాయిదా ఉన్నది. వాయిదా నాడు ఉ॥ 10-30 ని॥లకు మీరు గానీ, మీ తరఫు వకీలు ద్వారా గానీ పై కోర్టు ఎదుట హాజరయి మీకేమైనా ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపు కొనవలసినది. లేనియెడల మీ పరోక్షమునవిచారించి తీర్మానించబడును.

"శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు"
జి.శేషమ్మ, B.Sc., B.L.,
వాది తరఫు వకీలు.

మహారాజశ్రీ కోవూరు ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

I.A.No. 503/2023
O.S.No. 199/2023

ఆకురాతి లత ... పిటిషనరు / వాది

Vs

1. పొట్టేపాళెం శైలజ W/o Dr. శ్రీనివాసులు,
2. పొట్టేపాళెం కృష్ణప్రియ W/o మేడిశెట్టి ప్రసాద్, D/o Dr. శ్రీనివాసులు

D.No. B-13-411, రామచంద్రా నర్సింగ్ హోమ్, బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ, SPSR నెల్లూరు జిల్లా.

.. రెస్పాండెంట్లు / ప్రతివాదులు

పై నెంబర్న పిటిషనరు / వాది మీపై Specific Performance కోరుచూ పై దావా దాఖలు చేసియుండి అందులో I.A. 503/2023 నెంబర్న టెంపరరీ ఇంజంక్షన్ కోరుచూ పిటిషను దాఖలు చేసియున్నందున మీ నోటీసు నిమిత్తం తే. 16-12-2025దిన వాయిదా ఉన్నది. వాయిదా నాడు ఉదయం 10.30 ని॥లకు మీరు గాని, మీ తరఫు వకీలు ద్వారా గాని పై కోర్టు ఎదుట హాజరై మీకేమైనా ఆక్షేపణలున్న యెడల తెలుపుకోవలసినది. లేనియెడల మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు//
జి.శేషమ్మ, B.Sc., B.L.,
పిటిషనరు / వాది తరఫు వకీలు

రోడ్డు మలుపు...ప్రమాదానికి పిలుపు!

ఏఎస్‌పేట మండలంలోని పెద్దబ్బీపురం, గుడిపాడు గ్రామాలకు వెళ్లే మార్గంలో రోడ్డుకు ఇరువైపులా కంప చెట్లు పెరిగి అధ్వానంగా ఉంది. దారిలో రెండు చోట్ల మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ మార్గంలో నిత్యం ఎక్కువ మంది వాహనాలల్లో రాకపోకలు సాగిస్తుంటారు. మలుపుల వద్ద ఎలాంటి సూచిక బోర్డులు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ విషయమై ర.భ ఏఈ అమానుల్లాను సంప్రదించగా మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయిస్తామన్నారు. – న్యూస్‌టుడే, అనుమసముద్రంపేట

చినుకు పడితే.. చింతే..!

మండల పరిధిలోని లింగంగుంటలో ప్రాథమిక పాఠశాల, సచివాలయం ఒకే ప్రాంతంలో ఉన్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు ఆ ప్రాంతమంతా బురదమయంగా తయారైంది. ఉపాధ్యాయులు, విద్యార్థులు, సచివాలయ సిబ్బంది, స్థానికులు అడుగు తీసి అడుగు వేయాలంటే ఎక్కడ జారిపడతామోనని భయపడుతున్నారు. పంచాయతీ కార్యదర్శి రమణరావు మాట్లాడుతూ వర్షపు నీరు నిలవకుండా తగిన చర్యలు చేపడతామన్నారు. – న్యూస్‌టుడే, అనంతసాగరం

అదుపు తప్పితే.. అంతే సంగతులు!

కదిరినేనిపల్లి వద్ద రోడ్డు పక్కనే బావి ప్రమాదకరంగా ఉంది. వాహనదారులు ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా అందులో పడే అవకాశం ఉంది. మూడేళ్లక్రితం రూ.6.47 కోట్లతో రోడ్డు నిర్మాణం చేపట్టారు. గ్రామస్థులు బావి దగ్గర రక్షణ గోడ నిర్మించాలని గుత్తేదారుడ్ని కోరినా పట్టించుకోలేదు.– న్యూస్‌టుడే,మర్రిపాడు(ఆత్మకూరు గ్రామీణం)

రోడ్డుపై చెత్త.. పందుల స్వైరవిహారం

కోవూరు పట్టణంలో పందుల సంచారం అధికంగా ఉంది. చెత్త కుప్పల వద్ద సంచరిస్తూ ఛిన్నాభిన్నం చేస్తున్నాయి. దీంతో దుర్వాసనతో వెదజల్లడంతో పాటు దోమలు ప్రబలి వ్యాధులు వ్యాపిస్తున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కోవూరు

రైతుల ప్రయోజనాలే ధ్యేయం

ఆత్మకూరు, న్యూస్‌టుడే: రైతుల హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తుందంటూ ఏపీ రైతు సంఘం,సీపీఎం నాయకులు సోమవారం ఆత్మకూరులో నిరసన వ్యక్తం చేశారు. విత్తన, విద్యుత్తు సంస్కరణల చట్టాలు రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తాయన్నారు. జిల్లా రైతు సంఘం సహాయకార్యదర్శి ఎల్. కె ప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేటు కంపెనీలు విత్తనాలు అమ్ముకునేందుకు సులువైన చట్టాలు తయారు చేస్తుందన్నారు. ఇది ఏ మాత్రం తగదన్నారు. రైతుల ప్రయోజనాల ధ్యేయంగా పోరాటం చేస్తామన్నారు. అనంతరం జీవో ప్రతులను దహనం చేశారు. రైతు సంఘం మండల అధ్యక్షుడు కృష్ణమోహన్, నాయకులు వెంకటేశ్వర్లు, పెంచలయ్య, వెంకట్రావు శ్రీను తదితరులు పాల్గొన్నారు

పేదలకు న్యాయం చేయండి

మనుబోలు, న్యూస్‌టుడే: జట్లకొండూరు పంచాయతీలో పవర్‌గ్రిడ్ నిర్మాణం కోసం సేకరించిన భూముల్లో జరిగిన అవినీతిపై విచారణ చేపట్టి పేదలకు న్యాయం చేయాలని ఉపసర్పంచి ఆవుల తులసీరామ్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట లబ్ధిదారులతో కలిసి ఆందోళన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ 2011-12లో పవర్‌గ్రిడ్ నిర్మాణంలో భాగంగా సుమారు 120 ఎకరాలకు సంబంధించి భూసేకరణ చేశారన్నారు. ఓ నాయకుడు బినామీల పేర్లతో అవినీతికి పాల్పడటమే కాకుండా లబ్ధిదారులకు అందాల్సిన పరిహారాన్ని కూడా కాజేశారని పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఆ మేరకు తహసీల్దారు రమాదేవికి వినతిపత్రం అందజేశారు.

తుపాను బాధితుల్ని ఆదుకోవాలి

తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన చేస్తున్న సీపీఎం నాయకులు

తోటపల్లిగూడూరు, న్యూస్‌టుడే: మొంథా తుపాను బాధిత గిరిజనులకు నగదు సాయం చేస్తామని చెప్పి ఇంత వరకు ఇవ్వలేదని సీపీఎం, సీఐటీయూ మండల కార్యదర్శులు, లక్ష్మయ్య, మారుబోయిన రాజ అన్నారు. సోమవారం తుపాను సాయం పంపిణీ, రైతుల సమస్యలపై తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. దిత్వా తుపాను వల్ల నష్టపోయిన రైతులకు ఉచితంగా విత్తనాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు బండి శౌరి, చిన్నబ్బయ్య, గిరిజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

తోటపల్లిగూడూరు : తుపాను ప్రభావంతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని పాపిరెడ్డిపాళెం గ్రామంలో సోమవారం నారుమళ్లు, వరి పొలాలను ఆయన పరిశీలించారు. స్థానిక రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నష్టపోయిన రైతులకు రాయితీపై విత్తనాలు అందజేయాలనే ఆలోచన ప్రభుత్వం చేయడం లేదన్నారు. అనంతరం వైకాపా నాయకుల కుటుంబాలను పరామర్శించారు.

కత్తితో బెదిరించి బంగారం అపహరణ

వెంకటాచలం, న్యూస్‌టుడే: వృద్ధురాలిని కత్తితో బెదిరించి బంగారు నగలు అపహరించిన ఘటన సోమవారం తిక్కవరపాడులో చోటుచేసుకుంది. బాధితురాలి కథనం మేరకు తమలపాకుల సుగుణమ్మ ఇంటిలో ఒంటరిగా ఉన్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ఆమె వద్దకు వచ్చాడు. గ్రామంలో ఓ వ్యక్తి చిరునామా కావాలంటూ మాటలు కలిపాడు. అకస్మాత్తుగా కత్తి తీసి ఆమెపై దాడికి యత్నించాడు. బంగారు నగలు ఇవ్వాలని, లేకుంటే హత్య చేస్తానని బెదిరించాడు. భయాందోళన చెందిన వృద్ధురాలి అక్కడికక్కడే కుప్పకూలిపోయింది. వెంటనే దుండగుడు ఆమె శరీరంపై ఉన్న సుమారు మూడు సవర్ల బంగారు సరుడు, ఉంగరం, చెవి కమ్మలు అపహరించుకుని ద్విచక్రవాహనంపై పరారయ్యాడు. కొంత సమయానికి తేరుకున్న ఆమె గ్రామస్థులకు తెలపడంతో వారు అంతటా గాలించారు. ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పోలీసులకు భయపడి..కత్తితో గాయం చేసుకుని

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: భార్య పోలీసులకు ఫిర్యాదు చేయడంతో భయపడి భర్త తనను తానే కత్తితో పొడుచుకున్న ఘటన అన్నమయ్య జిల్లా పెనగలూరులో సోమవారం చోటుచేసుకుంది. రాపూరు మండలం గోనేపల్లికి చెందిన దొడ్డవరపు మునికృష్ణ కొన్నేళ్ల కిందట పెనగలూరుకు చెందిన శశికళను వివాహం చేసుకున్నారు. అతను మద్యానికి బానిసై భార్యను నిత్యం వేధించేవాడు. దీంతో ఆమె ఆదివారం పుట్టింటికి వెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న మునికృష్ణ పెనగలూరుకు చేరుకొని కత్తితో తనకు తానే చేతిపై గాయపర్చుకున్నాడు. అనంతరం భార్య బంధువులు దాడి చేసినట్లు ప్రచారం చేశారు. దీనిపై పోలీసులు విచారించగా కేవలం కేసుకు భయపడి ఇలా చేశానని ఒప్పుకొన్నట్లు ఎస్సై రఘురాం తెలిపారు. అనంతరం వారికి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించామని ఆయన వివరించారు.

విధుల్లో అస్వస్థత.. చికిత్స పొందుతూ మృతి

ఆత్మకూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉద్యోగి షేక్ షఫీ (41) గుండెపోటుతో మృతి చెందారు. వివరాల మేరకు నెల్లూరుపాళెంకు చెందిన ఇతను దూబగుంట విద్యుత్తు ఉపకేంద్రంలో షిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నారు. శనివారం రాత్రి విధులు నిర్వహిస్తున్న సమయంలో ఫిట్స్ వచ్చింది. దాంతో ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన సేవలకోసం ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లగా.. చికిత్స సమయంలో గుండెపోటు రావడంతో ఆయన మృతి చెందినట్లు తెలుస్తోంది.

పొలం పనులు చేస్తుండగా..

మనుబోలు, న్యూస్‌టుడే: పొలం పనులు చేస్తున్న ఓ రైతు హఠాన్మరణం చెందిన ఘటన మండలంలోని చెరుకుమూడిలో సోమవారం ఉదయం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు నీటిసంఘం మాజీ అధ్యక్షుడు ఎ.కృష్ణయ్య(70) పనులు చేసేందుకు పొలాల్లోకి వెళ్లాడు. ఒక్కసారిగా కుప్పకూలి పక్కనే ఉన్న కాలువలో పడి మృతి చెందారు.

ఆలయగోడ ధ్వంసం.. ఇద్దరి అరెస్టు

పొదలకూరు, న్యూస్‌టుడే: పొదలకూరు రామనగర్ గేటు సెంటరులో ఉన్న వినాయకుడి ఆలయ గోడను సోమవారం జేసీబీ యంత్రంతో ధ్వంసం చేయడంతో స్థానికులు అడ్డుకున్నారు. గత కొంత కాలంగా దీనిపై కోర్టు వివాదం నడుస్తోంది. ఈ నేపథ్యంలో గోడను పగుల కొట్టడంతో రాముతోపాటు జేసీబీ ఆపరేటర్‌ను ఎస్సై మహ్మద్ హనీఫ్‌లను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

అంతిమ సంస్కారానికి అగచాట్లు

అనంతసాగరం మండలం రేవూరు ఎస్సీ కాలనీకి చెందిన నోసిన బ్రహ్మయ్య(76) అనే వృద్ధుడు శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. వర్షంలోనే శ్మశానానికి తీసుకెళ్లారు. దారంతా బురదతో నిండిపోవడంతో కాలనీ వాసులు నానా ఇబ్బందులు పడ్డారు. అడుగు వేయలేని దుస్థితి నెలకొంది. దీనికితోడు శ్మశానంలో పిచ్చి చెట్లు మొలిచి ఉండడంతో అంత్యక్రియలు నిర్వహించడానికి కష్టాలు పడాల్సి వచ్చింది.

న్యూస్‌టుడే, అనంతసాగరం

కుటుంబ సభ్యులను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో మునిగిన వ్యక్తులకు మృతదేహాన్ని మరుభూమికి తీసుకువెళ్లాలంటే నానా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. దీనికితోడు శ్మశానవాటికలోని ఆవరణ లోపల, బయట ముళ్ల పొదలు, పిచ్చి చెట్లు ఏపుగా పెరిగిపోయాయి. ఎవరైనా అంత్యక్రియలు చేయాలంటే ముందుగా మృతదేహాన్ని పక్కన పెట్టి చెట్లను తొలగించి స్థలం బాగు చేసుకోవాల్సి వస్తోంది. మరికొన్నిచోట్ల సరైన దారి లేకపోవడంతో అవస్థలు తప్పడం లేదు.

సోమశిలలో పెచ్చులూడి శిథిలావస్థకు చేరిన క్రతువులు చేసుకునే షెల్టర్

పలు గ్రామాల్లో ఇలా..

అనంతసాగరం మండలంలో 25 పంచాయతీలున్నాయి. వీటిలో సగం పైనే శ్మశాన వాటికలు అధ్వానంగా ఉన్నాయి. మరికొన్ని చోట్ల అసలు వాటి ఊసే లేదు. సోమశిల గ్రామంలోని వాటికలో ముళ్లపొదలు ఏపుగా పెరిగిపోయాయి. క్రతువులు నిర్వహించే షెల్టరు పైకప్పు పెచ్చులూడి శిథిలావస్థకు చేరింది. శుభ్రం చేయాలని పంచాయతీ అధికారులకు గ్రామస్థులు ఎన్నోమార్లు విన్నవించుకున్నా పట్టించుకున్నవారే లేరు. రేవూరు గ్రామంలోనూ ఇదే పరిస్థితి ఉంది.

● కమ్మవారిపల్లి, వరికుంటపాడు, లింగంగుంట, కచిరదేవరాయపల్లి తదితర గ్రామాల్లో ప్రత్యేకంగా శ్మశానాలు లేవు. ఎవరైన మృతి చెందితే పెన్నా ఏరే దిక్కు. ఇసుకలో మృతదేహాన్ని ఖననం, దహనం చేయాల్సి వస్తోంది. వరదలు, భారీ వర్షాలు కురిసే సమయంలో అంత్యక్రియలు సక్రమంగా నిర్వహించలేని పరిస్థితి ఉంటుంది. అధికారులు ఇకనైనా స్పందించి వసతులు ఏర్పాటు చేయడంతోపాటు శ్మశాన వాటికలు లేని చోట భూమిని కేటాయించాలని ఆయా గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

శ్మశానాల అభివృద్ధికి కృషి చేస్తాం: –ఐజాక్ ప్రవీణ్, ఎంపీడీవో, అనంతసాగరం

మండల పరిధిలో శ్మశాన వాటికల్లోని సమస్యలను గుర్తించేందుకు సిబ్బందిని ఏర్పాటు చేస్తాం. కంప చెట్లను తొలగించి చదును చేయిస్తాం. ఎన్ఆర్ఈజీఎస్ కింద రహదారిని ఏర్పాటు చేసేలా చర్యలు చేపడతాం.

(c) eenadu

నెల్లూరు
• నెల్లూరు • నెల్లూరు గ్రామీణం

రోడ్లపై కట్టడాలను తొలగించాలి

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: నగరంలోని ప్రతి ఒక్క దుకాణానికి ట్రేడ్ లైసెన్సులు ఉండేలా చర్యలు తీసుకోవాలని నగరపాలకసంస్థ కమిషనర్ వైవో నందన్ ఆదేశించారు. సోమవారం నగరంలోని 12వ డివిజన్ ధనలక్ష్మీపురం ప్రాంతంలో అధికారులతో కలిసి పర్యటించారు. 54వ డివిజన్ జనార్దన్‌రెడ్డికాలనీలో రోడ్డు ఆక్రమణల తొలగింపు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. మార్జిన్ దాటి కాలువలు, రోడ్లపై నిర్మించిన కట్టడాలను పూర్తిస్థాయిలో తొలగించాలని సూచించారు. సిటీప్లానర్ హిమబిందు, డీపీ రఘునాథరావు, ఏసీపీ వేణు, ఈఈ రహంతుజానీ, సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

సమస్యలపై 48 వినతులు

నెల్లూరు(నగరపాలక సంస్థ), న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటరులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా సోమవారం కమిషనర్ వైవో నందన్ అర్జీలను స్వీకరించారు. వేదికలో 48 వినతులు వచ్చినట్లు తెలిపారు.

మూడు రోజులు తాగునీటి సరఫరాకు అంతరాయం

నెల్లూరు(నగరపాలకసంస్థ): నెల్లూరు ఆత్మకూరు బస్టాండ్ అండర్ బ్రిడ్జి కింద ఉన్న 800 ఎంఎం డయా మంచినీటి పైపులైను మరమ్మతులు చేపడుతున్నట్లు కమిషనర్ వైవో నందన్ ప్రకటనలో తెలిపారు. దీంతో హెడ్‌వాటర్ వర్క్స్ నుంచి తోటబడి సంపునకు వచ్చే మంచినీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. దీని కారణంగా మంగళ, బుధ, గురువారాల్లో 4, 5, 6, 7, 8, 9, 10, 45, 46 డివిజన్ల పరిధిలో నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు. 12వ తేదీ ఉదయం నుంచి మంచినీటి సరఫరా యథావిధిగా జరుగుతుందని నగర ప్రజలు సహకరించాలని కోరారు.

ఇంధన పొదుపుపై విద్యార్థులకు పోటీలు

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే: జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు జిల్లా స్థాయిలో నిర్వహించిన పలు పోటీల్లో విజేత విద్యార్థులకు సోమవారం నగరంలోని విద్యుత్తు భవన్‌లో బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.శ్రీధర్ మాట్లాడుతూ నెల్లూరు, కావలి, ఆత్మకూరు, కోవూరు, నెల్లూరు గ్రామీణ డివిజన్లలో ఇంధన పొదుపుపై అవగాహన కల్పిస్తూ విద్యార్థులకు క్విజ్ తదితర పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సతీష్, ఏఈ నాయక్, అశోక్, సునీల్, కిరణ్, అసిస్టెంట్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు అందించిన విద్యుత్తు శాఖ ఉన్నతాధికారులు

అరకొర బస్సులు.. అసౌకర్యాలు

ప్రధాన ఆర్టీసీ బస్టాండులో సమస్యల తిష్ఠ

నెల్లూరు ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా సౌకర్యాలు కరవయ్యాయి. ప్రాంగణం అధ్వానంగా తయారైంది. కొన్నేళ్లుగా సంస్థకు కొత్త బస్సులు రాకపోవడంతో ఉన్న వాటితోనే నెట్టుకొస్తున్నారు. అరకొర బస్సులతోనే స్త్రీ శక్తి పథకం అమలు చేయడంతో సమస్యలు తప్పడం లేదు.
– న్యూస్‌టుడే, నెల్లూరు(మార్కెట్ సెంటర్)

నీరు రాని మూత్రశాల

నెల్లూరు-1, 2 డిపోల పరిధిలో దాదాపు 250 బస్సులు ఉన్నాయి. ప్రధానంగా పర్యాటక కేంద్రాలకు వెళ్లే బస్సుల్లో రద్దీ ఎక్కువగా ఉంటోంది. రద్దీ సమయంలో గతంలో 60మంది వరకు ప్రయాణించే బస్సుల్లో పథకం అమలు తర్వాత వంద మందికి పైగా వెళుతున్నారు. ప్రయాణికుల సంఖ్య పెరిగినా ఆ మేరకు తగినన్ని బస్సులు లేవు.

కొరవడిన వసతులు

ప్రధాన బస్టాండ్‌లో సౌకర్యాల లేమితో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కుసుమూరు, పొలిరెడ్డిపాడు బస్సులు నిలిచే ప్లాట్‌ఫారం అధ్వానంగా ఉంది. గతంలో కడప బస్సులు నిలిచే ప్లాట్‌ఫారం వద్ద బస్సులు ఆగేవి. అక్కడ దూర ప్రాంతాలకు వెళ్లే బస్సుల రద్దీ పెరగడంతో కుసుమూరు, పొలిరెడ్డిపాడు వైపు వెళ్లే బస్సులను యూనియన్ కార్యాలయాల పక్కకు మార్చారు. ఇక్కడ ప్రయాణికులకు ఎలాంటి సౌకర్యాలు లేవు. ఈ మార్గంలో బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికులు ఎండకు ఎండుతూ, వానకు తడవాల్సి వస్తోంది.

నిర్వహణ లేమి

బస్టాండ్‌లోని మరుగుదొడ్లు దారుణంగా ఉన్నాయి. నిర్వహణ సరిగా లేకపోవడంతో కంపు కొడుతున్నాయి. బస్టాండ్ ఆవరణలోని బహిరంగ మూత్ర విసర్జనశాలల్లో సక్రమంగా నీరు కూడా రావడంలేదు. దీంతో ప్రయాణికులు అసౌకర్యానికి గురవుతున్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి బస్టాండులో సమస్యలు పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

వానొస్తే జలమయమే

భారీ వర్షం వస్తే బస్టాండ్ ప్రాంగణం జలమయం అవుతోంది. జీఎన్‌టీ రోడ్డుపై పడిన వర్షపు నీరు బస్టాండ్ ప్రాంగణాన్ని ముంచెత్తుతోంది. ఈ ప్రాంగణంలో ఉన్న ఒకటి, రెండు డిపోల గ్యారేజీలు ముంపునకు గురవుతుంటాయి. దిత్వా తుపాన్ ప్రభావంతో కురిసిన వర్షానికి గ్యారేజీలోని జనరేటర్ రూమ్‌లోకి నీరు ప్రవేశించింది. అయితే వర్షం ఆగిపోయినపుడు కాలువల ద్వారా నీరు వెళ్లిపోతున్నా ప్రాంగణం బురదమయంగా మారుతోంది.

ప్రతిభతో ప్రశంసలు

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే: నగరంలోని ఆదిత్య జూనియర్ కళాశాలలో సోమవారం 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో విద్యార్థులకు 'ప్రతిభా పాటవ పోటీలు' నిర్వహించారు. కృత్రిమ మేధ(ఏఐ) వల్ల భవిష్యత్తులో వచ్చే మార్పులపై కళాశాల విద్యార్థులకు ఉపన్యాసం(స్పీచ్) పోటీలు జరిగాయి. ఎం.సోనియా ప్రథమ, పి.జాబ ప్రవళిక ద్వితీయ, బి.మౌనిక తృతీయ బహుమతులు సాధించారు. వీరికి కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి, అధ్యాపకులు బహుమతులు ప్రదానం చేశారు.

బహుమతులు అందుకుంటున్న ఆదిత్య కళాశాల విద్యార్థినులు

గడువులోపు అర్జీలకు పరిష్కారం

నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. జేసీ మొగిలి వెంకటేశ్వర్లు, డీఆర్వో విజయకుమార్, జడ్పీ సీఈవో శ్రీధర్‌రెడ్డి, డీపీవో వసుమతి, హౌసింగ్ పీడీ వేణుగోపాల్, సర్వే ల్యాండ్ రికార్డుల సహాయ సంచాలకులు రఘురామరాజు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన పాతికేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పంచాయతీరాజ్ ఎస్ఈ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

● వివిధ శాఖలలో పని చేస్తూ మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాల పత్రాలను కలెక్టర్ అందించారు. షేక్ అమీత్, కె.చందులకు రెవెన్యూశాఖలో జూనియర్ అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేట్, ఎన్.నానికి పంచాయతీరాజ్ శాఖలో ఇంజినీరింగ్ అసిస్టెంట్, యు.రిషికి మార్క్ సోషల్ వెల్ఫేర్ శాఖలో వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్‌గా ఉద్యోగాలు కల్పించారు. డీఆర్వో విజయకుమార్ పాల్గొన్నారు.

ఎఫ్ఆర్ఎస్ ద్వారా హాజరైన వారికే జీతం

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: నెల్లూరు నగరపాలకసంస్థలో ఎఫ్ఆర్ఎస్ ద్వారా హాజరైన వారిని గుర్తించి డిసెంబరు నెల జీతాలు ఇవ్వాలని కమిషనర్ వైవో నందన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కార్యాలయంలోని ఛాంబరులో విభాగాల అధికారులు, సూపరింటెండెంట్లతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, డిప్యూటీ డైరెక్టర్ మాధురి, ఆరోగ్యాధికారి డాక్టర్ కనకాద్రి, సెక్రటరీ శ్రీలక్ష్మి, టీపీఆర్ వాసుబాబు, మేనేజర్ రాజేశ్వరి, ఈఈ రహంతుజానీ తదితరులు పాల్గొన్నారు. భారీ వర్షాలకు కల్యాణి ఫిలిమ్స్ సమీపంలో ముంపునకు గురైన కుటుంబాలకు టిడ్కో ఇంటిని కేటాయించి అన్ని వసతులు కల్పించినందుకు నిడిగుంట శీనయ్య, కొండమ్మ దంపతులు కమిషనర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

మాట్లాడుతున్న కమిషనర్ నందన్

13న జాతీయ లోక్‌అదాలత్

నెల్లూరు(టౌన్): నగరపాలకసంస్థ పరిధిలోని ఆస్తి, తాగునీటి కుళాయిలు, ఖాళీ స్థలాల పన్నులు, ట్రేడ్‌లైసెన్సుల బాకాయిదారులు, అనధికార నిర్మాణాలు, అనుమతులను అతిక్రమించి చేపట్టిన నిర్మాణ యజమానులపై క్రిమినల్ చర్యలకు న్యాయస్థానాల ద్వారా దాఖలు చేసిన కేసులను మాఫీ చేసుకునేందుకు కల్పిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ నందన్ సూచించారు. సోమవారం కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటరులో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా ప్రధాన న్యాయస్థానంలో ఈనెల 13వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌కు హాజరై కోర్టు కేసులను మాఫీ చేసుకోవాలని తెలిపారు. మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ రంగారావు పాల్గొన్నారు.

12 నుంచి ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభలు

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే: తిరుపతిలో ఈ నెల 12, 13, 14 తేదీల్లో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభలు జరగనున్నాయని ఆ సంఘం జిల్లా కార్యదర్శి వెన్ను నరేంద్ర తెలిపారు. సోమవారం బాలాజీనగర్‌లోని ఆ సంఘ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలో గంజాయి మాఫియాకు నిరసనగా పోరాడుతున్న పెంచలయ్యను గంజాయి ముఠా దారుణంగా హత్య చేసిందని ఆయన పోరాటాలను కొనసాగిస్తామన్నారు. 11వ తేదీన పెంచలయ్య జ్యోతిని మహాసభలకు తీసుకెళ్లేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్పొరేషన్ అధ్యక్ష, కార్యదర్శులు షేక్ అర్షం, జి.విష్ణు, సుమంత్ పాల్గొన్నారు.

సైనికుల త్యాగాలు వెలకట్టలేనివి

నెల్లూరు(నగరపాలకసంస్థ): దేశ రక్షణలో సైనికుల త్యాగాలను వెలకట్టలేమని, వారి సంక్షేమానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. సోమవారం సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని పురస్కరించుకుని హుండీ డ్రైవ్‌ను జిల్లా సైనిక బోర్డు ఛైర్మన్ అయిన కలెక్టర్, జేసీ హుండీలో తమవంతు డబ్బులు వేసి ప్రారంభించారు. నిధికి రూ.10వేల చొప్పున విరాళం అందజేసిన మాజీ సైనికులు మల్లికార్జునరావు, కావలి సైనిక సొసైటీ వారిని అభినందించారు. కార్యక్రమంలో డీఆర్వో విజయకుమార్, సైనిక సంక్షేమ అధికారి జి.హరికృష్ణ, మాజీ సైనికుల అసోసియేషన్ అధ్యక్షులు కళాధర్, ఉపాధ్యక్షులు మేడేపల్లి రత్నయ్య పాల్గొన్నారు.

నారాయణ నామం స్మరిస్తే పుణ్యం

నెల్లూరు(సాంస్కృతికం), న్యూస్‌టుడే: నేటి కలియుగంలో నారాయణ నామం స్మరిస్తే పుణ్యమార్గానికి దారి లభిస్తుందని ప్రముఖ ప్రవచన కర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు భక్తులకు పిలుపునిచ్చారు. మూడు రోజులుగా ఆయన నెల్లూరులోని పురమందిరంలో శ్రీ శంకరాచార్య వివరించిన శ్రీ జగన్నాథ అష్టకంపై ప్రవచనాలు అందిస్తున్నారు. శ్రీ భరద్వాజ్ రుద్రాభిషేక సంఘం ఆధ్వర్యంలో సాగుతున్న ఈ ప్రవచనాల్లో ముందుగా ఆ మహనీయుడ్ని సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ జగన్నాథుడికి పూరి పుణ్యక్షేత్రంలో చేస్తున్న పూజలు, ఆచార సంప్రదాయలు, అక్కడ స్వామివారు చూపే మహిమలను వివరించారు. భరద్వాజ రుద్రాభిషేకం ముఖ్య సభ్యులు ఫణిరత్నం, కోట వంశీకృష్ణ, రాఘవేంద్రరావు, నాగేశ్వరరావు, సుబ్రహ్మణ్యం, త్యాగరాజ కమిటీ సభ్యులు నాగదేవప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పూరీ జగన్నాథ వైభవం వివరిస్తున్న చాగంటి

అయ్యప్పకు అభిషేకాలు

నెల్లూరు (సాంస్కృతికం), న్యూస్‌టుడే: కేరళ సంప్రదాయం ప్రకారం నెల్లూరులోని వేదాయపాలెం అయ్యప్ప ఆలయంలో మండల పూజలు ఘనంగా జరుగుతున్నాయి. మహాగణపతి హోమం, సుగంధ పుష్పాలతో అభిషేకాలు, శ్రీవేలి ఉత్సవం, పూలంగి సేవ దర్శనం, మహా దీపారాధన, భగవతీసేవ తదితర కార్యక్రమాలు సాగాయి.

కల్వర్టు.. కష్టాలు చూడరే!

నగరంలోని మినీ బైపాస్ నుంచి సప్తగిరి కాలనీలోని పలు వీధులకు వెళ్లే మార్గాల మొదట్లో కల్వర్టులు ప్రమాదకరంగా మారాయి. రక్షణ గోడలు లేకపోగా.. స్లాబు సిమెంట్ పెచ్చులు ఊడి.. చువ్వలు బయటపడ్డాయి. రాకపోకల సమయంలో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.– న్యూస్‌టుడే, నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట)

ప్రమాదకరంగా కాలువ

నిత్యం రద్దీగా ఉండే నెల్లూరు ప్రధాన ఆర్టీసీ బస్టాండ్‌లో కాలువ ప్రమాదకరంగా మారింది. గ్రిల్స్ కొంత భాగం దెబ్బతినడంతో.. ప్రయాణికులు అందులో పడి గాయపడుతున్నారు. అక్కడ నాపరాయి పెట్టినా.. వాహనాల ధాటికి పగిలిపోయింది. రాత్రిళ్లు మరీ ఇబ్బందిగా ఉంది. అధికారులు స్పందించి.. పరిస్థితిని చక్కదిద్దాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, నెల్లూరు (మార్కెట్ సెంటర్)

అమ్మో.. ధనలక్ష్మీపురం రహదారి

నెల్లూరు రూరల్ నియోజక వర్గం ధనలక్ష్మీపురం వద్ద రోడ్డుపై పెద్ద ఎత్తున గుంతలు పడ్డాయి. చిన్నపాటి గుంతలు తుపాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు పెద్దవిగా మారాయి. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన స్థానం నుంచి ధనలక్ష్మీపురం వరకు ప్రతి 500 మీటర్లకు ఒకచోట రహదారిపై గుంతలు పడ్డాయి. సంబంధిత అధికారులు స్పందించిమరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.– న్యూస్‌టుడే, నెల్లూరు(పద్మావతి సెంటర్)

నెల్లూరులో వంద పడకల ఈఎస్ఐ ఆసుపత్రి

నెల్లూరు(నగరపాలకసంస్థ): నెల్లూరు నగరంలో వంద పడకలతో ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర కార్మిక శాఖ సహాయ మంత్రి సుశ్రీ శోభా కరండ్లజే తెలిపారు. సోమవారం లోక్‌సభలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నలకు లిఖిత పూర్వకంగా సమాధానమిచ్చారు. ఈఎస్ఐ లబ్ధిదారులకు వైద్య సేవలు అందించేందుకు నెల్లూరులో వంద పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేసేందుకు మార్చి 2019లో ప్రభుత్వం ఆమోదం తెలిపిందనేది నిజమేనా అని, ఇందుకు జరిగిన భూసేకరణ, సిబ్బంది వసతి గృహాల కోసం అదనంగా ఎకరం భూమిని కేటాయించడం వాస్తవమేనా అని ఎంపీ అడిగారు. ఆయన సమాధానమిస్తూ ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఉమ్మడి నెల్లూరు జిల్లాలో రెండు వంద పడకల ఈఎస్ఐ ఆసుపత్రులను ఏర్పాటు చేసేందుకు సూత్రప్రాయంగా ఆమోదం తెలిపిందని వివరించారు.

ఇప్పటికే రెండేళ్లు..
మొర వినేందుకు ఎన్నేళ్లో!

ప్రభుత్వం అందించే దివ్యాంగుల పింఛన్‌కు అర్హత ఉన్నా.. రాకపోవడంతో ఎంతో మంది బాధితులు అధికారుల చుట్టూ ఏళ్ల తరబడి తిరుగుతున్నారు. అయినా కనికరం చూపడం లేదు. నెల్లూరునగరం నవాబుపేట అరుణాచలంవీధికి చెందిన కేసర్ల రవికుమార్‌కు కాలు పని చేయదు. ఎవరైనా తోడులేనిదే నడవలేని పరిస్థితి. ఏ పని చేసుకోలేని దివ్యాంగుడు. జీవనాధారం కష్టంగా మారింది. వికలాంగుల పింఛను అందించి ఆదుకోవాలని రెండేళ్లుగా సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారు. పింఛను కోసం దరఖాస్తు చేసుకుంటే తిరస్కరణకు గురవుతోందని వాపోయారు. అధికారులు స్పందించి పింఛను అందించి ఆదుకోవాలని వేడుకున్నారు. – న్యూస్‌టుడే, నెల్లూరు(కలెక్టరేట్)

మహిళల ఆరోగ్య పరిరక్షణకే 'సఖీ సురక్ష'

నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సఖీ సురక్ష వైద్య శిబిరాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని మెప్మా పీడీ లీలారాణి కోరారు. సోమవారం నగరంలోని వైఎస్ఆర్ నగర్, కిసాన్ అర్బన్ హెల్త్ సెంటర్లలో ఈ వైద్య శిబిరాలు నిర్వహించారు. 16 రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ.. రూ. పది వేల విలువ చేసే పరీక్షలు ఉచితంగా చేస్తున్నట్లు తెలిపారు. తెదేపా నాయకురాళ్లు తాళ్లపాక అనూరాధ, భానుశ్రీ తదితరులు పాల్గొన్నారు.

పేర్లు నమోదు చేసుకుంటున్న మహిళలు

విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం 10న

నెల్లూరు (మార్కెట్ సెంటర్), న్యూస్‌టుడే: అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం ఈ నెల 10న వెంకటాచలం మండలంలోని కంపోజిట్ రీజనల్ సెంటర్‌లో జరుగుతుందని విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకులు మహమ్మద్ అయూబ్ ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి విభిన్న ప్రతిభావంతులు, సంఘాల నాయకులు, ప్రత్యేక పాఠశాలల విద్యార్థులు హాజరుకావాలని కోరారు. ఉపకరణాలు మంజూరైన వారు ఆలింకో సంస్థ ఇచ్చిన స్లిప్పులు, ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలు తీసుకురావాలని సూచించారు.

బాలికల రక్షణకు ఎన్నో చట్టాలు

నెల్లూరు(జడ్పీ), న్యూస్‌టుడే: బాలికలను వేధించే వారు.. బాల్యవివాహాలు చేసుకునేవారు జాగ్రత్తగా ఉండాలని, బాలికల రక్షణకు అనేక చట్టాలు అమలులోకి వచ్చాయని మహిళా అధికారులు, పోలీసులు తెలిపారు. సోమవారం బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. నెల్లూరు గ్రామీణ మండలంలోని వెంగళరావు నగర్ తాతయ్య బడి, గాంధీనగర్ మున్సిపల్ హైస్కూల్లో వేర్వేరుగా శిశు సంక్షేమశాఖ సిబ్బంది ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ బాల్య వివాహాలు చేసుకున్న వారికి . చేసిన వారికి, ప్రోత్సహించిన వారికి చట్టారీత్యా శిక్షలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థులంతా చట్టాలపై అవగాహన కల్గి ఉండాలని తెలిపారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పోలీసు శాఖ నుంచి శ్రీహరి, రాంబాబు, సీపీవోలు, మహిళా పోలీసులు, ఎం.ఈవో, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వెంగళరావు నగర్ స్కూల్లో ప్రతిజ్ఞ చేస్తున్న బాలికలు

చిన్నారి మృతి కలచివేసింది

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: ఇందుకూరుపేట మండలంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చిన్నారి కిరణ్ ప్రాణాలు కోల్పోవడం కలిచి వేసిందని నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. చిన్నారి మృతికి సంతాపాన్ని ప్రకటించారు. కిరణ్ మృతిపై ఏపీ వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్ సంతాపాన్ని ప్రకటించారు.

టౌన్ బస్సు డ్రైవర్, కండక్టర్లపై దాడి దారుణం

నెల్లూరు(విద్య): నగరంలో టౌన్ బస్సు డ్రైవర్, కండక్టర్లపై దాడిచేసి తీవ్రంగా గాయపరచగా బాధితులు నారాయణ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారిని సోమవారం సీపీఎం నాయకులు పరామర్శించారు. సీపీఎం నాయకుడు నాగేశ్వరరావు మాట్లాడుతూ పెంచలయ్య హత్య ఘటన మరువక మునుపే మరోసారి హత్యాయత్నానికి ఒడిగట్టడం దుర్మార్గమని, సత్వరమే ఆగడాలను అరికట్టి ప్రజలకు స్వేచ్ఛా వాతావరణం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మూలం ప్రసాద్ పాల్గొన్నారు.

పరామర్శిస్తున్న సీపీఎం నాయకులు

మేమున్నాం.. మీకు తోడుగా! (10 AM to 1 PM) నెల్లూరు, గ్రామీణం 80085 50332 80085 74001

సమస్య: బీవీనగర్ కేఎన్ఆర్ స్కూల్‌కు తూర్పుగా ఉన్న వీధిలో కాలువలు వ్యర్థాలతో నిండిపోయి.. మురుగునీరు ముందుకు కదలడం లేదు. – నాగేశ్వరరావు, స్థానికుడు
సమాధానం: కాలువలను శుభ్రం చేయిస్తాం. – డాక్టర్ కనకాద్రి, ఆరోగ్యాధికారి

? నవాబుపేట పుల్లమ్మసత్రంలో ఎన్ఆర్6/బీ2 స్తంభానికి విద్యుద్దీపం వెలగడం లేదు. రాత్రి పూట చీకటిగా ఉంటోంది. –శ్రీనివాస్
✓ పొదలకూరురోడ్డులోని అంబాపురం వసుధ నగర్‌లో మూడు స్తంభాలకు విద్యుద్దీపాలు వెలగడం లేదు. శివారు ప్రాంతం కావడంతో చీకటితో ఇబ్బందులు పడుతున్నాం. – కోటేశ్వరరావు
? మూలాపేట అలంకార్ సెంటరులోని మహాలక్ష్మి దేవస్థానం వద్ద స్తంభానికి విద్యుద్దీపం వెలగడం లేదు. – బాలసుబ్రహ్మణ్యం
✓ విద్యుద్దీపాల్ని ఏర్పాటు చేస్తాం. –ముజాహిద్దీన్, నగరపాలక సంస్థ డీఈ
? నగరంలోని గుప్తాపార్కు రోడ్డులో పశువులు ఎక్కువగా రోడ్డుపై సంచరిస్తున్నాయి. – రమేష్
✓ పశువులను గోశాలకు తరలిస్తాం. – డాక్టర్ మదన్‌మోహన్, వెటర్నరీ అధికారి
– న్యూస్‌టుడే, నెల్లూరు(టౌన్, స్టోన్‌హౌస్‌పేట)

తెరపై ఈనాడు

ఎం.1 సినిమాస్.: స్క్రీన్.3 ఆంధ్ర కింగ్ తాలుకా (తెలుగు)
స్పైస్.సినిమాస్: స్క్రీన్ 1. ఆంధ్ర కింగ్ తాలుకా (తెలుగు) స్క్రీన్ 2. ఆంధ్ర కింగ్ తాలుకా (తెలుగు), తేరే ఇష్క్ మె (హిందీ) స్క్రీన్ 3. ధురంధర్ (హిందీ) **రెయిన్ సినిమా:** స్క్రీన్.1. ధురంధర్ (హిందీ) స్క్రీన్..3. ఆంధ్ర కింగ్ తాలుకా (తెలుగు)

నలుగురు రౌడీషీటర్ల అరెస్టు

నెల్లూరు (నేర విభాగం), న్యూస్‌టుడే: గంజాయిని తరలించేందుకు సిద్ధంగా ఉన్న నలుగురు రౌడీషీటర్లు మేరిగ ప్రవీణ్, జె.మహేష్, ఎస్‌కే ముక్తియార్, ఎస్‌కే అబ్దుల్ మజీద్‌ను నెల్లూరు దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్ కల్యాణ్ రాజు సోమవారం అరెస్టు చేశారు. నగరంలోని మాగుంట లేఅవుట్ రైల్వేట్రాక్ వద్ద ఇద్దరిని, జీజీహెచ్ వద్ద మరో ఇద్దరిని అరెస్టు చేసి.. వారి నుంచి 4 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

గంజాయి కేసులో నిందితుడు..

నెల్లూరు(నేర విభాగం), న్యూస్‌టుడే: గంజాయి కేసులో రెండు సంవత్సరాలుగా పరారీలో ఉన్న నిందితుడిని నెల్లూరుగ్రామీణ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. ఒడిశాకు చెందిన చిరంజీవి నారాయణ రెడ్డిపేటలో నివాసం ఉంటున్నారు. 2023 సంవత్సరంలో ఓ గంజాయి కేసులో నిందితుడిగా ఉన్నాడు. అప్పటి నుంచి పోలీసులకు చిక్కకుండా పరారీలో ఉన్నాడు. సమాచారం అందుకున్న నెల్లూరుగ్రామీణ పోలీసులు అతనిని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరిచారు.

శాంతిభద్రతలు కాపాడాలని ఫిర్యాదు

నెల్లూరు (నేర విభాగం), న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నగరంలో శాంతి భద్రతలు క్షీణించాయని వైకాపా నాయకులు ఆరోపించారు. ఈ విషయంపై వైకాపా నగర నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, నెల్లూరుగ్రామీణ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆనం విజయ్ కుమార్ రెడ్డి కలిసి సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ అజిత వేజెండ్లను కలిసి వినతి పత్రం అందించారు. అలాగే వైకాపా నగర అధ్యక్షుడు, కార్పొరేటరు బొబ్బల శ్రీనివాస్ యాదవ్‌పై అన్యాయంగా పెట్టిన రౌడీ షీటును ఎత్తివేయాలని కోరారు. కార్యక్రమంలో వైకాపా నాయకులు పాల్గొన్నారు.

నగల పర్సు అపహరణ

నెల్లూరు(నేర విభాగం), న్యూస్‌టుడే: రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న వృద్ధురాలి బ్యాగ్‌ను కత్తిరించి అందులో ఉన్న నగల పర్సును గుర్తుతెలియని దుండగులు చోరీ చేసిన ఘటన సంతపేట పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. నార్తురాజుపాలెం కమ్మపాలెంకు చెందిన వింధ్యావలి సోమవారం బృందావనంలోని ఓ ఆసుపత్రికి వైద్య పరీక్షల నిమిత్తం వచ్చారు. అనంతరం కాపు వీధిలో దుస్తులు కొనుగోలు చేసేందుకు గాంధీబొమ్మ వద్ద నుంచి కాపువీధికి నడుచుకుంటూ బయల్దేరారు. కాపు వీధి సమీపంలోకి రాగా గుర్తుతెలియని దుండగులు ఆమె బ్యాగును కత్తిరించి అందులో నగల పర్సును చోరీ చేశారు. సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పర్సులో ఆరు సవర్ల బంగారు ఆభరణాలు రూ.15వేల నగదు ఉన్నట్లు ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు సాంకేతికత ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు.

నిరాశ.. ఉన్నతాధికారులపైనే ఆశ

నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: నెల్లూరు కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా అర్జీదారులు భారీగా తరలివచ్చారు. వృద్ధులు, మహిళలు, రైతులు, దివ్యాంగులు వినతులు అందించారు. ఎన్నిసార్లు తిరిగినా తమ సమస్యలు పరిష్కారం కావడం లేదని అధికారుల ఎదుట వాపోయారు.

కానిస్టేబుల్ దౌర్జన్యం

కావలికి చెందిన సింగంశెట్టి లీలా వెంకట శ్రీహర్ష, శోభనాల సాయిసుస్మిత 66 అంకణాల స్థలం కొనుగోలు చేశారు. వారి స్థలం ముందు ఉన్న స్థలంలో పోలీసు కానిస్టేబుల్ చికెన్ షాపు పెట్టి నడిపిస్తున్నాడని.. తొలగించాలని కోరితే దౌర్జన్యం చేస్తున్నాడని బాధితులు వాపోయారు. ఉన్నతాధికారులు న్యాయం చేయాలని వేడుకున్నారు.

ప్రజాభిప్రాయానికి విరుద్ధంగా నిర్ణయం

రాపూరు, కలువాయి, సైదాపురం మండలాలను ప్రజాభిప్రాయానికి విరుద్ధంగా గూడూరులో కలుపుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని రాపూరు మండల ప్రజల తెలిపారు. తిరుపతికి వెళ్లాలంటే 150 కి.మీ.కు పైగా మూడు బస్సులు మారాల్సి ఉందన్నారు. ప్రజల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని న్యాయం చేయాలని ఎస్‌డీ సద్దాంసాహెబ్, ఎంసీకే రెడ్డి, ముత్తహర్, ఖాదర్‌బాషా, రఫి తదితరులు కోరారు.

పెంచలయ్య కుటుంబాన్ని ఆదుకోవాలి

గంజాయి మాఫియాపై చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల నాయకులు మస్తాన్‌బీ, కేసీ పెంచలయ్య, రెహానాబేగం, ఉషా కోరారు. ప్రజా కళాకారుడు కె. పెంచలయ్య గంజాయికి వ్యతిరేకంగా అనేక కార్యక్రమాలు చేపట్టారని, ఓర్వలేని అరవ కామాక్షి ముఠా దారుణంగా హత్య చేయించిందన్నారు. ఆయన కుటుంబానికి రూ.50లక్షల ఆర్థిక సాయం, భూమి, నివేశన స్థలం కేటాయించాలన్నారు.

సెంటు లేకపోయినా 5 ఎకరాల భూమి ఉందంట

నెల్లూరునగరం గుర్రాలమడుగు సంఘానికి చెందిన యనమల సుధాకర్ ఆటో తోలుకుని జీవనం సాగిస్తున్నారు. వాహన మిత్ర పథకానికి దరఖాస్తు చేసుకోగా.. దొరవారిసత్రం మండలం పూల తోటలో అయిదు ఎకరాల భూమి ఉన్నట్లు రెవెన్యూ రికార్డుల్లో చూపుతూ తిరస్కరిస్తున్నారు. తనకు సెంటు భూమి కూడా లేదని వాపోయారు. భూమిని వెబ్ అడంగళ్ నుంచి తొలగించాలని తిరుపతికి వెళితే.. నెల్లూరుకు ఇక్కడి నుంచి అక్కడకు నాలుగు నెలల నుంచి తిప్పుతున్నారని వాపోయారు.

(c) eenadu

దీపిక సారథ్యం దేశానికే గర్వకారణం

మడకశిర, న్యూస్‌టుడే : దీపిక పేదరికం, అంగవైకల్యాన్ని లెక్కచేయకుండా ఆత్మస్థైర్యంతో సాధన చేసి... అంధుల క్రికెట్‌లో టీ-20 జట్టు సారథ్యం వహించి ప్రపంచకప్ గెలవడవం దేశానికే గర్వకారణమని బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత అన్నారు. సోమవారం ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఆధ్వర్యంలో మడకశిర ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో దీపికకు సన్మాన కార్యక్రమం, భారీ బహిరంగ సభను ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా మంత్రితోపాటు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, సినీ నటుడు సాయికుమార్, ఎమ్మెల్యే సింధూరరెడ్డి హాజరయ్యారు. మంత్రి మాట్లాడుతూ మారుమూల ప్రాంతమైన అమరాపురం మండలం తంబాళ్లహట్టి నుంచి కూలీలు చిక్కతిమ్మప్ప, చిత్తమ్మల బిడ్డ అంతర్జాతీయ స్థాయికి ఎదిగి స్ఫూర్తిగా నిలిచిందన్నారు. సాయికుమార్ మాట్లాడుతూ దీపికకు అభిమానిని అయ్యానన్నారు. ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ప్రసంగిస్తూ మడకశిర నియోజకవర్గం పేరును ప్రపంచ నలుమూలల చాటిన దీపికకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. దీపికకు పుట్టపర్తిలో 10 సెంట్ల స్థలం ఇవ్వాలని, జూనియర్ కళాశాల మైదానంలో ఇండోర్‌స్టేడియానికి ఆమె పేరు పెట్టాలని, అమరాపురం మండలంలో 5 ఎకరాల భూమిని ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం దీపిక, తల్లిదండ్రులను శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఎస్పీ సతీశ్‌కుమార్, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, క్రికెట్ కోచ్ మహంతేశ్, తెదేపా రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి, రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ ఛైర్మన్ లక్ష్మీనారాయణ, ఆర్డీఓ ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంధుల మహిళా క్రికెట్ జట్టు కెప్టెన్ దీపిక, తల్లిదండ్రులను సన్మానించిన మంత్రి, కలెక్టర్, ఎమ్మెల్యేలు ఎంఎస్ రాజు, సింధూరరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి తదితరులు

నగదు ప్రోత్సాహకం

ముఖ్యమంత్రి అందించిన రూ.10 లక్షల చెక్కు, మంత్రి సవిత రూ.2లక్షలు, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు రూ.2 లక్షలు, యాదవ సంఘం రూ.2 లక్షలు, సింగిల్ విండో కన్వీనర్లు రూ.లక్ష, అమరాపురం మండల తెదేపా నాయకులు రూ.50 వేలతోపాటు మరికొంత మంది నాయకులు నగదు ప్రోత్సాహకం అందజేశారు.

అర్జీదారు సమస్య వింటున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

స్పందించరు... పరిష్కరించరు

● ప్రజావేదికలో బాధితుల గగ్గోలు

పుట్టపర్తి, న్యూస్‌టుడే: ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగినా తమ సమస్యలు పరిష్కారం కావడం లేదని సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావేదికలో అర్జీదారులు వాపోయారు. సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించినా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమయ్యాయి. పరిష్కారానికి నోచుకోకపోవడానికి కారణాలను సంబంధిత అధికారులు అర్జీదారులకు వివరించకపోవడం వారి ఆవేదనను రెట్టింపు చేస్తోంది. మరోవైపు దరఖాస్తులు పునరావృతమవుతున్నా అధికారులు దస్త్రాల్లో అన్నీ పరిష్కరించినట్లు చూపుతూ అంకెలగారడీ చేస్తున్నారని అర్జీదారులు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌తో వాపోయారు. ఆయన జేసీ మౌర్యభరద్వాజ్, ఆర్డీఓ సువర్ణ, డీఆర్వో విజయసారథి, డిప్యూటీ కలెక్టర్లతో కలిసి ఫిర్యాదులు స్వీకరించారు. వాటిని సంబంధిత అధికారులు క్షేత్రస్థాయికి స్వయంగా వెళ్లి క్షుణ్నంగా పరిశీలించి, పారదర్శకంగా విచారించి, అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

ఆరేళ్లుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నాం

మా అమ్మానాన్నలు గంగమ్మ, జయప్ప పేరుతో ఉన్న ఆస్తిని సమీప బంధువులు వారి పేరిట ఆన్‌లైన్‌లో ఎక్కించుకున్నారు. న్యాయం చేయాలని తహసీల్దారు, ఆర్డీఓ కార్యాలయాల చుట్టూ ఆరేళ్లుగా ప్రదక్షిణలు చేస్తున్నాం. ఎవరూ పట్టించుకోవడం లేదు. అమ్మానాన్నలు చనిపోయారు. ఆ ఆస్తులను మా పేరుపై బదలాయించాలని వేడుకుంటున్నాం. మా భర్తలు అనారోగ్యంతో మృతి చెందారు. కూలి పనులకు వెళ్లి పిల్లలను పోషించుకుంటున్నాం, క్షేత్రస్థాయిలో విచారణ చేసి న్యాయం చేయాలని కోరుతున్నాం.
- గంగులమ్మ, జయమ్మ, అక్కాచెల్లెళ్లు, సొత్తర్లపల్లి

సాగులో ఉన్నా.. పట్టా ఇవ్వడం లేదు

మా పూర్వీకుల నుంచి భూమి సాగులో ఉంది. క్షేత్రస్థాయిలో విచారణ జరిపి పట్టా పాసుపుస్తకం మంజూరు చేయాలని తహసీల్దారు, ఆర్డీఓ కార్యాలయాల చుట్టూ మూడేళ్లుగా తిరుగుతున్నా. పరిశీలిస్తాం, మంజూరు చేస్తామని చెప్పడమే తప్ప ఇప్పటివరకు న్యాయం చేయలేదు. నా రెండు కాళ్లు చచ్చుపడ్డాయి. వేడుకుంటున్నా అధికారులకు కనికరం కలగడం లేదు. ఆ భూమిని ఇతరుకు పట్టా చేయడానికి అధికారులు ప్రయత్నం చేస్తున్నారు. - గౌరమ్మ, బ్రాహ్మణపల్లి, కదిరి

భారీగా జనన ధ్రువపత్రాలు జారీ

➡ పొంతన లేని లెక్కలు
➡ ఇష్టారాజ్యంగా మంజూరు

ఈనాడు, పుట్టపర్తి: జిల్లాలో కూరగాయలు కొనుగోలు చేసినంత సులువుగా జనన ధ్రువీకరణ పత్రాలు జారీ అవుతున్నాయి. వందల సంఖ్యలో జనాభా ఉండే గ్రామాల్లోనూ వేల సంఖ్యలో మంజూరు చేస్తుండటం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇటీవల అగళి మండలం కొమరేపల్లిలో 3,982 జనన ధ్రువపత్రాలు జారీ చేసిన విషయం వెలుగులోకి వచ్చింది. అంతేకాదు.. గతేడాదిలోనూ వేలసంఖ్యలో ధ్రువపత్రాలు జారీ అయ్యాయి. బత్తలపల్లి పంచాయతీ పరిధిలో 5,583 జననాలు నమోదు కాగా.. తర్వాత గోరంట్లలో 422, నంబులపూలకుంట 307, కొండకమర్ల 274, సోమందేపల్లి 270, తలుపుల 217, నల్లమాడలో 207 చొప్పున నమోదయ్యాయి. మొత్తం 445 పంచాయతీలకు గాను 347 పంచాయతీల్లో ఒక్కోచోట 50కి లోపే ధ్రువపత్రాలు జారీ చేయగా మిగిలిన వాటిల్లో ఎక్కువగా నమోదయ్యాయి. బత్తలపల్లిలో ఆర్డీటీ ఆసుపత్రి ఉండటంతో పెద్దసంఖ్యలో జననాలు నమోదవుతున్నాయి. మిగిలినచోట్ల కూడా వందల సంఖ్యలో ధ్రువపత్రాలు జారీ కావడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

కొమరేపల్లి పంచాయతీ కార్యదర్శులను విచారిస్తున్న పెనుకొండ ఇన్‌ఛార్జి డీఎల్‌పీవో నాగాంజనేయ ప్రసాద్

శ్రీసత్యసాయి జిల్లాలో..
పంచాయతీలు: 445
గ్రామ కార్యదర్శులు: 413
ఈఏడాది అక్టోబరు వరకు జనన ధ్రువపత్రాలు జారీ: 12,507
గతేడాది జారీ చేసినవి: 20,921

కొరవడిన పర్యవేక్షణ

పంచాయతీ కార్యదర్శులు బాధ్యతలు చేపట్టిన వెంటనే ఐడీ, పాస్‌వర్డు కోసం దరఖాస్తు చేసుకుని.. కొత్త పాస్‌వర్డు క్రియేట్ చేసుకుని లాగిన్ కావాలి. కొమరేపల్లిలో కొందరు తాము అసలు లాగిన్ కాలేదని చెబుతున్నారు. ఆ పంచాయతీలో 2021లో 2, 2025లో 7 మరణ ధ్రువీకరణ పత్రాలు జారీ అయ్యాయి. ఇవి ఎవరు చేశారన్న ప్రశ్న తలెత్తుతోంది. ఒకవేళ కార్యదర్శులు లాగిన్ కాలేకపోయినా.. వారి ఐడీ, పాస్‌వర్డు మరెవరో దుర్వినియోగం చేస్తున్నా.. అధికారులు ఎందుకు గుర్తించలేదన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వాస్తవంగా ప్రభుత్వ ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాలు జరిగితే కచ్చితమైన సంఖ్య నమోదవుతుంది. ఇళ్ల వద్ద కాన్పులు జరిగాయంటూ.. బోగస్ పత్రాలు జత చేసి ధ్రువపత్రాలు తీసుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి.

డబుల్ రిజిస్ట్రేషన్లూ..

ఎవరికైనా జనన, మరణ ధ్రువపత్రాలు కావాలంటే కొందరు సిబ్బంది ఉన్నతాధికారుల పేరుతో లంచాలు తీసుకుని సులువుగా జారీ చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లాలో 9 డబుల్ రిజిస్ట్రేషన్లు జరిగినట్లు తెలిసింది. దర్యాప్తులో జన్మించిన వారు మరో జిల్లాలో జనన ధ్రువపత్రాలు తీసుకుంటున్నారు. మరో జిల్లాలో జన్మించినవారు ఇక్కడి చిరునామాతో తీసుకున్నారు. ఒకటే ఆధార్ కార్డు ఉండటంతో ఇవి వెలుగులోకి వస్తున్నాయి.

విచారణ జరుగుతోంది

- సమత, జిల్లా పంచాయతీ అధికారిణి

జిల్లాలో బోగస్ జనన ధ్రువీకరణ పత్రాల జారీపై వైద్య, ఆరోగ్యశాఖ, పంచాయతీ అధికారుల ఆధ్వర్యంలో వేర్వేరుగా విచారణ జరుగుతోంది. సంబంధిత అధికారులు నివేదికలు సమర్పించిన తర్వాత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటాం. బోగస్ పత్రాల జారీకి అవకాశం లేకుండా చూస్తాం.

కియాలో ఆక్టోపస్ మాక్‌డ్రిల్

పెనుకొండ, న్యూస్‌టుడే: కియా ఇండియా పరిశ్రమలో అత్యవసర పరిస్థితిలో సమష్టిగా స్పందించే విధానంపై రాష్ట్ర పోలీస్ కమాండో విభాగం ఆక్టోపస్ ఆధ్వర్యంలో సోమవారం ఆపరేషన్ ఫాల్కన్ మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఇందులో భాగంగా ఐదుగురు ఉగ్రవాదులు ఆయుధాలతో పరిశ్రమలోని అడ్మిన్ భవనంలోకి చొరబడి, సెక్యూరిటీ సిబ్బందిపై కాల్పులు జరిపి, లోపలికి ప్రవేశించనట్లుగా అందిన సమాచారంతో ఆక్టోపస్ బృందం హుటాహుటిన స్పందించి వ్యూహాత్మకంగా ఆపరేషన్ ప్రారంభించి ఉగ్రవాదులను న్యూట్రలైజ్ చేసి బందీగా ఉన్న వారిని సురక్షితంగా రక్షించి మాక్‌డ్రిల్ పూర్తిచేశారు. కార్యక్రమంలో కియా సీఎస్‌వో మధుసూదన్, సెక్యూరిటీ ఇంఛార్జ్ నవీన్‌చంద్, వెంకటేశ్, రమేశ్,పార్థసారథి, ఆక్టోపస్ డీఎస్పీ జగ్గనాయుడు, ఆర్ఐ శ్రీనివాసరావు, ఉమాశంకర్, కియా స్టేషన్ ఎస్సై రాజేశ్, ఏఎస్సై వెంకటరమణ, డీఎంహెచ్‌వో నాగరాజు, ఆర్ఎస్సై ప్రసాద్, బాంబ్‌డిస్పోజల్ టీం, ఇతర పోలీసు బలగాలు పాల్గొన్నారు.

పరిశ్రమలో మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న ఆక్టోపస్ దళం

కాలువకు తాత్కాలిక మరమ్మతులు కష్టమే!

కూడేరు(ఉరవకొండ), న్యూస్‌టుడే: పీఏబీఆర్ కుడి కాలువ తెగిన ప్రదేశంలో తాత్కాలిక మరమ్మతులు కష్టమే అన్న వాదన వినిపిస్తోంది. కూడేరు మండలం జల్లిపల్లి వద్ద ఆదివారం కాలువ తెగిపోయిన విషయం తెలిసిందే. ఎక్కువ సమయం నీటి ప్రవాహం కొనసాగడంతో మట్టి కొట్టుకుపోయి గట్టు బండ తేలింది. దానిమీద ఇసుక సంచులను ఏర్పాటు చేసి ప్రవాహాన్ని కొనసాగించడం కష్టం కానుందని అధికారులు భావిస్తున్నారు. బండ ఎగుడు దిగుడుగా ఉండడంతో ఇసుక సంచులు బలంగా కూర్చుంటాయా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. నీటి ప్రవాహం పెరిగినపుడు సంచుల మధ్యలోకి నీరు చేరితే, మళ్లీ కోతకు గురయ్యే ప్రమాదం ఉంటుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో అక్కడ శాశ్వత మరమ్మతులు చేయించడమే మేలని చెబుతున్నారు. శాశ్వత పనులకు ఎక్కువ సమయం పడితే చెరువులకు నీరు అందడం మరింత ఆలస్యం అయ్యే అవకాశం ఉంది. సోమవారం తెగిపోయిన కాలువ గట్టును హెచ్చెల్సీ ఎస్ఈ సుధాకర్ రావు, డీఈఈ విశ్వనాథరెడ్డి పరిశీలించారు. రూ.93 లక్షలతో మరమ్మతునకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు వివరించారు.

తెగి పోయిన కాలువ గట్టును పరిశీలిస్తున్న హెచ్చెల్సీ ఎస్ఈ సుధాకర్‌రావు తదితరులు

పీఏబీఆర్ నీటి విడుదల..

పీఏబీఆర్ ప్రాజెక్టు అధికారులు మూడు గేట్ల ద్వారా సోమవారం పెన్నానదిలోకి 620 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. మరో వైపు కుడి కాలువ ఎస్కేప్ ఛానల్ ద్వారా ఎంపీఆర్ వైపు మరో 770 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతోంది. విద్యుత్పత్తికి 110 క్యూసెక్కులు, తాగునీటి పథకాలకు 55 క్యూసెక్కులు... ఇలా మొత్తం 1600 క్యూసెక్కుల మేర నీరు బయటికి పోతోంది. ప్రస్తుతం పీఏబీఆర్‌లో 5.2 టీఎంసీలు నిల్వ ఉన్నాయి. పైగా లింకు కాలువ, హంద్రీనీవా ద్వారా 730 క్యూసెక్కుల మేర ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. జలాశయ సామర్థ్యం 11 టీఎంసీలు. ఆనకట్ట భద్రత దృష్ట్యా 5 టీఎంసీలకు మించి నీటి నిల్వ ఉంచరు. ఈనేపథ్యంలో గేట్లను తెరిచి విడుదల చేసినట్లు జలాశయం డీఈఈ వెంకటరమణ, ఏఈఈలు ముత్యాలప్ప, గంగమ్మ, లక్ష్మీదేవి, రేణుక పేర్కొన్నారు.

పోలీసుల అదుపులో నకిలీనోట్ల చలామణిదారులు

బత్తలపల్లి, న్యూస్‌టుడే: నకిలీనోట్ల చలామణి విషయంగా గొడవపడిన ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కడప జిల్లా తాళ్లప్రొద్దుటూరు గ్రామానికి చెందిన రాజు అనే వ్యక్తి కొన్ని రోజుల క్రితం కదిరి పట్టణానికి చెందిన కొందరితో రూ.లక్ష మంచినోట్లకు రూ.3లక్షలు విలువచేసే నకిలీ నోట్లు ఇస్తామన్నాడు. ఆమేరకు వారు రూ.లక్ష రాజుకు అందజేశారు. అతను వారికి నకిలీనోట్లు ఇచ్చాడు. అవి సక్రమంగా లేకపోవడంతో రాజును గట్టిగా ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో సోమవారం సాయంత్రం బత్తలపల్లి మండలం వెంకటగారిపల్లి సమీపంలోని దర్గా వద్దకు కదిరికి చెందిన వారిలో ఒక వ్యక్తి వచ్చాడు. రాజుతో గొడవకు దిగాడు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి వెళ్లి ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. నిందితులను విచారిస్తున్నట్లు ఎస్సై సోమశేఖర్ వెల్లడించారు.

పది విద్యార్థులకు వంద రోజుల ప్రణాళిక

■ ప్రభుత్వ బడుల్లో అమలు ■ సెలవుల్లోనూ మధ్యాహ్న భోజనం

కొత్తచెరువు, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో చదవుతున్న విద్యార్థులు ఉన్నతంగా రాణించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం వివిధ పథకాలు అమలు చేస్తోంది. ఇందులో భాగంగా పదో తరగతి విద్యార్థుల కోసం 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక ప్రవేశపెట్టి అమలు చేస్తోంది. ఈనెల 6న కార్యక్రమం ఆరంభమైంది. మార్చి 14వ తేదీ వరకూ వంద రోజుల ప్రణాళిక అమలు చేస్తారు. ఇందులో భాగంగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు పునశ్చరణ తరగతులు చేపడుతున్నారు. ఉదయం నేర్చుకొన్న సబ్జెక్టుపై సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు పరీక్ష రాయాల్సి ఉంటుంది. రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా మెటీరియల్, మాదిరి ప్రశ్నాపత్రాలు రూపొందించారు. ఏయే రోజుల్లో ఏ సబ్జెక్టులపై తర్ఫీదు ఇవ్వాలో మార్గదర్శకాలు జారీ చేశారు. ప్రణాళికాబద్ధంగా విద్యార్థులు సన్నద్ధమైతే పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణులు కావడానికి అవకాశం ఉంటుంది. గతంలో అనంత సంకల్పం అనే కార్యక్రమం అమలు చేశారు. సరైన పర్యవేక్షణ లేకపోవడంతో పెద్దగా ఫలితాలు రాలేదు. దీంతో వందరోజుల ప్రణాళిక అమలులోకి తెచ్చారు.

అగళి ఉన్నత పాఠశాలలో స్లిప్ టెస్టు రాస్తున్న విద్యార్థులు

శ్రీసత్యసాయి జిల్లాలో ఇలా..
ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు: 312
పదో తరగతి విద్యార్థులు: 15,384
బాలికలు: 7,569, బాలురు: 7,815

పకడ్బందీగా నిర్వహిస్తున్నాం
- కిష్టప్ప, డీఈవో, శ్రీసత్యసాయి

ప్రభుత్వ పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా పకడ్బందీగా ప్రణాళిక అమలు చేస్తున్నాం. ఈమేరకు విద్యార్థులకు ప్రత్యేక తరగతులు, స్లిప్ టెస్టులు నిర్వహిస్తున్నాం.

సంక్రాంతికే మినహాయింపు!

గత సంవత్సరం వంద రోజుల కార్యక్రమం సెలవు రోజుల్లో మినహాయించారు. ఈ ఏడాది కేవలం సంక్రాంతి పండగను మాత్రమే మినహాయించారు. మిగిలిన అన్ని సెలవు రోజుల్లోనూ ప్రభుత్వ బడుల్లో ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాల్సిందే. ముఖ్యంగా పదో తరగతి విద్యార్థులకు సెలవు రోజుల్లో మధ్యాహ్న భోజనం అమలు చేస్తున్నారు. ఈ బాధ్యతలను ఆయా ఏజెన్సీలకు అప్పగించారు. సాధారణ రోజుల్లో ఇతర విద్యార్థులతో కలసి భోజనం చేస్తారు.

మినీ అంగన్‌వాడీ కార్యకర్తలకు పదోన్నతి

పుట్టపర్తి, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లాలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ ఆధ్వర్యంలో 370 మంది మినీ అంగన్‌వాడీ కార్యకర్తలకు అంగన్‌వాడీ కార్యకర్తలుగా పదోన్నతి కల్పించినట్లు ఐసీడీఎస్ పీడీ ప్రమీల సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కమిటీ ఆదేశాలు, అర్హత ప్రమాణాలు, నియమాల మేరకు నిష్పక్షపాతంగా, పారదర్శకంగా అప్‌గ్రేడ్ ప్రక్రియ జరిగిందన్నారు. ఎవరైనా మినీ అంగన్‌వాడీ కార్యకర్త అధికారులకు డబ్బులివ్వడానికి ప్రయత్నించినా, ఇచ్చినా ఎలాంటి విచారణ చేపట్టకుండానే తొలగిస్తామని హెచ్చరించారు. అర్హులకే పదోన్నతి లభించిందని, భవిష్యత్తులోనూ ఈ ప్రక్రియ పారదర్శకంగా కొనసాగుతుందని అందులో ఆమె పేర్కొన్నారు.

రెండు రోజులు క్రిష్ణాపురం రైల్వేగేటు మూత

ముదిగుబ్బ, న్యూస్‌టుడే: మండలంలోని 42వ జాతీయ రహదారి నుంచి బుక్కపట్నం వెళ్లే మార్గంలో ఉన్న క్రిష్ణాపురం రైల్వేగేట్‌ను రెండురోజుల పాటు మూసివేస్తున్నట్లు రైల్వే ఎస్ఎస్ఈ శివం మాతూర్ సోమవారం తెలిపారు. రైల్వే ట్రాక్ మెయింటెనెన్స్, సాంకేతిక తనిఖీల నేపథ్యంలో 10, 11 తేదీల్లో గేటు మూతబడుతుందన్నారు.

ప్రజావేదికకు 114 ఫిర్యాదులు

● ఎస్పీ కార్యాలయానికి తరలివచ్చిన బాధితులు

పుట్టపర్తి పట్టణం, న్యూస్‌టుడే: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అత్యధికంగా 114 ఫిర్యాదులొచ్చాయి. జిల్లా నలుమూలల నుంచి బాధితులు కార్యాలయానికి పోటెత్తారు. ఎస్పీకి ఫిర్యాదులు అందజేసి సమస్యలను విన్నవించారు. వాటిని క్షుణ్ణంగా పరిశీలించిన ఎస్పీ బాధితులకు చట్టపరిధిలో సత్వర న్యాయం అందించాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో న్యాయ సలహాదారు సాయినాథ రెడ్డి, మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ ఇందిర, ఎస్సీ, ఎస్టీ సెల్ సీఐ ఇస్మాయిల్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఫిర్యాదుదారుడితో మాట్లాడుతున్న ఎస్పీ సతీష్‌కుమార్

పురం నూతన రహదారులకు భూమిపూజ

భూమి పూజ చేస్తున్న మున్సిపల్ ఛైర్మన్, కమిషనర్, ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి తదితరులు

హిందూపురం సాంస్కృతికం, న్యూస్‌టుడే : పట్టణంలోని 22వ వార్డు నింకంపల్లి, ముక్కడిపేటలో నూతన రోడ్ల పనులకు సోమవారం మున్సిపల్ ఛైర్మన్ డీఈ రమేశ్‌కుమార్, కమిషనర్ మల్లికార్జున, ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి వీరయ్యలు భూమి పూజ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మంగళవారం నుంచి నూతన రోడ్ల పనులు చేయడం జరుగుతుందన్నారు. రోడ్లు వేయడంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని మున్సిపల్ అధికారులకు, కాంట్రాక్టర్లకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఈఈ వాణి, ఏఈ జనార్దన్, మాజీ మున్సిపల్ ఛైర్మన్ అనిల్‌కుమార్ కౌన్సిలర్లు నసీరాభాను, ముస్తాక్‌మహమ్మద్, తెదేపా పట్టణాధ్యక్షుడు వెంకటేశ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

11న ధర్మవరానికి మధ్యప్రదేశ్ సీఎం రాక

● వాజ్‌పేయీ విగ్రహావిష్కరణ ● ఇళ్ల పట్టాలు పంపిణీ

ధర్మవరం, న్యూస్‌టుడే: పట్టణంలో 11న జరిగే దివంగత మాజీ ప్రధాని వాజ్‌పేయీ విగ్రహావిష్కరణకు మధ్యప్రదేశ్ సీఎం మోహన్‌యాదవ్ ముఖ్యఅతిథిగా విచ్చేస్తారని వైద్య మంత్రి సత్యకుమార్ యాదవ్ కార్యాలయ ఇన్‌చార్జి హరీష్ బాబు తెలిపారు. ఆయన సోమవారం స్థానిక ఎన్డీఏ కార్యాలయంలో విలేకరులకు వివరాలు తెలిపారు. ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల వద్ద వాజ్‌పేయీ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ, మంత్రి సవిత, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, తెదేపా, జనసేన పార్టీల నాయకులు విచ్చేస్తారని చెప్పారు. విగ్రహావిష్కరణ అనంతరం కళాశాల క్రీడా మైదానంలో జరిగే బహిరంగ సభలో అందరూ పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా రెండు వేలమంది పేదలకు ఇళ్ల స్థలాల అనుమతి పత్రాలు ఇస్తారని, 2,087 మంది పదో తరగతి విద్యార్థులకు సైకిళ్లు అందజేస్తారని వివరించారు.

ఆన్‌లైన్ టికెట్లు.. తెలియక పాట్లు!

రైల్‌వన్ యాప్‌తో సులభతరం

గుంతకల్లు, న్యూస్‌టుడే: చరవాణుల ద్వారా రైల్వే జనరల్ టికెట్లను పొందడంపై అవగాహన లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. మొబైల్ ద్వారా టికెట్లను పొందడానికి రైల్వే రూపొందించిన 'రైల్‌వన్' యాప్‌ను వినియోగించడం గురించి ఎక్కువ మందికి తెలియదు. దీనిపై అవగాహన కల్పించడానికి రైల్వే అధికారులు స్టేషన్లలో మరిన్ని అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని ప్రయాణికులు కోరుతున్నారు. స్టేషన్‌లోకి ప్రవేశించగానే వారి వద్ద ఉండే చరవాణుల్లోకి యాప్‌ను పొందుపరిస్తే ప్రయోజనం కల్గుతుందని ప్రయాణికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఎలాగంటే?

మొదట రైల్‌వన్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలి. తరవాత ఫోన్ నెంబర్‌ను నమోదు చేయాలి. తరువాత ప్రయాణికుడి పేరు, ఓటీపీ నెంబరు నమోదు చేయాలి. అనంతరం పాస్‌వర్డ్, ఈమెయిల్ ఐ.డి, తరువాత చిరునామాను నమోదు చేయాలి. ఈ ప్రక్రియ పూర్తి అయిన తరువాత ఎక్కడి నుంచి ఎక్కడి వరకు ప్రయాణం చేయాలో చరవాణిలో ఎంటర్ చేసి డబ్బును ఆన్‌లైన్‌లో చెల్లించాల్సి ఉంటుంది.

★ టికెట్‌ను ఏ విధంగా పొందాలో అధికారులు సమాచారం కోసం రైల్వే స్టేషన్‌లో క్యూఆర్ కోడ్‌ను ఉంచి దీన్ని వినియోగించాలని చెబుతున్నారు. గుంతకల్లు స్టేషన్‌లో ఇద్దరు మాత్రమే అవగాహన కల్పిస్తున్నారు.

★ గుంతకల్లు రైల్వే జంక్షన్‌లో అధికారులు జనరల్ టికెట్లను చరవాణుల ద్వారా పొందడానికి వివరాలను ఏవిధంగా పొందుపర్చాలో అవగాహన కలుగజేయడానికి అధికారులు ఇద్దరు సిబ్బందిని మాత్రమే నియమించారు. స్టేషన్ గుండా రోజూ 15వేల మందికి పైగా వెళ్తుంటారు. రోజూ వారిలో ఒక శాతం మందికి కూడా అవగాహన కల్పించలేకపోతున్నారు. కనీసం పది మంది సిబ్బందిని నియమించాలని ప్రయాణికులు కోరుతున్నారు. చరవాణుల్లో టికెట్లు పొందడం తెలియక క్యూల్లో నిలబడుతున్నారు. ఇదేకాక స్టేషన్‌లో ఉండే ఆటోమేటిక్ టికెట్ వెండింగ్ మిషన్ల వద్ద కూడా వేచి ఉండాల్సి వస్తోంది. తమ వంతు కర్తవ్యంగా ఆన్‌లైన్ టికెట్ల గురించి తెలియజేస్తున్నామని స్టేషన్‌లో పనిచేస్తున్న ఇద్దరు తెలిపారు. విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళతామని తెలిపారు.

ప్రయాణికులకు రైల్‌వన్ యాప్‌పై అవగాహన కల్పిస్తున్న టికెట్ కలెక్టర్లు

ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్టేదీ?

రొద్దం, న్యూస్‌టుడే : మండలంలో గౌరాజుపల్లి గ్రామ సమీపంలోని పెన్నానదిలో అక్రమంగా ఇసుక తవ్వకాలు చేపడుతున్నారు. ఇష్టానుసారంగా రాత్రిళ్లు ట్రాక్టర్లతో ఇసుక తరలిస్తున్నారు. కర్ణాటకలోని పావగడ పట్టణంలో అధిక ధరలకు విక్రయిస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. అదేవిధంగా కుర్లపల్లి, తదితర గ్రామాల వద్ద ఎక్కువ శాతం కర్ణాటకకు ఇసుక తరలించడంతో సమీప బోరుబావుల్లో నీరు ఇంకిపోతోందని ఆయా రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల స్థానిక వెలుగు కార్యాలయంలో నిర్వహించిన ఫిర్యాదుల దినోత్సవంలో కూడా కర్ణాటకకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న విషయాన్ని మంత్రి సవిత వద్ద పలువురు రైతులు ఫిర్యాదు చేశారు. ఈవిషయంపై ఆమె వెంటనే స్పందించి కర్ణాటకకు తరలించే వారిపై చర్యలు చేపట్టాలని సంబంధించిన అధికారులకు ఆదేశించారు. దీనిపై తహసీల్దారు ఉదయశంకర్ రాజును వివరణ కోరగా ఇసుక తవ్వకాలు చేస్తే చర్యలు చేపడతామని, తప్పసరిగా అనుమతులు తీసుకోవాలన్నారు.

కర్ణాటకకు వెళ్తున్న ఇసుక ట్రాక్టర్

(c) eenadu

EENADU Classifieds

PERSONAL CLASSIFIEDS

BIRTHDAY GREETINGS

REAL ESTATE

HOUSE FOR SALE

అనంతపురం సాక్షి Office Opposite ఆర్టీసీ House No.28, ప్లాటు 3.85 Cents, 1750 Sqft Construction 3 BHK Duplex House అమ్మబడును. Contact No. ✆: 9948266888

JOBS

Opportunity for Male Hindi Age 20 to 30 Managers with good Pay in Sainagar, Anantapur. Cell: 8096000222.

గమనిక

8008709784

కేజీబీవీలో ఐదుగురికి కలెక్టర్ తాఖీదులు

గుండుమల కేజీబీవీలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు

మడకశిర, మడకశిర గ్రామీణం, న్యూస్‌టుడే: గుండుమల కేజీబీవీలో ప్రిన్సిపల్ చాందినితో పాటు మరో నలుగురికి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఎంఈఓ భాస్కర్ తెలిపారు. సోమవారం రాత్రి జిల్లా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ఎమ్మెల్యే ఎంఎస్ రాజుతో కలిసి కేజీబీవీలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. తొలుత విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. సౌకర్యాలపై విద్యార్థినులతో ఆరాతీశారు. ప్రధానంగా మెనూ ప్రకారం భోజనాలు ఇవ్వడం లేదని, 250 మంది విద్యార్థినులకు అవసరమైన మరుదొడ్లు ఉండాల్సి ఉండగా కేవలం రెండే మరుగుదొడ్లు ఉండడం, అవి కూడా సక్రమంగా పనిచేయకపోవడంతో విద్యార్థినులు కలెక్టర్‌కు వివరించారు. వసతి గృహాల్లో ఫిర్యాదుల పెట్టెలు ఏర్పాటు చేస్తామని, ఏవైనా సమస్యలుంటే ఫిర్యాదు వేయాలని తెలిపారు. ప్రిన్సిపల్ చాందినితో పాటు సోషియల్ సీఆర్‌టీ శ్రావణి, అకౌంటెంట్ సుజాత, వంటమనిషి రత్నమ్మ, స్వీపర్ రంగమ్మలకు ఎంఈఓ షోకాజ్ నోటీసులు ఇచ్చారు.

ఫ్లోర్‌బాల్ పోటీల్లో జిల్లా జట్టు ప్రతిభ

ట్రోఫీ అందుకున్న బాలికల జట్టుతో ప్రసాద్ తదితరులు

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లా బాలికల జట్టు ఫ్లోర్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచి రజత ట్రోఫిని సాధించింది. 7న నరసరావుపేటలోని దిల్లీ పబ్లిక్ స్కూల్‌లో పోటీలు జరిగినట్లు ఫ్లోర్‌బాల్ రాష్ట్ర సంఘం అధ్యక్షుడు ప్రసాద్, సాధారణ కార్యదర్శి జోసెఫ్ తెలిపారు. జట్టు విజయంలో పట్టణంలోని బీఎస్ఆర్ పాఠశాల విద్యార్థినులు నీలు హేమశ్రీ, అప్ప అంజుమ్, రోహిణి, కీర్తి, పావని, సహస్రరెడ్డి, ఈశ్వరి, గౌతమి, శ్రీదేవి, ఉషశ్రీ కీలకపాత్ర పోషించారు. సోమవారం విద్యార్థినులను ప్రధానోపాధ్యాయిని జ్యోతిలక్ష్మి, పీఈటీ లక్ష్మీనారాయణ, పాఠశాల కమిటీ సభ్యులు అభినందించారు.

రాష్ట్రస్థాయి కౌశల్ పోటీలకు 12మంది ఎంపిక

విద్యార్థులకు బహుమతులు అందించిన డీఈఓ తదితరులు

కొత్తచెరువు, న్యూస్‌టుడే: పోటీ ప్రపంచంలో అవకాశాలు అందిపుచ్చుకోవాలంటే నైపుణ్యాలు పెంపొందించుకోవాలని డీఈఓ కిష్టప్ప అన్నారు. ఆయన సోమవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో రాష్ట్రస్థాయి కౌశల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేసి మాట్లాడారు. భారతీయ విజ్ఞాన మండలి, అప్‌కాస్ట్ స్వచ్ఛంద సంస్థ కలిసి ఆన్‌లైన్లో నిర్వహించిన కౌశల్-25 పాఠశాల స్థాయి పోటీల్లో జిల్లా నుంచి 120 మంది విద్యార్థులు అర్హత సాధించారన్నారు. వీరిలో 12 మంది రాష్ట్రస్థాయికి పోటీలకు ఎంపికవడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం ఆయన ఎంపికైన విద్యార్థులకు జ్ఞాపిక, ప్రశంసాపత్రాలు, ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేశారు. 27న తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో జరిగే రాష్ట్రస్థాయి కౌశల్ పోటీల్లో విద్యార్థులు పాల్గొంటారని జిల్లా సైన్సు అధికారి తనూజ్‌కుమార్ తెలిపారు.

ఎంపికైన విద్యార్థులు వీరే..: రామ్‌చరణ్, సాదియాభాను, రుఖియాభాను, పూజిత (జడ్పీహెచ్ఎస్ కొట్నూరు, హిందూపురం), దీక్షిత, సంజన (జడ్పీహెచ్ఎస్, అగళి), పవన్‌సాయి, హేమతేజ, అక్షిత (ఎంపీయూపీఎస్, చౌడేశ్వరి కాలనీ, హిందూపురం), వినమ్ర (ఏపీఎంఎస్ హిందూపురం), చరణ్‌తేజ (బీఎస్ఆర్, ఎంపీఎల్ ఉన్నత పాఠశాల, ధర్మవరం), బండారు చైతన్యలక్ష్మి (ఏపీఎల్‌హెచ్ఎస్ బాలికలు, సంజయ్‌నగర్, ధర్మవరం).

పిల్లలు కలగలేదని భర్త వేధింపులు

భార్య బలవన్మరణం

సోమందేపల్లి, న్యూస్‌టుడే : మండలంలోని మండ్లి గ్రామానికి చెందిన వివాహిత ప్రశాంతి (22) భర్త వేధింపులు తాళలేక సోమవారం ఇంట్లోనే బలవన్మరణానికి పాల్పడింది. ఈఘటనకు సంబంధించి సీఐ రాఘవన్ ఆధ్వర్యంలో ఎస్సై రమేశ్‌బాబు కథనం మేరకు వివరాలు.. చాలకూరుకు చెందిన జయమ్మ, ప్రసాద్ దంపతుల కుమార్తె ప్రశాంతిని మండ్లి ఆంజనేయులు కుమారుడు మారుతికిచ్చి మూడేళ్ల కిందట వివాహం జరిపించారు. ఇరువురికి ఇది రెండో పెళ్లి కావడం గమనార్హం. వివాహం అయినప్పటి నుంచి సాఫీగా సాగిన వీరి సంసారంలో. పిల్లలు కావడం లేదనే విషయంలో చిచ్చు రేపింది. రెండో వివాహం చేసుకొని మూడేళ్లయినా పిల్లలు కలగలేదని భర్త మారుతి మనోవేదనతో భార్యను తరచూ వేధింపులకు గురి చేశాడు. దీంతో భర్త వేధింపులు తాళలేక ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఉప తహసీల్దార్ రెడ్డిశేఖర్, సీఐ, ఎస్సైలు, తమ సిబ్బంది, వీఆర్వో రామాంజనేయులు తదితరులతో కలిసి మండ్లి గ్రామానికి చేరుకొని ప్రశాంతి మృతదేహాన్ని పరిశీలించారు. ఆమె ఆత్మహత్యపై ఇరు కుటుంబ సభ్యులు, చుట్టుపక్కల వారితోను క్షుణ్ణంగా విచారణ చేపట్టారు. ప్రశాంతి తల్లి ఇచ్చిన ఫిర్యాదుతో అల్లుడు మారుతీపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాఘవన్ వివరించారు.

10 నుంచి టెట్ పరీక్షలు

కొత్తచెరువు, న్యూస్‌టుడే: టెట్ పరీక్షలు 10 నుంచి 21 వరకు జరుగుతాయని డీఈఓ కిష్టప్ప ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లాలో టెట్ రాసేందుకు 4,520 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12, తిరిగి మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు విడతల్లో పరీక్షలు నిర్వహిస్తారు. పుట్టపర్తి, బెంగళూరులోని కేంద్రాల్లో పరీక్షలు ఉంటాయి. అభ్యర్థులు హాల్‌టికెట్లు, గుర్తింపు కార్డులతో ఒక గంట ముందుగానే పరీక్షా కేంద్రానికి హాజరుకావాలని ఆయన అందులో కోరారు.

అగ్నిమాపక సిబ్బందికి మూడు రోజుల శిక్షణ

మాట్లాడుతున్న డీజీఎఫ్ పీవీ రమణ

పెనుకొండ, న్యూస్‌టుడే : రాష్ట్ర విపత్తు, స్పందన, అగ్నిమాపక సేవల శాఖ ఆధ్వర్యంలో 26 జిల్లాల్లో ఒక్కో జిల్లా నుంచి ఇద్దరు అగ్నిమాపక సిబ్బంది చొప్పున మొత్తం 52 మందికి 3రోజుల పాట ఈత, రెస్క్యూలో మెలకువలపై 3 రోజుల శిక్షణను డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫైర్ పీవీ రమణ ప్రారంభించారు. సోమవారం పట్టణంలోని అగ్నిమాపక కేంద్రం ఆవరణలోని ప్రాంతీయ శిక్షణ కేంద్రంలో తరగతులను ప్రారంభించారు. ఈసందర్భంగా కేంద్రం ఆవరణలో మామిడి మొక్కలు నాటి నీళ్లు పోశారు. శిక్షణలో పాల్గొంటున్న 52 మంది సిబ్బందిని కొండ మీదకు ట్రెక్కింగ్ తీసుకెళ్లారు. ఈసందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ శిక్షణ పూర్తి చేసుకున్న సిబ్బంది ఆయా జిల్లాల్లోని అగ్నిమాపక సిబ్బందికి శిక్షణ ఇస్తారన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారి నుంచి జిల్లా నుంచి ఒకొక్కరి చొప్పున ఎంపిక చేసి విజయవాడలోని ఆక్వాడెవిల్స్‌లో శిక్షణ ఇస్తారన్నారు. 145 కేంద్రాల్లో నూతన వాహనాలు సమకూర్చేందుకు చర్యలు చేపట్టామన్నారు. రీజినల్ అగ్నిమాపక అధికారి భూపాల్‌రెడ్డి, పెనుకొండ అగ్నిమాపక కేంద్రాధికారి వెంకటేశ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాకర సాగు.. లాభాల పసందు!

విపణిలో ఆశాజనకంగా ధర

కళ్యాణదుర్గం (గ్రామీణం), న్యూస్‌టుడే : కళ్యాణదుర్గం మండలం పాతచెరువు గ్రామానికి చెందిన హరినాథ్ కాకర పంట సాగు చేస్తూ అధిక దిగుబడులతో పాటు మంచి లాభాలు ఆర్జిస్తున్నారు. తీగ జాతి స్వల్పకాలిక పంట రైతుకు ఎంతో ఊరట కలిగిస్తోంది.

కాకర పంట

సెప్టెంబరులో మూడెకరాల్లో పంట సాగు చేశారు. రాఘవ్ రకం కాకర విత్తులు కళ్యాణదుర్గంలోని ఎరువుల దుకాణంలో 500 విత్తన ప్యాకెట్లను ఒక్కొక్కటి రూ.1,200తో 25 ప్యాకెట్లు కొనుగోలు, కర్రలకు రూ.1.15 లక్షలు, దారాలు, కూలీలకు రూ.45వేలు, తీగ అల్లేందుకు రూ.20వేలు, ఎరువులు, పురుగు మందులు పిచికారీ చేసేందుకు రూ.80వేలు వెచ్చించారు. మొత్తం రూ.2.70 లక్షలు పెట్టుబడి పెట్టారు. 55 రోజులకే పంట కోతకు వచ్చింది. నాలుగైదు రోజులకోసారి కోత కోస్తామని, మొదటి, రెండో కోతల్లో ఒక్కోసారి 3 టన్నులు, నాలుగో కోతలో మూడున్నర టన్నులు, ఐదో కోతలో ఏడున్నర టన్నుల దిగుబడి రాగా, ఇప్పటికి దాదాపుగా రూ.6.10 లక్షల వరకు ఆదాయం వచ్చింది. మరో రెండు నెలల కాలం పంట ఉంటుందని, 30-40 టన్నుల వరకు దిగుబడి వస్తుందని, సుమారుగా రూ.32 లక్షల వరకు లాభాలు ఉంటాయని రైతు చెబుతున్నారు. మరో రెండెకరాల్లో సాగు చేసిన పంట 10-15 రోజుల్లో కోతకు రానుంది. మార్కెట్లో టన్ను ధర రూ.20వేలతో తోట వద్దనే వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. రవాణా ఖర్చులు ఆదా అవుతున్నాయి.

రైతులకు అవగాహన కల్పిస్తున్నా..

-హరినాథ్, పాతచెరువు

గతంలో టమాట, కర్బూజ, మొక్కజొన్న పంటలు సాగు చేసి నష్టపోయా. ఏడాదిగా కాకర సాగు చేస్తూ మంచి లాభాలు ఆర్జిస్తున్నా. ప్రస్తుతం మూడెకరాల్లో పంట సాగు చేయగా, మరో రెండు ఎకరాల్లో పది రోజుల్లో కోతకు వస్తుంది. ఎకరాకు దాదాపు 15-20 టన్నుల వరకు దిగుబడి రానుంది. అదే స్థాయిలో మార్కెట్లో ధరలు బాగా ఉంటే మంచి లాభాలు పొందేందుకు ఆస్కారం ఉంది. ఈ పంట ఎంతో ఊరట కలిగిస్తోంది. పంట సాగుపై పలువురు రైతులకు అవగాహన కల్పిస్తున్నా.

జామ తోటల్లో పండు ఈగలా?

నార్పల, న్యూస్‌టుడే : జామ తోటల్లో పండు ఈగలను సమర్థంగా నివారిస్తే రైతులు అధిక దిగుబడులు, లాభాలు పొందవచ్చని రెడ్డిపల్లి కేవీకే ప్రధాన శాస్త్రవేత్త మల్లీశ్వరి తెలిపారు. పండు ఈగలను నిర్లక్ష్యం చేస్తే అవి జామకాయల నాణ్యతను దెబ్బతీస్తాయన్నారు. దీంతో రైతులకు 50 శాతం నష్టం జరుగుతుందన్నారు. తల్లి ఈగలు జామ కాయలపై గుడ్లు పెట్టడం కారణంగా పిల్ల ఈగలు కాయ లోపలకు వెళ్లి తినేస్తాయన్నారు.

చిట్కా

పండు ఈగల నివారణకు రైతులు మిథైల్ యాజినాల్ ఎరలను ఎకరానికి 12 ఏర్పాటు చేసుకోవాలి. దీంతో ఈగలు ఎరలో పడి నశిస్తాయి. పండు ఈగలు ఆశించిన కాయలను రైతులు తొలగించి నాశనం చేయాలని శాస్త్రవేత్త తెలిపారు.

పండు ఈగలు ఆశించి కుళ్లిన జామకాయలు

సమస్య- సమాధానం

బుక్కరాయ సముద్రం, న్యూస్‌టుడే : జిల్లాలో వివిధ రకాల పంటలు సాగుచేసిన రైతులు పంటల సాగులో ఎలాంటి సందేహాలున్నా రేకులకుంట వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త నారాయణస్వామి నంబరు: 6281284235కు ఫోన్‌చేసి తగిన సలహాలు, సూచనలు పొందవచ్చు.

సమస్య : బీర పంటకు బూడిద తెగులు ఆశించడంతో పూత, పిందెలు రాలిపోతున్నాయి. ఈ తెగులు నివారణ ఎలా చేపట్టాలి.

- నాగభూషణ, నీలంపల్లి

సమాధానం: బీర పంటలో బూడిద తెగులు నివారణకు రైతులు హైక్సాకొనజోల్ 5 శాతం, పైరాక్లోస్ట్రోబిన్ 0.4 మి.లీ, క్లోరోథలోనిల్ 40 శాతం లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకుంటే తెగులు ఉద్ధృతి తగ్గుతుంది.

సమస్య : మామిడి చెట్లు ప్రస్తుతం పూత, పిందె దశలో ఉన్నాయి. చెట్లకు చెదపురుగులు ఆశించాయి. ఈ పురుగులు ఎలా నివారించాలి.

-రాము, కెకె.అగ్రహారం

సమాధానం: చెద పురుగుల నివారణకు రైతులు చెట్లకు 40 కిలోల పశువుల పేడ ఎరువు, భాస్వరం, పొటాష్ ఎరువులు వేసుకున్న తర్వాత చెట్ల మొదలు దగ్గర పాలిథీన్ సంచి కట్టి గ్రీజు పూయాలి. ఇలా చేస్తే చెదపురుగులు చెట్టుపైకి ఎక్కలేవు. పురుగులు నశించాలంటే క్లోరిపైరిఫాస్ 3 గ్రాములు, లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

రైతేరాజు

అరటి రెండో పంటలో రక్షణ చర్యలు

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: అరటిలో మంచి నాణ్యత ఉంటే ధరలు బాగా ఉంటాయని ఉద్యాన అధికారులు కృష్ణతేజ, గౌసియా అన్నారు. అక్టోబరు నుంచి ధరలు తగ్గాయని రైతుల్లో ఆందోళన ఉందన్నారు. ప్రస్తుతం రెండో పంట డిసెంబరు మూడో వారానికంతా పూర్తవుతుంది. పంట రక్షణతో పాటు కాయ నాణ్యతను పెంపొందించుకొనేలా చూడాల్సిన అవసరం ఉంది. నాణ్యత ఉంటే ధర పెరుగుతుందని చెప్పారు.

ఇవి పాటించాల్సిన తరుణం

అరటి పంట, గెలల పెరుగుదలపై రైతులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. పంటకు సోకే సిగటక, ఆకుమచ్చ తెగులు నివారణకు జాగ్రత్తలు పాటించాలి. ప్రధానంగా తెగులు ప్రారంభ దశలో పసుపు మచ్చలు ఏర్పడి బూడిద, గోధుమ రంగుకు మారి ఆకులు ఎండిపోతాయి. తెగుళ్లు సోకకుండా తోటల్లో కలుపు మొక్కలను తొలగించుకోవడం, నీరు నిల్వ లేకుండా నీటిపారుదల వ్యవస్థను మెరుగు పరుచుకోవాలని సూచించారు. తెగుళ్ల వ్యాప్తి మొదలైతే ప్రొపిక్ కొనజోల్ ఒక మి.లీ.. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. రెండో విడతలో కార్బండాజిమ్, మ్యాంకోజెబ్ ఒక గ్రా లీటరు నీటికి, మూడో విడతలో ప్రొపికొనాజోల్, మ్యాంకోజెబ్ మిశ్రమం 1.4 గ్రాములు లీటరు నీటికి, ఐదో పిచికారీ పైరాక్లోస్ట్రోబిన్ 133, ఎపోనికొనాజోల్ 50 ఎస్‌సీ, మినరల్ ఆయిల్ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. వీటన్నింటిని పాటిస్తే అరటిని తెగుళ్ల నుంచి రక్షించుకోవచ్చని తెలిపారు.

అరటి పంట

గంగమ్మ ఆలయ ఈఓ మురళీకృష్ణకు రిమాండ్

నిందితుడిని చూపిస్తున్న డీఎస్పీ శివనారాయణస్వామి, సీఐ తదితరులు

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: యర్రదొడ్డి గంగమ్మకు భక్తులు సమర్పించిన వెండి ఆభరణాలు, చీరలను ఆదివారం ఆటోలో తరలిస్తూ స్థానికులకు పట్టుబడిన ఆలయ ఈఓ మురళీకృష్ణను రిమాండ్‌కు పంపినట్లు కదిరి డీఎస్పీ శివనారాయణస్వామి తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన కదిరి గ్రామీణ పోలీసులు నిందితుడిని అరెస్టు చేసినట్లు వెల్లడించారు. అతడి నుంచి రూ.6.23లక్షల విలువైన 5.570 కిలోల వెండి ఆభరణాలు, 1.980 గ్రాముల బంగారం, 15 చీరలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ వ్యవహారంలో ఈఓతో పాటు ఇతరుల పాత్ర ఉందా అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తామని డీఎస్పీ వివరించారు. ఆలయ ఈఓ వ్యవహారాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణించిన విషయం తెలిసిందే. ఉన్నత అధికారుల లిఖిత, మౌఖిక అనుమతులు లేకుండా, రికార్డులు, రిజిష్టర్‌లో నమోదు చేయకుండా ఆలయ ఆస్తులను తరలిస్తూ అధికార దుర్వినియోగానికి పాల్పడిన ఈఓను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. సమావేశంలో అప్‌గ్రేడ్ సీఐ నిరంజన్‌రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ముగ్గురు విద్యార్థుల ఆచూకీ లభ్యం

రాప్తాడు, న్యూస్‌టుడే: రాప్తాడు మండలం చిన్మయనగర్‌లో ఓ హాస్టల్‌లో ఉంటూ అదృశ్యం అయిన ముగ్గురు పదోతరగతి విద్యార్థుల ఆచూకీ సోమవారం కనిపెట్టారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శుక్రవారం ఉదయం హాస్టల్ నుంచి లగేజీ తీసుకొని వెళ్లిన విద్యార్థులు అనంతపురం రైల్వేస్టేషన్ నుంచి గుంతకల్లు చేరుకున్నారు. అక్కడి నుంచి కసాపురం అంజనేయ స్వామి సన్నిధిలో మూడు రోజులు గడిపారు. వీరి కోసం పోలీసులు 3 రోజులుగా అన్ని ప్రాంతాల్లో గాలింపు చేపట్టినట్లు రాప్తాడు సీఐ శ్రీహర్ష తెలిపారు. సోమవారం ఉదయం ఓ విద్యార్థి తన తల్లిదండ్రులకు ఫోన్ చేయగా పోలీసులు ఆ ఫోన్ నంబరు ద్వారా వారి ఆచూకీ కనుగొని తల్లిదండ్రులతో మాట్లాడించి అనంతపురానికి రప్పించారు. రైల్వేస్టేషన్‌కు రాగానే పోలీసులు అదుపులోకి తీసుకొని వాళ్లను విచారించి వారి తల్లిదండ్రులకు అప్పగించారు.

అమడగూరు పోలీసుల నిర్లక్ష్యం

బాధితుడు ఆదినారాయణ

పుట్టపర్తి పట్టణం, న్యూస్‌టుడే: చోరీకి గురైన ఆవుతో పాటు నిందితుడిని బాధిత రైతు కనిపెట్టి పోలీసులకు ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయలేదు. దీనిపై బాధితుడు ఆదినారాయణ సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ సంఘటన అమడగూరు పోలీస్‌స్టేషన్లో చోటుచేసుకుంది. అమడగూరు మండలం చీకిరేవులపల్లికి చెందిన బాధిత రైతు తుపాకుల ఆదినారాయణ తెలిపిన వివరాల మేరకు.. గత నెల 14న ఆయన ఇంటి వద్ద కట్టేసిన రూ.1.20 లక్షలు విలువచేసే ఆవు చోరీకి గురైంది. బాధితుడు స్థానిక పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేస్తే తీసుకోలేదు. అదే గ్రామానికి చెందిన పీట్ల రమేష్‌పై అనుమానంతో రైతు విచారించగా ఆవును కర్ణాటకలో అమ్మినట్లు తేలింది. ఆయన చింతామణి, తిమ్మసంద్ర, కోలారు పశువుల సంతలో వెదికారు. చివరికి కోలారు సంతలో ఆవును దొరకబుచ్చుకొని ఆ వ్యాపారికి రూ.లక్ష చెల్లించి ఆవును తిరిగి తెచ్చుకున్నాడు. ఈ విషయాన్ని ఆధారాలతో పోలీసులకు చూపించినా నిందితుడిపై కేసు నమోదు చేయలేదు. పైగా ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన నిందితుడి తండ్రి చావుకు రైతే కారణమంటూ ఆయనపైనే కేసు నమోదుకు పోలీసులు యత్నించారు. గతంలోనూ నిందితుడు రమేష్ అదే మండలంలోని గంగిరెడ్డిపల్లి, ఎ.రెడ్డివారిపల్లికి చెందిన పాడి రైతులు రామిరెడ్డి, మహబూబ్ బాషా ఆవులను దొంగలించాడని ఫిర్యాదు చేసినా పోలీసులు కేసు నమోదు చేయలేదు. దీనిపై న్యూస్‌టుడే అమడగూరు ఎస్సై సుమతి దృష్టికి తేగా ఆమె స్పందించారు. బాధిత రైతు ఫిర్యాదు చేసింది నిజమేనని, గత నెలలో సత్యసాయి జయంతి బందోబస్తులో బిజీగా ఉండి కేసు నమోదు చేయలేదన్నారు. వెంటనే నిందితుడిపై కేసు నమోదు చేసి బాధితుడికి న్యాయం చేస్తామన్నారు.

అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా బుడెన్‌సాబ్ నియామకం

అనంతపురం (మూడోరోడ్డు), న్యూస్‌టుడే: 8వ జిల్లా అదనపు న్యాయస్థానం, కుటుంబ న్యాయస్థానం పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా సీనియర్ న్యాయవాది బుడెన్‌సాబ్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఆయన మొదటి అదనపు జిల్లా న్యాయస్థానం పబ్లిక్ ప్రాసిక్యూటర్ గాపని చేశారు. ప్రస్తుతం ఆయనను అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమించారు. రామగిరి మండలం ఆర్.కొత్తపల్లికి చెందిన ఆయన 1977లో న్యాయశాస్త్ర విద్యలో పట్టభద్రులయ్యారు.

టీటీలో కదిరి విద్యార్థినుల సత్తా

ప్రిన్సిపల్, పీడీతో విద్యార్థినులు

అంతర్ కళాశాలల టేబుల్ టెన్నిస్ పోటీల్లో తమ విద్యార్థినులు ఎం.లక్ష్మి, ఎస్.సింధు, ఎస్.శ్రావణి విజేతలుగా నిలిచి కప్ సాధించినట్లు కదిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ స్మిత, పీడీ నరసింహాచారి తెలిపారు. 7న శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో అంతర్ కళాశాలల పోటీలు జరిగాయన్నారు. ఫైనల్స్‌లో అనంతపురం ఆర్ట్స్ కళాశాల జట్టుపై తమ విద్యార్థినులు గెలిచారని వెల్లడించారు. ఈ సందర్భంగా విజేతలను ప్రిన్సిపల్, పీడీతో పాటు అధ్యాపకులు అభినందించారు. **- న్యూస్‌టుడే, కదిరి**

లంచం కేసులో జైలుశిక్ష

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : లంచం తీసుకున్న కేసులో దక్షిణ మధ్య రైల్వే గుంతకల్ డివిజనల్ ఫైనాన్స్ కార్యాలయ అకౌంట్స్ అసిస్టెంట్‌గా పనిచేసిన చల్లా శ్రీనివాసులుకు (ప్రస్తుతం రిటైర్డ్) రెండేళ్ల జైలుశిక్షతోపాటు రూ.20 వేల జరిమానా విధిస్తూ కర్నూలు సీబీఐ కోర్టు న్యాయమూర్తి ఎం.శోభారాణి సోమవారం తీర్పు ఇచ్చారు. గుత్తేదారుడైన సీహెచ్‌డీ రాజులు నాయుడు.. తాను చేసిన పనులకు సంబంధించి రూ.30 లక్షల విలువైన బిల్లులు పెట్టారు. దీనిని మంజూరు చేసేందుకు నిందితుడు రూ.15 వేలు లంచం డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు సీబీఐని ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. 2017, నవంబరు 20న గుత్తేదారుడు లంచం ఇస్తుండగా సీబీఐ అధికారులు దాడి చేసి పట్టుకుని అరెస్టు చేశారు. కోర్టు విచారణలో నిందితుడిపై నేరం రుజువవడంతో జైలుశిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చేశారు. ప్రాసిక్యూషన్ తరఫున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సిరికొండ మనోహర్ వాదించారు.

రెండు లారీలు ఢీకొని చోదకుడు సజీవ దహనం

మరొకరికి గాయాలు

బేస్తవారపేట, న్యూస్‌టుడే: ప్రకాశం జిల్లా, గిద్దలూరు డివిజన్, బేస్తవారపేట మండలంలోని పెంచికలపాడు సమీపంలో అనంతపురం-అమరావతి జాతీయ రహదారిపై సోమవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఓ చోదకుడు సజీవ దహనం కాగా, మరో చోదకుడు గాయాల పాలయ్యాడు. ధర్మవరానికి చెందిన కుంపటి ఆది శేషయ్య మినీ లారీలో టమోటా లోడుతో అనంతపురం నుంచి రాజమండ్రికి బయలుదేరాడు. ఈ క్రమంలో పెంచికలపాడు సమీపంలోకి రాగానే అతను నడుపుతున్న లారీ టైరు పేలిపోవడంతో అదుపుతప్పి ఎదురుగా వస్తున్న మడ్డి ఆయిల్ ట్యాంకర్ బలంగా ఢీకొట్టింది. ప్రమాద ధాటికి మినీ లారీ బోల్తా పడగా ట్యాంకర్ లారీ ముందు భాగం పూర్తిగా దెబ్బతింది. అనంతరం కొద్ది క్షణాల్లోనే రెండు లారీల ఇంజిన్‌లకు పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. దీంతో చోదకుడు ఆదిశేషయ్య అప్రమత్తమై లారీలో నుంచి బయటపడ్డాడు. ఆయిల్ ట్యాంకర్ చోదకుడు పైడికొండల దుర్గారావు (40) క్యాబిన్ ధ్వంసమై పూర్తిగా మూసుకుపోవడంతో బయటికి వచ్చేమార్గం లేక అందులోనే ఇరుక్కుపోయాడు. చూస్తుండగానే మంటలు చెలరేగి అతన్ని చుట్టుముట్టడంతో కూర్చున్న సీట్‌లోనే సజీవ దహనమయ్యాడు. ఇతనిది పశ్చిమ గోదావరి జిల్లా దేవరపల్లి కాగా సోమవారం విశాఖపట్టణం సమీపంలోని పరవాడ వద్ద మడ్డి ఆయిల్‌ను ట్యాంకర్ లారీలో లోడ్ చేసుకున్నాడు. దాన్ని తాడిపత్రిలోని ఓ సిమెంట్ ఫ్యాక్టరీలో అన్‌లోడ్ చేసేందుకు వెళ్తుండగా ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. గిద్దలూరు అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు.

ఆరుగురు విద్యార్థుల డిబార్

ఎస్కేయూ, న్యూస్‌టుడే: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహిస్తున్న డిగ్రీ 3, 5 సెమిస్టర్ పరీక్షల్లో మాస్‌కాపీయింగ్‌కు పాల్పడుతున్న ఆరుగురు విద్యార్థులను డిబార్ చేసినట్లు పరీక్షల విభాగం సంచాలకులు జీవీ రమణ తెలిపారు. అనంతపురంలోని ఎస్ఎల్ఎన్ డిగ్రీ కళాశాలలో ఒకరు, ధర్మవరం వివేకానంద డిగ్రీ కళాశాలలో ఒకరు, గుత్తి ఎం.ఎస్ డిగ్రీ కళాశాలలో ముగ్గురు, హిందూపురం బాలాజీ విద్యామందిర్‌లో ఒకరిని డిబార్ చేసినట్లు ఆయన తెలియజేశారు.

సిమెంటు కర్మాగారంపై విజిలెన్స్ దాడులు

పరిశ్రమను సీజ్ చేస్తున్న విజిలెన్స్ అధికారుల బృందం

గోరంట్ల, న్యూస్‌టుడే : గోరంట్ల మండలంలోని గుత్తివారిపల్లి సమీపంలో కొనసాగుతున్న లేపాక్షి సిమెంట్ పరిశ్రమను విజిలెన్స్ అధికారుల బృందం సోమవారం జప్తు చేసింది. విజిలెన్స్ జిల్లా అధికారి ప్రసాద్, డీఎస్పీ నాగభూషణం, సీఐ శ్రీనివాసులు, ఎస్సై గోపాల్, సిమెంట్ కంపెనీ ప్రతినిధులు, జీఎస్టీ సిబ్బంది, స్థానిక వీఆర్వో ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఈక్రమంలో ట్యాంకర్ల ద్వారా సిమెంట్ తెప్పించుకుని ప్రముఖ కంపెనీల పేర్లున్న సంచుల్లో నింపి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు అందిన సమాచారంతో దాడులు నిర్వహించినట్లు సమాచారం. 335 బస్తాల సిమెంట్ ఉన్న లారీ, బ్రాండెడ్ కంపెనీకి చెందిన 88 ఖాళీ సంచులు, పరిశ్రమను జప్తు చేశారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

ప్రభాకర్

రాప్తాడు, న్యూస్‌టుడే: అప్పుల బాధ తాళలేక ఓ రైతు పురుగులు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. ఈ సంఘటన రాప్తాడు మండలం భోగినేపల్లిలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన చిత్రాప్రభాకర్ వ్యవసాయం చేస్తూ జీవనం సాగించేవారు. తమకు ఉన్న 5 ఎకరాల్లో పంటల సాగు చేస్తుండగా 3 సంవత్సరాల నుంచి పంటలు సరిగా పండక నష్టం వచ్చింది. తెలిసిన వారి వద్ద నుంచి అప్పులు చేయడం ప్రారంభించారు. 3 ఏళ్ల నుంచి పంటలు దిగుబడి రాక అప్పులు కాస్తా.. రూ.16 లక్షలకు చేరింది. వాటిని తీర్చే విషయమై.. ఇంటిలో గొడవలు జరిగేవి. అప్పులు ఇచ్చిన వాళ్లు డబ్బులు అడుగుతున్నారని చెప్పి నిత్యం బాధపడేవాడని భార్య లక్ష్మి తెలిపారు. గురువారం అప్పుల విషయమై భార్యతో గొడవపడి 4న సాయంత్రం పొలంలోకి వెళ్లి పురుగుల మందు తాగాడు. తమ్ముడు నరేష్‌కు ఫోన్ చేసి పురుగు మందు తాగినట్లు తెలపడంతో ఆయన వచ్చి వెంటనే అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

(c) eenadu

హిందూపురం
•హిందూపురం •పెనుకొండ •మడకశిర

పది పరీక్షల నమూనా పత్రాల పంపిణీ

విద్యార్థులకు యూటీఎఫ్ పరీక్షల నమూనా పత్రాలు అందజేస్తున్న హెచ్ఎం నాగేంద్రప్రసాద్

పెనుకొండ, న్యూస్‌టుడే : మండలంలోని మావటూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో దాతల సహకారంలో హెచ్ఎం నాగేంద్రప్రసాద్, ఎంఈవో సుధాకర్ ఆధ్వర్యంలో పదోతరగతి విద్యార్థులకు యూటీఎఫ్ మోడల్ పేపర్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు నబీ, రవీంద్రనాథ్, ఉపేంద్ర, రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన యాత్రలో విద్యార్థులు

పెనుకొండ, న్యూస్‌టుడే : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం రాఘవయ్య ఆధ్వర్యంలో విద్యార్థులు సోమవారం విజ్ఞాన యాత్రలో భాగంగా లేపాక్షి, వీరాపురం వెళ్లారు. ఈసందర్భంగా విద్యార్థులు మొదట లేపాక్షి ఆలయాన్ని సందర్శించి, అక్కడ చరిత్రను గురించి తెలుసుకున్నారు. అనంతరం చిలమత్తూరు మండలంలోని వీరాపురంలో సైబీరియన్ పక్షులను చూడటానికి వెళ్లారు. విజ్ఞాన యాత్రకు వెళుతున్న విద్యార్థులకు ఉదయం రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత బిస్కెట్లు పంపిణీ చేశారు.

లేపాక్షిలోని ఏడుశిరస్సుల నాగేంద్రుడు వద్ద విద్యార్థులు, ఉపాధ్యాయులు

మేమున్నాం.. మీకు తోడుగా

హిందూపురం : 91548 46650
పెనుకొండ : 91000 20922
మడకశిర : 76759 19016

సమస్య: పట్టణంలోని పరిగి రోడ్డులో ఉన్న మధురమీనాక్షి కల్యాణమండపం ఎదురుగా ఉన్న హస్నాబాద్‌కు వెళ్లే రహదారిలో కాలువలో మురుగు చేరి దుర్వాసన వెదజల్లుతోంది. **-నవీన్‌కుమార్**

సమాధానం: పారిశుద్ధ్య కార్మికులను పంపి శుభ్రం చేయిస్తా.

-శంకర్, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్

–న్యూస్‌టుడే, హిందూపురం సాంస్కృతికం

సమస్యలకు పరిష్కారం

స్పందనకు వందనం

హిందూపురం సాంస్కృతికం, న్యూస్‌టుడే: పట్టణంలోని వివిధ కాలనీల్లో నెలకున్న సమస్యలను 'ఈనాడు'లో మేమున్నాం మీకు తోడుగా దృష్టికి తీసుకుపోవడంతో సంబంధిత అధికారి స్పందించారు. పట్టణంలోని బెంగళూరు రోడ్డు సూగూరు ఆంజనేయస్వామి ఆలయానికి వెళ్లే రహదారి ప్రక్కన ఉన్న కాలువలో చెత్తాచెదారం పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. శనివారం మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్ పారిశుద్ధ్య కార్మికులను పంపి కాలువలను శుభ్రం చేయించారు.

పెనుకొండ, న్యూస్‌టుడే : 'పట్టణదారుల్లో గుంతలు.. పట్టని అధికారులు' అన్న శీర్షికన నవంబర్ 22న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత స్పందించారు. శనివారం మంత్రి సూచనల మేరకు రూ.6లక్షలతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. ఈకార్యక్రమంలో తెదేపా పట్టణ కన్వీనర్ శ్రీరాములు, మహిళా అధ్యక్షురాలు రమణమ్మ, నాయకులు త్రివేంద్ర, బాబుల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా చెత్త సేకరణకు మార్గం సుగమం

మున్సిపల్ కార్యాలయం వద్ద ఈ-ఆటోలు

హిందూపురం పట్టణం, న్యూస్‌టుడే : హిందూపురంలో ఇంటింటా చెత్త సేకరణకు ఆర్థిక భారం పెద్దగా పడకుండా అత్యాధునిక పద్ధతులతో ముందుకెళ్లడానికి అడుగులు పడుతున్నాయి. ఇంధనంతో నడిచే చెత్త సేకరణ ఆటోలకు మంగళం పడానున్నారు.

● గత ప్రభుత్వ హయాంలో ముందు నుంచి ఉచితంగా అందిస్తున్న సేవకు చెత్త పన్ను విధించింది. పన్ను వసూలు చేసి, ప్రైవేట్ ఏజెన్సీతో ఆటోలు పెట్టించి, ఇంటింటా చెత్త సేకరణ చేయించింది. చెత్త పన్ను వసూలు వివాదాస్పదంగా మారడంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రద్దు చేసింది. ఇంటింటా చెత్త సేకరణను వాహనాలతో కాకుండా కార్మికులతో తోపుడు బండ్లపై చేయించాలని పురపాలక శాఖ ఆదేశించింది. ఇది ఆచరణలో కష్టసాధ్యంగా మారింది.

మరిన్ని ఆటోలు వస్తేనే ప్రయోజనం...

● కార్మికులతో, తోపుడు బండ్లతో పెద్ద పట్టణాల్లో ఇంటింటా చెత్త సేకరణ సాధ్యం కాదని ఆరు నెలల కిందట మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన మల్లికార్జున గుర్తించారు. ఆటోలు పెడితే ఇంధనం ఖర్చు తడిసి మోపడవుతుంది. ఆదాయం తక్కువగా ఉన్న పురపాలికపై అదనపు భారం పడుతుంది.

ఆలోచన మెదిలిందిలా..!

అన్ని పరిమితులను గుర్తించిన కమిషనర్ చెత్త సేకరణకు విద్యుత్తు ఆటోలను కొనుగోలు చేయాలని ఆలోచన చేశారు. వాటిని ఛార్జింగ్ చేయడానికి మున్సిపల్ కార్యాలయంలోనే ఛార్జింగ్ పాయింట్లు సిద్ధం చేయించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి మంజూరై, ఖర్చు చేయకుండా ఉన్న 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.కోటితో ఈ- ఆటోల కొనుగోలుకు ఉపయోగించాలని నిర్ణయించి, ఉన్నతాధికారుల అనుమతి తీసుకొని, టెండర్లు పిలిచారు. ఒక్కో ఈ-ఆటోకు రూ.11 లక్షలు వెచ్చించి, 9 ఆటోలను నేరుగా వాటిని తయారు చేసే కంపెనీ నుంచి కొనుగోలు చేశారు. కంపెనీ ప్రతినిధులు ఇటీవలే మూడు ఆటోలను అప్పగించారు. మిగిలినవి త్వరలో అందించనున్నారు. వచ్చిన ఆటోల రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతోంది.

హైడ్రాలిక్ వ్యవస్థతో..

పాత ఆటోల మాదిరిగా కాకుండా ప్రస్తుతం సరఫరా అయిన ఆటోల్లో తడి చెత్త, పొడి చెత్త వేయడానికి వేరు వేరుగా కంపార్ట్‌మెంట్లు ఉండటం, చెత్తను డంప్ యార్డులో వేయడానికి హైడ్రాలిక్ వ్యవస్థ వంటి ఆధునాతన సదుపాయాలు ఉపయోగకరంగా ఉన్నాయని ఇంజినీరింగ్, పారిశుద్ధ్య విభాగాల అధికారులు పేర్కొన్నారు. అయితే మరిన్ని ఆటోలు వస్తేనే ప్రయోజనం చేకూరుతుంది. పట్టణంలో ఇంటింటా చెత్త సేకరణకు కనీసం 19 ఆటోలు అవసరం. ఒక్కో ఆటోను రెండు వార్డుల్లో తిప్పితే ఇళ్లలో ఉత్పత్తి అయ్యే చెత్తను పూర్తిగా సేకరించడానికి అవకాశం ఉంటుంది.

పురపాలిక :	జనాభా:	వార్డులు:	నివాస గృహాలు:	కార్మికుల సంఖ్య:	రోజు ఉత్పత్తి అయ్యే చెత్త:
హిందూపురం	1.8 లక్షలు	38	40 వేలు	340	60 మెట్రిక్ టన్నులు

చెక్‌డ్యాంకు మరమ్మతులేవీ?

మండలంలోని మోపురుగుండు వంకపై నిర్మించిన చెక్‌డ్యాం పూర్తిగా శిథిలమై కట్ట తెగిపోయింది. పై ప్రాంతం నుంచి వచ్చే నీరు నిలబడకుండా లోతట్టు ప్రాంతానికి నీరు వెళ్తున్నాయి. ఇప్పటికైనా మరమ్మతు చేసి నీరు నిల్వ ఉండేలా చేయాలని రైతులు సత్యనారాయణ, కరినింగప్ప, దివాకర్, రంగప్ప, రాజేంద్రచారి తదితరులు కోరారు. ఈ విషయమై ఏపీఈ జగదీశ్ మాట్లాడుతూ చెక్‌డ్యాంను పునర్నిర్మిస్తామన్నారు. **-న్యూస్‌టుడే, గుడిబండ**

నకిలీ జనన ధ్రువీకరణ పత్రం జారీపై విచారణ

అగళి, న్యూస్‌టుడే : మండలంలోని కొమరేపల్లి పంచాయతీలో జనన ధృవీకరణ పత్రాల గోల్‌మాల్ విషయంలో విచారణ కొనసాగుతుంది. గతంలో పంచాయతీలో పనిచేసిన పంచాయతీ కార్యదర్శులతో సోమవారం ఇంఛార్జి డీఎల్పీవో నాగాంజనేయ ప్రసాద్ విచారణ చేశారు. 2020-25 మధ్యలో పనిచేసిన వరదరాజులు, రమ్య, మహేశ్, అశోక్ తదితరుల నుంచి వివరాలు సేకరించారు. 2022-24 సమయంలో కొమరేపల్లి లాగిన్‌లో కొన్ని జనన, మరణ ధృవీకరణ పత్రాలు మంజూరైనట్లు వాటిపై విచారణ చేసినట్లు తెలిసింది.

ఘనంగా సంకష్టహర చతుర్థి వేడుకలు

హిందూపురం సాంస్కృతికం, న్యూస్‌టుడే: పట్టణంలోని ఎం.ఎఫ్.రోడ్డు, కోట, శ్రీనివాసనగర్, ఏటిగడ్డ ఆంజనేయస్వామి, నానెప్పనగర్‌లో ఉన్న గాయత్రి, వినాయక దేవాలయాల్లో సోమవారం రాత్రి ఘనంగా సంకష్టహరచతుర్థి వేడుకలు నిర్వహించారు. మహిళలు గణపతినామ స్తోత్ర పారాయణం, భక్తిగీతాలను ఆలపించారు.

పుష్పాలంకరణలో వినాయకుడు

'హిందూపురాన్ని జిల్లా కేంద్రంగా ప్రకటించాలి'

అంబేడ్కర్ కూడలిలో అఖిలపక్షం ఆధ్వర్యంలో నిరసన

హిందూపురం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రానికి అన్ని అర్హతలు ఉన్న హిందూపురాన్ని జిల్లా కేంద్రంగా గుర్తించకపోవటం అన్యాయమని అఖిలపక్షం నాయకులు వాపోయారు. సోమవారం స్థానిక ఇందిరా పార్కులో అఖిలపక్షం సమావేశం నిర్వహించి జిల్లా కేంద్రం సాధనకు పోరాటం ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. అక్కడి నుంచి అంబేడ్కర్ కూడలికి ర్యాలీగా చేరకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అఖిలపక్షం నాయకులు రామచంద్రారెడ్డి, వన్నూరప్ప, డాక్టర్ వెంకటరమణ, ఇందాద్, శ్రీరాములు, జమీల్, నాగరాజు, రవికుమార్, ఈశ్వరయ్య, అమానుల్లా, బాబావలి, చంద్రశేఖర్‌రెడ్డి, కదిరీశ్ తదితరులు మాట్లాడుతూ... హిందూపురాన్ని జిల్లా కేంద్రంగా ప్రకటించాలని శాసనసభ్యుడు బాలకృష్ణ అనాడు అఖిలపక్షం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేసి తమ ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే జిల్లా కేంద్రంగా గుర్తించేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారన్నారు. దీనికి సంబంధించి కనీసం ఇప్పటి వరకు ఎమ్మెల్యే స్పందించలేదని ఆవేదన చెందారు. దాదాపు 3 లక్షల జనాభా, జిల్లా కేంద్రం చేయటానికి అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయన్నారు. దిగిరాకపోతే జిల్లా కేంద్రం సాధనకు అఖిలపక్షం ఆధ్వర్యంలో ఉద్యమం కొనసాగుతుందని హెచ్చరించారు.

ఉపాధి హామీ సామాజిక తనిఖీ

గ్రామసభలో వివరాలు వెల్లడిస్తున్న సామాజిక తనిఖీ సిబ్బంది

అగళి, న్యూస్‌టుడే : మండలంలోని ఇరిగేపల్లి గ్రామం రైతు సేవా కేంద్రం వద్ద సోమవారం సామాజిక తనిఖీ గ్రామ సభ నిర్వహించారు. గ్రామ సర్పంచి లక్ష్మమ్మలింగరాజు అధ్యక్షతన నిర్వహించిన సామాజిక తనిఖీ గ్రామసభలో డీఆర్పీ రాజేశ్, మురళి పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామంలో జరిగిన పనుల వివరాలను సభలో చదివి వినిపించారు. క్షేత్రస్థాయిలో పని చేసిన వాటికి నోట్ కెమెరాలో కాకుండా, సాధారణ ఫొటో తీసినట్లు తెలిసింది. ఓ రైతుకు చెందిన పొలంలో 300 గుంతలకు రూ.9300 బిల్లులు చేశారని, పొలంలో గుంతలు లేవని, కనకాంబరం పూలచెట్లు ఉన్నాయని, కొని పనులు క్షేత్రస్థాయిలో కనపడలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఏ రమేశ్, వెంకటప్ప, క్షేత్ర సహాయకులు, ఉపాధి హామీ శ్రామికులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

13న ఉచిత కంటి వైద్య శిబిరం

హిందూపురం సాంస్కృతికం, న్యూస్‌టుడే: 'పురం' ట్రినిటీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఎంజీఎం క్రీడామైదానంలో ఈనెల 13న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ట్రినిటీ అధ్యక్షుడు డా.కుమార్‌రాజా సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణ, గ్రామాల్లో ఉన్న కంటి సమస్యలతో బాధపడుతున్న వారందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఉపాధ్యాయుడిపై సస్పెన్షన్ వేటు

మడకశిర గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని హరేసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న గణిత ఉపాధ్యాయుడు నరసింహమూర్తిని సస్పెండ్ చేసినట్లు ఎంఈఓ భాస్కర్ తెలిపారు. ఉపాధ్యాయుడు పాఠశాలలో చదువుతున్న 7వ తరగతి విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించాడని తల్లిదండ్రులు, ప్రధానోపాధ్యాయుడికి ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టి నివేదికను జిల్లా విద్యాశాఖ అధికారికి పంపగా పరిశీలించి ఆ ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేసినట్లు ఎంఈఓ తెలిపారు.

ఆటో బోల్తా.. ఆరుగురికి గాయాలు

పెనుకొండ,న్యూస్‌టుడే: పెనుకొండ మీద విహారానికి వెళ్లి తిరిగి వస్తుండగా ఆటో బోల్తాపడి అనంతపురానికి చెందిన ఆరుగురు గాయాలపాలయ్యారు. బాధితులు తెలిపిన వివరాల మేరకు అనంతపురం నగరంలో గుత్తిరోడ్డు ఎల్‌వీకాలనీ చెందిన ఓ కుటుంబం 9 మందితో పెనుకొండలోని బాబయ్యస్వామి దర్గా సందర్శనకు వచ్చారు. దర్గాలో ప్రార్థనలు ముగించుకుని పెనుకొండ పైకి విహారానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ఘాట్‌రోడ్డు వస్తుండగా ఆటోలో బ్రేక్ పెడల్‌కు నీళ్లసీసా అడ్డుపడింది. ఆటో అదుపుతప్పిన సమయంలో బ్రేక్ వేయలేకపోవడంతో బోల్తా పడింది. క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. ప్రమాదంలో రెహానా, మహబూబ్‌బేగం, బాబావలీ, చిన్ని, షాను, బాబా గాయాలపాలయ్యారు. ప్రాథమిక చికిత్స అనంతరం తీవ్రంగా గాయపడిన షాను, మహబూబ్‌బేగంలను మెరుగైన వైద్యం కోసం 108లో అనంతపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

తాగునీటి సమస్య పరిష్కరిస్తాం

సోమందేపల్లి, న్యూస్‌టుడే: పాపిరెడ్డిపల్లిలో నెలకొన్న తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించనున్నట్లు ఎంపీడీవో వెంకటలక్ష్మమ్మ, ఏఈ మహేశ్, ఉప ఎంపీడీవో ప్రేమ్‌కుమార్, తెదేపా నాయకులు చంద్రశేఖర్, సురేంద్ర పేర్కొన్నారు. ఈమేరకు తాగునీటి సమస్య ఉన్న ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం ఎంఈవో ఆంజనేయులు నాయక్‌తో కలిసి కేజీబీవీలో తాగునీటి సమస్యను తెలుసుకొన్నారు. వెంటనే విద్యుత్తు మోటారును మరమ్మతులకు తరలించారు. సక్రమంగా నీటిని సరఫరా చేస్తామని అధికారులు, నాయకులు తెలిపారు.

అఖండ-2 చిత్రానికి అడ్డంకులు తొలగాలని పూజలు

హిందూపురం గ్రామీణం, న్యూస్‌టుడే: నందమూరి బాలకృష్ణ నటిస్తున్న అఖండ-2 చిత్రం అడ్డంకులు తొలగిపోయి త్వరలో విడుదల కావాలని అభిమాన సంఘం నాయకులు కె.బసవనపల్లి శివాలయంలో 101 కొబ్బరి కాయలు కొట్టారు. అఖిల భారత బాలకృష్ణ అభిమాన సంఘం కన్వీనర్ నంబూరి సతీశ్, పట్టణ అధ్యక్షుడు బండారు బాలాజీ, ఉపాధ్యక్షుడు హెచ్.ఎన్.రాము, అభిమానులు పాల్గొన్నారు.

పాఠశాలకు టేబుల్ వితరణ

పెనుకొండ, న్యూస్‌టుడే : పట్టణ పరిధిలోని వెంకటరెడ్డి ప్రాథమికోన్నత పాఠశాలకు అవసరమైన టేబుల్‌ను పెనుకొండకు చెందిన ముస్లిం ఐక్యవేదిక కోర్‌కమిటీ సభ్యుడు రియాజ్‌బాషా వితరణ చేశారు. ఈసందర్భంగా సోమవారం రియాజ్‌బాషాను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నారాయణస్వామి, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఎస్ఎంసీ ఛైర్మన్ రవి, తదితరులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని వృద్ధుడి మృతి

సోమందేపల్లి, న్యూస్‌టుడే : స్థానిక క్రీస్తుజ్యోతి పాఠశాల సమీపంలో రహదారిపై సోమవారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని ఖాదర్‌బాషా(60) మృతి చెందారు. స్నేహలతా నగర్‌కు చెందిన ఆయన ఇక్కడి రహదారిపై నడిచివస్తుండగా ఈ సంఘటన చోటుచేసుకొన్నట్లు తెలిసింది. ఈ ఘటనపై పూర్తి వివరాలు తెలియడం లేదని పోలీసులు చెబుతున్నారు.

వ్యర్థాలు వేస్తున్న వారిపై చర్యలకు డిమాండ్

తహసీల్దార్ హసీనాసుల్తానాకు వినతి పత్రం ఇస్తున్న భాజపా నాయకులు

పరిగి, న్యూస్‌టుడే: కర్ణాటక నుంచి వ్యర్థాలను తీసుకువచ్చి ఆంధ్ర ప్రాంతంలోని రైతుల పొలాల్లోకి వేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని భాజపా నాయకులు, హైకోర్టు అడ్వకేట్ పరిగి వేణుగోపాలరావు సోమవారం తహసీల్దార్ హసీనాసుల్తానాకు ఇచ్చిన వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో భాజపా మండల అధ్యక్షుడు ఎన్.ఎల్. నరసింహమూర్తి, నాయకులు సంపత్, సురేందర్, ఎస్.ఎన్.మూర్తి, శివ, తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల కోటిసంతకాల సేకరణ

పెనుకొండ, న్యూస్‌టుడే : వైద్యకళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైకాపా లీగల్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు ఆధ్వర్యంలో న్యాయవాదులు కోటి సంతకాల సేకరణ నిర్వహించారు. సోమవారం పట్టణంలోని కోర్టురోడ్డులో న్యాయవాదులు ప్రజల నుంచి సంతకాలు సేకరించారు. న్యాయవాదులు విశ్వనాథ్‌నాయక్, జావిద్, నాగిరెడ్డి, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

మూడు పంచాయతీలకు భవనాల మంజూరు

గోరంట్ల, న్యూస్‌టుడే : మండలంలో మూడు పంచాయతీలకు నూతన భవనాలు మంజూరైనట్లు తెదేపా మండల కన్వీనర్ బాలకృష్ణచౌదరి, పంచాయతీ రాజ్‌శాఖ మండల ఏఈ వరప్రసాద్ పేర్కొన్నారు. ఒక్కో పంచాయతీ భవన నిర్మాణానికి రూ.32లక్షల ప్రకారం రెడ్డిచెరువుపల్లి, గడ్డంతండా, కరావులపల్లితండాకు నిధులు మంజూరైనట్లు చెప్పారు.

రహదారి పనులు.. పైపులైన్‌కు లీకేజీలు

గోరంట్ల ప్రజలకు తాగునీరు అందివ్వడానికి కొత్తచెరువు నుంచి ఏడాది క్రితం గోరంట్ల వరకు ఏర్పాటు చేసిన శ్రీసత్యసాయి నీటిపథకానికి అడుగడుగునా అవాంతరాలు ఎదురవుతూనే ఉన్నాయి. కోడూరు నుంచి ముదిగుబ్బ వరకు నూతనంగా నిర్మిస్తున్న 342 జాతీయ రహదారి విస్తరణ కోసం కొనసాగుతున్న పనుల నేపథ్యంలో తరచూ పైపులైన్ పగిలిపోతోంది. మూడు రోజుల క్రితం మార్గమధ్యలో వెంకటగారిపల్లికి సమీపంలో పైపులైన్ పగిలి వాటర్‌ఫౌంటైన్‌ను తలపిస్తోంది. గోరంట్లకు నీటి సరఫరా ఆగిపోయింది. ఆర్‌డబ్ల్యూఎస్ మండల ఏఈ మోహన్‌కుమార్‌ను విచారించగా పరిస్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. **-న్యూస్‌టుడే, గోరంట్ల**

సమాన హక్కులతోనే అభివృద్ధి సాధ్యం

మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కన్వీనర్ దిల్షాద్, పక్కన జిల్లా, మండల నాయకురాళ్లు శ్రీదేవి, గౌతమి తదితరులు

సోమందేపల్లి, న్యూస్‌టుడే: సమాజంలో అందరికీ సమాన హక్కులు కల్పించినప్పుడే మహిళలతో పాటు మానవాళి అభివృద్ధి సాధ్యమవుతుందని ఐద్వా జిల్లా కన్వీనర్ దిల్షాద్, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి తెలిపారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఆడిటోరియంలో మానవ హక్కులే-మహిళల హక్కులు అనే అంశంపై విద్యార్థినులతో సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతులైన జ్యోతిరావు పులే, గురుజాడ అప్పారావు, రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. హెచ్ఎం రామాంజనేయులు, ప్రదీప్‌కుమార్, పీడీ అలివేలమ్మ, గౌతమి, రజియా, భారతి, మల్లేశ్వరి, అశ్విని, వెంకటలక్ష్మమ్మ, హనుమక్క, ప్రభావతి పాల్గొన్నారు.

జిల్లడగుంట ఆంజనేయస్వామి హుండీ లెక్కింపు

మడకశిర గ్రామీణం, న్యూస్‌టుడే: భక్తరపల్లి లక్ష్మీనరసింహస్వామి, జిల్లడగుంట ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా జిల్లడగుంట ఆంజనేయస్వామి హుండీ ఆదాయం సోమవారం లెక్కించినట్లు దేవాదాయశాఖ ఈఓ నరసింహరాజు తెలిపారు. ఈ తాత్కాలిక హుండీ ద్వారా రూ.2.37 లక్షల ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

ఏఐ సాంకేతికతో విప్లవాత్మక మార్పు

హిందూపురం, న్యూస్‌టుడే: హిందూపురంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో సోమవారం 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో 'కృత్రిమ మేధ ఏఐ వల్ల భవిషత్‌లో వచ్చే మార్పులు' అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో రక్షిత ప్రథమ, భావన ద్వితీయ, గంగోత్రి తృతీయ స్థానంల్లో నిలిచారు. వీరికి కళాశాల ప్రిన్సిపల్ అనూరాధ, అధ్యాపకులు బహుమతులు అందజేశారు.

ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో విజేతలతో ప్రిన్సిపల్, అధ్యాపకులు

ఆడబిడ్డలకు ప్రభుత్వం అండగా ఉంటుంది: మంత్రి

అనాథలైన బాలికలకు రూ.25వేలు ఆర్థిక సాయం చేస్తున్న మంత్రి సవిత

పరిగి, న్యూస్‌టుడే: పరిగిలో తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మిగిలిన ఇద్దరు ఆడ బిడ్డలకు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి సవిత హామీ ఇచ్చారు. సోమవారం మంత్రి పరిగి పర్యటనకు వచ్చి అనాథ బాలికలను పరామర్శించారు. తన వంతుగా రూ.25వేల ఆర్థిక సాయం చేశారు. అక్షిత, వందనలను ఉన్నత చదువులు చదివించేందుకు ప్రభుత్వం తరపున, వ్యక్తిగతంగా తోడ్పాటు నందిస్తానన్నారు. అనంతరం మంత్రి బీసీ వసతి గృహాన్ని తనిఖీ చేశారు. ఉన్నత పాఠశాలలోని సమస్యలు తెలుసుకున్నారు. పార్టీ మండల కన్వీనర్ ఎస్.ఎన్.గోవిందరెడ్డి, తెలుగు యువత జిల్లా కార్యదర్శి ప్రవీణ్‌రెడ్డి, నాయకులు సోమప్ప,పాల్గొన్నారు.

విద్యార్థినుల సమస్యలపై ఆరా

పెనుకొండ, న్యూస్‌టుడే: పెనుకొండలోని ఏపీ గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత ఆకస్మికంగా తనిఖీ చేశారు. సోమవారం ఉదయం ద్విచక్రవాహనంపై పాఠశాలకు వెళ్లిన మంత్రి పాఠశాలలో మరుగుదొడ్లు, తాగునీరు, వంటగది, తరగతి గదులు, డార్మెట్రీ, పలు రికార్డులను పరిశీలించారు. వంటగది, మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం పాఠశాల విద్యార్థినులతో సమావేశమై అవసరాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో జరుగుతున్న ఆధునీకరణ పనులపై ఉన్నతాధికారులతో చరవాణిలో చర్చించారు. పాఠశాలకు ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ఉన్నారని, రెగులర్ ప్రిన్సిపల్‌ను నియమించాలని ఆదేశించారు. పాఠశాలలో భద్రతా ఏర్పాట్లు, గదుల శుభ్రత, వైద్య పరీక్షలు, ఆరోగ్యంపై ప్రత్యేకంగా ప్రశ్నించారు. పాఠశాల అభివృద్ధికి అవసరమైన పనులు, మరిన్ని సౌకర్యాలు త్వరలో కల్పిస్తామని విద్యార్థినులకు హామీ ఇచ్చారు.

(c) eenadu

పుట్టపర్తి

•పుట్టపర్తి •ధర్మవరం •కదిరి •రాప్తాడు

ఆలయానికి నీటి శుద్ధి యంత్రం వితరణ

మండలంలోని తవళం ఆంజనేయస్వామి ఆలయానికి నాయన చెరువుపల్లికి చెందిన సూర్యనాయక్ అనే వ్యక్తి సోమవారం నీటి శుద్ధి యంత్రాన్ని వితరణ చేశారు. ఆలయంలో జరిగే శుభకార్యాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు హాజరయ్యే భక్తులు శుద్ధ జలం లేక ఇబ్బందులు పడుతున్నారు. గేమేనాయక్ తాండా సర్పంచి కాంతమ్మ భర్త లక్ష్మన్ నాయక్ చొరవతో దాత ఈ యంత్రాన్ని అందజేశారు. ఆలయ ఛైర్మన్ ఈశ్వర్‌రెడ్డి, డైరెక్టర్ చెన్నకృష్ణ తదితరులు దాతకు కృతజ్ఞతలు తెలిపారు. -న్యూస్‌టుడే, తనకల్లు

కస్తూర్బా టైప్-4 వసతిగృహం సందర్శన

గాండ్లపెంట: పట్టణంలోని కస్తూర్బా టైప్-4 వసతిగృహాన్ని జీసీడీవో అనిత, విద్యాధికారులు కృష్ణానాయక్, శ్రీనివాసులు సోమవారం సందర్శించారు. ఈ గృహంలో విద్యార్థులతో పనిచేయిస్తున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంపై ఆరా తీశారు. విద్యార్థులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. వసతిగృహం ప్రాంగణమైన తొలి నాళ్లలో సిబ్బంది లేనప్పుడు తమ ఇష్టంతోనే పనులు చేసుకున్న విద్యార్థులు వారికి తెలిపారు. తదితర అధికారులు దురంగా మాట్లాడిన హాజరు పట్టిక పరిశీలించారు. వార్డెన్, సిబ్బంది సమన్వయంతో పనులు చేసుకోవాలని, తప్పిదాలు చేస్తే చర్యలు తప్పవని జీసీడీవో హెచ్చరించారు. పరస్పర అవగాహనతో మెలగాలని, వసతిగృహంలో ప్రశాంత వాతావరణంలో విద్యార్థులు చదువుకునేలా చూడాలని స్పష్టం చేశారు.

IN THE COURT OF THE 1st ADDL. DISTRICT JUDGE, ANANTHAPURAMU
E.P. No 137/2025 in Arbitration Case No.2211/2023

Between:
M/s. Five Star Business Finance Limited, Chennai Represented by its Authorized Signatory G.Giddaiah, Kurnool ..... Petitioner/ D.Hr
V/s
J.Dr. No.1. Shaik Vahida Begum W/o Shaik Mahaboob Peere, J.Dr. No2. Shaik Mahaboob Basha S/o Shaik Mahaboob Peere, J.Dr. No.3 Shaik Shavali S/o Shaik Mahaboob Peere, All are R/at, D.No.20/533, Lonikota, Dharmavaram, Anantapur District. Now at Sri Sathya Sai Dist. ...Respondents/J.Drs

వేలం ప్రకటన
పైన తెలిపిన E.P మెత్తమును రాబట్టుటకు 1వ J.Drను సంబంధించిన ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని పై తెలిపిన కోర్టులో వేలముకు తెచ్చియున్నారు. వేలములో పాల్గొనదలచినవారు 19-12-2025వ తేది ఉదయం 10.30 గంటలకు పై కోర్టులో హాజరై కొనుగోలు చేయుటకు లోబడి వేలములో పాల్గొనవచ్చును.

SCHEDULE
The property is situated in RD Anantapur and SRD of Dharmavaram, within the fields of Dharmavaram Village, Basavannakatta, Lonikota, Ananthapuramu District, Ward No.20, Sy.No.478-1, House No.20-533, Extent:24 Square Yards
Boundaries: North by: House with D.No.20-534 of B-Schedule, South by: House of P.Gajula Khaja Hussain, East by: Road and West by: P.Suleman Property.
Totally Site measuring-24 Square Yards and Built area is 216 Square Feet.
Ameen Value: Rs.3,50,000/-
D.Hr. Value: Rs.3,00,000/-
కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
M.SURESH KUMAR, Advocate
Ananthapuramu. Cell:9441168233

మేమున్నాం.. మీకు తోడుగా

పుట్టపర్తి: 80085 73039
కదిరి : 80085 73033
ధర్మవరం: 99596 98222

సమస్య: చెన్నేకొత్తపల్లి మండలం వెంకటాంపల్లి గ్రామ సమీపం నుంచి అమిదాలకుంట గ్రామం వరకు రహదారి పూర్తిగా శిథిలం కావడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. - రామ్మోహన్‌రెడ్డి, వెంకటాంపల్లి

సమాధానం: దారి పరిస్థితిపై ఉన్నతాధికారులకు నివేదించాం. నిధులు మంజూరైన వెంటనే నిర్మాణ పనులు చేపడతాం. - అబ్దుల్ ఖాదర్, మండల ఇన్‌ఛార్జి పీఆర్ ఏఈ

సమస్య: చెన్నేకొత్తపల్లి మండలం మేడాపురం పలు వీధుల్లో కాలువలను శుభ్రం చేయకపోవడంతో కాలనీ వాసులు ముఠుగుతో అసౌకర్యానికి గురవుతున్నారు. - మల్లికార్జున, స్థానికుడు

సమాధానం: గ్రామాన్ని సందర్శించి పరిశుభ్రత చర్యలు చేపట్టేలా గ్రామ సచివాలయ సిబ్బందికి సూచిస్తాం. - అశోక్‌నాయక్, ఈవోఆర్డీ
- న్యూస్‌టుడే, చెన్నేకొత్తపల్లి

ఆదమరిస్తే.. కాలువలోకే..

అస్తవ్యస్త పనులతో తిప్పలు

గాంధీనగర్‌లో ప్రమాదకరంగా ఉన్న మురుగుకాలువ

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: ధర్మవరం పట్టణ పురపాలికలో పలు చోట్ల సగం సగం నిర్మించిన కల్వర్టులు, కాలువలు నాణ్యతాలోపంతో ముప్పుగా పరిణమించాయి. కొన్ని ప్రాంతాల్లో పలకలు లేకపోవడం, మరి కొన్ని ప్రాంతాల్లో ఉన్నా సగానికి విరిగిపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఐదేళ్ల క్రితం నిర్మించిన కొన్ని కాలువలపై నేటికీ పలకలు వేయలేదు. గుత్తేదారులు సగం సగం పనులు చేయడమే దీనికి కారణం. ఈ నేపథ్యంలో ఎప్పుడు ఎవరు కాలువలో పడతారో, ఎలాంటి దుర్వార్త వినాల్సి వస్తుందోనని పట్టణవాసులు, వాహనచోదకులు భయాందోళన చెందుతున్నారు. వృత్తనసరి పరిస్థితుల్లో దేవుడిపై భారం వేసి రాకపోకలు సాగిస్తున్నారు. చిన్నపాటి మురుగుకాలువల్లో పడి గాయపడిన సందర్భాలెన్నో ఉన్నాయి. కొందరు మద్యం మత్తులో కాలువల్లో పడి చనిపోయిన ఘటనలు చోటుచేసుకున్నాయి. ప్రధానంగా వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాల్లోకి వరద నీరు భారీగా చేరుకుంటుంది. అలాంటి సమయంలో డ్రైనేజీ కాలువలు పొంగి పొర్లుతుంటాయి. ఏ కాలువ ఎక్కడున్నాయో తెలియక పడిపోయి ప్రాణాలు పోగొట్టుకునే ప్రమాదం ఉంది. దీనిపై పురపాలిక అధికారులు దృష్టికి తెచ్చినా స్పందించడం లేదని పట్టణవాసులు వాపోతున్నారు.

ఎక్కడెక్కడ ప్రమాదకరంగా ఉన్నాయంటే..

పట్టణంలోని గాంధీనగర్, శ్రీదేవి థియేటర్, దుర్గానగర్, గుడ్డిబావి వీధి, పీఆర్టీ స్ట్రీట్, పార్థసారథి నగర్, ఎల్‌సీకేపురం తదితర ప్రాంతాల్లో తెరుచుకున్న డ్రైనేజీ కాలువలు ప్రమాదకరంగా మారాయి. ఎస్‌బీఐ బ్యాంకు సమీప ముఠుగు కాలువ చాలా పెద్దగా ఉంటుంది. దీనికి కనీసం రక్షణ గోడ నిర్మించలేదు. ఈ ఏడాది మొదట్లో ఇందులో పడి ఓ కార్మికుడు మృతి చెందిన విషయం తెలిసిందే. కాలువ పక్కన నివాసాల్లో ఉంటున్న వారు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని భయభయంగా జీవిస్తున్నారు. చిన్నారులు, వృద్ధులు, మహిళలు ఏమాత్రం ఆదమరిచినా కాలువలోకి జారి పడిపోవాల్సిందే.

గట్టి చర్యలు తీసుకుంటాం

పట్టణంలోని పలు ప్రాంతాల్లో డ్రైనేజీ కాలువ పనులు అసంపూర్తిగా చేసినట్లు నా దృష్టికి వచ్చింది. ఇప్పటికే ఎక్కడెక్కడ అసంపూర్తిగా నిర్మించారో క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నాం. వారం రోజుల్లో ఆయా ప్రాంతాల్లో పనులు ప్రారంభించేలా గట్టి చర్యలు తీసుకుంటాం. అంతవరకు ఎలాంటి ప్రమాదం జరగకుండా తాత్కాలిక చర్యలు చేపడతాం.
-సాయికృష్ణ, ఇన్‌ఛార్జి కమిషనర్, ధర్మవరం

మీ-సేవా నిర్వాహకుడికి తాఖీదు

నంబులపూలకుంట, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో నిర్వహిస్తున్న మీ-సేవా నిర్వాహకుడు బాషాకు తహసీల్దార్ దేవేంద్రనాయక్ సోమవారం నోటీసు జారీ చేశారు. సేవలకు అధిక రుసుం తీసుకుంటున్నట్లు ఫిర్యాదు రావడంతో తనిఖీకి వచ్చినట్లు చెప్పారు. అధిక రుసుం తీసుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. మరోసారి ఫిర్యాదు వస్తే శాఖాపర చర్యలు తప్పవని హెచ్చరించారు.

భాజపా ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి ఎంపిక

తనకల్లు, న్యూస్‌టుడే: మండలంలోని కొక్కంటిక్రాస్‌కు చెందిన హనుమప్ప చంటి భాజపా ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈమేరకు ఆయన సోమవారం తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఆరోగ్య మంత్రి సత్యకుమార్‌యాదవ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గోపి శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

నల్లమాడ, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని పలు ఎరువుల దుకాణాలను సోమవారం మండల వ్యవసాయ అధికారి అల్తాఫ్‌అలీఖాన్ తనిఖీ చేశారు. స్థానికంగా ఉన్న శ్రీనివాస, శ్రీలక్ష్మీ వెంకటేశ్వర, హనుమాన్ ఫర్టిలైజర్స్, వెస్టేబుల్ దుకాణాలను తనిఖీ చేసిన ఆయన సరుకు నిల్వ రికార్డులు, ధరల జాబితాలను పరిశీలించారు. కొన్ని ఎరువుల శాంపిల్స్ తీసి ల్యాబ్‌కు పంపించారు. రైతులకు ఎరువులు అమ్మితే కచ్చితంగా బిల్లులు ఇవ్వాలని, ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయించాలని దుకాణదారులకు స్పష్టం చేశారు.

ఉపాధ్యాయులకు క్రికెట్ కిట్ పంపిణీ

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు స్పోర్ట్స్ మీట్ జరుగుతోంది. ఇందులో భాగంగా సోమవారం ఉపాధ్యాయుల మొదటి రౌండ్ క్రికెట్ పోటీలో గెలిచారు. పట్టణానికి చెందిన రోటరీక్లబ్ ఇన్నర్ వీల్ సంస్థ సభ్యులు విజేత జట్టుకు క్రికెట్ కిట్ పంపిణీ చేశారు.

చుక్కల భూముల సమస్య పరిష్కరించాలి

రైతులతో కలిసి నినాదాలు చేస్తున్న సీపీఐ నాయకులు

ముదిగుబ్బ, న్యూస్‌టుడే: కొన్నేళ్లుగా ముదిగుబ్బలో నెలకొన్న చుక్కల భూముల సమస్యను పరిష్కరించాలని సీపీఐ మండల కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. స్థానిక విద్యుత్తు కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు రైతులతో కలిసి ఆయన సోమవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. తొలుత బస్టాండ్ కూడలిలో జాతీయ రహదారిపై ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అధికారులు ఎంజాయ్‌మెంట్ సర్వే చేసి సాగులో ఉన్న వారికి సాగుపట్టాలు ఇవ్వకుండా గత ప్రభుత్వం తీసుకొచ్చిన నిబంధనలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వీటికి బయటకు రాకపోవడంతో కార్యాలయానికి తాళం వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాత పట్టాభూములను 22ఏ నిషేధిత జాబితాలో చేర్చడంతో చుక్కల భూములుగా నమోదయ్యాయని, దీనివల్ల రిజిస్ట్రేషన్లు ఆగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. 20 ఏళ్ల అనుభవంలో ఉన్న అసైన్డ్ భూములను ఫ్రీహోల్డ్ చేసి, రిజిస్ట్రేషన్ అయ్యేలా గత ప్రభుత్వంలో ఉత్తర్వులు వచ్చినా నేటికీ అమలుకు నోచుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వంలో ఫ్రీహోల్డ్ భూములపై కూడా నిషేధం విధించడంతో రిజిస్ట్రేషన్ జరగక రైతులు పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. అసైన్డ్ భూములను అమ్ముకోకుండా కుటుంబ అవసరాలు తీర్చడానికి అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. అధికారులు ఎన్‌ఓసీలు మంజూరు చేయకుండా కర్షకుల జీవితాలతో ఆడుకుంటున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి చుక్కల భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించాలని, ఫ్రీహోల్డ్ భూములపైనా నిషేధం ఎత్తివేయాలని కోరారు. లేకపోతే కలెక్టరేట్ ముట్టడి, చలో అమరావతి కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ధర్నాలో సీపీఐ నాయకులు తిప్పయ్య, ఈశ్వర్, రమేష్‌నాయుడు, వెంకటరాముడు, రామకృష్ణ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రహదారి సమస్య పరిష్కారం

నంబులపూలకుంట, న్యూస్‌టుడే: మండలంలోని తూర్పునడిమిపల్లి గ్రామంలో కొన్నేళ్లుగా నెలకొన్న రహదారి సమస్యను తహసీల్దార్ దేవేంద్రనాయక్, ఎంపీడీఓ పార్థసారథి, ఎస్సై వలీబాషా పరిశీలించి పరిష్కారం చూపారు. దీనిపై గ్రామస్థులు ప్రజావేదికలో ఫిర్యాదు చేశారు. ఈక్రమంలో సోమవారం అధికారులు గ్రామానికి వెళ్లి క్షేత్రస్థాయిలో సమస్యను పరిశీలించారు. గ్రామస్థులతో మాట్లాడి వివరాలు సేకరించారు. సర్వే చేయించి రహదారికి హద్దులు ఏర్పాటు చేశారు. టీఎన్‌కొత్తపల్లి, రంగస్వామిపల్లి గ్రామాలకు వెళ్లేందుకు సీసీ రోడ్డు వేస్తామని, ఇందుకోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని చెప్పారు.

బాల్య వివాహ రహిత జిల్లానే లక్ష్యం

గోడప్రతులను విడుదల చేస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, జేసీ మౌర్యభరద్వాజ్, పీడీ ప్రమీల తదితరులు

పుట్టపర్తి, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ కోరారు. ఆయన సోమవారం కలెక్టరేట్‌లో బాల్య వివాహ ముక్త భారత్-100 రోజుల ప్రణాళికలో భాగంగా మహిళ, శిశు సంక్షేమ శాఖ 'బాల్య వివాహం ఆపుదాం.. దేవుడి కృప పొందుదాం' అనే నినాదంతో రూపొందించిన గోడపత్రాలను జేసీ మౌర్యభరద్వాజ్, ఐసీడీఎస్ పీడీ ప్రమీలతో కలిసి విడుదల చేసి మాట్లాడారు. ప్రతి అధికారి, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, గ్రామస్థాయి సిబ్బంది ఈ దిశగా కృషి చేయాలన్నారు. బాల్య వివాహమనేది సామాజిక రుగ్మతని, చిన్నారుల ఆరోగ్యం, విద్య, భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం చూపుతుందని తెలిపారు. ఎక్కడైనా బాల్య వివాహం జరుగుతున్నా, చేస్తారని తెలిసినా వెంటనే 1098కు ఫిర్యాదు చేయాలని కోరారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డీఈఓ కిష్టప్ప, డీసీపీవో మహేష్ తదితరులు పాల్గొన్నారు.

21న పల్స్ పోలియో..

జిల్లావ్యాప్తంగా 21న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని జయప్రదం చేయడానికి అన్ని శాఖలు సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో పల్స్ పోలియోపై అవగాహన కల్పించే దుకు రూపొందించిన గోడ ప్రతులను కలెక్టర్ విడుదల చేసి మాట్లాడారు. 0-5 ఏళ్ల వయస్సున్న ప్రతి శిశువుకూ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయాలన్నారు. 21న చుక్కలు వేసుకోని పిల్లలకు 22, 23 తేదీల్లో ఇంటింటికీ వెళ్లి తప్పనిసరిగా వేయాలని స్పష్టం చేశారు.

దేశ రక్షణలో సైనికుల పాత్ర కీలకం

దేశ రక్షణకు ప్రాణాలు లెక్కచేయకుండా సరిహద్దుల్లో సేవలందిస్తున్న సైనికులకు ఏమిచ్చినా రుణం తీరదని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ అన్నారు. కలెక్టరేట్‌లో ఉమ్మడి జిల్లా సైనిక సంక్షేమ అధికారి తిమ్మప్ప ఆధ్వర్యంలో నిర్వహించిన సాయుధ దళాల పతాక దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సైనికుల సంక్షేమానికి మనమందరం తోడ్పాటు అందించాలన్నారు. అనంతరం సాయుధ దళాల పతాక నిధికి కలెక్టర్, జేసీ మౌర్యభరద్వాజ్ విరాళం అందజేశారు.

బాధితులకు సీఎం సహాయ నిధి

లబ్ధిదారులతో ఎమ్మెల్యే కందికుంట

కదిరి, న్యూస్‌టుడే: అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సాయాన్ని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ సోమవారం అందజేశారు. నియోజకవర్గం వ్యాప్తంగా 44 మందికి రూ.31.05 లక్షల సాయం మంజూరైనట్లు చెప్పారు. సంబంధిత చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి భవనంలో జరిగిన కార్యక్రమంలో అందజేసి మాట్లాడారు. ప్రభుత్వం పేదల సంక్షేమంతో పాటు ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. సాయం చేసే ప్రభుత్వాన్ని గుర్తుంచుకోవాల్సిన బాధ్యత లబ్ధిదారులపై ఉందన్నారు. ఆయన వెంట తెదేపా నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం

గాండ్లపెంట, న్యూస్‌టుడే: కదిరి-రాయచోటి ప్రధాన మార్గంలో గాండ్లపెంట, రెక్కమాను, ధనియానిచెరువు గ్రామాల వద్ద గుంతలమయమైన రోడ్డు మరమ్మతు పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. దాదాపు 1.65 కిలోమీటర్ల మేర సీసీ రోడ్డు వేస్తున్నారు. గత నెల 24న 'గుంతల రహదారికి మోక్షమెప్పుడో' శీర్షికన ఈనాడులో ప్రచురితమైన కథనంపై సంబంధిత అధికారులు స్పందించారు. రూ.2.70 కోట్లతో పనులు చేయిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

వీఆర్వోపై చర్యలకు వినతి

తాడిమర్రి, న్యూస్‌టుడే: మండలంలోని భీమరాయునిపేట గ్రామంలో ఉన్న స్థలానికి వేరే వ్యక్తికి పట్టా చేయించిన రాముడు అనే వీఆర్వోపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు సోమవారం తహసీల్దారు భాస్కర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు.

పబ్లిక్ నోటీసు

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా ఈ క్రింద కనబరచిన షెడ్యూలు దాఖలా ఆస్తిపై మా కక్షిదారులైన మొలకల భారతి, W/o పెద్ద సూర్యనారాయణ, డోర్ నెం.1/191, కృష్ణాపురం గ్రామం, బుక్కపట్నం మండలం, శ్రీ సత్యసాయి జిల్లా అను వారికి, వారి తండ్రి గారు అయిన అంబటి నాగేశ్వరరావు వారికి సంక్రమించిన... S/o Late మొలకల కోనయ్య ఈ షెడ్యూలు దాఖలా ఆస్తిని మా కక్షిదారులకు సేవించి తేది. 23-02-2012 సంవత్సరమున రిజిస్టర్ వీలునామా ద్వారా ఇవ్వడమైనది. వారి తండ్రి గారు అయిన ... కారణముతో తేది. 14-09-2023న మరణించడమైనది. [illegible]

షెడ్యూలు

శ్రీ సత్యసాయి జిల్లా, పుట్టపర్తి రి.డి. మరియు పుట్టపర్తి సబ్.రి.డి., ముదిగుబ్బ మండలం, ... రెడ్డివారిపల్లి గ్రామం.
సర్వే నెం. 840-A1, AC.2-64 సెంట్లు or 1.069 హెక్టార్లు ఈ భూమికి
... లో ఉన్నది.
ఇందుకు హద్దులు:
తూర్పు: ప్రభుత్వపు వారి భూమి, పడమర: మా సొంత భూమి,
దక్షిణం: రోడ్డు, ఉత్తరం: రోడ్డు

కక్షిదారుల తరపున వకీలు
K.నాగేంద్రరెడ్డి, BA, BL, అడ్వకేట్, కదిరి,
శ్రీ సత్యసాయి (జిల్లా). సెల్: 9440361798

అందుబాటులో నమూనా ప్రశ్నపత్రాలు

కదిరి గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలకు చెందిన పదో తరగతి విద్యార్థులకు 'హర్ట్ టు హెల్ప్ సంస్థ' ఛైర్మన్ మౌలా రవినాయక్ నమూనా ప్రశ్నపత్రాలు అందజేశారు. ఆయన సోమవారం మండలంలోని పట్నం, కాళసముద్రం, కదిరి బ్రాహ్మణపల్లి, కొండమనాయని పాళ్యం పాఠశాలలకు వెళ్లి దాదాపు 250మంది విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓలు చెన్నకృష్ణ, ఓబులరెడ్డితో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విజ్ఞాన మేళా

నల్లమాడ: స్థానిక శ్రీవాణి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన విజ్ఞాన మేళా అందరినీ ఆకట్టుకుంది. సోమవారం ఎంఈఓ-2 సురేష్‌బాబు మేళాను ప్రారంభించారు. విద్యార్థులు రూపొందించిన వివిధ నమూనాలు, ఆకృతులు ఆహారాలను

అ వీ.. ఇ వీ.. అ న్నీ..

అలరించాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగిన సృజనాత్మకత, నైపుణ్యాలు ఇలాంటి మేళాల్లో బయటపడతాయన్నారు. భవిష్యత్తులో గొప్ప శాస్త్రవేత్తలుగా ఎదిగే సమర్థతకు ఇది ఆసరవుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆరోగ్య విద్య అధికారి రామమూర్తి, కరస్పాండెంట్ సుధాకర్, ఉపాధ్యాయులు, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

సీఐటీయూ మహాసభలు జయప్రదం చేయండి

నల్లచెరువు, న్యూస్‌టుడే: విశాఖలో ఈ నెల 31 నుంచి జనవరి 4 వరకు జరిగే సీఐటీయూ అఖిల భారత మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం మండల నాయకులు కోరారు. వారు సోమవారం మండల కేంద్రంలో ఇంటింటికీ తిరిగి విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ మహాసభల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు, లేబర్‌కోడ్ బిల్లులపై చర్చ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు జగన్‌మోహన్, రామకృష్ణ, కృష్ణానాయక్, రైతు సంఘం సభ్యుడు శ్రీరాములు పాల్గొన్నారు.

అయ్యప్ప మాలధారులకు అన్నదానం

ధర్మవరం, న్యూస్‌టుడే: పట్టణంలోని శిరిసాయిబాబా ఆలయ ఆవరణలో సోమవారం అయ్యప్ప, శివ మాలధారులకు భాజపా జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్ అన్నదానం చేశారు. పార్టీ జిల్లా కార్యదర్శి డోలా రాజారెడ్డి ఆధ్వర్యంలో రోజూ మాలధారులకు మధ్యాహ్నం భోజన సౌకర్యం కల్పించడం అభినందనీయమని జీఎం శేఖర్ అన్నారు. కార్యక్రమంలో భాజపా పట్టణాధ్యక్షుడు జింకా చంద్రశేఖర్, నాయకులు గిర్రాజు నగేష్, అనిల్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు నాగలక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందికి క్రమశిక్షణ తప్పనిసరి

నల్లచెరువు, న్యూస్‌టుడే: మండలంలో పనిచేస్తున్న సచివాలయ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని, క్రమశిక్షణ పాటించాలని జీఎస్ డబ్ల్యూఎస్ అధికారి ఎం.మనోహర్ సూచించారు. ఆయన సోమవారం కొత్తపల్లి సచివాలయాన్ని ఎంపీడీఓ అశోక్‌కుమార్ రెడ్డితో కలిసి తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు పుస్తకం, మూమెంట్ రిజిస్టర్‌ను పరిశీలించారు. సంక్షేమ పథకాలు సంబంధించిన సర్వేలు ఎంతవరకు వచ్చాయో అడిగి తెలుసుకున్నారు.

కదిరి గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని కుమ్మరవాండ్లపల్లి గ్రామ సచివాలయాన్ని ఎంపీడీఓ పోలప్ప తనిఖీ చేశారు. సిబ్బంది సకాలంలో సర్వేలు పూర్తిచేయడం లేదని పంచాయతీ కార్యదర్శి రామ్మోహన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. సిబ్బంది సక్రమంగా విధులకు హాజరవుతున్నారో లేదో పర్యవేక్షించాలన్నారు. హాజరు రిజిస్టర్‌లో సంతకం చేయని గ్రామ సర్వేయర్‌కు తాఖీదు జారీ చేయాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు.

భవన నిర్మాణ కార్మికుడి దుర్మరణం

ధర్మవరం, న్యూస్‌టుడే: పట్టణంలోని శారదానగర్‌లో సోమవారం భవన నిర్మాణ కార్మికుడు గోవిందు(50) ఇంటి పైనుంచి కిందపడి మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పార్థసారథి నగర్‌కు చెందిన గోవిందు శారదానగర్‌లో ఓ ఇంటి నిర్మాణ పనులకు వెళ్లాడు. కర్రలపై నిలబడి పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు ఆతడిని చికిత్స నిమిత్తం ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య యల్లమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. ధర్మవరం 2వ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా మా కక్షిదారులైన వాది షేక్ రహంతుల్లా S/o మహబూబ్ సాబ్, Residing at తాళ్ళకాల్వ గ్రామము చేపరాల గాండ్లపెంట మండలం, శ్రీ సత్యసాయి జిల్లా, అను వారికి ప్రతివాదులు అయిన షేక్ నబి రసూల్, షేక్ ఉస్మాన్, కట్టుబడి ఖాజా బీ, సయ్యద్ ఖుర్షీద్ జాన్, S.జరీనా, S.హసీనా, వనం షమీమ్, షేక్ గుల్జార్, షేక్ షరూన్ బి, Smt. దిల్షాద్, షేక్ హుస్సేన్‌బాషా, షేక్ చాంద్ బాషా, షేక్ మహబూబ్‌బాషా, కు.నిజాయా, కట్టుబడి షేక్ మొహబూబ్ బాషా, కట్టుబడి బాబా, కట్టుబడి నూర్ మొహమ్మద్ రేష్మ అను వారలపై సీనియర్ సివిల్ జడ్జి, కదిరి కోర్ట్ యందు I.A. No.146/2008 in O.S.No.33/2022 అను ఫైనల్ డిక్రీ పిటీషన్‌ను దాఖలు చేసి ఉన్నారు. సదరు ఫైనల్ డిక్రీ పిటీషన్‌లో క్రింద కనపరచిన షెడ్యూలు దాఖలా ఆస్తిలో 86/144 వాటా లేదా 43/72 వాటాలుగా హక్కు నిర్ధయించబడి, వేరుచేసి ఇవ్వవలసినదిగా పై పిటీషన్ దాఖలు చేసి ఉన్నారు. కావున క్రింద కనపరచిన షెడ్యూల్ దాఖలా ఆస్తి విషయమై పై ఫైనల్ డిక్రీ పిటీషన్ పెండింగ్‌లో ఉండగా షేక్ నబి రసూల్, షేక్ ఉస్మాన్, కట్టుబడి ఖాజా బీ, సయ్యద్ ఖుర్షీద్ జాన్, S.జరీనా, S.హసీనా, వనం షమీమ్, షేక్ గుల్జార్, షేక్ షరూన్ బి, Smt. దిల్షాద్, షేక్ హుస్సేన్ బాషా, షేక్ చాంద్ బాషా, షేక్ మహబూబ్ బాషా, కు.నిజాయా, కట్టుబడి షేక్ మొహబూబ్ బాషా, కట్టుబడి బాబా, కట్టుబడి నూర్ మొహమ్మద్ రేష్మ మరియు వారి వారసుల నుండి ఎలాంటి క్రయ విక్రయాలు, తాకట్టు, దానములు, మార్పులు, చేర్పులు, రెవిన్యూ రికార్డు ట్రాన్స్‌ఫర్లు చేసుకున్నచో అటువంటివేవీ చెల్లనేరవని మరియు ఆలా చేసినవారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోబడునని ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమైనది.

షెడ్యూల్

శ్రీ సత్యసాయి జిల్లా, రిజిస్ట్రేషన్ జిల్లా పుట్టపర్తి, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, కదిరి. కురుమామిడి గ్రామ పొలం, గాండ్లపెంట మండలం.

1) సర్వారు ఖుష్కి 168 Extent Ac.2.93 cents పైకి Ac.0.05 cents in this covered three shop rooms bounded by: తూర్పు: వెలిచెలమల రోడ్, పడమర: కరోల సుబ్బారాయుడు భూమి, ఉత్తరం: బాదుల్లా ఇల్లు, దక్షిణం: రాయచోటి, కదిరిరోడ్. 2) సర్వారు ఖుష్కి 168 Extent Ac. 2.93 cents పైకి Ac.0.05 cents bounded by: తూర్పు: వెలిచెలమల రోడ్, పడమర: వాది, ప్రతివాదుల భూమి, ఉత్తరం: బజార్, దక్షిణం: మహమ్మద్ అలీ ఇల్లు. 3) సర్వారు ఖుష్కి 168 Extent Ac. 2.93 cents పైకి Ac.0.02 cents bounded by: తూర్పు: వెలిచెలమల రోడ్, పడమర: వాది, బాషా, ఉత్తరం: బజార్, దక్షిణం: సత్తారిసాబ్ ఇల్లు. 4) సర్వారు ఖుష్కి 168 Extent Ac. 2.93 cents పైకి Ac.2.17 1/4 cents bounded by: తూర్పు: item No.1 and 2 above and House of Badulla, పడమర: సయ్యద్‌సాబ్ భూమి, ఉత్తరం: The Land in S.No.165, దక్షిణం: రాయచోటి-కదిరి రోడ్.

కక్షిదారుల తరుపున వకీళ్ళు
G.Gurulinga Swamy, B.A., B.L.,
S.Raghunath, B.Com., L.L.B.,
M.Naresh Kumar Reddy, B.Sc., B.L.,
Advocates, Kadiri.
Cell: 94402 09891, 72073 05976, 88861 64478

దివ్యాంగులకు టింబక్టు సేవలు విస్తృతం

మాట్లాడుతున్న సంస్థ వ్యవస్థాపకురాలు మేరీ వటమట్టమ్

చెన్నేకొత్తపల్లి, న్యూస్‌టుడే: దివ్యాంగులకు టింబక్టు సేవలను మరింత విస్తృతం చేస్తామని టింబక్టు కలెక్టివ్ సంస్థ వ్యవస్థాపకురాలు మేరీ వటమట్టమ్, బబ్లూ గంగూలీ పేర్కొన్నారు. చెన్నేకొత్తపల్లి సమీపంలోని సివిఆర్సీలో సోమవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. బస్టాండ్ కూడలి నుంచి సభాస్థలి వరకు దివ్యాంగుల హక్కులపై చైతన్య ప్రదర్శన నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో దివ్యాంగుల అభ్యున్నతికి టింబక్టు రెండున్నర దశాబ్దాలుగా కృషి చేస్తోందన్నారు. దివ్యాంగులకు పలు ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

ప్రాణాంతకంగా విద్యుత్తు తీగలు

లారీకి తగిలిన తీగలను తొలగిస్తున్న క్లీనర్

కొత్తచెరువు, న్యూస్‌టుడే: కొత్తచెరువులోని ప్రధాన రహదారుల్లో కిందకు వేలాడుతున్న విద్యుత్తు తీగలు భారీ లోడ్ లారీలకు తగులుకొని ప్రమాదకరంగా పరిణమిస్తున్నాయి. సోమవారం కట్టెల లోడుతో వెళుతున్న లారీకి పుట్టపర్తి రోడ్‌లోని వాటర్‌ప్లాంటు వద్ద విద్యుత్తు తీగలు తగలడంతో నిలిపివేశారు. లారీ క్లీనర్ పైకెక్కి తీగలను తప్పించడంతో వాహనం ముందుకు వెళ్లింది. బుక్కపట్నం రోడ్డులో సైతం ఎత్తులో ఉన్న తీగలకు భారీ వాహనాలు తగిలినప్పుడల్లా నిప్పులు ఎగసిపడి వాహనచోదకులు భయాందోళన చెందుతున్నారు. నాలుగు రోడ్ల కూడలిలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. రాత్రి సమయాల్లో కిందికి వేలాడే తీగలను గుర్తించలేక భారీ వాహనాల చోదకులు వాటి కింది నుంచి వెళ్లాల్సి వస్తోంది. వాటిల్లో విద్యుత్తు సరఫరా జరుగుతుండడంతో తెల్లవారేసరికి ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకొని ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించాల్సి వస్తోందని స్థానికులు వాహనచోదకులు వాపోతున్నారు. తీగలు ఎవరికైనా తగిలితే ప్రాణాపాయం తప్పదని, ఇప్పటికే సమస్యపై పలుమార్లు ఫిర్యాదు చేసినా సంబంధిత శాఖ అధికారులు స్పందించడం లేదని విమర్శిస్తున్నారు. ఇకనైనా విద్యుత్తు తీగలను సరిచేసి ప్రమాదాలు జరగకుండా చూడాలని కోరుతున్నారు.

విద్యా సామగ్రి అందజేత

బత్తలపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని ఓబులాపురం గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ చిందులూరి బాబు ప్రసాద్ పాఠశాల పేద విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేశారు. అమెరికాలో వైద్యుడిగా పనిచేస్తున్న ఆయన సోమవారం గ్రామానికి వచ్చారు. ఈ సందర్భంగా పాఠశాలను సందర్శించారు.

ల్యాబ్ పరికరాల కొనుగోలుకు విరాళం

ధర్మవరం, న్యూస్‌టుడే: ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలోని ఎంఎల్‌టీ విభాగంలో ల్యాబ్ పరికరాల కోసం సోమవారం పట్టణానికి చెందిన పట్టుచీరల వ్యాపారి బండి హరికృష్ణ రూ.15వేలు విరాళం ప్రిన్సిపల్ వనితావాణికి అందజేశారు.

పదిలో రాణిస్తే.. విమానయానం

విద్యార్థులకు సూచనలు చేస్తున్న మున్వర్

తలుపుల, న్యూస్‌టుడే: ఏటా జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచే ఎస్సీ విద్యార్థులను ముంబయి నుంచి హైదరాబాద్ వరకు విమానంలో తీసుకెళతామని స్నేహితుల సంస్థ అధ్యక్షుడు మున్వర్ పేర్కొన్నారు. ఆయన సోమవారం మండలంలోని ఐదు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు వెళ్లి ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడారు. పేద విద్యార్థులను విమానంలో తిప్పుతున్నామన్నారు. బాగా చదివి మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. అందుకు మా ప్రోత్సాహం ఉంటుందని, వారిని తాను ఈ అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. హైదరాబాద్‌లో రెండు రోజుల పాటు చారిత్రక ప్రాంతాలు, జూలు చూపించడంతో పాటు దుస్తులు, బూట్లు, మంచి పుస్తకాలు కొనిస్తామన్నారు. ఈ అవకాశాన్ని ఎస్సీ విద్యార్థులు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

స్పాన్సర్లు, ఎంఎస్‌వోలను సత్కరించిన జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి, ఎమ్మెల్యేలు రవికుమార్, గొండు శంకర్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ మహేశ్వరరెడ్డి

నృత్య సందడి.. సరిగమల సవ్వడి

అంగరంగ వైభవంగా ఈనాడు @50, ఈటీవీ @30 వసంతాల వేడుకలు

సంగీత సంద్రంలో సిక్కోలు తడిసిముద్దయింది.. కళ్లు తిప్పుకోనివ్వని నృత్యాలు..అదిరే స్కిట్లు.. సుస్వరాల గీతాలు ఆకట్టుకోగా ప్రముఖ నటులు ఆలీ, ఆది హాస్యం కడుపుబ్బా నవ్వించాయి. మంచు కురిసే వేళ మనసు పులకించేలా చేసింది ఈనాడు @ 50, ఈటీవీ @ 30 వసంతాల వేడుక. శ్రీకాకుళం నగరం కోడిరామ్మూర్తి క్రీడా మైదానంలో సోమవారం అంగరంగ వైభవంగా వేడుకలు సాగాయి.

వ్యాఖ్యాతగా ప్రదీప్ మాచిరాజు వ్యవహరించారు. గాయకులు వందేమాతరం శ్రీనివాస్, రామ్ మిరియాల, కల్పన, సాకేత్, మాళవిక వివిధ పాటలు పాడి అందరిలో ఉత్సాహం నింపారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి హాజరయ్యారు. శ్రీకాకుళం డీఎస్పీ వివేకానంద ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

– ఈనాడు డిజిటల్ శ్రీకాకుళం, న్యూస్‌టుడే పాతబస్టాండ్, పాతశ్రీకాకుళం, సాంస్కృతికం

ఎర్రన్న స్మరణ

వందేమాతరం శ్రీనివాస్

కేంద్ర మాజీ మంత్రి దివంగత కింజరాపు ఎర్రన్నాయుడిని స్మరిస్తూ ఏవీ ప్లే చేశారు. తండ్రి మృతి అనంతరం ఆయన కుమారుడు రామ్మోహన్‌నాయుడు ప్రజా జీవితంలోకి వచ్చినప్పటి విశేషాలు, ప్రస్తుతం కేంద్రమంత్రి హోదాలో జిల్లా అభివృద్ధికి చేస్తున్న కృషిని కళ్లకు కట్టేలా చూపారు.

మరెన్నో వేడుకలు చేసుకోవాలి.. దివంగత రామోజీరావు స్థాపించిన 'ఈనాడు, ఈటీవీ' సంస్థలు నిబద్ధతతో విజయవంతంగా ముందుకెళ్తున్నాయి. ఇలాంటి మరెన్నో వేడుకలు చేసుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. పార్లమెంటు సమావేశాల కారణంగా ఇంతటి ప్రతిష్ఠాత్మక వేడుకలో ప్రత్యక్షంగా పాల్గొనలేకపోతున్నాను.

– కింజరాపు రామ్మోహన్‌నాయుడు, కేంద్ర మంత్రి (వీడియో సందేశం)

ప్రజాప్రయోజనాలే పరమావధి...

ఈనాడు, ఈటీవీ ప్రజాప్రయోజనాల కోసం పని చేస్తున్నాయి. అంకితభావం, క్రమశిక్షణ, నిజాయతీతో ప్రమాణాలు పాటిస్తున్నాయి. ఎంతో మంది రచయితలు, కళాకారులు, దర్శకులను పరిచయం చేసిన ఘనత వీటికే సొంతం. – కొండపల్లి శ్రీనివాస్, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి

ఆనందంగా ఉంది.. రాజకీయాల్లోకి రాక ముందు 'ఈనాడు' పత్రికకు విలేకరిగా పని చేయడంతో ఆ కుటుంబ సభ్యుడిగా ఈ వేడుకలో పాల్గొనడం ఆనందంగా ఉంది. రామోజీ గ్రూపు సంస్థలు ఇలాంటి మరెన్నో కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షిస్తున్నాను.– **కలిశెట్టి అప్పలనాయుడు, ఎంపీ, విజయనగరం**

● వేల మందికి ఉపాధి కల్పించి అందరికీ వినోదం, విజ్ఞానం అందిస్తున్న 'ఈనాడు, ఈటీవీ' సంస్థలు ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో నిర్వహించాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అభిలషించారు. అక్షరాన్ని ఆయుధంగా మలచి ప్రతి ఇంటా విజ్ఞానం పంచిన రామోజీరావు దార్శనికుడని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ కొనియాడారు.

హైపర్ ఆది, ప్రదీప్, ఆలీ హాస్య సన్నివేశం

ఎంఎస్‌వోలు: దుప్పల వెంకటరావు (ఎస్ఎస్‌సీ బీపీఎల్ స్పందన), జె.గిరిధర్‌రావు (జీటీపీఎల్ జేకే కమ్యూనికేషన్), మురళి, రాజులను (జీటీపీఎల్ జోయ్) అతిథులు సత్కరించారు.

సత్కారం

ఈ కార్యక్రమ స్పాన్సర్లు సౌత్ ఇండియా షాపింగ్ మాల్ స్టోర్ మేనేజర్ ఎస్.సురేష్, రాజేశ్వరి, ఫ్రీడం హెల్తీ కుకింగ్ ఆయిల్స్ ఏరియా సేల్స్ మేనేజర్ శ్రీకర్, మురళి, తెనాలి డబుల్ హార్స్ గ్రూప్ ఏరియా సేల్స్ మేనేజర్లు తమ్మినాన రవికుమార్, కోరాడ గోవిందరావు, మార్గదర్శి చిట్‌ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ముఖ్య కార్య నిర్వహణాధికారి పాటూరి సత్యనారాయణ, శ్రీలలిత రైస్ ఉత్తరాంధ్ర, ఒడిశా సేల్స్ హెడ్ కె.అనీల్‌కుమార్, ఎన్ఈఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ డైరెక్టర్ తేజ, ఆదిత్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ (ఐతం) ఛైర్మన్ డా.సోమేశ్వరరావు, డా.వీవీ నాగేశ్వరరావు, మాటూరు రామారావు స్టీల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ మాటూరు రామారావు, గ్లోబల్ విద్యాసంస్థల ఛైర్మన్ ప్రసాదరావు, మహాత్మాగాంధీ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (విశాఖపట్నం) చీఫ్ మెడికల్ అంకాలజిస్ట్ డా.యూ.ప్రవీణ, ఎస్ఎస్ జ్యూయలర్స్ మార్ట్ మేనేజింగ్ పార్టనర్లు కేవీ సత్యనారాయణ, శ్రీనివాస్, మీనాక్షి హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డా.గొండు గంగాధర్, గైనకాలజిస్టు డా.హరిత, ఫిజికెమ్ లేబొరేటరీస్ డిస్ట్రిబ్యూటర్ సూర్య, అంబికా దర్బార్ బత్తి డైరెక్టర్ అంబికా కోటేశ్వరరావు, వరం రెసిడెన్సీ మేనేజింగ్ పార్టనర్లు అంధవరపు తిరుమలరావు, సిల్లా గోపీనాథ్‌లకు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యేలు కూన రవికుమార్, గొండు శంకర్ జ్ఞాపికలు అందజేసి సత్కరించారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

కల్పన

రామ్ మిరియాల
తేజు

ప్రేక్షకులతో కిక్కిరిసిన కోడిరామ్మూర్తి మైదానం

కొండలు కరిగిపోతున్నాయ్..!

న్యూస్‌టుడే, హరిపురం (మందస)

అక్రమార్కులు ప్రకృతి వనరులను ధ్వంసం చేస్తున్నారు. ధనార్జన కోసం కంకర కొండలను సైతం పిండి చేస్తున్నారు. ఈ పరిస్థితి మందస, పలాస మండలాల పరిధిలో కొన్ని రోజులుగా జోరుగా సాగుతోంది. వర్షాలు తగ్గడంతో తవ్వకాలు చేపట్టి ట్రాక్టర్లు, టిప్పర్లలో తరలిస్తున్నారు.

● పలాస మండలం సువర్ణాపురం పంచాయతీ గుడ్డిపద్ర సమీపంలోని డీపట్టా భూముల్లో నిబంధనలకు విరుద్ధంగా కంకర తవ్వకాలు జరుగుతున్నాయి. వాల్టా చట్టం ప్రకారం రెండు అడుగులకు మించి లోతు తవ్వకూడదు. ఇక్కడ మాత్రం పొక్లెయిన్‌తో అయిదు అడుగుల లోతు వరకు తవ్వకాలు చేపడుతున్నారు. మందస మండలం రట్టి, బహాడపల్లి, లొహారిబంద, పిడిమందస, భోగాపురం ప్రాంతాల్లోని కంకర కొండల్లో తవ్వకాలు జరుగుతున్నాయి. కొండలోగాం, కుసుమాల, సాబకోట, బుడంబొ ప్రాంతాల్లోని రెవెన్యూ భూముల నుంచి కంకర కొల్లగొడుతున్నారు.

అక్రమ తవ్వకాలతో రూపు కోల్పోతున్న రట్టి కొండ

● వర్షాలు తగ్గుముఖం పట్టడంతో రహదారులను ఆనుకుని ఉన్న పొలాలను వెంచర్లుగా అభివృద్ధి చేస్తున్నారు. అందుకు అవసరమైన కంకర కోసం సమీప ప్రాంతాల కొండలను తవ్వేస్తున్నారు. గ్రామ స్థాయి రాజకీయ నాయకుల కనుసన్నల్లోనే ఈ తంతు సాగుతోందన్న విమర్శలున్నాయి. 'మందస మండలంలో కంకర తవ్వకాలకు అనుమతులు లేవు. అక్రమంగా తవ్వితే వాహనాలను పట్టుకుని సీజ్ చేస్తాం' అని ఇన్‌ఛార్జి తహసీల్దార్ కె.రామకృష్ణ స్పష్టం చేశారు.

దాటింది శతాబ్దం.. చోద్యం చూస్తోంది యంత్రాంగం

రెండు రాష్ట్రాల ప్రజలు రాకపోకలు సాగించే అతికొం- బల్లిలి అంతర్రాష్ట్ర రహదారిపై కొత్తూరు మండలం కర్లెమ్మ సమీపంలో వంతెన నిర్మించి వందేళ్లు దాటింది. సుమారు 120 సంవత్సరాల కిందట నిర్మించారు. వారధి లోపలి భాగం బీటలు వారి, మట్టి పగిలిపోయి మొక్కలు బాగా పెరిగాయి. రక్షణ గోడ సైతం కూలిపోయింది. ప్రధాన మార్గంలో పరిస్థితి ఇలా ఉండటంపై ప్రయాణికులు పెదవి విరుస్తున్నారు. ఏ క్షణాన ఏం జరుగుతుందోనని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. సమస్యపై ఆర్‌అండ్‌బీ డీఈఈ సాగర్ మాట్లాడుతూ రూ.1.5 కోట్లతో ప్రతిపాదనలు పంపించామని, నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతామన్నారు.

– న్యూస్‌టుడే, కొత్తూరు

నేరగాళ్ల ఉచ్చు.. అమాయకుల ఖాతాల్లో చిచ్చు..

న్యూస్‌టుడే, శ్రీకాకుళం నేరవార్తా విభాగం

జిల్లాలో సైబర్ నేరగాళ్లు కొత్త పంథా ఎంచుకుంటున్నారు. చిన్నపాటి ఎరవేసి ఖాతా ఖాళీ చేస్తున్నారు. ఇందుకు కారణం కొందరి అత్యాశే. సంబంధంలేని వ్యక్తులకు బ్యాంకు ఖాతాలను ఇచ్చి ఇరుక్కుంటున్నారు. పరోక్షంగా ఆయా నేరాల్లో భాగస్వాములవుతున్నారు. తద్వారా పోలీసు కేసుల్లో ఇరుక్కుని స్టేషన్లు, న్యాయస్థానాలు, జైళ్ల వరకు వెళ్లాల్సి వస్తోంది. ఇందులో అమాయకులు సైతం బలవుతున్నారు. ఈ తరహా మోసాలపై జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. జిల్లాలో ఇప్పటికే అలాంటి వారి కోసం వేట మొదలైంది. నేరగాళ్లకు బ్యాంకు ఖాతాలిచ్చి పరోక్షంగా సహకరిస్తున్న వారిపై నిఘా పెంచింది.



నిస్తేజమైన ఖాతాలకు జీవం పోసి వినియోగం

జిల్లాలో కొత్తరకం సైబర్ నేరాలు

దారి మళ్లిస్తున్నారిలా..

తొలుత ఎంపిక చేసిన బ్యాంకు ఖాతాలకు రూ.10, రూ.20 వేల చొప్పున వేర్వేరు వ్యక్తుల ఖాతాల నుంచి జమ చేస్తున్నారు. మీకు నగదు వచ్చిందని అంటూ ఫోన్ చేస్తున్నారు. వచ్చిందని చెబుతూ మీరెవరని అడిగితే లాటరీలో మీ నంబరుకు అవకాశం వచ్చిందని నమ్మబలుకుతున్నారు. అందుకే ఖాతాలో డబ్బులు జమ చేశామని, ఓటీపీ వస్తుంది చెప్పమంటున్నారు. వారి మాటలు విని ఓటీపీ చెబితే ఖాతాలో వారు వేసిన రూ.10 వేలతో పాటు మొత్తం ఖాళీ చేస్తున్నారు.

వినియోగంలో లేనివే లక్ష్యం..

● చాలాకాలంగా వినియోగంలో లేని ఖాతాలనే ఎంపిక చేసుకుని లావాదేవీలు చేస్తున్నారు. అలా చేయడానికి బ్యాంకు సిబ్బందికే పరోక్షంగా సహకరిస్తున్నారు. కొంతమంది ఉద్దేశపూర్వకంగా లావాదేవీలు జరపడానికి ఖాతాలను అద్దెకిస్తున్నారు. ఇందుకు కమీషన్ ముట్టజెబుతున్నారు. స్థానికంగా ఉన్న కొందరు ప్రలోభాలకు లొంగిపోవడంతో సైబర్ నేరగాళ్లు విదేశాలు, పక్క రాష్ట్రాల్లోనూ ఉండి భారతీయ బ్యాంకింగ్ వ్యవస్థను దెబ్బతీస్తున్నారు.

● శ్రీకాకుళంలో నివాసముంటున్న విశ్రాంత ఉద్యోగి ఖాతా నుంచి రూ.2.70 లక్షలు ఆరు ఇతర ఖాతాలకు సైబర్ నేరగాళ్లు నగదు జమచేశారు. తిరిగి ఆయా ఖాతాల నుంచి నేరుగా నగదును దారి మళ్లించారు. రెండో పట్టణ పోలీసులను బాధిత విశ్రాంత ఉద్యోగి ఆశ్రయించారు. పోలీసులు విచారణలో తొలుత నగదు బదిలీ అయిన ఆరు ఖాతాలను గుర్తించి వారిని స్టేషన్‌కు పిలిపించి విచారణ చేపట్టారు. వారి ఖాతాల నుంచి అప్పటికే నగదును విదేశాల్లో ఉన్న మరో ఖాతాకు బదిలీ చేశారు. వారు మాత్రం ఇప్పుడు పోలీసు కేసులు ఎదుర్కోవాల్సి వస్తోంది.

ఏడాది	నమోదైన కేసులు	పోయిన నగదు (రూ.కోట్లలో)
2024-25	16	9
2025-26	42	16.28

● ఇలాంటి కేసుల్లో విశాఖలో పదిమంది, తెలంగాణలో 84 మంది ఇప్పటికే అరెస్టయ్యారు. వీరంతా అత్యాశకు పోయి బ్యాంకు ఖాతాలను అద్దెకిచ్చిన వారే. మరికొందరు ఖాతాలను నేరుగా బ్యాంకు అధికారులే సైబరు నేరగాళ్లకు అప్పగించి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు.

సహకరిస్తే కేసులే.. సైబర్ నేరాల్లో విచారణ చేసిన సమయంలో నేరగాళ్ల కొత్త ఆలోచనలు, సాంకేతికత వినియోగం ఆశ్చర్యకరంగా ఉంటోంది. ఖాతాలను ఎట్టి పరిస్థితిలో ఎవరికీ ఇవ్వకూడదు. ఒక వేళ అనుమానాస్పద రీతిలో లావాదేవీలు జరుగుతున్నట్లు భావిస్తే 1930 నంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయొచ్చు. తెలిసి మౌనంగా ఉంటే నేరగాళ్లను ప్రోత్సహించినట్లే.

– కె.వి.మహేశ్వరరెడ్డి, జిల్లా ఎస్పీ , శ్రీకాకుళం

నకిలీ కరెన్సీ పేరిట టోకరా

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: కాశీబుగ్గలో నకిలీ కరెన్సీ పేరిట రూ.10 లక్షలు అసలు నోట్లు పట్టుకుపోయిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. ఒడిశాలోని మంత్రిడి ప్రాంతానికి చెందిన లక్ష్మణరావుకు అజ్ఞాత వ్యక్తులు వాట్సప్ కాల్ చేసి పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి ఉంటే అసలైన కరెన్సీ తీసుకొస్తే రెట్టింపు విలువైన నకిలీ నోట్లు ఇస్తామని నమ్మబలికారు. దీంతో ఆయన ఆశపడి రూ.10లక్షలు ఇచ్చేందుకు అంగీకరించారు. నగదు తీసుకొని పలాస సమీప మొగిలిపాడు జాతీయ రహదారిపైకి రావాలని సదరు వ్యక్తులు చెప్పడంతో అక్కడికి చేరుకున్నారు. ముఖానికి వస్త్రం కట్టుకుని ఇద్దరు వ్యక్తులు ద్విచక్రవాహనంపై వచ్చి వారితో తీసుకొచ్చిన సంచిని లక్ష్మణరావు కారులో పెట్టి నగదు తీసుకున్నారు. ఇందులో రూ. 50లక్షలు విలువ చేసే నకిలీ నోట్లు ఉంటాయని తాము వెళ్లిపోయాక సరి చూసుకోవాలని చెప్పి అక్కడి నుంచి ఉడాయించారు. వారు వెళ్లిపోయాక చూడగా సంచిలో అన్నీ పుస్తకాలు ఉన్నట్లు గుర్తించి, మోసం జరిగిందని తెలుసుకుని లబోదిబోమంటూ ఆ యువకులు పారిపోయిన మార్గంలో కొంత దూరం వెళ్లినప్పటికీ వారి జాడ తెలియరాలేదు. దీనిపై మరింత సమాచారం అందాల్సి ఉందని కాశీబుగ్గ సీఐ వై.రామకృష్ణ పేర్కొన్నారు.

10 నుంచి ఉపాధ్యాయ అర్హత పరీక్ష

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: జిల్లాలో ఏపీ టెట్- 2025 కంప్యూటర్ ఆధారిత పరీక్ష 4 కేంద్రాల్లో నిర్వహించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ నెల 10 నుంచి 21వ తేదీ వరకు రెండు షిఫ్టుల్లో పరీక్షలు జరగనున్నాయి. 9,221 మంది అభ్యర్థులు హాజరవ్వనున్నారు. ఎచ్చెర్లలోని శివాని, వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలల్లో, నరసన్నపేటలోని కోర్ టెక్నాలజీస్ కేంద్రం, టెక్కలి ఐతమ్‌లో పరీక్షలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

రైతేరాజు 6లో

రెక్కల కష్టం రోడ్లపై నిరీక్షిస్తోంది..

అన్నదాత ఆరుగాలం శ్రమించిన కష్టఫలం ఇలా రోడ్లపై నిరీక్షిస్తోంది.. జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ జోరందుకోకపోవడంతో ఎక్కడికక్కడే ధాన్యపు నిల్వలు ఉండిపోతున్నాయి. తమ వంతు వచ్చేవరకు పంటను దాచుకోలేక ఇలా రోడ్లు, కల్లాల్లో ఉంచేస్తున్నారు. అధికార యంత్రాంగం హడావుడి తప్ప క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కరించడంలో విఫలవుతోంది. నరసన్నపేట మండలం ఉర్లాం సమీపంలో ధాన్యపు రాశులను ఇలా పరదాలతో కప్పి ఉంచిన చిత్రమిది.. – న్యూస్‌టుడే, నరసన్నపేట గ్రామీణం

నయం చేస్తామని.. గాయం చేసి వదిలారు..

మందస మండలం చీపి పంచాయతీ పరిధిలో గౌరంగసాయి నుంచి కొండమేర మీదుగా చొంపాపురం వెళ్లే రహదారి ఇది. మట్టి రోడ్డుగా ఉండే దీన్ని తారురోడ్డుగా మార్చేందుకు అభివృద్ధి పనులు చేపడుతున్నారు. నాలుగు నెలల కిందట ఒక పొర 40 ఎంఎం మెటల్ వేసి పనులు ఆపేశారు. ప్రస్తుతం ఆ దారిలో నడవలేకపోతున్నామని, ద్విచక్ర వాహనాలు నడపడమూ సాధ్యం కావడం లేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాల కారణంగా పనులు ఆగాయని, త్వరలో కొనసాగిస్తామని ఐటీడీఏ ఏఈఈ ఇబ్రహీం తెలిపారు. – న్యూస్‌టుడే, మందస

మారింది కాలమే.. పాట్లు యథాతథం..

ఖరీఫ్ ముగిసింది. వరి కోతల అనంతరం మెట్ట ప్రాంతమైన ఎచ్చెర్ల నియోజకవర్గ పరిధిలో రైతులు మొక్కజొన్న పంట వేశారు. సాగుకు కావాల్సిన ఎరువుల కోసం మళ్లీ పాట్లు పడాల్సి వస్తోంది. ఇందుకు ఉదాహరణ జి.సిగడాం మండల కేంద్రంలో రైతు సేవా కేంద్రం వద్ద సోమవారం బారులు తీరిన రైతుల చిత్రమే.. కొరత కారణంగా ఒడిశా నుంచి రెట్టింపు ధరకు కొనుగోలు చేయాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. స్థానికంగా సరిపడా ఇవ్వడం లేదని ఆరోపిస్తున్నారు. అవసరం మేరకు ఎరువులు అందించేలా చర్యలు తీసుకుంటామని జి.సిగడాం మండల వ్యవసాయాధికారి బెండు బాబ్జీ అన్నారు. –న్యూస్‌టుడే, జి.సిగడాం

గూడు.. గోడు వినేదెవరు..?

న్యూస్‌టుడే, టెక్కలి పట్టణం

టెక్కలిలో హుద్‌హుద్ ఇళ్లు దక్కించుకున్న లబ్ధిదారులు రెండేళ్లుగా నరకాన్ని అనుభవిస్తున్నారు. విద్యుత్తు సౌకర్యం, తాగేందుకు నీరు అందుబాటులో లేక నిత్యం అవస్థలు పడుతూనే ఉన్నారు. తెదేపా హయాంలో నిర్మించిన ఇళ్లను ఎన్నికలకు కొద్దిరోజుల ముందు మౌలిక సదుపాయాలు కల్పించకుండానే వైకాపా నేతలు ఆదరాబాదరాగా పంపిణీ చేశారు. నాటినుంచి అక్కడివారంతా బిక్కుబిక్కుమంటూనే నివాసం ఉంటున్నారు.

టెక్కలిలో సదుపాయాలకు దూరంగా హుద్‌హుద్ నిర్మాణాలు

హుద్‌హుద్ ఇళ్లలో రెండేళ్లుగా కష్టాలకాపురం

జరిగింది ఇదీ..

● కంకరబంద ప్రాంతంలో పేదల కోసం 2016లో హుద్‌హుద్ ఇళ్ల నిర్మాణానికి మంత్రి అచ్చెన్నాయుడు శంకుస్థాపన చేశారు. రూ.10 కోట్లు వెచ్చించి జీప్లస్2 విధానంలో 196 గృహాలు నిర్మించారు.

● 2019 సార్వత్రిక ఎన్నికలు సమీపించడంతో పంపిణీని తాత్కాలికంగా వాయిదావేశారు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం ఐదేళ్లపాటు కాలయాపన చేసింది. ఇంతలో ఇళ్లకు ఉన్న తలుపులు, కిటికీలు, అద్దాలు, ఇనుప ఊచలు, వైరింగ్ ఆకతాయిల చర్యలతో పూర్తిగా ధ్వంసమయ్యాయి.

అంచనాలు రూపొందించాం..

'హుద్‌హుద్ ఇళ్లలో మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు సూచనలమేరకు అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించాం. నిధులు మంజూరైన వెంటనే వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటాం' అని గృహనిర్మాణ శాఖ పీడీ రమాకాంతరావు పేర్కొన్నారు.

నిత్యం నరకమే..

సొంతింటి కల నెరవేరిందన్న ఆనందం పేదలకు ఎక్కువకాలం నిలవలేదు. వైకాపా నేతల చుట్టూ కాళ్లరిగేలా తిరిగిన పేదలకు ఫలితం లేకపోవడంతో సొంత ఖర్చులతోనే ఇళ్లకు వైరింగ్, ఇతర మరమ్మతులు చేయించుకున్నారు. ప్రస్తుతం కొన్ని ఇళ్లలో ఉంటున్నవారు పక్కవీధి నుంచి పొడవాటి వైర్లతో విద్యుత్తును రప్పించుకుని మీటర్లు అమర్చుకున్నారు. మిగిలినవారంతా చీకట్లోనే కష్టాలకాపురం చేస్తున్నారు. నీటి సదుపాయం లేక పక్క వీధులకు బిందెలతో వెళ్తూ పై అంతస్తులకు మోసుకోవాల్సి వస్తోందని వాపోతున్నారు.

● మళ్లీ ఎన్నికలు సమీపించడంతో ఎలాంటి వసతులు కల్పించకుండానే 2023, సెప్టెంబరు 30న వాటిలో 90 ఇళ్లను వైకాపా ప్రభుత్వం లబ్ధిదారులకు పంపిణీచేసింది.

● 1.పుట్టుకతో వచ్చే లోపాలు, 2. బాల్యంలో వ్యాధులు, 3.పోషకాహార లోపాలు, 4. ఎదుగుదల లోపం సమస్యలను గుర్తించి ఉచితంగా చికిత్స అందిస్తున్నారు.

● ఏఎన్‌ఎంలు, మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లు(ఎంఎల్‌హెచ్‌పీ)లు విద్యార్థుల వద్దకే వెళ్లి పరీక్షలు నిర్వహిస్తున్నారు. విద్యార్థుల్లో రక్తహీనత, ఎత్తు, బరువు, కంటి, వినికిడి పరీక్షలు, మానసిక రుగ్మతలు, దంత సమస్యలు, చర్మ సంబంధిత వ్యాధులు ఇలా శరీరంలో ప్రతి వ్యాధికి సంబంధించి స్క్రీనింగ్ చేసి వివరాలను ఏపీ హెల్త్ యాప్‌లో నమోదు చేస్తారు.

● అంగన్‌వాడీలు, ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, సంక్షేమ వసతి గృహాలు, భవిత కేంద్రాల్లోని ప్రత్యేక అవసరాలు కలిగిన 18 ఏళ్లలోపు బాల బాలికలకు ఈ పరీక్షలు నిర్వహిస్తారు. వ్యాధి తీవ్రతకు అనుగుణంగా సీహెచ్‌సీ, ప్రాంతీయ ఆసుపత్రుల్లో చికిత్స అందిస్తారు.

చిన్నా.. ఆరోగ్యం బాగుందా..?

జి.సిగడాం కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

న్యూస్‌టుడే, పొందూరు

బాలలకు చదువు ఎంత ముఖ్యమో ఆరోగ్యమూ అంతే. ఆరోగ్యకరమైన బాల్యాన్ని అందించినప్పుడే భవిష్యత్తు సంతోషంగా ఉంటుంది. ఈ లక్ష్యంతో కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం(ఆర్‌బీఎస్‌కే)లో భాగంగా చైల్డ్ హెల్త్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తోంది.

● జిల్లాలో ఇటీవల నిర్వహించిన వైద్య పరీక్షల్లో ప్రధానంగా అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు జ్వరాలు, జలుబు అధికంగా ఉన్నాయని, పాఠశాలల్లో విద్యార్థులకు చర్మవ్యాధులు, మూర్ఛ, థైరాయిడ్ ఇతర వ్యాధులతోపాటు బరువు తక్కువగా ఉన్నారని వైద్యాధికారులు గుర్తించినట్లు తెలిపారు.

● ఈ పరీక్షలు ఈనెలాఖరులోగా పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. బాలలకు ప్రత్యేక వైద్యం అందించేలా చర్యలు చేపడుతున్నాం. నివేదిక ప్రభుత్వానికి పంపిస్తాం.' అని ఆర్‌బీఎస్కే నోడల్ అధికారిణి డా. శివరంజని తెలిపారు.

జిల్లాలో పరిస్థితి ఇది

కేటగిరీ	సంఖ్య	విద్యార్థులు	పరీక్షలు పూర్తయినవారు	సమస్యలున్నవారు
అంగన్‌వాడీలు	3,383	1,43,229	1,29,223	29,593
పాఠశాలలు	2,633	1,86,063	1,31,020	30,737

(c) eenadu

పాముల విశ్రాంతి భవనం..!

నందిగాం మండలం పెద్దబాణాపురం పంచాయతీ పరిధి పాత్రునివలస సమీపంలో జాతీయ రహదారి పక్కన 1989లో ప్రయాణికుల విశ్రాంతి భవనం నిర్మించారు. హరిదాసుపురం, ఆనందపురం, సవరబాణాపురం, పాత్రునివలస తదితర గ్రామాల ప్రజలకు ఇది ఉపయోగపడేది. అందులో పాముల పుట్ట పెరగడంతో ప్రస్తుతం రోడ్డుపై వాహనాల కోసం వేచి చూస్తున్నారు. పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పంచాయతీ కార్యదర్శి రమణబాబు తెలిపారు. – న్యూస్‌టుడే, నందిగాం

ధాన్యం కొనుగోళ్లలో మిల్లర్ల దోపిడీ

● మీకోసంలో ఏపీ రైతు సంఘం ఫిర్యాదు

సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, అధికారులు

శ్రీకాకుళం నగరం, పాతబస్టాండ్, న్యూస్‌టుడే: జిల్లాలోని మిల్లర్లు రైతుల నుంచి ధాన్యం కొనుగోలు సమయంలో బస్తాకు 4 నుంచి 5 కిలోల ధాన్యం అదనంగా తీసుకుంటున్నారని.. దీనికి అంగీకరించకపోతే ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.చంద్రరావు, పి.ప్రసాదరావు ఆక్షేపించారు. ఈ విషయమై విచారణ చేపట్టి అన్నదాతలకు న్యాయం చేయాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. శ్రీకాకుళం నగరంలోని జడ్పీ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం మీకోసం కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, పలువురు అధికారులు ప్రజల నుంచి అర్జీలు తీసుకున్నారు. 'అధికారులు అడిగిన మొత్తం ఇవ్వలేదని ఇతర మిల్లుల కంటే తక్కువ ధాన్యం కొనుగోలు కేటాయించారు' అని పోలాకి మండలం సుసరాంలోని దుర్గా మోడ్రన్ రైసు మిల్లు యజమాని టి.భూషణరావు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ అర్జీలు అందాయి. 169 వినతులు అందాయని అధికారులు తెలిపారు. ఉప కలెక్టర్ పద్మావతి, డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ★ జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో 62 వినతులు వచ్చాయి. పలువురితో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

బార్ కౌన్సిల్ ఎన్నికలకు ఓటరు జాబితా సిద్ధం

ఓటరు జాబితాను చూపుతున్న జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శివప్రసాదరావు, దామోదరరావు

పాతబస్టాండ్, న్యూస్‌టుడే: రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికలకు అర్హులైన న్యాయవాదులకు సంబంధించిన ప్రాథమిక ఓటరు జాబితా జిల్లా బార్ అసోసియేషన్‌లో ఉందని అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తంగి శివప్రసాదరావు, పిట్టా దామోదరరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. న్యాయవాదులు వారి పేరు, చిత్రం, చిరునామా, ఇతర వివరాలు సరిచూసుకోవాలని సవరణలకు ఈ నెల 17 వరకు అవకాశం ఉందని పేర్కొన్నారు. దీన్ని సద్వినియోగం చేసుకుని ఓటు హక్కును సంరక్షించుకోవాలని కోరారు.

పరీక్షా పే చర్చలో 2 లక్షల మంది భాగస్వాములయ్యేలా చర్యలు

గార (వమరవల్లి), న్యూస్‌టుడే: కేంద్రం నిర్వహిస్తున్న పరీక్షా పే చర్చ కార్యక్రమంలో జిల్లా నుంచి 2 లక్షల మంది భాగస్వాములయ్యేలా చర్యలు తీసుకున్నామని జిల్లా ఉపాధ్యాయ శిక్షణ సంస్థ ప్రధానాచార్యులు ఎ.గౌరీశంకరరావు తెలిపారు. ఏటా రాష్ట్రానికి చెందిన 56 మందితో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాట్లాడుతున్నారన్నారు. గతేడాది జిల్లా నుంచి 1.27 లక్షల మంది వివరాలు నమోదు చేసినట్లు చెప్పారు. ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న విద్యార్థులు ఇందులో భాగస్వామ్మిల్ని చేస్తున్నట్లు వివరించారు. జనవరి 11 వరకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు https://innovateindia.my.gov.inలో విద్యార్థుల వివరాలు నమోదు చేయాలని సూచించారు. మరిన్ని వివరాలకు 70936 35234కు ఫోన్ చేయాలని కోరారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

సాయికుమార్ (పాత చిత్రం)

నరసన్నపేట గ్రామీణం, కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: నరసన్నపేట మండలం చోడవరం సమీపంలో లుకులాం-కొమనాపల్లి రహదారిని ఆనుకుని ఉన్న 3ఆర్ నడగాం కాలువలో యువకుడి మృతదేహం కలకలం రేపింది. సోమవారం ఉదయం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారమిచ్చారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. నరసన్నపేట ఇన్‌ఛార్జి ఎస్‌ఐ జె.రంజిత్ తెలిపిన వివరాల ప్రకారం ఉన్నాయి. కాలువలో ద్విచక్రవాహనం కింద ఉన్న మృతదేహం కోటబొమ్మాళి మండలం గోపాలపురానికి చెందిన మప్పల సాయికుమార్ (21)గా గుర్తించామన్నారు. గొర్రెలు, మేకలు అమ్మకాలు, కొనుగోలు చేస్తుంటే సదరు యువకుడు నగదు వసూళ్ల కోసం వెన్నాపురం వచ్చాడని, తెలిసిన వారే హత్య చేసి కాలువలో పడేశారని, శరీరంపై పలు చోట్ల గాయాలున్నాయని తల్లిదండ్రులు అప్పన్న, సావిత్రి ఆరోపిస్తున్నారు. ఆదివారం రాత్రి ఫోన్ రావడంతో వెళ్లాడని వాపోతున్నారు. ఇంటికి ఆధారమైన కుమారుడు మృతి చెందడంతో వారు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. సోదరుడు వరుణ్ ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆసుపత్రికి తరలించామని పోలీసులు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

టీవీ చూడొద్దన్నారని ఇంటర్ విద్యార్థిని బలవన్మరణం

రణస్థలం, న్యూస్‌టుడే: అదే పనిగా టీవీ చూడొద్దని తల్లి మందలించడంతో మనస్తాపానికి గురై ఓ విద్యార్థిని బలవన్మరణానికి పాల్పడింది. రణస్థలం మండలం ముక్త్యాంపాలెం గ్రామానికి చెందిన శీల కీర్తి (17) ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. ఈ నెల 6న కళాశాల నుంచి ఇంటికొచ్చిన ఆమె టీవీ చూస్తుండగా తల్లి మందలించారు. మనస్తాపానికి గురై పురుగుల మందు తాగేసింది. బాధితురాలిని ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు.

తల్లిదండ్రులు మందలించారని బాలుడి అదృశ్యం

రణస్థలం, న్యూస్‌టుడే: సెల్‌ఫోన్ ఎక్కడిదని తల్లిదండ్రులు మందలించడంతో మనస్తాపానికి గురైన బాలుడు ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఈ విషయమై తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సోమవారం కేసు నమోదు చేశారు. లావేరు మండలం పాతకుంకాంకు చెందిన సతీష్, లక్ష్మి రణస్థలం మండలం బావరాజుపాలెంలో నివాసం ఉంటున్నారు. వారి కుమారుడు ఓ ప్రైవేటు పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రులు విధులకు వెళ్లినప్పుడు బీరువాలోని డబ్బులు తీసి చరవాణి కొనుగోలు చేశాడు. రహస్యంగా వినియోగిస్తుండగా వారు చూసి ఎక్కడిదని అడిగారు. మనస్తాపానికి గురై సైకిల్‌పై పాఠశాలకు వెళ్తున్నట్లు చెప్పి బయలుదేరాడు. జాతీయ రహదారి వైపు వచ్చి బాలికల వసతి గృహం వద్ద పడిపోయాడు. అక్కడే సైకిల్ వదిలి వెళ్లాడు. ఆదివారం తిరుమల నుంచి మరొకరి ఫోన్ తీసుకుని తల్లిదండ్రులతో మాట్లాడాడు. ఆ తర్వాత నుంచి జాడ తెలియలేదని వారు వాపోతున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు.

30 తులాల బంగారం చోరీ

సోంపేట, న్యూస్‌టుడే: సోంపేట కోర్టుపేటలో ఆదివారం అర్ధరాత్రి భారీ చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కోర్టుపేట తంగుడు మనోజ్ ఆదివారం భార్యతో కలిసి ద్విచక్రవాహనంపై బ్రహ్మపురలోని బంధువుల ఇంటి ఫంక్షన్‌కి వెళ్లి తిరిగి వస్తుండగా వారిని మరో ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో మనోజ్‌కు స్వల్పగాయాలయ్యాయి. దీంతో వీరు పిల్లలతోపాటు మనోజ్ అన్నయ్య ఇంటికి వెళ్లారు. ఈ క్రమంలో అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాను తాళంతో తెరిచి 30 తులాల బంగారంతోపాటు రూ.లక్ష దొంగిలించారు. పక్కింట్లోని తాళం స్థానంలో కొత్త వేయడంతో బాధిత కుటుంబం ఉదయం ఇంటికొచ్చేసరికి దొంగతనం జరిగినట్లు గుర్తించి సోంపేట సీఐ మంగరాజు, ఎస్సై లోవరాజులకు ఫిర్యాదు చేశారు. బరువా, కంచిలి ఎస్సైలు హరిబాబునాయుడు, పారినాయుడు, క్లూస్‌టీమ్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. చోరీ జరిగిన విధానం చూసి తెలిసిన వారి పనేనని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

కాశీబుగ్గలో రూ.1.20 లక్షలు..

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: కాశీబుగ్గలో ద్విచక్ర వాహనం డిక్కీలో ఉంచిన రూ.1.20 లక్షలు సోమవారం చోరీ గురైనట్లు సీఐ పి.రామకృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. రమేష్ మహారణ అనే వ్యక్తి ఇండియన్ బ్యాంకుకు వెళ్లి బంగారం తనఖా పెట్టి రూ.1.20 లక్షలు రుణం తీసుకున్నారు. ఆ నగదును తన ద్విచక్ర వాహనం డిక్కీలో పెట్టారు. కేటీ రహదారిలోని ఓ దుకాణం వద్ద ద్విచక్రవాహనం ఆపి లోపలకు వెళ్లారు. దుకాణంలో కేకు కొనుగోలు చేసి తిరిగి వచ్చి చూస్తే డిక్కీలో ఉండే నగదు కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేశామని సీఐ పేర్కొన్నారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	160	275	295

ఆనప.. అనుకూలమైన పంట..!

సారవకోట, న్యూస్‌టుడే: పంటల మార్పిడి విధానం పాటించి అధిక దిగుబడులు సాధించి వచ్చని సారవకోట మండలంలోని తొగిరి గ్రామ రైతు రావాడ జనార్దన నిరూపించారు. ఆయన మార్గంలో గ్రామానికి చెందిన సుమారు 30 మంది రైతులు అదే పద్ధతిని అనుసరించి ఆనప, టమాట, బరబాటి, క్యాలీఫ్లవర్, వంగ, బెండ, మిరప వంటి కూరగాయలు సాగు చేస్తున్నారు. ప్రస్తుతం జనార్దన 50 సెంట్ల విస్తీర్ణంలో ఆనప సాగు చేసి ఏడాదికి మంచి ఆదాయం పొందుతున్నారు.

దిగుబడి: ఆనప సాగుకు సారవంతమైన తేలికపాటి నేలలు అనుకూలం. నరసన్నపేట, చల్లవానిపేట తదితర గ్రామాల్లోని వ్యాపారుల వద్ద విత్తనాలు కొనుగోలు చేసి మెట్ట భూముల్లో సాగుచేస్తారు. పొలంలో గెత్తం వేసి బాగా దుక్కిచేసి విత్తనాలు నాటుతారు. అవసరమైన తడులు అందించి యూరియా, డీఏపీ వంటి ఎరువులు వేస్తారు. గొప్పు తవ్వి కలుపు నివారిస్తారు. విత్తనాలు వేసిన 50 రోజుల నుంచి కాపు వస్తుంది. నాలుగు నెలల పాటు పంట చేతికందుతుంది. ఏడాదిలో రెండు సార్లు సాగుచేస్తారు. రెండు రోజులకు ఒకసారి కాయలు కోతచేసి విక్రయాలు చేస్తున్నారు. ఒక్కొక్క కాయ రూ.20 నుంచి రూ.40లకు విక్రయిస్తున్నారు.

50 సంవత్సరాలుగా.. గత 50 సంవత్సరాలుగా పంట మార్పిడి విధానం పాటించి 50 సెంట్ల విస్తీర్ణంలో ఆనప సాగు చేస్తున్నాను. విత్తనాలు నాటడం నుంచి పంట కోత పూర్తి కావడానికి 6 నెలలు పడుతుంది. ఏడాదికి రెండు పంటలు చేతికి అందుతాయి. 50 సెంట్లలో వేసిన పంటకు రూ.6వేలు వరకు ఖర్చవుతుంది. పెట్టుబడి మినహా ఒక పంటకు రూ.50వేలు చొప్పున, ఏడాదికి రూ.లక్ష ఆదాయం వస్తుంది.

– రావాడ జనార్దన, రైతు, (తొగిరి)

రబీలో చోడి మంచిదే..

గొర్లిబంద గ్రామ పరిధిలో సాగు చేసిన చోడి

సారవకోట, న్యూస్‌టుడే: రబీ పంటగా చోడి (రాగులు) సాగుకు ఇదే సమయమని ఏవో వెంకటరావు సూచించారు. పొలాన్ని దమ్ము చేసి వెద రూపంలో, నారు వేసి నాటుకోవచ్చునని పేర్కొన్నారు. డిసెంబర్‌లో నారు వేసి జనవరి మొదటి వారానికల్లా నాట్లు వేయాలన్నారు. అనువైన రకాలను ఎంచుకుంటే అధిక దిగుబడి సాధించ వచ్చన్నారు. ఈ ఏడాది వర్షాలు అనుకూలంగా ఉండటంతో చెరువులు, బావుల్లో నీరుంది. ఈ నీటిని సద్వినియోగం చేసుకునే విధంగా ఆరుతడి పంటలను సాగు చేయాలన్నారు. వరి కోతకు వారం రోజుల ముందు పైపాటుగా ఎకరాకు 3 కిలోల విత్తనాలు వెద రూపంలో చల్లుకుంటే దుక్కి, నాట్లు వేసే ఖర్చు తగ్గుతుంది. వెద జల్లే ముందు ఒక రోజు విత్తనాన్ని నీటిలో నానబెట్టాలి. దమ్ము చేసి నాటే సమయంలో ఎకరాకు 30కిలోల డీఏపీ, 10 కిలోల పొటాష్ ఎరువు పైపాటుగా వేయాలి. నాటిన నెల రోజులకు 15కిలోల యూరియా వేసుకోవాలి. పీకపోటు ఆశిస్తే ఎసిఫేట్ 300గ్రా. 200 లీటర్ల నీటిలో, అగ్గితెగులు ఆశిస్తే 120గ్రా. ట్రైసైక్లోజోల్ 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. మేలు రకాలకు చెందినవి 110 నుంచి 125 రోజుల్లో పంట చేతికి అందుతుంది. 10 నుంచి 12 క్వింటాళ్ల దిగుబడి వస్తుందన్నారు. అదనపు సమాచారం కోసం రైతు సేవాకేంద్రాల్లో ఉండే వ్యవసాయ సహాయకులకు సంప్రదించాలన్నారు.

రైతేరాజు

చేపల పెంపకంలో జాగ్రత్తలు

జలుమూరు, న్యూస్‌టుడే: చేపల పెంపకంలో రైతులు జాగ్రత్తలు పాటించాలని మత్స్యశాఖ సహాయ సంచాలకులు టి.సంతోష్‌కుమార్ తెలిపారు. శీతాకాలంలో ఉష్ణోగ్రతలు తగ్గినప్పుడు చేపల జీవక్రియలు, నీటి ఉష్ణోగ్రతపై ఆధారపడి ఉంటుంది. ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టడం వల్ల చేపల పెరుగుదల తగ్గుతుంది. అలాంటి సమయంలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి. చెరువుల్లో పెరిగిన నాచు, నీటి మొక్కలు ఎప్పటికప్పుడు తొలిగించాలి. మేత వృథా కాకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి. సేంద్రియ ఎరువులు వాడకూడదు. వ్యవసాయ సున్నం ఎకరాకు పది కిలోలు వాడుకోవాలి. బ్యాక్టీరియా పెరగకుండా సానిటేజర్లు, పొటాషియం పర్మాంగనేట్ ఎకరాకు 500 గ్రాములు, 5 శాతం బోమిన్ ద్రావణం చెరువుల్లో వేయాలి. ఈ కాలంలో చేపకు పుండువ్యాధి సోకే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. వాటి నివారణకు దాణాతోపాటు యాంటీబయాటిక్ మందు ఇవ్వడంతో వ్యాధి నివారించవచ్చునని ఏడీ రైతులకు సూచించారు.

జామకు తెల్లసుడి గండం

జామ చెట్టులో తెల్లసుడి దోమ కనిపిస్తే వెంటనే కొమ్మలను కత్తిరించి లీటరు నీటిలో 5 మి.లీ. వేప నూనె కలిపి పిచికారీ చేయాలి. రాత్రి సమయంలో జిగురు పూసిన పసుపు రంగు డబ్బాలు లేదా జిగురు అట్టలను తెల్ల దోమ ఆశించిన మొక్కల వద్ద ఉంచితే తెల్లసుడి దోమను నివారించవచ్చు.

– న్యూస్‌టుడే, జలుమూరు

ఫోన్ కొట్టు.. సలహా పొందు

సాగులో చీడపీడలు అరికట్టేందుకు చేపట్టాల్సిన సస్య రక్షణ చర్యలపై కేవీకే సస్యరక్షణ విభాగం శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.కిరణ్... 8500274985 చరవాణి నంబరులో సంప్రదించాలి.

మామిడి తెగులుకు ఇదే నివారణ

సరుబుజ్జిలి, న్యూస్‌టుడే: జీడి మామిడి పంటల్లో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించొచ్చని ఆమదాలవలస కేవీకే ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్.వి.హరికుమార్ అన్నారు. ఈ ఏడాది వాతావరణ పరిస్థితుల వల్ల పంటలకు పలు రకాల పురుగులు, తెగుళ్లు ఆశించి నష్టపరిచాయని, జాగ్రత్తలు పాటిస్తే పంట ఆశాజనకంగా ఉంటాయన్నారు. రైతులు చరవాణిలో అడిగిన ప్రశ్నలకు ఇలా సమాధానం ఇచ్చారు.

ప్రశ్న: మామిడిలో ప్రస్తుతం ఆకు గూళ్లు, బూడిద తెగులు ఎక్కువగా కనిపిస్తున్నాయి. నివారణకు చర్యలు తెలపండి. -ఎస్.లక్ష్మణరావు,పెద్దసవలాపురం

సమాధానం: మామిడిలో బూడిద తెగులు నివారణకు నీటిలో కరిగే గంధకం 3 గ్రాములు లేదా హెక్సాకొనజోల్ 2 మి.లీ లేదా ప్రొపినెబ్ 2 గ్రాములు లేదా మైకొబ్యుటానిల్ 1 గ్రాము లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి

ప్రశ్న: జీడి మామిడి పూత రావడానికి సిద్ధంగా ఉంది. ప్రస్తుతం పడుతున్న పొగ మంచు కారణంగా ప్రతి సంవత్సరం పూత ఎండిపోతోంది. దీని నివారణకు చర్యలు తెలపండి. -ఎస్.రామారావు, పర్లాం

సమాధానం: పొగ మంచు తేమ కారణంగా పూత దశలో బ్లైట్ తెగులు సోకుతుంది. నివారణకు కార్బండిజమ్ 1 గ్రాము లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు లీటరు నీటికి కలిపి పూత విచ్చుకోక ముందే పూత కాడలకు పిచికారీ చేయాలి.

ప్రశ్న: టామాటా మొక్కలు ఎండిపోతున్నాయి నివారణకు చర్యలు తెలపండి.- పి.సోమేశ్వరరావు, ఎల్.ఎన్.పేట

సమాధానం: బ్యాక్టీరియా, శిలీంద్రాల కారణంగా ఎండు తెగులు సోకే అవకాశం ఉంది. ఇలాంటి ఎండిపోతున్న మొక్కల నుంచి పక్క మొక్కలకు తెగులు సోకే అవకాశం ఉంది. మొక్కలకు నీరు అందించేటప్పుడు తెగులు సోకే మొక్కల మొదళ్ల నుంచి నీరు వేరే మొక్కలకు చేరకుండా చూసుకోవాలి. నివారణకు కాపర్‌ఆక్సీక్లోరైడ్ 30 గ్రాములు, స్ట్రెప్టోసైక్లిన్ 1 గ్రాము 10 లీటర్ల నీటికి కలిపి మొక్క మొదళ్ల వద్ద పోయాలి.

లంచం అడిగారా.. ఫిర్యాదు చేయండి..!

న్యూస్‌టుడే, పాత శ్రీకాకుళం

ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే ప్రజలకు సేవలందించాల్సిన అధికారులు, ఉద్యోగులు చాలా సందర్భాల్లో నిర్దేశించిన పని చేయడానికి లంచం అడగడం.. సొమ్ము ఇవ్వకపోతే కావాలని కొర్రీలు వేస్తుంటారు. తప్పనిసరి పరిస్థితుల్లో వారు కోరిన మొత్తం అందజేసి అవసరమైన ధ్రువపత్రాలు పొందుతున్నారు. ఈ సందర్భంలో చైతన్యంతో వ్యవహరించి అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులను సంప్రదిస్తే ప్రణాళిక ప్రకారం లంచం తీసుకుంటుండగా పట్టుకునే ప్రయత్నం చేస్తారు. వ్యవస్థలో వేళ్లూనుకున్న అవినీతిని రూపుమాపాలంటే ఫిర్యాదు చేయడం ఒక్కటే మార్గం. మంగళవారం అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినం సందర్భంగా 'న్యూస్‌టుడే' కథనం.

నేడు అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినం

ఏప్రిల్‌లో ఓ ఉద్యోగి చేరిక నిమిత్తం ఉత్తర్వులు జారీ చేయడానికి రూ.20 వేలు లంచం తీసుకుంటూ అప్పటి డీఎంహెచ్‌వో టీవీ బాల మురళీకృష్ణ రూ.20 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.

మే 22న ఓ డీలర్‌కు చెందిన ఎలక్ట్రానిక్ కాటాలను ధ్రువీకరించి పత్రం జారీ చేయడానికి తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ టి.శ్రీధర్ రూ.1.78 లక్షలు లంచం తీసుకుంటుండగా అవినీతి నిరోధక శాఖ అధికారుల వలకు చిక్కారు.

సంవత్సరం	లంచం తీసుకుంటూ చిక్కినవి	ఆదాయానికి మించి ఆస్తులు	ఇతర కేసులు
2021	09	01	03
2022	06	01	03
2023	07	02	09
2024	02	01	--
2025	03	--	--

47 కేసుల నమోదు.. ● జిల్లాలో ఏసీబీ అధికారులు ఐదేళ్లలో 47 కేసులు నమోదు చేశారు. చాలా మంది అధికారులు, ఉద్యోగులు కారాగానికి వెళ్లారు. కొందరు న్యాయస్థానాల్లో విచారణ ఎదుర్కొంటున్నారు.

ధైర్యంగా ముందుకు రావాలి..

లంచం తీసుకోవడం.. ఇవ్వడమూ నేరమే. బాధితులు ధైర్యంగా ముందుకొచ్చి ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేయాలి. అధికారులు, ఉద్యోగులు పని చేయడానికి తీసుకున్న సొమ్మును కొన్ని వారాల తర్వాత సంబంధిత వ్యక్తులకు ఇచ్చేస్తారు. అపరిష్కృతంగా ఉంటే పూర్తి చేయించే బాధ్యత తీసుకుంటారు. – భాస్కరరావు, సీఐ, ఏసీబీ, శ్రీకాకుళం

ఫోన్ చేయాల్సిన నంబర్లు డీఎస్పీ: 94404 46124 | సీఐ: 73826 29272, 94913 05632 | టోల్ ఫ్రీ:1064

డీడీవో కార్యాలయాల ఏర్పాటుతో పీఆర్ వ్యవస్థ ప్రక్షాళన

మాట్లాడుతున్న జనసేన ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు చంద్రమోహన్

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆధ్వర్యంలో పంచాయతీరాజ్ శాఖకు మంచి రోజులు వచ్చాయని జనసేన ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు చంద్రమోహన్ అన్నారు. శ్రీకాకుళం నగరంలోని ఆ పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల్లో 10 వేల మందికి ఉద్యోగోన్నతి కల్పించారని తెలిపారు. డీడీవో కార్యాలయాల ఏర్పాటుతో ప్రజలకు సత్వర సేవలు అందేలా పీఆర్ వ్యవస్థను ప్రక్షాళన చేశారని పేర్కొన్నారు.

నేటి నుంచి సిక్కోలు హరిత మహోత్సవం

శ్రీకాకుళం సాంస్కృతికం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరం 80 అడుగుల రహదారిలోని ఓ ఫంక్షన్ హాలులో మంగళవారం నుంచి మూడు రోజుల పాటు సిక్కోలు హరిత మహోత్సవం నిర్వహించనున్నారు. శ్రీకాకుళం అసోసియేషన్ ఆఫ్ పిడియాట్రిక్స్ ఆధ్వర్యంలో చిరుధాన్యాలు, పొందూరు ఖాదీ, బుడితి ఇత్తడి, విత్తనాలతో కూడిన వివిధ రకాల స్టాళ్లు ఏర్పాటు చేశామని నిర్వాహకులు తెలిపారు. తొలి రోజు పలువురు ప్రముఖులు పాల్గొంటారన్నారు.

EENADU Classifieds

JOBS

వైజాగ్ SKLM VZM జిల్లాలలో స్కూల్స్ హాస్పిటల్స్ బ్యాంక్‌లలో ఔట్‌సోర్సింగ్ & కాంట్రాక్ట్ బేస్ ద్వారా పనిచేయుటకు అటెండర్స్, రికార్డ్స్, జూనియర్ అసిస్టెంట్స్, కంప్యూటర్ ఆపరేటర్స్ బుకింగ్ క్లర్క్స్ బీట్ ఆఫీసర్స్ హెల్ప్‌డెస్క్ గార్డెనర్స్ MNO FNO ల్యాబ్‌టెక్నీషియన్స్ ANM GNM చేసినవారు M/F అర్జెంట్‌గా కావలెను. 10th నుండి బీటెక్ వరకు జీ: 20K to 40K ✆ 8977011429.

అమెరికాలో 1 సం|| బాబు ఆలన, పాలన వ్యక్తిగత సంరక్షణ కొరకు అనుభవంగల ఆడవారు కావలెను. అమెరికా వీసా కల్గినవారు మాత్రమే. ✆ 9440803362

ఉచిత శిక్షణ, భోజనం మరియు వసతి సౌకర్యం & ఉద్యోగావకాశాలు. గాజువాకలో అర్హత: 10 ఆపైన. వయస్సు: 18-30. ✆ 9573366622, 9573366611.

వైజాగ్‌లో ప్రముఖ షాపింగ్ మాల్స్‌లో పనిచేయుటకు 18-35వ యువతి యువకులు కావలెను. జీతం 10000-13500 ఫుడ్‌రూము 9704637370, 9949904532.

పైడిభీమవరం, పరవాడ ఫార్మా కంపెనీలో సూపర్‌వైజర్స్, QC, QA, R&D, మేనేజర్స్, ఫైర్& సేఫ్టీ హెల్పర్స్, సెక్యూరిటీ కావలెను. Qlf 10th-డిగ్రీ MBA, B.ఫార్మా, జీ||28K to 38K. 9573635594, 9121044796

ఆర్మీ NAVY ఎయిర్‌ఫోర్స్ రైల్వే, SSC, బ్యాంకులలో ఉద్యోగావకాశాలు. అర్హత:10th-డిగ్రీ. Age:16-25. శిక్షణ 3నెలలు శిక్షణాకాలంలో హాస్టల్, 10th, ఇంటర్, డిగ్రీ డిస్టెన్స్ కోర్సులు కలవు. *ముందుగా ఎటువంటి ఫీజులేదు * క్రిస్టియన్ ఎడ్యుకేషన్ అకాడమీ, వైజాగ్. 9121232326.

MEDICAL

ఫార్మసిస్ట్ (M/F) కావలెను. 2-3 సం||లు అనుభవం ఉండవలెను. జీతం: 18వేలు, సంప్ర|| Medplus, రణస్థలం, శ్రీకాకుళం జిల్లా ✆ 9959991783.

SECURITY GUARDS

జైగణేష్ సెక్యూరిటీసంస్థలో విశాఖస్టీల్‌ప్లాంటు ఏరియాలో సెక్యూరిటీగార్డ్స్ 150 మంది 8గం|| డ్యూ జీతం 18815/- PF, ESI సెక్యూరిటీ సూపర్‌వైజర్స్ 11మంది (Ex -Service) జీతం: 22690/- సెక్యూరిటీ ఆఫీసర్ (Ex or Rtd పోలీస్ ఆఫీసర్) జీతం:30,000/- యూనిఫామ్-ఫ్రీ. ✆ 63091 17776.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు. ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే సంప్రదించండి: 8008597609

ఈనాడు దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి Cell: 80085 97609 ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి Cell: 80081 11237

మోసం కేసులో అరెస్టు

పాతపట్నం, న్యూస్‌టుడే: మోసం కేసులో తప్పించుకుని తిరుగుతున్న ఎడ్ల గోపి అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్సై కె.మధుసూదనరావు తెలిపారు. ఆయన చెప్పిన వివరాల మేరకు పాతపట్నం అమ్మవారి గుడి సమీపంలో వేరొకరి స్థలం విక్రయించేందుకు శ్రీనివాసరావు అనే వ్యక్తి వద్ద రూ.1.5 లక్షలు తీసుకుని బాడాన వెంకటరావు, జోగి రమేష్, ఎడ్ల గోపి ఒప్పందం చేసుకున్నారు. పలుమార్లు రూ.13.5 లక్షలు వరకు తీసుకుని మోసం చేశారు. దీనిపై బాధితుడి ఫిర్యాదు మేరకు 2025 ఫిబ్రవరిలో పోలీసులు కేసు నమోదు చేశారు. వెంకటరావు, రమేష్‌లను ఇటీవల అరెస్టు చేశారు. ఎడ్ల గోపి తప్పించుకుని తిరుగుతుండటంతో నాన్ బెయిల్‌బుల్ వారెంట్ జారీ చేశారు. సోమవారం పట్టుకుని పాతపట్నం కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్సై పేర్కొన్నారు. ఈనెల 15 వరకు జడ్జి రిమాండు విధించినట్లు చెప్పారు.

రాష్ట్ర ఖోఖో సంఘ కార్యవర్గంలో చోటు



పాతబస్టాండ్, న్యూస్‌టుడే: రాష్ట్ర ఖోఖో సంఘం కోశాధికారిగా శ్రీకూర్మంలోని జడ్పీ ఉన్నత పాఠశాల వ్యాయామోపాధ్యాయుడు **సాధు శ్రీనివాసరావు** ఎన్నికయ్యారు. ఏలూరులో ఆదివారం నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గ ఎన్నికల్లో ఆయన్ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఖోఖో అసోసియేషన్ అధ్యక్షుడు చిట్టి నాగభూషణం, కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు, జిల్లా పీఈటీ, పీడీ సంఘం ప్రతినిధులు అభినందించారు.

పీజీ కోర్సుల్లో మిగులు సీట్ల భర్తీకి ప్రవేశాలు

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: బి.ఆర్.అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో వివిధ కోర్సుల్లో మిగులు సీట్ల భర్తీకి ఈ నెల 9 నుంచి 12 వరకు తక్షణ ప్రవేశాలు నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ బిడ్డికి అడ్డయ్య తెలిపారు. ఆర్ట్స్ కోర్సులు.. ఆంగ్లం, తెలుగు, ఎంజేఎంసీ, సోషల్‌వర్క్స్, ఎంఎల్‌ఐఎస్‌సీ, గ్రామీణాభివృద్ధి, అర్థశాస్త్రం, ఎం.కాం, ఎంఈడీలలో జనరల్, ఈడబ్ల్యూఎస్ కేటగిరీలు కలిపి మొత్తం 201 సీట్లు ఉన్నాయన్నారు. సైన్స్ కోర్సులు బయోటెక్నాలజీ, మైక్రోబయాలజీ, ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఎనలిటికల్ కెమిస్ట్రీ, భౌతికశాస్త్రం, గణితం, అప్లైడ్ మేథమెటిక్స్ కోర్సుల్లో 56 సీట్లు ఖాళీలు ఉన్నాయన్నారు. పీజీ సెట్‌కు హాజరైన విద్యార్థులు రూ.500, కానివారు రూ.800 కౌన్సెలింగ్ ఫీజు చెల్లించాలన్నారు.

నత్తనడక..!

గిరిజన గ్రామాల్లో వేగం పుంజుకోని రోడ్ల పనులు

ఇదీ.. దుస్థితి 2024లో మామిడిగుడ్డి, ముకుందాపురం వరకు మూడు బిట్లుగా అభివృద్ధి చేయడానికి రూ.1.05 కోట్లు మంజూరయ్యాయి. రెండున్నర కిలోమీటర్ల వెట్ మిక్స్ వేసి వదిలేయడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

మెళియాపుట్టి మండలం పెద్దపద్మాపురం కుమ్మిచెట్టు కూడలి నుంచి నౌపడా-మెళియాపుట్టి రోడ్డు (ఎన్ఎం రోడ్డు)

న్యూస్‌టుడే, మెళియాపుట్టి

పక్కా రహదారులు ప్రగతికి చిహ్నాలు. గిరిజన గ్రామాల్లో రోడ్లు నిర్మించాలని దశాబ్దాలుగా మొర పెట్టుకుంటున్నా అరణ్య రోదనగా మారుతోంది. కొన్నిచోట్ల నిధులు అందుబాటులో ఉన్నా పనులు ముందుకు సాగకపోవడం గమనార్హం.

ఇదీ పరిస్థితి

- ఐటీడీఏ పరిధిలో సీతంపేట, పాతపట్నం, మందసలో 3 ఉప కార్యాలయాలున్నాయి. ఈఈ, ముగ్గురు డీఈఈలు, 12 మంది ఏఈలు ఉండాలి. ప్రస్తుతం ఈఈ, ఇద్దరు డీఈఈలు, ముగ్గురు ఏఈలు మాత్రమే ఉన్నారు.
- గతంలో ప్రతి ఏఈ కింద క్షేత్ర సహాయకుడు ఉండేవారు. ప్రస్తుతం లేకపోవడంతో ఇంజినీరింగ్ పనుల పర్యవేక్షణ కొరవడింది.
- పాతపట్నం ఉప కార్యాలయం పరిధిలో ఏఈ 5 నెలల కిందట సస్పెండయ్యారు. ఎఫ్‌ఏసీలో ఉన్న డీఈఈ 2 నెలలుగా సెలవులో ఉన్నారు. ప్రస్తుతం ఉప కార్యాలయంలో సిబ్బంది లేకపోవడంతో పనుల్ని పట్టించుకునే వారు కరవయ్యారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం..

మార్చి నుంచి బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో జాప్యం చోటుచేసుకుంది. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. పనులు జరిగేలా చర్యలు తీసుకుంటాం.

– డీవీఆర్ఎం రాజు, డీఈఈ, ఐటీడీఏ, పాతపట్నం

ఎక్కడి పనులక్కడే..

- కూటమి ప్రభుత్వం 'పల్లె పండగ' పేరిట రహదారుల అభివృద్ధికి కార్యాచరణ రూపొందించినా ఐటీడీఏ అధికారుల తీరుతో గిరిజన ప్రజలకు అవస్థలే మిగిలాయి.
- 2024-25 ఆర్థిక సంవత్సరంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో రూ.37.74 కోట్ల అంచనాతో 96 పనులు మంజూరు చేయగా 82 వివిధ దశల్లో ఉన్నాయి. 12 పూర్తి కాగా.. మరో 2 ప్రారంభం కాలేదు.
- మెళియాపుట్టి మండలంలో 46 పనులకు సంబంధించి రూ.11.74 కోట్లు మంజూరు చేసి ఏడాది గడిచినా ఎక్కడి పనులక్కడే ఉన్నాయి. నేలబొంతు ఆశ్రమ పాఠశాలలో అంతర్గత రహదారి పూర్తికాగా.. మిగిలినవి నడిచి వెళ్లడానికి వీలు లేకుండా మారాయి.

(c) eenadu

అడ్డంగా చెత్త.. మురుగు పారేదెలా

పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలో కాశీబుగ్గ తపాలా కార్యాలయం నుంచి బ్రాహ్మణవీధి వరకు ఉన్న కాలువలో అడ్డంగా చెత్త ఉండిపోవడంతో మురుగునీరు వెళ్లేందుకు అవకాశం లేకుండా పోతోంది. అధికారులు స్పందించి కాలువల్లో అడ్డంగా ఉన్న చెత్త తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. సిబ్బందిని పంపించి చెత్తను తొలగించి, మురుగునీరు పారేలా చర్యలు తీసుకుంటామని హెల్త్ ఇన్‌స్పెక్టర్ శేఖర్ తెలిపారు. - న్యూస్‌టుడే, పలాస

పలాస

• పలాస • ఇచ్ఛాపురం

బొప్పాయి.. శాఖోపశాఖలుగా..

బొప్పాయి చెట్టు ఒకే కాండంపై పెరుగుతుంది. ఇది సాధారణం. అదే శాఖలు వ్యాపించడం అసాధారణం. ఈ తరహా చెట్టు మందస మండలం మఖరజోలలోని ఓ ఇంటి పెరట్లో ఉంది. కొమ్మలు విస్తరించి పెరుగుతున్న దీన్ని చుట్టూ పక్కల వారు ఆసక్తిగా తిలకిస్తున్నారు. జన్యుపరమైన ఉత్పరివర్తనం వల్లే బొప్పాయిలో కొన్ని చెట్లు శాఖలుగా పెరుగుతాయని ఉద్యానశాఖ అధికారి శంకర్‌దాస్ వివరించారు. - న్యూస్‌టుడే, మందస

ఉపన్యసించి.. బహుమతులు పట్టేసి

విద్యార్థులు ప్రతి విషయంపై అవగాహన పెంపొందిస్తే భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.రవికుమార్ అన్నారు. పాఠశాల ఆవరణలో సోమవారం 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో 7, 8, 9, 10వ తరగతుల విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'విద్యార్థుల జీవితాల్లో సెల్‌ఫోన్ ప్రభావం'పై ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఇందులో జశ్వంత్ పాత్ర (10వ తరగతి), జి. మౌనిక (9వ తరగతి), ఆర్.సాహితి (9వ తరగతి) తొలి మూడు స్థానాల్లో నిలిచారు. విజేతలకు ప్రధానోపాధ్యాయుడు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఉపాధ్యాయులు స్వరాజ్యలక్ష్మి, కె.రాజు, కృష్ణారావు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, పలాస

ఊరి వైపు.. డెప్పూరు ప్రజల చూపు

- న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

డెప్పూరు గ్రామం చాలా కాలంగా కనీస సౌకర్యాలు లేక కొట్టుమిట్టాడుతోంది. గతంలో ఇక్కడ సుమారు 30పైగా కుటుంబాలు 120 మంది జనాభా ఉండేవారు. మౌలిక సదుపాయాల లేమితో ఒకరికొకరు ఊరు వీడి వలస వెళ్లారు. దీంతో చివరికి 4 కుటుంబాలే మిగిలాయి. అనంతరం గ్రామంలో ఆస్తులు, ఇతర అవసరాల కోసం గ్రామానికి తిరిగి రావాల్సిన అవసరం ఏర్పడింది. విధిలేని పరిస్థితుల్లో మౌలిక సౌకర్యాల సమస్య ఉన్నప్పటికీ అక్కడే జీవనోపాధి కొనసాగించుకుంటూ ఉంటున్నారు. ప్రస్తుతం 9 కుటుంబాలకు చెందిన 22 మంది నివసిస్తున్నారు.

★ అధికారులు, ప్రజాప్రతినిధులు ఎన్నికల సమయంలో తప్ప మిగిలిన సందర్భాల్లో ఇటుగా రాకపోవడంతో సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయి. దీంతో ప్రజలు మండపల్లి, జగన్నాథపురం, ఇచ్ఛాపురం, ఒడిశా రాష్ట్రంలోని హరిపురం ప్రాంతాలకు వెళ్లి ఉపాధి పొందుతున్నారు. స్వగ్రామం విడిచి పెట్టలేక, వలస వెళ్లినప్పటికీ ఇక్కడికొచ్చి కొంత కాలం ఉండి మరలా వెళ్తున్నారు.

అధ్వానంగా ఉన్న రహదారి

• దశాబ్దాలుగా వీడని సమస్యలతో గ్రామం ఖాళీ

• సౌకర్యాలు కల్పిస్తే వద్దామని చూస్తున్న గ్రామస్థులు

ఇదీ పరిస్థితి

డెప్పూరు గ్రామస్థులు విద్య, వైద్యం సదుపాయాలు కావాలంటే కనీసం 10 కిలోమీటర్లు వెళ్లాల్సి వస్తోంది. బాలకృష్ణాపురం నుంచి ప్రధాన రహదారి మీదుగా డెప్పూరు చేరుకోవాలంటే మట్టి రోడ్డే ఆధారం. ఈ మార్గంలో ఇరువైపులా పొదలు దట్టంగా పెరగడంతోపాటు విద్యుత్తు దీపాల సౌకర్యం లేకపోవడంతో రాత్రి వేళల్లో రాకపోకలకు అవస్థలు తప్పడం లేదు.

గత ప్రభుత్వం ఇంటింటికీ రేషన్ సరకులు అందించేది. ప్రస్తుతం సుమారు రెండున్నర కిలోమీటర్లు దాటితేగాని సరకులు అందుకునే అవకాశం లేకుండా పోయింది. ఇదిలా ఉండగా మరోవైపు వృద్ధులకు ఇంటి వద్దకు తెచ్చి రేషన్ సరకులు అందజేయాల్సి ఉన్నప్పటికీ అది కూడా జరగకపోవడంతో ఇబ్బంది తప్పడం లేదు. గ్రామానికి చెందిన విద్యార్థులు 10 కిలోమీటర్ల పైగా కాలినడకన వెళ్లాల్సి రావడంతో వారి చదువులు అర్ధాంతరంగా ఆగిపోతున్నాయి.

మౌలిక సదుపాయాలైన రహదారులు, విద్యుత్తు సౌకర్యాలు పూర్తి స్థాయిలో కల్పించగలిగితే సొంతూరు విడిచి వెళ్లిన 30కి పైగా కుటుంబాలు తిరిగి స్వగ్రామానికి వచ్చే వీలుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఇక్కడి ప్రజల పరిస్థితి, సమస్యలను 'న్యూస్‌టుడే' ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ దృష్టికి తీసుకెళ్లగా.. డెప్పూరు సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM) 8008574279 9063144707

సమస్య: ఇజ్జాపేటలో రెండు చోట్ల వీధి దీపాలు వెలగడం లేదు. - సమరాజ బెహరా, ఇచ్ఛాపురం **సమాధానం:** పరిశీలించి, సమస్య పరిష్కరిస్తాం. - ఐ.కిషోర్, ఏఈ, ఇచ్ఛాపురం - న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

సమస్య: మకరాంపురం బాలకి వద్ద జాతీయ రహదారిపై విద్యుత్తు దీపాలు వెలగకపోవడంతో చీకట్లు అలుముకుంటున్నాయి. - ఎస్.జగ్గారావు, సోంపేట **సమాధానం:** పరిశీలించి సమస్యను పరిష్కరిస్తాం. - అనూప్, సీనియర్ ఇంజినీర్, ఎన్‌హెచ్ఏఐ - న్యూస్‌టుడే, కంచిలి గ్రామీణం

చెత్తకు మోక్షం..

కేసుపురం సమీప ప్రధాన రహదారిలో చెత్త పేరుకుపోతోంది. ఈ మార్గంలో కేసుపురం, బూర్జపాడు, పెద్దలక్ష్మీపురం, శివకృష్ణపురం, చిన్నలక్ష్మీపురంతోపాటు ఒడిశా రాష్ట్రానికి, సాగర తీరానికి రాకపోకలు సాగిస్తుంటారు. దీనిపై ఈనెల 5న 'డంపింగ్ యార్డుగా మార్చేశారు' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన చిత్రకథనానికి పంచాయతీ కార్యదర్శి ఎస్.శివ స్పందించారు. సిబ్బందితో చెత్త తొలగించారు. - న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

నిబంధనలకు పాతర..!

పూండి, పల్లివూరు, నారాయణపురం ప్రాంతాల్లో ఉన్న జీడి కర్మాగారాలతోపాటు పూండిబజార్‌లో ఉన్న స్వీట్స్, బేకరీ ఇతర తయారీ పరిశ్రమల నుంచి కాలుష్యం చిమ్ముతోంది. ప్రస్తుతం జీడి కర్మాగారాల్లో రోస్టింగ్‌కు ఎక్కడా అనుమతులు లేవు. అయినా విచ్చలవిడిగా జీడి పిక్కలు కాలుస్తూ నిబంధనలను తుంగలో తొక్కుతున్నారు. ఈ విషయమై తహసీల్దార్ సీతారామయ్యను వివరణ కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు గ్రామీణం

బోరుమంటోంది..

మశాఖపురంలో బోరు మరమ్మతులకు గురై చాలా రోజులవుతోంది. బోరు కింద భాగంలో ఉన్న చప్టా శిథిలావస్థకు చేరింది. దీంతో స్థానికులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బోరు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు. ఈ విషయమై ఏఈ కె.రామారావును వివరణ కోరగా సంబంధిత అధికారులకు తెలియజేసి సమస్య పరిష్కరిస్తామన్నారు. - న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

కల్వర్టు కుంగింది..

మందస నుంచి బీసీ వెళ్లే రహదారి ఇది. మార్గమధ్యలోని కల్వర్టు కుంగి రంధ్రం ఏర్పడింది. దగ్గరకు వెళ్తేవరకు అది కనిపించకపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రూ.కోట్లతో రహదారిపై తారుపొర వేసి, కుంగిన కల్వర్టును వదిలేశారని ఆ ప్రాంత ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కల్వర్టు మరమ్మతులకు ప్రతిపాదనలు పంపించామని, నిధులు వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తామని ఐటీడీఏ ఏఈ ఇబ్రహీం తెలిపారు. - న్యూస్‌టుడే, మందస

శిథిలం.. భయం భయం..

ఘాటిముకుందపురంలో రక్షిత మంచినీటి ట్యాంకు శిథిలావస్థకు చేరుకుంది. ఓవర్ హెడ్ ట్యాంకు పైకి వెళ్లే మెట్లు ఊడి పడుతుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి నూతన ట్యాంకు నిర్మించాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ మోహన్ వద్ద ప్రస్తావించగా పరిశీలించి, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, కంచిలి గ్రామీణం

పలకలు ధ్వంసం..

ఇచ్ఛాపురం పుర పరిధి [illegible] ముఖద్వారంలోని కల్వర్టు శిథిలమైంది. ఏళ్లుగా నిర్వహణ లేకపోవడంతో పలకలు ధ్వంసమయ్యాయి. వీధి నుంచి గొల్లవీధి, పటేల్‌పేటకు వెళ్లే క్రమంలో వాహనదారులు ప్రమాదానికి గురవుతున్నారు. దీన్ని పుర కమిషనర్ రమేష్ దృష్టికి తీసుకెళ్లగా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. - న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

క్రీడల్లో రాణింపు.. ఉజ్వల భవితకు సోపానం

నృత్యాలతో అలరిస్తున్న బాలికలు

షాట్‌పుట్ విసిరి.. క్రీడలు ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ అశోక్

కబడ్డీ పోటీలో క్రీడాకారుల పట్టు

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: క్రీడారంగానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. ఇచ్ఛాపురం రాజావారి మైదానంలో సోమవారం [illegible] 76వ నియోజకవర్గ స్థాయి క్రీడాపోటీలను (గ్రిగ్స్) జ్యోతి వెలిగించి, షాట్‌పుట్ విసిరి ప్రారంభించారు. జోన్ 1 వ్యాయామోపాధ్యాయ సంఘం అధ్యక్షుడు కె.పద్మనాభరెడ్డి పర్యవేక్షణలో బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, టెన్నికాయిట్ పోటీలు జరిగాయి. బాలురకు 100, 200, 400, 800, 1500 మీటర్ల పరుగు పందెం, లాంగ్ జంప్, హైజంప్, షాట్‌పుట్, జావెలిన్‌త్రో పోటీలు నిర్వహించారు. నియోజకవర్గం నుంచి 750 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ప్రభుత్వ విప్ మాట్లాడుతూ [illegible] ఏదో ఒక క్రీడలో ప్రావీణ్యం సాధించాలన్నారు. శాప్ అధికారులతో చర్చించి త్వరలోనే నిధులు తెప్పించి దీన్ని క్రీడా మైదానంగా తీర్చిదిద్దుతామన్నారు. పలాస డిప్యూటీ డీఈవో పి.విలియమ్స్, ఎంఈవోలు కె.అప్పారావు, ఎస్.విశ్వనాథం, రెడ్డిక కార్పొరేషన్ అధ్యక్షుడు కొండ శంకర్‌రెడ్డి, జనసేన నియోజకవర్గ బాధ్యుడు దాసరి రాజు, ఆశి లీలారాణి, దక్కత ఢిల్లీరావు, మణిచంద్రప్రకాష్, బాల్జీ, పి.తవిటయ్య, ఎస్.కోట [illegible], లొద్దపుట్టి ప్రధానోపాధ్యాయుడు ఎస్.ప్రకాష్ అధ్యక్షత వహించారు.

వైభవంగా సంతోషిమాత ఆలయ వార్షికోత్సవం

పూజలందుకుంటున్న అమ్మవారు

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: ఇచ్ఛాపురం పట్టణ పొలిమేరలో కొలువుదీరిన సంతోషి రూపాదేవి ఆలయ వార్షికోత్సవం వైభవంగా నిర్వహించారు. సోమవారం భక్తులు మాటూరి చినసూర్యారావు, లక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో వేడుకలు ప్రారంభమయ్యాయి. పాలు, కొబ్బరినీటితో అమ్మవారికి భక్తులే స్వయంగా అభిషేకించి, పూజలు చేశారు. చినసూర్యారావు దంపతులు అమ్మవారికి పట్టు వస్త్రాలు అందించారు. విశేష అలంకరణ అనంతరం కుంకుమ పూజలు నిర్వహించారు.

అయ్యప్పస్వామి ఆలయంలో హోమాలు

పూండి అయ్యప్పస్వామి ఆలయంలో సోమవారం స్వామికి ప్రత్యేక హోమాలు నిర్వహించారు. అనంతరం పూజలు, అభిషేకాలు చేశారు. అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు గ్రామీణం

ప్లాస్టిక్ గోదాముల్లో తనిఖీలు

పలాస, న్యూస్‌టుడే: నిషేధిత ప్లాస్టిక్ వినియోగంపై పురపాలక అధికారులు కొరడా ఝుళిపించారు. పలాస-కాశీబుగ్గ పుర కమిషనర్ ఇ.శ్రీనివాసులు ఆధ్వర్యంలో సోమవారం కాశీబుగ్గ భగవతి థియేటర్ రోడ్డులో నిషేధిత ప్లాస్టిక్ నిల్వ ఉన్న ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. గోదాములకు చెందిన వ్యక్తులకు సమాచారమిచ్చి తాళాలు తెరవాలని కోరినా వ్యాపారులు స్పందించకపోవడంతో ఆయా భవనాలను సీజ్ చేసి, లభ్యమైన ప్లాస్టిక్‌ను వాహనంలో పురపాలక సంఘం కార్యాలయానికి తరలించారు. హెల్త్ ఇన్‌స్పెక్టర్ శేఖర్, ఆర్ఐ అమర్‌నాథ్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ నిబంధనలు పాటించాలి

బస్తా బరువు చూస్తున్న ఏడీఏ రామారావు

సోంపేట, న్యూస్‌టుడే: ఎరువుల డీలర్లు కొనుగోలు, అమ్మకాలు, నిల్వల రికార్డుల విషయంలో ప్రభుత్వ నిబంధనలు తప్పక పాటించాలని పలాస ఏడీఏ ఎం.రామారావు అన్నారు. సోమవారం సోంపేట మండలంలోని పలు ఎరువుల దుకాణాల్లో తనిఖీ చేశారు. లైసెన్సులు, బస్తాల బరువు ఇతర అంశాలు పరిశీలించారు. నాణ్యమైన ఎరువులు మాత్రమే విక్రయించాలని సూచించారు. వ్యవసాయాధికారి నరసింహమూర్తి పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మిక సంఘానికి స్థలం

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: ఇచ్ఛాపురంలోని చంద్రశేఖర భవన నిర్మాణ కార్మిక సంఘానికి రత్తకన్న సమీపంలోని 197వ సర్వే నంబరులో సుమారు 3 సెంట్ల స్థలాన్ని నిర్ధారిస్తూ పట్టా జారీ చేశారు. ఈ మేరకు తహసీల్దారు ఎన్.వెంకటరావు ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్ అశోక్ కార్యాలయం వద్ద సోమవారం రాత్రి ఈ పట్టాను కార్మికసంఘ ప్రతినిధులకు అందించారు.

సీఎం సహాయనిధి నిరుపేదలకు ఆసరా

కవిటి గ్రామీణం: ముఖ్యమంత్రి సహాయనిధితో నిరుపేదలకు ఆసరా కలుగుతుందని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. సోమవారం రామయ్యపుట్టుగలోని క్యాంపు కార్యాలయంలో మాగుపల్లి వినాయక్, ఎన్.బాలరాజు, సంగారు త్రినాథ్, శంకరరావు పాణిగ్రహి, పురియా పరిక్షోత్‌లకు సహాయనిధి చెక్కులు అందజేశారు.

సమయపాలన పాటించాలి

కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించే బాధ్యత కార్యదర్శులదేనని సచివాలయాధికారి బీవీఎస్ రెడ్డి అన్నారు. సోమవారం కవిటి మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపీడీవో ఎల్.త్రినాథ్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు.

ప్రతిభా పరీక్షలతో విద్యార్థులకు మేలు

కంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రతిభా పరీక్షలతో విద్యార్థుల్లో ఆరోగ్యకరమైన పోటీ ఏర్పడి చదువుపై ఆసక్తి పెరుగుతుందని ఎంఈవోలు శివరాంప్రసాద్, చిట్టిబాబు అన్నారు. ఏపీటీఎస్ ఆధ్వర్యంలో సిర్తలి ప్రాథమిక పాఠశాల ఆవరణలో సోమవారం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రతిభ పరీక్షలు నిర్వహించారు. ఈ పోటీల్లో మొత్తం 75 జట్లు పాల్గొనగా.. ఎంఎస్‌పల్లి, అంపురం ప్రాథమిక పాఠశాలల విద్యార్థులు విజేతలుగా నిలిచారు. ఎంపీపీ దేవదాస్‌రెడ్డి, కామేశ్ రెడ్డి, ఉపాధ్యాయ సంఘం నేతలు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో పాల్గొనండి

విద్యాలయ సిబ్బందితో టీపీసీ ఛైర్మన్ వజ్జ బాబూరావు

పలాస, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాల్లో స్వచ్ఛందంగా పాల్గొనాలని టీపీసీ ఛైర్మన్ వజ్జ బాబూరావు అన్నారు. బాబూరావు తండ్రి వజ్జ సూర్యనారాయణ వర్ధంతి సందర్భంగా మదర్ థెరిసా విద్యాలయం సిబ్బందికి వస్త్రాలు అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గంగాభవానీ, ఇన్‌ఛార్జి ఆర్.ప్రసాదరావు, జోగారావు, కూర్మారావు, పి.లక్ష్మణరావు, ఎస్.చిరంజీవి పాల్గొన్నారు.

నేత్ర వైద్య శిబిరం ఏర్పాటు

పలాస, వజ్రపుకొత్తూరు గ్రామీణం: గరుడఖండిలో శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేత్ర వైద్యశిబిరం సోమవారం నిర్వహించారు. రోగులకు పరీక్షలు చేసి శస్త్రచికిత్సలకు సిఫార్సు చేశారు. వైద్యురాలు అరుణకుమారి, టీపీసీ ఛైర్మన్ వజ్జ బాబూరావు, విఠల్, శంకరరావు పాల్గొన్నారు. దేవునల్తాడలో ఉద్దానం అభ్యుదయ సేవాసమితి ఆధ్వర్యంలో ఈనెల 10న వైద్య శిబిరం నిర్వహించనున్నారు.

దుప్పట్ల పంపిణీ

కాశీబుగ్గ, వజ్రపుకొత్తూరు, న్యూస్‌టుడే: కాశీబుగ్గలోని బీసీ బాలుర వసతి గృహంలో సోమవారం విద్యార్థులకు జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వి.దుర్గారావు దుప్పట్లు పంపిణీ చేశారు. వంశీకృష్ణ చౌదరి, దేవరాజు, కేదారీనాథ్, రామ్ పాల్గొన్నారు.

● బైపల్లిలో అమ్మనాన్న మెమోరియల్ ట్రస్టు ఛైర్మన్ గృహలక్ష్మి వృద్ధులకు దుప్పట్లు వితరణగా అందించారు.

నాడు వసతి గృహం.. నేడు అసాంఘిక నిలయం

- న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

నిరుపేద ఎస్సీ, ఎస్టీ, బీసీ తరగతుల బాలికలు ఇచ్ఛాపురం పట్టణ కేంద్రంలో చదువుకునేందుకు చక్కటి వేదిక బాలికల వసతి గృహం. దీన్ని సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించేవారు. వందల సంఖ్యలో బాలికలు ఇక్కడ ఉంటూ, చక్కగా చదువుకునేవారు. మహిళా ఉద్యోగులే సేవలందించేవారు. పురుషులు లోపలకు రాకుండా కట్టుదిట్టమైన నియంత్రణలు ఉండేవి.

చెత్తమూటలతో నిండిన హాస్టల్ గదులు

★ వివిధ సంస్థలతోపాటు దాతలూ స్పందించి, సహకరించేవారు. అలా బోరు, మరుగుదొడ్లు, పంకాలు సమకూరాయి. కొన్నేళ్ల కిందట రాష్ట్ర వ్యాప్తంగా వసతిగృహాల కుదింపులో ఇది రద్దయ్యింది. నాటి నుంచి ఈ నిలయం వృథాగా పడి ఉంది. రెండేళ్ల కిందట పౌరసరఫరాల గోదాంగా వినియోగించారు. కొత్త గోదాం అందుబాటులోకి రావడంతో ప్రస్తుతం అసాంఘిక కార్యకలాపాల వేదికగా, మందుబాబుల అడ్డాగా మారింది. ఎక్కడెక్కడి వారు చెత్త సామగ్రిని ఇక్కడే భద్రపరుచుకుంటూ దీన్ని భ్రష్టు పట్టించారు.

అవసరం ఉంది..

ఇచ్ఛాపురం ప్రాంతానికి సేవలందించే వివిధ ప్రజాసంస్థలకు ఈ భవనం ఎంతో అవసరం ఉంది. పుర పరిధిలో రెండు రైతు సేవా కేంద్రాలకు భవనాలు లేవు. బడి, గుడి, సచివాలయ అరుగులే వాటి చిరునామా. పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ (మెప్మా)కు సరైన భవనం లేదు. పుర పరిధిలో అతిథి గృహం లేదు. సమీపంలోనే రైతు బజారు ఏర్పాటుకు ప్రతిపాదనలున్నాయి. దానికి సంబంధించి కోల్డ్ స్టోరేజీని ఇక్కడ పెట్టొచ్చు. వీటిలో దేన్నికైనా ఈ భవనాన్ని వినియోగిస్తే ప్రయోజనం ఉంటుంది.

పరిశీలన చేయించి..

భవన వినియోగం విషయమై ఉన్నతాధికారులతో మాట్లాడి, పరిశీలన చేయిస్తాం. భవన పటిష్ఠతను గుర్తించి, అందుకు అనుగుణంగా ప్రతిపాదనలు చేస్తాం.

- డా.బెందాళం అశోక్, ప్రభుత్వ విప్

విత్తనాల చట్టం విరమించుకోవాలి

వజ్రపుకొత్తూరు, పలాస, న్యూస్‌టుడే: విత్తన బిల్లుతోపాటు స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి టి.అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. పలాస మండలం మాకన్నపల్లి, వజ్రపుకొత్తూరు మండలం కొండపల్లి రైతులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. సర్పంచి దేశయ్య, చిన్నారావు, ప్రసాద్, దుర్యోధన, రైతులు కామేశ్వరరావు, తేజ, మోహనరావు పాల్గొన్నారు.

12న మండల స్థాయి గణిత క్విజ్ పోటీలు

ఇచ్ఛాపురం గ్రామీణం: కొళిగాం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఈనెల 12న మండల స్థాయి గణిత క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు నరేంద్రనాథ్ పట్నాయిక్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. శ్రీనివాస రామానుజన్ 138వ జయంతి సందర్భంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సర్వే నంబర్లు సరిచేయాలని వినతి

తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీసీ సంక్షేమ ప్రతినిధులు

సోంపేట, న్యూస్‌టుడే: పొంత్తంగి గ్రామానికి చెందిన 443 సర్వే నంబరును మందస మండలం 442 సర్వే నంబరుగా చూపిస్తుండటంతో ధ్రువపత్రాలు జారీలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని జాతీయ బీసీ సంక్షేమ సంఘ ప్రతినిధులు ఎస్.గుణ ప్రసాద్, నరసింహులు పేర్కొన్నారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో తహసీల్దార్ అప్పలరాజుకు వినతిపత్రం అందజేశారు. వెంటనే రికార్డులు సరిచేయాలని కోరారు.

రూ.3 లక్షలతో అభివృద్ధి పనులు

వజ్రపుకొత్తూరులోని మండల పరిషత్తు, తహసీల్దార్, పోలీసు స్టేషన్, వెలుగు, విద్యుత్తు, ఉపాధిహామీ, పీహెచ్‌సీ, ఎంఈవో తదితర అధికార కార్యాలయాలకు వెళ్లే ప్రధాన రహదారి అభివృద్ధికి చర్యలు మొదలయ్యాయి. ఎంపీడీవో రమేష్ నాయుడు పర్యవేక్షణలో రూ.3 లక్షల అంచనా వ్యయంతో సీసీ రోడ్డు, రక్షణ గోడ పనులు చేపడుతున్నారు. గతంలో అసంపూర్తిగా వదిలేసిన రోడ్డు పనులు సైతం పూర్తి చేయనున్నట్లు ఆయన తెలిపారు. - న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు

డిమాండ్లు అంగీకరించండి

పలాస, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కార్యకర్తల డిమాండ్లు అంగీకరించేలా ప్రభుత్వం చొరవ చూపించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి అన్నారు. కాశీబుగ్గ ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి పార్వతికి సోమవారం ధర్నా నోటీసుల ప్రతులు అందజేశారు. సమస్యలు పరిష్కరించకపోవడంతో ఈనెల 12న జిల్లా కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాకు అనుమతి ఇవ్వాలని కోరారు. అంగన్‌వాడీ యూనియన్ నాయకులు బి.సునీత, ఆర్.అప్పలనరసమ్మ, డి.సునీత పాల్గొన్నారు.

క్యాన్సర్ వ్యాధి నివారణే లక్ష్యం.. వజ్రపుకొత్తూరు, న్యూస్‌టుడే: క్యాన్సర్ వ్యాధి శాశ్వత నివారణే లక్ష్యంగా అందరూ పని చేయాలని వైద్యాధికారి రిచర్డ్‌బూన్ సూచించారు. వజ్రపుకొత్తూరు ఆరోగ్య ఉప కేంద్రంలో సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎక్కువగా సంభవించే వివిధ రకాల క్యాన్సర్లపై అవగాహన కల్పించారు. ఇంటింటా సర్వే చేసి పరీక్షలు నిర్వహించాలన్నారు. నమూనా పరీక్షలకు ప్రజలు సహకరించాలని కోరారు.

సంఘటితంగా పోరాటం చేద్దాం

పలాస, న్యూస్‌టుడే: పలాస జిల్లా కేంద్రంగా మంజూరయ్యేంత వరకు సంఘటితంగా పోరాటం చేద్దామని జిల్లా సాధన సమితి ప్రతినిధులు కోరారు. కాశీబుగ్గ గాలిమేడ ఎదురుగా సోమవారం సమావేశం నిర్వహించారు. జిల్లా సాధన సమితి కన్వీనర్‌గా దువ్వాడ శ్రీధర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి, పాతపట్నం నియోజకవర్గాల్లో సాధన సమితులు ఏర్పాటు చేసి ఉద్యమిద్దామన్నారు. డి.జీవితేశ్వరరావు, టి.వీర్రాజు, రవికుమార్, సీహెచ్.సుందరలాల్, కుమార్‌నాయక్, పి.వైకుంఠరావు పాల్గొన్నారు.

జిల్లాసాధన సమితి కన్వీనర్‌గా ఎన్నికైన శ్రీధర్‌తో ప్రతినిధులు

లోక కల్యాణం కోరుతూ సైకిల్ యాత్ర



లోక కల్యాణం కోరుతూ మధ్యప్రదేశ్ రాష్ట్రం భోపాల్‌కు చెందిన సతీష్ కుస్వాహ దేశీయ సైకిల్ యాత్ర సోమవారం కంచిలికి చేరుకుంది. కాశీవిశ్వనాథ్, దక్షిణేశ్వర్, పూరీ జగన్నాథ్ తదితర ఆలయాలను సందర్శించి ప్రజలందరికీ సుఖశాంతులు కలగాలని ప్రార్థించినట్లు వివరించారు. తిరుమల, రామేశ్వరం క్షేత్రాలను సందర్శించడంతో తన యాత్ర పూర్తవుతుందని పేర్కొన్నారు. - న్యూస్‌టుడే, కంచిలి గ్రామీణం

28 మంది మందుబాబులకు జరిమానా

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: కాశీబుగ్గ పోలీస్ ఠాణా పరిధిలో ఇటీవల నమోదైన మందుబాబులకు సంబంధించిన కేసుల్లో పలాస జూనియర్ సివిల్ జడ్జి యు.మాధురి సోమవారం తీర్పు ఇచ్చారని ఎస్సై నరసింహమూర్తి తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపిన 16 మందికి రూ.10వేలు చొప్పున, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన 12 మందికి రూ.1000లు చొప్పున జరిమానా విధించారని ఎస్సై పేర్కొన్నారు.

(c) eenadu

టెక్కలి

• టెక్కలి • నరసన్నపేట • పాతపట్నం

ఆర్డీవోకు వినతిపత్రం అందిస్తున్న భాజపా నేతలు

సమస్యలు పరిష్కరించండి

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: తొలుసూరుపల్లి పంచాయతీ సైనికనగర్ శ్మశానవాటికలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని భాజపా నేతలు కోరారు. టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ముళ్లపొదలు, చెత్త పేరుకుపోవడంతో అంత్యక్రియల సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు తెలిపారు. భాజపా మండల శాఖ అధ్యక్షుడు జర్జాన రాంజీ, శాసనపురి శ్రీను, ఆకుల ప్రకాశ్, బాబూరావు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయండి

జలుమూరు, న్యూస్‌టుడే: గత ప్రభుత్వ హయాంలో తలపెట్టిన ఇళ్ల నిర్మాణాలను ఈనెల చివరి నాటికి పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలని ఎంపీడీవో బి.చిన్నమ్మడు ఆదేశించారు. మండల పరిషత్తు కార్యాలయంలో గృహనిర్మాణ సంస్థ అధికారులతో సోమవారం ఆమె సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ ఏఈ ప్రసాదరావు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM) 9441426248 8374620852

మీ ప్రాంతంలో ఏ ప్రజాసమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలు, చిత్రాలను వాట్సప్ ద్వారా పంపొచ్చు. లేదా ఫోన్లో వివరించొచ్చు. వాటిని బాధ్యులదృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

?: అంతర్జాల సమస్యతో సర్వర్ పనిచేయక ధాన్యం షెడ్యూలింగ్, ట్రక్ షీట్ జనరేట్ కోసం రైతుసేవా కేంద్రాల వద్ద అన్నదాతలు గంటల కొద్దీ పడిగాపులు కాయాల్సి వస్తోంది. ఆఫ్‌లైన్ ద్వారా కొనుగోలు చేయడంపై అధికారులు దృష్టి సారించాలి. **- పంగ అప్పారావు, గుమ్మపాడు**

★ ఎక్కడో కొన్ని కేంద్రాల్లో తప్ప అంతర్జాల సమస్య అంత తీవ్రంగా లేదు. ఇప్పటికే 50 శాతం ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తయింది. **- వెంకటరావు, ఏవో, సారవకోట**

- న్యూస్‌టుడే, సారవకోట

?: నందిగాం మండలం పెద్దతామరాపల్లి గ్రామ సమీపంలోని జాతీయ రహదారి వంతెన కింద చేతిపంపు 6 నెలలుగా పనిచేయడం లేదు. దీంతో ప్రయాణికులు తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించాలి. **- పాపారావు, స్థానికుడు**

★ క్షేత్రస్థాయిలో పరిశీలించి, సిబ్బందికి తెలియజేస్తాం. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

- లక్ష్మణరేఖ, పంచాయతీ కార్యదర్శి, పెద్ద తామరాపల్లి **- న్యూస్‌టుడే, నందిగాం**

ప్రతిభకు పదును పెట్టాలి

టెక్కలిలోని ఎస్‌వీఆర్‌కే జూనియర్ కళాశాలలో 'ఈనాడు- ఈటీవీ' ఆధ్వర్యంలో సోమవారం ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'కృత్రిమ మేధ వల్ల భవిష్యత్తులో వచ్చే మార్పులు' అనే అంశంపై ఉపన్యాస పోటీలు జరిగాయి. విద్యార్థులు ప్రతిభకు పదును పెడితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ మెట్ట రమేష్ సూచించారు. కె.తారకేశ్వరరావు (ప్రథమ ఎంపీసీ), ఎన్.మణికంఠ (ప్రథమ బైపీసీ), పి.రాగిణి (ప్రథమ బైపీసీ) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. విజేతలకు అధ్యాపకులు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించి అభినందించారు.

- న్యూస్‌టుడే, టెక్కలి పట్టణం

గళం విప్పారు.. బహుమతులు గెలిచారు

విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ప్రోత్సాహం అవసరమని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ రత్నకుమారి అన్నారు. పాఠశాలలో 'ఈనాడు- ఈటీవీ' ఆధ్వర్యంలో సోమవారం ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై ఉపన్యాస పోటీలు నిర్వహించగా పిల్లలు ఉత్సాహంగా పాల్గొన్నారు. బి.లాస్య (10వ తరగతి), ఎం.పవన్ (7వ తరగతి), బి.శ్రుతి (10వ తరగతి) తొలి మూడు స్థానాల్లో నిలిచారు. గెలుపొందిన వారికి ఉపాధ్యాయులు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించి అభినందించారు.

- న్యూస్‌టుడే, పాతపట్నం

శ్రీకారానికే పరిమితం.. కలగా స్వచ్ఛ గ్రామాల సాకారం

- న్యూస్‌టుడే, కొత్తూరు

పారాపురంలో ఏబీ రహదారి పక్కన వేసిన చెత్త

పాతపట్నం నియోజకవర్గం వివరాలు

మండలం	పంచాయతీలు	సంపద తయారీ కేంద్రాలు
కొత్తూరు	43	33
హిరమండలం	23	21
ఎల్ఎన్‌పేట	22	16
పాతపట్నం	34	28
మెళియాపుట్టి	37	25

నిరుపయోగంగా సంపద తయారీ కేంద్రాలు

స్వచ్ఛ గ్రామాల సాకారమే లక్ష్యంగా ప్రభుత్వం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇంటింటా వ్యర్థాలు సేకరించి, వాటి నుంచి సంపద సృష్టించాలనే ఆశయం అటు పాలకుల అలసత్వం, ఇటు అధికారుల నిర్లక్ష్యంతో నీరు గారిపోయింది. పలుచోట్ల కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. వ్యర్థాలను గ్రామ శివారులో వేయడం లేదా గుట్టలుగా వేసి నిప్పు పెడుతుండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వైకాపా అయిదేళ్ల కాలంలో వీటి గురించి అసలు పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వమైనా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఇదీ పరిస్థితి..

★ పాతపట్నం నియోజకవర్గంలోని 80 శాతం పంచాయతీల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు అందుబాటులో ఉన్నా.. ఎక్కడ వీటిని ఉపయోగిస్తున్న దాఖలాలు లేవు. వ్యర్థాలతో సేంద్రియ ఎరువును తయారుచేసి రైతులకు తక్కువ ధరకే అమ్మేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇవన్నీ కాగితాలకే పరిమితమయ్యాయి.

★ కొత్తూరు మండలంలోని కల్లెమ్మ, పారాపురం, మహర్తాపురం, మదనాపురం, సోమరాజపురం, మెట్టూరు, నివగాం, బలద, కురిగాం పంచాయతీల్లో రహదారుల పక్కనే చెత్త వేస్తున్నారు. సోమరాజపురం పంచాయతీ కేంద్రంలో సచివాలయానికి సమీపంలో పశువుల వ్యర్థాలు వేయడంతో స్థానికులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు.

★ హిరమండలం మేజర్ పంచాయతీతో పాటు సుభలయ, చొర్లంగి, ధనుపురం, కొండరాగోలు, గులుమూరు, పిండ్రువాడ వంటి పెద్ద పంచాయతీల్లోనూ చెత్త పేరుకుపోయి, అపరిశుభ్ర వాతావరణంతో ప్రజలు అగచాట్లు పడుతున్నారు.

★ ఎల్ఎన్‌పేట మండలంలోని ఎన్ఎన్‌పేట, తురకపేట, మిరియాపల్లి, శ్యామలాపురం, పాతపట్నం మేజర్ పంచాయతీ, కొరసవాడ, కాగువాడ, రొంపివలస, షరాళి, తిడ్డిమి, పెద్దలోగిడి, మెళియాపుట్టి మండలంలోని మెళియాపుట్టి, చాపర, పట్టుపురం, వసుంధర, గొప్పిలి, పెద్దపద్మాపురం పంచాయతీల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

వినియోగంలోకి తీసుకొస్తాం

గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ మరింత మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటాం. పనిచేయని కేంద్రాలు వినియోగంలోకి తెచ్చేందుకు కృషి చేస్తాం. సేంద్రియ ఎరువు తయారీపై పంచాయతీలకు ఆదేశాలు జారీ చేస్తాం. **- ఐవీ రమణ, డివిజనల్ పంచాయతీ అధికారి, టెక్కలి**

రూ.10 వేలు వితరణ

కొత్తూరు, న్యూస్‌టుడే: మండలంలోని అడవి కొత్తూరు పాఠశాల అభివృద్ధికి మెట్టూరు బిట్-1 పంచాయతీకి చెందిన బూర్లె శ్రీనివాసరావు రూ.10 వేలు సాయమందించారు. ప్రధానోపాధ్యాయుడు గేదెల వెంకటరమణకు సోమవారం ఈ నగదు అందించారు. గ్రామస్థులు పాల్గొన్నారు.

కళాశాలకు అభివృద్ధికి విరాళం

నరసన్నపేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థి ప్రముఖ వైద్యుడు బలగ మురళి విరాళం అందించారు. మౌలిక వసతుల కల్పనకు సోమవారం ఆయన రూ.50 వేల నగదును ప్రధానాచార్యులు పవన్‌కు అందజేశారు. కార్యక్రమంలో కళింగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పూర్ణారావు, మురళీధర్‌రావు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తీశ్వరుని సేవలో ఎమ్మెల్యే

నరసన్నపేట, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తిలోని కాళహస్తీశ్వరుడిని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సోమవారం దర్శించుకున్నారు. కుటుంబసమేతంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నిరంతర కృషితోనే ఫలితాలు

టెక్కలిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 'ఈనాడు- ఈటీవీ' ఆధ్వర్యంలో సోమవారం ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'కృత్రిమ మేధ వల్ల భవిష్యత్తులో వచ్చే మార్పులు' అనే అంశంపై ఉపన్యాస పోటీలు జరిగాయి. నిరంతర కృషితోనే విద్యార్థులు ఉన్నత ఫలితాలు సాధించగలరని ప్రిన్సిపల్ జి.తిరుపతిరావు సూచించారు. జె.నవ్య (ద్వితీయ ఎంపీసీ), జి.హేమ (ద్వితీయ సీఈసీ), పి.హేమకుమార్ (ద్వితీయ ఎంఎల్‌టీ) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు దక్కించుకున్నారు. విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించారు.

- న్యూస్‌టుడే, టెక్కలి పట్టణం

ధాన్యం కొనుగోలు చేయాలి

హిరమండలం, న్యూస్‌టుడే: కొండరాగోలు రెవెన్యూ గ్రామ పరిధిలోని రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయాలని జడ్పీటీసీ సభ్యుడు పి.బుచ్చిబాబు అధికారులను కోరారు. సోమవారం పలువురు అన్నదాతలు హిరమండలంలో ఆయన్ను కలిసి సమస్యలు వివరించారు.

ఏపీటీఎఫ్ కార్యవర్గ ఎన్నిక

ఏపీటీఎఫ్ హిరమండలం శాఖ కార్యవర్గ ఎన్నిక సోమవారం సుభలయ పాఠశాల ఆవరణలో జరిగింది. అధ్యక్షుడిగా ఎ.సింహాచలం, ప్రధాన కార్యదర్శిగా ఎన్.మురళీధరరావు, ఉపాధ్యక్షులుగా బి.రమేష్, గంగేశ్వరి, కె.ఆర్.ఎస్.శాస్త్రి, గౌరవ అధ్యక్షుడిగా కె.సింహాచలం ఎన్నికయ్యారు. రాష్ట్ర నాయకుడు శాంతారామ్ పాల్గొన్నారు. **- న్యూస్‌టుడే, హిరమండలం**

భగవాన్‌పురంలో వైద్య శిబిరం

టెక్కలి పట్టణం: భగవాన్‌పురంలో జ్వరాలు విజృంభించాయన్న సమాచారంతో కె.కొత్తూరు పీహెచ్‌సీ వైద్యాధికారిణి గాయత్రి ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 10 బృందాలతో ఇంటింటా సర్వే నిర్వహించారు. పలువురికి జ్వరాలు ఉన్నట్లు గుర్తించి మందులు సరఫరా చేశారు.

పోలీసులు అదుపులో గాయపరిచిన వ్యక్తి

పాతపట్నం, న్యూస్‌టుడే: మామిడిపల్లి గ్రామంలో కత్తితో గాయపరిచిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ కె.మధుసూదనరావు పేర్కొన్నారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈ ఏడాది అక్టోబరు 26న శోభ పంచాయతీ కొమ్మలగూడ గ్రామానికి చెందిన పడాల రాజు అనే వ్యక్తి మామిడిపల్లి గ్రామంలో జరిగిన కార్యక్రమానికి హాజరయ్యారు. అదే గ్రామానికి చెందిన జెన్ని రామారావుతో గొడవ జరిగింది. దీంతో రామారావు కత్తితో రాజుని గాయపరిచాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు రామారావును సోమవారం అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు చెప్పారు.

మూడు చక్రాల బళ్లు వితరణ

కొత్తూరు, న్యూస్‌టుడే: స్థానిక సామాజిక ఆసుపత్రికి రోగుల సౌకర్యార్థం సత్యసాయి భజన మండలి సభ్యులు మూడు చక్రాల బళ్లు రెండింటిని వితరణగా అందించారు. ఆసుపత్రి వైద్యులు, సిబ్బందికి సోమవారం వాటిని అందించారు.

తల్లికి తలకొరివి పెట్టిన కుమార్తె

నరసన్నపేట, న్యూస్‌టుడే: తల్లికి ఓ కుమార్తె దహన సంస్కారాలు చేశారు. నరసన్నపేట పట్టణంలోని పురుషోత్తమనగర్ కాలనీకి చెందిన బొమ్మాళి రాములమ్మ (65) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ఆమెకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు ఏడాది కాలంగా ఇల్లు విడిచి వెళ్లిపోయారు. భర్త మృతితో కుమార్తె రమణమ్మ తల్లి వద్దనే ఉంటున్నారు. తల్లి చితికి నిప్పంటించి అంతిమ కార్యక్రమం నిర్వహించారు.

బడి.. నిర్వహణ కొరవడి

సారవకోట మండలం సవరబొంతు ప్రాథమిక పాఠశాలలో 13 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ బడిలో తరగతి గదిలోకి వెళ్లే మార్గం అధ్వానంగా మారింది. కాంక్రీటు ఊడి రాళ్లు తేలాయి. కొంతకాలంగా ఇదే దుస్థితి కొనసాగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. నిధులు లేక పనులు చేయించడం లేదని హెచ్ఎం అప్పలమ్మ తెలిపారు. పరిశీలించి సూచనలు చేస్తామని ఎంఈవో వెంకటరమణ చెప్పారు.

- న్యూస్‌టుడే, సారవకోట

పక్కనే ప్రమాదం.. పట్టని వైనం

ఎల్ఎన్‌పేట మండలంలోని ఏబీ రహదారిలో స్కాట్‌పేట కూడలి వద్ద ఓ వృక్షం ఎండిపోయి ప్రమాదకరంగా ఉంది. దీంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి చెట్టును తొలగించాలని కోరుతున్నారు. ఇటీవల ఓ కొమ్మ రోడ్డుపై పడిందని ఆ సమయంలో వాహన రాకపోకలు లేకపోవడంతో ముప్పు తప్పిందని స్థానికులు తెలిపారు. చర్యలు తీసుకుంటామని ర.భ.శాఖ జేఈ గోపాలరావు పేర్కొన్నారు. **- న్యూస్‌టుడే, ఎల్ఎన్‌పేట**

నిర్మించారు.. వదిలేశారు..!

పోలాకి మండలంలోని రహమాన్‌పురం గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం అలంకారప్రాయంగా మారింది. పనులు పూర్తయి ఏడాది దాటినా పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడని స్థానికులు చెబుతున్నారు. ప్రస్తుతం సచివాలయ సిబ్బంది పాత పంచాయతీ భవనంలో ఇబ్బందులు పడుతూ విధులు నిర్వహిస్తున్నారు. ఈ విషయాన్ని ఎంపీడీవో జి.వి.రవికుమార్ వద్ద ప్రస్తావించగా.. తక్షణమే వినియోగంలోకి తీసుకొస్తామని తెలిపారు.

- న్యూస్‌టుడే, పోలాకి

ఒరిగింది.. కూలేలా ఉంది

జాతీయ రహదారిపై నరసన్నపేట- కోటబొమ్మాళి మార్గంలో జర్జంగి అండర్ పాస్ వద్ద విద్యుత్తు స్తంభం రహదారి వైపు ఒరిగిపోయి ప్రమాదకరంగా ఉంది. వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో పరిస్థితి ఇలా ఉండటంపై పలువురు పెదవి విరుస్తున్నారు. అపాయం జరగకముందే సంబంధిత సిబ్బంది స్పందించాలని కోరుతున్నారు. సమస్యను తూర్పు ప్రాంత విద్యుత్తు పంపిణీ సంస్థ ఏఈ కోటేశ్వరరావు వద్ద ప్రస్తావించగా.. పరిష్కరిస్తామన్నారు. **- న్యూస్‌టుడే, కోటబొమ్మాళి**

పాఠశాల ఆవరణ పరిశీలన

జలుమూరు, న్యూస్‌టుడే: మండలంలోని కెల్లివానిపేట పాఠశాల ఆవరణలో మంచినీటి పథకం పైప్‌లైన్ లీకేజీతో నీరు నిలిచి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. అధికారులు చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరారు. పిల్లల ఇబ్బందులపై ఈనాడులో ఈనెల 7న ప్రచురితమైన 'బడి..చిత్తడి..!' కథనానికి ఎంఈవోలు బమ్మిడి మాధవరావు, ప్రసాదరావు స్పందించారు. పాఠశాల ఆవరణను పరిశీలించారు. తక్షణమే చర్యలు తీసుకుంటామన్నారు.

స్పందనకు వందనం

ఎట్టకేలకు ప్లాట్‌ఫాం నిర్మాణం

కొత్తూరు, న్యూస్‌టుడే: మండలంలోని కొత్తపొన్నుటూరు గ్రామంలో మినీ తాగునీటి ట్యాంకు వద్ద నాచు పట్టి దుర్భరంగా ఉండేది. దీంతో నీరు పట్టేందుకు స్థానికులు అవస్థలు ఎదుర్కొనే వారు. దీనిపై ఇటీవల 'ఈనాడు'లో వచ్చిన చిత్ర వార్తకు సర్పంచి వై.చామంతి స్పందించారు. ట్యాంకు పరిసరాలను శుభ్రం చేయించి, ప్లాట్‌ఫాం నిర్మించారు. దీంతో పలువురు హర్షం వ్యక్తం చేశారు.

సీసీ కెమెరాల వితరణ

చెన్నాపురం ప్రాథమికోన్నత పాఠశాలకు అదే గ్రామానికి చెందిన టేకి శ్రీనివాసరావు సుమారు రూ.లక్ష విలువైన సీసీ కెమెరాలను వితరణగా అందించారు. విశ్రాంత ఉపాధ్యాయుడు గొనప భాస్కరరావు సోమవారం వీటిని ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచి కొంక్యాన వేణమ్మ, మండల విద్యాశాఖాధికారి ఉప్పాడ శాంతారావు, హెచ్ఎం కామేశ్వరి పాల్గొన్నారు.

- న్యూస్‌టుడే, నరసన్నపేట గ్రామీణం

క్రీడాకారులకు అభినందన

నందిగాం, న్యూస్‌టుడే: లఖిదాసుపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఇటీవల జరిగిన నియోజకవర్గ స్థాయి (గ్రిగ్స్) పోటీల్లో సత్తా చాటిన పెద్దతామరాపల్లి విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు బమ్మిడి నాగమునేష్, ఉపాధ్యాయులు సోమవారం అభినందించారు. వనమాల డిల్లేశ్వరి, మాదు కేశవరావు, జీరు జశ్వంత్, మండల అఖిల్ ప్రతిభ చూపినట్లు ఉపాధ్యాయులు చెప్పారు.

మందుబాబులకు జరిమానా

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపిన నేరానికి ఎనిమిది మందికి టెక్కలి జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ యు.మాధురి రూ.10 వేల చొప్పున జరిమానా విధించారు. ఈ విషయాన్ని సీఐ విజయ్‌కుమార్ తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన వారిని కోర్టులో హాజరుపర్చినట్లు ఆయన చెప్పారు.

కొట్లాట కేసులో నిందితుడి అరెస్టు

పాతపట్నం, న్యూస్‌టుడే: స్థానిక పెట్రోల్ బంక్ వద్ద ఈ ఏడాది సెప్టెంబరు 18న జరిగిన కొట్లాట కేసులో ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ కె.మధుసూదనరావు పేర్కొన్నారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాకుళానికి చెందిన తమ్మినేని సాయికుమార్, పొట్నూరు భవాని శంకర్ పర్లాఖెముండి వెళ్లారు. తిరిగి వస్తుండగా పాతపట్నం పెట్రోల్ బంక్ వద్ద ఇద్దరి మధ్య తగాదా జరిగింది. భవాని శంకర్ రాయి తీసుకుని సాయికుమార్ తలపై కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పాతపట్నం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేశారు. నిందితుడిని సోమవారం అదుపులోకి తీసుకుని, కోర్టులో హాజరు పరచగా 15 రోజులు జడ్జి రిమాండ్ విధించినట్లు ఎస్ఐ అన్నారు.

వసతి గృహాల్లో తనిఖీలు

పాతపట్నం, న్యూస్‌టుడే: బాలయోగి గురుకుల పాఠశాల, కొరసవాడ బీసీ వసతి గృహాన్ని జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారి కృష్ణారావు సోమవారం తనిఖీ చేశారు. మౌలిక వసతులు, భోజన నాణ్యత, తాగునీరు, మరుగుదొడ్లను పరిశీలించారు.

సాహసయాత్రకు ఎంపిక

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: హిమాచల్‌ప్రదేశ్‌లో ధర్మశాలలో పదిరోజుల పాటు నిర్వహించే సాహసయాత్రకు టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఐదుగురు ఎంపికయ్యారు. ఈ విషయాన్ని ప్రిన్సిపల్ టి.గోవిందమ్మ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వీరికి ప్రోగ్రాం అధికారిగా ఎన్ఎస్ఎస్ పీవో ల్యూక్‌పాల్ వ్యవహరిస్తారని పేర్కొన్నారు.

పల్లెల్లో రచ్చబండ

పాతపట్నం, న్యూస్‌టుడే: మండలంలోని సీది, తామర, పాసిగంగుపేట గ్రామాల్లో సోమవారం మాజీ ఎమ్మెల్యే, వైకాపా నాయకురాలు రెడ్డి శాంతి ఆధ్వర్యంలో రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్య కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ చేపడుతున్న కోటి సంతకాల సేకరణలో పలువురు పాల్గొన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించి, కరపత్రాలను ప్రదర్శించారు.

కరపత్రాలు ప్రదర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి, వైకాపా శ్రేణులు

టీవీ పాఠాలు.. భవితకు బాటలు

- న్యూస్‌టుడే, పోలాకి, సారవకోట, నరసన్నపేట, జలుమూరు

పోలాకి మండలం బెలమర అంగన్‌వాడీ కేంద్రంలో టీవీలో బొమ్మలు చూస్తున్న పిల్లలు

చిన్నారులకు ఆట పాటలతో పాఠాలు నేర్పిస్తూ, కృత్యాధార విధానంలో బోధించేందుకు అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం టీవీలను సరఫరా చేసింది. 'సక్షం' పేరుతో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు చిన్నారులను కేంద్రంలో ఉంచేలా ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు. దీని కోసం తొలి విడతగా కొన్ని కేంద్రాలను ఎంపిక చేశారు.

పెరిగిన హాజరు శాతం

దృశ్య శ్రవణ పరికరాల ద్వారా బోధన చేయడంతో పిల్లల సంఖ్య కూడా గణనీయంగా పెరిగిందని ఉద్యోగులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో పనులకు వెళ్లే తల్లిదండ్రులు చిన్నారులను కేంద్రాల్లో విడిచి పెట్టి వెళ్తున్నారు. గతంలో పిల్లలు మధ్యలోనే ఇంటికి వచ్చే పరిస్థితి ఉండేది. ప్రస్తుతం ఇది తగ్గుముఖం పట్టింది. అధికారులు భవనాలు బాగున్న వాటినే ఎంపిక చేశారు. దీంతో తల్లిదండ్రులు పిల్లలను కేంద్రాలకు పంపడానికి ఆసక్తి చూపుతున్నారు.

వివరాలు ఇలా..

మండలం	టీవీలు అందించిన కేంద్రాలు
నరసన్నపేట	05
పోలాకి	07
జలుమూరు	12
సారవకోట	16

ఆహ్లాదకరమైన వాతావరణం

కేంద్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రత్యేక సౌకర్యాలు కల్పించింది. అక్షరమాలలు, చిత్రాలతో పదాలు పరిచయం చేస్తున్నారు. టీవీల్లో కథలు, పాటలు, నృత్యాలు చూపుతూ చిన్నారులకు ఆసక్తి కలిగేలా బోధన చేస్తున్నారు. మిగిలిన కేంద్రాల్లోనూ ఇదే విధంగా సౌకర్యాలు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు. అధికారుల సమావేశంలో ఇదే అంశాన్ని చిన్నారుల తల్లిదండ్రులు ప్రస్తావిస్తున్నారు.

ప్రతిపాదనలు చేశాం

ప్రభుత్వ సూచనల మేరకు తొలి విడతలో కొన్ని అంగన్‌వాడీ కేంద్రాలను ఎంపిక చేశాం. దృశ్య, శ్రవణ పరికరాలను జిల్లాలో 153 కేంద్రాలకు అందజేశాం. ఈ పరికరాల వల్ల చిన్నారుల హాజరు శాతం పెరిగిందని సిబ్బంది నివేదికలు ఇస్తున్నారు. రెండో విడత కోసం ప్రతిపాదనలు చేశాం.

- ఐ.విమల, పీడీ, ఐసీడీఎస్

పనులు గుర్తించాలి

పాతపట్నం: వేసవిలో ఉపాధిహామీ పథకంలో భాగంగా చేపట్టనున్న పనులు గుర్తించి, వేతనదారులు సరిగా విధులు నిర్వర్తించేలా చర్యలు చేపట్టాలని డ్వామా పీడీ బి.లవరాజు సిబ్బందికి ఆదేశించారు. సోమవారం స్థానిక ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయంలో పాతపట్నం, మెళియాపుట్టి మండలాలకు చెందిన ఏపీవోలు, కంప్యూటర్ ఆపరేటర్లు, సాంకేతిక సహాయకులతో సమావేశం నిర్వహించి, పలు సూచనలు చేశారు.

ప్రణాళికలు తయారు చేయండి

నందిగాం, న్యూస్‌టుడే: వచ్చే ఆర్థిక సంవత్సరం చేపట్టే కార్యక్రమాలపై ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఏపీఎం మనోరత్నం ఆదేశించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో గ్రామ మహిళా సంఘాల సభ్యులకు సోమవారం శిక్షణ నిర్వహించారు. సభ్యులు చేపట్టాల్సిన పనుల గురించి వివరించారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

చల్లవానిపేట ఎరువుల దుకాణంలో తనిఖీలు చేస్తున్న వ్యవసాయశాఖ ఏడీ బగ్గు రజిని

జలుమూరు, పాతపట్నం, హిరమండలం, న్యూస్‌టుడే: ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని వ్యవసాయ శాఖ ఏడీ బగ్గు రజిని హెచ్చరించారు. జలుమూరు మండలంలోని చల్లవానిపేట ఎరువుల దుకాణంలో సోమవారం ఆమె తనిఖీలు నిర్వహించారు. వ్యవసాయాధికారి కె.రవికుమార్ పాల్గొన్నారు. ★ ఎరువులు విక్రయాల్లో నిబంధనలు పాటించాలని నరసన్నపేట ఏడీ ఎల్.వి.మధు సూచించారు. పాతపట్నం మండలంలోని దుకాణాలను ఆయన పరిశీలించారు. వ్యవసాయాధికారి కె.సింహాచలం ఉన్నారు. హిరమండలంలోని దుకాణాల్లో ఏడీ శ్రీనివాసరావు, మండల వ్యవసాయాధికారిణి బి.సంధ్య తనిఖీలు చేపట్టారు.

(c) eenadu

శ్రీకాకుళం

•శ్రీకాకుళం •ఆమదాలవలస •ఎచ్చెర్ల

నీరు పట్టుకునేదెలా..?

ఆమదాలవలస మండలం ఆర్ఆర్ కాలనీ పంచాయతీలో తాగునీటి బోరు చుట్టూ పనికిరాని మొక్కలు పెరిగి నివాసితులు ఇబ్బందులు పడుతున్నారు. బోరుకు ఆనుకుని ఉండడంతో విష సర్పాలు, కీటకాలు సంచరిస్తున్నాయని ఆవేదన చెందుతున్నారు. శుభ్రం చేయించాలని కోరుతున్నారు. తక్షణ చర్యలు తీసుకుంటామని ఈవోపీఆర్డీ గోపాలరావు తెలిపారు.
–న్యూస్‌టుడే, ఆమదాలవలస గ్రామీణం

తెరపై ఈనాడు

◆ మారుతి: మరువ తరమా ◆ సరస్వతి : ఆంధ్ర కింగ్ తాలూకా ◆ కిన్నెర : అమర కావ్యం ◆ కీర్తన: జనతా బార్ ◆ కీర్తిక: ధురంధర్ ◆ సన్‌మ్యాక్స్ : మమ్మీ ఈజ్ బ్యాక్ ◆ ఎస్‌వీసీ(రామలక్ష్మణ): ది గర్ల్ ఫ్రెండ్ ◆ సూర్యమహల్: రాజు వెడ్స్ రాంబాయి
– న్యూస్‌టుడే, పాతబస్టాండ్

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM) 9502198883 8008552704

?: శ్రీకాకుళం నగరం కొన్నా వీధిలోని ఓ కాలువలో మురుగు నీరు పారక దోమలు, దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నాం. - కె.రామారావు, కొన్నా వీధి, శ్రీకాకుళం ● పూడిక తొలగించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. - బి.శ్రీనివాసులు, ఇన్‌ఛార్జి కమిషనర్, శ్రీకాకుళం నగరపాలక సంస్థ
– న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం

ఆమదాలవలస పట్టణం, న్యూస్‌టుడే:
?: శ్రీకాకుళం రోడ్డు రైల్వేస్టేషన్ జంక్షన్ వద్ద ఇష్టానుసారంగా ఆటోలు నిలపడంతో రాకపోకలు ఇబ్బందిగా ఉంది. శ్రీను, ఆమదాలవలస ● పరిశీలించి చర్యలు తీసుకుంటాం.
బాలరాజు, ఎస్సై, ఆమదాలవలస
?: పార్వతీశంపేటలో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా జరగడం లేదు. వైకుంఠరావు, స్థానికుడు ● పనులు జరిగేలా చూస్తాం.
జాన్సన్, మున్సిపల్ ఏఈ, ఆమదాలవలస

ప్రసంగించి.. బహుమతులు పొంది

శ్రీకాకుళం గుజరాతీపేట ఎ.వి.ఎన్.ఎం. హెచ్. పాఠశాలలో సోమవారం ‘ఈనాడు’ ఆధ్వర్యంలో ‘విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం’ అనే అంశంలో ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో తొమ్మిదో తరగతి విద్యార్థులు ఐ.హర్షవర్ధన్, ఎన్.లోహిత్, సిహెచ్.జ్యోత్స్న వరుసగా మూడు స్థానాల్లో విజేతలయ్యారు. వీరిని ప్రధానోపాధ్యాయులు(ఇన్‌ఛార్జి)పి.నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు తాతారావులు అభినందించి బహుమతులు అందించారు. – న్యూస్‌టుడే, పాతబస్టాండ్

ఉత్సాహంగా.. ఉపన్యాసం

శ్రీకాకుళం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం ‘ఈనాడు’ ఆధ్వర్యంలో ‘విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం’ అనే అంశంలో ఉపన్యాస పోటీలు నిర్వహించారు. మొత్తంగా 19 విద్యార్థులు హాజరై ఉత్సాహంగా తమ ఆలోచనలను పంచుకున్నారు. ఇందులో ఎ.తనుశ్రీ(9వ తరగతి), ఎన్.మీనాక్షి(9వ తరగతి), పి.వనజ(7వ తరగతి)లు వరుసగా మూడు స్థానాల్లో విజేతలుగా నిలిచారు. వీరికి ప్రధానోపాధ్యాయులు ఎం.సుజాత, ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు. – న్యూస్‌టుడే, పాతబస్టాండ్

ఎప్పుడు మోక్షం.. చదివేందుకు కష్టం

–న్యూస్‌టుడే, సరుబుజ్జిలి, పొందూరు, ఆమదాలవలస గ్రామీణం, బూర్జ

వైకాపా హయాంలో నాడు-నేడు కార్యక్రమాన్ని ప్రారంభించి, పాఠశాలను ఆధునికీకరించారు. మొదటి విడత బాగానే జరిగినా... రెండో విడతలో నిధులు విడుదల జరగక పనులు నిలిచిపోయాయి. ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

❖ ఆమదాలవలస నియోజకవర్గంలోని నాడు-నేడు పాఠశాల భవనాల పనులు చేస్తున్న గుత్తేదారులకు సకాలంలో వైకాపా ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో గుత్తేదారులు అప్పట్లో పనులు నిలుపుదల చేశారు. దీంతో పాఠాలు బోధించేందుకు ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. ఆరు బయట, వరండాల్లో, చెట్ల కింద చదువు చెబుతున్నారు.

సరుబుజ్జిలి మండలం..

కొత్తకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సుమారు రూ. 69 లక్షలతో మరమ్మతు పనులు ప్రారంభించి మధ్యలో వదిలేశారు. ❖ గోనెపాడు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు రూ.1.20 కోట్లు మంజూరు చేయగా పిల్లర్ల స్థాయిలో ఆగిపోయింది. ❖ రొట్టవలస పాఠశాలకు రూ.1 కోటి, పురుషోత్తపురం, చిన్నకాకితాపల్లి పాఠశాలలకు రూ.80 లక్షలు చొప్పున ఇవ్వగా అరకొర పనులే చేశారు. ❖ దూసిపేట, గేదెలవానిపేట, ఆమదాలవలస బాలికల, బాలుర పాఠశాలలు, చిన్నజొన్నవలస, కొల్లివలసలో భవనాల పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఉపాధ్యాయులు శిధిలావస్థకు చేరుకున్న పాత భవనాల్లోనే విద్యనభ్యసిస్తున్నారు.

పిల్లర్ల స్థాయిలో నిలిచిపోయిన గోనెపాడు పాఠశాల భవనం

నియోజకవర్గంలో...

మండలం	పాఠశాలలు	నిధులు (రూ.కోట్లలో)	వివిధదశల్లో ఉన్నవి	పూర్తయినవి
సరుబుజ్జిలి	09	4.05	09	0
ఆమదాలవలస	22	09	22	0
పొందూరు	28	03	28	0
బూర్జ	11	5.97	11	0

❖ బూర్జ మండలం.. 11 పాఠశాలలకు అదనపు భవనాల పనులకు రూ.5.97 కోట్లు విడుదల చేయగా కే.కే. రాజపురం, కొల్లివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతోపాటు కేజీబీవీ, టీ.ఆర్.రాజుపేట, జంగాలపాడు, లక్కుపురం ప్రాథమిక పాఠశాలల్లో పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి.

❖ పొందూరు మండలంలోని రెండోవిడతలో 28 పాఠశాలలకు అదనపు భవనాలు మంజూరు చేశారు. పనులు ఆగిపోవడంతో తరగతి గదుల్లేక విద్యార్థులు వరండాలు, చెట్ల కింద కూర్చుంటున్నారు.

❖ ‘కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే పనులు ప్రారంభించి సకాలంలో పూర్తి చేస్తాం’ అని నాలుగు మండలాల నాడు-నేడు ఏఈలు తెలిపారు.

బాల్య వివాహాలు సాంఘిక దురాచారం

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: బాల్య వివాహాలను అరికట్టడానికి ప్రతిఒక్కరూ సహకరించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కోరారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రజలకు అవగాహన కల్పించడానికి మహిళా శిశు సంక్షేమ శాఖ రూపొందించిన గోడప్రతులను సోమవారం జడ్పీ కార్యాలయ సమావేశ మందిరంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బాల్య వివాహాలు సాంఘిక దురాచారమని వ్యాఖ్యానించారు. అందరి సహకారంతోనే వాటి నిర్మూలన సాధ్యమవుతుందన్నారు.

దిగజారిన పారిశుద్ధ్యం

పొందూరు మండలం బురిడికంచరాం గ్రామంలో శ్రీకాకుళం వైపు వెళ్లే రోడ్డులో మురుగు కాలువలో ప్లాస్టిక్ వ్యర్థాలు, గాజు సీసాలతో నిండటం వల్ల మురుగు నిలిచి దుర్వాసన వస్తోంది. దోమల బెడద ఎక్కువగా ఉందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎం.పి.డి.ఓ వాసుదేవరావు వద్ద ప్రస్తావించగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, పొందూరు గ్రామీణం

మురుగుతో అవస్థలు

గార మండలం శ్రీకూర్మం వీధుల్లో కాలువలు లేక మురుగు నీరు రహదారులపై నిలిచిపోతోంది. ఇక్కడి కూర్మనాథ క్షేత్రానికి వచ్చే భక్తులు, స్థానికులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయమై డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణను ‘న్యూస్‌టుడే’ సంప్రదించగా వాడుక నీరు రహదారి పైకి రాకుండా ఇళ్ల ముందు ఇంకుడు గుంతలు తవ్వుకోవాలని స్థానికులకు సూచిస్తున్నామని తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో కాలువల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. – న్యూస్‌టుడే, గార(శ్రీకూర్మం)

వంతెన కట్టండి.. బాధలు తీర్చండి

సరుబుజ్జిలి మండలంలోని నందికొండ రెవెన్యూ పరిధిలో వంశధార కాలువ ఎగువ భాగంలో కొండల పక్కన ఉన్న సుమారు 45 ఎకరాల పొలాలకు రహదారి సౌకర్యం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పండిన పంటలను తెచ్చుకునేందుకు ట్రాక్టర్లు వెళ్లే సౌకర్యం లేదని వాపోతున్నారు. వంతెన నిర్మించాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయాన్ని వంశధార ఈఈ బి.రవీంద్ర వద్ద ‘న్యూస్‌టుడే’ ప్రస్తావించగా పరిశీలించి రైతుల సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. –న్యూస్‌టుడే, సరుబుజ్జిలి

నత్తనడకన పనులు

జి.సిగడాం కస్తూర్బా పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణం నత్తనడకన సాగుతుంది. భవన నిర్మాణ పనుల్లో కూడా నాణ్యత లేదని పలువురు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి నాణ్యతగా పూర్తిచేయాలని కోరగా.. పరిశీలిస్తామని సంబంధిత అధికారులు తెలిపారు. –న్యూస్‌టుడే, జి.సిగడాం

ధాన్యం బస్తాల తొలగింపు

సరుబుజ్జిలి, న్యూస్‌టుడే: సరుబుజ్జిలి మండలంలోని మూలసవలాపురం ప్రాథమిక పాఠశాల ఆవరణలో ధాన్యం బస్తాలను రైతులు తొలగించారు. ఈ నెల 6న ‘అడ్డుగా మూటలు.. ఆక్కడే ఆటలు..!’ శీర్షికన ‘ఈనాడు’లో ప్రచురితమైన కథనానికి ఎంఈవో కె.శ్రీనివాసరావు, ఉపాధ్యాయుడు బి.వి.రమణ స్పందించి రైతులతో ధాన్యం బస్తాలను తీయించారు.

స్పందనకు వందనం

బోరు బాగు చేశారు

గత కొన్ని రోజులుగా పట్టణంలోని బీఆర్‌నగర్ వీధిలో ఉన్న తాగునీరు బోరు మూలకు చేరింది. ఈ సమస్యపై ‘ఈనాడు’లో ఈనెల 2న ‘బోరు పని చేయట్లే’ అనే శీర్షిక వచ్చిన వార్తకు మున్సిపల్ కమిషనర్ టి.రవి స్పందించి బోరుకు మరమ్మతు పనులు చేయించారు. – న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం

పోషకాహారంతో ఆరోగ్యం

శ్రీకాకుళం గ్రామీణం, న్యూస్‌టుడే: చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని నివారించడానికి అక్షయపాత్ర చేపట్టిన ఉదయం పౌష్టిక అల్పాహార పంపిణీ కార్యక్రమం ఉపయోగపడుతుందని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. శ్రీకాకుళం గ్రామీణ మండలం కిష్టప్పపేటలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి విద్యార్థులకు అందజేశారు. ప్రయోగాత్మకంగా మంగళ, గురు, శని వారాల్లో చిక్కీ, వేయించిన వేరుశనగలు, ఆరోగ్యకరమైన స్నాక్స్, ప్రొటీన్ బార్లు ఇవ్వనున్నట్లు అక్షయపాత్ర ప్రతినిధులు తెలిపారు. శ్రీకాకుళం నియోజకవర్గంలో 14 వేల మంది విద్యార్థులకు ఈ తరహా ఆహారం అందజేస్తామన్నారు. అక్షయపాత్ర ప్రాంతీయ అధ్యక్షుడు దళ్లర్ నిష్కించన భక్తదాస, ఆపరేషన్ మేనేజర్ షేక్ అష్ఫాక్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొండు శంకర్

పల్స్ పోలియో విజయవంతానికి పిలుపు

పాతబస్టాండ్, న్యూస్‌టుడే: ఈ నెల 21న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైద్యాధికారి విద్యాసాగర్ కోరారు. శ్రీకాకుళం నగరం టీపీసీటీ కాలనీలోని పట్టణ ఆరోగ్య కేంద్రంలో సోమవారం అంగన్‌వాడీ సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పోలియో చుక్కలు వేయడానికి అర్హులైన చిన్నారులను గుర్తించాలన్నారు. ఐసీడీఎస్ కృష్ణా పార్కు సెక్టార్ పర్యవేక్షకురాలు సీతా మహాలక్ష్మి ఆధ్వర్యంలో పోలియోను అరికడతామని.. బాల్య వివాహాలను నిర్మూలిస్తామని ప్రతిజ్ఞ చేశారు. హెల్త్ సూపర్‌వైజర్ రోజ్‌మేరీ, అంగన్‌వాడీ కార్యకర్తలు సంధ్యారాణి, సునీత, సుభాషిణి పాల్గొన్నారు.

ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది, వైద్యాధికారి విద్యాసాగర్

గ్రిగ్స్ పోటీలు ప్రారంభం

ఆమదాలవలస పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో చిన్నతనం నుంచే క్రీడా పోటీల్లో పాల్గొనేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ పాఠశాల మైదానంలో 69వ అంతర్ పాఠశాలల గ్రిగ్స్ క్రీడా పోటీలను ప్రారంభించారు. క్రీడలు, శరీరకచ మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయన్నారు. అనంతరం కీడ్రాకారులను పరిచయం చేసుకుని పోటీలు ప్రారంభించారు.

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే కూన రవికుమార్

గొయ్యి తవ్వారు.. వదిలేశారు..!

శ్రీకాకుళం నగరంలోని ఇల్లీసుపురం సమీపంలోని ఏసీబీ కార్యాలయం వద్ద ప్రధాన పైపులైన్ పగిలిపోవడంతో తాగునీరు వృథాగా పోతోంది. మరమ్మతులకు రహదారి మధ్యలో గొయ్యి తవ్వి పనులు పూర్తి చేయకుండా వదిలేశారు. రద్దీగా ఉండే దారిలో వాహనదారులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయమై నగరపాలక సంస్థ ఇన్‌ఛార్జి కమిషనర్ బి.శ్రీనివాసులును ‘న్యూస్‌టుడే’ సంప్రదించగా మరమ్మతులు చేపట్టి సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. – న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం

క్రీడాకారిణులకు అభినందన

పాతబస్టాండ్, న్యూస్‌టుడే: జాతీయ స్థాయి పాఠశాలల క్రీడా పోటీలకు ఎంపికైన ఇద్దరిని జిల్లా విద్యాశాఖ అధికారి కె. రవిబాబు సోమవారం అభినందించారు. ఇటీవల నరసరావుపేటలో రాష్ట్ర స్థాయి బాలికల ఈత పోటీలు జరగ్గా దీక్ష బెహరా రెండు కేటగిరీల్లో బంగారు పతకాలు, పి.ఇషా సంహిత కాంస్య పతకం అందుకుని జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో డీఈవో అభినందించారు.

సైకిల్ యాత్రలో ప్రజాభాగస్వామ్యం అవసరం

పాతబస్టాండ్, న్యూస్‌టుడే: గంజాయి, మాదకద్రవ్యాల నిర్మూలన అవగాహనపై విశాఖపట్నం రేంజ్‌లో జరుగుతున్న అభ్యుదయ సైకిల్ యాత్రలో జిల్లా ప్రజలను పెద్ద ఎత్తున భాగస్వామ్యం చేయాలని పోలీసు అధికారులకు ఎస్పీ మహేశ్వరరెడ్డి ఆదేశించారు. సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో సన్నాహక ఏర్పాట్ల విషయమై సమావేశం నిర్వహించారు. ఈ నెల 12 తేదీ నుంచి ప్రారంభమైన ఈ యాత్ర లక్ష్యం మాదకద్రవ్యాల వినియోగం నివారించడమన్నారు. అదనపు ఎస్పీలు కె.వి. రమణ, పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అటవీ భూమి ఆక్రమణపై విచారణ

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: ఎచ్చెర్ల మండలం కొయ్యాం రెవెన్యూ పంచాయతీలోని అటవీ భూమిని కొంతమంది ఆక్రమించుకున్నారు. స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం రెవెన్యూ, అటవీ శాఖ అధికారులు సర్వే నిర్వహించారు. ఫిర్యాదుతో హైకోర్టు ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో సంయుక్త సర్వే నిర్వహించి విచారణ చేస్తున్నట్లు తహసీల్దారు బలగ గోపాల్, రేంజర్ రాజశేఖర్‌లు తెలిపారు. గ్రామానికి చెందిన కొంతమంది 62 ఎకరాల అటవీభూమి ఆక్రమించి కొబ్బరి తోటలు సాగుచేస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారని అధికారులు తెలిపారు. దీనిపై క్షేత్రస్థాయిలో విచారించి నివేదిక ఉన్నతాధికారులు, కోర్టుకు అందజేస్తామన్నారు.

వినాయక ఆలయాల్లో పూజలు

శ్రీకాకుళం సాంస్కృతికం, న్యూస్‌టుడే: నగరంలో పలు ప్రాంతాల్లోని వినాయక ఆలయాల్లో సోమవారం సంకష్ట హర చతుర్థి అభిషేక పూజలు నిర్వహించారు. మొండేటివీధిలో లక్ష్మి గణపతి, పాలకొండరోడ్డులోని విజయగణపతి ఇతర ప్రాంతాల్లో గణపతి ఆలయాల్లో ఈ పూజలు జరిగాయి.

అభివృద్ధిని అడ్డుకుంటున్నారు

ఆమదాలవలస గ్రామీణం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులు అడ్డుకునే ధోరణి మానుకోవాలని పేడాడ జనార్దనరావు అన్నారు. సోమవారం ఆమదాలవలస మండలం శ్రీహరిపురంలో విలేకరులతో మాట్లాడారు. థర్మల్ పవర్‌ప్లాంట్ పనులు జరగకుండా వైకాపా నాయకులు గిరిజనులకు రెచ్చగొడుతున్నారన్నారు.

కనుగులవానిపేటలో పారిశుద్ధ్య పనులు

శ్రీకాకుళం గ్రామీణం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం గ్రామీణ మండలం కనుగులవానిపేటలో సోమవారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. సర్పంచి గంగు వెంకటరమణ ఆధ్వర్యంలో కాలువల్లో పూడిక తొలగించారు. వీధుల్లో పేరుకుపోయిన చెత్తను ట్రాక్టర్లలో తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానికులు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు.

శరవేగంగా నిర్మాణం

పొందూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పొందూరు బస్టాండ్‌లోని కాలువపై ఉన్న పలకలు శిథిలమయ్యాయి. దీనిపై అక్టోబర్ 23న శిథిలం భయం.. భయం శీర్షికతో ప్రచురితమైన వార్తకు స్పందించిన శ్రీకాకుళం 1 డిపో మేనేజర్ పనులు ప్రారంభించారు.

ఘనంగా ముందస్తు క్రిస్మస్ వేడుకలు

లావేరు, న్యూస్‌టుడే: మండలం అప్పాపురంలో ఆదివారం రాత్రి ముందస్తు క్రిస్మస్ వేడుకలు పాస్టర్ సురేష్ ఐజక్ ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి ఘనంగా నిర్వహించారు. తొలుత యేసు క్రీస్తు సందేశాన్ని ప్రజలకు వివరించారు.

సమయపాలన తప్పనిసరి

జి.సిగడాం, న్యూస్‌టుడే: సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డిప్యూటీ ఎంపీడీవో పి.వి. మురళీ అన్నారు. జి.సిగడాం మండలం ఆనందపురం గ్రామంలో సోమవారం సచివాలయాన్ని సందర్శించారు. సచివాలయంలో సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. గ్రామంలో పలు సర్వేలకు సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో పారిశుద్ధ్యం, తాగునీరు, వీధిలైట్లు తదితర వాటిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అనంతరం పలు రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు ఉన్నారు.

హాజరు వివరాలు పరిశీలిస్తున్న డిప్యూటీ ఎంపీడీవో మురళీ

సౌత్‌జోన్ వాలీబాల్ పోటీలకు బీఆర్‌ఏయూ క్రీడాకారులు

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: జేఎన్‌టీయూ, కాకినాడలో ఈ నెల 10 నుంచి జరగనున్న సౌత్‌జోన్ అంతర్ వర్సిటీ పురుషుల వాలీబాల్ క్రీడా పోటీల్లో స్థానిక డా. బి.ఆర్.అంబేడ్కర్‌విశ్వవిద్యాలయం తరఫున పాల్గొనే క్రీడాకారుల జట్టు సోమవారం పయనమయింది. 16 మంది విద్యార్థులు జట్టును వర్సిటీ వీసీ ఆచార్య కె. ఆర్.రజని అభినందించారు. పోటీలు 14 వరకు జరగనున్నాయి. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ బిడ్డికి అడ్డయ్య, స్పోర్ట్స్ డీన్ డా. పి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వీసీ కె.ఆర్. రజనితో క్రీడాకారులు

న్యాయమైన డిమాండ్లు పరిష్కరించండి

పొందూరు, న్యూస్‌టుడే: తమ న్యాయమైన డిమాండ్లు తీర్చాలని రాష్ట్ర వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ జిల్లా జనరల్ సెక్రటరీ ఎర్నేన పాపినాయుడు అన్నారు. పొందూరు మండల కేంద్రంలో సహకార బ్యాంకు ఎదురుగా నిరసన వ్యక్తం చేశారు. 2019, 2024లకు సంబంధించి రెండు పీఆర్‌సీలు అందించాలన్నారు. ఉద్యోగ విరమణ వయసు 62 సంవత్సరాలకు పెంచాలన్నారు. ప్రతి ఉద్యోగికి రూ.20 లక్షల బీమా, ఇతర డిమాండ్లు ప్రస్తావించారు. కార్యక్రమంలో బాతువ పీఏసీఎస్ సీఈవో లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

సహకార బ్యాంకు ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

పదవికి రామ్మోహన్ నాయుడు రాజీనామా చేయాలి

మాట్లాడుతున్న మాజీ సభాపతి తమ్మినేని సీతారాం

ఆమదాలవలస పట్టణం, న్యూస్‌టుడే: కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడిని మంత్రి పదవికి రాజీనామా చేయాలని మాజీ సభాపతి తమ్మినేని సీతారాం అన్నారు. సోమవారం నివాసంలో మాట్లాడారు. వేలాది మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా.. సమస్య పరిష్కరించలేకపోయిన మంత్రికి పదవి ఎందుకని ప్రశ్నించారు. దేశ పరువు, ప్రతిష్ఠ దిగజార్చారన్నారు.

★ కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రిగా ఉండి రామ్మోహన్ ఘోరవైఫల్యం చెందారని ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ అన్నారు. రామ్మోహన్ నాయుడు మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

రక్తదానానికి ముందుకు రండి

లావేరు, న్యూస్‌టుడే: యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని తహసీల్దారు జి.ఎల్.ఈ.శ్రీనివాసరావు అన్నారు. మండలంలో స్థానిక తెదేపా మండలపార్టీ అధ్యక్షుడు ముప్పిడి సురేష్ జన్మదినం సందర్భంగా సోమవారం ఐ.టీడీపీ కన్వీనర్ కె.రమణబాబు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం, నేత్ర పరీక్షల శిబిరం నిర్వహించారు. 22 మంది రక్తదానం చేశారు.

రక్తదానం చేస్తున్న యువకులు

నిర్వహణలో నిర్లక్ష్యం.. భవనం నిరుపయోగం

–న్యూస్‌టుడే, బూర్జ

బూర్జ మండలం గోపీదేవిపేట వద్ద గ్రామీణ జీవనోపాధి వనరుల అభివృద్ధి శిక్షణ కేంద్రం భవనాన్ని 2007-08 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం నిర్మించింది. యువత, మహిళలు, వివిధ శాఖల అధికారులకు ఏడాది పొడవునా శిక్షణ కార్యక్రమాలు, సదస్సులు, అవగాహన కార్యక్రమాలను నిర్వహించడమే ప్రధాన ఉద్దేశం. సరుబుజ్జిలి, ఆమదాలవలస, ఎల్.ఎన్.పేట, పాలకొండ, వీరఘట్టం, సీతంపేట ఇతర మండలాలకు చెందిన వారు పాల్గొనేవారు.

★ తరువాత కాలంలో నిర్వహణ కరవవడంతో సుమారు 8 ఏళ్లుగా నిరుపయోగంగా మారింది. కార్యక్రమాలు నిర్వహించే దాఖలాలు లేవు. దీంతో రూ.లక్షల నిధులతో నిర్మించిన భవనం పూర్వ వైభవాన్ని కోల్పోతోంది. పరిసరాలు గడ్డి, పొదలు పనికిరాని మొక్కలతో నిండాయి.

పనికిరాని మొక్కలు పెరిగి అధ్వానంగా కనిపిస్తున్న సీఎల్ఆర్‌సీ భవనం

★ నిరుద్యోగ యువతను గుర్తించి పోటీపరీక్షలకు శిక్షణలు ఇచ్చేందుకు కూటమి ప్రభుత్వం దృష్టిసారిస్తే మరింత బాగుంటుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు. ‘భవన పరిసరాలు పలుమార్లు శుభ్రం చేశామని, దీనిపై ఉన్నత అధికారులకు నివేదిక ఇచ్చామని మరోసారి ఉన్నతాధికారుల వద్ద ప్రస్తావిస్తాం’ అని ఏపీవో ఐ.రవి తెలిపారు.

14వ జన్మదిన శుభాకాంక్షలు
మా చాగంటి వంశోద్ధారకుడు, చిరునవ్వుల చిన్నారికి జన్మదిన శుభాకాంక్షలు

తాత: చాగంటి బాపయ్య పంతులు నాన్నమ్మ: చాగంటి మంగమ్మ (SKLM),
తాత : అరుణ్‌నామ్‌జోషి, నాగపూర్, అమ్మమ్మ: స్వాతినామ్‌జోషి
డాడీ : చాగంటి శివప్రసాద్ (UK), మమ్మీ: ప్రియారాణి (UK), చెల్లి : శ్రేయ (UK)
బాబాయ్ : చాగంటి వంశీకృష్ణ (HYD), పిన్ని: చాగంటి సమత
అక్క: చాగంటి నిత్య, చెల్లి : చాగంటి దీక్ష
మేనత్త: చాగంటి వెంకటసాయిసుధ (USA), మామయ్య: కర్నాటి రవీంద్రనాథ్ (USA)
వదినలు : కర్నాటి సుచిత, కర్నాటి ముక్త (USA)
చి॥ చాగంటి అభయ్ (UK)
సెల్: 9550706076, 9550105151

13వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
ఇండియన్ బ్యాంక్ శ్రీకాకుళం శాఖ / అలహాబాద్ బ్యాంక్ ఉమెన్స్ కాలేజ్ రోడ్, శ్రీకాకుళం బ్రాంచ్
ఖాతాదారులకు అత్యుత్తమ సేవలందిస్తున్న ఇండియన్ బ్యాంక్ (అలహాబాద్ బ్యాంకు) శ్రీకాకుళం శాఖ వారి 13వ వార్షికోత్సవం శుభవేళ బ్రాంచ్ మేనేజర్ శ్రీమతి జి. భారతి గారికి, మరియు సిబ్బందికి ఇవియే మా శుభాకాంక్షలు.
విజయదుర్గ ఎంటర్‌ప్రైజస్ ఏనుగుల మహల్ వీధి, Near ఎక్సైజ్ ఆఫీసు, శ్రీకాకుళం
శ్రీ స్వామి క్రిష్ణ ప్రసాద్ ఫర్నిచర్స్ దండి వీధి కలెక్టర్ ఆఫీస్ రోడ్, డిసిసిబి బ్యాంక్ ప్రక్కన, శ్రీకాకుళం
పవన్‌సాయి ఎంటర్‌ప్రైజస్ వన్‌వే ట్రాఫిక్‌రోడ్, ఎయిర్‌టెల్ ఆఫీస్ ప్రక్కన, శ్రీకాకుళం
శివసాయి ట్రేడర్స్ ఫర్నిచర్ షోరూం, ప్రొ॥ J. శ్రీనివాస్, కళింగ రోడ్డు, పందుంపుల్లల సెంటర్, శ్రీకాకుళం: Cell: 9490655733

(c) eenadu

ఈనాడు తిరుపతి

మంగళవారం డిసెంబరు 9, 2025 5

పురాతన ఆలయం.. త్రిమూర్తుల నిలయం

ఏర్పేడు, న్యూస్‌టుడే: ఏకశిల్పంపై బ్రహ్మ, విష్ణు మహేశ్వరులు కొలువుదీరిన పురాతనమైన శివాలయం మన జిల్లాలోనే ఉందని తెలుసా..? ఏర్పేడు మండలంలోని గుడిమల్లంలో ఈ ఆలయం ఉంది. విగ్రహం ముదురు కాఫీ రంగులో ఉండటంతో పాటు కింద భాగంలో మరగుజ్జుగా బ్రహ్మ, భుజాన బాణం, ఒక చేతిలో మేకపోతు తల, మరో చేతిలో కల్లుకుండ పట్టుకుని తలపాగ ధరించి గంభీరంగా ఉన్న శ్రీపరశురామేశ్వరస్వామి అలంకరణలో విష్ణువు, లింగ రూపంలో శివుడు కొలువుదీరి భక్తులకు దర్శనమిస్తాడు. 1, 2వ శతాబ్దంలో చోళులు, పల్లవులు ఈ ఆలయాన్ని నిర్మించి అభివృద్ధి చేసినట్లు చరిత్రకారులు చెబుతుంటారు.

గుడిమల్లంలోని పరశురామేశ్వరస్వామి ఆలయం

ప్రత్యేకతలు.. ◗ ఆలయ గోపురం గజపృష్ఠ ఆకారంలో ఉండటమే కాకుండా లోపలిభాగం గుండ్రంగా ఉంటుంది. గోడలపై శ్రీ గురుదక్షిణామూర్తి, శ్రీవేంకటేశ్వరస్వామితో పాటు పరివార దేవతామూర్తులు కొలువుదీరి ఉంటారు. ◗ సూర్యుడు ఉత్తరాయణంలో నుంచి దక్షిణాయంలోకి మారే సమయంలో కిరణాలు నేరుగా స్వామి పాదాలు తాకేవిధంగా కిటికీలు అమర్చారు. అంతరాలయం పల్లంగా ఉంటుంది. 60ఏళ్లకో పర్యాయం స్వర్ణముఖినది నీరు స్వామివారిని తాకుతుంటాయని భక్తులు చెబుతుంటారు.

ఆలయంలో వెలసిన స్వామివారు

ఊడలు దిగి.. మేడలు ఎదిగి

- వేరం కుదిరితే భవనం క్షేమం
- అవినీతిమయమైన పట్టణ ప్రణాళిక విభాగం

“తిరుపతిలో అక్రమ కట్టడాలపై ఫిర్యాదులు ఎక్కువగా ఉన్నాయి. వాటిని అధికారులే ప్రోత్సహిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. ఎలాంటి ఒత్తిళ్లకు లొంగాల్సిన అవసరం లేదు. నా నియోజకవర్గంలోనే అక్రమ కట్టడాలు తొలగిస్తున్నారు. మీరెందుకు ఉపేక్షిస్తున్నారో అర్థం కావడం లేదు.” - ఇటీవల పురపాలిక శాఖమంత్రి నారాయణ వ్యాఖ్యలు.

తిరుపతి(వ్యవసాయం), న్యూస్‌టుడే: తిరునగరిలో అక్రమ కట్టడాల తీవ్రత ఏస్థాయిలో ఉందో.. వాటివెనుక అవినీతి ఊడలు ఎంతగా విస్తరించాయో మంత్రి మాటలే నిదర్శనం. ఆయన హెచ్చరిక తదనంతరమూ పట్టణ ప్రణాళిక విభాగంలో చలనం లేదు. ఒకట్రెండు నిర్మాణాలు కూల్చివేసి లోపాయికారిగా సహకరిస్తుండటంతో నగరం వరద, ట్రాఫిక్ వంటి పీకల్లోతు సమస్యల్లోకి జారుకుంటోంది.

ఉల్లంఘనలు వేలల్లో..

వాస్తవానికి నగరంలో పదివేలకు పైగా అక్రమ కట్టడాలు, అనధికారిక, నిబంధనలకు విరుద్ధంగా, అనుమతుల్లేని కట్టడాలు ఉంటాయని అంచనా. వాటిలో వేయి వరకు గుర్తించినా చర్యలకు అడుగులు పడటం లేదు.

నగరంలో ఇటీవల కూల్చిన భవనం

ప్రభుత్వం గడువు విధించినా..

గత ప్రభుత్వంలో అక్రమాల జోరుతో సచివాలయ కార్యదర్శులతోనే పాలన సాగించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఇక్కడ తిష్ఠవేసిన అధికారులు వారి అండతో అక్రమాల సామ్రాజ్యం విస్తరించారు. అనుమతులు లేని, అనుమతులు రాని ప్రాంతాల్లో భవనాలు నిర్మించుకునేలా బేరం కుదుర్చుకుని చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం అక్రమ భవనాల వ్యవహారంలో కఠినంగా వ్యవహరిస్తుండటం, ఆగస్టు 31 తరువాత నిర్మించిన అనుమతులు లేని భవనాలు, అదనపు అంతస్తులను కూల్చివేయాలని కఠినంగా ఆదేశించడంతో లోపాయికారి ఒప్పందం ప్రకారం ఒకట్రెండు నిర్మాణాలు కూల్చి తరువాత తమ పంథా కొనసాగిస్తున్నారు.

ఎల్‌ఆర్‌ఎస్., బీపీఎస్ దరఖాస్తులు అందేనా?

మరోవైపు ఎల్‌ఆర్‌ఎస్, బీపీఎస్ పథకాలు పట్టణ ప్రణాళికాధికారులకు కాసులు కురిపిస్తున్నాయి. ఎల్‌ఆర్‌ఎస్ ప్రకటించి నాలుగు నెలలవుతున్నా.. పదికి లోపు దరఖాస్తులు మాత్రమే ఆమోదించారు. బీపీఎస్‌కు రెండువేల దరఖాస్తులు రావొచ్చని అంచనా. ఇదేమని అడిగేవారు లేకపోవడంతో అక్రమ నిర్మాణదారులు లెక్కచేయడం లేదు.

దేదీప్యం.. జాతర వైభవం


పెళ్లి మండపం వద్ద విద్యుద్దీపాలంకరణలు

ఏడుగంగల జాతర వైభవాన్ని పురస్కరించుకుని శ్రీకాళహస్తి వెలుగుల వైభవంతో శోభాయమానంగా మారింది. ఆదివారం అర్ధరాత్రి చాటింపు ఉత్సవం ప్రారంభం కావడంతో జాతర సందడి ప్రారంభమైంది. మంగళవారం సాయంత్రం ముక్కంటి ఆలయం తరఫున ఏడుగంగలకు సారె సమర్పించనున్నారు. బుధవారం వేదపుజమున జాతర నిర్వహణకు ఏర్పాట్లు సిద్ధమవుతున్నాయి. పట్టణంలోని పెళ్లి మండపం వద్ద పొన్నాలమ్మ, గాంధీవీధి అంకమ్మ, కొత్తపేట భువనేశ్వరి, జయరామారావు వీధి కామమ్మ, బేరివారి మండపం ముత్యాలమ్మ, సన్నిధివీధి అంకాళమ్మ, తేరువీధి నల్లగంగమ్మ పేర్లతో అమ్మవార్లు కొలువుదీరనున్నారు. - న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి

వైకుంఠ భక్తుల భద్రతే లక్ష్యం

ఉన్నతాధికారులతో సమీక్షిస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి (నేరవిభాగం), న్యూస్‌టుడే: అన్నిశాఖల సహకారంతో శ్రీవారి వైకుంఠ ద్వారదర్శనానికి వచ్చే భక్తులకు మెరుగైన సేవలు అందించాలని ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశించారు. పదిరోజుల పర్వదినాల్లో భక్తుల భద్రతపై సోమవారం స్థానిక కమాండ్ కంట్రోల్ కాన్ఫరెన్స్ హాల్‌లో సమీక్షించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా సమగ్ర ప్రణాళికలు రచించాలని.. కలెక్టర్, తితిదే విజిలెన్స్ విభాగంతో కలసి కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. తిరుమలలో ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్, లైన్ మేనేజ్‌మెంట్, అత్యవసర స్పందన బృందాల నియామకం, పాదచారుల మార్గాల భద్రత వంటి అంశాలపై చర్చించారు. చిన్నపిల్లలు తప్పిపోకుండా ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌లు, బృందాలు అదనంగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అదనపు ఎస్పీలు రవి మనోహరాచారి, శ్రీనివాసరావు, రామకృష్ణ, శ్రీనివాసులు, డీఎస్పీలు వెంకటనారాయణ, భక్తవత్సలం తదితరులు పాల్గొన్నారు.

16 నుంచి సుప్రభాతం స్థానంలో తిరుప్పావై

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి ఆలయంలో పవిత్ర ధనుర్మాసం పురస్కరించుకుని ఈనెల 16 నుంచి జనవరి 14 వరకు సుప్రభాతం బదులు తిరుప్పావై నివేదించనున్నారు. 12 మంది ఆళ్వార్లలో ఒకరైన శ్రీఆండాళ్(గోదాదేవి) మొదటగా ధనుర్మాసం వ్రతం ఆచరించడంతోపాటు వ్రతం ఎలా పాటించాలనే విషయాన్ని 30 పాశురాలతో కూడిన తిరుప్పావై దివ్యప్రబంధాన్ని లోకానికి అందించారు. ఈ నేపథ్యంలో తితిదే ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో తితిదే దేశవ్యాప్తంగా ఉన్న 233 కేంద్రాల్లో తిరుప్పావై ప్రవచనాలు పారాయణం చేయనున్నారు.

నకిలీ విత్తు.. రైతన్న చిత్తు

⏭ నాసిరకం వేరుసెనగ సరఫరా ⏭ నిర్లక్ష్యంగా ఏపీ సీడ్స్

ఏపీ సీడ్స్ నిర్లక్ష్యం రైతన్నలకు శాపంగా మారింది. నాణ్యత లేని విత్తనాలు సరఫరా చేసి చేతులు దులుపుకొంది. దీనికి తోడు ప్రణాళికా లోపం స్పష్టంగా కనిపిస్తోంది. రబీలో వేరుసెనగ విత్తుకు గడువు ముగుస్తున్నా రాయితీ విత్తనాలు ఇప్పటికీ పంపిణీకి నోచుకోలేదు. - న్యూస్‌టుడే, చిత్తూరు(వ్యవసాయం)

జిల్లా	వేరుసెనగ సాగు (హెక్టార్లలో)	విత్తన కేటాయింపు (క్వింటాళ్లలో)
చిత్తూరు	2,272	2,070
తిరుపతి	4,001	3,245

ముందస్తు ప్రణాళిక ఎక్కడ..?

■ రబీ సీజన్‌లో ఉమ్మడి చిత్తూరు జిల్లా తూర్పు ప్రాంత మండలాల్లో విస్తారంగా.. మిగిలిన చోట్ల నామమాత్రంగా వేరుసెనగ సాగు చేస్తారు. ■ చిత్తూరు జిల్లాలో నగరి, నిండ్ర, విజయపురం మండలాల్లో.. తిరుపతి జిల్లాలో శ్రీకాళహస్తి, ఏర్పేడు, తొట్టంబేడు, బీఎన్‌కండ్రిగ తదితర మండలాల్లో సాగవుతుంది. ■ నవంబరు రెండో వారంలో రైతులు రాయితీ విత్తు అందించాలి. డిసెంబరు 15లోగా విత్తుకుంటే లాభదాయకమని వ్యవసాయ శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. ■ రాయితీ విత్తు పంపిణీపై అధికారులకు ముందస్తు ప్రణాళికే లేదు. కేటాయింపుల నుంచి ధర నిర్ణయం వరకు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ■ పంపిణీ పూర్తి చేయాల్సిన సమయం నవంబరు చివరి వారంలో ఎట్టకేలకు రాయితీపై 30 కిలోల బస్తా ధర రూ. 1,656గా ఖరారు చేస్తూ ఉత్తర్వులిచ్చారు.

కాలయాపన.. తిరస్కరణ

రబీ సీజన్ విత్తన పంపిణీకి అక్టోబరులోనే విత్తనాన్ని సేకరించి ప్రాసెసింగ్ చేయాల్సి ఉన్నా ఏపీ విత్తన సంస్థ దృష్టిసారించలేదు. కర్నూలు, అనంతపురం జిల్లాల్లో విత్తన సేకరణ నవంబరు చివర్లో ప్రారంభించారు. వర్షాలతో కాయలు తేమశాతం అధికంగా ఉందని, నాణ్యత లేదంటూ నేటికీ చిత్తూరు, తిరుపతి జిల్లాలకు సరఫరా చేయలేదు. ■ చిత్తూరు జిల్లాకు సరఫరా చేసిన కాయలు నాణ్యమైనవి కావని ఏవోలు.. 2,070 క్వింటాళ్లు తిరస్కరించి వెనక్కి పంపేశారు.

త్వరలో అందజేస్తాం..

రబీ సాగు రైతులకు రాయితీ వేరుసెనగ విత్తు వీలైనంత త్వరగా పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టాం. నాణ్యమైనవి లభించడం లేదు. మేలైన కాయల సరఫరాకు.. ఏపీ విత్తన సంస్థకు లేఖ రాయనున్నాం. -మురళీకృష్ణ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

మోటార్లు.. రిపేర్లు

ఈ మోటార్లను చూడండి.. ఇటీవల దిత్వా తుపానుకు కురిసిన భారీ వర్షాలకు మరమ్మతుకు గురయ్యాయి. వాకాడు మండలం కొండూరులో ఓ దుకాణం వద్ద వీటిని రిపేరు చేస్తూ ఇలా కనిపించారు. ఒకవైపు పంట నీట మునిగి నష్టపోయామని.. మరోవైపు మోటార్లు పాడయ్యాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. - ఈనాడు, తిరుపతి

లక్ష్యం.. సూపర్ స్పెషాలిటీ వైద్యం

☛ ఈఎస్ఐ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.శ్యామ్‌బాబు

ముఖాముఖి

తిరుపతి (వైద్యవిభాగం), న్యూస్‌టుడే: ఉమ్మడి రాయలసీమ, నెల్లూరు జిల్లాలకు చెందిన కార్మికరాజ్య బీమా (ఈఎస్ఐ) కార్డుదారులు.. వారి కుటుంబ సభ్యులు సరాసరి 20 లక్షల మందికి ఆరోగ్య భరోసా కల్పించాల్సిన బాధ్యత తిరుపతి ఈఎస్ఐ ఆస్పత్రిపై ఉందని.. కూటమి ప్రభుత్వం, ఉన్నతాధికారుల తోడ్పాటుతో సరిపడా పడకలు, పరికరాలు, వైద్య సిబ్బందిని సమకూర్చుకుంటూ సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందించడమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నట్లు ఈఎస్ఐ మెడికల్ సూపరింటెండెంట్ డా.మల్చి శ్యామ్‌బాబు తెలిపారు. ఏడాదిలో తెచ్చిన మార్పులపై 'న్యూస్‌టుడే'తో ప్రత్యేకంగా మాట్లాడారు.

ఓపీని రెట్టింపు చేశాం

ప్రతినెలా రెండు వైద్య శిబిరాలు నిర్వహించి కార్మికులకు ఈఎస్ఐపై నమ్మకాన్ని పెంచుతున్నాం. ఒకప్పుడు నెలకు 4,500 ఉన్న ఓపీని.. గత సెప్టెంబరులో 7,884కు తీసుకొచ్చాం. నవజాత శిశువులకు టీకా వేసేందుకుగాను నేషనల్ ఇమ్యునైజేషన్ స్కీమ్‌లో చేర్చి నెలకు 275 టీకాలు వేసేస్థాయికి చేరాం. ఒకప్పుడు వెయ్యికి మించని ల్యాబ్ పరీక్షలు ఇప్పుడు 8 వేలకు పెంచాం.

మెమోలు స్వీకరించి..

పనిచేయని వారికి ఉన్నతాధికారి మెమోలు ఇవ్వడం సర్వసాధారణం. ఇక్కడ వార్డులు, క్యాజువాలిటీ, ఓపీల్లో పనిచేయని పరికరాలు, అవసరాల గురించి సంబంధిత సిబ్బందితోనే ముందుగా మెమోలు తెప్పించుకున్నాం. సంస్థ నిధులతో పాటు దాతల సహకారం తీసుకుని పరికరాలకు మరమ్మతులు చేయించాం. మూడు గ్లూకోమీటర్లు, 2,500 గ్లూకో స్ట్రిప్స్, ల్యాబ్, సర్జికల్ వస్తువులు సమకూర్చుకున్నాం. కొన్నేళ్లుగా పనిచేయని ఎక్స్‌రే యంత్రం అందుబాటులోకి తెచ్చాం.

రెఫరల్ అవసరం లేకుండా

పెద్ద శస్త్రచికిత్సలు మినహా ఈఎస్ఐ నుంచి అనుబంధ ఆసుపత్రులకు (రెఫరల్) రోగులను పంపకుండా ఇక్కడే సేవలు మెరుగుపరిచాం. నెలకు 200 వరకు కాన్పులు, శస్త్రచికిత్సలు చేస్తున్నాం. ట్రూనాట్ మిషన్ ద్వారా టీబీ రోగులను గుర్తించే పరీక్షలు నిర్వహిస్తున్నాం. రోగులకు మందుల కొరత లేకుండా చేశాం. రోగులతోపాటు ఓ సహాయకుడికి భోజనం అందిస్తున్నాం.

ఎన్‌ఏబీహెచ్ సాధనే లక్ష్యం

తిరుపతి ఈఎస్ఐ ఆస్పత్రికి నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఆఫ్ హాస్పిటల్స్ (ఎన్‌ఏబీహెచ్) గుర్తింపు వస్తే మెడిసిన్, గైనకాలజీ, ఆర్థో, జనరల్ సర్జరీ విభాగాలకు పీజీ సీట్లు రావడంతోపాటు నిధులు మంజూరవుతాయి. తద్వారా పడకల పెంపు, ఆస్పత్రి అభివృద్ధి సాధ్యమవుతుంది. సీటీ స్కాన్ మిషన్ కోసం విన్నవించాం. 8 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న అగ్నిమాపక శాఖ ఎన్‌వోసీ సాధన పనులు 90 శాతం పూర్తయ్యాయి. వంద పడకల స్థాయి సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎస్‌టీపీ) ఏర్పాటుకు నివేదించాం.

రోజువారీ సేవలు ఇలా..
- పడకలు : 100
- ఓపీ : 300-350
- ఐపీ : 60-70
- మొత్తం కార్డు దారులు: 5 లక్షలు

చక్రాల కుర్చీకి సుస్తి

ఈ చిత్రాలు చూడండి.. ఇలా చక్రాల కుర్చీలో వెళ్లడం కంటే.. మోసుకుంటూ తీసుకెళ్లడమే నయమని అనిపిస్తోంది కదూ.. రుయా ప్రభుత్వ ఆసుపత్రిలో ఇదీ పరిస్థితి. వీల్ ఛైర్లు మరమ్మతులకు గురయ్యాయి. కొన్నింటికి చక్రాలు ఊడిపోయాయి. ఫుట్‌రెస్టులు ఊడిపోతే గుడ్డను కట్టారు. - ఈనాడు, తిరుపతి

పారదర్శకంగా దర్యాప్తు చేయండి

■ లైంగిక దాడి కేసుపై ఎస్పీకి హోంమంత్రి ఆదేశం

తిరుపతి (నేరవిభాగం), న్యూస్‌టుడే: జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం విద్యార్థినిపై జరిగిన లైంగిక దాడి కేసును పారదర్శకంగా దర్యాప్తు చేయాలని రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత ఆదేశించారు. ఎస్పీ సుబ్బరాయుడుకి ఫోన్ చేసి కేసుకు సంబంధించిన పూర్వాపరాలు తెలుసుకున్నారు. మహిళల రక్షణే లక్ష్యంగా సాగుతున్న కూటమి ప్రభుత్వంలో ఏ ఒక్క మహిళకు అన్యాయం జరగకూడదని స్పష్టం చేశారు. విద్యార్థినికి న్యాయం జరిగేలా కేసును స్వయంగా పర్యవేక్షించాలని, విద్యార్థిని వద్దకు వెళ్లి భరోసా కల్పించాలని సూచించారు. నిందితులను వీలైనంత త్వరగా అరెస్టు చేయాలని స్పష్టం చేశారు. అనంతరం కేసు నమోదు, దర్యాప్తు వివరాలను ఎస్పీ నివేదించారు. నిందితుల చరవాణులు స్వాధీనం చేసుకుని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపామని, త్వరలో నిందితులను అరెస్టు చేస్తామని తెలిపారు.

ఒడిశాకు ప్రత్యేక బృందం

విద్యార్థినిపై ఆచార్య లక్ష్మణ్‌కుమార్ లైంగిక దాడికి పాల్పడగా.. మరో ఆచార్యులు శేఖర్‌రెడ్డి లొంగదీసుకునేందుకు వేధించారన్న వర్సిటీ ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ రజనీకాంత్ శుక్లా ఫిర్యాదుతో తిరుపతి పడమర పోలీసులు కేసు నమోదు చేశారు. డీఎస్పీ భక్తవత్సలం దర్యాప్తు చేస్తున్నారు. వర్సిటీ కమిటీ ఇచ్చిన నివేదికను పరిశీలించి సభ్యులను విచారించారు. సీఐ మురళీమోహన్ ఆధ్వర్యంలోని బృందం బాధితురాలి స్వరాష్ట్రమైన ఒడిశాకు వెళ్లింది. ఆమెను విచారించిన అనంతరం వాంగ్మూలం తీసుకోనున్నారు.

పిల్లలూ.. ప్రధానితో మాట్లాడుతారా..

తిరుపతి (విద్య), న్యూస్‌టుడే: బాలబాలికలకు.. ప్రధానమంత్రితో నేరుగా మాట్లాడే సువర్ణావకాశాన్ని కేంద్ర ప్రభుత్వం కల్పిస్తోంది. విద్యార్థుల్లో పరీక్షలపట్ల ఉన్న భయం, ఒత్తిడిని తగ్గించి వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు జాతీయస్థాయిలో 'పరీక్షా పే' చర్చా కార్యక్రమం ఏటా నిర్వహిస్తుండగా తొమ్మిదో విడత జనవరి 2026లో జరగనుంది. విద్యార్థులు తమ ప్రశ్నలు, సందేహాలు, అనుభవాలు, పరీక్షల సంసిద్ధతకు సంబంధించిన అభిప్రాయాలను ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా సమర్పించవచ్చు. పరీక్షల సీజన్ త్వరలో ప్రారంభం కానున్న నేపథ్యంలో వాటికి ఎలా సన్నద్ధమవ్వాలి.. విద్యార్థులు ఎదుర్కొనే సవాళ్లు ఏంటి? వాటిని ఎలా అధిగమించాలి? విద్యార్థుల ఆకాంక్ష ఏంటి? వాటిని చేరుకోవడానికి అనుసరించాల్సిన మార్గాలు.. పరీక్షల సమయంలో ప్రశాంతంగా ఎలా ఉండాలి.. తదితర అంశాలపై కార్యక్రమం జరుగుతుంది.

☛ **ప్రశ్నలు ఇలా ఉండాలి :** ప్రశ్న గరిష్ఠంగా 500 అక్షరాల్లోపు. ● రిజిస్ట్రేషన్‌కు innovateindia1.mygov.in వెబ్‌సైట్ సందర్శించాలి. ● అనంతరం 'పార్టిసిపేట్' బటన్‌పై క్లిక్‌చేసి విద్యార్థి //టీచర్ //తల్లిదండ్రులు అనే ఆప్షన్ ఎంచుకోవాలి. ● మొబైల్ లేదా ఈ-మెయిల్ ద్వారా లాగిన్ అయ్యి వివరాలు నమోదు చేయాలి. ● అక్కడ ఇచ్చే చిన్న మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాలి. ● పాల్గొన్న వారందరికీ ప్రశంసాపత్రాలు లభిస్తాయి. ● విజేతలకు ప్రధానితో నేరుగా మాట్లాడే అవకాశం, ప్రశంసాపత్రాలు 'ఎగ్జామ్ వారియర్స్' కిట్‌లు బహుమతిగా లభిస్తాయి.

కార్యక్రమం ప్రచార చిత్రం

రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ: జనవరి 11, 2026

అర్హులు : 6 నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు

ఎస్వీయూ పరిధిలో నేటి డిగ్రీ పరీక్ష వాయిదా

తిరుపతి (ఎస్వీయూ), న్యూస్‌టుడే: ఎస్వీయూ పరిధిలో మంగళవారం జరగాల్సిన డిగ్రీ పరీక్షలు సాంకేతిక కారణాలతో వాయిదా వేస్తున్నట్లు, మిగిలిన పరీక్షలు యథావిధిగా 10వ తేదీ నుంచి నుంచి జరుగుతాయని ఎస్వీయూ పరీక్షల విభాగం అధికారి రాజమాణిక్యం సోమవారం ప్రకటనలో తెలిపారు.

రైతేరాజు 6లో

104FM Tirupati 104 Mee FM

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వానేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 8008555167, 9154991499

డయల్ యువర్ సీఎండీకి 70 వినతులు

తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: విద్యుత్తు వినియోగదారుల సమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా సోమవారం నిర్వహించిన డయల్ యువర్ సీఎండీ కార్యక్రమానికి 70 వినతులు వచ్చాయి. తిరుపతిలోని డిస్కం కార్పొరేట్ కార్యాలయంలో సీఎండీ శివశంకర్ లోతేటి వినియోగదారుల సమస్యలను ఫోన్ ద్వారా తెలుసుకున్నారు. కర్నూలు 18, కడప 13, అనంతపురం 15, నెల్లూరు 03, శ్రీసత్యసాయి జిల్లా 03, తిరుపతి 11, చిత్తూరు 01, నంద్యాల నుంచి 6 సమస్యలు వచ్చినట్లు తెలిపారు.

కంగుంది.. వీధి నాటకం బాగుంది

కుప్పం గ్రామీణ, న్యూస్‌టుడే: దక్షిణాది రాష్ట్రాలకే కంగుంది వీధి నాటకాలు తలమానికంగా నిలుస్తున్నాయి. జమీందారుల పాలనలో ప్రారంభమైన ఈ నాటక కళ.. గల్లీ నుంచి దిల్లీ వరకు ప్రాచుర్యం పొందింది. ఇంటికో కళాకారుడు అన్నట్లు తయారై తమ ప్రదర్శనలతో శెభాష్ అనిపించుకుంటున్నారు కుప్పం మండలం కొత్తయిండ్లు గ్రామస్థులు. ఇక్కడి యువత సాఫ్ట్‌వేర్ కొలువులు, ఇతర ఉద్యోగాల్లో స్థిరపడినా.. నాటకాలను మాత్రం మరిచిపోకుండా ప్రదర్శిస్తుండటం గమనార్హం.

వీధి నాటకాల్లో గ్రామస్థులు

మహాభారత ఉత్సవాలకు డిమాండ్..

త్రిరాష్ట్ర కూడలిలో అటు తమిళనాడు.. ఇటు కర్ణాటక.. ఆంధ్రాలో ఏటా వేసవిలో మహాభారత ఉత్సవాలను అత్యంత వైభవంగా జరుపుకోవడం ఆనవాయితీ. ఈ ఉత్సవాల్లో భాగంగా 18 రోజుల పాటు మహాభారత పర్వాలకు సంబంధించిన నాటకాలను ప్రదర్శించేందుకు కొత్తయిండ్లు వీధి నాటక కళాకారులకు మంచి డిమాండ్ ఉంటుంది.

కళలను రక్షించుకునేందుకే...

నేను బెంగళూరులోని ఓ బ్యాంకులో పని చేస్తున్నా. నెలకు రూ. 70 వేలు జీతం తీసుకుంటున్నా. అంతరించిపోతున్న కళలను ఆదరించాలనే లక్ష్యంతో వీధి నాటకాలపై పట్టు సాధించా. మా ఇంట్లో ఐదు తరాలుగా నాటకాల్లో రాణిస్తున్నారు. ఆదాయం రాకపోయినా.. కళలను సంరక్షించుకోవాలనే లక్ష్యంతోనే ప్రదర్శనలు చేస్తున్నా. - హేమాద్రి, బ్యాంకు ఉద్యోగి

ఏఏ నాటకాలు ప్రదర్శిస్తారంటే...

సతీసావిత్రి, సత్యహరిశ్చంద్ర, జయంతి, జయలీల, కాంతామణి నాటకాలతో పాటు మహాభారతం, రామాయణ ప్రదర్శనలు చేస్తూ గ్రామస్థులు మంచి గుర్తింపు తెచ్చుకున్నారు.

చిన్నారులకు ప్రత్యేక శిక్షణ

వీధి నాటకాలకు ప్రసిద్ధిగాంచిన కంగుందిని కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ గుర్తించింది. సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన పది మంది చిన్నారులను ఎంపిక చేసి వారికి ప్రతి నెలా రూ.3 వేల చొప్పున పారితోషికాన్ని అందిస్తున్నారు. ఈ విద్యార్థులకు నాటకాలపై శిక్షణ ఇచ్చేందుకు ముగ్గురు గురువులకు రూ.8 వేల నుంచి రూ.10 వేల వరకు ప్రతి నెలా గౌరవ వేతనం ఇస్తున్నారు.

ఏనుగులొస్తే.. చెప్పేస్తాయ్..

ఏనుగును మెడలో ట్రాకర్

జిల్లాలో ఏనుగుల వరుస దాడులతో అటు రైతులు ఇటు ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారు. ఏనుగుల కదలికలను ఎప్పటికప్పుడు గుర్తించడానికి వాటి మెడకు జీపీఎస్ ఆధారిత రేడియో కాలర్(కాలర్ ఐడీ) ఏర్పాటు చేయడానికి అటవీ అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగానే మూడు రోజుల కిందట అనంతపురం సీసీఎఫ్ యశోదబాయి పులిచెర్ల మండలంలో అక్కడి పరిస్థితులను అంచనా వేశారు. - పలమనేరు, కల్లూరు న్యూస్‌టుడే

ఇలా పని చేస్తుంది..

జీపీఎస్ ద్వారా అనుసంధానించిన కాలర్‌ను గుంపులోని ఓ ఏనుగుకు అమరుస్తారు. ఇది అటవీశాఖ కార్యాలయానికి అనుసంధానమై ఉంటుంది. ఏనుగుల కదలికలు తెలిసేలా ప్రోగ్రాం ఉంటుంది. అవి గ్రామాల సమీపంలోకి రాగానే అధికారులు అప్రమత్తమై వాటిని తిరిగి అడవిలోకి పంపుతారు.

S.B.V.R. అగ్రికల్చరల్ కళాశాల, బద్వేలు

ఇంటర్మీడియట్ నందు Bi.P.C విభాగంలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు చివరి అవకాశం. కడప జిల్లా బద్వేలులో I.C.A.R., NEW DELHI వారిచే గుర్తింపు పొందిన S.B.V.R. అగ్రికల్చరల్ కాలేజ (S.B.V.R. A.G.B.Sc), నందు B.Sc (Hons.) Agricultureలో అడ్మిషన్ కొరకు ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకున్నా చేసుకోకపోయినా కన్వీనర్ కోటాలో అగ్రికల్చరల్ బి.ఎస్సి చేరుటకు చిట్ట చివరి అవకాశం కలదు.

వివరములకు సంప్రదించవలసినది : 94400 33523, 91825 05395, 94928 56652.

కరెస్పాండెంట్, S.B.V.R. అగ్రికల్చరల్ కళాశాల

(c) eenadu

శిరస్త్రాణం పెట్టుకో.. ఇంధనం పట్టించుకో

ఈనెల 15 నుంచి హెల్మెట్ లేని ద్విచక్ర వాహనాలకు పెట్రోలు పట్టకూడదనే నిబంధనలను జిల్లాలో అమలు చేయనున్నట్లు పోలీసుశాఖ ఓ ప్రకటన విడుదల చేసింది. దీంతో జిల్లాలోని పలు బంకుల్లో 'నో హెల్మెట్.. నో పెట్రోల్' నినాదాన్ని పాటిస్తున్నారు. తిరుచానూరు కూడలిలోని పెట్రోల్ బంకు వద్ద పోలీసులు ఇదే బ్యానర్ ఏర్పాటు చేశారు. వచ్చే వారం నుంచి శిరస్త్రాణం లేకుంటే పెట్రోలు పట్టకుండా చర్యలు తీసుకోనున్నారు. **- ఈనాడు, తిరుపతి; న్యూస్‌టుడే, తిరుపతి(నేరవిభాగం)**

ఆక్రమించేశారు.. ఇరుకుగా మార్చేశారు

వెంకటగిరి, బాలాయపల్లి, న్యూస్‌టుడే: ఆక్రమణలపై అధికారుల నిఘా కొరవడింది. జాతీయ రహదారుల అంచులనే ఆక్రమిస్తున్నా పట్టించుకోవడం లేదు. నిత్యం ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోంది. ఈ ఆక్రమిత స్థలాలు ప్రస్తుతం రూ.కోట్లల్లో పలుకుతున్నాయి. వెంకటగిరి నియోజకవర్గంలోని జాతీయ, రాష్ట్ర రహదారులతోపాటు పురపాలక పరిధిలోనూ అడుగడుగునా ఇదే పరిస్థితి.

ఎన్‌హెచ్ పొడవునా..

ఏర్పేడు నుంచి పెంచలకోన వెళ్లే 565 జాతీయ రహదారిలో స్థానిక క్రాస్ రోడ్డు వద్ద గతంలో బాలిక గురుకుల విద్యాలయ స్థలంలో పదిమీటర్ల దిక్కున రోడ్డు మార్జిన్ వ్యాపారుల కోసం దుకాణ సముదాయం నిర్మించుకున్నారు. ఈ దుకాణాలకు కేటాయించిన స్థలమే కాకుండా ఫుట్‌పాత్‌లను కలిపి వాడుతున్నారు. ఐటీఐ నుంచి పాలకేంద్రం, గూడూరు, రాపూరు రోడ్డు మలుపు వరకు ఈ రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లు ఆక్రమించారు.

నియోజకవర్గంలో ఏర్పేడు- పెంచలకోన జాతీయ రహదారి	3 కి.మీ
ఆక్రమణలు	2 కి.మీ మేర

కుంచించుకుపోతున్న జాతీయ, రాష్ట్ర రహదారులు

వెంకటగిరి క్రాస్‌రోడ్డు వద్ద మార్జిన్ల ఆక్రమణ

పురపాలికలోనూ ఇదే పరిస్థితి

వెంకటగిరి పురపాలక సంఘ పరిధిలోనూ రోడ్డు ఆక్రమించేశారు. పాలకేంద్రానికి సంబంధించిన ప్రభుత్వ స్థలాన్ని రోడ్డు మార్జిన్లలో తాత్కాలిక నిర్మాణాలు చేసి ఏళ్లుగా అనుభవిస్తున్నారు. స్థానిక అంగన్‌వాడీ ప్రాజెక్టు కార్యాలయం సమీపాన కట్టడాలు వెలిశాయి.

● **ర.భ. ఏఈ బాబును వివరణ కోరగా..** మార్జిన్లు అక్కడక్కడా ఆక్రమణలకు గురవడం నిజమే. విస్తరణ పనుల్లో తొలగించే చర్యలు తీసుకుంటామన్నారు.

ఎక్కడెక్కడంటే..

❖ పాలకేంద్రం కూడలిలో జాతీయ రోడ్డు మార్జిన్లను ఇరువైపులా ఆక్రమించి కట్టడాలు నిర్మించారు. ❖ విద్యుత్తు కార్యాలయం ప్రహరీ ఆనుకుని ప్రభుత్వ స్థలంలో కట్టడాలు నిర్మించి వ్యాపారాలు చేస్తున్నారు. ❖ దక్షిణ నడిబొడ్డున జాతీయ రహదారి ఫుట్‌పాత్‌లను వదిలిపెట్టలేదు. ❖ కమ్మకూడలిలో దక్షిణ బస్టాండ్ స్థలం మార్జిన్లో గదులు నిర్మించి వ్యాపారాలు చేస్తున్నారు. ❖ వెంకటగిరి నుంచి గూడూరు వైపు వెళ్లే రాష్ట్ర రహదారిలోనూ అదే తంతు. ❖ బాలాయపల్లి మండల సముదాయంలో రోడ్డు మార్జిన్లు ఆక్రమణలకు గురయ్యాయి. ఆ మార్గంలో గూడూరు మండలం గొల్లపల్లి, చెన్నూరు తదితర కూడళ్లలోనూ అదే తీరు.

తితిదే అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షల విరాళం

తిరుమల, న్యూస్‌టుడే: తితిదే ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు శ్రీనగర్ కాలనీకి చెందిన డా.పి.భద్రయ్యలు రూ.10,00,116 విరాళం అందించారు. విరాళం డీడీని ఆదివారం స్థానిక దాతల కేంద్రంలోని అధికారులకు అందజేసినట్లు ఆయన తెలిపారు.

వ్యర్థాల రీసైక్లింగ్‌పై శ్రీసిటీలో సదస్సు

నారాయణవనం, శ్రీసిటీ(వరదయ్యపాలెం), న్యూస్‌టుడే: ఏపీ సర్క్యులర్ ఎకానమీ, వ్యర్థాల రీసైక్లింగ్ పాలసీపై సోమవారం శ్రీసిటీలో ఉన్నత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. కాలుష్య నియంత్రణతో పాటు చెత్త నుంచి సంపద సృష్టించాలన్న ప్రభుత్వ మార్గదర్శకాలపై రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మన్ డా.పి.కృష్ణయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో పారిశ్రామిక ప్రతినిధులు, పర్యావరణ నిపుణులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

కైలాసకోనలో తమిళ కార్తిక పూజలు

నారాయణవనం, న్యూస్‌టుడే: కైలాసకోనలోని శ్రీ కామాక్షి సమేత కైలాసనాథేశ్వరస్వామి ఆలయంలో తమిళ కార్తిక మాసం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. సోమవారం ఉదయం స్వామి అమ్మవార్లకు రుద్రాభిషేకం, లలిత సహస్రనామ కుంకుమార్చన పూజలు అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు జలపాతంలో పవిత్రస్నానాలాచరించి స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. మహిళా భక్తులు నేతి దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

నేడు తిరుపతి- సాయినగర్ శిర్డీ రైలు ప్రారంభం

తిరుపతి(రైల్వే), న్యూస్‌టుడే: తిరుపతి- సాయినగర్ శిర్డీ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రారంభోత్సవం మంగళవారం తిరుపతిలో జరగనుంది. ముఖ్యఅతిథులుగా కేంద్ర రైల్వే, జలశక్తి సహాయమంత్రి వి.సోమన్న, రాష్ట్ర రోడ్డు, భవనాల శాఖమంత్రి బి.సి.జనార్దన్‌రెడ్డిలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జెండా ఊపి ఎక్స్‌ప్రెస్ రైలును ప్రారంభించనున్నారు. వీరితో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొననున్నారు. ఏర్పాట్లను గుంతకల్ డీఆర్ఎం పరిశీలించారు.

వరసిద్ధుడి ఆలయ ఆధ్వర్యంలో వేద పాఠశాల

❖ రూ.2.8 కోట్లతో నూతన పుష్కరిణి ❖ పాలకమండలి సమావేశంలో తీర్మానం

కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీ వరసిద్ధి వినాయకస్వామి ఆలయ ఆధ్వర్యంలో వేద పాఠశాల త్వరలో ప్రారంభించనున్నామని ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ తెలిపారు. ఆలయ పాలకమండలి తొలి సమావేశ వివరాలను ఛైర్మన్ మణినాయుడు, ఈవో పెంచల కిషోర్‌తో కలిసి సోమవారం వెల్లడించారు. ఆలయం వద్ద నిత్య పారాయణ నిర్వహిస్తే భక్తుల్లో ఆధ్యాత్మిక చింతన పెరుగుతుందన్నారు. 70 ఏళ్ల ముందు చూపుతో రూపొందించిన మాస్టర్‌ప్లాన్ అమలుకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని చెప్పారు. ఆలయానికి ఎదురుగా ఉన్న పుష్కరిణి తొలగించిన పాత ఆద్యా పోటు స్థానం(తూర్పు ఈశాన్యం)లో రూ.2.8 కోట్లతో నూతన పుష్కరిణి నిర్మిస్తామన్నారు. భక్తులకు సౌకర్యాల నిమిత్తం దాతల సహకారంతో త్వరలో అందుబాటులోకి తెస్తామని, భక్తులు ముందుకొచ్చి రూ.10 లక్షలు విరాళం అందజేస్తే ఆ గదికి వారి పేరు పెడతామన్నారు. రూ.25 కోట్ల తితిదే నిధులతో నిర్మించనున్న అతిథి గృహం, రెండు కల్యాణ మండపాల నిర్మాణానికి పాలకమండలి ఏకగ్రీవంగా ఆమోదం తెలిపిందన్నారు. వాటి నిర్మాణ, నిర్వహణ బాధ్యత పూర్తిగా కాణిపాకం ఆలయమే చేపడుతుందన్నారు. రూ.13 లక్షలతో స్వామివారి ప్రచార రథానికి మరమ్మతులు చేపట్టి గతంలో మాదిరి గ్రామాల్లో పర్యటించి హైందవ ధర్మాన్ని ప్రచారం చేస్తామని చెప్పారు. అంతరాలయ దర్శనంపై ఉభయదారుల సలహాలు, సూచనలతో మార్పు చేస్తామన్నారు. ఈఈ వెంకటనారాయణ, ఏఈవోలు ప్రసాద్, హరిమాధవరెడ్డి, ధనుంజయ, పాలక మండలి సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

వివరాలు వెల్లడిస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్, ఛైర్మన్ మణినాయుడు, ఈవో పెంచల కిషోర్

రైతేరాజు

రసాయనాలు పక్కనెట్టి.. సేంద్రియ సాగు చేపట్టి

సత్యవేడు, న్యూస్‌టుడే: సేంద్రియ వ్యవసాయంతో కూరగాయలు సాగు చేయడంవల్ల తక్కువ ఖర్చుతో మంచి దిగుబడులు సాధిస్తున్నారు. రసాయన ఎరువులు, మందులతో పిచికారీ చేయడంవల్ల అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. దీంతో రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు మొగ్గు చూపుతున్నారు. మండలంలోని రాజగుంటకు చెందిన భూమన పురుషోత్తంరెడ్డి సేంద్రియ వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధిస్తున్నారు.

నాలుగు ఎకరాల్లో..

భూమన పురుషోత్తంరెడ్డి సేంద్రియ పద్ధతిలో పంటలు సాగు చేస్తున్నారు. పొట్ల, సొర, బీర, కాకరకాయ వంటి వివిధ రకాల కూరగాయలను పండిస్తున్నారు. సేంద్రియ ఎరువులతో మంచి దిగుబడులు సాధించి ఆదాయాన్ని పొందుతున్నాడు.

రోజు మార్చి రోజు దిగుబడులు

విత్తు నాటిన 45రోజులలోపు దిగుబడి ప్రారంభమవుతుంది. రోజు మార్చి రోజు కోతకు వస్తాయి. నాలుగు ఎకరాల్లో మొదటి దశలో 750కేజీల వరకు దిగుబడి వస్తోంది. రెండో దశలో సుమారు 1400 వందల కేజీల వరకు దిగుబడి వస్తోంది. కేజీ రూ.15 నుంచి రూ.40 వరకు ధర పలుకుతుంది. నెలకు సరాసరి రూ.6.50లక్షలు, కూలీలు, ఎరువులు, రవాణా ఖర్చులు పోను రూ.రెండు లక్షల వరకు ఆదాయం వస్తోంది.

చీడపీడల నివారణ

బీజామృతం, ఘన జీవామృతం, కషాయం వంటివి తయారు చేసుకుని మొక్కల పెరుగుదలకు, చీడపీడల నివారణకు ఉపయోగిస్తున్నారు. అవసరాన్ని బట్టి వేరు కుళ్లు తెగులుకు అజిటోబ్యాక్టర్, సుడోమోనాస్ వంటివి తీగలకు వారానికొకసారి పిచికారీ చేయాల్సి ఉంటుంది.

దూడల పోషణలో మెలకువలు

పుత్తూరు, న్యూస్‌టుడే: పశువులను ఎంత జాగ్రత్తగా చూసుకుంటామో .. వాటి దూడలను అదే రీతిలో పోషణ చేయాలి. లేకపోతే అవి అనారోగ్యం బారిన పడతాయి. దూడల పోషణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను పశువైద్యాధికారిణి శ్రీదేవి వివరించారు. ఈ సీజన్‌లో అధిక సంఖ్యలో పుశువులు ఈనుతుంటాయి. పుట్టిన దూడలకు తగు మోతాదులో పాలు వదలకపోతే అవి మట్టిని నాకుతుంటాయి. అలాగే ఎక్కువ మంది పొదుగుకు అంటిన మట్టిని నీటితో కడగకుండా పాలు పట్టిస్తారు. ఆ మట్టిలో కలిసిన నులిపురుగులు దూడల పొట్టలోకి చేరి రక్తాన్ని పీల్చి వ్యర్థాల్ని విసర్జిస్తుంటాయి. ఇవి ఒక్కొక్కటి సుమారు రెండు లక్షల వరకు గుడ్లు పెట్టి సంతతిని పెంచుతుంటాయి. ఇవి పెరుగుతున్న కొద్దీ రక్తహీనత ఏర్పడి దూడలు కదల్లేక ఎక్కువ సేపు పడుకుని ఉండి తెల్లగా పాలిపోయి కనిపిస్తుంటాయి. వీటి నివారణకు పుట్టిన దూడలకు తగినన్ని పాలు వదలాలి. ప్రతి రోజూ పాలకు వదిలే ముందు పొదుగును శుభ్రంగా కడిగి పాలు తాగిన తరువాత మూతికి చిక్కాలు తగిలించాలి. పశువైద్యాధికారి సూచించిన మోతాదులో ఆ మందు పట్టిస్తుండాలి.

మామిడిలో జాగ్రత్తలు

తిరుపతి (వ్యవసాయం), న్యూస్‌టుడే: వాతావరణంలో మార్పుల కారణంగా మామిడిలో పూత ఆలస్యం అవుతుంది. మామిడిలో పూత రావడానికి నేలలో బెట్ట పరిస్థితులు చలి వాతావరణం ఉండాలి. కానీ ఈశాన్య రుతుపవన వర్షాలు డిసెంబర్ వరకు కురుస్తుండడంతో భూమి తడిగానే ఉంటుంది. ఈ వర్షాల కారణంగా డిసెంబరు-జనవరిలో రావలసిన పూత, జనవరి-ఫిబ్రవరిలో వస్తోంది. రైతులు పూత తొందరగా రావడానికి పురుగు మందుల కంపెనీల, వ్యాపారుల సలహాలతో అవసరం లేని మందులు కొట్టి మోసపోతున్నారు. శాస్త్రీయ సలహాలు పాటించి మామిడిలో మంచి పూతను పొందవచ్చును. ● ఈశాన్య రుతుపవన వర్షాలు ఆగిన తర్వాత మామిడి తోటను తేలికగా దున్నుకోవాలి. దీని వలన భూమిలో తేమ ఆరి, బెట్ట పరిస్థితులు ఏర్పడతాయి. ● డిసెంబరు మూడో వారంలో 13-0-45(మల్టి కె)లీటరు నీటికి 15 గ్రా, మోనో అమ్మోనియం పాస్ఫేట్ (12:61:0) లీటరు నీటికి, 10 గ్రా లేదా, నానో డీఏపీ లీటరు నీటికి 10 మి.లీ, సూక్ష్మ పోషకాల మిశ్రమం (ఫార్ములా 4) లీటరు నీటికి 2.5 గ్రా లేదా అర్కమ్యాంగో స్పెషియల్ లీటరు నీటికి 5 గ్రా కలిపి పిచికారీ చేయడం వలన మామిడిలో మంచి పూత వస్తుంది. **- మెరుగు భాస్కరయ్య, ఏడీఏ(విశ్రాంత), సాగు సలహాదారు, తిరుపతి**

ప్రశ్న జవాబు

రేణిగుంట, న్యూస్‌టుడే: ప్రశ్న: రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం ప్రవేశ పెట్టిన కొత్త యాప్ పేరు ఏమిటి? దాని ఉపయోగాలు తెలపండి?

- శ్రీనివాసులు, రైతు, కరకంబాడి

జవాబు: ఏపీఏఐఎంఎస్ 2.0- రైతు కోసం కొత్త డిజిటల్ సాయం. ఈ యాప్‌ని ప్లేస్టోర్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. రైతు పంటను రక్షించడానికి, సరైన నిర్ణయం తీసుకోడానికి ఈ యాప్ సహాయ పడుతుంది. ఇందులో భూమి సమాచారం, వాన-వాతావరణ అప్‌డేట్లు, నేల ఫర్టిలిటీ రిపోర్ట్, ముందస్తు చీడపీడల అలెర్ట్, పంట సరైన సాగు పద్ధతులు, రాయితీ-పథకాల వివరాలు, మార్కెట్ ధరల సూచనలు ఉంటాయి. ఇవి రైతుకు చాలా ఉపయోగపడుతుంది.

- సునీల్‌కుమార్, మండల వ్యవసాయాధికారి, రేణిగుంట

నీటమునిగిన వరి సంరక్షణ ఇలా..

తుపాను కారణంగా వరి పొలాలను వర్షపు నీరు ముంచెత్తింది. ఈ పరిస్థితుల్లో పంటను ఏ విధంగా కాపాడుకోవాలి.. సమగ్ర సస్య రక్షణ చర్యలు ఏవిధంగా చేపట్టాలన్న విషయమై వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు రమేష్‌రెడ్డి సమాధానాలు..

విత్తనశుద్ధి ఇలా..: విత్తనశుద్ధిని బట్టి దిగుబడి ఉంటుంది. కిలో విత్తనానికి 2.5 గ్రాముల కార్బండిజిమ్ కలిపి 24 గంటల తరువాత చల్లుకోవాలి. అదే దంప నారుమళ్లయితే లీటరు నీటికి ఒక గ్రాము కార్బండిజిమ్ కలిపి రోజంతా నానబెట్టి మళ్లీ మొలకలను చల్లుకోవాలి. పది లీటర్ల నీటిలో 1.5 కిలోల ఉప్పు కలిపి విత్తనాలను నానబెట్టాలి. తేలియాడే విత్తనాలను పక్కన పడేయాలి. మునిగిన గట్టి విత్తనాలను మళ్లీ రోజంతా మంచినీళ్లల్లో నానబెట్టి చల్లుకోవాలి.

వరిలో సస్యరక్షణ ఇలా..: నారు తీయడానికి వారం రోజులు ముందు సెంటు నారుమడికి 160 గ్రాముల కార్బోఫ్యూరాన్ గుళికలు చల్లుకోవాలి. జింక్‌లోపం రాకుండా ఉండేందుకు జింక్ సల్ఫేట్ ద్రావణాన్ని పిచికారీ చేసుకుంటే మంచిది. నారు నాటేముందు నారుకట్టలను రెండు మిల్లీలీటరు క్లోరిఫైరిపాస్ ద్రావణం లీటరు నీటితో కలిపి ఆ మిశ్రమంలో నారును ముంచి నాటు కోవాలి. కొసలు తుంచి నాటుకుంటే తెగుళ్ల నియంత్రణకు మరింత శ్రేయస్కరం. **- న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి**

మునిగిన పంట సంరక్షణ చర్యలు ఇలా..

వరి పంట సాగు చేసి పక్షం రోజులు పూర్తయ్యాక నీళ్లు నాలుగైదు రోజులు నిలబడి ఉన్నా పంటకు ఇబ్బంది ఉండదు. నారు దశలో నారుమడి కుళ్లి పోవడం, వేసిన విత్తనాలు వర్షం తీవ్రతకు నేలపై తేలియాడే అవకాశముంది. ఈ తరహా పరిస్థితి ఉంటే మళ్లీ కొత్తగా సాగు ప్రారంభించాల్సిందే.

MARGADARSI CHIT FUND PVT. LTD.

Chit Groups are available at our **TIRUPATI BRANCH**

CHIT GROUP	DURATION IN MONTHS	MONTHLY INSTALLMENT	CHIT VALUE
FT D	40	50,000	20,00,000
FT N	40	12,500	5,00,000
FT VD	40	1,50,000	60,00,000

Please Contact Branch Manager **Mr. C.KESAVULU NAIDU**, for further details.
Mobile No. 80080-01815, 91549-87874, Landline: 0877-2224700

అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ డా.వెంకటేశ్వర్

ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 308 వినతులు

తిరుపతి (కలెక్టరేట్), న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార కార్యక్రమానికి 308 వినతులు వచ్చాయి. సోమవారం శిక్షణ కలెక్టర్ సందీప్ రఘువాన్షీ, డీఆర్వో నరసింహులు, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్రరెడ్డి, సుధారాణి, రోజ్‌మాండ్‌తో కలిసి కలెక్టర్ డా.వెంకటేశ్వర్ వినతులు స్వీకరించారు. అత్యధికంగా రెవెన్యూ విభాగానికి సంబంధించి 184 వినతులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఆయా వినతులను నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

టికెట్ ఉంటేనే అంతరాలయ దర్శనం

ఈనాడు కథనానికి స్పందన

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తీశ్వరాలయంలో స్వామి, అమ్మవార్ల అంతరాలయ దర్శనాలకు వెళ్లే భక్తులు విధిగా టికెట్ తీసుకోవాల్సిందేనని ఈవో బాపిరెడ్డి స్పష్టం చేశారు. టికెట్ లేకుండా అంతరాలయ దర్శనాలకు అనుమతించడంపై 'నిఘా ఏమైనట్టు' శీర్షికన ఈ నెల 4వ తేదీన 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఆలయ ఈవో అంతరాలయ దర్శన టికెట్లు కుదింపు వద్దని, భక్తులు ఎవరైనా వాళ్ల వ్యక్తిగత వివరాలు ఇచ్చి అంతరాలయ దర్శన టికెట్లు పొందేందుకు వీలుగా ఆదివారం నుంచి అవకాశం కల్పించారు. తీసుకున్న టికెట్లను మహద్వారం ముందుగా స్కానర్ల ద్వారా తనిఖీ చేయడం, ఆపై మహద్వారం, స్వామి, అమ్మవార్ల ఆలయాల వద్ద పరిశీలించి పంపే విధంగా ఏర్పాట్లు అందుబాటులోకి తీసుకువచ్చారు.

KAIRA DISTRICT CO-OPERATIVE MILK PRODUCERS' UNION LIMITED
ANAND 388 001, Gujarat, India.
Phone: (02692) 256124, 256224, 256324
Amul

Tender AD

Amul Chittoor Dairy, a unit of Kaira District Co-operative Milk Producers' Union Limited popularly known as Amul Dairy having an Annual Turnover of Rs. 14,000+ crores, invites sealed tenders from eligible bidders for following items.

Description
1. Operation & Maintenance of Steam Boiler at ASD, Madanapalli.
2. Operation & Maintenance of Effluent Treatment Plant (ETP) at ASD, Madanapalli.

The details of E-tender can be downloaded free of cost from the Website http://tender.amuldairy.com after online registration. The online tender will be available for access from Dt. 09-12-2025 to Dt. 15-12-2025. The completed tender in physical form will be received up to 17:00 hours on 15-12-2025 by Sr. Manager (Purchase), Sy. Nos: 12/1, 13, 24/1 and 24/2, 25, 26, 27, Greamspet Revenue Village, Vellore Road, Chittoor, Chittoor District, Andhra Pradesh-517001, India. Details regarding eligibility criteria, specifications and other conditions are available in the tender format from the above website. The Amul Dairy reserves the right to accept or reject any or all the tenders without assigning any reason thereof.

9th December 2025 **Managing Director**

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
RASMECC & SARC బ్రాంచ్, 19-3-13, రేణిగుంట రోడ్, తిరుపతి-517501, తిరుపతి జిల్లా, (ఆం.ప్ర.)
అధీకృత అధికారి వివరములు : శ్రీమతి మల్లిక భ్రమరాంభ, చీఫ్ మేనేజర్, మొబైల్ నెం. : 9392303241

ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్ 2002లోని రూల్ 8(6) క్రింద
సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని రూల్ 8(6) నిబంధనలతో చదువబడు (సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద బ్యాంకునకు తనఖా చేసిన చర & స్థిరాస్తుల అమ్మకము)

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధీకృత అధికారి తీసుకున్న నిర్మాణాత్మక / భౌతిక స్వాధీనాన్ని సెక్యూర్డ్ క్రెడిటర్‌కు తనఖా పెట్టిన / వసూలు చేసిన క్రింద వివరించిన స్థిరాస్తిని సెక్యూర్డ్ క్రెడిటర్ "ఎక్కడ ఉందో అలాగే, ఉన్నది ఉన్నట్లుగా" మరియు "ఎక్కడ ఉందో అక్కడ" విక్రయించబడుతుందని ప్రజలకు మరియు ముఖ్యంగా ఋణగ్రహీతలకు మరియు హామీదారులకు నోటీసు ఇవ్వబడింది. దీ.09-07-2025 నాటికి రూ.11,35,055/- (పదకొండు లక్షల ముప్పై ఐదు వేల యాభై ఐదు రూపాయలు మాత్రమే) రికవరీ కోసం మరియు దానిపై సెక్యూర్డ్ క్రెడిటర్‌లకు (స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా) చెల్లించాల్సిన వడ్డీ, ఖర్చులు మరియు ఇతర ఖర్చులు.

ఋణగ్రహీత : 1) శ్రీ పిడతల విజయ రాకేష్ రెడ్డి, తండ్రి : రాజమోహన్‌రెడ్డి,
చిరునామా-1 : డో.నెం. 53-1-7ఎ, క్లాఫ్‌పేట, 1వ లైన్, ఎస్కోల్ చర్చ్ వెనుక, ఒంగోలు-523001.
2) శ్రీ పిడతల విజయరాకేష్ రెడ్డి, చిరునామా-2: బ్లాక్ నెం-1, అబుహలీఫా, ముదర్‌బిన్ నెజర్, 61వ వీధి, 3వ అంతస్తు, ఫ్లాట్ నెం-10, కువైట్.
3) శ్రీ పిడతల విజయ రాకేష్ రెడ్డి, తండ్రి : రాజమోహన్‌రెడ్డి, చిరునామా-3 : డో.నెం.1-67, రాయచోటి రోడ్, టి. సుండుపల్లి - 516130, అన్నమయ్య జిల్లా

అకౌంట్ నెం.: 37083612334 డిమాండు నోటీసు తేది: తేది.09.07.2025
డిమాండ్ నోటీసు ప్రకారం బకాయి మొత్తం: తేది.09.07.2025 నాటికి రూ.11,35,055.00/- వడ్డీ మరియు ఇతర ఖర్చులు.

స్థిరాస్తి వివరములు : చిత్తూరు జిల్లా, శ్రీ బాలాజీ రిజిస్ట్రేషన్ జిల్లా - తిరుపతి, రేణిగుంట సబ్ జిల్లా, రేణిగుంట మండలం, నెం-4, కొత్తపాలెం గ్రామ ఖాతాల సర్వే నెం. 121/2బి, 121/3, 121/4ఎ, 121/4బి, 121/4సి, 121/5బి1, 122/3, 122/4, 122/5ఎ, 122/5బి, 122/6ఎ, 122/6బి, 122/6సి2, 122/9బి, 122/11ఎ, 122/11బి లలోని ఎ.5.78 సెంట్లులో తుడా తిరుపతి ఎల్.పి.నెం.22/జి1/2015, తేది : 28-05-2015 ప్రకారం "శ్రీవారి మెడోస్" పేరుతో ఆమోదించబడిన లేఅవుట్ ప్లాట్ నెం.30 డాక్యుమెంట్ నెం.3614/2017, తేది : 17-08-2017 ప్రకారం శ్రీ పి. విజయ రాకేష్ రెడ్డి, తండ్రి : రాజమోహన్‌రెడ్డి గారికి చెందినది.
హద్దులు : తూర్పు: 40 అడుగుల వెడల్పు రోడ్డు, దక్షిణం : ప్లాట్ నెం.29 లోనిస్థలం, పడమర : ఇతరుల భూమి, ఉత్తరం : 40 అడుగుల వెడల్పు రోడ్డు, వీటి మధ్య కొలతలు : తూర్పు నుండి పడమర ఉత్తరం వైపు : 73.10 అడుగులు లేదా 22.51 మీటర్లు, తూర్పు నుండి పడమర దక్షిణం వైపు : 73 అడుగులు లేదా 22.265 మీటర్లు, ఉత్తరం నుండి దక్షిణం తూర్పు వైపు :66.6 అడుగులు లేదా 20.282 మీటర్లు, ఉత్తరం నుండి దక్షిణం పడమర వైపు :66.66 అడుగులు లేదా 20.282 మీటర్లు.
విస్తీర్ణం : 4882.09 చదరపు అడుగులు లేదా 542.45 చదరపు గజాలు లేదా 135.61అంకణాలు పూర్తిగా.

రిజర్వు ధర : రూ.63,74,000/- ధరావత్తు : రూ.6,37,400/- బిడ్ పెంపుదల : రూ.10,000/-

వేలం తేది : 12-01-2026, ఉ॥ 11.00 గం॥ల నుండి సా॥ 4.00 గం॥ల వరకు
ఆస్తి తనిఖీ తేది మరియు సమయం: తేది.15.12.2025 నుండి 10.01.2026, (ముందస్తు అనుమతితో ఆఫీసు పని వేళల్లో)
జి. వంశీ, మేనేజర్, సెల్ : 99493 49497, బి.బి. శ్రీనివాస్ నాయక్ : 99899 24214. ఫోన్ నెం. : సెల్ నెం. 94407 54134

ఇ-వేలం యొక్క నియమ నిబంధనలు

1) అమ్మకం యొక్క సవివరమైన నియమ నిబంధనల కొరకు, సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క వెబ్‌సైట్: www.sbi.co.in/web/sbi-in-the-news/auction-notices లో ఏర్పాటుచేసిన లింక్ ను రిఫర్ చేయండి. రిజిస్ట్రేషన్, EMD, వేలం యొక్క వివరములు మొదలగు వాటి గురించి సర్వీసు ప్రొవైడర్ M/s.PSB Alliance & M/s. Baanknet యొక్క ఇ-వేలం పోర్టల్: https://baanknet.com/eauction-psb/x-login & https://baanknet.com & టోల్‌ఫ్రీ ఫోన్ నెం.:91 8291220220, Mail ID: support.baanknet@psballiance.comను సంప్రదించవచ్చు.
2) ఆస్తిని రిజిస్ట్రేషన్ చేసుకొనుటకు వర్తించే స్టాంపు డ్యూటీలు బదిలీ ఛార్జీలు, ఫీజు వగైరా మరియు చట్టపరమైన/నాన్ స్టేటుటరీ బకాయిలు, పన్నులు, రేట్లు, అసెస్ మెంట్ ఛార్జీలు, ఫీజులు వగైరా కొనుగోలుదారే భరించవలెను.
గమనిక: ఆసక్తి గల బిడ్డర్లు ఇ-వేలం ముగిసేలోపు PSB Alliance నందు ప్రీ-బిడ్ EMD (Pre-Bid EMD) జమ చేయవలెను. ప్రీ-బిడ్ EMD మొత్తం PSB Alliance బ్యాంక్ అకౌంట్లో జమ అయిన సమాచారం వెబ్సైట్లో పొందుపరిచిన తరువాత మాత్రమే బిడ్డరు యొక్క "వాలెట్"లో చూపించబడుతుంది. బ్యాంకింగ్ ప్రక్రియలో ఇది జరుగుటకు సమయం పట్టవచ్చు. కావున బిడ్డర్లు చివరి నిముషంలో ఇబ్బందులు ఎదుర్కొనకుండా తమ ప్రీ-బిడ్ EMDను సాధ్యమైనంత త్వరగా జమ చేసుకోవాలని సూచించటమైనది.

తేది : 01.12.2025, ప్రదేశం: తిరుపతి సం/-అధీకృత అధికారి, భారతీయ స్టేట్ బ్యాంక్

మహిళా పోలీసులు.. 35 ఏళ్ల ఆత్మీయతలు..!

నిత్యం ఖాకీ దుస్తులు ధరించి ప్రజా సమస్యల పరిష్కారం.. శాంతి భద్రతల పరిరక్షణకు పరితపించే మహిళా పోలీసులు ఆత్మీయతలు పంచుకున్నారు. చిత్తూరు, తిరుపతి జిల్లాలకు చెందిన మహిళా పోలీసులు ఒకే వేదికపై చేరారు. బాగోగులు పంచుకుని ఆనందంగా గడిపారు. పోటీల్లో గెలిచి బహుమతులు అందుకున్నారు. కలసి భోజనం చేస్తూ.. పిల్లల యోగక్షేమాలు చర్చించుకున్నారు. చిత్తూరు, తిరుపతి జిల్లాలో పనిచేస్తున్న 1991 బ్యాచ్‌కు చెందిన మహిళా పోలీసులు 35 ఏళ్ల తర్వాత తిరుపతిలో సమావేశమయ్యారు. ముఖ్యఅతిథులుగా ఏసీబీ అదనపు ఎస్పీ విమలకుమారి, సీఐడీ డీఎస్పీ పద్మలత, ఎస్ఐ అనిత హాజరయ్యారు. ఏఎస్ఐ ఎంఆర్ఎల్ కుమారి, మహిళా పోలీసు నీరజ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. **- న్యూస్‌టుడే, తిరుపతి (నేరవిభాగం)**

తైపీ ఆర్చరీ ఓపెన్‌లో పసిడి పతకం కైవసం

నాయుడుపేట, న్యూస్‌టుడే: నాయుడుపేట పట్టణానికి చెందిన అంతర్జాతీయ ఆర్చరీ క్రీడాకారుడు తిరుమూరు గణేష్ మణిరత్నం చైనాలోని తైపీ కేంద్రంగా ఈ నెల 5- 7 వరకు జరిగిన ఆర్చరీ ఓపెన్ పోటీల్లో పసిడి పతకం సాధించాడు. ఇండోర్ కాంపౌండ్ ఆర్చరీ వ్యక్తిగత విభాగంలో జరిగిన పోటీల్లో 149-138తో చైనాపై గెలిచి పసిడి పతకం కైవసం చేసుకున్నాడు. అతను పలు దేశాల్లో జరిగిన ఆర్చరీ పోటీల్లో పాల్గొని ఇప్పటి వరకు 12 వరకు పసిడి, కాంస్య పతకాలు సాధించాడు. మూడు నెలల క్రితం కెనడాలో జరిగిన ప్రపంచ ఆర్చరీ యూత్ ఛాంపియన్ పోటీల్లో పాల్గొని పసిడి గెలిచాడు. గత నెలలో లక్సెంబర్గ్‌లోని స్ట్రాసెన్‌లో జరిగిన పోటీలో కాంస్యం సాధించాడు.

గణేష్ మణిరత్నం

సర్వదర్శనానికి 8 గంటలు

తిరుమల, తిరుపతి (తితిదే), న్యూస్‌టుడే: సర్వదర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. ఆదివారం శ్రీవారిని 75,343 మంది భక్తులు దర్శించుకోగా రూ.3.69 కోట్ల హుండీ కానుకలు లభించాయి.

18 వేల టోకెన్లు జారీ : శ్రీనివాసం, విష్ణునివాసం, భూదేవి కాంప్లెక్స్ వద్ద భక్తులకు సర్వదర్శన టోకెన్లు సోమవారం 18 వేలు జారీ చేశారు. శ్రీవారి మెట్టు మార్గం లో రెండువేల టోకెన్లు జారీ చేశారు.

టెట్‌కు 12 కేంద్రాలు

తిరుపతి (విద్య), న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు ఈనెల 10 నుంచి 21వ తేదీ వరకు టెట్ నిర్వహించనున్నారు. తిరుపతి జిల్లా, చెన్నైతో కలిపి 12 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి కేవీఎన్ కుమార్ సోమవారం తెలిపారు.

ఇండిగో విమానం రద్దు

రేణిగుంట, న్యూస్‌టుడే: ముంబై నుంచి రేణిగుంటకు రాకపోకలు సాగించే ఇండిగో విమానాన్ని యాజమాన్యం సోమవారం రద్దు చేసింది. వివిధ ప్రదేశాల నుంచి ఇక్కడికి వచ్చే అన్ని ఇండిగో విమానాలు సమయానికి రాకపోకలు సాగించాయి. అయితే ఈ ఒక విమానాన్ని మాత్రం కొన్ని కారణాలతో రద్దు చేసినట్లు తెలిసింది. అయితే ప్రయాణికులకు ముందుగానే సందేశాలు పంపించారు.

EENADU e Classifieds

EDUCATION

DISTANCE EDUCATION
10th/ Inter, BA,B.Com, B.Sc, BBA, BCA, BLIS, MA, M.Com, M.Sc, MCA, MBA, MLIS, Dip, B.Tech, M.Tech, M.Phil, Ph.D, BNYS, BPT, D Pharmacy, B Pharmacy, LLB, BA LLB, 9032030124

TO LET
తిరుపతి ఎయిర్‌పోర్ట్ దగ్గర 3BHK విల్లా & ధనలక్ష్మి నగర్, అవిలాల వద్ద 2 BHK Individual Houses అద్దెకు కలదు. ✆ 80086 25907.

JOBS
Immediate Joining: Wanted 3 x Accountants (M Com/CA), 5 x Computer Operator (Any Degree), 4 x Hindi Voice (Any Degree), for YV Accounting Solutions at Tirupati. Call: 8019670067.

తిరుపతిలోని ప్రముఖ కంపెనీకి బిజినెస్, రిటైర్డ్‌పర్సన్స్, వివాహితులు & యువత కావలెను. Age: 30 to 65, Qua: Inter to PG ✆ 7675095860

అమెరికాలో 1 సం|| బాబు ఆలన, పాలన వ్యక్తిగత సంరక్షణ కొరకు అనుభవంగల ఆడవారు కావలెను. అమెరికా వీసా కల్గినవారు మాత్రమే. ✆ 9440803362.

THE EENADU WAY CLASSIFIEDS
B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే
అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు
వివరాలకు...
80085 13290
మీ చిన్నారులకు పుట్టిన రోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి
B/W: రూ. 600
Colour: రూ. 800
ప్రకటనలపై 5% GST వర్తించును

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తిరుపతి

•తిరుపతి •చంద్రగిరి

విరాళం అందజేస్తున్న కలెక్టర్ డా.వెంకటేశ్వర్

ఫ్లాగ్‌డే హుండీ ప్రారంభం

తిరుపతి (కలెక్టరేట్), న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లో త్రిసాయుధ దళాల పతాక దినోత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఫ్లాగ్ డే హుండీ డ్రైవ్‌ను కలెక్టర్ డా.వెంకటేశ్వర్ విరాళం అందించి ప్రారంభించారు. దేశ భద్రత కోసం త్రిసాయుధ దళాలు అందిస్తున్న సేవలు, త్యాగాలు చిరస్మరణీయం అన్నారు. జిల్లా సైనిక సంక్షేమ అధికారి రాఘవులు, మాజీ సైనిక సంఘం ప్రతినిధులు మనోహర్ రెడ్డి, జయప్రకాష్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

డైరెక్టర్‌గా బాధ్యతల స్వీకరణ

తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నగరానికి చెందిన తెదేపా సీనియర్ నాయకుడు పెరుమాళ్ మధు అమరావతిలో జరిగిన కార్యక్రమంలో సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదలియార్ సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానన్నారు. ప్రభుత్వం తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలు సమర్థంగా నిర్వహిస్తానని ఆయన పేర్కొన్నారు.

బాధ్యతలు చేపడుతున్న పెరుమాళ్ మధు

కదిలివచ్చి.. కష్టం వివరించి

తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: ఓవైపు అనర్హులకు పింఛన్లు పెద్దఎత్తున అందుతుండగా మరోవైపు అర్హులు పింఛను పొందలేక అష్టకష్టాలు పడుతున్నారు. ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని, తమ కష్టం కళ్లారా చూసైనా స్పందించాలంటూ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌కు తరలివస్తున్నారు. దివ్యాంగులకు పరికరాలు, పింఛన్లు అందించి న్యాయం చేయాలంటూ విన్నవిస్తున్నారు.

మంచానికే పరిమితమైనా..

మా కుమారుడు బి.వేణుగోపాల్ (16) పుట్టకతోనే మానసిక వికలాంగుడు. వైద్య పరీక్షల్లో 90 శాతం అంగవైకల్యం నిర్ధారించారు. ఇంట్లో మంచానికే పరిమితమయ్యాడు. ఆరోగ్య పరిస్థితి దృష్టిలో ఉంచుకుని రూ.15 పింఛన్ మంజూరు చేయాలి. గతంలో అనేకసార్లు వినతులు ఇచ్చినా ఇప్పటి వరకు న్యాయం జరగలేదు. కూలి పనులు చేసుకుంటేగాని కుటుంబం గడవని పరిస్థితి. కుమారుడికి మంచి వైద్యం చేయించలేకపోతున్నాం. ప్రభుత్వం స్పందించాలి. **- తల్లిదండ్రులు వెంకటేష్, లక్ష్మీ, జయనగర్, తిరుపతి**

మూడు చక్రాల వాహనం కోసం

పుట్టుకతోనే పోలియో బారిన పడటంతో ఎటూ తిరగలేని పరిస్థితి. మూడు చక్రాల ఎలక్ట్రికల్ వాహనం కోసం అధికారులకు అనేక సార్లు వినతులు ఇచ్చినా ఇప్పటి వరకు పట్టించుకోలేదు. పింఛన్ రూ.15 చెల్లించి ఆదుకోవాలి. మూడు చక్రాల వాహనంతో సొంత అవసరాలు తీర్చుకోవడం సులవవుతుంది. **- సి.జన్సుంధర్‌రాజ్, మదనంబేడు**

విద్యార్థినులకు రక్షణేదీ?

- ❖ 2,117 మందికి ఒక్కరూలేని మహిళా రక్షణ సిబ్బంది
- ❖ సీసీ కెమెరాల పర్యవేక్షణ అరకొరే

తిరుపతి (ఎస్వీయూ), న్యూస్‌టుడే: ఎస్వీయూలోని విద్యార్థినుల వసతిగృహాల వద్ద రక్షణ ప్రశ్నార్థకంగా మారింది. ఇక్కడ ప్రత్యేకంగా మహిళా రక్షణ సిబ్బందిని ఏర్పాటు చేయకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. విశ్వనాథరెడ్డి అనే ఆచార్యుడుతోపాటు పలువురి సీనియర్లు ఇటీవల విద్యార్థినులను ర్యాగింగ్ చేయగా వారు టీసీలు తీసుకొని వెళ్లిపోయారు. వర్సిటీ పరిధిలో రెండు వసతిగృహాల వద్ద తగినంతమంది సిబ్బందిని నియమించకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఏడు దశాబ్దాల చరిత్ర కలిగిన వర్సిటీలో విద్యార్థుల కోసం రెండు వసతిగృహాలు ఉన్నాయి. వాటిలో సైన్స్, ఆర్ట్స్, ఇంజినీరింగ్, ఫార్మసీ, న్యాయ, ఎంబీఏ, ఎంసీఏ, బీఈడీ కళాశాలల నుంచి 2,117 మంది విద్యార్థినులు ఉంటున్నారు. ఒప్పంద పద్ధతిలో దాదాపు 25 మందికి పైగా సిబ్బందిని నియమించుకున్నా వారు సక్రమంగా విధులు నిర్వహించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. కొన్నినెలల కిందట ఓ అగంతుకుడు వసతిగృహాల్లోకి ప్రవేశించగా విద్యార్థినులు గుర్తించడంతో పరారయ్యాడు. సంస్కృత వర్సిటీ ఘటన నేపథ్యంలో పాలకులు తగిన రక్షణ చర్యలు తీసుకోవాలని, విద్యార్థినుల నుంచి ఫీడ్‌బ్యాక్ నిరంతరం తీసుకొనేలా ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు. మహిళా రక్షణ సిబ్బంది 24 గంటలపాటు ఉండేలా ఏర్పాటు చేయాలని, విద్యార్థినుల రాకపోకల సమయాలు నమోదు చేయాలని, వసతిగృహాల వద్ద నిరంతరం సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉండేలా చూడాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. ఇతర విద్యాసంస్థల్లోనూ విద్యార్థినుల రక్షణకు చర్యలు చేపట్టాలన్న విన్నపాలు లేకపోలేదు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
తిరుపతి : 80080 20003
చంద్రగిరి : 80085 74561
పాకాల : 80085 74563

తిరుపతి (నగరపాలిక), న్యూస్‌టుడే: సమస్య: గెస్ట్‌లైన్ హోటల్ ఎదురుగా ఉన్న బ్యాంక్ ఎంప్లాయిస్ కాలనీలో వీధికుక్కల సమస్య ఎక్కువగా ఉంది. 25 వరకు కుక్కలు ఉండటంతో పిల్లలు, వృద్ధులు తిరగడానికి భయపడుతున్నారు. చికెన్ షాప్ మొదలుకొని వీధి చివరి వరకు ఇదే పరిస్థితి. **- రాజు, బ్యాంకు ఎంప్లాయిస్ కాలనీ**

సమాధానం: పరిశీలించి కుక్కల తరలింపునకుగల సాధ్యాసాధ్యాలు పరిశీలిస్తాం. **- డా.గుణశేఖర్, పశువైద్యాధికారి**

గుంతల పూడ్చివేత

ఈనాడు కథనానికి స్పందన

తిరుపతి (గ్రామీణం), న్యూస్‌టుడే: ముత్యాలరెడ్డిపల్లి పోలీస్ స్టేషన్ కూడలిలోని రాయలచెరువు రోడ్డు గుంతలను పూడ్చారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు గుంతలమయంగా మారింది. చోదకుల సమస్యపై ‘ఈనాడు’లో ‘చిల్లులతో ఛిద్రం’ శీర్షికన సోమవారం కథనం వెలువడింది. స్పందించిన అధికారులు గుంతలకు కంకర నింపి చదునుచేశారు.

జ్ఞాపికలతో బాపట్ల వ్యవసాయ కళాశాల క్రీడాకారులు

బాపట్లకు ఓవరాల్ ఛాంపియన్‌షిప్

తిరుపతి (వ్యవసాయం), న్యూస్‌టుడే: శ్రీవేంకటేశ్వర వ్యవసాయ కళాశాల వేదికగా జరిగిన ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం (అంగ్రూ) వార్షిక క్రీడా, సాంస్కృతిక పోటీల్లో బాపట్ల వ్యవసాయ కళాశాల ఓవరాల్ ఛాంపియన్‌షిప్ దక్కించుకుంది. 19 వ్యవసాయ కళాశాలలకు చెందిన 642 మంది విద్యార్థులు క్రీడా, సాంస్కృతిక, వ్యాసరచన, వక్తృత్వ, రంగోలి, నాటికలు తదితర విభాగాల్లో తలపడి ప్రతిభ కనబరిచారు. అంగ్రూ విద్యార్థి వ్యవహారాల అధికారి డా.జి.రామచంద్రరావు అధ్యక్షతన జరిగిన ముగింపు సమావేశంలో పశువైద్య వర్సిటీ వీసీ డా.జె.వి.రమణ, అంగ్రూ రిజిస్ట్రార్ డా.ఎం.వి.రమణ, జూపార్క్ క్యూరేటర్ సెల్వం, పశువైద్య కళాశాల అసోసియేట్ డీన్ డా.జగపతి రామయ్యలు అతిథులుగా హాజరై విజేతలకు బహుమతులు, ట్రోఫీలను అందజేశారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారిని పలువురు ప్రముఖులు సోమవారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్‌లో శ్రీవారిని మూలమూర్తిని తెదేపా ఎమ్మెల్యే గణబాబు, మాజీమంత్రి ఆర్‌కే రోజా దర్శించుకున్నారు. ప్రముఖులకు తితిదే అధికారులు స్వాగతం పలికి శ్రీవారి మూలమూర్తి దర్శనం చేయించారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదాశీర్వచనం అందించగా తితిదే అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన

పాకాల, న్యూస్‌టుడే: ఆయిల్‌పామ్ మొక్కల సాగుపై పదిపుట్లబైలులోని రైతులకు సోమవారం అవగాహన కల్పించారు. జిల్లా ఉద్యానశాఖ అధికారి దశరథరామిరెడ్డి మాట్లాడుతూ హెక్టారు విస్తీర్ణానికి 143 ఆయిల్‌పామ్ మొక్కలను ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందన్నారు. అంతర పంటల సాగు, ఎరువులకు ప్రభుత్వం ఏడాదికి రూ.10,500 చొప్పున నాలుగేళ్లపాటు రాయితీ ఇస్తుందని వివరించారు. చంద్రగిరి ఉద్యానాధికారిణి శైలజ, వెంకటరామన్నగూడెం ఉద్యాన శాస్త్రవేత్త తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

పాడి రైతులకు రాయితీ యంత్రాలు

చంద్రగిరి గ్రామీణ, న్యూస్‌టుడే: పాడిరైతులకు గడ్డి కత్తిరించే యంత్రాలను ప్రభుత్వం 50 శాతం రాయితీపై అందించనుందని నారావారిపల్లి పశువైద్యాధికారి డా.వంశీ తెలిపారు. యంత్రం పూర్తి విలువ రూ.40,500 కాగా రైతు రూ.20,250 చెల్లిస్తే చాలని, ఆసక్తి కలిగిన రైతులు సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని తెలిపారు.

ఆలయ అభివృద్ధికి రూ.52.20 లక్షలు

తిరుపతి (గ్రామీణం): అవిలాల పంచాయతీలోని చెన్నరాయస్వామి ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం రూ.52.20 లక్షలు మంజూరు చేసింది. అభివృద్ధి ఆవశ్యకతను ఇటీవల ఎమ్మెల్యే పులివర్తినాని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిల దృష్టికి తీసుకెళ్లారు.

పీజీఆర్ఎస్ ఫిర్యాదులకు సత్వర పరిష్కారం

తిరుపతి(నేరవిభాగం): ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ఫిర్యాదులకు సత్వర పరిష్కారం చూపాలని ఎస్పీ సుబ్బరాయుడు పేర్కొన్నారు. సోమవారం డీపీఓలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 112 ఫిర్యాదులు అందాయి. అదనపు ఎస్పీ రవి మనోహరాచారి, డీఎస్పీ వెంకటనారాయణ, సీఐలు జయచంద్ర, తిమ్మప్ప, ఇమ్రాన్‌బాషా, ఎస్ఐ ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

12 నుంచి ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభలు

తిరుపతి (విద్య), న్యూస్‌టుడే: తిరుపతి వేదికగా ఈనెల 12 నుంచి ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నట్లు సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి ప్రసన్నకుమార్ తెలిపారు. ఎస్వీయూ శ్రీనివాస ఆడిటోరియం ముందు ఫ్లాష్ మ్యాబ్ నిర్వహించారు. అక్బర్, రవి, దామోదరం తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో కాపులకు సముచిత స్థానం

తిరుపతి (బైరాగిపట్టెడ): కూటమి ప్రభుత్వంలో కాపులకు సముచిత స్థానం కల్పించి జిల్లా వాసులకు నామినేటెడ్ పదవులు కల్పించిందని పలువురు నేతలు కొనియాడారు. తిరుపతిలోని ప్రైవేటు హాల్లో సోమవారం శ్రీకాళహస్తీశ్వర ఆలయ ఛైర్మన్ కొట్టే సాయి, డైరెక్టర్ పగడాల మురళి, కాపు కార్పొరేషన్ డైరెక్టర్లు టి.డి.వరప్రసాద్, తోట వాసుదేవలను సత్కరించారు.

విశ్రాంత ఉపాధ్యాయుడికి డిజిటల్ అరెస్టు వల

సైబర్ సీఐని సంప్రదించడంతో తప్పిన మోసం

తిరుపతి (నేరవిభాగం), న్యూస్‌టుడే: ఓ విశ్రాంత ఉపాధ్యాయుడిని సైబర్ నేరగాళ్లు డిజిటల్ అరెస్టు పేరుతో బురిడీ కొట్టించేందుకు యత్నించిన ఘటన తిరుపతిలో చోటుచేసుకుంది. ఈనెల 6న తిరుపతిలోని పద్మావతిపురం చెందిన ఓ విశ్రాంత ఉపాధ్యాయుడికి తెలియని నెంబరు నుంచి ఫోన్ వచ్చింది. ‘మీ ఫోన్ నంబరు నుంచి బెంగళూరులోని మహిళలకు అనుచిత సమాచారం వచ్చింది. మీపై నమోదైన కేసు విచారణ నిమిత్తం బెంగళూరుకు రావాలంటూ భయపెట్టారు. అంతలో మరో నెంబరు నుంచి బాధితుడికి ఫోన్ వచ్చింది. ‘మీ ఆధార్‌కార్డుతో కొత్త బ్యాంకు ఖాతా తెరిచి రూ.3 కోట్లకుపైగా అక్రమ లావాదేవీలు జరిపారు. దీనిపై సీబీఐ కేసు నమోదు చేసింది. సుప్రీంకోర్టుకు వెళ్లిన ఈ కేసులో వెంటనే అరెస్టు చేస్తున్నామంటూ’ భయపెట్టారు. ఇంట్లో ఎవరికీ చెప్పకుండా గదిలోకి వెళ్లి అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పాలని ఆదేశించారు. చివరకు నిర్దోషిగా నిరూపించుకోవాలంటే ఖాతాలో ఉన్న డబ్బు జమ చేయాలంటూ హుకుం జారీచేశారు. భయపడిన బాధితుడు రూ.8 లక్షలు పంపడానికి నగరంలోని బ్యాంకు వద్దకు బయలుదేరాడు. మార్గమధ్యంలో సైబర్ కార్యాలయానికి వెళ్లి అక్కడి సీఐ వినోద్‌కుమార్‌ను కలిసి వివరాలు చెప్పడంతో ఆయన బ్యాంకు ఖాతాలు పరిశీలించి సీబీఐవి కాదని చెప్పడంతో అసలు విషయం వెలుగుచూసింది.

14న సుపరిపాలన యాత్ర

తిరుపతి(గాంధీరోడ్డు), న్యూస్‌టుడే: అటల్- మోదీ సుపరిపాలన యాత్రను విజయవంతం చేద్దామని భాజపా జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. స్థానిక రాఘవేంద్రనగర్‌లోని పార్టీ కార్యాలయంలో యాత్రకు సంబంధించిన గోడప్రతులను సోమవారం ఆవిష్కరించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ చేపడుతున్న యాత్ర ఈనెల 14న తిరుపతికి చేరుకుంటుందన్నారు. పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్, తితిదే పాలకమండలి సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి జల్లి మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

గోడప్రతుల్ని ఆవిష్కరిస్తున్న భాజపా నాయకులు

ప్రథమ చికిత్స కిట్ల వితరణ

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి దర్శనార్థం ఆర్టీసీలో వచ్చే భక్తులు, సిబ్బంది భద్రత నిమిత్తం తిరుపతిలోని డీబీఆర్, ఎస్‌కే సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో వంద ప్రథమ చికిత్స కిట్లను అందించారు. తిరుమల డిపో మేనేజర్ టి.ఎం.చంద్రయ్య, అసిస్టెంట్ మేనేజర్ ఎ.వి.రమణ, అసిస్టెంట్ ఇంజినీర్ ఎం.డి.సి.శేఖర్, అసోసియేషన్ నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థినులకు వసతి సౌకర్యం కల్పించాలి

తిరుపతి(మహిళా వర్సిటీ), న్యూస్‌టుడే: తరగతులు ప్రారంభమై మూడునెలలు గడుస్తున్నా.. సెమిస్టర్ పరీక్షలు దగ్గరపడుతున్నా ఇంతవరకు పేద విద్యార్థినులకు వసతి కల్పించకుండా కాలయాపన చేస్తున్నారని పలువురు విద్యార్థి సంఘాల నాయకులు మండిపడ్డారు. ద్వితీయ కౌన్సెలింగ్ పూర్తయినప్పటికీ కళాశాలలో సీటు ఇచ్చి వసతి కల్పించకుండా కళాశాల ప్రిన్సిపల్ నారాయణమ్మ వేధిస్తున్నారంటూ ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఉదయ్‌కుమార్, కార్యదర్శి ప్రవీణ్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు శివబాలాజీ, తదితర విద్యార్థి సంఘాల నాయకులు సోమవారం కళాశాల వద్ద ఆందోళనకు దిగారు. మూతబడిన వసతిగృహాలను వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు.

ఆసుపత్రిలో.. దుర్గంధ ప్రవాహం

నగరపాలక సంస్థ కార్యాలయం పరిధిలోని పాత డ్రైనేజీ నుంచి పొంగే మురుగునీరు పక్కనే ఉన్న పాత ప్రసూతి ఆసుపత్రి రహదారిలో ప్రవహిస్తుండటంతో అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. బాలింతలు.. వివిధ సమస్యలతో వచ్చే మహిళలు.. చిన్నారులతో తల్లిదండ్రులు, వైద్యులు, విద్యార్థులు, ఉద్యోగులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు.. ఇక్కడే డీఎంహెచ్ఓ కార్యాలయం ఉన్నా పట్టించుకోవట్లేదని.. రుయా, నగరపాలక అధికారులు స్పందించి పరిష్కారం చూపాలని రోగుల బంధువులు కోరుతున్నారు. **- ఈనాడు, తిరుపతి**

‘అడ్డు’గోడను తొలగించండి

తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే: 29వ వార్డుకు చెందిన కుమ్మరితోపు - పోలీసు క్వార్టర్స్ మధ్య ఉన్న అడ్డుగోడను తొలగించాలని మాజీ ఎమ్మెల్యే మన్నూరు సుగుణమ్మ కోరారు. సోమవారం ఎస్పీ సుబ్బరాయుడుని కలిసి విన్నవించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. అలాగే వైకాపా ప్రభుత్వం రాజకీయ విభేదాలతో తెదేపా నాయకులపై పెట్టిన తప్పుడు కేసులను తొలగించాలని కోరారు. పార్టీ నగర అధ్యక్షులు చిన్నబాబు, బుల్లెట్ రమణ, దంపూరి భాస్కర్ యాదవ్, బీజీ కృష్ణయాదవ్, మునిశేఖర్ రాయల్, పుష్పావతి, కేవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత పోటీల విజేతలకు అభినందనలు

తిరుపతి (విద్య), న్యూస్‌టుడే: తితిదే, హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఇటీవల అన్నమయ్య కళాక్షేత్రంలో నిర్వహించిన భగవద్గీత ధారణ పోటీల్లో శ్రీవేంకటేశ్వర జూనియర్ కళాశాల విద్యార్థులు డి.నిశాంత్ చక్రవర్తి (ఎంఈసీ), ఎం.జశ్వంత్ (ఎంపీసీ) ప్రథమ, ద్వితీయ స్థానాల్లో బహుమతులు స్వీకరించినట్లు కళాశాల ప్రిన్సిపల్ సి.ప్రకాష్‌బాబు తెలిపారు. సోమవారం వారిని అభినందించారు. అధ్యాపకులు డా.కె. వెంకటరమణమ్మ, డా.వి.ప్రసన్నలక్ష్మి, కె.యమున పాల్గొన్నారు.

IN THE COURT OF THE 1st ADDITIONAL CIVIL JUDGE (JUNIOR DIVISION) OF TIRUPATI
I.A. NO: 168 OF 2023
O.S. NO: 1210 OF 2022
Between:-
T. Padmanabha ....Petitioner/Plaintiff
And
The state of A.P. represented by the District Collector, Tirupati District and others ...Respondents/Defendants
NOTICE TO THE PROPOSED 11th DEFENDANT
To,
P.Chandrasekhar Reddy, S/o. P. Bhaskar Reddy, residing at Tirumala Nagar, Opp. Upparapalli, Thummalagunta, Post, Tirupati Rural mandal, Tirupati district.
Sir,
Please take notice that the above I.A.is posted to 10-12-2025 for your appearance. If you fail to appear before the above said Court on 10-12-2025 at 10-30 A.M, either in person or through your pleader and file your objections, the above I.A. will be heard and determined in your absence.
B. NARAHARI REDDY, M.A.LLB., ADVOCATE,TIRUPATI

విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ భువనేశ్వరిదేవి

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

తిరుపతి(మహిళా వర్సిటీ), న్యూస్‌టుడే: గతనెల 29, 30న కాకినాడలో జరిగిన అండర్ -19 జిమ్నాస్టిక్స్ పోటీల్లో శ్రీపద్మావతి మహిళా జూనియర్ కళాశాల విద్యార్థినులు సత్తాచాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. సోమవారం ప్రిన్సిపల్ భువనేశ్వరిదేవి విద్యార్థినులను అభినందించారు. విద్యార్థినులు ధరణి, గంగాభవాని, రెడ్డిజీవన, అమృత బంగారు, వెండి పతకాలు సాధించారని, వీరిలో ధరణి, గంగాభవాని, చైత్రశ్రీ, చామంతి వచ్చేనెల 14 నుంచి కోల్‌కతాలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటున్నట్లు వెల్లడించారు. విద్యార్థినులకు శిక్షణ ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్ నిర్మలను సమావేశంలో అభినందించారు.

జాతీయ జట్టులో చోటు

తిరుపతి (క్రీడలు), న్యూస్‌టుడే: గోల్ షాట్‌బాల్ భారత జట్టులోకి జిల్లాకు చెందిన క్రీడాకారిణి ఎంపికైనట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజేంద్రప్రసాద్, మనోహర్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. గతనెల నవంబరు 15న పంజాబ్ రాష్ట్రంలో జరిగిన భారత జట్టు ఎంపిక క్యాంప్‌లో యర్రావారిపాలెం చెందిన దేవశ్రీ ఎంపికైంది. ఈనెల 9 నుంచి 14 వరకు భారత జట్టుతో సాధనచేసి 15 నుంచి 19వ తేదీ వరకు నేపాల్‌లో జరగనున్న దక్షిణాసియా ఛాంపియన్‌షిప్‌లో భారత తరఫున ప్రాతినిధ్యం వహించనుంది.

దేవశ్రీ

క్రీడాకారులతో గోపీనాయుడు, సురేష్

తైక్వాండోలో సత్తా

తిరుపతి(క్రీడలు): ఓపెన్ నేషనల్ తైక్వాండో ఛాంపియన్‌షిప్‌లో తిరుపతిలోని సత్యనారాయణపురానికి చెందిన తైక్వాండో క్లబ్ క్రీడాకారులు సత్తాచాటారు. ఆదివారం బెంగళూరు వేదికగా జేపీ పార్క్ తైక్వాండో ఛాలెంజ్ కప్ ఓపెన్ నేషనల్ ఛాంపియన్‌షిప్- 2025 పోటీలు జరిగాయి. అండర్- 6, 8, 10, 12, 14, 17 కేటగిరీల్లో మొత్తం పదిమంది క్రీడాకారులు స్వర్ణ, రజత, కాంస్య పతకాలు సాధించారు. వీరిని గ్రాండ్ మాస్టర్ గోపీనాయుడు, శిక్షకుడు సురేష్ అభినందించారు.

In The Court of the Principal Junior Civil Judge Tirupati
OS No. 403/2023
Indian Bank, Main Branch, Tirupati ...Plaintiff
Vs
S.Shanaz Begum and another ...Defendant
SUMMONS TO DEFENDANT
S.Shahnaz Begum w/o late S.K.Usman Basha, residing at D.No.6-11-59, Chenna Reddy colony, Tirupati, Tirupati District.
Please take summons that the above suit filed by the plaintiff for recovery of loan amount against Defendant and the matter is posted to 5.1.2026 for your appearance either in person or through your counsel at about 10.30 a.m. in the above court. In the event of your absence, the matter will be decided exparte.
Date of hearing 5.1.2026
K.RAMESH BABU
ADVOCATE, TIRUPATI

ఉద్యోగులతో సమావేశమైన ఖజానాశాఖ అధికారి లక్ష్మీకర్‌రెడ్డి

జనవరి నుంచే లైఫ్ సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేయండి

తిరుపతి (జీవకోన), న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగులు (పెన్షనర్లు) జనవరి ఒకటో తేదీ నుంచి మాత్రమే తమ లైఫ్ సర్టిఫికెట్లను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని, అంతకుముందు నమోదు చేసుకున్నా చెల్లవని జిల్లా ఖజానాశాఖ అధికారి లక్ష్మీకర్ రెడ్డి సూచించారు. సోమవారం జిల్లా పెన్షనర్ల సంఘం నేతలతో ఆయన సమావేశం నిర్వహించారు. కొందరు పింఛనుదార్లు 2026 సంబంధించి పింఛన్ పొందేందుకు ఈ ఏడాది నవంబరు, డిసెంబరు నుంచే ఆన్‌లైన్‌లో లైఫ్ సర్టిఫికెట్లు నమోదు చేసుకుంటున్నారని, అవి చెల్లవని స్పష్టం చేశారు. ఏపీ ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కె.ఆర్.శంకర్, సహాధ్యక్షుడు టి.గోపాల్, నగర ప్రధాన కార్యదర్శి వెంకటేశంశెట్టి, జిల్లా కోశాధికారి తాళ్లపాక సిద్ధ్య, నాయకులు టి.ఎ.రమణ, టి.కృష్ణమూర్తి,అల్లాబక్ష్, కరీం, భానుప్రసాద్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

16న నామినేషన్ల స్వీకరణ

తిరుపతి (తితిదే), న్యూస్‌టుడే: తితిదే విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘానికి సంబంధించి ఈనెల 16 నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం ఉంటుందని ఆ సంఘం కన్వీనర్ వి.కృష్ణస్వామి సోమవారం ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులు పరిపాలనా భవనం ఆవరణలోని ఉద్యోగుల కార్యాలయంలో లభిస్తాయని పేర్కొన్నారు.

నేడు విద్యుత్తు అంతరాయం

తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: నగరంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ గంగాధర్‌రెడ్డి తెలిపారు. వరదరాజనగర్, శ్రీపురం కాలనీ, యశోదనగర్, సీపీఎం కార్యాలయం పరిసర ప్రాంతాల్లో సరఫరా నిలిపివేయనున్నారు.

ఎన్ఎస్ఎస్ శిబిరాల ప్రారంభం

తిరుపతి(మహిళా వర్సిటీ), న్యూస్‌టుడే: శ్రీపద్మావతి మహిళా వర్సిటీ ఎన్ఎస్ఎస్ - 17, 22 యూనిట్ల ఆధ్వర్యంలో శానంబట్ల, బ్రాహ్మణపట్టు గ్రామాల్లో జరగనున్న ప్రత్యేక శిబిరాలు సోమవారం ప్రారంభమయ్యాయి. శిబిరానికి వంద మంది వాలంటీర్లతో వెళ్తున్న బస్సును ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ లలితకుమారి ప్రారంభించారు. ప్రోగ్రామ్ అధికారులు శాంతిశ్రీ, భారతి, దేవి పాల్గొన్నారు.

‘అఖండ-2’ విఘ్నాలు తొలగాలంటూ పూజలు

తిరుపతి (నగరం) : అఖండ-2 చిత్రం విడుదలకు ఎదురవుతున్న విఘ్నాలు తొలగిపోయి... త్వరలో ప్రేక్షకుల ముందుకు రావాలని బాలకృష్ణ అభిమానుల సంఘం నాయకులు మనోహర్‌రెడ్డి, మదన్‌మోహన్ ఆకాంక్షించారు. సోమవారం అలిపిరి పాదాల మండపం వద్ద సంఘం ఆధ్వర్యంలో 110 కొబ్బరికాయలు కొట్టి శ్రీవారిని ప్రార్థించారు. సురేష్, రమేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రికి సత్కారం

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: శ్రీవారి దర్శనార్థం విచ్చేసిన కేంద్రమంత్రి శ్రీపాద యశోనాయక్‌ను అఖిల భారతీయ యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు శంకర్ యాదవ్ తదితరులు సోమవారం సత్కరించారు. కపిలతీర్థం విచ్చేసిన ఆయనకు పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు. తెదేపా పట్టణ అధ్యక్షుడు వట్టికుంట శంకర్ నారాయణ, రమేష్ యాదవ్, కిరణ్ యాదవ్, చిట్టి యాదవ్, సోము యాదవ్, హరి, సురేష్ పాల్గొన్నారు.

కేంద్రమంత్రి శ్రీపాద యశోనాయక్‌ని సత్కరిస్తున్న శంకర్ యాదవ్

ఉన్నతస్థాయి విచారణ చేయించాలి : ఎంపీ

తిరుపతి(మంగళం), న్యూస్‌టుడే: జాతీయ సంస్కృత వర్సిటీ ఘటనపై ఉన్నతస్థాయి విచారణ చేయించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎంపీ మద్దిల గురుమూర్తి సోమవారం పార్లమెంటులో వాయిదా తీర్మానం ప్రవేశపెట్టారు. గురువుగా బాధ్యతాయుతమైన స్థానంలో ఉండి విద్యార్థిని భవిష్యత్తుతో ఆడుకోవడం దారుణమని, లైంగికంగా వేధించి బెదిరింపులకు దిగడం హేయమైన చర్య అన్నారు.

రైలు ఢీకొని ఐఐటీ విద్యార్థి మృతి

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: రైలు ఢీకొని ఐఐటీ విద్యార్థి మృతిచెందిన ఘటన ఖరగ్‌పూర్‌లో చోటుచేసుకుంది. తిరుపతి జిల్లాకు చెందిన భట్టారం శ్రవణ్ ఐఐటీలో రీసెర్చ్ స్కాలర్‌గా ఉన్నారు. శనివారం రాత్రి శ్రవణ్ ఐఐటీ సమీపంలోని రైల్వే ట్రాక్ దాటుతుండగా రైలు ఢీకొని గాయపడ్డాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందాడు.

(c) eenadu

శ్రీకాళహస్తి

•శ్రీకాళహస్తి • సత్యవేడు

శాస్త్రోక్తంగా సంకటహర హోమం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని కన్యమూల గణపతి(అంజి అంజి వినాయక స్వామి) ఆలయం వద్ద సంకటహర చతుర్థిని పురస్కరించుకుని యాగపూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం వినాయకస్వామికి విశేష పూజలు, ప్రత్యేక అభిషేకాలు జరిపారు. వేదోక్తంగా పూర్ణాహుతి కార్యక్రమాన్ని చేపట్టారు. గణనాథుడికి ధూప, దీప, నివేదనలు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో ఎన్.ఆర్.కృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ నాగభూషణం, తనిఖీ అధికారి సుదర్శనం, భక్తులు పాల్గొన్నారు.

పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

క్వారీ ఏర్పాటుకు అనుమతులు రద్దు చేయాలి

బీఎన్‌కండ్రిగ: బీఎస్‌పురం పరిధిలో క్వారీ ఏర్పాటుకు ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలని గ్రామస్థులు సోమవారం తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. బీఎస్‌పురం రెవిన్యూలో సర్వే నెం.28పి లోని 23 ఎకరాల భూమిలో వరి, నీలగిరి తైలం సాగు చేసుకుంటున్నామని, ఈ భూమిని తహసీల్దారు శ్రీదేవి గ్రామంలో విచారణ చేపట్టకుండా క్వారీ ఏర్పాటుకు ఎన్‌వోసీ మంజూరు చేశారన్నారు. దీనిపై జిల్లా పాలనాధికారికి ఫిర్యాదు చేశామని, అనుమతులు రద్దు చేయకపోతే ఆందోళన చేపడతామని తెలిపారు. సర్పంచి చింతా రాజయ్య, మణి పాల్గొన్నారు.

తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

అనుసంధానం లేక అవస్థలు

ఇటీవల కురిసిన వర్షాలకు నియోజకవర్గంలో పలు రోడ్లు ఛిద్రం

కోతకు గురైన నాగలాపురం టీపీకోటలో రోడ్డు

సత్యవేడు, న్యూస్‌టుడే: వైకాపా పాలనలో నియోకవర్గంలో రోడ్ల మరమ్మతుల గురించి పట్టించుకోకపోవడంతో బాగా దెబ్బతిన్నాయి. కల్వర్టులు, రోడ్లు బాగు చేయాలని కూటమి ప్రభుత్వంపై ఆశాలు పెట్టుకున్నారు.

ఎక్కడెక్కడ రోడ్డు ఎత్తు పెంచి బ్రిడ్జిలు నిర్మించాలి

నాగలాపురం వెస్ట్ ఎస్సీ కాలనీ వద్ద, టీపీ కోట గ్రామం భూపతీశ్వర కోన మార్గం వద్ద, బుచ్చినాయుడు కండ్రింగ మండలంలో ఆలత్తూరు, కాటూరులో, వరదయ్యపాళెం గోవర్ధనగిరి, సత్యవేడు వీఆర్ కండ్రిగ వద్ద ఉన్న బాలాజీ సాగర్ బ్రిడ్జి తాత్కాలికంగా ఉంది. కల్వర్టులు నిర్మించే సమయంలో ఎత్తు పెంచి నిర్మిస్తే వరద నీరు రోడ్డుపైకి చేరే అవకాశం తక్కువ.

✧ నాగలాపురం వెస్ట్ ఎస్సీ కాలనీ వద్ద నాగలాపురం- టీపీ కోట రోడ్డు మార్గం నాగలాపురం వెస్ట్ ఎస్సీ కాలనీ వద్ద ప్రతి ఏటా పొలాలు నుంచి వచ్చే వరద నీరు రోడ్డుపై రావడంతో ప్రతి ఏడాది రోడ్డు కోతకు గురవుతుంది. రోడ్డు నిర్మించే సమయంలో ఎత్తు పెంచి కల్వర్టులు నిర్మించగల్గితే పై నుంచి వచ్చే వరద సులువుగా వెళ్తుంది. టీపీ కోట గ్రామంలో వచ్చే మురుగునీరు, పై నుంచి వరద నీరు ప్రధాన రహదారిపై చేరి బయటకు వెళ్లే పరిస్థితి లేదు. నాగలాపురం-ద్వారక నగర్‌కు ఇటీవల ఎమ్మెల్యే భూమి పూజ చేశారు.

✧ బుచ్చినాయుడు కండ్రిగ మండలంలో ఆలత్తూరు, కాటూరు వద్ద ఉన్న బ్రిడ్జిలపై నుంచి వచ్చే వరద ప్రవహిస్తోంది, నిర్మించే సమయంలో ఎత్తు పెంచి నిర్మిస్తే బాగుంటుందని స్థానికులు కోరుతున్నారు.

నారాయణవనం పాలమంగళం ఉత్తరం అరుణానది ఉద్ధృతంగా ప్రవహిస్తున్నా రోడ్డు దాటుతున్న ద్విచక్ర వాహనదారులు

✧ సత్యవేడు మండలంలోని కన్నావరం గ్రామంలో ప్రతి ఏటా వర్షాలకు సత్యవేడు- నాగలాపురం వయా టీపీ కోట మార్గంలో గతంలో నిర్మించిన కల్వర్టులు మట్టితో పూర్తి స్థాయిలో పూడింది. గ్రామం పై భాగం నుంచి వచ్చే ఊటనీరు, వర్షపునీరు ప్రధాన రహదారిపై పారుతుంది. దీంతో రోడ్డు ఛిద్రమై స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

✧ నారాయణవనం మండలంలో తిరువట్యం, తుంబూరు, పాలమంగళంలో పాలమంగళం ఉత్తరంలో బ్రిడ్జిని ఇటీవల నిర్మించి అసంపూర్తిగా వదిలేశారు. దీంతో శిథిలావస్థ బ్రిడ్జిపై ప్రజలు భయం భయంగా రాకపోకలు సాగిస్తున్నారు. ప్రతి ఏటా వర్షాలకు తిరువట్యం, తుంబూరు గ్రామాల ప్రజలు జలదిగ్బంధంలో ఇరుక్కు పోతున్నారు. తుంబూరు, తిరువట్యం గ్రామల సమీపంలోని అరుణానదిపై కాలువలపై తప్పని సరిగా బ్రిడ్జి నిర్మించాల్సి ఉంది. ఇటీవల కలెక్టర్ ఈ రెండు గ్రామాలను సందర్శించారు. ప్రతిపాదనలు పంపాలని అధికారులకు తెలిపారు.

✧ వరదయ్యపాళెం మండల కేంద్రంలోని గోవర్ధనపురం బ్రిడ్జి ప్రతి ఏటా వరదలకు ఛిద్రమవుతుంది. మొదట బ్రిడ్జిపై తారురోడ్డు ర.భ.సా అధికారులు వేశారు. బ్రిప్పర్ల దాటికి తారురోడ్డుపై పెద్ద పెద్ద గుంతలతో దర్శనమిస్తోంది. ప్రతిసారీ తాత్కాలిక మరమ్మతులతో సరిపెడుతున్నారే తప్ప శాశ్వత నిర్మాణానికి చర్యలు చేపట్టడంలేదు. ఈ మార్గంలో వెళ్లే ద్విచక్ర వాహనాదారులు, ఆటోలు, పాదచారులు, ప్రజలు అవస్థలు పడుతున్నారు. వరదయ్యపాళెం-చిన్నపాండూరు, వరదయ్యపాళెం-సత్యవేడు, వరదయ్యపాళెం-తడ రోడ్డు అధ్వానంగా మారింది.

త్వరలో రోడ్లు, కల్వర్టులు నిర్మిస్తాం

నియోకవర్గంలో పలు అభివృద్ధి పనులకు కూటమి ప్రభుత్వం ఇటీవల నిధులు మంజూరు చేసింది. పంచాయతీ రాజ్ కింద రూ.34కోట్లు, ర.భ.సా కింద రూ.16కోట్ల నిధులు మంజూరయ్యాయి. వర్షం ఆగిన వెంటనే భూమి పూజ చేసి పనులు రెండు మూడు నెల్లలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తాం.

- కోనేటి ఆదిమూలం. ఎమ్మెల్యే.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
శ్రీకాళహస్తి: 80085 74555
నాగలాపురం: 98854 43308

వీధుల్లో అంధకారం

నారాయణవనం, న్యూస్‌టుడే: సమస్య: ఎరికంబట్టులో వీధి దీపాలు లేక చీకట్లు కమ్ముకున్నాయి. దీంతో రాత్రి వేళల్లో విషసర్పాల భయంతో ఇంటి నుంచి బయటకు రావడానికి ఇబ్బందులు పడుతున్నాం. **- ధనంజయ**

సమాధానం: గ్రామంలో వెలగని వీధి దీపాల స్థానంలో కొత్త దీపాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటాం.
- వేనయ్య, ఈవోపీఆర్డీ

బీఎన్‌కండ్రిగ, న్యూస్‌టుడే: సమస్య: బీఎన్‌కండ్రిగ సచివాలయ సమీపంలో వీధులకిరువైపులా పిచ్చి మొక్కలు పెరిగి రహదారికి అడ్డుగా ఉన్నాయి. **- రమేష్**

సమాధానం: త్వరలో పిచ్చ మొక్కలు తొలగించి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూస్తాం.
- పెంచలయ్య, పంచాయతీ కార్యదర్శి

రేణిగుంట, న్యూస్‌టుడే: సమస్య: రేణిగుంట పంచాయతీలోని జడ్పీ బాలుర పాఠశాల ఎదుట కాలువల్లో మట్టి పేరుకు పోవడంతో మురుగునీరు నిలుస్తోంది. **- కుమార్**

సమాధానం: రెండు రోజుల్లో శుభ్రత పనులు చేయిస్తాం. **- నాగేశం, సర్పంచి**

రేణిగుంట: సమస్య: రేణిగుంట పంచాయతీలోని శ్రీకాళహస్తి రోడ్డులో వీధి దీపం వెలగడం లేదు. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో ఇబ్బందులు తప్పడం లేదు. **- కృష్ణ**

సమాధానం: ఇక్కడ వెంటనే వీధి దీపం ఏర్పాటు చేయిస్తాం. **- రమేష్‌బాబు, పంచాయతీ కార్యదర్శి**

చెత్త దిబ్బల తొలగింపు

సత్యవేడు: స్థానిక కృష్ణయ్య శెట్టి వీధిలో వారం రోజుల పాటు పేరుకుని పోయిన చెత్తను పారిశుద్ధ్య కార్మికులు తొలగించారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు పేరుకు పోయిన చెత్త దుర్వాసన వస్తోందని సోమవారం 'ఈనాడు' లో కథనం ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ కార్యదర్శి మునిరవికుమార్ సమస్యను పరిష్కరించారు.

మురుగునీరు ...

శ్రీకాళహస్తి: పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో మురుగునీటి కాల్వల్లో స్తంభించిన మురుగునీటిని పారిశుద్ధ్య కార్మికులు శుభ్రం చేశారు. రోజుల తరబడి నీళ్లు నిలబడి పోవడంతో దుర్గంధంగా మారడంపై 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా పురపాలక సంఘ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించారు. నివాస గృహస్థులు ఆనందం వ్యక్తం చేశారు.

మలుపు.. ప్రమాదపు పిలుపు

పట్టణంలోని ఏపీసీడ్స్ కూడలిలో రోడ్డు పొడవునా గుంతలు ఏర్పడ్డాయి. రోడ్డు కుంగిపోవడంతో ప్రమాదకరంగా మారింది. గుంతలకు అడ్డుగా సూచికలు పెట్టినా రాత్రి వేళల్లో, అందులోనూ అర్ధరాత్రి తరువాత మంచు కురుస్తుండటంతో ప్రమాదకరంగా మారుతోంది. మలుపు కావడం, వాహనాల రాకపోకలు వేగంగాను, మరింత ఎక్కువగా ఉండటంతో ప్రమాదం పొంచి ఉంది. వీటిని బాగు చేసే దిశగా అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది. **- న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి**

సూచిక.. కనిపించక తికమక

శ్రీకాళహస్తీశ్వరుని దర్శనార్థం వచ్చే భక్తులు దర్శనం అయ్యాక వెళ్లేందుకు అవస్థలు తప్పడం లేదు. ప్రధానంగా నెల్లూరు, తిరుపతి మార్గాలను నిర్దేశిస్తూ ఏర్పాటు చేసిన సూచికలు వంగిపోయాయి. చోదకులకు కన్పించకుండా ఉండటంతో ఏపీసీడ్స్ కూడలికి వచ్చాక ఎటు వెళ్లాలో తెలియక అవస్థలు పడుతున్నారు. చోదకులకు కన్పించే విధంగా సూచికలు అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు చేపట్టాల్సి ఉంది.

- న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి

కాలనీకి చేరేదెలా..?

ఏర్పేడు మండలంలోని రెడ్డిగుంట ఎస్టీకాలనీకి వెళ్లే రోడ్డు కోతకు గురికావడంతో కాలనీవాసులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు అటవీప్రాంతం నుంచి ఊటనీరు కాలువకు పెద్దఎత్తున చేరడంతో గుడిమల్లం-రెడ్డిగుంట రోడ్డు కల్వర్టు కొట్టుకుపోయింది. దీంతో కాలనీ వాసులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాల్సి ఉంది.

- న్యూస్‌టుడే, ఏర్పేడు

గ్రామీణ బ్యాంకులో ఉచిత కంటి వైద్య శిబిరం

నాగలాపురం, న్యూస్‌టుడే: స్థానిక ఆం.ప్ర. గ్రామీణ బ్యాంకులో తిరుపతి అగర్వాల్ వైద్యశాల ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరాన్ని బ్యాంకు మేనేజరు సంతోష్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. బ్యాంకుకు వచ్చిన ఖాతాదారులకు ఉచితంగా కంటి పరీక్షలు చేయించి మందులను అందించారు. 20 మందికి కంటి శస్త్ర చికిత్సలు అవసరమని వైద్యులు సూచించారు. వైద్యులు దొరవేలు, సిబ్బంది పాల్గొన్నారు.

పోటీల్లో ప్రావీణ్యం.. బహుమతులు సొంతం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: పట్టణంలోని నారాయణ ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాల విద్యార్థులు పోటీల్లో తమదైన ప్రావీణ్యాన్ని సంపాదించి బహుమతులు సొంతం చేసుకున్నారు. పాఠశాల ఆవరణలో 'ఈనాడు' ఆధ్వర్యంలో సోమవారం 'విద్యార్థుల జీవితాలపై చరవాణి ప్రభావం' అంశంపై వక్తృత్వ పోటీలు జరిగాయి. పాఠశాలకు చెందిన టి.కె.జతిన్, కుషార్, ఆకాంక్ష మహాలింగ్‌లు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో విజేతలుగా నిలిచారు. వీరికి పాఠశాల ప్రిన్సిపల్ ఈశ్వరయ్య బహుమతులతో పాటు ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కేదార్, వెంకటకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన విద్యార్థులతో పాఠశాల ప్రిన్సిపల్ ఈశ్వరయ్య

అరణియార్‌ను పరిశీలిస్తున్న తుడా ఛైర్మన్ దివాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

పర్యాటకాభివృద్ధికి అదనపు నిధులు

పిచ్చాటూరు, న్యూస్‌టుడే: అరణియార్ చెంత పర్యాటకాభివృద్ధికి ప్రతిపాదనలు పంపిన వెంటనే అదనపు నిధులను కేటాయిస్తామని తుడా ఛైర్మన్ దివాకర్‌రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంతో కలసి ఆయన అరణియార్ వద్ద జరుగుతున్న పర్యాటకాభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గతంలో మంజూరు చేసిన రూ.రెండు కోట్ల తుడా నిధులతో వ్యూటవర్, బోటింగ్‌జెట్టి నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. ధరల పెరుగుదల కారణంగా గతంలో మంజూరు చేసిన నిధులు సరిపోనందున అదనపు నిధులు ఇవ్వాలని కోరగా తుడా ఛైర్మన్ సానుకూలంగా స్పందించారన్నారు. పిచ్చాటూరులో మురుగునీటి కాలువలను సైతం తుడా నిధులతో నిర్మిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీఈ శ్రీనివాసులు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ ఇళంగోవన్‌రెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యురాలు సుమాంజలి, మాజీ ఎంపీపీలు మురళి, గోవిందస్వామి తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో వ్యవసాయం .. నాగలాపురం : వ్యవసాయంలో అధిక దిగుబడుల సాధనకు తొలుత భూసార పరీక్షలు ఆపై సమగ్ర యాజమాన్య పద్ధతులే రైతులకు పునాదులుగా నిలుస్తాయని జిల్లా వనరుల కేంద్ర సహాయ సంచాలకులు సౌభాగ్యలక్ష్మి సూచించారు. కృష్ణాపురంలలో సోమవారం అవగాహన సదస్సులు నిర్వహించారు.

శ్రీసిటీ హైటెక్ పోలీస్‌స్టేషన్ ఎస్సైగా ప్రియాంక

సత్యవేడు: శ్రీసిటీ హైటెక్ పోలీస్‌స్టేషన్ నూతన ఎస్సైగా ప్రియాంక సోమవారం బాధ్యతలు స్వీకరించారు. తిరుపతి ఎస్‌బీ నుంచి ఇక్కడకు ఆమె బదిలీపై వచ్చారు. ఇక్కడ ఎస్సైగా పని చేసిన అరుణ్‌కుమార్‌రెడ్డిని తిరుపతికి బదిలీ చేశారు. బుచ్చినాయుడు కండ్రిగ ఎస్సై సుధీర్ కుమార్‌రెడ్డి, చంద్రగిరి పీఎస్ నుంచి చిత్ర తరుణ్‌లు ఇప్పటికే ఎస్సైగా బాధ్యతలు తీసుకున్నారు..

పిచ్చాటూరుకు రాఘవేంద్ర

పిచ్చాటూరు, న్యూస్‌టుడే: పిచ్చాటూరు ఎస్సైగా రాఘవేంద్ర సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఆయన భాకరాపేట నుంచి బదిలీపై పిచ్చాటూరుకు రాగా.. ఇక్కడ ఎస్సైగా పని చేస్తున్న వెంకటేష్ శ్రీకాళహస్తి రూరల్‌కు బదిలీపై వెళ్లారు.

మనోనేత్రంతో.. లక్ష్యం వైపు

అంధబాలుని సాహసయాత్ర

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: పట్టుమని పదేళ్ల బాలుడు. అందులోనూ అంధుడు. కళ్లు లేకున్నా మనోనేత్రంతో లక్ష్యం సాధించేందుకు చేసిన ప్రయత్నం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఏర్పేడు మండలం ఎండీపుత్తూరు గ్రామానికి చెందిన హర్షవర్ధన్ స్కేటింగ్‌లో ప్రపంచ రికార్డు నెలకొల్పాలని సంకల్పించాడు. అందుకు కుటుంబ సభ్యులు ఇచ్చిన ప్రోత్సాహంతో ఆదివారం బెంగళూరు సరిహద్దు అయిన నంగిలి టోల్‌గేట్ నుంచి ఉదయం 6 గంటలకు స్కేటింగ్‌తో 220 కిలోమీటర్ల సాహసయాత్రను ప్రారంభించారు. రాత్రి 10.30 గంటలకు శ్రీకాళహస్తి మీదుగా ఊరందూరు సమీపంలోని బైపాస్ వంతెన వద్దకు చేరుకోగానే స్థానిక ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి హర్షవర్ధన్‌ను ఘనంగా సత్కరించారు. రూ.20 వేలు నగదును కానుకగా అందజేశారు.

హర్షవర్ధన్‌కు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి

దోషులను కఠినంగా శిక్షించాలని వినతి

వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: తమ గ్రామంలో మద్యం, గంజాయి మత్తులో పోలూరు హరిని హత్య చేసిన నిందితులను శిక్షించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు సీఐ మురళికి విన్నవించారు. సోమవారం మండలంలోని సీఎల్‌ఎన్‌పల్లి పంచాయతీ మిట్ట ఎస్సీకాలనీకి చెందిన గ్రామస్థులు సీఐకి ఈ మేరకు వినతి పత్రాన్ని అందించారు.

నమశ్శివాయం, భాస్కరన్‌లను సన్మానిస్తున్న తెదేపా నేతలు

మొదలియార్ కార్పొరేషన్ సభ్యులుగా ప్రమాణం

నాగలాపురం, న్యూస్‌టుడే: రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ సభ్యులుగా నాగలాపురం మండలం వేంబాకం గ్రామానికి చెందిన నమశ్శివాయం, నారాయణవనానికి చెందిన భాస్కరన్‌లు సోమవారం విజయవాడ గొల్లపూడిలోని బీసీభవన్‌లో ప్రమాణ స్వీకారం చేశారు. **రేణిగుంట, న్యూస్‌టుడే:** రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా బీడీ బాలాజీ బాధ్యతలు స్వీకరించారు. సోమవారం విజయవాడలోని బీసీ సంక్షేమ భవనంలో కార్పొరేషన్ ఛైర్మన్ త్యాగరాజన్ సమక్షంలో బీసీ సంక్షేమ జాయింట్ డైరెక్టర్ ఉమాదేవి పర్యవేక్షణలో రేణిగుంటకు చెందిన బీడీ బాలాజీ రాష్ట్ర డైరెక్టర్‌గా ప్రమాణం చేశారు.

సమయానికి రారు... పనులు చేయరు

- చేయి తడిపే వరకు తిప్పుకుంటారు
- రేణిగుంట పంచాయతీ సిబ్బంది తీరు

రేణిగుంట : సర్పంచి చెప్పనా... కార్యదర్శి చెప్పనా... ఉన్నతాధిరులు లేదా అధికార పార్టీ నాయకులు ఎవరు చెప్పినా వారు పనులు చేయరు. రోజుల తరబడి తిప్పించుకుంటున్నారు. చివరికి ప్రజలే అర్థం చేసుకుని చేతులు తడిపితే అప్పుడు నత్తకు నడకలు నేర్పినట్లు పనులు చేస్తారు. .. ఇదీ రేణిగుంట పంచాయతీలోని కొందరు సిబ్బంది తీరు...

జిల్లాలోనే మేజర్ పంచాయతీల్లో రేణిగుంట పంచాయతీ ఒక్కటి. సుమారు 30 వేల మంది జనాభా ఉండే ఈ పంచాయతీ పట్టణ స్థాయిని తలపిస్తోంది. నిత్యం ఇంటి పన్నులు, నీటి పన్నులతో పాటు వివిధ పనులపై వస్తుంటారు. అయితే ఈ పంచాయతీ కార్యాలయంలో సిబ్బంది మాత్రం తమ పని కాదనట్లు వ్యవహరిస్తారు.

పన్నులు, అనుమతులు ఇబ్బందే

ఇళ్లవద్దకు, కార్యాలయాల వద్దకు వెళ్లి పన్నులు వసూలు చేయాల్సి ఉన్నా ఆదిశగా చర్యలు చేట్టడం లేదు. ప్రజలు, పరిశ్రమల వారు పలు మార్లు పన్నులు చెల్లిస్తామని చెప్పినా డిమాండ్లు ఇవ్వడం లేదు. పైగా కార్యాలయం వద్దకు వస్తే ఉదయం 11 గంటల వరకు కార్యాలయంలో కనిపించారు. ఇంటి ప్లాన్ అనుమతుల కోసమని ఒక వ్యక్తి తన ఇంటికి సంబంధించి డాక్యుమెంట్లు కార్యాలయం లోపల ఉన్న ఉద్యోగి వద్ద ఇచ్చి సరిగ్గా నెల రోజులు గడిచినా ఇంత వరకు అతీగతీ లేదు. ఎప్పుడూ ఏదో ఒకటి చెప్పి పంపుతున్నారు. పంచాయతీ కార్యాలయంలోని ఇద్దరు సిబ్బంది మాత్రం ఎప్పుడు వస్తారో ఎప్పుడు పోతారో తెలియదు. ఈ అంశంపై ఈవో పీఆర్‌డీ ప్రభురావును వివరణ కోరగా తన దృష్టికి ఈ సమస్య వచ్చిందని, ఇప్పటికే హెచ్చరించామని తెలిపారు. విచారించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సీఐటీయూ మహాసభలను విజయవంతం చేయండి

పిచ్చాటూరు, న్యూస్‌టుడే: విశాఖపట్నంలో ఈ నెల 31 నుంచి జనవరి 4వ తేదీ వరకు నిర్వహించనున్న సీఐటీయూ అఖిల భారత మహాసభలను విజయవంతం చేయాలని వ్య.కా.స.జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి జనార్దన్ కోరారు. నాగలాపురం, పిచ్చాటూరు మండలాల్లో సీఐటీయూ నేతలతో కలసి ఆయన సోమవారం విరాళాలు సేకరించారు. కార్మికుల అభ్యున్నతికి శ్రమిస్తున్న సీఐటీయూ పక్షాన ప్రజలు నిలవాలని ఆయన కోరారు. ఇంద్రాణి, రాజేశ్వరి, మురుగేశన్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన బోధనే లక్ష్యం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: టీచ్ టూల్ ద్వారా మెరుగైన బోధనను అందుబాటులోకి తీసుకురావాలన్నది ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కోర్సు డైరెక్టర్, ఎంఈవో బాలయ్య అన్నారు. పట్టణంలోని ఆర్‌పీబీఎస్ జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం మండల పరిధిలోని ఉపాధ్యాయులకు 'టీచ్ టూల్'కు సంబంధించి శిక్షణను ప్రారంభించారు. ప్రధానోపాధ్యాయులు తీగల వెంకటయ్య, గోపి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఆర్పీలు పాల్గొన్నారు. **రేణిగుంట:** ప్రతి ఉపాధ్యాయుడు ఆధునిక సాంకేతికతను అవగాహన చేసుకుని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని సమగ్ర శిక్ష డైరెక్టర్ రంగనాథయ్య, సెక్టోరియల్ అధికారి డాక్టర్ సుధాకర్‌నాయుడు తెలిపారు. సోమవారం స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు రెండు రోజుల టీచ్ టూల్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏర్పేడు ఎంఈవో దయాకర్, ప్రధానోపాధ్యాయురాలు శంకరి, ఏపీసీ గౌరీశంకర్, ఏఎల్‌ఎస్ సమన్వయ కర్త సారధి తదితరులు పాల్గొన్నారు.

ఫలితాల ఆధారంగా ఎరువులు .. సత్యవేడు, న్యూస్‌టుడే: భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా రైతులు పంటలకు ఎరువుల వేసుకోవాలని తద్వారా ఖర్చు తగ్గుతుందని జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు సౌభాగ్యలక్ష్మి అన్నారు. సోమవారం మండలంలోని కొత్తమారికుప్పం, పుదుకుప్పంలో భూసార పరీక్ష ఫలితాలపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి మురళి, సుబ్రహ్మణ్యం, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో నరసన్నపేట ఎమ్మెల్యే.. శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి కుటుంబ సభ్యులతో కలసి వాయులింగేశ్వరుని దర్శించుకున్నారు. దర్శనార్థం వచ్చిన వీరికి సోమవారం ఆలయ ట్రస్టుబోర్డు ఛైర్మన్ కొట్టేసాయి ప్రసాద్ ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మహారాజ రాజశ్రీ శ్రీకాళహస్తి సీనియర్ సివిల్‌జడ్జి కోర్టులో
EP.No.16/2012
O.S.No.101/2002
ఎ.అహ్మద్ మీరాన్ .. Plaintiff/D.Hr
మరియు
ఎం.పెరియస్వామి .. Respondent/J.Dr

వేలం ప్రకటన

పై దావా అమలు మనువు షెడ్యూలును వాది పరం డిక్రీ బాకీ రాబట్టుకొనుటకు గాను క్రింది కనబరిచిన షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని తేది 23-12-2025న పై కనిన కోర్టు నందు ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5 గంటల మధ్య బహిరంగ వేలము వేయబడును. సదరు వేలంలో పాల్గొనదలచినవారు వేలం షెడ్యూలు షరతులను పై కోర్టు యందు తెలుసుకొనవచ్చును.

SCHEDULE

1st Item: Chittoor District -Srikalahasti Sub District, Srikalahasti Mandal- Uranduru Village survey group- Uranduru Village site and house asbestos sheet roofing house bearing D. No. 2/128 measuring East to West 18 1/4 ft, North to South 17ft bounded on: East: House of A. Chinna Muni Reddy, South: 2nd item property. West: Site of K. Pullaiah, North: Joint wall of house of A. Muni Reddy,

2nd Item: Chittoor District, Srikalahasti Sub District, Srikalahasti Mandal - Uranduru Village survey group - Uranduru Village measuring East to West 20 ft and North to South 12 1/2 ft asbestos sheet house bounded on: East: House of A. Chinna Muni Reddy, South: House of C. Chenchu Reddy, West: House of C. Chenchu Reddy & Chenchu Reddy, North: 1st item property.

3rd Item: Chittoor District, Srikalahasti Sub District, Srikalahasti Mandal - Uranduru Village survey group - Uranduru Village measuring East to West on eastern side 13 1/2 ft on western side 14 ft, North to South 24 ft bounded on: East: Raja Veedhi, South: Compound wall of C.Chenchu Reddy, West: House of A. Chinna Muni Reddy, North: House site of A. Chinna Muni Reddy.

D.Hr Value: 1,89,757/-
Amin Value: 13,60,200/-
Date: 23-12-2025

సి.వెంకటస్వామి
D.Hr. తరఫు న్యాయవాది, శ్రీకాళహస్తి

బాలికల తల్లికి కరపత్రాన్ని అందిస్తున్న సర్పంచి కృష్ణయ్యశెట్టి, తపాలా సిబ్బంది

సుకన్య సమృద్ధి పథకానికి సర్పంచి విరాళం

నాగలాపురం, న్యూస్‌టుడే: ఎస్ఎస్‌పురంలో పది మంది పేద బాలికలకు తపాలా కార్యాలయంలో సర్పంచి కృష్ణయ్యశెట్టి విరాళాలను అందించి ఖాతాలను ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సుకన్య సమృద్ధి పథకానికి తపాలా సిబ్బంది దాతలను సంప్రదిస్తుండగా.. స్పందించిన సర్పంచి పది ఖాతాలకు నగదును విరాళంగా అందించి బాలికల పాసుపుస్తకాలను అందించారు. బాలికల భవిష్యత్తుకు నిర్దేశించిన పథకానికి సర్పంచులు, గ్రామస్థులు విరాళాలను అందించాలని తపాలా సిబ్బంది కోరారు. తపాలా ఇన్‌స్పెక్టర్ సతీష్, ఎంవో బి.మురళి, బీపీఎం మంజులమ్మలు పాల్గొన్నారు.

పల్లెటూరి పిల్లలు.. క్రీడల్లో విజేతలు

శ్రీకాళహస్తి(గ్రామీణం(ఏర్పేడు), న్యూస్‌టుడే: ఏర్పేడు మండలంలోని పాపానాయుడుపేట జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తున్నారు. ప్రాంతం ఎదైనా బరిలోకి దిగితే విజయం తమదేనని నిరూపిస్తున్నారు. గ్రాప్లింగ్, రెజ్లింగ్ పోటీల్లో జిల్లా, రాష్ట్ర స్థాయిలో రాణిస్తూ పతకాలను కైవసం చేసుకుంటున్నారు. పాఠశాలలో 350 మంది విద్యార్థులు ఉండగా 50మందికి పైగా వివిధ క్రీడల్లో రాణిస్తుండటంతో పలువురి మన్ననలు పొందుతుండటం గమనార్హం.

నిత్యం ప్రత్యేక శిక్షణ

విద్యార్థులు క్రీడలపై ఆసక్తిని చూపుతుండటంతో ప్రధానోపాధ్యాయులు మారయ్య ఆధ్వర్యంలో వ్యాయామ ఉపాధ్యాయులు ఉదయం, సాయంత్రం ప్రత్యేక శిక్షణ కల్పిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఆరు నెలల వ్యవధిలోనే జిల్లా, రాష్ట్రస్థాయిలోని గ్రాప్లింగ్, రెజ్లింగ్, ఎస్‌జీఎఫ్

రాష్ట్ర స్థాయిలో రాణిస్తున్న విద్యార్థులు

జుడోలో విద్యార్థులు రాష్ట్రస్థాయిలో రాణించారు. ఇదే విధంగా జాతీయస్థాయిలో రాణించేందుకు శిక్షణ ఇస్తున్నారు. అధిక సంఖ్యలో విద్యార్థులు క్రీడలవైపు మొగ్గు చూపుతున్నారు.

జాతీయస్థాయిలో రాణిస్తా

రాష్ట్రస్థాయిలో జరిగిన జూడో పోటీల్లో రెండు పర్యాయాలు కాంస్య పతకాలు సాధించాను. పోటీల్లో మెలకువలు నేర్చుకుని ఈ ఏడాది జాతీయ స్థాయిలో విజేతగా నిలిచి బంగారు పతకాన్ని సాధించాలన్నదే నా ఆశయం. **- యామిని**

చిన్నప్పటి నుంచి ఇష్టం

చిన్నప్పటి నుంచి క్రీడలంటే చాలా ఇష్టం. ఈ నేపథ్యంలోనే మా పీఈటీ మేడం ప్రత్యేక శిక్షణ కల్పించడంతో జిల్లా, రాష్ట్ర స్థాయి జూడో పోటీల్లో విజేతగా నిలిచా. ఇదే విధంగా రాణిస్తూ గొప్ప క్రీడా కారుడిగా రాణిస్తా.

- ధనూష్

ప్రతి విద్యార్థిని క్రీడాకారుడిగా తీర్చిదిద్దుతా

పాఠశాలలోని ప్రతి విద్యార్థిని గొప్ప క్రీడాకారుడిగా తీర్చిదిద్దాలన్నదే నా ఆశయం. ఈ నేపథ్యంలో అవసరమైన క్రీడా సామాగ్రిని సమకూర్చడమే కాకుండా వివిధ ప్రాంతాల్లో జరిగే పోటీల్లో పాల్గొనేలా చర్యలు తీసుకుంటున్నాం.

- పుష్పవాణి, వ్యాయామ ఉపాధ్యాయురాలు

దివ్యాంగులను ఆదరించాలి

వరదయ్యపాళెం : దివ్యాంగుల పట్ల మానవతా దృక్పథంతో ఆదరణ, ప్రేమ కలిగి ఉండాలని ఎంఈవో గున్నయ్య కోరారు. స్థానిక భవిత కేంద్రంలో సోమవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సహిత విద్య ఉపాధ్యాయుడు గణేష్, ప్రధానోపాధ్యాయుడు వెంకటనాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: మరదవాడలో తలారి చంద్రయ్యకు చెందిన గేదె రోడ్డు పక్కన ఉన్న విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. గేదె మృతితో జీవనాధారం కోల్పోయినట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

గూడూరు

• గూడూరు • వెంకటగిరి • సూళ్లూరుపేట

మొక్కకు నీరు పోస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, నాయకులు

గూడూరులో నిమ్మ ధరలు

మొదటి రకం: కేజీ రూ. 26 నుంచి రూ. 30 వరకు

రెండో రకం: కిలో రూ. 20 నుంచి రూ. 25 వరకు

ఏఎంసీలతో రైతులకు మెరుగైన సదుపాయాలు

తడ, న్యూస్‌టుడే: ఏఎంసీల ద్వారా రైతులకు మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. కొండూరు పరిధిలోని సూళ్లూరుపేట ఏఎంసీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన తొలి సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కమిటీ సభ్యులు అందరూ సమన్వయంతో పనిచేసి ఏఎంసీని అభివృద్ధి చేయాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటి, నీళ్లు పోశారు. మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, ఏఎంసీ ఛైర్మన్ ఆకుతోట రమేష్, వైస్ ఛైర్మన్ రవీంద్రరెడ్డి, తెదేపా నాయకులు కార్యదర్శి రామమ్మ తోపాటు పలువురు డైరెక్టర్లు పాల్గొన్నారు.

సహకార సంఘాల ఉద్యోగుల ధర్నా

నాయుడుపేటలో నిరసన తెలుపుతున్న సహకార ఉద్యోగులు

కోట, న్యూస్‌టుడే: స్థానిక సహకార బ్యాంకు వద్ద సోమవారం ఏపీ వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల ఐక్య వేదిక పిలుపు మేరకు దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోరుతూ ఉద్యోగులు ధర్నా చేపట్టారు. నినాదాలు చేస్తూ కార్యాలయం వద్ద బైఠాయించి, ప్లకార్డులు ప్రదర్శించారు. సహకార బ్యాంకు చీఫ్ మేనేజరు, సిబ్బంది మద్దతుగా ధర్నాలో పాల్గొన్నారు. తిన్నెలపూడి, చిట్టేడు, సిద్ధవరం, నెల్లూరుపల్లి, ఊనుగుంటపాళెం వ్యవసాయ పరపతి సంఘాల ఉద్యోగులు పాల్గొన్నారు. **నాయుడుపేట, న్యూస్‌టుడే:** జిల్లా కేంద్ర సహకార బ్యాంకు బ్రాంచి కార్యాలయం వద్ద నాయుడుపేట, ఓజిలి, పెళ్లకూరు మండలాల్లో పీఏసీఎస్‌ల్లో పనిచేసే సహకార సంఘాలు ఉద్యోగులు, సిబ్బంది తమ డిమాండ్లు పరిష్కరించాలంటూ జేఏసీ పిలుపు మేరకు ఆందోళన చేపట్టారు, కార్యాలయం ఎదుట బైఠాయించారు. అనంతరం బ్రాంచి మేనేజరు సత్యవతికి వినతి పత్రం అందజేశారు.

పాఠశాలల్లో విద్యార్థులకు క్విజ్ పోటీలు

నాయుడుపేట, న్యూస్‌టుడే: పాఠశాలల్లో విద్యార్థులు 12 నుంచి క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి చంద్రశేఖర్‌నాయుడు తెలిపారు. సోమవారం ఆయన నాయుడుపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న విద్యార్థుల అభ్యసన శిక్షణ తరగతులను పరిశీలించారు. పీఎంశ్రీ పథకం ద్వారా 44 పాఠశాలలను ఎంపిక చేసినట్లు వివరించారు. అకాడమిక్ కోర్డినేటర్ ప్రేమసాగర్, ఎంఈవోలు మునిరత్నం, శంకయ్య, చంద్రశేఖర్‌లు పాల్గొన్నారు.

10న విద్యాసంస్థలు బంద్

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: గూడూరును జిల్లా చేయాలని, కుదరని పక్షంలో నెల్లూరులో విలీనం చేయాలని ఐకాస నాయకులు చేపట్టిన రిలే దీక్షలు సోమవారం రెండో రోజుకు చేరుకున్నాయి. విద్యార్థి, యువజన సంఘాలు పాల్గొని 10న డివిజన్‌లోని విద్యా సంస్థల బంద్‌కు పిలుపునిచ్చారు. దశరథరామిరెడ్డి, ప్రభాకర్, సుబ్బయ్య, భాస్కర్‌గౌడ్, శరత్‌యాదవ్, జమాలుల్లా తదితరులు పాల్గొన్నారు.

ఉప కేంద్రం.. ముంపుమయం

✦ తరచూ వరద ముంచెత్తుతున్నా నామమాత్రపు చర్యలు

✦ శాశ్వత పరిష్కారానికి ప్రతిపాదనలతో సరి

కోట, వాకాడు, న్యూస్‌టుడే: నాలుగు దశాబ్దాలు కిందట పలుచోట్ల లోతట్టు ప్రాంతాల్లో విద్యుత్తు ఉపకేంద్రాలు నిర్మించారు. వర్షం కురిస్తే నీరు వెళ్లేందుకు వసతులు కూడా కల్పించలేదు. దీంతో భారీ వర్షాలు వచ్చినప్పుడల్లా విద్యుత్తు ఉప కేంద్రాలను వరద ముంచెత్తుతోంది. ఆదమరిస్తే విద్యుదాఘాతమే అన్నట్లు పరిస్థితి తయారైంది. అధికారులు మాత్రం నీరు చేరినప్పుడు తాత్కాలికంగా తొలగించి చేతులు దులుపుకుంటున్నారు. లెవలింగ్ చేయడానికి ఏళ్ల తరబడి ప్రతిపాదనలు పంపుతూ కాలయాపన చేస్తున్నారు.

సబ్ డివిజన్‌లో ఇదీ పరిస్థితి

కోట, వాకాడు, చిట్టమూరు మండలాలకు విద్యుత్తు సరఫరా చేసేందుకు కోట సబ్‌డివిజన్ పరిధిలో 17 విద్యుత్తు ఉప కేంద్రాలున్నాయి. ఇవి అన్ని కూడా లోతట్టు ప్రాంతాల్లోనే ఉన్నాయి. వీటిలో 12 ఉపకేంద్రాలకు ప్రహరీలు లేవు. వీటికి విద్యానగర్‌లోని 132కేవీ విద్యుత్తు ఉపకేంద్రం నుంచి విద్యుత్తు సరఫరా చేస్తారు.

విద్యానగర్‌లోని ఉపకేంద్రంలో చేరిన వరదనీరు (పాతచిత్రం)

ఉప కేంద్రాల వివరాలిలా..

కోట	7
వాకాడు	5
చిట్టమూరు	5

✦ ఈనెలలో దిత్వా తుపాను కారణంగా కురిసిన భారీ వర్షాలకు విద్యానగర్‌లోని 132 కేవీ విద్యుత్తు ఉప కేంద్రంలో మీటరు లోతులో వరద నీరు చేరింది. గుర్తించిన అధికారులు వెంటనే పూర్తిస్థాయిలో విద్యుత్తు సరఫరాను నిలిపివేసి, ప్రమాదం తప్పించారు. .

✦ ఉత్తమనెల్లూరు సమీపంలోని చల్లకాలువ కరకట్టల అంచునున్న విద్యుత్తు ఉప కేంద్రం చుట్టూ నీరు చేరి ముంపు బారిన పడింది. నెల్లూరుపల్లిలోని విద్యుత్తు ఉపకేంద్రంతో పాటు పలు కేంద్రాల్లోనూ ఇదే పరిస్థితి. అధికారులు స్పందించి విద్యుత్తు ఉప కేంద్రాలకు చుట్టూ ప్రహరీలు నిర్మించి వరద నీరు వెళ్లేందుకు వసతులు కల్పించాల్సిన అవసరం ఉంది.

శాశ్వత పరిష్కారం చేపడతాం

విద్యుత్తు ఉప కేంద్రాల రక్షణకు ప్రణాళిక రూపొందించి శాశ్వత నివారణ చర్యలు చేపడతాం. విద్యానగర్‌లోని విద్యుత్తు ఉప కేంద్రం నీరు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన పైపులు స్తంభించడం వల్లే ముంపునకు గురైంది. డీఎల్‌పీవోకు పరిసరాల్లో చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించాం. ప్రహరీల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం. **- చంద్రశేఖర్‌రావు, ఎస్ఈ**

మెరైన్ పోలీసులకు త్రుటిలో తప్పిన ప్రమాదం

వాకాడు, న్యూస్‌టుడే: నవాబ్‌పేట గ్రామంలో విధుల్లో ఉన్న శ్రీహరికోట మెరైన్ పోలీస్‌స్టేషన్‌లో ఇంటెలిజెన్స్ విభాగంలో హెడ్‌కానిస్టేబుల్ రమణయ్య, కానిస్టేబుల్ శ్రీనివాసులుకు సోమవారం త్రుటిలో ప్రమాదం తప్పింది. వీరిద్దరు వెపంజేరికి పడవలో వెళ్లారు. తిరుగు ప్రయాణంలో నవాబ్‌పేటకు పడవ లేకపోవడంతో తెప్పపై వస్తుండగా ప్రమాదవశాత్తు కాలువలో జారి పడ్డారు. స్థానికులు గుర్తించి సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. ఈ విషయంపై శ్రీహరికోట మెరైన్ సీఐ మాలకొండయ్యను వివరణ కోరగా ఇద్దరు సురక్షితంగా బయటకు వచ్చినట్లు చెప్పారు.

నిరసన తెలుపుతున్న ప్రయాణికులు

సమయపాలన పాటించలేదని ప్రయాణికుల నిరసన

కోట, న్యూస్‌టుడే: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద కోట- ముత్తుకూరు మార్గంలో బస్సు సర్వీసులు సమయపాలన పాటించడం లేదని ప్రయాణికులు సోమవారం నిరసన చేశారు. ఆర్టీసీ అధికారులు సరిగా స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కోట- ముత్తుకూరు మార్గంలో గంటకో సర్వీసు ఉండగా రెండు గంటలైనా బస్సులు రాకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాకాడు ఆర్టీసీ డీఎం చిన్నపెంచలయ్యను వివరణ కోరగా సమగ్రంగా విచారించి బస్సులు సమయపాలన పాటించేలా చూస్తామని చెప్పారు.

ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న మత్స్యకారులు

ప్రత్యేక పంచాయతీ ఏర్పాటుకు వినతి

వాకాడు, న్యూస్‌టుడే: దుగరాజపట్నం పంచాయతీ పరిధిలో ఉన్న కొండూరుపాళెం, అంజలపురం గ్రామాలను కలిపి పంచాయతీగా ఏర్పాటు చేయాలని రెండు గ్రామాల మత్స్యకారులు సోమవారం ఎంపీడీవో సాయిప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. దుగరాజపట్నం సర్పంచి శ్రావణి విన్నవించారు.

పిల్లల్ని పాఠశాలకు పంపాలి

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: పిల్లల్ని తల్లిదండ్రులు పాఠశాలకు పంపాలని మండలంలోని తాళ్వాయిపాడు గ్రామంలో నాయుడుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ర్యాలీ చేశారు. ఏఎంసీ వైస్‌ఛైర్మన్ కిలారి గోపి తదితరులు పాల్గొన్నారు.

తాళ్వాయిపాడులో ర్యాలీ చేస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

శిక్షణ తరగతులు

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో గూడూరు, చిల్లకూరు మండలాల ఉపాధ్యాయులకు టీచ్ టూల్‌పై రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఎంఈవో చంద్రశేఖరనాయుడు సోమవారం ప్రారంభించారు. డిప్యూటీ డీఈవో సనత్‌కుమార్, ఎల్ఎఫ్ఎల్ కో-ఆర్డినేటర్, ప్రేమ్‌కుమార్, శిక్షణ ప్రతినిధులు మాధవిలక్ష్మీ, మధుకర్, షఫీ పాల్గొన్నారు.

కోట, న్యూస్‌టుడే: కోట ఉన్నత పాఠశాలలో అబ్జర్వర్లకు జరుగుతున్న రెండు రోజుల శిక్షణ తరగతులను ఏఎంవో చంద్రశేఖర్ పరిశీలించారు. కోట, వాకాడు, చిట్టమూరు మండలాల నుంచి 58 మంది హాజరయ్యారు. కోఆర్డినేటర్ ప్రేమ్‌కుమార్, ఎంఈవో2 మస్తానయ్య పాల్గొన్నారు.

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సూళ్లూరుపేట, తడ, దొరవారిసత్రం మండలాలకు సంబంధించి టీచ్ టూల్ శిక్షణ పొందిన క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్, హెచ్ఎం, స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీలకు రీఫ్రెష్ టీచ్ టూల్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంఈవోలు సునీల, ఎం శీనయ్య, మల్లికార్జునరావు, కృష్ణయ్య పాల్గొన్నారు.

విజేతలతో ఉపాధ్యాయినులు

ఉపన్యాసంలో మెప్పించి.. విజేతలుగా నిలిచి

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఈనాడు-ఈటీవీ ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలను సోమవారం నిర్వహించారు. 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై వక్తృత్వ పోటీలు జరిగాయి. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను పి.సమీన ఖనమ్, ఎస్‌కె.షమీమ్, జి.ప్రణతి గెలుపొందారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు మాధవిలక్ష్మీ, ఉపాధ్యాయినులు యానాదమ్మ, వసంత, సుకన్య, మహేశ్వరి పాల్గొన్నారు.

ఒప్పంద కార్మికులను క్రమబద్ధీకరించాలి

వెంకటగిరి, న్యూస్‌టుడే: విద్యుత్తు శాఖలోని ఒప్పంద కార్మికులను రెగ్యులర్ చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు సూరిబాబు డిమాండ్ చేశారు. సోమవారం విద్యుత్తు ఉప కేంద్రంలో కార్మికులతో సమావేశం నిర్వహించారు. వచ్చే నెల 4న విశాఖపట్నంలో నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. సుమన్, సునీల్ కుమార్, రఘు, ప్రసాద్, రవి, మురళీ పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలతో నష్టపోయాం

తిరుపతి (కలెక్టరేట్), న్యూస్‌టుడే: సూళ్లూరుపేటలో ఓ డీలర్ నకిలీ వరి విత్తనాలు అమ్మడంతో పంటలు సాగుచేసి తీవ్రంగా నష్టపోయామని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్ఎస్‌లో సూళ్లూరుపేటకు చెందిన రైతులు తాము పండించిన పంటను తీసుకొచ్చి కలెక్టర్‌కు చూపించి ఫిర్యాదు చేశారు. దిగుబడి రాకపోవడంతో ఆర్థికంగా నష్టపోయామని, డీలర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు భాస్కర్, చలపతి విజ్ఞప్తి చేశారు. స్పందించిన కలెక్టర్ వెంటనే డీలర్‌పై విచారణ చేయాలంటూ వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తయారు చేసే మహిళలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, పనికి తగిన వేతనం ఇవ్వాలని మహిళలు ఎంఈవో చంద్రశేఖర్ నాయుడుకు వినతి పత్రం అందించారు. పట్టణంలో సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో నాయకులు, మహిళలు కలసి సమస్యల్ని వివరించారు.

రవాణా ఛార్జీలకు నగదు అందజేత

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: శ్రీపెసల గురప్పశెట్టి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌కు వైస్‌ఛైర్మన్ షేక్.రఫీ సోమవారం మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం చేతుల మీదుగా రూ.15 వేల నగదు అందించారు. ఈ మొత్తాన్ని విద్యార్థుల రవాణా ఛార్జీలకు ఉపయోగించాలని చెప్పారు.

వసతులు కల్పిస్తాం

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక భవిత కేంద్రంలోని దివ్యాంగులకు అవసరమైన వసతుల కల్పిస్తామని రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఎ.నాగూరయ్య పేర్కొన్నారు. సోమవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం జరిపారు. కార్యక్రమంలో ఎంఈవో మునిరత్నం, రోటరీ క్లబ్ ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం, జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం మంజుల పాల్గొన్నారు.

రాకపోకలకు గుంతలే అడ్డంకి

సూళ్లూరుపేట మండలంలోని సుద్దమదుగుతాగేళి నుంచి వెలగలపన్నూరు, తుంగమడుగు వెళ్లే ర.భ రహదారి గుంతలమయమైంది. దీంతో వాహనదారులు ఈ మార్గంలో రాకపోకలు సాగించాలంటే ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు గుంతలు మరింత పెద్దవిగా మారి బావులను తలపిస్తున్నాయి. అధికారులు స్పందించి రోడ్డును బాగుచేయాలని స్థానికులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, సూళ్లూరుపేట గ్రామీణం

కోతకు గురై.. కొట్టుకుపోయి

బాలాయపల్లి మండలం కామకూరు నుంచి హస్తకావేరి మధ్య రోడ్డు పలుచోట్ల గుంతలుపడి అధ్వానంగా తయారైంది. పెరిమిడి పంచాయతీ సీసీ కండ్రిగ, తిక్కవరం- కాట్రగుంట కొత్తూరు మీదుగా తాళ్లపల్లికి వెళ్లే మట్టి రోడ్లు దుస్థితికి చేరుకున్నాయి. వెంకటగిరి మండలం దాచెరువు రోడ్డు కల్వర్టు తాజా వర్షాలకు కోతకు గురై కొట్టుకుపోయింది. వెంకటగిరి పంచాయతీరాజ్ డీఈఈ లక్ష్మీనారాయణను వివరణ కోరగా కల్వర్టును పునర్నిర్మించేందుకు రూ.పాతిక లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు.

– న్యూస్‌టుడే, బాలాయపల్లి– డక్కిలి

రహదారిపై నేలవాలిన మర్రివృక్షం

మండలంలోని వెంకన్నపాళెం సమీపంలో భారీ మర్రి వృక్షం ర.భ శాఖ రోడ్డుపై సోమవారం కూలిపోయింది. విద్యుత్తు తీగలపై కొమ్మలు వాలి ఉండటంతో కిందకి జారిపోయాయి. ఆ సమయంలో విద్యుత్తు సరఫరా లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. వృక్షం నేలవాలే సమయంలో అటుగా రోడ్డుపై రాకపోకలు లేకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఇరువైపులా రాకపోకలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న విద్యుత్తు సిబ్బంది ఏఈ అనంతరావు పర్యవేక్షణలో తీగలను సరిచేసి విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించారు.

– న్యూస్‌టుడే, కోట,

ఈనాడు కథనానికి స్పందన

రోడ్డు పనులు ప్రారంభం

వెంకటగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: వెంకటగిరి-గూడూరు రోడ్డు అభివృద్ధి పనుల్లో ఎట్టకేలకే కదలిక వచ్చింది. అక్టోబరు 23న 'ఈనాడు'లో 'వామ్మో.. ఇదీ రోడ్డే' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. సోమవారం అమ్మపాళెం వద్ద పనులను గూడూరు రభ శాఖ ఈఈ రామాంజనేయులు పరిశీలించారు. కల్వర్టులతో పాటు తారురోడ్డు విస్తరణ పనులు చేస్తున్నట్లు చెప్పారు. **సూళ్లూరుపేట, న్యూస్‌టుడే:** ఉగ్గుమూడి గ్రామంలో విద్యుత్తు స్తంభానికి అల్లుకున్న తీగలను తొలగించారు. 'ఈనాడు'లో అల్లుకున్న నిర్లక్ష్యం అనే శీర్షికతో వార్త ప్రచురితమైంది. ఏఈ జగదీష్ స్పందించి సిబ్బందితో స్తంభానికి తీగలను తొలగించారు.

స్పందనకు వందనం

పరిష్కారమైన తాగునీటి సమస్య

డక్కిలి, న్యూస్‌టుడే: నరసనాయుడుపల్లిలో మోటారు పనిచేయక తలెత్తిన తాగునీటి సమస్యను ఎంపీడీవో రవీంద్రబాబు జోక్యం చేసుకొని పరిష్కరించారు.

భవన నిర్మాణం చేపడతాం

వెంకటగిరి: అంబేద్కర్ భవన నిర్మాణాన్ని కేటాయించిన స్థలంలో చేపడతామని దళిత సంఘం సీనియర్ నేత రామకృష్ణ అన్నారు. సోమవారం అంబేద్కర్ విగ్రహం వద్ద దళిత ఆత్మగౌరవం వేదిక ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఉదయ్‌కుమార్, సురేష్, పవన్, మల్లికార్జునరావు, జాన్ పాల్గొన్నారు.

హక్కుల సాధనకు పోరాటం

వెంకటగిరి: హక్కుల సాధనకు పోరాటం తప్పదని రోడ్డు మార్జిన్ వ్యాపార సంఘం జిల్లా అధ్యక్షుడు జనార్ధన్ అన్నారు. సోమవారం జిల్లా సదస్సు కరపత్రాలను విడుదల చేశారు. 15న తిరుపతిలో నిర్వహించే జిల్లా స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు వివరించారు. జిల్లా కార్యదర్శి శివకుమార్, పట్టణాధ్యక్షుడు నరసింహులు, ప్రధాన కార్యదర్శి మునీంద్ర, నేతలు పాల్గొన్నారు.

అభినందన కార్యక్రమంలో క్రీడాకారులు, గురువులు

ముగిసిన జేఎన్‌టీయూ శిక్షణ శిబిరం

కోట, న్యూస్‌టుడే: విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ ఐఎస్టీ క్రీడా మైదానంలో వారం రోజులుగా జరుగుతున్న జేఎన్‌టీయూ అనంతపురం వాలీబాల్ క్రీడాకారుల శిక్షణ తరగతులు సోమవారంతో ముగిసినట్లు కళాశాల డైరెక్టర్ విజయ కుమార్‌రెడ్డి, పీడీ మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఎంపికైన భరద్వాజ, శశికుమార్, సిద్ధార్థ, సాయినాథ్‌రెడ్డి, భార్గవ, బాల వెంకయ్య, దినేష్, అబ్దుల్, వెంకటేశ్వర్లు, డేనియల్ దినేష్, జయసూర్య, బాలాజీ అర్జున్‌లు సౌత్‌జోన్ అంతర విశ్వవిద్యాలయాల వాలీబాల్ పోటీల్లో పాల్గొంటారని వారు తెలిపారు. విశ్వవిద్యాలయం క్రీడా బోర్డు కార్యదర్శి నారాయణరెడ్డి క్రీడాకారులకు సమదుస్తులు పంపిణీ చేశారు.

ధర్నా విజయవంతం చేయండి

ఏవో శిరీషాకు వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: 12న కలెక్టర్ కార్యాలయాల వద్ద ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఇంద్రావతి, ప్రభావతి తెలిపారు. పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేసి, ఏవో శిరీషాకు సోమవారం వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఖాళీగా ఉన్న సూపర్‌వైజర్ పోస్టులను భర్తీ చేయాలని చెప్పారు. పెంచలమ్మ, లక్ష్మీ, ఆసియా బేగం, సీఐటీయూ నాయకులు జోగి శివకుమార్, బీవీ రమణయ్య పాల్గొన్నారు.

కార్మికులకు జీతాలు చెల్లించాలి

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: పురపాలక సంఘం పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు చెల్లించాలని సోమవారం జిల్లా పారిశుద్ధ్య కార్మికుల ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి వి.చెంగయ్య పేర్కొన్నారు. కమిషనర్ ఎస్‌కే.ఫజులుల్లాకు వినతిపత్రం అందించి సమస్యలు తెలిపారు.

దళిత మహిళపై దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలి

నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: డక్కిలి మండలం చెన్నసముద్రానికి చెందిన దళిత మహిళపై దాడి చేసిన శేఖర్ నాయుడుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, అరెస్ట్ చేయాలని సీపీఐ నాయకుడు పెంచలయ్య తెలిపారు. పట్టణంలోని డీఎస్పీ కార్యాలయం వద్ద సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ బాధితులకు వెంటనే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. శశికుమార్, కాళయ్య, నాగేంద్ర, తిరుపాలు, వరలక్ష్మి పాల్గొన్నారు.

ఒక్కటే పంచ్.. అభిరుచులు రెండు

● కరాటేలో అన్నదమ్ముల ప్రతిభ ● పోటీ ఏదైనా టాప్-2 కైవసం

జీవా, వినోద్

తడ, న్యూస్‌టుడే: చిన్ననాటి నుంచే కరాటేపై మక్కువ చూపారు. తండ్రి ప్రోత్సాహం స్థానికంగా ఉన్న గణేష్ మాస్టర్ సహకారంతో వెనుతిరగలేదు. చక్కగా తర్ఫీదు పొంది బ్లాక్ బెల్ట్ సాధించారు. అంతటితో ఆగకుండా రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని ఎన్నో పతకాలు సొంతం చేసుకున్నారు. ఇటు చదువు, అటు కరాటేలో తమదైన సత్తా చాటుతూ, ఒకే అభిరుచితో ముందుకెళ్తున్నారు ఈ అన్నదమ్ములు. పోటీలకు వెళ్తే తొలి రెండు స్థానాలు వీరే దక్కించుకునే వారు. కరాటే పోటీలకు రెఫరీలుగా వ్యవహరించే స్థాయికి వీరు ఎదిగారు.

ఇదీ నేపథ్యం

తడకండ్రిగ పంచాయతీ బోడిలింగాలపాడుకు గ్రామానికి చెందిన అయ్యాంగుళం చెల్లయ్య, పార్వతి దంపతుల కుమారులు వినోద్, జీవా. చదువు, కరాటేనే కాకుండా తండ్రికి వ్యవసాయంలోనూ చేదోడు వాదోడుగా ఉండేవారు. వేసవి సెలవుల్లో పరిశ్రమలో దినసరి కార్మికులుగా పనిచేస్తూ అవసరమైన పుస్తకాలు, ఇతర అవసరాలు తీర్చుకునేవారు.

సాధించిన పతకాలు

2015లో సూళ్లూరుపేటలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో అన్నదమ్ములిద్దరూ తొలి రెండు స్థానాలు సాధించారు. 2016లో తిరువళ్లూరులో నిర్వహించిన పోటీల్లో రెఫరీ సర్టిఫికేట్ పొందారు. అదే ఏడాది చెన్నైలో కటా విభాగంలో ప్రథమ, ద్వితీయ స్థానాలు కైవసం చేసుకున్నారు. 2017లో సాయ్ విభాగంలో చెన్నైలో నిర్వహించిన పోటీల్లో అవార్డులు అందుకున్నారు. 2021లో హైదరాబాదులో జాతీయస్థాయిలో నిర్వహించిన పోటీల్లో కటా విభాగంలో తొలి రెండు స్థానాల్లో నిలిచారు.

దేశం తరఫున పతకం సాధిస్తా

గూడూరు నారాయణ కళాశాలలో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్నా. ఖాళీ సమయాల్లో బ్లాక్- 2 సాధించాలన్న ధ్యేయంతో శిక్షణ పొందుతున్నా. దేశం తరఫున పోటీల్లో పాల్గొని పతకం సాధిస్తా. – జీవా

మండలస్థాయి అధికారి అవుతా

సూళ్లూరుపేటలో డిగ్రీ(బీకాం) పూర్తి చేశా. పోటీ పరీక్షలకు సిద్ధం అవుతూనే బ్లాక్-2 కోసం ఇంటి వద్దే శిక్షణ పొందుతున్నా. మండలస్థాయి అధికారిగా పేదలకు సేవ చేయాలన్నదే లక్ష్యం. – వినోద్

క్రైం కార్నర్

ప్రాణం తీసిన ఈత సరదా

ఈశ్వర్ (పాత చిత్రం)

వాకాడు, న్యూస్‌టుడే: వాకాడు గొల్లపాళెంకు చెందిన ఇనమాల ఈశ్వర్(37) అనే యువకుడు సోమవారం స్థానిక దొరువులో సరదాగా ఈత కొట్టేందుకు దిగాడు. దొరువులో లోత ఎక్కువగా ఉండటంతో ప్రమాదవశాత్తు నీటమునిగి ఊపిరాడక మృత్యువాత పడ్డాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది, గజ ఈతగాళ్లు దొరువులో గాలింపు చర్యలు చేపట్టి మృతదేహాన్ని బయటకు తీసుకువచ్చారు. ఎస్సై నిఖిల్‌బాబు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడి తల్లి శబరిమల యాత్రలో ఉన్నట్లు సమాచారం.

కాలువలో పడి వ్యక్తి మృతి

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: మండలంలోని పండ్లూరు పంచాయతీ వెంగమాంబపురానికి చెందిన ఎం.గురుప్రసాద్(45) స్థానిక ఎస్సీ కాలనీ పక్కన కాలువలో సోమవారం విగతజీవిగా పడి ఉండటంతో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసుల వివరాల మేరకు గురుప్రసాద్ ఆదివారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వచ్చేశాడు. కాలువ కల్వర్టుపై కూర్చొని ఉండటాన్ని స్థానికులు చూశారు. సోమవారం అతని ఆచూకీ కోసం కుటుంబసభ్యులు గాలించగా కాలువలో మృతదేహం బయటపడింది. పోలీసులు మృతదేహాన్ని స్థానిక ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతునికి భార్య, నలుగురు కుమార్తెలున్నారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

బాలాయపల్లి, న్యూస్‌టుడే: నిండలి సమీపాన కైవల్య నదిలో ఈతకు దిగి గల్లంతైన యువకుడి మృతదేహాన్ని సోమవారం గుర్తించారు. గత నెల 30న ఈతకెళ్లిన అలిమిలికి చెందిన ముగ్గురు యువకుల్లో పి.ప్రసన్న (32) గల్లంతవడంతో పోలీసులు కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. సోమవారం నదిలో గాలించగా మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై గోపి తెలిపారు.

రాచపాళెం చెరువులో ..

ఓజిలి, న్యూస్‌టుడే: మండలంలో రాచపాళెం చెరువులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం పడి ఉండడాన్ని సోమవారం పోలీసులు గుర్తించారు. మృతుని వయసు 35- 45 సంవత్సరాల మధ్య ఉన్నట్లు, మూడు రోజుల క్రితం ప్రమాదవశాత్తు పడి మృతిచెంది ఉంటారని పోలీసులు బావిస్తున్నారు. సిమెంటు కలర్ టీషర్టు, నలుపు రంగు ప్యాంట్ ధరించిన మృతదేహం నీటిలో తెలియాడుతుండగా స్థానికులు గుర్తించి వీఆర్వోకు సమాచారం ఇచ్చారు. ఎస్సై శ్రీకాంత్ ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



శ్రీ సొల్లేటి పెద్దకొండయ్య శ్రేష్ఠి గారు కోట

శ్రద్ధాంజలి

సహృదయులు శ్రీ సొల్లేటి పెద్దకొండయ్య శ్రేష్ఠి గారు దూరమవ్వడం బాధాకరం వారి కుటుంబసభ్యులకు మనోనిబ్బరాన్ని ప్రసాదించాలని దేవున్ని కోరుకుంటూ..

డా॥ జి.నాగభూషణ రావు MBBS, కోట

(c) eenadu

ఏయూ ప్రాంగణం... ప్రాణవాయువు కేంద్రం

వందల ఎకరాల్లో విస్తరించిన ఆంధ్ర విశ్వవిద్యాలయం విశాఖ నగరం మధ్యలో ఉంది. వందేళ్ల చరిత్ర కలిగిన ఏయూలో ఎక్కడ చూసినా భారీ వృక్షాలు కనిపిస్తాయి. కాంక్రీట్ జంగిల్‌గా మారిన నగరానికి వేలాది చెట్లతో కూడిన ఏయూ ప్రాంగణం 'ఆక్సిజన్ బ్యాంకు'లా మారింది. ప్రజలు ఉక్కిరిబిక్కిరి కాకుండా ప్రాణవాయువు అందిస్తోంది. –ఈనాడు, విశాఖపట్నం

'గూగుల్'కు భూములిచ్చిన రైతులకు పరిహారం జమ

ఆనందపురం, న్యూస్‌టుడే: ఆనందపురం మండలం తర్లువాడ గ్రామంలో 308 ఎకరాల భూమిని గూగుల్ డేటా సెంటర్ కోసం కూటమి ప్రభుత్వం కేటాయించింది. ఇక్కడ రెవెన్యూ అధికారులు అన్నివిధాల సర్వే ప్రక్రియ పూర్తి చేశారు. భూములు కలిగిన రైతుల జాబితా తయారు చేశారు. అంగీకార పత్రాలందించిన వారి బ్యాంక్ ఖాతాల్లో నష్టపరిహారం జమ చేస్తోంది. ఇక్కడ ఎకరా మార్కెట్ ధర రూ. 17 లక్షల వరకూ ఉంది. అయితే..రైతుల విన్నపం మేరకు దానిని రూ.20 లక్షలకు పెంచారు. రైతులకు 20 సెంట్ల భూమి ఇవ్వనున్న నేపథ్యంలో ఎకరం ఇచ్చిన డి.పట్టాదారులకు 80 సెంట్లకు గాను రూ. 40 లక్షల చొప్పున బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నారు. ఇప్పటి వరకు 18 మంది రైతులకు చెందిన 30 ఎకరాలకు పరిహారం జమ అయింది. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

నేవీ అడ్మిరల్ కప్ పోటీలు ప్రారంభం

సింధియా, న్యూస్‌టుడే : ఇండియన్ నేవల్ అకాడమీ (ఎన్‌డీఏ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నేవల్ సెయిలింగ్ ఛాంపియన్‌షిప్ (అడ్మిరల్ కప్) పోటీలు సోమవారం ప్రారంభమైనట్లు నేవీ వర్గాలు తెలిపాయి. భారత్‌లో 14వ ఎడిషన్‌గా జరుగుతున్న ఈ పోటీలకు ఆసియా, యూరప్, ఆఫ్రికా ఖండాల నుంచి 35 దేశాలు పాల్గొంటున్నాయన్నారు. ఈనెల 13వ వరకు షెడ్యూల్ ఖరారైందన్నారు.

పోటీలకు సిద్ధం చేసిన నేవీ తెరచాప పడవలు

ఇక.. ఆరు గంటల్లోనే!

విశాఖ నుంచి రాయపూర్ వెళ్లొచ్చు
గ్రీన్‌ఫీల్డ్ కారిడార్‌తో సాధ్యం
సగం సమయం ఆదా

ఈనాడు, విశాఖపట్నం, విజయనగరం : ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను కలుపుతూ ఆరు వరుసలతో నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ రహదారి పూర్తి చేసే కసరత్తు వేగంగా సాగుతోంది. కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో రూ.16,482 కోట్లతో ఆయా పనులు చేపడుతుండగా వచ్చే ఏడాది డిసెంబరుకు ప్రారంభించనున్నారు.

➤ విజయనగరం జిల్లా ఎల్.కోట సమీపంలో చెరువు చుట్టూ వృత్తాకారంలో రోడ్డు నిర్మించారు.

➤ ఒడిశాలోని ఉమ్మరికోట వద్ద ఏర్పాటు చేసిన ఇంటర్‌ఛేంజ్ పలు రహదారులను అనుసంధానం చేస్తుంది. ఇప్పటికే అనేక చోట్ల సూచికలు, వివరాల బోర్డుల ఏర్పాటు పూర్తయింది.

తగ్గిన దూరం..133 కి.మీ.

ప్రస్తుత రాయపూర్ నుంచి విశాఖకు ఎన్‌హెచ్-26లో 597 కి.మీ. ప్రయాణించాలి.

» కొత్త కారిడార్‌ను 464 కి.మీ.లతో పూర్తి చేస్తున్నారు. అంటే 133 కి.మీ. దూరం తగ్గింది.

» ఛత్తీస్‌గఢ్, ఒడిశాలోని పరిశ్రమలను విశాఖ పోర్టు, చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారికి అనుసంధానం చేసినట్లవుతుంది.

3.4 కి.మీ. మేర ట్విన్ టన్నెల్

రాయపూర్-విశాఖ ఆర్థిక కారిడార్ మూడు రాష్ట్రాల్లోని మారుమూల ప్రాంతాల మీదుగా వెళ్తుంది. కొండల నడుమ, అడవుల మధ్యలో ఎన్నో వంపులు తిరిగి వెళ్తుంది. ఈ కారిడార్ ఏపీ నుంచి ఒడిశాలోకి ప్రవేశించగానే కొండల మధ్యలో నుంచి పక్కపక్కనే రెండు టన్నెళ్లు (ట్విన్ టన్నెల్స్) నిర్మించాల్సి వచ్చింది. ఒక్కోటి 3.4 కి.మీ. పొడవు ఉండే వీటి నిర్మాణం ఇంజినీరింగ్ అద్భుతంగా పేర్కొనొచ్చు. కొరాపుట్ జిల్లా పరిధి సుంకి ఘాట్ సమీపంలో వీటిని నిర్మించారు.

ఇదీ ప్రయోజనం

☛ ప్రస్తుతం కొండల మధ్య విశాఖ నుంచి రాయపూర్‌కు చేరుకోవాలంటే 12 గంటల సమయం పడుతోంది. ఈ కారిడార్ అందుబాటులోకి వస్తే కేవలం ఆరు గంటల్లోనే చేరుకోవచ్చు.

☛ సరకు రవాణా మరింత వేగవంతమవుతుంది.

అమలోద్భవి మాతకు భక్త నీరాజనం

నగరంలోని పాతపోస్టాఫీసు సమీప విశాఖపురి పుణ్యక్షేత్రంలో అమలోద్భవిమాత మహోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. సెయింట్ అలోషియస్ పాఠశాల నుంచి ప్రారంభమైన అమలోద్భవిమాత ఊరేగింపులో పెద్ద సంఖ్యలో విశ్వాసులు పాల్గొన్నారు. నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చీ ఆదేశాల మేరకు పోలీసులు పకడ్బందీగా భద్రతా ఏర్పాట్లు చేశారు. –న్యూస్‌టుడే, జగదాంబకూడలి, జ్ఞానాపురం

మీకోసం.. ఎన్నో రకాలున్నాయ్!

★ ఎండు చేపల్లో పోషకాలు
★ విశాఖ నుంచి ప్రతినెలా 60 టన్నులు ఎగుమతి

ఈనాడు–విశాఖపట్నం: ఎండు చేపలు చూడగానే కొందరు 'పప్పుచారులో ఉప్పు చేప ఆహా!' అంటూ లొట్టలేస్తారు. మరి కొందరు 'వాసన బాబోయ్' అంటూ వాటిని దూరం పెడతారు. ప్రొటీన్ షేక్స్, సప్లిమెంట్స్ రాక ముందు మన దేశంలో ఈ ఎండు చేపలే ఆధారం. ఆంధ్రప్రదేశ్, కేరళ, తమిళనాడు, పశ్చిమబెంగాల్, ఒడిశాలో ఎండు చేపలు ఎక్కువగా వినియోగిస్తారు.

● విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో ఎండు చేపల ఉత్పత్తి 6-8శాతం ఉంటుంది. నెలకు 60 టన్నుల మేర ఎగుమతి చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతాల నుంచి శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్, సింగపూర్, బర్మా(మయన్మార్)కు ఎక్కువగా ఎగుమతి చేస్తారు.

ఈ జాగ్రత్తలు తీసుకోండి

ఎండుచేపల విషయంలో ఆహార ప్రియులు కొన్ని జాగ్రత్తలు కూడా తీసుకోవాలి. బీపీ, మూత్రపిండాలు, లివర్, గుండె సమస్యలున్న వారు వీటికి దూరంగా ఉంటే మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. వండే ముందు సరిగ్గా శుభ్రం చేయడం చాలా ముఖ్యం. వీటిని ముందుగా చేత్తో గట్టిగా తట్టి పైన ఉన్న దుమ్ము, ఇసుక లేదా ఎండిన చేప పొలుసు తొలగించాలి. చేపలను గోరువెచ్చని నీటిలో 10-15 నిమిషాలు నానబెట్టాలి. ఉప్పు ఎక్కువగా ఉంటే 2-3 సార్లు నీరు మార్చి నానబెట్టుకోవడం మంచిది. అందులో పసుపు, వెనిగర్, పాలు వేసి కడిగితే దుర్వాసన, బ్యాక్టీరియా పోతుంది. ఆ తర్వాత శుభ్రమైన నీటితో కడిగిన తర్వాత పొడి క్లాత్‌పై ఉంచి 5-10 నిమిషాలు వాటిని ఆరబెట్టి ఆపై వంట చేసుకోవాలి.

ఎన్నో రకాలు: ఎండు చేపల్లో...దాదాపు 30 రకాలున్నాయి. కొన్నింటికి డిమాండ్ ఎక్కువగా ఉంది. పండుగబ్బ, చావిడాలు, నెత్తళ్లు, పూసపరిగలు, వంజరాలు, కట్టపరిగలు, రొయ్యపొట్టు, ఎర్ర రొయ్య, పారలు, కానగంతలు, కవ్వాలు, గులివిందలు, ఇసుకదంతులు, గొరసలపై ఎక్కువ మంది మక్కువ చూపుతారు.

ఉపయోగాలు ఇలా: మామూలు చేపలతో పోల్చితే వీటిలో ప్రొటీన్స్ ఎక్కువగా ఉండటం వల్ల కండరాలు, శరీరానికి బలాన్నిస్తాయి. కాల్షియం, ఫాస్ఫరస్ పుష్కలంగా ఉండటం వల్ల ఎముకలు గట్టిగా మారేందుకు దోహదపడతాయి. ఒమెగా 3 ఫ్యాటీ ఆమ్లాలతో గుండె, మెదడుకు చాలా మంచిది. ఐరన్, బి విటమిన్స్, రోగనిరోధకశక్తి సైతం చక్కగా పెరుగుతుందని వైద్యనిపుణులు చెబుతున్నారు. వీటి వాసన కొందరికి ఇష్టం ఉండకపోచ్చుకానీ, పోషకాల్లో ఎండు చేపలు సూపర్. నాన్ వెజిటేరియన్స్ ఈ సంప్రదాయ ఆహారాన్ని ప్రయత్నించవచ్చని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

ఇంటి దొంగలు... ఖజానాకు జలగలు!

'వీఎంఆర్‌డీఏ'లో ఇష్టారాజ్యం

ఈనాడు, విశాఖపట్నం: ఆదాయానికి గండి పడుతున్నా విశాఖ మహాప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) అధికారులు కళ్లు మూసుకున్నారు. అనధికార వ్యాపార కార్యకలాపాలను కొందరు అధికారులే ప్రోత్సహిస్తూ ఇంటి దొంగల్లా మారారు. కైలాసగిరిపై అక్రమాలు చోటుచేసుకుంటున్నా పట్టించుకోకపోవడమే ఇందుకు ఉదాహరణ. కొండపై ఆక్రమిత స్థలాల్లో ఉన్న వారికి తాఖీదులిచ్చి కార్యకలాపాలు నిలిపేయాలన్నా ఏమాత్రం పట్టించుకోవడం లేదు. కమిషనర్ ఆదేశించినా లెక్కచేయడం లేదు. తెర వెనుక కొందరు అధికారుల దన్నే దీనికి కారణమని తెలుస్తోంది.

ఎలా అనుమతించారు?

కైలాసగిరిపై ఓ వ్యాపారి బహుళ స్థాయిలో వాణిజ్య కార్యకలాపాలు ఆరంభించారు. గేమ్ జోన్, టీ, స్నాక్స్ అవుట్‌లెట్, ఫుడ్ కోర్టు, ఏసీ రెస్టారెంట్, ఫ్యాన్సీ స్టోర్, అవుట్‌డోర్ గేమ్స్, కాఫీ, టీ స్టాల్ నిర్వహిస్తున్నారు. అలాగే రెండు అంతస్తుల్లో నిర్మాణాలు చేపట్టాడు. వీటన్నింటికీ పూర్తిస్థాయి అనుమతులు లేవని గుర్తించి అధికారులు నోటీసులు జారీ చేశారు.

3,910 చదరపు గజాల స్థలం కేటాయిస్తే అదనంగా 2 వేల గజాలకు పైగా స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టేశారు. ఈ మొత్తం స్థలానికి అద్దె కూడా సరిగా చెల్లించడం లేదు.

క్షేత్రస్థాయిలో పరిశీలించిన అధికారులు నోటీసులు ఇచ్చి వదిలేశారు. నిర్మాణాలపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు. సదరు నిర్వాహకుడి వ్యాపార కార్యకలాపాలు నిలిపేయాలని ఆదేశించిన కమిషనర్ ఆకస్మిక పర్యటనలో దుకాణాలు తెరిచే ఉండటం చూసి విస్మయం వ్యక్తం చేశారు. కొండపై తమకు అనుకూలంగా లేని ఉద్యోగులను బదిలీ చేయించే స్థాయిలో కొందరు వ్యాపారులున్నారు.

హెచ్చరించినా...

నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన ఓ నిర్వాహకుడి నుంచి వీఎంఆర్‌డీఏ వివరణ కోరుతూ నోటీసులు జారీ చేసింది. కొన్ని రక్షణ చర్యలు లేవని వెంటనే వాటిని పూర్తి చేయాలని ఆదేశించింది. అయితే సదరు వ్యక్తి ఆ తర్వాత కోర్టును ఆశ్రయించారు. దీని వెనుక కొందరు ఉద్యోగుల హస్తం ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వ్యాపార కార్యకలాపాలు నిరాటంకంగా సాగిస్తున్న తీరును పర్యవేక్షణ ఉద్యోగులు ఉన్నతాధికారుల దృష్టికి తేలేదు. కోర్టును ఆశ్రయించిన విషయమూ ఆలస్యంగానే తెలిసింది.

ఉక్కు నిర్వాసిత నిరుద్యోగుల కన్నెర్ర

ధర్నాలో పాల్గొన్న ఉక్కు నిర్వాసిత నిరుద్యోగులు

ధర్నాకు మద్దతుగా పాల్గొన్న రాజకీయ, కార్మిక సంఘాల నాయకులు

ఉక్కునగరం(స్టీల్ సెక్టారు–3), న్యూస్‌టుడే: 'తమకు ఉపాధి కల్పించాలని.. వన్‌టైమ్ సెటిల్‌మెంటు చేయాలని.. లేదా ఆర్.కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి ఉక్కు మిగులు భూముల్లో ఎకరం భూమి ఇవ్వాలని' డిమాండ్ చేస్తూ సోమవారం ఉక్కు ప్రధాన గేటు వద్ద ఉక్కు నిర్వాసిత నిరుద్యోగులు పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. సుమారు ఆరు గంటల పాటు ధర్నా జరిగింది. నిర్వాసితులు మాట్లాడుతూ.. వన్‌టైమ్ సెటిల్‌మెంటు చేసే వరకూ జీవన భృతి చట్టాన్ని అమలు చేస్తూ నెలకు రూ.25వేలు ఇవ్వాలని కోరారు. నిర్వాసితులకు న్యాయం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు రావాలని పలు రాజకీయ, ప్రజాసంఘాల నాయకులు అన్నారు. ధర్నాలో మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, నిర్వాసిత నాయకులు పి.భాస్కరరావు, యు.అప్పారావు, దేముడు, వంశీకృష్ణ, జగన్, రమణ, రాజకీయ నాయకులు తిప్పల దేవన్‌రెడ్డి, ఎం.రవి, గవర వెంకటరమణారావు, దండి ప్రియాంక, కాండవ గాయత్రీ దేవి, కార్మిక నాయకులు డి.ఆదినారాయణ, సీహెచ్.నరసింగరావు, జె.అయోధ్యరామ్, ఎం.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

దూర విద్య పరీక్షలకు పరిశీలకుల కరవు

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఏయూ దూర విద్యా కేంద్రం నిర్వహిస్తున్న పరీక్షలకు పర్యవేక్షకులు కరవయ్యారు. 196 అనుబంధ కళాశాలలతోపాటు, వర్సిటీలోనూ కళాశాలలు, రెగ్యులర్ ఆచార్యులు, అధ్యాపకులు ఉన్నప్పటికీ దూర విద్య పరీక్షల పరిశీలకులుగా(అబ్జర్వర్లు) వెళ్లేందుకు ఇష్టం పడటం లేదు. 78 పరీక్ష కేంద్రాలలో కొన్నింటికి మాత్రమే పరిశీలకులను నియమించారు. రాయలసీమ, కోస్తా జిల్లాల్లోని కేంద్రాలకు ఆయా ప్రాంతాల్లోని వర్సిటీల అధ్యాపకులను పరిశీలకులుగా నియమించారు. ఉమ్మడి విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు తగిన సంఖ్యలో అబ్జర్వర్లు లేకుండా పోయారు. అనధికార వ్యక్తులను నియమించారనే ఆరోపణలూ ఉన్నాయి.

అందని ప్రశ్న పత్రాలు

ఏయూ దూర విద్యా కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం మధ్యాహ్నం 2గంటల నుంచి జరగనున్న కోడ్ ఎస్‌బీ-476/ఎస్‌బీ-477/ఎస్‌బీ-478 ప్రశ్నపత్రాలను పలు కేంద్రాలకు పంపించలేదు. అలాగే యూజీ ఫౌండేషన్ కోర్సుకు సంబంధించి పేపర్ కోడ్ ఎస్.బి.189 ప్రశ్నపత్రం చేరలేదు. దూర విద్యా కేంద్రం సంచాలకులు ఆచార్య డి.ఎ.నాయుడు మాట్లాడుతూ కేవలం ఐదు కళాశాలలకే పంపించలేదని, మంగళవారం మధ్యాహ్నం వేళకు పంపిస్తామని చెప్పారు.

18న ఎన్జీవో సంఘం నగర కమిటీ ఎన్నికలు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఎన్జీఓ సంఘం విశాఖ సిటీ కమిటీ ఎన్నిక ఈనెల 18వ తేదీన నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి ఏవీఎస్ఎస్‌వీ సుబ్రహ్మణ్యం ఓ ప్రకటనలో తెలిపారు. గత నెల 21న జరగాల్సిన ఈ ఎన్నికలు అనివార్య కారణాల వల్ల వాయిదా పడ్డాయన్నారు. కలెక్టరేట్ ఆవరణలోని ఎన్జీఓ హోమ్‌లో ఈనెల 10వ తేదీన నామపత్రాల స్వీకరణ, 11న ఉపసంహరణ ఉంటుందన్నారు. 18న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎన్నిక జరుగుతుందని, తర్వాత పోలైన ఓట్లను లెక్కించి తుది ఫలితం వెల్లడిస్తామని వివరించారు.

విల్లు చిన్నబోయేలా... హరివిల్లు తెల్లబోయేలా

నగరంలో జరుగుతున్న జాతీయ స్థాయి రోలర్ స్కేటింగ్ పోటీల్లో క్రీడాకారుల ప్రతిభను వీక్షిస్తున్న ప్రేక్షకులు సంభ్రమాశ్చర్యాలకు గురవుతున్నారు. కాళ్లకు చక్రాలు కట్టుకొని...శరీరాన్ని అలవోకగా వివిధ రూపాల్లో వంచుతూ వారు చూపుతున్న ప్రతిభకు ముగ్ధులవుతున్నారు. సోమవారం జరిగిన పోటీల్లో బాలికల విన్యాసాలను ఇక్కడ చూడొచ్చు.

–న్యూస్‌టుడే, విశాఖ క్రీడలు

'పచ్చని' వేదిక.. పర్యావరణానికి కానుక..!

★ చినగదిలి నర్సరీలో వేలాది మొక్కల సంరక్షణ
★ అవసరమైన వారికి ఉచితంగా అందజేత

ఆరిలోవ, న్యూస్‌టుడే: నగర పర్యావరణానికి పచ్చని హారంలా భాసిల్లుతోంది చినగదిలిలోని జీవీఎంసీ నర్సరీ. 20ఏళ్ల కిందట దీన్ని ఏర్పాటు చేశారు. నగర అవసరాలకు అవసమైన వివిధ రకాల మొక్కలను సేకరించి ఇక్కడ సంరక్షిస్తున్నారు. నగరంలో రహదారులకు ఇరువైపులా, విభాగినులపై నాటేందుకు మొక్కలను ఇక్కడి నుంచే సరఫరా చేస్తున్నారు.

★ వేప, రావి, కానుగ మొక్కలతో పాటు ఎర్ర తురాయి, టాబోబియా, బోగన్‌విల్లా వంటి పువ్వుల రకాలు ఇక్కడ ఉన్నాయి. పక్షులు, ఉడతలు, కీటక జాతులకు ఆహారంగా ఉపయోగపడే సపోటా, మామిడి, జామ, సీతాఫలం, కొబ్బరి తదితర మొక్కలు అందుబాటులో ఉన్నాయి. వీటిని కడియం నుంచి తెప్పించినట్లు నిర్వాహకులు తెలిపారు.

నర్సరీలో సంరక్షిస్తున్న మొక్కలు

★ ప్రస్తుతం నర్సరీలో 40 వేల మొక్కలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని జీవీఎంసీ ఉద్యాన విభాగ డీడీ ఎం.దామోదరరావు తెలిపారు.

ఉచితంగా పంపిణీ..

పాఠశాలలు, కళాశాలలు, ఆలయాల ప్రాంగణంలో నాటేందుకు ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. అవసరమైనవారు జీవీఎంసీ కమిషనర్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకుని కమిషనర్ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. ఉచితంగా మొక్కలు తీసుకున్నవారు వాటిని సంరక్షిస్తామని భరోసా ఇవ్వాలి.

సంరక్షణ ఇలా..

ఇక్కడ మొక్కల సంరక్షణకు ఆరుగురు జీవీఎంసీ సిబ్బంది, రక్షణ కోసం సెక్యూరిటీ సిబ్బంది పనిచేస్తున్నారు. తెగుళ్లు, కీటకాలు ఆశించకుండా ఎప్పటికప్పుడు మందులు పిచికారీ చేస్తున్నారు. ఈ ఏడాది జులై నెలలో విశాఖ పోర్టు ట్రస్టు వివిధ రకాలకు చెందిన లక్ష మొక్కలను నర్సరీకి వితరణగా అందించిందని దామోదరరావు తెలిపారు. అవసరమైన ఇతర మొక్కలను కడియం నర్సరీల నుంచి తెప్పిస్తున్నామన్నారు.

ఇక.. కూరగాయలు డోర్ డెలివరీ!

పైలట్ ప్రాజెక్టుగా ఎంవీపీ రైతుబజారు ఎంపిక

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: నగరవాసుల సౌకర్యార్థం రైతుబజార్లలోని కూరగాయలను డోర్ డెలివరీ చేయడానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. నగరంలోని ఎంవీపీ రైతుబజారును పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. రవాణా ఛార్జీలు లేకుండా రైతుబజారు ధరలకే వినియోగదారులకు కూరగాయలు అందించనున్నారు. ఈ మేరకు మార్కెటింగ్ శాఖ మేషంట్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సంస్థ డెలివరీ బాయ్స్‌ని నియమించి వినియోగదారుల ఇళ్లకు కూరగాయలు సరఫరా చేస్తుంది. 'డిజి రైతుబజారుఏపీ' వెబ్‌సైట్‌లో బుక్ చేసుకోవాలి » రైతుబజార్లలోని రైతుల వద్ద నాణ్యమైన తాజా కూరగాయలు కొనుగోలు చేసి వినియోగదారులకు సరఫరా చేస్తారు. » రైతుబజారు పనిచేసే సమయాల్లో మాత్రమే ఈ సౌకర్యం ఉంటుంది. ప్రస్తుతం కూరగాయలు, పండ్లు అందుబాటులో ఉన్నాయని అధికారులన్నారు.

» ట్రయల్ రన్‌లో భాగంగా ప్రస్తుతం డెలివరీ బాయ్స్ ఎంవీపీ రైతుబజారు నుంచి 5 కిలో మీటర్ల దూరంలోని వినియోగదారుల ఇళ్లకు వెళ్లి కూరగాయలు అందజేస్తున్నారు. మరో రెండు వారాల్లో పూర్తి స్థాయిలో దీన్ని అందుబాటులోకి తీసుకురానున్నారు.

» ప్రస్తుతం ముగ్గురు డెలివరీబాయ్స్ సేవలు అందిస్తుండగా, వారికి మేషంట్ కంపెనీ వేతనాలు చెల్లిస్తుంది.

సరకు నాణ్యతలో జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రస్తుతం రైతుబజార్లకు వచ్చే కూరగాయల్లో నాణ్యత సరిగా ఉండటం లేదనే విమర్శలు ఉన్నాయి. ముఖ్యంగా టమాట, ఉల్లి నాసిరకంగా ఉంటున్నాయని వినియోగదారుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో డోర్ డెలివరీ విధానం ద్వారా నాణ్యమైన సరకు అందజేయకపోతే వినియోగదారులు తిప్పి పంపించే అవకాశం ఉంది. నాణ్యమైన సరకు ఉండేలా జాగ్రత్తలు తీసుకోకపోతే ఈ విధానానికి ఆరంభంలోనే ఆటంకం కలిగే అవకాశాలు ఉన్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

తుపాను బాధితులకు సామగ్రి అందజేత

సింధియా, న్యూస్‌టుడే: శ్రీలంక తుపాను ప్రభావిత ప్రాంతాల్లో విపత్తు ఉపశమన చర్యల్లో భాగంగా భారత నౌకాదళం 'ఆపరేషన్ సాగర్ బంధు' చేపట్టిన సంగతి విదితమే. ఇప్పటికే కొన్ని నౌకలు సహాయ కార్యక్రమాల్లో ఉండగా.. మరో నాలుగు యుద్ధనౌకలు సోమవారం చేరుకున్నట్టు నేవీ వర్గాలు తెలిపాయి. వెయ్యి టన్నుల సహాయ సామగ్రిని ఈ నౌకల ద్వారా చేరవేశామన్నారు.

శ్రీలంకకు చేరుకున్న ఐఎన్ఎస్ ఘరియల్ నౌక

భవిత మార్చేలా... నైపుణ్యం నేర్పేలా...

★ విద్యార్థులకు వృత్తి విద్యలో శిక్షణ
★ జిల్లాలో 31 పాఠశాలల్లో అమలు

ఈనాడు, విశాఖపట్నం: చదువు పూర్తయిన తర్వాత మంచి ఉద్యోగం సాధించాలంటే నైపుణ్యం అవసరం. ఉద్యోగంలో చేరిన తర్వాత ఉన్నత స్థానానికి చేరుకోవాలన్నా నైపుణ్యాలే కీలకం. దీన్ని గుర్తించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు వృత్తి విద్య నైపుణ్యాలు నేర్పిస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు స్వయం ఉపాధికి బాటలు వేసుకోవడానికి అవకాశం కల్పిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం, సమగ్ర శిక్షా (ఎస్ఎస్) భాగస్వామ్యంతో జిల్లాలోని పాఠశాలలకు ప్రయోగ, శిక్షణ సామగ్రి అందజేశారు. కోర్సులు నేర్పించడానికి ప్రత్యేకంగా నిపుణులను నియమించారు. ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకున్న విద్యార్థులకు నైపుణ్యాలు నేర్పిస్తున్నారు.

బేకరీ ఉత్పత్తుల తయారీపై శిక్షణ పొందుతున్న విద్యార్థినులు

★ పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు పూర్తయిన తర్వాత వారికి ప్రాక్టికల్స్ ఉంటాయి.

ఇంటర్న్‌షిప్, పరిశ్రమల సందర్శన

» జిల్లాలో 31 పీఎంశ్రీ, కేజీబీవీ, ఆదర్శ, జిల్లా పరిషత్ పాఠశాలల్లో విద్యార్థులకు వృత్తి విద్య నైపుణ్యాలు నేర్పిస్తున్నారు. పీఎం శ్రీ పాఠశాలల్లో మూడేసి, మిగిలిన పాఠశాలలో ఒక్కో కోర్సు బోధిస్తున్నారు.

» 6 నుంచి 8వ తరగతి వరకు విద్యార్థులకు ప్రీ ఒకేషనల్ కింద కౌశల్ బుద్ధ్ పేరిట నిర్వహిస్తున్నారు. వారికి పుస్తకాల్లో వృత్తి నైపుణ్యాలను నేర్పిస్తారు. వీరికి ఎక్స్‌పోజర్ విజిట్‌లో భాగంగా వృత్తి నైపుణ్యాలపై అవగాహన కల్పిస్తున్నారు. ఫలితంగా వారికి ఏదో ఒక అంశంపై ఆసక్తి మొదలవుతుంది.

» 9 నుంచి 12వ తరగతి విద్యార్థులకు శిక్షణతోపాటు ఇంటర్న్‌షిప్, పరిశ్రమల సందర్శన ఉంటుంది. వీరికి ప్రాక్టికల్ పరీక్షలు కూడా నిర్వహిస్తారు.

» ప్రతి పాఠశాలలో టైమ్ టేబుల్‌లో వారానికి నాలుగు పీరియడ్స్ కేటాయిస్తున్నారు. సంక్రాంతి, దసరా, ఇతర సెలవుల సమయంలో విద్యార్థులతో ఇంటర్న్‌షిప్ చేయిస్తున్నారు.

చదువుకుంటూనే ఉపాధి:

విద్యార్థుల ఆసక్తికి అనుగుణంగా నైపుణ్యాలు నేర్చుకోవడానికి ఒకేషనల్ విద్య ఉపకరిస్తుంది. ఇంటర్ పూర్తయిన తర్వాత విద్యార్థులు ఖాళీ సమయాల్లో నేర్చుకున్న నైపుణ్యాలతో ఉపాధి పొందగలరు. అవసరమైతే చదువుకుంటూనే పని చేసుకోవడానికి వీలుంటుంది. కొన్ని కోర్సుల్లో చేరిన విద్యార్థినులు సెలవుల్లో ఆ నైపుణ్యాలతో కొంత మొత్తం సంపాదిస్తున్నారు.

– డా.జె.చంద్రశేఖర్‌రావు, ఏపీసీ, సమగ్రశిక్ష

జిల్లాలో కోర్సులు

★ ఆటోమోటివ్ ★ వ్యవసాయం ★ అపెరల్ (దుస్తులు కుట్టడం) ★ బ్యూటీ అండ్ వెల్‌నెస్ ★ ఎలక్ట్రానిక్స్ ★ ఫుడ్ ప్రాసెసింగ్ ★ హెల్త్‌కేర్ ★ ఐటీ-ఐటీఈఎస్ ★ రిటైల్ ★ బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్

(c) eenadu

అమ్మవారికి విశేష పూజలు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారికి మార్గశిర మాసోత్సవాల సందర్భంగా సోమవారం విశేష పూజలు నిర్వహించారు. త్రికాల సమయంలో జరిపిన పంచామృతాభిషేకం పూజల్లో 30 మంది వరకు ఉభయదాతలు పాల్గొన్నారు. అనంతరం అనివేటి మండపంలో శ్రీచక్ర నవవర్ణార్చన, లక్ష్మీహోమం, శప్తశతీ, వేదపారాయణం, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారిని సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకొని పూజలు నిర్వహించారు.

వెండి ఆభరణాల అలంకరణలో అమ్మవారు

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి
శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయము, భువనేశ్వర్
టెండరు ప్రకటన

ROC.No.TTD-113021(31)/8/2023-SVBH

ఒక సంవత్సర కాలపరిమితిలో పూలమాలల టెండరు కోసం 17.12.2025 న టెండరు కోరబడుచున్నవి. తదుపరి వివరాల కోసం సంప్రదించవలసిన ఫోన్ నెంబరు: 79781 50462.

కార్యనిర్వహణాధికారి

TTD-40021/10/2025-PRO SEC (Adv.No.314), Dt:08.12.2025.

కనకమ్మ హుండీ ఆదాయం రూ.67.78 లక్షలు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారికి అక్టోబరు 29 నుంచి ఈనెల 8వ తేదీ వరకు హుండీల ద్వారా రూ. 67,78,784 లభించింది. ఈ మేరకు సోమవారం ఉదయం ఆలయ ఆవరణలో హుండీల ఆదాయాన్ని లెక్కించగా నగదుతో పాటు 47.5 గ్రాముల బంగారం, 669 గ్రాముల వెండి కూడా లభించింది. కొంత విదేశీ కరెన్సీ కూడా వచ్చినట్లు ఈఓ కె.శోభారాణి తెలిపారు. ఆమె ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ప్రక్రియలో దేవాదాయశాఖ జిల్లా సహాయ కమిషనర్ టి.అన్నపూర్ణ, ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, ఏఈఓలు ఆనందకుమార్, రాజేంద్రకుమార్, పర్యవేక్షకులు కనకరాజు, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కిస్తున్న ఉద్యోగులు, సేవా కమిటీ సభ్యులు

వృద్ధురాలిని బెదిరించి... సొమ్ములు స్వాహా

ఆరుగురు సైబర్ నేరగాళ్ల అరెస్టు

ఎండాడ, న్యూస్‌టుడే: డిజిటల్ అరెస్టు, అంతర్జాతీయ సైబర్ ముఠాలకు బ్యాంకు ఖాతాలు అందించి నేరాలకు పాల్పడుతున్న ఆరుగురు నిందితులను సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేశారు. ఎంవీపీ కాలనీకి చెందిన ఎ.రజనికుమారి(63)కి ఈ ఏడాది మే నెలలో మోహన్‌కుమార్ అనే వ్యక్తి నుంచి ఫోన్ చేసి హవాలా లావాదేవీలకు సంబంధించి ఆమెపై కేసు నమోదైందని, అరెస్టు నుంచి తప్పించుకోవాలంటే నగదు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. రెండు రోజుల తర్వాత వెంకట్రామన్ అనే వ్యక్తి ఫోన్ చేసి డబ్బు చెల్లించకపోతే కారాగారం తప్పదన్నాడు. వరుస బెదిరింపులకు భయపడిన ఆమె తన బ్యాంకు ఖాతా నుంచి రజత్‌కశ్యల్ పేరుతో ఉన్న ఖాతాకు రూ. 8.50 లక్షలు ఆన్‌లైన్‌లో నగదు పంపించారు. మరింత నగదు ఇవ్వాలని డిమాండ్ చేయడంతో తాను మోసపోయినట్లు తెలుసుకుని సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేసిన పోలీసులకు అనకాపల్లి జిల్లాకు చెందిన ఎం.నరసింగరావు, బాపట్ల జిల్లా కూచిపూడికి వాసి జంపాల సందీప్, కాకినాడ జిల్లా సామర్లకోటకు చెందిన వి.సత్యనారాయణ, గుంటూరు జిల్లా వాసి డి.బాలఫణికుమార్, పశ్చిమగోదావరి జిల్లా భీమవరం వాసి జవ్వాడి రామాంజనేయులు, కాకినాడ పట్టణానికి చెందిన నార్ని సతీష్‌చంద్రలను అరెస్టు చేశారు. వీరి నుంచి వివిధ బ్యాంకులకు చెందిన డెబిట్ కార్డులు, బ్యాంకు ఖాతా పాస్ పుస్తకాలు, రబ్బర్ స్టాంప్‌లు, యూపీఎస్ స్కానర్స్, స్వైపింగ్ యంత్రాలు, సిమ్ కార్డులు, ఖాతాలు తెరిచేందుకు ఉంచిన దస్త్రాలు, చరవాణులు స్వాధీనపర్చుకుని సీజ్ చేశారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సైబర్ క్రైం పోలీసులు పేర్కొన్నారు.

పోలీసులు స్వాధీనం చేసుకున్న చరవాణులు, డెబిట్ కార్డులు, రబ్బర్ స్టాంపులు

అమలోద్భవి మాతకు భక్త నీరాజనం

జ్ఞానాపురం, జగదాంబకూడలి, న్యూస్‌టుడే: పాతపోస్టాఫీసు దరి విశాఖపురి పుణ్యక్షేత్రంలో అమలోద్భవిమాత (మరియమాత) మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా క్షేత్రంలోని లూర్ధుమాత గుహ వద్ద జ్యోతి వెలిగించి ఉత్సవ దివ్య పూజాబలిని ప్రారంభించారు. విశాఖ అగ్రపీఠాధిపతి డాక్టర్ ఉడుమల బాలశౌరి మాట్లాడుతూ లోక రక్షకుడు క్రీస్తు ప్రభువుకి తల్లిగా ఉండేందుకు జన్మపాప రహితోద్భవిగా మరియమాతను సృష్టించారన్నారు. నేటి యువత తల్లిదండ్రుల ఆదేశాలకు లోబడి జీవించాలన్నారు. అనంతరం ఆయన్ను రక్షణగిరి డైరెక్టర్ ఫాదర్ కొండాల జోసఫ్ సత్కరించారు. మధ్యాహ్నం పాతపోస్టాఫీసు దరి సెయింట్ అలోషియస్ పాఠశాల నుంచి ఊరేగింపు చేపట్టారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మహోత్సవంలో వివిధ చర్చిల ఫాదర్లు, సిస్టర్లు, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. భక్తిగీతాలను ఆలపించారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వచ్చిన వేలాది మంది భక్తులు విచ్చేసి ప్రార్థనలు చేశారు.

ప్రదక్షిణలో పాల్గొన్న ఆరాధకులు

★ **ఎక్కడికక్కడ భద్రతా ఏర్పాట్లు:** పుణ్యక్షేత్రం వద్ద, స్వరూప తేరు ఊరేగింపు జరిగే ప్రాంతాల్లో నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చీ ఆదేశాలతో పోలీసులు ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పర్యవేక్షించారు. సీసీ కెమెరాలతో పాటు పోలీస్ కంట్రోల్ రూంను ఏర్పాటు చేశారు. ప్రధాన ఆలయంలోకి వెళ్లే మార్గంలో మెటల్ డిటెక్టర్ల వ్యవస్థను అందుబాటులోకి తెచ్చారు. భక్తులకు ఇబ్బందులు కలిగించిన పలువురు ఆకతాయిలను అదుపులోకి తీసుకున్నారు.

ఎంపీ రమేష్‌కు పరామర్శ

ఎర్రగుంట్ల, న్యూస్‌టుడే: రైల్వే స్టాండింగ్ కమిటీ ఛైర్మన్, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్‌ను పలువురు పరామర్శించారు. సీఎం రమేష్ తల్లి చింతకుంట రత్నమ్మ ఇటీవల తుది శ్వాసశాస విడిచారు. పెద్ద కర్మ సందర్భంగా సోమవారం వైఎస్సార్ కడప జిల్లా ఎర్రగుంట్ల మండలం పోట్లదుర్తిలోని సీఎం రమేష్ నివాసానికి ప్రజాప్రతినిధులు, నాయకులు వచ్చి చింతకుంట రత్నమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు.

ఎంపీ సీఎం రమేష్ తల్లి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ, మంత్రులు అచ్చెన్నాయుడు, అనిత, అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవి, తదితరులు

సీఎం రమేష్‌తో కలిసి ఫొటో ప్రదర్శనను తిలకిస్తున్న భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

విజేతలకు బహుమతుల ప్రదానం

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: జాతీయస్థాయి రోలర్ స్కేటింగ్ పోటీల్లో భాగంగా సోమవారం శివాజీపార్కు రింక్‌లో జరిగిన ఆర్టిస్టిక్ ఫిగర్ స్కేటింగ్ విభాగంలో విజేతలకు జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ డి.వి.రమణమూర్తి, డీఎస్‌డీఓ జూన్ గాల్లొయెట్ పతకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎ.పి.రోలర్ స్కేటింగ్ సంఘం అధ్యక్షుడు జె.సుధాకర్‌రెడ్డి, కమిటీ ప్రతినిధులు యార్లగడ్డ రవి, శీలం లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలతో జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ డి.వి.రమణమూర్తి, ఎ.పి.రోలర్ స్కేటింగ్ సంఘ అధ్యక్షుడు జె.సుధాకర్‌రెడ్డి

తొలి మూడు స్థానాల్లో విజేతలు వీరే..

★ బాలికల 6 నుంచి 8 ఏళ్ల విభాగంలో మిషికా మోది (గుజరాత్), వి.చాందిని ప్రదీత (ఆంధ్ర), తెక్వాని అనయ (గుజరాత్), బాలుర విభాగంలో డి.ఆర్.ఓర్జిత్ (తమిళనాడు), కె.తమజ్ఞరామ్ (ఆంధ్ర), పి.చంద్రశేఖర్ (ఆంధ్ర) ★ 8 ఉంచి 10 ఏళ్ల విభాగంలో ఎ.హెచ్. పటేల్ (గుజరాత్), జి.వర్షిణి (ఆంధ్ర), టి.ఎ.ఆశిష్ (గుజరాత్) ★ 10 నుంచి 12 ఏళ్ల బాలికల విభాగంలో ఎ.రష్మిత (ఆంధ్ర), జి.సుధిక్షసాయి (ఆంధ్ర), మాన్వి (గుజరాత్), బాలుర విభాగంలో ఎ.చేతన్‌ఆశిష్ (ఆంధ్ర), ఎన్.మోక్షజ్ఞ (ఆంధ్ర), ప్రణవ్‌బాలు (కేరళ).

గంగవరం పోర్టు వద్ద ఉద్రిక్తత

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: వన్‌టైం సెటిల్‌మెంటు కింద తమకు రూ.2లక్షల బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ గంగవరం పోర్టు మత్స్యకార నిర్వాసితుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం చేపట్టిన 'చలో ముట్టడి' కార్యక్రమం ఉద్రిక్తతకు దారితీసింది. ఉదయం గంగవరం, దిబ్బపాలెం నుంచి నిర్వాసిత కార్మికులు ర్యాలీగా తరలిరావడంతో పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేసినా.. నిర్వాసితులు నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. పోర్టు గేటు వద్ద బారికేడ్లను తొలగించి లోనికి దూసుకెళ్లే ప్రయత్నం చేయగా ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. పోర్టు యాజమాన్యం తీరుకు వ్యతిరేకంగా నినాదాలతో హోరెత్తించి గేటు బయట ధర్నాకు దిగారు. అదానీ గంగవరం పోర్టులో పనిచేస్తున్న 499 మంది మత్స్యకార నిర్వాసిత కార్మికులకు వన్‌టైం సెటిల్‌మెంటు కింద రెండేళ్లక్రితం పోర్టు యాజమాన్యం రూ. 24.80 లక్షలు చొప్పున చెల్లించింది. ఇంకా రూ. 2.20 లక్షలు చెల్లించాల్సిఉండగా జాప్యం చేయడంతో కొన్నాళ్లుగా నిర్వాసిత కార్మికులు, యాజమాన్యం మధ్య వాదనలు జరుగుతున్నాయి. ఆదాయ పన్ను, ఇతర కారణాలను చూపుతూ చెల్లింపులు నిలిపివేయడాన్ని నిర్వాసిత కార్మికులు తీవ్రంగా పరిగణించారు. పోర్టు కార్యకలాపాలు జరగకుండా అడ్డుకోవడంతో మధ్యాహ్నం వరకూ గందరగోళం చోటుచేసుకుంది. హార్బర్ ఏసీపీ కాళిదాసు, న్యూపోర్టు సీఐ కామేశ్వరరావులు కార్మికులకు సర్దిచెప్పినా వినకపోవడంతో గేటువద్ద ఉద్రిక్తత నెలకొంది. డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరెడ్డి పోర్టుగేటుకు చేరుకుని కార్మికులకు మద్దతుగా నిలిచారు. ఆ తర్వాత కార్మిక నాయకులను తీసుకుని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు క్యాంప్ కార్యాలయానికి చేరుకున్నారు. కార్మికుల డిమాండ్లను ఎమ్మెల్యే ముందుంచగా ఆయన నేరుగా పోర్టు యాజమాన్య ప్రతినిధులు, జిల్లా కలెక్టర్‌తో ఫోన్లో మాట్లాడారు. ఉపాధి కోల్పోయి మత్స్యకార కార్మికులు వీధిన పడ్డారని, పెండింగ్‌లో ఉన్న రూ. 2.20 లక్షలు తక్షణం చెల్లించాలని కోరారు. తమకు రెండువారాల గడువు ఇస్తే తగిన న్యాయం చేస్తామని హామీ లభించడంతో కార్మిక నాయకులు శాంతించి నిరసన విరమణకు ఒప్పుకొన్నారు.

పోర్టు గేటు వద్ద బైఠాయించిన మత్స్యకార నిర్వాసితులు

ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ హెచ్చరించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం జేసీ మయూర్ అశోక్, ఇన్‌ఛార్జి డీఆర్వో సత్తిబాబు, ఏడీసీ వర్మ తదితర అధికారులతో కలిసి పీజీఆర్ఎస్‌లో కలెక్టర్ వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకే సమస్యపై ఫిర్యాదులు పునరావృతం కాకుండా చూడాలని, సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ఒకే సమస్యపై పదేపదే అర్జీలు వస్తే ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. సీఎంవో నుంచి వచ్చే వినతులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారులు తమ తమ వినతులను అందజేశారు. రెవెన్యూ-108, జీవీఎంసీ-83, పోలీసు-18, ఇతర శాఖలకు సంబంధించి 83 వినతులు వచ్చినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

పీజీఆర్ఎస్‌లో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్

ఎస్టీయూ నూతన కార్యవర్గం ఎన్నిక

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే : రాష్ట్రోపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎనుకున్నట్లు రాష్ట్ర కౌన్సిలర్లు రెడ్డిపల్లి జగదీష్‌బాబు, చుక్కల స్వామి తెలిపారు. గౌరవాధ్యక్షులుగా కె. ప్రభాకర్, పీడీ అప్పలరాజు, అధ్యక్షురాలిగా చంద్ర పద్మావతి, అసోసియేట్ అధ్యక్షుడిగా విజినిగిరి శంకరరావు, ఉపాధ్యక్షులుగా ఆంజ నేయులు, సత్యనారాయణ, పురుషోత్తం, ప్రధాన కార్యదర్శిగా ఇమంది పైడిరాజు, కార్యదర్శిగా బీవీఎన్ కుమార్, కోశాధికారులుగా పి దేముడు బాబు, తాలాడ రామకృష్ణ, మహిళా కార్యదర్శులుగా సునీత, రత్నవల్లిలను ఎన్నుకున్నట్లు ప్రకటించారు.

నూతన కార్యవర్గంతో రాష్ట్ర ప్రతినిధులు

100 హెక్టార్లలో ఆయిల్ పామ్ సాగు లక్ష్యం

వన్‌టౌన్, న్యూస్‌టుడే: విశాఖ జిల్లా పరిధిలోని మూడు మండలాల్లో వంద హెక్టార్లలో ఆయిల్ పామ్ సాగు చేపట్టాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వంద శాతం రాయితీతో ఈ మొక్కలు ఇస్తోందని, ఆయిల్ పామ్ తోటల్లో అంతర్ పంటల నిర్వహణకు ఏడాదికి రూ.5250 చొప్పున నాలుగేళ్ల పాటు హెక్టార్‌కు రూ.21 వేలు రాయితీ ఇస్తామన్నారు. బిందు సేద్యం నీటి వసతి పరికరాలపై కూడా ప్రభుత్వం రాయితీ ఇస్తోందని కలెక్టర్ ఓ ప్రకటనలో తెలిపారు.

రద్దీ దృష్ట్యా ప్రత్యేక రైళ్లు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: పలు రైళ్ల రద్దీ దృష్ట్యా ప్రయాణికులకు సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించాలనే ఉద్దేశంతో ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు వాల్తేర్ సీనియర్ డీసీఎం కె.పవన్‌కుమార్ తెలిపారు.

★ చర్లపల్లి-షాలిమార్ (07148/49)(07181)..: ఈ నెల 8న రాత్రి 9.35 గంటలకు చర్లపల్లిలో బయలుదేరి మర్నాడు ఉదయం 9.05 గంటలకు దువ్వాడ చేరుకొని అక్కడి నుంచి 9.10 గంటలకు బయలు దేరి రాత్రి 11.50 గంటలకు షాలిమార్ చేరుకోనున్నట్లు తెలిపారు. తిరుగు ప్రయాణంలో ఈ రైలు ఈ నెల 10న మధ్యాహ్నం 12.10 గంటలకు షాలిమార్‌లో బయలు దేరి మర్నాడు ఉదయం 2.40 గంటలకు దువ్వాడ చేరుకొని అక్కడి నుంచి 2.42 గంటలకు బయలు దేరి సాయంత్రం 4 గంటలకు చర్లపల్లి చేరుకోనున్నట్లు పేర్కొన్నారు.

★ ఈ నెల 9న మధ్యాహ్నం 12.10 గంటలకు షాలిమార్‌లో బయలు దేరి మర్నాడు ఉదయం 2.40 గంటలకు దువ్వాడ చేరుకొని అక్కడి నుంచి 2.42 గంటలకు బయలు దేరి అదే రోజు సాయంత్రం 4 గంటలకు చర్లపల్లికి చేరుకోనున్నట్లు తెలిపారు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	126	125
లైవ్	153	145
డ్రెస్	222	260
స్కిన్‌లెస్	252	270

11వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

సన్‌రైజ్ చిల్డ్రన్ హాస్పిటల్ - గాజువాక

ONE AND ONLY EXCLUSIVE PEDIATRIC TERTIARY CARE HOSPITAL IN VIZAG

Dr. T. తిరుపతి MD, Pediatrics, FIPCCM Consultant Pediatrician, Neonatologist & Pediatric Intensivist

Dr. GANESH SANKU, MD Neonatal-Perinatal Medicine, USA | Dr. P.V.RAMANA M.S., MCH Associate Professor, Pediatric Surgeon | Dr. PRATIBHA Consultant Pediatrician, Neonatologist

Dr. NAVEEN M.B.B.S., DNB, Pediatric | Dr. Sri Lakshmi, M.D. Associate Professor, Pediatrician | Dr. Malavi, MBBS, DCH Consultant Pediatric, Neonatologist | Dr. P. Santhoshi Fellow in Pediatrics Consultant Pediatrician

11 YEARS OF LEADERSHIP IN PEDIATRIC TERTIARY CARE

24 SERVICE

Sunrise Children's Hospital

CHILDREN NEED, CHILDRENS HOSPITAL

MAIN BRANCH : #8-11-8, 1st Floor, Latha Hospital Building, Old Gajuwaka, VIZAG - 530026, Cell: 95503 777 99

CLINIC-1 : #58-9-30, Opp. Sri Bangaramma Sri Durgalamma Temple, New Karasa, NAD-530009. Cell: 70366 44666

CLINIC-2 : #2-36, Opposite Govt. Hospital, Main Road, AGANAMPUDI - 530053. Cell: 99669 33887

With Best Compliments from

N. SUBBARAO & FAMILY Wood & Composite Wood Products | Y. SAMBA SIVA RAO Sri Krishna Sai Engg. Works

TALACHERU VENKATESWARULU TVS Ventures Managing Director | TALACHERU VENKATA KRISHNA Amrutha Projects, Managing Partner, Hyd

TALACHERU SRINIVASULU MBBS, MD (General Medicine) | TALACHERU SRI HARI NAIDU Project Manager (RDSS, Chittoor)

Dr. SAJJA PANDURANGA PRASAD President: VASSIAWA SAJJAS VISHNUTEK ENGINEERING | VEMURI RAMESH BABU V.R. Engg. Works

V. KISHORE Pioneer Castings | S. SATYANARAYANA MURTHY Sri Sai Krishna Industries

N. SIVARAMA KRISHNA | KAKA SAMBASIVARAO & FAMILY

S. SEETHARAMAIAH Director, Engineering & Projects Cipla | POLISETTY SRINIVASULU Dy. General Manager, Pfizer

D. VIJAYA PRATHAP MONOMER POLYMERS | WASEEM RAJA PARVEEN MARBLES

VOGUE ELEGANT FASHION BOUTIQUE
CELEST MALL, SHOP NO.11, 1ST FLOOR, OLD GAJUWAKA

EENADU Classifieds

BUSINESS SERVICES | TO LET | SANKARAMATHAM | PERSONAL CLASSIFIEDS | LOST | JOBS | REAL ESTATE | GENERAL | JOB OPPORTUNITY | SECURITY GUARDS | TOURS AND TRAVELS

LOST PASSPORT
I, PULLABHATLA CHANDRA SEKHAR S/o P. Sanyasi Rao, Residing at D.No.3-253, Street Number 7, Adarshnagar, Old Dairy Farm, Visakhapatnam - 530040 Andhra pradesh, India, I Lost my Original Passport, bearing No. N5750920, when I went to take Xerox copies in Kanithi Nagar on my Bike and return back to my home on 15-11-2025. If anybody find please Return to above Address
9491333900

1250 Sft Flat Fully Finished Car Parking Nr: Sankaramatham Rd, opp: Crown Bakery Veg only For Rent. Ph: 7382941422

Wanted Staff in Saree Store Sales Boys, Sales Girls experience must be 2 to 3 years. Contact: 9394311123.

Wanted Civil Engineer B.Tech/ Diploma Minimum 5 years Experience in Roads Works. Resume Sent to : mohansaluru@gmail.com Ph: 9849913457.

Marketing Executives 10K to 30K, Telecallers (F) 10K to 15K, DTP & Digital (F&M) 15 to 25K. Ph: 0891 2563215, 9381756318.

జైగణేష్ సెక్యూరిటీసంస్థలో విశాఖ స్టీల్‌ప్లాంటు ఏరియాలో సెక్యూరిటీ గార్డ్స్ 150 మంది 8గం|| డ్యూటీ జీతం 18815/- PF, ESI సెక్యూరిటీ సూపర్‌వైజర్స్ 11మంది ...

ఇండియన్ బ్యాంక్ — ఎం.వి.పి. కాలనీ శాఖ
ప్లాట్ నెం.11, ఎం.ఐ.జి-1, సెక్టార్-2, ఎం.వి.పి.కాలనీ, విశాఖపట్నం-530017, ఫోన్: 0891-2520222

స్థిరాస్తుల అమ్మకానికి అమ్మకం ప్రకటన
"APPENDIX- IV-A" (రూలు 8(6)కు నిబంధన చూడండి)

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని రూలు 8(6) నిబంధనలతో చదువబడు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం ప్రకటన.

24-12-2025 | ఆస్తి ఐడి నెం.: IDIB30269460436 | రూ.1,40,00,000/- | రూ.14,00,000/- | రూ.10,000/-

(Indian Bank e-auction notice: https://baanknet.com, support.baanknet@psballiance.com; M/s PSB Alliance; తేది: 08-12-2025; సం/- అధీకృత అధికారి, ఇండియన్ బ్యాంక్)

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
అసెట్ రికవరీ బ్రాంచ్, డోర్ నెం.26-15-150, ... విశాఖపట్నం-530001.
ఫోన్: 0891-2537792 / 82, మొబైల్ నెం: 93245 17291. ఇ-మెయిల్: ubin0817295@unionbankofindia.bank

స్థిరాస్తి అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన
APPENDIX-IV-A [(See Proviso to Rule 8(6)]

రిజర్వు ధర: రూ.1,81,00,000/- | ధరావత్తు: రూ.18,10,000/- | బిడ్ పెంపుదల మొత్తం: రూ.1,81,000/-

ఇ-వేలం తేదీ మరియు సమయం : 30-12-2025, మ॥ 12.00 గం॥ నుండి సా॥ 05.00 గం॥ వరకు

https://www.unionbankofindia.co.in/auction-property/view-auction-property.aspx, www.unionbankofindia.co.in

తేది : 02.12.2025 | స్థలం : విశాఖపట్నం | సం/- అధీకృత అధికారి & అసిస్టెంట్ జనరల్ మేనేజర్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అసెట్ రికవరీ బ్రాంచ్

పెందుర్తి

తెరపై ఈనాడు
లక్ష్మీకాంత్ స్క్రీన్-1 **రాజు వెడ్స్ రాంబాయి**
స్క్రీన్-2 - **ఆంధ్ర కింగ్ తాలూకా**

ఘనంగా అన్న సమారాధన

పెందుర్తి, న్యూస్‌టుడే: జీవీఎంసీ 96వ వార్డు పరిధి పెందుర్తి ద్రోణంరాజు నగర్ రెల్లికాలనీలో కొలువైన పోలమాంబ అమ్మవారి ఆలయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం నుంచి భక్తులు అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించి దర్శనం చేసుకున్నారు. స్థానిక నాయకులు శరగడం చినఅప్పలనాయుడు, తదితరులు అమ్మవారిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన అన్నసమారాధనలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

80085 74978 సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

వేపగుంట, న్యూస్‌టుడే: ?: బీఆర్టీఎస్ కాలిబాటలపై పలకలు పడిపోయి ప్రమాదకరంగా మారాయి. –శ్రీనివాసరావు, వేపగుంట ✓: ప్రమాదకరంగా మారిన పలకలను తొలగించి కొత్తవి వేయించేందుకు చర్యలు తీసుకుంటాం. –శంకర్రావు, ఇన్‌ఛార్జి జోనల్ కమిషనర్

సబ్బవరం, న్యూస్‌టుడే: ?: సబ్బవరం శివారు గొల్లలపాలెంలో వ్యర్థాలు పేరుకుపోయి దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నాం. –కె.శ్రీరాములు, గొల్లలపాలెం ✓: క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటాం. –పి.ఆనందరావు, ఇన్‌ఛార్జి గ్రామ కార్యదర్శి, సబ్బవరం

?: సబ్బవరం పాత సినిమాహాలు వద్ద, ఎన్టీఆర్ విగ్రహం సమీప కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోయి దోమల బెడద వెంటాడుతోంది. –జి.ముత్యాలరావు, సబ్బవరం ✓: వెంటనే పరిశీలించి పరిశుభ్రత చర్యలు చేపడతాం. –డి.ప్రసాదరావు, గ్రామ కార్యదర్శి, సబ్బవరం

పరవాడ, న్యూస్‌టుడే: ?: పరవాడ మండలంలో కుక్కల బెడద అధికంగా ఉంది. అవి గుంపులుగా తిరుగుతూ దాడి చేస్తున్నాయి. –నాయుడు, పరవాడ ✓: పరిష్కారానికి వెంటనే చర్యలు చేపడతాం. –రమేశ్‌నాయుడు, ఎంపీడీవో, పరవాడ

బీఆర్‌టీఎస్‌లో రాకపోకలకు నిత్యం అవస్థలే...

వేపగుంట, న్యూస్‌టుడే

బీఆర్‌టీఎస్ సేవా మార్గాల్లో ఆక్రమణల కారణంగా స్థానికులు, వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా నాయుడుతోట-ఎల్‌జీపాలిమర్స్ కూడలి మధ్యలోని కృష్ణానగర్ ప్రాంతం వాహనదారులకు హడలెత్తిస్తోంది. దుకాణదారులు తమ తమ గూడ్సు వాహనాలను సేవా మార్గాల్లో పెట్టడంతో తరచూ ట్రాఫిక్ రద్దీ సమస్య తలెత్తుతోంది. జీవీఎంసీ, ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోకపోవడం వల్ల ఈ సమస్య రోజురోజుకు తీవ్రతరం అవుతోందని పలువురు వాపోతున్నారు.

కృష్ణానగర్ వద్ద దుకాణదారుల వాహనాలు సగ భాగం ఆక్రమించేశాయిలా..

సగం ఆక్రమించేసి..: ఇటీవల కాలిబాటల్లోని ఆక్రమణలను జీవీఎంసీ అధికారులు పోలీసు బందోబస్తుతో తొలగించిన సంగతి తెలిసిందే. ఇదే సమయంలో రహదారులను సగానికిపైగా తమ గూడ్సు వాహనాలతో ఆక్రమించేసిన దుకాణదారులపై ఎందుకు చర్యలు చేపట్టలేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. రద్దీ సమయాల్లోనూ లోడింగ్, అన్‌లోడింగ్ చేస్తుండడం వల్ల ఈ సమస్య మరింత జటిలం అవుతోందని అంటున్నారు.

నిబంధనలు బేఖాతరు: రహదారుల పక్కన వ్యాపారం చేసే దుకణదారులు నిబంధనలు కూడా పాటించడం లేదు. ముఖ్యంగా అగ్నిప్రమాదాల నివారణకు ఉపయోగించాల్సిన పరికరాలను సిద్ధంగా ఉంచడం లేదు. నాయుడుతోటలోని ఓ తుక్కు దుకాణం అగ్నిప్రమాదానికి గురై స్థానికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. మళ్లీ అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా దుకాణదారులు ఫైర్ సేఫ్టీ పరికరాలు సమకూర్చుకుని నిబంధనలన్నీ పాటించేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

■ రహదారి పక్కనున్న ఇళ్లను అద్దెకు తీసుకుని కొంతమంది వర్తకులు వ్యాపారాలు సాగిస్తున్నారు. ఆయా భవనాలను వ్యాపారానికి వినియోగిస్తున్నా ఇళ్ల పన్నులే వసూలు చేస్తుండడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంలో కొందరు అధికారులు ఆమ్యామ్యాలు తీసుకుని చూసీచూడనట్లు వదిలేస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం: పెందుర్తి-గోపాలపట్నం మధ్య బీఆర్‌టీఎస్ సేవా మార్గాల్లో రాకపోకలకు ఇబ్బందులు కలిగించే విధంగా దుకాణదారులు వాహనాలు ఉంచితే చర్యలు తప్పవు. రద్దీ సమయాల్లో లోడింగ్, అన్‌లోడింగ్ చేసి ఇబ్బంది కలిగిస్తే జరిమానా విధిస్తాం. కృష్ణానగర్ ప్రాంతంలో పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించి తగిన చర్యలు చేపడతాం. –నర్సింగరాజు, ట్రాఫిక్ ఎస్ఐ, పెందుర్తి పోలీసుస్టేషన్

● నేడు ఎన్టీపీసీ క్రీడా పోటీలు

లంకెలపాలెం(పరవాడ), న్యూస్‌టుడే: పరవాడ మండలం లంకెలపాలెం జడ్పీ హైస్కూల్ మైదానం వేదికగా మంగళవారం సింహాద్రి ఎన్టీపీసీ ఆధ్వర్యంలో మండలస్థాయి గ్రామీణ క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు హెచ్ఎం రౌతు నాగేశ్వరరావు తెలిపారు. ఇప్పటికే మైదానాన్ని, వేదికను అన్ని హంగులతో సిద్ధం చేసి ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఈ పోటీలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు జరుగుతాయన్నారు. ఎన్టీపీసీ ఈడీ సమీర్‌శర్మ ముఖ్యఅతిథిగా విచ్చేసి పోటీలు ప్రారంభిస్తారన్నారు. మండల వ్యాప్తంగా ఉన్న 14 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు చెందిన 6 నుంచి పదోతరగతి వరకు గల విద్యార్థులు క్రీడల్లో పాల్గొంటారన్నారు. బాలికలకు ఖోఖో, త్రోబాల్, కబడ్డీ; బాలుర విభాగంలో ఖోఖో, వాలీబాల్, కబడ్డీ పోటీలతో పాటు బాలబాలికలకు 200మీ., 800మీ. పరుగు పోటీలు, లాంగ్‌జంప్, షాట్‌పుట్, 400×100 రిలే పోటీలు ఉంటాయన్నారు. విద్యార్థులంతా పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

పోటీలకు సిద్ధమైన లంకెలపాలెం పాఠశాల మైదానం

రైతుల భూములు కార్పొరేట్లకు దోచి పెడుతున్నారు

సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి. రాఘవులు

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: రాష్ట్రం పారిశ్రామికంగా ముందుకు దూసుకెళ్తోందని, రూ.లక్షల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయంటూ కూటమి ప్రభుత్వం చెబుతున్నా అందుకు తగ్గ కార్యాచరణ కనిపించట్లేదని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు ఎద్దేవా చేశారు. సోమవారం జగదాంబకూడలిలోని సీపీఎం కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. గతంలో వేల ఎకరాల భూములను రైతుల నుంచి తీసుకుని కార్పొరేట్లకు ఇచ్చినా ఒరిగిందేమీ లేదన్నారు. ఆ భూముల్లో గడ్డి తుప్పలు తప్పా.. ఒక్క పరిశ్రమ కూడా రాలేదని వ్యాఖ్యానించారు. ఐటీ మంత్రి లోకేశ్ కూడా గడిచిన 17 నెలల్లో రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించామని అనడం విడ్డూరంగా ఉందన్నారు. అదే నిజమైతే ఆ డబ్బంతా ఎక్కడికి వెళ్లిందో చెప్పాలన్నారు. వివిధ ప్రాంతాల్లో భూములిచ్చిన రైతులకు పరిహారం ఏమిచ్చారంటూ ప్రశ్నించారు. ★ డేటా సెంటర్ అవసరమే కానీ అందులో వచ్చే ఉద్యోగాలు 300 కంటే మించవన్నారు. గూగుల్‌కి చౌకగా నీరు, విద్యుత్ ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రతిష్ఠను దిగజార్చి కార్మికుల జీతాల్లో కోత పెట్టి స్వచ్ఛందంగా ఉద్యోగాలను వదులుకునేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, యాజమాన్యం చేస్తున్నాయని మండిపడ్డారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.లోకనాథం, జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న బి.వి.రాఘవులు

■ ఆయుష్య గణపతికి పంచామృతాభిషేకం

పెందుర్తి, న్యూస్‌టుడే: సంకష్ట హర చతుర్థి పర్వదినాన్ని పురస్కరించుకుని వేంకటాద్రి క్షేత్ర పాలకుడు ఆయుష్య గణపతి ఆలయంలో స్వామివారికి విశేష అభిషేకాలు, అర్చనలు జరిగాయి. వేంకటాద్రి ఆలయ ప్రధానార్చకులు మహర్షి రామానుజాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు గణనాథునికి పంచామృతాభిషేకం నిర్వహించారు. నూతన వస్త్రాలతో అలంకరించి షోడశోపచార పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పెందుర్తి, న్యూస్‌టుడే: జీవీఎంసీ 96వ వార్డు పెందుర్తి సూర్యానగర్‌లో కొలువైన సంపత్ వినాయక ఆలయంలో సోమవారం విశేష హోమాలు, పూజలు జరిగాయి. పురోహితులు గణనాథునికి పంచామృతాభిషేకం, అర్చన చేశారు. హోమగుండంలో అగ్నిప్రతిష్ఠాపన చేసి వేదమంత్రాలతో హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

■ మార్షల్ ఆర్ట్స్‌లో విద్యార్థిని ప్రతిభ

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలం అరిప్ల స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న ఆర్.దీక్షిత ఈనెల 7వ తేదీన అనకాపల్లి తిరిడి కల్యాణమండపంలో షోటోకాన్ అకాడమీ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి కరాటే ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. వందలాది మంది పోటీ పడగా దీక్షిత అండర్-14 విభాగంలో పోటీపడి స్వర్ణ పతకం సాధించినట్లు ప్రిన్సిపల్ స్వామినాయుడు, కరాటే కోచ్ అప్పారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆమెను అభినందించారు.

విద్యాలయాలకు సామగ్రి వితరణ

ఇస్లాంపేట (పరవాడ), న్యూస్‌టుడే: జీవీఎంసీ 77వవార్డు పరిధి ఇస్లాంపేట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు సోమవారం రైల్వే కన్సల్టేటివ్ కమిటీ మాజీ డైరెక్టర్ కె.అప్పారావు, అగనంపూడికి చెందిన కాంట్రాక్టర్ నెల్లి శ్రీనివాసరావు తమ సొంత నిధులు రూ.?వేలు వెచ్చించి 16 కుర్చీలు సమకూర్చారు. పాఠశాలలో జరిగిన ఓ కార్యక్రమంలో వీటిని హెచ్‌ఎం ప్రమీలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్‌ఎంకు కుర్చీలు అందజేస్తున్న దాతలు అప్పారావు, శ్రీనివాసరావు

పాలిటెక్నిక్ కళాశాలకు పుస్తకాలు..

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని గ్రంథాలయానికి కాకినాడ ఆంధ్ర పాలిటెక్నిక్ కళాశాల విశ్రాంత సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి కె.శ్రీనివాసమూర్తి సుమారు రూ.10వేలు విలువైన పుస్తకాలను వితరణ చేశారు. ఈ సందర్భంగా సోమవారం పెందుర్తి కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.చంద్రశేఖర్‌కు సంబంధిత పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

చినముషిడివాడ (పెందుర్తి), న్యూస్‌టుడే: జీవీఎంసీ 97వ వార్డు చినముషిడివాడ శాంతినగరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఉపాధ్యాయులు సోమవారం అధ్యయన సామగ్రి అందజేశారు. ఐక్య ఉపాధ్యాయ సంఘం రూపొందించిన పదో తరగతి అధ్యయన సామగ్రిని పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు సొంత నిధులు వెచ్చించి వాటిని తెప్పించారని ప్రధానోపాధ్యాయిని శ్రీవాణి తెలిపారు. పది ప్రణాళికలో భాగంగా విద్యార్థులకు చక్కగా బోధించి మంచి ఫలితాలు రాబట్టేందుకు ఈ సామగ్రి ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పుస్తకాలు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

21న పల్స్‌పోలియో

వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఈనెల 21న జరిగే పల్స్‌పోలియో కార్యక్రమంలో అయిదేళ్ల లోపు ప్రతీ చిన్నారికి పోలియో చుక్కలు వేయించాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పల్స్‌పోలియో నిర్వహణపై జరిగిన సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో అయిదేళ్లలోపు చిన్నారులు 2,09,652 మంది ఉన్నారని చెప్పారు. వీరిలో నగర పరిధిలో 1,90,090 మంది, గ్రామీణ ప్రాంతంలో 16,562 మంది ఉన్నట్లు ఆయన వివరించారు. పోలియో చుక్కలు వేసేందుకు 1062 బూత్‌లు ఏర్పాటు చేస్తున్నారు. జేసీ మయూర్ అశోక్, ఇన్‌ఛార్జి డీఆర్వో సత్తిబాబు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జగదీశ్వరరావు, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ శంకర్‌ప్రసాద్, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

వన్‌టౌన్, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీ, స్వచ్ఛభారత్, క్లాప్ మిత్ర కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ అనుబంధ కార్మిక సంఘం ఏపీ గ్రామ పంచాయతీ, స్వచ్ఛభారత్ వర్కర్స్ యూనియన్ కోరింది. కలెక్టరేట్ వద్ద యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేపట్టిన తర్వాత యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ మాట్లాడారు. బకాయి పడిన జీతాలను వెంటనే చెల్లించాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ప్రమాదం లేదా సహజ మరణం పొందిన కార్మికుల వారసులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని నాయకులు డిమాండ్ చేశారు. అనంతరం వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు.

కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న వివిధ సంఘాల కార్మికులు

★ ఆటో కార్మిక సంఘం ఆధ్వర్యంలోనూ నిరసన ప్రదర్శన జరిగింది. ఈనెల 11 నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద చేపట్టనున్న రిలే నిరాహార దీక్షలకు సంబంధించిన సమాచారాన్ని సంఘ నాయకులు శ్రీను తదితరుల ఆధ్వర్యంలో కలెక్టర్‌కు విన్నవించారు.

అధికారులూ.. బాధ్యతగా వ్యవహరించండి

కార్పొరేషన్, న్యూస్‌టుడే: జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు విధి నిర్వహణలో బాధ్యతగా వ్యవహరించాలని కమిషనర్ కేతన్‌గార్గ్ హెచ్చరించారు. సోమవారం 'ఈనాడు'లో 'అడ్డగోలుగా ప్రతిపా'ధనం' శీర్షికతో ప్రచురితమైన కథనానికి స్పందించిన ఆయన ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడారు. పనుల ప్రతిపాదనల్లో అవకతవకలు చోటుచేసుకుంటున్నాయని, గుత్తేదారులు పనులు చేస్తున్న సమయంలో కనీసం పర్యవేక్షణ ఉండటం లేదన్నారు. వర్క్ ఇన్‌స్పెక్టర్లు, సహాయ ఇంజినీర్లు విధుల పట్ల అత్యంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. తీరు మారకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని, తప్పు ఎక్కడ దొర్లినా కఠిన చర్యలు తప్పవన్నారు.

■ వ్యాన్ ఢీకొని బిహార్ వాసి దుర్మరణం

పవన్‌కుమార్ (పాతచిత్రం)

లంకెలపాలెం (పరవాడ), న్యూస్‌టుడే: జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందినట్లు పరవాడ సీఐ మల్లికార్జునరావు తెలిపారు. ఆ వివరాలిలా.. బిహార్‌లోని జైరామ్ గ్రామానికి చెందిన పవన్‌కుమార్ (27) అగనంపూడి సమీప మినీ ఆటోనగర్‌లోని ఓ కంపెనీలో పనిచేస్తూ లంకెలపాలెంలో తోటిమిత్రులతో కలిసి నివాసం ఉంటున్నాడు. ఎప్పటి మాదిరిగానే సోమవారం ఉదయం విధులకు హాజరయ్యేందుకు సైకిల్‌పై వెళ్తుండగా లంకెలపాలెం ఎంవోఎస్ పెట్రోల్‌బంక్ సమీపంలో వెనుక నుంచి నీళ్ల సీసాలతో అతి వేగంగా వెళ్తున్న వ్యాన్ బలంగా ఢీకొట్టడంతో పవన్‌కుమార్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

గీతంలో 'స్మార్ట్ ఇండియా హ్యాకథాన్' ప్రారంభం

సాగరనగర్, న్యూస్‌టుడే: కేంద్రప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ ఇన్నోవేషన్ సెల్, అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) గీతం డీమ్డ్ వర్సిటీలో సోమవారం నుంచి జాతీయస్థాయిలో నిర్వహిస్తున్న 'స్మార్ట్ ఇండియా హ్యాకథాన్' ఫైనల్ పోటీలను గీతం ప్రొ-వీసీ ప్రొఫెసర్ వై.గౌతమ్ రావు ప్రారంభించారు. యువతలో నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి ఏఐసీటీఈ గత ఏడేళ్లుగా నిర్వహిస్తున్న ఈ స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ దేశంలో పలు స్టార్టప్‌లకు ఊపిరిపోసిందన్నారు. ★ గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్, విశాఖ నోడల్ సెంటర్ కన్వీనర్ ప్రొఫెసర్ రాజాఫణి పప్పు మాట్లాడుతూ ఈ పోటీల్లో పాల్గొనే విద్యార్థులకు కేంద్రప్రభుత్వం, ఇతరశాఖలు ఎదుర్కొంటున్న పలు సమస్యలకు పరిష్కారం కనుగొనాల్సిందిగా సూచించడం వినూత్న ప్రయత్నమన్నారు. ★ ఐదు రోజుల పాటు జరిగే ఈ పోటీలకు హాజరైన దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన 25 విద్యార్థి బృందాలు, 171 మంది యువత ఆలోచనల్ని న్యాయ నిర్ణేతల సమక్షంలో పరిశీలించి ఈ నెల 12వ తేదీన విజేతల్ని ప్రకటిస్తామని గీతం వీడీసీ కోచ్ బి.రాజ్‌కుమార్ పేర్కొన్నారు. కో-ఆర్డినేటర్లు వివేక్, అభితేజ్ తదితరులు పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా 60 విద్యాలయాల్లో జరుగుతున్న ఈ స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ పోటీల్లో పాల్గొంటున్న యువతను ఉద్దేశించి 'ఏఐసీటీఈ' ఛైర్మన్ టి.జి.సీతారామ్ వర్చువల్‌గా ప్రసంగించారు.

← విద్యార్థులనుద్దేశించి వర్చువల్‌గా మాట్లాడుతున్న ఏఐసీటీఈ ఛైర్మన్ సీతారామ్

■ బాల్య వివాహాలు అరికట్టేందుకు కృషి

వన్‌టౌన్, న్యూస్‌టుడే: బాల్య వివాహాలు అరికట్టేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ అన్నారు. ఈ మేరకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం బాల్య వివాహాలకు వ్యతిరేకంగా కలెక్టర్ జిల్లా అధికారులతో ప్రతిజ్ఞ చేయించి ప్రసంగించారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే 1098 నంబరుకు ఫిర్యాదు చేయాలన్నారు.

■ వినియోగదారులను చైతన్యపర్చాలి

వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఈ నెల 24న జరగనున్న జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా స్మార్ట్ సిటీ కంజ్యూమర్ ప్రొటెక్షన్ కౌన్సెల్ వెలువరించిన గోడపత్రికను సోమవారం జేసీ మయూర్ అశోక్ తన ఛాంబరులో విడుదల చేశారు. ఈ దినోత్సవాన్ని పెద్ద ఎత్తున చేపట్టి వినియోగదారులను చైతన్యపర్చాలని, వివిధ అంశాలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని జేసీ సూచించారు. డీసీఎస్ఓ వి.భాస్కర్రావు, కౌన్సెల్ కార్యదర్శి పేర్ల భాస్కర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

మహిళా మార్టుపై విచారణ చేపట్టాలి

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండల సర్వ సభ్య సమావేశం ఎంపీపీ బోకం సూర్యకుమారి అధ్యక్షతన సోమవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో వాడీవేడిగా జరిగింది. సబ్బవరం జెడ్పీటీసీ సభ్యుడు మృతి చెందినందున మండలానికి జిల్లా పరిషత్ నిధులు వస్తున్నాయా? లేదా? అని అసకపల్లి ఎంపీటీసీ సభ్యుడు కర్రి అప్పలనాయుడు తదితరులు లేవనెత్తారు. ఈ విషయంపై అధికారులు వెంటనే దృష్టి సారించాలని అన్నారు. సబ్బవరం మహిళా మార్టును రూ. 75లక్షలతో మొదలు పెట్టారని ప్రస్తుతం నష్టాల్లో కూరుకుపోయి మూతపడే స్థితికి చేరుకుందని అన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. బాటజంగాలపాలెం, ఆరిపాక, గొల్లలపాలెం, నల్లరేగులపాలెం, గుల్లేపల్లిలోని సమస్యలను సంబంధిత ప్రతినిధులు సమావేశం దృష్టికి తెచ్చారు. మావుళ్ల గెడ్డపై వంతెన నిర్మించాలని పలువురు కోరారు. ఉప ఎంపీపీలు ఝాన్సీ లక్ష్మీరాణి, మామిడి లక్ష్మి, ఎంపీడీవో పి.పద్మావతి, డీటీ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సూర్యకుమారి

జీవీఎంసీకి 86 వినతులు రాక

కార్పొరేషన్, న్యూస్‌టుడే: నగరంలో మల్టీప్లెక్సులు, షాపింగ్ మాల్స్, సినిమా థియేటర్లు వంటి వాణిజ్య సముదాయాల్లో నిబంధనలకు విరుద్ధంగా పార్కింగ్ రుసుములు వసూలు చేస్తున్నారని, వాటిని నియంత్రించాలని న్యాయవాది కొండా రాజీవ్‌గాంధీ ఫిర్యాదు చేశారు. మహా విశాఖ నగరపాలక సంస్థలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 86 వినతులు వచ్చాయి. మేయర్, కమిషనర్ అందుబాటులో లేకపోవడంతో అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి వాటిని స్వీకరించారు. వాటిలో జోన్-1కు 1, జోన్-2కు 8, జోన్-3కు 21, జోన్-4కు 6, జోన్-5కు 11, జోన్-6కు 22, జోన్-8కు 6, ప్రధాన కార్యాలయానికి 11 ఫిర్యాదులు అందాయి. వాటిలో పరిపాలనకు 13, రెవెన్యూకు 12, ప్రజారోగ్యానికి 4, ప్రణాళికకు 33, ఇంజినీరింగ్‌కు 18, ఉద్యానవన విభాగానికి 3, యూసీడీకి 3 ఫిర్యాదులున్నాయి.

ప్రమాదకరంగా కల్వర్టు

వేపగుంట, న్యూస్‌టుడే: మేహాద్రి రిజర్వాయరు సమీప కాలువపై ఉన్న కల్వర్టు శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. నరవ-కంపరపాలెం మార్గంలో రాకపోకలకు అనువుగా గతంలో పైపులు వేసి కల్వర్టు నిర్మించారు. భారీ వర్షాలకు రిజర్వాయరులో నీటిమట్టం పెరిగి గేట్లు ఎత్తినపుడు జల ప్రవాహానికి కల్వర్టు అడుగు భాగం, పైభాగం కోరుకుపోయి పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయి. దీనికి అవసరమైన మరమ్మతులు చేయించకుంటే భవిష్యత్తులో ప్రమాదాలు తప్పవని, సంబంధిత అధికారులు వెంటనే తగిన చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

■ పోలీసుల అదుపులో హత్య కేసు నిందితుడు

పెందుర్తి, న్యూస్‌టుడే: సహజీవనం నేపథ్యంలో మహిళను కిరాతకంగా హత్య చేసిన నిందితుడు వనుము శ్రీనివాసరావును ఎట్టకేలకు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ నెల 6వ తేదీన గోశాల సమీప సూర్యకాంతం లేఅవుట్‌లోని ఓ అపార్టుమెంటులో అల్లా దేవి అనే మహిళను శ్రీనివాసరావు హత్య చేసిన విషయం తెలిసిందే. హత్యానంతరం అతడు పరారయ్యాడు. సీఐ కె.వి.సతీశ్‌కుమార్ నేతృత్వంలో మూడు పోలీసు బృందాలు నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టాయి. ఎట్టకేలకు అతడు ఒడిశా రాష్ట్ర పరిధిలో ఉన్నట్లు గుర్తించి సోమవారం అక్కడికి వెళ్లి అదుపులోకి తీసుకున్నట్లు సీఐ పేర్కొన్నారు.

■ రేపు మాజీ ఎమ్మెల్యే వర్ధంతి

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మాజీ ఎమ్మెల్యే దివంగత పైలా అప్పలనాయుడు వర్ధంతి బుధవారం ఉదయం 8 గంటలకు పరవాడ సంతబయలు వద్ద నిర్వహించనున్నట్లు ఎంపీపీ పైలా వెంకటపద్మలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు పైలా శ్రీనివాసరావు తెలిపారు.

రెండు బొగ్గు లారీలు బోల్తా

క్రేన్ సహాయంతో లారీని తొలగిస్తున్న దృశ్యం

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలంలో రెండు బొగ్గు లారీలు బోల్తా పడ్డాయి. స్థానికులు తెలిపిన వివరాలిలా.. గంగవరం పోర్టు నుంచి పరవాడ మీదుగా పాలవలసలోని హిందుజా పవర్‌ప్లాంటుకు బొగ్గుతో వెళ్తున్న లారీలు సోమునాయుడుపాలెం సమీపంలో సోమవారం తెల్లవారుజామున అదుపు తప్పి బోల్తా పడ్డాయి. ఈ ఘటనలో రెండు లారీల డ్రైవర్లు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఆ సమయంలో ఇతర వాహనాలేవీ రాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు పేర్కొన్నారు. లారీల్లోని బొగ్గు నేలపై పడిపోయింది. క్రేన్‌ల సహాయంతో లారీలను అక్కడి నుంచి తొలగించారు.

స్వీయ రక్షణపై బాలికలకు శిక్షణ

చినముషిడివాడ (పెందుర్తి), న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఆరు నుంచి తొమ్మిదో తరగతి వరకు చదువుతున్న బాలికలకు సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో 'రాణి లక్ష్మీ బాయి ఆత్మరక్షణ ప్రశిక్షణ్' పేరిట స్వీయ రక్షణపై శిక్షణ కార్యక్రమం జరుగుతోంది. జీవీఎంసీ 97వ వార్డు చినముషిడివాడ శాంతినగరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ శిక్షణ జరుగుతోంది. కరాటే శిక్షకుడు జగదీశ్ ఆధ్వర్యంలో వారానికి రెండు రోజులు బాలికలకు శిక్షణ అందిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయిని శ్రీవాణి తెలిపారు. బాలికల స్వీయ రక్షణకు ఈ తర్ఫీదు ఎంతగానో సహాయపడుతుందని ఆమె పేర్కొన్నారు.

కరాటే సాధన చేస్తున్న బాలికలు

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్సై భీమరాజు

పరవాడ, న్యూస్‌టుడే: విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని పరవాడ ఎస్సై భీమరాజు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొత్త క్రిమినల్ చట్టాలు, డ్రగ్స్ అనర్థాలపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ఎక్కడైనా గంజాయి, డ్రగ్స్ అమ్మకం జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సైబర్‌క్రైమ్ పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్య అభ్యసించి ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. ప్రిన్సిపల్ వినోద్‌బాబు, సాంబశివరావు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

అర్జీల స్వీకరణ

వేపగుంట, న్యూస్‌టుడే: వేపగుంట జోనల్ కార్యాలయంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక జరిగింది. ఇన్‌ఛార్జి జడ్సీ శంకర్రావు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. సుజాతనగర్ సీ-1 జోన్‌లో రోడ్లు, కాలువలు నిర్మించాలని, చినముషిడివాడ, నేతాజీనగర్‌లలో అక్రమ నిర్మాణాలు, ఆక్రమణలు తొలగించాలని, శారదానగర్‌లో యూజీడీ పైపులైను సమస్య పరిష్కరించాలని అర్జీదారులు జడ్సీకి వినతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువిభాగాల అధికారులు పాల్గొన్నారు.

ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఇన్‌ఛార్జి జడ్సీ శంకర్రావు

మహాసభలు జయప్రదం చేయాలి

గోడపత్రిక ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

సబ్బవరం, న్యూస్‌టుడే: సీఐటీయూ 18వ మహాసభలు ఈనెల 31వ తేదీ నుంచి జనవరి 4వ తేదీ వరకు విశాఖపట్నంలో జరుగుతాయని సీఐటీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గనిశెట్టి సత్యనారాయణ అన్నారు. ఈమేరకు సోమవారం సబ్బవరం మండల ప్రధాన కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో గోడపత్రిక ఆవిష్కరించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలపై ఈ మహాసభల్లో చర్చిస్తారన్నారు. సీఐటీయూ నాయకులు రమణమ్మ, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

భీమిలి

సినిమాలు
చిట్టివలస (తగరపువలస), న్యూస్‌టుడే
గణేశ్- రివాల్వర్ రీటా
రాములమ్మ- జనతా బార్
తాతా- రాజు వెడ్స్ రాంబాయి
సప్తగిరి- ఆంధ్ర కింగ్ తాలుకా

వినియోగదారుల హక్కులపై సదస్సు

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: వినియోగదారుల హక్కులు సంబంధిత అంశాలపై గాయత్రీ విద్యాపరిషత్ (జీవీపీ) డిగ్రీ అండ్ పీజీ కోర్సుల కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో రుషికొండలో సోమవారం సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథి విశాఖ యూత్ కన్స్యూమర్ డిసిప్లెయిన్ అసోసియేషన్ ఛైర్మన్ మర్రి సత్యనారాయణ, విశిష్ట అతిథులు మాట్లాడారు. ఎన్ఎస్ఎస్ విభాగాధికారి డాక్టర్ జి. లక్ష్మీనారాయణ సమక్షంలో ప్లకార్డుల ప్రదర్శన ద్వారా అవగాహన ర్యాలీ చేపట్టారు. ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, స్థానిక పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

సింహాచలం దేవస్థానానికి మొక్కల వితరణ

కడియం, న్యూస్‌టుడే: పవిత్ర పుణ్యక్షేత్రంగా పేరొందిన సింహాచలం దేవస్థానానికి కడియపులంకకు చెందిన దుర్గా నర్సరీ అధినేత పెద్దిరెడ్డి శ్రీనివాస్ సంపంగి మొక్కలను వితరణ ఇచ్చారు. ఈ మొక్కలంటే స్వామికి ఎంతో ఇష్టమైనవిగా పరిగణిస్తారు. తుపాన్లకు అవన్నీ నేలకొరిగాయి. ఈ నేపథ్యంలో వాటి స్థానంలో కొత్తవి నాటేందుకు దేవస్థానం సూపరింటెండెంట్ హరికృష్ణను శ్రీనివాస్ కోరారు. అందుకోసం 100కు పైగా మొక్కలను సోమవారం మినీ లారీలో తరలించారు. గంగుల సత్యనారాయణ, గెద్దం ఆదినారాయణ, చల్లా దుర్గారావు, బాదం పెద్దకాపు, తదితర రైతులు పాల్గొన్నారు.

డైట్ అటెండర్ అకస్మాత్తుగా మృతి

భీమునిపట్నం, న్యూస్‌టుడే: ప్రభుత్వ డైట్‌లో ఆఫీస్ సబార్డినేట్(అటెండరు)గా పనిచేస్తున్న **టి.కృష్ణ(40)** సోమవారం తెల్లవారుజామున అకస్మాత్తుగా మృతి చెందారు.

భీమిలి డైట్‌లో అతడు గత పదేళ్లగా పనిచేస్తున్నాడు. మూడు రోజుల క్రితం అస్వస్థతకు గురవడంతో ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. సోమవారం చికిత్స పొందుతూ మరణించాడు. ఈయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అకస్మాత్తుగా మృతిచెందడం పట్ల కళాశాల ప్రధానాచార్యులు ఎల్.సుధాకర్, అధ్యాపక సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.

బీచ్‌రోడ్డులో కారు బీభత్సం

గ్రామీణ భీమిలి, న్యూస్‌టుడే: భీమిలి బీచ్‌రోడ్డులోని ఎర్రమట్టి దిబ్బల వద్ద అతి వేగంగా వస్తున్న కారు బీభత్సం సృష్టించింది. ముందు ఉన్న కారును ఢీకొనడంతో వాటితో పాటు రోడ్డు పక్కన ఆగి ఉన్న ఆటో సైతం నుజ్జయింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న మహిళకు తీవ్రగాయాలయ్యాయి. భీమిలి సి.ఐ.తిరుమలరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రుషికొండ వద్ద నున్న గీతం కళాశాలకు చెందిన కొందరు విద్యార్థులు సోమవారం ఒక కారులో ఎర్రమట్టి దిబ్బల ప్రాంతంలో ఉన్న మార్లిన్ కే రెస్టారెంట్‌కు మధ్యాహ్నం భోజనం కోసం బయలుదేరారు. వాహనాన్ని వేగంగా నడపడంతో ఎర్రమట్టి దిబ్బల ప్రాంతానికి వచ్చే సరికి ముందు వెళ్తున్న కారును ఢీకొని పల్టీలు కొడుతూ రోడ్డు పక్కన ఆగి ఉన్న ఆటోమీదకు దూసుకుపోయింది. ఈ ఘటనలో మూడు వాహనాలు నుజ్జయ్యాయి. ఆటోలో కూర్చుని ఉన్న అంజలి కుమారి అనే మహిళకు తీవ్రగాయాలయ్యాయి. సమీప నేళ్లవలసకు చెందిన బాధితురాలు భర్తతో కలిసి కర్ర పుల్లలు ఏరుకొనేందుకు వచ్చి ప్రమాదంలో గాయపడింది. చికిత్స నిమిత్తం ఆమెను నగరంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

ప్రమాదంలో నుజ్జయిన ఆటో వద్ద బాధితురాలు

చక్కని రాత.. ఉన్నత భవితకు బాట

‘పది’లో రాణించేందుకు విద్యార్థుల సాధన

కొమ్మాది, న్యూస్‌టుడే

పిల్లాడు బాగా చదువుతాడు.. కానీ మార్కులే రావడం లేదు.. కుర్రాడు లెక్కలు బాగా చేస్తాడు.. సూత్రాలు మాత్రం ఎందుకో తప్పుగా కనిపిస్తుంటాయని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తరచూ చెప్పే మాటలివి.. ఇందుకు కారణం చేతిరాత. ‘రాత బాగుంటే గీత బాగుంటుంది’ అన్న నానుడి పరీక్ష రాసే విద్యార్థికి ‘అక్షరాలా’ సరిపోతుంది. మంచి దస్తూరి ఉంటే సమాధానాలు దిద్దే ఉపాధ్యాయునికీ ఆ పత్రం అందంగా కనిపిస్తుంది. ఆ ప్రభావం మార్కులపై ఉంటుంది. అందుకే పరీక్షల్లో తెలివితో పాటు అక్షరాలు కూడా ఆయుధాలుగా పనిచేస్తాయి.

చేతిరాత సాధన చేయిస్తున్న ఉపాధ్యాయులు శ్రీనివాసరావు

సాధనతోనే సాధ్యం..: విద్యార్థి తెలివితో పాటు సమయపాలనకు, సహనానికి దస్తూరి ఓ సూచిక. అందుకే మంచి రాత రాసే విద్యార్థులే దాదాపు ‘టాపర్లు’గా నిలుస్తున్నారు. మార్చి 16వ తేదీ నుంచి పదోతరగతి పరీక్షలు జరగనున్నాయి. భీమిలి నియోజకవర్గంలో ఆనందపురం, పద్మనాభం మండలాలతో పాటు భీమునిపట్నం, మధురవాడ, చినగదిలి పరిధిలోని 55 ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ఉపాధ్యాయులు తీవ్రంగా కృషి చేస్తున్నారు. ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఎలాంటి దిద్దుబాట్లు, కొట్టివేతలు లేకుండా రెండున్నర గంటల్లో స్పష్టంగా పరీక్ష రాయాలి. అందుకే ఇప్పుడు అందరి దృష్టి చేతి రాతపై పడింది. ఇందుకు తగ్గ మెలకువలను ఉపాధ్యాయులు తెలుపుతూ సాధన చేయిస్తున్నారు.

✦ పరీక్ష నెమ్మదిగా రాస్తే సమయం సరిపోదు వేగంగా రాసేటప్పుడు తప్పులు దొర్లకుండా చూసుకోవాలి. ఇలా చేయాలంటే ముందుగా ప్రత్యేక తరగతులు, నమూనా పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని ఉపాధ్యాయులు సూచిస్తున్నారు.

ముత్యాల రాత కోసం కొన్ని సూచనలు..

✦ రెండు పదాల మధ్య ఒక అక్షరం లేదా ‘0’ పట్టేంత ఖాళీ స్థలం ఉండాలి. ✦ రెండు వరుసల మధ్య అర అంగుళం దూరం వదలాలి. ✦ పోలికలు గల అక్షరాలు ఒకేసారి సాధన చేయాలి. ✦ కంటికి పేపరుకు 30-35 సెం.మీ దూరం ఉండాలి.
✦ అంటుకోకుండా ప్రతి అక్షరం ఒకే పరిమాణంలో రాయాలి. ✦ కలము మామూలుగా పట్టుకోవాలి. బిగుసుకున్నట్లు పట్టుకోరాదు. ✦ అక్షరాల స్పష్టతకు ప్రాముఖ్యత ఇవ్వాలి.
✦ ప్రాథమిక స్థాయి నుంచే మంచి రాత అలవాటు చేసుకోవాలి.
✦ గీతలు లేని కాగితం లోనూ వరుస తప్పకుండా రాయగలగాలి.

ఆకట్టుకున్న వీధి నాటకాలు

భీమునిపట్నం, న్యూస్‌టుడే: దోమల వల్ల ప్రస్తుత సీజన్‌లో మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా వంటి విష జ్వరాలు వ్యాపిస్తున్నందున ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేస్తూ భద్రం ఫౌండేషన్ కళాకారులు ప్రదర్శిస్తున్న వీధి నాటకాలు అందరినీ ఆకట్టుకున్నాయి. జీవీఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు సోమవారం తగరపువలస, భీమిలి ప్రాంతాల్లో ఈ ప్రదర్శనలను నిర్వహించారు. ఈ కళా బృందంలో కొందరు దోమల వేషధారణతో ప్రజలను చైతన్య పరిచారు. నీటిని ఎక్కువ రోజులు నిల్వ ఉంచరాదని, చెత్త ఎక్కడపడితే అక్కడ పడేయరాదని తెలిపారు. జీవీఎంసీ ముఖ్య వైద్యాధికారి డా.నరేష్‌కుమార్ సూచనల మేరకు నిర్వహించిన కార్యక్రమంలో మలేరియా విభాగం బయాలజిస్ట్ సాంబమూర్తి, ప్రసాదరెడ్డి, భీమిలి మలేరియా ఇన్‌స్పెక్టర్ ఎస్.సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

దోమ వేషధారణతో వీధి నాటకం ప్రదర్శిస్తున్న కళాకారులు

అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం

దాతలకు విరాళం ధ్రువపత్రం అందిస్తున్న పర్యవేక్షకుడు సునీల్‌కుమార్, సూర్యనారాయణ

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామివారి నిత్య అన్నప్రసాద పథకానికి కాకినాడ దరి పెద్దాపురం ప్రాంతానికి చెందిన పాలకుర్తి కనక సత్తిరాజు కుటుంబం సోమవారం రూ.లక్ష విరాళంగా సమర్పించారు. విరాళాన్ని నగదు రూపంలో ప్రొటోకాల్ పర్యవేక్షకుడు పి.సునీల్‌కుమార్, సీనియర్ సహాయకుడు సూర్యనారాయణకు అందజేశారు. అధికారులు దాతలకు స్వామివారి దర్శనం కల్పించారు. పండితులు వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

కార్మిక పింఛనుదారులు దిల్లీకి పయనం

తగరపువలస, న్యూస్‌టుడే: కార్మికులకు నామమాత్రంగా ఇస్తున్న పింఛన్లను, పెరిగిన ధరలకు అనుగుణంగా పెంపుదల చేయాలని కోరుతూ రిటైర్‌మెంట్ పెన్షనర్ దారులు దిల్లీ పయనమయ్యారు. ఈ నెల 10న దిల్లీలో జరగనున్న జంతర్‌మంతర్ కార్యక్రమానికి చిట్టివలస జ్యూట్ మిల్లు పెన్షన్ దారుల సంఘం తరఫున పలువురు నాయకులు సోమవారం దిల్లీకి తరలి వెళ్లారు. మోర అప్పలరాజు, ఎస్.కె.హుస్సేన్, అప్పల రెడ్డి తదితరులు విశాఖ రైల్వే స్టేషన్‌లో మాట్లాడుతూ ఉద్యోగ విరమణ చేసిన కార్మికులకు నెలకు రూ.9వేల చొప్పున పింఛను పెంచాలని నినాదాలు చేశారు.

రైల్వే స్టేషన్‌లో చిట్టివలస జ్యూట్‌మిల్లు పింఛనుదారులు

వసతిగృహాల చెంత.. సెప్టిక్ వాహనాల చింత

మధురవాడ, న్యూస్‌టుడే

మధురవాడ ఏపీఈపీడీసీఎల్ కార్యాలయం సమీపంలోని సాంఘిక సంక్షేమ సమీకృత బాలుర, కళాశాల బాలుర వసతిగృహాల మధ్య ఖాళీ స్థలం సెప్టిక్ వ్యర్థాల వాహనాలకు అడ్డాగా మారింది. కొందరు ప్రైవేటు వ్యక్తులు వసతిగృహాల వద్ద విద్యార్థులు ఉండే గదుల పక్కన సెప్టిక్ ట్యాంకర్లను ఇష్టానుసారం పార్కింగ్ చేస్తున్నారు. అలాగే మాంసం దుకాణాల నుంచి కోళ్ల వ్యర్థాలను తరలించే వాహనాలు అక్కడే దర్శనమిస్తున్నాయి. దీంతో ఆయా వాహనాల నుంచి వెలువడే దుర్వాసనతో విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి లోనవుతున్నారు. దోమలు విపరీతంగా వృద్ధి చెందుతున్నాయని వాపోతున్నారు. మరోవైపు మురుగుకాలువ నుంచి వచ్చే దుర్వాసన వేధిస్తోంది. ఇదిలా ఉంటే వసతిగృహాల్లో ఆశ్రయం పొందుతున్న విద్యార్థులకు అన్ని వసతులు, సౌకర్యాలు కల్పించి స్వచ్ఛమైన వాతావరణం మధ్య వారు చదువుకునేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. కానీ ఇక్కడ పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. దీనిపై జీవీఎంసీ, పోలీసు అధికారులు దృష్టి సారించి వాహనాల పార్కింగ్ నిరోధించాలని కోరుతున్నారు.

మధురవాడ సాంఘిక సంక్షేమ వసతిగృహాల మధ్య పార్కింగ్ చేసిన సెప్టిక్ ట్యాంకర్లు

న్యాయబద్ధమైన డిమాండ్లు పరిష్కరించాలి

పద్మనాభం, న్యూస్‌టుడే: తమ న్యాయబద్ధమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ సహకార సంఘం పద్మనాభం మండల ఉద్యోగులు సోమవారం ఆందోళన నిర్వహించారు. పద్మనాభంలోని డీసీసీబీ కార్యాలయం ఎదుట ప్లకార్డులతో నినాదాలు చేశారు. జీవో నంబర్ 36 అమలు చేయాలని, 2019 తరువాత విధుల్లో చేరిన ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, పదవీ విరమణ వయసు పెంచాలని వినతిపత్రాన్ని బ్యాంకు మేనేజర్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ జిల్లా అధ్యక్షుడు జి.రామకృష్ణ, డి.మృత్యుంజయరావు, కె.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్వామి, అమ్మవార్లు

కమనీయం నరహరి నిత్య కల్యాణం

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామివారి దేవాలయంలో సోమవారం నిత్య కల్యాణోత్సవం కమనీయంగా జరిగింది. అర్చకులు దేవేరుల సమేతుడైన గోవిందరాజ స్వామిని చూడముచ్చటగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆశీనులను చేశారు. వేదమంత్రాలు, నాదస్వర మంగళవాయిద్యాల నడుమ దేవతా మూర్తుల పరిణయ వేడుకను జరిపించారు. భక్తులు పాల్గొని స్వామిని సేవించారు.

వైభవంగా శ్రీరామ షడక్షరీ హవనం

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీరామచంద్రుడు ఆవిర్భవించిన పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని సింహగిరిపై పవిత్ర గంగధార సమీపంలో కొలువైన సీతారామ స్వామి దేవాలయంలో సోమవారం శ్రీరామ షడక్షరీ హవనం సంప్రదాయబద్ధంగా జరిగింది. అర్చకులు జానకి రాములను పరివార సమేతంగా అలంకరించి ఆలయ ఉత్సవ మండపంలోని వేదికపై ఆశీనులను చేశారు. వేదమంత్రాల నడుమ హవనం నిర్వహించారు. హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి జరిపించారు. పుణ్యాహవాచనం జలాలతో ఆలయ ప్రదక్షిణం చేసి అంతరాలయంలో స్వామికి సమర్పించారు. భక్తులకు యజ్ఞ ప్రసాదం వితరణ చేశారు.

సీతారాములకు పూజలు చేస్తున్న అర్చకులు

అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవం

భీమిలి బీచ్ వద్ద ఉన్న అయ్యప్ప స్వామి దేవాలయం

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలి బీచ్ రోడ్డు వద్ద ఉన్న శ్రీ అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవం ఈ నెల 10న నిర్వహించాలని అయ్యప్ప స్వామి ట్రస్ట్‌వారు నిర్ణయించారు. అలాగే దేవాలయం జీర్ణావస్థకు చేరినందున నూతన హంగులతో ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడేలా సరికొత్త దేవాలయాన్ని నిర్మాణం చేయాలని తలపెట్టినందున దాతలు తోడ్పాటును అందివ్వాలని ఆలయ ట్రస్ట్ అధ్యక్షుడు సుసరాపు మాధవ శాస్త్రి కోరారు.

ఎంఐటీ స్టీమ్ ప్రోగ్రాంలో ఓక్రిడ్జ్ విద్యార్థినులు

తగరపువలస, న్యూస్‌టుడే: సింగనబంద వద్ద ఉన్న ఓక్రిడ్జ్ అంతర్జాతీయ పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థినులు మహాలక్ష్మి, షైలా అమెరికాలోని మసూచట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటీ) లో ఇటీవల జరిగిన స్టీమ్ (సైన్స్ టెక్నాలజీ ఇంజినీరింగ్ ఆర్ట్స్ మ్యాథమెటిక్స్) ప్రోగ్రాంలో పాల్గొని ప్రతిభ చూపారు. ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాలకు చెందిన పలు అంతర్జాతీయ పాఠశాలల విద్యార్థులతో కలసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. దీనిలో భాగంగా పలు శాస్త్రవేత్తలతో ఇంటరాక్ట్ అయ్యి పరిశోధన అనుభవాలను తెలుసుకున్నారు. విద్యార్థులతో మాట్లాడి వారి అకడమిక్ కల్చర్ ఇన్నోవేషన్‌పై అవగాహన పొందారు. ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ ఈవెంట్‌లో పాల్గొని వచ్చిన వీరిని ప్రిన్సిపల్ శైలా భమిడిపాటి తదితరులు అభినందించారు.

ఎంఐటీ స్టీమ్ ప్రోగ్రాంలో ఓక్రిడ్జ్ విద్యార్థులతో పాటు వివిధ దేశాల విద్యార్థులు

క్విజ్ లెర్న్‌లో ప్రతిభ

పద్మనాభం, న్యూస్‌టుడే: స్థానిక కస్తూర్బా గాంధీ గురుకుల విద్యాలయంలో ఎనిమిదో తరగతి చదువుతున్న వనజ బెంగళూరులో ఈనెల 9, 10 తేదీల్లో జరగనున్న క్విజ్ లెర్న్ కార్యక్రమానికి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయిని కె.గ్రేస్ లిల్లీ తెలిపారు. అమెజాన్ ఫ్యూచర్ ఇంజినీరింగ్ స్కిల్స్‌లో హ్యాక్ టు ఫ్యూచర్ కార్యక్రమంలో 22 పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన వనజ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. బెంగళూరుకు జిల్లా కో-ఆర్డినేటర్ కె.రమణి చౌదరితో కలిసి సోమవారం పయనమైనట్లు తెలిపారు.

విద్యార్థిని వనజతో ఉపాధ్యాయులు

నవోదయ ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు

కొమ్మాది, న్యూస్‌టుడే: కొమ్మాది జవహర్ నవోదయ విద్యాలయంలో 2026-27 విద్యాసంవత్సరంలో ఆరో తరగతిలో ప్రవేశాలకు ఈ నెల 13వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నామని ప్రిన్సిపల్ డాక్టర్ వై.ఎస్.ఎస్.చంద్రశేఖర్ తెలిపారు. శనివారం ఉదయం 11:30 నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకూ జరగనుందన్నారు. పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రిన్సిపల్ తెలిపారు.

గీతంలో ‘స్మార్ట్ ఇండియా హ్యాకథాన్’ ప్రారంభం

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: కేంద్రప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ ఇన్నోవేషన్ సెల్, అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) గీతం డీమ్డ్ వర్సిటీలో సోమవారం నుంచి జాతీయస్థాయిలో నిర్వహిస్తున్న ‘స్మార్ట్ ఇండియా హ్యాకథాన్’ ఫైనల్ పోటీలను గీతం ప్రొ-వీసీ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు ప్రారంభించారు. యువతలో నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి ఏఐసీటీఈ గత ఏడేళ్లుగా నిర్వహిస్తున్న ఈ స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ దేశంలో పలు స్టార్టప్‌లకు ఊపిరిపోసిందన్నారు.

* గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్, విశాఖ నోడల్ సెంటర్ కన్వీనర్ ప్రొఫెసర్ రాజాఫణి పప్పు మాట్లాడుతూ ఈ పోటీల్లో పాల్గొనే విద్యార్థులకు కేంద్రప్రభుత్వం, ఇతరశాఖలు ఎదుర్కొంటున్న పలు సమస్యలకు పరిష్కారం కనుగొనాల్సిందిగా సూచించడం వినూత్న ప్రయత్నమన్నారు.

* ఐదు రోజుల పాటు జరిగే ఈ పోటీలకు హాజరైన దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన 25 విద్యార్థి బృందాలు, 171 మంది యువత ఆలోచనల్ని న్యాయ నిర్ణేతల సమక్షంలో పరిశీలించి ఈ నెల 12వ తేదీన విజేతల్ని ప్రకటిస్తామని గీతం వీడీసీ కోచ్ బి.రాజ్‌కుమార్ పేర్కొన్నారు. కో-ఆర్డినేటర్లు వివేక్, అభితేజ్ తదితరులు పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా 60 విద్యాలయాల్లో జరుగుతున్న ఈ స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ పోటీల్లో పాల్గొంటున్న యువతను ఉద్దేశించి ‘ఏఐసీటీఈ’ ఛైర్మన్ టి.జి.సీతారామ్ వర్చువల్‌గా ప్రసంగించారు.

విద్యార్థులను ఉద్దేశించి వర్చువల్‌గా మాట్లాడుతున్న ఏఐసీటీఈ ఛైర్మన్ సీతారామ్

సాయిరాంకాలనీలో ఎన్ఎస్ఎస్ శిబిరం

కొమ్మాది, న్యూస్‌టుడే: జీవీఎంసీ 5వ వార్డు సాయిరాంకాలనీలో యాక్ట్స్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ఆధ్వర్యంలో ప్రత్యేక సేవా కార్యక్రమాలను సోమవారం ప్రారంభించారు. తెదేపా నాయకులు నమ్మిరమణతో పాటు కళాశాల ప్రిన్సిపల్ ఎం.పద్మారావు, వైస్ ప్రిన్సిపల్ పి.అప్పలరాజులు ప్రసంగించారు. అనంతరం వాలంటీర్లు ఇంటింటికి వెళ్లి పలు అంశాలను వివరిస్తూ సర్వే చేపట్టారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ ఉప్పాడ వెంకటరమణ, ఎయిమ్స్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ రాజాతాళ్లూరి, స్థానిక నేతలు గోవిందరావు, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికి వెళ్లి సర్వే చేస్తున్న వాలంటీర్లు

భగవద్గీత విశిష్టతపై ప్రచారం

మధురవాడ, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ భగవద్గీత ద్వారా కర్మయోగం విశిష్టత, త్రైత సిద్ధాంత జ్ఞానం తెలుసుకోవాలని త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి, హిందూ జ్ఞాన వేదిక (విశాఖ) కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. సంబంధిత కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో సోమవారం మధురవాడ పరిధి ఆర్టీసీ కాలనీలో భగవద్గీత, త్రైత సిద్ధాంత ఆధ్యాత్మిక గ్రంథాల ప్రచారం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ భగవద్గీత చదవడం ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు దేవి, నాగమణి, మహాలక్ష్మి, మంగ, అప్పలనాయుడు, అప్పారావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కాలనీలో భగవద్గీత ప్రచారం నిర్వహిస్తున్న ప్రబోధ సేవా సమితి సభ్యులు

కార్పెంటర్‌కాలనీలో అగ్నిప్రమాదం

కొమ్మాది, న్యూస్‌టుడే: జీవీఎంసీ 5వ వార్డు కొండవాలు ప్రాంతమైన కార్పెంటర్‌కాలనీలో ఓ రేకులషెడ్ ఇంట్లో సోమవారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. రిఫ్రిజిరేటర్ నుంచి మంటలు వ్యాపించడంతో ఇల్లంతా అగ్నికి ఆహుతైంది. కుటుంబీకులు, స్థానికులు వివరాల ప్రకారం.. ఆటోనడుపుతూ తల్లి ఎం.విజయ, తండ్రి ప్రసాద్‌తో కలిసి అద్దె ఇంట్లో గిరీష్ నివాసముంటున్నాడు. ఉదయం యథావిధిగా ఆటో నడిపేందుకు గిరీష్, కూలిపని చేసేందుకు ప్రసాద్ నగరానికి వెళ్లగా, తల్లి విజయ ఇంట్లో ఉన్నారు. ఉదయం 10:30 గంటల సమయంలో ఆకస్మాత్తుగా రిఫ్రిజిరేటర్ నుంచి మంటలు చెలరేగి మంటలు వ్యాపించాయి. అగ్నిమాపక సిబ్బంది చేరుకునే లోపు ఇంట్లోని సామగ్రి దగ్ధమయ్యాయి. స్థానిక కార్పొరేటర్ మొల్లి హేమలత సంబంధిత అధికారులకు సమాచారం తెలపడంతో రెవెన్యూ, పోలీసులు అగ్నిమాపక సిబ్బంది ప్రమాదతీరును పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు.

✦ మధురవాడలో అగ్నిమాపక కేంద్రం ఉంటే ఇలా సర్వం బూడిదపాలు కాదనీ, దూరంలో అగ్నిమాపక కేంద్రాలు ఉండడం, అవి ఘటనా స్థలికి వచ్చేలోపే నష్టం తీవ్రస్థాయికి చేరుకుంటుందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి మధురవాడలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

అగ్నిప్రమాద తీరును తెలుసుకుంటున్న అగ్నిమాపక శాఖ అధికారి

నేటి నుంచి సౌత్ జోన్ టీటీ పోటీలు

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ (ఏఐయూ) ఆధ్వర్యంలో గీతం డీమ్డ్ వర్సిటీ వేదికగా ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు దక్షిణమండల (సౌత్‌జోన్) అంతర్ విశ్వవిద్యాలయాల మహిళల టేబుల్‌టెన్నిస్ పోటీలను నిర్వహిస్తున్నట్లు గీతం క్యాంపస్ లైఫ్ అసోసియేట్ డీన్ అరుణ్‌కార్తిక్ తెలిపారు. విశాఖపట్నం టీటీ అసోసియేషన్ సాంకేతిక సహకారంతో ఏఐయూ నిబంధనలకు అనుగుణంగా జరిగే ఈ పోటీల వివరాలను వర్సిటీలో సోమవారం విలేకర్ల సమావేశంలో ఆయన వెల్లడించారు. ఈ పోటీల్లో దక్షిణ భారత్‌లోని 84 యూనివర్సిటీలకు చెందిన 400 మందిలో 50 మంది జాతీయ క్రీడాకారిణులు ఉన్నారన్నారు. పోటీల్లో విజేతలు త్వరలో ఉస్మానియా విశ్వవిద్యాలయం(తెలంగాణ)లో జరగనున్న ఫైనల్ పోటీల్లో టైటిల్ కోసం తలపడతారన్నారు. గతేడాది విజేతలుగా నిలిచిన నాలుగు జట్లను క్వార్టర్ ఫైనల్స్‌లో నేరుగా పాల్గొనే అవకాశం కల్పిస్తున్నామన్నారు. గీతం క్రీడా విభాగం డిప్యూటీ డైరెక్టర్ ఎన్.శ్రీనివాస్, సీనియర్ మేనేజర్ కె.తపస్వి, ఎస్.రితేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో ‘ఎస్‌టీఈఎం’పై ఆసక్తికి కృషి

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: సైన్స్ టెక్నాలజీ, ఇంజినీరింగ్ మ్యాథ్‌మెటిక్స్ (ఎస్‌టీఈఎం)ల్లో విద్యార్థులకు ప్రాథమిక దశ నుంచే ఆసక్తి పెంచే దిశగా గీతం డీమ్డ్ వర్సిటీలో బ్రెయినీ బాట్జ్ ఎడ్‌టెక్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. సంస్థ వ్యవస్థాపకులు, డైరెక్టర్లు సీతంరాజు నాగశిల్ప, వాడవల్లి గాయత్రి పర్యవేక్షణలో రోబోటిక్స్ నిర్వహణ తీరు, ఏఐ, శాస్త్ర, సాంకేతిక రంగాల్లో నూతన ఆవిష్కరణలు వంటి అంశాల్లో నైపుణ్యత పెంపొందించుకునే దిశగా పలు ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. బహుమతులు అందజేశారు.

సాంకేతిక పరికరాల నిర్వహణ తీరును తెలుసుకుంటున్న విద్యార్థులు

పీజీఆర్ఎస్‌కు 12 వినతులు

జోన్-2 కార్యాలయంలో సమస్యలను తెలుసుకుంటున్న జెడ్సీ అయ్యప్పనాయుడు

కొమ్మాది, న్యూస్‌టుడే: జీవీఎంసీ జోన్-2 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో జెడ్సీ అయ్యప్పనాయుడు 12 వినతులను స్వీకరించారు. 7వ వార్డు చంద్రంపాలెం వద్ద అనధికారికంగా డంపింగ్ చేసే వ్యర్థాలను తొలగించాలని సీహెచ్.నాగమణి ఫిర్యాదు చేశారు. ఎండాడ గ్రామంలో సర్వేసంఖ్య 23/2ఎఫ్ వద్ద డ్రైనేజీ వ్యవస్థ నిర్మించాలని, పీఎంపాలెం చాణక్యపూరి లే-అవుట్ వద్ద నీటి సరఫరా కోసం నూతనంగా కుళాయి కనెక్షన్ మంజూరు చేయాలని, మిధిలాపురి వుడాకాలనీకి చెందిన కమ్మిల ప్రవీణ్ దివ్యాంగుల పింఛను తొలగించాలని, పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి పింఛను పునరుద్ధరించాలని కోరారు.

ముగిసిన ఎన్ఎస్ఎస్ సేవాకార్యక్రమాలు

కొమ్మాది, న్యూస్‌టుడే: చైతన్య ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రత్యేక శిబిరాన్ని కొమ్మాది గ్రామంలో ఏడురోజుల పాటు నిర్వహించారు. గ్రామంతో పాటు ప్రభుత్వ పాఠశాలలో స్వచ్ఛభారత్, డ్రగ్స్‌పై పోరాటం, ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర కార్యక్రమాలను చేపట్టారు. ముగింపు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. చిన్నారులకు ఆటలపోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. సుమారు 50 మందికి పైగా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ కె.సురేష్, ఫైనాన్స్ డైరెక్టర్ మాధవి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కె.సునీల్‌బాబులు వాలంటీర్లను అభినందించారు.

ప్రధానోపాధ్యాయులను సత్కరిస్తున్న ఎన్ఎస్ఎస్ యూనిట్ బృందం

డాక్యుమెంట్స్ పోయినవి

మోపాడ ఆదినారాయణ, తండ్రి : అప్పన్న, సురాల వెంకటరావు, తండ్రి: అప్పలనారాయణ మురగడ వెంకటేశ్వర్లు, తండ్రి : రాములు వారు తేది.26.11.2025 న భీమిలి సబ్-రిజిస్టర్ ఆఫీసులో మా యొక్క డాక్యుమెంట్ నెంబర్స్ 9394/2024 & 2605/2025 గల డాక్యుమెంట్స్ సబ్-రిజిస్టర్ ఆఫీసులో పోయినవి. ఎంత వెతికినా దొరకలేదు. దొరికిన వారు దయచేసి సంప్రదించగలరు.
ఫోన్ : 98493 23871 / 77995 91733

బహిరంగ ప్రకటన

నా క్లయింటు అయిన కుమారి ముదునూరి మాధురి, తండ్రి : ముదునూరి శ్రీనివాస రాజు, ఫ్లాట్ నెం.101/A, అంజని టవర్స్, జె.పి. రోడ్డు, భీమవరం, పశ్చిమ గోదావరి జిల్లా వారు ఇచ్చిన భోగట్టాపై నేను బహిరంగ ప్రకటన ద్వారా తెలియజేయనది ఏమనగా.

నా క్లయింటుకు సంబంధించిన లింక్ డాక్యుమెంట్ నెం. 1343/1986 ఉమ్మడి సబ్-రిజిస్ట్రార్, విశాఖపట్నం నందు రిజిస్టర్ కాబడిన దస్తావేజులు తలకొండపల్లి పోలీస్ స్టేషన్ ఏరియా, సైబరాబాద్ నందు తేది.02.12.2025 న ప్రయాణిస్తుండగా పోయినది. దాని నిమిత్తం పోలీసు వారి వద్ద నుండి NOC కూడా పొంది ఉన్నారు. తిరిగి అవి దొరుకుటకు అవకాశం లేకుండా ఉండడం వలన ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది. సదరు ఆస్తి మీద నా క్లయింటుకి ఎటువంటి అభ్యంతరములు, తీర్మానములు, బాకీలు లేవు.

షెడ్యూల్ : విశాఖపట్నం జిల్లా, మధురవాడ గ్రామం, GVMC పరిధి, మధురవాడ గ్రామం యొక్క సర్వే నెం.4, ఉదా L.P.నెం.2/85 నందు "టీచర్స్ కోఆపరేటివ్ హౌసింగ్ బిల్డింగ్ సొసైటీ" అను పేరుతో ఉన్న లే-అవుట్ నందు విస్తీర్ణం 311 చ॥గజాలులోని స్థలం ప్లాట్ నెం.MIG-94 తో కలదు. హద్దులు : తూర్పు : అదే లే-అవుట్ యొక్క ప్లాట్ నెం.95 దక్షిణం : సొసైటీ వారికి చెందిన భూమి, పడమర : అదే లే-అవుట్ యొక్క ప్లాట్ నెం.93, ఉత్తరం : రోడ్డు. కొలతలు : తూర్పు దండె : 70 అడుగులు, దక్షిణం దండె : 40 అడుగులు, పడమర : 70 అడుగులు, ఉత్తరం : 40 అడుగులు.

ఈ ప్రకటన ద్వారా తెలియజేయునది ఏమనగా, సదరు రిజిస్టర్డ్ లింకు దస్తావేజు ఎవరికైననూ దొరికిన యెడల ఈ క్రింది చిరునామాకు ఏడు (7) దినములలోగా ఇవ్వగలరు. అట్లు కానియెడల సదరు ఆస్తి మీద ఎటువంటి అభ్యంతరములు ఎవరికీ లేవని నమ్మగలము.

యస్. వానాజీ, M.Sc., LLB; అడ్వకేట్, డోర్ నెం.49-48-19, NGGO's కాలనీ, అక్కయ్యపాలెం, విశాఖపట్నం-16
విశాఖపట్నం
తేది : 08.12.2025 ఫోన్ : 80740 46019

(c) eenadu

విశాఖ తూర్పు

21న పల్స్ పోలియో

వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఈనెల 21న జరిగే పల్స్‌పోలియో కార్యక్రమంలో అయిదేళ్ల లోపు ప్రతీ చిన్నారికి పోలియో చుక్కలు వేయించాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో అయిదేళ్ల లోపు చిన్నారులు 2,09,652 మంది ఉండగా, వీరిలో నగర పరిధిలో 1,90,090 మంది, గ్రామీణ ప్రాంతంలో 16,562 మంది ఉన్నట్లు వివరించారు. పోలియో చుక్కలు వేసేందుకు 1062 బూత్‌లు ఏర్పాటు చేశామన్నారు. జేసీ మయూర్ అశోక్, ఇన్‌ఛార్జి డీఆర్వో సత్తిబాబు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జగదీశ్వరరావు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

పెదవాల్తేరు, ఎంవీపీ కాలనీ: 8008574769

మద్దిలపాలెం: 9912120229

ఆరిలోవ, న్యూస్‌టుడే: ?: 13వ వార్డు పైనాపిల్ కాలనీలోని కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోయి మురుగు నిలిచిపోతోంది. దుర్వాసన, దోమలతో ఇబ్బంది పడుతున్నాం. - మాధవరావు, పైనాపిల్ కాలనీ ✓: వెంటనే సిబ్బందిని పంపించి కాలువల్లో పూడిక తొలగిస్తాం. - ఆర్.రామారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్.

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే :?: విశాలాక్షినగర్ పరిధి చలపతినగర్, కనకమహాలక్ష్మి కాలనీల్లో దోమలు అధికంగా వృద్ధి చెందాయి. రాత్రి, పగలు తేడా లేకుండా కుట్టేస్తున్నాయి. - కళావతి, చలపతినగర్. ✓: వెంటనే దోమల నివారణ చర్యలు తీసుకుంటాం. -మంగరాజు, మలేరియా అధికారి.

ఇందిరానగర్ (విశాలాక్షినగర్), న్యూస్‌టుడే : ?: పదోవార్డు నేతాజీనగర్, ఆదర్శనగర్‌లలో కుళాయిల నుంచి నీటి ధార సన్నగా వస్తోంది. మంచినీరు సరిపోవటం లేదు. - జగన్నాథం, విశ్రాంత ఉద్యోగి. ✓: కుళాయిలను పరిశీలించి సమస్యను పరిష్కరిస్తాం. -శ్రీనివాస్, ఏఈ .

పెదవాల్తేరు, న్యూస్‌టుడే : ?: లాసన్స్‌బేకాలనీలో చెత్త పేరుకుపోయింది. దోమలు, ఈగలు వృద్ధి చెందుతున్నాయి. - రామోహన్, లాసన్స్‌బేకాలనీ ✓: మీ ప్రాంతానికి సిబ్బందిని పంపించి చెత్తను తొలగిస్తాం - శ్రీనివాసరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: ?: 16వ వార్డు బాలసగర్ ప్రాంతంలో రహదారిపై వ్యర్థాల పోగులను తరలించడం లేదు. - శ్రీనివాసరావు, భానునగర్. ✓: తక్షణమే సిబ్బందిని పంపించి వ్యర్థాలను తొలగిస్తాం. - సూరిబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్.

స్పందనకు వందనం

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: 22వ వార్డు ఎన్జీజీఓ విభాగం సమీపంలో కల్వర్టు వద్ద లోతట్టుప్రాంతంలో నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని సోమవారం 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు ఏ.ఇ. సుజాత స్పందించారు. సిబ్బంది చేత మరమ్మతులు చేయించి సమస్యను పరిష్కరించారు.

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: ఈస్టుపాయింట్‌కాలనీలో చెత్త పేరుకుపోయిందని 'ఈనాడు'లో వచ్చిన కథనానికి శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ స్పందించారు. సోమవారం సిబ్బందితో చెత్తను తొలగించి పరిసరాలను శుభ్రం చేయించారు.

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే : విశాలాక్షినగర్ పరిధి ఎస్సీఎస్టీ కాలనీ, సంజీవ్‌నగర్ కాలనీలలో రోజువిడిచి రోజు కుళాయిలు ఇస్తున్నారని, ధార కూడా చాలా తక్కువగా వస్తోందని సోమవారం 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. దీనికి ఏఈ శ్రీనివాస్ స్పందించి కుళాయిల్లో ధార పెరిగేలా చర్యలు తీసుకున్నారు.

● జోన్-3 కార్యాలయానికి 21 అర్జీలు

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: జోన్-3 కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్ పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. జోన్-3కి మొత్తం 21 అర్జీలు వచ్చాయన్నారు. రెవెన్యూ 5, ప్రజారోగ్యం 3, పట్టణప్రణాళిక విభాగం 9, ఇంజినీరింగ్ విభాగం 3, యూసీడీకి 1 చొప్పున వచ్చాయన్నారు. సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

● వీఎంఆర్డీఏకు 21 వినతులు

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: సిరిపురం వీఎంఆర్డీఏ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. కమిషనర్ తేజ్‌భరత్ పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మొత్తం 21 వినతులు వచ్చినట్లు తెలిపారు. ప్రణాళిక విభాగానికి 8, పరిపాలనా విభాగానికి 4, ఎస్టేట్ విభాగానికి 7, సాంకేతిక విభాగానికి 2 వినతులు వచ్చాయన్నారు. వాటిని సంబంధిత అధికారులు గడువులోపు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

● దిగి వస్తున్న కూరగాయల ధరలు

ఆరిలోవ, న్యూస్‌టుడే: ఆరిలోవ రైతు బజారులో కూరగాయలు ధరలు తగ్గుతున్నాయి. అన్ని రకాల ధరలు రూ.10 మేర తగ్గాయని వినియోగదారులు తెలిపారు. ఆదివారం, సోమవారం వివిధ ప్రాంతాల నుంచి సరకు ఎక్కువగా వచ్చింది. 40 స్టాల్స్ కూరగాయలతో కళకళలాడాయి. సుమారు 125 క్వింటాళ్ల కూరగాయలు రాగా, గత వారం 90 క్వింటాళ్లు మాత్రమే వచ్చాయని రైతు బజారు ఎస్టేట్ మేనేజర్ ఐవీ నాయుడు తెలిపారు.

అత్యవసరమైతే ఎక్కడికెళ్లాలి?

ఆరిలోవ, న్యూస్‌టుడే: ముడసర్లోవ ఉద్యానవనంలో కనీస వసతులు లేక సందర్శకులు ఇబ్బందులు పడుతున్నారు. నిర్వహణ లేక మరుగుదొడ్లు శిథిలమయ్యాయి. ఉపయోగించుకునేందుకు వీలు లేనంతగా పాడయ్యాయి. తలుపులు ఊడిపోయి, పైపులు విరిగిపోయి దర్శనమిస్తున్నాయి. కార్తిక మాసం నుంచి వనభోజనాల కోసం అధిక సంఖ్యలో సందర్శకులు ఇక్కడికి వస్తున్నారు. మరుగుదొడ్ల దుస్థితిని చూపి హడలిపోతున్నారు. ముఖ్యంగా మహిళలు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. అత్యవసరమైతే ఎక్కడి వెళ్లాలో తెలియక ఆవేదన చెందుతున్నారు. అదే విధంగా కూర్చునేందుకు బెంచీలు లేవు. నీరులేక మొక్కలు వాడిపోతున్నాయి. తిని పడేసిన ఎంగిలి ఆకులు, గ్లాసులు, ఖాళీ మద్యం సీసాలతో పార్కు అపరిశుభ్రంగా మారింది. సౌకర్యాలు ఏమీ లేకపోయినా ప్రవేశ రుసుము రూ.10 వసూలు చేస్తున్నారని సందర్శకులు విమర్శిస్తున్నారు.

ముడసర్లోవ పార్కులో శిథిలావస్థలో ఉన్న మరుగుదొడ్లు

★ ఒకప్పుడు ఎంతో సుందరంగా ఉండే ముడసర్లోవ పార్కు పాలకుల నిర్లక్ష్యం కారణంగా నేడు కునారిల్లుతోందని పర్యాటకులు వాపోతున్నారు. గత వైకాపా ప్రభుత్వం దీన్ని పట్టించుకోలేదు. కార్పొరేషన్ ఎన్నికలప్పుడు అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చిన అప్పటి వైకాపా నాయకులు తర్వాత ఆ ఊసే ఎత్తలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16నెలలైనా పార్కు పరిస్థితి మెరుగుపడలేదని పెదవివిరుస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి మరుగుదొడ్లకు మరమ్మతులు చేయించడంతోపాటు, వాడుకనీరు, ఇతర సౌకర్యాలు కల్పించాలని సందర్శకులు కోరుతున్నారు. అప్పటి వరకు మొబైల్ మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

నీటి కోసం ఏర్పాటు చేసిన కుళాయిలు ఇలా..

పార్కు విస్తీర్ణం: 20 ఎకరాలు

నిత్యం వచ్చే సందర్శకులు: 2వేల నుంచి 3వేలు

సెలవు దినాల్లో..: 5వేలు

★ ఉద్యానవనం నిర్వహణ బాధ్యతలు చూస్తున్న జీవీఎంసీ అధికారులకు వివరణ కోరగా మరుగుదొడ్ల ఆధునీకరణకు ప్రతిపాదనలు పంపామని, త్వరలో బాగు చేయిస్తామని చెప్పారు.

శ్మశానవాటికలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే : హనుమంతువాక వీఎంఆర్డీఏ ఆరోగ్య ప్రాంగణానికి ఆనుకుని ఉన్న శ్మశానవాటికకు వెళ్లే మార్గంలో వాగుపై వంతెన, రహదారి, షెడ్, బోరు ఏర్పాటుకు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు సోమవారం శంకుస్థాపన చేశారు. రూ. 40లక్షలతో ఆయా పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం శ్మశానంలోని సౌకర్యాలను పరిశీలించి హనుమంతువాక, సంజయ్‌గాంధీకాలనీ, క్రాంతినగర్, ఇసుకతోట, వెంకోజీపాలెం, ఎంవీపీకాలనీ ప్రతినిధులతో చర్చించారు. నాణ్యత, వేగంతో పనులు పూర్తిచేయాలని గుత్తేదారును ఆదేశించారు. కార్పొరేటర్ గొలగాని మంగవేణి, నాయకులు బుదుమూరి గోవింద్, బాదరు బాలరాజు, కాళ్ల శంకర్, ఒమ్మి రాజు, నల్ల ఈశ్వరరావు, ఏఈ కొల్లి అప్పలనాయుడు, పోలా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, తదితరులు

రక్తదాన శిబిరానికి స్పందన

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: యువత రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని డాక్టర్ వీఎస్‌కృష్ణ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బి.సుజాత అన్నారు. సోమవారం కళాశాల ప్రాంగణంలో 13 ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ, లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. 74మంది విద్యార్థులు రక్తదానం చేశారని తెలిపారు. కళాశాల ఎన్‌సీసీ అధికారి బి.సన్యాసిరావు, లయన్స్‌క్లబ్ ప్రతినిధి సుధాకరరావు, అధ్యాపకులు వేదవ్యాస్, ఆర్వీనాయుడు, బాలమురళీ, మురళీకృష్ణ, హేమంత్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న విద్యార్థులు

సిద్ధి గణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు

అలంకరణలో సిద్ధి గణపతిస్వామి

ఆరిలోవ, న్యూస్‌టుడే: సంకట హర చతుర్థి సందర్భంగా చినగదిలి బీసీకాలనీలోని సిద్ధి గణపతి ఆలయంలో సోమవారం ఉదయం పంచామృతాభిషేకం నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, ఆలయ ప్రాంగణంలో హోమం నిర్వహించామని ఆలయ అర్చకులు దార్లపూడి సురేష్‌శర్మ తెలిపారు. స్వామి వారికి విశేష అలంకరణ, నక్షత్ర హారతి, పంచహారతులు జరిగాయన్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు మురళి తెలిపారు.

దర్పణం

పొంచి ఉన్న ప్రమాదం..

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: 16వ వార్డు మద్దిలపాలెం శివాలయం నుంచి సీఎంఆర్ శ్మశానవాటికకు వెళ్లే మార్గంలో కాలువపై ఏర్పాటు చేసిన ఇనుప గ్రిల్స్ ప్రమాదకరంగా మారింది. చోదకులు ప్రమాదాలబారిన పడకుండా కాలనీవాసులు గ్రిల్స్ వద్ద కర్ర ఏర్పాటు చేశారు. అయితే రాత్రుళ్లు అది కనిపించకపోవడంతో చోదకులు పడిపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

తవ్వారు.. యూజీడీకి లీకు పెట్టారు..

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: పెదవాల్తేరు గాంధీసెంటర్ వద్ద కాలువల అభివృద్ధికి చేపట్టిన పనుల కారణంగా భూగర్భ డ్రైనేజీ లీకవుతోంది. మురుగు నీరు రహదారిపై ప్రవహిస్తోంది. గత పది రోజులుగా ఈ పరిస్థితి నెలకొంది. పక్కనే వేంకటేశ్వర స్వామి ఆలయం ఉండటంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. స్థానికులు పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకపోయింది. ఇప్పటికైనా స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

తొలగని నిర్మాణం..తప్పని అవస్థలు

ఇందిరానగర్ (విశాలాక్షినగర్), న్యూస్‌టుడే : పాతడెయిరీఫారం కూడలిలోని డివైడర్‌ను తొలగించాలని మేయర్ పీలా శ్రీనివాసరావు ఆదేశించి మూడునెలలైనా అధికారులు పట్టించుకోవడం లేదు. గతంలో ఇక్కడ ప్రయాణికులు బస్‌కోసం వేచి ఉండేవారు. రెండేళ్ల క్రితం కూడళ్ల సుందరీకరణలో భాగంగా డివైడర్ ఏర్పాటు చేశారు. బస్ స్టాపును అరకిలోమీటరు దూరంలో ఏర్పాటు చేశారు. బస్సులు, ఆటోలు ఇక్కడ ఆగడం లేదు. మరోపక్క డివైడర్ కారణంగా ఆదర్శనగర్ నుంచి మధురవాడ వైపు, ఇందిరానగర్, రాజీవ్‌నగర్, వెటర్నరీకాలనీ నుంచి వచ్చే ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. మూడు నెలల క్రితం నగర మేయర్ పీలా శ్రీనివాసరావు వార్డు పర్యటనకు వచ్చిన సందర్భంగా డివైడర్‌ను తొలగించాలని జోనల్ కమిషనర్‌కు ఆదేశించారు. వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి పలుమార్లు జీవీఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఈ పని ట్రాఫిక్ పోలీసులు చేయాలని చెప్పి చేతులు దులుపుకొంటున్నారు. ఇప్పటికైనా స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

క్లిక్ క్లిక్

ఎన్‌పీటీఈఎల్ కోర్సుల నిర్వహణకు అనుమతులు

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఏయూ సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో అడ్జెంక్ట్ ప్రొఫెసర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆచార్య కె.రాజగోపాల్‌కు 12వారాల ఎన్‌పీటీఈఎల్ కోర్సులు నిర్వహించడానికి ఏఐసీటీఈ అనుమతులు మంజూరు చేసింది. సివిల్ ఇంజినీరింగ్‌లో యూజీ, పీజీ విద్యార్థులకు 'ఫైనైట్ ఎలిమెంట్ మెథడ్స్ కన్‌స్ట్రక్టివ్ మోడలింగ్ ఇన్ జియో మెకానిక్స్, జియోసింథటిక్స్ అండ్ రీఇన్‌ఫోర్స్‌డ్ సాయిల్ స్ట్రక్చర్స్' కోర్సులను అందిస్తారు. దేశవ్యాప్తంగా విద్యార్థులు ప్రవేశాలు పొందుతారు. 2026 జనవరి-ఏప్రిల్ మాసాలలో ఈ కోర్సులు నిర్వహిస్తారు. వీటిని పూర్తి చేసిన తరువాత విద్యార్థులకు లభించే క్రెడిట్స్‌ను వర్సిటీలు, జాతీయ విద్యా సంస్థలు పరిగణనలోనికి తీసుకుంటాయి.

విన్యాసాలు.. అదరహో..

స్కేట్ బోర్డు ఈవెంట్‌లో...

రోలర్‌హాకీ పోటీల్లో తలపడుతున్న ఆంధ్ర - తెలంగాణ జట్లు

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే : కాళ్లకు చక్రాలు తొడుక్కొని స్కేటర్లు చేస్తున్న విన్యాసాలు చూస్తే.. ఔరా అనకమానం. మ్యూజిక్‌కు తగ్గట్లు విన్యాసాలు చేస్తూ.. రివ్వున సాగిపోతున్న స్కేటర్లు ఆహూతులను ఆకట్టుకుంటున్నారు. శివాజీ పార్కు, వుడా పార్కు స్కేటు బోర్డుల్లో ఈ ప్రదర్శనలు జరుగుతున్నాయి. జాతీయస్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలు గత మూడు రోజులుగా జరుగుతున్న విషయం తెలిసిందే. ఇందులో వివిధ రాష్ట్రాలకు చెందిన స్కేటర్లు పాల్గొన్నారు. క్రీడాకారులు ఆర్టిస్టిక్, స్కేటుబోర్డు, స్పీడు, రోలర్ హాకీ ఈవెంట్లలో తమ ప్రతిభను కనబరుస్తూ మెరుపులు మెరిపిస్తున్నారు.

కుంగిన రోడ్డుకు మరమ్మతులు

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: బీచ్‌రోడ్డులో కుంగిన రహదారికి ఎట్టకేలకు మరమ్మతులు చేపడుతున్నారు. గత నెలలో కురిసిన భారీ వర్షాలకు వరద నీరు పోటెత్తి బీచ్‌రోడ్డు కుంగిపోయి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దీంతో జీవీఎంసీ అధికారులు రూ.49 లక్షల నిధులతో మరమ్మతులు చేపట్టారు. అక్కడ బాక్స్ విధానంలో కల్వర్టు నిర్మాణం చేపడుతున్నామని అధికారులు తెలిపారు. ఫలితంగా వరదనీరు వచ్చినా రహదారి కోతకు గురికాకుండా ఉంటుందన్నారు. మరో నెల రోజుల్లో పనులు పూర్తి చేస్తామని ఏఈ దేవి తెలిపారు.

పనులు చేస్తున్న సిబ్బంది

రాష్ట్రస్థాయి కౌశల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులకు అభినందన

విశాలాక్షినగర్ న్యూస్‌టుడే : భారతీయ వికాశ్ కౌశల్ ఆధ్వర్యంలో విద్యర్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఆన్‌లైన్‌లో జిల్లా స్థాయి కౌశల్ పోటీలు నిర్వహించారు. ఇందులో విజేతలైన విద్యార్థులకు బహుమతి ప్రదాన కార్యక్రమం సోమవారం సాయంత్రం డీఈఓ కార్యాలయంలో నిర్వహించారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను డీఈఓ ప్రేమకుమార్ అభినందించి అక్కడ కూడా ప్రతిభ కనబరిచి బహుమతులు సాధించాలని ఆకాంక్షించారు. ఉప విద్యాశాఖాధికారి సోమేశ్వరరావు, జిల్లా కామన్ బోర్డు కార్యదర్శి కృష్ణకుమార్, జిల్లా సైన్స్ అధికారి పాలగుమ్మి రాజారావు, జిల్లా కౌశల్ సమన్వయకర్త శ్రీనివాస్, సహ సమన్వయకర్త పి.నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభచూపిన విద్యార్థులతో డీఈఓ ప్రేమకుమార్

'స్మార్ట్ ఇండియా హ్యాకథాన్' ప్రారంభం

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: కేంద్రప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ ఇన్నోవేషన్ సెల్, అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) ఆధ్వర్యంలో గీతం డీమ్డ్ వర్సిటీలో సోమవారం నుంచి 'స్మార్ట్ ఇండియా హ్యాకథాన్' ఫైనల్ పోటీలు ప్రారంభమయ్యాయి. గీతం ప్రో-వీసీ ప్రొఫెసర్ వై. గౌతమ్‌రావు పోటీలను ప్రారంభించారు. ఏఐసీటీఈ గత ఏడేళ్లుగా నిర్వహిస్తున్న ఈ స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ పలు స్టార్టప్‌లకు ఊపిరిపోసిందన్నారు. ★ పోటీలకు హాజరైన 25 విద్యార్థి బృందాలు, 171 మంది యువత ఆలోచనల్ని న్యాయ నిర్ణేతల సమక్షంలో పరిశీలించి ఈ నెల 12వ తేదీన విజేతల్ని ప్రకటిస్తామని గీతం వీడీసీ కోచ్ బి.రాజ్‌కుమార్ తెలిపారు. గీతం స్కూల్ ఆఫ్ జినెస్ డీన్, విశాఖ నోడల్ సెంటర్ కన్వీనర్ ప్రొఫెసర్ రాజాఫణి పప్పు మాట్లాడారు.

బాల్య వివాహాల నివారణకు కృషి

వన్‌టౌన్, న్యూస్‌టుడే: బాల్య వివాహాలు అరికట్టేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ అన్నారు. ఈ మేరకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం బాల్య వివాహాలకు వ్యతిరేకంగా కలెక్టర్ జిల్లా అధికారులతో ప్రతిజ్ఞ చేయించి ప్రసంగించారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే 1098 నంబరుకు ఫిర్యాదు చేయాలన్నారు. ఈ సమావేశంలో జేసీ మయూర్ అశోక్, ఇన్‌ఛార్జి డీఆర్వో సత్తిబాబు, జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పెచ్చులూడిన పైకప్పు.. మూలకు చేరిన ఆర్వోప్లాంట్

పెచ్చులూడిన స్లాబ్

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: ఈస్టుపాయింట్ కాలనీ కేడీపీఎం ఉన్నత పాఠశాల బాత్రూంలో స్లాబ్ పెచ్చులూడుతూ ప్రమాదకరంగా మారింది. విద్యార్థులు బాత్రూంకు వెళ్లినపుడు ఎక్కడ పెచ్చులు రాలి పడతాయోనని ఆందోళన చెందుతున్నారు. భవనం పాతది కావడంతో స్లాబ్ దెబ్బతిని లోపలి ఇనుప ఊచలు బయటకు కనిపిస్తున్నాయి. అదే విధంగా పాఠశాలలో తాగునీరు కోసం ఏర్పాటు చేసిన ఆర్వోప్లాంట్ కొంతకాలంగా నిరుపయోగంగా ఉంది. రూ. లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ఈ ప్లాంట్ నిర్వహణ లేక మూలకు చేరింది. దీంతో మధ్యాహ్న భోజనం సమయంలో విద్యార్థులు నీటికోసం ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి స్లాబ్, ఆర్వోప్లాంట్‌కు మరమ్మతులు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

వృక్షశాస్త్ర విభాగం సందర్శన

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: విజయనగరం జవహర్ నవోదయ విద్యార్థులు సోమవారం ఆంధ్రవిశ్వవిద్యాలయం వృక్షశాస్త్ర విభాగాన్ని సందర్శించారు. హెర్బేరియం, మ్యూజియం, బొటానికల్ గార్డెన్‌లను సందర్శించారు. వివిధ మొక్కలు, అందులో భద్రపరిచిన వివిధ శిలాజాలు, స్పెసిమన్‌ల గురించి విభాగాధిపతి ఆచార్య డి.సంధ్యాదీపిక, క్యూరేటర్ ప్రకాశరావును అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు తమ సిలబస్‌లోని అంశాలను ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో 9వ తరగతి చదువుతున్న 64మంది విద్యార్థులు, నలుగురు ఉపాధ్యాయులు ఉన్నారు.

మ్యూజియంలో పరిశీలిస్తున్న నవోదయ విద్యార్థులు

'సరస్' ఎగ్జిబిషన్ నిర్వహణకు ఏర్పాట్లు

వన్‌టౌన్, ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఈనెల 15 నుంచి 26వ తేదీ వరకు విశాఖ వేదికగా నిర్వహించనున్న జాతీయ స్థాయి సరస్ (సేల్ ఆఫ్ ఆర్టికల్స్ ఆఫ్ రూరల్ ఆర్టిసియన్స్ సొసైటీ) ఎగ్జిబిషన్ నిర్వహణకు తగిన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ అధికారులను ఆదేశించారు. డ్వాక్రా, స్వయం సహాయక సంఘాల సభ్యులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో నిర్వహించే ఎగ్జిబిషన్‌లో వివిధ రాష్ట్రాలకు చెందిన డ్వాక్రా సభ్యులు పాల్గొంటారన్నారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 250 వరకు స్టాల్స్ ఏర్పాటు చేస్తారన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వారికి టీటీడీసీలో వసతి కల్పించాలని, వారికి తాగునీరు, ఆహారం ఏర్పాటు చేయాలన్నారు. సరస్ ఎగ్జిబిషన్ నోడల్ అధికారి, డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి మాట్లాడుతూ అన్ని విభాగాల అధికారుల సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. బ్యాంకర్లు తమ వంతు సహాయం అందించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా సరస్ ప్రచార పత్రికలను కలెక్టర్ విడుదల చేశారు.

ప్రచార పత్రికలను విడుదల చేస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్, ఇతర అధికారులు

నిల్వ ఉంచిన ఆహార పదార్థాల విక్రయం

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: బీచ్‌రోడ్డు పాండురంగాపురంలోని శుభం కేఫ్ అండ్ రెస్టారెంట్‌లో నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు విక్రయిస్తున్నట్లు గుర్తించి కేసు నమోదు చేశామని జిల్లా ఆహార భద్రతా అధికారి జి.వి. అప్పారావు తెలిపారు. రెస్టారెంట్‌పై వచ్చిన ఫిర్యాదుల మేరకు సోమవారం ఆహార భద్రతా అధికారులు తనిఖీలు చేపట్టారు. ఫ్రైడ్‌రైస్, బిర్యాని, నూడిల్స్, పుట్టగొడుగు కర్రీ, చికెన్‌ఫ్రై నిల్వచేసి వినియోగదారులకు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. సుమారు రూ.9వేల విలువ చేసే ఆహార పదార్థాలు సీజ్ చేశారు. నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు జిల్లా ఆహార భద్రత అధికారి అప్పారావు తెలిపారు.

ఆహారాన్ని పరిశీలిస్తున్న అప్పారావు

రోలర్ బాస్కెట్‌బాల్ విజేతలకు అభినందనలు

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే : రవీంద్రనగర్ కొండవాలు ప్రాంతానికి చెందిన కనకల శేష శేఖర్, పూజిత ఇటీవల విజయవాడలో జరిగిన రోలర్ బాస్కెట్‌బాల్ పోటీల్లో విజేతలుగా నిలిచారు. ఆయా విద్యార్థులు సోమవారం ఎంవీపీ కాలనీలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ నెల 28 నుంచి 31వ తేదీ వరకు మహారాష్ట్రలోని నాందేడ్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు తెలిపారు. ఎమ్మెల్యే క్రీడాకారులను అభినందించి జాతీయ స్థాయి పోటీల్లో కూడా విజయం సాధించాలని ఆకాంక్షించారు. చిన్నారుల తండ్రి కేవీ నరసింహమూర్తి పీఎంపాలెం పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

శేషుశేఖర్, పూజితలను అభినందిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

రైతుల భూములు కార్పొరేట్లకు దోచి పెడుతున్నారు

సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు విమర్శ

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: రాష్ట్రం పారిశ్రామికంగా ముందుకు దూసుకెళ్తోందని, రూ.లక్షల కోట్లు పెట్టుబడులు వస్తున్నాయంటూ చంద్రబాబు ప్రభుత్వం చెబుతున్నా అందుకు తగ్గ కార్యాచరణ కనిపించట్లేదని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు ఎద్దేవా చేశారు. సోమవారం విశాఖలోని జగదాంబకూడలిలోని సీపీఎం కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. గతంలో వేల ఎకరాల భూములను రైతుల నుంచి తీసుకుని కార్పొరేట్లకు ఇచ్చినా ఒరిగిందేమీ లేదన్నారు. ఆ భూముల్లో గడ్డి తుప్పలు తప్ప ఒక్క పరిశ్రమా రాలేదని వ్యాఖ్యానించారు. ఐటీ మంత్రి లోకేశ్ కూడా గడిచిన 17 నెలల్లో రూ.20 లక్షల కోట్లు పెట్టుబడులను ఆకర్షించామని అనడం విడ్డూరంగా ఉందన్నారు. అదే నిజమైతే ఆ డబ్బంతా ఎక్కడికి వెళ్లిందో చెప్పాలన్నారు. వివిధ ప్రాంతాల్లో భూములిచ్చిన రైతులకు పరిహారం ఏమిచ్చారంటూ ప్రశ్నించారు.

★ డేటా సెంటర్ అవసరమే కానీ అందులో వచ్చే ఉద్యోగాలు 300 కంటే మించవన్నారు. గూగుల్‌కి చౌకగా నీరు, విద్యుత్ ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రతిష్ఠను దిగజార్చి కార్మికుల జీతాల్లో కోత పెట్టి స్వచ్ఛందంగా ఉద్యోగాలను వదులుకునేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, యాజమాన్యం చేస్తున్నాయని మండిపడ్డారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.లోకనాథం, జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు

వనసమారాధనకు హాజరుకావాలని ఆహ్వానం

శివాజీపాలెం(మద్దిలపాలెం), న్యూస్‌టుడే: ముడసర్లోవ పార్కులో జనవరి 4న నిర్వహించనున్న గీత కులాల వన సమారాధనకు హాజరుకావాలని దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణశ్రీనివాస్‌కు గీత కులాల సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం శివాజీపాలెంలోని ఆయన కార్యాలయంలో కలిసి ఆహ్వానపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గిరిబాబు, నూకరాజు, మల్లేశ్వరరావు, రాము తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వంశీకృష్ణశ్రీనివాస్‌తో గీత కులాల నాయకులు

(c) eenadu

విశాఖ ఉత్తరం

•విశాఖ ఉత్తరం •విశాఖ దక్షిణం

తుమ్మల వెంకట్రామయ్య పురస్కారానికి ఎంపిక

ఉప్పల అప్పలరాజు

సీతంపేట, న్యూస్‌టుడే: అభ్యుదయ రచయిత సంఘం గుంటూరు జిల్లా శాఖ, విశాలాంధ్ర విజ్ఞాన సమితి 2025 సంవత్సరానికి ఆమోదజీవి తుమ్మల వెంకట్రామయ్య సాహితీ పురస్కారాన్ని నగరానికి చెందిన అరసం రాష్ట్ర కార్యదర్శి, కవి, నాటక రచయిత ఉప్పల అప్పలరాజుకు ప్రదానం చేయనున్నట్లు ప్రకటించారు. అప్పలరాజు డిఫెన్స్ ఫైర్‌సర్వీస్‌లో స్టేషన్ అధికారిగా ఉద్యోగ విరమణ చేశారు. అభ్యుదయ రచయితల సంఘంలో క్రియాశీలంగా పనిచేస్తున్నారు. పర్యావరణం, ఎయిడ్స్, పల్స్‌పోలియో వంటి కార్యక్రమాలకు సంబంధించి ప్రజల్లో చైతన్యం కలిగించే నాటికలు రాశారు. ఆయనకు ఈ పురస్కారం ప్రకటించడంపై పలువురు రచయితలు హర్షం వ్యక్తం చేశారు.

అఖిలభారత సివిల్ సర్వీస్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: అఖిలభారత సివిల్ సర్వీస్ అథ్లెటిక్స్ పోటీలు ఈనెల 13 నుంచి 15 వరకు బిహార్‌లో జరగనున్నాయి. పోటీలకు జాతీయ క్రీడాకారుడు వేదవ్యాస్ ఎంపికయ్యారు. ఆయన 5, 10వేల మీటర్ల పరుగులో తలపడతారు. జిల్లా క్రీడాభివృద్ధి సంస్థలో కోచ్‌గా విధులు నిర్వహిస్తున్న వైకుంఠరావు అఖిలభారత సివిల్ సర్వీసెస్ అథ్లెటిక్స్ జట్టుకు కోచ్‌గా వ్యవహరించనున్నారు. ఈ సందర్భంగా వారిని క్రీడాకారులు, క్రీడా సంఘాల ప్రతినిధులు అభినందించారు.

కె.వేదవ్యాస్

వైకుంఠరావు

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ. 10 నుంచి మ. ఒంటి గంట మధ్య

విశాఖ ఉత్తరం: 8008574796

విశాఖ దక్షిణం: 8008574977

మాధవధార, న్యూస్‌టుడే: ?: 51వ వార్డు [illegible] గెడ్డలో కొన్ని రోజులుగా వ్యర్థాలు పేరుకుపోయి ఉన్నాయి. మురుగు నీరు నిలిచి తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. దోమల వృద్ధి చెంది జ్వరాల బారిన పడుతున్నాం. - ఆర్.అప్పారావు, స్థానికుడు.

✓: వెంటనే గెడ్డను శుభ్రం చేయిస్తాం. - వెంకటరమణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్.

స్పందనకు వందనం

మురళీనగర్, న్యూస్‌టుడే: సెక్టార్-11 బృందావన్ పార్కు కూడలిలో వీధి దీపం వెలగడం లేదని ఇటీవల 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. దీనికి సంబంధిత అధికారులు స్పందించి కొత్త వీధి దీపాన్ని ఏర్పాటు చేసి వెలిగేలా చర్యలు తీసుకున్నారు.

కౌశలం పరీక్షలకు సాంకేతిక సమస్యలు

మాధవధార, న్యూస్‌టుడే

నిరుద్యోగ యువతకు స్థానికంగా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. దీనిలో భాగంగా కౌశలం పేరిట ఇంట్లోనే ఉద్యోగం(వర్క్ ఫ్రం హోం)కల్పనకు చర్యలు తీసుకుంది. తొలి విడతలో ఈ నెల 2 నుంచి 6వ తేదీ వరకు వార్డు సచివాలయాల్లో పరీక్షలు నిర్వహించింది. ఇంత వరకు బాగానే ఉన్నా సర్వర్ మొరాయింపుతో పరీక్షలు సరిగా రాయలేక పలువురు అభ్యర్థులు ఇబ్బందులు పడ్డారు. కొందరు స్థానికంగా లేకపోవడంతో పరీక్షలు రాయలేదు.

51వ వార్డులో పరీక్షకు హాజరైన అభ్యర్థి

తరచూ సర్వర్ మొరాయింపు: అభ్యర్థి ఏ సచివాలయం నుంచి పరీక్ష రాస్తున్నారో గుర్తించేలా జీపీఎస్ తరహాలో లైవ్ లొకేషన్ క్యాప్చర్ కోడ్ స్కాన్ చేయాల్సి ఉంది. ఈ విధానంలో తరచూ సాంకేతిక సమస్యలు తలెత్తాయి. ఫలితంగా పరీక్షకు ఆటంకాలు కలిగాయి. సమస్య పరిష్కారానికి లైవ్ లొకేషన్ క్యాప్చర్ కోడ్‌ను తొలగించినా పలుచోట్ల సర్వర్లు పని చేయలేదు. దీంతో పాటు చాలా సచివాలయాల్లో కంప్యూటర్ల మరమ్మతులకు గురై మూలకు చేరాయి. ఉన్న కంప్యూటర్లకు యూపీఎస్, ఇన్వర్టర్ సదుపాయం లేకపోవడంతో పలువురు అభ్యర్థులు పరీక్షలు రాయలేదు. అనివార్య కారణలతో పరీక్షలు రాయలేని అభ్యర్థులు లింక్‌లోని ఆధార్ నంబరు ద్వారా రీ షెడ్యూల్ చేసుకోవచ్చని అధికారులు తెలిపారు.

■ **25 శాతం మాత్రమే హాజరు:** నియోజకవర్గంలోని 89 సచివాలయాల్లో మొదటి విడతలో వెయ్యి మందికి సంక్షిప్త సందేశాలు పంపగా, ఇందులో కేవలం 25 శాతం మంది మాత్రమే పరీక్షలకు హాజరయ్యారు. పలు విడతల్లో పరీక్షలు నిర్వహించే అవకాశం ఉన్నందున ఈసారైనా సచివాలయాల్లోసదుపాయాలను కల్పించి పరీక్షలు సరిగా నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు అభ్యర్థులు కోరుతున్నారు.

నెరవేరనున్న ల్యాబ్ కల

రూ.69 లక్షలతో టీపీటీకాలనీ పాఠశాలలో నిర్మాణం

గురుద్వారా, న్యూస్‌టుడే

టీపీటీకాలనీ ఎంవీపీ హెచ్ పాఠశాలలో హైస్కూల్ ప్లస్ విద్యార్థులకు ల్యాబ్ కల ఎట్టకేలకు నెరవేర నుంది. ల్యాబ్ లేక విద్యార్థులు పడుతున్న ఇబ్బందులపై ఇటీవల 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. రూ.69 లక్షలతో ల్యాబ్ నిర్మాణం చేపట్టారు.

నిర్మాణ దశలో ఉన్న భవనం

★ కళాశాల ఏర్పాటై మూడేళ్లయినా గత వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా ల్యాబ్ సదుపాయం అందుబాటులోకి రాక విద్యార్థులకు అవస్థలు తప్పలేదు. జీవీఎంసీ పరంగా చూసుకుంటే గాజువాక, టీపీటీకాలనీ పాఠశాలలకు మాత్రమే ఈ ల్యాబ్‌లను మంజూరు చేశారు. ఇప్పటి వరకు కళాశాలల్లో ఎంపీసీ, బైపీసీ సబ్జెక్టులకు బోధన జరిగినా.. ల్యాబ్ లేకపోవడంతో విద్యార్థులు దూర ప్రాంతాల్లోని కళాశాలలకు వెళ్లి పరీక్షలు చేయాల్సి వచ్చేది. కూటమి ప్రభుత్వం చొరవతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పను న్నాయి. ప్రస్తుతమున్న కళాశాల భవనం పైఅంతస్తులో మూడు గదుల నిర్మాణం చేపడుతున్నారు. ల్యాబ్ అందుబాటులోకి వస్తే విద్యార్థుల ప్రవేశాలు పెరిగే అవకాశం ఉందని అధ్యాపకులు భావిస్తున్నారు.

కేజీహెచ్ మేనేజర్‌కు సత్కారం

ప్రభాకర్‌ను సత్కరిస్తున్న జిల్లా ఎన్జీవో సంఘం నాయకులు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: కింగ్ జార్జి ఆసుపత్రి (కేజీహెచ్) మేనేజరు ప్రభాకర్‌రావును సోమవారం ఎన్జీవో సంఘం నాయకులు సత్కరించారు. కేజీహెచ్ మేనేజర్‌గా ఆయన ఇటీవల బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు కె.ఈశ్వరరావు, నగర కమిటీ అధ్యక్షుడు వై.నారాయణరావు, తదితరులు ప్రభాకర్‌రావును శాలువతో సత్కరించి అభినందనలు తెలిపారు.

ఆయుర్వేద ఔషధాల పంపిణీ

మురళీనగర్, న్యూస్‌టుడే: త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్‌స్వామి వారి వికాస తరంగిణి ఆధ్వర్యంలో కప్పరాడ శ్రీ వైభవుని దివ్యక్షేత్రం ప్రాంగణంలో సోమవారం 16ఏళ్లలోపు వారికి ఆయుర్వేద ఔషధం అందజేశారు. ప్రతినెలా పుష్యమి నక్షత్రం రోజున ఈ కార్యక్రమం నిర్వహిస్తామని కేంద్రం నిర్వాహకులు తెలిపారు. ఈ ఔషధ సేవనంతో శారీరక, మానసిక ఆరోగ్యం చేకూరుతుందన్నారు. రోగనిరోధక శక్తి పెరిగి ఆరోగ్యంగా ఉంటారని వివరించారు. ఆలయ అర్చకులు శేషాచార్యులు ఔషధాన్ని పంపిణీ చేశారు.

అవీ ఇవీ

■ వినియోగదారులను చైతన్యపర్చాలి

వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఈ నెల 24న జరగనున్న జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా స్మార్ట్ సిటీ కంజ్యూమర్ ప్రొటెక్షన్ కౌన్సెల్ వెలువరించిన గోడపత్రికను సోమవారం జేసీ మయూర్ అశోక్ తన ఛాంబరులో విడుదల చేశారు. ఈ దినోత్సవాన్ని పెద్ద ఎత్తున చేపట్టి వినియోగదారులను చైతన్యపర్చాలని, వివిధ అంశాలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని జేసీ సూచించారు. డీసీఎస్ఓ వి.భాస్కర్రావు, కౌన్సెల్ కార్యదర్శి పేర్ల భాస్కర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

■ 21న పల్స్‌పోలియో

వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఈనెల 21న జరిగే పల్స్‌పోలియో కార్యక్రమంలో అయిదేళ్ల లోపు ప్రతీ చిన్నారికి పోలియో చుక్కలు వేయించాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పల్స్‌పోలియో నిర్వహణపై జరిగిన సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో అయిదేళ్లలోపు చిన్నారులు 2,09,652 మంది ఉన్నారని చెప్పారు. వీరిలో నగర పరిధిలో 1,90,090 మంది, గ్రామీణ ప్రాంతంలో 16,562 మంది ఉన్నట్లు ఆయన వివరించారు. పోలియో చుక్కలు వేసేందుకు 1062 బూత్‌లు ఏర్పాటు చేశామన్నారు. జేసీ మయూర్ అశోక్, ఇన్‌ఛార్జి డీఆర్వో సత్తిబాబు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జగదీశ్వరరావు, డీసీహెచ్ఎస్ డాక్టర్ శంకరప్రసాద్, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటరు డాక్టర్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

■ అధికారులూ.. బాధ్యతగా వ్యవహరించండి

కార్పొరేషన్, న్యూస్‌టుడే : జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు విధి నిర్వహణలో బాధ్యతగా వ్యవహరించాలని కమిషనర్ కేతన్‌గార్గ్ హెచ్చరించారు. సోమవారం 'ఈనాడు'లో 'అడ్డగోలుగా ప్రతిపాదనం' శీర్షికతో ప్రచురితమైన కథనానికి స్పందించిన ఆయన ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడారు. పనుల ప్రతిపాదనల్లో అవకతవకలు చోటుచేసుకుంటున్నాయని, గుత్తేదారులు పనులు చేస్తున్న సమయంలో కనీసం పర్యవేక్షణ ఉండటం లేదన్నారు. వర్క్ ఇన్‌స్పెక్టర్లు, సహాయ ఇంజినీర్లు విధుల పట్ల అత్యంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. తీరు మారకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి అంశాన్ని క్షుణ్నంగా పరిశీలిస్తున్నామని, తప్పు ఎక్కడ దొర్లినా కఠిన చర్యలు తప్పవన్నారు.

డాక్టర్ కె.ఎస్.శాస్త్రి సేవలు నిరుపమానం

తాటిచెట్లపాలెం, న్యూస్‌టుడే: మాస్టర్ హోమియో వైద్యాలయం ద్వారా డాక్టర్ కె.ఎస్.శాస్త్రి గత 50ఏళ్లుగా అందించిన సేవలు నిరుపమానమని, తన జీవితాన్ని సమాజ సేవకు అంకితం చేశారని జగద్గురు పీఠం జాతీయ సలహా మండలి సభ్యులు సి.హెచ్.ఎస్.ఎన్.రాజు(మచిలీపట్నం) అన్నారు. సోమవారం అక్కయ్యపాలెంలోని మాస్టర్ హోమియో వైద్యాలయం ప్రాంగణంలో జగద్గురు పీఠం సోదర బృందం ఆధ్వర్యంలో ఏర్పాటైన డాక్టర్ కె.ఎస్.శాస్త్రి సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు. మాస్టర్ ఎక్కిరాల రామకృష్ణమాచార్య ఆచరించిన ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాలను డాక్టర్ శాస్త్రి తపస్సుగా నిర్వహించారని, జగద్గురుపీఠం అధ్యక్షునిగా విశిష్టమైన సేవలందించారని వివరించారు. సంస్థ భౌగోళిక అధ్యక్షుడు కె.గురుప్రసాద్, కార్యదర్శి బి.ఆర్.కె.రాజు మాట్లాడారు. కార్యక్రమంలో కులపతి బుక్ ట్రస్ట్ కార్యదర్శి చింతలపాటి సత్యదేవ్, కార్య నిర్వాహక కార్యదర్శి అజ్జరపు శ్రీనివాస్, బి.ఉషారాణి, పి.రవిశంకర్, బాలభాను విద్యాలయం ప్రిన్సిపల్ ఎస్.వి.శుభశ్రీ, డాక్టర్ జ్యోతిర్మయి, డాక్టర్ డి.వి.భాస్కర్ రావు, కె.శ్రీనివాస్, కె.వి.ప్రసాద్ పాల్గొన్నారు.

2వేల మందికి ఉచిత అన్నదానం

వృద్ధాశ్రమ వాసికి ఉంగరం తొడుగుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

వన్‌టౌన్, న్యూస్‌టుడే: కొండగుడి పండగను పురస్కరించుకొని పాతనగరంలోని స్వామి వివేకానంద సేవా సంస్థ ఆవరణలో సోమవారం భక్తులకు అల్పాహారం, మధ్యాహ్న భోజనాలు ఏర్పాటు చేశారు. దాదాపు 2వేల మంది భక్తులకు అన్నప్రసాదం సమకూర్చినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రారంభించి సంస్థ సేవానిరతిని కొనియాడారు. అనంతరం సంస్థ సమకూర్చిన బంగారు ఉంగరాలను ఎమ్మెల్యే ఆశ్రమ వాసులకు అందజేశారు. పింఛను మొత్తంలో బంగారం కోసం కొంత నగదు జమ చేసి, దానికి సంస్థ మరింత కలిపి ఉంగరాలు ఇవ్వడం మంచి పరిణామమన్నారు. కార్పొరేటర్ సాధిక్, ఇతర ప్రతినిధులు కొల్లి సింహాచలం, దానేష్, సంస్థ అధ్యక్షులు అప్పారావు, అప్పలకొండ, సత్తిబాబు, భానోజీరావు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ నిర్మాతకు ఘన నివాళి

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ మహాపరినిర్వాన్ దివస్‌ను సోమవారం వాల్తేర్ డీఆర్ఎం కార్యాలయం ఆవరణలో నిర్వహించారు. వాల్తేర్ డీఆర్ఎం లలిత్ బోహ్రా పాల్గొని ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం రామారావు, సీనియర్ డివిజనల్ పర్సనల్ అధికారి జుసుఫ్ కబీర్ అన్సారీ తదితరులు పాల్గొన్నారు. డివిజన్ పరిధిలో పలు చోట్ల ఈ కార్యక్రమం నిర్వహించారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: పాతపోస్టాఫీసు కొండగుడి పండుగలో తప్పిపోయిన బాలుడిని హార్బర్ పోలీసులు చేరదీసి తల్లిదండ్రులకు అప్పగించారు. సోమవారం మధ్యాహ్నం పండుగలో బాలుడు ఏడుస్తూ ఉండటాన్ని హార్బర్ పోలీసులు గుర్తించారు. వివరాలు తెలుసుకుని మైక్ ద్వారా సమాచారం చేరవేసి తల్లిదండ్రులకు అప్పగించారు.

మూడు మండలాల్లో మానసిక ఆరోగ్య శిబిరాలు

సీతంపేట, న్యూస్‌టుడే: వాసవ్య మహిళా మండలి కమ్యూనిటీ మానసిక ఆరోగ్య సంస్థ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు కార్పొరేట్ సామాజిక కార్యక్రమాలలో భాగంగా కమ్యూనిటీ మానసిక ఆరోగ్య కార్యక్రమం శిబిరాలను ఆనందపురం, పెందుర్తి, సింహాచలం మండలాల్లో నిర్వహించనున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన గోడపత్రికను జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు సోమవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. వాసవ్య మహిళా మండలి కమ్యూనిటీ మానసిక ఆరోగ్య కార్యక్రమం ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ ఆర్.రామారావు, సమన్వయకర్త వై.గోపీచంద్, తదితరులు పాల్గొన్నారు.

గోడపత్రిక ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు

పేద మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ

కుట్టు మిషన్లు అందజేస్తున్న ఆకిరెడ్డి జగదీశ్ తదితరులు

తాటిచెట్లపాలెం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ఇంటింటికి వెళ్లి కార్యకర్తలు వివరించాలని తెదేపా జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి ఆకిరెడ్డి జగదీశ్ కోరారు. 42వ వార్డు సుబ్బలక్ష్మీనగర్‌లో సోమవారం జరిగిన తెదేపా కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం వేదాంత ఫౌండేషన్ సహకారంతో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మంజూరు చేసిన నాలుగు కుట్టుమిషన్లను పేద మహిళలకు అందజేశారు. ఈ సందర్భంగా తెదేపా వార్డు అధ్యక్షుడిగా ఎన్నికైన కన్నం వెంకట రమణారావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వార్డు కార్యదర్శి ఎం.రామకృష్ణ, మహిళావిభాగ అధ్యక్షులు శ్రీవాణి, తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలకు అభినందన

మురళీనగర్, న్యూస్‌టుడే : ఈ ఏడాది సెక్టార్-8 వాకర్స్ క్లబ్ నిర్వహించిన పలు సేవా కార్యక్రమాలకు జిల్లాస్థాయిలో 5 అవార్డులు లభించాయి. ఉత్తమ అధ్యక్షుడిగా ఎస్.భానుప్రకాష్‌కు ప్రత్యేక అవార్డు వచ్చింది. అదే విధంగా పలు ఉచిత వైద్యశిబిరాలు, వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించిన ఘనత ఈ క్లబ్‌కే దక్కింది. సోమవారం సాయంత్రం క్లబ్ సభావేదికపై జరిగిన కార్యక్రమంలో భానుప్రకాష్‌ను జిల్లా 101 గవర్నర్ కె.ద్వారకానాథ్, పూర్వ అధ్యక్షులు ఎన్.బుచ్చయ్య, ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్ అభినందించారు.

క్లబ్ అధ్యక్షులను అభినందిస్తున్న వాకర్స్ కార్యవర్గ సభ్యులు

సమావేశంలో మాట్లాడుతున్న పీఎల్వీ ప్రసాద్

తెలుగు భాషను పరిరక్షించుకుందాం..

మురళీనగర్, న్యూస్‌టుడే: సెక్టార్-13 భరద్వాజక్షేత్రంలో సోమవారం 'ఆంధ్రము- ఆంగ్లము' ఇతివృత్తంపై కవి సమ్మేళనం నిర్వహించారు. తెలుగుభాష వెనుకబడటానికి ప్రధాన కారణాలను, రక్షించుకోవడానికి తీసుకోవాల్సిన చర్యలను కార్యదర్శి సి.హెచ్.చినసూర్యనారాయణ వివరించారు. నాటక కర్త రొంగలి రాములు తెలుగుభాష సాహితీచరిత్రను విశ్లేషించారు. కోశాధికారి పి.ఎల్వీ.ప్రసాద్ కవి సమ్మేళనం నిర్వహించి కవితలను సమీక్షించారు. కవులు అడబాల సత్యనారాయణ, పిల్లా అర్జునుడు, చల్లా రాంబాబు, జి.ఎస్.ఎన్.మూర్తి, టి.ఆర్.మూర్తి, డి.ఎస్.కుమార్, సి.హెచ్.రవిమోహన్, కొల్లూరి కృష్ణ, డాక్టర్ పి.సింహాచలం, బి.వి.రమణమూర్తి, బి.వెంకటేశ్వరరావు, పి.చెల్వరాజు, కె.వి.రావు కవితలను చదివి ఆహూతులను అలరించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

వన్‌టౌన్, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీ, స్వచ్ఛభారత్, క్లాప్ మిత్ర కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ అనుబంధ కార్మిక సంఘం ఏపీ గ్రామ పంచాయతీ, స్వచ్ఛభారత్ వర్కర్స్ యూనియన్ కోరింది. కలెక్టరేట్ వద్ద యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం చేపట్టిన ధర్నాలో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ మాట్లాడారు. బకాయి పడిన జీతాలను వెంటనే చెల్లించాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ప్రమాదం లేదా సహజ మరణం పొందిన కార్మికుల వారసులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని నాయకులు డిమాండ్ చేశారు. అనంతరం వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. ★ ఆటో కార్మిక సంఘం ఆధ్వర్యంలోనూ నిరసన ప్రదర్శన జరిగింది. ఈనెల 11 నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద చేపట్టనున్న రిలే నిరాహార దీక్షలకు సంబంధించిన సమాచారాన్ని సంఘ నాయకులు శ్రీను తదితరుల ఆధ్వర్యంలో కలెక్టర్‌కు విన్నవించారు.

కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న వివిధ సంఘాలకు చెందిన కార్మికులు

కమిషనరేట్‌కు 115 ఫిర్యాదులు

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: నగర పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు 115 ఫిర్యాదులు వచ్చాయి. సీపీ శంఖబ్రత బాగ్చీ ఫిర్యాదులు స్వీకరించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి చట్టపరంగా విచారణ చేపట్టి త్వరితగతిన న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు.

నైపుణ్యాలతోనే ఉపాధి అవకాశాలు

సీతంపేట, న్యూస్‌టుడే: ఉపాధి అవకాశాలు పెరగాలంటే పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులు నైపుణ్యాలను మెరుగు పర్చుకోవాలని డాక్టర్ లంకపల్లి బుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య డి.దీపక్ చౌదరి అన్నారు. ఇన్ఫోసిస్ ఫౌండేషన్, ఐసీటీ (ఇన్ఫర్మేషన్ కమ్యూనికేషన్ టెక్నాలజీ) అకాడమీ సంయుక్తంగా కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమం కింద చేపట్టిన 'ఫినిషింగ్ స్కూల్ ఫర్ ఎంప్లాయిబిలిటీ' శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం కళాశాలలో ప్రారంభించారు. కళాశాల కరస్పాండెంట్ జి.మధుకుమార్ మాట్లాడుతూ విద్యార్థులు ఇలాంటి అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య జీఎస్‌కే చక్రవర్తి మాట్లాడుతూ పరిశ్రమలు-విద్యా సంస్థల భాగస్వామ్యం ప్రాముఖ్యతను వివరించారు. ఈ ప్రోగ్రామ్‌కు కళాశాలకు చెందిన 130మంది విద్యార్థులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా కోర్సుకు సంబంధించిన అవగాహన పత్రాన్ని ఐసీటీ రాష్ట్ర సంచాలకులు డాక్టర్ దినకర్ రెడ్డి, లంకపల్లి బుల్లయ్య కళాశాల కార్యదర్శికి అందజేశారు.

కరస్పాండెంట్‌కు ఎంఓయూ ప్రతిని అందిస్తున్న దినకర్ రెడ్డి

జీవీఎంసీకి 86 వినతుల రాక

కార్పొరేషన్, న్యూస్‌టుడే: నగరంలో మల్టీప్లెక్సులు, షాపింగ్ మాల్స్, సినిమా థియేటర్లు వంటి వాణిజ్య సముదాయాల్లో నిబంధనలకు విరుద్ధంగా పార్కింగ్ రుసుములు వసూలు చేస్తున్నారని, వాటిని నియంత్రించాలని న్యాయవాది కొండా రాజీవ్‌గాంధీ ఫిర్యాదు చేశారు. మహా విశాఖ నగరపాలక సంస్థలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 86 వినతులు వచ్చాయి. మేయర్, కమిషనర్ అందుబాటులో లేకపోవడంతో అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి వాటిని స్వీకరించారు. వాటిలో జోన్-1కు 1, జోన్-2కు 8, జోన్-3కు 21, జోన్-4కు 6, జోన్-5కు 11, జోన్-6కు 22, జోన్-8కు 6, ప్రధాన కార్యాలయానికి 11 ఫిర్యాదులు అందాయి. వాటిలో పరిపాలనకు 13, రెవెన్యూకు 12, ప్రజారోగ్యానికి 4, ప్రణాళికకు 33, ఇంజినీరింగ్‌కు 18, ఉద్యానవన విభాగానికి 3, యూసీడీకి 3 ఫిర్యాదులున్నాయి.

ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కమిషనర్ రమణమూర్తి

బాల్య వివాహాలు అరికట్టడానికి కృషి

వన్‌టౌన్, న్యూస్‌టుడే: బాల్య వివాహాలు అరికట్టేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ అన్నారు. ఈ మేరకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం బాల్య వివాహాలకు వ్యతిరేకంగా కలెక్టర్ జిల్లా అధికారులతో ప్రతిజ్ఞ చేయించి ప్రసంగించారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే 1098 నంబరుకు ఫిర్యాదు చేయాలన్నారు. ఈ సమావేశంలో జేసీ మయూర్ అశోక్, ఇన్‌ఛార్జి డీఆర్వో సత్తిబాబు, జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అధికారులతో ప్రమాణం చేయిస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్ తదితరులు

అప్రెంటీస్‌షిప్ మేళాకు 135 మంది ఎంపిక

కంచరపాలెం, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాత ఐటీఐలో సోమవారం నిర్వహించిన ప్రధానమంత్రి జాతీయ అప్రెంటీస్‌షిప్ మేళాకు స్పందన లభించింది. వివిధ ట్రేడులకు చెందిన సుమారు 300పైగా విద్యార్థులు పాల్గొన్నారు. వివిధ కంపెనీ ప్రతినిధులు పాల్గొని విద్యార్థుల ధ్రువపత్రాలు పరిశీలించారు. వారిలో 135 మందిని ప్రాథమికంగా ఎంపిక చేశారని ప్రిన్సిపల్ ఎన్.సోలమన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డి.వెంకటేశ్వరరావు, అప్రెంటీస్‌షిప్ అడ్వయిజరు యు.ఎస్.ఎన్.మూర్తి, ట్రైనింగ్ అధికారి హెచ్.వి.ఎన్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

31 నుంచి సీఐటీయూ మహాసభలు

గోడపత్రిక ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

మాధవధార, న్యూస్‌టుడే: ఈ నెల 31 నుంచి వచ్చేనెల 4వ తేదీ వరకు విశాఖలో జరగనున్న సీఐటీయూ అఖిల భారత 18వ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని సీఐటీయూ జోన్ అధ్యక్షుడు ఎస్.శ్రావణ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం మాధవధారలో మహాసభలకు సంబంధించిన గోడపత్రికలను ఆవిష్కరించారు. 4వ తేదీన బీచ్ రోడ్డులో ర్యాలీ, బహిరంగ సభ ఉంటుందని, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రమణ, అప్పలరాజు, ఎంకే లక్ష్మీ, లక్ష్మణ్, ఈశ్వరరావు, శివ, దేవి, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

రైతుల భూములు కార్పొరేట్లకు దోచి పెడుతున్నారు

సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి. రాఘవులు

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: రాష్ట్రం పారిశ్రామికంగా ముందుకు దూసుకెళ్తోందని, రూ.లక్షల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయంటూ కూటమి ప్రభుత్వం చెబుతున్నా అందుకు తగ్గ కార్యాచరణ కనిపించట్లేదని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు ఎద్దేవా చేశారు. సోమవారం జగదాంబకూడలిలోని సీపీఎం కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. గతంలో వేల ఎకరాల భూములను రైతుల నుంచి తీసుకుని కార్పొరేట్లకు ఇచ్చినా ఒరిగిందేమీ లేదన్నారు. ఆ భూముల్లో గడ్డి తుప్పలు తప్పా.. ఒక్క పరిశ్రమ కూడా రాలేదని వ్యాఖ్యానించారు. ఐటీ మంత్రి లోకేశ్ కూడా గడిచిన 17 నెలల్లో రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించామని అనడం విడ్డూరంగా ఉందన్నారు. అదే నిజమైతే ఆ డబ్బంతా ఎక్కడికి వెళ్లిందో చెప్పాలన్నారు. వివిధ ప్రాంతాల్లో భూములిచ్చిన రైతులకు పరిహారం ఏమిచ్చారంటూ ప్రశ్నించారు. ★ డేటా సెంటర్ అవసరమే కానీ అందులో వచ్చే ఉద్యోగాలు 300 కంటే మించవన్నారు. గూగుల్‌కి చౌకగా నీరు, విద్యుత్ ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రతిష్ఠను దిగజార్చి కార్మికుల జీతాల్లో కోత పెట్టి స్వచ్ఛందంగా ఉద్యోగాలను వదులుకునేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, యాజమాన్యం చేస్తున్నాయని మండిపడ్డారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.లోకనాథం, జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న బి.వి.రాఘవులు

17 నుంచి ధనుర్మాస పూజలు

ధనుర్మాస ఆహ్వానపత్రికను ఆవిష్కరిస్తున్న సభ్యులు

మురళీనగర్, న్యూస్‌టుడే : స్థానిక శ్రీసీతారామాలయంలో ఈనెల 17 నుంచి జనవరి 14 వరకు ధనుర్మాస పూజలు జరగనున్నాయి. అర్చకులు గొడవర్తి రఘురామాచార్యుల ఆధ్వర్యంలో ప్రతిరోజు ఉదయం తిరుప్పావై పాశురవిన్నపం, విశేష అర్చనలు చేస్తారు. 30న వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉదయం 5-30కు సీతారాముల ఉత్సవమూర్తులకు క్షీరాభిషేకం, పాశురవిన్నపం, ఉత్తర ద్వార దర్శనం, సహస్రనామార్చన ఉంటుంది. ఉత్సవాలకు సంబంధించిన ఆహ్వానపత్రికను సోమవారం ఆలయ ప్రాంగణంలో కమిటీ సభ్యులు, అధ్యక్ష, కార్యదర్శులు ఆవిష్కరించారు.

తవ్వి వదిలేసి.. అవస్థలు పెంచి..

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: అక్కయ్యపాలెం మహారాణి పార్లర్ ఎదురుగా ప్రధానరహదారి పక్కన మూడు నెలల కిందట కాలువ ఆధునికీకరణ పనులు చేపట్టారు. కొద్దిరోజులు పనులు జరిగినా తర్వాత నిలిపివేశారు. దీంతో దుకాణాల యజమానులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చెక్కలు, బల్లలు వేసుకుని దుకాణాల్లోకి రాకపోకలు సాగించాల్సి వస్తోందని వాపోతున్నారు. వినియోగదారుల రాక తగ్గిపోవడంతో వ్యాపారాలు సాగడం లేదని చెబుతున్నారు. ఇప్పటికైనా కాలువ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కోరుతున్నారు.

మహారాణిపార్లర్ ఎదురుగా ఇలా..

(c) eenadu

గాజువాక

• గాజువాక • విశాఖ పశ్చిమం

అలమండ రాజుకు నియామక పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస రావు

విజిలెన్స్ కమిటీ సభ్యుడిగా అలమండ రాజు

అక్కిరెడ్డిపాలెం, న్యూస్‌టుడే : విశాఖ జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యునిగా హరిజన జగ్గయ్యపాలెంకు చెందిన అలమండ రాజును నియమించగా.. కలెక్టర్ ఇచ్చిన నియామక పత్రాన్ని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు చేతుల మీదుగా ఆయన తీసుకున్నారు. జీవీఎంసీ 69వ వార్డు తెదేపా అధ్యక్షునిగా ఉన్న రాజును విజిలెన్స్ కమిటీ సభ్యునిగా నియమించడం పట్ల వార్డులోని నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

12న మెగా జాబ్‌మేళా

గోడపత్రికను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పల్లా తదితరులు

గాజువాక, న్యూస్‌టుడే : ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 12న శ్రీనగర్‌లోని టీవీ స్టార్, టీబీకే కళాశాలలో జరిగే జాబ్‌మేళాను వినియోగించుకోవాలని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు కోరారు. సోమవారం గాజువాక క్యాంప్ కార్యాలయంలో జాబ్ మేళా గోడపత్రికను ఆయన ఆవిష్కరించారు. తెదేపా సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, కార్పొరేటర్ బొండా జగన్, తెదేపా నాయకులు కర్రి దేవేంద్ర, జాజుల గంగరాజు, స్కిల్ డెవలప్‌మెంటు సిబ్బంది పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ. 10 నుంచి మ. ఒంటి గంట మధ్య

గాజువాక: 98494 65088

పశ్చిమం (గోపాలపట్నం): 95428 96869

గాజువాక, పెదగంట్యాడ, న్యూస్‌టుడే : **సమస్య:** కణితికాలనీలో వీధి దీపాలు అక్కడక్కడే వెలుగుతున్నాయి. ఎల్ఈడీ దీపాలను పునరుద్ధరించాలి. –సన్యాసిరావు, ప్రసాద బాబు, వడ్లపూడి **సమాధానం:** సిబ్బందిని పంపి దీపాలు వెలిగేలా చూస్తాం. –శివ, వీధి దీపాల నిర్వాహకుడు

గోపాలపట్నం, న్యూస్‌టుడే: ?: జీవీఎంసీ 52వ వార్డు పాతకరాస రామాలయం వీధిలో డ్రైనేజీలో పూడికలు తొలగించడం లేదు. –సురేఖ, పాతకరాస ✓: ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపడతాం. – మూర్తి, శానిటరీ ఇన్‌స్పెక్టర్

?: జీవీఎంసీ 90వ వార్డు సాకేతపురంలో వీధిదీపాల నిర్వహణ అధ్వానంగా తయారైంది. –అర్జునరావు, సాకేతపురం ✓: దీపాలు మరమ్మతులు చేపడతాం. – గోవింద రావు, వీధిదీపాల నిర్వాహకులు

వృక్షాల తొలగింపు

స్పందనకు వందనం

గాజువాక, న్యూస్‌టుడే : గాజువాక శివారులో రహదారులపై భవన వ్యర్థాలు, చెత్తకుప్పలపై జీవీఎంసీ యంత్రాంగం స్పందించింది. సోమవారం గాజువాక, చినగంట్యాడ, కూర్మన్నపాలెంలో రహదారుల పక్కన గుట్టలుగా పోగైన వ్యర్థాలను జేసీబీతో తొలగించడంతో నివాసితులు ఊపిరి పీల్చుకున్నారు.

తవ్వకాలు@365 రోజులు..

విసిగిపోతున్న జనాలు

పిలకవానిపాలెం కూడలి ప్రాంతంలో...

న్యూస్‌టుడే, సింధియా, గాజువాక

అభివృద్ధి పనులు జరుగుతున్నాయంటే ఎవరైనా సంతోషిస్తారు. ఆ పనుల వల్ల నాలుగు రోజులు ఇబ్బంది కలిగినా భరిస్తారు. అయితే ఆ ఇబ్బందులు సంవత్సరం మొత్తం ఉంటే? ఎవరికైనా సహనం నశిస్తుంది. ఈ అభివృద్ధి మాకు వద్దు బాబోయ్ అంటారు. ప్రస్తుతం పశ్చిమ, గాజువాక నియోజకవర్గాల్లో జరుగుతున్న కొన్ని పనులు 365 రోజులూ ఉంటున్నాయి. ఒక శాఖ పని పూర్తయిన తర్వాత రోడ్డు వేయడం.. ఆ మరుసటి రోజే ఇంకో శాఖ వాళ్లు వచ్చి తవ్వడం జరుగుతోంది. దీని వల్ల ఆ ప్రాంత ప్రజలు బేజారెత్తుతున్నారు.

ఆ ఐదు కిలోమీటర్లు..: హిందుస్థాన్ జింక్ గేటు మొదలుకొని సింధియా కూడలి వరకు 5.2 కి.మీ మేర సేవా రహదారి ఉంది. ఈ పరిధిలో ఎప్పుడూ పనులు జరుగుతూనే ఉంటున్నాయి.

➤ రెండు నెలల నుంచి శ్రీహరిపురం, ములగాడ, మల్కాపురం ఎస్ఎస్ఎల పరిధిలో భూగర్భ విద్యుత్తు పనులు జరుగుతున్నాయి. దీనికోసం పలుచోట్ల గోతులు తవ్వేశారు. వర్షం పడితే ఆ గోతుల్లో నీరు చేరి వాహనదారులకు చుక్కలు కనిపిస్తున్నాయి.

➤ కొత్తగా మరో నెట్‌వర్క్ సంస్థ కూడా తమ లైన్లను భూగర్భంలో వేసేందుకు ప్రయత్నిస్తోంది.

➤ హెచ్‌పీసీఎల్ విస్తరణ ప్రాజెక్టు కోసం 132కేవీ సామర్థ్యంతో (కేఈఏ) సంస్థ ద్వారా పరవాడ దరి కలపాక విద్యుత్కేంద్రం నుంచి నేరుగా భూగర్భంలోంచి విద్యుత్తు కేబుళ్లను వేశారు. ఈ కేబుళ్లను డివైడర్‌కు అడుగు మినహాయించి ఏర్పాటు చేశారు. ఈ పనుల వల్ల ఏర్పడిన గోతులు కూడా స్థానికుల సహనానికి పరీక్ష పెడుతున్నాయి.

గాజువాకలో విద్యుత్తు లైనుకోసం తవ్వి ఇలా..

ఇప్పటికే..: ➤ ఈ రహదారిలోనే ఇప్పటికే ఇండియన్ నేవీ ప్రధాన కార్యాలయం ఐఎన్ఎస్ సర్కార్స్ పరిధిలోని పలు విభాగాలకు మిలిటరీ ఇంజినీరింగ్ సర్వీసు ద్వారా మంచి నీటి పైపులైన్లు ఉన్నాయి.

➤ హిందుస్థాన్ షిప్‌యార్డుకు ప్రత్యేక పైపులైను ఉంది. ➤ ఏడాది న్నర కిందట కొత్తగా భారతీయ తీర గస్తీదళ కార్యాలయం, క్వార్టర్స్‌కు ప్రత్యేక లైను ఏర్పాటు చేశారు.

➤ ఎన్నో ఏళ్లుగా ప్రజావసరాల కోసం మంచినీటి సరఫరా లైను ఉంది. ఈ లైను ద్వారానే నివాసాల కాలనీలకు పంపిణీ జరుగుతోంది.

➤ కొన్ని ఏరియాల్లో ఎస్ఎల్ఆర్‌లకు కూడా ఈ పైపు లైన్ల ద్వారానే మోటార్ల ద్వారా పైకి పంపుతున్నారు.

➤ ఈ లైనుల్లో ఎక్కడ సమస్య తలెత్తినా ఆ గోతులు అదనం.

త్వరలో మరో కంపెనీ

ఇప్పటికే పలు సంస్థల తవ్వకాల పనులతో ఆ ప్రాంతవాసులు సతమతమవుతుంటే.. త్వరలో మరో కంపెనీ కూడా తమ పనులకు అనుమతించాలని జీవీఎంసీకి లేఖ అందజేసింది. ఇంటింటికి వంట గ్యాస్ పనుల కోసం ఈ దరఖాస్తు చేసినట్లు సమాచారం.

గాజువాకలోనూ అదే పరిస్థితి..

గాజువాక, పెదగంట్యాడ మండలాల్లో పైపులీకులు, గ్యాస్ పైపుల పేరుతో రోడ్లను తవ్వేశారు. యూజీడీ గోతులు అడుగడుగునా ఉన్నాయి. ఇవి చాలదన్నట్లు భూగర్భ విద్యుత్తు తీగల పనులు చుక్కలు చూపిస్తున్నాయి. ఇళ్లముందర తవ్వకాల వల్ల బయటకు రావడానికి నివాసితులు అవస్థలు పడుతున్నారు. బీసీరోడ్డు, వుడారోడ్డు, చినగంట్యాడ, మున్సిపల్‌రోడ్డు, నడుపూరులో గోతులు దారుల్లో బిక్కుబిక్కుమంటున్నారు.

రైతుల భూములు కార్పొరేట్లకు దోచి పెడుతున్నారు

సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు విమర్శ

మాట్లాడుతున్న సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు

విశాఖపట్నం (జగదాంబ కూడలి), న్యూస్‌టుడే: రాష్ట్రం పారిశ్రామికంగా ముందుకు దూసుకెళ్తోందని, రూ.లక్షల కోట్లు పెట్టుబడులు వస్తున్నాయంటూ చంద్రబాబు ప్రభుత్వం చెబుతున్నా అందుకు తగ్గ కార్యాచరణ కనిపించట్లేదని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు ఎద్దేవా చేశారు. సోమవారం విశాఖలోని జగదాంబకూడలిలోని సీపీఎం కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. గతంలో వేల ఎకరాల భూములను రైతుల నుంచి తీసుకుని కార్పొరేట్లకు ఇచ్చినా ఒరిగిందేమీ లేదన్నారు. ఆ భూముల్లో గడ్డి తుప్పలు తప్ప ఒక్క పరిశ్రమా రాలేదని వ్యాఖ్యానించారు. ఐటీ మంత్రి లోకేశ్ కూడా గడిచిన 17 నెలల్లో రూ.20 లక్షల కోట్లు పెట్టుబడులను ఆకర్షించామని అనడం విడ్డూరంగా ఉందన్నారు. అదే నిజమైతే ఆ డబ్బంతా ఎక్కడికి వెళ్లిందో చెప్పాలన్నారు. వివిధ ప్రాంతాల్లో భూములిచ్చిన రైతులకు పరిహారం ఏమిచ్చారంటూ ప్రశ్నించారు.

★ డేటా సెంటర్ అవసరమే కానీ అందులో వచ్చే ఉద్యోగాలు 300 కంటే మించవన్నారు. గూగుల్‌కి చౌకగా నీరు, విద్యుత్ ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రతిష్ఠను దిగజార్చి కార్మికుల జీతాల్లో కోత పెట్టి స్వచ్ఛందంగా ఉద్యోగాలు వదులుకునేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, యాజమాన్యం చేస్తున్నాయని మండిపడ్డారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.లోకనాథం, జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు పాల్గొన్నారు.

● **సేవలకు మెచ్చి.. అభినందించి**

గోపాలపట్నం, న్యూస్‌టుడే : జీవీఎంసీ 92వ వార్డు ఇందిరానగర్‌కి చెందిన ఆటోడ్రైవర్ వుల్లూరి సుందర్ పాతికేళ్లుగా తన ఆటో ద్వారా అందిస్తున్న సేవలను మెచ్చుకుని ఆదిలీల ఫౌండేషన్ ఆధ్వర్యంలో దిల్లీలోని అంబేడ్కర్ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో విజయనగరం ఎంపీ కె.అప్పలనాయుడు, దిల్లీ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి బహుజ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వుల్లూరి సుందర్‌ను సత్కరిస్తున్న దృశ్యం

● **దొంగల ముఠా అరెస్టు**

మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: అంతర్ జిల్లా దొంగల ముఠాను గుంటూరు జిల్లా మంగళగిరి పోలీసులు అరెస్ట్ చేశారు. ఆ వివరాల మేరకు.. విశాఖ, వైఎస్సార్ కడప జిల్లాలకు చెందిన తోట శివకుమార్, తోట వరలక్ష్మి, ఇంతియాజ్ పగలంతా రెక్కీ నిర్వహించి రాత్రి పూట తాళాలు వేసి ఉన్న ఇళ్లలోకి చొరబడి దొంగతనాలకు పాల్పడుతున్నారు. ముఠాపై గాజువాక, అనకాపల్లి, దువ్వాడ, మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్లలో పలు చోరీ కేసులు నమోదయ్యాయి. గత నెల 4వ తేదీన మంగళగిరి మండలం యర్రబాలెం గ్రామానికి చెందిన భూక్యా వీరాంజనేయులు ఇంట్లో ఈ ముఠా చోరీ చేశారు. బాధితుడు ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు వీరిని అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి 19 గ్రాముల బంగారం, 740 గ్రాముల వెండిని స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ వెల్లడించారు.

'ఐకమత్యంతో కాపుల ముందడుగు'

శ్రామికనగర్(గాజువాక), న్యూస్‌టుడే : కాపు సామాజిక వర్గం హక్కుల పరిష్కారానికి ఐకమత్యంతో ముందుకు సాగాలని పలువురు వక్తలు కోరారు. గాజువాక ఎల్‌వీ. నగర్‌లో సోమవారం తిరుమల దేవరాయ కాపు తెలగ బలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జిల్లా సంఘం అధ్యక్షుడు తోట రాజీవ్ పాల్గొని మాట్లాడారు.. సామాజికసేవల్లో తనంచి గుర్తింపు తెచ్చుకోవాలని సూచించారు. మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య, కాపు నాయకులు కరణంరెడ్డి నర్సింగరావు, కోరాడ రాజబాబు, గంటా రవి తేజ, సీహెచ్ పార్థసారథి తదితరులు మాట్లాడారు.

సమావేశంలో మాట్లాడుతున్న తోట రాజీవ్

తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న సకల కళావేదిక ప్రతినిధులు

కళావేదికకు స్థలం కేటాయించాలి

చినగంట్యాడ(గాజువాక), న్యూస్‌టుడే : గాజువాక పట్టణంలో కళావేదిక ఏర్పాటుకు అవసరమైన స్థలం కేటాయించాలని గాజువాక సకల కళావేదిక కమిటీ ప్రతినిధులు సోమవారం గాజువాక తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతులు అందజేశారు. ఉదయం సంస్థ వ్యవస్థాపకుడు ఏవీఎన్ఎం అప్పారావు ఆధ్వర్యంలో సభ్యులు పలు సమస్యలను వివరించారు. పారిశ్రామిక ప్రాంతంలో సరైన కళావేదిక లేదని, అవసరమైన స్థలం కేటాయించాల్సిన అవసరాన్ని గుర్తుచేశారు. కళాకారుల ఇతర సమస్యలను విన్నవించుకున్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ

కూర్మన్నపాలెం (దువ్వాడ), న్యూస్‌టుడే : ఇటీవల గుంటూరు జిల్లా మంగళగిరిలోని నిర్మల ఫార్మసీ కళాశాలలో జరిగిన రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో దువ్వాడ విజ్ఞాన్ ఫార్మా కళాశాల విద్యార్థిని చంద్రిక ప్రతిభ కనబరిచింది. ఈనెల 5, 6 తేదీల్లో నిర్వహించిన పోటీల్లో షార్ట్‌పుట్ విభాగంలో చంద్రిక ప్రథమ బహుమతి సాధించింది. ఈ సందర్భంగా సోమవారం కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో చంద్రికను ప్రిన్సిపల్ వై. శ్రీనివాసరావు అభినందించారు.

చంద్రికను అభినందిస్తున్న శ్రీనివాసరావు

జీవీఎంసీకి 86 వినతులు రాక

కార్పొరేషన్, న్యూస్‌టుడే: నగరంలో మల్టీప్లెక్సులు, షాపింగ్ మాల్స్, సినిమా థియేటర్లు వంటి వాణిజ్య సముదాయాల్లో నిబంధనలకు విరుద్ధంగా పార్కింగ్ రుసుములు వసూలు చేస్తున్నారని, వాటిని నియంత్రించాలని న్యాయవాది కొండా రాజీవ్‌గాంధీ ఫిర్యాదు చేశారు. మహా విశాఖ నగరపాలక సంస్థలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 86 వినతులు వచ్చాయి. మేయర్, కమిషనర్ అందుబాటులో లేకపోవడంతో అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి వాటిని స్వీకరించారు. వాటిలో జోన్-1కు 1, జోన్-2కు 8, జోన్-3కు 21, జోన్-4కు 6, జోన్-5కు 11, జోన్-6కు 22, జోన్-8కు 6, ప్రధాన కార్యాలయానికి 11 ఫిర్యాదులు అందాయి. వాటిలో పట్టణప్రణాళికకు 13, రెవెన్యూకు 12, ప్రజారోగ్యం 4, ప్రణాళికకు 33, ఇంజినీరింగ్ 18, ఉద్యానవన విభాగానికి 3, యూసీడీకి 3 ఫిర్యాదులున్నాయి.

అధికారులూ.. బాధ్యతగా వ్యవహరించండి

కార్పొరేషన్, న్యూస్‌టుడే : జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు విధి నిర్వహణలో బాధ్యతగా వ్యవహరించాలని కమిషనర్ కేతన్‌గర్గ్ హెచ్చరించారు. సోమవారం 'ఈనాడు'లో 'అడ్డగోలు ప్రతిపాదనం' శీర్షికతో ప్రచురితమైన కథనానికి స్పందించిన ఆయన ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడారు. పనుల ప్రతిపాదనల్లో అవకతవకలు చోటుచేసుకుంటున్నాయని, గుత్తేదారులు పనులు చేస్తున్న సమయంలో కనీసం పర్యవేక్షణ ఉండటం లేదన్నారు. వర్క్ ఇన్‌స్పెక్టర్లు, సహాయ ఇంజినీర్లు విధుల పట్ల అత్యంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. తీరు మారకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామన్నారు.

22ఏ జాబితా నుంచి తొలగించాలని వినతి

ఉన్నతాధికారులకు సమస్యను వివరిస్తున్న గ్రామస్థులు

గోపాలపట్నం, న్యూస్‌టుడే : మేహాద్రిగెడ్డ నిర్వాసితుల కాలనీని 22ఏ జాబితా నుంచి తొలగించాలని కోరుతూ.. జీవీఎంసీ 89వ వార్డు పద్మనాభనగర్ గ్రామాభ్యుదయ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్, జిల్లా సంయుక్త కలెక్టర్ అశోక్‌మయూర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం గౌరవ అధ్యక్షులు ఎన్. సోములు మాట్లాడుతూ.. గోపాలపట్నం మండల పరిధిలోని వెంకటాపురం రెవెన్యూలో మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ నిర్వాసితుల కాలనీ ఏర్పడి 50 ఏళ్లు గడుస్తున్నా నేటికి ఇళ్ల స్థలాలకు రిజిస్ట్రేషన్ కావడం లేదని వాపోయారు. గతంలో రెవెన్యూ సదస్సులో విన్నవించుకున్నామన్నారు. స్థానిక నిర్వాసితులను 22ఏ జాబితా నుంచి తొలగించి సమస్య పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సభ్యులు సంతోశ్, భాస్కరరావు, నాయుడు పాల్గొన్నారు.

అడుగడుగునా గండమే..!

గాజువాక, న్యూస్‌టుడే: జాతీయ రహదారి పాతగాజువాక కూడలి బస్టాప్ వద్ద డివైడర్, సెంటర్ మీడియన్ల వద్ద నిత్యం ప్రయాణికులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. ధ్వంసమైన కాలువలు, మ్యాన్ హోల్‌పై మూతలు పాదచారులకు చుక్కలు చూపిస్తున్నాయి. వీటిని పునరుద్ధరిస్తామంటూనే అధికారులు రోజులు గడిపేస్తుండడంతో ప్రమాదాల అంచున బిక్కుబిక్కుమంటున్నారు.

★ అనకాపల్లి, ఎలమంచిలి ఇతర దూరప్రాంతాలకు వెళ్లే బస్సులు ఆగే అమరావతి హోటల్ ముందు డివైడర్ శిథిలావస్థకు చేరింది. బస్టాప్‌ను ఆనుకుని కాలువపై సిమెంటు పలకలు విరిగిపోయాయి. ఎవరైనా తెలియక అడుగు పెడితే లోతైన కాలువలోకి జారిపడిపోక తప్పదు. పాత కాలువను బాగు చేస్తామంటూనే ఏళ్లు గడిపేస్తున్నారని వాపోతున్నారు. ఇటు జీవీఎంసీ, అటు ఎన్‌హెచ్ఏఐ అధికారులు కన్నెత్తయినా చూడడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కాలువల పక్కన జీవీఎంసీ ప్రజా మరుగుదొడ్లు ఉన్నాయి. అటు వెళ్లాలంటే ఇబ్బందికరంగా మారడంతో వెనుక నుంచి వెళ్తున్నారు. మ్యాన్‌హోల్ సిమెంటు దిమ్మెలు ఎత్తుగా ఉండడంతో దారిన వెళ్లేవారంతా తన్నుకుని పడిపోతున్నారు. రోజు ప్రయాణికులతో రద్దీగా ఉండే బస్‌స్టాప్ కూడలిలో సౌకర్యాలను మెరుగుపర్చాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదకరంగా యూజీడీ మూత.. పలకలు విరిగి ఇలా..

బహుమతుల అందజేత

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: చైతన్య మహిళా డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం గాజువాక హైస్కూల్లో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. వైద్యాధికారి డాక్టర్ హేమలత, పీఓలు సంతోషి, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. నడుపూరు, గాజువాకలో విద్యార్థులకు ప్రత్యేక వైద్యసేవలు అందించారు.

విద్యార్థులతో ఎన్ఎస్ఎస్ ప్రతినిధులు

వాహనాలు ఎలా తిరగాలి?

ఎన్ఏడీకూడలి (కాకానినగర్) న్యూస్‌టుడే: రూ. కోట్లు వెచ్చించి నిర్మించిన ఎన్ఏడీకూడలి ఫ్లైఓవర్ బ్రిడ్జి అనధికార ఆటోల పార్కింగ్‌కు అడ్డాగా మారుతోంది. గాజువాక, మర్రిపాలెం, గోపాలపట్నం, కరాస వైపులా మార్గాల సమీపంలోనే ఆటోలను అడ్డదిడ్డంగా నిలిపివేస్తున్నారు. రోటరీ పద్ధతి, యూటర్న్‌లు తీసుకున్నప్పుడు ఎదురెదురు వాహనాలు కనిపించకపోవడంతో ప్రమాదాలు తప్పడం లేదు. బ్రిడ్జి కిందనే ఆటోలు నిలిపివేసి ప్రయాణికులను ఎక్కిస్తుండటంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. అదీగాక కాకానినగర్ దగ్గర ట్రాఫిక్ సిగ్నల్ వదిలినప్పుడు ఒక్కసారిగా వాహనాలు బ్రిడ్జి కింద రాకపోకలు సాగించినప్పుడు.. ఇక్కడి అనధికార పార్కింగ్ చేసి ఉంటున్న ఆటోలతో చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇంత జరుగుతున్నప్పటికీ ట్రాఫిక్ పోలీసులు దృష్టిసారించడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అనధికార ఆటో పార్కింగ్‌లపై దృష్టిసారించాలని ప్రజలు కోరుతున్నారు.

ఫ్లైఓవర్‌బ్రిడ్జి కింద రోడ్డు మధ్యలో ఆటోలు

గీతంలో 'స్మార్ట్ ఇండియా హ్యాకథాన్' ప్రారంభం

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: కేంద్రప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ ఇన్నోవేషన్ సెల్, అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) గీతం డీమ్డ్ వర్సిటీలో సోమవారం నుంచి జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న 'స్మార్ట్ ఇండియా హ్యాకథాన్' ఫైనల్ పోటీలను గీతం ప్రో-వీసీ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు ప్రారంభించారు. యువతలో నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి ఏఐసీటీఈ గత ఏడేళ్లుగా నిర్వహిస్తున్న ఈ స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ దేశంలో పలు స్టార్టప్‌లకు ఊపిరిపోసిందన్నారు.

విద్యార్థులను ఉద్దేశించి వర్చువల్‌గా మాట్లాడుతున్న ఏఐసీటీఈ ఛైర్మన్ సీతారామ్

★ గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్, విశాఖ నోడల్ సెంటర్ కన్వీనర్ ప్రొఫెసర్ రాజాఫణి పప్పు మాట్లాడుతూ ఈ పోటీల్లో పాల్గొనే విద్యార్థులకు కేంద్రప్రభుత్వం, ఇతరశాఖలు ఎదుర్కొంటున్న పలు సమస్యలకు పరిష్కారం కనుగొనాల్సిందిగా సూచించడం వినూత్న ప్రయత్నమన్నారు.

★ ఐదు రోజుల పాటు జరిగే ఈ పోటీలకు హాజరైన దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన 25 విద్యార్థి బృందాలు, 171 మంది యువత ఆలోచనల్ని న్యాయ నిర్ణేతల సమక్షంలో పరిశీలించి ఈ నెల 12వ తేదీన విజేతల్ని ప్రకటిస్తామని గీతం వీడీసీ కోచ్ బి.రాజ్‌కుమార్ పేర్కొన్నారు. కో-ఆర్డినేటర్లు వివేక్, అభితేజ్ తదితరులు పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా 60 విద్యాలయాల్లో జరుగుతున్న ఈ స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ పోటీల్లో పాల్గొంటున్న యువతను ఉద్దేశించి 'ఏఐసీటీఈ' ఛైర్మన్ టి.జి. సీతారామ్ వర్చువల్‌గా ప్రసంగించారు.

శనివారం ఆడుకోండి.. సృజనాత్మకత పెంచుకోండి

పాఠశాలల్లో నోబ్యాగ్ డే అమలు

గోపాలపట్నం, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో చదువుతో పాటు సృజనాత్మక పెరిగేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయి. బడి సంచి మోత బరువు నుంచి వారంలో ఒక్కరోజు విద్యార్థులకు విముక్తి కలిగిస్తూ.. ఆటపాటలతో కూడిన అభ్యసన జరిగేలా క్షేత్రస్థాయిలో కార్యాచరణ చేపట్టాయి. ఇందుకు అవసరమైన నిధులు పాఠశాలలకు కేటాయించారు. ఉపాధ్యాయులు బోధనకు బదులుగా పిల్లలతో వివిధ రకాల కృత్యాలు చేయిస్తారు. గోపాలపట్నం మండల పరిధిలోని ప్రాథమిక పాఠశాలలు 27, ఉన్నత పాఠశాలలు 13 ఉన్నాయి. వీటిలో దాదాపు 11 వేలమంది విద్యార్థులు చదువుతున్నారు.

విద్యార్థులు తయారు చేసిన కాగిత పుష్పాలు

సృజన పెరిగేలా..: పాఠ్యాంశాల బోధన కారణంగా విద్యార్థులకు విసుగు లేకుండా ఉండాలని బండెడు పుస్తకాల మోత భారం తప్పిస్తే.. వారిలో ఒక్కరోజైనా నూతనోత్సాహం కలుగుతుందన్న భావనతో 'నో బ్యాగ్ డే' అమలు చేయాలని విద్యాశాఖ నిర్ణయించింది. ప్రతి శనివారం ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని ఆదేశాలు జారీచేసినప్పటికీ చాలావరకు నామమాత్రంగానే అమలు జరుగుతోంది.

నిధుల మంజూరు ఇలా..

★ పాఠశాలల్లో శనివారం ఆటపాటలతో సందడి నెలకొనేలా ప్రభుత్వం పీఎంశ్రీ నిధులు మంజూరు చేసింది. ఈ ఏడాది ప్రాథమిక పాఠశాలకు రూ.500, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు రూ.1000 చొప్పున కేటాయించారు. వీటితోనే పేపర్లు, బ్రష్‌లు, యోగా మ్యాట్‌లు, స్కిప్పింగ్ రోప్‌లు, పజిల్ బాక్సులు కొనుగోలు చేయనున్నారు. వీటితోపాటే ప్రథమ చికిత్స సామగ్రి తప్పనిసరిగా ఉండాలి.

ఆ రోజు ఏం చేస్తారంటే..

విద్యార్థులు పుస్తకాల సంచి ఇంట్లోనే ఉంచి బడికి వచ్చేలా ప్రణాళిక రూపొందించారు. ఒకటో తరగతి నుంచి 8వ తరగతి వరకు విద్యార్థులకు ఆటపాటలు, విద్య, వైజ్ఞానిక నమూనాల రూపకల్పన, పిల్లల్లో నైపుణ్యాల్ని వెలికితీసే మానసిక ఉల్లాస కార్యక్రమాలు నిర్వహిస్తారు.

★ 1, 2 తరగతులకు పాడుకుందాం.. మాట్లాడుకుందాం.. నడుద్దాం..సృజన, 3, 4, 5 తరగతులకు సృజన.. తోటకు పోదాం.. శుభ్రం చేద్దాం.. చదువుకుందాం.. విందాం.. కార్యక్రమాలు ఉంటాయి.

★ 6, 7, 8 తరగతుల విద్యార్థులకు ఆటల పోటీలు, ఆర్ట్స్, క్రాఫ్ట్స్, కుట్లు, అల్లికలు తయారీ వంటి అంశాలపై శిక్షణ ఉంటుంది.

బొమ్మలు వేస్తున్న విద్యార్థినులు

▶▶ **సద్వినియోగం చేసుకోవాలి:** ఆయా పాఠశాలల్లో నిర్వహిస్తున్న నో బ్యాగ్‌డేను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. ఇందుకు కావాల్సిన సామగ్రి కొనుగోలుకు ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు జమకానున్నాయి. పిల్లల స్థాయి మేరకు వివిధ కృత్యాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. – డి.దివాకర్, గోపాలపట్నం మండల విద్యాశాఖాధికారి

బోరుకు మరమ్మతులు చేయాలి

న్యూస్‌టుడే, సింధియా : జీవీఎంసీ 60వ వార్డు ఇందిరాకాలనీ పార్కులో మంచి నీటి బోరు మరమ్మతులకు వచ్చింది. గతంలో గుల్లలపాలెం మంచినీటి విభాగం కార్యాలయం పరిధిలో అన్ని బోర్లను బాగుచేశారు. ఈ పార్కులో బోరు మాత్రం బాగుపడలేదు. దీంతో పార్కుకు వచ్చిన వారు నీరు లేక ఇబ్బంది పడుతున్నారు. బోరును బాగుచేయాలని కోరుతున్నారు.

పార్కులోని బోరు

కాలంచెల్లిన పానీయాల పారబోత

సింధియా(జవహర్‌నగర్), న్యూస్‌టుడే: గత రెండు రోజులుగా స్థానిక జవహర్‌నగర్‌లో హోల్‌సేల్ వర్తకులు తమ వద్ద నిల్వ ఉన్న కాలం చెల్లిన పానీయాలను పారబోయడం కనిపించింది. చిన్న సైజు సీసాలు దాదాపు 3 వేలకు పైగా నిల్వ ఉన్నట్టు గుర్తించారు. వాటి వివరాలను సంబంధిత కంపెనీ వర్గాలకు అందజేసి బయట పారబోశారు.

ప్రయాణానికి తప్పని పాట్లు

కరాస, న్యూస్‌టుడే : మర్రిపాలెం ప్యాసింజర్ రైల్వేస్టేషన్ దగ్గర ఉన్న అండర్‌పాత్‌వే నుంచి వెళ్లే వారికి నిత్యం సమస్యలు తప్పడం లేదు. బీఆర్టీఎస్ ప్రధాన రహదారి నుంచి ఎలక్ట్రికల్ లోకోషెడ్, డీజిల్ లోకోషెడ్, ఇతర విభాగాలకు వెళ్లే ఉద్యోగులు ఇక్కడ ఉండే అండర్‌పాత్ వే నుంచి ప్రయాణిస్తుంటారు. అది చిన్న చెరువులా తయారు కావడంతో ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

మర్రిపాలెం అండర్‌పాత్‌వేలో నిలిచిన మురుగునీరు

(c) eenadu

ముఖాముఖి

ఈనాడు, విజయనగరం

మహిళల జీవనోపాధికి ఊతమిస్తూ.. అన్నదాతల బాగుకు ఆదాయ, ఉత్పత్తి కార్యకలాపాలు నిర్వహిస్తాం.. గ్రామీణ పేదల జీవన ప్రమాణాల మెరుగుకు పథకాల అమలులో కీలకపాత్ర పోషిస్తాం.. అని డీఆర్‌డీఏ- వెలుగు పీడీ శ్రీనివాస్‌పాణి పేర్కొన్నారు. జిల్లాలోని 18 మండలాల్లో శీతల గిడ్డంగుల నిర్మాణానికి ప్రతిపాదించామని 'ఈనాడు' ముఖాముఖిలో వివరించారు.

విదేశాలకు మునగపొడి

18 మండలాల్లో శీతల గిడ్డంగుల నిర్మాణం

'ఈనాడు'తో డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్ పాణి

వెదురు సాగుకు ప్రోత్సాహం

ఇతర దేశాల్లో మునగ పొడికి డిమాండు ఉంది. జిల్లాలో నిరుపయోగంగా ఉన్న భూముల్లో పైలెట్ ప్రాజెక్ట్ కింద తోటలు పెంచాలని నిర్ణయించాం. మూడు నెలల్లోనే ఈ పంట చేతికి అందుతుంది. సేకరించిన ఆకుల పొడి చేసి ఇతర దేశాలకు ఎగుమతి చేయవచ్చు. ఇందుకు రూ.60 లక్షలతో పొడి తయారీ యంత్రాన్ని ఏర్పాటు చేయనున్నాం. వెదురు సాగులో మహిళలను ప్రోత్సహిస్తాం. అనుబంధ ఉత్పత్తుల విక్రయానికి మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తాం.

27 ఎఫ్‌పీవోలకు అండ

జిల్లాలోని 27 రైతు ఉత్పత్తిదారుల సంస్థ (ఎఫ్‌పీవో)లకు అండగా ఉంటాం. ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించి వారు నష్టపోకుండా ఉత్పత్తులు సేకరించేలా తొలుత 18 మండలాల్లో శీతల గిడ్డంగులు, సేకరణ కేంద్రాలు నెలకొల్పుతాం. ఇప్పటికే డీఆర్‌డీఏ జిల్లా శిక్షణ కేంద్రంలో సౌర శక్తితో పనిచేసే గిడ్డంగిని నిర్మించాం. ఒక్కో గోదాము నిర్మాణానికి రూ.16 లక్షలు వ్యయం అవుతుంది. వీటిలో తమ ఉత్పత్తులు నిల్వ చేసి, విక్రయించుకునే వెసులుబాటు కల్పిస్తాం. ఎఫ్‌పీవో నుంచి 90 శాతం రాయితీ వచ్చేలా ప్రయత్నిస్తున్నాం. జిల్లాలో 34 వేల రైతు ఉత్పత్తిదారుల బృందాల్లోని సభ్యులకు అన్ని విధాలా సహకారానికి చర్యలు తీసుకుంటున్నాం.

సౌరశక్తితో పనిచేసే శీతల గిడ్డంగి

వనితలు స్వావలంబన సాధించేలా..

పొదుపు మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించేలా ముందుకు నడిపిస్తాం. ఆక్వా కల్చర్ చేపట్టేందుకు 35 మంది ముందుకొచ్చారు. షేడ్ నెట్ సాగును ప్రోత్సహిస్తున్నాం. ఈ పద్ధతిలో పూలు, కూరగాయలు, ఔషధ మొక్కల సాగుకు ఆసక్తి చూపిన 30 మంది డ్వాక్రా మహిళలను గుర్తించాం.

ఉపాధి పనుల్లో అలసత్వం

అయిదుగురు ఏపీవోలకు నోటీసులు

కొత్తవలస, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకం అమలులో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వంగర, వేపాడ, కొత్తవలస, జామి, మెంటాడ మండలాలకు చెందిన అయిదుగురు అదనపు పథక అధికారుల (ఏపీవోలు)కు పీడీ శారదాదేవి సోమవారం నోటీసులు జారీ చేశారు. ఈ నెల 5న కలెక్టర్ రాంసుందర్‌రెడ్డి నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఆయన ఆదేశాల మేరకు ఈ చర్యలు తీసుకున్నారు. మండలానికి వెయ్యి మంది వేతనదారులకు పనులు కల్పించాలన్న లక్ష్యాన్ని చేరడం, సమావేశాలు, టెలీకాన్ఫరెన్స్ నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఈ చర్యలు తీసుకున్నట్లు అధికారులు చెబుతున్నారు.

ముక్క పేరిట మస్కా

అన్నా.. నువ్వు నమూనాగా ఇచ్చిన ధాన్యం ఆడితే ముక్కలవుతోంది. ఇవి కొనుగోలు చేస్తే మేం నష్టపోతాం. తక్కువలో తక్కువ పది కిలోలు అదనంగా కావాలి. లేకుంటే కష్టమే.
- బొబ్బిలి ప్రాంతానికి చెందిన ఓ మిల్లరు

చూడన్నా.. కష్టపడి పండించాం.. ధాన్యం బాగానే ఉంది. ముక్కవుతోందంటున్నావ్. పదేసి కిలోలు ఎలా ఇవ్వగలను. కాస్త దయ చూడు. - అన్నదాత

- అదనంగా ధాన్యం డిమాండు
- కొందరు మిల్లర్ల తీరుపై ఆరోపణలు

పిరిడిలో ధాన్యం పరిశీలిస్తున్న బొబ్బిలి డివిజన్ ఏడీఏ, తహసీల్దారు

ఈనాడు, విజయనగరం

'ధాన్యంలో తేమ శాతం ఎక్కువగా ఉంది.. బియ్యం ముక్కలవుతోంది.. మరాడితే రవ్వలా మారుతోంది.. అదనంగా పంపిస్తేనే తీసుకుంటాం.. లేదంటే ఉంచుకోండి' . ఉమ్మడి జిల్లాలో పలువురు మిల్లర్ల మాటలివి. వివిధ కారణాలు చెప్పి అన్నదాతల సంపదను దోచేస్తున్నారు. ఇందులో దళారీలదే ప్రధాన పాత్ర. సేకరణ నుంచి తరలింపు వరకు వారే ఉంటుండడంతో రైతుకు నష్టం తప్పడం లేదు.

తెగుళ్ల సాకుతో..

గతంలో ప్రభుత్వం సరఫరా చేసే 1021 రకాన్ని వేసేవారు. తెగుళ్ల సోకుతున్నాయని.. పెట్టుబడి పెరుగుతోందని.. కొందరు ఈసారి సంపద స్వర్ణ రకం వైపు మొగ్గు చూపారు. సాధారణ రకాల కంటే అయిదారు బస్తాలు, సారవంతమైన నేలలో అన్నీ అనుకూలిస్తే పది బస్తాల కంటే ఎక్కువ దిగుబడి వస్తుండడంతో ఆశ పడ్డారు. ఈ ఏడాది.. విజయనగరం జిల్లాలో 57 వేల ఎకరాలు, మన్యంలో 25,875 ఎకరాల్లో సాగు చేపట్టారు. తుపాన్లు, ఈదురుగాలుల కారణంగా చాలావరకు పంట దెబ్బ తింది. అమ్మే నాటికి ముక్కలవుతోందని చెబుతుండడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధికారులు స్పందించాలి..

ఏటా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. గతంలో అయిదారు కిలోలు అడిగే వారు. ఇప్పుడు 10 నుంచి 15 కిలోలు డిమాండు చేస్తున్నారు. అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో ధాన్యం తీసుకునేలా చూడాలి. దోపిడీని అడ్డుకోవాలి.
- బి.రాంబాబు, కార్యదర్శి, జిల్లా రైతు సంఘం

ఇతర రకాలతో కలపొద్దు..

సంపద స్వర్ణ రకం మంచిదే. కొందరు పదేళ్ల నుంచి సాగు చేస్తున్నారు. ఈ ఏడాది అధిక వర్షాల కారణంగా కొంతమేర పంట వాలిపోయింది. ఆ గింజలకు మిగిలిన రకాల ధాన్యాన్ని కలపడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని మిల్లర్లు చెబుతున్నారు. అదనంగా డిమాండు చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. దీనిపై దృష్టిసారించి, చర్యలు తీసుకుంటాం.
- వీటీ.రామారావు, జిల్లా వ్యవసాయ శాఖాధికారి

పారాది వంతెన.. పనులు వేగవంతాన..

పనులు పరిశీలిస్తున్న అధికారులు

బొబ్బిలి గ్రామీణం, న్యూస్‌టుడే: బొబ్బిలి మండలం పారాది వద్ద వేగావతి నదిపై నిర్మిస్తున్న వంతెన స్లాబ్ పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. బుడా ఛైర్మన్ తెంటు లక్ష్మునాయుడు కొబ్బరి కాయ కొట్టి పనులు మొదలుపెట్టారు. ఇప్పటివరకు చేసినవాటికి ఇటీవల రూ.3 కోట్లు బిల్లులు చెల్లించడంతో పనులు ఊపందుకున్నాయి. వచ్చే ఏడాది మే, జూన్ నాటికి పూర్తిచేయాలనే లక్ష్యంతో వేగం పెంచారు. ఈ నెలాఖరుకు స్తంభాల మధ్య నాలుగు స్లాబ్‌లు వేస్తామని ర.భ.శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఈ మార్గంలో ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు రోజూ వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. బొబ్బిలి గ్రోత్ సెంటర్ నుంచి విశాఖ, ఇతర ప్రాంతాలకు ముడిసరకు రవాణా చేస్తున్నారు. పనులు పూర్తయితే అవస్థలు తీరుతాయి. ఏఈ రాజు, ఈఈ జేమ్స్ పనులు పరిశీలించారు.

స్టూలే కాళ్లు.. కదిపితే కన్నీళ్లు

స్టూలు ఆధారంగా నడుస్తున్న ఈ వ్యక్తి పేరు సత్యవరపు రాము. విజయనగరంలోని 12వ వార్డు బూడివీధికి చెందిన నిరుపేద. మోకాళ్ల చిప్పలు అరిగిపోవడం, వైద్యం చేయించుకునేందుకు డబ్బులు లేకపోవడంతో ఇలా స్టూలుతోనే కాలం వెళ్లదీస్తున్నారు. తోడు లేకుండా ఎక్కడికీ వెళ్లలేని పరిస్థితి. మూడు చక్రాల సైకిల్ కోసం అర్జీ పెట్టేందుకు సోమవారం కలెక్టరేట్‌కు వచ్చారు. ప్రధాన గేటు వద్ద రెయిలింగ్‌ను దాటేందుకు ఇబ్బంది పడ్డారు. ఈక్రమంలో ఓ మహిళ సాయంతో అధికారులను కలిసి వినతిపత్రం అందించారు.
– న్యూస్‌టుడే, విజయనగరం ఉడాకాలనీ

సైనిక సంక్షేమానికి నేను సైతం..

విరాళం అందిస్తున్న కలెక్టర్ రాంసుందర్‌రెడ్డి

విజయనగరం ఉడాకాలనీ, న్యూస్‌టుడే: దేశ భద్రత కోసం కృషిచేస్తున్న సైనికుల సంక్షేమం, వారి కుటుంబ సభ్యుల బాగు కోసం ప్రజలంతా సాయుధ దళాల పతాక నిధికి విరాళాలు అందించాలని కలెక్టర్ రాంసుందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. సరిహద్దుల్లో జవాన్ల సేవలను కొనియాడారు. అమరవీరులకు నివాళులర్పించారు. పతాక నిధికి విరాళమిచ్చారు. సైనిక సంక్షేమ శాఖ జిల్లా అధికారి ప్రసాదరావు, ఎన్‌సీసీ అధికారులు, సిబ్బంది, క్యాడెట్లు, మాజీ సైనికులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మనవరాలిపై లైంగిక దాడి

నిందితుడికి 20 ఏళ్ల జైలు, జరిమానా

విజయనగరం అయ్యన్నపేట, న్యూస్‌టుడే: మనవరాలిపై లైంగిక దాడికి పాల్పడిన ఓ కామాంధుడు కటకటాల పాలయ్యాడు. ఎస్పీ దామోదర్ వివరాల ప్రకారం.. విజయనగరంలోని ఓ ప్రాంతానికి చెందిన బి.సత్యారావు ఈ ఏడాది ఆగస్టు 18న తన మనవరాలైన ఆరేళ్ల బాలికపై లైంగికంగా దాడి చేశాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఈ ఘోరానికి ఒడిగట్టాడు. విషయం తెలుసుకున్న బాధితురాలి తల్లి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై శిరీష పోక్సో కేసు నమోదు చేశారు. మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ ఆర్.గోవిందరావు దర్యాప్తు చేపట్టారు. కోర్టులో అభియోగపత్రాలు దాఖలు చేయగా.. నేరారోపణ రుజువైంది. ఈమేరకు 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి కె.నాగమణి సోమవారం తీర్పునిచ్చారు. బాధితులకు రూ.5 లక్షల పరిహారం మంజూరు చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు ఎస్పీ తెలిపారు.

7 రోజుల్లో అర్జీలకు పరిష్కారం

విజయనగరం అయ్యన్నపేట: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే వినతులపై తక్షణమే స్పందించి.. వారంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఎస్పీ దామోదర్ ఆదేశించారు. సోమవారం నగరంలోని తన కార్యాలయంలో అర్జీలు స్వీకరించారు. 40 మంది వినతులు అందించారు. భూతగాదాలపై 20, కుటుంబ కలహాలపై 3, నగదు వ్యవహారాలపై 3, మోసాలపై 5, ఇతర అంశాలకు సంబంధించి 9 ఫిర్యాదులు వచ్చాయి. అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, డీసీఆర్బీ సీఐ కె.కుమారస్వామి పాల్గొన్నారు.

ఆప్కాబ్ నుంచి జిల్లాకు రూ.100 కోట్లు

రుణాల మంజూరుకు చర్యలు

చీపురుపల్లి, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లా రైతులకు తోడ్పాటు అందించడానికి ఆప్కాబ్ నుంచి అదనపు ఫైనాన్స్ కింద రూ.100 కోట్లు మంజూరు చేసినట్లు డీసీసీబీ ఛైర్మన్, తెదేపా విజయనగరం పార్లమెంటరీ అధ్యక్షుడు కిమిడి నాగార్జున తెలిపారు. సోమవారం చీపురుపల్లిలో విలేకరులతో మాట్లాడారు. కొద్ది రోజుల కిందట అమరావతిలో ఆప్కాబ్ ఛైర్మన్, ఎండీని కలిసి సమస్యలు తెలియజేశానని, ఈ మేరకు రుణాలు ఇచ్చేందుకు మంజూరు చేశారన్నారు. అర్హులైన నూతన సభ్యులకు ఇవ్వాలని బ్యాంకు అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ఛైర్మన్లు, సభ్యులు, సీఈవోలు వారి సంఘం పరిధిలోని అర్హత గల రైతులకు పంట రుణాల ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. సక్రమంగా చెల్లించినవారికి కేంద్ర ప్రభుత్వం 3 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 4 శాతం వడ్డీ తిరిగి ఇస్తుందన్నారు.

రైతేరాజు 6లో

ఈసారి 13,985 మందే..

ఉమ్మడి జిల్లాలో టెట్‌కు తగ్గిన పోటీ

– న్యూస్‌టుడే, విజయనగరం విద్యావిభాగం

ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)కు పోటీ తగ్గుముఖం పట్టింది. ఈసారి ఉమ్మడి జిల్లాలో 13,985 మందే ముందుకొచ్చారు. తొలిసారిగా ఉపాధ్యాయ అభ్యర్థులతో పాటు ఇన్‌సర్వీసు ఉపాధ్యాయులు పరీక్ష రాయనుండడంతో పోటీ ఎక్కువగా ఉంటుందని అంతా భావించారు. గతంలో రెండు టెట్‌లు రాసి ఉండడం, కొందరికి మంచి స్కోరింగ్ ఉండడంతో దరఖాస్తు చేయనున్నట్లు తెలుస్తోంది. ఈసారి తగినంత వ్యవధి కూడా లేకపోవడంతో స్కోరింగ్ చేయలేమన్న భావనతో వెనకడుగు వేసినట్లు మరికొందరు పేర్కొంటున్నారు.

శిక్షణ పొందుతున్న అభ్యర్థులు

గతంలో 28,889 మంది..

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత తొలిసారిగా గతేడాది అక్టోబరులో నిర్వహించిన టెట్‌కు 28,889 మంది బరిలో నిలిచారు. అప్పట్లో 2023-25 బ్యాచ్ డీఎల్‌ఈడీ, బీఎడ్ అభ్యర్థుల(చివరి సంవత్సరం వారు)కు డీఎస్సీకి అవకాశం కల్పించకపోవడంతో వారంతా ఇప్పుడు పోటీపడే అవకాశముంది. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఇన్‌సర్వీసు ఉపాధ్యాయులకు టెట్‌ను పాఠశాల విద్యాశాఖ తప్పనిసరి చేసింది. ఒక్క విజయనగరం జిల్లాలోనే 7,134 మంది ఉన్నారు. మన్యం జిల్లాతో కలిపితే ఆ సంఖ్య పదివేల పైమాటే. వీరిలో 3 వేల నుంచి 4 వేల మంది వరకు పోటీలో ఉన్నట్లు అంచనా.

పరీక్ష కేంద్రం	అభ్యర్థులు
అయాన్ డిజిటల్ జోన్	3,129
ఎంవీజీఆర్ కళాశాల	4,035
లెండి కళాశాల	4,800
సీతం ఇంజినీరింగ్ కళాశాల	1571
అవంతి కళాశాల	450

10 నుంచి పరీక్షలు

ఈనెల 10 నుంచి 21 వరకు పరీక్షలు జరగనున్నాయి. 5 కేంద్రాల్లో ఆన్‌లైన్ విధానంలో రోజూ ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు, 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు సెషన్లుగా నిర్వహించనున్నారు.

సందేహాల నివృత్తి..: ఎలాంటి సందేహాలున్నా 94933 13271, 95503 94572, 86397 91622 నంబర్లను సంప్రదిస్తే నివృత్తి చేస్తాం. హాల్‌టికెట్, నామినల్ రోల్‌లో తప్పులను సవరించేందుకు అన్ని పరీక్షా కేంద్రాల వద్ద డిపార్టుమెంట్ అధికారులకు డాక్యుమెంట్ల జిరాక్స్‌లను అందజేయాలి.
- మురళీ, ఇన్‌ఛార్జి డీఆర్వో, యు.మాణిక్యం నాయుడు, డీఈవో

నిమిషం ఆలస్యమైనా..
- హాల్‌టికెట్‌తో పాటు ఏదైనా గుర్తింపు కార్డు తప్పనిసరి
- నిమిషం ఆలస్యమైనా అనుమతి నిరాకరణ
- వీహెచ్, పీహెచ్ అభ్యర్థులకు 50 నిమిషాల అదనపు సమయం
- ఎలక్ట్రానిక్ పరికరాలు నిషిద్ధం

పాఠశాలలో విద్యుదాఘాతం..
పదో తరగతి విద్యార్థికి గాయాలు

విద్యుదాఘాతానికి గురైన బాలుడు

మెంటాడ, న్యూస్‌టుడే: విద్యుదాఘాతానికి గురై పదో తరగతి విద్యార్థి గాయపడిన ఘటన ఆంధ్ర జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం చోటుచేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి విద్యార్థి కుటుంబీకులు, డిప్యూటీ డీఈవో అందించిన వివరాలిలా ఉన్నాయి. పదో తరగతి చదువుతున్న కె.రామ్‌చరణ్ ఉదయం ప్రత్యేక తరగతుల కోసం పాఠశాలకు వెళ్లాడు. అప్పటికి ఉపాధ్యాయుడు రాకపోవడంతో పాఠశాల భవనంపైకి వెళ్లాడు. పైనుంచి పనసలవలసకు వెళ్లే విద్యుత్తు లైను ఉంది. తోటి విద్యార్థులు పైకి వెళ్లి చూసేసరికి విద్యుదాఘాతానికి గురై పడి ఉన్నాడు. వారి సమాచారం మేరకు కుటుంబ సభ్యులు గజపతినగరం సామాజిక ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అందించి.. జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. విద్యార్థి చేతులు, తొడ వద్ద కాలిపోయిందని, తలకు గాయమైందని, ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపినట్లు బాలుడి తండ్రి సత్యం చెప్పారు.

చేతికి గాయం

తీగలు మార్చాల్సి ఉన్నా..

పాఠశాల భవనం మీదుగా వెళ్తున్న విద్యుత్తు తీగలు మార్చాలని ఉన్నతాధికారులను గతంలో కోరామని ఎంఈవో శివాజీ వర్మ తెలిపారు. పాఠశాలకు నాడు-నేడు కింద అదనపు భవనాలు మంజూరయ్యాయని, విద్యుత్తు తీగలు తొలగిస్తే నిధులొస్తాయన్నారు. తీగల మార్పిడికి నగదు చెల్లించాలని సంబంధిత అధికారులు నోటీసులు ఇచ్చారని, ఆ విషయాన్ని గ్రామ పంచాయతీకి తెలియజేశామన్నారు. వాటికి నగదు చెల్లించకపోవడంతో పనులు చేపట్టలేకపోయామని విద్యుత్తుశాఖ ఏఈ రమేష్ తెలిపారు.

భూ ఆక్రమణలపై చర్యలేవీ?

ఎమ్మెల్యే సంస్థపై కలెక్టర్‌కు ఫిర్యాదు

ఈనాడు, విజయనగరం: విజయనగరం జిల్లా భోగాపురం మండలం ముంజేరు రెవెన్యూ పరిధిలో నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవికి చెందిన మిరాకిల్ సాఫ్ట్‌వేర్ సిస్టమ్స్ సంస్థ ప్రభుత్వ భూములు ఆక్రమించుకుందని అదే గ్రామానికి చెందిన పిడుగు నాగరాజు ఆరోపించారు. ఈమేరకు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ రాంసుందర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. గెడ్డలు, వాగులు, బందలు తదితర నీటి వనరులున్న సుమారు 10.13 ఎకరాల మేర కబ్జా చేసినా ఆ సంస్థ యాజమాన్యంపై చర్యలు తీసుకోలేదని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గతంలో సర్వే శాఖ దృష్టికి తీసుకెళ్లగా.. సంబంధిత అధికారులు స్పందించి సర్వే నం.393, 393, 397-2, 408-2, 342, 342లలో ఆక్రమణ జరిగిందని నిర్ధారించారన్నారు. అయినప్పటికీ ఇప్పటివరకు చర్యల్లేవన్నారు. ఆక్రమిత స్థలాలను ఆ కంపెనీకి ఉపయోగపడేలా మట్టితో కప్పేసి, తారు రోడ్లు, పార్కులు నిర్మించారన్నారు. దీనివల్ల ఆయకట్టు రైతులు పంటలు సాగు చేయలేక నష్టపోతున్నారన్నారు. తమ వద్ద అన్ని ఆధారాలు ఉన్నాయని, వాటిని కలెక్టర్‌కు అందించామని చెప్పారు.

చెరకు సాగు విస్తీర్ణం పెంచాలి

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రస్తుతం రెండున్నర లక్షల ఎకరాలున్న చెరకు సాగు విస్తీర్ణాన్ని 4 లక్షల ఎకరాలకు విస్తరించాలని జేసీ ఎస్.సేధు మాధవన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం క్రషింగ్, రవాణా, చెల్లింపులు, మిల్లుల పనితీరు తదితర అంశాలపై వ్యవసాయాధికారులు, తహసీల్దార్లతో సమీక్షించారు. సాగు పెంపుతోనే కర్మాగారాల మిల్లింగ్ సామర్థ్యం మెరుగుపడుతుందన్నారు. కేంద్రం నిర్ణయించిన ధరనే అధికారికంగా ప్రకటిస్తామని తెలిపారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు.

★ పీజీఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనలో కొందరు నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారని, ఈ వైఖరిని సహించేది లేదని జేసీ స్పష్టం చేశారు. రీ ఓపెన్ అవుతున్న వాటిపై ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. కేన్ కమిషనర్ ఎం.సత్యనారాయణ, సంకిలి చక్కెర కర్మాగారం యూనిట్ విభాగాధిపతి వెంకటసూర్య తదితరులు పాల్గొన్నారు.

నేడు క్రీడా ఎంపికలు

సీతంపేట, న్యూస్‌టుడే: శాప్ ఆధ్వర్యంలో షెడ్యూల్డ్ ప్రాంతం(పీసా)లోని గిరిజన క్రీడాకారులకు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలు నిర్వహించడానికి అధికారులు నిర్ణయించారని ఐటీడీఏ క్రీడా అధికారి ఎన్.జాకోబ్ దయానందం తెలిపారు. పార్వతీపురంలో మంగళవారం జిల్లాస్థాయి ఎంపిక పోటీలు నిర్వహిస్తామన్నారు. 18 ఏళ్లు పైబడిన స్త్రీ, పురుషులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. కబడ్డీ, విలువిద్య, పరుగు పందెంలో పోటీలు జరుగుతాయన్నారు.

స్థలం మాదన్నా.. కాదు పొమ్మంటున్నారు

న్యూస్‌టుడే, విజయనగరం అర్బన్

'30 ఏళ్లుగా భూమిని సాగు చేసుకుని బతుకుతున్నాం. కొందరు వ్యక్తులు ఖాళీ చేయాలని బెదిరిస్తున్నారు. పోలీసులకు చెప్పినా న్యాయం జరగలేదు' అని గరివిడి మండలం వెదుళ్లవలస గ్రామానికి చెందిన పలువురు దళితులు కలెక్టర్ రాంసుందర్‌రెడ్డికి సమస్య వివరించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రాలు అందించారు. సర్వే నంబరు 331-16, 17, 18, 19, 28, 29లో ఉన్న భూములను సాగు చేసుకుంటున్నామని, పట్టాలిచ్చి ఆదుకోవాలని కోరారు.

ఫిర్యాదు చేసేందుకు వచ్చిన వెదుళ్లవలస గ్రామస్థులు

వాళ్లు కట్టకపోతే మాకు నోటీసులా..?

సంఘంలో కొందరు సభ్యులు రుణాలు తీసుకుని, కట్టకపోవడంతో బ్యాంకు నుంచి తమకు నోటీసులొచ్చాయని చీపురుపల్లిలోని విజయకాలనీకి చెందిన పొదుపు సంఘం సభ్యులు జి.రాము, ఎ.సింహాచలం, జి.భాగ్యలక్ష్మి తదితరులు వాపోయారు. చీపురుపల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదన్నారు.

జీవన భృతి కల్పించాలి

బంగ్లాదేశ్‌లో చిక్కుకున్న మత్స్యకారులను విడిపించే వరకు తమ కుటుంబాలకు నెలకు రూ.20 వేల చొప్పున భృతి చెల్లించాలని తిప్పలవలస, కొండ్రాజుపాలెం గ్రామాలకు చెందిన మత్స్యకార కుటుంబాలు కోరాయి. ఈ సందర్భంగా ఏపీ వాడబలిజ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరిమెళ్ల వాసు వారికి నిత్యావసరాలు అందించారు.

273 అర్జీలు..

కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్‌ఎస్‌కు 273 అర్జీలు వచ్చాయి. అత్యధికంగా రెవెన్యూశాఖకు సంబంధించి 120, డీఆర్‌డీఏ- 45, వైద్యారోగ్య- 17, పంచాయతీరాజ్- 13, విద్యుత్తు- 10, పురపాలక- 10, సచివాలయం- 07, మిగిలినవి ఇతర శాఖలకు అందాయి. కలెక్టర్ రాంసుందర్‌రెడ్డి, జేసీ ఎస్.సేధు మాధవన్, ఇన్‌ఛార్జి డీఆర్వో మురళీ, ప్రత్యేక ఉప కలెక్టర్లు డి.వెంకటేశ్వరరావు, రాజేశ్వరి, ప్రమీలగాంధీ, బి.శాంతి, కళావతి తదితరులు పాల్గొన్నారు.

భూఆక్రమణకు యత్నం..

22ఎ జాబితాలో ఉన్న భూమిని ఆక్రమించేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని రేగిడి మండలం బూరాడ గ్రామానికి చెందిన వావిలపల్లి జగన్మోహనరావు, ఎంపీటీసీలు, మండల పరిషత్తు ఉపాధ్యక్షులు ఫిర్యాదు చేశారు. సర్వే నంబరు 64-2లో 3.12 ఎకరాల్లోని రాతిగుట్ట, ఆసరమెట్ట ప్రాంతాలను కబ్జా చేస్తున్నారని చెప్పారు.

లంచం అడిగితే.. ఇలా చేయండి

విజయనగరం, న్యూస్‌టుడే: ప్రభుత్వ కార్యాలయాల్లో పౌర సేవలు, సంక్షేమ పథకాల అమలు, ధ్రువపత్రాల మంజూరు, భూముల రిజిస్ట్రేషన్, ఇతరత్రా ఏ పని చేయాలన్నా అడిగినంత ఇవ్వకుంటే కొందరు ఉద్యోగులు ప్రజలను కాళ్లరిగేలా తిప్పిస్తుంటారు. ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే ఎన్నో ఘటనలు జరిగాయి. బాధ్యతాయుతమైన ఉద్యోగం చేస్తూ.. ప్రభుత్వ జీతం తీసుకొని లంచం ఆశించే అలాంటి వారిపై ఫిర్యాదుకు అనేక మార్గాలు ఉన్నాయి. మంగళవారం అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినం. ఈ సందర్భంగా ఆ నంబర్ల వివరాలు మీ కోసం...

- **లంచం సమస్య ఎదురైతే నంబరు:** 1064 టోల్ ఫ్రీ, 0866-2428770, 94404 40057
- **విజయనగరం అనిశా డీఎస్పీ:** 94404 46174, సీఐ: 94404 46176
- **ఆన్‌లైన్‌లో రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలంటే..:** https://acb.ap.gov.in



(c) eenadu

శరీర సౌష్ఠవ పోటీల్లో సత్తా

సూర్యనారాయణను అభినందిస్తున్న ఎస్పీ దామోదర్, చిత్రంలో దయానంద్

విజయనగరం అయ్యన్నపేట, న్యూస్‌టుడే: ముంబయిలో ఇటీవల జరిగిన జాతీయ స్థాయి శరీర సౌష్ఠవ పోటీల్లో విజయనగరానికి చెందిన ఈదుబిల్లి సూర్యనారాయణ సత్తా చాటాడు. వీల్‌ఛైర్(దివ్యాంగులు) విభాగంలో బంగారు పతకం సాధించి అంతర్జాతీయ మీట్‌కు ఎంపికయ్యాడు. వచ్చే ఏడాది మార్చిలో అమెరికాలో జరగనున్న టోర్నమెంటుకు హాజరుకానున్నాడు. ఈ సందర్భంగా సోమవారం ఎస్పీ దామోదర్ అభినందించారు. ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. పారా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు కె.దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

పెండలం కిలో రూ.15

సీతంపేట సంతలో విక్రయించేందుకు తీసుకువచ్చిన పెండలం దుంపలు

సీతంపేట మన్యంలో విస్తారంగా పండే పెండలం వారపు సంతలకు, మార్కెట్లకు భారీగా వస్తోంది. సీజన్ ప్రారంభం కావడంతో గిరిజనులు పంటను సేకరించి అమ్మకాలకు తీసుకువస్తున్నారు. కిలో రూ.15 లోపే ధర పలుకుతోందని చెబుతున్నారు. పూర్తిగా సేంద్రియ పద్ధతిలో పండిస్తుండడంతో రుచిగా ఉంటుందని కొనుగోలు చేసేందుకు వ్యాపారులు, ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. ధర ఏ మాత్రం గిట్టుబాటు కాకపోవడంతో గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. – న్యూస్‌టుడే, సీతంపేట

ఉక్కు కర్మాగారానికి భూములివ్వం

విజయనగరంలోని కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న వివిధ గ్రామాల రైతులు, నాయకులు

విజయనగరం ఉడాకాలనీ, న్యూస్‌టుడే: తోటపల్లి జలాలతో ఏటా రెండు పంటల సాగు, పశు పోషణకు ఆధారమైన తమ భూములను ప్రైవేటు ఉక్కు కర్మాగారానికి ఇవ్వమని గుర్ల మండలంలోని దమరసింగి, వల్లాపురం, బెల్లానపేట, మణిపురిపేట, ఎస్ఎస్ఆర్‌పేట, కెల్ల గ్రామస్థులు వాపోయారు. సోమవారం విజయనగరంలోని కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టారు. సమాచారం ఇవ్వకుండానే రెవెన్యూ అధికారులు భూములను పరిశీలించడం, సర్వేలకు పూనుకోవడం దారుణమన్నారు. పచ్చదనంతో నిండిన పల్లెలను పరిశ్రమలకు కేటాయించడం తగదన్నారు. కర్మాగారం వస్తే తమకు తాగు, సాగునీరు అందదని, విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, ఉపాధికి గండి పడుతుందన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించమని స్పష్టం చేశారు. అనంతరం ఇన్‌ఛార్జి డీఆర్వో మురళికి వినతిపత్రం అందజేశారు. ఏపీ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు వెంకటేశ్వర్లు, సూర్యనారాయణ, స్టీల్‌ప్లాంట్ వ్యతిరేక పోరాట కమిటీ గౌరవాధ్యక్షుడు బి.రాంబాబు, కన్వీనర్ మీసాల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పారాది కాజ్‌వేపై రాకపోకల పునరుద్ధరణ

బొబ్బిలి గ్రామీణం, న్యూస్‌టుడే: బొబ్బిలి మండలంలోని పారాది వద్ద వేగావతి నదిపై నిర్మించిన కాజ్‌వే ఇటీవల వర్షాలకు మరమ్మతులకు గురైంది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. స్థానిక ఎమ్మెల్యే బేబినాయన కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో మరమ్మతులకు రూ.15 లక్షలు మంజూరు చేశారు. పనులు పూర్తవడంతో సోమవారం రాకపోకలను పునరుద్ధరించారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
పురపాలక మరియు పట్టణ అభివృద్ధి శాఖ
బొబ్బిలి పట్టణ అభివృద్ధి సంస్థ, బొబ్బిలి
ఈ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీసు
Roc.No.15A/2025/PLG/BUDA
బొబ్బిలి పట్టణ అభివృద్ధి సంస్థ, బొబ్బిలి పరిధి [illegible] 2874.77 చ.కి.మీ [illegible] RFP [illegible] GIS Based Perspective Plan [illegible] e-procurement [illegible] 08/12/2025 [illegible] 08/01/2026 మధ్యాహ్నం 3.00 గంటల వరకు. [illegible]
ఉపాధ్యక్షులు, బొబ్బిలి పట్టణ అభివృద్ధి సంస్థ, బొబ్బిలి.

THE DISTRICT CO-OPERATIVE CENTRAL BANK Ltd., VIZIANAGARAM (HO).
D.No.18-2-9, AG Road, Vizianagaram
CO/L&A-Gold/2025-26 ప్రకటన Dated. 08.12.2025.
[illegible] Website: https://vizianagaramdccb.bank.in, Ph: 95501 65370 & 99897 73059.
స్థలం విజయనగరం, తేదీ: 08.12.2025.
Sd/- సి.హెచ్. ఉమామహేశ్వరరావు, ముఖ్య కార్యనిర్వహణాధికారి

గిరిజనుల సంప్రదాయాలు గొప్పవి

అక్కన్నగూడలో స్థానికులతో మాట్లాడుతున్న గోరటి వెంకన్న

సీతంపేట, న్యూస్‌టుడే: సీతంపేట మండలంలోని అక్కన్నగూడ గిరిజన గ్రామాన్ని తెలంగాణ ఎమ్మెల్సీ, ప్రజా కవి గోరటి వెంకన్న సోమవారం సందర్శించారు. స్థానికులతో మాట్లాడి గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను అడిగి తెలుసుకున్నారు. వారి జీవన విధానం గొప్పదన్నారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించారు. ఆదివాసీల సవర భాషపై పిల్లలకు ఉన్న పట్టును పరిశీలించారు. [illegible] తదితరులు పాల్గొన్నారు.

జనవరి 4న జిల్లాస్థాయి హిందీ ప్రతిభ పరీక్ష

వల్లాపురంలోని జడ్పీహెచ్‌ఎస్‌లో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: హిందీ సేవా సదన్ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ప్రాథమిక స్థాయిలో హిందీ ప్రతిభ పరీక్ష జరిగింది. ఉమ్మడి జిల్లాలో 12 పాఠశాలల్లో నిర్వహించగా సుమారు వెయ్యి మంది విద్యార్థులు హాజరయ్యారు. ఉమ్మడి జిల్లాల నుంచి 3 వేల మంది రాసినట్లు ఉత్తరాంధ్రా కార్యదర్శి కె.శ్రీధర్ తెలిపారు. ప్రతిభ చూపిన వారు జనవరి 4న జిల్లాస్థాయిలో నిర్వహించే పరీక్షకు హాజరు కావాలని సూచించారు.

క్యాలీఫ్లవర్ సాగు.. లాభాలు బాగు

న్యూస్‌టుడే, రామభద్రపురం

సాగుపై రైతులకు సూచనలిస్తున్న ఉద్యానాధికారి మోహన్‌కృష్ణ

సరైన సాగు విధానం అవలంబిస్తూ.. ఉద్యానాధికారుల సూచనలతో సస్యరక్షణ చేపడితే క్యాలీఫ్లవర్ సాగులో సిరులు కురిపిస్తున్నారు రామభద్రపురం మండలంలోని ఆరికతోటకు చెందిన రైతు వల్రి శివుడు. ఈయన 60 సెంట్లలో ఈ సాగు చేపట్టి రూ.లక్ష వరకూ లాభం ఆర్జించారు. సాగు విధానం ఆయన మాటల్లోనే..

ఇదీ సాగు విధానం...: తొలుత రెండు, మూడు సార్లు దుక్కులు వేసుకోవాలి. ఎకరాకు ఆఖరి దుక్కులో వేపపిండి 100 కిలోలు, పశువుల గత్తం 10 టన్నులు వేసుకోవాలి. మొక్కనాటక ముందు భాస్వరం 40 కిలోలు, పొటాష్ 40 కిలోలు వేయాలి. విత్తనశుద్ధి చేసుకోవాలి. విత్తనాలు నారుమడుల్లో పెంచి 30 రోజుల వయసు గల మొక్కలను 45 సెం.మీ. దూరంలో ఉండేలా నాటుకోవాలి. నాటిన తర్వాత 10 రోజులకోసారి నీటితడులివ్వాలి. మడుల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. 60 నుంచి 75 రోజుల మధ్యలో పంట కోతకు వస్తుంది. డ్రిప్ ద్వారా నీరందిస్తే తక్కువ ఖర్చుతో 25 శాతం దిగుబడి పెరుగుంది.

తెగుళ్ల నివారణ..: రెక్కలపురుగు లార్వా ఆశిస్తే ఆకువెనుక భాగాన చేరి పంటలను నాశనం చేస్తుంది. దీని నివారణకు 10 లీటర్ల నీటిలో ఫ్లుబెండయమైడ్ 3 గ్రాముల మందు కలిపి పిచికారీ చేయాలి. పశుపు రంగు చిగురుపోసిన అట్టముక్కలు ఎకరానికి 20 పెట్టుకుంటే రసం పీల్చు పురుగుల తాకిడి తగ్గుతుంది.

వల్రి శివుడు, రైతు

పెట్టుబడి.. లాభం పంటలో దుక్కులకు రూ.4వేలు, పశువుల గత్తం రూ.10వేలు, విత్తనాలు రూ.4వేలు, పురుగు మందులు రూ.6వేలు, ఎరువులకు రూ.5వేలు, కలుపు నివారణకు రూ.5వేలు కూలీల ఖర్చులు రూ.6వేలు మొత్తం రూ.40 వేలు వెచ్చించాను. 350 కేట్ల పంట దిగుబడి వచ్చింది. ఒక కేటు (22 పువ్వులు) రూ.400 వరకు మార్కెట్లో అమ్ముడుపోయింది. ఆ లెక్కన రూ.1,40,000 ఆదాయం రాగా ఖర్చులు పోనూ రూ.లక్ష లాభం వచ్చింది.

రైతేరాజు

జీడిమామిడిలో పూత రక్షణ తప్పనిసరి

జీడిమామిడిలో పూత రక్షణకు చర్యలు తీసుకుంటే దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయని రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డా.అమృతవీణ తెలిపారు. లేత చిగురు, పుష్పగుచ్ఛాలను ఆశించే టీ దోమ, ఆకుముడత, కాయ, గింజ తినే, తామర పురుగులు సాధారణంగా డిసెంబరు నుంచి మార్చి వరకు ఎక్కువగా ఆశిస్తాయి. వీటి నివారణకు ఈ నెలలో అవసరాన్ని బట్టి రెండు నుంచి మూడు దఫాలుగా మందులను పిచికారీ చేసుకోవాలి. కొత్త చిగుర్లు వచ్చేటప్పుడు మొదటి దఫా లీటరు నీటికి మోనోక్రాటోఫాస్ 1.6 మి.లీ. కలిపి చెట్టు కొమ్మలు, కాండంపై వేయాలి. పూత వచ్చిన తర్వాత లీటరు నీటికి లామ్డాసైహలోత్రిన్ 0.6 మి.లీ. కలిపి పిచికారీ చేయాలి. మూడోసారి గింజ బఠాణీ సైజులో ఉన్నప్పుడు ప్రొఫెనోఫాస్ 1.0 మి.లీ. లీటరు నీటికి కలిపి 10 నుండి 25 రోజుల వ్యవధిలో పురుగు ఉధృతిని బట్టి వేయాలి.

– న్యూస్‌టుడే, కురుపాం గ్రామీణం

సరైన సస్యరక్షణతో చీడపీడలు దూరం

కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే

సాగులో సరైన సస్యరక్షణ చర్యలతో తెగుళ్లు నివారించి చీడపీడల నుంచి పంటను కాపాడుకుని అధిక దిగుబడులు సాధించొచ్చని రస్తాకుంటుబాయి కేవీకే శాస్త్రవేత్త డా.ఎస్.స్రవంతి తెలిపారు. రైతుల ప్రశ్నలకు ఆమె సమాధానమిచ్చారు.

డా.ఎస్.స్రవంతి, కేవీకే సస్యపోషణ శాస్త్రవేత్త, రస్తాకుంటుబాయి

ప్రశ్న: మినుములో బూడిద తెగులు ఆశిస్తే ఏం చేయాలి? – టి.రామకృష్ణ, డి.ములగ గ్రామం

సమాధానం: రబీలో ఈ తెగులు వ్యాప్తి ఎక్కువ. నివారణకు లీటరు నీటికి గ్రాము కార్బన్‌డిజం కలిపి పిచికారీ చేయాలి. లేదా లీటరు నీటికి మైక్రో బుటానిల్ ఒక గ్రాము కలిపి పంటకు వేయాలి.

ప్రశ్న: నువ్వులు విత్తుకోవడానికి అనుకూలమైన సమయం ఏది? – జయప్రకాశ్, కొత్తగూడ

సమాధానం: నువ్వులు డిసెంబరు ద్వితీయ పక్షం నుంచి జనవరి రెండో పక్షం మధ్యలో విత్తుకుంటే అధిక దిగుబడి వస్తుంది.

ప్రశ్న: మినుములో పల్లాకు తెగులును తట్టుకునే రకాలేవి? - జి.నాగేశ్వరరావు, పెదమేరంగి

సమాధానం: పల్లాకు తెగులును మినుములోని ఎల్‌బీజీ-884, 904, 129, 104 రకాలు తట్టుకుంటాయి. ఖరీఫ్, రబీల్లో వరి మాగానుల్లో వేసుకోవడానికి అనుకూలమే.

ఫోన్ కొట్టు.. సలహా పొందు

చలికాలంలో పశువులు, మేకలు, గొర్రెలు, కోళ్ల పెంపకంలో చేపట్టాల్సిన సంరక్షణ చర్యలు, ఎలాంటి దాణా వేయాలి, ముందస్తు టీకాలు వంటి సలహాలకు 83328 18498 నంబరును సంప్రదించాలని కురుపాం పశువైద్యురాలు కె.శైలజ తెలిపారు.

తీగజాతి తోటల్లో బంక తెగులు నివారణ

ఈ సీజనులో తీగజాతి కూరగాయల తోటల్లో బంక తెగులు ఆశించి నష్టాన్ని కలగచేస్తాయి. సొరకాయ, పుచ్చ, కీరదోస, గుమ్మడి, బూడిద గుమ్మడి, బీర, కాకర, దొండ, ఇతర రకాల పంటలకు విత్తనం మొలక నుంచి కాయల కోత వరకు అన్ని దశల్లో వ్యాప్తి చెందుతుందని ఉద్యానాధికారిణి సీహెచ్.గిరిజ తెలిపారు. నష్టం, నివారణ ఆమె వివరించారు. అధిక తేమ, చల్లని వాతావరణం పరిస్థితుల్లో ఇది తీవ్రంగా వ్యాపిస్తుంది. ఇది సోకితే కాయలపై నల్ల మచ్చలు ఏర్పడతాయి. వేర్లు తప్ప మిగతా అన్ని భాగాల్లోనూ తెగులు లక్షణాలు కనిపిస్తాయి. ఆకుల అంచులు మొదట లేత నుంచి ముదురు గోధుమ వర్ణంలోకి మారి ఎండిపోతాయి. కొన్ని సందర్భాల్లో బీజ దశలపై నీటితో కూడిన మచ్చలు ఏర్పడి వడలిపోయి మొలకలు చనిపోతాయి. కాండంపైన బంకతో గజ్జి మచ్చలు ఏర్పడి ఎర్రని బంక లాంటి పదార్థం ఏర్పడుతుంది.

ఏం చేయాలి..?

సాగుకు మునుపు రైతులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని నాణ్యమైన నారు ఎంపిక చేసుకోవాలి. ఒకే పొలంలో పదేపదే సాగు చేయడంతో ఎక్కువగా వ్యాప్తి చెందుతుంది. తెగులు సోకినట్లు రైతులు గుర్తించగానే సస్యరక్షణ మందులను పిచికారీ చేయాలి. లీటరు నీటికి మాంకోజెబ్ 2.5 గ్రాములు లేదా క్లోరోథలోనిక్ 1.5 గ్రాములు లేదా మేటిరం జిపైర్లోస్ట్రోబిన్ 3 గ్రాములు చొప్పున కలిపి పిచికారీ చేస్తే బంక తెగులు నివారణ సాధ్యం.

– న్యూస్‌టుడే, కురుపాం గ్రామీణం

EENADU Classifieds

HEALTH & CARE

NEURO

నిర్మల న్యూరో & జనరల్ మెడికల్ సెంటర్
మెదడు, నరములు & వెన్నుముక వ్యాధి నిపుణులు
Dr.Nirmala Vangapandu
M.D.(Gen.Med) DM (Neuro) JIPMER
Specialist in Brain & Nerve Problems & General Physician
R.T.C.కాంప్లెక్స్ ఎదురుగా, INOX మల్టీప్లెక్స్ వెనుక వైపు, VZM
FOR APPOINTMENT : 63054 71147

REAL ESTATE

FLAT FOR SALE

2 BHK 1050, N/F Carparking, Generator, Plot:303, Sri Raga Enclave, Fort City School, Nr. KVR New Layout C:7893476789.

ధర్మపురి 80 అడుగుల రోడ్డుకు అతి దగ్గరలో 1000sft 2BHK E/F Flat అతి తక్కువ ధరలో అమ్మకానికి కలదు. ✆ 7995588192

HOUSE FOR SALE

Semi-Finished Independent House 108 Sqyds (D-Form Patta-15 Years), Construction Done upto 1st Slab. at Enuguraya Colony, Behind 100 Feet Ring Road, Vizianagaram. Price. 28Lakhs. 6281169648

LAND FOR SALE

గుర్ల మెయిన్ రోడ్ (2km) సమీపంలో 2 ఎకరాల భూమి అమ్మకానికి కలదు. విజయనగరం నుండి 12 కిమీ దగ్గరలో. ✆ 8790012309, 9908664019

PLOT FOR SALE

చెల్లూరు హైవే రోడ్డు 167 గ|| 58 ల|| & అయ్యన్నపేట జం|| 167 గ|| 78 ల|| ఇల్లు కట్టించి ఇవ్వబడును. ఈ నెలాఖరు వరకు ఆఫర్. C: 9701519395.

TO LET

To-let 3BHK Indp. House G/F, Carparking, Hajiali Nagar, Nr. Venkateswara Kalyana Mandapam, Phoolbagh Jn., VZM. ✆ 9849559024.

COMMERCIAL

1500 Sq. ft. Commercial second floor Nr.Ambati Satram above Samsung Plaza, Near Sonovision Ph: 7013745282.

JOBS

వైజాగ్ SKLM VZM జిల్లాలలో స్కూల్స్ హాస్పిటల్స్ బ్యాంకులలో ఔట్‌సోర్సింగ్ & కాంట్రాక్ట్ బేస్ ద్వారా పనిచేయుటకు అటెండర్స్, రికార్డ్, జూనియర్ అసిస్టెంట్స్, కంప్యూటర్ ఆపరేటర్స్ బుకింగ్ క్లర్క్స్ బీట్ ఆఫీసర్స్ హెల్ప్‌డెస్క్ గార్డెనర్స్ MNO FNO ల్యాబ్‌టెక్నీషియన్స్ ANM GNM చేసినవారు M/F అర్జెంట్‌గా కావలెను. 10th నుండి బీటెక్ వరకు జీ: 20K to 40K ✆ 8019265353.

అమెరికాలో 1 సం|| బాబు ఆలన, పాలన వ్యక్తిగత సంరక్షణ కొరకు అనుభవంగల ఆడవారు కావలెను. అమెరికా వీసా కల్గినవారు మాత్రమే. ✆ 9440803362

ఉచిత శిక్షణ, భోజనం మరియు వసతి సౌకర్యం & ఉద్యోగావకాశాలు. గాజువాకలో అర్హత: 10 ఆపైన. వయస్సు: 18-30. ✆ 9573366622, 9573366611.

వైజాగ్‌లో ప్రముఖ షాపింగ్ మాల్స్‌లో పనిచేయుటకు 18-35వ యువతి యువకులు కావలెను. జీతం 10000-13500 ఫుడ్‌రూము 9704637370, 9949904532.

పైడిభీమవరం, పరవాడ ఫార్మా కంపెనీలో సూపర్‌వైజర్స్, QC, QA, R&D, మేనేజర్స్, ఫైర్& సేఫ్టీ హెల్పర్స్, సెక్యూరిటీ కావలెను. Olf 10th-డిగ్రీ MBA, B.ఫార్మా, జీ:28K to 38K. 9573635594, 9121044796

ఆర్మీ NAVY ఎయిర్‌ఫోర్స్ రైల్వే, SSC, బ్యాంకులలో ఉద్యోగావకాశాలు. అర్హత:10th-డిగ్రీ. Age:16-25. శిక్షణ 3నెలలు శిక్షణాకాలంలో హాస్టల్, 10th, ఇంటర్, డిగ్రీ డిస్టెన్స్ కోర్సులు కలవు. *ముందుగా ఎటువంటి ఫీజులేదు* క్రిస్టియన్ ఎడ్యుకేషన్ అకాడమీ, వైజాగ్. 9121232326.

FACULTY/ TEACHERS

Required Social, Physics Teachers for 6th to 10th (Experienced & English Spoken skills must) Vizianagaram. C: 8341356488.

SECURITY GUARDS

జైగణేష్ సెక్యూరిటీసంస్థలో విశాఖస్టీల్‌ప్లాంటు ఏరియాలో సెక్యూరిటీగార్డ్స్ 150 మంది 8గం|| డ్యూటీ జీతం 18815/- PF, ESI సెక్యూరిటీ సూపర్‌వైజర్స్ 11మంది (Ex -Service) జీతం: 22690/- సెక్యూరిటీ ఆఫీసర్ (Ex or Rtd పోలీస్ ఆఫీసర్) జీతం:30,000/- యూనిఫామ్-ఫ్రీ. ✆ 63091 17776.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే సంప్రదించండి: 8008597609

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు. ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

అంగన్‌వాడీ కేంద్రాలకు మహర్దశ

– న్యూస్‌టుడే, విజయనగరం అయ్యన్నపేట

- 52 కేంద్రాల్లో మరుగుదొడ్లు
- 144 చోట్ల తాగునీటి సౌకర్యం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అంగన్‌వాడీ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పటికే బాల సంజీవని, పోషణ ట్రాకర్ యాప్‌లను నవీకరించడంతో పాటు.. వంట కష్టాలను తీర్చేందుకు విద్యుత్తు ఆధారిత స్టవ్‌లను అందజేసింది. అంతే కాకుండా మినీలను ప్రధాన కేంద్రాలుగా చేసేందుకు ఇప్పటికే జీవోలను జారీ చేసింది. ప్రస్తుతం ఆ ప్రక్రియ వేగవంతమవుతోంది. తాజాగా మరుగుదొడ్ల నిర్మాణానికి, మంచినీటి సదుపాయం కల్పించేందుకు పూనుకొంది.

జిల్లాలో ఇదీ పరిస్థితి..

కేంద్రాలు	2499
అద్దె భవనాలు	1182
సొంతవి	793
అద్దె ఉచితం	524
గర్భిణులు	7,093
బాలింతలు	6,457
మూడేళ్లలోపు పిల్లలు	41,078
ఆరేళ్లలోపు	17,415

రూ.43.20 లక్షలు విడుదల..

జిల్లాలోని 52 కేంద్రాల్లో శౌచాలయాల నిర్మాణానికి రూ.18.72 లక్షలు, 144 కేంద్రాల్లో మంచినీటి సౌకర్యం కల్పించేందుకు రూ.24.48 లక్షలు కేటాయించారు. ఒక్కో మరుగుదొడ్డికి రూ.36 వేలు, తాగునీటి కల్పనకు రూ.17 వేల చొప్పున వెచ్చించనున్నారు.

తీరనున్న సమస్యలు.. ప్రస్తుతం చాలా చోట్ల మరుగుదొడ్లు లేవు. దీంతో చిన్నారులు, గర్భిణులు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొందరు ఇళ్లకే వెళ్లాల్సిన పరిస్థితి. కేంద్రాల వద్ద అపరిశుభ్రత తాండవిస్తోంది. దుర్గంధం, దోమల విజృంభణతో బాలలకు అవస్థలు తప్పడం లేదు. తాగునీటిని చాలామంది ఇళ్ల నుంచే తీసుకెళ్తున్నారు. ఇక నుంచి ఈ కష్టాలు తప్పనున్నాయి.

త్వరలోనే పనులు..

'ఇటీవల నిధులు మంజూరయ్యాయి. దశల వారీగా అన్ని కేంద్రాల్లో పనులు ప్రారంభిస్తాం. కేంద్రాల నిర్వహణ, సమస్యల పరిష్కారంపై ప్రత్యేకంగా దృష్టిసారించాం. కార్యకర్తలతో ఎప్పటికప్పుడు మాట్లాడుతున్నాం. ఎలాంటి ఇబ్బందులున్నా నేరుగా తెలియజేయొచ్చు' అని **ఐసీడీఎస్ పీడీ విమలారాణి** తెలిపారు.

శోకసంద్రమైన కె.కొత్తవలస

రామకృష్ణ కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న మంత్రి

దత్తిరాజేరు, న్యూస్‌టుడే: తమిళనాడులో జరిగిన కారు ప్రమాదంలో జిల్లాకు చెందిన నలుగురు మరణించగా.. సోమవారం మృతదేహాలను తీసుకొచ్చారు. దత్తిరాజేరు మండలం కె.కొత్తవలస గ్రామానికి చెందిన ఎం.అప్పలనాయుడు, వి.రామకృష్ణ, ఎం.రాము భౌతికకాయాలకు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఒకే గ్రామానికి చెందిన ముగ్గురు మరణించడం బాధాకరమన్నారు. బాధిత కుటుంబాలకు ధైర్యం చెప్పారు. ప్రభుత్వ పరంగా అన్నివిధాలా ఆదుకుంటామన్నారు. మాజీ ఎమ్మెల్సీ రఘువర్మ, ఎంపీపీ అప్పలనాయుడు, తెదేపా మండల కన్వీనరు చప్ప చంద్రశేఖర్, నాయకులు ఈశ్వరరావు, సత్తిబాబు, మోహన్, సత్యారావు తదితరులు పాల్గొన్నారు. * ఇదే ఘటనలో గజపతినగరం మండలం మరుపల్లి వాసి బి.చంద్రరావు దుర్మరణం చెందారు. బాధిత కుటుంబాన్ని మంత్రి పరామర్శించారు. ఏఎంసీ అధ్యక్షుడు పి.వి.వి.గోపాలరాజు, తెదేపా మండలాధ్యక్షురాలు గంట్యాడ శ్రీదేవి తదితరులున్నారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	147	264	274

ట్రాక్టర్ నుంచి జారిపడి విద్యార్థికి తీవ్రగాయాలు

గాయపడిన ఆకాష్

చీపురుపల్లి, న్యూస్‌టుడే: ట్రాక్టర్ పైనుంచి జారిపడి పాలిటెక్నిక్ విద్యార్థి తీవ్రంగా గాయపడిన ఘటన చీపురుపల్లిలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. జామి మండలం అలమండకు చెందిన ఆకాష్ చీపురుపల్లిలోని జీబీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల(ఎలక్ట్రికల్ బ్రాంచి రెండో ఏడాది)లో చదువుతున్నాడు. సాంఘిక సంక్షేమశాఖ కళాశాల వసతి గృహంలో ఉంటున్నాడు. తరగతులు ముగించుకుని, చీపురుపల్లి వైపు వచ్చేందుకు స్నేహితులతో కలిసి ఓ ట్రాక్టర్‌ను ఆపి లిఫ్ట్ అడిగాడు. అయిదుగురు విద్యార్థులు తొట్టెలో ఎక్కారు. ట్రాక్టర్ కదిలేసరికి ఆకాష్ ప్రమాదవశాత్తు జారి తొట్టె, ఇంజిన్ మధ్యలో పడిపోయాడు. నడుము సమీపం నుంచి వెనుక చక్రం వెళ్లిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానిక ప్రాంతీయాసుపత్రిలో చికిత్స అనంతరం వార్డెన్ శ్రీనివాసరావు విజయనగరం ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి విశాఖకు తీసుకెళ్లారు. విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97609
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80081 11237

వేధింపులు భరించలేకే చంపేశాడు

చోదకుడి హత్య కేసులో తండ్రే హంతకుడు

పాలకొండ, గ్రామీణం, న్యూస్‌టుడే: అల్లారు ముద్దుగా పెంచిన కన్న తండ్రే కొడుకును చంపేశాడు. వేధింపులు భరించలేక విచక్షణ కోల్పోయి ఈ ఘాతుకానికి పాల్పడినట్లు పోలీసులకు చెప్పాడు. ఆర్టీసీ ఉద్యోగి అనుమానాస్పద మృతి మిస్టరీ ఎట్టకేలకు వీడింది. ఈ కేసు వివరాలను సీఐ ప్రసాదరావు సోమవారం వెల్లడించారు. పాలకొండ మండలం బుక్కూరుకు చెందిన ఆర్టీసీ చోదకుడు విఠల్‌రావు ఈనెల 2న ఇంట్లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. అతని భార్య కరుణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేయగా.. తండ్రి రామప్పుడు హత్య చేసినట్లు నిర్ధారణ అయింది. మద్యం తాగి తరచూ ఇంట్లో వేధింపులకు గురిచేస్తుండడంతో విసిగిపోయిన ఆయన.. విఠల్‌రావు నిద్రిస్తున్న సమయంలో గొడ్డలితో నరికి చంపేశాడు. గొడ్డలిని స్వాధీనం చేసుకుని, నిందితుడిని అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. విఠల్‌రావుకు ఇప్పటికే నాలుగు వివాహాలు జరిగినట్లు పోలీసులు చెబుతున్నారు. ఎవరితోనూ సరిగా ఉండకపోవడంతో ఇప్పటికే ముగ్గురు భార్యలు దూరమయ్యారని, ఈక్రమంలో కొన్ని నెలల కిందట శ్రీకాకుళం జిల్లాకు చెందిన కరుణను వివాహం చేసుకున్నాడన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యవసాయ కూలీ మృతి

పాలకొండ, గ్రామీణం, న్యూస్‌టుడే: పాలకొండ- వీరఘట్టం ప్రధాన రహదారిలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. బుక్కూరుకు చెందిన పి.రామినాయుడు(50) పనుకువలస నుంచి నడుచుకుంటూ వెళ్తున్న సమయంలో పాలకొండ వైపు వస్తున్న ఓ ద్విచక్ర వాహనం పనుకువలస కూడలిలో బలంగా ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితికి చేరారు. బాధితుడ్ని పాలకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. రామినాయుడు పశువుల కాపరిగా, వ్యవసాయ కూలీగా పనులకు వెళ్లేవారు. గతంలో భార్య చిన్నమ్మడు మృతి చెందింది. కుమార్తె ఉంది. తల్లిదండ్రులను కోల్పోవడంతో బోరున విలపిస్తోంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రయోగమూర్తి తెలిపారు.

ఒత్తిడి వల్లే మా అమ్మ మరణించింది

ఆశా కార్యకర్త మృతిపై కుమార్తె ఆరోపణ

మాట్లాడుతున్న జ్యోత్స్న, నాయకులు

పార్వతీపురం, కలెక్టరేట్ ప్రాంగణం, మక్కువ, న్యూస్‌టుడే: మక్కువ పీహెచ్‌సీ పరిధిలోని డి.శిర్లాంలో ఆశా కార్యకర్తగా పనిచేసిన పొందూరు విద్యావతి అదే పీహెచ్‌సీ వైద్యాధికారిగా గతంలో పనిచేసిన హరికృష్ణ, గ్రామానికి చెందిన తెదేపా నాయకుడు డి.గౌరునాయుడి వేధింపులతోనే గుండెపోటుకు గురై.. మరణించారని ఆమె కుమార్తె జ్యోత్స్న, ఎమ్మార్పీఎస్ నాయకులు ఆరోపించారు. సోమవారం తన తండ్రి శ్రీనివాసరావుతో కలిసి కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్‌ఎస్‌లో వినతిపత్రం అందించారు. విద్యావతి ఆరోగ్యవంతురాలిగా ఉండగానే ఆమెను తొలగించేందుకు కుట్రపూరితంగా వ్యవహరించి, తప్పుడు ఫిర్యాదులు చేశారు. న్యాయం చేయాలని వైద్యాధికారిని కోరగా.. తెదేపా నాయకుడు చెప్తేనే ఉద్యోగంలో చేర్చుకుంటామని చెప్పారన్నారు. ఈ విషయంలో మంత్రి సంధ్యారాణి దగ్గరకు వెళ్లినా ఫలితం లేకపోయిందన్నారు. చివరకు మానసిక ఒత్తిడితో గుండెపోటు వచ్చి సెప్టెంబరు 24న తన తల్లి మృతిచెందిందని కుమార్తె పేర్కొన్నారు. మరణానికి కారణమైన వైద్యుడు, తెదేపా నాయకుడిపై చర్యలు తీసుకోవాలని కోరారు. విషయాన్ని వైద్యాధికారి హరికృష్ణ వద్ద ప్రస్తావించగా.. వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారులకు ఆమెపై కొందరు ఫిర్యాదు చేశారని, దీనిపై విశాఖ ఆర్డీ ఇటీవల విచారణ కూడా చేశారని చెప్పారు. వారి ఆదేశాలు, నిబంధనల ప్రకారమే విధుల నుంచి తొలగించినట్లు పేర్కొన్నారు. అనారోగ్య సమస్యల కారణంగా ఆమె విధులు నిర్వహించలేకపోయేవారని వెల్లడించారు.

'ఆశా కార్యకర్త విద్యావతి ఏడాది కిందట ఒకసారి నా వద్దకు వచ్చి సమస్య చెప్పింది. పక్షవాతంతో మంచం పట్టిన ఆమె రెండేళ్లు విధులు నిర్వహించలేదని గ్రామ ప్రజలు తెలిపారు. ఆమె సమస్యను పరిష్కరించాలని అధికారులకు సూచించాను' మంత్రి సంధ్యారాణి చెప్పారు.

ఇంజినీరింగ్ విద్యార్థుల మేధకు పరీక్ష

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వ విద్యా మంత్రిత్వశాఖ ఇన్నోవేషన్ సెల్, అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) సంయుక్తంగా జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ గ్రాండ్ ఫినాలేకు ఒంగోలు నగరంలోని క్విస్ ఇంజినీరింగ్ కళాశాల వేదికైంది. 12 రాష్ట్రాలకు చెందిన 126 మంది విద్యార్థులు 18 బృందాలుగా పాల్గొన్నారు. హెరిటేజ్ అండ్ కల్చర్, మెడ్‌టెక్, అగ్రిటెక్, స్టూడెంట్స్ ఇన్నోవేషన్ ఆన్ మిస్‌లేనియస్.. అంశాల్లో ప్రోబ్లమ్ సొల్యూషన్స్‌పై సాఫ్ట్‌వేర్ రూపకల్పనపై పోటీలు ఏర్పాటు చేశారు. 36 గంటలు కొనసాగే పోటీలో విజేతలుగా నిలిచిన నలుగురికి రూ.1.50 లక్షలు బహుమతిగా అందజేస్తారు. విజేతలను ఎంటర్‌ప్రెన్యూర్స్‌గా చేసేందుకు మేక్ ఇన్ ఇండియాలో భాగంగా స్టార్టప్ ఫండ్ ఇస్తారు.

బొబ్బిలి

● బొబ్బిలి ● రాజాం ● గజపతినగరం ● చీపురుపల్లి

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

బొబ్బిలి - 80085 74367
గజపతినగరం - 80085 74332
రాజాం - 80085 74308
గరివిడి - 80085 74348

? పెదమజ్జిపాలెం సచివాలయం పరిసరాలు పరిశుభ్రం లేక మొక్కలతో అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. - స్థానికులు ★ చర్యలు తీసుకుంటాం. - విజయ్‌కుమార్, డిప్యూటీ ఎంపీడీవో, గంట్యాడ - గంట్యాడ గ్రామీణం

? కొండగుడెం పంచాయతీ పరిధిలోని మాదనవలసపురంలో సీసీ రోడ్లు, కాలువలు లేక ఇబ్బందులు పడుతున్నాం. - రామకృష్ణా రావు ★ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, సమస్యను పరిష్కరిస్తాం. - రియాజ్, ఏఈ, పంచాయతీరాజ్ - న్యూస్‌టుడే, సంతకవిటి

? కొండపేట వార్డు సచివాలయం పరిధి నవ్యనగర్‌లో రహదారులు, కాలువలు లేవు. తాగునీటి సమస్య వేధిస్తోంది. దోమలు, దుర్వాసన భరించలేకున్నాం. - స్థానికులు ★ ప్రాంతాన్ని సందర్శించి, చర్యలు చేపడతాం. - రామచంద్ర రావు, కమిషనర్ - రాజాం పట్టణం

? ఎనబోలువు గ్రామంలో సీసీరోడ్లు, కాలువలు లేవు. తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నాం. - స్థానికులు ★ నిధులు మంజూరుకు ప్రతిపాదనలు పంపిస్తాం. - రమేష్, ఏఈ - రామభద్రపురం

పైపులైనుకు మరమ్మతులు

స్పందనకు వందనం

చీపురుపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: చీపురుపల్లి మండలం ముగిదిపేట గ్రామంలో తాగునీటి పైపులైను మరమ్మతులకు గురై, సరఫరా ఆగిపోయింది. స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సమస్యను 'ఈనాడు' 'మేమున్నాం.. మీకుతోడుగా' దృష్టికి తీసుకొచ్చారు. విషయం సర్పంచి దన్నాన పద్మావతి వద్ద ప్రస్తావించగా.. సోమవారం మరమ్మతుల పనులు చేపట్టి, సరఫరా పునరుద్ధరించారు.

కూరగాయల ధరలు

రాజాం రైతుబజారులో సోమవారం కూరగాయల ధరలు (కిలో రూ.లలో).. ● టమాటా: 50 ● వంకాయలు: 40 ● దొండ: 30 ● బీర: 60 ● బెండ: 70 ● కాకర: 50 ● చిక్కుడు: 40 ● ఆనపకాయ (ఒకటి): 25 ● అరటి (జత): 20 ● మునగ: 70 ● ఉల్లి: 30 ● బంగాళదుంపలు: 30 ● అల్లం: 80 ● వెల్లుల్లి: 80 ● పచ్చిమిర్చి: 60 ● క్యాబేజీ: 30 - న్యూస్‌టుడే, రాజాం

స్క్రబ్ టైఫస్‌పై అవగాహన కల్పించాలి

సంతకవిటి, రామభద్రపురం: స్క్రబ్ టైఫస్ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో సురేష్ కుమార్ తెలిపారు. వైద్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఎక్కడైనా లక్షణాలు బయటపడితే ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. ● రామభద్రపురం: నాయుడువలసలో విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు జేసీ రాజు పాల్గొన్నారు.

అడ్రస్ లేదా.. అసలే లేరా?

న్యూస్‌టుడే - రేగిడి, చీపురుపల్లి

ప్రభుత్వం ఇటీవల పాత రేషన్‌కార్డుల స్థానంలో కొత్తగా స్మార్ట్ కార్డులు అందజేసింది. అందరికీ అందజేయాలని ఆదేశించింది. కానీ పంపిణీ గడువు ముగిసినా కొంతమంది లబ్ధిదారుల ఆచూకీ లేదు. వారి పేరున వచ్చిన కార్డులు అలానే ఉన్నాయి. దీంతో పంపిణీ కానివాటిలో బోగస్ కార్డులు ఏమైనా ఉన్నాయా? కొంతమంది డీలర్లు ఇన్నాళ్లూ సరకులను పక్కదారి పట్టించారా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

ఇదీ పరిస్థితి..

ప్రభుత్వం ఈ ఏడాది ఆగస్టు 15 నుంచి కొత్తరేషన్ కార్డులతో పాటు పాతవాటిని స్మార్ట్‌కార్డుల రూపంలో పంపిణీ చేసింది. గడువు ముగిసినా ఇప్పటికీ రాజాం నియోజకవర్గంలోని రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాల్లో 4,875 కార్డులు డీలర్లు, సచివాలయ ఉద్యోగుల వద్దే ఉండిపోయాయి. వీరు ఎక్కడున్నారు.. ఎప్పుడు కార్డులు తీసుకుంటారో తెలియని పరిస్థితి.

వచ్చినప్పుడు ఇవ్వాలి..

స్మార్ట్ రేషన్ కార్డు మంజూరై పంపిణీ జరగకపోతే.. ఆ వివరాలు రాష్ట్ర పౌరసరఫరాల శాఖకు పంపాల్సి ఉంటుంది. ప్రతి కార్డుకు సంబంధించి ఎందుకు పంపిణీ కాలేదో వివరాలు తెలియజేయాలి. ఇలాంటి కార్డులు తహసీల్దార్ కార్యాలయంలో భద్రపర్చేలా చర్యలు తీసుకుని కార్డుదారులు వచ్చిన సమయంలో అందజేయాల్సి ఉంటుంది.

పరిశీలిస్తున్నాం.. స్మార్ట్ కార్డులు 90 శాతం పైగా పంపిణీ జరిగింది. మిగిలినవి డీలర్లు, వీఆర్వోల వద్దే ఉన్నాయి. వలస వెళ్లినవారు కొందరైతే ఇతర జిల్లాలకు చెందినవి కొన్ని వచ్చాయి. ఇవన్నీ పరిశీలిస్తున్నామని సీఎస్‌డీటీలు ఈశ్వరరావు, అనంతకుమార్ తెలిపారు. మిగిలిపోయిన కార్డులను కలెక్టరేట్‌కు అప్పగిస్తామని చీపురుపల్లి తహసీల్దార్ డి. ధర్మరాజు తెలిపారు.

పూర్తి స్థాయిలో పంపిణీ కాని స్మార్ట్ రేషన్ కార్డులు

రాజాం, చీపురుపల్లి నియోజకవర్గాల్లో ఇలా..

మండలం	మొత్తం కార్డులు	పంపిణీ కానివి
రేగిడి	21,288	1154
వంగర	12,533	1473
రాజాం	27,734	1242
సంతకవిటి	19,044	1026
చీపురుపల్లి	17,891	901
మెరకముడిదాం	17,455	714
గరివిడి	20,721	1076
గుర్ల	20,433	700

సీఎం సహాయనిధితో పేదలకు భరోసా

రాజాం, న్యూస్‌టుడే: పేద, మధ్యతరగతి వర్గాలకు ఆపత్కాలంలో సీఎం సహాయనిధి అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో రాజాం, రేగిడి, సంతకవిటి, రాజాం పట్టణాలకు చెందిన 16 మందికి రూ.7.23 లక్షల విలువైన సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. వ్యాధులు, ప్రమాదాల బారిన పడి ఆసుపత్రుల్లో చికిత్స పొంది ఎన్టీఆర్ వైద్యసేవ వర్తించనివారికి సహాయనిధితో ప్రభుత్వం ఆదుకుంటోందని చెప్పారు. నాయకులు గురవాన నారాయణరావు, పట్టణాధ్యక్షుడు నంది సూర్యప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే కోండ్రు

ఆర్ఎస్‌కేల్లో యూరియా పంపిణీ

చీపురుపల్లి, గ్రామీణం, న్యూస్‌టుడే: చీపురుపల్లి మండలంలో రబీ సీజన్‌కు సంబంధించి మొక్కజొన్న సాగుచేసే రైతులకు యూరియా పంపిణీ చేసినట్లు వ్యవసాయాధికారిణి సూర్యకళ తెలిపారు. సోమవారం జి.అగ్రహారం, నిమ్మలవలస, కర్లాం, జి.ములగాం, జుకర్లపల్లి, పేరిపి, పెదనడిపల్లి రైతుసేవా కేంద్రాల్లో 25 మెట్రిక్ టన్నుల చొప్పున పంపిణీ చేశామన్నారు. ఎస్సై ఎల్. దామోదరరావు ఆధ్వర్యంలో ముందు బృందాలను బందోబస్తుకు పెట్టారన్నారు.

కర్లాం ఆర్ఎస్‌కే వద్ద వరుసలో రైతులు

తాగునీరు తాగలేరు

చీపురుపల్లి పట్టణంలోని రామాంజనేయ కాలనీలో ఇంటింటి కుళాయిల ద్వారా సోమవారం రంగు మారిన నీరు రావడంతో గ్రామస్థులు ఆందోళనకు గురయ్యారు. తాగునీరు ఇలా వస్తే ఎలాగని, తాగితే రోగాల బారిన పడతామని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలో నిర్వహణ ఇలా ఉంటే ఎలాగని ప్రశ్నించారు. ట్యాంకు శుభ్రం చేసినప్పుడు కొంత నీరు పైపులైనులోకి వెళ్లిపోవడం వల్ల ఇలా జరిగిందని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రామకృష్ణ అన్నారు. - న్యూస్‌టుడే, చీపురుపల్లి

వసతుల కరవు.. సమస్యల నెలవు

రాజాం పట్టణం పొనుగుటివలసలో రాజాం- సంతకవిటి ప్రధాన రహదారి దగ్గర ఉన్న పాత గ్రామ పంచాయతీ కార్యాలయంలో వార్డు సచివాలయం నిర్వహిస్తున్నారు. కనీస వసతులు లేక సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. మరుగుదొడ్లు పనిచేయట్లేదు. జీవిత వసతులు లేక సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. వర్షం వస్తే రోడ్డు బురదమయంగా మారుతోంది. మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతున్నారు. విషయాన్ని కమిషనర్ రామచంద్రరావు వద్ద ప్రస్తావించగా.. పరిశీలించి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. - న్యూస్‌టుడే, రాజాం పట్టణం

శిథిల భవనంతో చింత

గంట్యాడ మండలం పెదమజ్జిపాలెం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం శిథిలావస్థకు చేరింది. సొంత భవనం లేక, సమీపంలోని పాతకాల భవనాన్ని కేటాయించారు. అది శిథిలావస్థకు చేరి పైన స్లాబ్ పెచ్చులు ఊడి పడుతోంది. ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని చిన్నారుల తల్లిదండ్రులు, సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. తలుపులు, కిటికీలకు చెదలు పట్టి పూర్తిగా పాడయ్యాయి. విషయం గంట్యాడ ఐసీడీఎస్ సీడీపీవో ఉమాభారతి వద్ద ప్రస్తావించగా.. పరిశీలించి చర్యలు చేపడతామన్నారు. - న్యూస్‌టుడే, గంట్యాడ గ్రామీణం (పెద్దమజ్జిపాలెం)

కూలకముందే పట్టించుకోండి

రాజాం మండలం సోపేరు గ్రామంలో రక్షిత మంచినీటి పథకం నీటి ట్యాంకు శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. దీని పైభాగం పెచ్చులూడిపోతోంది. ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు. ప్రస్తుతం బోరు ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. కొత్త ట్యాంకు నిర్మాణంతో పాటు పాత ట్యాంకును కూలగొట్టాలని కోరుతున్నారు. విషయాన్ని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ జగన్మోహన్ వద్ద ప్రస్తావించగా.. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. - న్యూస్‌టుడే, రాజాం గ్రామీణం

ప్రయాణం.. ప్రమాదం

బొబ్బిలి మండలం చిత్రకోట బొడ్డవలస వద్ద వెంగళరాయసాగర్ ప్రధాన కాలువపై నిర్మించిన కల్వర్టు శిథిలావస్థకు చేరింది. గోడలు పగిలి, కింద భాగాన ఇనుప ఊచలు తుప్పుపట్టి భయంకరంగా ఉంది. దీని మీదుగా వెలగవలస, సీహెచ్‌బొడ్డవలస గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఎప్పుడు కూలుతుందోనని వాహనచోదకులు భయాందోళనకు గురవుతున్నారు. సమస్యను ఏఈ సుధీర్ వద్ద ప్రస్తావించగా.. ప్రతిపాదనలు పంపామన్నారు. - న్యూస్‌టుడే, బొబ్బిలి గ్రామీణం

శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

రేగిడి, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవోలు అన్నారు. సోమవారం రేగిడి ఉన్నత పాఠశాలలో పాఠశాల సముదాయాల ఛైర్మన్లు, జడ్పీ, ప్రాథమికోన్నత పాఠశాలల హెచ్‌ఎంలకు శిక్షణ నిర్వహించారు. పిల్లల్లో సృజనాత్మకత పెంచేందుకు శిక్షణ ఉపయోగపడుతుందని ఎంఈవో ప్రసాదరావు చెప్పారు. ● మెరకముడిదాం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రెండు రోజుల పాటు జరగనున్న టీచ్ టూల్ శిక్షణ తరగతులను ఎంఈవో చంద్రశేఖర్ ప్రారంభించారు. ● తెర్లాం: తెర్లాం ఉన్నత పాఠశాలలో టీచ్ టూల్ శిక్షణ ఎంఈవో జె.త్రినాథరావు ప్రారంభించారు.

నాగవంశీయుల సంక్షేమానికి కృషి

వంగర, న్యూస్‌టుడే: నాగవంశీయుల సంక్షేమానికి కృషి చేస్తామని ఆ సంఘం అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ ఎరుబోతు రమణారావు అన్నారు. సోమవారం వంగర మండలం అరసాడలో పర్యటించారు. స్థానికంగా ఉన్న నాగవంశీయులతో సమావేశమై మాట్లాడారు. ఆర్థికంగా వెనుకబడిన వారికి బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. బాధ్యతలు స్వీకరించిన తర్వాత ప్రతి జిల్లాలోని నాగవంశీయులను కలుస్తున్నానని, అందులో భాగంగానే వంగర వచ్చానన్నారు. అనంతరం సభ్యులు ఆయనను ఘనంగా సత్కరించారు. కార్పొరేషన్ డైరెక్టర్లు ఎం.ఆదిబాబు, విజయలక్ష్మి పాల్గొన్నారు.

రమణారావును సత్కరిస్తున్న సంఘ సభ్యులు

ఏకగ్రీవంగా ఎన్జీజీవో యూనిట్ ఎన్నిక

చీపురుపల్లి, న్యూస్‌టుడే: ఏపీఎన్జీజీవో చీపురుపల్లి తాలూకా యూనిట్ ఎన్నిక సోమవారం ఏకగ్రీవమైంది. అధ్యక్షుడిగా లెంక అప్పలనాయుడు, సహాయ అధ్యక్షురాలిగా కె.జగదీశ్వరి, ఉపాధ్యక్షులుగా టీవీకే లక్ష్మణరావు, పి.రవికుమార్, కేవీఎస్ఎస్ కిశోర్, ఎల్.వేణుగోపాలరావు, మహిళా ఉపాధ్యక్షురాలిగా వై.ఝాన్సీరాణి, కార్యదర్శిగా ఎం.అప్పలస్వామి, కార్యనిర్వాహక కార్యదర్శిగా జె.మురళీకృష్ణ, కోశాధికారిగా ఎస్.రామారావు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా కె.దుర్గారావు, ఆర్.స్వప్న వ్యవహరించారు. జిల్లా అధ్యక్షుడు టి.శ్రీధర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాణం చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

పీఏసీఎస్ ఉద్యోగుల నిరసన

గుర్లలో నిరసన తెలుపుతున్న పీఏసీఎస్ ఉద్యోగులు

గుర్ల, న్యూస్‌టుడే: తెట్టంగి, జమ్ముపేట, కెల్ల, గూడేం పీఏసీఎస్‌ల్లో పనిచేస్తున్న ఉద్యోగులు మండలంలోని గుర్ల డీసీసీబీ బ్రాంచి కార్యాలయం ఎదుట సోమవారం నిరసన చేపట్టారు. పెండింగ్‌లో ఉన్న వేతన సవరణ, మధ్యంతర భృతి, గ్రాట్యుటీ వంటి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జీవో 36ను అమలు చేయాలన్నారు. డీసీసీబీ బ్రాంచి మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి బి.రామునాయుడు తదితరులు పాల్గొన్నారు. ★ రామభద్రపురం: డీసీసీబీ కార్యాలయం ఎదుట పీఏసీఎస్ సీఈవోలు చింతల వాసుదేవరావు, కోట భాస్కరరావు, మజ్జి రమేష్‌నాయుడు తదితరులు నిరసన చేపట్టారు. బ్రాంచి మేనేజర్ గంటా చంద్రమోహన్‌కు వినతిపత్రం అందించారు. ★ బొబ్బిలి: బొబ్బిలిలో చింతాడ, కలువరాయి, రంగరాయపురం సొసైటీలకు చెందిన ఉద్యోగులు నినాదాలు చేశారు. తమ్మినాయుడు, అప్పలనాయుడు, శంకరరావు తదితరులు పాల్గొన్నారు. ★ చీపురుపల్లి గ్రామీణం: చీపురుపల్లిలోని కార్యాలయం వద్ద నినాదాలు చేశారు. ★ గజపతినగరం: అఖిల భారత సహకార బ్యాంకుల ఉద్యోగుల ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి కె.వి.ఎస్.రవికుమార్ గజపతినగరంలో ధర్నాలో పాల్గొని మద్దతు ప్రకటించారు. అఖిల భారత డీసీసీబీ ఉద్యోగుల సంఘ కార్యదర్శి ఒంగోలుకు చెందిన కె.వి.లోక్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు. ★ గంట్యాడ: గంట్యాడలో పీఏసీఎస్ సీఈవోలు ధర్నా చేశారు. సర్వదేముడు, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికంగా బలోపేతమవ్వాలి

వంగర: మహిళలు ఆర్థికంగా బలోపేతమవ్వాలని ఏపీఎం మంగమ్మ అన్నారు. సోమవారం వంగర వెలుగు కార్యాలయంలో మహిళా సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించారు. సంఘాల రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని చెప్పారు.

నైపుణ్యాలు అవసరం

రాజాం: ఇంజినీరింగ్ విద్యార్థులు నైపుణ్యాలను సాధించాలని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్ (సీఐటీడీ) శిక్షణాధికారి పి.చంద్రశేఖర్‌రావు అన్నారు. జీఎంఆర్ఐటీలో వారం రోజులపాటు నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ప్రిన్సిపల్ సీఎల్‌వీ ఆర్ఎస్‌వీ ప్రసాద్, సమన్వయకర్త సురేష్‌కుమార్, శిక్షకుడు డి.మోహన్‌కుమార్ పాల్గొన్నారు.

సహిత విద్య అమలు తీరు పరిశీలన

రామభద్రపురం: దివ్యాంగులకు అందించే సహిత విద్య అమలు తీరును పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల రీసెర్చ్ పర్యవేక్షకుడు కొల్లి ఈశ్వరరావు రామభద్రపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం పరిశీలించారు. అందుతున్న విద్య, సదుపాయాలు, తదితర అంశాలపై వివరాలు సేకరించారు.

వేతనాలు చెల్లించాలని వినతి

మెంటాడ: తమకు రావాల్సిన పెండింగ్ వేతనాలు చెల్లించాలని సోమవారం హరిత రాయబారులు ఎంపీడీవో పి.సుదర్శన్‌కు వినతిపత్రం అందజేశారు. హెల్త్ అలవెన్స్ కింద రూ.4 వేలు చెల్లించాలని, ఇతర సదుపాయాలు కల్పించాలని కోరారు. కౌలు రైతుల సంఘ జిల్లా కార్యదర్శి రాములు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అధ్యక్షుడిగా ఎన్నిక

రామభద్రపురం: సమగ్ర శిక్షా ఆర్ట్, క్రాఫ్ట్, వ్యాయామ ఉపాధ్యాయుల యూనిట్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా కాళ్ల సురేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విజయవాడలో ఆదివారం జరిగిన రాష్ట్రస్థాయి సదస్సులో ఏపీజేఏసీ ఛైర్మన్ బొప్పరాజు ఆధ్వర్యంలో ఎన్నిక జరిగిందన్నారు. సోమవారం రామభద్రపురంలో విలేకరులతో మాట్లాడారు.

కాలువల్లోని డెబ్రిస్ తొలగించండి

బొబ్బిలి: కాలువల్లోని డెబ్రిస్ తొలగించి, మురుగునీరు పారేలా చర్యలు తీసుకోవాలని పురపాలక కమిషనర్ ఎల్.రామలక్ష్మి అన్నారు. సోమవారం బొబ్బిలి పట్టణంలోని రైల్వేస్టేషన్, ఆర్టీసీ కాంప్లెక్స్ కూడళ్లు, సాయినగర్, జూట్ మిల్లు ప్రాంతాల్లో పర్యటించారు. రహదారికి ఇరువైపులా కాలువల్లో పలకలు వేసి ఉండడంతో మురుగునీరు పారడంలేదని, చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు.

కుష్ఠువ్యాధి గుర్తింపునకు సర్వే

మెంటాడ: జయతి గ్రామంలో ఇంటింట కుష్ఠు వ్యాధి గుర్తింపు సర్వే చేపట్టారు. చల్లపేట పీహెచ్‌సీ వైద్యాధికారిణి ఉషారాణి ఆధ్వర్యంలో ఆరు బృందాలుగా ఏర్పడి, 602 ఇళ్లలోని ప్రతి ఒక్కరినీ పరీక్షించారు. పది అనుమానిత కేసులను గుర్తించినట్లు వైద్యారోగ్య శాఖ సిబ్బంది తెలిపారు. డీపీఎంవో దుర్గాప్రసాద్, ఎంపీహెచ్ జి.ఉదయ్‌కుమార్, లెప్రా సంస్థ సమన్వయకర్త రమణ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు అవగాహన

బాడంగి: స్టేట్‌బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ డైరెక్టరు డి.భాస్కరరావు ఆధ్వర్యంలో వాడాడ గ్రామంలో మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 18 నుంచి 45 ఏళ్ల వయసున్న మహిళలకు అగరబత్తుల తయారీ, పుట్టగొడుగుల పెంపకం, జ్యూట్ బ్యాగుల తయారీపై ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. యువకులకు ఈనెల 10 నుంచి హౌస్ వైరింగ్ శిక్షణ ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. యువకులు ఆధార్, రేషన్ కార్డులతో రావాలన్నారు. శిక్షకుడు హర్ష పాల్గొన్నారు.

గోడు పట్టదు.. గొంతు తడవదు

పట్టణంలో రక్షిత నీటికి ఇక్కట్లు

గొల్లపల్లిలో కుళాయిల వద్ద పరిస్థితి

న్యూస్‌టుడే- బొబ్బిలి

బొబ్బిలి పట్టణంలో తాగునీటి సమస్యలు రోజురోజుకూ తీవ్రంగా పెరుగుతున్నాయి. భోజరాజపురం పంప్‌హౌస్ పథకం జీర్ణావస్థకు చేరింది. ఆపై వేగావతి నదిలోని ఇన్‌ఫిల్టరేషన్ బావులు సక్రమంగా పనిచేయడంలేదు. ప్రధాన పైపులైన్లు మరమ్మతులకు గురవడంతో నీరు లీకుల రూపంలో పోతోంది. ఏడాదికి రూ.10 నుంచి రూ.12 లక్షల మేర నిర్వహణకు వెచ్చిస్తున్నా ప్రజలకు అవస్థలు తప్పడంలేదు. రెండు రోజులకొకసారి నీరు ఇస్తున్నారు.

★ పట్టణం: బొబ్బిలి ★ జనాభా: 67 వేలు ★ వార్డులు: 31 ★ కుళాయిలు: 3,115 ★ అవసరమైన తాగునీరు: 10 ఎంఎల్‌డీ ★ ప్రస్తుతం ఇస్తున్నది: 3.8 ఎంఎల్‌డీ

ఈ ప్రాంతాల్లో సమస్య..

పట్టణంలోని ఐటీఐ, బోస్ నగర్, మిలట్రీ కాలనీలు, అప్పయ్యపేట, రాజమహల్ ఎరుకుల పాకలు, ప్రసాద్‌నగర్, చేనేతకాలనీ, పాతబొబ్బిలి, మల్లంపేటలో కుళాయిల నుంచి నీరు రావడంలేదు. ఇంది రమ్మకాలనీ రాజ్‌మహల్ వంటి ప్రాంతాలకు కుళాయిలు లేవు. శివారు ప్రాంతాలు ఎరుకులవీధి, యాతవీధి, గొల్లపల్లికి పూర్తిస్థాయిలో అందకపోవడంతో దూర ప్రాంతాల నుంచి తెచ్చుకుంటున్నారు.

లోపాలను సవరించాలి..

★ ప్రధాన పైపులు, సబ్ లైన్లలో ఉన్న లీకులను వెంటనే అరికట్టాలి ★ భోజరాజపురం హెడ్ వాటర్ వర్క్ వద్ద నదిలో నాలుగు బావుల్లో ఒకటి పనిచేయడం లేదు. దీనిని సరిచేయాలి ★ అదనంగా బోర్లు తీయాలి. ★ కుళాయిలకు మూతలు లేవు. నీరు వృథాగా పోతోంది. ★ నదిలో ఇన్‌ఫిల్టరేషన్ బావుల వద్ద ఇసుక తవ్వకాలు కట్టడి చేయాలి.

చర్యలు తీసుకుంటాం..

పైపులైన్ల లీకులను సరిచేసి, నీటి వృథాను అరికడుతున్నాం. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో మరమ్మతులు చేశాం. మరికొన్ని గుర్తించి, లీకులు కట్టడి చేసే ప్రయత్నం చేస్తున్నాం. మరమ్మతులకు మరో రూ.5 లక్షలు కేటాయించాం. వాటితో పనులు చేపడతాం. తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటాం. - రామలక్ష్మి, పుర కమిషనర్, బొబ్బిలి

సమస్యల పరిష్కారానికి పోరాటం

తెర్లాం, న్యూస్‌టుడే: ఏపీఎన్జీజీవోలోని సభ్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నూతన కార్యవర్గ సభ్యులు అన్నారు. సోమవారం తెర్లాం తాలూకా యూనిట్ ఎన్నిక ఏకగ్రీవమైంది. అధ్యక్షుడిగా నర్సుపల్లి నాగేశ్వరరావు, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా పి.వినయ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా సీహెచ్ జోగినాయుడు, ఎం.మహేశ్, ఎస్.దాసు, కార్యదర్శిగా కె.ప్రసాద్, పి.సత్యనారాయణ, వి.రామ్‌గోపాల్, సి.నిర్మలాదేవి, కోశాధికారిగా టి.అరుణ్‌సూర్య, జిల్లా కార్యవర్గ సభ్యులుగా మరికొంతమంది ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా జి.సూర్యనారాయణ వ్యవహరించారు.

ఎన్నికైన సంఘ సభ్యులు

విద్యార్థుల అవగాహన ర్యాలీ

చీపురుపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: చీపురుపల్లి మండలం రావివలస గ్రామంలో సత్యరామ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు సోమవారం ఎన్ఎస్ఎస్ శిబిరం ప్రారంభించారు. స్వచ్ఛాంధ్ర, పరిశుభ్రత తదితర అంశాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పలు అంశాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. పరిసరాల పరిశుభ్రత గురించి వివరించారు. ఎన్ఎస్ఎస్ పీవో ముకుంద, కళాశాల ప్రధానాచార్యుడు జగదీష్, సర్పంచి జానకీ రామమణికంత, విద్యార్థులు పాల్గొన్నారు.

ర్యాలీలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు

రైతులను ఇబ్బందిపెడితే చర్యలు

బొబ్బిలి గ్రామీణం, న్యూస్‌టుడే: ధాన్యం విక్రయాలకు తీసుకొచ్చే రైతులను ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. సోమవారం బొబ్బిలి మండలం పిరిడి, కింతలవానిపేట, శివడవలస, జగన్నాథపురం తదితర గ్రామాల్లోని మిల్లులను తహసీల్దారు శ్రీను, ఏడీఏ మధుసూదనరావు తదితరులు తనిఖీ చేశారు. సంపత్ స్వర్ణ రకం ముక్కలవుతోందని మిల్లర్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జేసీ సేధుమాధవన్ ఆదేశాలతో పరిశీలించారు. విజయనగరం నుంచి వచ్చిన ఐదుగురు టెక్నికల్ సహాయకులు టెస్ట్ మిల్లింగ్ చేశారు. రైతులతో మాట్లాడారు. అదనంగా ఒక్క కిలో కూడా ఇవ్వొద్దని చెప్పారు. ★ తెర్లాం: రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోలు చేయాలని తహసీల్దారు జి.హేమంత్ కుమార్ రైస్ మిల్లుల యజమానులకు సూచించారు. సోమవారం పెరుమాళి సమీపంలోని మిల్లును తనిఖీ చేశారు. ధాన్యం అన్‌లోడ్ చేసిన వెంటనే రసీదు ఇవ్వాలని తెలిపారు. తేమశాతం పేరుతో అదనంగా ఒక కిలో ధాన్యం కూడా తీసుకోవడానికి వీల్లేదన్నారు. ఉప తహసీల్దారు జి.సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆటోను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

రాజాం, న్యూస్‌టుడే: రాజాం పట్టణంలోని పాలకొండ రహదారిలో పెను ప్రమాదం తప్పింది. సోమవారం రాజాం నుంచి పాలకొండ వెళ్తున్న ఆర్టీసీ బస్సుకు ఆటో ఒక్కసారిగా ఎదురుగా వచ్చింది. దీంతో బస్సు ఢీకొట్టడంతో ఆటో ఒకవైపు పైకి లేచింది. స్థానికులు ఆటోను కిందకి దింపారు. ఆ సమయంలో చోదకుడు మాత్రమే ఉన్నారు. ఎలాంటి గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. బస్సు, ఆటో స్వల్పంగా దెబ్బతిన్నాయి. దీనిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

బదిలీ సిబ్బందికి సత్కారం

గంట్యాడ, న్యూస్‌టుడే: గంట్యాడ మండలం నుంచి సోమవారం ముగ్గురు పంచాయతీ కార్యదర్శులు బదిలీ అయ్యారు. కొర్లాం సెక్రెటరీ పీవీఎన్ వర్మ ఉద్యోగోన్నతిపై గొట్లాం కార్యదర్శిగా, రేగుబిల్లి కార్యదర్శి లక్ష్మీకాంతం గరివిడి మండలానికి, గంట్యాడ కార్యదర్శి కిరణ్ కొర్లాం కార్యదర్శిగా బదిలీ అయ్యారు. సోమవారం పంచాయతీ కార్యదర్శుల మండల కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. డిప్యూటీ ఎంపీడీవో అనురాధ తదితరులు పాల్గొన్నారు.

అంతర్ విశ్వవిద్యాలయాల పోటీలకు ఎంపిక

రాజాం, న్యూస్‌టుడే: అంతర్ విశ్వవిద్యాలయాల వాలీబాల్ పోటీలకు రాజాం జీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఎల్.కూర్మినాయుడు, డి.భవానీప్రసాద్, హర్షకుమార్ ఎంపికైనట్లు పీడీ బీహెచ్ అరుణ్‌కుమార్ సోమవారం తెలిపారు. ఈనెల 10 నుంచి 14 వరకు కాకినాడ జేఎన్‌టీయూలో పోటీలు జరగనున్నాయన్నారు. ఎంపికలు ఇటీవల ఎంబీజీఆర్ కళాశాలలో జరిగాయని పేర్కొన్నారు.

కూర్మినాయుడు భవానీప్రసాద్ హర్షకుమార్

నూనె గింజల సాగును అభివృద్ధి చేయాలి

బొండపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని ప్రతి గ్రామంలో నూనె గింజల సాగును అభివృద్ధి చేయాలని మండల వ్యవసాయాధికారి జి.మల్లికార్జునరావు కోరారు. సోమవారం మండల వెలుగు కార్యాలయంలో జాతీయ వంట నూనెల మిషన్ నూనె గింజలు అభివృద్ధి పథకంలో భాగంగా మహిళా రైతులకు, గ్రామైక్య సంఘాల ప్రతినిధులకు అవగాహన కల్పించారు. సంతోష్, బిందు, ఏపీఎం పెంటంనాయుడు, మహిళా సంఘాలు సభ్యులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మల్లికార్జునరావు

RAJAH RSRK RANGARAO COLLEGE
COLLEGE ROAD, BOBBILI – 535558, Vizianagaram Dist
EMAIL: rsrkmails@gmail.com
ADMISSION INTO SPOT AND CAT-B-SEATS FOR APPGCET - 2025
College PGCET Code AURR
Interested and eligible candidates may apply for admission under SPOT & Category B Seats into the following PG Programmes - M.Sc - Organic Chemistry & M.Sc - Analytical Chemistry. These seats will be filled as per the guidelines of the Competent authority.
Candidates who qualified in APPGCET - 2025, without APPGCET - 2025 are eligible for admission. The Eligible candidates may attend at the Principal's office along with all ORIGINAL certificates and fee on or before 10-12-2025.
For Further details Contact: 8500038444, 9440838862
PRINCIPAL CORRESPONDENT

(c) eenadu

ధాన్యం తరలింపులో ఇబ్బందులా?

రైతులారా... ధాన్యం తరలింపులో ఇబ్బందులున్నాయా..? మిల్లర్లు అదనపు కిలోలు డిమాండు చేస్తున్నారా..? పంట అమ్మినా నగదు జమ కాలేదా..? పీఎం కిసాన్, అన్నదాతా సుఖీభవ పథకాల నిధులు రాలేదా..? వ్యవసాయ యంత్రాల కొనుగోలు విషయంలో ఇక్కట్లు పడుతున్నారా..? ఇలాంటి సమస్యలను నేరుగా వ్యవసాయాధికారులు ఎ.నాగభూషణరావు, ఎ.శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లే అవకాశాన్ని 'ఈనాడు' కల్పిస్తోంది. మీరు చేయాల్సిందల్లా ఒక్క ఫోన్ కాల్ మాత్రమే.

నిర్వహణ తేదీ: 10.12.2025 (బుధవారం) సమయం: ఉదయం 11 నుంచి 12 వరకు - న్యూస్‌టుడే, **సంప్రదించాల్సిన నంబర్లు: 83310 56259, 83310 56287** విజయనగరం గ్రామీణం

విజయనగరం

•విజయనగరం •నెల్లిమర్ల • ఎస్.కోట

లోక్ అదాలత్ విజయవంతం చేయండి

మాట్లాడుతున్న మెజిస్ట్రేట్ కనకలక్ష్మి

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: ఈనెల 13న జరగనున్న జాతీయ లోక్‌అదాలత్‌లో ఎక్కువగా రాజీ పరిష్కారం చేసేలా న్యాయవాదులు సహకరించి, విజయవంతం చేయాలని ఎస్.కోట జూనియర్ సివిల్ జడ్జి బి.కనకలక్ష్మి అన్నారు. సోమవారం కోర్టులో న్యాయవాదులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. లోక్‌అదాలత్‌కు ఎక్కువ వ్యాజ్యాలను పంపించాలన్నారు. సివిల్ కేసుల్లో రాజీ అయితే కోర్టు ఫీజు తిరిగిస్తారని చెప్పారు. సమావేశంలో న్యాయవాదులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

విజయనగరం పట్టణం: 80089 02900
విజయనగరం గ్రామీణం: 80085 74317
ఎస్.కోట: 80085 74326
భోగాపురం: 70959 54646

?: శివాజీనగర్‌లో కాలువల్లో పూడిక, అపరిశుభ్రత ఎక్కువైంది. - **జి.కె.ఎస్.కుమార్, కొత్తవలస**
● పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి పరిస్థితిని మెరుగుపరుస్తాం. - **ప్రసాద్, శానిటరీ మేస్త్రి, కొత్తవలస** - న్యూస్‌టుడే, కొత్తవలస

?: బాలాజీనగర్ వేంకటేశ్వర ఆలయం సమీపంలో కాలువపై పలకలు వేయాలి. - **సాయికలు** ● పరిశీలించి, ఏర్పాటు చేస్తాం. - **శ్రీనివాస్, డీఈఈ** - న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

పరిసరాలు శుభ్రం

స్పందనకు వందనం

విజయనగరం పట్టణం: కొత్తాగ్రహారం-2 వినాయక అపార్టుమెంట్ ప్రాంతంలో వ్యర్థాలు పేరుకుపోయాయని, పనికిరాని మొక్కలు పెరిగాయని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా'కు ఫిర్యాదు చేశారు. సమస్యను ప్రజారోగ్య అధికారి కె.సాంబమూర్తి దృష్టికి తీసుకెళ్లగా.. కార్మికులతో శుభ్రం చేయించారు.

ఇసుక నిల్వలపై దాడులు

నెల్లిమర్ల: పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంతంలో అక్రమంగా నిల్వ చేసిన 375 క్యూబిక్ మీటర్ల ఇసుకను రెవెన్యూ, మైనింగ్, విజిలెన్స్ అధికారులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. జిల్లాలో అక్రమ తవ్వకాలపై 'ఈనాడు'లో 8న 'అడ్డగోలు తవ్వకాలు.. అడిగే వారే లేరు..!' శీర్షికన ఇచ్చిన కథనంపై అధికారులు స్పందించారు. నదిలో తవ్వకాలను పరిశీలించారు. నారాయణపట్నం వద్ద అక్రమంగా తరలిస్తున్న ఎం.గణకు చెందిన ట్రాక్టరును పట్టుకొని, రూ.10 వేలు జరిమానా విధించినట్లు తహసీల్దార్ శ్రీకాంత్ తెలిపారు.

రైతుబజార్లు.. ఇంకెంత దూరం

● స్థలమున్నా, ఏర్పాటుకాలేదు..
● వినియోగదారులకు నష్టం

న్యూస్‌టుడే, విజయనగరం గ్రామీణం, నెల్లిమర్ల, కొత్తవలస: విజయనగరం, కొత్తవలస, నెల్లిమర్లలో రైతుబజార్ల ఏర్పాటు ఏళ్లుగా కలగానే మిగిలింది. యంత్రాంగం నిర్లక్ష్యం, స్థల సమస్యల కారణంగా ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదు. దీంతో కూరగాయలు అధిక ధరలకు కొంటూ నష్టపోతున్నామని ప్రజలు వాపోతున్నారు.

విజయనగరం నియోజకవర్గంలో జనాభా విస్తరించడంతో ఉత్తర ప్రాంతాల ప్రజలు ఉద్యోగ, వ్యాపార, పిల్లల చదువు నిమిత్తం ఇక్కడే నివాసముంటున్నారు. ఆర్‌అండ్‌బీ, రింగ్‌రోడ్డు ఉల్లివీధి, కొత్తాగ్రహారం, బుచ్చన్నకోనేరు, పుల్లంపేట, గాజులరేగ, బాబ్జీపేట, శాంతినగర్, మంగళవీధి, దాబాగార్డెన్స్ ప్రాంతం, అనసూయవీధి, గవరవీధి, బొండాడవీధి, దక్షిణవీధి, కమ్మవీధి, కొత్తపేట, హుకుంపేట, కె.ఎల్.పురం, కణపాక, తోటపాలెం, పద్మావతినగర్, నటరాజ్‌కాలనీ ప్రాంతాల వారికి దూరంగా రైతుబజారు ఉండడంతో స్థానికంగా బహిరంగ మార్కెట్లోనే కూరగాయలు కొనుగోలు చేస్తున్నారు.

ప్రైవేటు వ్యాపారుల దందా

● మూడు నెలల కిందట ఓ ప్రైవేటుస్థలంలో ఉన్న రైతుబజారును ఖాళీ చేయించి రింగ్‌రోడ్డులో తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. దీంతో పాత బజారు ప్రాంతీయులు నగరపాలకసంస్థ కార్యాలయం, రాజీవ్‌క్రీడామైదానం వద్దకు వెళ్లి కొనాల్సిన దుస్థితి. కొందరు వ్యాపారులు అధిక ధరలు అమ్ముతుండడంతో చేసేది లేక కొంటున్నామని వినియోగదారులు లబోదిబోమంటున్నారు. ● నెల్లిమర్ల, కొత్తవలసలో బజార్ల ఏర్పాటుకు ఏళ్లుగా స్థానికుల నుంచి డిమాండు ఉంది. స్థల సేకరణ జరగక, ఏర్పాటు కాలేదు. భోగాపురంలో ఏర్పాటుకు పూసపాటిరేగ, భోగాపురం ప్రజలు చాన్నాళ్లుగా కోరుతున్నారు.

కూటమి ప్రభుత్వంపై ఆశలు

గత వైకాపా ప్రభుత్వంలో కొత్త రైతుబజార్ల ఏర్పాటుపై డిమాండ్లు వచ్చినా పట్టించుకోలేదు. గతంలో తెదేపా హయాంలో ఏర్పాటు చేసిన వాటిని గాలికొదిలేశారన్న వాదన ఉంది. కూటమి ప్రభుత్వం లోనైనా జిల్లా కేంద్రం, కొత్తవలస, నెల్లిమర్లలో వీటిని ఏర్పాటు చేస్తే, కూరగాయలు ప్రజలకు అందుబాటులో ఉంటాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ప్రతిపాదనలు పంపాం..

ప్రజల అవసరాల మేరకు కొత్త రైతుబజార్ల ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఆదేశాల మేరకు కొత్తవి ఏర్పాటు చేస్తాం.
- రవికిరణ్, ఏడీ మార్కెటింగ్ శాఖ

గోడప్రతుల ఆవిష్కరణ

విద్యావిభాగం: జేఎన్‌టీయూ గురజాడ విద్యాలయం, జెనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధ్వర్యంలో ఈనెల 13, 14వతేదీల్లో నిర్వహించనున్న హ్యాకథాన్ పోటీలకు సంబంధించిన గోడప్రతులను సోమవారం విద్యాలయంలో ఆవిష్కరించారు. ఉపకులపతి డా.వి.వి.సుబ్బారావు, రిజిస్ట్రార్ జి.జయసుమ పాల్గొన్నారు.

తెరపై ఈనాడు

● ఎస్వీసీ: ఆంధ్రా కింగ్ తాలూకా ● శ్రీకృష్ణ: రాజు వెడ్స్ రాంబాయి ● ఆదిత్య: మాస్ జాతర ● లీలామహల్: రివాల్వర్ రీటా ● రంజనీ స్క్రీన్- 1: ఆంధ్రా కింగ్ తాలూకా ● శివరంజనీ స్క్రీన్-2: అమర కావ్యం ● హిమగిరి: 12ఎ రైల్వే కాలనీ ● సప్తగిరి: 12ఎ రైల్వే కాలనీ - న్యూస్‌టుడే, కంటోన్మెంట్

ప్రాధాన్యతా క్రమంలో పరిష్కారం

అన్నక్యాంటీన్‌ను తనిఖీ చేస్తున్న కమిషనరు నల్లనయ్య

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: ప్రజా ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించి, సేవలను మరింత విస్తృతం చేయనున్నట్లు నగర పాలక సంస్థ కమిషనరు పి.నల్లనయ్య తెలిపారు. సోమవారం కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ● క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. అనంతరం ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని అన్న క్యాంటీన్‌ను తనిఖీ చేశారు. ● పెద్దచెరువులో మరణించిన చేపలను మత్స్యకారుల సాయంతో తొలగించినట్లు నల్లనయ్య వెల్లడించారు.

సెమీస్‌కు జిల్లా ఫుట్‌బాల్ జట్టు

నరసరావుపేట క్రీడలు, న్యూస్‌టుడే: ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 69వ రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల అండర్-17 బాల బాలికల ఫుట్‌బాల్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. పట్టణంలోని డాక్టర్ కోడెల శివప్రసాదరావు స్టేడియంలో సోమవారం జరిగిన పోటీలో బాలుర విభాగంలో విజయనగరం జట్టు సెమీస్‌కు చేరింది.

ఆక్రమణల తొలగింపు

శృంగవరపుకోటలో ప్రధాన దేవీగుడి కూడలిలో ఆక్రమణల తొలగింపునకు సీఐ వి.నారాయణమూర్తి ఆధ్వర్యంలో పోలీసులు చర్యలు చేపట్టారు. సోమవారం ఉదయం 6 గంటల నుంచి జేసీబీలతో రోడ్డుకిరువైపులా ఆక్రమణలు తొలగించి, తోపుడు బళ్లు పెట్టకుండా చూశారు. దుకాణదారులు ముందు మట్టి ఎత్తుగా వేసి దిమ్మెలు ఏర్పాటు చేయడంతో వర్షం నీరు రోడ్డుపైనే నిలిచిపోతోంది. దీంతో ట్రాఫిక్ ఏర్పడుతోంది. వీటిని తీసివేయించారు.
- న్యూస్‌టుడే, శృంగవరపుకోట

ప్రమాదాల నియంత్రణకు చర్యలు

లక్కవరపుకోట, న్యూస్‌టుడే: మండలంలోని గంగుబూడి కూడలి నుంచి ఎల్.కోట వచ్చే ఎన్‌హెచ్ 516బీ రోడ్డు ప్రమాదకరంగా మారడంతో పోలీసులు చర్యలు చేపట్టారు. వాహనాల వేగ నియంత్రణకు కూడళ్ల వద్ద ఇసుక డ్రమ్ములు ఏర్పాటు చేశారు. జమ్మాదేవిపేట నుంచి రంగరాయపురం మార్గమధ్యలో రెండు చోట్ల రంబుల్ స్ట్రిప్‌లను ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతాల్లో సమస్యలను గ్రామీణ సీఐ ఎల్.అప్పలనాయుడు, ఎస్సై నవీన్ పడాల్ ఎన్‌హెచ్ ఈఈకి సమస్య వివరించి, వీటిని ఏర్పాటు చేశారు.

పీఏసీఎస్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

నెల్లిమర్లలో బ్యాంకు వద్ద ధర్నా చేస్తున్న ఉద్యోగులు

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: పీఏసీఎస్‌లో 2019 తర్వాత చేరిన ఉద్యోగులందరినీ క్రమబద్ధీకరించాలని జిల్లా వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ల ఐక్యవేదిక నాయకులు డిమాండు చేశారు. సోమవారం నెల్లిమర్ల బ్యాంకు వద్ద ధర్నా నిర్వహించి మాట్లాడారు. నిబంధనలు లేకుండా ఉద్యోగుల జీతభత్యాలను చెల్లించాలన్నారు. గ్రాట్యుటీ చట్టాన్ని అమలు చేయాలన్నారు. అనంతరం నెల్లిమర్ల ఏజీఎం కె.రజినికి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. సభ్యులు గౌరినాయుడు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌పై బ్లాక్ స్పాట్ల పరిశీలన

భోగాపురం, న్యూస్‌టుడే: రహదారి ప్రమాదాలు నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం మండలంలో జాతీయ రహదారిపై బ్లాక్ స్పాట్స్‌ను పరిశీలించి, ప్రమాదానికి కారణాలు గుర్తించి, నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం భోగాపురం పోలీసు స్టేషన్‌ను సందర్శించి సూచనలు చేశారు. కార్యక్రమంలో సీఐ కూన దుర్గాప్రసాద్, ఎస్సై పాపారావు, సిబ్బంది పాల్గొన్నారు.

భోగాపురం పోలీస్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ ఎ.ఆర్.దామోదర్

అడుగడుగునా అవస్థలే!

తోటపాలెం శివాలయం దారిలో ఇళ్ల మధ్యే వ్యర్థాలు

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: నగరం నడిబొడ్డున్న తోటపాలెంలో కనీస వసతులు కరవయ్యాయి. పలు ప్రాంతాల్లో ప్రధాన రహదారులు దెబ్బతిన్నాయి. ఖాళీ స్థలాల్లో వ్యర్థాలు పేరుకున్నాయి. కాలువల వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో మురుగు రోడ్లపై పారుతోంది. దాదాపు అన్నిచోట్లా దోమల బెడద కనిపిస్తోంది. ● షిర్డీసాయి నగర్‌లో దుర్గంధం వస్తోంది. కాలువలు కానరావడం లేదు. ● ఐనాక్స్, ప్రదీప్‌నగర్, సాయినగర్, షిర్డీసాయి నగర్, తోటపాలెం ప్రాంతాల్లో బీటీ రోడ్లు పాడయ్యాయి. అడుగడుగునా గుంతలతో దర్శనమిస్తున్నాయి ●ముచ్చువాని చెరువు గట్టు ప్రాంతంలో తాగునీటి సమస్య వేధిస్తోంది ● తోటపాలెంలో కుక్కలు, పందులు సంచరిస్తున్నాయి ● ఇక్కడి ఖాళీ స్థలాలు మినీ డంపింగ్ యార్డుల్లా మారాయి ● నాయుడు కాలనీ, నరసింహానగర్, గెడ్డవీధి, షిర్డీకాలనీ తదితర చోట్ల కాలువలు, రోడ్లు అవసరం ● ఆర్టీసీ కాంప్లెక్స్‌కు దగ్గర డివిజన్ కావడంతో ఎక్కువగా ప్రైవేటు కళాశాలలు, పాఠశాలలు, అపార్టుమెంట్లు ఉన్నాయి. కానీ ఆ స్థాయిలో సౌకర్యాల్లేవు ● దొంతలవీధిలో విద్యుత్తు స్తంభం ప్రమాదకరంగా ఒరిగి కనిపిస్తోంది. తీగలు కిందకు వేలాడుతున్నాయి. నిధుల లభ్యత మేరకు అభివృద్ధి పనులు చేపడతామని కమిషనర్ నల్లనయ్య తెలిపారు.

దేశ సేవకు ముందుకు రావాలి

అగ్నివీర్‌లతో వివిధ సంస్థల ప్రతినిధులు, ప్రముఖులు

మయూరి కూడలి, న్యూస్‌టుడే: దేశ సేవకు యువత ముందుకు రావాలని, అప్పుడే జీవితంలో సంతృప్తి ఉంటుందని హజరత్ ఖాదర్ వలి దర్గా ధర్మకర్త, ఏటీకే వ్యవస్థాపకుడు డా.ఖలీలుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరీ అన్నారు. ఇటీవల అగ్నివీర్‌లుగా ఎంపికైన 22 మందిని చేయూత ఫౌండేషన్ సొసైటీ ఆధ్వర్యంలో నగరంలో సోమవారం సత్కరించారు. డిఫెన్స్ అకాడమీ సంచాలకుడు కృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రఘువర్మ పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న కేరళ వాసి అరెస్టు

కొత్తవలస: గంజాయి అక్రమంగా తరలిస్తున్న కేరళ రాష్ట్రం వయనాడ్ జిల్లాలోని మెప్పడి గ్రామానికి చెందిన పి.అషేరి నాసిక్‌ను కొత్తవలస ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద అరెస్టు చేసినట్లు సీఐ షణ్ముఖరావు తెలిపారు. దీనికి సంబంధించి సోమవారం ఆయన వివరాల ప్రకారం.. అందిన సమాచారంతో ఎస్సై జోగారావు వీఆర్వోలు, సిబ్బందితో కలిసి బస్టాండు వద్ద తనిఖీలు చేయగా అషేరి వద్ద కిలో గంజాయి(విలువ రూ.5 వేలు) ఉన్నట్లు గుర్తించారు. తహసీల్దారు సునీత సమక్షంలో దాన్ని సీజ్ చేశారు. కేసు నమోదు చేసి, నిందితుడిని అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. ఒడిశాలోని కొరాపుట్ జిల్లా చటువాలో ఓ వ్యక్తి నుంచి కొన్నట్లు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు.

బైకు ఢీకొని ఒకరికి గాయాలు

ఎస్.కోట: కాపుసోంపురం వంతెన వద్ద ఆదివారం మధ్యాహ్నం ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తి తీవ్రంగా గాయపడినట్లు సీఐ వి.నారాయణమూర్తి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. అనకాపల్లి జిల్లా సబ్బవరం మండలం దువ్వాడకు చెందిన కిలారి గంగన్న, స్నేహితుడు గొడ్డు ఆదర్శ్ బైకుపై అరకు నుంచి వస్తుండగా కాపుసోంపురం వద్ద వాహనం ఢీకొంది. గంగన్నకు గాయాలయ్యాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

కొట్లాటలో కేసు నమోదు

ఎల్.కోట, న్యూస్‌టుడే: ఇరువర్గాల ఘర్షణలో ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎల్.కోట ఎస్సై నవీన్‌పడాల్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. ఎల్.కోట బీసీ కాలనీకి చెందిన కట్టా అవినాష్, అదే ప్రాంతానికి చెందిన మహిళతో మాటలు కాస్త గొడవకు దారితీసింది. దీన్ని అడ్డుకోడానికి ప్రయత్నించిన స్థానిక బంగారయ్యపై అవినాష్ దాడిచేసి గాయపరిచాడు. ఆయన్ని ఎస్.కోట సీహెచ్‌సీకి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు

యువకుడి అదృశ్యం

భోగాపురం: యువకుడు కనిపించడం లేదంటూ అతని తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని భోగాపురం ఎస్సై సూర్యకుమారి సోమవారం తెలిపారు. మండల కేంద్రానికి చెందిన ఏ.చిరంజీవి పెయింటింగ్ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గత నెల ఒకటో తేదీ నుంచి కనిపించడం లేదని తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

స్థలం కేటాయించాలి

విజయనగరం గ్రామీణం: జొన్నవలసలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించాలని, అక్రమంగా నిర్మిస్తున్న చర్చి నిర్మాణ పనులు ఆపాలని మాలమహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ కోరారు. సోమవారం తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు.

మహాసభల విజయవంతానికి పిలుపు

మయూరి కూడలి: విశాఖలో డిసెంబరు 31 నుంచి జనవరి 4 వరకు జరగనున్న సీఐటీయూ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని సిటూ రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. జిల్లాకు వచ్చిన ఆయన సంబంధిత గోడప్రతులను ఆవిష్కరించారు.

బీఎల్ఏల జాబితాలివ్వాలి

విజయనగరం గ్రామీణం: పార్టీల ప్రతినిధులు పోలింగ్ కేంద్రాల వారీగా బీఎల్ఏల జాబితా ఇవ్వాలని ఆర్డీవో దాట్ల కీర్తి సూచించారు. సోమవారం నాయకులతో సమావేశమయ్యారు. ఓటర్లుగా కొత్తగా నమోదు, మార్పులు, చేర్పులు, పేర్ల తొలగింపునకు అవకాశం ఉందన్నారు. ఏఈవో ప్రసాద్, ఈడీటీ గాంధీ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

రాజేంద్రప్రసాద్

కంటోన్మెంట్: ఘంటసాల స్మారక కళాపీఠం నూతన కార్యవర్గం ఎన్నిక నగరంలో జరిగింది. వ్యవస్థాపక అధ్యక్షుడిగా ఎం.భీష్మారావు, గౌరవాధ్యక్షుడిగా సోమయాజులు, అధ్యక్షుడిగా డి.రాజేంద్రప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా డి.సర్వేశ్వరరావు, ముఖ్యకార్యదర్శిగా ఉమాశంకర్, కోశాధికారిగా సత్యనారాయణ నియమితులయ్యారు.

స్టీలు కంచాల పంపిణీ

వేపాడ, బంగారయ్యపేట పాఠశాలకు ఆస్ట్రేలియాలో ప్రభుత్వ యూనివర్సిటీ ఐటీ మెంబరుగా విధులు నిర్వహిస్తున్న రూపాదేవి రూ.10 వేలు విలువైన స్టీలు కంచాలు, గ్లాసులు అందజేశారు.

పురుగు మందులను తగ్గించాలి

విజయనగరం గ్రామీణం: వ్యవసాయ భూముల్లో ఎరువులు, రసాయన మందుల వినియోగాన్ని తగ్గించాలని, సేంద్రియ పద్ధతుల్లో సాగు చేయాలని ఏడీ నాగభూషణరావు అన్నారు. సోమవారం మండల సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీఎం స్వామి, ఎంపీడీవో వెంకటరావు, వ్యవసాయాధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'ఆట' రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా అమర్‌నాథ్

విద్యావిభాగం: ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్(ఆట) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా జిల్లాకు చెందిన మువ్వల అమర్‌నాథ్ నియమితులయ్యారు. పాడేరులో నిర్వహించిన రాష్ట్ర మహాసభల్లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గతంలో జిల్లా అధ్యక్షుడిగా, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పనిచేశారు.

మంత్రికి ఆహ్వానం

మయూరి కూడలి:నగరంలోఈ నెల 14 నుంచి 16 వరకు జరగనున్న మెగా ట్రేడ్ ఫెయిర్‌ను విజయవంతం చేయాలని ట్రేడ్ ఫెయిర్ సంస్థ అధ్యక్షుడు ఎ.ముఖేష్ అన్నారు. సోమవారం మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను ఆహ్వానించారు.

పాఠశాలకు స్థలం కేటాయించండి

ఎస్.కోట: పట్టణంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమోన్నత పాఠశాలకు అయిదెకరాల స్థలం కేటాయించాలని కోరుతూ సోమవారం పాఠశాల ఛైర్మన్ లక్ష్మి, సభ్యులు ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా తహసీల్దార్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు.

వైభవంగా సీతారాముల శాంతి కల్యాణం

విజయనగరం గ్రామీణం, న్యూస్‌టుడే: విజయనగరం మండలంలోని రామనారాయణంలో సోమవారం పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకొని సీతారాముల శాంతి కల్యాణం వైభవంగా జరిగింది. ఉదయం అర్చకులు చాణక్య, శ్రీహర్ష, కృష్ణతేజ ఆధ్వర్యంలో ఉత్సవ విగ్రహాలకు పంచామృతాలతో అభిషేకాలు, పూజలు సాగాయి. ఇవటూరి నారాయణశర్మ బాలకాండ పారాయణం చేపట్టారు.

రాములోరికి పట్టాభిషేకం

నెల్లిమర్ల: రామతీర్థం దేవస్థానంలో రాములోరికి సోమవారం పట్టాభిషేక మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామికి ప్రాతఃకాలార్చన, బాలభోగం చేపట్టారు. యాగశాలలో సుందరకాండ హవనం నిర్వహించారు. అనంతరం నిత్య కల్యాణ పూజలు చేపట్టారు. పునర్వసు నక్షత్రం పురస్కరించుకొని శ్రీమద్రామాయణ పారాయణం చేశారు. ప్రత్యేక పుష్పలంకరణ చేశారు. ఏసీ వై.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బాధితులకు రూ.లక్ష, నిత్యావసరాల అందజేత

సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే మాధవి

భోగాపురం: ఇటీవల బంగ్లాదేశ్ జలాల్లో కోస్టుగార్డులకు చిక్కుకున్న పూసపాటిరేగ, భోగాపురం మండలాలకు చెందిన 10 మంది మత్స్యకారుల కుటుంబాలను స్థానిక ఎమ్మెల్యే మాధవి సోమవారం పరామర్శించారు. కొండ్రాజుపాలెంలో ఒక్కో బాధిత కుటుంబానికి స్థానిక ఫిషరీస్, హ్యాచరీ సంస్థల సహకారంతో ఎమ్మెల్యే రూ.10వేలు చొప్పున రూ.లక్ష ఆర్థిక సాయంతో పాటు నిత్యావసరాలు అందజేశారు. ● అనంతరం పూసపాటిరేగ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఎమ్మెల్యే పాల్గొని ప్రజల నుంచి సమస్యలపై వినతులు స్వీకరించారు. తహసీల్దారు రమణ పాల్గొన్నారు.

రసాయన ఎరువుల వినియోగంతో అనర్థం

లక్కవరపుకోట, న్యూస్‌టుడే: పంటల సాగులో పెరుగుతున్న రసాయన ఎరువుల కారణంగా రుగ్మతలు విపరీతంగా పెరిగిపోతున్నాయని ప్రకృతి వ్యవసాయ సాగు జిల్లా మేనేజరు ఆనందరావు తెలిపారు. సోమవారం ఎల్.కోటలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రసాయనాలు వినియోగించే పంటలు తీసుకోవడంతో రోగాల బారిన పడుతున్నారన్నారు. ప్రకృతి వ్యవసాయంతో రోగాలు దరిచేరవన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, పొదుపు సంఘ మహిళలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ప్రకృతి వ్యవసాయ సాగు జిల్లా మేనేజరు ఆనందరావు

బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

భోగాపురం, న్యూస్‌టుడే: సమాజంలో లింగ సమానత్వం, బాలిక హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని భోగాపురం ఎంపీడీవో డి.స్వరూపారాణి అన్నారు. సోమవారం తన కార్యాలయంలో బాల్య వివాహాల నిర్మూలనపై ఏర్పాటుచేసిన సదస్సులో మాట్లాడారు. చదువుతో ఏదైనా సాధ్యమని.. బాలికలను అన్ని రంగాల్లో రాణించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. హక్కులపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో టి.లావణ్య, ఏసీడీపీవో సుజాత, ఎంఈవో రమణమూర్తి, ఈవోపీఆర్డీ గాయత్రి పాల్గొన్నారు.

యువత మత్తుతో చిత్తు కావద్దు

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: యువత మత్తుతో చిత్తు కావద్దని సీఐ వి.నారాయణమూర్తి హితవు పలికారు. సోమవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రత్యేక సేవా శిబిరం ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ సమాజాన్ని కుదేలు చేస్తున్న సమస్యల్లో డ్రగ్స్ ఒకటి అన్నారు. మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే శారీరకంగా, ఆర్థికంగా నష్టపోతామన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపల్ కేశవరావు, పీవో భాస్కరరావు, కళాశాల ప్రిన్సిపల్ కృష్ణమూర్తి, వైస్ ప్రిన్సిపల్ వాసుదేవరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ నారాయణమూర్తి

గిట్టుబాటు ధర కల్పించడమే లక్ష్యం

కొండగంగుబూడిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

వేపాడ, న్యూస్‌టుడే: అన్నదాతలు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే లలితకుమారి అన్నారు. మండలంలోని కొండగంగుబూడిలో సోమవారం ఆమె ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. కొన్న 48 గంటల్లో రైతుల ఖాతాల్లోకి నగదు జమ చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏవో ఎం.స్వాతి, తెదేపా నాయకులు రమణమూర్తి, కృష్ణమూర్తి, వెంకటరావు పాల్గొన్నారు.

పబ్లిక్ నోటీస్

మా క్లయింట్లు అయిన సబ్బి రామమూర్తి గారి కుమార్తెలు సత్యవతి, పద్మ మరియు అతని కోడలు వెంకట సత్యవతి, ఆమె కుమారుడు కిరణ్‌కుమార్, కుమార్తె బొద్దాన కృష్ణవేణి, విజయనగరం, దాసన్నపేట, గొల్లవీధి కాపురస్తుల భోగట్టా పైన సబ్బి లేట్ సూర్యనారాయణ గారి కుమారులు అయిన ముత్యాలు, రమణ, అప్పన్న; సబ్బి లేట్ రామప్పడు గారి కుమారుడు అప్పన్న, వాడపల్లి ప్రకాష్‌రావు గారి భార్య కృష్ణవేణి; తీగెల అప్పలరాజు గారి కుమారుడు శ్రీనివాసరావు, అతనిచే నామకగా రాయబడిన క్రయచీటిల్లో వివరించిన క్రయదారులు అయిన వొబ్బిలిశెట్టి హరినాథ్ గారి భార్య మమతా హరినాథ్, కోలా శ్రీనివాసు గారి భార్య మాధురి, మొగలపల్లి శ్రీనివాసరావు గారి భార్య రాధికారాణి, మందపాటి జోగి రామకృష్ణ రాజు గారి భార్య శ్వేత; బుద్రా కామేశ్వర్‌రావు గారి కుమారులు గున్నేశ్వరరావు, శర్మ మరియు దేవరాపల్లి సాయిబాబా గారి కుమారుడు సాయికృష్ణ, అను ఆసామీల మధ్య వ్రాయబడ్డ క్రయదస్తావేజులు మోసపూరితమైనవని ముఖ్యముగా సదరు తీగెల శ్రీనివాస్‌రావు గారు వ్రాయించుకున్న క్రయదస్తావేజు, మా క్లయింట్లు యొక్క భూమి, అనగా విజయనగరం, జమ్మునారాయణపురంలో చేరిన S.No 90/3 కలిగిన య. 1.06 సెంట్లు గల భూమిని, సదరు సబ్బి లేట్ సూర్యనారాయణ గారి కుమారుడు రమణచే తప్పుడుగా సబ్బి లేటు రామమూర్తి గారి కుమారుడు సబ్బి రమణచే క్రయపరిచినట్లు తయారు చేసి, సృష్టించబడిన తే. 20.06.2005 దస్తావేజు నెం. 4815/2005, మరియు దాన్ని ఆధారముగా సృష్టింపబడిన తదుపరి దస్తావేజులు అనగా 5025, 5220, 5274, 5732, 6983 మరియు 7036/2005 మరియు 4719/2017గా పుట్టబడిన దస్తావేజులనియు, మోసపూరితమైనవని మరియు రద్దుపరచ వలసిందిగా కోరుచూ, మా ద్వారా 06.12.2025ది గల నోటీసును పంపదలచి, పైన వివరించిన ఆసామిలందరికి, పైన పేర్కొన్న ముఖ్య విషయం తెలియపరచవలసిన కారణముగా, మరియు పై ఆసాముల యొక్క చిరునామాలు, చాలా కాలం క్రీతంవి, అగుటచేత యీ పబ్లిక్ నోటీస్ ద్వారా వారికి తెలియజేయుచున్నాము. పూర్తి వివరములకు, మా ఆఫీసునకు వచ్చి, పూర్తి సమాచారం పొందగలరు.

తే. 8.12.2025

కె. కృష్ణమూర్తి, న్యాయవాది,
13-5-6, కొత్తపేట, మండపం రోడ్,
విజయనగరం, సెల్: 98661 85310

(c) eenadu

రూ.200 కోట్లు..

రైతు కష్టానికి.. మిగిలిన నష్టం

ఉండి, భీమవరం అర్బన్, న్యూస్‌టుడే ఖరీఫ్ పంటపై అధిక వర్షాల పిడుగు పడింది. అన్నదాతను అప్పుల ఊబిలోకి నెట్టేసింది. ఎకరాకు 20 నుంచి 25 బస్తాల్లోపే దిగుబడులు వస్తున్నాయి. ఆపై సాధిస్తే... ఈ ఏడాదికి అతనే రారాజు. భూమున్న రైతుకే పెట్టుబడులు రావడం గగనమైపోయింది. కౌలురైతులకు రూ. 10-15 వేల మధ్య అప్పులు మిగులుతున్నాయి.

ఉండిలో ధాన్యాన్ని ఆరబెట్టుకుంటున్న కౌలురైతు కుటుంబం

రెండు ఎకరాల్లో వరి సాగు చేయగా అధిక వర్షాలకు మానిపండు తెగులొచ్చి పంట దెబ్బతింది. పైగా తేమ. వారం రోజులుగా ధాన్యాన్ని ఆరబెడుతున్నా తగ్గడం లేదు. రంగు మారింది. 40 బస్తాల దిగుబడి వస్తుందని అనుకుంటున్నా. ఇందులో 28 బస్తాలు మక్తా ఇవ్వాలి. ఎంత లేదన్నా.. ఎకరాకు రూ.15 వేలు నష్టం వస్తోంది. ఈ పరిస్థితి ఎన్నడూ చూడలేదు. **- పెద్దిరెడ్డి సుబ్బారావు, కౌలు రైతు**

1.15 ఎకరాల పంట అధిక వర్షాలకు దెబ్బతింది. పురుగు, తెగుళ్ల నివారణకు మందులు కొట్టించా. పెట్టుబడి రూ.30 వేలు అయింది. 28 బస్తాల దిగుబడి వచ్చింది. తేమ తగ్గేందుకు అయిదు రోజులుగా ఆరబెడుతున్నా. ఇంకెన్ని రోజులు పడుతుందో తెలియడం లేదు. **- విజ్జురోతు సత్యనారాయణ, రైతు**

జిల్లాలో అక్టోబరు నుంచి కురిసిన అధికవర్షాలు పూత, పాలుపోసుకోవడం, గింజ తయారీ దశల్లో పంటపై తీవ్ర ప్రభావాన్ని చూపాయి. తొలుత ఎకరానికి 38 బస్తాల చొప్పున దిగుబడి వస్తుందని అంచనా వేశారు. ఆ ప్రకారం 6,27,311 టన్నుల దిగుబడి రావొచ్చని, విలువ రూ.1486. 09 కోట్లు ఉంటుందని అధికారులు లెక్క వేశారు. ప్రస్తుతం దిగుబడులు చూస్తే రూ.200 కోట్లు అన్నదాతలు కోల్పోతారని అంటున్నారు.

80 వేల టన్నులు తగ్గొచ్చు.. 20 వేల ఎకరాల్లో పంట నష్టపోయింది. దీంతో ఎకరాకు 20, 25, 30, 32, 35, 40 బస్తాల చొప్పున దిగుబడులు వస్తున్నాయి. ఆ నష్టం 80 వేల టన్నుల వరకూ ఉండొచ్చు. 5. 50 లక్షల టన్నులకు దిగుబడి తగ్గదని భావిస్తున్నాం. **- వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయాధికారి**

వరి సాగు:	అంచనా దిగుబడి:	కొనుగోలు లక్ష్యం:	పంట కోసింది:	కోయాల్సింది :	వచ్చిన ఉత్పత్తి :	కొనుగోళ్లు :
2,18,330 ఎకరాలు	6,27,311 టన్నులు	5 లక్షల టన్నులు	1,41,925 ఎకరాలు	76,405 ఎకరాలు	3,40,407 టన్నులు	2,39,336 టన్నులు

ఆరు ప్రత్యేక రైళ్ల రద్దు

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: రైల్వే లైన్ల పునరుద్ధరణ పనుల్లో భాగంగా ఈ నెల 25, 26, 27 తేదీల్లో పలు రైళ్లను రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ పీఆర్వో కార్యాలయ అధికారులు తెలిపారు. ఈ నెల 25న చర్లపల్లి- నరసాపురం (07144), కాకినాడ టౌన్-చర్లపల్లి (07155), 26న నరసాపురం- చర్లపల్లి (07145), చర్లపల్లి- కాకినాడ టౌన్ (07156), హైదరాబాద్- కాకినాడ టౌన్(07157), 27న కాకినాడ టౌన్- హైదరాబాద్(07158) రైళ్లను రద్దు చేసినట్లు వారు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

తనిఖీలంతా ఉత్తిగ్యాస్

దారి మళ్లుతున్న రాయితీ సిలిండర్లు

వీరవాసరంలోని ఓ హోటల్‌లో స్వాధీనం చేసుకున్న సిలిండర్లు

ఇటీవల తణుకులోని ఒక షామియానా దుకాణంలో అక్రమంగా నిల్వ చేసిన 10 సిలిండర్లను రెవెన్యూ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. ఆ మరుసటి రోజే తాడేపల్లిగూడెంలోని ఓ క్యాటరింగ్ దుకాణంలో 10 గృహ వినియోగ సిలిండర్లను అధికారులు పట్టుకుని కేసులు నమోదు చేశారు.

ఆకివీడు, భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: జిల్లాలో గృహ వినియోగ సిలిండర్లు దారి మళ్లుతున్నాయి. పట్టణాలు, పల్లెలనే తేడా లేకుండా హోటళ్లు, వెల్డింగ్ దుకాణాలు, స్వీట్లు, హోటళ్లు, ఆహార పదార్థాలు తయారు చేసే చోట యథేచ్ఛగా వినియోగిస్తున్నారు. కొన్ని గ్యాస్ ఏజెన్సీల డెలివరీ బాయ్స్ నేరుగా వారికి అవసరమైన మేర విక్రయిస్తున్నారు. కొన్ని చోట్ల అయిదు కిలోల గ్యాస్ సిలిండర్లలో నింపి కొందరు సొమ్ము చేసుకుంటున్నారు. అయినా అధికారుల తనిఖీలు తూతూమంత్రంగా ఉంటున్నాయి.

ధర భరించలేక.. గృహ అవసరాలకు వినియోగించే 14.2 కిలోల సిలిండరు ధర రూ.892 కాగా వాణిజ్య అవసరాలకు వాడే 19 కిలోల సిలిండర్ ధర రూ.1800 వరకు ఉంది. ఇంత భారీ వ్యత్యాసం ఉండటం వల్ల వ్యాపారులు బ్లాక్ మార్కెట్‌లో గ్యాస్ ఏజెన్సీల నుంచి గృహ వినియోగ సిలిండర్లను రూ.1,100 నుంచి రూ.1,200 కొనుగోలు చేస్తున్నారు. ఎప్పటికప్పుడు దాడులు చేసి కేసులు నమోదు చేస్తున్నామని, మరింత నిఘా ఉంచి తనిఖీ చేసేలా చర్యలు తీసుకుంటామని పౌర సరఫరాల శాఖ ఏఎస్‌వో రవిశంకర్ తెలిపారు.

గ్యాస్ ఏజెన్సీలు:	45
కనెక్షన్లు:	6.27 లక్షలు
ప్రతినెలా వినియోగం:	2.35 లక్షల సిలిండర్లు
ఈ ఏడాదిలో నమోదు చేసిన కేసులు:	40
స్వాధీనం చేసుకున్న సిలిండర్లు:	130

సవాళ్ల గమనం గెలుపు పావనం

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: నిరంతర సాధన.. సవాళ్లను ఎదుర్కొనే ఆత్మస్థైర్యం ఆమె సొంతం. తండ్రి లేకున్నా.. తల్లి రెక్కల కష్టం వృథా కాకుండా.. గెలుపే గమనం.. గమ్యంగా ముందుకు సాగుతోంది.. జంగారెడ్డిగూడేనికి చెందిన కోండ్రు పావన లక్ష్మీ ప్రసన్న స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతూ వాలీబాల్‌లో రాణిస్తోంది. తల్లి సురేఖ వస్త్ర దుకాణంలో పనిచేస్తూ కూతుళ్లిద్దరిని చదివిస్తోంది. భారత వాలీబాల్ జట్టుకు ఎంపికవడంతోపాటు నావికాదళంలో చేరాలనే లక్ష్యంతో నిరంతర సాధన చేస్తున్నారు. లక్ష్మీప్రసన్న సోదరి శ్రీవల్లి కూడా వాలీబాల్ క్రీడాకారిణి. చెల్లిని స్ఫూర్తిగా తీసుకొని విశ్రాంత పీడీ నరసింహరాజు వద్ద మూడేళ్లుగా కఠోర శిక్షణ తీసుకుంటున్నారు. ఈ ఏడాది నన్నయ విశ్వవిద్యాలయం జట్టుకు ఎంపికయ్యారు. అండర్ - 21 విభాగంలో చెన్నైలో డిసెంబరు 10 నుంచి 14 వరకు జరగనున్న సౌత్‌జోన్ మహిళా వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారు ఈ ఏడాది ఆగస్టులో కాకినాడలో జరిగిన జోనల్ పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టు తరఫున ఆడి రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యారు. తిరుపతిలో జరిగిన పోటీల్లో జోనల్ జట్టు తరఫున రాష్ట్ర పోటీల్లో పాల్గొన్నారు.

కనిపిస్తే.. స్థలం ఖాళీ

➤ భీమవరంలోని ఖరీదైన ప్రాంతంలో స్థలమున్న యజమాని హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. ఆ స్థలంపై కన్నేసిన కబ్జాదారుడు నకిలీ పత్రాలు సృష్టించి న్యాయస్థానానికి వెళ్లాడు.

➤ ఏలూరు శనివారపుపేట పరిధిలో స్థలాన్ని కొందరు కబ్జా చేశారు. పైగా అడిగిన యజమానిపై దౌర్జన్యం చేయడంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించారు.

➤ నరసాపురంలో ఓ వ్యక్తి స్థలంలో ముఠా పాగా వేసింది. అడిగితే రకరకాలుగా కేసులు పెట్టి వేధిస్తున్నారని యజమాని వాపోతున్నారు.

భీమవరం పట్టణం, ఏలూరు నేరవిభాగం, నరసాపురం, న్యూస్‌టుడే: ఖాళీ స్థలం కనిపిస్తే చాలు కబ్జారాయుళ్లు రెండు రోజులు దాని చుట్టూ తిరుగుతారు. వారంలో దాన్ని శుభ్రం చేయిస్తారు. తర్వాత నకిలీ పత్రాలతో వారిదని తిరగబడతారు. అంతలో సెటిల్‌మెంట్ గ్యాంగ్ రంగంలోకి దిగుతోంది. స్థలం యజమాని వారు చెప్పిన వాటికి తలూపితే ఆక్రమించుకున్నోళ్లకు కొంత, మధ్యవర్తిత్వానికి ఇంకొంత పంచుకుంటారు. కాదంటే కోర్టులో వేస్తారు. కొందరు అధికారులు వత్తాసు పలకడం కబ్జాలకు మరింత ఊతమిస్తుంది.

ఒక స్థలానికి సంబంధించిన ఆస్తి పన్నుకు ఆక్రమణదారుల్లో ఒకరి పేరిట దరఖాస్తు చేస్తారు. డిమాండ్ నోటీసు వచ్చే లోపు.. దరఖాస్తు చేసిన వారి పేరుపై అధికారులు స్పెషల్ నోటీసు ఇవ్వడంతో దాన్ని చూపించి ఆస్తి తనదిగా దందా చేస్తున్నారు. ఆపై నకిలీ పత్రాలు పుట్టించి దరఖాస్తు చేస్తే అసలు ఆ స్థలం ఎక్కడ ఉందో క్షేత్రస్థాయిలో అధికారులు చూడకపోవడం కబ్జాదారులకు వరమవుతుంది.

కొన్ని ముఠాలు ఎవరి పేరిట స్థలం ఉందో ముందుగా ఈసీ తీయిస్తాయి. వాటి యజమానులు ఎక్కడ ఉంటున్నారు, విదేశాల్లో ఏమైనా స్థిరపడ్డారా వంటి వివరాలు సేకరిస్తారు. స్థల వివాదాలు స్థానిక పోలీసుస్టేషన్‌కు చేరాక సివిల్ వివాదమని ఫిర్యాదు స్వీకరించకుండా బాధితులను రోజుల తరబడి తిప్పుతున్నారు. ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన వారు కాళ్ల చెప్పులు అరిగేలా తిరిగి అలసిపోతున్నారు.

జిల్లాలో పోలీస్ స్టేషన్లకు వచ్చిన బాధితుల ఫిర్యాదులు పరిశీలిస్తే..

2023	340
2024	290
2025	165

బాధితులు వందల సంఖ్యలో ఉండగా చట్టపరంగా స్వీకరించిన అర్జీలు కేవలం పదుల సంఖ్యను మించకపోవడం విశేషం.

రేపటి నుంచి 8 కేంద్రాల్లో టెట్

మాట్లాడుతున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఏపీ టెట్ 2025 ఉపాధ్యాయుల అర్హత పరీక్షకు పక్కాగా ఏర్పాట్లు చేయాలని జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆ అంశంపై సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. డిసెంబరు 10 నుంచి 21 వరకు పరీక్షలు జరుగుతాయని, జిల్లాలో 8 చోట్ల కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. అక్కడ అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. ఆయా చోట్ల 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. 12,985 మంది పరీక్షలు రాయనున్నట్లు పేర్కొన్నారు.

☛ పదో తరగతి విద్యార్థుల కోసం వంద రోజుల కార్యాచరణ అమలు చేయాలని జేసీ ఆదేశించారు.

☛ డిసెంబరు 12న కలెక్టరేట్‌లో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. దానికి సంబంధించిన గోడపత్రాన్ని మిగిలిన అధికారులతో కలిసి ఆవిష్కరించారు. రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో జరిగే శిబిరంలో అన్ని శాఖల ఉద్యోగులు పాల్గొనేలా అవగాహన కల్పించాలని సూచించారు.

వారసత్వ సంపద.. నేర్చుకుందాం పద!

మన ప్రాచీన సాంస్కృతిక, సామాజిక, ఆధ్యాత్మిక, కళా రంగాలకు సంబంధించిన విజ్ఞానాన్ని అందించాలనే సంకల్పంతో భీమవరంలోని ఎస్‌ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలోని సృజన వాటికను ఏర్పాటు చేశారు. ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్(ఐకేఎస్)లో భాగంగా అరుదైన వారసత్వ సంపదను ప్రదర్శనగా ఉంచి విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస నిపుణులు ఈదరపల్లి సీతారామరాజు అవగాహన కల్పిస్తున్నారు. పండగలు, ఆహార వ్యవహారాలపై ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టి భారతీయ స్ఫూర్తిని రేకెత్తిస్తున్నారు. ఈ సృజన వాటికలో గిరిజనులు సంప్రదాయ వేటకు వినియోగించే విల్లు, బాణాలు, జంతువుల కొమ్ములతో తయారు చేసిన బూరలు, వెదురు, తాటి, ఈత, జమ్ము, వరి, ఖర్జూరం ఆకులతో తయారైన ఉత్పత్తులు, సిమెంట్, థర్మాకోల్ వ్యర్థాలతో తీర్చిదిద్దిన జలపాతం ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. దేశవాళీ వరి రకాల గురించి వివరిస్తున్నారు. **- ఈనాడు, భీమవరం**

విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ..

కొమ్ములతో తయారు చేసిన బూరలు, పాత్రలు

కృత్రిమ జలపాతం

పోటీలకు.. సాధనట

ఇదేంటి.. ఈ బాలిక ఇలా కూర్చుంది అనుకుంటున్నారా.. ఇది ఆటలో ఓ సాధన. ఒలింపిక్స్‌లో పతకమే లక్ష్యంగా ముందుకు వెళ్తోంది పాలమంతపూడి గ్రీష్మ. తొమ్మిదో తరగతి చదువుతోంది. యోగా, స్కిప్పింగ్, మల్లఖంబ్ తదితర సుమారు 150 జాతీయ, రాష్ట్ర, జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొని ప్రథమ బహుమతులు, బంగారు పతకాలు సాధించింది.

కళలు, క్రీడల్లో స్వాతి కిరణాలు కథనం 6లో

వెలుగులోకి అవినీతి

● రూ.57.76 లక్షలు స్వాహా చేసిన యానిమేటర్

ఎస్సై నాగరాజుకు ఫిర్యాదు చేస్తున్న డ్వాక్రా మహిళలు

ఆకివీడు, న్యూస్‌టుడే: ఆకివీడులో డ్వాక్రా సంఘాల సభ్యులను ఓ యానిమేటర్ రూ.లక్షల్లో బురిడీ కొట్టించిన విషయం తెలిసిందే. సోమవారం ఉదయం 10 గంటలకు పెద్ద ఎత్తున మహిళలు స్థానిక యూనియన్ బ్యాంకు వద్దకు చేరుకుని తీసుకున్న రుణం ఎంత?, జమ చేసింది ఎంత? పొదుపులో ఎంత నిల్వ ఉందో స్టేట్‌మెంట్ ఇవ్వాలని అధికారులను కోరారు. ఒక దశలో అసహనానికి లోనైన మహిళలు బ్యాంకు ఎదురుగా ఉన్న జాతీయ రహదారిపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. కొద్దిసేపటికి ఎస్సై నాగరాజు అక్కడి చేరుకుని వారితో చర్చించి ఆందోళనను విరమింపజేశారు. అనంతరం ఎస్సై బ్యాంకు అధికారులతో మాట్లాడారు.

యానిమేటర్ పరిధిలో 34 డ్వాక్రా సంఘాలు ఉన్నాయి. వాటిలో 30 సంఘాలకు సంబంధించిన లావాదేవీలు యూనియన్ బ్యాంకులో కొనసాగుతున్నాయి. 17 సంఘాలకు సంబంధించి రూ.57.76 లక్షలు యానిమేటర్ తన సొంతానికి వాడుకున్నట్లు ప్రాథమికంగా గుర్తించామని, విచారణ కొనసాగుతుందని బ్యాంకు మేనేజర్ నాగరమేశ్ ఎస్సైకు వివరించారు. డ్వాక్రా మహిళలు చెబుతున్న వివరాలను బట్టి విచారణ పూర్తయితే స్వాహా చేసిన సొమ్ము మరింత పెరిగే అవకాశం ఉంది.

బ్యాంకు వద్దే పడిగాపులు.. బ్యాంకు ఉన్నతాధికారులు వస్తారని చెప్పడంతో మహిళలు గంటల తరబడి ఉన్నారు. చివరికి భీమవరం నుంచి వచ్చిన అధికారులకు మహిళలు జరిగిన మోసాన్ని వివరించారు. సంఘంలోని సభ్యులు, వారి ఖాతా వివరాల గురించి తెలిసి.. వారికి తెలియకుండా మీరెలా నగదును యానిమేటర్ చెప్పిన ఖాతాలకు మళ్లించారని, ఇదంతా మీకు తెలియకుండానే జరిగిందంటారా? అంటూ బ్యాంకు సిబ్బందిని ప్రశ్నించారు. విచారణ పూర్తి చేసి, న్యాయం చేస్తామని ఉన్నతాధికారులు వారికి హామీ ఇచ్చారు. అప్పటి వరకు తీసుకున్న రుణాలు తిరిగి చెల్లించమని మహిళలు చెప్పడంతో వాయిదాలు క్రమంగా చెల్లించాలని, స్వాహా చేసిన నగదు విషయంలో చర్యలు తీసుకుంటామని సముదాయించారు.

జగన్ తీరు సిగ్గుచేటు: మంత్రి నిమ్మల

పాలకొల్లు, న్యూస్‌టుడే: పరకామణిలో చోరీ వ్యవహారం చిన్నదంటూ వైకాపా అధినేత జగన్ సమర్థించడం సిగ్గుచేటని జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. పాలకొల్లులోని తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. తిరుమల క్షేత్రంలో మాఫియాను నడిపింది జగన్ అంటూ ఎద్దేవా చేశారు. అతనికి ప్రజల కంటే దొంగలు, దోపిడీదారులపైనే ప్రేమ ఎక్కువని తేల్చి చెప్పారు. ప్రజలు ప్రతిపక్ష హోదా లేకుండా చేసినా జగన్ వైఖరిలో మార్పు కనిపించడం లేదని దుయ్యబట్టారు.

స్టెప్పేసి.. సందడి చేసి..

ఈ నెల 25న విడుదల కానున్న శంబాల చిత్ర యూనిట్ భీమవరంలోని ఎస్‌ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం సందడి చేసింది. కథానాయకుడు ఆది, కథానాయిక అర్చన విద్యార్థులతో కలిసి నృత్యం చేశారు. మావుళ్లమ్మను దర్శించుకున్నారు. **- న్యూస్‌టుడే, భీమవరం పట్టణం**

బాగుంటే 4 లేకుంటే 1

ప్రభుత్వ బడుల్లో సామాజిక తనిఖీ

బొర్రంపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

కొయ్యలగూడెం గ్రామీణ, టి.నరసాపురం, భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: పాఠశాలకు ప్రహరీ ఉందా.. దానికి అమర్చిన ప్రవేశద్వారం(గేటు) బాగుందా? మధ్యాహ్న భోజనం ఎక్కడ వండుతున్నారు.. వంటశాల ఎక్కడ ఉంది. మరుగుదొడ్ల వాడకం, వాష్‌బేసిన్ అందుబాటులో ఉందా.. సబ్బు వాడుతున్నారా మొదలైన అంశాలతో పాటు మిగిలిన అన్ని అంశాలను పరిశీలిస్తూ కొన్నిరోజులుగా ప్రభుత్వ పాఠశాలల్లో సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నారు. ఈ సమాచారం ఆధారంగా బడులకు 1 నుంచి 4 వరకు స్థాయిలను నిర్ణయించనున్నారు. అన్నీ బాగుంటే లెవల్ 4, లేకుంటే 1గా పరిగణిస్తారు. ✦ మండల, జిల్లాపరిషత్తు, ఎయిడెడ్, ప్రభుత్వ పాఠశాలలతోపాటు వివిధ గురుకులాలు, సంక్షేమ వసతిగృహాల్లో తనిఖీలు చేస్తున్నారు.

ఏమేం పరిశీలిస్తున్నారంటే: తరగతి గదుల్లో వెలుతురు, విద్యుత్తు సదుపాయం, సరిపడా ఫ్యాన్లు ఉన్నాయా, స్విచ్‌బోర్డులు ఎంత ఎత్తులో ఉన్నాయన్న అంశాలపై ఆరా తీస్తున్నారు. గ్రీన్‌చాక్ బోర్డుల లభ్యత, విద్యార్థులు, ఉపాధ్యాయులకు అవసరమైన బల్లలు, కుర్చీల సంఖ్య, వ్యర్థాల నిర్వహణ, బడి తోట, ఆర్వోప్లాంట్ల పని తీరు, బడి పరిసరాల్లో ప్రమాదాలకు ఆస్కారం ఉన్న కట్టడాలు, గుంతలు, విద్యుత్తు పరికరాలు, అగ్నిప్రమాదాల నుంచి రక్షణ, భద్రత ఏర్పాట్లు, మొదలైన వాటితో పాటు పరీక్షల నిర్వహణ, అదనపు తరగతులు, దూరప్రాంత విద్యార్థుల కోసం తీసుకున్న చర్యలు మొదలైన అంశాలు.

జిల్లా:	ఏలూరు	పశ్చిమగోదావరి
పాఠశాలలు:	1748	1340
క్లస్టర్లు:	111	89
తనిఖీలో పాల్గొంటున్న సీఆర్‌ఎంటీలు	98	94
క్లస్టర్ కాంప్లెక్సు ఛైర్మన్లు	13	-

తల్లిదండ్రుల కమిటీ సమక్షంలో

తల్లిదండ్రుల కమిటీ అధ్యక్షుడు, సభ్యులు, ప్రధానోపాధ్యాయుల సమక్షంలో సీఆర్పీ(సీఆర్ఎంటీ)లు ఆడిట్ వివరాలను చరవాణి యాప్‌లో నమోదు చేస్తున్నారని ఏలూరు సమగ్రశిక్షా సీఎంవో యెహోషువా చెప్పారు.

తేజస్సు లేని మనసు!

యువకుడి దుర్మరణంతో దిక్కులేని తల్లీకూతుళ్లు

ఆమెకు భర్తే తేజస్సు..
అతడికి కుమార్తె ఉషస్సు..
ఆ ఆప్యాయతతో ఉప్పొంగేది మనసు..
ముచ్చటైన కుటుంబం వారిది..
మమతానురాగాల బంధం అల్లుకుంది..
సంతోషాల పొదరిల్లు కట్టుకుంది..
వీరిపై విధికి కన్నుకుట్టింది..
ప్రమాదంలో మృత్యువు కబళించింది..
కుటుంబాన్ని దుఃఖసాగరంలో ముంచింది

భార్య, కుమార్తెతో తేజ(పాత చిత్రం)

దెందులూరు, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. ఏలూరు శివారు చాటపర్రు ప్రాంతం సగర్లపేటకు చెందిన అత్తిలి తేజ(24)కు భార్య, ఏడాది వయసున్న కుమార్తె ఉన్నారు. కూలి పనులు చేస్తూ.. వారిని కంటికి రెప్పలా చూసుకుంటున్నారు. సోమవారం గంగన్నగూడెంలోని మేనమామ ఇంటికి తేజ ద్విచక్ర వాహనంపై వెళ్లారు. ఈ నెలలోనే కుమార్తె తొలి పుట్టిన రోజు ఉండటంతో.. దుస్తులు కొనేందుకు ఇద్దరు వేర్వేరు ద్విచక్ర వాహనాల్లో ఏలూరు బయల్దేరారు. మార్గం మధ్యలోని వేగవరం వద్ద ఏలూరు నుంచి జంగారెడ్డిగూడెం వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ఘటనలో తేజ అక్కడికక్కడే మృతి చెందారు. పెట్రోలు ట్యాంకు నుంచి మంటలు చెలరేగడంతో.. ద్విచక్ర వాహనం పూర్తిగా దగ్ధమైంది. తేజ మృతితో సగర్లపేటలో విషాదం అలముకుంది. ఇక తమకు దిక్కెవరంటూ కుటుంబ సభ్యులు రోదించడం పలువురిని కలచివేసింది. మృతదేహాన్ని సర్వజన ఆసుపత్రి శవాగారానికి తరలించారు. దెందులూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

తీరం.. ఏం చేసింది నేరం

జాడ లేని తాబేళ్లు

ఈనాడు డిజిటల్, భీమవరం, మొగల్తూరు, న్యూస్‌టుడే: ఆలివ్ రిడ్లే తాబేళ్లు.. ఏటా వేల మైళ్ల దూరం ప్రయాణం చేసి తీరంలోని ఇసుక తిన్నెల్లో గుడ్లు పెట్టేందుకు నవంబరులో వచ్చేవి. ఈ ఏడాది డిసెంబరు రెండో వారం వచ్చినా తీరంలో కనిపించడం లేదు.

ఏటా నవంబరు నుంచి మార్చి వరకు గుడ్లు పెట్టే సమయం కావడంతో అర్ధరాత్రి 2 నుంచి ఉదయం 6 గంటల మధ్య ఒడ్డుకు వస్తుంటాయి. తీరానికి సుమారు 50 మీటర్ల దూరంలో ఉన్న ఇసుక దిబ్బల్లో బొరియలు చేసి గుడ్లు పెడుతుంటాయి.

అటువంటి సమయంలోనే బోట్లు, వలలకు తాకి, ఇతర కారణాలతో మృత్యువాత పడుతున్నాయి. ఈసారి ఇంకా రాకపోవడం, కాకినాడ, శ్రీకాకుళం, ఇతర తీర ప్రాంతాల్లో మృత్యువాత పడటంపై పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఏర్పాట్లు ఇవీ.. పెదమైనవానిలంక, చినమైనవానిలంక మధ్య గతేడాది రెండు హేచరీలు ఏర్పాటు చేస్తే ఈసారి మూడు చేశారు. రాత్రి 8 నుంచి 10 గంటలు, తెల్లవారుజామున 3 నుంచి 6 గంటల వరకు తీరంలో తాబేళ్ల జాడను గుర్తించేందుకు ఆరుగురు సిబ్బంది (బీచ్ వాచర్స్)ని మూడు బేస్ క్యాంపుల్లో నియమించారు.

ఎంతో మేలు.. సముద్రంలో ఆక్సిజన్ పెంచడంతో పాటు మత్స్య సంపదను వృద్ధి చేయడంలో తాబేళ్లు కీలకపాత్ర పోషిస్తాయి. చేపగుడ్లు తినే జెల్లీ ఫిష్ జాతిని నియంత్రిస్తాయి. తాబేళ్ల కోసం ముందస్తుగా ఏర్పాట్లు చేసినట్లు అటవీ శాఖ రేంజ్ అధికారి కరుణాకర్ తెలిపారు.

12న ఉద్యోగ మేళా

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: ఏలూరు సమీప ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో జిల్లా ఉపాధి కార్యాలయం, ఎన్‌సీఎస్, నైపుణ్యాభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యాన ఈ నెల 12న ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి రమేశ్ కుమార్ తెలిపారు. అర్హులు https://naipunyam.ap.gov.in/user-registrationలో పేర్లు నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 81848 87146 నంబరును సంప్రదించాలని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

(c) eenadu

కళలు, క్రీడల్లో స్వాతి కిరణాలు

భీమవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: భీమవరానికి చెందిన చిన్నారులు చదువులతోపాటు వివిధ రంగాల్లో తమ ప్రతిభ కనబరుస్తున్నారు. కత్తిసాము, కూచిపూడి, భరత నాట్యం, మల్లఖంబ్, చెస్, అథ్లెటిక్స్ వాటిలో జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయి పోటీల్లో ప్రదర్శనలిస్తూ అవార్డులు, ప్రశంసలు, పతకాలు అందుకుంటున్నారు.

నాట్యమూ.. వైద్యమూ..

చదువుతో పాటు నృత్యంలోనూ తన ప్రతిభను చాటుతున్న కొడమంచిలి సత్యవతి శ్రీజ మూడో తరగతి చదువుతోంది. కూచిపూడి నృత్యం, భరత నాట్యం చేస్తూ తన ప్రతిభతో ఎన్నో అవార్డులు సాధించింది. రాజమహేంద్రవరం, అన్నవరం, భీమవరం, యనమదుర్రు జిల్లా ప్రాంతాల్లో 50 ప్రదర్శనలు ఇచ్చి ప్రశంసలు అందుకుంది. నృత్య కళాకారిణిగా గుర్తింపు పొంది, వైద్యురాలిగా సేవలందించడమే లక్ష్యంగా చెబుతోంది.

దేశం తరఫున..

మూడో తరగతి చదువుతున్న వగిరి విస్సయ కత్తి సాము (ఫెన్సింగ్)లో జాతీయ స్థాయిలో ప్రథమ బహుమతి, జిల్లా, రాష్ట్ర స్థాయిలో సుమారు 75 పోటీల్లో అనేక పురస్కారాలు అందుకుంది. ఇటీవల జాతీయ స్థాయిలో ప్రథమ బహుమతి, స్వర్ణ పతకం సాధించింది. ఇండోనేసియాలో జరగనున్న అంతర్జాతీయ ఫెన్సింగ్ పోటీల్లో ఇండియా తరఫున పోటీపడనుంది.

ఐపీఎస్ లక్ష్యం..

చదరంగంలో చురుకుగా ఉన్న సాదనాల అంజలి తొమ్మిదో తరగతి చదువుతోంది. చదరంగంలో 40 అవార్డులు, మెడల్స్ అందుకుంది. రాజమహేంద్రవరం, విశాఖపట్నం, విజయవాడ, గన్నవరం, ఏలూరు, తాడేపల్లిగూడెం, పాలకొల్లుల్లో జరిగిన పోటీల్లో మెడల్స్ పొందింది. చదరంగంలో గ్రాండ్ మాస్టర్, ఐపీఎస్ అధికారి కావడమే లక్ష్యమని చెబుతోంది.

వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

అర్జీలకు సత్వర పరిష్కారం

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన మీకోసం కార్యక్రమానికి 19 అర్జీలు వచ్చాయని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి తెలిపారు. కుటుంబ కలహాలు, సైబర్ మోసాలు, భర్త, అత్తింటి వేధింపులు, నకిలీ పత్రాలు, ఆస్తి వివాదాలు, ప్రేమ పేరుతో మోసం తదితర ఫిర్యాదులు వచ్చాయన్నారు. వాటిని చట్టపరిధిలో పరిష్కరించి ఆ వివరాలను ఫిర్యాదుదారులకు తెలియజేయాలని సంబంధిత పోలీసు స్టేషన్ అధికారులను ఆదేశించారు. అదనపు ఎస్పీ వి.భీమారావు, సీఐలు కె.వి.వి.ఎస్.సత్యనారాయణ, దేశింశెట్టి వెంకటేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.

గడువులోగా పరిష్కరించండి: జేసీ

జేసీకి సమస్య వివరిస్తున్న మున్సిపల్ వైస్‌ఛైర్మన్ వెంకటరమణ తదితరులు

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: పీజీఆర్ఎస్ అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి గడువులోగా పరిష్కరించాలని జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన అర్జీలు స్వీకరించి అనంతరం అధికారులతో సమావేశం నిర్వహించారు. 198 అర్జీలు వచ్చినట్లు వెల్లడించారు. డీఆర్వో శివన్నారాయణరెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ● జిల్లా కేంద్రాన్ని నరసాపురం మార్చాలంటూ ఆ ప్రాంతానికి చెందిన వివిధ సంఘాల నేతలు, విశ్రాంత ఉద్యోగులు వినతిపత్రం అందించారు. ● నరసాపురం మున్సిపల్ కమిషనర్ అభివృద్ధి పనులకు ఆటంకంగా ఉన్నారని వైస్‌ఛైర్మన్ బర్రె వెంకటరమణ జేసీకి ఫిర్యాదు చేశారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఆమెతో పాటు పలువురు మహిళా కౌన్సిలర్లు కలెక్టరేట్‌కు వచ్చారు. ● మా అమ్మాయిని ఒకరు మోసం చేసి హైదరాబాద్‌కు తీసుకెళ్లారు.. అక్కడ దొంగతనం కేసులు పెట్టి ఆమెను జైల్లో పెట్టారని ఆమె కుటుంబ సభ్యులు, మద్దతుగా వచ్చినవారు తెలిపారు. ఆమెను ఇక్కడికి తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

సెలవు రోజుల్లో పనిభారం తగదు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: సెలవు రోజుల్లోనూ ఉపాధ్యాయులను పనిచేయాలని వేధించడం సరికాదని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.సాయి శ్రీనివాసు అన్నారు. భీమవరంలో సోమవారం నిర్వహించిన జిల్లా కార్యవర్గ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు.

మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సాయి శ్రీనివాసు

ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు తీవ్రమైన ఒత్తిళ్లతో బోధనేతర పనిచేస్తున్నారన్నారు. దీనికి తోడు ఆదివారం కూడా పాఠశాలలకు వచ్చి 100 రోజుల ప్రణాళిక అమలు చేయాలనడం సబబు కాదన్నారు. పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. 12వ పీఆర్సీ కమిటీ నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

నూతన కార్యవర్గం నియామకం.. 2026-28కు ఎస్టీయూ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. జిల్లా అధ్యక్షుడిగా పి.ఆర్.వి.ఎస్ సాయివర్మ, జిల్లా ప్రధాన కార్యదర్శిగా కె.వి.రామచంద్రరావు, ఆర్థిక కార్యదర్శిగా పి.వి.డి.ప్రసాద్, రాష్ట్ర కార్యనిర్వాహకులుగా గుత్తుల శ్రీనివాసు, డి.దావీదును నియమించారు.

పత్తేపురంలో.. తెల్ల కాగితం

నిడమర్రు మండలం పత్తేపురంలో సందడి నెలకొంది. సోమవారం గ్రామంలో తెల్ల కాగితం సినిమా చిత్రీకరణ ప్రారంభమైంది. గ్రామ పంచాయతీ కార్యాలయ పరిసరాల్లో కథానాయకుడు హర్ష రోషన్, కథానాయిక వైష్ణవి, నటుడు అజయ్‌పై పలు సన్నివేశాలు చిత్రీకరించారు. దీన్ని తిలకించేందుకు చుట్టుపక్కల ప్రజలు తరలి రావడంతో గ్రామంలో హడావుడి నెలకొంది.

- న్యూస్‌టుడే, నిడమర్రు

రైతేరాజు

మిశ్రమ సాగు.. ఫలితాలు బాగు..!

కూరగాయల సాగులో లాభాలు పండిస్తున్న రైతు

జంగారెడ్డిగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: వ్యవసాయాన్ని లాభసాటిగా చేయాలనుకున్న ఆ రైతు సంకల్పం నెరవేరింది. కష్టపడ్డాడు.. ఏడాది పొడవునా ఆదాయం గడిస్తున్నారు జంగారెడ్డిగూడెం మండలం వేగవరం గ్రామానికి చెందిన రైతు బొంతు సత్యనారాయణ. స్వతహాగా సత్యనారాయణ వ్యవసాయ కుటుంబం కావడంతో సుమారు 30 ఏళ్లుగా సంప్రదాయ పంటలైన వరి, మొక్కజొన్నతోపాటు జీడిమామిడి, కొబ్బరి, పత్తి తదితరాలు సాగుచేసేవారు. అయితే కొన్ని సందర్భాల్లో సరైన గిట్టుబాటు ధరలు రాకపోవడం, ప్రకృతి వైపరీత్యాలు, ఇతరత్రా కారణాలతో పంట దిగుబడులలో వ్యత్యాసం, విపరీతంగా పెరిగిన కూలీ ఖర్చుల కారణంగా ప్రత్యామ్నాయ పంటలను సేద్యం చేయాలని అనుకున్నారు. ఈ క్రమంలో కూరగాయల సాగు ఆరంభించారు.

మూడెకరాల్లో.. మూడేళ్లుగా.. మూడేళ్లుగా గ్రామ శివారులో మూడెకరాల భూమిని కౌలుకు తీసుకుని అందులో కాకర, వంగ, దొండ ఇతర కూరగాయల పంటలను పండిస్తున్నారు. ఏడాది పొడవునా ఆదాయం వచ్చేలా ప్రత్యేక ప్రణాళిక అమలు చేస్తున్నారు. కాకర విత్తనాలను దొమ్మేరు నుంచి, దొండ మొక్కలను కడియపులంక నుంచి తీసుకొచ్చారు. కాకర నాటిన 45 రోజుల నుంచి కాపు ప్రారంభమై ఆరు నెలల వరకు ఉంటుంది. దొండ మూడేళ్లు, వంగ ఏడాది పాటు దిగుబడి అందిస్తున్నాయి. వీటిని 15 లేదా 50 కిలోల సంచుల్లో నింపి ఖమ్మం, జంగారెడ్డిగూడెంతోపాటు ఇతర మార్కెట్‌లలో రైతు విక్రయిస్తున్నారు. కూరగాయల సాగులో ఉత్తమ సస్యరక్షణ చర్యలను అవలంబిస్తున్నారు. పంటలకు సరైన పద్ధతిలో నీటిని అందించడంతోపాటు మొక్క మొదట్లో పశువుల పెంట, జీవామృతం, ఇతర కషాయాలను వాడుతున్నారు.

ఆదాయం బాగుంది..

'తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం వచ్చేలా రైతులు వ్యవసాయం చేయాలి. ఏకకాలంలో రెండు, మూడు రకాల పంటలను పండిస్తున్నా. వీటివల్ల ఏడాది పొడవునా ఆదాయం వస్తోంది. ఖర్చులు పోనూ ఏడాదికి రూ. 2 లక్షల పైగా ఆదాయం గడిస్తున్నా..' అని రైతు సత్యనారాయణ తెలిపారు.

ఉద్యాన విశ్వవిద్యాలయం న్యూస్‌టుడే

ప్రశ్న: అరటిలో సిగటోక ఆకు పచ్చ తెగులుని ఎలా నివారించాలి. -తాతారావు, వేల్పూరు

సమాధానం: అరటిలో వచ్చే సిగటోక వైరస్ వల్ల ఆకు మచ్చ తెగులు గుర్తించిన వెంటనే మొదటిసారి ప్రొపికొనజోల్ (1 మి.లీ./లీటరు నీటికి), రెండోసారి కార్బండిజమ్+మంకోజెబ్ మిశ్రమం (1 గ్రా/లీటరు నీటికి), మూడోసారి ట్రైఫ్లోక్సీస్ట్రోబిన్+టెబ్యుకొనజోల్ మిశ్రమం (1.4 గ్రా/లీటరు నీటికి), నాలుగోసారి డైఫనో కొనజోల్ 1 మి.లీ/లీటరు నీటికి) పిచికారీ చేసుకోవాలి.

డా. పి.విజయలక్ష్మి, ప్రధాన శాస్త్రవేత్త
కృషి విజ్ఞాన కేంద్రం, వెంకట్రామన్నగూడెం

మీరూ అడగొచ్చు © చరవాణి 73826 33692

మిరప సాగులో నిర్లక్ష్యం వద్దు

పెనుమంట్ర, న్యూస్‌టుడే: మిరప పంటలను ఆశించే తెగుళ్ల విషయంలో రైతులు కాస్త అప్రమత్తం ఉండాలని లేదంటే నష్టం ఎక్కువగా ఉంటుందని ఉద్యాన అధికారి ప్రియదర్శిని తెలిపారు. వివిధ రకాల తెగుళ్ల విషయంలో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై ఆమె వివరించారు. ఎండు తెగులు నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు లేదంటే మెటాలక్సీల్, మంకోజెబ్ రెండు గ్రాములు లీటరు నీటికి కలిపి మొక్కల మొదళ్లలో పోయాలి. ఆకుమచ్చ తెగులు నివారణకు కార్బండజిం ఒక గ్రాము లేదంటే మంకోజెబ్ 2.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. వర్షాలు కురిసిన సందర్భంలో తగ్గిన వెంటనే 19:19:19 లేదంటే 13:0:45 లేదా యూరియా మూడు నుంచి నాలుగు గ్రాములు లీటరు నీటిలో కలిపి పంటపై పిచికారీ చేస్తే మంచిది.

పొగాకులో పురుగుల నివారణ తప్పనిసరి

కొయ్యలగూడెం, న్యూస్‌టుడే: గత నెల రోజులుగా వర్జీనియా పొగాకు తోటలు వేసే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. అయితే ఈ తోటల్లో పురుగుల నివారణకు సరైన యాజమాన్య పద్ధతులను అనుసరించకుంటే పురుగుల ఉద్ధృతికి ఎక్కువై నష్టపోయే పరిస్థితి ఉందని కొయ్యలగూడెం వేలం కేంద్రం సూపరింటెండెంటు గ్రేస్ మార్గరెట్ పేర్కొన్నారు. సస్యరక్షణ చర్యలు సూచించారు. తోటకు పురుగులు పట్టకుండా నాట్లు వేసిన 20 రోజులకు హెక్టారుకు 10-12 చొప్పున లింగాకర్షక బుట్టలు పెట్టాలి. తోట చుట్టూ బంతి మొక్కలను రెండు వరుసల్లో నాటుకుంటే తల్లి రెక్కల పురుగు బంతి పువ్వులపై గుడ్లు పెడుతుంది. వాటి సంతతిని నాశనం చేయడం ద్వారా పొగాకు మొక్కలను కాపాడుకోవచ్చు. హెక్టారుకు 10చొప్పున పక్షి స్థావరాలను ఏర్పాటు చేస్తే పురుగులను నివారిస్తాయి.

లద్దె పురుగు: ఉద్ధృతి ఎక్కువగా ఉంటే 0.5శాతం వేపగింజల కషాయాన్ని.. లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ 5 ఎస్‌జీని 10 లీటర్ల నీటికి 5 గ్రాములు చొప్పున పిచికారీ చేస్తే నివారించవచ్చు.

శనగపచ్చ పురుగు.. పురుగుల ఉద్ధృతి 10 శాతం కంటే ఎక్కువ ఉంటే ఫ్లూబెండియమైడ్‌ను 480 ఎస్‌సీని 2.5 మి.లీ లేదా క్లోరాంట్రనిలిప్రోల్‌ను 18.5 ఎస్‌సీని 3 మి.లీటర్లను 10 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

వరి దుబ్బులు కాలిస్తే నష్టమే అధికం

మార్టేరు, న్యూస్‌టుడే

వరి మోడులను కాల్చడం వల్ల భూమి వేడెక్కి పంట దిగుబడికి అవసరమైన భాస్వరం, పొటాష్, జింక్ నత్రజని, సల్ఫర్ తదితర మూలకాలు నశించి భూసారం తగ్గి దిగుబడిపై ప్రభావం చూపుతుందని మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం పరిశోధనా సహ సంచాలకులు డాక్టర్ టి.శ్రీనివాస్ తెలిపారు. విపరీతమైన పొగ ఏర్పడటంతో కార్బన్ డైఆక్సైడ్ విడుదలై వాయు కాలుష్యంతో పర్యావరణానికి నష్టం వాటిల్లుతోంది. రైతులకు మేలు చేసే వానపాములు, నత్తలు, పీతలు, ఇతర మిత్రపురుగులు వేడికి

చనిపోతాయి. వానపాములు భూమిపై వ్యర్థాలను తిని విసర్జిస్తాయి. దానిలో నత్రజని ఉంటుంది. నత్తలు, పీతలు వరి చేలోని నీటిపై ఉండే దోమల గుడ్లను ఆహారంగా తీసుకుంటాయి. సహజ సిద్ధంగా భూమిలో ఉండే మేలు జాతి సూక్ష్మజీవులు, భాస్వరాన్ని కరిగించే బ్యాక్టీరియా వంటివి అంతమవుతాయి.

ఇలా చేయండి...

దమ్ము చేసే ముందు వరి మోడులకు అయిదు రోజులు పాటు నీరు పెట్టాలి. అనంతరం సూపర్ పాస్ఫేట్, యూరియా చల్లుకోవాలి. సూపర్ పాస్ఫేట్ వరి మోడును కుళ్లేలా, యూరియా మెత్తబడేలా చేసి భూసారం పెంపునకు దోహదపడుతుంది. లేదంటే జీవ నియంత్రణ పద్ధతిలో డికంపోజర్ ద్రావణాన్ని 5 కిలోల బెల్లం, 20లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయడం ద్వారా మోడు కుళ్లుతుంది.

16న సర్వోదయ స్ఫూర్తి కార్యక్రమం

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: సర్వోదయ మండలి నాయకుడు, విద్యా దాత చింతలపాటి వరప్రసాద మూర్తిరాజు జయంతి సందర్భంగా.. నిడమర్రు మండలం పెదనిండ్రకొలనులోని మహాత్మా గాంధీ భవనంలో ఈ నెల 16న సర్వోదయ స్ఫూర్తి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ మండలి ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు తెలిపారు. విద్య, సాంస్కృతిక రంగాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు పురస్కారాల ప్రదానం చేయనున్నట్లు ఆయన సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

టెట్‌లో మినహాయింపు ఇవ్వాలని డిమాండ్

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి.ఎస్.విజయరామరాజు సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 2010కి ముందు నియామకమైన ఉపాధ్యాయుల విషయమై టెట్‌పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రివ్యూ పిటిషన్ వేయాలని కోరుతూ ఈ నెల 9, 10 తేదీల్లో అన్ని తాలూకా కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తామన్నారు. 18న జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం దగ్గర ధర్నా చేస్తామన్నారు.

చీకట్లో అరణ్యరోదన

జాతీయ రహదారిపై దీపాల్లేక కష్టాలు

మండవల్లి, న్యూస్‌టుడే: జాతీయరహదారి 165కి ఇరువైపులా వీధిదీపాలు లేకపోవడం ప్రాణాల మీదకు తెస్తోంది. రోడ్డు విస్తరణ పనులు పూర్తై స్తంభాలను ఏర్పాటు చేసినా ఇప్పటికీ విద్యుత్తు దీపాలు మాత్రం వేయలేదు. ముదినేపల్లి, మండవల్లి మండలాల్లోని పలు గ్రామాలు అంధకారంలో మగ్గుతున్నాయి.

మండవల్లి మండలం కానుకొల్లు, లింగాల, పెరికెగూడెం, మండవల్లి, భైరవపట్నం, ముదినేపల్లి మండల పెదపాలపర్రు, దాకరం, పెయ్యేరు గ్రామాల పరిధిలో 25 కిలో మీటర్ల మేర రోడ్డు నిర్మాణం పూర్తయ్యింది. విశాలంగా రోడ్డు ఉండటంతో వాహనాలు రయ్‌రయ్‌మంటూ పరుగులు పెడుతున్నాయి. అదే స్థాయిలో ప్రమాదాలకు గురవుతున్నాయి. దీనిపై ఎన్‌హెచ్ డీఈ సత్యనారాయణను వివరణ కోరగా రోడ్డు నిర్మాణంతో పాటు వీధి దీపాల బాధ్యత గుత్తేదార్లదేనన్నారు. త్వరలో దీపాలు వేసే అవకాశం ఉందన్నారు.

అంధకారంలో మండవల్లి గ్రామం

ప్రమాదాలు ఇలా..

✦ గతేడాది భైరవపట్నం బస్టాండ్‌కు కూతవేటు దూరంలో రోడ్డుపక్కనే ఉన్న గుట్టను ఢీకొట్టి బాబూరావు(24) మృతి చెందడంతో తండ్రి లేని ఆ కుటుంబం ఉన్న ఒక్క మగదిక్కునూ పోగొట్టుకుని రోడ్డున పడింది.

✦ మూడు నెలల క్రితం రాత్రివేళ ఇస్రో విశ్రాంత శాస్త్రవేత్త చందు వెంకటేశ్వరరావు హైదరాబాద్ నుంచి స్వగ్రామం లింగాలకు కారులో వస్తుండగా ముదినేపల్లి వద్ద అదుపుతప్పి పక్కనే ఉన్న కాలువలోకి దూసుకు పోయింది. వెంకటేశ్వరరావు మృతి చెందారు. భార్యను స్థానికులు కాపాడారు.

✦ మరుసటిరోజే లింగాల సమీపంలో ద్విచక్రవాహన ప్రమాదంలో భీమవరానికి చెందిన వ్యక్తి మృతి చెందారు.

పరీక్ష పే చర్చ దరఖాస్తు గడువు పెంపు

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: ప్రధానమంత్రి నరేంద్రమోదీతో నిర్వహించనున్న పరీక్ష పే చర్చ-2026 దరఖాస్తు గడువును జనవరి 11 వరకు పొడిగించినట్లు తూర్పుగోదావరి జిల్లా దూబచర్ల డైట్ ప్రధానాచార్యురాలు ఎం.కమలకుమారి తెలిపారు. అన్ని యాజమాన్యాల పాఠశాలల విద్యార్థులు అర్హులని చెప్పారు. పరీక్ష పే చర్చకు నోడల్ అధికారిగా డీఈవో, సమన్వయకర్తగా తాను వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు innovateindia.mygov.in వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఏం బాగోలేదు

★ రెవెన్యూ ఉద్యోగుల పనితీరుపై ఐవీఆర్ఎస్‌లో అసంతృప్తి

★ దిద్దుబాటు చర్యలకు అధికారుల కసరత్తు

ఈనాడు డిజిటల్, భీమవరం: ఐవీఆర్ఎస్ విధానంలో ప్రజల నుంచి సేకరిస్తున్న అభిప్రాయాల ద్వారా రెవెన్యూ శాఖలో వేళ్లానుకున్న నిర్లక్ష్యం, అవినీతి, అక్రమాలు వెలుగు చూస్తున్నాయి. భూముల రీసర్వేలో సర్వేయర్లు నిబంధనలు పాటించకపోవడం, నోటీసులు ఇవ్వకుండా వారి ఇష్టానుసారం వ్యవహరించడం, పట్టాదారు పాస్ పుస్తకాలకు మామూళ్లు అడగడం, క్షేత్రస్థాయి పర్యటనల్లో అక్రమాలకు పాల్పడటంపై ప్రజలు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల తరబడి సమస్య పరిష్కారానికి నోచుకోకపోవడంతో నేరుగా అర్జీదారులకే ఫోన్లు చేసి విషయం తెలుసుకుంటున్నారు. దాంతో కొందరి ఉద్యోగుల తీరే దానికి కారణమని తెలుస్తోంది. ఈ క్రమంలో ఆచంట నియోజకవర్గంలోని కొందరు ఉద్యోగుల తీరుపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేయడంతో దిద్దుబాటు చర్యలకు ఉన్నతాధికారులు కసరత్తు చేపట్టారు.

నియోజకవర్గంలో మండలాధికారుల తీరు చర్చనీయాంశంగా మారింది. ఓ మండలాధికారి పంట బోదెలు, కాలువల ఆక్రమణలపై రైతులు ఫిర్యాదు చేసినా క్షేత్రస్థాయి పర్యటనలో కనీసం కారు దిగి పరిశీలన చేసిన దాఖలాలు లేవు. ఇక పట్టాదారు పాస్ పుస్తకానికి ఓ ధర నిర్ణయించారు. మరో మండలంలో సేవలను బట్టి ఉంటుంది. నియోజకవర్గంలోని పరిస్థితిపై ఇటీవల కొందరు రాష్ట్రస్థాయిలో నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేయడంతో జిల్లా యంత్రాంగం కదిలింది.

అర్జీలపై ఆరా.. భూవివాదాలు, పట్టాలివ్వకపోవడం, తప్పుగా పేరు నమోదవడం, దస్తావేజుల్లో తప్పులు, కుల, ఆదాయ ధ్రువ పత్రాలు, అడంగల్ ఇతరత్రా వాటిపై ప్రజలకు సేవలందించాలి. సంబంధిత ఉద్యోగులు సమాచారం ఇవ్వకపోవడం, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోకపోవడం, కొందరు మామూళ్లు ఇవ్వకపోవడంతో ఆలస్యం చేయడం, ఇతరత్రాపై ఫిర్యాదులు అందాయి. క్షేత్రస్థాయిలో వచ్చిన అర్జీల పరిష్కారం, తీసుకున్న చర్యలపై ఆర్డీవో, జేసీలు గత నాలుగు రోజులుగా ఆరా తీస్తున్నారు. దస్త్రాలను పరిశీలిస్తున్నారు. సమన్వయ లోపంతోనే ఇలా జరిగిందని, ఉద్యోగులకు కౌన్సెలింగ్ ఇస్తున్నామని ఆర్డీవో దాసిరాజు తెలిపారు.

కీచక ఉపాధ్యాయుడిపై సస్పెన్షన్ వేటు

భీమవరం గ్రామీణ, న్యూస్‌టుడే: భీమవరం మండలం గొల్లవానితిప్ప ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడు బి.సుధీర్‌బాబును విద్యాశాఖ ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. అసభ్యంగా ప్రవర్తిస్తూ, లైంగిక వేధింపులకు గురి చేశాడంటూ విద్యార్థులు గ్రామస్థులతో కలిసి ఇటీవల మూకుమ్మడిగా ఫిర్యాదు చేశారు. దానిపై విచారణ చేసిన అధికారులు ఆరోపణలు నిజమని తేలడంతో తాజాగా చర్యలు తీసుకున్నారు. సస్పెన్షన్ ఉత్తర్వులను సదరు ఉపాధ్యాయుడికి పంపినట్లు ఉప విద్యాశాఖాధికారి రమేశ్ సోమవారం వెల్లడించారు.

తాతని చూడటానికి వెళ్తొస్తూ.. మృత్యు ఒడికి..

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: తాతని చూడటానికి వెళ్లి తిరిగొస్తున్న యువకుడిని ట్రాక్టర్ రూపంలో మృత్యువు కబళించింది. ద్వారకాతిరుమల పోలీసుల కథనం ప్రకారం.. కామవరపుకోట మండలం వడ్లపల్లికి చెందిన కంచర్ల తనూజ్ కుమార్ (25) ఆయిల్‌పామ్ లోడింగ్ పాయింట్ వద్ద పని చేస్తున్నారు. సోమవారం సూర్య చంద్రరావుపేటలో ఉంటున్న తాతని చూసేందుకు వెళ్లారు. అనంతరం ద్విచక్ర వాహనంపై తనూజ్‌కుమార్ ఇంటికి బయల్దేరారు. మార్గం మధ్యలో గుండుగొలను కుంట వద్దకు వచ్చే సరికి ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో తనూజ్‌కుమార్ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు.

రాష్ట్రస్థాయి రోడ్ రన్ పోటీలకు 22 మంది

తణుకు, న్యూస్‌టుడే: జిల్లా అండర్-16, 18, 20 బాలురు, బాలికలు, పురుషులు, మహిళలు క్రాస్ కంట్రీ (రోడ్ రన్) జట్ల ఎంపికలు సోమవారం స్థానిక డీమార్ట్ రోడ్డులో నిర్వహించినట్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సంకు సూర్యనారాయణ తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 200 మంది క్రీడాకారులు హాజరవ్వగా ఉత్తమ ప్రతిభ కనబరచిన 22 మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎంపికైన జట్లు ఈ నెల 24న పెద్దాపురంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాయన్నారు.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)
(కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -130 రిటైల్ ధర 157 చికెన్ విత్ స్కిన్ - 228, చికెన్ స్కిన్‌లెస్ - 259. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 149, 158, 169 చికెన్ విత్ స్కిన్ - 284 చికెన్ స్కిన్‌లెస్ - 294.

మాస్టర్ అథ్లెటిక్స్‌లో పతకాలు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: జాతీయస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ ఓపెన్ మీట్‌లో పశ్చిమగోదావరి జిల్లా సహాయ మలేరియా అధికారి యాతం నాగబాబు పతకాలు సాధించారు. ఈ పోటీలు సికింద్రాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయ క్రీడా మైదానంలో ఈ నెల 7న జరిగాయన్నారు. 1500 మీటర్లలో వెండి పతకం, 400, 800 మీటర్ల పరుగులో కాంస్య పతకాలు సాధించినట్లు ఆయన సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2013 నుంచి ఇప్పటి వరకు 68 పతకాలు సాధించానన్నారు.

గంగానమ్మ సేవలో.. వ్యాసాశ్రమ పీఠాధిపతి

పవరుపేట(ఏలూరు నగరం), న్యూస్‌టుడే: పవరుపేట గంగానమ్మ జాతర వైభవోపేతంగా సాగుతోంది. ఇందులో భాగంగా తిరుపతి జిల్లా ఏర్పేడులోని వ్యాసాశ్రమ పీఠాధిపతి పరిపూర్ణానందగిరి స్వామిజీ, ఉత్తరాధికారి అసంఘానంద స్వామిజీ మేడలోని అమ్మవార్లను సోమవారం దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు వారికి జాతర కొలుపుల కమిటీ అధ్యక్షుడు మామిళ్లపల్లి పార్థసారథి, సభ్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామిజీలు భక్తులనుద్దేశించి ప్రసంగించారు. వారి వెంట కళా రత్న కేవీ సత్యనారాయణ, జవ్వాజి మోహన విఠల్, ఘంటా బాజ్జీ, గారపాటి వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఇక్కడికొస్తేనే రోగమొచ్చేలా ఉందే..

భీమవరం ప్రాంతీయ ఆసుపత్రి ఆవరణలో దుర్వాసన వెదజల్లుతోంది. దాదాపు 8 మండలాల నుంచి నిత్యం 350 మందికి పైగా రోగులు పరీక్షలకు వస్తారు. 100 పడకల ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు, వారి బంధువులతో రద్దీగా ఉంటుంది. ఆసుపత్రి ఆవరణ నుంచి గదుల్లోకి వెళ్లాలంటే దుర్వాసన భరించాలి. రోగులు ఉండేచోట శౌచాలయాలు శుభ్రం చేయకపోవడంతో ముక్కుపుటలు అదిరేలా దుర్వాసన వస్తోందని రోగులు, వారి బంధువులు వాపోతున్నారు. వందలాది మంది రోగులు వచ్చే ఆసుపత్రి వర్గోన్నతి పొందినా.. సరిపడా పారిశుద్ధ్య సిబ్బంది లేరు. కేవలం 8 మంది మాత్రమే ఉన్నారు. ఉన్న కొద్ది మందికీ పనిభారం పెరిగిందని, వేతనాలు కూడా మూడు నెలలుగా చెల్లించలేదని సిబ్బంది వాపోతున్నారు. ఇదిలా ఉంటే ఆసుపత్రిలోని రేకుల షెడ్డుల్లో ఉందామంటే అవీ భయ పెడుతున్నాయి. రేకులు విరిగిపోయి, కర్రలు ఊడి పడుతున్నాయి.

- న్యూస్‌టుడే, భీమవరం పట్టణం

భీమవరం ప్రాంతీయ ఆసుపత్రి ఆవరణలో ఇలా..

ఊడి పడేలా రేకులు

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

JOBS

Wanted Managers to Motivate Team/ Targets/ Salary upto 50K/ Tanuku/ age above 30Yr/ must Insurance Exp. © 98494 21277.

అమెరికాలో 1 సం|| బాబు ఆలన, పాలన వ్యక్తిగత సంరక్షణ కొరకు అనుభవంగల ఆడవారు కావలెను. అమెరికా వీసా కల్గినవారు మాత్రమే. © 9440803362

ఏలూరులో ప్రముఖ జనరల్ ఇన్సూరెన్స్, లైఫ్‌ఇన్సూరెన్స్ కంపెనీలో పార్ట్/ఫుల్‌టైమ్ వర్క్ చేయుటకు ఎగ్జిక్యూటివ్స్, గృహిణిలు, రిటైర్డ్ ఎంప్లాయిస్ కావలెను. ఆకర్షణీయమైన జీతం. © 78932 35972.

ఆర్మీ NAVY ఎయిర్‌ఫోర్స్ రైల్వే, SSC, బ్యాంకులలో ఉద్యోగావకాశాలు. అర్హత:10th-డిగ్రీ. Age:16-25. శిక్షణ 3నెలలు శిక్షణాకాలంలో హాస్టల్, 10th, ఇంటర్, డిగ్రీ డిస్టెన్స్ కోర్సులు కలవు. *ముందుగా ఎటువంటి ఫీజులేదు * క్రిస్టియన్ ఎడ్యుకేషన్ అకాడమీ, వైజాగ్. 9121232328.

MARKETING/ SALES

విజయవాడ- ఏలూరు హైవేఫేసింగ్, అమరావతి ORR Exitకి సమీపంలో అప్రూవుడ్ లేఅవుట్ వెంచర్‌కు ఉత్సాహవంతులైన మార్కెటింగ్ లీడర్స్ M/F కావలెను. సంప్ర. © 99125 12356.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనలద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటన కర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ గోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గ్రుడ్డు ధర రూ. 6.50 పై॥
తణుకు ఆఫీసు: 08819-224254

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం
CLASSIFIEDS

92.7 FM Rajamahendravaram
92.7 Mee FM
ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

భీమవరం

• భీమవరం • ఉండి

గణపతికి విశేష అభిషేకాలు

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: పట్టణంలో గణపతి ఆలయాల్లో స్వామికి సోమవారం విశేషాభిషేకాలు నిర్వహించారు. పంచారామ క్షేత్రం ఎదుట ఉన్న విద్యా గణపతి ఆలయంలో ఉదయం పంచామృతాలతో అభిషేకాలు, సాయంత్రం విశేష పుష్పాలంకరణ, సహస్ర నామ పూజలు భక్తుల సహకారంతో చేసినట్లు ఆలయాభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. ● కొత్త బస్టాండ్ వెనుక ఉన్న వరసిద్ధి వినాయక ఆలయం, జంక్షన్ రైల్వే స్టేషన్‌కు వెళ్లే రహదారిలో ఉన్న గణపతి ఆలయంలో స్వామికి విశేష పూజలు, అలంకరణలు చేశారు.

ఉపన్యసించి.. అవగాహన పెంచి..

'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీలు

బహుమతులు ఇస్తున్న సంస్కార్ పాఠశాల యాజమాన్యం

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: 'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీలను భీమవరంలోని సంస్కార్ ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో సోమవారం నిర్వహించారు. 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై జరిగిన ఉపన్యాస పోటీలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇందులో తొమ్మిదో తరగతి విద్యార్థులు ఎ.షణ్ముఖ మహేశ్, ఎం.అక్షయ్, బి.వెంకట సాయిలక్ష్మి వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. పాఠశాల డైరెక్టర్లు నందమూరి వి.కె.రాజేశ్, ఎన్.నాగప్రశాంతి బహుమతులు అందజేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

భీమవరం పట్టణం: 80085 74471	10 AM to 1 PM
భీమవరం మండలం: 80085 74533	వీరవాసరం: 80085 74475
పాలకోడేరు: 80085 74467	ఉండి: 80085 74526
ఆకివీడు: 80085 74525	కాళ్ల: 94401 04042

ఆకివీడు, న్యూస్‌టుడే: ? ఆకివీడు మండలం కాళింగగూడెంలోని 5వ వార్డు పరిధిలో సుమారు రెండేళ్లగా అల్ప విద్యుత్తు సమస్య ఉంది. సమస్య పరిష్కారం కోసమని నెల రోజుల కిందట ఒక చిన్న (16 కేవీ డబ్బా) పరివర్తకాన్ని ఏర్పాటు చేశారు. కానీ దానికి ఇప్పటికీ కనెక్షన్ ఇవ్వలేదు. - **బి.వెంకన్న, స్థానికుడు**

✔ పరివర్తకానికి కనెక్షన్ ఇచ్చి వినియోగంలోకి తీసుకొస్తాం. అల్ప విద్యుత్తు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. - **శ్రీనివాసరావు, ఏడీఈ, విద్యుత్తుశాఖ**

? ఆకివీడులోని మల్లింపు రహదారి వెంబడి పలు చోట్ల చెత్త పారబోస్తూ తగలబెడుతున్నారు. ఇబ్బందులు పడుతున్నారు. - **రామకృష్ణ**

✔ చెత్త తొలగింపజేస్తాం. తగలబెట్టకుండా చర్యలు తీసుకుంటాం. - **సాకేత్‌బాబు**

ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్, ఆకివీడు

భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: ? జువ్వలపాలెం రోడ్డు ప్రధాన రహదారి గుంతలమయమై రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. - **సత్తిబాబు**

✔ మరమ్మతులకు ప్రతిపాదనలు పంపించాం. - **రామరాజు, డీఈ, ర.భ.శాఖ**

పాలకోడేరు, న్యూస్‌టుడే: ? మోగల్లు అమ్మవార్ల ఆలయం వద్ద రోడ్డు పక్కన చెత్త, వ్యర్థాలను సమీపంలోని పంట కాలువలో పడేయడంతో కాలువ దాదాపు పూడిపోయింది. కాలువలో చెత్త, వ్యర్థాలను తొలగించే చర్యలు తీసుకోవాలి. - **టి.శ్రీనివాసరావు**

✔ చెత్త, వ్యర్థాలను తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. - **బి.గోపి, ఇన్‌ఛార్జి కార్యదర్శి**

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: ? రోడ్డుపై చెత్త తీయడం లేదు. డ్రెయిన్లు దుర్వాసన వస్తున్నాయి. - **లక్ష్మి గృహిణి**

✔ ఆయా ప్రాంతాలను పరిశీలించి చెత్త లేకుండా పనులు చేయిస్తాం. - **ఎ.రాంబాబు, సహాయ కమిషనర్**

? ఉండి రోడ్డులో తాగునీటి ఇబ్బందులున్నాయి. ట్యాంకర్ల కోసం వేచి ఉండాల్సి వస్తోంది. - **లక్ష్మీనారాయణ, ప్రైవేటు ఉద్యోగి**

✔ ఉండి రోడ్డు, ఆరేటి నగర్ తదితర ప్రాంతాలకు ట్యాంకర్లు వెళ్తున్నాయి. గతం కంటే ట్రిప్పుల సంఖ్య పెంచాం. - **కె.రామచంద్రారెడ్డి, కమిషనర్**

ఎప్పుడూ ఇలానే.. ప్రక్షాళన చేయకుండానే

పల్లెల్లో అధ్వానంగా మురుగు కాలువలు

భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: భీమవరం నియోజకవర్గంలో అధిక శాతం మురుగు కాలువలు అధ్వానంగా మారాయి. వైకాపా పాలకులు ఐదేళ్ల పాటు వాటిని పట్టించుకోకపోవడంతో సుమారు 8 వేల ఎకరాల్లో రైతులు సాగుకు దూరమయ్యారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పరిస్థితిలో పాక్షికంగా మార్పు వచ్చినా.. ఇప్పటికీ పూర్తి స్థాయి ప్రక్షాళన జరగలేదు. చేలల్లో మురుగునీరు బయటికి వెళ్లే మార్గం లేక వరి పంట తీవ్రంగా దెబ్బతింటుంది. ఖరీఫ్ సీజన్ అయితే పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. ఇప్పటికైనా సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకుని వరి పంటను రక్షించాలని రైతులు కోరుతున్నారు.

నియోజకవర్గంలో ఇలా..

మండలాలు	2 (భీమవరం, వీరవాసరం)
వరి విస్తీర్ణం	19 వేల ఎకరాలు
సమస్య తీవ్రంగా ఉన్న కాలువలు	11

● వీరవాసరం మండలంలో పొలమూరు, తుక్కోడు మురుగు కాలువలు దారుణంగా ఉన్నాయి. వీటి వెంబడి 11 వేల ఎకరాల్లో వరి సాగు జరుగుతోంది. తోలేరు, పడమటపాలెం, మత్స్యపురి తదితర గ్రామాల్లోనూ కాలువలు అధ్వానంగా ఉన్నాయి.

ఉండి రాయలం డ్రెయిన్ దుస్థితి. దీని పరిధిలో నాలుగు వేల ఎకరాల వరి ఆయకట్టు ఉంది. తూడు, కిక్కిసతో నిండిపోయింది. ఫలితంగా నీరు దిగువకు వెళ్లే మార్గం లేక వందల ఎకరాల్లో సాగును రైతులు విరమించుకున్నారు. చినఅమిరం పరిధిలో పరిస్థితి మరింత దారుణంగా ఉంది.

'కాలువల ప్రక్షాళనకు ప్రతిపాదనలు తయారు చేస్తున్నాం. ఆ తర్వాత నీటి సంఘాల ఆధ్వర్యంలో ఆ పనులు వచ్చే మే నెలలో చేపట్టే అవకాశం ఉంది.' అని డ్రెయినేజీ శాఖాధికారులు తెలిపారు.

న్యాయవాదులకు రక్షణ చట్టం తీసుకురావాలి

అజయ్‌కుమార్‌కు డైరీ అందజేస్తున్న న్యాయవాదులు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: న్యాయవాదులపై పెరుగుతున్న దాడుల నేపథ్యంలో వారికి రక్షణ కల్పించేలా చట్టం చేయాలని భారత న్యాయవాదుల సంఘం(ఐ.ఎ.ఎల్) రాష్ట్ర అధ్యక్షుడు చలసాని అజయ్‌కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం భీమవరం వచ్చిన న్యాయవాదులతో మాట్లాడారు. 1982లో స్థాపించిన ఐ.ఎ.ఎల్ న్యాయవాదుల హక్కుల కోసం పోరాడుతోందన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.న్యూటన్, ఐఏఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్ రంగారావు, పట్టణ అధ్యక్షుడు వై.వి.ఆనంద్, బి.శివయ్య తదితరులు పాల్గొన్నారు.

ఖాళీల భర్తీకి వినతి

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: పదో తరగతి విద్యార్థులకు 100 రోజుల ప్రణాళిక పూర్తిస్థాయిలో జరిగేలా ఆయా పాఠశాలల్లోని ఉపాధ్యాయుల ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్.ఎల్.వి.ఎస్ చలం, ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు సోమవారం డీఈవో ఇ.నారాయణకు వినతిపత్రం ఇచ్చారు. వందరోజుల ప్రణాళికలో ఆదివారం తరగతులు ఉపసంహరించుకోవాలన్నారు.

హోంగార్డుల సేవలు ప్రశంసనీయం

సన్మానం అందుకున్న వారితో ఎమ్మెల్యే రామాంజనేయులు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: పోలీసు శాఖలో హోంగార్డుల సేవలు ప్రశంసనీయమని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. హోంగార్డుల దినోత్సవ కార్యక్రమంలో భాగంగా నిర్వాహకులు కంతేటి వెంకట్రాజు, ఆకనపల్లి బాలుబ్రహ్మాజీ తదితరుల ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన 20 మందిని సన్మానించారు. భట్టిప్రోలు శ్రీనివాసు, కొండ్ర శ్రీనివాసు పాల్గొన్నారు.

మావుళ్లమ్మ సన్నిధిలో 'శంబాల' చిత్ర బృందం

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: భీమవరం మావుళ్లమ్మ ఆలయాన్ని శంబాల చిత్రం హీరో ఆది, హీరోయిన్ అర్చన, నటుడు ఇంద్రనీల్ తదితరులు సోమవారం దర్శించుకున్నారు. ప్రధానార్చకుడు మల్లికార్జునశర్మ వారితో పూజలు చేయించి అమ్మవారి ఆశీర్వాదం, శేషవస్త్రం అందించారు. అంతరాలయంలో వేదాశీర్వాదం, ప్రసాదం అందించినట్లు ఆలయ సహాయ కమిషనర్ బి.ఎం.నగేష్ తెలిపారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో హీరో ఆది మాట్లాడుతూ.. సినిమాకు కంటెంట్ బాగుంటేనే ప్రేక్షకుల ఆదరణ లభిస్తుందని, అలాంటి ప్రత్యేక కంటెంట్‌తో ఈనెల 25న శంబాల చిత్రంతో వస్తున్నామన్నారు.

ఆశీర్వాదం పొందుతున్న సినీ నటులు ఆది, అర్చన, ఇంద్రనీల్ తదితరులు

తూడు తొలగింపు

ఉండి, న్యూస్‌టుడే: చిలుకూరు నుంచి వెలివర్రు వచ్చే పంట కాలువలో తూడు తొలగింపు పనులు ఎట్టకేలకు చేపట్టారు. ఈనెల అయిదో తేదీన 'మేమున్నాం.. మీకు తోడుగా' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన సమస్యకు జలవనరులశాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకున్నారు. పంట కాలువలో తూడుతో పాటు మట్టి, ఇతర వ్యర్థాల తొలగింపు పనులు చేపట్టారు.

పీఆర్‌టీయూ మండల శాఖ ఎంపిక

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: పీఆర్‌టీయూ భీమవరం మండల శాఖ ఎంపికైంది. పి.ఎ.రవికిరణ్ అధ్యక్షతన భీమవరంలో సోమవారం జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు హాజరై కమిటీ వివరాలు వెల్లడించారు. మండల శాఖ అధ్యక్షుడిగా డి.రాజేశ్, ప్రధాన కార్యదర్శిగా అడబాల సత్యనారాయణ, గౌరవ అధ్యక్షుడిగా కె.వరప్రసాద్, సహ అధ్యక్షుడిగా ఎం.రాజేశ్, పి.ఎ.వి.సత్యనారాయణ, కార్యదర్శులుగా ఇ.రాజా రత్నకుమార్, ఎం.చెన్నకేశ్, మహిళా కార్యదర్శిగా ఎ.సునంద, ఉపాధ్యక్షురాలిగా ఎం.పద్మసునీత నియమితులయ్యారు.

'హఠాత్తుగా పొమ్మంటే ఎక్కడికి వెళ్లాలి'

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: దశాబ్దాలుగా కుమ్మరిచెరువు గట్టుపై జీవిస్తున్న మమ్మల్ని తక్షణం ఖాళీ చేయాలంటున్నారంటూ భీమవరం మండలం దిర్సుమర్రుకు చెందిన పలువురు మహిళలు వాపోయారు. ఆ విషయంపై కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహించారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు.

విద్యార్హత పత్రాల్లో పేర్లు సరి చేయాలని ధర్నా

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: గత విద్యాసంవత్సరంలో పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణులైనవారి విద్యార్హత పత్రాల్లో తల్లిదండ్రుల పేర్లు ఇంటి పేర్లు వెంటనే సరిచేయాలని విద్యార్థులు కోరారు. ఈ మేరకు పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో భీమవరంలోని ఏఐఆర్‌టీ ఉన్నత పాఠశాల దగ్గర సోమవారం ఆందోళన నిర్వహించారు. ఇదే విషయాన్ని జిల్లా విద్యాశాఖాధికారుల దృష్టికి గతంలోనే తీసుకెళ్లామన్నారు. ఇప్పటి వరకు పరిష్కారం కాలేదని వాపోయారు. విషయం తెలుసుకుని పాఠశాల వద్దకు వచ్చిన డీఈవో రమేశ్ విద్యార్థులతో మాట్లాడారు. సమస్యను త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

బాధ్యతల స్వీకరణ

కాళ్ల (భీమవరం సాంస్కృతికం), న్యూస్‌టుడే: కాళ్ల మండలం జీవీడబ్ల్యూఎస్ అధికారిగా బాలకృష్ణమోహన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఆయన కాళ్ల మండలం సీసలి గ్రామ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. ఉద్యోగోన్నతి లభించడంతో మండలంలోని పలువురు కార్యదర్శులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.

ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం ప్రారంభం

పాలకోడేరు, న్యూస్‌టుడే: ఎన్‌ఎస్‌ఎస్ శిబిరాన్ని గ్రామస్థులు సద్వినియోగం చేసుకోవాలని పెన్నాడ బైట్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ కె.సురేశ్ కోరారు. పెన్నాడలో కళాశాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎన్‌ఎస్‌ఎస్ ప్రత్యేక శిబిరాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ నెల 14 వరకు నిర్వహించే శిబిరంలో మెగా వైద్య శిబిరం, పాఠశాల విద్యార్థులకు అవగాహన, స్థానికులకు డిజిటల్ మోసాలు, పోలీస్ చట్టాలపై అవగాహన కల్పించడంతో పాటు ఆరోగ్య పరిస్థితులపై ఇంటింటా సర్వే నిర్వహిస్తామని సమన్వయకర్త ఏబీఎస్ఆర్ మనోహర్ తెలిపారు. డీన్ బాస్కరరావు, కార్యదర్శి వెంకట్రాజు, సర్పంచి అనూష తదితరులు పాల్గొన్నారు.

పెన్నాడలో ఇంజినీరింగ్ విద్యార్థుల ర్యాలీ

మహాసభల విజయవంతానికి పిలుపు

భీమవరం (గ్రామీణ), న్యూస్‌టుడే: విశాఖపట్నంలో డిసెంబరు 31 నుంచి జనవరి 4 వరకు జరిగే సీఐటీయూ మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా కమిటీ సభ్యుడు బంజెట్టి శ్రీనివాస్ కోరారు. ఆ కార్యక్రమ గోడప్రతులను ఆయన సోమవారం భీమవరం మండలం వెంపలో ఆవిష్కరించి మాట్లాడారు. కసుమూరి కృష్ణంరాజు, తోట శిబారావు పాల్గొన్నారు.

వీరవాసరం, న్యూస్‌టుడే: అయిదు రోజుల పాటు విశాఖపట్నంలో జరిగే సీఐటీయూ మహాసభలను విజయవంతం చేయాలని నాయకులు వీరవాసరంలో సోమవారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా గోడపత్రికలను ఆవిష్కరించారు. అంజనేయులు, వరలక్ష్మి, సత్యవతి పాల్గొన్నారు.

అపరిచిత వ్యక్తులతో జాగ్రత్త

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: అపరిచిత వ్యక్తుల విషయంలో విద్యార్థినులు జాగ్రత్త వహించాలని చైల్డ్ వెల్ఫేర్ అసోసియేషన్ సీసీ మమత సూచించారు. ఆ సంస్థ, పోలీసు శాఖ సంయుక్త ఆధ్వర్యంలో పాలకొల్లు బీఆర్‌ఎంబీఎం, సుభాష్ చంద్రబోస్ ఉన్నత పాఠశాలల్లో సోమవారం అవగాహన సదస్సులు నిర్వహించారు.

జాగ్రత్తలతో క్షయ నివారణ

పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే: లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యురాలు ఎం.నవ్యజీవన్ ఆధ్వర్యంలో టీబీ ముక్తి భారత్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు.

డివైడర్‌ను ఢీకొని కారు పల్టీ

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమలలో ఓ ప్రైవేటు లాడ్జి ఎదురుగా సోమవారం రాత్రి పెను ప్రమాదం తప్పింది. ఆకివీడుకు చెందిన ఓ భక్తుడు ద్వారకాతిరుమల శ్రీవారి దర్శనానికి కారులో వచ్చారు. స్వామి దర్శనానంతరం అతను తిరిగి స్వగ్రామం బయలుదేరారు. ఘటనా స్థలం వద్దకు వచ్చే సరికి ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో కారు పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఏమీ కాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

యువతి అదృశ్యం

ఉండి, న్యూస్‌టుడే: అర్తమూరులో అమ్మమ్మ ఇంటికొచ్చిన 22 ఏళ్ల యువతి రెండ్రోజుల కిందట అదృశ్యమైన ఘటనపై కేసు నమోదైందని పోలీసులు తెలిపారు. మహదేవపట్నం గ్రామానికి చెందిన ఆ యువతి నెల రోజుల నుంచి అర్తమూరులోని అమ్మమ్మ ఇంట్లో నివాసముంటోంది. ఈనెల ఆరో తేదీ రాత్రి ఇంట్లో అందరూ నిద్రపోయిన తరువాత అదృశ్యమైందని, దర్యాప్తు చేసి ఆచూకీ కనుగొనాలని ఆమె తండ్రి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

వివాహిత.. **భీమవరం పట్టణం, న్యూస్‌టుడే:** కుమార్తె ఆచూకీ లేదని అందిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశామని భీమవరం రెండో పట్టణ ఎస్సై రెహమాన్ తెలిపారు. ఏలూరు జిల్లా భుజబలపట్నానికి చెందిన వివాహిత భీమవరంలోని ఆసుపత్రికి వెళ్తున్నానని చెప్పి ఈ నెల 2న వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. చుట్టుపక్కల, బంధువుల ఇళ్ల దగ్గర వెతికినా.. ఎలాంటి ఆచూకీ లేకపోవడంతో బాధిత మహిళ తండ్రి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రేషన్ డీలర్లపై కేసులు

భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: భీమవరం పట్టణంలోని పలు రేషన్ దుకాణాల్లో అధికారులు సోమవారం తనిఖీలు చేశారు. 21 దుకాణాల్లో తనిఖీలు చేయగా.. ఏడు చోట్ల సరకు నిల్వల్లో వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించారు. ఆ డీలర్లపై 6ఏ కేసులు నమోదు చేసినట్లు పౌరసరఫరాల డీటీ సురేశ్ తెలిపారు.

ప్లాస్టిక్ వ్యర్థాలతో ఆరోగ్యానికి ముప్పు

భీమవరం గ్రామీణ, న్యూస్‌టుడే: విష్ణు కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ఆధ్వర్యంలో భీమవరం మండలం కొవ్వాడలో సోమవారం స్థానిక పాఠశాల విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ప్లాస్టిక్ వ్యర్థాలతో కలిగే అనారోగ్య సమస్యల గురించి అవగాహన కల్పించారు. కళాశాల, పాఠశాల ప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

గుంతలు.. రాకపోకలకు ఇక్కట్లు

తోలేరు ఆర్‌అండ్‌బీ రహదారి గుంతలమయంగా మారింది. దశాబ్ద కాలం కిందట రూ.32 లక్షలతో దీనిని అభివృద్ధి చేశారు. మరమ్మతులకు గురయినప్పుడల్లా అధికారులు తాత్కాలిక పనులతో సరిపెడుతున్నారు. దీంతో ఈ రహదారి పరిస్థితి మరింత దయనీయంగా మారింది. ఆర్‌అండ్‌బీ ఏఈ డీఎస్ఎన్.మూర్తి మాట్లాడుతూ.. తోలేరు రహదారి అభివృద్ధికి రూ.4 కోట్లతో అంచనాలు తయారు చేసి ఉన్నతాధికారులకు పంపామన్నారు. అప్పటి వరకూ ఆర్‌అండ్‌బీ సాధారణ నిధులతో తాత్కాలిక మరమ్మతులు చేసేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. - **న్యూస్‌టుడే, తోలేరు (వీరవాసరం)**

తవ్వారు.. వదిలేశారు..

నిత్యం విద్యార్థులు, వివిధ వాహనాలతో రద్దీగా ఉండే రెస్టు హౌస్ రోడ్డు ప్రధాన రహదారి పక్కన పైపు లీకేజీ మరమ్మతు నిమిత్తం గోతులు తీసి వదిలేశారు. సుమారు నెల రోజులు కావస్తున్నా.. మరమ్మతులు చేయకుండా తీసిన గోతులు పూడ్చకుండా.. అలానే వదిలేశారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో నీరు వృథా అవుతోందని చెబుతున్నారు. పురపాలక నీటి సరఫరా విభాగం ఏఈ టి.సురేంద్ర మాట్లాడుతూ.. సిబ్బంది కొరతతో ఆలస్యమైంది, లీకేజీ సమస్య వెంటనే పరిష్కరిస్తామన్నారు. - **న్యూస్‌టుడే, భీమవరం, గునుపూడి**

ముందుకొచ్చి.. అందుబాటులోకి తెచ్చి..

పనులు చేస్తున్న కార్మికులు

సుమారు ఏడేళ్ల నుంచి వాంద్రంలో నిర్మాణ దశలోనే నిలిచిన గ్రామ సమైక్య భవనానికి కొత్త వెలుగొచ్చింది. ఆగిన పనులు పూర్తిచేసేందుకు ఆ గ్రామ సర్పంచి, తెదేపా గ్రామ అధ్యక్షుడు దాసరి వెంకటకృష్ణ ముందుకొచ్చారు. కొబ్బరికాయ కొట్టి సోమవారం పనులు ప్రారంభించారు. గ్రామంలో ఏదైనా సమావేశం నిర్వహించాలన్నా.. ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నా.. శ్లాబ్ వేసి వదిలేసిన గ్రామ సమైక్య భవనమే ప్రధాన ఆధారం. ఫ్లోరింగ్, ప్లాస్టింగ్‌లతో పాటు మరుగుదొడ్ల వంటి సౌకర్యాలు కల్పించని ఈ భవనాన్ని పూర్తి చేయాలనే స్వయం సహాయక సంఘాల ప్రతినిధుల అభ్యర్థనతో పనులు చేయిస్తున్నానని దాత వెంకటకృష్ణ తెలిపారు. తుది మెరుగులు దిద్దే పనులకు దాదాపు రూ.1.50 లక్షల వరకూ ఖర్చవుతోందని ఆయన తెలిపారు. - **న్యూస్‌టుడే, వాంద్రం (ఉండి)**

సమస్యలు పరిష్కరించాలని ఆందోళన

భీమవరం వన్‌టౌన్, వీరవాసరం, న్యూస్‌టుడే: సహకార సంఘాల ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు సోమవారం జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల ఆందోళనలు నిర్వహించారు. నెల రోజులపాటు దశల వారీగా ఆందోళనలు చేయనున్నట్లు జిల్లా నాయకుడు నందమూరి సుబ్బారావు తెలిపారు. ఉద్యోగుల క్రమబద్ధీకరణ, ఉద్యోగ విరమణ వయసు పెంపు, వేతన సవరణ, గ్రాట్యుటీ చెల్లింపు తదితర డిమాండ్లను నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది ఎస్.ప్రసాద్, పి.అఖిల్, లింగం శ్రీనివాసరావు, యాళ్లబండి శ్రీనివాసరావు, అడబాల రామలింగేశ్వరరావు, మేడిది గణపతి రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

వీరవాసరం: నినాదాలు చేస్తున్న ఉద్యోగులు

సైబర్ నేరం.. ఆరుగురి అరెస్టు

ఎండాడ, న్యూస్‌టుడే: అంతర్జాతీయ సైబర్ ముఠాలకు బ్యాంకు ఖాతాలు అందించి నేరాలకు పాల్పడుతున్న ఆరుగురు నిందితులను సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేశారు. ఎంవీపీ కాలనీలో నివసిస్తున్న ఎ.రజనికుమారి(63)కి ఈ ఏడాది మే నెలలో మోహన్‌కుమార్ అనే వ్యక్తి నుంచి ఫోన్ కాల్ వచ్చింది. హవాలా లావాదేవీలకు సంబంధించి మీపై కేసు నమోదైందని, అన్ని ఆధారాలు ఉన్నాయని భయపెట్టాడు. ఆమెను అరెస్టు చేస్తామని బెదిరించి విషయం పరిష్కరించాలంటే నగదు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. ఇది జరిగిన రెండు రోజుల తర్వాత వెంకట్రామన్ అనే వ్యక్తి ఫోన్ చేసి డబ్బు చెల్లించకపోతే ముంబయి స్టేషన్‌లో డివిజన్ కారాగారంలో పెడతామని చెప్పాడు. వరుస బెదిరింపులకు భయపడిన ఆమె తన బ్యాంకు ఖాతా నుంచి రజత్‌కశ్యల్ పేరుతో ఉన్న ఖాతాకు రూ.8.50 లక్షలు ఆన్‌లైన్‌లో నగదు పంపించారు. మరింత నగదు ఇవ్వాలని డిమాండ్ చేయడంతో తాను మోసపోయినట్లు తెలుసుకుని సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులకు అనకాపల్లి జిల్లాకు చెందిన ఎం.నరసింగరావు, బాపట్ల జిల్లా కూచిపూడి వాసి జంపాల సందీప్, కాకినాడ జిల్లా సామర్లకోటకు చెందిన వి.సత్యనారాయణ, గుంటూరు జిల్లా వాసి డి.బాలఫణికుమార్, పశ్చిమగోదావరి జిల్లా భీమవరం నివాసితుడు జవ్వాడి రామాంజనేయులు, కాకినాడ పట్టణానికి చెందిన నార్ని సతీష్‌చంద్రను అరెస్టు చేశారు. వీరంతా పలువురు వ్యక్తులకు నగదు ఆశ చూపి వారి నుంచి టెలిగ్రాం ఛానల్ ద్వారా కరెంటు ఖాతాలు తెరచి సైబర్ ముఠా సభ్యులకు అప్పగిస్తున్నట్లు గుర్తించారు. ఆరుగుర్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సైబర్ క్రైం పోలీసులు పేర్కొన్నారు.

పూర్తయితేనే విముక్తి

రోజురోజుకీ అధికమవుతున్న ప్రయాణికుల కష్టాలు

ఉండి, న్యూస్‌టుడే: ఉండిలో 165 జాతీయ రహదారిపై నిర్మాణ దశలో ఉన్న రైల్వే పైవంతెన(ఆర్వోబీ) నిర్మాణం పూర్తయ్యే వరకూ ప్రయాణికుల కష్టాలకు విముక్తి లభించేలా లేదు. ఈ పనులు చేపట్టి ఇప్పటికే అయిదేళ్లు పూర్తయ్యాయి. ఇటీవల పనులు చురుగ్గా సాగుతున్నా.. తరచూ రెండు, మూడు వారాల చొప్పున రైల్వే గేటును పూర్తిగా మూసేస్తున్నారు. దీంతో ఇటుగా రాకపోకలు సాగించే వారు పడే అవస్థలు అన్నీ ఇన్నీ కావు.

ఉండిలో ఆర్వోబీ గేటు వద్ద ఇబ్బందులు పడుతున్న మహిళలు

చుట్టూ తిరిగి వెళ్తూ.. నిత్యం 30 వేలకు పైబడే వాహనాలు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటాయి. వర్షాలతో ఖరీఫ్ పంట అధిక చోట్ల దెబ్బతింది. ఆ పంట మాసూళ్లు, మిల్లులకు తరలించే సమయంలో రైల్వే గేటును వారం రోజులుగా మూసేశారని రైతులు వాపోతున్నారు. దీంతో ధాన్యాన్ని చుట్టూ తిప్పి వాహనాల్లో తీసుకెళ్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇదే అదనుగా.. దగ్గర గ్రామాలకు రాకపోకలు సాగించేందుకు ఆటోలే ప్రధాన ఆధారమవుతున్నాయి. ఇదే అదనుగా భావించి వారు అధిక ధరలు వసూలు చేస్తున్నారని ప్రయాణికులు చెబుతున్నారు. రాబోయేది క్రిస్మస్, కొత్త సంవత్సరం, సంక్రాంతి పండగల సీజన్ కావడంతో జనవరి నెలాఖరు వరకూ మరోసారి రైల్వే గేటు వేయకుండా చూడాలని అధికారులను కోరుతున్నారు. రైల్వే ట్రాక్‌కు చేర్చి నిర్మాణాలు జరుగుతున్న సమయాల్లో గేటు మూయాల్సి వస్తోందని అధికారులు తెలిపారు.

పతకాలు సాధించిన విద్యార్థులతో శిక్షకుడు సాయిబాబు

కరాటేలో బాలల ప్రతిభ

వీరవాసరం, న్యూస్‌టుడే: ఇటీవల తూర్పు గోదావరి జిల్లా అనపర్తిలో జరిగిన ఏపీ అటల్‌జీ రాష్ట్ర స్థాయి కరాటే టోర్నమెంట్‌లో వీరవాసరం అల్టిమేట్ అడ్వాన్స్ షోటోకాన్ కరాటే సంస్థ విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు శిక్షకుడు కడలి సాయిబాబు సోమవారం తెలిపారు. గ్రామానికి చెందిన సబ్బారపు కేశవ, సబ్బారపు నికిత్, గుడాల లక్ష్మణ్, గుల్లిపల్లి యాన్విత, సబ్బారపు డింపుల్, పంజా హేమశ్రీ, కామిశెట్టి గౌతమ్, 7, 8, 10, 12 సంవత్సరాల విభాగాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో పతకాలు సాధించినట్లు తెలిపారు. సోమవారం వీరవాసరంలో జరిగిన కార్యక్రమంలో బాల బాలికలను పలువురు ప్రముఖులు అభినందించారు.

జిల్లా స్థాయి పోటీల్లో సత్తా

ఆకివీడు, న్యూస్‌టుడే: ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా శనివారం భీమవరం డీఎన్ఆర్ కళాశాలలో సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి పారా ఒలింపిక్స్ క్రీడా పోటీలలో ఆకివీడు బాలుర ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. పరుగు పందెం, షాట్‌పుట్, డిస్కస్ త్రోలో విజేతలుగా నిలిచిన విద్యార్థులు పి.అలేఖ్య, సాయిదుర్గ, పి.సాయి, అయ్యప్ప, ముత్యాలరావు, ఎన్.క్రాంతిని సోమవారం ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు. ప్రధానోపాధ్యాయుడు పి.నాయుడు, ప్రత్యేక విద్యా ఉపాధ్యాయురాలు బ్రైటీ బ్యూలా తదితరులు పాల్గొన్నారు.

విజేతలతో ఉపాధ్యాయులు

రామకృష్ణను అభినందిస్తున్న పీడీ, ఉపాధ్యాయులు

అథ్లెటిక్స్‌లో మూడు బంగారు పతకాలు

పాలకోడేరు, న్యూస్‌టుడే: భీమవరంలో జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్‌లో మోగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి కె.రామకృష్ణ మూడు బంగారు పతకాలు సాధించినట్లు హెచ్‌ఎం త్రినాథులు తెలిపారు. 100 మీటర్ల రన్నింగ్, షాట్‌పుట్, డిస్కస్ త్రోలో ప్రతిభ చాటి మొదటి స్థానంలో నిలిచినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థి రామకృష్ణను గ్రామస్థులు, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

మారథాన్‌లో మెరిసి

సత్యప్రసాద్‌ను అభినందిస్తున్న ఎస్పీ

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: మారథాన్‌లో భీమవరం జిల్లా పోలీసు కేంద్రంలోని ఏఆర్ కానిస్టేబుల్ శీలబోయిన వెంకట సత్యప్రసాద్ ప్రతిభ కనబరిచారు. విశాఖపట్నంలో నవంబరు 30న నిర్వహించిన 32 కిలోమీటర్ల మారథాన్‌లో 5000 మంది ఔత్సాహికులు పాల్గొన్నారు. దీనిని 2.58 గంటల్లోపు పూర్తి చేసిన సత్యప్రసాద్‌ను ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, అదనపు ఎస్పీ వి.భీమారావు, అధికారులు జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో అభినందించారు. ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్‌కు గన్‌మేన్‌గా సత్యప్రసాద్ విధులు నిర్వహిస్తున్నారు.

వేలం ప్రకటన

మహారాజశ్రీ భీమవరం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో

E.P.: 3/2024 in O.S.No. 32/2016

DHR: లక్కు శ్రీనివాసరావు

JDR: ఇళ్ళ త్రిమూర్తులు

ది. 22-12-2025వ సం.రం. తేదీన ఈ నెంబర్ JDR తాలూకు యీ దిగువ షెడ్యూల్ దాఖలా ఆస్తిని పై కోర్టులో ఉదయం 10-30 ని.లకు పై కోర్టు వారు వేలం జరిపెదరు. కావలసినవారు సదరు వేలములో పాల్గొని వేలం పాట పాడుకొనవలెను.

వేలం కావలసిన E.P. షెడ్యూల్ దాఖలా ఆస్తి వివరం

W.G.Dt., Bhimavaram District Registry, Bhimavaram Sub-Registry, Palakoderu Mandal, Goraganamudi Grampanchayat Area, Goraganamudi village, RCC building in an extent of 113.43 Sq. Yds. or 95 Sq. Mts. in R.S.No. 238 is bounded by:
East: Site of Illa Rambabu, **South:** Joint Lane, **West:** Site of Illa Yedukondalu, **North:** Water Tank.

With in the above boundaries, RCC building in an extent of 113.43 Sq. Yds. or 95 Sq. Mts. with all easementary rights therein etc.,

Approximate value of DHR: Rs. 5,00,000/-
Court Field asst. Value: 22,00,000/-

Sd/- **K.V.Ramesh,** Pennada
Advocate for D.H.R.

(c) eenadu

నరసాపురం

• నరసాపురం • పాలకొల్లు • ఆచంట

చర్యలు కోరుతూ డీఎస్పీకి వినతి

నరసాపురం, న్యూస్‌టుడే: నరసాపురం పురపాలక కార్యాలయంలో ఈ నెల 6న ఛైర్‌పర్సన్ బర్రె శ్రీవెంకటరమణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో తమను కార్యాలయం లోపల ఉంచి గేటు వేసిన కూటమి పార్టీ కౌన్సిలర్లపై చర్యలు కోరుతూ సోమవారం వైకాపా సభ్యులు అధికారులకు వినతిపత్రాలు అందించారు. పురపాలక కమిషనర్‌ను ప్రభుత్వానికి సరెండర్ చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. నరసాపురంలో డీఎస్పీ శ్రీవేదఅరవిందకు, భీమవరం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావినతుల పరిష్కార వేదికలో వినతిపత్రాలు అందించారు. ఛైర్‌పర్సన్ బర్రె శ్రీవెంకటలక్ష్మి, వైస్‌ఛైర్‌పర్సన్ కామన నాగిని, కౌన్సిలర్లు కామన రామసీత, సోమరాజు దుర్గాభవాని, పతివాడ పద్మ, అడిదల శ్యామల, కస్తూరి ఇందిర, సిర్రా కాంతమ్మ, రాజేష్‌కన్నా, సఖినేటిపల్లి సురేశ్ తదితరులు ఫిర్యాదు చేసిన వారిలో ఉన్నారు.

బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

క్రీడల్లో దివ్యాంగ విద్యార్థుల ప్రతిభ

పోడూరు, న్యూస్‌టుడే: భీమవరంలో సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి దివ్యాంగుల క్రీడా పోటీల్లో పోడూరులోని భవిత కేంద్రం విద్యార్థులు ప్రతిభ చూపి బహుమతులు సాధించినట్లు హెచ్ఎం ఆకుల కల్యాణి తెలిపారు. పరుగు విభాగంలో పి.భాగ్యలక్ష్మి, ఎం.దీవెన, షాట్‌పుట్‌లో ఎన్ ఫణీంద్ర, ఎం.దిలీప్‌కుమార్ బహుమతులు సాధించారన్నారు. వీరు డీఈవో నారాయణ, ఇతర అధికారుల నుంచి పతకాలు ప్రశంసాపత్రాలు అందుకున్నట్లు తెలిపారు.

సాంకేతిక నైపుణ్యాలతో ఉజ్వల భవిత

'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు

బహుమతులు అందుకున్న విద్యార్థులతో కళాశాల అధ్యాపకులు

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థులు అధునాతన సాంకేతిక పరిజ్ఞానంలో నైపుణ్యం సాధిస్తే ఉజ్వల భవిష్యత్తు సొంతమవుతుందని అధ్యాపకులు పేర్కొన్నారు. నరసాపురం పట్టణంలోని శ్రీ సూర్య జూనియర్ కళాశాలలో విద్యార్థులకు 'ఈనాడు' ఆధ్వర్యంలో సోమవారం ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'కృత్రిమ మేధ (ఏఐ) వల్ల భవిష్యత్తులో వచ్చే మార్పులు' అనే అంశంపై నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ చూపారు. ఈ పోటీల్లో తెలగంశెట్టి లక్ష్మీ దీప్తి (జూనియర్ ఎంపీసీ), దొంగ సత్యమనోజ్ఞ (జూనియర్ ఎంపీసీ), కొట్టు ఇందు (సీనియర్ బైపీసీ) వరుసగా తొలి మూడు స్థానాల్లో నిలిచారు. కళాశాల కరస్పాండెంట్ ఘంటసాల బ్రహ్మాజీ, ప్రిన్సిపల్ యు.లక్ష్మీకాంత్, బి. రామచంద్ర రెడ్డి విజేతలకు బహుమతులు అందజేశారు.

శ్రీ చైతన్య పాఠశాలలో.. నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: నరసాపురం శ్రీ చైతన్య ఆంగ్ల మాధ్యమ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో కె. దినేశ్ (తొమ్మిదో తరగతి), ఎం.కృపాకుమార్ (ఎనిమిదో తరగతి), సీహెచ్ భవిజ్ఞ (ఎనిమిదో తరగతి) వరుసగా తొలి మూడు స్థానాల్లో నిలిచారు. ప్రధానోపాధ్యాయుడు బి.జె.వి.వి.వేణుగోపాలరావు, డీన్ పి.కృష్ణంరాజు, ఎం.లక్ష్మీభవాని విజేతలకు బహుమతులు అందజేశారు.

పాలకొల్లు పట్టణంలో.. పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: పాలకొల్లు మాంటిస్సోరిస్ జూనియర్ కళాశాలలో 'కృత్రిమ మేధ (ఏఐ) వల్ల భవిష్యత్తులో వచ్చే మార్పులు' అనే అంశంపై నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో 20 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఎం.విజయలక్ష్మి, బి.కల్యాణి, వై.ధనలక్ష్మి వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరికి కళాశాల డైరెక్టర్ కె.వి.కృష్ణవర్మ, ప్రిన్సిపల్ ఎన్.షణ్ముఖసాయి, అధ్యాపకురాలు యు.శైలజ బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

✦ పాలకొల్లు ఎల్ఆర్‌పేటలోని మాంటిస్సోరిస్ ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో 24 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఎం.లక్ష్మి (9వ తరగతి), వై.గ్రీష్మ (8వ తరగతి), ఎంజే దేవి(7వ తరగతి) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరికి డైరెక్టర్ కె.వి.కృష్ణవర్మ, హెచ్ఎం కె.కిశోర్ బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

కుర్రాళ్లకు సరదా.. కన్నోళ్లకు వ్యథ!

రోడ్డు ప్రమాద బాధితుల్లో విద్యార్థులే ఎక్కువ

✪ మార్టేరు - బ్రాహ్మణ చెరువు రహదారిలో ఆలమూరు వద్ద ఇటీవల ఓ బాలుడు ద్విచక్ర వాహనంతో ఆటోను ఢీకొట్టాడు. తీవ్ర గాయాలపాలైన అతడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతివేగమే ఈ ప్రమాదానికి కారణం.

✪ ఈ ఏడాది అక్టోబరులో తణుకు పట్టణానికి చెందిన ముగ్గురు యువకులు ఒకే ద్విచక్ర వాహనంపై పేరుపాలెం బీచ్‌కు వెళ్తూ దిగమర్రు వద్ద ఎదురుగా వచ్చిన ట్యాంకర్‌ను ఢీకొట్టారు. ఈ ఘటనలో 19 ఏళ్ల యువకుడు మృతి చెందగా, 17 ఏళ్ల వయసున్న మరో ఇద్దరు తీవ్ర గాయాలపాలయ్యారు.

పాలకొల్లు మార్కెట్, పెనుమంట్ర, నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: పిల్లలు అడిగిందే తడవుగా కొందరు తల్లిదండ్రులు వారికి అధునాతన బైకులు కొని ఇస్తున్నారు. మరి కొందరు డ్రైవింగ్ లైసెన్సు లేని విద్యార్థులకు ద్విచక్ర వాహనాలు ఇచ్చి కళాశాలలకు పంపుతున్నారు. దీంతో వారు ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారం బైకులు నడిపి ప్రమాదాలకు కారణమవుతున్నారు. ఇలాంటి ప్రమాదాల్లో కొందరు మృత్యువాత పడుతుండగా.. మరికొందరు వైకల్యాలకు గురై భవిష్యత్తును కోల్పోయి కన్నవారికి తీరని వేదన మిగులుస్తున్నారు. ప్రమాదాలకు గురైన మైనర్లు గాయాలతో ఆసుపత్రులో ఉండగానే తల్లిదండ్రులను జత చేస్తూ కేసులు నమోదు చేయాల్సిన పరిస్థితిపై పోలీసులు కూడా ఆవేదన చెందుతున్నారు.

ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ముగ్గురు యువకులు

● పాలకొల్లు, నరసాపురం, ఆచంట నియోజకవర్గాల పరిధిలో ఈ ఏడాది ఆరంభం నుంచి జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మైనర్లు మృత్యువాత పడగా, మరో 12 మంది గాయాలపాలైనట్లు పోలీసులు చెబుతున్నారు. కేసులు నమోదు కాని ఘటనలు దీనికి రెట్టింపు ఉంటాయని అంచనా.

● నరసాపురం పోలీసులు సీతారామపురం వద్ద ఈ నెల 4న తనిఖీలు నిర్వహించగా లైసెన్సు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడుపుతూ దాదాపు 20 మంది విద్యార్థులు (మైనర్లు) పట్టుబడ్డారు. ఈ విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులకు పోలీసు సబ్‌డివిజన్ కార్యాలయం వద్ద డీఎస్పీ శ్రీవేద అరవింద కౌన్సెలింగ్ నిర్వహించారు.

జన్మదిన శుభాకాంక్షలు
ఆచంట నియోజకవర్గ శాసనసభ్యులు మరియు మాజీ మంత్రివర్యులు శ్రీ పితాని సత్యనారాయణ గార్కి జన్మదిన శుభాకాంక్షలు.
గూడూరి జె.జె. నాగరాజు
AE. ఇన్‌ఛార్జి
APEPDCL, పెనుమంట్ర

సంఘ సభ్యులతో కలిసి కేకు కోస్తున్న నాయకర్

దివ్యాంగుల సంక్షేమానికి కార్యాచరణ

నరసాపురం, న్యూస్‌టుడే: కూటమి సర్కారు దివ్యాంగుల సంక్షేమానికి ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తోందని ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ అన్నారు. దివ్యాంగుల కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల ప్రకటించిన ఇంద్రధనస్సు పథకాలపై హర్షం వ్యక్తం చేస్తూ పట్టణంలో ఎన్టీఆర్ ఘాట్‌లో మదర్‌థెరిసా దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కేకు కోసి దివ్యాంగులకు పంపిణీ చేశారు. జనసేన పట్టణ అధ్యక్షుడు కోటిపల్లి వెంకటేశ్వరరావు, సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు చిక్కాల చిన్న, మైలా వసంతరావు, వలవల నాని, దేశినీడి గంగాధర్, వాతాడి కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

బీమాతో బాధిత కుటుంబాలకు అండ

నరసాపురం, న్యూస్‌టుడే: తెదేపా సభ్యత్వం ఉన్న వారికి కల్పించిన బీమా బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తోందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు అన్నారు. 31వ వార్డుకు చెందిన కొండేటి జాన్ ఇటీవల మృతిచెందారు. ఆయన కుటుంబ సభ్యులకు సోమవారం బీమా పరిహారం చెక్కు అందించారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార కార్పొరేషన్ ఛైర్మన్ కొల్లు పెద్దిరాజు, ఏఎంసీ ఛైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పాలూరి బాబ్జి, కొప్పాడ రవీంద్రనాథ్‌ఠాగూర్, నాగిడి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే సహించం

సిబ్బందికి సూచనలిస్తున్న ఆనందబాబు

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు వర్తింపజేసే విషయంలో గ్రామ సచివాలయ సిబ్బంది అలసత్వం వహిస్తే సహించబోమని మండల గ్రామ సచివాలయాధికారి బి. ఆనందబాబు స్పష్టం చేశారు. చిట్టవరంలో గ్రామ సచివాలయాన్ని ఆయన సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బంది పనితీరుపై ఆరాతీశారు. సంక్షేమ పథకాలు అమలుతీరుతో పాటు కౌశలం, తల్లికి వందనం, సిటిజన్ ఈకేవైసీ, ఈ-సర్వీసెస్, గోదావరి క్రీడోత్సవ రిజిస్ట్రేషన్లపై సమీక్షించారు. సిబ్బంది విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పని చేయాలని సూచించారు.

సమస్యలు పరిష్కరించాలంటూ ధర్నా

తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న ఆయాలు

పెనుగొండ, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దారు కార్యాలయ ఆవరణలో ధర్నా చేశారు. అనంతరం తహసీల్దారు జి.అనిత కుమారికి వినతిపత్రం అందించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మండలంలో 62 పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలకు ఏడేళ్ల నుంచి రూ.6 వేల చొప్పున వేతనాలు ఇస్తున్నారన్నారు. కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, ఏకరూప దుస్తులు అందించాలని, పీఎఫ్, ఈఐఎస్ఐ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ✦ ఆయాల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పెనుగొండ ఎంఈవో డి.శుభాకరరావుకు సీఐటీయూ నాయకులు వినతిపత్రం అందించారు.

జన్మదిన శుభాకాంక్షలు
ఆచంట నియోజకవర్గ శాసనసభ్యులు మరియు మాజీ మంత్రివర్యులు శ్రీ పితాని సత్యనారాయణ గార్కి జన్మదిన శుభాకాంక్షలు.
మాముడూరు LSCS
ఛైర్‌పర్సన్ : బైరిశెట్టి దుర్గారావు
పర్సన్స్ : దేవ త్రిమూర్తులు, దారపురెడ్డి కృష్ణ
C.E.O: G. ఏడుకొండలు & సిబ్బంది

జన్మదిన శుభాకాంక్షలు
ఆచంట నియోజకవర్గ శాసనసభ్యులు మరియు మాజీ మంత్రివర్యులు శ్రీ పితాని సత్యనారాయణ గార్కి జన్మదిన శుభాకాంక్షలు.
శ్రీమతి G. వరలక్ష్మి, D.E.E, R&B, తణుకు
A. యశ్వంత్, A.E.E, R&B, తణుకు
T.R.V. ప్రసాద్, A.E, R&B, పెనుగొండ

జన్మదిన శుభాకాంక్షలు
మాకు అత్యంత ఆప్తులు, మా మార్గదర్శకులు, మాజీ మంత్రివర్యులు, ఆచంట శాసనసభ్యులు శ్రీ పితాని సత్యనారాయణ గార్కి జన్మదిన శుభాకాంక్షలు.
శ్రీ పితాని సత్యనారాయణ గారు
మాజీ మంత్రివర్యులు, శాసనసభ్యులు, ఆచంట
SSN గోల్డెన్ సిటీ, వెంచర్స్ & ఫిష్ ట్యాంక్స్
SSN మూర్తి, గుండుగొలను, 99089 14444 - S.రామలక్ష్మి
లీలా కనకమణి పార్వతి జానా సురేష్ బాబు (శిరి ట్రావెల్స్)
నాగస్వాతి పితాని భానుచందర్

చికిత్స పొందుతూ మృతి

మొగల్తూరు, న్యూస్‌టుడే: ఉపాధి లేదని మనస్తాపంతో కలుపు మందు తాగిన యువకుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటనపై సోమవారం కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ కేఎస్‌పీ సుభాని తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సీతారామపురం సౌత్ పరిధి పిల్లిపేటకు చెందిన కూర్మ ఆనందకుమార్(25) ఉపాధి నిమిత్తం గల్ఫ్‌వెళ్లారు. అక్కడ పనులు చేయలేక ఇటీవల తిరిగి వచ్చారు. ఇక్కడ కూడా ఏ పనీ చేయలేకపోవడంతో మనస్తాపానికి గురై ఈ నెల 2న కలుపు నివారణ మందు తాగారు. కుటుంబ సభ్యులు అతడిని నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చగా... చికిత్స పొందుతూ మృతిచెందారు. దీనిపై ఆయన తండ్రి ఆదినారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

దివ్యాంగులం.. ఏ పనీ చేయలేం

భీమవరం కలెక్టరేట్, రుస్తుంబాద (నరసాపురం), న్యూస్‌టుడే: అవయవాలు సక్రమంగా లేని మేము ఏ పని చేయలేం.. భారమంతా కుటుంబ సభ్యులే భరిస్తున్నారు. ప్రభుత్వం నుంచి తగిన సాయం అందించి ఆదుకోవాలి. ఇదీ పలువురు దివ్యాంగులు కలెక్టరేట్ వరకు వచ్చి ఉన్నతాధికారులకు విన్నవించారు. నరసాపురం రెవెన్యూ డివిజన్ కార్యాలయంలోనూ పలువురు తమ సమస్యలపై అర్జీలు ఇచ్చారు .

✦ నాకు పోలియో వల్ల రెండు కాళ్లు పని చేయవు. ఇప్పుడిస్తున్న ఆరు వేల పింఛన్‌తో జీవనం కష్టంగా ఉంది. రూ.15వేలు ఇప్పించాలి. కొడుకు, కోడలు సాయంతో ఇక్కడి వరకు వచ్చాను.

- తోట నాగశ్రీను, మేడపాడు(పాలకొల్లు)

ఆదుకోవాలంటూ అధికారులకు వినతులు

నేను నిలబడలేను.. నడవలేను. ఇప్పుడిస్తున్న ఆరు వేల పింఛను చాలక ఇబ్బందిగా ఉంది. రూ.15వేల పింఛను ఇప్పించాలి.

- మేలే డేవిడ్‌జార్జ్ ప్రైస్, పెనుగొండ

✦ గ్రామంలో కాలువ పక్కన 20 ఏళ్ల కిందట ఇళ్లు నిర్మించుకుని జీవిస్తున్నాం. ఎలాంటి ప్రత్యామ్నాయం చూపకుండా ఇళ్లు తొలగించాలంటూ పంచాయతీ అధికారులు నోటీసులు ఇచ్చారు.

- కవురు సీతమ్మ, లిఖితపూడి

✦ మా ప్రాంతంలో ఓ రైతు కాలువగట్టు ఆక్రమించారు. దీంతో పొలాలకు వెళ్లే మార్గం లేకుండా పోయింది.

- గుబ్బల సత్యనారాయణ, కేపీపాలెంనారు

వృద్ధురాలి మెడలో గొలుసు చోరీ

మొగల్తూరు, న్యూస్‌టుడే: వృద్ధురాలి మెడలో గొలుసును దుండగుడు లాక్కుని పరారయ్యాడు. ఎస్సై వై.నాగలక్ష్మి తెలిపిన సమాచారం ప్రకారం.. కేపీపాలెంనార్త్ పోతాబత్తులవారిమెరకకు చెందిన పోతాబత్తుల రామలక్ష్మి సోమవారం కొబ్బరి ఈనెలు తీస్తుండగా ద్విచక్రవాహనంపై గుర్తుతెలియని వ్యక్తి వచ్చాడు. ఈనెలు, తేగలు కొనుగోలు చేస్తానంటూ బేరమాడాడు. ఇంతలోనే అకస్మాత్తుగా ఆమె మెడలో రెండు కాసుల బంగారు గొలుసు లాక్కొని ద్విచక్ర వాహనంపై పరారయ్యాడు.

వ్యాన్‌ను ఢీకొట్టిన ఆటో.. ఇద్దరికి గాయాలు

పోడూరు, న్యూస్‌టుడే: ఆగి ఉన్న వ్యాన్‌ను ప్రయాణికులతో వెళ్తున్న ఆటో ఢీకొట్టిన ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. పాలకొల్లు పట్టణానికి చెందిన షేక్ షకీలా ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి ఆటోలో అత్తిలి వెళ్లి తిరిగి వస్తుండగా పోడూరు మండలం జగన్నాథపురం వద్ద ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో షేక్ షకీలాతో పాటు మరొకరికి గాయాలయ్యాయి. స్థానికులు వారిని పాలకొల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

స్వచ్ఛత వట్టిమాటే!

ములపర్రు శివారు పితానివారిపాలెంలో పాఠశాల సమీపాన పేరుకుపోయిన వ్యర్థాలు

పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే: పర్యవేక్షణ లేమితో పల్లెల్లో పారిశుద్ధ్య నిర్వహణ దిగజారుతోంది. అధిక శాతం గ్రామాలకు పూర్తిస్థాయి కార్యదర్శులు లేకపోవడంతో పారిశుద్ధ్య, ఇతర నిర్వహణ పనులు సజావుగా సాగడం లేదు. ఒక్కో కార్యదర్శి రెండు, మూడు గ్రామాల బాధ్యతలు చూస్తుండటంతో వారు ఎప్పుడు, ఎక్కడ అందుబాటులో ఉంటారో తెలియని పరిస్థితి నెలకొంటుంది. దీంతో క్షేత్ర స్థాయి సిబ్బందిపై ఎలాంటి పర్యవేక్షణ ఉండటం లేదు. పెనుగొండ మండలంలో నడిపూడి, ములపర్రు, రామన్నపాలెం, పెనుగొండ గ్రామాల్లో కార్యదర్శులు లేకపోవడంతో ఇన్‌ఛార్జి అధికారులతోనే కాలం వెళ్లదీస్తున్నారు. ఈ అంశంపై డిప్యూటీ ఎంపీడీవో మల్లేశ్వరరావు స్పందిస్తూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

ప్రయాణికుల భద్రతకు చర్యలు

పంటును పరిశీలిస్తున్న ఎంపీడీవో

నరసాపురం, న్యూస్‌టుడే: పంటులో ప్రయాణికుల భద్రతకు తగు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో ఎం.నాసరురెడ్డి నిర్వాహకులను ఆదేశించారు. నరసాపురం-సఖినేటిపల్లి గ్రామాల మధ్య వశిష్ఠ గోదావరిపై ప్రజా రవాణా పంటును ఆయన సోమవారం పరిశీలించారు. ప్రయాణకుల రక్షణకు తీసుకున్న చర్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.

సహకార ఉద్యోగుల నిరసన

నినాదాలు చేస్తున్న సంఘ సభ్యులు

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ల ఐక్యవేదిక ఆధ్వర్యంలో పాలకొల్లు డీసీసీబీ ప్రాంగణంలో సోమవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఉద్యోగ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచాలని, సంఘాలకు షేరు ధనంపై ఇవ్వాల్సిన 6 శాతం డివిడెండ్, వడ్డీ బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. డిమాండ్ సాధనకు వచ్చే నెల 5వ తేదీ వరకు వివిధ రూపాల్లో ఆందోళనలు కొనసాగిస్తామని సంఘం సభ్యులు పి.కృష్ణారావు, ఎం.మురళీకృష్ణ, కె.కృష్ణకిశోర్, ఆకుల వెంకటేశ్వరరావు, బి.శ్రీనివాస్, జి.ప్రసాదరావు తెలిపారు.

అపరిచిత వ్యక్తులతో జాగ్రత్త

అవగాహన కల్పిస్తున్న మమత

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: అపరిచిత వ్యక్తుల విషయంలో విద్యార్థినులు జాగ్రత్త వహించాలని చైల్డ్ వెల్ఫేర్ అసోసియేషన్ సీసీ మమత సూచించారు. ఆ సంస్థ, పోలీసు శాఖ సంయుక్త ఆధ్వర్యంలో పాలకొల్లు బీఆర్ఎంబీఎం, సుభాష్ చంద్రబోస్ ఉన్నత పాఠశాలల్లో సోమవారం అవగాహన సదస్సులు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు.

జన్మదిన శుభాకాంక్షలు
ఆచంట నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత మా ఆప్తులు, శ్రేయోభిలాషులు శ్రీ పితాని సత్యనారాయణ గార్కి మా హార్దిక జన్మదిన శుభాకాంక్షలు. వారు ఇటువంటి పుట్టినరోజులు మరిన్ని జరుపుకోవాలని కోరుకుంటూ..
శ్రీ పితాని సత్యనారాయణ గారు
మాజీ మంత్రివర్యులు, MLA, ఆచంట
పులవర్తి రెడ్డియ్య గుప్త
వెంకటలక్ష్మి జ్యూయలరీ మార్ట్, తిరుమల ఫైనాన్స్
పెనుగొండ
కట్టా సత్యనారాయణ గుప్త, తణుకు
కట్టా వెంకటరత్నం (చిన్నబ్బాయి) పెనుగొండ
నూలి నాగ వీరవెంకట గణేష్‌రాజ్, పెనుగొండ
నూలి లక్ష్మణస్వామి, పెనుగొండ
పులపర్తి వెంకటేశ్వరరావు (కొండబాబు), పెనుగొండ
చింతలపూడి శ్రీనివాసరావు, పెనుగొండ
గణేష్ బాలాజీ కిరాణా & జనరల్ స్టోర్స్, పెనుగొండ
తుమ్మలపల్లి వెంకట రెడ్డియ్య, పెనుగొండ
తుమ్మలపల్లి రవీంద్ర, పెనుగొండ
దాచేపల్లి శంకర్రావు (గోవిందు), పెనుగొండ
యలమర్తి వెంకట శ్రీనివాస ప్రణీత్, పెనుగొండ
రాజేష్ ఫ్యాషన్స్, పెనుగొండ
ఉద్దగిరి శ్రీధర్ (దత్తు), పెనుగొండ
పచ్చిగోళ్ళ వెంకట శ్రీరామ్ నితిన్ (బాబి), పెనుగొండ
మోటమర్రి రామ్‌ప్రసాద్ గుప్త, పెనుగొండ
నూలి సూర్యప్రకాష్, పెనుగొండ
సన్నిధి నిఖిలానంద్ సత్యసూర్యనారాయణ గుప్త (సురేష్), పెనుగొండ

75 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్ వద్ద అధికారులు

పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే: సిద్ధాంతం కూడలిలో సోమవారం తనిఖీలు చేసి ట్రాక్టర్‌లో అక్రమంగా తరలిస్తున్న 75 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు విజిలెన్స్ ఎస్సై సీహెచ్ రంజిత్‌కుమార్ తెలిపారు. అక్రమ రవాణాకు బాధ్యుడైన కె.రాంబాబును ప్రశ్నించగా ఉంగుటూరు, పరిసర గ్రామాల్లో కార్డుదారుల నుంచి కిలో రూ.20 చొప్పున కొనుగోలు చేసి రావులపాలేనికి చెందిన వ్యాపారులు కర్రి రామిరెడ్డి, రాజగోపాలరెడ్డిలకు కిలో రూ.22.50 చొప్పున విక్రయిస్తున్నట్లు చెప్పాడు. రూ. 3 లక్షల విలువైన బియ్యంతో పాటు ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు. కె.రాంబాబు, కర్రి రామిరెడ్డి, రాజగోపాలరెడ్డి, ట్రాక్టర్ యజమాని యర్రా సుబ్బారావులపై నిత్యావసర వస్తువుల చట్టం 1955 ప్రకారం కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. పౌరసరఫరాల విభాగం ఆర్ఐ కేవీవీ సత్యనారాయణ, సిబ్బంది తనిఖీల్లో పాల్గొన్నారు.

తాగునీటి పథకాల నిర్వహణ అస్తవ్యస్తం

మండల సమావేశంలో ధ్వజమెత్తిన సభ్యులు

సభ్యులు ప్రస్తావించిన అంశాలపై వివరణ ఇస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ లోకేశ్

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: పలు గ్రామాల్లో రక్షిత మంచినీటి పథకాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందంటూ సోమవారం జరిగిన నరసాపురం మండల పరిషత్తు సమావేశంలో సభ్యులు ధ్వజమెత్తారు. ఎంపీపీ మైలాబత్తుల సోని అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ పరిధిలో పనుల పురోగతిని ఆ శాఖ ఏఈ లోకేశ్ వివరిస్తుండగా ఎంపీటీసీ సభ్యులు మల్లుల వెంకట సత్యనారాయణ, సంగాని రాంబాబు, మైల వీర్రాజు, నక్కా లక్ష్మీనారాయణ, జడ్పీటీసీ సభ్యుడు బొక్కా రాధాకృష్ణ తదితరులు పలు సమస్యలను ప్రస్తావించారు. ట్యాంకులను నెలల తరబడి శుభ్రం చేయడం లేదని, కుళాయిల ద్వారా కలుషిత నీరు సరఫరా అవుతున్నా పట్టించుకోవడం లేదంటూ ఏఈని నిలదీశారు. జల్‌జీవన్ మిషన్ ద్వారా చేపట్టిన పనులు నత్తనడకన సాగుతున్నాయని, ఇదే పరిస్థితి కొనసాగితే వచ్చే వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తుతాయన్నారు. నరసాపురం ప్రధాన పంట కాలువ నుంచి లక్ష్మణేశ్వరంలో భారీ రక్షిత మంచినీటి పథకం చెరువులోకి నీటిని మళ్లించేందుకు రూ.50 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన పైపులైనును ఏడాది గడుస్తున్నా ఎందుకు ప్రారంభించలేదని జడ్పీటీసీ సభ్యుడు రాధాకృష్ణ ప్రశ్నించారు.

బయటి వ్యక్తుల హవా.. మండల పరిషత్తు సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు మాత్రమే హాజరు కావాల్సి ఉండగా కొందరు బయట వ్యక్తులు వచ్చి అధికారులను పలు సమస్యలపై ప్రశ్నించారు. తూర్పుతాళ్లు-2 ఎంపీటీసీ సభ్యురాలి స్థానంలో ఆమె భర్త హనుమంతరావు సమావేశానికి వచ్చి అధికారుల దృష్టికి పలు సమస్యలను తీసుకెళ్లారు. ఎంపీపీ మైలాబత్తుల సోని తండ్రి శ్రీను సమావేశానికి వచ్చి కూర్చున్నారు.

(c) eenadu

ఆచంట శాసనసభ్యులు పితాని సత్యనారాయణ గార్కి జన్మదిన శుభాకాంక్షలతో..

ADVT Special Feature

సౌత్‌జోన్ వాలీబాల్ పోటీలకు ఎంపిక

పోడూరు, న్యూస్‌టుడే: పోడూరు మండలం జిన్నూరు గ్రామానికి చెందిన గుబ్బల శ్రీనివాస్ సౌత్‌జోన్ విశ్వవిద్యాలయాల స్థాయి వాలీబాల్ టోర్నీకి ఎంపికయ్యారు. పాలకొల్లులోని ఏఎస్‌ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్న శ్రీనివాస్ కాకినాడలో ఈ నెల 10 నుంచి 14వ తేదీ వరకు జరిగే టోర్నీలో పాల్గొంటారు. గతంలో ఒడిశా, రాజస్థాన్, మధ్యప్రదేశ్, అసోం రాష్ట్రాల్లో జరిగిన టోర్నీల్లో శ్రీనివాస్ పాల్గొని ప్రతిభ చాటారు.

శ్రీనివాస్

ప్రజా సంక్షేమమే లక్ష్యం

పోడూరు, న్యూస్‌టుడే: నిరంతరం ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేసే నాయకుల్లో ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ ఒకరని పలువురు నాయకులు కొనియాడారు. పితాని జన్మదిన వేడుకలను ముందస్తుగా సోమవారం రాత్రి కొమ్ముచిక్కాలలో ఆయన కార్యాలయం వద్ద అభిమానులు, పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గంలో పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన ముఖ్య నాయకులు, కార్యకర్తలు 60 కిలోల భారీ కేకును పితానితో కోయించారు. పలువురు నాయకులు ఆయనకు పుష్పగుచ్ఛాలు, పండ్లు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. టీఎన్ఎస్ఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి చిలుకూరి ప్రసన్న, పార్టీ మండల కార్యదర్శి ఉప్పలపాటి చంటి, తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడు గణపతినీడి రాంబాబు, నాయకులు కడలి ఏడుకొండలు, నరాలశెట్టి వెంకటేశ్, నెక్కంటి అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యులతో కలిసి కేకు కోస్తున్న పితాని

జాగ్రత్తలతో క్షయ నివారణ

పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే: పాలకొల్లు మండలం లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యురాలు ఎం.నవ్యజీవన్ ఆధ్వర్యంలో టీబీ ముక్తి భారత్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. రోటరీ క్లబ్ పాలకొల్లు శాఖ అధ్యక్షులు, వైద్యుడు కె.ఆనందరాజు మాట్లాడుతూ క్షయ బారిన పడి మందులు వాడేవారు అదనపు పోషకాహారం తీసుకోవాలన్నారు. చలి గాలిలో తిరగకుండా జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. తగు జాగ్రత్తలు పాటించడం ద్వారా క్షయ వ్యాధిని నివారించవచ్చన్నారు. క్షయ లక్షణాలు ఉన్నవారికి వ్యాధి నిర్ధారణ అయితే ఆరు నెలలకు మందులు ఉచితంగా అందించడంతో పాటు నెలకు రూ. వెయ్యి చొప్పున ఆర్థిక సాయం అందిస్తామని చెప్పారు. అనంతరం 20 మందికి పోషకాహార కిట్లు అందజేశారు.

గణనాథుడికి గరిక పూజలు

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: మార్గశిర బహుళ చవితి, సంకట హర చతుర్థి సందర్భంగా నరసాపురం పట్టణంలోని బాల గణపతి, ఇతర ఆలయాల్లో గణనాథుడికి సోమవారం పంచామృతాభిషేకాలు, గరిక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయాలకు తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు.

అనారోగ్య బాధితులకు ఆర్థిక సాయం

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఇద్దరికి పాలకొల్లు వాకర్స్ క్లబ్ సభ్యులు ఆర్థిక సాయం అందించారు. పాలకొల్లు మండలం యాళ్లవానిగరువుకు చెందిన బాలుడికి రూ.20 వేలు, పట్టణానికి చెందిన మహిళలకు రూ.7 వేల చొప్పున అందజేసినట్లు క్లబ్ సభ్యులు షేక్ పీర్‌సాహెబ్, మానెం బసవరాజు, పోతుల ఉమాశంకరరావు, జవ్వాజి కల్యాణ్, జి.హరిబాబు తెలిపారు.

ఖాళీలు భర్తీ చేయాలని వినతి

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: పదో తరగతి విద్యార్థులకు 100 రోజుల ప్రణాళిక పూర్తిస్థాయిలో జరిగేలా ఆయా పాఠశాలల్లోని ఉపాధ్యాయుల ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్.ఎల్.వి.ఎస్ చలం, ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు సోమవారం డీఈవో ఇ.నారాయణకు వినతిపత్రం ఇచ్చారు. వందరోజుల ప్రణాళికలో ఆదివారం తరగతులు ఉపసంహరించుకోవాలన్నారు.

వినతుల పరిష్కారంలో జాప్యం వద్దు

నరసాపురం, న్యూస్‌టుడే: ప్రజల నుంచి అందే వినతులను ఎలాంటి జాప్యం లేకుండా పరిష్కరించాలని నరసాపురం ఆర్డీవో దాసి రాజు అధికారులకు సూచించారు. పట్టణంలోని రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'ప్రజా వినతుల పరిష్కార వేదిక'లో ఆయన పాల్గొని వినతులు స్వీకరించారు. ఆక్రమిత స్థలంలో ఆలయం తొలగించాలంటూ హైకోర్టు ఆదేశించిన అనంతరం గ్రామస్థులు తనపై దాడికి యత్నిస్తున్నారని, రక్షణ కల్పించాలని సీతారామపురానికి చెందిన చెరుకూరి ప్రసాదరాజు అర్జీ అందించారు. గ్రామానికి చెందిన కొందరు గతంలో వైకాపాలో ఉన్నారని, ఇటీవల వారు జనసేనలో చేరి తనపై అక్రమంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు బనాయిస్తున్నారని కాళీపట్నంతూర్పు గ్రామానికి చెందిన మేడిద బాబ్జి అర్జీ ఇచ్చారు. తమ స్థలం మధ్య నుంచి పంచాయతీ అధికారులు అక్రమంగా సీసీ డ్రెయిన్ నిర్మించారంటూ కొత్తపాలేనికి చెందిన నిప్పులేటి సురేశ్ ఫిర్యాదు చేశారు.

సమస్యలు తెలుసుకుంటున్న ఆర్డీవో రాజు

అజయ్‌కుమార్‌కు డైరీ అందజేస్తున్న న్యాయవాదులు

న్యాయవాదులకు రక్షణ చట్టం తీసుకురావాలి

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: న్యాయవాదులపై పెరుగుతున్న దాడుల నేపథ్యంలో వారికి రక్షణ కల్పించేలా చట్టం చేయాలని భారత న్యాయవాదుల సంఘం(ఐ.ఎ.ఎల్) రాష్ట్ర అధ్యక్షుడు చలసాని అజయ్‌కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం భీమవరం వచ్చిన న్యాయవాదులతో మాట్లాడారు. 1982లో స్థాపించిన ఐ.ఎ.ఎల్ న్యాయవాదుల హక్కుల కోసం పోరాడుతోందన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.న్యూటన్, ఐఏఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్ రంగారావు, పట్టణ అధ్యక్షుడు వై.వి.ఆనంద్, బి.శివయ్య తదితరులు పాల్గొన్నారు.

జన్మదిన శుభాకాంక్షలు
మాజీ మంత్రివర్యులు, ఆచంట శాసనసభ్యులు
శ్రీ పితాని సత్యనారాయణ గార్కి
మా హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు.
ఆధ్య చిల్డ్రన్స్ & మల్టీస్పెషాలిటీ హాస్పటల్
డా॥ పంపన శ్రీనివాస్, MBBS., MD (Paediatrics)
చిన్న పిల్లల మరియు నవజాత శిశువుల వైద్య నిపుణులు
24 గం॥లు అందుబాటులో ఉంటారు
కోడేరు రోడ్, మాధవరావు గారి హాస్పటల్ దగ్గర, ఆచంట. సెల్: 80196 29555, 98668 36669

జన్మదిన శుభాకాంక్షలు
నిగర్వి, నిరాడంబరులు, ఆచంట నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత, మా ఆప్తులు, శ్రేయోభిలాషులు
శ్రీ పితాని సత్యనారాయణ గార్కి
మా హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు.
శ్రీ పితాని సత్యనారాయణ గారు
మాజీ మంత్రివర్యులు, శాసనసభ్యులు, ఆచంట
వరికూటి సాయికిషోర్
పెనుమంట్ర

జన్మదిన శుభాకాంక్షలు
ఆచంట నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న మా ఆప్తులు, శ్రేయోభిలాషులు
శ్రీ పితాని సత్యనారాయణ గార్కి
మా హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు
శ్రీ పితాని సత్యనారాయణ గారు
మాజీ మంత్రివర్యులు, శాసనసభ్యులు, ఆచంట
గుత్తుల లోకేశ్వరరావు
ఛైర్‌పర్సన్: PACS ములపర్రు
పెనుగొండ మండల టీడీపీ అధ్యక్షులు
ఉటాల వెంకటేశ్వరరావు, పర్సన్ | నెక్కంటి భాస్కరరావు, పర్సన్
U. శ్రీరామ్, C.E.O. మరియు సిబ్బంది
ది.హిందూ ముస్లీం సహకార పరపతి సంఘం, ములపర్రు

జన్మదిన శుభాకాంక్షలు
ఆచంట నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత, మా ఆప్తులు, శ్రేయోభిలాషులు
శ్రీ పితాని సత్యనారాయణ గార్కి
మా హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు
శ్రీ పితాని సత్యనారాయణ గారు
మాజీ మంత్రివర్యులు, MLA ఆచంట
చేకూరి నర్సింహరాజు, పర్సన్
నల్లి త్రిమూర్తులు, పర్సన్
కేతా సత్యనారాయణ (సత్తిబాబు)
ఛైర్ పర్సన్: PACS ఇలపర్రు
చికిలే సునీల్ CEO మరియు సిబ్బంది ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం, ఇలపర్రు

జన్మదిన శుభాకాంక్షలు
మాకు అత్యంత ఆత్మీయులు, శ్రేయోభిలాషులు
శ్రీ పితాని సత్యనారాయణ గార్కి
మా హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు.
శ్రీ పితాని సత్యనారాయణ గారు
మాజీ మంత్రివర్యులు, శాసనసభ్యులు ఆచంట

యిందుకూరి వెంకట నర్సింహరాజు (చెరుకువాడ రాజు) ఓడూరు గ్రామ TDP అధ్యక్షులు, ఆలమూరు నీటి సంఘం అధ్యక్షులు	యిందుకూరి వెంకట సుబ్బరాజు, TDP నాయకులు, ఓడూరు
యిందుకూరి సాయి సుబ్బరాజు, గ్రామ పంచాయతీ వైస్ ప్రెసిడెంట్, ఓడూరు	వేగేశ్న సాయి మనోహర్‌రాజు, స్టేట్ ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ డైరెక్టర్, ఓడూరు
యిందుకూరి సురేంద్రవర్మ, TDP నాయకులు, ఓడూరు	పెన్మెత్స సూర్యనారాయణరాజు (వాసు), TDP నాయకులు, ఓడూరు
యిందుకూరి త్రినాథరాజు, TDP నాయకులు, ఓడూరు	భూపతిరాజు పెద్దిరాజు, TDP నాయకులు, ఓడూరు
బాలం బాలకృష్ణ, TDP నాయకులు, ఓడూరు	మల్లిపూడి పెద్దిరాజు, TDP నాయకులు, ఓడూరు
కప్పల యేసయ్య, TDP నాయకులు, ఓడూరు	మారంపూడి వెంకటేశ్వరరావు, TDP నాయకులు, ఓడూరు
బాలం దుర్గాప్రసాద్, TDP నాయకులు, ఓడూరు	మిర్తిపాటి గోపి, TDP నాయకులు, ఓడూరు
మానేపల్లి జగదీష్, TDP నాయకులు, ఓడూరు	పీతల బాబ్జీ, TDP నాయకులు, ఓడూరు
సాదే క్రాంతి, TDP నాయకులు, ఓడూరు	సనాయిల దానయ్య, TDP నాయకులు, ఓడూరు
కేతా ఏడుకొండలు, TDP నాయకులు, ఓడూరు	ముప్పిడి చిన్ని, TDP నాయకులు, ఓడూరు

జన్మదిన శుభాకాంక్షలు
మా ఆప్తులు, శ్రేయోభిలాషులు
శ్రీ పితాని సత్యనారాయణ గార్కి
ఇవే మా హృదయ పూర్వక జన్మదిన శుభాకాంక్షలు.
శ్రీ పితాని సత్యనారాయణ గారు
శాసనసభ్యులు, ఆచంట
మాజీ మంత్రివర్యులు
నెక్కంటి బుజ్జి, TDP నాయకులు, ఆచంట
మొనవర్తి బుల్లియ్యచౌదరి, TDP నాయకులు, ఆచంట
గణేశుల సత్యనారాయణ (సత్తిబాబు), ఉప సర్పంచ్, కోడేరు
మన్నె వెంకట సుబ్రహ్మణ్యం, TDP నాయకులు, ఆచంట
కోమటి సురేష్, TDP నాయకులు, ఆచంట

జన్మదిన శుభాకాంక్షలు
ఆచంట నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న మా ఆప్తులు, శ్రేయోభిలాషులు
శ్రీ పితాని సత్యనారాయణ గార్కి
మా హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు
శ్రీ పితాని సత్యనారాయణ గారు
మాజీ మంత్రివర్యులు, శాసనసభ్యులు, ఆచంట
నక్కా వేదవ్యాసశాస్త్రి
ఛైర్‌పర్సన్: PACS పెనుగొండ
శ్రీమతి నక్కా శ్యామలాసోని
సర్పంచ్, పెనుగొండ

జన్మదిన శుభాకాంక్షలు
ఆచంట నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న మా ఆప్తులు, శ్రేయోభిలాషులు
శ్రీ పితాని సత్యనారాయణ గార్కి
మా హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు.
శ్రీ పితాని సత్యనారాయణ గారు
మాజీ మంత్రివర్యులు, MLA, ఆచంట
బడేటి వీరబ్రహ్మం (బ్రహ్మజీ)
ఛైర్మన్: AMC, పెనుగొండ
పేరాబత్తుల తాతాజీ, గ్రామ TDP అధ్యక్షులు, రామన్నపాలెం
పప్పొప్పుల బుజ్జి, పెనుగొండ
పెనుమాక రమేష్, రామన్నపాలెం
లక్కు వర్మ, నక్కావారిపాలెంపాలెం (సిద్ధాంతం)
యర్రంశెట్టి నాగమల్లేశ్వరరావు, రామన్నపాలెం

జన్మదిన శుభాకాంక్షలు
మా ఆప్తులు, శ్రేయోభిలాషులు
శ్రీ పితాని సత్యనారాయణ గార్కి
మా హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు.
శ్రీ పితాని సత్యనారాయణ గారు
మాజీ మంత్రివర్యులు, శాసనసభ్యులు, ఆచంట
కడలి భాస్కరరావు, ఛైర్‌పర్సన్
బలుసు శ్రీరామమూర్తి, పర్సన్
తోరం ప్రసాద్, పర్సన్
యాండ్ర విష్ణుమూర్తి, CEO మరియు సిబ్బంది
ది మృత్యుంజయ విశాలసహకార పరపతి సంఘం నెం. సి 2324, ఆచంట

జన్మదిన శుభాకాంక్షలు
మా ఆప్తులు, శ్రేయోభిలాషులు
శ్రీ పితాని సత్యనారాయణ గార్కి
మా హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు
శ్రీ పితాని సత్యనారాయణ గారు
మాజీ మంత్రివర్యులు, శాసనసభ్యులు, ఆచంట
కోయ నాగవెంకట పోతురాజు
ఛైర్‌పర్సన్: PACS ఆలమూరు
కడలి ఏడుకొండలు, పర్సన్ | పెన్మెత్స వెంకటరాఘవరాజు
మంగిన నాగవిష్ణువు, CEO మరియు సిబ్బంది

జన్మదిన శుభాకాంక్షలు
మాకు అత్యంత ఆత్మీయులు, శ్రేయోభిలాషులు
శ్రీ పితాని సత్యనారాయణ గార్కి
మా హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు.
శ్రీ పితాని సత్యనారాయణ గారు
మాజీ మంత్రివర్యులు
AP శాసనసభా హక్కుల కమిటీ ఛైర్మన్
శాసనసభ్యులు, ఆచంట
కాకిలేటి బాపిరాజు
కాంట్రాక్టర్ క్లాస్-II
కొఠాలపర్రు, పెనుగొండ మండలం

జన్మదిన శుభాకాంక్షలు
మాకు అత్యంత ఆత్మీయులు, శ్రేయోభిలాషి మా ప్రియతమ ఆచంట శాసనసభ్యులు, మాజీ మంత్రివర్యులు
శ్రీ పితాని సత్యనారాయణ గారి
పుట్టినరోజు సందర్భంగా వారికి మా హృదయపూర్వక శుభాకాంక్షలు.
తణుకు తాలూకా రైస్ మిల్లర్స్ అసోసియేషన్

శ్రీ వెంకట రామలింగేశ్వర రైస్ & ఫ్లోర్‌మిల్, మే॥పా॥ గుణ్ణం మోహన్‌రావు, అధ్యక్షులు, వేల్పూరు	శ్రీ వెంకటసూర్య పద్మ బాయిల్డ్ & రా రైస్‌మిల్, మే॥పా॥ గాజుల బులిపుల్లారావు, కార్యదర్శి, పెనుగొండ	శ్రీ వెంకట సుబ్రహ్మణ్యం ఇండస్ట్రీస్, ప్రొ॥ ఎన్.సుబ్రహ్మణ్యం సన్ నాగబాబు, కోశాధికారి, పెనుగొండ
శ్రీ వెంకటేశ్వర మోడరన్ బాయిల్డ్ & రా రైస్‌మిల్, కె.సత్యనారాయణ, కె.వెంకట సూర్యనారాయణ, ఉరదాళ్ళపాలెం	శ్రీ వెంకటేశ్వర మోడరన్ రైస్‌మిల్, మే॥పా॥ డి.వి.ఎస్. ప్రకాశరావు, ఇరగవరం	శ్రీ రామభద్ర మోడరన్ రైస్‌మిల్, ప్రొ॥ పి.రామకృష్ణ గోపాలరాజు, తేతలి
అలివేలు రైస్ ప్రొడక్ట్స్, ప్రొ॥ ఆరిమిల్లి రామకృష్ణ (రాము), వేల్పూరు	శ్రీ విజయ నాగజ్యోతి రైస్‌మిల్, ప్రొ॥ కూనపరెడ్డి జయరాజు - నాగజ్యోతి, అత్తిలి	శ్రీ రామలింగేశ్వర రైస్ & ఆయిల్ మిల్, ప్రొ॥ బండా వెంకట కృష్ణారావు & బ్రదర్స్, వేల్పూరు
శ్రీ వెంకట్రామ మోడరన్ రైస్‌మిల్లు, ప్రొ॥ ఆరిమిల్లి అప్పారావు, ఇరగవరం	శ్రీ వెంకటరమణ ఇండస్ట్రీస్, ప్రొ॥ బచ్చు హనుమంతరావు, వడలి	శ్రీ గాయత్రి రైస్ ఇండస్ట్రీస్, ప్రొ॥ N.S.K. మణికంఠ, పెనుగొండ
విష్ణు శ్రీ ఆగ్రో ఇండస్ట్రీస్ ప్రై.లి., నూకల వెంకట సత్యనారాయణ, ఆలమూరు	లక్ష్మీ గణపతి ట్రేడర్స్, ప్రొ॥ వి.ఎస్.సుధాకరరెడ్డి, మార్టేరు	శ్రీ విజయలక్ష్మి రైస్ ఇండస్ట్రీస్, దూళ్ళ ప్రకాశ్, దూళ్ళ జోషిబాబు, తేతలి
శ్రీ శివగాయత్రి రైస్ ఇండస్ట్రీస్, వడలి, మే॥పా॥ తుమ్మలపల్లి శ్రీనివాస్, శ్రీఅర్జునరావు	కె.వి.రెడ్డి & అదర్స్ Cont. శ్రీకామేశ్వరి రైస్‌మిల్లు, ప్రొ॥ కర్రి సుబ్బారెడ్డి	శ్రీ అన్నపూర్ణ రైస్‌మిల్లు, మే॥పా॥ ఎస్.ఆర్.ఎస్ నాగేంద్రబాబు, వేల్పూరు
శ్రీ వీరవెంకట కృష్ణా రైస్‌మిల్లు, ప్రొ॥ సీహెచ్.వీరరాఘవులు, కావలిపురం	లక్ష్మీ రైస్‌మిల్లు, ప్రొ॥ పెనుమర్తి రంగబాబు, కొమరవరం	శ్రీ ధనలక్ష్మి రైస్‌మిల్లు, ప్రొ॥ రెడ్డి దుర్గారావు, వేల్పూరు
వెంకట లక్ష్మి రైస్‌మిల్లు, ప్రొ॥ పిండి కృష్ణమూర్తి, ఇరగవరం	లక్ష్మీసాయి రైస్ ట్రేడర్స్, ప్రొ॥ ఎన్.వి.నాగబాబు	సాయిదుర్గ మోడరన్ రైస్‌మిల్లు, మే॥పా॥ కె.నవీన్‌కుమార్, అయితంపూడి
విజయ ఫుడ్ ప్రొడక్ట్స్, ప్రొ॥ పి.సత్యనారాయణరెడ్డి, అయితంపూడి	ఏలేటిపాడు సొసైటీ రైస్‌మిల్లు, సీఈవో: Ch.V.V.K., సూర్యనారాయణ, ఏలేటిపాడు	మహాలక్ష్మి శ్రీ ఎంటర్‌ప్రైజస్, మే॥పా॥ ఎస్.వెంకట శ్రీనివాసరావు, దువ్వ
మోహన రైస్ ఆగ్రో ప్రొడక్ట్స్, ప్రొ॥ పుట్టా మహేంద్రబాబు (రమేష్), వేల్పూరు	దత్తసాయి ఫుడ్స్, మే॥పా॥ టి.వై.స్వామి, పెనుగొండ	వెంకటసాయి గణేష్ రైస్‌మిల్లు, మే॥పా॥ డి.సత్యనారాయణ, బ్రాహ్మణచెరువు
మల్లిఖార్జున రైస్ ట్రేడర్స్, ప్రొ॥ కె.ఎస్.ఎస్.పి.రెడ్డి, పెనుగొండ	శ్రీలక్ష్మి వెంకటేశ్వర రైస్‌మిల్లు, ప్రొ॥ సత్తి వెంకటరెడ్డి, వేల్పూరు	శ్రీ శివపార్వతి ట్రేడర్స్, ప్రొ॥ టి.సత్యనారాయణరెడ్డి, జుత్తిగ
శ్రీ వెంకట పద్మ రైస్‌మిల్లు, ప్రొ॥ జి.వెంకటరావు, వేల్పూరు	శ్రీ నరసింహ సోమేశ్వర రైస్‌మిల్లు, ప్రొ॥ నాగళ్ళ ప్రసాదగుప్త, పెనుగొండ	అరుణాచల శివ ఇండస్ట్రీస్, ప్రొ॥ ఎన్. సూర్యప్రభాకరరావు, పెనుగొండ
విజయతేజ కార్పోరేషన్, ప్రొ॥ పి.చంద్రశేఖర్, వీరభద్రపురం	దుర్గా రైస్ ప్రొడక్ట్స్, ప్రొ॥ ఎన్.వి.వి.ఎస్.ఎస్.జి.నరశింహం, పెనుగొండ	శ్రీ వెంకట లక్ష్మి రైస్‌మిల్, ప్రొ: I.శ్రీనివాస్, వెంకటరమణ, అత్తిలి
నవ్యకృష్ణ ఇండస్ట్రీస్, ప్రొ॥ పి.పోతురాజు, పెనుగొండ	శ్రీ వెంకటసాయి రైస్‌మిల్లు, ప్రొ॥ డి.సూర్యనారాయణ, పేకేరు	విజయగణపతి ట్రేడర్స్, మే॥పా॥ కోయ మోహనరావు, నెలమూరు
వెంకటేశ్వర రైస్‌మిల్లు, ప్రొ॥ ఓ. వెంకటేశ్వరరావు, కన్నయకుముదవల్లి	శ్రీ హిమజ ఇండస్ట్రీస్, ప్రొ॥ బి. సోమశేఖర్, అయినపర్రు	లక్ష్మీసాయితేజ రా రైస్‌మిల్, మే॥పా॥ V. శ్రీనివాసరావు, V. రవితేజ, అత్తిలి

(c) eenadu

నరసాపురం

• నరసాపురం • పాలకొల్లు • ఆచంట

శివయ్యకు పంచామృతాభిషేకాలు

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: నరసాపురం పట్టణంలో విశ్వేశ్వర, బసవేశ్వర, ఏకాంబరేశ్వర, కపిల మల్లేశ్వర, అమరేశ్వర స్వామి ఆలయాల్లో సోమవారం ఉదయం పంచామృతాభిషేకాలు, బిల్వార్చనలు చేశారు.

రామేశ్వర స్వామి ఆలయంలో.. పెనుమంట్ర, న్యూస్‌టుడే: నత్తారామేశ్వరంలో శ్రీరామేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ఉదయం సుగంధద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. పార్వతీమాతకు కుంకుమార్చనలు చేశారు.

నరసాపురం విశ్వేశ్వర స్వామి ఆలయంలో..

క్షీరారామంలో లక్ష్మీగణపతి హోమం

పాలకొల్లు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: పాలకొల్లులోని క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయంలో సోమవారం పంచామృతాభిషేకాలు చేశారు. ఆలయ మండపంలో లక్ష్మీగణపతి హోమం జరిగింది.

పూజల్లో పాల్గొన్న భక్తులు

సేవా శిబిరాలతో సామాజిక చైతన్యం

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు సేవా శిబిరాల ద్వారా సామాజిక చైతన్యం తెచ్చేలా కృషి చేయాలని స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాల వైస్-ప్రిన్సిపల్ ఎ.గోపీచంద్ సూచించారు. ఆ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-1 ఆధ్వర్యంలో సేవా శిబిరాన్ని ఆయన చిట్టవరంలో సోమవారం ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా వాలంటీర్లు పలు సామాజిక సమస్యలపై సర్వే నిర్వహించారు. సర్పంచి తాడి లక్ష్మణరావు, కళాశాల ఛైర్మన్ కేవీ సత్యనారాయణ, కోశాధికారి కేవీ స్వామి తదితరులు పాల్గొన్నారు.

వేగంగా అభివృద్ధి పనులు: నిమ్మల

పాలకొల్లు, న్యూస్‌టుడే: పట్టణ పరిధిలో దమ్మయ్యపర్తి డ్రెయిన్ ఆధునికీకరణ పనులను మంత్రి నిమ్మల రామానాయుడు సోమవారం పరిశీలించారు. ఈ డ్రెయిన్‌పై రెండు ప్రాంతాల్లో వంతెనల నిర్మాణాలకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 2019కు ముందు తెదేపా ప్రభుత్వ హయాంలో దమ్మయ్యపర్తి డ్రెయిన్ అభివృద్ధికి నిధులిస్తే తర్వాత వచ్చిన వైకాపా సర్కారు ఆ పనులను నిలిపేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మొదటి ఏడాదిలోనే రూ. 14 కోట్లు మంజూరు చేయగా పలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. జీప్లస్ కాలనీలో దశలవారీగా అన్ని వసతులు కల్పిస్తామన్నారు. కూటమి నాయకులు జీవీ, ఉన్నమట్ల కబర్ధి, తులా రామలింగేశ్వరరావు, కర్నేని గౌరునాయుడు, పొట్నూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

డ్రెయిన్ పనులను పరిశీలిస్తున్న మంత్రి

సీఎం సహాయనిధితో పేదలకు భరోసా..
పాలకొల్లు, న్యూస్‌టుడే: సీఎం సహాయనిధితో వేలాది మంది పేదలకు భరోసా లభిస్తుందని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. తన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో 38 మందికి రూ. 15.50 లక్షల విలువైన సహాయ నిధి చెక్కులను ఆయన పంపిణీ చేశారు.

మహాసభల విజయవంతానికి పిలుపు

పెనుమంట్ర, న్యూస్‌టుడే: విశాఖపట్నంలో జరిగే సీఐటీయూ అఖిల భారత మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం మండల కన్వీనర్ నేతల చిత్తరంజన్ పిలుపునిచ్చారు. సీఐటీయూ మండల కమిటీ సమావేశం పెనుమంట్రలో సోమవారం జరిగింది. వివిధ రంగాల కార్మికుల సమస్యలపై చర్చించారు. నాయకులు సుబ్బరాజు, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

జన్మదిన శుభాకాంక్షలు
మా ఆప్తులు, శ్రేయోభిలాషులు
శ్రీ పితాని సత్యనారాయణ గార్కి
ఇవే మా హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు.
శ్రీ పితాని సత్యనారాయణ గారు, మాజీ మంత్రివర్యులు, శాసనసభ్యులు
పెచ్చెట్టి కనకదుర్గ, సర్పంచ్, కోడేరు

పెచ్చెట్టి సుబ్రమణ్యం Ex. సర్పంచ్, కోడేరు	గణేశుల సత్యనారాయణ ఉప సర్పంచ్, కోడేరు
కడలి నాగమునీంద్రరావు, కరుగోరుమిల్లి నీటి సంఘం అధ్యక్షులు, TDP నాయకులు	
బండి వెంకటేశ్వరరావు, నీటి సంఘం ఉపాధ్యక్షులు, TDP నాయకులు మరియు డైరెక్టర్లు	
బండి నాగేశ్వరరావు గ్రామ పంచాయితీ 3వ వార్డు, 170 బూత్ కన్వీనర్, కోడేరు	పెచ్చెట్టి సత్యనారాయణ Ex. సర్పంచ్, కోడేరు
గుబ్బల దుర్గారావు గ్రామ TDP అధ్యక్షులు, కోడేరు	నయనాల పెద్దిరాజు TDP నాయకులు, 171 బూత్ కన్వీనర్
యర్రంశెట్టి రామనాగేశ్వరరావు (రాంబాబు) TDP నాయకులు, కోడేరు	బండారు ముత్యాలు Ex. సర్పంచ్, కోడేరు
కోట బుల్లి మలియ్య Ex. గ్రామ TDP అధ్యక్షులు, కోడేరు	గణేశుల యల్లారావు (అబ్బులు) TDP నాయకులు, కోడేరు
పెచ్చెట్టి సూర్యబాబు TDP నాయకులు, కోడేరు	పెచ్చెట్టి రామకృష్ణ (కిట్టయ్య) TDP నాయకులు, కోడేరు
పిల్లి మురియ్య TDP నాయకులు, కోడేరు	కడలి కుమారస్వామి TDP నాయకులు, కోడేరు
మట్టపర్తి ఏడుకొండలు TDP నాయకులు, కోడేరు	బండారు వెంకట్రావు TDP నాయకులు, కోడేరు
సలపల్లి శ్రీనువాసు గ్రామ టీడీపీ ఉపాధ్యక్షులు, కోడేరు	బండి వెంకటకృష్ణరామయ్య గ్రామ TDP సెక్రటరీ, కోడేరు
పెచ్చెట్టి హరిబాబు TDP నాయకులు, కోడేరు	బండి సుబ్బారావు (బుజ్జి) టీడీపీ నాయకులు, కోడేరు
కడలి చింతారావు BC నాయకులు, TDP నాయకులు, కోడేరు	వాతాడి సీతారామయ్య

జన్మదిన శుభాకాంక్షలు
మా ఆప్తులు, శ్రేయోభిలాషులు, మా ప్రియతమ మాజీ మంత్రివర్యులు, ఆచంట శాసనసభ్యులు
శ్రీ పితాని సత్యనారాయణ గార్కి ఇవే మా హృదయ పూర్వక జన్మదిన శుభాకాంక్షలు
షేక్ బాజ్జీ, M.Com TDP నాయకులు, బూత్ కన్వీనర్
P.శాంతి నిర్మల M.A; B.Sc; B.Ed
ప్రశాంత్, ప్రసన్న
మరియు షేక్ బాజ్జి మిత్రమండలి

జన్మదిన శుభాకాంక్షలు
మాజీ మంత్రివర్యులు, ఆచంట శాసన సభ్యులు
శ్రీ పితాని సత్యనారాయణ గార్కి
మా హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు.
శ్రీ పితాని సత్యనారాయణ గారు, మాజీమంత్రివర్యులు, శాసనసభ్యులు, ఆచంట
B.S.S.S. కృష్ణమోహన్, MPDO, ఆచంట
మరియు మండల ప్రజాపరిషత్ కార్యాలయ సిబ్బంది
& ఆచంట మండల పంచాయితీ కార్యదర్శులు

జన్మదిన శుభాకాంక్షలు
మాజీ మంత్రివర్యులు, ఆచంట శాసన సభ్యులు
శ్రీ పితాని సత్యనారాయణ గార్కి
మా హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు.
శ్రీ పితాని సత్యనారాయణ గారు, మాజీమంత్రివర్యులు, శాసనసభ్యులు, ఆచంట
T. సూర్యనారాయణమూర్తి, MPDO, పెనుగొండ
మరియు మండల ప్రజాపరిషత్ కార్యాలయ సిబ్బంది
& పెనుగొండ మండల పంచాయితీ కార్యదర్శులు

జన్మదిన శుభాకాంక్షలు
మాజీ మంత్రివర్యులు, ఆచంట శాసనసభ్యులు
శ్రీ పితాని సత్యనారాయణ గార్కి
మా హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు
శ్రీ పితాని సత్యనారాయణ గారు, మాజీ మంత్రివర్యులు, శాసనసభ్యులు, ఆచంట
G.కనకరాజు, తహశీల్దార్
ఆచంట మరియు కార్యాలయ సిబ్బంది
ఆచంట మండల గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం
& ఆచంట మండల చౌక డిపో డీలర్ల సంఘం

జన్మదిన శుభాకాంక్షలు
మా ఆప్తులు, శ్రేయోభిలాషులు, మాజీ మంత్రివర్యులు, ఆచంట నియోజకవర్గ శాసనసభ్యులు
శ్రీ పితాని సత్యనారాయణ గార్కి
మా హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు.
శ్రీ రామేశ్వరస్వామివారి దేవస్థానం, ఆచంట
నెక్కంటి గజేశ్వరరావు, ఛైర్మన్

శ్రీమతి మన్నే విజయలక్ష్మి, ట్రస్టీ	పెచ్చెట్టి సత్యనారాయణ, ట్రస్టీ
పూసల ఏడుకొండలు, ట్రస్టీ	శ్రీమతి బాలం రేవతి, ట్రస్టీ
వేమన రవీంద్రకుమార్, ట్రస్టీ	దూది నరసింహారావు, ట్రస్టీ

అదిమూలం వెంకట సత్యనారాయణ
కార్యనిర్వహణాధికారి మరియు సిబ్బంది

జన్మదిన శుభాకాంక్షలు
మా ఆప్తులు, శ్రేయోభిలాషులు, ఆచంట నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత
శ్రీ పితాని సత్యనారాయణ గార్కి మా హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు.
శ్రీ పితాని సత్యనారాయణ గారు, మాజీ మంత్రి వర్యులు, శాసనసభ్యులు, ఆచంట
A. వేమవరం

గుడాల నాగ సత్యనారాయణ గ్రామ TDP అధ్యక్షులు	బాలుసు మాధవీలత BJP జిల్లా ఉపాధ్యక్షురాలు
కనిపాల వెంకటేశ్వరరావు గ్రామ TDP సెక్రటరీ	నేలపాటి వినూరత్నం గ్రామ BJP అధ్యక్షులు
నెక్కంటి సత్తిబాబు సొసైటీ అధ్యక్షులు	దాంగ నాగార్జున TDP సీనియర్ నాయకులు
విశ్వనాథుల పద్మజ MPTC-1	గుడాల శ్రీనివాసరావు TDP సీనియర్ నాయకులు
గుడాల లక్ష్మీదుర్గ MPTC-2	B.K. సత్యనారాయణ Ex. గ్రామ TDP అధ్యక్షులు
గిద్దాడ దుర్గాప్రసాద్ TDP తెలుగు యువత అధ్యక్షులు	దేవబోళ్ళ చిన్న TDP సీనియర్ నాయకులు
గుడాల ఏడుకొండలు TDP కార్యదర్శి	బాబ్జా చిన్నిగోపాలకృష్ణ TDP సీనియర్ నాయకులు
గుత్తుల చిరంజీవి ZPH స్కూల్ ఛైర్మన్	వీరమళ్ళు భాస్కరరావు TDP సీనియర్ నాయకులు
ఆకుమర్తి గనిరాజు TDP సీనియర్ నాయకులు	కోన సత్యప్రసాద్ BJP నాయకులు
వీరమళ్ళు వీరాజు TDP సీనియర్ నాయకులు	పాల నారాయణ TDP సీనియర్ నాయకులు

జన్మదిన శుభాకాంక్షలు

మా ఆప్తులు, శ్రేయోభిలాషులు, మా ప్రియతమ నేత, ఆచంట అభివృద్ధి ప్రదాత, జన హృదయనేత
గౌ॥ శ్రీ పితాని సత్యనారాయణ గార్కి
మా హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు.
శ్రీ పితాని సత్యనారాయణ గారు
మాజీ మంత్రివర్యులు
AP శాసనసభ హక్కుల కమిటీ ఛైర్మన్
శాసనసభ్యులు, ఆచంట

ఉప్పలపాటి సురేష్‌బాబు ZPTC, ఆచంట మండలం	గాదిరెడ్డి శ్రీరాములు TDP, ఆచంట	తమ్మినీడి ప్రసాద్ సిద్ధాంతం వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్	చిలుకూరి సీతారామ్ ఆచంట మండల TDP అధ్యక్షులు	జిరా నర్సింహమూర్తి ఆచంట నియోజకవర్గ SC సెల్ అధ్యక్షులు	జిరా తిరుపతమ్మ, Ex. సర్పంచ్, ఆచంట మండల తెలుగు మహిళా ఉపాధ్యక్షురాలు	కేతా మురయ్య Ex. ఆచంట మండల TDP అధ్యక్షులు	మొసవర్తి వెంకట సుబ్బారావు ఛైర్మన్: PHC ఆచంట
గాదిరెడ్డి విద్యాసాగర్ కన్నాపురం	తమ్మినీడి ఫృధ్వీకుమార్ ఆచంట గ్రామ TDP అధ్యక్షులు	నెక్కంటి గజేశ్వరరావు ఛైర్మన్, శ్రీ రామేశ్వర స్వామి వారి దేవస్థానం, ఆచంట	బలుసు శ్రీరామమూర్తి ఆచంట కో-ఆపరేటివ్ బ్యాంక్ పర్సన్	నెక్కంటి వీర వెంకట సత్య ప్రభాకర్ కవిటం నీటి సంఘం అధ్యక్షులు		చిలుకూరి సత్యవతి పశ్చిమగోదావరి జిల్లా తెలుగు మహిళా ఉపాధ్యక్షురాలు	కేతా మురళి ఆచంట మండల తెలుగు యువత అధ్యక్షులు
నెక్కంటి సుబ్బారావు కృషి పండిట్, ఆచంట	కోళ్ళ సత్యనారాయణ ఆచంట క్లస్టర్ 6 ఇన్‌ఛార్జి	కమ్మ సత్యనారాయణ TDP నాయకులు, ఆచంట	గాదిరెడ్డి కృష్ణ చైతన్య ఆచంట గంధర్వమహల్	నెక్కంటి పవన్ వెంకటసాయి ఆచంట మండల iTDP ఇన్‌ఛార్జి	దబ్బా ప్రకాష్, దబ్బా సుష్మ TDP నాయకులు, ఆచంట	చేకూరి సోమశేఖర్ TDP నాయకులు, ఆచంట	మన్నే రామలింగమూర్తి (రాంబాబు) TDP నాయకులు, ఆచంట
మొసవర్తి వెంకటేశ్వరరావు (చిన్న) TDP నాయకులు, ఆచంట	చిలుకూరి సత్యనారాయణ (చంటి) శ్రీరామ ఐస్ ప్లాంట్, ఆచంట	నెక్కంటి సాగర్‌కృష్ణ Nexus Products (UPVC విండోస్) రాజమండ్రి	దేసెకోట సత్యనారాయణ (B.K) TDP నాయకులు, A.వేమవరం	M.P.V.S.ప్రసాద్ TDP నాయకులు, ఆచంట	బలుసు శ్రీను ఆచంట కమ్మ సంఘం అధ్యక్షులు	నెక్కంటి శేషగిరిరావు (గిరి) TDP నాయకులు, ఆచంట	గాదిరెడ్డి రామచంద్రమూర్తి (రాము) TDP నాయకులు, ఆచంట
విశ్వనాథుల ప్రసాద్ TDP నాయకులు, ఆచంట	నెక్కంటి శ్రీనివాస మృత్యుంజయరావు బుజ్జి ఈవెంట్స్, ఆచంట	నెక్కంటి శ్రీను మల్లవరం	జక్కంశెట్టి సత్యనారాయణ మార్టేరు వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్	కేతా రామకృష్ణ అధ్యక్షులు: ఛాంబర్ ఆఫ్ కామర్స్, ఆచంట	టైలశెట్టి ఆదిలక్ష్మి Ex.MPP, ఆచంట	గాదిరెడ్డి భాస్కరరావు పంచాయితీ 6వ వార్డు మెంబర్	మన్నే రాధాకృష్ణ గ్రామ TDP అధ్యక్షులు, శేషమ్మచెరువు
బొడపాటి దుర్గా ప్రసాద్ రాష్ట్ర తెలుగుయువత నాయకులు	బొడపాటి గణపతి గ్రామ TDP అధ్యక్షులు, కందరవల్లి	బాలిశెట్టి సూర్యనారాయణ ఆచంట గ్రామ ఉపాధ్యక్షులు	తమ్మినీడి బలరామ్ కో-ఆపరేటివ్ బ్యాంక్, ఆచంట	ఆచంట వినయ్ వినాయక బ్యాటరీస్, ఆచంట	చేకూరి సత్యనారాయణ (బాబ్జి) TDP నాయకులు, ఆచంట	మన్నే రాధాకృష్ణ TDP నాయకులు, శేషమ్మచెరువు	భగవాన్ ఆక్వా ట్రేడర్స్ వాకలపూడి కార్తిక్, ఆచంట
చిలుకూరి విశ్వేశ్వరరావు శ్రీమతి సత్యవతి	చిలుకూరి సురేష్ మీషో కొరియర్ సర్వీస్, ఆచంట	మన్నే రామకృష్ణ TDP నాయకులు, ఆచంట	చిలుకూరి వెంకటరమణారావు TDP నాయకులు, ఆచంట	రెడ్డి నారాయణరావు (చిన్ని) TDP నాయకులు, ఆచంట	కుక్కల నర్సింహారావు దివ్యసాయి ఏజెన్సీస్, ఆచంట	మన్నే వీరాస్వామి TDP నాయకులు, ఆచంట	మన్నే వెంకట్రావు మన్నే విజయలక్ష్మి
నెక్కంటి వెంకట అరుణ్ గణేష్ TDP నాయకులు, ఆచంట	పూసల ఏడుకొండలు శ్రీ రామేశ్వరస్వామి దేవస్థానం ట్రస్టీ, ఆచంట	మేకా వెంకటేశ్వరరావు (చిన్నబ్బు) TDP నాయకులు, ఆచంట	మన్నే విజయరాధిక మన్నే నాగేశ్వరరావు	బాలం శ్రీకృష్ణ TDP నాయకులు, బాలంవారిగూడెం	పెచ్చెట్టి సత్యనారాయణ (చిన్న) శ్రీరామేశ్వరస్వామి దేవస్థానం ట్రస్టీ, కొడమంచిలి	వాసంశెట్టి సోమరాజు TDP నాయకులు, కొడమంచిలి	కాండ్రేకుల నాగశ్రీనివాసరావు సీనియర్ TDP నాయకులు, కొడమంచిలి
కారెం సంజయ్ TDP నాయకులు, ఆచంట	పెచ్చెట్టి వీరాస్వామి కోఆపరేటివ్ మాజీ ఉపాధ్యక్షులు, కొడమంచిలి	శీలం రామకృష్ణ	శీలం శ్రీనివాసరావు TDP నాయకులు, చెమ్మచెరువు	పెచ్చెట్టి రామకృష్ణ చైతన్య ఎన్విరో హైడ్రో, ఆచంట	కకర నరేష్ KK బ్రెడ్స్ ఫుడ్ వర్క్స్, NTR నగర్	నాగు మాస్టర్	సత్యవరపు మధు ఆచంట
కకర యశ్వంత్ NTR నగర్	గుబ్బల రామకృష్ణ TDP నాయకులు, శేషమ్మచెరువు	గుత్తుల ఏడుకొండలు కన్వీనర్, పెద్దపేట	ఆకుమర్తి మోహన్ ఆచంట మండల SC సెల్ అధ్యక్షులు	జిల్లెల సూర్యచంద్రరావు జిల్లా SC సెల్, ములపర్రు	కేతా సత్యనారాయణ TDP నాయకులు, క్రిందపోడు	ఉండ్రాజు ఆచంట	బొక్కా వెంకటనారాయణ TDP సీనియర్ నాయకులు, కొనపోతుగుంట
బాలం గోపాలకృష్ణ సీనియర్ TDP నాయకులు, బాలంవారిపాలెం	బాలం సత్యనారాయణ శ్రీను కేబుల్ నెట్‌వర్క్, బాలంవారిపాలెం	సత్యసాయి ఆగ్రో ఇండస్ట్రీస్ Ch. రామారావు, Ch. లక్ష్మణరావు, పండితవిల్లూరు		మానేపల్లి రాంబాబు (MRB) TDP నాయకులు, ఆచంట	సజ్జా నారాయణ ఆచంట మానవత ప్రెసిడెంట్	కుంపట్ల సత్యనారాయణ TDP నాయకులు, ఆచంట	లింగోలు లక్ష్మణరావు పంచాయితీ Ex. వైస్ ప్రెసిడెంట్, ఆచంట
N.సత్యనారాయణరాజు విజయదుర్గ న్యూ ట్రేడర్స్, ఆచంట	శివశంకర ట్రేడర్స్ రైస్ మిల్, ఆచంట	సానబోయిన ఏడుకొండలు ఆచంట TDP సెక్రటరీ	తమ్మినీడి సత్యశ్రీనివాస్ ఆచంట	దమ్మా గోపాలకృష్ణ (గోపి) తాపీ మేస్త్రి, ఆచంట	కలపర్తి శ్రీనివాస్ (వాసు) వడ్రంగి మేస్త్రి, ఆచంట	సానబోయిన రామకృష్ణ 13వ వార్డు మెంబర్, ఆచంట	కుక్కల శ్రీనివాసరావు
కుక్కల మాధవరావు Rtd. టీచర్, వంకతాళ్ల చెరువు	కుక్కల రామేశ్వరం TDP నాయకులు వంకతాళ్ల చెరువు	మన్నే శ్రీహరి TDP నాయకులు, ఆచంట	కనకదుర్గమ్మ ఆలయ కమిటీ కొడమంచిలి	మల్లువలస పెద్ద శ్రీను సూర్య ఫుట్‌వేర్, ఆచంట	బూరాబత్తుల శ్రీను మెకానిక్, TDP నాయకులు, కొనపోతుగుంట	గుబ్బల జోగేశ్వరరావు SS కార్గో	కారెం ప్రేమరాజు శ్రీమతి నాగమణి విందు ఫ్యామిలీ రెస్టారెంట్, ఆచంట
కేతా నర్సింహారావు TDP నాయకులు, కొడమంచిలి	కేతా దామోదరరావు రావిగుంట	కడలి ముత్యాలరావు రావిగుంట	బొక్కా నాగేశ్వరరావు రావిగుంట	బుడితి శ్రీను శ్రీనివాస ఐస్ పార్లర్, ఆచంట	చిలుకూరి సత్యనారాయణ TDP నాయకులు, ఆచంట	కేతా వీరాస్వామి ఆచంట సెట్టిబలిజ సెక్రటరీ	కుక్కల శ్రీనివాసరావు S/o సత్యనారాయణ TDP నాయకులు వంకతాళ్ల చెరువు
కుడిపూడి శ్రీనివాసరావు S/o నాయుడు, వంకతాళ్ల చెరువు	దామ్మేటి బాలు TDP నాయకులు	గుబ్బల సోమేశ్వరరావు TDP సీనియర్ నాయకులు, వంకతాళ్ల చెరువు	కట్టా రాంబాబు స్వప్న సెల్ పాయింట్ ఆచంట	గిద్దాడ పరమేశ్వరరావు శ్రీ వెంకటేశ్వర క్లాత్ షోరూమ్, ఆచంట	కేతా మహేశ్వరరావు TDP నాయకులు, వంకతాళ్ల చెరువు	ముప్పన వేణుగోపాల్ TDP నాయకులు, ఆచంట	వైట్ల గంగాధరరావు ఆచంట

(c) eenadu

చట్టాలపై అవగాహన అవసరం

ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, తదితరులు

తణుకు, న్యూస్‌టుడే: విద్యార్థి దశ నుంచి చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి. మహాలక్ష్మి పేర్కొన్నారు. బాల్య వివాహ ముక్త్ భారత్ 100 రోజుల కార్యక్రమంలో భాగంగా సోమవారం వైదిస్వరంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా చట్టాలు, హక్కులపై, పోషకాహారం తదితర అంశాలపై అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సత్యనారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఏడుకొండలు, ఉపాధ్యాయులు అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి రూ.7.80 కోట్లు

తణుకు, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని మూడు ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం రూ.7.80 కోట్లు మంజూరు చేసిందని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఇరగవరం మండలం రేలంగి లక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి రూ.3కోట్లు, తణుకు మండలం దువ్వ దానేశ్వరి అమ్మవారి ఆలయానికి రూ.3కోట్లు, వేల్పూరు రుద్రేశ్వర స్వామి ఆలయానికి రూ.1.80 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. 30 శాతం ప్రజల భాగస్వామ్యంతో ఈ నిధులను ఆలయాల అభివృద్ధికి వినియోగించనున్నట్లు పేర్కొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
తాడేపల్లిగూడెం : 99488 53114
తణుకు : 85558 50851
తణుకు (గ్రామీణం): 63005 79402
అత్తిలి : 91548 46774

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: ? తాడేపల్లిగూడెం భాగ్యలక్ష్మీపేట పార్కు పరిసరాల్లో పందుల సంచారంతో పరిసరాలు కలుషితమవుతున్నాయి. - ప్రభాకర్, స్థానికుడు
✔ పందుల సంచారం అరికడతాం. - సోమేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్
? తాడేపల్లిగూడెం పెంటా సెంటర్ గోదాము రోడ్డులో పురపాలక పైపులైను మరమ్మతుల కోసం తవ్విన గుంత పూర్తిగా పూడ్చక రాకపోకలకు ప్రమాదకరంగా మారింది. - కిరణ్, స్థానికుడు
✔ గుంతను పూడ్చిస్తాం. - వెంకటేశ్వరరావు, ట్యాప్ ఇన్‌స్పెక్టర్

తెరుచుకున్న శౌచాలయం

ఈనాడు స్పందన

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి పురపాలక సంఘం అధికారులు స్పందించారు. స్థానిక ఏపీఎస్పీ కార్యాలయం దగ్గర ఉన్న శౌచాలయాన్ని చాలా కాలం నుంచి మూసివేశారు. దీంతో వివిధ పనులపై వచ్చే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీనిపై 'శౌచాలయాన్ని తెరిపించండి సారూ' శీర్షికతో నవంబరు 30న కథనం ప్రచురించగా అధికారులు స్పందించి ఆ సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం

గణేష్‌నగర్(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: వార్డుల్లో నాయకులు సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని 34, 35 వార్డుల్లో అభివృద్ధి పనులపై జనసేన ఆధ్వర్యంలో అంగన హరికృష్ణ రూపొందించిన కాలమానిని ఆయన విడిది కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. నాయకులు దినేష్ యాదవ్, పాలూరి వెంకటేశ్వరరావు, వీర మహిళలు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

గణేష్‌నగర్(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం పార్టీలకతీతంగా పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు అందజేస్తోందని తాడేపల్లిగూడెం మండల జనసేన అధ్యక్షుడు అడపా ప్రసాద్ అన్నారు. ఎమ్మెల్యే విడిది కార్యాలయంలో సోమవారం 8 మంది లబ్ధిదారులకు రూ.13 లక్షల విలువగల చెక్కులను నాయకులతో కలిసి అందించారు.

గోడ పత్రికల ఆవిష్కరణ

మోదుగుంట(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: పెండింగ్ క్లెయిమ్‌లు పరిష్కరించి భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా నాయకుడు దాసం వరప్రసాద్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం మోదుగుంట గ్రామంలో భవన నిర్మాణ కార్మికులతో కలిసి గోడ పత్రిక ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ సంక్షేమ బోర్డు పథకాలు నిలిపివేస్తూ గత వైకాపా ప్రభుత్వం తీసుకొచ్చిన జీవోను కూటమి ప్రభుత్వం ఇంకా రద్దు చేయలేదన్నారు. కె.శ్రీనివాస్, పి.వీరబాబు, కె.పోసేంద్ర ప్రసాద్, పి.జాన్, పంచగవల సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆటోనగర్ కల నెరవేరేనా..?

పుష్కరం దాటినా తణుకులో పడని ముందడుగు

న్యూస్‌టుడే, తణుకు

పుష్కర కాలం గడిచినా తణుకులో ఆటోనగర్ ఏర్పాటు కలగానే మిగిలింది. ప్రభుత్వాలు మారుతున్నా తమ జీవితాల్లో మార్పులు లేవని స్థానికులు వాపోతున్నారు. ఎన్నికలు వచ్చిన ప్రతిసారి నాయకులు హామీలివ్వడమే తప్ప అమలు చేయడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. కూటమి ప్రభుత్వమైనా ఈ సమస్య పరిష్కరించాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

ఇరుకు సందుల్లో కార్యకలాపాలు సాగిస్తూ

దశాబ్దం నుంచి ఎదురు చూపులు

పట్టణంలో కార్లు, ట్రాక్టర్లు, ఆటో మెకానిక్‌లు, వెల్డింగ్, లేత్ కార్మికులు, బీరువాల తయారీదారులు పెద్ద సంఖ్యలో ఉన్నారు. వారంతా కలిసి 12 ఏళ్ల క్రితం సంఘంగా ఏర్పడి ఆటోనగర్ ఏర్పాటు చేయాలని ప్రజాప్రతినిధుల్ని సంప్రదించారు. అప్పట్లో సమైక్యాంధ్ర ఉద్యమం కారణంగా ఈ అంశం మరుగున పడింది. 2014లో తెదేపా ప్రభుత్వ హయాంలో భూసేకరణకు ప్రయత్నించినప్పటికీ ప్రతిపక్ష నాయకులు అడ్డుకున్నారు. 2019లో అప్పటి వైకాపా ప్రభుత్వం ఈ అంశాన్ని అటకెక్కించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మళ్లీ ఆశలు చిగురించాయి.

300 మందికిపైగా సభ్యులు..

ఆటోనగర్ సాధన సమితిలో మొత్తం ఐదు యూనియన్లు ఉన్నాయి. అందులో సుమారు 300 మందికిపైగా సభ్యులున్నారు. వారిలో వెల్డింగ్, ఫౌండ్రి కార్మికులు 130, కార్ల మెకానిక్‌లు 70, బీరువాల తయారీ చేసే యూనిట్లు 30, ఆటో, ట్రాక్టర్ మెకానిక్‌లు 90 మంది వరకు ఉంటారు. వారంతా ఆటోనగర్‌లో దుకాణాలు ఏర్పాటు చేసుకునేందుకు మక్కువ చూపిస్తున్నారు.

ఎందుకంటే..?

పరిశ్రమలకు అవసరమైన సామగ్రిని తయారు చేసే ఫౌండ్రీలు, వెల్డింగ్ దుకాణాలు, కార్లు, లారీ మెకానిక్ షెడ్లు, నివాసాల మధ్య ఉండడంతో శబ్ద కాలుష్యం, పరిసరాలు అపరిశుభ్రత, విద్యుత్తు సమస్య ఉత్పన్నమవుతోంది. రాత్రి పూట పని చేసుకునే వెసులుబాటు ఉండటం లేదు. దీంతో నివాసాలకు దూరంగా అన్ని దుకాణాలు, షెడ్లు ఏర్పాటు చేసుకునేలా స్థలం చూపించి, ప్రత్యేకంగా విద్యుత్తు నియంత్రిక ఏర్పాటు చేస్తే ఎవరికి ఇబ్బందులు ఉండవని ఆటోనగర్ సాధన సమితి చెబుతోంది.

2011 నుంచి పోరాడుతున్నాం.. ఆటోనగర్ సాధన కోసం 2011 నుంచి పోరాడుతున్నాం. ఊరు శివారున ప్రత్యేక స్థలం కేటాయిస్తే చేతి వృత్తిదారులకు ఉపయోగకరంగా ఉంటుంది. - కడలి రామారావు, ఆటోనగర్ యూనియన్ అధ్యక్షుడు

నేటితో షష్టి ఉత్సవాలు ముగింపు

అత్తిలి (గ్రామీణం), న్యూస్‌టుడే: స్థానిక శ్రీవల్లీ దేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి షష్టి ఉత్సవాలు మంగళవారంతో ముగుస్తున్నాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. నవంబరు నెల 25 నుంచి ఈనెల 8 వరకు 15 రోజుల పాటు షష్టి కావడిపై ఆసక్తిగల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం రాత్రి కావడిపై నిర్వహించిన సంగీత విభావరి భక్తులను అలరించింది. మంగళవారం రాత్రి తోలు బొమ్మలాటతో ఉత్సవాలు ముగుస్తున్నాయన్నారు.

అభయ గణపతికి అభిషేకాలు

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: పట్టణంలోని శ్రీకృష్ణ యోగధ్యాన మందిరంలో మార్గశిర బహుళ చవితి పురస్కరించుకుని సోమవారం అభయ గణపతికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని విశేషంగా అలంకరించారు. ఈ క్రతువులో భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

వీరేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

కొండ్రుప్రోలు(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం మండలం కొండ్రుప్రోలులోని భద్రకాళీ సమేత వీరేశ్వర స్వామికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా స్వామిని విశేషంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి స్వామిని దర్శించుకున్నారు.

క్రీస్తు దీవెనలు అందరికీ ఉండాలి

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: ప్రజలందరికీ యేసు క్రీస్తు దీవెనలు ఉండాలని ఏపీ భవన ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ఛైర్మన్ వలవల బాబ్జీ అన్నారు. ఆదివారం రాత్రి ఫెయిత్ చర్చి ఆధ్వర్యంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా నిర్వాహకులు బాబ్జీని సత్కరించారు. ఆకాశపు స్వామి, గంధం సతీశ్, సీలి వెంకటాచలం పాల్గొన్నారు.

బొలిశెట్టిని అభినందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు

అభివృద్ధి పనుల వివరాలు పరిశీలిస్తున్న చంద్రబాబు

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్‌ని ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం అమరావతి వెలగపూడి సచివాలయం సీఎంఓ బ్లాక్-1 కార్యాలయంలో ప్రత్యేకంగా అభినందించారు. ఎమ్మెల్యే శ్రీనివాస్ ముందుగా సీఎంతో భేటీలో భాగంగా తాడేపల్లిగూడెం పట్టణంలో ఇండోర్ స్టేడియం, ఈత కొలను, జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ప్రాంగణ మైదానం అభివృద్ధి పనులను వివరించారు. ఈ సందర్భంగా అంచనా దస్త్రాలను ముఖ్యమంత్రి పరిశీలించారు. వాటి ప్రారంభోత్సవానికి రావాలని ముఖ్యమంత్రిని ఆహ్వానించారు. అనంతరం నియోజకవర్గంలోని రహదారుల అధ్వాన స్థితిలో ఉన్నాయని, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. అందుకు చంద్రబాబు సానుకూలంగా స్పందించి సహకరిస్తానని తెలిపారు. నాయకులు పాలూరి వెంకటేశ్వరరావు, జేపీ సాయినిరంజన్, పసుమర్తి రామ్‌లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్.ఆర్.ఎస్.ను సద్వినియోగం చేసుకోండి

కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేఅవుట్ల క్రమబద్ధీకరణ (ఎల్ఆర్ఎస్) పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు సూచించారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ప్రతి సోమవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కమిషనర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ వేదిక ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్నామన్నారు. ఎల్.ఆర్.ఎస్. ప్రకటించిన తరువాత ఇంతవరకు 205 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. అనంతరం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మొత్తం ఏడు అర్జీలు వచ్చాయని.. వాటిని ఆయా శాఖల అధికారులకు ఇచ్చి పరిష్కరిస్తామని తెలిపారు. సహాయ కమిషనర్ నగీన సుల్తాన్ బేగం, ఎంఈ వెంకటరమణ, మేనేజర్ రవి సుధాకర్, ఏసీపీ సీతారామ్, ఎంహెచ్‌వో ఎన్.రాజు, టీపీవో జగదీష్, సీసీ నరేశ్ పాల్గొన్నారు.

వైద్య శిబిరంలో క్లబ్ సభ్యులు, జనవతారకం ఆసుపత్రి వైద్యులు

122 మందికి వైద్య పరీక్షలు

అత్తిలి (గ్రామీణం), న్యూస్‌టుడే: సోమవారం అత్తిలి మండలం మంచిలి గ్రామంలో అత్తిలి లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు శిరగాని నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఇందుకూరి సుబ్బరాజు ఆర్థిక సహకారంతో క్యాన్సర్ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. జనవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ పరిశోధన ఆసుపత్రి వైద్యులు 122 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ గవర్నర్ ఆర్‌వీఎస్ సూర్యనారాయణరాజు మాట్లాడుతూ క్యాన్సర్‌ను మొదటి దశలోనే గుర్తిస్తే నివారణ సాధ్యమన్నారు. ఆహార అలవాట్ల కారణంగా క్యాన్సర్ వ్యాధి విస్తరిస్తోందన్నారు. ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో వర్రినీడి వెంకటశివ, దాసం బాబ్జీ, లయన్స్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

రాధాకృష్ణ సేవలు ఎనలేనివి

పురస్కారంతో సత్కరిస్తున్న నిర్వాహకులు

తణుకు, న్యూస్‌టుడే: పైడిపర్రు జడ్పీ ఉన్నత పాఠశాలలో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు పి.రాధాకృష్ణకు డా సర్వేపల్లి రాధాకృష్ణ జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు-2025 దక్కినట్లు సోమవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాదులోని సుందరయ్య కళా నిలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డు అందుకున్నట్లు తెలిపారు.

చెరువుకు అవుట్‌లెట్ లేక అవస్థలు

ఇరగవరం, న్యూస్‌టుడే: మండలంలోని కత్తవపాడు గ్రామంలో తాగునీటి చెరువుకు అవుట్‌లెట్ లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఐదెకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ చెరువుకు నీరు వచ్చే మార్గమే కాని, బయటకు వెళ్లే మార్గం లేదు. దీంతో తూడు, పసర్లు పడుతున్నాయి. ఈ కారణంగా నీరు కలుషితం అవుతోంది. తూడు పెరగడంతో రెండు నెలల క్రితమే తూడు తొలగించారు. ప్రజలకు ఉదయం కావలిపురం రిజర్వాయర్ నుంచి, సాయంత్రం చెరువు నీటిని ఫిల్టర్‌బెడ్ ద్వారా శుభ్రం చేసి అందిస్తున్నట్లు కార్యదర్శి ఆర్. వెంకట నరేశ్ చెప్పారు. ఈ సమస్యను ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వీఎస్ పవన్ దృష్టికి తీసుకెళ్లగా అవుట్‌లెట్ నిర్మాణానికి రూ.40లక్షలు అంచనాతో ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపామన్నారు.

కత్తవపాడులో తామరాకులతో నిండిన తాగునీటి చెరువు

తాగునీరు కలుషితం.. వ్యాధులతో సతమతం

రావిపాడులో పైపులైను లీకేజీతో పెరుగుతున్న బాధితులు

న్యూస్‌టుడే, పెంటపాడు(తాడేపల్లిగూడెం వన్‌టౌన్)

పెంటపాడు మండలం రావిపాడులో నీటి కాలుష్యంతో గ్రామస్థులు పచ్చ కామెర్లు, జ్వరాల బారిన పడుతున్నారు. గ్రామంలో మూడు దశాబ్దాల కిందట నిర్మించిన మంచి నీటి పైపులైను పాడవడంతో లీకులు ఏర్పడి ఈ సమస్య తలెత్తింది. సురక్షిత తాగునీటి సరఫరాపై గత వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడంతో ప్రస్తుతం ఈ సమస్య తీవ్రరూపం దాల్చింది. పైపులైనుకు ఎక్కడికక్కడ లీకులు ఏర్పడి మురుగు బోదె నీరు కలిసిపోయి కలుషితమవుతోంది. దీంతో సుమారు 100 నివాసాల్లో 500 మందికిపైగా జనాభా ఉన్న సుమారు 100 నివాసాల్లో 500 మందికిపైగా జనాభా ఉన్న చిన్నగుడి, పెన్నాడ వారి వీధి, తోటవారి వీధి, సగరపేట ప్రాంతాల్లో కలుషిత నీరు సరఫరా అవుతోంది. స్థానికులు జ్వరాల బారిన పడుతుండడంతో గ్రామ అధికారులు, కూటమి నాయకులు పైపులైను తవ్వించి లీకులు సరిచేయిస్తున్నారు. ప్రస్తుతం నీటి సరఫరా నిలిపివేశారు. సమస్య ఉన్న ప్రాంతాల్లో ట్యాంకర్లతో నీటి సరఫరా చేస్తున్నారు.

వైద్య శిబిరం ఏర్పాటు.. కలుషిత నీరు తాగి కొద్ది రోజుల క్రితం గ్రామానికి చెందిన బాలిక లాస్యకు జ్వరం రాగా సమీప ఆసుపత్రిలో చేర్పిస్తే కామెర్లు అని వైద్యులు నిర్ధారించారు. తర్వాత ఆమె సోదరుడికి జ్వరం రావడంతో ఆసుపత్రిలో చికిత్స పొందాడు. వారిద్దరి వైద్యానికి సుమారు రూ.5 లక్షలు ఖర్చయిందని కుటుంబ సభ్యులు తెలిపారు. అనంతరం వరుసగా తొమ్మిది మంది జ్వరాల బారిన పడ్డారు. వారిలో పెన్నాడ పవన్ కుమార్ ప్రస్తుతం రాజమహేంద్రవరంలో చికిత్స పొందుతున్నాడు. దీంతో వైద్య శాఖ యంత్రాంగం అప్రమత్తమై గ్రామంలోని పెన్నాడవారి వీధిలో ముదునూరు ఆరోగ్య కేంద్రం వైద్యురాలు వి.పూజిత ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహిస్తోంది. కలుషిత తాగునీటి వల్లే చిన్నారులు జ్వరాల బారిన పడ్డారని వైద్యులు పేర్కొంటున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి ఎం.శేఖర్‌బాబు మాట్లాడుతూ గ్రామంలో ప్రస్తుతం పరిస్థితి అదుపులో ఉందన్నారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నామని.. స్థానికులకు నీటి ఇబ్బందులు లేకుండా ట్యాంకర్లతో సరఫరా చేస్తున్నామన్నారు.

లీకులు సరిచేసేందుకు తవ్వకాలు

దివ్యాంగులం.. ఏ పనీ చేయలేం

మీరే ఆదుకోవాలంటూ జేసీకి వినతులు

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: అవయవాలు సక్రమంగా లేని మేము ఏ పని చేయలేం.. భారమంతా కుటుంబ సభ్యులే భరిస్తున్నారు. మా ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే. ప్రభుత్వం నుంచి తగినంత సాయం అందించి ఆదుకోవాలి. ఇదీ పలువురు దివ్యాంగులు కలెక్టరేట్ వరకు వచ్చి ఉన్నతాధికారులకు చేస్తున్న విన్నపాలు. కొందరైతే ఇప్పుడిస్తున్న పింఛను ప్రతి నెలా మందులకే సరిపోతుంది.. పోషణ కష్టమవుతుంది కాబట్టి పింఛను సొమ్ము పెంచాలని వేడుకుంటున్నారు. మరొకరి సాయంతో జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చి అర్జీలు ఇస్తున్నారు.

☛ నా కుమార్తె అనూష పుట్టుకతోనే మానసిక, శారీరక దివ్యాంగురాలు. ఆమె పోషణ చాలా కష్టంగా ఉంది. ప్రస్తుతం ఇస్తున్న ఆరు వేల పింఛను రూ.15 వేలకు పెంచాలని కోరుతున్నాం. - బి.సత్యనారాయణ (తణుకు)

ఎరువుల దుకాణాల తనిఖీ

నిల్వలు పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

పెదతాడేపల్లి, చినతాడేపల్లి (తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం మండలంలో రబీ సీజన్ వరి సాగు ప్రారంభం కానుంది. ఈ క్రమంలో సోమవారం తణుకు వ్యవసాయ సహాయ సంచాలకుడు జి.నరేంద్ర తాడేపల్లిగూడెంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఎరువుల గోదాములను తనిఖీ చేశారు. తాడేపల్లిగూడెం, చినతాడేపల్లిలోని మార్క్‌ఫెడ్, పెదతాడేపల్లిలోని ఎరువుల గోదాముల్లో నిల్వలపై ఆరా తీశారు. తాడేపల్లిగూడెం మండల వ్యవసాయ అధికారి వి.నారాయణరావు పాల్గొన్నారు.

డ్రెయిన్లు, రహదారులు నిర్మించాలని వినతి

ఇరగవరం, న్యూస్‌టుడే: పొదలాడ గ్రామంలో డ్రెయిన్లు, రహదారులు అభివృద్ధి చేయాలని కోరుతూ సోమవారం మండల పరిషత్తు కార్యాలయంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో ఎంపీడీవో ఎ.శ్రీనివాసరావుకు స్థానికులు వినతి పత్రం అందించారు. డ్రెయిన్లు లేక వాడకం నీరు గుంటల్లో నిలిచి దోమలతో ఇబ్బంది పడుతున్నామన్నారు. అందరికీ తాగునీరు అందేలా ట్యాంకు సామర్థ్యం పెంచాలని కోరారు.

లారీ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొట్టడంతో ఓ వ్యక్తి తీవ్రగాయాలపాలైన ఘటన అత్తిలి మండలం తిరుపతిపురంలో ఆదివారం ఉదయం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. ఉండి మండలం సాగిపాడు గ్రామానికి చెందిన మామిడిశెట్టి శ్రీను(34) ఆదివారం ఉదయం అత్తగారి గ్రామమైన తిరుపతిపురానికి ద్విచక్రవాహనంపై వస్తున్నారు. గ్రామం సమీపానికి రాగానే తిరుపతిపురం నుంచి బల్లిపాడు వైపు వెళ్తున్న లారీ అతివేగంగా బైకును ఢీకొట్టింది. వాహనంపై నుంచి పడిపోయిన శ్రీనుకి తీవ్ర గాయాలవ్వడంతో స్థానికులు 108 అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రేమరాజు తెలిపారు.

మహాసభల విజయవంతానికి పిలుపు

గోడపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

తణుకు, న్యూస్‌టుడే: సీఐటీయు 18వ అఖిల భారత మహా సభలను జయప్రదం చేయాలని సీఐటీయూ మండల కమిటీ కన్వీనర్ జుత్తిగ రామాంజనేయులు, కార్మికులు విజ్ఞప్తి చేశారు. సోమవారం ఇరగవరం మండల కేంద్రంలో మహాసభ గోడపత్రికను ఆవిష్కరించి మాట్లాడారు. భాజపా అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కార్మిక చట్టాలను తుంగలో తొక్కుతున్నారన్నారు. పూర్వ విధాన చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కామన మునిస్వామి, డి.విజయలక్ష్మి, కె.అరుణ కుమారి, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

యర్రమిల్లిపాడులో కారు దగ్ధం

ఉంగుటూరు, న్యూస్‌టుడే: యర్రమిల్లిపాడుకు చెందిన తమ్మిన రోహిత్ చౌదరి తన స్నేహితుడితో కలిసి ఆదివారం దేవరపల్లి వెళ్లారు. పనులు ముగించుకొని స్వగ్రామం బయల్దేరారు. లక్ష్మీనగరం-యర్రమిల్లిపాడు రోడ్డులో కారు ముందు భాగం నుంచి పొగ రావడంతో వారు అప్రమత్తమయ్యారు. కారు రోడ్డు పక్కన నిలిపి బయటకొచ్చేశారు. బోనెట్ తెరిచే వ్యాపించడంతో.. కారు పూర్తిగా దగ్ధమైంది. భీమడోలు అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకొని మంటలు అదుపు చేశారు.

ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించండి

తాడేపల్లిగూడెం: వినతి పత్రం అందిస్తున్న నాయకులు

తణుకు: నిరసన తెలుపుతూ...

రామారావుపేట(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: సహకార సంఘాల ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తాడేపల్లిగూడెం నియోజకవర్గంతోపాటు ఉంగుటూరు మండలంలోని బొమ్మిడి, బాదంపూడి, చేబ్రోలు సహకార సంఘాల ఉద్యోగులు సోమవారం తాడేపల్లిగూడెం డీసీసీ బ్యాంకు వద్ద ఆందోళన నిర్వహించారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నినాదాలు చేశారు. అనంతరం ఏజీఎం శంకర్‌నారాయణకు వినతిపత్రం అందించారు. బ్రాంచి మేనేజర్ బస్వ సత్యానారాయణ, సూపర్‌వైజర్ దివ్య, సహకార సంఘాల ఉద్యోగులు పాల్గొన్నారు.

తణుకు, న్యూస్‌టుడే: వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు వెంటనే పరిష్కారం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ.ప్రతాప్, సహకారం సంఘాల ఉద్యోగుల రాష్ట్ర నాయకుడు చిల్లకూరి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక డీసీసీబీ బ్యాంకు వద్ద సహకార ఉద్యోగుల సంఘాల (జేఏసీ), సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. జీవో నెంబర్ 36 అమలు చేసి, 2019, 2024 పెండింగ్ వేతన సవరణలు పూర్తి చేసి అప్పటి వరకు మధ్యంతర భృతి ఇవ్వాలన్నారు. యూనియన్ రాష్ట్ర మాజీ కార్యదర్శి కొల్లి సత్యనారాయణ, ఈ.గోపాలరావు, పి.విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేర్చారు.. మిన్నకున్నారు!

కుట్టు యంత్రాలకు మహిళల నిరీక్షణ

☛ గణపవరానికి చెందిన రుద్రరాజు సౌమ్య కుట్టు శిక్షణ పొంది నాలుగు నెలలు పూర్తవుతోంది. కుట్టు యంత్రాలు ఎప్పుడిస్తారంటూ ఇప్పటి వరకు కనీసం పది సార్లు సచివాలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. అక్కడ సరైన సమాధానం చెప్పడంతో. . నిరాశగా ఇంటికొస్తున్నారు.

☛ పిప్పరకు చెందిన కృష్ణవేణి గణపవరంలో కుట్టు శిక్షణ పొందారు. ఇప్పటి వరకు ధ్రువపత్రం, కుట్టు యంత్రం, బ్యాంకు రుణం మంజూరు చేయలేదు. యంత్రమిస్తే కొంత మొత్తాన్ని జోడించి దర్జీ దుకాణం పెట్టుకోవాలని అనుకుంటున్నానని.. తన ఆశ నెరవేరేలా కనిపించడం ఆవేదన వ్యక్తం చేశారు.

గణపవరం, న్యూస్‌టుడే: మహిళల ఆర్థిక స్వావలంబనకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. వారి జీవనశైలి, ఆర్థికాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. వెనుకబడిన తరగతుల సహకార ఆర్థిక సంస్థ ఆధ్వర్యాన ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. తద్వారా నియోజకవర్గంలో సుమారు 560 మంది శిక్షణ పొందేలా ప్రణాళిక రూపొందించింది.

గణపవరంలో శిక్షణ పొందుతూ..

మూడు నెలల శిక్షణ.. నియోజకవర్గంలో నాలుగు మండలాలున్నాయి. మండలానికి 140 మందిని రెండు భాగాలుగా విభజించి శిక్షణనిచ్చారు. 85 శాతం హాజరు ఉండాలన్న నిబంధన విధించడంతో.. ఒక్కో మండలం నుంచి 110 చొప్పున సుమారు 440 మంది అర్హత సాధించారు. వీరికి ధ్రువపత్రంతో పాటు ఉచిత కుట్టు యంత్రం అందించేలా మార్గదర్శకాలు రూపొందించారు. మహిళలు నేరుగా దర్జీ దుకాణాలు ఏర్పాటు చేసుకునేలా బ్యాంకుల నుంచి రుణ సదుపాయం కల్పించాల్సి ఉంది.

కాళ్లరిగేలా తిరుగుతున్నా.. శిక్షణ పూర్తై నాలుగు నెలలవుతున్నా.. నేటికీ మహిళలకు కుట్టు యంత్రాలు అందించలేదు. వారు రోజూ కాళ్లరిగేలా తిరుగుతున్నా.. సరైన సమాధానం చెప్పే వారే కరవయ్యారు. పలు మండలాల్లో ధ్రువపత్రాలు అందించలేదు. 'కుట్టు యంత్రాల పంపిణీ అంశం ఉన్నతాధికారుల పరిధిలో ఉంది. అన్ని మండలాల లబ్ధిదారులకు ఒకేసారి అందజేస్తారని తెలిసింది. త్వరలోనే యంత్రాలు అందజేసే అవకాశముంది' అని గణపవరం ఎంపీడీవో బేబి శ్రీలక్ష్మి తెలిపారు.

ప్లాస్టిక్ భూతం.. అరికడదాం

తాడేపల్లిగూడెం పట్టణాన్ని ప్లాస్టిక్ భూతం వదలడం లేదు. పాలిథిన్ సంచులు తదితరాల వాడకం వల్ల కలిగే అనర్థాలపై స్వచ్ఛంద సంస్థలు, అధికారులు ప్రజలకు అనేక రకాలుగా అవగాహన కల్పిస్తున్నా కొంతమంది ప్రజలు, వ్యాపారులు పెడచెవిన పెడుతూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. పర్యావరణహిత ప్లాస్టిక్ వినియోగించాలని మున్సిపల్ అధికారులు ఎన్నిసార్లు వ్యాపారులకు చెబుతున్నా వాటి విక్రయాలు మానడం లేదు. భూమిలో కలిసిపోయే పాలిథిన్ సంచులు, గ్లాసులు, సీసాలు వినియోగించాలని, విక్రయించాలని అధికారులు చెబుతున్నప్పటికీ వాటి ధరలు అధికంగా ఉన్నాయని వ్యాపారులు సాకులు చెబుతున్నారు. వాడిన అనంతరం వాటిని ఖాళీ స్థలాలు, మురుగు బోదెల్లో పారబోస్తుండడంతో కాలువలు పేరుకుపోయి పారిశుద్ధ్య సమస్య తలెత్తుతోంది. దీంతోపాటు ఆయా ప్రాంతాలు దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారుతున్నాయి. దోమల కారణంగా జ్వరాలు తదితర వ్యాధుల బారిన పడుతూ ఇల్లు, ఒళ్లు గుల్ల చేసుకోవాల్సి వస్తోందని పట్టణ ప్రజలు వాపోతున్నారు. వాటిని తొలగించేందుకు మున్సిపల్ సిబ్బంది తలలు పట్టుకుంటున్నారు. కొన్నిచోట్ల ప్లాస్టిక్ వ్యర్థాలకు నిప్పు పెడుతుండడంతో పర్యావరణం కాలుష్యమవుతోంది. అధికారులు నిబంధనల్ని పక్కాగా అమలు చేసి ప్లాస్టిక్ సామగ్రి విక్రయాలు, వినియోగం అరికట్టాలని పలువురు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, తాడేపల్లిగూడెం అర్బన్

యాదవులకు జగన్ పెద్దపీట

తణుకు, న్యూస్‌టుడే: వైకాపా అధినేత జగన్‌మోహన్‌రెడ్డి యాదవులకు పెద్ద పీట వేశారని యాదవ సంఘ నాయకుడు సందాపు దుర్గారావు యాదవ్ అన్నారు. సోమవారం స్థానిక వైకాపా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యాదవుడైన కారుమూరి నాగేశ్వరరావుకు ఎమ్మెల్యే, మంత్రి పదవులు ఇచ్చారని గుర్తుచేశారు. బీసీ మహిళ గూడూరి ఉమాబాల, తణుకు అసెంబ్లీకి కారుమూరికి సీట్లు ఇచ్చారన్నారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు పార్థసారథి యాదవ్, బొద్దాని శ్రీనివాస్ యాదవ్, పిట్టా అప్పలరాజు యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

ఈనాడు వైఎస్సార్ కడప

మంగళవారం డిసెంబరు 9, 2025

దేశంలోనే సుందరం.. ఆరోగ్యమాత మందిరం

దేశంలో నిర్మించిన కథోలిక చర్చిల్లో అతి సుందరమైన చర్చిగా కడప నగరంలోని ఆరోగ్యమాత చర్చి పేరొందింది. రెండస్తుల్లో నిర్మించిన ఈ చర్చిలో ఒకే సారి 1200 మంది విశ్వాసులు ప్రార్థనలు చేసుకునే వీలుంది. దక్షిణ భారతదేశంలోని చర్చిల నిర్మాణంలో సిద్ధహస్తుడైన కడప నగరవాసి ఇంజినీరు వెంకటేశ్వర్లు ఈ చర్చి నిర్మాణానికి డిజైన్లు రూపొందించారు. 1978 నుంచి ఈ చర్చి ఆరోగ్యమాత పుణ్యక్షేత్రంగా ప్రచారంలోకి వచ్చింది. ఇక్కడి మేరీ మాతను దయగల మాత, పిల్లల మేరీ మాత అని కూడా పిలుస్తారని విశ్వాసులు చెబుతున్నారు. త్వరలో ప్రారంభమయ్యే క్రిస్మస్ వేడుకలకు ఈ ప్రార్థనా మందిరం సిద్ధం ముస్తాబవుతోంది. - న్యూస్‌టుడే, నాగరాజుపేట

పుష్పగిరి.. భక్తసిరి

వల్లూరు, న్యూస్‌టుడే: జిల్లాలో పురాతన పుణ్యక్షేత్రం పుష్పగిరిలో వెలసిన శ్రీ వైద్యనాథేశ్వర స్వామి భక్తులతో కిటకిటలాడింది. మార్గశిర సోమవారం సందర్భంగా ఆలయంలో వైద్యనాథేశ్వర స్వామికి రుద్రాభిషేకాలు నిర్వహించారు. భక్తులు పంచనదీ సంగమమైన పినాకినీ నదిలో పుణ్యస్నానాలు ఆచరించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. శ్రీలక్ష్మీ సమేత కామాక్షి అమ్మవారిని పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించి కుంకుమార్చనలు నిర్వహించారు. మంగళవారం వైద్యనాథేశ్వర స్వామికి శతరుద్రాభిషేకం నిర్వహిస్తున్నట్లు అర్చకులు రాజశేఖర్ తెలిపారు.

నగరంలో మంత్రుల సందడి

ఎంపీ సీఎం రమేశ్‌తో కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ, స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులు

కడప నగరంలో సోమవారం మంత్రుల సందడి కనిపించింది.. రాష్ట్ర సచివాలయం తరలి వచ్చిందా అన్నట్లుగా అమాత్యులతో పాటు ఎమ్మెల్యేలు, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు, పార్టీ అగ్ర నేతలు తరలి రావడంతో ఎటు చూసినా నాయకులు, కార్యకర్తలతో కళకళలాడింది. అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ మాతృమూర్తి ఇటీవల మృతి చెందడంతో ఆయనను పరామర్శించేందుకు కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మతో పాటు శాసనసభ స్పీకర్ అయ్యన్న పాత్రుడు, వ్యవసాయ, హోం, విద్యుత్, రెవెన్యూశాఖల మంత్రులు అచ్చెన్నాయుడు, అనిత, గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్ తదితరులు కడపకు విచ్చేశారు. ఈ సందర్భంగా విమానాశ్రయంలో తెదేపా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు హరిప్రసాద్, గోవర్ధన్‌రెడ్డి, క్రికెట్ స్టేడియం ఛైర్మన్ శ్రవణ్‌రాజ్‌రెడ్డి, రెడ్డెయ్య తదితరులు వారికి స్వాగతం పలికారు. హోం శాఖ మంత్రి అనితకు కడప ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం వారంతా ఎర్రగుంట్ల మండలం పోట్లదుర్తికి వెళ్లారు. - న్యూస్‌టుడే, కడప, నేరవార్తలు అరవిందనగర్, ఎర్రగుంట్ల

ఓపీకి ఉంటేనే రిమ్స్‌లో వైద్యం

సర్వజన ఆసుపత్రి, న్యూస్‌టుడే: రిమ్స్‌కు వెళ్తే పెద్ద డాక్టర్లుంటారు.. మెరుగైన వైద్యం అందుతుందని ఎన్నో వ్యయప్రయాసలకు జిల్లా నలుమూలల నుంచి రోగులు వస్తుంటారు. ముప్పతిప్పలు తప్పడం లేదు. సర్వజన ఆసుపత్రిలో రోజుకో నిబంధన పెట్టి రోగులను ఇబ్బందులకు గురి చేస్తూ ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లేలా చేస్తున్నారని రోగులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైద్యం కోసం వచ్చిన వారు ఓపీ విభాగంలోని కౌంటర్ వద్దకు వెళ్లి పేరు, ఊరు, రోగం చెబితే గతంలో ఓపీ చీటీ ఇచ్చేవారు. ప్రస్తుతం ఓపీ చీటీ కోసం గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోందని వాపోతున్నారు. అనారోగ్యంతో అసలే నిలబడలేని తాము ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఓపీ కోసం నిరీక్షించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాతావరణంలో మార్పుల వల్ల వివిధ రకాల అనారోగ్యాలకు గురైన వారు 1,500ల నుంచి 2 వేల మంది వరకు రిమ్స్‌కు రోజూ వైద్యానికి వస్తుంటారు. ప్రస్తుతం ఆండ్రాయిడ్ చరవాణిలో యాప్ డౌన్‌లోడ్ చేసుకుని అందులో నుంచి క్యూఆర్‌కోడ్ స్కాన్ చేసి రోగి వివరాలు, చిరునామా నమోదు చేస్తే సెల్‌కు ఓటీపీ వస్తుంది. వచ్చిన ఓటీపీని ఓపీ కౌంటర్‌లో చెబితేనే ఓపీ చీటీ ఇస్తామని సిబ్బంది చెబుతున్నారని గగ్గోలు పెడుతున్నారు. చరవాణి లేదంటే వారి పరిస్థితి వర్ణనాతీతం.

12 గంటల తరువాత కూడా ఓపీ కోసం నిరీక్షిస్తున్న మహిళలు.. మూతపడిన మహిళల ఓపీ రిజిస్ట్రేషన్ కౌంటర్

పర్యాటక పోలీస్.. అంతా తుస్‌స్‌స్!



ఒంటిమిట్ట కోదండ రామాలయం దర్శనం కోసం వస్తున్న యాత్రికుల కోసం తితిదే నాలుగేళ్ల కిందట రూ.7.50 లక్షలతో వెచ్చించి బస్‌షెల్టర్‌ను నిర్మించింది. రామయ్య క్షేత్రం వెనుక వైపున నిర్మించడంతో ఎండ, వాన నుంచి రక్షణగా ఉండేది. గత వైకాపా ప్రభుత్వం పర్యాటకులు, భక్తుల భద్రతకు ప్రముఖ పుణ్య క్షేత్రాల్లో 'పర్యాటక పోలీస్ కేంద్రం' ఏర్పాటు చేయాలని ముందుకొచ్చింది. భక్తుల కోసం తితిదే నిర్మించిన బస్‌షెల్టర్‌ను అప్పట్లో జిల్లా పోలీస్ అధికారులు ఎంపిక చేశారు. 2023 ఫిబ్రవరి 14న నాటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ఆన్‌లైన్‌లో ప్రారంభించారు. తొలుత ఒకరిద్దరూ సిబ్బందితో సేవలు అందించారు. ఆ తర్వాత పక్కన పెట్టేశారు. అంతా ఆరంభశూరత్వంగా మారింది. ప్రస్తుతం కంప చెట్లు, కలుపు మొక్కలతో నిండి కళాహీనంగా ఉంది. - న్యూస్‌టుడే, ఒంటిమిట్ట

ష్... ఏసీబీ నిద్రపోతోంది!

◆ లంచగొండుల భరతం పట్టేదెవరు!

◆ నేడు అంతర్జాతీయ అవినీతి నిరోధక దినం

ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు ఒక్క ఏసీబీ దాడి కూడా జరగలేదు... ఒక్క అధికారీ లంచం తీసుకుంటూ పట్టుబడలేదు.. ఆదాయానికి మించి ఆస్తులున్న ఉద్యోగిని గుర్తించలేదు.. అంటే జిల్లాలో అవినీతి కనుమరుగైందా! ఆశ్చర్యంగా ఉంది కదూ! ఇది నిజం. జిల్లాలోని పలు ప్రభుత్వ శాఖల్లో చేయి తడపందే పనులు జరగడం లేదు. అ 'ధనం' సమర్పించుకోందే దస్త్రం కదలడం లేదు.. అమ్యామ్యాలు ఇవ్వనిదే ఏ పనీ జరగడం లేదు. మరి ఏసీబీ ఏం చేస్తోందంటే గాఢ నిద్రలో ఉంది. నడిపించే నాయకుడు (డీఎస్పీ) లేక ఏడాదైంది. నేడు అంతర్జాతీయ అవినీతి నిరోధక దినం సందర్భంగా ప్రత్యేక కథనం.

- న్యూస్‌టుడే, కడప నేరవార్తలు

● జిల్లాలోని సుమారు 70 ప్రభుత్వ శాఖలున్నాయి. ఇందులో రెవెన్యూ, రిజిస్ట్రేషన్లు, రవాణా, పోలీసు, ఖజానా, విద్య, వైద్య శాఖలు అవినీతిలో ముందంజలో ఉండగా మిగతా శాఖల్లో ఎవరికి వారుగా అవకాశం వచ్చినప్పుడల్లా లంచం ఉనికిని చాటుతున్నారు. అవినీతి అధికారులకు ముకుతాడు వేసేందుకు అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)ను ఏర్పాటు చేశారు.

గత ఏడాది ఒక్కటే కేసు

2024 మార్చి 11న కడప కలెక్టరేట్‌లోని డి. విభాగంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ప్రమీల రైతు నుంచి రూ.50 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి దొరికారు.

ఎవరికి ఫిర్యాదు చేయాలంటే..

టోల్‌ఫ్రీ 1064 | డీఎస్పీ 9440446191 | సీఐ 9866213944

ఆడిటింగా.. పాడా

◆ విజిలెన్స్ విచారణతో ఆందోళన

◆ ప్రజాధనం దోపిడీలో భాగస్వామ్యం

◆ వైకాపా నేతలతో అంటకాగి స్వాహా పర్వం

ఈనాడు, కడప : పులివెందుల ప్రాంత అభివృద్ధి సంస్థ (పాడా) కింద పనులు చేపట్టిన అధికారుల్లో ఆందోళన నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్ విచారణ చేయించడంతో అక్రమాలు తమ మెడకు చుట్టుకుంటాయనే భయం పట్టుకుంది. వైకాపా హయాంలో అయిదేళ్ల కాలంలో దాదాపు రూ.1000 కోట్ల నిధుల్ని పాడా కింద వ్యయం చేశారు. ఈ నిధులను నేతలకు పప్పుబెల్లాల్లా పంచిపెట్టారు. సాధారణ ఎన్నికల్లో లబ్ధికి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. అలకతో ఉన్న వైకాపా నేతలను ప్రసన్నం చేసుకోవడానికి పాడా, డ్వామా కింద నరేగా నిధుల్ని, పనుల్ని పంచిపెట్టి నాలుగు రాళ్లు వెనకేసుకునేలా ప్రోత్సహించారు. విజిలెన్స్ విచారణలోనూ అక్రమాలు చాలా వరకు వెలుగులోకి వచ్చాయి. పాడాకు డిప్యుటేషన్‌పై వచ్చిన అధికారులతో పాటు పనులు చేసిన వివిధ ఇంజినీరింగ్ విభాగాల గుట్టు బయటపడుతోంది. అప్పట్లో ముఖ్యమంత్రి నియోజకవర్గం కావడం, ఆపై రాజకీయ ఒత్తిళ్లతో చెప్పిందల్లా తలూపుతూ అధికారులు మమ అనిపించారు. నిబంధనలు పాటించకుండా ఎడాపెడా బిల్లులు ఇష్టారాజ్యంగా చెల్లించారు. క్షేత్రస్థాయిలో ప్రజాధనం వ్యయానికి, పనులకు భారీ వ్యత్యాసం కనిపిస్తోంది. ఇందులో అధికారుల పాత్రను విజిలెన్స్ నిగ్గు తేల్చుతోంది. అక్రమాలు తమ మెడకు చుట్టుకుంటాయనే భయం లేకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. ఇప్పుడు పలువురు ఇంజినీరింగ్ అధికారుల జాతకాలు వెలుగులోకి వస్తున్నాయి. విజిలెన్స్ విచారణలో అధికారుల పాత్రను సమగ్రంగా వివరించినట్లు సమాచారం. ఈ వ్యవహారం బయటికి పొక్కడంతో అధికారుల్లో దడ మొదలైంది.

పాడా నిధుల కింద నిర్మించిన అరటి ఉప ఉత్పత్తుల తయారీ యూనిట్

అంటకాగిన అధికారి

పాడా నిధుల వ్యయంపై ఆడిటింగ్ చేయలేదు. వైకాపాతో అంటకాగిన అధికారి తన బాధ్యతను విస్మరించారు. నిబంధనలకు విరుద్ధంగా సొంత జిల్లాలోనే విధులు నిర్వహించారు. సాధారణంగా సొంత జిల్లాలో జిల్లా అధికారి పనిచేయరాదనే నిబంధనలున్నాయి. గత సాధారణ ఎన్నికల సమయంలో మూడేళ్లుగా ఒక ప్రాంతంలో పనిచేసే అధికారులను బదిలీ చేయాలనే నిబంధన ఉంది. ఈ నిబంధనను వర్తింప చేయకుండా ఆడిటింగ్ అధికారికి మినహాయింపు ఇచ్చారు. ఎన్నికల వ్యయ నోడల్ అధికారిగా అధికారిణి నియమించాల్సి ఉన్నప్పటికీ కోడ్ నిబంధన బయటపడుతుందనే కారణంగా ఆ బాధ్యతలను మరో అధికారికి అప్పగించారు. సాధారణ ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పాడా ఆడిటింగ్ హడావుడిగా నిర్వహించి అధికారులకు క్లీన్‌చిట్ ఇచ్చే ప్రయత్నం చేశారు. ముఖ్యమంత్రి పర్యటన ప్రొటోకాల్ ఖర్చుల కింద రూ.8 కోట్లు, కార్యాలయ ఫర్నిటర్, ఐటీ సంబంధిత పరికరాలు, కంప్యూటర్ల కొనుగోలుకు రూ.4 కోట్లు వ్యయం చేసినట్లు చూపించారు. ఈ వ్యయానికి సంబంధించి సరైన ఆధారాలు అధికారులు చూపించలేదు. ఈ వ్యవహారం తాజాగానే వెలుగులోకి వచ్చింది. త్వరలోనే విజిలెన్స్ నివేదికపై చర్యలు మొదలుకానున్నాయి.

పీజీఆర్ఎస్ నమోదులో నిర్లక్ష్యం

పలువురు ఉద్యోగులపై వేటు

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ఎంతో ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తుండగా అధికారుల నిర్లక్ష్యం క్షేత్రస్థాయిలో స్పష్టంగా కన్పిస్తోంది. అర్జీదారులు మళ్లీ మళ్లీ వినతులు ఇస్తున్నా పరిష్కారం కాకపోవడంతో దీనిపై దృష్టి పెట్టిన కలెక్టర్ శ్రీధర్ కఠిన చర్యలకు ఉపక్రమించారు. అందులో భాగంగా సింహాద్రిపురం తహసీల్దారు కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ సింగరయ్య, కడప కార్పొరేషన్ పరిధిలోని సరోజినీనగర్ శానిటేషన్ సెక్రటరీ గోపాలకృష్ణయ్యలను సస్పెండ్ చేయగా, సింహాద్రిపురం డిప్యూటీ తహసీల్దారు హరిబాబు, కడప సర్వేశాఖ ఏడీ కార్యాలయంలో పనిచేస్తున్న విలేజ్ సెక్రటరీ నారాయణమ్మలకు ఛార్జి మెమో ఇవ్వాలని ఆదేశించారు. ఖాజీపేట ఎస్‌హెచ్‌వోపై చర్యలు తీసుకోవాలని ఎస్పీని ఆదేశించారు. సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి సంబంధిత అధికారులందరూ తప్పని సరిగా హాజరుకావాలని, గైర్హాజరైన జిల్లా అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని జాయింట్ కలెక్టర్‌ను ఆదేశించారు.

ఇంటికే తీగలు.. చెంతకే సేవలు

మకోసం — కరెంటు కష్టాలకు చెక్

కలకడ, రాయచోటి, న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యుత్‌శాఖలో కొత్త సంస్కరణలు తీసుకొచ్చింది. దీంతో విద్యుత్ సర్వీసులు సులభంగా పొందవచ్చు. విద్యుత్ లైన్‌కు కొత్త కనెక్షన్ తీసుకొనే ఇంటికి 30 మీటర్లు దూరం దాటితే స్తంభాల ఖర్చు ఇప్పటి వరకు వినియోగదారే భరించాల్సి వచ్చేది. దరఖాస్తు చేశాక.. క్షేత్ర స్థాయి పరిశీలన అనంతరం అధికారులు రుసుం నిర్ణయించేవారు. దానికి అదనంగా సర్వీస్ లైన్, డెవలప్‌మెంట్ ఛార్జీలు అధికారికంగా, సిబ్బందీ అనధికారికంగా వసూలు చేసేవారు.

ఇక నుంచి : వినియోదారులకు సత్వర సేవలందించాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలతో ఏపీ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ (ఏపీఈఆర్సీ) కొత్త విద్యుత్ కనెక్షన్ల జారీలో సంస్కరణలు తీసుకొచ్చింది. కొత్త కనెక్షన్, అదనపు లోడ్‌కు కేటగిరీ ఆధారంగా స్థిర ఛార్జీలు నిర్ణయించింది. అదనపు ఛార్జీలు ఎత్తేసింది. సత్వరం కనెక్షన్ అందిస్తామని ఏపీఈపీడీసీఎల్ పీలేరు డివిజన్ డీఈ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

కొత్త ఛార్జీలు ఇలా..

- **గృహ అవసరాల కనెక్షన్లు (ఎల్‌టీ)** : కిలో వాట్‌కు రూ.1,500, 1 నుంచి 20 కిలోవాట్ల వరకు అదనంగా ప్రతి కిలో వాట్‌కు రూ.2 వేలు చొప్పున చెల్లించాలి. 20 నుంచి 150 వరకు కిలో వాట్‌కు రూ.12,600 చొప్పున చెల్లించాలి.
- **వాణిజ్య సర్వీసులకు** : కిలో వాట్‌కు రూ.1,800, ఇక 20 కిలోవాట్ల వరకు రూ.1,800తో పాటు అదనంగా ప్రతి కిలో వాట్‌కు రూ.2 వేలు చొప్పున చెల్లించాలి. 20 నుంచి 150 వరకు ప్రతి కిలోవాట్‌కు రూ.12,600 చొప్పున చెల్లించాలి.
- **హెచ్‌టీ విద్యుత్ లైన్లకు** : 75 నుంచి 150 వరకు ప్రతి కిలోవాట్‌కు రూ.4,400 చొప్పున చెల్లించాలి. నియంత్రికను వినియోగదారే ఏర్పాటు చేసుకోవాలి.

బాల కోహ్లీలు.. భవిష్యత్ బుమ్రాలు

కడప క్రీడలు, న్యూస్‌టుడే : వారు బ్యాట్ చేతపట్టారంటే కోహ్లీలా పరుగుల వరద కురవాల్సిందే.. బంతి అందుకుంటే బుమ్రాలా వికెట్లు నేలకూలాల్సిందే..! ఈ ఏడాది నవంబరు 25 నుంచి డిసెంబరు 8వ తేదీ వరకు వైఎస్సార్‌ఆర్-ఏసీఏ స్టేడియం, కేఎస్‌ఆర్ఎం, కేవోఆర్ఎం క్రికెట్ మైదానాల్లో జరిగిన ఏసీఏ అండర్-14 అంతర్ జిల్లాల క్రికెట్ పోటీల్లో పలువురు యువ క్రికెటర్లు బ్యాటింగ్, బౌలింగ్ రంగాల్లో చక్కటి ప్రదర్శన చేశారు. అర్ధ సెంచరీలు, సెంచరీలతో పాటు పెద్దఎత్తున వికెట్లు తీసి సత్తా చాటారు.

పరుగుల బాద్‌షా వర్మ

అశ్విని, రమేష్‌రాజుల కుమారుడు పి.వి.ఎస్.ఆర్ వర్మది పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం. వైజాగ్‌లో నారాయణ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్నాడు. ఆరేళ్లుగా క్రికెట్ ఆడుతున్నాడు. రైట్ ఆర్మ్ టాప్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్. స్పిన్ బౌలింగ్ చేయగల సమర్థుడు. ఈ టోర్నమెంట్‌లో రెస్ట్ ఆఫ్ సెంట్రల్‌జోన్ జట్టుకు ప్రాతినిధ్యం వహించి 359 పరుగులు సాధించాడు. ఇందులో రెండు సెంచరీలు, ఒక అర్ధ సెంచరీ ఉన్నాయి. కోహ్లీలా నిలకడగా బ్యాటింగ్ చేయాలనేదే తన లక్ష్యం అంటున్నాడు.

సెంచరీల ధీరుడు రాజ్‌కుమార్

బాపట్ల జిల్లా కారంచేడు మండలం ఆదిపూడి గ్రామానికి చెందిన పి.రాజ్‌కుమార్ ఆరేళ్ల క్రితమే బ్యాటు పట్టాడు. లెఫ్ట్‌ఆర్మ్ ఓపెనింగ్ బ్యాటింగ్, కీపింగ్ చేస్తూ ఉంటాడు. ఈ టోర్నమెంట్‌లో రెస్ట్‌ఆఫ్ సెంట్రల్‌జోన్ తరపున ఆడి 350కి పైగా పరుగులు చేశాడు. ఇందులో రెండు సెంచరీలున్నాయి. భారత జట్టుకు ఆడటమే తన లక్ష్యమని చెబుతున్నారు.

క్రికెట్ కెరటం రక్షన్‌సాయి

అత్తూరి రక్షన్‌సాయిది తిరుపతి. నాలుగేళ్లుగా క్రికెట్ ఆడుతున్నాడు. ఆల్‌రౌండర్‌గా రాణిస్తున్నాడు. రైట్‌ఆర్మ్ ఫాస్ట్‌బౌలర్‌గా, రైట్‌ఆర్మ్ మిడిల్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్‌గా రాణిస్తున్నాడు. 18 వికెట్లు తీసుకుని టోర్నమెంట్‌లోనే అగ్రస్థానంలో నిలిచాడు. బ్యాటింగ్‌లో 288 పరుగులు సాధించాడు. ఒకేసారి అయిదు వికెట్లు తీసి ఉత్తమ ప్రదర్శన కనబరిచారు. టోర్నమెంట్‌లో మూడు అర్ధ సెంచరీలు తన ఖాతాలో వేసుకున్నారు.

రిమ్స్‌లో స్క్రబ్ టైఫస్‌కు ప్రత్యేక విభాగం

సర్వజన ఆసుపత్రి, న్యూస్‌టుడే: స్క్రబ్ టైఫస్‌కు రిమ్స్ ఆసుపత్రిలో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేస్తున్నామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రస్తుతం నిర్ధారణ కోసం ర్యాపిడ్ టెస్ట్‌లు చేస్తున్నట్లు చెప్పారు. పూర్తి స్థాయి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసే పరికరాల కోసం ఇండెంట్ పెట్టామని త్వరలో వస్తాయన్నారు. అనుమానిత కేసులు వస్తే తిరుపతి, విజయవాడకు నమూనాలు పంపి నిర్ధారణ అయిన తరువాత వైద్యం చేస్తామన్నారు. ఆసుపత్రిలో స్క్రబ్ టైఫస్‌కు మందులు, వైద్యం అందుబాటులో ఉన్నాయని, జిల్లా ప్రజలు ఎలాంటి భయాందోళనకు గురికానవసరం లేదని, అనుమానం వస్తే వెంటనే రిమ్స్‌కు రావాలన్నారు. 24 గంటలూ వైద్యులు అందుబాటులో ఉంటారని స్క్రబ్ టైఫస్ బారిన పడకుండా అప్రమత్తంగా ఉంటూ ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

రైతేరాజు 6లో

వెనుక జలాలు.. మునిగిన పొలాలు



సోమశిల జలాశయానికి వరద పెరుగుతుండడంతో వెనుక జలాలు తరుముకొస్తున్నాయి.. పెనగలూరు మండలంలో సిరివరం, ఎన్ఆర్ పురం గ్రామాల చుట్టూ చేరాయి. వారం రోజులుగా తుపాన్ ప్రభావంతో చెయ్యేరు, పుల్లంగేరు, గుంజనేరు ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి. ఈ వరద నీరంతా పెన్నానదిలో కలిసి సోమశిల వైపు పయనిస్తోంది. జలాశయం నీటి మట్టం పెరుగుతుండడంతో వెనుక జలాలు రెండు గ్రామాల పరిధిలోని వ్యవసాయ భూములను ముంచెత్తున్నాయి. మునక ప్రాంతాలను గుర్తించినప్పటికీ రైతులకు నష్ట పరిహారం ఇవ్వలేదని స్థానికులు వాపోతున్నారు. నెలల తరబడి భూముల్లో నీటి నిల్వలుంటే వ్యవసాయం చేసేదెలాగని ఆవేదన వ్యక్తం చేశారు. - న్యూస్‌టుడే, రాజంపేట గ్రామీణ

చిన్నారుల కళ్లల్లో మసక తుపాను



● తరగతి గదిలో సూచికపై కనిపించని అక్షరాలు

● నేత్ర పరీక్షలతో అంధత్వ సమస్య వెలుగులోకి

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: నేటితరం విద్యార్థులు క్రీడా మైదానాల కంటే స్మార్ట్ ఫోన్లతో ఎక్కువగా గడుపుతున్నారు. పాఠశాలల నుంచి ఇంటికి చేరగానే సెల్‌ఫోన్లతో గంటలకొద్దీ కుస్తీ పడుతున్నారు. వీడియో గేమ్‌లు ఆడుతున్నారు. టీవీలకు అతుక్కుపోతున్నారు. కంప్యూటర్లకు కళ్లను అప్పగిస్తున్నారు. ల్యాప్‌టాప్‌లతో మమేకం కావడంతో కంటి చూపు మసకబారుతోంది. దృష్టి లోపాలు శాపాలుగా మారుతున్నాయి. డిజిటల్ యుగంలో భావి పౌరులను అంధత్వం వెంటాడుతోంది. ఈ నేపథ్యంలో పాఠశాలలు, కళాశాలల్లో నేత్ర పరీక్షలు చేయాలని కూటమి ప్రభుత్వం ఆదేశించింది. జిల్లాలో పిల్లలను కంటి వైద్య నిపుణులు పరీక్షించారు. ఆరు శాతం మందిలో రుగ్మతలు ఉన్నట్లు నిర్ధారించారు.

బాల్యంలోనే చిన్న 'చూపు' : నాలుగు నెలల పాటు ఎంపిక చేసిన బడుల్లో చూపు సమస్య ఎలా ఉందని పరీక్షలు చేశారు. అందులో 3,700 మందిలో దృష్టి లోపం ఉన్నట్లు నిర్ధారించారు. వీరంతా కళ్లద్దాలు వాడాల్సిన అవసరం ఉందని తేల్చారు. ఒక్కో కళ్లజోడుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.280 ఖర్చు చేయడానికి అనుమతిచ్చింది. ఈ మేరకు త్వరలో తెప్పించాలని నిర్ణయించారు. కొందరిలో దగ్గరి, మరికొంతమందిలో దూరపు చూపు సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. పుస్తకం చదివే సమయంలో, తరగతి గదిలో అక్షరాలు మసకబారి కనిపిస్తున్నాయని చెప్పారు.

పరీక్షలు నిర్వహిస్తున్న నేత్ర వైద్యుడు రఘురామిరెడ్డి

జిల్లాలో పరీక్షల ఫలితాలిలా..

కంటి పరీక్షలు చేసింది : జిల్లా అంధత్వ నివారణ సంస్థ

ఎప్పుడు: ఆగస్టు నుంచి నవంబరు వరకు

ఎన్ని పాఠశాలల్లో	563
ప్రాథమిక విద్యాలయాలు	281
ప్రాథమికోన్నత	57
జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలు	198
రెసిడెన్షియల్	10
కళాశాలలు	17
పరీక్షించింది	61,382
పనిచేసిన బృందాలు	17
దృష్టి లోపం ఉన్న వారు	3,700

కంటిని కాపాడుకోండిలా... పుస్తకం చదివే సమయంలో కంటికి 12-14 ఇంచుల దూరం ఉండాలి. 60 డిగ్రీల ఉండేలా చూసుకోవాలి. వెలుతురు ఎక్కువగా, తక్కువగా ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ముందు నుంచి కాకుండా వెనుక వైపు లైటింగ్ ఉండాలి. ఫ్యాను కింద ఎక్కువ సేపు కూర్చుంటే గాలిలో తేమ తగ్గిపోయి కళ్లు పొడిబారతాయి. స్మార్ట్‌ఫోన్లకు అతుక్కుపోరాదు. కనీసం 20 నిమిషాలకు ఒకసారి విరామం ఇవ్వాలి. పిల్లలకు సెల్‌ఫోన్లు ఇవ్వకపోవడమే ఉత్తమం. వీడియోలు చూస్తున్నారా, గేమ్‌లు ఆడుతున్నారా అని తల్లిదండ్రులు పరిశీలించాలి. టీవీని కనీసం 3-4 మీటర్ల దూరంలో కూర్చొని వీక్షించాలి. కంప్యూటర్ స్క్రీన్ కనీసం తొమ్మిది ఇంచుల పరిమాణం ఉంటే మంచిది. మరకలు లేకుండా తెరను రోజూ శుభ్రం చేసుకోవాలి. నేత్ర సమస్యలు ఉన్నాయని పిల్లలు చెబితే ప్రతి ఆరు నెలలకు ఒకసారి క్రమం తప్పకుండా పరీక్షలు చేయించాలి. క్రమం తప్పకుండా పోషకాహారాన్ని తినాలి.

త్వరలోనే కళ్లజోళ్ల పంపిణీ : జిల్లాలో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించాం. నేత్ర సమస్యలతో బాధపడుతున్న 3,700 మందికి త్వరలో కళ్లద్దాలు ఉచితంగా అందజేస్తాం. - జి.మాధవీలత, జిల్లా అధికారిణి, అంధత్వ నివారణ సంస్థ, కడప

(c) eenadu

సమస్యలివే.. పరిష్కరించండయ్యా!

● గ్రీవెన్స్‌కు 450 వినతుల అందజేత

వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ శ్రీధర్

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: నగరంలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వినతులు భారీగా వచ్చాయి. గత వారంలో గ్రీవెన్స్ లేకపోవడంతో సోమవారం జిల్లా నలుమూలల నుంచి బాధితులు తరలి వచ్చారు. మొత్తంగా 450 అర్జీలు రాగా అందులో 280 రెవెన్యూ సంబంధిత అర్జీలు వచ్చాయని అధికారులు తెలిపారు. వినతులు స్వీకరించిన కలెక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇన్‌ఛార్జి డీఆర్వో వెంకటపతి, ఎస్ఎస్ఏ ఏపీసీ ప్రేమంత్‌కుమార్, అడా సెక్రటరీ శిరీష, జడ్పీ సీఈవో ఓబులమ్మ, డీఆర్‌డీఏ పీడీ రాజ్యలక్ష్మీ, మెప్మా పీడీ కిరణ్‌కుమార్, రిమ్స్ పరిపాలనాధికారి రంగస్వామి తదితరులున్నారు.

రూ.15 వేల పింఛను ఇప్పించండి సారూ!

మాది నిరుపేద కుటుంబం. కూలికి వెళ్తే గానీ పూట గడవదు. మా బిడ్డ మానసిక దివ్యాంగురాలు. 2021లో వైద్యులు పరీక్షలు చేసి 75 శాతం వికలత్వం ఉన్నట్లు నిర్ధారించారు. ప్రస్తుతం వికలత్వం బాగా పెరిగింది. రూ.15 వేలు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలి.

- సారా, అక్కాయపల్లె, కడప

నివాసం మంజూరు చేయండి

నేను అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్నా. నాకంటూ ఎలాంటి ఆస్తులు లేవు. రాత్రి వేళలో రోడ్డు పక్కన టెంట్ వేసుకుని పడుకోవాల్సి వస్తోంది. దాతలు ఇచ్చిన గుడిసెలాంటి షెల్టరే దిక్కయింది. చిన్నపాటి వాన కురిసినా ఇబ్బందికరంగా ఉంటోంది. ప్రభుత్వం ఇంటి స్థలంతో పాటు నివాసం ఏర్పాటు చేసి ఇస్తే మేలు జరుగుతుంది. అధికారులు కనికరించాలి.

- వెంకటరమణ, ప్రొద్దుటూరు

భూమి రిజిస్ట్రేషన్ చేయించాలి

నాకు వేల్పుచర్లలో కొంత భూమి ఉంది. కొన్నేళ్లుగా సాగు చేసుకుంటున్నా. ప్రస్తుతం నేను ఒక్కదాన్నే ఉన్నాను. ఆ భూమిలో సాగు చేయగా వచ్చే దిగుబడులే జీవనాధారం. ఆ భూమి వేరే సర్వే నంబర్‌లో ఉన్నట్లు రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. రిజిస్టర్ చేసుకునేందుకు అవకాశం లేదు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలి.

- వడ్ల వీరమ్మ, ముద్దనూరు

బాధితులకు సత్వర న్యాయమే లక్ష్యం : ఎస్పీ

బాధితుల సమస్యలు వింటున్న ఎస్పీ నచికేత్ విశ్వనాథ్

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: బాధితులకు సత్వరమే న్యాయం(అందించాలని ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ పోలీసులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఎస్పీ ఆధ్వర్యంలో 'ప్రజా ఫిర్యాదుల-పరిష్కార వేదిక' కార్యక్రమం నిర్వహించారు. బాధితులతో ఆయనే స్వయంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. న్యాయం కోసం ఠాణాకు వచ్చే ప్రతి ఒక్కరికీ సాంత్వన కలిగేలా చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. 130 ఫిర్యాదులు రాగా వాటిని ఆయన పరిశీలించి సంబంధిత ఠాణాలకు బదలాయించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ప్రకాష్‌బాబు, డీఎస్పీ బాలస్వామిరెడ్డి, డీటీసీ డీఎస్పీ అబ్దుల్ కరీం పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం

కడప నేరవార్తలు: ప్రొద్దుటూరు డివిజన్ పరిధిలో జరిగే అసాంఘిక కార్యకలాపాలపై కఠినంగా వ్యవహరించాలని ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ పోలీసులను ఆదేశించారు. మట్కా, క్రికెట్ బెట్టింగ్, జూదం జరగకుండా కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రొద్దుటూరు పోలీసు సబ్ డివిజన్ పరిధిలోని నేరాలపై ఆయన సమీక్ష నిర్వహించారు. కళాశాలలు, పాఠశాలల వద్ద బాలికలపై జరిగే వేధింపులపై అవగాహన కల్పించాలన్నారు. రానున్న స్థానిక సంస్థ ఎన్నికల దృష్ట్యా రౌడీషీటర్లు, గొడవలు సృష్టించే వారి కదలికలపై నిఘా ఉంచాలన్నారు.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL
JUNIOR CIVIL JUDGE, KADAPA
I.A.No. 869/2025 / O.S.No.979/2025

1. Chabuksavar Shaik Akbar Basha
2. Chabuksavar Mohammed Shahmeer
on their behalf and on behalf of Muslim community people of Muradia Nagar and its surrounding areas, Kadapa City, in representative capacity. - Petitioners/Plaintiffs

Vs.

1. Syed Sha Jamalullah Basha Khadri, S/o Late Syed Sha Mohammed Kamalullah Basha Khadri, aged about 52 years, Muslim, Business, resident of D/No.6/258-2, Trunk Road, Kadapa City, Aadhar No. Not Known, Cell No.98494 23717.
2. Syed Tameem Khadri @ Tahirullah Khadri, S/o Syed Nazarullah Basha Khadri, aged about 38 years, Muslim, Business, resident of D/No.49/219, Upstairs, Muradia Nagar, Ravindra Nagar, Kadapa City, Aadhar No. Not Known, Cell No.70139 34166. - Respondents/Defendants

NOTICE UNDER ORDER 1
RULE 8 C.P.C.

ఇందుమూలముగా యావన్మందికీ తెలియజేయడం ఏమనగా, పై తెల్పిన వాదులు పై తెల్పిన రాజశ్రీ కోర్టు ఎదుట ప్రతివాదులపై కడప నగరం, మురాదియా నగర్ మరియు దాని పరిసర ప్రాంతాలకు చెందిన ముస్లిం మతస్తుల తరఫున ప్రతినిధుల హోదాలో మరియు వారి సొంత హోదాలో కడప నగరం, చెమ్ముమియాపేట, రవీంద్ర నగర్ ఏరియా, మురాదియా నగర్‌లో వున్న మురాదియా శ్మశాన వాటికను ప్రతివాదులు అన్యాయముగా ఆక్రమించి, దానికి సంబంధించిన ప్రహరీ గోడను, సిమెంట్ రోడ్లను, సమాధులు, వీధి లైట్లు, చెట్లు మొదలైనవి తొలగించి పంక్షన్ హాలు మొదలైన కట్టడాలు కట్టుటకు ప్రయత్నిస్తున్నందున, వారి చర్యలను శాశ్వతముగా నిషేదిస్తూ ఉత్తర్వులు ఇవ్వవలెనని పై తెల్పిన దావాను దాఖలు చేసివున్నారు. పై దావాలో మురాదియా నగర్ మరియు దాని పరిసర ప్రాంతాలకు చెందిన ముస్లిం మతస్తులకు ఎవ్వరికైనను అభ్యంతరములు వున్నచో, వారు రాజశ్రీ కోర్టు ఎదుట 23.12.2025 తేదీన ఉదయం 10.30 గంటలకు హాజరై తెలుపుకోవచ్చునని ఈ పబ్లిక్ నోటీసు ద్వారా తెలియజేయడమైనది.

By the Order of the Court
Sd/- M.Venkata Ramana
Advocate, Kadapa.

ఎంపీ రమేష్‌కు పరామర్శ

ఎంపీ రమేష్ తల్లి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు, కేంద్ర సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాసవర్మ, మంత్రులు అచ్చెన్నాయుడు, అనిత, అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవి, తదితరులు

ఎర్రగుంట్ల, న్యూస్‌టుడే: రైల్వేస్టాండింగ్ కమిటీ ఛైర్మన్, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్‌ను పలువురు పరామర్శించారు. ఎంపీ రమేష్ తల్లి చింతకుంట రత్నమ్మ ఇటీవల తుదిశ్వాస విడిచారు. పెద్ద కర్మ సందర్భంగా సోమవారం ఎర్రగుంట్ల మండలం పోట్లదుర్తిలోని సీఎం రమేష్ నివాసానికి ప్రజాప్రతినిధులు, నాయకులు వచ్చి చింతకుంట రత్నమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, కేంద్ర భారీ పరిశ్రమల, ఉక్కుశాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, మంత్రులు అచ్చెన్నాయుడు, అనిత, అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్ మాధవ్, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కాల్వ శ్రీనివాసులు, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, జేసీ అస్మిత్‌రెడ్డి, బొజ్జల సుధీర్‌రెడ్డి, కెఎన్ఎస్ రాజు, బండారు సత్యనారాయణ మూర్తి, పంచకర్ల రమేష్ బాబు, సుందరపు విజయ్ కుమార్, బండారు శ్రావణి, వరదరాజులురెడ్డి, తితిదే బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసురెడ్డి, సినీ నటుడు వెంకట్, మాజీ ఎమ్మెల్యేలు వల్లభనేని వంశీమోహన్, మాజీ ఎమ్మెల్సీ చదిపిరాళ్ల నారాయణరెడ్డి, మాజీ ఎంపీ తులసిరెడ్డి, తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి, రాయలసీమ రాష్ట్ర సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కుంచం వెంకటసుబ్బారెడ్డి తదితరులు చింతకుంట రత్నమ్మ చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రజాప్రతినిధులు, నాయకుల రాకతో డీఎస్పీ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

చిరు ధాన్యాలు.. బహుళ ప్రయోజనాలు

రాయచోటి, వీరబల్లి, న్యూస్‌టుడే: జిల్లాలో ఇటీవల చిరుధాన్యాల వినియోగం పెరిగింది. ఎక్కువ మంది ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. రాగి, జొన్న, సామలు, కొర్రలు మొదలైన వాటితో తయారయ్యే ఆహార పదార్థాలు ఆహారంలో తీసుకుంటున్నారు. పోషక విలువలు ఎక్కువ, ఖర్చు తక్కువ కావడంతో రైతులు సైతం ఆసక్తి చూపుతున్నారు.

ముడి సరకుల ప్రాసెసింగ్ ఇలా..

రైతులు పండించే చిరుధాన్యం పంటలను ప్రాసెసింగ్ చేసిన తర్వాతనే ధాన్యం ఇతర అవసరాలకు వినియోగిస్తారు. తిరుపతి, వాల్మీకిపురం, మదనపల్లెలలో ప్రాసెసింగ్ యూనిట్లు ఉన్నాయి. తిరుపతి ఎస్వీ ప్రాంతీయ వ్యవసాయం పరిశోధన స్థానంలో రైతులు తీసుకొచ్చిన ముడి సరకును ప్రాసెస్ చేస్తారు. కిలోకు రూ.10-12 తీసుకొని నాలుగు రకాల యంత్రాలతో వడపట్టి రైతుకు తిరిగి ధాన్యం అందజేస్తారు. ఈ ప్రాసెసింగ్ యూనిట్‌లో ఏటా ఇక్కడి నుంచి మూడు నెంచి 5 వేల కిలోల పంట ప్రాసెస్ జరుగుతుంది. జిల్లాలో చిరుధాన్యం పంటల సాగు ఇలా ఉంది.

100 గ్రాముల్లో పోషకాల శాతం ఇలా

పంట	మాంస కృత్తులు	పిండి పదార్థం
కొర్రలు	1.2	63.2
సామలు	9.7	60.9
జొన్న	10.4	70.7
సజ్జ	11.8	67
రాగి	7.7	72.6

జిల్లాలో సాగు విస్తీర్ణం (హెక్టార్లలో)

కొర్రలు	32
సామలు	13
సజ్జ	499
మొక్కజొన్న	26
జొన్న	21
రాగులు	351

ఖర్చు తక్కువ... రాబడి ఎక్కువ

● చిరు ధాన్యపు పంటలకు నీటి అవసరం తక్కువ ● తెగుళ్లు, చీడపీడలను తట్టుకునే శక్తి ఉంటాయి ● రసాయన మందుల వినియోగాన్ని విస్మరించొచ్చు ● రెండు, మూడు తడులు పదున్లు వర్షం సరిపోతుంది ● మూడు నెలల్లోనే పంట కాలం పూర్తి ● చిరుధాన్యాల్లో మాంసపు కృత్తులు, పీచు పదార్థాలు అధికం

ప్రభుత్వ ప్రోత్సాహం

చిరుధాన్యం పంటలు సాగు చేస్తే తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం పొందవచ్చు. మంచి ఆరోగ్యానికి అవసరమైన దిగుబడి ఇస్తాయి. తక్కువ నీటితోనే పండించుకోవచ్చు. సాగుకు ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందుతోంది. రైతులకు సూచనలు ఇస్తున్నాం. - **వెంకటమోహన్, జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారి**

స్ఫూర్తి

రైతేరాజు

క్యాప్సికం సాగు.. లాభాలు బాగు

దిగుబడులను ఎగుమతికి సిద్ధం చేస్తున్న కూలీలు

రామసముద్రం, న్యూస్‌టుడే: [illegible] ... అయిదు టన్నుల దిగుబడితో ఆరు నెలలకు 60 టన్నుల దిగుబడులు తీశారు. చెన్నై, కోలార్, బెంగళూరు మార్కెట్లకు తరలించి అమ్మకం చేశారు. కిలో రూ.30 నుంచి రూ.40 వరకు పలికింది. సాగుకు రూ.6 లక్షల వరకు ఖర్చు కాగా సాగు వ్యయం పోనూ రూ.12 లక్షల మేర ఆదాయం సమకూరినట్లు రైతు తెలిపారు.

రైతు ప్రశ్న శాస్త్రవేత్త సమాధానం

[illegible] ... తెగుళ్లను నివారించవచ్చు. అరటి తోటల్లో నీరు నిలవకుండా చేసి, ఎరువులు వాడకం పెంచాలి.

- సురేష్ బాబు, ఉద్యాన శాఖ అధికారి- న్యూస్‌టుడే, రాజంపేట గ్రామీణ

చిట్కా: మామిడిలో సస్యరక్షణకు సమయమిదే..!

తోటలలో పిచికారీ చేస్తున్న రైతు

రామాపురం, న్యూస్‌టుడే: [illegible] ... ఈ సమయంలో ఒకటి రెండు తేనెటీగల పెట్టెలను తోటలో పెట్టడం అక్కడక్కడా బెల్లం ద్రావణం తడిపిన గోనె సంచులు వేలాడదీయడంతో ఈగలకు ఆకర్షించి పిందె కట్టే శాతం పెంచొచ్చు. ఈ విషయాలపై ఉద్యాన అధికారులు మామిడి రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

ఉద్యోగోన్నతులు పొందిన వారికి స్థానాల కేటాయింపు

కడప ఏడురోడ్లు: జడ్పీ, డీపీవో పరిధిలో పని చేస్తున్న సీనియర్ అసిస్టెంట్లు, పంచాయతీ సెక్రటరీ (గ్రేడ్-1)లకు డిప్యూటీ ఎంపీడీవోలుగా ఉద్యోగోన్నతులు కల్పిస్తూ గత నెల 19న పంచాయతీరాజ్-(గ్రామీణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. మూడు వారాల తర్వాత వారికి స్థానాలను కేటాయించారు. డిప్యూటీ ఎంపీడీవోలుగా పదోన్నతి పొందిన 33 మంది జీఎస్‌డబ్ల్యూఎస్‌లలో డిప్యూటీ ఎంపీడీవోలుగా విధులను నిర్వర్తించాల్సి ఉంది.

ఇంటికి చేరేలోపే మృత్యు ఒడికి

కుమారి (పాత చిత్రం)

తొండూరు, న్యూస్‌టుడే: విధులు ముగించుకుని ఇంటికి వెళ్తుండగా ప్రమాదవశాత్తు లారీ కిందపడి రెవెన్యూ ఉద్యోగి మృతి చెందిన సంఘటన తొండూరు మండలం మడూరు సమీపంలో చోటుచేసుకుంది. పులివెందులకు చెందిన కుమారి (36) తొండూరు తహసీల్దారు కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం విధులు ముగించుకుని స్వగ్రామానికి వెళ్లేందుకు పులివెందుల వైపు వెళ్తున్న ఓ వ్యక్తి ద్విచక్ర వాహనంలో వెనుక వైపు కూర్చుని ప్రయాణిస్తున్నారు. మడూరు మలుపు సమీపంలో వెళ్లగానే చోదకుడు ముందు వెళ్తున్న లారీని అధిగమించే ప్రయత్నం చేశారు. అదే సమయంలో ఎదురుగా లారీ వస్తుండటంతో అకస్మాత్తుగా బ్రేక్ వేశారు. దీంతో కుమారి ఒక్కసారిగా రోడ్డుపై పడిపోయారు. వెనక నుంచి వస్తున్న లారీ ఆమెపై నుంచి వెళ్లడంతో ఆమె అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ఎస్సై ఘనమద్దిలేటి ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆమెకు భర్త, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..

ప్రభుదేవ (పాతచిత్రం)

కమలాపురం, న్యూస్‌టుడే: కడప-తాడిపత్రి జాతీయ రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. మండలంలోని జంగంపల్లెకు చెందిన పాలెం ప్రభుదేవ (22) ఎలక్ట్రీషియన్‌గా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం పందిళ్లపల్లె నుంచి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా చదిపిరాళ్ల వద్దకు రాగానే కడప నుంచి వస్తున్న వ్యాన్ ఢీకొట్టడంతో రోడ్డుపై పడిపోయాడు. అదే సమయంలో వెనక నుంచి వస్తున్న కంటైనర్ అతనిపై నుంచి వెళ్లడంతో తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న ఎస్సై విద్యాసాగర్ సంఘటనా స్థలానికి వెళ్లి క్షతగాత్రుడిని 108లో కడప సర్వజన ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలోనే మృతి చెందారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

అనుమానాస్పద స్థితిలో సెక్యూరిటీ గార్డు..

ప్రొద్దుటూరు వైద్యం: స్థానిక వేంకటేశ్వరపేటలో గంగరాజు(56) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు కమలాపురానికి చెందిన గంగరాజు కడపలోని టౌన్‌క్లబ్‌లో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. ప్రొద్దుటూరులో కొంత కాలంగా ఇంటిని బాడుగకు తీసుకుని ఓ మహిళతో సహజీవనం చేస్తున్నాడు. అతను అప్పుడప్పుడు పట్టణానికి వచ్చి వెళ్తుంటాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి ఇక్కడికి వచ్చిన గంగరాజు ఇంట్లో పడుకుని ఆదివారం రాత్రి అయినా తలుపులు తీయలేదు. దీంతో స్థానికులు లోపలికి వెళ్లి చూడగా విగత జీవిగా కనిపించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆయువు తీసిన పొగ మంచు

వీరపునాయునిపల్లె: మండలంలోని ఉరుటూరు వద్ద సోమవారం ఉదయం కారు ఢీకొని గుమ్మిరెడ్డి చెన్నకేశవరెడ్డి (77) అనే వృద్ధుడు మృతి చెందారు. ఏఎస్సై అన్వర్‌బాషా తెలిపిన వివరాల ప్రకారం.. సర్వరాజుపేట కాలనీకి చెందిన ఆయన తన పొలం వద్దకు ఉదయాన్నే వెళ్తుండగా.. అప్పటికే పొగ మంచు దట్టంగా కప్పి ఉండటంతో ఎర్రగుంట్ల వైపు నుంచి వస్తున్న కారు ఆయన్ను బలంగా ఢీకొట్టింది. ప్రమాదానికి కారణమైన చోదకుడు వెంటనే ఆయన్ను ప్రొద్దుటూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చిట్టీల పేరుతో రూ.అయిదు కోట్ల మోసం

ఆవేదన వ్యక్తం చేస్తున్న బాధితులు

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: ఒంటిమిట్ట మండలం మాధవరంలో చిట్టీల పేరుతో వందలాది మందిని ఓ వ్యక్తి మోసగించాడు. బాధితులంతా తమకు న్యాయం చేయాలంటూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో సోమవారం ఎస్పీ నచికేత్ విశ్వనాథ్‌ను కలిసి వేడుకున్నారు. అనంతరం కడప ప్రెస్‌క్లబ్‌లో బాధితులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. మాధవరానికి చెందిన సుమారు రెండు వందల మంది అదే ప్రాంతానికి చెందిన మల్లికార్జున్ అనే వ్యక్తి వద్ద పదేళ్లుగా చిట్టీలు వేస్తున్నారు. ప్రతి నెలా డబ్బులు క్రమం తప్పకుండా ఇవ్వడంతో స్థానికుల నమ్మకం చూరగొన్నాడు. దీంతో పలువురు అతనికి అప్పుగా భారీగా అప్పు కింద నగదు ఇచ్చారు. ఈ క్రమంలో నవంబరు 15వ తేదీ నుంచి మల్లికార్జున్ అతని కుటుంబ సభ్యులతో సహా అదృశ్యమయ్యాడు. ఆచూకీ తెలియకపోవడంతో బాధితులంతా కంగు తిన్నారు. దీంతో ఎస్పీని కలిసి విచారించి న్యాయం చేయాలని బాధితులు కోరారు.

S.B.V.R. అగ్రికల్చరల్ కళాశాల, బద్వేలు

ఇంటర్మీడియట్ నందు Bi.P.C విభాగంలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు చివరి అవకాశం. కడప జిల్లా బద్వేలులో I.C.A.R., NEW DELHI వారిచే గుర్తింపు పొందిన S.B.V.R. అగ్రికల్చరల్ కాలేజి (S.B.V.R. A.G.B.Sc), నందు B.Sc (Hons.) Agricultureలో అడ్మిషన్ కొరకు ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకున్నా చేసుకోకపోయినా కన్వీనర్ కోటాలో అగ్రికల్చరల్ బి.ఎస్సీ చేరుటకు చిట్ట చివరి అవకాశం కలదు.

వివరములకు సంప్రదించవలసినది : 94400 33523, 91825 05395, 94928 56652.
కరెస్పాండెంట్, S.B.V.R. అగ్రికల్చరల్ కళాశాల

కెనరా బ్యాంక్ Canara Bank (భారత ప్రభుత్వరంగ సంస్థ) సిండికేట్ Syndicate
కడప మెయిన్ బ్రాంచ్ (1962)
చిన్నాచౌక్, శంకరాపురం, కడప.
బ్లైండ్ స్కూల్ ఎదురుగా, కడప-516002

ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు డిమాండ్ నోటీసు
(తేదీ 05.04.2025 నాటి మునుపటి డిమాండ్ నోటీసును రద్దు చేయడం ద్వారా)

టు:
1. శ్రీ షేక్ నవైలా మహీన్, తండ్రి: షేక్ మొహమ్మద్ నవీద్, 8/188-1, అల్మాస్‌పేట్, కడప, ఆంధ్రప్రదేశ్ - 516001 (ఋణగ్రహీత).
2. శ్రీ షేక్ మొహమ్మద్ నవీద్, తండ్రి: షేక్ అబ్దుల్ సత్తార్, హెచ్.నెం. 8-164, అల్మాస్‌పేట్, కడప, ఆంధ్రప్రదేశ్ - 516001 (ఋణగ్రహీత & తనఖాదారు).
3. శ్రీమతి షేక్ రుబినా, భర్త: మహమ్మద్ సిరాజుద్దీన్, హెచ్.నెం. 39/650-16-3, పక్కిర్‌పల్లి కేశవ రెడ్డి పక్కన, కడప, ఆంధ్రప్రదేశ్ - 516001 (ఋణగ్రహీత).
4. శ్రీమతి షేక్ ఫిరోజ్ షాహీన్, భర్త: షేక్ అబ్దుల్ సత్తార్, 8/188-1, అల్మాస్‌పేట్, కడప, ఆంధ్రప్రదేశ్ - 516001 (ఋణగ్రహీత).

డియర్ సర్/మేడమ్,
విషయం: సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 లోని సెక్షన్ 13(2) ప్రకారం డిమాండ్ నోటీసు.
మా కెనరా బ్యాంక్, కడప మెయిన్ బ్రాంచ్ నుండి శ్రీ షేక్ నవైలా మహీన్, శ్రీ షేక్ మొహమ్మద్ నవీద్, శ్రీమతి షేక్ రుబినా, శ్రీమతి షేక్ ఫిరోజ్ షాహీన్ గార్లు పొందిన లోన్/ఋణసౌకర్యాల వివరములు:

లోన్ స్వభావం & అకౌంట్ నెం.	లోన్ మొత్తం & లోన్ తేదీ	వడ్డీతో కలిపి మొత్తం బకాయి	వడ్డీ రేటు
కెనరా మార్ట్‌గేజ్ లోన్ అకౌంట్ నెం. 164003376296	రూ. 3,90,00,000/- తేదీ: 02-05-2023	రూ. 3,75,58,105.04	11.75 % (9.75 % plus 2% pen. int.)

మాకు తనఖా పెట్టిన వ్యక్తి / వ్యక్తులచే వ్రాసి ఇవ్వబడిన సంబంధిత డాక్యుమెంట్ల ద్వారా ఈ నోటీసును షెడ్యూలులో వివరించిన ఆస్తుల తనఖా ద్వారా పైన తెలిపిన ఋణాలు / ఋణసౌకర్యాలకు తగు విధంగా హామీ కల్పించబడినది. పేర్కొన్న నియమ నిబంధనల ప్రకారం తమ ఋణాలను చెల్లించడంలో పైన తెలిపిన మీరు విఫలమైనందున బ్యాంక్ సదరు ఋణాన్ని తేదీ 01-12-2025న నిరర్థక ఆస్తి (ఎన్.పి.ఎ) గా వర్గీకరించింది. అందువలన ఈ నోటీసు తేదీ నుండి 60 రోజులలోగా రూ. 3,75,58,105.04 (అక్షరాల మూడు కోట్ల డెబ్బై ఐదు లక్షల యాభై ఎనిమిది వేల నూట ఐదు రూపాయలు మరియు నాలుగు పైసలు మాత్రమే) + తదుపరి వడ్డీ, ఖర్చులు కలిపి మొత్తమును చెల్లించవలసిందిగా కోరుతూ సంబంధిత చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద మీకు [illegible]

SARFAESI [illegible]

తేది: 03-12-2025, ప్రదేశం: కడప. సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

పరకామణి దొంగలను జగన్ వెనకేసుకురావడం శోచనీయం

పులివెందులలోని తితిదే కల్యాణ మండపాన్ని పరిశీలిస్తున్న పాలకమండలి సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి

చక్రాయపేట, పులివెందుల, న్యూస్‌టుడే: శ్రీవారి పరకామణిలో దొంగతనం చేసిన వ్యక్తులను మాజీ సీఎం వైఎస్ జగన్ అదేదో చిన్న దొంగతనం కేసు అని మాట్లాడడం శోచనీయమని తితిదే బోర్డు పాలకమండలి సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి అన్నారు. పులివెందులలో అలంకారప్రాయంగా ఉన్న తితిదే కల్యాణ మండపాన్ని పరిశీలించేందుకు సోమవారం ఆయన పులివెందుల వచ్చారు. సమస్యలను పరిష్కరించి త్వరలోనే మండపాన్ని అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. కోట్లాదిమంది శ్రీవారి భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా మాట్లాడిన జగన్ ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం గండి క్షేత్రాన్ని ఆయన సందర్శించారు. ఏపీ మార్క్‌ఫెడ్ డైరెక్టర్ వంగల శశి భూషణ్‌రెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు శివమోహన్‌రెడ్డి, నేతలు పాల్గొన్నారు.

అంతర్ జిల్లాల క్రికెట్ విజేత రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్

రక్షన్‌సాయి లోకేశ్‌రెడ్డి రుత్విక్ జైవర్ధన్‌నాథ్

కడప క్రీడలు, న్యూస్‌టుడే: ఏసీఏ అండర్-14 అంతర్ జిల్లాల క్రికెట్ పోటీల్లో 15 పాయింట్లతో రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్టు విజేతగా నిలిచింది. రెండు, మూడు స్థానాల్లో నార్త్ జోన్ విన్నర్స్ (11 పాయింట్లు), సెంట్రల్ జోన్ విన్నర్స్ (11 పాయింట్లు) జట్లు నిలిచాయి. సోమవారం జరిగిన క్రికెట్ మ్యాచ్‌ల వివరాలివి.

● వైఎస్ఆర్ఆర్-ఏసీఏ క్రికెట్ స్టేడియంలో 12 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో బ్యాటింగ్‌ను రెండో రోజు (సోమవారం) ఆరంభించిన రెస్ట్ ఆఫ్ నార్త్‌జోన్ జట్టు 74.1 ఓవర్లలో 268 పరుగులకు ఆలౌట్ అయ్యింది. జట్టులో ధన్విన్ 59, ప్రజ్ఞాన్ పండిత్ 47 పరుగులు చేశారు. సెంట్రల్ జోన్ విన్నర్స్ జట్టు బౌలర్లు జైవర్ధన్‌నాథ్ 5, రామ్‌కిరణ్ 2 వికెట్లు తీసుకున్నారు. ఆపై సెంట్రల్ జోన్ విన్నర్స్ రెండో ఇన్నింగ్స్‌ను ఆరంభించి మ్యాచ్ ముగిసే సమయానికి 26 ఓవర్లలో 66 పరుగులు చేసి అయిదు వికెట్లు కోల్పోయింది. మ్యాచ్ డ్రాగా ముగిసింది.

● కేవోఆర్ఎం క్రికెట్ మైదానంలో 6 వికెట్ల నష్టానికి 30 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుగా బ్యాటింగ్‌ను ఆరంభించిన నార్త్‌జోన్ విన్నర్స్ జట్టు 64.1 ఓవర్లలో 131 పరుగులకు ఆలౌట్ అయ్యింది. జట్టులో శ్రీరామ్ 35 పరుగులు చేశారు. రెస్ట్‌ఆఫ్ సెంట్రల్ జోన్ బౌలర్ లోకేష్ రెడ్డి 5 వికెట్లు తీసుకున్నాడు. ఆపై రెండో ఇన్నింగ్స్‌ను ఆడిన రెస్ట్ ఆఫ్ సెంట్రల్‌జోన్ జట్టు 41 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 113 పరుగులు చేసింది. నార్త్‌జోన్ బౌలర్ రుత్విక్‌కు 5 వికెట్లు పడ్డాయి. ఈ మ్యాచ్ డ్రాగా ముగిసింది.

● కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో ఒక వికెట్ నష్టానికి 39 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బ్యాటింగ్‌ను ఆరంభించిన రెస్ట్ ఆఫ్ సౌత్‌జోన్ జట్టు 60 ఓవర్లలో 184 పరుగులకు ఆలౌట్ అయ్యింది. జట్టులో సాయికృష్ణ చైతన్య 48 పరుగులు, తాహీర్ 45 పరుగులు చేశారు. సౌత్‌జోన్ విన్నర్స్ జట్టు బౌలర్ రక్షణ్ సాయి మరోసారి సత్తాచాటి 5 వికెట్లు తీసుకున్నాడు. ఆపై సౌత్‌జోన్ విన్నర్స్ జట్టు బ్యాటింగ్‌ను ఆరంభించి 44 ఓవర్లలో 157 పరుగులు చేసి 7 వికెట్లు కోల్పోయింది. జట్టులో మణిదీప్ 54 పరుగులు, రక్షణ్‌సాయి అజేయంగా 48 పరుగులు చేశాడు. మ్యాచ్ డ్రాగా ముగిసింది.

11 నుంచి ఈశ్వరీదేవి ఆరాధనోత్సవాలు

బ్రహ్మంగారిమఠం: జగన్మాత ఈశ్వరీదేవి ఆరాధన గురుపూజా మహోత్సవాలు ఈ నెల 11వ తేదీ నుంచి 16వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు మఠాధిపతి వీర శివకుమారస్వామి తెలిపారు. పలు సాంస్కృతిక, అన్నదాన కార్యక్రమాలు చేపట్టనున్నారు.

విభిన్న ప్రతిభావంతుల రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల విజేత కడప జట్టు

విజయం సాధించిన జిల్లా జట్టు సభ్యులు వీరే

కడప క్రీడలు, న్యూస్‌టుడే: గుంటూరులోని విజ్ఞాన్ విశ్వవిద్యాలయంలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి విభిన్న ప్రతిభావంతుల క్రికెట్ పోటీల్లో సోమవారం జిల్లా జట్టు సెమీ ఫైనల్స్‌లో తూర్పుగోదావరి జిల్లా జట్టుపై విజయం సాధించి ఫైనల్స్‌కు చేరింది. మొదట బ్యాటింగ్ చేసిన కడప జట్టు నిర్ణీత 16 ఓవర్లలో 171 పరుగులు చేసింది. కడప బ్యాట్స్‌మెన్ ప్రవీణ్ 41 బంతుల్లో చేలరేగి ఆడి 85 పరుగులు చేశాడు. అనంతరం తూర్పుగోదావరి జిల్లా జట్టు 145 పరుగులకు ఆలౌట్ అయ్యింది. కడప జట్టు 26 పరుగుల తేడాతో విజయం సాధించి ఫైనల్స్‌కు అర్హత సాధించింది. ఈ నెల 9న ఫైనల్స్ గుంటూరులోనే జరగనుంది.

EENADU Classifieds

AUTO
VEHICLES FOR SALE
REAL ESTATE
HOUSE FOR SALE
JOBS
గమనిక

[illegible]

ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన రూ. 350/- మాత్రమే
Contact: KDP: 9989997626, 8008514248, PDTR: 8008597620

ప్రొద్దుటూరు
● ప్రొద్దుటూరు ● జమ్మలమడుగు ● బద్వేలు ● మైదుకూరు

మార్కెట్‌లో పరిశుభ్రత పనులు చేపట్టాలి

మహిళలతో మాట్లాడుతున్న కమిషనర్ రవిచంద్రారెడ్డి

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు అనిబిసెంటు పురపాలక మైదానం, తాత్కాలిక కూరగాయల మార్కెట్‌ను సోమవారం సాయంత్రం కమిషనర్ రవిచంద్రారెడ్డి పరిశీలించారు. మైదానంలోని వ్యాయామం చేస్తున్న మహిళలతో కమిషనర్ మాట్లాడారు. జిమ్ చుట్టూ ఉన్న ఇనుప కంచె తెగిపోయిందని కమిషనర్ దృష్టికి తెచ్చారు. కూరగాయల మార్కెట్‌ను నిత్యం శుభ్రంగా ఉంచాలని పారిశుద్ధ్య అధికారులను ఆదేశించారు. పురపాలక ఇంజినీరు శ్రీనివాసులు, పట్టణ ప్రణాళిక సహాయ కమిషనర్ నాగరాజు, పారిశుద్ధ్య అధికారి సుబ్బరాయుడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కష్టపడే వారికే తెదేపాలో గుర్తింపు

తెదేపా ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: కష్టపడేవారికి పార్టీలో తప్పకుండా గుర్తింపు ఉంటుందని తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి భరోసా ఇచ్చారు. రాష్ట్ర మత్స్య సహకార సంఘాల సమాఖ్య లిమిటెడ్ ఛైర్మన్ యాటగిరి రాంప్రసాద్ సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో భూపేష్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు శ్రీనివాసులు, సంజీవరాయుడు, బాలుడు, బాలు, సురేష్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం... మీకు తోడుగా...

(10 AM to 1 PM)
ప్రొద్దుటూరు : 9966349431
జమ్మలమడుగు : 9000409516
మైదుకూరు : 8008573447
బద్వేలు గ్రామీణ : 8008573493

?: మండల పరిధిలోని జంగాలపల్లె-సుద్దపల్లె, పెద్దముడియానికి వెళ్లే రహదారులు దెబ్బతిని గుంతలు పడ్డాయి. మండల కేంద్రానికి రాకపోకలు సాగించాలంటే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. -**స్థానికుడు, జంగాలపల్లె**
✓: దెబ్బతిన్న రహదారులను బాగు చేయించేలా చర్యలు తీసుకుంటాం. - **అభిలాష్‌రెడ్డి, ఆర్అండ్‌బీ ఏఈ, పెద్దముడియం**
?: శ్మశానవాటికకు సరిపడా స్థలం లేక అంత్యక్రియలకు అవస్థలు తప్పడం లేదు. అధికారులు చర్యలు చేపట్టాలి. - **జంగాలపల్లె గ్రామస్థుడు**
✓: శ్మశాన వాటిక విషయమై పూర్తి వివరాలు సేకరించి చర్యలు తీసుకుంటాం. - **బాలనరసింహులు, తహసీల్దారు - న్యూస్‌టుడే, పెద్దముడియం**

వెనుక జలాలు.. రాకపోకలకు ఇక్కట్లు

వేములూరు వంతెన ఎత్తు పెరిగితేనే సమస్య తీరేది

వేములూరు వంతెనపై సోమశిల వెనుక జలాలు

అట్లూరు, న్యూస్‌టుడే : అట్లూరు మండల పరిధిలోని వేములూరు వంతెనపై సోమశిల వెనుక జలాలు ఉండటంతో రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. వంతెన ఎత్తు పెంచితేనే సమస్య తీరుతుంది. వెనుక జలాలతో ఏడాదిలో కొన్ని నెలలు వంతెనపై 28 గ్రామాల ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. సోమశిల జలాలతో నెల్లూరు జిల్లాలో కొన్ని మండలాలు సస్యశ్యామలంగా ఉన్నాయి. సోమశిల ముంపుతో అట్లూరు, నందలూరు, గోపవరం, ఒంటిమిట్ట మండలాల్లో సుమారు 110 గ్రామాలకు పరిహారం చెల్లించారు. ముంపునకు సంబంధం లేని అట్లూరు మండలంలోని 28 గ్రామాల ప్రజలు ఏటా ఇబ్బందులకు గురవుతున్నా పాలకులు, అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు.

నిత్యం ఇబ్బందులే

అట్లూరు మండలంలోని ముత్తుకూరు, వేములూరు, కామసముద్రం, మాడపూరు, మణ్యంవారిపల్లె, కమలకూరు పంచాయతీ వాసులు మండల కేంద్రం అట్లూరుకు రావాలన్నా, జిల్లా కేంద్రం కడపకు వెళ్లాలన్నా 45 కిలోమీటర్లు అదనంగా ప్రయాణించాల్సి ఉంది. ప్రభుత్వ ఉద్యోగులు, విద్యార్థులు, రైతులు, డ్వాక్రా మహిళలు, చిరు వ్యాపారులు అట్లూరుకు వెళ్లాలంటే అవస్థలు తప్పడం లేదు. వంతెనపై పెరిగిన వెనుక జలాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వంతెనపై నెలలుగా వెనుక జలాలు నిల్వ ఉండటంతో ప్రయాణికులు జారిపడి గాయాలవుతున్నారు.

నెరవేరని హామీ

వేములూరు వంతెనను రూ.12 కోట్లతో ఎత్తుగా నిర్మిస్తామని 2021లో అప్పటి ముఖ్యమంత్రి జగన్ బద్వేలు పర్యటన సందర్భంగా హామీ ఇచ్చారు. దీంతో ఇక కష్టాలు తీరుతాయని ప్రజలు భావించినా హామీ నెరవేరలేదు. ప్రతి ఏటా వంతెనపై 28 గ్రామాల వాసులకు ఇబ్బందులు తప్పడం లేదు.

ప్రయాణ భారం పెరిగింది

వేములూరులో నివాసం ఉంటున్నాను. బతుకుదెరువు నిమిత్తం అట్లూరు క్రాస్ రోడ్డులో సెల్‌ఫోన్ల అమ్మకాలు, రిపేర్ చేసే దుకాణం ఉంది. వంతెనపై సోమశిల జలాలు లేనప్పుడు మా గ్రామం నుంచి క్రాస్‌రోడ్డుకు వచ్చి వెళ్లేందుకు 15 కి.మీ. ప్రస్తుతం వంతెనపై వెనుక జలాలుండటంతో వేములూరు నుంచి బయనపల్లె మీదుగా క్రాస్‌రోడ్డుకు వెళ్లి రావాలంటే 80 కి.మీ ప్రయాణించాల్సి ఉంది.
- **వెంకటేష్, వేములూరు**

ఆక్రమణదారులపై చర్యలకు డిమాండ్

మైదుకూరు, న్యూస్‌టుడే : మైదుకూరు ఇందిరమ్మకాలనీ సమీపంలో వంక పోరంబోకు ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట పేదలతో కలిసి పార్టీ నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా చంద్ర మాట్లాడుతూ ఇటీవల పేదలతో కలిసి భూపోరాటం చేయగా అభ్యంతరం వ్యక్తం చేసిన రెవెన్యూ అధికారులు అదేరోజు రాత్రి ఆక్రమణదారులు చదును చేసినా చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. వంక పోరంబోకు స్థలం అన్యాక్రాంతం కాకుండా సర్వే చేసి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలన్నారు. ఈ విషయమై తహసీల్దారు రాజసింహ నరేంద్ర మాట్లాడుతూ.. సర్వే చేసి హద్దులు తేల్చి ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

తహసీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులుగగ

ఆలయ పునరుద్ధరణకు నిధుల మంజూరు

అట్లూరు, న్యూస్‌టుడే : బద్వేలు నియోజకవర్గంలోని ఐదు ఆలయాల పునరుద్ధరణకు రూ.5 కోట్ల నిధులను దేవాదాయ శాఖ మంత్రి ఆనం నారాయణరెడ్డి మంజూరు చేశారు. పోరుమామిళ్ల మండలం గురప్పగారిపల్లెలోని మద్దిమాను గురప్పస్వామి ఆలయానికి రూ.2.32 కోట్లు, బద్వేలు మండలం చెన్నంపల్లె ఆదికేశవస్వామి ఆలయానికి రూ.1.20 కోట్లు, అనంతరాజుపురంలోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయానికి రూ.80 లక్షలు, అట్లూరు మండలం చౌటపల్లె, మహమ్మద్‌దాయపల్లె రామాలయాల పునరుద్ధరణకు రూ.68 లక్షలు నిధులు కేటాయించారు. అట్లూరులోని పురాతన రామాలయాల అభివృద్ధికి నిధులు కేటాయించారు.

పాఠశాలలు.. ఆక్రమణలకు నిలయాలు

రామదాసుపురం బడి వద్ద పశుగ్రాసం వేశారిలా..

చాపాడు, న్యూస్‌టుడే: చాపాడు మండలంలో మూతపడిన పాఠశాలలను స్థానికులు ఆక్రమించుకుని పలు కార్యకలాపాలు సాగిస్తున్నారు. ఈ ఏడాది విద్యార్థుల్లేక మూత వేసిన రామదాసుపురం ప్రాథమిక పాఠశాలలో పశుగ్రాసం వేశారు. దీనికి విశాలమైన మైదానం, ప్రహరీ ఉన్నాయి. కొత్తరాజువారిపేటలో మంచంవేసి పడకగదిగా మార్చారు. వీరభద్రాపురం, తూర్పు అనంతపురంలో వలస కూలీలు వినియోగిస్తుంటారు. ఇలాగే వదిలేస్తే స్థానికులు ఒకరిని చూసి మరొకరు పూర్తి స్థలాలు ఆక్రమిస్తారని, అధికారులు స్పందించి ప్రభుత్వ జాగాలను కాపాడాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ సమస్యపై ఎంఈవో రవిశంకర్‌ను వివరణ కోరగా పాఠశాలల స్థలాలు వెంటనే ఖాళీ చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.

పరుగు పందెంలో ప్రతిభ

బహుమతి అందుకుంటున్న తేజేశ్వరరెడ్డి

జమ్మలమడుగు గ్రామీణ, న్యూస్‌టుడే: కడప మున్సిపల్ స్టేడియంలో సమగ్ర శిక్ష సహిత విద్య ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన క్రీడల్లో జమ్మలమడుగు భవిత కేంద్రానికి చెందిన విద్యార్థి తేజేశ్వరరెడ్డి ప్రతిభ చాటాడు. అండర్-14 పరుగుపందెంలో పాల్గొని జిల్లా స్థాయిలో రెండో బహుమతి సాధించాడు. భవిత కేంద్రం ఐఈఆర్పీలు చంద్రమోహన్, అర్చనలు విద్యార్థిని అభినందించారు.

మార్షల్ ఆర్ట్స్‌లో విద్యార్థుల సత్తా

పతకాలు సాధించిన విద్యార్థులు

మైదుకూరు, న్యూస్‌టుడే : అనకాపల్లిలో జరిగిన మార్షల్‌ఆర్ట్స్ పోటీల్లో మైదుకూరు ఉన్నత బాలుర పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. సోమవారం నిర్వహించిన పోటీల్లో పదో తరగతి విద్యార్థి ఎం.చెన్నకేశవ బంగారు పతకం, ఎం.నవీన్‌కుమార్ వెండి, 9వ తరగతికి చెందిన భువనేశ్వరరెడ్డి రజత పతకం పొందినట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు రాంనాయక్ తెలిపారు

‘అవినీతిపరులను కాపాడేందుకే జగన్ ప్రయత్నాలు’

మాట్లాడుతున్న తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు లింగారెడ్డి, పక్కన నాయకులు

ప్రొద్దుటూరు వైద్యం, న్యూస్‌టుడే: అవినీతిపరులను, దందాలు చేసే అనుచరులను కాపాడేందుకే మాజీ సీఎం జగన్ అధికారులపై ఇష్టం వచ్చినట్లు వ్యాఖ్యలు చేస్తున్నారని తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లెల లింగారెడ్డి ఆరోపించారు. ప్రొద్దుటూరులోని ఆయన కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఇటీవల జగన్ నిర్వహించిన రెండు గంటల మీడియా సమావేశంలో ప్రజా ప్రయోజనాల గురించి ఒక్క అంశం కూడా ప్రస్తావించలేదన్నారు. పరకామణి కేసులో నేరానికి పాల్పడిన వ్యక్తికి రెండింతల శిక్షపడాల్సి ఉందన్నారు. ఆయన ఆస్తులు రాయించుకుని లోక్‌అదాలత్‌లో రాజీ చేయించి అది చిన్నకేసు అని జగన్ చెబుతున్నారని ధ్వజమెత్తారు. తిరుమల లడ్డూ కల్తీ నెయ్యి కేసులో సీబీఐ ద్వారా నియమించిన అధికారులను జగన్ తిట్టడం తగదన్నారు. తెదేపా నాయకులు టప్పా బాషా తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీ లేక.. భద్రత కరవు

రాజుపాళెం మండలంలోని పలు గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రహరీలు లేకపోవడంతో చిన్నారులకు అవస్థలు తప్పడం లేదు. ఈ కేంద్రాల ముందు భాగంలో ప్రధాన రోడ్డు ఉండటంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూలాలుగా ప్రహరీ లేని అంగన్‌వాడీ కేంద్రం భవనం ఇదే. - **న్యూస్‌టుడే, రాజుపాళెం**

గుంతల దారి.. జాగ్రత్త బాటసారి

వనిపెంట మరాఠీవీధి వద్ద మిట్టమాసుపల్లెకు వెళ్లే దారి అధ్వానంగా మారింది. చిన్నపాటి వర్షం పడితే పరిసరాల్లోని నీరు పెద్ద ఎత్తున నిల్వ చేరుతోంది. పాదచారులతో పాటు వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం బ్రహ్మంగారిమఠం వెళ్లే దారి కావడంతో వాహన రాకపోకలు ఎక్కువే. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాల్సి ఉంది. - **న్యూస్‌టుడే, మైదుకూరు**

పొంచి ఉన్న ప్రమాదం

బద్వేలు పురపాలకలో పలు చోట్ల విద్యుత్తు తీగలకు చెట్ల కొమ్మలు తగిలి తరచూ మంటలు వస్తున్నాయి. దీంతో విద్యుత్తు సరఫరాకు తరచూ తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. బద్వేలులోని సుమిత్రానగర్‌లో ఇదే పరిస్థితి నెలకొంది. ప్రధాన రహదారి పక్కనే ఉన్న విద్యుత్తు నియంత్రిక రక్షణ కంచె లేకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని పాదచారులు భయపడుతున్నారు. సమస్యను పురపాలక, విద్యుత్తు శాఖ అధికారులకు తెలిపినా పరిష్కరించడం లేదని పురవాసులు వాపోతున్నారు. - **న్యూస్‌టుడే, బద్వేలు**

ఇలాగైతే.. ఊరి పేరు తెలిసేదెట్టా!

జాతీయ రహదారి విస్తరణతో మైదుకూరు పురపాలక రాయప్పగారిపల్లె వద్ద గ్రామ పేరు సూచించే బోర్డును పిచ్చి మొక్కలు కప్పేశాయి. రహదారి విస్తరణ పనులతో పేరును సూచించే బోర్డును దారిపక్కన పెట్టగా అక్కడ పిచ్చిమొక్కలు పెరగడంతో కనిపించకుండా పోయింది. సూచిక కనిపించేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది. - **న్యూస్‌టుడే, మైదుకూరు**

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య

కొండాపురం, న్యూస్‌టుడే: కొండాపురంలోని ఆర్అండ్ఆర్ కాలనీ సమీపంలో నివాసం ఉండే **లక్ష్మితులసి** (36) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై ప్రతాప్‌రెడ్డి వివరాల మేరకు కానిస్టేబుల్ వెంకటరమణ, లక్ష్మితులసి దంపతులు. వీరికి 2012లో వివాహమైంది. కుమార్తె, కుమారుడు సంతానం. ఆదివారం రాత్రి లక్ష్మితులసి ప్రొద్దుటూరులో ఇల్లు నిర్మించుకుందామని భర్తను అడిగారు. కడపలో ఇల్లు నిర్మించుకుంటే పిల్లలను చదివించుకోవడానికి బాగుంటుందని వెంకటరమణ చెప్పారు. తన మాటను పట్టించుకోలేదని మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరు లేని సమయంలో ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై పేర్కొన్నారు.

స్థల వివాదంతో వృద్ధుడి బలవన్మరణం

ఖాజీపేట, న్యూస్‌టుడే: మండల పరిధిలోని దుంపలగట్టు గ్రామంలో స్థల వివాదం కారణంగా వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన పోతుగంటి హుస్సేన్ (80) ఇంటి పక్కన స్థలాన్ని కొందరు ఆక్రమించారు. ఈ విషయమై అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి ఫలితం లేదు. స్థల వివాద నేపథ్యంలో పలుమార్లు గొడవలు జరిగాయి. ఈ క్రమంలో సోమవారం కొందరు హుస్సేన్‌ను తిట్టడంతో విషద్రావణం తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ వంశీధర్ వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు రోడ్డులో జాతీయ రహదారి నిర్మాణ పనుల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు గాయపడ్డారు. యూపీకి చెందిన గణేష్ సోమవారం హైవే పనులు చేస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తలకు తీవ్రంగా గాయమైంది. ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

గండికోట జలాశయం గేట్ల పనితీరు పరిశీలన

గేట్ల పనితీరును పరిశీలిస్తున్న ఎస్ఈ కొండారెడ్డి, అధికారులు

కొండాపురం, న్యూస్‌టుడే: గండికోట జలాశయంలోని గేట్ల పనితీరును జలవనరుల శాఖ ఎస్ఈ కొండారెడ్డి సోమవారం పరిశీలించారు. జలాశయం పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 26.85 టీఎంసీలు కాగా ప్రస్తుతం 26.30 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు. మైలవరం జలాశయానికి నీటిని పంపే గేట్లను పరిశీలించి వాటి పనితీరుపై ఆరా తీశారు. కార్యక్రమంలో గండికోట ప్రాజెక్టు ఈఈ ఉమామహేశ్వర్లు, మెకానికల్ క్వాలిటీ కంట్రోల్ డీఈఈ నారాయణరెడ్డి, జలవనరులశాఖ ఏఈఈలు జ్ఞానేంద్రరెడ్డి, సుదర్శన్, విశ్రాంత ఎస్ఈ లక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలని వినతి


దువ్వూరు తహసీల్దార్ సంజీవరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బద్వేలు గ్రామీణ, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని రైతులను కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అన్వేష్, సీపీఎం పోరుమామిళ్ల మండల కార్యదర్శి భైరవప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బద్వేలు ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. చెరువులకు నీటిని వదులుతున్న సమయంలో 1200 ఎకరాల పంట ముంపునకు గురవుతుందని నష్టపరిహారం చెల్లించాలని కోరారు.

దువ్వూరు : ఉల్లిరైతులకు ప్రభుత్వం ప్రకటించిన హెక్టారుకు రూ.50 వేల సాయం తక్షణం అందజేయాలని రైతు సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ఎ.వి. రమణ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు దువ్వూరు తహసీల్దార్ వై.సంజీవరెడ్డికి సోమవారం విన్నవించారు.

రేషన్ డీలర్లకు నోటీసులు

ప్రొద్దుటూరు గ్రామీణ, న్యూస్‌టుడే: నిబంధనలు ఉల్లఘించిన 33 మంది డీలర్లకు తహసీల్దారు గంగయ్య నోటీసులను జారీ చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కూటమి ప్రభుత్వం ఆదేశాల ప్రకారం వృద్ధులు, దివ్యాంగుల ఇళ్ల వద్దకు సరకులు ఇవ్వాలని నిర్దేశించారు. ఈ నిబంధనలు పాటించని వారికి నోటీసులు జారీ చేసి వివరణ ఇవ్వాలని కోరారు. ఈ విషయమై పీడీఎస్ డీటీ శివప్రసాదు మాట్లాడుతూ నోటీసులందుకున్న డీలర్లు ఇచ్చే సంజాయిషీ ఆధారంగా చర్యలు చేపడుతామన్నారు.

గ్రామస్థాయి నుంచే పార్టీ బలోపేతం

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: గ్రామస్థాయి నుంచే పార్టీని బలోపేతంపై దృష్టి సారించినట్లు ఎమ్మెల్సీ, వైకాపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి రామసుబ్బారెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని పి.బొమ్మేపల్లెలో నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి చేయూత

చాపాడు, న్యూస్‌టుడే: నరహరిపురం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ సి.నారాయణరెడ్డి బడి అభివృద్ధికి రూ.10,300 విరాళం అందించినట్లు హెచ్ఎం నరసింహశాస్త్రి తెలిపారు. పాఠశాలలో బాలికల మరుగుదొడ్లకు తలుపులు సమకూర్చి, వాటిని వినియోగంలోకి తెచ్చేలా సహకరించారని వివరించారు.

ఎమ్మార్పీ ధరకే ఎరువులు విక్రయించాలి

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: ఎమ్మార్పీ ధరలకే ఎరువులు విక్రయించాలని పులివెందుల వ్యవసాయ సహాయ సంచాలకులు ప్రభాకర్‌రెడ్డి సూచించారు. సోమవారం జమ్మలమడుగు ఏవో శ్రీకాంత్‌రెడ్డితో కలిసి ఎరువులు, పురుగు మందుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.

సైకాలజీ విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

విద్యార్థులతో జన విజ్ఞాన వేదిక నాయకులు

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక జనవిజ్ఞానవేదిక (జవివే) కార్యాలయంలో సోమవారం టెట్ కోచింగ్‌లో ఉన్న విద్యార్థులకు సైకాలజీ పుస్తకాలను విద్యార్థులకు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో నాయకులు తవ్వా సురేష్, సునీత, రాజేష్, కల్యాణకృష్ణ, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

రహదారులు బురదమయం.. పారిశుద్ధ్యం అధ్వానం

బురదమయంగా కాలనీకి వెళ్లే రహదారి

జంగాల కాలనీలో వృథాగా పోతున్న నీరు

బద్వేలు, న్యూస్‌టుడే: బద్వేలులోని పలు వార్డుల్లో గేట్ వాల్వుల పరిస్థితి అధ్వానంగా మారింది. ఇవి సక్రమంగా లేకపోవడంతో లీకేజీ అవుతున్నాయి. దీంతో రహదారులపై నీరు చేరి బురదమయంగా మారుతున్నాయి.

❖ పట్టణంలోని శివానగర్ వార్డు సచివాలయం పరిధిలోని జంగాల కాలనీలో గేటువాల్వ్ సక్రమంగా లేదు. లీకేజీతో రహదారి అధ్వానంగా మారింది. ఈ విషయమై ప్రజలు పురపాలక అధికారులకు విన్నవించినా సమస్య పరిష్కారం కాలేదు. పారిశుద్ధ్యం అధ్వానంగా ఉండటంతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. ఈ వార్డు సచివాలయం పరిధిలో రెండు వేలకు పైగా నివాసాలు, అయిదు వేల మంది జనాభా ఉంది.

ప్రధాన కూడళ్లలో వెలగని వీధి దీపాలు

పట్టణంలో వీధి దీపాల సమస్య ఉంది. ప్రధాన కూడళ్ల వద్ద స్తంభాలకు దీపాలు ఏర్పాటు చేయలేదు. రాత్రివేళల్లో విషపురుగుల సంచారం అధికంగా ఉంటుంది. ఈ విషయమై పుర కమిషనర్ నరసింహారెడ్డి మాట్లాడుతూ.. నీటి లీకేజీకి చర్యలు తీసుకుంటామన్నారు. వీధి దీపాలను ఏర్పాటు చేసేలా, పారిశుద్ధ్యానికి చర్యలు తీసుకుంటామన్నారు.

కొరవడిన పర్యవేక్షణ.. నిర్వహణ అస్తవ్యస్తం

పురపాలక పెట్రోలు బంకులో తేలని జమా ఖర్చులు

కొత్రపాడు రోడ్డులో పురపాలక పెట్రోలు బంకు

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు పురపాలక సంఘం పెట్రోల్ బంకు నిర్వహణపై అధికారుల పర్యవేక్షణ కొరవడింది. 2022 జనవరిలో కొత్రపాడురోడ్డులో పురపాలక స్థలం 30 సెంట్లలో పెట్రోల్ బంకును ప్రారంభించారు. కొద్ది రోజుల కిందట పెట్రోల్ బంకు నుంచి వచ్చిన ఆదాయంలో జమా ఖర్చుల్లో వ్యత్యాసం వచ్చినట్లు కమిషనర్ రవిచంద్రారెడ్డి గుర్తించి అమృత్‌పథకం సహాయ గణాంకాల అధికారి డేవిడ్‌ను విచారణాధికారిగా నియమించారు. ✶ పెట్రోలు బంకు ఏర్పాటు నుంచి సరైన రికార్డులు లేకపోవడంతో ప్రారంభం నుంచి కొనుగోలు, జమాఖర్చుల జాబితా రికార్డులను రూపొందించాలని పెట్రోల్ బంకు నిర్వహణ చూసే పుర ఉద్యోగులను ఆదేశించారు. వీరిలో ఒకరికి ఉద్యోగోన్నతి వచ్చినా కమిషనర్ రిలీవ్ చేయలేదు. కొందరు ప్రైవేటు ట్రావెలర్స్ యజమానులు ఈ బంకు నుంచి అప్పు విధానంలో డీజిల్‌ను కొనుగోలు చేశారు. రెండు రోజుల కిందట కమిషనర్ బస్సు యజమానులను పిలిపించి బకాయి చెల్లించాలని కమిషనర్ వారిని ఆదేశించారు. దీంతో యజమానులు రూ.15 లక్షలు చెల్లించారు. ✶ ఈ విషయమై పురపాలక కమిషనర్ రవిచంద్రారెడ్డి మాట్లాడుతూ.. పెట్రోలు బంకు ప్రారంభం నుంచి ఆడిట్ జరగలేదని అధికారుల పర్యవేక్షణ కొరవడిందన్నారు. అవినీతి ఏమీ ఉండకపోవచ్చని పేర్కొన్నారు. ఆడిట్ అనంతరం వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్నారు. ఇదే విషయాన్ని పురపాలక ప్రాంతీయ డైరెక్టర్‌కు సమాచారం ఇచ్చానని స్పష్టం చేశారు.

డిమాండ్ల సాధనకు పోరాటం

ఆందోళన చేస్తున్న సహకార సంఘాల ఉద్యోగులు

ప్రొద్దుటూరు గ్రామీణ, న్యూస్‌టుడే: న్యాయబద్ధమైన 12 సమస్యలను పరిష్కరించాలని సహకార సంఘాల ఉద్యోగులు డిమాండు చేశారు. సోమవారం వైఎంఆర్ కాలనీలోని డీసీసీబీ కార్యాలయం వద్ద వారు ధర్నా చేపట్టారు. పెండింగ్‌లో ఉన్న వేతన సవరణలను ఆమోదించి మధ్యంతర భృతి చెల్లించాలన్నారు. సమస్యల పరిష్కారానికి ఆందోళన కార్యక్రమాలను బలోపేతం చేస్తామన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99899 97626
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

(c) eenadu

కడప

• కడప • పులివెందుల • కమలాపురం

ప్రజా సమస్యలు త్వరితగతిన పరిష్కరించండి

ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ మనోజ్‌రెడ్డి

బిల్టప్, కడప న్యూస్‌టుడే: ప్రజల సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యం చేయకూడదని నగరపాలక సంస్థ కమిషనర్ మనోజ్‌రెడ్డి అధికారులకు సూచించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. నగర వాసుల నుంచి అర్జీలు స్వీకరించారు. తక్షణమే సమస్యలు పరిష్కరించాలని సిబ్బందిని ఆయన ఆదేశించారు.

ఘనంగా కలర్స్ డే వేడుకలు

వేంపల్లె, న్యూస్‌టుడే: వేంపల్లె శ్రీచైతన్య ఉన్నత పాఠశాలలో సోమవారం కలర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు వివిధ రంగుల దుస్తులు ధరించి ఆకట్టుకున్నారు. పలు పండ్ల ఆకృతులను రూపొందించి వాటిని రంగులతో తీర్చిదిద్ది ప్రదర్శించారు. కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి, డైరెక్టర్లు చేతన్‌రెడ్డి, చైతన్యరెడ్డి పాల్గొన్నారు.

రంగుల పండ్ల ఆకృతులు, దుస్తులతో విద్యార్థులు

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM to 1 PM)
కడప: 8008573428, 8074174832
పులివెందుల : 8008573466
కమలాపురం : 8008573475

?: పులివెందులలోని బేతేలు చర్చి ప్రాంతంలో కలుషిత నీరు వస్తోంది. అధికారులు చొరవ తీసుకుని సమస్యను పరిష్కరించాలి. **- రవిచంద్ర, బ్రాహ్మణపల్లె రోడ్డు, పులివెందుల**

✓: సమస్య ఎక్కడ ఉందో గుర్తించి పరిష్కరిస్తాం. **- రాముడు, కమిషనర్, పులివెందుల పురపాలక సంఘం**

?: పులివెందులలోని హెచ్‌పీ గ్యాస్ కార్యాలయం వీధిలో కోతుల బెడద ఎక్కువగా ఉంది. సమస్యను పరిష్కరించగలరు. **- బాబా ఫక్రుద్దీన్, స్థానికులు**

✓: త్వరలో సమస్యను పరిష్కరిస్తాం. **- రాముడు, కమిషనర్, పులివెందుల పురపాలక సంఘం - పులివెందుల, న్యూస్‌టుడే**

ఖాళీ స్థలాలు.. వ్యాధులకు కారకాలు

పట్టించుకోని అధికారులు.. ఇబ్బందుల్లో ప్రజలు

కమలాపురం, న్యూస్‌టుడే: నగర పంచాయతీలోని నివాసాల మధ్యలో ఖాళీ స్థలాలు రోగాలకు నిలయాలుగా మారుతున్నాయి. కంప చెట్లు పెరగడం, నీరు నిలిచిపోవడంతో దోమల ఉత్పత్తి కేంద్రాలవుతున్నాయి. ఈ సమస్య ప్రజలను తీవ్రంగా వేధిస్తోంది. పట్టణంలోని ప్రధాన సమస్యల్లో ఖాళీ స్థలాల్లో మురుగు నిలిచి ఉండటంతో అందులో పిచ్చి మొక్కలు, కంప చెట్లు దట్టంగా పెరిగిపోతున్నా అధికారులు పట్టించుకోలేదని విమర్శలున్నాయి. తూతూ మంత్రంగా పనులు చేసి వెళ్లిపోవడం తప్ప శాశ్వత చర్యలు తీసుకోవట్లేదని విమర్శలున్నాయి.

ఇదీ పరిస్థితి! : పారిశుద్ధ్య సిబ్బంది రోడ్లపై చెత్త కుండీలు శుభ్రం చేయడం, కాలువల్లో వ్యర్థాలను తొలగించడం వంటివి మాత్రమే చేస్తున్నారు. ఇళ్ల మధ్యలో ఖాళీ స్థలాల్లోని చెత్తను వదిలేస్తున్నారు. స్థల యజమానులు వీటిని పట్టించుకోవడం లేదు. ఈ నేపథ్యంలో అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీ కాలువల నుంచి నీరు బయటకు వచ్చి అక్కడక్కడ ఖాళీ స్థలాల్లో మురుగు చేరి పందులు, కుక్కలకు ఆవాసాలుగా మారుతున్నాయి. పెద్ద ఎత్తున పిచ్చి మొక్కలు, కంప చెట్లు పెరుగుతున్నాయి. విష కీటకాలు చేరుతున్నాయి. అవి ఒక్కో సారి ఇళ్లలోకి రావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ● ఖాళీ స్థలాలను యజమానులు విక్రయించాలని భావించినప్పుడు, ఏదైనా అవసరం వచ్చినప్పుడు మాత్రమే శుభ్రం చేయిస్తున్నారు. మిగతా సమయంలో ఆ వైపు చూడటమే లేదు. అధికారులు స్పందించి చర్యలు తీసుకుంటే తప్ప సమస్యకు పరిష్కారం లభించదు. ఈ విషయమై నగర పంచాయతీ కమిషనర్ ప్రహ్లాద్ మాట్లాడుతూ.. ఖాళీ స్థలాల వారికి నోటీసులు ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. అయినా వినకపోతే తగు చర్యలు తీసుకుంటామన్నారు.

నగర పంచాయతీ : కమలాపురం	
జనాభా : 23 వేలు	
వార్డులు : 20	
ఖాళీ స్థలాలు : 200 పైనే	

సొసైటీ కాలనీలోని ఖాళీ స్థలంలో పెరిగిన కంప చెట్లు

మద్యం మత్తులో ఇద్దరిపై కత్తితో దాడి

చెన్నూరు, న్యూస్‌టుడే: చెన్నూరులోని ఓ మద్యం దుకాణం వద్ద జరిగిన ఘర్షణలో మద్యం మత్తులో ఓ వ్యక్తి ఇద్దరిపై కత్తితో దాడి చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చెన్నూరులోని అరుంధతినగర్‌కు చెందిన వెంకటసుబ్బయ్య, వెంకటయ్యలు మద్యం దుకాణం వద్ద ఉన్నారు. అదే సమయంలో కొత్తగాంధీనగర్‌కు చెందిన ప్రదీప్ అనే వ్యక్తి అక్కడికి వచ్చి వారితో వాగ్వాదానికి దిగి కత్తితో దాడి చేశాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. ఎందుకు దాడి చేశాడనేది విచారణలో తేలాల్సి ఉంది.

ఎస్పీని ఆశ్రయించిన ప్రేమజంట

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: తొండూరుకు చెందిన మనోహర్, వేల్పులకు చెందిన షేక్ సుస్మాన్‌బేగంలు ఎస్పీ నచికేత్ విశ్వనాథ్‌ను సోమవారం ఆశ్రయించారు. వారం రోజుల కిందట తాము ప్రేమ వివాహం చేసుకున్నామని.. యువతి కుటుంబ సభ్యుల నుంచి తమ కుటుంబానికి ప్రాణహాని ఉందంటూ మనోహర్ ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్పీ ఈ విషయాన్ని పులివెందుల డీఎస్పీకి బదలాయించారు.

నేడు కౌన్సిల్ సమావేశం

కమలాపురం: స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో నేడు మధ్యాహ్నం 3 గంటలకు ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, ఛైర్‌పర్సన్ మార్పురి మేరి అధ్యక్షతన సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్నామని నగర పంచాయతీ కమిషనర్ ప్రహ్లాద్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి కౌన్సిలర్లందరూ హాజరు కావాలని ఆయన కోరారు.

విద్యా సామగ్రి అందజేత

కడప ఏడురోడ్లు, చింతకొమ్మదిన్నె, న్యూస్‌టుడే: మండలంలోని అంగడివీధి జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఆ పాఠశాల పూర్వ ఉపాధ్యాయిని స్వరూపరాణి స్టడీ మెటీరియల్లను అందజేశారు. వాటిని ఎంఈవో-2 రమాదేవి చేతుల మీదుగా సోమవారం విద్యార్థులకు పంపిణీ చేశారు.

వైకల్యం కంటే సంకల్ప బలమే గొప్పది

విజేతలకు ప్రశంసా పత్రాలు అందిస్తున్న సమగ్రశిక్షా అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ప్రేమంత్‌కుమార్

కడప క్రీడలు, న్యూస్‌టుడే : ప్రతిభకు వైకల్యం అడ్డురాదని.. సంకల్ప బలం ముందు అది చాలా చిన్నదనే విషయాన్ని విభిన్న ప్రతిభావంతులు గుర్తించుకోవాలని సమగ్రశిక్షా అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ప్రేమంత్‌కుమార్ అన్నారు. కడప మున్సిపల్ మైదానంలో సోమవారం విభిన్న ప్రతిభావంతులకు పలు క్రీడా పోటీలు చేపట్టారు. 50 మీటర్లు, 100 మీటర్ల పరుగు పోటీలతో పాటు షాట్‌పుట్, డిస్క్ తదితర క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సహిత విద్యా సమన్వయకర్త రమణమూర్తి పాల్గొన్నారు.

14న కడపలో విద్యా సదస్సు

వేంపల్లె, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులు, విద్యారంగ సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేయాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు నర్రెడ్డి సంగమేశ్వరరెడ్డి పేర్కొన్నారు. కడపలో ఈ నెల 14న ఎస్టీయూ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన విద్యా సదస్సుకు సంబంధించిన గోడపత్రాలను వేంపల్లె జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం తోటి ఉపాధ్యాయులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఆ రోజు కడప కలెక్టరేట్ నుంచి జడ్పీ హాల్ వరకు మహా ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు.

సస్యరక్షణ చర్యలు తప్పనిసరి

లింగాల : విస్తారంగా కురిసిన వర్షాలతో అరటి పంటకు సిగటోక ఆకుమచ్చ తెగుళ్లు వ్యాపించాయని తక్షణం సస్యరక్షణ చర్యలు చేపట్టకపోతే దిగుబడులు తగ్గే అవకాశం ఉందని కొవ్వూరు అరటి పరిశోధన ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ రవీంద్రకుమార్ అన్నారు. బోనాల, మురారిచింతల రైతు సేవాకేంద్రాల్లో సోమవారం సిగటోక ఆకుమచ్చ తెగులు నివారణ, సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పులివెందుల ఉద్యాన అధికారి గువ్వా రాఘవేంద్రారెడ్డి పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

మాట్లాడుతున్న డీఈవో షంషుద్దీన్

కడప విద్య, న్యూస్‌టుడే: జిల్లాలో పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈవో షంషుద్దీన్ అన్నారు. స్థానిక జయనగర్‌కాలనీ జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం ఎస్సెస్సీ-2026 పరీక్షల సన్నద్ధతలో భాగంగా ఉపాధ్యాయులకు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు అన్ని సబ్జెక్టుల్లో మెరుగైన ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. వంద రోజుల యాక్షన్ ప్లాన్‌ను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. కోర్స్ డైరెక్టర్లు విజయభాస్కర్‌రెడ్డి, ఇర్షాద్‌అహ్మద్, ఆర్పీలు సురేష్‌కుమార్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

ఓటర్ల వివరాల నమోదులో అలసత్వం తగదు

మాట్లాడుతున్న ఆర్డీవో చిన్నయ్య

పులివెందుల, న్యూస్‌టుడే: ఓటర్ల వివరాల నమోదులో అలసత్వం వీడాలని.. ఎన్నికల కమిషన్ సూచనల మేరకు పని చేయాలని పులివెందుల ఆర్డీవో చిన్నయ్య అన్నారు. పురపాలక కార్యాలయంలో సోమవారం పురపాలక కమిషనర్ రాముడు, తహసీల్దారు నజీర్ అహమ్మద్‌లతో కలిసి బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించారు. 2002 ఓటర్ల జాబితాను తాజా జాబితాకు మ్యాపింగ్ చేయాలని ఎన్నికల అధికారులు సూచించారు. మ్యాపింగ్ చేయడంలో జాప్యం లేకుండా పనిచేయాలని చెప్పారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

కడప విద్య, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ సొసైటీ అధికారి ఉదయశ్రీ అన్నారు. స్థానిక స్వీస్ట్ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. చెట్లు మనకు ప్రాణవాయువును అందిస్తాయని.. పర్యావరణ సమతుల్యతను కాపాడతాయని విద్యార్థులకు వివరించారు.

నాటిన మొక్క వద్ద ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99899 97626
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

10న తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన

కమలాపురం, న్యూస్‌టుడే: రైతుల సమస్యలపై ఈ నెల 10న స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న ఆందోళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంవీ సుబ్బారెడ్డి కోరారు. స్థానిక రెవెన్యూ కార్యాలయం ఆవరణంలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని సీపీఐ రైతు సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త ఆందోళన కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

మత్తు కట్టడిలో యువత ముందుండాలి

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: గంజాయి, డ్రగ్స్ నిర్మూలనలో యువత ముందుండాలని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అదనపు పర్యవేక్షణాధికారి వినోద్‌కుమార్ అన్నారు. ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో గంజాయి, మత్తుకు వ్యతిరేకంగా ముద్రించిన గోడ పత్రాలను సోమవారం ఆవిష్కరించారు. జిల్లాలో గంజాయి, డ్రగ్స్ నిర్మూలనకు ప్రత్యేక దళాలు ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వలరాజు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: పోలీసు శాఖలో డిజిటల్ అరెస్టులనేవే ఉండవని సైబర్ థాణా పోలీసులు సూచించారు. కడప ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాల ఆధ్వర్యంలో సోమవారం నగరంలో సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ.. సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎరువులు అధిక ధరలకు అమ్మితే చర్యలు

కమలాపురం: ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని బద్వేలు డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు వెంకటసుబ్బయ్య హెచ్చరించారు. మండలంలోని ఎరువుల దుకాణాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఎరువుల స్టాక్ రిజిస్టర్, స్టాక్ బ్యాలెన్స్, బిల్లు పుస్తకాలు, స్టాక్ బోర్డును పరిశీలించారు. ఎమ్మార్పీ ధరల పట్టికను రైతులకు కనిపించేలా దుకాణంలో ఉంచాలన్నారు.

అన్నమయ్య జిల్లాలో విలీనంపై నిరసన

సిద్దవటం రెవెన్యూ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న మండల వాసులు

సిద్దవటం, న్యూస్‌టుడే: సిద్దవటం మండలాన్ని అన్నమయ్య జిల్లాలో విలీనం చేసే ప్రక్రియ చేపట్టడడంపై సోమవారం సిద్దవటంలో మండల ప్రజలు నిరసన వ్యక్తం చేశారు. జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. సిద్దవటాన్ని అన్నమయ్య జిల్లాలో విలీనం చేసే ముందు ఇక్కడి ప్రజలకు ఎదురయ్యే సమస్యలను గుర్తించకుండా ఇష్టానుసారంగా నిర్ణయం తీసుకోవడం సబబుకాదన్నారు. ప్రభుత్వం పునరాలోచించి విలీనం ప్రక్రియను వెనక్కి తీసుకోవాలని కోరారు. సిద్దవటంలో మంగళవారం బంద్ కార్యక్రమం చేపట్టనున్నామని జేఏసీ నాయకులు తెలిపారు. అనంతరం కడపలో కలెక్టర్ శ్రీధర్‌ను కలిసి వినతి పత్రం అందించారు.

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట, సిద్దవటం మండలాలను కడప జిల్లాలోనే కొనసాగించాలని మండల ఐకాస నాయకులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారానికి మూడు రోజులకు చేరాయి. ప్రజలకు రవాణా, పరిపాలన పరంగా ఎంతో సౌలభ్యంగా ఉన్న కడప నుంచి తమ ప్రాంతాలను అన్నమయ్య జిల్లాలోకి చేర్చాలని నిర్ణయం తీసుకోవడం దారుణమని మండిపడ్డారు. జడ్పీటీసీ సభ్యుడు ముద్దు కృష్ణారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

టెయిల్ పాండ్ విస్తరణ పనులు అడ్డుకుంటాం

వేముల, న్యూస్‌టుడే: టెయిల్ పాండ్ విస్తరణకు ముందుకెళ్తే రైతులతో కలిసి అడ్డుకుంటామని తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పార్థసారథిరెడ్డి, మాజీ సర్పంచి శ్రీనాథరెడ్డిలు స్పష్టం చేశారు. ముడి యురేనియాన్ని శుద్ధి చేసిన తర్వాత వచ్చే వ్యర్థాలను కనంకిందకొట్టాల సమీపంలోని టెయిల్ పాండ్‌లో నింపుతున్నారని కొట్టాల గ్రామస్థులు సోమవారం ఆందోళన చేపట్టారు. వారికి వీరు మద్దతు తెలిపారు. విషయం తెలుసుకున్న ఆర్డీవో చిన్నయ్య, డీఎస్పీ మురళినాయక్, సీఐ ఉలసయ్యలు పాండ్ వద్దకు చేరుకుని వారితో చర్చించారు. సమస్యలపై చర్చించేందుకు రెండురోజుల్లో సమావేశాన్ని ఏర్పాటుచేస్తామని.. అప్పటి వరకు ఎలాంటి పనులు చేపట్టరని చెప్పడంతో ఆందోళన విరమించారు. మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్ మధుసూదన్‌రెడ్డి, మార్కెట్‌యార్డు ఉపాధ్యక్షుడు చంద్రవర్ధన్‌రెడ్డి, శేషారెడ్డి పాల్గొన్నారు.

ఆర్డీవో చిన్నయ్యతో చర్చిస్తున్న తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షులు పార్థసారథిరెడ్డి, మాజీ సర్పంచి శ్రీనాథరెడ్డి

అన్నమయ్య కాలిబాటను అభివృద్ధిపరచాలంటూ నిరసన

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: అన్నమయ్య కాలిబాటకు ఎకో హెరిటేజ్ కల్చర్ వాక్‌వేగా గుర్తింపు ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ గోవిందమాల ధరించిన భక్తులు కలెక్టరేట్ ఎదుట సోమవారం నిరసన వ్యక్తం చేశారు. కడపలోని శ్రీసప్తగిరి గోవిందమాల సేవా సమితి అధ్యక్షుడు మల్లెల రామాంజనేయులు ఆధ్వర్యంలో భక్తులు మహావీర్ కూడలి నుంచి ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకుని అక్కడ నిరసన వ్యక్తం చేశారు. జాయింట్‌కలెక్టర్ అదితిసింగ్‌కు వినతి పత్రం అందించారు.

రసాయన మందుల వాడకం తగ్గించాలి

అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎండీ అమరేంద్రకుమార్

కడప వ్యవసాయం, న్యూస్‌టుడే: పంటలకు రసాయన మందుల వాడకం బాగా తగ్గించాలని రాష్ట్ర గొర్రెలు, మేకల పెంపకందార్ల సమాఖ్య కార్యనిర్వాహక (ఎండీ) సంచాలకులు అమరేంద్ర కుమార్ అన్నారు. పురుగు మందులు సూత్రీకరణ సంస్థ (గురుగ్రామ్, హరియాణా) సహకారంతో సోమవారం రాష్ట్ర, జిల్లా గొర్రెల, మేకల పెంపకం దారుల సమాఖ్య ఆధ్వర్యంలో జడ్పీ సమావేశ మందిరంలో రైతులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి శ్రీనివాసులు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఎస్ఎస్‌వీహెచ్ జేడీ శారదమ్మ, జిల్లా గొర్రెల పెంపకం దారుల సహకార సమాఖ్య అధ్యక్షుడు నాగమల్లయ్య అధికారులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ వాలంటీర్లను అభినందించిన వీసీ

వైవీయూ, న్యూస్‌టుడే: యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలోని జాతీయ సేవా పథకం వాలంటీర్లను వీసీ ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ ప్రశంసించారు. ఆయన కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. హిమాచల్ ప్రదేశ్‌లోని మనాలిలో గత నెల 22 నుంచి ఈ నెల ఒకటో తేదీ వరకు నిర్వహించిన అడ్వెంచర్ క్యాంపులో సాహసాలను ప్రదర్శించారని చెప్పారు.

CHANGE OF NAME
I, DUDHYALA PAVAN KUMAR, S/o D.P.V. Ramana, Resident of D.No. 1/2751, MIGH-140, Housing Board Colony, Near Manikanta Swamy Temple, Kadapa City, YSR Kadapa District, Andhra Pradesh - 516004, have changed my name to DUDYALA PAVAN KUMAR. Henceforth, I shall be known as DUDYALA PAVAN KUMAR for all purposes.

జనవరిలో పులివెందులకు ముఖ్యమంత్రి రాక

వేంపల్లె, న్యూస్‌టుడే: సీఎం చంద్రబాబు జనవరిలో పులివెందులకు రానున్నారని మాజీ ఎమ్మెల్సీ, తెదేపా పులివెందుల నియోజకవర్గ ఇన్‌ఛార్జి బీటెక్ రవి అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పులివెందులలో తెదేపా గెలుపే లక్ష్యంగా ముందుకెళ్తున్నామన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం వైకాపాకు చెందిన పలువురు పార్టీలో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. వారిలో జిల్లా బలిజ సంఘం యువజన అధ్యక్షుడు కటిక నాగరాజు, కాంగ్రెస్ పార్టీ మండల శాఖ ఉపాధ్యక్షుడు సుబ్బరాయుడు, వడ్డెర సంఘం అధ్యక్షుడు చంటెన్న, పలువురు బలిజ సంఘం నాయకులు ఉన్నారు. కార్యక్రమంలో మండల తెదేపా పరిశీలకుడు అజ్జుగుట్టు రఘునాథరెడ్డి, తెదేపా కన్వీనర్ రామమునిరెడ్డి, తెదేపా నేతలు షబ్బీర్, వెంకటస్వామి పాల్గొన్నారు. జనవరి మాసంలో జరిగే గండికోట ఉత్సవాలకు ముఖ్యమంత్రి వస్తున్నారని.. ముందుగా ఆయన పులివెందులలో పర్యటించి ఇక్కడ పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తారని వివరించారు.

తెదేపాలో చేరిన వారితో మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి

జీవనోపాధిని దెబ్బతీయొద్దు

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అఖిలపక్ష నేతలతో ఎమ్మార్పీఎస్ నేతలు, బాధితులు

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: కొన్నేళ్లుగా రోడ్డుపక్కనే చెప్పులు కుట్టుకుంటూ జీవనం సాగిస్తున్న పక్కీరుపల్లె అరుంధతీవాసుల ప్రయోజనాలు కాదని రాజకీయ ప్రయోజనాలకు జిల్లా పరిషత్ అధికారులు ప్రాధాన్యం ఇస్తున్నారని ఐక్య కార్యాచరణ సమితి నాయకులు ఆరోపించారు. కడప నగరంలోని పోస్టాఫీసు ఎదురుగా చెప్పులు కుట్టుకుంటూ జీవిస్తున్న వారిని ఖాళీ చేయాలని జడ్పీ అధికారులు ఆదేశించిన నేపథ్యంలో బాధితులతో అఖిలపక్ష నేతలు సోమవారం కడప కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అధికారులకు వినతి పత్రం అందించారు. నాయకులు రామాంజులు, మాతయ్య, మల్లేసు, సుబ్బరాయుడు, చర్మకారులు పాల్గొన్నారు.

నూతన చర్చి ప్రారంభం

నాగరాజుపేట, న్యూస్‌టుడే: స్థానిక పులివెందుల రోడ్డులోని ప్రకాశంపల్లెలో సోమవారం క్రీస్తుమా మంచి కాపరి నూతన ప్రార్థనా మందిరాన్ని కడప మేత్రాసన పాలక అధికారి డాక్టర్ సగినాల పాల్‌ప్రకాష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కడప మేత్రాసనం పీఠాధిపతులు మాట్లాడుతూ.. అమలోదబివి మాత పండుగ రోజున ప్రార్థనా మందిరాన్ని ప్రారంభించడం గొప్ప విషయమన్నారు. దివ్యబలిపూజ నిర్వహించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ప్రకాశంపల్లె వాసులు పాల్ ప్రకాష్‌ను ఘనంగా సన్మానించారు.

చర్చిని ప్రారంభిస్తున్న డాక్టర్ సగినాల పాల్‌ప్రకాష్

ఘనంగా అంబులం పూజ

అరటి బోదెలతో సిద్ధం చేసిన 18 మెట్లు

మారుతీనగర్, న్యూస్‌టుడే: స్థానిక శంకరాపురంలోని జీఆర్‌కేఆర్ ఆసుపత్రి పక్కన గణేష్ యూత్ ఆధ్వర్యంలో సోమవారం అయ్యప్పస్వామి అంబులం పూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అయ్యప్ప భక్తులు స్వామి వారిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. ● దేవుని కడప శ్రీరామ నగర్‌లో సోమవారం అయ్యప్ప స్వామి మండల పూజ ఘనంగా నిర్వహించారు. గురుస్వామితో పాటు అయ్యప్ప భక్తులు స్వామి వారిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. పండ్లతో పంచామృతాభిషేకం చేశారు. 18 మెట్లు ఏర్పాటు చేసి అనంతరం మండల పూజ చేశారు.

కొత్త ఆవిష్కరణలపై ప్రత్యేక దృష్టి

వేంపల్లె, న్యూస్‌టుడే: ట్రిపుల్ ఐటీ విద్యార్థులు సాంకేతికతకు అనుగుణంగా కొత్త ఆవిష్కరణలపై దృష్టి సారించాలని డైరెక్టర్ కుమారస్వామి గుప్తా పేర్కొన్నారు. క్వాంటమ్ కంప్యూటింగ్ కార్యశాల ముగింపు కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన ట్రిపుల్ ఐటీలో నిర్వాహకులకు ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమరావతిలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్వాంటమ్ వ్యాలీని, ట్రిపుల్ ఐటీలో ఏర్పాటు చేసిన క్వాంటమ్ ఇన్నోవేషన్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఐబీఎం ఫౌండర్ జ్ఞాన్ ఎల్లా, ఏవో రవికుమార్, ప్రోగ్రాం ఆర్గనైజర్లు పాల్గొన్నారు.

శాస్త్రీయ ప్రతిభను వెలికితీసేందుకే కౌశల్ పరీక్షలు

కడప విద్య: ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో శాస్త్రీయ ప్రతిభను వెలికితీయడానికి కౌశల్ పరీక్షలు దోహదపడతాయని డీఈవో షంషుద్దీన్ అన్నారు. స్థానిక డీఈవో కార్యాలయంలో సోమవారం ప్రతిభ చూపిన విద్యార్థులను ఆయన అభినందించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

వైవీయూ, న్యూస్‌టుడే: భావి పౌరులైన విద్యార్థులు సీపీ బ్రౌన్‌ను స్ఫూర్తిగా తీసుకుని తెలుగు భాషా సాహిత్యంపై మక్కువ పెంచుకుని ముందుకు సాగాలని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు పార్వతి అన్నారు. స్థానిక సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో యోగివేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. మంగళవారం డిగ్రీ విద్యార్థులకు రామాయణం, భాగవతం పఠనంపై పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు.

గణతంత్ర వేడుకలకు అంగన్‌వాడీ కార్యకర్తలు

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: వచ్చే నెల జనవరి 26వ తేదీన దిల్లీలో జరిగే గణతంత్ర దిన వేడుకలు తిలకించేందుకు అంగన్‌వాడీ కార్యకర్తలకు అవకాశం లభించింది. ఈ మేరకు రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమశాఖ డైరెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆయిదుగురు అంగన్‌వాడీ కార్యకర్తలను ఎంపిక చేయగా అందులో జిల్లా నుంచి జె.గంగావతిలక్ష్మీ ఎంపికయ్యారు. వీరితో పాటు అన్నమయ్య జిల్లా కురబలకోట మండలం తెట్టు హరిజనవాడకు చెందిన గౌరిని ఎంపిక చేశారు.

5వ వర్ధంతి

చిరునవ్వుతో అందరిని ఆప్యాయంగా పలుకరిస్తూ మా అందరి హృదయాలలో చిరస్థాయిగా నిలిచిన మీ మరణం మాకు తీరని లోటు. మా నుండి దూరమై 5 సంవత్సరాలైనా నిరంతరం నీ జ్ఞాపకాలను పంచుకుంటూ.. నీ ఆత్మకుశాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ... శోకతప్త హృదయాలతో... అశ్రునయనాలతో...
భార్య : డా॥ పి.సుధారాణి
రిటైర్డ్ ప్రొఫెసర్, MD (Homeo) Repertory Govt. Homeo Medical College, కడప.
కీ॥శే॥ డా॥ పి.వి.ప్రసాద్
ప్రొఫెసర్, MD (Homeo) Materiamedica Govt. Homeo Medical College, Kadapa.
జననం : 28.01.1964 మరణం : 09.12.2020
కుమారుడు : పి.వి.నిఖిల్ చక్రవర్తి
కోడలు : బి.ఎన్.లహరి
కుమార్తె : పి.వి.స్రవంతి
అల్లుడు : బి.ఉదయ్‌కుమార్
మనుమడు : విశ్రుధ్ (Vishrudh)

11వ వర్ధంతి

జననం 7-3-1949
మరణం 9-12-2014
మంచితనానికి మారుపేరుగా నిలిచి, అందరినీ ఆప్యాయంగా పలుకరిస్తూ మా కుటుంబ ఉన్నతికై అహర్నిశలు శ్రమించిన మీరు మాకు దూరమై 11 సం॥లు గడిచినను మీ తీయని జ్ఞాపకాలు ఎన్నటికీ మరువలేము. మీ పవిత్రాత్మకు శాంతి కలుగజేయాలని ఆ భగవంతుని ప్రార్థిస్తూ...
కీ॥శే॥ కనపర్తి కోదండరామిరెడ్డి గారు
చింతకొమ్మదిన్నె మండల మాజీ ఉపాధ్యక్షులు, శ్రీ బాలాజీ రెడిమేడ్స్, Y.V. స్ట్రీట్, కడప, క్లాత్ మర్చంట్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు, ఊటుకూరు, సి.కె.దిన్నె మం॥
కుమారులు : కనపర్తి విజయకుమార్‌రెడ్డి, కనపర్తి శివశంకర్‌రెడ్డి మరియు కుటుంబ సభ్యులు. Cell : 9000474981, 9440074436.

(c) eenadu